కృణ్వంతో విశ్వమార్యమ్ ఓ౩మ్ వేదోఽఖిలో ధర్మమూలమ్

ఆ యా సమయాలలో అజ్ఞాత వ్యక్తులచే చేర్చబడిన ప్రక్షిప్తాలను తొలగించి పరిశుద్ధము చేయబడిన

మనుస్మృతి

'మానవ సంహిత * మనుధర్మ శాస్త్రము * మానవ ధర్మశాస్త్రము' అను

ప్రాచీన భారత రాజ్యాంగము-శిక్షాస్మృతి

టీకాతాత్పర్య సహితము * మనుస్మృతిగురించి సమస్తము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాలపరిశీలనం * మహర్షి దయానంద భాష్యోపేతం
పరిశోధితము * పరిశీలితము * పరిష్కృతము * వివిధ వివాదాలనిర్మూలనము

మనుస్మృతి పై గల
అనేక ఆక్షేపణలకు
సహేతుకమైన
సమాధానం తెలిపే
గ్రంథరాజము



ప్రక్షిప్తాలప్రక్షాళనం
కల్పితాలనిరాకరణం
ఇది 'మనుస్మృతి'
మహత్త్వాన్ని తెలిపే
అపూర్వ గ్రంథం

హిందీ రచయిత
భాష్యకర్త, అనుసంధానకర్త - సమీక్షకుడు
డా॥ సురేంద్ర కుమార్
M.A., Ph.D

తెలుగు అనువాదము
వాచస్పతి, విద్యావారిధి, వేదభాస్కర
డా॥ మట్టి కృష్ణారెడ్డి ఆర్య
M.A; M.Ed; Ph.D; D.Litt



1824-1883

ఆర్యసమాజ సంస్థాపకులు
మహర్షి స్వామి దయానంద సరస్వతియే
ఈ 'మనుస్మృతి'
పునరుద్ధరణకు ప్రేరకులు

నేటి ఆధునిక యుగంలో వేదోద్ధరణ చేసినది, 'మనుస్మృతి'లో అనేక ప్రక్షిప్త - కల్పిత శ్లోకాలు చేరినవని గుర్తించి మొట్టమొదటిసారి లోకానికి తెలిపినది, తాను రచించిన 'సత్యార్థ ప్రకాశం', 'ఋగ్వేదాది భాష్య భూమిక', 'సంస్కార విధి' మొదలగు గ్రంథాలలో సుమారు 600 శ్లోకాలకు పైగా వేదానుకూలమైన వాటిని ఆ యా సందర్భాలలో ప్రమాణంగా తీసుకొనినది, దీన్ని ప్రక్షాళన చేయవలసిన అవసరమున్నదని ప్రేరణ కలిగించినది మహర్షి స్వామి దయానంద సరస్వతియే.

స్వామీజీ వ్రాసిన గ్రంథాలను బాగా అధ్యయనం చేసి ప్రేరణ పొందిన డా॥ సురేంద్ర కుమార్ (కులపతి - కాంగిడీ విశ్వవిద్యాలయం, హరిద్వార్) గారు 'మనుస్మృతి'ని పునరుద్ధరిం చదలచి ఆమూలాగ్రం అనేక కోణాలలో అనగా శ్లోకశైలీ, విషయ వ్యతిరేకత, పరస్పర విరుద్ధ విషయాలు, పునరుక్తి దోషాలు, వేదవిరుద్ధ విషయాల-ఆధారంగా శాస్త్ర ప్రమాణాలతో, తర్కబద్ధంగా పరిశీలించి, విశేష వివరణలనిచ్చి 'ఇది మూల శ్లోకం - ఇది ప్రక్షిప్త శ్లోకం' అని నిరూపించి, దీనిపై కలిగిన అనేక సందేహాల, ఆక్షేపణల నివృత్తి కొరకు విస్తృతమైన భూమికను వ్రాసి 'మనుస్మృతి' వాస్తవ స్వరూపాన్ని "హిందీ భాషలో" ప్రజలముందుంచారు. దాన్ని నా శక్తి కొలది ప్రయత్నించి మూలానికేమాత్రం భంగం కలుగకుండా అనువదించి తెలుగు భాషీయులముందు పెడుతున్నాను.

ఇంతకుముందు తెలుగు భాషలో ఆ యా పండితులు 'మనుస్మృతి' శ్లోకాలకు తాత్పర్యం వ్రాసి ముద్రించినారు. అవన్నీ ప్రక్షిప్త సహితంగా ముద్రించబడినవే. అవి విశమిశ్రిత పాయసమువంటివి. వాటిని ప్రామాణికంగా తీసుకోరాదు. వాటిని చూపించి 'మనుస్మృతిలో ఇట్లున్నదేమిటి?' అని మమ్ములను ప్రశ్నించరాదు. ఈ 'పరిశుద్ధం' చేయబడిన 'మనుస్మృతి' ని మాత్రమే చదివి దీనిపై చర్చ చేయవచ్చు.

తెలుగు భాషలోనే కాదు ఇతర అనేక భాషలలో ముద్రించబడిన 'మనుస్మృతి'లో ప్రస్తుతము 2685 శ్లోకాలున్నవి. వాటన్నింటినీ పరిశీలించి పైన తెలిపినవిధంగా ప్రక్షిప్తాలను తొలగించి 1226 శ్లోకాలు మాత్రమే మనుకృతాలని, మిగిలిన 1459 శ్లోకాలు ప్రక్షిప్తాలని, అవి ప్రామాణికం కావని డా॥ సురేంద్రకుమార్ గారు తేల్చి చెప్పారు. దీన్ని మాత్రమే చదివి వాస్తవాలను అవగాహన చేసుకొని ఈ మహోన్నతమైన 'మనుస్మృతి' ఆధారంగా తమ జీవితాలను ధర్మబద్ధం చేసుకొని ధన్యజీవులు కావాలని కోరుతూ.....

- మట్టి కృష్ణారెడ్డి ఆర్య

మనువు ప్రతిపాదించిన జీవన విధానము - సమాజ వ్యవస్థ

మను మహర్షి
ప్రపంచపు తొలి రాజ్యాంగ నిర్మాత

'మనుస్మృతి'గా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఈ మహాగ్రంథంలో
'సృష్టి ఉత్పత్తి, మన్వంతరాలు, యుగాలు, కాలవిభజన'
మొదలగు సంక్షిప్త వివరణలతో పాటు
'బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు'లను నాలుగు 'వర్ణాలు';
'బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస' మను నాలుగు 'ఆశ్రమాలు';
'దేవ, ఋషి, పితృ' అను మూడు 'ఋణాలు';
'ధర్మ, అర్థ, కామ, మోక్షము'లను నాలుగు 'పురుషార్థాలు';
'బ్రహ్మ, పితృ, దేవ, అతిథి, బలివైశ్వదేవ' అను 'పంచ మహాయజ్ఞాలు';
'గర్భాధానం, పుంసవనం, సీమంతోన్నయనం, జాతకర్మ, నామకరణం, నిష్క్రమణం, అన్నప్రాశనం, చూడాకర్మ, కర్ణవేధం, ఉపనయనం, వేదారంభం, సమావర్తనం, వివాహం, వానప్రస్థం, సన్న్యాసం, అంత్యేష్టి' అను 'పదహారు సంస్కారాలు'.
వీటితో పాటు 'రాజధర్మం, దండనీతి';
'స్త్రీ పురుష కర్తవ్యాలు - వారి వారి హక్కులు';
'సత్త్వరజస్తమోగుణాల మీమాంస' - వాటి వివిధ కర్మలు;
జీవనవిధానం, మోక్షసాధన మొదలగు విషయాలు ఇందులో విశ్లేషించబడ్డాయి.

ఇలా 'మనుస్మృతి'లో వైయక్తిక, సామాజిక సర్వాంగీణ వికాసానికి సంబంధించిన ఎన్నో విషయాలు, ప్రాచీన భారతీయ వ్యవస్థను నిర్ధారితం చేసే అద్భుత విధానాలు నిరూపితమై ఉన్నవి. ఇదే ఈ దేశపు సాంఘిక వ్యవస్థకు వెన్నెముకగా ఎన్నో వేల ఏళ్ళ నుంచి నిలిచి ఉంది. ఇది సర్వకాల సర్వావస్థలలో ప్రపంచ మానవాళికి ధర్మమార్గాన్ని - జీవన విధానాన్ని చూపే దిక్సూచిక.

'మనుస్మృతి'ని వ్యతిరేకించే వారికి సవాల్

ఇందులో కుల వ్యవస్థ లేదు. స్త్రీల నింద అసలుకే లేదు. పైపెచ్చు స్త్రీశూద్రులకు అత్యున్నత స్థానం ఇవ్వబడింది. ఈ గ్రంథాన్ని ఆ మూలాగ్రం చదివితే దీనిపట్ల గల అనేక అపోహలు, ఆక్షేపణలు, సందేహాలు, దురభిప్రాయాలు మొదలగునవి తొలగిపోతాయి. ఇంకా ఇందులో ఎవరికైనా సందేహాలుంటే చర్చకు రావచ్చు. దీన్ని పూర్తిగా చదివినవారే చర్చకు అర్హులు.

- మట్టి కృష్ణారెడ్డి ఆర్య

మహర్షి మనువు 'మహా మానవుడు'

ప్రపంచ మానవులకు ఒక సువ్యవస్థితమైన,
నియమబద్ధమైన, నైతికమైన, ఆదర్శవంతమైన
జీవన పద్ధతిని నేర్పిన మొట్టమొదటి
మహోన్నత మహావ్యక్తి 'మను మహర్షి'
అతడు మానవజాతికి ఆదిపురుషుడు. ఆదర్శమానవుడు.
ఆది ధర్మ శాస్త్రకారుడు. ఆదిశాసన రచయిత. ఆది 'శాసన దాత'.
ఆది సమాజ సంస్థాపకుడు. రాజనీతి వ్యవస్థాపకుడు. ఆది 'రాజర్షి'.
వేదప్రతిపాదిత యజ్ఞపరంపరను, వర్ణాశ్రమ ధర్మాలను
మానవజాతి నిత్యజీవితంలో ఒక భాగంగా చేసిన 'ప్రథమ ధర్మగురువు'.
అతడు రచించిన ధర్మశాస్త్రం 'మనుస్మృతి' (మనుధర్మ శాస్త్రం-మానవ సంహిత)
ఇది అన్నింటికంటే అతి ప్రాచీనమైన స్మృతి గ్రంథం.
వేదశాసనాన్ని సమాజంలో అనుశాసించిన ధర్మశాస్త్రం.
అనంతమైన ఆర్ష సాహిత్యాన్నీ, రామాయణ భారతేతిహాసాలనూ
తీసి చూచినచో దీని గొప్పతనమేంటో మనకు తెలుస్తుంది.
వైదిక సాహిత్యం నుండి మొదలుకొని నేటి సాహిత్యం వరకూ గల
శాస్త్రకారులూ, సాహిత్యకారులూ, రచయితలూ, కవులూ,
రాజులూ, రారాజులూ, చక్రవర్తులూ మొదలగువారు
దీని సుదీర్ఘమైన ధర్మపరంపరను ముక్తకంఠంతో ప్రశంసించారు.
వైదిక, లౌకిక గ్రంథాలన్నింటిలోనూ మనువు వచనాలు
'ఔషధం వలె హితం చేయునవి-గుణము నిచ్చునవి'గా ప్రస్తుతించారు.
ఇది సకలకాలాలలో సమస్త భూమండలంలో ప్రవర్తించదగిన సంపూర్ణ 'మానవ సంహిత'
ఎవరు అంగీకరించినా-అంగీకరించకపోయినా, ఎవరు అవునన్నా-కాదన్నా
'వేదోఽఖిలో ధర్మ మూలమ్' అన్న ఈ మహోన్నత 'మనుధర్మ శాస్త్రం'
'మనుస్మృతి'గా ఈ భూమండలమున్నంతవరకు మనగలుగుతుంది.
మన్ననలనందుకుంటుంది.
వేదధర్మాచరణ పరాయణులకు మార్గాన్ని చూపిస్తుంది.
'కృణ్వంతో విశ్వమార్యమ్' చేస్తుంది.

– ఆచార్య మట్టి కృష్ణారెడ్డి

మనువు పద్ధతికి కేంద్ర బిందువు 'మానవుడే'

మన మనసులలో మనుష్యుని జీవన క్రమం ఏ ప్రకారంగా ఉండాలి? సంపూర్ణ వికాసం కలిగి యోగక్షేమాలతో ఉండటానికి మన వైయక్తిక, సామాజిక జీవనాన్ని ఏ దిశల లోకి మళ్లించాలి? అనే ప్రశ్నలు మాటిమాటికి కలుగుతుంటాయి.

ఈ ప్రశ్నలకు మనువు చెప్పిన సమాధానం ఒకటే – **'ఋత'** మార్గాన్ని అనుసరించు. దాని వల్ల అభ్యుదయమూ, నిఃశ్రేయస్సూ కలుగుతాయి; ఏది లేక పోతే జీవితానికి ఏ విలువ లేదో, ఆ నీ **'శీలసంపద'**ను వృద్ధి చేసుకో. అందరూ గ్రహించవలసిన శాశ్వత తత్త్వమైన **'ధర్మాన్ని'** ఆశ్రయించు. **'ఆచారం'** అనే పునాదిపై జీవితాన్ని స్థాపించుకో. అది లేకుంటే మనిషి తననూ, తన జాతినీ ఉన్నతికి చేర్చలేడు.

'ఋతం', 'శీలసంపద', 'ధర్మం', 'ఆచారం' అనే ఈ గొప్ప ఆదర్శాలు భారతీయ సంస్కృతిలో మనిషి ఔన్నత్యాన్ని కొలిచే చతుర్ముఖ కొలమానములు. వీటిలో ఏ ఒక్క దాన్ని కొలిచేందుకు ఉపక్రమించినా, మిగిలినవన్నీ తమంతకు తామే జీవితంలోకి వచ్చి చేరిపోతాయి.

వేదం **'ఋతం'** అనే దాన్ని వివరించగా, వాల్మీకి విశేషంగా **'శీలసంపద'** ను తెలుపగా, వ్యాసుడు **'ధర్మం'**ను వర్ణించగా వాటికే మనువు **'ఆచారం'** అనే పేరుపెట్టి దానికి అతి గొప్ప స్థాన మిచ్చాడు– దాన్నే పరమధర్మంగానూ చెప్పాడు. ఈ **'ఆచారమే'** మనువు విధానాలకు ఇరుసు. దీని వల్లనే మానవుని జీవన వ్యవస్థకు తగిన ప్రణాళిక ఏర్పడింది.

మనువు పద్ధతికి కేంద్రబిందువు మానవుడే అయినందున అతని సంపూర్ణ వికాసమూ, అభ్యుదయాల మార్గాన్ని ప్రశస్తం చేయటమే అతని ఏకైక లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించటానికి మనువు – మానవుని దైనందిన జీవితాన్ని, జీవితాంతమూ ఆచరించడానికి ముందే నిశ్చయించిన కార్యక్రమాలతో కూడిన ఒక చక్కని రేఖాచిత్రాన్ని తయారు చేశాడు. అదియే ఈ **'మనుస్మృతి'.**

–అనువాదకుడు

अनुसंधानात्मक प्रकाशन

मनुस्मृति

हिन्दीभाष्य, प्रक्षिप्तश्लोकानुसन्धाननिर्देश एवं अनुशीलन नामक समीक्षासहित, शास्त्रीयप्रमाणों तथा मनुस्मृतिसम्बन्धी आलोचनात्मक अध्ययन से युक्त

परिष्कृत एवं परिवर्धित कम्प्यूटरीकृत
नवीनतम संस्करण

भाष्यकार, अनुसन्धानकर्त्ता एवं समीक्षक -
डॉ. सुरेन्द्रकुमार
आचार्य (संस्कृत-साहित्य, व्याकरण, दर्शन)
एम.ए. (संस्कृत, हिन्दी), पी-एच.डी.
कुलपति, गुरुकुल कांगड़ी विश्वविद्यालय,
हरिद्वार (उत्तराखण्ड)

तेलुगु अनुवादक
वाचस्पति **डॉ. मर्रि कृष्णा रेड्डी आर्य**
M.A; M.Ed; Ph.D; D.Litt

प्रकाशक
दयानन्द पब्लिकेशन्स
दिलसुखनगर, हैदराबाद-५०००६०.
सेलः ९४४१२००३२२

A Research Publication

THE MANUSMRITI

(Hindi Exposition with interpolated shlokas pointed out, along with Anusheelan Commentary embellished with authority from Shastras, a critical study of the Manusmriti)

[Improved and Enlarged computerised Edition]

Bhashyakar, Researcher and Commentator
Dr. Surendra Kumar
Acharya (Sanskrit Literature,
Grammar and Philosophy),
M.A. (Sanskrit, Hindi), Ph.D.
Vice-Chancellor,
Gurukul Kangri University, Haridwar,
Uttarakhand

Telugu Translation by:
Vachaspati
Dr. Marri Krishna Reddy Arya
M.A; M.Ed; Ph.D; D.Litt

Published by:
Dayananda Publications
Dilsukhnagar,Hyderabad-500 060.
Cell: 94412 00322

डॉ. सुरेन्द्र कुमार जी का संक्षिप्त परिचय

मनुस्मृति भाष्यकार एवं पूर्व कुलपति गुरुकुल कांगड़ी विश्वविद्यालय हरिद्वार (उत्तराखंड)।

जन्म एवं जन्मस्थान :**पिता श्री गहरसिंह जी**



माता श्रीमती शान्तिदेवी जी

गांव : **मकड़ौली कलां, जिला - रोहतक (हरियाणा)**

शिक्षा : आपने गुरुकुल परम्परा में अध्ययन करते हुए गुरुकुल झज्जर (हरियाणा) से आचार्य परीक्षा एवं गुरुकुल कांगड़ी विश्वविद्यालय हरिद्वार से हिन्दी विषय में एम. ए. परीक्षा उत्तीर्ण की और विश्वविद्यालय में सर्वप्रथम स्थान प्राप्त किया । पंजाब विश्वविद्यालय चंडीगढ़ से एम.ए. संस्कृत और पी.एच.डी. परीक्षा उत्तीर्ण की ।

शैक्षणिक एवं प्रशासनिक सेवा: आपने हरियाणा सरकार के अन्तर्गत कालेज कैडर में प्राध्यापक के पद पर छत्तीस वर्ष तक अध्यापन किया । राजकीय स्नातकोत्तर महाविद्यालय सैक्टर-९ गुरुग्राम (हरियाणा) से प्रिंसिपल के पद से सेवानिवृत्त हुए । तत्पश्चात् आपने गुरुकुल कांगड़ी विश्वविद्यालय हरिद्वार में पांच वर्ष तक कुलपति (वाइस चांसलर) के पद पर कार्य किया । गुरुकुल कांगड़ी विश्वविद्यालय के इतिहास में आपके प्रयासों से प्रथम बार विश्वविद्यालय को राष्ट्रीय मूल्यांकन संस्था नैक द्वारा ए ग्रेड प्राप्त करने का गौरव प्राप्त हुआ। वर्तमान में आप महर्षि दयानन्द सरस्वती की उत्तराधिकारिणी सभा "परोपकारिणी सभा, अज्मीर (राजस्थान)" के संरक्षक हैं । लेखन एवं सम्पादन - आपने चौंतीस पुस्तकों का लेखन एवं सम्पादन किया है । इनमें से छह पुस्तकें महर्षि दयानन्द विश्वविद्यालय रोहतक (हरियाणा) के संस्कृत के पाठ्यक्रम में निर्धारित हैं । आपने मनुस्मृति नामक शास्त्र में समय - समय पर हुए प्रक्षेपों की पहचान के लिए सात साहित्यिक मानदंडों की कसौटी पर विशेष अनुसंधान कार्य किया है । जो मनुस्मृति (संपूर्ण) और विशुद्ध मनुस्मृति दो प्रकार के संस्करणों में उपलब्ध है । उसका अब तक चार भाषाओं में अनुवाद हो चुका है । इनके द्वारा किये गये शोध और भाष्य इनके द्वारा किये गये शोध और भाष्य युक्त मनुस्मृति सर्वाधिक पढ़ी जाने वाली मनुस्मृति है ।

विभिन्न पत्र-पत्रिकाओं में आपके दो-सौ से अधिक लेख प्रकाशित हो चुके हैं । तीन पत्रिकाओं के आप सम्पादक रहे हैं । सम्मान एवं पुरस्कार - अभी तक आपको लेखन तथा प्रशासनिक उपलब्धियों के लिए दो दर्जन सम्मान एवं पुरस्कार प्राप्त हो चुके हैं ।

दूरदर्शन एवं आकाशवाणी से वक्तव्य:

भारत सरकार के डी.डी. चैनल, भारती, आस्था, संस्कार, साधना, सुदर्शन चैनलों तथा आकाशवाणी के कई केन्द्रों से अब तक एक-सौ से अधिक वक्तव्य प्रसारित हो चुके हैं ।

కృణ్వంతో విశ్వమార్యమ్ ఓ౩మ్ వేదోఽ_ ఖిలో ధర్మమూలమ్

ఆయా సమయాలలో అజ్ఞాత వ్యక్తులచే చేర్చబడిన ప్రక్షిప్తాలను తొలగించి పరిశుద్ధము చేయబడిన

మనుస్మృతి

మానవ సంహిత ❋ మానవ ధర్మశాస్త్రము

టీకా తాత్పర్య సహితము

'మనుస్మృతి' గురించి సమస్తము

మనుధర్మ శాస్త్రము

ప్రాచీన భారత రాజ్యాంగము-శిక్షాస్మృతి

'మనుస్మృతి' పై గల అనేక ఆక్షేపణలకు సహేతుకమైన సమాధానం తెలిపే గ్రంథరాజము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలనం ❋ మహర్షి దయానంద భాష్యోపేతం
పరిశోధితము ❋ పరిశీలితము ❋ పరిష్కృతము ❋ వివిధ వివాదాల నిర్మూలనము

ప్రస్తుతం మనుస్మృతిలో గల మొత్తం శ్లోకాల సంఖ్య 2685
మూల (Original) శ్లోకాలు 1227, కల్పిత (Duplicate) శ్లోకాలు 1458



మనుస్మృతిని
వ్యతిరేకించే
వారికి
సవాల్...

❋

దీన్ని
పూర్తిగా
చదివినవారే
చర్చకు అర్హులు



ప్రక్షిప్తాల
ప్రక్షాళనం
❋
కల్పితాల
నిరాకరణం

❋

ఇది
మనుస్మృతిని
పునరుద్ధరించే
గ్రంథం

వేద ఖడ్గం ❋ స్మృతి అమలుచేస్తుంది

వేదధర్మ పునఃస్థాపనార్థం 'మనుస్మృతి' పునరుద్ధరణ - కులమత నిర్మూలన

హిందీ మూలం
భాష్యకర్త, అనుసంధానకర్త-సమీక్షకుడు
సాహిత్యాచార్య, వ్యాకరణాచార్య, దర్శనాచార్య
డా॥ సురేంద్ర కుమార్
M.A., Ph.D.
కులపతి, కాంగడీ విశ్వవిద్యాలయం, హరిద్వార్

తెలుగు అనువాదం
విద్యావారిధి, సిద్ధాంతాలంకార, విద్యాభూషణ
ఆర్షవిద్యావినోద, వేదరత్న, వేదభాస్కర
వాచస్పతి డా॥ **మత్తి కృష్ణారెడ్డి** ఆర్య
M.A., M.Ed, Ph.D., D.Litt

మనుస్మృతి (మనుధర్మ శాస్త్రము)

ప్రాచీన భారత రాజ్యాంగము-శిక్షాస్మృతి
మానవ ధర్మసంహిత, విశ్వమానవ సంవిధానం - The World Constitution
విశేష వివరణ సహిత ప్రక్షిప్తాలపరిశీలనం - మహర్షి దయానంద భాష్యోపేతం
పరిశోధితము - పరిశీలితము - పరిష్కృతము - వివిధ వివాదాల నిర్మూలనము

హిందీ మూలం : డా॥ సురేంద్ర కుమార్
తెలుగు అనువాదం : డా॥ మట్టి కృష్ణారెడ్డి ఆర్య
ప్రథమ ముద్రణ : డిసెంబరు 16, 2022 శుభకృత్ మార్గశిర పౌర్ణమి
ప్రతులు : **2000**
వెల : 2,100/-

ప్రాప్తి స్థానం:
మట్టి రాధాదేవి
శ్రీ సరస్వతీ శిశుమందిరం
ఇం.నెం.16-1-18/34/51/1
ప్రసన్నాంజనేయ నగర్, కొత్త పోలీసు స్టేషన్ దగ్గర
సైదాబాదు, హైదరాబాదు-59
సెల్: 94412 00322, 98495 83929
Email: vedadharmapracharatrust@gmail.com

Printed at:
Vighneshwara Art Printers
16-11-477/6/2/1/A,
Asian Neuro & Nephrology Institute Lane
Moosarambagh, Dilsukhnagar, Hyderabad-60.
Cell: 040-66820662, 99122 77341

Binding:
Y.V. Reddy Printers & Binders
Moosarambagh, Dilsukhnagar, Hyderabad-36.
Cell: 93910 15317
Email: yvr.postpresssolutions@gmail.com

ప్రకాశకీయము

వైదిక వాఙ్మయం చదువుకున్న సుధీజనులకు, చదవాలనుకున్న జిజ్ఞాసువులకు **'మనుస్మృతి'**పై ఒక అపూర్వమైన, అద్వితీయమైన, సుబోధకమైన భాష్యాన్ని ప్రచురించి పాఠకుల కరకమలాలకు అంకితం చేస్తున్నందులకు మాకెంతో సంతోషం కలుగుతున్నది. ఇది నేటినుండి **'పరిశుద్ధ మనుస్మృతి'**గా ప్రసిద్ధమౌతుంది.

దీని హిందీ రచయిత విద్వద్వరేణ్యులైన **డా॥ సురేంద్ర కుమార్ గారు.** వీరు 30 సంవత్సరాలకు పైగా పరిశోధించి, ప్రక్షిప్తాలను తొలగించి **'పరిశుద్ధ మనుస్మృతి'**గా దీన్ని పునరుద్ధరించినారు. ఇంతటి మహోన్నత ఉద్గ్రంథాన్ని తెలుగులోకి సరళ సుబోధకంగా, అనువదించినవారు వాచస్పతి బిరుదాంకితులు, చతుర్వేద భాష్యాది గ్రంథాలను అనువాదసహితంగా తెలుగువారి కందించిన కర్మయోగి, తన జీవిత సర్వస్వాన్ని వేద సాహిత్య నిర్మాణానికి అంకితం చేసిన త్యాగశీలి **డా॥ మట్టి కృష్ణారెడ్డి** గారు. వీరు మాకు 15 సంవత్సరాల నుండి సుపరిచితులు. వీరి వేద ప్రచురణ కార్యదక్షత – వేదప్రచార కార్య దీక్షిత మమ్ములను ఎంతగానో ప్రభావితం చేసింది. వీరు గతంలో ముద్రించిన ఋగ్వేదభాష్యానికి పేపరు, ముద్రణ సహాయం చేసే అవకాశం మాకు లభించినది. ప్రస్తుతం **'మనుస్మృతి'** అను మనుధర్మ శాస్త్రాన్ని ముద్రించి తెలుగువారి కందిస్తున్నాము.

ఎందుకీ ధర్మగ్రంథాన్ని ముద్రించవలసి వచ్చింది? ఇందులో అంత గొప్ప విషయాలేమున్నాయి? ఉంటే అనేకమంది దీన్ని ఎందుకు విమర్శిస్తున్నారు? ఎందుకు తగలబెడుతున్నారు? వేలాది, లక్షలాది సంవత్సరాలు ప్రపంచాన్ని శాసించిన ధర్మశాస్త్రం అనేక అపోహలతో, ఆక్షేపణలతో నేడెందుకు అవమానింపబడుతున్నది? ఆ మహోన్నత వేదధర్మ ప్రతిపాదిత స్మృతిగ్రంథం ఎందుకు జనసమూహంలో అంటరానిదిగా ఈసడింపబడుతున్నది? ఇలా... ఇలా... అనేకానేక ప్రశ్నలకు సమాధానంగా ఈ గ్రంథం మహోజ్జ్వల కాంతితో ప్రకాశింపబడుతోంది. దీన్ని విమర్శించువారి సందేహాలను ఇది పటాపంచలు చేస్తుంది. మనుస్మృతిపై కలుగు అనేక ఆక్షేపణలకు ఈ గ్రంథం సప్రమాణికంగా సమాధానమిస్తోంది.

'ధర్మాభిలాషులైన పాఠకులు ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి లాభాన్వితులవుతారని, ధర్మ రహస్యాలను తెలుసుకొని పులకించిపోతారని, ధర్మ సందేహాదులను తొలగించుకొని హృదయ పూర్వకంగా హర్షాన్ని ప్రకటిస్తారని, ఆనందంతో మరల దీన్ని శిరస్సు నెత్తుకుంటారని' మాకు నమ్మకంగా ఉంది. ఇది అంతటి మహోన్నతమైన ధర్మ గ్రంథం. మధ్యకాలంలో కొందరు స్వార్థపరులు చేర్చిన ప్రక్షిప్తాలతో ఇది కలంకితమైనదేకాని ఎవరి పట్లా పక్షపాతం చూపలేదు. ఇందులో కులవ్యవస్థ లేదు. స్త్రీలను తక్కువ చేయలేదు. వ్యక్తి, కుటుంబము, సమాజము, దేశము, ప్రపంచము ఎలా ఉండాలో, ఎలా నియంత్రించాలో, ఎలా నియంత్రించబడాలో మొదలగు శాసనాలు, అనుశాసనాలు ఎన్నో ఇందులో పొందుపరచబడి ఉన్నవి.

తినబోతూ రుచి యెందుకు? ఆసాంతం అవలోకించండి. అవగాహన చేసుకోండి. అపోహలను తొలగించుకొని అనుశాసనంతో ధర్మాన్ని అనుసరించండి. ఈ తొలి ప్రయత్నంలో ఏవైనా పొరపాట్లు దొర్లినచో వాటిని తెలియపరచిన మలి ముద్రణలో సవరించగలమని మనవి చేస్తూ పాఠకులు దీన్ని ఆదరించగలరని కోరుచున్నాము.

బుధజన విధేయులు

చిలుముల సత్యారెడ్డి

పావులూరి సుబ్బారావు

అధ్యాయాల క్రమంగా 'మూల శ్లోకాల-*ప్రక్షిప్త' శ్లోకాల పట్టి

అధ్యాయం	మూలశ్లోకాలు	* ప్రక్షిప్తశ్లోకాలు	మొత్తం శ్లోకాలు
1వ అధ్యాయం	78	* 66	144
2వ అధ్యాయం	164	* 60	224
3వ అధ్యాయం	85	* 201	286
4వ అధ్యాయం	90	* 170	260
5వ అధ్యాయం	41	* 128	169
6వ అధ్యాయం	64	* 33	97
7వ అధ్యాయం	184	* 42	226
8వ అధ్యాయం	237	* 183	420
9వ అధ్యాయం	165	* 171	336
10వ అధ్యాయం	15	* 116	131
11వ అధ్యాయం	32	* 234	266
12వ అధ్యాయం	72	* 54	126
	1227	* 1458	2685

మూల (Original)శ్లోకాలు	1227
*(స్టార్) గుర్తు గలవి ప్రక్షిప్త (Duplicate) శ్లోకాలు	*1458
మొత్తం శ్లోకాలు	2685

*(స్టార్) గుర్తు కలిగినవి ప్రక్షిప్తాలని తెలుసుకోవాలి

ప్రస్తుతం ప్రచారంలో గల 'మనుస్మృతి'లోని మొత్తం శ్లోకాలు-2685

గమనిక:– ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 'మనుస్మృతి'లో మొత్తం 2685 శ్లోకాలుంటే అందులో 1226 శ్లోకాలు మాత్రమే మనుకృతం. ఇవే ప్రామాణికాలు. మిగిలిన 1459 శ్లోకాలు ప్రక్షిప్తాలు, కల్పిత శ్లోకాలు. నిక్షిప్తాలు లేదా చేర్చబడినవి. వీటిని ఆధారంగా చేసుకొని 'మనుస్మృతి'ని విమర్శించకూడదు.

తెలుగులో నాకు లభించిన 'మనుస్మృతులు'

ఈ ప్రక్షిప్త శ్లోకాలు గల మనుస్మృతులను తగులబెట్టండి

ఇందులో 1458 ప్రక్షిప్త శ్లోకాలు చేరినందున ఇవి విషమిశ్రిత పాయసములాంటివి

ఇవి ప్రామాణికాలు కావు- ప్రతి ఒక్కరు నిరసించదగినది. సమాజానికి హాని చేయునవి.

మనుస్మృతికి తాత్పర్యం రచించినవారు	-	ముద్రించినవారు
1. వేదం వేంకట సుబ్బరామశాస్త్రి	-	వావిళ్ళవారు మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రి-1
2. ఆవంచ సత్యనారాయణ	-	ఇమ్మడిశెట్టి అక్కెశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు, విజయవాడ-1
3. భాగవతుల సుబ్రహ్మణ్యం	-	నవరత్న బుక్‌హౌస్, విజయవాడ-2
4. కె.వై.ఎల్. నరసింహారావు	-	కె.వై.ఎల్.నరసింహారావు, హైదరాబాద్
5. డా॥ఎన్.ఎల్.నరసింహాచార్య	-	ఎన్.రంగనాయకమ్మ-అల్వాల్-హైద్రాబాద్-10
6. పొనుగోటి కృష్ణారెడ్డి	-	జయంతి పబ్లికేషన్స్-విజయవాడ-2

గమనిక:- ఇంకెందరు పండితులు 'మనుస్మృతి' కి తెలుగు తాత్పర్యం రచించినారో నాకు తెలియదు. నాకు లభించిన గ్రంథాలు ఇవే.

సూచన:- ఈ పైన 'మనుస్మృతి' గ్రంథాలన్నీ ప్రక్షిప్తాలు-కల్పితాలతో కూడుకున్నవే. ఇవి ప్రామాణికాలు కావు. వీటిని చదివిన పాఠకులు 'మనుస్మృతి'ని చాలా ఘోరంగా విమర్శిస్తూ-తగులబెడుతున్నారు. కాబట్టి ఎట్టి పరిస్థితులలో కూడా వీటిని ప్రామాణికంగా అంగీకరించకూడదని మనవి-

ఎందుకంటే- ఇప్పుడు మనుస్మృతి పేర అందుబాటులో ఉన్న ఏ పుస్తకాన్ని చదివినా అందులో శూద్రులపట్ల, చాండాలాది బడుగు వర్గాలపట్ల, అంత్యజాతులపట్ల, స్త్రీలపట్ల కొట్టవచ్చినట్లు కనబడే క్రూరత్వం, దుర్వివక్షతలను చూస్తే మనిషన్న ప్రతి ఒక్కడికి ఒళ్ళు మండుతుంది. మరీ ఇంత దారుణమా? అమానుషమా? అని తీవ్రమైన జుగుప్స కలుగుతుంది. నిమ్నస్థాయి జాతులనుద్దేశించి నిర్దేశించిన శిక్షలనుగాని, వాటి వెనుక ఉన్న వర్ణాధిక్య భావజాలన్ని కానీ ఈ కాలంలో ఎవరూ సమర్థించరు.

అందుకే వీటిని తగులబెట్టండి:- మనుస్మృతిని అప్రతిష్ఠపాలు చేసింది, తగులబెట్టేంత స్థాయికి దిగజార్చింది, సమాజానికి దూరం చేసింది ఇలాంటి ప్రక్షిప్తాలు గల గ్రంథాలే. ఇవి ఎక్కడ కనిపించినా తగలబెట్టండి. ఇవి ఏ మాత్రం సమాజానికి ఉపయోగపడని చెత్త పుస్తకాలు. పైగా విమర్శలకు, దూషణలకు, దహనానికి కారణమౌతున్నవి. ఏ మాత్రం బుద్ధి జ్ఞానం ఉన్నవాడు వీటిని మెచ్చుకోడు. **'వీటివల్ల అసలు 'మనుస్మృతి'కి ఇప్పటికే ఎనలేని హాని జరిగింది. మను మహర్షికి చెప్పజాలనంత అవమానం జరిగింది. ఒక మహోన్నత ధర్మశాస్త్రానికి సమాజం దూరమయ్యింది'.**

కావున పాఠకులారా ! పైన తెలిపినవే గాక ఇంకెక్కడైనా ఇలాంటి ప్రక్షిప్తసహిత మనుస్మృతి పుస్తకాలను కొంటే బయటకు విసిరేయండి. బహిష్కరించండి.

ముద్రణ కర్తలకు మనవి:- మన హిందూ సమాజాన్ని, భారతీయ సంస్కృతిని విమర్శలకు గురిచేసే ఇలాంటి గ్రంథాలను దయచేసి ముద్రించకండి. సద్గ్రంథాలను ముద్రించి మీ వ్యాపారాలను వృద్ధిచేసుకోండి. **-మట్టి కృష్ణారెడ్డి**

తెలుపుతుంది. శూద్రులని, దళితులని చెప్పబడుతున్న, అలా అనుకుంటున్నవారిలో ఎంతోమంది బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులున్నారు. అన్నిరకాల విద్యాలయాలలో (చిన్న-పెద్ద) విద్యను బోధిస్తున్న వారందరూ **'బ్రాహ్మణులు'**; ప్రభుత్వ నిర్వహణలో పనిచేస్తున్న IAS, IPSలు చిన్న పెద్ద రాజకీయ నాయకులు **'క్షత్రియులు'**; స్వంతంగా చిన్న పెద్ద వ్యాపారాలు, వ్యవసాయం, పశుపాలన మొదలగునవి చేస్తున్నవారు **'వైశ్యులు'**; పై వారందరికీ సహకరిస్తూ చిన్న-పెద్ద ఉద్యోగాలు (కూలీ-జీతం) చేస్తున్నవారందరూ **'శూద్రులు'**. ఇదీ నేటి వర్ణ వ్యవస్థ. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏ కులంవారైనా - ఏ మతం వారైనా మీరు చేస్తున్న వృత్తిని బట్టి మీ దే వర్ణమో మీరే నిర్ణయించుకోవచ్చు. మనుధర్మ శాస్త్రంలో చెప్పబడిన వర్ణవ్యవస్థ ఇదే.

ఇందులో కేవలం వర్ణవ్యవస్థనే కాదు - వ్యక్తి, కుటుంబ, సమాజ, దేశ నిర్మాణాది విషయాలెన్నో ఉన్నాయి. ఇది సర్వకాల సర్వావస్థలలో **'సృష్టి ఉన్నంతవరకు - మానవుడు భూమిపై బ్రతికున్నంతవరకు'** ఈ ధర్మశాస్త్రానుసారం జీవితాన్ని గడపవలసిందే. ఎవరు అంగీకరించినా - అంగీకరించకపోయినా ఇదే సత్యం - ఇదే ధర్మం. అప్పుడే అతడు శారీరక, మానసిక, బౌద్ధిక, ఆత్మిక, పారలౌకిక అభివృద్ధులను సాధించగలుగుతాడు. లేనిచో నేటి సమాజంలో ప్రపంచమంతా జీవిస్తున్నట్లుగానే అంటే భోగలాలసులై, విలాసాలతో, వినోదాలతో, శారీరిక వాంఛలతో, మద్య మాంసాది దుర్వ్యసనాలతో, డబ్బు, అధికారం, విచ్చలవిడితనం మొదలగు కారణాలతో ఎందుకు బ్రతుకుతున్నామో తెలియక, ఎలా బ్రతకాలో తెలియక శారీరక, మానసిక రోగాలతో కేవలం బ్రతకడానికే బ్రతికేస్తున్నారు. చావలేక బ్రతుకుతూ చస్తున్నారు.

నేడు ధర్మబద్ధమైన జీవన విధానం లేక, న్యాయబద్ధమైన వ్యవస్థ లేక, బడులలో ఈ విషయాలు తెలుపక, పెద్దలకు తెలియక, అన్నిరంగాలూ అస్తవ్యవస్తమై, అయోమయమై దినదినగండం నూరేళ్ళ ఆయుష్షుగా, ఎప్పుడు ఉద్యోగాలొస్తాయో, ఎప్పుడు పదవులు ఊడుతాయో తెలియక సర్వం అభద్రతా భయంతో అతలాకుతలమైపోయింది సమాజం.

అందుకే మరల పునాది నుండి ఈ సమాజ భవనం నిర్మాణం కావాలి. ఈ నడుస్తున్న కుళ్ళిన వ్యవస్థలనన్నీ కూలద్రోయాలి. వ్యక్తి నిర్మాణంతోనే కుటుంబం, సమాజం, దేశం నిర్మాణమౌతుంది. కనుక మన ప్రాచీన ఋషులు చెప్పిన ధర్మశాస్త్రానుసారంగా మానవుని నిర్మాణం జరగాలి. అందుకే ఈ **'మనుస్మృతి' - 'మనుధర్మశాస్త్రం'** పునరుద్ధరణ. ఈ సర్వతోముఖ, సర్వోన్నత వ్యవస్థాగత నిర్మాణ కార్యంలో మేధావులైనవారూ, అన్నిరంగాలవారూ, అన్నివర్గాల, వర్ణాల-కులాలవారూ ప్రతిఒక్కరు ఈ ధర్మస్థాపనలో భాగస్వాములు కావాలి.

ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి జీవితాన్ని, సమాజాన్ని చక్కదిద్దండి. ఏవైనా లోటుపాటులుంటే తెలియజేయండి. అందరం కలిసి ధర్మబద్ధులమై (సర్వమానవ సమ)ధర్మ స్థాపనతో సమసమాజ నిర్మాణం చేద్దాం. రండి కదలిరండి. గ్రహణం వీడిన సూర్యుడిలా ప్రక్షిప్తాల ప్రక్షాళనతో ఈ **'మనుస్మృతి'** అసలైన, నిజమైన, శాశ్వతమైన, యథార్థమైన **'ధర్మశాస్త్రం'**గా వెలువడుతోంది. ఈ వెలుగులో మీ జీవితాలను చక్కదిద్దుకోండి.

ఈ మహద్గ్రంథాన్ని చదివిన తరువాత కూడా సందేహాల నివృత్తి జరగనిచో చర్చకు రండి. సత్యమేదో తేలుద్దాం.

- మట్టి కృష్ణారెడ్డి

అనువాదకుని ముందుమాట

'శృతి' అంటే వేదం. **'స్మృతి'** అంటే ధర్మశాస్త్రం. **'వేదోఽఖిలో ధర్మమూలమ్'** 'సమస్త ధర్మాలకూ వేదమే మూలం'. ఇది మనువు వచనం. ఆ వేదధర్మాన్ని ప్రతిపాదిస్తూ శాసించేది ధర్మశాస్త్రం. జైమిని **"చోదనా లక్షణోఽర్థో ధర్మః"** అని చెప్పాడు. **'చోదన'** మంటే **'పురికొల్పటం, ప్రేరేపించటం'** అని అర్థం. వ్యక్తి చేయదగిన విధుల్ని బోధించేది ధర్మం. ధర్మాలు సామాన్యమనీ, విశేషమనీ రెండు రకాలు. 'అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం' మొదలగునవి సామాన్య ధర్మాలు. 'వర్ణ ధర్మాలు, ఆశ్రమ ధర్మాలు' విశేష ధర్మాలు. ఇవన్నీ వేదాలలో విధి నిషేధాలుగా, కర్తవ్యాకర్తవ్యాలుగా విధింపబడి ఉన్నవి.

ఇంతటి మహోన్నత ధర్మగ్రంథం నేడు అనేక కల్పితాలతో, ప్రక్షిప్తాలతో నిండి వివిధ విమర్శలకు గురౌతున్నది. మూల మనుస్మృతిలో 1226 శ్లోకాలు మాత్రమే ఉంటే అందులో 1459 శ్లోకాలు అనగా సగానికిపైగా ప్రక్షిప్తాలుగా చేరి ధర్మశాస్త్రాన్నే కలుషితం చేసినవి. ఈ కల్పిత ప్రక్షిప్తాలతో కూడిన **'మనుస్మృతి'**ని చదివి నేటి విద్యావంతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అనేక రకాల ఆక్షేపణలతో విమర్శిస్తున్నారు.

19వ శతాబ్దంలో వేదవేదాంగ సర్వశాస్త్ర విశారదుడైన మహర్షి దయానంద సరస్వతి వేదోద్ధరణ చేసి నిత్య సత్యమైన వేద సిద్ధాంతాన్ని ప్రచారం చేయుటకు ఆర్య సమాజాన్ని స్థాపించాడు. మనుస్మృతిని ఆధారంగా చేసుకొని మానవ సమాజంలో గల అనేక దురాచారాలను, ధర్మం పేరుతో, దైవం పేరుతో జరుగుతున్న దురాగతాలను, పురాణేతిహాసాలలో అనేక మతగ్రంథాలలో గల మూఢాచారాలను, అందులోగల సత్యాసత్యాలను విశదపరుస్తూ జగద్విఖ్యాతమైన **'సత్యార్థ ప్రకాశ్'**మను ఉద్గ్రంథాన్ని రచించి సమాజానికెంతో మేలు చేశాడు. ఇందులో 600లకు పైగా మనుస్మృతి శ్లోకాలను ప్రమాణాలుగా స్వీకరించాడు. అటులనే ఋగ్వేదాది భాష్యభూమిక, సంస్కార విధి మొదలగు గ్రంథాలలో కూడా మనుస్మృతి శ్లోకాలనే ప్రమాణంగా స్వీకరించి, ఇందులో ఎన్నో ప్రక్షిప్తాలు చేరినవని విద్వాంసులు వాటిని వెలికి తీసి ఈ విశ్వవిఖ్యాత మానవ ధర్మసంహితను వేదానుకూలంగా పవిత్రీకరించి **'పరిశుద్ధమనుస్మృతి'**ని ప్రపంచానికందించాలని తన గ్రంథాలలో ఆకాంక్షించాడు.

ఇలా ఆర్ష సాహిత్యాన్ని పునరుద్ధరించిన మహర్షి దయానంద సరస్వతి సిద్ధాంతాలకు ప్రభావితులై ఆర్ష గురుకులాలలో వేదశాస్త్రాలనధ్యయనం చేసి **'మనుస్మృతి'** పట్ల మహర్షి వెలిబుచ్చిన అభిప్రాయాన్ని మనస్సునందు నిలుపుకొని వైదిక వ్యాకరణ, దర్శనశాస్త్ర, సాహిత్యాదులలో పారంగతులైన **డా॥ సురేంద్ర కుమార్** (కాంగిడీ విశ్వవిద్యాలయం పూర్వ కులపతి)గారు ఈ మనుస్మృతిని పరిష్కరించదలచి సుమారు 30 సంవత్సరాలు అహోరాత్రాలు పరిశోధించి, పరిశీలించి, హేతుబద్ధంగా అనేక ప్రమాణాలతో తర్కించి హంస **'నీరు గలిసిన పాలను వేరు చేయనట్లు'**గా ప్రక్షిప్తాలను పసిగట్టి, నిక్షిప్తాలను వెలికి తీసి కల్పితాలనే కలుపు మొక్కలను వేరుచేసి అందులోని ధర్మ విశేషాలను వివరించి, వేద మూలసిద్ధాంతాలను సమూలంగా బహిర్గతం చేసి **'మనుస్మృతి'** మహత్త్వాన్ని మరోసారి మానవ లోకానికి చాటి చెప్పుటకు హిందీ భాషలో (బృహద్గ్రంథంగా) భాష్యం రచించారు. ఇప్పుడిది గ్రహణం తొలగిన సూర్యుడిలా, మేఘం తొలగిన చంద్రుడిలా ప్రకాశిస్తున్నది. మనుస్మృతి పట్ల గల అనేక సందేహాలకు సమాధానం దొరకడంతో విమర్శించే వారి

మూతులు మూగబోయాయి. కుతర్కాలు చేసే వారి కుమతులు మారిపోయాయి. ప్రశంసించే వారి మతులు వికసించాయి. వేదాల తర్వాత రెండవ స్థానంలో నిలిచిన మనుధర్మశాస్త్రం వీరి ప్రయత్నంతో మరల తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నది.

మహర్షి దయానంద సరస్వతి వేదోద్ధరణ చేస్తే, **డా॥ సురేంద్ర కుమార్‌గారు** అవిరామ అవిరళ కృషితో **'మనుధర్మ శాస్త్రోద్ధరణ'** చేశారు. ఈ గ్రంథాన్ని వీరు రెండు రకాలుగా ముద్రించారు. ప్రస్తుతం ప్రచారంలో ప్రచులితమైన ప్రక్షిప్త సహిత **'మనుస్మృతి'**ని ఉన్నదున్నట్లుగా శ్లోకాలన్నీ ఇస్తూ వాటి వాస్తవికతలను తర్కము హేతువను గీటురాయిపై పరీక్షించి మూల శ్లోకాలను, ప్రక్షిప్త శ్లోకాలను వేరువేరుగా చూపిస్తూ ప్రక్షిప్త సహిత **'మనుస్మృతి'**ని అందించారు.

రెండవరకంగా కేవలం మూల శ్లోకాలను మాత్రమే తీసుకొని వాటికి వేదానుకూలంగా వివరణ వ్రాసి సత్యసమ్మతంగా **'విశుద్ధ మనుస్మృతి'**ని ముద్రించారు.

నేను ఈ రెండవదైన **'విశుద్ధ మనుస్మృతి'**ని 1992లో తెలుగులోకి అనువదించి ముద్రించితిని. వాటి ప్రతులు ఎప్పుడో సమాప్తమైనవి. నేటికి ముప్పదేళ్ళ కాలం గడిచినది. ఈ ముప్పదేళ్ళ మధ్యకాలంలో వివాహం, విద్యాధ్యయనం, వేదగిరి స్థాపనం, వేద, వేదాంగ, వేదోపాంగ సహిత వేదభాష్యాలను తెలుగులో అనువాదసహితంగా ముద్రించడం, అందులో భాగంగానే ఈ బృహత్ పరిశుద్ధ **'మనుస్మృతి'**ని **శ్రీ సురేంద్ర కుమార్** గారి అనుమతితో తెలుగులోనికి యథాతథంగా అనువదించడం, ముద్రించడం జరిగింది.

ఈ **మనుస్మృతి** పునరుద్ధరణకార్యం మహా సాహసోపేతమైనది. అతి క్లిష్టమైనది. ఇంతటి సంక్లిష్ట కార్యాన్ని **డా॥ సురేంద్ర కుమార్** గారు ఎలా సాధించారో నా ఊహకందకున్నది. తెలుగులో కూడా పది వరకు **'మనుస్మృతి'** గ్రంథాలు లభ్యమవుతున్నవి. అవన్నియూ ప్రక్షిప్తాలతో కూడినవే. వాటినెవరైనా చదివితే **'ఇవి తప్పక తగులబెట్ట దగినవే'** అనిపిస్తున్నది. ఎందుకంటే ఇందులో మూల **'మనుస్మృతి'** కంటే ఎక్కువగా ప్రక్షిప్త శ్లోకాలే ఉన్నవి. ఇందులో ఏవి కల్పితాలో తెలియక పాఠకులు తికమక పడుతూ ఉన్నారు. ఈ ధర్మగ్రంథాభిమానులు ఇందులోని విమర్శనాత్మక విషయాలను సమర్థించలేకపోతున్నారు. నిరసించువారిని అరికట్టలేకపోతున్నారు.

ఇట్టి సందిగ్ధావస్థలో ఈ గ్రంథం సంపూర్ణ పరిష్కారాన్ని చూపిస్తున్నది. వేదాదేశాలను శ్వాసగా అనుశాసించే ఈ గ్రంథానికి కొత్త ఊపిరులు పోసినట్లున్నది. ఇప్పుడిక ఈ పరిష్కృత **'మనుస్మృతి'** పాఠకుల సందేహాలను, అపోహాలను తొలగిస్తుంది. సత్యసనాతన వైదిక ధర్మాలను సమాజంలో పునఃస్థాపితం చేస్తుంది. **సృష్టిని నడిపించేది వేదాలైతే - మానవ సమాజాన్ని ధర్మమార్గంలో నడిపించేవి ధర్మశాస్త్రాలు. ఇట్టి మహోన్నత 'శృతి-స్మృతి' గ్రంథాలను తెలుగు వారికి అందించడం నా పురాకృత భాగ్యమని భావిస్తున్నాను.** ఇంతటి మహామహిమాన్వితమైన మనుధర్మశాస్త్రాన్ని సంపూర్ణ అవలోకనంతో అవగాహనతో పునరుద్ధరించిన డా॥ సురేంద్ర కుమార్ గారికి ఈ బృహద్గ్రంథాన్ని ముద్రించుటకు ముందుకు వచ్చి తమ స్వంత ధనంతో సుందరంగా ముద్రింపజేసి తెలుగుపాఠకుల కందజేస్తున్న గౌరవనియులు **శ్రీ పావులూరి సుబ్బారావుగారికి శ్రీ చిలుముల సత్యారెడ్డిగారికి** మనఃపూర్వకంగా నమస్కరిస్తూ... అనేకానేక కృతజ్ఞతలను తెలుపుతున్నాను.

అనువాదకుడు
-మట్టి కృష్ణారెడ్డి

20 · AI Camera

హిందీ మనుస్మృతి ప్రథమ ప్రచురణ (1981) సందర్భంగా రాయబడిన

మూల రచయిత ముందు మాట

సంపూర్ణ మనుస్మృతికి సంబంధించిన ఈ విస్తృత, పరిష్కృత, కంప్యూటరీ కృత గ్రంథము మీ చేతుల్లో ఉంది. ప్రథమ ప్రచురణ చాలా హడావుడిగా జరిగింది. నాటి నుండి ఎన్నో ఎన్నో ముద్రణలతో పాటుగా మార్పు చేర్పుల పనికూడా జరుగుతూంది. భూమిక ముందుగా ముద్రితమైంది. ప్రక్షిప్తాల తొలగింపు తర్వాత జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఇతర కారణాల వల్ల తొలి ముద్రణలో కొన్ని లోపాలు, పొరపాట్లు జరిగాయి. ఇది మాకు బాధ కలిగించిన విషయం. తరువాతి ముద్రణలలో ఆ లోపాలను సవరించాము. ఇందులో పాఠకులకు ఎన్నో కొత్త విషయాలు అందిస్తున్నాము. భూమికలో మనువు, మనుస్మృతికి సంబంధించిన కొత్త విషయాలపై చర్చించాము. కొత్త దృష్టికోణంతో నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం చేశాము. ప్రక్షిప్తాల తొలగింపులో మనుస్మృతికి అసలైన విలువ కట్టటం చాలా అవసరం. ఆ అవసరం కొరకే ఇదొక ప్రయత్నం. ఈ ముద్రణ పాఠకులకు ఎంతో ఉపయోగకారి అవుతుందని ఆశిస్తున్నాను.

స్మృతులలో లేదా ధర్మశాస్త్రాలలో **'మనుస్మృతి'** అన్నింటినీ మించిన గొప్ప ఆర్షగ్రంథం. మనుస్మృతికి తర్వాతి కాలంలో ఎన్నో స్మృతులు వచ్చాయి. కాని, **'మనుస్మృతి'** వెలుగులో అవి నిలువలేకపోయాయి. మనుస్మృతి వెలుగు మాత్రం నేటికీ పూర్వం వలెనే ఉంది. మనుస్మృతిలో ఒక వైపు మానవ సమాజం కోసం శ్రేష్ఠమైన కుటుంబ కర్తవ్యాల విధానం, మరొక వైపు మానవులకు ముక్తిని ప్రసాదించే ఆధ్యాత్మిక ఉపదేశాలు ఉన్నాయి. ఈ విధంగా మనుస్మృతి భౌతిక, ఆధ్యాత్మిక ఆదేశ-ఉపదేశాల కలయిక గల ఏకైక శాస్త్రంగా విరాజిల్లుతూంది.

అంతేగాకుండా అన్ని ధర్మశాస్త్రాల కన్నా ఇది అతి ప్రాచీనమైనది. సృష్టి ప్రారంభకాలపు శాస్త్రమనే గౌరవం కూడా మనుస్మృతికే దక్కుతుంది. శతపథ, తైత్తిరీయ, కాఠక, మైత్రాయణి, తాండ్య మొదలైన బ్రాహ్మణాలలో మనువును పేర్కొనడం, **"మనుర్వై యత్కించావదత్ తద్ భైషజమ్"**-అంటే 'మనువు చెప్పినవి భైషజ = ఔషధం వలె గుణకారి, కల్యాణకారి అవుతాయి' అని. ఇలాంటి వచనాలు లభించడం, మనుస్మృతిని పై చెప్పిన వైదిక సాహిత్యం కన్నా ప్రాచీనమూ, విశిష్టమూ అయిన ధర్మశాస్త్రంగా నిరూపిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో మనుస్మృతి కాలం సృష్టి ప్రారంభకాలంగా భావించబడింది. అంటే, మనువు మానవులు, మానవ సమాజ మర్యాదలు మొదలైన వ్యవస్థల గురించి మొట్టమొదట ఉపదేశించిన గ్రంథమిది. మనువు వ్యవస్థలు సార్వకాలికమూ, సార్వభౌమికమూ, సత్యమూ, వ్యావహారికమూ అయినవి. దీనికి కారణం మనుస్మృతి వేదమూలకం కావడమే. వేదమూలకం కావడం మనుస్మృతి కున్న మరొక విశేషగుణం. ఈ విశేషగుణం కారణంగానే మనుస్మృతికి అన్నింటినీ మించిన గౌరవం లభించింది. శాస్త్రకారులు మనుస్మృతి ఘనతను నిర్వివాదంగా స్వీకరించి, ఇలా ప్రకటించారు-

మనుస్మృతి విరుద్ధా యా సా స్మృతిర్నప్రశస్యతే ।
వేదార్థోపనిబద్ధత్వాత్ ప్రాధాన్యం హి మనోః స్మృతేః॥ బృహస్పతి స్మృతి,సంస్కారఖండం 13.14

అంటే- మనుస్మృతికి వ్యతిరేకంగా ఉండే ఏ స్మృతి అయినా, ప్రశంస యోగ్యం-పొగడదగింది - కాదు. వేదార్థాలను అనుసరించి వర్ణించినందున, మనుస్మృతే అన్నింటి కన్నా ముఖ్యమూ, ప్రశంసనీయమూ అయినది.

ఈ విధంగా అనేకానేక విశేషాలున్నందున మనుస్మృతి మానవమాత్రుడికి ఉపయోగ కారీ, పఠనీయమూ అయింది, కానీ నేటి కాలంలో ఇంత ఉత్తమమూ, ప్రసిద్ధమూ అయిన ఈ గ్రంథపు పఠన పాఠనాలు లోపించడం శోచనీయ విషయం. దీనిపట్ల జనానికి అశ్రద్ధ కలుగుతూ ఉంది. దీనికి కారణం మనుస్మృతిలో ప్రక్షిప్తాలు విపరీతంగా చోటుచేసుకోవడం. ఈ ప్రక్షిప్తాల వల్లనే మనుస్మృతి ఉజ్జ్వల రూపం మలినంగానూ, వికృతంగానూ మారిపోయింది. పరస్పర విరుద్ధమూ, సందర్భ వ్యతిరేకమూ, పక్షపాతమయమూ అయిన విషయాలతో మనుస్మృతి వాస్తవిక స్వరూపమూ, వైభవమూ కోల్పోయింది. ఒక గొప్ప తత్త్వద్రష్టా, ఋషి యొక్క సాటి లేని శాస్త్రాన్ని, స్వార్థపరులైన ప్రక్షిప్తకులు వివిధ ప్రక్షిప్తాలతో పాడుచేసి, ఈ శాస్త్రానికే కాక మనుమహర్షికీ ఎంతో అన్యాయం చేశారు.

ఈ మనుస్మృతి పరిశోధనకార్యం- భాష్యంలోని విశేషాలు

1. ప్రక్షిప్త శ్లోకాలను పరిశోధనమనే పద్ధతులతో ప్రమాణాలతో సమీక్షించి వాటిని నిర్ధారించుట- ఇదే ఈ ప్రచురణలోని ప్రముఖ ఉద్దేశం. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలనే తప్పులు, మారిన రూపాలు, వికృత రూపాలను తొలగించి అసలైన రూపాలను జనం ముందుకు తేవడమే. అది బజారులో హిందీ, తెలుగు సంస్కృతాలలో టీకాతాత్పర్యాలున్న మనుస్మృతి ప్రతులు వందలాదిగా దొరుకుతున్నాయి. వందల ఏళ్లుగా మనుస్మృతి మీద రచనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ నేటి వరకూ పరిశోధనా దృష్టితోనూ, ఈ విధంగానూ ఏ భాష్యకారుడూ రచించే ప్రయత్నం చేయలేదు.

మహర్షి దయానందుల మాటలతో ప్రేరితుణ్ణై, మార్గ దర్శనం పొంది, మనుస్మృతిలోని ప్రక్షిప్తాల తొలగింపు అనే కఠినమైన, చిక్కులతో కూడిన క్లిష్టమైన ఈ పనికి పూనుకున్నాను. ఎన్నో ఏళ్ల నిరంతర పరిశ్రమకు ఫలితంగా మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించే పని సంపూర్ణమైంది. అయినా ఇది **'అంతిమం'** అనటానికి వీలు లేదు. కానీ, వీలున్నంత వరకు ప్రక్షిప్తాలను తొలగించాను. దీనివల్ల 'మనుస్మృతి'కి పట్టిన వికృతరూపం తొలగింది. ఈ లోపాలు తొలగడంతో మునుపటివలె, ప్రకాశవంతమైన వాస్తవిక రూపంతో మన ముందు నిల్చింది.

ప్రక్షిప్తాలు తొలగించడంలో ఎలాంటి పక్షపాత భావన లేకుండా తటస్థంగా పరిశీలించి, అనేక ఆధారాలతో సమీక్షించి సరియైన పద్ధతులను ప్రమాణాలను అనుసరించి విశేషంగా ఈ గ్రంథాన్ని సాహిత్యలోకాని కందించాను. నేను పరిశోధించిన విధానాలు ఇవి-

అవి- **1. అంతర్విరుద్ధాలు లేదా పరస్పరవిరుద్ధాలు, 2. సందర్భవిరుద్ధాలు, 3. విషయవిరుద్ధాలు లేదా ప్రకరణవిరుద్ధాలు, 4. సంబంధం లేనివి, 5.శైలీవిరుద్ధాలు, 6. పునరుక్తులు- పదే పదే చెప్పినవి, 7. వేదవిరుద్ధాలు.**

ఇన్ని ఆధారాలుగా ఈ కొత్త 'మనుస్మృతి' రూపొందింది.

పూర్తిగా సంస్కరించిన మనుస్మృతిలోని అన్ని శ్లోకాలనూ యథాస్థానంలో యథా క్రమంలో పెడుతూ, ఎక్కడెక్కడ ప్రక్షిప్తాలున్నాయో, ఆధారాలతో పేర్కొంటూ, 'వివరణ' అనే పేరుతో సమీక్షించాను. దీని వల్ల పాఠకులే స్వయంగా అన్నీ తెలుసుకోగలుగుతారు. ప్రస్తుతం బజారులో లభించే 'మనుస్మృతి'లో మొత్తం శ్లోకాల సంఖ్య 2685. నా పరిశోధనలో ప్రక్షిప్తాలుగా తేలిన సంఖ్య, 1471. అంటే 1471 శ్లోకాలు అందులోకి ప్రక్షిప్తాలుగా చేరాయన్న మాట! మిగిలిన 1214 అసలైనవి, మౌలికాలు.

2. విభిన్న శాస్త్రాల ప్రమాణాలతో పరిశీలనకు పుష్టి-బలం-సమీక్ష- ప్రక్షిప్త శ్లోకాల విశ్లేషణ చేయటమే కాకుండా, 600 శ్లోకాలను **'వివరణ'** కిందికి తెచ్చి ఆ శ్లోకాల భావం, వాటిలోని చిక్కులు, వివాదాలు, గుర్తింపులు, ఇతరేతర విచారణీయ అంశాల పైనా దృష్టిపెట్టడం జరిగింది. వీలున్నంత ఎక్కువగా స్పష్టం చేసి, చిక్కులు తీసే ప్రయత్నమూ జరిగింది. ఎన్నో చోట్ల విషయాలను పట్టికల రూపంలో ఇచ్చాను. సమీక్షలో వేదాలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, వ్యాకరణాలు, సూత్రగ్రంథాలు, నిరుక్తం, సుశ్రుత, కౌటిల్యుని అర్థశాస్త్రం మొదలైన వాటి నుంచి ఎన్నో ప్రమాణాలిచ్చి, వాటితో మనువుకున్న సంబంధాల, భావాల సమన్వయాన్ని స్థాపిస్తూ, వాటిని ఇంకా ఎక్కువ ప్రామాణికాలుగా పరిపుష్టం చేశాను. ఎన్నో పదాలకు వ్యాకరణసూత్రాలు ఇచ్చి అర్థాలు కూడా చెప్పాను. కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని తులనాత్మకంగా చెప్పటంలోని ఉద్దేశం, మనువు రచించిన విధివిధానాలు ఎంత కాలం వరకూ విరివిగా ప్రచారంలో ఉన్నాయో చెప్పటానికే !

3. మనువు చెప్పిన వాటితోనే మనువు భావాలకు వ్యాఖ్యానం -పైన చెప్పిన పరిశీలనతో పాటుగా శ్లోకాలు లేదా భావాల వ్యాఖ్య స్పష్టంగా చెప్పటానికి మనువు చెప్పినవాటినే వాడుకునే ప్రయత్నం చేశాను. ఇలాంటి మరికొన్ని విషయాలను మనువే స్వయంగా కొన్ని శ్లోకాలలో అక్కడక్కడా పేర్కొన్నాడు. ఇలాంటి శ్లోకాలను లేదా వాటి సంఖ్యను, వాటికి సంబంధించిన శ్లోకాలతో జోడించి పోల్చటం, సరిచూడటం లేదా వేరొక చోట వ్యాఖ్యానరూపంగా ఇవ్వడం చేశాను. అంతే కాకుండా, శ్లోకాల వ్యాఖ్య మధ్య కూడా ఎన్నో బ్రాకెట్లలో అలాంటి శ్లోకాల సంఖ్యలిచ్చాను. వీటి ద్వారా ఆ శ్లోకాలలోని విషయాలపై దృష్టిపడుతుందని.

4.మనువు మాన్యత ననుసరించి సందర్భోచిత అర్థాలు -పరంపరాగతమైన సంస్కృత, హిందీ భాష్యాలలో కొన్ని శ్లోకాల అర్థాలు ఎలా ఇచ్చారంటే, అవి మనుస్మృతి యోగ్యతకు సరిపోవటమూ లేదు; సందర్భోచితాలూ కావు.

అలాంటివి-1.2,6,22,137;2.19; 3.56 మొదలైనవి. కొన్ని శ్లోకాలలో అయితే వరుస క్రమం కూడా లేదు. అలాంటివి. 1-14,15,16,17,18,19 మొదలైనవి. అందుకనే అన్ని శ్లోకాలనూ, వాటి అర్థాలనూ మనువును అనుసరించి, సందర్భోచితంగా, వరుసక్రమంలో ఉండేవిధంగా చేయబడ్డాయి. వాటి వివరణలో అర్థాలకు బలం చేకూర్చే కారణాలు, యుక్తులు, ప్రమాణాలు ఇచ్చాను. పాఠకులు వాటిని తులనాత్మకంగా పరిశీలించేందుకు. టీకలో ఆ శ్లోకాలకు ప్రచారంలో ఉన్న అర్థాలు కూడా ఇచ్చాను. ఈ భాష్యంలో ఇలాంటి మార్పులు చేసిన అర్థాలున్న శ్లోకాలు దాదాపుగా 54 ఉన్నాయి.

5. భూమికలో మనుస్మృతికి కొత్త పరిశీలన(మూల్యాంకనం)-గ్రంథం ప్రారంభంలో మనుస్మృతికి **'పునర్ మూల్యాంకనం'** అనే పేరుతో విస్తృతమైన ముందు మాట ఉంది. ఇందులో మనుస్మృతికి సంబంధించిన అన్ని ప్రశ్నలు, మనువు - మనుస్మృతి కాలం, మనుస్మృతికి ముందరి, ఇప్పటి రూపాలు, మనుస్మృతిలోని ప్రక్షిప్తాల ప్రమాణం, వాటి పరిభాష - ఉదాహరణపూర్వకమైన విశ్లేషణ, వివరణ మనుస్మృతిలో అధ్యాయ విభజన, మనువు మౌలిక ఘనతలు మొదలైనవాటిపై సహేతుక, ప్రమాణపూర్వక చర్చలు ఉన్నాయి. ఈ విశ్లేషణ అనేక విషయాలపై ఒక కొత్త పరిశీలన.

6. మహర్షి దయానందుల అర్థాలు - భావార్థాలు-మహర్షి దయానందులు తమ గ్రంథాలన్నిటికీ మనుస్మృతినే ఆధారంగా భావించారు. దాదాపు 524 శ్లోకాలు లేదా శ్లోక ఖండాలను ప్రమాణపూర్వకంగా ఉట్టంకించారు. ఎన్నో శ్లోకాలకు కేవలం భావాలనే గ్రహించాను. మహర్షిదయానందులవారు, తమ గ్రంథాలలో మనుస్మృతిలోని ఏ యే శ్లోకాలకు భాష్యం రాశారో, బహుశా అన్ని శ్లోకాలకూ **'దయానందభాష్యం'** పేరిట మహర్షి భాష్యమే ఉంది. ఎక్కడెక్కడ మనువు శ్లోకాలకు కేవలం భావమే మహర్షి గ్రంథాలలో లభ్యమైందో, అక్కడ ఆ యా శ్లోకాలకు ఆ భావాలే సంకలితం చేశాను. మహర్షి దయానంద భాష్యంతో మనువు శ్లోకాల్లోని ఎన్నో చిక్కుముడులు విడిపోయాయి.

7. తొలిసారి హిందీలో టీకాటిప్పణి-మొదటిసారి మొత్తం మనుస్మృతిలోని సంస్కృత పదాలకు హిందీలో అర్థాలు చెప్పబడ్డాయి. దీని వల్ల విద్యార్థులకు మార్గం సుగమం కావటంతో పాటుగా, కాస్త సంస్కృతం తెలుసుకోగలిగే స్వాధ్యాయ పరులైన పాఠకులు కూడా సంస్కృతపదాల జ్ఞానం, మననంతో శ్లోకాల అర్థాలను సులువుగా తెలుసుకోగలుగుతారు. ఈ దృష్టితో ఈ ప్రచురణ జనసామాన్యానికి విశేషంగా ఉపయోగపడుతుంది.

8. అన్ని విషయసూచికలు, సూచీలతో ఉన్నది-ఏ గ్రంథానికైనా విషయసూచికలు చాలా ఉపయోగపడతాయి, సులువుగా తెలుసుకునేలా ఉంటాయి. విద్యార్థులు, పాఠకుల సౌలభ్యం కోసం ఈ ప్రచురణలో ప్రతి శ్లోకానికి రెండు పంక్తుల శ్లోకానుక్రమణిక, వివరణ, సమీక్షలతో చర్చించిన విషయాల సూచి, సంకేతసూచి మొదలైన అవసరమైన సామగ్రినంతా ఇందులో సమీకరించి పెట్టాను.

9. మనుస్మృతిలోని ప్రకరణాల వివరాలు-ముఖ్య వ్యాసాలు లేదా ప్రకరణాల ప్రారంభంలో కాని, చివరలో కాని అందులో ఉన్న విషయాలను సూచించడం మనువు శైలి. మనువు చెప్పిన సంకేతాలను అనుసరించి మనుస్మృతిలో 21 ప్రకరణాలు-ప్రధానాలు అవుతాయి. ఈ ప్రచురణలో యథాతథంగా చెప్పటం, దానితో పాటు శ్లోకాల పరిధిని కూడా చెప్పటం జరిగింది.

10.'విశుద్ధ మనుస్మృతి' పేరిట మరోసారి మౌలిక శ్లోకాల ప్రచురణ-ఈ ప్రచురణలో మూలాలని చెప్పబడిన శ్లోకాలను తీసుకుని, ప్రక్షిప్త శ్లోకాలను తొలగించి ఈ మనుస్మృతిని **'విశుద్ధ మనుస్మృతి'** పేరిట మరొక ప్రచురణ కూడా చేశాను. దీనివల్ల పాఠకులకు మనువు ఉపదేశాలు, ఆదేశాలను వరుసగా చదివిన ఆనందం కలుగుతుంది.

పాఠకులకు మనవి

మనుస్మృతిలోని ప్రక్షిప్తాల తొలగింపు, పరిశీలనకు కొన్ని సాహిత్య ఆధారాలను అనుసరించి చేసే బాధ్యతను స్వీకరించాను. నాకున్న బౌద్ధిక శక్తి మేరకు 25-30 సంవత్సరాల చిన్న వయసులోనే నేను చేసిన ఈ (40 సంవత్సరాల) ప్రయత్నం మీ చేతుల్లో ఉంది. నిస్సందేహంగా ఇది చాలా కఠినమైనది. చిక్కులతో కూడినది. వివాదాస్పదమైనది. ఎప్పుడో జరిగి ఉండవలసిన పని ఇది. అయినా ఎవరూ ఇప్పటివరకు ముందుకు రాలేదు. చిక్కుపనిలో ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎక్కడో లోపాలు, పొరపాట్లు దొర్లుతూనే ఉంటాయి. విద్వాంసులైన పాఠకులు నా ఈ పొరపాట్లను క్షమించి, వాటిని తెలియజేయాలని, తగిన సూచనలిమ్మనీ కోరుతున్నాను. తరువాతి ముద్రణలో వాటిని సరిచేసుకుంటాను.

తేది. 12.1.1981

– సురేంద్ర కుమార్

సంకేత సూచి

అ.అష్టా	అష్టాధ్యాయి
అథర్వ	అథర్వవేదం
ఆప.ధ.	ఆపస్తమ్బ ధర్మసూత్రం
ఆప. శ్రౌ.	ఆపస్తమ్బ శ్రౌతసూత్రం
ఆశ్వ.గృ.సూ.	ఆశ్వలాయన గృహ్యసూత్రం
అ.ఆశ్వ.శ్రౌ.సూ.	ఆశ్వలాయన శ్రౌతసూత్రం
ఉణా	ఉణాదిసూత్రపాఠం
ఉపా.	ఉపాసనావిషయం
ఋ.ఋక్	ఋగ్వేదం
ఋ.దయా.	ఋషి దయానన్ద
ద.ల.సం.భ్రా.ని	దయానన్ద లఘుగ్రన్థ సంగ్రహం-భ్రాన్తినివారణ
ఋ.ద.ప. వి.	ఋషి దయానన్ద పత్ర-విజ్ఞాపన
ఋ.భా.భూ.	ఋగ్వేదాదిభాష్యభూమిక
ఐ.బ్రా.	ఐతరేయ బ్రాహ్మణం
కాఠ.సం.	కాఠక సంహిత
కౌ.అ.కౌట.అర్థ.	కౌటిల్య అర్థశాస్త్రం
ప్ర. అ.	ప్రకరణ, అధ్యాయం
కౌ.బ్రా	కౌషీతకీ బ్రాహ్మణం
కౌషీ.గృ.	కౌషీతకీ గృహ్యసూత్రం
గో.బ్రా.గో.పూ. గో.ఉ.	గోపథ బ్రాహ్మణం, పూర్వార్చిక, ఉత్తరార్చిక
గో.గృహ్య.	గోభిలీయ, గృహ్యసూత్ర
గౌ.ధ.	గౌతమ, ధర్మసూత్ర
తై.ఆ.	తైత్తిరీయ ఆరణ్యకం
తై.బ్రా.తైత్తి	తైత్తిరీయ బ్రాహ్మణం
తై.సం.తైత్తి.సం.	తైత్తిరీయ సంహితా
ద. ల. గ్ర. ఆ.	దయానన్ద లఘుగ్రన్థసంగ్రహం-ఆర్యాభివినయం
ద. ల.గ్ర.గో.	దయానన్ద లఘుగ్రన్థసంగ్రహం గోకరుణానిధి
ద.ల. గ్ర. సం.	దయానన్ద లఘుగ్రన్థసంగ్రహం
ద.ల.సం.పం.	దయానన్ద లఘుగ్రన్థసంగ్రహం-పఞ్చమహాయజ్ఞవిధి
ద. ల. భ్ర.	దయానన్ద లఘుగ్రన్థ సంగ్రహం-భ్రమోచ్ఛేదన
ద. ల. వే.ఖ.	దయానన్ద లఘుగ్రన్థ వేదవిరుద్ధమత ఖణ్డన
ద. శా.సం.	దయానన్ద శాస్త్రార్థ సంగ్రహం
ద. ల.శి.	దయానన్ద లఘుగ్రన్థ శిక్షాపత్రీ-ధ్వాన్తనివారణ
దివా	దివాదిగణం (ధాతుపాఠం)
ని.నిరు.	నిరుక్తం
పార.గృహ్య.	పారస్కర గృహ్యసూత్రం
పూ. ప్ర.	పూనా ప్రవచనం
పూ. మీ.	పూర్వమీమాంస
పం.వి.	పఞ్చమహాయజ్ఞవిధి
ప్ర.పా.	ప్రపాఠకం

చా. చాణ. సూ. : చాణక్యసూత్ర
ఛాన్దో. : ఛాన్దోగ్యోపనిషద్
జై. ఉ. : జైమినీయ ఉపనిషద్ బ్రాహ్మణ.
జై. గృ : జైమిని గృహ్యసూత్రం
తా. తాణ్డ్య. బ్రా. : తాణ్డ్యబ్రాహ్మణం
వాసి. ధ. : వాసిష్ఠ ధర్మసూత్రం
వేదా. సూ. : వేదాన్త సూత్రం
వైశే. వైశేషిక : వైశేషిక దర్శనం
శ. శత. బ్రా : శతపథ బ్రాహ్మణం
స. ప్ర- : సత్యార్థప్రకాశం
యజు : యజుర్వేద సంహిత
సం. వి. : సంస్కారవిధి
సామ : సామవేదం
సూ. : సూక్తం
బృహ. స్మృతి. : బృహస్పతిస్మృతి
బౌధా. ధ. : బౌధాయన ధర్మసూత్రం
బ్రహ్మ. : బ్రహ్మానన్దవల్లీ
భ్వా. : భ్వాదిగణ (ధాతుపాఠం)
మహా. : మహాభారతం
ఆది. : ఆదిపర్వం
భీష్మ : భీష్మపర్వం
శాన్తి : శాన్తిపర్వం
మం. : మణ్డలం
మైత్రా. సం. : మైత్రాయణీ సంహిత
యాజ్ఞ. స్మృ. : యాజ్ఞవల్క్య స్మృతి
యోగ. : యోగదర్శనం
సాంఖ్య : సాంఖ్యదర్శనం

శ్లోకాల క్రమసంఖ్య విషయంలో పాఠకులు తెలుసుకోవలసిన ముఖ్య విషయాలు

ఈ పరిష్కృత గ్రంథంలో ప్రచారంలో ఉన్న శ్లోకాల క్రమసంఖ్యలో కొన్ని మార్పులు చేయబడినవి. దయచేసి పాఠకులు ఈ విషయాన్ని తెలుసుకోవాలి.

1. ప్రథమ, ద్వితీయ, దశమాధ్యాయాలు తప్ప మిగతా అధ్యాయాలలో పరంపరగా ప్రచారంలో ఉన్న క్రమసంఖ్యనే ఇవ్వబడింది. **2.** ప్రథమ, ద్వితీయ, దశమాధ్యాయాల శ్లోక సంఖ్యలు ఈ విధంగా ఇవ్వబడినవి. **అ.** విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ద్వితీయాధ్యాయపు 25 శ్లోకాలు ప్రథమాధ్యాయంలోనికి తీసుకోబడినవి. కావున ప్రథమాధ్యాయం 120 నుండి 144 వరకు వీటికి రెండు రెండు క్రమ సంఖ్యలు ఈయబడినవి. మొదటి సంఖ్య క్రమానుసారంగా నడుస్తున్న సంఖ్య. రెండవ సంఖ్య పెద్ద బ్రాకెట్స్‌లలో ద్వితీయాధ్యాయపు పరంపరాగత సంఖ్యగా ఈయబడినది.

ఆ. ద్వితీయాధ్యాయంలోని రెండుక్రమ సంఖ్యలలో మొదటిది పరిష్కృత సంఖ్య; రెండవది పరంపరగా వస్తున్న క్రమసంఖ్య.

ఇ. దశమాధ్యాయంలో రెండుసంఖ్యలు ఈయబడినవి. మొదటిది ఈ సంస్కరణాను సారంగా, రెండవది పరంపరగా ప్రచారంలో ఉన్న క్రమసంఖ్య **3.** ఈ పరిష్కృత గ్రంథంలో ప్రక్షిప్తాలుగా గుర్తించబడిన శ్లోకాలకు ప్రారంభంలో '*' స్టార్ గుర్తు ఈయబడినది. దీన్ని చూడగానే ఇది ప్రక్షిప్త శ్లోకమని తెలుస్తుంది. స్టార్ గుర్తు లేని శ్లోకాలు మూల శ్లోకాలని గుర్తించాలి. **4.** టిప్పణిలో చూపబడిన ప్రచలిత అర్థం కుల్లూకభట్టు భాష్యానుసారంగా పం. హరగోవింద శాస్త్రి వ్రాసిన టీక ఉదాహరణా ఈయబడినది. **5.** ఇందులో ముఖ్యంగా మూలశ్లోకాలకు ప్రత్యేకమైన సంఖ్యను ఇస్తూ ప్రచారంలో ఉన్న క్రమసంఖ్యానుసారం మూలశ్లోకంతో పాటు ప్రక్షిప్త శ్లోకానికి కూడా వరుససంఖ్య ఈయబడినది. శ్లోకానుక్రమణికను చూడదలచినపుడు ప్రచలిత సంఖ్యతోనే చూడాలి.

అనువాదకుని పీఠిక + భాష్యకారుని భూమిక = మనుస్మృతి గురించి సమస్తము

అనువాదకుని పీఠిక-విషయ సూచిక

రాజు-రాజ్యాంగం అవసరమా? 49
మనువు ప్రతిపాదించిన ధర్మ స్వరూపం 49
మనువు పేరు చారిత్రిక సత్యం 50
స్వాయంభువుని నుంచి వైవస్వతుని వరకు గల 'మనువు వంశం' 50
మనువు అందించిన మహత్తర ప్రసాదం 'మానవ ధర్మ శాస్త్రం'. 51
మనువు పద్ధతి రూపురేఖలు 51
ఎన్నో తరాల నుంచి వస్తున్న మూలధనం ఈ తేజో రాశి గ్రంథం' 52
కర్మ యోగపు తొలి గురువు 52
మనువు సాంస్కృతిక గగనములో గొప్ప దీప స్తంభం 53
రాజర్షి మనువు 53
మనుస్మృతి 56
మనుధర్మం 56
మనువు - దేశం 58
పండితాః సమదర్శినః 59
మనువు చెప్పింది 'ఔషధాలన్నింటికీ ఔషధం' 62
వేదో-ఖిలో ధర్మమూలం 63
అది ఆశ్రమ వ్యవస్థ కాదు, లోకవ్యవస్థ 63
యథా పిండే తథా బ్రహ్మాండే 63
మూడు లేదా నాలుగులోకాలు 64
వేదాలలోని లోక వ్యవస్థ 64
స్వరారోహణం 64
అన్నిటి కన్నా గొప్ప ఆశ్రమం 65
ఆర్యుల ప్రముఖమైన నాలుగు చిహ్నాలు 69
ఆచార్యుని స్వరూపం 69
దండధారణ పరమౌషధం 70
దండధారణా ప్రయోజనం 70
దండశక్తి - ఆశ్రమ వ్యవస్థ 71
దండశక్తి - సామాజిక వ్యవస్థ 71
ఆశ్రమ వ్యవస్థ గొప్పతనం 73

'మనువు-మనుస్మృతి'పై ఆక్షేపణలు కారణాలు, పరిష్కారాలు-75-106

I మనువు ఏర్పరచిన వర్ణవ్యవస్థ వాస్తవిక స్వరూపం-**76-84**

మనువు ఏర్పరచిన వర్ణవ్యవస్థ గుణ-కర్మ-స్వభావాల వల్ల వేదాల ఆధారంగా ఏర్పడింది. 76
వర్ణవ్యవస్థ-కులవ్యవస్థలలోగల భేదము 76
వర్ణాలలో కులాన్ని గూర్చి చెప్పలేదు. 76
మనువును కుల వ్యవస్థాపకునిగా భావించినచో మనుస్మృతి రచనయే వ్యర్థమవుతుంది. 76
వర్ణవ్యవస్థలో వర్ణ పరివర్తనకు ఏర్పాట్లు. 77
నిర్ధారింపబడిన కర్మలను విడిచిపెట్టినచో వర్ణం మారును. 77
మహాభారత కాలం వరకు వర్ణవ్యవస్థ అమలు. 77
వర్ణ మార్పునకు చారిత్రిక ఉదాహరణలు. 77
కులాల వర్ణమార్పిడులు. 78
నాలుగు వర్ణాలలో లభించే సమాన గోత్రాల రహస్యం. 78
వర్ణ వ్యవస్థకు ఆధారమైన తత్త్వాలు. 78
శూద్రుల వర్ణ మార్పిడి వ్యవహారంలో అవకాశం అవసరం. 79
వర్ణవ్యవస్థను గూర్చి సరియైన అంచనా. 80
'మహర్షి మనువు'పై- డా ॥ అంబేద్కర్ చేసిన ఆరోపణలు సరియైనవి కావు 80
మనువు యొక్క వైదిక వర్ణవ్యవస్థ విషయంలో పైన ప్రస్తావించినవానిలో డా ॥ 81
డా॥ అంబేద్కర్ వర్ణవ్యవస్థను కులవ్యవస్థకు జనని అంటారు. 82
వర్ణమును కులవ్యవస్థకు జన్మనిచ్చునదిగ చెప్పి 82
డా॥ అంబేద్కర్ నేటి కులభేదాలు లేని రాజ్యాంగాన్ని 83
మనువు కుల వ్యవస్థను నిర్మించలేదు. 83

ప్రపంచంలో ఏర్పడిన వ్యవస్థలన్నీ నూటికినూరుశాతం 83
పై వాటికంటే కూడా అతి భయావహమైనది 84
వేదాలలో కుల వ్యవస్థ పేరుకు కూడా లేదు. 84
డా॥ అంబేద్కర్ యొక్క మనువిరోధ పరంపరలో మనుస్మృతిని విరోధించే రచయితలందరిలో 84

II మనుస్మృతిలో శూద్రుల స్థితిః 85-89

దళితులు-వెనుకబడిన వర్గాలవారిని మనువు శూద్రులని చెప్పలేదు 85
మనువు చేసిన శూద్ర నిర్వచనం నేటి శూద్రులకు వర్తించదు 85
శూద్రులు అంటరానివారు కారు 86
శూద్రులకు సన్మాన వ్యవస్థలో మొదటి స్థానం 87
శూద్రునకు ధర్మాన్ని పాలించుటలో స్వతంత్రము 87
దండన వ్యవస్థలో శూద్రునకు అందరి కంటే తక్కువ దండన 88
శూద్రులు దాసులు కారు 89
శూద్రులు సవర్ణులే 89

III మనుస్మృతిలో స్త్రీల స్థానం 89-93

మనువునోట ఆర్యనారి కీర్తిగానం **89**
స్త్రీలకు అత్యున్నత గౌరవం 91
పుత్రుడు-పుత్రిక సమానం 91
పుత్రుడు - పుత్రికలకు తండ్రి ఆస్తిలో సమానాధికారం 92
స్త్రీ ధనరక్షణకై విశేష నిర్దేశం 92
స్త్రీలపై జరుగు అత్యాచారాలకు కఠిన శిక్షలు 92
వివాహం చేసుకొనుటలో స్వతంత్రాధికారం 92
ప్రతి ధర్మానుష్ఠానమునందు సహభాగిత్వం తప్పనిసరి 92
స్త్రీలకు అమర్యాద కలిగించే స్వతంత్రతను మనువు సమర్థించలేదు 93

IV మనుస్మృతిలో ప్రక్షిప్తాలు-93-103

మనువు చేసిన వ్యవస్థ 'వైదిక వర్ణ వ్యవస్థ' 94
మనువేర్పరచిన యథా యోగ్యమైన దండన వ్యవస్థ 94
శూద్రుని గూర్చి వ్రాసిన పరిభాష 94
'మనుస్మృతి'యే అసలైన 'భారత రాజ్యాంగం-శిక్షాస్మృతి' 95
నేటి న్యాయ వ్యవస్థపై నా అభిప్రాయం 97
పీఠిక సింహావలోకనం 100
హిందీ భాష్యకారుని ఉద్దేశ్యం 104

మనుస్మృతి భూమిక-విషయ సూచిక

మనుస్మృతి భూమిక-1వ అధ్యాయం

మనుస్మృతి గొప్పతనం, రచయిత, కాలం, తొలిరూపం **107-118**

1. మనుస్మృతి మహత్త్వం 107
అ. భారతదేశంలో మనుస్మృతి ప్రభావం-ఘనత 108
ఆ. విదేశాలలో మనుస్మృతి ప్రభావం- విదేశ విద్వాంసుల 'మను ప్రశంస' 111
ఇ. విదేశీ రచయితల అభిప్రాయంలో మనువే 'తొలి శాసన సృష్టికర్త' 116
ఈ. మనుస్మృతిపై విదేశీ విద్వాంసుల పరిశోధనలు-భాష్యాలు 117
2. మనుస్మృతి మూలప్రవక్త ఎవరు? 118-131
అ. మనుస్మృతి చెప్పినవాడు స్వాయంభువ మనువు 118
ఆ. మనుస్మృతి రచయిత వైవస్వత మనువు 123
ఇ. మనుస్మృతి భృగువు రచన 125
స్టార్ (*) గుర్తు గల శ్లోకాల ప్రక్షిప్తత-విశ్లేషణ 127
ఈ. మనుస్మృతి బ్రహ్మ రచన 129
3. మనువు, మనుస్మృతి-కాల నిర్ణయం 131-133
క. ప్రాచీన భారతీయ సాహిత్యంలో స్వాయంభువ మనువు కాలం 131
ఖ. ఆధునికుల అభిప్రాయాల ప్రకారం స్వాయంభువ మనువు కాలం 133

* మనువు సృష్ట్యాది నాటివాడు 133
* వేదాలలో మనువు పదం 133
4. **నేటి మనుస్మృతి రచనా కాలం** **134-140**
క. ఆధునిక ఆధారాలు-సూచనలు **134**
ఖ. ప్రాచీన ఆధారాలు-సూచనలు 136
* సారాంశం 139
5. **మనుస్మృతి అర్వాచీన మనేందుకు కారణాలు-సమాధానాలు** **141-146**
1. తరువాతి రాజుల పేర్లు 141
2. తరువాతి స్మృతికారులు లేదా ఋషుల పేర్లు 141
3. తరువాతి ప్రాంతాల పేర్లు 141
4. అర్వాచీన పౌరాణిక సిద్ధాంతాల వర్ణన 141
5. మనుస్మృతిలోని విభిన్న జాతుల పేర్లు 143
6. మనుస్మృతిలో ఇతర ధర్మస్మృతుల ఉటంకింపు 143
7. మనుస్మృతి-అందులోని భాష 143
8. మనుస్మృతి తొలి రూపం 144

2వ అధ్యాయం

మనుస్మృతి - ప్రక్షిప్తాలు 147-180
1. **మనుస్మృతిలోని ప్రక్షిప్తాల పరిశీలన ఆవశ్యకత - ఉపయోగాలు** 147
2. **ప్రక్షిప్తం అంటే?** 147
3. **మనుస్మృతిలో ప్రక్షిప్తాలు లేవా?** 147
ప్రాచీన భారతీయ సాహిత్యంలో ప్రక్షిప్తాల ప్రవృత్తి చరిత్ర 154
4. **వివిధ గ్రంథాలలోని ప్రక్షిప్తాల ప్రవృత్తి-మనుస్మృతిలోని ప్రక్షిప్తాల మూలాల ప్రవృత్తులు** 156
1. మనుస్మృతికి గౌరవమూ, ఘనత చేకూర్చే పద్ధతి 158
క. బ్రహ్మకు సంబంధం కలిపే శ్లోకం 158
ఖ. ప్రశంసాపూర్వక ప్రక్షిప్తాలు 158
2. మనువు వ్యక్తిత్వాన్ని అలౌకికంగా రుజువు చేసే ధోరణి 158
3. కీర్తి, గొప్పతనాల కోసం మనుస్మృతితో భృగుమహర్షిని జోడించే రీతి 159
4. మనువు గౌరవాలను వ్యతిరేకించే ధోరణి 159
5. తమకు నచ్చిన గొప్ప విషయాలను ఈ శాస్త్రంలో రుజువు చేసే ధోరణి 159
6. స్వార్థ పూరిత ఉద్దేశాలను సఫలం చేసుకునేందుకు వాటిని చొప్పించే ధోరణి 160
7. పక్షపాతధోరణి 160
8. లేని దాన్ని చేర్చే ధోరణి 160
9. నాగరికత, సంస్థల ధోరణి 161
5. **ప్రక్షిప్తాల పరిశోధన-ప్రమాణాలు** **161-175**
1. విషయ వ్యతిరేకాలు (ప్రకరణ వ్యతిరేకాలు) 164
2. ప్రసంగ వ్యతిరేకాలు 166
3. అంతర్ వ్యతిరేకం (పరస్పర వ్యతిరేకం) 170
4. పునరుక్తులు 173
5. శైలీగత ఆధారం లేదా శైలీ వ్యతిరేకం **175-183**
క. రచనా శైలిలోని తేడాలు 175
ఖ. నిరాధారం, అయుక్తియుక్తాల శైలి 178
గ. అతిశయోక్తులు నిండిన శైలి 179
ఘ. పక్షపాతపు శైలి 179
1. బ్రాహ్మణ వర్గం పట్ల విశేష పక్షపాతం 179
2. స్త్రీల పట్ల వివక్ష 180
3. అంటరానిభావనతో పక్షపాతశైలి 180
4. ద్వేషం, నిందతో కూడిన శైలి 180
5. హెచ్చు తగ్గుల భావనతో పక్షపాత శైలి 180
6. అవాంతర వ్యతిరేకం 180
7. వేద వ్యతిరేకాలు 181
వేదాల ఉద్దేశం 182
6. **ప్రక్షిప్తాల వల్ల కలిగే నష్టం-ప్రమాదం** **183-185**
1. భారతీయ సంస్కృతిలో ఏర్పడిన వికృతి 183
2. రచనా కాలపు అపోహలు 184
3. సాహిత్య పరమైన తక్కువ చూపు 185
4. ప్రామాణికతలో సందేహాలు 185
5. మనువు వ్యక్తిత్వంపై బురద 185
6. మనుస్మృతి పట్ల ద్వేషపు దృష్టికోణం 186

3వ అధ్యాయం

మనువుకున్న ప్రముఖ మౌలిక లక్షణాలు వాటికి ఆధారాలు 187-244

1. మనుస్మృతిలో వర్ణ వ్యవస్థ జన్మ వల్ల కాదు, కర్మ వల్ల **187**

అ. కర్మల ఆధారంగానే వర్ణవ్యవస్థకు గుర్తింపు 187

క. 'బ్రాహ్మణుడు' అనే పేరు కర్మలను బట్టి వర్ణవ్యవస్థ సూచకం. 190

ఖ. 'క్షత్రియ' నామకులు కర్మలను బట్టి వర్ణ సూచన 190

గ. 'వైశ్య' నామకుల కర్మలను బట్టి వర్ణ సూచన 191

ఘ. 'శూద్ర' నామకుల కర్మలను బట్టి వర్ణ సూచన 191

కర్మల వల్ల వర్ణ వ్యవస్థను సాధించే ఇతర ప్రమాణాలు 191

'ఉపనయనం'లో శుద్రుల ప్రసక్తి ఎందుకు లేదు? 197

'బ్రాహ్మణస్య' మొదలైన పదాలకు మను సమ్మతమైన అర్థాలు 198

2. మాంసం తినటం, పశుయజ్ఞాలు పాపం కలిగిస్తాయి. 199

3. మరణించినవారికి శ్రాద్ధం మనుసమ్మతం కాదు 202

అ. జీవించి ఉన్నవారి శ్రాద్ధ కర్మల వర్ణనలు 202

ఆ. మృతుల శ్రాద్ధం గురించి చెప్పినవి 203

1. అంతర్ వ్యతిరేకత-203 **2.** సందర్భ వ్యతిరేకాలు-204 **3.** విషయ వ్యతిరేకాలు 205

4. నియోగ ఆచారం-మనువు చెప్పింది-వైదికమే ! 205

అ. ఈ ఆచారం చెప్పిన చోట్లు 205

1. నియోగం అంటే 205

2. వేదాలలో నియోగ విధానానికి ఇతిహాసాల ప్రమాణం 206

3. దేవర పదానికి అర్థం, ప్రాచీన పరంపరల సంకేతం 206

ఆ. మనుస్మృతిలో ఈ ఆచారపు ఖండన 207

1. విషయ వ్యతిరేకాలు 207

2. పరస్పర వ్యతిరేకాలు 207

ఇ. నియోగ పద్ధతి శాస్త్రీయత-ఐతిహాసిక సమీక్ష 208

క. నియోగ పద్ధతి స్వరూపం 208

ఖ. యూరప్, బైబిల్‌లలో అనివార్యమైన నియోగ పద్ధ 208

గ. ప్రాచీన కాలంలో భారతదేశంలో నియోగ ఆచారం 210

ఘ. భారతదేశంలో నేటికీ నియోగపద్ధతి ఉంది 214

ఙ. మానవ సమాజానికి నియోగ పద్ధతి అపరిహార్యమా? 214

5. స్త్రీల విషయంలో మనువు అభిప్రాయం 215

6. మనుస్మృతిలో వివాహ వయసు 220

7. శూద్రుల పెళ్లి విషయంలో మనువు అభిప్రాయం 224

1. శూద్రులు ఎవరు? 224

2. శూద్రులు అస్పృశ్యులు కారు. 225

3. శూద్రులూ ఆర్యులే 225

4. శూద్రులు దాసులనే విధానం మనువు చెప్పలేదు. 226

5. శూద్రులకు అద్భుతమైన మానవీయ సన్మానం 227

6. శూద్రుడి విషయంలో మనువు దండనీతి 227

7. వేదాలలో వర్ణించిన శూద్రుల పట్ల సద్భావమే మనువు ఆదర్శం 228

8. శూద్రులకు ధర్మపాలనాధికారం 229

9. శూద్రులకు గౌరవం 229

10. శూద్రులు పవిత్రులు 229

8. స్వర్గ నరకాలు 230

9. 'ప్రేతశుద్ధి' మొదలైన ఆడంబరాలు మనువు చెప్పినవి కావు 231

10. వేదాలు చదవక పోవడం లేదా నిర్ధారిత సమయంలో వేదాధ్యయనం విడిచిపెట్టడం, మనుసమ్మతం కాదు. 233

11. ప్రాయశ్చిత్తం- దాని అర్థం, ఉద్దేశం, ఫలం **235**
12. **అస్తుల పంపకం** **235**
రక్షణ భాగం అనే పద్ధతి ఎందుకు? **236**
13. **మనుస్మృతిలో చెప్పిన మనుష్యులలో ఋషులు, దేవతలు, పితరులు** **237**
1. ఋషి ఎవరు? 237
2. దేవతలు ఎవరు? 238
జడ దేవతలు 240
3. పితరులు ఎవరు? 241
4. అసురులు ఎవరు? 242
5. గంధర్వులు ఎవరు? 242
6. రాక్షసులు ఎవరు? 243
7. పిశాచులు ఎవరు? 243
8. దస్యులు ఎవరు? 243
9. ఆర్యులు, అనార్యులు ఎవరు? 244
14. **మనువు-వేదాలు** 244

4వ అధ్యాయం

మనుస్మృతిలో అధ్యాయవిభజన-ప్రకరణాలు **244-250**
1. **మనుస్మృతిలో అధ్యాయ విభజన మౌలికం కాదు.** **245**
క. ఒకటవ, రెండవ అధ్యాయాల విభజనలో మార్పు 246
ఖ. ఎనిమిదవ అధ్యాయం విభజనలో గందరగోళం 247
గ. తొమ్మిదవ అధ్యాయపు విభజనపై చర్చ 248
2. **మనుస్మృతిలోని ప్రకరణాలు-వాటి ముగింపుల నిర్ధారణ** **249**
3. **మనుస్మృతిలో వర్ణాలు, ఆశ్రమాల ధర్మాల వివరణ పద్ధతి** **250**

5వ అధ్యాయం

మనుస్మృతి - దయానంద మహర్షి ప్రక్షిప్త నిర్దేశాలు **251-254**
1. దయానంద మహర్షి పెంచిన మనుస్మృతి గౌరవం 251
2. మహర్షి గ్రహించిన అర్థాలు, భావాలు 252
3. స్పష్టమైన ప్రక్షిప్త సూచనలు 253
4. దయానంద మహర్షి పేర్కొన్న శ్లోకాల ప్రక్షిప్తాంతర్గమనం 254

మనుస్మృతి విషయ సూచిక

మనుధర్మ శాస్త్రము◆మానవ సహిత◆మానవ ధర్మసంహిత

ప్రథమాధ్యాయము

సృష్ట్యుత్పత్తి, ధర్మోత్పత్తి విషయాలు

విషయము **శ్లోక సంఖ్య**

ప్రారంభ భూమిక 1 నుండి 4 వరకు

మహర్షులు మనువును సమీపించుట 1
మహర్షులు వర్ణాశ్రమాల ధర్మాల గురించి మనువును ప్రశ్నించుట 2
మహర్షులకు మనువు ప్రత్యుత్తరం 4

జగదుత్పత్తి విషయం 5-107; 144 వరకు

ఉత్పత్తికి పూర్వం జగత్తు స్థితి 5
జగదుత్పత్తి క్రమము 6

*** ఈశ్వరోత్పత్తి 7-13వ శ్లోకం వరకు**

* ఈశ్వరోత్పత్తి 7
* జలతత్వోత్పత్తి 8
* బ్రహ్మోత్పత్తి 9
* నారాయణ శబ్దార్థము 10
* బ్రహ్మస్వరూప కథనం 11
* అండవిభజన 12
* అండఖండముల నుండి సృష్టిరచన 13
ప్రకృతి నుండి పంచమహాభూతాల సృష్టి 14,15
పంచమహాభూతాల సృష్టివర్ణన 16
* బ్రహ్మశరీరనిర్వచనం 17
సూక్ష్మశరీరంతో ఆత్మసంయోగం 18
సమస్తవినశ్వర ప్రపంచోత్పత్తి 19
పంచ మహా భూతాల-గుణ కథనం 20
వేదశబ్దాల ద్వారా నామకరణం-విభాగం 21
ఉపసంహార రూపంలో సమస్త జగదుత్పత్తి వర్ణన 22
వేదాల ఆవిర్భావం 23
* సమయాదుల ఉత్పత్తి 24,25
ధర్మాధర్మాల-సుఖదుఃఖాల విభాగం 26
సూక్ష్మం నుంచి స్థూలక్రమంలో సృష్టివర్ణన 27
జీవులకు కర్మలతో సంయోగం 28-30
నాలుగు వర్ణాల వ్యవస్థానిర్మాణం 31
* బ్రహ్మ నుండి స్త్రీ పురుషుల ఉత్పత్తి 32
* మనువు పుట్టుక 33
* పదిమంది ప్రజాపతుల పుట్టుక 34,35
* మరల సప్తమనువుల దేవతల సృష్టి 36
* యక్ష మొదలగువారి సృష్టి 37-41
ప్రాణుల ఉత్పత్తి క్రమము 42
జరాయుజ జీవులు 43
అండజములు 44
స్వేదజ-జీవులు 45
ఉద్భిజ జీవులు-ఓషధులు 46
వనస్పతులు-వృక్షాలు 47
గుల్మ-గుచ్ఛ-తృణ-ప్రతాన-వల్లీ మొ॥ 48
వృక్షాలలో అంతశ్చేతన 49
* ప్రపంచగతుల ఉపసంహారం 50
* బ్రహ్మ-అన్తర్ధానం 51
పరమాత్మ జాగ్రత్-సుషుప్తి అవస్థలు 52
పరమాత్మయొక్క సుషుప్త్యవస్థలో జగత్తు యొక్క ప్రళయావస్థ 53,54
* ఈ శాస్త్రాన్ని బ్రహ్మ నుండి పొందు క్రమము 58
* మనువు భృగువుతో ఈ సంహితను బోధించుమని చెప్పుట 59
* భృగువు మునులకు ఇచ్చిన

ప్రత్యుత్తరము 60-63
నిమేషాది కాలపరిమాణం 64
సూర్యుడి ద్వారా రాత్రింబవళ్ళ విభాగం 65
* పితరుల దినరాత్రము 66
దైవీదినరాత్రులు-'ఉత్తరాయణం-దక్షిణాయనం' 67
బ్రహ్మ యొక్క దినరాత్రముల వర్ణన 68
సత్యయుగ పరిమాణం(కృత యుగం) 69
త్రేతా-ద్వాపర-కలియుగ-పరిమాణాలు 70
దేవయుగపరిమాణము 71
బ్రహ్మ యొక్క దినరాత్రుల పరిమాణం 72-73
సుషుస్వ్యా వస్థ నుంచి మేలుకొన్న తరవాత సృష్టి ఉత్పత్తి ప్రారంభం 74
సూక్ష్మ పంచభూతోత్పత్తి క్రమంలో 'ఆకాశ ఉత్పత్తి' వర్ణన 75
వాయు ఉత్పత్తి 76
అగ్ని ఉత్పత్తి 77
జలం, పృథ్వీల ఉత్పత్తి 78
మన్వంతరకాల పరిమాణం 79-80
*యుగాన్ని బట్టి ధర్మ వృద్ధిహ్రాసాలు 81-86
నాలుగు వర్ణాల కర్మల నిర్ధారణ 87
వర్ణధర్మాలు 88
బ్రాహ్మణ వర్ణధర్మాలు 88
క్షత్రియవర్ణ కర్మలు 89
వైశ్యవర్ణ ధర్మాలు-కర్తవ్యాలు 90
శూద్రవర్ణ కర్తవ్యాలు-ధర్మాలు 91
* బ్రాహ్మణుల శ్రేష్ఠత -మహత్వ వర్ణన 92-101
* ఈ శాస్త్రరచనకు ప్రయోజనం 102
* బ్రాహ్మణుడు తప్పక దీన్ని చదవాలి 103
* ఈ శాస్త్రాధ్యయన ఫలం 104-106
* ఈ శాస్త్ర ప్రతిపాద్య విషయం 107

ధర్మోత్పత్తి విషయం-108 నుండి 144 వరకు

సదాచారం పరమధర్మం 108
ఆచారహీనునికి వైదిక కర్మల ఫలప్రాప్తి ఉండదు 109
సదాచారం ధర్మానికి మూలం 110
* మనుస్మృతి అధ్యాయానుసారం విషయసూచి 111-118
* భృగు ద్వారా ఈ శాస్త్రం బోధించబడుట 119
విద్వాంసులు ఆచరించిన ధర్మవర్ణన ప్రారంభం 120
కర్మపాలన విషయంలో సకామత అకామతావివేచనం 121-124
ధర్మానికి మూలాధారం-మూలస్రోతస్సు 125
* వేదం సర్వజ్ఞాన మయం 126
ఆత్మానుకూల ధర్మ గ్రహణము 127
శ్రుతి-స్మృత్యుక్త ధర్మానుష్ఠాన ఫలం 128
శ్రుతి స్మృతుల పరిచయం 129
శ్రుతి-స్మృతులను అవమానించేవాడు నాస్తికుడు 130
ధర్మానికి 4 ఆధారభూత లక్షణాలు 131
ధర్మజిజ్ఞాసలో శ్రుతే పరమప్రమాణం 132
వేదోక్తమైన సర్వవిధానాలు ధర్మమే 133
రెండు ఆదేశాల ఉదాహరణ-నిష్కర్ష 134
* ఈ శాస్త్రాధ్యయనానికి అధికారి 135
బ్రహ్మోవర్తదేశానికి హద్దులు 136
సదాచార లక్షణం 137
* బ్రహ్మర్షి దేశానికి హద్దులు 138
ప్రపంచంలోని మానవులందరూ ఆర్యావర్త విద్వాంసుల నుండి విద్యను నేర్చుకోవాలి 139
మధ్యదేశానికి హద్దులు 140
ఆర్యావర్తదేశానికి హద్దులు 141
ఆర్యావర్తం యజ్ఞీయ దేశం- తద్భినం మ్లేచ్ఛదేశం 142
ద్విజు లెక్కడ నివసించాలి? 143
సృష్ట్యుత్పత్తి-ధర్మోత్పత్తి విషయం సమాప్తం-వర్ణధర్మాల విషయం ప్రారంభం 144

ద్వితీయాధ్యాయము

సంస్కారాలు-బ్రహ్మచర్యాశ్రమవిషయాలు

సంస్కారాలు 2-42వరకు

సంస్కారాల నిర్దేశం-వాటి లాభాలు 1
సంస్కారాల ద్వారా ఆత్మకు చెడు సంస్కారాల నివారణ 2
వేదాధ్యయనం, యజ్ఞం, వ్రతాదుల వల్ల

బ్రహ్మప్రాప్తి 3
జాతకకర్మ సంస్కార విధానం 4
"నామకరణ సంస్కారం" 5
వర్ణానుసారంగా నామకరణం 6,7
స్త్రీల నామకరణ విధి 8
నిష్క్రమణం, అన్న ప్రాశన సంస్కారం 9
ముండన సంస్కారం 10
ఉపనయన సంస్కారం 11
ఉపనయనానికి విశేష సమయం 12
ఉపనయనానికి అంతిమ తిథి 13
ఉపనయనం నుండి పతితులైన వ్రాత్యుల లక్షణం 14
వ్రాత్యులతో సంబంధ విచ్ఛేద కథనం 15
వర్ణానుసారంగా మృగచర్మవిధానం 16
వర్ణానుసారంగా మేఖలావిధానం 17
మేఖలాధారణలో వికల్పము 18
వర్ణానుసారంగా యజ్ఞోపవీత ధారణ 19
వర్ణానుసారంగా దండదరణవిధానం 20
వర్ణానుసారంగా దండముల పరిమాణం 21
వర్ణానుసారంగా దండముల స్వరూపం 22
సంస్కారంలో భిక్షావిధానం 23
భిక్షావిధి 24
భిక్షను ఎవరినడగాలి? 25
గురువుకు భిక్షాసమర్పణ 26
* నాలుగు దిక్కులలో ముఖముపెట్టి భుజించిన దాని ఫలము 27
భోజనానికి ముందు ఆచమన విధానం 28
భోజనసంబంధంలో మనో వైజ్ఞానిక విధానం 29-32
ఆచమన విధి 33-35
యజ్ఞోపవీత ధారణకు మూడు స్థితులు 38
యజ్ఞోపవీతం, మేఖలాదుల పునర్గ్రహణ విధి 39
కేశాంత సంస్కారం 40
బ్రహ్మచారి కర్తవ్యాల వర్ణన 43
బ్రహ్మచారుల కర్తవ్యాలు 44-224 వరకు
ఉపనయనం తర్వాత బ్రహ్మచారి శిక్షావిధానం 44
వేదాధ్యయనానికి ముందు గురువుకు అభివందనం 46
గురువుకు అభివాదనం చేసే విధి (పద్ధతి) 47
అధ్యయనారంభం-సమాప్తివిధి 48
వేదాధ్యయనానికి ఆద్యంతంలో ప్రనవోచ్చారణ విధానం 49
ఓంకారం మరియు గాయత్రీ ఉత్పత్తి 51,52
ఓంకారపూర్వక గాయత్రీ జపానికి ఫలితం 53
* మానసజప శ్రేష్ఠత 61,62
ఇంద్రియ సంయమము 63
ఇంద్రియాల గణన 64-66
పదకొండవ ఇంద్రియం మనస్సు 67
ఇంద్రియాలను నిగ్రహించడం వల్ల కార్య సిద్ధి 68
విషయానుభవం వల్ల కోరికలు అభివృద్ధి అవుతాయి 69
విషయత్యాగమే శ్రేష్ఠం 70,71
విషయాసక్తుడికి సిద్ధి లభించదు 72
జితేంద్రియుడి పరిభాష 73
ఏ ఒక్క ఇంద్రియాన్ని నిగ్రహించకపోయినా కూడా నష్టమే 74
ఇంద్రియనిగ్రహం ద్వారా సర్వార్థసిద్ధి 75
సన్ధ్యోపాసన సమయం: గాయత్రీ జపం 76
సన్ధ్యోపాసనాఫలం 77
సన్ధ్యోపాసన చేయనివాడు శూద్రుడు 78
ప్రతిదినం గాయత్రీ జపవిధానం 79
వేదం-అగ్నిహోత్రాదులకు అనధ్యయనం ఉండదు. 80,81
స్వాధ్యాయఫలం 82
సమావర్తనం వరకు హోమాదికర్తవ్యాలు చేయడం 83
చదువుటకు యోగ్యుడైన శిష్యుడు 84
అడగని వాడికి ఉపదేశం చేయరాదు 85
దుర్భావనాపూర్వక ప్రశ్నకు జవాబీయరాదు 86
ఎవరికి విద్యాదానం చేయరాదు? 87
అయోగ్యులకు విద్యాదాన నిషేధం 88
విద్యాదానసంబంధమైన కథ, నిర్దేశం 89,90
గురువుకు ప్రథమాభివాదనం 92
* విప్రుని శ్రేష్ఠత-అశ్రేష్ఠత 93
గురువుగారి శయ్యమీద ఆసనం మీదగాని కూర్చోరాదు 94
పెద్దలకు అభివందనం చేయడం వల్ల మానసిక

ప్రసన్నత 95
అభివందనం వల్ల ఆయుర్విద్యాయశోబలప్రాప్తి 96
అభివాదన విధి 97
నమస్కారానికి ప్రతినమస్కార విధానం 100
నమస్కారానికి జవాబివ్వని వాడికి నమస్కారం చేయరాదు 101
వర్ణానుసారంగా కుశల ప్రశ్న విధి 102
దీక్షితుడి నామోచ్చారణ నిషేధం 103
పరస్త్రీ నామోచ్చారణ నిషేధం 104
* పరివార సంబంధీకులకు అభివాదనం 105-108
* నాగరికులతో మైత్రీ వ్యవహారం 109
* బాలబ్రాహ్మణుడు కూడా వృద్ధ క్షత్రియులకు తండ్రిలాంటివాడు 110
సన్మానానికి అర్హతలు 111,112
ఎవరు ఎవరికి దారి ఇవ్వాలి? 113
రాజుకంటే స్నాతకుడే అధికమాన్యుడు 114
ఆచార్యుని లక్షణం 115
ఉపాధ్యాయుడి లక్షణం 116
తండ్రే గురువు 117
ఋత్విజుని లక్షణం 118
ఆచార్యుడి గొప్పతనము 119
* ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, పితరుల తులన 120
* తండ్రి కంటే వేదజ్ఞాన ప్రదాత అయిన ఆచార్యుడు గొప్పవాడు. 121,122
ఆచార్యుడిచ్చిన వర్ణనిర్ధారణయే స్థిరమైనది 123
గురువు యొక్క సామాన్య లక్షణం 124
వయోవృద్ధునికంటే, విద్వాంసుడైన బాలకుడే పెద్దవాడు, మాననీయుడు 125
ఈ విషయంలో ఆంగిరసుని దృష్టాంతం 126,127
జ్ఞానాధారంగా-బాలకుడికి-తండ్రికి పరిభాష 128
వయోనిమిత్తం లేకుండా వేదజ్ఞానే శ్రేష్ఠుడు 129
వర్ణాలలో పరస్పర శ్రేష్ఠత్వానికి ఆధారం
130జ్ఞానే పెద్దవాడు 131,132
మూర్ఖజీవితం నిష్ఫలం 133
గురుశిష్యుల వ్యవహారం 134
పవిత్రమనస్సు కలవారికే వైదిక ధర్మఫలితం లభిస్తుంది 135
పరద్రోహం విడిచిపెట్టాలి 136
బ్రాహ్మణుడు- అవమానాన్ని సహించాలి 137
సన్మానం కోరనివాడే సుఖవంతుడు 138,139
ద్విజులకు వేదాభ్యాసం అనివార్యం 140
వేదాభ్యాసమే పరమ తపము 141,142
వేదాధ్యయనం చేయనివాడు శూద్రుడౌతాడు 143
* ద్వితీయజన్మనిరూపణము 144-146
* యజ్ఞోపవీతానికి పూర్వం మంత్రోచ్చారణ నిషేధం 147-149
గురుకులవాసలో బ్రహ్మచారులు పాటించాల్సిన వివిధ నియమాలు 150
బ్రహ్మచారి దైనందిన నియమాలు 151
మద్యమాంసాదుల త్యాగం 152
అంజనం, గొడుగు-చెప్పులు మొ॥వి.వాడరాదు 153
పేకాట-నింద-స్త్రీదర్శనం మొ॥వి నిషేధం 154
ఏకాకిగా (ఒంటరిగా) శయనించడం 155
* స్వప్నదోషానికి ప్రాయశ్చితం 156
భిక్షాసంబంధ నియమం 157
ఎవరిని భిక్ష అడగాలి? 158
ఎవరి గృహాలకు భిక్షకు పోరాదు? 159
పాపకర్మలు చేసేవారిని భిక్ష అడగరాదు 160
సాయంప్రాతః-అగ్నిహోత్రానికి పునః 161
* భిక్ష-యజ్ఞం చేయనివారికి ప్రాయశ్చిత్తం 162,163
* బ్రాహ్మణ బ్రహ్మచారికి భిక్షా సంబంధ సడలింపు 164,165
గురుసమీపంలో ఉన్నప్పుడు-బ్రహ్మచారి మర్యాదలు 166
గురువు ఎదుట సావధానంగా కూర్చోవాలి లేదా నిలబడి ఉండాలి 167
గురువు ఆదేశానుసారంగా నడవాలి 168
గురువు కంటే తక్కువ స్థాయిలో వేషభూషలుండాలి 169
గురువుతో మాట్లాడే పద్ధతి 170-172
గురువు కంటే నిమ్నాసనంలో కూర్చోవాలి 173
గురువును పేరుతో పిలువరాదు 174
గురునింద చేయరాదు 175
* గురునింద ఫలము 176
గురువుకు ఎప్పుడు అభివాదం చేయరాదు? 177

గురువుతో కలిసి కూర్చోడానికి-కూర్చోక పోవడానికి గల నియమాలు. 178
గురువుతో ఎక్కడెక్కడ కూర్చోవచ్చు? 179
గురువు యొక్క గురువుతో గురుసమానమైన ఆచరణ 180
ఇతర అధ్యాపకులతో ఎలా వ్యవహరించాలి? 181
* గురుపుత్రాదులతో వ్యవహారము 182-184
* గురుపత్నులతో వ్యవహారము 185,186
యువతి అయిన గురుపత్ని పాదస్పర్శ చేయరాదు-అందుకు కారణం. 187
యువతి అయిన గురుపత్ని యొక్క చరణస్పర్శవల్ల హాని 188,189
స్త్రీలతో ఏకాంతంగా ఉండరాదు 190
యువతి అయిన గురుపత్నికి అభివందన విధి 191,192
గురుసేవాఫలితం 193
బ్రహ్మచారికి గ్రామనివాస నిషేధం 194
సూర్యోదయాస్తమయముల సమయంలో నిద్రించినచో ప్రాయశ్చిత్తం 195,196
సంధ్యోపాసన విధానం విధి 197
స్త్రీ-శూద్రాదుల యొక్క ఉత్తమాచారం కూడా అనుకరించదగినదే 198
* త్రివర్గ సంబంధ మాన్యతలు 199-212
నిమ్నస్తర వ్యక్తుల నుండి కూడా జ్ఞాన ధర్మాల ప్రాప్తి 213
ఉత్తమ పదార్థాలను అన్ని స్థానాల నుండి గ్రహించవచ్చు 214,215
ఆపత్కాలంలో బ్రాహ్మణేతరుల నుండి కూడా విద్యాధ్యయనం చేయవచ్చు 216-218
* ఆజీవన గురుసేవా ఫలం 219
సమావర్తన సంస్కారంలో గురుదక్షిణ విధానం 220
గురుదక్షిణగా ఇవ్వవలసిన వస్తువులు 221
* గురువు మరణించనపుడు గురుదక్షిణ విధానం 222,223
బ్రహ్మచర్యాశ్రమ పాలన ఫలం 224

తృతీయాధ్యాయము

సమావర్తన-వివాహ సంస్కారాలు-పఞ్చ మహాయజ్ఞ విధాన విషయం

సమావర్తనం 1 నుండి 3 వరకు

బ్రహ్మచర్యం, వేదాభ్యాసకాలం 1
సమావర్తనం ఎప్పుడు చేయాలి 2,3

వివాహ-విషయం 4-66 వరకు

గుర్వాజ్ఞతో వివాహం 4
వివాహయోగ్యకన్య 5
వివాహంలో త్యాజ్యకులం 6,7
వివాహానికి అయోగ్య కన్యలు 8-10
అష్టవిధ వివాహాలు-వాటి పద్ధతులు 20,21
* వర్ణానుసారంగా ధర్మ్య వివాహం 22-26
బ్రాహ్మ స్వయంవర వివాహానికి గల లక్షణం 27
దైవవివాహ లక్షణం 28
ఆర్ష వివాహ లక్షణం 29
ప్రాజాపత్య వివాహలక్షణం 30
ఆసుర వివాహ లక్షణం 31
గాంధర్వ వివాహ లక్షణం 32
రాక్షస వివాహ లక్షణం 33
పైశాచిక వివాహ లక్షణం 34
* ద్విజుల కన్యాదాన విధి 35
* వివాహగుణలాభములు 36-38
ప్రథమ చతుర్వివాహాల వల్ల లాభం 39,40
ద్వితీయ చతుర్విధ వివాహాలు నిందనీయాలు 41
శ్రేష్ఠ వివాహాల వల్ల శ్రేష్ఠ సంతానం, నీచవివాహాల వల్ల నీచసంతతి 42
* సవర్ణ అసవర్ణ కన్యల వివాహ విధి 43,44
ఋతుకాల సంబంధమైన విధానం 45
స్త్రీల స్వాభావిక ఋతుకాలం 46
నిందిత రాత్రులు 47
పుత్ర-పుత్రీ-ప్రాప్త్యర్థం నిమిత్తంగల రాత్రులు 48
పుత్ర-పుత్రికా జన్మలకు కారణం 49
సంయమనం గల గృహస్థులు కూడా బ్రహ్మచారే 50
వరుడి నుండి కన్యాశుల్కం తీసుకోవడం నిషేధం 51,52
ఆర్ష వివాహంలో కూడా గోమిథునం

తీసుకోవడం నిషేధం 53,54
స్త్రీలను గౌరవించే పద్ధతి-దాని ఫలితం 54
స్త్రీలను గౌరవించడం వల్ల గొప్ప లాభం 56
స్త్రీలు శోకగ్రస్తులవడం వల్ల కటుంబాలకు వినాశప్రాప్తి 57,58
స్త్రీలకు సదా సత్కారం జరగాలి 59
పతీపత్నుల పరస్పర సంతోషమే కుటుంబ కల్యాణం 60
పతి-పత్నుల మధ్య కలిగే పారస్పరిక అప్రసన్నత వల్ల సంతానం కలగకపోవడం 61
స్త్రీ ప్రసన్నురాలైతే కుటుంబమంతా ఆనందం 62

పంచమహా యజ్ఞ విధిల 43-82 వరు

పంచమహా యజ్ఞాల విధానం 67
పంచమహా యజ్ఞానుష్ఠానానికి కారణం 68,69
పంచమహాయజ్ఞాల నామాలు-నామంతరాలు70-72
పంచయజ్ఞాలకు మరొకపేరు నామాంతరాలు 73,74
బ్రహ్మయజ్ఞం అలాగే అగ్నిహోత్ర విధానం 75
అగ్నిహోత్రం వల్ల లాభం 76
గృహస్థాశ్రమ మహత్త్వం 77,78
గృహస్థాశ్రమానికి యోగ్యులెవరు? 79,80
పంచయజ్ఞాల ముఖ్యకర్మలు 81
పితృయజ్ఞ విధానం 82
* ప్రితృయజ్ఞ-బలివైశ్వదేవయజ్ఞములలో దేన్ని ఎన్నుకోవాలి? 83
బలివైశ్వదేవ యజ్ఞ విధానం 84-92
* అతిథి యజ్ఞ విధానం 94
* భిక్ష-హవ్యకవ్యముల విధానం 95-98
సజ్జనుల గృహాలలో సత్కారార్థం సదా లభించే వస్తువులు 101
అతిథి లక్షణం 102
ఎవరు అతిథులు కారు? 103
పరగృహంలో భోజనం చేయాలనే భావన వల్ల పాపం 104
ఇంటికి వచ్చిన అతిథిని త్రిప్పి పంపించరాదు105
అతిథి పూజనం సుఖదాయకం, ఆయుర్వర్ధకం, కీర్తిప్రదం 106,107
రెండోసారి భోజనం వండినప్పుడు బలియజ్ఞం అవసరం లేదు 108,109
అతిథులు కాని వారికి భోజనం 113
అతిథుల కంటే ముందుగా ఎవరికి భోజనం పెట్టాలి? 114
గృహస్థదంపతులు అందరిభోజనాల తర్వాత మిగిలినదాన్ని భుజించాలి 116-118
* రాజు మొ॥గు వారి సత్కారం 119-149
శ్రాద్ధకర్మకు తగని బ్రాహ్మణులు 150-169

మృతక శ్రాద్ధ విధానం- తత్సంబంధ నియమము 140-185 వరకు

* అపాఙ్క్తేయ బ్రాహ్మణులకిచ్చిన దానం ఫలితమివ్వదు 170-182
* పాఙ్క్తేయబ్రాహ్మణులు 183-201
* దేవకర్మ కంటే పితృకర్మ శ్రేష్ఠము 202-204
* దేవకర్మ పితృశ్రాద్ధపు విధులు 205-236
* పితరులకు ఎటువంటి అన్నం ప్రాప్తించదు? 237,238
* శ్రాద్ధ సమయపు జాగ్రత్తలు 239-243
* శ్రాద్ధములో ఇతర భాగములు 244-248
* శ్రాద్ధము భోజనపు తర్వాత విధుల 249-266
పితరులకు తృప్తిదాయక అన్న-మాంసాదులు-తృప్తి అవధి 267-280
* త్రైమాసిక శ్రాద్ధ విధానము 281-283
* పితదులకు వసువాదిసంజ్ఞలు 284
గృహస్థులకు రెండే విధాల భోజనవిధానం 285

చతుర్థాధ్యాయము

గృహస్థాన్తర్గత ఆజీవిక-వ్రతపాలన విషయం

ఆజీవిక 1-12 వరకు

ఆయువు రెండోభాగంలో గృహస్థుడు కావాలి 1
గృహస్థుడి జీవిక పరపీడారహితంగా ఉండాలి 2
జీవనయాత్ర సాగించేంత వరకే ధనం నిలవచేసుకోవాలి 3
* ఆజీవికల భేదాలు 4-6
* ధాన్యసంగ్రహభేదాలు 7-10
శాస్త్ర విరుద్ధంగా జీవిక ఉండరాదు. 11
సంతోషము సుఖమూలము-అసంతోషం

దుఃఖమూలము 12

స్నాతక గృహస్థుల వ్రతాలు 13-260 వరకు

గృహస్థులకు సత్త్వగుణవర్ధకాలైన వ్రతాలు 13-14
అధర్మంగా ధనాన్ని నిలవ చేయవద్దు 15
ఇంద్రియాసక్తి నిషేధం 16
స్వాధ్యాయం వల్ల కృతకృత్యత 17
* వయసును బట్టి వ్యవహారము 18
పంచమహా యజ్ఞాల పాలనకు నిర్దేశం 21
* యజ్ఞాలకు వికల్పం 22-24
అగ్నిహోత్ర విధానం 25
* అయనము-ఋతు యజ్ఞము 26-28
అతిథిసత్కారవిధానం 29
సత్కారానికి యోగ్యులు కాని వ్యక్తులు 30
సత్కారానికి యోగ్యులు 31
భిక్ష, బలివైశ్వ దేవముల విధానం 32
* క్షుధావస్థలో రాజు నుండి ధన గ్రహణము 33-34
స్వాధ్యాయంలో తత్పరుడై ఉండాలి 35
* దండకమండలాదులధారణ 36-39
రజస్వలా గమన నిషేధం, దానివల్ల హాని 40,41
రజస్వలకాలంలో సంగమం చేయకపోవడం వల్ల లాభాలు 42
* స్త్రీని ఏ అవస్థలలో చూడరాదు 43,44
* మలమూత్రాది విసర్జనలో విడువదగిన విషయాలు 45-52
* వివిధ త్యాజ్య విషయాలు 53-66
ఏ పశువులపైసవారి చేయాలి-చేయకూడదు? 67,68
* బాలసూర్యాదుల దర్శణనిషేధం 69-78
దుష్టుల సహవాసం చేయవద్దు 79
* శూద్రులకు ఉపదేశాదుల నిషేధం 80-83
* అక్షత్రియ రాజు నుండి దాన గ్రహణ నిషేధం 84-91
* బ్రహ్మముహూర్తంలో జాగరణ 92-93
సంధ్యోపాసనాది నిత్యకర్మల పాలనవల్ల దీర్ఘాయుష్య ప్రాప్తి 93,94
* శ్రావణీ ఉపాకర్మ 95-98
* అనధ్యాయములు 99,100
* వివిధ అధన్యాయాల విధానము 101-127
స్త్రీ సంగమంలో పర్వదిన త్యాగం 128
* భోజనానంతరం స్నానాదుల నిషేధం 129-132
పరస్త్రీ సేవన నిషేధం, ఇంకా త్యాజ్యవ్యక్తులు 133
పర స్త్రీ సంబంధం వల్ల హాని 134
* ఈ మూడింటి నవమానించరాదు 135,136
మనస్సులోకి రాకూడని ఆత్మహీన భావన 137
సత్యాన్ని ప్రియంగా తెలపడం 138
భద్రవ్యవహారముండాలి 139
* ఎప్పుడు ఎవరితో వెళ్ళరాదు? 140
హేళన చేయకూడని వారు 141
* గోవు మొదలగు వాటి మలాలను తాకరాదు 142-144
యజ్ఞసంధ్యాది కార్యాలు 145
యజ్ఞసంధ్యాది కల్యాణకారి కార్యాల వల్ల లాభాలు 146
వేదాభ్యాసమే పరమ ధర్మం 147
వేదాభ్యాస కథనం-తత్ఫలితం 148,149
* వివిధ ధార్మిక చర్చల విషయాలు 150-153
వృద్ధులకు అభివందనపూర్వక,స్వాగతం 154
సదాచార ధర్మ ప్రశంస-తత్ఫలం 155,156
దురాచారాల వల్ల హాని 157,158
పరవశకార్యాల త్యాగం 159
సుఖ-దుఃఖ లక్షణం 160
ప్రసన్నతను కలిగించే కర్మనే చేయాలి 161
తల్లి-తండ్రి ఆచారాదులను హింసించరాదు 162
నాస్తికత్వం, వేద నింద మొ॥ నిషిద్ధ కర్మలు 163
కేవలం శిక్షణార్థమే శిష్యుణ్ణి దండించాలి 164
* బ్రాహ్మణ హింస వల్ల నరకప్రాప్తి 165-169
అధర్మం నిందనీయం-తత్ఫలం దుఃఖప్రాప్తి 170-174
సత్య ధర్మాలను పాటించండి 175
ధర్మవర్జిత అర్థకామాలను వదలాలి 176
చపలత్వాన్ని త్యజించు 177,178
వివాదం చేయదగని వ్యక్తి 179,180
* వివాదం చేయనందు వల్ల పాప నివృత్తి 181-185
దానాన్ని ఆశించరాదు 186
దానాల విధులు 187

* అవిద్వాంసుడు దానం తీసుకొని నష్టపోతాడు 188,189
దానం తీసుకోడానికి అనధికారులు 3 రకాలు 190
* అవిద్వాంసుడు దానగ్రహణానికి భయపడాలి 191
బైడాలవ్రతుని లక్షణం 195
బక వ్రతికుడి లక్షణం 196
* ఛలకపట బ్రాహ్మణులకు దాన ఫలితం 197-200
ఇతరులు స్నానం చేసిన నీటిలో స్నానం చేయరాదు 201
* ఇతరుల సాధనాలవల్ల పాపం 202
ఏ నీటిలో స్నానం చేయాలి 203
యమముల సేవించడంలో ప్రాధాన్యం 204
* అభక్ష్యభోజనం 205-226
దానధర్మ పాలన కథనం 227
* అడిగినప్పుడు దానం తప్పక ఇవ్వాలి 228
* వివిధ దానాల ఫలం 229-232
* "వేదజ్ఞానదానం-సర్వశ్రేష్ఠం 233
ధర్మసంచయ విధానం-ధర్మప్రశంస 238-243
ఉత్తముల సహవాసం చేయండి 244-245
స్వర్గప్రాప్తికి సహాయకగుణాలు 246
* దానగ్రహణ సంబంధ విషయాలు 247-254
అబద్ధమాడే వాడు పాపి 255-256
యోగ్య పుత్రుడికి గృహకార్యాలను సమర్పించడం257
ఆత్మచింతన కోసం ఆదేశం-తత్ఫలితం 258
విషయోపసంహారం 259,260

పంచమాధ్యాయము

గృహస్థాన్తర్గత-భక్ష్యాభక్ష- దేహశుద్ధి- ద్రవ్యశుద్ధి స్త్రీధర్మవిషయాలు

భక్ష్యాభక్ష 1-56 వరకు
* ఋషులు భృగువును ప్రశ్నించుట 1-4
ద్విజులకు అభక్ష (తినకూడని) పదార్థాలు 5-9
భక్ష్య పదార్థాలు 10-25
* మాంసభక్షణానికి అనేక విధులు 26
భక్ష్యాభక్ష్య మాంసవిచారం 27-44
హింసామూలకమవడంవల్ల మాంసభోజనం నింద్యమే 45-50
మాంసభక్షణ ప్రసంగంలో 8 రకాలైన పాపుల గణన 51-56
గృహస్థాంతర్గత దేహశుద్ధి విషయం. 57-110
దేహశుద్ధి 57
* అశుద్ధి సమయము 58-63
* సమీపస్థ బంధువుల శుద్ధివిధి-అవధి 64-74
* విదేశస్థ బాంధవుల శుద్ధి-అవధి 75-79
* ఇతర అశుద్ధుల శుద్ధి విధి 80-90
* ఏ వర్ణ మృతక శరీరాన్ని ఏ దిశగా తీసుకువెళ్ళాలి? 92
* రాజులకు అశుద్ధి ఉండదు 93-99
* అసపిండుల ప్రేతశుద్ధి 100-104
దేహధారుల శుద్ధికారక పదార్థాల గణన 105
అర్థశౌచమే సర్వోత్తమశుద్ధి 106
ధర్మాచరణం వల్ల వివిధ శీలదోషాలకు శుద్ధి 107,108
శరీర-మనో-ఆత్మ-బుద్ధులశుద్ధి 109,110
ద్రవ్యశుద్ధి విషయం **111-146** వరకు
పాత్రల శుద్ధి 111-117
అన్య వస్త్రాది పదార్థాల శుద్ధి 118-126
* శుద్ధ, అశుద్ధ వస్తువుల గణన 127-131
* శరీరాంగాల మలశుద్ధి 132-136
* బ్రహ్మచారుల, సన్న్యాసుల శుద్ధి ప్రకారం 137
* విభిన్న విధాల అశుద్ధుల శుద్ధి ప్రకారం 138-146
గృహస్థాంతర్గత-పత్నీధర్మ విషయం 147-166 వరకు
* స్త్రీ ధర్మం 147,148
తండ్రికి-భర్తకు-పుత్రునికి దూరంగా ఉన్న స్త్రీకి-హాని జరుగుతుందనే భయం 149
భార్యలో ఉండాల్సిన గుణాలు 150
భర్తకు చేయాల్సిన సేవా శుశ్రూషలు 151
వివాహానంతరం భార్య మీద భర్తకు గల అధికారం 152
* భార్యసంబంధ విషయాలు 153-162
పూర్వపతిని విడిచిపెట్టి రెండో పతిని స్వీకరించడం నిందనీయం 163-164
పత్యనుకూలాచరణం వల్ల పత్నికి అధిక గౌరవం 165-166

స్త్రీ మరణించినట్లయితే యజ్ఞం ద్వారా అగ్ని సంస్కారం 167-168
ఉపసంహారం 169

షష్ఠాధ్యాయము

వానప్రస్థ-సన్యాస-ధర్మ విషయం

వానప్రస్థ విషయం 1-32 వరకు

వానప్రస్థాన్ని అవలంబించడం 1
వానప్రస్థధారణ సమయం 2
వానప్రస్థధారణ విధి 3-4
వానప్రస్థుడికి పంచ మహాయజ్ఞ విధానం 5-6
అతిథి యజ్ఞం-బలివైశ్వదేవ యజ్ఞ విధానం 7
బ్రహ్మయజ్ఞ విధానం 8
అగ్నిహోత్ర విధానం 9
విశేష యజ్ఞాలను నిర్వహించడం 10
బలివైశ్వ దేవయజ్ఞ విధానం 11-12
పవిత్ర భోజనం చేయండి! 13
అభక్ష్య పదార్థాలు 14-15
వానప్రస్థుడు గ్రామోత్పన్న పదార్థాలను తినరాదు 16-25
సాంసారిక సుఖాలలో ఆసక్తుడు కాకుండా బ్రహ్మచర్యాన్ని పాటించాలి 26
తాపసికుల గృహాలనుండే భిక్షాగ్రహణం 27,28
ఆత్మశుద్ధి కోసం వేదమంత్రాల మననం 29-21

సన్న్యాస ధర్మ విషయం 33-85 వరకు

సన్న్యాస గ్రహణ విధానం 33-35
సన్న్యాసధారణ 36,37
గృహస్థాశ్రమం నుండి కూడా సన్న్యాసం తీసికోవచ్చు 38-40
పూర్ణ వైరాగ్యంతో నేరుగా సన్న్యాసాన్ని స్వీకరించవచ్చు 41
సన్న్యాసి ఏకాకిగా పర్యటించాలి 42
సన్న్యాసి నిర్లిప్త భావనతో గ్రామంలో భిక్షను స్వీకరించాలి 43-44
జనన మరణాలపై సమదృష్టి 45
పవిత్ర సత్యాచరణ చేయాలి 46
అవమానాన్ని సహించాలి 47
క్రోధాదులను చూపరాదు 48
ఆధ్యాత్మిక ఆచరణలో స్థిరంగా ఉండాలి 49
* భోజనం కొరకు పాఖండం చేయరాదు 50-51
ముండన పూర్వక కాశాయ వస్త్రాలను ధరించాలి 52-54
ఒకసారి మాత్రమే భిక్ష అడగాలి 55,56
భిక్ష లభించనపుడు దుఃఖపడరాదు 57
నిందా ప్రశంసలకు దూరంగా ఉండాలి 58
ఇంద్రియాలను నియంత్రించి, మోక్షానికి సమర్థతను పెంచుకోవాలి 59-60
మానవ జీవనంలో దుఃఖమయ స్థితిగతులకు చెందిన చింతన 61-63
అధర్మం వల్ల దుఃఖం, ధర్మం వల్ల సుఖం 64
యోగం ద్వారానే పరమాత్మ దర్శనం 65
దూషించిన పరిస్థితులలోనూ ధర్మపాలన ముఖ్యం 66
ధర్మాచరణ లేకుండా కేవలం బాహ్యాడంబరంతో శ్రేష్ఠఫలితముండదు 67-69
ప్రాణాయామం తప్పనిసరి 70
ప్రాణాయామం వల్ల ఇంద్రియాల దోషక్షయం 71
ప్రాణాయామ ప్రత్యాహార, ధారణలతో దోషక్షయము 72
ధ్యానం వల్ల పరమాత్మ జ్ఞానం 73
యథార్థజ్ఞానంతో కర్మబంధన వినాశం 74
అహింసాది వైదిక కర్మల ద్వారా పరమాత్మ పద ప్రాప్తి 75
* అపవిత్ర శరీర త్యాగం 76-79
ఆశలేనివానికే సుఖం, మోక్షప్రాప్తి 80
పరమాత్మలో స్థానం 81-83
పరమాత్మయే సుఖస్థానం 84
ఉపసంహారము 85,86
ఆశ్రమ ధర్మ సమాప్తికి ఉపసంహారం 87
ఆశ్రమధర్మపాలన వల్లనే మోక్షమార్గంలో ప్రగతి 88
గృహస్థుడి శ్రేష్ఠత్వం 89
గృహస్థుడు సముద్రం లాంటి వాడు 90,91
ధర్మానికి పది లక్షణాలు 92
దశలక్షణాత్మక ధర్మపాలనవల్ల ఉత్తమ గతి 93-96
ఆశ్రమ ధర్మాల బ్రాహ్మణ ధర్మాల ఉపసంహారం 97

సప్తమాధ్యాయము

స్త్రీ మరణించినట్లయితే యజ్ఞం ద్వారా అగ్ని సంస్కారం 167-168
ఉపసంహారం 169

షష్ఠాధ్యాయము

వానప్రస్థ-సన్యాస-ధర్మ విషయం

వానప్రస్థ విషయం 1-32 వరకు

వానప్రస్థాన్ని అవలంబించడం 1
వానప్రస్థధారణ సమయం 2
వానప్రస్థధారణ విధి 3-4
వానప్రస్థుడికి పంచ మహాయజ్ఞ విధానం 5-6
అతిథి యజ్ఞం-బలివైశ్వదేవ యజ్ఞ విధానం 7
బ్రహ్మయజ్ఞ విధానం 8
అగ్నిహోత్ర విధానం 9
విశేష యజ్ఞాలను నిర్వహించడం 10
బలివైశ్వ దేవయజ్ఞ విధానం 11-12
పవిత్ర భోజనం చేయండి! 13
అభక్ష్య పదార్థాలు 14-15
వానప్రస్థుడు గ్రామోత్పన్న పదార్థాలను తినరాదు 16-25
సాంసారిక సుఖాలలో ఆసక్తుడు కాకుండా బ్రహ్మచర్యాన్ని పాటించాలి 26
తాపసికుల గృహాలనుండే భిక్షాగ్రహణం 27,28
ఆత్మశుద్ధి కోసం వేదమంత్రాల మననం 29-21

సన్న్యాస ధర్మ విషయం 33-85 వరకు

సన్న్యాస గ్రహణ విధానం 33-35
సన్న్యాసధారణ 36,37
గృహస్థాశ్రమం నుండి కూడా సన్న్యాసం తీసికోవచ్చు 38-40
పూర్ణ వైరాగ్యంతో నేరుగా సన్న్యాసాన్ని స్వీకరించవచ్చు 41
సన్న్యాసి ఏకాకిగా పర్యటించాలి 42
సన్న్యాసి నిర్లిప్త భావనతో గ్రామంలో భిక్షను స్వీకరించాలి 43-44
జనన మరణాలపై సమదృష్టి 45
పవిత్ర సత్యాచరణ చేయాలి 46
అవమానాన్ని సహించాలి 47
క్రోధాదులను చూపరాదు 48
ఆధ్యాత్మిక ఆచరణలో స్థిరంగా ఉండాలి 49
* భోజనం కొరకు పాఖండం చేయరాదు 50-51
ముండన పూర్వక కాశాయ వస్త్రాలను ధరించాలి 52-54
ఒకసారి మాత్రమే భిక్ష అడగాలి 55,56
భిక్ష లభించనపుడు దుఃఖపడరాదు 57
నిందా ప్రశంసలకు దూరంగా ఉండాలి 58
ఇంద్రియాలను నియంత్రించి, మోక్షానికి సమర్థతను పెంచుకోవాలి 59-60
మానవ జీవనంలో దుఃఖమయ స్థితిగతులకు చెందిన చింతన 61-63
అధర్మం వల్ల దుఃఖం, ధర్మం వల్ల సుఖం 64
యోగం ద్వారానే పరమాత్మ దర్శనం 65
దూషించిన పరిస్థితులలోనూ ధర్మపాలన ముఖ్యం 66
ధర్మాచరణ లేకుండా కేవలం బాహ్యాడంబరంతో శ్రేష్ఠఫలితముండదు 67-69
ప్రాణాయామం తప్పనిసరి 70
ప్రాణాయామం వల్ల ఇంద్రియాల దోషక్షయం 71
ప్రాణాయామ ప్రత్యాహార, ధారణలతో దోషక్షయము 72
ధ్యానం వల్ల పరమాత్మ జ్ఞానం 73
యథార్థజ్ఞానంతో కర్మబంధన వినాశం 74
అహింసాది వైదిక కర్మల ద్వారా పరమాత్మ పద ప్రాప్తి 75
* అపవిత్ర శరీర త్యాగం 76-79
ఆశలేనివానికే సుఖం, మోక్షప్రాప్తి 80
పరమాత్మలో స్థానం 81-83
పరమాత్మయే సుఖస్థానం 84
ఉపసంహారము 85,86
ఆశ్రమ ధర్మ సమాప్తికి ఉపసంహారం **87**
ఆశ్రమధర్మపాలన వల్లనే మోక్షమార్గంలో ప్రగతి 88
గృహస్థుడి శ్రేష్ఠత్వం 89
గృహస్థుడు సముద్రం లాంటి వాడు 90,91
ధర్మానికి పది లక్షణాలు 92
దశలక్షణాత్మక ధర్మపాలనవల్ల ఉత్తమ గతి 93-96
ఆశ్రమ ధర్మాల బ్రాహ్మణ ధర్మాల ఉపసంహారం 97

సప్తమాధ్యాయము

రాజధర్మ-విషయం-1-35 వరకు

రాజునియుక్తి మరియు సిద్ధి

రాజుకావడానికి అధికారి ఎవరు? 2
రాజు కావలసిన అవసరమేమిటి? 3
రాజుకు ఉండాల్సిన ఎనిమిది (8) విశిష్ట గుణాలు 4
రాజు దివ్యగుణాల వల్ల ప్రభావశాలి. 5-12
రాజును అవమానించరాదు 13
దండన విధాన విధి 14-16
* దండన మహత్త్వం 17-18
న్యాయానుసారమైన దండనే హితకారి 19
* దండన లేనిచో హాని 20-25
దండించడానికి అధికారం గల రాజు ఎవరు? 26
అన్యాయమైన దండన ప్రయోగం వల్ల రాజుకు వినాశనం 27-32
న్యాయానుసార దండన విధానం వల్లనే రాజుకు కీర్తి ప్రతిష్ఠలు 33
న్యాయవిరుద్ధాచరణ వల్ల రాజుకు అపకీర్తి 34-35
రాజు దినచర్య-భృత్యుడి నియుక్తి విధానం 36
రాజు వేదవేత్తలైన ఆచార్యుల నియంత్రణలో ఉండాలి 37
రాజు వేదవేత్తలైన శిక్షకులను ఆదరిస్తూ, సత్కరిస్తూ ఉండాలి 38
రాజు వేదవేత్తల నుండి క్రమశిక్షణ అనుశాసనం నేర్చుకోవాలి 39
* అనుశాసన విహీనరాజుల వినాశనానికి ఉదాహరణ 40-42
రాజు విద్వాంసుల నుండి విద్యలను నేర్చుకోవాలి 43
జితేంద్రియుడైన రాజు మాత్రమే ప్రజలను వశపరచుకోగలడు. 44
వ్యసనాలెన్ని? 45,46
కామజ వ్యసనాలు-10 (పది) 47
క్రోధజ వ్యసనాలు-8 48
ఈ వ్యసనాలన్నింటికి మూలం లోభం 49
కామజ-క్రోధజ గుణాలలో-అధిక కష్టదాయక వ్యసనాలు 50-52
వ్యసనం మృత్యువు కంటే భయంకరమైనది 53
మంత్రుల నియుక్తి-వారి లక్షణాలు 54
రాజుకు సహాయకుల అవసరానికి కారణం 55
* మంత్రులతో మంతనాలు చేయాలి 56-59
అవసరాన్ననుసరించి ఇతర అమాత్యుల నియుక్తి 60,61
అమాత్యులకు కావలసిన సహాయకాధికారుల నియుక్తి 62
ప్రధాన దూతను రాయబారిగా నియమించడం 63
శ్రేష్ఠదూత లక్షణాలు 64,65
దూత విధులు (కర్తవ్యాలు) 66-68
రాజు నివాసస్థానం ఎలా ఉండాలి? 69
ఆరు(6) రకాలుగా దుర్గ (కోట) నిర్మాణం 70
పర్వత దుర్గపు గొప్పతనం 71-73
దుర్గ మహత్త్వం 74,75
రాజు నివాసగృహం (రాజభవనం) 76
రాజుకు వివాహయోగ్యమైన భార్య 77
పురోహితుణ్ణి ఎన్నుకోవడం, అతని కర్తవ్యాలు 78-80
విభిన్నాధ్యక్షుల నియుక్తి 81
రాజు స్నాతక విద్వాంసులను సత్కరించాలి 82-86
యుద్ధానికి వెళ్ళడం- యుద్ధసంబంధమైన వ్యవస్థ 87-90
యుద్ధంలో ఎవరిని చంపకూడదు? 91-93
యుద్ధం నుండి పారిపోయేవాడు అపరాధియే అవుతాడు 94-96
జయించిన ధనం నుండి రాజుకు కొంత ఇవ్వాలి 97.98
రాజు ఆలోచించాల్సిన విషయాలు 99-110
రాజు ప్రజలను పీడించరాదు 111
ప్రజాశోషణము వల్ల హాని కలుగుతుంది 112
రాష్ట్ర నియంత్రణోపాయాలు 113
నియంత్రణ కేంద్రాలు-రాచకార్యాలయాల ఏర్పాట్లు 114
చిన్న అధికారుల నియుక్తి 115-120
నగరంలో సచివాలయ నిర్మాణం 121
ప్రభుత్వోద్యోగుల కార్యకలాపాలను గమనించుట 122
లంచాలు తీసుకునే ప్రభుత్వాధికారులపై దృష్టి 123
లంచగొండి ఉదోగ్యులకు దండన 124

ఉద్యోగస్థుల వేతన నిర్ధారణ 125-132
* బ్రాహ్మణులకు పన్నువేయరాదు 133-138
* పన్ను వసూలుతో అత్యాశహానికరాకం 139-144
రాజుల దైనందిన కర్తవ్యాలు 145
సభలోకి వెళ్ళి ప్రజల కష్టాలను వినాలి 146
రాజ్య సంబంధమైన ఆలోచనలు చేయాల్సిన స్థానములు 147
మంత్రాలోచనాన్ని రహస్యంగా ఉంచడం 148-150
ధర్మార్థకామాల గురించి ఆలోచించాలి 151
ధర్మార్థకామముల మధ్య విరోధముండరాదు 152
రాయబారుల గుప్తచారుల ఆచరణలను పరికించడం 153
అష్టవిధాలైన కర్మలను గురించి ఆలోచన 154
రాజ్యమండలం విచారించాల్సిన 4 మూల ప్రకృతులు 155
రాజ్యమండలం ఆలోచించాల్సిన 8 ఇతర మూల ప్రకృతులు 156
రాజ్యమండలం యొక్క ప్రకృతుల 72 భేదాలు 157
శత్రు-మిత్ర-తటస్థుల లక్షణం 158,159
సంధి-విగ్రహాది షాడ్గుణ్య వర్ణన 160,161
సంధి-వాటిలో భేదాలు 162,163
విగ్రహం దాని భేదాలు 164
యానం దాని భేదాలు 165
ఆసనం దాని భేదాలు 166
ద్వైధీభావం దాని భేదాలు 167
సంశ్రయం దాని భేదాలు 168
సన్ధి చేసుకొను సమయం 169
విగ్రహమునకు సమయం 170
యానమునకు సమయం 171
ఆసనమునకు సమయం 172
ద్వైధీభావమునకు సమయం 173
సంశ్రయమునకు సమయం 174-179
రాజనీతి యొక్క నిష్కర్ష 180
ఆక్రమణకు వెళ్ళడం-వ్యూహరచనా వ్యవస్థ 181-185
ఆక్రమణ సమయంలో శత్రువులు-శత్రుమిత్రుల విషయంలో విశేష దృష్టి ఉంచడం 186
వ్యూహరచనలు 187-193
సేనకు ఉత్సాహ వర్ధనం 194
శత్రురాజును పీడించడానికి ఉపాయాలు 195,196
శత్రురాజుల అమాత్యులలో భేదాలను సృష్టించడం 197-200
రాజుకు విజయానంతరం కర్తవ్యం 201
ఓడిపోయిన రాజు ద్వారా ప్రతిజ్ఞాపత్రం రాయించడం 202-207
మంచిమిత్రుడు అన్నింటికంటే గొప్పబలము 208
ప్రశంసనీయ మిత్రరాజు లక్షణం 209
కష్టదాయక శత్రు లక్షణం 210
తటస్థుల లక్షణం 211
ప్రభువుకు అన్నిటి కంటే ఆత్మరక్షణ చాలా ముఖ్యం 212-215
మంత్రణ-శస్త్రాభ్యాసమయిన మీదట భోజనార్థం అంతఃపురానికి పోవడం 216
రాజుసుపరీక్షిత భోజనమునే చేయాలి 217-219
ఖాద్య పదార్థాలతో సహా ఇతర ప్రయోజ్య సాధనాలతో జాగ్రత్త 220
భోజనానంతరం విశ్రాంతి- రాజకార్యాలచింతన 221
సైనికుల, శస్త్రాస్త్ర నిరీక్షణం 222
సన్ధ్యోపాసన, గుప్తచారుల ప్రతినిధుల నుండి సందేశాలు వినడం 223
గుప్తచరులతో ఆలోచించిన తరవాత సాయంకాల భోజనార్థం అంతఃపురానికి వెళ్ళడం. 224
రాత్రి శయనకాలం 225,226

అష్టమాధ్యాయము

రాజధర్మాంతర్గత వ్యవహార నిర్ణయము 1-251
రాజు న్యాయసభలో ప్రవేశించుట 1
న్యాయసభలో-వివాద విషయాలను చూడాలి 2
18 విధాలైన వివాదలు (దావాలు) 3-8
ప్రభువులేనప్పుడు- వివాదాలను నిర్ణయించడానికి ఒక ముఖ్యమైన న్యాయాధీశుణ్ణి నియమించడం 9
ముఖ్యన్యాయాధీశుడు ముగ్గురు విద్వాంసులతో కలిసి, న్యాయ నిర్ణయం చేయాలి 10
న్యాయసభకు పరిభాష 11
వివాదాలను పరిష్కరించడం, నిర్ణయించడంలో ధర్మ రక్షణే ప్రేరణగా ఉండాలి 12
న్యాయ సభలో న్యాయమే చెప్పాలి. న్యాయాన్నే

నిర్ణయించాలి 13
అన్యాయం చేసే న్యాయసభా సభ్యుడు మృతకుడితో సమానం 14
చంపబడిన ధర్మం చంపినవాడినే చంపుతుంది 15
ధర్మహంతకుడు 'వృషలు'డని పిలువబడతాడు 16
ధర్మమే పరజన్మలో కూడా తోడుగా ఉంటుంది 17
అన్యాయం వల్ల సభాసదులందరూ నిందలపాలవుతారు 18
యథాయోగ్యమైన వ్యవహారం (నిర్ణయం) వల్ల ప్రభువు పాపి అనిపించుకోడు 19
* శూద్రుడు ధర్మ ప్రవక్త కాకూడదు 20-24
నిర్ణయంలో హావభావాల వల్ల మనస్సును గుర్తించడం 25-26
బాల ధన రక్షణ 27
వన్ధ్యాదుల ధన రక్షణ 28-29
వారసులు లేని వారి ధనరక్షణ 30-33
సురక్షిత ధనాన్ని దొంగిలించినవానికి దండన 34
దొంగలించిన ధనం దొరికినప్పుడు 35,36
* పాతి పెట్టబడిన ధనానికి బ్రహ్మానుడే స్వామి 37-41
కర్తవ్య నిర్వాహకుడు అందరికీ ప్రియుడు 42
రాజుగాని, ప్రభుత్వాధికారులు గాని వివాదాలను పెంచరాదు. 43
న్యాయ నిర్ణయంలో అనుమాన ప్రమాణ సహాయత 44-46
అప్పు తీసుకోవడం-ఇవ్వడంలో జరుగు **63**
వివాదాల విచారణ 47-178వరకు
అప్పు తీసుకొని ఇవ్వకుండా ఉండటం 47-60
సాక్షుల స్వరూపం-సాక్షి ఎవడు? 64-67
సాక్ష్యానికి అనర్హు లెవరు? 64-67
విశేష సందర్భంలో విశేషమైన సాక్షి 68
ఏకాంతంలో జరిగిన అపరాధాలకు సాక్షులందరూ అర్హులే 69-71
బలాత్కారాది కార్యాలలో అందరూ సాక్షులు కావచ్చు 72
సాక్ష్యములలో నిశ్చయము 73-77
స్వాభావికమైన సాక్ష్యాన్నే అంగీకరించాలి 78
సాక్ష్యాన్ని స్వీకరించే పద్ధతి 79-83
సాక్షి ఆత్మవిరుద్ధంగా సాక్ష్యమివ్వరాదు 84-108
సాక్ష్యంతో ప్రమాణం చేయించుట 109-116
అబద్ధపు సాక్ష్యపు వివాదముపై పునర్విచారణ 117
అసత్య సాక్ష్యానికి ఆధారం 118
అసత్య సాక్ష్యానికి నేరాన్ని బట్టి దండన వ్యవస్థ 119-122
అబద్ధపు సాక్షికి శరీర దండన 123-125
దండించేప్పుడు విచారించాల్సిన విషయాలు 126
అన్యాయపూర్వక దండన నీయరాదు 127-130
ఇచ్చిపుచ్చుకోవడానిఇ ఉపయోగపడే నాణేల ముద్రల-విలువలు 131
కొలతలకు ముందుగా మాపక తూకాలకు సంబంధించిన త్రసరేణు పరిభాష 132
లిక్షా-రాజసర్షపము-గౌరసర్షపముల పరిభాష 133
మధ్య యవ-కృష్ణల-మాష-సువర్ణాల పరిభాష 134
పల-ధరణ-రౌప్యమాషకముల పరిభాష 135
రౌప్యధరణ రజతపురాణ-కార్షాపణల పరిభాష 136
రౌప్యశతమాన-నిష్కముల పరిభాష 137
పూర్వ-మధ్యమ-ఉత్తమ సాహస పరిభాష 138
* ఋణంపై పను 139
ఋణం మీద వడ్డీ విధానం 140-142
లాభాన్నిచ్చే కుదువ వస్తువులకు వడ్డీ లేదు 143
కుదువ-వడ్డీ సంబంధ వ్యవస్థలు 144-150వరకు
ఇచ్చిన ధనానికి రెట్టింపు కంటే అధికం తీసుకోరాదు 151,152
ఎవరెవరి నుండి వడ్డీ తీసికోరాదు 152
పునః ఋణపత్రాది లేఖనం 154-156
సముద్ర యానములపై అద్దె-కిరాయ నిర్ధారణ 157
జమానత్ సంబంధ విధానం 158-162
ఎనిమిది రకాలైన వారితో జరిగే దావా చెల్లదు 163
శాస్త్ర నియమ విరుద్ధాలైన దావాలు ప్రమాణాలు కావు 164,165
కుటుంబార్థం చేసిన ఋణాన్ని కుటుంబీకులే తీర్చాలి 166,167
* బలాత్కారాలన్నీ అమాన్యములు 168
2వ తాకట్టు పెట్టిన వస్తువుకు సంబంధించిన

వివాదల నిర్ణయం 179-189వరకు
3వ వివాదం “అస్వామి విక్రయం” 169-205
ఇతరుల వస్తువును అమ్మడం 197-203
వివాహంతో మోసం చేయువానికి దండన 204,205
4వ వివాదం-సామూహిక వ్యాపార నిర్ణయము
ఋత్విక్ వివరణలో దక్షిన వ్యవస్థ 206-209
* కలిసి వ్యాపారం చేయుట-లాభాన్ని పంచుకొనుట 210
5వ దానాన్ని తిరిగి తీసుకొను సందర్భం 212-213
ఇచ్చిన వస్తువును తిరిగి ఇవ్వకుండా ఉండటం 212,213
6వ వివాదం -వేతన వివాదాలు 214-217
7వ వివాదం చేసుకున్న ఒడంబడిక తప్పడం
ప్రతిజ్ఞోల్లంఘనం **218-221**
చేసుకున్న ఒడంబడిక తప్పడం 218-221
8వ వివాదం
క్రయ-విక్రయ సంబంధాలు
క్రయ-విక్రయ వివాద నిర్ణయం **222,223**
* కన్యా వివాహ విషయ వివాదంలో దండన 224-228
9వ వివాదం పాలక-స్వామి-నిర్ణయం 229-244
పశువుల యజమాని-పశువుల కాపరుల వివాదం పశువులు, పశుస్వామి, పశుసంరక్షణ వివాదము 229
10వ వివాదం సరిహద్దుల తగాదాలు-వాటి నిర్ణయం 245-265
ఎల్లల వివాదం 245
11వ వివాదం-‘కటువాక్య కథనసంబంధమైన వివాదం దాని నిర్ణయం’ 266-277
12వ వివాదం కర్రతో గాయపడేట్లు కొట్టిన వాటికి సంబంధించిన.. 278-300
కర్రతో గాయపడేట్లు కొట్టిన వాటికి సంబంధించిన వివాదాలు-వాటి నిర్ణయాలు 278-300
13వ వివాదం చోరదండన తీర్పు నిర్ణయం
చోరదండనము 301-302
దొంగల నుండి ప్రజలను రక్షించడం శ్రేష్ఠ ధర్మం 303-305
రాష్ట్ర యజ్ఞానికి అభయ ప్రదానమే దక్షిణ 306-313
చోరుడికి స్వయంప్రాయశ్చిత్త విధి 314
ప్రాయశ్చిత్త క్రియ ద్వారా స్వయంగా తనను శిక్షించుకొనే పద్ధతి 315
నేరస్తుణ్ణి దండించనట్లయితే రాజుకు పాపభాగి316
పాపుల సహవాసంతో పాపం లభిస్తుంది 317
రాజు వల్ల శిక్ష అనుభవించినట్లయితే దోషముండదు 318
విభిన్న చౌర్యాలకు దండనవ్యవస్థ 319-331
దౌర్జన్యం-చౌర్య లక్షణం 332,333
దోపిడీదారులైన-దొంగలకు అంగచ్ఛేదనం 334
తల్లితండ్రి ఆచార్యులందరూ రాజుతో దండనీయులే 335
రాజు నేరం చేస్తే వెయ్యిరెట్లు అధికంగా దండించాలి 336
ఉన్నత వర్ణ వ్యక్తులకు అధిక దండన 337,343
దౌర్జన్యం, దారిదోపిడి, గృహదహనం హత్యలు బలాత్కారం మొదలగు అపరాధాల నిర్ణయం 344
దౌర్జన్య వ్యక్తి దొంగకంటే అధిక పాపాత్ముడు 345
దొంగలను దండించని రాజు నశించిపోతాడు 346
మిత్రత కోసమో, ధనం కోసమో నేరస్థులను క్షమించరాదు 347
దొంగలను చంపుట అపరాధం కాదు 350
15వ వివాదం స్త్రీ-సంగ్రహణ సంబంధమైన వివాద నిర్ణయం 352-356
పర స్త్రీ సంగ్రహణ విషయం 357-370
* గర్వంతో వ్యభిచరించే స్త్రీకి దండన 371
* గర్వంతో వ్యభిచరించే పురుషుడికి దండన 372-385
పంచవిధ మహాపరాధులను వశపరచుకొనే రాజు ఇంద్రుడితో సమానం 386,387
ఋత్విక్-యజమానుల మధ్య పరస్పర ఎడబాటుతో దండన 388
తల్లి, తండ్రి, భార్య పుత్రులను దండించకుండా వదిలినందుకు దండన 389-397
వ్యాపారంలో పన్ను-వస్తు విలువల నిర్ధారణ 398-402
తూకాల-కొలతల సాధనాలను 6 మాసాలకొకసారి పరీక్షించాలి 403
పడవల రేవు నౌకా వ్యాపారంలో బాడుగ నిర్ణయ వ్యవస్థ 404-409
* వైశ్య శూద్రులతో వారి పనులు

చేయించాలి 410,412
శూద్రులతో సేవ చేయించాలి 413,414
7 రకాల శూద్రదాసులు 415-420

నవమాధ్యాయము

రాజధర్మాంతర్గత వ్యవహార నిర్ణయం 1-250
స్త్రీ పురుష ధర్మ సంబంధమైన వివాదాలు-వాటి నిర్ణయం 1-102
స్త్రీ విషయంలో తమ కర్తవ్యాలను పాలించని తండ్రి,భర్త, పుత్రుడు నిందనీయులు 4
ప్రతిచిన్న చెడు సహవాసం నుండి స్త్రీలను తప్పక రక్షించాలి 5,6
కుటంబ మర్యాద అంతా స్త్రీ మీదనే ఆధారపడి ఉంటుంది 7
జాయా (భార్య) లక్షణం 8
పతి ఎలాంటివాడో సంతానం కూడా అలాంటిదే 9
స్త్రీలను బలవంతంగా రక్షించలేం 10
స్త్రీలను గృహకార్యాల్లోనూ ధర్మ విధుల్లోనూ నిమగ్నులను చేయాలి 11
స్త్రీలు ఆత్మ నియంత్రణతోటే చెడుల నుండి రక్షించబడుతారు 12
స్త్రీలు చెడిపోవడానికి 6 కారణాలు 13
* స్త్రీల నింద్య స్వభావ వర్ణన 14-24
సంతానోత్పత్తి సంబంధమైన ధర్మాలు 25
స్త్రీలు గృహలక్ష్ములు 26
స్త్రీలు లోకయాత్రకు ఆధారం 27
గృహసుఖమంతా స్త్రీ మీదనే ఆధారపడి ఉంది 28-30
పుత్రునిపై అధికార సంబంధ కథనం 31
పుత్రుడి మీద అధికార విషయంలో భిన్నాభిప్రాయాలు 32
స్త్రీ పురుషులకు-క్షేత్ర-బీజ రూపంలో సామ్యత 33-40
* పరస్త్రీలతో సంతానోత్పత్తి చేయరాదు 41-48
పరస్త్రీకి పుత్రోత్పత్తి కలిగిస్తే ఆ పుత్రునిపై ఆమెకు లేదా ఆమె భర్తకు అధికారం 49-51
బిడ్డపై ఆ స్త్రీ లేదా ఆ స్త్రీ యజమానిదే అధికారం 52
ఒడంబడిక చేసికొన్న బిడ్డమీద ఇద్దరికీ సమానాధికారం- 53-56
అన్న భార్య గురుపత్నితో, తమ్ముని భార్య కోడలితో సమానం 57
వారితో సంగమం పాపం 58
సంతానం లేనప్పుడు నియోగం ద్వారా సంతాన ప్రాప్తి 59
నియోగంలో గమన విధి 60,61
నియోగం ద్వారా పుత్రప్రాప్తి కలిగిన పిదప శారీరక సంబంధం అపరాధం 62,63
నియోగ విధాన ఖండన 64-68
నిశ్చితార్థం తరువాత చనిపోతే అన్య వివాహ విధానం 69-73
ప్రవాసానికి వెళ్ళే భర్త స్త్రీకి జీవనోపాధిని కల్పించి వెళ్ళాలి 74-75
పతి కోసమై ప్రతీక్షించే అవధి తరువాతనే నియోగం లేదా పునర్వివాహం 76-80
పురుషుడు మరొక స్త్రీ యందు సంతానోత్పత్తి ఎప్పుడు చేయవచ్చు 81-84
అనేక పత్నులున్నా గౌరవ వ్యవహారము 85-87
ఉత్తమ వరుడు లభించగా వెంటనే కన్యా వివాహం జరపాలి 88
గుణహీనుడైన పురుషుడితో వివాహం చేయరాదు 89
కన్య స్వయంవర వివాహం చేసికోవచ్చు 90
స్వయంవర వివాహంలో దోషం లేదు 91-95
స్త్రీ పురుషునికి అర్ధాంగిని 96
కట్నం విషయంలో ఖండన మండనాలు 97-100
భార్యాభర్తలు పారస్పరిక గౌరవాన్ని ఎప్పుడూ అతిక్రమించకూడదు 101
విడిపోయే అవసరమే రాకూడదు 102
17వ వివాదం దాయభాగ వివాద-వర్ణన 103-219
వేరుబడేటప్పుడు దాయభాగాన్ని సమానంగా విభజన చేయడం 104
సమిష్టిగా ఉన్నప్పుడు విభజనలో వికల్పం 105-107
తమ్ముళ్ళ విషయంలో అన్న కర్తవ్యం 108,109
పెద్దన్న పట్ల తమ్ముళ్ళ కర్తవ్యం 110,111
కలిసి ఉండి వేరుపడినట్లయితే "ఉద్ధార అంశ విభాజనం" 112-119
నియోగంతో పుట్టిన సంతానం భార్యల ప్రకారం

ఆస్తిలో వాటాల వ్యవస్థ 120-126

పుత్రికా ధర్మనిర్ణయం చేయడంలో ఉద్దేశం 127-129

పుత్రులు లేనప్పుడు తండ్రి సమస్త సంపదకు పుత్రికే సర్వాధికారిణి 130

తల్లి ధనం పుత్రికకే చెందుతుంది 131-133

పుత్రికా ధర్మ నిర్ణయం జరిగిన తరవాత పుత్రుడు జన్మించినప్పుడు దాయవ్యవస్థ 134

పుత్రుని లక్షణం 138-34

దత్త పుత్రుడికి దాయభాగ విధానం 141-144

నియోగజ, అక్షేత్రజుడైనా దాయభాగ విధానం 145,146

నియోగవిధి లేకుండా కన్న పుత్రుడు దాయభాగానికి అధికారి కాడు 147-157

12 రకాల పుత్రులు 158

దాయ భాగానికి 6 గురు పుత్రులు అధికారులు 159

దాయ భాగానికి 6 గురు పుత్రులు అనధికారులు 160-165

* ఔరస పుత్రుని లక్షణము 166

* క్షేత్రజ పుత్రుని లక్షణము 167

* దత్రిమ పుత్రుని లక్షణము 168

* కృత్రిమ పుత్రుని లక్షణము 169

* గూఢోత్పన్న పుత్రుని లక్షణము 170

* అపవిద్ధ పుత్రుని లక్షణము 171

* కానీన పుత్రుని లక్షణము 172

* సహోఢ పుత్రుని లక్షణము 173

* క్రీతపుత్రుని లక్షణము 174

* పౌనర్భవ పుత్రుని లక్షణము 175

* అక్షతయోనికి పునర్వివాహ విధానం 176

స్వయం దత్త పుత్రుని లక్షణం 177

పారశవ పుత్రుని లక్షణము 178

మాతృ సంపదను సోదరీ సోదరీమణుల సమానంగా పంచుకోవాలి 192,193

స్త్రీ ధనం ఆరు విధాలు 194,195

బ్రాహ్మాది వివాహాలలో స్త్రీ సంపదకు అధికారి పతియే-భర్తే 196

ఆసురాది-వివాహాలలో స్త్రీ సంపదకు ఉత్తరాధికారి 197

స్త్రీలు రహస్యంగా ధనాన్ని నిలవ చేయరాదు 199,200

వికలాంగులు సంపదకు అనధికారులు 201

వీరికి భోజనాచ్ఛాదనమును ఇస్తూ ఉండాలి 202

స్వార్జితానికి అతడే యజమాని 206

మళ్ళా కలిసి తరువాత వేరుపడినప్పుడు ఉద్ధార భాగముండదు 210

సోదరుడు చనిపోగా అతడి ధన విభాగం 211

కర్తవ్య పాలనం చేయని జ్యేష్ఠుడికి ఉద్ధారం లేదు 213

దానయ ధనవంచితులు 214

పితృ ధనాన్ని అసమానంగా విభాగం చేయరాదు 215

సంతానం లేని ఒంటరి పుత్రుడి సంపదకు ఉత్తరాధికారి ఎవరు? 217

18వ వివాదం: ద్యూత సంబంధమైన వివాద నిర్ణయం 220-250

కుటుంబానికి, దేశానికి నష్టం కలిగించే జూదాన్ని నివారించాలి 221

జూదం కూడా ప్రత్యక్షంగా చేసే ఒక దొంగతనమే 222

జూదం - సమాహ్వాయాలలో-భేదం 223-230

దావాల అనంతరం ఉపసంహారం 231-251

లంచం తీసికొని అన్యాయం చేసేవారికి దండన 231

వివాదాలను నిర్ణయించడంలో కపటంగా ప్రవర్తించేవారికి దండన 232

ఎవరి ఒత్తిడి వల్ల గాని, లేదా ధనాశకు పాల్పడి గాని న్యాయనిర్ణయాన్ని మార్చరాదు. 233

అన్యాయం చేసిన అమాత్యులను-న్యాయాధీశులను దండించాలి 234

ఆ నలుగురు మహా పాతకులు-వారికి దండన 235-251

లోకకంటకులను రాజు ఏరివేయాలి 252-325

లోకకంట కులను రాజు ఏరివేయాలి 252-255,

తస్కరులు రెండు విధాలు 256,257

లోకకంటకుల గణన 258-263

గుప్తచరుల ద్వారా అపరాధులను

గుర్తించే స్థలాలేవి? 264-269
సాక్షం లభించినప్పుడే దండించాలి లేదా చంపాలి 270
దొంగలకు సహకరించిన వారిని కూడా దండించాలి 271-273
సామూహిక హాని జరిగేప్పుడు-సహకరించని వారికి దండన 274,275
విభిన్న అపరాధులకు దండన 276-293
7 రాజప్రకృతులు వాటి మహత్త్వం 294-300
రాజు శాసనంలోనే నాలుగు యుగాలు 301,302
రాజు యొక్క అష్ట రూపాలు 303
ప్రభువుకున్న ఇంద్రరూపాచరణం 304
రాజుకున్న సూర్యరూపాచరణం 305
రాజు అనుసరించాల్సిన వాయు వ్రతం 306
రాజు-యమ రూపధారణ 307
రాజు యొక్క వరుణరూపాచరణం 308
రాజు యొక్క చన్ద్ర రూపాచరణం 309
రాజు యొక్క అగ్నివ్రతాచారణం 310
రాజు-పృథ్వీరూపాచరణం 311
* బ్రాహ్మణుని ఉగ్రరూప క్రోధము 313

దశమాధ్యాయము

వైశ్యుల కర్తవ్యాలు 326-336
వేదోపదేశ అధికారం బ్రాహ్మణులదే 1
* వర్ణసంకర వర్ణన 5
* భిన్న వర్ణ స్త్రీలకు పుట్టిన అపసద
* సంతానము 7-14
* సంకీర్ణ జాతులు 15-19
వ్రాత్యులు-వారి సంతానం 20-42
ధర్మపాలన చేయనందువల్ల శూద్రత్వాన్ని పొందిన జాతులు 43-44
నాలుగు వర్ణాలలో విభిన్న వ్యక్తుల సంజ్ఞలు 45
అపసదుల-అపధ్వంసజుల కర్మలు 46-56
అనార్యులను వారి కర్మలను బట్టి గుర్తించాలి 57
అనార్యుల లేదా దస్యుల లక్షణాలు 58-64
కర్మానుసారంగా వర్ణ పరివర్తనం 65
* బీజ-క్షేత్ర శ్రేష్ఠతా నిర్ణయము 66-94
* ఆపత్కాలంలో క్షత్రియుల ఆజీవిక కర్మ 95-97
ఆపత్కాలంలో వైశ్యుల ఆజీవిక కర్మ 98
* ఆపత్కాలంలో శూద్రుల ఆజీవిక కర్మ 99-108
* దానలోభము నిందనీయము 109-114
ధర్మానుకూల 7 రకాల ఆదాయం 115
* పది రకాల ఆజీవికలు-వృత్తులు 116,117
* రాజు యొక్క ఆపత్కాలీనకర్మ 118-120
* అభావ అవస్థలలో శూద్రుని కర్తవ్యము 121-130

ఏకాదశాధ్యాయము

* దానము మరియు యజ్ఞ సంబంధ విధానము 1-6
* సోమయజ్ఞ విధానము 7-16
* ఆకలిగొన్నవాడు ఎట్టైనా భోజనాన్ని సంపాదించాలి 17-23
శూద్రుని నుండి భిక్షవద్దు 24
యజ్ఞ ధనాన్ని స్వార్థం కొరకు ఉపయోగించువాడు పాపి 25-27
అనాపత్కాలంలో ఆపత్కాల ధర్మాలకు ఫలముండదు 28-30
బ్రాహ్మణ అపరాధులను స్వయంగా దండించాలి 31-33
యజ్ఞానికి అనధికారులు 35-43
ప్రాయశ్చిత్తం ఎప్పుడు చేయాలి 44-47
ప్రాయశ్చిత్తానికి అర్థం 47
* చెడు కర్మలతో శరీర వికారాలు 48-52
ప్రాయశ్చిత్తం చేసుకోవాలి? 53
* మహాపాతకముల వర్ణన 54
* మహాపాతకములకు సమాన కర్మ 55-58
* ఉపపాతకముల వర్ణన 59-67
* వర్ణ సంకరము చేయు కర్మలు 68
* అపాత్రీకరణ కర్మలు 69-71
బ్రహ్మ హత్యకు ప్రాయశ్చిత్తము 72-89
సురాపానానికి ప్రాయశ్చిత్తము 90-97
* బంగారపు దొంగతనానికి ప్రాయశ్చిత్తము 98
* సువర్ణస్తేయప్రాయశ్చిత్తం 99-101
* గురుపత్ని గమనానికి ప్రాయశ్చిత్తము 102-106
* ఉపపాతకాలకు ప్రాయశ్చిత్తము 107-117
* అవకీర్ణి యొక్క ప్రాయశ్చిత్తము 118-123

* జాతిభ్రంశం చేయు కర్మలకు ప్రాయశ్చిత్తంము 124
* అపాత్ర వర్ణసంకరహు చేయువారి కర్మలకు ప్రాయశ్చిత్తము 125
* క్షత్రియాదుల వధకు ప్రాయశ్చిత్తము 126-130
* పశుపక్షాదుల వధకు ప్రాయశ్చిత్తము 131-161
* అభక్ష్య భక్షణానికి ప్రాయశ్చిత్తము 145-161
* దొంగతనానికి ప్రాయశ్చిత్తము 162-168
* పొందదగనివి పొందిన దానికి గుణాలు ప్రాయశ్చిత్తము 169-178
* పతితులతో సహవాసమున్నందుకు ప్రాయశ్చిత్తము 179-190
నిందిత కర్మలు చేయువారికి ప్రాయశ్చిత్తము 192
ఇతర అనేక ప్రాయశ్చిత్తాలు 197-202
వేదోక్త కర్మల త్యాగానికి ప్రాయశ్చిత్తం 203
బ్రాహ్మణున్ని నిందించినందుకు, చంపినందుకు ప్రాయశ్చిత్తము 204-208
అవిహిత కర్మలు చేసినందుకు ప్రాయశ్చిత్త నిర్ణయం 209
ప్రాయశ్చిత్తాల పరిచయ వర్ణన 210
ప్రాజాపత్యవత విధి-1 211
కృచ్ఛ్ర-సాంతపన వ్రతవిధి 212
అతికృచ్ఛ్రవ్రత విధి 213
తప్తకృచ్ఛ్ర వ్రతం 214
పరాక కృచ్ఛ్ర వ్రతివిధి 215
చాంద్రాయణ వ్రత విధి 216
యవ మధ్యమ చాంద్రాయణ వ్రతవిధి 217
యతి చాంద్రాయణ వ్రతవిధి 218
శిశు చాంద్రాయణ వ్రతవిధి 219-221
వ్రతపాలన సమయంలో యజ్ఞం చేయాలి 222-224
వ్రతపాలన సమయంలో గాయత్రీ జపం చేయాలి 225
మానస పాపాలకు ప్రాయశ్చిత్త విధి 226
ప్రాయశ్చిత్తమున ఐదు కర్మల ద్వారా పాపభావనల నుండి విముక్తి 227
అందరి ఎదుట తన అపరాధాన్ని అంగీకరించినట్లయితే పాప భావన నుండి విముక్తి 228
అనుతాప పాపభావనల నుండి ముక్తి 229-230
కర్మ ఫలాలను గురించి ఆలోచించినందువల్ల పాపభావన నుండి ముక్తి 231
పాప భావన నుండి ముక్తిని కోరేవాడు మళ్ళీ పాపం చేయరాదు 232
మనస్సుకు ప్రసన్నత కలిగే వరకు తపస్సు చేయాలి 233
తపోమహిమః 234-244
వేదాభ్యాసాదుల వల్ల పాపభావన క్షయిస్తుంది 245
వేదజ్ఞానాగ్ని వల్ల పాపభావన క్షయిస్తుంది 246-262
వేదజ్ఞానరూప తటాకంలో పాపభావనను ముంచాలి 263
వేదవేత్త లక్షణం 264
ఈశ్వరుడు కూడా ఒక జ్ఞేయవేదమే 265
ప్రాయశ్చిత్త విషయానికి ఉపసంహారం 266

ద్వాదశాధ్యాయము

కర్మఫల విధానం,
నిఃశ్రేయస కర్మల వర్ణన **1-126** వరకు

* ఋషులు భృగువును ప్రశ్నించుట 1
* భృగువు ఋషులకు ఉత్తరమిచ్చుట 2
త్రివిధ కర్మలు, త్రివిధగతుల వర్ణన 3
మనస్సే కర్మప్రవర్తకం 4
త్రివిధ మానసిక పాపాలు 5
చతుర్విధ వాగ్రూప పాపాలు 6
త్రివిధ శారీరక పాపకర్మలు 7
కర్మ ఎట్టిదో, భోగమట్టిది 8,9
* త్రిదండి పరిభాష 10,11
* క్షేత్రజము-భూతాత్మ 12
* ఫల అనుభవ కర్త జీవాత్మయే 13-23
ఆత్మను ప్రభావితం చేసే మూడు ప్రాకృతిక గుణాలు 24
ఏ గుణానికి ప్రాధాన్యత ఉందో ఆత్మకు కూడా అలాగే 25,26
ఆత్మలో సత్త్వగుణ ప్రాధాన్యాన్ని గుర్తించడం 27
ఏ గుణానికి ప్రాధాన్యం ఉందో ఆత్మకు

కూడా అలాగే 25-26
ఆత్మలో సత్త్వగుణ ప్రాధాన్యాన్ని గుర్తించడం 27
ఆత్మలో రజోగుణ ప్రాధాన్యానికి గుర్తు 28
ఆత్మలో తమోగుణ ప్రాధాన్యానికి గుర్తు 29-30
సత్త్వ గుణాన్ని ప్రతక్ష్యం చేసే లక్షణాలు 31
రజోగుణ లక్షణాలు 32
తమోగుణ లక్షణాలు 33,34
తమో గుణవంతుడి కర్మల యొక్క సంక్షిప్త పరిభాష 35
రజోగుణవంతుడి కర్మల సంక్షిప్త పరిభాష 36
సత్త్వ గుణవంతుడి కర్మల సంక్షిప్త పరిభాష 37
త్రిగుణాల ప్రధాన ఉద్దేశాలు-పారస్పరిక శ్రేష్ఠత్వం 38-39
మూడుగుణాల ఆధారంపై మూడు గతులు 40
మూడు గతుల (జన్మల) యొక్క కర్మ-విద్యను బట్టి మూడు గౌణగతులు 41
తామన గతులకు మూడు భేదాలు 42-44
రాజోగుణ గతుల వారిలో మూడు భేదాలు 45-47
సాత్త్వికగతుల మూడు భేదాలు 48-51
అధర్మాచరణవల్ల దుఃఖరూప జన్మల ప్రాప్తి 52
* కర్మల ప్రకారం జీవికి జన్మల ప్రాప్తి 53-72
విషయ సేవనాలవల్ల పాపయోనుల ప్రాప్తి 73
నిరాసక్తుల ప్రకారం ఫలప్రాప్తి 74
పాపులకు ప్రాప్తించు దుఃఖాలు 75-80
ఆసక్తి-అనాసక్తుల అనుసారం ఫలప్రాప్తి 81
నిశ్ర్శేయస్కర కర్మల వర్ణన 82-83
* ఆత్మజ్ఞాన వర్ణన 84
ఆత్మజ్ఞానం సర్వశ్రేష్ఠ ధర్మం 85
* ప్రవృత్త-నివృత్త కర్మల వర్ణన 86-90
ఇంద్రియసంయమనంతో జన్మ సాఫల్యత 92-93
వేదం సనాతన నేత్రం 94
వేదవిరుద్ధమైన శాస్త్రం అప్రామాణికం 95-97
పంచభూతాది సూక్ష్మశక్తుల జ్ఞానం వేదాలనుండే కలిగింది 98
వేదమే సుఖాలకు సాధనం 99
వేదవేత్తయే రాజు,సేనాధిపతి, న్యాయాధిపతి కావాలి 100
వేదజ్ఞానం వల్ల మోక్షము వైపు ప్రగతి 102
ఆచరించువాడు శ్రేష్ఠుడు 103
తపస్సు వల్ల పాపభావనా నాశం, విద్య వల్ల అమృత ప్రాప్తి 104
ధర్మజ్ఞానం కోసం త్రివిధ ప్రమాణాల జ్ఞానం 105
వేదానుకూలమైన తర్కం వల్ల ధర్మజ్ఞానం 106
మనుస్మృతి రహస్యము 107
అవిహిత ధర్మాల విధానం శిష్ట విద్వాంసుడు చేయాలి 108
శిష్ట విద్వాంసుల లక్షణం 109
ధర్మ నిర్ణాయక పరిషత్తులో ముగ్గురు లేదా పదిమంది విద్వాంసులుండాలి. 110
ధర్మపరిషత్ యొక్క 10 మంది సదస్యులు 111
ధర్మపరిషత్తుకు సంబంధించిన సదస్యత్రయం 112
ధర్మ నిర్ణయంలో అసంఖ్యాకమూర్ఖుల కంటే ఒక్క వేదజ్ఞుడు చెప్పిందే ప్రమాణం 113
ధర్మ పరిషత్‌కు సభ్యులు కారాని వారెవరు? 114
మూర్ఖులు నిర్ణయించిన ధర్మం వల్ల పాపాభివృద్ధికి అవకాశముంది 115
నిఃశ్రేయస కర్మల ఉపసంహారం 116,117
ఈశ్వరద్రష్ట అధర్మంలో మనస్సు నుంచడు 118
పరమేశ్వరుడే సర్వనిర్మాత ఫలప్రదాత, ఉపాస్యుడు 119
ఇంద్రియాలలో ఆకాశాదుల ధ్యానం 120,121
పరమ సూక్ష్మరూపుడుగా పరమాత్మను గుర్తించండి 122
పరమాత్మకు అనేక నామాలు 123
సర్వాంతర్యామి పరమాత్మే ఈ ప్రపంచాన్ని చక్రం లాగా నడుపుతున్నాడు 124
సమాధి వల్ల ఈశ్వర-మోక్షప్రాప్తి 125
ఈ శాస్త్రాధ్యయన ఫలం 126

అనుబంధము

1. అధ్యాయాల క్రమంగా 'మూల-ప్రక్షిప్త' శ్లోకాలు **1361-1508**
2. మనుస్మృతిశ్లోకానాముభయపఙ్క్తి అనుక్రమణికా **1509-1586**
3. మనుస్మృతి-శబ్దసూచి **1587-1694**

విశేష వివరణ-ప్రక్షిప్తాంతర్గత విచారిత విషయాల సూచి

ప్రథమాధ్యాయము

ధర్మస్వరూపం 256
ఆధ్యాత్మిక ఉద్దేశ్యసాధకం 256
లౌకిక వ్యవహార సాధకం 257
దర్శనశాస్త్రాలలో ధర్మస్వరూపం 257
'అన్తరప్రభవాణామ్' అనుపదానికి అర్థం 258
'సాన్తరాళానామ్' అనుపదానికి అర్థం 258
'అస్య సర్వస్య' అనుపదాలకు అర్థం 261
"కార్యతత్త్వార్థవిత్" అనే దానికి సరియై అర్థం 262
మొదటి నాలుగు శ్లోకాల మౌలికతపై చర్చ 265
మనుస్మృతిలోని ప్రశ్నలు-సమాధానాల విషయం 266
మనుస్మృతి శైలి 266
శైలి ఆధారంగా ఈ విషయపు కూర్పు 266
మనుస్మృతోని సాంగోపాంగశైలి 269
'స్వయం భూ' శబ్దానికి సరియైన అర్థం 269
పరమాత్మ ప్రకటితమగునను దానికి అర్థం 270
సృష్ట్యుత్పత్తి విషయంలో వేదమంత్రాల ప్రమాణం 270
14,15 శ్లోకాలకు సరియైన అర్థం 277
సృష్ట్యుత్పత్తి ప్రక్రియ 277
మహత్తత్త్వం-మనస్సు అంటే ఏమిటి? 278
'ఆత్మనః ఉద్ బబర్హ' శబ్దానికి అర్థం 278
పంచతన్మాత్రల నుండి పంచమహాభూతాల సృష్టి 279
16వ శ్లోకానికి సరియైన అర్థం 279
సృష్ట్యుత్పత్తి విషయంలో వేదశాస్త్రాల అభిప్రాయం 279
పంచమహాభూతాలు-కర్మలు 281
18వ శ్లోకానికి సరియైన అర్థం 281
సూక్ష్మశరీర సంఘటనం 282
సృష్ట్యుత్పత్తి క్రమం 282
పురుషుడిలోని మహత్తత్త్వాదులకు అర్థం 283
సృష్టిలో మానవుల ఉత్పత్తి 283
పంచ మహా భూతాల క్రమం-గుణాలు 283
పంచభూతాల ఉత్పత్తి క్రమం 284
సృష్టి ప్రారంభంలో నామకరణం 284
21వ శ్లోక క్రమంపై విచారణ 285
21వ శ్లోకానికి సరియైన అర్థం 285
22వ శ్లోకానికి సరియైన అర్థం 285
'సూక్ష్మం' శబ్దార్థం 286
సాధ్యులెవరు? 286
'యజ్ఞ' శబ్దానికి వ్యాపకార్థం-వేదాల ఉద్దేశం 287
'యజ్ఞము'నకు 'జగత్త'నే అర్థానికి ప్రమాణాలు 288
వేదోత్పత్తి విషయంలో వేదాది ప్రమాణం 289
వేదోత్పత్తి విషయంలో ఇతర ప్రమాణాలు 289
జగదుత్పత్తి ప్రయోజనం-కర్మఫలం 292
వేదాల్లో చాతుర్వర్ణ్య వ్యవస్థానిర్మాణం 293
బ్రాహ్మణ గ్రంథాలలో 294
వర్ణోత్పత్తి విషయక భ్రాన్త కల్పన 294
ఏడుగురు మానవులతో చరాచర జగత్తు సృష్టి జరుగదు 296
ఈ 42వ శ్లోకానికి సరియైన అర్థం 299
వృక్షాల్లో ఉన్న చైతన్యాన్ని గురించి ఆలోచన 301
భృగువు చెప్పిన మనుస్మృతి ముందే కూర్చిన శాస్త్రం కాదు 307
ప్రాచీనకాలపరిమాణానికి ఆధునిక కాల పరిమాణాలకు పోలిక 309
64వ శ్లోకం శైలిపై చర్చ 309
మృతపితరుల పేరిటి కల్పన నిరాధరం 310
ఉత్తరాయణ దక్షిణాయన వివేచనం 311
సూర్యుడు జడదేవత 311
నాలుగు యుగపరిమాణాల తులనాత్మక పట్టిక 314
కాలగణనా పద్ధతి 315
యుగం లేదా కాలం ధర్మాధర్మాల వల్ల ఏర్పదు 322
కర్మద్వారానే వర్ణ వ్యవస్థ 323
బ్రాహ్మణనామం కూడా కర్మద్వారానే వర్ణ వ్యవస్థను సూచిస్తుంది 324

క్షత్రియ శబ్దార్థం 325
శూద్రశబ్దం కూడా కర్మ వర్ణవ్యవస్థనే సూచిస్తుంది 327
వర్ణవ్యవస్థ కర్మానుసారమే ఏర్పడుతుంది 333
109వ శ్లోకానికి-మరొకచోట సమర్థన 337
వూలర్ చేసిన ప్రక్షిప్తాల ఆరోపణ నిరాధారం 342
ధర్మానికి 4 లక్షణాలు, వాటి స్వరూపం 343
వేదం 343
స్మృతి మరియు శీలములు 343
సదాచారం 344
'ఆత్మనః తుష్టిః 344
తర్కశబ్దవివేచనం 348
'సాంతరాళానాం' శబ్దానికి సరియైన అర్థం 352
పారంపర్యక్రమం యొక్క అభిప్రాయం 353
ప్రామాణిక దేశపటము-చిత్రవివరణ 355
ఆర్యావర్తంలోని ప్రాంతాలు లేదా జనపదాలు 355
142వ శ్లోకానికి సరియైన అర్థం 358
మ్లేచ్ఛశబ్దాభిప్రాయం 358
మనుస్మృతిలో అధ్యాయవిభజన మౌలికం కాదు 360
మనుస్మృతిలో వర్ణాలు, ఆశ్రమాలను గురించి ఒకేచోట వర్ణన 361

ద్వితీయాధ్యాయము

సంస్కారాల ఉద్దేశ్యం 363
సంస్కారాల అనుష్ఠానం బాలబాలికలందరికీ అవసరం 363
శూద్రులకు సంస్కారాలు నిషేధంకావు 364
'గార్భైః' మొదలైన పదాలలోని అర్థ వ్యాప్తి 365
మనుస్మృతి షోడశ (పదహారు) సంస్కారాలు 365
'ఏనః' శబ్దానికి అర్థం 367
వర్ధనశబ్ద వివేచనం 369
జాతకర్మకు గృహ్యసూత్ర ప్రమాణాలు 369
గృహ్యసూత్రాలలో నామకరణ ప్రమాణాలు 370
6,7 శ్లోకాల అర్థం 371
"జుగుప్సిత' శబ్దానికి అర్థం 372
నిష్క్రమణ, అన్న ప్రాశనాలకు ప్రమాణాలు 373
బ్రాహ్మణాది పదాలకు మనుసమ్మతమైన అర్థం 375
ఉపనయన ప్రసంగంలో శూద్రవర్ణాన్ని గురించిన ప్రస్తావన ఎందుకు లేదు? 375
ఎంగిలి తినడం దోషం 383
తెగిపోయిన యజ్ఞోపవీతం మొదలగువాటిని నీటిలో ఎందుకువేయాలి? 386
స్త్రీలకు వేదాధ్యయనం, ఉపనయనం మనుసమ్మతాలు 387
స్త్రీల వేదాధ్యయనం-వేదాలలో ప్రమాణాలు 388
అధ్యయన ఆద్యంతాలలో చేయు ఓంకారోచ్చారణ వల్ల కలుగు లాభాలు 392
ఇందుకు యోగదర్శన ప్రమాణాలు 392
ఓంకారం, మహా వ్యాహృతుల వివేచనం 393
"ఓమ్" ఈశ్వరుడి ముఖ్యనామం 395
గాయత్రీ మన్త్రార్థం 395
ఇంద్రియశబ్దోత్పత్తి- 399
చరకశాస్త్రంలో ఇంద్రియాల విషయం 400
వషట్ కారమునకు ఉత్పత్తి 406
స్వాధ్యాయం యొక్క అభిప్రాయం 407
'అబ్ద' శబ్దానికి సరియైన అర్థం 407
'స్వాధ్యాయ'మంటే 408
ఆప్త శబ్దానికి అర్థం 408
నిరుక్తంలో విద్యా కథ 411
నమస్కారం చేయడంవల్ల 411
ఆయుర్విద్యా యశోబలం ఏలా అభివృద్ధి చెందుతాయి? 414
విశిష్ట విద్వాంసుడు సర్వాధికమాన్యుడు 421
కల్పమంటే ఏమిటి? 422
'ఋత్విక్' కావడానికి ఎవడు అధికారి? 423
బ్రహ్మజన్మ అంటే ఏమిటి? 425
'జాతి' శబ్దార్థ వివేచనం 426
'జాతి' శబ్దానికి అర్థం 426
'కవి' శబ్దోత్పత్తి 427
అనూచానుడు అందరికంటే గొప్పవాడు 429
అవమానాన్ని సహించమని ఎందుకు చెప్పినట్లు? 432
'స్రగ్వీ' శబ్దాన్ని గురించి 434

వేదాన్ని చదవనందువల్ల-కుటుంబమంతా శూద్రులవడం-ఎందువల్ల? 435
'బ్రహ్మచారి' శబ్ద వ్యుత్పత్తి 437
బ్రహ్మచారికి పెద్దలెవరు? 438
పితృయజ్ఞం ఎవరు చేయాలి? 438
'దేవతాభ్యర్చనము' గూర్చి..... 438
తర్పణానికి సరియైన అభిప్రాయం 439
"మధు"శబ్దం-అర్థం 440
యజ్ఞసమిధలు 444

తృతీయాధ్యాయము

సమావర్తనమంటే ఏమిటి? 465
సమావర్తన కాలం-అందుకు సంబంధించిన నియమాలు 465
వివాహమనగా ? 466
వివాహానికి వయోనియమం 467
స్త్రీలకు వివాహ వయస్సు 467
ఆయుర్వేద శాస్త్రంలో వివాహ వయస్సు 468
వేదంలో గల వివాహ వయస్సు 468
మనుస్మృతి నాలుగు వర్ణాల గురించి 469
వివాహంలో నిషిద్ధకన్యలు 471
8 విధాల వివాహాలపై మనువు అభిప్రాయం 475
బ్రాహ్మ వివాహ లక్షణం 478
బ్రాహ్మ వివాహమే స్వయంవర వివాహం 478
దైవ వివాహ లక్షణం-స్పష్టీకరణ 478
'దేవ' శబ్దానికి అర్థం-సాత్త్విక ప్రవృత్తి గల విద్వాంసులే దేవతలు 478
"ఋత్విక్" శబ్దానికి ప్రసంగానుకూలమైన అర్థం 479
ఆర్షవివాహ-వివాద-పరిశీలన 479
ఆర్ష వివాహ లక్షణం 480
ఋషి అంటే ఎవరు? 480
ప్రాజాపత్య వివాహ లక్షణం పరిశీలన 480
'ప్రజాపతి'అని ఎవరినంటారు? 481
ఆసుర వివాహ లక్షణం-పరిశీలన 481
గాంధర్వ వివాహ లక్షణం-పరిశీలన 482
గంధర్వులెవరు? 482
రాక్షస వివాహలక్షణం-పరిశీలన 483
రాక్షసుడెవడు? 483
పైశాచిక వివాహ లక్షణం 483
పిశాచుడెవడు? 484
ఋతుకాలంలో వర్జిత పర్వములు 488
పర్వదినాలలో సమాగమం నిషేధం దేనికి? 488
'ఋతుకాలగమనం' గృహస్థుడికి తప్పని సరి కర్తవ్యం 488
ఋతుగమనంలో నిషిద్ధరాత్రులు 489
'అధికశబ్ద' వివరణ 490
ఆధునిక-చికిత్సా-విజ్ఞానానికి వ్యతిరేకం కాదు 490
గృహస్థ బ్రహ్మచారి ఎవరు? 491
స్త్రీ ధన వివరణ 492
ఆర్ష వివాహంలో శుల్కం తీసుకోవడం 493
56వ శ్లోకానికి సరియైన అర్థం 494
స్వర్గమంటే ఏది? 502
'పితరశబ్ద పరిశీలన' 505
పితరుల సంబంధంగా వేద ప్రమాణం 505
పితరుల గణన-వారి అభిప్రాయం 506
'దేవ' శబ్ద పరిశీలన 507
ఋషి శబ్ద పరిశీలన 508
యజ్ఞంలో లవణయుక్త ఆహార పదార్థాన్ని వేయరాదు 510
అతిథి తన కులగోత్రాలు చెప్పరాదు 519
'ఎవరిని అతిథిగా భావించకూడదు?' 520
గృహ్యాదేవతలు 522
యజ్ఞశేషానికీ శేష భుక్తభోజనానికీ తేడా ఏమిటి? 549

చతుర్థాధ్యాయము

హవ్యకవ్య శబ్దాల వివేచనం 562
దీర్ఘకాలసన్ధ్య వల్ల దీర్ఘాయుష్మ ప్రాప్తి 578
యోగదర్శనం ద్వారా జన్మాంతరజ్ఞాన సమర్థన 591
కర్మఫలభోక్త ఎవరు? 598
ధర్మవర్జిత అర్థం 600
ధర్మవర్జితకామం 600
ఉత్తర కాలంలో సుఖంలేని ధర్మం 600
లోకవికృష్ట ధర్మం 600

ధర్మార్థకామ స్వరూపం 600
దానగ్రహణానికి సంబంధించిన ధర్మవిధి 603
యమాలను ఆచరించనందువల్ల పతనం 609
యమ నియమాలేవి? 609
కర్తే కర్మఫలభోక్త 619
బ్రాహ్మణశబ్దాభిప్రాయం 621

పంచమాధ్యాయము

గృంజన మంటే 'శల్గం' 628
చెప్పిన పదార్థాలు అభక్ష్యం- తినదగనివి కావటానికి కారణం 629
యజ్ఞపాత్రల పరిచయం-వివరణ 655
స్త్రీల విషయంలో మనువుకున్న గౌరవం 663
మనువు చెప్పిన స్త్రీ సంబంధ విధానాలు 664
'సంస్థిత' శబ్ద వివేచనం 666

షష్ఠాధ్యాయము

వానప్రస్థధారణమునకు-బ్రాహ్మణముల గ్రంథాలు ప్రమాణాలు 673
26వ శ్లోకానికి వివరణ 683
వానప్రస్థాశ్రమం నుండి సన్యాసాశ్రమం స్వీకరించడానికి సామాన్య పద్ధతి 687
సన్యాసి ద్వారా అభయ ప్రదానం 688
'అనగ్నిః' అనగా 690
కాలప్రతీక్ష ఎలా చేయాలి? 691
ఇంద్రియ నిరోధానికి యోగశాస్త్ర ప్రమాణం 696
యోగ పరిభాష 698
ప్రాణాయామవిధి-లక్షణం 700
ప్రాణాయామ లక్షణం 700
ప్రాణాయామంలో ముఖ్యంగా మూడు భేదాలు 701
ప్రాణాయామ మంత్రం 701
ప్రాణాయామం వల్ల దోషనివారణ 702
ధారణ, ప్రత్యాహార వివేచనంలో యోగప్రమాణం 703
ధ్యానయోగ వివేచన 704
మోక్షసుఖానికి ఆశ్రయం పరమాత్మే 708
ఋషి దయానందభాష్యం-ధర్మ లక్షణాల విశేష వ్యాఖ్య 711
బ్రాహ్మణ శబ్ద ఉపలక్షణాత్మక ప్రయోగము 714

సప్తమాధ్యాయము

రాజుకు ఉండవలసిన విశిష్ట గుణాలు 716
అలంకారికంగా దండన గురించి వర్ణన 724
ధర్మ స్వభావం 725
'విషమః' అను పదానికర్థం 727
వర్ణాశ్రమ ధర్మాలను రక్షించడం రాజు కర్తవ్యం 730
'భృత్యులంటే ఎవరు?' 730
రాజు యొక్క జీవనచర్య 731
37వ శ్లోకార్థవివరణ 731
రాజు-దినచర్య, కౌటిల్యుని అర్థశాస్త్రం 731
రాజు యొక్క అనుశాసన విషయంలో కౌటిల్యుడి అభిప్రాయం 733
'త్రయీ విద్యా' అనగా 734
ఇంద్రియాలను జయించడం గురించి కౌటిల్యుడి అభిప్రాయం 735
'తౌర్యత్రికమ్, మృగయా, స్త్రియః' శబ్దాల మీద విశేష వివరణ 737
నియుక్తికి ముందు అమాత్యుల పరీక్షావిధి 740
షడ్గుణాల విస్తృతవర్ణన 742
రాజు-అమాత్యుల మధ్య కార్య విభజన 745
కౌటిల్యుని అనుసారం దూతకార్యాలు 746
కౌటిల్యుని అర్థశాస్త్రంలో 4రకాల దుర్గములు 748
ఆప్త, బలి శబ్దాలకు విశేషార్థం 752
కౌటిల్యుడి అర్థశాస్త్రానుసారంగా విభాగాధ్యక్షులు 753
విపశ్చిత్ శబ్దానికి అర్థం 754
'ఛిద్ర' శబ్ద వ్యుత్పత్తికోసం 762
ఛిద్రమంటే 763
కౌటిల్యుడి ద్వారా ఉద్ధృత శ్లోకం 763
"పరిపన్థిన్" శబ్దానికి అర్థం 764
రాష్ట్రకర్షణమంటే 766
రాజ్య సంరక్షణ కోసం మనుప్రోక్తమైన నియంత్రణ కేంద్ర వ్యవస్థా సూచిక 768
'కులం' అర్థం 769
మంత్రుల, సేవకుల భరణ, పోషణ వ్యవస్థ 773
మనువు సూచించిన పన్ను విధానం 776
'బ్రాహ్మణాన్ అర్చ్య' అను శబ్దానికర్థం 780

మనుప్రోక్తమైన రాజు దినచర్య 781
కౌటిల్య ప్రోక్తమైన రాజు దినచర్య 782
"నిఃశలాకే అరణ్యే" 783
"మన్త్ర" శబ్దానికి రాజనీతి పరమైన అర్థం 783
రాజు, ధర్మ-కామ-అర్థాలను గురించి ఆలోచన చేయడం 785
అష్టవిధకర్మల వివాదానికి సమాధానం 786
మనుప్రోక్తమైన రాజు యొక్క అష్టవిధ కర్తవ్యాలు 787
రాజు కర్తవ్యాలు ఎనిమిది 787
పంచవర్గమంటే ఏమిటి? 788
అనురాగం, అపరాగం 789
మండలం 789
మధ్యమాది నాలుగు మూల ప్రకృతి రూపమైన రాజుల లక్షణాలు 789
అష్టమూల ప్రకృతుల రాజుల లక్షణాలు 790
72 ప్రకృతులు 791
షడ్గుణాల వివరణ 793
త్రివిధ మార్గాలను సంశోధించాలి 801
వివిధ వ్యూహాల పరిచయము 802
మనుప్రోక్తమైన యుద్ధనీతి, మరియు తదంగ ప్రత్యంగాలు (పట్టిక) 805
యుద్ధవ్యూహ రచన-శస్త్రాస్త్ర సంకేత వర్ణన 805
కాలజ్ఞ శబ్దానికి మనుసమ్మతమైన అర్థం 814
విషాపహైః మన్త్రైః 815
కౌటిల్యుడి అర్థశాస్త్రంలో ప్రభువుకు భోజన సంబంధమైన నిర్దేశం 815
కౌటిల్యుని యానాది ప్రయోగవిధి 816
"స్త్రీభిః" పదానికి అభిప్రాయం 817
226 శ్లోకవర్ణనను గురించిన ఆలోచన 820
భృత్యశబ్దార్థాన్ని గురించిన ఆలోచన 820

అష్టమాధ్యాయము

మంత్రజ్ఞులు, బ్రాహ్మణులు అంటే ఎవరు? 821
వినీతుడంటే ఎవరు? 821
"అధర్మ" శబ్దం యొక్క అభిప్రాయం 829
సాక్షి శబ్దాన్ని గురించి పరిశీలన 844
సాక్షి విశేష కథనానికి-అభిప్రాయం 846
సాహస దండం-వాటి ప్రమాణం 861
తూచే ప్రమాణాల వివేచన-పట్టిక 866
రామాయణంలో ఉదాహరింపబడిన మనుస్మృతి శ్లోకాలు 921
దౌర్జన్యం-చౌర్యం-వీటి లక్షణం 926

నవమాధ్యాయము

'జాయా' శబ్ద నిర్వచనం 953
నియోగవిధి 968
నియోగంలో ఏ ఏ విషయాలుంటాయి? 968
దేవర శబ్దానికి అర్థం 968
వేదాలలో నియోగ విధానం 968
ప్రతి ధర్మకార్యాన్ని భార్యతో కలిసి చేయాలి 981
ఉద్ధారభాగ విభజనం 987
ఉద్ధారభాగ విధానమెందుకు? 987
'స్వధా' శబ్దానికి మను సమ్మతమైన అర్థం 991
పుత్రికాధర్మం 992
పుత్రీ-పుత్రులు ఆత్మరూపములు 993
జూదం వల్ల నష్టం 1018
వేదాలలో జూదనిషేధం 1018
'కుశీలవ' శబ్దానికి అర్థం 1019
'త్రిదివంయాన్తి' ఇదొక నుడికారం 1027
'తస్కర' శబ్ద వ్యుత్పత్తి 1027
'ఔపిధిక'శబ్దార్థం 1028
హితా శబ్దానికి 'నది' అని అర్థం 1033
'వరుణపాశ శబ్దానికి'అర్థం 1044
నవమాధ్యాయ విభాగ నిర్ణయం 1048

దశమాధ్యాయము

శూద్రుడు ఉత్కృష్ట వర్ణమును పొందుట 1052
వర్ణములు నాలుగు 1055
నాలుగు వర్ణాలకు శాస్త్రీయ ప్రమాణాలు 1055
దస్యు శబ్దం యొక్క అభిప్రాయం 1064
అనార్యుడు, అతని లక్షణం 1067
కర్మణా వర్ణవ్యవస్థకు అతిస్పష్టమైన ఉదాహరణం 1070
ఈ 65వ శ్లోకానికి సంబంధించిన ప్రమాణాలు 1070

వర్ణ పరివర్తనానికి ఉదాహరణ 1071

ఏకాదశాధ్యాయము

ప్రాయశ్చిత్త శబ్దానికి అర్థం, ఉద్దేశం 1096
యోగదర్శనంలో "కృచ్ఛ" మొ॥ వ్రతముల ఉద్దేశం 1130
మహావ్యాహృతియుక్త హోమమంత్రాలు 1134
పవిత్రాకారక మంత్రాలు 1134
ప్రాయశ్చిత్తంతో పాపాలుకాదు పాపభావన తొలగుతుంది 1137
ఆపత్కాలంలో దానం ద్వారా పాపభావన నుండి ముక్తి గురించిన వివేచన 1137
త్రయీ విద్యా వర్ణన 1147

ద్వాదశాధ్యాయము

48వ శ్లోకానికి ప్రచలితమైన అర్థం సరియైనదికాదు 1163
49వ శ్లోకానికి ప్రచలితమైన అర్థంలో అశుద్ధి 1163
50వ శ్లోకానికి "అసంగతమైన' అర్థం 1164
ఈ శ్లోకంలో పాఠభేదం ప్రక్షిప్తం 1172
"స్వారాజ్యమ్" శబ్దానికి అర్థం 1175
ఆత్మ శబ్దోత్పత్తి-దాని అర్థం 1176
"అర్వాక్ కాలం" అనగా 1177
వేదశాస్త్రవిత్ అర్హతి 1179
పాపభావనా వినాశం 1181
అమృత శబ్దానికి అర్థం 1181
ప్రత్యక్ష ప్రమాణం 1182
అనుమాన ప్రమాణం 1182
తర్కమంటే అభిప్రాయమేమిటి? 1183
జాతి శబ్దార్థం 1187
మూర్ఖులు నిర్ణయించిన ధర్మం వల్ల హాని 1188
సర్వజ్ఞుడైన పరమాత్మ యొక్క అనుభవజ్ఞానంతో అధర్మ నివృత్తి 1189
పరమాత్మే సర్వదేవతలకు దేవత 1191
పరమాత్మ స్వరూపం గుణకర్మల వర్ణన 1191
ఈ 122 శ్లోకానికి వేదమంత్రాలతో పోలిక 1191
పరమాత్మ యొక్క గౌణ నామాలు-వాటి అర్థాలు 1192
124 శ్లోకానికి అన్యత్ర వర్ణన 1194
ఉపర్యుక్త స్వరూపం గల పరమాత్మ జగదుత్పత్తి 1194
సర్వప్రాణులలో ఆత్మవత్ భావన, పరమాత్మ దర్శనంతో ముక్తి 1195



ओ३म्
ఓమ్

అనువాదకుని పీఠిక + భాష్యకారుని భూమిక = 'మనుస్మృతి గురించి సమస్తము'

అనువాదకుని 'పీఠిక'

ఆది శాసన కర్త మనువు-మనుస్మృతి గురించి

రాజు-రాజ్యాంగం అవసరమా?

అంపశయ్య మీది భీష్మపితామహుణ్ని యుధిష్ఠిర మహారాజు ఇలా అడిగాడు – “రాజ్యాల నిర్మాణం ఎప్పటి నుంచి జరిగింది? రాజులు ఎప్పటి నుంచి ఉన్నారు? దండన పద్ధతులు ఎప్పటి నుంచి మొదలయ్యాయి? మొదట్లో ఏ విధంగా ఉండేది?”

దానికి పితామహుడు **“న వై రాజ్యం న రాజాసీత్ న దండో న చ దాండికః”...** అన్నాడు.

ఆయన ఆ వాక్యాన్ని పూర్తి చేయకముందే మళ్లీ యుధిష్ఠిరుడు అందుకుని “రాజ్యమూ లేక, రాజూ లేక, దండించేవాడూ లేకపోతే ఆ పరిస్థితి శోచనీయంగా ఉండేదేమో కదా!” అన్ని చోట్లా అవ్యవస్థ, అనాచారాలు, హత్యలు జరిగేవేమో కదా! అన్నాడు. దీనికి తాతగారు 'కాదు, అలా కాదు' – **ధర్మేణైవ ప్రజా సర్వా రక్షతి స్మ పరస్పరమ్** – “ప్రజలందరూ **'ధర్మం'** ద్వారానే పరస్పరం రక్షించుకుంటూ ఉండేవారు.” అన్నాడు.

దీనికి ఆశ్చర్యచకితుడైన యుధిష్ఠిరుడు, **“మరి శిక్షావిధానపు అవసరం ఎందుకు ఏర్పడింది?”** అని అడిగాడు. దానికి సమాధానాన్ని వేర్వేరు శాస్త్రాల నుంచి ప్రమాణాలు చూపుతూ తాత ఇలా చెప్పాడు –**“ముందుగా మనిషిలో లోభం ప్రవేశించింది. దానితో ధనం సేకరించడం ప్రారంభించాడు. దానివల్ల సోమరితనం, శ్రమశక్తి లేమి, తర్వాత హింస, అబద్ధాలాడడం, కామం, క్రోధం, అహంకారం, ద్వేషం, కటుత్వం, కొట్టడం, భయం, తాపం, శోకం, మనస్తాపం మొదలైనవి కలిగాయి. ఆ సమయంలో ఋషులు 'ఇప్పుడు యోగ్యుడైన శాసకుని అవసరం ఉంద'ని భావించారు. అపుడు ఋషులందరూ కలిసి మనువును తమ పాలకుడిగా ఎంచుకున్నారు.”**

మనువు ప్రతిపాదించిన ధర్మ స్వరూపం

ప్రాచీన భారతీయ ఆలోచనాపద్ధతికి మూలకారణమైన ఆదర్శాలకు, సిద్ధాంతాలకు అనుకూలమైనదే మనువు ప్రతిపాదించిన ధర్మం. ఏ ధర్మానికి వేదాలలో సూత్రాలు గుదిగుచ్చబడ్డాయో, రామాయణంలో వాల్మీకి ఏ ధర్మానికి సజీవ మూర్తుల చిత్రాలు లిఖించాడో, మహాభారతంలో వ్యాసుడు ఏ ధర్మానికి విశద వ్యాఖ్యానం చేశాడో, అదే ఈ ధర్మం. మనుధర్మం–మనుధర్మశాస్త్రం–మనుస్మృతి.

మన మనసులలో మనుష్యుని జీవన క్రమం ఏ ప్రకారంగా ఉండాలి? సంపూర్ణ వికాసం కలిగి యోగక్షేమాలతో ఉండటానికి మన వైయక్తిక, సామాజిక జీవనాన్ని ఏ దిశల లోకి మళ్లించాలి? అనే ప్రశ్నలు మాటిమాటికి కలుగుతుంటాయి.

ఈ ప్రశ్నలకు మనువు చెప్పిన సమాధానం ఒకటే– **'ఋత'** మార్గాన్ని అనుసరించు. దాని వల్ల అభ్యుదయమూ, నిఃశ్రేయస్సూ కలుగుతాయి; ఏది లేక పోతే జీవితానికి ఏ విలువ లేదో, ఆ నీ **'శీల సంపద'**ను వృద్ధి చేసుకో. అందరూ గ్రహించవలసిన శాశ్వత తత్త్వమైన **'ధర్మాన్ని'** ఆశ్రయించు. **'ఆచారం'** అనే పునాదిపై జీవితాన్ని స్థాపించుకో. అది లేకుంటే మనిషి తననూ, తన జాతినీ ఉన్నతికి చేర్చలేడు.

'ఋతం', 'శీలసంపద', 'ధర్మం', 'ఆచారం' అనే ఈ గొప్ప ఆదర్శాలు భారతీయ సంస్కృతిలో మనిషి ఔన్నత్యాన్ని కొలిచే చతుర్ముఖ కొలమానములు. వీటిలో ఏ ఒక్క దాన్ని కొలిచేందుకు ఉపక్రమించినా, మిగిలినవన్నీ తమంతకు తామే జీవితంలోకి వచ్చి చేరిపోతాయి.

వేదం **'ఋతం'** అనే దాన్ని వివరించగా, వాల్మీకి విశేషంగా 'శీలసంపద'ను తెలుపగా, వ్యాసుడు **'ధర్మం'**ను వర్ణించగా వాటికే మనువు **'ఆచారం'** అనే పేరుపెట్టి దానికి అతి గొప్ప స్థాన మిచ్చాడు- దాన్నే పరమధర్మంగానూ చెప్పాడు. ఈ **'ఆచారమే'** మనువు విధానాలకు ఇరుసు. దీని వల్లనే మానవుని జీవన వ్యవస్థకు తగిన ప్రణాళిక ఏర్పడింది.

మనువు పద్ధతికి కేంద్రబిందువు మానవుడే. అతని సంపూర్ణ వికాసమూ, అభ్యుదయాల మార్గాన్ని ప్రశస్తం చేయటమే అతని ఏకైక లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించటానికి మనువు- మానవుని దైనందిన జీవితాన్ని, జీవితాంతమూ అచరించడానికి ముందే నిశ్చయించిన కార్యక్రమాలతో కూడిన ఒక చక్కని రేఖాచిత్రాన్ని తయారు చేశాడు. అదియే ఈ మనుస్మృతి.

మనువు పేరు చారిత్రిక సత్యం

నేటి చరిత్రకారులు తమ తేదీల లెక్కలలోకి మనువును తేలేకపోయినా, వేలాది సంవత్సరాలనుండి ఈ దేశంలో అనుస్యూతంగా వస్తున్న సంకల్ప పరంపరలో మనువు పేరు స్మరిస్తూనే ఉన్నాం. తొమ్మిదవ శతాబ్దం నాటి టీకాకారుడు మేధాతిథి **"మనువు వేద జ్ఞానం, వాటి అనుష్ఠానం తెలిసినవాడు, పరంపరాగతంగా జనులు చెప్పుకునే విషయాలలో ప్రఖ్యాతుడైన వాడు"** అంటాడు. మరొక ప్రసిద్ధ టీకాకారుడు గోవిందరాజు కూడా **'వేద పారంగత మహర్షి'**గా మనువును పేర్కొని, పరిచయం చేశాడు. అనేకమంది విద్వాంసులు మనువునే **'యజ్ఞాదుల తొలి ప్రవర్తకుడు'**గా భావించారు. అతనినే **'ప్రథమ ప్రజాపతి'**గా స్వీకరించారు.

మనువు చెప్పినవాటికి **'పరమ ఔషధాలు'** అనే పేరు పెట్టారు. ఇక పురాణాలలో నైతే మనువు వంశక్రమం వివరణ ఉంది. అతని ద్వారానే ఆర్యావర్తంలోని ప్రముఖ ప్రాచీన రాజవంశాల ఉత్పత్తి జరిగిందనీ భావిస్తారు. అంటే మనువు అనేది ఎవరో కల్పించిన పేరు కాదనీ, అది ప్రాచీన భారతీయ ఐతిహాసిక పరంపరలోనిదేనని దీని సారాంశం.

స్వాయంభువుని నుంచి వైవస్వతుని వరకు గల 'మనువు వంశం'

ఇక్కడ మనం ఎదుర్కొనే చిక్కేమిటంటే, పురాణాల ప్రకారం **'స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత'** మొదలైన పద్నాలుగుమంది మనువులున్నారు. వారందరికీ వేర్వేరు కాలాలు, లేదా మన్వంతరాలు నిర్ధారిత మయ్యాయి. వీరిలో స్వాయంభువ మనువు అందరి కన్నా ప్రాచీనుడు, మొదటి కల్పంలో ఉన్నవాడు. వైవస్వత మనువు ప్రస్తుత మన్వంతరానికి ప్రవర్తకుడు. వీరిలో ఎవరిని మనం ఆది పురుషుడుగా భావించాలి? ఎవరికి శ్రద్ధాంజలి ఘటించాలి? అనేది ప్రశ్న.

దీనికి భారతీయ కాలగణన పరంపరనే మనం అనుసరించాలి. ఎందుకంటే ప్రస్తుతం వైవస్వతమన్వంతరం నడుస్తోంది. అతని నుంచే ఇక్ష్వాకువు, మాంధాత, హరిశ్చంద్రుడు, సగరుడు, దిలీపుడు, భగీరథుడు, రఘువు, శ్రీరామచంద్రుడు వంటి అమోఘ పరాక్రమశాలురైన రాజులను అందించిన 'సూర్యవంశం' పుట్టింది. మరో వైపు పురూరవుడు, యయాతి, పురువు, భరతుడు, కురువు, భీష్ముడు, యుధిష్ఠిరుడు, అర్జునుడు, శ్రీకృష్ణుడు, వంటి విభూతులు గలవారికి జన్మ నిచ్చిన **'చంద్ర వంశం'** తాలూకు శాఖ, ప్రశాఖల ఉత్పత్తి కూడా జరిగింది. కనుక అతనికే మన ప్రథమ అర్ఘ్యం అర్పించడం అన్ని విధాలా మేలవుతుంది. ఈ మహాపురుషుడు ఒక చారిత్రిక వ్యక్తి అనటంలో ఎటువంటి సందేహమూ లేదు.

మనువు అందించిన మహత్తర ప్రసాదం

'మానవ' ధర్మ శాస్త్రం-అదే మనుధర్మశాస్త్రం- మనుస్మృతి

'మనువు' అనేది మనకు అత్యంత ప్రాచీననామంగా స్వీకరించడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి-'ఈ పుణ్య భూమికి చెందిన రాజర్షి పరంపరకు మూలాధారం మనువే'. **రెండవది**-ఈ దేశంలోని వేల ఏళ్ల క్రితపు పురాతన సమాజ వ్యవస్థను నిర్ధారితం చేసిన పద్ధతితో అతని పేరు కలిసి ఉండటం. అనగా **'మనుస్మృతి'** లేదా **'మానవ ధర్మశాస్త్రం'** అనే పేరు ఉండడం. దీన్ని వినని భారతీయుడు ఎవడుంటాడు? అనూచానంగా వస్తున్న ఆచారం ప్రకారం **'ఈ ప్రసిద్ధ ధర్మ గ్రంథం రాజర్షి మనువే మనకిచ్చిన గొప్ప కానుక'**గా అందరూ అంగీకరిస్తారు.

వ్యూలర్, జైస్వాల్ మొదలైన పండితులు దీనికి జోడించిన **'మనువు'** పేరు అర్థవంతమేనని తెలిపారు. వ్యూలర్, మాక్స్ ముల్లర్ మొదలైన దార్శనికులు అనేదేమిటంటే, దీని కన్నా ముందు **'మానవ ధర్మ సూత్రాలు'** పేరిట ఒక ప్రాచీన విధాన గ్రంథం ఉండేదనీ, దాన్ని ఆధారం చేసుకునే నేటి **'మానవ ధర్మ శాస్త్రం'** లేదా **'మనుస్మృతి'** పుట్టిందనీ, పైన చెప్పిన ధర్మ సూత్రాలకు కృష్ణయజుర్వేదపు మైత్రాయణీ శాఖలోని ఆరు చరణాలతో సంబంధం ఉందనీ, అది తారతమ్య మనువుకు చెందిన ప్రాచీన పరంపరకు సంబంధించిందనీ అంటారు. అందుచేతనే పై **'ధర్మ సూత్రాలు'** గ్రంథం ఆధారంగా దాని నేపథ్యంలోనే నేటి **'ధర్మశాస్త్రం'** ఈ రెండింటి పేర్లతోనూ **'మానవ'** అనే పదం కలిసి ఉంది. ఈ ప్రాచీన పద్ధతి రూప నిర్ధారణలో స్వాయంభువ మనువు నుంచి వైవస్వత మనువు వరకు గల పౌరాణిక మనువు వంశపు జోక్యం కచ్చితంగా ఉండే ఉంటుంది. అందు వల్లనే శతాబ్దాల తరబడి కాలం గడిచిన తర్వాత కూడా, నేటికీ **'మనువు'** అనే ప్రాచీన నామం అలాగే నిలిచి ఉన్నది.

ఈ మానవధర్మ శాస్త్రపు నేటి రూపం క్రీ.పూ. 2వ శతాబ్ది నాటికి భార్గవ వంశీయులకు లభించింది. వారు బ్రాహ్మణ ధర్మ పునరుజ్జీవనంలో ప్రముఖ పాత్ర నిర్వహించి, ప్రాచీన గ్రంథాలను నవీన పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. మహా భారతం వంటి అతి ఘనమైన గ్రంథాన్ని కూడా ఆ శాస్త్రం మార్చిందనీ అంటారు. మనుస్మృతిలోని ఎన్నో శ్లోకాలు మహాభారతంలో ఉన్నవి ఉన్నట్లుగా స్వీకరించటం జరిగింది. అందుచేత పై అభిప్రాయానికి బలం చేకూరుతూంది. అటు నారదస్మృతి అయితే నేటి **'మనుస్మృతి'**ని స్పష్టంగా సజ్జనుడైన భార్గవుని రచనగా అందిస్తూంది. ఈ మాటకు పుష్టి నిచ్చే విషయం మనుస్మృతిలోనే **'భృగువు రచన'**గా పేర్కొనబడి ఉండటమే ! అంటే దీని ప్రవక్త **'భృగుమహర్షి'** అని గ్రంథం ప్రారంభంలో ఋషుల ప్రార్థనపై మనువు ధర్మ వ్యాఖ్య చేస్తున్నట్లు ఉంది. కానీ, కొంత రచన తర్వాత, తన మానసపుత్రుడైన భృగువుకు అప్పగించినట్లు కనబడుతుంది. ఆ పైన మిగిలిన గ్రంథమంతా భృగువే వ్యాఖ్యానించినట్లుగా ఉంది. దీనివల్ల **'మానవ ధర్మశాస్త్రం'** నేటి రూపంలోకి వాస్తవంగా మనువు ద్వారా చెప్పబడి, తర్వాత భృగువు ద్వారా లిఖించబడిందని స్పష్టమవుతుంది.

మనువు పద్ధతి రూపురేఖలు

నేటి మనుస్మృతిలో మొత్తం 2685 శ్లోకాలున్నవి. ఇది 12 అధ్యాయాలుగా ఉన్నది. ఈ మహా గ్రంథంలో సృష్టి ఉత్పత్తి, మన్వంతరాలు, యుగాలు, కాలవిభజన యొక్క సంక్షిప్త వివరణల తర్వాత, 'బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు'లను నాలుగు **'వర్ణాలు'** ; బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాస'మను నాలుగు **'ఆశ్రమాలు'**; 'దేవ, ఋషి, పితృ అను **'మూడు ఋణాలు'**, 'ధర్మ అర్థ కామ **మోక్షాలు' అను నాలుగు 'పురుషార్థాలు'**; 'బ్రహ్మ, పితృ, దేవ, అతిథి, బలివైశ్వదేవ' అను ఐదు యజ్ఞాలు; 'గర్భాధానం, **పుంసవనం, సీమంతోన్నయనం**, జాతకర్మ, నామకరణం, నిష్క్రమణం, అన్నప్రాశనం,

చూడాకర్మ, కర్ణవేధం, ఉపనయనం, వేదారంభం, సమావర్తనం, వివాహం, వానప్రస్థం, సన్న్యాసం' అంత్యేష్టి, అను **'పదహారు సంస్కారాలు'** – వీటితో గుది గుచ్చిన ప్రాచీన భారతీయ వ్యవస్థను నిర్ధారితం చేసే అద్భుత విధానం నిరూపితమై ఉంది. ఇదే ఈ దేశపు సాంఘిక వ్యవస్థకు వెన్నెముకగా ఎన్నో వేల ఏళ్ల నుంచి నిలిచి ఉంది. ఏడు–ఎనిమిది అధ్యాయాలలో భారతీయ **'రాజ ధర్మం'**, **'దండ నీతి'** విస్తృతంగా విశ్లేషించబడ్డాయి కనుక, ఆ రెండు అధ్యాయాలూ గొప్పవి. ఇక తొమ్మిదవ అధ్యాయంలో **'స్త్రీ పురుషుల కర్తవ్యాలు'**, హక్కుల గురించి ఉంది. పన్నెండవ అధ్యాయంలో **'సత్త్వ రజస్తమో గుణాల మీమాంస'**తో కూడిన మూడు విధాల కర్మలు, జీవనగతి, మోక్ష సాధన మొదలైన విధానాలున్నాయి. ఇవన్నీ తక్కువ ప్రాధాన్యం గలవేమీ కావు.

ఎన్నో తరాల నుంచి వస్తున్న మూలధనం 'ఈ తేజో రాశి గ్రంథం'

ప్రాచీన ఐతిహాసిక యుగం నుంచి క్రీస్తు పూర్వం వరకు, అంటే **'మానవ ధర్మ శాస్త్రపు'** ఇప్పటి ముద్రణ వరకూ, మనువు పేరూ, వ్యక్తిత్వమూ మన భారతీయ సాంస్కృతిక గగనంలో ఆకాశ గంగ వలె విస్తరించటం చూస్తున్నాము. ఆకాశ గంగతో మనువు నెందుకు పోల్చామంటే, పైన గల నక్షత్ర మాలికలోని కోట్ల తారలవలె మనువు కీర్తిలోనూ ఎన్నో తెలియని సమాజ విధాయకుల కీర్తి కలసి ఉంది. మనదేశంలో ప్రారంభం నుంచే మన పూర్వుల ద్వారా వచ్చిన విషయాలకు తర్వాతి తరాలవారు తమ తమ కాలాల ప్రతిభను కూడా కలుపుతూ ఉండటం జరిగింది. వైదిక వాఙ్మయాన్నే తీసుకోండి – అందులో ఒకటే ఋషి లేదా ఋషి వంశం కిందే ఆ వంశంలోని ఎందరో మేధావుల కావ్యధార ప్రవహిస్తూ వస్తూంది! ఇదే మహా భారతం విషయంలోనూ చెప్పుకోవచ్చు. తర్వాతి తరాలవారెందరో వ్యాసులవారి మూల కావ్యానికి తమ కాలపు భావాలను కలిపి గ్రంథాలను వెలువరించారు. మనువు విధానపు కథా ఇంతే.

పూర్వపు, ఐతిహాసిక కాలపు సంధికాలంలో, ఆది పురుషుడు మనువు ఆధ్వర్యంలో ఆచారమూలకమైన సమాజ వ్యవస్థ రూపరేఖలు ఎన్నో రూపుదిద్దుకున్నాయి. తర్వాతి వికాసకాలంతో పాటుగా ఎన్నో విషయాలు చేరి మునుపటి కన్నా జటిలమయ్యాయి. కచ్చితంగా స్వాయంభువ మనువు నుంచి వైవస్వత మనువు ఆ తర్వాత ఎందరో అజ్ఞాత ఆలోచనాపరులు, సమాజ నిర్మాతల కలాల చమత్కారం, ఎన్నో వేల ఏళ్లు పనిచేసినందు వల్లనే మనుస్మృతి నేటి వికృత రూపానికి రాగలిగింది. ఇలా ప్రతి కాలంలోనూ మార్పులు రావటం చేతనే దాని బాహ్య స్వరూపంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నా, అందులోని వ్యవస్థ మాత్రం, **'మనువు పద్ధతి'** పేరిటనే పిలువ బడుతూంది. ఎన్ని మార్పులకు లోనైనా మూలంలోని ఆది సూత్రం మాత్రం అలాగే నిలవడానికి కారణం 'ఈ దేశపు సమాజ వ్యవస్థ అనే శిల మనువుల వంశ పరంపర ద్వారా శిల్పంగా రూపొందటమే'

కర్మ యోగపు తొలి గురువు

మనువు చెప్పిన ధర్మం స్పష్టంగా శక్తి–వేద మూలకమే. దేని వ్యాఖ్య తర్వాతి కాలంలో శ్రీకృష్ణుని ముఖతః భగవద్గీతగా వెలువడిందో, ఆ మహత్తర కర్మ యోగానికి మూలభూతుడైన ఆది గురువు మనువే. అతడు వ్యక్తినీ, జాతినీ అన్ని విధాలుగా బలయుతంగానూ, వీర్యవంతంగానూ చూడాలని భావించాడు. 'కర్తవ్యము, కర్మల నుంచి తప్పించుకునే పలాయనవాదులను పరిగణించ లేదు. అలాంటివారిపై అందుకనే ఆయన కఠోరమైన బాధ్యతలు, ఋణాల భారం మోపేవాడు. ఈ నిర్దిష్ట కర్తవ్యాల శక్తినే 'శిక్ష' అన్నాడు. ఈ శాసించే శక్తి పట్ల ఆయన కెంత దృఢ విశ్వాసమంటే, 'శిక్ష' అనేదే అంతా అనేశాడు; అదే శాసకుడన్నాడు; అదే నాయకుడన్నాడు; దాని బలం పైనే జాతి మొత్తం తనకు నిర్ధారించిన ధర్మ కర్మలలో సంలగ్నమై ఉంటుందని నమ్మాడు.

జీవితంలో క్రమశిక్షణకు ప్రబల సమర్థకుడు కావడం చేత, అమర్యాద, అనియంత్రణ, స్వేచ్ఛాశీలం, అరాజకతల పట్ల తీవ్ర వ్యతిరేకత కనబరచేవాడు. ఆయన ప్రకారం, ప్రతి ఒక్కరికీ తమ తమ కర్తవ్యాలు ఉంటాయి. వాటి నుంచి తప్పించుకునే అవకాశం ఎవ్వరికీ లేదు. ఈ విధంగా మనువు 'రాజు – ప్రజలు, గృహస్థులు – సన్న్యాసులు, గురుశిష్యులు, భార్యాభర్తలు, తల్లిదండ్రులు, సంతానం, అందరినీ' తమ తమ కర్తవ్యాలతో కఠినంగా బంధించాడు. మనువు ధర్మానికి పది లక్షణాలను సూచించాడు. అవి – 'ధృతి, క్షమ, దమం, అస్తేయం (దొంగతనం చేయకుండా ఉండటం), శౌచం (శారీరక శుభ్రత), ఇంద్రియ నిగ్రహం, బుద్ధి, విద్య, సత్యం, అక్రోధం. వీటితో పాటు వీటిని పొందే నాలుగు సాధనాలనూ చెప్పాడు – 'వేదాలు, స్మృతులు, ఆచారాలు, వివేకం. గమనిస్తే వీటిలో తొలి మూడు సాధనాలూ తమ కట్టుబాట్ల-విధి నియమాల పాశంలో మనిషిని బంధించి, అతనికి స్వతంత్ర నిర్ణయం తీసుకునే అవకాశం లేకుండా చేస్తాయి. కాని చివరి సాధనం ద్వారా ఇష్టం వచ్చినట్లు ఉండే అవకాశం ఉంది. దీని వల్ల మనువు వ్యక్తి స్వాతంత్ర్యం పట్ల తీవ్ర వ్యతిరేకత గలవాడు కాదని తెలుస్తుంది. జీవితంలోని ప్రతి అడుగుకూ పద్ధతి చెబుతూ, అన్నింటినీ నిర్ణయించేసిన తర్వాత కూడా, చివరి నిర్ణయం కోసం 'అంతరాత్మ యొక్క వివేక వాణిని ఆశ్రయించ' మని సంతోషంగా మనకు అనుమతించాడు.

మనువు నిర్ణయించిన సమాజ వ్యవస్థకు రెండు గట్టి ఇరుసులున్నాయి. **ఒకటి** – కుల ధర్మాల కట్టుబాట్ల చేత నియంత్రితమైన కుటుంబం – దీని చుక్కానిని మనువు గృహ స్వామి లేక కుటుంబం యజమాని చేతులలో ఉంచాడు. **రెండు**– దేశపు రూప నౌకను సంతులితం చేస్తూ 'జాతీయ ఆదర్శాలను అనుసరించి దాన్ని నడిపించే గట్టి రాజనీతి. దీనికి ధర్మ మర్యాదలను పాలించే దండాన్ని ధరించిన రాజే సూత్రధారి' అని మనువు భావించాడు. ఈ రెండు ఆధార స్తంభాల రక్షణ, మౌలిక పవిత్రతలను నిలిపి ఉంచేందుకు ఎన్ని సాధనాలు అవసరమో, వాటన్నిటినీ చెప్పటంలో మనువుకు అలసట కలగనే లేదు. అన్నింటినీ విశదంగా వివరించాడు. కుటుంబ మనే వేదికపై స్త్రీ పురుషులను ఒకరి కొకరు పూరకాలుగా చెబుతూ, దాన్ని గొప్ప పదాలతో ఈ విధంగా నిర్వచిస్తున్నాడు – "ఎవరు భర్తో అతడే భార్య కూడా" ఇదే విధంగా దేశ మనే వేదికపై రాజును మూర్ధాభిషిక్తుణ్ని చేసి, 'రాజే యుగ పురుషుడు; అతడే యుగ ప్రవర్తకుడు; అతడే అగ్రనాయకుడు' అనీ, ప్రకటించాడు. అయినా 'రాజు, ఇంటి యజమాని' – ఈ ఇద్దరినీ తమ తమ రంగాలలో ఉన్నత పదవులలో నిలిపినా, కర్తవ్యాల, కర్మల నుంచి వారు తప్పినట్లయితే, వారికి పతనం తప్పదని చెప్పటంలోనూ కించిత్తయినా తటపటాయించలేదు. వీటి వల్ల పద్ధతుల దృఢత్వం, సైద్ధాంతిక ఉన్నతి పట్ల ఆయన కున్న విశ్వాసం తెలుస్తుంది.

మనువు సాంస్కృతిక గగనములో గొప్ప దీప స్తంభం

జీవితంలో **'ఆచారాలను'** సర్వోపరిగా ఉన్నత స్థానంలో నిలబెట్టిన **'మను రాజర్షి'**, కచ్చితంగా భారతీయ సాంస్కృతిక గగనతలంలో వెలిసిన **'గొప్ప దీప స్తంభమే'**. వేలాది సంవత్సరాలుగా ఒక వెలుగు వెలుగుతూ ప్రపంచానికి దారిచూపిన ఈ దీపస్తంభం కొందరు స్వార్థపరుల కపోల కల్పనలతో కొరుడు గట్టినా వేద బీజమంత్రాలతో నిలబడి ఉండటంలో, ఈ పుణ్యభూమి హృదయ స్థానంలోని సరస్వతి, గంగ, యమున మొదలైన పవిత్ర జలాలతో తడిసి పునీతమైన ప్రాంతాలలో ఇది నేటికీ నిలబడి ఉండటంలో ఆశ్చర్యమే లేదు.

రాజర్షి మనువు

భారతీయ మహా పురుషులలో మనువుది ఒక విశేష స్థానం. చరిత్రకారులు ఆయనను చరిత్రకు అతీతమైనవాడు అనుకున్నా, నేటికీ ఈ దేశపు సామాజిక వ్యవస్థ పునాదులలో మనువు నిర్ధారించిన ప్రశస్త నియమాలే పని చేస్తున్నాయి.

vo U20 · AI Camera 2023.04.16 09:15

ఆర్యుల యుగ యుగాల స్థిర జీవనపు ఆధారశిలను స్థాపించిన మహా పురుషులెందరో ఉన్నారు. వారిలో మనువు పేరు సాటిలేని ప్రకాశం గలది. మనువును ప్రథమ ప్రజాపతి అంటారు. జన జీవన అభివృద్ధికి ఎటువంటి ప్రశస్త నియమాలుండాలో, ఉదార జీవన క్రమపు ఆవశ్యకత అవసరమో అలాంటి ఆర్యసంస్కృతికి ఒక సుందరమైన ప్రతీక మనువు. సహస్రముఖాలుగా విస్తరించిన మన జీవన క్రమాన్ని నియంత్రించిన శ్రేయస్సు ఆ మనువుకే తప్ప వేరే ఎవరికీ దక్కలేదు. మనువు కొన్ని స్పష్టమూ, నిశ్చితమూ అయిన ఆదర్శాలకు ప్రతినిధి. అవన్నీ సక్రమంగా సాగాలంటే, మనం ఆయన చెప్పిన ధర్మ ప్రతిపాదక స్వరూపాన్ని బాగా పరిశీలించి అర్థం చేసుకోవాలి.

మన నేటి చరిత్రకు అతీతుడైన వ్యక్తి మనువు. ఆయన పేరు వినగానే మనకు ‘సూర్యోదయపు బంగారు కాంతులలో మానవులు, దేవతలు కలిసి విహరిస్తున్నట్లుగా’ ఒక సుందర దృశ్యం కనులముందు గోచరిస్తుంది. ఆ యుగపు గాథల సముదాయం నుంచి చారిత్రిక సత్యాలు, పురాణాల కల్పనలు. వీటిని విశ్లేషించటం కేవలం మన భారతీయులకే కాదు, ప్రపంచంలోని ఏ దేశానికైనా కఠినకార్యమే. మన ఊహలను, అపోహలను కాసేపు అదుపులో ఉంచుకొని చూడగలిగితే, మానవజాతి యొక్క పూర్వ పురుషులను గురించిన సత్యం, కల్పనలు ఎంత గొప్పవో తెలుస్తుంది. ఆనాటి సజీవ జీవన చిత్రం మనకు ఇష్టమైనది. అది మన మనో రాజ్యంలో సమస్త జాతీయ జీవనపు ఒకానొక విరాట్‌వస్తువైపోయి ఎప్పటికీ వ్యాపించే ఉంటుంది. ఇలా మనువు కల్పన అతడు ప్రతిపాదించిన ధర్మాల గాఢమైన ముద్ర మన సామాజిక, వ్యక్తిగత జీవితాలలో స్థిరంగా నిలబడిపోయి ఉంది.

భారత దేశంలోనే కాక ఇతర దేశాల చరిత్రలలోనూ మనువును పోలిన పేర్లు ఉండటం సందేహమే కలిగిస్తుంది. కొందరి అభిప్రాయం ప్రకారం జల ప్రళయం నాటి ‘నూహ’, అతని కథ ప్రాచీన సుమేరు దేశపు గ్రంథాలలోనూ ఉన్నాయి, క్రైస్తవ, మహమ్మదీయ మతాలలోనూ ఉన్నాయి. శతపథ బ్రాహ్మణంలో జల ప్రళయానికి సంబంధించినవాటిలోనూ మనువును గురించి ఉంది. ప్రాచీన క్రీట్ ద్వీపపు తొలి సమ్రాట్టు పేరు **‘మినోస్’** అనేది కూడా మనువు పేరుతో కలుస్తూంది. ఈజిప్టు దేశపు తొలిరాజు పేరు ‘మేనిజ్’. వీటన్నింటి వెనుకా ఒక మనువు వంశం దాగి ఉన్నట్లుగా తోస్తుంది. భారతీయ సాహిత్యంలోని పద్నాలుగుమంది మనువుల పేరిటా పద్నాలుగు మన్వంతరాల కాల విభాగాలు వెలసి ఉన్నాయి.

వీరిలో మొట్టమొదటి వాడు స్వాయంభువ మనువు. ఇతడే మానవ ధర్మ శాస్త్రపు ధర్మాలను ప్రవచించినవాడు. నేటి మన్వంతరం వైవస్వత మనువు పేరిట వెలసింది. భారతీయ చరిత్ర ప్రకారం, ఈ మనువే సుప్రసిద్ధమైన ఇక్ష్వాకు వంశపు రాజులలో తొలి సమ్రాట్టు. ఈ ఇక్ష్వాకు వంశీయుల పరంపరే ప్రాచీన భారతీయ తిథి క్రమపు కొలబద్దగా భావించబడుతూంది. మహాకవి కాళిదాసు **‘సోఽహమాజన్మ శుద్ధానాం”** (రఘువంశ 1.5) అంటూ ఈ వంశంలోని కర్మిష్ఠులైన రాజర్షులను గురించే విశేషంగా పవిత్ర వర్ణన చేశాడు.

> **వైవస్వతో మనుర్నామ మాననీయో మనీషిణామ్ ।**
> **ఆసీన్మహీక్షితామాద్యః ప్రణవచ్ఛన్దసామివ ॥**
>
> – రఘు. 1.5

వేదాలలో ప్రణవానికి ఎటువంటి ప్రముఖ స్థానం ఉందో, అలాంటి స్థానమే మహనీయుడైన వైవస్వత మనువుకూ మనీషులలో ఉంది. అంటే ఏ విధంగా ప్రణవం రహస్యమైన త్రయీ విద్యలకు ప్రతీకో, అదే విధంగా ఆ నాటి రాజులందరిలోనూ నీతికి ప్రతీకగా మనువును చెబుతారు. మనువు చెప్పిన మానవ ధర్మాలలోని ఉత్కృష్ట ఉపదేశాలను కొన్నింటిని, కాళిదాసు తన రఘువంశపు రాజుల శీలాలలో పొదిగాడు–

సోఽహమాజన్మశుద్ధానామాఫలోదయ కర్మణామ్ ।
ఆసముద్రక్షితీశానామానాకరథవర్త్మనామ్ ॥
శైశవేభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణామ్ ।
వార్ధకే మునివృత్తీనాం యోగేనాన్తే తనుస్త్యజామ్ ॥
యథావిధిహుతాగ్నీనాం యథా కామార్చితార్థినామ్ ।
యథాపరాధదణ్డానాం యథాకాల ప్రబోధినామ్ ॥ –రఘువంశ. 1. 6,17

ఆ సూర్యవంశీయు లందరూ సముద్రం అంచుల వరకు గల రాజ్యముగలవారూ, జీవితపర్యంతమూ శుద్ధ సంస్కారాలు గలవారూ, తొలి వయస్సులో విద్యాభ్యాసం, యౌవనోచిత భోగా లనుభవించినవారూ, వార్ధక్యంలో ముని వృత్తిని అవలంబించి చివరికి యోగ మార్గంలో శరీరాన్ని వదిలేవారూ అని ఉంది. ఈ విధంగా సువ్యవస్థ గల నాలుగు ఆశ్రమాలనూ అనుసరించినవారే. కీర్తి కోసం జయించిన వారు, సత్యం కొరకు మితభాషులు, దానం కోసమే ధనాన్ని కూడబెట్టిన వారు, సంతానం కొరకే గృహస్థులూ అయ్యారు. విధిననుసరించి యజ్ఞ యాగాలు చేయటం, నిర్దేశిత సమయంలో మేల్కొనడం, అపరాధానుసారం శిక్షించటం, యాచకుల కోరికలను అనుసరించి దానాలు చేయటం – ఇవి వారందరి ప్రత్యేకతలు. ఈ శ్లోకాలలో చెప్పిన మానవ జీవన స్వరూపమే సంక్షేపంగా మానవ ధర్మం. మనం ఆదర్శ మహారాజులుగా భావించే రఘువు, దిలీపుల పూర్వజుడే మనువు. ఉదాత్త క్షాత్ర ధర్మానికి ఉత్కృష్ట ప్రతినిధులైన ఆ రాజర్షుల రూపాలు మన మనో నేత్రాల ముందుకు తేవడంలో, కవులు ప్రయోగించిన **'శాలప్రాంశులు, వృష స్కంధులు, వ్యూఢ ఉరస్కులు, మహాబాహులు'** – వంటి విశేషణాలు సార్ధకమయ్యాయి. మను రాజర్షి భౌతిక స్వరూపం కూడా కొంత వరకు ఈ విధంగానే మనకు గోచరిస్తుంది.

ఈ ఉదార పరంపరకు చెందిన ఆర్య జీవితం గడిపినవాడే శ్రీకృష్ణుడు కూడా. గీతలో ఆయనే స్వయంగా ఇలా చెప్పాడు–

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽ బ్రవీత్ ॥ – భగవద్గీత. 4. 1

రాజర్షుల ఈ ఉత్తమప్రజ్ఞా యోగం వైవస్వత మనువు నుంచే ప్రారంభమైంది. ఈ అనుయాయులలో జనకమహారాజు కూడా ఉన్నాడు. 'బ్రహ్మ, క్షాత్ర–ఈ రెండు ఆదర్శాలకూ పూర్తి ప్రమాణం కృష్ణుడి జీవనమే' అని మునుపే చెప్పుకున్నాము. ఇదే విషయాన్ని మనువు, జనకులను, ఆ ఆదర్శాలనే పాటించిన ఇతర రాజర్షుల విషయంలోనూ చెప్పుకోవచ్చు. మహా కవి కాళిదాసు, మనువు నడిపించిన మార్గానికి విభిన్నంగా ఇటూ అటూ కూడా కదలని వారు రఘువంశ రాజ్యాల ప్రజలు. ఎలాగంటే –

రేఖా మాత్రమపి క్షుణ్ణాదా మనోర్వర్త్మనః పరమ్ ।
న వ్యతీయుః ప్రజా తస్య నియంతుర్నేమివృత్తయః ॥

దుర్యోధనుడు కూడా తన పాలనలో మనువు ధర్మం పాటించినవాడేనని భారవి చెప్పాడు. మనువు రాజధర్మపు గొప్ప ఆదర్శాలు, రాజ్యాభిషేక సమయంలో చేసే ప్రతిజ్ఞతోనే భారతీయ రాజులను దీక్షాబద్ధులను చేస్తూంది అని గ్రహించాలి. ఇతిహాసయుగంలో గుప్తవంశపు సమ్రాట్టులందరూ దీనికి ఉదాహరణగా నిలుస్తారు. వారిపాలనలో స్వర్గంలోని సమృద్ధి భూమి మీద విలసిల్లిందని కవులు వర్ణించారు.

మనుస్మృతి

ఇప్పటి **'మనుస్మృతి'** లేదా **'మానవ ధర్మశాస్త్రం'** పన్నెండు అధ్యాయాలతో అనుష్టుప్ ఛందస్సులో ఉంది. ఇందులోని విషయాలు ఆధారంగానే మనకు, ఏకాగ్రతతో కూర్చున్న మహా తేజస్వుడు, అమిత ఓజస్కుడు, ధీమంతుడు మహాత్ముడునైన మనువును ఋషులు ధార్మిక సంబంధ ప్రశ్నలు వేశారని తెలుస్తొంది –

మనుమేకాగ్రమాసీనమభిగమ్య మహర్షయః ।
ప్రతిపూజ్య యథాన్యాయమిదం వచనమబ్రవీత్ ॥ – మను. 1.1

కాని కొంత వరకు ధర్మ నిరూపణ జరిగిన తర్వాత, తన శిష్యుడైన భృగువుకు ఆ పిమ్మటి ప్రవచనం కొనసాగించమని అప్పగించి వెళ్లాడు. మిగిలిన గ్రంథ వ్యాఖ్యానమంతా భృగువు చేశాడు. సహజంగా నేటి మనుస్మృతి ప్రచురణ భృగువంశీయులైన ఆచార్యులే చేశారు. మనుస్మృతి, మహాభారతం– ఈ రెండింటిలో సమానత్వం చాలా ఉందనే ప్రమాణం మరొకటుందని స్వర్గీయ డా॥ వ్యూలర్ అరణ్యపర్వం – అనుశాసనిక పర్వాలతో మనుస్మృతిని పోల్చి, రెండింటిలోనూ దాదాపుగా 250 శ్లోకాలు సమానమనీ, ఈ సంఖ్య మనుస్మృతిలోని పదవభాగం లోనిదనీ చెప్పాడు. మహాభారతంలోని మిగిలిన పర్వాలలోనూ మరిన్ని సమాన శ్లోకాలు ఉండవచ్చు. ఇటీవల భండార్కర్ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షులు డా॥ విష్ణు సుకథన్‌కర్ తన 'భృగువు' అనే వ్యాసంలో, ఎంతో పరిశోధన, విద్వత్తలతో మహాభారతపు ఇప్పటి ప్రచురణ భార్గవ వంశీయులైన బ్రాహ్మణుల ద్వారా జరిగిందని నిరూపించాడు. దీన్ని కీత్ కూడా అంగీకరించాడు. వారే మహాభారతంలో మనుస్మృతి శ్లోకాలను కనుగొన్నారని తోస్తుంది. మరి అయితే మనుస్మృతి మూలరూపమేమిటి? అన్న ప్రశ్నకు సమాధానంగా పలువురు 'మనుస్మృతి కన్నా ముందే ఒక మానవ ధర్మ సూత్రం' ఉండేదనీ, అందులో శాఖ–ప్రతి శాఖలవలె శ్లోకాలు, సూత్రాలు కలిసే ఉండేవనీ అభిప్రాయ పడుతున్నారు. ఇప్పుడు **'మానవ ధర్మ సూత్రం'** లభించకపోయినా, కృష్ణయజుర్వేదంలోని మైత్రాయణీ శాఖతో సంబంధం ఉండేదని వారి భావన. మైత్రాయణీ శాఖలో ఒక మానవ సంబంధ చరణం ఉండేది. ఆ నాటి పరిభాషలో చరణం అంటే 'వైదిక పరిషత్తు' లేదా ఆచార్యుల పరిసరాలలో నడిచే విద్యాసంస్థ. మానవ ఆచార్యుల చరణంలో రచితమైన ధర్మ సూత్రాల ఆధారంగానే నేటి మనుస్మృతిలోని అధిక భాగం తయారైనట్లు తోస్తుంది. సంస్కృత సాహిత్యంలో మనువు పేరు చాలా పురాతన మనేది గుర్తుంచుకోవలసిన విషయం. తైత్తిరీయ సంహిత, మైత్రాయణీ సంహితలలో మనువు రచన **'ఓషధులకు ఓషధి'** అంటే –**'నీతులలో కెల్లా పరమ నీతి'**గా చెప్పబడింది.

మనుధర్మం

జర్మనీకి చెందిన ప్రసిద్ధ దార్శనికుడైన నిత్షే ఇలా రాశాడు - The Law book of manu is an incomparably greater intellectual work than the Bible. అంటే బైబిల్ కన్నా మేధాశక్తితో రచించిన పుస్తకమే మనుస్మృతి అని. అతని ప్రశంస గొప్పతనాన్ని గ్రహించాలంటే, మనువు ధర్మాన్ని తెలుసుకోవడం చాలా అవసరం. మనువు ధర్మం కర్తవ్య నిర్వహణం. మనువు వైదిక కర్మయోగ ప్రతిపాదకుడు. మనువు ప్రకారం ఆ వైదిక కర్మయోగానికి మూలం దృఢ సంకల్పమే. సంకల్పం కోరిక నుంచే అన్ని యజ్ఞాలు, వ్రతాలు, తపస్సు, జీవితంలోని ఎదురు లేని శక్తులు పుడతాయి. జీవితంలో శక్తి సంపన్నులు కావాలనే భావం పుట్టినప్పుడు, మనువు చెప్పిన వైదిక కర్మ యోగం పనికి వస్తుంది.

ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ । 6.35

అంటే 'ఋషి ఋణం, దేవఋణం, పితౄణం– ఈ మూడింటి ద్వారా జాతీయ సంస్కృతి, పితృభూమి, మానవ వంశాలకు యథోచిత సేవ చేసిన తర్వాతే, మనిషి తన ఆధ్యాత్మిక జీవితాన్ని గురించి ఆలోచించే అధికారం పొందుతాడు' అని.

మనువు ధర్మం గణితంలోని అంకెల వలె చాలా సరళంగా ఉంటుంది. అందులో పుట్టుక నుంచి మరణపర్యంతమూ, మనిషి జీవితచిత్రం మొత్తం ఉంటుంది. 'ధర్మం, అర్థం, కామం, మోక్షరూపమైన నాలుగు పురుషార్థాలూ; దేవ ఋణం, ఋషి ఋణం, పితౄణ రూపమైన మూడు తప్పని కర్తవ్యాలూ; పదహారు సంస్కారాలూ; పంచమహా యజ్ఞాలూ; బ్రహ్మచర్యం, వానప్రస్థం, గృహస్థం, సన్న్యాస రూపాల నాలుగు ఆశ్రమాలూ; బ్రాహ్మణ క్షత్రియ వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలు' ఇదే సంక్షిప్తంగా మను ధర్మం.

ఒక చిన్న పిల్లవాడు సైతం మనువు చెప్పిన ధర్మాల రూపురేఖలు చిత్రించ గలుగుతాడు. ఈ మనువు ఆదర్శాలు 'జీవితంలో ఇహ పరలోకాలు, సేకరణ-త్యాగాలు, యోగ వైరాగ్యాలు'- వీటిని వెంట తీసుకుని వెళతాయి. దీని పేరే ప్రాచీన బ్రాహ్మ, క్షాత్ర ధర్మాల సమన్వయం. ఒక రథాన్ని లాగడంలో రెండు ఎద్దులు ఏ విధంగా సమాంతరంగా నడుస్తాయో, ఆ విధంగా ఈ ఆదర్శాలలో అభ్యుదయం, నిశ్శ్రేయమూ కలిసి నడుస్తాయి. మనువు చెప్పిన ధర్మమూ, మహాభారతంలో ప్రతిపాదించిన ధర్మమూ ఒకటే. వేదవ్యాసుడు-

ధారణాద్ధర్మ ఇత్యాహుః ధర్మో ధారయతే ప్రజాః ।
యత్స్యాద్ధారణసంయుక్తం స ధర్మ ఇత్యుదాహృతః ॥ మ.భా. 12.110.11

అన్నాడు. అంటే ధర్మమనే శక్తి ప్రజలను, సమాజాన్నీ ధరిస్తుంది. ఇది మనిషిని విడిగా చేసి అరణ్యమార్గం చూపే సాధనం కాదు. జీవితంలోని విజయ భావనను నశింపజేసి, కామెర్ల వ్యాధి వలె జీవితాన్ని నిస్తేజపరిచే ధర్మం మనువుకు ఏ మాత్రమూ సమ్మతం కాదు. ప్రసిద్ధ విద్వాంసుడైన డాక్టర్ మీస్ (Dr. Mees), **'ధర్మం - సమాజం'** అనే తన గ్రంథంలో భారతీయ దృష్టి కోణంలో **'ధర్మం'** పదానికి అర్థాన్ని వివరించే ప్రయత్నం చేశాడు. మనువు, వేదవ్యాసుడు, మనిషినీ, జాతినీ ఇహలోక జీవనంలో అభ్యున్నతి సాధించి, ఆ తర్వాత ఆధ్యాత్మిక శాంతివరకు తీసుకు వెళ్లే వ్యవస్థిత కార్యక్రమాన్నే ధర్మం అన్నారు. ఈ ధర్మం ప్రకృతి విధానాలతో కలిసి ఉంటుంది. అథర్వవేదంలో 'ధర్మమే ఈ భూమిని ధరించి ఉంద'ని ఉంది. ప్రతి మనిషి జీవనము కూడా ధర్మమనే దృఢమైన పునాది మీదే నిలబడుతుంది. ఆధారం ఎంత బలంగా ఉంటే, అంత ఎత్తుకు జీవిత ప్రాసాదం నిర్మితమవుతుంది. అందుకనే మనువు చెప్పిన పది ధర్మ లక్షణాలనే ప్రధానంగా తీసుకొని రామాయణం ద్వారా వాల్మీకి రామచరిత్రను ఆదర్శంగా రచించాడు.

ఈ మనువు వాక్యాన్ని చూడండి- **'ఆచారః పరమో ధర్మః'** - 1.108

ఇంకా 'ఆచారహీనుడైన విప్రునికి వేదఫలాలేవీ ప్రాప్తించవు, ఆచారవంతుడైతేనే సంపూర్ణ ఫలాలు లభిస్తాయి' అన్నాడు. ఈ విధంగా ఆచారం వల్లనే ధర్మ ప్రాప్తి అని భావించిన ఋషులందరూ 'తపస్సుకు మూలం కూడా ఆచార'మనే చెప్పారు-

మనువు పదే పదే తన శాస్త్రానికి వేదాలే మూల మని చెప్పాడు. ఋగ్వేదంలో -

ఋతస్య పంథాం న తరంతి దుష్కృతః । ఋ. 9.73.6

అంటే ఆచారహీనులైనవారు సత్యమార్గాన్ని దాటలేరు. మనువు దీన్నే అనువదించి ఇలా చెప్పాడు -

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసి చ ।

న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛతి కర్హిచిత్ ॥ -మను. 2.97

అంటే, వేదాలు, త్యాగం, యజ్ఞాలు, తపస్సు - ఇవన్నీ దుష్టమనోభావాలున్నవారికి ఫలించవు.

ఈ ఆచార మూల జీవన సాధనే మనువు చెప్పిన బ్రహ్మచర్య ఆశ్రమం. మనువు విద్యా విధానం ఉద్దేశ్యం 'డాక్టర్లు, వకీళ్లు లేదా ఇంజినీర్లు లేదా ఇలాంటి ఉద్యోగుల ఉత్పత్తి కాదు. దాని ఉద్దేశ్యం మానసికంగానూ, శారీరకంగానూ బలవంతులై, తమ తమ జాతి వారి మహత్తర జీవితం పట్ల శ్రద్ధ గల ఆచారవంతులను తయారు చేయటమే. వివాహానికి

ఎవరికి అధికారం ఉంది? దీనికి సమాధానంగా మనువు చెప్పే ఒకటే పదం – 'అవిప్లుత బ్రహ్మచారి' అని. గృహస్థాశ్రమంలోకి అడుగు పెట్టడంతో పాటే ప్రతి వారికీ దేశం తాలూకు జీవన మరణాలతో సంబంధమూ ఏర్పడుతుంది. దీన్ని పిరికివాడు ఎప్పుడూ మార్చ లేడు. నిజానికి నీతిమూలక ఆచారమే నిత్యధర్మం. అది సత్యం కావటం వల్లనే మనకు ఒక స్థిర కర్తవ్యంగా మారుతుంది.

వర్ణ (కుల) ధర్మాలు

గీతాంజలి గ్రంథానికి భూమిక రాసిన విద్వాంసుడు 'పూర్వం ఎటువంటి వర్ణాలవారికి కీర్తి లభించిందో మీకు తెలుసా?' అన్నాడు. ప్రాచీన ఆర్యసమాజంలో గృహస్థును రోమన్ న్యాయకర్తలు 'poter familias' అన్నారు. అతనే కుటుంబానికి ప్రధాన కేంద్రం. సమాజం మొత్తానికీ రాజు. మానవ ధర్మంలో గృహస్థు అనే దివ్య భావన వల్లనే నేటికీ జాతి జీవనమంతా ప్రాణంతో అలరారుతూంది. రాజ్యం, సమాజం – వీటి వ్యవస్థలు బలహీనపడినప్పుడు గృహస్థే సౌరమండలంలోని సూర్యుని వలె తన కుటుంబానికి కేంద్రంగా నిలిచి దాన్ని నియంత్రిస్తాడు. ఆ నియంత్రణే జీవనం, అరాజకత మృత్యువు. రాజుకు జరిగే రాజ్యపట్టాభిషేకం వలె గృహస్థుకూ అభిషేకం జరుగుతుంది. దేశంలో ఉచ్చ స్థానం దేశానిదైతే, రెండవది కుటుంబానిదవుతుంది. హిందువులలో కొన్ని వర్గాలలో గృహం యజమాని మరణిస్తే, అతని పుత్రునికి అతని స్థానంలో ఉచ్చ స్థానం లభిస్తుంది. ఆ ఆచారం నేటికీ ఉందనటానికి 13వ రోజున పుత్రునికి తలపాగా చుట్టటమే నిదర్శనం.

మనువు-దేశం

మనువు చెప్పిన భారతవర్షం ఒక పుణ్యభూమి. దీన్ని ఆయన దేవనిర్మిత దేశంగా భావించాడు. ఈ దేశంలో ప్రాచుర్యంలో ఉన్న ఆచారాలపట్ల మనువు మనసులో ఎంతో గర్వం ఉంది. ఇవే సదాచారాలను అదే ఆర్యోచితమైన గౌరవంతో మనువు భూమి మీద అందరికీ ఆదర్శంగా పేర్కొని, దేశాన్ని అత్యంత ఉన్నత ఆసనంపై ఉంచాడు. ఇలాంటి భావనే దేశం ఇంకా అమరంగా నిలచి ఉండేందుకు కారణం. ఆ భావనే చీకటిలో సైతం దుఃఖాల నుంచి రక్షిస్తుంది. అర్వాచీన భారత దేశపు పునరుత్థాన మనే భవనపు తోరణ ద్వారం పై మనువు చెప్పిన ఈ శ్లోకం స్వర్ణాక్షరాలతో లిఖితమవుతుంది–

ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్రజన్మనః ।
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ॥ – మను. 2.20

అంటే ఈ దేశంలో జన్మించిన శ్రేష్ఠులైనవారి నుంచి భూమి మీది మానవ జాతి అంతా తమ తమ శీలాలను, చరిత్రలను చక్కదిద్దుకొను విద్యను పొందాలి"అని

రాజ్యంలో రాజసింహాసనమే అన్నింటి కన్నా ఉన్నతాసనం. అక్కడి నుంచే శిక్షలు విధించబడతాయి. మనువుకు అరాజకదేశ మంటే గిట్టదు. అరాజకత వ్యాపించిన దేశంలో మత్స్య న్యాయంతో 'బలవంతులు నిర్బలులను భక్షించడం, బాధలు పెట్టడం చేస్తారు'. రాజనీతి బాగున్నంత కాలమూ మనువు చెప్పినపద్ధతి బాగా అమలులో ఉంటుంది. స్వదేశంలో రాజు బలం కాస్త అటూ ఇటూ అయితే, మనువు ఏర్పరచిన ఆదర్శ వ్యవస్థలన్నీ చతికిలబడిపోతాయి. అందుకనే మనువు దేశపు శక్తిని అతి గొప్పశక్తిగా పరిగణించాడు. మనువు ప్రకారం శిక్ష అనేది ధర్మానికి మరొక పేరు. ఆ శిక్ష కనుక నిర్బలమైతే ధర్మం రసాతలానికి వెళ్లిపోతుంది. మనుధర్మం కేవలం శుష్కమైన విశ్వాసం కాదు. ప్రజలను ధరించి, పెంపొందించే జీవితపు అతి శక్తివంతమైన పద్ధతి. శిక్ష్మా స్మృతికి మూలమైనది. న్యాయకర్త నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ప్రజలు కూడా పరస్పరం అణచివేతకు దూరంగా ఉంటారు. మనువు ప్రకారం శిక్షే రాజు, శిక్షే నాయకుడు, శిక్షే శాసనం, అదొక్కటే మొత్తం దేశంలో ఏకైక పురుషుడు.

ఈ విధంగా అన్నిటి నుంచీ నిర్భయంగా ఉంటూ, అందరినీ నిర్భీతులను చేసే **'దండనీతి'** దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్నంతకాలమూ ఆ దేశపు ఆత్మవిశ్వాసం వైభవంగా ఉంటుంది. బ్రాహ్మ ధర్మం, క్షాత్ర ధర్మాల అందమైన సమన్వయమే మనువు ఆదర్శం. వీటిని నేటి రాజనీతి పరిభాషలో విధాయక, కార్యపాలక శక్తులు అంటారు.

అంటే, బ్రహ్మ తేజం లేని క్షాత్ర తేజం, క్షాత్ర తేజం లేని బ్రహ్మ తేజమూ వికసించవు. ఇవి కలిస్తేనే ఇహపరలోకాలలో అన్ని అభివృద్ధులూ జరుగుతాయి.

ఇటువంటి వ్యవస్థలో బుద్ధిబలం, భుజబలం – రెండిటికీ సమాన గౌరవం లభిస్తుంది. మనువు చెప్పిన ఆదర్శ బ్రాహ్మణులలో అత్యున్నత దేశసంస్కృతి రూపుదాల్చి ఉంటుంది. వారే బ్రాహ్మణ ధర్మపు నిఘంటువులు అవుతారు. దేశపు ధర్మ నిర్మాణం ఇలాంటి జ్ఞానుల పరిషత్తులలోనే జరుగుతుంది. రాజదండం ఇలాంటి ధర్మాలను అమలు చేస్తుంది. మానవ ధర్మం మెజారిటీ మీద ఆధారపడి ఉండదు. ఒక జ్ఞాని పదివేలమంది మూర్ఖుల కన్నా శ్రేష్ఠుడు.

ఏకోఽపి వేదవిద్ధర్మం యం వ్యవస్యేద్ద్విజోత్తమః ।
స విజ్ఞేయః పరో ధర్మో నాజ్ఞానాముదితోఽయుతైః ॥ – మను. 12.113

మనువు ప్రకారం విద్వాంసుడు లేదా కర్మిష్ఠి అయిన జ్ఞాని అందరి కన్నా అధికుడు. ధనం, బంధువులు, ఆయుస్సు, కర్మ, విద్య– ఈ ఐదూ ఆదరానికి పాత్రాలు. వీటిలో తర్వాతిది మొదటి దాని కన్నా శ్రేష్ఠం. ధనం కన్నా జ్ఞానం చాల ఉన్నతం. మానవుల గొప్పతనాన్ని చాటే ఈ సందేశాన్నే ఋషులు చెప్పారు. మనువు కూడా దీన్నే గ్రహించాడు. మనువు దృష్టిలో **'మనుష్యుడు'** అన్నిటికీ కేంద్రం కావటం చేత, అతని నిర్మాణమే అన్ని శాస్త్రాల, ధర్మాల ధ్యేయం. మనుష్యుని సమృద్ధి కొరకే దేశంలోని ఆదర్శ సంస్థల వికాసం జరుగుతుంది. మనువు **'రాజే యుగ ప్రవర్తకుడు'** అని భావించటం చేత **'రాజా హి యుగ ముచ్యతే'**, సప్తాంగాలు గల రాజ్యమే మానవ సమాజానికి అన్నిటి కన్నా అతి ఆవశ్యక మని చెప్పాడు. దీన్ని సిద్ధింపజేసుకోవాలంటే ఒకవైపు శక్తివంతమైన శిక్షా స్మృతి (న్యాయవ్యవస్థ) ఉండాలి, రెండోవైపు దేశప్రజలలో నిర్మలత్వం, తేజస్సు రావటమూ జరగాలి.

పండితాః సమదర్శినః

ప్రస్తుతం ఈ దేశపు సమాజ వ్యవస్థలో ఎన్నో రకాల భేదాలున్నవి. వీటిలో ముఖ్యమైనవి జాతి భేదం, భాషా భేదం, ధర్మ భేదం – అనేవి మూడు. కాని ఈ భేదాలన్నిటికీ అతీతంగా భారతీయ దార్శనిక ఆలోచనా విధానం అందరిలోనూ నెలకొని ఉన్న ఏకత్వం మీద ఆధారపడి, దానికి బలాన్ని ఇచ్చింది. ఈశ్వరుడు ఒక్కడే, అతడు అంతటా, అన్నిటా వ్యాపించి ఉన్నాడు. అందరి హృదయాలలో ఉంటాడు, ఇదే భారతీయ సంస్కృతికి ఆత్మ. భారతదేశపు నేత్రం వేదాంత చైతన్యమయం. అది అన్నమయ శరీరం కన్నా వేరై, అన్ని ప్రాణులలోనూ ఒకటే అయి ఉంటుంది. అదే అంతిమ మూలతత్త్వం. శైవులు, వైష్ణవులు, ఆస్తికులు, భాగవతులు, భక్తులు, జ్ఞానులు, యోగులు– ఇలా అందరిదీ ఆత్మ విషయంలో ఒకటే ఆలోచన. ఈ సమస్త జగత్తూ భగవంతుని నివాస స్థానం. ఆయనే అందరికీ అధ్యక్షుడు. ఆయనే ఆత్మ స్వరూపంతో అందరిలోనూ ఉంటాడు. ఇటువంటి ఆలోచన మనుష్య లందరినీ ప్రేమ అనే పాశంతో బంధిస్తుంది. ఇదే నిజము. దీన్ని జీవితంలో అమలు చేయాలి. ఆత్మ ఏకత్వాన్ని గురించిన విషయం కేవలం చెప్పటం – వినటాలలోనే ఉంటే అది వ్యర్థమే !

నేటి భారతీయ జీవన శకటం ఊబిలో చిక్కుకుపోయింది. ఉన్నత జ్ఞానరంగంలో ఏ విషయాన్నైతే సత్యమని నమ్మాలో, దాన్ని వ్యవహారంలోకి తేవడానికి వంద ఇబ్బందులు ఎదురయ్యాయి. వ్యావహారిక జీవితంలో హెచ్చుతగ్గులు, స్పృశ్యత– అస్పృశ్యతలు అనే బలమైన గోడలు లేచి, అవి ఎంత కఠినమయ్యాయంటే, నేటి నాగరికులు వాటిని గురించి

ఆలోచించి వణికిపోతారు. అయినా విశ్వాత్మను నమ్మే పద్ధతి ఆ యా సమయాలలో ప్రకటమై సమాజానికి కరదీపిక వలె దారిచూపటంలో సమర్థత చూపింది. ఎటువంటి డొంకతిరుగుడూ లేకుండా చెప్పదలచిన దాన్ని నేరుగా చెప్పగలిగే శ్రీకృష్ణుడు మన దేశపు మంచి దార్శనికులలో అగ్ర గణ్యుడు. ఆయన తన పద్ధతిలో సమాజపు ప్రతి విషయానికీ చక్కని అన్వయంతో మార్గాన్ని సొంతం చేసుకున్నాడు. పశుపాలకులతో చక్కగా కలిసిపోయాడు. తానే పాలు పితకటం, ఆవులను పెంచటం చేశాడు. రథాన్ని నడిపే సారథి కూడా అయ్యాడు. యజ్ఞాలలో అతిథుల కాళ్లు కడగటాన్ని ఎంతో ఇష్టపడి, శారీరక శ్రమ గొప్పతనాన్ని కూడా తెలియజేశాడు. భగవద్గీతలో బ్రాహ్మణులు, శూద్రుల మధ్యగల శుష్క భేదాలను తిరస్కరించే తన అభిప్రాయాలనూ వెల్లడించాడు. తద్వారా తాను సమదర్శిననీ ప్రకటించాడు. అటువంటివాడికి ఇతడు విద్వాంసుడైన బ్రాహ్మణుడు, ఇతడు శ్వపచుడైన శూద్రుడు, ఇది పశువు' – అనే భేదబుద్ధి ఉండనే ఉండదు. గీతల్లోని సూత్రమిదే – **"పండితాః సమదర్శినః"** క్లుప్తంగా ఇది భారతీయుల తెలివినీ, జ్ఞానం లేదా వివేకాన్ని తెలియజేసే సూత్రం. ఎందరో ఈ సూత్రాన్ని అతిక్రమించి వెళ్లే ప్రయత్నాలు చేసినప్పటికీ, దీన్ని కాదనే ఎటువంటి సైద్ధాంతికులూ, లేదా మతవాదులు కానీ నేటి వరకూ లేరనే చెప్పాలి. వ్యాసులవారు కూడా భారతీయ జ్ఞానాన్ని చాలా కఠినసమయంలో సంతులితంగా చెప్పే ప్రయత్నం చేశారు. ఆయన ధర్మానికి బుద్ధిమూలకమైన వ్యాఖ్యను ఇలా చెప్పారు–

"ధారణాత్ ధర్మ ఇత్యాహుః ధర్మో ధారయతే ప్రజాః"

దేన్ని ధారణ చేస్తామో అదే ధర్మం. ఈ ధర్మం సమాజాన్ని, ప్రజలను ధరిస్తుంది. ధరించడం అంటే, సమాజానికి ఏది ఆచారమో, ఏది నీతి ధర్మమో దాన్ని పతనం కానీయకుండా కాపాడుతుంది. పరలోకం లేదా దేవతలను నమ్మటం లేదా పూజలను చేయటం వ్యాసుల వారు ధర్మంగా చెప్పలేదు. గొప్ప విషయాలను గందరగోళం చేయటం కూడా ధర్మం కాదు. వ్యాసులవారు ధర్మం అనే దాని అర్థాన్ని అత్యధికంగా బుద్ధిద్వారా పొందేదిగానే చెప్పాలనుకున్నారు.

ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష న చ కశ్చిత్ శ్రుణోతి మామ్ ।
ధర్మాదర్థశ్చ కామశ్చ స ధర్మః కిం న సేవ్యతే ॥ – మ. భా. 18.5.49

మహాభారతం చివరలో ఆయన ధర్మమే అర్థకామాలకు మూలమనీ, అదే నిత్యమనీ, దాన్నే ఆశ్రయించాలనీ సారాంశంగా చెప్పారు. ఆనాడు చేతులెత్తి ఆయన చెప్పిన విషయాలు అయస్కాంతపు ముల్లు ఉత్తర ధ్రువం వైపునకే దాన్నే చూపుతుందో, ఆ విధంగానే నేటికీ ధర్మం వైపు సంకేతిస్తూనే ఉంది. ధర్మాన్ని వ్యాఖ్యానిస్తూ నాలుగు వర్ణాలను గురించీ చెప్పారు.

ఆ నాలుగు వర్ణాలలోనూ హెచ్చుతగ్గులు, ఆభిజాత్యపు గొప్పతనం – ఇవి మంచివి కావన్నారు. ముందు గీతలో గుణ కర్మల ననుసరించి నాలుగు వర్ణాల విభజనను ప్రతిపాదించారు–

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ॥ భ. గీ. 4.23

ఇక్కడ ఏ వర్ణాన్నీ గొప్పగా చెప్పటం లేదా వాటిలో తారతమ్యం చూపే భావం లేదు. నాలుగు వర్ణాల సమాహారం లేదా కలయిక వల్ల పుట్టిన ఆనాటి సమాజవర్ణన ఉంది. ఇందులో వర్ణాల గుణాలు, కర్మలే వాటి విభజనకు హేతువన్నారు. రెండవది, ఆచార ప్రధానమైన జీవితమే వ్యాసులు అన్ని చోట్లా ఉండాలని నొక్కి చెప్పారు. అజగర యుధిష్ఠిరుల సంవాదం దీన్ని విశదం చేస్తుంది. అజగరుడు "ఓ రాజా! బ్రాహ్మణు డెవరు?" అని అడిగితే యుధిష్ఠిరుడు ఇలా జవాబిచ్చాడు.

సత్యం దానం క్షమా శీలం ఆనృశంస్యం తపో ఘృణా ।
దృశ్యన్తే యత్ర నాగేంద్ర స బ్రాహ్మణ ఇతి స్మృతః ॥ మ. భా. 3.77.12

"ఓ నాగరాజా ! సత్యం, దానం, క్షమ, శీలం, సహృదయత్వం, తపస్సు, దయ (ద్వేషం లేక పోవడం) ఎవరిలో ఉంటాయో, అతడే బ్రాహ్మణుడు."

నాగరాజు దీనికి సంతోషించలేదు. యుధిష్ఠిరుణ్ణి సంశయ నివృత్తి కోసం మళ్లీ ప్రశ్నించాడు-

శూద్రేష్వపి చ సత్యం చ దానమక్రోధ ఏవ చ ।
ఆనృశంస్యమహింసో చాఘృణా చైవ యుధిష్ఠిర ॥ మ.భా. 3.77.13

అతనన్నాడు - "ఓ యుధిష్ఠిరుడా!" లోకంలో నాలుగు వర్ణాలున్నాయి. ఎవడైనా శూద్రునిలో నీవు చెప్పిన సత్యం, దానం, క్రోధం లేమి, అహింస, దయ మొ॥ గుణాలుంటే, అతడు బ్రాహ్మణుడు అవుతాడా?" అని. దానికి యుధిష్ఠిరుడు ఇలా జవాబిచ్చాడు-

శూద్రే యద్ భవేల్లక్ష్మ ద్విజే తచ్చ న విద్యతే ।
న వై శూద్రో భవేచ్ఛూద్రో బ్రాహ్మణో న చ బ్రాహ్మణః ॥ మ.భా. 3.77.14
యత్రైతల్లక్ష్యతే సర్పవృత్తం స బ్రాహ్మణః స్మృతః ।
యత్రైతన్న భవేత్సర్ప తం శూద్రమితి నిర్దిశేత్ ॥ మ.భా. 3.77.15

"శూద్రుడిలో ఆచార సంబంధమైన ఈ లక్షణాలుంటే, అతడు శుద్రుడు కాడు. బ్రాహ్మణునిలో ఈ లక్షణాలు లేక పోతే అతడు బ్రాహ్మణుడు కాడు. నాగరాజా! ఎవనిలో శీలం ఉంటుందో అతడే బ్రాహ్మణుడు, ఎవడికి శీలం లేదో వాడే శూద్రుడు!"

నాగరాజు మళ్లీ ధర్మరాజును తర్కంలో పెడుతూ "నీ ప్రకారం శీలం వల్ల బ్రాహ్మణుడవుతాడు. అయితే శీలం, కర్మలూ లేని జాతి వ్యర్థమవుతుంది కదా!" అంటాడు.

యది తే వృత్తతో రాజన్ బ్రాహ్మణః ప్రసమీక్షితః ।
వ్యర్థాం జాతిస్తదాఽయుష్మన్ కృతిర్యావన్న దృశ్యతే ॥ మ.భా. 3.77.16

ఈ ప్రశ్న మామూలుది కాదు. ఇది జాతులనే చెట్టు మీదికి లేచే గొడ్డలి వంటిది. ముల్లు వంటి ఈ ప్రశ్నకు కూడా ధర్మరాజు జంకలేదు. అదే ధైర్యంతో, సాహసంతో జవాబిచ్చాడు.

జాతిరత్ర మహాసర్ప మనుష్యత్వే మహామతే ।
సంకరాత్సర్వవర్ణానాం దుష్పరీక్ష్యేతి మే మతిః ॥ మ.భా. 3.77.17
యత్రేదానీం మహాసర్ప సంస్కృతం వృత్తమిష్యతే ।
యం బ్రాహ్మణమహం పూర్వముక్తవాన్ భుజగోత్తమ ॥ మ.భా. 3.77.18

"ఓ నాగరాజా ! అస లీ జాతులేమిటి? ఏ జాతిలో వర్ణసంకరం జరగలేదు? వర్ణాల పరస్పర సంకరం కారణంగా జాతుల సరైన గుర్తింపువిషయంలో నా అభిప్రాయం అడగటం దండుగ. తత్త్వదర్శనం చేసేవారి అభిప్రాయంలో శీలమే ముఖ్యం. పుట్టుక తర్వాత వర్ణాలలో జాతకర్మ మొదలైన సంస్కారాలు జరిగినా, శీలం లేక పోతే అటువంటివాడు నా దృష్టిలో వర్ణసంకరుడే. అందుకని ఓ నాగరాజా ! ఏ వ్యక్తిలో శీలం-సంస్కారం ప్రకాశిస్తూ ఉంటుందో, అతడే బ్రాహ్మణుడు."

భారతదేశపు విశ్వాత్మను ప్రదర్శించే ఈ వాక్యాలు వ్యాసులవారి నూతన ధర్మపు వ్యాఖ్యలోనివి. బుద్ధభగవానుడు, మహావీరుడు తమ జీవితాలలో వాటిని ఆచరిస్తూ ఉపదేశించటం వల్ల ఈ సత్యాన్ని ప్రచారం చేశారు. విశ్వంలోని భారతీయులందరూ దాన్ని సమర్థించి తామూ గ్రహించారు. అయినా ఈ వ్యాధి నిర్మూలం కాలేదు.

ఎనిమిదవ శతాబ్దిలో శంకరభగవత్పాదులు వేదాంతజ్ఞానాన్ని దేశపు దార్శనిక దృష్టికోణంగా మార్చారు. దాని సారాంశ మేమిటంటే అన్ని జీవులలోనూ ఆత్మ తత్త్వపు ఏకత్వాన్ని గుర్తించటమే వేదాంత ఫలం అని. వారి శారీరిక భాష్యంలోని అపశూద్రాధికరణం అనే ప్రకరణంలో, దాన్ని మనం కాదన లేము. కాని మలబారు నుంచి ఉత్తరాపథానికి వచ్చినపుడు వారి అభిప్రాయాలకు ఎదురు దెబ్బ తగిలింది. ఉత్తరాపథంలో కాశీపురి జ్ఞానానికి ఆటపట్టు. అక్కడ వారికి చండాల దంపతులు ఎదురుపడితే, "దూరం తొలగు!" అన్నారు. వారి వేదాంతజ్ఞానం అప్పుడు మాయమై పోయింది. ఆ చండాలుని నోటి వెంట శంకరుల పట్ల గద్దింపు ఇలా వినిపించింది.

అన్నమయాదన్నమయమథవా చైతన్యమేవ చైతన్యాత్ ।
ద్విజవర దూరీ కర్తుమిచ్ఛసి కిం బ్రూహి గచ్ఛేతి ॥

"ఓ బ్రాహ్మణుడా ! మట్టితో తయారైన నీ శరీరంతో, మట్టితో తయారైన నా శరీరాన్ని తొలగమంటున్నావా? లేక నీ ఆత్మను నా ఆత్మకు దూరం చేయాలనుకుంటున్నావా? ఏ ధర్మంతో 'తొలగు తొలగు" అంటున్నావు?

"చూడబోతే నీ దగ్గర గంగాజలం ఉన్నట్టుంది. దాంట్లో ఏ సూర్యుని నీడ పడుతూందో, నా నీటిలో పడే నీడ కన్నా అది భిన్నమైనదా?

"నీ దగ్గర బంగారు కుండ ఉంది, నా వద్ద కేవలం మట్టి పాత్రే ఉంది. ఈ రెండింటిలోనూ వేర్వేరు ఆకాశాలున్నాయా?

"ప్రతి శరీరరూప కుండలలోనూ ఆత్మస్వరూప సహజానందపు జ్ఞానసముద్రం ఉంది. అందులోనూ నీ బ్రాహ్మణ-చండాలమనే భేదముందా? ఆ భ్రమ ఇంకా నీకు తొలగ లేదా?

"బ్రాహ్మణ – చండాల అనే భేదబుద్ధి వదలి పెట్టు. ఇటువంటి స్థిర బుద్ధి ఉంటేనే గురువు కాగలుగుతావు". ఇది విన్న శంకరులకు జ్ఞానోదయం కలిగింది.

మహర్షి స్వామి దయానంద సరస్వతి ధర్మం, జాతీయత-రెండిటిలోనూ భారతీయ ప్రాచీన ఉదారవాణిని ప్రకటించారు. అస్పృశ్యత అనేది హిందూసమాజానికి, హిందూ ధర్మానికే కళంక మని స్పష్టంగా చెప్పారు. ఈ మాలిన్యం లోపలా, బయటా, అంతటా వ్యాపించి ఉందనీ, దీనికి మన సంస్కృతిలో ఎటువంటి స్థానమూ లేదని 'మనుస్మృతి'యే దీనికి సరియైన సమాధానం చెబుతుందని, ప్రక్షిప్తాలు చేరడం వలననే ఈ దుర్గతి ఏర్పడినదని ఎలుగెత్తి పలికారు.

మనువు చెప్పింది 'ఔషధాలన్నింటికీ ఔషధం'

వైదిక ధర్మపు పునాది రెండు వ్యవస్థలపై నిలబడి ఉంది. **1. ఆశ్రమ వ్యవస్థ, 2. వర్ణ వ్యవస్థ.** ఈ రెండూ నాలుగేసి చొప్పున విషయాలను తెలియజేస్తాయి. అవి క్రమంగా బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సంన్యాస ఆశ్రమాలు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణాలు. ఆశ్రమాలకు వ్యక్తి నిర్మాణంతోనూ, వర్ణాలకు సమాజ నిర్మాణంతోనూ సంబంధం ఉంది. సమాజ నిర్మాణంలో వ్యక్తిది పెద్ద స్థానం. వ్యక్తులు కలిస్తేనే సమాజం ఏర్పడుతుంది. ఎంత ఉత్తములైన జనం ఉంటే అంత ఉత్తమ సమాజం తయారవుతుంది. దేశమనే భవనానికి పునాది వర్ణవ్యవస్థ అయితే, ఆ వర్ణవ్యవస్థకు పునాది ఆశ్రమవ్యవస్థ అని చెప్పవచ్చు. వర్ణవ్యవస్థ సమాజానికి ఔషధమైతే ఆశ్రమవ్యవస్థ ఆ ఔషధాలన్నింటికీ పరమౌషధమవుతుంది. తాండ్యబ్రాహ్మణకారుడు చెప్పినదాన్ని మనం సగౌరవంగా ఆచరించవచ్చు – **"మనుర్వై యద్ కించావదత్ తద్ భైషజం భైషజతాయై ।"** తాం.బ్రా. 23.16.6-7 -అంటే మనువు చెప్పినది ఔషధాలకే పరమౌషధం అని. అందుచేత మనువే ఈ రెండు వ్యవస్థలకూ సంస్థాపకుడు.

vivo U20 · AI Camera

వేదోఽఖిలో ధర్మమూలం

పైన చెప్పినదాని చివరి పంక్తి అభిప్రాయం 'ఈ రెండు విధాల వ్యవస్థలనూ మనువుకు ముందు ఎవరూ చెప్పలేదనో లేదా వాడుకలో లేవనో' కాదు. స్వయంగా మనుభగవానుడే **"వేదోఽఖిలో ధర్మమూలమ్"** అని చెప్పాడు. ధర్మాలన్నింటికీ వేదాలే మూలమన్నప్పుడు ఈ వ్యవస్థ మూలం వేదాలలో ఎలా ఉండకుండాపోతుంది? ఆధునికయుగంలో వేదాలను ఉద్ధరించిన మహర్షి దయానంద స్వామి కూడా **"వేదాలన్నీ సత్యవిద్యల పుస్తకాలు"** అని చెప్పి దాన్నే బలపరిచారు. వేదాలలో ఈ సత్యాలకు మూలాలున్నాయన్న మాట నిజమే. కానీ వాటికి నీరు పోసి, చిగుళ్లు, పుష్పాలుగా చేసి వృక్షరూపమిచ్చినవారు తరువాతి ఋషులే ఐనా వీరికి మనువు పూర్వ ఋషిగా పరిగణితుడయ్యాడు. ఈ రెండు విధాల వ్యవస్థలలో వర్ణ వ్యవస్థను గురించి విశదంగా, స్పష్టంగా వేదాలలో ఉంది. కానీ, ఆశ్రమవ్యవస్థను గురించి విశదంగా లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే ! నాలుగు సంహితలలోనూ ఎక్కడా **"ఆశ్రమం"** అనే పదమే లేదు. 'శ్రమ' అనే పదం చాలా చోట్ల ఉంది కానీ, 'ఆశ్రమ' పదం లేదు. అందువల్ల ఆశ్రమవ్యవస్థ, దీనితో పాటు ఆశ్రమ పద ప్రయోగాన్ని తొలిసారి చేసిన ఘనత మను భగవానునికే చెందుతుంది. రెండు విధాల వ్యవస్థలలో 'ఆశ్రమ వ్యవస్థ' స్థానం 'యమముల'వలె ప్రముఖమైనదని చెప్పుకోవచ్చు.

మనం **"ఆశ్రమాన్ సేవేత సతతమ్ న తు వర్ణాన్ కేవలాన్ బుధః ।**
శ్రమాత్ పతత్యకుర్వాణోఽపి వర్ణాన్ కేవలాన్ భజన్॥"

కేవలం వర్ణాలనే కాక ఆశ్రమాలనూ పాటించాలి. ఎందుకంటే ఆశ్రమధర్మాలు పాటించకుండా కేవలం వర్ణాలనే పాటిస్తే, తమ కర్తవ్యాల నుంచి పతితులు అవుతారు.

అది ఆశ్రమ వ్యవస్థ కాదు, లోకవ్యవస్థ

నాలుగు సంహితలలోనూ 'ఆశ్రమ' పదం లభించక పోవటం ఆశ్చర్యమే ! మరైతే ధర్మం, సత్యాల మూలం వేదాలని ఎలా చెప్పగలుగుతాము? ఇక్కడే విద్వాంసులందరూ ఆలోచించ వలసిన విషయం 'వేదాలకు సొంతమైన శైలిని జాగ్రత్తగా పట్టుకోవాలి' అనేది. వేదాల శైలి లోకులపై ఆధారపడి ఉంటుంది. వేదాల రచన, నిర్మాణం, వ్యవస్థను లోకంలో పంచాలనేది మనువు ఉద్దేశ్యం. అందుచేత ప్రతి తత్త్వాన్నీ లోకులలో ప్రతిపాదించాలి, లోకులకు పంచాలి అనేదే "వైదిక దర్శనం" 'ఎవరికి ఈ ఆలోచనా లోచనం ఉంటుందో, వారే నిజమైన దార్శనికులు'. వీటన్నింటినీ గోచరింప జేసేందుకే పాణిని భగవానులు **"లోకృ దర్శనే"** అనే ధాతువును సృష్టించారు. కళ్ల ముందు స్పష్టంగా ఉండేవీ, ఆలోచనా లోచనాలకే కనిపించేదీ, వాటిని చూడగలిగినవారే **'లోకులు"** అవుతారు!

యథా పిండే తథా బ్రహ్మాండే

ఎదుట కనిపించే బ్రహ్మాండాన్ని మనం త్రిలోకీ అంటాము. బ్రహ్మాండం లాగే తయారైన పిండం కూడా త్రిలోకీలోని భాగంగానే దర్శనం అవుతుంది. అప్పుడు -

"యథా బ్రహ్మాండే తథా పిండే" లేదా **"యథా పిండే తథా బ్రహ్మాండే"** అనే సూత్రం అన్వయ మవుతుంది. బ్రహ్మాండంలోని లోకంలో భాగమైన పిండంలోని భాగాలను లోకం లోనివిగా పేర్లు పెట్టడమే 'దర్శనం'. ఇదే విధంగా బ్రహ్మాండంలోని లోకాలకు పిండంలోని భాగాల పేర్లు పెట్టడమూ 'దర్శనమే'. ఈ రెండు విధాల పేర్లనూ వర్ణ, ఆశ్రమ

వ్యవస్థలోకి తేవటం, దర్శనంలోని 'దర్శనపు' 'దర్శనం' అవుతుంది. దీని పేరే 'విజ్ఞానం'. ఇటువంటి ద్రష్ట అయిన వ్యక్తినే **'ఋషి'** అంటారు.

మూడు లేదా నాలుగులోకాలు

వేదపండితులకు ఈ బ్రహ్మాండం మూడు లోకాలుగా విభజించబడిందనీ, వాటి ప్రసిద్ధ నామాలు **'భూః భువః,** స్వః' అనీ తెలుసు. వీటినే **'పృథివి, అంతరిక్ష, ద్యు'**, అని కూడా అంటారు. రెండింటినీ కలిపి చెప్పుకుంటే మూడుకు మారుగా నాలుగవుతాయి. **'భూః, భువః, ద్యుః, స్వః'** **'పృథివి, అంతరిక్ష, ద్యు, స్వః'**. మూడు లోకాలను లెక్కించేటప్పుడు, **'ద్యు, స్వః'**లను ఒకటిగానే భావించి, **'స్వః'** లోకం లేదా **'ద్యులోకం'** అంటారు. లోక భాషలో దేన్ని **'తల'** అంటారో దానిలో ముఖ భాగం, శిరో భాగం రెండూ సమ్మిళితమై ఉంటాయి. వీటి మధ్య గల **'భ్రూ రేఖ ముఖభాగాన్నీ, శిరోభాగాన్ని'** అంటే **'ద్యులోకం, స్వర్లోకా'**లను పంచుతూంది. **'భ్రూ రేఖ'** నుంచి కింది కంఠం వరకు గల భాగం **'ద్యులోకం'**, భ్రూ రేఖ నుంచి పైన శిఖ వరకు గల భాగం **'స్వర్లోకం'**. ఇప్పుడు మనం పిండ గతం, బ్రహ్మాండ గతం భాగాలైన సంజ్ఞలను వ్యక్తి, సమాజాలలో మూర్త రూపాలుగా చూద్దాం. వాటి యోగ్యతలను ఆ యా అంగాలలో కలిపితే, వాటి వాటి పేర్ల జ్ఞానం కలుగుతుంది. ఆ పరిస్థితిలో వ్యక్తి, సమాజాల విభజన దర్శనవిషయంగా కాక అది శ్రమసాధ్యం కావటం చేత, ఆ లోక వ్యవస్థ కూడా ఆశ్రమ వ్యవస్థ అవుతుంది.

వేదాలలోని లోక వ్యవస్థ

పైన చెప్పిన భాగాలు అథర్వవేదంలోని స్కంభ సూక్తంలో గొప్పగా చెప్పబడ్డాయి.

యస్య భూమిః ప్రమాఽన్తరిక్ష ముతోదరమ్ ।
దివం యశ్చక్రే మూర్ధానం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥ - అథ. 10.7.32

దేని గొప్పతనాన్ని కొలవటానికి ప్రమాణ భూత సాధనంగా భూమి చరణ స్థానీయమో, దేని లోపలిభాగం అంతరిక్షలోకమో, ఉదరస్థానీయమో, దేని ప్రకాశం ద్యులోకం ముఖస్థానీయమో ఆ జ్యేష్ఠ బ్రహ్మకు నమస్కారాలు.

యో భూతం చ భవ్యం చ సర్వం యశ్చాధితిష్ఠతి ।
స్వర్యస్య చ కేవలం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥ - అథ. 10.8.1

కేవలం 'స్వః' గుణం గల ఆ బ్రహ్మసత్త, మిగిలిన సత్తల నుంచి తనను తాను వేరుచేస్తున్నది. బ్రహ్మకున్న **'ఆనంద'** గుణమే ఆయనను ప్రకృతి, జీవుల నుంచి వేరుచేస్తున్నది. **ప్రకృతి**- కేవలం సత్; **జీవాత్మ** - సత్ చిత్ రెండూను; బ్రహ్మ - సత్ చిత్ ఆనందం. బ్రహ్మలో కేవలం ఆనందమే అధికం. జీవాత్మలో ఆనందం తక్కువ. అతని ధ్యానం, ధ్యేయం ఆనందలోకం, స్వర్లోకం. బ్రహ్మకున్న కేవలం 'స్వః' ను తనలో లయింపజేసుకుంటే, అప్పుడు కైవల్యప్రాప్తి అవుతుంది.

స్వర్లోకారోహణం

స్వర్లోకానికి వెళ్లేవాడు వేదాల లోని మంత్రాలను ఇలా పఠిస్తాడు -

పృథివ్యాఽ అహ ముదంతరిక్షమారుహమంతరిక్షాద్దివమారుహమ్ ।
దివో నాకస్య పృష్ఠాత్ స్వర్జ్యోతిరగామహమ్ ॥ - యజు. 17.67

పృథ్వీ లోకం నుంచి నేను అంతరిక్ష లోకంలోకి, అంతరిక్ష లోకం నుంచి ద్యులోకానికి, ద్యులోకం నుంచి స్వర్జ్యోతిని ప్రాప్తింపజేసుకున్నాను.

దీని అర్థం ఏమిటంటే, గురుకులంలో చేరిన బ్రహ్మచారి, తన వ్రతాన్ని చెబుతాడు – నేను బ్రహ్మచర్యాశ్రమం నుంచి గృహస్థాశ్రమానికి, గృహస్థాశ్రమం నుంచి వానప్రస్థానికి, వానప్రస్థం నుంచి సన్న్యాసాశ్రమంలోనికి తప్పకుండా ప్రవేశిస్తాను. ఈ ఆశ్రమాలలోనికి క్రమంగా కాకుండా నేరుగా సన్న్యాస ఆశ్రమం స్వీకరించేవారు అరుదుగానే ఉంటారు. విశ్వతోధార యజ్ఞం చేసేవారు వానప్రస్థాన్ని పట్టించుకోకుండా సరాసరిగా స్వర్జ్యోతిని పొందుతారు. అలాంటివారిని గురించి తర్వాతి మంత్రంలో–

స్వర్యంతో నా౨ పేక్షంత౨ ఆద్యాగ్ం రోహంతి రోదసీ ।
యజ్ఞం యే విశ్వతోధారగ్ం సువిద్వాంసో వితేనిరే ॥ – యజు. 17.68

ఈ మొత్తం చర్చ సారాంశం ఏమిటంటే, బ్రహ్మచర్య ఆశ్రమం పురుషుని పాదం– పృథ్వీలోకం కూడా. గృహస్థుని ఉరు భాగం, అంతరిక్షలోకం కూడా. వానప్రస్థం ముఖభాగం, ద్యులోకం కూడా. అలాగే సన్న్యాసి శిరోభాగమూ, స్వర్లోకం కూడా. అంటే పింద బ్రహ్మాండాలలోని యోగ్యతలను సంపాదించేవాడు తనలో వాటిని ధరిస్తాడు అని. వీటిని ధరించటానికి చాలా శ్రమ పడవలసి ఉంటుంది. పాదాలు, పృథ్వి–రెండూ మనిషిని ధరిస్తాయి. రెండూ తపస్వులే, రెండూ సహస్వులే. రెండూ గతిని, స్థితిని కలిగిస్తాయి. అంతే కాదు, పై అవయవాల కథ, వ్యథ, పీడలను తొలగించటానికి వెంటనే పరుగుతీస్తాయి కూడా. ఈ అన్ని గుణాలనూ కలిగి ఉండాలంటే, పాదాల వలె తపస్వులు, పృథ్వివలె సహస్వులు–సహనశీలురు కావాలి. ఆరోహణ కర్త అయినవాడు పృథ్వీ లోకం పై నున్న అంతరిక్ష లోకం – గృహస్థ ఆశ్రమానికి వెళతాడు. అప్పుడతని లోకం అంతరిక్షం, అవయవాలు ఊరువులు, ఉదరం అవుతాయి. ఆ అంతరిక్షం కూడా విశాలం, గొప్పది, అందరికీ ఆధారం, ఆశ్రయ మిచ్చేది, ఇచ్చిపుచ్చుకోవడానికి కేంద్రం, ఉదరం, నాభి, హృదయం అవుతాడు; నఖశిఖ పర్యంతం అన్నం, రసం, రక్తం, ఓజస్సు, శ్రద్ధలను నడిపిస్తాడు. వీటన్నిటికీ ఇంకా ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. ఆరోహణ కర్త అంతరిక్ష రూపమైన గృహస్థాశ్రమం నుంచి ద్యులోకరూపమైన వానప్రస్థంలోకి వెళ్లాడంటే, అతడు వాణి, శ్రోత్రాలవలె వక్త, శ్రోత కావలసి ఉంటుంది. నాసిక వలె ప్రాణ అపాన యజ్ఞ కర్త, చక్షువులవలె ద్రష్ట, చర్మంవలె సర్వ స్పర్శా కావాలి. రసనం–నాలుకవలె సరస్వతీ ప్రవాహం కావాలి; ద్యులోక రూపమైన వానప్రస్థాశ్రమం నుంచి స్వర్లోకరూపమైన సన్న్యాసాశ్రమంలోకి ప్రవేశించేటప్పుడు, కూర్మం – తాబేలు వలె తన సమస్త ఇంద్రియాలనూ అంతర్ముఖం చేసుకుని, అతీంద్రియ దర్శనం చేసుకుంటూ, వీపు మీద దేశ సముద్రాన్ని మథిస్తాడు. అందరికీ **'మంత'** అవుతాడు. ఈ విధంగా వ్యక్తి నిర్మాణం అత్యంత శ్రమతో కూడినది కావటం చేత, అన్ని వ్యవస్థల పేర్లూ ఆశ్రమ వ్యవస్థలే కావాలి. ఈ భావన లన్నింటినీ మనుభగవానుడు ఆశ్రమవ్యవస్థగా పేర్కొన్నాడు. అందుకనే నేను ముందుగానే వర్ణ వ్యవస్థ కేవలం ఔషధమే, ఆశ్రమ వ్యవస్థ ఔషధాలకే ఔషధమని చెప్పాను.

అన్నిటి కన్నా గొప్ప ఆశ్రమం

అన్ని ఆశ్రమాలలోనూ అత్యుత్తమ ఆశ్రమం గృహస్థాశ్రమమే. ఒకసారి యుధిష్ఠిర మహారాజు భీష్మ పితామహుణ్ణి అన్నిట్లోకెల్లా గొప్ప ఆశ్రమం ఏది? అని అడిగాడట. అప్పుడు భీష్మ పితామహుడు, "నాయనా ! తూకం వేసి చూద్దాం" అన్నాడు. తక్కెడ తెప్పించారు. వేటితో దేన్ని తూచాలి? అని సందేహం వచ్చింది. భీష్ముడన్నాడు. "ఆశ్రమాలు నాలుగు, తక్కెడలు రెండు. రెండు ఆశ్రమాలను ఒక తక్కెడలో, మరి రెండు ఆశ్రమాలను రెండవ దాంట్లో పెట్టి తూచాలి" అని. తాతగారు చెప్పినట్లే యుధిష్ఠిరుడు చేశాడు. కానీ ముల్లు ఒక వైపుకే వంగుతూంది. "పితామహా ! లెక్క ప్రకారమే తక్కెడల్లో పెట్టాం కానీ, సరిగ్గాతూగటం లేదే !" అన్నాడు యుధిష్ఠిరుడు. అప్పుడు తాత 'బ్రహ్మచర్యం, గృహస్థ ఆశ్రమాలున్న తక్కెడలో నుంచి బ్రహ్మచర్య ఆశ్రమాన్ని తీసి, వానప్రస్థ సన్న్యాస ఆశ్రమాలున్న తక్కెడలో పెట్టు. అప్పుడు ఎలా తూగుతుందో చూద్దాం" అన్నాడు. తాత చెప్పినట్లుగా చేస్తే అప్పుడు ఆ త్రాసు సమంగా తూగింది. అప్పుడు భీష్ముడు –

ఆశ్రమాంస్తులయా సర్వాన్ ధృతానాహుర్మనీషిణః ।
ఏకతశ్చ త్రయో రాజన్ ! గృహస్థాశ్రమ ఏకతః ॥ మహా. 12.12.11

మహాభారత రచయిత వ్యాసుడు ఇదంతా ఆది విధానకారుడైన మనువు నుంచి స్వీకరించాడు. మనువు వ్యవస్థ ఏమిటో చూద్దాం. మనువు- బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస - ఈ నాలుగు వేర్వేరు ఆశ్రమాలూ గృహస్థ ఆశ్రమం నుంచే పుట్టాయన్నాడు. మిగిలిన మూడు ఆశ్రమాలను పోషిస్తుంది, రక్షిస్తుంది కనుక, వేదాలు, స్మృతుల ప్రకారం ఈ అన్నిటిలోనూ గృహస్థాశ్రమమే శ్రేష్ఠం. మనువు-

యథా నదీ- నదాః సర్వే సాగరే యాంతి సంస్థితిమ్ ।
తథైవాశ్రమిణః సర్వే గృహస్థే యాంతి సంస్థితిమ్ ॥ - మను. 6.90

పెద్ద పెద్ద నదీనదాలన్నీ ఎలా సముద్రంలోకి వెళ్లి కలుస్తాయో, అలాగే అన్ని ఆశ్రమాలూ గృహస్థాశ్రమాన్ని ఆధారం చేసుకుని నిలుస్తాయి. ఇంత కన్నా గొప్ప మాటేమి చెప్పాడంటే, మిగిలిన ఆశ్రమవాసులకు భోజనాదికాలే కాక వాటి ప్రాణాలు కూడా నిలబెడుతుంది అని.

యథా వాయుం సమాశ్రిత్య వర్తంతే సర్వ జంతవః ।
తథా గృహస్థమాశ్రిత్య వర్తంతే సర్వ ఆశ్రమాః ॥ - మను. 3.77

ఎలా గాలి వల్ల అన్ని ప్రాణుల ప్రాణాలు నిలబడతాయో, అలాగే ఇతర ఆశ్రమాలు గృహస్థాశ్రమం వల్ల నిలబడతాయి. ఆ పైన-

యస్మాత్ త్రయోఽప్యాశ్రమిణో దానేనాన్నేన చాన్వహమ్ ।
గృహస్థేనైవ ధార్యంతే తస్మాత్ జ్యేష్ఠాశ్రమో గృహీ ॥ - మను. 3.78

మిగిలిన మూడు ఆశ్రమవాసులకూ అన్న వస్త్రా లిచ్చి ఆదుకుంటూంది కనుక గృహస్థాశ్రమం అన్నిటి కన్నా పెద్దది. అన్న వస్త్రాదులు పొంది జీవిస్తున్న మిగిలిన మూడు ఆశ్రమాలూ ఈ గృహస్థాశ్రమం నుంచే పుడుతున్నాయి. గృహస్థు తన పిల్లవాణ్ని చదువు కోసం గురు కులానికి పంపకపోతే బ్రహ్మచర్యాశ్రమ నిర్మాణం ఎలా జరుగుతుంది? అలాగే ఒక గృహస్థు తన తండ్రికి ఇల్లు వదిలి వెళ్లమని అనుమతించకపోతే వానప్రస్థాశ్రమం ఎట్లా పుడుతుంది? విద్య అధ్యాపనకు వానప్రస్థం ఎలా లభిస్తుంది? మరి శంకరులు, దయానందుల వంటి సన్న్యాసులు మనకెలా లభిస్తారు? మిగిలిన మూడు ఆశ్రమాలు గృహస్థాశ్రమం ఆధారంగా ఉండటమే కాకుండా, సమాజంలోని నాలుగు వర్ణాల పుట్టుక కూడా ఇక్కడే జరిగింది. వర్ణ విభాగం కేవలం గృహస్థ ఆశ్రమంలోనే ఉంటుంది. మూడు ఆశ్రమాలకు వర్ణం వర్తించదు. స్నాతకులైన తర్వాతే ఆచార్యులు తమ విద్యార్థుల విద్యార్థినుల వర్ణాలు ప్రకటిస్తారు. బ్రహ్మచారి కూడా ఏదో ఒక వర్ణానికి చెందిన వాడే కానీ, అతని వర్ణమేమిటో ఇంకా నిర్ధారితం కాలేదు. రెండవ జన్మ తర్వాతే అతడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో ఎవరో తెలుస్తుంది. బ్రహ్మచర్యాశ్రమంలో అతడు విద్యాభ్యాసం చేస్తుంటాడు, అతడు ఒక వర్ణం వాడు కాడు. వానప్రస్థంలో గృహం, వర్ణం త్యజించి విద్యను నేర్పుతాడు. క్రమంగా తనలో బ్రాహ్మణత్వాన్ని సంతరింపజేసుకుంటాడు. దీనివల్ల సమయం వచ్చినపుడు సన్న్యాస ఆశ్రమంలో ప్రవేశించే వీలుంటుంది. వీళ్లంతా గృహస్థ ఆశ్రమం మీదే ఆధారపడి ఉంటారు. ఈ విధంగా ఆశ్రమ వ్యవస్థ ఔషధాలకు ఔషధమైతే, గృహస్థాశ్రమం పరమౌషధం అవుతుంది.

గృహస్థాశ్రమం పరమౌషధ తుల్యం కావడానికి కొన్ని విశేష కారణాలున్నాయి. వాటిని కూడా చూద్దాం-

గృహస్థాశ్రమం పెళ్లితో ప్రారంభమవుతుంది. వివాహమంటే రెండు కులాలను కలిపే సంస్కారం. కులమనగా గురుకులం. కన్యాగురుకులంలో స్నాతకురాలై ఉన్న అమ్మాయి బాలుర గురుకులంలో ఉన్న అబ్బాయితో వివాహం జరిపించడం రెండు కులాలను కలపడమన్నమాట. గుణకర్మ స్వభావాలు ఏకంగా ఉన్నవారితోనే వివాహం జరిపేవారు. ఇందులో తల్లిదండ్రులకంటే గురువులే ప్రాధాన్యత వహిస్తారు. పతి కులంలోని ధర్మాలు, వ్రతాలు, పరంపరను వధువు తన బాధ్యతగా స్వీకరిస్తుంది. అందుకే వధువు అవుతుంది. దీన్నే వ్యవహారంలో కోడలు అంటారు. ఆమెయే గృహస్థ వ్రతధర్మాలను, పరంపరను గోచరింపజేసే యజ్ఞాగ్ని అవుతుంది. ఈ అగ్నినే సాక్షిగా చేసుకుని వ్రతాదులు స్వీకరిస్తుంది. శ్రుతి ఏమంటుందంటే "ఓ కుటుంబ సభ్యులారా ! ఈ అగ్నికి సపర్యలు చేయండి - రథపు నాభిలో ఇరుసును జోడించిన విధంగా మీరు ఆమెకు సపర్యలు చేయాలి. ఆమె వల్లనే కుటుంబం ఏర్పడుతుంది. ఆ కుటుంబరూప చక్రాన్ని సమాజ రథానికి పూనిస్తే సమాజ రథం నడుస్తుంది. కుటుంబ సభ్యుల ఆసనాలు-స్థానాలు మారుతుంటాయి. కానీ, రథపు నాభిలోని అగ్ని యొక్క ఆసనం-స్థానం స్థిరంగా, దృఢంగా ఉంటుంది. కుటుంబచక్రపు నిర్మాణానికి ఇదే కేంద్ర బిందువు అవుతుంది.

వివాహ వేదిక మీద వధూవరుల ముందు పెట్టే కాడిని **'ధర్మ గ్రంథి'** లేదా **'వ్రత గ్రంథి'** అంటారు. భర్త - **బధ్నామి సత్యగ్రంథినా మనశ్చ హృదయం చ తే-** అంటాడు.

తర్వాత ఇద్దరూ పరస్పరం హృదయాల మీద చేతు లుంచి- **మమ వ్రతే తే హృదయం దధామి మమ చిత్త మను చిత్తం తే అస్తు। మమ వాచమేక మనా జుషస్వ ప్రజాపతిస్త్వా నియునక్తు మహ్యమ్ ॥** - అంటారు. ఈ గ్రంథి బంధనం రెండు హృదయాలు, రెండు చిత్తాలు, రెండు, స్వరాలను కలపటానికే. ఈ ఏకతే ఒకటిగా కలవటం అవుతుంది. ఇదే యజ్ఞానికి కేంద్రబిందువు. ఇది కలపటమనేది 'సమర్పణ'కు ప్రతీక. అగ్నిదేవతకు స్వాహాకార సమర్పణ దానానికి కూడా ప్రతీక. ఈ అన్ని గుణాలూ దైవత్వ ప్రాప్తి, స్నేహదానం, పరస్పర సమర్పణం కుటుంబానికి ఆధారశిలలు అవుతాయి. ఈ మూడింటి పైనే కుటుంబ సౌధం నిలబడుతుంది. ఉత్తమ కార్యాచరణల నుంచే మనిషి కర్తవ్యాలను నేర్చుకుంటాడు. ఈ దయ, దానం, దక్షిణ, దమనం, దాంపత్యజీవనానికి మూర్తరూపం ఇస్తాయి.

వివాహ వేదిక మీది చిట్ట చివరి సప్తపది దంపతుల మధ్య స్నేహ భావాన్ని కలిగిస్తుంది. దీన్ని ఏడడుగులు వేసి ప్రకటిస్తారు; ఈ ఏడడుగులూ వ్యవస్థిత పద్ధతిలో జరుగుతాయి. కుడి పాదాన్ని ముందుకు పెట్టిన తర్వాత ఎడమ కాలిని దానితో సమానంగా పెడతారు. మళ్లీ కుడి పాదం, దానితో సమానంగా ఎడమ పాదం. ఎడమపాదం ముందుకు వెళ్లకుండా చూస్తారు. వ్యక్తుల కుడి భాగం పనికీ, ఎడమ భాగం ఫలానికీ ప్రతీకలు. వరుడు వధువుతో - గుర్తుంచుకో- **'మా సవ్యేన దక్షిణం అతిక్రామ'** - ఎప్పుడూ కుడి పాదాన్ని ఎడమ పాదం దాటకుండా చూసుకో - అంటాడు. అంటే ఫలం కోరుకోవటాన్ని పురుషార్థము కన్నా అధికం కాకుండా చూసుకోవాలి. ఎంత పురుషార్థం నిర్వహిస్తావో అంతే ఫలం కోరు. తక్కువ పని చేసి ఎక్కువ ఫలం ఆశిస్తే అర్థ దోషం కలగవచ్చు. అర్థ శుచిత్వం కలగక పోవచ్చు. ఇది మన మధ్య స్నేహభావాన్ని కలిగిస్తుంది. దీని మీదే ఇద్దరి ధ్యాసా ఉండాలి. సమాన వ్యాఖ్యానం ఉండాలి. ఆహార విహారాలు సమానం కావాలి. గుర్తుంచుకో! నా కుడి భుజం మీద నీ కుడి చెయ్యి ఉండాలి, ఎడమ భుజం మీద నీ ఎడమ చెయ్యి. అలా గైతేనే నేను పుణ్యాలు, విజయాలు ఆర్జించగలుగుతాను. నీవే నాకు ప్రధానమైన ఆసరా అవుతావు. నా ఒక చేతిలో దయా దాక్షిణ్యాలు, రెండవ చేతిలో జయం, విజయం వస్తాయి. అప్పుడు నేను స్వాభిమానంతో - **'కృతం మే దక్షిణే హస్తే, జయో మే సవ్య ఆహితః'।** (అథర్వ. 7.52.8) గృహస్థ జీవితంలో ప్రవేశించి ఈ ప్రతిజ్ఞలను ఆచరణలో పెడితే శిష్టాచార ప్రియత్వం సహనం, సుఖ దుఃఖాల పట్ల సమభావం, దానగుణం, యాచించక పోవడం, దయ, పితరులు, దేవతలపట్ల, అతిథులపై ప్రేమ, అందరికీ ఉపకారం చేసే గుణం, ధైర్యం, అన్ని భూతాలకూ హితం చేయటం, తదితర సుగుణాలు కలుగుతాయి. ఇటువంటివి గల గృహస్థాశ్రమం మిగిలిన మూడు ఆశ్రమాలకూ ఆధారమైతే గృహస్థాశ్రమమే కాదు, భూమండలమంతా స్వర్గమై విలసిల్లుతుంది. అందుకనే మనువు - **'తస్మాత్ జ్యేష్ఠాశ్రమో గృహీ'**- అన్నాడు.

గృహస్థేతరమైన మూడు ఆశ్రమాలవారు భిక్షాటనకు ఇల్లిల్లూ తిరుగుతారు. గృహిణులు వారి జోలెలు నింపుతారు. అప్పుడు ఆ మూడు ఆశ్రమాలవారూ – **'హే మాతః ! భిక్షాం దేహి! – ఓ తల్లీ ! భిక్ష ఇవ్వు'** అంటారు. గృహిణి తల్లిగా మారి వస్తే, మాతృవాత్సల్యం భిక్షాన్నంతో పాటు కలిసి జోలెలో పడుతుంది. ఇక్కడి నుంచే అర్థ కామాలపై నియంత్రణ అనే శిక్షణ మొదలవుతుంది. మిగిలిన ఆశ్రమవాసులు అన్నిటినీ గృహస్థుల నుంచే నేర్చుకుంటారు. అందుకనే మనువు **'జ్యేష్ఠాశ్రమో గృహీ'** అనటంలో **'ఔషధానికి ఔషధం కన్నా మహౌషధం'** అని స్ఫురింపజేశాడు.

వేదారంభ సంస్కారంలో బ్రహ్మచారి ఉపనయనం తర్వాత తొలి సమిధను అగ్నికి సమర్పిస్తూ – **'జీవ పుత్రో మమాచార్యో'** – నా గురువులు పిల్లలు గలవారే కాదు, జీవితులైన పుత్రులు గలవారు కూడా అని ప్రార్థిస్తాడు. అతని ఈ కోరిక తన గురువును గృహస్థాశ్రమంలో వారిగా చూడాలని. పిల్లలున్న వారే మమ్మల్నీ పుత్రభావంతో చూస్తారనేది స్వాభావికం కదా! తర్వాత మనం – **'మేధావ్యహమసాని అనిరాకరిష్ణుయశస్వీ, తేజస్వీ బ్రహ్మవర్చసీ అన్నాదో భూయాసమ్'** । పా.కా. 2 కం.4–3 అంటాము. నిస్సందేహంగా మా ఆచార్యుడు నాకు జన్మ నీయటానికి నన్ను తన ఉదరంలో పెట్టుకుంటాడు. అప్పుడే నేను పరిపక్వతను పొంది రెండవ జన్మ పొందుతాను. నాకు ద్విజుడనే పేరు వస్తుంది. ఆ కోరిక నన్ను పదేపదే పిలిచి– **'తస్మాత్ జ్యేష్ఠాశ్రమో గృహీ'** అంటూంది.

పైన పేర్కొన్న వాక్యాలలో మహాభారతం, మనుస్మృతుల ప్రమాణాలతో ఆశ్రమాలలో గృహస్థాశ్రమం అన్నింటి కన్నా గొప్పది, మొట్టమొదటిది, శ్రేష్ఠం అని ప్రతిపాదితమవుతూంది. పైన కొన్ని ఉద్దేశ్యాలిచ్చాము. మరొకటి ఏమిటంటే, గృహస్థుడు పంచమహాయజ్ఞాలను చేయటంలో నిర్లక్ష్యం చూపరాదు అనేది. మనువు – **'పంచైతాంస్తు మహాయజ్ఞాన్ యథా శక్తి న హాపయేత్'॥** అన్నాడు.

అతి తక్కువ సమయంలో పూర్తి అయ్యే ఈ యజ్ఞాలను పంచమహాయజ్ఞాలని ఎందుకన్నారంటే– ఇవి 'అతని - ఆమె' జీవితాంత వ్రతాలు. మరణం తర్వాతే వదలిపోతాయి కానీ అంతకు ముందు కాదు. వీటిని చేయటం వల్ల వ్యక్తి ఆత్మ గొప్పదవుతుంది. **'బ్రహ్మ యజ్ఞం, దేవయజ్ఞం'** వల్ల వ్యక్తిగత ఉన్నతి జరుగుతుంది. పితృ యజ్ఞం, 'అతిథి యజ్ఞం, బలివైశ్వదేవ యజ్ఞం' వల్ల సామాజికోన్నతి జరుగుతుంది. ఇవే వీరికి పరీక్షలు. గృహస్థు తన పితరులకు, వృద్ధులకు రక్త సంబంధం చేత భోజనం పెడతాడు. అతిథులకు మానవత్వంతో పెడతాడు. కానీ కుక్కలు, కుష్ఠు వ్యాధి గ్రస్తులు, కాకులు, గోవులు మొదలైనవాటికి ఆత్మ సంబంధంతో ఆహార మిస్తాడు. ఈ పనులు గృహస్థు పరీక్షకు అవకాశ మిచ్చేవి. వీటి ద్వారా అతని ఆత్మ గొప్పదవుతుంది. అందుకే వీటిని **'మహాయజ్ఞాలు'** అనటమే యుక్తం. అందుచేతనే తాండ్య బ్రాహ్మణ కర్త చెప్పిన మాట పరమ సత్యం. అదేమిటంటే **"మనువు ఔషధాలకే ఔషధం"** అని చెప్పటం.

ఈ పంచమహాయజ్ఞాలలో బ్రహ్మయజ్ఞానికి గల స్థానం అన్నటి కన్నా ఉన్నతం. బ్రహ్మ యజ్ఞం అంటే ఇక్కడ సంధ్యావందనం కాదు, స్వాధ్యాయం. ఈ స్వాధ్యాయంలో వేదాధ్యయనం ప్రముఖం. ఈ స్వాధ్యాయాన్ని యాజ్ఞవల్క్య భగవానుడు **'పరమశ్రమ'** అని, మనుభగవానుడు **'పరమ తపస్స'**ని, పతంజలి మహాముని **'పరమయోగ'** మని, ఉపనిషత్తుల ఋషులు **'పరమ స్కంధం'** (అధ్యాయం) అని, యాజ్ఞికులు **'పరమయజ్ఞ'**మని, దయానంద మహర్షి **'పరమధర్మ'**మనీ నిర్వచించారు. మనువు ప్రతిపాదించిన ఆశ్రమ వ్యవస్థ దీని మీదే నిలబడింది. ఈ శ్రమ అనేది ప్రతి ఆశ్రమవాసీ ఆచరించి తీరవలసిన విషయం. సన్న్యాసాశ్రమంలో ఉన్నవాడు, మిగిలిన నాలుగు యజ్ఞాలనూ తప్పించుకుంటాడు కానీ స్వాధ్యాయ యజ్ఞం చేసితీరవలసిందే. అతనికి చెప్పిందేమిటంటే – **"సంన్యసేత్ సర్వ కర్మాణి వేదమేకం న సంన్యసేత్ ॥"** అని. సన్న్యాసి అన్ని కర్మలనూ వదలిపెట్ట గలుగుతాడు కానీ, వేదాధ్యయనాన్ని వదలకూడదు. అంటే మనువు చెప్పిన పంచమహాయజ్ఞాలలో దేవయజ్ఞం, పితృయజ్ఞం, అతిథియజ్ఞం, బలివైశ్వదేవయజ్ఞం ఇవి ఔషధాలు. కానీ స్వాధ్యాయయజ్ఞం ఔషధాలకే ఔషధం అని మనం అనవచ్చు. దాని మహిమను గురించి – **'పరమ చికిత్సక ఆత్మనో భవతి"** అన్నారు. స్వాధ్యాయశీలుడైన వ్యక్తి తన ఆత్మకు పరమ వైద్యుడవుతాడు అని.

ఆర్యుల ప్రముఖమైన నాలుగు చిహ్నాలు

ఆర్యుల నాలుగు గుర్తులు **‘శిఖ, సూత్రం, మేఖల, దండం’** అని అందరికీ తెలిసిందే. ఉపనయన సమయంలో ఆచార్యుడు వటువు చేత ఈ నాలుగూ ధరింపజేస్తాడు. వీటిలో మూడు వటువు తన శరీరంలో ధరిస్తాడు. నాలుగవదైన దండాన్ని చేతితో పట్టుకుంటాడు. కూర్చున్నప్పుడు, విశ్రాంతి సమయంలో దాన్ని నేల మీద పెడతాడు. శరీరంలో ధరించిన మూడు చిహ్నాలు శరీరంలోని మూడు కేంద్రాలలో ఉంటాయి. తల మీద శిఖ, హృదయం మీద యజ్ఞోపవీతం, నాభి చుట్టూ అంటే నడుముకు మేఖల ఉంటాయి. అవి వరుసగా మనస్సు, ప్రాణం, అన్నం – వీటికి కేంద్రాలు. వీటిని ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక కేంద్రాలనవచ్చు. ఇంకా వేరే పేర్లు పెట్టాలంటే, సాత్త్విక, రాజసిక, తామసిక బంధనాలనీ అనవచ్చు. ఇవే వరుణుడి ఉత్తమ, మధ్యమ, అధమపాశాలు. వటువు వరుణుణ్ని ఇలా ప్రార్థిస్తాడు –

ఉదుత్తమం వరుణ పాశమస్మదవాధమం వి మధ్యమం శ్రథాయ ।
అథావయమాదిత్య వ్రతే తవానాగసో అదితయే స్యామ ॥– ఋ. 1.24.15

ఓ వరుణదేవా! ఉత్తమ మధ్యమ అధమ అనే ఈ మూడు బంధాల నుంచీ విముక్తి ప్రసాదించు ! మేము ఆదిత్య వ్రతంతో అదితిమాత పాపరహిత పుత్రులం కావాలనుకుంటున్నాము. మా ఉత్తమ బంధాన్ని పై నుంచి విప్పు, అధమ బంధాన్ని కింది నుంచి విప్పు, కానీ మధ్యమ బంధాన్ని మాత్రం బాగా వదులు చేసి తొలగించు. వేదంలోని ఈ ప్రార్థనను మనువు ఈ మూడు కేంద్రాల మీద మూడు గుర్తులుగా చెప్పాడు. అందుచేత మనువు చెప్పింది ఔషధమని రుజువైంది.

ఆచార్యుని స్వరూపం

అథర్వవేదంలోని బ్రహ్మచర్య సూక్తంలో ఆచార్యుల ఐదు రకాల రూపాలను పేర్కొన్నారు. అవి ‘మృత్యు, వరుణ, సోమ,ఓషధి, పయస్సు’–

“ఆచార్యో మృత్యుః వరుణ సోమ ఓషధయః పయః ॥”– అ. 11.5.14

బాగా అధ్యయనం చేసినవారు ‘ఆచార్యుని తొలిరూపం మృత్యువు, చివరిరూపం పాలు’ అని చక్కగా అర్థం చేసుకోగలరు. గురుకులంలో ప్రవేశించే కుమారరూపమైన గర్భాన్ని ఆచార్యుడు తన ఉదరంలో ధరిస్తాడు. అంతే కాకుండా అతన్ని పరిపూర్ణపక్వత చెందేలా తయారు చేస్తాడు. విద్యానదిలో అతడు స్నానం చేయటానికి ఈ తీరం నుంచి ఆ తీరానికి ఈదుకుంటూ వెళ్లే సరికి నిష్ణాతుడవుతాడు. అప్పుడు బ్రహ్మచారికి ‘స్నాతకుడు’ అనే పేరు పెడతాడు. ఎందుకంటే అప్పటికతడు ఉత్తీర్ణుడవుతాడు కనుక. ఆ నదికి ఈవలి తీరం పేరు మృత్యువు, అవతలితీరం పేరు పాలు. అథర్వ శ్రుతిలోనూ ఇదే చెప్పబడింది –

ఆచార్య ఉపనయమానో బ్రహ్మచారిణం కృణుతే గర్భమంతః।
తం రాత్రీస్తిస్ర ఉదరే బిభర్తి తం జాతం ద్రష్టుం అభి సంయంతి దేవాః ॥అ. 11.5.3

ఈ రెండవ జన్మ నెత్తిన శిశువుకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతి నిశ్చిత మవుతుంది. ఈ కొత్త స్నాతకుణ్ని చూడటానికి దిగ్దిగంతాల విద్యాలయాల నుంచి విద్వాంసులు వస్తారు– **“తం జాతం ద్రష్టుం అభి సంయంతి దేవాః॥”** విద్వాంసులతో పాటు ఈ కొత్త స్నాతకుల తల్లిదండ్రులు, చుట్టాలు కూడా వస్తారు. విద్వాంసులు ఆశీర్వదిస్తే సామాన్యులు **“చక్షు శ్రోత్రం యశో అస్మాసు ధేహి। అన్నం లోకహితముదరమ్॥”** ఓ ప్రియమైన స్నాతకుడా! మాకు

కళ్లివ్వు, చెవులివ్వు, కీర్తినివ్వు, అన్నం ఇవ్వు, రక్తం ఇవ్వు, ఉదరం – జీర్ణ శక్తిగల ఉదరాన్నివ్వు". ఇలా ద్విజుడైన స్నాతకుడు జనానికి కళ్లే కాదు, వారి కంటి దీపమూ అవుతాడు. అందరికీ జ్ఞాన నేత్రం అవుతాడు. ఇలా మొత్తం సంఘ వ్యవస్థ సక్రమంగా నడిచే ఘనత మనుభగవానుడికే చెందుతుంది. అందుచేతనే మనువు ప్రతివ్యవస్థా కూడా ఔషధాల్లో ఔషధం అంటున్నాము.

మునుపే చెప్పుకున్నాం– ఉపనయనం కోసం వచ్చే వటువు చేత శిఖ, సూత్రం, మేఖల – అనే మూడు చిహ్నాలను ధరింపజేస్తారని. ఆ వటువునే ఔషధంగా భావిస్తారు. గమనిస్తే అన్నం, ప్రాణం, మనస్సు–ఈ మూడు వలయంగా అతన్ని చుట్టుముట్టినట్లుగా అనిపిస్తుంది. ఈ మూడు వృత్తాల ఆద్యంతాలు బ్రహ్మ. అందుచేతనే ఉపనిషత్తుల ఋషులు – **'అన్నం వై బ్రహ్మ, ప్రాణో వై బ్రహ్మ, మనో వై బ్రహ్మ'** – అన్నారు. ఆదివృత్తమూ బ్రహ్మే, అంతమూ బ్రహ్మే. తొలి ఆశ్రమంలోనివాడి పేరే బ్రహ్మచారి. అతడు తన నాభికేంద్రం ద్వారా అన్నోపాసన, హృదయ కేంద్రం ద్వారా ప్రాణ బ్రహ్మోపాసన, మస్తిష్క కేంద్రం ద్వారా మనో బ్రహ్మోపాసన చేయాలి. వీటి ద్వారానే బుద్ధితో వేదాలు, బ్రహ్మల ఉపాసన చేయటం నేర్చుకుంటాడు. అంతే కాదు, గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తూ, అతడు–

> **"బ్రహ్మాపరం యుజ్యతాం బ్రహ్మపూర్వం బ్రహ్మాంతతో మధ్యతో బ్రహ్మ సర్వతః ।**
> **ఏవం అనావ్యాధాం దేవపురాం ప్రపద్య పతిలోకే విరాజ॥"** అథర్వ. 14. 1. 64 అంటాడు.

గృహస్థాశ్రమంలో ప్రవేశించబోయే స్నాతకునికి ఆచార్యుడు ఆశీర్వాదరూపంలో తగిన మాటలు చెప్పటమే ఆశ్చర్యకరం ! దీని వల్ల, ఆర్యావృత్తానికి కూడా ఆదీ బ్రహ్మే, అంతమూ బ్రహ్మే. బ్రహ్మ కున్న రెండు భేదాలనూ శబ్ద బ్రహ్మ, పర బ్రహ్మ అంటారు. శబ్ద బ్రహ్మ మంటే వేదనిధి, పరబ్రహ్మమంటే పరమసత్తా. ఆధునిక విజ్ఞానం, గణితశాస్త్రమూ వృత్తానికి అంతముందని అంగీకరించారు. కాని వైదిక సంస్కృతిలోని వృత్తాంత పదం, వృత్తానికి ఆది, అంతం రెండూ బ్రహ్మమేనని ప్రకటిస్తుంది. మన ఆశ్రమ వ్యవస్థలోని మొదటి భాగం బ్రహ్మచర్యం, చివరిది సన్న్యాసం. మునుపే వటువు శరీరంలో మూడు గుర్తులుంటాయని చెప్పుకున్నాము. అవి ఉన్నచోట బ్రహ్మగ్రంథులు ఉంటాయి. వాటినే శిఖాగ్రంథి, యజ్ఞోపవీత గ్రంథి, మేఖలా గ్రంథి అంటారు. ఆ గ్రంథులను తెరవ విప్ప నంత వరకు సన్న్యాసం స్వీకరించే అధికారం కలగదు. ఈ మూడు గ్రంథులూ తెరచుకోగానే, ఆ మూడు చిహ్నాలు సహజంగానే విడిపోతాయి. అలాంటి వాణ్ణే సన్న్యాసి అంటారు. వీరిని పరిధిలో ఉంచటానికి శిక్షా వ్యవస్థ ఏర్పడింది. ఈ శిక్షా వ్యవస్థ ప్రథమాశ్రమం నుంచి చివరి ఆశ్రమం వరకు ఉంటుంది.

దండధారణ పరమౌషధం

ఆచార్యుడు తన శిష్యుడికి మూడు చిహ్నాలు శరీరంపై ధరింపజేసినపుడే చేతిలో దండాన్ని పెడతాడు. ఉపనయనం కోసం వచ్చిన శిష్యులందరికీ ఒకటే ఎత్తుగల దండాలివ్వడు. వైశ్యుడు కావాలనుకునే ఇహార్థికి మీసాల వరకు ఎత్తుగల దండాన్ని ఇస్తాడు.

క్షత్రియత్వం కోరుకునే బలార్థికి కనుబొమల వరకు ఎత్తుగల దండాన్ని ఇస్తాడు. బ్రహ్మవర్చస్సును కోరే యువకునికి శిఖవరకు ఎత్తున్న దండాన్ని ఇస్తాడు. నాలుగేసి అంగుళాలు పెద్ద, చిన్న దండాలు ఇవ్వటంలో ఉద్దేశ్యమేమిటో చెబుతున్నారు.

దండధారణా ప్రయోజనం

అంతేవాసి (అంటే శిష్యుడు) అనేవాడు క్రమశిక్షణలో ఉంటూ, తన తప్పు తెలుసుకుని, అంగీకరించి, శిక్షను అనుభవించడానికి సిద్ధంగా ఉండేవాడని తెలుస్తూంది. అదుపులో ఉంచటం కోసం కొయ్యతో తయారైన దండం వల్ల

శిష్యుడు చాలా లోతుగా ఆలోచించగలుగుతాడు. ఎలాగంటే, మాటల ద్వారా ఏదైన తప్పు జరిగితే, తనను తానే నియంత్రించుకోగలను అనుకుంటాడు లేదా అవసరమైతే ఆచార్యునికి తన దండాన్ని ఇచ్చేసి, క్రమశిక్షణలో పెట్టడానికి అంగీకరిస్తాననుకుంటాడు. ఆచార్యుడే స్వయంగా దండాన్ని పైకి ఎత్తే అవకాశం కలుగదు. కనుబొమల వరకు ఎత్తుగల దండాన్ని ధరించటంలో అర్థమేమిటంటే, జ్ఞానేంద్రియాల ద్వారా జరిగిన తప్పును నియంత్రించడం. మీసాల వరకు గల దండం జ్ఞానేంద్రియాల కేంద్రం అదే అని. మీసాల కింది నోరు కర్మేంద్రియాలకు ప్రతినిధిత్వం వహిస్తుంది. అందుచేత కర్మేంద్రియాల ద్వారా జరిగే తప్పులను దండంతో క్రమశిక్షణలో పెట్టేచోట, కళ్లు, చెవులు, ముక్కు నాలుక, వీటివల్ల జరిగే తప్పులకు తగిన శిక్ష ననుభవించి తమను తాము సచ్చరిత్రులుగా చేసుకుంటారు. తనను తాను దండించుకోకుండా తనకు శిక్ష విధించమని గురువు ఎదుటికి వెళ్లి ఆయనను కోరటమనేది, ఆయనపట్ల శిష్యునికున్న సమర్పణ భావం, వినయ నమ్రతలను తెలియజేస్తుంది. శిరస్సు = కేశాల వరకు ఉన్న దండాన్ని ధరింపజేయటం అంటే, శిష్యుడు మానసిక అపరాధం చేసి ఉంటే, తనకు తానే శిక్ష విధించుకుని, దమనం, సంయమాలను తెలియజేస్తాడు. శీలవంతుడవుతాడు. ఒకవేళ మానసిక అపరాధానికి తగిన శిక్ష తోచకపోతే, ఆచార్యుని పాదాల వద్దకు చేరి, శిక్షించమని ప్రార్థిస్తాడు. ఈ విధంగా శిష్యుడు తన అన్నవృత్తం, ప్రాణవృత్తం, మనోవృత్తం– ఈ మూడింటికీ యజమాని అవుతాడు.

బ్రహ్మచారి తన శరీరంలో ధరించే మూడు గుర్తులు అతనికి ఔషధాలని మనం చెప్పవచ్చు. కానీ దండధారణం ఔషధాలకే ఔషధం. ఎందుకంటే, మిగిలిన మూడు చిహ్నాలూ సమయానుకూలంగా జారిపోతాయి. కానీ, వటువు దండధారణ చేసినప్పటి నుంచీ మరణ పర్యంతమూ అది చేతి నుంచి జారదు. స్వాధ్యాయం వలెనే దీన్నీ మరణపర్యంతం ధరించవలసి ఉంటుంది.

దండశక్తి - ఆశ్రమ వ్యవస్థ

పై భాగంలో దండధారణను గురించిన వ్యక్తిగత లాభం చెప్పుకున్నాం. రెండవ లాభం ఆశ్రమ వ్యవస్థకు సంబంధించింది. దండరూపమైన చిహ్నాన్ని వ్యక్తి జీవితపర్యంతమూ ధరిస్తాడు. తనను తాను నియంత్రించుకోలేకపోతే, ఆ దండాన్ని ఒకసారి ఆచార్యునికి అప్పగిస్తే, మరొక సారి సమాజం చేతిలోనూ పెట్టడం జరుగుతుంది. విజ్ఞులు వైదికవివాహవేదికపై జరిగే తతంగాలలో ఒకడు కలశం పట్టుకుని కూర్చుంటే, మరొకడు దండం పట్టుకుని కూర్చోవటమనేది గ్రహించి ఉంటారు. దీనివల్ల కొత్తగా బ్రహ్మచర్యాశ్రమం నుంచి వచ్చినవాడు వివాహవేదికపై కూర్చుంటే, అతడు తన నియంత్రణను సమాజానికి అప్పగించాడని గ్రహించాలి. ఇంత వరకు బ్రహ్మచర్య జీవితాన్ని ఆచార్యునికి అర్పించినందున, ఆ దండాధికారం ఆచార్యునికి అప్పగించాడు. ఇప్పుడు అతని సామాజిక జీవనం ప్రారంభమవుతూంది కనుక, ఆ దండాధికారాన్ని సమాజంలోని అనుభవజ్ఞులైన వృద్ధుని చేతికి అప్పగిస్తారు. దాని ఉద్దేశ్యం– 'వధూవరులు, గృహిణీ గృహస్థులు, పత్నీపతులు భార్యాభర్తలు–వీరిలో తప్పులు జరిగితే వాటిని నియంత్రించే అధికారాన్ని అతడు సమాజానికి అప్పగిస్తున్నాడు' అని భావం. అటు తర్వాతి ఆశ్రమాలైన వానప్రస్థం సన్న్యాసాలలో వారిని దీక్షాబద్ధులను చేయటానికి గురువు అదే దండాన్ని 'వానప్రస్థుడికి, సన్న్యాసి'కి అప్పగిస్తాడు. అంటే ఇక నుంచి నిన్ను నీవే నియంత్రించుకోవాలి అని. నీ అపరాధాల నిరాకరణను స్వయంగా నీవే చేసుకోవాలి. నీవు కనుక నిన్ను నీవు నియంత్రించుకోలేకపోయినట్లయితే ఆ రెండు ఆశ్రమాలకూ నీవు పనికిరానివాడివని అర్థం.

దండశక్తి - సామాజిక వ్యవస్థ

మనుభగవానుడు వైయక్తిక జీవనాన్ని నాలుగు ఆశ్రమాలుగానూ, సామాజిక జీవితాన్ని నాలుగు వర్ణాలుగానూ విభజించాడు. వ్యక్తిగత జీవితాన్ని చక్కగా గడపటానికి ఆశ్రమ ధర్మాలు పాటించటం ఎలా ముఖ్యమో సామాజిక జీవితాన్ని చక్కగా గడపటానికి నాలుగు వర్ణాలు పాటించటమూ అంతే ముఖ్యము. ఈ వర్ణాలు 'బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శు

ద్రు'లని నాలుగు విధాలని, మనం ఇంతకు మునుపే చెప్పుకున్నాము. ఇహలోక విషయాలు కోరుకునే వైశ్యబాలకుని ముక్కు వరకూ ఎత్తున్న దండాన్ని ఇస్తారు. బలం కోరుకునే క్షత్రియునికి కనుబొమ్మల వరకు ఎత్తుగల దండాన్నిస్తారు. బ్రహ్మవర్చస్సును కోరుకునే బ్రాహ్మణ బాలుని చేత తల వరకూ ఎత్తుగల దండాన్ని ధరింపజేస్తారు అని. నాలుగ వర్ణంవాడు తన లక్ష్యాన్ని నిర్ధారించుకోలేడు కనుక అతనికి ఎటువంటి దండాన్నీ ఇవ్వరు.

శూద్రేతరులైన మూడు వర్ణాలవారూ ధరించే దండాల కొలత వారి నియంత్రణలోని శక్తికి, పాలన శక్తికి వార ఎవరిని ఎంతవరకు దండించగలరు? అనే విషయానికి ద్యోతకాలు. వైశ్యవృత్తిలోనివారు పాలన విభాగంల పాలుపంచుకుంటే, వారికి నోటితో అంటే మాటలతో చేసే తప్పులకు దండించే అధికారం ఉంటుంది. ముక్కు కింద ఉంటే రసనేంద్రియమైన నాలుక అన్నం తినటంతోపాటు వాక్కక్తికీ ప్రతీక అవుతుంది. దీనిలో రెండు శక్తుల సమ్మిళితమై ఉంటాయి. రసాన్ని గ్రహిస్తుంది కనుక నాలుక జ్ఞానేంద్రియమూ, వాక్శక్తి వల్ల కర్మేంద్రియమూ అవుతుంది. ఈ రెండింటి ద్వారా జరిగే తప్పులను తన దండంతో నియంత్రించగలుగుతాడు వైశ్యుడు. బలార్థి అయిన క్షత్రియస్నాతకుడు కళ్లు, చెవులు మొదలైన ఇంద్రియాల ద్వారా జరిగే అపరాధాలను నియంత్రించటము, శిక్షించటమూ చేయగలుగుతాడు. కానీ ఆపైన ఉండే చోటు ఇతని అధికారం కిందికి రాదు. అది బ్రహ్మవర్చస్సును కోరుకునే బ్రాహ్మణుడి అధికారంలో ఉంటుంది. బలార్థి అయిన క్షత్రియుని అధికారం ఏ జ్ఞానేంద్రియం పరిధి వరకు ఉంటుందో, అక్కడి నుంచి బ్రాహ్మణుడి క్షేత్రం అంతఃకరణ చతుష్టయం-మనుస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాల చేత ప్రేరితమై జరిగే అపరాధాలను బ్రాహ్మణుడు కుశలతతో నివారించే ప్రయత్నం చేస్తాడు.

విజ్ఞుల ముందు బ్రహ్మాండం, పిండం అనే రెండు వ్యవస్థలు తెరచిన పుస్తకంవలె ఉంటాయి. వీటి సూక్ష అధ్యయనం దార్శణికులు, వైజ్ఞానికులు అహర్నిశలు చేస్తూనే ఉంటారు. కానీ, వీటి అంతాన్ని కనుగొనలేకపోతున్నారు. ఈ రెండింటిలోనూ సంపన్నమైన శాసన వ్యవస్థను వైయక్తిక, సామాజిక జీవితంలోకి తెచ్చుకుంటే, అప్పుడది ఆదర్శ వ్యవస్థ అవుతుంది. శాసించేవాని దగ్గర ఉండే పిండంలో అన్ని శక్తులూ బాగా పని చేస్తే, ఆ పిండం ఆరోగ్యంగానూ, అందంగానూ ఉంటుంది. ఇందులోనూ దండవ్యవస్థ సహజంగా, చక్కగా తనంతట తానే నడుస్తుంటుంది. శరీరంపై జరిగే బాహ్యామైన దాడులు, ఆయుధాలతో గుచ్చటం వంటి వాటిని నివారించటానికి ఇది సాటిలేని వ్యవస్థ. శరీరంపై ఏర్పడి ఉన్న చర్మం, తానొక సూచనా విభాగమైనట్లుగా పిండాన్నంతటినీ ఆవరించి ఉంటుంది. బయట జరిగే దాడులను వెంటనే గుర్తించి కేంద్రానికి తెలియజేస్తుంది; అప్పుడు కేంద్రం వెంటనే రక్షక విభాగానికి ఫలానా చోట దాడి జరిగిందనీ, ఫలానాచోట ఆయుధం గుచ్చారనీ తెలిపి, వాటిని నిరాకరించమని ఆదేశాలిస్తుంది. దోమ వచ్చి మన చర్మం మీద వాలీ వాలగానే వెంటనే చెయ్యి లేచి దాని మీద చటుక్కున పడుతుంది. దీనివల్ల చేతులు దేహంలో దండం పని- శిక్షించటం చేస్తున్నాయని తెలుస్తుంది.

మానవ దేహంలో సహజంగానే శిక్షా వ్యవస్థ ఉంటుంది. ఆంగ్లభాషలో 'ఆర్మ్' అనే పదానికి 'భుజం' అనీ 'శస్త్రం' (ఆయుధం) అనీ అర్థాలున్నాయని అందరికీ తెలిసినసంగతే. శాస్త్రాల వల్లనే శిక్షా వ్యవస్థ స్థాపితమవుతుంది. ఈ శిక్షా వ్యవస్థ ఎవరి చేతిలో ఉంటుందో వారిని క్షత్రియులంటారు. శిక్షా వ్యవస్థ లేకుంటే, శిక్ష, రక్షణ జరగవు. ఇక్కడ దీన్ని గురించి వివరంగా చెప్పకుండా, మనిషికి గల బాహుబలం సహజంగా ఎలా నియంత్రిస్తుందో, దాన్ని కేవలం రేఖా మాత్రంగా చెబుతున్నాను. నిఘంటువులలో 'బాహు' పదానికి భుజం నుంచి మధ్య వేలి వరకూ ఇచ్చారు. అదే ప్రతి వ్యక్తికీ క్షాత్రబలం, శాస్త్రబలం, ఆయుధం అవుతుంది. ఇందులో సహజ నియంత్రణశక్తి కనబడుతుంది. భుజాలు ఎత్తకుండా మోచేతుల వరకు చేతులు ఎత్తి వేలుతో చెప్పడం 'వాగ్దండ' శిక్షా సూచన. ఆ వేళ్లను లేదా చేతులను మడిచి భుజాలను పైకెత్తడమంటే క్షత్రియుడు భుజార్పణం లేదా శస్త్రార్పణం చేయగలడు అని. మీ చేతులను కింది వైపు తీసుకువెళితే, ఆ చేతులు వైశ్యుని 'ధనదండన' శిక్షా సూచన అవుతుంది. ఈ విధంగా అసత్యాలాడటం వల్ల బ్రాహ్మణునికి వాగ్దండన, క్షత్రియుడు అన్యాయం చేస్తే శస్త్ర త్యాగం చేయించటం (డిసార్మ్), పిసినారికి ధనదండన జరుగుతాయి. అందుకే మహాభారతకారుడు-

వాచి దండో బ్రాహ్మణానాం క్షత్రియాణాం భుజార్పణమ్ ।
ధనదండః స్మృతో వైశ్యో నిర్దండః శూద్ర అచ్యతే ॥ – మహా. 12.15.1 అన్నాడు.

ఆర్తులను రక్షించే సమయంలో అందరికీ భుజాల అవసరం ఉంటుంది.

పై విశ్లేషణను బట్టి 'ఆశ్రమ వ్యవస్థ ఔషధాలకే ఔషధం' అని చెప్పవచ్చు. ఈ కిందివాటికి సంబంధించిన ఎనిమిది సూత్రాలు చెప్పబడినవి. వాటి వివరణ పంచవర్గలరూపంలో వివరించబడినవి.

పంచవర్గలు అనగా 'క, చ, ట, త, ప' అను అయిదు వర్గలలో 25 అక్షరాలుంటాయి. వాటిలో మొదటి అక్షరం **'క'**. చివరి అక్షరం **'మ్'**. ఈ రెండు కలిస్తే **'కమ్'** అవుతుంది. **'కమ్'** అంటే **'మోక్షమని'** అర్థం. ఈ పంచవర్గాలలో గల 25 అక్షరాలకు 25 లాభాలు చెప్పబడినవి. వీటిని కనుక ప్రపంచమంతా ఆచరణలో పెడితే, అందరికీ **'కమ్'** అంటే **'మోక్షం'** కలుగుతుంది. ఇదే మనువు ఉద్దేశ్యం. **ఏదో ఒకనాడు ఈ ప్రపంచమంతా మనువు చెప్పిన ఈ సూత్రాన్ని తప్పకుండా ఆచరిస్తుంది. లేకపోతే ప్రపంచ యుద్ధాలు, అశాంతి, బలాత్కారాలు, దొంగతనాలు, దోపిడీలు, లంచాలు, చొరబాట్లు మొదలైనవాటికి బలైపోతుంటుంది. ఆ ఎనిమిది సూత్రాలు ఇవి–**

ఆశ్రమ వ్యవస్థ గొప్పతనం

ఆశ్రమాలు నాలుగు–1. బ్రహ్మచర్యం, 2. గృహస్థం, 3. వానప్రస్థం, 4. సన్న్యాసం. ఇందులో

1. **రెండు ఆశ్రమాలు కదిలేవి అనగా నడిచేవి:–** మొదటిది 'బ్రహ్మచర్యం', **నాలుగవది** **'సన్యాసం'**. వీటిలో గత్యర్థకాలైన (నడకను సూచించే) **'చరగతౌ'** **'వ్రజగతౌ'** ధాతువుల ప్రయోగం వలన గమనం, జ్ఞానం, ప్రాప్తి దీనికి స్పష్టమైన ఆధారం.
2. **రెండు ఆశ్రమాలు కదలనివి అనగా స్థిరంగా ఉండేవి:–** రెండవది 'గృహస్థ', **మూడవది** **'వానప్రస్థం'**– వీటిలో **'గతి నివృత్తౌ స్థా'** ధాతు ప్రయోగం వలన స్థిరంగా ఉండడం దీనికి ఆధారం.
3. **రెండు ఆశ్రమాలు ఐచ్ఛికాలు:–** రెండవది, నాలుగవది. వ్యక్తి 'గృహస్థ కావడం, కాకపోవడం'; 'సన్న్యసించడం, సన్న్యసించక పోవటం' వారి వారి ఇష్టం.
4. **రెండు ఆశ్రమాలు అనివార్యాలు:–** మొదటిది, మూడవది, ప్రతి వ్యక్తీ బ్రహ్మచర్యాశ్రమంలోకి వెళ్లవలసే ఉంటుంది. గృహస్థుడైన ప్రతివాడూ వానప్రస్థం స్వీకరించవలసిందే.
5. **మూడు ఆశ్రమాలలో వ్యక్తులకు స్వతంత్రం ఉండదు:–** బ్రహ్మచారి, వానప్రస్థుడు, సన్న్యాసి. కేవలం గృహస్థ ఆశ్రమంలోనే వ్యక్తికి స్వాతంత్ర్యం ఉంటుంది. తన ఇష్ట ప్రకారం చేయగలుగుతాడు.
6. 'బ్రహ్మచర్య, వానప్రస్థ సన్న్యాస' ఈ మూడు ఆశ్రమాలలో ఏ వర్గాలు, వర్ణాలు ఉండవు. 'వర్గాలు, వర్ణాలు' లేని సమాజం స్వర్గమే స్వర్గము – శాంతే శాంతి.
7. గతిశీలుడైన (తిరిగే) బ్రహ్మచారి (మనవడు), స్థితిశీలుడైన (నివసించే) వానప్రస్థు (తాత) ని నీడలో ఉంటాడు. అనగా గురుకులం. గురుకులాలను వానప్రస్థులే నిర్వహిస్తారు. వీరిని మునులు అంటారు. ఆస్తులకైనా, జ్ఞానానికైనా వారసులు మనవళ్ళే. అసలైన సంపద జ్ఞానమే.
8. గతిశీలుడైన సన్న్యాసి స్థితిశీలుడైన గృహస్థ నీడలో ఉంటాడు. ఇతడు గృహస్థులను చక్కదిద్దుతాడు.

క. జీవాత్మకు 'ఇహ, పర' అని రెండు లోకాలున్నట్లే బ్రహ్మచారికి కూడా తండ్రి (గృహస్థ) ఇల్లు, పితామహుడి (వానప్రస్థ) (తాతయ్య) ఇల్లు (గురుకులం) అని రెండు ఇళ్లుంటాయి. తండ్రి ఇంటి నుంచి తాత ఇంటికీ, తాత ఇంటి నుంచి తండ్రి ఇంటికీ అనగా బడినుంచి ఇంటికి – ఇంటినుండి బడికి రాకపోకలే ఆవాగమన అభ్యాసం అవుతాయి. పూర్వకాలంలో ఇలాంటి విద్యావిధానమే ఉండేది. దీని ద్వారా అందరూ జ్ఞానులు, త్యాగులు అవుతారు.

ఖ. ఎనిమిదేళ్ల బాలుడు చదువుకోవటానికీ, అరవై ఏళ్ల తాత చదివించడానికీ ఇల్లు వదిలిపెడతారు. ఆ ఇద్దరూ కలిసిన చోటే **'గురుకులం'** అవుతుంది. తాత ఆచార్యుడు, మనవడు శిష్యుడు - అంతేవాసి. ఇలా అయితే దేశంలోని విద్య నిశ్శుల్కం అవుతుంది. అంటే కొనుక్కుని నేర్చుకునే విద్య కాదు. ఇది ఆత్మవిద్య. అభ్యుదయనిశ్శ్రేయసాలనిచ్చే ఆత్మ విద్య. **'విద్యయాఽమృతమశ్నుతే'**.

గ. తండ్రి గ్రామంలో, తాత అడవిలో ఉంటే, గ్రామ్య, అరణ్య సంస్కృతులు రెండింటి సామంజస్యమూ విద్యార్థికి అబ్బుతాయి.

ఘ. తండ్రివల్ల **'శరీరజన్మ'**, తాతవల్ల **'విద్యాజన్మ'** కలగటం వల్ల బాలుడు **'ద్విజుడు'** అవుతాడు. తద్ ద్వారా **'పితృఋణం, దేవ ఋణం'** తీర్చుకునేందుకు సన్నద్ధుడవుతాడు.

ఙ. కుమారుడు తండ్రియై పితృఋణం నుంచి, ఆ తండ్రి తాతయై దేవఋణం నుంచి విముక్తుడవుతాడు.

చ. **'పుత్రునికి పుత్రుడు కలిగితే ఇల్లు వదిలివెళ్లటం అనివార్యం'** కనుక, సంతతిని నియంత్రించవచ్చు. ఇదే త్యాగం. **త్యాగేనైకేన అమృతత్త్వమానశుః.**

ఛ. **'కుమారునికి కుమారుడు పుడితే ఇల్లు విడవటం తప్పదు'** కనుక సంపదలు సహజంగా నియంత్రణలోనికి వస్తాయి. ఎవరూ స్వార్థపరులుకారు. పరోపకార పరాయణులౌతారు. కర్మయోగులు, జ్ఞానయోగులు అవుతారు.

జ. శిష్యుడైన పౌత్రుడు / పౌత్రుడైన శిష్యుడు సహజంగా అందరినీ గౌరవిస్తాడు, విద్యలను సేవించేవాడు అవుతాడు. ధర్మార్థకామ మోక్షాలను పొందుతాడు.

ఝ. తాతా మనవలిద్దరూ వనాలలో ఉంటే, గృహస్థులైన దంపతులిద్దరూ తమ స్నేహాన్ని, దానాన్ని గురుకులం వైపు ప్రవహింపజేస్తారు.

ఞ. మనవడు పుడితే వానప్రస్థానికి వెళ్లాలి కనుక, ఇంటిని గృహస్థ ధర్మశాలగా భావించి పంచమహాయజ్ఞాలతో జీవనం గడుపుతాడు.

ట. ఆచార్యుడైన తాత, శిష్యుడైన తన మనవడికి వాత్సల్యంతో పాటు, ఆయువు, విద్య, కీర్తి, బల రూపాల ఆశీస్సులు ప్రసాదిస్తాడు. ఇదే అసలైన వారసత్వం. జీవిత సార్థక్యం.

ఠ. ఆచార్యుడు, అంతేవాసి శాస్త్ర చర్చలలో లీనమై పరస్పర గోష్ఠులు నిర్వహిస్తే బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులవంటి వాఙ్మయ నిర్మాణం జరుగుతుంది. అప్పుడే వారు 'ఋషి ఋణం' నుంచి కూడా ముక్తులవుతారు.

డ. నగరాలలోని అత్యధిక జనాభాపై సహజంగానే నియంత్రణ ఏర్పడుతుంది.

ఢ. వన ప్రాంతాలలో అగ్నిహోత్రాలు తప్ప, కుంపటులు వెలగవు. పశువులిచ్చే పాలు, చెట్లు ప్రసాదించే కాయలు, పళ్లు, ఔషధుల రసాలు వారికి ఆహారమవుతాయి.

ణ. వనాలు, పశువుల రక్షణ సహజంగానే జరుగుతుంది.

త. అన్నం కొరకు మిగిలిన ఆశ్రమవాసులు గృహస్థ వద్దకు వచ్చి భిక్ష కోరుతారు. దానివల్ల దేశపు ఆర్థిక వ్యవస్థ, కామ వ్యవస్థ సహజంగా నియంత్రణలో ఉంటుంది.

థ. తాత తన కుల వ్రత రక్షణార్థం ఇతరుల మనవణ్ని కూడా తన మనవడుగా చేసుకునే అవకాశం లభిస్తుంది. పుత్ర పరివర్తనం అనే సిద్ధాంతం నిజమవుతుంది.

ద. ప్రతి వ్యక్తీ తన సంకల్పాలు, వ్రతాలను శిష్యులైన మనవళ్ళ చేత చేయించి వాటిని సాకారం చేసుకోగలుగుతారు. తమ కలలను నేరవేర్చుకుంటారు.

ధ. సమయాని కన్నా ముందు- సమయం మించి పోయాక, అనగా వయసుకు ముందు వయసుపోయాక అంటే బ్రహ్మచర్యా శ్రమంలో వానప్రస్థా శ్రమంలో కామ వాసనల ప్రకోపానికి అవకాశమే ఉండదు.

న. అక్రమ సంబంధాలు లేకపోవటం చేత నైతికత ఔన్నత్యం పొందుతుంది.

ప. కుటుంబ వ్యవస్థలో అపూర్వమైన మార్పులు కలుగుతాయి.

ఫ. ఇతరులను తల్లితో సమానంగా, మిత్రులవలె, ఆత్మ(తన)వలె చూసే గొప్ప అవకాశం లభిస్తుంది. ఇది ఆత్మోన్నతికి పరమావశ్యకం.

బ. బాల్యావస్థ (ఎనిమిదేళ్లు), వృద్ధావస్థ (60 ఏళ్లు)లో జరిగే వివాహాలకు సహజంగానే ఆంక్షలు ఏర్పడి, ఎన్నో సామాజిక చెడురీతులు నశించిపోతాయి.

భ. దేశానికి ఎన్నో విషయాలలో అనుభవజ్ఞులైన విద్వాంసులు అనాయాసంగా లభిస్తారు. వారు తమ విద్యలను దాచకుండా అందరికీ ఉచితంగా పంచుతారు.

మ. సంపదలు, అధికార వాంఛలు సహజంగానే తొలగిపోతాయి. ఎందుకంటే దేశం జ్ఞానసంపన్నులను, అధికారులను గౌరవిస్తుంది.

ఈ విధంగా చతురాశ్రమ జీవన విధానం గల సమాజం సహజంగానే అభివృద్ధి చెందుతుంది. వర్ణ వ్యవస్థ కేవలం గృహస్థాశ్రమం వరకే పరిమితం. బ్రహ్మచారులకు, వానప్రస్థులకు, సన్న్యాసులకు వర్ణమే వర్తించదు.

బ్రహ్మచారులకు వర్ణాన్ని వారి గుణకర్మ స్వభావాలను బట్టి గురువు ఇస్తాడు. అదొక ఉపాధి నేటి డిగ్రీలలాంటిది. ఎవరు ఏ విధ్యను నేరిస్తే వారికి ఆ డిగ్రి వస్తుంది. దాని ద్వారానే ఉద్యోగ జీవనం సాగిస్తాడు. ఉద్యోగ విరమణ తర్వాత ఆ డిగ్రి-ఉపాధితో పనుండదు. తాను నేర్చుకున్న చదువు ద్వారా చేయు వృత్తికే వర్ణమని పేరు. అంటే తనకు తాను వరించుకునేది- ఎంచుకునేది. ఉద్యోగం చేయునంత వరకే అతని ఉపాధి డిగ్రి పనికి వచ్చి దాని విరమణ తర్వాత అది ఎలా పనికిరాదో అటులనే గృహస్థాశ్రమం తర్వాత ఉండే వానప్రస్థ సన్న్యాసులకు వర్ణసంబంధముండదు. విద్యార్థులు-బ్రహ్మచారులు ఇంకా చదువులోనే ఉంటారు కనుక వారికి వర్ణమనే పట్టా ఇవ్వడానికి వీలులేదు. చదువుపూర్తి కాకముందు పట్టారాదు- ఉద్యోగం ముగిసిన తర్వాత ఆ పట్టాతో పనీ ఉండదు. అటులనే వర్ణ వ్యవస్థా సంబంధం 'గృహస్థాశ్రమం వరకే పరిమితం' అని తెలుసుకోవాలి. ఇదే వర్ణాశ్రమ సారాంశం.

'మనువు-మనుస్మృతి'పై ఆక్షేపణలు - కారణాలు, పరిష్కారాలు

'మనువు-మనుస్మృతి' పై వస్తున్న ఆక్షేపణలను ముఖ్యంగా 3 రకాలుగా విభజించవచ్చు.

1. మనువు జన్మ ఆధారంగా కుల వ్యవస్థను ఏర్పరచినాడు.

2. ఆ వ్యవస్థలో మనువు శూద్రులకు అనగా దళితులకు పక్షపాతంతో కూడిన అమానుష విధానాన్ని చేసినాడు. సవర్ణములవారికి విశేషించి బ్రాహ్మణులకు విశేషాధికారాలు ఇచ్చినాడు. కావున మనువు శూద్ర విరోధి.

3. మనువు స్త్రీ విరోధి. ఆయన పురుషులతో సమానంగా స్త్రీలకు అధికారాలనివ్వలేదు. ఆయన స్త్రీలను నిందించినాడు.

ఈ మూడు ఆక్షేపణలకు సమాధానం కొరకు బయటి ప్రమాణాలు అభిప్రాయాలకంటె అంతఃసాక్షి అనగా మనుస్మృతిలోని శ్లోకాలే అధిక ప్రమాణంగా ఉంటాయి. కావున, ఇచ్చట మనుస్మృతిలోని అంతః సాక్ష్యాల ఆధారంగా యథార్థం నిరూపించబడుతుంది.

I మనువు ఏర్పరచిన వర్ణవ్యవస్థ వాస్తవిక స్వరూపం

1. మనువు ఏర్పరచిన వర్ణవ్యవస్థ గుణ-కర్మ-స్వభావాల వల్ల వేదాల ఆధారంగా ఏర్పడింది.

గుణ-కర్మ-స్వభావాల ఆధారంగా మనుస్మృతిలో వర్ణించిన వర్ణవ్యవస్థ వేదంలోనిదే. ఈ వ్యవస్థ ముఖ్యంగా మూడు వేదాలలో (ఋగ్వేదం 10.10.11,12; యజు. 31.10,11; అథర్వ. 19.6.5,6) లభిస్తున్నది. మనువు వేదాలను ధర్మానికి పరమప్రమాణంగా అంగీకరించినాడు. కావున ఆయన వర్ణవ్యవస్థను ధర్మానికి మూలవ్యవస్థగా నెంచి వాటిని వేదాలనుండి గ్రహించి తన శాసనాల్లో క్రియారూపము నిచ్చి ధర్మ శాస్త్రం ద్వారా ప్రచారం చేసి విస్తరింపజేసినాడు.

2. వర్ణవ్యవస్థ-కులవ్యవస్థలలోగల భేదము

మనువు యొక్క వైదిక వర్ణవ్యవస్థ గుణ-కర్మ-స్వభావాల ఆధారంగా ఏర్పడింది. కాని జన్మ ఆధారంగా కాదు. వర్ణవ్యవస్థ మరియు కులవ్యవస్థలు ఒకదానికొకటి వ్యతిరేక వ్యవస్థలని ముందుగానే తెలుసుకొనుట చాలా అవసరం. ఒకటున్నచోట మరొకటి ఉండలేదు. వర్ణవ్యవస్థలో **'వర్ణం'** ముఖ్యం. కులవ్యవస్థలో **'కులం'** అనగా పుట్టుక ముఖ్యం. ఈ రెండింటిని ఒకే అర్థంలో వాడేవారు తమతోపాటు పాఠకులను కూడా భ్రాంతిలో-అపోహాలో, అయోమయంలో పడవేస్తారు. వర్ణ శబ్దం **"వృ వరణే"** అను ధాతువుతో తయారైంది. దాని అర్థం 'వరింపబడు' సముదాయమని అర్థం. వైదిక వర్ణవ్యవస్థలో మానవ సమాజాన్ని బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రు లనెడు నాలుగు సముదాయాలలో విభజించినారు. వ్యక్తులు తమ గుణ-కర్మ-స్వభావాలను అనుసరించి ఈ సముదాయాలను వరించుచున్నంత కాలం అవి వర్ణ వ్యవస్థలుగా పిలువబడినవి. జన్మతో బ్రాహ్మణ, శూద్రులుగా గుర్తించనారంభించినప్పటి నుండి అది జాతి(కుల) వ్యవస్థగా మారినది. వర్ణశబ్దంలోని ధాతువు-ప్రత్యయాలలోగల మూల అర్థంతోనే ఈ వ్యవస్థ ఏర్పడింది. అది గుణ-కర్మ-స్వభావాల ఆధారంగా వరించబడుచున్నదని, జన్మతో కాదని గుర్తు చేస్తున్నది.

3. వర్ణాలలో కులాన్ని గూర్చి చెప్పలేదు.

మనువు యొక్క వర్ణవ్యవస్థను సాధించుటకు లేదా సమర్థించుటకు ఒకే ఒక్క పెద్ద ప్రమాణమేమంటే- మనువు కేవలం నాలుగు వర్ణాలనే ఉల్లేఖించాడు. ఆయన ఏ ఒక్క కులాన్నిగానీ, గోత్రాన్నిగానీ పరిగణనకు తీసుకొనలేదు. దీని వలన రెండు సత్యాలు స్పష్టమగుచున్నవి. **ఒకటి:** మనువు కాలంలో జన్మతో ఏ కులమూ లేదు. **రెండవది:** కులం (జన్మ) లేదా గోత్రానికి వర్ణవ్యవస్థలో ఎటువంటి మహత్త్వమూ, స్థానమూ లేదు. మనువు కాలంలో కులాలుండి జన్మతోనే వర్ణము నిర్ణయించబడినట్లైతే ఆయన ఆ కులాలను తప్పక పరిగణనలోనికి తీసుకొనియుండేవాడు. ఫలానా కులాలు లేక గోత్రీయులు బ్రాహ్మణులని, ఫలానా గోత్రము వారు శూద్రులని చెప్పియుండేవాడు. మనువు జన్మ ఆధారంగా వచ్చు గొప్పతనాన్ని ఎంతగా ఉపేక్షించాడో, నిరసించాడో ఒక శ్లోకము (3-109) ద్వారా తెలియుచున్నది. దానిలో 'భోజనాలకై కుల గోత్రాలను చూచేవారిని ఆయన **'వాన్తాశీ'** 'వాంతిచేసుకొని దానినే భుజించువాడని' నిందతో కూడిన విశేషణాలతో దూషించాడు. గౌరవ ఆదరాలు-గొప్పతనాలను నిర్ణయించే సమయంలో వ్యక్తుల కుల-గోత్రాల మాటే ఆయన చెప్పలేదు. కేవలం గుణ-కర్మ-స్వభావాలనే చెప్పాడు.

4. మనువును కుల వ్యవస్థాపకునిగా భావించినచో మనుస్మృతి రచనయే వ్యర్థమవుతుంది.

మనువును జన్మతో వర్ణవ్యవస్థను ప్రతిపాదించువానినిగా భావించినచో మనుస్మృతిని రచించుటలో గల ఉద్దేశ్యమే వ్యర్థమవుతుంది. ఎట్లనగా ! మనుస్మృతిలో వేర్వేరు వర్ణాలవారికి వేర్వేరు కర్మలను చేయు విధానం చేయబడింది. ఎవరైనా జన్మతోనే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా పిలువబడనారంభించినచో వారు తమకు విధింపబడిన కర్మలు చేసినా చేయకున్నా వా రా వర్ణములోనే ఉంటారు. వారికి కర్మల విధానం నిరర్థకమౌతుంది. కనుక మనువు నిర్ణయించిన వేర్వేరు

కర్మలే వారు కర్మణా వర్ణవ్యవస్థను అంగీకరింతురని, జన్మతో కాదని నిరూపించుచున్నది.

5. వర్ణవ్యవస్థలో వర్ణ పరివర్తనకు ఏర్పాట్లు.

వర్ణవ్యవస్థ కులవ్యవస్థలలో గల చాలా పెద్ద తేడా ఏమిటంటే – వర్ణవ్యవస్థలో వర్ణాల మార్పిడి జరుగుతుంది. ప్రతి వ్యక్తికి తన వర్ణాన్ని మార్చుకొనే స్వతంత్రముంటుంది. కాని కుల వ్యవస్థలో జన్మించిన కులమే జీవితాంతం వరకూ ఉంటుంది. మనువు యొక్క వ్యవస్థ 'వర్ణ వ్యవస్థ'. దీనిలో వ్యక్తి తన వర్ణాన్ని మార్చుకొనే స్వతంత్రమున్నది. ఈ విషయాన్ని తెలిపే ఒక మహత్త్వపూర్ణ శ్లోకాన్ని ప్రమాణరూపంలో ఈ క్రింద వ్రాస్తున్నాం. దీనితో సందేహాలన్నీ దూరమవుతాయి. అది

శ్లో॥ శూద్రో బ్రాహ్మణతామేతి బ్రాహ్మణశ్చైతి శూద్రతామ్ ।
క్షత్రియా జ్జాతమేవం తు విద్యాద్వైశ్యాత్తథైవ చ ॥ (మను.10-65)

'గుణ-కర్మ-స్వభావాల ఆధారంగా బ్రాహ్మణుడు శూద్రుడగును. శూద్రుడు బ్రాహ్మణుడగును. ఇదే విధంగా క్షత్రియ, వైశ్యులలో కూడా వర్ణ మార్పిడులు జరుగును'.

6. నిర్ధారింపబడిన కర్మలను విడిచిపెట్టినచో వర్ణం మారును.

మనుస్మృతిలోని ఎన్నో శ్లోకాలలో నిర్ధారణ చేయబడిన కర్మలను విడిచిపెట్టి నీచకర్మలను ఆచరించినచో ద్విజులను శూద్రులుగా పరిగణించుటకు విధానం కలదు (2-37,40,103,168; 4-245 మున్నగు శ్లోకాలను చూడుడు). అలాగే శ్రేష్ఠకర్మల నాచరించే శూద్రులు ఉన్నత వర్ణాలను పొందుటకు విధానమున్నది (9-335).

7. మహాభారత కాలం వరకు వర్ణవ్యవస్థ అమలు.

పైన చెప్పిన ప్రమాణాలు, యుక్తుల ద్వారా మనువు ఏర్పరచిన వ్యవస్థలో సమాజంలోని వ్యక్తులందరికీ గుణ-కర్మ-స్వభావాలననుసరించి ఆ యా వర్ణాలను గ్రహించుటకు సమానావకాశాలుండెడివని స్పష్టమగుచున్నది. వేదకాలంనుండి మొదలుకొని మహాభారత (గీత) కాలం వరకూ ఈ కర్మలపై ఆధారపడిన వర్ణవ్యవస్థ అనుసరింపబడుచుండినది. గీతలో స్పష్టంగా యిట్లు చెప్పబడింది-

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః" (4.13)

గుణకర్మ విభాగాల ననుసరించి నాలుగు వర్ణాల వ్యవస్థ నిర్మించబడింది. జన్మ ఆధారంగా కాదు.

8. వర్ణ మార్పునకు చారిత్రిక ఉదాహరణలు.

భారతీయ చరిత్రలో కర్మ ఆధారంగా ఏర్పడిన వర్ణవ్యవస్థను సమర్థించే వందలాది ప్రమాణాలు లభిస్తాయి. ఇవన్నీ ఏ వర్ణమూ జన్మ మూలంగా ఏర్పడలేదని నిరూపిస్తాయి. అవి –

1) దాసీపుత్రుడైన **'కవష ఇలూష'** మరియు శూద్రురాలి పుత్రుడైన **'వత్స'** మంత్రద్రష్టలైనందున ఇరువురూ **'ఋగ్వేద మంత్రాలను దర్శించిన ఋషులు'**గా పిలువబడ్డారు.
2) క్షత్రియ వర్ణంలో పుట్టిన రాజా **'విశ్వామిత్రుడు'** 'బ్రహ్మర్షి' అయినాడు.
3) అజ్ఞాత కులంలో (తన వర్ణము తెలియని) **'సత్యకామ జాబాలుడు'** బ్రహ్మవాదియై **'ఋషి'** అయినాడు.
4) చండాలుని గృహంలో పుట్టిన **మాతంగుడు** **'ఋషి'**గా పిలువబడ్డాడు.
5) (కొన్ని కథల ఆధారంగా) నిమ్న కులంలో పుట్టిన **రత్నాకరుడు** **'మహర్షి వాల్మీకి'**గా మారినాడు.
6) దాసీ పుత్రుడైన **'విదురుడు'** – ధృతరాష్ట్రమహారాజు యొక్క మహామంత్రియై **'మహాత్ముడు'**గా పిలువబడ్డాడు.
7) దశరథుని పుత్రుడు **శ్రీరాముడు**, యదువంశమున పుట్టిన **శ్రీకృష్ణుడు** **'భగవాన్'** అనే పేరుతో పిలువబడ్డారు.

వీరిరువురను బ్రాహ్మణులు కూడా పూజిస్తున్నారు. వీరిరువురి వర్ణాలు క్షత్రియవర్ణాలైనప్పటికీ కర్మల కారణంగానే వారట్లు పూజింపబడుచున్నారు.

8) పులస్త్య ఋషి వంశజుడైన లంకాధీశుడు **రావణుడు** బ్రాహ్మణుడైయ్యుండి **'రాక్షసుడి'**గా పిలువబడ్డాడు.

9) శ్రీరామునకు పూర్వమున్న రఘుమహారాజు కుమారుడు **'ప్రవృద్ధుడు'** నీచకర్మలను చేయుట వలన క్షత్రియవర్ణమునుండి బహిష్కరింపబడి **'రాక్షసుడు'** అయ్యాడు.

10) రాజా **త్రిశంకుడు 'ఛండాల'** వర్ణాన్ని పొందాడు.

11) **విశ్వామిత్రుని కుమారు** లనేకులు **'శూద్రులు'**గా పిలువబడ్డారు.

9. కులాల వర్ణమార్పిడులు.

వ్యక్తుల ఉదాహరణలే గాక చరిత్రలో కులము లేక కులాలు పూర్తిగా వర్ణ మార్పిడి నొందినవి కూడా లభించును. మహాభారతము, మనుస్మృతులలో కొంత పాఠభేదంతో లభించే శ్లోకాలలో నిమ్నజాతులవారు మొదట క్షత్రియులుగా నుండిరి. కాని వారు తమ క్షత్రియవర్ణ కర్తవ్యములను త్యజించినందున బ్రాహ్మణులు చెప్పిన ప్రాయశ్చిత్తమును చేసుకోనందున ప్రజలు వారిని శూద్రులుగా పరిగణించారు.

శ్లో॥ **శనకైస్తు క్రియాలోపాదిమా క్షత్రియ జాతయః ।**
వృషలత్వం గతా లోకే బ్రాహ్మణాదర్శనేన చ ॥
పౌణ్డ్రకా శ్చౌద్ర ద్రవిడాః కాంబోజాః యవనాః శకాః ।
పారదాః పహ్లావాశ్చీనాః కిరాతాః దరదాః ఖశాః ॥ మను. 10.43, 44

తమకు నిర్ణయించిన కర్తవ్య కర్మలను విడిచి పెట్టినందున మరియు బ్రాహ్మణులు చెప్పిన ప్రాయశ్చిత్తాదులను చేసుకోనందున నెమ్మది–నెమ్మదిగా ఈ క్షత్రియవర్ణమునకు చెందినవారంతా శూద్రులుగా పిలువబడ్డారు. వారు పౌండ్రక, ఔడ్ర, ద్రవిడ, కాంభోజ, యవన, శక, పారద, పహ్లవ, చీన, కిరాత, దురద, ఖశలు. మహాభారతములో 35.17,18 శ్లోకాలలో వీరితోపాటు మేకల, లాట్, కాన్వశిరా, శౌణిక, ద్వార, చౌర, శాబర, బర్బర కులాలను గూర్చి కూడా చెప్పబడింది.

తరువాత కూడా వర్ణమార్పిడుల ఉదాహరణలు చరిత్రలలో లభిస్తాయి. జె. విల్సన్, హెచ్.ఎల్, రోజ్ ల కథనం ప్రకారం రాజపుతానా, సిన్ధ మరియు గుజరాతుకు చెందిన పోఖరనా లేక పుష్కరణ బ్రాహ్మణులు ఉత్తర ప్రదేశ్‌లో ఉన్నావ్ జిల్లాలోని ఆమ్తాడా యొక్క పాలకులు మరియు మహావర రాజపూతులు వర్ణమార్పిడులతో నిమ్న వర్ణాల నుండి ఉన్నత వర్ణానికి చేరారు. (హిందీ విశ్వకోశ్ భాగం 4 చూడండి)

10. నాలుగు వర్ణాలలో లభించే సమాన గోత్రాల రహస్యం.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మరియు దళిత జాతులలో సమానంగా కనిపించే గోత్రాలు చారిత్రిక వంశ వరంపరను సమర్ధించే ప్రమాణం. వీరంతా ఒకే మూలవంశములోని పరివారాలలో జన్మించినవారనిపించుచున్నది. ముందుగా వర్ణవ్యవస్థలో గుణ–కర్మ–స్వభావాల ఆధారంగా ఎవరు ఏ వర్ణమును వరించారో వా రా వర్ణంతో పిలువబడుచుండిరి. తరువాత వేర్వేరు కారణాల వలన వారిలో ఉన్నత–నిమ్న వర్ణాల మార్పిడి జరుగుచుండెడిది. ఏదో ఒక క్షేత్రంలో ఉన్న బ్రాహ్మణుడే మరొక చోట క్షత్రియుడుగా వేరొకచోట శూద్రుడుగా పిలువబడుచుండెను. అలా కొంతకాలం గడచిన తరువాత జన్మ ఆధారంగా అతని కులము రూఢియైనది.

11. వర్ణ వ్యవస్థకు ఆధారమైన తత్త్వాలు.

మనుస్మృతిలో చెప్పబడిన వర్ణవ్యవస్థకు గుణ –కర్మ–స్వభావాలు ఆధారాలు. మనువు వర్ణానికి మహత్వాన్ని ఆదరసత్కారాలనివ్వడు. పైన చెప్పిన గుణాలను గౌరవిస్తాడు. సుగుణము లధికంగా గల వ్యక్తికి మరియు ఉన్నత వర్ణానికి

ఎక్కువ ఆదర సత్కారాలు లభిస్తాయి. గుణాలు తక్కువగు కొలది ఆదర సత్కారాలు తక్కువవుతాయి. నేటి వరకూ ప్రపంచములోని ఏ సభ్యవ్యవస్థ ఈ తత్వాలను కాదనలేదు. ఇకముందు కూడా కాదనబోదు. వీనిని కాదంటే జరిగే పరిణామం అన్యాయం, అసంతోషం, ఆక్రోశం, అవ్యవస్థ, అరాచకం తాండవమాడుతాయి. దీనినే- సామెతగా చెప్పాలంటే **'గుఱ్ఱం గాడిదె ఒకటే అనుట'** లేక **'అందరినీ ఒకే లాఠీతో పెత్తనం చేయుట'** అనవచ్చు. దీనివలన కలిగే పరిణామంతో ఏ సమాజంగాని, దేశంగాని వికాసం చెందదు. ఉన్నతినొందజాలదు. సమృద్ధి సంపన్నం కాజాలదు. సుఖాలతో సంతుష్టిగా మనజాలదు. ఇటువంటి వ్యవస్థ ముక్కలు కాకుండా ఎక్కువకాలం వరకు నిలువలేదు. అందరూ సమానంగా ఉండే సమాజాన్నే ఏర్పరచెదమని చెప్పు నేటి సామ్యవాద వ్యవస్థ కూడా ఈ తత్వాలు లేకుండా ఉండజాలదు.

దానిలో కూడా గుణ-కర్మ-స్వభావాల ననుసరించి పదవులు, సామాజిక హెూదాలు కలవు. వాటి ననుసరించే జీత భత్యాలు, తదితర సౌకర్యాలు గౌరవాలలో తేడాలున్నవి.

నేటి వర్ణ వ్యవస్థను చూడండి-

నేటి మన శాసనాలు ఉద్యోగాల వ్యవస్థలను పోల్చి చూసినట్లైతే మనువు మాటలు సులభంగా అర్థమై ఆనాటి మను వ్యవస్థ మరియు నేటి వ్యవస్థలలో గల ముఖ్యమైన సమానతలు బోధపడుతాయి. నేటి ప్రభుత్వ పాలనాయంత్రాంగ వ్యవస్థలో నాలుగు వర్ణాలున్నవి. 1. ప్రథమ శ్రేణి అధికారి 2. ద్వితీయ శ్రేణి అధికారి 3-4. తృతీయ చతుర్థ శ్రేణుల కర్మచారులు. వీనిలో మొదటి రెండు శ్రేణులు -అధికారులు. తరువాతివారు కర్మచారులు. ఈ విభజన గుణ కర్మ-యోగ్యతల ఆధారంగానే జరిగింది. వాటి ఆధారంగానే వారికి ప్రాముఖ్యత, గౌరవ అధికారాలు లభిస్తున్నవి. ఈ పదవులకు కావలసిన యోగ్యతలను ముందు కూడా విద్యాసంస్థలు (గురుకులాలు, ఆశ్రమాలు, ఆచార్యుడు) ధృవపరుస్తుండేవి. నేడు కూడా విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు మున్నగునవే చేయుచున్నవి. ఏ క్షేత్రంలోనైనా విద్యార్హతలకు సంబంధించిన ప్రమాణపత్రా లేవీ లేకుంటే, అల్పజ్ఞానము లేక అజ్ఞానముతో కూడిన వ్యక్తి సేవ లేక శరీర శ్రమతో కూడిన పనినే చేస్తాడు. అందువలన అతడు కర్మచారులలో చివరిశ్రేణికి చెందును. పూర్వకాలంలో కూడా గురువు వద్దకు వెళ్ళి విద్యనభ్యసించలేనివాడు తన స్థాయికి చెందిన పనినే చేసేవాడు. అతనిని శూద్రుడని పిలిచేవారు. శూద్రుడనగా నిమ్న స్థితిలో నున్నవాడు, ఆజ్ఞలను పాలించువాడు మున్నగు అర్థాలు. నౌకరు, చాకరు, సేవకుడు, సర్వెంట్, అర్దలీ, క్రిందిస్థాయి ఉద్యోగి మున్నగు పేర్లలో ఎంత సమానార్థమున్నదో స్వయంగా చూడవచ్చును. ఉద్యోగాలను నిర్ణయించుటలో కూడా చాలా తేడాలున్నవి. విద్యాసంస్థల నుండి డాక్టర్లు, వకీళ్ళు, అధ్యాపకులు మున్నగు వారూ తగిన డిగ్రీలు పొందితేనే ఉద్యోగాలు పొందుటకు అర్హులవుతారు. లేనిచో లేదు. ఇవన్నీ నియమాలు, కర్తవ్యాలతో నిర్ధారించబడినవి. ఆ నియమాలను పాటించనిచో వారిని ఆ పదవి నుండి తొలగిస్తారు.

12. శూద్రుల వర్ణ మార్పిడి వ్యవహారంలో అవకాశం అవసరం.

తమనుతాము **'శూద్రుల'** మనుకొనే వారిని, ఏదో కారణంగా తమను శూద్రకోటిలో ఎంచుకొంటూ మానవులకుండే అధికారాలనుండి తమను తాము వంచితులను చేసుకొన్నవారిని, మనువును ధార్మిక గురువుగా నెంచుచూ మనువు యొక్క సిద్ధాంతాలననుసరించే ఆర్యసమాజం, వారి యోగ్యతలను బట్టి ఏ వర్ణములోనైనా స్వీకరించుటకు ఆహ్వానిస్తున్నది. వారు ఆ యా వర్ణాలతో వ్యవహరింపబడే అవకాశాన్నిస్తుంది. నేటి రాజ్యాంగం తయారగుటకు ఎంతో ముందుగానే మనుస్మృతిలోని ఆదేశాలను దర్శించిన మహర్షి దయానంద సరస్వతి అంటరానితనం, హెచ్చు తగ్గులు, కుల భేదాలు, వృద్ధ వివాహాలు, బహుభార్యావివాహాలు, సతీసహగమనం, స్త్రీలను హింసించుట మున్నగువానిని సమాజంలోని దురాచారాలుగా ఘోషించి, వాటికి వ్యతిరేకంగా వానిని నిర్మూలించుటకై ఉద్యమం జరిపాడు. స్త్రీలకు గురుకులాలు, విద్యాలయాలు స్థాపించాడు. ఆర్యసమాజ విద్యాసంస్థలలో శూద్రులకు ప్రవేశాధికారాలనిచ్చాడు. ఈ పరిణామంతో అందులో శిక్షణ పొందిన వందలాది

మంది దళితులు సంస్కృత భాషలో, వేదాది శాస్త్రాలలో విద్వాంసులై స్నాతకులైనారు. వారి అస్పృశ్యతను రూపుమాపుటకై మనువును అనుసరించారు. మహర్షి దయానందుని శిష్యులైన ఎందరో ఆర్యసమాజీయులు నేటికీ అస్పృశ్యతను రూపుమాపు ఉద్యమాన్ని విడువలేదు. ఇటువంటి ఆర్యసమాజీయులను నేడు దళితకులాలవారెందుకు మరచిపోతున్నారు? ఈ విషయాలేవీ తెలియనటువంటి దళిత రచయితలు ఆర్యసమాజాన్ని కూడా రంగుల కళ్ళద్దాలతో చూస్తున్నారు. ఇది వారి అకృతజ్ఞత, అజ్ఞానం కాదా?

13. వర్ణవ్యవస్థను గూర్చి సరియైన అంచనా.

మహర్షి మనవుపై డా॥ అంబేద్కర్ చేసిన ఆరోపణలు సరియైనవి కావు. ఆయన మనుస్మృతిలో ప్రస్తావించిన ఆదర్శవంతమైన జీవన విలువలు, మర్యాదలు (హద్దులు), ధర్మస్వరూపాలు, సార్వభౌమికాలు, సార్వకాలికాలు. ఐనా దేశకాల పరిస్థితుల ఆధారంగా తరువాత ఏర్పడిన వ్యవస్థలు అప్పటి పరిస్థితులకనుకూలంగా ఉండాలి. మనువు తన కాలంలో ఏ సామాజిక వ్యవస్థను గ్రహించాడో అది ఆ సమయంలో సర్వశ్రేష్ఠమైన వ్యవస్థ. అందువలననే ఆ వ్యవస్థ ఎంతో వ్యాపకమైన ప్రభావంతో కూడినదై వేలాది సంవత్సరాల వరకూ అది విస్తరిస్తూ వచ్చింది. ఈ కాలచక్రంలో కొన్ని వ్యవస్థలు తమ మూల స్వరూపాలను పోగొట్టుకొని వికృతంగా మారినవి. నేడు రాజనీతి మరియు సామాజిక పరిస్థితులు మారినవి. రాజుల పాలననుండి మనం ప్రజాపాలనలోనికి ప్రవేశించాం. సమయానుకూలంగా అనేక సమాజ వ్యవస్థలు కూడా మారినవి. దీని అభిప్రాయం ప్రాచీనత మనకు పూర్తిగా నిరాకరించదగినదని గాని మరియు అవమానించదగిన వస్తువనిగాని కాదు. ఇదే ఆలోచన గనుక మనలో ఉప్పొంగినట్లైతే మన ప్రాచీన గౌరవంతో ముడిపడియున్న ప్రతి వస్తువు, మహాపురుషులు, కవులు, రచయితలు, నగరాలు, తీర్థాలు, భవనాలు, సాహిత్యం, చరిత్రలు అన్నీ నిందనీయాలవుతాయి. ప్రతి ఒక్క వ్యవస్థ, వస్తువు, వ్యక్తి యొక్క విలువ అప్పటి పరిస్థితుల దృష్టితోనే కట్టాలి. అదే సరైన విలువగా లెక్కించబడుతుంది.

14. 'మహర్షి మనువు'పై- డా ॥ అంబేద్కర్ చేసిన ఆరోపణలు సరియైనవి కావు

భారతీయ రచయితలలో మనువును నిరోధించు పరంపరకు ప్రముఖ నాయకుడు, వారికి ప్రేరణనిచ్చు స్రోతస్సు డా॥ భీమ్‌రావ్ అంబేద్కర్. కుల భేదాలు హెచ్చు తగ్గులు అంటరానితనంవంటి కురీతుల కారణంగా పుట్టుకతోనే తన జీవితంలో అనేక అవమానాలు, అసమానతలు, కష్టాలు, అన్యాయాలను అనుభవించాడు. ఆ పరిస్థితులలో స్వాభిమానం గల విద్యావంతులెవరైనా ఆయన చేసిన పనే చేస్తారు. కాని మనువును మనుస్మృతిని గూర్చి, గంభీర అధ్యయనం చేసి దాన్ని పూర్తిగా తెలుసుకొనకుండానే పూర్వాగ్రహంతో (ముందుగానే ఏర్పరచుకున్న వ్యతిరేక భావాలతో) ఆయన మహర్షి మనువు విషయంలో వ్యవహరించిన తీరు చాలా అనుచితమైనది. అన్యాయంతో కూడినది. చట్టము తెలిసిన ఒక వ్యక్తిగా ఆయన ఈ అకృత్యానికి, అనౌచిత్యానికి పాల్పడేది లేకుండెను. ఆయన మన రాజ్యాంగంలో ఒక క్లాజును పొందు పరిచారు. అది: **అపరాధిని విడిచి పెట్టినా సరే అనుచితమైన నిర్ణయాల మూలంగా నిరపరాధులను దండించరాదు.** అని. కానీ ఆయన జీవితంలో ఈ నియమాన్ని పాటించలేదు. మనుస్మృతిలో లేని తర్వాత చేర్చబడిన, జన్మాధారంగా ఏర్పడిన సామాజిక వ్యవస్థలను డా॥ అంబేద్కర్ మనువుపై రుద్ది అనవసరంగా అతనిని దోషిగా ప్రకటిస్తూ ఆయనకు వ్యతిరేకంగా నిందారోపణలు చేసాడు. భారతీయ సమాజంలో ప్రతిష్ఠ గల ఒక మహర్షిని గూర్చి హద్దుమీరిన కటువచనాలతో దూషించుట నేరముకాదా? అప్పటివారిలో చాలా మంది వ్యక్తులు మనువు విషయంలో ఆయనకు గల కొన్ని అపోహలు పూర్వాగ్రహంతో కూడినవని, వాటిని ఆయన వీడాలని మాటిమాటికీ తెలియజేసారు. ఐనా ఆయన తన పూర్వాగ్రహాన్ని విడువలేదు. ఇందుకు చాలా కారణాలున్నవి. అప్పటికే ఆయన మనువు విషయంలో వ్రాసినవాటిని మార్చుకొనుటకు కూడా ఇష్టపడలేదు. ఆయన అన్న

మాటలలోనే చెప్పాలంటే **"నాపై మనువనే భూతం సవారీ చేయుచున్నది. దానిని దించగలిగేటంత శక్తి నాలో లేదు"**అని. నిజమే! ఆ భూతాన్ని ఆయన జీవించి యున్నంత కాలం దించలేకపోయాడు. కానీ తన తరువాత ఆ భూతాన్ని తన అనుచరులపై విడిచి పెట్టి పోయాడు. ఐతే ఈ భూత సవారీ మనువుపై చేసిన ఆరోపణలు, రచనలు, వివేకముతో కూడినవా? దీనిపై చర్చచేయవలసిన అవసరమున్నది.

డా॥ అంబేద్కర్ సంస్కృతము తెలిసినవారు కాదనే మాట వాస్తవమైన విషయం. ఈ మాట ఆయన తనంతట తానే స్వయంగా అంగీకరించినట్లుగా మనకీ క్రింది విషయాన్ని బట్టి బోధపడుతుంది. మనువుకు సంబంధించి ఆయన చేసిన సమస్త అధ్యయనం విశ్లేషణలు ఆంగ్లభాషలో వ్రాసిన విమర్శల ఆధారంగా గ్రహించి చేసినవి. అందువలన వారు మూలంలో చేరిన ప్రక్షిప్త శ్లోకాల ప్రసంగాదులపై ఆలోచించలేకపోయారు. ఆంగ్లంలో చదివిన విమర్శలే ఆయనలో నాటుకుపోయినవి. డా॥ అంబేద్కర్ కాలం వరకు మనుస్మృతిలో జరిగిన ప్రక్షిప్తాలపై ఎటువంటి పరిశోధనలు కూడా జరుగలేదు. అందువలన ఆయనకు మూల శ్లోకాలకు-ప్రక్షిప్తాలకు మధ్య తేడా తెలుసుకొనుట కెటువంటి ఆధారం లభించలేదు. పైన చెప్పిన కారణం లేకపోతే బహుశా ఆయన మనువును, మనుస్మృతిని ఆలోచించకుండా ఇంత విమర్శించేవాడు కాదేమో!

మన రాజ్యాంగంలో 75సం॥ రా లలో 100 కుపైగా సవరణలు జరిగినవి. వానిలో కొన్ని రాజ్యాంగంలోని మూలభావాలకు వ్యతిరేకమైనవి. – ఉదా: ఆంగ్లభాష వాడుక గడువును పెంచుట, ముస్లింలలో గుజారాభత్తా షరతును తీసి వేయుట మున్నగునవి. తాను రాసిన రాజ్యాంగంలో తన తరువాత జరిగిన మార్పులకు భవిష్యత్తులో జరుగబోవు మార్పులకు డా॥ అంబేద్కరును బాధ్యునిగా చేయగలమా? చేయజాలనిచో వేలాది సం॥రాల తరువాత చేయబడిన వికృత వ్యవస్థలకు మనువును బాధ్యుని చేయుట తగునా?

15. **మనువు యొక్క వైదిక వర్ణవ్యవస్థ విషయంలో డా॥ అంబేద్కర్** యొక్క మౌలిక అభిప్రాయాన్ని ఇచ్చుట ప్రస్తావించి వాటిపై చర్చించుట అవసరం. ఈ సమీక్షతో ఈ వ్యాసానికి ఒక క్రొత్త కోణం లభిస్తుంది.

(1) "ఒక మాట మీకు నేను చెప్పాలనుకుంటున్నాను-మనువు కుల వ్యవస్థను నిర్మాణం చేయలేదు. ఆయ నలా చేయజాలడు. కులప్రథ మనువు కంటె ముందునుండి కలదు". (భారతదేశంలో జాతి ప్రథ 29వ పేజి)

(2) "వేదాలలో చాతుర్వర్ణ్య సిద్ధాంతం కలదనునది నిర్వివాద విషయం. దానిని పురుష సూక్త మందురు". (హిందూత్వ కా దర్శన్ 122వ పేజి)

(3) 'కుల నిర్మాణమునకు మనువు బాధ్యుడు కాకపోయినా ఆయన వర్ణ పవిత్రతను గూర్చి ఉపదేశించారు. వర్ణం కులానికి జనని.

(4) ఈ విధంగా మనువు కులవ్యవస్థను రచించకపోయినా కూడా కుల వ్యవస్థకు ముందున్నవాడగుట వలన ఆయనపై నిశ్చయంగా ఆరోపణ చేయవచ్చును." (హిందూత్వ కా దర్శన్ 42వ పేజి) 1) స్వామి దయానందుడు మరియు వారి అనుయాయుల వర్ణానికి సంబంధించిన వైదిక సిద్ధాంతానికి వ్యాఖ్యానం బుద్ధికుశలతతో కూడినదనియు, ఘృణాస్పదము కాదనియు నేనంగీకరింతును. వ్యక్తికి సమాజంలో గల స్థానాన్ని నిర్ణయించగలిగే తత్త్వం కులమనే మాటను నేనంగీకరించను. అది కేవలం యోగ్యతకే విలువనిచ్చును". (జాతి ప్రథా ఉన్మూలన్ 119 పేజి).

(5) "వేదాలలో వర్ణాన్ని గూర్చిన విషయం యొక్క సారాంశమేమనగా – "వ్యక్తి తనకు సహజసిద్ధంగా లభించిన యోగ్యతననుసరించి ఏ వృత్తినైనా చేపట్టవచ్చును.

(6) కులానికాధారభూతమైన సిద్ధాంతం వర్ణానికాధారభూతమైన సిద్ధాంతం కంటే వేరు. కేవలం మూలరూపంలోనే తేడా కాకుండా, ఒకదానికొకటి వ్యతిరేకం. వర్ణ సిద్ధాంతం (వర్ణం) గుణాలపై ఆధారపడియున్నది. (జాతి ప్రథా ఉన్మూలన్ 81వ పేజి).

16. పైన ప్రస్తావించినవానిలో **డా ॥ అంబేద్కర్ వర్ణవ్యవస్థ రచన** వేదాలలో నుండి జరిగినదని స్పష్టంగా అంగీకరించాడు. మహర్షి మనువు వాటికి కర్త కాదు, కేవలం పోషకుడు మాత్రమే. వేదాలలోని వర్ణవ్యవస్థ గుణ –కర్మ–యోగ్యతల ఆధారంగా ఏర్పడింది. ఇది బుద్ధిపూర్వకంగా అసహ్యించుకోదగినదికాదు. వర్ణవ్యవస్థ–కులవ్యవస్థ ఒకదానికొకటి వ్యతిరేకం. మనువు కులవ్యవస్థకు నిర్మాత కానేకాదు. ఈ విధంగా వర్ణవ్యవస్థ కులవ్యవస్థల నిర్మాతయనే ఆరోపణ మనువుకు వర్తించదు. వర్ణవ్యవస్థను పోషించుట వలన కులవాదమును పోషించెనను ఆరోపణ కూడా సరికాదు. ఏలయన డా ॥ అంబేద్కర్ అన్నట్లు "వర్ణవ్యవస్థ బుద్ధితో కూడినదై, అసహ్యించుకొనదగినది కానిచో వర్ణవ్యవస్థను పోషించి మహర్షి మనువు మంచిపనే చేసాడు. తప్పేమీ చేయలేదు. మనువు వైదిక ధర్మావలంబి యగుటవలన వేదాలను పరమ ప్రమాణంగా అంగీకరించును. ధర్మ గ్రంథాలలోని ఆదేశాలను పాలించుచూ వానిలోని మంచి వ్యవస్థలను ప్రచారంచేసి – ప్రజలలో విస్తరింపచేసాడు. అందులో వారి తప్పేమీ లేదు. ధర్మావలంబులంతా అలాగే చేస్తారు".

బౌద్ధుడైన తరువాత డా ॥ అంబేద్కర్ కూడా బౌద్ధమత ఆలోచనలను ప్రచారము చేసి విస్తరింపజేసాడు. ఆయన చేసిన ఈ పని మంచిదైనచో మనువు చేసింది కూడా మంచిదే. ఇలా అంగీకారపు మాటలున్నప్పటికిని ప్రతిచోట కులవాదానికి బాధ్యునిగా చేసి డా॥ అంబేద్కర్ మనువును నిందించాడు. మనువు తరువాత ఏర్పడిన సామాజిక కుల వ్యవస్థలను మనువు పై రుద్ది ఆయనను నిందించుట ఎక్కడి న్యాయం?

17. **డా॥ అంబేద్కర్ వర్ణవ్యవస్థను కులవ్యవస్థకు జనని అంటారు.** వర్ణవ్యవస్థను పోషించినందున మనువును దోషియనుట ఎంతటి విచిత్రమైన తర్కము! ఒకరకంగా కులవాదం వంటిదే ఇది. ఎట్లనగా ఎవరైనా శ్రాద్ధము పెట్టకుంటే అతడు తనకు ముందున్న ఆరుతరాల వారితో సహా నరకానికి పోతాడు. ఏలయన: ఆ తరాలవారు అతనికి జన్మనిచ్చి పోషించారు కనుక. అలాగే ఎవరైనా శ్రాద్ధాన్ని పెట్టినచో అతనికి ముందున్న ఆరు తరాలవారు అతనికి జన్మనిచ్చిన కారణంగా తరిస్తారు. అలాగే కుల వ్యవస్థ దోషంతో కూడినది. కావున దానికి ముందున్న వ్యవస్థను పోషించిన మనువుకూడా దోషియగును అనేది ఆయన తర్కం. ఆశ్చర్యమేమంటే చట్టం తెలిసిన వ్యక్తి ఒక శాసనదాతపై ఇటువంటి ఆరోపణలు చేయడు. డా॥ అంబేద్కర్ రాజ్యాంగంలోనైతే ఒక అపరాధిని దండించునపుడు అతనితో పాటు అతనికి జన్మనిచ్చిన తల్లిదండ్రులను, తాత మున్నగువారిని కూడా అపరాధులుగా ప్రకటించాలనే శాసనాన్ని చేయలేదు. గతించిన వారిని అపరాధులుగా ప్రకటించి, వారిని దండించి నష్ట భ్రష్టముచేయునట్టి ఈ సిద్ధాంతాన్ని దేశంలోని మరికొన్ని వ్యవహారాలకు కూడా అన్వయించి రాజ్యాంగంలో పొందుపరచి అమలు చేసినట్లైతే గతంలో దేశద్రోహంతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ, విదేశీయ పాలకులకు సహకరించి, గూఢచారి పనులు చేస్తూ, నిజమైన దేశభక్తులకు ఉరిశిక్షలు వేయించినట్టి వారిని, దేశము స్వాతంత్ర్యమైన తరువాత వారిని అపరాధులుగా ప్రకటించి దండించవలయునని తలంచే కొందరు దేశభక్తులకు సంతోషము కలుగును. అపరాధులు విందులూ, పదవులు, ధనాన్ని పొంది అప్పుడూ గౌరవంతో సుఖాలను అనుభవించారు. ఇప్పుడూ సుఖంగా ఉన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు మాత్రం నానా ఇబ్బందులు పడుతున్నారు. కనుక అలా జరిగితే దుష్టులకు గుణపాఠం చెప్పి భవిష్యత్తులో దేశ ఐక్యత – అఖండత మరియు స్వతంత్రతలకు మేలు చేకూరును.

18. **వర్ణమును కులవ్యవస్థకు జన్మనిచ్చునదిగ చెప్పి–** భవిష్యత్తులో వర్ణమునుండి కులములు పుట్టుననే ఆశతో మనువు తెలిసే ఈ వర్ణ వ్యవస్థను పోషించెనని చెప్పి ఆయనను దోషిగా నిలబెట్టుచున్నారు. డా॥ అంబేద్కర్ నేటి రాజ్యాంగ వ్యవస్థను పోషించాడు. భవిష్యత్తులో దీనినుండి ఎటువంటి వ్యవస్థ పుట్టునో ఆయనకు తెలియునా? ఎంత మాత్రం తెలియదు. ఇదే విధంగా మహర్షి మనువుకు కూడా వర్ణవ్యవస్థ ఇటువంటి రూపాన్ని ధరించువిషయం తెలియదుగదా!

19. **డా॥ అంబేద్కర్ నేటి కులభేదాలు లేని రాజ్యాంగాన్ని** నిర్మించి పోషించారు. మన దౌర్భాగ్యం వలన కొన్ని వందల సం॥రాల తరువాత ఇది కులవ్యవస్థగా మారితే డా॥ అంబేద్కర్ దానికి జనకుడుగా బాధ్యత వహింతురా? అందరూ కాదనే అంటారు.

మనువు కులతత్త్వవాదానికి విరోధి. కనుక ఆయనను కులవ్యవస్థకు జనకునిగా ఎందుకనాలి? ఇదే విధంగా కులవ్యవస్థ వర్ణవ్యవస్థకు వ్యతిరేకమైన వ్యవస్థ. మనువును తన వర్ణవ్యవస్థకు విరోధియైన కులవ్యవస్థకు జన్మనిచ్చినవారుగా ఎట్లు చెప్పగలం? అందుచేత ఆయన పై కులవ్యవస్థకు జనకునిగా ఆరోపణ చేయుట సరాసరి తప్పు. వాస్తవంగా తరువాత ఏర్పడిన సమాజం ఈ వర్ణవ్యవస్థను వికృతం చేసి దానిని కులవ్యవస్థగా మార్చివేసింది. కావున ఆ సమాజమే దీనికి జన్మనిచ్చినందున అదే దోషి అవుతుంది.

20. **మనువు కుల వ్యవస్థను నిర్మించలేదు. అమలు చేయలే**'దని చెప్పినదానిని బట్టి ఈ రెండు మాటలకు మనువు బాధ్యులు కారని డా॥ అంబేద్కర్ స్వయంగా అంగీకరించినట్లే దీనిని బట్టి ముందునుండే సమాజంలో వర్ణవ్యవస్థ ప్రచలితమైనదని స్వయంగా సమాజమే దానిని స్వీకరించిందని అర్థమౌతుంది. అది ప్రజల మనస్సు-బుద్ధులలో వ్రాయబడి తిష్ఠ వేసిన వ్యవస్థ. ప్రజలంతా ఉత్తమ వ్యవస్థగా అంగీకరించి స్వీకరించినది. మనువు వారిపై బలవంతంగా రుద్దినది కాదు. ఇది సమాజము స్వీకరించిన వ్యవస్థ. దానిలో మనువు తప్పేముంది? ఆయన ప్రజలు స్వీకరించిన ఆనాటి వ్యవస్థను పోషించారు. ఇందులో దోషము, దోషులుండుటకు అవకాశమే లేదు.

21. **ప్రపంచంలో ఏర్పడిన వ్యవస్థలన్నీ నూటికినూరుశాతం** అందరూ అంగీకరించి పోషించినవి కావు. అందువలన తరువాత ఏర్పడిన కుల వ్యవస్థ (హిందూ వ్యవస్థ) లోని కొన్ని లోపాల ఆధారంగా దానిని నిందించి అవమానించుట ఎన్నటికీ మంచిదికాదు. న్యాయము, సమానతలున్నవని వాదించే నేటి రాజ్యాంగ వ్యవస్థ సంపూర్ణమైనదా? ఇప్పటికీ దానిలో ఎన్ని వివాదాలున్నయో తెలియదు. సమయావసరాలను బట్టి ఆరక్షణ (రిజర్వేషన్ల)కు సంబంధించిన క్లాజు చేయబడినది. ఐనా దానిమీద నేడు తీవ్ర వివాదమున్నది. కొన్ని వందల సం॥రాల తరువాత ఈ పరిస్థితులను మరచిపోయినపుడు, ఈ వ్యవస్థ యొక్క చరిత్రను వ్రాయునపుడు బహుశా యిప్పటి ఆరక్షణ కులాలను గూర్చికూడా, నేడు ప్రాచీన ధర్మ శాస్త్రాలలోని బ్రాహ్మణులను గూర్చి వ్రాస్తున్నట్లే వ్రాయవచ్చును. నేటి రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నత అధికారినుండి చివరి ఉద్యోగి వరకూ పరీక్షలు- ఉపాధుల (డిగ్రీల)ను అనుసరించే నియమించబడవలెనని నియమము కలదు. ఐనా కొన్ని స్థానాలలో తమ ఇష్టమున్నవారిని నియమిస్తారు. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత కొద్ది సం॥రాలలోనే పరిపాలనా వ్యవస్థలోని పదవులకు, అధికారంలోనున్న నాయకులకు సంబంధించినవారిని గాని, అధికారులకు సంబంధించినవారిని గాని, లేదా సిఫార్సులున్నవారినిగాని తీసుకొనే పరిస్థితి ఏర్పడింది. యోగ్యతల ఆధారంగా నియమించే పద్ధతినే మరచిపోయారు. ఇంటర్వ్యూలు యోగ్యతను తెలుసుకొనుటకు నిర్వహింపబడును. కాని అచ్చట కూడా వేలాది ఉద్యోగాలు సిఫార్సులు, ధనముల ఆధారంగా ఇవ్వబడుచున్నవి. న్యాయాలయాలు రద్దుచేసిన అనేక సెలక్షన్ బోర్డులు ఇందుకు ప్రమాణాలు. రాజకీయరంగంలోని పదవుల నలంకరించుటలో యోగ్యత అనేది పేరుకు కూడా కనబడదు. అది స్వ-పర నగ్నరూపం. వందలాది సం॥రాల తర్వాత ఈ వ్యవస్థలు ఇంకా వికృతరూపాన్ని ధరించి జన్మపై ఆధారపడే రూపాన్ని ధరిస్తే దానికి డా॥ అంబేద్కర్ను, ఆయన రాజ్యాంగ సభను **బాధ్యులుగా తలంచవలయునా?** వారు ఏర్పరచిన వ్యవస్థను భవిష్యత్ వ్యవస్థకు జననిగా ఎంచవలయునా? అలా **కానట్లయితే మనువును కూడా** కుల వ్యవస్థకు జనకులుగా బాధ్యులుగా ఎంచరాదు.

22. పై వాటికంటే కూడా అతి భయావహమైనది డా॥ అంబేద్కర్ ఆలోచించకుండా అన్నమాట. అది– “మీరు కుల వ్యవస్థను రూపుమాపాలనుకుంటే దానికై మీరు నిరంతరం **“వేదాలు, శాస్త్రాలపై డైనమైట్లను పెట్టాలి”** (జాతి ప్రథమ ఉన్మూలన్ 99వ పేజీ). ఒక వైపు ఆయన వేదాలలో కుల వ్యవస్థ లేదు, వర్ణ వ్యవస్థ కలదంటారు. ఆ వర్ణ వ్యవస్థ గుణ–కర్మల ఆధారంగా నిర్మించినందున బుద్ధితో కూడినది, అసహ్యించుకోరానిదని అంటూ కూడా మరో వైపున డైనమెట్ పెట్టాలనే అనుచిత ఉద్వేగంతో కూడిన మాటలు మాట్లాడాడు. ఆయన మాటలు ఎంత పరస్పర విరోధమైనవో గమనించుడు. ఆయన వేదాలు, ధర్మశాస్త్రాలు, రామాయణం, మహాభారతం, పురాణాలు, గీతలన్నింటితో సంబంధాన్ని తెంచుకొని వాటన్నింటినీ నష్టభ్రష్టాలు చేయాలన్నాడు! ధర్మాన్ని గూర్చి తెలుసుకోవాలనే కోరిక కలిగించి, సాహిత్యం, సంస్కృతి, సభ్యత, ఆచార వ్యవహారాలు, జీవన విలువలన్నింటికీ ఆశ్రయమై, ప్రేరణనిచ్చే స్రోతస్సులు ధర్మ శాస్త్రాలు. వానిని నష్టంచేయడమంటే ఆర్య (హిందూ) సంస్కృతి–సభ్యత, ధర్మాలన్నింటినీ నష్టము చేయుటే. డా॥ అంబేద్కర్కు కావలసినదిదేనా? డా॥ అంబేద్కర్ హిందూధర్మంలో ఉండి పీడింపబడి దానిని విడిచిపెట్టాలనుకుంటే హిందూ ధర్మాన్ని విడిచి కేవలం మనుష్యునిగ ఉండవచ్చును. కాని ఆయన ధర్మాన్ని విడిచి ఉండలేకపోయారు. ఆయన బౌద్ధ ధర్మాన్ని ఆశ్రయించాడు. ఆయన బౌద్ధ ధర్మ శాస్త్రాలను ప్రమాణంగా స్వీకరించి, హిందువులను మాత్రం ధర్మం, ధర్మ శాస్త్రాలను విడిచిపెట్టాలని చెపుతాడు. ఈ సందర్భంలో ఒకప్పుడు గాంధీ ఇచ్చిన జవాబును చూడండి. అది: **“ఎలాగైతే కురాన్ ను అంగీకరించకుండా ముస్లిం కాలేడో, బైబిలును అంగీకరించకుండా క్రైస్తవుడు కాలేడో అలాగే వేదాది శాస్త్రాలను అంగీకరించకుండా ఎవరైనా హిందువౌతాడా?”** అని. డా॥ అంబేద్కర్ యొక్క ఈ ఆలోచన **“ఎవరికైనా చేతులు–కాళ్ళు విరిగితే వాటిని శస్త్ర చికిత్స చేసి తీసివేయుటకు బదులుగా ఆ వ్యక్తిని చంపివేయుమన్నట్లున్నది”.**

23. వేదాలలో కుల వ్యవస్థ పేరుకు కూడా లేదు. ఐనా డా॥ అంబేద్కర్ వేదాలను కారణం లేకుండా విమర్శించాడు. వాటిని నష్టం చేయాలన్నాడు. వాటి గొప్పతనాన్ని అంగీకరించలేదు. బౌద్ధుడై కూడా ఆయనలాగే చేసాడు. ఆయన బౌద్ధ శాస్త్రాలను, తన గురువును అవహేళన చేసాడు. ఎట్లనగా! బౌద్ధ శాస్త్రాలలో మహాత్మా బుద్ధుడు–వేదాలను, వేద– విద్వాంసులను ప్రశంసిస్తూ బౌద్ధ ధర్మంలో వేదాల మహత్వాన్ని ప్రతిపాదించాడు. ఈ ప్రమాణాలను చూడండి–

అ) విద్వా చ వేదేహి సమేచ్చ ధమ్మమ్ ।
న ఉచ్చావ చం గచ్ఛతి భూరి పఞ్ఞ్రే ॥ (సుత్తనిపాత 292)

అనగా: మహాత్మా బుద్ధుడు – ‘వేదాలతో ధర్మజ్ఞానాన్ని పొందిన విద్వాంసుడు ఎన్నడూ చలింపడు. ఆపదలలో దుఃఖించడు’ అని అంటాడు.

ఆ) విద్వాచసో వేదగూ నరో ఇధ, భవాభవే సంగం ఇమం విసజ్జా ।
సో వీత వణ్హో అనిఘో నిరాసో, అతారి సో జాతి జరాంతి బ్రూమితి ॥ (సుత్తనిపాత 1060)

అనగా: వేదం తెలసిన విద్వాంసులు ఈ లోకంలో జన్మ–మరణాలపై ఆసక్తిని విడిచి కోరికలు, తృష్ణ, పాపాలను లేకుండా చేసుకొని జన్మ మరణ బంధాలనుండి విడివడుదురు. అనగా మోక్షమును పొందుదురని భావము. ఇతర శ్లోకాలు 322, 458,503, 846, 1059 మున్నగునవి కూడా చూడగలరు.

24. డా॥ అంబేద్కర్ యొక్క మనువిరోధ పరంపరలో డా॥ భదన్త ఆనంద కౌసల్యాయన ద్వారా ‘రాష్ట్రీయ కర్తవ్య’మనే పేరుతో రాయబడిన మను వ్యతిరేక పుస్తకం పూర్తిగా నిరాధారమైనది. దీనిలో తర్కం లేదు. సరైన విశ్లేషణ లేదు. అపవ్యాఖ్య, అప్రస్తుతుల నాశ్రయించి మంచిని కూడా చెడుగా నిరూపించుటకు ప్రయత్నించాడు. మనువు స్త్రీలను నిందించెనని తెలుపుతూ,

స్త్రీలు **"పూజార్హులు-సమ్మానించదగినవారని"** మనువెందుకన్నాడని బాధ పడ్డాడు. ఇది **'బొమ్మా నాదే బొరుసూ నాదే'** అన్నట్లుగా ఉంది. దీనినే వితండవాద మంటారు. ఆయన స్థితి విరోధముతో భాసించునది. ఈయన మహాత్మాగాంధీని ప్రశంసించినారు. కానీ ఆయన అభిప్రాయాలను అంగీకరించలేదు. ఆయన బౌద్ధుడు. కాని బౌద్ధ సాహిత్యంలో వర్ణించిన వేదాన్ని, వేద విద్వాంసుల యొక్క మహత్వాన్ని అంగీకరించడు. సగర్వంగా తాను అవైదికుడు, అహిందువునని ప్రకటించుకొంటాడు. కాని హిందువుల శాస్త్రాలను ఉద్ధరించే వానినిగా చెప్పుకొనుటలోనూ, హిందువులు పూజించే మనువు, శ్రీరాముడు మున్నగు మహాపురుషులను నిందించుట-విమర్శించుటలోనూ డా॥భదన్త ఆనంద కాలాన్ని వెళ్ళబుచ్చుతుంటాడు.

25. **మనుస్మృతిని విరోధించే రచయితలందరిలో ఏక పక్షంగా** పూర్వాగ్రహంతో కూడిన మాటలు కొన్ని సమానంగా కనబడుతుంటాడు. వారు కర్మతో వర్ణ వ్యవస్థను సిద్ధింపజేయునట్టి వివాదము లేని శ్లోకాలను, స్త్రీ-శూద్రాదులను గూర్చి హితం, సద్భావంతో కూడిన వాక్యాలను పూర్వాపర ప్రసంగాలతో సంబంధమున్న మూల శ్లోకాలుగా అంగీకరించబడే మనుస్మృతి శ్లోకాలను వీరు ప్రస్తావించనేలేదు. కేవలము ప్రక్షిప్తాలుగా చెప్పబడుచున్న వివాదాస్పద శ్లోకాలను మాత్రమే ప్రస్తావించి నిందతో కూడిన విమర్శలు చేసారు. ఒకే పుస్తకంలో ఒకే ప్రసంగంలో స్పష్టంగా పరస్పర విరుద్ధమాటలు ఎందుకున్నాయనే సందేహానికికూడ వారు సమాధానం చెప్పలేకపోయారు. రెండు వ్యతిరేకమాటలలో కేవలం వివాదాస్పదమైనదానినే ఎందుకు గ్రహించారు? రెండవదానినెందుకు ఉపేక్షించారు? అనే ప్రశ్నకు కూడా వారు సమాధానం చెప్పలేకపోయారు. ఆ రచయితలు ఈ ప్రశ్నలపై చర్చించినట్లైతే వారి అభ్యంతరాలకు సమాధానాలు స్వయంగా వారికే లభిస్తాయి. ఆవేశాలకు లోనుకావలసిన అవసరముండదు. ఎన్నో భ్రాంతులు తొలగిపోతాయి.

II మనుస్మృతిలో శూద్రుల స్థితి:

ఇప్పుడు మనుస్మృతిలో అన్నింటికంటే ఎక్కువగా చర్చించబడిన శూద్రులకు సంబంధించిన వివాదాస్పద విషయాలపై ఆలోచన జరుపుదాం. మనుస్మృతిలోని అంతఃసాక్షి శ్లోకాలపై దృష్టిని సారించినచో మనకు కొన్ని అత్యంత మహత్త్వపూర్ణమైన ఆధారాలు, సత్యాలు లభిస్తాయి. ఇవి శూద్రుల విషయంలో మహర్షి మనువు యొక్క భావాలను తెలియజేస్తాయి. అవి –

1. దళితులు-వెనుకబడిన వర్గాలవారిని మనువు శూద్రులని చెప్పలేదు:

నేడు దళితులు, వెనుకబడిన కులాలవారుగా చెప్పబడుచున్న కులాలను మనుస్మృతిలో ఎక్కడా **'శూద్రు'**లని చెప్పలేదు. మనువు యొక్క వర్ణ వ్యవస్థ వ్యక్తులందరి (స్త్రీ-పురుషుల) గుణ-కర్మ-స్వభావాలను, యోగ్యతలను బట్టి నిశ్చయింపబడింది. కులాల ఆధారంగా కాదు. ఇందువల్లనే ఏ ఒక్క కులాన్ని శూద్రవర్ణంగ లిఖించి **'ఈ కులమువారు శూద్రులని'** చెప్పలేదు. మనువు తరువాత ఏర్పడిన సమాజ వ్యవస్థలను నిర్మించినవారు కొన్ని వర్ణాలవారికి శూద్రులనే పేరు పెట్టి కాలాంతరంలో (తరువాతి కాలంలో) వారిని శూద్రవర్ణంలో కలిపారు. ఈ నిజం తెలియని వారు కొందరు అపోహలతో ఈ నిందను మనువుపై మోపారు. నేటి వికృత వ్యవస్థలకు కారణమైన దోషులెవరో తెలుసుకోకుండా మనువు తరువాత వచ్చిన కులసమాజానికి అతడే కారణమని నేటి దళిత ప్రతినిధులు మనువును నిందిస్తున్నారు. ఇదేమి న్యాయం?

2. మనువు చేసిన శూద్ర నిర్వచనం నేటి శూద్రులకు వర్తించదు:

'శూద్ర' శబ్దానికి మహర్షి మనువు చేసిన నిర్వచనం కూడా నేటి దళితులకు, వెనుక బడిన కులాలవారికి వర్తించదు. మనువు శూద్రులకు చేసిన నిర్వచనం యిలావుంది. "బ్రహ్మజన్మ" అనగా **'విద్యా జన్మ'**. ఈ రెండవ జన్మ ఎవరికి కలుగునో వారు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు. బ్రహ్మ జన్మ కలుగక 'ఏకజాతి'వారు అనగా ఒకేజన్మ కలవారు అంటే చదువనివారు శూద్రులు. అనగా నిర్ధారింపబడిన సమయంలో గురువు వద్దకు వెళ్ళి ఉపనయన వేదారంభ సంస్కారాలతో వేదాధ్యయనం

విద్యాధ్యయనాలు చేసిన తరువాత తన గురువు తన గుణకర్మస్వభావాలను బట్టి, యోగ్యతనుబట్టి ఏ వర్ణానికి యోగ్యుడో నిర్ణయించి ఆ యా వర్ణానికి సంబంధించిన యోగ్యతా పత్రాన్నిస్తాడు. ఇది వర్ణ నిర్ణయం. ఇలా వారి **'విద్యాజన్మ'** అనే పేరుతో చెప్పబడు రెండవ జన్మ. దీనిని శాస్త్రాలలో **'బ్రహ్మజన్మ'** అంటారు. మందబుద్ధి కారణంగానో, యోగ్యత లేని కారణంగానో **'విద్యాధ్యయనం'** మరియు పై మూడు ద్విజ వర్ణాలలో నుండి ఏ వర్ణానికి చెందినవారైనా విద్యా-దీక్షను పొందనటువంటి చదువురాని వ్యక్తి **'ఏకజాతి' = 'ఒకే జన్మ కలవాడు'** గురుగర్భం నుండి పుట్టనివాడు **'శూద్రుడు'** అనబడుతాడు. ఇది గాక పై వర్ణాలలో దీక్షను పొంది తమకు నిర్దేశించిన కర్మలను చేయనివారు కూడా శూద్రులవుతారు. అనగా పుట్టుకతో అందరూ శూద్రులే. వేదాది విద్యాధ్యయనంతోనే ద్విజులౌతారు. (మనుస్మృతి 2-126, 169, 170, 172; 10-4 మున్నగునవి).

ఈ విషయంలో ఒకటి రెండు ప్రమాణాలు:

అ) **బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః, త్రయో వర్ణాః ద్విజాతయః ।**
చతుర్థః ఏక జాతిస్తు, శూద్రః నాస్తి తు పంచమః ॥ (మనుస్మృతి 10.4)

అనగా: 'బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య' ఈ మూడు వర్ణాలవారిని ద్విజులంటారు. వీరికి రెండవ విద్యాజన్మ ఉంటుంది. నాల్గవ వర్ణం 'ఏకజాతి' కేవలం తల్లిదండ్రుల ద్వారా జన్మ పొందినవారు, విద్యాజన్మ పొందనివారు శూద్రులు. ఈ నాలుగు వర్ణాలు తప్ప వేరొక వర్ణము లేదు.

ఆ) **శూద్రేణ హి సమస్తావద్ యావద్ వేదేన జాయతే** । (2.147)

ఒక వ్యక్తి బ్రహ్మ జన్మ = వేదాధ్యయనమనెడు జన్మ పొందనంతవరకు అతడు శూద్రునితో సమానమే అగును.

ఇ) యో న వేత్త్యభివాదస్య విప్రః ప్రత్యభివాదనమ్ ॥
నాభివాద్య స్స విదుషా యథా శూద్ర స్తథైవ సః ॥ (2.101)

అభివాదనం చేసే జ్ఞానంలేని వాడు శూద్రుడే.

ఈ) **"ప్రత్యవాయేన శూద్రతామ్"** (4.245)

బ్రాహ్మణుడు హీనులతో స్నేహం చేయుట వలన హీన ఆచరణతో శూద్రుడగును. తరువాత కూడా శూద్రునకు ఇదే పరిభాష (నిర్వచనం) ఉన్నది.

ఉ) **జన్మనా జాయతే శూద్రః, సంస్కారాద్ ద్విజ ఉచ్యతే ।** (స్కంద పురాణం)

ప్రతి వ్యక్తి జన్మించినపుడు శూద్రుడగును. ఉపనయన-వేదారంభ సంస్కారాలతో దీక్ష పొందిన వారు ద్విజులవుతారు.

మనువు యొక్క ఈ వ్యవస్థ ఇప్పటికినీ బాలిద్వీపంలో ఉన్నది. అచ్చట 'ద్విజాతి' 'ఏకజాతి' అను పేర్లతోనే పిలువబడుతారు. శూద్రున్ని అంటరానివానిగా భావించరు.

3. శూద్రులు అంటరానివారు కారు: శూద్రుల పట్ల మహర్షి మనువునకు మానవులపట్ల గల సద్భావననే ఉన్నదని ఆయన వారిని అంటరానివారు, నిందింపదగినవారు, అసహ్యించుకోదగినవారుగా అంగీకరించలేదని అనేక శ్లోకాల ద్వారా తెలియుచున్నది. మనువు శూద్రుల కొరకు 'ఉత్తమ, ఉత్కృష్ట, శుచి'ల వంటి విశేష గుణాలను వాడారు. అటువంటి విశేష్య వ్యక్తి ఎన్నడూ అంటరానివాడు లేక అసహ్యించుకొనబడువానిగా ఎంచబడరాదు. (9-335)

శూద్రులను ద్విజవర్ణాలవారి ఇండ్లల్లో వారికి సేవచేయుట వంటి శ్రమతో కూడిన పనులు చేయుటకు ఆజ్ఞాపించినాడు. (1-91, 9-334, 335) ద్విజుని గృహానికి శూద్రుడు అతిథిగా వచ్చినట్లైతే అతనికి భోజనం చేయించవలెనని ఆదేశం కలదు (3-112). తన ఇండ్లల్లో శూద్రులు పనివారుగనున్న ద్విజులు ముందు పనివారిచే భోజనం చేయించి తరువాత వారు

భుజించాలని ఆదేశమున్నది (3-116). నేటి వర్ణరహిత సభ్య సమాజంలో తమ కంటే ముందు పనివారికి భోజనం పెట్టుదురా? ఇంత జాగ్రత్తగా వారిని గుర్తుంచుకొందురా? మహర్షి మనువు దృష్టికోణము ఎంత కృపాపూర్ణమైనదో మానవతతో, గౌరవంతో కూడియున్నదో గమనింపుడు.

వైదిక వర్ణ వ్యవస్థలో విరాట్ పురుషుడైన పరమాత్మ లేక బ్రహ్మ యొక్క స్వరూపాన్ని ఈ విధంగా వర్ణించారు. బ్రాహ్మణులు ముఖంగా, క్షత్రియులు బాహువులుగా, వైశ్యులు తొడలుగా, శూద్రులు పాదాలుగా అలంకారంతో వర్ణించబడ్డారు. (1-31). దీని వలన మనకు మూడు విషయాలు బోధ పడతాయి.

ఒకటి: నాలుగు వర్ణాలవారు పరమాత్మునికి ఒకే రకమైన సంతానం.

రెండవది: ఒకే రకమయిన సంతానంలో ఎవరూ అంటరానివారు, అసహ్యించుకొనబడువారుండరు.

మూడవది: ఒకే శరీరములోని అంగమైన కాళ్ళు అంటరానివి గాని, అసహ్యించుకొనబడునవిగాని కాజాలవు. ఇటువంటి శ్లోకాలుండగా పక్షపాతం లేనివా రెవరైనా మనువు శూద్రులను అంటరానివారుగ, అసహ్యించుకోబడువారిగ ఎంచుచుండెనని అనగలరా?

4. శూద్రులకు సన్మాన వ్యవస్థలో మొదటి స్థానం:

మనువు చేసిన సన్మాన వ్యవస్థలో శూద్రులకు విశేష స్థానమున్నది. ఈ వ్యవస్థలో మొదటి మూడు వర్ణాలవారిని ఎక్కువ గుణాల ఆధారంగా ఎక్కువ గౌరవించవలెనని చెప్పారు. వీరిలో విద్యావంతులు అందరికంటే ఎక్కువగా సన్మానించదగినవారు (2.111, 112, 130). కాని శూద్రుల ఎడల ఎక్కువ సద్భావాన్ని ప్రదర్శిస్తూ ద్విజవర్ణానికి చెందిన వ్యక్తి, వృద్ధుడైన శూద్రున్ని ముందుగా గౌరవించాలని అశిక్షితుడు (చదువురాని వ్యక్తి) మాత్రమే శూద్రుడగునని చెప్పాడు. ఈ విధమైన గౌరవాన్ని మొదటి మూడు వర్ణాలలో ఎవ్వరికీ మనువు ఇవ్వలేదు. **"మానార్హః శూద్రోఽపి దశమీం గతః"** (2.137) అనగా వృద్ధుడైన శూద్రున్ని ద్విజులంతా ముందుగా గౌరవించాలి. మిగిలిన మూడు వర్ణాలలో ఎక్కువ గుణవంతున్ని ముందుగా గౌరవించాలి.

5. శూద్రునకు ధర్మాన్ని పాలించుటలో స్వతంత్రము: "న ధర్మాత్ ప్రతిషేధనమ్" (10.126) 'శూద్రునకు ధార్మిక కార్యాలు చేయుటలో నిషేధములేదు' అని చెప్పి మనువు శూద్రునకు ధర్మాన్ని పాలించుటకు స్వాతంత్ర్యాన్నిచ్చాడు. 'శూద్రుడు కూడా ఉత్తమ ధర్మాన్ని గ్రహించాలి' అనే శ్లోకము (2.213) ద్వారా ఈ సత్యము బోధపడుతుంది. వేదాలలో శూద్రులు యజ్ఞాదులు చేయుటకు, వేదాది శాస్త్రాలను చదువుటకు స్పష్టమైన అధికారమున్నది.

అ) **యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః ।**
బ్రహ్మ రాజన్యాభ్యాగ్ం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయ ॥ యజు. 26-2

అనగా- 'నే నీ కళ్యాణకారకమైన వేదవాణిని మానవులందరి కొరకు అనగా బ్రాహ్మణ, క్షత్రియ, శూద్ర, వైశ్యులకు, వారి స్త్రీలకు, భృత్యులకు, అతి శూద్రులు మున్నగువారందరకూ ఉపదేశించుచున్నానని స్వయంగా భగవానుడు వేదముద్వారా తెలియజేసాడు.

ఆ) **యజ్ఞియాసః పఞ్చజనాః మమ హోత్రం జుషధ్వమ్ ।** ఋగ్వేదం 10-53-4
పంచజనాః = చత్వారో వర్ణాః, నిషాదః పంచమః" ॥ నిరుక్తం 3-8

అనగా-యజ్ఞం-అగ్నిహోత్రం ఐదు రకాల మనుష్యులు ప్రతినిత్యం చేయాలి. నాలుగు వర్ణాల వారు మరియు ఐదవ వ్యక్తి నిషాదుడు. వీరు పంచజనులనబడుతారు.

తన మనుస్మృతి వేదానుకూలమైనదని మహర్షి మనువు ప్రతిజ్ఞ చేసాడు. అందువలన వేదాలను ఆధారంగా గ్రహించిన మనువునకు కూడా అదే గౌరవాదరాలు గలవు. ఇందువలననే ఉపనయన సందర్భంలో కూడా ఎచ్చటా శూద్రునికి ఉపనయనాధికారాన్ని ఆయన నిషేధించలేదు. ఉపనయనం చేయించుకొననివారిని మాత్రమే శూద్రులన్నాడు.

6. దండన వ్యవస్థలో శూద్రునకు అందరి కంటే తక్కువ దండన:

మనువు విధించిన దండన వ్యవస్థను చూచినచో 'మనువు శూద్రులకు కఠినదండన విధించెననుట, బ్రాహ్మణులకు విశేషాధికారములనిచ్చి వారికి విశేష సౌకర్యాల నేర్పరచెననుట' పూర్తిగా నిరాధారమైనదని బోధపడుతుంది. మనువేర్పరచిన దండన వ్యవస్థకు గుణ దోషాలు కొలమానాలైతే బౌద్ధికస్థాయి, సామాజిక స్థాయి, పదవి, చేసిన అపరాధం యొక్క ప్రభావాలు ఆధారభూతమైన తత్త్వాలు. మనో వైజ్ఞానికంతో పాటు యోగ్యతననుసరించి మనువు విధించిన దండన వ్యవస్థ వర్ణాలలో గుణ-కర్మ యోగ్యతల ఆధారంగా ఉన్నత వర్ణాలవారికి అధిక గౌరవం మరియు సామాజిక స్థాయిలను ప్రదానం చేసినట్లే అపరాధం (తప్పు) చేసినప్పుడు కూడా అంతే అధిక దండన విధించాడు. ఈ విధంగా మనువేర్పరచిన యోగ్యతననుసరించిన దండన వ్యవస్థలో శూద్రునకు అందరికంటే తక్కువ శిక్ష కలదు. రాజునకు అంతకంటే ఎక్కువ; బ్రాహ్మణునకు అందరికంటే ఎక్కువ. మనువు యొక్క ఈ వ్యవస్థ సర్వసామాన్య శిక్ష. ఇది శిక్షాస్థానాలన్నింటిలోనూ ఆనాడు అమలు జరిగింది.

శ్లో ॥ అష్టాపాద్యం తు శూద్రస్య స్తేయే భవతి కిల్బిషమ్ ।
షోడశైవ తు వైశ్యస్య ద్వాత్రింశత్ క్షత్రియస్య చ ॥
బ్రాహ్మణస్య చతుఃషష్టిః పూర్ణం వాపి శతం భవేత్ ।
ద్విగుణా వా చతుః షష్టిః, తద్దోష గుణ విద్ధి సః ॥ (మను. 8-337, 338)

దొంగతనం మున్నగు అపరాధాలలో శూద్రునకు 8 రెట్లు దండన విధించినచో వైశ్యునకు 16రెట్లు, క్షత్రియునకు 32 రెట్లు, బ్రాహ్మణునకు 64 రెట్లు గాని, లేక 100 గాని, లేక 128 రెట్లు దండన విధించవలయును. ఏలయన! అధిక వర్ణముల వారు ఆ అపరాధం యొక్క గుణ- దోషాలను, వాని వలన కలుగు పరిణామాలను, ప్రభావాలను బాగుగా తెలిసినవారు.

దీనితో పాటు పైన చెప్పిన శిక్షను విధించుటలో ఎవరినీ విడువరాదని మహర్షి మనువు రాజును ఆదేశించాడు. వారు ఆచార్యులైనా, పురోహితులైనా చివరకు రాజు యొక్క తల్లిదండ్రులైనా, ప్రాణమిత్రులైనా, . ప్రాణసఖియైనా సరే. రాజు అపరాధులను దండించక విడువరాదని, అపరాధి తనకు విధించిన శారీరక దండనకు బదులుగా అధికంగా ధనరాశినిచ్చి శిక్షలేకుండా చేసుకొనజూచినా శిక్షించకుండా విడువరాదని ఆదేశించాడు.(8.335, 347).

మనువేర్పరచిన శిక్షతో కూడిన ఈ వ్యవస్థ ఎంత మనోవైజ్ఞానికం, న్యాయపూరితం, వ్యావహారికం, శ్రేష్ఠమైన ప్రభావంతో కూడినదో చూడండి. దీనిని నేటి శిక్షలతో పోల్చి చూస్తే రెండింటిలో గల తేడా స్పష్టమౌతుంది. **'చట్టం దృష్టిలో అంతా సమానమే'** అని మన న్యాయవ్యవస్థ గొప్పగా చెప్పుకుంటున్నది. కాని దీనిలోని లోపమేమంటే: నేడు పదవి యొక్క హెూదా, సామాజిక హెూదాలననుసరించి గౌరవించే వ్యవస్థ వేరువేరుగా నున్నది. శిక్ష తగిన విధంగా లేదు. ఇదెలా ఉందంటే: 'చేనులో పడి మేస్తున్న లేగదూడకు, ఎద్దుకు, ఏనుగుకు కూడా శిక్ష ఒకటే దెబ్బ' ఐతే దాని ప్రభావమేముంటుంది? పాపం లేగదూడ ఒక కర్ర దెబ్బతో పారిపోతుంది. ఎద్దైతే కొంచెం బెదురుతుంది. కాని ఏనుగుకు మాత్రం ఆ దెబ్బతాలూకు అనుభూతి కూడా ఉండదు. నిజానికిది సమానదండన ఔతుందా? లోక వ్యవహారంలో ఉన్నదే సమాన దండన. ఎద్దును కర్రతోను, ఏనుగును అంకుశంతోను, పులిని హంటర్ తోను వశము చేసుకొంటారు. మరొక ఉదాహరణ తీసుకుందాం: ఒక నిరుపేదవాడు వెయ్యి రూపాయల జరిమానాను అప్పు చేసి కట్టగలడు. మధ్యతరగతి వ్యక్తి కొంత కష్టంతో కడితే, బాగా ధనమున్న సంపన్నుడు కాలి చెప్పుతో సమానంగా భావించి అనాయాసంగా ఆ ధనాన్ని కట్టివేస్తాడు. మనో విజ్ఞానంతో సంబంధంలేని ఈ దండనవిధానం వలననే, 'దండన' అనబడు సన్నని వలలో నేడు పెద్ద పెద్ద వ్యక్తులు చిక్కుకుంటే ధనము, పదవి, అధికారం, సంపదగల శక్తిశాలురైనవా రా వలను అవలీలగా త్రెంచుకొని పారిపోతారు. గణాంక వివరాలను పరిశీలించి

చూస్తే స్వతంత్రం లభించిన తరువాత ఎందరు పేదలకు శిక్ష పడినదీ; ధనము, పదవి, అధికారం, సంపదలుకలవారికెందరికి శిక్ష పడినదీ అవగతమౌతుంది. ధనవంతులు ఆర్థిక అపరాధాలలో ధనాన్ని అపరాధరుసుముగా చెల్లిస్తూ నేరాలను చేస్తూనే ఉన్నారు. యోగ్యతననుసరించి మనువు ఏర్పరచిన దండన వ్యవస్థలో అటువంటి అవకాశం లేదు. మనువు యొక్క శిక్షాస్మృతి అపరాధం యొక్క తీరును బట్టి ఉంటుంది. దానిలో నాలుగు వర్ణాల వారిలో ఎక్కువ అపరాధం చేసినవారికి కఠోరమైన దండన విధిస్తే, సామాన్యమైన అపరాధం చేసిన వారికి సాధారణమైన దండన విధించుట కలదు. కేవలం శూద్రులకు మాత్రమే విధించే కఠోరమైన దండన విధానం ప్రక్షిప్త శ్లోకాలలోనే ఉన్నది. కనుక పైన చెప్పిన శిక్షా నీతికి విరుద్ధంగా లభించే శ్లోకాలు మనువు రచించినవి కావు.

7. శూద్రులు దాసులు కారు:

'శూద్రునితో దాస్యమును చేయించుకొనుట లేక వారు చేసిన పనికి తగిన జీతము నియ్యకుండుట' అను మాట మనువు ఆదేశాలకు విరుద్ధము. సేవకులు, భృత్యులగువారిని నియమించిన స్థానము - పదవులననుసరించి వేతనాన్ని నిర్ణయించవలెనని, వారి వేతనాలను కారణం లేకుండా తగ్గించరాదని మనువు రాజును ఆదేశించి వారి వేతన వ్యవస్థను సునిశ్చితం చేసాడు. (7.125, 126, 8.216).

8. శూద్రులు సవర్ణులే:

నేడున్న మనుస్మృతిని తీసి చూస్తే మనువు తరువాత ఏర్పడిన సమాజము తన ఇష్టానుసారంగా మార్చివేసిన వ్యవస్థలు దానిలో ఎన్నియున్నవో తెలుస్తుంది. శూద్రులతో సహా నాలుగు వర్ణాలవారిని సవర్ణులుగాను, నాలుగు వర్ణాలకంటె వేరైనవారిని అసవర్ణులుగాను మనువు వ్రాసాడు. (10.4, 45). కాని ఆయన తరువాత ఏర్పడిన సమాజం శూద్రులను అసవర్ణులుగా పిలుపసాగింది. మనువు శిల్పకారులు, లోహకారులు మున్నగు వృత్తిపనులవారినందరినీ వైశ్యులుగా వ్రాసాడు. (3.64, 9.329, 10.99, 120). కాని తరువాత ఏర్పడిన సమాజం వారిని కూడా శూద్రులలో కలిపింది. మరొకవైపు వ్యవసాయం, పశుపాలనలు వైశ్యుల పనిగా మనువు చెప్పాడు (1-90). ఐనా శతాబ్దాలుగా బ్రాహ్మణులు, క్షత్రియులు కూడా వ్యవసాయం, పశుపాలనాదులు చేయుచున్నారు. వీరిని వైశ్యులుగా నేటి సమాజం గుర్తించుట లేదు. దీనిని మనువు చేసిన వ్యవస్థగా చెప్పుటెట్లు? ఈ విధంగా మనువు చేసిన వ్యవస్థలు న్యాయమైనవి. ఆయన శూద్రులకు గాని ఇతర వర్ణాలవారికి గాని అన్యాయం, పక్షపాతం చేయలేదు.

III మనుస్మృతిలో స్త్రీల స్థానం

మనువునోట ఆర్యనారి కీర్తిగానం

మనువు ప్రకారం 'స్త్రీ' ఉత్తమ సంతతికి, వారి విశుద్ధికి కారణ మవుతుంది. కుటుంబంలో తల్లిదండ్రులు వృత్తానికి కేంద్రం, పరిధి వంటివారు. ఇద్దరూ చూడటానికి వేరుగా ఉంటారు కానీ, ఒకటే. మనువు **'యో భర్తా సా స్మృతాంగనా'** అన్నాడు. అంటే భర్తగా ఉన్నవాడే అభిన్న - విడదీయలేని - రూపంలో భార్యగానూ ఉంటాడు అని. ఆ ఇద్దరి ఉనికీ ఒకటే భాగం. ఇద్దరిలోనూ అధికారం విడిగా ఉండదు, స్వార్థాల వ్యతిరేకతా విడిగా ఉండదు. కానీ తల్లికి వెయ్యి మంది తండ్రుల కన్నా గౌరవం అధికంగా ఉంటుంది. తల్లి పృథ్వి. క్షమాశీల అయిన భూదేవిలా ఉంటూ కుటుంబ పోషణ చేస్తుంది.

స్త్రీ తల్లి కావడంతోనే సంపూర్ణతను సంతరించుకుంటుంది. వీరులైన కుమారుల తల్లి - వీరమాత - అని పిలిపించుకోవటంలోని గౌరవం మరేదాని వల్లా ఆమెకు లభించదు. ప్రకృతి పురుషుడు లేకుంటే నిస్సహాయురాలవుతుంది, స్త్రీ కూడా ఆరాధ్య దైవంగా కొలిచే ఆదర్శ భర్తనే కోరుతుంది. వివాహం స్త్రీ జీవితంలోని పరాకష్ఠ పదవి. అందుచేతనే మనువు స్త్రీలకు వైవాహిక విధినే అన్నింటి కన్నా పెద్ద వైదిక సంస్కారంగా భావించాడు. ఏ రోజు జాతిలో ఉత్తమ సంతానం

రాదో ఆనాడు బహుశా స్త్రీ తన మాతృత్వపు గౌరవాన్ని కోల్పోతుందేమో! అయితే, ఆ నాడే జాతి మొత్తానికీ మరణం నిశ్చయం. నేటి కాలంలో మానవుల సంఘంలో స్త్రీ గౌరవాన్ని గురించిన అసత్యాలు, భ్రమనిండిన ఆలోచనలూ వ్యాపించి ఉన్నాయి. వేరొక పద్ధతిలో స్త్రీత్వాన్ని నాశనం చేయలేరు కనుక, సంతాన నిరోధం ద్వారా మాతృత్వాన్ని నాశనం చేస్తున్నారు. మాతృత్వాన్ని ఉపేక్షించటం ద్వారా స్త్రీని స్వర్గం నుంచి నరకకూపం లోకి తోయడమే జరుగుతూంది. పురుషుడు, స్త్రీ కారణంగా తన అమరత్వాన్ని సిద్ధింపజేసుకుంటాడు కనుక ఆమెను పూజిస్తాడు. అంటే స్త్రీత్వానికి సిద్ధి అతడు ఆమె ద్వారా మళ్లీ పుత్రుడుగా పుడతాడు. సంతాన సిద్ధికి విలక్షణ కారణం స్త్రీయే. అందుచేత ప్రపంచంలో స్త్రీ అత్యంత మహనీయురాలు.

ఆర్యనారిని మనువు ఎంతగా ప్రశంసించాడంటే – ప్రపంచ సాహిత్యంలో అటువంటి వ్యక్తి మరొకరు ఉండరు. వైదిక సాహిత్యంలోని సూత్ర గ్రంథాలలో ఒక అనువాక్కు ఉంది. వివాహాది కార్యాలలో ఆ వాక్కును గౌరవిస్తారు–

యస్యాం భూతం సమభవత్ యస్యాం విశ్వమిదం జగత్ ।

తామద్య గాథాం గాస్యామి యా స్త్రీణాముత్తమం యశః ॥

అంటే– 'భూత భవిష్యత్తులకు జనని అయిన నారి మహా అదృష్టవంతురాలు. ఆమె అటువంటి కీర్తికి పాత్రురాలు కనుకనే నేడామె గాథలు పాడుతున్నాము' అని.

యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఫలాః క్రియాః ॥ – మను. 3.56

ఎక్కడ స్త్రీలను గౌరవిస్తారో అక్కడ దేవతలు నివసిస్తారు. ఎక్కడ స్త్రీల అనాదరణ జరుగుతుందో, అక్కడి అన్ని కార్యాలూ నిష్ఫలమవుతాయి.

సన్తుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్ ॥ – మను. 3.60

ఏ కులంలో భర్త భార్య వల్ల, భార్య భర్త వల్ల సంతుష్టులై ఉంటారో, అక్కడ సకల శుభాలూ కలుగుతాయి.

స్త్రియాం తు రోచమానాయాం సర్వం తద్రోచతే కులమ్ ।
తస్యాం త్వరోచమానాయాం సర్వమేవ న రోచతే ॥ – మను. 3.62

స్త్రీలు ఆనందిస్తేనే కుటుంబమంతా సంతోషంగా ఉంటుంది. ఆమె దుఃఖిస్తే ఏదీ బాగుండదు.

సదా ప్రహృష్టయా భావ్యం గృహకార్యేషు దక్షయా ।
సుసంస్కృతోపస్కరయా వ్యయే చాముక్తహస్తయా ॥ – మను. 3.150

స్త్రీ ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. ఇంట్లో అన్ని పనులూ చేయాలి, అన్ని వస్తువులూ శుభ్రంగా ఉంచాలి. ఖర్చుల విషయంలో అదుపు ఉండాలి.

స్వాం ప్రసూతిం చరిత్రం చ కులమాత్మానమేవ చ ।

స్వం చ ధర్మం ప్రయత్నేన జాయాం రక్షన్హి రక్షతి ॥ – మను. 9.7

ఏ పురుషుడు పూనుకుని స్త్రీని రక్షిస్తాడో, అతడు తన సంతానాన్ని, శీలాన్ని, కుటుంబాన్ని, ధర్మాన్ని, తనను తాను రక్షించుకున్నవాడవుతాడు.

ప్రజనార్థం మహాభాగాః పూజార్హా గృహదీప్తయః ।

స్త్రియః శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన ॥ – మను. 9.26

ఎన్నో శుభాలు కలిగించే స్త్రీలు పూజనీయలు. వారు ఇంటికి దీపాలు. సంతానోత్పత్తి కొరకు ప్రజాపతి వారిని సృష్టించాడు. ప్రతి ఇంట్లోని స్త్రీ ఆ ఇంటికి లక్ష్మి అవుతుంది. ఆమెకూ, లక్ష్మికీ ఎటువంటి భేదమూ లేదు.

ఉత్పాదనమపత్యస్య జాతస్య పరిపాలనమ్ ।
ప్రత్యహం లోకయాత్రాయాః ప్రత్యక్షం స్త్రీ నిబన్ధనమ్ ॥ - మను. 9.27

సంతానానికి జన్మ నియ్యటం, ఆ పుట్టిన పిల్లల లాలన పాలన, నిత్య లోకయాత్ర (భోజనాదుల ఏర్పాట్లు)- వీటికి ఏకైక ప్రత్యక్ష కారణం స్త్రీలే.

అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషారతిరుత్తమా ।
దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చహ ॥ - మను. 9.28

సంతానం, ధర్మ కార్యాలు, శుశ్రూష, గొప్ప ఆనందం, తన, తన కుటుంబం పెద్దల కష్ట సుఖాలు చూడటం - అన్నీ స్త్రీ అధీనంలో ఉంటాయి.

మనస్సు, వాక్కు, శరీరాలతో - త్రికరణ శుద్ధిగా ఏ స్త్రీ భర్తకు అనుకూలంగా ఉంటుందో, ఆమె ఈ లోకంలో సాధ్వీమణిగా కీర్తి పొందుతుంది.

దేవతల ఎదుట చేసిన ప్రతిజ్ఞలతో పురుషుడు స్త్రీని పెళ్లాడుతాడు కానీ, స్వేచ్ఛగా కాదు. అందుచేత దేవతల ప్రీతి కొరకు స్త్రీని నిత్యమూ భరిస్తూ, పోషిస్తూ ఉండాలి.

మన పూర్వ ఋషులు పుణ్య స్త్రీల చరిత్రలు అందరికీ మేలు చేస్తాయని చెప్పారు. తాను, భార్య, సంతానం - పురుషుని విస్తృతి ఇంతే ! పురుషుడు చేసే అన్ని ధర్మ కార్యాలలోనూ స్త్రీకి సమాన భాగస్వామ్యం ఉంటుంది.

మనువును స్త్రీ విరోధిగా చిత్రించుటకు అవలంభించిన వైఖరి నిరాధారాలతో కూడినవని వాస్తవాలకు విరుద్ధమైనవని మనుస్మృతిలోని శ్లోకాల ద్వారానే తెలుస్తున్నది. స్త్రీలకు సంబంధించి ఆయన చేసిన వ్యవస్థలన్నీ వారికి గౌరవం, సురక్ష, సమానత, సద్భావం, న్యాయం కలిగించునవి. ప్రేరణాదాయకమైనవి. కొన్ని ప్రమాణాలను చూడండి-

1. స్త్రీలకు అత్యున్నత గౌరవం:

స్త్రీల గొప్పతనానికి, మహిమలకు ఉన్నతమైన గౌరవాన్ని ఇచ్చి, స్త్రీల విషయంలో అందరికంటే - ముందు ఆదర్శవంతమైన భావాలను ప్రకటించినవారిలో ప్రపంచములో మొట్ట మొదటి మహాపురుషుడుగా మనువు నిలిచాడు.

స్త్రీల యెడల ఆయన ప్రయోగించిన గౌరవప్రద సుందరమైనట్టి విశేషణాలే స్త్రీల పై మనువుకు గల ఉన్నత భావాలను తెలియజేయుటకు ప్రమాణాలు. స్త్రీ గృహం యొక్క భాగ్యాన్ని ఉదయింపజేయునట్టిది. ఆమె ఆదరింపదగినట్టి గృహలక్ష్మి. గృహాన్ని నడిపే యజమానురాలు. గృహాన్ని స్వర్గంగా మార్చే దేవత. సంసార యాత్రకు ఆధారం. (9-11, 26, 28;4 5-150). కళ్యాణాన్ని కోరు కుటుంబసభ్యులు స్త్రీలను ఆదరించి సత్కరించాలి. అనాదరంతో శోకించు స్త్రీలున్న కుటుంబం శీఘ్రంగా నాశనం చెందుతుంది. స్త్రీల ప్రసన్నతపైనే కుటుంబం యొక్క నిజమైన ప్రసన్నత, ఆనందం ఆధారపడి ఉంది (3-55 నుండి 62వరకు). కావున గృహస్థులైన భార్యా-భర్తలు పరస్పరం సంతోషంతో మెలగుచుండాలి. విపరీత ఆచరణ చేయరాదు. ఒకరితో నొకరు విడిపోవునట్టి పరిస్థితి రాకుండా మెలగాలి (9-10;1-102).

2. పుత్రుడు-పుత్రిక సమానం:

'పుత్రుడు - పుత్రిక లిరువురు సమానమని ప్రకటించిన మొదటి రాజ్యాంగ నిర్మాత మనువే.

"పుత్రేణ దుహితా సమా" (9.130)

పుత్రిక పుత్రునితో సమానము. ఆత్మ వంటిది. అందువలన ఆమె పితృసంపదకు అధికారిణి.

3. పుత్రుడు - పుత్రికలకు తండ్రి ఆస్తిలో సమానాధికారం:

మనువు తండ్రికి చెందిన ఆస్తిలో పుత్రునకు - పుత్రికకు సమానాధికారములున్నవని చెప్పాడు. ఈ విషయాన్ని 9-130, 192 శ్లోకాలలో వర్ణించారు. దీనినే యాస్కాచార్యుడు నిరుక్తంలో ఈ విధముగా చెప్పాడు-

శ్లో॥ అవిశేషేణ పుత్రాణాం దాయో భవతి ధర్మతః ॥
మిథునానాం విసర్గాదౌ మనుః స్వాయంభువోఽబ్రవీత్ ॥ (3.1-4)

సృష్ట్యాదిలో స్వాయంభువ మనువు దాయభాగాన్ని అనగా తండ్రికి చెందిన సంపదలో పుత్ర పుత్రికలకు సమానాధికారముండునను విధానాన్ని చేసాడు. తల్లి ఆస్తిలో కేవలం కన్యలకే అధికారాన్ని విధించి కుటుంబంలో కన్యల యొక్క మహత్త్వాన్ని మనువు పెంచాడు. (9.131)

4. స్త్రీ ధనరక్షణకై విశేష నిర్దేశం:

స్త్రీలను అబలలని ఎంచి ఆమె బంధు బాంధవులు స్త్రీ ధనాన్ని స్వాధీనం చేసుకొనినచో, వారిని దొంగలుగా భావించి శిక్షించాలని మనువు ఆదేశించారు (9.212, 3.52, 8.2, 8.29).

5. స్త్రీలపై జరుగు అత్యాచారాలకు కఠిన శిక్షలు:

స్త్రీలను హత్యగావించుట, అపహరించుట వంటి దుష్కర్మలను చేయువారికి మరణ శిక్షను విధించి, బలాత్కరించు వారికి యాతనలతో కూడిన శిక్షతో బాటు దేశ బహిష్కరణ విధించి మనువు స్త్రీలకు రక్షణను సుస్థిరం చేసాడు. (8-323,9-232; 8-352). స్త్రీల జీవితంలో ఎదురగు ప్రతి ఒక్క చిన్న-పెద్ద కష్టాన్ని దృష్టిలోనుంచుకొని వానిని లేకుండా చేయుటకై స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను రూపొందిచాడు. పురుషులు తమ తల్లి, పత్ని, పుత్రికలతో పోట్లాడరాదని ఆదేశించారు (4.180). వీరిపై అబద్ధపు ఆరోపణలు చేయువారిని, భార్యతో వివాహ జీవితానికి సంబంధించిన బాధ్యతలను నెరవేర్చనివారిని దండించు విధినేర్పరిచాడు (8-275, 389; 9.4).

6. వివాహం చేసుకొనుటలో స్వతంత్రాధికారం:

వివాహ విషయంలో మనువుకు ఆదర్శభావాలున్నవి. కన్యలు తమకు తగిన వరుని స్వయంగా వరించు అధికారాన్ని కల్పించి స్వయంవరం చేసుకొను అధికారాన్ని స్వతంత్రతలను ఇచ్చాడు. (9.90, 91). విధవా స్త్రీలు పునర్వివాహాన్ని చేసుకొనుటకు కూడ అధికారాన్నిచ్చాడు. దీనితో పాటు సంతానం కొరకు నియోగం చేసుకొనుటకు కూడా వీలు కల్పించాడు. (9.176; 9.56 నుండి 63 వరకు). ఆయన కన్యల వివాహం ఆదర స్నేహాలకు ప్రతీకగా చెప్పారు. అందువలన వివాహాలలో ఎటువంటి యిచ్చు-పుచ్చుకొనే కట్నకానుకల వ్యవహారమైనా అనుచితమని చెప్పుచూ వానిని తీవ్రంగా నిషేధించాడు (3.51 నుండి 54 వరకు). స్త్రీలు దుష్టులు, గుణహీనులైన పురుషులను వివాహం చేసుకొనరాదని, అంతకంటే సుఖంగా జీవించుటకై జీవించినంతకాలం అవివాహితలుగా నుండుటే శ్రేయస్కరమని ఆయన స్త్రీలకు సలహానిచ్చాడు (9.89).

7. ప్రతి ధర్మానుష్ఠానమునందు సహభాగిత్వం తప్పనిసరి:

ప్రపంచ దేశాలలో వైదిక ధర్మమునసరించే ఒక్క భారత దేశంలోనే పురుషులు చేసే ప్రతి ధర్మ కార్యాలలో స్త్రీలు (సహభాగిత్వం) పాల్గొనే అధికారం కలదు. ఇతర మతాలలో, ఇతర దేశాలలో ఎచ్చటనూ ఇది కానరాదు. ఇచ్చట జరుపబడే ప్రతి ఒక్క ధార్మిక, సామాజిక, పారివారిక కార్యకలాపాలలో పురుషులతో పాటు స్త్రీలు తప్పక ఉండాలి. ఇదే మనువు యొక్క సిద్ధాంతం కూడా. అందువలన ధర్మకార్యాలను అనుష్ఠించే నిర్వహణ బాధ్యత స్త్రీకి అప్పగించబడింది. ఆమె సహకారంతోనే ప్రతి కార్యాన్ని పురుషులాచరించాలని నిర్దేశింపబడింది (9.11, 28, 96). వైదికకాలంలో స్త్రీలకు వేదాధ్యయనం, యజ్ఞోపవీత ధారణ, యజ్ఞకార్యాలను స్వయంగా చేయుచు-చేయించే అధికారముండేది. వారు యజ్ఞాలలో బ్రహ్మాస్థానాన్ని సుశోభితం గావించుచుండిరి. ఉన్నత విద్యనభ్యసించి మంత్రద్రష్టలై స్త్రీలు ఋషికలుగా ఉండెడివారు. వేదాలను ధర్మానికి పరమ ప్రమాణంగా అంగీకరించు మహర్షి మనువు వేదాలలో స్త్రీలకు గల ధార్మిక అధికారాలన్నింటినీ సమర్థించారు. అందువలననే ఆయన వేదమంత్రాలతో కూడిన ధర్మకార్యాల అనుష్ఠానం స్త్రీల ఆధీనంలో ఉండాలని ఘోషించాడు (2.4; 3.28).

8. స్త్రీలకు అమర్యాద కలిగించే స్వతంత్రతను మనువు సమర్థించలేదు:

మనువు సుగుణాలను ప్రశంసించి అవగుణాలను నిందిచేవాడని ప్రసంగవశాత్తు ఇచ్చుట స్పష్టపరచుట అవసరం. మంచిగుణాలను ఆయన గౌరవించేవాడు. అలాగే దుర్గుణాలు కలవారిని దండించేవాడు. ఆయన సుగుణవతులైన స్త్రీలను పూర్తిగా గౌరవించి సత్కరించినట్లే అవగుణాలు గల స్త్రీలను నిందించి దండించు విధానమునేర్పరిచాడు. మనువులోని మరొక విశేష గుణమేమన:- ఆయన స్త్రీలకు రక్షణలేని, మర్యాదలేని స్వతంత్రతను సమర్థించలేదు. కాలాంతరంలో అహితమొనర్చు విషయాలను కూడా ఆయన సమర్థించడు. అందువలన ఆయన 'స్త్రీలెన్నడూ తండ్రి, భర్త, కుమారుల రక్షణ నుండి వేరుకావలదని, ఏలయన: వారికి దూరమై ఏకాకిగా ఉండుటవలన రెండు కుటుంబములు నిందలకు లోనగుట కవకాశముండు'నని హెచ్చరించాడు (5.149, 9.5,6). దీని అర్థం మనువు స్త్రీల స్వాతంత్ర్యానికి విరోధియని ఎన్నడూ తలంచరాదు. సమాజపరంగా స్త్రీలకు రక్షణ మున్ముందుగా చాలా అవసరమను అర్థము దీనిలో దాగియున్నది. ఆ రక్షణ వారికి శాసనము-రాజ్యాంగము ద్వారా గాని లేక ఎవరైనా పురుషుని ద్వారాగాని, లేక స్వయంగా వారి సామర్థ్యంతో గాని లభించవచ్చును. భోగవాదులు, అపరాధాలు చేయు ప్రవృత్తికల పురుషులు స్త్రీల సామర్థ్యాన్ని అణచివేస్తుంటారు. శస్త్రాలను ధరించిన బందిపోటు స్త్రీలకు కూడా పురుషుల రక్షణ అవసరమైనట్లు అనేక ఉదాహరణల ద్వారా తెలియుచున్నది. పైన చెప్పిన మనువు యొక్క మాటలను నేటి రాజకీయ పరిస్థితుల దృష్టితో చూచుట సరికాదు. నేడు దేశంలో స్త్రీల రక్షణకు ఎన్నో శాసనాలు చేయబడ్డాయి. రాజ్యాంగం వారికి అండగా ఉన్నది. ఐనా వేలాది మంది నారీమణులు అపరాధుల చేతికి చిక్కి బలియై జీవితాన్ని నాశనమొనర్చుకొని నిరాశతో కూడిన జీవితాన్ని గడుపుచున్నారు. ప్రతిరోజూ స్త్రీలపై అత్యాచారాలు, స్త్రీల హత్యలవంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నవి. రాజ్య పరిపాలనలో ఒడుదుడుకులేర్పడినపుడు రాజ్యాంగం బలహీనపడును. అప్పుడు జరిగే పరిణామాలలో స్త్రీల రక్షణ మాటేమిటి? అట్టి పరిస్థితులలో మనువు మాటల యొక్క మహత్వాన్ని నిశితంగా పరిశీలించి చూచిన మనువు చెప్పిన మాట నూటికి నూఱు శాతం సరియైనదని అంగీకరించక తప్పదు.

పైన చెప్పిన వివరణలతో మహర్షి మనువు ఏర్పరిచన వ్యవస్థ స్త్రీ-శూద్రులకు వ్యతిరేకం కాదని, అది న్యాయంతో కూడినదని, పక్షపాతం లేనిదని మనకు స్పష్టమైనది. నిందతో కూడిన, విరోధించదగిన మాటలేవీ మనువు చెప్పలేదని తేటతెల్లమైనది.

మనుస్మృతిలో ప్రక్షిప్తాలు

మనుస్మృతిలో ఉత్తమ విధానాలకు సంబంధించిన శ్లోకాలతోపాటు మనువును వ్యతిరేకించే ఇతర రచయితల ద్వారా వ్రాయబడిన శ్లోకాలు కూడా కలిసిపోయినవి. వాటివలననే మనువును, మనుస్మృతిని వ్యతిరేకిస్తున్నారు. వీనిని మనం పూర్తిగా తొలగించాలి. ఈ విధమైన ప్రక్షిప్తాలవల్ల మనుస్మృతికొక పెద్ద చిక్కు సమస్య ఎదురైనది.

మనుస్మృతిలో ఒకే విషయంలో న్యాయమైన శ్రేష్ఠ విధానం మరియు అన్యాయంతో కూడిన నిందా విధానం ఉన్నది. ఈ స్థితిని మౌలికముగా వాస్తవమని అంగీకరించవచ్చునా? ఒక బుద్ధికుశలుడైన సామాన్య రచయిత యొక్క రచనలలో కూడా యిటువంటి పరస్పర విరోధాలైన మాటలు కనపడనపుడు ఒక ధర్మవేత్త, శాసనవిదుడైన ఋషి యొక్క న్యాయశాస్త్రంలో ఇటువంటి విరోధం కనబడునా? కనబడదు. న్యాయపూర్ణంగా, శ్రేష్ఠ గుణ-కర్మ-యోగ్యతల ఆధారంగా చేయబడిన శాసనాలు మహర్షి మనువు చెప్పిన మూల శ్లోకాలుగా గుర్తించాలి. దానికి భిన్నంగా అన్యాయంతో పక్షపాతంతో కూడిన శ్లోకాలను ప్రక్షిప్తాలుగా గుర్తించాలి. అనగా మనువు తరువాత వచ్చినవారు వాటిని రచించి అప్పుడప్పుడు అక్కడక్కడ మనుస్మృతిలో కలిపివేసారని తెలుసుకోవాలి. ఇదే సరియైన స్పష్టమైన వివాదము లేని జవాబు. ఈ జవాబుకు మనుస్మృతిలోనే అనేక ప్రమాణాలు లభిస్తున్నవి. మనువు ప్రవచించిన మనుస్మృతిలోని మూల శ్లోకాలు పూర్వాపర ప్రసంగాలతో, విషయాలతో కలిసియున్నవి. అవి గుణ -కర్మ-యోగ్యతల యొక్క సిద్ధాంతాలపై ఆధారపడి గంభీరమైన శైలిలో నున్నవి. కాని కలిపిన

(ప్రక్షిప్త) శ్లోకాలు ప్రసంగానికి – విషయానికి విరుద్ధంగా వేరు శైలిలోనున్నవి. వీటి ఆధారంతో ఈ వ్యాసంలో ప్రమాణంగా వ్రాసిన శ్లోకాలు మూలములని, వీని భావాలకు వ్యతిరేకమైన శ్లోకాలు ప్రక్షిప్తాలని తెలుసుకోవాలి. ఈ ప్రక్షిప్త శ్లోకాలనే మను విరోధులైన రచయితలు, వక్తలు తమ వ్యతిరేకతకు ఆధారంగా చేసుకొన్నారని భావించాలి. సంక్షిప్తంగా ప్రస్తుత విషయంలో మూల ప్రక్షిప్త శ్లోకాలు ఈ విధంగా ఉన్నాయి –

1. **మనువు చేసిన వ్యవస్థ 'వైదిక వర్ణ వ్యవస్థ'** (డా॥ అంబేద్కర్ కూడా దీనిని అంగీకరించాడు). కావున గుణ-కర్మ-యోగ్యతల యొక్క సిద్ధాంతంపై ఆధారపడిన శ్లోకాలన్నీ మూల శ్లోకాలు. వీనికి వ్యతిరేకంగా జన్మతో (జాతిని) కులాన్ని విధించునవి, జన్మ ఆధారంగా పక్షపాతంతో కూడినవి ప్రక్షిప్తాలు.

   మనువున్న కాలంలో కులాలు ఏర్పడలేదు. అందువలననే మనువు వర్ణాలలో కులాన్ని వ్రాసి చూపలేదు. ఈ శైలి, సిద్ధాంతాల ఆధారంగా వర్ణ సంస్కారాలకు సంబంధించిన శ్లోకాలు కూడా ప్రక్షిప్తాలే.
2. **మనువేర్పరచిన యథా యోగ్యమైన దండన వ్యవస్థ** సాధారణ శాసనం. ఆ శాసనం దీనికి విరుద్ధంగా పక్షపాతంతో కూడి శూద్రులకు కఠిన దండన వ్యవస్థను విధించే శ్లోకాలు ప్రక్షిప్తాలు.
3. **శూద్రుని గూర్చి వ్రాసిన పరిభాష** శూద్రుల పట్ల సదభిప్రాయాన్ని కల్గిస్తుంది. వారి ధర్మాలను గూర్చి, పై వర్ణాన్ని పొందే విధానాలను గూర్చి చెప్పే శ్లోకాలు మూలములు. వాటికి భిన్నంగా జన్మతో కులముల శూద్రునిగ నిర్ణయించుట, అంటరానితనం, హెచ్చుతగ్గులు, ఉచ్చ నీచాలు, తోటి వారిపై అధికారాలను చలాయించుట మున్నగువాటిని విధించు శ్లోకాలు ప్రక్షిప్తాలు.
4. **స్త్రీలను గూర్చి వ్రాసిన నారీసత్కారం,** స్వతంత్రత, సమానత, శిక్షను విధించు శ్లోకాలు మూలములు. వీనికి వ్యతిరేకమైనవి ప్రక్షిప్తాలు.

మనుస్మృతిలోని రచనాశైలి ఆధారంగా, సర్వసామాన్య ప్రమాణాల ఆధారంగా మూల/ప్రక్షిప్త శ్లోకాలను వేరువేరుగా చూపి వానిపై యుక్తి-ప్రమాణాలతో కూడిన సమీక్ష ఇందు చేయబడినది. మనుస్మృతి యొక్క మూల విషయాన్ని తెలియజేయుచు, ప్రక్షిప్త శ్లోకాలను తగిన కారణాలతో తొలగించి, దీనికి సంబంధించిన అనేక అపోహలను తొలగించి, పరిశుద్ధమైన మనుస్మృతిని శ్రీ సురేంద్ర కుమార్ గారు మహర్షి దయానంద సరస్వతి మార్గంలో వారి ప్రేరణతో దీనిని పునరుద్ధరించినారు. ఇది అత్యంత తర్కబద్ధమైన పరిశోధన.

'ఇక ప్రక్షిప్త శ్లోకాలను గూర్చి వివాదం చేయనవసరం లేదు' అను విషయాన్ని ఇచ్చట స్పష్టం చేయుటవసరం. వీటి విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయం స్పష్టత ఏర్పడింది. భారతీయ సాహిత్యంలో అధికభాగం సంస్కృతానిదే. ప్రాచీన సంస్కృత సాహిత్యంలో అనేక సమయాలలో ప్రక్షిప్తాలు జరిగినవను విషయం ఒక చారిత్రిక సత్యం. ఈ విషయంలో వ్రాతపూర్వక ప్రమాణాలు కూడా లభించినవి. 10 వేల శ్లోకాల మహాభారత కావ్యం ప్రక్షిప్తాలు చేయబడి నేడు ఒక లక్ష శ్లోకాలకు చేరింది. నేపాల్ లోని పురాతత్త్వ గ్రంథాగారంలో ఒక వెయ్యి సం॥రాల పూర్వపు ఒక రామాయణ వ్రాత ప్రతి ఉన్నది. దానిలో లేని వందలాది శ్లోకాలు నేటి రామాయణంలో కనిపిస్తున్నవి. ఇదే పరిస్థితి 'మనుస్మృతికి అన్నింటి కంటే ఎక్కువగా ఏర్పడింది. కారణమేమనగా–మనష్యుని నిత్య ఆచార వ్యవహారాలతో దీనికే ఎక్కువ సంబంధమున్నది.కావున స్వార్థపరులు అంత ఎక్కువగా దీనిని చెడగొట్టారు.

1. ఆంగ్ల పరిశోధకులైన వూలర్, జె. జైలీ, కీథ్, మెక్డానల్ మరియు ఇన్సైక్లోపిడియా (అమెరికా) రచయితలు కూడా మనుస్మృతిలో ప్రక్షిప్తాలు జరిగినవన్న విషయాన్ని అంగీకరించారు.
2. ఆర్య సమాజ ప్రవర్తకుడైన మహర్షి దయానంద సరస్వతి ప్రక్షిప్తములేని మనుస్మృతిని ప్రమాణముగా అంగీకరించారు. వీరే మనుస్మృతిలో ప్రక్షిప్తాలు చేరావని మొట్టమొదటిసారిగా లోకానికి తెలియపరిచారు. వీరు కొన్ని ప్రక్షిప్త శ్లోకాలను

వేరుచేసి చూపి భవిష్యత్తులో ఆ పనిచేయుటలో పండితులకు ప్రేరణనిచారు. స్వయంగా తాను వ్రాసిన అనేక గ్రంథాలలో మనుస్మృతి శ్లోకాలను ప్రమాణంగా ఇచ్చారు. వైదిక మనుస్మృతికి భాష్యం రచించారు.

3. మనుస్మృతిలో లభించే వివాదాస్పద విషయాలు తరువాత చేర్చబడినవని **'వర్ణ వ్యవస్థ'** అనే తన పుస్తకంలో మహాత్మా గాంధీ అంగీకరించారు. డా॥రాధాకృష్ణన్, రవీంద్రనాథ్ ఠాగూర్ మున్నగు దేశనాయకులు, విద్వాంసులు కూడా దీనినే సమర్థించారు.

కనుక మనువు, మనుస్మృతియొక్క యథార్థ స్వరూపాన్ని తెలుసుకొని, ప్రక్షిప్త శ్లోకాల ఆధారంగా చేస్తున్న విరోధాన్ని ఆందోళనను వెంటనే విడిచిపెట్టాలి. శుద్ధమనుస్మృతిని అంగీకరించాలి. మనువు, మనుస్మృతి మనకు గర్వకారణం. ఇది అమూల్యమైన ధర్మశాస్త్రం. మన గౌరవానికి, సంస్కృతికి ఆధారమైనట్టిది. సంకుచితభావాలతో, స్వార్థపూరిత రాజకీయాలతో కూడిన దృష్టితో దీనిని చూచి తిరస్కరించరాదు. నమస్కరించి సత్కరించాలి. గుణకర్మస్వభావాలతో, వారి వారి యోగ్యతలతో కూడిన విధంగా వర్ణవ్యవస్థను పునరుద్ధరించాలి. నవసమాజాన్ని సార్వకాలికమైన, సార్వజనీనమైన శ్రుతిస్మృతుల ఆధారంగా పునర్నిర్మించాలి. ప్రపంచమంతా ఈ విధంగా నిర్మాణమైనప్పుడే వసుధైవ కుటుంబ భావన సార్థకమవుతుంది. ఒకే దేవుడు, ఒకే చట్టం, ఒకే భాష, ఒకే భావన ఉన్నప్పుడు ప్రపంచమంతా ఏకమవుతుంది. ఏకత్వ భావనయే ఐకమత్యం. అదే సమైక్యం. సమసమాజం. సమసమాజ నిర్మాణమే శ్రుతిస్మృతుల ఆశయం.

'మనుస్మృతి'యే అసలైన 'భారత రాజ్యాంగం - శిక్షాస్మృతి'

(**సూచన:** మన దేశంలో అమలులో ఉన్న **'భారతరాజ్యాంగం - శిక్షాస్మృతి'** జాతీయమైనది - దేశీయమైనది కాదు. అది అరువు తెచ్చుకున్నది. అతుకుల బొంత. అది తప్పులు జరిగిన తర్వాతనే శిక్షలు వేసేది. బాల్యం నుండే పాఠ్యాంశంగా పెట్టి శిక్షణ నిచ్చేది కాదు. దాని ద్వారా వ్యక్తి నిర్మాణం, సమాజ నిర్మాణం జరుగదు. అది అపరిపూర్ణం, అశాస్త్రీయం, సకాలంలో న్యాయం జరుగదు. నేరం జరిగినచోట న్యాయ విచారణ జరుగదు. చీకట్లో పోయిన వస్తువును వెలుగులో వెతుకుతున్నట్లు ఉంటుంది. బాధితుని మాట వినదు. బాధకునికి - నేరస్థునికి సువ్యవస్థితమైన రక్షణ ఉంటుంది. ఇలా.....దొంగలు పడ్డ 6 నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ఉంటుంది. ఇంకా ఎంతో రాయాలని ఉంది. విస్తరణ భీతితో ఇక్కడ రాయలేకపోతున్నాను.)

భారతదేశం 'వేదభూమి, ధర్మభూమి, కర్మభూమి, తపోభూమి, యజ్ఞభూమి'గా పొగడబడుతూ 'విశ్వ గురువు'గా వెలుగొందినది. వేదాలు పుట్టిన భూమి, సర్వశాస్త్రాలు వెలసిన నేల, ఎందరెందరో ఋషులు, మునులు, మహర్షులు, మహాత్ములు, మహామహులు, సిద్ధులు, యోగులు, ధర్మ సంస్థాపకులు, సమాజోద్ధారకులు, సంఘ సంస్కర్తలు, సాధు సంతువులు, వీరులు, శూరులు, ధీరులు, విజ్ఞానవేత్తలు, ఆయుర్వేదాచార్యులు, ధనుర్విద్యాది అస్త్ర శస్త్ర పారంగతులు, సంగీత సాహిత్యాది చతుష్షష్టి కళావిశారదులు, షట్‌శాస్త్ర దార్శనికులు, వేదాంగ ప్రవర్తకులు, బ్రాహ్మణారణ్యకోపనిషదాదుల నెరింగిన బ్రహ్మవేత్తలు, కుటుంబ జీవన విధానం తెలిపే రామాయణం, సమాజంలో ఎలా మెలగాలో తెలిపే మహాభారతం, ఇతిహాస పురాణాది గాథలు, అనేకానేక సాహితీ ప్రక్రియలు, ఎన్నో భాషలు, ప్రాంతాలు, కళలు-కళాకారులు, జీవనదులు, పర్వతశ్రేణులు, సజీవనదీనదాలు.... ఒకటి రెండననేల? ఎన్నో విశేషతలు గల భారతదేశం నేడెందుకిలా ఉన్నది? ఒకనాడు వేదశాస్త్ర బోధలతో విశ్వగురు స్థానంలో ఉండి, స్మృత్యాది ధర్మశాస్త్రాల ద్వారా ప్రపంచాన్ని శాసించి, సర్వజనులను అనుశాసనంలో ఉంచి, ధర్మార్థ కామ మోక్షాల సాధనకు చతురాశ్రమాలతో చాతుర్వర్ణ్య వ్యవస్థతో స్వర్గభూమిగా వెలుగొంది ప్రపంచానికే అనేక విద్యలను బోధించి జ్ఞానభిక్షను పెట్టిన నేల ఈనా డెందుకు మసకబారిపోయినది? సంవత్సరాల పొడుగునా యజ్ఞ యాగాదులను నిర్వహించే యజ్ఞవేదిక లెక్కడ ఉన్నవి? శిశువును శిష్యునిగా - గురువుగా మార్చే గురుకులాలెక్కడున్నవి? తల్లిగా భావించే గోమాతలెందుకు కనుమరుగవుతున్నవి? భారతదేశపు గుర్తులన్నీ కాలగర్భంలో

ఎందుకు కలిసిపోతున్నవి? చరిత్రలు సృష్టించినవారి చరితలు చరిత్ర పుటలలోనుంచి ఎందుకు తొలగిపోతున్నవి?.... ఇలా ఎన్నో భారతదేశపు చిహ్నాలు భవితకు లేకుండా పోతున్నవి. పైన తెలిపినవేవీ లేనినాడు భారతీయులకు భవిష్యత్తే లేదు. వాటినన్నింటిని పునరుద్ధరించవలసిన అవసరమెంతైనా ఉంది.

దేశం మతాల పేరుతో, కులాల పేరుతో, ప్రాంతాల పేరుతో, రాజకీయ పార్టీల పేరుతో, స్వార్థపరుల కుహనా రీతులతో రోజురోజుకు దిగజారిపోతున్నది. స్థిరమైన ధర్మశాసనం, సుస్థిరమైన పాలన లేకపోవడమే అన్ని అవస్థలకు, అనర్థాలకు, అసమానతలకు, అధోగతికి కారణమౌతున్నది.

దేశంలో ఉన్న సమస్త సమస్యలకు అనగా మత, కుల, ప్రాంత, వర్గ భేదాలకు, ఇంకా అనేకానేక సమస్యలకు ఒకే ఒక్క పరిష్కారం **'జాతీయమైన, దేశీయమైన, ధర్మబద్ధమైన సర్వాంగీణ వికాసహేతువైన, వర్ణాశ్రమ పూర్వకమైన రాజ్యాంగాన్ని పునరుద్ధరించడమే'**. సుస్థిరమైన పాలన, సువ్యవస్థితమైన సమాజం ఉన్నప్పుడే సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. స్వావలంబన ఏర్పడుతుంది. పరబుద్ధిమీద ఆధారపడినంతవరకు పరతంత్రం తప్పదు.

ఇప్పుడున్న రాజ్యాంగంలో ఏ వ్యవస్థ దేశీయమైనది? విద్యారంగమా? వైద్యరంగమా? పరిపాలనా రంగమా? న్యాయరంగమా? వ్యవసాయరంగమా? అన్నీ పరదేశీయుల నుండి అరువు తెచ్చుకున్నవే. అతుకుల బొంతే. గతుకుల బతుకే. ప్రజాస్వామ్యం, ప్రజలే ప్రభువులన్న పేరుతో స్వార్థపరులైన నాయకులు రాజ్యమేలుతున్నంతవరకు, చదువనివారు, చదివినవారిని శాసిస్తున్నంతవరకు, అర్థబలం, అంగబలం, అధికార బలంతో ఇంకా దోచుకోవడం - దాచుకోవడం జరుగుతున్నంతవరకు, తమ అధికారాలను నిలుపుకొనుటకు, పదవులను సాధించుటకొరకు అనుచితములైన ఉచితాలను ప్రజలకు పంచుతూ వారిని సోమరులను, నిష్క్రియులను చేయుచూ వారిని బలహీనులుగా ఉంచునంతవరకు ఈ దేశం గతి ఇలాగే ఉంటుంది. నేటి రాజ్యాంగాన్ని అడ్డు పెట్టుకొని అన్నిరంగాలవారూ అన్నివిధాలా అవినీతికి పాలుపడుతున్నారు.

వీటన్నింటిని సక్రమమైన మార్గంలో పెట్టాలంటే ఒకే ఒక్క సాధనం 'శాసనం'. అది దేశీయమై- జాతీయమై ఉండాలి. అది ఒక్క **'మనుస్మృతి'** - **'మనుధర్మశాస్త్రం'**తోనే సాధ్యం.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు రాజ్యాంగం లేదా? రాజ్యాలు లేవా? రాజులు, ప్రజలు లేరా? ఉంటే ఈ రాజ్యాంగమే ఉన్నదా? **'యథా రాజా తథా ప్రజాః'** అన్నట్లు నాయకుడెలా ఉంటే వారి ననుసరించే ప్రజలూ అలాగే ఉంటారు. భారతదేశాన్ని పాలిస్తున్న పరదేశీయులను తరిమి కొట్టడానికి ధైర్య సాహసాలతో సుభాష్ చంద్రబోసు, వీర సావర్కర్ ఒకరిద్దరేల వేలాది, లక్షలాది మంది వీరులు దేశ స్వాతంత్ర్యానికై వీరోచితంగా ఎదురొడ్డి పోరాటం చేస్తుంటే వారిని **'అతివాదు'**లన్నారు. శత్రువులకు (ఆంగ్లేయులకు) సలాం కొడుతూ తిట్టినా ఇంకొకటి తిట్టండని, కొట్టినా ఇంకొకటి కొట్టండని పిరికి బతుకులు బతుకుతూనే అహింసావాదులమంటూ సత్యాగ్రహులమంటూ మహాత్ములమంటూ, దేశభక్తులమంటూ, స్వతంత్ర్యానికై సమరం చేయకుండానే యోధులమంటూ, జన జీవనంలో అధికారాలను, గౌరవ మర్యాదలను పొంది మితవాదులుగా పేరుపొంది దేశము అతిగా నాశనం కావడానికి, విచ్ఛిన్నం కావడానికి కారకులైనారు. పోరాటం చేస్తున్న బోసు లాంటి వారి ధాటికి తట్టుకోలేక పారిపోదామనుకున్న ఆంగ్లేయులు ఇక వదలి పోతున్నామని, మా పద్ధతులనన్నీ ఇక్కడే మీకొరకు విడిచిపెట్టిపోతున్నామని, వారికనుకూలంగా ఉన్నవారికి వారి పరిపాలనను అప్పగించి వెళ్ళిపోయినారు. నాటి నుండి వారు తిని లేచిన విస్తరాకులపైనే కూర్చుని మన నాయకులు వారి ప్రతినిధులుగా దే సంపదలను భోంచేస్తున్నారు. దేశ స్వాతంత్ర్యం పేరుతో వ్యక్తులు మారినారే కాని వ్యవస్థలు మారలేదు. తెల్లవాళ్ళకు బదులు నల్లవాళ్ళు. ఇంతే తేడా. మిగతాదంతా 'సేమ్ టు సేమ్'.

ఇప్పుడున్న వ్యవస్థలన్నీ మారడానికి సంస్థాగతమైన మార్పులు జరగాలి. అది పునాదుల నుండే జరగాలి. 'విద్యాలయాలలో దేశనిర్మాణం జరుగుతుంద'న్నట్లు విద్యా విధానం నుండే ఇది ప్రారంభం కావాలి. **'చట్టం'** తప్పు జరిగిన తరువాత **'శిక్షలు'** వేయడానికి కాదు. తప్పులే చేయకుండా శిక్షణ నివ్వడానికి. ఈ **'మనుధర్మ శాస్త్రం'**లో వ్యక్తి

మొదలుకొని ప్రపంచం వరకు, సృష్టి మొదలుకొని ప్రళయం వరకు, జననం మొదలు మరణం వరకు ఎన్ని శాసనాలు, శిక్షలు-శిక్షణలు, నియమాలు, నిబంధనలు, విధులు, నిషేధాలు మొదలగునవి వ్యక్తికి - సంఘానికి ఏమేమి కావలెనో అవన్నీ వివరించబడ్డాయి. ఇప్పుడున్న రాజ్యాంగం వల్ల మనిషి నిర్మాణం కాదు కదా ఎవరికీ ఏవిధమైన న్యాయం సకాలంలో జరుగదు. అది వాయిదాలతో సాగిపోతుంది. వాదాలతో వీగిపోతుంది.

నేటి న్యాయస్థానంలో న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టారు. ఆమె గుడ్డిదై పోయింది. కళ్ళముందు ఎన్ని అన్యాయాలూ, అక్రమాలూ జరుగుతున్నా చూడలేకపోతుంది..... ఇలా ఇప్పటి న్యాయవ్యవస్థపై, ఎంత వ్రాసినా తక్కువే. ఏది వ్రాసినా వ్యర్థమే.

నేను **'వేదగిరి'** ఆశ్రమంలో ఉన్నప్పుడు కొన్ని సంఘటనలు జరిగినవి. అందులో భాగంగా చేయని నేరానికి నాతోపాటు 26 మందిని మహబూబ్‌నగర్ జైల్లో నెలరోజులు నిర్బంధించారు. ఆ నెలరోజులు జైలు జీవితం గడుపుతూ ఎన్నో అనుభవాలను పొందినాను. దానిపై ఒక పుస్తకాన్ని వ్రాసి ముద్రించినాను. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం పట్ల నాకుగల అభిప్రాయాన్ని అందులో కొంత వ్రాసాను. జనవరి 3, 2009 నుండి నెలరోజుల పాటు జైలులో ఉంటూ రోజూ యోగ, భగవద్గీత చెప్పేడివాడిని. జైలర్‌గా పనిచేస్తున్న చలపతిరావు గారు **"26 జనవరి గణతంత్ర దినోత్సవం నాడు నన్ను ప్రసంగించు"**మని కోరారు. ఆ సందర్భంలో ఫోటోలు తీయుమని కోరాను. వారలాగే చేసారు. నేను సుమారు అరగంటకు పైగా ఉపన్యసించాను. జైలు నుండి విడుదలైన తరువాత **"వేదగిరి సంఘటన - పూర్వాపరాలు"** అన్న పేరుతో నా జైలు జీవితాన్ని రాస్తూ జనవరి 26, 2009 నాడు పాలమూరు జైలులో చేసిన ప్రసంగ పాఠాన్ని యథాతథంగా వ్రాసి అందులో ముద్రించినాను. 13 సంవత్సరాల క్రితం వ్రాసిన ఆ ప్రసంగ పాఠాన్ని ఏమాత్రం మార్పులు చేయకుండా యథాతథంగా ఇక్కడ ఇస్తున్నాను. పాఠకులు నా అభిప్రాయాన్ని గమనింతురు గాక!

నేటి న్యాయ వ్యవస్థపై నా అభిప్రాయం

జనవరి 26, 2009 గణతంత్ర దినోత్సవం నాడు 'భారత రాజ్యాంగం'గురించి 'జైలులో నేను చేసిన ప్రసంగపాఠం' యథాతథం

జనవరి 26 నాడు గణతంత్ర దినోత్సవం పాలమూరు జెయిలులో చక్కగా జరుపుకొన్నాము. సబ్ జెయిలరు గారైన చలపతిరావు గారు కెమెరా తెప్పించినారు. జెయిలరు గారు నా తోటి గణతంత్ర దినోత్సవము గురించి ఉపన్యసింపజేసినారు. నేను వేదములో ఉన్న రాష్ట్రీయ గీతమును ఆలపించి జైలరు మొదలగువారిని సంబోధించి ఉపన్యాసమును ప్రారంభించితిని. రాజుల కాలం పోయి మంత్రుల రాజ్యం వచ్చినదని, రాజుల కాలంలో మంత్రం నడిచేదని, మంత్రం అంటే వేదాలలో ఉండే వాక్యాలను మంత్రాలంటారని, అవి రహస్యార్థములతో మానవుడిని ధర్మమార్గములో నడిపించేవని, రాజులు కూడా మంత్రయుక్తంగా - మనోయుక్తంగా ధర్మరహస్యోపేతంగా ప్రజలను పాలించేవారని, ప్రజలు చేసే నేరాలను వారి వారి గ్రామాలలోనే గ్రామపెద్దల సమక్షంలోనే ప్రజామోదంతో ఏ స్థాయి వ్యక్తి (బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు) ఎంత తప్పు చేస్తే ఆ తప్పుకు అంతేస్థాయిలో నేరస్థలముననే తత్‌క్షణమే ఆ సమయముననే శిక్షలు వేసి బాధితునికి సద్యః ప్రయోజనం కలిగించి అటు బాధకుడిని - ఇటు బాధితుడిని ఇద్దరినీ కూర్చుండబెట్టుకొని ఎవరికి ఎలా చెప్పవలసిన మాటలను అలా చెప్పి ఇద్దరికీ న్యాయపూర్వకముగా సలహాలిచ్చి సహాయం చేసి ఆ బాధక - బాధితులనిద్దరిని కలిసి మెలిసి జీవించుడని, ఈర్ష్యా ద్వేషాలతో పగ-ప్రతీకారాలతో జీవితమును ఇంకా సమస్యాత్మకం చేసుకోవద్దని, మునుపటి మాదిరిగనే ప్రేమతో కలిసి జీవించుమని, లేని యెడల కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించి - బుజ్జగించి ఆ యిద్దరి మధ్యన - ఇరువర్గాల మధ్య గల విద్వేషపు అడ్డుగోడలను చాకచక్యంతో కూల్చివేసి ప్రేమవారధిని గట్టి తొలుతకంటె ఎక్కువగా కలిసి జీవించేటట్లు జేసేవారు. ఎవరి తప్పును వారు

తెలుసుకునేటట్లుగా చేసి జీవితాలను చక్కదిద్ది,సంఘ జీవితాన్ని ఇంకా సుసంఘటితం చేసేవారు. ఏది తప్పో, ఎవరిది తప్పో, ఎవరు ఎలాంటి వారో, వారి వారి ప్రవర్తన లెటువంటివో ఆయా గ్రామాలలో గల తమ తోటి ప్రజలకు - పెద్దలకు తెలుసు. కావుననే గ్రామపెద్ద అక్కడనే అన్యాయం జరిగినచోటనే నష్టం చేసిన వానితో నష్టపోయిన వానికి వెంటనే పరిహారం చెల్లింపజేసి ఇద్దరినీ న్యాయమార్గములో నడిపింపజేసేవారు.

రాజుల కాలంలో చక్కనైన న్యాయవ్యవస్థ ఉండేది. ఏ గ్రామంలోని ప్రజల తప్పులు - నేరములు ఆ గ్రామములోనే నేరము జరిగిన తక్షణమే అదేచోట - అదే సమయములో అదే స్థాయిలో గ్రామపెద్దలు, ప్రజలు అందరు కలిసి వారి వారి స్వభావములను, నేరములను బట్టి తీర్పు నిచ్చెడివారు. నష్టపోయినవారికి, నష్టం చేసినవానిచేత వెంటనే దాన్ని పూర్తి చేయించేవారు. దీనివల్ల న్యాయం జరుగుతుండేది. నష్టం చేసినవానికి దానిని పరిహారంగా చెల్లించిన వెంటనే దాని వెనక కలిగే నష్టమెంతో తెలిసివస్తుంది. మరల అలాంటి పనులు చేయడు. తమ జీవితమును - విధానమును తమ తోటివారు, ప్రజలు, పెద్దలు గమనిస్తుంటారు కనుక న్యాయం చెప్పడం - శిక్షించడం న్యాయపూర్వకంగా జరుగుతుంది.

పెద్ద పెద్ద నేరములు లేదా క్లిష్ట సమస్యాత్మకమైన నేరములను పై న్యాయస్థానానికి పంపించేవారు. ఆయా స్థాయినిబట్టి న్యాయం జరిగేదాకా ఎవరికీ అన్యాయం జరుగకుండా తీర్పులు చేసేవారు. ఆ కాలంలో ప్రతి ఒక్క నేరానికి శిక్ష, బాధితునికి న్యాయం జరిగేది. మరి ఈ కాలంలో ఏదో ఒక తీరుగా న్యాయం పేరుతో అన్యాయం తీర్మానింపబడుతుందే తప్ప ఎవరికీ న్యాయం జరగటం లేదు.

రాజుల కాలంలో ప్రతి గ్రామానికి ఒక న్యాయాధికారి లేదా గ్రామపెద్ద ఉండేవారు. అతడే గ్రామములో జరుగు అన్ని పంచాయితీలకు తీర్పు చెప్పేవాడు. తనకు సహాయంగా వీధికొక్కరిని లేదా వర్గానికొక్కరిని లేదా కులానికొక్కరిని పెద్దగా గుర్తించి వారి సలహా మేరకు తీర్పులు చెప్పేవాడు. గ్రామ పంచాయితే అక్కడ న్యాయస్థానము. అతడే న్యాయాధికారి. డబ్బు తీసుకుని వాదించే వాదప్రతివాదులుండరక్కడ. అంతా నిస్వార్థంగా నిజాయితీగా, నీతి తప్పకుండా న్యాయాన్ని తీర్మాణం చేసి అమలు పరుస్తారు. అర్థాన్ని (డబ్బును) తీసుకుని వాదించే స్వార్థపు-ఏకపక్షపు న్యాయవాదులుండరక్కడ. ధర్మం, న్యాయం, నీతి నిజాయితీలే వారికి కనబడతాయి. తన, మన, పర తారతమ్యములక్కడ కనబడవు. న్యాయస్థానాన్ని ధర్మపీఠంగా భావించి అన్యాయాన్ని బలిపీఠమెక్కిస్తారక్కడ. ఆనాడు ధర్మశాస్త్రము ప్రకారము శిక్షలు జరుపబడేవి. ఈనాడు అర్థశాస్త్రాన్ని బట్టి తీర్పులు చేయబడుతున్నాయి. నాటికీ- నేటికీ న్యాయ నిర్ణయములో హస్తిమశకము (ఏనుగు-దోమ) లకున్నంత తేడా కనబడుతున్నది. దీనికంతటికి కారణం నేటి చదువులలో ధర్మం - నీతిబోధలు లేకపోవడమే. అర్థ సంపాదనమెలా చేయాలనే బోధలు చేస్తున్నారు. డబ్బును ఎన్ని రకాలుగా, ఎలా సంపాదించాలో పాఠాల రూపంలో శిక్షణను ఇస్తున్నారే తప్ప ధర్మమార్గంలో, నీతియుక్తంగా కలిసి జీవించే విధానాన్ని పాఠశాలల్లో ఎక్కడా నేర్పించడం లేదు. అన్నింటికీ డబ్బుతోనే ముడివేయడం జరుగుతున్నది. అన్నిటినీ డబ్బుతోనే కొంటున్నారు. అర్థబలం - మందబలం ఉన్నవాడిదే న్యాయం. ఈనాటి విద్యావ్యవస్థ సమస్తం అస్తవ్యస్థమైపోయినది. అదంతా గందరగోళంగా మారింది. పాఠ్యాంశాలలో శతాంశమైనా నీతి నిజాయితీలను గూర్చి బోధించరు. అస్తమానం ఎలా పాసు కావాలి? ఎలా ఉద్యోగాన్ని పొందాలి? ఎలా సంపాదించాలి? ఏ జీతం చేస్తే జీతం ఎక్కువ వస్తుంది? అన్న బానిస ఆలోచనలతోనే నేటి విద్యావిధానం ముందుకు సాగుతున్నది. తల్లిదండ్రులు, గురువులు అందరూ అలానే ఆలోచిస్తున్నారు. వందల ఏళ్ళు పరతంత్రములో జీవించిన మనం ఈ స్వాతంత్ర్యంలోనూ పరతంత్రంగానే (ఇతరుల దగ్గర ఉద్యోగం - జీతం చేయడం తోటే) జీవించాలనుకుంటున్నాము.

భారతదేశములో మానవ జీవన విధానం చాలా గొప్పగా ఉండేది. తరతరాలుగా, వంశానుగతంగా, వారసత్వంగా వ్యవసాయము, కులవృత్తులు, వ్యాపారము, పశుపాలనము, గురుశిష్య పరంపర విద్యా విధానము అమలులో ఉండేది. వారి వారి సంతానము తమ వృత్తులను వారసత్వంగా పొంది నిరుద్యోగ సమస్య అనేదే లేకుండా అందరూ సమానంగా

vivo U20 · AI Camera

ఐకమత్యంగా కలసిమెలసి అన్ని వర్గాలవారు ఒకే కుటుంబముగా జీవించేవారు. నేడు నాటి వ్యవస్థ ఎక్కడుంది? అంతా కలగూరగంప. చిన్నా, పెద్దా అనే భేదమే లేదు. మంచి-చెడూ అనే తారతమ్యమే లేదు. గురుశిష్య పరంపర లేదు. తల్లి-తండ్రి, గురువు-దైవం పట్ల భక్తిశ్రద్ధలు లేవు. ఇరుగు-పొరుగు, బంధువులు-మిత్రులు మొదలగువారి పట్ల ప్రేమ విశ్వాసములు సన్నగిల్లినవి. అందరూ అన్నింటినీ ధనముతోనే కొంటున్నారు. దానితోనే కొలుస్తున్నారు. అందుకే నేటి సమాజ వ్యవస్థ అంతా అస్తవ్యస్థం - గందరగోళం - మాయాజాలం - మాయాలోకం. మంత్రుల రాజ్యం - కుతంత్రుల ఇష్టారాజ్యం. యంత్రాల నియంత్రణా తంత్రంతో సాగుతున్న గణతంత్రం. ఇదే మన గణతంత్ర దినోత్సవపు గొప్పతనం. ఈ గణతంత్ర రాజ్యములో అన్నీ తంత్రాలు - కుతంత్రాలే. మాయా మంత్రాలే. పాలన, రక్షణ, 'శిక్షణ', బోధన అన్నీ పరతంత్రపు వారసత్వాలే. ఆంగ్లేయులు పోయినారు గానీ వారి పాలన, రక్షణ, శిక్షణ విధానం మాత్రం ఏమాత్రం మారలేదు. మన జాతీయమైన పాలన, పోషణ, శిక్షణ, రక్షణ, న్యాయవిధానం మొదలగువన్నింటిని మరచి ఇంకా పరపాలన విధానంలోనే భావ బానిసత్వంలో మ్రగ్గిపోతున్నాం. మన ప్రాచీన జాతీయ వారసత్వ సంపదను పుణికి పుచ్చుకుని దేశీయ జీవితాన్ని గడిపినప్పుడే మనం నిజమైన స్వతంత్రులం. జన జాగరణ మంత్రాన్ని సూత్రంగా మార్చి తీర్చి కూర్చినప్పుడే నిజమైన గణతంత్ర దినోత్సవం.

స్వాతంత్ర్యం రాకపూర్వం గ్రామాలలో లేదా దేశంలో న్యాయవ్యవస్థ సక్రమంగా ఉండేది. ఒక గ్రామానికి ఒక సర్పంచ్ లేదా గ్రామ యజమాని - ప్రథమ పౌరుడు. అతడే న్యాయాధికారి - న్యాయనిర్ణేత. 10 గ్రామాలకు కలిపి 1 నాయకుడు; 100 గ్రామాలకు ఒక సామంతుడు; 1000 గ్రామాలకు 1 రాజు; 10,000 గ్రామాలకు 1 మహారాజు; 1,00,000 గ్రామాలకు 1 సామ్రాట్టు; 10,00,000 గ్రామాలకు 1 చక్రవర్తి. ఈ విధంగా పరిపాలనా విధానము ననుసరించి న్యాయాధికారులు ఉండేవారు. ఎక్కడి సమస్యలు అక్కడే - అదే గ్రామంలో పూర్తిగా పరిష్కరింపబడేవి. ఏవేని విశేషమైన క్లిష్టమైన, దేశ సంబంధమైన, ధర్మసంబంధమైన సమస్యలుంటే ఆ యా స్థాయిలలో పరిష్కరింపబడుతాయి. అంతేగాని నేటి మాదిరిగా మూర్ఖ పద్ధతిని అవలంభించేవారు కాదు.

ఇంకా చెప్పాలంటే ఎన్నో లొసుగులున్నాయి. ఈ పరిస్థితులలో ఈ సమయంలో అన్నీ చెప్పుట సాధ్యం కాదు. ఈ జైలు ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవాన్ని ఈవిధంగా జరుపుకోవడం నాకెంతో ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ, ఒకింత బాధాకరంగానూ ఉన్నది.

నేను జెయిలుకు రాక పూర్వం జెయిలంటే ఒక విధమైన భావన ఉండేది. అక్కడ అందరూ నేరస్థులే ఉంటారు. దుష్టులు, దుర్మార్గులు, హంతకులు, దేశద్రోహులు మొదలగు చెడు సంస్కారములు కలిగిన వ్యక్తులే ఉంటారు అనే అభిప్రాయం ఉండేది. ఈ నా అభిప్రాయం పూర్తిగా నిజం కాదని తెలిసింది. ఇక్కడ ఉన్న చాలామంది ఖైదీలు నేరం ఆరోపింపబడి వచ్చినవారే ఉన్నారు. ఏ కొందరో నిజమైన నేరగాళ్ళు ఉంటారు. పడ్డవారంతా (జెయిల్లో) చెడ్డవాళ్ళు కాదన్న భావన నాలో పెంపొందుతున్నది. ఈ సందర్భంగా నేను మిమ్ములనందరిని ఒకటే కోరుతున్నాను. తప్పు చేసియో, చేయకనో ఏదో ఒక కారణాన ఇక్కడికి వచ్చినాము. తప్పు చేసినవారుంటే సరిదిద్దుకోవాలి. చేయనివారు గుణపాఠం నేర్చుకొని ఇంకా జాగ్రత్తగా ఉండాలి.

ఇలా ఇంకా ఏమేమో మాట్లాడి ఈ అవకాశాన్ని ఇచ్చిన జైలర్ గారికి, శ్రద్ధగా విన్న తోటి ఖైదీలందరికి ధన్యవాదములు తెలిపి ముగించితిని. అందరు ఒక్కసారిగా గట్టిగా చప్పట్లు కొట్టినారు. జెయిలరు గారు చాలా అభినందించినారు. అందరికీ లడ్డూలు పంచినారు. విశేష భోజనమును పెట్టినారు. భోజనానంతరం కొందరు ఆధ్యాత్మికచింతనాపరులు, నేను ప్రతినిత్యం బోధించు విషయాలకు ప్రభావితులైనవారు సమావేశమై శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్రలోని కాలజ్ఞానమును గూర్చి చెప్పించుకొని చక్కగా విన్నారు. ఈ రోజు ములాఖతులు లేనందున సత్సంగముతో గడిపితిమి.

పీఠిక సింహావలోకనం

మన ప్రాచీన భారతీయ, సాంఘిక, రాజకీయ, ధార్మిక సంబంధమైన జీవన విధానాన్ని తెలుసుకొనటానికి స్మృతి గ్రంథాలెంతో ఉపయోగపడతాయి. నేడు మనకు రాజ్యాంగంవలెనే ఆనాటి సమజానికి ఈ స్మృతులు శిరోధార్యాలు. ధర్మశాస్త్రాల్లో మనుస్మృతి సుప్రసిద్ధం. దీనిలో ఆచార నియమాలు, రాజధర్మాలు, శాసనసంబంధమైన విషయాలు, వ్యవహార ప్రాయశ్చిత్త విధానాలు, కర్మఫలాదుల వివరణ, వర్ణాశ్రమ విధివిధానం మొదలైన విషయాలెన్నో చెప్పబడినాయి. ఇంకా ఇందులో ధర్మ-అధర్మ వివేచన, మానవులు ఆచరించవలసిన ధర్మాలు, ఆచారాల వైశిష్ట్యం, ఆధ్యాత్మిక సాధనలు పేర్కొనబడినాయి. దీనివలన ఆనాటి సమాజం ధర్మాన్ని నియమబద్ధంగా ఎలా పాటించేదో మనకు తెలుస్తుంది. అంతేగాక స్వార్థపూరితమై అపమార్గంలో ప్రయాణిస్తున్న నేటి సమాజం సక్రమమార్గంలో పురోగమించడానికి ఇది ఒక కరదీపికలాగా ఉపయోగపడుతుంది. ‘మనిషి తానుచేసే పుణ్యపాపాలకు ఫలాన్ని తప్పక అనుభవిస్తాడనీ, అది వెంటనే కానీ, కొంతకాలం తర్వాత కానీ, జన్మాంతరంలో కానీ, లోకాంతరంలో కానీ కావొచ్చు. ఏ కర్మలు ఎంతకాలం తర్వాత ఏ లోకంలో, ఏ జన్మలో, ఏ విధమైన ఫలం లభిస్తుందో తెలిసిన మహిమాన్వితుడైన మను మహారాజు విశ్వ మానవజాతికి ధర్మ-అధర్మాలను గురించిన సమస్త విజ్ఞానాన్ని మనుస్మృతిగా అందించాడు. వేదమూలమైన ఈ విజ్ఞానాన్ని ధర్మశాస్త్రంలో సర్వజన సులభంగా ప్రవచించాడు. అనంతమైన ఈ విజ్ఞాన ధర్మ సంగ్రహం ‘మనుధర్మశాస్త్రం’గా మానవుడికి శుభాన్ని కలిగిస్తుంది. బుద్ధిని పెంపొందింపచేస్తుంది. మోక్షోపాయాన్ని బోధిస్తుంది. అందుకే ఇది సర్వోత్కృష్టమైంది.

జీవులు చేసే సర్వకర్మలకు పరమేశ్వరుడు సర్వసాక్షి. అవి చేసుకున్న కర్మలను బట్టే ఉత్తమ, మధ్యమ, అధమ గతులు ప్రాప్తిస్తాయి. మానవుడు శరీరం, వాక్కు, మనస్సు అనే త్రికరణాలతో ఆచరించే కర్మ శాస్త్రయుక్తమైనదైతే సుఖాన్ని, శాస్త్రనిషిద్ధమైనదైతే దుఃఖాన్ని కలిగిస్తుంది.

ఈ విధంగా మానవులు పుణ్యకర్మలకు శుభ ఫలాన్ని, పాపకర్మలకు అశుభ ఫలాన్ని పొందుతారు. కాబట్టి ధర్మమొక్కటే మనిషికి సర్వకాలాల్లో, ఇహపరాల్లో తోడ్పడే నిజమైన మిత్రడనీ, అది మనలను మంచిస్థితిలో నిలబెట్టి కాపాడుతుందనీ, అధర్మం వల్ల మనిషి పతనమవుతాడని మనుస్మృతి చెబుతుంది. మరణానంతరం కూడా మన వెంట వచ్చేది ధర్మమొక్కటేననీ, మిగిలిన ధన, కనక, వస్తు, వాహనాదులు, బంధుమిత్రాదులు, పుత్రకళత్రాదులు శరీరంతో పాటే విడిచిపెట్టి పోతారని అందుకే ధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించాలని మనువు చెప్తాడు –

“ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మాత్ ధర్మో న హన్తవ్యో మా నో ధర్మో హతోఽవధీత్ ॥ మను. 8.15
ఏక ఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః ।
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి” ॥ మను. 8.17

మానవుడు ఒకరి పట్ల ఒకరు ఎలా ప్రవర్తించాలో మనుస్మృతి వివరంగా చెప్పింది. అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాలవారికీ అవసరమైన ధర్మోపదేశాలు దీనిలో మనకు లభిస్తాయి. మృదుత్వం, దయ, ప్రేమ, సాత్వికత మొదలైన మహోన్నత సుగుణాలతో మానవులను ఉత్తేజింపచేయగల సమాజ మర్యాద ప్రణాళిక దీనిలో మనకు కనిపిస్తాయి. ఇతరుల మనస్సును నొప్పించకుండా ఉండడం మన సమాజ ధర్మాల్లో మొదటిది. ఎదుటివాడు బాధ కలిగించినా అతనిపట్ల కఠినంగా మాట్లాడరాదనీ, అతన్ని నొప్పించరాదనీ, ఎవరికీ ద్రోహంచేసే సంకల్పం కూడా చెయ్యరాదనీ, ఇతరులకు తనవలన హానికలుగుతుందనే భయం కలిగించరాదనీ మనువు ఆదేశించాడు –

“అహింసయైవ భూతానాం కార్యం శ్రేయోఽనుశాసనమ్ ।
వాక్చైవ మధురా శ్లక్ష్ణా, ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా” ॥ మను. 2.134

మానవుడు ఈ ఒక్క జన్మలోనే తల్లిదండ్రుల రుణాన్ని తీర్చుకోలేడని, అనేక జన్మలు కావాలని, బిడ్డల కొరకు తల్లిదండ్రులు అంత కష్టపడతారని మనువు అంటాడు -

"యం మాతాపితరౌ క్లేశం సహేతే సంభవే నృణామ్ ।
న తస్య నిష్కృతిః శక్యా కర్తుం వర్షశతైరపి" ॥ మను. 2.227

కాబట్టి తల్లిదండ్రులను, ఆచార్యులను, అన్నలను అవమానించరాదని, వారివల్ల బాధ కలిగినా కూడా ఎదురించరాదని, వారికెప్పుడూ సంతోషాన్నే కలిగించాలి. వాళ్ళ అనుమతిలేనిదే ఏ పనీ చెయ్యరాదని, వారి అనుమతితో, ఆజ్ఞతో, సలహాలతో నడిస్తే అన్ని తపస్సులూ చేసినట్లేనని మనువు చెప్పాడు -

"ఆచార్యశ్చ పితా చైవ మాతా భ్రాతా చ పూర్వజః ।
నార్తేనాప్యవమంతవ్యా బ్రాహ్మణేన విశేషతః" ॥ మను. 2.225

ఎవ్వరితోనూ వివాదం పెట్టుకోకూడదని, ముఖ్యంగా రుత్విక్కు, పురోహితుడు, ఆచార్యుడు, మేనమామ, అతిథి, బాలుడు, వృద్ధుడు, రోగి, వైద్యుడు, జ్ఞాతి, వియ్యంకుడు, బంధువు, తల్లిదండ్రులు, అక్కచెల్లెల్లు, అన్నదమ్ములు, కొడుకు, కూతురు, భార్య, సేవకుడు వీరితో ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదం పెట్టుకోరాదని, జీవులు జన్మాంతరంలో చేసుకున్న పాపఫలితంగా ఈ జన్మలో కలిగిన లోపాలకు గానీ, లోటుపాట్లకు గానీ ఎవ్వరినీ ఆక్షేపించకూడదని, అవయవలోపం కలవారిని, అవయవ ఆధిక్యం కలవారిని, విద్యావిహీనలను, వృద్ధులను, కురూపులను, దరిద్రులను, హీనజాతివారిని ఆక్షేపించకూడదని మనువు శాసించాడు -

"హీనాంగానతిరిక్తాంగాన్ విద్యాహీనాన్ వయోఽధికాన్ ।
రూపద్రవ్యవిహీనాంశ్చ జాతిహీనాంశ్చ నాక్షిపేత్" ॥ మను. 4.141

వారిలో రోగి ఎదురుగా వస్తే అతడు పూజ్యుడు కాకపోయినా అతనికి దారి ఇచ్చి తప్పుకోవాలి. అట్లే స్త్రీలకు, వృద్ధులకు, బరువు మోసే వాళ్ళకి సాదరంగా దారివ్వాలని, ఇంకా పెళ్ళికుమారుడికి, స్నాతకుడికి, ప్రజాపాలకులకు, వాహనాల్లో వెళ్ళే వాళ్ళకు దారి ఇవ్వాలని మనువు చెప్పాడు.

"చక్రిణో దశమీస్థస్య రోగిణో భారిణో స్త్రియాః ।
స్నాతకస్య చ రాజ్ఞశ్చ పంథా దేయో వరస్య చ" ॥ మను. 2.138

తనకు సంబంధంలేని ఇతరుల రహస్యాలను వినకూడదని, అసందర్భంగా మాట్లాడరాదని, సరైన నడవడిక కలిగి ఉండాలని, ఇతరులకు అపకారంచేసే ఆలోచనే రాకూడదని, ఎవరైనా డబ్బు అవసరమై బాధపడే వారికి ఉపకారంగా డబ్బు అప్పుగా ఇచ్చినా అధిక వడ్డీ తీసుకోకూడదని, ఒకవేళ తీసుకున్నా చాలా తక్కువ వడ్డీ తీసుకోవాలని మనువు చెప్పాడు. ఇంటికి వచ్చిన అతిథికి కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చి, ఆసనం మీద కూర్చోబెట్టి, గౌరవించి, భోజనం పెట్టాలని, మంచివాళ్ళ ఇళ్ళల్లో అతిథులకు విశ్రాంతికి ఇంత చోటు, పడుకోవడానికి ఒక చిరు చాప, త్రాగటానికి కాసిన్ని మంచినీళ్ళు, ఒక మంచి మాట తప్పక లభించాలని మనువు చెప్పాడు -

"తృణాని భూమిరుదకం వాక్చతుర్థీ చ సూనృతా ।
ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యంతే కదాచన" ॥ మను. 3.101

అట్లని ఒకరింటికి అతిథిగా వెళ్ళి భోజనం చేయటమే సుఖంగా ఉందనుకుని ఎప్పుడూ పరాన్న భోజనం చేసే గృహస్థు అన్నదాత ఇంట్లో పశువుగా పుడతాడని కూడా హెచ్చరిస్తున్నాడు మనువు -

"ఉపాసతే యే గృహస్థాః పరపాకమబుద్ధయః ।
తేన తే ప్రేత్య పశుతాం వ్రజన్త్యన్నాది దాయినామ్" ॥ మను. 3.104

సాధారణంగా మనిషికి గౌరవాన్ని కలిగించేవి ఐదు విషయాలు. వాటిల్లో ముఖ్యమైనది విద్య. ఆ తర్వాత అతడు చేసే పని. మూడవది వయస్సు. నాల్గవది బంధువర్గం. ఆపైన ధనం. ఇవి మనిషి గౌరవానికి కారణాలవుతాయి.

లోకంలో డబ్బు, అధికారం, సంపదగల కుటుంబాలను ఉన్నత కుటుంబాలని చెబుతూ ఉంటారు. కానీ, మనువు పారమార్థిక విజ్ఞానం కలిగి ధర్మాన్ని పాటించే కుటుంబాలే డబ్బులేకపోయినా ఉన్నత కుటుంబాలని చెప్పి, అటువంటి కుటుంబాలతో వివాహాది సంబంధాలు పెట్టుకోవడం మంచిదని సూచిస్తాడు.

అహింస, సత్యం, పరద్రవ్యాన్ని అపహరించకుండా ఉండడం, పరిశుభ్రత, ఇంద్రియ నిగ్రహం ఇవి అందరికీ ఉండవలసిన సామాన్య ధర్మాలు. ఆధ్యాత్మిక సాధనాల్లో అతిముఖ్యమైనది అహింస. సన్యాసి కూడా సర్వాన్ని పరిత్యజించినా, అహింసావ్రతాన్ని మాత్రం పరిత్యజించరాదని పెద్దలు చెప్పారు. ఇంద్రియనిగ్రహం వల్ల, రాగద్వేషాలు వదలటం వల్ల, సర్వజీవులపట్ల అహింసను అవలంభించడం చేత అమృతత్వం సిద్ధిస్తుంది. 'ఎవరు ప్రాణులను వధించడానికి కానీ, బంధించడానికి కానీ, బాధపెట్టడానికి కానీ ఇష్టపడరో, ఎవరు సర్వప్రాణుల హితం కోరుతారో వాళ్ళు అనంతమైన సుఖాన్ని పొందుతా'రని మనువు చెప్పాడు. తమ సుఖాలకై హింసచేయని ప్రాణుల్ని, జంతువుల్ని, మనుష్యుల్ని హింసించి చంపేవాళ్ళు జీవన్మృతులు. అటువంటివాళ్ళు బ్రతికుండీ మరణించిన వాళ్ళతో సమానం. వాళ్ళకు ఇహపరాలలో సుఖం ఉండదని మనుస్మృతి చెబుతున్నది.

మనువు సర్వధర్మాలలోనూ సత్యాహింసలకు అగ్రస్థానం ఇచ్చాడు. హింస లేకుండా బ్రతకగలమా? నడిచేటప్పుడు క్రిమికీటకాలు చనిపోవడం లేదా? అని మనకు సందేహం కలుగుతుంది. పరపీడనం ఎంత తక్కువగా చేస్తే అంత మంచిదనీ, బొత్తిగా చేయకుండా ఉండటం సర్వోత్తమమని మనువు అభిప్రాయం–

"అద్రోహేణైవ భూతానామల్పద్రోహేణ వా పునః" ॥ మను. 4.2

ధార్మికుడైనవాడు 'ఇంతకంటే తక్కువ హింస సాధ్యం కాదా' అని ఆలోచించాలే కానీ, అనివార్యంగా కొంత హింస జరుగుతున్నది కాబట్టి మరికొంత హింస ఎందుకు చేయకూడదని ఆలోచించరాదు. అసత్యం ఆత్మద్రోహం. అసత్యమాడేవాడు తన మనస్సు ఎలా ఉందో.. అలాగాక మరొక రకంగా వ్యక్తం చేస్తున్నాడు. అసత్యం చేత ఇతరులను మోసగిస్తున్నానని అతను అనుకుంటాడు. కానీ యథార్థంగా తన ఆత్మను తానే అపహరిస్తున్నాడు. కాబట్టి అతడు పాపుల్లోకెల్లా మహా పాపాత్ముడని మనువంటాడు –

యోఽన్యథా సంతమాత్మానమన్యథా సత్సు భాషతే ।
స పాపకృత్తమో లోకే స్తేన ఆత్మాపహారకః" ॥ మను. 4.255

దానాన్ని మనువు అనేక చోట్ల ప్రశంసించాడు. దానానికి ఎవరు అర్హులో కూడా చెబుతాడు. ఈ విషయంలో దీనుల పట్ల, అనాథల పట్ల ఇతనికి గల పక్షపాతం మనకు అన్నిచోట్ల కనబడుతుంది. ముఖ్యంగా మనువు చెప్పేదేమిటంటే – డబ్బు సంపాదించడానికి అవకాశం లేని బాలురు, వృద్ధులు, రోగులు మొదలైన వారిపట్ల ఉదారదృష్టి కలిగి ఉండాలి. ఆపదల్లో ఉన్నవారికి తప్పకుండా సహాయం చెయ్యాలి. ఆర్థిక పరిస్థితుల వల్ల తమ ఇంట్లో వంట చేసుకుని తినలేని వారికి గృహస్థు యధాశక్తి అన్నం పెట్టాలి –

"శక్తితోఽపచమానేభ్యో దాతవ్యం గృహమేధినా" ॥ మను. 4.32

అందరికీ అన్నం పెట్టడానికి ప్రయత్నించాలి. డబ్బిచ్చే కంటే అన్నం పెట్టడం మంచిదంటాడు మనువు–

"దద్యాచ్చ సర్వభూతానామన్నమేవ ప్రయత్నతః" ॥ మను. 9.333

ఇతరుల మెప్పుకొరకు దానంచేసి చెప్పుకోవటం వలన దానఫలం తగ్గిపోతుంది. దానాన్ని శ్రద్ధతోనూ, గౌరవంతోనూ చెయ్యాలి. అలాచేసే దానాన్నే స్వీకరించాలి. కాని పక్షంలో దాతప్రతిగ్రహీతలు నరకానికి వెళతారు. ధర్మబద్ధమైన పద్ధతిలో ధనాన్ని సంపాదించాలి. మనం అనుభవించే సమస్త వస్తువులు దోషరహితంగా ఉండాలంటే వాటిని న్యాయమార్గంలో సంపాదించాలి. అన్యాయంగా సంపాదించే ధనంతో వచ్చే వస్తువులు మలినాలు. కాబట్టి వాటిని దగ్గరకు రానీయకూడదు.

లంచగొండితనం నేరమనీ, పాపమనీ మనువు ఆనాడే చెప్పాడు. అక్రమసంపాదన పాపకార్యమనీ, అపమార్గంలో ధనం సంపాదించరాదనీ మనువు ఆదేశించాడు. అక్రమంగా సంపాదించిన ధనాన్ని దానం చేసినా ఎవ్వరూ తీసుకోకూడదనీ, దానివలన దాత చేసిన పాపం, దానం ఇవ్వబడిన ధనం ద్వారా దానం స్వీకరించిన వారికి కూడా వస్తుందని మనువు చెప్పాడు. లుబ్ధుడు, పాపియైనవాడు రాజైనా సరే అతని ధనాన్ని స్వీకరించరాదని మనువు గట్టిగా నొక్కి చెప్పాడు. దీనినిబట్టి మనువు ధనానికి కాకుండా ధర్మానికీ, నీతికీ ఎంత ప్రాధాన్యత నిచ్చాడో మనకు తెలుస్తుంది.

ప్రతి మనిషి సామాజిక దృష్టితో వ్యవహరించాలని మనువు ఆదేశించాడు. మనిషి స్వార్థపరుడు కాకుండా తన తోటివారి కష్టసుఖాలను గమనించి వాటిలో పాలుపంచుకోవాలి. సమాజ క్షేమానికి భంగం కలిగించే చెడు పనులు చేసేవారు ఆకతాయిలనీ, అటువంటి వాళ్ళు ఎవరైనా సరే వాళ్ళను వధించాలని మనువు చెప్పాడు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండి, పని మీద తన వద్దకు వచ్చే ప్రజల నుంచి లంచం తీసుకొనే వాళ్ళను సమాజ ద్రోహులుగా మనువు పేర్కొన్నాడు. సమాజంలోని తోటి మనుషుల క్షేమం కోసం మొక్కలను నాటడం, తోటలను పెంచడం, బావులు, చెరువులు, కాలువలు త్రవ్వించడం మొదలైన మంచి పనులు తప్పక చేయాలని చెప్పటం చేత మనువు సమాజ సేవకు ఎంతటి ప్రాధాన్యత నిచ్చాడో మనకు తెలుస్తుంది.

"దానధర్మం నిషేవేత నిత్యమైష్టిక పౌర్తికమ్" ॥ మను. 4.227

మానవుడు పరలోకం లేదనే భావంతో వేద నిందనూ, దూషణనూ చేయరాదనీ, ద్వేషాన్నీ, దంభాన్నీ, దురభిమానాన్నీ, కోపాన్నీ, క్రూరత్వాన్నీ విడిచిపెట్టాలని, మృదుస్వభావం, ఇంద్రియ నిగ్రహం, దాతృత్వం కలిగి ఉండాలనీ, దృఢవ్రతుడై దుర్మార్గులు, క్రూరులు అయినవారితో స్నేహం చేయకుండా, ఎవరినీ హింసించకుండా ఉండే వాడు స్వర్గాన్ని జయిస్తాడనీ, భోగాలను అనుభవించడం వలన కోరికలు చల్లారవనీ, పైగా అగ్నిలో నెయ్యి పోయటం వలన అది మరీ వృద్ధిచెందునట్లు భోగానుభవం వలన కోరికలు ఇంకా వృద్ధిచెందుతాయని మనువు చెప్పాడు.

"న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే" ॥ మను. 2.94

భోగవిలాసం కలవాడు ఎన్ని తపస్సులు చేసినా, ఎన్ని నియమాలు ఆచరించినా అవి ఫలించవనీ, ఇంద్రియాలను స్వాధీనం చేసుకొని మనస్సును కూడా నిగ్రహం చేసుకునేవాడు పురుషార్థాలన్నింటినీ సాధించగలడనీ, మనం పర్వదినాల్లో గురువులను, పెద్దలను దర్శించి వారి ఆశీస్సులు పొందాలనీ, మనువు చెప్పాడు. మనిషికి జీవితంలో ఆశాభంగం ఎదురైనా, దరిద్రం అనుభవించవలసి వచ్చినా 'ఇంక నా బ్రతుకింతే' అని నిరుత్సాహపడకుండా తనను తాను అవమానించుకోకుండా జీవితాంతం ఎల్లప్పుడూ తనకు మంచి శుభం కలుగుతుందని భావించాలనీ మనువు చెప్పాడు–

"నాత్మానమవమన్యేత పూర్వాభిరసమృద్ధిభిః ।
అమృత్యోః శ్రియమన్విచ్ఛేన్నైనాం మన్యేత దుర్లభామ్" ॥ మను. 4.137

ఈ విధంగా మనువు మనకు చూపించిన మార్గం ఇహ–పర సుఖదాయకమే కాక ఆత్మవికాస హేతువు కూడా. మనస్సును నిర్మలం చేసుకోవడానికీ, మోక్షార్హతను పొందటానికీ మానవుడు చేయవలసిన సాధనల నెన్నింటినో మనువు పేర్కొన్నాడు. మానవత్వం లేనివాడు మనిషి కాడనీ, మనిషి అంటే ఎలా ఉండాలి? ఏ ఏ లక్షణాల వల్ల పశుపక్షాదులకంటే, రాక్షసపిశాచాదులకంటే భిన్నుడుగా గుర్తింపబడుతున్నాడు? అనే విషయాలను మనుస్మృతిలో మనువు నిరూపించాడు.

మనువు చెప్పిన ఈ మానవ ధర్మాలు మానవ జాతి మనుగడకు మూలస్తంభాలు. జీవనపథ నిర్దేశాలు. మానవలోక సుఖసంతోషాలకు మార్గదర్శక సూత్రాలు. మనందరికీ శిరోధార్యాలు. అవశ్యం ఆచరనీయాలు

* * * * *

హిందీ భాష్యకారుని ఉద్దేశ్యం

ఈ భాష్యంలో ముందు వెనుకలగల శ్లోకాలలోని అభిప్రాయాల సమన్వయంతో మూలశ్లోకాల నిరూపణ, అసలైన అర్థాలను తెలియజెప్పుచూ మహర్షి దయానంద సరస్వతి భాష్యాన్ని జోడిస్తూ, మూల శబ్దాల నిర్వచనాలు చేస్తూ, ప్రక్షిప్త శ్లోకాలను ప్రసంగ వ్యతిరేకాలతో, శైలీగత ఆధారంగా విషయ వ్యతిరేకత, అంతర్ వ్యతిరేకతాది కారణాలతో నిరూపిస్తూ, వాటిని సమర్థించేందుకు ఇతరుల శాస్త్ర వాక్యాలను ఉదహరిస్తూ, వీటి మీద ప్రధానంగా ఆర్షవాక్యాలనే ఉద్ధరణగా ఇస్తూ, అక్కడక్కడ ఋషికల్పులైన ఆచార్యుల, ఆప్తులైన విద్వాంసుల ఆర్షవ్యతిరేకం కానివీ, యుక్తిసంగతాలూ అయిన ప్రయోగాలు చూపుతూ, ఇందులో మనువు యొక్క సనాతన, ఆధ్యాత్మిక, అర్థవంత వాక్యాలకు వ్యాఖ్యానం మీమాంసకుల పద్ధతిలో, ఏక వాక్యత ఉండే విధంగా చేస్తూ, సమయానికి తగిన అర్థాలను ఐతిహాసిక పద్ధతిలో అన్వయిస్తూ, దాని వల్ల ఆర్షీయమైన నిరుక్త పద్ధతే అంతటా సమానంగా గోచరింపజేస్తూ అవసరమైన చోట్ల విస్తారంగానూ, సంక్షిప్తంగానూ, కేవలం కావలసిన అర్థాలతోనే డా॥ సురేంద్రకుమార్ గారు ఈ భాష్యం రచించారు. ఈ విషయాలను ఇంతలోతుగా అవలోకనం చేసిన భాష్యకారుడు పాఠకులకు **'మనువు ఎప్పుడూ నేటి వాడే'** అనిపించేలా చేశారు.

"చారిత్రిక ప్రమాణాలతో యుగప్రళయం తర్వాత కూడా, ఈ యుగంలోవలెనే శిష్టుడైన మనువు తర్వాతి యుగాలలో, మళ్లీ మానవ సంతానాభివృద్ధి, ఆనువంశికంగా వచ్చే శాస్త్రాలు, ధర్మ కర్మల ప్రచారం చేస్తాడు. ఈ విధంగా ప్రతి మన్వంతరం లోనూ తప్పకుండా మనువు పేరు గల ఒక అధికారి మానవలోకంలో పుడుతూనే ఉంటాడు. మునుపటి యుగాలలోని ధర్మ కర్మలను, వాటి నియమాలను 'గుర్తు' చేసుకుని, వాటి ఆధారంగా సర్వజనాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వేదాలకనుకూలంగా అందరికీ ఉపయోగపడేవిధంగానూ **'స్మృతి'** గ్రంథాన్ని రూపొందిస్తాడు.

పైన చెప్పిన దాని ప్రకారం భాష్యకారుడు మనువును వేదాలు, వాటిని దర్శించిన అగ్ని, వాయువు, ఆదిత్యుడు, అంగిరుడు తదితరులవలె నిత్యుడని విశ్వసిస్తున్నట్లు తోస్తుంది. ఏ విధంగా వేదాలలోని కర్త ప్రతి కల్పారంభంలోనూ ఇవే అగ్ని మొదలైన పేర్లతో సంబంధితుడవుతాడో, అదే విధంగా స్మృతికారులు కూడా మనువు పేరుతోనే పిలువబడతారు. ప్రతి కల్పంలోనూ ఉద్భవించే ఆర్య ఋషుల సంఖ్య అనంతం. వారందరూ నిత్యులే. వారి పేర్లనే ఉపాధిగా భావించాలి. ఏ విధంగా ఋగ్వేదాన్ని పొందినవారి పేరు అగ్ని, యజుర్వేదాన్ని పొందిన వారి పేరు వాయువు, సామ వేదాన్ని పొందినవారి పేరు ఆదిత్యుడు, అథర్వవేదాన్ని పొందిన వారి పేరు అంగిరుడు అని చెప్పుకున్నామో, అదేవిధంగా ఈ నాలుగు వేదాలు పొందినవాడు బ్రహ్మదేవుడు. ఏ ప్రకారంగా వేదాలలోని విభిన్న సూక్తాలు, అధ్యాయాలలో పేర్కొన్న ఋషుల పేర్లు, అగ్ని మొదలైన వారి పేర్లు నిత్యమో, అదే ప్రకారంగా మనువుల పేర్లు కూడా నిత్యమై భాసిస్తాయి. మనువనే పేరున్న ఋషి స్మృతుల రచన చేస్తాడు, అతని ఆ రచనకు **'మనుస్మృతి'** అనే పేరు వస్తుంది.

నాలుగు పురుషార్థాలకూ వేర్వేరు గ్రంథాలున్నాయి. వాటి సమష్టి రూపమే **'మనుస్మృతి'**. ఎందుకంటే, ఆ నాలుగు పురుషార్థాలను బోధించే శాస్త్రమే ఇది. దీన్ని **'ధర్మశాస్త్రం'** అని ఎందుకు అంటారంటే, ఇందులో ధర్మానికి తగిన నిరూపణలున్నాయి. ఇది ధర్మాన్ని కూడా సాధించేదవుతుంది. మిగిలిన పురుషార్థాలనూ సాధించి నియమిస్తుంది కనుక, అన్నిటినీ కలిపి జోడించిన శాస్త్రం. మనుస్మృతిలోని అన్ని అధ్యాయాలలోనూ అంతటా నాలుగు పురుషార్థాలూ పరస్పర సంబంధాలు కలవిగా నిరూపితమైనా, **"వైశేష్య"** న్యాయంతో ఇందులోని మొదటి ఆరవ, పన్నెండవ అధ్యాయాల్లో క్రమంగా **'జగత్తుకు కారణం' 'సృష్టి ప్రారంభపు'** వర్ణన, **'వానప్రస్థ సన్న్యాస ధర్మాల'** కథనం, **'ఆధ్యాత్మికత'**ల ఉపదేశం నుంచి, **'ఆన్వీక్షకీ'** లేదా మోక్ష శాస్త్రం; రెండవ, మూడవ, పదకొండవ అధ్యాయాలలో క్రమంగా, 'సంస్కారాలు, బ్రహ్మచర్యం, వివాహం, యజ్ఞాలు మొదలైనవాటి **'ప్రాయశ్చిత్త'** విధానం నుంచి, ముఖ్యంగా **'త్రయీ'** విద్య లేదా **'ధర్మ శాస్త్రం'**, నాలుగవ, ఐదవ, పదవ అధ్యాయాలలో వరుసగా, జీవికావృత్తి, గృహస్థ ధర్మం, భక్ష్య అభక్ష్యాల విషయాలు, ద్రవ్యాలు మొదలైనవాటి శుద్ధి, జాతి, వర్ణ నిర్ణయం, 'ఆపద్ధర్మపు వ్యవస్థ విషయాలు; ఏడవ, ఎనిమిదవ, తొమ్మిదవ

అధ్యాయాలలో 'రాజధర్మం, వ్యవహారం, దుష్టులను నిగ్రహించడం' ఉన్నాయి. తర్వాత **'దండ నీతి'** లేదా **'అర్థ శాస్త్రం'** ప్రతిపాదితమైంది. ఇలా నాలుగు పురుషార్థాల సమావేశం ఈ ఒక్క మానవ ధర్మశాస్త్రంలోనే నిక్షిప్తమయ్యాయి. ఈ విద్యలకు చేసిన నాలుగు రకాల విభజననే 'అంతిమం'గా భావించరాదు. ఎందుకంటే అన్ని విద్యలూ పరస్పర సంబంధం కలవీ, పరస్పర ఆశ్రితాలు కూడా. **'అర్థ శాస్త్రం'** లోనూ జీవనోపాధి పురోగతి ఉంటుంది. కానీ **'అర్థమూ'**, ఉపాధీ **'కామాన్ని'** సాధించేవి. అందుకని వీటిని **'కామ శాస్త్రం'**తో జోడించారు. **'అర్థపు'** రక్షణ దండంతో జరుగుతుంది. కనుక, **'దండ నీతి'**ని **'అర్థ శాస్త్రం'** అన్నారు. ఇలా ఉంటాయి పరస్పర సంబంధం, ఆశ్రయమూ!

మొట్ట మొదటి రాజైన మనువు ఈ సర్వజ్ఞ దృష్టితోనే అన్నింటినీ ఈ గ్రంథంలో ఇమిడ్చాడు. అందుచేతనే ఈ **'మానవ సద్ధర్మశాస్త్రం'** ప్రజలైన మానవుల పట్ల సహజమైన కరుణామయ భావంతో నిండి ఉంటుంది. ఈ కారణం చేతనే మహాజనులైన మానవులారా ! జన సమాజాలన్నీ ఈ శాస్త్రపు అధ్యయనం, శ్రవణం, మననం చేయాలి. మహర్షులందరూ దీన్ని ధర్మం విషయంలో పరమ ప్రమాణగ్రంథంగా భావించి, తాము రచించిన అన్ని శాస్త్రాల ప్రామాణికత, ప్రతిష్ఠల కొరకు, ఎంతో ఆదరంతో దీనిలోని సిద్ధాంతాలనూ, వాక్యాలనూ పేర్కొన్నారు. ఇందులో వేదాల అర్థాల సంగ్రహం, ఉపదేశాలు ఉండటం చేత,మహనీయులందరూ దీన్ని ఆచార వ్యవహారాలకు ఎంతో కాలంగా వినియోగించుకుంటున్నారు. ఈ కారణం చేత కూడా మానవులందరూ శ్రేయోదాయకమైన, అభ్యుదయదాయకమైన ఈ మానవ ధర్మశాస్త్రాన్ని ఎల్లప్పుడు పఠించాలి, ఆచరించాలి.

అమూల్యమైన ఈ బృహద్గ్రంథపు అనువాద కార్యాన్ని స్వీకరించటంలో నాకు కలిగిన ఉత్సాహం, ఉత్కంఠ, అభిలాషలకు పైన చెప్పినవి కొన్ని కారణాలైతే, దయానంద మహర్షి పట్ల భాష్యకారుడు విద్వద్వరేణ్యుడైన సురేంద్ర కుమార్ గారికి గల గౌరవం మరొక కారణం. దీని రచనలో ప్రమాణాలుగా చూపిన గ్రంథాలలో ముఖ్యంగా **'ఋగ్వేదాదిభాష్య భూమిక, ఋగ్వేద భాష్యం, సత్యార్థ ప్రకాశం,' సంస్కారవిధి, చాణక్యుని అర్థశాస్త్రం, నిరుక్తం** మొ॥నవి ఇందులో ఎంతో సమ్మానపూర్వకంగా పేర్కొనబడ్డాయి. అంతే కాదు, ఆ యా చోట్ల మను సిద్ధాంతాల పుష్టి కొరకు, తన వ్యాఖ్యానంలోనూ సమాజంలో వ్యాపించి ఉన్న అంధ విశ్వాసాలను కడిగేస్తూ, దయానందమహర్షిని ఎంతో భక్తితో స్మరించుకున్నాడు. అలాగే ప్రక్షిప్తాల గురించి ఆయన రాసిన వాక్యాలు చదవదగినవి. ప్రక్షిప్తాలైన కల్పిత శ్లోకాలతో మనుస్మృతికి ఎంతో అపకారం జరిగింది. ఈ కల్పిత శ్లోకాలే హిందూ సమాజ పతనానికి దారి తీసిందనే విషయం రుజువైంది. అందుచేతనే ఆర్ష సంస్కృతి, ఆర్ష సాహిత్య పునరుద్ధరణ చేసిన దయానంద మహర్షి పురాణాలను అనార్షమూ, అప్రామాణిక మని భావించి వాటి ఖండన, బహిష్కారం చేశారు. ఇది చదివి స్వామివారికి పురాణాల ఉపయోగం ప్రయోజనాల గురించి తెలియదని, అందుకే వారు అలా, చెప్పారని మనం భావించటం అనుచితమే అవుతుంది. ఎందుకంటే వారి వేద భాష్యాలు, ఇతర గ్రంథాలలోని విషయ వివరణల వలన వారి సంస్కృత వాఙ్మయ విషయ ప్రతిభ స్పష్టంగా తెలుస్తూంది. స్వామివారు ఇతిహాస పురాణాలను పూర్తిగా అధ్యయనమూ, పరిశోధనా చేశారు. ఈ అన్ని విషయాలూ తెలిసే దయానంద మహర్షి పురాణాలను ఖండన చేశారు. అప్పటికి అది అవసరమని భావించారు. వారిలా చేయటం కొత్త విషయమేమీ కాదు. పూర్వం నుంచే లోక కల్యాణం కోరే మహాత్ములు ఇటువంటి పనులు చేస్తూనే ఉన్నారు. **"అతి సర్వత్ర వర్జయేత్"** – అన్నీ బాగా తెలిసినవారు సైతం సమాజానికి అనిష్టం జరుగుతున్నప్పుడు, తాత్కాలికంగా వాటిని వ్యతిరేకించవలసి వస్తుంది.

ఇంతకూ చెప్పవచ్చే దేమిటంటే, కృష్ణయజుర్వేదం మొదలుకొని పురాణాల వరకూ, కాలక్రమంలో కొత్త వాక్యాలు, ప్రకరణాల ప్రక్షిప్తం జరిగింది. విడివిడిగా వాటిపై గ్రంథాలూ వెలశాయి. ఈ కారణం చేతనే బహుశా, అన్ని గ్రంథాలలో వ్యతిరేక వాక్యాలు, అనవసరపు పునరుక్తులూ, దురుక్తులు, అతిశయోక్తులు, అబద్ధాలు – వీటితో సంకరమై పోయి, గుర్తించరానంత జటిలమయ్యాయి. ప్రాచీన ఋషుల పేర్లతో ప్రఖ్యాతి చెంది, వాటిపట్ల శ్రద్ధ చూపవలసినవయ్యాయి. మొత్తం దేశంలో అపాండిత్యం, దంభాచారం, గుడ్డినమ్మకాలు, మోసం మొదలైనవి ప్రబలాయి. పురాణాలలోని ఒక్కొక్క

U20 · AI Camera 2023.04.16 12:50

అనుష్టుప్ శ్లోకాన్ని పరమ ప్రమాణంగా నమ్మసాగారు; ప్రధాన పురాణాలకు వేర్వేరుగా వ్యాఖ్యానాలు వెలయించారు. 'పురాణాల' పట్ల 'అతి'గా భక్తి పెరిగింది. వాటిని గురించి విన్నవే ప్రజలకు విశ్వసించదగినవైపోయి, వాటి దుష్పరిణామాలుగా 'వేదాలు', 'బుద్ధి'-ఈ రెండిటికీ తిలాంజలులు ఇచ్చే స్థితి ఏర్పడింది. ఆ పరిస్థితులలో మహర్షి దయానందసరస్వతి హిందూసమాజంలో మరచిపోయే దశలో ఉన్న వేదాల వైపు మొగ్గే విధంగా సదుద్దేశ్యంతో, అప్పటికి పురాణాలను బహిష్కరించటమే ఖండించడమే అవసర మని అనుకున్నారు. ఎలాగంటే బౌద్ధానికి పూర్వం వేదాలలోని అక్షరాలకు పూజలు జరిగేవి. వేదాల పేరు మీద అనేక దురాచారాలు-దంబాచారాలు, యజ్ఞయాగాదుల పేరున మద్యమాంసాది దుర్వ్యవహారాలు ప్రబలినాయి.

ఆ దురాచారాల నుండి దూరం చేసి ప్రజలలో స్వతంత్ర ఆలోచనాశక్తిని జాగృతం చేయటానికి బుద్ధభగవానుడు **'వేదాల'** ఖండన అవసరమనుకున్నాడు. **'ఓల్డ్ టెస్టమెంట్'**ను మూఢంగా కొలిచేవారిని సమయానికి అనుగుణంగా మేలుకలిగించే సన్మార్గంలోకి తేవాలని ఏసుక్రీస్తు కొత్త సమాచారాన్ని (న్యూ స్టేట్‌మెంట్) వినిపించాడు. ఆ ప్రకారంగా ప్రాచీనత వెర్రి తలలు వేసినపుడు, నవీనత వైపు, నవీనతలో 'పరాకాష్ఠ' కలిగినపుడు ప్రాచీనత వైపూ సాధారణ ప్రజల దృష్టిని మల్లించేందుకు అప్పటి ఆచార్యులు ఒకదాని ఖండనా, మరొకదాని మండనా చేయవలసి వచ్చింది. దాన్ని అనుసరించే దయానంద సరస్వతి పురాణాలను బహిష్కరించారు.

నిజానికి సత్యమైన ఐతిహాసిక వాస్తవ మేమిటంటే, బుద్ధుడు, మహావీరుడు, శంకరులు రామానుజులు, రామానందులు, దయానందులు మొదలైన సాధుసంతులు, ప్రవర్తకాచార్యులు, వారి వారి సంప్రదాయాలు, ముఖ్యంగా సమాజంలో మార్పులు తేవడానికీ, ఆ యా సమాజాలలో ఆవిర్భవించారు. వీరందరూ వైదిక ఆర్య ధర్మం, సనాతన ఆర్ష - మానవ ధర్మాలను పునరుద్ధరించిన వారు. ఎప్పుడు విశుద్ధ వైదిక ఆర్య ధర్మమూ, సనాతన ఆర్ష - మానవ ధర్మమూ 'అసురులు, దస్యులు, అనార్యులు, కౌలులు, కాపాలికులు, వామాచారులు, వజ్రయానులు, అఘోర పంథులు, దుర్మార్గుల ద్వారా' వికృతమూ, కలుషితమూ, దూషితమూ అవుతాయో, అప్పుడు ఆర్యమానవ సమాజరూపుడైన విరాట్‌పురుషుడు, ఆ యా సమయానుకూలంగా, సమాజంలో మార్పులు తెచ్చే ఆచార్యులు, సంప్రదాయజ్ఞులను పుట్టిస్తాడు. భవిష్యత్తులోనూ ఈ విధంగానే జరుగుతుంది. "పరిస్థితే మనిషిని తయారు చేస్తుంది", "అవసరమే, దానికి తగిన వస్తువును సృష్టిస్తుంది"; ఇది నైసర్గిక నియమం.

ఈ దృష్టితో పరికిస్తే, అప్పుడు బుద్ధభగవానుడి నుంచి నేడు దయానందసరస్వతీ స్వామి వరకు అందరు ధర్మాచార్యులూ ఒకటే మహత్తమ వైదిక ప్రస్థాన పథంలో నడిచినవారే. వారే ఆర్యమానవ ధర్మానికి ప్రామాణికులూ అవుతారు. వీరిలో శంకరులు, రామానుజులు, రామానందులు, దయానందులు మొదలైనవారు ప్రత్యక్షంగానే వైదిక ధర్మోద్ధారకులు, హిందూ ధర్మాచార్యులుగా గణన కెక్కినవారు.

ఇవన్నీ వ్రాయడం ముఖ్య ఉద్దేశ్యం పాఠకులకు **'మనుస్మృతి భాష్యం'** రచయిత వైదిక సిద్ధాంతాల మర్మాలు గ్రహించినవారని, సుధీమణులైన విద్వాంసులని తెలియజేయటమే ! **శ్రీ సురేంద్రకుమార్ గారి** ఈ భాష్యం నిజంగానే **'మనుస్మృతి'** పునరుద్ధరణకు పునాదులు వేసినది. దీనిపై భవ్యమైన ధర్మసౌధం పునర్నిర్మాణమౌతుంది. **'వేదోఽఖిలో ధర్మమూలం'** అన్న సందేశం భవిష్యత్తులో సార్థకమౌతుంది.

తేదీ: డిసెంబర్ 8, 2022
శుభకృత్ మార్గశిర పౌర్ణమి
సరస్వతీ శిశు మందిరం
సైదాబాదు, హైదరాబాదు.

ఆర్య విద్వన్మణుల అనుయాయి
- మట్టి కృష్ణారెడ్డి ఆర్య
9441200322

* * * * *

మనుస్మృతి విస్తృత భూమిక

మొదటి అధ్యాయం

మనుస్మృతి గొప్పతనం, రచయిత, కాలం, తొలిరూపం

1.మనుస్మృతి మహత్త్వం

భారతీయసాహిత్యంలో మనువు రచించిన స్మృతికి, **'మనుస్మృతి'**, **'మనుసంహిత'**, **'మానవధర్మశాస్త్రం'**, **'మానవశాస్త్రం'** మొదలైన ఎన్నో పేర్లున్నాయి. రచనాకాలంలోనే అన్నిటి కంటే ప్రామాణికమూ, ప్రతిష్ఠ, ప్రాచుర్యం గల గ్రంథంగా పేరు గాంచింది. కాబట్టి, మనుస్మృతి భారతీయ సాహిత్యంలోనే అన్నింటి కంటే అత్యధికంగా చర్చించబడిన గ్రంథం. స్మృతులలో దీని స్థానం అన్నింటినీ మించినది. ఈ కారణం చేతనే మనుస్మృతి తరువాతి కాలంలో ఎన్నో స్మృతులు వచ్చినా దీని ప్రభావంముందు అవి నిలబడలేకపోయాయి, తమ ప్రభావం చూపలేక పోయాయి. కానీ ఎంతోకాలం గడిచినా **'మనుస్మృతి'** వైభవం మాత్రం నేటికీ కొనసాగుతూనే ఉంది.

మనుస్మృతి ఒక విధివిధానాలు విద్యుక్త నియామాలు గల శాస్త్రం. ఇందులో ఒక వైపు వర్ణాశ్రమ ధర్మాల రూపంలో వ్యక్తికీ, సమాజానికీ హితకరమైన ధర్మాలు, నైతిక కర్తవ్యాలు, మర్యాదలు, ఆచరణల వర్ణన ఉంటే, శ్రేష్ఠ సమాజ వ్యవస్థకు కావలసిన విధి విధానాలు, చట్టాల నిర్ధారణతో పాటు మరోవైపు వీటితో ముక్తిని కలిగించే ఆధ్యాత్మిక ఉపదేశాలు కూడా నిరూపించబడ్డాయి. అంటే భౌతికమూ, ఆధ్యాత్మికమూ అయిన అభ్యాసాల కలయికతో ఉన్న సాటి లేని ధర్మశాస్త్రం **'మనుస్మృతి'** అని చెప్పుకోవచ్చు. ఈ విధంగా మనుస్మృతి వ్యక్తులకు, సమాజాలకు ధర్మశాస్త్రమూ, ఆచారశాస్త్రమూ కావడంతో పాటుగా, సామాజిక వ్యవస్థను చక్కగా ఉంచే **'సంఘటిత శక్తి'** కూడా అవుతుంది. దీనికి ప్రపంచంలోనే **'ఆది సంవిధానం'** (World Constitution)గా గౌరవం కలిగింది.

మనుస్మృతికి ఇంతటి ఘనత, ప్రాచుర్యం కలగటానికి కారణం, వ్యక్తులకు, సమాజాలకు హితకారి కావడమే. ఇందులో వ్యావహారిక, సహేతుక విధివిధానాలు ఉండటమే కాకుండా, దీని ప్రాచీనత, వేదానుకూలత కూడా చెప్పుకోదగిన కారణాలు. అతి ప్రాచీనమూ, అత్యధిక గౌరవమూ, శ్రద్ధ చూపతగినది కావడం వల్లనే **'వేదాలు సమస్త భారతీయ సాహిత్య సంస్కృతులకూ మూలాధారం'**. అందు చేతనే మనువు కూడా తన స్మృతికి **'వేదాల'**నే ఆధారం చేసుకున్నాడు.

"వేదోఽఖిలో ధర్మమూలమ్" (మను. 2.6)- అంటే 'వేదాలే అన్ని ధర్మాలకూ మూలం' అని అతని దృఢ విశ్వాసం.

మనువు మనుస్మృతిలో వర్ణాలు, ఆశ్రమధర్మాల రూపంలో వ్యక్తులకు - సమాజాలకు మేలు చేసే ధర్మాలు, కర్తవ్యాలు, పద్ధతుల వర్ణనలను వేదాల ఆధారంగానే చేశాడు[1]. ధర్మజిజ్ఞాసలో వేదాలనే పరమప్రమాణంగా అంగీకరించాడు-

'ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః'- (మను. 1.132) [2.13] అంటే ధర్మం పట్ల జిజ్ఞాస గలవారికి వేదాలే పరమ ప్రామాణ్యాలు. వాటి నుంచే ధర్మ - అధర్మాలను నిర్ణయించుకోవాలి.

మనువుకు వేదాల పట్ల ఎంతో శ్రద్ధ ఉంది. అతడు వాటిని అపౌరుషేయాలని నమ్మాడు[2]. వేదాలు అపౌరుషేయాలు కావటం చేతనే భ్రాంతి లేని జ్ఞానం, ధర్మాలకు మూల ఆధారం, పరమ ప్రామాణ్యాలు. అందువల్లనే కుతర్కాలు వాటిని ఖండించలేవు. ఎవరు కుతర్కాల (వితండవాదాల) తో వేదజ్ఞానాన్ని ఖండిస్తారో, అవమానిస్తారో లేదా నిందిస్తారో వారిని

---

[1] 2.8,9

[2] 'విధానాస్య స్వయంభువః । అచిన్త్యస్యాప్రమేయస్య......'(మను. 1.3)

వేదాలు **“నాస్తికుడు”** అనే తిరస్కార పూర్వకమైన పదంతో పిలుస్తాయి-

తే సర్వార్థేష్వమీమాంస్యే తాభ్యాం ధర్మో హి నిర్బభౌ ।
యోఽవమన్యేత తే మూలే హేతుశాస్త్రాశ్రయాద్ ద్విజః । మను. 1.129 [2.10]
స సాధుభిర్బహిష్కార్యో నాస్తికో వేద నిందకః ॥ మను. 1.130 [2.11]

అంటే - శ్రుతి, స్మృతి గ్రంథాల నుంచే ధర్మం పుట్టింది కాబట్టి, వాటిని ఏ పరిస్థితులలోనూ చర్చ, నింద చేయకూడదు. అవి ధర్మాలకు మూలాధారాలు. తర్కశాస్త్రాన్ని ఆధారం చేసుకుని ఎవరైతే వితండవాదంతో వాటిని అవమానిస్తారో, నిందిస్తారో సజ్జనులు వారిని సమాజం నుంచి బహిష్కరించాలి. ఎందుకంటే 'వేదనింద చేసేవారు **'నాస్తికులు'**.

మనుస్మృతికి గౌరవాన్ని కలిగించే కారణాలలో ఒకదానికి విశేష ప్రాధాన్యం ఉంది. అదేమిటంటే మనువు తన కాలంలో తానే ప్రఖ్యాత దార్శనికుడు, తత్త్వ ద్రష్ట, ధర్మజ్ఞుడైన ఋషి కావడంతో పాటుగా ధర్మనిష్ఠ గల, న్యాయవిదుడైన రాజు కావడం కూడా. మనుస్మృతిలోని భూమికలో దీనికి ప్రమాణాలు ఉన్నాయి. గొప్ప ప్రభువూ, గొప్ప విద్వాంసుడూ, ధర్మాలను యథాతథంగా చెప్పగలవాడూ కాబట్టే జిజ్ఞాసువులైన ఋషులందరూ ఈ రచనకు మనువునే ఎంపిక చేసుకున్నారు. ధర్మాల మూలాధారాలు అపౌరుషేయాలు. అవి అచింత్యాలు, అపరిమిత జ్ఞానసంపద గలవి. ఇలాంటి వేదాలను తెలిసినవాడు, వాటిలో నిర్దిష్ట ధర్మాలు ఎరిగినవాడు కేవలం మనువే అని ఋషులకు తోచింది.[3] మనువు **“అమితౌజాః”**- అత్యధికమైన జ్ఞానశక్తి సంపన్నుడు.[4] వారి అగాధమైన విద్వత్తుకు సంకేతమేమిటంటే, వారు ధర్మప్రవచనాల అధికారాన్ని, “సంపూర్ణ బ్రహ్మచర్యంతో విధిపూర్వకంగా సాంగోపాంగంగా వేదాలు చదివినవారూ, వేదాల అర్థాలను సాకారం చేసుకున్నవారూ, ధార్మికులూ, పరోపకారులూ అయిన విద్వాంసులకే ఈ స్మృతి గ్రంథాన్ని బోధించారు”[5]. వారు పైన చెప్పిన విశిష్ట విద్వాంసుల మాటలూ, ఆచరణలే వారి శ్రద్ధకు ప్రమాణంగా స్వీకరించి ధర్మబోధ చేశాడు. స్వయంగా ఇంతటి విద్వాంసుడూ ప్రభువునైన మనువు ద్వారా చెప్పబడిన ధర్మ శాస్త్రపు ప్రామాణికత, ఘనతలను ఎవరైనా అంగీకరించవలసిందే.

ఈ అనేక కారణాల వల్లనే మొత్తం భారతీయ సమస్త సాహిత్యమంతటిలోనూ మనువు వచనాలు ఎంతో ఆదరణీయమయ్యాయి. ప్రామాణికంగా అంగీకరించబడ్డాయి[6].

అ. భారతదేశంలో మనుస్మృతి ప్రభావం-ఘనత

మనుస్మృతి తొలిరూపం ఏమిటో ఈ అధ్యాయంలోనే తరువాత చర్చిద్దాము. మను ధర్మశాస్త్రపు అస్తిత్వం వైదికకాలం నుంచే ఉందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. దీనికి సమర్థనగా చెప్పబడిన ఒకే రకమైన వాక్యాలు సంహితా గ్రంథాలు, బ్రాహ్మణాలలో కనబడుతున్నాయి.

---

3. 'భగవాన్....ధర్మాన్ నః వక్తుమర్హసి ॥ (మను. 1.2)
త్వమేకోఽహ్యస్య సర్వస్య విధానస్య స్వయంభువః ॥
అచింత్యస్యాప్రమేయస్య కార్యతత్త్వార్థవిత్ప్రభో, (మను. 1.3)
4. స తైః పృష్టస్తథా సమ్యక్ - అమితౌజాః ॥ (మను. 1.4)
5. యం శిష్టా బ్రాహ్మణా బ్రూయుః స ధర్మః స్యాదశఙ్కితః ॥ మను. 12.108
ధర్మేణాధిగతో యైస్తు వేదః సపరిబృంహణః ।
తే శిష్టా బ్రాహ్మణా జ్ఞేయాః శ్రుతిప్రత్యక్షహేతవః ॥ మను. 12.109
6. 12.113,106 110-112. ॥

“మనుర్వై యత్ కించావదత్ తద్ భేషజమ్”[7]

అంటే– **“మనువు చెప్పినవి మానవులకు భేషజం = ఔషధం, మందు వలె శుభమూ, స్వస్థతను కలుగజేసేవి”** అని.

ఈ వాక్యం ద్వారా, ఆ సమయంలో మనుధర్మశాస్త్రాన్ని అన్నింటి కంటే ప్రామాణికంగా భావించేవారనీ, ధర్మనిర్ణయంలో దీనికి అన్నింటినీ మించిన ఘనత ఉండేదనీ తెలుస్తున్నది. ఒకే విధంగా ఎన్నో గ్రంథాలలో లభించే ఈ వాక్యం, మను ధర్మశాస్త్రం ఆ కాలంలో బహుళ ప్రాచుర్యం పొందిందనీ, ఒక మందు వలె మేలు చేస్తుందని స్వీకరించేవారనీ సూచిస్తూంది. అందుచేతనే పై వాక్యం అంత ప్రసిద్ధి చెందింది.

నిరుక్తశాస్త్రంలో యాస్కమహర్షి ‘వారసత్వపు ఆస్తుల విషయంలో కొడుకులతో సమానంగా కూతుళ్లకూ అధికారం ఉంద’ని చెబుతూ, ఏదో ప్రాచీన గ్రంథంలోని శ్లోకాన్ని ఉటంకించి, మనువు అభిప్రాయాన్ని కూడా చెప్పాడు[8].

మనువు చెప్పిన సమానాధికారం గురించిన అభిప్రాయాలు మనుస్మృతిలో 9.130, 192, 212 శ్లోకాలలో ఉన్నాయి[9]. దీనివల్ల కూడా మనువు సూక్తులలోని విశేష ప్రామాణికత, ఘనత తెలుసుకోవచ్చు.

వాల్మీకి రామాయణంలో వాలి – సుగ్రీవుల యుద్ధ సందర్భంలో రాముడు వాలిని పడగొట్టిన తరువాత, గాయపడిన వాలి రాముడితో ‘ఈ పని ఉచితమా! ధర్మమా?’ అని అంటాడు. అప్పుడు రాముడు తన పని ‘సహేతుకమూ, ఉచితమూ’ అని చెప్పటానికి, మనుస్మృతిలోని వాక్యాలను ఉదహరిస్తాడు. రెండు శ్లోకాలను ఉదహరించి తాను చేసినది ధర్మానుకూలమే అని చెప్పాడు[10]. ఈ రెండు శ్లోకాలూ ఇప్పటి మనుస్మృతిలో కొన్ని పాఠాంతరాలతో 8.396,388 సంఖ్యలలో ఉన్నాయి. ఈ వచనాల వల్ల కూడా శ్రీరాముడి కాలంలో మనుస్మృతికి ధర్మ నిర్ణయం చేసేటప్పుడు అత్యంత ప్రామాణికతా, ప్రసిద్ధి, గౌరవమూ, ఘనత లభించాయి – అని తెలుస్తూంది.

మహాభారతంలోని ఎన్నో సందర్భాలలో మనువు విశిష్ట స్మృతికారుడుగా వర్ణించబడ్డాడు[11]. మహాభారతంలోని ఈ శ్లోకాల వల్ల, ఆ కాలంలో మనువు వచనాలను కుతర్కంతో ఖండించలేనివని భావించేవారు–

భారతం మానవో ధర్మః సాంగోపాంగశ్చికిత్సకః ।
అజ్ఞాసిద్ధాని చత్వారి, న హంతవ్యాని హేతుభిః ॥

అంటే – మహాభారతం (పాఠభేదాలతో పురాణం)[12], మనువు ద్వారా ప్రతిపాదించబడిన ధర్మం, సాంగోపాంగ విద్యాప్రాప్తి కలిగినవాడు, ధార్మిక విద్వాంసుల ఆజ్ఞతో కార్యాలు చేసినవాడు – ఈ నాలుగింటిలో హేతుశాస్త్రం ఆధారంగా కుతర్కం మొదలైనవాటి ద్వారా ఖండించరాదు.

దేవగురువైన బృహస్పతి తన స్మృతిలో స్పష్టంగా మనుస్మృతిని గొప్ప స్మృతిగా ప్రకటించాడు. దాని ప్రామాణికత, ఘనతలను కీర్తిస్తూ ఇలా అన్నాడు –

---

[7] తైత్తి.సం.2.2.10.2; 3.1.9.4 ॥ తాండ్యబ్రా.23.16.7 ॥ [8] నిరు. 3.4 ॥ అర్ధ సహితంగా శ్లోకాన్ని చూడండి – ఇదే తొలి అధ్యాయంలో ‘మనువు కాల నిర్ణయం’ శీర్షికలో ఉంది.

[9] **యథైవాత్మా తథా పుత్రః పుత్రేణ దుహితా సమా ।**
తస్యామాత్మని తిష్ఠంత్యాం కథమన్యో ధనం హరేత్ ॥ (మను.9.130)
ఆత్మ వంటివాడే పుత్రుడు. పుత్రుని వంటిదే పుత్రిక; ఆ ఆత్మరూపిణి అయిన పుత్రిక ఉండగా ఇతరులకు ధనం ఎలా వెళుతుంది? అంటే పుత్రుని వలెనే పుత్రిక కూడా ధనానికి అధికారిణి అవుతుంది.

[10] కిష్కిం–18.30,32. అర్ధ సహిత శ్లోకం చూడండి – ఇదే ప్రథమ అధ్యాయంలో **‘మనుస్మృతి కాలనిర్ణయం’** శీర్షికలో ఉంది.

[11] మహా. ఆది.73.89. శాంతి. 36.3; 56.33; 118.26; 121.10, 12; 201.32,33; 335.44,46 మొదలైనవి.

[12] నిరుక్త.4,19లో పురాణపదానికి నిర్వచనం చెబుతూ **“పురా నవం భవతీతి”** – అంటే పూర్వం కొత్తదీ, ఇప్పుడు కాదు అని. ఇలా పురాణపదం ఇతిహాస గ్రంథాలను పేర్కొనే వాచకం అయింది. దీన్ని ఆధారం చేసుకునే ఆ తరువాత, ఇతిహాస గ్రంథాలన్నిటికీ ‘పురాణాలు’ అనే పేరు వచ్చింది. ఇక్కడ పురాణ పదాన్ని 18 పురాణాలకూ స్వీకరించకూడదు. ఎందుకంటే నిరుక్తకారుడి కాలంలో వీటిలో ఏ పురాణాల రచన జరగలేదు. అన్ని పురాణాలూ ఆ తరువాతి రచనలే.

వేదార్థోపనిబద్ధత్వాత్ ప్రాధాన్యం హి మనోః స్మృతేః ।
మన్వర్థవిపరీతా తు యా స్మృతిః సా న శస్యతే ॥ సంస్కార ఖండం. 13 ॥
తావచ్ఛాస్త్రాణి శోభంతే తర్కవ్యాకరణాని చ ।
ధర్మార్థమోక్షోపదేష్టా మనుర్యావన్న దృశ్యతే ॥ సంస్కార ఖండం. 14 ॥

అంటే - వేదమంత్రాల అర్థాలను అనుసరించి రచించబడటం వల్ల, అన్ని స్మృతులలోనూ మనుస్మృతే అన్నింటి కంటే ప్రధానమూ, ప్రశంసనీయమూ. ఏ స్మృతి మనువు చెప్పిన అర్థాలకు వ్యతిరేకంగా ఉందో అది ప్రశంసాయోగ్యమూ కాదు; గ్రహించదగిందీ కాదు. తర్క వ్యాకరణాది శాస్త్రాలకు ఘనత ఎంతవరకంటే, ధర్మార్థ మోక్షాల ఉపదేశం ఇచ్చే మనువు లేనంతవరకే. అంటే మనువు ఉపదేశాల ముందు మిగిలిన అన్నిశాస్త్రాలూ వెలవెలబోతాయి అని.

మహాత్ముడైన బుద్ధుడు తన ఉపదేశాలలో మనుస్మృతిలోని శ్లోకాలూ, వాటికి అర్థాలూ ఉటంకించి వాటిని గౌరవించేవాడు. **'ధమ్మపదం'** బౌద్ధుల ధర్మగ్రంథం. దీంట్లో బుద్ధుని ఉపదేశాలు సంకలితమై ఉంటాయి. బుద్ధుడి కాలం దాదాపుగా 2600 ఏళ్ల క్రితమని చెబుతారు. మనువు శ్లోకాల పాలీ అనువాదాలు ధమ్మపదంలో లభిస్తాయి. అంటే మనుస్మృతి బౌద్ధం కంటే ముందరిది. బౌద్ధులకూ ప్రామాణికమూ, గౌరవనీయమూ అయిన గ్రంథం అని తెలుస్తున్నది. రెండు ఉదాహరణలు చూడండి-

మనుస్మృతిలో - **అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవినః ।**
చత్వారి తస్య వర్ధన్తే, ఆయుర్విద్యాయశోబలమ్ ॥ 2.121॥
ధమ్మపదంలో - **అభివాదన సీలస్య నిచ్చం బుడ్డాపచాయినో ।**
చత్తారో ధమ్మా వడ్ఢన్తి ఆయువిద్దో యసోబలమ్ ॥ 8.20॥
'మనుస్మృతిలో- **న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః ।** 2.156॥
'ధమ్మపదం"లో -**న తేన థేరోసి హోతి యేనస్య పలితం సిరో ।** 19.5॥

ఈ విధంగా బౌద్ధమహాకవి అశ్వఘోషుడు తన **'వజ్రకోపనిషత్'**లో తన వాదాన్ని సమర్థించుకొనేందుకు ఎన్నో మనువు శ్లోకాలను ప్రమాణరూపంగా ఉటంకించాడు. ఇతడు కనిష్కుడి సమకాలికుడు. ఇతడి కాలం క్రీ.శ.ఒకటో శతాబ్దమని చెబుతారు.

క్రీ.పూ. 500-400 నాటి మహాకవి భాసుడి **'ప్రతిమానాటకం'**లో రావణుడు చెప్పిన మాటలలో మనకు, ఆ నాడు మను ధర్మశాస్త్రం ను ఎంతో గౌరవంతో చదివేవారనీ, అది గొప్ప పాఠ్యగ్రంథాలలో ఒకటనీ తెలుస్తుంది. రావణుడు చెప్పిన ఆ వాక్యం -

రావణః- కాశ్యపగోత్రోఽస్మి సాంగోపాంగం వేదమధీయే ।
మానవీయం ధర్మశాస్త్రం, మాహేశ్వరం యోగశాస్త్రం చ...॥ పుట. 79

విశ్వరూపుడు తన యజుర్వేద భాష్యంలోనూ, యాజ్ఞవల్క్య స్మృతి భాష్యంలోనూ మనుస్మృతి శ్లోకాల నెన్నింటినో పేర్కొన్నాడు.

శంకరాచార్యులు వేదాంతసూత్ర భాష్యంలో మనుస్మృతి నుంచి ఎన్నిటినో చెప్పారు[13].

---

[13] విశ్వరూపుని యాజ్ఞ.స్మృ.భాష్యం. 1.45 ॥ వేదాంత భాష్యం. 1.3.28, 36; 2.1.1, 11; 3.1.14; 3.4.38; 4.2.6 ॥

క్రీ.శ.500లో జైమినిసూత్రాల భాష్యకారుడు శబరస్వామి తన భాష్యంలో మనువు వాక్యాలెన్నింటినో ఉదహరించాడు. యాజ్ఞవల్క్య స్మృతి భాష్యకారులలో ఒకడైన విజ్ఞానేశ్వరుడు యాజ్ఞవల్క్య స్మృతికి పుష్టి చేకూర్చేందుకు, మనువు శ్లోకాలను చాలానే ఉదహరించాడు[14].

గౌతముడు, వశిష్ఠుడు, ఆపస్తంబుడు, ఆశ్వలాయనుడు, జైమిని, బోధాయనుడు మొదలైనవారి సూత్ర గ్రంథాలలోనూ మనువు చెప్పినవాటిని సాదరంగా పేర్కొన్నారు[15].

కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో మనుస్మృతిని తన పద్ధతులకు ఆధారంగా ఒప్పుకున్నాడు, ఎన్నో చోట్ల మనువు అభిప్రాయాలను పేర్కొన్నాడు[16]. తమ ప్రామాణికతనూ, గౌరవాన్ని పెంచుకునేందుకో లేదా మనువు అభిప్రాయాలు గొప్పవని భావించో, ఎన్నో ఇతర గ్రంథాలు కూడా మనువును పేర్కొన్నాయి[17].

19వ శతాబ్దంలో ఆర్యసమాజ సంస్థాపకుడు మహర్షి దయానందసరస్వతి మనుస్మృతికి అన్నింటి కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. వారు ఒక్క మనుస్మృతినే ఆర్షమూ, ప్రామాణికమూ అని ప్రకటించి తమ అభిప్రాయాలకు ఆధారంగా చేసుకున్నారు. వారు తమ గ్రంథాలలో మనుస్మృతిలోని 524 శ్లోకాలను లేదా శ్లోకభాగాలను ప్రామాణికంగా ఉదాహరించారు.

ప్రాచీనకాలం నుంచీ మనుస్మృతికి అనుకూలమైన ఆచరణే ప్రతిష్ఠాసూచకంగా భావించబడుతూ వస్తున్నది. క్రీ.శ.571లో లభించిన వలభిరాజు ధారసేనుడి శిలాశాసనంలో, ఆ రాజు మనుధర్మశాస్త్రంలోని నియమాలను పాలించినవాడుగా పేర్కొని, అతని గొప్పతనం చెప్పబడింది.

అన్ని స్మృతిగ్రంథాలూ, ధర్మశాస్త్రాలలో ప్రాచీనకాలం నుంచి నేటివరకు, అత్యధికంగా టీకలూ, భాష్యాలూ మనుస్మృతికే రచించబడ్డాయి. ఇంకా రాయబడుతూనే ఉన్నాయి. ఇది కూడా మనుస్మృతి అత్యుత్తమమూ, సర్వాధిక ప్రభావం కలది అనటానికి నిదర్శనమే[18].

నేటి కాలంలోనూ పఠన - పాఠనాలు, అధ్యయన- మననాల్లో మనుస్మృతికే ప్రాచుర్యం ఉంది. హిందూ కోడ్ బిల్, రాజ్యాంగాల ప్రముఖ ఆధారం మనుస్మృతే. నేటి కోర్టులలోనూ న్యాయ నిర్ణయంలోనూ మనుస్మృతి పాత్ర చాలా ఉంది. హిందూ సామాజిక, రాజకీయ వ్యవస్థలను చెప్పే సందర్భాలలో మనుస్మృతిని పేర్కొనటం తప్పనిసరి అవుతూంది. దానివల్ల మార్గదర్శనమూ లభిస్తున్నది.

ఆ. విదేశాలలో మనుస్మృతి ప్రభావం- విదేశ విద్వాంసుల 'మను ప్రశంస'

మనువు 'మనుస్మృతి'కి కేవలం భారతదేశంలోనే కాకుండా విశ్వమంతటితోనూ సంబంధమున్నది. దీని ప్రభావం భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచంలోని సభ్యదేశా లెన్నింటిలోనో కనబడుతూంది. ప్రాచీనకాలంలోనే మనుస్మృతి ప్రాచుర్యం ప్రపంచం నలుమూలల దాకా సాగింది. అనేక దేశాల సంస్కృతి, సభ్యత, సాహిత్యం, ఇతిహాసాలు మొదలైనవాటిని మనుస్మృతి ప్రభావితం చేసింది. ఈ విధంగా మనువు, మనుస్మృతి - ఈ రెండింటికీ అంతర్జాతీయ లేదా ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉంది. మనువు, మనుస్మృతులకు తగినంత గుర్తింపూ, స్థాపనా ప్రపంచంలోని విద్వాంసులలో కలిగాయి.

---

14. యాజ్ఞ. స్మృతి.1.7; 53, 62, 68, 72, 79, 80; 2.1, 2, 5, 21, 26 మొదలైనవి.

15. గౌ.ధ.21.7 ॥ వాసి.ధ.1.17 ॥ ఆప.ధ.2.14.11 ॥ ఆప.శ్రౌ.3.10,35; 3.1.7 ॥ ఆశ్వ.శ్రౌ.9.7.2; 10.71 ॥ జై.గృ.1.24 ॥ బౌ.ధ.4.1.14,16 ॥

16. కౌటిల్యుని అర్థశాస్త్రం ప్ర.1.అ.1.ప్ర.10.అ.14 ॥ 17.స్మృతి చంద్రిక, నిర్ణయసింధువు, సంస్కారమయూఖ, శ్రీమత్ భాగవతం, దానహేమాద్రి, వ్రతహేమాద్రి మొదలైనవి;18. మేధాతిథి నుంచి నేటివరకు దాదాపుగా 10 ప్రసిద్ధ సంస్కృతభాష్యాలు లభిస్తున్నాయి. సంక్షిప్తమూ, పూర్ణమూ అయిన మనుస్మృతిపై మొత్తం దాదాపుగా 30 హిందీ టీకలు లభిస్తున్నాయి.

అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ మొదలైన దేశాలు ప్రచురించిన 'ఎన్‌సైక్లోపీడియా'లలో, **'ద కేంబ్రిజ్ హిస్టరీ ఆఫ్ ఇండియా'**లోనూ, శ్రీ కేవల్ మోట్వానీ రచన **'మనుధర్మ శాస్త్రం ఎ సోషలాజికల్ అండ్ హిస్టారికల్ స్టడీ'** అనే గ్రంథంలో మనువు చెప్పిన సత్యాల వర్ణన విస్తృతంగా చేయబడింది. ఈ రచయితలు మనువు, మనుస్మృతుల ప్రభావం ఏదో ఒక విధంగా చైనా, జపాన్, బర్మా, ఫిలిప్పీన్స్, మలయా, సయాం (థాయిలాండు), వియత్నాం, కాంబోడియా, జావా, చంపా (దక్షిణ వియత్నాం), ఇండోనేషియా, మలేషియా, బాలీ, శ్రీలంక, బ్రిటన్, జర్మనీ, న్యూజిలాండ్, రష్యా, సైబీరియా, తుర్కిస్తాన్, స్కాండినేవియా, స్లోవనిక్, గౌలిక్, ట్యూటానిక్, రోం, గ్రీసు, బాబిలోనియా, అస్సీరియా, టర్కీ ఇరాన్, ఈజిప్టు, క్రీట్, సుమేరియా, అమెరికా, అమెరికా ద్వీపాలు – వీటన్నిటిలోనూ ఉన్నట్లు చెప్పారు.

ఆగ్నేయ ఆసియా దేశాలలోని రాజ్యాంగాలు మనుస్మృతి ఆధారంగానే రూపొందాయి. వాటి రచయితలు 'మను' అనే పేరుతో వాటిని సమాదరించేవారట. ఇక్కడ మనువు, మనుస్మృతుల ప్రశంసలు, ప్రభావ విషయకమైన కొన్ని విదేశీయపు ఉటంకింపులు చూద్దాం –

క. చైనాలో లభ్యమైన పురాతత్త్వ ప్రమాణాలు–విదేశీయ ప్రమాణాలలో మనుస్మృతి మూల రూపమూ, దాని కాలసంబంధిత విషయాలు తెలిపే ఒక పురాతత్త్వ ప్రమాణం మనకు చైనా భాషలోని వ్రాతప్రతులలో లభిస్తుంది. 1932లో జపాను బాంబు విస్ఫోటం ద్వారా చైనావారి 'చారిత్రకమైన గోడ'ను కూల్చినప్పుడు, అందులో ఒక ఇనుప పెట్టె దొరికింది. అందులోని పుస్తకాలలో చైనీయుల ప్రాచీన పాండు లిపి ఉంది. ఆ వ్రాతప్రతులు సర్ ఆంగుత్స ఫ్రిట్స్ గేగ్రీ (Augits Fritz Geogre)కు దొరికాయి. అతడు వాటిని లండన్ తీసుకెళ్లి మ్యూజియంలో పెట్టాడు. ఆ వ్రాతప్రతులను ప్రొఫెసర్ ఆంటోనీ గ్రేమే (Prof.Anthony Graeme) చైనా భాషా విద్వాంసుల చేత చదివించాడు. వారి వల్ల, చైనా రాజు చిన్-ఇజ్-వాంగ్ (Chin-ize-wang)తన పరిపాలన కాలంలో, అన్ని ప్రాచీన గ్రంథాలనూ ధ్వంసం చేయాలనీ, దాని ద్వారా చైనా సంస్కృతికి సంబంధించిన అన్ని ప్రాచీన ప్రమాణాలూ నశించాలనీ ఆదేశించాడట! అప్పుడు కొన్ని గ్రంథాలను ఎవరో పుస్తక ప్రేమికుడు ఒక పెట్టెలో పెట్టి, చైనా గోడ కడుతున్న సమయంలో ఆ పెట్టెను ఆ గోడలో పెట్టించాడు. ఆ వ్రాతప్రతులలో ఒకదానిలో – **'మనుధర్మ శాస్త్రం' భారతదేశంలో అన్నిటి కంటే గొప్పది. అది వైదిక సంస్కృతంలో రాయబడింది. పదివేల సంవత్సరాల కంటే ప్రాచీనమైనది.** అని రాయబడి ఉందట. ఈ వివరణ శ్రీ కేవల్ మోట్వానీ గ్రంథం 'మనుధర్మశాస్త్ర : **ఎ సోషలాజికల్ అండ్ హిస్టారికల్ స్టడీ**'లో ఇవ్వబడింది. (పుట. 232).

ఈ చైనా ప్రమాణం మనుస్మృతి తాలూకు అసలైన కాల వివరణను ఇవ్వలేకపోయినా, మనువు ధర్మశాస్త్రం చాలా ప్రాచీనమైందనీ, పాశ్చాత్య రచయితల ద్వారా ఇవ్వబడిన కల్పిత కాల నిర్ణయం తప్పనీ నిరూపిస్తున్నది.

ఖ. 'ద కేంబ్రిడ్జ్ హిస్టరీ ఆఫ్ ఇండియా' లో ఆంగ్లేయ చరిత్రకారులు, ఆంగ్లేయులు భారతదేశం లోకి వచ్చినప్పుడు, భారతదేశమూ, అన్ని దక్షిణ, ఆగ్నేయ ఆసియా దేశాలైన బర్మా, కాంబోడియా, థాయిలాండు, జావా, బాలీ ద్వీపం, శ్రీలంక, వియత్నాం, ఫిలిప్పీన్స్, మలేషియా, ఇండోనేషియా, చైనా, రష్యాలోని కొన్ని ప్రాంతాలలోనూ రాజ్యాంగ విధానంగా మనుస్మృతికి అన్నిటినీ మించిన గౌరవం ఉండేదని రాశారు. ఈ రాజ్యాంగాల రచయితలందరూ ఎంతో గౌరవంతో **'మను'** అనే పేరును తమ పేర్లతో జోడించుకునేవారట ! అక్కడి శిలాశాసనాలలో ఉన్న మనుస్మృతిలోని శ్లోకాల ఉటంకింపులు దొరికాయి. బర్మా దేశపు రాజ్యాంగాల పేర్లు **'ధమ్మ థటం' 'మానవసారం'**; కాంబోడియా రాజ్యాంగం పేరు **'మానవనీతసారం'** లేదా **'మనుసారం'**. కాంబోడియా ప్రాచీన చరిత్రలో కాంబోడియావాసులు మనువు వంశజులని ఉందట. ఇదే ప్రకారంగా ఇరాన్, ఇరాక్‌ల ప్రాచీన చరిత్రలలో తాము స్వయంగా ఆర్యులమనీ, ఆర్యవంశీయుల మనీ ప్రకటించారు. ఈజిప్టు ప్రజలు తమను సూర్యవంశీయులుగా భావిస్తారు. వారి పిరమిడులలో సూర్యుడి చిత్రం కనిపిస్తుంది.

ఇది వారి సూర్యవంశీకతకు ప్రతీక.

గ. సంస్కృత సాహిత్యపు ప్రసిద్ధ చరిత్రకారుడు, పాశ్చాత్య రచయిత, ఏ.బి.కీత్ తన **‘ఎ హిస్టరీ ఆఫ్ సంస్కృత్ లిటరేచర్’**లో మనుస్మృతి ప్రభావాన్నీ, ప్రశంసలనూ ఇలా పేర్కొన్నాడు.

"The Influence of the text is attested by its acceptance in Burma siam (Thailand) and Java as authoritative and production of works based on it." (P.445)

అంటే – “బర్మా, థాయిలాండు, జావా మొదలైన దేశాలలో మనుస్మృతిని స్వీకరించటంలోని ప్రామాణికత, అధికారిక ప్రభావం, అక్కడి రాజ్యాంగంపై – మనుస్మృతి మూలాధారంగా ఉండటం వల్లనే అక్కడి రాజ్యాంగాలు మనుస్మృతిని ఆధారం చేసుకునే రాయబడ్డాయి”– అని.

The Smriti of Manu not to guide the life of any single community, but to be a general guide for all the classes of the state." (P.404)

అంటే – “మనువు రచించిన స్మృతి (మనుస్మృతి) ఏదో ఒక సముదాయానికే జీవన పథాన్ని చూపించేది కాదు, ప్రపంచంలోని అన్ని సముదాయాలకూ సమానరూపంతో జీవిత మార్గాన్ని చూపుతుంది”– అని.

ఘ. జర్మనీకి చెందిన విఖ్యాత దార్శనికుడు ఫ్రెడరిక్ నీత్సే, **“బియాండ్ నిహిలిజం– నీత్షే, వితవుట్ మార్క్స్”** అనే పుస్తకంలో **“మనుస్మృతి – బైబిల్”**ల తులనాత్మక పరిశీలన చేసి, ‘మనుస్మృతి బైబిలు కంటే ఉత్తమ శాస్త్రమనీ, అందుచేత బైబిలును వదిలేసి మనుస్మృతినే చదవా’లనీ నినదించాడు. నీత్సే –

"How wretched is the new testament compared to Manu. How faul it Smalls" (P.41) "Close the bible and open the cod of manu." (The will to power', Vol.I, Book II, P.126)

అంటే – **‘మనుస్మృతి బైబిలు కంటే ఉత్తమ గ్రంథం. బైబిలు నుండి అశ్లీలత, చెడుల దుర్గంధం వస్తూంది. బైబిలు మూసిపెట్టండి, మనుస్మృతి చదవండి! అని’.**

ఙ. భారతరత్న శ్రీ పి.వి.కాణే – ఇతడు ధర్మశాస్త్రాల ప్రామాణిక చరిత్రకారుడు, పరిశోధకుడు. తన **‘ధర్మశాస్త్ర చరిత్ర’** అనే బృహత్ గ్రంథంలో ఇలాంటి విషయాలే చెప్పాడు. ఆయన –

‘మనుస్మృతి ప్రభావం భారతదేశం బయట కూడా పడింది. చంపా (దక్షిణ వియత్నాం) కు చెందిన ఒక రికార్డులో మనువు శ్లోకాలెన్నో లభిస్తాయి. బర్మాలో **‘ధమ్మథటం’** ఉంది, దానికి మనువు ఆధారం. బాలీ ద్వీప న్యాయశాస్త్రం మనుస్మృతి ఆధారంగానే వచ్చింది (భాగం. 1.పుట. 47).

చ. ఆసియా చరిత్రపై ప్యారిస్ యూనివర్సిటీ నుంచి డి.లిట్ పురస్కారం, ఇంకా ఎన్నో పురస్కారాలు పొందిన చరిత్రజ్ఞుడు డా॥ సత్యకేతు విద్యాలంకార్ **‘ఆగ్నేయ ఆసియా, దక్షిణ ఆసియాల్లో భారతీయ సంస్కృతి’** పుస్తకంలో ఈ విషయానికి సంబంధించిన ఎన్నో విషయాలు చెప్పారు. అవి –

1. “ఫిలిప్పీన్స్‌వాసులు వారి ఆచారసంహిత మనువు, లాగోత్సే స్మృతులు ఆధారంగా రచించబడ్డాయని నమ్ముతారు. అందుకనే అక్కడి పార్లమెంటు ద్వారం మీద ఈ రెండు మూర్తులనూ ప్రతిష్ఠించారు.” (పు. 47)
2. “చంపా (దక్షిణ వియత్నాం) రికార్డులు, రాజకీయ శిలాశాసనాల వల్ల అక్కడి న్యాయానికి ప్రధానంగా మనువు, నారదుడు, భార్గవుల స్మృతులు, ధర్మశాస్త్రాలు ఆధారమని తెలుస్తూంది. ఒక రికార్డు ప్రకారమైతే, ఇంద్రవర్మదేవ మహారాజు మనువు మార్గం (మనువు ప్రతిపాదించిన మార్గం) అనుసరించేవాడు.” (పు. 254)

U20 · AI Camera 2023.04.16 12:51

3. "చంపా (దక్షిణ వియత్నాం) లో జీవితం వర్ణాశ్రమ ధర్మ వ్యవస్థపై ఆధారపడి నడిచేది ....రాజు వర్ణాశ్రమ వ్యవస్థ ఉన్న గ్రంథాన్ని ఆదర్శంగా ఎప్పుడూ తన ముందు ఉంచుకునే వాడు. క్రీ.శ.1799 నాటి మొదటి ఇంద్రవర్మ మహారాజు రికార్డులలో అతని రాజధానిని గురించి ఇలా రాయబడింది.... అక్కడ వర్ణాలు, ఆశ్రమాలు ఎంతో చక్కగా సరైన వ్యవస్థలో ఉండేవి."(**= నిరుపద్రవ వర్ణాశ్రమ-వ్యవస్థితిః**) (పు.257)

4. **"ధమ్మ థటం లేదా ధమ్మ సథం"** అనేది బర్మాదేశీయుల ఆచారాలు, న్యాయాలు తెలియజేసే గ్రంథాలు. వీటికి మనుస్మృతి మొదలైన స్మృతి గ్రంథాలు ఆధారం. పదహారవ శతాబ్దంలో బుద్ధఘోషుడు దీన్ని **'మనుసారం'** అనే పేరుతో పాలీభాషలోకి అనువదించాడు. ఈ ధమ్మథటానికి **'మనుసారం'** అనే పేరే **'మనుస్మృతి'** లేదా **'మానవ సంహిత'** ఆధారంగా రచించినదని తెలియజేస్తుంది. 'ధమ్మసథం' వర్గానికి చెందిన 17వ, 18వ శతాబ్దాలలో బర్మాలో వచ్చిన ఎన్నో గ్రంథాలన్నిటిలోనూ మనువు పేరు కనిపిస్తూనే ఉంటుంది" (పు.297).

5. "కాంబోడియావాసులకు మనుస్మృతి చాలా బాగా తెలుసు. ఉదయవీరవర్మ మహారాజు **'సదోక్ కాకథేం'** లో లభించిన రికార్డులలో **'మానవ నీతిసారం'** పేర్కొనబడింది. ఇది మానవ సంప్రదాయపు నీతి విషయక గ్రంథం. యశోవర్మ **'ప్రసతకోమన'** లో లభించిన రికార్డులోనూ మనుసంహితలోని ఒక శ్లోకం ఇవ్వబడింది. ఇది మనుస్మృతిలో 2వ అధ్యాయంలో 136వ శ్లోకంగా కనిపిస్తుంది.". ఇందులో మర్యాదలను గురించిన వ్యవస్థ వివరించబడింది(పు.198).

6. "క్రీ.శ.668లో జయవర్మ పంచమ కంబుజ్ (కాంబోడియా) రాజయ్యాడు..... ఒక రికార్డులో ఇతన్ని గురించి ఇలా ఉంది - **"వర్ణాశ్రమాలను దృఢమైన ఆధారాలతో స్థాపించి భగవంతుణ్ని ప్రసన్నం చేసుకున్నాడు."** (పు.149)

7. "మొదటి జయవర్మ మహారాజు రికార్డులో ధర్మశాస్త్రాలు, అర్థశాస్త్రాలు తెలిసిన ఇద్దరు మంత్రులు పేర్కొనబడ్డారు. **'మనుసంహిత'** లాంటి గ్రంథం ధర్మశాస్త్రంగా ఉండేది.... కంబుజ్ (కాంబోడియా) లో విశేష ప్రాచుర్యం గల **"ధర్మశాస్త్రాలలో మనుసంహితకు విశిష్టస్థానం ఉండేది"** (పు.198).

8. బాలీద్వీపం (ఇండోషియా) లో నేటికీ వర్ణవ్యవస్థ ప్రాచుర్యంలో ఉంది. అక్కడ నేటికీ వైదిక వర్ణవ్యవస్థ ప్రభావం వల్ల ఉన్నత జాతులను **'ద్విజాతి'** అనీ, శూద్రులను **'ఏకజాతి'** అనీ అంటారు. ఈ పేర్లు మనువు 10.4వ శ్లోకంలో చెప్పాడు. **"అక్కడ శూద్రుల పట్ల భేదభావం గానీ, ఎక్కువ తక్కువలు, అంటరానివారు మొదలైన వ్యవహారాలేవీ లేవు. ఇదే మనువు చెప్పిన వర్ణవ్యవస్థ యొక్క వాస్తవరూపం"** (పు.19,114).

ఛ. యూరప్‌కు చెందిన ప్రసిద్ధరచయిత పి.థామస్, తన 'Hindu Religion, customs and mannors'లో మనుస్మృతికి వేదాల తరువాత అంత ఘనత ఉందని చెప్పాడు.

"The code of manu is of great autiquity only less ancient then the three vedas." (P.102)

అంటే - **"మనుస్మృతి అత్యుత్తమ స్థానంలో ఉంది. వేదాల తర్వాత దీనికే అంత గొప్పతన ముంది**-అని.

జ. అమెరికాలో ప్రచురితమైన **'ది మేక్మిలన్ ఫ్యామిలీ ఎన్‌సైక్లోపీడియా'**లోనూ మనువును మానవజాతి ఆది పురుషుడు, తొలి సమాజ వ్యవస్థాపకుడనీ పేర్కొన్నారు.

"Manu is the progenitor of the human race. He is thus the lord and guardian of the living." (P.131)

అంటే - **"మనువు మానవజాతికి ఆది పురుషుడు. అతడు తొలి ఆది సమాజపు వ్యవస్థాపకుడు లేదా తొలి నాగరిక పథ ప్రదర్శకుడైన రాజు"**- అని.

ఝ. రష్యా సమాజ శాస్త్రజ్ఞుడు, పి.డి. ఓస్‌మేన్స్కీ తన పుస్తకంలో 'A New model of universe' లో **"మనుస్మృతిలోని వర్ణవ్యవస్థను బాగా ప్రశంసిస్తూ, దాన్ని ప్రపంచంలోని సర్వోత్తమ సమాజ వ్యవస్థ"**గా పేర్కొన్నాడు.

“మనువు చెప్పిన వర్ణాశ్రమ వ్యవస్థ మానవ సమాజపు శ్రేష్ఠమైన వ్యవస్థ. గుణధర్మాలు ఆధారంగా ఏర్పడిన వర్ణవ్యవస్థ కంటే శ్రేష్ఠమైన మరొక సమాజ వ్యవస్థ లేనే లేదు. మనువు వర్ణవ్యవస్థ, సామ్యవాదం, పెట్టుబడిదారుల వాదం – ఈ రెండిటిలోనూ ఏ దోషాలూ లేవు. కానీ ఈ 'మనుస్మృతి' లో ఈ రెండిటి విశేషాలూ ఉన్నాయి. మనువు చెప్పిన వర్ణవ్యవస్థ పునః స్థాపిత మైతేనే కానీ మానవజాతి సమగ్ర అభివృద్ధి సాధించలేదు.”

ఞ. ప్రసిద్ధ ఇంగ్లాండు రచయిత డా॥ జి.హెచ్. మీజ్ “వర్ణవ్యవస్థలోని మొదటి మూడు వర్ణాలుగా సమాజాన్ని విభజిస్తే, ఆ వ్యవస్థ ఉండటం వల్ల భూమి స్వర్గంగా మారిపోతుం”దన్నాడు. (వర్క్, వెల్త్, అండ్ హాపీనెస్ ఆఫ్ మాన్‌కైండ్).

ట. ప్రపంచంలో ఈ వ్యవస్థ ప్రాచుర్యాన్ని గురించి డా.అంబేద్కర్ ఇలా చెప్పాడు – “చాతుర్వర్ణ పద్ధతి.....ఇది ప్రపంచమంతటా వ్యాపించింది. ఈజిప్టువాసులు కూడా పాటించారు. ప్రాచీన ఫారస్ జనంలోనూ ఉండేది. ప్లాటో ఈ వ్యవస్థను గురించి ఎంతగా సంతోషించాడంటే, దీన్ని సామాజిక సంస్థ లన్నిటికీ ఆదర్శరూపమని అన్నాడు.”(డా.అంబేడ్కర్ వాఙ్మయ ఖండం7, పు.210).

ఠ. మేడం అనీబిసెంట్ (జర్మనీ) మనుస్మృతిని ప్రశంసిస్తూ “నేటి సమస్యలు నిండిన దైనిక ప్రశ్నలకు సమాధానాలతో కూడినది 'మనుస్మృతి' కనుక, భారతీయులకే కాక ఆంగ్లేయులకూ సమానంగా ఉపయోగపడుతుంది” అన్నది. (ది సైన్స్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, భూమిక, పు.27, భగవాన్‌దాస్).

డ. బెల్జియం మేధావులూ, రచయితలూ 'మనుస్మృతిని అధ్యాత్మజ్ఞానం, రాజ్యాంగ ప్రమాణాల విషయంలో సర్వశ్రేష్ఠ గ్రంథం'గా భావిస్తారు. 'ఇది జీవిత సత్యాలను ప్రతిపాదిస్తుం'దని వారంటారు. (ద గ్రేట్ సీక్రెట్ పు.95).

ఢ. మేడం హెచ్.పి. బ్లావట్స్కీ తన 'ఐసిస్ అన్‌వెయిల్డ్' లో మనుస్మృతిని మొట్టమొదటి జ్ఞాన ఆధారంగా ప్రతిపాదించింది. పురాతత్త్వవేత్త వి.గార్డన్ చైల్డ్ దీన్ని సమర్థించాడు, (కేవల్ మోట్వానీ రచించిన మనువు పేర్కొన్న గ్రంథం.పు.197-201).

ణ. సంస్కృత విద్వాంసుడూ, బ్రిటన్‌కు చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీవారి భారత దేశపు సుప్రీం కోర్టు న్యాయాధీశుడూ అయిన సర్ విలియం జోన్స్, మనుస్మృతి ఆంగ్ల అనువాదపు భూమికలో మనుస్మృతిలోని ఎన్నో విశేషాలను చెబుతూ ఇలా రాశాడు –

A spirit of Subline devotion, of behevolence to mankind, and the amiable tenderness to all sentiment creatures pervades the whole work; the style of it has certain austere majesty that sounds like the language of legislation and extorts a respectful awe; the sentiments of independence on all being but God, and the admonitions even to the kings are truely noble. Illustitutes of Hindu Law the ordinances of Manu according to the gloss of kulluka. (Verbally translated from the original Sanskrit with a pretace. P.S.1884)

అంటే – “మనుస్మృతిలో గంభీరమైన భావాలున్నాయి. మానవత పట్ల ఉదారభావా లున్నాయి. ఇందులో జీవులందరి పట్లా సౌమ్యమైన సానుభూతి అంతటా వ్యక్తమవుతుంది. దీనిలోని శైలి మామూలుగా గంభీరంగా, చేయవలసిన పనులను సామాన్యులకు చెప్పే భాషలో ఉంది. పాఠకులను ఈ శైలి సాదరంగానే ఆకర్షిస్తుంది, విస్మితులనూ చేస్తుంది. భగవంతుడికి తప్ప వేరెవ్వరికీ భయపడని స్వతంత్రభావాన్ని మేల్కొలుపుతుంది. సమ్రాట్టులైనా తప్పులు చేస్తే మందలించవచ్చునే భావాలు ఉన్నాయి. ఇవన్నీ కచ్చితంగా ఉత్తమమైనవి.”

మనువు పద్ధతుల పట్ల ఇలాంటి పొగడ్తలతో కూడిన, వివరణతో కూడిన అభిప్రాయాలను విదేశీ విద్వాంసులు వెలిబుచ్చారు.

vivo U20 · AI Camera 2023.04.16 12:51

ఇ. విదేశీ రచయితల అభిప్రాయంలో మనువే 'తొలి శాసన సృష్టికర్త'

ప్రాచీనకాలంలో మనువు ఖ్యాతి ప్రపంచమంతా వ్యాపించింది, అది నేటికీ నిలిచి ఉంది. అంతర్జాతీయ స్థాయిలో అతనికి లభించిన ఘనత భారతీయులందరికీ గర్వకారణం. దానికి కొన్ని ప్రమాణాలు చూడదగినవి –

త. అమెరికావారు ప్రచురించిన 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ది సోషల్ సైన్సెస్'లో మనువును 'తొలి రాజ్యాంగ దాత' గానూ, మనుస్మృతిని అన్నటికంటే ఖ్యాతిగాంచిన 'రాజ్యాంగశాస్త్రం' గానూ గౌరవించారు.

"Theroughout the father east Manu is the name of the founder of law. Manu Law. book are knoun....in Later times the name 'MANU' became a title which was given to juristic writers of exceptional eminence." (P.260)

అంటే – "ప్రాగ్దేశాలలో సుదూరతీరాల వరకు మనువు పేరు 'రాజ్యాంగ ప్రతిష్ఠాపకు'ని రూపంలో వ్యాపించింది. మనువు రచన (మనుస్మృతి) కూడా సుప్రసిద్ధమే. తరువాతి కాలంలో మనువు పేరు ఎంతగా మారుమోగిపోయిందంటే, ఆ దేశాలలో రాజ్యాంగ నిర్మాతలందరికీ 'మనువు' అనే పేరు జోడించబడసాగింది. వారిని 'మనువు' అనే పిలిచేవారు."

థ. సంస్కృత సాహిత్యపు ప్రసిద్ధ విమర్శకుడూ, విద్వాంసుడూ అయిన ఎ.ఎ.మేక్డొనాల్ తన **'ఎ హిస్టరీ ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్'**లో మనుస్మృతిని అన్నిటికంటే ప్రాచీనమూ, గొప్పదీ అయిన రచనగా పేర్కొన్నాడు–

"The most important and earliest of the matricol smrities is the Manava Dharm Shastra, or cod of Manu." (P.432)

అంటే –"స్మృతులలో అతి ప్రాచీనమూ, ప్రధానమూ అయిన ధర్మశాస్త్రం ఒకటుంది. దానినే మనుస్మృతి అంటారు".

ద. యూరోపియన్ రచయిత పి.థామస్ తన 'Hindu Religion Customs and Manners' గ్రంథంలో, మనువును భారతీయుల **'తొలి రాజ్యాంగపు ప్రదాత'**గా పేర్కొని, మనుస్మృతిని అతి ప్రాచీనమూ, అతిప్రధాన **"రాజ్యాంగం"**గా భావించాడు.

"Manu seems to have been the first law-giver of indo aryans and all Latter law givers accept his authority as Unquestionable."(P.102)

అంటే–"మనువు భారతీయులకూ, యూరోపీయ ఆర్యులకూ ప్రథమ సంవిధాన ప్రదాత. అటు తరువాతివారందరూ తమ రచనల కంటే మనుస్మృతియే సందేహరహితమైనదిగా –అనుమానాలకు సమాధానం యిచ్చునది గా చెబుతారు".

ధ. జర్మనీదేశీయుడైన ప్రసిద్ధ దార్శనికుడు ఫ్రేడరిచ్ నీత్సే **'దివిల్ టు పవర్'** అనే తన పుస్తకంలో మనుస్మృతిని ఒక ఉత్తమ పఠనీయ గ్రంథమని పేర్కొన్నాడు. మనువు మానవజాతికి ఆ స్మృతిని ప్రదానం చేసినవాడు –

Close the Bible and open the code of Manu (Vol-1, Book-II, P.126)

అంటే–"బైబిలు చదవడం ఆపేసి మనుస్మృతిని చదవండి"–అని.

న. యూరోపియన్ రచయిత లూయిస్ రేనో తన **'రిలిజియన్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియా'**లో మనుస్మృతిని న్యాయబోధ చేసే శాస్త్రంగా పేర్కొన్నాడు –

"The laws of Manu provide a good illistration of the interlacing of themes in Indian literature, here we have a legislative text, or at any rate a book of legal maxims." (P.49)

అంటే – **“మనువు న్యాయపద్ధతి చాలా మంచి శిక్షణ నిచ్చేది. ఆ పద్ధతులు భారతీయ సాహిత్యంతో కలిసి ఉంటాయి. మనువు గ్రంథం న్యాయ విధివిధానాలను తెలిపే రాజ్యాంగ గ్రంథం”.**

ప. న్యూ జెర్సీ (అమెరికా) లో ప్రచురితమైన ‘ద మాక్‌మిలన్ ఫ్యామిలీ ఎన్‌సైక్లోపీడియా’లో హిందూన్యాయంలో మనుస్మృతిని ప్రముఖ స్మృతిగా భావిస్తారు.

"Manu, his name is attached to the most important codidication of Hindu law, the Manava-dharam shastra (Law of Manu)" (Vol.13,P.131)

అంటే– **“మానవధర్మశాస్త్రం – మనుస్మృతి హిందువుల విధివిధానాలకు చాలా ప్రధానమైన ఒక సంహిత. దానిరచయిత మనువు”.**

ఫ. సంస్కృత సాహిత్య విమర్శకుడు, రచయిత ఎ.బి.కీత్ తన **‘ఎ హిస్టరీ ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్’** లో మనువును న్యాయదాత, న్యాయమూర్తిగా అంగీకరించాడు.

"Manu, he was the renewer of secrificial ordinances and the dispenser of maxims of justice." (P.440)

అంటే – **“మనువు ధార్మిక విధులనూ, న్యాయవిధానాలనూ ఇచ్చిన తొలిదాత”** అని.

బ. **‘ప్రిన్సిపల్ ఆఫ్ పొలిటికల్ సైన్స్’**లో ఆర్.ఎన్.గిల్ బ్రిస్ట్ మనుస్మృతిని అన్నిటి కంటే ప్రభావవంతమైన భారతీయ న్యాయశాస్త్రంగా చెప్పాడు–

"The Most influential basis of Hindu law is the code of Manu." (P.163)

అంటే–**“మనుస్మృతి హిందూ న్యాయశాస్త్రరూపంలో అన్నిటి కంటే ప్రభావవంతమైన న్యాయం”**– అని.

విదేశీ సాహిత్యంలో మనువును మొదటి చట్ట– సంవిధాన శాస్త్రప్రదాత గా చెప్పడం పూర్తిగా సబబే. ఈ గౌరవనీయ బిరుదుకు **‘మనువు’** సహజంగానే అధికారి అవుతాడు. **“ఇవాళ కొందరు భారతీయులు తమ పూర్వజుడైన మనువును నిందిస్తూ, తమ అజ్ఞానాన్ని చాటుకుంటూ తమ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, నాగరికతలతో తమ పూర్వీకులను స్వయంగా తామే అవమానిస్తున్నారు. విదేశీయులు ఎందరో మనువును గౌరవిస్తున్నారు.”**

ఈ. మనుస్మృతిపై విదేశీ విద్వాంసుల పరిశోధనలు-భాష్యాలు

ప్రపంచమంతా మనుస్మృతి ప్రభావమూ, భారతదేశము, చుట్టుపక్కల దేశాలలో దాని గొప్పతనం చూసి, అనేకమంది విదేశీ విద్వాంసులు మనుస్మృతి పట్ల ఆకర్షితులయ్యారు. వారు మనుస్మృతిపై అనేక గ్రంథాలు రచించారు. వాటిలో ప్రముఖమైనవాటి వివరణ చూద్దాం. ఇవన్నీ మనుస్మృతి ప్రఖ్యాతిని అంగీకరించాయి.

1786లో మనుస్మృతి ఆధారంగా రచించిన ఫారసీగ్రంథాల ఆంగ్ల అనువాదాలు ప్రచురించ బడ్డాయి. 1794లో సర్ విలియం జోన్స్ రచించిన ఆంగ్ల అనువాదం ముద్రితమైంది. అతడు న్యాయాధీశుడుగా మన దేశానికి వచ్చాడు. ఇక్కడి సమాజంలో మనుస్మృతి గొప్పతనాన్ని చూసి, ఒక విద్యార్థిలాగా చదివాడు. 1825లో జిసి హాగ్టన్ అనువాదం ముద్రించారు. ఫ్రెంచ్ భాషలో 1833లో పార్.ఏ.లాసల్యూర్ డైస్ లాంగ్ చాంప్స్ 'LOIS DE MANOU' అను గ్రంథాన్ని ముద్రించాడు. అది మనుస్మృతికి భాష్యమూ, వివరణ కూడా. 1884లో హాప్‌కిన్స్ **‘ద ఆర్డినెన్స్ ఆఫ్ మను’** (The Ordinances of Manu)వచ్చింది. 1886లో ఆక్స్‌ఫర్డ్ **‘ది సీక్రెడ్ బుక్స్ ఆఫ్ ద ఈస్ట్ సీరీస్’** లోని 24వ ఖండంలో మాక్స్‌ముల్లర్ బ్యాలర్‌ల భాష్యం, విమర్శాపూర్వకమైన అనువాదము వచ్చాయి. 1887లో జె.జోలీ ది జర్మన్ భాషలో అనువాదం వచ్చింది. ఈ ప్రచురణల వల్ల విదేశాలలో మనువు, మనుస్మృతులకు బాగా ప్రాచుర్యమూ, ప్రాబల్యమూ కలిగాయి.

వీటి వల్ల ప్రపంచమంతటా తగినంతగా మనుస్మృతికి ప్రచారం వచ్చిందని తెలుస్తూంది. భారతీయులకైతే ఇది **'తొలి రాజ్యాంగం'** అనే గొప్ప గౌరవం గల విషయమే! నేడు మనుస్మృతి అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనవిషయమైందనేది స్పష్టం. భారతదేశపు మార్గదర్శక గ్రంథం ప్రపంచానికీ మార్గదర్శకమైంది.

మనువునూ, మనుస్మృతినీ పూర్తిగా పరిశీలించకుండానే, అధ్యయనం చేయకుండానే, ప్రక్షిప్తాలతో = కల్పితాలతో, కువిమర్శలతో కూడిన గ్రంథాలను చదివి వ్యతిరేకభావాలను కలిగించుకొని విమర్శలు చేసే ముందు, దానిపై విశ్వవ్యాప్తంగా ఎలాంటి చెడు ప్రభావం పడుతుందో ఆలోచించాలి. మన గౌరవాన్ని మనమే చేతులారా పాడుచేసుకుంటున్నామా? అని ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

2. మనుస్మృతి మూలప్రవక్త ఎవరు?

అతి ప్రాచీన కాలం నుండి నేటివరకు భారతీయ వాఙ్మయం, సంస్కృతి, నాగరికత, ధర్మం, ఆచార వ్యవహారాలు, చట్టం, పఠన పాఠనాలు మొదలైన అన్ని రంగాలలో కొద్దో గొప్పో తన ప్రభావాన్ని కలిగి ఉన్న మనుస్మృతి లేదా విశిష్ట మానవధర్మ శాస్త్రానికి మూల రచయిత లేదా ప్రవక్త ఎవరనే ప్రశ్న నేడు వివాదాలు, శంకలు, సందేహాల తుఫానులో చిక్కుకుపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పూర్వమూ బీజప్రాయంగా అప్పటి సాహిత్యంలో ఉండిన ఈ వివాదం, ఆధునిక కాలంలో మహా వృక్షమైంది. రచయితలు తమ తమ ఊహలు, కల్పనలు, నిరాధారమైన అభిప్రాయాలతో దీన్ని మరింత వివాదాస్పదం చేశారు.

మనుస్మృతిలో చేరిన ప్రక్షిప్తాలు కూడా దీనికి ఒక ప్రముఖకారణం. అందులోని ప్రక్షిప్తాలను తొలగించి అటు పైన మనుస్మృతిలోని ప్రశ్నలను గురించి ఆలోచించవలసిన అవసరం ఉంది. అప్పటికి కానీ సందేహాలు లేని కచ్చితమైన విషయాలు బయటికి రావు[19]. మనుస్మృతి మూల రచయిత లేదా ప్రవక్త విషయంలో నాలుగు అభిప్రాయాలున్నాయి.

అ. **'మనుస్మృతి'** మూలరచయిత లేదా ప్రవక్త స్వాయంభువ మనువు.

ఆ. **'మనుస్మృతి'** వైవస్వత మనువు చెప్పాడు లేదా రచించాడు.

ఇ. **'మనుస్మృతి'** ని భృగువు చెప్పాడు.

ఈ. **'మనుస్మృతి'** ని బ్రహ్మ చెప్పాడు.

ఇక్కడ ఈ అభిప్రాయాలను విపక్షం చేసి ప్రామాణికంగా ప్రక్షిప్త శ్లోకాలను విశ్లేషణపూర్వకంగా చర్చించబోతున్నాను.

అ. మనుస్మృతి చెప్పినవాడు స్వాయంభువ మనువు

అధిక సంఖ్యాకులు మనుస్మృతి మనువు చెప్పాడు, అదీ **'స్వాయంభువ మనువు'** అనేది నమ్ముతారు. నేనూ ఇదే అభిప్రాయానికి వచ్చాను. దీన్ని గురించి లభించిన సామగ్రిని బట్టి ఇది రెండు రకాలని చెప్పాలి – 1.లోపలి ఆధారాలను బట్టి, 2.బ్రహ్మ సాక్ష్యాన్ని బట్టి. మొదటిది–లోపలి ఆధారాలను బట్టి చర్చిస్తాం. దీనికి ముందుగా మనుస్మృతి రచనాశైలిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

1. మనుస్మృతి రచనాశైలి:-

మనుస్మృతి అధ్యయనం వల్ల **'మనుస్మృతి'** రచనా శైలి **'ప్రవచన శైలి'** అని తెలుస్తుంది. అంటే, మనుస్మృతి మూలతః ప్రవచనంగా చెప్పబడింది. తరువాత ఆయన శిష్యులు వాటిని సంకలనం చేసి దానికి ఒక శాస్త్రం లేదా

---

[19] రచయిత మనుస్మృతి ప్రక్షిప్తాలను అనుసంధానించి అంతర్గత ఆధారాలతో ప్రమాణాల ఆధారంగా నిర్ధారించారు. వివరాలకు 2వ అధ్యాయంలో సోదాహరణంగా చూడండి.

గ్రంథరూపం ఇచ్చారు. మనుస్మృతిలోని భూమిక లాంటి తొలి అధ్యాయంలోని మొదటి నాలుగు శ్లోకాలు - వచనాల వల్ల మహర్షుల జిజ్ఞాసాపూర్వకమైన ప్రశ్నలకు మనువు ప్రవచనరూపంలో ఇచ్చిన సమాధానాలు అని తెలుస్తుంది. **"మనుమ్........ అభిగమ్య మహర్షయః...వచనమబ్రువన్"** (1.1), **'భగవన్ సర్వవర్ణానాం.......... ధర్మాన్నో వక్తుమర్హసి"** (1.2), **"త్వమేకో హ్యస్య సర్వస్య........కార్యతత్త్వార్థవిత్ ప్రభో"** (1.3), **"ప్రత్యువాచ.......... మహర్షీన్ శ్రూయతామ్ ఇతి"** (1.4) ఈ అన్ని శ్లోకాలూ ముఖ్యంగా 'సతైః పృష్టః' (1.4) పద ప్రయోగం వల్ల దీన్ని తరువాత ఎవరో సంకలితపరిచారని తెలుస్తుంది. దీన్ని ప్రవచనరూపంలో వినడం-వినిపించడం జరిగింది. అందువల్లనే ప్రతి ప్రసంగం ప్రారంభం లేదా చివర లేదా రెండు చోట్లా వినే - చెప్పేవారి క్రియల ప్రయోగం ఉంది. ఎలాగంటే -**'వక్తుమర్హసి'** (1.2), **'శ్రూయతామ్'** (1.4), **'తత్తథా వోఽభిధాస్యామి'** (1.42), **'ఏషా సమాసేన ప్రకీర్తితా...... వర్ణధర్మాన్నిబోధత'** (1.144), **'ఏష ప్రోక్త... కర్మయోగం నిబోధత'** (2.43), **'స్త్రీవివాహాన్నిబోధత'** (3.20), **'ఏతద్వోఽభిహితం..... శ్రూయతామితి'** (3.286), **'ఏషోదితా'** (4.259), **'ప్రవక్ష్యామి'** (5.57), **'వః ప్రోక్తః....... శ్రుణుత నిర్ణయమ్'** (5.110), **'ఉక్తో వః......, ధర్మాన్నిబోధత'** (5.146), **'ఏషవోఽభిహితః..... రాజ్ఞాం ధర్మం నిబోధత'** (6.97), **'రాజధర్మాన్ ప్రవక్ష్యామి'** (7.1), **'తత్తద్వోఽహం ప్రవక్ష్యామి'** (7.36), **'ఏష ఉక్తః'** (8.409), **'దాయభాగం నిబోధత'** (9.103), **'ఏషోఽఖిలః ఉక్తః'** (9.325), **'ఏషః కీర్తితః...... పర ప్రవక్ష్యామి'** (10131), **'తాన్వోఽభ్యుపాయాన్ వక్ష్యామి'** (11.210), **'ఏష వోఽభిహితః...ఇమం నిబోధత'**(11.226), **'సమాసేన వక్ష్యామి'** (12.39), **'ఇదం నిబోధత'** (12.82) మొదలైనవి మూలప్రవక్త మాటలను ఉన్నది ఉన్నట్లుగా సంకలితపరచటం జరిగిందని, మౌలిక సంకలనమూ అదే చెబుతూందనీ గుర్తుంచుకోవాలి.

మనుస్మృతి మొత్తంలోనూ ప్రారంభం నుంచి చివరి వరకూ చెప్పటం - వినటం - వీటి క్రియలలో ఉత్తమ పురుష ప్రయోగం **'అభిధాస్యామి'** (1.42), **'ప్రవక్ష్యామి'** (5.57), **'రాజధర్మాన్ ప్రవక్ష్యామి'** (7.1), **'అహం ప్రవక్ష్యామి'** (7.36), **'పరం ప్రవక్ష్యామి'** (10.131), **'వక్ష్యామి'** (11.210), **'సమాసేన వక్ష్యామి'** (12.39) ఉందనేదీ గమనించవలసిన విషయం.

నిరుక్తంలో చెప్పబడిన ఒక సత్యమేమిటంటే - "ప్రాచీనకాలంలో **"సాక్షాత్ కృతధర్మాణః"** సాక్షాత్కరింపజేసుకొన్న ధర్మాలను, ఋషుల ప్రవచనాలు, ఉపదేశాలు అనే మాధ్యమం ద్వారా బోధించేవారనీ, ముఖ్యంగా శిష్యపరంపర రూపంలో అది సురక్షితంగా ఉండేదనీ, లిపిబద్ధమైన అంటే రాసిన గ్రంథాలు చదవటం ద్వారా కాదనే విషయం దీన్ని బట్టి తెలుస్తున్నది. దీన్నే నిరుక్తం సమర్థిస్తుంది. రాసిన గ్రంథాల ద్వారా విద్యలు బోధించడం ఆ పైన ఎంతో కాలం తర్వాత వచ్చింది. అప్పటికి జనం ఉపదేశాలు గ్రహించటంలో ఆలస్యం, ఉదాసీనత, ఉత్సాహం తగ్గడం లాంటివి ప్రదర్శించారు[20]. మహర్షి దయానందులు గౌరవంగా సూర్యవంశపు రాజు ఇక్ష్వాకు సమయంలో ఉపదేశాలను లిపిబద్ధం చేసే పరంపర మొదలైంది[21] అన్నారు. ఈ విధంగా 1.1-4 శ్లోకాలలో వర్ణించిన సన్నివేశం - అందులో మహర్షులు వ్యక్తిగత సందేహాలను తీర్చుకునేందుకు మనువు దగ్గరికి రావడం, మనువు వారికి జవాబు లీయటం - మొత్తం మనుస్మృతి మొదటి నుంచి చివరి వరకు మనువు ద్వారా చెప్పటం - వినటంలోని క్రియా పదాలు ఉత్తమ పురుష ప్రయోగంలో ఉండటం - దీన్నంతటినీ గమనిస్తే మనం మనుస్మృతిలోనిది ప్రవచన శైలి అని చెప్పవచ్చు. దీన్ని బట్టి మనుస్మృతి ప్రవచన కర్త మనువే అని నిశ్చయించవచ్చు.

---

[20] **సాక్షాత్ కృతధర్మాణ ఋషయో బభూవుః, తేఽవరేభ్యోఽసాక్షాత్కృతధర్మభ్య ఉపదేశేన మన్త్రాన్ సంప్రాదుః. ఉపదేశాయ గ్లాయన్తోఽవరే బిల్మగ్రహణాయేమం గ్రంథం సమామ్నాసిషుర్వేదం చ వేదాంగాని చ** ॥ నిరు. 1.19.

[21] ఉపదేశమంజరి, నవమ ఉపదేశం, పృ. 62.

ఇక్కడి ప్రసంగాలలో 1-4 శ్లోకాలలో వెలిబుచ్చిన సందేహాలకు సమాధానాలు చెప్పవలసిన అవసరమూ ఉంది. కానీ కొందరు, మనుస్మృతి భూమికలోని 4 శ్లోకాలను మూలరూప శ్లోకాలుగా పరిగణించనవసరం లేదనీ, అవి మనువు చెప్పినవి కావు కాబట్టి, వాటిని ప్రామాణికాలుగా భావించనవసరం లేదనీ అభిప్రాయపడుతున్నారు. ఈ 1-4 శ్లోకాలు మనువు చెప్పినవాటిలాగా మౌలికాలు కాకపోయినా, వీటి శైలి, సన్నివేశం, ప్రశ్నలు - వీటి ఆధారంగా మౌలికాలుగానే స్వీకరించబడ్డాయి. స్వీకరించాలి కూడా. ఎందుకంటే వాటిని భూమికలో రాశారు కాబట్టి మనుస్మృతిలోని శైలినిబట్టి మనువు భావాలను (ప్రవచన రూపంలో ఉన్నవి) భృగువు లేదా వేరెవరో శిష్యులు సంకలితపరిచారని గ్రహించాలి. సంకలనకర్త శ్లోకాల ద్వారా మనువు దగ్గరికి మహర్షులు రావడం, ప్రశ్నలడగటం భూమిక రూపంలోకి తెచ్చాడు. సన్నివేశం మౌలికం. ప్రశ్నలు మౌలికం. అందువల్ల సంకలన శైలిని అనుసరించి శ్లోకాలూ మౌలికమేనని అనుకోవాలి. కొందరు టీకాకారులు ఐదో శ్లోకం నుంచి అసలైన మనుస్మృతి ప్రారంభమని ఎలా భావించారో కాని, వారి ఈ ఆలోచన పొరపాటు. మనుస్మృతి సంకలిత శైలిగల గ్రంథం, ఈ దృష్టితో చూస్తే ఈ నాలుగు శ్లోకాలు కూడా మౌలికమే, సంకలితరూపంలోనే ఉన్నాయి.

ఇక్కడ మరొక విషయాన్ని చెప్పుకోవలసి ఉంది. శైలి ఆధారంగా టీకాకారులు మనువు పేరుతో పేర్కొన్న అన్ని శ్లోకాలనూ మౌలికాలుగా భావించారు. **మహర్షి ర్మనునా భృగుః** (1.60), **ఉక్తవాన్ మనుః.**(1-118), **మనునా పరికీర్తితః** (1.126), **మనురబ్రవీత్** (8-339) మొదలైనవి. వాళ్లనే దేమిటంటే, మనువు భావాల ఆధారంగానే మనుస్మృతిని భృగువు రచించాడు కాబట్టి ఇలాంటి శ్లోకాలు అసందర్భాలు కావని ఇలాంటి అభిప్రాయం పూర్తిగా తప్పే. ఎందుకంటే మనుస్మృతి మనువు భావాల ఆధారంగా రాసిన గ్రంథం కాదు. మనువు భావాలను యథాతథంగా అదే శైలిలో సంకలితపరచిన గ్రంథం. సంకలనంలో మౌలిక అంశాల మధ్య సంకలనకర్త ఏదీ చెప్పడు. కానీ, **"మనూక్తవాన్"** లాంటి పదాలున్న శ్లోకాలు సంకలనకర్త పేర్కొనడం వల్ల అవి ప్రక్షిప్తాలవుతాయి, మౌలికాలు కావు. 1.4లో **"శ్రూయతామ్"** అని మనువు సమాధానం ప్రారంభమవుతుంది. ఈ శైలి వల్ల, శ్లోకం తర్వాత మనువు చెప్పేవి ఉత్తమ పురుషలో ఉంటాయి కాబట్టి, అవి మౌలికాలూ, ఇతరుల ద్వారా పేరును పేర్కొని చెప్పబడేవి ప్రక్షిప్తాలనీ తెలుస్తూంది. అందువల్ల ఉత్తమ పురుషలో లేని శ్లోకాలన్నీ తరువాత చేర్చబడినవని గ్రహించాలి.

2. ప్రాచీన కాలం నుంచి ఇప్పటి వరకు ఈ గ్రంథం **'మనుస్మృతి'** లేదా **'మానవ ధర్మశాస్త్రం'** అనే పేరుతో ప్రసిద్ధి ఉండటం వల్ల, ఇది మనువు చెప్పిందే అనటానికి నిదర్శనంగా పద్నాలుగుమంది మనువులలో మొట్టమొదటివాడైన స్వాయంభువ మనువు చెప్పిన గ్రంథమే ఇది. ఈ విషయం మనుస్మృతిలో స్పష్టంగా ఉంది. పలు చోట్ల మనువుతో పాటుగా **'స్వాయంభువ'** అనే విశేషణం ప్రయోగించబడింది కూడా.

3. ఇప్పటి మనుస్మృతిలో మధ్య మధ్య దాదాపు 30 చోట్ల మనువు పేరును పేర్కొన్న వర్ణనలున్నాయి. వాటిలో ఆరుచోట్ల స్పష్టంగా స్వాయంభువ మనువు అనే విశేషణం ప్రయోగించబడింది.[22] ఈ పరంపరాగతమైన ప్రక్షిప్త ఉట్టంకింపులు కూడా దీని ప్రవక్త స్వాయంభువ మనువు అనే స్థిరీకరిస్తున్నాయి.

4. కింది ప్రక్షిప్త శ్లోకాలలోని వర్ణనలు మనుస్మృతి రచయిత స్వాయంభువ మనువేనని చెబుతున్నాయి.

క. **ఇదం శాస్త్రం తు కృత్వాఽసౌ మామేవ స్వయమాదితః ।**
విధివద్ గ్రాహయామాస మరీచ్యాదీంస్త్వహం మునీన్ ॥
స్వాయమ్భువస్యాస్య మనోః షడ్వంశ్యా మనవోఽపరే ॥ 1.58, 61 ॥

---

22. (క) స్వాయంభువ మనువు పేరున్న స్థలాలు -1.32.-36, 58-61,102; 6.54; 8.124; 9.158 ॥
(ఖ) కేవలం మనువు అని మాత్రమే ఉన్న స్థలాలు-1.1-4, 118,119, 126; 3.36, 150; 4.103; 5.41; 8.139, 168, 204, 242, 279, 292, 339; 9.17, 182, 183, 239; 10.63, 78; 12.107, 126 ॥ 1.1-4 శ్లోకాలు వదిలిపెట్టి మిగిలిన అన్ని శ్లోకాలూ ఈ పరిశోధన కార్యంలో ప్రక్షిప్తాలని తేలింది. కాబట్టి వాటిని జనశ్రుతిలో వచ్చినవని గ్రహించాలి.

ఖ. స్వాయమ్భువో మనుర్ధీమానిదం శాస్త్రమకల్పయత్ ॥ 1.102 ॥

భృగువు స్వాయంభువు శిష్యుడు (1.34-35; 3.194; 12.2). అందువల్ల భృగు వచనాలలో రాసిన మనువు కూడా స్వాయంభువ మనువే. అతనే ఈ శాస్త్రకర్త అన్నారు. ఈ శ్లోకాలను గురించిన గొప్ప విషయం ఏమిటంటే, భృగువు చెప్పినది అనటంతో పాటుగా మనుస్మృతి మూలప్రవక్త అని కూడా చెప్పబడింది.

గ. యథేదముక్తవాన్ శాస్త్రం పురా పృష్టో మనుర్మయా ॥ 1.119 ॥

ఘ. ఏవం స భగవాన్ దేవో లోకానాం హితకామ్యయా ।
ధర్మస్య పరమం గుహ్యం మమేదం సర్వముక్తవాన్ ॥ 12.107 ॥

ఙ. "మానవస్యాస్య శాస్త్రస్య" 12.107 ॥

చ. "ఏతన్మానవం శాస్త్రం భృగుప్రోక్తమ్' 12.126 ॥

మా పరిశోధన ఆధారంగా పై అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలుగా నిరూపించబడ్డాయి. అందుచేత మౌలికంగా ప్రామాణికాలు కావు; అయినా వీటిని చారిత్రక, పారంపర్య జనశ్రుతిగా స్వీకరించబడ్డాయి.

5. చరిత్రకారులు బ్రహ్మావర్త ప్రాంతంలోని బర్హిష్మతీనగరాన్ని స్వాయంభువ మనువు రాజధాని అంటారు. మనుస్మృతిలో బ్రహ్మావర్త ప్రాంతాన్ని విద్య, సదాచారాల కేంద్రంగా ప్రకటించి, దానికి ఎంతో ప్రముఖ స్థానం ఇచ్చారు (1.136-139). ఈ ప్రాంతంలో మనుస్మృతి ప్రవచనమూ - రచనా జరిగాయి. దీనివల్ల కూడా మనుస్మృతి రచయిత స్వాయంభువ మనువు అనే సంకేతం లభిస్తుంది.

మనుస్మృతిలో లభించే లోపలి ప్రమాణాలే కాకుండా బయటి సాక్ష్యాలు కూడా వీటితో కలుస్తాయి. వాటి వల్ల కూడా మనుస్మృతి ప్రవక్త స్వాయంభువ మనువే అని తెలుస్తుంది. అవి -

క. తైత్తిరీయం మొదలైన సంహితలు[23], బ్రాహ్మణ గ్రంథాల నుండి ఆధునిక కాలపు భారతీయ వాఙ్మయం వరకూ స్వాయంభువ మనువు ఒక ధర్మశాస్త్రకారుడుగా, లేదా మనుస్మృతి కర్తగా సుప్రసిద్ధుడు. అందుచేత, మనువు పేరిట లభిస్తూన్న ధర్మశాస్త్ర రచయిత ఈ మనువేనని చెప్పవచ్చు.

ఖ. నిరుక్తంలో [24] ఆస్తి వారసత్వపు హక్కు విషయంలో ఏదో ఒక ప్రాచీన గ్రంథంలోని శ్లోకాన్ని ఉటంకించి, స్వాయంభువ మనువు అభిప్రాయాన్ని చెబుతూ, 'వారసత్వపు ఆస్తిలో కొడుకు, కూతురు ఇద్దరికీ హక్కు ఉంటుంది' అని చెప్పారు.

మనువు పేరిటి ఈ అభిప్రాయం, నేటి మనుస్మృతిలో 9.130,192 శ్లోకాలలో ఉంది. ఈ ప్రాచీనమైన ఉటంకింపు కూడా స్వాయంభువ మనువే మనుస్మృతి రచయిత అని స్థిరీకరిస్తుంది.

6. మహాభారతంలో చాలా చోట్ల స్వాయంభువ మనువును ఒక ధర్మశాస్త్రకారుడుగా పేర్కొన్నారు. అంతే కాకుండా ఎన్నో చోట్ల అతని పేరుతో పాటుగా అభిప్రాయాలు, శ్లోకాలు కూడా ఉటంకించారు. ఈ అన్ని అభిప్రాయాలూ, శ్లోకాలూ మనుస్మృతిలో ఉన్నాయి. అవి -

---

[23] (క.) తైత్తి.సం. 2.2.10.2; 3.1.9.4. తాం.బ్రా. 23.16.7 ॥
(ఖ) మనువు బ్రాహ్మణ వాక్యాలనూ ప్రవచించాడు. దీనికి ప్రమాణాలు సంహితలలో లభిస్తయి-
"ఆపోవా ఇదం నిరమృజన్ । సమనురేవోదశిష్యత । స ఏతామిష్టిమశ్యత్తామా హరత్తయా యజత....।" (కాఠ... సం.... 11.2; తైత్తి....సం.... 3.1.9.30.....కూడా) ।

[24] నిరు. 3.4.'మను కాలం' శీర్షికలో అర్థంతో కూడిన శ్లోకాన్ని చూడండి.

క. శకుంతలా దుష్యంతుల ప్రేమసందర్భంలో అష్టవిధ వివాహాలను చెప్పినవాడు స్వాయంభువ మనువు అని పేర్కొన్నాడు కవి[25].

ఖ. శాంతి పర్వం 36వ ప్రకరణంలో మనుస్మృతిలోని 1.1-4 శ్లోకాలలోని సంఘటనను యథాతథంగా పేర్కొంటూ, ఋషులు ధర్మ జిజ్ఞాసతో స్వాయంభువ మనువు దగ్గరికెళ్లారు. అక్కడ మనువు చెప్పిన శ్లోకాల్లో కొన్ని నేటి మనుస్మృతిలోనూ ఉన్నాయి. వాటిలో కొన్ని యథాతథంగానూ, కొన్ని పాఠాంతరాలతోనూ, మరి కొన్ని యథాతథ భావం గలవీ ఉన్నాయి[26].

గ. శాంతిపర్వంలో అధ్యాయం 67.15-30లో, పూర్వపు దొంగతనాలు, అరాచకత్వం మొదలైనవాటితో విసిగిపోయిన ప్రజలు మనువును రాజుగా ఎన్నుకున్న ఘట్టం ఉంది. ఈ మనువు బ్రహ్మదేవుడి కుమారుడు. ఇది కూడా స్వాయంభువ మనువుకు సంబంధించిన ఘట్టమే.[27] మనువు రాజయ్యాక, ప్రజలకు సుంక నిర్ధారణ చేయటం, అది - "పశువులు, బంగారాలను 50వ భాగం చేస్తాము" అనేది. ఈ సుంకపు వ్యవస్థ ఇప్పటి మనుస్మృతి 7-130లో ఉంది[28].

ఘ. శాంతిపర్వం అధ్యాయం 335.44,46లలో ఒక ధర్మశాస్త్రకారుడుగా స్వాయంభువ మనువు వర్ణన ఉంది.[29]

ఙ. మహాభారతంలో ఎన్నో చోట్ల మనువు పేరిట అతని శ్లోకాలు లేదా భావాలు పేర్కొనబడ్డాయి. వాటిలోని ఎన్నో శ్లోకాలు భావాలు, నేటి మనుస్మృతిలో అలాగే లభిస్తున్నాయి.[30]

చ. మహా భారతంలోని ఒక గొప్ప శ్లోకంలో మూడు విశేషాలు చెప్పబడ్డాయి. 1. మనువు వైయక్తిక, సామాజిక ప్రవచనం చేశాడు, 2. సృష్టికి ప్రారంభకాలంలో ఆ ప్రవచనం చేశాడు, 3. అది వేదాల ఆధారంగా చెప్పాడు. ఆ శ్లోకం-

ధర్మసారం మహాప్రాజ్ఞ మనునా ప్రోక్తమాదితః ।
ప్రవక్ష్యామి మనుప్రోక్తం పౌరాణం శ్రుతిసంహితమ్ ॥అశ్వమేధపర్వం.అ. 92లో 53 నుంచి వరుసగా

అంటే - "నేను మనువు చెప్పిన సామాజిక వైయక్తిక ధర్మాల సారం నీకు చెప్తాను. అవి వేదాల ఆధారంగా, సృష్టి ప్రారంభంలో మనువు చెప్పినవి" అని.

7. భాగవత పురాణంలోనూ ఆదిరాజు రాజర్షి మనువు ధర్మాలను ప్రవచించాడని ఉంది -

యః పృష్టో మునిభిః ప్రాహ ధర్మాన్ నానావిధాన్ శుభాన్ ।
నృణాం వర్ణాశ్రమాణాం చ సర్వభూతహితః సదా । ఏతద్ ఆదిరాజస్య....॥ (3.25,38,39)

---

[25] **అష్టావేవ సమాసేన వివాహా ధర్మతః స్మృతాః....మనుః స్వాయంభువోఽబ్రవీత్** ॥ (ఆది.73.8-9) ఈ శ్లోకాలు ఇప్పటి మనుస్మృతిలో 3.20-34 వరకు వర్ణించబడినది.

[26] (క) **తైరేవముక్తో భగవాన్ మనుః స్వాయంభువోఽబ్రవీత్** ॥ (మహా.శాంతి.36.5)
(ఖ) యథాతథం శ్లోకం మహా.శాంతి పర్వంలో లో 36.35,46,47; మనుస్మృతిలో వరుసగా 3.117; 2.132; 2.133 ॥ యథాతథం భావం-మహా. శాంతి పర్వంలో 36.20; మను.లో 12.108-109 ॥ పాఠాంతరంతో-మహా.శాంతి పర్వంలో
36.27, 28; మను.లో 4.218,217,220. భావగ్రహణం మిగిలిన శ్లోకాల్లో కూడ ఉంది.

[27] మహా.ఆది.1.32 ॥

[28] **పంచాశద్భాగ ఆదేయో రాజ్ఞా పశుహిరణ్యయోః** । (7-130)

[29] (క) **మనుః స్వాయంభువోఽబ్రవీత్.** ఆది.53.8,9.
(ఖ) **తైరేవముక్తో భగవాన్ మనుః స్వాయంభువోఽబ్రవీత్ ।**
శుశ్రూషధ్వం యథావృత్తం ధర్మం వ్యాససమాసతః ॥ శాంతి.36.6 ॥
(గ) శాన్తి....12 అ...॥
(ఘ) స్వాయమ్భువ మను ద్వారా శాస్త్ర రచనా, శాన్తి....335.44,46 ॥ మొదలైనవి.

[30] **"మనునా చైవ రాజేంద్ర గీతా శ్లోకా మహాత్మనా"**- శాంతి.56.33 ॥ వేరే చోట్ల శాంతి .12 అ; 118.26; 121.10.12 ॥

అంటే - "ఆ తొలి రాజు మనువు ఆదికాలంలో మునులు అడగటం చేత వర్ణాలు, ఆశ్రమాలకు సంబంధించిన ఎన్నో ధర్మాలు చెప్పాడు. ఆ బ్రహ్మపుత్రుడైన మనువు స్వాయంభువ మనువే!"

8. ఈ విధంగానే వాల్మీకి రామాయణంలోనూ రాముడు 'వాలి-సుగ్రీవుల యుద్ధం సందర్భంలో' వాలి వధ ధర్మానికి అనుకూలమే అంటూ, మనువును పేర్కొని, రెండు శ్లోకాలు ఉటంకిస్తాడు. ఆ శ్లోకాలు కూడా నేటి మనుస్మృతిలో ఉన్నాయి[31]. వీటివల్ల మనుస్మృతి మనువు చెప్పిందే అని స్పష్టమవుతూంది.

9. విశ్వరూపుడు యాజ్ఞవల్క్య స్మృతిలో 2.73,74,83,85 శ్లోకాలకు భాష్యం రాస్తూ, ఇప్పటి మనుస్మృతిలోని 8.68, 70,71, 105, 106, 304 శ్లోకాలను ఉటంకించాడు. అక్కడ మనువు పేరును స్వాయంభువ మనువుగా చెప్పాడు.

10. విజ్ఞానేశ్వరుడు యాజ్ఞవల్క్య స్మృతి **"మితాక్షరా"** భాష్యంలోనూ, శంకరచార్యులు **'వేదాంత సూత్రాల భాష్యం'**లోనూ, శబరస్వామి **'జైమినిసూత్రాల భాష్యం'**లోనూ, బౌద్ధ మహాకవి అశ్వఘోషుడు తన **'వజ్రకోపనిషత్తు'** లోనూ, భాస కవి **'ప్రతిమా నాటకం'**లోనూ, గౌతముడు, వశిష్ఠుడు, ఆపస్తంబ **సూత్రగ్రంథాల**లోనూ,[32] వలభి మహారాజు ధారసేనుని **శిలాశాసనాల** లోనూ[33], ధర్మోపన్యాసాలలో మనువు నిర్దేశించినవీ, వాటికి పుష్టి కలిగించేందుకు ఏ యే శ్లోకాలను ఉట్టంకించారో, అన్నీ మనువువే, ఇప్పటి మనుస్మృతిలో లభ్యమవుతున్నాయి. వీటి వల్ల దీని మూల రచయిత మనువేననీ, భృగువు, తదితరు లెవరూ కారనీ స్పష్టమవుతున్నది. మనువు పేరిట పేర్కొనబడిన సుప్రసిద్ధ ధర్మశాస్త్రకారుడు స్వాయంభువ మనువే.

ఆ. మనుస్మృతి రచయిత వైవస్వత మనువు

కొందరు దార్శనికులు మనుస్మృతి మనువుదే నంటారు కానీ, ఆ మనువు స్వాయంభువు కాదు, వైవస్వత మనువంటారు. అలా అనడానికి వారిచ్చిన ఆధారాలు ఇవీ -

1. మనుస్మృతిలోని 1.61, 62 శ్లోకాలలో స్వాయంభువ మనువు వంశవర్ణన చేస్తూ ఏడో వాడైన వైవస్వత మనువు వరకు చెప్పారు. తొలి మనువు జీవిత కాలంలో ఏడో మనువు పేర్కొనబడడు కాబట్టి, ఏడో మనువు వైవస్వతుడే మనుస్మృతి రాశాడు.

2. కౌటిల్యుడి అర్థ శాస్త్రం ప్ర.8, అ.12లో ఆదికాలంలో ప్రజలు వైవస్వత మనువును రాజుగా ఎన్నుకున్న ఘటన ఉంది. అక్కడ ఇచ్చిన సుంకపు వ్యవస్థ[34], ప్రాచుర్యం పొందిన మనుస్మృతి 7.130-132లతో కలుస్తుంది. అందువల్ల ఈ స్మృతి రచయిత వైవస్వత మనువు.

ఈ ఆధారాలను పరిశీలిస్తే వీటి ఆధారంతో ఈ నిర్ధారణ ఎంత మాత్రమూ సరైనది కాదని తేలుతుంది. వాటినీ పరిశీలిద్దాం.

1. **మనుస్మృతిలో వైవస్వత మనువువిగా చెప్పబడిన శ్లోకాలు ఇవి -**

స్వాయంభువస్యాస్య మనోః షడ్వంశ్యా మనవోఽపరే ।
సృష్టవన్తః ప్రజాః స్వాః స్వాః మహాత్మానో మహౌజసః ॥ 1.61 ॥

---

[31] వా.రామా.కిష్కిం. 18.31-32; మను.లో 8.316, 318 ॥

[32] 'మనుస్మృతి మహత్త్వము' శీర్షిక టిప్పణులలో చెప్పిన చోట చూడండి.

[33] క్రీ.శ.571 నాటి శిలాశాసనం.

[34] 'మనుస్మృతి కాలం' శీర్షికలో చెప్పిన చోట చూడండి.

స్వారోచిషశ్చోత్తమశ్చ తామసో రైవతస్తథా ।
చాక్షుషశ్చ మహాతేజా వివస్వత్సుత ఏవ చ ॥ 1.62 ॥

అంటే - ఈ స్వాయంభువ మనువు వంశంలో మహాత్ములూ, గొప్ప తేజస్వులూ అయిన మరో ఆరుగురు మనువులు పుట్టారు. వారందరూ తమ తమ కాలాల్లో ప్రజలను సృష్టించారు. వారు స్వరోచి, ఉత్తముడు, తామసుడు రైవతుడు, చాక్షుషుడు, వివస్వతుడు.

మనుస్మృతిలోని పైన చెప్పబడిన రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలుగా కనిపిస్తున్నాయి. ఈ ప్రక్షిప్తతకు చాలా కారణాలున్నాయి.

క. స్వాయంభువ మనువు, తన తరువాత రాబోయే భావితరాలవారిని వర్ణించలేడని చెప్పడం ఉచితం, మునుపటి 1-58-60 శ్లోకాలలోని వర్ణన, తరువాతి సంకలన కర్త, మనువు తన భావి తరాలవారిని ఎలా వర్ణించగలడు? అని చెబుతున్నాడు. ఈ శ్లోకాలు తరువాత చేర్చబడ్డాయి. పైగా కాలవిరుద్ధమైన వర్ణన అది.

ఖ. పూర్వాపర ప్రసంగాలతోనూ ఇవి విభేదిస్తున్నాయి. ముందు 1.57, 1.64 శ్లోకాలలో సృష్టి ఉత్పత్తి, దాని కాలపు వర్ణన జరుగుతూంది. మధ్యలో వచ్చిన ఈ శ్లోకాలు ఆ క్రమాన్ని భంగం చేస్తున్నాయి.

గ. మనువుల ద్వారా ఈ చరాచర సృష్టి, దాని పోషణ జరిగిందని చెప్పటం సృష్టి క్రమానికే వ్యతిరేకం. ఇది మనుస్మృతిలోని 1.6, 14-23 శ్లోకాలలో వర్ణించినదానికీ వ్యతిరేకమే !

ఘ. ఈ ప్రసంగం భృగువు **'మనుస్మృతి ప్రవచనం'** చేశాడని చెప్పటమూ అసంగతమే. దీని శైలిని బట్టి ఇది పూర్తిగా మనువు చెప్పినదే అని తెలిసిపోతూంది[35]. ఇలాంటి ప్రక్షిప్త శ్లోకాల ఆధారంగా దీన్ని వైవస్వత మనువు రచన అనలేము.

2. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో వైవస్వత మనువుకు జరిగిందని చెప్పిన ఘటన, మహాభారతం శాంతి పర్వంలో 67.15-30లలో స్వాయంభువ మనువు విషయంలో జరిగినట్లు చెప్పబడింది. కౌటిల్యుడు నామాంతరం - పేరు మార్చడం ఎందుకు చేశాడో చెప్పలేము. పాఠభేదాల వల్ల ఇలా జరిగి ఉండవచ్చు. లేదా వైవస్వత మనువు ఈ వ్యవస్థలను ఇష్టపడి ఆచరణలో పెట్టడం వల్ల, అవి అతని పేరిట చలామణి అయి ఉండవచ్చునని తోస్తుంది. కొన్ని వంశావళులు పరికించినప్పుడు, ఇద్దరు మనువులూ మొట్టమొదటి రాజులు అనే వర్ణన వల్లనూ, పరిశీలకులకు ఆ ఇద్దరూ ఒకరే ననిపించి ఉండవచ్చునని తోస్తుంది. ఇద్దరినీ ఒకటే విధంగా వర్ణించటం భ్రాంతికి గురిచేసి ఉంటుంది. ఇతిహాసాల రచయితలు దీనికి సమాధానం చెబుతూ, **'స్వాయంభువ మనువే సృష్టికి 'ప్రథమ మహారాజు' అనీ, 'వైవస్వత మనువు ప్రళయం తరువాతి సృష్టికి మొదటి రాజనీ, అందుచేతనే ఇద్దరినీ తొలి రాజులు అన్నార'**నీ స్పష్టం చేశారు.

ఇవే కాకుండా - ఇంకా చాలా విషయాలు ఇందులో పేర్కొన్నవి ఉన్నాయి. వాటి వల్లనూ మనుస్మృతి రచయిత వైవస్వత మనువు కాదనీ, స్వాయంభువ మనువే అనీ చెప్పవచ్చు. ఎలా అంటే-

3. మనుస్మృతిలో వైవస్వత మనువే శాస్త్రప్రవక్త అనేందుకు లోపలి సాక్ష్యం ఏదీ లేదు. పైన చెప్పుకున్న చోట తప్ప, ఇంకెక్కడా వైవస్వత మనువు పేరైనా లేదు. పైన చెప్పుకున్న చోట కూడా, వంశావళి ఉన్నందున అతని పేరు ఉంది. మనుస్మృతి రచనకూ, అతనికీ ఎలాంటి సంబంధమూ చూపబడలేదు.

4. మనుస్మృతిలో మనువుతో పాటు భృగువు పేర్కొనబడ్డాడు. ఈ భృగువు స్వాయంభువ మనువు శిష్యుడు. వైవస్వత మనువు శిష్యుడు కాడు.

---

[35] 'మనుస్మృతి రచయిత స్వాయంభువ మనువు' శీర్షికలో శైలిని గురించిన విస్తార చర్చ చూడండి.

5. భారతీయ సాహిత్యంలో ఈ ఇద్దరు మనువులనూ మొట్టమొదటి రాజులుగా వర్ణించినప్పటికీ, స్వాయంభువ మనువుకు ధర్మశాస్త్రకారుడుగా అధిక ఖ్యాతి వచ్చింది. వైవస్వత మనువుకు ఒక రాజుగా ఖ్యాతి వచ్చింది. [36]వైవస్వత మనువును ధర్మశాస్త్రకారుడుగా ఎక్కడా పేర్కొనలేదు.

6. వాల్మీకి రామాయణంలో వైవస్వత మనువును సూర్యవంశ రాజులలో ప్రథముడని చెప్పాడు. అతడే అయోధ్యను స్థాపించాడు[37].

మనుస్మృతిలో తాత్కాలిక ప్రదేశంగా గానీ, భౌగోళిక స్థితిని గురించి గానీ అయోధ్యను గురించిన వర్ణన గాని ఎక్కడా లేదు. స్వాయంభువ మనువు పాలించిన బ్రహ్మావర్తాన్ని గురించి ఎంతో గొప్పగా చెప్పబడింది.[38]

7. మనుస్మృతిలో స్వాయంభువుకు తర్వాతి మనువులు లేదా వైవస్వతునికి ముందున్న మనువుల ప్రసక్తి లేక పోవటం కూడా, ఇది స్వాయంభువు కాలానిదే అని రూఢిపరుస్తూంది. ఇక్కడ కేవలం మనువు రాజ్యాన్ని గురించి ఉంది. కానీ, అది కూడా ప్రక్షిప్తమే[39]. శైలి ఆధారంగా చూసినా, వైవస్వత మనువుకు చాలా తర్వాతి కాలపు ప్రక్షిప్తమని రుజువైంది. పైగా పృథుమహారాజు ప్రసక్తి వచ్చింది కానీ, అతడు వైవస్వతునికి 7వ తరంలో పుట్టినవాడు.[40]

8. మనుస్మృతి 1.79, 80లలో **'మన్వంతరాల కాలపరిణామ వర్ణన'** ఉంది. ఒకవేళ ఇది వైవస్వత మన్వంతరమై ఉంటే, అక్కడ మునుపటి మన్వంతరాల కాలం, పేర్లు తప్పక ఇచ్చి ఉండేవారు. కేవలం మన్వంతర వర్ణన ఉండటం వల్ల అది ప్రారంభ మన్వంతర కాలపు కృతి అని తెలుస్తుంది. మన్వంతరమనేది కేవలం కాలపరిణామరూపంగా వాడుకలోకి వచ్చింది. మనువుల వ్యక్తిగతమైన పేర్ల మీద వీటి నామకరణం ఆ తర్వాత ఎప్పుడో నిర్ధారితమైంది.

9. మనుస్మృతితో పాటు ఇతర గ్రంథాలలో వర్ణించిన వంశవృక్షాలు కూడా మనుస్మృతికీ, స్వాయంభువ మనువుకూ ఉన్న సంబంధాన్నే స్థిరపరుస్తున్నాయి. మనుస్మృతిలో ఎన్నో చోట్ల మనువుకు బ్రహ్మతో నేరుగా ఉన్న సంబంధాన్ని గురించి ఉంది. 'బ్రహ్మావర్తం' మొదలైన పేర్లు పెట్టడం వల్ల బ్రహ్మకు విశేషప్రాధాన్యం ఇవ్వబడింది. స్వాయంభువుకు ఉన్నట్లుగా, వైవస్వత మనువుకు బ్రహ్మతో సరాసరిగా సంబంధం కులంతో గానీ, విద్యతో గానీ[41] లేవు. అతని పేరు స్వాయంభువు. అంటే స్వయంగా పుట్టాడు అని. అంటే బ్రహ్మ కుమారుడు లేదా వంశజుడు కావడం వల్ల 'స్వాయంభువు' అయింది. మనుస్మృతిలో బ్రహ్మతో నేరుగా సంబంధ ప్రవృత్తి, అతడికి ప్రాధాన్యం ఇవ్వడం అనే భావన, ఇతడిని స్వయంభువుగా స్థిరపరుస్తున్నాయి.

ఇ. మనుస్మృతి భృగువు రచన

మనుస్మృతిని భృగువు రచనగా భావించే వారికి ఆధారాలు మనుస్మృతిలోనే ఉన్నాయి. తరువాతి గ్రంథాలలోనూ వాటినే ఆధారం చేసుకుని మనుస్మృతి భృగువు రచన అంటున్నారు. అందుచేత ఇక్కడ, భృగువు రచన అనే శ్లోకాలను ముందుగా విశ్లేషిద్దాం-

---

[36] **మనుర్వైవస్వతో రాజా-ఇత్యాహ. తస్య మనుష్యా విశః ॥** శత. 13.4.3.3 ॥

[37] వా.రామా.బాల. 70.20లో వంశపరిచయంలో తొలి రాజుగా చెప్పబడ్డాడు బాల. 5.6లో మనువే అయోధ్యను స్థాపించాడు అని ఉంది. **"అయోధ్యానామ నగరీ తత్రాశీల్లోకవిశ్రుతా । మనునా మానవేన్ద్రేణ యా పురీ నిర్మితా స్వయమ్"** ॥

[38] మను. 2.17-20.

[39] **"పృథుస్తు వినయాద్రాజ్యం ప్రాప్తవాన్ మనురేవ చ ॥"** (7.42)

[40] వాల్మీకీయ రామాయణం బాల. 70.24

[41] వాల్మీకి రామాయణం బలకాండ 70.19-21లో ఉన్న వంశావళి చూడండి. బ్రహ్మ నుంచి మరీచి, మరీచికి కశ్యపుడు, కశ్యపునికి వివస్వానుడు, వివస్వానునికి వైవస్వత మనువు.

1. మునుపటి పరిశీలన విషయాల్లో మనుస్మృతిలోని శైలిని గురించి విశేషంగా చెప్పుకున్నాం. దానివల్ల అందులోని శైలి ప్రవచనశైలి అనీ, దాని మూలంగా మనువే ఆది ప్రవక్త అని రుజువైంది. 1.1-4 శ్లోకాలలో మనువును మహత్తర ధర్మఋషిగా భావించటం వల్ల, ఋషులందరూ ఆయన వద్దకు వచ్చి ధర్మసందేహాలు నివృత్తి చేసుకునేవారు. సందేహాలు మనువు నడిగితే ఆయన సమాధానాలు చెబుతుండేవాడు. అందువల్ల తన కాలం నాటి విద్వాంసు లందరిలోనూ మనువే విశిష్ట విద్వాంసుడని తెలుస్తూంది. ఆ సమాధానాలు 1.1-4 శ్లోకాలతో మొదలై చివరి వరకూ అదే శైలిలో సాగుతాయి. ఈ విధంగా ఇతరు లెవరైనా ఋషులకు జవాబు లివ్వడం శైలికీ, వ్యావహారిక విధానానికీ చెందిన విషయం కాదు. మధ్య మధ్యలో చాలా శ్లోకాల్లో భృగువు ప్రవచించినట్లు ఉంది. ఇది పద్ధతి లేని, ఉచితం కాని, సందర్భం కాని విషయం. ఎందుకంటే, విశిష్ట విద్వాంసుడుగా భావించి ఋషులు వచ్చింది మనువు వద్దకు. ప్రశ్నలూ ఆయననే అడిగారు, వారికి తగిన విధంగా జవాబులు చెప్పిందీ మనువే. కాని భృగువు మళ్లీ జవాబు లియ్యడం ప్రారంభిస్తాడు; కానీ చివరి దాకా-1.1-4 శ్లోకాల నుంచి చివరి దాకా అదే శైలి కొనసాగుతుంది.

నిజానికి మనుస్మృతిలోని భృగువుకు సంబంధించిన శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే. భృగువు శిష్యులు అతనికి ప్రాధాన్యం కల్పించి మనువుతో సమానంగా నిలపాలనే ఉద్దేశంతో వాటిని ప్రక్షిప్తం చేసి ఉంటారు. మూల మనుస్మృతి శైలికీ, ప్రక్షిప్తాల శైలికీ వాటి అసందర్భమూ, అసమంజసమూ అయిన విషయాల వల్ల, మనుస్మృతిలో ఆ శ్లోకాలు మనువు తరువాతి కాలంలో బలవంతంగా చొప్పించ బడ్డాయని నిర్ధారిత మవుతూంది. మనుస్మృతిలో ఎక్కడా కూడా ప్రసంగం ముందు గానీ, తర్వాత గానీ అవి కలవకపోవటం, పైన వ్యతిరేక వర్ణనలుండటం వల్ల, వాటిని కావాలని బలవంతంగా మనుస్మృతిలో చొప్పించారని తెలిసిపోతూంది. ఇక్కడ వాటి ప్రక్షిప్తతను గురించి చర్చిద్దాం-

క. ఏతద్వోఽయం భృగుః శాస్త్రం శ్రావయిష్యత్యశేషతః ।
ఏతద్ధి మత్తోఽధిజగే సర్వమేషోఽఖిలం మునిః ॥ 1.59 ॥
తతస్తథా స తేనోక్తో మహర్షిర్మునినా భృగుః ।
తానబ్రవీత్ ఋషీన్ సర్వాన్ ప్రీతాత్మా శ్రూయతామితి॥ 1.60 ॥

అంటే- "ఈ భృగుమహర్షి ఈ మనుస్మృతి శాస్త్రాన్ని మీకు పూర్తిగా వినిపిస్తాడు. ఎందుకంటే, ఇతడు సంపూర్ణశాస్త్రాన్ని మనువునైన నా నుంచి బాగా నేర్చుకున్నాడు. మహర్షి మనువు ఇట్లా చెప్పగానే, భృగుమహర్షి కుతూహలంతో వచ్చిన ఆ ఋషులందరితోనూ ప్రసన్నచిత్తంతో 'వినండి' అన్నాడు."

ఈ శ్లోకాల ప్రక్షిప్తతలను గురించిన విశ్లేషణ - పైన కనిపించే శైలి ఆధారంగానే కాకుండా, మరికొన్ని విషయాల ఆధారంగానూ ప్రక్షిప్తాలని తేలుతూంది.

1. **అసందర్భ వర్ణనలు**-ముందు 1.57, 1.64 శ్లోకాలలో సృష్టి ఉత్పత్తి, దాని కాలం ఉన్నాయి. వీటిలోని విషయ క్రమాన్ని అసందర్భ వర్ణన భంగం చేస్తున్నది. మనువు ఇచ్చిన సృష్టి ఉత్పత్తి సంబంధ విషయాలు 1.144 (1.25) లో పూర్తి అవుతాయి. నడుస్తున్న ఒక ప్రకరణం పూర్తి కాకుండానే, సందర్భం లేకుండానే, ఈ శాస్త్రపు అధ్యయన - అధ్యాపనల క్రమం చెప్పి, భృగువు ద్వారా వినమని చెప్పటం, అసందర్భంగానూ, అనుచితంగానూ, బలవంతంగా చొప్పించినట్లూ తెలిసిపోతుంది.

2. **అంతర్విరోధము-లోపలి విషయ వ్యతిరేకత** -1.58, 1.61-63 శ్లోకాలు కూడా సందర్భాన్ని బట్టి ఈ శ్లోకాలతో కలిసినట్లు కనిపిస్తాయి. వాటిలో 1.6, 14-23లలో వర్ణించిన సృష్టి ఉత్పత్తి క్రమంలో వ్యతిరేక వర్ణనలున్నాయి. మనువుల నుండే ఈ చరాచర సృష్టి ఏర్పడలేదు.

U20 · AI Camera
2023.04.16

3. **శైలీవిరోధము-శైలిలో వ్యతిరేకత-** మనుస్మృతిలో సహజంగా ప్రవచనం ఉండటం వల్ల మూల సంకలనంలో 'శాస్త్రం' అనే పదం వాడబడి ఉండదు. ఇక్కడ 'శాస్త్రం' అనే పాఠాన్ని తరువాత ప్రక్షిప్తంగా చేర్చి ఉంటారు.

ఖ. **యథేదముక్తవాన్ శాస్త్రం పురా పృష్టో మనుర్మయా ।**
తథేదం యూయమప్యద్య మత్సకాశాన్నిబోధత ॥ 1-119 ॥

అంటే –"**మహర్షులతో భృగుముని, మునుపు నేను అడిగినందుకు మనుమహర్షి ఈ శాస్త్రాన్ని నాకు ఉపదేశించిన విధంగా, ఇవాళ మీరు నా నుంచి వినండి అన్నాడు.**" ఇక్కడ భృగువే మనువును ఆది ప్రవక్తగా పేర్కొన్నాడు.

ఈ శ్లోకపు ప్రక్షిప్తత - విశ్లేషణ -

1. **అసందర్భం** - ముందు 1-110, 1.120 (2-1) శ్లోకాలలో ధర్మస్వరూప విశ్లేషణ ఉంది. దీని మధ్యలో సందర్భం లేకుండానే, మనువు నుంచి వినడం, తానే వినిపించడం అనేవి అసంగతం. దీనివల్ల, ముందు వెనుకల విషయభంగం అయింది.

2. **శైలీ వ్యతిరేకత** - శైలీపరంగా చూస్తే ఈ శ్లోకం భృగువు కాకుండా వేరెవరో రాసినట్లు కనిపిస్తుంది. ఇక మనువుదైతే ఏ విధంగా చూసినా కాదు.

గ. శ్రుత్వైతానృషయో ధర్మాన్ స్నాతకస్య యథోదితాన్ ।
ఇదమూచుర్మహాత్మానమనలప్రభవం భృగుమ్ ॥ 5.1 ॥
స తానువాచ ధర్మాత్మా మహర్షీన్ మానవో భృగుః ।
శ్రూయతాం యేన దోషేణ మృత్యుర్విప్రాన్ జిఘాంసతి ॥ 5.3 ॥

ఈ 5.1-4 శ్లోకాలలో మహర్షులు 'తమ ధర్మాలలో స్థిరంగా ఉన్నప్పటికీ, విద్వాంసులను మృత్యువు ఎందుకు ప్రభావితం చేస్తుంది? అని భృగువును, ప్రశ్నిస్తారు. అందుకు భృగువు వారికి అభ్యాసం లేకపోవడం, సదాచారాలు మానడం, సోమరితనం, అన్నదోషం -వీటివల్ల విద్వాంసులను మృత్యువు చంపుతుంది అని జవాబు చెబుతాడు.

ఈ '*' (స్టార్) గుర్తుగల శ్లోకాల ప్రక్షిప్తత- విశ్లేషణ

1. **శైలీవ్యతిరేకత-** శైలిని బట్టి చూస్తే ఇవి భృగువు కంటే తరువాతి వారెవరో రాసి చేర్చినవిగా తోస్తుంది. భృగువు శైలి కంటే భిన్నమైన శైలిలో వర్ణన ఉంది కాబట్టి, భృగువు రచన కాదు. స్మృతి ప్రారంభంలో ప్రశ్నలు మనువును అడిగారు. మనువు దగ్గరకే ఋషులు వచ్చారు. మళ్లీ భృగువును ప్రశ్నించడం, అతడు జవాబు చెప్పడం మనుస్మృతి శైలికి వ్యతిరేకం.

2. **ప్రసంగవిరోధం-అసందర్భం-**పై విషయం భక్ష్యం- అభక్ష్యం - తినదగినవి, తినకూడనివి అయిన పదార్థాలది. కానీ ఈ శ్లోకంలో మృత్యువుకు కారణం,అడగడం, సమాధానం చెప్పబడ్డాయి. ఇక్కడ ప్రశ్న - జవాబుల అసందర్భ వ్యవహారం ఇవి ప్రక్షిప్తాలని చెబుతున్నది.

ఘ. **చాతుర్వర్ణ్యస్య కృత్స్నోఽయముక్తో ధర్మస్త్వయానఘ ।**
కర్మణాం ఫలనిర్వృత్తిం శంస నస్తత్త్వతః పరామ్ ॥ 12.1 ॥

స తానువాచ ధర్మాత్మా మహర్షీన్మానవో భృగుః ।
అస్య సర్వస్య శృణుత కర్మయోగస్య నిర్ణయమ్ ॥ 12.2 ॥

ఈ శ్లోకాల ప్రక్షిప్తత విశ్లేషణ-

1. **అసందర్భం-** వీటి కంటే ముందు 11.266వ శ్లోకంలో మౌలిక శైలిని అనుసరించి మునుపటి విషయం ముగింపు, తరువాతి కర్మావధి విషయం ప్రారంభానికి సంకేతమైంది. అటు తరువాత మళ్లీ ప్రశ్నలు-జవాబులు అసంగతమూ, మనువు శైలికి వ్యతిరేకమూ.
2. **శైలీ వ్యతిరేకం -** ఇవి కూడా భృగువు తరువాతి వారెవరివో రచనలు.

జ. **ఇత్యేతన్మానవం శాస్త్రం భృగుప్రోక్తం పఠన్ ద్విజః ।**
భవత్యాచారవాన్నిత్యం యథేష్టాం ప్రాప్నుయాద్ గతిమ్॥ 12.136 ॥

అంటే - ఈ భృగువు చెప్పిన మానవశాస్త్రాన్ని చదివే ద్విజుడు ఎల్లప్పుడూ ఆచారవంతుడై, కోరిన గతులు పొందుతాడు - అని.

ఈ శ్లోకపు ప్రక్షిప్త చర్చ - ఈ శ్లోకంలో మనుస్మృతికి **'శాస్త్రం'** అనే పద ప్రయోగమే, ఇది తరువాత ప్రక్షిప్తంగా చేర్చబడిందని తెలియజేస్తున్నది. ఇది కూడా భృగువు తరువాతివారెవరో రచించిందే. ఇందులో దీన్ని మనువు రచించాడని చెప్పినా, భృగువు పేరు అతనికి కీర్తి రావాలని జోడించబడింది. ఇలా భృగువు పేరిట గల శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే !

1. ఇక్కడ, మనువు పేరు గల శ్లోకా లన్నిటినీ పారంపర్య జనశ్రుతిలాగా ప్రామాణికాలుగా భావిస్తూ, వీటి కర్త స్వాయంభువ మనువు అంటున్నప్పుడు భృగువు పేరున్న శ్లోకాలను కూడా ప్రామాణికమని ఎందుకు అంగీకరించడం లేదు? అనే సందేహం కలుగుతుంది.

   దీనికి స్పష్టమైన సమాధానం ఏమిటంటే - భృగువు పేరున్న శ్లోకాలు మనుస్మృతిలో ఎక్కడా పొసగటం లేదు అనేదే. అన్నీ కూడా కావాలని అసందర్భంగా చొప్పించినవే. భృగువు మనుస్మృతిని ప్రవచించాడు అనడంలో ఇబ్బందేమీ లేదు. కానీ అతని ప్రవచనం ఆధారంగా మూల మనుస్మృతిని సంకలితపరిచారు అనేది పూర్తిగా నిరాధారం. అతడు మనువుకు సమకాలీనుడు కాబట్టి ఈ ప్రవచనాల తొలి సంకలనాన్ని అతనే చేసి ఉండవచ్చు. కానీ మౌలిక సంకలనానికీ, భృగువు పేరుగల శ్లోకాలకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఇంకా విశేషమేమిటంటే, భృగువు పేరిట గల శ్లోకాలలోనూ, మనుస్మృతి మూల ప్రవక్త మనువనే ఉండటం.
2. బహుశా భృగువు ఒక సంహితను వేరుగా రచించి ఉండవచ్చు కానీ, అది అలభ్యం. మహాభారతం శాంతి పర్వం 57.51లో ఒక శ్లోకం భృగువును పేర్కొంటూంది. అది -

   రాజానం ప్రథమం విన్దేత్ తతో భార్యాం తతో ధనమ్ ।
   రాజన్యసతి లోకస్య కుతో భార్యా కుతో ధనమ్ ॥

   ఈ శ్లోకం ఇప్పటి మనుస్మృతిలో లేదు. విశ్వరూపుడు యాజ్ఞవల్క్య స్మృతి భాష్యంలో 1-187, 252లో పేర్కొన్న శ్లోకాలు కూడా మనుస్మృతిలో లేవు. అపరార్కుడు భృగువు పేరిట ఇచ్చిన ఈ శ్లోకంలో మనువు పేరు ఉంది-

   యేషు పాపేషు దివ్యాని ప్రతిశుద్ధాని యత్నతః ।
   కారయేత్ సజ్జనైస్తాని నాభిశస్తం త్యజేన్ మనుః ॥ యాజ్ఞవల్క్య స్మృతి. 2.96॥
3. ఇప్పటి మనుస్మృతి భృగుసంహిత అయివుంటే, దీని ప్రారంభం మనువు దగ్గరికి కాకుండా ఋషులు భృగువు దగ్గరికే వెళ్లి ఉన్నట్లు ఉండేది. లేదా నారదుడు, అగ్ని, విష్ణువు, యాజ్ఞవల్క్యుడు, బృహస్పతి మొదలైనవారి స్మృతులలో

ఉన్నట్లుగా వారే ప్రశ్నలు అడిగినట్లుగా ఉండేది.[42] మనుస్మృతి మనువు ప్రస్తావనతో ప్రారంభం కావడమే అది భృగుసంహిత గానీ, భృగువు రచన గానీ కాదనీ, మనువుదేననీ తెలియజేస్తుంది. 'మనుస్మృతిలో భృగువును జోడించినట్లుగా ఏ ఇతర స్మృతిలోనూ జరుగలేదు' అనడమే దీనికి నిదర్శనం.

4. చాలా గ్రంథాలలో భవిష్యపురాణంలోని ఒక శ్లోకం ఉంటుంది. అది స్వాయంభువ శాస్త్రం. అంటే మనుస్మృతి ఆధారంగా నాలుగు సంహితల రచన జరిగిందని వివరిస్తున్నది. అవి 1. భృగుసంహిత, 2. నారదసంహిత, 3. బృహస్పతిసంహిత, 4. ఆంగిరససంహిత.[43] వీటిలో చివరి మూడూ లభిస్తున్నాయి. కానీ, భృగుసంహిత దొరకడం లేదు. ఈ మూడింటి ప్రారంభాలూ ఆ యా రచయితల పేర్లతో ఉన్నట్లుగానే, ఇదే శైలి భృగుసంహితలోనూ ఉండి ఉంటుంది. దీని వల్ల మనుస్మృతి కంటే వేరైన భృగుసంహిత ఉండేదని స్పష్టమవుతూంది.

ఈ ప్రమాణాలు, నిదర్శనాలతో వాడుకలో ఉన్న మనుస్మృతి భృగువు రచన కాదని తేలుతూంది. బహుశా భృగుసంహితకు ప్రాచుర్యం లభించకపోవటం వల్ల, భృగువు శిష్యులు మనుస్మృతిలో భృగువు పేరును జోడించి, దానికి భృగువు ప్రవచనమనే గొప్పతనాన్ని ఆపాదించి ఉండవచ్చు.

ఈ. మనుస్మృతి బ్రహ్మ రచన

ఇప్పటి మనుస్మృతి మౌలికంగా బ్రహ్మ చెప్పిందన్న అభిప్రాయమూ ఉంది. కాని దీన్ని అంగీకరించే వారి సంఖ్య తక్కువే. దీనికి ఆధారం కూడా మనుస్మృతే. అందువల్ల ఇక్కడ దానికి ఆధారభూతమైన ఈ శ్లోకాన్ని పరిశీలిద్దాం - మనుస్మృతిలో కేవలం ఒక్కచోట మాత్రమే దీన్ని పేర్కొన్నారు. స్వాయంభువ మనువు - ఈ బ్రహ్మ ఈ స్మృతి శాస్త్రం రచించి, ముందుగా మనువునైన నా చేత విధిపూర్వకంగా చదివించారు. తరువాత నేను మరీచి మొదలైన పదిమంది మునులకు నేర్పించాను.

ఇదం శాస్త్రం తు కృత్వాఽసౌ మామేవ స్వయమాదితః ।
విధివద్ గ్రాహయామాస మరీచ్యాదీంస్త్వహం మునీన్ ॥ 1.58 ॥

ఈ శ్లోకపు ప్రక్షిప్తత - విశ్లేషణ - మనుస్మృతిలో ఈ శ్లోకం ప్రక్షిప్తంగా తేలింది. దీని ప్రక్షిప్తతను గురించి చర్చించే ముందు భారతీయ చారిత్రక పరంపరను అనుసరించి బ్రహ్మను ఆది గురువుగా భావిస్తారనే విషయం చెప్పుకోవడం సందర్భోచితమే అవుతుంది. అందువల్ల ప్రతి విద్యావంశమూ అతనితోనే ప్రారంభమవుతుంది. మనువు ఈ విషయాన్ని బ్రహ్మ నుంచి తెలుసుకుని ఉంటే, దీన్ని అంగీకరించడంలో ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ ఈ శాస్త్రాన్ని బ్రహ్మే రచించి మనువు కిచ్చాడు, మనువు మిగతా ఋషుల కిచ్చాడంటే ఒప్పుకోవడం చాలా కష్టం. ఈ కింది విషయాల వల్ల మనుస్మృతి దీన్ని ఒప్పుకోదు -

---

[42] అత్రిస్మృతి ప్రారంభం-**'హుతాగ్ని హోత్రమాసీనమత్రిం వేదవిదాం వరమ్ -ఇదం వచనమబ్రువన్'**
విష్ణుస్మృతిలో- **"విష్ణుమేకాగ్రమాసీనం....పప్రచ్ఛుర్మునయః సర్వే" ॥**
యాజ్ఞవల్క్య స్మృతిలో- **"యోగీశ్వరం యాజ్ఞ్యవల్క్యం సంపూజ్య మునయోఽబ్రువన్"॥**
బృహస్పతిస స్మృతిలో-**"రాజా.....భగవన్తం గురుం శ్రేష్ఠం పర్య పృచ్ఛద్ బృహస్పతిమ్" ॥**

[43] హేమాద్రి, సంస్కారమయూఖ మొదలైన గ్రంథాలలో భవిష్యపురాణంలోని ఈ శ్లోకం కనిపిస్తుంది.
భార్గవీయా నారదీయా చ బార్హస్పత్యాంగిరస్యపి ।
స్వాయంభువస్య శాస్త్రస్య చతస్రః సంహితాః మతాః ॥

1. **అసందర్భం- క.** ఈ శ్లోకంలో బ్రహ్మ పదం వాడబడలేదు. టీకాకారులు పూర్వశ్లోకాల నుంచి ఈ పదాన్ని తీసుకున్నారు. ముందరి శ్లోకాలలో 1.50-51లలో తప్పితే, ఇంకెక్కడా బ్రహ్మ పేరున్న ఆది పురుషుడి వర్ణన లేదు కాని, సృష్టి కర్తగా బ్రహ్మను చెప్పారు. 1.50-51 శ్లోకాలు ప్రక్షిప్తాలు. కాబట్టి వాటి నుంచి పదాలను తీసుకునే వీలు లేదు. ఎందుకంటే తర్వాత వచ్చిన వర్ణనలలో ఎందరో సృష్టికర్తల పేర్లు ఎన్నో శ్లోకాలలో వచ్చాయి.

   ఖ. మునుపటి 1.57, 1.64 శ్లోకాలలో సృష్టి ఉత్పత్తి, దాని కాల పరిణామం చెప్పబడింది. కాబట్టి, ఇక్కడ ఈ శ్లోకం అసంగతం. ఆ ప్రసక్తిని భంగం చేసి, ఏ చర్చా లేకుండానే చెప్పిన ఈ విషయం పూర్తిగా అనవసరమూ, అప్రాసంగికము !

2. **లోపలి వ్యతిరేకత-** ఈ శ్లోకం తరువాతి 1.59-63లకు సంబంధించింది. అందువల్ల ఈ అన్ని శ్లోకాలలోని విషయమూ ఒకటే. వీటిలో మనుష్యుల నుంచి చరాచర సృష్టి ఉత్పత్తి వర్ణన ఉంది. ఇది సృష్టిక్రమానికి వ్యతిరేకమూ, మనువు ముందు చెప్పిన 1.6,14-23 శ్లోకాలకూ వ్యతిరేకం.

ఈ శ్లోకంలో బ్రహ్మను ఈ శాస్త్రానికి కర్త అనడానికి కారణం **'మనుస్మృతిలో మొదటి మనువు, భృగువు చెప్పినవాటిలో వైరుధ్యం ఏర్పడటం'**. ఈ శ్లోకం వల్ల తలెత్తిన వ్యతిరేకతను తొలగించేందుకు టీకాకారులు ఎంతో ప్రయత్నం చేశారు. కానీ, వారి ప్రయత్నం అంతంత మాత్రమే అయింది. వారేమంటారంటే, మనుస్మృతి మూలానికి ప్రవక్త బ్రహ్మ అనీ, మనువు చేత ఆయన శాస్త్రోక్తంగా విధినిషేధాలతో అధ్యయనం చేయించాడనీ, తర్వాత మనువు దాన్ని ఈ రూపంగా గ్రంథం రచించాడు కాబట్టి దానికి మనుస్మృతి అనే పేరొచ్చిందనీ అంటున్నారు.

మరి కొందరు- ఈ గ్రంథరచయిత బ్రహ్మగారే. వారి నుంచి మనువు ఈ జ్ఞానాన్ని సంపాదించి, దానిస్వరూపం, అర్థాలతో పాటు మరీచి మొదలైనవారికి వెల్లడించాడు. అందుకనే దీన్ని మానవశాస్త్రం అంటారు. ఈ రెండు అభిప్రాయాలూ నిరాధారాలూ, యుక్తియుక్తం కానివి కూడా. వీటి విశ్లేషణకు 1.1-4 శ్లోకాలను సునిశితంగా పరిశీలించాలి. ఈ శ్లోకాల భావమూ, భాషల పట్ల దృష్టి కేంద్రీకరిస్తే ఈ కింది విషయాలు తెలిశాయి.

క. మనుస్మృతి అనేది 'మహర్షుల జ్ఞాసలకు ప్రవచనరూపంలో ఇవ్వబడిన సమాధానం'. తరువాత అది సంకలనం చేయబడింది. అంతే కానీ, మనుస్మృతి మూలరూపంలో శాస్త్రంగా రచించినది కాదు. మహర్షులు మనువు దగ్గరి కొచ్చి, ధర్మాలను వరుసగా తెలుసుకోవాలని కోరితే (1.1-3) మనువు వారికి సమాధానంగా వీటిని చెప్పాడు (1.4).

ఖ. దీని మూల ప్రవక్త కూడా మనువే. అందుచేతనే మనువు తనకు తెలిసినంతవరకు నేరుగా వేదాల నుంచి విషయాలను గ్రహించి మనుస్మృతిలో వెలువరించాడు. (1.23, 24, 87,125,129). ఒకవేళ ఇది బ్రహ్మ పరంపర ద్వారా లభించినా, లేదా బ్రహ్మ ద్వారానే లభించినా, అది దీని ప్రత్యేకత అవుతుంది. అప్పుడు ఋషులు మనువు దగ్గరి కొచ్చి **"ఓ వేదాలు తెలిసినవాడా!"** అని సంబోధించవలసిన అవసరమే ఉండేది కాదు. అలాంటి సందర్భంలో వారు మనువుతో, **"మీకు బ్రహ్మ నుంచి ఈ జ్ఞానం ప్రాప్తించే అదృష్టం కల్గింది. అందుకని మిమ్మల్నే అడుగుదామని వచ్చాము"** అని ఉండేవారు కదా! అలాంటి ఉట్టంకింపు లేవీ లేవు. పైగా ఇక్కడ మనువు వ్యక్తిగత విద్వత్తు స్పష్టంగా బహిర్గతమవుతూంది. స్వయంగా జ్ఞాని కాబట్టే తన ఆ జ్ఞానం ఆధారంగా వీరికి సమాధానం చెప్పాలనీ, వేదాలను పరిశీలించి సంపాదించిన తన ఆశయాన్ని చెప్పినాడే కానీ ఇతరులది కాదనీ గ్రహించాలి.

గ. బ్రహ్మ నుంచే ఈ జ్ఞానం పొంది ఉంటే, బ్రహ్మ పేరు వల్ల ఋషులు దాన్ని పొందాలన్న ఆకర్షణతో ఉంటే, లేదా మనువుకు బ్రహ్మ పేరు వల్ల ఏదైనా విశిష్టత లేదా ఖ్యాతికి సంబంధించిన విషయం కనిపించి ఉంటే, మనువు అన్ని విషయాలతో పాటుగా, "బ్రహ్మ ఇది చెప్పారు, అది చెప్పారు, ఇదే ఉచితమన్నారు. ఇది కాదు" మొదలైనవి చెప్పేవాడు. లేదా బ్రహ్మ అభిప్రాయాలను తెలియజేసేవాడు. కానీ మనుస్మృతిలో ఎక్కడా కూడా బ్రహ్మ అభిప్రాయానికి

vo U20 · AI Camera

సంబంధించినవి ఏవీ లేవు. [9.138] కాబట్టి, మనుస్మృతి రచనతో బ్రహ్మకు ఎలాంటి సంబంధమూ లేదని తెలుస్తూంది. ధర్మాధర్మాలను గురించి చెప్పేటప్పుడు ఋషులు-మునుల అభిప్రాయాలు చెప్పాడు లేదా తన అభిప్రాయాలు చెప్పాడు. ఋషులు, మునుల ఘనతను గురించి ఎన్నో చోట్ల ప్రస్తావనలున్నాయి. **(ఆహుర్మనీషిణః** (1.17) **ధర్మస్య మునయో గతిమ్** (1.110, 2-88,124 మొదలైనవి). వీటితో కూడా బ్రహ్మకు సంబంధముంటే, దాన్నీ ప్రముఖంగా పేర్కొనేవాడు. దీన్ని బట్టి మనుస్మృతి మూల ప్రవక్త మనువేననీ, బ్రహ్మకు దీని రచనతో ఎలాంటి సంబంధమూ లేదనీ రుజువవుతూంది.

ఘ. మనుస్మృతి శైలిని బట్టి దాని మూలరూపం ఒక కట్టుదిట్టమైన (నిబద్ధ) శాస్త్రరూపం కాదని తెలుస్తూంది. శాస్త్రరూపంలో లేదు అంటే, మూల సంకలనంలో 'శాస్త్రం' అనుపదం దీనికి వ్యవహారంలో లేదనే కదా! ఈ పద ప్రయోగం లేకపోవటం వల్ల, బ్రహ్మకు దీనితో గల సంబంధం రుజువు కావడం లేదు. కాబట్టి, ఈ శ్లోకాలలోని **'శాస్త్రం'** అను పదమే సమంజసం కాదు.

ఙ. మనుస్మృతి మూలరూపంలో ఋషుల ప్రశ్నలకు ప్రవచనరూపంలో ఇచ్చిన సమాధానం. సంకలనం తరువాతే మనుస్మృతి ఒక **'శాస్త్ర'**రూపం దాల్చింది. అందువల్ల **'శాస్త్రం'** అనే పదం మౌలికం అయ్యే వీలు లేదు. సంకలనరూపంలో గానీ, లేదా శాస్త్రరూపంలో గానీ రాని ప్రవచనాలను, మనువు **'శాస్త్రం'** అని ఎలా అనగలుగుతాడు? 'సంకలనం'గా వచ్చిన తరువాతే 'శాస్త్ర'రూపంలో ప్రఖ్యాతి చెందింది. అప్పుడు బయటివారు ప్రక్షిప్త శ్లోకాలను చొప్పించి వాటి వల్ల దీన్ని శాస్త్రంగా వ్యవహరించారు. ఈ విధంగా 58-59 శ్లోకాలలోని **'శాస్త్రం'** అనే పదం, వాటిని ప్రక్షిప్తాలుగా రూఢిపరుస్తుంది.

చ. మునుపు కొందరు విద్వాంసులు చూపిన రెండు విషయాల ఆధారంగా దీన్ని మనువు రచన అని అంగీకరిస్తే, ఆ విషయాలు చెప్పినవారు, చివరికి దీన్ని భృగు సంకలనం అని కాకుండా భృగువు రచన అని నమ్మే విధంగా చెప్పగలగాలి. ప్రాముఖ్యాన్ని గ్రహించి చదివి చెప్పినందువల్ల మనువే దీని రచయిత. అయితే, భృగువు కూడా మనువు ప్రాముఖ్యాన్ని మహర్షుల ముందు తన పదాల్లో చెప్పాడు (58-60).

వీటి వల్ల, మనుస్మృతి రచనతో బ్రహ్మకు ఏ విధమైన సంబంధమూ లేదనీ, ఇది మౌలికంగా మనువు రచనే అనీ, బ్రహ్మతో సంబంధం జోడించడం తరువాతివారి ప్రక్షిప్తాలేననీ, అన్ని అభిప్రాయాలనూ పరిశీలించి పూర్వాపరాలు చూస్తే, మనుస్మృతి మూలప్రవక్త లేదా రచయిత స్వాయంభువ మనువేననీ తేలుతూంది.

3. మనువు, మనుస్మృతి-కాల నిర్ణయం

ప్రక్షిప్తాల వల్ల నష్టం జరిగిన కొన్ని విషయాలలో **'మనువు మనుస్మృతి- కాలనిర్ణయం'** అనేది కూడా ఒకటి. లేఖకులు మనుస్మృతిలో లభించిన వర్ణనలను పరిశీలించి వాటిని అనుసరించే కాల నిర్ణయం చేశారు. వేటిని ఆధారం చేసుకుని మనుస్మృతి అర్వాచీనమన్నారో, వాటిని గురించి తరువాత చెప్పుకుందాం. ముందుగా **'మనువు'**, ఇప్పటి **'మనుస్మృతి'**- వీటి కాల నిర్ణయానికి సంబంధించిన ఇతర ఆధారాలను చర్చిద్దాం.

మనువు చెప్పిన విషయాల వల్ల **'స్మృతి, ధర్మాలు- నియమాలు'** మొదలైన విషయాల నుంచి తెలిసేది మనువు అంటే **'స్వాయంభువ'** మనువేనని రుజువైంది. అన్ని చర్చలూ, గ్రంథాలూ మనువు పేరు విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చాయి.

క. ప్రాచీన భారతీయ సాహిత్యంలో స్వాయంభువ మనువు కాలం

1. మనువు కాలాన్ని పరిగణించడంలో మనుస్మృతి మరియు యితర భారతీయ సాహిత్యంలో వంశావళులు ప్రముఖంగా సాయపడతాయి. మనుస్మృతిలో మూడు చోట్ల మనువు వంశ చర్చ ఉంది.

కూడా[52]. ప్రారంభంలో వేదాల నుంచే పేర్లను గ్రహించి వ్యక్తులకూ, వస్తువులకూ పేర్లు పెట్టేవారు[53]. మనువు వేదాలు అపౌరుషేయాలని ప్రకటించిన తర్వాత, ఆ మనువు చరిత్రనే వేదాలలో వెతకడం, మనువుకు అన్యాయం చేయడమే, మనువు కంటే ముందే వేదాలు ఉన్నాయి కాబట్టి, ఆ విషయం కాలానికి వ్యతిరేకమే అవుతుంది.

వేదాలలో మనువు పదం వేర్వేరు అర్థాలలో వచ్చింది. ఒక చోట అది ఈశ్వరుడికి పర్యాయ పదం[54]. మరొక చోట మనిషికి,[55] ఇంకొక చోట మనన శీలుడైన విద్వాంసుణ్ణి చెప్పింది[56]. ఎక్కడ ఈశ్వర వాచకంగా ప్రయోగించబడిందో అక్కడ విశ్లేషకులు బహుశా వ్యక్తి వాచకంగా గ్రహించియుంటారు. ఎక్కువ లోతుల్లోకి వెళ్ళకుండా, ఈ విషయంలో మనుస్మృతి లోనిదే ఒక ప్రమాణం చూపించి, దీన్ని ప్రామాణికం చేయవచ్చు. ఈశ్వరుణ్ని వర్ణిస్తూ మనువు 'ఆ పరమేశ్వరుణ్ని విభిన్న నామాలతో పిలవవచ్చు. వాటిలో ఒకటి **'ప్రజాపతి మనువు'** కూడా'-

ఏతమేకే వదన్త్యగ్నిం మనుమన్యే ప్రజాపతిమ్ ।
ఇన్ద్రమేకే పరే ప్రాణమపరే బ్రహ్మ శాశ్వతమ్ ॥ 12.123 ॥

ఈ విధంగా స్వయంగా మనువు అభిప్రాయం ప్రకారం కూడా వేదాలలో **'ప్రజాపతి, పిత'** మొదలైన విశేషణాలతో సంబోధించబడిన మనువు ఈశ్వరుడే ! ఈ ప్రమాణం ఉండగా, వేదాలలో మనువు పరిచయం కోసం వెదకడం మనువు దృష్టికోణానికి వ్యతిరేకమే.

4. నేటి మనుస్మృతి రచనా కాలం

ఆధునిక విశ్లేషకుల ప్రకారం, ప్రస్తుతం వాడుకలో ఉన్న ఛందోబద్ధమైన మనుస్మృతి రూపం, బాగా తర్వాతి కాలం లోనిది. దీని కాలం క్రీ.పూ. ఒకటి – రెండు శతాబ్దులు. మునుపటి చర్చలో మనుస్మృతి మూల ప్రవక్త స్వాయంభువ మనువు అనీ ఎక్కువ మంది విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే అంగీకరిస్తారనీ స్పష్టంగా చెప్పుకున్నాము. ఏ రచయిత చేసిన కృతి ఆ కాలం రచయిత కాలమే అయుంటుందనే సత్యాన్ని ఎవరైనా అంగీకరించి తీరవలసిందే కదా! అందువల్ల మనుస్మృతి కూడా దాని ప్రవక్త స్వాయంభువ మనువునాటిదే అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దాని తొలిరూపం ఎలా ఉండి ఉంటుంది? అనే విషయం మాత్రం చర్చనీయాంశమే. మనుస్మృతి ఆదిరూపపు చర్చ, ఈ చివరలో చేయబడుతుంది. ఇక్కడ ముందు వ్యవహారంలో ఉన్న ఛందోబద్ధ రూపపు మనుస్మృతి కాలాన్ని చర్చిద్దాం. మిగిలిన ప్రాచీన గ్రంథాల వలె మనుస్మృతి విషయంలో కాలానికి ఎక్కడా ఏ ఉట్టంకింపూ లేకపోవటం చేత, కచ్చితంగా కాలనిర్ణయం చేయటం దుష్కరమే. అయినప్పటికీ, ప్రాచీన గ్రంథాలలో పేర్కొన్న విషయాలు, పేర్లు ఉట్టంకింపుల ఆధారంగా దీన్ని చేయవచ్చు. ఇప్పుడు విద్వాంసులు ఈ విషయంలో ఆధారాలుగా గ్రహించిన సత్యాల మీదా, కాలనిర్ణయంలో సహాయపడే ఇతర ఆధారాల మీద దృష్టి సారిద్దాం –

క. ఆధునిక ఆధారాలు-సూచనలు

క్రీ.శ. తొలి సంవత్సరం నుంచీ క్రీ.శ.1300 వరకు ఉన్న భారతీయసాహిత్యంపై దృష్టి పెడితే, మనుస్మృతి ఎంతో ప్రసిద్ధమూ, ప్రభావం గలదీ అని తెలుస్తూంది. దీనికి ఎందరో విద్వాంసులు సంస్కృత భాష్యాలు రాశారు. వాటిలో కుల్లూకభట్టు మన్వర్థ ముక్తావళి టీక (క్రీ.శ.1150-1300) నేటికీ అధిక ప్రాచుర్యంలో ఉంది. అన్నిటి కంటే ప్రాచీనమైన

---

52. మను. 1.23; 1.4 ॥

53. మను. 1.22.

54. ఋగ్. 1.80.16; (స్వామి దయానంద భాష్యం)

55. 4.26.4; 5.2.12; 6.21.11; 8.47.4

vo U20 · AI Camera

'మేధాతిథి మను భాష్యం' కాలం క్రీ.శ. 825-900 మధ్య అన్నారు. ఇవి కాకుండా **'సర్వజ్ఞ నారాయణుని మన్వర్థ వివృతి'** (దాదాపు క్రీ.శ.1400), **'గోవిందరాజు మను టీక'** (దాదాపు క్రీ.శ.1200-1300), నందనుని నందిని, రాఘవానందుని టీక లభిస్తున్నాయి.

విశ్వరూపుడు (790-850) తన యాజ్ఞవల్క్య స్మృతి, యజుర్వేదభాష్యాలలో మనుస్మృతిలోని దాదాపు 200 శ్లోకాలు ఉదాహరించాడు.[57] దీని తరువాత మితాక్షరి రచయిత విజ్ఞానేశ్వరుడు (క్రీ.శ.1040-1100) కూడా తన భాష్యంలో మనుస్మృతిలోని వందలకొద్దీ శ్లోకాలను పేర్కొన్నాడు[58]. శంకరాచార్యులు తన వేదాంతసూత్రాల భాష్యంలో తన ఆలోచనలకు సమర్థకంగా మనుస్మృతిలోని ఎన్నో శ్లోకాలను తీసుకున్నారు. కొన్ని శ్లోకాలకైతే మనువు పేరును కూడా స్పష్టంగా రాశారు[59]. క్రీ.శ.500లో (కొందరి అభిప్రాయం ప్రకారం క్రీ.శ.200-400) జైమినిసూత్ర భాష్యంలో శబరస్వామి మనువు అభిప్రాయాలను పేర్కొనడం కనబడుతుంది[60]. బౌద్ధమహాకవి అశ్వఘోషుడు తన **'వజ్రకోపనిషత్తు'**లో తన అభిప్రాయాలను బలపరిచేందుకు, మనువు శ్లోకాలను పేర్కొన్నాడు[61]. ఇతడు కనిష్క మహారాజుకు (క్రీ.శ.78) సమకాలీనుడు.

క్రీస్తుకు పూర్వపు గ్రంథాలను పరిశీలిస్తే, యాజ్ఞవల్క్య స్మృతిలోని విషయాలను కొత్త పద్ధతిలో వర్గీకరించడం, చాలా కొత్త విషయాలను చెప్పడం ఉంటాయి. కానీ మనుస్మృతితో సరి తూగే విషయాలను చూస్తే మాత్రం, మనుస్మృతిని ఎదుట పెట్టుకుని, అందులోని విషయాలను సంక్షిప్తంగా చెప్పినట్లే ఉంటుంది.[62] ఇతని కాలం క్రీ.శ. 102కు పూర్వంగా చెబుతారు. యాజ్ఞవల్క్య స్మృతి కంటే మనుస్మృతి బాగా ప్రాచీన రచన అనే విషయంలో మాత్రం అందరు విద్వాంసులూ ఏకాభిప్రాయంతోనే ఉన్నారు. ఇదే విధంగా కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని (క్రీ.పూ.100-300) చదివినా, చాలా విషయాలను కొత్తగా చెప్పటంతో పాటుగా, ప్రాచీన విషయాలను చెప్పే సందర్భాలలో మనుస్మృతినే ఆధారం చేసుకుని చెప్పాడు.[63] చాలా చోట్ల మనువు అభిప్రాయాలను పేరుతో సహా చెప్పాడు.[64] 14వ అధ్యాయంలో దాదాపు అలాగే ఉంటుంది.

నాస్య ఛిద్రం పరో విద్యాత్ విద్యాచ్ఛిద్రం పరస్య తు ।
గూహేత్కూర్మ ఇవాంగాని రక్షేద్వివరమాత్మనః ॥ 7.105 ॥

---

56. ఋగ్. 1.80.16; 1.33.99; 2.33.13; (స్వామిదయానంద భాష్యం).నిరుక్తం, బ్రాహ్మణాలలో ఈ అర్థాలను సమర్థించారు. **'మనుః మననాత్'** (నిరు.12.34.) **'యే విద్వాంసస్తే మనవః'** (శత.8.6.3.18)

57. విశ్వరూపుడు యాజ్ఞ.స్మృ.1.45; 2.73, 74,83,85 శ్లోకాల భాష్యంలో మనువు 8.68,70,71, 105, 106, 340 శ్లోకాలను ఉదాహరించాడు.

58. యాజ్ఞ.స్మృ.1.7,53,62,69,72,78,80; 2.1,2,5,21,26 మొదలైన శ్లోకాల భాష్యంలో మనుస్మృతిలోని 2.10, 3.5, 3.44; 9.69; 3.49; 8.128, 8.13, 8.4-7, 8.350-351, 8.129 శ్లోకాలను ఉదహరించారు.

59. శంకరాచార్యులు 1.3.28; 1.3.36; 2.1.1; 2.1.11; 3.4.38; 4.2.6 సూత్రాలపై మను.లోని 1.21, 10.4; 12.6; 12.91; 12.105-106; 2.87; 1.27 శ్లోకాలను పేర్కొన్నారు. 3.1.14లలో మనువు పేరు కూడా ఉంది. 2.1.1లో **"మనుర్వై యత్కించావదత్..."** ఈ బ్రాహ్మణవాక్యాన్ని పేర్కొని మనువును ప్రశంసించారు.

60. ధర్మశాస్త్ర చరిత్ర. పి.వి.కాణే.

61. పైదే.

62. యాజ్ఞ.స్మృ.లోని 2.7; 1.15; 1.35; 2.36 మొదలైన శ్లోకాలలో మను.2.12,2.69, 1.141, 143, 144; 8.40 శ్లోకాల సంక్షిప్త భావాలు చూడండి.

63. అర్థశాస్త్రంలో ప్ర.3,అ.6,2.4, 3.5, 14.28 దినచర్య ప్ర-97లో మను.7.37, 7.39,43, 7.37-225 దినచర్య 7.155 శ్లోకాల భావం యథాతథంగా చూడండి.

64. ప్ర.8.అ.12, 1.1,10.14 మొదలైనవి చూడండి.

U20 · AI Camera 2023.04.16 12:5

భాసుని 'ప్రతిమా నాటకం' (క్రీ.పూ. 200-300, కొందరి అభిప్రాయం ప్రకారం క్రీ.పూ. 400-500) లో రావణుడు పలికిన వాక్యం వల్ల, అంతకుముందు **'మానవ ధర్మ శాస్త్రం'** ఒక ప్రసిద్ధ ధర్మశాస్త్రమన్న సూచన లభిస్తుంది.

"రావణః - కాశ్యపగోత్రోఽస్మి సాఙ్గోపాఙ్గవేదమధీయే మానవీయం ।
ధర్మశాస్త్రం, మాహేశ్వరం యోగశాస్త్రమ్.....చ" ప్రతిమానాటకం-పృ. 79 ॥

చరిత్రకారుడైన శూద్రకుని **'మృచ్ఛకటికం'** నాటకం క్రీ.పూ.మూడో శతాబ్ద రచనగా భావిస్తారు. ఇందులో ఏదో గ్రంథంలోని శ్లోకాన్ని ఉదహరిస్తూ **"బ్రాహ్మణుడు అవధ్యుడు"** అని చెబుతాడు. ఈ అభిప్రాయం మనువు పేరుతో సహా ఉదహరించబడింది -

అయం హి పాతకీ విప్రో న వధ్యో మనురబ్రవీత్ ।
రాష్ట్రాదస్మాత్తు నిర్వాస్యో విభవైరక్షతైః సహ ॥ 9.39 ॥

ఖ. ప్రాచీన ఆధారాలు-సూచనలు

అనూచానంగా వచ్చిన పద్ధతుల ప్రకారం, చాలా ప్రాచీనమని భావించే సాహిత్యంలో కూడా మనుస్మృతిలోని శ్లోకాలు ఉదహరించబడి లభిస్తాయి -

1. అ. మహాభారతంలో స్మృతికారుడు అని చెప్పిన పలు చోట్ల స్వాయంభువ మనువు లేదా మనువు అని పేర్కొనబడింది. మనువు పేరుతో ఉదాహరించబడిన శ్లోకాలు నేడు వ్యవహారంలో ఉన్న మనుస్మృతిలో లభిస్తున్నాయి. మనువు పేరు చెప్పకుండా వేర్వేరు ధర్మవిషయాల సందర్భాలలో చెప్పినవీ, యథాతథంగా మనుస్మృతిలో కనిపించేవీ యాభైకి పైగానే ఉన్నాయి. అంతే కాకుండా, కాస్త పాఠ భేదాలతోనూ, యథాతథంగా స్వీకరించిన భావాలూ గల శ్లోకాలు కూడా 50ని మించే ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని శ్లోకాలు టీకలోని వివరణలు చూడండి[65].

ఆ. మనువు పేరుతో మనుస్మృతి నుండి తీసుకున్న శ్లోకాలు.

మహాభారతంలో	**మనుస్మృతిలో**	**మహాభారతంలో**	**మనుస్మృతిలో**
శాన్తి. 56.24	9.321	ఆది. 73.9, 10	3.21

ఇ. మనువుపేరు లేకుండా మనుస్మృతి నుండి తీసుకున్న శ్లోకాలు.

మహాభారతంలో	**మనుస్మృతిలో**	**మహాభారతంలో**	**మనుస్మృతిలో**
ఆది. 75.50	2.94	,, 108.17-20	2.145-146
శాన్తి. 34.2	11.44	,, 121.60	8.335
శాన్తి. 35.4-5	11.75-76	,, 130.10	4.20
శాన్తి. 35.6	11.79	,, 130.20	8.44.
శాన్తి. 35.16	11.90	,, 139.22	4.173
శాన్తి.36.27	4.218	,, 140.7,8,24	7.102-106
శాన్తి.36.35	3.117	,, 161.4	11.237
శాన్తి.36.46	2.157	,, 165.1-5, 6-25	11.1-4,7,11-40

---

[65] (అ) స్వాయంభువ మనువు పేరుపై శ్లోకాలు-మహాభారతం. ఆది.73.8,9; శాంతి.36.5-8; 335, 44-46; 12.121; 26.121;.10,12 మొదలైనవి.

శాన్తి.36.47	2.158	,, 165.31,32,37	4.238,239
శాన్తి.72.6	1.99	,, 43.53	11.180, 207,90, 103,104,72,74, 79
శాన్తి.72.10	1.100		
శాన్తి.72.11(ఆధా)	1.101		
శాన్తి.75.7	8.305	,, 165.65	8.372
శాన్తి.83.49	7.105	,, 165.75-76	11.149,154
శాన్తి.87.9-23	7.120-123	,, 243.11-21	4.32;3.285; 4.179-185;
శాన్తి.87.14	7.127		
శాన్తి.87.18	7.139	,, 244.10-11	6.22-23
శాన్తి.90.16	8.16	,, 244.28	6.39
శాన్తి.91.6	9.301	,, 244.15	6.4-5
శాన్తి.91.21	4.172-173	,, 264.11-13	4.224-226
శాన్తి.108.5-9	2.229-234		

ఈ. మనుస్మృతిలోని భావాలను యథాతథంగా వర్ణించే శ్లోకాలు-

మహాభారతంలో	మనుస్మృతిలో	మహాభారతంలో	మనుస్మృతిలో
శాన్తి.36.20	12.110, 112	,, 165.66	8.371, 373
శాన్తి.36.28	4.217, 220	,, 201.32-33	12.8 4.7.9
శాన్తి.56.24	9.313, 319	,, 243.2-4	4.29-31
శాన్తి.72.12	9.69	,, 243.7-8	6.18
శాన్తి.87.3-5	7.114-114	,, 244.8-9	6.17,20,29
శాన్తి.87.18	7.128	,, 244.12-15	6.38
శాన్తి.88.4-5	7.129	,, 244.23-24	
శాన్తి.95.18	4.172	,, 244.4-5	6.43-44
శాన్తి.165.24	11.24	,, 244.17	6.40
శాన్తి.165.56-59	11.126-131	,, 244.7	6.43-44

ఈ అన్ని ప్రమాణాల వల్లా మనుస్మృతి మహాభారతం కంటే ముందరిదని రుజువవుతూంది. మహాభారతం లోని ప్రమాణాలూ, భారతీయ సంప్రదాయానుసారం మహాభారతయుద్ధం జరిగిన కాలం 5000 ఏళ్లకు ముందు జరిగిందనీ, మహాభారత రచయిత వ్యాసమహర్షి మహాభారతానికి సమకాలీనుడనీ తెలుస్తూంది. ఈ విధంగా చూస్తే మనుస్మృతి కాలం దాని కన్నా ముందరిదే అని తేలుతూంది.

ఆధునిక చరిత్రకారులు మహాభారత రచనా కాలమూ, యుద్ధం జరిగిన కాలమూ వేర్వేరని భావిస్తారు. వారి లెక్క ప్రకారం, మహాభారత రచన క్రీ.శ.100-600 మధ్యకాలంలో జరిగింది. ఒక కొత్త పరిశోధన ననుసరించి ఈ కాలం క్రీ.పూ.100 ఏళ్లనాటిది.[66]

2. వాల్మీకిరామాయణం కిష్కింధాకాండ 18.30,32 శ్లోకాలలో మనువు పేరుతోపాటు రెండు శ్లోకాలు లభిస్తున్నాయి- **“శ్రూయతే మనునా గీతౌ శ్లోకౌ చరిత్ర వత్సలౌ ।”** ఇక్కడ స్పష్టంగా మనువు రాసిన **“గీతౌ శ్లోకౌ”** పదం పఠించబడింది.

(క) వాలిసుగ్రీవుల ద్వంద్వ యుద్ధంలో రాముడు దూరంగా నిలబడి నిశ్శబ్దంగా వాలిని సంహరిస్తాడు. మరణసమయంలో వాలి రాముడు చేసిన ఈ పని ధర్మానుకూలం కాదంటాడు. దానికి జవాబు చెప్తూ రాముడు, **‘మనువు శ్లోకాలను రెంటిని ఉదాహరిస్తూ, తన పని ధర్మానుకూలమే’**నని రుజువు చేస్తాడు. ఈ రెండు శ్లోకాలూ నేటి మనుస్మృతిలో కొద్ది పాఠభేదాలతో 8.316, 318లుగా ఉన్నాయి. రామాయణంలోని ఆ శ్లోకాలు -

రాజభిర్ధృతదణ్డాశ్చ కృత్వా పాపాని మానవాః ।
నిర్మలాః స్వర్గమాయాన్తి సన్తః సుకృతినో యథా ।
శాసనాద్ వాపి మోక్షాద్ వా స్తేనః పాపాత్ ప్రముచ్యతే ॥
రాజా త్వశాసన్ పాపస్య తదవాప్నోతి కిల్బిషమ్ ॥

ఖ. ఇవి కాకుండా రామాయణంలో అయోధ్యాకాండలో 107.12లో మనుస్మృతిలోని మరొక శ్లోకం 9.138 ఉంది. చతుర్థపాదంలో పాఠభేదం తప్ప, ఉన్నది ఉన్నట్లుగా ఉంది. ఇది మనువు పేరు లేకుండా ఉదాహరించబడింది-

పుమ్నామ్నో నరకాద్ యస్మాత్ పితరం త్రాయతే సుతః ।
తస్మాత్ పుత్ర ఇతి ప్రోక్తః పితౄన్ యః పాతి సర్వతః ॥

భారతీయ ప్రాచీన సిద్ధాంతం ప్రకారం వాల్మీకి మహర్షి రామాయణానికి సమకాలికుడు. రాముడి కాలం లక్ష సంవత్సరాల పూర్వముదని భావిస్తారు. పాశ్చాత్య, భారతీయ ఆధునిక విద్వాంసులు రామాయణ రచనాకాలం క్రీ.పూ. మూడో శతాబ్ది నుంచి ఆరో శతాబ్ది లోపు అంటారు. కానీ, ఇవాళ కొందరు పాశ్చాత్యులూ, వారి అనుయాయులైన కొందరు భారతీయులూ, వాల్మీకి రామాయణం మహాభారతం తర్వాతిదనే ఒక వాదం లేవదీశారు. సందర్భం వచ్చింది కాబట్టి, ఇది కూడా స్పష్టం చేయవలసి ఉందని అనుకుంటున్నాను. మహాభారతం, రామాయణం తరవాతిది అని చెప్పే ఎన్నో ప్రమాణాలున్నాయి. పాశ్చాత్య విద్వాంసులు “మహాభారతం రామాయణం కంటే ముందు రచన” అంటే, వారి అనుయాయులైన కొందరు భారతీయులు దానికి తాళం వేశారు. భాషను ఆధారంగా భావించి వీరలా అంటున్నారు. ఇదేమీ కచ్చితమైన ఆధారమేమీ కాదు; దీన్ని రుజువు చేసేందుకు వారి వద్ద తగిన ప్రమాణాలూ లేవు. ఇక్కడ ఈ విషయం చెప్పడం సందర్భోచితం కాదు. అందుకని రెండు మూడు ప్రమాణాలిచ్చి ఈ చర్చను ముగిస్తాను. ఈ చర్చలో ఆ మహాభారత సిద్ధాంతమే స్వీకరించబడింది. అదేమిటంటే మహాభారతం రామాయణం తరువాతిది అని. వాల్మీకి రామాయణం మహాభారతం ముందుది అని రుజువు చేసే ప్రమాణాలివి-

క. రామాయణంలో మహాభారతంలోని సంఘటనలు లేదా కౌరవులు, పాండవుల ఉల్లేఖనం లేదు. కానీ మహాభారతంలో వాల్మీకి, ఆయన రామాయణం, రాముడికి సంబంధించిన సంఘటనలు, ఆ పాత్రల ఉల్లేఖనాలు ఉన్నాయి.

---

[66] శ్రీ చింతామణి వినాయక్ వైద్య, తన ‘మహాభారత మీమాంస’లో పరిశోధనాత్మక సత్యాలు చెప్పారు. ఒక ‘డాయోక్రాయ్ సోస్టోమ’ అనే పేరున్న గ్రీకు రచయిత క్రీ.శ.50లో దక్షిణభారతంలోని పాండ్యదేశానికి వచ్చాడు. తన పుస్తకంలో భారతదేశంలో ఒక లక్ష శ్లోకాల ఇలియడ్ (చరిత్రాత్మక మహాకావ్యం) ఉందని రాశాడు. **‘ఇలియడ్’** అంటే నిస్సందేహంగా, అతని అభిప్రాయంలో **‘మహాభారతమే’** !

ఖ. మహాభారతంలో ఎన్నోచోట్ల సంఘటన వర్ణనలు, ఉదాహరణలు, శ్లేషార్థాలు రామాయణంలోనివి ఉన్నాయి.

గ. కింది రెండు శ్లోకాలు వాల్మీకి రామాయణం లోనివిగా మహాభారతంలో ఉన్నాయి-

అ. **బ్రహ్మఘ్నే చ సురాపే చ చౌరే భగ్నవ్రతే తథా ।**
నిష్కృతిర్విహితా రాజన్ కృతఘ్నే నాస్తి నిష్కృతిః ॥ శాన్తి. 172.24 ॥

రామాయణంలో ఇది కిష్కింధాకాండ 34.12గా ఉంది. అక్కడ **"బ్రహ్మఘ్నే"** బదులుగా **'గోఘ్నే'** అనే పాఠాంతరం ఉంది. **'రాజన్'** బదులుగా **'సద్భిః'** అనే పాఠం ఉంది. మిగతాదంతా అలాగే ఉంది.

ఆ. **న హన్తవ్యాః స్త్రియశ్చేతి తద్బ్రవీషి ప్లవంగమ ।**
పీడాకరమమిత్రాణాం యచ్చ కర్తవ్యమేవ తత్ ॥ మహా. 7.143.66,రామా.యుద్ధ.81.28లో

3. మనుస్మృతిలో కేవలం వేదాల (1.21, 23; 3.2; 11.262-264; 12.111-112 మొదలైనవి) లోని, వేదాంగాలలోని (2.140,141) విషయాలే ఉన్నాయి. వేదాంగాలు కూడా ఒక వ్యక్తి రచించిన గ్రంథంలాగా కాకుండా, ఒక విద్యరూపంలో ఉన్నాయి. దీనికి రెండు తర్కాలు చెప్పుకోవచ్చు-

క. ఈ విద్యలను ఎవరో రచించిన సూచనా లేదు, గ్రంథరూప సూచనా లేదు.

ఖ. 12.111లో విద్యలు తెలిసినవారు **"హేతుకః, తర్కీ, 'నైరుక్తః' ధర్మపాఠకః"** మొదలైన విద్యల పేర్లతో పరిగణితులయ్యారు. కానీ గ్రంథ పాఠకుల రూపంలో కాదు. ఒక్కొక్క విద్య మీదా విభిన్న ఆచార్యుల గ్రంథాలు లభ్యాలు. మనుస్మృతిలో వీటిలోని ఏ ఒక్క గ్రంథాన్నీ పేర్కొనకపోవడం, మిగిలిన బ్రాహ్మణ, ఆరణ్యక విద్యలను పేర్కొనకపోవటం వల్ల, ఈ స్మృతి వీటన్నిటి కంటే పూర్వపుదేనని రుజువవుతూంది. (మనుస్మృతిలో లభించిన ఇతర విద్యావిషయాలు, వ్యక్తుల పేర్లు, ప్రదేశాల విషయంలో సమాధానానికి ఇదే అధ్యాయంలో తరువాత **'మనుస్మృతిని అర్వాచీనమని నమ్మటానికి కారణాలు సమాధానాలు'** శీర్షిక చూడండి).

4. మనుస్మృతికి కేవలం వేదాలే ఆధారం.వేదాల నుంచే నేరుగా తెలుసుకున్న విషయాలను ధర్మాల రూపంలో వర్ణించి, వాటినే ప్రమాణాలుగా నమ్మమని సలహా ఇస్తాడు. (1.4,21,23; 2.128-130,132; 12.92-94, 97,99,100,106,110-113 మొదలైనవి). వేదాలు, మనుస్మృతి - వీటి మధ్య వేరే ఏ గ్రంథమూ పేర్కొనకపోవడం వల్ల, ఇది మౌలికంగా వేదాలే ధర్మాలకు ఆధారభూతంగా ఉన్న కాలమనీ, ఇతర ఏ గ్రంథాలకూ వేదాల వంటి ఘనత లభించలేదనీ స్పష్టమవుతూంది. ఈ సమయం చాలా ప్రాచీనం కూడా.

5. విభిన్న స్మృతులలో మనుస్మృతి ఉట్టంకింపూ, ప్రశంసా ఉన్నాయి. అనేక సూత్ర గ్రంథాలలోనూ మనువు పేరు, అతని అభిప్రాయాలూ ఉల్లేఖితమయ్యాయి. వీటిలో ఆశ్వలాయన శ్రౌత సూత్రాలు (9.7.2; 10.7.1), ఆపస్తంబ శ్రౌత సూత్రాలు (3.1.7; 3.10.35), వశిష్ఠ ధర్మ సూత్రాలు (1-17), ఆపస్తంబ ధర్మ సూత్రాలు (2.14.11), బోధాయన ధర్మసూత్రాలు (4.1.14, 4.2.16), గౌతమ ధర్మ సూత్రాలు (21.7) మొదలైనవి పేర్కొనదగినవి.

6. ప్రారంభకాలంలో మనువు పాలించిన బ్రహ్మావర్తమూ, దానిలో మనువు చెప్పిన మహత్త్వమూ ఉండేవి. రామాయణ, మహాభారతాల కాలం నాటికి ఈ ప్రాంతం పేరు మారిపోయింది. రామాయణ మహాభారతాలలో బ్రహ్మావర్తం పేరైనా లేకపోవడం కూడా, అవి మనుస్మృతి తర్వాతి రచనలనిపించడానికి కారణం అయివుండవచ్చు.

సారాంశం

పైన చెప్పుకున్న ఆధారాలు, వాదాల వల్ల తేలేదేమిటంటే - ప్రస్తుతం వ్యవహారంలో ఉన్న ఛందోబద్ధమైన **'మనుస్మృతి'** అత్యంత ప్రాచీనం. లభిస్తున్న లౌకిక భాషలోని గ్రంథాల కంటే, కొన్ని వైదిక గ్రంథాల కంటే కూడా ప్రాచీనమైనది.

ఆధునిక అభిప్రాయాలను పరిశీలిస్తే, **'ముండే ముండే మతిర్భిన్నా'** అనే నానుడి సార్థక మైనట్లుగా తోస్తుంది. ఒక్కొక్క విషయం మీదా దాదాపుగా అందరు సుప్రసిద్ధ విద్వాంసులకూ వేర్వేరు అభిప్రాయాలు ఉన్నాయి. కానీ వీటి స్థిరత్వానికి మాత్రం భరోసా లేదు. ఎందుకంటే అవి చీటికీ మాటికీ మారిపోతుంటాయి. అయినా, వాటి ఆధారంగా కూడా ఛందోబద్ధమైన **'మనుస్మృతి'** రామాయణ మహాభారతాల కంటే ప్రాచీనమని తేలుతున్నది.

పాశ్చాత్య విద్వాంసుల ప్రభావంలో ఉండి 'వారు చెప్పే వాటినే సరైనవని నమ్మి మన ఆధునిక విద్వాంసులు 'స్మృతులు ప్రాచీనమ'ని నమ్మటానికి సంకోచిస్తుంటారు. పాశ్చాత్య విద్వాంసులూ, వారి భారతీయ సమర్థకులూ కాల నిర్ణయం కొరకు ఒక హద్దును ఏర్పరచుకున్నారు. వాటికి పూర్వాపరాల క్రమం కూడా సిద్ధం చేసుకున్నారు. 'ఇది ఆ సంహిత కాలం, ఇది ఆ సూత్రాల కాలం, ఇది ఆ స్మృతి కాలం', మొదలైనవి. ఇది మంచి పద్ధతి కాదు. సూత్రకాలంలో ఛందోబద్ధమైన రచనలు జరిగాయి. ఛందోబద్ధ రచనలతో పాటు సూత్ర గ్రంథాలూ రచితమయ్యాయి. అంత మాత్రం చేత సూత్ర గ్రంథాలు పూర్వరచనలు, స్మృతులు వాటి తరువాతివి అనటం సబబు కాదు. వీటిని స్పష్టం చేయటానికి ఒక ప్రమాణం సరిపోతుంది. ఆధునిక చరిత్రకారులు సూత్రగ్రంథాల కాలాన్ని క్రీ.పూ. 300 నుంచి 600 వరకు అన్నారు. అన్నిటి కంటే ప్రాచీన స్మృతులు గౌతమ, వశిష్ఠ స్మృతులన్నారు. వీటి కాలం క్రీ.పూ. 602గా నిర్ధారించారు. యాస్కాచార్యుని నిరుక్తం కాలం క్రీ.పూ. 800 అన్నారు. నిరుక్తం 3.4లో వారసత్వపు హక్కును గురించిన మనువు అభిప్రాయం ఉంది. అది ఒక ప్రాచీనస్మృతి గ్రంథంలోని వచనం; అనుష్టుప్ ఛందస్సులో ఉంది[67]. అంటే వారి ప్రకారం కూడా క్రీ.పూ. 800కు ముందు స్మృతి గ్రంథా లున్నాయని తేలింది కదా! స్మృతికారు లెవరైనా మనువు అభిప్రాయాన్ని తమ స్మృతిలో శ్లోక బద్ధం చేశారంటే, ఆ కాలంలో స్మృతులు శ్లోకాల రూపంలో ఉన్నట్లే కదా! కాలం పరంగా చాలా ప్రాచీన మైనదైనా, మనుస్మృతి మునుపే శ్లోక బద్ధమై ఉండిందన్న సంగతిని కాదనలేము. ఈ విధంగా ఛందోబద్ధ మనుస్మృతి ప్రాచీనమైన దన్న సంగతికి బలం చేకూరుతూంది.

ఇక్కడ 'రామాయణమే ఆది కావ్యమంటారు కదా, వాల్మీకి ఆదికవి. వారి నోటి నుంచే తొలి ఛందోబద్ధమైన శ్లోకం వెలువడింది' అనే శంక కలుగుతుంది. ఇది పూర్తిగా సరి కాదు. రామాయణాని కంటే ముందు వేదాలు, సంహితలలో రామాయణంలో ఉన్న అనుష్టుప్ ఛందస్సులో అనేక మంత్రాలు లభించాయి కాబట్టి ఇది సరైనది కాదంటున్నాము.[68] రామాయణం ఆది కావ్యం అనడంలోని అంతరార్థం, కావ్యాత్మక శైలిలో, లౌకిక సాహిత్యంలో ఆది ప్రథమ రసమయ కావ్యమని. రామాయణం ప్రారంభంలో భూమికలోని **"మా నిషాద ప్రతిష్ఠాం త్వం...."** (బాల. 2.15) శ్లోకం సందర్భంలో, **"నా నోటి నుంచి వచ్చిన ఈ వాక్యం గద్యరూపం లేదా శ్లోకరూపం"** అని ఆలోచించి ఉండక పోవచ్చు. దాని భావం "నేను భావావేశంలో ఈ దుర్భావనతో కూడిన అపవాక్యాన్ని ఎందుకు చెప్పాను?" అని మాత్రమే. టీకాకారులు దీన్ని తప్పుగా అర్థం చేసుకుని, ఆ రూపంలో పెట్టారు.

ఆ సందర్భంలో బ్రహ్మ అవతరించిన పౌరాణిక కాల్పనిక కథ, ఈ వ్యాఖ్యను ఈ మలువు తిప్పింది. ఈ కథ అందులో ప్రక్షిప్తమని రుజువైంది, రామాయణంలో పేర్కొన్న మనుస్మృతి శ్లోకాల వల్ల సహజంగానే మనుస్మృతి రామాయణం కంటే ప్రాచీనమని స్పష్టమవుతూంది.

---

[67] **అవిశేషేణ పుత్రాణాం దాయో భవతి ధర్మతః ।**
మిథునానాం విసర్గాదౌ మనుః స్వాయంభువోఽబ్రవీత్ ॥ (3.4)

[68] అనుష్టుప్ ఛందస్సు లక్షణం-""**పంచమం లఘు సర్వత్ర, సప్తమం ద్వి చతుర్థయోః ।**
షష్ఠం గురుర్విజానీయాత్ ఏతదనుష్టుప్ లక్షణమ్" ॥ ఈ లక్షణాలు ఆధారంగా వేద మంత్రాన్ని చూడండి **యస్తు సర్వాణి భూతాన్యాత్మన్నేవానుపశ్యతి । సర్వభూతేషు చాత్మానం తతో న విచికిత్సతి.** యజు. 40.6.

5. మనుస్మృతి అర్వాచీన మనేందుకు కారణాలు - సమాధానాలు

ఈ విశ్లేషణ తర్వాత మనుస్మృతి ప్రాచీనమనేందుకు ఇన్ని ఆధారాలు లబ్ధమవుతుండగా, 'దాన్ని ఆధునికమని ఎందుకంటున్నారు?'అనే ప్రశ్న వస్తుంది. దీనికి జవాబుగా, మనుస్మృతిలో లభించే అర్వాచీన సాధనాలను గురించి ఉన్నన్ని విషయాల సంఖ్య, దాన్ని ఆధునికమను విమర్శకుల సంఖ్య కంటే ఎక్కువే అని చెప్పవలసి ఉంటుంది. ఆ కారణాలను వెలికి తెస్తూ ఆ ప్రశ్నకు జవాబు చెప్పబడుతుంది. మనుస్మృతిలోని ఈ కింది విషయాలు, దాని ప్రాచీనతను వ్యతిరేకిస్తున్నాయి.

1. **తరువాతి రాజుల పేర్లు:-** మనుస్మృతిలో మనువు తరువాత ఎంతో మంది రాజుల పేర్లు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయి. అవి వేనుడు, నహుషుడు, పిజవన పుత్రుడు, సుదాసుడు, సుముఖుడు, నేమి (7-41). మనువు. పృథువు, కుబేరుడు, విశ్వామిత్రుడు (7-42). సుదాసుడు (8.110). పృథువు (9-44). వేనుడు (9.66).
2. **తరువాతి స్మృతికారులు లేదా ఋషుల పేర్లు:-** మనుస్మృతిలో సందర్భోచితంగా అనేకులైన స్మృతికారులు, ఋషుల అభిప్రాయా లున్నాయి, లేదా ధర్మసిద్ధిలో వారి ఉదాహరణ లున్నాయి. అవి - అత్రి, ఉతథ్యుని పుత్రుడు గౌతముడు, శౌనకుడు, భృగువు (3.16), వశిష్ఠుడు (8.110,140), వత్సుడు (8.116), వశిష్ఠుడు - అక్షమాల శారంగి - ముదపాలుడు (9.24). దక్ష ప్రజాపతికి కశ్యపుడు, ధర్మరాజు, సోమరాజులకు కన్యాదానం (9.128-129). అజీగర్తుడు- శునఃశేఫుడు (10.105), వామదేవుడు (10.106). వృధుబధయీ (10.107).
3. **తరువాతి ప్రాంతాల పేర్లు:-** చారిత్రకంగా తరువాత ఏర్పడిన కొన్ని ప్రాంతాల పేర్లు మనుస్మృతిలో ఉన్నాయి. అవి - కురుక్షేత్రం, మత్స్య, పాంచాల, శూరసేనక ప్రదేశాలున్న బ్రహ్మర్షిదేశం (1.138; 2.19). ఈ దేశాల వీరులకు యుద్ధంలో స్థాన నిర్దేశం (7.193).
4. **అర్వాచీన పౌరాణిక సిద్ధాంతాల వర్ణన:-** ఆధునికమైన కొన్ని సిద్ధాంతాలు కూడా మనుస్మృతిలో ఉన్నాయి. అవి -
   - **క.** గంగ, కురుక్షేత్రాలకు పాపాలు తొలగించుకోవడానికి వెళ్లడం (8.92).
   - **ఖ.** ఎనిమిది, పదకొండేళ్ల కన్యల పెళ్లి (9.14)

ఈ వర్ణనలు మొదటి ఉదాహరణలకు సమాధానంగా ఇచ్చిన సందర్భోచిత విషయాలు, అందరికీ అన్వయించేవిగా కనిపిస్తున్నాయి.

క. ఇలాంటి వన్ని తరువాతి వర్ణనలూ, అప్పుడప్పుడూ జరిగే మార్పులు, అభివృద్ధి, సిద్ధాంతాలను శాస్త్ర సమ్మతమని నిరూపించేందుకు ప్రయత్నించే స్వభావం గలవారు చేర్చే ప్రక్షిప్తాలు. తమ తమ విషయాలలో ఈ చోట్లు పరస్పర వ్యతిరేకంగానూ, సందర్భానికి తగనివిగానూ అనిపిస్తూ, కచ్చితంగా తరువాత చేర్చిన ప్రక్షిప్తాలని అనిపిస్తాయి. కొన్ని చోట్ల ఇవి సందర్భానికి విరుద్ధంగానూ, మరి కొన్ని చోట్ల మనువు వర్ణించిన విషయాలకు వ్యతిరేకంగానూ ఉన్నాయి. ఇలాంటి విషయాలను కాల నిర్ణయానికి ఆధారాలుగా గ్రహించే వీలు లేదు. మునుపే చాలా చోట్ల, మనుస్మృతి మూలతః మనువు ప్రవచనమనీ, ఆ తరువాతే సంకలింతపరచబడిందనీ చెప్పుకున్నాము.

ఖ. వక్త భావాలను ప్రకటించేదే సరైన సంకలనం. ఇలాంటి శైలి వల్ల, మనువు ప్రవచనాలలో మనువు తరువాతి వారి - అతని సమకాలికులను వదిలిపెడితే - ఉల్లేఖనలు సంభవం కావు. అయినా లభిస్తున్నాయి. అంటే, ఆయా చోట్లను ఆ తరువాతి వారెవరో చేర్చేసి ఉంటారని స్పష్టమవుతూంది.

గ. ఈ వర్ణనలు ఆధారంగా ఇది తరువాతి కాలంలో సంకలితపరచబడిందనో లేదా 'పునః సంస్కరించబడిందనో భావించకుండా, మూలరూపాన్నే తొలిరూపంగా భావిస్తూ, వీటన్నిటినీ తరువాతి కాలపు ప్రక్షిప్తాలుగా తీసుకోవాలి.

ఘ. పైన పేర్కొన్న ప్రాంతాలు ఇతర ఆధారాల వల్ల కూడా ప్రక్షిప్తాలని తేలాయి. దీనికి సంబంధించిన విస్తృత చర్చ భాష్యంలో తగిన చోట్ల కనిపిస్తాయి. ఇక్కడ వాటిని ప్రక్షిప్తాలుగా నిరూపించే కాలానికి సంబంధించిన సత్యాలను సంక్షేపంగా చెప్పుకుందాం -

1. ప్రాచీన గ్రంథాలలో లభించే వంశావళులు ఆధారంగా 'మనువు లేదా స్వాయంభువ మనువు వర్ణన, బ్రహ్మ తరువాతితరంలో ఆయన పుత్రుడు లేదా శిష్యుడుగా' ఉంది. ఇతన్ని సృష్టిలో తొలిరాజుగా భావించారు. ఈ విధంగా ఇతర రాజులు, ఋషులు మనువు కంటే తరువాతి వారని తెలుస్తుంది. కొందరు రాజుల, ఋషుల వంశావళులు వేరే చోట్ల స్పష్టంగా ఉన్నాయి. దీని వల్ల ఈ కథనానికి మరింత బలం చేకూరుతున్నది. ఈ రాజులలో నహుషుడు నేమి లేదా నిమి, మను వివస్వానుని, పృథు అనరణ్యునికి, నహుషుడు అంబరీషునికి, నిమి ఇక్ష్వాకుడి పుత్రులు.[69] కుబేరుడు రావణుని సోదరుడు[70]. విశ్వామిత్రుడు గాధిరాజు పుత్రుడు.[71] వేనుడు అంగదేశపు దుర్మార్గుడైన రాజు.[72] ఇతడు కర్దముని పుత్రుడు అనంగుని కొడుకు. పిజవన పుత్రుడు సుదాసుడు ఉత్తరపాంచాలదేశపు రాజు. ఇతడు రాముడి కంటే చాలా తరాల తరువాతివాడు.[73] సుముఖుని కచ్చితమైన వివరాలు తెలియరావడం లేదు. ఈ విధంగా వీరందరూ మనువుకు చాలా తరాల తర్వాతివారు.
2. ఋషుల పేర్లు, విద్యావంశాలు ఆధారంగా చూస్తే, పలు కాలాల్లో ఒక్కొక్క పేరు మళ్లీ కనబడుతుంటుంది. అందువల్ల ఆ యా సందర్భాలలో వశిష్ఠుడు, భరద్వాజుడు, వామదేవుడు మొదలైన ఋషుల పేర్లు వస్తున్నాయి. అయినా ఈ అన్నింటిలోనూ మొదటివాడుగా కనిపించే వ్యక్తి మనువు. తర్వాతివాడు వశిష్ఠుడు, భృగువు, అత్రి, మనువు శిష్యులే కాబట్టి తరువాతి వారే[74]. అజీగర్తుడు భృగువంశంలో జన్మించిన బ్రాహ్మణుడు. అతని పుత్రుడు శునఃశేపుడు. ఇది హరిశ్చంద్రుడి కాలం నాటిది[75]. కశ్యపుడు, మరీచి పుత్రుడు[76] వీరంతా మనువు తర్వాత మూడో తరంవారు.
3. కురుక్షేత్రం మొదలైన ప్రదేశాల నామకరణం మనువుకు చాలా కాలం తర్వాత జరిగింది. ఈ నామకరణం మహాభారతం కంటే కొంత పూర్వపు కాలానిది. కౌరవుల పూర్వజుడైన కురురాజు పేరిట పేరు పొందిన వంశం ఆధారంగా దీని కీ పేరుపెట్టారు. ఈ కురురాజు వైవస్వత మనువు కుమార్తె ఇల వంశంలో ఎన్నో తరాల తర్వాత పుట్టాడు.[77] ఇదే విధంగా మిగిలిన ప్రాంతాల పేర్లు కూడా తరువాత పెట్టినవే. ఈ విధంగా మనువు ప్రవచనాలలో చాలా ప్రాంతాలు తరువాతివని చెప్పటం సాధ్యం కాదు.
4. ఈ నిజం ఆధారంగానే **'కురుక్షేత్రానికి వెళ్లడం'** అనే దానికీ సమాధానం చెప్పబడుతూంది. 'కురుక్షేత్రం' కురురాజు స్థాపించింది. మనువుకు వంద తరాలకు పైగానే తరువాతిది. మనువు కాలంలో కురుక్షేత్రం లేకపోతే, అక్కడికి వెళ్లిన వర్ణన కూడా జరగనిదే. అందువల్ల ఇదీ తరువాత చొప్పించిన ప్రక్షిప్తమే. 9.94లోని వివాహ వర్ణన, మనువు అంతకు ముందు వర్ణించిన వివాహ విషయ సంబంధమైన అధిక వివరాల కోసం భాష్యంలో ఉదహరించిన శ్లోకం.3.4 శ్లోకం గురించిన విస్తృత సమీక్ష చూడదగింది. ఈ శ్లోకం సందర్భానికి విరుద్ధం కూడా. మిగిలిన అర్వాచీన వర్ణనల పరిస్థితి కూడా ఇంతేనని గ్రహించాలి.

---

69. వాల్మీకి రామాయణం బాలకాండ 70.20, 24,42; 71.3 ॥
70. అదే బాలకాండ 20.18 ॥ 71. అదే బాలకాండ.34.6
72. మహాభారతం శాంతి పర్వం. 59.96-99.
73. ప్రాచీన చరిత్ర నిఘంటువు. పు.1056 ॥
74. మను.1.35 ॥ 75. ఐతరేయ బ్రాహ్మణం. 7.15-57 ॥
76. వాల్మీకి రామాయణం 71.19-20 ॥
77. మహాభారతం అరణ్యపర్వం 59.43 ॥

5. **మనుస్మృతిలోని విభిన్న జాతుల పేర్లు** - కొందరు మనుస్మృతిలో యవనులు, బాహ్లీకులు, కంబోజులు, చైనీయులు మొదలైన జాతులు పేర్కొనబడ్డా యంటారు. యవనులు, కంబోజులు, గాంధారుల వివరణ ప్రియదర్శి అశోకుడి శిలా శాసనాలలోనూ వస్తుంది. అందువల్ల మనువు క్రీ.పూ. మూడో శతాబ్దినాటివాడు.

మనుస్మృతిలో ఈ జాతులను 10.43,44లో పేర్కొన్నారు. పదో అధ్యాయంలో జన్మలు ఆధారంగా వర్ణ సంకరాన్ని గురించిన పూర్తి విషయం తర్వాతి ప్రక్షిప్తమే. ఇది మనువు శైలి, కర్మాధారమైన పూర్వపు విషయాలకు వ్యతిరేకమే కాకుండా, ప్రకరణానికి సంబంధించినది కూడా కాదు. మనువు నాలుగు వర్ణాల వ్యవస్థను చెప్పి, ఐదవదంటూ ఏ వర్ణమూ లేదని సృష్టంగా చెప్పాడు. (1.31, 87-91; 10.4) అతడు ఈ వర్ణాల ధర్మవిధానాలను గురించే చెప్పాడు (1.2). ఈ విధంగా ఈ జాతుల మౌలిక ఉదాహరణ మనుస్మృతిలోని ఏ సందర్భంలోనూ లేదు. మనువు కాలంలోనే, అతని అభిప్రాయాలు, సిద్ధాంతాల ప్రకారమే నాలుగు వర్ణాలు కాకుండా వేరే ఏ జాతీ. ఉపజాతీ లేకపోతే, ఇప్పటి కాలంలో వీటి ఉనికి తలెత్తే అవకాశమే లేదు. పైన చెప్పిన రెండు శ్లోకాలలోనూ ఈ జాతులు శూద్రులు కావటానికి కారణం చెప్పినది భూతకాలమే. ఈ వర్ణన పద్ధతిని బట్టి చాతుర్వర్ణ్య వ్యవస్థ ఆచరణలోకి రావడం, దానిలో వికారాలు వచ్చిన తర్వాతి స్థితినీ వర్ణించారు. ఈ ప్రకారంగా చూస్తే ఈ శ్లోకాలు మనువు కాలానివి కానే కావు!

6. **మనుస్మృతిలో ఇతర ధర్మస్మృతుల ఉట్టంకింపు** -కొందరు 12.95 శ్లోకంలోని **"యా వేదబాహ్యాః స్మృతయః"** పదాల వల్ల ఇతరస్మృతులను కూడా భావిస్తూ, మనువు చెప్పిన విషయాలు ఆ నాటి బౌద్ధ జైన స్మృతులను సూచిస్తున్నాయని ఊహించారు.

ఇలా ఆలోచించేవారి ఊహలు పూర్తిగా నిరాధారమైనవే. ఇక్కడ మనువు అభిప్రాయం ఏమిటంటే, వేదానుకూలం కానివి, ఎవరు రాసినప్పటికీ, అవి గౌరవించదగినవి కావు అని మాత్రమే. ఎందుకంటే, తన స్మృతి వేదానుకూలమని ప్రకటించాడు, వేదాలనే ధర్మాలకు మూలాధారమని, పరమ ప్రమాణమనీ అన్నాడు కాబట్టి (2.6, 8-13 మొదలైనవి). 12.96లోని **"ఉత్పద్యంతే చ్యవంతే చ"** మొదలైన వచనాల వల్ల, మనువు వేదవ్యతిరేకులకు - అలాంటి ఆలోచనలు కలవారికి- ఇదొక శాశ్వత కథనంగా చెప్పాడు. బౌద్ధ జైన మతాలు ఆ నాడు ఉండి ఉంటే, వాటిని పేర్కొనటానికి ఎందుకు జంకుతారు? ఈ విధమైన స్పష్టమైన విషయమేదీ పేర్కొనక పోతే, కల్పనల వల్ల ఏ లాభమూ లేదు, భ్రాంతి కలగటం తప్ప! ఈ విషయంలో మరొక వాదం ఏమిటంటే, మనువుకు దాదాపు 78-90 తరాల తర్వాత పుట్టిన బుద్ధుడు, మహావీరుడు ప్రవర్తిల్ల జేసిన మతాల ఉటంకింపు అంతకు శతాబ్దాలకు ముందే మనుస్మృతిలో ఉండటం ఎలా సంభవమవుతుంది? మనుస్మృతిలోని వర్ణనల ద్వారా బౌద్ధ - జైన స్మృతుల ఆశయాలను స్వీకరించడం తప్పు.

7. **మనుస్మృతి - అందులోని భాష** -మనుస్మృతిలోని భాష చాలా సహజమూ, సరళ లౌకికమూ అంటారు. ఇది పాణిని వ్యాకరణాన్ని అనుసరించి ఉంటుంది. అందువల్ల మనుస్మృతి తగినంత ఆధునికమే.

మనుస్మృతిలోని భాష సహజమూ, సరళలౌకికమూ అన్నంత మాత్రాన, ఈ కారణం చేత ఇది అర్వాచీనభాషగా పేర్కొనబడదు. ఇది ఒక ధర్మశాస్త్రం కాబట్టి, దీనికి అన్ని విధాలుగానూ జనులందరితోనూ సంబంధం ఉంటుంది. ఇందులో లోకులందరి ఆచార-వ్యవహారాలకూ సంబంధించిన నిర్దేశాలుంటాయి. అందువల్ల ఇలాంటి గ్రంథపు భాష సహజమూ, సరళమూ కావడం స్వాభావికమూ, అవసరమూ కూడా. ప్రాచీనకాలంలో సాహిత్యకభాష వైదికభాష ఉండేది. వ్యవహారంలో వైదికభాష కలిసిన సంస్కృతం ప్రయోగించబడేది. మనువు వైదికకాలపు వ్యక్తి కాబట్టి, అతని భాష మౌలికంగా వైదికకాలానికి తగినట్టే ఉంటుంది.

నేటికీ మనుస్మృతిలో పాణినికి పూర్వపు ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇందులోని వైదికప్రయోగాలూ, వైదికప్రయోగ శైలి - ఈ గ్రంథాన్ని పాణినికి పూర్వపుదిగానూ, వైదికకాలపు సంకలన మనీ రుజువు చేస్తున్నాయి.

క. **'మే త్యుక్త్వా'** (8.57) **'మే+ ఇత్యుక్త్వా'** - ఈ సంధి పాణినీయం కాదు. ఇందులోని ఇకారపు పూర్వ స్వరూపం ఛాందసం.

ఖ. **'హాపయతి'** (3.71) దీనికి **'వదులుతుంద'**ని అర్థం. ఇక్కడ ప్రేరణార్థకం కాకుండా ప్రకృత్యర్థం (మూలార్థం) లోని **'ణిచ్'** ఛాందసం.

గ. 2.169-171 శ్లోకాలలో **'మౌంజీ బంధనం', 'మౌంజి బంధనం'** ఈ పదాల ప్రయోగంలో వికల్పం వల్ల హ్రస్వం ఛాందస ప్రయోగం.

ఘ. **'ఉపనయనం'**- దీనికి **'ఉపనాయనం'** అనే అర్థంలో ప్రయోగం (2.36) పాణినికి పూర్వపుది. ఇక్కడ దీర్ఘాన్ని పాణినివ్యాకరణ సమ్మతం కానప్పటికీ శిష్టప్రయోగంగా భావించి, **'అన్యేషామపి దృశ్యతే'** (అ.6.3.137) సూత్రం నుంచి గ్రహించి, ప్రయోగించాడు.

జ. 1.20లో **'ఆద్యాద్యస్య'** ప్రయోగం ఉంది. ఇది **'ఆద్యస్య-ఆద్యస్య'**గా ఉండాలి. కాని ముందరి **'ఆద్యస్య'** యొక్క సుపలుక్ ఛాందసప్రయోగం కావటం చేత ఒప్పుకున్నారు. (సుపాం సులుక్.....అష్టాధ్యాయి 7.1.39)

చ. శైలిలో వైదికభాష- **'ఆ హైవ స నఖాగ్రేభ్యః'** (2.168), **'పుత్రకా ఇతి హోవాచ'** (2.151) మొదలైనవి.

దీని భాషలో కనిపించే మరొక లక్షణం ఏమిటంటే, ప్రారంభంలో అధికంగా కనిపించిన వైదిక భాషలోని ప్రయోగాలు క్రమంగా తగ్గిపోవడం. సర్వసామాన్యులకూ సంబంధించిన గ్రంథం కాబట్టి సమయానుకూలంగా దీని భాష మారుతూ వచ్చింది. అలాంటి ఉదాహరణల వల్ల ఈ మాటకూ బలం చేకూరింది. వాల్మీకిరామాయణానికి దాక్షిణాత్య, వంగదేశపు, వాయవ్య ప్రాంతాలలోని ప్రచురణలు ప్రసిద్ధంగా ప్రాచుర్యంలో ఉన్నాయి. దీని దాక్షిణాత్య పాఠంలో వైదిక ప్రయోగాలు ఎక్కువగా ఉంటాయి. ఇతర భాషల ప్రచురణల్లో ఎక్కువ భాగం మార్చి లౌకికం చేయబడ్డాయి. ఇదే మనుస్మృతికీ జరిగి ఉండవచ్చు. కాలాన్ని బట్టి చూస్తే, మనువు ఋషులందరి కంటే పూర్వీకుడు. అతని రచన అయిన ఈ స్మృతి అన్నింటి కంటే అధికంగా ప్రసిద్ధిచెందింది. మరి దీని సంకలనం తర్వాత ఎప్పుడో ఆధునిక కాలంలో జరిగిందనడం సమంజసం కాదు. కొందరు "మనువు తర్వాతి వశిష్ఠుడు, గౌతముడు మొదలైనవారి స్మృతులు మనుస్మృతి కంటే ప్రాచీనాలు. వాటి సంకలనమే ముందు జరిగింది" అనే మాటలు అసంబద్ధాలు. భాషాపరంగా ఈ స్మృతులలో కొంత పూర్వాపర క్రమం కనబడుతున్నదీ అంటే, దానికి కారణం వాటి ప్రాచీనతా, మనుస్మృతి అర్వాచీనతా కాదు; మనుస్మృతికి వచ్చిన బహుళ ప్రాచుర్యమూ, సామాన్యజనులు సైతం వ్యవహారంలో ఉపయోగపడటం వల్ల ఆ యా సమయానుకూలంగా దాని భాషలోనూ, ప్రయోగాలలోనూ, జరిగిన మార్పులే అని చెప్పుకోవాలి. మిగిలిన స్మృతులలో వాటికి ప్రసిద్ధి కలగక పోవడం, ప్రాచుర్యం కలగకపోవడం వల్ల భాషలోనూ మార్పులు రాకపోవడమే.

8. మనుస్మృతి తొలి రూపం

మనుస్మృతి మొదటి రూపం ఎలా ఉండి ఉంటుంది? ఈ ప్రశ్నను చర్చిస్తూ ఎందరో దార్శనికులు ఎన్నో అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు దీని తొలి రూపం గద్యంలో ఉందంటే, మరి కొందరు సూత్రాల రూపంలోనిదన్నారు. ఇక కొందరు పద్యాల రూపంలోని దన్నారు. దీని శైలిని బట్టి ఈ ప్రశ్నకు లభించే సమాధానమే ఎక్కువ సంతోషం కలిగించేదీ, ప్రామాణికమూ అని నా అభిప్రాయం. మనుస్మృతి శైలి మీద ఈ అధ్యాయం మధ్యలో (మనుస్మృతి రచయిత ఎవరు అనే ప్రశ్నకు సమాధానంలో) తగినంత విస్తారంగా ప్రమాణాలతో సహా వెల్లడి చేయబడింది. దాని ప్రకారం, మనుస్మృతి మౌలికంగా : మనువు ప్రవచనాలు, అవి తర్వాత సంకలితమయ్యాయి. ప్రారంభం నుంచి చివరి వరకూ ఇది మనువు ప్రవచనాల రూపమే, అలాగే సంకలించబడింది. నిరుక్తంలోని ప్రాచీనకాలంలో ఉపదేశాలు, ప్రవచనాల ద్వారానే విద్య బోధించబడేది కానీ, లిపిబద్ధ గ్రంథాలను చదివించడం ద్వారా కాదు - అనే ప్రమాణంతో ఈ విషయానికి బలం చేకూరింది. జనం ఉపదేశాలను ఎప్పుడు నిర్లక్ష్యం చేయటం ప్రారంభించారో, అప్పటి నుంచీ గ్రంథాలను రచించి, వాటి ద్వారా విద్యాబోధన మొదలైంది.[78]

---

[78] నిరు.1.19. ఈ విషయం **'మనుస్మృతి మూల ప్రవక్త'** అనే శీర్షికలో మొదట ఉదహరించబడింది.

1. ప్రవచనాలు గద్యరూపంలోనే ఉంటాయి. అందువల్ల మనుస్మృతి తొలిరూపం గద్యమేనని కచ్చితంగా చెప్పవచ్చు. గద్యరూపం నుంచే దీన్ని పద్యాలలోకి మార్చారు.

దీనికి శైలి కాకుండా మనుస్మృతిలోని యితర కొన్ని ప్రమాణాలు చూద్దాం. వాటి వల్ల విషయక్రమాన్ని ఉన్నది ఉన్నట్టుగా ఉంచటానికి కొంత ఇబ్బంది కలిగితే, తప్పనిపరిస్థితిలో ఆ క్రమాన్ని మార్చారని తెలుస్తూంది. మూలరూపం పద్యరూపంలో ఉండి ఉంటే, ఏ క్రమంలో విషయాలు చెప్పబడ్డాయో అదే క్రమంలో వాటి వ్యాఖ్య కూడా జరిగి ఉంటుంది. అవి-

క. 8.6 లో పద్దెనిమిది వ్యాజ్యాల పరిగణన చేస్తూ, **'పారుష్యే దండవాచికే'** అనే పదప్రయోగం చేస్తూ దండన **'కఠోరత'** **'మాటల కటుత్వం'** - ఈ విధంగా ఈ అభియోగాల వర్ణన ఉంది. అటు తర్వాత దీని విస్తృత వ్యాఖ్యలో ముందు **'వాక్పారుష్యం'** వర్ణన ఉంది (8.266-277). ఆ తరువాత **'దండ పారుష్యం'** వర్ణన (8.278-300) ఉంది. ఈ విధంగా వరుస మారిపోయింది. బహుశా ఈ మార్పు ఛందస్సు వల్ల జరిగి ఉంటుంది.

టీకాకారులు దీనికి వ్యాకరణపరంగా ఇలా సమాధానం చెప్పారు **'అల్పాచ్తరం పూర్వం'** (అష్టాధ్యాయి 2.2.34) అనేదాని నియమాల ప్రకారం, **'అల్పాచ్'** కావడం వల్ల ఛందస్సులో శిక్షను ముందుగా పరిగణించినట్లుంది. దీన్ని ఒప్పుకోవడంలో అభ్యంతరా లేమీ లేవు. కాని దీని వ్యాఖ్యానంలో నిర్దేశించిన శృంఖలాక్రమంలో తేడా వస్తుంది కాబట్టి, **'అల్పాచ్'**కు ప్రాధాన్యం ఇవ్వడానికి కారణమేదీ కనిపించదు. స్వతంత్ర పరిగణనలో ఈ నియమం బాగుందని చెప్పవచ్చు. ఈ నియమానికి వ్యతిరేకంగా పైన చెప్పినట్లుగా **'వాగ్దాండికే'** ప్రయోగం ద్వారా ఉంచితే, తప్పకుండా ఛందోభంగం అవుతుంది. ఈ కారణం వల్లనే దాని వరుసను మార్చి **'దండవాచికే'** అనే ప్రయోగం చేయవలసి వచ్చి ఉంటుంది. ఇలాంటి ఉదాహరణలు ఇంకా చాలా చోట్ల కనిపిస్తాయి.

ఖ. 12.83 లో ఆరు మేలుకలిగించే కర్మలు ఇలా ఉన్నాయి - **'వేదాభ్యాసం, తపస్సు, జ్ఞానం, ఇంద్రియనిగ్రహం, ధార్మికక్రియలు, ఆత్మచింతనం'.** కానీ వీటిని వ్యాఖ్యానించేటప్పుడు, **ఆత్మజ్ఞానం** (12.85-92), **శమం - ఇంద్రియ నిగ్రహం** (12.92), **వేదాభ్యాసం** (12.92-102), **తపస్సు, జ్ఞానం** = విద్య (12.104), **ధర్మం** (12.105-115) అనే వరుస ఉంది. వీటి వ్యాఖ్యానం గద్యరూపంలో ఈ క్రమంలోనే ఉంది. కానీ ఛందోబద్ధం చేసేటప్పుడు, ఇదే వరుసలో ఛందోరచన కుదరకపోవడం వల్ల క్రమాన్ని మార్చవలసి వచ్చింది.

2. మనుస్మృతి తొలిరూపం సూత్రాలలో లేదు. దీని శైలి వల్ల గానీ, మనువును పేర్కొన్న వారి ఉదాహరణల వల్ల గానీ, దీనికి బలం చేకూరడం లేదు. అంటే ఉదాహరణలు కూడా వాక్యాలలోనే ఉన్నాయని గ్రహించాలి. బహుశా ఈ మాట కూడా **'సూత్రాలు'** అని సూత్రగ్రంథాలలో జోడించబడి ఉండవచ్చు. ప్రాచీన గ్రంథాల నుండి ఇప్పటి వరకు వచ్చిన వాటిలో మనువు శాస్త్రం **'మానవ ధర్మశాస్త్రం'** లేదా **'మనుస్మృతి'** అనే పేరుతోనే చెప్పబడుతూంది కానీ, **'మానవ ధర్మ సూత్రాలు'** అని ఎక్కడా ఎవరూ పేర్కొనలేదు.
3. **'మానవ ధర్మసూత్రాలు'** అనే గ్రంథాన్ని కొందరు మనువురచనగా భావిస్తున్నారు కానీ, మనుస్మృతితో దానికి పూర్తిగా పోలికలు లేవు. ఈ సూత్రగ్రంథాన్ని చాలా కాలం తరువాతి వారెవరో మనువు పేరిట, తమ అభిప్రాయాలు కలబోసి రచించి ఉంటారు. ఈ సూత్రరూపం ఆదిరూపం కాదు. దీన్ని పద్యరూపం చూసి రచించి ఉండవచ్చు.
4. గ్రంథాల సూత్రశైలి ఎక్కువ ప్రాచీనం కాదు కానీ, గద్యపద్య రూపాలే చాలా ప్రాచీనమైనవి. సూత్రాల కంటే గద్యరూపంలోనే ప్రాచీన గ్రంథాలన్నీ లభిస్తున్నాయి- బ్రాహ్మణ గ్రంథాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు మొదలైనవి. నేటి మహాభారతం ఎన్నో చోట్ల గద్యరూపంలో ఉంది. మిగిలిన ఆధునిక గ్రంథాలు కౌటిల్యుడి అర్థశాస్త్రం, నారద గద్యస్మృతి ఇత్యాదులు గద్యరూపంలోనే ఉన్నాయి. అందుచేత మనుస్మృతి ప్రారంభరూపం గద్యరూపం అని అంగీకరించవచ్చు.

U20 · AI Camera

5. ఒకప్పుడు మహాపురుషులు ప్రవచనాలు చెప్పడం, వారి శిష్యులు వాటిని గద్యరూపంలోగానీ, పద్యరూపంలోగానీ సంకలితం చేయడం అనే పద్ధతి ఉండేది. బహుశా అన్ని ధర్మగ్రంథాలు కూడా అలాంటి మహానుభావుల ఉపదేశాలుగా వెలువడి, తరువాత సంకలితం చేయబడి ఉండవచ్చు. బుద్ధుడి ఉపదేశాలన్నీ **'ధమ్మపదం'** పేరుతో పద్యరూపంలో ఉన్నాయి. గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ పేరుతో లభించే గ్రంథాలన్నీ అతని శిష్యుల ద్వారా సంకలితమైనవేనని అంటారు. మహర్షి దయానందుల పేరిట లభించే **'ఉపదేశ మంజరి'** లేదా **'పూనా ప్రవచనాలు'** పుస్తకం మౌలికంగా వారి ప్రవచనాలు. తరువాత ఇతరుల ద్వారా సంకలితమూ, సంపాదితమూ అయ్యాయి. ఈ విధంగానే మనుస్మృతి కూడా సంకలితమైంది.

6. గద్యరూపంలో ఉండిన మనుస్మృతి పద్యరూపం లోకి ఎప్పుడు మారిందో చెప్పలేము కానీ, లభించిన ఉదాహరణల ద్వారా మనుస్మృతి పద్యరూప గ్రంథం కూడా అతి ప్రాచీనమైనదనే చెప్పవచ్చు. మనుస్మృతిలో భృగువు పేరు పదే పదే వస్తుంటుంది. మనువు శిష్యుడైన భృగువు వీటిని పద్యాలుగా రాసి ఉండవచ్చు. లేదా సంకలనం తరువాత సులువు కోసం మనువు తొలి శిష్యులలో ఎవరో వీటికి పద్యరూపం ఇచ్చి ఉండవచ్చు. ఈ పద్యరూప గ్రంథమూ చాలా ప్రాచీనమని ఎందు కంటున్నామంటే, మనువు పేరు కంటే ముందుగా గ్రంథ రూపం ప్రాచుర్యం లోనికి రావడమే దీనికి కారణం. ఎందుకంటే రామాయణం[79], మహాభారతం[80]. వీటిలో మనువు శ్లోకాలు పాడినట్లుగా ఉంది - అంటే ఈ గ్రంథాల రచనా కాలాల్లో ఈ శ్లోకాలు మనువు పేరిట ప్రసిద్ధిగాంచాయనే కదా !

7. నారదస్మృతి ముందు మాటలో మనువు ఒక ధర్మశాస్త్రాన్ని రచించాడనీ, అందులో లక్ష శ్లోకాలున్నాయనీ, 1080 అధ్యాయాలు, 24 ప్రకరణాలు ఉన్నాయనీ ఉంది. నారదుడు దీని 12000 శ్లోకాలను సంక్షిప్తం చేసి, మార్కండేయుడికి బోధించాడు. మార్కండేయుడు. వీటిని 8000 శ్లోకాలకు సంక్షిప్తం చేశాడు. తరువాత సుమతి అయిన భార్గవుడు 4000 శ్లోకాలకు కుదించాడు. నారదస్మృతిలోని ఈ విషయం గ్రంథం గొప్పతనాన్ని పెంపొందించడానికే జరిగింది. ఈ విధంగా సంక్షేపంగా చెప్పడం మూలరూపానికి అనురూపంగా లేదు. అలాంటి శాస్త్రీయ ప్రమాణం కూడా ఏదీ లేదు.

***

---

[79] "శ్రూయతే మనునా గీతా శ్లోకా చరిత్ర వత్సలా"- వాల్మీకి రామాయణం. 18.30 ॥

[80] "మనునా చైవ రాజేంద్ర గీతా శ్లోకా మహాత్మనా"- మహా భారతం శాంతి పర్వం. 56.24 ॥

రెండవ అధ్యాయం

మనుస్మృతి - ప్రక్షిప్తాలు

1. మనుస్మృతిలోని ప్రక్షిప్తాల పరిశీలన ఆవశ్యకత - ఉపయోగాలు

మనుస్మృతిని ప్రక్షిప్తాలతో వికారం కావడాన్ని చూస్తుంటే, వాటిని పరిశీలించడం అవసరమని తోస్తూంది. ప్రక్షిప్తాలను పరిశీలించడం, వాటిని వేరుచేయటంతోనే మనుస్మృతి శ్రేష్ఠరూపం వెలుగుచూడగలుగుతుంది. ఇది ఎంతో ఉపయోగకరమూ అవుతుంది. దీనివల్ల మనువు, మనుస్మృతికి సంబంధించి ప్రచారంలో ఉన్న అపోహలన్నీ తొలగిపోతాయి. ఈ పరిశీలన వల్ల ఒక వైపు సాహిత్య దృష్టితో జరిగే గొప్ప కార్యం ఏమిటంటే - భారతీయ సాహిత్యంలోని ఒక ప్రముఖ గ్రంథం ప్రామాణిక రూపంతో లభిస్తుంది; మరొక వైపు ఆధ్యాత్మిక దృష్టితో ఉన్నతి కావాలనుకునేవారు లేదా జీవితంలో సన్మార్గంలో వెళ్లాలనుకునేవారికి కూడా ఈ లోపరహిత రూపంతో పథ నిర్దేశం జరుగుతుంది. సాంస్కృతిక దృష్టితో చూస్తే మనువు కాలపు భారతీయ సమాజం, సంస్కృతుల రూపాలను మనుస్మృతి దర్శింపజేస్తుంది. వర్తమాన సమాజం ఎల్లలను, వ్యవస్థలను దిగ్దర్శనం చేయిస్తుంది. చారిత్రకపరంగా కలిగే లాభం ఏమిటంటే, ప్రక్షిప్తవిషయాలతో కలుషితమైన మనుస్మృతిని ఆధారం చేసుకుని చరిత్రకారులు, ప్రాచీన చరిత్రలో రాసిన మాంసభక్షణం, పశుయజ్ఞాలు, జాతిభేదాలు, అస్పృశ్యత, హెచ్చుతగ్గులు - లాంటి నీచమైనవిషయాలు పోయి, ఆ చరిత్ర శుద్ధమూ, ఉజ్జ్వలమూ అయిన వాస్తవస్వరూపం మన ముందుకు వస్తుంది. ఇలా మనుస్మృతి మీద పరిశోధన జరగటం వల్ల ఆధ్యాత్మికంగానూ, భారతీయ సమాజం, సంస్కృతి, సాహిత్యం, చరిత్రలకు ఎంతో మేలు జరుగుతుంది.

ప్రాచీన భారతీయ సాహిత్యం మనకు అమూల్యమూ, ఎంతో గౌరవప్రదమైన నిధి లాంటిది. అందులోని ఒక విశిష్టగ్రంథానికి చక్కని గుర్తింపు కలుగుతుంది. విలువ ఏర్పడుతుంది. అంతే కాకుండా మనుస్మృతికి సంబంధించిన ఆంతరిక సమస్యలు, అంటే - రచయిత, రచనా కాలం, మౌలిక ఘనతలు మొదలైనవాటిని పరిష్కరించటంలోనూ ఎంతో కొంత సాయం తప్పకుండా లభిస్తుంది.

2. ప్రక్షిప్తం అంటే?

ప్రక్షిప్తం అంటే - **'ఒకరి రచనలో ఇతరులు కలిపిన విషయాలు'** అని అర్థం. ఎవరైనా ఒకరు రాసిన మూల గ్రంథంలో ఇతరులు కలిపే అభిప్రాయాలు, విషయాలను **'ప్రక్షిప్తాలు'** లేదా **'ప్రక్షేపాలు'** అంటారు. మనుస్మృతిలో మనువు కాకుండా ఇతరులు రాసి కలిపినవాటిని **'ప్రక్షిప్తాలు'**గా భావిస్తారు. ఈ ప్రక్షిప్తాలు **'వ్యతిరేకపు ఆలోచనలు'** నిండినవో, లేదా చెడువో కానక్కర లేదు; అవి గ్రంథాన్ని బలపరిచేవీ, మంచి ఆలోచనలతో కూడినవీ కావచ్చు.

3. మనుస్మృతిలో ప్రక్షిప్తాలు లేవా?

కొందరు మనుస్మృతిలో ప్రక్షిప్తాలు లేవనే అంటారు. ప్రస్తుతం ఉన్న **'మనుస్మృతి'** వాస్తవస్వరూపమేననే వీరి అభిప్రాయం పూర్తిగా అపోహే అని చెప్పవచ్చు. ప్రస్తుతం లభిస్తున్న మనుస్మృతిని పరిశీలిస్తే ఇది ప్రక్షిప్తాలతో నిండి ఉందనీ, ఒక్కసారిగా కాకుండా అప్పుడప్పుడు కొంత కొంతగా మనుస్మృతిని ప్రక్షిప్తాలతో నింపేశారనీ కచ్చితంగా చెప్పవచ్చు. వీటిని బలపరిచే ఈ కింది విషయాలను పరికించండి -

1. ఇప్పుడు లభిస్తున్న **'మనుస్మృతి'లో విషయవిరుద్ధం, పరస్పర విరుద్ధం, సందర్భానికి వ్యతిరేకమైన శ్లోకాలు,** ఎన్నో పునరుక్తులు ఉన్నాయి; ఇంకా ఆశ్చర్యం కలిగించే విషయ మేమిటంటే, అక్కడ కూడా త్రికోణాత్మకమైన

వ్యతిరేక విషయాలు 'పరస్పర విరుద్ధాలు' ఉన్నాయి; లేదా మొదటి శ్లోకంలో ఒక పద్ధతి ఉంటే, ఆ వెంటనే దాని తరువాతి శ్లోకంలోనే దాన్ని వ్యతిరేకించే విషయం ఉంది. ఇంత హాస్యాస్పదమైన పరిస్థితిని చూసి కూడా మనుస్మృతిలో ప్రక్షిప్తాలు లేవు అంటే, చెప్పుకునేదేమీ ఉండదు ! ఒక మామూలు రచయిత రాసిన పుస్తకంలోనూ ఇన్ని లోపాలుండవు. ఆ రచనలో ఆలోచనల ఐకమత్యం, విషయం, సందర్భాల చక్కని క్రమం, స్పష్టమైన అభివ్యక్తి ఉంటాయి. అలాంటప్పుడు, మనువు లాంటి దార్శనికుడు, విద్వాంసుడి రచనలో ఇలాంటి లోపాలు, దోషాలు ఉండటం ఎంత మాత్రమూ సంభవం కాదు. మనుమహర్షి తన కాలపు అత్యధిక ప్రఖ్యాతి గల, ధర్మసంబంధ విషయమర్మజ్ఞుడైన విద్వాంసుడు. అందుచేతనే ఆసక్తి గల మహర్షులందరూ తమ సందేహనివృత్తి కోసం ఆయన దగ్గరి కెళ్లారు. వారు వాటిని నివేదించుకుంటూ ఇలా అన్నారు –

భగవన్ సర్వవర్ణానాం యథావదనుపూర్వశః ।
అన్తరప్రభవాణాం చ ధర్మాన్నో వక్తుమర్హసి ॥ 1.2 ॥
త్వమేకో హ్యస్య సర్వస్య విధానస్య స్వయంభువః ।
అచిన్త్యస్యాప్రమేయస్య కార్యతత్త్వార్థవిత్ప్రభో ॥ 1.3 ॥

అంటే – ఓ భగవన్ ! మీరు అన్ని వర్ణాలనూ, ఆశ్రమాలనూ సరిగ్గా చెప్పే సమర్థులు. ఈశ్వరుడి రచన, అచిన్త్యమూ, అపరిమితమూ అయిన జ్ఞానంతో నిండిన వేదరూప విధానపు ధర్మతత్త్వాన్నీ (వ్యావహారిక తత్త్వం), దాని అర్థాన్నీ గ్రహించిన ఏకైక విద్వాంసులు మీరే ! (అందుకని మాకీ ధర్మాలను ఉపదేశించండి) అని.

దీన్ని బట్టి మనుమహర్షి తన కాలంలో **'ప్రఖ్యాతుడనీ,** ఈ విషయంలో అందరికంటే సాధికారత కలిగిన **మహా విద్వాంసుడనీ'** స్పష్టంగా తెలుస్తుంది. అందుచేత అలాంటి విద్వాంసుడి రచనలో పైన చెప్పుకున్న లోపాలు ఉండే అవకాశమే లేదు. అయినా లోపాలు కనిపిస్తున్నాయంటే, మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయనే కదా! (వీటికి ఉదాహరణలు ఇదే అధ్యాయంలో ప్రక్షిప్తాల పరిశీలన ఆధారం, ప్రమాణాలు, శీర్షికలో చూడగలరు).

2. మనుస్మృతిలో ఒకవైపు శ్లోకాల గాంభీర్యం, యుక్తియుక్తత, ఆధారాలు, కాఠిన్యం, పక్షపాత రహితమైన సంతులిత శైలి ఉంటాయి; మధ్య మధ్య అతి సామాన్యపు, యుక్తియుక్తం కాని, నిరాధారమైన, అతిశయోక్తులు నిండిన అతి కఠినమూ, పక్షపాతపూర్ణమైన రూఢశైలికి అంధానుకరణ శైలి చెందిన శ్లోకాలూ కనబడుతుంటాయి. నిస్సందేహంగా, చెప్పిన దానికి వ్యతిరేకాలూ, భిన్నతలూ ఒకే రచయిత శైలిలో ఉండవు. మనువుతో సమానమైన విద్వత్తు గల పండితు డెవరో వీటిని రచించాడని చెప్పవచ్చు, కాబట్టి ఇవి కచ్చితంగా ప్రక్షిప్తాలే !

3. మనుస్మృతిలో మనువుకు తరువాతి జనం, జాతులు, స్థలాలను గురించి రాయబడి ఉంది. అలాగే అక్కడ కూడా మనువు నిర్ధారించిన మౌలిక వ్యవస్థలకు భిన్నమైన వ్యవస్థలు వర్ణించబడి ఉన్నాయి. కొన్ని శ్లోకాల్లోనైతే **'మనురబ్రవీత్' "మనో రనుశాసనమ్"** మొదలైన పద ప్రయోగాలున్నాయి. ఇవి తప్పకుండా వేరే రచయితను సూచిస్తున్నాయి. ఇలాంటి అన్ని శ్లోకాలూ తరువాతివి కావటం వల్ల ప్రక్షిప్తాలే.

4. లభించిన మనుస్మృతి ప్రతులు కూడా మనుస్మృతిలోనివి ప్రక్షిప్తాలని చెప్పటానికి ఆధారాలవుతున్నాయి. చాలా శ్లోకాలు ప్రాచీన ప్రతుల్లో కాక, అర్వాచీన ప్రతుల్లో కనిపిస్తున్నాయి. తరువాతి కాలపు ప్రతుల్లో శ్లోకాల సంఖ్య పెరగటం గమనించవలసిన విషయం. లభించిన వ్రాతప్రతుల పరిస్థితే ఈ విధంగా ఉంటే, గడిచిన సుదీర్ఘకాలంలో ప్రక్షిప్తాలు లేవనటం ఎలా కుదురుతుంది? ఉదాహరణకు కొన్ని శ్లోకాలు చూడండి–

క. కింది శ్లోకం రెండో అధ్యాయంలో 18వ శ్లోకం కేవలం మేధాతిథి భాష్యంలోనే ఉంది-

విరుద్ధా చ విగీతా చ దృష్టార్థాదిష్టకారణే ।
స్మృతిర్న శ్రుతిమూలా స్యాద్యా చైషాఽసమ్భవశ్రుతిః ॥

అంటే - నిర్దిష్ట కారణంతో ఉన్నదానికి వ్యతిరేకంగా, అసంగతమూ, అసంభవమూ అయిన అర్థాన్ని ప్రతిపాదించే స్మృతి వేదవిరుద్ధస్మృతి అనబడుతుంది.

ఖ. కింది శ్లోకాలు మేధాతిథి మొదలైన ముగ్గురు ప్రాచీన భాష్యకారుల భాష్యాలలో లేవు. తరువాతి ఆధునిక ప్రతులలో కనబడుతున్నాయి. ఇవి ప్రక్షిప్తాలనేందుకు ఇదే గొప్ప ప్రమాణం.

సాయం ప్రాతర్ద్విజాతీనామశనం స్మృతినోదితమ్ ।
నాన్తరే భోజనం కుర్యాదగ్నిహోత్రసమో విధిః ॥

మను. 2.52 తర్వాత ఈ సంస్కరణంలో 2.27 తర్వాత

అంటే - స్మృతి, ప్రాతః సాయంకాలాల్లో ఏ విధంగా అగ్నిహోత్ర కార్యాలు చేస్తారో అదే విధంగా రెండుసార్లే భుజించాలనే నియమం ఏర్పరచింది. మధ్యలో ఎప్పుడూ భోజనం చేయకూడదు.

గ. నేను మనుస్మృతికి వేర్వేరు పుస్తకాల దుకాణాలలో సుమారు 30-40 ప్రతులు చూశాను. వాటిలో కొన్ని శ్లోకాలు చాలా తక్కువ ప్రతులలోనే కనిపిస్తున్నాయి. కొన్ని శ్లోకాలైతే ఎక్కడో ఒక్కొక్క ప్రతిలోనే కనబడతాయి. అలాంటి ఒక శ్లోకం ప్రయాగ ప్రతిలో ఉన్నది. ఇది -

పరోక్షం సత్కృపాపూర్వం ప్రత్యక్షం న కథఞ్చన ।
దుష్టానుచారా చ గురోరిహ వాఽముత్ర చైత్యధః ॥

(మను. 1.200 తరువాత, ఈ సంస్కరణంలో 2.175 తరువాత)

అంటే - శిష్యులు గురువు పేరును ముందు చెప్పి తమ పేరు తర్వాత గౌరవపూర్వకంగా చెప్పాలి, ఎదుట కూడా అలాగే చేయాలి. గురువు చేత దుర్మార్గాలు చేయించే శిష్యుడు ఇహ - పరాలలోనూ అధోగతి పాలవుతాడు.

ఘ. మరి కొన్ని శ్లోకాలు చూడండి -

యేఽప్యతీతాః స్వధర్మేభ్యః పరపిణ్డోపజీవినః ।
ద్విజత్వమధికాంక్షన్తి తాంశ్చ శూద్రానివాచరేత్ ॥ 8.102 తరువాత ॥

అంటే - తమ ధర్మకర్మలు వదులుకుని ఇతరులపై ఆధారపడి జీవించేవారు తమను తాము బ్రాహ్మణులుగా భావించమన్నా, వారిని శూద్రులతో సమానంగా చూడాలి.

తదస్త్రం సర్వవర్ణానామనివార్యం చ శక్తితః ।
తపోవీర్యప్రభావేణ అవధ్యానపి బాధతే ॥ 11.33 తరువాత ॥

అంటే - బ్రాహ్మణుడి కంఠస్వరం అనే అస్త్రం ఎలాంటి దంటే, ఏ వర్ణానికి చెందినవాడైనా, ఆ సమర్థతను తొలగించ లేడు; అది తపశ్శక్తి వల్ల సంపన్నమై ఉంటుంది కాబట్టి చంపదగని శత్రువులను కూడా సంహరిస్తుంది.

5. చూడబోతే ఇతర గ్రంథాల నుంచి కూడా శ్లోకాలు కొన్ని మనుస్మృతిలో కలిపేశా రనిపిస్తుంది. మహాభారతం (అశ్వమేధపర్వం పు. 380. పూనా ప్రచురణ) లోని శ్లోకం మనుస్మృతి ప్రతులు కేవలం నాలుగింటిలోనే లభిస్తుంది.

పురాణం మానవో ధర్మః సాఙ్గోపాఙ్గశ్చికిత్సకః ।
ఆజ్ఞాసిద్ధాని చత్వారి న హన్తవ్యాని హేతుభిః ॥ 12.110 తరువాత ॥

అంటే - పురాణాలు బ్రాహ్మణాలు మొదలైన చారిత్రక గ్రంథాలు, మనువు చెప్పిన ధర్మ శాస్త్రం, సంపూర్ణ విద్వాంసులు, చికిత్సకులు, ధర్మాత్ములైన విద్వాంసులు చెప్పిన రుజువైన విషయాలు - ఈ నాలుగింటినీ తర్కంతో ఖండించరాదు.

ఈ శ్లోకం ఈ విషయాన్ని, మనుస్మృతిలో ప్రక్షిప్తమని తెలియజేస్తుంది. ఇంతవరకూ ఇది మనుస్మృతిలోని శ్లోకాలతో అందరికీ అంగీకారయోగ్యంగా కలిసిపోలేదు. అందుచేత ఇది బ్రాకెట్లలో కనిపిస్తుంది.

6. ప్రక్షిప్తం చేసినవారు, కొత్త శ్లోకాలను చొప్పించటమే కాకుండా, తమ ఇష్టం వచ్చినట్లుగా పాఠ భేదాలూ రచించారు. కొన్ని పాఠభేదాలు వ్రాయసగాళ్ల ప్రమాదవశాత్తూ లేదా అజాగ్రత్త వల్ల చేసి ఉండవచ్చు. కానీ చాలా పాఠభేదాలు కావాలని చేసినవే. కింది పాఠభేదాలు ఈ విషయాన్ని బలపరుస్తాయి.

క. పదో అధ్యాయంలోని వర్ణసంకరాల ధర్మాలు మనుప్రోక్తంలో అంటే మూల గ్రంథంలో లేవు. తరువాతి కాలంలో జరిగిన వర్ణవ్యవస్థలోని వికారాల వల్ల ఏర్పడిన జాతిభేదాల వల్ల, ఆ శ్లోకాలు తరువాతి కాలంలో చేర్చబడ్డాయి. సంకరజాతులను హీనంగా భావించి, వాటి కర్తవ్యాలను మనుస్మృతిలో కలిపారు (అవి కర్తవ్యాల వలె కాకుండా, ద్వేషమూ, నిందలు కలిసిన వికృత రూపాలుగా ఉన్నాయి). వాటిని మౌలికాలే అని రుజువు చేసేందుకు 1.2 శ్లోకంలో **అంతర ప్రభవాణాం** పదం స్థానంలో **సంకర ప్రభవాణాం** అనేది వేశారు. ఈ పాఠభేదం నాలుగైదు లిఖిత ప్రతులలో ఉంది. టీకాకారులు **అంతర ప్రభవాణాం** అర్థాన్ని కూడా 'వర్ణసంకరం' చేయటం అన్ని విధాలా తప్పే! దీనికి సరైన అర్థం **'ఆశ్రమాలు'** అని ఉండాలి (దీని కోసం 1.2 మీద 'వివరణ' సమీక్షను చూడండి). బహుశా ప్రారంభంలో ఈ పదానికి సరైన అర్థమైన **'ఆశ్రమాలు'** అనే పదమే చలామణి అయి ఉంటుంది. ప్రక్షిప్తం చేసినవారు దాన్ని మూలం నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. అది తొలగిపోక పోగా, టీకాకారుల పాఠ భేదం వల్ల **'అంతర ప్రభవాణాం'** పదమే వర్ణసంకరం చెందిందేమో అన్న అనుమానం కలిగించారు.

ఖ. ఇదే విధంగా 12.82లో **'ధర్మక్రియాఽఽత్మచింతా చ'** అనే పదాలకు బదులుగా **'అహింసా గురుసేవా చ'** అని పాఠాన్ని, గురువుకు ప్రాధాన్యం ఉండాలి అనే భావంతో మార్చారు. ఇది సందర్భోచితంగా లేదు - (అ) ఈ 83వ శ్లోకంలో కొన్ని మేలు చేసే పనులను పరిగణించారు. అటు తరువాత ఆ ఆరు పనులను గురించి 12.85-115లలో వ్యాఖ్యానముంది. అందులో 'అహింస, గురుసేవ' లను ఎక్కడ కూడా పేర్కొన లేదు కానీ, ఆత్మజ్ఞానం, ధర్మ క్రియలకు వివరణ ఉంది. (ఆ) మనువు సాత్త్విక కర్మలనే మేలు చేసేవిగా భావించాడు. ఈ శ్లోకంలో మిగిలిన అన్ని కర్మలూ మూలం లోనివే ఉన్నాయి కానీ, ఈ రెండిటికే పాఠభేదాలు కనబడుతున్నాయి. సాత్త్వికకర్మల వర్ణనలు 12.31లో ఉన్నాయి. వాటినే ఇక్కడ స్వీకరించడం మను సమ్మతమూ, మౌలిక పాఠమూ అవుతుంది. మనువు ప్రకారం ఆ కర్మలే ముక్తిదాయకాలు. ఈ విధంగా **'అహింసా గురుసేవా చ'** అనేది మార్చిన పాఠం అవుతుంది.

గ. ఇదేవిధంగా 5-57 శ్లోకంలోని తొలిపాదంలో **'ప్రేతశుద్ధిం'** అనే పాఠం, ప్రాచుర్యంలో ఉన్న ప్రతులలో కనబడుతుంది. దీని స్థానంలో **'దేహశుద్ధిం'** అని ఉండాలి. దీనివల్ల మనువు శైలి, విషయ విశ్లేషణలు తెలుస్తాయి. తర్వాతి కాలంలో, మిగిలిన ప్రక్షిప్తాలవలెనే, ప్రేతజన్మలు మొదలైన వాటిలో శుద్ధిక్రియలు ఒక కర్మకాండగా మారినప్పుడు, ఈ పాఠభేదం చేసి, ప్రేతాది విషయాలున్న శ్లోకాలలో కలిపేశారు. ఈ పాఠపు అమౌలికత-మూలం కాని విషయం. **'దేహశుద్ధిం'** పాఠానికి ఉన్న మౌలికత కింది ప్రమాణాలతోనూ, వాక్యాలతోనూ సిద్ధిస్తాయి.

అ. ఒక విషయాన్ని ఏ విషయసంకేతంతో చెబుతూ ప్రారంభిస్తాడో, అదే సంకేతంతోనే ముగించడం మనువు శైలిలో కనబడుతుంది. (చూడండి 3.286, 4.259, 8.1, 9.250. 10.131, 11.266 మొదలైనవి) కానీ ఇక్కడ ఈ శైలికి భిన్నంగా విషయాన్ని "ప్రేతశుద్ధి' పదంతో ప్రారంభించడం కనబడుతూంది (5.57), ముగింపు **'శరీరశుద్ధి'** ప్రయోగంతో ఉంది (5.110). విషయం ముగింపును సూచించే శ్లోకంలోని పదాల వల్ల, ఇది **'శరీరశుద్ధి'** విషయకమే కానీ ప్రేతశుద్ధిది కాదని తెలిసిపోతూంది. అందువల్ల ఈ శ్లోకంలో సమానార్థకమైన **'దేహశుద్ధి'** పదమే మను సమ్మతమని తెలుస్తుంది.

ఆ. మనువు ఈ విషయాన్ని దేహం (5.105), గాత్రం (5.109), శరీరం (5.110) మొదలైన పదాలతో వర్ణించాడు. కాబట్టి ఈ విషయం ప్రేతశుద్ధికి సంబంధించింది కాదు, దేహశుద్ధిదేనని రుజువౌతూంది.

ఇ. ప్రస్తుతం వాడుకలో ఉన్న పాఠాల ననుసరించి ప్రేతశుద్ధి అనే పాఠాన్నే సరైనది అని భావించి, దీన్నే అంగీకరిస్తే అందులో దంతోత్పత్తి కాలీన శుద్ధి, సూత శుద్ధి, మనసు, ఆత్మ మొదలైనవాటి శుద్ధి ఎందుకొచ్చాయి? ప్రేతంలో మనస్సు, ఆత్మ ఉండనే ఉండవు కదా! ఈ విధంగా విషయసంకేత శ్లోకమూ, వర్ణనా సరిగా కలవడం లేదు. దీన్ని బట్టి కూడా ప్రక్షిప్తాలను చొప్పించటానికే పాఠభేదాలు తరువాత ఏర్పరిచారని తెలుస్తూంది. శైలిలో కలిసిపోయిన పాఠం **'దేహశుద్ధిం'** అనేదే. మనస్సు, ఆత్మ మొదలైనవి దేహంతో సంబంధం గల పదార్థాలు. అందుచేత ఈ పాఠాన్ని సరైన పాఠంగా స్వీకరించాను.

ఈ ప్రమాణాల వల్ల మనుస్మృతిలో పాఠభేదాల రూపంలోనూ ప్రక్షిప్తాలు చొప్పించారని తెలుస్తుంది. ఇలాంటి పాఠభేదాలు వేరే చోట్లలోనూ ఉన్నాయి.

7. మనుస్మృతిలోని అధ్యాయాల విభజన మౌలికం కాదు, అంటే దీన్ని మనువు చేయలేదు. ఇది తరువాతి కాలంలో ఎవరి ద్వారానో చేయబడింది. (దీన్ని గురించి వివరాలు కావాలంటే, 'మనుస్మృతిలో అధ్యాయవిభజన' శీర్షిక చూడండి) ఆ విధంగా విభజిస్తున్నప్పుడు, అధ్యాయాల ముగింపులో ఏకరూపతను సాధించాలని, విభజన కర్త లేదా తరువాతి కవు లెవరో మనుస్మృతిలో మార్పులు-చేర్పులు కూడా చేశారు. ప్రథమ అధ్యాయంలో 111 నుంచి 118 శ్లోకాలలో అసందర్భమైన విషయ సూచికను జోడించారు. అష్టమ అధ్యాయం చివరలో విషయం మధ్యలోనే విషయ సమాప్త సూచక శ్లోకాలు, ఏకరూపత కోసం భ్రమపడి కలిపారు (8.420 మొదలైనవి). ఈ మార్పులు, చేర్పులు మనుస్మృతిలోని విషయాలు, శ్లోకాలలో తెలుస్తుంటాయి. దీనితో మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయని స్పష్టంగా తెలిసిపోతుంటుంది.

8. మనుస్మృతిలోని **'అవాంతర విరోధాలు'** కూడా మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయని తెలియజేస్తాయి. ఒకటే ప్రక్షిప్త విషయంలోనూ పరస్పర వ్యతిరేకాలైన విషయాలుంటే, వాటిని **'అవాంతర విరోధాలు'** అంటారు. ఒక ప్రక్షిప్తం విషయంలోనే వేర్వేరు వ్యతిరేక విషయాలుంటే, వాటి విశ్లేషణ వల్ల ఈ కింది సత్యాలు స్పష్టమవుతాయి.

(1) ఎన్నో పరస్పర వ్యతిరేకాలు అయిన విషయాలు ఒకే వ్యక్తి రచనలై ఉండవు.

(2) అలాంటి విరోధాత్మకమూ, విభిన్నతలూ గల వర్ణనలు మనువు లాంటి దార్శనిక ఋషి రచనలు అయి ఉండవు.

(3) ఈ వేర్వేరు గొప్పతనాలను వేర్వేరు వ్యక్తులు చొప్పించారు.

(4) వేర్వేరు కాలాల్లో (ఎప్పుడు ఏయే విషయాలు ప్రాచుర్యంలో ఉన్నాయో వాటిని) కలిపేశారు.

(5) ఎక్కడ విభిన్నాలూ, వ్యతిరేకాలూ అయిన విషయాలు ఎక్కువగా ఉంటాయో, అక్కడ అవిఅంతగా వివాదాస్పదమూ అయి ఉంటాయి. అలాంటి వివాదాస్పద విషయాలున్నప్పుడే, జనం వాటిని మార్చేందుకూ, తమ గొప్పతనం చాటుకోవటానికీ దృష్టి కేంద్రీకరిస్తారు.

ఈ సత్యాలవల్ల మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయనీ, అవి వేర్వేరు వ్యక్తుల ద్వారా వేర్వేరు కాలాలలో చేర్చబడ్డాయనీ రుజువవుతూంది. ఈ పరిస్థితిలో ప్రక్షిప్తాలు లేవని తిరస్కరించటానికీ వీలుపడదు.

9. భాష్యకారులందరూ మనుస్మృతిలో ఎంతో కొంత ప్రక్షిప్తా లున్నాయని అంగీకరించారు. వాటిలో చౌఖంబా నుంచి వెలువరచిన కుల్లూక భట్టు మనుస్మృతి భాష్యంలో, సంపాదకుడు 170 ప్రక్షిప్త శ్లోకాలను చూపారు. అందువల్ల వాటిని పెద్ద బ్రాకెట్లలోనూ, వేర్వేరు సంఖ్యలోనూ ఇచ్చారు. తరువాతి అందరు పౌరాణిక పండితులూ ఈ ప్రక్షిప్తాలను ఉన్నవి ఉన్నట్లుగా స్వీకరించారు. కుల్లూకభట్టు భాష్యంలో, దీన్ని అనుసరించిన తరువాతి ఇతర టీకాకారులు, భాష్యకారులూ, తాము అంగీకరించిన ప్రక్షిప్తాలను అధ్యాయాలవారీగా ఇచ్చిన వివరాలు ఇవి.

ప్రథమ అధ్యాయంలో	11	రెండో అధ్యాయంలో	11
మూడో అధ్యాయంలో	21	నాలుగో అధ్యాయంలో	19
ఐదో అధ్యాయంలో	22	ఆరో అధ్యాయంలో	6
ఏడో అధ్యాయంలో	16	ఎనిమిదో అధ్యాయంలో	30
తొమ్మిదో అధ్యాయంలో	6	పదో అధ్యాయంలో	2
పదకొండవ అధ్యాయంలో	14	పన్నెండవ అధ్యాయంలో	12
ప్రక్షిప్త శ్లోకాల మొత్తం సంఖ్య			170

10. మేధాతిథి భాష్యంలో చివర ఉన్న శ్లోకం వల్ల, మనుస్మృతికి మేధాతిథి రాసిన భాష్యం లుప్తమైందని తెలుస్తూంది. దాని విభిన్న సంస్కరణల సాయంతో, సహారణ రాజు కొడుకు మదనుడు దీన్ని మళ్లీ సంకలితంజేశాడు. ఆ స్థితిలో శ్లోకాలలో క్రమమైన మార్పులు, శ్లోకాల ఎక్కువ తక్కువలు, పాఠాంతరాలు మొదలైనవి జరగడం చాలా సాధారణ విషయం-

మాన్యా కాపి మనుస్మృతిస్తదుచితా వ్యాఖ్యాపి మేధాతిథేః ।
సా లుప్తైవ విధేర్వశాత్ క్వచిదపి ప్రాప్యం న తత్పుస్తకమ్ ।
క్షోణీన్ద్రో మదనః సహారణసుతో దేశాన్తరాదాహృతైః,
జీర్ణోద్ధారమచీకరత్తత ఇతస్తత్పుస్తకైర్లేఖితైః ॥ ఉపోద్ఘాతం, మేధాతిథి భాష్యం, గంగానాథ ఝా. ఖండం. 3. పృ. 1

అంటే - సమాజంలో గొప్పదైన మనుస్మృతి, దానికి మేధాతిథి భాష్యమూ ఉండేవి. కానీ, దురదృష్టవశాత్తూ ఆ భాష్యం లుప్తమైంది. ఎక్కడా దొరకడం లేదు. సహారణుని కుమారుడు మదనుడనే రాజు వేర్వేరు ప్రాంతాల నుంచి సంస్కరించిన ప్రతులు తెప్పించి, జీర్ణోద్ధరణ చేయించటమే కాకుండా, వేర్వేరు పుస్తకాలతో పోల్చి ఈ భాష్యం తయారు చేయించాడు.

11. భారతీయ ప్రాచీన సాహిత్యం మొత్తంలోనూ ప్రక్షిప్తాలు ఉన్నాయనే వాస్తవాన్ని సుప్రసిద్ధ ఆచార్యులు స్వామి ఆనందతీర్థ 'మహాభారతం-తాత్పర్య అర్థ నిర్ణయం'లో స్పష్టంగా అంగీకరించారు.

క్వచిద్ గ్రన్థాన్ ప్రక్షిపన్తి క్వచిదన్తరితానపి ।
కుర్యుః క్వచిచ్చ వ్యత్యాసం ప్రమాదాత్ క్వచిదన్యథా ॥
అనుత్పన్నా అపి గ్రన్థా వ్యాకులాః సన్తి సర్వశః ।
ఉత్పన్నాః ప్రాయశః సర్వే కోట్యంశోఽపి న వర్తతే ॥ అ. 2 ॥

అంటే - కొన్ని గ్రంథాలలో ప్రక్షిప్తాలు చేరుతాయి. కొన్నిటిలో మూలరచనలలోని వచనాలను మారుస్తారు. కొన్ని చోట్ల ముందు వెనుక ప్రక్షిప్తాలుంటాయి. కొన్నిచోట్ల పొరపాటున తప్పుల తడకలుగా తయారవుతాయి. నశించిపోకుండా మిగిలిన గ్రంథాలన్నీ కత్తిరింపులు, కుదింపులు అనే పీడనలకు లోనయ్యాయి. ఎక్కువ భాగం గ్రంథాలన్నింటినీ ధ్వంసం చేశారు. ఇప్పుడు సాహిత్యంలో 'కోటి' వ వంతు కూడా మిగలలేదు. ఇదే స్థితి మనుస్మృతిది కూడా.

12. **చైనాలో లభ్యమైన పురాతాత్త్విక ఆధారం:** దీని చర్చ మొదటి అధ్యాయంలోనూ జరిగింది. దాన్నే మళ్లీ చెప్పుకుందాం. విదేశీయ ఆధారాలలో మనుస్మృతి కాలం, శ్లోకాల సంఖ్యకు సంబంధించిన విషయాలను తెలిపే ఒక గొప్ప పురాతాత్త్విక ప్రమాణం, మనకు చైనాభాషలో వ్రాతప్రతుల ద్వారా లభ్యమవుతున్నది. 1932లో జపాను చారిత్రకమైన చైనా గోడలను బాంబు విస్ఫోటంతో కూల్చినప్పుడు, అందులో చైనావారి పుస్తకాల ప్రాచీన వ్రాతప్రతుల భాండారం గల ఒక ఇనుప పెట్టె దొరికింది.

ఆ వ్రాతప్రతులు సర్ ఆగిట్స్ ఫ్రిట్జ్ జార్జ్‌కు (Augits Fritz Geogre) దొరికాయి. ఆయన వాటిని లండన్‌కు తీసుకెళ్లి బ్రిటిష్ వస్తు ప్రదర్శనశాలలోని మ్యూజియంలో పెట్టారు.

ఆ వ్రాతలను ప్రొ.ఆంటొనీ గ్రేమ్ (Prof. Anthony Graeme) చైనా విద్వాంసుల చేత చదివించారు. చైనా రాజు చిన్-ఇజ్-వాంగ్ (Chin-ize-wang) తన పాలనకాలంలో అన్ని ప్రాచీన గ్రంథాలనూ నాశనం చేయాలని ఆదేశించాడు. వాటిలోని చైనాకు సంబంధించిన ప్రాచీన ఆధారాలన్నీ మిగలకుండా పోవాలనేది అతని ఆశయం. ఎవరో విద్యా ప్రేమికులు ఈ వ్రాతప్రతులను ఒక ఇనుపపెట్టెలో దాచి, చైనా చారిత్రక కుడ్యం కడుతున్నప్పుడు ఆ పెట్టెను గోడలో నిక్షిప్తం చేయించాడు. యాదృచ్ఛికంగా బాంబు పేలడంతో ఆ పెట్టె బయటపడింది. చైనా భాషలో రాసిన ఆ వ్రాతప్రతులలో ఇలా ఉంది - **"మనువు ధర్మశాస్త్రం భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యంగల గ్రంథం. అది వైదిక సంస్కృతభాషలో రచించబడింది. పదివేల ఏళ్ల కంటే ప్రాచీనమైంది."** ఈ వివరణ శ్రీ కేవల్ మోట్వానీ గారి **"మనుధర్మశాస్త్ర ఎ సోషియాలాజికల్ అండ్ హిస్టారికల్ స్టడీ"** (పు.232-233) లో ఉంది.

చైనా సాహిత్యం ఇస్తున్న ఈ ఆధారంతో మనుధర్మ శాస్త్రం అతి ప్రాచీనమైనదన్న సంకేతం లభిస్తూంది. పాశ్చాత్య రచయితలు కల్పించిన కాలనిర్ణయాన్ని, ఈ ప్రమాణం అసత్యమని నిరూపించడమే కాకుండా, మనుస్మృతిలో ఒకప్పుడు 680 శ్లోకా లుండేవని చెబుతూంది.

13. పాశ్చాత్య పరిశోధకులు వూలర్, జె.జౌలీ, కీథ్, మేక్ డొనాల్ మొదలైనవారు, మనుస్మృతితో పాటు ప్రాచీన భారతీయ సాహిత్య మంతటా ప్రక్షిప్తాలు ఉన్నాయని అంగీకరించారు. జె.జౌలీ కొన్ని ప్రక్షిప్తాలను చూపించారు కూడా.

14. కొందరు ఇతర భాష్యకారులు, విమర్శకులూ మనుస్మృతిలోని ప్రక్షిప్తాల సంఖ్య ఇలా చెప్పారు-

విశ్వనాథ నారాయణ మాండలీకం - 148
జగన్నాథ రఘునాథ ధారపురే - 100
హరగోవింద శాస్త్రి - 153
జయంత కృష్ణ హరికృష్ణదేవ - 59

మనుస్మృతి యొక్క తొలి పాశ్చాత్య సమీక్షకుడు న్యాయాధీశుడు సర్ విలియం జోన్స్, లభిస్తున్న 2684 శ్లోకాలలో 2005 శ్లోకాలు ప్రక్షిప్తాలని ప్రకటించారు. ఆయన ప్రకారం, 680 శ్లోకాలు మూల రచనలో ఉండేవి. పైన చెప్పిన చైనా సాహిత్యం కూడా ఇదే చెబుతూంది.

15. గాంధీ మహాత్ముడు 'వర్ణ వ్యవస్థ' అనే తన పుస్తకంలో, ఇప్పటి మనుస్మృతిలో కనబడుతున్న ప్రమాదకరమైన విషయాలు, తరువాత కలిపినవేనని చెప్పారు.

16. మన మాజీ రాష్ట్రపతి, దార్శనిక విద్వాంసులు డా॥ రాధాకృష్ణన్, రవీంద్రనాథ టాగూరు మొదలైనవారు కూడా మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయని ఒప్పుకున్నారు.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో ప్రక్షిప్తాల ప్రవృత్తి చరిత్ర

'బహుశా సమస్త భారతీయ సాహిత్యంలో అంగీకరించవలసిన సత్యం ఏమిటంటే, అందులో సమయానుకూలంగా ప్రక్షిప్తాలు జరుగుతుంటాయి' అని. దీనికి సంబంధించిన పాత వ్రాతప్రతులు, ఆధారాలు, అంతర సాక్ష్యాలు కూడా లభిస్తున్నాయి. అందుచేత ఈ విషయం. చర్చనీయం కాదు. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను పరిశీలించడంతో పాటుగా, మిగతా భారతీయ సాహిత్యంలోని ప్రక్షిప్తాల విషయచరిత్రపై కూడా దృష్టిసారించబడుతూంది. దీనివల్ల పాఠకులకు ప్రక్షిప్తాలలోని నిజమెంత? అనే విషయం నిరంతరం మార్పులకు లోనయ్యే తత్త్వం కూడా తెలుస్తుంది. సరిగ్గా మనుస్మృతిదీ ఇదే పరిస్థితి!

క. వాల్మీకి రామాయణం:-పాఠ భేదాలతో నేడు వాల్మీకి రామాయణం సంస్కరించిన ప్రతులు మూడు రకాలుగా లభిస్తున్నాయి-1. దాక్షిణాత్యం, 2. పశ్చిమోత్తరీయం, 3. గౌడీయం లేదా పూర్వీయం. ఈ మూడు రకాల గ్రంథాలలోనూ ఎన్నో సర్గలు, శ్లోకాలలో తేడాలున్నాయి. గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ వారి దాక్షిణాత్య సంస్కరణలో నేటికీ మూల పాఠంతో కలవని అనేక సర్గలు ఉన్నాయి. వీటికోసం "ప్రక్షిప్తః సర్గః" అని ముద్రించి ఉంటుంది. (చూ. ఒక ఉదాహరణ-ఉత్తర కాండలోని 59వ సర్గ తర్వాత రెండు సర్గల మీద 'ప్రక్షిప్తః సర్గః' అని ఉంది.).

నేపాల్ రాజధాని కాఠ్‌మండులోని జాతీయ పుస్తకాగారంలో నేపారీ లిపిలో ఉన్న ఒక వాల్మీకి రామాయణం రాతప్రతి భద్రపరచబడి ఉంది. ఇది వేయి ఏళ్ల ప్రాచీన మన్న విషయం నేను చూశాను. దీనిలో నేటి ప్రతులలో కంటే వందలాది శ్లోకాలు తక్కువగా ఉన్నాయి. అంటే అటు తర్వాతి ఒకటి - రెండు వేల సంవత్సరాలలో వాటిని కలిపారన్న మాట స్పష్టమవుతూంది. విమర్శకుల అభిప్రాయంలో నేటి వాల్మీకి రామాయణంలోని బాల, ఉత్తర కాండలలోని అత్యధిక భాగాలు ప్రక్షిప్తాలే. నేటికీ రామాయణం ప్రారంభంలోని మూడు అనుక్రమణికలూ, సమయానుకూలంగా చేర్చబడిన విషయాలను తెలుపుతాయి. వాటిలో ఒకదానిలో స్పష్టంగా - **'షట్కాండాని'** అని ఉంది. (4.2) వాల్మీకి రామాయణంలోని అవతార సంబంధ శ్లోకాలు భారతీయ సమాజంలో అవతారధారణ జరిగిన తర్వాత ప్రక్షిప్తాలయ్యాయి.

ప్రముఖంగా పేర్కొవలసిన బౌద్ధ ధర్మంలోని ఒక ఆధారం ఇక్కడ చెప్పుకోవాలి. బౌద్ధ ధర్మానికి చెందిన **'అభిధర్మ మహావిభాషా'** అనే గ్రంథం లభిస్తూంది. మూడో శతాబ్దంలో చైనాభాషలోకి అనువదించిన ప్రతి దొరికింది. అందులో ఒక చోట **"రామాయణంలో 12,000 శ్లోకాలున్నాయి" అని ఉంది. (డా॥ ఫాదర్ కామిల్ బుల్కే, 'రామకథా: ఉత్పత్తి వికాసాలు" పు. 94)** కానీ నేడు దొరుకుతున్న రామాయణంలో 25,000 వేల శ్లోకాలున్నాయి. ప్రాచీన గ్రంథాల్లో ఏ విధంగా ప్రక్షిప్తాలు చేరుతాయో చూపేందుకు, ఇదొక సంక్షిప్త వివరణ మాత్రమే !

ఖ. మహాభారతం- దీనికి సంబంధించిన ఒక విశేష ఆధారం చూపబోతున్నాను. దాదాపు 2000 ఏళ్ల క్రితమే ఈ మహాభారతంలో చేరిన ప్రక్షిప్తాలను గురించి అప్పటి సాహిత్యలోకంలో వ్యతిరేకత చెలరేగింది-అనే సత్యాన్ని ఈ విషయం చెబుతూంది. ప్రాచీన భారతీయసాహిత్యంలో ఎంతో పూర్వం నుంచే ప్రక్షిప్తాలు చొరబడ్డాయని చెప్పటానికి ఇదొక ప్రమాణం. ఈ విషయాన్ని గరుడ పురాణం చెప్పడం మరీ ఆశ్చర్యకరం ! వ్యాసమహర్షి పేరుతో ఇతరుల ద్వారా రచించబడినవి కావడం చేత ఇందులో ప్రక్షిప్తాలు బాగా చేరాయి.

దైత్యాః సర్వే విప్రకులేషు భూత్వా,
కలౌ యుగే భారతే షట్ సహస్ర్యామ్ ।
నిష్కాస్య కాంశ్చిత్ నవనిర్మితానాం
నివేశనం తత్ర కుర్వన్తి నిత్యమ్ ॥ బ్రహ్మకాణ్డ 1.59 ॥

అంటే- ఈ కలియుగంలో ఆరువేల శ్లోకాల భారత - సంహిత అంటే మహాభారతంలో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. దైత్యవంశీయులైనవారు తమను బ్రాహ్మణ కులానికి చెందిన వారుగా చెప్పుకుంటూ, కొన్ని శ్లోకాలను తొలగిస్తున్నారు, వాటి స్థానంలో కొత్త కొత్త శ్లోకాలను రచించి చేరుస్తున్నారు అని.

గ. గ్రంథాలను ఇష్టం వచ్చినట్లుగా మారుస్తూ చిందర వందర చేస్తూ స్వార్థపరులు కొందరు వైదిక పరంపరలను వికృతం చేశారు- అనే విషయం **'మహాభారతం'**లో కనిపిస్తున్నది. మహాభారతకర్త ఆవేదన చూడండి-

సురా మత్స్యాః పశోర్మాంసమ్, ఆసవం కృశరౌదనమ్ ।
ధూర్తైః ప్రవర్తితం యజ్ఞే నైతద్ వేదేషు విద్యతే ॥
అవ్యవస్థితమర్యాదైః విమూఢైర్నాస్తికైః నరైః ।
సంశయాత్మభిరవ్యక్తైః హింసా సమనువర్ణితా ॥ శాన్తి. 265.9,4 ॥

అంటే- "సురాపానం, మత్స్యభోజనం, పశుమాంసం, పానీయాలు, లవణాన్నం - ఉప్పుకలిసిన అన్నాన్ని ఆహుతి చేయడం. ఇలాంటి పద్ధతులు వేదాలలో (వైదిక సంస్కృతిలో) లేవు. వీటన్నింటినీ ధూర్తులు వ్యాప్తిలోకి తెచ్చారు. మర్యాదాహీనత, మద్యమాంసాల పట్ల ఆశ, నాస్తికత, ఆత్మ-పరమాత్మల పట్ల నమ్మకం లేని జనం గుట్టుచప్పుడు కాకుండా హింసకు సంబంధించిన వర్ణనలను కలిపేశారు" అని.

ఘ. మహాభారతం అనే మహాకావ్యపు వృద్ధి చరిత్ర, ఇప్పటి మహాభారతంలో స్వయంగా వర్ణించబడింది. మహాభారత యుద్ధం తర్వాత వ్యాసమహర్షి రాసిన కావ్యంపేరు **'జయ కావ్యం'** **"జయో నామేఽతిహాసోఽయం"**- (మహా.ఆది. 1.262.20) పైన చెప్పిన గరుడపురాణం ప్రకారం ఆరువేలు. ఇప్పటి మహాభారతంలో కేవలం 8800 శ్లోకాలు ఉన్నాయి - **"అష్టౌ శ్లోక సహస్రాణి అష్టౌ శ్లోక శతాని చ"** (ఆది.పర్వం. 2.131, 209). వ్యాస శిష్యుడు వైశంపాయనుడు వీటిని పెంచి 24000 శ్లోకాలు గల మహాకావ్యంగా చేసి, దీనికి **'భారత సంహితనే'** అనే పేరు పెట్టాడు - **"చతుర్వింశీ సాహస్రీం చక్రే భారత సంహితామ్"** (ఆది, పర్వం. 1.102) కాలాంతరంలో సౌతి అనే వ్యక్తి ఇందులో చేర్పులు చేసి దీన్ని ఒక **"శతసహస్రమిదం కావ్యం మయోక్తం శ్రూయాతాం హి వః"** (ఆది.108) అని చెప్పారు.

ఈ **'జయ'** కావ్యం నుంచి **'భారతం'**, **'భారత'** కావ్యం నుంచి **'మహాభారతమ్'** తయారవటం అనేది వాస్తవ కథ. ఈ పరంపరకు చెందిన తర్వాతి కవులు తమ ప్రత్యేక స్వతంత్ర కావ్యాలు రచించటానికి మారుగా, దాన్నే పెంచుతూ పోయారు. దీనివల్ల మహాభారతపు మౌలికత, ప్రామాణికతలకు హాని కలగటంతో పాటు దాని చారిత్రకతకూ నష్టం వాటిల్లింది.

జ. **గీత**-గీత మహాభారతంలోని భాగమే. నేడు లభిస్తున్న దాని స్వరూపం వాడుకలో లేనిది. యుద్ధ భూమిలో కొన్ని నిమిషాల పాటు చేసిన ఉపదేశం సమయానికి తగిందీ కాదు; ఇంత విస్తృతమూ కాదు. సంక్షేపానికి విస్తారరూపం అన్నట్లయితే, అది కృష్ణుడు చెప్పిన మూలప్రవచనం అయి ఉండదు. మునుపు చెప్పుకున్నట్లుగా మహాభారతాన్ని, ఎప్పుడు విస్తరించారో, అప్పుడే గీతను కూడా పెంచి ఉంటారు. కాబట్టి, మూలతః దాన్ని వ్యాసుడు రచించి ఉండదు. నేటి గీతలో అనేక సందర్భోచితం కాని విషయాలు జోడించబడ్డాయి.

చ. నిరుక్తం- యాస్కాచార్యుడు రచించిన నిరుక్తంలోని 13-14 అధ్యాయాల విషయంలో విమర్శకుల అభిప్రాయం ఏమిటంటే, అవి తరువాత జోడించబడ్డాయని. వాటితో కూడిన 'పరివర్ధిత సంస్కరణ'గా చెప్పబడుతున్న ఇది శిష్యపరంపర రచించినది.

ఛ. చరకసంహిత- అగ్నివేశ మహర్షి రచించిన చరకసంహితలో కూడా, ఆయన శిష్యులు చివరి అధ్యాయాలను వేర్వేరు విషయాలతో పూరించారు. దీంట్లో చెప్పుకోదగిన విషయం ఏమిటంటే, ఈ భాగాన్ని యీ వ్యక్తులు రాశారని స్పష్టంగా చెప్పటం. అయినా దీని వల్ల మార్పులు చేసిన పరంపర, చరిత్ర - వీటిని గురించి తెలుస్తున్నది.

సాహిత్య పరంపరలోని పై పరిశీలన వల్ల, పై గ్రంథాల వలెనే మనుస్మృతిలో కూడా ప్రక్షిప్తాలున్నాయని నిశ్చితమైంది. ఈ ప్రక్షిప్తాలు వేర్వేరు కాలాలలో వేర్వేరు వ్యక్తుల చేత చేయబడ్డాయి. మనుస్మృతి భాష సరళమూ, లోకంలో వాడుకలో ఉన్నదీ కావడం చేత, శ్లోకాలు సులువుగా కలిసి పోతాయి. భాషలో కూడా పెద్దగా తేడా కనిపించదు. అయినప్పటికీ విశేషంగా చేసిన అధ్యయనం వల్ల సాహిత్య విషయకమైన ప్రమాణాలు ఆధారంగా చాలా ప్రక్షిప్తాలు బయటపడ్డాయి.

4. వివిధ గ్రంథాలలోని ప్రక్షిప్తాల ప్రవృత్తి

మనుస్మృతిలోని ప్రక్షిప్తాల మూలాల ప్రవృత్తులు

ఈ ప్రక్షిప్తాల సమస్య దాదాపు భారతీయసాహిత్యమంతటా ఉంది. స్వార్థపరులు కొందరు తమ స్వార్థం కోసమూ, తమ వికృత ఆచరణలను శాస్త్రసమ్మతమని రూఢిపరిచేందుకూ లేదా తామనుకున్న వ్యాఖ్యలూ, ఆలోచనల ప్రచారం కోసమూ, గ్రంథాలలో ప్రక్షిప్తాలను చొప్పిస్తుంటారు. ఒక్కోసారి ఒక గ్రంథంలోని పరిశోధనలు, మార్పులు లేదా వ్యవస్థాపరంగానో ఒక కారణం ప్రముఖమవుతుంటుంది. కొన్నిసార్లు గ్రంథాన్ని వికృతం చేయటమూ ప్రక్షిప్తకారుల ముఖ్య ఉద్దేశం అవుతుంది. ఇలా గ్రంథాలలో ప్రక్షిప్తాలు జరుగుతూ ఉంటాయి. ప్రాచీనకాలంలో రాతప్రతులే ఎక్కువగా ఉండేవి కాబట్టి, ఈ పని చాలా సులువుగా జరిగిపోయేది.

ఎవరి దగ్గర ఉన్న ప్రతిలో వారు ఇష్టం వచ్చినట్లుగా మార్పులు చేసేసి, తరువాతి ప్రతులను వాటిని అనుసరించే తయారు చేసేవారు. ఈ విధంగా తరువాతి ప్రతులలో ప్రక్షిప్త శ్లోకాలు, అభిప్రాయాలు చేరిపోతుండేవి. ఈ కారణం చేతనే రాతప్రతుల నకళ్లలో పరస్పరం వ్యతిరేకాలు, పాఠభేదాలు కనబడుతుంటాయి. ప్రాచీన సంస్కృత గ్రంథాలు, సాహిత్య కావ్యాలు, అపభ్రంశ, హిందీ కావ్యాలు- మొదలైన వీటన్నిటి అవస్థా ఇదే !

మొత్తం ప్రాచీన లౌకిక, సంస్కృత, సాహిత్యంలో ప్రక్షిప్తాలు జరిగాయి. కాని ధర్మశాస్త్రాలలో ప్రక్షిప్తాలు చోటు చేసుకునే పద్ధతి ఎందుకంటే, వాటిలోని విధానాలు, వ్యక్తులు, సమాజంతో సరాసరిగా, ప్రతి దినమూ సంబంధం కలిగి ఉంటారు కాబట్టి. ఈ ధర్మవిధానాలను మార్చటమూ, పాడు చేయటమూ స్వార్థపరుల పనే ! దీని కోసం స్వార్థపరులు ఎన్నో నకిలీ పుస్తకాలు కూడా రచించే ప్రయత్నాలు చేశారు. మరి ప్రక్షిప్తాల బెడద నుంచి ఈ జనం ఎలా బయటికొస్తారు? పండిత గంగాప్రసాద్ ఉపాధ్యాయ మనుస్మృతి ముందు మాటలో రెండు-మూడు సంఘటనలను వివరించారు. వాటి ద్వారా మనకు ప్రక్షిప్తాల ధోరణులు, గ్రంథాలను పాడు చేసే స్వార్థపరుల కుట్రలు తెలిసిపోతాయి. అవి ఇలా ఉంటాయి - "హిందువులలో సోదరుల మధ్య ఆస్తి పంపకాల పద్ధతి చాలా ఇబ్బంది పెట్టే విషయం. ప్రాచీనస్మృతుల ఉద్దేశం ఈ విషయాన్ని జటిలం చేయడం కాదు. వారు సాధారణంగా సుగమమూ, సరళమూ అయిన నియమాలే ఏర్పరచారు. ఆ తర్వాత జటిలత వచ్చి చేరింది. హిందువులు (ఆర్యులు) ఒక ప్రాచీన జాతివారు. అప్పుడప్పుడూ దాయాదులకు ఇవ్వవలసిన ఆస్తి భాగం గురించి గొడవలు వచ్చేవి. వేర్వేరు పక్షాలవారు, తమ తమ పక్షాల కోసం పండితుల సాయం తీసుకునేవారు. వీరు తమ పక్షం వారిని బలపరిచేందుకు ప్రక్షిప్తాలు చేర్చేవారు. ఇది వట్టి కల్పన కాదు, దీనికి చారిత్రక ప్రమాణాలు కూడా ఉన్నాయి. **'దత్తకమీమాంస'**ను నందక పండితుడు ఈ ఉద్దేశంతోనే రచించాడు. ఇది అతి తక్కువ రోజుల్లో-బ్రిటిష్ రాజ్యం స్థాపితం కావటానికి 125 ఏళ్ల కంటే పాతదేమీ కాదు. బ్రిటిషు రాజ్యం ప్రారంభంలో ఇది పొరపాటున ఆంగ్లంలోకి

అనువదితమైంది. ఆంగ్ల న్యాయాలయాల్లో దీన్నే ప్రమాణంగా అంగీకరించారు. అలహాబాదు హైకోర్టు తాలూకు మొత్తం సభ, సర్ జాన్ ఏజ్ అధ్యక్షతలో ఒక తీర్పు నిచ్చింది. దీనివల్ల నందకపండితుడి ప్రక్షిప్తాలను ఆదరించే పని లేదని ఎంతో చక్కగా రుజువైంది. **'దత్తక మీమాంస'** దాయాదులకు భాగం ఇవ్వకుండా ఉండేందుకే రాయబడిందని అంటారు.

'దత్తక చంద్రిక' అనేది రెండో పుస్తకం. దీనిలోని విషయం గురించి అందరు బెంగాలీ పండితులకూ, ఇది రఘుమణి విద్యాభూషణుడు రచించినదని తెలుసు. రఘుమణి కోల్ బ్రూక్‌గారి సహచరుడు. బెంగాలులోని ఒక రాజు. అతడు ఒక బాలుణ్ని దత్తత చేసుకున్నాడు. తర్వాత ఒక పుత్రుడు కలిగాడు. అతని అనంతరం, రాజు ఎవరు కావాలన్న సమస్య వచ్చింది. దత్తత తీసుకున్న బాలుడి పక్షం వహించటానికి రఘుమ7ణి పుస్తకం రాశాడు. పుస్తకం లేకపోయి ఉంటే, పాత పద్ధతిలో మూడో వంతు ఆస్తి లభించేది. ఈ వ్యాజ్యం కొనసాగలేదు. సంధి జరిగింది. దీని చివరి శ్లోకం ఇలా ఉంది.

ర-మ్యైషా చంద్రికాదత్త పద్ధతేర్దర్శికాల-**ఘు.**
మ-నోరమా సన్నివిశై రంగిణాం ధర్మతార-**ణిః।**

ఈ వాక్యాల మొదటి, చివరి అక్షరాలతో **'రఘుమణి'** పదం ఏర్పడుతుంది.

క్రీ.శ.1832లో కలకత్తా సంస్కృత కళాశాల పండితులు ఒక వల పన్నారు. జైనుల వ్యాజ్యం ఒకటి నడుస్తున్నది. పండితుల వ్యవస్థను గౌరవించేవారు. వీరొక గ్రంథం రాసి కళాశాల లైబ్రేరియన్‌కు లంచమిచ్చి లైబ్రరీలోని రిజిస్టర్‌లో పుస్తకాన్ని నమోదు చేయించారు. కాలేజీ అధికారి హెచ్.హెచ్.విల్సన్- అతనికి సందేహం కలిగింది. పుస్తకం పట్టుబడింది. పండితుడు తన నేరాన్ని అంగీకరించాడు. ఆ నాటి నుండి అక్కడ పండిత వ్యవస్థకున్న అధికారాలు తొలగించబడ్డాయి. (చూడండి-సర్కార్ శాస్త్రి రాసిన 'హిందూ లా' పు.187)

ఎవరికైతే ప్రక్షిప్తాలు చొప్పించే దుష్ప్రవర్తన ఉంటుందో, ఆ వ్యక్తి ఎవరి మంచి చెడ్డలు, లాభనష్టాలు చూడడు. తన స్వార్థం ఒక్కటే చూసుకుంటాడు కాబట్టి, దాన్ని నెరవేర్చుకోవటానికి వీలున్నన్ని చెడ్డ పనులు చేస్తుంటాడు. ధన లోభంతో వ్యాపారి కల్తీ చేయాలనుకుంటే, ఆహార పదార్థాలలో రాళ్లు, మట్టి, చెక్కపొట్టు, పేడ, రంగులు, కొవ్వు మొదలైన తినకూడని వస్తువులు, పనికి రానివి కల్తీ చేసేందుకు ఎంత మాత్రమూ వెనుకాడడు.

ఆ కల్తీ వల్ల జనులకు కలిగే హాని, ఇబ్బందులు అతనికి ఏ మాత్రం పట్టవు. **వస్తువులు కాలం, లోభం – వీటిని అనుసరించి** కల్తీ చేస్తూనే ఉంటాడు. ఇదే పరిస్థితి గ్రంథాల ప్రక్షిప్తాలకూ ఉంటుంది. అలా ప్రక్షిప్తాలను చొప్పించడం వల్ల ఎంత హాని కలుగుతుందనే ఆలోచన లేకుండానే ప్రక్షిప్తకారులు తమ లాభాల కోసం **'ప్రక్షిప్తాలు'** చేస్తూ ఉంటారు. అలా చేయటానికి అన్ని రకాల చాతుర్యాలూ ప్రదర్శిస్తారు. ఒక చోట కొత్త శ్లోకాన్ని జోడిస్తారు, మరో చోట పూర్తిగా కొత్త విషయాన్నే రాసి కలుపుతారు, ఇంకో చోట వ్యతిరేక ప్రక్షిప్తాన్ని చేరుస్తారు, వేరొక చోట శ్లోకాలు తీసేస్తారు లేదా పాఠభేదాలు కల్పిస్తారు.

ఇదే పరిస్థితి మనుస్మృతిదీ. ధర్మశాస్త్రాలలో మనుస్మృతికే అత్యధిక గౌరవం దక్కింది కాబట్టి, అది ప్రక్షిప్తకారుల ఆక్రమణలకూ, కుట్రలకూ ముఖ్య లక్ష్యమైంది. ప్రాచీనకాలం నుంచీ ముద్రణ యుగం వరకు మనుస్మృతిలో కలుపు మొక్కలు చేరుతూనే ఉన్నాయి. సంప్రదాయాలు శిథిలమో లేక వికృతమో కావడం జరుగుతుంటే, జనం కూడా తమ సంప్రదాయాలను శాస్త్ర సమ్మతమని రుజువు చేయడానికి మనుస్మృతిలో దాన్ని సరిపోలే ఆలోచనలను ప్రక్షిప్తాలు చేశారు. స్వార్థపరులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మనుస్మృతిని కల్తీ చేశారు. ఎప్పుడెప్పుడు ధార్మిక లేదా మత-మతాంతరాలు అతలాకుతలమయ్యాయో, వాటి దురాక్రమణ మనుస్మృతి లాంటి ధార్మిక గ్రంథాల మీదా జరిగింది. వాటిని వికృతం చేయటానికి ప్రక్షిప్తాలను చేర్చారు. మనుస్మృతిలోని ఆ ప్రక్షిప్తాలను నిర్ధారించటానికి వాటి ఆధారాల నిర్ధారణ కావాలి. మూలరూపం చెడగొడుతున్న ప్రక్షిప్తాలను పరిశీలించాలి. ఎందుకంటే మనిషి ఇలాంటి ప్రవృత్తులతో

2023 04 16 12 56

ప్రభావితమై ఇలాంటివి చేస్తాడని మనస్తత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. విరోధులు లేదా స్వార్థపరులే ప్రక్షిప్తాలు చేయనక్కరలేదు, సమర్థనలు, పొగడ్తల రూపాలలోనూ ప్రక్షిప్తాలు చేరవచ్చు. తమ ఆలోచనలకు కూడా చోటు ఉండాలనే ఉద్దేశంతోనూ లేదా లేనిదాన్ని పూరించాలనే ఆలోచనతోనూ మంచి అభిప్రాయాలనూ సయితం ప్రక్షిప్తాలుగా కలిపేయవచ్చు. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను గుర్తించే సమయంలో, వాటిని మూలంలో కలిపేందుకు ఏ విధమైన ప్రేరక స్ఫూర్తి కలిగిందో చూడటమూ జరిగింది. ప్రేరకాలు లేవని అనిపించిన చోట, అందుకు ప్రక్షిప్తాలుగా భావించలేదు. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను పరిశీలన, విశ్లేషణ చేసినప్పుడు అందుకు కలిగిన ప్రేరణలు ఎలా ఉన్నాయో చూద్దాం.

1. **మనుస్మృతికి గౌరవమూ, ఘనత చేకూర్చే పద్ధతి-** మనుస్మృతిలో ఎక్కడెక్కడ దాని ప్రశంస, ఘనత లేదా విశేషాల వర్ణనలున్న శ్లోకాలున్నాయో లేదా దీన్ని బ్రహ్మకు జోడించడం జరిగిందో ఆ శ్లోకాలన్నీ ఈ పరంపరకు చెందిన శిష్యులు, లేదా ప్రశంసకులు, దీని గౌరవాన్ని గొప్పతనాన్ని పెంచే ఉద్దేశంతో చేసిన ప్రక్షిప్తాలు. మనువు లాంటి సరళస్వభావుడు, ఉన్నతస్థాయికి చెందిన ఋషి తన గ్రంథాన్ని తానే అతిగా ప్రశంసించడం జరగదు. ఈ ప్రశంసాత్మక శ్లోకాలు తరువాతివే. అందరు విద్వాంసులూ తమ విషయాలను బ్రహ్మదేవుడితో జోడించి-ఎలాగోలా-చెప్పుకోవడం అనే ధోరణి మధ్యయుగపు సాహిత్యంలో కనబడుతుంది.

భరతముని తన నాట్య శాస్త్రం బ్రహ్మ నుంచి ఉద్భవించిందంటాడు. మహాభారతాన్ని పంచమ వేదంగా ప్రకటించారు. ఆ కాలంలోని సమాజంలో బ్రహ్మకు సంబంధించినవిగా చెప్పుకున్న ఏ శాస్త్రానికైనా సులువుగా గౌరవం లభించేది. మనుస్మృతిలోనూ ఇలాంటి వర్ణనల మూలంగా ఆ ధోరణి కనబడుతుంది. ఎక్కడెక్కడ బ్రహ్మతో కలిపారో, లేదా బ్రహ్మను ప్రశంసించారో ఆ శ్లోకాలు విషయానికీ, శైలికీ అనురూపంగా ఉండవు. ఆ యా చోట్ల ఈ విషయాలను విస్తృతంగా చర్చించాను. ఇక్కడ కేవలం కొన్ని ఉదాహరణలే చూపుతున్నాను. వాటిలో పైన చెప్పుకున్న ధోరణి ఉంది-

క. బ్రహ్మకు సంబంధం కలిపే శ్లోకం-

ఇదం శాస్త్రం తు కృత్వాసౌ మామేవ స్వయమాదితః ।
విధివద్గ్రాహయామాస మరీచ్యాదీంస్త్వహం మునీన్ ॥ 1.58 ॥

అర్థం-మనువు చెప్పేదేమిటంటే "సృష్టి ప్రారంభంలో బ్రహ్మగారు ఈ ధర్మ శాస్త్రం రచించి మొట్టమొదట నాకు ఉపదేశించారు. తరువాత నేను మరీచి మొదలైన మునుల చేత దీన్ని చదివించాను".

ప్రజాపతిరిదం శాస్త్రం తపసైవాసృజత్ప్రభుః ॥ 11.243 ॥

అర్థం - "ఈ శాస్త్ర రచనను ప్రజాపతి తపస్సుతో చేశాడు."

ఖ. ప్రశంసాపూర్వక ప్రక్షిప్తాలు-

ఇదం స్వస్త్యయనం శ్రేష్ఠమిదం బుద్ధివివర్ధనమ్ ।
ఇదం యశస్యమాయుష్యమిదం నిఃశ్రేయసం పరమ్ ॥ 1.106 ॥

అర్థం-"ఈ శాస్త్రం సకలశుభాలూ కలిగించేదీ, శ్రేష్ఠమూ, బుద్ధినిచ్చేదీ, మోక్షప్రాప్తిని కలిగించే శాస్త్రం."

ఇత్యేతన్మానవం శాస్త్రం భృగుప్రోక్తం పఠన్ద్విజః ।
భవత్యాచారవాన్నిత్యం యథేష్టాం ప్రాప్నుయాద్గతిమ్ ॥ 12.126 ॥

అర్థం-"భృగువు చెప్పిన ఈ శాస్త్రాన్ని ఏ బ్రాహ్మణుడు చదువుతాడో, అతడు సదాచారాలు పాటించేవాడై, పరలోకంలో నచ్చిన గతులు పొందగలుగుతాడు."

2. **మనువు వ్యక్తిత్వాన్ని అలౌకికంగా రుజువు చేసే ధోరణి** -మనుస్మృతిలో మనువు ప్రశంసలు, లేదా అతన్ని గురించిన ఉట్టంకింపులు గల శ్లోకాలు వస్తాయి. మనువు ద్వారా సమస్త స్థావర జంగమాల ఉత్పత్తి జరిగిందని

చెప్పే (1.35-45) మూల శ్లోకాలలో, మనువు శిష్యులు లేదా అతని పక్షంవారు, అతన్ని అలౌకిక వ్యక్తిత్వం గల పురుషుడుగా రుజువు చేయటానికి ఆ ధోరణిని కనబరుస్తారు. ఇలాంటి అసందర్భ ప్రలాపాలను మనువు కూడా చేయలేదు.

3. **కీర్తి, గొప్పతనాల కోసం మనుస్మృతితో భృగుమహర్షిని జోడించే రీతి** -మనుస్మృతిలో ఎక్కడో ఒకచోట, ఏదో ఒక రూపంలో భృగువును పేర్కొనడం శైలికి గానీ, అందులోని గౌరవపూర్వక విషయాలకు గానీ ఎంత మాత్రమూ అనుకూలంగా ఉండదు. అయినా ఎన్నో చోట్ల మనుస్మృతిని భృగువుకు జోడించి, అసందర్భమైనరీతిలో దీన్ని భృగు ప్రవచనంగా చెప్పారు. మనుస్మృతి ఒక సుప్రసిద్ధ గ్రంథం, అన్నిటికంటే ఎక్కువగా గౌరవం పొందిన గ్రంథం. భృగు శిష్యులు, అతని కీర్తి, గొప్పతనం ప్రచారం చేయటం కోసం లేదా దీన్ని 'భృగు సంహిత'గా మార్చటం కోసం అతని ప్రవచనాలను లేదా పేరును దీనికి జోడించారు. అలాంటి కొన్ని శ్లోకాలను చూడండి -

ఏతద్వోఽయం భృగుః శాస్త్రం శ్రావయిష్యత్యశేషతః ।
ఏతద్ధి మత్తోఽధిజగే సర్వమేషోఽఖిలం మునిః ॥ 1.59 ॥

అర్థం- భృగుమహర్షి నా నుంచి ఈ ధర్మశాస్త్రాన్ని చదువుకున్నాడు. ఈ భృగు మహర్షి మీకు సంపూర్ణ ధర్మశాస్త్రాన్ని వినిపిస్తాడు- అని మనువు చెప్పాడు.

తతస్తథా స తేనోక్తో మహర్షిర్మనునా భృగుః ।
తానబ్రవీదృషీన్సర్వాన్ప్రీతాత్మా శ్రూయతామితి ॥ 1.60 ॥

అర్థం- ఆ తర్వాత మనువు చెప్పగా, భృగు మహర్షి ప్రసన్నుడై ఆ ఋషులందరితోనూ ఇప్పుడు మీరు వినండి అంటూ ఉపదేశించసాగాడు.

శ్రుత్వేతానృషయో ధర్మాన్ స్నాతకస్య యథోదితాన్ ।
ఇదమూచుర్మహాత్మానమనలప్రభవం భృగుమ్ ॥ 5.1

మహర్షులందరూ స్నాతకుల- విద్య నేర్చిన వారి-ధర్మాలను విని, అగ్ని వలె తేజస్వి అయిన భృగువుతో ఇలా అన్నారు.

ఇత్యేత న్మానవం శాస్త్రం భృగు ప్రోక్తం పఠన్ద్విజః ॥ (12.126)

అర్థం- ఈ భృగు ప్రోక్త ధర్మ శాస్త్రాన్ని ద్విజులు చదువుతారు. (వారుసదా-చారులవుతారు.)

4. **మనువు గౌరవాలను వ్యతిరేకించే ధోరణి**-మనుస్మృతిలో అక్కడక్కడా మనువు గొప్పతనాన్ని ఖండించే శ్లోకాలు కూడా ఉన్నాయి. ముందు మనువు ఘనత, అటు తర్వాత వాటి నిషేధపూర్వకమైన ఖండన ఉన్నాయి. ఇలాంటి శ్లోకాలలో, మూలంలో మనువు గొప్పతనాలను ఖండించే ధోరణి ఉంది. ఎలాగంటే-

క. 9.59 నుంచి 63 వరకు ఉన్న శ్లోకాలలో నియోగం అనే విధానం ఉంది. కానీ తర్వాతి 64-68 శ్లోకాలలో నింద కనిపించే పద్ధతిలో నిషేధం ఉంది.

ఖ. 5.45 నుంచి 55 వరకు గల శ్లోకాలలో మాంసభక్షణాన్ని నిషేధిస్తూ, దాన్ని పాపంగా అంగీకరించాడు. మళ్లీ 56వ శ్లోకంలో మాంస భక్షణం, మద్యపానం దోషాలు కావని చెప్పబడింది.

5. **తమకు నచ్చిన గొప్ప విషయాలను ఈ శాస్త్రంలో రుజువు చేసే ధోరణి**- మనుస్మృతి ఒక ప్రసిద్ధమూ, అందరి గౌరవమూ పొందిన శాస్త్రం. అందులో ఏ ఘనతా లేకపోతే, జనం దాన్ని స్వీకరించేవారే కాదు. లేదా ఆ ఘనతకు పుష్టిని చేకూర్చేందుకు మనుస్మృతి ప్రమాణమే కావాలి కాబట్టి, ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు, తమ ఘనతలను మనుస్మృతి నుంచి సిద్ధించినవని చెప్పేందుకు ఎంత మాత్రమూ సంబంధంలేని ప్రక్షిప్తా లెన్నో

vivo U20 · AI Camera

మనుస్మృతిలో చొప్పించబడ్డాయి. వాటికి మనుస్మృతికున్న ఘనతతో సమాన స్థానం లేనే లేదు. మనుస్మృతిలో ప్రకృతి నుంచి మహత్తు, మహత్తు నుంచి అహంకారం మొదలైన తత్త్వాల ప్రక్రియ ద్వారా సృష్టి పుట్టిందని ఉంది. (1.14-21). కానీ ఆధునిక వేదాంతులు తమ ఘనతలను మనుస్మృతి సమ్మతాలుగా చేసేందుకు, మనుస్మృతి యొక్క మౌలిక గౌరవాన్ని తిరస్కరిస్తూ, పూర్వం గుడ్డు నుంచి బ్రహ్మ పుట్టాడనీ, బ్రహ్మ నుంచి మొత్తం విశ్వపు ఉత్పత్తి జరిగిందనీ ఒక విషయాన్ని ప్రక్షిప్తంగా చొప్పించారు. (1.9,12,13,32 నుంచి 45 వరకు) ఇలాంటి ప్రక్షిప్తాలు తమ ఘనతల ప్రచారం కోసం చేయబడ్డాయి.

6. **స్వార్థపూరిత ఉద్దేశాలను సఫలం చేసుకునేందుకు వాటిని చొప్పించే ధోరణి**- మనుస్మృతి ఒక ఆధ్యాత్మిక, సాత్త్విక గుణాలను దిగ్దర్శనం చేయించే శాస్త్రం కూడా. దాని అసలైన ఉద్దేశాన్ని గమనించకుండా, దాని ఘనతకు వ్యతిరేకమని తెలిసినప్పటికీ, స్వార్థపరులు తమ వికృత సంప్రదాయాలనూ, స్వార్థపూరితమైన అభిప్రాయాలనూ, శాస్త్ర సమ్మతాలనిపించాలనే ఉద్దేశంతో వాటిని ప్రక్షిప్తాలుగా చొప్పించారు. శ్రాద్ధ వర్ణన, మాంసం తినటం, మద్యం తాగటం, హింస, యజ్ఞాలలో పశుబలులు, పలు పెళ్లిళ్లు మొదలైనవన్నీ ఆ పద్ధతికి చెందిన ధోరణుల నుండి పుట్టినవే. ఇలాంటి ప్రక్షిప్తాలు ఎక్కువగా వామాచారులు లేదా ఆ విధమైన ఆచరణలు చేసేవారి ద్వారా ప్రక్షిప్తాలుగా చేర్చబడ్డాయి.

7. **పక్షపాతధోరణి**-మధ్యయుగంలో బ్రాహ్మణులకు విద్యపై ఏకాధికారం ఏర్పడింది. మిగిలిన వర్ణాలవారు విద్య లేకపోవటం చేత, రోజురోజుకూ అజ్ఞానులవుతూ వచ్చారు. అన్ని పనులకూ బ్రాహ్మణులు ఉచితానుచితాలు చూడకుండా, తమ సౌలభ్యం, సుఖాల ననుసరించి కర్తవ్యాలను నియమించటం ప్రారంభించి, కింది వర్ణాలవారిపై వీలున్నంత ఎక్కువగా నిషేధాలు విధించారు. ఇలాంటి పక్షపాతపూరిత ఆలోచనలూ మనుస్మృతిలో చొప్పించారు. అంటరాని తనం, హెచ్చు తక్కువలు, స్త్రీలు, శూద్రుల పట్ల అసహ్యం, నింద, అణచివేత వంటి ఆలోచనలున్న అన్ని శ్లోకాలలోనూ పక్షపాత ధోరణి కనబడుతుంది. బ్రాహ్మణులకు విశేషమైన అధికారాలు, విశేషమైన గొప్పతనం ఇవ్వటం, విశేషంగా ప్రశంసించటం- ఈ ధోరణి నుంచే పుట్టాయి.

8. **లేనిదాన్ని చేర్చే ధోరణి**-ఏదైనా శాస్త్రం లేదా పద్ధతి, తన కాలం నాటి వ్యవస్థలు లేదా పరిస్థితులను అనుసరించే ఏర్పడుతుంది. కాలక్రమేణా కొన్ని కొత్త సంప్రదాయాలు, కొత్త సమస్యలు లేదా కొత్త విషయాలు సమాజంలో ఏర్పడుతుంటాయి. కానీ, సమాజం ప్రతి నిర్ణయానికీ ఆ పాతశాస్త్రం మీదే ఆధారపడుతుంది. అలాంటి పరిస్థితిలో ఆ అర్వాచీన కాలపు విషయాలు ధర్మశాస్త్రంలో లేకపోవటం లేదా ఏదైనా విషయం లేదనుకోవటం వల్ల, జనం శాస్త్రాలలో కలుపుమొక్కలను చేర్చేస్తుంటారు. మనుస్మృతిలోనూ ఇలాంటి ధోరణిలో ఎన్నో ప్రక్షిప్తాలు చేరాయి.

క. మనుస్మృతిలో యౌవనం వచ్చిన తరువాతనే పెళ్లిచేసుకోవాలని ఉంది – కానీ తరువాతి కాలంలో పరధర్మానికి చెందినవారి దురాక్రమణల వల్ల లేదా చెడుపద్ధతుల ప్రభావం వల్ల ఆడపిల్లల జీవితాలకు భద్రత లేదని భావించినవారు, బాల్యవివాహాల పద్ధతిని ప్రాచుర్యంలోకి తెచ్చారు. మనుస్మృతిలో బాల్యవివాహాల పద్ధతి లేకపోవటంతో దాన్ని కూడా ప్రక్షిప్తంగా చేర్చేశారు.

త్రింశద్వర్షోద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్ ।
త్ర్యష్టవర్షోష్టవర్షాం వా ధర్మే సీదతి సత్వరః ॥ 9.94

అర్థం- "గృహస్థ ధర్మానికి లోపం కలగకుండా ఉండాలంటే, 30 ఏళ్ల పురుషుడు 12 ఏళ్ల అమ్మాయినీ, 24 ఏళ్లవాడు 8 ఏళ్ల కన్యనూ పెళ్లాడాలి."

ఖ. అలాగే మనువు ఒక సమయంలో ఒకటే పెళ్లి అనే పద్ధతి ఏర్పరచాడు (5.167-168). కానీ, తరువాతి కాలంలో బహువివాహాల పద్ధతి సాగింది. తోబుట్టువులకు ఆస్తి ఇవ్వటం కూడా ఒక పెళ్లిని అనుసరించే జరిగింది.

వేర్వేరు వర్ణాల స్త్రీల వల్ల కలిగిన కొడుకులకు ఆస్తిలో భాగం అనే పద్ధతి లేకపోవటం చేత, తర్వాతి కాలంవారు, దానికి సంబంధించిన పద్ధతులను కూడా మనుస్మృతిలో చేర్చారు-

చతురోऽంశాన్హరేద్విప్రస్త్రీనంశాన్క్షత్రియాసుతః ।
వైశ్యాపుత్రో హరేద్వ్యంశమంశం శూద్రాసుతో హరేత్ ॥ 9.153 ॥

అర్థం-"బ్రాహ్మణస్త్రీకి పుట్టిన పుత్రులు నాలుగు భాగాలు, క్షత్రియ స్త్రీ పుత్రులు 3 భాగాలు, వైశ్య స్త్రీ పుత్రులు 2 భాగాలు, శూద్ర స్త్రీ పుత్రులు 1 భాగం తీసుకోవాలి."

ఇదే విధంగా ఆ యా కాలాల్లో ప్రచారంలోకి వచ్చిన సంప్రదాయవాదం, మూఢ విశ్వాసాల వల్ల ప్రేరితులైనవారు, ఆ ధోరణిని కూడా మనుస్మృతిలో ప్రవేశపెట్టారు.

9. **నాగరికత, సంస్థల ధోరణి**-మనుస్మృతి మూలరూపం ప్రవచనాత్మకమైన గద్య శైలి. తరువాతి కాలంలో మనుస్మృతి అధ్యాయాలుగా విభాజితమైంది. విభజించినవాడు, తన బుద్ధికి తోచినట్లుగా విభజించాడు. ఆ అధ్యాయాల చివర ముగింపును సూచించే శ్లోకాల శైలికి ఏకరూపతను సాధించడం కోసం, కొన్ని చోట్ల తనవంతుగా శ్లోకాలను కలిపేశాడు. అలాంటి ఒక శ్లోకాన్ని చూడండి -

ఏవం సర్వానిమాన్ రాజా వ్యవహారాన్సమాపయన్ ।
వ్యపోహ్య కిల్బిషం సర్వం ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ 8.420 ॥

అర్థం- ఈ విధంగా రాజు ఈ వివాదాలన్నింటినీ పరిష్కరించి అన్ని దోషాలనూ (పాపాలను) దూరం చేస్తాడు, ఉత్తమ గతులు పొందుతాడు.

ఇలా కొన్ని శ్లోకాలను ఏకరూపత కోసం కలిపారు. (వీటి విస్తార చర్చ ఈ భూమికలోనే తొలి అధ్యాయంలో 107, 111-118 వరకు విషయసూచికను తెలిపే శ్లోక విభజన వ్యవస్థను పరిష్కృతరూపాలు చూపటానికి రాసి కలిపారు. దీనివల్ల మనుస్మృతిలో చెప్పిన విషయాలన్నీ ఒకటే చోట తెలుస్తాయి.

10. **తమ అభిప్రాయాల స్పష్టీకరణ, వ్యాఖ్యల ధోరణి.** మనుస్మృతిలో ఎక్కడైనా అతిశయోక్తి పూర్ణకాలు, మహిమాత్మకం లేదా వ్యాఖ్యానాలు, చెప్పినవాటిని పదే పదే రకరకాలుగా చెప్పడం- ఇలాంటివి ఉంటే, అవన్నీ ప్రక్షిప్తాలే. అలాంటివి -

క. పదకొండో అధ్యాయంలో 54-190 శ్లోకాలలోని ప్రాయశ్చిత్త విధానం, వర్గీకరణ, విధులు మను సమ్మతం కావు. ఎవరో తరువాతి రచయిత తన పద్ధతిలో వీటిని చెప్పాడు.

ఖ. 12.86-90 శ్లోకాలలో నివృత్త కర్మల వివరణ సందర్భోచితం కాదు. వీటిని కూడా తరువాతవారెవరో ఉద్దేశంతో జోడించారు.

ఈ విధంగా అన్ని ప్రక్షిప్త శ్లోకాలకూ మూలంలో ఏదో ఒక ధోరణి తప్పకుండా కనబడుతూనే ఉంటుంది. కొన్ని చోట్లనైతే ఒకటే సారి వేర్వేరు ధోరణులూ కనబడుతుంటాయి. ఈ విధంగా ధోరణుల అవగాహన వల్ల శ్లోకాల ప్రక్షిప్తత మరింత బాగా స్పష్టమవుతుంది.

5. ప్రక్షిప్తాల పరిశోధన-ప్రమాణాలు

"మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయి"-ఈ అభిప్రాయం స్థిరమయ్యాక, వాటి పరిశోధన, ఉపయోగాలపై ఆలోచించడం, ఇవీ ముగిసిన తర్వాత, ప్రక్షిప్తాల పరిశోధన ఎలాగన్న ప్రశ్నవస్తుంది. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను ఎలా గుర్తించాలి? ఎలా వాటిని మూలంలోనివి కావని ప్రకటించాలి? ఇవి ఆలోచించవలసిన విషయాలు. ఇవి చాలా గంభీరమూ, క్లిష్టమూ అయిన ప్రశ్నలు. 'స్పష్టంగా ఇవి మూలం, ఇవి ప్రక్షిప్తాలు' అని నిర్ధారించే ప్రత్యక్ష సాధనం ఏదీ లేదు. ఈ పని అంత

AI Camera

సులభమే అయివుంటే ఈ పాటికి నిర్ణయం జరిగిపోయి ఉండేది. ఇది ఎంతో కఠినమూ, చిక్కు సమస్య అయినప్పటికీ, దీన్ని పూర్తిచేయటానికి ఒక ఉపాయం తోచింది. అదేమిటంటే-కృతిత్వం-రచన ఆధారంగా, కొన్ని కచ్చితమైన ప్రమాణాలు లేదా ఆధారాలను నిర్ధారించగలిగితే, ఆ ఆధారాలకు అనుగుణంగా నిలిచినవి మూల శ్లోకాలనీ, మిగిలినవి ప్రక్షిప్తాలనీ తేల్చవచ్చు. కచ్చితమైన ఆధారాలు లేకుండా చేసే పని ప్రామాణికతను సంతరించుకోదు. ఇంతకు ముందు కూడా మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. వీటిలో ఆర్యసమాజంలోని విద్వాంసుల్లోని తులసీరామస్వామి, స్వామి శ్రద్ధానంద, చంద్రమణి విద్యాలంకర్, సత్యరామ సిద్ధాంత శాస్త్రి, గంగాప్రసాద్ ఉపాధ్యాయ లాంటివారు చేసిన కృషి చెప్పుకోదగినది. వీరే కాకుండా వూలర్, డా.జె.జైలీ మొదలైన పాశ్చాత్య పండితులూ మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ, సమస్య పరిష్కృతం కాలేదు. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించటానికి ఇప్పటి వరకూ జరిగిన ప్రయత్నాలలో ఈ కింది లోపాలున్నాయి-

1. ప్రక్షిప్తాలు తొలగించేందుకు పరిశోధకులు అందరూ అంగీకరించే, అందరికీ విశ్వాసం కలిగించే ఆధారాలు చూపలేకపోయారు. ఆధారాలు లేని ప్రక్షిప్తాలను చూసి పాఠకులు, పరిశోధకులు ఆధారాలు లేకుండానే తమ కిష్టం లేని శ్లోకాలను ప్రక్షిప్తాలన్నారనే అభ్యంతరం లేవదీశారు. తమ అభిప్రాయాలకు అనుకూలంగా ఉన్నవాటిని ఉంచి, ప్రతికూలమైనవాటిని ప్రక్షిప్తాలని ప్రకటించారు అన్నారు. ఈ ఆక్షేపణ ముఖ్యంగా ఆర్యసమాజానికి అనుకూలంగా ఉన్నవాటిని ఉంచి, మిగతావాటిని ప్రక్షిప్తాలన్నారని ఆర్యసమాజ పండితులనే ఎత్తి చూపారు.
2. కచ్చితమైన ఆధారాలు లేకపోవటం చేత, ప్రక్షిప్తాలు తొలగించేవారి వల్ల జరిగిన పొరపాటు ఏమిటంటే, కొన్ని మౌలిక శ్లోకాలను తొలగించటం, ప్రక్షిప్తాలను మౌలికాలనుకుని అలాగే ఉంచేయటం.
3. కొందరు విద్వాంసులు కొన్ని ఆధారాలను తీసుకున్నారు కానీ, వాటినీ అన్ని చోట్లా అన్వయించ లేకపోయారు. చాలా చోట్ల తప్పుడు పద్ధతిలో అన్వయించారు.
4. బయటికి తీసిన ప్రక్షిప్త శ్లోకాల కారణాలు, వివరణ సరిగ్గా చేయలేకపోయారు. దాని వల్ల పాఠకులకు వారి పద్ధతి అవగాహన కాలేదు. వారు వారి పట్ల సంతుష్టులూ కాలేదు.
5. కుల్లూకభట్టు ప్రక్షిప్తాలు తీసివేయటంలో ఎలాంటి కృషీ చేయలేదు. కాని చౌఖంబావారు ముద్రించిన అతని భాష్యంలో 170 శ్లోకాలను ప్రక్షిప్తాల గుంపులో ఉంచారు. వీటిని బ్రాకెట్లలోనూ విడిగానూ చూపారు. అప్పటివరకు మనుస్మృతిలో కలవని ఈ శ్లోకాలనే ప్రక్షిప్తాలుగా చెప్పారు. అంతకు మునుపు మనుస్మృతిలో కలిసిపోయిన శ్లోకాలను గురించి కుల్లూక భాష్యంలో ఎలాంటి సూచన ఇవ్వలేదు. అందుచేత వారు చూపిన ప్రక్షిప్తాలే కాకుండా ప్రక్షిప్తాల పరిశోధనలో నిజమైన కృషి జరగలేదనే అనుకోవచ్చు.

ఈ లోపాల వల్ల మనుస్మృతిలో ఇంతవరకూ ప్రక్షిప్తాల పరిశోధన పూర్తిగా జరగలేదనే చెప్పవచ్చు. ఇప్పుడు మళ్లీ ఈ పరిశోధన కోసం కొత్తకోణం నుంచి మరో ప్రయత్నం జరిగింది. ఇది సాహిత్య పరమూ, తటస్థమూ, సర్వ సామాన్యమూ అయిన ప్రయత్నం. ఈ ఆధారాలు పూర్తిగా రచన మీదే ఆధారపడ్డవని ఇక్కడ స్పష్టంగా చెప్పడం అవసరమని, ఇది ప్రభావవంతమని భావిస్తున్నాను. దీని వెనుక ఎలాంటి ఒత్తిడీ లేదా మతవాదమూ లేదు. ఒక రచన ఏ విధంగా అందరికీ సమానమో, ఆ రచనను పరిశీలించే ఆధారాలు లేదా ప్రమాణాలు కూడా అందరికీ సమానమే. ఇవి అన్ని వర్గాల వారూ సమానంగా స్వీకరించేవీ, ఆ ఆధారాల సాయంతో శ్లోకాలను పరీక్షించుకునేవీ అవుతాయి. ఏ యే శ్లోకాలు, విషయాల పైన ఇవి అన్వయించవచ్చో, అక్కడక్కడ ఆ యా 'ప్రమాణాలు' కారణపూర్వకంగా చూపించాము. వాటిని చదివి పాఠకులు సైతం స్వయంగా పరీక్షించవచ్చు. ఒక ప్రక్షిప్త విషయం లేదా శ్లోకంపై ఎన్నో ఆధారాలు ఒకటేసారి అన్వయించవచ్చు. అలాంటి చోట్ల ఆ అన్ని ఆధారాలనూ అన్వయించి చూపించాము. దీని వల్ల ఆ శ్లోకాల ప్రక్షిప్తత మరింత గట్టిగా రుజువవటంతో పాటుగా, ఆ ప్రక్షిప్త భాగాల విశ్లేషణలో ఎటువంటి సందేహమూ ఉండదు. ఏ ఉపాయాలు లేదా ప్రమాణాలు తక్కువగా లేదా అంశికరూపంలో అన్వయించబడ్డాయో, వాటినీ చెప్పటం జరిగింది.

ఎందుకంటే, ఇతర ఆధారాలతో పాటుగా వాటి ప్రభావసిద్ధి లేదా బలం చేకూర్చేందుకు సహాయకాలవుతాయి, వాటికి ఆసరా ఇస్తాయనే అభిప్రాయంతో అలా చేశాను.

ఈ విధంగా ప్రక్షిప్తాలు తొలగించడమనే కష్ట సాధ్యమైన పని వీలున్నంత ఎక్కువగా ఉపయోగపడే ప్రయత్నాలు జరిగాయి, పూర్తిగా తటస్థతను అనుసరించటమూ జరిగింది. అయినప్పటికీ కొన్ని ప్రక్షిప్త శ్లోకాలు కనపడకపోవడం జరిగింది అంటే, అవి ఈ ఆధారాలకు లొంగలేదు. అందువల్ల ప్రక్షిప్తాలు చొప్పించేవారు తమ శ్లోకాలను మనుస్మృతిలోని శ్లోకాలతో కలిపేందుకు శాయశక్తులా ప్రయత్నించారు; అందుచేతనే ఆ శ్లోకాలు మనుస్మృతిలో ఎంతగా కలిసిపోయాయి అంటే, అవి ఈ ఆధారాలకు లొంగనివయ్యాయి. ఈ కారణం చేతనే, ఈ ఆధారాలకు లొంగని శ్లోకా లన్నిటినీ అవి ఎలా వున్నా సరే, వాటిని ప్రక్షిప్తాలనే దృష్టితో చూడలేదు. ప్రక్షిప్త శ్లోకాలెన్నిటిని తొలగించామో, వాటి ప్రక్షిప్తాలను గురించి చర్చించటంతో పాటుగా, ఆ విధంగా చొప్పించటానికి ఏర్పడిన నేపథ్యం, దాని ధోరణి గురించి చర్చించామనే విషయాన్ని కూడా ఇక్కడ స్పష్టం చేస్తున్నాను. ఎందుకంటే వ్యక్తులు ఏదో ఒక ప్రత్యేక ధోరణితో ప్రేరితులు కావటం వల్లనే ప్రక్షిప్తాలు చొప్పిస్తారు. ఇలా ఈ పరిశోధన కార్యక్రమం చాలా విధాలుగా బలం చేకూర్చుకుంది.

1. కచ్చితమైన **'ఆధారాలతో'** ప్రక్షిప్తాలను తొలగించటం చేత.
2. ప్రక్షిప్తాలైన శ్లోకాలకు ఒకటి కాక అనేక ఆధారాలు అన్వయం కావటం చేత.
3. ప్రక్షిప్త శ్లోకాలకు మూలంలో ప్రక్షిప్త ధోరణిని దృష్టిలో పెట్టుకోవటం చేత.

ఈ విధంగా ప్రక్షిప్త శ్లోకాలను అంగీకరించి, అవి మౌలికాలా? లేక ప్రక్షిప్తాలా? అని పరిశీలించడంతో అవి ప్రక్షిప్తాల నుంచి తప్పించుకునే అవకాశం లేకుండా పోతుంది.

స్థాన భ్రష్టమైన కొన్ని శ్లోకాలూ ఉన్నాయి. పాఠకులు వాటిని సందర్భోచితం కానివి అని చెప్పవచ్చు కానీ ప్రక్షిప్తాలని అంగీకరించలేరు. ఎందుకంటే వాటి నేపథ్యం ప్రక్షిప్తాలయ్యే ధోరణికి చెందినది కాదు. వాటికి ఏ ప్రక్షిప్త విషయంతోనూ సంబంధం లేదు. అవి మనుస్మృతి శైలికి లేదా గౌరవానికి విరుద్ధంగానూ లేవు. ఇలాంటి శ్లోకాలకు అర్థాలిచ్చి యథాతథంగా ఉంచేయటం జరిగింది. ఇలా స్థానభ్రంశమైన శ్లోకాల సంఖ్య చాలా తక్కువే. కొన్ని ఉదాహరణలతో వీటిని స్పష్టం చేయటం అవసరం-

క. **అణ్వ్యో మాత్రా వినాశిన్యో దశార్ధానాం తు యా స్మృతాః ।**
తాభిః సార్ధమిదం సర్వం సమ్భవత్యనుపూర్వశః ॥ 1.27 ॥

అర్థం-"పంచ మహాభూతాలకు కారణభూతమైన విపరిణామాలను పంచతన్మాత్రలు అంటారు. వాటితో పాటు ఈ సంపూర్ణ జగత్తు సూక్ష్మం నుంచి స్థూలమూ, ఆ పైన స్థూలతరమూ మొదలైన క్రమంలో ఉత్పత్తి అవుతుంది."

దీనిలో ఒక సాధారణ వర్ణన ఉంది. ప్రక్షిప్తం కావటానికి ఎలాంటి ప్రేరక ధోరణీ కనిపించడం లేదు. అంతర్విరుద్ధంగానూ లేదు. ఎందుకంటే ఇందులో ఎలాంటి ఆదేశమూ లేదు. ప్రాచుర్యంలో ఉన్న పుస్తకాలలో ఇది ఎక్కడ ఉందో, పూర్వాపరాల కోణంలో అసందర్భమే. కానీ, ముందువెనుకల విషయాలు కర్మలను గురించి ఉన్నాయి. ఇది వ్యతిరేకం కాని, సహజ విషయం కనుక దీన్ని ప్రక్షిప్తం అనలేము.

ఖ. **సర్వేసాం తు స నామాని కర్మాణి చ పృథక్-పృథక్ ।**
వేదశబ్దేభ్య ఏవాదౌ పృథక్సంస్థాశ్చ నిర్మమే ॥ 1.21 ॥

అర్థం- "ఆ పరమాత్మ సృష్టి ప్రారంభంలోనే వేదాలలోని పదాలతో అన్ని వస్తువుల పేర్లు, అన్నింటి వేర్వేరు కర్మలూ, వాటి వివిధ విభాగాలూ తయారు చేశారు."

ఈ శ్లోకం కూడా క్రమాన్ని బట్టి చూస్తే అసంబద్ధమే. వేదాల ఉత్పత్తి 23వ శ్లోకంలో చెప్పాడు. వేదాలలోని శబ్దాలతో నామకరణం, విభజన ముందే చెప్పాడు. 23వ శ్లోకం వరకూ ఇంకా ఉత్పత్తి విషయమే ఉంది. వేదాలతోపాటు ఉత్పత్తి విషయం చెబితే సంపూర్ణత కలుగుతుంది. నామకరణం మొదలైనవి ఉత్పత్తి తర్వాతి విషయాలు. ఇలా ఇది కూడా స్థానంలో లేని శ్లోకమైంది. దీన్ని 23వ శ్లోకం తర్వాత (అగ్నివాయురవిభ్యస్తు.... అనే శ్లోకం తర్వాత) సరైన క్రమంలో పెట్టడానికి సూచనలిచ్చాము. దీనితో అది క్రమస్థానంలోకి వచ్చింది. బ్రహ్మ వేదాలు సృజించాడు, వేదాల నుండి నామకరణం, కర్మల విభజన జరిగాయి. ఈ విధంగా ఈ శ్లోకం తర్వాతి కర్మల విషయం **"కర్మణా చ వివేకార్థం"** (1.26) తో సందర్భోచితంగా కలిసిపోతుంది. దీనికి కూడా ప్రక్షిప్తాలతోనూ ఎలాంటి సంబంధం లేదు. ఏ గౌరవానికీ వ్యతిరేకం కాదు. ఈ విధంగా ప్రక్షిప్త ధోరణి లేని శ్లోకాలను యథాతథంగా అలాగే ఉంచాను.

ఇక్కడ చెప్పుకోవలసిన మరొక విషయం-ప్రక్షిప్త ధోరణి లేనివైనా, ప్రక్షిప్త విషయాలతో సంబంధం గల శ్లోకాలను ఈ కోవలోకి చేర్చకుండా, ప్రక్షిప్తాలుగానే స్వీకరించాను.

ప్రక్షిప్తాలతో తగినంత సంబంధమున్న మరొక విషయం పాఠభేదాల సమస్య. చాలా చోట్ల ప్రక్షిప్తకారులు కొత్త శ్లోకాలను కలిపేందుకు బదులుగా మౌలిక శ్లోకాలలోనే పాఠభేదాలు కలిగించారు. కొన్ని పాఠభేదాలు అజాగ్రత్తగానూ జరిగాయి. పాఠభేదాలను గుర్తించడం లేదా వాటికి మూలరూపాలీయడం ప్రత్యేకమూ, ప్రధానమూ అయిన విషయాలే కానీ చాలా కష్టతరం కూడా. అయినప్పటికీ, కొన్ని ప్రక్షిప్త పాఠభేదాలను గుర్తించే ప్రయత్నం జరిగింది. తగిన మేరకు ప్రామాణిక పాఠాలు లభించనందువల్ల, మనుస్మృతి గౌరవం, సందర్భం, విషయం, శైలికి అనుకూలంగా ఏ పాఠాలు తగినవి అనిపించాయో, వాటిని అర్థదృష్టితో అధికంగా సముచితమూ, ఉపయోగపడతా యనుకున్నవీ గ్రహించాను. అర్థాలు మారిపోయే పాఠభేదాలను **"అధ్యయనం"** అనే సమీక్షలో చేర్చాను.

ప్రక్షిప్తాల పరిశోధన అనే కార్యప్రణాళికను పేర్కొన్న తరువాత, ఇప్పుడు 'ప్రమాణాల' మీద దృష్టి సారించటం మిగిలింది. ప్రక్షిప్తాల పరిశోధన కోసం ఏడు కచ్చితమైన ఆధారాలను నిర్ధారించాను. వీటిలో తొలి ఆరూ అంతస్సాక్ష్యాలు-గ్రంథంలోని విషయాల ఆధారంగా ఉంటాయి. అంటే మనుస్మృతి రచనా శైలి, ఘనతలు వీటితో ఈ ప్రమాణాలకు లొంగే శ్లోకాల ప్రక్షిప్తత రుజువవుతుంది. ఏడో ప్రమాణాలను గురించి మనువే స్వయంగా చాలా చోట్ల సూచించాడు. దాని ప్రకారం 'వేదాలను' బయటి సాక్ష్యాల రూపంలో ప్రమాణాలుగా అంగీకరించారు. ఆ ఆధారాలు ఈ కింద ఉన్నాయి.-

1. విషయ వ్యతిరేకాలు లేదా ప్రకరణ వ్యతిరేకాలు
2. సందర్భ వ్యతిరేకాలు
3. అంతర్ విరోధాలు లేదా పరస్పర వ్యతిరేకాలు
4. పునరుక్తులు
5. శైలికి వ్యతిరేకాలు లేదా శైలిలోని ఆధారాలు
6. అవాంతర వ్యతిరేకాలు
7. వేద వ్యతిరేకాలు. (సహకరించే ఆధారాల రూపంలో)

నిర్వచనాలు, ఉదాహరణల సహితంగా వీటిపై జరిగిన విస్తృత విశ్లేషణ ఇలా ఉంది-

1. విషయ వ్యతిరేకాలు (ప్రకరణ వ్యతిరేకాలు):

మనుస్మృతి కొన్ని ముఖ్య విషయాలు లేదా ప్రకరణాలలో నిబద్ధమైనది - కచ్చితంగా ఉంటుంది. ఏదైనా విషయప్రారంభంలో గానీ, అంతంలో గానీ, లేదా రెండు చోట్లా ఆ వర్ణించిన విషయం సంకేతాన్ని తానే ఇచ్చాడు. మనుస్మృతిలోని అధ్యాయ విభజన కూడా దాదాపుగా ముఖ్య విషయాలను అనుసరించే జరిగింది. తొలి అధ్యాయంలో సృష్టి ఉత్పత్తి, ధర్మ ఉత్పత్తి; రెండో దాంట్లో సంస్కారాలు, బ్రహ్మచర్య ఆశ్రమం; మూడో అధ్యాయంలో గృహస్థ ధర్మం

AI Camera 2023.04.16

(వివాహం, పంచయజ్ఞాల విధానం); ఆరో దానిలో వానప్రస్థం, సన్న్యాసం మొదలైనవి. కచ్చితమైన ఆ విషయాల వర్ణనలలో చెప్పిన విషయాల కన్నా భిన్నమూ లేదా వ్యతిరేకంగా ఉన్న శ్లోకాలన్నీ, విషయ వ్యతిరేకాలు; ఈ విషయ వ్యతిరేకత ఆధారంగా అవి ప్రక్షిప్తాలు. మనువే స్వయంగా తాను రచించిన విషయాలను ఒక నిశ్చితమైన పరిధుల్లో బంధించి, వాటిని సూచించినందునా, తానే విషయానికి విరుద్ధమైన మరొక విషయాన్ని వివరించడు కాబట్టి, ఇవి మౌలిక శ్లోకాలు కాదని తిరస్కరించవచ్చు. అందుచేత, అలాంటి మౌలికం కాకుండా తర్వాత కలపబడిన శ్లోకాలేనని భావించవచ్చు. అవి -

క. **మాతులాంశ్చ పితృవ్యాంశ్చ శ్వశురానృత్విజో గురూన్ ।**
అసావహమితి బ్రూయాత్ప్రత్యుత్థాయ యవీయసః ॥
మాతృష్వసా మాతులానీ శ్వశ్రూరథ పితృష్వసా ।
సంపూజ్యా గురుపత్నీవత్ సమాస్తా గురుభార్యయా ॥
భ్రాతుర్భార్యోపసంగ్రాహ్యా సవర్ణాహన్యహన్యపి ॥ (2.130-132) (ఈ సంస్కరణంలో 2.105-107)

అర్థం - **('బ్రహ్మచారి')** మేనమామ, చిన్నాన్న, మామ, ఋత్విజులు మొదలైన పెద్దలకు, వారు వయసులో చిన్నవారైనా లేచి నిలబడి, **'నేను ఫలానా'** అని ప్రవర (పరిచయ కావ్యం) చెప్పుకుని, తన పేరుతో నమస్కరించాలి. పిన్ని, మామి-మామ భార్య, అత్త, మేనత్త -వీరందరూ గురుపత్ని వలె పూజ్యులు. బ్రహ్మచారి, అన్నయ్య భార్యకు ప్రతిరోజూ పాదాలంటి నమస్కరించాలి.

దీనికి మునుపటి శ్లోకాలలో-ఉపనయన సంస్కారం తరువాత, 2.68 (ఇందులో 2.43)లలో **'కర్మయోగం నిబోధత'** అని, బ్రహ్మచారి కర్తవ్యాల వర్ణన చేయబడి ఉంది. తరువాత 2.164 (ఇందులో 2.139)లోను **"అనేన క్రమయోగేన....గురౌ వసన్ సంచిను యాద్ బ్రహ్మాధిగమికం తపః"** అన్నాడు.

అంటే-"ఈపైన చెప్పిన విధానం ప్రకారం బ్రహ్మచారి గురువు వద్ద ఉంటూ వేదజ్ఞానం కలిగించే తపస్సు చేయాలి" అని. దీని వల్ల గురుకులంలో ఉంటూ బ్రహ్మచారి ఏ పనులు చేయాలో, కేవలం వాటి వివరణే ఉంది. ఇది కాకుండా 2.69 (ఇందులో 44), 108 (ఇందులో 83), 175 (150), 191-203 (166-178), 219 (194), 241-244 (ఈ సంస్కరణలో 216-219) శ్లోకాలలో సంస్కారం తర్వాత సమావర్తనం వరకు గురుకులంలోనే ఉండే పద్ధతి ఉంది. సూర్యాస్తమయం తర్వాత గ్రామంలో జనసంచారం ఉన్నచోట- ఉండరాదన్న నియమమూ ఉంది (2.219 (194). పైన పేర్కొన్న శ్లోకాలలోని కర్తవ్యాలు బ్రహ్మచారి పాటించడమే లేదు. గురుకులంలో అతని మామ, చిన్నాన్న, పిన్ని, అన్న భార్య తదితరులతో ఎలాంటి సంబంధమూ ఉండదు.అటువంటప్పుడు అతడు ఎలా రోజూ పాదాలకు నమస్కరించగలడు? ఈ శ్లోకాలలో అత్తమామలకు నమస్కరించే విధానమూ చెప్పబడింది. బ్రహ్మచారికి అత్త మామ లెక్కడుంటారో చెప్పండి! స్పష్టమయ్యేదేమిటంటే, ఈ వాక్యాలు నిర్దేశాలే కానీ అర్థవాదాలు- అర్థాన్ని ప్రతిపాదించేవి-కావు. ఈ విధంగా బ్రహ్మచర్యాశ్రమంలోని విషయాలలో గృహస్థాశ్రమపు కర్తవ్యాలు చెప్పటం విషయ వ్యతిరేకం. అందువల్ల ఇవి ప్రక్షిప్తాలు.

ఖ. ఇదే విధంగా బ్రహ్మచర్యాశ్రమపు కర్తవ్యాలను గురించి 2.225-237 (ఇందులో 2.200-212) వరకు ఆచార్యులు తల్లిదండ్రుల సేవలు చెప్పారు-

త్రిష్వప్రమాద్యన్నేతేషు త్రీంల్లోకాన్ విజయేద్ గృహీ ।
దీప్యమానః స్వవపుషా దేవవద్దివి మోదతే ॥ 2.232, ఈ సంస్కరణంలో 2.207 ॥

అర్థం- ఈ ముగ్గురి (ఆచార్యులు, తల్లిదండ్రులు) సేవలో జాగ్రత పడే గృహస్థు, మూడులోకాలనూ జయించి, తేజోవంతమైన శరీరంతో దేవతలవలె స్వర్గంలో ఆనందంగా ఉంటాడు.

బ్రహ్మచారి కర్తవ్యాల మధ్య గృహస్థుడి కర్తవ్యాలు చెప్పటం విషయ వ్యతిరేకం. దీంట్లోనైతే 'గృహీ' అని స్పష్టంగా చెప్పాడు. ఇలా ఈ మొత్తం ప్రసంగమే ప్రక్షిప్తం.

గ. **నిషేకాదిశ్మశానాన్తో మన్త్రైర్యస్యోదితో విధిః ।**
తస్య శాస్త్రేఽధికారోఽస్మిన్ జ్ఞేయో నాన్యస్య కస్యచిత్ ॥ 2.16,ఈ సంస్కరణంలో 1.135

అర్థం- 'గర్భాధానం నుంచి అంత్యేష్టి వరకూ ఏ యే సంస్కారాల విధానాలు, వేద మంత్రాలు చెప్పాయో, వాటినే ఈ (మనుస్మృతి) శాస్త్రంలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల అధికారాలుగా భావించాలే కాని, ఇతరాలను కాదు.'

2.1వ శ్లోకంలో (ఇందులో 1.120) మనువు ధర్మోత్పత్తి విషయం ప్రారంభిస్తాననీ చెప్పాడు. 2.25 (1.1.44) లో దాని ముగింపును సూచించాడు. ధర్మోత్పత్తి విషయంలో సూచన లేకుండానే **'మనుస్మృతిని చదవటంలోని అధికార, అనధికారాలు'** అనేది విషయ వ్యతిరేకం. కాబట్టి ఈ శ్లోకం ప్రక్షిప్తం అనుకోవచ్చు.

2. ప్రసంగ వ్యతిరేకం

ఈ పరిశీలన కార్యక్రమంలో మనుస్మృతిలోని ముఖ్య విషయాలను **'విషయాలు'** అనీ, చెబుతున్న దాని చిన్న చిన్న భాగాలు లేదా ఏదైనా చర్చా క్రమాన్ని **'ప్రసంగాలు'** అనీ మనువు సూచించాడు. ప్రస్తుత విషయానికి ముందు వెనుకలుగా గల విషయాలకు భిన్నంగా చర్చలు లేదా వేరు విషయాలు ప్రారంభించే శ్లోకాలు, ఒకదాన్ని చెప్పాక, మళ్ళీదాన్నే కొత్త కోణంతో చర్చించడం లేదా దాన్ని ప్రారంభించే శ్లోకాలు (ఉపసంహారం వికల్పలను వదిలిపెట్టి) క్రమబద్ధమైన విషయాలలో ఆ క్రమం తర్వాత లేదా ముందే చెప్పిన క్రమ వ్యతిరేక శ్లోకాలు, అనవసరమైన చోట లేదా ప్రసంగమే లేకుండా చెప్పే శ్లోకాలు **'ప్రసంగ వ్యతిరేకాలు'** అవుతాయి.

క. **ఇప్పటి ప్రసంగంలో పూర్వాపర విషయాల భిన్న చర్చ-**

క. **అహోరాత్రే విభజతే సూర్యో మానుషదైవికే ।**
రాత్రిః స్వప్నాయ భూతానాం చేష్టాయై కర్మణామహః ॥ 1.65 ॥
పిత్ర్యే రాత్ర్యహనీ మాసః ప్రవిభాగస్తు పక్షయోః ।
కర్మచేష్టాస్వహః కృష్ణః శుక్లః స్వప్నాయ శర్వరీ ॥ 1.66 ॥
దైవే రాత్ర్యహనీ వర్షం ప్రవిభాగస్తయోః పునః ।
అహస్తత్రోద్గయనం రాత్రిః స్యాద్దక్షిణాయనమ్ ॥ 1.67 ॥

అర్థం- **'సూర్యుడు మానవీయ'**, దైవీయ రాత్రిం బవళ్లను విభాగిస్తాడు. రాత్రి ప్రాణుల నిద్రకూ, పగలు తిరగటం మొదలైనవాటికీ, పనులకూ ఉంటాయి(1.65). మనుషుల నెలకాలం నెలలోని రెండు పక్షాలు. పితరులకు ఒకరాత్రి-ఒక పగలు అవుతుంది. వాటిలో కృష్ణ పక్షం కర్మలకు పితరుల దినమూ, శుక్ల పక్షం నిద్రపోయే రాత్రీ అవుతాయి (1.66). మనుషుల ఏడాదికాలం దేవతలకు ఒకరాత్రి, పగలు అవుతుంది. దానిలో ఆరునెలలు ఉత్తరాయణం దేవతలకు పగలు, ఆరునెలలు దక్షిణాయనం వారికి రాత్రీ అవుతాయి (1.67).

వీటిలో 66వ శ్లోకం పూర్వాపర ప్రసంగాలకు భిన్నమైనదాన్ని చెప్పింది. అందుచేత ఇది ప్రసంగ వ్యతిరేకం. ఈ శ్లోకం పూర్వాపర విషయాలను భంగం చేసింది. 65లో **'మానుష దైవికే'** అనడం వల్ల, ఆపైన మనుషుల దేవతల

రాత్రింబవళ్లను చెప్పటమే రచయిత అభిప్రాయమని స్పష్టమవుతూంది. సంకేతం ప్రకారం, మానవుల రాత్రింబవళ్ల విషయం 65లోనే చెప్పటం జరిగింది. ఇక మిగిలిన దేవతల రాత్రింబవళ్ల విషయం 67లో చెప్పాడు. కానీ ప్రక్షిప్తకారులు ఈ విషయాన్ని భంగపరచి, ఇక్కడ చెప్పవలసిన అవసరమే లేకపోయిన మధ్యలో పితరుల రాత్రింబవళ్ల విషయాన్ని చొప్పించారు. ఇలా 66వ శ్లోకం ప్రసంగ వ్యతిరేకం. మరణించినవారి శ్రాద్ధాన్ని గొప్పగా భావించేవారు, తమ 'మృతపితరుల'కు సంబంధించిన విషయాన్ని శాస్త్ర సమ్మతంగా నిరూపించడానికి, ప్రక్షిప్తం చేశారు.

ఖ. నడుస్తున్న ప్రకరణాన్ని భంగం చేసి పూర్వాపరాలకు భిన్నమైన కొత్త ప్రకరణాన్ని ప్రారంభించుట-

చతుర్ణామపి వర్ణానాం ప్రేత్య చేహ హితాహితాన్ ।
అష్టావిమాన్సమాసేన స్త్రీవివాహాన్నిబోధత ॥ 3.20 ॥

బ్రాహ్మో దైవస్తథైవార్షః ప్రాజాపత్యస్తథాసురః ।
గాన్ధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమో౽ధమః ॥ 3.21 ॥

అర్థం-'నాలుగువర్ణాలవారికీ పరలోకంలో మంచి చెడు చేసే ఎనిమిది రకాల పెళ్లిళ్లు ఇవి - 1.బ్రాహ్మ, 2.దైవ, 3.ఆర్ష, 4. ప్రాజాపత్య, 5. ఆసుర, 6.గాంధర్వ 7.రాక్షస 8. పైశాచ వివాహాలు.

ఈ విషయాన్ని చెదరగొడుతూ మధ్యలోనే కొత్త విషయం ప్రారంభమైంది.

యో యస్య ధర్మ్యో వర్ణస్య గుణదోషౌ చ యస్య యౌ ।
తద్వః సర్వం ప్రవక్ష్యామి ప్రసవే చ గుణాగుణాన్ ॥ 3.22 ॥

పృథక్పృథగ్వా మిశ్రౌ వా వివాహౌ పూర్వచోదితౌ ।
గాన్ధర్వో రాక్షసశ్చైవ ధర్మ్యౌ క్షత్రస్య తౌ స్మృతౌ ॥ 3.26 ॥

అర్థం-'ఏ యే వర్ణాలవారికి ఏ యే వివాహాలు ధర్మానుకూలమో, ఏ యే వివాహాలలో ఏయే గుణాలు, దోషాలు ఉన్నాయో, వారికి పుట్టే సంతానానికి ఏ యే గుణదోషాలుంటాయో, వాటన్నిటినీ నీకు చెబుతాను. విడివిడిగా గానీ లేదా కలిసిగా గానీ ముందుగా చెప్పిన గాంధర్వమూ, రాక్షసమూ, క్షత్రియులకు ధర్మంతో కూడినవి అవుతాయి.'

20-21వ శ్లోకాలలో ప్రారంభమయ్యే మౌలిక భగ్న విషయం మళ్లా ప్రారంభమైంది-

ఆచ్ఛాద్య చార్చయిత్వా చ శ్రుతిశీలవతే స్వయమ్ ।
ఆహూయ దానం కన్యాయా బ్రాహ్మో ధర్మః ప్రకీర్తితః ॥ 3.27 ॥

యజ్ఞే తు వితతే సమ్యగృత్విజే కర్మ కుర్వతే ।
అలంకృత్య సుతాదానం దైవం ధర్మం ప్రచక్షతే ॥ 3.28 ॥

అర్థం-'విద్య, శీలం గల వరుణ్ని పిలిచి వస్త్రాదులు, తగిన సత్కారాలు చేసి కన్యనీయడం 'బ్రాహ్మ' వివాహమవుతుంది. (3.27). ఋత్విజుల ద్వారా విస్తారంగా యజ్ఞాదులు చేసి వస్త్రాలు, నగలు మొదలైన వాటితో అలంకరించి కన్యను దానం చేయటం 'దైవ' వివాహం అవుతుంది' (3.28).

ఇక్కడ 20వ శ్లోకంలో మనువు ఎనిమిది రకాల వివాహాలు, 21వ శ్లోకంలో వాటి పేర్లు చెప్పాడు. తర్వాత క్రమం ప్రకారం వాటి నిర్వచనాలు ఉండాలి. అవి 27-34 శ్లోకాలలో ఉన్నాయి; కానీ ఆ విషయాన్ని మధ్యలో చెదరగొడుతూ, ప్రక్షిప్తకారుడు, ఒక కొత్త విషయాన్ని ఏ యే వర్ణాల వారికి ఏ యే వివాహాలు ధర్మానికి అనుకూలమో అంటూ 22-26 శ్లోకాలలో నడిపించాడు.

మనువు అభిప్రాయం, వర్ణాల ప్రకారం పెళ్లిళ్ల గొప్పతనం చెప్పడం కాదు; విధి ప్రకారం వివాహాల మంచి చెడులు చెప్పడమే. ఈ విషయాన్ని ఆయన నిర్దేశ వర్ణనలు గల శ్లోకాలలో స్పష్టంగా చెప్పాడు. 39 నుంచి 42 వరకు గల శ్లోకాలలో ఇదే రుజువవుతుంది. ఈ విధంగా 22 నుంచి 26 వరకు గల శ్లోకాల మధ్య ఉన్న విషయాలు విషయవ్యతిరేకం. అందువల్ల అవి ప్రక్షిప్తాలు. ఇవి పెద్ద-చిన్న అనే అంతరాలు చూపే పక్షపాతంతో ఉన్నాయి. కాబట్టి ప్రక్షిప్తాలు.

గ. క్రమబద్ధమైన వివరణ గల విషయాలలో తగినట్లుగా ఉండే వాటి తరువాత క్రమానికి వ్యతిరేకంగా ఉన్న శ్లోకం -

ద్విధా కృత్వాత్మనో దేహమర్ధేన పురుషోఽభవత్ ।
అర్ధేన నారీ తస్యాం స విరాజమసృజత్ప్రభుః ॥ 1.32 ॥

అర్థం- 'బ్రహ్మ తన శరీరాన్ని రెండు భాగాలుగా చేసి, సగం నుంచి పురుషుణ్ని, మిగతా సగం నుంచి స్త్రీని తయారు చేశాడు. తర్వాత ఈ స్త్రీ యొక్క 'విరాట్' రూపాన్ని పుట్టించాడు.'

అహం ప్రజాః సిసృక్షుస్తు తపస్తప్త్వా సుదుశ్చరమ్ ।
పతీన్ ప్రజానామసృజం మహర్షీనాదితో దశ ॥ 1.34 ॥

అర్థం- 'నేను (మనువు) ప్రజలను సృష్టించాలనే కోరికతో కఠిన తపస్సు చేసి, పదిమంది ప్రజాపతులైన మహర్షులను సృష్టించాను.'

ఏవమేతైరిదం సర్వం మన్నియోగాన్మహాత్మభిః ।
యథా కర్మ తపోయోగాత్ సృష్టం స్థావరజంగమమ్ ॥ 1.41 ॥

అర్థం- 'ఈ విధంగా ఈ మహర్షులందరూ నా ఆజ్ఞ ప్రకారం తపస్సు చేసి, సమస్తమైన స్థావర జంగమ జగత్తును సృష్టించారు'.

ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమిటంటే, మనుస్మృతికారుడు ఒక కచ్చితమైన పద్ధతిలో క్రమంగా ప్రకృతి, మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, మనస్సు, పంచ మహాభూతాలు, ఈ తత్త్వాలతో స్థావర జంగమాదుల సృష్టిని అంగీకరించాడు.(1.14-21) ముందటి శ్లోకాలలో ఇదే క్రమంలో సృష్టి ఉత్పత్తిని చెబుతూ 1.18-18 శ్లోకాలలో ప్రజల 'సృష్టి జరిగింది' అని చెప్పాడు. మళ్లీ 1.19-21 శ్లోకాలలో సంక్షిప్తంగా మిగిలిన సమస్త ప్రపంచపు ఉత్పత్తి కథనం చెప్పాడు. ఇలా ప్రజల (ప్రాణుల) మిగతా జగదుత్పత్తిని ఒక క్రమంలో చెప్పిన ఒక విషయం పూర్తయింది. తర్వాత 1.22-31 శ్లోకాలలో సృష్టించిన ప్రాణుల కర్మల యోగం మొదలైన విషయాలు చెబుతున్నాడు. 1.32 నుంచి ఒక కొత్త విషయం ప్రారంభమై, అందులో బ్రహ్మ ద్వారా అందరు స్త్రీ పురుషుల నిర్మాణం చెప్పబడుతున్నది. 1.34లో మనువు మనసులో ప్రజలను సృష్టించాలనే కోరిక ఉన్నట్లుగా చెప్పబడింది. 1.41లో మహర్షులు స్థావర జంగమాదుల ఉత్పత్తి చేశారని ఉంది. ఇట్లా పరిశీలిస్తే క్రమానికి వ్యతిరేకంగా కనబడుతుంది. ఇది మౌలిక శ్లోకమే అయితే 1.34లో ప్రాణుల ఉత్పత్తి చెప్పే ముందు దీని క్రమోచితమైన-వరుసలో ఉన్న-వివరణ ఉండాలి. కాని క్రమంలో ఇది కలవలేకపోతూంది. అందువల్ల ప్రక్షిప్తకారుడు, తర్వాత జోడించాడు. ఇలా ఈ శ్లోకాల క్రమ వ్యతిరేకతే వీటిని ప్రక్షిప్తాలుగా రుజువుచేస్తున్నది. మిగిలిన **'అంతరవ్యతిరేకాలు'-'లోపలి వ్యతిరేకతలు'**-మొదలైన ఆధారాల వల్ల కూడా 1.32 నుంచి 1.42 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలని రూఢి అవుతుంది.

ఘ. క్రమబద్ధమైన వివరణ గల విషయాలలో ఆ క్రమానికి ముందే వచ్చిన క్రమ వ్యతిరేకమైన శ్లోకాలు-

తదణ్డమభవద్ధైమం సహస్రాంశుసమప్రభమ్ ।
తస్మిఞ్జజ్ఞే స్వయం బ్రహ్మా సర్వలోకపితామహః ॥ 1.9 ॥

తస్మిన్నణ్డే స భగవానుషిత్వా పరివత్సరమ్ ।
స్వయమేవాత్మనో ధ్యానాత్తదణ్డమకరోద్ ద్విధా ॥ 1.12 ॥

తాభ్యాం స శకలాభ్యాం చ దివం భూమిం చ నిర్మమే ।
మధ్యే వ్యోమదిశశ్చాస్టావపాం స్థానం చ శాశ్వతమ్ ॥ 1.13 ॥

అర్థం- ఆ 'అప్' తత్త్వం మంచు వలె శుభ్రమైనదీ, సూర్యుని వలె మెరిసేదీ, అండాకారం కలదైంది. అందులో నుండి అన్ని లోకాలకూ పితామహుడైన బ్రహ్మ స్వయంగా అవతరించాడు.' 'ఆ గుడ్డులో భగవానుడు పరివత్సరం (కల్పంలో వందవ భాగం) వరకూ నివసించి, అటు తర్వాత ఎంతో జాగ్రత్తగా ఆ గుడ్డును రెండు భాగాలు చేశాడు.' 'గుడ్డులోని రెండు భాగాల నుంచి ద్యులోకం, పృథివీ లోకాలను సృజించాడు. వాటి మధ్య ఆకాశం, ఎనిమిది దిక్కులు, జలానికి శాశ్వత స్థానమూ (అంతరిక్షం) చేశాడు.'

ఈ. 1.9, 12,13 శ్లోకాలను గురించిన ఒక సందర్భం ఉంది. ఇందులో ఒక గుడ్డు ద్వారా సృష్టి ఉత్పత్తిని చెప్పారు. బ్రహ్మ ఆ గుడ్డులో ఉండి దాన్ని రెండు ముక్కలు చేశాడు. ఆ రెండు ముక్కల నుంచీ ద్యులోకం, పృథ్వీ లోకం, ఆకాశం, సముద్రం మొదలైనవి వచ్చాయి.

మనుస్మృతిలోని సృష్టి ఉత్పత్తి ప్రక్రియ దాని క్రమాన్ని గురించి వెనుకటి 'గ' భాగంలో తగినంత చర్చించుకున్నాము. ఈ ఉదాహరణను అర్థం చేసుకోవటానికి కూడా దాన్ని గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది. మహత్తు మొదలైన తత్త్వాల ప్రక్రియ, సృష్టి ఉత్పత్తి క్రమం-వీటి వర్ణన చేసిన 1.19-21 వరకు ఉన్న శ్లోకాలలో పూర్తిగా సృష్టి తయారైన క్రమం ఉంది. వాటి నిర్మాణం 14 నుండి 21 శ్లోకాలలో ఉంది కానీ, ఈ సందర్భంలో వాటి రచనకు ముందుగానే ద్యులోకం, పృథ్వీ లోకం మొదలైనవాటి స్థూల సృష్టి జరిగినట్లుగా ఉంది. ప్రాకృతిక తత్త్వాలే తయారుకానప్పుడు, పృథ్వి మొదలైనవి దేనితో చేయబడ్డాయనే ప్రశ్న వస్తుంది. ఈ సందర్భం మౌలికమైతే, దీని వర్ణన సరైన పద్ధతిలో 1.15 శ్లోకం తర్వాత, లేదా 18వ శ్లోకం తర్వాత రావాలి, కానీ ఇలా క్రమవ్యతిరేకం కావడం వల్ల ఆ శ్లోకాలు **'విషయ వ్యతిరేకం'** అయ్యాయి. ఈ శ్లోకాలు అంతర వ్యతిరేకాలు అనే ఆధారం వల్ల ప్రక్షిప్తాలని రుజువైంది.

జ. పైన చెప్పిన స్థలం లేదా విషయం లేకుండానే చెప్పబడిన శ్లోకాలు -

జగతశ్చ సముత్పత్తిం సంస్కారవిధిమేవ చ ।
వ్రతచర్యోపచారం చ స్నానస్య చ పరం విధిమ్ ॥ 1.111

దేశధర్మాన్ జాతిధర్మాన్ కులధర్మాంశ్చ శాశ్వతాన్ ।
పాఖణ్డగణధర్మాంశ్చ శాస్త్రేఽస్మిన్నుక్తవాన్ మనుః ॥ 1.118

అర్థం- 'మనుస్మృతిలో జగత్తు ఉత్పత్తి, సంస్కారాల విధి, వ్రత విధానాలు, స్నాన విధులు క్రమంగా చెప్పబడ్డాయి. ఈ శాస్త్రంలో మనువు దేశం, జాతి, కులాల ధర్మాలు, నాస్తికుల అవైదిక కర్మలను వివరించాడు.

ఇక్కడ 111-118 వరకు ఉన్న శ్లోకాలలో ఒక విషయం ఉంది. ఇక్కడ మనుస్మృతిలోని విషయాల సూచిక ఇవ్వబడింది. ఇక్కడ ఆలోచించదగిన విషయం ఏమిటంటే, ఈ విషయ సూచిక తగిన చోట లేదా ఏదైనా గ్రంథం

ప్రారంభంలో ఉంటుంది, లేదా చివరలో ఉంటుంది. ముందు వెనుకలలో కాకుండా ఎక్కడ పడితే అక్కడ విషయ సూచికను ఇవ్వడం ఏ విద్వాంసుడికైనా తగదు. ఈ శ్లోకాలకు ఇది తగిన చోటు కాదు. పైగా బలవంతంగా చొప్పించినట్లు కనబడుతూంది. ఈ ఆధారం వల్ల ఇవి ప్రక్షిప్తమని రుజువవుతూంది. రెండు ఇతర ప్రమాణాలు కూడా అవి ప్రక్షిప్తాలని చెబుతున్నాయి.

1. విషయసూచికను చెప్పటానికి ఇది తగిన చోటు కాదు, దీని శైలి కూడా ఇది కాదు. దీనిది ప్రవచన శైలి. ప్రతి ఒక ప్రవచనం లేదా విషయం, ముందు వెనుకల విషయాలతో గొలుసులాగా కలిసి ఉంటుంది. మనువు శైలిలో ఏదైనా విషయాన్ని ప్రారంభించడం లేదా ముగించటంలో లేదా రెండు చోట్లా వాటి సూచన లుంటాయి. శైలి అఖండంగా ఉండటం వల్ల ఆ ప్రవాహంలోనే విషయాలకు తగిన సూచనలూ ఉంటాయి. అందువల్ల విడిగా విషయ సూచికకు అవసరమే ఉండదు. అందువల్లనే మనువు, మనుస్మృతిలోని విషయాలను సూచించే సూచికను చెప్పటానికి తగిన సందర్భాన్ని ప్రారంభించనే లేదు. ఇక్కడ చెప్పబడిన శ్లోకాలు మనువు శైలిలో ఇమడవు. ఈ కారణం చేత ఇవి ప్రక్షిప్తాలని తెలిసిపోతున్నాయి.
2. ఏ చోట ఈ శ్లోకా లున్నాయో, అక్కడ ముందువెనుకల ఉన్నవి సృష్టి - ఉత్పత్తి, ధర్మోత్పత్తి విషయాలు. క్రమంగా ఇవి 1.5, 1.108; 2.1 నుంచి మొదలై 2.25లో ముగుస్తాయి. ఈ విషయ సంకేతాలను అనుసరించి వీటిని మధ్యలో చెప్పటం విషయ వ్యతిరేకమూ, సందర్భ వ్యతిరేకమూ కూడా అవుతుంది. ఎందుకంటే ఇవి క్రమంలో ఉన్న విషయాలకు భంగం కలిగిస్తున్నాయి. ఈ విధంగా తగిన చోటు, సందర్భం లేకుండా చెప్పబడిన శ్లోకాలు 'సందర్భ వ్యతిరేకం' అవుతాయి. బహుశా తరువాతి కాలంలో మనుస్మృతిని అధ్యాయాల ననుసరించి పద్ధతిలో పెట్టిన వ్యక్తులే ఈ శ్లోకాలను చొప్పించి ఉండవచ్చు.

3. అంతర్ వ్యతిరేకం (పరస్పర వ్యతిరేకం)

మనుస్మృతిలో ఎక్కడైనా రెండు విషయాలకు పరస్పర విరోధం కలుగుతుందో, లేదా ఒక విషయానికీ మరొక విషయానికీ ఖండన ఏర్పడుతుంటే దానిని **'అంతర్ వ్యతిరేకం'** లేదా **'పరస్పర వ్యతిరేకం'** అంటారు. ఇలాంటి వివరాలున్న శ్లోకాలలో ఒకటి మౌలికమూ, రెండోది ప్రక్షిప్తమూ అని రూఢిగా తెలిసిపోతుంది. మనుస్మృతి మొత్తం ఒక్క రచయిత రాసింది మాత్రమే. వాటిలోని విషయాలకు ఒక దానితో మరొక దానికి వ్యతిరేకత రాకూడదు. ఒక విశిష్ట రచయిత రచనలో ఇలాంటి వ్యతిరేకతలు అసలుండనే ఉండవు. అయినా మనుస్మృతిలో ఈ దోషం స్పష్టంగా కనబడుతూనే ఉంది. తప్పకుండా ఇలాంటివి ప్రక్షిప్తాలే ! ఇలాంటివి వచ్చినప్పుడు, మౌలిక విషయాన్ని మనువు చెప్పినదిగా గ్రహించి, రెండోదాన్ని **'అంతర్‌వ్యతిరేకం'** లేదా **'పరస్పరవ్యతిరేకం'** ఆధారంగా ప్రక్షిప్తంగా భావించాను. కొన్ని అంతర్ వ్యతిరేకాల ఉదాహరణలు చూడండి -

క. కింద ఇచ్చిన అన్ని శ్లోకాలూ ఇప్పటి మనుస్మృతిలో ఉన్నాయి. వీటిలో పరస్పరం ఘోరంగా వ్యతిరేకాలైనవి. ఈ శ్లోకాలు ఒకరి రచనలే కావు. సమయానుకూలంగా ఇతరుల ద్వారా ప్రక్షిప్తాలుగా చొప్పించబడ్డాయి అని తెలిసిపోతుండటం ఆశ్చర్యకరం! సమాజంలో గొప్ప సంప్రదాయాలు శిథిలమైపోతుంటే, వాటిని శాస్త్రసమ్మతాలు చేయటానికి ఈ ప్రక్షిప్తాలను చేర్చారు. చూడండి -

తొలి మూల విషయం -తన కులానికి చెందిన ఒక స్త్రీ భార్యగా ఉండాలి.

అసపిణ్డా చ యా మాతురసగోత్రా చ యా పితుః ।
సా ప్రశస్తా ద్విజాతీనాం దారకర్మణి మైథునే ॥ 3.4 ॥

అర్థం- "తల్లికి చెందిన ఆరు తరాల అమ్మాయి, తండ్రి గోత్రానికి చెందిన అమ్మాయి కాకుండా, వేరే అమ్మాయి పెళ్లికి, సంతానం పొందేందుకు తగినదవుతుంది.'

ఉద్వహేత సవర్ణాం లక్షణాన్వితామ్ (7.77) 'సవర్ణురాలూ, ఉత్తమ లక్షణాలు గల కన్యను పెళ్లాడు.

పెళ్లి విషయంలో కన్యను గురించి చెప్పినప్పుడు, ఏక వచనమే ప్రయోగించారు. ఆ పదం తగిన ఒకటే స్త్రీని సూచిస్తుంది.

"నోద్వహేత్ కపిలాం కన్యామ్" (3.8) **"న చ భీషణనామికామ్"** (3.9)
"మృద్వఙ్గీముద్వహేత్ స్త్రియమ్" (3.10) **"స్వదారనిరతః సదా"** (3.45)
"సన్తుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ।" (3.60)

రెండో ప్రక్షిప్త విషయం-

కింద ఇచ్చిన శ్లోకంలో మునుపు చెప్పిన ఒక భార్యకు వ్యతిరేకంగా పలువురు భార్యలను చేసుకునే పద్ధతిని ఎవరో మనుస్మృతిలో చేర్చారు. బ్రాహ్మణుడికి నాలుగు వర్ణాల నలుగురు కన్యలు, క్షత్రియుడికి ముగ్గురు, వైశ్యుడికి ఇద్దరు, శూద్రుడికి తన కులం అమ్మాయి ఒకతే భార్య ఉండవచ్చు.

శూద్రైవ భార్యా శూద్రస్య సా చ స్వా చ విశః స్మృతేః ।
తాశ్చ స్వా చైవ రాజ్ఞశ్చ తాశ్చ స్వా చాగ్రజన్మనః ॥ 3.13 ॥

అర్థం- "శూద్రుడికి తన కులపు కన్య ఒక్కతే భార్యగా ఉండాలి. వైశ్యుడికి వైశ్య స్త్రీ, శూద్రస్త్రీ ఇద్దరు భార్యలు, క్షత్రియుడికి క్షత్రియ, వైశ్య, శూద్రస్త్రీలు ముగ్గురు భార్యలు, బ్రాహ్మణుడికి నాలుగు కులాల స్త్రీలు నలుగురు భార్యలు ఉండవచ్చు.

మూడోది మనుపు చెప్పిన రెండిటికీ వ్యతిరేకంగా ప్రక్షిప్తమైన విషయం- బ్రాహ్మణ క్షత్రియులు ఇద్దరూ ఎలాంటి పరిస్థితులలోనూ శూద్ర స్త్రీని పెళ్లాడరాదు.

న బ్రాహ్మణక్షత్రియయోరాపద్యపి హి తిష్ఠతోః ।
కస్మింశ్చిదపి వృత్తాన్తే శూద్రా భార్యోపదిశ్యతే ॥ 3.14 ॥

అర్థం- 'బ్రాహ్మణుడు, క్షత్రియుడు- వీరికి విపత్కాలంలో సైతం శూద్ర స్త్రీని పెళ్లాడే పద్ధతి లేదు. అంటే శూద్ర కన్యను వదిలి మిగిలిన వర్ణాలవారిని పెళ్లాడవచ్చు.

ఏ బుద్ధిమంతుడైనా ఇలాంటి పరస్పర వ్యతిరేకాలైన మూడు విషయాలు ఒకటే వ్యక్తి రాసినవని చెప్పగలడా? మరే బుద్ధిమంతుడైనా మనుస్మృతిలో ప్రక్షిప్తాలున్నాయనీ, వాటిని తొలగించాలనీ అనకుండా ఉండగలడా? ఈ ప్రక్షిప్త శ్లోకాలను పరిశోధించి తొలగించిన తర్వాతే మనుస్మృతి వాస్తవికస్వరూపం మన ముందుకు వస్తుంది. వీటిలో చెప్పిన తొలి విషయమే సంబద్ధమూ, మౌలికమూ, మనువు చెప్పినదీ అవుతుంది. మిగిలిన రెండూ ప్రక్షిప్తాలే.

ఖ. తొమ్మిదో అధ్యాయంలో 57-63 వరకున్న శ్లోకాలలో స్త్రీల ఆపత్కాల ధర్మాలు చెప్పారు. సంతానం లేకపోతే అక్కడ నియోగ విధానం ఉంది. ఇది మనువుకు తగిన పద్ధతీ, మౌలికమూను. ఒక శ్లోకం చూడండి -

దేవరాద్వా సపిణ్డాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా ।
ప్రజేప్సితాఽధిగన్తవ్యా సన్తానస్య పరిక్షయే ॥ 9.59 ॥

అర్థం - "సంతానం లేకుంటే, తన భర్త, కుటుంబం వారి, లేదా సమాజం అనుమతిపై మరిది లేదా ఇతర సపిండీకుడు (సగోత్రుడు) అయిన పురుషుడి నుండి కోరుకున్న సంతానాన్ని పొందాలి." కానీ ఈ విషయం పూర్తికాగానే,

ఈ ఆలోచనకు సరిగ్గా వ్యతిరేకమైన ఆలోచనలున్న వ్యక్తులు దీన్ని ఖండిస్తున్న శ్లోకాలను చొప్పించారు. ఆ శ్లోకాలలో ఈ నియోగాన్ని నిషేధించడం ఉంది. సాధుపురుషులు దీన్ని గర్హించవలసిందిగానూ, నిందనీయంగానూ చెప్పారు. దీనికి వికృతమైన కారణాలు చెప్పారు. వీటిని 64 నుంచి 68 వరకు ఐదు శ్లోకాలలో చెప్పారు. వాటిలోని రెండు శ్లోకాలు చూద్దాం -

నాన్యస్మిన్ విధవా నారీ నియోక్తవ్యా ద్విజాతిభిః ।
అన్యస్మిన్ హి నియుఞ్జానా ధర్మం హన్యుః సనాతనమ్ ॥ 9.64 ॥

అర్థం- "ద్విజాతి జనం- బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు - విధవ అయిన స్త్రీకి ఇతర మరిది, లేదా సగోత్ర పురుషులతో నియోగానికి అనుమతించరాదు. అలా చేసినవారు సంతానధర్మాన్ని పాడుచేసినవారవుతారు."

అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః ।
మనుష్యాణామపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి ॥ 9.66 ॥

అర్థం- 'విద్వాంసులు ఈ నియోగపద్ధతిని పశుధర్మం అన్నారు. ఇది వేనరాజుకాలంలో ప్రసిద్ధి పొందింది.'

వీటిలో 64-68 వరకు గల శ్లోకాల విషయం మౌలికం కాదు. ఆ తరువాతి వారు ఎవరో దీన్ని ఖండించేందుకు కలిపారు. అందుచేత, **'అంతర్ వ్యతిరేకం'** లేదా **'పరస్పర వ్యతిరేకం'** అనే ఆధారంతో వాటిని ప్రక్షిప్తాలుగా చెప్పవచ్చు. వేదాలలో చెప్పిన విషయాన్ని, కొద్ది కాలానికే ప్రసిద్ధిలో ఉంది అనటం మంచిది కాదు. మనుస్మృతి స్వయంగా ఆది సృష్టిది. మనువు తాను ముందు చెప్పిన విషయాలే నియోగ ప్రతిపాదకమని తెలుస్తూంది. వేనరాజు మనువు కంటే చాలా తరువాతి వాడు.[1]

గ. **'అహింసా పాలనం'** లేదా **'హింసా నిషేధం'** అనేది మనుస్మృతి లోని అనేక విషయాలతో పాటు మనుస్మృతి అనే భవనం నిలిచేందుకు తోడ్పడే పునాది వంటిది. ఎవరు హింస, మాంసం తినటం, పశు యజ్ఞం, వీటిని మనుసమ్మతంగా భావిస్తారో, వారు మనువుతో పాటు మనుస్మృతికీ అన్యాయం చేస్తున్నవారవుతారు. పైగా వారు సహజంగా వీరి పట్ల నిజాయతీపరులు కారు. మనువు అన్ని రకాల హింసలనూ పాపాలుగా భావించి, వాటి స్థానంలో అహింసను ప్రోత్సహించాడు. అహింస అనేది మనుస్మృతికి ఎలాంటి ఆధారమైన ఘనత అంటే, ఒక విషయం ద్వారా దాన్ని మనం గ్రహించవచ్చు. గృహస్థులకు మనువు నిత్యమూ పంచమహా యజ్ఞాలు చేయటం అనివార్యంగా విధానమన్నాడు. దాని వెనుక కూడా హింసను నివారించే పద్ధతే ఉంది. గృహస్థులు తెలియకా, తప్పనిసరై చేసే ఎన్నో చిన్న చిన్న పొరపాట్లకు ప్రాయశ్చిత్తంగానే పంచమహా యజ్ఞాలు చేయటం అవసరమన్నాడు-

పఞ్చసూనా గృహస్థస్య చుల్లీ పేషణ్యుపస్కరః ।
కాణ్డనీ చోదకుమ్భశ్చ బధ్యతే యాస్తు వాహయన్ ॥ 3.68 ॥

తాసాం క్రమేణ సర్వాసాం నిష్కృత్యర్థం మహర్షిభిః ।
పఞ్చ క్లృప్తా మహాయజ్ఞాః ప్రత్యహం గృహమేధినామ్ ॥ 3.69 ॥

అర్థం- **"గృహస్థుడి ఇంట్లో పొయ్యి, విసర్రాయి, చీపురు, రోలు, నీటి కుండ ఈ ఐదూ హింసలకు స్థానాలు."** వీటిని వాడుతూ గృహస్థు హింసతో కూడిన పాపాలు చేస్తాడు. 'వాటి ప్రాయశ్చిత్తం కోసం మహర్షులు గృహస్థులకు క్రమంగా ఐదు మహా యజ్ఞాలను దైనందిన విధానంగా చేశారు.'

ఇదే కాకుండా మనువు ఇతరమైన ఎన్నో ప్రదేశాల్లో హింసను నిషేధించాడు. హింస చేసేవాడిని నిందించాడు.

అ. **వర్జయేన్ మధుమాంసం చ ప్రాణినాం చైవ హింసనమ్ ॥**

(2.177; ఈ సంస్కరణంలో 152 వది)

అర్థం– "మద్యపానం, మాంసం తినడం, ప్రాణి హింస వదలి పెట్టాలి."

ఆ. హింసారతశ్చ యో నిత్యం నేహాసౌ సుఖమేధతే ॥ 4.170 ॥

అర్థం– "ఎవడు నిత్యమూ హింసాపూరిత కార్యాలు చేస్తాడో, వాడు ఈ ప్రపంచంలో సుఖాన్ని పొందలేడు."

ఇ. నాకృత్వా ప్రాణినాం హింసా మాంసముత్పద్యతే క్వచిత్ ।
న చ ప్రాణివధః స్వర్గ్యస్తస్మాన్మాంసం వివర్జయేత్ ॥ 5.48 ॥

అర్థం– "ప్రాణులను హింసించకుండా మాంసం లభించదు, ప్రాణుల వధ సుఖాన్ని ఇవ్వదు. అందువల్ల మాంసాన్ని అన్ని విధాలుగా మానేయాలి.'

హింస చేయమని సలహా ఇచ్చేవాడు కూడా పాపంలో భాగస్వాములవుతారని చెప్పిన తొలి ధర్మశాస్త్రకారుడు మనువే ! ఏదో రకంగా మాంసాన్ని పొందేవాడిని మనువు **'ఘాతకుడు'** అన్నాడు. హింసకు సంబంధించిన అందరినీ 'ఘాతకులు' అని ప్రకటించి, తన అహింసా మార్గాన్ని ఎలాంటి సందేహాలూ లేని విధంగా స్పష్టం చేశాడు. ఈ 'ఘాతకులు' పాపులు –

ఈ. అనుమన్తా విశసితా నిహన్తా క్రయవిక్రయీ ।
సంస్కర్తా చోపహర్తా చ ఖాదకశ్చేతి ఘాతకాః ॥ 5.51 ॥

అర్థం– "సలహా ఇచ్చేవాడు, కోసేవాడు, చంపేవాడు, కొనేవాడు, అమ్మేవాడు, వండేవాడు, తెచ్చేవాడు (వడ్డించేవాడు), తినేవాడు–ఈ అందరూ ఘాతు కులు (పాపులు).[1]

అహింసను సమర్థిస్తూ, హింసను నిందిస్తూ ఇంతగా రాసిన విద్వాంసుడి గ్రంథంలో, ఎక్కడైనా మాంస భక్షణాన్ని మౌలికంగా భావిస్తే, అది దుస్సాహసమే అవుతుంది. ఇంత స్పష్టంగా చెప్పినా, మనుస్మృతిలో మాంసం తినడం, పశు బలి, హింసా పరత్వం గల శ్లోకాలను కలిపేశారు. చూడండి–

అ. నానిష్ట్వా నవసస్యేష్ట్వా పశునా చాగ్నిమాన్ ద్విజః ।
నవాన్నమద్యాన్మాంసం వా దీర్ఘమాయుర్జిజీవిషుః ॥ 4.27 ॥

అర్థం– అగ్నులు 'కొత్త అన్నం, మాంసాలకు' పేరాశ చెందుతాయి, అందుకని "ఏ ద్విజులు కొత్త అన్నం, పశు మాంసాలతో అగ్నిలో హోమం చేయరో, వారి ప్రాణాలనే అగ్నులు తినాలని భావిస్తాయి." ఇతర ప్రక్షిప్త విషయాలు –

ఆ. 5వ అధ్యాయంలో 11 నుంచి 47వరకు ఉన్న శ్లోకాలలో మాంసం తినే విధానం.

ఇ. 3వ అధ్యాయంలో 122 నుంచి 284 వరకు గల శ్రాద్ధాలలో రకరకాల మాంసాలు తినే విధానం.

ఇవి, ఇంకా మనుస్మృతిలోని హింసను సమర్థించే అన్ని శ్లోకాలూ మౌలిక ఘనతను వ్యతిరేకించేవే కావటం చేత, **'అంతర్ వ్యతిరేకాలు'** ఆధారంగా ప్రక్షిప్తాలే. ఈ శ్లోకాలను స్వార్థులైన పండితులూ, వామాచారులైనవారు ప్రక్షిప్తాలుగా చేశారు. (ముఖ్యమైన అంతర్వ్యతిరేకాలను తెలుసుకోవాలంటే, తరువాతి పదమూడో అధ్యాయం చూడండి– 'మనుస్మృతి–ప్రముఖమౌలిక ఘనతలు' – శీర్షికలోని విశ్లేషణ.)

4. పునరుక్తులు

మొదట చెప్పిన విషయాన్నే మరింత గొప్ప అభిప్రాయంతో చెప్పడం పునరుక్తి అవుతుంది. కొన్ని చోట్ల ప్రక్షిప్తకారులు తమ భావాలను రూఢి చేయటానికి మునుపు చెప్పిన అంశాలను వాటి ప్రయోజనాల ప్రకారం తీసుకున్నారు. వాటిని చదివితే, ఈ విషయాన్ని మళ్లీ తీసుకోవలసిన అవసరం అసలు లేదనిపిస్తుంది. అనవసరంగా వాటిని మళ్లీ చెప్పటం, అవి ప్రక్షిప్తాలని సంకేతిస్తున్నాయి. అవి –

క. మనువు సృష్టి ఉత్పత్తిని వర్ణిస్తూ క్రమంగా జగత్తును ప్రకటించిన పరిస్థితి ద్వారానే పరమాత్మరూప ఉత్పత్తిని కూడా వర్ణించాడు -

తతః స్వయంభూర్భగవానవ్యక్తో వ్యఞ్జయన్నిదమ్ ।
మహాభూతాదివృత్తౌజాః ప్రాదురాసీత్తమోనుదః ॥ 1.6

అర్థం- 'అప్పుడు తన పనులను చేయటానికి స్వయం సమర్థత, మహత్తు, పంచ మహాభూతాలు మొదలైన తత్త్వాలను ఉత్పన్నం చేసేందుకు అమిత శక్తి గల, స్థూల రూపంలో కనబడని పరమాత్మ, ఈ సమస్త ప్రపంచాన్నీ కనబడేదిగా చేస్తూనే తానూ కనిపించాడు.' దీని తరువాతి శ్లోకమే ఇది -

యోఽసావతీన్ద్రియగ్రాహ్యః సూక్ష్మోఽవ్యక్తః సనాతనః ।
సర్వభూతమయోఽచిన్త్యః స ఏవ స్వయముద్బభౌ ॥ 1.7

అర్థం- ఎవరైతే ఇంద్రియాలతో గ్రహించలేనివాడు, సూక్ష్ముడు, అవ్యక్తుడు, సనాతనుడు, అన్ని ప్రాణులకూ ఆశ్రయ స్థానమైనవాడు, అచింత్యుడూ అయిన పరమాత్ముడు, ఆయన తనంతట తానే పుట్టాడు.

ఈ శ్లోకంలో కొత్త విషయాలేమీ లేవు. కొన్ని కొత్త విశేషణాలతో ఆరో శ్లోకంలో చెప్పిన దాన్నే మళ్లీ చెప్పారు. ఆరో శ్లోకంలో పరమాత్మ కనిపించాడని ఉంది. దీంట్లోనూ పరమాత్మ ఉత్పన్న మయ్యాడనే ఉంది. **'అవ్యక్తః'** అనే దాన్ని అలాగే చెప్పారు. **'స్వయం భూః'** అనే దాన్ని **'స ఏవ స్వయముద్బభౌ'** అని రూపంమార్చిన పునరుక్తిగా చెప్పారు. ఈ విధంగా **'పునరుక్తి'** అనే ఆధారం ప్రకారం, ఈ శ్లోకం ప్రక్షిప్తమే.

ఈ పునరుక్తి ఎందుకు వచ్చింది? సందర్భానుసారం దీన్ని స్పష్టంగా చెప్పడం కూడా ఇది ప్రక్షిప్తమే నని చెప్పటానికి దోహదం అవుతూంది. ఆరో శ్లోకంలో భగవంతుడు కనిపించడం జగత్తు కనిపించటమే అని తెలుస్తుంది. అంటే, పరమాత్మ అవ్యక్తుడు- కనిపించనివాడు, కనబడే జగత్తులోనే ఆయన కనిపించడం అనుమానం అవుతుంది. కాని పై 7.2.3 వరకు ఉన్న శ్లోకాలలో పౌరాణిక కల్పన ఆధారంగా, చేసిన ప్రక్షిప్తం ఇది. వాటిలో బ్రహ్మ పుట్టడం ఉంది. దాన్ని నిరూపించటానికి ఏడో శ్లోకంలో, **'యోఽసౌ'** అని చెప్పి, కొత్త విషయం ప్రారంభించారు. ఆ నేపథ్యం కోసం ప్రక్షిప్త కర్త విధి లేక ఈ పునరుక్తి చెప్పాడు. లేకపోతే ఒకసారి ఆరో శ్లోకంలో చెప్పిన దాన్ని మళ్లీ చెప్పే అవసరమే లేదు. ఈ బ్రహ్మ ఉత్పత్తి విషయం మనువు సృష్టి ప్రక్రియకు పూర్తిగా వ్యతిరేకం (14-21). దీన్ని మనుస్మృతి సమ్మతం చేయటానికి, ఈ విషయం చొప్పించారు. కానీ వస్త్రానికి అతుకు వేసిన విధంగా, ఇది ప్రక్షిప్తమని స్పష్టంగా తెలిసిపోతూనే ఉంది.

ఖ. **పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా ।**
సా భర్తృలోకమాప్నోతి సద్భిః సాధ్వీతి చోచ్యతే ॥ 5.165 ॥

అర్థం- ఏ స్త్రీ (త్రికరణ శుద్ధిగా) మనస్సు, వాక్కు, శరీరాలను అదుపులో ఉంచుకుని (పతిం న+అభిచరతి) పతికి వ్యతిరేకంగా చరించదో, (సా) ఆమె, (భర్తృలోకం +ఆప్నోతి) భర్తృలోకం అంటే భర్త హృదయంలో ఆదరపూర్వకమైన స్థానాన్ని సంపాదించుకుంటుంది. (చ) ఇంకా (సద్భిః - 'సాధ్వీ' + ఇతి ఉచ్యతే) శ్రేష్ఠులైనవారు ఆమెను 'పతివ్రత' లేదా 'మంచి భార్య' అని ప్రశంసిస్తారు.'

ఈ శ్లోకపు 9.29లో అంతా పునరుక్తే, అనవసరమే. అందుచేత 9.29 స్థానంలో దీన్ని పునరుక్త ప్రక్షిప్తంగా అంగీకరించారు.

---

1. మహాభారతంలో వేనుని పేరుతో ఇద్దరు రాజులున్నారని ఉంది. ఒకడు- వైవస్వత మనువు పదిమంది కొడుకులలో ఒకడు. (మహా.ఆది.70.13). రెండవవాడు-అంగదేశానికి ఒక దుష్టుడైన రాజు ఉండేవాడు- అతడు కర్దమ పుత్రుడైన అనంగుని కుమారుడు. ఇతనికి పృథుమహారాజు పుట్టాడు. (శాంతి.పర్వం.59.96-99) ఈ ఇద్దరూ స్వాయంభువ మనువు తర్వాతి వారు. మనుస్మృతిలో చెప్పింది అంగరాజు వేనుడి గురించే.

20 · AI Camera 2023.04.16

గ. 5.134 శ్లోకం కూడా 9.30లో పూర్తిగా పునరుక్తమే. ఇతర ఆధారాల వల్ల కూడా ఇది ప్రక్షిప్తంగా రూఢి అయింది. అందుచేత, ఈ రెండు చోట్లా ప్రక్షిప్తంగా భావించారు.

ఘ. 8.324లో శస్త్రాలు, ఔషధాలు మొదలైనవి దొంగిలించిన చోరులకు దేశ కాలాలను బట్టి దండన లభిస్తుందన్న విషయం ఉంది –

మహాపశూనాం హరణే శస్త్రాణామౌషధస్య చ ।
కాలమాసాద్య కార్యం చ దణ్డం రాజా ప్రకల్పయేత్ ॥ 8.324 ॥

అర్థం– 'ఏనుగు మొదలైన పెద్ద జంతువులు, శస్త్రాలు ఔషధాలు దొంగిలిస్తే రాజు సమయం, పనిని అనుసరించి శిక్షించాలి.'

దీని పునరుక్తి –

సీతాద్రవ్యాపహరణే శస్త్రాణామౌషధస్య చ ।
కాలమాసాద్య కార్యం చ రాజా దణ్డం ప్రకల్పయేత్ ॥ 9.293 ॥

అర్థం – '**వ్యవసాయ**'పు పనిముట్లు, నాగలి మొదలైనవి, శస్త్రాలు, మందులు, దొంగిలిస్తే రాజు కాలమూ, కార్యాలను అనుసరించి శిక్షించాలి.'

ఇక్కడ మొదటి పదం మినహాయించి మిగిలినదంతా ఉన్నదున్నట్లుగా పునరుక్తే. మునుపటి శ్లోకం సందర్భోచితంగా ఉంది. ఇది అసందర్భంగా చెప్పబడింది. ఇలా '**పునరుక్తి**' కావడం వల్ల ఇది ప్రక్షిప్తం.

5. శైలీగత ఆధారం లేదా శైలీ వ్యతిరేకం

మనువు చెప్పినట్లుగా సంపూర్ణ మనుస్మృతి రచయిత ఒక వ్యక్తే. మనుస్మృతి శైలి గంభీరం, సంతులితం, ఆధార సహితం, యుక్తియుక్తం, నిష్పక్షపాత వైఖరితో ఉంటుంది.

కానీ, మధ్య మధ్య అతిసామాన్యమూ, నిరాధారమూ, యుక్తియుక్తం కాని, అతిశయోక్తులు నిండిన, పక్షపాతవైఖరి శైలితో కూడిన శ్లోకాలు కూడా కనబడుతుంటాయి. పరస్పర వ్యతిరేకమూ, ముందు చెప్పిన దాని కంటే వేరుగా చెప్పటమనేది ఒకే రచయిత శైలిలో జరగని పని అనేది కచ్చితంగా చెప్పవచ్చు. మనువు విద్వాంసుడైన ఋషి, అందుచేత, మిగిలిన శ్లోకాలు ప్రక్షిప్తాలే కాని మనువు చెప్పినవి కావు. మనుస్మృతిని జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, మను సమ్మతం కానివిగా తోచే శైలులన్నీ రెండు విభాగాలు చేయబడ్డాయి.

1. మనువు శైలి కంటే వేరైన శైలులు– **క. రచనా శైలిలో కనబడే తేడాలు**
2. వర్ణన శైలికి వ్యతిరేక శైలులు **ఖ. నిరాధారమూ, యుక్తియుక్తం కాని శైలి**
గ. అతిశయోక్తులు నిండిన శైలి

ఘ. పక్షపాతశైలి (ద్వేషం, నింద, చెడ్డమాటలు, హెచ్చుతగ్గులు, అంటరాని తనాన్ని ప్రోత్సహించేది).

మను సమ్మతమైన మౌలిక శైలులు కాని కారణం చేత, ఈ శైలులలో గల శ్లోకాలు ప్రక్షిప్తాలుగా చెప్పారు. మనువు యొక్క మౌలిక శైలుల విస్తృత పరిశీలన 'మనుస్మృతి శైలులు' శీర్షికలో జరిగింది. శైలులను నిర్ధారించే పద్ధతులపై అక్కడే చర్చించబడింది. అక్కడ కేవలం సంక్షిప్తంగా చెప్పటంతో పాటుగా వాటికి ఉదాహరణలూ ఉన్నాయి.

క. రచనా శైలిలోని తేడాలు

రచనా దృష్టితో చూస్తే మనుస్మృతిది '**ప్రవచన శైలి**' అంటే మనుస్మృతి మూలతః ప్రవచనమే. మనుస్మృతిలో ప్రవచనానికి ఎన్ని విషయాలు లేదా ప్రకరణాలు ఉన్నాయో, వాటి ప్రారంభం, ముగింపులలో లేదా రెండు చోట్లా

క్రమంగా వాటి ప్రారంభం, ముగింపుల సూచనలు ఉంటాయి. ఈ అన్ని చోట్లా **'వినడం- వినిపించడం తాలూకు క్రియల'** ప్రయోగాలు ఉన్నాయి. అన్ని ప్రవచనాలూ గొలుసుల వలె కలిసి ఉన్నాయి. ఈ శైలి ఆధారంగా ఈ కింది విషయాలు తేలుతున్నాయి –

అ. మనుస్మృతి మౌలికంగా పూర్వం కూర్చిన శాస్త్రం కాదు. మహర్షుల కుతూహలానికి ప్రశ్నలకు సమాధానాలుగా ప్రవచనరూపంలో చెప్పబడింది. వాటిని సంకలించటం వల్ల **'శాస్త్రం'** అని దానికి పేరు వచ్చింది. ప్రవచనాలు చెప్పే ప్రవక్త దాన్ని స్వయంగా **'శాస్త్రం'** అని చెప్పలేదనీ, తాను చెప్పిన ప్రవచనాలను గ్రంథరూపంలోనిదనీ చెప్పలేదనీ దీని వల్ల స్పష్టమవుతూంది. ఈ రూపం తరువాత తయారవుతుంది. అందువల్ల మనుస్మృతిలో ఎక్కడెక్కడ పూర్వం కూర్చిన **'శాస్త్రం'** లేదా **'గ్రంథం'** రూపంలో చెప్పబడిందో, ఆ శ్లోకాలు తరువాతి కాలంలో చొప్పించబడ్డ ప్రక్షిప్తాలని తెలుస్తుంది. ఎందుకంటే అప్పటికి మనుస్మృతి సంకలితమై, కూర్చిన **'శాస్త్రం'** లేదా **'గ్రంథరూపం'**లో వచ్చేసింది. అవి –

1. **ఇదం శాస్త్రమధీయానో బ్రాహ్మణః శంసితవ్రతః ।**
మనో వాగ్దేహజైర్నిత్యం కర్మదోషైర్న లిప్యతే ॥ 1.104 ॥

అర్థం– 'ఈ శాస్త్రాన్ని చదివి దీన్ని అనుసరించి వ్రతాలను చేసే బ్రాహ్మణులకు, మనస్సు, వాక్కు, దేహం చేసే కర్మల వల్ల కలిగే దోషాలు లేదా పాపాలు అంటవు.'

2. **నైఃశ్రేయసమిదం కర్మ యథోదితమశేషతః ।**
మానవస్యాస్య శాస్త్రస్య రహస్యముపదిశ్యతే ॥ 12.107 ॥

అర్థం– 'మోక్షప్రాప్తికి సాధనాలైన అన్ని కర్మలూ చెప్పబడ్డాయి. ఇప్పుడు, మానవ శాస్త్రపు రహస్యాల ఉపదేశం జరుగుతుంది.[1]

ఈ విధమైన శ్లోకాలు, మనుస్మృతి – పరంపరలోని శిష్యుల ద్వారా మనుస్మృతి ప్రశంస, ఘనతను పెంచే దృష్టితో కలపబడ్డాయి.

ఆ. ఈ విధంగా, ఈ శైలిలోనూ, మూల ప్రవచనాల సంకలనంలోనూ మనువు పేరు కూడా రానప్పుడు, భృగువు పేరు రావడంలోని సామంజస్యం ఎంత ఉంటుంది? అందుచేత మనువు, భృగువుల పేరిట చెప్పబడిన శ్లోకాలన్నీ ఈ శైలి ఆధారంగా పరిశీలిస్తే ప్రక్షిప్తాలు. వాటి భాషా ప్రయోగం, శైలి కూడా అవి మనువుచెప్పిన విషయాలున్న మూలసంకలనంలోనివి కావనే చెబుతున్నాయి. అవన్నీ ఇంకెవరో రాసినవి. కొందరు తమ ఆశయాలన్నీ మనువువిగా చెప్పాలనే అభిప్రాయంతో వాటిని ఆ ఇద్దరి పేరిటా జోడించారు. ఇది ఎలాంటి ఛిద్ర ద్వారమంటే, ఎవరికి కావాలంటే వారు తమ అభిప్రాయాలను, ఆశయాలను మనువు పేరిట జోడించేందుకు వీలున్న ద్వారం. వారెన్ని శ్లోకాలు రచించి జోడించినా, అవి గుర్తించదగినవి కావు. తరువాతివారు తమ ఇష్టం వచ్చినట్లుగా మనువు పేరిట ఉన్న శ్లోకాలను చూపించి తమ అభిప్రాయాలను నెరవేర్చుకుంటారు. ఇదే వాస్తవం.

మనువు శిష్యుడైన భృగువు తన అభిప్రాయాలను మనువు పేరిట రాశాడంటే, ఆ విషయంలోనూ ఎన్నో సందేహాలు కలుగుతాయి. –

1. అంటే మనువు ప్రవచనాలను భృగువు మౌలిక రూపంతో సంకలించలేదా?
2. అది మౌలిక రూపంలోనే ఉంటే, ఒక్కోచోట పేరు లేకుండా, మరోచోట పేరుతో పాటుగా, రెండు పద్ధతులలో ఎందుకు ఉన్నట్టు? సంకలన శైలిలో మిగిలిన అన్ని విషయాలూ మౌలికరూపంలోనే జరిగి ఉంటే, అక్కడక్కడా మనువు పేరు చెప్పటం ఎందుకు జరిగింది?

3. మనువు సంకలనంలో భృగువు పేరున్న శ్లోకాలు ఎలా వచ్చాయి? మనుస్మృతిలో ఇది అర్థం లేని విషయం కాదా?

ఈ విధంగా మనుస్మృతిని ప్రక్షిప్తకారులు తమకు నచ్చిన 'భాండాగారం'గా చేసుకున్నారు. ఈ శైలిలో తేలే కచ్చితమైన సంగతేమిటంటే, ఇలాంటి మనువు, భృగువుల పేర్లుగల అన్ని శ్లోకాలూ మూలరూపంలో లేవు. తరువాతి కాలంలో వారి శిష్యులు రచించి కలిపారు-అని. మనువు పేరున్న ఈ శ్లోకం చూడండి-

1. **యః కశ్చిత్కస్యచిద్ధర్మో మనునా పరికీర్తితః ।**
స సర్వోఽభిహితో వేదే, సర్వజ్ఞానమయో హి సః ॥2.7; ఈ సంస్కరణంలో 1.126 ॥

అర్థం- 'మనువు ఎవరెవరికి ఏ యే ధర్మాలు చెప్పాడో అవన్నీ వేదాలు చెప్పినవే మరియు ఆ వేదాలు సంపూర్ణ జ్ఞానయుక్తములు.

2. **దశ స్థానాని దణ్డస్య మనుః స్వాయమ్భువోఽబ్రవీత్ ।**
త్రిషు వర్ణేషు యాని స్యురక్షతో బ్రాహ్మణో వ్రజేత్ ॥ 8.124 ॥

అర్థం- 'స్వాయంభువైన మనువు దణ్డముయొక్క పది స్థానములు చెప్పారు. వాటిని ఆధారం చేసుకుని, క్షత్రియాది మూడు వర్ణాల వారికీ దండన ఉంటుంది, బ్రాహ్మణుణ్ని దండన లేకుండానే విడిచిపెట్టాలి.

3. **ఋణే దేయే ప్రతిజ్ఞాతే పఞ్చకం శతమర్హతి ।**
అపహ్నవే తద్ద్విగుణం తన్మనోరనుశాసనమ్ ॥ 8.139 ॥

అర్థం- 'అప్పుల విషయంలో మనువు ప్రకారం శిక్షలు ఇట్లా ఉంటాయి. అప్పు తీసుకున్నవాడు న్యాయ సభకు వచ్చి అప్పు తీసుకున్నట్లు ఒప్పుకుంటే ఐదు శాతం శిక్షే ఉంటుంది. అట్లా కాకుండా అక్కడ కూడా అబద్ధం చెప్పినా లేదా విషయం దాచినా, పది శాతం శిక్ష పడుతుంది.'

భృగువు పేరిట గల శ్లోకాలు -

1. **ఏతద్వోఽయం భృగుః శాస్త్రం శ్రావయిష్యత్యశేషతః ।**
ఏతద్ధి మత్తోఽధిజగే సర్వమేషోఽఖిలం మునిః ॥ 1.59 ॥

అర్థం- 'ఈ భృగుముని మీ అందరికీ సంపూర్ణ ధర్మశాస్త్రం వినిపిస్తారు. ఈ ముని సమస్త శాస్త్రాలూ నా వద్దనే చదివారు.'

2. **స తానువాచ ధర్మాత్మా మహర్షీన్మానవో భృగుః ।**
శ్రూయతాం యేన దోషేణ మృత్యుర్విప్రాఞ్జిఘాంసతి ॥ 5.3 ॥

అర్థం- 'ధర్మాత్ముడైన భృగుముని మహర్షులతో, ఏ దోషం చేత విప్రులను (విద్వాంసులను) మృత్యువు చంపాలనుకుంటుందో, దాన్ని వినండి.'

3. **ఇత్యేతన్మానవం శాస్త్రం భృగుప్రోక్తం పఠన్ద్విజః ।**
భవత్యాచారవాన్నిత్యం యథేష్టాం ప్రాప్నుయాద్ గతిమ్ ॥ 12.126 ॥

అర్థం- 'భృగువు చెప్పిన ఈ ధర్మశాస్త్రాన్ని చదివిన ద్విజుడు సదాచారి అవుతాడు, 'తన ఇష్ట ప్రకారం సద్గతులు పొందుతాడు'.

ఇ. 'క' ఖండంలో చూపినట్లుగా మనువు శైలిలో ఏదైనా విషయం లేదా ప్రకరణం ప్రారంభం లేదా చివరలో లేదా రెండు చోట్లా చెప్పిన విషయపు సంకేతాలు ఉంటాయి. ఏదైనా స్వతంత్ర ప్రకరణంలో లేదా ఒక ప్రకరణం

ముగింపులో, ప్రారంభించిన చర్చల ప్రారంభం-ముగింపులలో ఆ విషయపు సంకేతం లేదు అంటే, ఆ ప్రకరణం మనువు శైలిది కాదని. అవి -

1. తొలి అధ్యాయంలో 111-118 శ్లోకాలలో మనుస్మృతి విషయ సూచిక సంగతి ఒక స్వతంత్ర, పూర్వాపర విషయాలలో వేర్వేరుగా ఉంది. కానీ ఇందులో మొదట్లో చెప్పిన విషయానికి సంబంధించిన సంకేతం, లేకపోవడం ఇది మనువు శైలిది కాదని రూఢి చేస్తున్నది.
2. 11వ అధ్యాయంలోని 1-43లో స్వతంత్ర దానాల, ఇతరమైన చిల్లర విషయాలున్నాయి. కానీ వాటి ఆది అంతాలలో విషయ సంకేతం లేదు. 43 శ్లోకాలలో చెప్పిన విషయానికి ఏ సంకేతమూ లేకపోవడం, ఇది మనువు శైలిది కాదని తెలుస్తుంది. కాబట్టి ఇది కూడా ప్రక్షిప్తమే.

ఖ. నిరాధారం, అయుక్తియుక్తాల శైలి-

మనువు ప్రతి ఒక్క విధానాన్నీ, విషయాన్నీ ఆధారంతో పాటుగానూ, యుక్తియుక్తంగానూ వివరించాడు. ధర్మనిర్ణయం కోసం తర్కాన్ని కూడా ప్రముఖ ఆధారంగా తీసుకున్నాడు. (12.106,119). మనువు యొక్క ఈ దృష్టికోణం ప్రకారం, కింది శ్లోకాలు మనువు శైలివి కావనీ, ప్రక్షిప్తాలనీ భావించాను. ఎక్కడ కార్యకారణ, సాధ్య -సాధనల పరస్పర సంబంధం లేని వర్ణనలు ఉన్నాయో, వేటికి బుద్ధికి సంబంధించిన స్థితి లేదో, లేదా, తర్కానికి నిలబడవో అలాంటి విషయాలు నిరాధారమూ, అయుక్తియుక్తాల శైలికిందికి వస్తాయి. అవి -

ధాన్యం హృత్వా భవత్యాఖుః కాంస్యం హంసో జలం ప్లవః ।
మధు దంశః పయః కాకో రసం శ్వా నకులో ఘృతమ్ ॥ 12.62 ॥

అర్థం- 'ధాన్యం దొంగిలిస్తే ఎలుక, కంచు దొంగిలిస్తే హంస, నీటిని దొంగిలిస్తే నీటి కోడి, మధువును దొంగిలిస్తే జోరీగ, పాలను దొంగిలిస్తే కాకి, రసాన్ని దొంగిలిస్తే కుక్క, నేతిని దొంగిలిస్తే ముంగిస అవుతారు'.

ఇక్కడ చెప్పిన దొంగతనాలకూ, వాటి ఫలితంగా చెప్పిన జన్మలకూ పరస్పరం సంబంధమే లేదు. అందువల్ల ఇదంతా నిరాధారమూ, అయుక్తియుక్తమూ అయినది.

ప్రత్యగ్నిం ప్రతిసూర్యం చ ప్రతిసోమోదకద్విజాన్ ।
ప్రతిగాం ప్రతివాతం చ ప్రజ్ఞా నశ్యతి మేహతః ॥ 4.52 ॥

అర్థం- 'అగ్ని, సూర్యుడు, చంద్రుడు నీరు, బ్రాహ్మణులు, గోవులు, వాయువు- వీరి వైపు ముఖం పెట్టి మూత్ర విసర్జన చేసేవారు బుద్ధిలేనివారవుతారు'.

ఇందులోనూ చెప్పిన వస్తువుల వైపు ముఖం పెట్టి మూత్ర విసర్జన చేసేవారి బుద్ధి పోతుందని చెప్పటం సమంజసంగా లేదు. వాటికి సంబంధమే లేదు. ఇదే విధంగా ఈ కింది పద్ధతులు కూడా అసమంజసాలు, నిరాధారాలూ.

మృదం గాం దైవతం విప్రం ఘృతం మధుం చతుష్పథమ్ ।
ప్రదక్షిణాని కుర్వీత ప్రజ్ఞాతాంశ్చ వనస్పతీన్ ॥ 4.39 ॥

అర్థం- 'మట్టి, గోవు, దేవుడి ప్రతిమ, బ్రాహ్మణుడు, నెయ్యి, తేనె, నాలుగు దారుల కూడలి, ప్రసిద్ధమైన చెట్టు- వీటి కుడివైపు ముఖం పెట్టి ఎడమవైపు నుంచి వెళ్లాలి.'

వినాద్భిరప్సు వాప్యార్తః శారీరం సంనివేశ్య చ ।
సచైలో బహిరాప్లుత్య గామాలభ్య విశుద్ధ్యతి ॥ 11.202 ॥

అర్థం–'పండితుడైనవాడు నీరు లేకుండా, నీటిలోనూ మలమూత్రాలు విసర్జిస్తూ, బట్టలు లేకుండా స్నానం చేసి, నీటి నుంచి బయటికి రాగానే గోవును ముట్టుకుంటే, అతడు శుద్ధుడవుతాడు.'

గ. అతిశయోక్తులు నిండిన శైలి –

తన కోరిక నెరవేరాలనే ఆలోచనతో, ఏదైనా విషయాన్ని ఉన్న దాని కంటే ఎంతో ఎక్కువగా వర్ణిస్తే, అది అతిశయోక్తుల శైలి అవుతుంది. మనువు శైలి ఎంతో సంతులితంగా ఉంటుంది. మనుస్మృతి ఒక విధాన శాస్త్రం కావడం చేత, అందులో చెప్పే ప్రతి ఒక్క విధానమూ, ప్రత్యేక ధర్మ–అధర్మాల కథనం సహజంగా ఉండాలి. కానీ కొన్నిచోట్ల సహజంగా లేవు. అవి–

అవగూర్య త్వబ్దశతం సహస్రమభిహత్య చ ।
జిఘాంసయా బ్రాహ్మణస్య నరకం ప్రతిపద్యతే ॥ 11.206 ॥

అర్థం–'బ్రాహ్మణుణ్ని కొట్టాలని కర్ర ఎత్తినంత మాత్రాన వందేళ్లు నరకంలో ఉంటాడు. కొట్టినవాడు వెయ్యేళ్లు నరకంలో ఉంటాడు'.

శోణితం యావతః పాంసూన్ సంగృహ్ణాతి మహీతలే ।
తావన్త్యబ్దసహస్రాణి తత్కర్తా నరకే వసేత్ ॥ 4.168 ॥

అర్థం– 'బ్రాహ్మణుణ్ని రక్తం వచ్చేలా కొడితే, ఆ రక్తపుచుక్కలు ఎన్ని మట్టి రేణువులను తడుపుతాయో, అన్ని వేల ఏళ్లు కొట్టినవాడు నరకంలో పడతాడు'.

ఇలాంటి అతిశయోక్తులు నిండిన శైలి కావడం చేత, ఇవి మనువు చెప్పినవికావు, ప్రక్షిప్తాలు.

ఘ. పక్షపాతపు శైలి

ఎక్కడ ఒక వర్గం, వ్యక్తి లేదా విషయానికి తగిన ఆధారాలు లేకుండా, విశేషంగా వంతపలికి చెబితే, లేదా ఒక వర్గం లేదా వ్యక్తి పట్ల ద్వేషం, తిట్టడం, హెచ్చుతగ్గులు, అంటరానితనం మొదలైన వాటితో ప్రేరితులై తప్పుడు రీతిలో అవమానిస్తే, అది పక్షపాతపు శైలి అవుతుంది. మనువు శైలిలో పైన చెప్పిన 'ఆధారం' లేదా కారణాలు ఆధారంగానే ప్రశంస లేదా నింద ఉంటాయి. మునుపటి కోపతాపాల వల్ల పక్షపాతంతో కాదు. కానీ మధ్య మధ్య పక్షపాతం తప్ప మరేదీ లేని శ్లోకాలు కూడా వస్తుంటాయి, అవి మనువు చెప్పినవి కావు –

1. బ్రాహ్మణ వర్గం పట్ల విశేష పక్షపాతం

అ. **స్వమేవ బ్రాహ్మణో భుఙ్క్తే స్వం వస్తే స్వం దదాతి చ ।**
అనృశంస్యాద్ బ్రాహ్మణస్య భుఞ్జతే హీతరే జనాః ॥ 1.101 ॥

అర్థం– "బ్రాహ్మణుడు ఏం తింటాడో, ధరిస్తాడో, ఇస్తాడో అదంతా అతనిదే– అవన్నీ బ్రాహ్మణుడివే, మిగిలినవారు తినేదంతా బ్రాహ్మణుల దయ మీదే ఆధారపడి ఉంటుంది."

బ్రాహ్మణం దశవర్షం తు శతవర్షం తు భూమిపమ్ ।
పితాపుత్రౌ విజానీయాద్ బ్రాహ్మణస్తు తయోః పితా ॥ 2.135; ఈ సంస్కరణలో 2.110

అర్థం– పదేళ్ల బ్రాహ్మణుడు, నూరేళ్ల క్షత్రియుడు, తండ్రీ కొడుకులతో సమానం. వారిలో బ్రాహ్మణుడు తండ్రితో సమానుడు.

2. స్త్రీల పట్ల వివక్ష

ఆ. విశీలః కామవృత్తో వా గుణైర్వా పరివర్జితః ।
ఉపచర్యః స్త్రియా సాధ్వ్యా సతతం దేవవత్పతిః ॥ 5.154 ॥

అర్థం- "పతివ్రత అయిన స్త్రీ, దుష్టుడు, పరస్త్రీగాముడు, గుణహీనుడైన భర్త అయినా ఎప్పుడూ దేవతలాగా పూజ, సేవ చేయాలి."

3. అంటరానిభావనతో పక్షపాతశైలి

ఇ. న విప్రం స్వేషు తిష్ఠత్సు మృతం శూద్రేణ నాయయేత్ ।
అస్వర్గ్యా హ్యాహుతిః సా స్యాచ్ఛూద్రసంస్పర్శదూషితా ॥ 5.104 ॥

అర్థం- 'తన వర్గంలోనివారు ఉన్నంత వరకు, బ్రాహ్మణుడి శవాన్ని శూద్రుల చేత మోయించకూడదు. ఎందుకంటే శూద్రుడి స్పర్శతో కలుషితమైన శరీరం దహనమైతే స్వర్గం చేరదు'.

4. ద్వేషం, నిందతో కూడిన శైలి

ఈ. వృషలీఫేనపీతస్య నిఃశ్వాసోపహతస్య చ ।
తస్యాం చైవ ప్రసూతస్య నిష్కృతిర్న విధీయతే ॥ 3.19 ॥

అర్థం- 'పెళ్లాడి శూద్రస్త్రీని చుంబించేవాడు, ముఖం మీద శూద్ర స్త్రీ ఊపిరి తగిలేవాడు, శూద్రస్త్రీ గర్భాన పుట్టినవారు, మోక్షాన్ని ఎప్పటికీ పొందలేరు.'

5. హెచ్చు తగ్గుల భావనతో పక్షపాత శైలి

ఉ. సహాసనమభిప్రేప్సురుత్కృష్టస్యాపకృష్టజః ।
కట్యాం కృతాఙ్కో నిర్వాస్యః స్ఫిచం వాస్యావకర్తయేత్ ॥ 8.281

అర్థం- 'ఏ శూద్రుడు బ్రాహ్మణుడి వలె ఆసనంపై కూర్చోవాలనుకుంటాడో, అతని నడుముపై వాతలు పెట్టి, దేశం నుంచి వెళ్లగొట్టాలి. లేదా అతని భుజాలను కోసేయాలి."

పైన చెప్పిన అన్ని శ్లోకాలూ పక్షపాతశైలివి కాబట్టి, మను ప్రోక్తం కావు, ప్రక్షిప్తాలే !

6. అవాంతర వ్యతిరేకం

మనుస్మృతిలో కొన్ని విషయాలు గుడ్డిగా చేర్చబడినవి ఉన్నాయి. ఒక ప్రక్షిప్త విషయంలోనే ఎన్నో పరస్పర వ్యతిరేకాలైనవి కనబడుతున్నాయి. ఈ వ్యతిరేక విషయాల వల్ల కొన్ని సారాంశాలు తెలుస్తున్నాయి- 1. వివాదాస్పద విషయాలలోనే ఎక్కువ ప్రక్షిప్తాలు జరిగాయి. 2. ఇన్ని వ్యతిరేక విషయాలు ఒకే రచయిత రచనలో ఉండే అవకాశం లేదు. 3. ప్రక్షిప్తాలు వేర్వేరు వ్యక్తుల ద్వారా జరిగాయి. 4. వేర్వేరు సమయాలలో జరిగాయి. 5. ఇలాంటి వ్యతిరేక విషయాలు మనువు లాంటి విద్వాంసుడి రచన కాదు. అందువల్ల అవన్నీ ప్రక్షిప్తాలూ, అప్రామాణికాలూ.

ఒక ప్రక్షిప్త విషయంలోనే పరస్పర వ్యతిరేకవిషయాలుంటే, అవి **'అవాంతర వ్యతిరేకం'** అవుతాయి. ఈ ఆధారాన్ని ఒక తోడ్పాటు ఆధారంగా స్వీకరించాము. దీనివల్లనే పైన చెప్పిన సారాంశాలు స్పష్టంగా తెలిశాయి, వాటి అప్రామాణికతా, ప్రక్షిప్తతా బలం చేకూర్చుకున్నాయి. ఉదా-3.122 నుంచి 248 వరకు శ్రాద్ధ వర్ణన ఉంది- అది అంతర్ వ్యతిరేకమూ, విషయ వ్యతిరేకమూ మొదలైన ఆధారాలవల్ల ప్రక్షిప్తంగా రుజువు అయింది. దానితో పాటు ఆ విషయంలో లభించే

అంతర్ వ్యతిరేక విషయాలు దాని ప్రక్షిప్తతనూ, అప్రామాణికతనూ బలపరుస్తున్నాయి. స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసం విషయపు పూర్వాపరాలు చూడకుండానే ఇష్టం వచ్చినట్లుగా ప్రక్షిప్తాలు చొప్పించి, తమ గొప్పతనాన్ని శాస్త్ర సమ్మతంగా రుజువు చేసే ప్రయత్నం చేశారు. ఇందులోని కొన్ని అంతర్ వ్యతిరేక విషయాలు ఇలా ఉన్నాయి -

అ. మూడో అధ్యాయంలో 129వ శ్లోకంలో దేవకర్మలలో వేదం తెలియని బ్రాహ్మణుడికి ఆహారం ఇవ్వకూడదు అని ఉంది. 149లో శ్రాద్ధం చేసేవాడు దేవకర్మలో ఆహారం పెట్టేటప్పుడు, వేదాలు చదివాడా లేదా అని పరీక్షించకూడదు. కేవలం బ్రాహ్మణుడైతే చాలు అని ఉంది.

ఆ. మొత్తం విషయంలో మాంసం తినటం గురించీ, మాంస ప్రశంసా ఉన్నాయి. కానీ 152వ శ్లోకంలో మాంసం అమ్మేవాడు బ్రాహ్మణుడికి ఆతిథ్యం ఇవ్వడం నిషేధమని ఉంది. మాంసం తినటం పవిత్రమూ, ప్రశంసనీయ కార్యమూ అయితే, మాంసం అమ్మేవాడు నింద్యుడు ఎలా అవుతాడు?

ఇ. 151వ శ్లోకంలో శ్రాద్ధ కర్మలో బ్రహ్మచారి భోక్తగా ఉండరాదని నిషేధం ఉంది. 186, 192, 234 శ్లోకాలలో శ్రాద్ధంలో తిండి పెట్టడం గురించి ఉంది. అంతే కాదు, వీటిలో అతడు పంక్తి పావనుడు (శ్రాద్ధభోజన పంక్తిని పవిత్రం చేసేవాడు) అని అంగీకరిం చబడింది.

ఈ. 196-197 శ్లోకాలలో శూద్రులు మొదలైన అన్ని వర్ణాలవారూ శ్రాద్ధం చేయవచ్చని చెప్పారు. 241 మొదలైన వాటిలో శూద్ర స్పర్శ నిషేధం, శూద్రుణ్ణి చూస్తే శ్రాద్ధపుణ్యం పోతుంది మొదలైనవి ఉన్నాయి.

ఉ. 167-173 వరకు ఉన్న శ్లోకాలలో వేర్వేరు రకాల మాంసాలతో ఎన్నో నెలలు, సంవత్సరాలు, అనంతకాలం వరకు పితరులకు తృప్తి కలిగించ వచ్చని భావించారు. ఒకసారి పెట్టిన శ్రాద్ధానికే ఇంత తృప్తి కలిగితే, మళ్లీ పాక్షిక మాస శ్రాద్ధం పెట్టే అవసరం ఎందుకు వచ్చినట్లు?

7. వేద వ్యతిరేకాలు

మనుస్మృతిలోని 1.3; 2.6 (ఈ సంస్కరణలో 1.125); 9.15; 12.93-99; 109-113 శ్లోకాల వల్ల, మనువు వేదాలనే ధర్మానికి మూలాధారమని నమ్ముతాడనీ, అతని మనుస్మృతి కూడా వేదానుకూలమనీ తెలుస్తూంది. మిగిలిన తర్వాతి స్మృతులు కూడా మనుస్మృతి వేదాలకు అనుకూలమైందని ప్రకటించాయి. దీన్ని బట్టి మనుస్మృతిలో ఏ విషయము కూడా వేద విరుద్ధం కాకూడదన్నది సారాంశంగా తెలుస్తుంది. ఏది వేద వ్యతిరేకమైనా, మనువు ఘనత ఆధారంగా అది ప్రక్షిప్తమనే భావించాలి. వేదాల ఘనతను వివాదాలు లేకుండా చెప్పడం ఒక జటిల కార్యమే కాబట్టి, వేదాలలో చెప్పినవి ఆధారంగా ఈ ఆధారాన్ని వాడుకోవచ్చు. ముఖ్యంగా ఈ విధానాలలో ఈ ఆధారాన్ని వాడటం చాలా అవసరం. వీటిలో వేదాల నుంచి చెప్పిన విషయాలున్నాయి కాబట్టి, కొన్ని ఉదాహరణలు చూడండి-

1. కింది శ్లోకాలలో స్త్రీలు, శూద్రులు వేద మంత్రాలు చదవకూడదన్న నిషేధం ఉంది -

క. అమన్త్రికా తు కార్యేయం స్త్రీణామావృదశేషతః ॥ 2.66; ఈ సంస్కరణంలో 2.41॥

అర్థం - 'స్త్రీలను సంస్కరించేందుకు అన్ని కర్మలూ మంత్రాలు లేకుండానే చేయాలి'.

ఖ. సాయం త్వన్నస్య సిద్ధస్య పత్న్యమన్త్రం బలిం హరేత్ ॥ 3.121 ॥

అర్థం- 'సాయంకాలం వంటింట్లో వండిన అన్నాన్ని భార్య మంత్రాలు చెప్పకుండానే బలిగా పెట్టాలి.'

గ. నావిస్పష్టమధీయీత న శూద్రజనసన్నిధౌ ॥ 4.99 ॥

అర్థం- 'వేదాలను అస్పష్టంగా చదవకండి. శూద్రుల ముందు అసలు చదవవద్దు.'

వేదాల ఉద్దేశం

ఇప్పుడు పైన చెప్పిన, విషయాలపై వేదాల ఉద్దేశం/ అభిప్రాయం ఏమిటో చూద్దాం.

క. **"యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః ।**
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయ ॥" యజు. 26. 2॥

అంటే- 'పరమేశ్వరుడు చెబుతున్నాడు (యథా) ఎటుల (జనేభ్యః) అందరు మానవులకూ (ఇమాం) ఈ (కల్యాణీమ్) కల్యాణమంటే ప్రపంచమూ, సుఖాన్నిచ్చే హారి (వాచం) ఋగ్వేదం మొదలైన నాలుగు వేదాలలో చెప్పినవి (ఆవదాని) ఉపదేశం చేస్తాను. అలాగే మీరూ చేయండి. ఇక్కడ ఎవరైనా 'జనం' అనే పదానికి ద్విజులనే తీసుకోవాలి, ఎందుకంటే స్మృతులు మొదలైన గ్రంథాల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకే వేదాలు చదివే అధికారం ఉంది. స్త్రీలు, శూద్రులకు ఎందుకు లేదనే ప్రశ్న వేయండి ! (ఉత్తర) - (బ్రహ్మ రాజన్యాభ్యామ్) మొదలైనవి. పరమేశ్వరుడు స్వయంగా బ్రాహ్మణులు, క్షత్రియులు (ఆర్యాయ) వైశ్యులు, (శూద్రాయ) శూద్రులు, (స్వాయ) ఇంకా తమ భృత్యులు, స్త్రీలు (అరణాయ), ఇంకా అతి శూద్రులు మొదలైనవారికి కూడా వేదాలను ప్రకాశం చేశాడు - అంగీకరించాడు" (స.ప్ర.. తృతీయ. సము.).

ఖ. అందరికీ వేదాలు చదువుకునే అధికారమూ, యజ్ఞాలు మొదలైన వైదిక క్రియలు చేసే అధికారమూ ఉండటంలో వేదమంత్రాలతో పాటుగా వేదాల అంగమైన నిరుక్త శాస్త్రపు ప్రమాణం చూడండి-

"యజ్ఞియాసః పంచజనా మమ హోత్రం జుషధ్వమ్॥" (ఋగ్. 10. 53. 4)

ఈ మంత్రంలో చెప్పిన 'పంచజనాః' పదాన్ని వ్యాఖ్యానిస్తూ యాస్కాచార్యుడు స్పష్టంగా ఇలా చెప్పాడు-

"గన్ధర్వాః పితరో దేవా అసురా రక్షాంసీత్యేకే ।
చత్వారో వర్ణాః, నిషాదః పఞ్చమ ఇతి ఔపమన్యవః ।
నిషాదః కస్మాద్? నిషణ్ణం అస్మిన్ పాపకమితి నైరుక్తాః,పఞ్చజనీనయా విశా ।"నిరుక్త. 3. 8॥

అంటే- 'గంధర్వులు, పితరులు, దేవతలు, అసురులు, రాక్షసులు - ఈ ఐదు వర్గాలవారికీ యజ్ఞాలు చేసే అధికారం ఉంది; ఇలా ఆచార్యుడు భావించాడు. ఔపమన్యుని అభిప్రాయంలో నాలుగు వర్ణాల వారు-బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు, నిషాదులు - పాపకర్మలు చేసేవారు- వీరందరికీ యజ్ఞాలు చేసే అధికారం ఉంది. నిషాదులను 'నిషాదులు' అని ఎందుకంటారు? ఈ వ్యక్తుల మనసులో పాపచింతన ఉంటుంది కాబట్టి. ఈ విధంగా అందరు మనుష్యులలోనూ ఈ ఐదు వర్ణాలుంటాయి. యజ్ఞంలో మంత్రాలు తప్పకుండా పఠిస్తారు కాబట్టి, అందరికీ వేదాధ్యయనం చేసే అధికారం సహజంగా ఉంటుంది.

గ. స్త్రీలకు వేదాధ్యయనం, విద్య, బ్రహ్మచర్యాశ్రమం - ఈ విధానాలలో వేదం చెప్పిన ప్రమాణం-

'బ్రహ్మచర్యేణ కన్యా యువానం విందతే పతిమ్' అథర్వ. 3. 24. 11. 18 ॥

ఏ విధంగా అబ్బాయిలు బ్రహ్మచర్యాశ్రమంలో ఉండి విద్యమొత్తం, చక్కని శిక్షణ పొందిన తరువాత యువతి, విదుషి, అనుకూలంగా ఉండేది, ఇష్టమైనది, తమ వంటి లక్షణాలున్న స్త్రీలనే పెళ్లాడతారో, అలాగే (కన్యా) కుమారి (బ్రహ్మచర్యేణ) బ్రహ్మచర్య ఆశ్రమంలో ఉండి వేదాది శాస్త్రాలను చదువుకుని పూర్తిగా విద్యనూ, చక్కని శిక్షణనూ పొందిన యువకులై, సంపూర్ణంగా యౌవనావస్థలో ఉండే తమ వంటి ప్రియ విద్వాంసుడు (యువానం) యుక్త వయస్కుణ్ని (విందతే) పొందాలి. అందుకనే స్త్రీలకు కూడా బ్రహ్మచర్యమూ, విద్యాభ్యాసమూ తప్పక ఉండాలి.

ప్రశ్న - స్త్రీలు వేదాలు చదవాలా?

జవాబు-తప్పకుండా. శ్రౌత సూత్రాలు మొదలైన వాటిలో **'ఇమం మంత్రం పత్నీ పఠేత్'** అని ఉంది.

అంటే- స్త్రీ యజ్ఞంలో ఈ మంత్రం చదవాలి. వేదాది శాస్త్రాలను చదవకపోతే యజ్ఞంలో స్వరసహితంగా మంత్రాల

ఉచ్చారణ, సంస్కృతం మాట్లాడటం ఎలా చేస్తుంది? భారతదేశంలోని స్త్రీలకు తలమానికాలుగా నిలిచిన గార్గి మొదలైన వేద విద్వాంసురాళ్లు ఉండేవారని శతపథ బ్రాహ్మణంలో స్పష్టంగా ఉంది. (స.ప్ర.తృతీయ.సము.).

ఆ. మనుస్మృతి ఐదో అధ్యాయంలో 26 నుండి 42 వరకు ఉన్న శ్లోకాలలో వేదాల సాక్ష్యం చూపి హింసా విధానం ఉందన్నారు. ఇది అబద్ధమూ, వేద వ్యతిరేకమూ కూడా. వేదంలో హింసా నిషేధం ఉంది -

'యజమానస్య పశూన్ పాహి' యజు. 1.1 ॥
మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని సమీక్షే యజుః. 36.18 ॥

కాబట్టి వేద వ్యతిరేకాలు కావటం చేత మనుస్మృతిలోని హింసను చెప్పే అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే!

చివరలో ఒక స్పష్టమైన విషయాన్ని చెప్పుకోవడం చాలా అవసరం. పైన చెప్పుకున్న ఆధారాలే కాకుండా ఇంకా ఎన్నో 'ప్రమాణాలు' తయారు చేసుకోండి. కానీ నేను ఇప్పటికి ఏడు ఆధారాల పైనే పని చేశాను. మిగిలిన ఆధారాలను ఎందుకు తయారు చేయలేదంటే, అవి దోషపూరితాలు కావచ్చు. ఉదాహరణగా, కొన్ని శ్లోకాలు స్థాన భ్రష్టమయ్యాయని, వాటికి మనమే తగిన సంఖ్యలిచ్చి సరి చేస్తే, ఇక హద్దులున్న ఆధారాలే ఉండవు. కొందరు ఒక శ్లోకాన్ని ఒక చోట పెడితే ఇంకొకరు ఇంకో చోట పెడతారు. స్థాన భ్రష్టమైన శ్లోకాలను అవి ప్రక్షిప్తాలు కావని రూఢి పరచుకుని, వాటిని అదే చోట ఉంచి, తమకు తోచినట్లు అర్థాలు చెప్పారు. కొన్ని ఆధారాలు తయారు చేయటానికి వీలే లేకపోయింది. ఎలాగంటే, ఒక పద భాగం లేదా వాక్యం - వీటి రూపంలో జరిగిన ప్రక్షిప్తాలను వేరు చేయటం. ఈ విధంగా మూలాలుగా మిగిలిన కొన్ని శ్లోకాలలోనూ ఉన్న ఇలాంటి కొన్ని రచనలు, నిర్ధారించిన ఆధారాల చట్రంలో ఇమడనివి ఉన్నాయి. అవి మనువు రచన లాంటివే అనిపించినా, అవి మూలశ్లోకాలనటానికి సందేహం కలుగుతూంది.

ఎంత పనీ చేసినా కూడా ఇందులో ఇంకా కొంత పని మిగిలే ఉంటుంది. మనుస్మృతిలోని కొరతలు, వికృత రూపాన్ని తొలగించటానికి శాయశక్తులా ప్రయత్నించాను. దీనివల్ల మనుస్మృతిలోని లోపాలు పూర్తిగా తొలగించామని గర్వంగా చెప్పుకునే పరిస్థితి లేదు.

6. ప్రక్షిప్తాల వల్ల కలిగే నష్టాలు, అనర్థాలు ప్రమాదం

మనుస్మృతిలో ప్రక్షిప్తకారులు తమ స్వార్థాన్నీ, ఉద్దేశాలనూ చొప్పించారు కానీ, ఈ దుష్కార్యం వల్ల మనుస్మృతికి చాలా లోతైన దెబ్బ తగిలింది. మనుస్మృతిని అధ్యయనం చేసేవారికి, దాని మూలరూపం చాలా శుద్ధమూ, పరిష్కృతమూ, మానవత్వంతో నిండినది, పక్షపాతం- పీడనలు లేనిదీ, ఉత్తమాశయాలతో కూడినదని అర్థమవుతుంది. ప్రక్షిప్తాల వల్ల ఆ రూపం వికృతమూ, లోపభూయిష్ఠమూ, అసహ్యంగా మారిపోయింది. మనువు చెప్పిన మూల వ్యవస్థలను మార్చేసి, మనువు ఉద్దేశాలను సంకీర్ణమూ, ద్వేషం కలిగేవిగా చేశారు. ప్రక్షిప్తాల వల్ల మనుస్మృతి నేటి పాఠకులకు ఆక్షేపణీయమూ, చర్చనీయాంశమూ, అయింది. దీన్ని అందరూ అసహ్యంతోనూ, ద్వేషంతోనూ చూస్తున్నారు. అందువల్ల అధ్యయనం చేయదగిన గ్రంథం కాదనీ భావిస్తున్నారు. ఒక ఉత్కృష్టమైన గ్రంథం ప్రక్షిప్తాల వల్ల అవమానాల పాలైంది. ప్రక్షిప్తాల వల్ల కలిగిన హాని, అపోహలు కలిగించే విషయాలను కింది వాటి వల్ల గ్రహిద్దాం -

1. భారతీయ సంస్కృతిలో ఏర్పడిన వికృతి

మనువు కాలం నాటి సమాజపు సంస్కృతి ఎంతో ఉన్నత ఆదర్శాలను కలిగినదీ, పక్షపాత రహితమూ, ఇబ్బంది కలిగించని వ్యవస్థలు, మానవత, ఆధ్యాత్మికతలతో విలసిల్లేది. వర్ణ వ్యవస్థ ప్రకారమే కర్మ లుండేవి (1.87-91). ఆనాడు ద్వేషం వ్యక్తుల పట్ల కాక దుష్కర్మల పైన ఉండేది. తరువాతి కాలంలో వ్యవస్థలూ, సంప్రదాయాలూ వికృతమూ, శిథిలమూ అయ్యాయి. వర్ణ వ్యవస్థ కర్మల ప్రకారం కాక పుట్టుకల ప్రకారం అయింది. జ్ఞాన విద్యపై బ్రాహ్మణుల ఏకాధిపత్యం ఏర్పడింది. వారు తమను అందరి కంటే ఉన్నతులూ, పవిత్రులమని ప్రకటించి, స్త్రీ శూద్రులను అసహ్యించుకునే

విధంగానూ, అంటరానివారుగానూ చేశారు. అటు తర్వాతి కాలంలోని ఈ వికృత వ్యవస్థలను శాస్త్ర సమ్మతమని నిరూపించేందుకు మనుస్మృతిలోనూ, ఇతర గ్రంథాలలోనూ ప్రక్షిప్తాలను చొప్పించారు. వాటిని చదివిన వారు ఈ వికృతులన్నీ మనువు కాలం నాటివేనని భావిస్తున్నారు. **“ఈ ప్రక్షిప్తాలను ఆధారం చేసుకునే, విమర్శకులు మనువు కాలంలో జాతులు, అస్పృశ్యత, స్త్రీ శూద్రులను హీనంగా చూడటం ఉండేవని ఆక్షేపణ చేస్తున్నారు”.** శూద్రుల పట్ల పక్షపాత వైఖరి, విద్వేష ధోరణి ఉన్నాయంటున్నారు. మాంసం తినటం, జంతు బలులు, బహు వివాహాలు మొదలైనవి ఉండేవంటున్నారు. ఇలాంటి ప్రక్షిప్తాల వల్లే ప్రాచీన సంస్కృతి స్వరూపం వికృతంగానూ, అసహ్యంగానూ మారింది. చరిత్రకారులు నాటి సమాజం, సంస్కృతుల గురించి రాస్తున్న చరిత్ర అంతా, ఈ ప్రక్షిప్తాల ఆధారంగానే ఉండటంవల్ల అవి వాస్తవం కావు అని చెప్పవచ్చు.

2. రచనాకాలపు అపోహలు

మనుస్మృతి రచనా కాలం గురించి విద్వాంసులలో అభిప్రాయ భేదాలున్నప్పటికీ లభించిన ఆధారాల వల్ల, మనుస్మృతి మనకు లభిస్తున్న మొత్తం లౌకిక సంస్కృత సాహిత్యాని కంటే ప్రాచీన మని తేలుతూంది. కొంత వైదిక సాహిత్యం కంటే కూడా ప్రాచీనమే (వివరంగా చర్చలలో చెప్పాము); కానీ కొందరు ఆధునిక చరిత్రకారులు దీన్ని మహాభారతం కంటే తరువాతిది అనీ, మరి కొందరు శృంగుల కాలం నాటిదనీ చెబుతారు. రచనా కాలానికి సంబంధించిన ఈ అపోహలు కొన్ని ప్రక్షిప్త శ్లోకాల వల్ల ఏర్పడిందే. మహాభారతం కంటే తరువాతిదే అనేవారు, కింది శ్లోకాలను ఆధారంగా భావిస్తారు-

కురుక్షేత్రం చ మత్స్యాశ్చ పఞ్చాలాఃశూరసేనకాః ।
ఏష బ్రహ్మర్షిదేశో వై బ్రహ్మావర్తాదనన్తరః ॥ 2.19 ॥

అర్థం- ‘బ్రహ్మావర్తంలో కలిసిన కురుక్షేత్రం, మత్స్య, పాంచాల, శూరసేనక ప్రాంతాలు బ్రహ్మర్షి దేశమని పిలువబడతాయి.’

కురుక్షేత్రాంశ్చ మత్స్యాంశ్చ పఞ్చాలాన్‌శూరసేనజాన్ ।
దీర్ఘాంల్లఘూంశ్చైవ నరానగ్రానీకేషుయోజయేత్ ॥ 7.193 ॥

అర్థం- ‘కురుక్షేత్రం, మత్స్య, పాంచాల, శూరసేనక ప్రాంతాలలో పుట్టిన సైనికులు పొడుగ్గా లేదా పొట్టిగా ఉండేవారు. వారిని సేనలో వెనుక భాగంలో ఉంచేవారు’.

ఈ శ్లోకాలలోని కురుక్షేత్రం, మత్స్య, పాంచాల, శూరసేనక అనే పేర్లను బట్టి, మనుస్మృతి వీటి కంటే తరువాతిదని పండితుల అభిప్రాయం. అయితే నిజానికి ఈ రెండు శ్లోకాలూ తరువాతి కాలానివే.

ఇలా కొన్ని అత్యాధునిక సంప్రదాయాల వల్ల, కొన్ని వామపక్షీయుల సంప్రదాయాల వల్ల మనుస్మృతి శృంగ కాలంనాటిదని ప్రకటించారు.

బాల్యవివాహం, మద్యమాంసాల విధానం. మొదలైన వాటి వల్ల. ఆ శ్లోకాలను చూడండి -

త్రింశద్వర్షోద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్ ।
త్ర్యష్టవర్షోఽష్టవర్షాం వా ధర్మే సీదతి సత్వరః ॥ 9.94 ॥

అర్థం- ‘గృహస్థ ధర్మంలో లోపాన్ని పూరించుకునేందుకు, 30 ఏళ్ల పురుషుడు 12 ఏళ్ల కన్యనూ, 24 ఏళ్ల యువకుడు 8 ఏళ్ల బాలికనూ పెళ్లాడాలి.

న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే ।
ప్రవృత్తిరేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలా ॥ 5.56 ॥

అర్థం- 'మాంసం తినటం, మద్యం తాగటం, వ్యభిచారం వీటిలో దోషం లేదు. ఇవి ప్రాణుల స్వాభావిక ప్రవృత్తి. కానీ వీటిని వదిలిపెట్టడం ఎంతో లాభదాయకం'.

ఈ శ్లోకాలు కూడా ప్రక్షిప్తాలే. ఇలాంటి ప్రక్షిప్త శ్లోకాలు మనుస్మృతి కాలం విషయంలో వివాదాలు సృష్టించాయి. అందుకనే చరిత్రకారులు దీని కాల నిర్ణయం చేయటంలో అపోహపడ్డారు.

3.సాహిత్యపరమైన చిన్న చూపు

మూల రూపంలో మనుస్మృతి ఉత్కృష్టమూ, బోధన గ్రంథమూ అనేది స్పష్టం. ఇందులో శాంతి ప్రదాలు, హిత కరాలూ, మార్గదర్శకాలైన మనువు ప్రవచనాలు ఉన్నాయి. ఈ ప్రవచనాలలో ఎక్కువగా ఎలా ఉంటున్నాయంటే, జీవితానికి శాశ్వతమూ, సార్వభౌమికమూ అయిన సిద్ధాంతాలని చెప్పవచ్చు. అందువల్లే మనుస్మృతికి భారతీయసాహిత్యంలో ప్రముఖ స్థానం ఉంది; కానీ ప్రక్షిప్తాల కారణంగా నేడు దీన్ని ఛాందసవాదం గల గ్రంథంగానూ, వికృతులు ఎన్నో ఉండటం చేత సాహిత్యంలో గౌరవనీయ స్థానం లేనిదిగానూ, ఘనత లేనిదిగానూ అయిపోయింది. ప్రక్షిప్తాల వల్లే మనుస్మృతి కున్న సాహిత్యశ్రేష్ఠత నశించిపోయింది.

4. ప్రామాణికతలో సందేహాలు

వేర్వేరు వ్యతిరేక విషయాలున్న కారణం చేత, నేడు పాఠకులు మనుస్మృతి ప్రామాణికతనే శంకిస్తున్నారు. మనుస్మృతి రచయిత ఎవరు, ఇది నిజంగా వాస్తవిక గ్రంథమేనా, మొదలైన ప్రశ్నలు ప్రక్షిప్తాల వల్లనే తలెత్తుతున్నాయి, మరింత జటిలమూ అవుతున్నాయి. కింది శ్లోకాలతో మనుస్మృతి మనువు చెప్పిందేనని రుజువవుతూంది.

మనుమేకాగ్రమాసీనమభిగమ్య మహర్షయః ।
ప్రతిపూజ్య యథాన్యాయమిదం వచనమబ్రువన్ ॥ 1.1 ॥

అర్థం- 'ఏకాగ్ర చిత్తంతో కూర్చుని ఉన్న మనువు ఎదుటికి మహర్షులు వస్తే, వారిని తగిన రీతిగా సత్కరించి, మనువు ఇలా చెప్పసాగాడు.'

కానీ ఈ కింది శ్లోకం దీన్ని భృగువు చెప్పిందని అంటున్నది.

ఏతద్వోఽయం భృగుః శాస్త్రం శ్రావయిష్యత్యశేషతః ॥ 1.59 ॥

ఇదం శాస్త్రం తు కృత్వా సౌ మామేవ స్వయమాదితః ।
విధివద్ గ్రాహయామాససమరీచ్యాదీం స్త్వహంమునీన్ ॥ 1.58 ॥

అర్థం- 'ప్రజాపతి ఈ ధర్మశాస్త్రాన్ని తపస్సు చేసి చెప్పాడు.'

ప్రజాపతిరిదం శాస్త్రం తపసైవాసృజత్ప్రభుః ॥ 11.243 ॥

అర్థం- 'బ్రహ్మదేవుడు ఈ ధర్మశాస్త్రాన్ని సృష్టి ప్రారంభంలో తయారు చేసి, మొట్టమొదట విధిపూర్వకంగా నాకు ఉపదేశించారని మనువు చెబుతున్నాడు. అటు తర్వాత నేను, మరీచి మొదలైన మునుల చేత చదివించాను.

ఈ విధంగా, అన్య పరస్పర వ్యతిరేకాలు, విషయ వ్యతిరేకాలు, మనుస్మృతిలో కలిపినారు. వాటిని చదివి పాఠకుల తల తిరుగుతుంది. ఇందు చేతనే దాని ప్రామాణికతపై సందేహాలు కలుగుతాయి.

5.మనువు వ్యక్తిత్వంపై బురద

మనుమహర్షికి ధర్మ ప్రవక్తగా అందరూ ఎంతో గొప్పస్థానం ఇచ్చారు. తరువాతి శాస్త్రాలు, ఋషులు, మహర్షులు ఏకగ్రీవంగా మనువు విధానాలను ప్రామాణికంగా అంగీకరించారు. ప్రామాణికులు, గల పండితులు కూడా సమ్మతించారు.

"యద్వై కించ మనురవదత్ తద్ భైషజం" (మనువు చెప్పిందంతా రోగికి మందుతో సమానం - తై.సం. 2.2.102) అని చెప్పి వారి పట్ల అందరూ ఎంతో ఆదరం చూపారు. కానీ తరువాతి కాలంలో పక్షపాతం, మొండితనం, ఛాందసత్వ, మూఢ విశ్వాసాలు, ఈర్ష్యాద్వేషాలతో కూడి ఉన్న ప్రక్షిప్తాల వల్ల, పాఠకుల దృష్టిలో మనువు ప్రతిష్ఠ ధూళిలో కలిసింది. పాఠకులు ప్రక్షిప్తాలను పరీక్షించలేక పోయారు. అందుచేతనే ఇలాంటి విషయాలు రాసిన వాడెవరైనా విశిష్ట వ్యక్తి కాలేదని భావించారు. ఇలాంటి ప్రక్షిప్తాలు మనువు వ్యక్తిత్వాన్నే హత్య చేశాయి.

6. మనుస్మృతి పట్ల ద్వేషపు దృష్టికోణం

పైన చెప్పుకున్న నిందా పూర్వకమైన అమానుష విషయాలు మనుస్మృతిలో ఉండటం చూసి, నేటివారు దీన్ని పట్ల ఉపేక్ష, ద్వేష భావాలతో ఉన్నారు. దీన్ని కొందరైతే 'స్వార్థ బ్రాహ్మణుల పుస్తకం' అంటూ ఎగతాళి చేస్తున్నారు. ముఖ్యంగా కింది జాతుల వారైతే ఇందులో తమ కులాల పట్ల పక్షపాతమూ, విద్వేషమూ ఉన్నాయి, కాబట్టి దీని పట్ల తమ ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు, చేస్తున్నారు.

అందులో స్త్రీల నిందను చూసి స్త్రీలందరూ ఈ గ్రంథం పట్ల అసంతృప్తిని కనబరుస్తున్నారు. ఇలా బ్రాహ్మణేతరవర్గాలన్నీ మనుస్మృతి పట్ల అసహనాన్ని నిరసనను తెలియబరుస్తూ తగులబెడుతున్నారు. ఇవన్నీ కూడా ప్రక్షిప్తాల వల్ల ఏర్పడిన లోపాలే !

ఈ ప్రకారం, ప్రక్షిప్తాల వల్ల మనుస్మృతికి ఎంతో హాహాని కలిగింది. దాని పట్ల ఎన్నో రకాల అపోహలు కలిగాయి. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను పరిశోధించి వాటిని దూరం చేస్తే, మనుస్మృతి యొక్క మౌలిక శుద్ధరూపం వెలుగులోకి వస్తుంది. ప్రక్షిప్తాలు తొలగిపోతే, మనువు, మనుస్మృతుల పట్ల ప్రజలలో శ్రద్ధ కలుగుతుంది. అప్పుడు మునుల కాలం నాటి ప్రాచీన భారతీయ సంస్కృతి, చరిత్రల వాస్తవిక చిత్రం అందరికీ కనులముందు కనబడుతుంది.

***

U20 · AI Camera 2023.04.16 12:

మూడవ అధ్యాయం

మనువుకున్న ప్రముఖ మౌలిక లక్షణాలు - వాటికి ఆధారాలు

కిందటి అధ్యాయంలో మనుస్మృతిలోని ప్రక్షిప్తాలైన శ్లోకాలు, వాటి పరిశీలనలో తోడ్పడిన 'ప్రమాణాల' లక్షణాలు, ఉదాహరణలతో సహా వాటి విశ్లేషణ చేసి, ప్రక్షిప్తాల పరిశోధన పద్ధతిని స్పష్టంగా చెప్పాను. భాష్యంలో ఆ యా శ్లోకాలపై యథాస్థానాలలో ఉంచటానికి ఆధారమైన సమీక్ష నిచ్చాను. అయినప్పటికీ ఈ విషయంలో పదేపదే 'ఈ ఫలానా గుర్తింపును మౌలికంగా ఎందుకు అంగీకరించారు?' 'దీన్ని ప్రక్షిప్తమని ఎందుకన్నారు?' 'మీరు దీన్ని ప్రక్షిప్తంగా ఎలా ప్రకటించారు? దీన్ని మౌలికమని ఎందుకు స్వీకరించరాదు?' లాంటి అనుమానాలు కలుగుతూనే ఉంటాయి.

కర్తృత్వాన్ని ఆధారం చేసుకుని 'ప్రసంగ వ్యతిరేకాలు, అంతర వ్యతిరేకాలు, శైలీ వ్యతిరేకాలు[1] మొదలైన ఏడు ప్రమాణాల ప్రకారం, ఏవేవి మనుస్మృతికి వ్యతిరేకాలుగా రుజు వయ్యాయో, వాటిని ప్రక్షిప్తాలన్నాను. వేదాలకు అనుకూలమైన[2] మనుస్మృతికి చెందిన వాటిని మౌలికం[3] అన్నాను. ఇక్కడ మనువుకున్న కొన్ని ప్రముఖమైన గుర్తింపులను, మనుస్మృతిలో లభించే వాటికి సంబంధించిన సమగ్రమైన పక్ష-విపక్షాల వివరణను ఏకసూత్రంగా చెప్పి, సహేతుక-ప్రమాణ పూర్వక విశ్లేషణ జరిగింది -

1. మనుస్మృతిలో వర్ణవ్యవస్థ జన్మ వల్ల కాదు, కర్మ వల్ల

మనుస్మృతిలో ఎన్నో చోట్ల స్పష్టంగానూ, సాంకేతికంగానూ కొన్ని విషయాలున్నాయి. వాటి వల్ల, మనువునాటి వర్ణ వ్యవస్థ, నిర్ధారణ మౌలికంగా విద్య, మరియు కర్మ వల్ల జరిగిందనీ, జన్మ వల్ల కాదనీ రుజువవుతుంది. అంటే ఒక బాలుడి వర్ణం లేదా జాతి నిర్ధారణ అతని తల్లిదండ్రుల వల్ల జరగదు. ఏ జాతిలో పుట్టిన పిల్లవాడికైనా తల్లిదండ్రులు తమ వర్ణం లేదా మరోవర్ణంలో దీక్షను ఇప్పించవచ్చు. విద్యాభ్యాస కాలం చివరిలో వర్ణ నిర్ధారణ, దాని గుణాలు, కర్మలు, స్వభావం విద్య మొదలైనవాటి ఆధారంతో ఆచార్యుడు చేస్తాడు. అటు తర్వాత అతని జీవిత కాలంలో ఎప్పుడైనా విద్య, చేసే పనులు లేదా వృత్తులను బట్టి వాటిలో మార్పులు కలగవచ్చు. మనుస్మృతిలో 'వర్ణ' పదం 'కర్మ'కు పర్యాయ పదంగా వాడబడింది.

అ.కర్మల ఆధారంగానే వర్ణవ్యవస్థకు గుర్తింపు

అ. పనులను బట్టి వర్ణవ్యవస్థ గుర్తింపునకు లోబడి ఉంటుందా? లేక సాంకేతిక స్థలానికా?

ఈ విషయాన్ని చూపించే చోట్లు మనుస్మృతిలో ఉన్నాయి. ఇవన్నీ కూడా మనుస్మృతికి ఆధారభూతమైన సాంకేతిక విషయాలలో, విషయసమ్మతమూ, శైలికీ అనుకూలంగా ఉన్నాయి -

1.31,87-91; 2.11-14 (36-39); 78 (103), 101 (126), 143 (268); 4.245; 10.65.

పై అన్ని చోట్లా పరిశీలన, విశ్లేషణ చేసిన తర్వాత, దీనికి సంబంధించిన ఈ అభిప్రాయాలు చెప్పుకోవచ్చు.

1. (క) జన్మచేతనే ఎవరైనా గొప్పవారు లేదా గొప్పవారు కాదు అనే అభిప్రాయంతో ఉంటే, ఆయా జాతుల పనులు నిర్ధారించడం, శ్రేష్ఠులు, తక్కువ పనులు చేసేవారు అనటం, గొప్ప జాతి వారుగా పుట్టటం, అందులో

---

[1] శైలీవిధానాలు, ఇతర ఆధారాల పరిజ్ఞానం కోసం రెండో అధ్యాయంలోని **'శైలీ గత ఆధారాలు'** శీర్షిక చూడండి.

[2] 1.129(2.10); 1.3; 1.125 (2.6); 1.127, 128, 130-134(2.8,9,11-15); 1.21,31;12.108; 109, 113 మొ॥

[3] 12.95-96.

నుండి పతనం కావడం అనే పద్ధతులను చెప్పే అవసరమే ఉండేది కాదు. ఎందుకంటే, జన్మ చేత శ్రేష్ఠుడో, భ్రష్టుడో అయితే వాడు అలాగే ఉంటాడు, పని చేసినా చేయకపోయినా. బాల్య, కౌమార దశలలోనూ వర్ణాలకు నిర్దేశించిన పనులు చేయడు, పైగా అజ్ఞానంతో వ్యతిరేకకర్మలు చేస్తాడు. అలాంటి పరిస్థితిలో పుట్టుకతో బ్రాహ్మణుడు లేదా ధర్మానికి రూపం అనుకుంటే (1-98), తర్వాత కర్మలు చేయకపోవటం వల్లగానీ లేదా వ్యతిరేకకర్మలు చేసినందు వల్లగానీ అతడి బ్రాహ్మణత్వం నశించకూడదు; కాని మనుస్మృతిలోని అన్ని విధి నిషేధ వాక్యాలూ, వ్యవస్థలూ, వర్ణాలకు పనులను నిర్దేశించటం వల్ల, మనువు ధర్మాధర్మాలు, కర్మ వ్యవస్థలనే వర్ణ వ్యవస్థగా లేదా వ్యక్తి గొప్పతనంగా అంగీకరించాడే కాని జన్మతో కాదు అని, స్పష్టంగా తెలుస్తూంది. పుట్టుకతోనే శ్రేష్ఠతను అంగీకరిస్తే, మనుస్మృతిలోని కర్మ వ్యవస్థ అంతా వ్యర్థమే ! ఎవరైనా పాటించినా పాటించకపోయినా, వ్యవస్థ గొప్పతనమేమీ నిలిచి ఉండదు. ఎందుకంటే గొప్పతనం, నీచత్వం పుట్టుకతోనే నిర్ధారించబడ్డాయి కాబట్టి. కింది శ్లోకాలలో వాటిని మరింత స్పష్టంగా తెలుసుకుందాం-

శూద్రో బ్రాహ్మణతామేతి బ్రాహ్మణశ్చైతి శూద్రతామ్ ।
క్షత్రియాజ్జాతమేవం తు విద్యాద్వైశ్యాత్తథైవ చ ॥ 10.65 ॥

అంటే- 'గొప్ప, తక్కువ' పనుల వల్ల క్రమంగా శూద్రవర్ణంలో పుట్టిన వాడు బ్రాహ్మణుడూ, బ్రాహ్మణవర్ణంలో పుట్టిన వాడు శూద్రుడూ అవుతారు. అంటే గుణాలు, కర్మలను అనుసరించి ఎవరైనా బ్రాహ్మణుడు అయితే అలాగే ఉంటాడు. బ్రాహ్మణుడు క్షత్రియ వైశ్య శూద్రుల గుణాలున్నవాడైతే, వాడు క్షత్రియ వైశ్య శూద్ర వర్ణాలకు చెందిన వాడవుతాడు. అలాగే శూద్రుడి ఇంట్లో పుట్టినవాడు మూర్ఖుడు అయితే శూద్రుడుగా ఉండిపోతాడు. ఉత్తమ వర్ణంతో గుణవంతుడు అయితే అదే విధంగా బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు అవుతాడు. ఇలా క్షత్రియ వైశ్య వర్ణాల్లో పుట్టినవాడికీ వర్ణం మారుతుందని భావించాలి'.

మనువు ఈ శ్లోకంలో ఎంతో స్పష్టమైన పదాలతో వర్ణ వ్యవస్థను కర్మలు ఆధారితమైందని చెప్పాడు. దీనికి సంబంధించిన మిగతా చర్చను, సమీక్షను 2.31; 87-91, 107; 11.114 శ్లోకాలలో చూడండి.

పై శ్లోకాన్ని బలపరచడానికి పరంపరా గత ప్రమాణం:- ప్రాచీన కాలంలో కర్మానుసారంగా వర్ణవ్యవస్థ ఉండేది. ఇందుకు అనేక ప్రమాణాలు, ఉదాహరణలు దొరుకుతాయి. 1.5.10-11 ॥

ధర్మచర్యయా జఘన్యో వర్ణః పూర్వం పూర్వం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ ॥1॥
అధర్మచర్యయా పూర్వో వర్ణో జఘన్యం జఘన్యం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ ॥2॥

ధర్మాచరణ వల్ల కింది వర్ణాలు ఉత్తమవర్ణాన్ని పొంది, అదే వారికి తగిందని అందులోని వారుగానే లెక్కించబడతారు. (1)

అధర్మాచరణ వల్ల మునుపటి అంటే, ఉత్తమ వర్ణుడైన వాడు, తన కంటే కింది వర్ణాలను పొంది, అతడు దానికే యోగ్యుడు కాబట్టి, ఆ వర్ణం వాడుగానే పరిగణింపబడతాడు. (2)

2. తమ ధర్మాలను, కర్మలనూ పాటించకపోతే ఎవరైనా శూద్రులవుతారు- అనేది మనువు అభిప్రాయం. అది- (క) వేదం చదవకపోతే బ్రాహ్మణుడు శూద్రుడవుతాడు.

యోఽనధీత్య ద్విజో వేదమన్యత్ర కురుతే శ్రమమ్ ।
స జీవన్నేవ శూద్రత్వమాశు గచ్ఛతి సాన్వయః ॥ 2.168 ॥

(ఖ) సంధ్యోపాసన చేయనివాడు శూద్రుడవుతాడు.

న తిష్ఠతి తు యః పూర్వాం నోపాస్తే యశ్చ పశ్చిమామ్ ।
స శూద్రవత్ బహిష్కార్యః సర్వస్మాత్ ద్విజకర్మణః । 2.103 ॥

చెప్పిన వయసులో ఉపనయనం కాకపోతే, ఆ బ్రాహ్మణుడు **'వ్రాత్యుడు'**గా పిలువబడే శూద్రుడవుతాడు. (2.37-40).

ఘ. నీచుల సాంగత్యం వల్ల బ్రాహ్మణుడికి శూద్రత్వం కలుగుతుంది.

ఉత్తమానుత్తమాన్ గచ్ఛన్ హీనాన్ హీనాంశ్చ వర్జయన్ ।
బ్రాహ్మణః శ్రేష్ఠతామేతి ప్రత్యవాయేన శూద్రతామ్ ॥ 4.245 ॥

ఈ ప్రమాణాల వల్ల మనువు జన్మతో శ్రేష్ఠుడు కాడనీ అనలేదు, పుట్టుకల వల్ల వర్ణ వ్యవస్థ ఏర్పరచలేదు. పుట్టుకతో వర్ణాలు నిర్ణయించి ఉంటే, పైన చెప్పినవిధంగా ఎక్కువ తక్కువలు ఏర్పడేవే కావు.

3. అంతే కాకుండా, ఆ విధంగా శూద్రుడైన వ్యక్తి తన కర్మలను మార్చుకోవటానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటే, మళ్లీ తన అసలు వర్ణంవాడు కావచ్చు. మనువు విషయాన్ని **'వ్రాత్య'** అనే శూద్రుల కోసమూ, వర్ణ వ్యతిరేక కార్యాల వల్ల బ్రాహ్మణ వర్ణం నుంచి బహిష్కృతులైన వారి కోసమూ చెప్పబడిన ప్రాయశ్చిత్తాలనూ చెప్పాడు (11.191-196). ఈ పద్ధతి వల్ల కూడా మనువు ఏర్పరచిన **'వర్ణవ్యవస్థ'** కర్మల ననుసరించే అని స్పష్టమవుతూంది.

4. మనువు వ్యక్తుల ప్రతిష్ఠ, గొప్పతనాలను, గుణాలను యోగ్యత ననుసరించే అంగీకరించాడు. (2.136, 237, 154, 156). దీనివల్ల కూడా పుట్టుకతో వర్ణ వ్యవస్థను మనువు అంగీకరించలేదనీ, కర్మలు లేదా గుణాలు ఆధారంగానే ఏర్పరిచాడనీ స్పష్టమవుతూంది.

5. వర్ణాల కర్మలను చెబుతూ **"లోకానాం వివృద్ధ్యర్థమ్"** (సమాజ వృద్ధి కోసం 1.31), **"సర్వస్యాస్యతు గుప్త్యర్థంమ్"** (ఈ సమస్త జగత్తు రక్షణ కోసం 1.87) అని వీటిని కర్మ నిర్ధారణకు కారణాలన్నాడు మనువు. ఎందుకంటే జన్మతోనే శ్రేష్ఠుడైతే హెచ్చు తక్కువల నిర్ధారణ జరిగిపోతే, దాని వల్ల సమాజం, జగత్తులలో ఏం వృద్ధి జరుగుతుంది? పెద్ద వర్ణాలవారి వృద్ధి మాత్రం జరుగుతుంది. అంతేకాక, ఆ వృద్ధి కూడా ఎక్కడ జరుగుతుంది? ఏ స్థాయిలో ఉన్నవాడు అ స్థాయిలోనే ఉంటాడు. అతడికి స్థాయిని పెంచుకునే అవకాశం ఎలా లభిస్తుంది? పుట్టుకతో వర్ణ వ్యవస్థను అంగీకరిస్తే, పైన చెప్పిన కారణాలు నిరర్థకాలవుతాయి. ఈ కారణాల వల్ల మరో సంకేతం కూడా లభిస్తూంది- నాలుగు వర్ణాలను ఉద్దేశించి జనాన్ని ఏర్పరచలేదు, ప్రజల వృద్ధి కోసం (ప్రజల కోసం) నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. అంటే పుట్టిన జనమంతా సమానులే. వారి గుణకర్మలను అనుసరించి నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. సమాజం వాటిలో ఉంటూ వృద్ధి చెందాలని. ఈ పద్ధతి వల్లనూ వర్ణ వ్యవస్థ కర్మల వల్ల మాత్రమే ఏర్పడిందని రుజువవుతూంది.

6. **'వర్ణం'** అనే పదానికి అర్థం, 'వ్యుత్పత్తులే' పుట్టుకతో కాక, కర్మలను బట్టి వ్యవస్థ ఏర్పడిందని తెలిసిపోతూంది. నిరుక్తంలో **'వర్ణం'** పదానికి **'వ్యుత్పత్తి'** ఉంది..**'వర్ణో వృణోతేః'** అని. (2.1.4). అంటే కర్మల ప్రకారం దేన్ని వరిస్తామో అదే **'వర్ణం'**. దీన్ని దయానంద మహర్షి కూడా ఇలా వివరించారు-

వర్ణో వృణోతేరితి నిరుక్తప్రామాణ్యాద్ వరణీయా వరీతుమర్హాః ।
గుణకర్మాణి చ దృష్ట్వా యథాయోగ్యం వ్రియన్తే యే తే వర్ణాః॥ (ఋ.భా.భూ,వర్ణాశ్రమధర్మవిషయం)

అంటే- గుణ కర్మలను చూసి తగిన అధికారం ఎవరికి దక్కుతుందో అదే వర్ణం.

7. కర్మలను అనుసరించిన వర్ణాల పేర్లే వర్ణ వ్యవస్థ బోధకాలు-వర్ణాల పేర్లు వాటి కర్మల ప్రకారం పెట్టారు. ఆ పేర్ల వ్యుత్పత్తి ఆ కర్మలను బోధపరుస్తుంది-

క. 'బ్రాహ్మణుడు' అనే పేరు కర్మలను బట్టి వర్ణవ్యవస్థ సూచకం-వర్ణాల పేర్లకు వ్యాకరణం ప్రకారం రచన, వ్యుత్పత్తుల వల్ల కూడా మనువు కర్మానుసారమే పేర్లు పెట్టాడనీ, పేర్ల వల్ల వర్ణాల పనులు కూడా తెలుస్తాయనీ స్పష్టమవుతూంది. 'బ్రహ్మన్' ప్రాతిపదిక నుంచి **'తదధీతే తద్వేద'** (అష్టా. 4.2.59) అనే అర్థంలో **'అణ్'** అనే ప్రత్యయం కలవడం వల్ల 'బ్రాహ్మణ' పదం వస్తుంది. దీని వ్యుత్పత్తి - **"బ్రాహ్మణా వేదేన పరమేశ్వరస్య- ఉపాసనే చ సహ వర్తమానో విద్యాది- ఉత్తమగుణయుక్తః పురుషః"**- అంటే వేదాల, అధ్యయనం పరమాత్మ ఉపాసనలో లీనమై విద్య మొదలైన ఉత్తమ గుణాలు కలిగినవాడినే 'బ్రాహ్మణుడు' అని చెప్పబడుతాడు. బ్రాహ్మణులకు ఈ ప్రముఖ కర్మలు ఉండాలని మనువు నిర్దేశించాడు.

"ఆగ్నేయో బ్రాహ్మణః" (తాం. 15.4.8). **"ఆగ్నేయో హి బ్రాహ్మణః"** (కాఠ. 29.10) = బ్రాహ్మణుడు శ్రేష్ఠమైన వ్రతాలు, యజ్ఞాదులతో సంబంధం గలవాడు. అంటే బ్రాహ్మణుడు యజ్ఞకర్త అవుతాడు.

అ. **"బ్రాహ్మణో వ్రతభృత్"** (తై.సం. 1.6.7.2), **"వ్రతస్య రూపం యత్సత్యమ్"** (శ. 12.8.2.4) = బ్రాహ్మణుడు శ్రేష్ఠమైన వ్రతాలు కర్మలను ధరించే వాడవుతాడు. సత్యం పలకడం ఒక వ్రతపు రూపం. **"గాయత్రో వై బ్రాహ్మణః"** (ఐత. 1.28). **"గాయత్రో యజ్ఞః"** (గో.పూ. 4.24) **"గాయత్రో వై బృహస్పతిః"** (తాం. 5.1.19) = బ్రాహ్మణుడు గాయత్రుడు అవుతాడు. గాయత్రిని వేదం, యజ్ఞాలు, మరియు పరమాత్మ అని అంటారు.

ఖ. 'క్షత్రియ' నామకులు కర్మలను బట్టి వర్ణ సూచన

(1) 'క్షణు'- 'హింస' అనే అర్థం గల (తనాది) ధాతువు నుంచి **'క్తః'** ప్రత్యయం కలవటం వల్ల 'క్షతః' మొదలైన పదాలు వస్తాయి. 'క్షత' ఉపపదంలో **"త్రైజ్"** = పాలన చేయటమనే అర్థంలో (భ్వాది) ధాతువు నుంచి **'అన్యేష్వపి దృశ్యతే'** (అష్టా. 3.2.101) సూత్రం చేత 'డః' ప్రత్యయం, పూర్వపద అంతంలోని అకార లోపంతో **'క్షత్రాద్ ఘః'** (అ. 4.1.138) సూత్రంతో పుట్టుక అనే అర్థంలో **'ఘః'** ప్రత్యయం కలిసి **'క్షత్రియ'** పదం వచ్చింది. **'క్షదతి రక్షతి జనాన్ క్షత్రః'** - ఎవరు జనాన్ని కాపాడే పని చేస్తారో లేదా **'క్షణ్యతే హింస్యతే నశ్యతే పదార్థోయే న స 'క్షతః' - ఘాతాదిః, తతస్త్రాయతే రక్షతీతి క్షత్రః'** = ఆక్రమణ, గాయాలు, హాని మొదలైన వాటి నుంచి ప్రజలను రక్షించేవాడు కాబట్టి అతడిని, **'క్షత్రియుడు'**అంటారు. బ్రాహ్మణ గ్రంథాలలో- **'క్షత్రం రాజన్యః'** (ఐత. 8.2; 3.4) **'క్షత్రస్య వా ఏతద్రూపం యద్ రాజన్యః'** (శత. 13.1.5.3) = క్షత్రియుడు అనేది **'క్షత్ర'** అనే దాని రూపమే. అంటే ప్రజా రక్షకుడు అని అర్థం.

(2) ఇక్కడ అపత్య (సంతానం) అనే అర్థంలో **'ఇయ'** అనేది ఆదేశమైతే క్షత్రియ మొదలైన పదాలు రూపొందటంలో మనువేమైన పుట్టుకను బట్టి వర్ణాలు చెప్పాడా? అనే అనుమానం కలుగుతుంది. ఈ అనుమాన నివారణకు చక్కని సమాధానం ఉంది. వంశం అనేది కేవలం జన్మతో మాత్రమే కాకుండా విద్యా జన్మతోనూ ముందుకు వెళ్తుంది. అష్టాధ్యాయి 2.1.19. ఈ **'సంఖ్యా వంశేన'** సూత్రంలో విద్యతోనే జన్మను లెక్కించారు. మనుస్మృతి 2.119-123 శ్లోకాలలో స్పష్టంగా విద్యను ఆధారం చేసుకునే జన్మ అని చెప్పాడు. ఇలా గుణ గ్రాహ్యత, కార్యకారణ భావం, విద్య - ఈ మూడిటినీ ఆధారం చేసుకునే అపత్యం మొదలైనవాటితో సంబంధం ఏర్పడుతుంది. సూర్యుడు, వరుణుడు మొదలైనవారికి భార్యాపిల్లలు లేకపోయినా, కార్యకారణాలు, గుణగ్రాహిత్వం మొదలైనవాటిని ఆధారం చేసుకుని, అదితి పుత్రుడు ఆదిత్యుడు, సూర్యుడి భార్య సూర్యా మొదలైనవి, వరుణాని, మైత్రావరుణుడు మొదలైన ప్రయోగాలు ఏర్పడ్డాయి.

(3) క్షత్రియుడి విస్తృత కర్తవ్యాలు 7.1 నుంచి 9.225 వరకు గల శ్లోకాలలో ఉన్నాయి.

గ. ‘వైశ్య’ నామకుల కర్మలను బట్టి వర్ణ సూచన

(1) “విశః మనుష్య నామ” (నిఘంటు. 2.3) దీని నుంచి భావార్థంలో ‘యత్’, దాని నుంచి స్వార్థంలో ‘అణ్’. లేదా “విశ్” ప్రాతిపదిక నుంచి అపత్యార్థంలో ‘యఞ్” ధాందస ప్రత్యయంతో ‘వైశ్య’ పదం రూపొందింది. యో యత్ర - తత్ర వ్యవహార విద్యాసు ప్రవిశతి సః ‘వైశ్యః’ ‘వ్యవహార విద్యాకుశలః జనో వా’ = ఎవడు రకరకాల వ్యావహారిక వ్యాపారాలలో ప్రవేశం కలిగి ఉంటాడో లేదా వివిధ వ్యవహార విద్యలలో కుశలుడై ఉంటాడో వాడు ‘వైశ్యుడు’ అవుతాడు. బ్రాహ్మణ గ్రంథాలలో-

“ఏతద్వై వైశ్యస్య సమృద్ధం యత్ పశవః” (తాండ్య. 18.4.6) “తస్మాదు బహు పశుర్వైశ్వదేవో హి జాగతో (వైశ్యః)” (తాండ్య. 6.1.10) = పశుపాలనం వల్ల వైశ్యులకు సమృద్ధి కలుగుతుంది. ఇది వైశ్యుల కర్తవ్యం.

2. వైశ్యుల కర్తవ్యాలను గురించి విస్తారంగా 9.326-334 (10.1-8) లలో చెప్పాడు.

ఘ. ‘శూద్ర’ నామకుల కర్మలను బట్టి వర్ణ సూచన

(1) ‘శుచ్ - శోకార్థక’ (భ్వాది) ధాతువు నుంచి ‘శుచే ర్దశ్చ’ (ఉణా. 2.19) సూత్రంతో ‘రక్’ ప్రత్యయం, ఉకారాన్ని దీర్ఘంగానూ, ‘చ’ కు ‘ద’ ఇచ్చి ‘శూద్ర’ పదం తయారవుతుంది. శూద్రః= శోచనీయః శోచ్యాం స్థితిమాపన్నో వా, సేవాయాం సాధురవిద్యాదిగుణసహితో మనుష్యో వా = ఏ కులం(వర్ణం) లో పుట్టినవాడైనా, తన చదువు లేమి, అజ్ఞానాల వల్ల పెద్దవర్ణాన్ని పొందలేకపోయినవాడు, తాను తక్కువ కులం (వర్ణం) వాణ్ని అనే భావం, దాన్ని పెంచుకునే చింతతో ఎప్పుడూ ఉండేవాడు, లేదా యజమాని ద్వారా పోషణ కోరుకునేవాడు, ఇలాంటి శ్రమజీవి లేదా సేవకుడు శూద్రుడు. బ్రాహ్మణాలలోనూ ఇదే విషయం చెప్పారు. “అసతో వా ఏష సంభూతో యత్ శూద్రః” (తై. 3.2.3.9) అసతః = అవిద్యాత్. చదువు లేమి, అజ్ఞానం వల్ల ఎవరిది నిమ్నవర్ణం అవుతుందో, చదువు లేమి వల్ల కేవలం శరీరశ్రమ, సేవ మొదలైనపనులే చేయగలుగుతాడో అతడు, ‘శూద్రు’డవుతాడు.

(2) శూద్రుడు ఉత్తమకర్మలు చేయటం వల్ల అగ్రవర్ణాన్ని పొందవచ్చు (9.35; 10.65 మొ॥).

(3) శూద్రుల కర్తవ్యాల వివరాలు 9.334-335లలో చెప్పాడు. వీటిలో శూద్రుల పట్ల మనువుకున్న గౌరవం, మరింత స్పష్టమవుతుంది - జన్మతో శూద్రులు కారనీ, వారు ద్వేషించదగిన వారు కారనీ కూడా తెలుస్తుంది.

8. ‘కర్మల వల్ల వర్ణ వ్యవస్థను సాధించే ఇతర ప్రమాణాలు’.

మనువు కర్మ ద్వారానే వర్ణవ్యవస్థను అంగీకరించాడు. దీనికి ఇతర ప్రమాణాలు కూడా ఉన్నాయి.

క. శూద్రులను వారు తక్కువవారుగా చూడరు. ‘శుచిః’ = పవిత్రులు, ‘ఉత్కృష్ట శుశ్రూషః’ మొదలైన విశేషణాలతో సంబోధించారు (9.335). అన్ని వర్ణాల వారి ఇళ్లల్లోనూ అన్ని రకాలైన సేవలూ చేసేవారు అపవిత్రులు, అంటరాని వారు, హీనులు కారు.

ఖ. చదువుకోకపోవటం వల్ల వారిని శూద్రులంటాడు మనువు. వారికి వేదాధ్యయనం లాంటి రెండో బ్రహ్మజన్మ ఉండదు. 2.126లో అజ్ఞానం వల్లనే ఇలాగన్నాడని తెలుస్తుంది - “యథా శూద్రస్తథైవ సః” బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులను ద్విజులని ఎందుకంటారంటే, వారికి బ్రహ్మజన్మరూపమైన రెండో జన్మ ఉంటుంది. ‘ద్విర్జాయతే ఇతి ద్విజః.’ శూద్రుణ్ని చదువు లేమి వల్ల ‘ఏక జాతిః’ అని అంటారు. ఆధారం చూడండి -

బ్రాహ్మణః క్షత్రియో వైశ్య స్త్రయో వర్ణాః ద్విజాతయః ।
చతుర్థ ఏకజాతిస్తు శూద్రో నాస్తి తు పంచమః ॥ 10.4 ॥

గ. కర్మలు ఆధారంగా మనుషులను రెండు వర్గాల వారు అన్నాడు మనువు- ఎవరు శ్రేష్ఠమైన, ధర్మానికి అనుకూలమైన ఆర్యపరంపరలలో దీక్ష స్వీకరిస్తారో, ఆ నాలుగు వర్ణాల వారూ ఆర్యులు. వారిలో అదీక్షితులు- దీక్ష తీసుకొననివారు అందరూ దస్యులు (10.45).

ఘ. కర్మలు ఆధారంగానే వ్యక్తులను శ్రేష్ఠులు = ఆర్యులు,అశ్రేష్ఠులు = అనార్యులు అని మనువు చెప్పాడు. 10.57-58 లలో కర్మలు ఆధారంగానే వారిని గుర్తించాలని అన్నాడు. ఇవన్నీ కూడా మనువు వర్ణవ్యవస్థ గొప్పతనాన్ని రుజువు చేస్తున్నాయి.

9. **కర్మలచేత వర్ణ వ్యవస్థ :** 1.31లో కూడా మనువు తన 'కర్మల చేత వర్ణ వ్యవస్థ' యొక్క గొప్పతనాన్ని సూచించాడు. 1.16, 23,26-30 శ్లోకాలలో ఒక్కసారిగా అనేకులైన ప్రజలు పుట్టారు - బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. అందరూ సమానమైన మానవుల రూపాలలోనే పుట్టారని చెప్పాడు. ఆ అందరి నుంచీ, మానవ సమాజవృద్ధి కోసం ఒక వ్యవస్థరూపంలో నాలుగు వర్ణాల ముఖం, బాహువులు,తొడలు,పాదాలు- వీటి సమానతతో (గుణ కర్మలను అనుసరించి) నిర్మాణం జరిగింది. 1.31లో ఈ విషయమంతా ఆలంకారిక రూపంలో ఉంది. పైన చెప్పిన అవయవాల స్థానం, పనులూ ఏవేవి మన శరీరంలో ఉన్నాయో, అదే విధంగానే క్రమంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల స్థానం ఏర్పడింది. ఈ విధంగా యోగ్యతలను బట్టి వారిని నాలుగు వర్ణాలుగా విభజించి, వారి పనులను కూడా అర్హతలను అనుసరించే ఏర్పరిచాడు. ఆ వర్ణన క్రమం (ఎందరో ప్రజల ఉత్పత్తి, వారి వర్ణ వ్యవస్థ), ఆలంకారిక వివరణ చేయటం, పనులను బట్టే వర్ణ వ్యవస్థను సూచిస్తున్నాయి. ఈ ఆధారాలతో **'కర్మల చేత వర్ణ వ్యవస్థ' మనువు మౌలిక శ్రేష్ఠత అని రూఢి అవుతూంది. అందుచేత దీనికి వ్యతిరేకమైన 'జన్మల చేత వర్ణ వ్యవస్థ' అనే విషయం అంతర్వ్యతిరేకత అనే ఆధారం వల్ల ప్రక్షిప్తం అవుతుంది.**

10. **'బ్రాహ్మణ గ్రంథాలలో కర్మల చేతనే వర్ణ వ్యవస్థ అనే స్పష్టమైన వివరణ ఉంది'.** అవి -

అ. **"సః (క్షత్రియః) హ దీక్షమాణ ఏవ బ్రాహ్మణతామభ్యుపైతి॥"** (ఐ. 7.23)

= క్షత్రియుడు దీక్షితుడై బ్రాహ్మణత్వాన్ని పొందుతాడు.

ఆ. **"తస్మాదపి (దీక్షితమ్) రాజన్యం వా వైశ్యం వా బ్రాహ్మణ ఇత్యేవ బ్రూయాత్,**
బ్రాహ్మణో హి జాయతే యో యజ్ఞాజ్జాయతే॥" (శత. 3.2.1.40)

క్షత్రియుడు గానీ లేక వైశ్యుడు గానీ యజ్ఞాలలో (దీక్ష తీసుకుని ఉపనయన సంస్కారంతో) బ్రాహ్మణుడుగానే పిలవబడతాడు. అంటే బ్రహ్మచర్యాశ్రమంలో వేదాధ్యయనం చేస్తున్న సమయంలో యజ్ఞ దీక్షితులైనవారందరూ బ్రాహ్మణ కర్మలు చేసేవారే అవుతారు. తర్వాత విద్యను బట్టి, కర్మలను బట్టి క్షత్రియులూ, వైశ్యులూ అవుతారు.

11. **'వర్ణ పరివర్తనకు ఉదాహరణ'-** ఐతరేయ బ్రాహ్మణం 2.19లో కవష-ఐలూషుడనే వాణ్ని గురించిన ఒక సంఘటన ఉంది. అది వర్ణపరివర్తన అంటే వర్ణం మారిన విషయానికి చక్కని ప్రమాణం. కింది జాతిలో పుట్టిన వ్యక్తి ఋషుల సద్గుణాలు కలిగి ఉండటం చేత ఋషులలో లెక్కించబడి పెద్ద వర్ణం వాడని చెప్పబడ్డాడు-

క. **"ఋషయో వై సరస్వత్యాం సత్రమాసత, తే కవషమైలూషం సోమాదనయన్, దాస్యాః పుత్రః కితవోఽబ్రాహ్మణః కథం నో మధ్యే దీక్షిష్టేతి ।.... స బహిర్ధన్వో దృళ్హ పిపాసయా విత్త ఏతదపోనప్త్రీయమపశ్యత్ - ప్రదేవత్రా బ్రహ్మణే గాతురేత ఇతి॥"**

అంటే - 'ఋషులు' సరస్వతీ నదీ తీరంలో యజ్ఞానికి ఏర్పాటు చేశారు. యజ్ఞంలో పాల్గొనటానికి వచ్చిన కవష ఐలూషుణ్ని, ఋషులు సోమరసపానం చేయనీయలేదు. ఒక దాసీపుత్రుడు, గొప్పపనులు చేయనివాడు, చదువు లేనివాడు

మన మధ్య ఎలా యజ్ఞదీక్షితుడయ్యాడు? అనేది వారందరి ఆలోచన (యజ్ఞం నుంచి బయటికి పంపించబడ్డ తర్వాత). కవష ఐలూషుడు పిపాస = వ్యాకులతతో బాధపడుతూ అడవిలోకి వెళ్లిపోయాడు. అక్కడ అతడు **"అపోనప్త్రం'** దేవతలకు సంబంధించిన సూక్తాన్ని **'అర్థదర్శనం'** చేసుకున్నాడు. **'వేదార్థాలను చూసినవాడు'** కావడం చేత, ఋషులు అతన్ని తమ మధ్యకు పిలిచి యజ్ఞదీక్షితుణ్ని చేశారు.

ఇది ఋగ్వేదం 10.30వ సూక్తం వేదంలో ఈ సూక్తం ఇతని పేరిటనే నేటికీ ఉంది. ఈ ఋషి చూసిన ఇతర సూక్తాలు 10.31-34 కూడా ఉన్నాయి. దీని వల్ల సూక్తాలలో పేర్లున్న ఋషులు, ఆయా సూక్తాల అర్థ ద్రష్టలు అనీ, ఏ కులంలో పుట్టిన వాడైనా చదువుకుని ఋషి కావచ్చుననీ తెలుస్తూంది.

ఖ. ఛాందోగ్య ఉపనిషత్తులో ఏదో తెలియని కులంలో పుట్టినా, గుణాలు, కర్మలను బట్టి బ్రాహ్మణుడైన జాబాలుని కథ ఉంది. ఇలాగే చండాల కులంలో పుట్టిన మతంగ ఋషి బ్రాహ్మణు డయ్యాడు. వాల్మీకి రామాయణంలో క్షత్రియ రాజైన విశ్వామిత్రుడు బ్రాహ్మణుడైన కథ ఉంది. ఈ ప్రకారంగా గుణాలు, కర్మలను బట్టి వర్ణవ్యవస్థ, వర్ణాలు మారడం కూడా ఉన్నాయని తెలుస్తుంది.

12. 'వర్ణాలు నాలుగు'- మనువు నాలుగు వర్ణాల గొప్పతనాన్ని చాలా స్పష్టంగానే ప్రకటించాడు. మనుస్మృతిలో అంతటా వర్ణనాత్మకంగా నాలుగు వర్ణాల వివరణే ఉంది. ఈ నాలుగు వర్ణాలలో దీక్షితులు కానివాళ్లందరూ దస్యులు అన్నాడు (10.49). అంతే కానీ వర్ణ సంకరమైన వాటికి వేరే పేర్లేమీ చెప్పలేదు. దీన్ని రుజువు చేసేందుకు మనుస్మృతిలోని ఈ కింది శ్లోకాలు చూడండి- 1.31, 87-91; 3.20; 5.57; 7.68; 10.45; 65,131;12.97 మొదలైనవి.

నాలుగు వర్ణాలకు శాస్త్రీయ ప్రమాణాలు-

మిగిలిన శాస్త్రాలలోనూ ఈ నాలుగు వర్ణాలే చెప్పారు. ఈ నాలుగు వర్ణాలకూ చెందనివారు భిన్నంగా నిషాదులు, అసురులు, రాక్షసులు మొదలైన వర్గాలకు చెందిన వారుగా పిలువబడ్డారు.

క. **"ఊర్జాద ఉత యజ్ఞియాసః పఞ్చజనా మమ హోత్రం జుషధ్వమ్ ।"** ఋక్ 10.53.4 ॥

"పఞ్చజనాః- చత్వారో వర్ణాః నిషాదః పఞ్చమ ఇతి ఔపమన్యవః ।" నిరు. 3.2.7 ॥

నాలుగు వర్ణాలు = బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. ఐదవ వర్ణంవారు నిషాద జనులు. వీరు వేదంలో చెప్పిన వారు, మొత్తం ఐదురకాల మనుషులు.

ఖ. **"చత్వారో వర్ణాః । బ్రాహ్మణో రాజన్యో వైశ్యః శూద్రః "** శ.బ్రా. 5.5.4.9 ॥

"చత్వారో వై పురుషా బ్రాహ్మణో రాజన్యో వైశ్యః ॥" మైత్రా.సం.4.4.6 ॥

13. 'కర్మల వల్ల నాలుగు వర్ణాలకు ఆధారం వేదాలే' -

యజుర్వేదంలోని పురుషసూక్తంలో నాలుగు వర్ణాల జనమూ వర్ణించబడ్డారు. ఆ మంత్రాలతో మనువు భావం మరింత స్పష్టం కావడంతో పాటుగా, బ్రహ్మదేవుడి నాలుగు అవయవాల నుంచి వారు పుట్టారన్న అపోహకూడా తొలగిపోతుంది. వేదాలలో కర్మలు, గుణాల ఆధారంగా ఉన్న ఆలంకారికవర్ణనలాంటిదే మనుస్మృతిలోనూ ఉంది. ఆ మంత్రాలు ఈ కిందివి -

క. **యత్పురుషం వ్యదధుః కతిధా వ్యకల్పయన్ ।**
ముఖం కిమస్యాసీత్ కిం బాహూ కిమూరూ పాదా ఉచ్యేతే ॥ యజుః.31.10 ॥

యత్పురుషం= సర్వశక్తిమంతుడైన ఈశ్వరుణ్నే పురుషుడు అంటారు. **కతిధావ్యకల్పయన్=** అతనికి రకరకాల సామర్థ్యాలున్నాయని చెప్పారు. ఎందుకంటే అతడికి చిత్రవిచిత్రాలైన సమర్థతలు ఎన్నో రకాలుగా ఉన్నాయి. వాటిని ఎన్నో కల్పనలతో వర్ణిస్తారు. **ముఖం కిమస్యా సీత్ =** ఈ పురుషుడి ముఖం అంటే ముఖ్యమైన గుణాలతో ఈ ప్రపంచంలో ఏమి పుట్టింది? **కిం బాహూ=** బలవీర్యాలు, శౌర్యం, యుద్ధం మొదలైన విద్యా గుణాలతో ఎవరు పుట్టారు? **కిమూరూ=** వ్యాపారం మొదలైన మధ్యమ గుణాలతో ఎవరు పుట్టారు? ఈ నాలుగు ప్రశ్నల జవాబులు ఇవి-

ఖ. **బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః ।**
ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత ॥ యజుః. 31.11 ॥

బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ = ఈ పురుషుడి అజ్ఞపై విద్య, నిజం చెప్పడం మొదలైన ఉత్తమ గుణాలు, మంచి కర్మలతో బ్రాహ్మణవర్గం పుడుతుంది. వారు శ్రేష్ఠ కర్మలు, గుణాలతో ఉండటం చేత మనుషులలో ఉత్తములనబడతారు. **బాహూ రాజన్యః కృతః=** బలపరాక్రమాలు మొదలైన మనువు చెప్పిన క్షత్రియ వర్ణాన్ని ఈశ్వరుడు సృష్టించాడు, **ఊరూ తదస్య =** వ్యవసాయం, వ్యాపారం, అన్ని ప్రాంతాల భాషలు తెలుసుకోవడం, పశుపాలనం మొదలైన గుణాలతో వైశ్య వర్ణం ఉంటుంది. **పద్భ్యాం శూద్రో అజాయత =** పాదాలు అన్నింటి కంటే కింది అవయవమైన విధంగా, మూర్ఖత్వం మొదలైన నీచగుణాలతో శూద్రవర్ణులు ఉంటారు.' (ఋ.భా.భూ.పు. 125-126)

ఈ ఆలంకారిక వర్ణనను బలపరచేందుకు, వేదాలకు వ్యాఖ్యానాలైన బ్రాహ్మణాలు ఆధారంగా లభిస్తున్నాయి.

గ. **"బ్రాహ్మణో మనుష్యాణాం ముఖమ్ ।"** తాం. 1.6.1 ॥

అంటే- 'బ్రాహ్మణుడు మనిషి ముఖం అవుతాడు' - అంటే ముఖం చేసే పనులే బ్రాహ్మణుడికీ ఉంటాయి-అని.

ఘ. **"అస్య సర్వస్య బ్రాహ్మణో ముఖమ్ ।"** శ. 3.9.1.14 ॥

అంటే - 'ఈ మొత్తం మానవ సమూహానికి ముఖరూపంగా బ్రాహ్మణుడు ఉంటాడు.'

ఆ. జన్మతో వర్ణ వ్యవస్థను నిర్ణయించే స్థలం-అనుమానాల నిరాకరణ

మనుస్మృతిలో జన్మతో వర్ణ వ్యవస్థను వెదికేవారు ముఖ్యంగా దానికి ఆధారాలను ఈ కింది చోట్ల చూస్తారు-

(1) 1.2లో **'అంతరప్రభవాణామ్'**, 1.137 (2.18) లో **'సాంతరాలానామ్'** పదాలలో వర్ణ సంకర విషయం ఉంది. ఇలా మనువు వర్ణ సంకరాల ధర్మాలను కూడా చెప్పి, జన్మతో వర్ణాన్నీ, జాతులనూ అంగీకరిస్తాడు. పదో అధ్యాయంలో పుట్టుకతోనే ఒప్పుకునే వర్ణ సంకరాలు, ఇంకా వేర్వేరు జాతుల వర్ణనలు ఉన్నాయి.

(2) 1.98-100 శ్లోకాలలో పుట్టుక ఆధారంగా బ్రాహ్మణుల ప్రశంస ఉంది.

(3) 2.11-14 (2.36-39) ఉపనయన విషయాల శ్లోకాలలో శూద్రులను పేర్కొనలేదు. దీని అర్థం మనువు పుట్టుకతోనే శూద్రులు అని అంగీకరించాడని. పుట్టుకతో ఇతర వర్ణాల పేర్లను చెప్పటం కూడా మనువుకున్న పుట్టుకతో వచ్చే గొప్పతనాన్ని అంగీకరించే ప్రవృత్తిని తెలియజేస్తుంది.

వీటికి సమాధానాలు వరుసగా ఇచ్చాను-

1. ఈ శ్లోకాలలో టీకాకారులు **'అంతర ప్రభవాణామ్'** పదానికి -**"సంకీర్ణ జాతులు లేదా వర్ణ సంకరులు"** అని అర్థాన్ని పెడతోవ పట్టించారు. ఈ పదానికి అసలు అర్థం, 'ఆశ్రమాల' అని ఉండాలి. దీనికి బలం చేకూర్చేందుకు కిందివి చూడండి -

క. 2.18 (ఈ ముద్రణ ప్రకారం) (1.137) లో **'అంతర ప్రభవణాం'** పదానికి పద్యాయవాచకంగా **'సాంతరాలానమ్'** పదాన్ని ప్రయోగించారు. ఇక్కడ ఎలా వర్ణాలతో పాటు **'అంతర ప్రభవణామ్'** పదం వాడారో, పైన చెప్పిన శ్లోకంలో అలా **'సాంతరాలానామ్'** పద ప్రయోగం ఉంది. ఆ శ్లోకంలో **'సాంతరాలానామ్'** అంటే **'ఆశ్రమమ్'** అందువల్ల ఇక్కడ కూడా దాని పర్వాయవాచకంగా **'అంతర ప్రభావాణామ్'** పదానికి అర్థం **'ఆశ్రమాలు'** అనేదే. 2.18 (1.137) శ్లోకంలో కూడా టీకాకారులు **'సాంతరాలానామ్'** పదానికి **'సంకీర్ణజాతి'** లేదా **'వర్ణ సంకరం'**గా రాసినప్పటికీ, అది మనువు మూలానికి వ్యతిరేకం. ఈ శ్లోకంలో ధర్మానికి మూలాధారాలైన నాలుగింటిలో **'సదాచారమ్'** (2.6,12 లేదా 1.125, 131) లక్షణం చెప్పి, **"బ్రహ్మావర్త దేశంలోని ప్రజలు ఆచరించే ఆశ్రమాల పరంపరాగతమైన విషయాలు సదాచారం అనబడతాయి"** అని వివరించారు. ఈ శ్లోకంలోని **'సాంతరాల'** పదం **'వర్ణ సంకరమ్'** లేదా **'సంకీర్ణజాతి'** అనే అర్థాలు ఎందుకు సరిపోవు అంటే, వర్ణసంకరుల ఆచరణ **'సదాచారమ్'** అనేదానికి సరిపోదు. అంతే కాకుండా, ఆ ఆచరణ ఆ శ్లోకాలలోని **'సదాచారం'**గా అంగీకృతం కాదు.

దీనికి ప్రత్యక్ష ఆధారం, వర్ణ సంకరుల ధర్మాల వర్ణన వచ్చినప్పుడు, ఎన్నో చోట్ల వారి ఆచరణలు, నిందనీయమూ, విడిచిపెట్టదగినవి అని చెప్పబడింది. ఆ సందర్భంలో సంకీర్ణ జాతులకు వాడిన కొన్ని విశేషణాలు చూడండి- **"మాతృదోషవిగర్హితాన్"** తల్లి తప్పు వల్ల, నిందనీయమైన పుట్టుక గలవారు (10.6), **"క్రూరాచారా వహారవాన్"** = క్రూరమైన ఆచార వ్యవహారాలు కలవారు (10.9), **"అధమోన్నృణాం"** = మనుష్యులలో నీచులు (10.12), **"అవ్రతాంస్తు యాన్"** = వ్రతహీనులు (10.20), **"పాపాత్మా భూర్జకంటకః"** = పాపాత్ములైన భూర్జ కంటకులు (10.21), **"తతోఽపృథిక దూషితాన్"** వారికన్నా దూషిత ఆచరణ చేసేవారు. (10.29), **"జనయంతివిగర్హితాన్"** = నిందించదగిన సంతానాన్ని పుట్టిస్తారు (10.29). ఈ విధంగా సంకీర్ణ జాతులవారిని **'అపసద'** (నీచ), **'అవధ్వంసజ'** (పతితులకు పుట్టిన) మొదలైన పదాలతో పిలవటం కూడా. రచయిత వీరిని నీచ ఆచరణ చేసేవారని భావిస్తున్నట్లు తెలుస్తుంది. అంతే కాకుండా ఈ సందర్భంలో వర్ణ సంకరులు చేసే జంతు హింస, మొదలైన ధర్మాలు, మనువు అభిప్రాయం ప్రకారం ధర్మాలు కావు, దుష్కర్మలే. మరి అలాంటి వాటి ఆచరణను, **'సదాచారమ్'** అని ఎలా అనగలుగుతాము? వాటిని 'ధర్మాలు' అనీ చెప్పలేము. దీనివల్ల పై శ్లోకంలోని **'సాంతరాల'** పదానికి **'వర్ణసంకరమ్'** అని అర్థం చెప్పటం సమంజసమూ కాదు, మనువుకు వ్యతిరేకం కూడా. అందుచేత అక్కడ దాని అర్థం **'ఆశ్రమమ్'** అని చెప్పాలి. దానికి పర్యాయ వాచకంగా వాడటం చేత ఈ శ్లోకంలోని **'అంతర ప్రభవం'** పదానికి **'ఆశ్రమమ్'** అనే అర్థమే తగినది.

ఖ. మనుస్మృతిలో వర్ణాల ధర్మాలతో పాటుగా ఆశ్రమధర్మాలు కూడా వివరంగానూ, విశిష్టంగానూ చెప్పబడ్డాయి కానీ వర్ణ సంకరాల ధర్మాలు కాదు. గమనించవలసిన విషయం ఏమిటంటే, ఈ శ్లోకంలో ఏ వరుసలో వర్ణాలు, ఆశ్రమాల ధర్మాలు చెప్పాలనుకున్నారో, అదే క్రమంలోనే మనుస్మృతిలో ఆశ్రమాల, వర్ణాల క్రమం ఒకదాని వెంట ఒకటి చెప్పబడ్డాయి. అంటే – రెండో అధ్యాయంలో బ్రహ్మచర్య ఆశ్రమం, ఆరులో వానప్రస్థాశ్రమం, సన్న్యాస ఆశ్రమాల వర్ణనలు ఉన్నాయి. వాటితో పాటుగా ఆరో అధ్యాయం వరకు బ్రాహ్మణుల కర్తవ్యాలు కూడా చెప్పాడు. తర్వాత క్షత్రియుల మిగిలిన కర్తవ్యాలు 7.1 నుంచి 9.325 వరకు ఉన్నాయి. వైశ్యుల కర్తవ్యాలు 9.326 నుంచి 333 (ఈ సంస్కరణంలో 10.1-6) వరకు, శూద్రుల పనులు 9.334 నుంచి 335లలో ఉన్నాయి. **'అంతర ప్రభవాణామ్'** పదానికి **'ఆశ్రమమ్'** అని కాకుండా **'వర్ణ సంకరమ్'** అనే అర్థం చెబితే, ప్రారంభంలో ఆశ్రమధర్మాలు అడిగే పనే లేనప్పుడు, ఇంత విస్తృతంగా, ఈ ఆశ్రమ ధర్మాల వ్యవస్థ ఎందుకు జరిగింది? అనే ప్రశ్న వస్తుంది. వర్ణాలు, ఆశ్రమాల ధర్మాలతో పాటుగా ప్రముఖంగా

చెప్పే మనువు శైలి వల్ల కూడా. ఈ శ్లోకంలో వర్ణాలు, ఆశ్రమాల విషయంలోనే ప్రశ్నలు ఉన్నాయి.కానీ, వర్ణ సంకరాల విషయంలో లేవని తెలిసిపోతూంది.

గ. మనుస్మృతిలో అంతటా వర్ణాలతో పాటు ఆశ్రమాలనూ చెప్పే లక్షణం కనబడుతూంది కానీ, వర్ణసంకరాలది కాదు. 12.97లో వర్ణాలతో పాటు ఆశ్రమాలనూ చెప్పాడు - **'చాతుర్వర్ణ్యం త్రయో లోకాః చత్వారశ్చాశ్రమాః పృథక్."** ఇదే విధంగా 7.35లోనూ వర్ణాల, ఆశ్రమాల ధర్మాలకు రాజును రక్షకుడుగా పేర్కొన్నాడు. అంతే కానీ అక్కడ వర్ణసంకరాల ఊసే లేదు.

స్వే స్వే ధర్మే నివిష్టానాం సర్వేషామనుపూర్వశః ।
వర్ణానామాశ్రమాణాం చ రాజా సృష్టోఽభిరక్షితా ॥

ఈ పద్ధతి ప్రకారం కూడా ఇక్కడ వర్ణాలతో పాటు ఉపయోగించిన **'అంతర ప్రభవమ్'** పదానికి అర్థం **'ఆశ్రమమ్'** అనే రుజువవుతూంది.

ఘ. మనుస్మృతిలోని 10వ అధ్యాయంలో తప్ప ఇంకెక్కడా విడిగా వర్ణసంకరాల చర్చ లేనే లేదు. నామకరణ సంస్కారం (2.26-35 లేదా.2.1-10), వివాహ విధులు (3.20) మొదలైన విషయాలలో శూద్రులకు విధానాలు చెప్పినప్పుడు కూడా వర్ణసంకరుల ప్రసక్తి లేదు. పదో అధ్యాయంలోనే వీరిని గురించి చెప్పినా, అది ప్రక్షిప్తమే, (వివరణల కోసం పదో అధ్యాయంలోని శ్లోకాల సమీక్ష చూడండి.). పైగా అది విషయానికి వ్యతిరేకంగానూ ఉంది. మనువు యొక్క విషయ సంకేత శైలి వల్లనూ పదో అధ్యాయంలో వర్ణ సంకరుల విషయం ప్రక్షిప్తమని తెలుస్తుంది. వర్ణాల ధర్మాలను చెప్పటం ప్రారంభించి మనువు - **"వర్ణధర్మాన్నిబోధత"** (1.144 మిగిలిన ముద్రణలలో 2.25) అన్నాడు. అదేవిధంగా ఈ విషయం ముగింపును చెబుతూ - **"ఏష ధర్మవిధిః కృత్స్నశ్చాతుర్వర్ణస్య కీర్తితః"** 10.142 (మిగిలినవాటిలో 10.131).

రెండు చోట్లా వర్ణాల ధర్మాలను చెప్పాడే కానీ, ఆపద్ధర్మం చెప్పలేదు. ఇక్కడ మధ్యలో వర్ణసంకరులను గురించి చెప్పవలసిన అవసరమూ, అవకాశమూ లేదు. అయినా ఎవరో బలవంతంగా మధ్యలో చొప్పించారు.

ఇదే విధంగా 10.15 (మిగిలిన వాటిలో 10.4) లో మనువు ఆర్యుల సమాజంలో నాలుగు వర్ణాలే ఉన్నాయి, ఐదవది లేనే లేదని స్పష్టంగా ప్రకటించాడు. వీటికి భిన్నమైన వారందరూ, ఆర్యభాషలు మాట్లాడినా, మ్లేచ్ఛభాషలు మాట్లాడినా సరే, దస్యులు అన్నాడు (10.56 (10.45). ఇక్కడ వర్ణసంకరుల ప్రసక్తే లేదు. ఈ కారణం చేత వర్ణసంకరులను గురించి ఉన్నవి (10.5.73) మనుస్మృతి సమ్మతమైనవి లేదా మౌలికాలు కావు. అలాగైనప్పుడు, ఈ గ్రంథంలోని ఏదో పదం నుంచి **'వర్ణ సంకరం'** అనే అర్థాన్ని గ్రహించడం వల్ల ఏ ఉపయోగం లేదు. వ్యతిరేకమూ కూడా! అందువల్ల ఇక్కడ కూడా **'వర్ణసంకర'** అనే అర్థం కాక **'ఆశ్రమమ్'** అనే అర్థమే మనుస్మృతి సమ్మతం.

ఙ. మనువు సంక్షిప్తంగా 1.85-91 శ్లోకాలలో ఒక్కొక్క వర్ణం పేరూ చెబుతూ, వాటి కర్మలనూ పేర్కొన్నాడు. దీని వల్ల సమాజంలో నాలుగు వర్ణాలే తప్ప వేరేది లేదని మనువు స్పష్టంగా చెప్పాడని తెలుస్తూంది. అంతే కాకుండా, ఈ నాలుగు వర్ణాల ధర్మాలు చెప్పటమే మనువు అభీష్టమని, వేరే వర్ణసంకరుల గురించి కాదనీ స్పష్టమవుతూంది. అందుచేత ఇక్కడ కూడా **'అంతర ప్రభవ'** పదానికి అర్థం వర్ణసంకరం అనటం మనువు మౌలికతకు వ్యతిరేకం. 'ఆశ్రమం' అనే అర్థమే ప్రకరణానికి ఉచితమైనది.

చ. భాగవతపురాణం వల్ల ఇది చారిత్రిక సత్యమని, మరింత స్పష్టంగా రుజువవుతుంది. అక్కడ మనువును గురించి చక్కని పరిచయముంది. మనువు బ్రహ్మకు పుత్రుడు, తొలిరాజు. అతడికి సామ్రాజ్యం ఉండేది. అతని రాజధాని

'బ్రహ్మావర్తం' అనే దేశంలో ఉండేది, వగైరా వగైరా విషయాలు. ఈ స్వాయంభువ మనువే ఋషులకు వర్ణాశ్రమాల ధర్మాలను గురించి ఉపదేశించాడే కానీ, వర్ణసంకరుల పనులను చెప్ప లేదనీ ఉంది. దానికి గొప్ప ప్రమాణం ఇదే -

ప్రజాపతిసుతః సమ్రాట్ మనుః విఖ్యాతమఙ్గలః ।
బ్రహ్మావర్తం యోఽధివసన్ శాస్తి సప్తార్ణవాం మహీమ్ ।

యః పృష్టో మునిభిః ప్రాహ ధర్మాన్ నానావిధాన్ శుభాన్ ।
నృణాం వర్ణాశ్రమాణాం చ సర్వభూతహితః సదా ।
ఏతద్ ఆదిరాజస్య మనోశ్చరితమద్భుతమ్ ॥ 3.22,25, 38, 39

అంటే - 'ప్రజాపతి బ్రహ్మకు పుత్రుడు విఖ్యాతుడు, కీర్తి పొందినవాడు అయిన మను సమ్రాట్ (చక్రవర్తి). బ్రహ్మావర్త దేశాన్ని రాజధానిగా చేసుకుని, ఏడు ద్వీపాలున్న ఈ భూమిని పాలించేవాడు. ఆ స్వాయంభువ మనువే మునులు అడగటం చేత, మానవుల వర్ణాలు, ఆశ్రమాలను గురించి ఉపదేశించాడు. ఇతడు అందరి ప్రజల హితాన్ని కోరేవాడు. ఇది తొలి రాజైన మనువు అద్భుత చరిత్ర.

స్వాయంభువ మనువు రాజు కావడం, ధర్మాలు ప్రవచనం చేయటం - వీటి వివరణ కొన్ని ఇతర పురాణాలలోనూ ఉంది. బ్రహ్మాండపురాణాంలోనూ ఉంది. బ్రహ్మాండపురాణం 2.13.105; మత్స్యపురాణం 3.32,45; వాయుపురాణం 3.2.35; 3.23.47 మొదలైనవి.

ఛ. వర్ణ సంకరుల విషయం ప్రక్షిప్తమైతే, దాన్ననుసరించే ప్రక్షిప్తకారులు అంతర ప్రభవం, సాంతరాలం పదాలకు అర్థాలను మార్చి **'వర్ణ సంకరమ్'** అనే అర్థాన్ని ప్రాచుర్యంలోనికి తెచ్చారు. అంతే కాదు, తమ అభిప్రాయం ప్రకారం, ఆ జనం పాఠభేదాలు చేయటానికీ ప్రయత్నించారు. మూడు- నాలుగు వ్రాతప్రతుల్లో **'అంతర ప్రభావాణామ్'** పదం స్థానంలో **'సంకర ప్రభవాణామ్'** అనే పాఠభేదమూ కనిపిస్తున్నది. ఈ పాఠభేదం వర్ణసంకర సంబంధితమైన ప్రక్షిప్త శ్లోకాలను మౌలికమని రుజువుచేయటానికి చేసిన ఒక విఫల ప్రయత్నమే. ఈ పాఠభేదం ప్రాచుర్యంలోకి రాలేదు కానీ, దీన్ని అనుసరించిన అర్థ భ్రాంతి (అపోహ) మాత్రం ప్రచారంలోకి వచ్చింది.

2. 1.98-100 శ్లోకాలు; 1.92-107 వరకు ఉన్న శ్లోకాల మధ్య వస్తాయి. పూర్వాపర పరంగా వాటితో సంబంధం కలవిగానూ ఉన్నాయి. కానీ ఈ శ్లోకాలన్నీ పూర్వాపరంగా పరిశీలిస్తే అసంబద్ధాలు, సూచించిన సృష్టి ఉత్పత్తి విషయానికి బయటివి. వీటిలో మనుస్మృతి శాస్త్రం అని ఉంది. శైలినిబట్టి ఈ ప్రయోగం, ఈ శ్లోకాలు తరువాతివేనని తెలుస్తూంది.

3. ఉపనయనంలో శూద్రుల ప్రసక్తి ఎందుకు లేదు?

క. 2.36-38 (ఈ సంస్కరణంలో 2.11-13) శ్లోకాలలో మనువు ఉపనయనసంస్కార విధానం గురించి చెబుతూ, శూద్రులను పేర్కొనలేదు. నిజంగా మనువు కర్మల వల్లనే వర్ణ వ్యవస్థను అంగీకరించి ఉంటే, శూద్రులను ఎందుకు చెప్పలేదన్న ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానం -

అ. ఈ ప్రశ్నలోనే దీని సమాధానం ఉంది. ఉపనయన విషయంలో శూద్రులను పేర్కొనకపోవటం చేత, మనువు ఉపనయనం, వేదాభ్యాస దీక్షకు పూర్వం జన్మతో ఎవరినీ ఫలానా వర్ణస్థుడుగా పరిగణించ లేదని సూచించాడని అర్థమవుతుంది. ఇది ద్విజ దీక్షా సంస్కారం. ద్విజులు మూడు రకాలు. ఏ వర్ణంలో పుట్టిన బాలుడైనా, దీక్ష తీసుకోవాలనుకుంటే, ఈ మూడు వర్ణాలలో దేని దీక్షనైనా తీసుకోవచ్చు. విద్య, దీక్షల తర్వాత మళ్లీ ఆచార్యుడు చివరగా వారి వారి వర్ణాలేమిటో నిర్ణయిస్తాడు (2.121 (146), 123 (148).

ఆ. ఎవడు ఈ మూడు వర్ణాలనూ స్వీకరించలేడో, వేదారంభం, ఉపనయన పూర్వకమైన బ్రహ్మజన్మ = విద్యను స్వీకరించలేకపోతాడో, వాడు శూద్రుడుగా ఉండిపోతాడు. ఉపనయనానికి ముందు అంటే, ద్విజన్మకు ముందు అన్ని వర్ణాల బాలురూ శూద్రులే అవుతారు - **"జన్మనా జాయతే శూద్రః, సంస్కారాత్ ద్విజ ఉచ్యతే ।"** ఇలా ఎవరైనా బాలుడు ఏ వర్ణంలో నైనా దీక్ష తీసుకోవచ్చు. మనువు చాలా స్పష్టంగా - **'చతుర్థః ఏకజాతిస్తు శూద్రః'**॥ (10.4) అని చెప్పాడు.

ఈ విధంగా ఉపనయనం మొదలైన వాటికి ముందు శూద్రుడిది ఏ వర్ణమో నిర్ధారించబడక పోవటం వల్ల దాన్ని పేర్కొనే అవసరమే లేదు. ద్విజుడు **'పతితుడో', 'శూద్రుడో'** అధ్యయనం తర్వాతే తెలుస్తుంది. ద్విజులకు నిర్ధారించిన అధ్యయనం లేనివారు పనులలో అసమర్థత కలవారే శూద్రులవుతారు (2.14-15 (39.40).

ఇ. మనువు పుట్టుకతో వర్ణ వ్యవస్థను అంగీకరించలేదు - అనే దానికి బలం చేకూర్చే మరొక విషయం, ఉపనయనాన్ని శూద్రులకు మనువు నిషేధించలేదు అనేది. పుట్టుకతోనే శూద్రు డనే వర్ణనిర్ధారణను అంగీకరించి ఉంటే, ఈ ఉపనయనాన్ని విడిగా చెప్పి నిషేధించి ఉండేవాడు.

ఖ. 'బ్రాహ్మణస్య' మొదలైన పదాలకు మను సమ్మతమైన అర్థాలు

అ. వ్యాప్తిలో ఉన్న టీకలలో 2.11-13 శ్లోకాలలో 'బ్రాహ్మణస్య' మొదలైన పదాలలోని బ్రాహ్మణ బాలకుని, **'రాజ్ఞః'** లేదా **'క్షత్రియస్య'** = క్షత్రియ బాలకుని, **"వైశ్యస్య', 'విశః'** = వైశ్య బాలకుని - అనే అర్థాలున్నాయి. ఇవి శ్లోకంలోని పదప్రయోగాలకూ, మనువు అభిప్రాయానికీ వ్యతిరేకం. శ్లోకంలోని పదాలలో బాలుడు అనే అర్థ మిచ్చే పదాలేవీ లేవు. అందువల్ల 'బ్రాహ్మణ బాలకుడు, మొదలైన అర్థాలు వచ్చే అవకాశం లేదు. ఇదే విధంగా మనువు కర్మణా వర్ణ వ్యవస్థనూ కర్మల వల్ల వర్ణాలు మారుతాయనీ అంగీకరించాడు. (చూడండి-10-65; 1.87-91; 107 శ్లోకాలు. వాటి మీది సమీక్ష). ఈ అర్థాలతో జన్మను బట్టి వర్ణాలలో ప్రవేశం జరుగుతుందనీ, అది కూడా బ్రాహ్మణుడికి బ్రాహ్మణ వర్ణంలోనూ, క్షత్రియుడికి క్షత్రియ వర్ణంలోనూ, వైశ్యుడికి వైశ్య వర్ణంలోనూ అని అవుతుంది. ఇది పైన చెప్పిన విషయాలతో కలవడం లేదు.

ఇక్కడ ఈ పదాలు జాతి వాచకాలు కావు, వర్ణ సంజ్ఞా వాచకాలు. వాటి అర్థాలు- **'బ్రాహ్మణ-వర్ణానికి దీక్షా కాలం'** మొదలైనవి. మనువు సమ్మతించిన దాని ప్రకారం నిర్ధారణ వల్ల వీటి అర్థాలు- **'బ్రాహ్మణ వర్ణం స్వీకరించాలనుకునేవారు'** మొదలైనవి అవుతాయి. ఈ అర్థం మనువు చెప్పిన 'బ్రహ్మవర్చసకామస్య' (2.12) మొదలైన పదాలతో కూడా వస్తుంది. ఈ అర్థం కింద రెండు రకాల భావాలు కలుస్తాయి- ఎవరైతే వర్ణాన్ని మార్చుకుని తమ పిల్లలను మరొక వర్ణంలో దీక్షితులను చేయాలనుకుంటారో, వారు కూడా నిర్ణీత సమయంలో వ్యవస్థను అనుసరించి మార్చుకోవచ్చు.

ఆ. అంత చిన్న వయసు గల పిల్లలకు 'ఇచ్ఛిక' అనే పదం ఎందుకు సంబంధం జోడించుకోలేక పోతూందని సందేహం వస్తుంది. దీనికి స్పష్టమైన సమాధానం - మాతాపితల ఇష్టం ఆధారంగా - ఇది ప్రయోగించబడుతుంది. తల్లిదండ్రులు ప్రారంభం నుంచీ తమ పిల్లలు ఎలా పెరిగాలనుకుంటారో దానికి తగ్గట్టుగానే సంస్కారం చేస్తారు. అలాగే ఆచార్యుడు వాడి చదువు - దీక్షలను పరిశీలించి వర్ణపు చివరి నిర్ణయం ఆచార్యుడే చేస్తాడు [2.121 (146). 123 (148)]. మనువు ఈ వ్యవహారం ఆధారంగానే ఐదేళ్ల బాలుడికి **'బ్రహ్మవర్చసకామస్య', 'బలార్థినః', 'వైశ్యస్య ఇహ అర్థినః'** (2.12) పదాలను ప్రయోగించాడు. కానీ అంత చిన్న వయసు వారికి బ్రహ్మవర్చసకామన మొదలైన వాటి కోరిక,గాంభీర్యం, పరిణామాలు తెలిసే అవకాశం ఉండదు. నేటికీ చిన్నవయసు బాలురను తల్లిదండ్రులు తమకు నచ్చినట్లే తాము కోరిన పాఠశాలల్లోనే చేరుస్తున్నారు.

పై చెప్పిన విశ్లేషణ (సంఖ్య 1) వల్ల, మనుస్మృతిలో వర్ణ సంకరాల వర్ణన దీనిలో ప్రతిపాదించినది కాదని తెలుస్తూంది. అవి మనువుకు అధార భూతమైన విలువలతో సరిపోవడం లేదు కూడా. ఇతరమైన శైలి మొదలైన విభిన్న కారణాలతో కూడా పదో అధ్యాయంలోని వర్ణ సంకరం పద ప్రయోగం తరువాతిదీ, ప్రక్షిప్తమూ అని రుజువవుతూంది. వాటి వర్ణన శైలి విధి విధానంగా కాకుండా, ఐతిహాసికంగా ఉంది. ఈ విధంగా ఈ వర్ణన మనువు చెప్పింది కాదని చెప్పవచ్చు.

2. మాంసం తినటం, పశుయజ్ఞాలు పాపం కలిగిస్తాయి

మనువు మాంసం తినటం, యజ్ఞాలలో జంతువులను బలి ఇవ్వటం నింద్యమూ, పాపమని భావించాడు. ఈ రెండూ అతని ముఖ్య ఉద్దేశమూ, ప్రతిపాద్య విషయమూ, మనుస్మృతికి ఆధారభూతమైన భావనలకు వ్యతిరేకాలు కూడా.

అ. పైన చెప్పిన వాటి విధాయకం, సంకేతక స్థలాలు:--

మాంసం తినటం, పశుబలులు పాపం-2.152 (177); 3.68-69; 4.2,68,170, 246; 5.5,45-49,51. వీటిని పరిశీలించిన తర్వాత కింది నిర్ధారణకు వచ్చాము -

1. 'అహింసా పాలనం' లేదా 'హింసానిషేధం' మనుస్మృతిలోని విలువలలో ఒకటి. వీటి మీదే మనుస్మృతిరూప ప్రాసాదం నిలిచి ఉంది. హింసను మనువు చెప్పాడని అనుకుంటే **'మనుస్మృతికి ఆధారస్తంభమైన వ్యవస్థే కూలిపోతుంది'**. వేర్వేరు చోట్ల హింసానిషేధం, అహింసాపాలనలపై మనువు ఆదేశాల కోణంలో చూస్తే ఇలా కచ్చితంగా చెప్పవచ్చు -

క. అన్నిరకాల హింసలూ, లేదా మాంసభక్షణం మనువుకు వ్యతిరేకం.

ఖ. యజ్ఞాలలో జంతుబలులు మనువుకు వ్యతిరేకం.

గ. యజ్ఞం చేయాలనే ఉద్దేశంతో జంతుహింస చేయటం కూడా మనువుకు వ్యతిరేకమే. ఎలాగంటే - మనువు గృహస్థులకూ, వానప్రస్థులకూ ఐదు యజ్ఞాలను తప్పవని చెప్పాడు. ఈ యజ్ఞాల ముఖ్య ఉద్దేశం హింసను నివారించటమే! -

పఞ్చసూనా గృహస్థస్య చుల్లీ పేషణ్యుపస్కరః ।
కణ్డనీ చోదకుమ్భశ్చ బధ్యతే యాస్తు వాహన్ ।
తాసాం క్రమేణ సర్వాసాం నిష్కృత్యర్థం మహర్షిభిః ।
పఞ్చ క్ళృప్తాః మహాయజ్ఞాః ప్రత్యహం గృహమేధినామ్ ॥ 3.68,69

ఎవరైతే నిత్యజీవితంలో జరిగే చిన్న చిన్న హింసలకు సైతం నివృత్తిగా ప్రాయశ్చిత్తం చేసుకుంటారో, ఎవరికి ఇతర ప్రాణులను పీడించాలనే భావన కూడా ఉండదో, ఏ ఇతర ప్రాణులకూ బాధ కలిగించని జీవనవిధానాన్ని ఎవరు అవలంబిస్తారో, (4.4)[4] జంతువులపై ప్రయాణించేవారు వాటికి దెబ్బ తగలని విధంగా కొరడా ప్రయోగిస్తారో, (4.68)[5] వారు జంతు హింసా చేయరు, మాంసం అసలే తినరు. చిన్న చిన్న హింసలకే ప్రాయశ్చిత్తం చేసుకునేది, తమ పాపాలను శుద్ధి చేసుకునేందుకే. అందుకే మనువు చెప్పిన పంచ యజ్ఞాల విధానాలు ఇందులో హింస మను సమ్మతమేనని రూఢి చేయాలని ప్రయత్నించేవారు ఉండటమే ఆశ్చర్యం కలిగించే విషయం! అలా జరిగితే మరి పాప శుద్ధి చేయుట మెందుకు?

---

[4] "అద్రోహేణైవ భూతానామల్పద్రోహేణ వా పునః - విప్రో జీవేత ॥"

[5] "వినీతైస్తు వ్రజేన్నిత్యం.....ప్రతోదేనాతుదన్ భృశమ్॥

2. మనువు 5.49లో చాలా స్పష్టంగా ఇలా ఆదేశించాడు - "నివర్తేత సర్వ మాంసస్య భక్షణాత్" = అన్ని రకాలైన మాంస భోజనానికీ దూరంగా ఉండండి ! అంతేకాకుండా, చాలా చోట్ల మాంసభక్షణాన్ని స్పష్టంగా నిషేధించాడు. హింసను నిందించడమూ, అహింసను ప్రశంసించడమూ, ప్రేరేపించడమూ కూడా చేశాడు.-

క. "వర్జయేత్ మధుమాంసం చ.......ప్రాణినాం చైవ హింసనమ్ ॥" 2.152 (177) ॥

ఖ. "వర్జయేత్ మధుమాంసమ్" ॥ 6.14 ॥

గ. "హింసారతశ్చ యో నిత్యం నేహాసౌ సుఖమేధతే ।" ॥ 4.170 ॥

ఘ. "యో అహింసకాని భూతాని హినస్తి ఆత్మసుఖేచ్ఛయా ।
స జీవంశ్చ మృతశ్చైవ న క్వచిత్ సుఖమేధతే" ॥ 5.45 ॥

ఙ. "అహింస్రః దమదానాభ్యాం జయేత్ స్వర్గం తథావ్రతః" । ॥ 4.246 ॥

చ. "విచరేత్ నియతః నిత్యం సర్వభూతాని-అపీడయన్ ॥" ॥ 6.52 ॥

ఛ. "అహింసయా చ భూతానాం అమృతత్వాయ కల్పతే ।" ॥ 6.60 ॥

జ. "యో బన్ధనవధక్లేశాన్ ప్రాణినాం న చికీర్షతి ।
స సర్వస్య హితప్రేప్సుః సుఖమత్యన్తమశ్నుతే ॥" ॥ 5.46 ॥

3. అంతే కాదు, మాంసం సంపాదించేందుకు సహాయం చేసే ప్రతి ఒక్కరినీ మనువు-ఘాతకుడు = పాపి అని సంబోధించాడు. కింది శ్లోకంలో ఎనిమిది రకాల మనుషులను పాపులని చెప్పాడు.

క. అనుమన్తా విశసితా నిహన్తా క్రయవిక్రయీ ।
సంస్కర్తా చోపహర్తా చ ఖాదకశ్చేతి ఘాతకాః ॥ 5.51 ॥

అర్థం-"(అనుమంతా) చంపమని చెప్పేవాడు, (విశసితా) మాంసం కోసేవాడు, (నిహంతా) జంతువును చంపేవాడు, క్రయవిక్రయీ జంతువులను చంపేందుకు డబ్బు తీసుకుని అమ్మే వాడు, కొనే వాడు, (సంస్కర్తా) వండే వాడు, (ఉపహర్తా) వడ్డించే వాడు, (చ) ఇంకా (ఖాదకః). తినేవాడు, (ఇతి ఘాతుకాః) - వీళ్లందరూ హంతకులూ, పాపులూ."

4. భక్ష్యా అభక్ష్య విషయం (5.5,8.10,24,25) శ్లోకాల వల్ల, మనువు, తామసిక, రాజసిక, **'అమేధ్య ప్రభవ'** = అశుద్ధ స్థానాలలో పుట్టే అన్ని పదార్థాలనూ అభక్ష్యాలు-తినకూడనివి-అన్నాడని తెలుస్తోంది. పాసిన భోజనం, వెల్లుల్లి, ఉల్లి మొదలైనవి తామసిక, రాజసిక భోజనం కిందికి వస్తాయి. అశుభ్రమైన చోట్ల పుట్టే పదార్థాలు, రక్తంలోని కొవ్వు - ఇవి ఉన్న మాంసం మొదలైనవి అమేధ్యంలో పుట్టినవి అన్నాడు. కొన్ని ప్రమాణాలు చూడండి-

క. లశునం గృఞ్జనం చైవ పలాణ్డుం కవకాని చ ।
అభక్ష్యాణి ద్విజాతీనామమేధ్యప్రభవాణి చ ॥ 5.5 ॥

ఖ. నాకృత్వా ప్రాణినాం హింసాం మాంసముత్పద్యతే క్వచిత్ ।
న చ ప్రాణివధః స్వర్గ్యస్తస్మాన్మాంసం వివర్జయేత్ ॥ 5.48 ॥

గ. సముత్పత్తిం చ మాంసస్య వధబన్ధౌ చ దేహినామ్ ।
ప్రసమీక్ష్య నివర్తేత సర్వమాంసస్య భక్షణాత్ ॥ 5.49 ॥

5. మనువు సాత్త్విక గుణాలున్న పదార్థాలనే తిన దగినవీ, ప్రశంసించ దగినవీ అన్నాడు. రాజస, తామసాలను నింద్యాలుగా[6] భావించాడు. సాత్త్విక గుణాలతోనే మోక్ష ప్రాప్తి అవుతుందని అన్నాడు.[7] ఇదే మను ధర్మశాస్త్రంలోని ప్రవచనాల ఉద్దేశం - **"బ్రాహ్మీయం క్రియతే తనుః"** [2.3(28)] ఇంకా తామసిక, రాజసిక పదార్థాలను తినడం మనువు ప్రతిపాదించిన విషయాలకూ, ఉద్దేశాలకూ వ్యతిరేకాలు.

6. మూడో అధ్యాయంలో యజ్ఞ సందర్భాలలో మనువు ఎక్కడా మాంస యజ్ఞ విధానం చెప్పలేదు. వానప్రస్థం విషయంలోనైతే యజ్ఞాలను అన్నాలతోనే చేయండి, అవి కూడా **'మేధ్య'** = శుభ్రమైన, శుభమైన అన్నాలతో- అని స్పష్టంగా చెప్పాడు.

> **మున్యన్నైః వివిధైః మేధ్యైః శాకమూలఫలేన వా ।**
> **ఏతానేవ మహాయజ్ఞాన్ నిర్వపేత్ విధిపూర్వకమ్ ॥** 6.5 ॥

మనువు ఘనతను అర్థం చేసుకోవడానికి ఈ ప్రమాణాలను మించినవి ఇంకేముంటాయి? దీని తరువాత కూడా మాంస భక్షణం, జంతు బలులను మను సమ్మతమని భావించేవారు, మనువుకూ, మనుస్మృతికీ అన్యాయం చేస్తున్నట్లే!

7. మాంస భక్షణం, జంతుబలులు గల యజ్ఞాలకు వ్యతిరేకంగా వేదాలలో ఆధారాలు

ఈ విషయంలో ప్రక్షిప్తకర్తలు, మాంస భక్షణం కోసం యజ్ఞాల ముసుగు వేసుకున్నారు. యజ్ఞాల విధానాలు వేదాలలో ఉన్నాయి. అందుచేత, ఇక్కడ యజ్ఞాలకు సంబంధించిన వేదాల ప్రమాణాలే చూపుతున్నాము. వీటి వల్ల తమ స్వార్థ ప్రయోజనాలు పొందడానికి స్వార్థపరులు అనవసరంగా యజ్ఞాలు, వేదాలను అపకీర్తిపాలు చేశారు -

క. **'అధ్వరం'** పదం ఋగ్వేదంలో 1.23.17; 1.135.7; 1.44.13; 3.24.2; 7.72.4; 7.6.8.'

యజుర్వేదంలో -37-19; 3.11; 21.47 మొదలైన ఎన్నో చోట్ల యజ్ఞం అనే అర్థంలో ప్రయోగించ బడింది. నిరుక్తంలో ఈ పదానికి వ్యుత్పత్తి చెబుతూ యాస్కాచార్యులు - **"అధ్వర ఇతి యజ్ఞ నామ, ధ్వరతి హింసా కర్మా తత్ ప్రతిషేధః"** (నిఘం.3.17; 1.7) అన్నాడు. అంటే - **'అధ్వరం'** = యజ్ఞానికి పేరు. **'ధ్వర'** అనే హింసాత్మక ధాతువు నుంచి ఏర్పడింది. దేంట్లో హింస ఉండదో దాన్ని **'అధ్వరం'** = యజ్ఞం అంటారు. ఈ సూచనతో యజ్ఞాలలో ఏ రకమైన హింసా జరగదని స్పష్టమవుతూంది. యజ్ఞం పేరుతో జంతు హింస చేయటం. స్వార్థపరులు ఉదరపోషణ కోసం కల్పించినది.

ఖ. యజుర్వేదంలో **'కర్మకాండను వేదం'** అంటారు. దానిలోని తొలిమంత్రంలోనే జంతువులను హింసించకూడదనే ఉంది - **'యజమానస్య పశూన్ పాహి"** (యజు.1.1) అంటే 'యజ్ఞాలు చేసేవారు జంతువులను కాపాడండి' అని.

గ. **మాంసాహారులకు యజ్ఞాలు చేసే అధికారం లేదు-** యజ్ఞాలలో మాంస పద్ధతి చర్చ లేనే లేదు. వేదాలలో, యజ్ఞ పద్ధతుల విషయాలలో యజ్ఞీయ ప్రవృత్తిలో అన్నాహారాల (మాంసాహారులు కాదు) వ్యక్తులే యజ్ఞాలు చేయాలని ఉంది. కింది వేదమంత్రాలు ప్రమాణంగా ఇచ్చారు -

> **"ఊర్జాద ఉత యజ్ఞియాసః పంచజనా మమ హోత్రం జుషధ్వమ్।"** ఋ.10.53.4 ॥

అంటే, కేవలం అన్నం తినేవారే (మాంసం తినే వారు కాదు), యజ్ఞీయ ప్రవృత్తి గలవారే, ఐదు రకాల (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, నిషాదులు) వ్యక్తులే యజ్ఞాలు చేయాలి.

నిరుక్తకారుడు, **'ఊర్జ'** పద వ్యుత్పత్తీ, అర్థమూ ఇచ్చాడు - **'ఊర్గితి అన్ననామ, ఊర్జయతి ఇతి సతః'** (నిరు.3.2.7) అంటే అన్నం శరీరానికి ప్రాణశక్తిని ఇస్తుంది కాబట్టి దాన్ని **'ఊర్జ'** అంటారు.

---

[6] 5.5,24; 12.7,28,29,32,33,35,36 ॥

[7] 12.7,31,37,83 ॥

8. ఇక్కడ పేర్కొన్న అన్ని మనుస్మృతి విషయాలూ, సందర్భంతో పాటు అనుకూలత కలిగినవి, శైలికి అనురూపంగానూ ఉన్నాయి.

ఆ. మాంస సమర్థకుల మాటలు-విశ్లేషణ.

అ. 3.123, 267-272లలో వివిధ మాంసాలతో మృతక శ్రాద్ధలలో తృప్తి.

ఆ. 4.26-28 లలో మాంసం తినేటప్పుడు వాటితో యజ్ఞం చేయటం.

ఇ. 5.6,7, 11-23, 26-44, 50,52-56 లలో రక రకాల మాంస పద్ధతులు, వాటిని యజ్ఞ పూర్వకంగా తినటం, ఖండన మండనాలు.

1. ఈ శ్లోకాలలో చెప్పిన విషయాలు, పైన చెప్పిన వాటికి వ్యతిరేకం. అందువల్ల వీటిని పరిగణించ నక్కరలేదు.
2. 'అ' భాగం నుంచి శ్లోకాలు విషయానికి వ్యతిరేకంగా ఉన్నాయి. అక్కడ పంచ యజ్ఞాల విషయం ఉంది, మృతకా శ్రాద్ధ క్రియల విషయం కాదు. (వివరణకు 3లో చూడండి, దీని సమీక్షలో)
3. 'అ' భాగంలోని శ్లోకాలలో మృతక శ్రాద్ధాలకు సంబంధించిన విషయాలున్నాయి. ఇవి విషయ వ్యతిరేకాలు కూడా. 'అ' లోని 5.11-23 శ్లోకాల లోనివి 5.10,14లోని విషయాలను భంగం చేశాయి. 5.26-44 శ్లోకాలలో కొత్తగా మాంసం తినటంలోని విధులు-విధులు కానివి అనేది ప్రారంభమైంది. ఇది కూడా అసందర్భమే.
4. మూడు చోట్లలోని శైలి నిరాధారమూ, అతిశయోక్తులతో కూడినదీ, హేతుబద్ధం కానిది.
5. ఈ మాంస సమర్థకుల విషయాలలో పరస్పర వ్యతిరేకాలైన పద్ధతులూ ఉన్నాయి. వాటి వల్ల ఈ విషయం పలువురు వేర్వేరు సమయాలలో రాసి కలిపేశారని తెలుస్తూంది.

3. మరణించినవారికి శ్రాద్ధం మనుసమ్మతం కాదు

అ. **జీవించి ఉన్నవారి శ్రాద్ధ కర్మల వర్ణనలు-** 3.80-82,4.30-31. పంచ యజ్ఞాలను గురించి చెబుతున్న సందర్భంలో శ్రాద్ధాన్ని క్రమబద్ధంగా మనువు చెప్పాడు. అది బ్రతికి ఉన్నవారి విషయంలోనే జరుగుతుంది కానీ, మరణించినవారికి కాదు. మనువు అంటాడు - 'శ్రాద్ధ సమయంలో పితరులను పూజించండి. దీన్ని ప్రతిరోజూ చేయాలి. తల్లిదండ్రులను తల్లిదండ్రుల లాంటి పెద్దలను సంతోషపెడుతూ, వారికి ఆహారం, నీరు, కందమూలాలు మొదలైనవి సమర్పించి శ్రాద్ధ కార్యం చేయండి. ఇదే **'పితృయజ్ఞం'**. ఈ శ్లోకాలలో శ్రాద్ధం కోసం ఋషులు, పితరులు, మానవులు మొదలైన అందరు జీవితులనూ గణించాడు. 4.30-31లో ఇలాంటి వారి హవ్యం = భోజన పదార్థాల దానం, కవ్యం = అవసరమయ్యే ధనం, బట్టలు మొదలైన వాటి దానాల పద్ధతి ఉంది. శ్లోకాలు చూడండి.

క. **ఋషయః పితరో దేవా భూతాన్యతిథయస్తథా ।**
ఆశాసతే కుటుమ్బిభ్యస్తేభ్యః కార్యం విజానతా ॥ 3.80

ఖ. **స్వాధ్యాయేనార్చయేతర్షీన్హోమైర్దేవాన్యథావిధి ।**
పితౄన్స్రాద్ధైశ్చ నృనన్నైర్భూతాని బలికర్మణా ॥ 3.81

గ. **కుర్యాదహరహః శ్రాద్ధమన్నాద్యేనోదకేన వా ।**
పయోమూలఫలైర్వాఽపి పితృభ్యః ప్రీతిమావహన్ ॥ 3.82 ॥

ఈ విషయంలో విస్తృత విశ్లేషణ చేయబడింది. పితృయజ్ఞాలు రెండు రకాలు- ఒకటి తర్పణం, రెండు శ్రాద్ధం. **యేన కర్మణా విదుషో దేవాన్, ఋషీన్, పితౄంశ్చ తర్పయంతి = సుఖయంతి తత్తర్పణమ్** - అంటే కర్మల వల్ల

విద్వాంసులైన దేవతలు, ఋషులు, పితరులకు సుఖాలు చేకూర్చటాన్ని తర్పణం అంటారు. **'యత్తేషాం శ్రద్ధయా సేవనం క్రియతే తత్ శ్రాద్ధమ్'** - అంటే జీవించి ఉన్న వారికి శ్రద్ధతో చేసే సేవలే శ్రాద్ధం అనబడతాయి.

శ్రాద్ధం అంటే - శ్రద్ధతో చేసే పనులు. తల్లిదండ్రులకు శ్రద్ధతో సేవలు, శుశ్రూషలు చేయడం, ఆహారం అందించటం మొదలైనవి. దీనినే పితరుల **'తర్పణం'** లేదా **'పితృయజ్ఞం'** అంటారు. ఈ శ్రాద్ధ తర్పణాలు మొదలైనవి కర్మ గోచరాలు. అంటే ప్రత్యక్షంగా ఎదుట ఉన్నవారి విషయంలోనే జరుగుతాయి. మృతులైనవారికి కాదు; ఎందుకంటే మరణించినవారు ఎదుట ఉండటం జరగదు కాబట్టి. అందువల్ల పితృయజ్ఞంతో వారికి సేవలు చేసే వీలు ఉండదు. వారి పేరు చెప్పి ఇచ్చే వస్తువులు వారికెప్పటికీ చేరవు. ఆ కారణం చేత మృతులకు సుఖం కలిగించటం అనేది అసలు జరిగేపని కాదు. తర్పణాలు మొదలైనవి కర్మతో సత్కరించే పద్ధతులు మూడు - దేవ, ఋషి, పితర యజ్ఞాలు, 'పితరులు' అంటే మరణించిన వారిని కాదు, బ్రతికి ఉన్నవారు అనే.

"పాంతి పాలయంతి రక్షంతి అన్న-విద్యా-సుశిక్షా-ఆదిదానైః, తే పితరః" = అన్నం, చదువు, శిక్షణ మొదలైనవాటి వల్ల ఆలన పాలనలు, రక్షణ ఎవరు కలిగిస్తారో వారే 'పితరులు' అనబడతారు. ఇందులో బ్రాహ్మణాల ప్రమాణాలు చూడదగినవి -

అ. "దేవా వా ఏతే పితరః" గో.ఉ.1.24 ॥

ఆ. "స్విష్టకృతో వై పితరః" గో.ఉ.1.25 ॥

అంటే - సుఖ సౌకర్యాల ద్వారా ఆలన పాలన చేసేవారు, హితం చేసే విద్వాంసులు **'పితరులు'** అనబడతారు పైన చెప్పిన శ్లోకం, దానికి ముందు వెనుకల గల శ్లోకాలతో ఇముడుతున్నది. విషయం, శైలి వీటికి అనుకూలంగా ఉంది.

ఆ. మృతుల శ్రాద్ధం గురించి చెప్పినవి

(అ) 3.122-284 వరకు మృతుల శ్రాద్ధం గురించిన ఒక స్వతంత్ర విషయం ఉంది.

ఇది తన ముందు వెనుకల గల విషయాలతో ఏ విధంగానూ కలవదు, విషయ సంకేతానుసారం లేదు, మనువు మూల భావనలకు అనుకూలంగానూ లేదు. ఈ కింది కారణాల వల్ల ఇది తెలుస్తూంది-

1. అంతర్ వ్యతిరేకత

1. అంతర్ వ్యతిరేకత- ఇందులో చెప్పిన విషయాలకు, మనుస్మృతిలోని మిగిలిన విషయాలకూ ఎన్నో అంతర్ వ్యతిరేకతలు కనిపిస్తున్నాయి- (1) 3.122 నుంచి 284 శ్లోకాలలో మృతుల శ్రాద్ధ విధానం ఉంది. ఇది మనువుకు వ్యతిరేకం. మనువు పితృ యజ్ఞం రూపంలో బ్రతికి ఉన్నవారి శ్రాద్ధం, అదీ ప్రతిరోజూ చేయాలని చెప్పాడు. (3.80-82) (వివరాలకు 3.85 మీది పరిశీలన సమీక్ష చూడండి) మనువు ప్రకారం, **'పితు'** లే **'పితరులు'**. ఈ పదానికి వయోవృద్ధులు అంటే **'పెద్దలు'** లేదా **'పాలకులు'** **'విద్వాంసులు'** మొదలైన వారు. 9.28; 2.126; (2.151) లలో **'పితృ'** పదాన్ని **'పెద్దలు'** అనటానికి వాడాడు.

2. రోజు వారీ పితృయజ్ఞం లేదా శ్రాద్ధం ఇంట్లో చేయమన్నాడు. కానీ ఈ శ్లోకాలలో చెప్పిన శ్రాద్ధం వనాలు, నదీతీరాలు, ఏకాంత స్థలాల్లో (3.207) చేయాలని ఉంది. ఈ తేడా మనువుకు వ్యతిరేకం.
3. మనువు పితృ యజ్ఞాన్నే శ్రాద్ధంగా భావించాడు. దాని కంటే ఇతరమైన దేన్నీ పితృ యజ్ఞంలో చేర్చలేదు (3.80-82) ఈ శ్లోకాల్లో **"పితృ యజ్ఞం తు నిర్వర్త్య"** అనీ, **"పిండాన్వాహార్యకం శ్రాద్ధం కుర్యాత్ మాసాను మాసికం"** (122) అనే విధానంతో, చెబుతున్నవాడు. దీన్ని పితృయజ్ఞం కంటే వేరైనదిగా అని భావించాలని తెలిసిపోతూంది. ఈ వేరైన ప్రత్యేక శ్రాద్ధపద్ధతి మనువు చెప్పిన వ్యవస్థకు అనుకూలం కాదు.

4. పితృ యజ్ఞం సందర్భంలో కేవలం అన్నం, నీరు, కంద మూలాలతోనే శ్రాద్ధం చేయాలి. (3.82) ఇక్కడున్న విషయంలో మాంసంతో శ్రాద్ధం చేయటం ఎక్కువ ఫలితాన్నిస్తుందని ఉంది (3.266-272).

5. ఈ విషయంలో చాలా చోట్ల మాంసం తినే విధానం ఉంది (3.123, 227,257, 266-272). ఇది మనువు మూల విషయానికే వ్యతిరేకం. మనువు మాంసం తినటం పాపమనీ, మాంసం తినే వాడు పాపి అని చెప్పాడు. (5.43-51) హింసించేవారికి ప్రాయశ్చిత్తాలు కూడా విధించాడు (3.68-69; విస్తృత వివరణకు 4.26-28 శ్లోకాలది చూడండి.).

6. కర్తే స్వయంగా ఫల భోక్త అన్నాడు మనువు (4.240). అంటే కార్యం చేసే వాడికే ఫలం దక్కుతుంది అని. ఈ విషయంలో శ్రాద్ధ కర్త ద్వారా పితరులకు చేసేవాటి వివరణ (3.220,222), ఒకరికి శ్రాద్ధం చేయటం వల్ల ఏడు తరాల వంశజులకు పుణ్యఫల ప్రాప్తి (3.146) మొదలైనవి అసలు వాటికి వ్యతిరేకం.

7. మనువు కర్మల వల్లనే వర్ణవ్యవస్థ అని భావించాడు. 1.88; 2.143 (168), 122-123 (147-148). 136,137,152-156,164-166, 182 మొదలైన శ్లోకాలలో వర్ణ వ్యవస్థను పుట్టుకను బట్టి భావించినట్లుగా ఉంది. అందువల్ల పై చెప్పిన శ్లోకాలలో ఉన్న కర్మలు బ్రాహ్మణులవి కాక పోవచ్చు. వాటిలో ఈ కర్మలుంటే, వారు మనువు వ్యవస్థ ప్రకారం బ్రాహ్మణులు కారు.

8. 2.81(106) లో వేదాధ్యయనం సర్వదా పుణ్యదాయకం అని ఉంది. కానీ ఇక్కడి విషయంలో శ్రాద్ధ సమయంలో వేద పాఠం నిషిద్ధం (188).

9. మొదటి అధ్యాయంలో సృష్టి ఉత్పత్తిని చెబుతూ, పరమాత్మ ద్వారా పంచభూతాల నుంచి చరాచర జగత్తు, ఉత్పత్తి జరిగిందని ఉంది (1.6,14, 20). కానీ ఇక్కడ చెప్పిన వాటిలో మరీచి మొదలైన ఋషుల ద్వారా చరాచర జగత్తు ఏర్పడిందని ఉంది. ఇది ప్రకృతి విరుద్ధమైన కథనం (201).

10. 1.91లో శూద్రుల పని ద్విజుల సేవ చేయటం అని ఉంది. ఇక్కడ శూద్రులు శ్రాద్ధ పదార్థాలను తాకడం కూడా నిషిద్ధమే. (241) 197వ శ్లోకంలో శూద్రుల పితరులు **సుకాలీలు** అని భావించారు. మరి శూద్రులకు శ్రాద్ధపదార్థాల స్పర్శ కూడా నిషిద్ధమైతే, శూద్రుల ఇళ్లల్లో ఏ బ్రాహ్మణుడు శ్రాద్ధ భోజనం చేస్తాడు? అలా తినక పోతే, శూద్రులకు శ్రాద్ధనియమాలెందుకు?

11. ఈ మొత్తం ప్రసంగంలో పితరులకు హవ్య కవ్యాలిచ్చే పద్ధతు లున్నాయి. కానీ మనువు అభిప్రాయం ప్రకారం, బ్రతికున్న వారికి ఇచ్చే ఆహారం, వారి హితం కోసం ఇచ్చే బట్టలు, ధనం, మొదలైన దానం **'హవ్య కవ్యాలు'** అవుతాయి. 4.30-31లలో మనువు స్పష్టంగా చెప్పినవి చూడండి. బ్రతికి ఉన్న ధార్మిక విద్వాంసులకు హవ్య కవ్యాలు ఇవ్వడం గురించి చెప్పాడు. ఈ మొత్తం విషయం మనువు చెప్పిన దానికి వ్యతిరేకం కాబట్టి ప్రక్షిప్తమే.

2. సందర్భ వ్యతిరేకాలు

1. 3.117లో గృహస్థ ధర్మాన్ని **'శేష భుక్'** అవాలని చెప్పాడు. 118లో **'యజ్ఞ శేష భుక్'** కావాలని చెప్పాడు. 3-285లో ఈ మాటలకు వికల్పరూపాలైన విషయాలు ఉన్నాయి. 285వ శ్లోకం 117,118 శ్లోకాల **'అర్థవాద'** రూప మని చెప్పవలసి ఉంది. మధ్యలోని ఈ శ్లోకాలు వాటి ముందు వెనుకల ఉన్న విషయాలను పాడు చేసి, ఏకవాక్యాత్మక వర్ణనను చెదరగొట్టాయి, అందువల్ల 3.119-284 శ్లోకాలు సందర్భ వ్యతిరేకాలు.

2. 3.117-118, 284 శ్లోకాలలో అతిథి యజ్ఞానికి సంబంధించిన విషయం ఉంది. అందులో గృహస్థు ఎలా భోజనం చెయ్యాలి అనే దాని స్పష్టీకరణ ఉంది. వీటి మధ్య సంబంధితుల పూజ, రాజు స్నాతకుల పూజ

(3.119,120), బలి వైశ్వ దేవవిధానం (3.121), పితృ శ్రాద్ధ విధానం (3.122-284) - ఇవి పూర్వాపర సందర్భ వ్యతిరేకాలు.

3. 3.122 లో **'పితృ యజ్ఞం తు నిర్వర్త్య'** అని చెప్పి కొత్తగా మళ్లీ పితృ శ్రాద్ధపు విషయం చెప్పబడింది. ఇది మౌలికమైతే విషయ క్రమం దృష్టితో పితృయజ్ఞం ప్రసంగం (3.81,82) తో పాటు ఉండాలి. అలా కాకుండా, మధ్యలో నుంచి మొదలైంది. ఈ క్రమరాహిత్యమే. ఇది మౌలికం కాదని చెబుతూంది. ఈ విధంగా ఈ సందర్భ వ్యతిరేకాల ఆధారంగా ఇవన్నీ 3.119 నుంచి 284 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలే అని చెప్పాలి.

3. విషయ వ్యతిరేకాలు-

3.67వ శ్లోకంలో **"వైవాహికేఽగ్నౌ కుర్వీత.... పంచయజ్ఞవిధానం చ "** అని గృహస్థ దైనిక పంచ యజ్ఞాలు చేయాలని ఉంది. ముగింపును సూచించే 3.283 **"ఏతత్ వః అభిహితం సర్వం విధానం పాంచయజ్ఞికం"** వల్లనూ, 67 నుంచి 286 శ్లోకాలలోని విషయం కేవలం దైనిక పంచ యజ్ఞాలు చేయటమే. 3.119 నుంచి 284 వరకు గల వాటిలో దైనిక పంచ యజ్ఞాలకు భిన్నంగా మాసికం, త్రైమాసికం మొదలైన శ్రాద్ధాల వర్ణన ఉంది. ఇది మనువు విషయ సంకేతాలకు సరిపోవటం లేదు కాబట్టి, విషయ వ్యతిరేకాలు. అందుచేత ప్రక్షిప్తాలు.

ఈ విధంగా మృతుల శ్రాద్ధపు గుర్తింపు మనువు చెప్పింది కాక, ఇతరుల ద్వారా ప్రక్షిప్తంగా చేర్చబడింది. మనువు చెప్పినవి అంటే, కేవలం కుటుంబంలోని జీవించి ఉన్న వయోవృద్ధులు, విద్వాంసులు మొదలైనవారి సేవ, శుశ్రూషలకు సంబంధించినదే.

4. నియోగ ఆచారం-మనువు చెప్పింది వైదికమే

అ. ఈ ఆచారం చెప్పిన చోట్లు

నియోగ ఆచారం ఒక ప్రపంచవ్యాపితమైన ఆచారంగా మారినరూపాలతో నేటికీ ఉంది. వైదిక కాలంలో నచ్చిన వారు పాటించేవారు. క్రైస్తవులలో తప్పనిసరి.

మనువు 9.56-59, 62,63 శ్లోకాలలో ఎంతో స్పష్టంగా నియోగ విధానాన్ని చెప్పాడు. సంతానం లేనప్పుడు (భర్త మరణం లేదా జీవించి ఉన్నా సంతానోత్పత్తికి అర్హుడు కాకపోతే) స్త్రీకి లేదా విధవకు మరిది అంటే భర్త సోదరుడు లేదా అతని వంశంలోని పురుషుడితో సంతానం పొందాలి అన్నాడు మనువు. దీనికి ప్రముఖ శ్లోకం ఉంది-

దేవరాద్వా సపిణ్డాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా ।
ప్రజేప్సితాధిగన్తవ్యా సన్తానస్య పరిక్షయే ॥ 9.59 ॥

1. నియోగం అంటే -

నియోగం అంటే 'కారణాంతరాల వల్ల భర్త నపుంసకుడైతే, స్త్రీ లేదా విధవ సంతానం కోసం అన్య పురుషుడితో శారీరక సంబంధం పెట్టుకోవడానికి అనుమతించడం. ఇదే **'నియోగమ్'**. **'నియోగానికి నియుక్తం'** చేయటం లేదా **'నియమించే విధి'** అని అర్థం. అంటే సమాజంలో, కుటుంబంలో పెళ్లిళ్లు జరిగినట్లుగా నియోగమూ జరుగుతుంది. అందరి ముందూ పుత్రుణ్ని పొందటానికి సంబంధం నిశ్చయిస్తారు. ఆ నిశ్చయానికి కట్టుబడి ఉండటమే **'విధి'**. దీన్ని అతిక్రమించడం **'విధిని వదిలిపెట్టడం'** అవుతుంది. ఈ నియోగం కేవలం వంశం నిలుపుకునేందుకు పుత్ర ప్రాప్తి కోసం మాత్రమే కానీ, విలాసానికి కాదని మనువు స్పష్టం చేశాడు. సంతానం కలిగిన తర్వాత ఆ స్త్రీ పురుషులు సంబంధం పెట్టుకుంటే అది శిక్షార్హం అవుతుంది (9.62-63). భారత దేశంలో ఈ పరంపర అత్యంత ప్రాచీన కాలంలోనే ఉంది, ఇందులో వేదాలు, ఇతిహాసాలు, ఆచారాల ఆధారాలు లభిస్తున్నాయి.

2. వేదాలలోని నియోగ విధానానికి ఇతిహాసాల ప్రమాణం

క. ఉదీర్ష్వ నార్యభిజీవలోకం గతాసుమేతముప శేష ఏహి ।
హస్తగ్రాభస్య దిధిషోస్తవేదం పత్యుర్జనిత్వమభి సం బభూథ ॥ ఋ. 10.18.8 ॥

అర్థం- "(నారి) విధవా! నీవు (ఏతం గతాసుం) ఈ మరణించిన భర్తపై ఆశను విడిచిపెట్టి, మిగిలిన పురుషులలో (అభి జీవలోకం) బ్రతికి ఉన్న మరొక పతిని (ఉపైహి) పొందు, (ఉదీర్ష్వ) ఈ విషయానికి సంబంధించిన ఆలోచనను కచ్చితంగా మనసులో ఉంచుకో. (హస్త గ్రాభస్య దిధిషోః) విధవవైన నీ పాణిని గ్రహించేందుకు నియోగించిన భర్త కోసం నియోగమైతే (ఇదం) ఈ (జనిత్వం) పుట్టే బాలకుడు ఆ నియుక్తుడైన (పత్యుః) పతి కొడుకే అవుతాడు. నీవు నీ కోసం నియోగించుకుంటే నీ కొడుకు అవుతాడు. (తవ) ఇలా నిశ్చయించుకున్న (అభి సంబభూత) పురుషుడు కూడా నియమ పాలన చేయాలి" (స.ప్ర.చతుర్థ సము.).

ఖ. (ప్రశ్న) ఈ నియోగం చనిపోయినవాడి తర్వాత జరుగుతుందా లేదా భర్త బ్రతికి ఉన్నప్పుడు కూడానా?

(జవాబు) భర్త బ్రతికి ఉన్నప్పుడూ జరుగుతుంది-**అన్య మిచ్ఛస్వ సుభగే పతిం మత్ ॥** (ఋ. 10.10.10).

భర్త సంతానోత్పత్తి విషయంలో అసమర్థుడైతే, తన భార్యతో సుందరీ! సౌభాగ్యాన్ని కోరే స్త్రీవైన నీవు (మత్) నేను కాక (అన్యం) రెండో భర్తను (ఇచ్ఛస్వ) కోరు. ఎందుకంటే నా నుంచి సంతానోత్పత్తిని ఆశించకు అని చెబుతాడు. అప్పుడు ఆమె మరొకరిని నియోగించి సంతానం పొందుతుంది. కానీ తాను పెళ్లాడిన ఆ భర్త సేవలోనే ఉంటుంది. అదే విధంగా భార్యకు ఏవైనా జబ్బులు వచ్చి ఆ కారణం చేత సంతానోత్పత్తికి పనికి రాక పోతే, భర్త స్వామీ ! నా నుంచి సంతానం పొందే ఆశను విడిచిపెట్టి మరో స్త్రీ ద్వారా సంతానం పొందుమని చెప్పాలి.

"పాండురాజు భార్యలు కుంతీదేవి, మాద్రీదేవి, దేవతల సాయంతోనే సంతానం పొందారు. వ్యాస మహర్షి చిత్రాంగద విచిత్ర వీర్యులు మరణించిన తరువాత, తన తమ్ముల భార్యలను నియోగించి అంబికకు ధృతరాష్ట్రుణ్ని, అంబాలికకు పాండురాజునూ, దాసికి విదురుణ్నీ కలిగించి వంశాన్ని నిలబెట్టాడు; ఇలాంటి ఇతిహాసాలు ఈ విషయానికి ప్రమాణాలు" (స.ప్ర.చతుర్థ.సము.).

3. దేవర పదానికి అర్థం, ప్రాచీన పరంపరల సంకేతం

మనుస్మృతి లేదా వైదిక సాహిత్యంలో దేవర పదానికి నేడు ప్రాచుర్యంలో ఉన్న 'భర్త తమ్ముడు' అని కాక, విస్తృతమైన అర్థం ఉంది. నిరుక్తంలో 'దేవర' పదానికి అర్థం ఇలా ఉంది -

"దేవరః కస్మాత్ ద్వితీయో వర ఉచ్ఛతే॥" 3.15

అంటే - **"విధవకు రెండవ భర్త అయిన వాడు దేవర. భర్త కంటే చిన్న లేదా పెద్ద కావచ్చు లేదా తన వర్ణానికి చెందిన వాడు లేదా ఉత్తమ వర్ణం వాడూ కావచ్చు."** ఎవరితో నియోగం జరుగుతుందో అతడే దేవర" (స.ప్ర.116).

నేడు ఆ పదం భర్త తమ్ముడనే అర్థంలోనే రూఢి అయింది. దీని వల్ల స్త్రీ విధవ అయితే, మరణించిన భర్త తమ్ముడితోనే ఆమెకు సంతానం కలిగిస్తారు. ఈ నియోగవిధి కూడా మారినరూపంతో జరుగుతూంది. ఈ ఆచారం వల్ల ప్రాచీన కాలంలోని నియోగ పద్ధతి ఉందని సూచించ బడుతూంది.

4. **ఇక్కడ 'నియోగ పద్ధతి'** మనువు చెప్పిన మౌలిక విషయాలలో ఒకటని స్పష్టంగా చెప్పటమూ అవసరమే. దీనిని కింది ప్రమాణాలు బలపరుస్తున్నాయి.

క. నియోగపద్ధతి పూర్వం చెప్పినదీ, ఆధారమైనదీ కూడా.

ఖ. ఈ విషయాన్ని సూచించిన శ్లోకాలలో దీన్ని ప్రారంభమూ, ముగింపుల సంకేతా లున్నాయి (9.56,203). ఈ శ్లోకాల విషయాలతో చక్కగా గొలుసు కట్టులా జోడించబడి ఉండటమే ఈ విషయం మౌలిక మనటానికి రుజువు.

గ. 9.145-146లలో నియోగంవల్ల పుట్టిన పుత్రుడికి ఆస్తిలో భాగంపై పూర్తి హక్కు ఉంటుంది. ఇది కూడా ఈ విషయం మను సమ్మతమేనని రూఢి చేస్తూంది.

ఘ. నియోగ పద్ధతిలో కాకుండా పుట్టిన వాడికి ధనం మొదలైన వాటిపై అధికారం. 9.147 ఉండదని చెబుతూంది. దీనివల్ల మనువు, నియోగాన్ని స్వీకరించదగింది అన్నాడే కానీ నియోగ త్యాగాన్ని కాదు.

ఙ. మనుస్మృతిలో ఈ ఆచారపు ఖండన

మనుస్మృతిలో ఈ నియోగపద్ధతి చెప్పటం పూర్తి కాగానే, దాని వెనుకనే దాన్ని ఖండించే శ్లోకాలు ఉన్నాయి. 9.64-68 శ్లోకాలలో దీన్ని ఖండిస్తూ, 'నియోగం పనికి రాదు, ఇది ధర్మాన్ని చంపుతుంది. 'నియోగం జంతుధర్మం. వేనుడనే రాజు కాలంలో ఈ జంతు ధర్మం వ్యాప్తిలోకి వచ్చింది.' మొదలైనవి ఉన్నాయి.

అలాంటి ఖండనాత్మక శ్లోకాలు చూడండి -

నాన్యస్మిన్ విధవా నారీ నియోక్తవ్యా ద్విజాతిభిః ।
అన్యస్మిన్ హి నియుఞ్జానా ధర్మం హన్యుః సనాతనమ్ ॥ 9.64 ॥

అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః ।
మనుష్యాణామపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి ॥ 9.66 ॥

అర్థం - 'విధవ ఎవరితోనూ నియోగం చేయించుకోకూడదు. నియోగం చేయించే వారు సనాతన ధర్మాన్ని పాతిపెడుతున్నారు.' 'ద్విజ విద్వాంసులు నియోగాన్ని జంతుధర్మమని నిందించారు. దీనికి ప్రాచుర్యం వేన మహారాజు పాలన కాలంలో కలిగింది.'

నియోగపద్ధతి చెప్పిన తర్వాత వచ్చిన ఈ ఖండన తరువాతి కాలంలోదే. పద్ధతి మౌలికమూ, దాని ఖండన ప్రతిక్రియగానూ జరుగుతాయి. అందువల్ల ఈ నియోగ వ్యతిరేక వర్ణన మనువు రాసింది కాదు, ఎవరో తర్వాతి కాలంలో ప్రక్షిప్తం చేశారు.

పూర్వం చూపిన ప్రమాణాల వల్ల ఈ పద్ధతి వేదోక్తం కాబట్టి, అతి ప్రాచీనమని రుజువవుతూంది. ఈ శ్లోకాలలో వారు చెప్పిన వేన మహారాజు విషయం తప్పు. కౌటిల్యుదు కూడా తన అర్థ శాస్త్రంలో దీనిని చెప్పాడు. అంటే కౌటిల్యుడి కాలం వరకూ కూడా నియోగ పద్ధతి ప్రాచుర్యంలో ఉంది. గుర్తింపు పొందిందని సారాంశం. కౌటిల్యుదు 60వ ప్రకరణంలో 4వ అధ్యాయంలో కారణం ప్రదర్శన పూర్వకంగా నియోగ పద్ధతిని పేర్కొన్నాడు. అంతేకాకుండా, పై చెప్పిన ఖండన శ్లోకాలు ఈ కింది కారణాల వల్ల ప్రక్షిప్తాలుగా రుజు వవుతున్నాయి.

1. **విషయ వ్యతిరేకాలు-** విషయ సంకేత శ్లోకాల (9.56,103) ప్రకారం, ఇది స్త్రీలకు ఆపద్ధర్మంగా సంతాన ప్రాప్తికి ఉపయోగ పడుతుంది. నియోగ పద్ధతి ఆ విషయానికి సంబంధించిది కాబట్టి అది మౌలికం. ఖండన పూర్వాపర విషయాలకు ఎక్కడా సరిపోవటం లేదు కాబట్టి అది ప్రక్షిప్తం.
2. **పరస్పర వ్యతిరేకాలు-** 9.66-67 శ్లోకాలలో వేనరాజు కాలంలో నియోగ విధానం విస్తారంగా ఉందని చెప్పబడింది. వేనరాజు మనువుకు ఎన్నో తరాల తరువాతి వాడు. అందువల్ల ఈ శ్లోకంలోని వేనరాజు తర్వాత పుట్టిన ఎవరివల్లో ఇది ప్రక్షిప్తంగా మనుస్మృతిలో చేర్చబడింది. వేనుడు అంగ దేశపు రాజు. ఇతని తండ్రి కర్దమ ప్రజాపతి కుమారుడైన

అనంగుడు. ఇతడు మనువు తర్వాత ఎన్నో తరాలు గడిచాక పుట్టినవాడు. (మహాభారతం, శాంతి పర్వం 59.96,99). కాల వ్యతిరేకమనే ఆధారం వల్ల ఈ శ్లోకం మనువు కాలానిదని రుజువు కావడం లేదు.

ప్రక్షిప్తకారుల నిందను అనుసరించి, ఒక వేళ వేనరాజు ద్వారా నియోగ పద్ధతి ప్రారంభమై ఉంటే, లేదా సమకాలీనమని భావించినా, అప్పటికీ, ఈ ఆచారం సృష్టి ప్రారంభమైన తొలియుగాల లోనిదిగా తెలుస్తుందే కానీ, తర్వాతిది కాదు. ఎందుకంటే వేనరాజు చాక్షుష మనువు వంశంలో పుట్టినవాడు.

ఇ. నియోగ పద్ధతి శాస్త్రీయత-ఐతిహాసిక సమీక్ష

క. నియోగ పద్ధతి స్వరూపం-

మనుస్మృతిలో చెప్పిన నియోగ ఆచారం, వైదిక కాలానికి చెందిన సమాజంలో కేవలం **'ఆపద్ధర్మంగా'** సహజంగా స్వీకరించిన ఒక ఆచారంగా ఉండేది. కుటుంబ సుఖం, పూర్ణత, వంశ సంరక్షణ, స్త్రీ సంరక్షణ - వీటి కోసం ఈ ఆచారం పాటించేవారు. ప్రాచీన కాలం నుంచి పురాణ కాలం వరకు, మారిన స్వరూపంతో నేటికీ ఇది కనిపిస్తుంది.

ఐదుగురు పాండవులు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలైనవారు, ఎందరో ప్రాచీన రాజులు, ఋషులు, మునులు నియోగ పద్ధతి వల్ల పుట్టిన వారే. భర్త లేదా భార్య మరణిస్తే, లేదా భర్త లేదా భార్యలకు నయం కాని జబ్బు లుంటే, సంతానం కోసం ఈ పద్ధతిని పాటించేవారు. ఇది కుటుంబ వ్యవస్థను కాపాడే ఉపయోగ కరమైన ఉపాయం. దీనికి ఇంకా ఎన్నో విశేషమైన కారణాలున్నాయి. ప్రాచీన రాజ్యాలలో ఎన్నో యుద్ధాలు జరుగుతుండేవి. వాటిలో లక్షలాది జనం మరణిస్తుండేవారు. ఎన్నో ప్రాణాంతక వ్యాధుల వల్ల కుటుంబాలకు కుటుంబాలే నశిస్తుండేవి. అలాంటి పరిస్థితులలో గృహస్థు లేదా స్త్రీ - హితం జరగటానికి, వేరే ఏ విధమైన ఉపాయమూ ఉండేది కాదు. వైదిక మర్యాదలలో బహు వివాహాలు నిషేధించారు. పైగా వితంతువులకు మళ్లీ పెళ్లి జరగటం అసంభవం ! అలాంటి అరాజక స్థితిలో స్త్రీలు సంతానం లేకుండా ఒంటరిగా ఉండవలసి వచ్చేది.అలాంటి ఆపత్కాలంలో ఈ ఆచారాన్ని గణించవలసిందే, మామూలు పరిస్థితుల్లో కాదు. ఎందుకంటే ఇది సామాన్య స్థితిలో పాటించవలసిన ఆచారం కాదు.

కొందరు నియోగ పద్ధతిని గురించి విని కనుబొమలు ముడివేస్తారు. అలాంటివారు ఏదైనా చర్చించే ముందు సామాజిక, మనో వైజ్ఞానిక, చరిత్రలను కాస్త ఆలోచించాలి. ఆ ఆచారం ఏ సమాజంలో ప్రాచుర్యంలో ఉందో, అప్పుడు అక్కడ కొందరు అసహ్యించుకున్నా, దాన్ని సహజంగానే భావించేవారు. హిందువులు, ఈశాన్య ప్రాంతాలలో, శివ లింగం - యోని పూజలు, జైనులు, నాగ సాధువులు పూర్తి నగ్నంగా ఉండే అసభ్య ఆచారాన్ని కూడా ఆ విధంగానే ద్వేషించేవారు ఉన్నా, మరి కొందరు సహజంగానే భావించేవారు. వారికి అవి మామూలుగా అనిపించినా, ఆలోచిస్తే సభ్య సమాజానికి అవి అత్యంత అసభ్యమూ, అసహ్యించు కోవలసినవీ అనిపిస్తుంది. అదే విధంగా ఒకప్పుడు నియోగపద్ధతి పెళ్లి లాగా సమాజం అంగీకరించిన, సహజమైన, గౌరవించదగిన ఆచారంగానే ఉండేది. నేటికీ ఏదో ఒక రూపంలో చాలా సమాజాలలో జరుగుతూనే ఉంది. అంతే కాదు, మానవ సమాజం ఉన్నంతకాలమూ ఇది ఉంటుంది.

ఖ. యూరప్, బైబిల్‌లలో అనివార్యమైన నియోగ పద్ధతి-

ఏ యూరపు సంస్కృతి, ప్రవర్తన, ఆచార వ్యవహారాలు, ఆహార పానీయాలు మొదలైన వాటిని అనుకరిస్తూ, ప్రశంసిస్తూ, మహా గొప్పగా భావిస్తున్న నేటి ఎక్కువ మంది భారతీయులు తెలుసుకోవలసిన దేమిటంటే, అక్కడ నేటికీ నియోగపద్ధతి అమలులో ఉందని. వీర్య బ్యాంకులను స్థాపించి కృత్రిమ గర్భాధానం ద్వారా నచ్చిన రూపం, గుణాలు ఉన్న సంతానాన్ని పొందుతున్నారు. అద్దె తల్లుల ద్వారా సంతానం పొందటం చట్ట రీత్యా అంగీకృతం, సమాజమూ అంగీకరించింది. వివాహాలు కాకుండానే యువతులు పిల్లలను కంటున్నారు. ఒక బిడ్డ ఒకడి సంతానమైతే, ఇంకొక బిడ్డ ఇంకొకడి సంతానం. ధనం లభిస్తుందన్న ఆశతో యూరపులో ప్రచారంలో ఉన్న **'అద్దె తల్లుల'** పద్ధతి నేడు మనదేశం

ట్రోక్కీ వచ్చింది. అక్కడ శారీరక సంబంధాలకు పూర్తి స్వాతంత్ర్యం ఉంది. అందరూ అసహ్యించుకు 'సమ లైంగిక వివాహాలు' నేడు మొత్తం యూరపులో చట్ట బద్ధమైంది. కానీ మానవుల కిది జంతువుకన్నా హీనావస్థ ! అయినా అక్కడి సమాజంలోనూ, మన భారతీయ సమాజంలోనూ ఈ పద్ధతులు సహజమేనని అంగీకరించారు. మనం వాటిని గురించి ఆలోచించకుండా, వారి సంస్కృతి గొప్పదని అటు వైపు మొగ్గుతున్నాం కానీ, మన దేశంలో నియోగపద్ధతి కేవలం సంతాన ప్రాప్తికోసన అపద్ధర్మంగానూ, వ్యక్తిగత ఇష్టం మీద, సమాజం సమ్మతితోనే జరిగేది. అందులోనూ ఉపకార భావన, మర్యాదా పూర్వకమైన పద్ధతి ఉండేవి. పైన చెప్పిన యూరోపియ విషయాలలోనూ మనకు అది అసహజం కాదని అనిపించవచ్చు. అందువల్ల, నియోగ పద్ధతిని ఆపద్ధర్మంగానూ, సహజసమ్మతమైన ఆచారంగానూ గ్రహించవలసిన అవసరం ఉంది.

యూదులు, క్రైస్తవులు తమ ధర్మ గ్రంథంగా భావించే బైబిలులో ఎన్నోచోట్ల అనివార్యమైన నియోగ పద్ధతిని గురించి ఉంది. దీన్ని బట్టి ప్రాచీన కాలంలో ఈ పద్ధతి ప్రపంచ వ్యాప్తంగా ఉండేదనీ, ధర్మ బద్ధంగా అంగీకృత మైనదనీ తెలుస్తున్నది.బైబిలులో నియోగ పద్ధతి అనివార్యమని భావించారు. మన దేశంలో అది వ్యక్తుల ఇష్టాన్ని బట్టి ఐచ్ఛికం. బైబిలు నుంచి కొన్ని ప్రమాణాలు, ఉదాహరణలు చూడండి –

1. బైబిలులో నియోగాన్ని గురించి ఇలా ఉంది – పరమేశ్వరుడి దృష్టిలో దుష్టమైనది. అందుకనే పరమేశ్వరుడు దాన్ని, వాడిని చంపాడు. అప్పుడు యహూదాహా ఓనాన్ (ఏరో తమ్ముడు) తో **"నీ అన్న భార్య వద్దకు వెళ్లు. ఆమెతో దేవర ధర్మం పూర్తి చేసి దానితో నీ అన్న వంశాన్ని ముందుకు నడుపు"** అంటాడు (ఉత్పత్తి, పర్వం 38.7.8).
2. ఆయత ఖండం 24లో సరః (సారా) యూదుల, క్రైస్తవుల, ముసల్మానుల మూల మాతగానూ, ఆమె భర్త ఇబ్రాం (ఇబ్రాహిం) మూల పితగానూ భావించబడ్డారు. సారా పెద్ద కష్టంలో ఉండగా ఒక పైగంబర్ ద్వారా నియోగజుడు–నియోగం వల్ల పుత్రుడు పుట్టాడు. అతని పేరు ఇసహాక్. దాన్ని గురించి బైబిల్‌లో ఏముందో చూడండి – **"నియమ సమయంలో అంటే వసంత ఋతువులో నేను నీ వద్దకు మళ్లీ వస్తాను. సారాకు పుత్రుడు కలుగుతాడు."** (ఉత్పత్తి, పర్వం 1.8.24). **"తాను చెప్పినట్లు పరమేశ్వరుడు సరఃను కలిశాడు. తాను చెప్పినట్లుగా సరః విషయంలో చేశాడు. సరః గర్భిణి అయింది."** (ఉత్పత్తి, పర్వం 21.2).
3. బైబిల్‌లోని ఈ నియోగం అనివార్యమూ, కఠోర పద్ధతి కూడా. దీనికి ఎందరో టీకాకారులు 'నియోగం' అనే పేరు పెట్టారు.– **"పలువురు అన్నదమ్ములు కలిసి ఉన్నప్పుడు, వారిలో ఒకడు సంతాన హీనుడుగా మరణిస్తే, అతని భార్యను ఇతర గోత్రాల వారికి ఇచ్చి పెళ్లి చేయకూడదు. ఆమె భర్త సోదరుడు ఆమె వద్దకు వెళ్లి ఆమెను తన భార్యగా చేసుకుంటాడు. వారికి పుట్టిన తొలిబిడ్డ, మరణించిన ఆమె భర్త బిడ్డ అవుతాడు. ఆమె భర్త సోదరుడు ఆమెను నియోగ పద్ధతిలో కూడకపోతే, ఆమె నగర వీథులలోని వృద్ధుల వద్దకు వెళ్లి, నా భర్త సోదరుడు ధర్మపాలన చేయటం లేదు అని చెప్పాలి. అప్పుడు ఆ నగరంలోని వృద్ధులు అతన్ని పిలిచి వివరించి, అతను కనుక తన పట్టుదల మీదే ఉంటే, ఆ అందరి ముందూ ఆమె అతని కాలి చెప్పును ఊడదీయించి, అతని ముఖంపై ఉమ్మాలి. అప్పుడు ఇస్రాయెల్‌లో అలాంటి వాడికి నిందా బోధకుడు అనే పేరు వస్తుంది. అది చెప్పు విప్పించిన వాడి వంశం"** అవుతుంది. (వ్యవస్థ వివరణ, పర్వం 25, ఆయతం 5–10).

ఈ ప్రమాణాలు, ఉదాహరణలతో మరిదితో నియోగం, మరిదితో వివాహం జరిపించే సంప్రదాయాలు యూదులు, క్రైస్తవులలో తప్పనిసరి అనీ, బైబిల్‌లో చెప్పబడిందనీ తెలుస్తూంది. ఈ రెండిటి తేడానూ పాఠకులు గ్రహించాలి. ఎవరైనా పురుషుడు అన్యస్త్రీ వల్ల సంతానం పొందితే, ఆ సంతానం ఆ స్త్రీ, ఆమె భర్త వంశపు సంతానంగా చెప్పబడుతుంది. ఇది 'నియోగం'. ఆ నియోగం చేసిన వాడి వంశపు సంతానంగా చెప్పబడితే, దాన్ని 'పునర్వివాహం' అంటారు. ఇలాంటి

ఆచారాలు విశ్వవ్యాప్తంగా ఉండేవి; ఉన్నాయి. ఈ ఆచారాలు ఏ రూపంలో ఉన్నా, సమాజానికి మనిషి అవసరం ఎప్పుడూ ఉంటూ వచ్చింది. నేటికీ ఉంది, భవితలోనూ ఉంటుంది. కాని నియోగం విషయంలో భారతీయ సంప్రదాయపు వివేచన కలవారు, 'బైబిల్', 'యూదుల', 'క్రైస్తవుల సమాజాల' ను గురించి ఎంత మాత్రమూ ఆలోచించరు. బైబిల్‌లో చెప్పిన నియోగమే వారికి స్వీకరించ దగింది అవుతుందా? మనుస్మృతిలో చెప్పింది మాత్రం అంగీకారానికి యోగ్యం కాదా?

గ. ప్రాచీన కాలంలో భారతదేశంలో నియోగ ఆచారం

1. నియోగం అనేది అప్పటివిధానమని చెప్పలేము, అది కేవలం మనుస్మృతి ద్వారానే తెలిసింది. సాయణాచార్యుడు ఋగ్వేద భాష్యంలో **"ఉదీర్ష్వనార్యభి"** (10-18.8) అనే మంత్రానికి భాష్యంలో నియోగవిధానాన్ని చెప్పాడు. **"కుహ స్వి ద్దోషా కుహ...."** (ఋగ్.10.40.2) భాష్యంలో విధవకు దేవరునితో నియోగవిధానాన్ని చెప్పాడు - **"శయుత్ర = శయనే, విధవేవ = యథా మృత భర్తృకా నారీ, దేవరమ్ = భర్తృ భ్రాతరమ్ అభిముఖీ కరోతి...."**= భర్త మరణం తర్వాత, విధవ మరిది (పతి సోదరుని)తో లేదా మరొక వ్యక్తితో సంభోగిస్తుంది (నియోగం వల్ల సంతానం పొందుతుంది). వారి **"ఋగ్విధానం"**లోనూ నియోగ పద్ధతి ఉంది. (అ.3, 44-45 శ్లోకాలు) ఇది దుర్గాచార్యుని అభిప్రాయం. సారాంశ మేమిటంటే మధ్యయుగపు భాష్యకారులు కూడా నియోగం వేదాలలో ఉందని భావించడం.
2. నియోగ పద్ధతి వేదాలలో నుంచి పురాణాలలోనూ వచ్చింది. దీని చరిత్ర రామాయణం, మహా భారతం, స్మృతులు, పురాణాలలోనూ లభిస్తుంది. ఎందుకంటే అప్పటి సమాజం దీన్ని స్వీకరించడం సహజ పద్ధతిగా జరిగింది. వశిష్ఠ స్మృతి అ.18లో నియోగ పద్ధతి ఉంది. భాగవత పురాణంలో నియోగ సంతానపు వివరణ ఉంది. వైదిక కాలపు రాజు **పృషదశ్వుడి** పుత్రుడు **రథీతరుడు** సంతానం లేకపోవటం చేత అంగిరస మహర్షి నియోగంతో పుత్రుణ్ని పొందాడు. అతనికి **'ఆంగిరసుడు'** అని పేరు. కల్మాష పాదుడు అనే రాజు తన రాణి **మదయంతికి** వశిష్ఠ మహర్షి నియోగంతో సంతానం పొందాడు. (స్కంధం.9.అ.9). బలికి సంతానం లేకపోతే, అతని **భార్య సుదేష్ణ** దీర్ఘతమ ముని నియోగంతో పుత్రుణ్ని పొందింది. వాల్మీకి రామాయణం ప్రకారం, కేసరి - అంజన దంపతులకు పుట్టిన హనుమంతుడు నియోగ పుత్రుడు. దేవతల సముదాయంలోని ఒక వాయు వంశీయు (వాయు దేవుడు)ని పుత్రుడు. యుద్ధ. 30.22,25; ఉత్తర 35.19,20) ఇదే విధంగా వాలీ సుగ్రీవులు కూడా క్రమంగా ఇంద్రుడు, సూర్యుడు - వీరి నియోగ పుత్రులే. (వా.రామా.బాలకాండ 17.10). మహాభారతం, ఆ తర్వాతి అన్ని పురాణాలలోనూ నియోగాన్ని పదే పదే పేర్కొన్నారు. పరశురాముడు పలువురు రాజులను సంహరించిన తర్వాత, ఆ క్షత్రియుల విధవలు బ్రాహ్మణుల నియోగంతో సంతానం పొందారు. (మహాభారతం ఆది పర్వం 104,177).
3. **'గౌతమ ధర్మ సూత్రం'**లో జీవించి ఉన్న భర్త అసమర్థుడైతే లేదా భర్త మరణిస్తే అతని భార్య మరిది నియోగంతో సంతానం పొందవచ్చు. (18.4.14). **'బౌధాయన ధర్మసూత్రం'**లో విధవకు రోగిష్ఠి, నపుంసకుడైన పతికి, నియోగంతో పుట్టిన పుత్రుడు **'క్షేత్రజ్ఞుడు'** అని చెప్పబడింది (1.68-69). **'కౌటిల్యుడి అర్థ శాస్త్రం'**లో చాణక్యుడు పుత్రులు లేని రాజు భార్యకు, బ్రాహ్మణుడి యొక్క సంతానం లేని భార్యకు సమాన గుణాలున్న వ్యక్తి నియోగంతో సంతానం పొంద వచ్చునని రాశాడు (1.17; 3.6 మొదలైనవి). **'నారదస్మృతి'**లో కూడా నియోగంతో ఇద్దరు పుత్రులను పొంద వచ్చునని నిర్దేశించబడింది (స్త్రీ-పుంస.80-83).

మనుస్మృతి కాకుండా **'వశిష్ఠ ధర్మసూత్రం'**లో ఒక ఆధారం ద్వారా, నియోగ ప్రక్రియను అర్థం చేసుకోవలసి ఉందని తెలుస్తూంది. కన్యకు వివాహం చేయటం ఏ విధంగా ఆమె సంరక్షకుడి కర్తవ్యమో, అదే విధంగా, నియోగం

జరిపించడం కూడా వారి బాధ్యతే అవుతుంది. ప్రమాణం చూడండి -**"ఊర్ధ్వం షడ్భ్యోమాసేభ్యః స్నాత్వా..... విద్యాకర్మ గురుయోని సంబంధాన్ సంనిపాత్య పితా భ్రాతా చ నియోగం కారయేత్"** (17.56-65). అంటే - **'భర్త మరణించిన ఆరు నెలలకు స్నానాదులతో శుద్ధమై స్త్రీ తన తండ్రి, సోదరుడు, గురువు, పురోహితుడు, చుట్టాలను సమావేశ పరచి, వారి అనుమతితో నియోగం చేయించుకోవాలి.'** ఇలాంటి నియోగం, పెళ్లితో సమానంగా, సహజ సామాన్య సామాజికకుటుంబ వ్యవహారంగా ఉండేది. దీన్ని చాలా క్రమశిక్షణతోనూ, సంయమనంతో కూడిన మర్యాద పూరిత విధిగానూ అంగీకరించారు. నియోగం ద్వారా సంతానం పొందిన తర్వాత, ఆ స్త్రీ పురుషుల మధ్య వ్యవహారం మునుపటి లాగే ఏ సంబంధమూ లేనిదిగా ఉండాలి. లేకపోతే వారిని దండన పొందే అపరాధులుగా భావించేవారు. (నారదీయ స్మృతి, స్త్రీ-పుంస. 84-85; మను. 9.58 మొ॥). ఎక్కువ మంది శాస్త్రకారుల అభిప్రాయమేమిటంటే, నియోగం ద్వారా ఒకరిద్దరు పిల్లలను మాత్రమే పొందాలని. ఎలాగంటే - **"ఏకముత్పాదయేత్పుత్రం న ద్వితీయం కథంచ న"** (ఋగ్విధానం. 3.45); **"ద్వితీయ మేకే ప్రజననమ్"** (మను. 9.61) = ఇద్దరిని పొందవచ్చు, **"నాతి ద్వితీయం"** గౌతమ ధర్మ సూత్రం 18.8 = ఇద్దరి కంటే ఎక్కువ సంతానం పొందరాదు. ఇద్దరు సంతానమే అనే విషయంలో యాజ్ఞ వల్క్యస్మృతి (1.68-69), నారద స్మృతి (స్త్రీ - పుంస. 80-83), బౌధాయన ధర్మసూత్రం (2.268-70), కౌటిల్యుడి అర్థశాస్త్రం(1-17) ఏకీభవిస్తున్నాయి. వారు మరణించిన తర్వాత మళ్లీ ఇతరుల నియోగంతో సంతానం పొందవచ్చు కానీ, జీవించి ఉండగా కాదు.

4. **'వాల్మీకి రామాయణం'**లో చాలా చోట్ల హనుమంతుణ్ని **'వాయు పుత్రుడు'** అన్నారు. దానికి కారణం, వివరణ ఈ శ్లోకంలో ఉన్నాయి -

సూర్యదత్తవరస్వర్ణః సుమేరుర్నామ పర్వతః ।
యత్ర రాజ్యం ప్రశాస్త్యస్య కైసరీ నామ వై పితా ।
తస్య భార్యా బభూవేష్టా అఞ్జనేతి పరిశ్రుతా ।
జనయామాస తస్యాం వై వాయురాత్మజముత్తమమ్ ॥ ఉత్తరకాణ్డ 35.19-20

అర్థం- 'సూర్యకాంతి పడటం చేత దేని స్వరూపం బంగారుమయం అవుతుందో, అలాంటి సుమేరువు అనే పర్వతం ఉంది. అక్కడ కేసరి అనే రాజు పాలిస్తున్నాడు. అతని ప్రియ భార్య అంజనా దేవి. ఆమెకు దేవ వంశీయుడైన వాయు దేవుడి నియోగంచేత హనుమంతుడు పుట్టాడు.

5. వ్యాస మహర్షి, తల్లి సత్యవతి ఆదేశంపై నిర్ధారించిన విధంగా 'నియోగ' పుత్రులను పుట్టించాడు. ఆ వివరాలు మహా భారతంలో ఇలా ఉన్నాయి -

తతోఽమ్బికాయాం ప్రథమః నియుక్తః సత్యవాగృషిః ॥4॥
సాపి కాలేన కౌసల్యా సుషువేఽన్ధం తమాత్మజమ్ ॥13॥
తతస్తేనైవ విధినా మహర్షిస్తామపద్యత....అమ్బాలికమ్.... ॥14॥
తతః కుమారం సా దేవీ ప్రాప్తకాలమజీజనత్ పాణ్డుం... ॥21॥
తతః కుమారం సా దేవీ ప్రాప్తకాలమజీజనత్ పాణ్డుం... ॥21॥
తతః స్వైర్భూషణైర్దాసీం భూషయిత్వాప్సరోపమామ్ ।
ప్రేషయామాస కృష్ణాయ..... ॥24॥
ధర్మాత్మా భవితా లోకే సర్వబుద్ధిమతాం వరః ॥27॥

స జజ్ఞే విదురో నామ కృష్ణద్వైపాయనాత్మజః ।
ధృతరాష్ట్రస్య వై భ్రాతా పాణ్డోశ్చైవ మహాత్మనః ॥28॥ (ఆదిపర్వ. అ. 105)

అర్థం - 'మాత సత్యవతి వ్యాస మహర్షిని ముందు అంబికకు నియోగం చేయమని చెప్పింది. ఆమెకు అంధుడైన ధృతరాష్ట్రుడు పుట్టాడు. అదే, నియోగ పద్ధతి చేత వ్యాస మహర్షి అంబాలికకు పాండురాజు పుట్టేలా చేశాడు. ఈ విధంగా కృష్ణ ద్వైపాయన వ్యాసుడు ధర్మాత్ముడు, బుద్ధిమంతుడూ అయిన శ్రేష్ఠుడు **విదురుణ్ణి** దాసికి అనుగ్రహించాడు; ఇతడు ధృతరాష్ట్రుడు, **పాండురాజుల** అనుజుడు.'

మహాభారతంలో ఐదుగురు పాండవులనూ నియోగ పుత్రులనే అంటారు. పాండురాజు సంతానం కలిగించడంలో అసమర్థుడై తన భార్య కుంతికి స్వయంగా ఇలా ఆదేశించాడు -

తస్మాత్ ప్రహేష్యామ్యద్య త్వాం హీనః ప్రజననాత్ స్వయమ్ ।
సదృశాత్ శ్రేయసో వా త్వం విద్ధ్యపత్యం యశస్విని ॥ (ఆదిపర్వ. 119.37)
అహ్వయామాస వై కున్తీ గర్భార్థే ధర్మమచ్యుతమ్ ॥ 1 ॥ (ఆదిపర్వ. 112 అధ్యాయ)
సా తం విహస్యమానాపి పుత్రం దేహ్యబ్రవీదిదమ్ ॥ 4 ॥
సంయుక్తా సా హి ధర్మేణ యోగమూర్తిధరేణ హ ।
లేభే పుత్రం వరారోహా సర్వప్రాణభృతాం హితమ్ ॥ 5 ॥

అర్థం - 'పాండురాజు తన భార్య కుంతిని పిలిచి నేను సంతాన ఉత్పత్తికి అసమర్థుణ్ని కాబట్టి, నీవు ఎవరైనా నాతో సమానుడూ, ఉత్తమ స్థాయికి చెందిన వ్యక్తి నుండి సంతానం పొందు' అని ఆదేశించాడు. కుంతి సంతానం కోసం ధర్మదేవుడనే ధర్మ వంశీయ వ్యక్తిని ఆహ్వానించింది. అతనిని తనకు పుత్రుడిని ప్రదానం చేయమని ప్రార్థించింది. యోగులవంశానికి చెందిన ధర్మదేవుడిని నియోగంతో కుంతి అందరికీ హితం చేసే **యుధిష్ఠిరుడు** అనే పుత్రుణ్ణి పొందింది. తరువాత వాయుదేవుడనే లేదా ఒక వాయువంశజుడి నియోగంతో **భీముణ్ణి**, ఇంద్రదేవుడనే దేవసముదాయానికి చెందిన వ్యక్తి నియోగంతో అర్జునుణ్ణి పొందింది. (ఆదిపర్వం 122.12-14, 28-34). ఇదే విధంగా మాద్రి కూడా భర్త, పెద్ద రాణి కుంతి అనుమతి మీద అశ్విన్ వంశీయులైన ఇద్దరి నియోగంతో **సకుల సహదేవులను** పొందింది(ఆది. 133.16-17).

పై ఉదాహరణల విషయంలో నియోగ పద్ధతి మర్యాదను గురించి విశ్లేషించడం మేలవుతుంది. వ్యాస మహర్షి తల్లి సత్యవతి ఆదేశంపై ఆమె కోడళ్లకు, విచిత్రవీర్యుడి రాణి అంబికతో నియోగపద్ధతిలో ధృతరాష్ట్రుణ్ణీ, రెండో రాణి అంబాలికకు పాండు రాజును, దాసికి విదురుణ్ణి పుట్టించాడు. వ్యాసుడు వారితో మళ్లీ నియోగాన్ని పాటించలేదు. అంతే కాదు, ఆ రాణులు కూడా అన్య పురుషుల నియోగాన్ని మళ్లీ కోరలేదు. ఈ కారణం చేతనే ఈ ప్రాధాన్యం గల విషయాన్ని పాఠకుల ముందు పెట్టాలనుకుంటున్నాను. హస్తినాపుర రాజవంశంలో వారసుడు లేని పరిస్థితి ఏర్పడినందువల్ల, వారసుణ్ణి పొందాలనే ఆలోచన కలిగింది. రాజమాత సత్యవతి ముందు అంబికకు నియోగం చేయించింది. ఆమెకు గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు జన్మించడంతో, ఆ తర్వాత రెండో నియోగం అంబాలికకు చేయించింది. ఆమెకు కూడా పాండురోగం గల పాండురాజు పుట్టడంతో, రాజమాత సత్యవతిదేవి, మళ్లీ మొదటి కోడలు అంబికను నియోగం చేయించుకోమని కోరింది. ఆమెకు ఆ నియోగంపట్ల ఆసక్తి లేకపోవడం చేత, ఆమె ఆ రాత్రి దాసిని తన బదులుగా తన నియోగానికి పంపించింది. ఆమెకు విదురుడు పుట్టాడు. ఈ నియోగం ఒకేసారి జరగలేదు. ఒకదాని తర్వాత ఒకటిగా జరిగింది. తొలి పుత్రులు అనారోగ్యంతో ఉండటం వల్ల. (మహా భారతం. ఆది పర్వం. అ. 105) ఇక్కడ పాఠకులకు మరొక సత్యం కూడా చెప్పవలసి

ఉంది - రాజమాత సత్యవతి ముందు భీష్ముణ్నే నియోగం చేయమని ఆదేశించింది. ఆజన్మ బ్రహ్మచర్య వ్రతదీక్షలో ఉన్నాడు కాబట్టి, భీష్ముడు తిరస్కరించాడు. (మహాభారతం.ఆది.పర్వం.103-104). ఇష్టం ఉన్న స్త్రీ పురుషులే నియోగానికి పూనుకునేవారని దీని వల్ల స్పష్టమవుతూంది.

వాల్మీకి రామాయణంలో కేసరి రాజు భార్య అంజనా దేవికి దేవసముదాయానికి చెందిన ఎవరో వాయువంశీయుడైన (వాయుదేవుడు) వ్యక్తి నియోగం ద్వారా **హనుమంతుడికి** జన్మ నిచ్చాడు. (ఉత్తర కాండ.13.14-49) ఆ తర్వాత ఆమె నియోగం చేయించుకోలేదు. పాండురాజు రెండో భార్య మాద్రి దేవజాతికి చెందిన అశ్విన్ వంశీకులైన ఇద్దరు పురుషుల వల్ల నియోగం ద్వారా ఇద్దరు పుత్రులను పొందింది. దీనికి రెండు ప్రత్యేకమైన కారణాలున్నాయి. 1. పాండు రాజు కుంతిని ఎక్కువమంది సంతానాన్ని పొందుమని పదే పదే ఆదేశించాడు. ఎందుకంటే క్షత్రియులకు సంతానమే వారి బలం (మహా భారతం, ఆది.122.11). 2. కుంతి చదువుకున్న ధర్మ శాస్త్రం ప్రకారం ముగ్గురు పుత్రులు పుట్టే వరకు నియోగ పద్ధతిని ఆచరించవచ్చు. ముగ్గురి తర్వాత కూడా పాండురాజు పుత్రులను పొందుమని అడగటం వల్ల, కుంతి ముగ్గురికంటే నియోగం ద్వారా పుత్రులను పొందటం శాస్త్ర విరుద్ధమని చెప్పింది. (122.76-78). ఆ తర్వాత సంతానం పొందే స్త్రీ **'స్వేచ్ఛా విహారిణి'** (స్వైరిణి) **'వ్యభిచారిణి'** గా పిలువబడుతుంది- **'నాతశ్చతుర్థం ప్రసవమాపత్స్వపి వదంత్యుత'** (122.77) = మునుపటి సంతానం ఉండగా నాలుగో పుత్రుణ్ని పొందటం నియోగ శాస్త్రాలలో ఆపద్ధర్మంగా కూడా పనికిరాదు. అప్పుడు పాండురాజు మౌనం వహించి, ఆ పైన - **'ఏవ మేతద్ ధర్మ శాస్త్రం"** (122.78) = **"అవును. నీవు చెప్పిందే ధర్మశాస్త్రమూ చెబుతున్నది"** అంటాడు. కుంతీ దేవి ముగ్గురు పుత్రులను ముగ్గురు వ్యక్తుల వల్ల పొందింది, ఒకరి వల్లనే కాదు. దీనివల్ల, నియోగ పద్ధతిలోనూ ఒక నిర్దిష్టమైన వ్యవస్థ ఉందని తెలుస్తూంది. అందులో ఎక్కడా స్వేచ్ఛగానూ, కాముకతతోనూ లేదా జంతు ధర్మపు ఆచరణ లేదు.

నియమాలతో పాటు మినహాయింపులూ ఉంటాయేమో ! వాటి కారణాలు చెప్పటానికే ఈ చర్చంతా. దైత్య వంశంలో ప్రహ్లాదుడి మనవడూ; విరోచనుడి పుత్రుడూ అయిన బలి ప్రసిద్ధ రాజు. అంధుడైన దీర్ఘతమసుడి నియోగంలో తన భార్య సుదేష్ణ ద్వారా ఐదుగురు పుత్రులను పొందారు. ఇక్కడ కూడా బలికి అధికసంతానం కావాలనే దీర్ఘతమసుడిని కోరాడు. (హరి వంశం.1.32), విష్ణుపురాణం 4.18; భాగవతపురాణం 9.20; బ్రహ్మాండపురాణం 1.3). దైత్యపరంపరలో ఈవంశ మొక్కటే ఇట్లా ప్రత్యేకంగా ఉన్నది కాబోలు.

6. వైదిక సాహిత్యంలో సత్యకామ జాబాలుడి వృత్తాంతమూ ప్రసిద్ధమే. అతడు సహజంగా నియోగం వల్ల పుట్టిన వాడే కాని, అక్రమ సంతానం కాదు. పుత్రప్రాప్తి కోసం సేవాకార్యంలో నిమగ్నమైన అతని తల్లికే తెలియదు అతడు ఎవరి నియోగంతో పుట్టాడో. అందువల్లనే గురువు అడిగినప్పుడు ఆమె నేను పిల్లవాడి గోత్రం చెప్పలేను అని సత్యమే చెప్పింది. దీనివల్ల ఆ సమయంలో నియోగంతో సంతానం పొందడం క్రమపద్ధతే, గౌరవనీయమే అయినప్పుడు, అతని తల్లి అక్రమసంతానాన్ని ఎందుకు పొందుతుంది? అనే విషయం స్ఫురుస్తుంది. ఛాందోగ్య ఉపనిషత్తులోని ఈ ప్రకరణంలో అతని తల్లి 'కొడుకు పుట్టాడు' అనలేదు, **"త్వాం - అలభే"** = పుత్రుణ్ని కోరి నిన్ను పొందాను - అన్నది. ఆ కాలంలో దానికి మార్గం నియోగ పద్ధతే (ఛాందోగ్య ఉప.4.4.2-5).

పాఠకులు, బైబిలు, భారతీయ కథలలోని వర్ణనలలో ఇలాంటి సహజత్వమును గమనించాలి. నియోగ విషయంలో ఎలాంటి అసహజతా, అపరాధభావం, కాముకత, లజ్జ లేదా మర్యాద లేనితనం ఉండేవి కావు. వ్యవహారమంతా ఎంతో సామాన్యంగా ఉండేది. ఇలాంటి పుత్రులు పుట్టడం వల్ల కుటుంబం, సమాజంలో సంబరాలు చేసుకున్నట్లు కూడా వర్ణన లున్నాయి. **బైబిల్‌లో అయితే నియోగం చట్టబద్ధంగా అనివార్యమని ప్రకటించబడింది. వైదిక సంప్రదాయంలో అది జనం ఇష్టం మీదా, స్త్రీ పురుషుల ఇష్టం మీదా ఆధారపడి ఉండేది.**

ఘ. భారతదేశంలో నేటికీ నియోగపద్ధతి ఉంది

యూరోపులో ప్రసిద్ధిలో ఉన్న నియోగపద్ధతులన్నీ భారతదేశంలోనూ ఉన్నాయి. అద్దెతల్లి 'సరోగేట్ మదర్) అయ్యే స్త్రీల సంఖ్య కూడా ఇక్కడ లక్షలలో ఉంది. ఇదొక వ్యాపారంగా మారింది. స్త్రీలు 8-10 లక్షల రూపాయల వరకూ తీసుకుని సంభోగం ద్వారా లేదా వీర్య స్వీకరణ ద్వారా ఏ పురుషుడికైనా సంతానాన్ని కనిస్తున్నారు. ఇది నియోగ పద్ధతి యొక్క నికృష్ట రూపం ! ప్రాచీనభారతదేశంలో నియోగం కేవలం సంతానం పొందే పవిత్రమూ, మానవీయమూ అయిన భావనలతో జరిగేది. ఇవాళ ఎక్కడ పదితే అక్కడ విశేష గుణాలున్న యువకుల లేదా వ్యక్తుల నుండి వీర్యాన్ని కొనుగోలు చేసి దాచే వీర్య బ్యాంకులు తెరుస్తున్నారు. కావాలనుకున్న స్త్రీలు కృత్రిమ గర్భాధానంతో నచ్చిన గుణాలు గల సంతానాన్ని పొందుతున్నారు. దీన్ని చట్టబద్ధం చేసే బిల్లు త్వరలోనే రాబోతున్నది. ఇందులో ఒక స్త్రీ తన సంతానం కాకుండా, అద్దె గర్భంతో ఎందరికైన జన్మనిచ్చే పద్ధతికి చట్టబద్ధమైన గౌరవం కలుగబోతూంది. నియోగాన్ని విమర్శించేవారు ఈ కొత్త పద్ధతిని ఎప్పుడైనా వ్యతిరేకిస్తారా? వారు జంతువుల కంటే పతనమైన 'సమ లైంగిక సంబంధం', యువతీ యువకులు పెళ్లి కాకుండానే కలిసి ఉండే పద్ధతినే 'లివిన్ టు గెదర్' వ్యతిరేకించడం లేదు. రాజస్థాన్‌లో సాంప్రదాయికంగా వస్తున్న 'నత ఆచారం' నియోగపద్ధతే !"

జ. మానవ సమాజానికి నియోగ పద్ధతి అపరిహార్యమా?

ప్రతి దంపతులకూ సంతానం కావాలి అనేది నైసర్గికమూ, వైజ్ఞానికమూ అయిన నిజం. సంతానం కలగకపోతే, కనిపించిన ప్రతి మంచి చెడు మార్గాలనూ, చివరికి అందరూ అసహ్యించుకునే 'ఇతరుల పిల్లలను బలి ఇవ్వటం' కూడా చేస్తారు. దీని కోసమే ధర్మశాస్త్రాలు వివాహ వ్యవస్థను ఏర్పరచాయి. వివాహం తర్వాత కూడా, దంపతులలో ఏ ఒక్కరికి చావు, నపుంసకత్వం, దీర్ఘవ్యాధులు, ఇంకేదైనా కారణం చేత సంతానం కలగకపోవటం జరగవచ్చు. గృహస్థులు ఈ లోపాన్ని పూరించు కోవాలనుకుంటారు. దీని కోసం ఈ విశాల ప్రపంచంలో ఎన్నో పద్ధతులు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఎక్కువ మందిని పెళ్లాడటం, మళ్లీ పెళ్లి, నియోగం వంటివి. వీటిని అంగీకరించనివారు, చాటుమాటుగా స్వేచ్ఛాచరణ అంటే వ్యభిచారం జరుపుతారు. అనేకులను పెళ్లాడటం, మళ్లీ పెళ్లి – వీటిలో ఎన్నో రకాలైన సమస్యలు ఉన్నాయి. అందుకని వైదిక సంస్కృతీ సభ్యతలు పాటించే సమాజం అన్నిటి కంటే తక్కువ సమస్యలు గల లేదా ఆపదలు లేని నియోగ పద్ధతిని అంగీకరించింది. సమాజంలో వివాహితులై సంతానం లేనివారికి మరొక మార్గం లేకపోతే, ఆ చోట వ్యభిచారం, అవ్యవస్థ, మర్యాదాహీనత పెరుగుతాయి. వీటివల్ల కలిగే దుష్పరిణామాలు అధిక ప్రమాదకారులు అవుతాయి.

పైన చెప్పుకున్నట్లుగా నియోగ పద్ధతి అనేది మానవ సమాజంలో తొలగించలేని ఆచారం. ఇది సహజమైనది. నేటికీ ఉంది. మానవ సమాజం ఉన్నంత వరకూ ఉంటుంది – కానీ రూపాలు మార్చుకుంటుంది. మనిషి కోరిక కేవలం సంతానప్రాప్తి ఒకటే కాదు, సుగుణాలు గల సంతానం పొందాలనేది పాఠకులు గమనించవలసి ఉంది. దానికి ఏకైక ఉపాయం ఎలాంటి రూపంలో వ్యవహారంలో ఉన్నప్పటికీ, అది నియోగపద్ధతే. నియోగానికి ఆధారభూతమైన సిద్ధాంతం ప్రారంభంలోనిదే నేటికీ ఉంది. ఇవాళ ప్రపంచమంతా, భారతదేశంలోనూ **'కిరాయి తల్లి'** (సరొగేట్ మదర్) పద్ధతి, **'వీర్యబ్యాంకుల వీర్యంతో సంతానోత్పత్తి'** రూపాలలో ఉంది. వీటి ప్రాచుర్యం రోజురోజుకూ పెరుగుతూ ఉంది. **ప్రారంభంలో విశేష గుణాలు లేదా ప్రత్యేక పద్ధతిలో సంతాన ప్రాప్తి కోసం సమాన గుణాలు లేదా గొప్ప వ్యక్తుల (ఋషులు, మునులు, బ్రాహ్మణులు, బలశాలులు, క్షత్రియులు మొ॥ వారి చేత నియోగం జరిగేది. నేడు వీర్య బ్యాంకులలో సంచితమైన వీర్యంతో విశేష గుణాలున్న సంతానం (శాస్త్రవేత్తలు, డాక్టర్లు, క్రీడాకారులు, బుద్ధిజీవులు మొ॥) పొందుతున్నారు. సిద్ధాంతం, మానసికతలతో లేదా ఏమీ లేదు కానీ, నియోగపద్ధతి రూపం మారింది.** విచిత్రం ఏమిటంటే, నేటి బుద్ధిజీవులు, ప్రగతివాదులు, సమాజ శాస్త్రవాదులు ఈ పద్ధతిని ఆపకపోగా, వీటికి సౌకర్యాలు

కల్పించమనీ, వీటి కోసం భద్రతగల చట్టాలు చేయమనీ ప్రభుత్వాలను కోరటం ! మరైతే అప్పుడు నియోగ పద్ధతికి వ్యతిరేకత, విమర్శ, నిందించే అధికారం ఎక్కడున్నది? నిజానికి ప్రాచీనకాలపుది నియోగపద్ధతి నేటిపద్ధతి కంటే ఎంతో గొప్పది. పెళ్లితో సమానంగా, నైతిక వ్యవస్థగా, క్రమశిక్షణతో ఒక మర్యాదాపూర్వకమైన పద్ధతిగా ఉండేది. నేటి నియోగపద్ధతులలో ఆ విధమైన మర్యాదా పూర్వక విధి లేదు. ప్రాచీన కాలంలో సంతాన ప్రాప్తి పవిత్రంగానూ, మానవీయ భావనలు ఆధారంగానూ జరుగుతుండేది. కానీ నేటి రోజులలో ఈ నియోగం పూర్తిగా వ్యాపారాత్మకం అయిపోయింది. ఈ పరిస్థితి భావి మానవ సమాజాన్ని అమర్యాదా పూర్వకంగానూ, వికృతంగా మారే ప్రమాదానికి ఘోరకారణం కాగలదు. ఈ వ్యాపారం వేశ్యావృత్తిలాగా రూపు దాల్చవచ్చు. ఈ విధమైన రెండు నియోగ పద్ధతుల్ని పరిశీలించే వారు దేన్ని, వీటిలో దేన్ని నిందిస్తారో? నేటి వ్యాపారాత్మక, అమర్యాదా పూర్వక నియోగపద్ధతినా లేదా ప్రాచీన నిర్వ్యాపారాత్మక, మానవీయ భావనల ప్రధానమైనదాన్నా?

భారతీయ సమాజమే కాదు, విశ్వ సమాజం మొత్తం సంతానోత్పత్తిని సహజ భావంతోనే చూస్తూ వస్తున్నది. నియోగజుడూ, ఏ కులమో తెలియని వాడైన సత్యకామ జాబాలుడిని ఒక గొప్ప ఋషిగానూ, అక్రమ సంతానమైన ఏసునూ, **కబీరును** కూడా మునులుగానే గౌరవించింది. నియోగ పుత్రులందరినీ సమాజం సొంత సంతానం వలెనే, సమానంగా, విధిపూర్వకంగా స్వీకరించింది, ఆదరించింది. కుటుంబంలో, సమాజంలో తమ సొంత బిడ్డలు పుట్టినప్పుడు ఏ విధంగా సంబరాలు జరుపుకుంటారో అదే విధంగా నియోగజులు పుట్టినప్పుడు కూడ ఉత్సవాలు చేసుకున్నారు. మొత్తం మీద ఏ కారణం చేతనైనా సంతానం లేని విపత్కర పరిస్థితిలో కుటుంబం, చట్టాలు, సమాజం అనుమతితో జరిగే, కేవలం సంతానప్రాప్తి కోసమే ఇది ఒక రకంగా 'ఉప వివాహం'గా ఉండేది. దీనివల్ల కుటుంబంలో మనసుకు ప్రశాంతత, సంతానం పొందటం, వంశ రక్షణ, స్త్రీలకు సంతానం నుండి ఆశ్రయం మొదలైన లాభాలు కలిగేవి. సమాజంలో దురాచారాలు ప్రబలటం, మర్యాదలు నశించటం, కుటుంబాలు చీలిపోవడం జరగకుండా మర్యాద అనేది ఒక పరిమితిలో ఉండేది. ప్రాచీనకాలపు జనంలో నేటి ఆధునికులవలె, పాశ్చాత్యులలో లాగే సిగ్గులేనితనం పశువుల కంటే నీచమైన సమలైంగికత గల జీవితం లేదా ఆచరణ ఉండేవి కావు.

5.స్త్రీల విషయంలో మనువు అభిప్రాయం

చాలామంది విమర్శకులు మనువుకు స్త్రీల పట్ల చాలా హీనమైన, విపక్ష గల, నీచ దృక్పథం ఉందని భావిస్తారు. మనుస్మృతిలోని 2.41-42 (66-67); 5.147,148, 153-162,164, 266, 9.2, 3,14-24 శ్లోకాలు ప్రక్షిప్తాలైనవాటిని చూసి, జనం ఆ విధంగా అనుకుంటారు. ఈ శ్లోకాలు పరస్పర వ్యతిరేకాలు, విషయ వ్యతిరేకాలు, వేద వ్యతిరేకాలు కూడా. అందుచేత మౌలికం కావు.

కానీ, ఈ ప్రక్షిప్తాలను పక్కన పెడితే, మనుస్మృతిలోని ప్రసంగాలు, విషయ శైలికి అనుకూలంగా ఎన్నో శ్లోకాలున్నాయి. వాటి వల్ల మనువుకు స్త్రీల పట్ల ఎంతో గౌరవం, శ్రద్ధ, ఉన్నత భావాలు ఉన్నాయని తెలుస్తుంది. మనువు స్త్రీని ఇంటికి స్వామిని (యజమానురాలు), గృహలక్ష్మి, దేవి, గృహాన్ని అలంకరించే ఎన్నో విశేషణాలతో పేర్కొన్నాడు. స్త్రీలను ఇంటి సుఖానికి ఆధారంగా భావించాడు. వారిని గౌరవించడం, సంతోషంగా ఉంచడం చేయాలని ప్రోత్సహించాడు. రాజర్షి మనువు కుటుంబం - సమాజంలో నారీమణుల గొప్పతనాన్ని బాగా అర్థం చేసుకున్నవాడూ, స్త్రీని అందరి కంటే ఎక్కువగా ఆదరించాలనే అభిప్రాయం గలవాడూ అయిన విశ్వంలోని మొట్టమొదటి సమాజశాస్త్రకారుడు.

భారతీయ సమాజంలో స్త్రీల విషయంలో దేవి, గృహలక్ష్మి, గృహశోభ లాంటి అభిప్రాయా లున్నాయి. ఇవన్నీ మనువు సూచించిన సంగతులే. వీటికి ప్రమాణంగా ఈ శ్లోకం చూడండి -

క. ప్రజనార్థం మహాభాగాః, పూజార్హా గృహదీప్తయః ।
స్త్రియః శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన ॥ 9.25 ॥

అర్థం- 'సంతానోత్పత్తి చేసి స్త్రీలు కుటుంబ సౌభాగ్యాన్ని అభివృద్ధి చేస్తారు. వారు సత్కరించదగిన యోగ్యతగలవారు, గృహానికి శోభ, లక్ష్మీస్వరూపులు, ఇంట్లో లక్ష్మీదేవికీ, స్త్రీకీ (ఇల్లాలికీ) తేడా లేదు.'

ఖ. మనోవైజ్ఞానిక దృష్టితో ఆలోచించిన మనువు 'కుటుంబం'లో స్త్రీలను గౌరవించాలని ఉదారభావంతో అన్నాడు. ఎక్కడ ఇల్లాలిని గౌరవిస్తారో ఆ కుటుంబంలో ఇంటి వాతావరణం, సుఖంగా, ఆనందంగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలోని కుటుంబం, ఉన్నతి - సమృద్ధి పొందుతుంది. దివ్య లాభాలు, దివ్య గుణాలు, దివ్య సంతానంతో ఆ కుటుంబం విలసిల్లుతుంది. ఏ ఇంట్లో కలహాలు ఉంటాయో ఆ ఇంట్లో సుఖమయ వాతావరణం గానీ, పిల్లలు గొప్ప వాళ్లవటం గానీ జరగవనేది అందరూ అంగీకరించిన విషయం. మనుస్మృతిలోని ఒక ప్రసిద్ధ శ్లోకం దీనికి సరైన అర్థం చెబుతుంది-

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।
యత్రై తాస్తు న పూజ్యంతే సర్వాః తత్రాఫలాః క్రియాః ॥ 3.56 ॥

అర్థం- 'ఏ కుటుంబంలో స్త్రీలకు పూజ అంటే గౌరవం ఉంటుందో అక్కడ దేవతలు = దివ్య గుణాలు, దివ్య సంతానం, దివ్య లాభాలు కలుగుతాయి. ఇది కుటుంబంలో కనబడుతుంది. ఏ ఇంట్లో స్త్రీలు గౌరవం పొందరో అక్కడ కలహాల వాతావరణం ఉండటం వల్ల వారి గృహస్థ ఆశ్రమం నిష్ఫలమవుతుంది.'

గ. మనువు పద్ధతులలోని ప్రత్యేకత ఏమిటంటే, స్త్రీ పురుషులలో భేదం చూపకపోవడం. ఏ పద్ధతిని చెప్పినా, అందులో ఇద్దరికీ సమానగౌరవం ఇస్తాడు. తమ ప్రవర్తనతో పరస్పరం సంతోషంగా ఉంచటమే. భార్యాభర్త లిద్దరి ధర్మమూ అంటాడు మనువు -

సన్తుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్ ॥ 3.60 ॥

అర్థం- 'ఏ కుటుంబంలో భార్య భర్తను, భర్త భార్యను సంతృప్తి పరుస్తారో, ఆ కులంలో శుభాలే జరుగుతాయి.'

ఘ. 'లేడీస్ ఫస్ట్' అనే పాశ్చాత్య సంస్కృతిలోని ఆచారం పట్ల ఎలా వ్యామోహం చెందేవారో, దాని కంటే ముందే శిష్టాచారం తాలూకు ప్రస్తావన మనువు మనుస్మృతిలో చెప్పాడని గ్రహించాలి. ఇందులో స్త్రీలను ప్రాధాన్యతతో గౌరవిస్తూ ఇలా అన్నాడు-

"స్త్రియః.....పంథా దేయః"2.138

అంటే- "స్త్రీలను గౌరవిస్తూ వారి కోసం ముందుగా దారి వదలాలి"అని.

జ. తండ్రి, అన్న, భర్త మొదలైనవారందరూ స్త్రీలను సత్కరించాలి.

"పితృభిః భ్రాతృభిశ్చైతాః....పూజ్యా భూషయితవ్యాశ్చ" 3.55 ॥

వస్త్రాలు, ఆభరణాలతో స్త్రీల నెప్పుడూ సత్కరిస్తుండాలి.

"తస్మా దేతాః సదా పూజ్యా భూషణాచ్ఛాదనాశనైః" 3.59 ॥

చ. స్త్రీలు శోకగ్రస్తులైతే కుటుంబం పాడవుతుంది. వారిని సమ్మానించడమూ, ప్రసన్నంగా ఉంచడం వల్ల కుటుంబం ఉన్నతిని పొందుతుంది.

శోచన్తి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులమ్ ।
న శోచన్తి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా ॥ 3.57 ॥

ఛ. స్త్రీలు ఇంటి సుఖాలు, ధర్మకార్యాలకు ఆధారం అవుతారు-

అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషా రతిరుత్తమా ।
దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ ॥ 9.28 ॥

జ. స్త్రీలు ఇంటి యజమానురాళ్ళు, ఇంట్లో జరిగే ప్రతి ధార్మికకార్యాన్ని నిర్వహించి నడిపిస్తారు. ఇంట్లోని ధనానికి సంరక్షకలవుతారు. ఆదాయ వ్యయాల బాధ్యత భార్యదే అవుతుంది.

అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్ ।
శౌచే ధర్మేఽన్నపక్త్యాం చ పరిణాహ్యస్య వేక్షణే ॥ 9.11 ॥

ఝ. మనువు స్త్రీ పురుషులలో వివక్షను ఎప్పుడూ చెప్పలేదు. స్త్రీ పురుషుడి దాసి అని గానీ, ఆమె పురుషుడి అధీనంలో బంధీకృతురాలు అని గానీ చెప్పలేదు. ఇద్దరూ కూడా పరస్పర భావనలను గౌరవించుకుంటూ ఉండాలని చెప్పాడు. పైగా స్త్రీలను ఎక్కువ ఆదరంగా చూడాలనే అన్నాడు. వీటికి పుష్టి చేకూరుస్తూ కొన్ని శ్లోకా లియ్యబడ్డాయి. స్త్రీల పట్ల పక్షపాత పూర్వకమూ, అణచి పెట్టడమూ, స్వాతంత్ర్యం లేకుండా ఉంచడమూ, ఇవేవీ మనువుకు నచ్చని విషయాలు, వారి పట్ల ఆయనకు సమానభావమూ, స్వాతంత్ర్యం ఇవ్వాలనే భావాలున్నాయి-వీటికి బలం చేకూర్చే ప్రమాణాలు -

ఞ. మనుస్మృతిలో స్త్రీలను బంధించి ఉంచాలనే ధోరణి వ్యర్థమనీ, స్త్రీలు స్వయంగా ఆలోచించి పనులు చేయాలనే ఉంది. స్త్రీలను ఎప్పుడూ అణచి వుంచాలనే అభిప్రాయాన్ని ఆయన వ్యతిరేకించాడు.

న కశ్చిద్ యోషితః శక్తః ప్రసహ్య పరిరక్షితుమ్ । 9.10 ॥

స్త్రీ ఎప్పుడూ తనను తాను రక్షించుకోగలిగితేనే సురక్షితంగా ఉంటుంది.

అరక్షితా గృహే రుద్ధాః పురుషైరాప్తకారిభిః ॥ 9.12 ॥

ట. ఎలాంటి పక్షపాతమూ లేకుండా స్త్రీ పురుషు లిద్దరికీ సమాన స్థాయి ఉండాలని భావించే మనువు ఇచ్చిన సలహాలు, సూచనల వల్ల- స్త్రీని పురుషుడు తన అధీనంలో ఉంచుకోవాలనే అభిప్రాయం వీగిపోతుంది. మనువు ఇచ్చిన ప్రమాణాలే కాకుండా, మరికొన్ని ప్రమాణాలూ చూడాలి-

స్త్రీ పురుషులు కలసి ఉండాలి, ఇదే భార్యాభర్తల ముఖ్యకర్తవ్యం -

అన్యోన్యస్య-అవ్యభిచారో భవేదామరణాన్తికః ।
ఏష ధర్మః సమాసేన జ్ఞేయః స్త్రీపుంసయోః పరః ॥ 9.101 ॥

స్త్రీ పురుషులు ఎన్నటికీ విడిపోకూడదు -

తథా నిత్యం యతేయాతాం స్త్రీపుంసౌ తు కృతక్రియౌ ।
యథా నాభిచరేతాం తౌ వియుక్తౌ ఇతరేతరమ్ ॥ 9.102 ॥

స్త్రీ పురుషులిద్దరూ సమానులే. అందుకని అన్ని పనులూ కలిసి చేయాలి.

ప్రజనార్థం స్త్రియః సృష్టాః సన్తానార్థం చ మానవాః ।
తస్మాత్సాధారణో ధర్మః శ్రుతౌ పత్న్యా సహోదితః ॥ 9.96 ॥

ఈ విషయాల ఆధారంగా, ఏయే శ్లోకాలలో అణచివేయాలని ఆదేశాలున్నాయో, వాటి చేత ప్రేరితులై స్త్రీలకు ప్రతిబంధకాలు కలిగించుచున్న ఆజ్ఞలు మనువు చెప్పినవి కావని తెలుసుకోవాలి. ఇవి మనువు చెప్పిన భావనలకు వ్యతిరేకాలు.

ఛ. స్త్రీలను మనువు నిరసించలేదు. పైగా వారి గౌరవ మర్యాదలను గొప్పగా చెప్పాడు. కొన్ని ఉదాహరణలు చూడండి -

భర్త భార్యతో కలహించరాదు -

"భార్యయా......వివాదం న సమాచరేత్" 4.180 ॥

భార్య మొదలైన స్త్రీలపై అబద్ధపు ఆరోపణలు చేయకూడదు. వారిని గురించి చెడ్డ మాటలు ఆడకూడదు. ఎవరైనా అలా చేస్తే శిక్షార్హులు -

"మాతరం పితరం జాయామ్.....ఆక్షారయన్ శతం దాప్యః" 8.275 ॥

జ. స్త్రీలకు వేదాధ్యయనం, యజ్ఞోపవీతధారణ మనువుకు సమ్మతమే.

కొన్ని శ్లోకాలలో స్త్రీలకు గురుకుల వాసం, వేదాధ్యయనం, మంత్ర పూర్వక క్రియలను నిషేధించినట్లు కనబడుతుంది. అవి-2.41,42 (66-67), 9.18 మొదలైనవి. ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే. మిగిలిన అన్ని శ్లోకాలలోనూ, వేదంలోనూ స్త్రీలు అన్ని ధార్మిక కార్యాలు, వేదాధ్యాయనం చేయొచ్చనని ఉంది.

1. మనువు ప్రతి ధార్మిక కార్యంలోనూ స్త్రీ పురుషులకు సమాన అధికారం ఉందని చెప్పాడు. 2.1(2.26)లో అందరి సంస్కారాలు వేద మంత్రాలతో కూడిన యజ్ఞాల ద్వారా చేసే విధానం ఉందని చెప్పబడింది. 2.4 (2.29) శ్లోకంలో జాతకర్మ చేసేటప్పుడు బాలబాలికలకు ఇద్దరికీ మంత్రోచ్చారణ పూర్వకంగా తేనెను నాకించే పద్ధతి ఉందని చెప్పాడు- **"మంత్రవత్ ప్రాశనం చాస్య."** దీనివల్ల మంత్రోచ్చారణ లేదా శ్రవణం మొ॥ విషయాలలో మనువు స్త్రీ పురుషులలో భేదం చూపే వాడు కాదని తెలుస్తోంది. ఇదే విధంగా నామకరణం, వివాహం మొ॥ అన్ని సంస్కారాలనూ యజ్ఞాలు, మంత్రపూర్వకంగా చేసేపద్ధతి ఉంది (2.8), 2.41వ శ్లోకంలో. స్త్రీలకు మంత్రాలు నిషేధం అనేది మనువుభావాలకు వ్యతిరేకమని స్పష్టమవుతూంది. అందువల్ల అవి ప్రక్షిప్తాలు.
2. ఇదే విధంగా 3.28లో అగ్నిహోత్రపూర్వకంగా స్త్రీలకు దైవ వివాహం చేసే పద్ధతి చెప్పాడు. అగ్నిహోత్రంలో మంత్రోచ్చారణ ఉండనే ఉంటుంది. అందువల్ల స్త్రీలకు సంబంధించిన కార్యకలాపాలు మంత్ర రహితమని మనువు ఎప్పుడూ చెప్పలేదని తెలుస్తోంది. స్త్రీల వివాహాలు కూడా యజ్ఞంలో స్వస్తి మంత్రపూర్వంగా ఉన్నాయి. (4.152). అంత్యేష్టి కూడా అగ్నిహోత్రంతోనే చెప్పబడింది. (5.167) ఈ కారణాల వల్ల కూడా 2.41వ శ్లోకంలో స్త్రీలకు మంత్రరహిత విధానం వేదపద్ధతికి వ్యతిరేకం కాబట్టి అదీ ప్రక్షిప్తమే.
3. మనువు తన ఇంట్లోనూ అగ్నిహోత్రం మొ॥ ధార్మిక కార్యక్రమాల ముఖ్య బాధ్యత స్త్రీలకే అప్పగించాడు. పురుషులు ప్రతి ధార్మిక కార్యాన్నీ స్త్రీలతో పాటుగానే చేయాలని ఆదేశించాడు.
4. **"శౌచే ధర్మే - అన్న పక్త్యాం చ"**- ఇంటి శుభ్రత, ధర్మ కార్యాల నిర్వహణ, భోజనం తయారు చేయడం మొ॥ భార్యకు అప్పగించాలి (9.11).
5. **"అపత్యం ధర్మకార్యాణి"** (9.28) సంతానోత్పత్తి, వారి పోషణ, అగ్నిహోత్రం లాంటి ధర్మకార్యాలు పత్ని ఆధ్వర్యంలో ఉంటాయి.
6. **"తస్మాత్ సాధారణో ధర్మః శ్రుతౌ పత్న్యా సహోదితః"** (9.66). మామూలు ధర్మకార్యమైన అగ్ని హోత్ర విధులలో కూడా భార్యను కలుపుకోవాలి. ఇదే విధంగా 2.1-3 (2.26-28) శ్లోకాలలో అందరికీ సంస్కారాలు సమానంగా జరగడం ఆవశ్యకమని చెప్పాడు. ఎందుకంటే ఇవి శారీరకమూ, సంస్కార సంబంధమైన దోషాలను తొలగిస్తాయన్నాడు. అక్కడ స్త్రీ పురుషులలో భేదం లేదన్నాడు. దీనితో రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి-

1. అన్ని సంస్కారాలూ మంత్ర పూర్వకంగా ఉంటాయి. కాబట్టి స్త్రీకైనా, పురుషుడికైనా ఏ సంస్కారం చేసినా మంత్ర పూర్వకంగా ఉండాలి. 2. ఆ సంస్కారాలు ద్విజాతికి చెందిన అందరికీ అవసరమే- స్త్రీ అయినా, పురుషుడైనా.

ప్రక్షిప్త శ్లోకాలలో స్త్రీలకు మంత్ర రహిత క్రియావిధానం, పెళ్లినే ఉపనయన సంస్కారంగా భావించడం, పతి సేవనే బ్రహ్మచర్య ఆశ్రమంగా భావించడం, ఇంట్లోని పనులనే అగ్ని హోత్రంగా భావించడం అను పద్ధతులకు వ్యతిరేకం, అందువల్ల ఇవన్నీ ప్రక్షిప్తాలు.

ధ. స్త్రీల వేదాధ్యయనం విషయంలో వేద ప్రమాణాలు

మునుపు చెప్పిన శ్లోకాలలో స్త్రీలకు మంత్రోచ్చారణ నిషేధమనే విషయం ఉంది. మనుస్మృతికి ఆధారం వేదాలు కాబట్టి, ఈ విషయంలో వేదాలు ఏమంటున్నాయో తెలుసుకోవడం మేలవుతుంది.

1. వేదాలలో అందరూ వేదాలు చదవ వచ్చని ఉంది -

యథేమాం వాచం కల్యాణీమ్ ఆవదాని జనేభ్యః ।
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయ...। యజుర్వేద 26.2 ॥

అంటే- "పరమేశ్వరుడు చెప్పేదేమిటంటే **(యథా)** నేను **(జనేభ్యః)** అందరికీ **(ఇమామ్)** ఈ **(కల్యాణీమ్)** కల్యాణ అంటే జీవితం+ముక్తి - వీటి సుఖాన్ని ఇచ్చే **(వాచమ్)** ఋగ్వేదం మొ॥ నాలుగు వేదాలను **(ఆవదాని)** ఉపదేశిస్తున్నాను. అలాగే నీవూ చేయి... **(బ్రహ్మ రాజన్యాభ్యామ్)** బ్రాహ్మణ, క్షత్రియ, **(అర్యాయ)**, వైశ్య **(శూద్రాయ)** శూద్రులు, **(స్వాయ)** నీ భృత్యులు, స్త్రీలు మొ॥ **(అరణాయ)**, అతి శూద్రులు - అందరికీ వేదాలను తెలియజేశాను" అని.

2. ఇలాగే అథర్వవేదంలోకూడా చెప్పబడింది.

"బ్రహ్మచర్యేణ కన్యా యువానం విన్దతే పతిమ్" 11.5.18 ॥

అంటే- 'బ్రహ్మచర్య ఆశ్రమంలో ఉంటూ వేదాలు చదువుతూ, బ్రహ్మచర్యాన్ని పాటించిన తరవాత, గృహస్థ జీవితాన్ని ఆశించే కన్య, యువకుడైన పతిని వరిస్తుంది'.-అని.

3. స్త్రీల ఉపనయనం విషయంలో ఋగ్వేదం 10.109.4 వ మంత్రపు ప్రమాణం ఇలా ఉంది- **"భీమా జాయా బ్రాహ్మణస్యోపనీతా"**-

ఈ ప్రమాణాలతో స్త్రీలకు బ్రహ్మచర్య ఆశ్రమం, గురుకుల వాసం, ఉపనయనం మొదలైనవన్నీ ఉండేవని తెలుస్తూంది.

4. వైదిక కాలం నాటి చరిత్రను చూస్తే, అందులోనూ స్త్రీలకు మంత్రనిషేధం లాంటివి లేవని తెలుస్తుంది. ఆ నాడు మంత్ర ద్రష్టలైన ఎందరో తపస్వినులు ఉండేవాడు. ఏయే మంత్రాల అర్థాలు, రహస్యాలు వారు తెలుసుకున్నారో, ఆ సూక్తులలో వారి పేర్లు 'ఋషికలు' (మహిళా ఋషులు తపస్వినులు)గా నేటికీ కనిపిస్తున్నారు. ఒక్క ఋగ్వేదంలోనే దాదాపు 30 మంది ఇలాంటి తపస్వినుల పేర్లు ఉన్నాయి. వారిలో అదితి, జుహూ, ఇంద్రాణి, ఘోష, గోధ, అపాల, రోమశ, లోపాముద్ర మొదలైన వారు పేర్కొనదగినవారు. ఇలాగే ఉపనిషత్తులలో గార్గి, మైత్రేయి లాంటి బృహత్తత్త్వజ్ఞాతలైన తపస్వినుల వర్ణన ఉంది. మనువు తన స్మృతిని వేదానుకూలమూ, వేదాన్ని ధరించినదిగానూ భావించాడు. (1.125-132) (2.6-13); 12,94,95,97, 99,109,112,113,మొ.) అందుచేత స్వయంగా వేదాలలో ఉన్న ఈ విషయాలకు వ్యతిరేకంగా ఉండటం వల్ల పైన చెప్పిన ఆక్షేపణలు, ఆరోపణలు పరిగణించదగినవి కావు.

6. మనుస్మృతిలో వివాహ వయసు

కొందరు మనుస్మృతిలోని కింది శ్లోకాల ఆధారంగా, మనుస్మృతిలో బాల్య వివాహాలు లేదా అల్పాయు- చిన్న వయసులో వివాహాలు ఉన్నాయని అంటారు. బహుశా అది తర్వాతి కాలపు శ్లోకమై ఉంటుంది. యుద్ధాలు, అరాజకత లాంటి కారణాల వల్ల ఆడపిల్లల భద్రత చింతకలిగించి ఉంటుంది. ఆ భయం దూరం కావటానికి ఆధునిక గ్రంథాలలో ఇలాంటి పద్ధతి ప్రవేశపెట్టి, దాన్ని శాస్త్ర సమ్మతం చేయటానికి మనుస్మృతి మొదలైన గ్రంథాలలో చేర్చేసి ఉంటారు. బాల్యవివాహ విధానాన్ని చెప్పే అన్ని శ్లోకాలూ మనుస్మృతి మౌలికతకు వ్యతిరేకాలు. ఇలాంటి ప్రక్షిప్త శ్లోకాన్ని ఒకదాన్ని చూడండి -

త్రింశద్వర్షోద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్ ।
త్ర్యష్టవర్షోఽష్టవర్షాం వా ధర్మే సీదతి సత్వరః ॥ 9.94 ॥

అంటే, గృహస్థధర్మం లోపించకుండా ఉండటానికి 30 సంవత్సరాల వయసున్న పురుషుడికి 12 సంవత్సరాల అమ్మాయికి, 24 సంవత్సరాల పురుషుడికి 8 సంవత్సరాల అమ్మయికి పెళ్ళి చేయాలి.

క. దీన్ని నివారించదానికి మనువు సమావర్తన సంస్కారం. (3.1-3)లో వివాహ విధానం (3.4,65)లో, అలాగే స్త్రీ ధర్మాలు (5.147-166, 9.102) మొదలైన ప్రమాణాలు ఇచ్చాడు. ఈ ప్రమాణాల ద్వారా పైన చెప్పిన అభిప్రాయం తప్పని, మనువుకు సమ్మతం కాదని, తేలింది. అది తరువాతి కాలంలో మనుస్మృతిలో చేర్చబడిందని, అది ప్రక్షిప్తమని తెలుసుకోవాలి.

స్త్రీ వివాహ వయస్సు:- దీనికి స్పష్టమైన సంకేతాన్ని మనువు 9.90 శ్లోకంలో ఇచ్చాడు.

త్రీణి వర్షాణ్యుదీక్షేత కుమార్యృతమతీ సతీ ।
ఊర్ధ్వం తు కాలాదేతస్మాద్ విన్దేత సదృశం పతిమ్ ॥ 9.90 ॥

అంటే -'ఋతుధర్మం' ప్రారంభమైన తర్వాత మూడేళ్ల వరకు వేచి ఉండి, ఆ తర్వాత వివాహం చేసుకోవాలనుకున్న కన్య స్వయంవర వివాహం చేసుకుంటుంది'. -అని

కన్యలలో ఋతుధర్మం మామూలుగా 13-14 ఏళ్ల వయసులో మొదలవుతుంది. మూడేళ్ల తర్వాత ఇది 16-17 సంవత్సరాల వయసవుతుంది. అందువల్ల కన్యకు పెళ్లి వయసు కనీసం 16 అవుతుంది. 25 ఏళ్ల పురుషుడు, 16 ఏళ్ల కన్యను పెళ్లాడాలి. ఇంత కంటే ఎక్కువ వయసులో ఇంతే అనుపాతంలో ఉన్నవారికే పెళ్లి చేయాలి. ఎందుకంటే సంతానోత్పత్తి సమర్థత, శరీర నిర్మాణం దృష్టితో చూస్తే 16 ఏళ్ల కన్య, 25 ఏళ్ల పురుషుడికి తగినది అవుతుంది. తర్వాత చెప్పబోయే ఆయుర్వేద ప్రమాణాలతో ఈ విషయానికి బలం చేకూరుతుంది. వాటిలో కారణాలతో సహా పదహారేళ్లకు ముందు కన్య పెళ్లికి అర్హురాలు కాదనీ, అలా పెళ్లి చేస్తే ఏం కీడు జరుగుతుందో చెప్పబడింది.

ఖ. స్త్రీ వివాహ వయసును నిర్ధారించే మరొక ప్రబల ప్రమాణం కూడా మనుస్మృతిలో ఉంది. మనువు వివాహం తర్వాత శారీరిక సంపర్కానికి నియమాలు చెప్పాడు. రజోదర్శనం నుంచి 16 రాత్రులు స్త్రీకి ఋతుకాలం అవుతుంది. వేటిని కూడని రాత్రులు అన్నాడో వాటిని విడిచి పెట్టి, పురుషుడు కేవలం ఋతుకాలంలోనే సంపర్కం చేయాలనేది ఉంది (3.45-50). చూడండి -

ఋతుకాలాభిగామీ స్యాత్ స్వదారనిరతః సదా ।
పర్వవర్జం వ్రజేత్ చైనాం తద్వ్రతో రతికామ్యయా ॥ 3.45 ॥

ఋతుఃస్వాభావికః స్త్రీణాం రాత్రయః షోడశః స్మృతాః । 3.46 ॥

అర్థం – పురుషుడెప్పుడూ పత్నీవ్రతంలో ఉంటూ ఋతు కాలంలోనే సంగమించాలి. సంతానం కావాలంటే పర్వదినాలు విడిచి మిగిలిన రోజుల్లో సంగమించాలి. స్త్రీలకు ఋతు కాలం రజోదర్శనం నుంచి 16 రోజులు ఉంటుంది.

ఈ శ్లోకాలను బట్టి ఆడపిల్లల వివాహ వయసు 16 లేదా అంతకు మించి ఉండాలి. వారికి రజోదర్శనం కావాలి. విజ్ఞానశాస్త్రపరంగా వారి శరీరం సంతానోత్పత్తికి యోగ్యం కావాలి అని స్పష్టమవుతూంది కదా!

గ. కన్య వివాహ వయసును నిర్ధారించే మరొక ప్రమాణం కూడా మనుస్మృతిలో ఉంది –

'ఉద్వహేత ద్విజో భార్యాం సవర్ణాం లక్షణాన్వితామ్' 3.4 ॥

= "స్నాతకుడైన ద్విజుడు **సవర్ణ అంటే తన వర్ణానికి చెందిన, చదువుకున్న, ఉత్తమ లక్షణాలున్న కన్యను పెళ్లాడాలి."**

'మనుస్మృతిలోని వర్ణ వ్యవస్థ'– దీని చర్చలో సప్రామాణికంగా చెప్పబడిన విషయ మేమిటంటే, ఎవడైనా గుణాలు, కర్మల వల్లే కాని పుట్టుకతో బ్రాహ్మణుడు కాదు అనేది. అందులో ఒక వర్ణానికి చెందిన యువకుడు ఏ విధంగా చదువు దీక్షల వల్ల **'సవర్ణుడు'** అవుతాడో, అదే విధంగా ఒక వర్ణానికి చెందిన అమ్మాయి కూడా చదువు దీక్షల వల్ల **'సవర్ణ'** అవుతుంది. సవర్ణ స్త్రీతో వివాహం అంటే, ఆమె బాలిక కాకూడదు, తన వర్ణానికి చెందిన చదువుకున్న యువతి కావాలి అని.

ఘ. వివాహం తర్వాత స్త్రీ కర్తవ్యాన్ని గురించి మనువు ఇలా చెప్పాడు – గృహ కార్యాలన్నీ చేయగలగటం, ఇంటిని అలంకరించడం, శుద్ధి చేయడంలో చతురురాలు కావడం, ఆదాయ వ్యయాలు నిర్వహించడం (5.150), ఇంటికి యజమానురాలు కావడం, అన్ని వస్తువులూ జాగ్రత్త పెట్టడం, ధార్మిక అనుష్ఠానాల నిర్వహణ (9.11, 26–29, 96,101). వీటన్నింటి వల్లా, ఇవన్నీ అల్పాయుస్సువారికి నిర్దేశించినవి కావు, తెలివి గల యువతి కర్తవ్యాలు అని తెలుస్తూంది. కొన్ని శ్లోకాలు ఆలోచించదగినవి –

సదా ప్రహృష్టయా భావ్యం గృహకార్యేషు దక్షయా ।
సుసంస్కృతోపస్కరయా వ్యయే చాముక్తహస్తయా ॥ 5.150 ॥

అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషా రతిరుత్తమా ।
దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ ॥ 9.28 ॥

అర్థం– 'కుటుంబంలో స్త్రీ ఎప్పుడూ ప్రసన్నంగా ఉండాలి. ఇంటి పనుల్లో కుశల అయి వుండాలి. ఇంట్లోని ప్రతి వస్తువునూ స్వచ్ఛంగా, అందంగా ఉంచాలి. ఎక్కువగా ఖర్చు చేసేది కాకూడదు! 'సంతానం, యజ్ఞాదులైన ధార్మిక కార్యాలు చేయగలిగి ఉండాలి. కుటుంబంలోని అందరి సేవలు, జాగ్రత్తలు, రోగాలు, దోషాలు లేని దాంపత్య జీవితం, తన ఇంట్లోని పెద్దల సుఖమయ జీవితం, ఇవన్నీ భార్యను ఆశ్రయించి ఉంటాయి. 'ఇవన్నీ చిన్న వయసు కన్య చేయలేదు. కాబట్టి మనువు యువతి అయిన స్త్రీని ఉద్దేశించాడే కానీ బాల్యవివాహం కాదు'.

ఙ. ఆయుర్వేదం ప్రకారం వివాహం వయసు

ఈ విషయంలో శరీర విజ్ఞాన వైద్య గ్రంథాలు అన్నింటినీ మించిన మంచి ప్రమాణాలు. ఎందుకంటే అవి శరీరాన్ని ఆధారం చేసుకుని ఉచితానుచితాల విశ్లేషణ చేస్తాయి. ఆయుర్వేదపు సుప్రసిద్ధ గ్రంథం. **'సుశ్రుతం'** లో శరీర వృద్ధి క్షీణతలను బట్టి నాలుగు దశలు చెప్పబడ్డాయి. వాటి ప్రకారం పెళ్లి వయసును ఆ గ్రంథం నిర్ధారించింది.

"చతస్రో అవస్థాః శరీరస్య వృద్ధిః, యౌవనమ్, సమ్పూర్ణతా, కిఞ్చిత్ పరిహాణిః చేతి । ఆషోడశాత్ వృద్ధిః, ఆపఞ్చవింశతేః యౌవనమ్, ఆచత్వారింశతః సమ్పూర్ణతా, తతః కిఞ్చిత్ పరిహాణిః చేతి" ॥

(సుశ్రుత సూత్రస్థానం. 35.35)

శరీరానికి నాలుగు దశ లుంటాయి. 16 నుంచి 24 వరకు వృద్ధి పెరిగే దశ, 25 నుంచి యౌవనం ప్రారంభం అవుతుంది. 40వ ఏటి నుంచి శరీరం పరిపక్వత చెందుతుంది. సంపూర్ణంగా పరిపక్వత కలిగిన తర్వాత, శరీరంలోని ధాతువులలో కొంత కొంత క్షీణత - తరుగుదల మొదలవుతుంది.

ఈ యువావస్థే వివాహానికి తగిన దశ అవుతుంది. దీని కంటే ముందు శరీరంలోని ధాతువులలో పరిణతి ఉండదు. బాల్య వివాహం వల్ల, శరీరంలోని ధాతువికాసం ఆగిపోయినప్పుడు గర్భధారణ, సంతానం విషయాల్లో ఎన్నో అవాంతరాలు చోటు చేసుకుంటాయి. అవి - గర్భం నిలవకపోవడం, గర్భస్రావం, గర్భపాతం, దుర్బలమైన సంతానం కలగడం, పుట్టిన కొంత కాలానికే చనిపోవడం, సంతానపు అనారోగ్యం మొదలైనవి. ఈ కారణాల చేతనే సుశ్రుత కర్త 25 ఏళ్లకు ముందు పురుషుడికీ, 16 ఏళ్లకు ముందు కన్యకూ వివాహం నిషేధించాడు. కుశలుడైన వైద్యుడు 25 ఏళ్ల పురుషుడు, 16 ఏళ్ల కన్య - వీరిని సంతానోత్పత్తిలో సమ సామర్థ్యం గలవారని పేర్కొన్నాడు. కింది ప్రమాణాల్లో ఈ విషయాలు చూడవచ్చు -

పఞ్చవింశే తతో వర్షే పుమాన్నారీ తు షోడశే ।
సమత్వాగతవీర్యౌ తౌ జానీయాత్ కుశలో భిషక్ । (సుశ్రుత, సూత్రస్థాన 35.15)
ఊనషోడశవర్షాయామప్రాప్తః పఞ్చవింశతిమ్ ।
యద్యాధత్తే పుమాన్ గర్భం కుక్షిస్థః స విపద్యతే ॥
జాతో వా న చిరం జీవేత్ జీవేద్వా దుర్బలేన్ద్రియః ।
తస్మాదత్యన్తబాలాయాం గర్భాధానం న కారయేత్ ॥ (సుశ్రుత, శారీర. 10.59, 60)

చ. వేదాలలో వివాహం వయసు

వేదాలలో బ్రహ్మచర్యాశ్రమంలో ఉండి చదువుకున్న యువతి అయిన కన్య ద్వారా యువకుడైన పురుషుడు. -వీరి వివాహం గురించి చెప్పబడింది. పైన చెప్పిన ప్రమాణాలలో యౌవనావస్థ 25 ఏళ్ల తరువాతేనని ఉంది. ఈ విధంగా వేదాలలో 25 ఏళ్ల తరువాతే పురుషుడికి వివాహం వయసని భావించబడింది. కింది మంత్రం చూడండి-

"బ్రహ్మచర్యేణ కన్యా3యువానం విన్దతే పతిమ్ ॥" అథర్వవేదం.11.5.18

అంటే- "ఏ విధంగా అబ్బాయి పూర్ణ బ్రహ్మచర్యంలో ఉండి చదువుకుని యువకుడై పెళ్లి చేసుకుంటాడో, అదే విధంగా బ్రహ్మచర్య ఆశ్రమాన్ని ముగించుకుని యువతి అయిన కన్యలు భర్తను వరించాలి."అని.

ఛ. వేదాలలోనూ, వైదిక సాహిత్యంలోనూ ఈ వేదోక్త వ్యవస్థకు ఎన్నో ప్రమాణాలు లభిస్తాయి. వైదిక కాలంలో స్త్రీలు కూడా బ్రహ్మచర్యాశ్రమం గురుకులంలో గడిపి, వేదాధ్యయనం చేసి తపస్వినులు అవుతుండేవారు. మంత్ర ద్రష్టలుగా నేటికీ వేద సూక్తాలలో వారి పేర్లు కనిపిస్తాయి.

ఇలాంటి 26 మంది తపస్వినుల వివరణ 'బృహద్దేవత'లో (2.82-84) ఉంది. వారి పేర్లు - అపాల, ఘోష, గోధ, విశ్వవారా, ఉపనిషద్, నిషద్, బ్రహ్మజాయ (జుహూ), అగస్త్యభగిని, అదితి, ఇంద్రాణి, సరమ, రోమశ, ఉర్వశి, లోపాముద్ర, నది, యమి, శాశ్వతి, శ్రీవాక్, శ్రద్ధ, దక్షిణ, రాత్రి, సూర్య, సావిత్రి. వీరు కాకుండా సులభ, గార్గి, మైత్రేయి మొ॥ విదుషీమణుల చరిత్ర ఉపనిషత్తులలోనూ, మహాభారతం మొ॥ గ్రంథాలలోనూ ఉంది.

జ. 'యమస్మృతి'లో కూడా స్త్రీల ఈ పరంపర ఉంది-

పురాకల్పే తు నారీణాం మౌఞ్జీబన్ధనమిష్యతే ।
అధ్యాపనం చ వేదానాం సావిత్రీవాచనం తథా ॥

అంటే - 'ప్రాచీన శాస్త్రాలలో స్త్రీలకు ఉపనయన సంస్కారం, సావిత్రీ జపం = సంధ్యావందనం యజ్ఞం మొ॥, వేదాల అధ్యయన-అధ్యాపనలు ఉన్నాయి. 'హారీత స్మృతి'లో స్త్రీలలోని 'బ్రహ్మ వాదినుల' వర్గాన్ని గురించిన చర్చ ఉంది. వారు వేద శాస్త్రాలను చదువుకునే బ్రహ్మవాదినులయ్యేవారు. అప్పటికి బాల్యావస్థలో కాకుండా పూర్తి విదుషీమణులూ, వైదిక కాలంలోని స్త్రీలు సంపూర్ణ యువతులూ అయిన తర్వాతనే వైదిక కాలంలోని స్త్రీలు పెళ్లి చేసుకునే వారని స్పష్టమవుతూంది.

తన స్మృతి వేదాన్ని ఆధారం చేసుకున్నదీ, వేదానికి అనుకూలమైనదిగా ఉండాలనేది మనువు ప్రతిజ్ఞ. అందువల్ల అతని స్మృతిలో వేద వ్యతిరేక విషయాలు ఉండవు. బాల్యవివాహానికి సంబంధించిన అన్ని పద్ధతులూ 'వేదవ్యతిరేకాలు' అనేది. ప్రమాణం ఆధారంగా అవి ప్రక్షిప్తాలే !

ఝ. స్త్రీ-పురుషుల సగటు పెళ్లి వయసు కొంచెం.....

ఇది అందరికీ తెలిసిన విషయమే కాబట్టి, మనువు దీన్ని పెద్దగా చెప్పలేదు కానీ, వేరుచోట్ల దీన్ని గురించి స్పష్టంగా చెప్పబడింది.

వేదాలలోనూ, ఇతర శాస్త్రాలలోనూ మనిషి సగటు ఆయువు 100 ఏళ్లని భావించబడింది. దీన్ని ఆధారం చేసుకునే వేదాలలో వందేళ్ల, అంతకు పైబడిన కాలం ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రార్థనలు జరిగాయి.

'తచ్చక్షుర్దేవహితం పురస్తాచ్ఛుక్రముచ్చరత్ ।
పశ్యేమ శరదః శతం జీవేమ శరదః శతం
శృణుయామ శరదః శతం ప్రబ్రవామ శరదః శతమ్
అదీనాః స్యామ శరదః శతం భూయశ్చ శరదః శతాత్।' యజుర్వేద 36.24

ఈ సగటు ఆయువు ఆధారంగా మనిషి జీవితాన్ని నాలుగు దశలుగా విభజించి, వాటి పరిమితిని నిర్ధారించారు-

చతుర్థమాయుషో భాగముషిత్వాద్యం గురౌ ద్విజః ।
ద్వితీయమాయుషో భాగం కృతదారో గృహే వసేత్ ॥ 4.114,169

వనేషు చ విహృత్యైవం తృతీయం భాగమాయుషః ।
చతుర్థమాయుషో భాగం త్యక్త్వా సంగాన్ పరివ్రజేత్ ॥ 6.33

వందేళ్ల ఆయువు, 25-25 ఏళ్ల చొప్పున నాలుగు భాగాలవుతుంది. ఆయువులోని తొలి భాగంలో అంటే, 25 ఏళ్ల వరకు బ్రహ్మచర్య పాలనం జరగవలసి ఉంది. రెండో భాగంలో అంటే 25 ఏళ్ల తర్వాత గృహస్థుడు కావాలి. కొడుక్కు కొడుకు పుట్టాక, లేదా చర్మం, జుట్టు పండి పోయాక, (6.2) గృహస్థం నుంచి వానప్రస్థుడు కావాలి. అటు తర్వాత నాలుగో భాగంలో సంన్యాసి కావాలి.

ఈ పద్ధతులలో మనువు **'పురుషుడి వివాహం వయసు కనీసం 25 ఏళ్లుండా'**లని స్పష్టంగా చెప్పాడు. అంతకు ముందు పెళ్లి జరగరాదు. ఈ పద్ధతిలో స్త్రీ వర్గాలను పరిగణిస్తే వారి సగటు వివాహం వయసు 25వ సంవత్సరంలో నిర్ధారితం చేయవచ్చు. లేదా సుశ్రుతుడు చెప్పిన ప్రమాణాలను అనుసరించి కనీసం 16 ఏళ్లుగా నిర్ధారించవచ్చు. 16 ఏళ్లకు ముందు కన్యకు పెళ్లి పనికి రాదు.

7. శూద్రుల పెళ్లి విషయంలో మనువు అభిప్రాయం

స్థూల దృష్టితో మనుస్మృతిని చదివిన వారికి అందులో శూద్రుల పట్ల గౌరవం, అగౌరవం రెండూ ఉన్నట్లు అనిపిస్తుంది. గంభీరంగా లోతుగా చదివితే, మౌలిక, ప్రక్షిప్తాలను పరిశీలించి మనువు మౌలిక అభిప్రాయాలను గ్రహిస్తే మనువు శూద్రుల పట్ల మానవీయ, సమానత లాంటి అభిప్రాయాలతో ఉన్నాడని అర్థమవుతుంది. మనుస్మృతిలో అక్కడక్కడ కనిపించే పక్షపాతం, అన్యాయం, హెచ్చుతక్కువలు, అంటరానితనం మొదలైన వన్నీ, కర్మాధారిత వర్ణ వ్యవస్థ విచ్ఛిన్నమై జన్మాధారిత జాతుల వ్యవస్థగా రూపొందిన కాలంలో తరువాతివారు చేర్చిన ప్రక్షిప్తాలే కానీ, మౌలికాలు కావు.

పుట్టుకను అధారం చేసుకున్న జాతి వ్యవస్థను అనుసరించి నేటి సమాజంలో శూద్రులుగా పేర్కొనబడుతున్న వారు మనువు వర్ణించిన శూద్రులూ కారు, వారి పట్ల ద్వేషభావం ఉండాలనే అర్థమూ లేదు. ముందే ప్రమాణాలు చూపినట్లుగా, మనువు చెప్పిన కర్మాధారిత వర్ణ వ్యవస్థలో జాతులు, ఉప జాతులు లేనే లేవు. కేవలం నాలుగు వర్ణాలే ఉన్నాయి. ఆ నాలుగు వర్ణాలలో పుట్టిన బాలబాలికలు మూడు వర్ణాలలోనే చదువు, దీక్ష గ్రహించేవారు. విద్యనేర్వనివారిని శూద్రులని పిలిచేవారు. అంటే మిగిలిన మూడు పెద్ద వర్ణాలలోనూ చదువుకోని వారినే శూద్రులనే వారు. అందువల్ల వారిలో హెచ్చుతగ్గులు, అంటరానితనం, ఈర్ష్యాద్వేషాలు ఉండేవి కావు. మనువు ప్రకారం సవర్ణులూ, ఆర్యులూ కూడా శూద్రులయ్యేవారు. వారు ఆ నాలుగు వర్ణాల వ్యవస్థలోనే ఉండే వారు కాబట్టి, మిగిలిన వర్ణాల వారితో సమానులుగానే ఉండేవారు. నేడు అనుకుంటున్న నిమ్న లేదా వెనుకబడిన జాతుల జనాన్ని మనువు ఎక్కడా శూద్రులు అనలేదు. నేటి జనం తాము ఆరోపించిన విషయాలతో మనువు పేరును బలవంతంగా జోడించి, మనువు వారిని శూద్రులన్నాడని చెబుతున్నారు. నాటి వర్ణవ్యవస్థలోని శూద్రుడు నేటి శూద్రుడు కాడు. వారిని నేటి పుట్టుకకు సంబంధించిన జాతివాదమే శూద్రులని ప్రకటించింది.

1. శూద్రులు ఎవరు?

ముందుగా పాఠకులు మనువు నిర్దేశించిన వర్ణ వ్యవస్థలో శూద్రు లెవరో, వారెలా వచ్చారో తెలుసుకోవాలి. మనువు వర్ణ నిర్ధారణ వ్యవస్థను పరిశీలించినట్లయితే ఒక గొప్ప శ్లోకం కనబడుతుంది.

బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః త్రయో వర్ణా ద్విజాతయః ।
చతుర్థ ఏక జాతిస్తు శూద్రో నాస్తి తు పఞ్చమః ॥ 10.4 ॥

అంటే –"మనువు చెప్పిన ఆర్యుల వర్ణ వ్యవస్థలో కేవలం నాలుగు వర్ణాలు లేదా జాతులున్నాయి. ఐదవ వర్ణం కానీ, జాతి కానీ లేదు. నాలుగువర్ణాల్లో మొదటి మూడూ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు. వీరు **'ద్విజాతి'** అనబడతారు. ఎందుకంటే వీరికి రెండు జన్మ లుంటాయి. ఒకటి తల్లిదండ్రుల వల్ల, రెండోది గురువు ద్వారా స్నాతకరూపమైన బ్రహ్మజన్మ = విద్యా జన్మ. ఎవడికి విద్యా జన్మ ఉండదో, అంటే, మునుపటి మూడు వర్ణాల వారి చదువు, శిక్షణ పొంది స్నాతకుడు కాని వాడు, తల్లిదండ్రుల వల్ల పొందిన కేవలం ఒక జన్మ ఆధారంగా **'ఏక జాతీయుడు' = 'ఒకటే జన్మ వాడు'** అనబడతాడు. వాడిని శూద్రుడు అంటారు" అని అర్థం.

చూశారా, శూద్రుడికి ఎంత చక్కని నిర్వచనం ఇచ్చాడో ! మనువు ప్రకారం నాలుగు వర్ణాల వారిలో ఎవరు చదువు లేనివారో వారు శూద్రులు. ఒక జాతి – ఉపజాతిని ఆధారం చేసుకుని శూద్రుడని మనువు రాయలేదు. మనుస్మృతిలోని ఇతర శ్లోకాలలోనూ ఇదే అభిప్రాయానికి బలం చేకూరుతుంది. ఎవరైనా అగ్రవర్ణానికి చెందినవారు అధ్యయన-అధ్యాపనలు, తన వర్ణానికి చెందిన ఆచరణలు, చదువుకున్నవారు వారి శిష్టాచారాలను వదిలిపెడితే, చదువు లేని వారిలాగా వ్యవహరించడమూ, ఆచారం లేకుండా ఉంటే, అలాంటి వారిని మనువు శూద్రులని అన్నాడు. మనువు అభిప్రాయంలో చదువులేనివాడే శూద్రుడు అనేది స్పష్టమైంది.

యో న వేత్త్యభివాదస్య విప్రః ప్రత్యభివాదనమ్ ।
నాభివాద్యః స విదుషా యథా శూద్రస్తథైవ సః ॥ 2.126 ॥

అర్థం – ఏ ద్విజుడికి అభివాదనానికి సమాధానం తెలియదో, అంటే విధిప్రకారం జవాబు ఇవ్వనివాడికి అభివాదనం చేయనక్కర లేదు. ఎందుకంటే వాడు శూద్రునితో సమానుడు కాబట్టి.

"యోఽనధీత్య ద్విజో వేదమ్....శూద్రత్వమాశు గచ్ఛతి సాన్వయః ।" 2.168 ॥

అంటే – వేదం స్వాధ్యాయం విడిచినవాడు, అధ్యయనాన్ని వదిలినందున, త్వరలోనే శిక్షణలేనివాడై శూద్రత్వాన్ని పొందుతాడు. అంతే కాదు, అతనితోపాటు అతని కుటుంబమూ శూద్రత్వాన్ని పొందుతుంది అని.

2. శూద్రులు అస్పృశ్యులు కారు.

అగ్ర వర్ణులైన మూడు వర్ణాల వారూ తమ తమ వర్ణాలకు తగిన విద్యాభ్యాసం చేయటం వల్ల తమ తమ వృత్తులకు తగిన పనులు చేస్తారు. విద్య నేర్వనివాడైన **'శూద్రుడు'** విద్యాసంబంధమైన కార్యాలేవీ చేయలేడు కాబట్టి, కాయకష్టమే చేస్తాడు. నేటికీ చదువుకోనివారు ఈ పనులే చేస్తున్నారు. ప్రభుత్వ సేవారంగాలలో నేటికీ వారి పేర్లు నాలుగో శ్రేణి కర్మికులు (క్లాస్‌ఫోర్) చప్రాసీలు, ప్యూనులు, శ్రామికులు, భృత్యులు, సేవకులు, చౌకీదారులు, పరిచారకులు, పనులపై తిరిగేవారు మొదలైన వాటికే పరిమితమయ్యాయి. మొదట్లో వీరందరినీ శూద్రవర్ణులుగా పరిగణించేవారు. శూద్రుడంటే, **'శారీరక శ్రమ చేసేవాడు'** అనే అర్థం – **'శుద్రవతీతి'**– **'ఆశు ద్రవతీతి'** = పని చెప్పిన వాడి ఆదేశానుసారం ఇటూ అటూ తిరిగే పనులు చేసే వాడు. ఈ పేరులో ఎలాంటి తక్కువ తనమూ, లేదా ఈర్ష్యాద్వేషాలూ లేవు. శూద్రుల కర్తవ్యం ఇళ్లలో పనులు చేయడమే నని మనువు చెప్పాడు–

ఏకమేవ తు శూద్రస్య ప్రభుః కర్మ సమాదిశత్ ।
ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషామనసూయయా ॥ 1.91 ॥

అర్థం– 'వేదాలలో పరమేశ్వరుడు, మిగిలిన మూడు ఉన్నత వర్ణాల వారికీ నిష్ఠాపూర్వకంగా సేవ చేయడమే శూద్రుల కర్తవ్యమని చెప్పాడు.

"తపసో శూద్రమ్"– యజు. 30.5 ॥

అర్థం–'కాయకష్టపు పనులు చేయటానికే శూద్రవర్ణంవారి వ్యవస్థ జరిగింది.'

ద్విజుల ఇళ్లలో వంటలు చేసేవారు, అక్కడనే తినే వారు, బట్టలు ఉతికే వారు, ఇంటికి కావలసిన సామగ్రి తెచ్చేవారు, గిన్నెలు తోమేవారు– వీరెవరినీ ఎప్పుడూ అస్పృశ్యులు లేదా ద్వేషభావంతో చూసేవారు కాదు. అందు వల్ల మనువు చెప్పిన వర్ణ వ్యవస్థలోని శూద్రుడు అస్పృశ్యుడు కాడు. ద్వేషించతగినవాడు కాడు, తక్కువ కారు, అనాదరించతగినవారు కాదు. మనువు పేరిట ఈ రకమైన విషయాలు చెప్పేవారందరూ మనువుతో పాటు మనువు చెప్పిన వ్యవస్థపై కూడా లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నవారే.

3. శూద్రులూ ఆర్యులే

మనువు 'ఆర్యులు, అనార్యు'లను ఇలా గుర్తించాలని చెబుతున్నాడు–

"వర్ణాపేతమ్....ఆర్యరూపమివ అనార్యమ్" 10.57 ॥

అంటే– 'నాలుగువర్ణాలవారు కాని వారు, అనార్యులు.' ఇందాకటి శ్లోకంలో చాతుర్వర్ణ్య వ్యవస్థ ఆర్యుల వ్యవస్థ; అందులోని నాలుగు వర్ణాల వారూ ఆర్యులు అని చెప్పబడింది. ఈ విధంగా మనువు ఏర్పరచిన వ్యవస్థ ప్రకారం

శూద్రులు సవర్ణులే కాదు, ఆర్యులే అవుతారు. శూద్రులను ఎక్కడైనా, అసవర్ణులు, అనార్యులు అని చెబితే అలాంటి కథనాలు మనువు విధానాలకు వ్యతిరేకమూ, అలాంటిది జన్మతో ఏర్పడిన జాతి వాదుల ప్రసాదమే అవుతుంది. **డా.బి.ఆర్.** అంబేద్కర్ కూడా తన సాహిత్యంలో పలు చోట్ల మనువు శూద్రులను ఆర్యులలోని వారే నని చెప్పాడనే ఈ సత్యాన్ని స్వీకరించాడు. అతను చెప్పిన కొన్ని పఠనీయాలూ, స్మరణీయాలూ అయిన వాక్యాలు-

క. "**దురదృష్టవశాత్తూ జనులందరిలోను శూద్రులు అనార్యు**"లనే భావం పాతుకుపోయి వుంది. కానీ ప్రాచీన సాహిత్యంలో దీన్ని గురించి కాస్తయినా ఆధారాలు లభించడం లేదు."

(డా. అంబేద్కర్ వాఙ్మయం. ఖండం 5.పు.319)

ఖ. 'ధర్మసూత్రాలలో ఉన్న శూద్రులు అనార్యులు అనే మాట అంగీకరించ దగింది కాదు. ఈ సిద్ధాంతం **"మనువు, కౌటిల్యులకు వ్యతిరేకం."** (శూద్రుల అన్వేషణ. పు.42)

గ. "శూద్రులు ఆర్యులే, అంటే వారు జీవితంలో ఆర్యులపద్ధతి పట్ల నమ్మకం గలవారు. శూద్రులను ఆర్యులుగా స్వీకరించారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనూ వారిని ఆర్యులనే పేర్కొన్నారు. శూద్రులు ఆర్యులసంఘానికి అభిన్నులూ, సమ్మానితులైన సభ్యులు." (డా.అంబేద్కర్ వాఙ్మయం 5వ ఖండం, పు.322).

ఘ. "ఆర్య జాతులంటే నాలుగువర్ణాలవారని అర్థం- బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు. మరో విధంగా చెప్పాలంటే, నాలుగువర్ణాలవారినీ మనువు ఆర్య వాదపుసారమని నమ్మాడు" (అం.వా.ఖండం. పు.215).

ఙ. "మనుస్మృతిలోని 10.4వ శ్లోకం (**బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః....** ఈ అధ్యాయం ప్రారంభంలో చెప్పబడింది). రెండు కారణాల వల్ల చాలా గొప్పది. ఒకటి - ఇందులో శూద్రులు దస్యుల కంటే భిన్నులని చెప్పబడటం.

రెండు- దీనివల్ల శూద్రులు కూడా ఆర్యులని తెలియటం." (పైది.అం.వా.8వ ఖండం, పు.125 - వ్యాఖ్యానం).

చ. "సవర్ణం అంటే నాలుగు వర్ణాలలోనూ ఒక వర్ణానికి చెందిన వారై ఉండటం. అసవర్ణులు అంటే ఆ నాలుగు వర్ణాలకూ చెందని వారు కావటం. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు సవర్ణులు." (పైదే. అం.వా.ఆరవ ఖండం.పు.181)

4. **శూద్రులు దాసులనే విధానం మనువు చెప్పలేదు.** మనువు శూద్రులు దాసులు అని కాని ఆ మాటలకు వంత పాడేవాడు గానీ కాదు. వారికి శూద్రులు, సేవకులు, స్త్రీ కార్మికులు మొదలైన పదవులు, వేతనాలు ఆయా స్థానాల ననుసరించి ఇమ్మని చెప్పాడు. వేతనం తీసుకునే వాడు దాసుడు కాదు. చూడండి -

క. **రాజా కర్మసు యుక్తానాం స్త్రీణాం ప్రేష్యజనస్య చ ।**
ప్రత్యహం కల్పయేద్ వృత్తిం స్థానకర్మానురూపతః ॥ 7.125

అంటే- "రాజు పనిలో నియమించే శ్రామికులు, సేవకులు, స్త్రీలకు ప్రతి రోజూ వేతనం, పని, పదవి, స్థానాలను అనుసరించి నిర్ధారించాలి." దీనికి స్పష్టమైన అర్థం ఏమిటంటే, మనువు ప్రకారం, శూద్రులు, స్త్రీలను దాసులుగా చేసుకోకూడదు. వారి పదవి, వేతనాల ప్రకారం వారి చేత పనులు చేయించుకోవాలి.

ఖ. కింది శ్లోకంలో చెప్పిన పద్ధతి ఏమిటంటే, ఏదైన జబ్బు చేయటం లాంటి కారణాలతో భృత్యులు దీర్ఘ కాలం సెలవు తీసుకున్నా, వారి జీతం వారికి ఇవ్వాలి. ఈ పద్ధతికి ఆధారం మానవీయత. దాసుడికి ఎప్పుడూ ఇలాంటి పద్ధతి ఉండదు. అదేమిటంటే -

"స దీర్ఘస్యాపి కాలస్య తల్లభేతైవ వేతనమ్ ।" 8.216

అర్థం- 'సెలవు నుంచి తిరిగివచ్చాక భృత్యుడు తనకు పూర్వం నిర్ధారించిన పనులు పూర్తి చేస్తే అతనికి సెలవు రోజుల జీతం కూడా తీసుకునే అధికారం ఉంటుంది. అంటే దీర్ఘ కాలం సెలవుల్లో ఉన్నప్పటికీ అతని జీతం అతని కివ్వాలి అని.'

5. శూద్రులకు అద్భుతమైన మానవీయ సమ్మానం

ఈ కింది ఆదేశం ద్వారా, మనువుకు శూద్రుల పట్ల ఎంతటి మానవీయ గౌరవం ఉందో తెలుస్తుంది. మనువేమంటాడంటే, తమ భృత్యులు (శూద్రులు) భోజనం చేసిన తర్వాతనే ద్విజ దంపతులు భుజించాలి అని.

భుక్తవత్సు-అథ విప్రేషు స్వేషు భృత్యేషు చైవ హి ।
భుంజీయాతాం తతః పశ్చాత్-అవశిష్టం తు దమ్పతీ ॥ 3.116 ॥

అర్థం- 'విద్వాంసులైన తమ అతిథులూ, భృత్యులూ (శూద్రులు) తిన్న తరువాతే మిగిలిన ఆహారం ద్విజ దంపతులు తినాలి."

నేటి వర్ణరహిత ప్రపంచంలో ఏ సభ్య సమాజంలోనైనా, శూద్రుల పట్ల మనువు లాంటి గొప్ప మానవతా దృక్పథం కలవారున్నారా? నేటి ఏ సమాజంలోనైనా శూద్రుల పట్ల మనువు వలె ఉదారమూ, అద్భుతమూ అయిన ఆదేశా లిచ్చిన వారు ఉన్నారా? సాటి లేని ఇలాంటి ఆదేశాలిచ్చిన మనువుపై శూద్ర విరోధి అనే ఆరోపణ చేయటం కేవలం కృతఘ్నతే తప్ప మరేదైనా అవుతుందా? మనుస్మృతిలోని శూద్ర విరోధి అని చెప్పిన అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే అనడానికి, ఈ ఒక్క శ్లోకము సరి పోదా? ఈ శ్లోకం వల్ల, శూద్రులు సేవకులుగా ఉంటూ ద్విజుల ఇళ్లలోనే తినేవారని తెలుస్తూంది. వారిని అస్పృశ్యులుగానూ, ద్వేష భావంతోనూ చూసే వారు కారనీ స్పష్టమవుతూంది.

6.శూద్రుడి విషయంలో మనువు దండనీతి

పాఠకులారా ! రండి అన్నింటికంటే ఎక్కువగా మనువు చెప్పిన దండనవ్యవస్థపైనే దృష్టి పెట్టబడుతుంది. మనుస్మృతిలో "శూద్రులకు అత్యధిక దండన-బ్రాహ్మణులకు ప్రత్యేకమైన మినహాయింపు ఇవ్వబడిం"దని చాలా మంది అపోహపడుతుంటారు. ఇది సరియైనదికాదు. మనుస్మృతిలో మనువు మాత్రం ఇలా ఎక్కడా చెప్పలేదు. బ్రాహ్మణులకు అత్యధిక దండన- శూద్రులకే అతి తక్కువ దండన వ్యవస్థ ఉంది. జ్ఞానులైన వారు, పెద్ద పదవిలో ఉన్నా వారు చేసే తప్పు యొక్క ప్రభావం సమాజంపై ఎక్కువ పడుతుంది. కాబట్టే మనువు దండన వ్యవస్థను యథాయోగ్యంగా, మనో వైజ్ఞానిక ఆధారంగా నిర్ణయించినాడు. గుణకర్మ స్వభావాల ఆధారంగా ఎక్కువ వర్ణంవారికి ఎక్కువ శిక్ష, తక్కువ వర్ణంవారికి తక్కువ శిక్ష విధింపబడింది. ఎట్ల సమాజంలో గౌరవం అధికంగా ఉంటుందో అట్లే శిక్ష కూడా అధికంగానే ఉంటుంది.

శూద్రులకు అందరి కంటే తక్కువ దండన పద్ధతి

మనువు చెప్పిన శిక్షా వ్యవస్థలో శూద్రులకు అందరికంటే తక్కువ దండన లభించేది. బ్రాహ్మణులకు అందరి కంటే ఎక్కువ శిక్ష; రాజుకు అంత కంటే ఎక్కువ. మనువు చెప్పిన ఈ సర్వ సామాన్యమైన దండన విధానం,సిద్ధాంతపరంగా అన్ని వర్ణాలవారికి దండన పద్ధతి యథోచితంగా ఆచరణలో ఉండేది -

అష్టాపాద్యం తు శూద్రస్య స్తేయే భవతి కిల్బిషమ్ ।
షోడశైవ తు వైశ్యస్య ద్వాత్రింశత్ క్షత్రియస్య చ ॥ 8.337 ॥

బ్రాహ్మణస్య చతుఃషష్టిః పూర్ణం వాఽపి శతం భవేత్ ।
ద్విగుణా వా చతుఃషష్టిః, తద్దోషగుణవిద్ధి సః ॥ 8.338 ॥

అంటే- 'ఏదైనా దొంగిలిస్తే ఆ అపరాధానికి శూద్రుడికి 8 రెట్లు, వైశ్యుడికి 16 రెట్లు, క్షత్రియుడికి 32 రెట్లు, ఇంకా అంటే 128 రెట్లు అధికంగా కూడా. ఇలా ఎందుకంటే, ఆయా వర్ణాల వారి తదుపరి తరాల వారు ఒక అపరాధపు గుణదోషాలు, వాటి పరిణామాలు, ప్రభావాలు మొ॥ బాగా అర్థం చేసుకోగలుగుతారు." నేటి వర్ణరహిత ప్రపంచంలో ఏ సభ్య సమాజంలోనైనా, ఎవరెంత ఉన్నత వర్ణానికి చెందితే వారి వల్ల అంతంతగానూ దుష్ప్రభావాలు సమాజంపై

పడతాయి. అందుచేత మనువు చెప్పిన వ్యవస్థలో ఎవరెంత పెద్దవారైతే, అంత ఎక్కువ శిక్ష పడుతుంది. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, ఆచార్యుడు మొదలైన వారెవరికైనా అపరాధానికి తగిన దండన నుండి మినహాయింపు ఉండదు.

పితాఽఽచార్యః సుహృన్మాతా భార్యా పుత్రః పురోహితః ।
నాఽదణ్డ్యో నామ రాజ్ఞోఽస్తి యః స్వధర్మే న తిష్ఠతి ॥ 8.335 ॥

కార్షాపణంభవేద్దణ్డ్యోయత్రాన్యః ప్రాకృతో జనః ।
తత్ర రాజా భవేద్ దణ్డ్యః సహస్రమితి ధారణా ॥ 8.336 ॥

అర్థం- 'ఎవరైతే తమకు నిర్దేశించిన, ధర్మాలు, కర్తవ్యాలు, విధానాలు పాటించరో, వారు తప్పక దండనీయులు, తండ్రి, తల్లి, గురువు, మిత్రుడు, భార్య, కొడుకు లేదా పురోహితుడు అయినా సరే! ఏ అపరాధానికైనా సామాన్యుడికి ఒక పైసా శిక్షపడితే, దానికి రాజుకు 1000 రెట్లు అధికంగా, జరిమానా పడుతుంది. ఇక్కడ **గురువు, పురోహితులను** కూడా తప్పక దండించే పద్ధతి ఉంది. అందుచేత బ్రాహ్మణులను దండించకుండా విడిచిపెట్టేపద్ధతిని చెప్పే శ్లోకాలన్నీ మనుస్మృతిలో లభించే వన్నీ మను వ్యవస్థకు వ్యతిరేకాలు కాబట్టి ప్రక్షిప్తాలు.'

7. వేదాలలో వర్ణించిన శూద్రుల పట్ల సద్భావమే మనువు యొక్క ఆదర్శం

వేదాలను పరమ ప్రమాణంగానూ, తన స్మృతి గ్రంథానికి ఆధారంగానూ భావించి స్వీకరించిన మనువు, వేదాలలో చెప్పిన ఆదేశాలు, నిర్దేశాలకు వ్యతిరేకంగా వెళ్లడు. వాటికి వ్యతిరేకంగా పద్ధతులు చెప్పడు. అందుచేత, తన స్మృతిలో శూద్రుల పట్ల ఎలాంటి అసద్భావననూ చూపడని ఊహించనైనా ఊహించలేము. ఆయనకు వేదాలను గురించి లోతైన జ్ఞానం ఉంది. ఆ పరంపరకు తాను స్వయంగా వాహకుడు. అందుచేత ఆయన విధానం సద్భావంతోనే నిండి ఉంటుంది. వాటిలో కొన్ని మునుపే చెప్పుకున్నాము. ఇక్కడ వేదాలలో శూద్రుల పట్ల సద్భావనను వర్ణించే కొన్ని మంత్రాలు చూడండి-

క. **రుచం నో ధేహి బ్రాహ్మణేషు రుచం రాజసు నస్కృధి ।**
రుచం విశ్యేషు శూద్రేషు మయి దేహి రుచారుచమ్ ॥ యజుర్వేదం. 18.48॥

అర్థం- పరమేశ్వరుడు పక్షపాత రహితుడై బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్ర మొదలైన అన్ని వర్ణాల పట్ల సమానమైన ప్రేమను చూపునట్లు విద్వాంసులు కూడ సమాన ప్రేమను చూపాలి. ఈశ్వరుడి గుణకర్మ స్వభావాలకు వ్యతిరేకంగా నడచువారందరూ నీచులు- తిరస్కరింపదగినవారు.

ఖ. **"ప్రియం మా దర్భ కృణు బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ ।"**
అథర్వవేద. 19.32.8 ॥

అర్థం- 'నన్ను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులందరికీ ప్రియమైన వాణ్ని చేయండి, నేనందరినీ ప్రేమించేవాణ్నీ, అందరి ప్రేమనూ పొందే వాడిని కావాలి.'

గ. **ప్రియం మా కృణు దేవేషు ప్రియం రాజసు మా కృణు ।**
ప్రియం సర్వస్య పశ్యత ఉత శూద్రే-ఉతార్యే ॥ అథర్వవేద. 19.62.1॥

అర్థం- 'నాపై బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు, ఇంకా ఎవరెవరి దృష్టి పడుతుందో వారందరికీ ప్రియమైన వాణ్ని చేయి!'

వేదాలలోని ఈ మంత్రాలు మంచి భావాలతో నిండిన రచనలు. వైదిక కాలం నాటి సమాజం ఎలా ఉండేదో చెప్పటానికి, వైదిక సంస్కృతి, సామాజిక వ్యవస్థలకు ఒక నమూనా మంత్రంగా ఇది చెప్పబడింది. ఈ వేదాలే స్వాయంభువ

మనువుకు ఆదర్శాలు. అందుచేతనే అతని రచనలు కూడా ఎంతో సద్భావంతో నిండి ఉన్నాయి. వేదభక్తుడైన మనువు, శూద్రుల పట్ల మంచిభావమే తప్ప తక్కువ చేసే మాటలు చెప్పనే లేదు. మనుస్మృతిలో లభించే సూక్తులు **'వేద వ్యతిరేకం'** అనేది ప్రమాణం ప్రకారం, తరువాతివారు ప్రక్షిప్తం చేసినవే అని చెప్పవచ్చు.

8. శూద్రులకు ధర్మపాలనాధికారం

శూద్రులకు ధర్మపాలనాధికారం ఉంది. 2.238లో **"అంత్యాదపి పరం ధర్మమ్"** అని చెప్పి, శూద్రులు మొ॥ వారు కూడా ధర్మవిద్య నేర్చుకోవాలని చెప్పాడు మనువు. ధర్మాన్ని ఎవడు తెలుసుకుంటాడో వాడు ధర్మపాలనం చేసేవాడవుతాడు. ధర్మాచరణం చేస్తాడు. అతని నుంచి ఎవరైనా ఆ ధర్మవిద్యను నేర్వగలుగుతారు - అని చెప్పాడు.

క. శూద్రులకు వేదాధ్యయన అధికారం

శూద్రులకు వేదాలను అధ్యయనం చేసే అధికారం కూడా ఉంది. యజుర్వేదంలోని 26.2 మంత్రంలో **"యథేమాం వాచం కల్యాణీం.... శూద్రాయ చార్యాయ చ"**అని సంకేతా లిచ్చాడు. దీని వ్యాఖ్య ఇదే అధ్యాయంలోని **'స్త్రీ-వేదాధ్యయనం'** అనే వ్యాసంలో (సంఖ్య 5) ఇవ్వబడింది. చూడండి.

ఖ. వేదాలలో శూద్రులకు యజ్ఞ విధానం

ఋక్ 10.53.4-5లలో **"పంచజనా మమహోత్రం జుషధ్వమ్"** అని చెప్పి శూద్రులు కూడా యజ్ఞాలు చేయాలని ఆదేశించాడు. నిరుక్తం 3.2.5 వ్యాఖ్యలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు మరియు నిరామిష భోజులైన నిషాదులను పంచ జనులుగా పరిగణించాడు. (దీని మీద విస్తృత చర్చ **'కర్మణా వర్ణ వ్యవస్థ'** వ్యాసంలో సంఖ్య 12లో జరిగింది.).

9. శూద్రులకు గౌరవం

మనుస్మృతిలో అక్కడక్కడా శూద్రుల పట్ల ద్వేషం, కోపం, అమర్యాద, వివక్షలను చెప్పే వర్ణనలున్నాయి. ఇవన్నీ కూడా అధర్ములు, పాపులు, దోషులైనవారి పట్ల తప్ప మిగిలిన ఎవరి పట్లా కోపాన్ని ప్రకటించడం మనువుశైలిలో లేనే లేదు. అన్ని పద్ధతులనూ సహజంగానూ, నిర్లిప్తంగానూ చెబుతాడు. 1.91లోని పద్ధతి ఆ విధంగా సహజమైనది. కింది శ్లోకంలో మనువు ద్విజులను సైతం వృద్ధశూద్రులను ముందుగా గౌరవించాలని ఆదేశించాడు.

"సోఽత్ర మానార్హః శూద్రోఽపి దశమీం గతః" 2.192 (137) ॥

10. శూద్రులు పవిత్రులు. అగ్రవర్ణాన్ని పొంద దగినవారు. శూద్రులు అస్పృశ్యులు, కింది జాతివారు, ద్వేషించ దగినవారు కారు- ఈ శ్లోకం చూడండి -

శుచిరుత్కృష్టశుశ్రూషుర్మృదువాగనహంకృతః ।
బ్రాహ్మణాద్యాశ్రయో నిత్యముత్కృష్టాం జాతిమశ్నుతే ॥ 9.335 ॥

శుద్ధులు- పవిత్రులు, (శరీరము, మనసుతో) (ఉత్కృష్టశుశ్రూషః)తన కంటే పెద్ద వర్ణాలు వారికి సేవ చేసేవారు, (మృదువాక్) బాగా మాట్లాడేవారు, అహంకారం లేని వారు, ఎప్పుడూ బ్రాహ్మణులు మొ॥ మూడువర్ణాలవారి సేవలో నిమగ్నులయ్యే శూద్రులు ఉత్తమ, బ్రాహ్మణాది ద్విజ వర్ణాన్ని పొందగలుగుతారు.

ఈ శ్లోకంలోని వర్ణనను బట్టి శూద్రులను మనువు హీనంగా చూసేవాడు కాదనీ, గొప్ప, పెద్ద వర్ణాలవారి చదువు - దీక్షలు పొంది గొప్పవర్ణాలను పొందే అధికారమున్న వారిగా భావించే వాడనీ తెలుస్తుంది. ఈ విషయం మనువు చెప్పిన 10.65లోనూ ఉంది.

ఉపనయన విషయం 2.11-14 (36-39) లలో ఎక్కడా కూడా శూద్రులకు ఉపనయనం నిషేధమని చెప్ప లేదనీ ఉంది. దీని వల్ల ఎవరూ జన్మతో ఉన్నత వర్ణస్థులు కాదన్న సూచన లభిస్తుంది. శూద్రులకు పుట్టిన బాలుడు కూడా ద్విజ వర్ణాలు పొందటానికి ఉపనయనం చేయించుకోవచ్చు.

ఈ సంక్షిప్త విశ్లేషణతో శూద్రుల పట్ల మనువు కున్న అభిప్రాయం స్పష్టమవుతూంది. మరింత చర్చ 'మనువు - కర్మణా వర్ణ వ్యవస్థ' అనే వ్యాసం చూడండి.

8. స్వర్గ నరకాలు

అ. స్వర్గం లేదా స్వర్గలోకంపై మనువు అభిప్రాయం

ఈ ప్రపంచాన్ని మించిన స్వర్గం గానీ, నరకంగానీ ఉన్నాయని మనువు నమ్మేవాడు కాదు. సుఖం లభిస్తే అదే స్వర్గం, దుఃఖం కలిగితే అదే నరకం. ఇవి ఈ జీవితంలోనే, ప్రపంచంలోనే లభిస్తూ ఉంటాయి. దీనికి ప్రమాణాలు -

(1) 'స్వర్గం' అనే పదాన్ని మనువు ఇహ లోక సుఖాలు, మోక్ష సుఖం- ఈ రెండిటికీ వాడాడు. 3.79లో అక్షయ సుఖం అంటే మోక్షం కోసం 'స్వర్గ' శబ్దాన్ని ప్రయోగించాడు: దానికి పర్యాయ వాచకంగా ఇహలోక సుఖం కోసం 'సుఖం' అనే పదాన్ని ప్రయోగించాడు.

(2) సుఖం అనే దాని అర్థం లేదా దాని పర్యాయపదమైన 'స్వర్గాన్ని' వేరే చోట్ల కూడా వాడాడు-

క. **"అస్వర్గ్యం చాతిభోజనమ్"** । 2.32 (2.57) ॥

ఖ. **"దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ ।"** 9.28 ॥

గ. **"స్వర్గ-ఆయుష్య-యశస్యాని వ్రతానీమాని ధారయేత్ ।"** 4.13 ॥

(3) అక్షయ సుఖం లేదా మోక్షం కోసం 'స్వర్గం' పద ప్రయోగం చేశాడు.

క. **3-79లో "స్వర్గమక్షయమిచ్ఛతా."**

ఖ. **"ఇదమన్విచ్ఛతాం స్వర్గమ్, ఇదమానన్త్యమిచ్ఛతామ్ ।"**

(4) 12.9, 39-52 శ్లోకాలలో మరణం తర్వాత జీవుడికి అతని కర్మల ప్రకారం ప్రాప్తించబోయే జన్మల వర్ణన చేశాడు. ఈ సందర్భంలో స్వర్గ లోకం లేదా స్వర్గ యోనిని ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదు.

(5) వ్యాకరణ శాస్త్రం ప్రకారం, 'స్వర్గం' ఉప పదంగా **'గమ్లృ - గతౌ'** అనే ధాతువు నుంచి 'డ ప్రకరణేఽన్యేష్వపి దృశ్యతే' అ.3.248 వార్తిక సూత్రంతో 'డః' ప్రత్యయం సాయంతో రూపొందుతుంది. గతి అంటే **'జ్ఞానం-గమనం-ప్రాప్తి'** అని మూడు అర్థాలున్నాయి. 'స్వః' సుఖానుభవం కలగడం, సుఖంలోకి ప్రవేశించడం, సుఖ ప్రాప్తి కలగడం-ఇవే. స్వర్గం అంటే సుఖం.

(6) ఇలాగే **'స్వర్గ లోకం'** అర్థం కూడా ఉంటుంది. **'లోకృ దర్శనే'** ధాతువు నుంచి **'లోక'** శబ్దం వస్తుంది. దాని అర్థం **'స్థానం'**. ఎక్కడ స్వర్గం ప్రాప్తిస్తుందో- సుఖం కలుగుతుందో అదే **'స్వర్గ లోకం'**.

ఆ. నరకం కల్పన కూడా మనువుకు వ్యతిరేకం:- 4.81, 87-91 శ్లోకాలలో 21 నరక యోనుల లెక్క ఉంది. క్షత్రియులు కాని రాజుల నుంచి దానం స్వీకరించిన వారికి ఈ జన్మలు కలుగుతాయని చెప్పాడు. మనువు ప్రకారం, **'నరకం'** పేరిట ఒక జన్మ లేదా స్థానం లేనే లేదు. ఈ విషయంలో హీనమైన ఆధారాలతో మనువుకు వ్యతిరేకమైన ప్రక్షిప్తాలు -

1. **నరక శబ్దము స్వర్గ పదానికి వ్యతిరేకం.** మనువు 2.32 (2.57) లో సుఖమూ, 3.79 లో స్వర్గ పద్దాల ప్రయోగం సుఖం, **'అక్షయ సుఖం'** వీటి కోసం చేశాడు. 9.28లో **"దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ"** అని చెప్పి, **'వర్తమాన జీవిత సుఖం'** అనే అర్థంలో వాడాడు. దీని వల్ల స్వర్గానికి వ్యతిరేక పదమైన **'నరకం'** అనేదాని అర్థం, ఏదైనా జన్మ లేదా స్థాన విశేషం కాదనీ, కేవలం దుఃఖమేననీ స్పష్టమవుతుంది. నిరుక్తంలో

యాస్కాచార్యులు కూడా 'నరకం' పదాన్ని ఇదే విధంగా నిర్వచించాడు- **"నరకం న్యరకం నీచైర్గమనమ్ ఇతి వా"**- అంటే దుఃఖం, అధః పతనం లేదా అవనతి పేరే 'నరకం' (నిరుక్తం 1.3-11).

2. మరణం తర్వాత జీవితానికి కేవలం రెండే దశ లున్నాయని మనువు భావించేవాడు. ఒకటి-ఈ ప్రపంచంలో స్థావర జంగమాలుగా పుట్టడం (6.63,74; 12.9, 39-52) లేదా రెండు బ్రహ్మప్రాప్తి కలగటం.(4.149; 6.81; 12.116, 125). దీని వల్ల మనువు అభిప్రాయంలో నరకం పేరిట మరొక జన్మ ఎత్తవలసిన అవసరం లేనే లేదని స్పష్ట మవుతూంది.

3. మనువు, 12.9,39 నుంచి 52 వరకు గల శ్లోకాలలో మృత్యువు తర్వాత జీవునికి అతని కర్మలను అనుసరించి కలిగే జన్మలను లెక్కించాడు. ఈ గణనలో నరకం గురించిన ప్రస్తావన లేక పోవడం వల్ల, మనువు 'నరకాన్ని' విశ్వసించడని తెలుస్తూంది. 12.52, 74,82 శ్లోకాలలో చాలా స్పష్టంగానూ సరళంగానూ వ్యక్తి తన కర్మల ప్రకారమే పైన చెప్పిన శరీరాలను ధరించి, ఇదే ప్రపంచంలో సుఖదుఃఖాలు అనుభవిస్తాడని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అందుచేత నరకం అనే దాని కల్పన మనువుకు వ్యతిరేకం.

9.'ప్రేతశుద్ధి' మొదలైన ఆడంబరాలు మనువు చెప్పినవి కావు

ప్రేతశుద్ధి, సూతక శుద్ధి- వీటి పేరిట కొందరు గొప్ప ప్రదర్శన చేస్తుంటారు. అశౌచం కలిగితే ఏం చేయాలి? అనేదానికి మనువు నేరుగా సమాధానం చెప్పాడు. ప్రేతం, సూతకం లేదా ఇతరవిధాలైన అశౌచం కలిగితే, నీరు మొదలైన వాటితో శుద్ధి జరుగుతుంది. మనస్సుకు అశాంతి రూపమైన అశుద్ధి కలిగితే, ఈశ్వరుడు, గాయత్రీ మంత్రం మొ॥వాటితో తొలగిపోతుంది. (5.105,107,109). ఎలాంటి అశౌచం కలగకుండానే, దూరంగా కూర్చుని అశౌచం అనుకోవడం వట్టి ఆడంబరమే ! పైగా సహేతుకం కాదు కూడా! ప్రేతశుద్ధి, సూతక శుద్ధి మొదలైన దంబాచారాలు ఆచరించే వారిని గురించి 5.58-104 వరకు ఉంది. ఇవన్నీ వేర్వేరు అధారాలను అనుసరించి, విషయాలు, సందర్భాలు, శైలి- వీటికి వ్యతిరేకం కావటం, మనువు చెప్పినవి కాకపోవటం వల్ల ప్రక్షిప్తాలు. వాటిని విశ్లేషించి సారాంశాలు తెలుసుకుందాం -

1. ప్రస్తుత విషయ ప్రారంభానికి సంకేతం 5-57వ శ్లోకంలోనూ, ముగింపు 5-110 లోనూ ఉన్నాయి. వీటిలో ఇచ్చిన **"దేహ శుద్ధిమ్..... ప్రవక్ష్యామి"**, **"ఏష శౌచస్య వః ప్రోక్తః శారీరస్య వినిర్ణయః"** అనే సంకేతాలను అనుసరించి, "శరీరం, శరీరానికి సంబంధించిన మనస్సు, బుద్ధి, ఆత్మ మొ॥వాటి శుద్ధి". వీటిని ఈ సంకేతాలు చెబుతున్నాయి. (వీటి పుష్టికోసం 5.57 సమీక్ష చదవగలరు).

ఈ విషయంలో పైన పేర్కొన్నవాటికి సంబంధించిన శ్లోకాలనే మౌలికమని భావించవలసి ఉంటుంది. తాను సూచించిన పద్ధతిలోనే మనువు 5.105-106 శ్లోకాలలో ముందు భూమిక రూపంలో శుద్ధికారకమైన పదార్థాలను చెప్పాడు. తర్వాత 109లో శరీరశుద్ధి కాకుండా **'అద్భిః గాత్రాణి శుద్ధ్యన్తి'** అశౌచం పాటించే గడువు, సపిండం, సపిండం కానివారు అశౌచం పాటించే విధానం, సూతక అశుద్ధి, పరదేశంలో ఉండేవారి అశుద్ధి మొ॥ ఉన్నాయి. ఇవి విషయ వ్యతిరేకాలు.

2. పైన చెప్పిన విషయాలను సూచించే శ్లోకాల ఆధారంగా మనువు పద్ధతి ఒకటి బాగా తెలుస్తుంది. అదేమిటంటే, 'అశుద్ధి సంపర్కంతో శరీరాదులకు అశుద్ధి కలుగుతుంది" అని. వాటి శుద్ధికి ఉపాయం- **"అద్భిః గాత్రాణి శుద్ధ్యంతి"**- (109). అంటే 'శరీర శుద్ధి జలంతో జరుగుతుంది' మొ॥ 58 నుంచి 104 శ్లోకాలలో ఏమేమి చెప్పబడిందో, అదంతా మనువుకు వ్యతిరేకమే -

క. 5.58 నుంచి 60 శ్లోకాల వరకు, సపిండం, సపిండం కానివి- వీటి భేదంతో ప్రేతశుద్ధి, అశుద్ధి – వీటిని పాటించే 1.10 రోజులవరకు, నాలుగు గడువులను చూపి, ఒక **'ధార్మిక కృత్యం'** రూపంలో వర్ణించబడి ఉంది. మనువు శరీరపు అశుద్ధినే చెప్పాడు. సపిండం, అది కానిది అన్నీ సమానంగా జరుగుతాయనీ, వాటికి పలు దినాల గడువు ఉండదనీ అన్నాడు. శరీరం అశుద్ధమైతే నీటితో కడిగితే శుద్ధ మవుతుంది. ఈ విధంగా ఈ శ్లోకాలలో చెప్పినదంతా మనువుకు సమ్మతం కాదు కాబట్టి, ఇవి ప్రక్షిప్తాలు. మిగిలిన శ్లోకాలు వీటిని ఆధారం చేసుకున్నవి కాబట్టి, వాటితో పాటు ఇవీ ప్రక్షిప్తాలే.

ఖ. 5.74 నుంచి 84లలో పరదేశంలో ఉండే వారి శుద్ధిని చెప్పటం కూడా మనువుకు వ్యతిరేకమే. ఎలాంటి అశుద్ధీ తగలనప్పుడు, శరీరం అశుద్ధమని చెప్పటమెందుకు?

గ. 5.85-87,103లలో శూద్రులను అస్పృశ్యులు అంటే అపవిత్రులుగా భావించినట్లు ఉంది. మనువు దీన్ని అంగీకరించడు. అతడు శూద్రులను 'శుచిః' అంటే 'పవిత్రులు'గా భావిస్తాడు (9.335). కాబట్టి ఈ శ్లోకాలు మనువుకు వ్యతిరేకం కావటం చేత ప్రక్షిప్తాలు.

3) 5.58 నుంచి 104 శ్లోకాల వరకు- 'సపిండం, సపిండం కానిది' అనే భేదాలతో నాలుగు పద్ధతులను (58-60) అనుసరించి **'అశుద్ధం అని భావించడం.'** ఇది సహేతుకం కాని వివరణం. ఎందుకంటే మృతుడు తగలటం చేత శరీరం మైలపడితే అది సపిండం – సపిండం కానిది అనే వాటితో సమాన మవుతుంది. నీటితో శుద్ధీకరణ జరుగుతుంది. దీనికి విధానాల సార్ధకతకూ పనిలేదు, సపిండం- సపిండం కానివన్న భేదంతోనూ పని లేదు. మానసిక అశుద్ధి అంటే, మనసులో శోకం ఉంటే దానికి ఏ విధానమూ ఉండదు, ఇందులో అందరికీ దూరమయ్యే పని ఉండదు. కాబట్టి ఈ వ్యవస్థే సహేతుకం కాదు. మనువు ఏర్పరచినవన్నీ యుక్తి యుక్తంగా, సహేతుకంగా-కారణాలు చూపేవిగా ఉంటాయి. ఈ వ్యతిరేకత ఉండటం చేత ఈ శ్లోకాలు మనుసమ్మతం కావు.

4) విషయ వ్యతిరేకాలు అనే ఆధారంతో ఈ శ్లోకాలను పరిశీలిస్తే అన్నీ అవేనని తెలిసిపోతుంది. 57వ శ్లోకం, 110వ శ్లోకం – వీటిలో 'శరీర సంబంధమైన అవయవాల అశుభ్రతను శుద్ధి చేయటం' అనే విషయం ఉంది. వాటి ప్రకారం ఈ విషయక్రమం ఇలా ఉంటుంది –

క. శరీరం, శరీర అవయవాల అశుభ్రతను శుద్ధిచేయటాన్ని చెప్పడం (57)

ఖ. మళ్లీ 105లో భూమికరూపంలో శుద్ధిచేసే పదార్థాల పరిగణన

గ. మళ్లీ శరీరం, శరీర సంబంధ శుద్ధిని గురించి (106-109) చెప్పడం. ఇది మామూలు పద్ధతిలో భావ గాంభీర్యంతో సంక్షిప్తంగా చెప్పబడింది. ఇందులో శరీరసంబంధమైన ఆత్మ, మనస్సు, బుద్ధి – వీటి శుద్ధీకరణ ఉంది.

ఈ విధంగా మనువు పద్ధతి, విషయ సంకేతాలను (57-110) అనుసరించి ఒక విషయ క్రమంలో ఉంటుంది. 5.58 నుంచి 108 శ్లోకాల వల్ల ఆ క్రమానికే భంగం కలిగింది. శరీరం మొదలైనవాటి శుద్ధికి భిన్నంగా అశుభ్రతను **'ధార్మిక కృత్యం'** రూపంలో భావించే ఒక ప్రత్యేకమైన ముందు వెనుక గల విషయాలకు భిన్నంగా ఒక పద్ధతి చెప్పబడింది. శుద్ధిని గురించి చెప్పాలంటే, ముందు శుద్ధి చేసే పదార్థాలను పేర్కొనడమే విషయౌచిత్యం అవుతుంది. దీని ఆధారంగా 57 తర్వాత 105వ శ్లోకాలు, విషయ దృష్టితో సంబద్ధం అవుతాయి. మధ్యలోని మిగిలిన శ్లోకాలన్నీ విషయానికి వ్యతిరేకం. విషయ భంజకం కావటం చేత ప్రక్షిప్తాలు.

10. వేదాలు చదవకపోవడం లేదా నిర్ధారిత సమయంలో వేదాధ్యయనం, విడిచిపెట్టడం, మనుసమ్మతం కాదు.

పై విషయాన్ని చెప్పే శ్లోకాలు 4.91-127లు. అనివార్య పరిస్థితులలో వేదాధ్యయనం చేయకపోవడం, శ్రావణమాసంలో పూర్ణిమ నాడు కొంత చదివి విడిచిపెట్టడం, శుక్ల, కృష్ణ పక్షాలలో వేదాలు, వేదాంగాలను అధ్యయనం కోసం విభజించడం మొదలైన విషయాలు, మనువు చెప్పిన మూలాలను భావనను, శైలిని అనుసరించినవి కావు. ఈ విషయ విశ్లేషణ వల్ల ఈ కింది సత్యాలు స్పష్టమవుతున్నాయి-

(1) సంవత్సరంలో నాలుగున్నర నెలలు వేదాధ్యయనం చేయడం తరువాత విడిచిపెట్టడం, మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, శుక్ల పక్షంలో వేదాధ్యయనం, కృష్ణ పక్షంలో వేదాంగాల అధ్యయనం - ఇవన్నీ మనువు తరువాతికాలం లోనివి. దీని వల్ల మనువు ఏర్పరచిన వ్యవస్థలు నిర్వీర్యమౌతాయి. ఈ పద్ధతులకు మనువు పద్ధతులతో పొసగక పోగా, పైపెచ్చు వ్యతిరేకత ఏర్పడుతూంది. ఎలాగంటే-

క. **'వేదాల అధ్యయనాన్ని'** మనువు, ద్విజులందరికీ అవసరమని, నిత్యకర్మ అని చెప్పాడు. (1.87-90). ఈ చెప్పిన కర్మలను ఎవరైనా చెయ్యకపోతే, వారు తమ వర్ణం నుంచి పతితు లవుతారు. ప్రత్యేకించి వేదాభ్యాసాన్ని విడిచిపెట్టే ద్విజుడు శూద్రుడుగా లెక్కించబడతాడు-

“యోఽనధీత్య ద్విజో వేదమన్యత్ర కురుతే శ్రమమ్ ।
స జీవన్నేవ శూద్రత్వమాశు గచ్ఛతి సాన్వయః ॥” 2.143 (168) ॥

ఖ. మనువు వేదాధ్యయనాన్ని నిత్య దినచర్యగా చేయాలని చెప్పాడు. ఈ పవిత్ర కార్యంలో అనధ్యాయం పెట్టలేదు-

“వేదోపకరణే చైవ స్వాధ్యాయే చైవ నైత్యకే ।
నానురోధోఽస్త్యనధ్యాయే హోమమన్త్రేషు చైవ హి ॥” 2.80(105) ॥

నైత్యకే నాస్త్యనాధ్యాయో బ్రహ్మసత్రం హి తత్ స్మృతమ్ ।
బ్రహ్మాహుతిహుతం పుణ్యమనధ్యాయ వషట్ కృతమ్ ॥ 2.81(106) ॥

గ. నిత్య వేదాధ్యయనానికి ఇతర ప్రమాణాలు కూడా ఉన్నాయి -

అ. యః స్వాధ్యాయమధీతేఽబ్దం విధినా నియతః శుచిః ।
తస్య నిత్యం క్షరత్యేష పయో దధి ఘృతం మధు ॥ 2.82 (2.107) ॥

ఆ. ఆ హైవ స నఖాగ్రేభ్యః పరమం తప్యతే తపః ।
యః స్రగ్వ్యపి ద్విజోఽధీతే స్వాధ్యాయం శక్తితోఽన్వహమ్ ॥ 2.142(167) ॥

ఈ విధంగానే గృహస్థుల వ్రతాలను కూడా స్పష్టంగా చెప్పాడు -

ఇ. సర్వాన్ పరిత్యజేదర్థాన్ స్వాధ్యాయస్య విరోధినః ।
యథాతథాధ్యాపయంస్తు సా హ్యస్య కృతకృత్యతా ॥ 4.17 ॥

ఈ. బుద్ధివృద్ధికరాణ్యాశు ధన్యాని చ హితాని చ ।
నిత్యం శాస్త్రాణ్యవేక్షేత నిగమాంశ్చైవ వైదికాన్ ॥ 4.19 ॥

ఉ. "స్వాధ్యాయే చైవ యుక్తః స్యాత్ నిత్యమ్" 4.64 ॥

ఊ. "స్వాధ్యాయే నిత్యయుక్తః స్యాత్" 3.75 ॥

ఈ ఆధారాల వల్ల మనువు ప్రతివారికీ వేదాల అధ్యయనాన్ని నిత్యమూ చేయవలసిన తప్పని సరి కార్యక్రమంగా భావించాడనేది తెలుస్తూంది. నిత్యమూ చేయవలసిన వాటిలో ఐదు మహా యజ్ఞాలను కూడా మనువు పేర్కొన్నాడు. వాటిలో 'బ్రహ్మ యజ్ఞం' అనే సంధ్యోపాసన, వేదాధ్యయనానికి మరొక పేరు. 4.95-127 శ్లోకాలలో నాలుగున్నర నెలలు వేదం చదవటం, వాటిని గ్రామం వెలుపల వదలివెయ్యటం శుక్ల పక్షంలో వేదం చదవడం, కృష్ణ పక్షంలో వేదాంగాలు చదవడం మొదలైన పద్ధతులు చెప్పబడ్డాయి. వీటికీ, మనువు చెప్పిన వాటికీ పొందిక/ పొంతన కుదరటం లేదు. పైగా వ్యతిరేకంగానూ ఉన్నాయి. ప్రతి దినమూ వేదాలు చదివే పద్ధతి ఉంటే, నాలుగున్నర నెలలు మాత్రమే చదవడం, తర్వాత వదిలిపెట్టడం మొదలైన వాటి అవసరమే రాదు. అందువల్ల ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలు. ఈ విషయంలో మరి కొన్ని లోపలి వ్యతిరేకతలూ ఉన్నాయి -

(2) 4.99, 108 శ్లోకాలలో 'శూద్రులు వేదం చదివే పద్ధతి లేదు' అనే ఆధారం మీద శూద్రులు వేదం చదవకూడదనే విషయం ఉంది. ఇది మనువుకే కాక వేదాలకూ వ్యతిరేకం (దీన్ని విస్తృతంగా 2.144-149 (169-174) శ్లోకాలకు ఉన్న 'లోపలి వ్యతిరేకతలు' అనే శీర్షిక గల సమీక్ష చూడండి. ఈ అధ్యాయంలో దాని సంఖ్య 6).

(3) 4.109-111,117,124- శ్లోకాలలో మృతుడికి శ్రాద్ధం పెట్టడం గురించి ఉంది. ఇది కూడా మనువుకు వ్యతిరేకమే. (దీని కోసం 3.119-281 శ్లోకాల సమీక్ష చూడండి. ఈ అధ్యాయంలో దాని సంఖ్య 3).

(4) 4.112 లో సూతకాన్ని గురించి ఉంది. సూతకపు వర్ణన మనువు చెప్పినట్లు కనిపించదు (దీని కోసం 5.58-104 శ్లోకాల 'విషయ వ్యతిరేకతలు' సమీక్ష చూడండి. ఎందుకంటే సూతకాన్ని గురించి ఇదే వ్యాసంలోని 61,62 శ్లోకాలలో వస్తుంది).

(5) 4.113,114లలో పర్వ దినాలలో వేదాధ్యయనం నిషిద్ధం అని ఉంది. అయితే 4.25; 6.9 లలో ఈ పర్వ దినాలలో విశేషమైన యజ్ఞాలు చేసేపద్ధతి ఉంది. వాటిని వేదమంత్రాలతోనే నిర్వహించాలి.

(6) 4.116 వ శ్లోకంలో శ్మశానంలో వేదం చదవాలని ఉంది. మరి 5.167లో అంత్యేష్టి కర్మ యజ్ఞ సంపాదనం ద్వారానే జరుగుతుందనీ, యజ్ఞంలో వేద మంత్రోచ్చారణ ఉందనీ చెప్పబడింది.

(7) 112వ శ్లోకంలో చెప్పిన మాంస భక్షణం మనువుకు వ్యతిరేకం. (4.26-28 శ్లోకాలపై. 'లోపలి వ్యతిరేకతలు' సమీక్ష చూడండి. ఈ అధ్యాయలలో దాని సంఖ్య 2.)

(8) 123-125 శ్లోకాలలో మూడు వేదాల ధ్వనులను పరస్పర విరుద్ధంగా చూపడం, మనువు చెప్పిన 2.76-78 (51-53) శ్లోకాలకు వ్యతిరేకం.

(9) 101 నుంచి 126 వరకున్న శ్లోకాలలో వేదాల అనధ్యయనం (వేదాలకు సెలవులు) నిషేధించబడింది. 2.79.81 (104-106) ఇలా లోపలి వ్యతిరేకతలు ఆధారంగా 4.95 నుంచి 127వరకు గల అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే.

(2) **విషయ వ్యతిరేకాలు-** (1) 4.101 నుంచి 127 వరకు గల శ్లోకాలు విషయానికి దూరంగా ఉన్నాయి. వీటికి 'సతోగుణ వర్ణనం'తో ఎలాంటి సంబంధమూ లేదు. ఇవి ఏ రకమైన వ్రతాలూ కావు. అందుచేత ప్రక్షిప్తాలు (విస్తృత విశ్లేషణను 4.33,34లలో చూడండి).

2. శిష్యుల వేదాధ్యయన విషయం రెండో అధ్యాయంలో ఉంది కనుకనూ, ఇది విషయ వ్యతిరేకం (2.44-48). (69-73), 139 (164), 140-142 (165, 166); (3.1,2). ఇక్కడ గృహస్థుల వ్రతాల విషయాలున్నాయి. (4.13). అందుచేత ఈ చోట శిష్యుల అధ్యాపనం, సెలవులు, అధ్యాయ - అనధ్యాయాలు చెప్పడం విషయ వ్యతిరేకం. దీన్ని రెండో అధ్యాయంలోనే కలిపి చెప్పి ఉండవచ్చు.

3. వేద వ్యతిరేకాలు- 4.99,108 శ్లోకాలలోని శూద్రులు వేదాలు చదవ కూడదనే మాట వేద వ్యతిరేకం - వేదాలలో శూద్రులు యజ్ఞం చేయడమూ, మంత్రాలు వినడం అనే పద్ధతి చెప్పబడింది. ప్రమాణం కోసం 2.42, 9.335 లలోని 'వేద వ్యతిరేకాలు' శీర్షిక గల సమీక్షలను చూడండి. వాటికి ఈ అధ్యాయంలోని సంఖ్య 6.

4. శైలీ గతమైన ఆధారం- 1. ఇందులోని 103వ శ్లోకంలో 'మనురబ్రవీత్' అనే పదాల వల్ల మనువు కాని వ్యక్తి ఎవరో చెప్పినట్లు తెలిసిపోతూంది. 2. ఇందులోని 101 నుంచి 127 శ్లోకాల శైలి లోకాపవాదం మీద ఆధారపడింది. 114 నుంచి 124 లలోని శైలి సహేతుకం కాదు.

11. ప్రాయశ్చిత్తం - దాని అర్థం, ఉద్దేశం, ఫలం

'ప్రాయశ్చిత్తం' అనే పదం ప్రాయః+చిత్తం పదాలతో సమాసంలో **'పారస్కరప్రభృతీని చ సంజ్ఞాయాం'** (అష్టా. 6.1.157) తో సుట్ ఆగమయోగంతో ఏర్పడుతుంది. **'తపాది సాధనపూర్వకం కిల్బిష నివారణార్థం చిత్తమ్ = నిశ్చయమ్, ప్రాయశ్చిత్తమ్.'** ఎవరైనా నిందనీయం లేదా తనది కాని కర్తవ్యాన్ని చేసి, తర్వాత దాన్ని చేయటం వల్ల మనస్సులో దుఃఖం కలిగితే, దానికి శిక్షా రూపంగా స్వయం తపం = కష్టాన్ని సహిస్తూ మళ్ళీ అలాంటి పాపం చేయనని నిశ్చయించుకుంటారు. అదే ప్రాయశ్చిత్తం అనబడుతుంది. అలా చేయటం వల్ల మనస్సులోని దుఃఖ భారం తొలగిపోతుంది. ఎవరైనా ఎవరినైనా ఉన్నట్టుండి పొరపాటుగా తిట్టడం జరిగితే, తర్వాత బాధ కలిగి ఆ ఖేదాన్ని ప్రకటిస్తారు. ఆటు పైన మనసులో ఆ బాధ ఉండదు. తర్వాత అలాంటి పని మళ్ళీ చేయకుండా జాగ్రత పడతాడు. ఇలా చేయటం వల్ల పాపం తగ్గదు కానీ, ఆ పాపపు భావనలు తగ్గుతాయి. ప్రాయశ్చిత్తం చేసుకునేవాడు తాను చేసిన పాపకర్మను గురించి పశ్చాత్తాపపడతాడు. దానికి శిక్షారూపంగా తపస్సు చేస్తాడు. మళ్ళీ అలాంటిది చేయకూడదని నిర్ణయించుకుంటాడు, జాగ్రత్త పడతాడు. (11.229-230). ఈ విధంగా ప్రాయశ్చిత్తం వల్ల మనుష్యుడి పాపం పెరగటం ఆగుతుంది. అతడు ధర్మానికి అభిముఖం అవుతాడు.

ఇదే ప్రాయశ్చిత్తమునకు గల నిర్వచనం గల 11.230, 11.232 శ్లోకాలలో తెలుస్తుంది. రెండోదేమిటంటే, చేసిన అధర్మానికి ఫలం కూడా ఏదో విధంగా లభిస్తుందనే మనువు అనడం.

"న త్వేవ కృతోఽధర్మః కర్తుర్భవతి నిష్ఫలః". (4.173) ॥

ఈ ప్రమాణాలు ఆధారంగా ప్రాచుర్యంలో ఉన్న అర్థాలలో ఎక్కడ ఏ శ్లోకంలో 'పాపం నుంచి తప్పించుకోవడం' లాంటివి ఉంటే అవేవీ మనుసమ్మతం కావు - అని స్పష్టమవుతూంది.

12. ఆస్తుల పంపకం

మనువు పరంపరగా వచ్చే ఆస్తుల మీద కొడుకు, కూతురు, తల్లి - వీరందరికీ అధికారం ఉందని చెప్పాడు. తల్లిదండ్రులు జీవించి ఉంటే సంపదలన్నీ వారివే. పిల్లలు వాటిని పంచలేరు (9.104). తండ్రి అనుకుంటే తాను జీవించి ఉండగానే సంపద లన్నిటినీ పిల్లలందరికీ పంచవచ్చు. తల్లిదండ్రుల మరణానంతరం ఆస్తుల పంపకంలో ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉంటాయి. పుత్రులందరూ ఏకాభిప్రాయానికి వస్తే, ఆ విధంగా పంపిణీ జరుగుతుంది. ఎలాగంటే-

1. అందరూ పైతృక సంపదలను సమానంగా పంచుకోవచ్చు (9.104)
2. లేదా కలిసే ఉండాలనుకుంటే, పెద్ద కొడుకు సంపద లన్నిటినీ స్వీకరిస్తాడు. తల్లిదండ్రుల వలె బాధ్యతలు నిర్వహిస్తూ, తమ్ములందరి ఆలన పాలనలు చూసుకుంటాడు. చిన్నవారు కూడా అన్నను తల్లిదండ్రుల వలెనే భావించి ఆదరిస్తారు. (9.105) కర్తవ్యనిర్వహణ సరిగ్గా లేకుంటే పెద్ద వాడు శిక్షార్హుడు అవుతాడు (9.213). అతని స్థానానికి ఆదరం పోతుంది. (9.110)

3. పెద్దవాడి నీడలో ఉంటూ, తర్వాత చిన్న వారు విడిపోవాలనుకుంటే పిత్రార్జిత సంపదలను ఇలా విభాగించవచ్చు-వంశసంపదలో 20వ భాగం పెద్ద వాడికి ఎక్కువగా లభిస్తుంది. మధ్య వాడికి అందులో సగం, చిన్న వాడికి నాలుగవ వంతు దీన్ని **'ఉద్ధార భాగం'** రక్షణ అంటారు (9.112).

దీన్ని అర్థం చేసుకోవటానికి ఒక ఉదాహరణ చూడండి – తండ్రి సంపాదన 960 రూపాయలనుకుందాం. అందులో పెద్ద వాడికి 20వ భాగం (960/20 = 48) రు.48 భాగం వస్తుంది. మధ్యవాడికి 40వ వంతు (960/40 = 24) రు.24 వస్తాయి. చిన్నవాడికి 80వ వంతు (960/80 =12) రు.12 లభిస్తాయి. ఈ ధనం విభజన తర్వాత, మిగిలినదంతా సమానంగా పంచుకుంటారు. అంటే – 48+24+12 = 84; రూ.960–84 = 876, 876÷3 = 292, ఇలా 292–292 రు.చొప్పున ఒక్కొక్కరి భాగానికీ వస్తుంది. ఈ పద్ధతిలో పెద్దవాడికి 292 + 48 = రూ.340, మధ్య వాడికి 292+24 = రూ.316, చిన్నవాడికి 292 + 12 = రు.304 వస్తాయి. ఈ రక్షణ భాగం, తన తమ్ముళ్లను తండ్రి వలె రక్షించినవాడికి వస్తుంది.

రక్షణ భాగం అనే పద్ధతి ఎందుకు?

9.104లో పిత్రార్జితాన్ని సమానంగా పంచుకోవాలని ఉంది. ఈ శ్లోకంలో రక్షణ భాగం పంచిన తర్వాత, సమాన భాగాల విభజన ఉంది. ఇది వ్యతిరేకమని తోస్తుంది.కానీ, వ్యతిరేకం కాదు. ఇది విభజనలో రెండో ప్రత్యామ్నాయము (105) వివరణలో ఉంది. ఇది తన తమ్ములను బాగా చూసుకున్న పెద్ద వాడికే లభిస్తుంది. కలిసి ఉంటూ, బాధ్యత వహించి తమ్ముల అభివృద్ధికి తోడ్పడాలి. ఎందుకంటే మిగిలిన వారి కంటే ఎక్కువగా కష్టపడ్డాడు కాబట్టి, ఈ తోడ్పాటు వల్ల విడిపోయే సమయంలో అతనికి అధిక భాగం వస్తుంది.

ఈ అధికభాగాన్ని ముందు పంచిఇచ్చిన తర్వాత, మిగిలిన ధనం అందరికీ సమానంగా వస్తుంది (9.136).

4. లేదా రక్షణ భాగం విడిగా తీయకపోతే, పెద్ద వాడికి రెండు భాగాల సంపద చెందుతుంది. మధ్య వాడికి ఒకటిన్నర, మూడో వాడికి ఒకభాగం (9.117).

5. అందురు సోదరులూ తమ తమ భాగాల నుంచి అక్కచెల్లెళ్లకు నాలుగో వంతు ఇవ్వాలి (9.118).

తల్లికి చెందిన స్వధనం (స్త్రీధనం) మీద పెళ్లి కాని కూతుళ్లకే అధికారం ఉంటుంది (9.131). తల్లి మరణిస్తే, పుత్రులు, పెళ్లయిన పుత్రికలూ అందరూ, ఆమె సంపదను సమానంగా పంచుకోవాలి (9.192). ఆ సంపద ఆరు విధాలుగా ఉంటుంది. మనువు ఈ స్త్రీ ధనపు వివరణను 9.194–197 శ్లోకాలలో ఇచ్చాడు.

(1) అధ్యగ్ని = వివాహ సందర్భలో బంధువులు, అతిథులు ఇచ్చిన ధనం.

(2) అధి– ఆవాహనికమ్ = అత్తింటికి వెళ్తున్నప్పుడు తండ్రి ఆమెకు ఇచ్చిన ధనం.

(3) ప్రీతి కర్మలలో లభించిన ధనం = వేర్వేరు సందర్భాలలో భర్త మొదలైనవారు ఇచ్చిన ధనం.

(4) కన్యకు అన్నదమ్ముల ద్వారా ఇవ్వబడిన ధనం.

(5) తండ్రి ఇచ్చిన ధనం.

(6) తల్లి ఇచ్చిన ధనం.

(6) పుత్రులు లేని తల్లిదండ్రుల సంపదలు మొత్తానికీ కన్యే సంపూర్ణాధికారిణి అవుతుంది. ఆ సంపదలు వేరెవరికీ ఇచ్చే వీలు లేదు (9.130).

(7) **కొడుకులు లేకపోతే, కూతురి కొడుకుసు** (దౌహిత్రుడు – మనవడు) దత్తత చేసుకుని, అతనికీ భాగం ఇవ్వవచ్చు **(9.131,134)**

(8) నపుంసకుడు, పుట్టుగుడ్డి, చెవిటివాడు, పిచ్చివాడు, పరమమూర్ఖుడు, మూగవాడు, వికలాంగుడు - ఇలాంటి పుత్రులు సంపదకు వారసులు కాలేరు. మిగిలిన సోదరులు వీరి ధనాన్ని సంరక్షిస్తూ, వీరి బాధ్యతను స్వీకరించాలి. వారు పెళ్లి చేసుకుంటే తమ తండ్రి ఆస్తికి పుత్రులు వారసు లవుతారు (9.201-203).

(9) జూదరి, దొంగతనం, దోపిడి మొదలైన దుర్వ్యసనాలు గలవారు ఆస్తికి వారసులు కాలేరు (9.214).

13. మనుస్మృతిలో చెప్పిన మనుషులలో ఋషులు,దేవతలు పితరులు

మనువు 2.115-131 శ్లోకాలలో చెప్పిన వేర్వేరు వేద పారంగతులైన విద్వాంసులే, వారి స్థాయి యోగ్యతలను బట్టి ఋషులు, దేవతలు, పితరులు అనబడతారు. వీరిలో ఏ విద్యనైనా సాక్షాత్కరింప జేసుకొన్న విశేషజ్ఞులు **'ఋషులు'** అవుతారు. దివ్య గుణాల ఆచరణ గలవారు **'దేవతలు'**, పాలించే గుణాలు ప్రధానంగా గల వయోవృద్ధులు, మాతాపితలు, మొదలైన గురుజనులు **'పితరులు'** అవుతారు. కొన్ని వర్గాలు స్వభావం, ప్రవృత్తులు ఆధారంగా ఏర్పడతారు. దైవీయ గుణ సంపత్తి గల కొందరు తమ పేర్ల వల్లనూ దేవతలవుతారు. అదేవిధంగా అసురులు, గంధర్వులు, రాక్షసులు, పిశాచాల స్వభావం గలవారు, సంస్కారం, ప్రవృత్తి కారణంగా ప్రసిద్ధులవుతారు. మనుస్మృతిలో వీరిని గురించిన వివరాలు అక్కడక్కడ ఇవ్వబడ్డాయి. అన్ని వివరాల సారంగా కింద మనువు అభిప్రాయాలను చూడండి -

1. **ఋషి ఎవరు? - 'ఋషీగతౌ'** అనే ధాతువుకు **'ఇన్'** ప్రత్యయం **'ఇగుపధాత్ కిత్'** అనే దాని యోగం చేత **'ఋషి'** శబ్దం ఏర్పడుతుంది. గతి - అనగా జ్ఞానం, గమనం, ప్రాప్తి అనే ఈ మూడు అర్థాలు వస్తాయి. ఋషి అందరి కన్నా ఎక్కువ స్థాయి విద్వాంసుడు. వేద మంత్రార్థాల ద్రష్ట, ధర్మం, ఈశ్వర సాక్షాత్కారం కలిగిన ప్రామాణిక పురుషుడు, కనుకనే ఋషి అని పిలుస్తారు. వేదాలు, వేదాంగాలు మొ॥ విద్యల గూఢమైన అర్థాలను ప్రత్యక్షం చేసుకునే ఘనత ఇతనిలో ఉంటుంది. కనుక అతడు ధర్మోపదేష్ట అవుతాడు.

క) నిరుక్తకారుడు ఋషిని ఇలా నిర్వచించాడు - **'ఋషిః దర్శనాత్ స్తోమాన్ దదర్శ ఇత్యౌపమన్యవః'** (నిరు. 2.11). అంటే ఋషి వేదార్థాలు, విద్యల రహస్యాలను ప్రత్యక్షం చేసుకునేవాడు. ఔప మన్యవ ఆచార్యుడి అభిప్రాయం ప్రకారం **'మంత్ర ద్రష్టలు కావటం చేతనే వారు ఋషులవుతారు'**. అలాగే **"సాక్షాత్కృతధర్మాణ ఋషయో బభూవుః"** - అంటే ధర్మాన్నీ, ఈశ్వరుణ్నీ సాక్షాత్కారం చేసుకునేవారే ఋషులు. (నిరు. 1.20) ॥

ఖ) బ్రాహ్మణ గ్రంథాలలోనూ ఋషుల ప్రత్యేకతలు ఈ విధంగానే చెప్పబడ్డాయి-

అ) **"యో వై జ్ఞాతోఽనూచానః స ఋషిరార్షేయః ।"** శత. 4.3.4.29 ॥

ఆ) **"ఏతే వై విప్రా యదృషయః ॥"** శత. 1.4.2.7 ॥

గ. మహర్షి మనువు కూడా ఋషిచర్చ ప్రసంగంలో ఈ విశేషతలనే ఉల్లేఖించాడు -

ఇ) **న హాయనైర్న పలితైర్న విత్తేన న చ బన్ధుభిః ।**
ఋషయశ్చక్రిరే ధర్మం యోఽనూచానః స నో మహాన్ ॥ 2.129 ॥

ఈ) **ఋషయో దీర్ఘసన్ధ్యత్వాత్ దీర్ఘమాయురవాప్నుయుః ।**
ప్రజ్ఞాం యశశ్చ కీర్తిం చ బ్రహ్మవర్చసమేవ చ ॥ 4.94 ॥

ఉ) **"అథ యదేవానుబ్రవీత । తేనర్షిభ్యం ఋణం జాయతే ।**
తద్ధ్యేభ్య ఏతత్ కరోత్యృషీణాం నిధిగోప ఇతి హ్యనూచానమాహుః ॥" శత. 1.7.5.3॥

"అథార్షేయం ప్రవృణీతే । ఋషిభ్యశ్చైవేనమేతద్దేవేభ్యశ్చ నివేదయత్యం ।
మహావీర్యో యో యజ్ఞం ప్రాపదితి తస్మాదార్షేయం ప్రవృణీతే ॥ శత. 1. 4. 5. 3

అర్థం- "అన్ని విద్యలనూ చదివి దేన్ని చదివించాలో అది **'ఋషి కర్మ'** అవుతుంది.

ఈ చదవటం, చదివించడం వల్ల ఋషుల ఋణం, అంటే వారికి ఇష్టమైన జ్ఞానాన్ని ఇతరులకు ఇవ్వటం చేత తీరుతుంది. ఎవరు ఈ ఋషులకు సేవ చేస్తారో వారు ఋషులకు సుఖాన్ని కలిగించే వారవుతారు. వారే వ్యవహారం అంటే విద్యాకోశాన్ని రక్షించే వారవుతారు. ఎవరు అన్ని విద్యలూ గ్రహించి అందరినీ చదివిస్తారో, వారే ఋషులు అవుతారు.

ఏది చదివి చదివించడం కోసం విద్యార్థులను స్వీకరిస్తుందో, అది **'ఆర్షేయం'** అంటే ఋషుల పని అనబడుతుంది. ఆ కర్మను నిర్వహిస్తూ, ఆ ఋషులు, దేవతలను ప్రసన్నులను చేసే పదార్థాలను నివేదించడం, వారి సేవ చేయడం ఎవరు చేస్తారో ఆ విద్వాంసులు ఎంతో జ్ఞానంగలవారై విశేష జ్ఞానం పొందుతారు. విద్వాంసుడు, విద్యను గ్రహించేవాడు ఎవరో అతనికి **'ఋషి'** అనే పేరు కలుగుతుంది" (ద.ల.గ్రం.సం. 245-255).

2. దేవతలు ఎవరు? - **'దివు = క్రీడా విజిగీషా వ్యవహార-ద్యుతి-మోద-మద-స్వప్న-కాంతి - గతిషు'** (దివాది) ధాతువు నుంచి **'పచాద్యచ్'** నుంచి **'యచ్'** ప్రత్యయం లేదా **'దివుమర్దనే'** (చురాది) లేదా **'దివు పరికూజనే'** (చురాది) ధాతువు నుంచి **'అచ్'** ప్రత్యయపు యోగంతో **'దేవ'** శబ్దం పుడుతుంది. దేవతలు **'జడం, చేతనం'** అని రెండు విధాలుగా ఉంటారు. (విస్తృత వివరణ కోసం 1.67 సమీక్ష చూడండి). ఈ శ్లోకంలో దేవశబ్దం నుంచి చేతన దేవతలు తెలుస్తారు. శతపథ బ్రాహ్మణంలో ఇలా ఉంది-

అ) **"ద్వయం వా ఇదం న తృతీయమస్తి సత్యం చైవానృతం చ ।**
సత్యమేవ దేవా అనృతం మనుష్యాః ।
'ఇదమహమనృతాత్ సత్యముపైమీతి' తన్మనుష్యేభ్యో దేవానుపైతి।" శతపథ. 1. 1. 1. 4-5

"రెండు లక్షణాల వల్ల మనుషులకు రెండు పేర్లు ఏర్పడతాయి. అంటే దేవతలు, మనుషులు. అక్కడ సత్యం, అబద్ధం అనేవి రెండు కారణాలు. ఎవరు నిజం చెప్తారో, నిజం నమ్ముతారో, నిజమైన పనులు చేస్తారో వారు **'దేవతలు'**. అబద్ధం నమ్మేవారు, అబద్ధపు కర్మలు చేసేవారు **'మనుషులు'** అవుతారు. అసత్యం నుంచి దూరమై సత్య ప్రాప్తిని పొందేవారు **'దేవజాతి'** "మనుషులుగా పరిగణించబడతారు." (ద.ల.గ్ర.సం. 245-255)

ఆ) **విద్వాంసో హి దేవాః ॥** శత. 3. 7. 6. 10

ఇ) **యే బ్రాహ్మణాః శుశ్రువాంసోఽనూచానాస్తే, మనుష్యదేవాః ॥** శత. 2. 4. 3. 14

ఈ) **సత్యసంహితా వై దేవాః ॥** ఐ.బ్రా. 1. 16 ॥

అంటే విద్వాంసులైన మనుషులను దేవతలు అంటారు. దేవ శబ్దానికి నిరుక్తంలోని నిర్వచనం- **"దేవో దానా ద్వా దీపనాద్వా, ద్యోతనాద్వా, ద్యుస్థానో భవతీతి వా । యో దేవః సా దేవతా"** (నిరు. 7. 15). అంటే- దానం ఇవ్వడంవల్ల, వెలుగు చూపడం వల్ల, వెలుగు కనిపించడం వల్ల, ద్యుస్థానీయం కావడం వల్ల **'దేవుళ్లు'** అనబడతారు. ఈ దేవుళ్లనే **'దేవతలు'** అని కూడా అంటారు. ఈ విధంగా విద్యలతో వెలుగుతూ, విద్యాదానం చేసేవారు, దివ్య గుణాలు, ఉత్తమ ఆచరణలు కలవారైన విద్వాంసులు 'దేవతలు' అవుతారు. ఎలాగంటే - **"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ,"** (ప్ర.పా. 7. 11). మనుస్మృతిలో ఇలాంటి విద్వాంసులనే దేవతలంటారు-కింది శ్లోకాలు చూడండి-

ఉ) **తే తమర్థమపృచ్ఛన్త దేవానాగతమన్యవః ।**
దేవాశ్చైతాన్సమేత్యోచుర్న్యాయ్యం వః శిశురుక్తవాన్ ॥ 2.139 ॥

ఊ) **న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః ।**
యో వై యువాఽప్యధీయానస్తం దేవాః స్థవిరం విదుః ॥ 2.127 ॥

'దేవతా అభ్యర్చన' అంటే - నిరుక్తంలో **"యో దేవః, సా దేవతా"** (7.4.15) అని ఉంది - దేవుడినే దేవత అంటారు. దేవ శబ్దానికి **'తల్, టాప్'** ప్రత్యయాలను కలపడం వల్ల, **'దేవతా శబ్దం'** ఏర్పడుతుంది. చైతన్యం గల దేవతల విషయంలో దేవ శబ్దానికి అన్నిటి కంటే ముఖ్యమైన అర్థం **'పరమాత్మ'** అవుతుంది. ఎందుకంటే పరమాత్మ-దేవుడే అందరు దేవతలకూ దేవత అవుతాడు. జడ దేవతలు ఉపయోగించే యోగ్యత గల వారవుతారు, చైతన్య దేవతలను (విద్వాంసులు, తల్లి, తండ్రి మొ॥) సత్కారం, సేవ మొదలైన -వాటి ద్వారా ప్రసన్నులు చేసుకునే వీలుంటుంది. కానీ, ఉపాసనాయోగ్యత ఒక్క పరమాత్మకే ఉంటుంది, ఇతరులెవరికీ ఉండదు! కాబట్టి ఇక్కడ **'దేవతాఽభ్యర్చనం'** అనే దానికి పరమాత్మ దేవుని ఉపాసన చేయటమనే అర్థం. ఎక్కడైనా అగ్ని, ఇంద్రుడు, వరుణుడు మొదలైన పేర్లతో దేవతల స్తుతి, వర్ణన లభిస్తే, అవి కూడా తమ ద్వారా పరమాత్మ స్తుతినే నిర్దేశిస్తాయి. ఎందుకంటే, ఇవి పరమాత్మ కున్న దివ్యశక్తులు లేదా గుణాలే ! ఆయన పేర్లు కూడా. ఆయనకు ప్రత్యంగాలే, వేర్వేరు దేవతల స్తుతి చేయటం అంటే, పరమాత్మ యొక్క ఆయా గుణాలను స్తుతించడమే. ఈ విధంగా అందరు దేవతలూ పరమాత్మలోనే కలిసిపోయి ఉంటారు. నిరుక్తకారుడు దీన్ని ఈ విధంగా స్పష్టీకరించాడు -

అ) **"మహాభాగ్యాద్దేవతాయా ఏక ఆత్మా బహుధా స్తూయతే ।**
ఏకస్యాత్మనోఽన్యే దేవాః ప్రత్యఙ్గాని భవన్తి ।
కర్మజన్మానః ఆత్మజన్మానః ఆత్మైవైషాం రథో భవతి ॥
ఆత్మాశ్వః ఆత్మాయుధమ్, ఆత్మేషవః సర్వం దేవస్య దేవస్య ।" నిరుక్త 7.1.4

అంటే - **'ఒక్క పరమాత్మ'** అనే దైవమే ముఖ్య దైవం... సర్వశక్తిమత్తత. తదితర అనేక విధమైన వైభవాలతో ఉండటం వల్ల, అనేక నామాలు, గుణాలతో ఆయనను స్తుతిస్తారు. మిగిలిన దేవత లందరూ ఈ పరమాత్మ అనే మహాదేవుని ప్రత్యంగరూపాలు. వారందరూ ఈయనలోనే లీనమై ఉంటారు. ఈ ఒక్క పరమేశ్వరుడి అద్వితీయ శక్తుల నుంచే వెలుగు, ధారణ, ఉత్పాదన కలగటంవల్ల, ఆ వ్యవహార దేవతలందరూ ప్రకటమవుతారు. వారి జన్మకర్మలు ఈశ్వరుని సమర్థత వల్లనే జరుగుతాయి. వీరి రథం అంటే ప్రేమపూరిత స్థానం, గుర్రాలు అంటే త్వరగా సుఖప్రాప్తి కలిగే కారణం, గమన హేతువు, ఆయుధాలు = శత్రువులను నశింపజేసి విజయం పొందడం, ఇషు = బాణాల వలె అన్ని దుష్టగుణాలు, దుఃఖాలనూ ఛేదించే శస్త్రాలు, ఇవే పరమాత్మ. పరమాత్మ ఎవరెవరిలో ఎంతెంత దివ్యత్వాన్ని ఉంచుతాడో, ఆయా ద్రవ్యాలలో అంతంతే దైవత్వం ఉంటుంది, ఎక్కువగా ఉండదు. ఈ విధంగా మిగిలిన దేవతలందరూ పరమేశ్వర వాచి - అంటే పరమేశ్వరునిగా చెప్పబడేవారు మాత్రమే.' దీనికి వేదాల ప్రమాణాలు ఉన్నాయి -

అ) **ఇన్ద్రం మిత్రం వరుణమగ్నిమాహురథో దివ్యః స సుపర్ణో గరుత్మాన్ ।**
ఏకం సద్విప్రా బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వానమాహుః ॥ ఋ.10.164.46 ॥

ఇ) **తదేవాగ్నిస్తదాదిత్యస్తద్ వాయుస్తదు చన్ద్రమాః ।**
తదేవ శుక్రం తద్బ్రహ్మ తా ఆపః స ప్రజాపతిః ॥ యజుః.32.1 ॥

స్వయంగా మనుస్మృతి ప్రమాణాలు చూడండి -

ఈ) **అత్మైవ దేవతాః సర్వా సర్వమాత్మన్యవస్థితమ్ ।**
అత్మా హి జనయత్యేషాం కర్మయోగం శరీరిణామ్ ॥ 12.119 ॥

ఉ) **ఏతమేకే వదన్త్యగ్నిం మనుమన్యే ప్రజాపతిమ్ ।**
ఇన్ద్రమేకే పరే ప్రాణమపరే బ్రహ్మ శాశ్వతమ్ ॥ 12.123 ॥

మనువు పలు చోట్ల ప్రసంగాల రూపంలో కేవలం పరమాత్మనే స్వీకరించాడు. ప్రమాణ రూపాలుగా వాటిని చూడవచ్చు - 2.76-78 (2.101-103), 4.92-93, 12.118,119, 122, 125 ॥

ఈ మొత్తం విశ్లేషణ, ప్రమాణాలతో మనుస్మృతిలోని 2.151 (176) మొదలైన శ్లోకాలలో **'దేవతా - అభ్యర్చనం'** అనే దానికి పరమాత్మ దేవుని ఉపాసన అంటే సంధ్య చేయటమని అర్థం. మిగిలిన అర్థాలన్నీ అపోహలే. ఈ శ్లోకంలోని శివుడు, విష్ణువుల ప్రతిమల పూజల వర్ణన కాల్పనికమూ, అప్రామాణికమూ. ఎందుకంటే శివుడు, విష్ణువు, మనువు తర్వాత చాలా కాలానికి వచ్చారు. వారి అవతారాల ధారణ చాలా తర్వాతి కాలపు కల్పన.

ఈ విధంగా- దేవుడు అని, సాత్త్విక ప్రవృత్తి (12.40) గల విద్వాంసులను అంటారు. అగ్నిహోత్రాన్ని కూడా **'దేవయజ్ఞం'** పేరిట పిలిచారు. యజ్ఞాలను ప్రత్యేకంగా అనుష్ఠించడం, యజ్ఞ కర్మలు చేసేవారికి కన్యా దానం చేయడం - ఈ రెండూ **'దేవుడు'** పేరుతో సమానమే. ఈ పద్ధతులు దేవతలు = విద్వాంసుల కర్మలకు తగినట్లుగా, సమ్మతంగా ఉంటాయి. అందుచేత, 3.28 లో ఇలాంటి వివాహాన్ని **'దైవవివాహం'** అన్నారు.

జడ దేవతలు

చైతన్యం గల దేవతలే కాకుండా, సూర్యుడు, అగ్ని, వాయువు, పృథ్వి, అంతరిక్షం, ద్యులోకం, చంద్రుడు, నక్షత్రాలు, దశప్రాణాలు = ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ పన్నెండు నెలలు-ఇవి జడదేవతలు. నిరుక్తంలో **'దేవ'** శబ్దానికి నిర్వచనం ఇలా ఉంది - **'దేవో దానాద్వా, దేపనా ద్వా, ద్యోతనాద్వా, ద్యుస్థానో భవతీతి వా'** (7.4.15). అంటే - 'దానం ఇచ్చేవారు, వెలుగు చూపేవారు, ప్రకాశించేవారు లేదా ద్యుస్థానీయులను దేవతలు అంటారు.' సూర్యుడు ద్యుస్థానీయుడు. తన ప్రకాశంతో అన్ని పదార్థాలనూ ప్రకాశింప జేస్తాడు. అందువల్ల అతడు దేవుడు.

శతపథ బ్రాహ్మణంలో దేవతలను గురించి చెబుతూ, జడాలు, చేతనాల రూపంలో 33 మంది దేవతలను లెక్కించారు. -

"స హెూవాచ మహిమాన ఏవైషామేతే త్రయస్త్రింశత్త్వేవ దేవా ఇతి । కతమే తే త్రయస్త్రింశత్ ఇతి? అష్టౌ వసవః, ఏకాదశ రుద్రాః, ద్వాదశాదిత్యాస్త ఏకత్రింశత్ ఇన్ద్రశ్చైవ ప్రజాపతిశ్చ త్రయస్త్రింశావితి।

కతమే వసవ ఇతి? అగ్నిశ్చ, పృథివీ చ, వాయుశ్చ, అన్తరిక్షం చ, ఆదిత్యశ్చ, ద్యౌశ్చ, చన్ద్రమాశ్చ, నక్షత్రాణి చ, ఏతే వసవః ।

కతమే రుద్రా ఇతి? దశేమే పురుషే ప్రాణాః (ప్రాణః, అపానః, వ్యానః, సమానః, ఉదానః, నాగః, కూర్మః, కృకలః, దేవదత్తః, ధనఞ్జయశ్చ) ఆత్మా-ఏకాదశస్తే ।

కతమ ఆదిత్యా ఇతి? ద్వాదశ మాసాః సంవత్సరస్య ఏతే ఆదిత్యాః ।

కతమ ఇన్ద్రః, కతమః ప్రజాపతిరితి । స్తనయిత్నురేవేన్ద్రో యజ్ఞః ప్రజాపతిరితి । తదాహుః యదయమేక ఇవ పవతే । కతమ ఏకో దేవ ఇతి? స బ్రహ్మేత్యదిత్యాచక్షతే । శత.వా.14, ప్రపా.16 ॥

3. పితరులు ఎవరు? - **పాతి పాలయన్తి రక్షన్తి, అన్న-విద్యా-సుశిక్షా-అదిదానైః తే పితరః** = ఎవరు అన్నం, విద్య, సంస్కారం మొదలైనవి ఇచ్చి ఆలన - పాలన, రక్షణ చేస్తారో, వారిని **'పితరులు'** అంటారు. దీనికి బ్రాహ్మణ గ్రంథాలలోని ప్రమాణాలు చూడదగినవి -

అ) **"దేవా వా ఏతే పితరః"** గో. ఉ. 1. 24

ఆ) **"స్విష్టకృతో వై పితరః"** గో. ఉ. 1. 25

అంటే సుఖ సౌకర్యాలతో ఆలన పాలన చేసేవారు, హిత సంపాదన (ధర్మపరంగా సంపాదించిన) చేసే విద్వాంసులను 'పితరులు' అంటారు.

ఇ) **"మర్త్యాః పితరః"** (శ. 2. 1. 3. 4)

జీవించి ఉన్న వ్యక్తులే **'పితరులు'** అంటే మృతులు కారు. ఈ ప్రమాణాల ద్వారా మరణించిన పితరుల గౌరవం కాల్పనికమూ, అపోహ అని తేలుతూంది. తల్లిదండ్రులు, తాత, ఆచార్యుడు - వీరే **'పితరులు'** అనబడతారు.

మనుస్మృతిలో ఆయా సందర్భాలలో వీరినే **'పితరులు'** అన్నారు. 4. 257లో వారి ఋణం నుంచి విముక్తులు కావడానికి - **"మహర్షి- పితృ- దేవానాం గత్వానృణ్యం యథావిధి."** ఇది జీవించి ఉన్నవారికే వీలవుతుంది. మనుస్మృతిలోని ఇతర ప్రమాణాలూ చూడండి -

ఈ) **అధ్యాపయామాస పితౄన్ శిశురాఙ్గిరసః కవిః ।**
పుత్రకా ఇతి హోవాచ జ్ఞానేన పరిగృహ్య తాన్ ॥ 2. 126 ॥

ఉ) **పితరశ్చైవ సాధ్యాశ్చ ద్వితీయా సాత్త్వికీ గతిః ॥** 12. 49 ॥

ఊ) **పితృదేవమనుష్యాణాం వేదశ్చక్షుః సనాతనమ్ ॥** 12. 94 ॥

ఏ) **దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ ।** 9. 28 ॥

ఐ) **ఋషయః పితరో దేవా భూతాన్యతిథయస్తథా ।**
ఆశాసతే కుటుమ్బిభ్యస్తేభ్యః కార్యం విజానతా ॥ 3. 80 ॥

మనువు 4. 30-31లో జీవించిన, ధార్మికులైన, వేద విదులైన విద్వాంసులకే హవ్య - కవ్యాలు ఇవ్వాలనే పద్ధతిని చెప్పాడు. ఆ శ్లోకాల వల్ల జీవించి ఉన్నవారికే హవ్యకవ్యాలు ఇవ్వాలనే పద్ధతి స్పష్టమవుతూంది. ఇదే శ్రాద్ధం. శ్రాద్ధ సంబంధమైన హవ్య కవ్యాలతో మరణించినవారి పితృశ్రాద్ధానికీ ఎలాంటి సంబంధమూ లేదు.

ఓ) **పితరుల విషయంలో వేదాల ప్రమాణం**
ఊర్జం వహన్తీరమృతం ఘృతం పయః కీలాలం పరిస్రుతమ్ ।
స్వధాస్థ తర్పయత మే పితౄన్ ॥ యజుః. 2. 34

అర్థం - 'పిత లేదా స్వామి తన మనమలు, నౌకరులను ప్రతిదినమూ ఇలా ఆజ్ఞాపించాలి - (తర్పయత మే పితౄన్) ఎవరు నా తండ్రి - తాత, నాయనమ్మ, తల్లి-అమ్మమ్మ, ఆచార్యులు, వీరి కంటే వేరైన విద్వాంసులు వయసు లేదా జ్ఞానం వల్ల వృద్ధులుంటారో, గౌరవించ దగినవారో, వారందరి ఆత్మలనూ యథోచితంగా సేవలతో ప్రసన్నం చేయాలి. సేవచేయటానికి కావలసిన పదార్థాలు ఇవి- (ఊర్జా వహంతీః) ఉత్తమ జలం, (అమృతం) అనేక విధాలైన రసాలు, (ఘృతం) నెయ్యి, (పయః) పాలు, (కీలాలం) ఎన్నో విధాలుగా సంస్కరించి తయారు చేసిన రోగ నాశకాలైన ఉత్తమ అన్నం (పరిస్రుతం) అన్ని రకాలైన ఉత్తమ ఫలాలు, ఈ అన్ని పదార్థాలతోనూ వారికి సేవ చేయాలి. (స్వధాస్థ) ఓ పూర్వం చెప్పిన పితరులారా ! మీరందరూ మా అమృత రూపాలైన భాగాలతో ఎల్లప్పుడూ సుఖంగా ఉండండి !" (ద.ల.గ్ర.సం. 245-255).

ఔ) పితరుల గణన- దాని అభిప్రాయాలు

ఎవరిని పితరు లనాలో, ఎవరు సేవలకు యోగ్యులో వారిని ఈ కింద పేర్కొంటున్నారు -

1. సోమసదః, 2. అగ్నిష్వాత్తాః, 3. బర్హిషదః, 4. సోమపాః, 5. హవిర్భుజః, 6. అజ్యపాః, 7. సుకాలినః, 8. యమరాజాః, 9. పితృపితామహ ప్రపితామహాః, 10. మాతృ పితామహీ ప్రపితామహ్యాః, 11.సగోత్రా, 12. ఆచార్యాది సంబంధినః. (విస్తృత వ్యాఖ్యకు 3.82వ శ్లోకంలో చూడండి.).

పై చెప్పిన లక్షణాలతో జీవించి ఉన్నవారినే **'పితరులు'** అనాలి, వారికి సేవ చేయటమే **'పితృ యజ్ఞం'**. మృత పితరుల కల్పన అపోహా, అజ్ఞానమూ అవుతుంది.

ప్రజాపతి, ప్రజలంటే - సంతానం ఆలన పాలనలలో తత్పరులైన తల్లిదండ్రులు మొదలైన గృహస్థులైన విద్వాంసులే ప్రజలు. వారిని **'పితరులు'** అని కూడా అనవచ్చు. దీనికి బ్రాహ్మణ గ్రంథాలు, నిరుక్తమూ ప్రమాణాలు- **"ప్రజా అపత్యనామ"** (నిఘ. 2.2), **"ప్రజాపతిః పాతా వా పాలయితా వా"** (నిరు. 10.41), **"పితరః ప్రజాపతిః "** (గో.ఉ .6.15), **"పురుషః ప్రజాపతిః"** (శత. 6.2.1.23). ప్రజలను పుట్టించి వారి ఆలన పాలన చేయటం చేత, పురుషుడు **'ప్రజాపతి'** అవుతాడు. పితరులు అంటే, తల్లి, తండ్రి మొదలైనవారు ప్రజాపతులు అవుతారు. సంతానం ఆలన పాలన చేసే తల్లిదండ్రులు మొదలైన గృహస్థులైన విద్వాంసుల ద్వారా ఆమోదించబడి, సమ్మతించబడి, ఆ పనులను ఆచరించటం వల్ల, 3.30లో చెప్పిన ఈ విధమైన వివాహాన్ని **'ప్రాజాపత్య వివాహం'** అన్నారు.

4. అసురులు ఎవరు?

'న సురా అసు రాః' - అంటే దేవతలతో సమానులు కానివారు, దేవతల వలె నిఃస్వార్థులు, వైరం లేనివారు, పరులకు మేలు చేసేవారు, త్యాగులు, తపస్వులు, సహనం మొదలైన భావనలు లేనివారు. తమ దేహం, ప్రాణాల పోషణ కొరకు, తమ స్వార్థం, సుఖ సౌకర్యాలు, ధనం, తమ మేలుకు తగిన సాధనాల సంపాదనలో నిమగ్నులై ఉండేవారు. వాటిని పొందటానికి రకరకాల వంచనలు, కుట్రలు, మాయా జాలాలు చేస్తుంటారు; అలాటివారిని **'అసురులు'** అంటారు. వీటిలో నిరుక్తం, బ్రాహ్మణ గ్రంథాలలోని ప్రమాణాలు చెప్పుకోదగినవి-

> **"అసురతాః స్థానేష్వస్తాః స్థానేభ్య ఇతి వా,**
> **అసురితి ప్రాణనామాస్తః శరీరే భవతి, తేన తద్వన్తః ।"** నిరు. 3.7
>
> **"(అసురాః) స్వేష్వేవాస్యేషు జుహ్వాతశ్చేరుః"** శత. 11.1.8.1

"మాయాత్యేసురాః (ఉపాసతే)" (శత. 10.5.2.10), **అసు క్షేపణే (అదాది) ధాతువుకు** 'అసేరురన్' (ఉణాది. 1.42) తో **'ఉరన్'** ప్రత్యయంతో **'అసుర'** శబ్దం తయారైంది. 'అసురు'లతో సంబంధం పెట్టుకునేవాడు అనే అర్థంలో **'అణ్'** ప్రత్యయం కలిస్తే **'ఆసుర'** పదం వస్తుంది. ఈ విధంగా ఇతరుల భావనలను నిర్లక్ష్యం చేసి, ధనం, స్వార్థ సాధనలలో ఉండేవారి ద్వారా అంగీకృతమై, సమ్మతమై లేదా వారి ఆచరణను అనుసరించి ఉండటం వల్ల, 3.31లో ఈ పెళ్లికి **'ఆసుర వివాహం'** అని పేరు వచ్చింది.

5. గంధర్వులు ఎవరు?

గంధర్వ పదం వ్యుత్పత్తి -**"గామ్- వాచమ్ ధరతీతి గంధర్వః"**- అంటే పాడే గొప్ప కంఠాన్ని కలిగి ఉండేవారు. సంగీతం అంటే పాట. నాట్యాలలో ప్రవీణులైన వారిని విలాసులుగా, ఎప్పుడూ ఆనందంలో మునిగి ఉండేవారు, అలంకార ప్రియులు, కాముక ప్రవృత్తి ప్రధానంగా ఉండేవారు - వీరు **'గంధర్వులు'** అనబడతారు. బ్రాహ్మణ గ్రంథాలలోని కింది ప్రమాణాలు వీటిని వివరిస్తాయి - **"రూపమితి గన్ధర్వాః (ఉపాసతే)"** (శత. 10.5.2.10), **యోషిత్కామా వై**

గన్ధర్వాః (శత. 3.2.4.3) "**స్త్రీకామా వై గన్ధర్వాః**" (ఐత. 1.277; కా. 12.3), "**గన్ధో మే, మోదో మే ప్రమోదో మే । తస్మై యుష్మాసు (గన్ధర్వేషు)**" (జై. ఉ. 3.25.4) ఇలాంటి వ్యక్తుల అంగీకారం, సమ్మతం లేదా వారి ఆచరణలను అనుసరించే వారు కావటం చేత, 3.32లో వర్ణించబడిన ఆ వివాహం '**గాంధర్వ వివాహం**' అయింది.

6. రాక్షసులు ఎవరు?

'రక్ష్ – రక్షించే' / పాలించే ధాతువు నుంచి, '**సర్వ ధాతుభ్యోఽసున్**' (ఉణాది 4.189) సూత్రం నుంచి "**అసున్**" ప్రత్యయమూ, '**ఇదమ్**' అనే అర్థంలో అణ్ ప్రత్యయం కలవటం వల్ల '**రాక్షస**' పదం ఏర్పడుతుంది. నిరుక్తం 4-18లో రాక్షస పదానికి నిర్వచనం ఇలాగుంది – "**రక్షః రక్షితవ్యమస్మాద్, రహసి క్షణోతీతి వా, రాత్రౌ నక్షతే ఇతి వా**" అంటే ఎవరి నుంచి ధన సంపదలు, ప్రాణం మొ॥ వాటిని రక్షించుకోవలసి వస్తుందో, ఒంటరిగా ఉన్నప్పుడు ఎవరు హాని కలిగిస్తారో, ఎవరు రాత్రి వేళల్లో దోపిడులు, దొంగతనాలు, వ్యభిచారం లాంటి చెడ్డ పనులు చేస్తారో, వారు '**రాక్షసులు**'. ఈ విధంగా తమ స్వార్థం కోసం ఇతరులకు హాని కలిగించేవారు, ఇతరులను ఇబ్బంది పెట్టి, పీడించేవారు, అత్యాచారులు, అన్యాయం చేసేవారు, బలాత్కరించే స్వభావం కలవారు, మద్యం తాగడం, మాంసం తినడం చేసే తమోగుణం కలవారు (12.44) '**రాక్షసులు**' అనబడతారు. ఇలాంటి వారికి అనుకూలంగా వారిని అంగీకరించి సమ్మతించి చేసుకునే వివాహం 3.33లో చెప్పినట్లుగా '**రాక్షసవివాహం**' అవుతుంది.

7. పిశాచులు ఎవరు?

పిశ్ – అవయవే (తదాది) ధాతువు నుంచి '**క**' ప్రత్యయం వస్తుంది, '**పిశమ్**' పదం ఏర్పడుతుంది. '**పిశ్**' ఉప పదంతో ఆఙ్-పూర్వక '**చము-అదనే**' ధాతువు నుంచి '**డః**' ప్రత్యయ పూర్వక '**పైశాచ**' శబ్దం రూపొందుతుంది. లేదా '**పిశిత్**' పూర్వ పదం నుంచి '**అశ్**' ధాతువు నుంచి అణ్ '**ఇత్**' లోపం 'శ' కారం 'చ' కారమై పైశాచం అవుతుంది. '**యే పిశితమ్ =** అవయవీ భూతం, పేశితం వా మాంసం రుధిరాదికమ్ ఆచమంతి భక్షయంతి తే '**పైశాచాః**' ప్రాణుల పచ్చి మాంసం, రక్తం తాగేవారు, హింసించే వారు, దురాచారులు, అనాచారు లు, మలిన సంస్కారం కలవారు, అత్యంత తమోగుణం కలవారు (12.44), అతి తక్కువ, ఆసహ్యించుకో దగిన స్వభావం కలవారు '**పిశాచులు**' అనబడతారు. వీరిని అనుసరించి నచ్చి పెళ్లాడే వారి వివాహం 3.34లో చెప్పినట్లుగా '**పిశాచ వివాహం**' అవుతుంది.

8. దస్యులు ఎవరు?

వేదాలలోనూ, ప్రాచీన సంస్కృత సాహిత్యంలోనూ '**దస్యులు**' అనే పదం విరివిగా వాడబడింది. మనువు ఈ దస్యులు ఎవరో స్పష్టంగా చెప్పాడు. వేదాలలో మానవులలోని రెండు వర్గాలు చెప్పారు. '**ఆర్యులు**' = శ్రేష్ఠులు, '**దస్యులు**' = శ్రేష్ఠులు కానివారు. మనువు వర్ణాశ్రమ ధర్మాలలో దీక్షితులు కానివారు (10.57), ధర్మపాలన చేయకుండా అధర్మాచరణ పరులైన నాలుగువర్ణాల నుంచి వేరైన వారందరూ '**దస్యులు**' అని చెప్పాడు. దస్యులు అనే పదం అర్థమూ, వ్యుత్పత్తీ కూడా వారి ఆచరణలనే తెలియజేస్తాయి. '**దసు – ఉపక్షయే**' ధాతువు నుంచి '**యజిమనిషుంధిదసిజనిభ్యోయుచ్**' (ఉణాది 3.20) నుంచి '**యుచ్**' ప్రత్యయం కలవడం చేత, '**దస్యు**' అనుపదం ఏర్పడుతుంది. నిరుక్తం 7.23లో దీని వ్యుత్పత్తి ఇలా ఉంది– "**దస్యుః దస్యతేః క్షయార్థాత్.... ఉపదాసయతి కర్మాణి**" = మంచి పనులు చేయనివాడు లేదా మంచి పనులకు ఇబ్బంది కలిగించేవాడు దస్యుడు. మనువు శ్లోకం ఈ కింద ఉంది.

> **ముఖబాహూరుపజ్జానాం యా లోకే జాతయో బహిః ।**
> **మ్లేచ్ఛవాచశ్చార్యవాచః సర్వే తే దస్యవః స్మృతాః ॥** 10.45 ॥

అర్థం – 'లోకే **లోకంలో, (ముఖ+బాహు+ఉరు+పత్-జానామ్) =** బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర – ఈ నాలుగు వర్ణాల నుంచీ. **(బహిః=)** మంచి పనులు చేయక పోవటం వల్ల బహిష్కృతులూ లేదా వీటిలో దీక్ష తీసుకోని

వారూ, (యా జాతయః) = అయిన జాతులు ఏవి ఉన్నాయో, (మ్లేచ్ఛవాచః చ ఆర్యవాచః), వారు మ్లేచ్ఛ భాషలు మాట్లాడినా, లేదా ఆర్య భాషలు మాట్లాడినా, **('తే సర్వే')** = వారందరూ (దస్యవః స్మృతాః) = **'దస్యులు'** అని పిలవబడతారు!

9. ఆర్యులు, అనార్యులు

నాలుగు వర్ణాలలోనూ ఏదో ఒక దానిలో దీక్షితులు, శ్రేష్ఠసంస్కారాలు గలవారు, స్వభావం, ఆచరణలు చేసేవారు **'ఆర్యులు'** అవుతారు. వీరికి వ్యతిరేకులు **'అనార్యు'** లవుతారు. మనువు ఈ కింది శ్లోకంలో అనార్యుల లక్షణాలు చెప్పాడు-

వర్ణాపేతమవిజ్ఞాతం నరం కలుషయోనిజమ్ ।
ఆర్యరూపమివానార్యం కర్మభిః స్వైర్విభావయేత్ ॥ 10.57 ॥

అర్థం - **(వర్ణ - అపేతం)** = 'వర్ణాలలోని దీక్షలు లేని వారు, లేదా వర్ణాల నుంచి బహిష్కృతులు, **(ఆర్య రూపం+ఇవ+అనార్యం)** = మంచి ఆచారవ్యవహారాలు, స్వభావం ప్రదర్శించే వారు కానీ, నిజానికి శ్రేష్ఠ లక్షణాలు లేనివారు అనార్యులు (కలుష యో నిజమ్) [కలుషయోనౌ = దుష్ట యోనౌ జాయతే ఇతి కలుష యోనిజః తమ్] దుష్టసంస్కారాలు గల వారి నుంచి పుట్టిన దుష్ట సంస్కారులు లేదా దుష్ట ప్రవృత్తి గలవారు, **(స్వైః కర్మభిః విభావయేత్)**= తమ కర్మల ద్వారా గుర్తించబడతారు. అంటే మంచిపనులు చేయని వారు, చెడ్డ పనులు చేసేవారు - వారు**'అనార్యులు.'**

మనువు ప్రతి వ్యక్తినీ ఏదో ఒక వర్ణంలో దీక్ష గ్రహించి ఉత్తమ ధర్మానుకూలంగా ప్రవర్తించే వాడనే చెప్పాడు. కొందరు ఎంతగా దుష్ట సంస్కారాలకు లోబడతా రంటే, వారికి ధర్మాచరణం పట్ల ఆసక్తి కలగనే కలగదు. వారు ఏ వర్ణంలోని దీక్షనూ గ్రహించరు. **(వర్ణాపేతమ్)**= వారిలో స్వభావ సహజంగా నీచత, నిర్దయత ఉంటాయి. ధార్మిక క్రియల పట్ల నిర్లక్ష్య భావం ఉంటుంది. ఇలాంటి వారే అనార్యులు లేదా దస్యులు. దుష్ట సంస్కారాలున్న వారికి కలిగే దుష్ట సంస్కారులు = కలుషయోనిజులు లేదా దస్యులు. వీరిలో ఆ సంస్కారాలు ఎంతగా ప్రబలమై ఉంటాయంటే, అవి ఏదో ఒకరూపంలో బయటపడి వారిని గుర్తించేలా చేస్తాయి. 3.41-42లలో మనువు, దుష్ట సంస్కారులకు జనించే కుసంస్కారులను సంకేతించాడు - వారే కలుషయోనిజులు లేదా దస్యులు అవుతారు -

ఇతరేషు తు శిష్టేషు నృశంసానృతవాదినః ।
జాయన్తే దుర్వివాహేషు బ్రహ్మధర్మద్విషః సుతాః ॥ 3-41 ॥
అనిందితైః స్త్రీ భవతి ప్రజా
నిన్దితైర్నిన్దితా నౄణామ్ తస్మాన్నిందాన్ వివర్జయేత్ ॥ 3-42 ॥

ఈ శ్లోకంలో ఉచ్చ - నిమ్న జాతులను వేరు చేయటం మనువు చెప్పింది కాదు. ఇక్కడ చెప్పినవారు ఆర్యుల వలె కనిపించే అనార్యులు. దుష్టులకు పుట్టడం వల్ల దుష్ట - గుణ - కర్మ, స్వభావం గలవారు. వా రే వర్ణంలోనివారైనా సరే, **'కలుష యోనిజులు'** అనే పిలవ బడతారు.

14. మనువు - వేదాలు

మనువు వేదాలను **'అపౌరుషేయాలు'** అని నమ్మాడు. వాటిని తన స్మృతికి, ధర్మాలకు మూలస్రోతస్సులుగా భావించాడు. వాటిని చదవటానికి అందరు మానవులకూ అధికారం ఉంది, ఎలాంటి పరిస్థితిలోనైనా వాటిని చదవాలి (దీని విస్తృత చర్చ రెండో అధ్యాయంలో 'వేద వ్యతిరేకత' శీర్షికలో చూడండి) అని చెప్పాడు.

***

నాలుగవ అధ్యాయం

మనుస్మృతిలో అధ్యాయవిభజన-ప్రకరణాలు.

వర్ణాశ్రమధర్మ వర్ణన పద్ధతి

1. మనుస్మృతిలో అధ్యాయ విభజన మౌలికం కాదు.

మనుస్మృతిలోని అధ్యాయ విభజన మనువు చేసింది కాదు. తరువాతి కాలంలోని ఎవరో ఆ పని చేశారు. మనుస్మృతి పరంపరనే తరువాతి వారెవరో తమ సౌకర్యం కోసం, తమదైన ధోరణిలో పొందుపరచటంతో పాటు అందులో కొన్ని మార్పులు, చేర్పులు కూడా చేసినట్లు తోస్తుంది. నేడు లభించే అన్ని ప్రతులలోనూ అధ్యాయాలు విభాజితమయ్యే ఉంటున్నాయి. ఇది మనుస్మృతి అసలైన రూపం కాదు. దీని వల్ల మనుస్మృతిలో అధ్యాయ విభజన కూడా చాలా ముందే జరిగినట్లు తెలుస్తూంది. అతి ప్రాచీనం కావటం వల్ల మనుస్మృతి తాలూకు అధ్యాయరహిత ప్రతి కూడా నేడు దొరకటం లేదు. ఇలా మనుస్మృతిలో అధ్యాయవిభజన చేసిన వ్యక్తి కూడా రెండు చోట్ల పొరపాట్లు చేశాడు. అధ్యాయ విభజన పూర్తిగా ఉచితం - తగినది కాదు. ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే, నేటి వరకూ ఏ పండితుడి దృష్టీ ఆ పొరపాట్ల పైకి వెళ్లక పోవటమూ, అదే పొరపాటు అధ్యాయవిభజనతోనే మనుస్మృతి చలామణి కావటం జరిగింది. ఈ పొరపాట్లను గురించి చర్చించే ముందు, అధ్యాయవిభజన యొక్క అమౌలికతను గురించీ చెప్పుకోవడం ఉపయోగకారి అవుతుంది.

మనుస్మృతి రచనాశైలి వల్ల అందులో అధ్యాయ విభజన లేనే లేదని తెలుస్తూంది. మనుస్మృతి లోనిది ప్రవచన శైలి. మొత్తం ప్రవచనం గొలుసుభాగాలుగా జోడించబడింది. మౌలికంగా ఈ శైలిలో అధ్యాయవిభజన జరగటమూ కుదరదు, దాని అవసరమూ లేదు. ఎందుకని అధ్యాయ విభజన జరిగే అవకాశం లేదంటే మనువు ఏ విషయాన్ని ప్రారంభించాడో దాన్ని ప్రారంభం, చివర లేదా రెండు స్థలాలలోనూ విషయాన్ని సూచిస్తాడు. ఎక్కువ చోట్ల అదే శ్లోకంలోని మొదటి పంక్తిలో పూర్వవిషయం పూర్తయిందని సూచిస్తాడు. రెండో పంక్తిలో తర్వాతి విషయ ప్రారంభాన్ని సూచిస్తాడు - కొన్ని చోట్ల అయితే, ఒక పాదంలో ఒక విషయం ప్రారంభం లేదా పూర్తి అయిన సూచన ఉండి, మిగిలిన మూడు పాదాలలో రెండో విషయం ప్రారంభం లేదా పూర్తి అయిన సూచన ఉంటాయి.

ఎలాగంటే -

అ. తృతీయ అధ్యాయపు చివరి 286వ శ్లోకం -

ఏతద్వోఽభిహితం సర్వం విధానం పాఞ్చయజ్ఞికమ్ ।
ద్విజాతిముఖ్యవృత్తీనాం విధానం శ్రూయతామితి ॥ 3.286 ॥

అర్థం - 'ఈ ఐదు మహాయజ్ఞాల మొత్తం పద్ధతి మీకు చెప్పాను. ఇప్పుడు ద్విజాతీయుల ఉపాధుల పద్ధతి వినండి.'

ఇక్కడ తొలిపంక్తిలో 'పంచయజ్ఞ విధానం' విషయం పూర్తి అయిన సంకేతం ఉంది.రెండో పంక్తిలోనే ద్విజాతీయుల వృత్తుల విషయం ప్రారంభమైన సంకేతం ఉంది.

ఆ. ఇదే విధంగా కింది శ్లోకపు తొలి పంక్తిలో రాజధర్మం పూర్తి అయిన సూచన, రెండో దాంట్లో వైశ్య - శూద్రుల కర్తవ్యాలు ప్రారంభమైనట్లు -

ఏషోఽఖిలః కర్మవిధిరుక్తో రాజ్ఞః సనాతనః ।
ఇమం కర్మవిధిం విద్యాత్ క్రమశో వైశ్య-శూద్రయోః ॥ 9.325 ॥

అర్థం - 'ఇది రాజు యొక్క సనాతన, సంపూర్ణ కార్యపద్ధతి. ఇప్పుడు వైశ్యుల, శూద్రుల పనుల పద్ధతిని తర్వాత చూసి తెలుసుకోండి'.

ఇ. కింది శ్లోకంలో మొదటి మూడు పాదాల్లో మునుపు చెప్పిన నాలుగు విధాల కర్మల విషయం పూర్తయిన సూచన ఉంది. చివరి పాదంలో తరువాతి విషయం ప్రారంభానికి -

ఏష వోఽభిహితో ధర్మో బ్రాహ్మణస్య చతుర్విధః ।
పుణ్యోఽక్షయఫలః ప్రేత్య రాజ్ఞాం ధర్మం నిబోధత ॥ 6.97 ॥

అర్థం - 'ఈ నాలుగురకాల ఆశ్రమధర్మాలు చెప్పాను. ఈ ధర్మాలు ఆచరించటం వల్ల పుణ్యమూ, మరణం తర్వాత మోక్షమూ కలుగుతాయి. ఇక దీని తర్వాత రాజుల కర్తవ్యాలైన పనులను వినండి.'

దీనివల్ల ఈ శైలిలో అధ్యాయవిభజన అవసరం లేదనీ, పూర్వాపర విషయాల సూచనలు వెంటవెంటనే ఉంటాయనీ, అందువల్ల అధ్యాయాలవారీగా విభజించే అవసరం లేదనీ తెలుస్తూంది. మనుస్మృతి రచనాశైలి అఖండం. అధ్యాయవిభజన చేస్తే శ్లోకాలను విరవవలసి వస్తుంది. లేదా తొలి విషయపు సూచన గల పంక్తిని ముందరి అధ్యాయంలోనే ఉంచవలసి వస్తుంది. ఇప్పటి ప్రచారంలో ఉన్న ముద్రణలలో అలాగే ఉంది. ఒక విషయం పూర్వపువిషయంతో గొలుసులోని భాగంవలె కలిసి ఉండడం వల్ల రచయితకు అధ్యాయాలవిభజన పట్ల అభిరుచి లేదని స్పష్టమవుతూంది. అందుచేత మనుస్మృతి తొలి ప్రతులు ఆ శైలిలోనే ఉండి ఉండాలి. అధ్యాయవిభజన అయినంత వరకు ఆ విధమైన ప్రతులే ప్రసిద్ధిలోకి వచ్చాయి.

క. ఒకటవ, రెండవ అధ్యాయాల విభజనలో మార్పు

అధ్యాయవిభజన చేసినవారు ముఖ్యవిషయాలను అనుసరించే విభజన చేసినట్లు తోస్తుంది. ప్రతి అధ్యాయంలోనూ ఒకటి రెండు ముఖ్యవిషయాలున్నాయి. తొలి అధ్యాయంలో - సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి, రెండో అధ్యాయంలో - సంస్కారాలు, బ్రహ్మచర్య ఆశ్రమం; మూడో అధ్యాయంలో- వివాహం, పంచమహా యజ్ఞ విధానం మొ॥. కానీ తొలి అధ్యాయపువిభజనే తప్పుగా జరిగింది. అది రెండో అధ్యాయంలోని 25వ శ్లోకం వరకు ఉండవలసింది. తొమ్మిదో అధ్యాయంలోనూ కొన్ని మార్పులు చేయబడ్డాయి.

అ. మనుస్మృతిలోని తొలి అధ్యాయంలో రెండు ముఖ్యవిషయాలున్నాయి- సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి. రెండిటికీ పరస్పరం ఉన్న ఆశ్రయం వల్ల, మనువు ఈ రెండిటినీ ఒకటిగానే భావించి రచించాడు. ధర్మాన్ని గురించి చెప్పేముందు దానికి సంబంధించిన ఇతర అవసరమైన విషయాలను భూమిక రూపంలో చెప్పాల్సి ఉంది. 1.4-5 నుంచి మనువు సృష్టి ఉత్పత్తి విషయాన్ని ప్రారంభించాడు. 1.108 నుండి ధర్మం గురించి ప్రారంభించాడు. 2.25లో ఈ సంయుక్త విషయాలు ముగిసిపోతాయి. అక్కడ మనువు ఇలా సూచించాడు-

ఏషా ధర్మస్య వో యోనిః సమాసేన ప్రకీర్తితా ।
సభ్యవశ్చాస్య సర్వస్య వర్ణధర్మాన్నిబోధత ॥

అర్థం- 'ఈ ధర్మాన్ని తెలుసుకునే అన్ని కారణాలనూ సంక్షిప్తంగా చెప్పాను. ఈ జగత్తు ఉత్పత్తిని కూడా చెప్పాను. ఇప్పుడు వర్ణధర్మాలను వినండి."

మనువు ఈ రెండు విషయాల ముగింపును ఒకటిగా చేయటంవల్ల దీన్ని విడదీయడం తప్పని తెలుస్తుంది. ఈ విషయాన్ని ముగించిన తర్వాతే తొలి అధ్యాయం పూర్తికావాలి. ఇప్పటి ప్రతులలో 1.119వ శ్లోకంతోటే అధ్యాయం పూర్తి కావటం, పైన చెప్పిన సూచనా శ్లోకానికి వ్యతిరేకం.

ఆ. పరంపరాగతమైన అధ్యాయవిభజనలోని మరొక పొరపాటు ఏమిటంటే, ఇందులో ధర్మ ప్రసంగాలను కూడా భంగం చేయటం. 1.87-91 శ్లోకాలలో వర్ణాల పనుల విభజనతో సృష్టిఉత్పత్తి విషయం పూర్తవుతుంది.

మళ్లీ 1.108-110 శ్లోకాలలో ధర్మచర్చ ముందు మాటలాగా ప్రారంభమైంది. మళ్లీ 2.1లో 'యో ధర్మస్తం నిబోధత' అంటూ ధర్మోత్పత్తి విషయం ప్రారంభమైంది. అధ్యాయ విభజనకారుడు ధర్మభూమికలో 1.108-110 శ్లోకాలను తొలి అధ్యాయంలో పెట్టాడు. ధర్మోత్పత్తి విషయం రెండో అధ్యాయంలో వచ్చింది. ఇలా విషయ భంగం లేదా విభజనే తారుమారుగా జరిగింది.

ఇ. ధర్మవిషయాలు రెండో అధ్యాయంలో రావడంవల్ల ముఖ్య విషయాలను అనుసరించి అధ్యాయ విభజనకు వైజ్ఞానిక ఆధారం కూడా ఏర్పడలేదు. రెండో అధ్యాయంలో జరిగిన ధర్మోత్పత్తి, సంస్కారాలు, బ్రహ్మచర్య ఆశ్రమం -ఇలా అనేక విషయాలు వచ్చాయి.

వీటిని చూస్తే తొలి అధ్యాయవిభజన 2.25 తర్వాతే జరగవలసిందనిపిస్తుంది. ఇలాగైతేనే తొలి అధ్యాయం ఒక ముఖ్యవిషయం సంపూర్ణమవుతుంది. సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి, రెండో అధ్యాయంలోని విషయాలు, సంస్కారాలు, బ్రహ్మచర్యాశ్రమం- అవుతాయి. ఇలా విభజించడం వల్ల, ధర్మవిషయాలు, ముఖ్యవిషయాలు మధ్యలో ఆగిపోవు, పైగా మనుస్మృతిలోని సంకేత శైలిని అనుసరించే అధ్యాయవిభజనా జరుగుతుంది.

అందుచేత, మేము మనువు సమ్మతించిన పద్ధతి ప్రకారం 2.25 తర్వాతే తొలి అధ్యాయాన్ని ముగించాము. ఇప్పటి రెండో అధ్యాయానికి ముందు 25 శ్లోకాలను తొలి అధ్యాయంలోనే ఉంచాము. ఈ విధంగా తొలి అధ్యాయంలోని శ్లోకాలు పెరిగి 144 అయ్యాయి. రెండో అధ్యాయంలో 25 శ్లోకాలు తగ్గాయి. ఈ ముద్రణలో శ్లోకాల సంఖ్య ఈ పద్ధతిలోనే ఇవ్వబడింది.

ఖ. ఎనిమిదవ అధ్యాయం విభజనలో గందరగోళం

ఎనిమిదో అధ్యాయపు విభజనలో ఏ పొరపాట్లు, గందరగోళాలు జరిగాయో, అవి ఇవియే-

అ. ఎనిమిదో అధ్యాయంలోని విషయం = రాజధర్మంలో 18 విధాల వ్యవహారా (వ్యాజ్యాల) ల నిర్ణయం అనేది. అ.8.4-7 శ్లోకాలలో వీటిని ఒక్కొక్కటే లెక్కించారు కూడా. అ.8.1-3లలో ఈ విషయం ప్రారంభించిన సూచన లున్నాయి. కింద ఇచ్చిన అ.9.250లో ఈ విషయాన్ని సంకేత పూర్వకంగా ముగించారు.

ఉదితోఽయం విస్తరశో మిథో వివదమానయోః ।
అష్టాదశసు మార్గేషు వ్యవహారస్య నిర్ణయః ॥

అర్థం - 'ఇక్కడ పరస్పరం వాదించుకునేవారి 18 విధాలైన వ్యాజ్యాల నిర్ణయాల సవివరణ వర్ణనలు ఇచ్చాము.'

కాని అధ్యాయవిభజనకర్త ఎనిమిదో అధ్యాయాన్ని విభజించేటప్పుడు, ఈ విషయాన్ని తెలియక విరగ గొట్టాడు. 18 వ్యాజ్యాల నుంచి 15 వ్యాజ్యాలు (స్త్రీ సంగ్రహం వరకు) ఎనిమిదో అధ్యాయంలో ఉండిపోయాయి. మిగిలినవి మూడూ (స్త్రీ పురుషుల ధర్మాలు, వారసత్వపు నిర్ణయం, ద్యూత నిర్ణయం) తొమ్మిదో అధ్యాయంలోనికి కలపబడ్డాయి. ఇలా ఈ అధ్యాయాల విభజన మనువు సంకేతశైలికి వ్యతిరేకంగా ఉంది.

ఆ. అధ్యాయవిభజన చేసిన తర్వాతి కాలపు వ్యక్తికి, వాటిని విభజించేటప్పుడు తికమక కలిగి, అ.8.419 శ్లోకంతో వ్యాజ్యాల నిర్ణయం పూర్తి అయిపోయింది. అక్కడ విషయం ముగిసినందుకు సంకేతంగా శ్లోకం లేకపోయేసరికి, తానే ఒక కొత్త శ్లోకాన్ని రచించి కలిపేశాడు -

ఏవం సర్వానిమాన్ రాజా వ్యవహారాన్సమాపయన్ ।
వ్యపోహ్య కిల్బిషం సర్వం ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ 8.420

అర్థం - 'ఈ విధంగా రాజు పైన చెప్పిన విధంగా అన్ని వివాదాలనూ పూర్తి చేసి, అన్ని రకాల దోషాలనూ దూరం చేస్తాడు. అందుకుగాను ఉత్తమ గతులను పొందుతాడు.'

ఈ 18 వ్యాజ్యాల నిర్ణయమూ పూర్తి అయినప్పుడు, మనువు తన శైలిలో ముగింపు సూచనా శ్లోకాన్ని ఇచ్చాడు. అది పైన (అ.9-250) చెప్పబడింది. అన్ని ముద్రణలలోనూ పొరపాటున అ.8.420 శ్లోకం నుంచి అధ్యాయం చివరలో, 'వ్యవహార నిర్ణయం' విషయ సమాప్తి చేయబడి ఉంది. ఇంతవరకు ఈ పొరపాటు మీద విద్వాంసుల దృష్టిపడకపోవటం ఆశ్చర్యజనకమే!

ఇ. ఈ గందరగోళానికి మరొక తికమకతో పుష్టి చేకూరుతూంది. తొలి అధ్యాయంలోని ప్రక్షిప్త విషయ సూచిక తయారు చేసినవారి పొరపాటది. దీన్ని అధ్యాయవిభజనకర్తే రాసినా, లేదా ఎవరైనా తర్వాతి వారు రాసినా, వారికి ముఖ్య, గౌణ విషయాల సమ్యక్ జ్ఞానం లేదని చెప్పవచ్చు. 'వ్యవహార నిర్ణయం' రాజధర్మంలోని ఒకే ఒక్క ముఖ్యమైన, విస్తృతమైన విషయం. దానిని 18వ భాగంగా భావించాడు. విషయసూచికలోని శ్లోకాలను చూస్తే, దాని రచయితకు 'వ్యవహార నిర్ణయం' ఒక భిన్న విషయమనిపించి దాన్ని ఎనిమిదో అధ్యాయంలో పూర్తయిందని భావించి, తొమ్మిదో అధ్యాయంలో మిగిలిన మూడు వ్యాజ్యాలనూ స్వతంత్ర విషయాలుగా భావించి విడి విడి విషయాలుగా రచించాడు–

రాజ్ఞశ్చ ధర్మమఖిలం కార్యాణాం చ వినిర్ణయమ్ ॥ 1.114 ॥
సాక్షిప్రశ్నవిధానం చ ధర్మం స్త్రీపుంసయోరపి ।
విభాగధర్మం ద్యూతం చ కణ్టకానాం చ శోధనమ్ ॥ 1.115 ॥

అర్థం – 'ఎనిమిదో అధ్యాయంలో' సాక్షులను ప్రశ్నించే తీరు, 'తొమ్మిదో అధ్యాయం'లో భార్యల ధర్మం, విభాగ ధర్మం, జూదసంబంధ విషయాలు, కంటకభూత దోషాలను తొలగించడం లాంటివి ఉన్నాయి. 'ఏడో అధ్యాయంలో' రాజు యొక్క అన్ని ధర్మాలు, 'ఎమిదో అధ్యాయం'లో అన్ని కార్యాల (వ్యాజ్యాల) నిర్ణయాలు చెప్పాడు.'

తొమ్మిదో అధ్యాయంలో 'స్త్రీ పురుష ధర్మాలు, విభాగధర్మాలు, ద్యూత ధర్మాలు' లాంటి విషయాల నిర్ణయాల వ్యవహారం కింద రావలసిన విషయాలు, విడిగా ఉన్నవి కావు. మామూలుగా 7, 8, 9 అధ్యాయాలలో రాజధర్మమే చెప్పారు. 7.1 నుంచి అవి మొదలై, 9.250లో పూర్తయ్యాయి. ఆ తర్వాత వైశ్య, శూద్రుల కొన్ని పనుల వివరాలున్నాయి.

గ. తొమ్మిదవ అధ్యాయపు విభజనపై చర్చ

ఇప్పుడు లభిస్తున్న మనుస్మృతులలో తొమ్మిదో అధ్యాయంలో 336 శ్లోకాలున్నాయి. ఏడో, ఎనిమిదో, తొమ్మిదో అధ్యాయాలలో 325 వరకు రాజనీతి ఉంది. ముందే చెప్పినట్లు మనుస్మృతి అధ్యాయవిభజన కూడా ప్రకరణానుసారం జరిగింది. కానీ, కొన్ని అధ్యాయాలవిభజనలో విభజన చేసినవారు పొరపాటు చేశారు. ప్రకరణాన్ని అర్థం చేసుకోకుండానే విభజన చేసేశారు. ఇలా ఈ అధ్యాయంలోనూ పొరపాట్లు జరిగాయి. విషయంతో పాటు 9.326 నుంచి 9.336 వరకు గల శ్లోకాలలో చెప్పిన వైశ్య, శూద్రుల కర్తవ్యాలను కలిపేశారు. వీటితో పాటు చాతుర్వర్ణ్య ధర్మాలు (2.144 (2.25) నుంచి 9.336 వరకు) పూర్తవుతాయి. మళ్లీ పదో అధ్యాయంలో నాలుగు వర్ణాల ధర్మాల ఉప సంహారం ఉంది. వైశ్య శూద్రుల ధర్మాల విషయాలు 11 శ్లోకాల ప్రకరణంలోని ఒక అధ్యాయంగా ఉండడం బాగనిపించక, మేము ఈ శ్లోకాలను పదో అధ్యాయంలో ఉపసంహార వర్ణనతో పాటు కలిపాము. 9.325 వ శ్లోకంలో చెప్పినట్లుగా ఇక్కడ ఈ రాజధర్మ అధ్యాయాన్ని పూర్తి చేశాము.

ఇప్పుడు ఆలోచించవలసిన ప్రశ్న ఏమిటంటే, ఈ అధ్యాయాలవిభజనను కొత్త దృష్టితో చేయాలా? లేదా ప్రక్షిప్త శ్లోకాల దిద్దుబాట్లతో పాటుగా ప్రాచుర్యంలో ఉన్న రూపాలతో తీసుకోవచ్చా? అనేది. సమాధానంగా, ముఖ్యంగా ప్రాచుర్యంలో ఉన్నవాటినే ఉంచుదామనుకున్నాము.

ఎందుకంటే, వీటిని మార్చటం వల్ల పెద్ద మార్పేమీ ఉండదు. ఎనిమిదో అధ్యాయం పెద్దదై పోతుంది. అందులోకి 700 శ్లోకాలు వచ్చేస్తాయి. తొమ్మిదిలో 10-11 మాత్రమే ఉంటాయి. అందుచేత ఈ అయోమయాలను దృష్టిలో ఉంచుకుని, ఈ విభజనను ఉన్నది ఉన్నట్లుగానే ఉంచేశాము. మనుస్మృతి శైలి ప్రకారం, లేదా విషయాల ప్రకారం సంతులితంగా విభజన చేయటం కుదరదు. విషయాల ప్రకారం అధ్యాయాలు విభజిస్తే, ఒక అధ్యాయంలో 600-700 శ్లోకాలు, కొన్నిటిలో 50-60 అవుతాయి. అధ్యాయాల సంఖ్యా పెరుగుతుంది. అందుకని తొలి, తొమ్మిది అధ్యాయాలను వదిలి, మిగిలిన అన్నిటినీ ప్రాచుర్యంలో ఉన్నట్లుగానే విభజనను స్వీకరించాము. ప్రస్తుతపు ముద్రణలలో పెద్ద తేడా రాదు, శ్లోకాలను కలపటంలో ఇబ్బందీ కలగదు. అందువల్ల, ఇప్పటి అన్ని గ్రంథాలు, ఉదాహరణలు అన్నీ ప్రాచుర్యంలో ఉన్న ముద్రణలోని సంఖ్యలను అనుసరించే ఉన్నాయి.

2. మనుస్మృతిలోని ప్రకరణాలు-వాటి ముగింపుల నిర్ధారణ

మనుస్మృతిని దాని సంకేత శైలి ప్రకారం కొన్ని ముఖ్య విషయాలుగా తప్పక విభజించే వీలుంది. ఇలా చేసినా, ఆ శైలీ శ్లోకాలు ముఖ్య విషయాలకు అనుగుణంగా విభజించబడతాయి. కానీ, వాటి వల్ల విషయం లేదా ప్రసంగాల గురించి తెలుస్తుంది. మనుస్మృతిలో చిన్న చిన్న విషయాలు కూడా చాలానే ఉన్నాయి. వాటిని లెక్కిస్తే మొత్తం విషయసూచిక తయారవుతుంది. విషయ విస్తరణ భీతితో చెప్పడం లేదు. ముఖ్యమైనవి లేదా విషయవిభజన కింది ప్రకారం చేయవచ్చు.

	ముఖ్య విషయం పేరు	శ్లోకా లెంత వరకు ఉన్నాయి?
1.	భూమిక (ముందు మాట)	1.1 నుండి 1.4 వరకు
2.	సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి	1.5 నుండి 2.25 వరకు (ఇందులో 1.5 నుండి 1.144 వరకు)
3.	సంస్కారాలు	2.26 నుండి 2.68 వరకు (2.1-2.42 వరకు)
4.	బ్రహ్మచర్యాశ్రమం	2.69 నుండి 2.249 వరకు (2.45-2.244 వరకు)
5.	గృహస్థంలో వివాహం	3.1 నుండి 3.66 వరకు
6.	గృహస్థంలో పంచయజ్ఞ విధానాలు	3.67 నుండి 3.286 వరకు
7.	గృహస్థంలో వృత్తులు	4.1 నుండి 4.13 వరకు
8.	గృహస్థంలో స్నాతకుల వ్రతాలు	4.14 నుండి 4.260 వరకు
9.	గృహస్థంలో భక్ష్య - అభక్ష్యాలు	5.1 నుండి 5.56 వరకు
10.	గృహస్థంలో శుద్ధిపద్ధతి	5.57 నుండి 5.146 వరకు
11.	గృహస్థంలో స్త్రీ ధర్మాలు	5.147 నుండి 5.169 వరకు
12.	వానప్రస్థాశ్రమం	6.1 నుండి 6.32 వరకు
13.	సన్యాసఆశ్రమం	6.33 నుండి 6.97 వరకు
14.	రాజధర్మంలో రాజ సిద్ధి, కర్తవ్యాలు	7.1 నుండి 7.226 వరకు
15.	రాజధర్మంలో 18 రకాల వ్యాజ్యాల నిర్ణయం	8.1-3 నుండి 9.250 వరకు
16.	రాజధర్మంలో లోకకంటకుల తొలగింపు	9.251-252 నుండి 9.325 వరకు
17.	వైశ్య శూద్రుల కర్తవ్యాలు	9.326 నుండి 936 వరకు

18.	వర్ణాల ఆపద్ధర్మాలు	10.1 నుండి 10.131 వరకు
19.	ప్రాయశ్చిత్త విధానాలు	11.44 నుండి 11.265 వరకు
20.	కర్మఫల విధానాలు	12.1 నుండి 12.82 వరకు
21.	కర్మఫల విధానాలలో నిఃశ్రేయస్కర కర్మల వివరాలు	12.83 నుండి 12.116 వరకు

ప్రాచుర్యంలో ఉన్న అధ్యాయాల విభజన ప్రకారంగా ఈ ముఖ్య విషయాలకు శీర్షికలు, విషయం ఎంత వరకు ఉంది అనేదీ చూపించాము. అంతే కాకుండా మనువు యొక్క సంకేతం ప్రకారం అవాంతర విషయాలకు కూడా శీర్షిక లిచ్చాను. దీనివల్ల విషయాలు లేదా ప్రసంగాల పరిజ్ఞానంలో సరళత కలిగింది.

3.మనుస్మృతిలో వర్ణాలు, ఆశ్రమాల ధర్మాల వివరణ పద్ధతి

మనుస్మృతిలో వర్ణాలు, ఆశ్రమాల ధర్మాలు ఆరో అధ్యాయం చివరి వరకూ ఉన్నాయి. విషయ సంకేతక శ్లోకంలో **"వర్ణ ధర్మాన్నిబోధత"** (అ.1.144 (2.25)), ఉపసంహారాత్మక **"ఏషవో౽భిహితో ధర్మో బ్రాహ్మణస్య చతుర్విధః"** (అ.6.97) అనేవి చదివి, జిజ్ఞాసాపరులు మనువుని వర్ణాలు, ఆశ్రమాలను గురించి ప్రశ్నించారు కదా అనే కుతూహలం కలుగుతుంది.(1.2), మరి విషయసంకేతక శ్లోకాలలో కేవలం వర్ణధర్మాలనే ఎందుకు చెప్పారు? అని. దీనికి సమాధానం మనువు శైలి ఇతర శ్లోకాలతో తెలుస్తుంది. దాన్ని ఈ విధంగా గ్రహించాలి.

1. మనుస్మృతిలోని శైలితో పాటుగా ఆశ్రమ ధర్మాలు, వర్ణాల విషయాలు నడుస్తుంటాయి. వర్ణాల సుదీర్ఘ విషయాలలోనే అవి కూడా వస్తూ, ఆరో అధ్యాయంలో బ్రాహ్మణ ధర్మాలతో పాటుగా ముగుస్తాయి. ఆరో అధ్యాయంలో ఆశ్రమాలు ముగియగానే బ్రాహ్మణ వర్ణధర్మాలు, వ్యావహారిక కర్తవ్యాలు కూడా పూర్తవుతాయి. ఆరో అధ్యాయం వరకు నాలుగు ఆశ్రమాల ధర్మాలు, వ్యావహారిక కర్తవ్యాలు - అన్నీ ద్విజులకే ఒక పాలించవలసిన విషయంగా ఉన్నాయి. ఈ అధ్యాయాలలో చెప్పినవి బ్రాహ్మణుల ధర్మాలే-కర్మలే (1.88). ఆ తరువాత మిగిలిన వర్ణాలవారి కర్తవ్యాలు - 'క్షత్రియుల'వి ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాల 325వ శ్లోకం వరకు పూర్తవుతాయి. వైశ్యులవి 9.326 నుంచి 333 [ఇందులో 10.1 నుంచి 10.8 వరకు], శూద్రుల కర్తవ్యాలు 9.334-335 [ఇందులో 10.9-10వరకు] ముగుస్తాయి.

2 ఈ మధ్య రెండవ అధ్యాయంలో బ్రహ్మచర్యాశ్రమం, మూడవ అధ్యాయం నుంచి 5వ అధ్యాయం వరకు గృహస్థాశ్రమం, ఆరవ దానిలో వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం ఉన్నాయి. ఆశ్రమ ధర్మాలను వర్ణధర్మాల కిందివే అని భావించి ఆ యా విషయాలను సందర్భానుసార శ్లోకాలు, ముగింపు శ్లోకాలలో వాటిని పొందుపరిచాడు. [2.43 (2.68) 2.224 (2.249); 3.2,67, 286; 4.1, 259; 5.169; 6.1, 33, 87-90] మొ॥

3. ఈ అధ్యాయాలలో "విప్రులు" "బ్రాహ్మణులు" "ద్విజులు" అను పదాలను ఆ యా చోట్ల పర్యాయవాచకాలుగా ప్రయోగించాడు.

4. మనువు ఈ శైలిలో 1.2, 1.137 (2.18) లలో ఆశ్రమానికి పర్యాయవాచకాలుగా **'అంతర ప్రభవం'**, **'సాంతరాళం'** పదాలను వాడాడు. వీటి అర్థం - **"వర్ణానాం అంతరే ప్రభవః = ఉత్పత్తిః - స్థితిః యేషాం తే అంతర ప్రభవాః = ఆశ్రమాః."** ఈ శైలికి అనుగుణంగా ఆశ్రమాలను వర్ణధర్మాల కిందే చెప్పాడు. ఆరో అధ్యాయం వరకు కలిసి నడుస్తూ ముగిశాయి. ఇదే మనువు శైలి.

***

ఐదో అధ్యాయం

మనుస్మృతి - దయానంద మహర్షి ప్రక్షిప్త నిర్దేశాలు

ముందుగా, మనుస్మృతికి సంబంధించిన పరిశోధన స్వతంత్రమైనదనీ, అంతర్వ్యతిరేకం, విషయ వ్యతిరేకం మొదలైన ఏడు తటస్థ సాహిత్యపు కొలమానాలు ఆధారంగా పరిశీలించాననీ పాఠకులకు తెలియజేస్తున్నాను. ఆ కొలమానాలు ఆధారంగా ఏ యే శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజువయ్యాయో, వాటిని ప్రక్షిప్తాలని, మౌలికమైనవాటిని మౌలికాలనీ ప్రకటించాను. ఇది దయానందమహర్షికి సంబంధించిన తులనాత్మక, సమీక్షాత్మక కార్యం కాదు. కొందరు పాఠకులు ఈ రెండిటినీ కలిపేసి చెబుతున్నారు. వారిని ఆ విధంగా చేయవద్దని వేడుకుంటున్నాను. ఈ రెండు పనులనూ స్వతంత్రమూ, విడివిడివి అనీ గుర్తించగోరుతున్నాను. ఇందులో దయానందమహర్షి శ్లోకార్థాలనూ, నిర్దేశాలనూ వాటి విశిష్టత కారణంగా పేర్కొనటం జరిగింది. వాటివల్ల పాఠకులు లాభం పొందుతారనేది మా ఉద్దేశం.

దయానంద మహర్షివారు కొన్ని శ్లోకాలను ప్రక్షిప్తాలని తమ గ్రంథాలలో చెప్పారు. ప్రక్షిప్తాలు లేని మనుస్మృతిని చదవమనీ చెప్పారు. తన జీవితంలో సమయాభావం కారణంగా మహర్షికి మనుస్మృతిని ప్రక్షిప్తరహితంగా చేయటానికీ - చేయించటానికీ కుదరలేదు. మహర్షి శిష్యులు వారి ఆదేశాలను పాటించి నిర్వహించడం వారి కర్తవ్యం. దానికి తటస్థ కొలమానాలు ఆధారంగా పరిశోధించి, మౌలికాలు, ప్రక్షిప్తాలైన శ్లోకాలను గుర్తించాలి. వారివారి ఇష్టాలు అయిష్టాలను బట్టీ చేసే పని బుద్ధి జీవులను లబ్ధ ప్రతిష్ఠులను చేయదు – మహర్షి అనుయాయులూ మనుస్మృతి ప్రేమికులూ అయినవారు, నిజంగా మనుస్మృతి వైభవాన్ని చూడాలనుకుంటే, అసూయలను అహంకారాలను వదిలిపెట్టి, సాహిత్య ఆధారాలను గ్రహించి పరిశోధించి, నిజానిజాలు తేల్చాలి. కేవలం చర్చల వల్ల మహర్షి ఆదేశాలను పాటించినట్లు కాదు.

1. దయానంద మహర్షి పెంచిన మనుస్మృతి గౌరవం

రచనాకాలంలోనే మనుస్మృతికి ధర్మశాస్త్రాలలో కెల్లా సర్వోత్కృష్టమూ, ప్రామాణికమూ అయిన ఘనత లభించినా, ఆధునిక కాలంలో దానికి మునుపటి వైభవమూ లేదు, ప్రతిష్ఠా లేదు. ప్రక్షిప్తాలతో వికృతమూ, రూపుమాసినదీ కావటం చేత, దాని గౌరవం నశించిపోయింది. దయానందమహర్షి ఆ గౌరవాన్ని రక్షించుటయే కాక, పెంచారు కూడా. వారు మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను ఎత్తి చూపి, ప్రజల దృష్టికోణాన్ని మార్చారు. 'లభిస్తున్న రూపుమాసిన మనుస్మృతి అసలైనదనీ, అందులో ఉన్న ప్రతి విషయమూ గొప్పదనీ' వక్కాణించారు. ఇందులో ఎన్నో ప్రక్షిప్తాలు చేరాయనీ, అవి లేని మనుస్మృతి ప్రామాణికమూ, అనుకరణీయమూ అనీ చెప్పారు. దాని వేదానుకూలతను చాటి చెప్పారు. కాశీశాస్త్రార్థంలో దయానందమహర్షి ఇలా చెప్పారు –

> **మనుస్మృత్యాదీన్యపి వేదమూలాని సన్తి ।**
> **తస్మాత్తేషామపి ప్రామాణ్యమస్తి న తు వేదవిరుద్ధానాం వేదాప్రసిద్ధానాం చేతి ।**

అంటే – మనుస్మృతి మొదలైనవి కూడా వేదాలు మూలంగా కలవే. ఇందులో వాటి ప్రమాణాలు కూడా ఉన్నాయి. ఏవేవి వేద వ్యతిరేకాలో, వేదాలవల్ల సిద్ధించవో వాటికి ప్రమాణాలు ఉండవు (ద.శా.సం.పు.21).

దయానందమహర్షి తన గ్రంథాలలో మనుస్మృతిలోని 514 శ్లోకాలు లేదా శ్లోకాల భాగాలను ప్రమాణ రూపంలో పేర్కొన్నారు. చాలా శ్లోకాల భావాలనూ స్వీకరించారు. ఇన్ని ఎక్కువ ప్రమాణాలు పేర్కొని, ధర్మ ప్రమాణంలో మనుస్మృతికి ఎంతో గొప్ప స్థానం ఉందనీ, దానిని వదిలిపెట్టలేమనీ రుజువు చేశారు. వేదాల ద్వారా ఆయన ఏదైనా శాస్త్రం నుంచి ప్రమాణాలను చూపి ఉంటే, అది మనుస్మృతి నుంచే ! తన వైదిక విషయాలకు ఆసరాగా మనుస్మృతిలోని శ్లోకాలే స్వీకరించారు. తన గ్రంథాలలో గ్రంథ ప్రామాణ్య అప్రామాణ్యాల విషయంలో 'వేదానుకూలమైనవి ప్రామాణికాలు, వేద

వ్యతిరేకమైనవి అప్రామాణికాలు' అని చెప్పారు. వాటికి మూలాధారం కూడా మనుస్మృతే. కానీ శాస్త్రార్థంలో - **"ఏవేవి మనువు చెప్పాడో, అవన్నీ ఔషధాలకే ఔషధాలు"** అని నిజమే చెప్పారు.

దయానందమహర్షి అత్యధిక ప్రమాణాలను పేర్కొనడం వల్ల, ధర్మనిర్ణయాల విషయంలో మనుస్మృతిని గురించిన చర్చలు మళ్లీ పెరిగాయి. అన్ని వర్గాలవారూ దీని వైపు ఆకర్షితులయ్యారు. ఈ విధంగా దయానందమహర్షి, ఆధునిక యుగంలో మనుస్మృతి గౌరవాన్ని పునరుజ్జీవింపచేశారు.

2. మహర్షి గ్రహించిన అర్థాలు, భావాలు

మహర్షి వేదానుకూలమైన విషయాలను పరిశీలించి, వాటిని తమ గ్రంథాలలో పేర్కొన్నారు. వాటిని పరిపుష్టం చేయటానికి తమ గ్రంథాలలో మనుస్మృతిలోని దాదాపు 524 శ్లోకాలను, శ్లోక భాగాలను పలుమార్లు పేర్కొన్నారు. ఎన్నో శ్లోకాల భావాలను స్వీకరించారు. ఏ యే శ్లోకాల అర్థాలను తమ గ్రంథాలలో పేర్కొన్నారో, ఈ భాష్యంలో దాదాపు వాటన్నటికీ భాష్యం రాశారు. లేదా పేర్కొన్న స్థలాలను పేర్కొన్నారు. పలుమార్లు చెప్పిన వాటి అర్థాలు ఎక్కడి నుంచి తీసుకున్నారో చెప్పారు. అలా దాదాపు 422 శ్లోకార్థాలు ఉన్నాయి. వారి శ్లోకాల అర్థాలలో విశిష్టత, గాంభీర్యం ఉన్నాయి. ఈ సందర్భంలో ఒక ప్రమాణం సరిపోతుంది. మనువు శ్లోకం ఎంత ప్రసిద్ధమో, దాని అర్థం కూడా పరంపరాగతంగా అంతే అవ్యవహారిక రూపంలో ప్రాచుర్యంలో ఉంది -

యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఫలాః క్రియాః ॥ 3.56 ॥

దీనికి టీకాకారు లందరూ ఇలా అర్థాలు రాశారు - 'ఎక్కడ స్త్రీల పూజ జరుగుతుందో, అక్కడ దేవతలు సంతృప్తి చెందుతారు.' ఇలా కనిపించని దేవతల కల్పన చేయబడింది. ఈ కల్పన వల్ల దీని అర్థం నమ్మలేనిది, అవ్యవహారికం, అసంగతం, హాస్యాస్పదం అయింది; కానీ, మహర్షి 'దేవతాః' అనే దానికి నిరుక్తశాస్త్రం ఆధారంగా అర్థాన్ని గ్రహించి, స్పష్టంగా ఇలా రాశారు'- **ఏ ఇంట్లో స్త్రీల పూజ అంటే స్త్రీలు గౌరవించబడతారో, అక్కడ దేవతలు అంటే దివ్య గుణాలు, దివ్య లాభాలు, దివ్య సంతానం, దివ్య భోగాలు మొదలైనవి లభిస్తాయి.' ఏ ఇంట్లో స్త్రీలకు గౌరవం ఉండి, వారు ఆనందంగా ఉంటారో, వారి పట్ల గౌరవపూర్వకమైన వ్యవహారం ఉంటుందో, ఆ ఇంటి వాతావరణం ఎన్నో సుఖాలతో నిండి ఉంటుంది, వారి పిల్లలు ఉత్తములుగా ఎదుగుతారు** - ఇది ప్రత్యక్షంగా చూడవచ్చు. ఇది ఎంత సందర్భోచితమూ, వ్యావహారికమూ అయిన అర్థం ! (విస్తృత చర్చ భాష్యంలోని ఆ స్థలంలో చూడండి.).

3. స్పష్టమైన ప్రక్షిప్త సూచనలు

మేధాతిథి, కుల్లూక భట్టు మొదలైనవారి టీకలలో పాఠభేదాల రూపంలో లభించే శ్లోకాలను ప్రక్షిప్తాలుగా చూపారు. కానీ స్వార్థంతో చేసిన ప్రక్షిప్తాలపై అందరి కంటే ముందు దయానంద మహర్షివారి దృష్టి పడింది. ఆ ఉద్దేశంతో కొన్ని ప్రక్షిప్త శ్లోకాలను ఉదహరించారు. కొన్నిటిని తొలగించేందుకు ప్రోత్సహించారు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి -

క. **"ఇప్పుడు మనుధర్మ శాస్త్రం ఎలాంటి స్థితిలో ఉంది ? అనేది ఆలోచించాలి. గొల్లవారు పాలలో నీరు పోసి పాలను పెంచి కొనేవారిని మోసగించినట్లుగా ఈ మానవ ధర్మశాస్త్రం పరిస్థితి కూడా అలాగే అయింది. అందులో చాలా దుష్టమైన ప్రక్షిప్తాలు చేరాయి. అవి మనువు రచనలు కావు."**(పూ.ప్ర.పృ.91).

ఖ. **'వర్ణ భేదం' గుణాల మీదే కాని, జన్మమీద ఆధార పడదని స్వామి ఒక రోజు చెబుతూ, తమ కథనానికి ప్రమాణంగా మనుస్మృతిలోని కొన్ని శ్లోకాలు చదివారు. అప్పుడొకరు మనుస్మృతిలో కొన్ని ఇతర శ్లోకాలు దీనికి వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. స్వామీజీ అవి ప్రక్షిప్తాలని చెప్పారు."** (ద.జీ.దే.పృ.357).

గ. సత్యార్థ ప్రకాశంలో కింది శ్లోకాలను ప్రక్షిప్తాలుగా సమీక్షించారు –

1. **ప్రోక్షితం భక్షయేత్ మాంసం....** 5.27 ॥

అర్థం – "యజ్ఞంలో ప్రోక్షణతో శుద్ధిచేసిన మాంసం తినండి."

2. **న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే ।**
ప్రవృత్తిరేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలా । 5.56 ॥

'మాంస భక్షణం,తాగడం, వ్యభిచారం చేయటంలో దోషం లేదు. ఇదంతా ప్రాణుల సహజ ప్రవృత్తి. వీటి నుంచి తొలగటం ఇతరత్రా లాభప్రదం" (స.ప్ర.సము. 11).

3. **పురాణాని ఖిలాని చ.** (3.232) (స.ప్ర.సము. 11).

ఘ) "బ్రాహ్మణులలో విద్య తగ్గుతూ వచ్చింది, అభిమానం పెరిగింది... మన మంత్రాలు పారుతున్నాయి. అందరూ మన ఆజ్ఞలు పాటిస్తున్నారు అనేది గమనించి, వారు ఎన్నోరకాల వ్రతాలు, ఉపవాసాలు,ఉద్యాపనలు, శ్రాద్ధం, మూర్తి పూజ మొ॥ వేదవ్యతిరేక కర్మలలో జనాన్ని పెట్టడం ప్రారంభించారు. దాని ద్వారా వారి జీవితం సులువుగా గడిచిపోయేది." మామూలుగా, బ్రాహ్మణుల నుంచి విముఖులు కాకుండా, ఇలాంటి శ్లోకాలన్నీ జోడించబడ్డాయి–

అవిద్వాంశ్చైవ విద్వాంశ్చ బ్రాహ్మణం దైవతం మహత్ ।
ప్రణీతశ్చాప్రణీతశ్చ యథాగ్నిర్దైవతం మహత్ ॥ 9.317 ॥

అర్థం – "బ్రాహ్మణుడు విద్వాంసుడైన , మూర్ఖుడైన, పెద్ద దేవత అవుతాడు. అగ్ని హోమం కోసమైనా, కాకపోయినా పెద్ద దేవతే కదా!"

శ్మశానే చాపి తేజస్వీ పావకో నైవ దుష్యతి ।
హూయమానశ్చ యజ్ఞేషు భూయ ఏవాభివర్ధతే ॥ 9.318 ॥

అర్థం – "తేజోవంతమైన అగ్ని శ్మశానంలోనూ చల్లారిపోతుంది, యజ్ఞాలలో హవిస్సులు పొంది అదే అగ్ని మరింతగా ప్రజ్వలిస్తుంది."

అగ్నిని నిదర్శనంగా చేసుకుని, విద్వాంసుడైనా, మూర్ఖుడైనా బ్రాహ్మణుడు సాక్షాత్తు దేవత అని చెప్పారు. ప్రాచీన గ్రంథాలలో ఇలాంటి పనికి రాని శ్లోకాలు జోడించి, కొత్త రచనలు చేసి, బ్రాహ్మణులు తమ శక్తిని పెంచుకున్నారు. మనుస్మృతిలాంటివాటిలోనూ తమ గొప్పతనం తెలిపే వాక్యాలను కలిపేశారు. ఎలాగంటే –

ఏవం యద్యప్యనిష్టేషు వర్తన్తే సర్వకర్మసు ।
సర్వథా బ్రాహ్మణాః పూజ్యాః పరమం దైవతం హి తత్ ॥ 9.319 ॥

అర్థం – "ఈ ప్రకారంగా బ్రాహ్మణులు ఎటువంటి అనిష్ట కర్మలు చేసినా, వారు అన్ని విధాలా పూజ్యులే ! ఎందుకంటే వారు పెద్ద దేవతలు." (పూ.ప్ర.పృ. 134)

ఙ) పైన చెప్పిన శ్లోకాలను ఉదహరిస్తూ మహర్షి మరొక చోట ఇలా రాశారు – "మామూలుగా బ్రహ్మణుల పట్ల విముఖులు కాకుండా ఉండేందుకు, ఇటువంటి శ్లోకాలను జోడించారు....... ప్రాచీన గ్రంథాలలో ఇటువంటి దొంగశ్లోకాలు చేర్చి, నవీనరచనలు తయారు చేసి బ్రాహ్మణులు తమ శక్తిని పెంచుకున్నారు. మన్వాది స్మృతులలోనూ తమ ఘనతను తెలిపే వాక్యాలు కలిపేశారు." (పూనా ప్రవచనం పృ. 134)

చ) "మనుస్మృతిలోని ప్రక్షిప్త శ్లోకాలు, వాటితో నిండిన విడి స్మృతి గ్రంథం (చదవదగినవి కావు)." (ఋ.భూ.గ్రంథ ప్రా.)

ఈ ఉదాహరణలు, దయానందమహర్షి మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను – రూపుమారిన శ్లోకాలను గుర్తించి 19వ శతాబ్దిలో దాన్ని సవరించటానికి మొట్టమొదట నిర్దేశించారు అనటానికి ప్రమాణాలు.

4. దయానంద మహర్షి పేర్కొన్న శ్లోకాల ప్రక్షిప్తాంతర్గమనం

దయానందమహర్షి తమ గ్రంథాలలో ఇచ్చిన స్ఫూర్తి వల్లనే మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించటానికి తగిన ప్రయత్నాలు చేశాము. ఇంతకు ముందు కూడా ఆర్యసమాజంలోని కొందరు పండితులు మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించే ప్రయత్నం చేశారు. కానీ వారు కచ్చితమైన ఆధారాలు చూపలేకపోవటం వల్ల, అపోహలు, దోషాలూ అలాగే ఉండిపోయాయి. కొందరైతే మహర్షి పేర్కొన్న అన్నిటినీ ప్రక్షిప్తాలని ప్రకటించారు. మరి కొందరు ప్రక్షిప్తాలలోనికి చేర్చదగినవాటిని కూడా మౌలికాలుగా భావించారు. వాటికి మేము సప్రమాణంగా ప్రక్షిప్తాలని నిరూపించాము. ఈ పరిశోధనలో దయానందమహర్షి పేర్కొన్నవి ప్రక్షిప్తాల కిందికి ఎలా వచ్చాయో లేదా వాటిని ప్రక్షిప్తాలుగా ఎలా అనుకున్నారో, వాటిని మౌలికాలుగా భావించటం వల్ల కలిగే సమస్యలు, ఆ విషయాలు స్పష్టీకరణ ఈ కింద ఇచ్చాము-

1. మనుస్మృతిలోని ప్రక్షిప్తాలను తొలగించేందుకు చిక్కుగానూ, మహా కఠినంగానూ తయారైన ఈ పని ముగించేందుకు, మేము స్వీకరించిన తటస్థ 'ఆధారాలు' లేదా ప్రమాణాలు, అవి పూర్తిగా రచయిత రచనపై ఆధారపడిన సాహిత్యక విషయాలు, అందరూ అంగీకరించినవి. ఈ పని చేస్తూన్నప్పుడు ఎటువంటి ఈర్ష్యాసూయలూ మేము దరికి రానీయలేదు. కృతి శైలిని అనుసరించి ఆ గ్రంథపు వాస్తవిక స్వరూపం వెలుగులోకి రావాలని ఈ ప్రయత్నం చేశాము. ఈ పని అన్ని వర్గాలవారికీ సమానంగా, గౌరవించదగినదిగా ఉండాలని చేశాము. ఆ విధంగా జరగకపోతే, దీని వల్ల విశేష ప్రయోజనమూ, కలగదు, న్యాయోచితమూ కాదు. పైన పేర్కొన్న ఆధారాల కిందికి వచ్చే దయానంద మహర్షి చెప్పిన కొన్ని శ్లోకాలను మేము ప్రక్షిప్తాలుగా ఎందుకు నిర్ణయించా మంటే – ఆ శ్లోకాలను పైన చెప్పిన **'ఆధారాల'** నుంచి తొలగిస్తే, అవి మళ్లీ ఆ **'ఆధారాలే'** వ్యర్థమైనవిగా మారిపోతాయి. ఆధారాలు లేకుండా చేసిన ఏ పనైనా ప్రామాణికమనిపించుకోదు. అప్పుడు ఈ మొత్తం పరిశోధన వ్యర్థమూ, నిష్ప్రయోజనమూ అయిపోతుంది.
2. దయానంద మహర్షి చెప్పిన శ్లోకాలు ప్రక్షిప్తాల కిందికి రావటానికి కారణం, **'ప్రకరణ వ్యతిరేకాలు'** అనే ఆధారం వల్లే అయి ఉంటుంది. కొన్ని శ్లోకాలు ఎలాగున్నాయంటే, విషయం మొదలైన వాటి దృష్ట్యా తమ కన్నా ముందున్న వాటితో సంబంధం కలిగి ఉన్నాయి. కానీ అవి పూర్వం చెప్పిన ఆధారాల వల్ల ప్రక్షిప్తాలుగా నిరూపించబడ్డాయి. ముందువాటితో సంబంధం కలిగి ఉండడం చేత, మహర్షి తమ గ్రంథంలో పేర్కొన్న కొన్ని శ్లోకాలు (1.10, 35,36; 2.16; 3.184; 4.85; 5.65; 8.125; 371, 372, 419, 420) ప్రక్షిప్తాల కిందికి వస్తాయి. ఏ యే శ్లోకాలు ప్రక్షిప్తాల కిందికి వచ్చాయో, అవీ, అలా రావడానికి కారణం, ఆధారాల ప్రకారం ఈ భాష్యంలో యథా స్థానంలో కనిపిస్తాయి. పాఠకులు మేము చెప్పిన ప్రమాణాలు, ఆధారాలను అనుసరించి, వాటిని పరిశీలించవచ్చు.

'భూమిక' రచయిత

డా॥ సురేంద్రకుమార్

***

మనుస్మృతి

మనుధర్మశాస్త్రము ◆ మానవధర్మసంహిత

విశ్వమానవ సంవిధానము-The World Constitution

విశేషవివరణ ◆ ప్రక్షిప్తాల పరిశీలన ◆ ఋషిదయానందభాష్యోపేతం

ప్రథమాధ్యాయము

మొత్తం శ్లోకాల సంఖ్య: 144. మూలశ్లోకాలు: 78 ; ప్రక్షిప్తాలు : 66

సృష్ట్యుత్పత్తి-ధర్మోత్పత్తి విషయాలు-1 నుండి 144 (2.25) వరకు

ప్రారంభ భూమిక 1వ శ్లోకం నుండి 4వ శ్లోకం వరకు

☞ గమనిక:- * (స్టార్) గుర్తు కలిగిన శ్లోకాలు ప్రక్షిప్తాలు. అవి ప్రామాణికాలు కావు.

1 నుండి 6వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

మహర్షులు మనువును సమీపించుట-

మనుమేకాగ్రమాసీనమభిగమ్య మహర్షయః ।
ప్రతిపూజ్య యథాన్యాయమిదం వచనమబ్రువన్ ॥ మూలశ్లోక సంఖ్య. 1

టీక:-మహర్షయః = మహర్షులు, ఏకాగ్రం ఆసీనం = ఏకాంతమున ఆసీనులై ఉన్న, మనుం= మనుమహారాజును, యథాన్యాయం ప్రతిపూజ్య = యథావిధిగా (తగినట్లుగా) పూజించి అంటే ప్రణామంచేసి, ఇదం వచనం అబ్రువన్ = ఈ విధంగా అడిగారు (పలికారు.)

తాత్పర్యం:-ఒనానొక సమయంలో మహర్షులంతా ఏకాగ్రచిత్తంతో, నిశ్చలంగా ధ్యానని మగ్నుడై ఉన్న మనువును సమీపించి యథోచిత సత్కారం జరిపి ఇలా అన్నారు. ॥1॥

మహర్షులు వర్ణాశ్రమాల ధర్మాల గురించి మనువును ప్రశ్నించుట- ఇది మనుకృతం-ప్రామాణికం

భగవన్సర్వవర్ణానాం యథావదనుపూర్వశః ।
అన్తరప్రభవాణాం చ ధర్మాన్నో వక్తుమర్హసి॥ మూలశ్లోక సం. 2

టీక:- భగవన్ = ఓ పూజనీయుడా ! తమరు, సర్వవర్ణానాం = సమస్తవర్ణముల యొక్క, అంటే బ్రాహ్మణుల, క్షత్రియుల, వైశ్యుల, శూద్రుల యొక్క , చ = మరియు, అన్తరప్రభవాణాం [వర్ణానాం అంతరే ప్రభవః = ఉత్పత్తిః, స్థితిః యేషాం తే అన్తరప్రభవాః = ఆశ్రమాః] సమస్త వర్ణాలలో ఉండే ఆశ్రమాల (బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాల)

యొక్క, **ధర్మాన్** = కర్తవ్యాలను, **యథావత్** = ఉన్నదున్నట్లుగా చక్కగా, **అనుపూర్వశః** = క్రమాన్ని అనుసరించి అంటే వర్ణాలు-బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య, శూద్ర క్రమమునను సరించి, అలాగే బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే క్రమాన్ని అనుసరించి, **నః** = మాకు, **వక్తుమర్హసి** = చెప్పతగినవారు మీరే కాబట్టి తెలియపరచండి.

తాత్పర్యం:-"ఓ మహాత్మా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలవారికి సంబంధించినవీ; వారి అనులోమ విలోమ సంబంధాల వల్ల ఏర్పడిన వర్ణాలకు చెందినట్టివీ అయిన ఆశ్రమాలను, వాటి ధర్మాలను మాకు యథాక్రమంగా కూలంకషంగా తెలియపరచండి." ॥2॥

వివరణ:

మనుస్మృతి ఒక ధర్మశాస్త్రం. **"ధర్మశాస్త్రం తు వై స్మృతిః"** (1.129) [2.10] ధర్మశాస్త్రమే స్మృతి గ్రంథము. ఈ గ్రంథంలో ధర్మ స్వరూపంతో పాటు ఈ శ్లోకంలో ప్రయోగింపబడిన - ఈ గ్రంథానికి ఆధారభూతమైన **'అన్తరప్రభవాణామ్'** అను పదంపై విశేషించి అనేక ప్రమాణాలతో చర్చించి వివరించి ధర్మమే సమస్త మానవాళికి ఆధారభూతమని ప్రతిపాదింపబడింది.

1. ధర్మస్వరూపం:-

క. వ్యాకరణ శాస్త్రానుసారం **'ధృఞ్-ధారణే'** అను ధాతువునకు **'అర్తిస్తుసుహు సృధ......** (ఉణాది 1.140) అను సూత్రంతో **'మన్'** ప్రత్యయం చేరినప్పుడు. **'ధర్మ'** శబ్దం సిద్ధిస్తుంది. **"ధారణాత్ ధర్మ ఇత్యాహుః"** అనే వ్యుత్పత్తి ననుసరించి ఆత్మశాంతికోసం, ఉత్తమసుఖ ప్రాప్తికోసం ఆచరింపబడు కర్తవ్యమే ధర్మం. **"ధ్రియతే అనేన లోకః"** అనే మరొక వ్యుత్పత్తి ననుసరించి 'ఏది లోకాన్ని మర్యాదలో (హద్దులలో) ఉంచగలదో, అలాంటి విధానమే ధర్మం.' ఈ విధంగా ఆత్మోన్నతిని కలిగించునట్టి మోక్షం లేదా ఉత్తమ సుఖాన్ని కలిగించునట్టి సదాచరణ, కర్తవ్యం, శ్రేష్ఠమైన విధాన (చట్ట) నియమం ధర్మమని చెప్పబడుతుంది.

ఖ. ధర్మశబ్దం మనుధర్మశాస్త్రంలో వ్యాపకమైన అర్థంలో ప్రయోగింపబడింది.

మొదటిది -ముఖ్యార్థం **'ఆధ్యాత్మిక ఉద్దేశ్యసాధకం'**.

రెండోది గౌణార్థం- **'లౌకిక వ్యవహార సాధకం'**.

ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆత్మకు మొదటిదే ఉపకారకం. నిఃశ్రేయససిద్ధిని కలిగించునది. అంటే మోక్షప్రాప్తిని కలిగించునట్టి ఆచరణయే **"ధర్మం"**. ధర్మానికి ముఖ్యమైన అర్థం ఇదే.

ఈ ధర్మమే సార్వభౌమికం, సార్వకాలికం మరియు సార్వజనీనమైనది. ఇలాంటి ధర్మాన్ని ప్రతిపాదించుటయే ధర్మశాస్త్రం యొక్క ముఖ్యోద్దేశ్యం. ఈ కింది శ్లోకం ద్వారా మనుమహారాజు ఈ ధర్మాన్నే ప్రతిపాదించాడు.

ఆధ్యాత్మిక ఉద్దేశ్యసాధకం

"వేదాభ్యాసః, తపః, జ్ఞానమ్, ఇంద్రియాణాం చ సంయమః
ధర్మక్రియాఽఽత్మ చిన్తా చ నిఃశ్రేయసకరం పరమ్ ॥ మను.12.83

1. వేదాభ్యాసం, 2. తపస్సు-వ్రతసాధనం, 3. జ్ఞానం - సత్యవిద్యాప్రాప్తి, 4. ఇంద్రియ సంయమనం, 5. ధర్మక్రియ= ధర్మపాలనం, అంటే యజ్ఞాదిధార్మిక క్రియానుష్ఠానం, 6. ఆత్మచిన్తా = పరమాత్మజ్ఞానం, ఈ ఆరు మోక్ష ప్రాప్తికి సర్వోత్తమ కర్మలు.

ఇందుకు ప్రమాణాలు.....

(అ) ధర్మం శనైః సంచినుయాత్ వల్మీకమివపుత్తికాః ।
పరలోకసహాయార్థం సర్వభూతాన్యపీడయన్ ॥ మను. 4.238

(ఆ) ధర్మేణ హి సహాయేన తమస్తరతి సుదుస్తరమ్ । మను. 4.242

(ఇ) ధృతిః క్షమా దమోఽస్తేయం, శౌచమింద్రియనిగ్రహః ।
ధీర్విద్యాసత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్ ॥ మను. 6.92

మనుస్మృతిలో ధర్మ పాలనకు పరిణామ స్వరూప ఫలప్రాప్తికి ఈ అర్థాన్నే సూచిస్తున్నది. ఇందుకు ప్రమాణాలు.

(ఈ) ఏతదోఽభిహితం సర్వం నిఃశ్రేయసకరం పరమ్ ।
అస్మాదప్రచ్యుతో విప్రః ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ మను. 12.116

(ఉ) అనేన విప్రో వృత్తేన వర్తయన్ వేదశాస్త్రవిత్ ।
వ్యపేతకల్మషో నిత్యం బ్రహ్మలోకే మహీయతే ॥ మను. 4.260

ఈ అర్థమే ఈ క్రింది శ్లోకాలలో కూడా చెప్పబడింది.

మను. 1.128; 2.134[2.159]; 2.224 [2.249]; 4.138; 156, 175, 238, 239, 242, 243, 260; 8.16, 17, 83 మొ॥ శ్లోకాలు చూడండి.

లౌకిక వ్యవహార సాధకం

వ్యావహారిక క్షేత్రంలో మూడువిధాలైన-ఆత్మిక, మానసిక, శారీరకమైన ఉన్నతిని కలిగించేది, మానవత్వాన్ని, దైవత్వాన్ని వికసింపజేసి ఉత్తమ సుఖాన్ని శ్రేష్ఠ వ్యావహారిక కర్తవ్యాన్ని లౌకిక మర్యాద లేదా విధానాన్ని (Law) తెలిపేది ధర్మమంటారు. దేశకాల పరిస్థితులను బట్టి ఈ ధర్మాలలో (కర్మలలో) పరివర్తనం (మార్పు) కూడా సంభవిస్తుంది. ఇందుకు ప్రమాణాలు.

(అ) న బ్రూయాత్ సత్యమప్రియమ్ 4.138
(ఆ) యోషితాం ధర్మమాపది 9.56
(ఇ) ఏషః ధర్మః స్త్రీ పుంసయోః 9.101,103
(ఈ) ద్యూతధర్మం నిబోధత 9.220
(ఉ) దండం ధర్మం విదుర్బుధాః 7.18
(ఊ) రాజధర్మాన్ ప్రవక్ష్యామి 7.1
(ఏ) వివాహసంబంధంగా - బ్రాహ్మో ధర్మః 3.27; దైవం ధర్మం 3.28
ఆర్షః ధర్మః 3.29; ఆసురః ధర్మః 3.31మొదలైనవి.

దర్శనశాస్త్రాలలో ధర్మస్వరూపం

(ఐ) "యతోఽభ్యుదయనిఃశ్రేయససిద్ధిః స ధర్మః"- వైశేషికదర్శనం 1.1.2. దేన్ని ఆచరించుటవల్ల అభ్యుదయం అంటే ఆత్మిక-మానసిక-శారీరక ఉన్నతి కలుగునో, వ్యావహారికమైన ఉత్తమసుఖప్రాప్తికలుగునో మరియు నిఃశ్రేయసిద్ధి అంటే మోక్షసిద్ధి సంభవించునో అలాంటి ఆచరణం లేదా కర్తవ్యమే ధర్మం.

(ఙ) "చోదనాలక్షణోఽర్థో ధర్మః:- పూర్వమీమాంస 1.1.2.

మానవుడు ఆచరించవలసిన వేదవిహితకర్మలే "ధర్మము".

2. 'అన్తరప్రభవాణామ్' అను పదానికి అర్థం:-

"అన్తరప్రభవాణామ్" అనే సమాసానికి మనుసమ్మతమైన అర్థం ఈ క్రింది విధంగా ఉంది.

ఈ శబ్దానికి మనువు సూచించిన అర్థం- **"ఆశ్రమాలు"** అని.కాని మేధాతిథి, కుల్లూకభట్టు, ఇంకా వారి అనుచరులు సూచించిన అర్థం- సంకీర్ణజాతులు, వర్ణసంకరాలు. అయితే ఇక్కడ ఈ అర్థం పొసగదు. కారణమేమంటే- వర్ణాశ్రమ ధర్మాలను గురించే మహర్షులు మనుమహారాజును ప్రశ్నించారు.

క. ఇదే అధ్యాయం 1.137వ శ్లోకంలో **"అన్తరప్రభవాణాం"** కు బదులుగా **'సాన్తరాళానామ్'** అనే పదం ప్రయోగింపబడింది. వర్ణాలను గురించి ప్రతిపాదించిన మీదట ఆశ్రమాలను గురించి ప్రశ్నించు సందర్భంలో, **"సాన్తరాళానామ్"** అనే శబ్దం ప్రయోగింపబడింది. కాబట్టి ఇక్కడ **"ఆశ్రమాలు"** అనే అర్థం తీసికోవాలి. 2.18[1.137] ఇక్కడ కూడా టీకాకారులు **'సాంతరాళానాం'** అనే శబ్దానికి "సంకీర్ణజాతులు, లేదా వర్ణసంకరాలు" అనే అర్థం రాశారు. ఇది 'మను' సమ్మతం కాదు.

వేదోఽఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్ ।
ఆచారశ్చైవ సాధూనామాత్మనస్తుష్టిరేవ చ ॥ 1.125[2.6]

వేదః స్మృతి సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః ।
ఏత చ్చతుర్విధం ప్రాహుః సాక్షాత్ ధర్మస్య లక్షణమ్ ॥ మను. 1.131[2.12]

ఈ శ్లోకంలో **"వేదం, స్మృతి, సదాచారం, తన ఆత్మకు ప్రియమైనది"** అను ఈ నాలుగు ధర్మానికి మూలాధారాలని చెప్పబడినవి. ఇందులో ఒకటి సదాచారం.

తస్మిన్దేశే య ఆచారః పారంపర్య క్రమాగతః ।
వర్ణానాం సాన్తరాళానాం స సదాచార ఉచ్యతే ॥ మను. 1.137[2.18]

'సాన్తరాళానామ్' అను పదానికి అర్థం:- 'సాన్తరాళానామ్' అనే శబ్దానికి 'వర్ణసంకరం, సంకరజాతులు అనే అర్థం పొసగదు. కారణం- ఈ సంకరజాతుల ఆచారం సదాచారం కాదు. బ్రహ్మావర్తదేశవాసుల వర్ణధర్మాలు, అక్కడి ఆశ్రమాల ధర్మాలే సదాచారాలు. వర్ణసంకీర్ణుల ధర్మవర్ణన సందర్భంలో వారి ఆచారం నిందనీయమనీ సదాచారం కాదనీ పలుచోట్ల చెప్పటం జరిగింది. అదే సందర్భంలో సంకీర్ణజాతులకు ప్రయోగించిన విశేషణాలు ఇలా ఉన్నాయి. **మాతృదోష విగర్హితాన్** = తల్లిచేసిన తప్పువల్ల నిందనీయ జన్మగలవారు; **క్రూరాచారవిహారవాన్** = క్రూరమైన ఆచరణకలవారు (10.9), **అధమో నృణాం** = మానవులలో నీచులు (10.12), **అవ్రతాంస్తు యాన్** = వ్రతహీనులు (10.20), **పాపాత్మా భూర్జకంటకః**= పాపాత్ములు, భూర్జకంటకులు (10.21), **"తతోఽప్యధికదూషితాన్"** వారికంటే అధిక దుష్టాచార సంపన్నులు (10.29), **జనయన్తి విగర్హితాన్** = నిందిత సంతతిని కనువారు (10.29), ఇదేవిధంగా, సంకీర్ణజాతులకు, అపసదు (నీచు) లని, అపధ్వంసజు (పతితోత్పన్ను)లని నామకరణం చేయాలని తెలుపుటద్వారా - వారు నిందనీయులని

స్మృతికారుని ఉద్దేశం. వర్ణసంకరులకు పశుహింస మొ॥కర్మలు ధర్మమని తెలుపుటవల్ల వారి కర్మలు ధర్మములు కావని పలుచోట్ల స్మృతికారుడు నిందించి ఉన్నాడు. కాబట్టి వారి ఆచారాలు ధర్మమెట్లవుతుంది? అందువల్ల ఇక్కడ **"సాంతరాళ"** శబ్దానికి సంకరజాతులు అని అర్థం చెప్పుట పొసగదు. ఇది స్మృతికారుని ఉద్దేశ్యానికి భిన్నం. కాబట్టి **'అన్తరప్రభవాణాం'**, లేదా **"సాన్తరాళానామ్"** అనే శబ్దాలకు **'ఆశ్రమాలు'** అనే అర్థం చెప్పాలి.

ఖ. మనుస్మృతిలో వర్ణధర్మాలతో పాటు విస్తృతంగా విశేషంగా ఆశ్రమాల ధర్మాలను కూడా వర్ణించడం జరిగింది. కానీ వర్ణసంకరుల ధర్మాలు మాత్రం కాదు. ఈ శ్లోకంలో వర్ణాల యొక్క, ఆశ్రమాల యొక్క ధర్మాలను యథాక్రమంగా ప్రకటించడమే సూచించబడింది. అదేక్రమంలో వర్ణాశ్రమధర్మాలు ప్రతిపాదించబడినవి. ఆశ్రమాలు, వర్ణాలు వాటి వాటి ధర్మాలు బాగా చెప్పబడినవి. ద్వితీయాధ్యాయంలో బ్రహ్మచర్యాశ్రమ వర్ణన, తృతీయాధ్యాయం నుండి పంచమాధ్యాయం వరకు గృహస్థాశ్రమ ధర్మాలు, షష్ఠాధ్యాయంలో వానప్రస్థ సన్న్యాస ఆశ్రమంతో పాటు, బ్రాహ్మణవర్ణ కర్తవ్యాలు కూడ వర్ణింపబడినవి. 7వ అధ్యాయం 1 నుండి 9వ అధ్యాయంలో 325 శ్లోకం వరకు క్షత్రియ వర్ణ ధర్మాలు, 9వ అధ్యాయంలో 326 శ్లోకం నుండి 333 శ్లోకాల వరకు వైశ్యుల ధర్మవర్ణన [10.1-6], 9.334 నుండి 335 [10.7,8] వరకు శూద్రుల కర్తవ్యాలు వర్ణింపబడినవి.

"అన్తరప్రభవాణాం" అనే శబ్దానికి **'ఆశ్రమాలు'** అనే అర్థం తీసుకోక పోయినట్లయితే- **వర్ణసంకరం లేదా సంకీర్ణజాతులు'** అనే అర్థం గ్రహించవలసి వచ్చేది. అప్పుడు ప్రారంభంలో ఆశ్రమధర్మాలను ప్రశ్నించవలసిన సందర్భమేమి? కాబట్టి వర్ణ ధర్మాలతో పాటు ఆశ్రమధర్మాలను వర్ణించుట మనుస్మృతి శైలి. కాబట్టి ఈ శ్లోకంలో **"అన్తర ప్రభవాణాం"** అనే శబ్దానికి **"ఆశ్రమాలు"** అనే అర్థమే కాని-వర్ణసంకరము లని కాదు.

గ. మనుస్మృతిలో వర్ణాల వర్ణనతో పాటు ఆశ్రమాల వర్ణన కూడా అంతట కనబడుచున్నది. వర్ణసంకరుల వర్ణన కాదు. 12వ అధ్యాయం-97వ శ్లోకంలో కూడా-

"చాతుర్వర్ణ్యం త్రయో లోకాః చత్వారశ్చాశ్రమాః పృథక్" మను.12-97

వర్ణాల వర్ణనతో పాటు ఆశ్రమాల వర్ణనే కనపడుతుందికాని, వర్ణసంకరుల వర్ణన లేదు.

ఇదేవిధంగా- 7వ అధ్యాయం-35వ శ్లోకంలోనూ-

స్వేస్వే ధర్మే నివిష్టానాం సర్వేషామనుపూర్వశః ।
వర్ణానామాశ్రమాణాం చ రాజా సృష్టోఽభిరక్షితా ॥ మను.7.35

వర్ణధర్మాలను, ఆశ్రమధర్మాలను రక్షించడం రాజు కర్తవ్యమని చెప్పబడింది. ఇందులో వర్ణసంకరుల ప్రసక్తే లేదు. ఈ ప్రవృత్తి అన్ని స్థలాలలో కనబడుచున్నది. అందువల్ల వర్ణ ధర్మాల వర్ణనసందర్భంలో **'అంతరప్రభవ'** అనే శబ్దానికి **'ఆశ్రమాలు'** అనే అర్థమే సిద్ధిస్తున్నది.

ఘ. మనుస్మృతిలో 10వ అధ్యాయంలో తప్ప మరెక్కడ కూడా వర్ణధర్మాలతో పాటుగానీ లేదా స్వతంత్రంగా గానీ వర్ణసంకరాల వర్ణన కనపడదు. నామకరణ సంస్కారం [2.1-10,2.26-35;] వివాహవిధి-[3.20] మొదలైన సందర్భాలలో శూద్రుల ధర్మాలను వర్ణించేప్పుడు కూడా వర్ణసంకరముల ప్రసంగమే లేదు., 10వ అధ్యాయంలో వర్ణింపబడిన వర్ణసంకరుల విషయం కూడా కల్పితమేగాని మనుసమ్మతంకాదు. వివరంగా తెలిసికొనగోరువారు పదో

అధ్యాయంలో గల శ్లోకాల గురించి రాసిన సమీక్ష చూడగలరు. కారణమేమంటే ! అక్కడ ప్రసంగానికి (సందర్భం) విరుద్ధంగా వర్ణించబడటమే." వర్ణ ధర్మాలను బోధించే సందర్భంలో, "వర్ణధర్మాన్నిబోధత" (1-144) [2.25] అని, వర్ణధర్మాలవర్ణన సమాప్తి సందర్భంలో కూడా "ఏష ధర్మవిధిః కృత్స్నశ్చాతుర్వర్ణ్యస్య కీర్తితః" [10.142 (10.131)]అని ఈ రెండు సందర్భాలలో కూడా వర్ణధర్మాలే పేర్కొనబడినవిగాని, వర్ణసంకరం కాదు. ఈ మధ్యలో వర్ణ సంకరుల ప్రస్తావన ఎలా వచ్చింది? దీని నెవరో కావాలని పట్టుబట్టి మధ్యలో కలిపినట్లుగా కనిపిస్తున్నది.

ఇదే విధంగా, 10వ అధ్యాయం-9వ [10.4] శ్లోకంలో మనుమహారాజు **"ఆర్యుల సమాజంలో కేవలం నాలుగు వర్ణాలే ఉన్నాయని ఐదో వర్ణం లేదని స్పష్టంగా చెప్పాడు."** మిగిలినవారందరు ఆర్యభాషను మాట్లాడినా లేదా [10.56 (10.45)] మ్లేచ్ఛభాషను మాట్లాడినా శుభకర్మలలో విఘ్నాలు సృష్టించినా దస్యులే. దీన్ని బట్టి వర్ణసంకరుల వర్ణన [10.5-73] మనుస్మృతికి సమ్మతం కాదని ఖచ్చితంగా తెలుస్తుంది. మనువు సంక్షిప్తంగా 10వ అధ్యాయం- 51వ శ్లోకం నుండి 54వ శ్లోకం వరకు వర్ణ ధర్మాలను వర్ణిస్తూ, ఒక్కొక్క వర్ణాన్ని తీసికొని వారి వారి కర్తవ్యాలను తెలిపినాడు. దీన్నిబట్టి మనువు నాలుగు వర్ణాలనే వర్ణించి ఐదో వర్ణం లేదన్నాడు. కాబట్టి ఈ వర్ణసంకర ప్రసంగం ప్రక్షిప్తమే. కొందరు **"అంతర ప్రభవ", "సాన్తరాళ"** శబ్దాలకున్న అర్థాన్ని మార్చి వర్ణసంకరమనే అర్థం వ్యాప్తం చేశారు. ఇంతే కాక తమ ఆశయాలకనుగుణంగా పాఠభేదాలను కల్పించుటకు కూడా వెనుకాడలేదు. 2,3 సంస్కరణలలో **'అంతర ప్రభవాణాం'** అనే దానికి బదులు **'సంకర ప్రభవాణామ్'** అనే పాఠభేదాన్ని కూడా కల్పించారు. కానీ ఈ పాఠభేదం ప్రచలితం కాలేదు. ఇంకా ఈ పాఠభేదము ననుసరించి పాఠం చెబుతూ ఇంకా చాలా భ్రాంతిని కలిగించారు.

జ. మనువు సంక్షిప్త భూమికగా 1వ అధ్యాయం 87 శ్లోకం నుండి 91వ శ్లోకం వరకు ఒక్కొక్క వర్ణం యొక్క పేరును, వాటి వర్ణనను చేసాడు. దీనివల్ల వర్ణాలు నాలుగేనని ఇంతకంటే ఎక్కువగా లేవని స్పష్టమౌతున్నది. ఈ నాలుగు వర్ణాల ధర్మాలను తెలుపడమే మనువు యొక్క అభీష్టం. వర్ణసంకరవిషయం కాదు. కాబట్టి అక్కడ **'అన్తరప్రభవం'** యొక్క అర్థం **'వర్ణసంకరం'** కాదని, ఇది మనువు యొక్క మూలసిద్ధాంతానికి విరుద్ధమని దీనికి **'ఆశ్రమాలు'** అనే అర్థమే ప్రకరణానుకూలమని స్పష్టమవుతున్నది.

చ. పురాణాలలో కూడా 'వర్ణాశ్రమాల యొక్క వాటి ధర్మాల యొక్క ప్రవక్త స్వాయంభువ మనువే అని తెలుపబడింది. అంతే కాని **'వర్ణసంకరము'** వాటి ధర్మాల గురించి కాదని స్పష్టం చేయబడింది. దీనికి ప్రమాణం-

యః పృష్టో మునిభిః ప్రాహ ధర్మాన్ నానావిధాన్ శుభాన్ ।
నృణాం వర్ణాశ్రమాణాం చ సర్వభూతహితః సదా॥
ఏతద్ధి ఆదిరాజస్య మనోశ్చరిత మద్భుతమ్ ॥ భాగవత పురాణం 3.25.38,39

ఇదే విధంగా ఇతర పురాణాలలో అనగా బ్రహ్మాండపురాణం 2.13.105; మత్స్యపురాణం 3.44.5; 4.14.90; వాయుపురాణం 3.2.35, 3.23.47 మొ॥వి.

3. జాతివాదకాలీన ప్రక్షేపము:-

జాతి(కుల) వాదం ప్రారంభమైన తర్వాత **"అన్తరప్రభవాణాం" "సాన్తరాళ"** శబ్దాల అర్థాలు పరివర్తనం చెంది, వాటి స్థలంలో **'వర్ణసంకర'** అర్థం ప్రచలితమైంది. అప్పుడు **'అన్తరప్రభవ'** కాస్త **'సంకరప్రభవ'** అయ్యింది. కొందరుస్వార్థపరులు దీనిని బాగా ప్రచారం చేసి మనువు యొక్క మూలాభిప్రాయానికి విఘాతం కలిగించారు. ఇలా పాఠభేదాలు ప్రక్షిప్తాలు మనుస్మృతిలో కలిసినవి. ఎందరో పండితులు **'అన్తరప్రభవ'**ను **'సంకరప్రభవం'**గా ప్రచారం చేసినా అది నిలువలేదు. **'అన్తరప్రభవ'** శబ్దమే అన్ని మూలగ్రంథాలలో నిలిచిపోయినది.

త్వమేకో హ్యస్య సర్వస్య విధానస్య స్వయంభువః ।
అచిన్త్యస్యాప్రమేయస్య కార్యతత్త్వార్థవిత్ప్రభో॥

ఇది మనుకృతం-ప్రామాణికం
మూలశ్లోక సం. **3**

టీక:- **హి** = ఎందుకంటే, **ప్రభో!** = వేదజ్ఞుడవై, ధర్మోపదేశంలో సమర్థవంతుడవైన ఓ ప్రభో ! **అస్య సర్వస్య** = ఈ సమస్త జగత్తుకు, [1-5-1.144(2.25) వరకు వర్ణంచబడిన] **అచిన్త్యస్య** = ఆలోచనల ద్వారా ఎవరిహద్దులు తెలియవో అనగా ఆలోచనలకు అందవో లేదా ఎవరియందు అసత్యమేమీలేదో, **అప్రమేయస్య** = ఎవరియందు అపరిమిత సత్యవిద్యలవర్ణన కలదో, ఎవరియందు సమస్త విద్యలు కలవో అలాంటి, **స్వయంభువః విధానస్య** = స్వయంభూ [1.6] పరమాత్మ ద్వారా విరచితమైన [1.23]వేదముల యొక్క, **కార్యతత్త్వార్థవిత్** = కర్తవ్యరూప ధర్మాలు గాని లేదా ప్రతిపాద్య విషయాల యొక్క, **తత్త్వార్థవిత్** = యథార్థరూపాలను, లేదా వాటి రహస్యాలను తెలిసినవారు, **ఏకః త్వం** = తమరొక్కరే. అంటే, ప్రస్తుతం సమస్త ధర్మాలను విశేషంగా తెలిసిన విద్వాంసులు తమరే మాకు కనిపిస్తున్నారు. అందువల్ల తమరే మాకు ధర్మాలను చెప్పండి.

[ఈ శ్లోకం 1.2వ శ్లోకానికి పూరక వాక్యము. ఈ రెండవ శ్లోకంలో వర్ణాశ్రమ ధర్మాల గురించి ప్రశ్నించబడింది. దానినే ఇక్కడ గుర్తించి మనువును ప్రశంసింస్తున్నాడు. ఇదియే మనుస్మృతికి ప్రతిపాద్య విషయమైన ధర్మ కథనము.]

ఋషిదయానందభాష్యం:- వేదజ్ఞుడవైన ఓ మహర్షీ! ఈ సమస్త జగత్తుకు ఆధారమై, ఆలోచనలకు అందనివాడు, అపరిమిత సత్యవిద్యలు కలవాడు అగు స్వయంభూ పరమాత్మ ద్వారా రచింపబడిన వేదాల కర్తవ్యరూప ధర్మాలను, వాటి ప్రతిపాద్య విషయాల యథార్థ స్వరూపాలను, రహస్యాలను తెలిసినవారు తమరొక్కరే. కాబట్టి నీవే మాకు అట్టి ధర్మాల గురించి వివరించుము.॥3॥ (ఋ.భా.భూ.వేదవిషయం)

వివరణ:

వేదాలు సమస్త సత్య విద్యలను బోధించు గ్రంథాలు. ఈ ప్రకారంగా వేదమొక్కటే జగత్తుకు సంవిధానం (Constitution). సంవిధానరూపాలైన వేదాలలో చేయదగిన కర్మలేమిటి? కర్తవ్యరూపమైన ధర్మమేమిటి? వాటిని తెలుపుమని మహర్షులందరూ మనుమహర్షిని ప్రశంసిస్తూ వర్ణ ధర్మాలను, ఆశ్రమధర్మాలను బోధించుమని ప్రార్థిస్తున్నారు. మానవధర్మాన్ని గురించి తెలియజేయడమే మనుధర్మశాస్త్రం యొక్క ముఖ్యోద్దేశ్యం. వేదం స్వయంభువం. అంటే స్వతఃసిద్ధంగా సహజంగా ఉండేది. సనాతనమైనది. నిత్యనూతనమైనది. అందులో ఏమాత్రం అసత్యముండదు. కేవలం సత్యవిద్యలే వర్ణింపబడినవి. ఆ సత్యవిద్యలన్నీ తెలిసినవాడు **'మనుమహర్షి'** అని ఋషుల అభిప్రాయం. అందుకే అతని సమీపం చేరి ప్రశంసించి ప్రశ్నించారు.

కుల్లూకభట్టు మొ॥ వ్యాఖ్యానకారులందరూ ఈ శ్లోకానికి తప్పుడు అర్థాన్నే చెప్పారు. వాటిలో ఈ కింది దోషాలున్నాయి.

(1) **'అస్య సర్వస్య'** ఈ సర్వనామాలను వేదాలకు అన్వయించారు.

(2) **'కార్య'**శబ్దానికి అగ్నిష్టోమాది యజ్ఞకార్యాలని అర్థం చెప్పారు.

(3) **తత్త్వార్థవిత్** = బ్రహ్మను ఎరిగినవాడని అర్థం చెప్పారు. ఇది చాలా అసంగతం. సీమితం. పరిమితం. సంకుచితం. ఇది మనుధర్మశాస్త్రానికి సమ్మతమైన అర్థం కాదు. దీన్ని నిరూపించి సమర్థించడానికి విస్తృత సమాలోచన చేయవలసి ఉంది.

1. **'అస్య సర్వస్య' అను దానికి అర్థం:-"అస్య సర్వస్య"** అనే పదాలకు **"ఈ సమస్తజగత్తు యొక్క"** అని అర్థం చెప్పడం సమంజసం-సరైనది కూడా.

క. **"అస్య"** లేదా **"ఇదం"** శబ్దాన్ని స్వతంత్రంగా ప్రయోగించినప్పుడు ముఖ్యంగా మూడు అభిప్రాయాలు చెప్పవచ్చు. (1) ఉపస్థితమైన దానిని లేదా సమీపంలో ఉన్నదానిని, (2) సమీపమందున్న జగత్తు, (3) పూర్వాపర విషయానికి సంబంధించిన వస్తువు. ఈ మూడు అర్థాలను బట్టి చూసినట్లయితే **'అస్య సర్వస్య'** అనే పదానికి వేదాలకు సంబంధం లేదు. జగత్తుతో సంబంధమని చెప్పడమే సముచితం. ఎందుకంటే చెప్పబోయే విషయం జగత్తుకు సంబంధించినది కాబట్టి. వేదంతో ఈ పదాలకు సంబంధం కలిగించడం కుదరదు. కాబట్టి ఇక్కడ జగత్తే చెప్పబడింది. **'అస్య, ఇదం'** మొ॥ పదాల ప్రయోగం స్వతంత్రంగా **'జగత్తు'**కోసం ప్రయోగించడమే సంస్కృతభాషకు గల ప్రవృత్తి. ఈ 1వ అధ్యాయంలో 5వ శ్లోకంలో **'ఆసీదిదం'** (ఆసీత్ ఇదం) ప్రయోగం కూడా జగత్తు కోసమే ప్రయోగింపబడింది.

ఖ. ఇదేగాక, మరి రెండు స్థలాలలో **'సృష్టి-ఉత్పత్తి'** సందర్భంలో కూడా **'జగత్'** అనే అర్థంలోనే **'ఇదం'** శబ్ద ప్రయోగం కనిపిస్తుంది. ఉదాహరణకు -సృష్టి ఉత్పత్తి పూర్తికాగా, **"సర్వస్య అస్య తు సర్గస్య"** (1.87) అని ఈ సంపూర్ణ జగత్తు యొక్క ఉత్పత్తి చెప్పబడింది. [2.25, 1.144]

గ. శైలిని బట్టి పూర్వాపరాల సందర్భాన్ని బట్టి ఈ పదాలకు **'జగత్'** అనే అర్థమే సరైనది. ఈ అధ్యాయంలో 5వ శ్లోకంలో ఈ పదాలనే ఆధారంగా తీసికొని మనుమహర్షి **'సృష్టి-ఉత్పత్తి'** విషయాన్ని ప్రారంభించాడు. ఈ జగత్తుకు సంవిధానమైన వేదాన్ని అతడెరుగును. అందువల్లనే మనుమహర్షి ధర్మస్వరూప నిర్ణయానికి ముందే జగత్స్వరూపవర్ణన చేయడానికి ప్రారంభించాడు. దానివల్ల ధర్మోత్పత్తిని, ధర్మావశ్యకతను, తన్మహత్వాన్ని, తత్స్వరూపాన్ని తెలిసికొని ప్రజలు ధర్మతత్పరులవుతారని భావించాడు. ఇక్కడ సాంగోపాంగ శైలి కనిపిస్తుంది. **"సంభవశ్చ అస్య సర్వస్య"** 2.25, 1.144 ద్వారా సృష్ట్యుత్పత్తిని సూచించాడు. ఈ పదాల ద్వారానే ఈ సృష్టి విషయాన్ని ముగించాడు.

ఘ. ఈ శ్లోకంలో విధానశబ్దం వేదాలనుద్దేశించే ప్రయోగింపబడింది. అది కూడా సాభిప్రాయంగా ఉంది కాబట్టి సార్థకమైంది. అలాగే ఇది నిమిత్త- నిమిత్తీభావద్యోతకార్థ ప్రయుక్తం కూడా. వేదం విధానం. విధానం ఏదైనా ఒకానొక నిమిత్తాన్ని అనుసరించే ప్రయోగించబడుతుంది. కాబట్టి **'అస్య సర్వస్య'** పదాల ద్వారా [1.5] సంకేతితమైన జగత్తే ఆ పదాలకు నిమిత్తి అని **"వేదం జగత్తుకు ఒక విధానం"** అని మనువు అనేకచోట్ల స్పష్టంగా చెప్పాడు. **'పితృదేవమనుష్యాణాం వేదః చక్షుః సనాతనమ్'** 12-94 పితృ-దేవ-మనుష్యులకు వేదం ఒక సనాతనమైన చక్షువు- నేత్రమని చెప్పడం వల్ల, నేత్రమెలా ప్రజలకు మార్గదర్శకమో వేదాలు కూడా మానవులందరికీ మార్గదర్శకాలనే అర్థంలో ప్రయోగించాడు. ఈ విధంగా **'విధానస్య'** అనే పదంతో **'అస్య సర్గస్య'** అనే పదాల ద్వారా కూడ **'జగత్'** అనే అర్థమే సిద్ధింపబడింది. అందుకే ఈ సర్వనామ శబ్దాలు ప్రయోగింపబడినవి.

(2,3) "కార్యతత్త్వార్థవిత్" అనే దానికి సరియైన అర్థం.

క. **'కార్య'** శబ్దానికి **'అగ్నిష్టోమాది'** యజ్ఞకార్యమని, **'తత్త్వ'** శబ్దానికి **'బ్రహ్మ'** అని వ్యాఖ్యానకారులు అర్థం చెప్పారు. ఈ అర్థం మనుసమ్మతం కాదు. ఇది అప్రాసంగికం-అసందర్భం. కార్యమంటే ప్రతిపాద్య విషయమని లేదా సమస్త వ్యావహారిక తత్త్వాలైన ధర్మాలని అభిప్రాయం. ఈ 1వ అధ్యాయం 2వ శ్లోకంలో వేసిన ప్రశ్నకు విషయం ధర్మం కాబట్టి దానికి జవాబుగా ప్రతిపాద్య విషయం కూడా ధర్మమే. కేవలం యజ్ఞాన్ని, బ్రహ్మను వర్ణించడమే మనుస్మృతి యొక్క ధ్యేయం కాదు. అంతేగాక వీటిని గురించి ప్రత్యేకంగా ఏమాత్రం ప్రశ్నించలేదు. యజ్ఞాదులు ధర్మానికి అంగాలు, అవి ధర్మంలోనే అంతర్భూతాలవుతాయి. వేదాలు కేవలం యజ్ఞాల గురించి, బ్రహ్మ గురించే ప్రతిపాదిస్తున్నట్లయితే

వేదాల ఉపయోగం సంకుచితం, సీమితమవుతుంది. సమస్త ప్రపంచశ్రేష్ఠవ్యవహారా (ధర్మా) లకు జ్ఞానవిజ్ఞానాదులకు వేదాలు సాధకాలని మహర్షి దృఢాభిప్రాయం. ఇందుకు ఈ కింది శ్లోకాలే సాక్ష్యాలు.

"శ్రుతి ప్రామాణ్యతో విద్వాన్ స్వధర్మే నివిశేత వై" -మను. 2.8

వేదాల యొక్క ప్రతిపాద్య విషయాలు వర్ణాశ్రమధర్మాలు మొదలగునవి. వేదాలు విద్యలగురించి కాకపోతే మనువు యొక్క-ఈ విధానమే వ్యర్థమౌతుంది. కాబట్టి మనువు స్వయంగా ప్రతిపాదించిన విషయాన్ని మనం తప్పక అంగీకరించాల్సిందే. దీనిని బలపరచడానికి ఈ క్రింద అనేక శ్లోకాలు ఇవ్వబడుతున్నాయి చూడండి.

"సర్వేషాం తు స నామాని కర్మాణి చ పృథక్ పృథక్
వేదశబ్దేభ్య ఏవాదౌ పృథక్ సంస్థాశ్చ నిర్మమే 1.21

(అ) వేదాల ద్వారానే సమస్త పదార్థాలకు నామకరణం చేయబడింది. వాటి కర్మల విధానం, వాటి పరిస్థితుల విధానం వేదాల ద్వారానే జరిగింది. వేదప్రయోజనం బహుముఖమైనదే గాక ఉపయోగకరమైనది కూడా.

చాతుర్వర్ణ్యం త్రయో లోకాశ్చత్వారశ్చాశ్రమాః పృథక్ ।
భూతం భవ్యం భవిష్యం చ సర్వం వేదాత్ ప్రసిద్ధ్యతి ॥ మను. 12.97

(ఆ) 12వ అధ్యాయం- 97వ శ్లోకంలో -"నాలుగు వర్ణాల, ఆశ్రమాల, కాలత్రయజ్ఞానం వేదం ద్వారానే లభిస్తుంది."

శబ్దః స్పర్శశ్చ రూపం చ రసో గన్ధశ్చ పఞ్చమః ।
వేదాదేవ ప్రసూయన్తే ప్రసూతిగుణకర్మతః ॥ మను. 12.98

(ఇ) 12వ అధ్యాయం-98వ శ్లోకంలో శబ్దస్పర్శమొ ॥ సూక్ష్మశక్తులకు సంబంధించిన వైజ్ఞానిక సిద్ధికూడా వేదాలద్వారానే లభిస్తుంది.

బిభర్తి సర్వభూతాని వేదశాస్త్రం సనాతనమ్ ।
తస్మా 'దేతత్' పరం మన్యే యజ్జన్తోరస్యసాధనమ్ ॥ 12.99

ఈ. 12.99 శ్లోకంలో సమస్త వ్యవహారాల సర్వోపరి సాధకశాస్త్రం వేదమే అని చెప్పబడింది.

ఉ. 7.43, 12.100లో రాజనీతిని బోధించేది, ధర్మాధర్మజ్ఞాన ప్రదాయి, 12.109-113 వరకు ప్రపంచంలో శ్రేష్ఠ వ్యవహారాలను సాధించేది [1.23] వేదమే.
వేదమే శాస్త్రమని చెప్పబడింది. దానికి ప్రమాణాలు-

త్రైవిద్యేభ్యస్త్రయీం విద్యాం దణ్డనీతిం చ శాశ్వతీమ్ ।
అన్వీక్షికీం చాత్మవిద్యాం వార్తారంభాశ్చ లోకతః ॥ మను. 7.43.
సైనాపత్యం చ రాజ్యం చ దణ్డనేతృత్వమేవ చ ।
సర్వలోకాధిపత్యం చ వేదశాస్త్రవిదర్హతి ॥ మను. 12.100

ఊ. **పితృదేవమనుష్యమణాం వేదశ్చక్షుః సనాతనమ్ ।**
అశక్యం చాప్రమేయంచ వేదశాస్త్రమితి స్థితిః ॥ 12.94

ఏ. 12.94, పితృ-దేవ-మనుషులకు వేదమే చక్షువు-కన్ను.
'అచిన్త్యస్యాప్రమేయస్య' అను ఈ శ్లోకభావం మరియు '**అశక్యం చా ప్రమేయం చ వేదశాస్త్రమితి స్థితిః**' అను శ్లోక భావం వేదం అనంత సత్యవిద్యల నిధి అని, అది అందరికి జ్ఞానాన్ని ఇవ్వడానికేనని తెలుపబడింది.

అందువల్ల కేవలం యజ్ఞాన్ని, బ్రహ్మను ప్రతిపాదించడమే వేదాల కార్యమని తెలిపే కుల్లూకభట్టు వ్యాఖ్య మనుసిద్ధాంతానికి సర్వథా విరుద్ధం.

ఖ. మనుస్మృతి కేవలం ఉపనిషత్తులలాగా ఆధ్యాత్మిక గ్రంథం కాదు. సమాజాన్ని విధించు ధర్మశాస్త్రం. అందువల్ల యజ్ఞాదులు దాని అంగికాదు. అంగములే 1.125-134 [2.6-15] వరకున్న శ్లోకాలలో వేదాల ద్వారానే ధర్మం వికసిస్తుందని చెప్పబడింది. **"వేదోఽఖిలో ధర్మమూలమ్"** [1.125] యజ్ఞం, బ్రహ్మప్రాప్తి ధర్మంలో అంతర్భాగమే. కారణం ఇవి కూడా మానవుడి ధర్మాలే. ఈ విధంగా చూస్తే కుల్లూకభట్టుగారి వ్యాఖ్య ప్రతిపాద్య విషయానికి అనుకూలంగా లేదు.

గ. ఈ అర్థం అప్రాసంగికం-అసందర్భం కూడ. 1.2వ శ్లోకంలో 'వర్ణాల ఆశ్రమాల ధర్మం తెలుపమని ప్రశ్నించారు.' తమరు వర్ణాశ్రమధర్మాలను తెలియజేయడానికి సమర్థులు. [1.2] అదేవిధంగా జగత్తుకు విధానరూపమైన వేదమందున్న కర్తవ్యధర్మాలను తెలిసినవారు తమరొక్కరే. [1.3] ఏదైనా తెలిసినవారే చెప్పగలరు అని అడిగినారు.

ఈ విధంగా ఋషులందరు అడగడంతో స్పష్టమైనదేమనగా ! మనువు మాత్రమే వేదాలనూ, అందులో చెప్పబడిన ధర్మాలనూ విశేషంగా తెలిసినవాడు. అతడే అట్టి ధర్మాలను స్పష్టంగా చెప్పగలడు. కాబట్టి మనుస్మృతిలో వేదోక్తధర్మాలే చెప్పబడినవి. ఋషులడిగిన ప్రశ్నకు మనువే జవాబు చెప్పగలడు. అందుకే అతనిని చేరి ప్రశ్నించారు. ఈ స్మృతిలో ధర్మాల గురించియే ప్రశ్నించబడింది. కాని టీకాకారులు యజ్ఞాల గురించి బ్రహ్మ గురించి మాత్రమే ఇందులో చెప్పబడిందని రాశారు. మనుస్మృతిలో ప్రతిపాదించిన విషయం మాత్రం ముఖ్యంగా ధర్మాల గురించే. వాస్తవంగా మనువు వేదార్థాలను, వేదప్రతిపాదిత ధర్మాలను తెలిసినవాడు. ఈ విషయం మనుస్మృతిలోని 12వ అధ్యాయం 108-114 శ్లోకాల ద్వారా స్పష్టమౌతున్నది. వేదవేత్తయే ధర్మోపదేశం చేయగలడు, ఇతరులు కాదు. ఈ కారణంగానే మహర్షులందరు మనువును చేరి ఆ ధర్మాలను తెలుసుకున్నారు. ఆ విషయాలే ఇందులో పొందుపరచబడినవి. ఆ మనుప్రోక్త ధర్మాలను ఈ భాష్యంలో తర్కబద్ధంగా చర్చించి యుక్తియుక్తంగా మనుసమ్మతంగా రాయడం జరిగింది. దీనికి పూర్వం రాసిన టీకాకారుల అర్థాలు ఏకాంగంగా మనువిరుద్ధంగా ఉన్నాయి. అందువల్ల మనుస్మృతిలో ధర్మ ప్రతిపాదనమే ముఖ్యం. మనువు విశేష ధర్మజ్ఞుడు, వేదవేత్త. అలాంటివారే ధర్మాన్ని ప్రబోధించగలరు. కావున టీకాకారులు యజ్ఞప్రతిపాదన బ్రహ్మప్రాప్తికి సాధనమని వ్యాఖ్యానం చేయడం చాలా అసందర్భం.

మహర్షులకు మనువు ప్రత్యుత్తరం

ఇది మనుకృతం-ప్రామాణికం

స తైః పృష్టస్తథా సమ్యగమితౌజా మహాత్మభిః ।
ప్రత్యువాచార్చ్య తాన్సర్వాన్మహర్షీఞ్ఛ్రూయతామితి ॥ మూలశ్లోక సం. 4

టీక:- **తైః మహాత్మభిః** = ఆ మహర్షుల ద్వారా, **సమ్యక్** = చక్కగా, శ్రద్ధతో, **తథా** = ఉపర్యుక్త ప్రకారంగా, **పృష్టః** = అడిగినవాడై, **అమితౌజాః** = అత్యధిక జ్ఞానసంపన్నుడైన మనుమహర్షి, **తాన్ సర్వాన్ మహర్షీన్** = ఆ మహర్షులనందరిని, **అర్చ్య** = యథావిధిగా సత్కరించి, **శ్రూయతాం ఇతి** = వినండి అని, **ప్రత్యువాచ** = జవాబిచ్చాడు.

తాత్పర్యం:-ఉత్తములు, సంస్కారహృదయులు అయిన ఆ మహర్షులు ఈ విధంగా ఆదరపూర్వకంగా అడగ్గా, ఆ మహర్షుల ప్రతిభా వ్యుత్పత్తులను ఎరిగినవాడైన మనువు కూడా ప్రతి సత్కారం-ప్రత్యభివాదం చేసి; మహర్షులను తాను కూడా పూజించి **"వినండి-చెబుతాను"**అని పలికాడు.॥4॥

వివరణః

క. మనుస్మృతి శైలిననుసరించి అడిగిన సందర్భం, ప్రత్యుత్తర విధానం అనగా **‘శ్రూయతాం’** వినండి-చెబుతాను అను పద్ధతిని బట్టి ఈ నాలుగు శ్లోకాలు మూలశ్లోకాలనే భావించాలి. ఎందుకంటే ఈ మనుస్మృతిలో అనేక (ప్రక్షిప్త) శ్లోకాలు చేర్చబడ్డయి.. వీటిని 1వ అధ్యాయం 5వ శ్లోకం నుండి 144 శ్లోక్లాల వరకు మనుభావాలని చెప్పి భృగుమహర్షి గానీ లేదా మరొక శిష్యుడెవరైనా గానీ సంకలనం చేసి ఉండవచ్చు. అందువల్లనే **‘మహర్షిర్మనునా భృగుః 1.60, ‘ఉక్తవాన్ మనుః’ 1.118, మనునా పరికీర్తితః1.126, మనురబ్రవీత్ 8.339’** అనే పదాలు ఉండటం వల్ల మనువు చెప్పాడనడం వల్ల ఈ శ్లోకాలెవరో చేర్చి ఉండవచ్చునని తెలుస్తున్నది. కాబట్టి ఉత్తమపురుషతో చెప్పిన శ్లోకాలే మనువుకు సంబంధించినవి. తక్కినవి ప్రక్షిప్తములు. అవి మౌలికములు (Original) కావు.

పరిశీలన- మొదటి నాలుగు శ్లోకాల మౌలికతపై చర్చ

1-4 శ్లోకాలు మనువు చెప్పిన ఇతర శ్లోకాలవలె మౌలికంగా లేకపోయినా, వాటిశైలి, కూర్పు, ప్రశ్నలు ఆధారంగానూ, మనుస్మృతి ప్రవచించిన భూమిక రూపంగా వీటిని చెప్పటం వల్లనూ మౌలికం గానే ఇవి పరిగణితమయ్యాయి.

(క) మనుస్మృతి శైలి వల్ల మనువు భావాల సంకలనం (ముందు ప్రవచనం రూపంలోనివి) భృగువు లేదా మరెవరో శిష్యుల ద్వారా ప్రవచనం తర్వాతే జరిగిందని తెలుస్తూంది. సంకలన కర్త, ఈ శ్లోకాల ద్వారా మనువు వద్దకు మహర్షులు రావటం, ప్రశ్నలు వేయటం- ఇదంతా భూమికలో చెప్పాడు.

(ఖ) కూర్పు మౌలికమే.

(గ) ప్రశ్నలూ మౌలికమే; అందుచేత సంకలన శైలినను సరించి శ్లోకాలూ మౌలికాలుగానే కనబడతాయి. ఐదవ శ్లోకం నుంచే మనువు రచన అని కొందరు భావించడం పొరపాటు. మనుస్మృతి సంకలన శైలిగల గ్రంథం కనుక, ఆ కోణంలో పరికిస్తే, ఆ నాలుగు శ్లోకాలూ పరిచయాత్మక భూమిక రూపంలో మౌలిక సంకలనాలే.

వీటి శైలి ఆధారంగా, వ్యాఖ్యాతలందరూ ఆ శ్లోకాలను మౌలికాలనే అంగీకరించారు. వాటిలో మనువు పేరును పేర్కొని వర్ణించారు.- (**మహర్షిర్మనునా భృగుః**- 1.60, **ఉక్తవాన్ మనుః**-1.118, **మనునా పరికీర్తితః** 1.126, **మనురబ్రవీత్**- 8.339 మొదలైనవి.) మనువు భావాలను అనుసరించే భృగువు మనుస్మృతిని రచించాడు కనుక, ఇలాంటి శ్లోకాలు అసంగతాలు కావని వారి అభిప్రాయం. ఇది కూడా పొరపాటే. ఎందుకంటే-

(1) మనుస్మృతి, మనువు ప్రవచనాలను యథాతథంగా అదే శైలిలో సంకలించినదే కాని, మనువు భావాలు స్వీకరించి రచించిన గ్రంథం కాదు.

(2) సంకలనంలో మౌలికాంశాల మధ్య సంకలన కర్త చెప్పేదేమీ ఉండదు. అందువల్ల **‘మనురుక్తవాన్’** మొదలైన పదాలున్న శ్లోకాలు సంకలన కర్త చెప్పటం వల్ల అవి ప్రక్షిప్తాలు, మౌలికాలు కావు !

(3) 1.4 శ్లోకం **‘శ్రూయతాం’** అని మనువు జవాబు చెప్పడంతో ప్రారంభమవుతుంది. ఈ శ్లోకం వల్ల దీని తర్వాత మనువు ప్రకటించిన ఆలోచనలు ఉత్తమ పురుష శైలి ద్వారా పేరును పేర్కొని చెప్పటం ప్రక్షిప్తం. కనుక, అన్ని శ్లోకాలూ ఉత్తమ పురుషలో లేవు కనుక మూల సంకలనం నుంచి మార్చబడ్డాయని గ్రహించాలి.

జగదుత్పత్తి విషయము. 5 నుండి 107, 144 వరకు

5,6 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఉత్పత్తికి పూర్వం జగత్తు స్థితి-

ఆసీదిదం తమోభూతమప్రజ్ఞాతమలక్షణమ్ ।
అప్రతర్క్యమవిజ్ఞేయం ప్రసుప్తమివ సర్వతః ॥ మూలశ్లోక సం.5

టీక:- **ఇదం** = ఈ సమస్త ప్రపంచం, **తమోభూతం** = సృష్టికిముందు అంధకారంతో, **ఆవృతం** = కప్పబడి ఉండేది. ఆ సమయంలో అది, **అవిజ్ఞేయం**= ఎవరికీ తెలియదు, **అప్రతర్క్యం** = తర్కం ద్వారానూ తెలియబడదు. **అలక్షణం అప్రజ్ఞాతం** = ప్రసిద్ధ చిహ్నం ద్వారా తెలిసికోడానికి వీలుకానిది. కానీ వర్తమానకాలంలోనే అది తెలిసికోవడం జరుగుతుంది. **సర్వతః** = అన్నివైపుల, **ప్రసుప్తమివ ఆసీత్** = నిద్రిస్తున్నట్లుగా పడి ఉండేది.

ఋషి దయానందభాష్యం:-ప్రళయకాలంలో ఈ ప్రపంచమంతా చీకటై ఉంది. బ్రహ్మలోనే ఆచ్ఛాదితమై అవ్యాకృతమై (లీనమై) ప్రకృతి వేరుపడక ఉన్న సమయమది. అది ఊహలకు తర్కించుటకు ప్రసిద్ధి చిహ్నాలుగల ఇంద్రియాలకు అందనట్టిది. లక్షణరహితమైనది. ప్రత్యక్ష ప్రమాణగమ్యం కానిది. కనీసం శబ్దము చేతనూ తెలియబడనిది. గాఢాంధకారంలో నిద్రిస్తున్నట్లుగా ఉంది. కానీ వర్తమాన కాలంలోనే అది తెలిసికోవడం జరుగుతుంది. (స.ప్ర. 8వ.సము.)॥5॥

వివరణ: 14,15 శ్లోకాలకు సరియైన అర్థం:-

(1) వేదంలో చెప్పిన భావాల ఆధారంగా ఉన్న శ్లోకం-

శ్లోకంలో ఉన్న భావం కింది వేదమంత్రంలో ఇలా ఉంది.

తం ఆసీత్ తమసా గూఢమగ్రేఽప్రకేతం సలిలం సర్వమా ఇదమ్ ।
తుచ్ఛ్యేనాభ్వపిహితం యదాసీత్తపస్తన్మహినా జాయతైకమ్ ॥ఋగ్. 10.129.3

అర్థం- ప్రళయకాలంలో ఈ జగత్తంతా మూలప్రకృతిరూపంలో ఉంది. అంధకారంలో విలీనమై ఉంది. ఏదీ తెలుసుకునే అవకాశమే లేదు. అంతటా సలిలం-జలమయమే. తుచ్ఛ్య= సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాత్మ నుంచే ఈ జగత్తంతా వ్యాపితమైంది. పరమాత్మ తన శక్తితో ఈ జగత్తును కారణరూపం నుంచి కార్యరూపంలోకి మార్చి సృష్టించాడు.

(2) మనుస్మృతిలోని ప్రశ్నలు- సమాధానాల విషయం-

బహుశా వ్యాఖ్యాతలందరికీ వచ్చిన అనుమానం ఒకటే- మహర్షులు ధార్మిక విషయాలను గురించి ప్రశ్నించారా? అనేది. (1.2). కాని మనువు సృష్టి ఉత్పత్తి గురించి విషయానికి సంబంధం లేకుండా ఎందుకు చెప్పాడు? కొందరు విమర్శకులు ఈ వర్ణన చాలా అతిగా ఉందని భావిస్తే, మరి కొందరు దీన్ని ప్రక్షిప్తమనే ప్రకటించారు. నిజానికి ఈ వర్ణన అప్రాసంగికమూ కాదు, అతిగానూ లేదు, ప్రక్షిప్తమూ కాదు. మనుస్మృతి శైలిని పరిశీలించినట్లయితే ఈ వర్ణన ప్రాసంగికమూ, పరిధిలోనే ఉంది, మౌలికమూ అని తేలుతుంది. దీన్ని నిరూపించే మాటలు, ప్రమాణాలు కింద ఉన్నాయి.

మనుస్మృతి శైలి- మనుస్మృతి కొన్ని ప్రముఖ విషయాలతో విభాజితమై ఉంది. ఇందులోని శైలి ఎటువంటిది అంటే-ఏదైనా విషయం ప్రారంభిస్తే, దాని ఆది అంతాలలో లేదా రెండు చోట్లా దాని సంకేతాలుంటాయి. ఇక్కడ కూడా 'అస్య సర్వస్య' (1.3) నుంచి తర్వాతి చెప్పబోయే విషయమైన జగదుత్పత్తి ప్రారంభపు సంకేతం ఉంది. ఆపైన 1.144 (2.25)లో 'సంభవశ్చాస్య సర్వస్య' అని చెప్పి, దీని ముగింపు సంకేతమూ ఇచ్చాడు. అదే శ్లోకంలో తర్వాతి విషయపు సంకేతం కూడా ఉంది. ఈ విధంగా ఈ విషయ ప్రారంభం, ముగింపుల సంకేతాలు మనువు స్వయంగానే చెప్పాడు. ఇదే విధంగా ఈ విషయాన్ని గురించి అడిగిన ప్రశ్నతో ఆ తర్వాతి విషయాన్ని జోడించి చెప్పాడు. ఇటువంటి స్థితిలో ఇది అప్రాసంగికంగా లేదా ఇష్టం వచ్చినట్లుగా ఉందని చెప్పలేము.

(3) శైలి ఆధారంగా ఈ విషయపు కూర్పు- ఇదే ప్రాసంగికమని రుజువైన తర్వాత, పుట్టిన ప్రశ్న ఏమిటి? విమర్శకులు, వ్యాఖ్యాతలకు ఈ విషయం అప్రాసంగికం, పద్ధతిలో లేదు ప్రక్షిప్తం అనటం ఎలా జరిగింది? -అనేది. ఋషులందరూ ధర్మజిజ్ఞాస కలగటం చేత అడిగిన ప్రశ్నలకు సృష్టి ఉత్పత్తిని ఎందుకు మనువు ప్రారంభించాడు? దీనికి సమాధానంగా కింది వివరణలు చూడండి-

(క) మనువు ప్రశ్నలను అనుసరించే సమాధానాలు ఎంచుకున్నాడు. ఈ వర్ణన 2,3 శ్లోకాల ప్రశ్నలో ఉంది. మిగిలిన ప్రశ్నలకు సమాధానాల కోసం పూర్తిగా వ్యవస్థీకృతం, క్రమబద్ధమూ అయిన విషయాలను మొదలు పెట్టాడు. వ్యాఖ్యాతల వల్ల ప్రశ్నలడిగే 2, 3 శ్లోకాల సరైన, తగిన అర్థం గ్రహించ లేకపోవటం వల్లనే ఈ భ్రమ, సందేహం కలుగుతాయి. వ్యాఖ్యాతలు రెండవ శ్లోకాన్ని ఒక స్వతంత్ర ప్రశ్నగాను, మూడవ శ్లోకాన్ని స్వతంత్ర ప్రశంసా వాక్యంగాను భావించారు. అన్వయ దృష్టితో రెండిటినీ అసంబద్ధమైనవని, కింది విధంగా అర్థాలు చెప్పారు. రెండవ శ్లోకం- "హే భగవన్ ! బ్రాహ్మణాది చతుర్వర్ణాలు, అంబష్ఠులు (క్షురకులు) మొదలైన నిమ్నకులాలవారు, సూతులు మొదలైన వారు, ఖూర్జకంటకులు మొదలైన సంకీర్ణ జాతులు- వీరికి తగిన ధర్మాలను చెప్పటానికి మీరే యోగ్యులు." (అందుచేత చెప్పండి) మూడవ శ్లోకం- "ఎందుకంటే హే ప్రభో ! ఒక్క మీరే సంపూర్ణ అపౌరుషేయాలు, అచింత్యం, అప్రమేయమైన వేదాలు, అగ్నిష్టోమాది యజ్ఞకార్యాలు, బ్రహ్మను తెలిసినవారు."

వ్యాఖ్యాతలు పైన చెప్పిన అర్థాలు చెప్పటం చేత, ఇక్కడి విషయ వర్ణనలో క్రమపద్ధతి. ఏర్పడటం లేదు. రెండవ శ్లోకంలో మనువును అడిగిన ప్రశ్న ధర్మసంబంధమైనది. మూడవ శ్లోకంలో మనువును ప్రశంస చేస్తూ వేదాలలో చెప్పిన అగ్నిష్టోమాది యజ్ఞాలు, బ్రహ్మను తెలిసినవాడంటూ అతన్ని విద్వాంసుడంటున్నారు.

రెండవ శ్లోకం- "హే భగవన్ ! బ్రాహ్మణాది చతుర్వర్ణాలు, అంబష్ఠుల వంటి వారు, సూతులు మొదలైనవారు, ఖూర్జకంటకులు ఆది సంకీర్ణజాతుల యథోచిత ధర్మాలను క్రమంగా చెప్పటానికి మీరే యోగ్యులు." (అందుకని వాటిని చెప్పండి)

మూడవ శ్లోకం- "ఎందుకంటే హే ప్రభో ! పూర్తిగా అపౌరుషేయం, అచింత్యం, అప్రమేయమైన వేదాలలోని అగ్నిష్టోమం మొదలైన యజ్ఞకార్యాలు, బ్రహ్మను తెలుసుకున్నవారు మీరొక్కరే." వ్యాఖ్యాతలు పై అర్థాలు చెప్పటంలో విషయవర్ణనల కూర్పు క్రమబద్ధం చేయటం కుదరదు. రెండవ శ్లోకంలో మనువును ధార్మికసంబంధి ప్రశ్నలను అడిగారు మహర్షులు. మూడవ శ్లోకంలో అతన్ని ప్రశంసిస్తూ, అతన్ని విద్వాంసుడన్నారు. వేదంలో చెప్పిన అగ్నిష్టోమాది యజ్ఞాలను బ్రహ్మను తెలుసుకున్నవాడని, ఎప్పుడు ఏ విషయాన్ని గురించి అడుగుతారో దానికి అప్పుడు సమాధానం పొంది, ఆ విద్వత్తును ప్రశంసించడం సందర్భోచితంగా ఉంటుంది. మరో విషయానికి సంబంధించిన ప్రశ్న అడుగుతున్నప్పుడు, మరొక విషయంలో అతన్ని విద్వాంసుడు అని అనడం సబబు కాదు.

(ఖ) ఇలాంటి పొరపాటే మరొకటీ జరిగింది. మూడవ శ్లోకం లోని 'అస్య సర్వస్య' ద్వారా సర్వ నామాలను వేదాల విశేషణాలుగా భావించి, వ్యాఖ్యానించటం. దాని అసలు అర్థం 'జగత్తు'కు సంకేతం.

సహజంగా ఈ రెండూ శ్లోకంతో కలసినవి, ఏకవాక్యాత్మకం కూడా. మూడవ శ్లోకం, రెండవ శ్లోకంలోని వాక్యానికి పూరక వాక్యం. వాటిలో రెండవ శ్లోకంలో అడిగిన ప్రశ్నలను బట్టి కారణపూరకంగా మనువును ప్రశంసించారు. "మేము మీ వద్దకు కుతూహలంతో వచ్చాము" అంటూ మూడవ శ్లోకంలో కాని ఈ వాక్యం పూర్తికాదు.

"ఎందుకు వచ్చామంటే ఈ విషయంలో అన్నీ తెలిసిన విద్వాంసులు మీరే కనుక' అని ముగుస్తుంది ఆ వాక్యం. తర్వాతి నాలుగు, ఐదు శ్లోకాల వల్ల మనువు జవాబు చెప్పటం ప్రారంభించిన 'అస్య సర్వస్య' పదాలను అనుసరించే వ్యాఖ్యానించారు. ఈ శ్లోకాల అసలు అర్థం ఇలా చెప్పుకోవాలి-

"హే భగవన్ ! మీరు అన్ని వర్ణాల, ఆశ్రమాల ధర్మాలు సరిగ్గా తెలిసినవారు. వాటిని క్రమపద్ధతిలో చెప్పగల సమర్థులు. అందుచేత హే ప్రభో ! ఈ ప్రపంచంలోని క్రమపద్ధతిలోని అపౌరుషేయ, అచింత్య, అపరిమిత జ్ఞానంగల వేదాలలో ప్రతిపాదించిన లేదా వ్యావహారిక తత్త్వం, అంటే ధర్మాలు, వేదార్థాలు తెలిసిన ఏకైక వ్యక్తి మీరే ! (అందుచేత వర్ణాలు, ఆశ్రమాల ధర్మాలను ప్రవచించండి)". ఇలా వేదాలలో వేటిని ధర్మాలుగా చెప్పారో, వాటిని లేదా వేదాలలో చెప్పిన ధర్మాలను తెలుసుకున్న విశిష్ట విద్వాంసుడు మనువు. లేదా వేదాలు ప్రతిపాదించిన ధర్మాలు, 1.125, 131 (2.6,12) శ్లోకాలలో ధర్మాలకు మూలాధారంగా వేదాలనే భావించారు. అందుచేతనూ మనువు ఈ విషయాలు తెలిసిన పండితుడు. దీన్నే మనువు ప్రవచించాలి కనుక ఈ విషయాలను గురించే ఆతన్ని మహర్షులు ప్రశ్నించారు. అడిగిన విషయమేమిటో, దాని విషయంలోనే మనువు ప్రశంస జరిగింది. దేన్ని ప్రశంసించారో, ఏది అడిగారో దాన్నే మనుస్మృతిలో ప్రతిపాదించారు. అదే సందర్భోచితం అవుతుంది.

(౩) ఈ శ్లోకాలలో మనువును సంక్షిప్తంగా 'ఈ జగత్తుకున్న పద్ధతులు, రూపం అపౌరుషేయాలైన వేదాలలో వర్ణించిన ధర్మాలు మీకు తెలుసు, అందువల్ల మాకు వర్ణాలు, ఆశ్రమాల ధర్మాలను తెలియజెప్పండి' అని అడిగారు. మనువు ఆ శ్లోకాలలోని కుతూహలాన్ని అనుసరించే సమాధానం చెప్పడం ప్రారంభించాడు- 'ఈ జగత్తు స్థితి ఏమిటి? అది ఏవిధంగా వేదాలలో ఉంది? (1.5-87), వేద జగత్తు విధాన రూపం ఎటువంటిది? ఎందుకంటే ఇదంతా ఈశ్వరుడి నుంచే ఉత్పన్నమైంది. ఆయన నుంచే కర్మలు, పేర్ల విభజన, నిర్ధారణ అయ్యాయి. (1.21,23,87-91), వేదాల నుంచి ధర్మాలు ఏ విధంగా పుట్టాయి? ఆ ధర్మాల లక్షణాలు ఏవి? (1.120-144 లేదా 2.1-25)". ఈ విధంగా మూడవ శ్లోకం వరకు చెబుతూ, ఆ పైన రెండవ శ్లోకంలోని ముఖ్యప్రశ్న "ధర్మాల వర్ణన" వద్దకు వచ్చి, 1.144 (2.25)లో **"వర్ణధర్మాన్నిబోధత"** అని వాటిని చెప్పటం ప్రారంభించాడు. ఇలా మూడవ శ్లోకంలోని అసంగతమైన అర్థపు కారణం ఈ విషయాన్ని అప్రాసంగికమని చెప్పే భ్రాంతిని కలిగించింది. (విస్తృత వివరణకు 1.3 శ్లోకం పై 'పరిశీలన' పేరిట గల సమీక్షను చదవండి).

(4) 1.5 నుంచి 1.144 శ్లోకాల (మిగిలిన ప్రచురణల ప్రకారం 2.25) లోని ఈ వర్ణన మనుస్మృతిలోని భూమిక రూపంలో ఉంది. ఇందులో లేఖకుడు తన విషయంలో అసంబద్ధమైన అన్ని రకాల, అవసరమని భావించిన విషయాలను చెప్పాడు. ఇదే విధంగా మనువు, ధర్మాలకు సంబంధించిన అవసరమైన తగిన ప్రశ్నలకు సమాధానాల కొరకు, ఈ విషయాన్ని ప్రారంభించాడు. విషయ దృష్టితో ఇది అవసరం కూడా మనువు ఇందులో ఏ విషయాలను సంక్షేపంగా చెప్పాడో, ధర్మాలను గురించిన అధ్యయనంలో ఆ అనుమానాలన్నీ కలగడం సహజమే. అందుచేత ముందుమాట (భూమిక)లో వీటిని గురించి ముందుగానే తన అభిప్రాయాలు చెప్పాడు. ఎలాగంటే - మనుస్మృతి ఏ యే ధర్మాలను చెప్పబోతున్నానో, అవి ఎక్కడి నుంచి పుట్టాయి? (1.129 లేదా 2.10) ఆ ధర్మాలను ఏ లక్షణాలు ఉన్నాయి? (1.125,131 లేదా 2.6,12) వేటిని చూసి వ్యక్తి ధర్మాల పట్ల ప్రేరితుడవుతాడో, ఈ జగత్తులో ఆ ధర్మం అవసరం ఏమిటి? దాని స్థితి ఏమిటి? జగత్తు, ధర్మం రెండింటి సంబంధం ఏమిటి? జగత్తులో ధర్మాలు, కర్మలను అనుసరించి జీవులు ఎలా ప్రవర్తిస్తాయి? (1.5-87,1.42-50) ధర్మం పుట్టుక జగత్తును ఆశ్రయించి ఉంటుంది. అందుచేతనే ధర్మాని కన్నా ముందు జగత్తు పుట్టుకను చెప్పాడు. వేదాలను ధర్మాలకు మూలమని భావించటం అవి అపౌరుషేయాలు కనుకనే (1.21-23). ఈ ప్రపంచపు సృష్టి, స్థితి, ప్రలయకర్త సర్వశక్తిమంతుడైన పరమాత్మ. ఆయనే వేదాలు, వాటి ద్వారా ధర్మాల విధానాలను ఏర్పరచేవాడు. అందుచేత, ఆ ఈశ్వరుడు నియమించిన ధర్మాలను మనుష్యులు పాలించాలి- మొదలైనవి తెలుసుకోవటానికే, మనువు వీటిని ముందుమాట రూపంలో చెప్పాడు.

(5) మనుస్మృతిలోని సాంగోపాంగశైలి

మనువు సాంగోపాంగమైన శైలిని సొంతం చేసుకున్నాడు. ప్రాచీన శాస్త్రాలలో ఈ శైలి ప్రచురంగా ఉండేది- **'అథాతో బ్రహ్మజిజ్ఞాసా', 'జన్మాద్యస్య యతః'** (వేదాంత 1.1.2) ఈ శైలిలోని పద్ధతి ఏమిటంటే, అన్నిటి కన్నా గొప్ప తత్త్వం పరమేశ్వరుని వర్ణనతో ప్రారంభించి, క్రమంగా తన విషయం వరకు చెప్పడం. దీని వల్ల, ఆ శాస్త్రపు చివరి ప్రయోజనం బ్రహ్మతత్త్వాన్ని పొందడం, ఆ విషయానికి ఆ పరతత్త్వంతో సంబంధం ఉండటం- అనే రెండు విషయాల సంకేతాలూ అందుతాయి. ఇదే విధంగా మనుస్మృతిలోనూ ధర్మాలు వేదాల ద్వారా ఈశ్వరుణ్ని దర్శింపచేస్తాయి కనుకనూ, **"బ్రాహ్మీయం క్రియతే తనుః"** [2.28.(2.3)] ఈ ధర్మాలను పాటించటం వల్ల మోక్షప్రాప్తి లేదా ఆత్మజ్ఞానం పొందే యోగ్యతను కలుగజేయటమే శాస్త్రాల చివరి ఉద్దేశ్యం కనుకనూ, ధర్మాలకు ఈశ్వరునితో సంబంధం ఉన్నట్లు ఉంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

జగుదుత్పత్తి క్రమము-

తతస్స్వయమ్భూర్భగవానవ్యక్తో వ్యఞ్జయన్నిదమ్ ।
మహాభూతాదివృత్తౌజాః ప్రాదురాసీత్తమోనుదః ॥ మూలశ్లోక సం. **6**

టీక:- తతః = ప్రళయం తరువాత సృష్టికి ముందు, **స్వయమ్భూః** = తన కార్యకారణమందు స్వయం సమర్థుడు, పరసహాయం అపేక్షించనివాడు, **అవ్యక్తః** = స్థూలరూపంలో కనిపించకుండా ఉండేవాడు. **తమోనుదః** = తమోరూపమైన ప్రకృతికి ప్రేరకుడు, అంటే ప్రకృతిని ప్రకటావస్థకు ప్రేరేపించేవాడు, **మహాభూతాదివృత్తౌజాః** = భూమి, జలము, అగ్ని, వాయువు మొదలయిన మహాభూతాలను, మహత్ అహంకారాదులను కూడా ఉత్పన్నం చేయగల శక్తిసంపన్నుడైన, **భగవాన్** = పరమాత్మ, **ఇదం** = ఈ సమస్త సృష్టిని, **వ్యఞ్జయత్** = ప్రకటావస్థలోకి తీసికొనిరాగా, **ప్రాదురాసీత్** = (ఇది) ప్రకటమైనది.

తాత్పర్యం: ప్రళయానంతరం సృష్టి ప్రారంభంలో స్వయంభువుడైన పరమాత్మ అనంతంగానూ- నిరంతరాయం గానూ సృష్టిచేయ సామర్థ్యం కలిగినవాడై తనంతట తాను ప్రకాశమానుడై ఈ పాంచభౌతిక జగత్ సృష్టిని బహిర్గతపరచేందుకు, ప్రకృతిని ప్రేరేపిస్తూ ప్రకటావస్థలోకి తెచ్చి స్వయంగా వ్యక్తమయ్యాడు.॥6॥

సమస్త వేదస్మృతి పురాణ ఇతిహాసాదుల చేత చెప్పబడిన ఈ పరమాత్మ బాహ్యేంద్రియాలకు కనిపించడు. మనలాగా అవయవాలు లేనివాడు. సకల భూత(జీవ) రాశి తనయందే కలిగినవాడు. **'ఈ విధంగా ఉంటాడ'**ని ఊహకు అందనివాడు. పరిపూర్ణ పరిశుద్ధాత్ములకు మాత్రమే కనిపించేవాడు. ప్రకృతిని **'మహత్'** రూపంలోకి తెచ్చి ప్రకాశింపజేశాడు.

వివరణ:

1. 'స్వయం భూ' శబ్దానికి సరియైన అర్థం:- కుల్లూకభట్టు వ్యాఖ్యానం ప్రకారం **'స్వయమ్భూః'** అనే శబ్దానికి = స్వేచ్ఛగా శరీర ధారణ చేసేవాడు' అని అర్థం. కానీ, ఇది సరియైన అర్థం కాదు. ఈ శ్లోకంలో **'అవ్యక్తః'** అనే విశేషణమున్నది. ఎప్పుడూ స్థూలరూపంలో కనిపించనివాడని అర్థం. దీన్ని బట్టి పరమేశ్వరుడు ఎల్లప్పుడూ సూక్ష్మరూపంలోనే ఉండేవాడని స్పష్టమవుతుంది. అతడు ఎప్పుడూ శరీర ధారణ చేయడు. ఇందుకు భిన్నంగా ఉన్నందువల్ల కుల్లూకభట్టు వ్యాఖ్య స్వీకరణ యోగ్యం కాదు. ఈ సందర్భంలో మహర్షి దయానందులవా రిచ్చిన **'స్వయమ్భూ'**శబ్దార్థాన్ని గమనించాలి.

"భూసత్తాయాం వాచి" = 'స్వయం' పూర్వకమైన 'భూ' ధాతువు నుండి 'స్వయమ్భూ' శబ్దం ఉత్పన్నమవుతుంది. "యః స్వయం భవతి సః = స్వయమ్భూరీశ్వరః" తనకోసం తాను ప్రకటమై, ఎవరి సహాయం కోరనివాడు స్వయంభూః (సత్యార్థప్రకాశం.సం.1).

2. పరమాత్మ ప్రకటితమవునని అనడంలో అభిప్రాయమేమంటే- జగత్తును ప్రకటావస్థకు తీసుకురావడమని తాత్పర్యం. ఈ భావాన్ని వ్యక్తం చేయడానికే **'వ్యఞ్జయన్నిదం"** అనే పదాన్ని మనుమహర్షి ప్రయోగించాడు. ఇక్కడ ప్రకటితమైనది జగత్తు. పరమేశ్వరుడు కాదు. జగత్తు యొక్క ప్రకాశావస్థయే పరమాత్మ అస్తిత్వాన్ని సూచిస్తుంది. ప్రకృతిని ప్రళయావస్థలోకి తీసుకురావడమే పరమేశ్వరుడి అప్రకటావస్థ. ఈ **'జాగ్రత్, సుషుప్త'**లే- క్రమంగా పరమేశ్వరుడి అవస్థలు. 1వ అధ్యాయం 52-54. ఈ శ్లోకాలలో పరమేశ్వరుడు శరీరధారిగా జన్మించునని చెప్పడం అంగీకరించదగినది కాదు. ఇది మనుస్మృతికి విరుద్ధం కూడా.

3. సృష్ట్యుత్పత్తి విషయంలో వేదమంత్రాల ప్రమాణం:- సృష్ట్యుత్పత్తి విషయంలో వేదమంత్రాల ప్రమాణంగా పురుషసూక్తంలోని మంత్రాలలో - పరమేశ్వరుడు నిరాకారుడు. జన్మలేనివాడని తెలుపబడిన విషయాన్నే మనువు 1.5,6 శ్లోకాలలో వర్ణించాడు.

"తమ ఆసీత్ తమసా గూళ్హమగ్రేఽ ప్రకేతం సలిలం సర్వమా ఇదమ్ ।
తుచ్ఛ్యేనాభ్వపిహితం యదాసీత్తమసస్తన్మహినా జాయతైకమ్ ॥ ఋ. 10. 129. 3

ఈ సమస్త జగత్తు సృష్టికి ముందు అంధకారంతో ఆవృతమై ఉండింది. రాత్రి రూపంగా తెలియడానికి వీలులేకున్నది. ఆకాశరూపమైన సమస్త జగత్తు పరమేశ్వరుడి ఒక ప్రదేశంలో ఆచ్ఛాదితమై ఉంది. అతడు తన సామర్థ్యంతో కారణరూపంగా ఉన్న ఈ ప్రకృతిని కార్యరూపం (జగత్)గా మార్చాడు- (స.ప్ర.)

(క) **"నాసదాసీన్నో సదాసీత్తదానీం నాసీద్రజో నో వ్యోమా పరోయత్ ।**
కిమావరీవః కుహ కస్య శర్మన్నంభః కిమాసీత్ గహనం గభీరమ్ ॥ఋ. 10. 129. 1

టీక:- నాసదాసీత్ = ఈ కార్యసృష్టి ఉత్పన్నం కాకముందు సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడు, జగత్కారణభూతమైన అంటే జగన్నిర్మాణ సాధనమైన ప్రకృతి ఉండినది. ఆ సమయంలో, **అసత్** = శూన్యనామం గల నేత్రాలకు కనబడరానిదైన ఆకాశం కూడా లేదు, **నో సదాసీత్ తదానీ...** = ఆ కాలంలో సత్ అంటే సత్త్వరజస్తమోగుణాత్మకమైన "ప్రధాన"మనే పదార్థమూ లేదు. **నాసీద్రజః** = పరమాణువులు కూడా లేవు. **నో వ్యామ....**= సర్వ స్థూలజగత్తుకు నివాసస్థానమైన విరాట్ పదార్థమూ లేదు. **కిమావరీవః** = ఈ వర్తమాన జగత్తు కూడ మంచు భూమిని కప్పినట్లు ఆ శుద్ధ బ్రహ్మను కప్పివేయలేదు. ఆ మంచునీరు వల్ల నదీప్రవాహం ఏర్పాటు కాలేదు. అగాధం గానీ, మిట్టపల్లాలు గానీ ఏర్పడలేవు. దీన్ని బట్టి పరమేశ్వరుడు అనంతుడని, ఆయన సృష్టించిన ఈ జగత్తు ఈశ్వరుడితో పోల్చితే స్వల్పాతి స్వల్పమని తెలుస్తుంది (ఋగ్వేదాది భాష్య భూమిక సృష్టివిద్యా విషయము).

(ఖ) **'ప్రజాపతిశ్చరతి గర్భే అంతరజాయమానో**
బహుధా వి జాయతే ......। యజు. 31. 19

ప్రజారక్షకుడు, జగత్తుకు స్వామియైన ఆ పరమేశ్వరుడే జడములందు, చేతనములందు అంతర్వ్యాప్యంగా సర్వత్ర వ్యాపించి ఉన్నాడు. సమస్త జగత్తును సృష్టించి తాను జన్మలేనివాడిగా ఉన్నాడు. (ఋ.భా.భూ.)

(గ) ఈ కింది వేదమంత్రంలో పరమేశ్వరుడు "స్వయమ్భూః" విశేషణముచే చెప్పబడుతూ, సూక్ష్ముడు, అంతర్యామి, శరీరరహితుడు, జన్మ మరణ రహితుడు, సృష్టి మరియు వేదార్థాలను ప్రకాశింపజేసినవాడని వర్ణించబడింది.

"స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరం శుద్ధమపాపవిద్ధమ్ ।
కవిర్మనీషీ పరిభూః స్వయమ్భూర్యాథాతథ్యతోఽర్థాన్ వ్యదధాత్ శాశ్వతీభ్యః సమాభ్యః ॥యజు. 40.8.

"హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్।
స దాధార పృథివీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ ॥ ఋ. 10.121.1

ఓ మానవులారా! ఎవరు సూర్యాది సర్వతేజస్వి పదార్థాలకు ఆధారభూతుడో, ప్రస్తుతమున్న జగత్తుకు, భూతకాలీన జగత్తుకు అద్వితీయపాలకుడో, ఆ పరమేశ్వరుడు ఈ జగదుత్పత్తికి పూర్వం ఉన్నాడు. ఆయనే ఈ పృథ్వి మొ॥ సూర్యపర్యంతమున్న జగత్తును సృష్టించాడు.

(7) పురుష ఏవేదగ్ం సర్వం యద్భూతం యచ్చ భావ్యమ్ ।
ఉతామృతత్త్వస్యేశానో యదన్నేనాతిరోహతి ॥ యజు. 31.2

పూర్వోక్త విశేషణాలు గల ఆ పరమపురషుడే పరమేశ్వరుడు. ఏ జగత్తు ఇంతకుముందు ఉత్పన్నమైనదో, ఇక ముందు కానున్నదో, ప్రస్తుతమున్నదో, ఈ మూడురకాలైన జగత్తును ఆయనే రచించాడు. ఆయన కాకుండా మరెవ్వరూ ఈ ప్రపంచాన్ని సృష్టించేవారు లేరు. కారణం-ఆ పరమేశ్వరుడే 'ఈశానః' సర్వశక్తిమంతుడు, అమృతుడు, మోక్షప్రదాత, ఆయనే పృథివ్యాది సమస్త జగత్తును వ్యాపించి ఉన్నాడు. దానికి వేరుగా కూడా ఉన్నాడు. కారణం-ఆయనలో జన్మాది వ్యవహారముండదు. తన సామర్థ్యంతో, సర్వజగన్నిర్మాణం చేస్తాడు. కానీ తాను జన్మ ఎత్తడు. (ఋ.భా. భూ.)

"తస్య త్వష్టా విదధత్ రూపమేతి" యజు. 31.17

సృష్టి ఉత్పన్నం కాని సమయంలో జగత్తు ఈశ్వరుడి సామర్థ్యం ననుసరించి కారణరూపంగా ఉంటుంది. ఈశ్వరుడు తన సామర్థ్యము ననుసరించి జగత్తును సృష్టిస్తాడు. అప్పుడు కార్యజగత్తు గుణాలు కలదై స్థూలరూపంలో ప్రత్యక్షమవుతుంది. (ఋ.భా.భూ.)

7వ శ్లోకం నుండి 13వ శ్లోకం వరకు ప్రక్షిప్తశ్లోకాలు. ఇవి ప్రామాణికం కాదు

* **ఈశ్వరోత్పత్తి-**

* *యోఽసావతీంద్రియగ్రాహ్యః సూక్ష్మోఽవ్యక్తః సనాతనః ।*
సర్వభూతమయోఽచింత్యః స ఏవ స్వయముద్బభౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 7

తాత్పర్యం:-సకల వేదపురాణేతిహాస ప్రసిద్ధమైన ఏ పరమాత్మ గలడో శుద్ధమనసుచేత తెలిసినవాడూ, బహిరింద్రియాలకు అగోచరుడూ, అవయవరహితుడూ, నిత్యుడూ, సకల భూతాత్ముడూ, ఇంతటివాడని ఊహించరాని వాడూ అయిన ఆ పరమాత్మ మహదాదిరూపాలతో ఆవిర్భవించాడు.॥7॥

* **జలతత్వోత్పత్తి-**

* *సోఽభిధ్యాయ శరీరాత్స్వాత్సిసృక్షుర్వివిధాః ప్రజాః ।*
అప ఏవ ససర్జాఽఽదౌ తాసు బీజమవాసృజత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 8

తాత్పర్యం:-అప్పుడా పరమాత్మ సకల జీవజాలాన్ని సృష్టించదలచాడు. ఈ తలంపు తనకు కలగగానే, 'జలము ఉత్పన్నమగును గాక' అని సంకల్పించాడు. ఆ నీటిలో స్వశక్తిరూపమైన బీజాన్ని ఉంచాడు. ॥8॥

* బ్రహ్మోత్పత్తి-

* తదండమభవద్ధైమం సహస్రాంశుసమప్రభమ్ ।
తస్మిన్జజ్ఞే స్వయం బ్రహ్మా సర్వలోకపితామహః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *9*

తాత్పర్యం:-ఆ బీజం సూర్యునితో సమానమైన కాంతి గల్గిన అండంగా రూపుదిద్దుకుంది. ప్రారంభంలోనే "నేను హిరణ్యగర్భుడినౌదునుగాక" అని సంకల్పించి అందులో ప్రవేశించి పరమాత్మ తనకు తానే సమస్తలోకాలకు కారణభూతుడైన చతుర్ముఖ బ్రహ్మగా జన్మించాడు. ॥9॥

* నారాయణ శబ్దార్థము-

* ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ।
తా యదస్యాయనం పూర్వం తేన నారాయణః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10**

తాత్పర్యం:- ఆపము అందుచేత ఇవి నరసూనవులు అనబడుతున్నవి. నీరు నారములు అనబడును. ఈ జలము పరమాత్మ చేత ఉత్పన్నమైనవి. అట్టి నారములు ఈ పరమాత్మకు ఉనికిపట్టు అగుటచేత ఈ పరమాత్మ నారాయణుడనబడుతున్నాడు. ॥10॥

ఋషిదయానందుడు చెప్పిన అర్థం:- జలానికి, జీవులకు 'నారా' అని పేరు. 'అయనం' అనగా నివాస స్థానం. కావున సమస్త జీవులలో మరియు ప్రకృతిలో వ్యాపకుడైనందున పరమాత్మునికి 'నారాయణుడు' అని పేరు. (స.ప్ర. 1వ సము.)

* బ్రహ్మస్వరూప కథనం-

* యత్తత్కారణమవ్యక్తం నిత్యం సదసదాత్మకమ్ ।
తద్విసృష్టస్స పురుషో లోకే బ్రహ్మేతి కీర్త్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **11**

తాత్పర్యం:-ఉత్పత్తి గల అన్నింటికీ కారణుడు, బాహ్యేంద్రియాలకు అగోచరుడు, ఉత్పత్తీ నాశమూ లేనివాడు. నిత్యానిత్య వస్తురూపంలో ఉన్నవాడు, నిత్య శాశ్వతుడు అయిన పరమాత్మ చేత సృజింపబడిన ఈ పురుషుడే లోకమున అంతటా 'బ్రహ్మ' అని వ్యవహరించబడుతున్నాడు. అతడే సకల తిర్యక్ స్థావర-జంగమాత్మక భూత సృష్టికి నాంది పలికాడు. ॥11॥

* అండవిభజన-

* తస్మిన్నండే స భగవానుషిత్వా పరివత్సరమ్ ।
స్వయవేవాఽఽత్మనో ధ్యానాత్తదండమకరోద్ద్విధా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **12**

తాత్పర్యం:-ఆ అండమున ఆ భగవంతుడైన బ్రహ్మ చెప్పబోవు బ్రహ్మమానమున ఒక సంవత్సరం ఉండి 'ఈ అండం రెండుగా అగును గాక' అని తలచినంతమాత్రమున దాన్ని రెండుగా చేశాడు. ॥12॥

* అండఖండముల నుండి సృష్టిరచన-

* తాభ్యాం స శకలాభ్యాం చ దివం భూమిం చ నిర్మమే ।
మధ్యే వ్యోమ దిశశ్చాష్టావపాం స్థానం చ శాశ్వతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **13**

తాత్పర్యం:-అంతట ఆ బ్రహ్మ పై చీలికచే ఆకాశాన్ని కింది చీలికచే భూమిని, నడుమ బయలును, ఎనిమిది దిక్కులను, శాశ్వతమైన నీటిపట్టును (సముద్రాన్ని) నిర్మించాడు. ॥13॥

ప్రక్షిప్తాల పరిశీలన

7 నుండి 13వరకు గల శ్లోకాలలోని విషయం పూర్వాపర విషయాలకంటె భిన్నంగా, మరో కొత్త విషయానికి ప్రస్తావనగా ఉంది. కాబట్టి ఈ పై చెప్పిన 7శ్లోకాలు మౌలికం కాదు, కింది ప్రమాణాలతో ఇవి ప్రక్షిప్తమని రుజువవుతుంది.

1. శైలీగత ఆధారం

మనుస్మృతిలో సృష్టి ఉత్పత్తి వర్ణన ఒక కచ్చితమైన సంక్షిప్త శైలిలో జరిగింది. మనువు ఎక్కడెక్కడ సృష్టి ఉత్పత్తి విషయం ప్రారరంభించాడో లేదా ప్రళయాల గురించి చెప్పాడో, సరాసరిగా మనువు = మహత్ తత్త్వపు ఉత్పత్తి విషయాలను పేర్కొంటాడు. ఎలాగంటే-

క. ప్రళయం తర్వాత సృష్టి ఉత్పత్తి కొరకు పరమాత్మ పూనుకుంటాడు- **'సృజతి మనః సదాత్మకమ్'** (1.74), **'మనః సృష్టిం వికురుతే చోద్యమానం సిసృక్షయా'** (1.75).

ఖ. ప్రళయం వచ్చినా ముందు మనువు చెప్పిన దేమిటంటే- **"తస్మిన్ స్వపితి సుస్థే తు కర్మాత్మానః శరీరిణః । స్వకర్మభ్యో నివర్తంతే మనశ్చ గ్లాని మృచ్ఛతి ।"** (1.53) ఇదే విధంగా ఇందులో కూడా మనువు వర్ణనశైలి ప్రకారం, పరమాత్మ సృష్టిరచనలో నిమగ్నుడైన పిదప, మనువు మహత్తునే అన్నిటి కన్నా ముందుగా చెప్పాడు (1.6,14). ఈ విషయాల వల్ల మనువు వర్ణనశైలి ననుసరించి ఇక్కడ ఆరవ శ్లోకంలో పరమాత్మ కనిపించిన తర్వాత మొట్టమొదట మనువు రాసిన ఉత్పత్తిని తెలియజేసే 14వ శ్లోకమే ఉండాలనేది తెలుస్తూంది. మధ్యలోని ఈ శ్లోకాలు విషయ సంబంధమైనవి కావు. వాటిలో బ్రహ్మ, ద్యులోకాల ఉత్పత్తి ఉంది. అందుకని ఇవి మనువు వర్ణనశైలికి అనుగుణంగా లేనందున ప్రక్షిప్తాలు. సృష్టికి అవసరమైన **'మహత్'** తత్త్వమే లేనపుడు, పృథ్వి, సముద్రాలు ఎలా తయారవుతాయి?

ఈ శ్లోకాల భాషాశైలి కూడా ఇవి ప్రక్షిప్తాలని స్పష్టం చేస్తున్నది-

క. ఆరవ శ్లోకంలో సహజమైన క్రమంలో, సాధారణ పద్ధతిలో పరమాత్మ ఉత్పత్తిని గురించి చెప్పాడు, మళ్లీ దీని తర్వాత రాబోయే విషయం ఇదే క్రమంలోనూ, శైలిలోనూ 14వ శ్లోకం నుంచి ప్రారంభమైంది. మధ్యలో **'యోఽసౌ'** (1.7) 'ఈ పరమాత్మ..... అతడే ముందుగా స్వయంగా ఉత్పన్నమయ్యాడు'- **'స ఏవ స్వయముద్బభౌ'** (1.7) అని చెప్పి, మళ్లీ పరమాత్మ ఉత్పత్తిని చెప్పే విషయం ప్రారంభించి, అందులో బ్రహ్మ అనే పురుషుని ఉత్పత్తిని చెప్పడం వల్ల, నడుస్తున్న విషయాన్ని మధ్యలో ఖండించి **'యోఽసౌ'** ద్వారా ఒక కొత్త భిన్న విషయాన్ని రాసి, దాన్ని ఇక్కడ చొప్పించారని, **'స ఏవ స్వయముద్బభౌ'** అనే వాక్యరచనతో మూలంలోని విషయాన్ని మళ్లీ మొదలుపెట్టే అభిప్రాయంతో, లేదా ఆరవశ్లోకం చెప్పేసిన ఇదే అభిప్రాయాన్ని మళ్లీ అదే భావంతో చెప్పవలసిన అవసరమేముంది? దీన్ని బట్టి ఇది ప్రక్షిప్తమని తెలిసిపోతుంది. ఏడవ శ్లోకంలోని భావం గల విషయాలను తరువాతి శ్లోకాలలో **'సః'** (1.8) **'తత్** (1.9) **'తాః'** (1.10) **'యత్తత్'** (1.11) **'తస్మిన్'** (1.12) **'తాభ్యాం'** (1.13) మొదలైన సర్వనామాలతో విస్తారం చేశారు. కాని 14వ శ్లోకం నుంచి ఈ సంబంధం తెగిపోయింది. దానివల్ల ఈ శ్లోకాలలోని విషయాలు పూర్తిగా భిన్నమైనవి. ఆరవశ్లోకంతో కాని, 14వ శ్లోకంతో కాని ఎంత మాత్రమూ కలవవు అని తెలుస్తూంది. ఇది మౌలిక క్రమమైతే, 1.7లో **'యోఽసౌ'** అని మునుపటి శ్లోకపు భావాన్ని మళ్లీ కొత్త పద్ధతిలో చెప్పవలసిన అవసరం లేదు. పైగా **'తత్'** లేదా **'సః'** పదాలతో అదే వరుసలో కలిసి ఉండేవి- ఏడవశ్లోకంతో 8-13 శ్లోకాలు ఒకటే ప్రవాహంలో కలిసినట్లు-భాషాశైలికి భంగం చేయటంతో ఇది ప్రక్షిప్తమని రుజువు చేస్తూంది.

ఖ. 14వ శ్లోకంలోని మొదటి పంక్తిలోని మాటలు చాలా స్పష్టంగా 7-13 శ్లోకాలలోని విషయాన్ని ప్రక్షిప్తాలని రుజువు చేస్తున్నాయి. అంతే కాకుండా, 14వ శ్లోకంలోని భావం 6వ శ్లోకం విషయంతో పూర్తిగా కలుస్తోంది కాని, 13తో కాదనీ తెలుపుతున్నది. అది- **"ఉద్బబర్హ ఆత్మనశ్చైవ మనః"**. అంటే తర్వాత పరమాత్మ తనను ఆధారం చేసుకుని, మహత్‌ను ఉత్పన్నం చేశాడు అని. ఇక్కడ 'చ', 'ఏవ' పదాలు విషయాన్ని కలిపే అవ్యయాలు. ఈ అర్థంతో ఈ శ్లోకానికి ముందు ప్రకృతి ప్రేరకుడైన పరమాత్మ ఉత్పత్తి వర్ణన ఉండాలనీ, తర్వాత **"ఆత్మనశ్చైవ మనః"**, ప్రకృతి తర్వాత 'మనః'= మహత్తు ఉత్పత్తి జరిగిందనీ తెలుస్తోంది. 13వ శ్లోకంలో పృథివి, ద్యులోకం మొ॥ వాటి వర్ణన ఉండటం వల్ల, దాని తర్వాత **"ఆత్మనః చ ఏవ"** పదాల ప్రయోగం అవసరమే ఉండదు. తర్వాత 14వ శ్లోకమే ఉండాలి. మధ్యలోని శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలు.

గ. ఆరవ శ్లోకంలో పరమాత్మ **"ఇదం మహాభూతాదివ్యంజయన్"** ఈ మహాభూతాలైన తత్త్వాలను ఉత్పన్నం చేస్తున్నట్లు చెప్పాడు. దీనివల్ల మనువుకు పరమాత్మ బ్రహ్మ సృష్టి జరగటం ఇష్టం కాదనీ, లేదా మునుపటి విషయాల్లో బ్రహ్మామొదలైన ఇతరులెవరి సృష్టినీ చెప్పటం వద్దనుకున్నాడనీ, కేవలం మహత్ మహాభూతాది తత్త్వాల ఉత్పత్తి, వాటి వర్ణనే చేయాలనుకున్నాడనీ అర్థమవుతూంది. దీని ద్వారా మొదటి వర్ణనను గురించి 14-16 శ్లోకాలలో చెప్పినట్లు సంకేతించాడు. ఇల్లా 6వ శ్లోకం తర్వాత 14-16 శ్లోకాల వర్ణనే ఉండాలి; బ్రహ్మ ఉత్పత్తి (7-13) కాదు. ఈ శైలీ సంకేతం ఆధారంగానూ ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని తెలుస్తూంది.

ఘ. 12,13 శ్లోకాల శైలి కూడా యుక్తియుక్తం కాదు. వాటిలో అవ్యాప్తి దోషం ఉంది. గుడ్డు కల్పన ద్వారా దాని రెండు భాగాలతో ద్యులోకం, పృథ్వి, సముద్రం తయారైనాయనుకుంటే, చాలా ప్రశ్నలు వస్తాయి. అండ నిర్మాణం జరిగినపుడు ప్రపంచంలోని అన్నిచోట్లా అది వ్యాపించిందా? లేదా కొన్ని స్థానాలలో మాత్రమేనా? పూర్తిగా వ్యాపించి ఉంటే, ముక్కలైనపుడు, అంత ఆకాశం ఎలా వచ్చింది? కొన్ని స్థానాలలోనే ఉంటే, మిగిలిన చోట్ల ఏముండింది? అక్కడ ఆకాశం ఉండి ఉంటే, గుడ్డు రెండు ముక్కలైనపుడు ఆకాశమెందుకు వచ్చింది? గుడ్డులోని ఒక ముక్కతో భూమి మాత్రం ఏర్పడితే, మిగిలిన ముక్క నుంచి సూర్యచంద్రాది గ్రహాలు తయారైతే, సూర్యుడు భూమికన్నా చాలా పెద్ద, మిగిలిన గ్రహాలు, పర్వతాలు, బ్రహ్మాండంలోని ఇతర వస్తువులన్నీ ఎలా, ఎక్కడి నుంచి వచ్చాయి? ఇది చెప్పనే లేదే ! ఈ వర్ణనలో అవ్యాప్తి దోషం ఉంది. దిక్కులు విడిగా నిర్మించే ప్రత్యేక వస్తువులు కావు. ఈ విధంగా గుడ్డు ప్రక్రియ నుంచి సృష్టి జరిగిందనడం దోషయుక్తమైన కల్పన, యుక్తియుక్తమూ కాదు. అందుకనే ఇది మనువు వంటి విశిష్టవిద్వాంసుని గ్రంథంలో చోటు చేసుకోలేదు.

2. పునరుక్తులు

పదాలు, భావాల దృష్ట్యా ఈ శ్లోకాలు పునరుక్తులు మాత్రమే. ఆరవ శ్లోకంలోని భావాన్ని ఏడవ శ్లోకంలో కొన్ని కొత్త విశేషణాలు కలిపి, మునుపటి వలెనే చెప్పారు. ఇందులో కొత్త అర్థం ఏదీ లేదు. మునుపటి శ్లోకంలో **"తతః స్వయంభూ.... అవ్యక్తో వ్యంజయన్నిదం.....ప్రాదురాసీత్"** 'అప్పుడు ఉత్పన్నం కావడం వల్ల స్వయం సమర్థుడైన పరమాత్మ ఈ ప్రపంచాన్ని ప్రకటితం చేస్తూ తానూ కనిపించాడు' అని చెప్పబడింది. ఏడవ శ్లోకంలోనూ పరమాత్మ ఉత్పన్నమైన విషయం చెప్పారు. పదాల పునరావృత్తి కూడా- **"అవ్యక్తః"** అనేది ఉన్నది ఉన్నట్టుగా, **'స్వయంభూః ప్రాదురాసీత్'** ను కూడా **'స ఏవ స్వయముద్బభౌ'** అనే ఉంది. కొత్త విషయం రాసేందుకు **'యోఽసౌ'** అని మళ్లీ పీఠిక తయారు చేశారు. దీనివల్ల బ్రహ్మ ఉత్పత్తి జరుగుతుందని చెప్పి ఉంటారు. ఇలా పునరుక్తి కావడం వల్ల ఈ శ్లోకం మౌలికం కాదు. మిగిలిన 8-13 శ్లోకాలకు ఇది ఆధారభూతం. అందుకని ఈ ఆధారంతో కూడా అవి మౌలిక శ్లోకాలు కావు.

3. అంతర్ వ్యతిరేకాలు

అంతర్వ్యతిరేకాలు ఆధారంగా ఇది మౌలికం కాదు.

(క) ఆరవ శ్లోకంలో అవ్యక్త పరమాత్ముని ద్వారానే సమస్త జగత్తు, మహాభూతాలు, తత్త్వాల సృష్టి జరిగిందని ఉంది. ఈ శ్లోకాలలో బ్రహ్మద్వారా (9.13) సృష్టి ఉత్పత్తి అయిందనడం పైదానికి వ్యతిరేకం.

(ఖ) ఆరవ శ్లోకంలో **'వ్యంజయన్ ఇదం ప్రాదురాసీత్'**- అంటే ఈ జగత్తు కనబడటమే పరమాత్మను కూడా దర్శింపజేస్తుంది, మరి ఏడవశ్లోకంలో ముందు పరమాత్మ స్వతంత్రంగా పుట్టాడనీ, తర్వాత మిగిలిన జగత్తు పుట్టిందనీ ఉంది. ఈ రెండు విషయాలలోనూ వ్యతిరేకత కనబడుతూంది.

(గ) మనువు పరమాత్మే సరాసరిగా స్వయం సృష్టికర్త అని భావించాడు (1.6,19, 52-54,57,74-78, 80). పరమాత్మను **'అవ్యక్త'** (1.6), **'సూక్ష్మ'** (6.65), **'అవ్యయ'** (1.19,57), 'సర్వ వ్యాపకుడు' (1.54, 6.73, 12.91) అని చెప్పాడు. ఈ శ్లోకాలలోని ప్రత్యేక పురుషుడు బ్రహ్మరూపంలో ఈశ్వరుని ఉత్పత్తి అని చెప్పడం, బ్రహ్మద్వారా సృష్టి రచన జరిగిందనడం, 9,17 శ్లోకాలలో అతన్ని ఏకదేశీయుడు అనడం, పైన చెప్పిన విషయాలకు వ్యతిరేకం. చెప్పిన విశేషణాలతో నిర్దిష్ట ఈశ్వరుడు పుట్టలేడు. సర్వవ్యాపకుడైతే ఏకదేశీయుడు కాలేడు. సృష్టికొరకు సక్రియుడు కావడమే అతని ఉత్పత్తి, ప్రకటనలను తెలియజేస్తుందనీ, సక్రియుడు కాకుంటే ప్రళయదశ అనీ ఇక్కడ మళ్లీ స్పష్టం చేయడం మొదలవుతుంది. 1.52-54 శ్లోకాలలో పరమాత్మ యొక్క ఈ దశలను జాగ్రత్, సుషుప్తుల రూపంలో వర్ణించాడు. ఆ శ్లోకాల వల్ల 'బ్రహ్మ శరీరధారణ చేసి సృష్టిస్తాడు, తర్వాత అంతర్ధాన మవుతాడు' (1.7-12,51) అని చెప్పడం, ఈ ప్రక్షిప్త అపోహను కూడా తనకుతానే ఖండిస్తుంది. కాబట్టి పైన చెప్పిన 7-13 వరకు గల శ్లోకాలు కల్పితాలు.

(ఘ) బీజం నుంచి ఒక గుడ్డు పుట్టడం, అందులో ఒక్క బ్రహ్మమాత్రమే పుట్టడం, దాని నుంచి లోకాల నిర్మాణం, ఇదంతా కేవలం కల్పనే 1.7-12. కాబట్టి మనువు ద్వారా చెప్పబడినదే మౌలికమైనవీ అవే ముఖ్యమైన విషయాలనీ తెలిసిపోతూంది. కల్పిత శ్లోకాలన్నీ మనువు చెప్పిన అభిప్రాయాలకు వ్యతిరేకమని స్పష్టంగా తెలుస్తూంది.

(జ) సమస్త స్థావరజంగమ జగదుత్పత్తి మహత్, అహంకారం, పంచభూతాల క్రమంలో జరిగిందన్నాడు మనువు. (1.14,16,18-21,74-78). కానీ ఈ చోట స్థావరాల ఉత్పత్తి గుడ్డు నుంచి (1.12,13), ప్రాణుల ఉత్పత్తి విరాట్ ద్వారా (32-40) అనీ ఉంది.

(చ) ఒక్కసారిగా అనేక ప్రాణుల, పదార్థాల సృష్టి జరిగిందన్నాడు మనువు-**'వ్యంజయన్ ఇదం'** (1.6). **'సర్వేషాం తు స నామాని కర్మాణి చ పృథక్ పృథక్'**, **'అగ్ని వాయు రవిభ్యస్తు'** (1.21,23), **'ద్వంద్వైరయోజయేచ్చేమాః సుఖదుఃఖాదిభిః ప్రజాః'** (1.27), **'యం తు యస్మిన్ కర్మణి'** (1.28), **'బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం శూద్రం చ నిరవర్తయత్'** (1.31). దీనివల్ల కేవలం బ్రహ్మ అతని వంశం వల్ల సృష్టి ప్రారంభమైందనటం మనువుకు వ్యతిరేకమూ, ప్రక్షిప్తమూ అని స్పష్టమవుతూంది. ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే, ఇన్ని ఎక్కువ శ్లోకాలలో మనువు స్పష్టమైన పదాలతో వేర్వేరు రకాల సృష్టి ఉత్పత్తిని గురించి, అదీ బ్రహ్మద్వారా సృష్టి జరిగిందన్న విషయానికి ముందే చెప్పటం. (1.32-40). అయినా ప్రక్షిప్తకారులు బ్రహ్మ వంశం నుంచి సృష్టి ప్రారంభమైందని చెప్పే దుస్సాహసం చేసి, పాఠకులు వాటిని కూడా మౌలిక మనుకుంటారని సంతృప్తి చెందారు. ఈ 1.32-40 శ్లోకాలు బ్రహ్మ వంశం ద్వారా సృష్టి జరిగిందన్న వాటికి (1.32-40) ముందున్నాయి. ఇవి కాకుండా ఇంకా ఇతర ప్రమాణాలు అనేకం ఉన్నాయి. బ్రహ్మ ఉత్పత్తి, అతని వంశం వల్ల ఇతర సృష్టి జరిగిందనడం కపోల కల్పితమూ, నిరాధారమూ, మనువుకు వ్యతిరేకమూ, తర్కవిరుద్ధమూ.

(ఛ) 'జరాయుజ, అండజ, ఉద్భిజ, స్వేదజాలు అయిన ప్రాణులు, స్థావరాల సృష్టి ఒకటేసారి జరగడం (1.43-49), "కర్మాత్మానః శరీరిణః" (1.53-54) మొదలైనవి.

(జ) ఒకవేళ బ్రహ్మ, విరాట్‌ల వంశాల నుంచే మన ఉత్పత్తి జరిగిందని భావించినా, సృష్టి ప్రారంభంలో పరమాత్మ చేసిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రుల విభజన ఎలా జరుగుతుంది? దాని మీదే మొత్తం మనుస్మృతి ఆధారపడి ఉంది. వర్ణాలు వాటి ధర్మాల విషయమే తెలియకుండా అయిపోతుంది, ఇక వాటి ప్రసక్తే ఉండదు. అవసరం కూడా లేదు.

(ఝ) వేదాలను సాక్షాత్కరింపజేసుకున్న అగ్ని, వాయువు, ఆదిత్యుడు ఏ వంశం వారు?

(ఞ) బ్రహ్మ తన అర్ధభాగం నుంచి స్త్రీని సృష్టించి, విరాట్‌ను ఉత్పన్నం చేశాడు. విరాట్ ఏ స్త్రీ వల్ల మనువును పుట్టించాడు?

(ట) మొదటి శ్లోకంలో చెప్పిన మనువు దగ్గరికి వచ్చి ప్రశ్నలు అడిగిన మహర్షులందరూ ఎలా పుట్టారు? వారంతా ఏ వంశంవారు?

(ఠ) మనువు ఒక్కడి వల్లే వంశం కొనసాగి ఉంటే, అతడు వర్ణించిన ఎనిమిది రకాల వివాహాల (3.20-42) పరంపర ఎక్కడ, ఎట్లా ఏర్పడుతుంది? తల్లిదండ్రుల తరాలు, వారి వివాహసంబంధాలలో వదిలిపెట్టడం (3.5), ఎక్కడ రూపొందాయి? ఇటువంటి ఎన్నో ప్రశ్నలు బ్రహ్మకు సంబంధించిన విషయాన్ని ప్రక్షిప్తమని రూఢి చేస్తున్నాయి.

(డ) మనువు సృష్టి ఉత్పత్తినీ దాని క్రమాన్నీ సందర్భానుసారంగా 1.73-80 శ్లోకాలలో మళ్లీ చెప్పాడు. అక్కడ బ్రహ్మను గురించి ఏమీ రాయలేదు. అందువల్ల బ్రహ్మను గురించిన విషయం మనువు రచన కాదని తెలుస్తూంది. ఇది మౌలికమైతే దాని క్రమంలో కూడా దాన్ని గురించి ఎక్కడో ఒకచోట చెప్పబడి ఉండేది.

4. విషయ వ్యతిరేకాలు

ఈ విషయం 'విషయ వ్యతిరేకాలు' అనే ప్రమాణం ఆధారంగా అసంగతమూ, ప్రక్షిప్తమూ అని తెలుస్తూంది-

(క) సమస్త స్థావర జంగమాలు, జగత్తు-వీటి ఉత్పత్తిని మనువు మహదాది క్రమంలోనే భావించాడు. ఆ క్రమం 1.16తో పూర్తి అవుతుంది. ద్యులోకం, పృథ్వి, సముద్రం మొ॥ స్థావర జగత్తు, బ్రహ్మ ఉత్పత్తి ఆ క్రమంలో సంపూర్ణం కావడం వల్ల ముందుగానే చెప్పేశాడు. అసలది అసంభవం! ఇలా 7-13 శ్లోకాలలోని విషయం అసంగతం కనుక విషయవ్యతిరేకం.

(ఖ) తొమ్మిది, పదకొండవ శ్లోకాలలో బ్రహ్మవర్ణన విషయానికే సంబంధమున్నది. వాటి మధ్య 'నారాయణః' పేరుకు వ్యుత్పత్తి చెప్పటం అసందర్భం. ఇక్కడ 'నారాయణ' పేరుకు ఎటువంటి సందర్భమూ లేదు. అటువంటి పేర్లకు వ్యుత్పత్తి చెప్పటం అవసరం కూడా కాదు. ఈ విషయపు ప్రక్షిప్తతకు 1.32-41, 50-51 శ్లోకాల సమీక్ష చూడండి.

14 నుండి 16వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ప్రకృతి నుండి పంచమహాభూతాల సృష్టి-

ఉద్బబర్హాఽఽత్మనశ్చైవ మనస్సదసదాత్మకమ్ । మూలశ్లోక సం. **7**
మనసశ్చాప్యహంకారమభిమన్తారమీశ్వరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***14***

టీక:- చ = మరియు మళ్ళీ ఆ పరమేశ్వరుడు, **"ఆత్మనః ఏవ"** = స్వాశ్రయ-స్థితకృతిలో, **సద్+అసద్+ఆత్మకమ్** = కారణరూపంలో ఉంటూ, వికారియైన అంశంతో కార్యరూపంలోనూ ఉండే స్వభావం గల, **మనః**= మహత్ నామక

తత్త్వమును, **చ** = మరియు, **మనసః అపి** = మహత్తత్త్వం నుండి, **అభిమన్తారం** = నేను ఉన్నాను అని అభిమానించే, **ఈశ్వరమ్** = సామర్థ్యం కలిగినది. (తర్వాతి శ్లోకంతో సంబంధం).

తాత్పర్యం:- ఆ పరమాత్మ ఆ కారణరూపంతో సదసదాత్మకం అయిన మహత్తును, ఆ మహత్తు నుండి అభిమానంతో కూడిన స్వకార్యాలు చేయడంలో నేర్పరి అయిన అహంకారాన్ని సృష్టించాడు.॥14॥

మహాంతమేవ చాఽఽత్మానం సర్వాణి త్రిగుణాని చ । మూలశ్లోక సం. **8**
విషయాణాం గ్రహీతౄణి శనైః పఞ్చేన్ద్రియాణి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***15***

టీక:- అహంకారమ్ = అహంకారనామక తత్త్వమును, **చ** = మరియు మళ్ళీ దాని నుండి, **సర్వాణి త్రిగుణాని** = త్రిగుణాత్మకమైన సర్వ పంచతన్మాత్రలను, శబ్దస్పర్శరూప-రస-గంధములు, [1.19,27] **చ** = మరియు, **ఆత్మానం ఏవ మహాన్తమ్** = ఆత్మోపకారకం, లేదా నిరంతర గమనశీలియైన మనస్సనే ఇంద్రియాన్ని, **చ** = మరియు, **విషయాణాం గ్రహీతౄణి** = విషయాలను గ్రహించునట్టి, **పంచేంద్రియాణి** = రెండు వర్గాలకు సంబంధించిన జ్ఞానేంద్రియాలను (చక్షుశ్రోత్రజిహ్వాఘ్రాణము), కర్మేంద్రియాలను (హస్త-పాద-వాక్-పాయూపస్థలు), [2.64-66] **శనైః** = యథాక్రమంగా, **ఉద్బబర్హ** = ఉత్పన్నం చేశాడు. 14,15 మిగిలిన వాటి ఉత్పత్తి తరువాతి శ్లోకంలో.

తాత్పర్యం:-మహత్తత్త్వమును, దాని నుండి ఆత్మకు ఉపకారకాలైన సత్త్వరజస్తమోగుణాలు గల అన్నింటినీ, విషయ గ్రహణశక్తిగల అన్ని ఇంద్రియాలనూ (జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలను) క్రమంగా ఉత్పన్నం చేశాడు.॥15॥

వివరణ: 14,15 శ్లోకాలకు సరియైన అర్థం:-

ఈ పై 14,15 రెండు శ్లోకాలకు సరియైన అర్థం తెలిసికోలేక, టీకాకారులు, ఆలోచనాపరులు భ్రమలో పడ్డారు. ఇక్కడ సృష్టి ఉత్పత్తి ప్రక్రియను ప్రతిక్రమంగా వర్ణించారు. “మనః సదసదాత్మకం” అనే శబ్దానికి ‘సంకల్ప వికల్పాత్మకమైన మనస్సు’ అని అర్థం చెప్పారు. అయితే మనసుకు ముందు అహంకారం, అహంకారానికి ముందు మహత్తు’ అని ఇలా అర్థం చెప్పారు. ఈ ప్రతిక్రమాన్ని క్రమబద్ధంగా నిరూపించలేకపోయారు. కారణం- 15వ శ్లోకంలో మహత్తత్త్వం తరువాత ఇంద్రియవర్ణన కనిపిస్తుంది. ఈ అర్థ భ్రాంతివల్ల వ్యాఖ్యాతలు ఈ శ్లోకాలకు సరియైన అర్థం తెలుసుకొనక భ్రాంతిపూర్వకమైన అర్థం చెప్పారు.

1. **సృష్ట్యుత్పత్తి ప్రక్రియ:-** సృష్టి ఉత్పత్తివిషయంలో మనుమహర్షి- సాంఖ్యదర్శనకారులు ఏకాభి ప్రాయంలో ఉన్నారు.

> **సత్త్వ రజ స్తమసాం సామ్యావస్థా ప్రకృతిః, ప్రకృతేర్మహాన్, మహతో ఽహంకారః, అహంకారాత్ పంచతన్మాత్రాణి, ఉభయమింద్రియమ్ । పంచతన్మాత్రేభ్యః స్థూలభూతాని, పురుష ఇతి పంచవింశతిర్గణః.**
>
> (సాంఖ్య. 1-126)

(సత్త్వం) శుద్ధం, (రజః) మధ్యమం, (తమః) జడము. ఈ మూడు వస్తువుల సామ్యావస్థయే ప్రకృతి. ఈ తత్త్వం కార్యరూపంలో మారకుండా మూలకారణరూపంలో ఉన్నప్పుడు దీనికి ‘ప్రకృతి’ అని పేరు. సమస్తకార్యానికి గల కారణావస్థయే ప్రకృతి. ప్రకృతినుండి మహత్తత్త్వం (బుద్ధి), దానినుండి అహంకారం, దాని నుండి పంచతన్మాత్రలు పంచ సూక్ష్మభూతాలు మరియు దశేంద్రియాలు, పదకొండవది మనస్సు. ఇవన్నీ కలిసి 24. 25 వది **‘పురుషుడు’** అంటే **‘జీవుడు’**. వీటిలో ప్రకృతి అవికారిణి మరియు మహత్తత్త్వం, అహంకారం పంచసూక్ష్మభూతాలు ప్రకృతి కార్యాలు. ఇంద్రియాలకు, మనస్సుకు, సూక్ష్మభూతాలకు కారణం పురుషుడు. జీవుడు దేనికీ ‘ప్రకృతి’ కాదు. అంటే ‘ఉపాదానకారణం’ కాదు. కార్యమూ కాదు.

2. మహత్తత్త్వం-మనస్సు అంటే ఏమిటి?

మనస్సు, మహత్, బుద్ధి ఈ శబ్దాలు పర్యాయవాచకాలుగా విభిన్న శాస్త్రాలలో కనిపిస్తున్నవి. ఈ శ్లోకం మొదటి పంక్తిలో ఉన్న **'మనః'** శబ్దం ఆద్యకార్యతత్త్వమైన మహత్తు. మనస్సనే ఇంద్రియం ప్రకృతికి ప్రథమ కార్యం కాజాలదు. ప్రకృతి యొక్క మొదటి వికారం **'మహత్'**. ఇక్కడ ఆ **'మహత్'** కే **'మనః'** శబ్దం ప్రయోగింపబడినది. ఇందుకు ప్రమాణం సాంఖ్యదర్శనం **"మహదాఖ్యం ఆద్యం కార్యం తన్మనః"** (1-72) ప్రకృతిలో జరిగే మొదటి కార్యానికి **'మహత్'** అని పేరు. దానికే మరొక పేరు 'మనస్సు'. 15వ శ్లోకం- మొదటి పంక్తిలో ఉన్న **'మహాన్తం'** శబ్దానికి 'మన'స్సనే ఇంద్రియమని అర్థం. **'ఆత్మానం'** అనే విశేషణ ప్రయోగముంది. ఆత్మతో సంబంధమున్నది మనస్సనే ఇంద్రియానికే గదా ! **'అత-సాతత్యగమనే'** అనే ధాతువు నుండి **'ఆత్మా'** అనే శబ్దం పుడుతుంది. దానికి 'నిరంతరం గమనశీల'మని అర్థం. అలాంటి స్వభావం ఒక మనస్సుకే ఉంది. ఈ విధంగా పై రెండు శ్లోకాలకు నిర్భ్రాంతం, ఉచితక్రమయుక్తమైన అర్థం వస్తుంది. చరకశాస్త్రంలో శారీరక స్థానంలో 1.62-66 శ్లోకానికి ఈ ప్రక్రియనే ప్రామాణికంగా అంగీకరించి వర్ణన చేశారు.

3. 'ఆత్మనః ఉద్ బబర్హ' శబ్దానికి అర్థం

ఇక్కడ **'ఆత్మనః ఉద్‌బబర్హ'** పద ప్రయోగంతో భ్రాంతి కలుగకూడదు. నవీన వేదాంతులు చెప్పినట్లు మనస్సు మొ॥ తత్త్వాలు పరమేశ్వరుణ్ణి ఏదో ఒక అంశం నుండి జనించినవని చెప్పడం భ్రాంతిదాయకమే. మను. 12.24లో ప్రకృతి పర్యాయవాచీ రూపం ఆత్మా పదము ప్రయోగించబడింది. ఆత్మా నామక ప్రకృతి సత్త్వ-రజ-తమ స్సుయుక్తమైనది. దీని ప్రథమ వికార్ 'మహాన్' వున్నది. ఈ శ్లోకం యొక్క అభిప్రాయం. ఈ తత్త్వాలన్నీ స్వాశ్రయస్థిత ప్రకృతి నుండి ఉత్పన్నమై ప్రకటింపబడినవని దీని అభిప్రాయం. బ్రహ్మవ్యాపకం. ప్రకృతి వ్యాప్యం. అంతర్వ్యాప్యమైన ప్రకృతి యొక్క పరమాణువులను కారణం నుండి స్థూలజగత్తును నిర్మించి, బాహ్యంగా స్థూలరూపంచేసి, తాను అందులోనే వ్యాపకమై సూక్ష్మభూతుడై ఆత్మానందమయుడవుతున్నాడు ఏది దేనికంటే సూక్ష్మమో అది దానికి ఆత్మ. అంటే స్థూలంలో సూక్ష్మం వ్యాపకమవుతుంది (ఋ.భా.భూ.41). లోహంలో అగ్ని ప్రవేశించి లోహమంతటా వ్యాపించి ఉన్నట్లు. ఈ విధంగా మహత్ మొ॥ వాటికి 'ప్రకృతి' ఆత్మ. అందువల్ల ఇచ్చట **'ఆత్మనః'** శబ్దానికి 'ప్రకృతి' అని అర్థం. ఇందుకు ఈ అధ్యాయంలోని 1.53,54,57 శ్లోకాలు ప్రమాణాలు. ప్రళయావస్థలో సమస్తజగత్తు తన ప్రకృతిరూపంలో ఉంటూ, సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడి ఆశ్రయంలో లీనమైపోతుంది. మళ్లీ ఉత్పత్తి సమయంలో పరమేశ్వరుడు తన ఆశ్రయం నుండి వేరు చేసి జీవింపచేస్తాడు. ఆ యా తత్త్వాలన్నింటినీ కలుపుతాడు.

పంచమహాభూతాల సృష్టివర్ణన-

ఇది మనుకృతం-ప్రామాణికం
మూలశ్లోక సం.**9**
ప్రక్షిప్త శ్లోక సం.**16**

తేషాం త్వవయవాన్సూక్ష్మాన్ షణ్ణామప్యమితౌజసామ్ ।
సన్నివేశ్యాఽఽత్మమాత్రాసు సర్వభూతాని నిర్మమే ॥

టీక:- తేషాం తు = పైన [14-15] వర్ణించిన తత్త్వాల నుండి, **అమితౌజసామ్** = అత్యధిక శక్తికలిగిన, **షణ్ణామపి** = ఆరు తత్త్వాలకు సంబంధించిన, **సూక్ష్మాన్ అవయవాన్** = సూక్ష్మములైన అవయవాలను అంటే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనే పంచతన్మాత్రలు, ఆరోది అయిన అహంకారానికి సంబంధించిన సూక్ష్మ అవయవాలను, **ఆత్మమాత్రాసు** = వాటికి గల ఆత్మభూత తత్త్వాలకు సంబంధించిన వికారి అంశాలు, అంటే కారణాలతో కలిపి, **సర్వభూతాని** = సమస్త పంచసూక్ష్మ-మహాభూతా లను-ఆకాశం, వాయువు, అగ్ని, జలం మరియు పృథ్వులను, **నిర్మమే** = సృష్టించాడు.

తాత్పర్యం:- పైన చెప్పిన అహంకారం యొక్క దాని తన్మాత్రల యొక్క సూక్ష్మావయవాలను వాటి ఆరు వికారాలలో సమస్త పంచసూక్ష్మ మహాభూతాలను- ఆకాశం, వాయువు అగ్ని, జలం మరియు పృథ్వులను సృష్టించాడు.

వివరణ:

1. **పంచతన్మాత్రల నుండి పంచ మహాభూతాల సృష్టి** -ఏది దేనికంటే సూక్ష్మమో, అది ఆ స్థూలానికి ఆత్మ. అహంకారం నుండి పంచతన్మాత్రల సృష్టి జరిగింది. అందువల్ల అహంకారం పంచతన్మాత్రలకు **'ఆత్మ'** అనబడుతుంది. పంచభూతాల రచనా ప్రక్రియ క్రమం ఇలా జరిగింది.

పంచతన్మాత్రలకు ఆత్మరూపతత్త్వం అహంకారం. దానికి సంబంధించిన వికారి అంశం ఆకాశం. దాని యొక్క సూక్ష్మావయవాలైన శబ్దతన్మాత్రలతో కలిసినప్పుడు **'ఆకాశ'** మనే సూక్ష్మ మహాభూతం రచింపబడుతుంది. అదేవిధంగా వాయువుకు ఆత్మభూతమైన తత్త్వం ఆకాశం. దాని యొక్క వికారిభూతమైన అంశము వాయువు. వాయువు యొక్క సూక్ష్మభూతమైన స్పర్శ తన్మాత్రలు కలిసినప్పుడు **'వాయువు'** అనే మహాభూతసృష్టి జరుగుతుంది. అగ్నికి ఆత్మభూతమైన తత్త్వం వాయువు. దాని యొక్క వికారి అంశతో-అంటే అగ్ని యొక్క సూక్ష్మ అవయవమైన రూపతన్మాత్రల సంయోగంతో **'అగ్ని'** అనే మహాభూత సృష్టి జరుగుతుంది. జలానికి ఆత్మభూతతత్త్వం **'అగ్ని'**. దాని వికారాంశ జలం యొక్క సూక్ష్మావయవమైన రస తన్మాత్రలతో కలసినప్పుడు జలమనే మహాభూతం సృష్టించబడుతుంది. పృథ్వి యొక్క ఆత్మభూతతత్త్వం జలం. జలం యొక్క వికారి అంశం పృథ్వి, పృథ్వి యొక్క సూక్ష్మావయవమయిన గంధ తన్మాత్రలతో కలిసినప్పుడు **'పృథ్వి'** అనే మహాభూతం ఏర్పడుతుంది. [1.75-78 సమీక్ష చూడండి]

2. 16వ శ్లోకానికి సరియైన అర్థం

టీకాకారులందరూ ఈ శ్లోకానికి అసంగతమైన అర్థాన్నే చెప్పారు. (1) **"సర్వభూతాని నిర్మమే"** అనే దానికి **'సర్వప్రాణులను సృష్టించా'**డని అర్థం చెప్పారు. ఇక్కడ ఆ సందర్భమేమీ లేదు. ప్రాణ సృష్టి జరిగిందని చెప్పడంవల్ల ప్రాణుల ఉత్పన్నం పూర్తికాదు. రాబోయే 19,20 శ్లోకాలలో వర్ణించబడిన జగదుత్పత్తి పునరుక్తమవుతుంది. ఆరు సూక్ష్మావయవాల నుండి ప్రాణి జగత్ జన్మించినట్లు అంగీకరించినట్లయితే 19వ శ్లోకంలో చెప్పబోయే సప్తావయవాల నుండి జగద్రచన కల్గినదనే విషయం భిన్నమవుతుంది. కాబట్టి ఇక్కడ పంచభూతాల విషయమే సంగతం. ఇప్పుడే సృష్ట్యుత్పత్తికి సంబంధించిన మూలతత్త్వాల వర్ణన జరుగుతుంది. 15వ శ్లోకంలో ఇంద్రియాల ఉత్పత్తిని వర్ణించిన తరవాత పంచభూతాల క్రమం వస్తుంది. ఆ విషయమే ఈ శ్లోకం (15)లో సూచించాడు. ఈ విధంగా సర్వభూతాల ఉత్పత్తి వర్ణన క్రమబద్ధంగా జరుగుతుంది. 1.74-78వరకు గల శ్లోకాలలో ఈ విషయమే వర్ణించబడింది. ఇదే విధంగా పై శ్లోకాలలో పంచభూతముల సృష్టి ఉత్పత్తి గురించే వర్ణించడం జరిగింది. ఈ అర్థం చెప్పడంలో సంబంధం కుదురుతుంది. క్రమబద్ధం చేయబడుతుంది. విరోధంలేదు. భ్రాంతి దూరమవుతుంది-

3. సృష్ట్యుత్పత్తి విషయంలో వేదశాస్త్రాల అభిప్రాయం.

ప్రశ్న-ఏకమతమైతే-సృష్టివిషయంలో వేదాది శాస్త్రాలు- ఏకమతమా, భిన్నమా?

జవాబు- ఏకమతమే

ఏదైనా అవిరోధమైతే ?

"తస్మాద్వా ఏకస్మాదాత్మనః ఆకాశః సంభూతః ।
ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః ।
అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః, ఓషధిభ్యోఽన్నమ్,
అన్నాద్రేతః, రేతసః పురుషః । స వా ఏష
పురుషోఽన్నరసమయః" (తైత్తిరీయోపనిషత్ వచనం. బ్రహ్మవల్లీ. అను-1)

ఇది తైత్తిరీయోపనిషద్వచనం- ఆ పరమేశ్వర ప్రకృతుల నుండి 'ఆకాశం' అంటే 'అవకాశం పుట్టింది. అంటే అంతటా వ్యాపించి ఉన్న కారణరూప ద్రవ్యాన్ని ఒక చోట ప్రోగుచేసినట్లయితే ఆకాశం ఉత్పన్నమవుతుంది. వాస్తవంగా ఆకాశం ఉత్పన్నం కాదు. కారణం? ఆకాశం లేనట్లయితే ప్రకృతి, దాని పరమాణువులు ఎక్కడ ఉండగలవు? ఆకాశం తరువాత వాయువు, తదనంతరం అగ్ని, దాని తరువాత జలం, జలం నుండి పృథ్వి, పృథ్వినుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నం, అన్నం నుండి రేతస్సు, రేతస్సు (వీర్యము) నుండి **'పురుషుడు'** అంటే **'శరీరం'**.

ఇక్కడ ఆకాశాదిక్రమంలో **'ఛాందోగ్య'**ంలో అగ్న్యాది, **'ఐతరేయ'**మున జల ఆదిక్రమాన్ననుసరించి సృష్టి ఏర్పడింది. వేదాలలో ఒకచోట పురుషుడి నుండి మరొక చోట హిరణ్యగర్భాదుల నుండి, మీమాంసా దర్శనంలో కర్మనుండి, **'వైశేషిక దర్శనం'**లో కాలం నుండి, **'న్యాయదర్శనం'**లో పరమాణువుల నుండి, **'యోగశాస్త్రం'**లో పురుషార్థం వల్ల, **'సాంఖ్యదర్శనం'**లో ప్రకృతి నుండి, **'వేదాంతదర్శనం'**లో బ్రహ్మ నుండి సృష్టి ఉత్పన్నమైందని చెప్పబడింది. అయితే ఏది నిజం? ఏది అబద్ధం?

జవాబు: ఇందులో అన్నీ సత్యాలే. అబద్ధమొక్కటీ లేదు. విపరీతంగా భావించుటే అసత్యం. కారణం? జగత్తుకు పరమేశ్వరుడు చేతన నిమిత్తకారణం. ప్రకృతి ఉపాదానకారణం. మహాప్రళయంలో ఆకాశ వాయువులకు ప్రళయం రాదు. అగ్న్యాదులకు ప్రళయం సంభవిస్తుంది. అగ్ని ఆది క్రమాన్ననుసరించి విద్యుత్ (అగ్ని) నష్టం కానప్పుడు జలక్రమం ననుసరించి సృష్టి జరుగుతుంది. ఏ ప్రళయంలో ఎక్కడవరకు నష్టమవుతుందో అక్కడి నుండియే సృష్టి ఉత్పన్నమవుతుంది. హిరణ్యగర్భ-పురుష నామాలన్నీ పరమేశ్వరుడికి చెందినవే.

కానీ ఒక కార్యంలో ఒకే విషయంలో విరోధముంటే- అది విరుద్ధమనబడుతుంది. షట్ శాస్త్రాలందున్న అవరోధమును చూడండి. - మీమాంసాశాస్త్రం- **'ప్రపంచంలో కర్మ (చేష్ట) లేనిదే కార్యముండదు'** అంటుంది. వైశేషికం-**'సమయంతో సంబంధం లేకుండా ఏ కార్యముండదు'** అంటుంది. న్యాయదర్శనం- **'ఉపాదానకారణం లేనిదే ఏదీ జరుగదు'** అంటుంది. యోగదర్శనం- **'పురుషార్థం లేనిదే సృష్టిరచన జరుగదు'** అంటుంది. సాంఖ్యశాస్త్రంలో తత్వాలు కలువకుండా సృష్టి జరుగదు. వేదాంత శాస్త్రంతో చేసేవాడు చేయక పోతే ఏ పదార్థం కూడా ఉత్పన్నం కాదు. కాబట్టి సృష్టి క్రియ ఆరు కారణాలను బట్టి సంభవిస్తుంది. ఈ ఆరు కారణాలకు వ్యాఖ్యానంగా ఒక్కొక్కదానికి ఒక్కొక్క శాస్త్రముంది. అందువల్ల వీటిలో విరోధ మేమీ లేదు. ఆరుగురు పురుషులు కలిసి ఒక దూలమునెత్తి గోడమీద పెట్టినట్లు ఆరుగురు శాస్త్రకారులు కలిసి ఈ సృష్టికార్యానికి వ్యాఖ్యచేశారు (స.ప్ర.సం. 8).

ఈ క్రింది శ్లోకం ప్రక్షిప్తం ప్రామాణికం కాదు

* బ్రహ్మశరీరనిర్వచనం-

* *యన్మూర్త్యవయవాస్సూక్ష్మాస్తస్యేమాన్యాశ్రయంతి షట్ ।*
తస్మాచ్ఛరీరమిత్యాహుస్తస్య మూర్తిం మనీషిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **17**

తాత్పర్యం:-ఏ కారణంచేత శరీర సంపాదకములైన అహంకారతన్మాత్రారూపాలైన సూక్ష్మావయవాలు ఆరూ ప్రకృతిసహితుడయిన బ్రహ్మయొక్క మూర్తిని, ఇంకా చెప్పేవీ, ముందు చెప్పినవీ, అయిన భూతేంద్రియాలు కార్యరూపంలో ప్రవేశిస్తున్నవి కాబట్టి, ఆ బ్రహ్మమూర్తిని శరీరమని (ఆరింటి యొక్క చేరిక అని) పండితులు చెబుతారు.

ప్రక్షిప్తానుశీలన:

ఈ 17వ శ్లోకం క్రింది ప్రకారంగా ప్రక్షిప్తం.

ప్రసంగవిరోధం:- క. ఇక్కడ సృష్ట్యుత్పత్తి క్రమం నడుస్తున్నది. 16వ శ్లోకంలో వర్ణించిన ఉత్పత్తి ప్రక్రియయొక్క క్రమబద్ధ సంబంధం 18వ శ్లోకంలో ఉన్నది. ఈ రెండింటి మధ్యలో ఆ క్రమాన్ని భంగంచేసి 'శరీర' నిర్వచనం చేయుట అసందర్భం.

ఖ. పైన చెప్పబడిన శ్లోకాలలో 'మూర్తి' శబ్దంగాని, శరీర శబ్దంగాని రాలేదు. ఆ సందర్భంలో ఈ విషయం చెప్పడం గాని, వాటికి నిర్వచనమివ్వడం గానీ అవసరం లేదు. సందర్భచర్చ లేకుండా 'శరీర' నిర్వచనం ఇచ్చుట అసందర్భం. కావున ఇది మౌలిక శ్లోకం కాదు.

18 నుండి 23వ శ్లోకం వరకు మనుకృతం-ప్రామాణికం

సూక్ష్మశరీరంతో ఆత్మసంయోగం-

తదావిశన్తి భూతాని మహాంతి సహ కర్మభిః । మూలశ్లోక సం.10
మనశ్చావయవైస్సూక్ష్మై స్సర్వభూతకృదవ్యయమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.18*

టీక:-తదా = అప్పుడు, అంటే జగత్తుకు సంబంధించిన తత్త్వముల సృష్టి జరిగినప్పుడు, **సహకర్మభిః** = తమ తమ కర్మలతో, **మహాంతి భూతాని** = శక్తిశాలియైన సమస్త సూక్ష్మమహాభూతాలు, **చ** = మరియు, **సూక్ష్మైః అవయవైః మనః** = సమస్త, సూక్ష్మావయవాలు - ఇంద్రియాదులు, మనస్సు, **సర్వభూతకృత్ అవ్యయమ్** = సమస్త భౌతిక ప్రాణిశరీరాలకు జన్మనిచ్చే, అవినాశి ఆత్మను, **ఆవిశన్తి** = ఆవేష్టితమవుతాయి. ఈ విధంగా సూక్ష్మ శరీర రచన జరుగుతుంది. జీవాత్మ సంయోగం వల్లనే సమస్త శరీరాలలో జీవం వస్తుంది. ఆ జీవాత్మతో వియోగం కలుగగా సమాప్తమవుతుంది.

తాత్పర్యం:- ఆ పంచతన్మాత్రల నుండి ఆకాశాది పంచమహాభూతాలు తమ తమ కార్యాలతో పాటు సృజింపబడినవి. తమ సూక్ష్మావయవాల సమేతంగా సమస్త ప్రాణులనొనర్చునట్టి అవినాశియైన మనస్సు కూడా జనించినది.

వివరణ:

1. **పంచమహాభూతాల కర్మలు:-** అవకాశాన్ని కల్పించడమే ఆకాశ కర్మ. గతినివ్వడం వాయువు పని. పక్వం చేయడం అగ్నిపని. ఏకీకరణం చేయడం జలం పని. ధరించడం పృథ్వి పని.

2. **18వ శ్లోకానికి సరియైన అర్థం:-** వాఖ్యాతలిచ్చిన అర్థమిది. **"వినాశరహితుడు సర్వ భూతాలకూ కర్త అయిన ఆ బ్రహ్మనుండి తమ తమ కర్మలతో మహాభూతాలైన ఆకాశాదులు, సూక్ష్మావయవాలతో కూడిన మనస్సు సృష్టించబడింది"** ఈ విధంగా అర్థం చెబితే ఈ క్రింది దోషాలు కలుగుతాయి.

క. ఈ అర్థంలో కొంత భ్రాంతి ఉంది. 1.14-15 శ్లోకాలలో మనస్సు యొక్క ఉత్పత్తి స్పష్టంగా వర్ణించబడింది. మళ్లీ మనస్సు యొక్క ఉత్పత్తి వర్ణించబడింది. రెండు శ్లోకాల తరువాత మళ్లీ మనస్సు యొక్క ఉత్పత్తిని గురించి చెప్పవలసిన అవసరం ఏముంది? అందువల్ల ఇది పునరుక్తి అవుతుంది.

ఖ. మనువు వ్రాసిన దానికి టీకాకారులు వ్రాసిన భావార్థానికి సంబంధం కుదరడంలేదు. 14-15 శ్లోకాలలో మనస్సు యొక్క వర్ణన చేయబడింది. 16వశ్లోకంలో సమస్త ప్రాణుల ఉత్పత్తి చూపబడింది. 17వ శ్లోకంలో పరమాత్మ యొక్క ప్రాకృతికరూప శరీరాన్ని నిర్వచించాడు. మరల 18వ శ్లోకంలో మళ్ళీ మనస్సు గురించి చెప్పబడింది. 19లో మరొక్కసారి జగదుత్పత్తి తెలుపబడింది. ఇలా ఒక క్రమం లేకుండా పోయింది.

గ. సృష్ట్యుత్పత్తిని ప్రారంభించిన మనుమహర్షి సర్వతత్త్వాల ఉత్పత్తిని వర్ణించిన తరవాత, ఆ తత్త్వాలకు ఆత్మతో గల సంయోగాన్ని చూపించడం జరింగింది. జీవుడికి తత్త్వాలతో సంయోగం ప్రదర్శించలేక పోయినట్లయితే ఉత్పత్తి వర్ణన అసంపూర్ణంగా ఉండిపోయేది. మనుధర్మశాస్త్రంలో ఈ విషయవర్ణన చాలా ఆవశ్యకం. కారణం? మానవధర్మమే మనుమహర్షికి అభీష్టవిషయం. కేవలం స్థూలజగత్తును వర్ణించడం ముఖ్యవిషయం కాదు. ప్రచలితమైన వ్యాఖ్యలలో ఈ

ప్రసంగం కనిపించదు. కానీ, వ్యాఖ్యాకారులు చేసిన ఈ లోపం వల్ల పాఠకులకు భ్రమకలుగుతుంది. వారికి సరియైన స్మృతిదృక్పథం కనిపించదు. ఈ మనుధర్మశాస్త్రంలో కేవలం ప్రకృతి పరమాత్మల విషయమే చెప్పబడలేదు. ప్రపంచంలోని మానవులు ఈ ప్రకృతి మాధ్యమంగా పరమేశ్వరుణ్ణి ఎలా పొందాలి? వారి జీవన విధానమెలా ఉండాలి? మొదలగు అనేక విషయాలు ఇందులో ఉన్నవి.

ఈ భాష్యం ద్వారా పైన చెప్పబడిన లోపం తొలగుతుంది. అన్యశాస్త్రాల లాగా సృష్ట్యుత్పత్తి వర్ణన సంపూర్ణం గానూ క్రమబద్ధం గానూ ఉంటుంది.

ఘ. సూక్ష్మశరీర సంఘటనం:- 5 ప్రాణాలు, 5 జ్ఞానేంద్రియాలు, 5 సూక్ష్మభూతాలు, మనస్సు, బుద్ధి = 17. ఈ తత్త్వాలకే సూక్ష్మశరీరమని పేరు. ఈ సూక్ష్మశరీరం జన్మ మరణాదులలో కూడా జీవుడితో కలిసి ఉంటుంది. (స.ప్ర.నవమ.స.) 5 జ్ఞానేంద్రియాలు, 5 సూక్ష్మభూతాలు, 1.14,15 శ్లోకాలలో పేర్కొనబడినవి. ప్రాణం, అపానం, వ్యానం, సమానం, ఉదానం ఇవి పంచప్రాణాలు.

సమస్తవినశ్వర ప్రపంచోత్పత్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

తేషామిదం తు సప్తానాం పురుషాణాం మహౌజసామ్ । మూలశ్లోక సం. **11**
సూక్ష్మాభ్యో మూర్తిమాత్రాభ్య స్సంభవత్యవ్యయాద్వ్యయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **19**

టీక:- ఈ విధంగా, **అవ్యయాత్** = వినాశరహితపరమాత్మ నుండి, రెండో అర్థంలో 'సృష్టికి మూలకారణమైన అవినాశి ప్రకృతిద్వారా'. **తేషాం తు** = ఉపరోక్తమైన (14-16,18 శ్లోకవర్ణితాలు), **మహౌజసామ్** = మహాశక్తిశాలి అయిన, **సప్తానాం పురుషాణాం** = ఏడుతత్త్వాల (మహత్, అహంకారం, పంచతన్మాత్రలు), **సూక్ష్మాభ్యః మూర్తిమాత్రాభ్యః** = జగత్పదార్థాలను నిర్మాణం చేసే సూక్ష్మ వికారి అంశాలతో, **ఇదం వ్యయమ్** = ఈ దృశ్యమాన వినాశశీల వికారరూపమైన జగత్తు, **సంభవతి** = ఉత్పన్నమవుతుంది.

తాత్పర్యం:- పరమాత్మ చేత పుట్టినవి; ఆత్మవృత్తిచేత తెలియదగినవి కాబట్టి పురుషములును, స్వకార్యసంపాదన చేత వీర్యవంతములై పంచమహాభూతాలు, మహత్తత్త్వం, అహంకారం అనే ఈ ఏడింటి యొక్క నిత్యములైన, కారణములైన మూర్తిమాత్రల వల్ల అనిత్యమైన కార్యరూప ప్రపంచం ఉత్పన్నమవుతుంది.

వివరణ:

ఈ కింద చూపబడే ప్రక్రియల ద్వారా వినాశశీలమైన సమస్త జగత్తు ప్రకటితమవుతుంది.

1. సృష్ట్యుత్పత్తి క్రమం: సృష్టించే సమయం రాగా ఆ పరమేశ్వరుడు సూక్ష్మపదార్థాలను ఒకచోటుకి చేరుస్తాడు. ప్రథమావస్థలో 'పరమసూక్ష్మ ప్రకృతి' రూప కారణం నుండి కొంచెం స్థూలమవుతుంది. ఆ స్థూలరూపమే 'మహత్తత్త్వం'. అంతకంటే కొంచెం స్థూలమైనరూపానికే 'అహంకార'మని పేరు. అహంకారం నుండి భిన్నభిన్నాలైన 'పంచసూక్ష్మభూతాలు'-'శ్రోత్రం, త్వక్, నేత్రం, జిహ్వా, ఘ్రాణం' అనే పంచ 'జ్ఞానేంద్రియాలు'. 'వాక్, పాణి, పాద, పాయు -ఉపస్థ' లనే 'పంచకర్మేంద్రియాలు'. 11వది మనస్సు కొంత స్థూలమై ఉత్పన్నమవుతుంది. ఆ పంచతన్మాత్రల నుండి అనేక స్థూల రూపాలను పొందుతూ మనకు కనిపించే పంచస్థూల భూతాలు క్రమంగా ఉత్పన్నమవుతాయి. వాటి నుండి రకరకాలైన ఓషధులు, వృక్షాదులు, వాటి ద్వారా 'అన్నం', దానినుండి రకరకాలైన 'వీర్యం', వీర్యం నుండి 'శరీరం' ఉత్పన్నమవుతుంది. కానీ ఆదిసృష్టి మైథున సృష్టికాదు. కారణం పరమాత్మ స్త్రీపురుషులను సృష్టించి ఆ శరీరాలలో జీవులను ప్రవేశపెట్టిన తరువాత మైథున సృష్టి ప్రారంభమవుతుంది (స.ప్ర.సము. 8).

2 పురుషుడిలోని మహత్తత్త్వాదులకు అర్థం: నిరుక్తం (2.1-3) లో పురుషశబ్దానికి వ్యుత్పత్తి ఇవ్వబడింది. పురి+శయః = పురుషః. దీన్ని బట్టి తన కార్యపదార్థాలలో సూక్ష్మరూపంగా శయనించే స్థిరంగా ఉండే మహత్తత్త్వాది సూక్ష్మతత్త్వాలకే 'పురుష' అని పేరు. శతపథ బ్రాహ్మణంలో వాయువు మరియు అగ్ని అను మహాభూతములకు 'పురుష' సంజ్ఞతో అభివర్ణించారు. (13.6.2.1; 10.4.1.6).

3 సృష్టిలో మానవుల ఉత్పత్తి

ప్రశ్న : మానవ సృష్టి ముందు జరిగిందా! లేక పృథివి మొదలైన పంచభూతాల సృష్ట్యా?

జవాబు : పృథివి మొదలైనవే ముందు పుట్టాయి. అవి లేకుండా మానవుడు ఉండటానికి, తినడానికి వీల్లేదు గదా ! (స.ప్ర.సము.8)

ప్రశ్న : సృష్టి ఆదిలో ఒకరిద్దరా జన్మించినది? లేక అనేకులా?

జవాబు : అనేకులు జన్మించారు. కారణం- ఏ జీవుల కర్మలు ఈశ్వర సృష్టిలో ఉత్పన్నం కావలసి ఉన్నవో, ఆ జన్మలను సృష్టి ఆదిలో పరమేశ్వరుడే కలిగిస్తాడు. ప్రమాణం-

"సాధ్యా ఋషయశ్చ యే తతో మనుష్యా అజాయన్త" యజు.31.9; శ.బ్రా.కాం.14.4.25.

ఈ విషయం యజుర్వేదంలో లభిస్తుంది. దీన్నిబట్టి, ఆదిలో అనేకమంది (వందలువేలు) మనుషులు ఉత్పన్నమైనట్లు నిశ్చితమవ్వడమే గాక; సృష్టిని చూసినప్పుడు, మానవులు అనేకమైన తల్లిదండ్రుల సంతతి అని స్పష్టమవుతుంది (స.ప్ర.సము.8వ సము).

ఇది మనుకృతం-ప్రామాణికం

పంచ మహా భూతాల-గుణ కథనం-

ఆద్యాద్యస్య గుణం త్వేషామవాప్నోతి పరః పరః । మూలశ్లోక సం.**12**
యో యో యావతిథశ్చైషాం స స తావద్గుణః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**20**

టీకా:- ఏషాం = ఈ శ్లోకాలలో చెప్పబడిన పంచమహాభూతాలలో గల, ఆద్య + ఆద్యస్య గుణం తు = పూర్వ పూర్వ భూతాల గుణాలు, పరః పరః = తరవాత తరువాత అనగా ఉత్తరోత్తర ఉత్పన్నమయ్యే భూతాలకు సంక్రమిస్తుంది. చ = మరియు, యః = ఏ యే భూతం, యావతిథః = ఏ సంఖ్యలో ఉందో; సః సః = అ యా భూతం, తావద్గుణః = అంతటి అధిక గుణయుక్తంగా, స్మృతః = గుర్తింపబడింది.

తాత్పర్యం:- ముందు చెప్పిన పంచమహాభూతాలలో ఆకాశం, వాయు, తేజో, జల, పృథ్వ్యాలలో మొదటి దాని గుణాన్ని రెండోది కలిగి ఉంటుంది. మరియు ఏది యేది ఎన్నోదో, అది అంత వరకు చెప్పిన దాని గుణాలు కలిగి ఉంటుంది. అంటే, రెండోది మొదటి దానిగుణం మరియు తన గుణం కలిగి ఉంటుంది. మూడోది మొదటిదాని రెండోదాని గుణాలతో పాటు తనగుణం కలిగి ఉంటుంది.॥20॥

ఉదా:-'ఆకాశం' శబ్ద గుణాన్ని,'వాయువు' శబ్దస్పర్శగుణాలను, 'తేజస్సు' శబ్ద స్పర్శ రూపాలను, 'జలం' శబ్ద స్పర్శ రూప రసగుణాలను, 'పృథివి' శబ్ద స్పర్శ రూప రస గంధములను గలది. అలాగే పృథివి మొదలు ఆకాశం వరకూ, పృథివి శబ్దస్పర్శరూపరసగంధములూ, జలం శబ్దస్పర్శరూపరసములూ, తేజస్సు శబ్దస్పర్శరూపములూ, వాయువు శబ్ద స్పర్శములూ, ఆకాశం శబ్దం మాత్రమే గలవి.

వివరణ:

పంచ మహా భూతాల క్రమం- గుణాలు: పంచమహాభూతాల నిశ్చితక్రమం- ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి. వీటిలో ఆకాశం ప్రథమస్థానంలో ఉంది. దీనికి తన గుణమైన శబ్దమే ఉంది. వాయువు

ద్వితీయస్థానంలో ఉన్నది. అందుకే వాయువుకు రెండు గుణాలున్నవి. మొదటిది ఆకాశగుణమైన శబ్దము, రెండవది తనదైన స్పర్శగుణము. ఇదేవిధంగా తృతీయస్థానంలో ఉన్న అగ్నిలో తనకంటే ముందున్న భూతాల గుణాలు- శబ్దం, స్పర్శలేగాక తనగుణమైన రూపం; నాలుగోస్థానంలో ఉన్న జలానికి ముందున్న మూడు గుణాలు తన గుణమైన రసము; ఐదోస్థానంలో ఉన్న పృథ్వియందు ముందున్న నాలుగు గుణాలు, తన గుణమైన గంధము కలిసి అయిదు గుణాలు ఉన్నాయి. **పంచభూతాల ఉత్పత్తి క్రమం-గుణాల పట్టిక.**

పంచభూతాల ఉత్పత్తి క్రమం	**ఆకాశం**	**వాయువు**	**అగ్ని**	**జలం**	**పృథివి**
1. ఆకాశపు నిజగుణం	శబ్దం	శబ్దం	శబ్దం	శబ్దం	శబ్దం
2. వాయువు నిజగుణం	×	స్పర్శ	స్పర్శ	స్పర్శ	స్పర్శ
3. అగ్ని నిజగుణం	×	×	రూపం	రూపం	రూపం
4. జల నిజగుణం	×	×	×	రసం	రసం
5. పృథ్వి నిజగుణం	×	×	×	×	గంధం
ఒక్కొక్క మహాభూతంలో ఉన్న గుణాలు	**1**	**2**	**3**	**4**	**5**

వేదశబ్దాల ద్వారా నామకరణం-విభాగం- ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేషాం తు స నామాని కర్మాణి చ పృథక్ పృథక్ । మూలశ్లోక సం.**13**
వేదశబ్దేభ్య ఏవాऽऽదౌ పృథక్ సంస్థాశ్చ నిర్మమే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**21**

టీక:- **సః** = ఆ పరమాత్మ, **సర్వేషాం తు నామాని** = సర్వపదార్థాల నామాలను (గోజాతికి గౌ అని, అశ్వజాతికి అశ్వమని మొ॥), **చ** = మరియు, **పృథక్ పృథక్ కర్మాణి** = భిన్న భిన్న కర్మలు (బ్రాహ్మణులకు వేదాధ్యయనం, యజనం, క్షత్రియులకు రక్షణ, వైశ్యులకు కృషి-గోరక్షణ, వ్యాపారాదులు, శూద్రులకు సేవ, ఇతర ప్రాణులకు హింస, అహింస మొ॥ కర్మలు) **పృథక్, పృథక్ సంస్థాః** = వేరువేరు విభాగాలు, (ప్రాణులలో మనుష్య పశుపక్షి ఆది వ్యవస్థలు, నాలుగు వర్ణాల వ్యవస్థ, **ఆదౌ** = సృష్టి ప్రారంభంలో, **వేదశబ్దేభ్యః, ఏవ** = వేద శబ్దాల ద్వారానే, **నిర్మమే** = నిర్మించాడు. వేదమంత్రాల ద్వారానే ఈ జ్ఞానాన్ని ఇచ్చాడు.

తాత్పర్యం:-సృష్టి ఆదిలోనే పరమాత్మ తాను సృజించిన సర్వభూతాలకు, వాటివాటి పరిణామాలకు మొదలగు వాటన్నిటికీ వేదాల్లో చెప్పబడిన పేర్ల నే తీరుగా ఏర్పరచినాడో, అలాగే వాటికి కర్మలను, ఆ యా లౌకిక వృత్తులనూ ఏర్పరిచాడు. ॥21॥

వివరణ:

1. ఈ శ్లోకార్థాన్ని వివరిస్తూ మహర్షి దయానందులు ఈ విధంగా వ్యాఖ్య చేశారు.

ఈ వచనానుకూలంగా ఆర్యులు వేదాలననుసరించి ఏర్పాటుచేసిన వ్యవస్థ సర్వత్ర ప్రచలితమైనది. ఉదాహరణకు-సమస్తజగత్తులో వారాలు 7, మాసాలు 12, రాసులు 12. ఈ వ్యవస్థను చూడండి (పూనా ప్రవచనం). వేదోక్త విషయం **"శాశ్వతీభ్యః సమాభ్యః"** (యజు.40.8) అంటే అది సనాతన జీవరూప ప్రజలకు పరమేశ్వరుడు వేదం ద్వారా సర్వవిద్యల జ్ఞానం కలుగజేశాడు (స.ప్ర.208).

2. సృష్టి ప్రారంభంలో నామకరణం: సృష్టి ప్రారంభంలో వేదశబ్దాల ద్వారానే మనుషులకు పేర్లు, కర్మ, విభాగాలు మొ॥వాటి జ్ఞానం లభించింది. పరమేశ్వరుడు వేదశబ్దాల రూపంలో ఈ జ్ఞానాన్ని కలుగజేశాడు. 'నిర్మమే' అనడంలో భావమిది-నామములు, కర్మలు, విభాగములు మొ॥ వాటి జ్ఞానం వేదశబ్దాలలో అంతర్నిహితం చేసి ప్రజలకు అవగాహన చేశాడు.

3. 21వ శ్లోక క్రమంపై విచారణ:- క్రమదృష్టిలో ఈ శ్లోకం 15వ శ్లోకం తరువాత ఉండవలసినది. సృష్టి దృష్టితో చూసినా క్రమాన్ని బట్టి చూసినా 15 తరువాతనే ఉండతగినది. కారణం? వేదాల ప్రస్తావన తరువాతనే, వ్యవహారముల జ్ఞానం కలుగుతుంది. అంతకుముందు కలుగదు. ఆ విధంగా క్రమం ఉచితంగా లేదు. 12వ శ్లోకంలో సృష్టి ఉత్పత్తి ప్రక్రియ వర్ణించడం జరిగింది. 14వ శ్లోకంలో ఆ ప్రసంగం సమాప్తమవుతుంది. ఈ ప్రసంగాల మధ్య వేదశబ్దాల ద్వారా నామకరణం మొ॥ జ్ఞానం కలిగిందని చెప్పడం అసంగతం, అసందర్భం కూడా.

4. 21వ శ్లోకానికి సరియైన అర్థం: వ్యవస్థలకు ఉదాహరణంగా కుల్లూకభట్టు- "కుమ్మరి కుండలు చేయడం, సాలె నేతనేయడం చూపాడు. ఈ ఉదాహరణ సరియైనదికాదు. మనుమహర్షికి విరుద్ధమైనది. ఇక్కడ వ్యవస్థలకు- వర్ణవ్యవస్థ వ్యవస్థలని పేరు. ఈ అధ్యాయంలో 21వ శ్లోకంలో 'కర్మానుసారంగా పరమేశ్వరుడు నిర్మించిన వ్యవస్థ' అని వర్ణించడం జరిగింది. కేవలం నాలుగు వర్ణాలే మను ప్రోక్తాలు. వారి అభిప్రాయం ప్రకారం కులాలుడు (కుమ్మరి), తన్తువాయుడు (సాలె) మొ॥ జాతి ఉపజాతులు కాదు. వారికి చెప్పబడిన కర్మలున్నూ ఈశ్వర కల్పితం కాదు. శిల్పకార్యం వైశ్యుల కృత్యమని మను అభిప్రాయం. ఏ రకమైన శిల్పకర్మచేసినా అది వైశ్య కర్మే అవుతుంది. కులాలుడు (కుమ్మరి) గానీ తన్తువాయుడు (సాలె) గానీ కాదు. మను వ్యవస్థననుసరించి ఈవేళ కుండలు చేసేవాడు, రేపు గుడ్డలు కూడా నేయవచ్చు, ఆ మరునాటిరోజు మరొక పని చేయవచ్చు.....అయినప్పటికీ అతడు వైశ్యుడని పిలువడం జరుగుతుంది. అంతేగాని, కుమ్మరి, సాలె అని పిలువబడదు. కారణం? ఇలాంటి జాతులను గాని, ప్రత్యేకించి కర్మలను గాని మనువు వర్ణించలేదు.

వర్ణవ్యవస్థ శిథిలమైన తరువాత, కార్యరూఢిని ఆధారంగా చేసికొని ఈ జాతులు, ఉపజాతులు కల్పించి ఈ వర్ణ వ్యవస్థను ఉదాహరించడం గొప్ప పొరపాటు. మనుధర్మ వ్యవస్థకు ఇది విరుద్ధమైనది.

ఇది మనుకృతం-ప్రామాణికం

సమాహార రూపంలో సమస్త జగదుత్పత్తి వర్ణన-

కర్మాత్మనాం చ దేవానాం సోఽసృజత్ప్రాణినాం ప్రభుః । మూలశ్లోక సం.**14**
సాధ్యానాం చ గణం సూక్ష్మం యజ్ఞం చైవ సనాతనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**22**

టీక:- 1వ అధ్యాయంలో-6వ శ్లోకం నుండి 20వ శ్లోకం వరకు వర్ణించిన ప్రక్రియానుసారంగా **సః ప్రభుః** = ఆ పరమాత్మ, **కర్మాత్మనాం దేవానాం** = కర్మ స్వభావంగా గల సూర్య, అగ్ని, వాయువు మొ॥ దేవతల యొక్క **ప్రాణినాం** = మనుష్య, పశు, పక్షి మొ ॥ సామాన్య ప్రాణుల యొక్క, **చ** = మరియు, **సాధ్యానాం** = సాధక శ్రేణికి చెందిన విద్వాంసుల యొక్క, **గణమ్** = సముదాయాన్ని, **సనాతనం సూక్ష్మం యజ్ఞం ఏవ** = సృష్టి ఉత్పత్తికాలం నుండి ప్రళయం వరకు నిరంతర ప్రవాహమానమైన సూక్ష్మ సంసారం అంటే మహత్, అహంకారం పంచతన్మాత్రలు మొ॥ సూక్ష్మరూపమయం మరియు సూక్ష్మ శక్తియుత సంసారాన్ని (జగత్తును), **అసృజత్** = సృష్టించాడు.

తాత్పర్యం:-ఆ పరమాత్మ కర్మాత్ములైన దేవతలనూ (సూర్య, అగ్ని వాయువు మొ॥), ప్రాణి సమూహాలనూ, పాషాణాదులనూ, సూక్ష్మజ్ఞానులైన సాధ్యులనూ, నిత్యములైన యజ్ఞములనూ సృష్టించాడు.॥22॥

వివరణ:

1. 22వ శ్లోకానికి సరియైన అర్థం:-

కుల్లూకభట్టాదులు సూక్ష్మశబ్దాన్ని విశేషణంగా చేసి, సాధ్య శబ్దానికి -సూక్ష్మయోని విశేషమని అర్థం చెప్పారు. ఇది కేవలం మిథ్యాకల్పనే. మనుష్యులకు భిన్నంగా అంటే మానవ యోని గాక దేవయోని అంటూ ఏదీ లేదు. 15,16

శ్లోకాలలో యోనిగత ప్రాణులను గురించి మనువు వర్ణించాడు. అందులో దేవయోని అంటూ 'ఎక్కడా లేదు. ఇది మనుస్మృతికి విరుద్ధం. వాస్తవంగా అక్కడక్కడ మనుధర్మశాస్త్రంలో కనిపించే దేవ, ఋషి, పితర మొ॥ మనుషులలో ఉన్న స్తరవిశేషాలే. యోగ్యతను బట్టి, స్థాయిని బట్టి ఇవన్నీ మానవులకున్న పేర్లే.

2 'సూక్ష్మం' శబ్దార్థం:-

సూక్ష్మ శబ్దాన్ని సాధ్య శబ్దానికి విశేషణంగా కలపడం సంగతం కాదు. సృష్టి ఉత్పత్తి ప్రక్రియ వర్ణనానంతరం ఆ ప్రసంగము అంతా ఈ శ్లోకంలో ఉపసంహరించాడు. ఏకత్ర సంకేతంగా పరమేశ్వరుడు జడచేతనలుగానూ స్థూలసూక్ష్ములుగానూ సమస్త విశ్వాన్ని సృజించాడు.

3. సాధ్యులెవరు?

ప్రాణులకు భిన్నంగా సాధ్యులను వర్ణించడంలో -వారికున్న విశిష్టతను తెలియజేయడానికి సృష్టిప్రారంభంలో వివిధరకాలైన ప్రాణులు జన్మిస్తారు. అందులో సాధకకోటికి చెందిన విశేష సంస్కారం కలిగిన వ్యక్తులు కూడా ఉంటారు. సాధ్యకోటికి సంబంధించిన వ్యక్తులలో అగ్ని, వాయువు, రవి మొ॥ ఋషుల పేర్లు ఉదాహరించవచ్చు. వీరుకూడా సాధక కోటికి సంబంధించిన విశేష సంస్కార సంపన్నులైన వ్యక్తులు. నిరుక్తకారుడైన యాస్కాచార్యులవారు 'ఋషి'శబ్దానికి నిర్వచనం చేస్తూ, ఆచార్య ఔపమన్యుని అభిప్రాయాన్ని పేర్కొంటూ **"ఈ తపస్వీసాధకులు"** తపస్సులో లీనమైన కారణంగా వేదజ్ఞాన ప్రాప్తి కలిగిందని అభిప్రాయపడ్డారు. అందువల్ల వీరు సాధన కోటికి సంబంధించిన వ్యక్తులని స్పష్టమవుతుంది.

> **"ఋషిర్దర్శనాత్ । స్తోమాన్ దదర్శ" ఇతి ఔపమన్యవః ।**
> **తద్యదేనాంస్తపస్యమానాన్ బ్రహ్మ స్వయంభ్వభ్యానర్షత**
> **ఋషయోఽభవంస్తదృషీణాం ఋషిత్వమ్" ఇతి విజ్ఞాయతే ॥** నిరుక్తం. 2. 3. 12

వేదమంత్రార్థ జ్ఞానం కలగడం వల్ల ఋషులవుతారు. ఇది ఔపమన్యుని అభిప్రాయం. ప్రారంభంలో అగ్ని వాయువ్వాది ఋషులు తపస్సు చేయడంవల్ల అపౌరుషేయమైన వేదాలు సాక్షాత్కరించినవి. వేదార్థదర్శనం కలగడం వల్ల వారు ఋషులుగా ప్రసిద్ధిచెందారు. ఈ తపస్వి సాధకులు సాధనలో లీనం కాగానే వేదజ్ఞానం కలిగిందనే విషయం బ్రాహ్మణ గ్రంథాలలో కనిపిస్తుంది.

(అ) "తేభ్యస్తప్తేభ్యస్త్రయో వేదా అజాయన్త"
అగ్నేః ఋగ్వేదః, వాయోర్యజుర్వేదః, సూర్యాత్ సామవేదః । శత.బ్రా-11. 5. 2. 3

(ఆ) అజాన్హ వై పృశ్నీం స్తపస్యమానాన్ బ్రహ్మ స్వయంభూ
అభ్యానర్షత్తదృషయోఽభవన్. తై.ఆ. 2. 8

రాబోయే శ్లోకంలోనే మనుమహర్షి పైన పేర్కొన్న ఋషుల పేర్లను పేర్కొన్నాడు. ఇంకెందరో ఈ సాధక కోటిలో ఉన్నారు. ఇందుకు కొన్ని అన్య ప్రమాణాలను చూడగలరు.

(ఇ) సాధ్యాః దేవాః సాధనాత్ నిరుక్తం. 12. 40
(ఈ) సాధ్యాః నామ దేవాః 'విద్వాంసః' ఆసన్ తాండ్యబ్రాహ్మణం 8. 3. 5
(ఉ) సాధనసాధ్యాః 'దేవాః' విద్వాంసో జనాః యజు. 29. 11

(ఊ) **సాధనం యోగాభ్యాసాదికం కుర్వన్తో జ్ఞానినః 'జనాః'** యజు.31.9
(ఏ) **అన్యైర్విద్యార్థం సంసేవితుమర్హాః 'విద్వాంసో జనాః'** ఋ.1.164.50
(ఐ) **సాధ్యాః జ్ఞానినః ఋషయో మన్త్రద్రష్టారశ్చ** ఋ.భూ.91.సృష్టివిషయః

ఈ ప్రకారంగా సాధ్యశబ్దానికి సాధకవర్గానికి చెందిన విశిష్ట విద్వాంసులని అర్థం. మనుస్మృతిలో అంతఃసాక్షిగా ఉంది.

"పితరశ్చైవ సాధ్యాశ్చ ద్వితీయా సాత్త్వికీ గతిః" (మను. 12.49) అంటే మధ్యమ సత్త్వగుణంగల జీవులు పితరులు మరియు సాధ్యులు. అంటే కార్యసిద్ధి కోసం సేవించదగిన అధ్యాపకాది జన్మలెత్తుతారు. వేద జ్ఞానాన్ని ఉపదేశించిన ప్రారంభక ఋషులు కూడా విశ్వానికి ప్రథమాధ్యాపకులు -ఆది(గుణ) గురువులు, బోధకులు. సృష్టి ప్రారంభం కాగానే సాధ్యవర్గానికి చెందిన వ్యక్తులు ఉత్పన్నమవుతారనే విషయం పురుషసూక్తంలో ఉంది.

(1) **"యత్ర పూర్వే సాధ్యాః సన్తి దేవాః ॥** యజు.31-36
(2) **"తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ పురుషం జాతమగ్రతః ॥**
తేన దేవా అయజన్త సాధ్యా ఋషయశ్చ యే ॥ యజు.31-9
(3) **యత్పురుషేణ హవిషా దేవా యజ్ఞమతన్వత ॥** యజు.31-14

బ్రహ్మాండాన్ని సృష్టించడం, రక్షించడం, లయం చేయడమే యజ్ఞం. అదే జగన్నిర్మాణ సామాగ్రి. ఈ బ్రహ్మాండ యజ్ఞాన్ని పురుషుడు సృష్టించాడు (ఋ.భా.భూ).

4 'యజ్ఞ' శబ్దానికి వ్యాపకార్థం-వేదాల ఉద్దేశం.

యజ్ఞశబ్దానికి అర్థం చెప్పడంలో వ్యాఖ్యాతలు సంకుచితంగానే ప్రవర్తించారు. ఈ శ్లోకంలో ఉన్న **'యజ్ఞ'** శబ్దానికి **'హవన'**మనే సీమితార్థం గాక వ్యాపకమైన అర్థం **'జగత్తు'**. దీనికి ఈ కింది ఉదాహరణలు తోడ్పడతాయి.

కేవలం హోమం కోసమే యజ్ఞాలున్నవనే భావన మహర్షికి లేదు. విశ్వమందున్న జ్ఞానవిజ్ఞానాలు, కర్మవ్యవహారాలు అన్నింటికోసం వేదాలు ఉత్పన్నమైనవని మహర్షి భావన. మనుస్మృతిలో అనేక స్థలాలలో వ్యక్తం చేసిన వాటినిబట్టి ఈ విషయం స్పష్టమవుతుంది.

అ. నాలుగు వర్ణాల, నాలుగు ఆశ్రమాల, మూడు కాలాల జ్ఞానం వేదం వల్ల కలుగుతుంది. (12.97.)

ఆ. శబ్ద-స్పర్శ మొ॥ సూక్ష్మశక్తులకు సంబంధించిన వైజ్ఞానిక సిద్ధికూడా వేదాల ద్వారా లభిస్తుంది. (12.98)

ఇ. విశ్వంలో ఉన్న సర్వవ్యవహారాలకు సంబంధించిన ఉత్తమోత్తమ సాధకగ్రంథం వేదం. 12.99

ఈ. పితృ, దేవ, మనుషులకు వేదం చక్షువు. అంటే ధర్మాధర్మాలను, జ్ఞానవిజ్ఞానాలను బోధించేవి. 12.94

ఉ. రాజనీతి జ్ఞానాన్నిచ్చేది వేదం. 7.43,12.100.

ఊ. వేదమే సర్వధర్మాలకు స్రోతస్సు, ఆధారం కూడా. 2.6-15

ఏ. వేదాల ద్వారానే ప్రపంచమంతా ఉన్న సర్వపదార్థాలకు నామకరణం- విభాగం, కర్మల నిర్ధారణ జరిగింది. దీన్నిబట్టి వేదోత్పత్తి కేవలం హోమనిర్వహణార్థమేకాదు. ప్రపంచంలో సర్వసిద్ధులు పొందుటకేనని తెలిసికోవాలి. (1.21.)

ఐ. సర్వ సత్యవిద్యలను విధించునది వేదమే. ఇది విశ్వ సంవిధానం (The Constitution of the world). సమస్త వ్యవహారాలను సాధించు గ్రంథం వేదమేనని చెప్పడం- వేదాల ఉపయోగం అపర్యాప్తమని తెలియజేయడమే. (1.3)

దీన్ని బట్టి **'వేదం సర్వజనోపయోగకారి'** అని మనుమహర్షి యొక్క వ్యాపకదృష్టి మనకు విదితమవుతుంది. పై మాన్యతలన్నీ దాన్నే సమర్థిస్తున్నవి. సమస్త వ్యవహారాలను, ధర్మాలను, జ్ఞాన విజ్ఞానాలను సాధించడానికి వేదమవసరమని నిస్సందేహంగా చెప్పవచ్చు. అదేవిధంగా యజ్ఞమంటే కేవలం హోమమనేగాక వ్యాపకార్థంలో జగత్తని భావించాలి. ఈ విధంగా 1.21,22 శ్లోకార్థాలకు కూడా సంగతి ఏర్పడుతుంది. ప్రపంచాన్ని (1.21) సృష్టించి, ఆ ప్రపంచసిద్ధికోసం లేదా ప్రపంచానికి కావలసిన సర్వసిద్ధులకోసం (1.22) వేదాలు సృష్టించబడినవని స్పష్టమవుతుంది.

5. 'యజ్ఞము'నకు 'జగత్త'నే అర్థానికి ప్రమాణాలు.

(అ) యజ్ఞో వై భువనత్రయమ్ - తై.సం.3.3.7.5.
(ఆ) విరాట్ వై యజ్ఞః సంసారః శత.1.1.1.22.
(ఇ) వైరాజః యజ్ఞః. గో.పూ.5-24. గో.ఉ.6.15.

మహర్షి దయానందులవారు (యజు.13.14) మంత్రానికి భాష్యం రాస్తూ-జగత్తునే యజ్ఞమన్నారు. **"దేవా యజ్ఞం అతన్వత"** ఈ బ్రహ్మాండమనే యజ్ఞాన్ని పురుషుడు ఉత్పన్నం చేశాడు. (ఋ.భా.భూ)

యజ్ఞశబ్దానికి విశేషణంగా ప్రయోగించిన 'సనాతన' శబ్దం ద్వారా కూడా యజ్ఞశబ్దానికి 'జగత్తనే' అర్థం కలుగుతుందని టీకాకారులు చెప్పారు. యజ్ఞక్రియకు సనానత శబ్దానికి సంబంధం కుదరదు. కాబట్టి సనాతన శబ్దం యజ్ఞమునకు విశేషణం కాజాలదు. సంగతి సందర్భం కుదరకపోయినా, వ్యాఖ్యాతలు అటు యిటు లాగి ఏదోవిధంగా యజ్ఞంతో సంబంధం కుదిరించారు. యజ్ఞం వేదోక్తమైన కర్మ కావడం వల్ల, లేదా కల్పాంతరంలో కూడా యజ్ఞాలు చేయడం వల్ల యజ్ఞం సనాతనమని అర్థం సరిచేశారు. ఈ విధంగా చూస్తే వేదోక్తకర్మలన్నీ సనాతనములు కావలసి ఉంటుంది కదా! ఇక యజ్ఞములకే ఎందుకు సనాతనత్వమున్నట్లు? వాటికే విశిష్టత ఎందుకు? కాబట్టి బలాత్కారంగా యజ్ఞములకు సనాతనత్వం అంటగట్టడం ప్రయాసమాత్రమే. ఇదే కాకుండా,1.57 శ్లోకంలో సనాతన శబ్దానికి పర్యాయవాచకంగా **"అజస్రమ్" "సంజీవయతి చాజస్రమ్"** విశేషణంగా ప్రయోగం 'జగత్తు' కోసమే ఉపయోగించడం జరిగింది. (అజస్రం = ప్రళయకాలం వరకు జీవించేది) ఇక్కడ కూడా సనాతన శబ్దం జగత్తుకు విశేషణంగా ప్రయోగించబడింది.

వేదాల ఆవిర్భావం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అగ్నివాయురవిభ్యస్తు త్రయం బ్రహ్మసనాతనమ్ । మూలశ్లోక సం.**15**
దుదోహ యజ్ఞసిద్ధ్యర్థమృగ్యజుస్సామలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**23**

టీక:- ఆ పరమేశ్వరుడు, **యజ్ఞసిద్ధ్యర్థం** = విశ్వమందున్న సమస్త ధర్మాలు, అర్థాలు, కామములు, మోక్షం మొ॥ సకల వ్యవహార సిద్ధికోసం లేదా జగత్తులోని సమస్తరూపాల జ్ఞానిసిద్ధి కోసం, **(యజ్ఞే జగతి ప్రాప్తవ్యా సిద్ధిః = యజ్ఞసిద్ధిః అథవా యజ్ఞస్య సిద్ధిః = యజ్ఞసిద్ధిః) అగ్నివాయురవిభ్యః తు** = అగ్ని, వాయువు ఆదిత్యుల నుండి, అంటే వారి ద్వారా, **ఋక్, యజుః సామలక్షణ త్రయం సనాతనం బ్రహ్మ = ఋక్**= జ్ఞానం, **యజుః** = కర్మ, **సామ** = ఉపాసనా రూప వివిధ జ్ఞానాలకు నిత్యవేదాలను, **దుదోహ** = ప్రకటింపజేశాడు.

తాత్పర్యం:- అంతేగాక, వేదాల చేత యజ్ఞాలు నెరవేర్చదగినవి. కాబట్టి ఆ యజ్ఞాల నిమిత్తం పరమాత్ముడు సృష్టి ఆరంభంలో మానవులను సృజించి అగ్న్యాది నలుగురు మహర్షుల హృదయాలలో నాలుగు వేదాలను ప్రకాశింపజేశాడు. నాలుగు వేదాలను, ఆ బ్రహ్మ అగ్ని, వాయు, ఆదిత్య, అంగిరసుల నుండి ఋక్, యజు, సామ, అథర్వవేదాలను బ్రహ్మ గ్రహించాడు.

ఋషిదయానందభాష్యం:- "ఏ పరమేశ్వరుడు ఆది సృష్టిలో మనుషులను ఉత్పన్నం చేసి, అగ్ని మొ॥ నలుగురి మహర్షుల ద్వారా నాలుగు వేదాలను బ్రహ్మకు తెలియజేశాడో, ఆ బ్రహ్మ అగ్ని-వాయువు, ఆదిత్య అంగిరసల ద్వారా ఋగ్యజుస్సామా థర్వాలను గ్రహించాడు.

పూర్వోక్త అగ్ని, వాయువు, ఆదిత్య, అంగిరసల నుండి బ్రహ్మ వేదాధ్యయనం చేశాడనడానికి మను శ్లోకాలే సాక్ష్యం. బ్రహ్మే వేదాధ్యయనం చేయగా, ఒక వ్యాసాదుల విషయం, మన విషయం చెప్పాలా? (ఋ.భా.భూ.). ॥23॥

వివరణ:

1. ఈ శ్లోకంలో యజ్ఞ శబ్దానికి **'జగత్త'** నే అర్థం. దీనికి సమర్థకంగా 1.22 శ్లోకసమీక్షను చూడండి.

2 వేదోత్పత్తి విషయంలో వేదాది ప్రమాణం

మనస్మృతికి (మనుధర్మశాస్త్రం) వేదమే మూలస్రోతస్సని మహర్షి అభిప్రాయం. వేదాలు అపౌరుషేయాలని భావించాడు. పరమేశ్వరు డీ వేదాలను ఉత్పత్తి చేశాడని అంగీకరించాడు. వేదాల ద్వారానే తనకీ విషయాలు తెలిసినవని తెలిపాడు. స్వయంగా వేదమే ఈ విషయాన్ని ఇలా ప్రకటిస్తున్నది.

(అ) **"తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే ।**
ఛందాంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాదజాయత ॥ యజు.31.7

అర్థం-సచ్చిదానంద స్వరూపుడు, సర్వస్థానములందు పరిపూర్ణుడు. సర్వమానవులకు ఉపాసనీయుడు, సర్వసామర్థ్యం కలిగిన ఆ పరమేశ్వరుడే ఋగ్వేద, యజర్వేద, సామవేద, అథర్వణవేదాలను ఉత్పన్నం చేశాడు.

(ఆ) **"యస్మాదృచో అపాతక్షన్ యజుర్యస్మాదపాకషన్ ।**
సామాని యస్య లోమాని అథర్వాంగిరసో ముఖమ్ ।
స్కమ్భం తం బ్రూహి కతమఃస్విదేవ సః ॥ అథర్వ. 10.4.20

సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడి నుండే, **ఋచః** = ఋగ్వేదం, **యజుః** = యజుర్వేదం, **సామాని** = సామవేదం, **అంగిరసః** = అథర్వణ వేదం అనే నాలుగు వేదాలు ఉత్పన్నమైనవి. ఇదేవిధంగా రూపకాలంకారం ద్వారా ఈశ్వరుడు వేదోత్పత్తి విషయాన్ని స్పష్టం చేశాడు.

అథర్వణం ఆయన ముఖంతో సమానమని, సామవేదం రోమాలతో సమానమని, యజుర్వేదం హృదయంతో సమానమని, ఋగ్వేదం ప్రాణంతో సమానమని తెలిపాడు. ఈ నాలుగు వేదాలను సృష్టించిన దేవు డెవరు? **(బ్రూహి కతమః స్విదేవ సః)** ఈ ప్రశ్నకు జవాబుగా **'స్కంభంతమ్'** అని చెప్పారు. సర్వజగత్తుకు కారణమైన కర్త ఎవరో అతడికి స్కంభమని పేరు. అతన్నే నీవు వేదోత్పత్తికారకుడని తెలిసికో.

బ్రాహ్మణాలు కూడా యథాతథంగా దీన్నే ప్రమాణంగా తీసుకొన్నాయి.

"ఏవం వా అరేఽస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్
యదృగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరసః (శతపథం.14.5)

ఆ మహాశక్తిశాలియైన పరమాత్మ యొక్క నిశ్వాసరూపంగా, ప్రకటితమైన ఈ నాలుగు వేదాలు ఋక్, యజు, సామ- అథర్వణ నామాలతో ప్రసిద్ధమైనవి.

తేభ్యస్తప్తేభ్యః త్రయోవేదా అజాయన్త
అగ్నేర్ ఋగ్వేదో వాయోర్యజుర్వేదః సూర్యాత్ సామవేదః శత.11.5.2.3

తపస్సంపన్నులైన ఆ ఋషులద్వారా పరమాత్మ అగ్ని నుండి ఋగ్వేదాన్ని, వాయువు నుండి యజుర్వేదాన్ని, సూర్యుడి నుండి సామవేదాన్ని, ఈ విధంగా త్రయీవిద్యారూపమైన నాలుగువేదాలను ప్రకటింపజేశాడు.

ఇ. వేదోత్పత్తి విషయంలో ఇతర ప్రమాణాలు-

వేదాలు అపౌరుషేయాలని మనువు అభిప్రాయం-ఈ శ్లోకంలో తెలిపాడు. మరికొన్ని చోట్ల కూడా వర్ణించాడు 1.3,21,13.11.264, 265, 12.94 ధర్మం- అధర్మం, సుఖదుఃఖ విభాగం.

ఈ క్రింది 24,25వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కాదు

* సమయాదుల ఉత్పత్తి-

* కాలం కాలవిభక్తీశ్చ నక్షత్రాణి గ్రహాంస్తథా ।
సరితస్సాగరాఞ్ఛైలాన్ సమాని విషమాణి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**24**

* తపో వాచం రతిం చైవ కామం చ క్రోధమేవ చ ।
సృష్టిం ససర్జ చైవేమాం స్రష్టుమిచ్ఛన్నిమాః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**25**

తాత్పర్యం:- పరమాత్మ ప్రజానీకాన్ని సృష్టించడంతో పాటు కాలగణనకు సులభసాధ్యాలనదగిన ఋతువులు-మాసాలు- అయనాలు మొ॥ కాలవిభాగాన్ని;నక్షత్రాలనూ; సూర్యాది గ్రహాలనూ, నదులనూ, సముద్రాలనూ, పర్వతాలనూ, మిట్టపల్లాలనూ, తపస్సునూ, వాక్కునూ, శ్రద్ధనూ, క్రోధాన్నీ, కామాన్నీ సృజించాడు. ॥24,25॥

ప్రక్షిప్త పరిశీలన –

ఈ (శ్లో. 24,25) రెండు శ్లోకాలూ కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తా లని చెప్ప వచ్చు.

1. ప్రసంగ వ్యతిరేకం

(క) పూర్వాపరాలు సందర్భానికి వ్యతిరేకంగా ఉన్నాయి. 21 వ శ్లోకంలో వేదాల వల్ల కర్మ జ్ఞానం బోధించే పద్ధతి ఉన్నట్లు చెప్పారు. 26 వ శ్లోకంలో చెప్పిన కర్మల వివేచన దానికి సంబంధించే ఉంది. కర్మల సంబంధ ప్రసంగం మధ్య సృష్టి ఉత్పత్తి వర్ణన ఆ పూర్వాపర సందర్భాన్ని భంగం చేస్తూంది.

(ఖ) సృష్టి ఉత్పత్తి వర్ణన 22 తో పూర్తయింది. దాని తర్వాత వేదోత్పత్తి సంగతి ఉంది. ఒక విషయం పూర్తయిన వెనుక, మళ్లీ దాన్నే కొత్తగా ప్రారంభించటం అసంగతం.

2 శైలీ పర మైన ఆధారం

(క) సృష్టి ఉత్పత్తికి ముందు ప్రాణుల శరీర నిర్మాణాన్ని వర్ణించేటప్పుడు, మనువు కాస్త విస్తృత శైలినే ఎంచుకున్నాడనేది స్పష్టమే. కానీ మిగిలిన జడ పదార్థాలను మాత్రం సంకేత ప్రాయంగానే పేర్కొన్నాడు (1. 19. 21). ఈ శ్లోకాలలో జడ పదార్థాల ఉత్పత్తిని లెక్కలతో సహా వివరంగా చెప్పటమే అది మనువు శైలి కాదని నిరూపిస్తూంది.

(ఖ) గణన లేదా వర్ణన గల శైలి సరిగ్గా లేక పోవటంతో పాటు, ఇందులో అవ్యాప్తి దోషం స్పష్టంగా కనబడుతూంది. కొన్ని పదార్థాలు, భావాల ఉటంకింపు ఉంది కానీ, లోభం, మోహం, వృక్షాలు మొద లైన చాలా విషయాల సూచన ఐనా లేనే లేదు. ఆ పేర్కొన్న పదార్థాల కైనా నిశ్చిత మైన ఆధారాలూ లేవు. మనువు రచనలో ఈ విధ మైన లోపాలు ఉండవు. అందు చేత ఈ శ్లోకాలు మనువు శైలికి చెందినవి కావు.

(గ) పదాల ప్రయోగం కూడా వీటిని ప్రక్షిప్తా లని రుజువు చేస్తున్నాయి. 1, 16, 17, 22 లలో మనుష్యులు, ప్రాణుల ఉత్పత్తి చెప్పేశారు. అటు పైన వేద జ్ఞాన ప్రాప్తిని గురించి కూడా ఉంది. ఐనా ఈ శ్లోకాలలో 'స్రష్టు మిచ్ఛన్ ఇమాః ప్రజాః' అని ఉంది. అంటే ఇప్పుడే పరమాత్మ ప్రజా సృష్టి చేయా లని భావిస్తున్నాడు అని అర్థం. ఈ ప్రయోగమే ఇది మనువు శైలికి సంబంధించినది కాదు అని రుజువు చేస్తూంది. ఆ తర్వాత ఎప్పుడో అసందర్భంగా చొప్పించారు.

26 నుండి 31వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

ధర్మాధర్మాల-సుఖదుఃఖాల విభాగం-

కర్మణాం చ వివేకార్థం ధర్మాధర్మౌ వ్యవేచయత్ । మూలశ్లోక సం.**16**
ద్వన్ద్వైరయోజయచ్చేమాః సుఖదుఃఖాదిభిః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**26**

టీక:- **చ** = మరియు, **కర్మణాం వివేకార్థం** = కర్మల యొక్క వివేచన కోసం, **ధర్మాధర్మౌ** = ధర్మాధర్మాలను, **వ్యవేచయత్** = విభజించాడు, **చ** = తథా, **ఇమాః ప్రజాః** = ఈ ప్రజలను, **సుఖదుఃఖాదిభిః ద్వన్ద్వైః** = రెండు విరోధిగుణాల సుఖదుఃఖాల యొక్క లేదా వ్యవస్థల యొక్క జంటలతో, **అయోజయత్** = కలిపాడు.

తాత్పర్యం:-కర్మాచరణలో యుక్తాయుక్త వివేకం కలగడానికి యజ్ఞాలు, దానం, జపం, హోమం మొ॥ సత్కార్యాలు చేయాలనీ; బ్రహ్మహత్య, గో హత్య లాంటి హేయమైన కార్యాలు చేయరాదనీ తెలియజేయడానికి ధర్మాధర్మాలను వేరుపరిచాడు. ఈ ప్రజల్ని సుఖ దుఃఖాలు, రాగ ద్వేషాలు, క్రోధ శాంతాలు మొ॥ ద్వంద్వ స్వభావాలు కమ్ముకొనేలా చేశాడు. అంటే వీటికి ప్రతిస్పందించే స్వభావాలు ఏర్పరచాడన్నమాట! ॥26॥

వివరణ:

ధర్మాధర్మ విభాగాల చర్చ క్రింది వేదమంత్రంలో ఇవ్వబడింది. అదే భావాన్ని మనువు స్వీకరించాడు.

"దృష్ట్వా రూపే వ్యాకరోత్ సత్యానృతే ప్రజాపతిః (యజు. 19.77)

ప్రజాపతిః=సర్వజగత్తుకు అధ్యక్షుడైన ఈశ్వరుడు, **సత్యానృతే** = సత్యమంటే ధర్మం, అసత్యమంటే అధర్మం, **వ్యాకరోత్** = వాటిని తన సర్వజ్ఞత్వం వల్ల చక్కగా విచారించి, సత్యాన్ని - అసత్యాన్ని వేరువేరు చేశాడు. (ఋ.భా.భూ.)

ఇది మనుకృతం-ప్రామాణికం

సూక్ష్మం నుంచి స్థూలక్రమంలో సృష్టివర్ణన-

అణ్వ్యో మాత్రా వినాశిన్యో దశార్ధానాం తు యాః స్మృతాః । మూలశ్లోక సం. **17**
తాభి స్సార్ధమిదం సర్వం సంభవత్యనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **27**

టీక:- **దశార్ధానాం తు** = ఐదు పంచభూతాల యొక్క, **యాః** = ఏ, **వినాశిన్యః** = వినాశశీలం గలవి- తన అహంకార కారణంలో లీనమై నష్టమై పోయే స్వభావం గలవి, **అణ్వ్యః మాత్రాః స్మృతాః** = సూక్ష్మ తన్మాత్రలుగా చెప్పబడినవి, **తాభిః సార్ధమ్**= ఈ సమస్త ప్రపంచం, **అనుపూర్వశః** = క్రమంగా సూక్ష్మం నుంచి స్థూలంగా, స్థూలం నుంచి స్థూలతరంగా, స్థూలతరం నుంచి స్థూలతమంగా, **సంభవతి** = ఉత్పన్నమవుతుంది.

తాత్పర్యం:- పృథివ్యాపస్తేజో వాయురాకాశాలైన పంచమహాభూతాలను నశ్వరమూర్తులైన శబ్దస్పర్శ రూపరసగంధాలైన పంచతన్మాత్రలను వాటితో పాటు ఈ చెప్పబోయే ప్రపంచంలోని స్థులసూక్ష్మ స్థూలతర వస్తుతతిని సృష్టించాడు. ॥27॥

వివరణ:

27వ శ్లోక క్రమంపై విచారణ:- క్రమాన్ననుసరించి చూస్తే ఈ శ్లోకం 19వ శ్లోకం (తేషామిదం) తరువాత ఉండవలసింది. భూతముల తన్మాత్రల ఉత్పత్తి, వాటి ద్వారా జగదుత్పత్తిక్రమం. అదే సందర్భం 19వ శ్లోకం తరువాత పూర్తవుతుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

జీవులకు కర్మలతో సంయోగం-

యం తు కర్మణి యస్మిన్ స న్యయుఙ్క్త ప్రథమం ప్రభుః । మూలశ్లోక సం. **18**
స తదేవ స్వయం భేజే సృజ్యమానః పునః పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **28**

టీక:- **సః ప్రభుః** = ఆ పరమేశ్వరుడు, **ప్రథమం**= సృష్ట్యారంభంలో, **యం తు** = ఏ ప్రాణిని, **యస్మిన్ కర్మణి** = ఏ కర్మయందు, **న్యయుఙ్క్త** = నియమించెనో, **పునః** = ప్రత్యేక సృష్టి ఉత్పత్తి సమయంలో (1.80), **సః** = అతడు మళ్లీ, **సృజ్యమానః** = జన్మధారణచేస్తూ, **తదేవ** = ఆ కర్మనే, **స్వయం** = తన కోసం తానే, **భేజే** = పొందడం ప్రారంభించాడు.॥28॥

తాత్పర్యం:-సృష్టికర్త అయిన బ్రహ్మ ఏ యే జాతిని ఆదిసృష్టిలో ఏ యే కార్యాలలో నియమించెనో, ఆ యా జాతి మరల మరలా సృజించబడుతూ ఆ యా కార్యాలు చేస్తూ స్వకర్మవశమున అందులోనే నిమగ్నమవుతున్నవి. ॥28॥

హింస్రాహింస్రే మృదుక్రూరే ధర్మాధర్మా వృతానృతే । మూలశ్లోక సం.**19**
యద్యస్య సో౽దధాత్సర్గే తత్తస్య స్వయమావిశత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**29**

టీక:- **హింస్ర+అహింస్రే** = హింసించే సింహ వ్యాఘ్రాదులు, **అహింసా** = గోవులు, జంతువులు మొదలగు **మృదు + క్రూరే** = దయ గలవి, కఠిన హృదయం గలవి, **ధర్మాధర్మా**= ధర్మం, అధర్మం, **ఋతానృతే** = సత్యం, అసత్యం, **యస్య** = ఏ ప్రాణి యొక్క, **యత్ కర్మ** = ఏ కర్మ, **సర్గే** = సృష్టికి ఆరంభంలో, **స అదధాత్** = ఆ పరమేశ్వరుడు ధారణచేయించాడో, **తస్య తత్** = అతడికి అదే కర్మ, **స్వయం** = తనకుతానే, **ఆవిశత్** = పొందాడు.

తాత్పర్యం:-సృష్ట్యాది నుంచే హింసను-దయను; క్రూర స్వభావాన్ని-మృదుత్వాన్ని; ధర్మాన్ని- అధర్మాన్ని; సత్యాన్ని -అసత్యాన్ని మొ॥ స్వభావాలలో ఏ యే జాతులకు ఏ యే గుణాలు ఉంచాలో అవే ఆ యా జాతులకు స్వభావసిద్ధంగా ఏర్పడేలా చేశాడు. ప్రళయానికి పూర్వం ఏ యే స్థితులు ఏ జాతికి ఉన్నవో అవే ఉన్నాయి. ॥29॥

వివరణ:

జగదుత్పత్తి ప్రయోజనం-కర్మఫలం

సృష్టి ఆరంభంలో ప్రాణులకున్న భిన్నభిన్నకర్మలకు కారణం జగద్రచన ప్రయోజనం అనుసరించి మహర్షి దయానందులవారు 'సత్యార్థ ప్రకాశంలో ఇలా రాశారు.

ప్రశ్న : విశ్వనిర్మాణం వల్ల పరమేశ్వరుడికి ఏమి ప్రయోజనం?

జవాబు : .....ప్రళయానికి పూర్వం సృష్టిలో జీవులు చేసిన పాపపుణ్యకర్మలకు ఫలమును ఈశ్వరుడు ఎలా ఇవ్వగలడు? వానిని జీవులు ఎలా అనుభవించగలరు?

ప్రశ్న : ఈశ్వరుడు జీవులలో కొందరికి మనుష్యజన్మ, మరికొందరికి సింహాది క్రూరజన్మ, ఇంకా కొన్ని జీవులకు, మృగం, గోవు మొ॥ జన్మలను, కొందరికి వృక్షాదులను, క్రిమికీటక, పతంగాదుల జన్మనిచ్చాడు. దీనివల్ల పరమేశ్వరుడు పక్షపాతికాడా ?

జవాబు : ఈశ్వరుడికి పక్షపాత దోషం అంటదు. కారణం-పూర్వసృష్టిలో ఆ యా జీవులొనర్చిన కర్మల ననుసరించి వ్యవస్థ చేయబడుతుంది. కర్మానుసారం కాకుండా మరొక జన్మనిచ్చినట్లయితే పక్షపాత దోషం వస్తుంది. (స.ప్ర. 8వ సముల్లాసం)

ఇది మనుకృతం-ప్రామాణికం

యథర్తులింగాన్యృతవః స్వయమేవర్తుపర్యయే । మూలశ్లోక సం.**20**
స్వాని స్వాన్యభిపద్యంతే తథా కర్మాణి దేహినః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**30**

టీక:- **యథా** = ఏ విధంగా, **ఋతవః** = ఋతువులు-వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశరములు, **ఋతుపర్యయే** = ఋతుపరివర్తనం జరగ్గా, **స్వయమేవ** = తమంతట తామే, **ఋతులింగాని** = తమ తమ ఋతుచిహ్నాలను(వసంతం రాగా చిగుర్లు వేయడం, కాయలు గాయడం) **అభిపద్యన్తే** = పొందును. **తథా** = అలాగే, **దేహినః** = దేహధారులైన ప్రాణులుకూడా, **స్వాని స్వాని కర్మాణి** = తమ తమ కర్మలను పొందుతారు. అంటే తమ తమ కార్యాలలో లగ్నమవుతారు.

తాత్పర్యం:-వసంతాది ఋతువులు తమకు తామే తమ తమ ఋతుచిహ్నాలను పొందునట్లుగానే ప్రాణులుకూడా ప్రళయానంతరం సృష్టిలో తనుకు తామే తమ తమ పూర్వకర్మ ఫలాన్ని బట్టి తమతమ సహజగుణాలను పొందుతున్నాయి.॥30॥

నాలుగు వర్ణాల వ్యవస్థానిర్మాణం- ఇది మనుకృతం-ప్రామాణికం

లోకానాం తు వివృద్ధ్యర్థం ముఖబాహూరుపాదతః । మూలశ్లోక సం.**21**
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం శూద్రం చ నిరవర్తయత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**31**

టీక:- ఆ పరమేశ్వరుడు, **లోకానాం తు వివృద్ధ్యర్థం**= ప్రజలయొక్క విశేష వృద్ధి కోసం,శాంతి, సమృద్ధి,ప్రగతికోసం, **ముఖ+బాహు+ఊరు పాదతః** =ముఖం, బాహువులు, తొడలు, పాదాల యొక్క గుణాలతో సామ్యంగా, **క్రమశః** = క్రమంగా, **బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం చ శూద్రం** = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలను, **నిరవర్తయత్** = నిర్మించాడు. అంటే చాతుర్వర్ణ్య వ్యవస్థను నిర్మించాడు.

తాత్పర్యం:- వసంతం, గ్రీష్మాది ఋతువులు ఆ యా ఋతుచిహ్నాలననుసరించి, వాటి కాలం రాగానే అవేలక్షణాలతో సహజంగా ప్రవర్తిల్లుతూన్నట్లే-సృష్టిలో ముఖభాహూరుపాదాలకు చిహ్నంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఉత్పన్నమయ్యారు. ॥31॥

వివరణ:

1. వేదాల్లో చాతుర్వర్ణ్య వ్యవస్థానిర్మాణం

వేదంలో ఉన్న పురుషసూక్తంలో నాలుగు వర్ణాల ఉత్పత్తి వర్ణన ఉంది. మహర్షి మనువు ఈ శ్లోకాన్ని వేదాలందున్నట్లు ప్రతిపాదించాడు. ఈ మంత్రం ద్వారా మనుభావం స్పష్టమవుతుంది. బ్రహ్మ అంగాలనుంచి నాలుగు వర్ణాల ఉత్పత్తి కలిగిందనే భ్రాంతిని నివారణ చేయాలి. కర్మల, గుణాల ఆధారంగానే వర్ణాలు ఉత్పన్నమైనవనేది వేదసమ్మతమైన వర్ణనే మనుస్మృతిలో ఉదాహరించాడు. వేదమంత్రం-

అ. **"యత్పురుషం వ్యదధుః కతిధా వ్యకల్పయన్ ।**
ముఖం కిమస్యాసీత్ కిం బాహూ కిమూరూ పాదా ఉచ్యేతే" ॥యజు. 1.10

టీక:- యత్పురుషం = సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడే పురుషుడు, **కతిధా వ్యకల్పయత్** = ఎవడి సామర్థ్యాన్ని అనేక విధాలుగా ప్రతిపాదిస్తారో, ఎవరిలో చిత్రవిచిత్రాలైన అనేక రకాలైన సామర్థ్యముందో, అనేక కల్పనల ద్వారా ఎవరిశక్తి సామర్థ్యాలను వర్ణిస్తారో, **"ముఖం కిమస్య ఆసీత్** = అలాంటి పురుషుడి ముఖం అంటే ముఖ్యగుణాల ద్వారా ఏమి ఉత్పన్నమైంది?, **కిం బాహూ** = బలవీర్య శూరత్వం, యుద్ధాది విద్యాగుణాల ద్వారా ఎవరు ఉత్పన్నమయ్యారు? **కిమూరూ** = వ్యాపార ఆది, మధ్యమ గుణాల ద్వారా పుట్టినదేది?, **పాదా ఉచ్యేతే** = నిమ్న గుణాల ద్వారా ఏమి పుట్టింది?

ఈ ప్రశ్నలకు జవాబుగా

ఆ. **"బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః**
ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రోఽజాయత ॥యజు. 31.11

టీక:- బ్రాహ్మణోఽస్యముఖమాసీత్ = ఈ పురుషుడి (పరమేశ్వరుడి) ఆజ్ఞానుసారం విద్య-సత్యభాషణం మొ॥ ఉత్తమగుణాల, శ్రేష్ఠకర్మల ద్వారా బ్రాహ్మణ వర్ణం ఉత్పన్నమవుతుంది. ఉత్తమ గుణాలు, శ్రేష్ఠకర్మల వల్ల ఈ జన్మ ఉత్తమంగా పిలువబడుతుంది, **బాహూ రాజన్యః కృతః** = బలపరాక్రమం మొదలైన ఉత్తమగుణాలు కలిగిన క్షత్రియులను సృష్టించాడు, **ఊరూ తదస్య యద్వైశ్యః** = వ్యవసాయం(కృషి), వ్యాపారం, అన్ని దేశభాషలను తెలిసికోవడం పశుపాలన మొ॥ మధ్యమగుణాల ద్వారా వైశ్యవర్ణం సిద్ధమవుతుంది. **పద్భ్యాం శూద్రోఽజాయత**= అన్నిటికంటే కింద ఉన్న (నిమ్న-నీచ అంశం పాదం) మాత్సర్యాది నిమ్న కోటికి సంబంధించిన శూద్రవర్ణం సిద్ధమవుతుంది (ఋ.భా.భూ.సృష్టి విధాన విషయం).

2. బ్రాహ్మణ గ్రంథాలలో.... ఈ ఆలంకారిక వర్ణనకు సహాయకంగా వేదాలకు వ్యాఖ్యాన గ్రంథాలైన బ్రాహ్మణ గంథాలందు ప్రమాణాలున్నాయి. ఈ కింది వాక్యాలలో సమాజానికి లేదా మనుషులకు బ్రాహ్మణుడు ముఖమని చెప్పబడ్డాడు. అంతేకాని ముఖం నుంచి పుట్టినట్లు కాదు.

(ఇ) **బ్రాహ్మణో మనుష్యాణం ముఖమ్** (తాండ్యబ్రా. 1-6-1) బ్రాహ్మణుడు మానవులకు ముఖము.

(ఈ) అస్య సర్వస్వ బ్రాహ్మణో ముఖమ్ (శత. 3. 9. 1. 14)

ఈ సమాజానికి లేదా ప్రపంచానికి బ్రాహ్మణుడు ముఖరూపం. అంటే సర్వప్రముఖ స్థానం కలవాడు.

3. వర్ణోత్పత్తి విషయక భ్రాన్త కల్పన-

ఈ శ్లోకానికి వ్యాఖ్యానం చేస్తూ, కుల్లూకభట్టు ఒక అత్యంత అవిశ్వసనీయమైన కల్పనచేసి, అలాంటి అంధవిశ్వాసాన్నే సమర్థించాడు. అతని వ్యాఖ్య "బ్రహ్మ తన ముఖం నుంచి బ్రాహ్మణుడినీ, బాహువుల నుంచి క్షత్రియుణ్ణీ, తొడల నుంచి వైశ్యుణ్ణీ, పాదాల నుంచి శూద్రుణ్ణి కన్నాడు (పుట్టించాడు). ఈ అంధకల్పనను ఎవరూ విశ్వసించరని తెలిసి ఈ వాక్యాన్ని జోడించాడు **"దైవ్యా చ శక్త్యా ముఖాదిభ్యో బ్రాహ్మణాది నిర్మాణం బ్రహ్మణో న విశంకనీయం, శృతిసిద్ధత్వాత్'. తథాచ శృతిః-బ్రాహ్మణోఽస్య ముఖామాసీత్"** (ఋ. 10. 90. 12)అంటే బ్రహ్మ ముఖాదుల నుంచి బ్రాహ్మణాది వర్ణాలు అతని దివ్యశక్తి వల్ల పుట్టినవి. ఇందులో ఏ మాత్రం శంకించరాదు. కారణం-పరమేశ్వరుడి ముఖమే బ్రాహ్మణుడని వేదం ప్రతిపాదిస్తుంది కాబట్టి. వాస్తవంగా ఇక్కడ ఆలంకారికంగా జరిగిన వర్ణనమిది. పరమేశ్వరుడి ముఖం, బాహువులు, తొడలు, పాదాలు గుణాలతో సామ్యత ననుసరించి నాలుగు వర్ణాల నిర్మాణం జరిగింది. ఉదాహరణకు, సప్తమాధ్యాయంలో 4వ శ్లోకంలో వర్ణించినట్లు- ఇంద్రుడు, వాయువు, యముడు, సూర్యుడు, చంద్రాదులైన అష్టవసువుల అంశలతో రాజు నిర్మాణమైనట్లుగా ఈ వసువుల ద్వారా రాజు నిర్మాణం జరగదు. ఆలంకారికంగా చెప్పినందువల్ల రాజులో పైన పేర్కొన్న వసువుల గుణాలున్నవని అర్థం. బ్రహ్మముఖాదుల నుంచి ఈ వర్ణాలు పుట్టినవని చెబుతూ కుల్లూకభట్టు చేసిన వ్యాఖ్య అవాస్తవికం. అస్వాభావికం అసంగతం కూడా. ఆలంకారిక రూప వర్ణనను బట్టి బ్రాహ్మణుడు ముఖస్థానీయుడని మాత్రమే చెప్పవచ్చు. అదే సంగతం-సముచితం. దివ్యశక్తివల్ల బ్రహ్మముఖం నుంచి పుట్టినట్లుగా అర్థం చెప్పడం కూడా అభూతకల్పనే. కారణం దివ్యశక్తి కూడా ఒక నిశ్చిత ప్రక్రియననుసరించి పని చేస్తుంది. దివ్యశక్తి అంటే సృష్టి క్రమానికి విరుద్ధంగా పనిచేస్తుందని భావించరాదు. అందువల్ల కుల్లూకభట్టుగారి విశ్వాసం కూడా బుద్ధి సంగతం కాదు. శైలినిబట్టి, ప్రసంగాన్ని బట్టి చూసినా ఇది ఆలంకారికంగా చెప్పినట్లు అర్థమవుతుంది. దీన్ని బట్టి కుల్లూకభట్టు, తదనుయాయుల వ్యాఖ్య అసంబద్ధమని నిశ్చితమవుతుంది.

(క) సృష్టి ఉత్పత్తి క్రమంలో 1. 16, 19, 22 లలో మానవులు మొద లైన ప్రాణులు పుట్టటం గురించి చెప్పటం ముగిసి పోయింది. ఆ పైన ఋషుల వేద జ్ఞాన ప్రకటనమూ జరిగింది (1. 23). ప్రజల సుఖ దుఃఖాలనూ (1. 26) చెప్పేశారు. మరి రెండవ సారి మళ్లీ ఉత్పత్తి ఏమిటి?

(ఖ) మను స్మృతిలో బ్రహ్మోత్పత్తి విషయం ప్రక్షిప్తం కనుక, ఆ పేరుతో కలిపి అర్థాలు చెప్పటమూ అనుచితమే (దీనికి 1. 7-13 శ్లోకాల వివరణ చూడండి). పరమాత్మ సూక్ష్మము, అవ్యయుడు కనుక శరీరాన్ని ధరించడు. అందు చేత ఆయన ముఖం మొదలైన వాటిని ఊహించడమే కుదరదు. ఇక వాటి నుంచి ఉత్పత్తి, తదితరాల ప్రశ్నే తలెత్తదు.

(గ) ఒకవేళ బ్రహ్మ వల్లనే ఈ ఉత్పత్తి అంతా జరిగిం దనుకున్నా, ఈ విషయం రుజువు కాదు. అందుకని బ్రహ్మను గురించి చెప్పిన చోట సృష్టి ఉత్పత్తి క్రమం - 'బ్రహ్మ నుంచి విరాట్టు, విరాట్టు నుంచి మనువు, మనువు నుంచి మిగతా సృష్టి' - (1. 32 - 41) ఈ విధంగా ఉంది. దానికీ పలు రకాల వ్యతిరేక వాదాలు వినవస్తున్నాయి.

(ఘ) బ్రాహ్మణులు ముందు పుట్టి ఆ తర్వాతనే మనువు పుట్టా డని తెలిపారు.

(జ) ఒక వేళ పైన చెప్పిన బ్రహ్మ పరంపర నుంచే సృష్టి మొత్తం వచ్చి ఉంటే, బ్రాహ్మణులు మొదలైనవారు ముందుగా ఎందుకు, ఎవరి నుంచి పుట్టారు?

(ఝ) బ్రాహ్మణులు, తదితరులను ముందే సృష్టించి ఉంటే, ఆ తర్వాత విరాట్టు, మనువులను సృష్టించ వలసిన అవసర మేమిటి? ముందు పుట్టించిన వారితోనే సృష్టి జరిగి పోయేది కదా?

(ఞ) ముఖం మొద లైన వాటి నుంచి బ్రాహ్మణులు పుట్టా రనుకుంటే, విరాట్టును కూడా మరొక అవయవం నుంచి ఎందుకు పుట్టించ లేదు? వారిని పుట్టించటానికి ముందు స్త్రీని సృష్టించ వలసిన అవసరం ఎందుకు ఏర్పడింది (1.32)?

ఈ విధంగా ఎన్నో ప్రశ్నలతో కూడిన కుల్లూక భట్టు, అతని అనుయాయుల ఊహ లన్నీ తప్పు, అనందర్భ మైన వని రుజు వవుతుంది. అందు చేత ఆలంకారిక అర్థమే మనువు చెప్ప దలచిం దనేది తెలిసి పోతున్నది. ఇక్కడ వర్ణించిన వారిని గురించి కాక, వర్ణాల ఉత్పత్తి ప్రదర్శన జరిగింది.

ఈ క్రింది 32 నుండి 41వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు ఇవి ప్రామాణికం కావు

*** బ్రహ్మ నుండి స్త్రీ పురుషుల ఉత్పత్తి-**

*** ద్విధా కృత్వాఽఽత్మనో దేహమర్ధేన పురుషోఽభవత్ ।**
అర్ధేన నారీ తస్యాం స విరాజమసృజత్ప్రభుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***32***

తాత్పర్యం:-తదుపరి బ్రహ్మ తన దేహాన్ని రెండుభాగాలుగా విభజించుకొని ఒక భాగంను పురుషుడును, మరో భాగంను స్త్రీగాను అయ్యాడు. అప్పుడా పురుషుడు ఆ స్త్రీతో సంగమించి విరాట్ పురుషుడిని సృజించాడు.॥32॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

*** మనువు పుట్టుక-**

*** తపస్తప్త్వాఽసృజద్యం తు స స్వయం పురుషో విరాట్ ।**
తం మాం విత్తాస్య సర్వస్య స్రష్టారం ద్విజసత్తమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***33***

తాత్పర్యం:-“ఓ బ్రాహ్మణోత్తములారా! విరాట్ పురుషుడు దేనినైతే తపించి సృజించాడో, అంటే..... విరాణ్మూర్తి క్రమించి ఎవర్ని సృజించదలచాడో ఆ ప్రజాపతిని-స్రష్టను-పరమేష్ఠి- విరించి-కమలాసనుణ్ణి నేనే అని తెలుసుకోండి !” ॥33॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

*** పదిమంది ప్రజాపతుల పుట్టుక-**

*** అహం ప్రజాసిసృక్షుస్తు తప స్తప్త్వా సుదుశ్చరమ్ ।**
పతీన్ ప్రజానామసృజం మహర్షీనాదితో దశ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***34***

తాత్పర్యం:-నేను ప్రజలను సృష్టించాలనే సంకల్పంతో, ఇతరులకు సాధ్యంకాని తపస్సు చేసి మొదట పదిమంది ప్రజాపతులను సృజించాను. ॥34॥

*** మరీచిమత్ర్యంగిరసౌ పులస్త్యం పులహం క్రతుమ్ ।**
ప్రచేతసం వసిష్ఠం చ భృగుం నారదమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***35***

తాత్పర్యం:-ఆ ప్రజాపతులు ఎవరెవరంటే?......మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, ప్రచేతనుడు, వశిష్ఠుడు, భృగువు, నారదుడు. ॥35॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

*** మరల సప్తమనువుల దేవతల సృష్టి-**

*** ఏతే మనూంస్తు సప్తాన్యానసృజన్ భూరితేజసః ।**
దేవాన్ దేవనికాయాంశ్చ మహర్షీంశ్చామితౌజసః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***36***

తాత్పర్యం:-గొప్ప తేజస్సు కలిగిన మరీచ్యాదులు (పైన చెప్పబడిన పదిమంది ప్రజాపతులు) తమవలెనే తేజస్సు గలిగిన ఏడుగురు మనువులను-దేవతలను-దేవతలకు నివాసాలను-మరింత తేజస్సుగల మహర్షులను సృజించారు. ॥36॥

* యక్ష మొదలగువారి సృష్టి-

* యక్షరక్షః పిశాచాంశ్చ గంధర్వాప్సరసోఽసురాన్ ।
నాగాన్ సర్పాన్సుపర్ణాంశ్చ పితౄణాం చ పృథగ్గణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**37**

తాత్పర్యం:-కుబేరాదులగు యక్షులను, రాక్షసులను, పిశాచాదులను గంధర్వులను అప్సరసలను, అసురులను, నాగజాతులను, సర్పాలను, గరుడుడు మొదలైన పక్షి జాతులను, పితృదేవతలను, తదితర గణాలను ఈ ప్రజాపతులే సృష్టించారు. ॥37॥

* యక్ష మొదలగువారి సృష్టి- ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* విద్యుతోఽశనిమేఘాంశ్చ రోహితేంద్రధనూంషి చ ।
ఉల్కానిర్ఘాతకేతూంశ్చ జ్యోతీంష్యుచ్చావచాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**38**

* కిన్నరాన్వానరాన్మత్స్యాన్ వివిధాంశ్చ విహంగమాన్ ।
పశూన్మృగాన్మనుష్యాంశ్చ వ్యాలాంశ్చోభయతోదతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**39**

* క్రిమికీటపతంగాంశ్చ యూకామక్షికమత్కుణమ్ ।
సర్వం చ దంశమశకం స్థావరం చ పృథగ్విధమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**40**

* ఏవమేతైరిదం సర్వం మన్నియోగాన్మహాత్మభిః ।
యథాకర్మ తపోయోగాత్సృష్టం స్థావరజంగమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**41**

తాత్పర్యం:-ఉరుములు, మెరుపులు, పిడుగులు, మేఘాలతో కూడిన ఆకాశాన్ని, పొడవాటి రోహితమనే నక్షత్రాన్ని, ఇతర నక్షత్రాలను, తోకచుక్కలను, ఇంద్రధనుస్సును, ఉత్పాతాలను, మంటలు గల్గిన జ్యోతిస్సులను, ఆ రోదసి లోనే గ్రహాలను, కిన్నర, కింపురుషాదులను, వానరులను, నరులను, మత్స్యజాతులను, రకరకాల పక్షులను, పశుజాతులను, మృగాలను, పులివంటి అడవి జంతువులను, కీటకాలను, క్రిమిజాతులను, ఈగలు-నల్లులు వంటి క్షుద్రక్రిములను, వృక్షాలను, పర్వతాలను ఈ మరీచ్యాది మహర్షులు సృజించారు.

ఇలా ఆ మహాత్ములైన మరీచ్యాది ప్రజాపతులు తపము చేసి, నా ఆజ్ఞతో వారి వారి కర్మానుసారంగా ఈ కనిపిస్తున్న స్థావరజంగమరూపమైన ప్రపంచమంతా సృజించారు. ॥38-41॥

ప్రక్షిప్తాల పరిశీలన

32 నుంచి 41 వరకు గల శ్లోకాలలోని ఈ విషయం కింది ప్రమాణాల ప్రకారం ప్రక్షిప్తం-

1. విషయ వ్యతిరేకం

(1) ఏడుగురు మానవులతో చరాచర జగత్తు సృష్టి జరుగదు- ఈ వర్ణన వల్ల సృష్టి ఉత్పత్తి గురించి ఒక్కసారిగా రెండు విషయాలు తయారయ్యాయి- ఒకటి, అవ్యక్త సూక్ష్మ పరమాత్మ ద్వారా మహత్ మొదలైన తత్త్వాలు పుట్టాయనేది మొదటిది. అది-5,6,14-23, 27-31, 42-49, 52-57, 67-78 శ్లోకాలలో వివరించబడింది. రెండవది, బ్రహ్మ వంశీయుడైన మనువు ద్వారా సమస్త జగత్సృష్టి జరిగిందన్న విషయం గలవి 7.13, 24,25, 32-41, 50,51, 58-63 శ్లోకాలు. ఈ రెండిటిలో ఒకటే మౌలికం, రెండూ కాలేవు అనేది సందేహం లేని విషయం;

ఎందుకంటే, ఈ రెండూ పరస్పర వ్యతిరేకాలు కావటంతో పాటు, రెండిటి శ్లోకాలూ క్రమంలో కలవడం లేదు. ఈ రెండిటిలో అవ్యక్త సూక్ష్మ పరమాత్మ ద్వారా తత్త్వాల నుంచి సృష్టి జరిగిందనేదే మౌలికమని భావించాలి, ఎలాగంటే-

క. 1.5,6లలో అదే పరమాత్మ సృష్టి ఉత్పత్తిని గురించి చెప్పటం ప్రారంభించాడు. హేతువుల ప్రమాణంగా ఆయనే సృష్టి చేయటంలో సమర్థుడని భావించబడుతూంది.

ఖ. తత్త్వాల నుంచి సృష్టి జరిగిందన్న క్రమమే యుక్తి యుక్తం. 1.5,6 శ్లోకాలలో **'మహాభూతాది వృత్తౌ జాః'**, **'తమోనుదః'** మొ॥ విశేషణాలతో మనువు ఇదే క్రమాన్ని సంకేతించాడు కాని, బ్రహ్మవంశాన్ని కాదు.

గ. బ్రహ్మవిషయాన్ని చెప్పే శ్లోకాలను ఎక్కడెక్కడ ప్రక్షిప్తాలుగా చొప్పించబడ్డామో, అవన్నీ పూర్వాపర శ్లోకాలతో క్రమంలో కానీ, విషయంలో కానీ కలవడం లేదు. పైగా వాటి వల్ల మూల విషయానికి అక్కడక్కడా భంగం కలిగింది.

ఘ. బ్రహ్మవిషయం గల శ్లోకాల శైలి కల్పనలపై ఆధారపడి అయుక్తంగానూ, అవిశ్వసనీయంగానూ, ఆధార రహితంగానూ, అపరిష్కృతాలుగానూ, గంభీర రహితంగానూ ఉంది. మూలరచనలోని శ్లోకాల శైలిలో ఈ లోపాలు లేవు.

ఙ. ఎవరైనా మనుజుల ద్వారా (మనువు, ప్రజాపతులవలె) స్థావరాలు, పశుపక్షులు, కీటకాలు మొ॥., వాటి సృష్టి ప్రకృతి విరుద్ధమూ, నమ్మదగినది కాదు. వీటివల్ల మనుస్మృతిలో బ్రహ్మకు సంబంధించిన ఉత్పత్తి మౌలికం కాదని తేలుతూంది. ఈ విధంగా 32-41 శ్లోకాలలోని ఈ విషయం కూడా బ్రహ్మవిషయం ఉంది కనుక ప్రక్షిప్తమే.

(2) ఈ శ్లోకాలు పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకాలు. ఇవి మూలాన్ని భంగపరుస్తున్నాయి. 24వ శ్లోకం నుంచి కర్మల చర్చ మొదలైంది.

అదే క్రమంలో 31వ శ్లోకంలో కర్మల ప్రకారం సమాజంలో నాలుగు వర్ణాల నిర్మాణం చెప్పారు. దీని తర్వాత వారి కర్మలు చెప్పాలి. కానీ మనువు విషయాన్ని మార్చి, మరియు ప్రాణుల వర్గాలు, జన్మక్రమాల వివరణ అవసరమని భావించి, 42వ శ్లోకంలో ఈ విషయపు మార్పిడిని గురించి చెప్పాడు. తొలి వాక్యంలో కర్మను గురించి 31వ శ్లోకం ఆధారంగా చెప్పాడు. అందువల్ల 31వ శ్లోకం తర్వాత 42వ శ్లోకం ఉండటమే ఉచితం. ఇవి ఉన్న విషయాన్ని భంగం చేయటం వల్ల విషయ వ్యతిరేకాలు.

(3) 1.14-23 శ్లోకాలలో సమస్త జగత్తు ఉత్పత్తినీ చెప్పటంతో, ఆ శ్లోకంతో ఆ ఉత్పత్తి విషయం ముగిసి పోయింది. విషయం అయిపోయిన తర్వాత మళ్లీ జగదుత్పత్తిని గురించి చెప్పటం, మరొక భిన్న విషయం ప్రారంభించడం సందర్భోచితం కాదు. ఈ దృష్టితో కూడా ఈ శ్లోకాలు విషయ వ్యతిరేకాలు.

2 అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో మూడు రకాల వ్యతిరేకతలు ఉన్నాయి-

క. 1.5, 6, 14-23 శ్లోకాలలో అవ్యక్త సూక్ష్మ పరమాత్మ వల్ల తత్త్వాల నుంచి సృష్టి జరిగింది.

ఖ. 1.7-13,50, “ఏవం సర్వం స సృష్ట్వేదం చ అచింత్య పరాక్రమః”- 'ఇలా ఆ బ్రహ్మ ఈ సమస్త జగత్తు'నూ, నన్నూ (మనువును) ఉత్పన్నం చేసి(1.51) అన్నదాని ప్రకారం ఈ సృష్టి బ్రహ్మదని భావించారు.

గ. 34-41 శ్లోకాలలో మనువు, అతని ద్వారా ఉత్పన్నమైన పదిమంది ప్రజాపతులకు ఈ జడ-జంగమ జగద్రచయిత అని చెప్పారు. ఈ మూడు విషయాలూ ఒకదానికి ఒకటి వ్యతిరేకాలు. వీటిలో ఏదో ఒకటే మౌలికం కావాలి. 1.7-13, ఈ 32-42 శ్లోకాల కిచ్చిన వివరణలలో, ప్రమాణాలు ఆధారంగా అవ్యక్త సూక్ష్మ పరమాత్మ నుంచి సృష్టి జరిగిన సంగతే మౌలికమని రూఢి అవుతూంది. మిగిలిన రెండూ దీనికి వ్యతిరేకం కావడం చేత, మనుప్రోక్తమూ, మౌలికమూ కాకుండా ప్రక్షిప్తాలవుతాయి.

3. శైలీగత ఆధారాలు

మనువు శైలికి ఈ శ్లోకాల శైలి భిన్నంగా ఉంది. మౌలిక సృష్టి క్రమం (1.5-6, 14-23) శ్లోకాల శైలి ఆధారంతో కూడినదీ, పరిష్కృతమూ, యుక్తియుక్తిమూ (ఒక సునిశ్చితమైన, ప్రకృతి సిద్ధమైన ప్రక్రియననుసరించి సృష్టిక్రమాన్ని చూపించేది) అయినది. కానీ, ఈ శ్లోకాల శైలి నిరాధారమూ, సృష్టి క్రమానికి వ్యతిరేకమూ, అపరిష్కృతమూ, యుక్తియుక్తం కానిదీ-

క. ఈ శ్లోకాలలో సృష్టి ఉత్పత్తి ఒక నిశ్చితమైన ప్రక్రియకాదు.

ఖ. 32వ శ్లోకంలో బ్రహ్మ యొక్క సగభాగం నుంచి పురుషుడు, రెండవ సగం నుంచి స్త్రీని సృష్టించాడనే వర్ణన కూడా హేతుబద్ధం కానిది, అవిశ్వసనీయం, సృష్టి క్రమానికి వ్యతిరేకం, మూఢ నమ్మకం మీద ఆధారపడింది.

గ. బ్రహ్మ తన సగభాగం నుంచి సృష్టించిన స్త్రీ నుంచి విరాట్‌ను సృష్టించాడు. కానీ విరాట్ మనువును ఏ స్త్రీ నుంచి పుట్టించాడు? (32, 33), దీనికి వివరణ లేదు.

ఘ. ఇదే విధంగా మనువు దశ ప్రజాపతులను (34), వారు ఏడుగురు మనువులను (35, 36), ఏ స్త్రీ ద్వారా జన్మింపజేశారు? ఆ స్త్రీ పుట్టుక ఎలా జరిగింది? బ్రహ్మ ఒక స్త్రీనే సృష్టించినట్లు చెప్పారు. ఆమె ద్వారా విరాట్, పుట్టాడు. వీటన్నిటినీ చెప్పలేదు, కేవలం కల్పనగా చూపారు.

జ. మనుష్యుల నుంచి పశుపక్షులను, కీటకాలు, పురుగులను, జడవస్తువులు పుట్టడం ప్రకృతికి విరుద్ధం (37-41). ఇవన్నీ ఈ శ్లోకాల శైలి నిరాధారమూ, హేతుబద్ధం కాని, అపరిష్కృత మని రూఢి చేస్తున్నాయి. వీటి రచన కేవలం ఒక సంప్రదాయం ప్రకారం, మూఢమైన కల్పనపై ఆధారపడింది. మౌలిక విషయంలో సృష్టిని గంభీరంగా, సంక్షిప్తమైన శైలిలో చెప్పాడు. అందుచేత మనువు ప్రాణుల, స్థావరాలను గణించలేదు. ఈ శ్లోకాలలో పరిగణనాత్మక శైలి ఉంది. ఈ వర్ణనలో సంక్షిప్తతా లేదు, గాంభీర్యమూ లేదు. ఈ దృష్టితో ఇవి మనువు చెప్పినవి కావు. (1.7-13 శ్లోకాల సమీక్షలు చూడదగినవి).

ఈ విధంగా పైన చెప్పిన ఆధారాలు, ప్రమాణాల వల్ల ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని తెలుస్తున్నాయి. వీటితో పాటు బ్రహ్మకు సంబంధించిన విషయం కూడా మౌలికం కాదని తేలిపోతూంది.

42 నుండి 49వ శ్లోకం వరకు మనుకృతం ఇవి ప్రామాణికం

ప్రాణుల ఉత్పత్తి క్రమము

యేషాం తు యాదృశం కర్మ భూతానా మిహ కీర్తితమ్ । మూలశ్లోక సం. **22**
తత్తథా వోఽభిధాస్యామి క్రమయోగం చ జన్మని ॥ ప్రక్షిప్త శ్లోక సం. **42**

టీక:- **ఇహ** = ఈ ప్రపంచంలో, **యేషాం భూతానాం** = ఏ మనుషుల, **యాదృశం కర్మ** = కర్మ ఎలాంటిదో, **కీర్తితం** = వేదాలలో చెప్పబడిందో, **తద్** = దాన్ని, అలాగే (1.87-91), **చ** = మరియు, **జన్మని** = జన్మించడం, **క్రమయోగం** = నిశ్చితక్రమాన్ని, **వః** = తమకు, **అభిధాస్యామి** = తెలియజేస్తాను.

తాత్పర్యం:- ఏ ప్రాణులకు ఏ కర్మ వేదాలలో చెప్పబడిందో ఆ యా కర్మలను క్రమయోగాన్ని తెలియజేస్తాను. ఏ యే భూతాలకు (జీవరాశికి) ఈ సంసారమున ఏ కర్మ ఆచరణయోగ్యమో ఈ క్రింద ముమ్ముందు వివరించబడుతుంది.॥42॥

వివరణ:

42 శ్లోకానికి సరియైన అర్థం:-

ఈ 42వ శ్లోకశైలి -అర్థం గురించిన పరిశీలన: 1.సృష్టి ఉత్పత్తి ప్రసంగం సమాప్తమైన తరవాత కర్మల ప్రసంగం వచ్చింది. కానీ సృష్టికి సంబంధించిన ఇంకా కొన్ని విషయాలను తెలుపవలసి ఉన్నందున మనువు ఈ ప్రసంగాన్ని మార్చి సృష్టి ఉత్పత్తిని ప్రారంభించాడు. భిన్నప్రసంగాన్ని ప్రారంభించేముందు తత్సంబంధమైన సూచన చేస్తాడు. ఇది మనువు శైలి. అందువల్ల ప్రసంగభిన్నమనే దోషం రాదు.

2. ఇక్కడ **'కీర్తితమ్'** అనడం ద్వారా వేదాలలో చెప్పబడిందని భావన. 1.3, 21,87 శ్లోకాల ద్వారా ఈ విషయం సమర్థించడం జరిగింది. ఈ శ్లోకాలలో మను అభిప్రాయమిది. "పరమేశ్వరుడు విధించిన కర్మ విధానం తత్సంబంధమైన జ్ఞానం వేదం ద్వారా కలిగించాడు". వేదోక్త కర్మలనే మనువు వర్ణించాడు. 1.3 శ్లోకంలో చెప్పినట్లుగా మనుమహర్షి కార్యతత్వార్థవిదుడు కాబట్టి, వేదప్రతిపాదితమైన ధర్మాధర్మాలను గురించి జిజ్ఞాస తెలియజేశాడు.

3. "క్రమయోగమ్" అనడం ద్వారా క్రమానుసారమని అర్థకథనం సరైనది కాదు. జీవుల ఉత్పత్తికి ఒక నిశ్చిత క్రమముంది. మనుష్యాదులు జరాయువు నుండి; పక్షులు, సర్పాలు అండాల నుండి పుట్టినవని తెలియజేయడానికి **"క్రమయోగం చ జన్మని"** అని ప్రయోగించాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

జరాయుజ జీవులు-

పశవశ్చ మృగాశ్చైవ వ్యాళాశ్చోభయతోదతః । మూలశ్లోక సం. **23**
రక్షాంసి చ పిశాచాశ్చ మనుష్యాశ్చ జరాయుజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **43**

టీక:- పశవః = ఆవు మొ ॥ గ్రామపశువులు, **మృగాః** = అహింసకవృత్తి కలిగిన జింక మొ॥ వన్యపశువులు, చ = మరియు, **ఉభయతోదతః వ్యాళాః** = రెండువైపుల దంతాలుగల, పశువులు, హింసావృత్తి కలిగిన సింహవ్యాఘ్రాది మృగాలు, చ = అలాగే, **రక్షాంసి** = రాక్షసులు, **పిశాచాః** = పిశాచులు, చ = అలాగే, **మనుష్యాః** = మనుషులు, **జరాయుజాః** = మావి నుండి పుట్టినవి.

తాత్పర్యం:-పైన-క్రింద దంతాలు ఉండే పశువులు, మృగాలు, క్రూరమృగాలు, రాక్షసులు, పిశాచాలు, మనుషులు, 'మావి' నుంచి పుట్టినవారు. వీరిని **'జరాయుజాలు, మావిజాలు'** అంటారు.॥43॥

వివరణ:- రాక్షస, పిశాచాల లక్షణాల గురించి 3.33,34వ శ్లోకాల సమీక్షను చూడండి.

ఇది మనుకృతం-ప్రామాణికం

అండజములు-

అండజాః పక్షిణస్సర్పా నక్రామత్స్యాశ్చ కచ్ఛపాః । మూలశ్లోక సం. **24**
యాని చైవం ప్రకారాణి స్థలజాన్యౌదకాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **44**

టీక:- పక్షిణః = పక్షులు, **సర్పాః** = సర్పాలు, **నక్రాః** = మొసళ్ళు, **మత్స్యాః** = చేపలు, చ = మరియు, **కచ్ఛపాః** = తాబేళ్ళు, చ = మరియు, **యాని**= అన్యములైన, **ఏవం ప్రకారాణి** = ఈ రకాలైన, **స్థలజాని**= భూమిమీదనుండే, చ = మరియు, **ఔదకాని** = జలమందుండే జీవములు, అవన్నీ, **అండజాః** = అండజములు అంటే, గుడ్డు నుండి పుట్టేవి.

తాత్పర్యం:- భూమిమీద తిరగాడే, పాములు, తేళ్లు, నీటిలో తిరిగాడే చేపలు, తాబేళ్లు....మొ॥వి., **'అండజములు'**. అంటే గుడ్ల నుంచి ఉత్పన్నమయ్యేవి. ఇవి నీటిలో ఉండేవి కొన్ని, భూమ్మీద ఉండేవి కొన్ని.॥44॥

ఇది మనుకృతం-ప్రామాణికం

స్వేదజ జీవులు-

స్వేదజం దంశమశకం యూకామక్షికమత్కుణమ్ । మూలశ్లోక సం. **25**
ఊష్మణశ్చోపజాయన్తే యచ్చాన్యత్కించిదీదృశమ్ ॥ ప్రక్షిప్తశ్లోక సం. **45**

టీక:- **దంశమశకం** = కొండితో కాటువేసే దోమ మొదలయినవి, **యూకా** = పేలు, **మక్షిక** = ఈగలు, **మత్కుణాః** = నల్లులు, **యచ్చ అన్యత్ కించిదీదృశం** = ఇలాంటి మరికొన్ని జీవులు, **ఊష్మణః** = వేడివల్ల, **ఉపజాయన్తే**= పుట్టేవి. ఇవన్నీ, స్వేదజం = చెమట నుంచి పుట్టినవి.

తాత్పర్యం:-ఈగలు, దోమలు, పేలు, నల్లులు, కొన్ని సూక్ష్మ క్రిమికీటకాలు....వీటిలో ఏవేవి చెమట వల్ల (ఆవిరితో కూడిన ఉక్కపోతకు) పుడతాయో వాటిని **'స్వేదజములు'** అని వ్యవహరించాలి.॥45॥

ఉద్భిజ జీవులు-ఓషధులు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఉద్భిజ్జాస్స్థావరాస్సర్వే బీజకాండప్రరోహిణః । మూలశ్లోక సం.**26**
ఓషధ్యః ఫలపాకాంతా బహుపుష్పఫలోపగాః ॥ ప్రక్షిప్తశ్లోక సం.**46**

టీక:- **బీజకాండప్రరోహిణః** = బీజముల నుంచి, కొమ్మలనుంచి పుట్టేవి, **సర్వే స్థావరాః** = ఒకే స్థానమందుండి, కదలని వృక్షం మొ॥, **ఉద్భిజాః** = భూమినిగాని చీల్చుకొనిగాని పుట్టే వీటిలో, **ఫలపాకాంతా** = ఫలించిన తరవాత ఎండిపోయేవి, మరియు, **బహుపుష్పఫలోపగాః**= పెక్కు పుష్పాలు, ఫలాలు కలుగునట్టి, **ఓషధ్యః** = ఓషధాలు అని పిలువబడును.

తాత్పర్యం:-స్థావరములైనవి (వృక్షములు) అన్నీ భూమినిగాని విత్తనాన్నిగాని చీల్చుకొని పుడుతున్నాయి. ఇవి రెండు విధాలుగా ఉన్నాయి. కొన్ని విత్తనాల నుంచి పుడుతున్నాయి. మరి, కొన్ని కొమ్మలు నాటడం వల్ల వృక్షాలవుతున్నాయి. వ్రీహధాన్యం మొ॥ పంటలు, పండటంతోనే నశించేవి. మరి కొన్ని చెట్లు ఏళ్ల తరబడి ఫలపుష్పాలు అందించేవి. ఇవి **'ఓషధులు'** అని పిలువబడతాయి.॥46॥

వనస్పతులు-వృక్షాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

అపుష్పాః ఫలవన్తో యే తే వనస్పతయః స్మృతాః । మూలశ్లోక సం.**27**
పుష్పిణః ఫలినశ్చైవ వృక్షాస్తూభయతః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**47**

టీక:- **యే అపుష్పాః ఫలవన్తః** = పూలు రాకుండా ఫలాలుండే వృక్షాలు, **వనస్పతయః స్మృతాః** = వాటికి వనస్పతులని పేరు ఉ॥ వటవృక్షం, రాగి, మేడి, అత్తిపండు మొ॥, **చ** = మరియు, **పుష్పిణః ఫలినః** ఏవ = పూలు వచ్చి ఫలించేవి, **ఉభయతః** = రెండు రకాలైనవి, **వృక్షాః స్మృతాః** = వృక్షాలుగా పిలవడం జరుగుతున్నాయి.

తాత్పర్యం:-పుష్పాలులేకుండానే ఫలాలనిచ్చే చెట్లు 'వనస్పతు'లనబడతాయి. కొన్ని వృక్షాలు పుష్పించి, ఫలాలను ఇస్తున్నాయి. వీటికే వృక్షాలని వ్యవహారం. ఈ ప్రకారం **'ఉద్భిజాలు ఓషధులు - వనస్పతులు'** అని రెండు విధాలుగా ఉన్నాయి. ॥47॥

గుల్మ-గుచ్ఛ-తృణ-ప్రతాన-వల్లీ మొ॥- ఇది మనుకృతం-ప్రామాణికం

గుచ్ఛగుల్మంతు వివిధం తథైవ తృణజాతయః । మూలశ్లోక సం.**28**
బీజకాండరుహాణ్యేవ ప్రతానా వల్ల్య ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం..**48**

టీక:- వివిధం = అనేక రకాలైన, **గుచ్ఛ** = వేళ్ళనుంచి పొదలుగా వచ్చేవి, **గుల్మం** = ఒక వేరుతో అనేక పాయలుగా వ్యాపించే -చెరుకు మొదలైనవి, **తథైవ** = అదే రకంగా, **తృణజాతయః** = గడ్డిగాదములు, **బీజకాండ రుహాణి** = బీజం నుంచి, కొమ్మల నుంచి పెరిగేవి. **ప్రతానాః** = మొలిచి వ్యాపించేవి-గరికగడ్డి మొ॥వి, **చ** = మరియు, **వల్ల్యః** = మొలచి దేన్నైనా ఆధారంచేసుకొని పాకే తీగెలు మొ॥వి., ఏవ = ఈ సమస్త స్థావరాలకు కూడా ఉద్భిజములని పేరు.

తాత్పర్యం:-వ్రేళ్ల మొదలునుంచీ తీగలు సాగునవి "**గుచ్ఛములు**' అనీ; ఎక్కువ వ్రేళ్లు కలిగి దుబ్బుగా మొక్కలు పెరిగేవి '**పొదలు**' లేదా '**గుల్మములు**' అనీ; ఇంకా దర్భ మొ॥గడ్డి జాతులనీ; సొర, బీర వంటివి '**ప్రతానము**'లనీ; గుమ్మడి వంటివి '**వల్లులు**' అనీ చెప్పబడ్డాయి. కొన్ని కొమ్మలు నాటగా పెరిగేవి కూడా ఉన్నాయి. ॥48॥

వృక్షాలలో అంతశ్చేతన-

ఇది మనుకృతం-ప్రామాణికం

తమసా బహురూపేణ వేష్టితాః కర్మహేతునా । మూలశ్లోక సం.**29**
అంతస్సంజ్ఞా భవంత్యేతే సుఖదుఃఖసమన్వితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**49**

టీక:- **కర్మ హేతునా** = పూర్వ జన్మలో చేసిన కర్మఫలం వల్ల, **బహురూపేణ** = పలురకాలైన అజ్ఞానాది తమోగుణాల ద్వారా, **వేష్టితాః** = చుట్టబడిన (నిండిన), **ఏతే** = ఈ స్థావరజీవులు, **సుఖదుఃఖ సమన్వితాః** = సుఖదుఃఖాలతో కలిసి, **అంతఃసంజ్ఞా భవంతి** = ఆంతరిక చైతన్యవంతులవుతాయి. అంటే వీటిలోపల చైతన్యముంటుంది. కాని, చరప్రాణులతో సమానంగా బాహ్యక్రియలో ప్రత్యక్షంగా కనిపించదు. అత్యధికమైన తమోగుణం వల్ల చైతన్యం, భావాలు ప్రస్ఫుటంగా కనిపించవు.

తాత్పర్యం:-ఈ స్థావరాలన్నీ రకరకాల కర్మలకు కారణమయిన తమోగుణంతో కూడుకున్నవై, అంతర్గతంగా చైతన్యాన్ని కలిగి ఉండడం చేత సుఖదుఃఖాలకు నెలవై ఉన్నాయి. ॥49॥

వివరణ:

వృక్షాల్లో ఉన్న చైతన్యాన్ని గురించి ఆలోచన- ఇక్కడ వృక్షాలలో చైతన్యముందని మహర్షి స్వీకరించాడు. అయితే ఆ చైతన్యం బాహ్యరూపంలో కనిపించేది కాదు. కేవలం ఆంతరికంగానే ఉంటుంది. అంతేగాక, ఈ వృక్షాదులు అత్యధిక తమోగుణ పరివేష్టితాలు. సుఖదుఃఖ భావసమన్వితమైన చైతన్యం ఈ వృక్షాదులలో ఉన్నప్పటికీ, తమోగుణాధిక్యత వల్ల అనుభూతి (feeling) ప్రకటం కాదు. మూర్ఛితప్రాణిలో చైతన్యమున్నప్పటికీ సుఖదుఃఖజ్ఞానం లేనట్లు, వృక్షాదులలో సుఖదుఃఖ వ్యవహారముండదు. పంచేంద్రియాలు గల ప్రాణులకే సుఖదుఃఖానుభూతి కలుగుతుంది. ఇంద్రియాలున్నప్పుడే విషయాలతో వాటికి సంబంధముంటుంది. వీటిలో ఇంద్రియాలు లేవు కాబట్టి, సుఖదుఃఖానుభూతి వ్యక్తం కాదు. ఇందుకు సాంఖ్యదర్శనం సాక్షి-

"పంచావయవయోగాత్ సుఖసంవిత్తిః" (5.27 సాంఖ్య)

పంచేంద్రియాలకు పంచవిషయాలతో (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు) సంబంధం కలిగినప్పుడు సుఖానుభూతి గానీ లేదా దుఃఖానుభూతి గానీ జీవుడికి కలుగుతుంది. చెవిటివాడికి తిట్లవల్ల బాధ, గుడ్డివాడికి రూపం వల్ల సుఖదుఃఖాదులు, నాలుక లేని వాడికి రుచి జ్ఞానం, ముక్కు పోయినవాడికి సుగంధ, దుర్గంధ జ్ఞానం కలుగదు గదా? అదే విధంగా వృక్షాలకు కూడా పీడానుభూతి కలుగదు. అందువల్లనే వృక్షాదులను ఛేదించడంలో హింస గానీ హింసాజన్య పాపం గానీ ఉండదు.

ఈ క్రింది 50,51వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** ప్రపంచగతుల ఉపసంహారం-**

* *ఏతదంతాస్తు గతయో బ్రహ్మాద్యాస్సముదాహృతాః ।*
ఘోరేఽస్మిన్ భూతసంసారే నిత్యం సతతయాయిని ॥ ప్రక్షిప్త శ్లోక సం.*50*

తాత్పర్యం:-భయంకరమైనది, ఎప్పటికప్పుడు నశించేతత్త్వంగలది అయిన ఈ పాంచభౌతిక సంసారంలో బ్రహ్మా మొదలుకొని పైనచెప్పబడిన స్థావరముల వరకు మొత్తం అంతటినీ 'సృష్టి' అని నిర్వచించవలసి ఉంటుంది. ॥50॥

* బ్రహ్మ-అన్తర్ధానం- ఇది ప్రక్షిప్తం.ప్రామాదికం కాదు

* ఏవం సర్వం సస్పృష్ట్వేదం మాం చాచిన్త్య పరాక్రమః ।
ఆత్మన్యంతర్దధే భూయః కాలం కాలేన పీడయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **51**

తాత్పర్యం:-ఈ విధంగా స్థావర జంగమరేపమైన సమస్త వస్తువులను సృష్టించి, సాటిలేని ధీవిక్రమశాలి అయిన బ్రహ్మ నన్ను చూసి, సృష్టికాలాన్ని ప్రళయకాలానంతర సృష్టిని వివరించి, తనకు తానై తనలోకి అంతర్ధానమైనాడు.॥51॥

ప్రక్షిప్తాల పరిశీలన-

ఈ 50-51వ శ్లోకాలు కింది ప్రమాణాల వల్ల ప్రక్షిప్తాలు-

1. విషయవ్యతిరేకాలు

(1) 1.9లో వర్ణించిన ఒక కొత్త విషయం ద్వారా సృస్టిని చూపించి, పై శ్లోకంలో బ్రహ్మ అంతర్ధానం చెప్పి, ఆ విషయాన్ని, ముగించారు. తర్వాతి 1.80వ శ్లోకం వరకు పరమాత్మ సృష్టి చేసిన ప్రక్రియ నడుస్తూంది. మూలవిషయపు ముగింపున కన్నా పూర్వమే బ్రహ్మ అంతర్ధానం చెప్పి, ముగించటం విషయ వ్యతిరేకం.

2. అంతర్ వ్యతిరేకాలు- 'బ్రహ్మ' అనే విశేష వ్యక్తి చేత సృష్టి జరగలేదు

క. ఈ శ్లోకాలు బ్రహ్మద్వారా జగదుత్పత్తి జరిగిందనే విషయానికి సంబంధించింది. ఈ విషయం ఎన్నో ఆధారాలు, హేతువుల వల్ల ప్రక్షిప్తాలని రుజువైంది. (చూడండి 1.7-13, 32-42 శ్లోకాల సమీక్ష) అందుచేత ఆ ప్రసంగానికి సంబంధించిన శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే.

ఖ. 1.3 నుంచి స్పష్టంగా అవ్యక్త పరమాత్మ ద్వారా సృష్టి జరిగిందని చెప్పారు. ఈ జగత్తు ప్రకటమయ్యే రూపంలోనే అతని ప్రకటనమూ (జగత్తులోని పదార్థాలు, సృష్టి ద్వారా 'పరమాత్మ ఉన్నాడు' - అనేది నిశ్చయం కావడం మొ॥) జరిగిందని చెప్పటమూ, శరీరధారి రూపంలో అతని జన్మ మళ్ళీ చెప్పబడింది. ఈ శ్లోకాలలో బ్రహ్మ ద్వారా సృష్టి అంతర్ధానం కావటం-పై విషయానికి వ్యతిరేకాలు.

గ. ఇదే విధంగా 1.19, 54,57; 6.65; 73; 12.118-124 మొదలైన శ్లోకాలు కూడా, సృష్టికర్త అయిన పరమాత్మను సూక్ష్మ, అవ్యయ, సర్వ వ్యాపకుడుగా చెప్పినదానికి వ్యతిరేకాలుగా ఉన్నాయి. ఆ శ్లోకాలలో పేర్కొన్న విశేషణాల వల్ల ప్రతిపాద్యుడైన పరమాత్మ శరీరధారణ చేయడు. వెంటనే తర్వాతి 52-54 శ్లోకాలలో పరమాత్మ సృష్టి ప్రక్రియలో లీనం కావడానికి అతని 'జాగ్రదవస్థ', ప్రళయం కావించిన అవస్థను 'శయనావస్థ' అని అలంకారికంగా వర్ణించడం సృష్టికర్త అయిన పరమాత్మ అవ్యక్త, అత్యయరూపంలో ఉంటూ ఎప్పుడూ శరీరధారణ చేయడు, అంతర్ధానం కాడు- అనే విషయాలను రుజువు చేస్తుంది- అతడు ఒకటే అవస్థలోనే ఉంటూ కేవలం మేలుకుంటాడు. సృష్టి ప్రక్రియ కొరకు ప్రవృత్తుడవుతాడు. ప్రళయం కావించి నివృత్తుడవుతాడు. ఏ విధంగా- మనిషి పనులు చేయుటకు మేలుకుని, అవి ముగిశాక పడుకుంటాడో ఆ విధంగానే సృష్టిక్రియ జరుగుతుంది. ఈ శ్లోకాలలో వర్ణించిన బ్రహ్మ రూపంలో పరమాత్మ శరీరధారణ, అంతర్ధానం కావడం పైన చెప్పిన శ్లోకాలకు వ్యతిరేకం.

ఘ. 1.52-54 శ్లోకాలతో సృష్టికర్త పరమాత్మ అవ్యక్త, అవ్యయ, సూక్ష్మంగా ఉంటాడు, సృష్టి చేసి, ప్రళయం వరకు కొత్త పదార్థాల సృష్టి, స్థితి, లయము చేయటంలో ప్రవృత్తుడు (మేలుకుని ఉండి) అవుతాడు. తర్వాత ప్రళయ కాంలోనే నివృత్తు (నిద్రలోకి వెళ్లటం)డవుతాడు. 52లో చెప్పిన 'సృష్టికర్త బ్రహ్మ మనువును సృష్టించి అంతర్ధానమయ్యాడు' అనడం, పైన చెప్పిన వాటికి వ్యతిరేకమని రుజువుతూంది. ఎందుకంటే ప్రళయకాలం వరకు సృష్టి జరుగుతూనే ఉంటుంది. పైన చెప్పిన దాని ప్రకారమైతే, అవ్యక్తుడైన పరమాత్మే సృష్టిని ప్రళయం వరకు నడిపిస్తాడు. కానీ 52వ

శ్లోకం ప్రకారం, మధ్యలోనే బ్రహ్మ అంతర్ధానం కావడం చేత, మళ్లీ సృష్టి నిర్మాణ ప్రక్రియను ఎవరు చేస్తారు? దాన్ని ముందుకు ఎవరు నడిపిస్తారు? 52వ శ్లోకం ప్రకారం బ్రహ్మ అంతర్ధానం కావడంతో, ఈ మొత్తం ప్రపంచపు చేష్టలుడిగిపోవాలి. ఒకసారి ఉత్పన్నమైన తర్వాత పరమాత్మ అవ్యక్త రూపంలోనే దీన్ని నడిపిస్తూ ఉంటాడు అనుకుంటే, ఈ సంచాలనాన్ని అతడు బ్రహ్మను సృష్టించడానికి ముందే చేయగలడు కదా! అందుచేత ఇది కూడా అంటే, మనువును సృష్టించి బ్రహ్మ అంతర్ధానమయ్యాడు అనేది కూడా అసంగతమైన కల్పనే అని తోస్తుంది.

జ. 68-73 శ్లోకాలలోనూ ఇలాంటి వ్యతిరేకాలున్నాయి. అక్కడ బ్రహ్మ పగలు, రాత్రులను గురించి చెబుతూ, సృష్టి స్థితుల పూర్తికాలం నాలుగు అర్బుదాల, 22 కోట్ల సంవత్సరాల కాలవ్యవధి బ్రహ్మకు ఒకదినం అవుతుందని చెప్పారు. అంటే, ఈ సంపూర్ణ కాల పరిమితి వరకు బ్రహ్మ (పరమాత్మ) మేలుకుని ఉంటాడు. అంటే, సృష్టి సంచాలనంలో నిమగ్నుడై ఉంటాడు (52-57). ఇక్కడ మనువును సృష్టించి సృష్టికర్త బ్రహ్మ అంతర్ధానం కావడం, అతని ఆయుస్సు కొంతకాల పరిమితివరకే ఉంటుందనడం, పైన చెప్పిన సంవత్సరాల లెక్కకు సరిపోవడం లేదు. ఇట్లాంటి కాలగణనతో బ్రహ్మను గురించి చెప్పినదానికి వ్యతిరేకం అవుతూంది. పరమాత్మ కన్నా వేరైన సృష్టికర్తగా బ్రహ్మను చెప్పటం మను సమ్మతం కాదు. వర్ణనలలోని విషయాలు మనుస్మృతిలోని విషయాలతో కలవడం లేదు; అందుచేత పరస్పర వ్యతిరేకాలైన ఆధారాలు కారణంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

52 నుండి 54వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

పరమాత్మ జాగ్రత్-సుషుప్తి అవస్థలు-

యదా స దేవో జాగర్తి తదేదం చేష్టతే జగత్ । మూలశ్లోక సం.**30**
యదా స్వపితి శాంతాత్మా తదా సర్వం నిమీలతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**52**

టీక:- **యదా** = ఎప్పుడయితే, **సః దేవః** = ఆ పరమాత్మ (1.6లో వర్ణించబడిన) **జాగర్తి** = మేలుకొనునో, అంటే సృష్ట్యుత్పత్తికి ప్రయత్నిస్తాడో, **తదా** = అప్పుడు, **ఇదం జగత్ చేష్టతే** = ఈ సమస్త ప్రపంచం చేష్టాయుక్తమవుతుంది, అంటే (1.42-49) మొత్తం చేష్టలు కలుగుతాయి, **యదా** = ఎప్పుడయితే, **శాంతాత్మా** = సర్వకర్మల నుంచి శాంతమైన ఈ ఆత్మ, **స్వపితి** = నిద్రిస్తుందో, అంటే సృష్ట్యుత్పత్తి -స్థితి కార్యం నుంచి నివృత్తమవుతుందో, **తదా** = అప్పుడు, **సర్వం** = ఈ సమస్త ప్రపంచం, **నిమీలతి** = ప్రళయం చెందుతుంది.

తాత్పర్యం:-ఎప్పు దా పరమాత్మ జాగ్రదావస్థలో ఉంటాడో అప్పుడే జగత్ చైతన్యంతో తొణికిసలాడుతూ జీవ వ్యాపారాలు నిర్వహించగల సమర్థత కలిగినదిగా ఉంటుంది. ఆతడెప్పుడు నిద్రించునో ఈ సర్వం 'లయం' అవుతుంది.॥52॥

పరమాత్మయొక్క సుషుప్త్యవస్థలో జగత్తు యొక్క ప్రళయావస్థ- **ఇది మనుకృతం-ప్రామాణికం**

తస్మిన్ స్వపితి సుస్థే తు కర్మాత్మానశ్శరీరిణః । మూలశ్లోక సం.**31**
స్వకర్మభ్యో నివర్తన్తే మనశ్చ గ్లానిమృచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**53**

టీక:- **సుస్థే** = సృష్టికర్మ నుంచి నివృత్తుడైన, **తస్మిన్ స్వపితి** = ఆ పరమాత్మ నిద్రించిన తరవాత, **కర్మాత్మానః** = శ్వాసప్రశ్వాసలు, తినడం, నిద్రించడం మొ॥ కర్మలు చేయడం స్వభావంగాగల, **శరీరిణః** = దేహధారులైన జీవులందరూ కూడా, **స్వకర్మభ్యః నివర్తన్తే** = తమ తమ కర్మల నుంచి నివృత్తులవుతారు. **చ**= మరియు, **మనః** = మహత్తత్త్వం, **గ్లానిం** = ఔదాసీన్యమును, అంటే సర్వకార్యాలనుంచి విరమించుకొనే అవస్థను, **ఋచ్ఛతి** = పొందుతారు.

తాత్పర్యం:-ఆ ప్రజాపతి ఈక్షణరహితుడై నిద్రించేటప్పుడు కర్మస్వరూపం కల్గిన జీవులన్నీ కర్మలను చాలిస్తున్నాయి. మనస్సు కూడ విశ్రాంతిని పొందుతోంది. ॥53॥

వివరణ: ఇక్కడ మనః శబ్దానికి **'మహతత్త్వం'** అని అర్థం చెప్పుకోవాలి.(1.14,15 శ్లోకాల సమీక్ష చూడండి.)

ఇది మనుకృతం-ప్రామాణికం

యుగపత్తు ప్రలీయంతే యదా తస్మిన్ మహాత్మని । మూలశ్లోక సం.**32**
తదాయం సర్వభూతాత్మా సుఖం స్వపితి నిర్వృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**54**

టీక:- **తస్మిన్ మహాత్మని** = ఆ సర్వవ్యాపక పరమాత్ముడి ఆశ్రయంలో, **యదా** = ఎప్పుడయితే, **యుగపత్తు ప్రలీయన్తే**= ఒకేసారి ప్రాణులందరూ చేష్టారహితులై లీనమైపోతారో, **తదా** = అప్పుడు, **అయం సర్వభూతాత్మా** = ఈ సమస్తప్రాణులకు ఆశ్రయ భూతమైన పరమాత్మ, **నిర్వృతః** = సృష్టి సంచాలనకార్యం నుంచి నివృత్తుడై, **సుఖంస్వపితి** = సుఖంగా నిద్రిస్తాడు.

తాత్పర్యం:-ఈ జీవులన్నీ ఏకకాలంలో మహాత్ముడైన పరమాత్మలో ఎప్పుడు లీనమవుతున్నాయో, అప్పుడా పరమాత్మ సైతం జాగ్రదావస్థ-చైతన్యావస్థ మొ॥వి విడిచిపెట్టి ప్రశాంతంగా నిద్రిస్తాడు. అంతటా దట్టమైన చీకట్లావరించి ఉంటాయని అంతరార్థం. ॥54॥

ఈ క్రింది 55,56వ శ్లోకాలు ప్రక్షిప్తాలు.ఇవి ప్రామాణికం కావు

* *తమోఽయం తు సమాశ్రిత్య చిరం తిష్ఠతి సేంద్రియః ।*
న చ స్వం కురుతే కర్మ తదోత్క్రమతి మూర్తితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***55***

తాత్పర్యం:-ఎప్పుడీ జీవుడు ఇంద్రియాదులతో కూడ జ్ఞాన లేమిని పొందుతాడో, శ్వాస క్రియను చేయడో (చైతన్య శూన్యుడవుతాడో) అప్పుడా జీవికి ప్రాణోత్క్రమణం జరిగిందంటాం ! అంటే జీవుడు దేహం నుంచి తొలగిపోయాడన్నమాట! ॥55॥

* *యదాణుమాత్రికో భూత్వా బీజం స్థాస్ను చరిష్ణు చ ।*
సమావిశతి సంసృష్టస్తదా మూర్తిం విముంచతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.***56***

తాత్పర్యం:-సూక్ష్మాలైన పుర్యష్టకం గలవాడై జీవుడు వృక్షాదులకు కారణమైన స్థిరమైన బీజాన్నిగాని; లేదా మనుష్యాదులకు కారణమైన జంగమాత్మక బీజాన్ని గాని పొందినప్పుడు స్థూల శరీరాన్ని గ్రహిస్తాడు. అంటే దేహధారి కాగలడని అర్థం. ॥56॥

వివరణ:- 'భూత, ఇంద్రియ,మనో బుద్ధి, వాసన, కర్మ, వాయు, అవిద్య' ఇవన్నీ పుర్యష్టకమనబడు తుందని వ్యాఖ్యాకారుల అభిప్రాయం.

ప్రక్షిప్తాల పరిశీలన

55, 56 శ్లోకాలు ప్రక్షిప్తాలు. వీటిలో నవీన వేదాంతవాదం ప్రభావం వల్ల విషయాన్ని మళ్లించేందుకు ప్రయత్నించారు. కింది ఆధారాలతో ఇవి అమూలకాలని తెలుస్తుంది-

1. విషయ వ్యతిరేకాలు

క. పూర్వాపర శ్లోకాల విషయంలో వీటికి పొంతన లేదు. 52వ శ్లోకం నుంచి పరమాత్మ మేలుకొనటం, సుషుప్తి వర్ణనలు ఉన్నాయి. దీని ప్రకారం, 52వ శ్లోకంలో మేలుకొన్న వర్ణనల, 53-54లలో సుషుప్తి వర్ణనలు ఉన్నాయి. రెండింటి వర్ణనా చేసి, 57వ శ్లోకంలో ఆ రెండు అవస్థలనూ ముగించారు. దీని వల్ల, మధ్యలో 55, 56 శ్లోకాలలోని జీవుల వర్ణన లేదా జీవులు మునుపటి స్థితికి రావటం, శరీరధారణ- వీటి కథనం ఇక్కడ చెప్పవలసినది కాదు. అనవసరంగా మధ్యలో చొప్పించారు. శ్లోకాలలో చెప్పినట్లు ఇక్కడ 54 తర్వాత 57వ శ్లోకం ఉండటమే సరైనది.

ఖ. పరమాత్మ జాగృతి, సుషుప్తుల వల్ల జగత్తులోని ప్రాణుల మీద ఎటువంటి ప్రభావం పడుతుందో, దాన్ని 52-54 శ్లోకాలలో సంకేతరూపంగా సంక్షిప్త శైలిలో చెప్పబడింది. 53వ శ్లోకంలో ప్రాణుల కర్మలవల్ల నివృత్తం కావటం, మనస్సుకు పరితాపం కలగటం- ఇది శరీరంలో నుంచి జీవుడు వెళ్లాక కలుగుతుంది. ఇవన్నీ చూపి, 54వ శ్లోకంలో- 'మళ్లీ జీవులు ఆ పరమాత్మలో లీనమవుతారు' - ఇలాటి కథనంతో మునుపటి జీవుల చర్చను పూర్తిచేసి ముగించారు. ఒక విషయపు పూర్ణత, ముగింపు సంకేతాల తర్వాత మళ్లీ మరో విధంగా అదే విషయాన్ని ప్రారంభించటం, ఇతరుల అభిప్రాయాలను ద్యోతకం చేస్తోంది. అందువల్ల అది విషయ వ్యతిరేకం. ఈ దృష్టితో ఈ శ్లోకాలు కూడా విషయ వ్యతిరేకాలు.

2. అంతర్వ్యతిరేకాలు

సృష్టి ఉత్పత్తి విషయం (1.5,6, 14-24)లో ప్రాణుల శరీర నిర్మాణం గురించి మనువు ఏడు తత్త్వాలు (మహదాది) వాటి వికారాలు- మనః = మహత్తత్త్వం, వాటి సూక్ష్మ అవయవాలు, ముఖ్యరూపాలతో జరుగుతుందని చెప్పాడు. అక్కడ అణుమాత్రిక పద్ధతిని గురించిన సంకేతమేదీ లేదు. పైగా అవినాశి అయిన ఆత్మతో సంయోగాన్ని చెప్పాడు. (1.18,19). మునుపటి, ఇప్పటి విషయాలలోని భిన్నత వల్ల ఈ కథనం అంతర్ వ్యతిరేకం, అందుచేత ఈ రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం స జాగ్రత్స్వప్నాభ్యామిదం సర్వం చరాచరమ్ । మూలశ్లోక సం.**33**
సంజీవయతి చాజస్రం ప్రమాపయతి చావ్యయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**57**

టీక:- సః **అవ్యయః** = అవినాశి అయిన ఆ పరమేశ్వరుడు, ఏవం = ఈ ప్రకారంగా [51-54], **జాగ్రత్ స్వప్నాభ్యాం** = మేలుకోవడం, నిద్రించడం ద్వారా, ఇదం సర్వం **చరాచరం** = జడ చేతనరూపమైన ఈ జగత్తును, **అజస్రం సంజీవయతి** = ప్రళయకాలం వరకు నిరంతరం జీవింపచేస్తాడు. **చ** = మరియు, **ప్రమాపయతి** = అంతం చేస్తాడు. అంటే కారణంలో లీనం చేస్తాడు.

తాత్పర్యం:-నిత్యశాశ్వతుడైన ఆ బ్రహ్మ ఈ ప్రకారం జాగ్రత్ స్వప్నావస్థల చేత ఎల్లప్పుడు స్థావర జంగమాత్మకమైన ఈ భౌతిక ప్రపంచాన్ని సృష్టిస్తూ ఉంటాడు, నశింపజేస్తూంటాడు. ఇదొక చక్రభ్రమణం లాంటిది. సృష్టి స్థితి లయకార్యాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. మరల మరల పునరావృత్త మవుతూంటుంది.॥57॥

వివరణ:- దీని సమగ్ర వివరణకొరకు 12.118-125లో చూడగలరు.

58 నుండి 63వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు.ఇవి ప్రామాణికం కావు

*** ఈ శాస్త్రాన్ని బ్రహ్మ నుండి పొందు క్రమము-**

* *ఇదం శాస్త్రం తు కృత్వాఽసౌ మామేవ స్వయమాదితః ।*
విధివద్గ్రాహయామాస మరీచ్యాదీంస్త్వహం మునీన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*58*

తాత్పర్యం:-బ్రహ్మ ఈ శాస్త్రాన్ని రూపొందించి, తానే నాకు విధిప్రకారం స్వయంగా ఉపదేశించాడు. నేను మరీచ్యాది ప్రజాపతులకు అందరికీ వివరించాను.॥58॥

*** మనువు భృగువుతో ఈ సంహితను బోధించుమని చెప్పుట-**

* *ఏతద్వోఽయం భృగుశ్శాస్త్రం శ్రావయిష్యత్యశేషతః ।*
ఏతద్ధి మత్తోఽధిజగే సర్వమేషోఽఖిలం మునిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*59*

తాత్పర్యం:-ఇప్పుడీ భృగుమహర్షి ఈ మానవధర్మశాస్త్రాన్ని అంతటినీ నా వల్ల క్షుణ్ణంగా తెలుసుకున్నందువల్ల ఇతడు దీనినంతటినీ మీకు విన్పించగలడు... అని మనువు ముగించాడు॥59॥

* భృగువు మునులకు ఇచ్చిన ప్రత్యుత్తరము

* *తతస్తథా స తేనోక్తో మహర్షిర్మనునా భృగుః ।*
తానబ్రవృదృషీన్ సర్వాన్ ప్రీతాత్మా శ్రూయతామితి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***60***

తాత్పర్యం:-ఎదుట ఇంతమంది మహామునులున్నా, గురువైన మనువు తననే చెప్పమని నియమించడం చేత, సంతుష్టాంతరంగుడైన భృగుమహర్షి వారందరినీ వినండి అని కోరాడు.॥60॥

* *స్వాయంభువస్యాస్య మనోః షడ్వంశ్యా మనవోఽ పరే ।*
సృష్టవంతః ప్రజాః స్వాస్స్వా మహాత్మానో మహౌజసః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***61***

తాత్పర్యం:-మహా తేజోమూర్తులు, గొప్ప హృదయంగలవారు అయిన స్వాయంభువ మనువు వంశజులు మరో ఆరుగురు ఈ సృష్టికార్యంలో నియమితులై తమ తమ వంశాలను అభివృద్ధి చేశారు.॥61॥

* *స్వారోచిషశ్చోత్తమశ్చ తామసో రైవతస్తథా ।*
చాక్షుషశ్చ మహాతేజా వివస్వత్సుత ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***62***

తాత్పర్యం:-ఆ ఆరుగురూ ఎవరెవరంటే.....స్వారోచిషుడు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు, చాక్షుషుడు మరియు గొప్ప తేజోశాలి అయిన వివస్వతుని (సూర్యుని) కుమారుడు వైవస్వతుడు....॥62॥

* *స్వాయంభువాద్యా స్సప్తైతే మనవో భూరితేజసః ।*
స్వే స్వేఽ ంతరే సర్వమిదముత్పాద్యాఽఽ పుశ్చరాచరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***63***

తాత్పర్యం:-మహత్తరమైన తపశ్శక్తి గల స్వయంభువ మొ॥ ఈ ఏడుగురు మనువులు-తమ తమ అంతరంగాలలో నుంచి స్థావర జంగమాత్మకరూపమైన ఈ సృష్టిని చేసి ప్రజాపాలన చేశారు.॥63॥

ప్రక్షిప్తాల పరిశీలన

భృగు మహర్షి శిష్యులూ, మనుస్మృతి పరంపరలోని వారూ ప్రసిద్ధిని కోరి, భృగువును మనుస్మృతిలోనికి ప్రవేశపెట్టడం, మనువు, మనుస్మృతులకు ఎక్కువ ఘనత, ప్రతిష్ఠ, ప్రసిద్ధుల కొరకు బ్రహ్మను కలపడం, మనువువంశాన్ని అలౌకికం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ శ్లోకాలను ప్రక్షిప్తాలుగా కలిపేశారు. ఈ 58-63 వరకు గల శ్లోకాలు కింది **'ఆధారాల'** ద్వారా ప్రక్షిప్తాలని తెలుతూంది.

1. విషయ వ్యతిరేకాలు

ఇవి పూర్వాపర విషయాలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

(1) పూర్వాపర శ్లోకాలలో 58,64 శ్లోకాలలో సృష్టిఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన పరస్పర వ్యతిరేకాలైన వర్ణనలున్నాయి. మధ్యలో ఈ 58-63 శ్లోకాలలో శాస్త్రవచనాలు, మనువంశ వర్ణనలతో విషయ భంగం చేశారు. వీటివల్ల ఇక్కడ విషయమేమీ లేదు.

(2) 52-57 వరకు గల వాటి పూర్వ శ్లోకాలలో పరమాత్మ జాగృతి, సుషుప్తి అవస్థలు ఆలంకారికంగా వర్ణించారు. జాగ్రత్- సుషుప్తి అవస్థలు రాత్రి-పగలు సాపేక్షం కావటం వల్ల ఆ అవస్థల పరిమితిని చెప్పటమే అవసరమూ, విషయమూ అవుతుంది. అందుచేత 64-73 శ్లోకాలలో పరమాత్మ ఏ పగలు- రాత్రులలో మేలుకుంటాడో, పడుకుంటాడో, వాటి పరిమితి ఎంతో చెప్పబడింది. ఈ విధంగా 52-57, 64-73 శ్లోకాలు ఒకటే గొలుసులో కలుస్తాయి. అలాగే 52-57, 64-73 శ్లోకాల నేపథ్యం కూడా అవుతాయి. 68వ శ్లోకంలో ఈ రాత్రి పగళ్ల విషయం చెప్పే సంకేతం కూడా ఉంది. దీనివల్ల 64-73 శ్లోకాలలోని విషయాన్ని 52-57 శ్లోకాలతో మరింత చక్కగా కలిపిన ప్రమాణం లభిస్తూంది. ఈ 58 నుంచి 63 శ్లోకాలు ఆ విషయాన్ని భంగం చేశాయి. వీటిలో ముందు వెనుకలకు సంబంధించిన ఏ విషయమూ లేదు; అందువల్ల ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2 అంతర్ వ్యతిరేకాలు

(1) భృగువు చెప్పిన మనుస్మృతి ముందే కూర్చిన శాస్త్రం కాదు.

మనుస్మృతి మూల రచయిత మనువు. బ్రహ్మకాదు. 58వ శ్లోకంలో దీని మూల రచయిత బ్రహ్మ అని ఉంది; ఇది మనువు కృతం (1.1-4) అని పూర్వం చెప్పిన దానికి వ్యతిరేకం. ఈ అంతర్ వ్యతిరేకత కారణంగా 58వ శ్లోకం ప్రక్షిప్తం. ఎందుకంటే, మిగిలిన 59-63 శ్లోకలు దానిపై ఆధారపడినవి. అందుచేత ప్రక్షిప్తాలు. పైగా సహజంగానే ప్రక్షిప్తాలని తెలిసి పోతూంది. ఈ శ్లోకంలో వచ్చిన వ్యతిరేకతను తొలిగించడానికి టీకాకారులు ఎంతో ప్రయత్నించారు. కాని అదంతా వ్యర్థమే అయింది. వారు దీని మూల రచయిత బ్రహ్మ అనీ, మనువు చేత బ్రహ్మ శాస్త్ర రూపంలో విధ్యుక్తంగా చదివించాడు, మనువు దాన్ని ప్రతిపాదించాలని గ్రంథరూపం ఇచ్చాడు అని చెబుతున్నారు.

రెండవ వాదం ప్రకారం- ఈ గ్రంథ రచయిత బ్రహ్మ. తర్వాత దీని జ్ఞానం పొందిన మనువు దీనికి ఒకరూపమూ, అర్థమూ కలిపి మరీచి మొదలైనవారికి వెలువరించాడు. అందుకే ఇది 'మానవశాస్త్రం' అని చెప్పబడింది. ఈ రెండూ నిరాధారాలూ, అయుక్తి యుక్తాలూ. దీని విశ్లేషణకు 1.1-4 శ్లోకాల మీద లోతుగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఈ శ్లోకాల భావాలు, భాష మీద దృష్టిని కేంద్రీకరిస్తే, కింది విషయాలు స్పష్టమవుతున్నాయి-

క. మనుస్మృతి మౌలికంగా మునువు చెప్పిన శాస్త్రం కాదు. మౌలికంగా కుతూహలానికి ప్రవచన రూపంలో చెప్పిన సమాధానాలు. వాటిని తర్వాత సంకలించారు- మహర్షులు స్వాయంభువమనువు వద్దకు వెళ్లి ధర్మాలను తెలుసుకోవాలని కుతూహలం ప్రకటించారు (1.1,2) మనువు వారికి సమాధానలు చెప్పాడు[1.4]

ఖ. దీనిమూల ప్రవక్త కూడా స్వాయంభువ మనువే. 1.3వ శ్లోకం దీన్ని రుజువు చేయటానికి విశేషంగా తోడ్పడుతుంది. మహర్షులు, తమ జిజ్ఞాసను ఆయన వద్దే ఎందుకు ప్రకటించారో చెబుతూ, 'మరీ ప్రపంచానికి విధానరూపాలు, అచింత్యాలు, అప్రమేయాలు అయిన వేదాలను ధర్మాలను = వ్యావహారిక తత్త్వాలు తెలిసినవారు, అందుకే మీ వద్దకు వచ్చాము' అని ప్రశ్నలు అడిగిన తర్వాత చెబుతారు. మనువు తన కాలపు సామాజిక వ్యవస్థ విషయాలు తెలిసిన విశిష్ట విద్వాంసుడు. తెలుసుకనుకనే, వేదాలను అనుసరించి ఏ పని ధర్మం, ఏది అధర్మం అని వాటిని చెప్పే సమర్థత కలవాడు. అందుచేతనే ఋషులు మనువు వద్దకు వచ్చారు కానీ, బ్రహ్మ నుంచి ఈ జ్ఞానం మనువు పొందాడు కనుక రాలేదు. ఈ కారణం వల్లనే మనువు తన జ్ఞానాన్ని అనుసరించి వేదాలతో తెలిపిన విషయాలనే మనుస్మృతిలో చెప్పాడు. (1.23-24,87,125,129). బ్రహ్మ నుంచి ఈ జ్ఞానం పొంది ఉంటే కనుక, బ్రహ్మ ద్వారా పొందటం ఇతని గొప్పతనంగా భావించేవారు. అలా జరిగి ఉంటే, ఋషులు మనువును గురించి 'ధర్మాలు, వేదాలు తెలిసినవాడు' అని చెప్పేపనే లేదు. మీకు ఈ జ్ఞానాన్ని బ్రహ్మ నుంచి పొందే భాగ్యం కలిగింది, అందుకనే మిమ్మల్ని అడుగుదామని వచ్చాము' అని ఉండేవారు. కానీ ఆ విధమైన సంకేతం ఏదీ ఇవ్వక, మనువు తన వ్యక్తిగతమైన విద్వత్తునే సూచించే శ్లోకమిది. అందుచేత, తన జ్ఞానాన్ని ఆధారం చేసుకునే మనువు సమాధానాలుగా -వేదాలలో తాను పరిశోధించి పరిశీలించి గ్రహించినదే చెప్పాడు కానీ, ఇతరుల అభిప్రాయాలు కాదు.

గ. బ్రహ్మ నుంచి ఈ జ్ఞానం పొంది ఉంటే, బ్రహ్మ పేరు వల్ల ఋషులు ఇది తెలుసుకోవాలనే ఆకర్షణ కలిగి ఉంటే, లేదా మనువుకు బ్రహ్మ పేరువల్ల ఏదో విశిష్టత లేదా కీర్తి కనిపించి ఉంటే, మనువు అన్ని విషయాలతో బాటుగా, బ్రహ్మనాకు ఇది చెప్పాడు, ఆ విషయం చెప్పాడు, లేదా ఆ విషయాన్ని ఉచితమన్నాడు, ఇది కాదన్నాడు' మొదలైన మాటలతో కచ్చితంగా చెప్పేవాడు. కానీ మనుస్మృతిలో బ్రహ్మ అభిప్రాయాలను గురించిన మాటలెక్కడా రాయలేదు. ఆ విధంగా ఎక్కడా కూడా బ్రహ్మను గురించిన సంగతులు, చెప్పక పోవటం వల్ల, మనుస్మృతికీ, బ్రహ్మకూ ఎటువంటి సంబంధమూ లేదని తెలుస్తూంది. గమనించవలసిన విషయ మేమిటంటే, ధర్మాధర్మాలను గురించి చెబుతున్నప్పుడు ఋషులు, మునుల అభిప్రాయాలు చెప్పాడు మనువు, లేదా తన అభిప్రాయాలు. ఋషులు, మునుల గౌరవాన్ని గురించి

పలుచోట్ల సంకేతించాడు.[**'ఆహుః మనీషిణః'** (1.17), **'ధర్మస్య మునయో గతిమ్'** (1.110; 2.88,124) మొ॥.] ఆదిపురుషుడైన బ్రహ్మవంటివానికి, సర్వజ్ఞునికి మనుస్మృతితో కించిత్తైన సంబంధముంటే, తప్పకుండా మనువు దాన్ని ప్రముఖంగా పేర్కొనేవాడు. కాబట్టి దీనివల్ల మనుస్మృతి మూల ప్రవక్త మనువేననీ, బ్రహ్మకు దీనితో ఏ సంబంధమూ లేదనీ తెలుస్తూంది.

ఘ. మనుస్మృతి శైలివల్ల, మనుస్మృతి మౌలికంగా ఒక నిబద్ధశాస్త్రంగా రూపొందలేదని తెలుస్తూంది. అలా శాస్త్రరూపంలోనే లేనపుడు, దీని మూల సంకలనంలో **'శాస్త్రం'** అని దీన్ని చెప్పటం సమంజసం కాదు. **'శాస్త్రం'** అనటం కుదరనప్పుడు, **'బ్రహ్మ ఈ శాస్త్రాన్ని రచించాడు', 'ఈ శాస్త్రాన్ని భృగువు నా నుంచి నేర్చాడు, ఇప్పుడు అతనే వినిపిస్తాడు'** మొదలైన వేవీకూడా దాన్ని గురించి చెప్పటం కూడా తప్పే. ఇలా అసమంజసమైన ప్రయోగాలు చేయటం వల్ల, మనుస్మృతితో బ్రహ్మకు ఏ విధమైన సంబంధమూ లేదని తేలుతూంది.

ఙ. మనుస్మృతి మౌలికంగా ఋషుల జిజ్ఞాసకు ప్రవచనరూపంలో ఇవ్వబడిన సమాధానాలు. ఈ ప్రవచన రూపంలో వినిపించిన -విన్న గ్రంథం కనుక, ప్రతివిషయపు ఆరంభం, చివరలలో విన్న-వినిపించిన అర్థాలు వచ్చే క్రియా రూపాల ప్రయోగమే ఉంది, ఎలాగంటే- **'వక్తుమర్హసి'** (1.2), **'శ్రూయతామ్'** (1.4), **'హోఽభిధాస్యామి'** (1-42), **'తం నిబోధత'** (1.120), **'ఏత ద్వోఽభిహితం సర్వం'** (3.286), **'విధానం శ్రూయతామ్'** (3.286), **'మమేదం సర్వముక్తవాన్'** (12.117) మొ॥. మనువు శిష్యులు దీన్ని సంకలనం చేశారు. ఇది ప్రారంభం నుంచి 1.1-4 శ్లోకాల శైలిని చెబుతుంది. **'స తైః పృష్టః'** అనే ప్రయోగం దీన్ని సంకలనంగా రూఢిపరుస్తుంది. సంకలనం తర్వాతే మనుస్మృతి **'శాస్త్ర'** రూపం దాల్చింది. మూల ప్రవక్త చెప్పినవాటిని యథాతథంగా సంకలనంగా రూపొందిన దాన్నే మౌలిక సంకలనం అంటారు. **'శాస్త్రం'** అనే ప్రయోగం మనుస్మృతికి మౌలికం కాజాలదు; ఏ ప్రవచనం ఇప్పటి వరకూ సంకలనం లేదా శాస్త్రం రూపంలోనే రాలేదో, అలాంటి వాటిని మనువు **'శాస్త్రం'** అని ఎలా అనగలడు? మనువు ప్రవచనాల ద్వారా 'సంకలన' రూపం దాల్చిన తర్వాతే, **'శాస్త్ర'** రూపంలో ఖ్యాతిపొందిన తర్వాతే, ఇటువంటి శ్లోకాలను కలిపారు. వాటిలోనే దీన్ని **'శాస్త్రం'** అని వ్యవహరించారు. ఈ విధంగా 58-59 శ్లోకాలలో **'శాస్త్రం'** అనే పద ప్రయోగం తరువాతి ప్రక్షిప్తమేనని తెలుస్తూంది.

చ. కొందరు విద్వాంసులు చెప్పిన ఆ రెండు విషయాలు ఆధారంగా దీన్ని మనుకృతమేనని విశ్వసించినట్లయితే, ఆ విషయాలు చెప్పినవారు చిట్టచివరికి భృగు కృతమనాలి కాని, భృగు సంకలితం కాదు; ఆశయాన్ని అర్థం చేసుకుని, చదివి చెప్పటం చేత, మనువే దీని రచయిత, భృగువు కూడా మనువు ఆశయాలను మహర్షులకు తన పద్ధతిలో చెప్పాడు అనాలి (58-60). ఈ విధంగానైతే భృగువే దీని రచయిత అవుతాడు. ఇలా ఈ రెండు విషయాలూ చెప్పినవారి మాటలనే ఖండిస్తున్నాయి. అందువల్ల అంగీకృతంకావు. వీటివల్ల మౌలిక శ్లోకాలను అనుసరించి, మనుస్మృతితో బ్రహ్మకెటువంటి సంబంధమూ లేదు, మౌలికంగా ఇది మనువురచనే, బ్రహ్మకు సంబంధం ఉందన్న ప్రతి విషయమూ తరువాతి కాలపు ప్రక్షిప్తాలే అని పూర్తిగా స్పష్టమవుతుంది.

ఛ. 63వ శ్లోకంలో మనువులు, ఈ చరాచర జగత్తుల ఉత్పత్తి దాన్ని కాపాడే విషయాలు, 1.6,14-23 శ్లోకాలలోని విషయాలకు పరస్పర వ్యతిరేకంగానూ ఉన్నాయి. వాటిలో చరాచర జగత్తు ఉత్పత్తి, పాలన, అవ్యక్త సూక్ష్మపరమాత్మ ద్వారా మహదాది తత్త్వాల క్రమంలో జరిగాయని ఉంది. ఇది ప్రకృతివిరుద్ధం కూడా. ఎవరైనా దేహధారులైన మనుష్యులు, పశువులు, పక్షులు, కీటకాలు, పురుగులు, నేల, పర్వతాలు మొ॥ వాటి సృష్టి చేయలేరు. (చూడండి 32-41 శ్లోకాల **"అంతర్ వ్యతిరేకాలు"** శీర్షిక వివరాలు). ఈ విధంగా 63వ శ్లోకం ప్రక్షిప్తమని తేలింది. దీనిపై ఆధారపడిన 58-62 శ్లోకాలు ప్రక్షిప్తమని తేలడంతో, సహజంగానే ప్రక్షిప్తాలని తెలుస్తూంది.

జ. ఏవిధంగా, ఈ మనుస్మృతి రచయిత మనువును, బ్రహ్మమునిమనవడు (1.32-33), శిష్యుడు (1.58) అని చెప్పి, భవిష్యత్తులోని ఆరుగురు మనువులనూ (1.61-63) భూతకాలంలోనే వర్ణించడం ఎలా వ్యతిరేకమూ, అసందర్భ వర్ణనా కూడా అవుతుందో, అదే విధంగా భృగువును స్వాయంభువ మనువు పుత్రుడు (1.35), శిష్యుడు (58, 59) అని చెప్పి, అతని ద్వారా మనువు భావివంశాన్ని భూతకాలపు శైలిలో చెప్పటం (60-63) కూడా కాలవిరుద్ధమూ, అసందర్భమూ, అంతర్ వ్యతిరేకమూ అవుతుంది. స్వాయంభువ మనువు బ్రహ్మ పుత్రుడు, మనువు దగ్గర చదువుకున్నది శిష్యుడు భృగువు. మనువు కాలంలోని భృగువు భావి ఏడు తరాలలోని వారిని భూతకాలంలో వర్ణించడం జరిగింది. ఇది అసంబద్ధ ప్రలాపమే అవుతుంది. ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే.

64, 65వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

నిమేషాది కాలపరిమాణం-

నిమేషా దశ చాష్టౌ చ కాష్ఠా త్రింశత్తు తాః కలా । మూలశ్లోక సం.**34**
త్రింశత్కలా ముహూర్తస్స్యాదహోరాత్రం తు తావతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**64**

టీక:- **దశ చ అష్టౌ చ** = (18) పద్దెనిమిది కలిసి, **నిమేషాః** = నిమిషాల (కనురెప్పవేసేకాలం) సమయానికి ఒక 'కాష్ఠ' అవుతుంది, **తాః త్రింశత్తు** = ముప్పై కాష్ఠల సమయానికి 'కళ' అని పేరు. ముప్పై కళల సమయానికి 'ముహూర్తమని'పేరు (48 నిమిషాలు). మరియు **తావతః తు** = అలాంటి, అంటే 30 ముహూర్తముల సమయం, **అహోరాత్రం** = ఒక దినం అంటే ఒకరాత్రి, ఒక పగలు అవుతుంది.

తాత్పర్యం: పద్దెనిమిది నిమిషాల సమయానికి ఒక కాష్ఠ అవుతుంది. ముప్పైకాష్ఠల సమయానికి ఒక కళ అవుతుంది. ముప్పై కళల సమయానికి ముహూర్తమని పేరు. ముప్పై ముహూర్తాల సమయం ఒక అహోరాత్రం.॥64॥

వివరణ:

ప్రాచీనకాలపరిమాణానికి ఆధునిక కాల పరిమాణాలకు పోలిక. ఆధునికకాల విభాగాన్నను సరించి ఈ కిందివిధంగా సమయం విభజించడం జరుగుతుంది. 8/45 క్షణాలు 1. నిమేషం, 3 1/5 క్షణాలు ఒక కాష్ఠ. ఒక నిమిషం(Minutes) + 36 క్షణాలు 1 కళ. 48 నిమిషాలు (Minutes)1 ముహూర్తం, 24 గంటలు ఒకరాత్రి, ఒక పగలు.

2. 64వ శ్లోకం శైలిపై చర్చ: ఏ విషయాన్నైనా లేదా ప్రసంగాన్నైనా, ప్రారంభంలో గానీ సమాప్తంలో గానీ సూచించడం మనుస్మృతిశైలి. ఇది భూమికలో ప్రదర్శించినట్లు ఇక్కడ కాలప్రమాణ ప్రసంగం ఏ సూచన లేకుండా ఎలా ప్రారంభించారనే సంశయం పాఠకులకు రావచ్చు. ఈ విషయం ప్రారంభించడానికి కొన్ని స్థానములందు సూచించడం జరిగింది. 52-57 వరకు పరమేశ్వరుడి యొక్క జాగ్రత్ సుషుప్త్యవస్థల ప్రసంగముంది. దీంతో ఈ కాలప్రమాణ ప్రసంగం దీనికి సంబంధించినదే. ఆ శ్లోకాలే ఈ విషయానికి భూమిక లాంటివి. సృష్టికాలం పరమేశ్వరుడి జాగ్రదవస్థగా, సుషుప్తి ప్రళయావస్థగా ఆలంకారికంగా వర్ణన చేయబడింది. అందువల్ల, పరమాత్మకు రాత్రిసమయమెంత? పగటి సమయమెంతో తెలుప వలసి ఉందో, ఆ విషయం తెలియజేయడానికి ప్రారంభంలో మానవుడికి సంబంధించిన రాత్రింబవళ్ళ విషయం వర్ణిస్తూ [64-65] 68 శ్లోకాలలో పరమాత్మ యొక్క రాత్రింబవళ్ళ వర్ణన సూచింపబడినది. 73వ శ్లోకంలో ఈ చర్చను ముగించాడు. ఈ విధంగా ఈ శ్లోకాల వర్ణన పూర్వాపర ప్రసంగాలతో సంబంధించి ఉంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

సూర్యుడి ద్వారా రాత్రింబవళ్ళ విభాగం-

అహోరాత్రే విభజతే సూర్యోమానుషదైవికే । మూలశ్లోక సం.**35**
రాత్రిస్స్వప్నాయ భూతానాం చేష్టాయై కర్మణామహః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**65**

టీక:- **సూర్యః** = సూర్యుడు, **మానుషదైవికే** = మనుషులకూ దేవతలకూ దినరాత్రులకు సంబంధించిన, **విభజతే** = విభాగం చేస్తున్నాడు. అందులో, **భూతానాం స్వప్నాయ రాత్రిః** = ప్రాణులు నిద్రించడానికి 'రాత్రి, **కర్మణాంచేష్టాయై అహః** = కర్మలు చేయడానికి 'పగలు'.

తాత్పర్యం:-సూర్యుడు ఈ అహోరాత్రులను మానుషములుగాను, దైవికములుగాను విభజించాడు. అందు రాత్రి ప్రాణుల నిద్ర నిమిత్తమూ, పగలు ప్రాణులకార్యముల నిమిత్తమూ ఏర్పడి ఉన్నాయి. ॥65॥

ఈ క్రింది శ్లోకం ప్రక్షిప్తం ప్రామాణికం కాదు

* పితరుల దినరాత్రము-

* **పిత్ర్యే రాత్ర్యహనీ మాసః ప్రవిభాగస్తు పక్షయోః ।**
కర్మ చేష్టాస్వహః కృష్ణః శుక్లస్స్వప్నాయ శర్వరీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***66***

తాత్పర్యం:-మానవుల మాస మొక్కటి పితృదేవతలకు ఒక రేయింబగలు. అందు కృష్ణపక్షం కర్మానుష్ఠానానికీ, శుక్లపక్షం నిద్ర నిమిత్తమూ ఏర్పడినవి.॥66॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం-

1. విషయ వ్యతిరేకం

(1) పూర్వాపర విషయాలకు వ్యతిరేకం కనుక ఇది ప్రక్షిప్తం. 64-65 శ్లోకాలలో రాత్రింబవళ్ల ప్రమాణం చెబుతూ, మనుష్యుల, దేవతల రాత్రింబవళ్ల వర్ణనను గురించిన సంకేతం ఇవ్వబడింది. దాని ప్రకారం, 65వ శ్లోకంలో మానవుల రాత్రింబవళ్ల వివరణ ఉంది, మిగిలినది దేవతల రాత్రింబవళ్లని 67వ శ్లోకంలో ఉంది. 65వ శ్లోకంలోని సంకేతం ప్రకారం, 67వ శ్లోకం అక్కడుండాలి. 66వ శ్లోకం ఎటువంటి సంకేతమూ లేకుండా చెప్పబడింది, పూర్వాపర విషయాలను భంగం చేస్తూంది. అందుచేత ప్రక్షిప్తం.

2. శైలీగత ఆధారం

64-73 శ్లోకాలలో పితరులకు సంబంధించిన విషయాలు చెప్పడం మనువుకు ఇష్టంలేదని స్పష్టంగా ఉంది. 64-65 శ్లోకలలో రాత్రింబవళ్లను గురించి చెప్పాడు కనుక, అవి కూడా మానవులకూ దేవతలకూ సంబంధించినవే. 68 నుంచి 72 వరకు గల శ్లోకాలలోని ప్రపంచవర్ణన, అది కూడా మానవులకూ, దేవతలకూ సంబంధించిందే; పితరుల యుగాలకు సంబంధించిన విషయమే అక్కడ లేదు. ఒకవేళ పితరుల వర్ణన ఆ విషయానికి సంబంధించిందీ, మౌలికమూ అయివుంటే, యుగాల ఆధారంతో వాటిని గురించి తప్పక చెప్పేవాడు. తర్వాత చెప్పిన యుగాల పరిమాణాలలో పితరులను గురించి లేకపోవడం, వీటిని మౌలికాలనీ, మనుసమ్మతమనీ రుజువు కావటం లేదు; అందువల్ల ఇది ప్రక్షిప్తం.

3. అంతర్ వ్యతిరేకాలు

మృతపితరుల పేరిటి కల్పన నిరాధరం.

(1) 3.80-82; 12.49 శ్లోకాలలోని వర్ణన వల్ల మనువు చెప్పిన పితరులనే పేరున్న భిన్నమైన వర్గం లేనే లేదు. చెప్పిన మాతాపితలు మొదలైన పెద్దలనే పితరులంటారు - అనే విషయం స్పష్టంగా ఉంది; పై శ్లోకాలలో మనువు అన్నం, ఫలాలు, నీరు మొదలైనవాటితో పితరులకు దైనిక శ్రాద్ధం చేయాలని చెప్పాడు. అంటే మాతాపితలు, మొదలైనవారికి శ్రద్ధాపూర్వకంగా చేసే దైనందిన సేవ అని అర్థం. ఈ శ్లోకంలో పితరుల వర్ణన భిన్నమైన వర్గంగా చూపబడింది. అందుచేత పైన చెప్పినశ్లోకాల విషయం దీనికి వ్యతిరేకంగా ఉంది.

(2) 65వ శ్లోకంలో సూర్యుడు నిర్మించిన రాత్రింబవళ్ల కథనం ఉంది. 66వ శ్లోకంలోని రాత్రింబవళ్ల పరిభాష దీని కిందికి రాదు. అందువల్ల ఈ కథనం మను సమ్మతం కాదు.

67 నుండి 80వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

దైవీ దినరాత్రులు- 'ఉత్తరాయణం-దక్షిణాయనం'-

దైవే రాత్ర్యహనీ వర్షం ప్రవిభాగస్తయోః పునః । మూలశ్లోక సం.**36**
అహస్తత్రోదగయనం రాత్రిస్స్యాద్దక్షిణాయనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**67**

టీక:- **వర్షం** = మానవులకు ఒక సంవత్సరం. **దైవే రాత్ర్యహనీ** = దేవతలకు ఒక రాత్రి-ఒక పగలు. **తయోఃపునః ప్రవిభాగః** = ఆ దేవతల రాత్రింబగళ్ళకు కూడా మళ్ళీవిభాగం, **తత్ర ఉదగయనం అహః** = అందులో భూమధ్య రేఖకు ఉత్తరంగా సూర్యుడు ఉండే సమయం దేవతలకు ఉత్తరాయణ మవుతుంది. **దక్షిణాయనం రాత్రిఃస్యాత్** సూర్యుడు దక్షిణంగా ఉండే సమయం దేవతలకు దక్షిణాయనమవుతుంది.

ఇక్కడ దేవశబ్దానికి లౌకికం, అలౌకికములైన ప్రాణి విశేషాలని అర్థం కాదు. జడదేవతయైన సూర్యుడికి సంబంధించిన ఆలంకారిక వర్ణన. మానుష దైవీ- దినరాత్రుల విభాగకర్తగా చెప్పడం జరిగింది. ॥67॥

తాత్పర్యం:-మానవులకు ఒక సంవత్సరం-దేవతలకు ఒక రేయింబగళ్లు. అందులో మానవులకూ, దేవతలకూ ఉత్తరాయణం పగలనీ, దక్షిణాయనం రాత్రి అనీ చెప్పబడును.

వివరణ: 1. ఉత్తరాయణ దక్షిణాయన వివేచనం.

ఉత్తరాయణం

(1) భూమధ్యరేఖకు ఉత్తరం వైపు సూర్యుడు ఉండే సమయం.
(2) మకరరేఖ నుంచి ఉత్తరంగా కర్కాటక రేఖవైపు ఉండే సమయం.
(3) 'మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ. ఈ 6 మాసాల సమయం.
(4) శిశిర, వసంత, గ్రీష్మ ఋతువుల సమయాన్ని ఉత్తరాయణమంటారు.

దక్షిణాయనం

(1) భూమధ్యరేఖ నుంచి దక్షిణం వైపు సూర్యుడు ఉండే సమయం.
(2) కర్కాటక రేఖ నుంచి దక్షిణంగా మకరరేఖవైపు సూర్యుడు ఉండే సమయం.
(3) శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజు, కార్తీక, మార్గశిర, పుష్యమి ఈ ఆరుమాసాల సమయం.
(4) వర్ష, శరత్, హేమన్త ఋతువుల సమయాన్ని దక్షిణాయనమంటారు.

మానవ సంబంధమైన దినం ఉజ్జ్వలం గాను, తీవ్ర ప్రకాశమయం గాను ఉంటుంది. ఇక రాత్రి అనుజ్జ్వలం గాను (నక్షత్రాలు, చంద్రుడు మొ॥ వాటివలె) మంద ప్రకాశం గాను ఉంటుంది. ఇదేవిధంగా ఉత్తరాయణంలో గ్రీష్మఋతువులో సూర్యప్రకాశం, తాపం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ అయనం దినంతో సమానం. దక్షిణాయనం హేమంత ఋతువులో సూర్యుడి తాపం, ప్రకాశం, అల్పంగా ఉంటుంది. అందువల్ల ఈ సమయం రాత్రిగా చెప్పబడింది. ఈ విధంగా దైవీ దినరాత్రులకు చెందిన ఆలంకారిక వర్ణనమిది.

సూర్యుడు జడదేవత

నిరుక్తంలో దేవశబ్దానికి అర్థం ఇలా చెప్పబడింది. "దేవో దానాద్వా, దీపనాద్వా, ద్యోతనాద్వా, ద్యుస్థానో **భవతీతివా**" (ని.7.4.15) దానం ఇచ్చేవాడు. ప్రకాశింపజేసేవాడు, ప్రకాశించేవాడు, ద్యుస్థానమందుండేవాడు దేవశబ్దవాచ్యుడవుతాడు. సూర్యుడు ద్యుస్థానమందున్నాడు. తన ప్రకాశం ద్వారా మూర్తివంతమైన సమస్త ద్రవ్యాలను ప్రకాశింపజేసేస్తాడు.

శతపథ బ్రాహ్మణంలో దేవతలను గురించి ప్రస్తావిస్తూ 'దేవతలు జడములు, చైతన్యవంతము'లని రెండు విధాలుగా విభజించి, మొత్తం 33 దేవతలున్నారని నిర్ధారణ చేయడం జరిగింది. వాటిల్లో-వసువులలో సూర్యుడు ఒకడు.

“స హోవాచ మహిమాన ఏవైషామేతే త్రయస్త్రింశత్త్వేవ దేవా ఇతి । కతమే తే త్రయస్త్రింశత్ ఇతి । అష్టౌ వసవః, ఏకాదశ రుద్రాః, ద్వాదశాదిత్యాస్త ఏకత్రింశత్ ఇంద్రశ్చైవ ప్రజాపతిశ్చ త్రయస్త్రింశావితి ।

కతమే వసవ ఇతి? అగ్నిశ్చ పృథివీచ, వాయుశ్చ అంతరిక్షం చ, ఆదిత్యశ్చ, ద్యౌశ్చ, చంద్రమాశ్చ, నక్షత్రాణి చ ఏతే వసవః, కతమే రుద్రా ఇతి? దశేమే పురుషే ప్రాణాః (ప్రాణః, అపానః, వ్యానః, సమానః, ఉదానః, నాగః, కూర్మః, కృకలః,దేవదత్తః, ధనఞ్జయశ్చ) ఆత్మా ఏకాదశస్తే । కతమ ఆదిత్యా ఇతి । ద్వాదశమాసాః సంవత్సరస్య ఏతే ఆదిత్యాః.

కతమ ఇన్ద్రః, కతమః ప్రజాపతిరితి । స్తనయిత్నురేవ ఇన్ద్రో, యజ్ఞః ప్రజాపతి రితి । తదాహుః యదయమేక ఇవ పవతే । కతమ ఏకో దేవ ఇతి ? స బ్రహ్మేత్యాధిత్యాచక్షతే.(శత.కా.14, ప్రపా 16)

వీరే కాకుండా దివ్యగుణాలు గలవారు, దివ్యకర్మలు చేసేవారు కూడా దేవతలనబడతారు. **యథా- 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవో భవ** (త్తైత్తిరీయోపనిషద్ ప్రపా.1-11 విస్తృతసమీక్ష కోసం (3-82) చూడండి.)

బ్రహ్మ యొక్క దినరాత్రముల వర్ణన-

ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మస్య తు క్షపాహస్య యత్ప్రమాణం సమాసతః । మూలశ్లోక సం.**37**
ఏకైకశో యుగానాం తు క్రమశస్తన్నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం.**68**

టీక:- మనుమహారాజు మహర్షులతో ఇలా అంటున్నాడు. **బ్రాహ్మస్యతు క్షప+అహస్య** = పరమేశ్వరుడికి సంబంధించిన, పగలు-రాత్రి, **తు**= అలాగే , **ఏకైకశః యుగానాం** = ఒక్కొక్క యుగానికి, **యత్ ప్రమాణం** = ఏది ప్రమాణమో, **తత్** = దాన్ని, **క్రమశః** = క్రమానుసారంగానూ, **సమాసతః** = సంక్షిప్తంగానూ, **సత్ నిబోధత** = బాగా వినండి.

తాత్పర్యం:-బ్రహ్మదేవుని అహోరాత్రానికీ, నాలుగు యుగాలకుగల పరిమాణాన్ని గురించి మీకు తెలుపుతాను వినండి. ॥68॥

సూచన:- బ్రహ్మదినరాత్రుల విశేష పరిమాణాన్ని 1.72లో చూడండి.

సత్యయుగ పరిమాణం (కృత యుగం)-

ఇది మనుకృతం-ప్రామాణికం

చత్వార్యాహుస్సహస్రాణి వర్షాణాం తత్ కృతం యుగమ్ । మూలశ్లోక సం.**38**
తస్య యావచ్ఛతీ సన్ధ్యా సన్ధ్యాంశశ్చ తథావిధః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**69**

టీక:- తత్ చత్వారి సహస్రాణి వర్షానాం కృతం యుగం ఆహుః = (67వ శ్లోకంలో వర్ణించిన దైవాదిన రాత్రుల వర్ణన) నాలుగువేల దివ్యసంవత్సరాలు ఉన్నది కృతయుగం. అదే సత్యయుగం. **తస్య** = ఆ సత్యయుగానికి సంబంధించిన, **యావత్ శతీసన్ధ్యా** = వందసంవత్సరాలు, **సన్ధ్యాంశశ్చ** = సంధ్యాకాలం, **తథావిధః** = అన్ని సంవత్సరాల కాలం సంధ్యాంశమనడం జరుగుతుంది.

తాత్పర్యం:-నాలుగువేల దైవసంవత్సరాలు కృతయుగమని అంటారు. అందులో మొదటి నూరేండ్లు సంధ్య అనే అరుణోదయమూ, తరువాతి నూరేండ్లు సంధ్యాంశమూ అవుతున్నాయి. మొత్తానికి నాలుగువేల ఎనిమిది వందలు దైవవర్షములు. ॥69॥

వివరణ:- ఏ యుగానికైనా, పూర్వసంధికాలానికి సంధ్య అనీ, అలాగే ఉత్తరసంధి కాలానికి "సంధ్యాంశ"మని అంటారు. ఈ శ్లోకాన్ని బట్టి 4000+400 = సంధ్యావర్షం + 400 = సంధ్యాంశవర్షం = 4800 దివ్యవర్షములు. దీన్ని మానవ సంవత్సరాలుగా మార్చుకోడానికి 360తో హెచ్చించాలి. ఈ విధంగా 4800×360 = 17,28000. మానవ సంవత్సరాలకు ఒక సత్యయుగమవుతుంది.

త్రేతా-ద్వాపర-కలియుగ-పరిమాణాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఇతరేషు ససన్ధ్యేషు ససంధ్యాంశేషు చ త్రిషు । మూలశ్లోక సం. **39**
ఏకాపాయేన వర్తన్తే సహస్రాణి శతాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **70**

టీక:- **ఇతరేష త్రిషు** = మిగిలిన మూడు-త్రేతా-ద్వాపర-కలియుగాలలో, **ససన్ధ్యేషు, ససంధ్యాంశేషు** = సంధ్యానామక కాలంలో, **తథా** = అలాగే, సంధ్యాంశ నామక కాలాల్లో, **సహస్రాణి చ శతాని ఏక-అపాయేన** = క్రమంగా ఒక్కొక్కవేయి, ఒక్కొక్క వంద తగ్గించినట్లయితే, **వర్తన్తే** = వాటికి తమ తమ కాల- పరిమాణాలు వస్తుంది. ఇందులో నుండి 1000 దివ్య సంవత్సరాలు, సంధి సంవత్సరాలు 400, సంధ్యాశం సంవత్సరాలు 400 మొత్తం కలిపితే 1800 దివ్య సంవత్సరాలు. ఇందులో నుండి అంటే 4800ల దివ్యసంవత్సరాలను 360తో గుణించగా 17,28,000ల సంవత్సరాలు అవుతాయి. ఇది సత్యయుగం అనబడుతుంది. 4800 దివ్యసంవత్సరాలలో నుండి 1000 దివ్యసంవత్సరాలు తగ్గించగా 3600ల దివ్యసంవత్సరాలు. సంధిసంవత్సరాలైన 400 దివ్యసంవత్సరాల నుండి 100 మరియు దివ్యాంశసంవత్సరాలైన 400 దివ్య సంవత్సరాల నుండి 100 దివ్య సంవత్సరాలను తగ్గించగా మొత్తం 3600ల దివ్య సంవత్సరాలు అవుతాయి. ఈ 3600 దివ్య సంవత్సరాలను 360తో గుణించగా = 12,96,000 సంవత్సరాలు అవుతాయి. ఇది త్రేదాయుగం అనబడుతుంది. 3600 దివ్య సంవత్సరముల నుండి 1000 దివ్య సంవత్సరాలను తగ్గించగా 2600ల దివ్య సంవత్సరాలు. సంధి సంవత్సరాలైన 300ల నుండి 100 మరియు దివ్యాంశ సంవత్సరాలైన 300ల నుండి 100 దివ్య సంవత్సరాలను తగ్గించగా మొత్తం 2400ల దివ్య సంవత్సరాలు అవుతాయి. ఈ 2400ల దివ్య సంవత్సరాలను 360తో గుణించగా 8,64,000 సంవత్సరాలు అవుతాయి. ఇది ద్వాపరయుగం అనబడుతుంది. ఈ పై విధంగా 2400ల దివ్య సంవత్సరాల నుండి 1000 దివ్య సంవత్సరాలను తగ్గించగా 1400 దివ్యసంవత్సరాలు అవుతాయి. సంధిసంవత్సరాలైన 200 ల నుండి 1వందను మరియు సంధ్యాంశ సంవత్సరాలైన 200ల నుండి 1 వందను తగ్గించగా మొత్తం 1200 దివ్యవర్షములు అవుతాయి. ఈ 1200 దివ్య వర్షాలను 360తో గుణించగా 4,32,000ల సంవత్సరాలు అవుతాయి. ఇది కలియుగం అనబడుతుంది.

తాత్పర్యం:-సంధ్య, సంధ్యాంశము వీటితో కూడిన తక్కిన యుగములలో ఒక్కవేయి తగ్గిస్తూ రావడంవల్ల సంఖ్య ఏర్పడింది. అంటే త్రేతాయుగానికి మూడువేల దివ్యసంవత్సరాలు. అందులో సంధ్య, సంధ్యాంశాలకు మూడువందల దివ్యసంవత్సరాలు, ద్వాపరయుగానికి రెండువేల దివ్యసంవత్సరాలు, సంధ్యసంధ్యాంశాలకు రెండు వందల దివ్యసంవత్సరాలు, కలియుగానికి వెయ్యి దివ్యసంవత్సరాలు. సంధ్య, సంధ్యాంశములకు వంద దివ్య సంవత్సరాలు. కాబట్టి త్రేతాయుగానికి 3600 దివ్య సంవత్సరాలూ, ద్వాపరయుగానికి 24000 దివ్య సంవత్సరాలూ, కలియుగానికి 1200 దివ్య సంవత్సరాలూ అని తెలుసుకోవాలి.॥70॥

దేవయుగపరిమాణము- ఇది మనుకృతం-ప్రామాణికం

యదేతత్పరిసంఖ్యాతమాదావేవ చతుర్యుగమ్ । మూలశ్లోక సం. **40**
ఏతద్ద్వాదశసాహస్రం దేవానాం యుగముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **71**

టీక:- యత్ +ఏతత్ = ఇది, ఆదౌ+ఇతి = మునుపటివలె (69-70) చతుర్యుగం = నాలుగు యుగాలు. పరిసంఖ్యాతం = కాలపరిమాణరూపంలో లెక్కించామో, ఏతత్ = ఇది, ద్వాదశసాహస్రం = 12 వేల దివ్యవర్షముల కాలం, [ఇది మానవులకు ఒక చతుర్యుగకాలం,] దేవానాం= దేవతలకు, యుగం = ఒక యుగంగా, ఉచ్యతే = చెప్పబడుతుంది.

తాత్పర్యం:-మానవచతుర్యుగములు పన్నెండు ఒక దివ్యయుగం, ఇది దేవమానమున పన్నెండువేల సంవత్సరాలు కలది. ॥71॥

వివరణ: నాలుగు యుగపరిమాణాల తులనాత్మక పట్టిక

12000 వేల దివ్యవర్షములు ఒక చతుర్యుగం, దాన్ని మానవ సంవత్సరాలుగా మార్చాలంటే, దాన్ని 360తో గుణించాలి. 12000×360 = 43,20,000. ఇది మానవ సంవత్సరాలలో ఒక చతుర్యుగం. పైన పేర్కొన్న రెండు శ్లోకాలలో ఉన్న కాలపరిమాణాలను ఈ పట్టికలో చూడగలరు.

దివ్యవర్షములు+	సంధ్యావర్షములు+	సంధ్యాంశ వర్షములు =		మానుషవర్షములు	యుగనామం
4000 +	400 +	300	= 4800×360 =	17,28,000	సత్యయుగం
3000 +	300 +	300	= 3600×360 =	12,96,000	త్రేతాయుగం
2000 +	200 +	200	= 2400×360 =	8,64,000	ద్వాపరయుగం
1000 +	100 +	100	= 1200×360 =	4,32,000	కలియుగం
10,000 +	1000 +	1000	=12000	12000×360=43,20,000	1 చతుర్యుగం

బ్రహ్మ యొక్క దినరాత్రుల పరిమాణం-

ఇది మనుకృతం-ప్రామాణికం

దైవికానాం యుగానాం తు సహస్రం పరిసంఖ్యయా । మూలశ్లోక సం.**41**
బ్రాహ్మమేకమహర్జ్ఞేయం తావతీం రాత్రిమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**72**

టీక:- దైవికానాం యుగానాం తు = దైవయుగాలను, సహస్రం పరిసంఖ్యయా = వెయ్యితో గుణించగా వచ్చే సంఖ్య, అంటే నాలుగు మానుష యుగాల దివ్యవర్షములు. 12000 వాటిని 1000తో గుణిస్తే 1,20,00,000 అవుతుంది. దివ్యవర్షములు బ్రహ్మకు ఒక పగలు; ఒక రాత్రి అవుతుంది.

తాత్పర్యం:-అలాంటి దైవయుగములు రెండువేలయితే, బ్రహ్మకొక అహోరాత్రమని చెప్పబడును.॥72॥

వివరణ:

నాలుగు మానవ యుగాలకు గల దివ్య వర్షములు 12000×1000 = 1,20,00,000 (ఒకకోటి 20 లక్షల దివ్యవర్షములు బ్రహ్మకు ఒక పగలు. అంతే రాత్రి కూడా. ఇదే మానవ సంవత్సరాలలో చూడాలంటే 1,20,000,00×360 = 4,32,00,00,000 ఇది మానవ సంవత్సరాల కాలపరిమాణం. నాలుగు వందలకోట్ల 32 లక్షల సంవత్సరాలు. ఇది పరమాత్మ జాగ్రదవస్థ- మేలుకొని సృష్టి నిర్మాణం చేసే సమయం. ఇంతేకాలం రాత్రి అంటే సృష్టికార్యం నుంచి నివృత్తుడై ప్రళయం చేసే కాలం. ఇదే రాత్రి కాలం. ఇదే శ్లోకం 1.52 నుండి 57వ శ్లోకం వరకు ఆలంకారికంగా వర్ణించబడింది.

ఇది మనుకృతం-ప్రామాణికం

తద్వై యుగసహస్రాన్తం బ్రాహ్మం పుణ్యమహర్విదుః । మూలశ్లోక సం.**42**
రాత్రిం చ తావతీమేవ తేఽహోరాత్రవిదో జనాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**73**

టీక:- ఎవరైతే, తత్ యుగ సహస్రాన్తం బ్రాహ్మం పుణ్యం అహః = వెయ్యి దివ్య యుగాలు పరబ్రహ్మకు ఒక దినమనీ, చ = మరియు, తావతీమేవ రాత్రిం = అన్నియుగాలు కలిపి బ్రహ్మకు ఒక రాత్రి అనీ, విదుః = తెలుసుకొంటారో, తే వై = వారు మాత్రమే “అహోరాత్రవిదో జనాః = సృష్టి ఉత్పత్తి, ప్రళయకాలాలను తెలిసినవారు.

తాత్పర్యం:-అలాంటి దివ్యయుగాలు వేయింటితో ముగిసిన బ్రహ్మయొక్క పగటిని పుణ్యదినమనీ, అంతే సంఖ్యగల బ్రహ్మయొక్క రాత్రిని స్వప్న కాలమనీ చెబుతారు. ఇలాంటి బ్రాహ్మమైన అహోరాత్ర సంఖ్యను తెలిసినవారు అహోరాత్రజ్ఞులు అనీ, అలాంటి అహోరాత్రసంఖ్యను ఎరుగవలసినది ఆవశ్యకమవడం వల్ల పుణ్యమనీ చెప్పబడింది. ॥73॥

వివరణ: కాలగణనా పద్ధతి:- వేదోత్పత్తి సమయాన్ని గురించి-మహర్షి దయానందులవారు తన ఋగ్వేదాదిభాష్య భూమికలో, 1-68 నుండి 73 శ్లోకాలను ఉదాహరిస్తూ, వాటి భావాలను ఈ విధంగా పేర్కొన్నారు. ఈ కాలగుణ వి.సం.1933; క్రీ.శ. 1876 అనుసారంగా-

ప్రశ్న : వేదాలు పుట్టి ఎన్ని సంవత్సరాలైనవి?

జవాబు : 1 వృందం, 96 కోట్ల 8 లక్షల 52వేల 9 వందల 76 డెబ్భైఆరు సంవత్సరాలయ్యాయి. అంటే సృష్టి జరిగి ఇన్ని సంవత్సరాలయ్యాయి.

ప్రశ్న : వేదోత్పత్తిలో, జగదుత్పత్తిలో ఇన్ని సంవత్సరాలు గడిచాయని ఎలా నిర్ణయిస్తారు?

జవాబు : సృష్టిలో ప్రస్తుతం ఏడవ వైవస్వత మన్వంతరం జరుగుతుంది. ఇంతకుముందు. (1) స్వాయంభువ, (2) స్వారోచిష, (3) ఔత్తమి, (4) తామస, (5) రైవత, (6) చాక్షుష ఈ 6 మన్వంతరాలు గడిచిపోయాయి. ఇప్పుడు 7వ దైన వైవస్వత మన్వన్తరం జరుగుతుంది. ఇంకా సావర్ణి మొ॥ 7 మన్వన్తరాలు అనుభవించవలసి ఉంది. ఇవన్నీ కలిసి 14 మన్వంతరాలు. అంటే మన్వంతరమంటే-71 చతుర్యుగాల కాలం.

సత్యయుగం	17,28,000
త్రేతాయుగం	12,96,000
ద్వాపరయుగం	8,64,000
కలియుగం	4,32,000
మొత్తం	**43,20,000**

ఒక్కక్షణం నుంచి నిమిషం మొ॥ ఒక్క సంవత్సరం కాలంనందుండే సూక్ష్మ, స్థూలభాగాలకు ఆర్యులు పేర్లు పెట్టారు.

ఈ నాలుగు యుగాలలో మొత్తం 43,20,000 సంవత్సరాలున్నాయి. వీటికే చతుర్యుగమనిపేరు. ఇలా 71 చతుర్యుగాలు అంటే 30,67, 20,000 సంవత్సరాలకాలానికీ మన్వంతరమని పేరు. ఇలాంటి 6 మన్వంతరాలు, కలిసి 1 అర్బుదం 84 కోట్ల 3 లక్షల 20వేల సంవత్సరాలు. 7వ మన్వంతర భాగంలో, 28 చతుర్యుగాలు గడచినవి. ఈ చతుర్యుగంలో కలియుగంలో నేటికి 4976 సంవత్సరాలు గడచిపోయాయి. ఇక మిగిలిన, 4 లక్షల 27వేల 024 సంవత్సరాలు అనుభవించవలసి ఉన్నాయి.

12,0532976 (12 కోట్ల 5 లక్షల 32 వేల 9 వందల 76) వర్షములు వైవస్వతమనువు అనుభవించాడు. ఇక 186187024 (18 కోట్ల 61 లక్షల, 87 వేల 24) వర్షములు అనుభవించవలసి ఉంది. ఇందులో వర్తమాన విక్రమ సంవత్సరం 77ను ఆర్యులు విక్రమ-1939 సం॥ అని పేరు పెట్టారు. పూర్వం రాసిన చతుర్యుగి ఒక్కవెయ్యి అయితే, బ్రహ్మకు ఒక దినం(పగలు). అలాంటి చతుర్యుగాలు కలిస్తే బ్రహ్మకు ఒకరాత్రి అని : అంటే సృష్టి రచించిన తరవాత వెయ్యి చతుర్యుగాల పర్యంతం ఈశ్వరుడి సృష్టి జరుగుతూనే ఉంటుంది. ఈ సమయానికే బ్రహ్మదినమంటారు. ఒక వెయ్యి సం॥ల పర్యంతం సృష్టిని లయం చేస్తూ ఉంటాడు. అంటే కారణంలో లయం చేస్తాడు. ఆ సమయాన్ని బ్రహ్మ రాత్రి అంటారు. అంటే సృష్టి జరుగుతున్న కాలం పగలు (దినం) కాగా, ప్రళయం జరిగే కాలం రాత్రి అవుతుంది.

ఈ వర్తమాన బ్రహ్మదినం (పగలు)లో 1,96,08,52,976 సం॥లు. (1 అర్బుదం 96 కోట్ల 8 లక్షల 52వేల 976. తొమ్మిదివందల డెబ్భైఆరు) గడిచాయి. అలాగే వేదోత్పిత్తి జరిగి అన్ని సం॥లు గడచ్చిపోయాయి.ఇంకా

2,33,32,270,24 (2 అర్బుదముల 33 కోట్ల, 32 లక్షల 27 వేల 24) సం॥లు సృష్టి జరగవలసి ఉంది. వీటిలో చివరి 24 వ సం॥ జరుగుతుంది. రాబోయే సృష్టి సంవత్సరాలలో నుండి ఒక్కొక్క సంవత్సరం తగ్గిస్తూ పోతూ, గతవర్షములకు ఒక్కొక్క సంవత్సరం కలుపుతూ ఉండాలి. ఇప్పటివరకు తగ్గిస్తూ కలుపుతూ చేసినట్లుగానే (ఋ.భూ.వేదోత్పత్తి విషయము).

సుషుప్త్యవస్థ నుంచి మేలుకొన్న తరువాత సృష్టి ఉత్పత్తి ప్రారంభం- ఇది మనుకృతం-ప్రామాణికం

తస్య సోఽహర్నిశస్యాంతే ప్రసుప్తః ప్రతిబుధ్యతే । మూలశ్లోక సం.**43**
ప్రతిబుద్ధశ్చ సృజతి మనస్సదసదాత్మకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**74**

టీక:- **సః ప్రసుప్తః** = ప్రళయసమయంలో నిద్రించేవాడిలాగా ఉన్న పరమాత్మ, (1.52-57), **తస్య అహర్నిశస్య+అన్తే** = పగలు, రాత్రి అయిన తరువాత, **ప్రతిబుధ్యతే** = మేలుకొంటాడు. (1.68-72) అంటే సృష్టి ఉత్పత్తిలో నిమగ్నుడవుతాడు. **చ** = మరియు **ప్రతిబుద్ధశ్చ**= మేలుకొని, **సత్+అసత్+ఆత్మకమ్** = కారణరూపంలో ఉండునట్టి, వికారి అంశతో కార్యరూపంలో ఉండునట్టి స్వభావం కలిగిన, **మనః** = "మహత్" నామక ప్రకృతి యొక్క ఆద్యకార్య తత్త్వాన్ని, **సృజతి** = సృష్టిస్తారు.

తాత్పర్యం:-బ్రహ్మ అలాంటి అహోరాత్రమున రాత్రి కాలంలో నిద్రించి, దాని అంతంలో మేల్కొంటాడు. అలా మేల్కొంచి, అవాంతర ప్రళయమున భూరాదిలోకముల సృష్టి నిమిత్తమై సదసదాత్మకమయిన 'మహత్తు'ను సృష్టిస్తాడు.॥74॥

వివరణ: 1. ఇక్కడ సృష్టి ఉత్పత్తి అనే నూతన ప్రసంగాన్ని ప్రారంభించలేదు. (1.14-16) పూర్వోక్త ప్రసంగంలో ఉదాహరించిన తత్త్వాల ఉత్పత్తితో పాటు, భూతముల ఉత్పత్తి ప్రక్రియావర్ణన చేయలేదు. మిగిలిపోయిన దాన్ని ఇక్కడ విస్తారంగా వర్ణించాడు. 2. ఈ శ్లోకంలో 'మనః' శబ్దానికి 'మహత్తత్త్వం' (1.14-15) వివరణ చూడగలరు.

సూక్ష్మ పంచభూతోత్పత్తి క్రమంలో 'ఆకాశ ఉత్పత్తి' వర్ణన ఇది మనుకృతం-ప్రామాణికం

మనస్సృష్టిం వికురుతే చోద్యమానం సిసృక్షయా । మూలశ్లోక సం.**44**
ఆకాశం జాయతే తస్మాత్తస్య శబ్దం గుణం విదుః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**75**

టీక:- **సిసృక్షయా**= సృష్టి చేయాలనే కోరికతో మళ్ళీ ఆ పరమేశ్వరుడు, **మనః సృష్టిం వికురుతే** = మహత్తత్త్వసృష్టికి వికృత భావాన్ని కలిగిస్తాడు. అంటే అహంకారరూపంలో మార్పు చేస్తాడు. **తస్మాత్** = మళ్ళీ దానియొక్క వికారి అంశం నుండి, **చోద్యమానం ఆకాశం జాయతే** = ప్రేరేపింపబడిన ఆకాశం ఉత్పన్నమవుతుంది. **తస్య** = ఆ ఆకాశానికి, **గుణం శబ్దం విదుః** = శబ్దం గుణమని తెలుసుకొనుడు.

తాత్పర్యం:-బ్రహ్మచే పురికొల్పబడిన అహంకార తత్త్వాన్ని మహత్తు సృష్టిని చేయడానికి ప్రేరేపిస్తుంది. అలాంటి మహత్తు, అహంకారం నుండి ఆకాశం పుట్టింది. ఆకాశానికి శబ్దం గుణమని చెబుతారు.

వివరణ: ఆకాశ ఉత్పత్తిని గురించి శ్రీ దయానందమహర్షి అభిప్రాయం "ఆ పరమేశ్వరుడు ప్రకృతుల నుండి ఆకాశం (అవకాశము) అంటే సర్వత్ర వ్యాపించి ఉన్న కారణరూప ద్రవ్యమును ఒక చోట పోగుచేసినట్లయితే, ఆకాశం (Space) ఉత్పన్నమవుతుంది. వాస్తవంగా ఆకాశం పుట్టదు. ఆకాశం లేనట్లయితే ప్రకృతి పరమాణువులు ఎక్కడ ఉండగలవు? (స.ప్ర. 8వ సముల్లాసము).

వాయు ఉత్పత్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆకాశాత్తు వికుర్వాణాత్సర్వగంధవహశ్శుచిః । మూలశ్లోక సం.**45**
బలవాన్ జాయతే వాయు స్స వై స్పర్శగుణో మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**76**

టీక:- ఆకాశాత్ తు వికుర్వాణాత్ = ఆకాశం యొక్క వికారోత్పాదక అంశం నుండి, **సర్వగంధవహః**= సమస్త గంధాన్ని తీసుకుపోయే, **శుచిః**= శుద్ధమైనట్టి, **వాయుః**= వాయువు, **జాయతే** = ఉత్పన్నమవుతుంది. **సః వై**= ఆ వాయువు, నిశ్చయంగా, **స్పర్శగుణః** = స్పర్శగుణం కలిగిందిగా, **మతః** = అంగీకరించబడింది.

తాత్పర్యం:-వికారాలను పుట్టించునట్టి ఆకాశం నుండి సుగంధదుర్గంధాలను తీసుకుపోయేదీ, పవిత్రమైనదీ, బలిమిగలదీ అయిన వాయువు పుట్టింది. అలాంటి వాయువు స్పర్శగుణం గలది.॥76॥

అగ్ని ఉత్పత్తి-

ఇది మనుకృతం-ప్రామాణికం

వాయోరపి వికుర్వాణాద్విరోచిష్ణుః తమోనుదమ్ । మూలశ్లోక సం.**46**
జ్యోతిరుత్పద్యతే భాస్వత్తద్రూపగుణముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**77**

టీక:- వాయోరపి = వాయువు యొక్క, **వికుర్వాణాత్** = వికారోత్పాదకమైన అంశం నుండి, **విరోచిష్ణుః** = ప్రకాశించునట్టి, **తమోనుదమ్** = అంధకారాన్ని నశింపజేయునట్టి, **భాస్వత్** = ప్రకాశకమైన, **జ్యోతిః + ఉత్పద్యతే** = అగ్ని ఉత్పన్నమవుతుంది, **తత్+రూపగుణమ్+ఉచ్యతే** = దాని గుణం రూపం అని చెబుతారు.

తాత్పర్యం:-వికారజనకమైన వాయువు నుండి ఇతరాలను ప్రకాశింపజేసేదీ, ఎక్కువ ప్రకాశం గలదీ, చీకటిని పోగొట్టునదీ అయిన జ్యోతి పుట్టింది. ఆ జ్యోతికి గుణం రూపమే అని అంటారు. అదియే అగ్ని. ॥77॥

జలం, పృథ్వీల ఉత్పత్తి-

ఇది మనుకృతం-ప్రామాణికం

జ్యోతిషశ్చ వికుర్వాణాదాపో రసగుణాః స్మృతాః । మూలశ్లోక సం.**47**
అద్భ్యో గంధగుణా భూమిరిత్యేషా సృష్టిరాదితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**78**

టీక:- చ = మరియు, **జ్యోతిషః వికుర్వాణాత్** = వికారోత్పాదకమైన, అగ్ని అంశం నుండి, **రసగుణాః ఆపః స్మృతాః** = రసగుణం గల నీళ్ళు (జలం) ఉత్పన్నమయ్యాయి. మరియు, **అద్భ్యః** = నీటి నుంచి, **గంధ గుణా భూమిః** = గంధగుణం గల భూమి. **ఇతి +ఏషా సృష్టిః ఆదితః** = ఈ ప్రకారంగా సృష్టి ప్రారంభించబడినది. (1.14) ఇంతవరకు వర్ణింపబడిన సృష్టి ప్రక్రియ (1.75-78) సుస్పష్టంగా తెలిసికోడానికి. 1.16 శ్లోకానికి సంబంధించిన వివరణ చూడగలరు.

తాత్పర్యం:- వికారగుణం గల ఆ జ్యోతి నుండి జలం పుట్టింది. ఆ జలం రసగుణం కలది. ఆ జలం నుండి గంధగుణం గల భూమి పుట్టింది. ఇదే మహాప్రళయానంతరమైన సృష్టికి మొదటి భూతసృష్టి.ఆ భూతములవల్లనే అవాంతరసృష్టికి తరవాత కల్గిన భూరాదిలోక త్రయ నిర్మాణం జరిగినది.॥78॥

వివరణ: 75 నుండి 78 శ్లోకాల వరకు సంబంధించిన స్పష్టమైన వివరణను తెలుసుకొనుటకు 1.16లో గల అనుశీలనను చూడగలరు.

మన్వంతరకాల పరిమాణం-

ఇది మనుకృతం-ప్రామాణికం

యత్ ప్రాగ్ద్వాదశసాహస్ర ముదితం దైవికం యుగమ్ । మూలశ్లోక సం.**48**
తదేకసప్తతిగుణం మన్వంతరమిహోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**79**

టీక:- ప్రాక్ = ముందటి శ్లోకాలలో 1.71, **యత్** = ఏ, **ద్వాదశ సహస్రమ్** = 12 వేల దివ్య వర్షములు, **దైవికం యుగమ్ ఉదితం** = ఒక దేవయుగమని చెప్పబడింది, **తత్ + ఏకసప్తతి గుణం** = 71 రెట్లున్న సమయం అంటే 12000×71 = 852000 దివ్యవర్షములు అలాగే 852000 దివ్య వర్ష ×360 = 30,67,20,000 = మానవ సంవత్సరాలు (ఇహ మన్వన్తరమ్ ఉచ్యతే) ఒక మన్వంతర కాలమని చేబుతారు.

తాత్పర్యం:-పూర్వమే 12 వేల దివ్యసంవత్సరాల పరిమాణం గల (మనుష్యమానం ప్రకారం) 71 చతుర్యుగాలను ఒక దైవయుగంగా చెప్పబడి ఉంది. అలాంటి దైవయుగాలు 71 అయితే ఒక మన్వంతరం అనబడుతుంది. ॥79॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మన్వంతరాణ్యసంఖ్యాని సర్గ స్సంహార ఏవ చ । మూలశ్లోక సం. **49**
క్రీడన్నివైతత్కురుతే పరమేష్ఠీ పునః పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **80**

టీక:- పరమేష్ఠీ = సర్వోత్తముడైన పరమేశ్వరుడు, అసంఖ్యాని మన్వంతరాణి = అసంఖ్యమన్వంతరాలను, సర్గః = సృష్టి, చ = మరియు, సంహార ఏవ = ప్రళయమూ, క్రీడన్నివ = ఆడుకొనేట్లుగా, పునః పునః = మాటికి మాటికి, కురుతే = చేస్తూ ఉంటాడు.

తాత్పర్యం:-ఈ ప్రకారంగా సృష్టి ప్రళయాలు అనంతంగా ఉన్నందు వల్ల మన్వంతరాలు కూడా అసంఖ్యాకంగా ఉంటాయి. ఈ సృష్టిని బ్రహ్మ ఒక క్రీడా వినోదంగా మాటిమాటికీ చేస్తూ ఉంటాడు.॥80॥

వివరణ: ఈ శ్లోకాలను ఉదాహరిస్తూ స్వామి దయానందులవారిట్లు ఋగ్వేదాది భాష్యభూమికలో రాశారు. ఈ శ్లోకాలలో దేవసంవత్సరాల వర్ణన ఉంది. నాలుగు యుగాల పరిమాణం 12000 సం॥లు. దీనికి దైవ యుగమనిపేరు. ఇదేవిధంగా అసంఖ్యాక మన్వంతరములలో అనంతమైన సృష్టి జరిగిపోయింది. ఇంకా అనేకసార్లు జరుగుతుంది. అందువల్ల, సదా సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడు సహజస్వభావంతో సృష్టిని రచిస్తూ, పాలిస్తూ చివరిలో లయం చేస్తూ ఉంటాడు. ఎల్లప్పుడు అలానే చేస్తూంటాడు. సృష్టి అనాది ప్రవాహం.

ప్రశ్న : ఎప్పుడైనా సృష్టికి ప్రారంభముందా? లేదా?

జవాబు : లేదు. పగటికి పూర్వం రాత్రి, రాత్రికి పూర్వం పగలు. అలాగే పగటి వెంట రాత్రి, రాత్రి వెంట పగలు వస్తున్నట్లుగా సృష్టికి పూర్వం ప్రళయం, మరియు ప్రళయానికి పూర్వం సృష్టి, అలాగే సృష్టికి వెనుక ప్రళయం ప్రళయానికి ముందు సృష్టి, అనాది కాలం నుంచి చక్రం లాగా తిరుగుతూ వస్తున్నాయి. దీనికి ఆద్యంతాలు లేవు. కానీ దినరాత్రుల ప్రారంభాంతాలు కనిపిస్తునట్లుగా, సృష్టి ఆద్యంతాలు జరుగుతూనే ఉంటాయి. కారణం-పరమాత్మ, జీవుడు, జగత్కారణమైన ప్రకృతి ఈ మూడు అనాది స్వరూపాలు. అలాగే జగదుత్పత్తి స్థితి- వర్తమాన ప్రవాహం ద్వారా అనాది. నదీ ప్రవాహం లాగా ఒకప్పుడు కనిపిస్తుంది. మరొకప్పుడు ఎండిపోతుంది. కనిపించదు. మళ్ళీ వర్షాకాలంలో కనిపిస్తుంది. ఎండాకాలంలో కనిపించదు. ఇలాగా వ్యవహారాలన్నీ ప్రవాహరూపంగా తెలిసికోవాలి. (స.ప్ర. 8వ సము.)

మనుప్రోక్త కాలపరిమాణపట్టిక శ్లో. 1.64 నుండి 80వ శ్లోకం వరకు వర్ణించడం జరిగింది.

1-64వ శ్లోకం నుండి 80వ శ్లోకం వరకు వర్ణిత మనుప్రోక్త కాల పరిమాణ పట్టిక.

రెప్పపాటుకాలం	1 నిమిషం	8/45 సెకండ్లు
18 నిమిషాలు	1. కాష్ఠ	3,1/5 సెకండ్లు
30 కాష్ఠలు	1 కల	1 నిమిషం-36 సెకండ్లు
30 కలలు	1 మూహూర్తం	48 నిమిషాలు లేదా రెండు ఘడియలు
30 ముహూర్తాలు	1 దినం-రాత్రి+పగలు	24 గంటలు,లేదా 60 ఘడియలు
15 దినరాత్రములు	1 పక్షం (మానవ)	
2 పక్షములు	1 మాసం (మానవ)	
6 మాసాలు	1 అయనం (మానవ)	1 దినం, లేదా రాత్రి (దివ్యం)

2 అయనాలు	1 సంవత్సరం ఉత్తరాయణం-దక్షిణాయనం	1 రాత్రింబవళ్ళు (దివ్యం)
2 అయనాలు 12 మాసాలు	1 సంవత్సరం	1 రాత్రింబవళ్ళు (దివ్యం)
360 దినరాత్రులు (దివ్య)	360 సం॥లు (మానవ)	1 సం॥ దివ్యం
4000 దివ్య వర్షం× 360 కాల పరిమాణం	=14,40,000 మానవవర్షం	సత్యయుగం యొక్క ప్రముఖ
400 ది.వ × 360	=1,44,000 మావన వర్షం	సత్యయుగంలోని సంధ్యాకాలం
400 ది.వ × 360	=1,44,000 మానవ వర్షం	సత్యయుగంలోని సంధ్యాంశకాలం
4800 ది.వ × 360	=17,28,000 మానవ వర్షం	సత్యయుగంలోని పూర్ణకాల పరిమాణం
3000 ది.వ × 360	= 10,80,000 మానవవర్షం	త్రేతాయుగంలోని ప్రముఖ కాలపరిమాణం
300 ది.వ × 360	= 1,08,000-మానవవర్షం	త్రేతాయుగ సంధ్యాకాలం
300 ది.వ యోగ × 360	= 1,08,000-మానవవర్షం	త్రేతాయుగ సంధ్యాంశకాలం
3600 ది.వ × 360	= 12,96,000-మానవవర్షం	త్రేతాయుగ పూర్ణకాలపరిమాణం
2000 ది.వ × 360	= 7,20,000-మానవవర్షం	ద్వాపరయుగ ప్రముఖకాల పరిమాణం
200 ది.వ × 360 సంధ్యాంశకాలము	= 72,000-మానవవర్షం	ద్వాపరయుగ సంధ్యాకాలము
200 ది.వ యోగ × 360	= 72,000-మానవవర్షం	ద్వాపరయుగ
2400 ది.వ × 360	= 8,64,000-మానవవర్షం	ద్వాపరయుగ పూర్ణకాల పరిమాణం
1000 ది.వ × 360	= 3,60,000-మానవవర్షం	కలియుగ ప్రముఖ కాలపరిమాణం
100 ది.వ × 360	= 36000-మానవవర్షం	కలియుగ సంధ్యాకాలం
100 ది.వ × 360	= 36000-మానవవర్షం	కలియుగసంధ్యాంశకాలం
1200 ది.వ యోగ × 360	= 4,32000-మానవవర్షం	కలియుగ పూర్ణకాల పరిమాణం
12000 ది.వ × 360	= 42,20,000-మానవవర్షం	ఒక చతుర్యుగముల సమయం (మానవ) లేదా దేవతల యుగం.

12,00 × 71 ది.వ × 360= 30,67, 20,000		ఒక మన్వంతర సమయం మానవవర్షం
1,20,00,000" × 360	4,32,00,00,000	బ్రహ్మకు ఒకదినం లేదా రాత్రి కాలపరిమాణం అనగా సృష్టికి సమయావధి లేదా ఒక ప్రళయ సమయావధి.
(1000 దివ్యయుగాలు)		

2,40,00,000 ది.వర్ష × 360 = 8,64,00,000 మానవ వర్షములు/ బ్రహ్మకు ఒక దినరాత్రి కాలం అంటే ఒక సృష్ట్యుత్పత్తి, ప్రళయ కాలావధి.

81 నుండి 86వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు.ఇవి ప్రామాణికం కావు

*** యుగాన్ని బట్టి ధర్మ వృద్ధిహ్రాసాలు-**

* *చతుష్పా త్సకలో ధర్మః సత్యం చైవ కృతే యుగే ।*
నాధర్మేణాగమః కశ్చిన్మనుష్యాన్ ప్రతి వర్తతే ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***81***

తాత్పర్యం:-కృతయుగంలో ధర్మం పరిపూర్ణంగా ఉండి, నాలుగు పాదాల మీద నడుస్తుంది. అలాగే సత్యం అన్ని విధాలా నిలిచి ఉంటుంది. అధర్మం అసలుండదు. ॥81॥

* *ఇతరేష్వాగమాద్ధర్మః పాదశస్త్వవరోపితః ।*
చౌరికానృతమాయాభిర్ధర్మశ్చాపైతి పాదశః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***82***

తాత్పర్యం:-మిగిలిన మూడు యుగాల్లోనూ అధర్మంతో విద్యా, ధనాలను జనులు సంపాదించడం చేత ధర్మం ఒక్కోపాదం తగ్గుతూ రాగా-ఈ అధర్మార్జిత విత్త విద్యల చేత సత్యం, శాంతి, శౌచం కూడ తగ్గసాగుతాయి.॥82॥

* *అరోగాస్సర్వసిద్ధార్థాశ్చతుర్వర్షశతాయుషః ।*
కృతే త్రేతాదిషు హ్యేషామాయుర్హ్రసతి పాదశః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***83***

తాత్పర్యం:-కృతయుగంలో మానవులు ధర్మిష్ఠులు కావడం వల్ల రోగాలు లేనివారూ, సకలవిధములైన కోరికలు నిండినవారూ, నాలుగువందల సంవత్సరాల ఆయుష్షుగలవారూ, త్రేతాదియుగాలు మూడింటి యందు వీరికి ఆయుష్షు పాదపాదమున అల్పమవుతుంటుంది.॥83॥

* *వేదోక్తమాయుర్మర్త్యానామాశిషశ్చైవ కర్మణామ్ ।*
ఫలన్త్యనుయుగం లోకే ప్రభావశ్చ శరీరిణామ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***84***

తాత్పర్యం:-'శతాయుః పురుషః' మొదలయిన శ్రుతులందు చెప్పబడిన ఆయుష్షూ, కామ్యకర్మలకు కలిగే ఫలవిషయాలైన ప్రార్థనలూ, శాపానుగ్రహ సమర్థములైన బ్రాహ్మణులకు గల ప్రభావములును యుగానుసారమున ఫలిస్తుంది. ॥84॥

* *అన్యే కృతయుగే ధర్మాస్త్రేతాయాం ద్వాపరేఽపరే ।*
అన్యే కలియుగే నృణాం యుగహ్రాసానురూపతః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***85***

తాత్పర్యం:-కృతయుగంలోని ధర్మాలు వేరు. త్రేతాయుగంలో వీటికంటే భిన్నమైన ధర్మాలుంటాయి. కలియుగంలోని ధర్మాలు వీటిని పోలి ఉండవు. ఇలాగే యుగాల క్షీణతను బట్టి, ఆ యా యుగాల ధర్మాలు వేర్వేరుగా ఉంటాయి. ॥85॥

* *తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞాన ముచ్యతే ।*
ద్వాపరే యజ్ఞమేవాహుర్దానమేకం కలౌ యుగే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **86**

తాత్పర్యం:-ప్రధానంగా అన్ని ధర్మాలూ అన్ని యుగాల జనులకు ఉండవలసినవే అయినప్పటికీ, కృతయుగంలో మేలైనది తపస్సు. త్రేతాయుగంలో ఆత్మజ్ఞానం, ద్వాపరంలో యజ్ఞం, కలియుగంలో దానం ఉత్తమ ధర్మం. ॥86॥

ప్రక్షిప్తాల పరిశీలన

81 నుంచి 86 శ్లోకాలలోని విషయం కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తాలని తేలుతూంది.

1. ప్రసంగవ్యతిరేకం

సృష్టి ఉత్పత్తి (1.5-23) ప్రక్రియలో 24 నుంచి 31వరకు కర్మల విధానం, ప్రాప్తి మొ॥ వాటి వర్ణనతో విషయం కర్మ చర్చమీదే నడిచింది. కానీ, సృష్టి ఉత్పత్తి, దాని ప్రక్రియ మొ॥ వాటికి సంబంధించిన విషయాలు కొన్ని మిగిలిపోయాయి. వాటిని చెప్పటం అవసరమని భావించిన మనువు, 1.42 శ్లోకంలో ప్రాణుల కర్మలను తర్వాత చెబుతాను, ముందు జన్మ విషయాలను చక్కగా చెబుతాను. **(యేషాం తు యాదృశం కర్మ భూతానామిహ కీర్తితమ్ తత్తథా వోఽభిధాస్యామి క్రమయోగం చ జన్మని)** అన్నాడు. ఆ కర్మల విషయాన్ని మార్చి **'సృష్టి జన్మను గురించిన విషయం'** అనే దాన్ని 43వ శ్లోకం నుంచి ప్రారంభించాడు. ఈ సంకేత శ్లోకాన్ని అనుసరించి మనువు 43 నుంచి 80 శ్లోకాల వరకు పైన చెప్పిన విషయాన్ని ముందుగా చర్చించాడు. సంకేతక శ్లోకం ప్రకారం 80వ శ్లోకం మధ్యలో అది పూర్తికావడంతో, మళ్లీ అక్కడే వదిలేసిన 'కర్మచర్చకు సంబంధించిన విషయం' ప్రారంభం కావలసి ఉంది. అది 87వ శ్లోకం నుంచి ప్రారంభంకాగా, మధ్యలోని ఈ శ్లోకాలు సంకేతించిన విషయాన్ని భంగం చేశాయి. వీటిలో అనవసరమూ, అసందర్భమూ అయిన 'యుగ ఫలితాలు' ఉన్నాయి. దీన్ని సంకేతక (1.42) శ్లోకంలోనే చెప్పేసినట్లుగానూ లేదు, దీనికి పూర్వాపర శ్లోకాలతో సంబంధమూ లేదు. అందువల్ల పూర్వవిషయమైన సృష్టికి సంబంధించినదీ, వీటి తర్వాతి (కర్మల విధానం 87-91) వాటికి సంబంధించినదీ కాదు. వీటిలో రచనకు సంబంధించిన వర్ణన కాకుండా ఫల ప్రదర్శన ఉంది. ఈ దృష్టితో 80వ శ్లోకం తర్వాత 87వ శ్లోకమే ప్రాసంగికమూ, క్రమబద్ధమూ అవుతుంది. అందుకని ఇవి ప్రక్షిప్తాలు.

2. శైలీగత ఆధారం

క. భాషా ప్రయోగ శైలి వల్లనూ 80వ శ్లోకం తర్వాత 87వ శ్లోకమే క్రమమైనదని తెలుస్తూంది. 80వ శ్లోకంలో **'పరమాత్మ ఈ మొత్తం జగత్తును పదే పదే సృష్టిస్తాడు, లయం చేస్తాడు'** అన్నాడు. ఈ శ్లోకపు క్రమం ప్రకారమే 87వ శ్లోకంలో - **'సర్వస్యాస్య తు సర్గస్య గుప్త్యర్థం'** అనే పదాలు ప్రయోగించాడు. దీని వరుసలో-**'ఈ మొత్తం జగత్తు రక్షణ కొరకు'** అంటే, మునుపటి (5.80) శ్లోకాల్లో చెప్పాడో, ఆ జగత్తు రక్షణ కోసం. ఈ విధంగా **'సర్వస్యాస్య'** మీద ప్రయోగం 80వ శ్లోకానికి 87వ శ్లోకంతో సంబంధం ఉందని రుజువు చేస్తుంది.

ఖ. రెండవ కోణంలో చూస్తే, పైన చెప్పిన క్రమం సరిపోతుంది. ఎందుకంటే 81-86 శ్లోకాలలో జగత్తు వర్ణనే లేదు. అందుచేత ఈ శ్లోకాల తర్వాత **'అస్య సర్వస్య'** (87) పదాల ప్రయోగం కుదరదు. ముందు జగత్తు వర్ణన ఉన్న 80వ శ్లోకం వరకు గల వాటి తర్వాత కుదురుతుంది. ఈ విధంగా శైలి వల్లనూ 80,87లకే క్రమం సరిపోతుంది.

3. విషయవ్యతిరేకం

1.4-5 శ్లోకాలలో సృష్టి ఉత్పత్తి పూర్వకంగా ధర్మోత్పత్తి ప్రారంభమూ, 1.144లో అవి 'ఈ సమస్త జగత్తు ఉత్పత్తి, ధర్మాల విషయాలు సంక్షేపంగా చెప్పాను' **(ఏషా ధర్మస్య వో యోనిః సమాసేన ప్రకీర్తితా । సంభవశ్చాస్య సర్వస్య...)** అని

చెప్పి విషయసమాప్తిని సంకేతించాడు మనువు. దీనివల్ల 1.4-144 శ్లోకాలలోని విషయం సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి-వీటిని గురించినదని తెలుస్తుంది. ఈ సంకేతం ప్రకారం వీటి మధ్య వీటికి సంబంధించిన విషయాలు మౌలికాలే కానీ, వేరు కావు. 81-86 శ్లోకాలలోని వర్ణన ఏదో ఒక ఉత్పత్తిని కానీ, లేదా ఆ ప్రక్రియకు కానీ సంబంధించినది కాదు. వీటిలో యుగాలను అనుసరించిన ఫల కథనం ఉంది, ఇది ఈ అధ్యాయానికి సంబంధించింది కాదు. ఇటువంటి శ్లోకం విషయ వైవిధ్యం గలది కనుక విషయ విరుద్ధం, అందుచేత ప్రక్షిప్తం.

4. అంతర్ వ్యతిరేకం

యుగం లేదా కాలం ధర్మాధర్మాల వల్ల ఏర్పడదు.

ఈ శ్లోకాలలోని విషయం మనుస్మృతిలోని మౌలిక ఘనతకు ఎన్నో రకాలుగా వ్యతిరేకంగా ఉంది.

క. మనుస్మృతి మొత్తం ధర్మాధర్మాలకు కర్మలే కారణమనే సిద్ధాంతంపై ఆధారపడి ఉండగా, ఈ శ్లోకాలలో యుగం లేదా కాలమే ధర్మాధర్మాలకు కారణమని ఉంది. మనుస్మృతి ప్రకారం ఎవరైనా చెడ్డ పనులు (అధర్మం) చేస్తే వారికి చెడ్డ ఫలాలు, మంచి పనులు చేస్తే మంచి ఫలాలు లభిస్తాయని ఉంది (12.3-9,24-51). మనుస్మృతిలో చెప్పిన ధర్మం వేదవిహితమైనది (1.23,24,129). వేదాలు నిత్యాలు (1.4,23,24, 12.94). అందుచేత వేదాలలో చెప్పిన ధర్మాధర్మాల ఫలాలు కూడా నిత్యమూ, ఒకేవిధంగా ఉంటాయి. ఈ శ్లోకాలలో చెప్పిన **'యుగాన్ని అనుసరించి ధర్మాధర్మాలు, ఫలాలు'** మనుస్మృతి యొక్క మూల ఉద్దేశ్యానికి వ్యతిరేకం, అందువల్ల ఈ శ్లోకాలు మౌలికం కాలేవు.

ఖ. ధర్మం యుగానుసారం నాలుగవవంతు తగ్గుతుంది. (1.82). అంటే స్వాభావికంగా తగ్గుతుంది కానీ ప్రత్యేక స్థితిలో తగ్గదు. ఎందుకంటే అది దాని స్వభావం కనుక! ఇక అప్పుడు మనుస్మృతిలో ధర్మపాలనను గురించి చెప్పే అవసరమేముంది?

గ. 1.24-29 శ్లోకాలలో మనువు, సృష్టి ప్రారంభంలో కర్మానుసారం శరీరాలు ప్రాప్తిస్తాయని చెప్పాడు. మరి సత్యయుగంలో జనమందరికీ సిద్ధులు ప్రాప్తించి ఉంటే (1.81-83) ఆ సమయంలో దుఃఖమూ, అధర్మమూ ఎందుకు ఉన్నాయి? అందులోనూ అది సత్యయుగం !

ఘ. 85-86 శ్లోకాలలో నాలుగు యుగాలలోనూ క్రమంగా తపస్సు, జ్ఞానం, యజ్ఞాలు, దానాలను ధర్మంగా భావించారు. మనుస్మృతికి ఆధారభూతమైన విషయానికే ఇది వ్యతిరేకం. మనువు అనేక శ్లోకాలలో తపస్సు, జ్ఞానం, యజ్ఞాలు, దానాలను శాశ్వత కాలీనమూ, సమానధర్మాలుగా భావించి, వాటిని కలిపి నిర్వహించాలని చెప్పాడు. [2.166-167 (2.141-142), 2.175(150); 3.67,69-76;4.19-20, 227, 233; 6.4-12,70,75 మొ॥] మనుస్మృతిలో ఎక్కడా కూడా యుగాన్ని అనుసరించి ధర్మపాలనం చేయమని చెప్పలేదు.

ఙ. 9.301,302 శ్లోకాలలో మనువు రాజుల ఆచరణలనే యుగాల రూపాలుగా భావించాడు. ఈ శ్లోకాలలో మనువు రెండు విషయాలను స్పష్టం చేశాడు- ఒకటి, కర్మలను అనుసరించి ధర్మాధర్మాలు లేదా మంచి చెడుల యుగాలుగా భావించాడే కానీ, యుగాలు లేదా కాలాన్ని ధర్మాధర్మాలకు కారణంగా భావించలేదు. **'కాలం'**, లేదా **'యుగం'** జడపదార్థం కాబట్టి, జడ పదార్థం ఎప్పటికీ ధర్మాధర్మాలకు కారణం కాజాలదు.

రెండు, ఈ శ్లోకాల ఆలంకారిక వర్ణన వల్ల, మనువు యుగాలను కేవలం 'కాలప్రమాణ' రూపంలోనే స్వీకరించాడు. కానీ, గత శ్లోకాలలో (81-83) చెప్పిన ధర్మాధర్మాలకు కారణంగా కాదు. ఈ శ్లోకాలను అనుసరించి యుగఫలాలు చెప్పదలిస్తే, 9.301,302 శ్లోకాలలో కర్మలు ఆధారంగా రాజుల యుగాలను ఆలంకారిక వర్ణన చేసి ఉండడు. వాటిని రాజుల విశేష ఆచరణలుగా ఒక యుగానుసారం రాజుల ఆచరణలో వచ్చే మార్పులుగా భావించి ఉండేవాడు. అవి ఇలా ఉన్నాయి-

కృతం త్రేతాయుగం చైవ ద్వాపరం కలిరేవ చ ।
రాజ్ఞో వృత్తాని సర్వాణి రాజా హి యుగముచ్యతే ॥
కలిః ప్రసుప్తో భవతి స జాగ్రద్ ద్వాపరం యుగమ్ ।
కర్మ స్వభ్యుద్యత స్త్రేతా విచరంస్తు కృతం యుగమ్ ॥

'సత్యయుగం, త్రేతాయుగం, ద్వాపర, కవియుగాలు- ఇవన్నీ రాజుల ఆచరణ విశేషాలే; అందుకే రాజులనే యుగాలు అంటారు. ఉద్యమరహితుడైన రాజు కలియుగం అవుతాడు, మేలుకుని ఉండి కూడా పనులు చేయనివాడు ద్వాపరం, పనులు చేయటానికి ప్రయత్నించే రాజు త్రేతాయుగం, ఈ విధంగా చక్కని ఏర్పాట్లతో పనులు చేయటం వల్ల రాజు నిశ్చింతగా ఉంటే సత్యయుగం.

ఇలా ఎన్నో అంతర్ వ్యతిరేకాలు ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజువు చేస్తున్నాయి. ఇవి మూఢ విశ్వాసాలనూ, సంప్రదాయాలనూ ప్రచారం చేయాలనే దురుద్దేశంతో చొప్పించిన ప్రక్షిప్త శ్లోకాలు.

87 నుండి 91వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

నాలుగు వర్ణాల కర్మల నిర్ధారణ-

సర్వస్యాస్య తు సర్గస్య గుప్త్యర్థం స మహాద్యుతిః । మూలశ్లోక సం.**50**
ముఖబాహూరుపజ్జానాం పృథక్కర్మాణ్యకల్పయత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**87**

టీక:- **అస్య సర్వస్య సర్గస్య**= (5-80 వరకు) పర్యంతం వర్ణించిన ఈ సమస్త విశ్వం యొక్క, **గుప్త్యర్థం**= సురక్షణ సువ్యవస్థ, సమృద్ధి కోసం, **సః మహాద్యుతిః** = ఆ మహాతేజస్వి అయిన పరమాత్మ, **ముఖ-బాహూ-ఉరు పద్ + జానాం** = ముఖం, బాహువులు, ఊరువులు (తొడలు), పాదాలు వీటి సామ్యంతో నిర్మితులైన - అంటే, క్రమంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలకు, **పృథక్ కర్మాణి అకల్పయత్** = వేరువేరుగా కర్మలను వేదము దారా కల్పించాడు.

తాత్పర్యం:-సమస్తజన సంరక్షణార్థం తేజోరూపుడైన బ్రహ్మ, పరమేష్ఠియగు పరమాత్ముడు.'ఈ సమస్త జగత్తు యొక్క రక్షణార్థమై ముఖము, బాహువులు, ఊరువులు, పాదములు వలె మానవసమాజమును బ్రాహ్మణ క్షత్రియ, వైద్య, శూద్రులను అంగములు (విభాగములు)గా వేర్వేరు కర్మలను- ధర్మాలను ఏర్పరచాడు. ॥87॥

వివరణ:

కర్మద్వారానే వర్ణ వ్యవస్థ

క. కర్మద్వారానే వర్ణ వ్యవస్థ ఏర్పడింది. ఇందుకు వర్ణశబ్దోత్పత్తి నిరూపణమే సాక్ష్యం. వేదాన్ని ఆధారంగా చేసికొని మనుమహర్షి వర్ణవ్యవస్థను ఏర్పాటు చేశాడు.

ఋగ్...10.90.11-12 మరియు యజుర్వేదంలో 31.10,11 మంత్రాలలో ప్రదర్శితమైన వ్యవస్థనే మనువు యథాతథంగా చూపెట్టాడు. ఈ వ్యవస్థ జన్మను బట్టిగాక, గుణ కర్మలను బట్టి నిశ్చితమైంది. ఈ శ్లోకంలోనూ మరియు 1.31వ శ్లోకం లో కూడా, సమాజంలో చాతుర్వర్ణ నిర్మాణం ముఖ-బాహు-ఊరువు- పాదాల సామ్యాన్ననుసరించి కర్మలను నిర్ణయించారు. 1.88 నుండి 91 వరకు ఈ కర్మలను పాలించే వ్యక్తులు, ఆ యా వర్ణాలకు అధికారులవుతారు. విస్తృత విశ్లేషణ కోసం 1.31వ వివరణ సమీక్ష, 1.92-107, 2.11-13,10.65వ అంతర్వ్యతిరేక శీర్షిక చూడండి శ్లోకాల వివరణ చూడండి.

ఖ. ఈ వ్యవస్థ కర్మనిర్ధారితమనే విషయాన్ని స్వయంగా వర్ణశబ్దమే నిరూపిస్తుంది. నిరుక్తంలో వర్ణశబ్దోత్పత్తి-"వర్ణో వృణోతేరితి" నిరుక్త ప్రామాణ్యాత్ వరణీయా వరీతుమర్హాః గుణకర్మాణి చ దృష్ట్వా యథాయోగ్యం ప్రియన్తే యే తే వర్ణాః"

("ఋ.భా. భూ. వర్ణాశ్రమధర్మ విషయం") వర్ణనామముల వ్యుత్పత్తి ననుసరించి కూడా వర్ణాలయొక్క కర్మలు సూచించబడును.

గ. శబ్దం అర్థాన్ని సూచిస్తుంది. అదే వారి ముఖ్యకర్మ. ఆ కర్మలు తనవిగా చేసికొన్నప్పుడే ఆ వ్యక్తి ఆ వర్ణానికి అధికారి కాగలడు. విస్తృత విశ్లేషణ కోసం 1.88 నుంచి 91 వరకు గల శ్లోకాల వివరణ చూడగలరు.

వర్ణ ధర్మాలు

ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మణ వర్ణధర్మాలు-

మూలశ్లోక సం. **51**
ప్రక్షిప్త శ్లోక సం. **88**

అధ్యాపనమధ్యయనం యజనం యాజనం తథా ।
దానం ప్రతిగ్రహశ్చైవ బ్రాహ్మణానామకల్పయత్ ॥

టీక:- **బ్రాహ్మణానామ్** = బ్రాహ్మణులకు, **అధ్యయనం, అధ్యాపనం** = చవడం, చదివించడం, **తథా** = అలాగే, **యజనం యాజనం** = యజ్ఞాలు చేయడం, చేయించడం, **దానం ప్రతిగ్రహం చ+ఏవ** = దానమివ్వడం- [4.187-196, 227] దానం తీసికోవడం ఈ ఆరు కర్మలు, **అకల్పయత్** = కల్పించాడు.

తాత్పర్యం:-వేదాలను-శాస్త్రాలను చెప్పడం, శిష్యుల చేత అధ్యయనం చేయించడం, తాను వేద పఠనం చేయడం, యజ్ఞాలు చేయడం-చేయించడం, ఇతరులకు దానం ఇవ్వడం-తాను గ్రహించడం అనే (6) షట్కర్మలు బ్రాహ్మణులు ఆచరించదగినవి. ॥88॥

ఋషి దయానందభాష్యం: (1) నిష్కపటంతో, ప్రేమతో పురుషుడు పురుషుణ్ణి, స్త్రీ స్త్రీని చదివించాలి, (2) పూర్ణవిద్యను చదువాలి. (3) అగ్ని హోత్రం మొదలుకొని అశ్వమేధ పర్యంతం యజ్ఞాలు చేయాలి. (4) యజ్ఞాలు చేయించాలి. (5) విద్యను గానీ లేదా సువర్ణాదులను గానీ సుపాత్రులకు (యోగ్యుతో) దానమివ్వాలి. (6) న్యాయంగా ధనం సంపాదించే గృహస్థుల నుంచి దానం స్వీకరించాలి.

ఇందులో 3 కర్మలు-చవదవడం, యజ్ఞం చేయడం, దానమివ్వడం-ధర్మానికి, మిగిలిన 3 కర్మలు- చదువు చెప్పడం, యజ్ఞం చేయించడం, దానం తీసుకోవడం జీవిక కోసం (జీవనోపాధికి). కాని **"ప్రతి గ్రహః ప్రత్యవరః"** (మను. 1.104)

వివరణ:

బ్రాహ్మణనామం కూడా కర్మద్వారానే వర్ణ వ్యవస్థను సూచిస్తుంది. వ్యాకరణానుగుణంగా చూసినా, వ్యుత్పత్తినిబట్టి చూసినా మనువు కర్మానుగుణంగానే మనువు నామకరణం చేశాడని సిద్ధమవుతుంది. పేరుతో వర్ణం, కర్మ కూడ తెలిసిపోతుంది. బ్రహ్మన్ అనే ప్రాతిపదికకు **"తదధీతే తద్వేత"** (అష్టా. 4.2.59) అనే అర్థంలో **'అణ్'** ప్రత్యయం రాగా, **"బ్రాహ్మణ"** శబ్దం నిష్పన్నమవుతుంది. దీనికి వ్యుత్పత్తి **"బ్రహ్మణా వేదేన పరమేశ్వరస్య ఉపాసనేన చ సహ వర్తమానో విద్యాద్యుత్తమగుణయుక్తః పురుషః"** అంటే వేదాధ్యయనం, పరమాత్మోపాసనలో లీనమై ఉంటూ, విద్యాద్యుత్తమ గుణాలు కలిగి ఉన్న వ్యక్తే బ్రాహ్మణుడు అనబడును. ఈ కర్మలే బ్రాహ్మణుడి ముఖ్య కర్మలని మను అభిప్రాయం.

వర్ణాలకు సంబంధించిన కర్మల వర్ణన బ్రాహ్మణగ్రంథా (వేద వ్యాఖ్యాన గ్రంథములు) లలో చూడగలం.

ఇక్కడ బ్రాహ్మణ-కర్తవ్యములు చూడండి.

(అ) ఆగ్నేయో బ్రాహ్మణః ("తాం.బ్రా. 15.4.8), ఆగ్నేయో హి బ్రాహ్మణః (కాఠ. 29.10)

(ఆ) బ్రాహ్మణో వ్రతభృత్ (తై.సం. 1. 6. 7-2)
వ్రతస్య రూపం యత్ సత్యమ్ (శత. 12. 8. 2. 4)
శ్రేష్ఠ వ్రతములను (కర్మలను) చేసేవాడు. సత్యభాషణమే వ్రతస్వరూపం.

(ఇ) గాయత్రో వై బ్రాహ్మణః (ఐ. 1. 12)
గాయత్రీ యజ్ఞః (గో.పూ. 4. 24)
గాయత్రీ వై బృహస్పతిః (తాం. 5. 1. 15)

బ్రాహ్మణుడే గాయత్రం. వేదానికీ, యజ్ఞానికీ పరమేశ్వరుడికే గాయత్రమని పేరు.

క్షత్రియవర్ణ కర్మలు- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రజానాం రక్షణం దానమిజ్యాఽధ్యయన మేవ చ । మూలశ్లోక సం. **52**
విషయేష్వప్రసక్తిశ్చ క్షత్రియస్య సమాసతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **89**

టీక:- దీర్ఘ బ్రహ్మచర్యం ద్వారా- **అధ్యయనం** = సాఙ్గోపాంగ వేదాది శాస్త్రాలను చదవడం, **ఇజ్యా** = అగ్నిహోత్రాదియజ్ఞాలను చేయడం, **దానం** = సుపాత్రులకు విద్యా, సువర్ణాదులను, ప్రజలకు అభయం ప్రదానంచేయడం, **ప్రజానాం రక్షణం** = అన్నివిధాల, అన్నివేళలా ప్రజలను రక్షించడం. **విషయేషు-అప్రసక్తిః** = విషయములందు అనాసక్తుడై సదా జితేంద్రియుడుగా ఉండటం, లోభం, వ్యభిచారం, మద్యపానాది దుర్వ్యసనాలకు దూరంగా ఉంటూ, వినయ, సుశీలాది శుభకర్మలందు సదాప్రవృత్తుడై ఉండటం, **క్షత్రియస్య సమాసతః** = ఇవే సంక్షేపంగా క్షత్రియుడి కర్మలు (కర్తవ్యాలు లేదా ధర్మాలు).

తాత్పర్యం:-ప్రజలను రక్షించడం, దానాలు-యజ్ఞాలు నిర్వర్తించడం. వేదాధ్యయనం, ముఖ్యంగా ముఖ్యంగా (ధన-స్త్రీ సంబంధమైన కోరికలను అణచుకొని క్షత్రియులు ముఖ్యంగా ఆచరించవలసి వున్నది.

ఋషి దయానందుభాష్యం:- "న్యాయంగా ప్రజలను రక్షించడం అంటే పక్షపాతం లేకుండా శ్రేష్ఠులను సత్కరించడం, దుష్టులను నియంత్రించడం, అన్ని విధాలా అందరినీ పాలించడం, దానం చేయడం, ధర్మానుసారంగా, విద్యాదులకు తగిన ఏర్పాటు చేయడం, యోగ్యులైనవారికి సహాయ-సహకారాలందించడం అగ్ని హోత్రాది యజ్ఞాలను నిర్వహించడం, చేయించడం, వేదాదిశాస్త్రాలను చదవడం, చదివించడం, విషయాలలో, (భోగాలలో) చిక్కుకోకుండా ఉండటం. జితేంద్రియుడుగా, సదా శారీరకంగా, ఆధ్యాత్మికంగా బలవంతుడుగా ఉండటం- (స.ప్ర. 4 సముల్లాసం). ॥89॥

వివరణ:

క్షత్రియ శబ్దార్థం:- వర్ణవ్యవస్థకు కర్మే మూలమని క్షత్రియశబ్దం సూచిస్తుంది. -(క) **'క్షణు-హింసాయాం'** హింస అనే అర్థం గల తనాది ధాతువుకు, **"క్తః"** ప్రత్యయం చేర్చగా, **"క్షతః"** శబ్దం తయారువుతుంది. **'క్షతః'** అనే పదానికి, **'త్రైఙ్'**= పాలించడం అనే అర్థంలో **'భ్వాది'** ధాతువుకు, **"అన్యేష్వపి దృశ్యతే** (అష్టా 3-2-101) సూత్రం ద్వారా **"డః"** ప్రత్యయం రాగా, **'పూర్వపదాన్త్యాకారలోపః'** వల్ల అకారలోపం కాగా **"క్షత్ర"**శబ్దం ఉత్పన్నమవుతుంది.

"క్షత్ర ఏవ క్షత్రియః"; స్వార్థంలో **"ఇయః"** ప్రత్యయం రాగా, **'క్షత్రియ'** శబ్దం ఏర్పడుతుంది, లేదా **'క్షత్రస్య అపత్యం వా, క్షత్రాత్ ఘః** (అష్టా 4.1,138) సూత్రం ద్వారా జన్మించడం అనే అర్థంలో **'ఘ'**ః ప్రత్యయం రాగా, **"క్షత్రియ"** శబ్దం నిష్పన్నమవుతుంది. **"క్షదతి రక్షతి జనాన్-క్షత్రః"** ప్రజలను రక్షించే వాడు క్షత్రియుడు లేదా **క్షణ్యతే హింస్యతే నశ్యతే పదార్థో యేన సః "క్షతః" 'ఘాతాదిః తతస్త్రాయతే రక్షతీతి క్షత్రః'**, ఆక్రమణ, దెబ్బ, హాని మొ॥ వాటి

నుండి ప్రజలను రక్షించేవాడు కాబట్టి క్షత్రియుడని పిలుస్తారు. బ్రాహ్మణ గ్రంథాలలో **"క్షత్రం రాజన్యః"** (ఐ. 8. 2. 3. 4) **'క్షత్రస్య వా ఏతద్రూపం యద్ రాజన్యః'** (శ. 13. 1. 5. 3) క్షత్రమునకు రూపాంతరమే క్షత్రియ శబ్దం. ప్రజలను రక్షించువాడని అర్థం.

(ఖ) ఇక్కడ **అపత్యార్థే 'ఇయ్'** ఆదేశం వల్ల **'క్షత్రియ'** శబ్దం సిద్ధమవుతుంది. జన్మను ఆధారంగా చేసికొని మనువు వర్ణవ్యవస్థ చేశాడనే సందేహం రావచ్చు. కానీ దీనికి సమాధానమిది- 'వంశం కేవలం జన్మను అనుసరించే గాక, విద్యాజన్మవల్ల కూడా ఏర్పడుతుంది'. **"సంఖ్యావంశ్యేన"** (అష్టా) 2. 1. 19 సూత్రం ద్వారా, విద్య వల్ల జన్మ కలుగుతుందని చెప్పడం జరిగింది. మనుస్మృతి 2. 119-123 శ్లోకాలలో విద్య ఆధారంగానే జన్మ వస్తుందని స్పష్టంచేశారు. ఈ విధంగా, గుణగ్రాహిత్వం, కార్యకారణభావం, విద్యల ఆధారంగానే పుత్రాది మొ॥ సంబంధాలు ఏర్పడతాయి. ఉదాహరణకు - సూర్యుడు, వరుణుడు మొ॥ వారికి పత్ని గాని, అపత్యాదులు, పుత్రులు గాని లేవు. అయినా, కార్యకారణం, గుణగ్రాహిత్వాదులను ఆధారంగా చేసికొని' **అదితి పుత్రుడు** = ఆదిత్యుడు, సూర్యుడి పత్ని సూర్యా అని, అలాగే **'వరుణానీ, మైత్రావరణః'** మొదలగు ప్రయోగాలున్నాయి. వివరణ కోసం మనుస్మృతి సమీక్షను చూడండి.

(గ) క్షత్రియుడి విస్తృత కర్తవ్యాల వర్ణన 7. 1 నుండి 9. 225 వరకున్న శ్లోకాలలో చూడగలరు.

వైశ్యవర్ణ ధర్మాలు-కర్తవ్యాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

పశూనాం రక్షణం దానమిజ్యాఽధ్యయన మేవ చ । మూలశ్లోక సం. **53**
వణిక్పథం కుసీదం చ వైశ్యస్య కృషి మేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **90**

టీక:- పశూనాం రక్షణం = గోవు మొ॥ పశువుల పాలన, రక్షణ, **దానమ్** = విద్యా-ధర్మాభివృద్ధి కోసం ధనాదులను దానం చేయడం. [4. 187-196,227] ఇజ్యా = అగ్నిహోత్రాది యజ్ఞాలను చేయడం, **అధ్యయనమ్** = [8. 140] వేదాది శాస్త్రాలను చదవడం; **వణిక్పథం** = సర్వవిధాల, అన్ని రకాల వ్యాపారం చేయడం [9. 326-333], **కుసీదం** = వడ్డీ వ్యాపారం-వందకు, [8. 140] 4,6,8,12,16, లేదా 20 అణాలకంటే అధికంగా వడ్డీ తీసికోకుండా ఉండటం, ఇచ్చిన మొత్తానికంటే, రెండురెట్లు వడ్డీరూపంలో తీసికోకుండా ఉండటం, (అంటే ఒక్కరూపాయి అప్పుగా ఇచ్చినట్లయితే, 1000 సంవత్సరాలయినా సరే రెండు రూపాయల కంటే అధికం తీసుకోరాదు) ఎక్కువగా ఇవ్వకుండా ఉండటం, కృషి, వ్యవసాయం చేయడం వైశ్యుడి కర్తవ్యాలు (ధర్మాలు).

ఋషిదయానంద భాష్యం:- 'గో సంరక్షణం, యాగాలు చేయడం, వేదాధ్యయనం, నీటి మార్గముననూ భూమి మార్గంలోనూ, వ్యాపారం చేయడం, వడ్డీ జీవనమూ, వ్యవసాయం చేయడం ఇవి వైశ్యులకు ధర్మములుగా నియమింపబడినవి.॥90॥

లక్షణాలు

(1) (పశూనాం రక్షణం) = గోవు మొ॥ పశువులను పాలించడం, వాటి పాలు మొ॥ వాటిని అమ్మడం; **(2) వణిక్పథం** = నానాదేశాల భాషలను, లెక్కా పద్ధతులను, భూగర్భవిద్య, భూమి-బీజములు మొ॥ వాటి గుణాలను తెలిసికోవడం, సమస్త పదార్థాల ధరలు తెలిసికోవడం; **(3) కుసీదం** = వడ్డీ తీసుకోవడం, **(4) కృషిమేచ** = వ్యవసాయ విద్యను నేర్చుకోవడం, ధాన్యరక్షణం, ఎరువుల భూముల పరీక్షణం ధాన్యం విత్తడం, మొ॥ వ్యవహారాలు తెలిసికోవడం. ఈ నాలుగు కర్మలు వైశ్యుడి జీవికకోసం (స. ప్ర. 4).

తాత్పర్యం:- గోవు మొదలైన పశువులను, యాగాలను రక్షించడం/ చేయడం, దానం, వేదాధ్యయనం చేయడం, భూమి/జల మార్గాన వ్యాపారాలు, వడ్డీలకు ధనమిచ్చి వ్యాపారం చేయడం, వ్యవసాయం చేయడం వైశ్యులు చేయదగినవి.

నూటికి రూపాయపావలా కంటే అధికం గాను, నాలుగు అణాలకంటే తక్కువ గాను వడ్డీ తీసుకోరాదు. ఇచ్చిన దాని కంటె రెట్టింపు వచ్చినట్లయితే అంతకుమించి ఒక్క పైసాకూడా అధికంగా తీసుకోరాదు. ఎంత తక్కువ వడ్డీ తీసుకొంటే అతని ధనం అంత ఎక్కువగా పెరుగుతుంది. అతడి గృహంలో ఎప్పుడూ ధననష్టమవడం గాని, కుసంతతి కలగడం గాని జరగదు. (సంస్కారవిధి గృ.ధ.)

వివరణ:

క. 'వైశ్య' అనే నామం కూడా కర్మలవల్లనే వర్ణమేర్పడటాన్ని సూచిస్తుంది. (క) **"విశః"** మనుష్యనామసు పఠితమ్ (నిరుక్తం-2-3) దానికి భావార్థంలో **'యత్'** ప్రత్యయం చేర్చగా **విశ్+యత్** = స్వార్థమున **'అణ్'** లేదా **'విశ+యణ్'**, ఛాందసప్రత్యయం (అపత్యార్థమున) చేర్చినట్లయితే **'వైశ్య'** శబ్దమేర్పడుతుంది.

"యో యత్ర తత్ర వ్యవహారవిద్యాసు ప్రవిశతి సః 'వైశ్యః', వ్యవహారవిద్యాకుశలః జనోవా", వివిధ వ్యావహారిక వ్యాపారాలలో ప్రవేశించేవాడు, లేదా వివిధ వ్యావహారిక విద్యలలో కుశలుడైనవాడు వైశ్యుడు.

ఖ. "బ్రాహ్మణ గ్రంథాలలో-

"ఏతత్ వై వైశ్యస్య సమృద్ధం యత్ పశవః"(తాం. 18. 4. 6)

"తస్మాదు బహుపశుర్వైశ్వదేవో హి జాగతో (వైశ్యః)". (తాం. 6. 1. 10)

పశుపాలనం వల్ల వైశ్యుడు సమృద్ధవంతుడవుతాడు. ఇది వైశ్యకర్తవ్యం.

(గ) వైశ్యుడి కర్తవ్యాలను విస్తారంగా తెలిసికోవడానికి, 9.225-333లో వరకు చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

శూద్రవర్ణ కర్తవ్యాలు-ధర్మాలు-

ఏక మేవ హి శూద్రస్య ప్రభుః కర్మ సమాదిశత్ । మూలశ్లోక సం. **54**
ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషామనసూయయా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **91**

టీక:- ప్రభుః = పరమేశ్వరుడు, **శూద్రస్య** = విద్యావిహీనుడు, చదివించినప్పటికీ చదువురానివాడు, శరీరబలసంపన్నుడు సేవాకార్యాలలో నిపుణుడు అయినవాడు శూద్రుడు. అలాంటి వాడికి, **ఏతేషామేవ వర్ణానాం** = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు అనే మూడు వర్ణాలవారికి, **అనసూయయా** = నిందారహిత ప్రేమతో, **శుశ్రూషాం** = సేవలు చేయడం, ఏకమేవ కర్మ = ఈ ఒక్క కర్మనే, **సమాదిశత్** = చేయుమని ఆజ్ఞాపించాడు (స.ప్ర-177).

ఋషిదయానంద భాష్యం:-శూద్రులకు విధించిన ధర్మం ఒకే ఒక్కటి. అది-బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు అనే మూడు వర్ణాల వారికి ఆ యా విధి విహిత కర్మలలో గుణదోషాలెంచక శుశ్రూష చేయడమే.॥91॥

వివరణ:

శూద్రశబ్దం కూడా కర్మ వర్ణవ్యవస్థనే సూచిస్తుంది.

క. శుచ్-శోకార్థక 'భ్వాది' ధాతువుకు **"శుచేర్దశ్చ"** (ఉణా. 2. 19) సూత్రం ద్వారా 'రక్' ప్రత్యయం, ఉకారానికి దీర్ఘం, 'చ'కు 'ద' కారం రాగా. "శూద్ర" శబ్దం నిష్పన్నమవుతుంది. ఏ వర్ణంలో పుట్టినా అశిక్షితుడైన వక్తి శూద్రుడే అనబడుతాడు. **"శూద్రః ధుద్రవతి, ఆయుద్రవతి"** అనగా అశిక్షితుడైనందువల్ల ఆ వ్యక్తి యజమాని ఆదేశానుసారం ఇటుఅటు తిరుగుతూ సేవలేదా పని చేస్తాడు కావున అతడు ఆయా వర్ణాల కర్తవ్యకార్యాలలో అసమర్థుడవడం వల్ల శూద్రుడనబడుతాడు. **"శూద్రః = శోచనీయః, "శోచ్యాం స్థితిమాపన్నోవా, సేవాయాం సాధుః, అవిద్యాది గుణసహితో మనుష్యో వా** = శూద్రుడెవడు?" తన అజ్ఞాన కారణంగా ఏ విధంగానూ ఉన్నతస్థితిని పొందలేనట్టి వాడు, 'నేను

నిమ్నస్థితిలో ఉన్నాను' అను చింతే లేనివాడు. ఉన్నతస్థితిని పొందాలనే అభిలాష లేనివాడు లేదా యజమానిద్వారా భరణపోషణ జరుగుతుందనే ఆలోచన కలవాడు. ఇలాంటి సేవకుడు శూద్రుడు. **"అసతో వా ఏష సమ్భూతో యత్ శూద్రః"** (తై. 3. 2. 3. 9) **అసతః** = అవిద్యాతః = అజ్ఞానం లేదా అవిద్యవల్ల ఎవరి జీవన స్థితి నిమ్నంగా ఉంటుందో, కేవలం సేవ (service) మాత్రమే చేయగలడో-అలాంటి మానవుడు శూద్రుడు. అలాంటి శూద్రుడు జీవితంలో విద్యను పొంది ఉన్నత వర్ణం పొందవచ్చు [10. 65]

ఖ. శూద్రుడి కర్తవ్యాల ప్రసంగం విషయంలో-మను అభిప్రాయాలను ఈ విధంగా చూడాలి. **"శూద్రుడి'** కోసం **'శుచి'** శబ్దాలన్నీ ప్రయోగించాడు. శారీరకంగాను, మానసికంగాను పరి విత్రుడు. **"ఉత్కృష్టశుశ్రూషః"** ఉత్తమోత్తమ సేవ చేసేవాడు [9. 335]. దీన్ని బట్టి శూద్రుడి గురించి మనువుకు ఎలాంటి నీచభావన లేదు. అందరికీ సేవచేసేవాడు అపవిత్రుడు ఎలా కాగలడు? మనువు అభిప్రాయం శూద్రుడు నాలుగు వర్ణాలలోని వాడు కావడం వల్లన వర్ణుడు, ఆర్యుడు [10. 4,45,57].

గ. జన్మతో (పుట్టుకతో) అందరూ శూద్రులే. శూద్ర వర్ణంలో పుట్టినంత మాత్రాన ఎవడూ శూద్రుడుకాడు. ఉపనయనాదులలో శిక్షితుడు కాకుండా బ్రహ్మజన్మ రాదు. అంటే వేదాధ్యయనరూపమైన ద్వితీయజన్మను పొందలేకపోతాడు. ఈ ద్వితీయజన్మే 'బ్రహ్మజన్మ' అది ఉపనయన సంస్కారం ద్వారా లభిస్తుంది. **"ద్విర్జాయతే ఇతి ద్విజః"** శూద్రుడికి ఈ ద్వితీయ జన్మ లేకపోయినందు వల్ల 'ఏకజన్మః' 'ఒకే జన్మ' కలవాడయ్యాడు. దీన్ని బట్టి మనకు తెలిసిందేమంటే, మనువు జన్మను బట్టి వర్ణాన్ని అంగీకరించకుండా కర్మను బట్టి మాత్రమే వర్ణ వ్యవస్థను ఏర్పాటు చేశాడని నిర్ధారణ అవుతున్నది. మనువు ఆలోచనను (10. 4 శ్లోక వివరణ చూడగలరు).

చతుర్థః ఏక జాతిస్తు శూద్రః.

విద్యాధ్యయనరూపమైన ద్వితీయ జన్మలేనందు వల్ల శూద్రుడు ఏక జాతి వాడైనాడు. ద్విజుడు కాలేదు.

92 నుండి 107వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* బ్రాహ్మణుల శ్రేష్ఠత-మహత్వ వర్ణన-

* **ఊర్ధ్వ నాభేర్మేధ్యతరః పురుషః పరికీర్తితః ।**
తస్మాన్మేధ్యసమం త్వస్య ముఖముక్తం స్వయంభువా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***92***

తాత్పర్యం:- నాభి (బొడ్డు)కి కింద భాగం కంటే పై భాగం ఎంతో ఉత్తమం, పరిశుద్ధం కాబట్టి, అందులోనూ ముఖం మరీ ఉత్తమమని బ్రహ్మచేత చెప్పబడింది. ॥92॥

* **ఉత్తమాంగోద్భవాజ్జ్యైష్ఠ్యాద్బ్రహ్మణశ్చైవ ధారణాత్ ।**
సర్వస్యైవాస్య సర్గస్య ధర్మతో బ్రాహ్మణః ప్రభుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***93***

తాత్పర్యం:- శిరస్సును 'ఉత్తమాంగము' అన్నారు. అటువంటి శిరస్సునుంచి ఉద్భవించడం వల్ల-వేదాలను ధారణ చేయడం వల్ల క్షత్రియాది వర్ణాలకే ధర్మోపదేశాలు చేయగల అర్హత ఉన్న బ్రాహ్మణులే ధర్మానికి ప్రతినిధులు.

* **తం హి స్వయంభూః స్వాదాస్యాత్తపస్తప్త్వాదితోఽసృజత్ ।**
హవ్యకవ్యాభివాహ్యాయ సర్వస్యాస్య చ గుప్తయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***94***

తాత్పర్యం:- కనుకనే-బ్రహ్మదేవుడు హవ్య కవ్యాలు (దేవపితృకర్మ) చేసే నిమిత్తం తన ముఖం ద్వారా బ్రాహ్మణుల్ని సర్వజగద్రక్షణ కోసం తపస్సు చేసి తనకు మారుగా వారిని ఇక్కడ (భూమ్మీద) ఉంచాడు. ॥94॥

* *యస్యాస్యేన సదాశ్నంతి హవ్యాని త్రిదివౌకసః ।*
కవ్యాని చైవ పితరః కిం భూతమధికం తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **95**

తాత్పర్యం:- ఈ బ్రాహ్మణుల వల్లనే వేల్పులకు హవ్యముల ద్వారా భోజనం, పితృదేవతలకు కవ్యముల ద్వారా పిండశ్రాద్ధ భోజనాదులు అందుతున్నాయి. ఇంతటి ఉత్తమ విధిని ఇంకెవరు నిర్వర్తించగలరు?॥95॥

* *భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః ।*
బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠాః నరేషు బ్రాహ్మణాః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **96**

తాత్పర్యం:- పాంచభౌతికంగా రూపొందిన స్థావర జంగమ రాశులలో ప్రాణులు శ్రేష్ఠమైనవి. ఈ ప్రాణులలో బుద్ధిజీవనం గలవి ఉత్తమోత్తమములు. బుద్ధిజీవనులలో మానవులు శ్రేష్ఠులు. ఈ మానవులలో బ్రాహ్మణులు అత్యంత ఉత్తములు, (ఇంకా సూక్ష్మంగా చెబుతున్నాడు-తదుపరి శ్లోకంతో అన్వయం...).॥96॥

* *బ్రాహ్మణేషు చ విద్వాంసో విద్వత్సు కృతబుద్ధయః ।*
కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవేదినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **97**

తాత్పర్యం:- ఇట్టి బ్రాహ్మణులలో జ్యోతిష్టోమాది యజ్ఞాలు చేయడానికి సాధికారత ఉన్నట్టి జ్ఞానులు ఉత్తమోత్తములు. ఈ జ్ఞానాన్ని అనుష్ఠానంలో/ఆచరణలో పెట్టగల బ్రాహ్మణులింకా శ్రేష్ఠులు. వీరికంటే బ్రహ్మవేత్తలు సర్వాధికులు.॥97॥

* *ఉత్పత్తిరేవ విప్రస్య మూర్తిర్ధర్మస్య శాశ్వతీ ।*
స హి ధర్మార్థముత్పన్నో బ్రహ్మభూయాయ కల్పతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **98**

తాత్పర్యం:- బ్రాహ్మణుడి జన్మమే ధర్మానికి శాశ్వతమైన/ నిత్యమైన శరీరం. అంటే విప్రుడు ధర్మాచరణ నిమిత్తమే జన్మించినాడు. ఇలాంటి ధర్మాచరణ చేతనే ఇతడు బ్రహ్మత్వం పొందగలడు (ఈ ధర్మ మూర్తిని బ్రతికించే బాధ్యత ఇతర వర్ణాలది.).॥98॥

* *బ్రాహ్మణో జాయమానో హి పృథివ్యామధిజాయతే ।*
ఈశ్వరస్సర్వభూతానాం ధర్మకోశస్య గుప్తయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **99**

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి ఇంత ఆధిక్యం ఇవ్వడానికి కారణం-జన్మిస్తూనే బ్రాహ్మణుడు (పూర్వజన్మ సంస్కారంచేత) పుణ్యవశాన మేటిగా జన్మిస్తున్నాడు. ధర్మసమూహాన్ని సంరక్షించడానికి, బ్రహ్మతరపున ప్రతినిధి అతడు.

* *సర్వం స్వం బ్రాహ్మణస్యేదం యత్కించిజ్జగతీగతమ్ ।*
శ్రైష్ఠ్యేనాభిజనేనేదం సర్వం వై బ్రాహ్మణోఽర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **100**

తాత్పర్యం:- భూమిపైన గల సమస్తం బ్రాహ్మణుడిదే.! అందరి హితాన్ని (మేలును) కోరి ధర్మాధర్మాలు తెలియజెప్పి సృష్టిలోని స్థితిని సరిగ్గా ఉంచడం వల్ల సకల ధనాలు బ్రాహ్మణుడికి ఇవ్వదగినవి.

* *స్వమేవ బ్రాహ్మణో భుఙ్క్తే స్వం వస్తే స్వం దదాతి చ ।*
ఆనృశంస్యాద్బ్రాహ్మణస్య భుంజతే హీతరే జనాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **101**

తాత్పర్యం:- బ్రహ్మచేత దత్తం చేయబడిన తన ధనాన్నే తాను భుజించడం/అనుభవించడం బ్రాహ్మణుడికి గల అనుభవాత్మక అర్హత చాటి చెబుతుంది. బ్రాహ్మణుడి వల్లనే ఇతర వర్ణాలు సర్వస్వం అనుభవించగల్గుతున్నారు.

*** ఈ శాస్త్రరచనకు ప్రయోజనం-**

* *తస్య కర్మవివేకార్థం శేషాణామనుపూర్వశః ।*
స్వాయంభువో మనుర్ధీమానిదం శాస్త్రమకల్పయత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102**

తాత్పర్యం:- ఇంతటి పవిత్రమూర్తి అయిన బ్రాహ్మణుడి గురించి ఇతర వర్ణాలవారి ధర్మాలను తెలియచెప్పు నిమిత్తమే జ్ఞానీ-స్వయంభువు అయిన మనువు ఈ ధర్మశాస్త్రాన్ని రచించాడు.

శాస్త్ర ప్రశంస

*** బ్రాహ్మణుడు తప్పక దీన్ని చదవాలి-**

* *విదుషా బ్రాహ్మణేనేదమధ్యేతవ్యం ప్రయత్నతః ।*
శిష్యేభ్యశ్చ ప్రవక్తవ్యం సమ్యఙ్నాన్యేన కేనచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **103**

తాత్పర్యం:- ఈ శాస్త్రాన్ని ఏ బ్రాహ్మణుడు అధ్యయనం చేసి, దీని ఫలితాన్ని గ్రహించాలనుకుంటాడో అతడే ధర్మశాస్త్రాన్ని ప్రయత్న పూర్వకంగా చదవాలి. తన శిష్యులకు చెప్పాలి. ఇది కేవలం జిజ్ఞాసాపరులకు మాత్రమే ఉద్దేశించినది. అందరికీ చెప్పరాదు.

*** ఈ శాస్త్రాధ్యయన ఫలం-**

* *ఇదం శాస్త్రమధీయానో బ్రాహ్మణశ్శంసితవ్రతః ।*
మనోవాగ్దేహజైర్నిత్యం కర్మదోషైర్న లిప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104**

తాత్పర్యం:- ఈ ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేయడానికైనా కఠిన నియమాలను ఆచరించాలి. ఆ ప్రకారం అధ్యయనం చేసే విప్రులకు మనస్సువల్ల, వాక్కువల్ల, దేహంవల్ల ఎలాంటి పొరపాట్లు జరిగినా వారికి ఆ పాపాలు అంటవు.

* *పునాతి పఙ్క్తిం వంశ్యాంశ్చ సప్త సప్త పరావరాన్ ।*
పృథివీమపి చైవేమాం కృత్స్నామేకోఽపి సోఽర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **105**

తాత్పర్యం:- ఈ ధర్మ శాస్త్రాన్ని ఎవరైతే అధ్యయనం చేస్తారో వారు గొప్ప పుణ్యపురుషులై ఉండటమేగాక, తమ పంక్తిన కూర్చొన్నవారిని కూడా పుణ్యవంతులుగా చేయగలరు. ఇటు ఏడు తరాలు-అటు ఏడు తరాల వారిని కూడా పునీతులను చేయగలరు. ఇలాంటి ధర్మమతి సమస్తభూమండలాన్నీ దానంగా స్వీకరించడానికి అర్హత ఉన్నవాడు.

* *ఇదం స్వస్త్యయనం శ్రేష్ఠమిదం బుద్ధివివర్ధనమ్ ।*
ఇదం యశస్యమాయుష్యమిదం నిశ్శ్రేయసం పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **106**

తాత్పర్యం:- ఈ ధర్మ శాస్త్రాధ్యయనం కోరిన కోరికలను తీరుస్తుంది. జపం-హోమం మొ॥ దివ్య విషయాల్ని బోధించడం చేత పవిత్రమైనది కూడ. విధి, నిషేధాల్ని చెప్పడం చేత ఇది జ్ఞాన దాయకం. కీర్తి, ఆయువు, మోక్షాలను కూడా ప్రసాదిస్తుంది.

* ఈ శాస్త్ర ప్రతిపాద్య విషయం-

* అస్మిన్ ధర్మోఽఖిలేనోక్తో గుణదోషౌ చ కర్మణామ్ ।
చతుర్ణామపి వర్ణానామాచారశ్చైవ శాశ్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **107**

తాత్పర్యం:-ఈ ధర్మశాస్త్రంలో పరిపూర్ణంగా అన్ని ధర్మాలు వివరించబడ్డాయి. ఏది చేయాలో, ఏది చేయరాదో చెప్తూ ఆ యా విధి నిషేధాలకు ఫలితాలు కూడా చెప్పబడ్డాయి. చాతుర్వర్ణాలవారు ఆచరించదగిన ఆచారాలు స్పష్టంగానే పేర్కొనబడ్డాయి.॥107॥.

ప్రక్షిప్తాల పరిశీలన

ఈ శ్లోకాలలో మనువు చెప్పిన వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పక్షపాతపూర్వకమైన పద్ధతిలో, జన్మను ఆధారం చేసుకుని బ్రాహ్మణుల సహేతుకం కాని, నిరాధార ప్రశంస లక్ష్యంగా కనబడుతూంది. ఈ 92 నుంచి 101087 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలుగా రుజువవుతున్నాయి-

1. ప్రసంగవ్యతిరేకం

క. 1.42వ శ్లోకం విషయ సంకేతాన్నిచ్చే శ్లోకం. 1.144వ శ్లోకం ఈ అధ్యాయంలోని విషయాలను తెలుపుతుంది. ఈ రెండు శ్లోకాలూ, ఈ అధ్యాయంలోని విషయాలనూ, వాటి క్రమాన్నీ నిర్దేశించాయి. 42శ్లోకంలో చెప్పిన కర్మచర్చ విషయాలన్ని మధ్యలోనే వదిలిపెట్టి, మునుపటి దానిలో మిగిలిన సృష్టి ఉత్తత్తికి సంబంధించిన విషయాలూ, తర్వాత, కర్మ చర్చ పూర్తయిన సంకేతమూ ఉన్నాయి. దాని ప్రకారం 80వ శ్లోకం వరకు సృష్టి సంబంధిత విషయాలు చెప్పి, 87 నుంచి 91 వరకు కర్మల విధాన వర్ణన ఉంది. అటుపైన కర్తవ్యాలు, ధర్మాలకు సంబంధించిన వర్ణనే ఉండాలి. ఎందుకంటే 144వ శ్లోకంలో ఈ అధ్యాయంలోని రెండే విషయాలు చెప్పబడ్డాయి- సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి. దాన్ని అనుసరించి 91వ శ్లోకంలో కర్మోత్పత్తితో పాటు సృష్టి ఉత్పత్తి విషయం కూడా ముగిసిపోయిన తర్వాత, ధర్మ సంబంధ విషయాలు ప్రారంభం కావాలి. అవి 108 నుంచి మొదలయ్యాయి, 1.120లో ఈ విషయం సంకేతపూర్వకంగా మొదలైంది. ఈ రెండూ పరస్పరం సంబంధం గలవి. అందుచేత ఆ సంబంధ క్రమంలోనే వీటిని ఉంచారు. 92-107 శ్లోకాలలో చెప్పిన బ్రాహ్మణుల మహిమ (92-105), శాస్త్రపు మహిమ (106-107)ల చర్చలు పై శ్లోకాలలోని వీటి సంకేతక క్రమాన్ని భంగం చేస్తున్నాయి. పై చెప్పిన సంకేతక శ్లోకాలలో వీటిని గురించి చెప్పలేదు. అందుచేత ముందు వెనుకల గల కర్మధర్మల విషయాలతో కలవక పోవడం చేత ఈ శ్లోకాలు అసందర్భాలూ, ప్రక్షిప్తాలూ.

ఖ. ప్రసంగపు పూర్వాపర క్రమబద్ధతకూడా చూడాలి. 87-91 శ్లోకాలలో వర్ణాల కర్మల ఉల్లేఖన ఉంది. 108-110 శ్లోకాలలో చెప్పిన ఆచరణనే పరమధర్మంగా చెప్పాడు. ఈ విధంగా పూర్వాపరశ్లోకాల విషయం, వర్ణన శైలి- వీటికి కూడా ఒక క్రమబద్ధత ఉంది. ఈ [92-107] శ్లోకాలు ఈ క్రమబద్ధతను చెడగొట్టాయి. బ్రాహ్మణులు, శాస్త్ర మహిమల అసందర్భమైన, పూర్వాపర ప్రసంగాల దృష్ట్యా అనవసర విషయాల వర్ణన జరిగింది. అందుచేత పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకం కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు.

గ. 102 నుంచి 107 వరకు గల శ్లోకాలలో- ఈ శాస్త్రం చదివే అర్హత గలవారు, శాస్త్ర మహిమ, ఇందులో ఏముంది, మొదలైన విషయాలు ఉన్నాయి. వర్ణన దృష్టితోనైతే ఇవి గ్రంథం ప్రారంభంలో కానీ, చివర కానీ, ఉంటాయే తప్ప, ఏదైనా ప్రసంగం మధ్యలో చొచ్చుకుని రావడం ఉండదు. మనుస్మృతి ప్రారంభం, అంతంలోని శైలి ఎలా ఉంటుందంటే, అక్కడ ఇటువంటి చర్చలకు అవకాశమే ఉండదు, అలా చెప్పటం రచయిత ఇష్టమూ కాదు. అక్కడ వీరి

ప్రక్షిప్తాలకు అవకాశం లేదు కనుక, ప్రక్షిప్తకారులు ఇక్కడి ప్రసంగాన్ని మధ్యలో ఛేదించి పైన చెప్పుకున్న చర్చలన్నిటినీ చేశారు. ఈ విధంగా వాటి స్థానభ్రష్ట వర్ణనే వాటిని అసందర్భాలని నిరూపిస్తున్నాయి. ఈ ప్రసంగ వ్యతిరేకాలు ఆధారంగా 92-107 శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. విషయ వ్యతిరేకం

1.1-4 శ్లోకాలతో ప్రారంభమైన విషయాన్ని పూర్తి చేస్తూ మనువు, 1.144లో 'ఈ ధర్మపు ఉత్పత్తి, సంపూర్ణ జగత్తు ఉత్పత్తి వీటిని చెప్పాను' అన్నాడు. మనువు తాను చెప్పదలచినదానికి హద్దు నిర్ణయించుకుంటే, దాని సంకేతాన్ని కూడా చేస్తాడు అనేది స్పష్టంగా తెలుస్తూంది. కాని ఈ వ్యతిరేక శ్లోకాలలో పైన చెప్పుకున్న రెండు విషయాలకూ సంబంధించిన వర్ణనే ఉండాలి; అలా ఉంటేనే విషయంతో కలుస్తాయి. ఈ శ్లోకాలలోని విషయాలు ఆ రెండు విషయాలకూ సంబంధించినవి కావు కనుక, విషయ వ్యతిరేకాలూ, ప్రక్షిప్తాలూ.

3. శైలీగత ఆధారం

క. 102 నుంచి 107 వరకు గల శ్లోకాలలో ఒక పూర్వ నిబద్ధశాస్త్రరూపమని మనుస్మృతి ప్రశంస ఉంది. మౌలికంగా దాన్ని **'శాస్త్రం'** అనే పేరుతో వ్యవహరించారు. కానీ మనుస్మృతి శైలివల్ల అది పూర్వ నిబద్ధమైన శాస్త్రమూ కాదు. మనవు దాన్ని **'శాస్త్రం'** అని చెప్పనూ లేదు అని తెలుస్తూంది. (దీని కొరకు 1.58-63 శ్లోకాలకిచ్చిన 'అంతర్ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి). మనుస్మృతి మౌలికంగా ఒక ప్రవచనం. అందుచేత అది శాస్త్రమూ కాదు, ఈ ప్రవచనాన్ని శాస్త్రమని ఎవరూ చెప్పలేదు. మౌలికంగా దీన్ని ఎవరూ శాస్త్రమనే పనీలేదు, ప్రశంసించే పనీ లేదు. ప్రవచనాలను సంకలించిన పిదప, శాస్త్రరూపంలోకి మారిన తర్వాతే మనుస్మృతికి సంబంధించిన ఇటువంటి శ్లోకాలు కలిపారు. వాటిలోనే ఇది శాస్త్రమనే ప్రశంస ఉంది, లేదా **'శాస్త్రమనే పేరు'** ఉందని వ్యవహారంలోకి వచ్చింది. ఈ విధంగా **'శాస్త్రం'** అని చెప్పే శ్లోకాలు తరువాత కలపబడ్డాయి. మిగిలిన 92-101 శ్లోకాలు కూడా వీటికి సంబంధించినవే కాకుండా వీటికి పీఠికగా నిలిచాయి. (102 నుంచి) అందుచేత ప్రక్షిప్తాలుగా రుజువయ్యాయి కనుక, స్వతః ప్రక్షిప్తాలే!

ఖ. ఏ విషయాన్నైనా ప్రారంభించినా, ముగించినా, ఆచోట్ల లేదా రెండు చోట్లా సంకేతించడం మనువు శైలిలోని ప్రత్యేకత. ఈ శైలి ఆధారంగా సంకేతం లేకుండా ఏదైనా విషయం ఉంటే, అది మనువు చెప్పింది కాదని తెలిసిపోతుంది. ఈ శ్లోకాల ప్రారంభంకానీ, అంతంకానీ, సంకేతాలు లేవు. అందుచేత ఇవి మనువు శైలివికావు.

గ. మనుస్మృతిలోని శైలి ప్రవచనశైలి. ఇందులోని అన్ని విషయాలూ ఒకగొలుసుకట్టులా కలిసి ఉంటాయి. ఈ శైలిలో విషయసూచికకు సంబంధించినవి ఏవీ రాలేవు. మూల గ్రంథంలో విషయసూచిక అంటూ ఏదీ లేదు. 107వ శ్లోకంలో ఏవిషయాలు ఉన్నాయో, అవి తర్వాతి కాలంలో కలిపినవే.

ఘ. ఈ ప్రసంగంలో 92-101 శ్లోకాలలో బ్రాహ్మణుల మహిమ, 102 నుంచి 106లో శాస్త్రరూపంలో మనుస్మృతి మహిమ ఉన్నాయి. ఈ ప్రకారంగా మహిమను గురించిన సుదీర్ఘప్రసంగం మనువు శైలికాదు. ఆయన అర్థవాదరూపంలోనే సంక్షిప్తపద్ధతిలో ప్రశంస లేదా నింద చేస్తాడు.

ఙ. ఇందులో 94-95 (దేవతలు-పితరులు, బ్రాహ్మణుల ద్వారా హవ్య కవ్యాలను ఆరగించటం), 105 (ఏడేడు ముందు వెనుక తరాలను పవిత్రం చేయటం) శ్లోకాల శైలి అయుక్తియుక్తమూ, నిరాధారమూ; 98, 100,104-106లలో అతిశయోక్తులు నిండిన, 94-95, 99-101, 103 శ్లోకాల శైలి పక్షపాతంతో కూడి ఉంది. మనువు శైలిలో లోపాలు ఉండవు.

చ. 102లో **"స్వాయంభువో మనుర్ధీమానిదం శాస్త్రమకల్పయత్"** ప్రయోగంతో, దీని రచయిత మనువు కాదు, వేరొకడని తెలిసిపోతూంది. మనుకృతం కాకపోవడం చేత ప్రక్షిప్తం, మిగిలినవి వానికి సంబంధించినవే కాబట్టి అవీ ప్రక్షిప్తాలే.

4. అంతర్ వ్యతిరేకం

వర్ణవ్యవస్థ కర్మాను సారమే ఏర్పడుతుంది.

(1) ఈ శ్లోకాలలో జన్మతోనే వర్ణ వ్యవస్థ అని చెప్పారు. మనువు కర్మలవల్లే వర్ణ వ్యవస్థ ఏర్పడుతుందని చెప్పాడు. ముఖ్యంగా 98-99శ్లోకాలలోనైతే, పుట్టగానే బ్రాహ్మణుణ్ణి విశిష్టవ్యక్తిగా చెప్పారు. ఈ పుట్టుకతో వర్ణవ్యవస్థ అనేది మనువు చెప్పినదానికి వ్యతిరేకం అవుతుంది-

క. మనువు జన్మతో ఒక వర్ణాన్ని శ్రేష్ఠమని లేదా శ్రేష్ఠం కానిదని చెప్పి ఉంటే, వర్ణాలను నిర్ధారించే అవసరమే ఉండేది కాదు. ఎందుకంటే, పుట్టుకతోనే ఒకడు శ్రేష్ఠుడో, కాదో నిర్ణయమైతే పనులు చేసినా, చేయకున్నా, అతడు అలాగే ఉంటాడు. బాల్యంలోనూ, కౌమార్యంలోనూ వర్ణాలకు నిర్ణయించిన కర్మలు చేయకపోగా, అజ్ఞానంతో వ్యతిరేక కర్మలు చేస్తాడు. ఆ దశలో అతన్ని పుట్టుకతో బ్రాహ్మణుడు లేదా ధర్మానికి ప్రత్యక్షరూపంగా భావిస్తారు. (98). అలాగైతే తర్వాత కర్మలు చేయకపోవడం, లేదా వ్యతిరేకకర్మలు చేయడం వల్ల కూడా అతని బ్రాహ్మణత్వానికి భంగం కలగకూడదు. కానీ మనుస్మృతిలోని అన్ని విధినిషేధ వాక్యాలూ, వ్యవస్థలూ, వర్ణాలూ అన్నీ కర్మల నిర్ణయం వల్లే కనుక, మనువు ధర్మాధర్మాలూ, కర్మలూ, వ్యవస్థల నుంచే వర్ణవ్యవస్థ లేదా వ్యక్తి శ్రేష్ఠతను భావిస్తాడు. కానీ, జన్మతో కాదని స్పష్టమవుతూంది. జన్మతోనే శ్రేష్ఠత్వాన్ని అంగీకరిస్తే, మనుస్మృతిలోని సంపూర్ణ కర్మవ్యవస్థా వ్యర్థమైపోతుంది. శ్రేష్ఠత-అశ్రేష్ఠతలు జన్మతోనే నిర్ధారితమవుతాయి కనుక, ఎవరైనా పాటించినా, పాటించకపోయినా వ్యవస్థలకు ఎటువంటి మహత్త్వమూ ఉండదు. కానీ, మనువు కర్మలు ఆధారంగానే వర్ణ వ్యవస్థను అంగీకరించాడు కనుక, కర్మత్యాగమూ, కర్మ స్వీకరణ- వీటి మీద వర్ణ పరివర్తన జరగటాన్ని విధించాడు.

కింది శ్లోకాలలో వాటిని గురించి చెప్పినది చూడండి-

శూద్రో బ్రాహ్మణతామేతి బ్రాహ్మణ శ్చైతి శూద్రతామ్ ।
క్షత్రియో జ్జాత మేవం తు విద్యా ద్వైశ్యాత్ తథైవ చ ॥ (10.65)

అర్థం - శ్రేష్ఠులు-శ్రేష్ఠులు కానివారు తమ కర్మలను అనుసరించి శూద్ర కులంలో పుట్టినవాడు బ్రాహ్మణుడు, బ్రాహ్మణ కులంలో పుట్టిన వాడు శూద్రుడు అవుతారు. అంటే గుణ కర్మలను బట్టి ఎవరైనా బ్రాహ్మణుడైతే బ్రాహ్మణుడుగా ఉంటాడు. బ్రాహ్మణ కులంలో పుట్టినా క్షత్రియ, వైశ్య శూద్రుల గుణా లుంటే వారు క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అవుతారు. ఇదే విధంగా శూద్రుని ఇంట్లో పుట్టిన వాడు మూర్ఖుడైతే శూద్రుడుగా ఉండిపోతాడు. ఉత్తమ గుణాలుంటే వాటికి తగినట్లుగా బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యు డవుతాడు. ఇలాగే క్షత్రియ, వైశ్యకులాలలో పుట్టిన బాలుడు లేదా వ్యక్తికి కూడా వర్ణంలో మార్పులు జరుగుతాయని గ్రహించాలి.

ఖ. తమ తమ ధర్మాలను నిర్వహించకపోతే, ఎవరైనా శూద్రు డవుతాడు- అనేది మనువు అభిప్రాయం ఎలా గంటే-

అ. వేదం చదవకపోతే బ్రాహ్మణుడు శూద్రు డవుతాడు.

యోఽనధీత్య ద్విజో వేద మన్యత్ర కురుతే శ్రమమ్ ।
స జీవ న్నేవ శూద్రత్వ మాశు గచ్ఛతి సాన్వయః ॥ 2.168

ఆ. సంధ్యోపాసన చేయనివాడు శూద్రునితో సమానుడవుతాడు.

న తిష్ఠతి తుయః పూర్వాం నో పాస్తే యశ్చ పశ్చిమామ్ ।
స శూద్రవత్ బహిష్కార్యః సర్వస్మాత్ ద్విజకర్మణః ॥ 2.103

ఇ. తగిన వయసులో ఉపనయనం జరగకపోతే ద్విజుడు కావాలనే కోరిక గలవాడు 'వ్రాత్యుడు' అనే శూద్రుడవుతాడు. (2.37-40.)

ఈ. నీచుల సాంగత్యం వల్ల బ్రాహ్మణునికి శూద్రత్వం కలుగుతుంది.

ఉత్తమానుత్తమా న్గచ్ఛన్ హీనాన్ హీనాంశ్చ వర్జయన్ ।
బ్రాహ్మణః శ్రేష్ఠ తా మేతి ప్రత్యవా యేన శూద్రతామ్ ॥ 4.245

ఈ ప్రమాణాలతో పుట్టుకతో ఎవరినీ శ్రేష్ఠులు, శ్రేష్ఠులు కానివారు అని మనువు చెప్పనూ లేదు, పుట్టుకతో వర్ణ వ్యవస్థను ఏర్పరచనూ లేదు అని తెలుస్తుంది. జన్మతో వీరి కులం నిర్ధారితమైతే పైన చెప్పిన విధంగా కింది జాతుల వారు కారు.

గ. శూద్రత్వం పొందిన ఎవడైనా తన కర్మలు మార్చుకుంటే, లోపాలు దిద్దుకుని ప్రాయశ్చిత్తాలు చేసుకుంటే, అతడు మళ్లీ తన వర్ణంలోని వాడవుతాడు. ఈ పద్ధతిని మనువు, 'వ్రాత్యులు' అయిన శూద్రులు, వర్ణ వ్యతిరేకకార్యాలు చేసి బ్రాహ్మణ వర్ణం నుంచి బహిష్కృతులైన బ్రాహ్మణులకు తగిన ప్రాయశ్చిత్తాలు చెప్పిన చోట, విశదీకరించాడు (11.191-196). ఈ వ్యవస్థ వల్ల కూడా మనువు ఏర్పరచిన వర్ణ వ్యవస్థ జన్మను బట్టి కాదు, కర్మను బట్టే అని రుజువవుతూంది.

ఘ. వ్యక్తుల ప్రతిష్ఠ, గొప్పతనాలను, గుణాలను బట్టేనని మనువు చెప్పాడు (2.136, 137,154,156). దీనివల్ల కూడా పుట్టుకను బట్టి శ్రేష్ఠత, ఔన్నత్యం, వర్ణ వ్యవస్థను మనువు అంగీకరించ లేదనీ, కర్మలు లేదా గుణాలను ఆధారం చేసుకునే వాటిని నిర్ణయించాడనీ స్పష్ట మవుతూంది.

ఙ. మనువు వర్ణాల కర్మలను, **"లోకానాం వివృద్ధ్యర్థం"** (సమాజ వృద్ధి కోసం 1.31), **"సర్వస్యాస్య తు గుప్త్యర్థం"** (ఈ సమస్త జగత్తు రక్షణకోసం 2.87) అంటూ ఆ నిర్ధారణకు కారణం చెప్పాడు. వీటిని శ్రద్ధగా పరిశీలిస్తే, జన్మను బట్టి కాక కర్మలను బట్టే వర్ణ వ్యవస్థను ఏర్పరిచాడని స్పష్టంగా తెలుస్తుంది. జన్మతోనే వ్యక్తి శ్రేష్ఠుడు, కాడు, ఉన్నతుడు, నీచుడు అని నిర్ధారణ జరిగితే, దాని వల్ల సమాజం లేదా జగత్తుకు ఎలా వృద్ధి కలుగుతుంది? కేవలం గొప్పవారికి ఉన్నతి కలుగుతుంది. ఆ వృద్ధి కూడా ఎవరు ఏ స్థాయిలో ఉంటే, అదే స్థాయిలో ఉండటమే అవుతుంది. వారికి తమ స్థాయి పెరగటానికి అవకాశం ఎలా లభిస్తుంది? పుట్టుకతో వర్ణ వ్యవస్థను అంగీకరిస్తే ఈ కారణాలు చెప్పటం దండుగే. ఈ కారణాలు చెప్పటం వల్ల నాలుగు వర్ణాలను బట్టి ప్రజలను సృష్టించలేదు, ప్రజల వృద్ధికొరకే నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయనీ తెలుస్తుంది. అంటే, ముందు జన్మతో సమానులైన ప్రజల సృష్టి, తర్వాత వారి గుణకర్మలను బట్టి నాలుగు వర్ణాలు వచ్చాయి. దాని వల్ల సమాజం ఒక వ్యవస్థకు కట్టుబడి ఉండి వృద్ధి చెందుతూ ఉంటుంది. ఈ ప్రయోగ పద్ధతిని బట్టి కూడా కర్మణా వర్ణ వ్యవస్థ అనేది రుజువవుతూంది.

చ. **'వర్ణం'** అనే పదానికి అర్థమూ, వ్యుత్పత్తి - వీటి వల్ల కూడా మనువు ఏర్పరచిన వ్యవస్థ జన్మ వల్ల కాకుండా కర్మల వల్లనే అనీ తెలుస్తూంది. నిరుక్తంలో 'వర్ణం' పదానికి వ్యుత్పత్తి 'వర్ణో వృణోతేః' (2.1.4) అని ఉంది. అంటే కర్మానుసారం ఎవరి వరణం జరుగుతుందో అది 'వర్ణం' అని. దీన్ని మరింత పరిపుష్టం చేయటానికి దయానంద మహర్షి ఇలా చెప్పారు-

వర్ణో వృణోతేరితి నిరుక్త ప్రామాణ్యాద్వరణేయా వరీతుమర్హాః ।
గుణ కర్మాణి చ దృష్ట్వా యథాయోగ్యం వ్రియన్తే యేతే వర్ణాః ॥ ఋ.భా.భూ.వర్ణాశ్రమధర్మవిషయే

అంటే- గుణకర్మలను బట్టి యథాయోగ్యంగా ఎవరికి అధికారం ఇస్తారో అది వర్ణం అని.

వర్ణాలకు పేర్లు వారి కర్మలను బట్టే పెట్టారు. పేర్ల వ్యుత్పత్తి వారు చేసే కర్మలను తెలుపుతుంది. (దీని కొరకు 1.87-91 శ్లోకాల విస్తృత వివరణ చూడండి.)

3. బ్రాహ్మణ గ్రంథాలలో కర్మణా వర్ణ వ్యవస్థను స్పష్టంగా చెప్పారు. అది -

"సః (క్షత్రియః) హదీక్షమాణ ఏవ బ్రాహ్మణతా మభ్యుపైతి ।" (ఏ. 7.23)

క్షత్రియుడు బ్రాహ్మణ వర్ణంలో దీక్షితుడై బ్రాహ్మణత్వం పొంద గలుగుతాడు.

క్షత్రియుడైనా, వైశ్యుడైనా యజ్ఞంలో దీక్ష తీసుకుని (ఉపనయన సంస్కారంతో) బ్రాహ్మణు డవుతాడు. అంటే బ్రహ్మచర్యా శ్రమంలో వేదాధ్యయన సమయంలో యజ్ఞ దీక్షితులై అందరూ బ్రాహ్మణులు కావచ్చు. ఆ తర్వాతి శిక్షణ లనే కర్మల ప్రకారం క్షత్రియులు, వైశ్యులు అవుతాడు.

ఛ. మనువు కర్మణా వర్ణ వ్యవస్థ ఏర్పరిచాడు అనటానికి ఇతర ప్రమాణాలూ ఉన్నాయి-

క. మనువు శూద్రులను హీనులుగా భావించే వాడు కాదు. - 'శుచిః' = పవిత్రులు, 'ఉత్కృష్ట శుశ్రూషులు' మొదలైన విశేషణాలతో సంబోధించే వాడు (9.335). అందరి ఇళ్లలోనూ అన్ని రకాల సేవలూ చేసేవాడు అపవిత్రుడూ, అస్పృశ్యుడూ, లేదా హీనుడూ ఎలాగవుతాడు?

ఖ. చదువుకోని వాడినే మనువు శూద్రు డన్నాడు. అలాంటి వారికి వేదాధ్యయన రూపమైన బ్రహ్మజన్మ ఉండదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు బ్రహ్మ జన్మ రూపమైన రెండవ జన్మ ఉంటుంది కనుక, వారికి ద్విజు లంటారు - 'ద్విర్జాయతే ఇతి ద్విజః'.

శూద్రుణ్ణి చదువుకోని కారణంగా 'ఏక జాతిః' అంటారు. దీనికి ప్రమాణం -

"బ్రాహ్మణః క్షత్రియో వైశ్య స్త్రయో వర్ణా ద్విజాతయః ।
చతుర్థ ఏక జాతిస్తు శూద్రో నాస్తి తు పంచమః ॥" (10.4).

గ. మనువు, కర్మలను బట్టి మనుష్యులు రెండు వర్ణాలకు చెందుతారని అన్నాడు-

1. శ్రేష్ఠ ధర్మానుకూలంగా ఆర్య పరంపరలలో దీక్షితులైనవారు, శూద్రులతో సహా, నాలుగు వర్ణాల వారూ ఆర్యులవుతారు.

2. వీరిలో దీక్షితులు కానివారు దస్యులు (10.45)

ఘ. మనువు కర్మలు ఆధారంగానే వ్యక్తిని శ్రేష్ఠ = ఆర్యుడు, శ్రేష్ఠుడు కాని వాడు = అనార్యుడు అన్నాడు. 10.57.58 లలో కర్మలను బట్టే వీరిని గుర్తించాలనీ చెప్పాడు. ఇవన్నీ మనువు ఏర్పరచిన కర్మణా వర్ణ వ్యవస్థను నిరూపిస్తున్నాయి.

జ. 1.31లో కూడా మనువు తన **'కర్మణా వర్ణవ్యవస్థా'** అని సంకేతించాడు. 1.16,23,26-30 శ్లోకాల ద్వారా ఒక్కసారిగా ఎందరో ప్రజలు-బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు మొదలైన రూపాలలో పుట్టలేదు. కానీ, సమాన మానవ రూపాలలోనే పుట్టారు. తర్వాత ఆ బోలెడు మంది జనం నుంచి సమాజ వృద్ధికొరకు, ఒక వ్యవస్థ రూపంలో నాలుగు వర్ణాల ముఖం, చేతులు, తొడలు, పాదాల సామ్యంతో (గుణకర్మల ప్రకారం) నిర్మాణం జరిగింది. 1.31లో ఆలంకారిక రూపంలో దీని కథనం ఉంది. చెప్పిన అవయవాలకు ఏ స్థానమూ, పనులూ శరీరంలో ఉన్నాయో, సమాజంలోనూ అదే స్థానం వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు నిర్దేశించాడు. ఈ విధంగా యోగ్యతను అనుసరించి జనాన్ని నాలుగు వర్ణాలుగా విభజించి, వారి పనులకు కూడా వాటి ప్రకారమే నిర్ణయించాడు. ఈ వర్ణన క్రమం (ప్రజల ఉత్పత్తి, వారి వర్ణ వ్యవస్థా), ఆలంకారిక కథనం కర్మానుసారం వర్ణ వ్యవస్థను సంకేతిస్తూంది. ఈ ప్రమాణాల ద్వారా **'కర్మణా వర్ణ వ్యవస్థా'** అనేది మనువు మౌలిక ఉద్దేశ్యమని రుజువవుతూంది. దీనికి వ్యతిరేకమైన 'జన్మనా వర్ణ వ్యవస్థా' అనేది అంతర్ వ్యతిరేకం అనే ఆధారంతో ప్రక్షిప్తం అవుతుంది. (దీని కొరకు 1.31,87-91; 2.11; 10.65 శ్లోకాల సమీక్ష చూడండి).

ఝ. 94వ శ్లోకంలో బ్రహ్మ ముఖం నుంచి బ్రాహ్మణుల ఉత్పత్తి, జరిగిందన్నాడు. 93లో కూడా దాన్నే **'ఉత్తమాంగోద్భవ'** అని చెప్పాడు. 92లోనూ బ్రహ్మను గురించి చెప్పాడు. బ్రహ్మ ప్రసక్తి మౌలికం కాదు. మనుస్మృతిలోని విషయాలతో ఈ విషయానికి ఎన్నో విధాల వ్యతిరేకత ఉంది. (దీనికి చూడండి-1.7-13, 32-41, 50-51 శ్లోకాలపై సమీక్ష) ఈ విధంగా ఈ మూడు శ్లోకాలు ప్రక్షిప్తాలు, మిగిలిన ప్రసంగం వీటికి సంబంధించిందే కనుక, అది కూడా ప్రక్షిప్తమే.

ఞ. ఇదే విధంగా 94-95 శ్లోకాలలో పితరులను ప్రత్యేక వర్గంగా భావించటం కూడా మనువుకు వ్యతిరేకమే. (దీని విస్తృత సమీక్ష చూడండి- 3.119-284 శ్లోకాలపై **'అంతర్ వ్యతిరేకాలు'** శీర్షిక) ఈ అంతర్ వ్యతిరేకత కారణంగా 94-95 శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజువవుతున్నది. మిగిలినవి ముందు వెనుకల గల ప్రసంగానికి చెందింది కనుక, ప్రక్షిప్తాలు.

ట. 105వ శ్లోకంలో పూర్వాపర ఏడేడు తరాల పవిత్రత ఉంది. దీనికి 4. 240వ శ్లోకంలోని విషయంతో వ్యతిరేకత ఏర్పడుతూంది. ఎందుకంటే, అక్కడ కర్తనే ఫలభోక్తగా చెప్పారు. ఎవరైనా మనుస్మృతిని చదివి పూర్వాపరమైన ఏడేడు తరాలను పవిత్రం చేస్తే, తర్వాతి ఏడు తరాల వారికి మనుస్మృతిని చదివే అవసరం ఏముంటుంది? వారి జీవితాలను ఆ ఒక్క అధ్యేత పవిత్రం చేసేశాడు కదా!... ఈ అంతర్ వ్యతిరేకత వల్ల 105వ శ్లోకం ప్రక్షిప్తమైంది. మిగిలిన ముందు వెనుకల గల శ్లోకాలు దీనికి సంబంధించినవే కనుక, అవీ ప్రక్షిప్తాలే !

ధర్మోత్పత్తి విషయం- 108 నుండి 144 వరకు

108 నుండి 110వ వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

సదాచారం పరమధర్మం-

ఆచారః పరమో ధర్మశ్శ్రుత్యుక్తస్మార్త ఏవ చ । మూలశ్లోక సం. **55**
తస్మాదస్మిన్ సదా యుక్తో నిత్యం స్యాదాత్మవాన్ ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **108**

టీక:- **శ్రుత్యుక్తః చ స్మార్తః +ఏవ** = వేదాలలో, స్మృతులలో కూడా చెప్పబడిన, **ఆచారః** = ఆచరణం, **పరమః ధర్మః**= శ్రేష్ఠ ధర్మం, **తస్మాత్** = అందువల్ల, **ఆత్మవాన్ ద్విజః** = ఆత్మోన్నతిని కోరునట్టి ద్విజుడు, **అస్మిన్** = ఈ శ్రేష్ఠమైన ఆచారంలో, **సదా** = ఎల్లప్పుడు, **యుక్తః స్యాత్** = ప్రయత్నశీలుడుగా ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- వేదాలలో-ధర్మ శాస్త్రాలలో చెప్పబడిన ఆచారాలు ముఖ్యధర్మాలై ఉన్నందువల్ల స్వాభిమానులగు ద్విజులు ఆ యా ఆచారాలు పాటిస్తూనే ఇతరుల చేత పాటింపజేయడానికి ప్రయత్నించాలి. (స.ప్ర. 3వ సము.) ॥108॥

ఈ శ్లోకాన్ని ఉదాహరిస్తూ దయానంద సరస్వతుల వారీ కింది అర్థం ఇచ్చారు. "వేదాలను, వేదాను కూల స్మృతులను చెప్పడం వినడం, వినిపించడం, చదవడం, చదివించడం వల్ల ఫలమేమి? వాటిలో ప్రతిపాదించిన ధర్మం ఆచరించుటయే ఫలం. అందువల్ల ధర్మాచారంలో నిరంతరం శ్రద్ధావంతుడు కావాలి. సత్యభాషణాది వ్రతాల (కర్మ)ను ఆచరించడమే వేదాదిస్మృతులలో చెప్పిన ఆచారం. ఆచారహీనుడికి వైదికకర్మల ఫలప్రాప్తి ఉండదు.

ఆచారహీనునికి వైదిక కర్మల ఫలప్రాప్తి ఉండదు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఆచారాద్విచ్యుతో విప్రో న వేదఫలమశ్నుతే । మూలశ్లోక సం. **56**
ఆచారేణ తు సంయుక్తస్సంపూర్ణఫలభాగ్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **109**

టీక:- ఆచారాత్ విచ్యుతః విప్రః = ధర్మాచరణకు దూరుడైన విప్రుడు, **వేదఫలం న అశ్నుతే** = వేదప్రతిపాదిత ధర్మజన్యసుఖరూప ఫలాన్ని పొందజాలడు. మరియు ఎవడు, **ఆచారేణ తు సంయుక్తః** = విద్యాధ్యయనం చేసి ధర్మాన్ని ఆచరిస్తాడో అతడు, **సంపూర్ణ ఫలభాగ్ భవేత్** = సంపూర్ణ సుఖాన్ని అనుభవించగలడు.

ఋషి దయానందభాష్యం:- ఈ శాస్త్రంలో చెప్పబడిన ఆచారాల నుంచి పతితుడైన బ్రాహ్మణుడు అనాచారవంతుడిగా పరిగణించబడటమేగాక వేదాధ్యయనం మొ॥ వాటివల్ల కలిగే ఫలితాన్నీ పొందలేడు. ఆచారవంతుడు అయితే పైన చెప్పిన ఫలితాలన్నింటికీ అర్హుడు.

ధర్మాచరణరహితుడైన విప్రుడు వేదప్రతిపాదిత ధర్మజన్య సుఖరూప ఫలాన్ని పొందడు. వేదవిద్యనంభ్యసించి ధర్మాచరణ చేయువాడే సంపూర్ణ సుఖాన్ని పొందుతాడు. (స.ప్ర.3వ సము)॥109॥

వివరణ:

109వ శ్లోకానికి -మరొకచోట సమర్థన. సందర్భానుసారంగా ఋషుల ప్రమాణాలు శృంఖలలాగా మరొకచోట చెప్పబడతాయి. ఈ శ్లోకభావాన్ని బలపరుస్తూ మనువు ఆ క్రింది శ్లోకాలను కూడా చెప్పాడు.

ఉదాహరణకు-

(క) "యస్య వాఙ్ మనసీ శుద్ధే సమ్యగ్గుప్తే చ సర్వదా।
స వై సర్వమవాప్నోతి వేదాన్తోపగమం ఫలమ్." ॥ 1.135 [2.160]

(ఖ) "వేదాస్త్యాగాశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసి చ ।
న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛన్తి కర్హిచిత్"॥ 2.72 [2.69]

వేదోక్త కర్మలను ఆచరించనివాడికి సిద్ధి లభించదు. కానీ ఆచారవంతుడికి సిద్ధి (ఫలితము) లభిస్తుందని ఈ శ్లోకాలలో చెప్పబడింది. సదాచారం వల్ల ధర్మం నడుస్తుంది. సదాచారమే ధర్మానికి మూలం.

ఇది మనుకృతం-ప్రామాణికం

సదాచారం ధర్మానికి మూలం

ఏవ మాచారతో దృష్ట్వా ధర్మస్య మునయో గతిమ్ । మూలశ్లోక సం.**57**
సర్వస్య తపసో మూలమాచారం జగృహుః పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**110**

టీక:- ఏవం = ఈ ప్రకారంగా, **ఆచారతః** = ధర్మాచారణవల్లనే, **ధర్మస్య** = ధర్మం యొక్క, **గతిం** = ప్రాప్తి, అలాగే అభివృద్ధిని, **దృష్ట్వా**= చూసి, **మునయః** = మునులు, **సర్వస్య తపసో మూలం** = సర్వ తపస్సులకు శ్రేష్ఠమైన ఆధారంగా, **ఆచారం** = ఆచారాన్ని, **జగృహుః** = స్వీకరించారు.

తాత్పర్యం:- ఈ ప్రకారంగా ఆచారాలను అనుసరించి ధర్మం స్థితమై/స్థిరమై ఉండటం చేత అన్ని విధాల జపతపాది దివ్య కర్మలకు ఆచారమే ముఖ్యమని సనాతన మహర్షులు చెప్పారు.

111 నుండి 118వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* మనుస్మృతి అధ్యాయానుసారం విషయసూచి

* జగతశ్చ సముత్పత్తిం సంస్కారవిధిమేవ చ ।
వ్రతచర్యోపచారం చ స్నానస్య చ పరం విధిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*111*

* దారాధిగమనం చైవ వివాహానాం చ లక్షణమ్ ।
మహాయజ్ఞవిధానం చ శ్రాద్ధకల్పం చ శాశ్వతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*112*

* వృత్తీనాం లక్షణం చైవ స్నాతకస్య వ్రతాని చ ।
భక్ష్యాభక్ష్యం చ శౌచం చ ద్రవ్యాణాం శుద్ధిమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **113**

* స్త్రీధర్మయోగం తాపస్యం మోక్షం సన్న్యాస మేవ చ ।
రాజ్ఞశ్చ ధర్మమఖిలం కార్యాణాం చ వినిర్ణయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **114**

తాత్పర్యం:- ఈ మానవ ధర్మ సంహిత (మనుస్మృతి)లో విషయక్రమాన్ని వివరించాలంటే (సంక్షిప్తంగా) జగదుత్పాదన, నాందీ క్రమం మొదటి అధ్యాయంలోను; వివిధ సంస్కారాలు, బ్రహ్మచర్యాది వ్రతాలు, గుర్వభివాదం మొ॥వి ద్వితీయాధ్యాయంలోను; స్నాతక వ్రతవిధానం, వివాహాది విషయాలు, వైశ్వదేవాది పంచమహాయజ్ఞాలు, శ్రాద్ధ సంబంధ విషయాలు మొ॥వి తృతీయాధ్యాయం లోను; జీవనోపాయాలు, గృహస్థుడి ఆచారాలు మొ॥వి నాలుగో అధ్యాయంలోను; ఏవి తినాలి-ఏవి తినకూడదు, మరణకాల ఆశౌచం, స్త్రీ ధర్మాలు మొ॥వి ఐదో అధ్యాయంలోను; వానప్రస్థ/యతి/సన్న్యాస ధర్మాలు ఆరోఅధ్యాయంలోను; క్షత్రియులకు సంబంధించిన ధర్మాలన్నీ ఏడో అధ్యాయంలోను ఉన్నాయి. 111-114

* సాక్షిప్రశ్నవిధానం చ ధర్మం స్త్రీపుంసయోరపి ।
విభాగధర్మం ద్యూతం చ కంటకానాం చ శోధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **115**

* వైశ్యశూద్రోపచారం చ సంకీర్ణానాం చ సంభవమ్ ।
ఆపద్ధర్మం చ వర్ణానాం ప్రాయశ్చిత్తవిధిం తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **116**

* సంసారగమనం చైవ త్రివిధం కర్మ సంభవమ్ ।
నిశ్శ్రేయసం కర్మణాం చ గుణదోషపరీక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **117**

* దేశధర్మాన్ జాతిధర్మాన్ కులధర్మాంశ్చ శాశ్వతాన్ ।
పాఖండగణధర్మాంశ్చ శాస్త్రే-స్మిన్నుక్తవాన్ మనుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **118**

తాత్పర్యం:- సాక్షుల్ని ప్రశ్నించే పద్ధతి, వ్యవహార నిర్ణయం మొ॥వి న్యాయ సంబంధమైనవి ఎనిమిదో అధ్యాయంలోను; అర్థ-కామ సంబంధ ఆచారాలు, వైశ్య, శూద్ర వర్ణాల ఆచారాలు తొమ్మిదో అధ్యాయంలోను; సంకీర్ణజాతులు వారి ధర్మాలు, ఆపద్ధర్మాలు పదో అధ్యాయంలోను; లోకంలో వివిధ వర్ణాల వారికి అనుసరించదగిన ప్రాయశ్చిత్త విధానాలు, న్యాయ సమ్మతమైన ప్రాప్తి ధర్మాలు, దేశ-వర్ణ ధర్మాలు, కుల ధర్మాలు, వేదాన్ని ఒప్పుకోని పాషండ జాతుల ధర్మవిచారం మొ॥వి పన్నెండో అధ్యాయంలోను చెప్పబడి ఉన్నాయి.

పైన చెప్పిన ఈ విషయాలతో చేరి ఉండే సకల ధర్మాలు స్వాయంభువ మనువుచేత చెప్పబడ్డాయి. 115-118

ప్రక్షిప్తాల పరిశీలన

మనుస్మృతిలోని విషయసూచిక విషయం ఈ క్రింది 'ఆధారాల' ప్రకారం ప్రక్షిప్తం-

1. ప్రసంగ వ్యతిరేకం

క. ఈ శ్లోకం పూర్వాపర ప్రసంగ వ్యతిరేకం. ఇక్కడ ముందు (108-110), తర్వాతి (120-144) శ్లోకాలు ధర్మానికి సంబంధించినవి. మధ్యలో ఈ విషయసూచికకు, సంబంధించిన శ్లోకాలు వాటిని భంగం చేస్తూన్నాయి. వీటిలో అసందర్భమైన విషయసూచిక చెప్పబడింది; ప్రసంగ వ్యతిరేకం కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు.

ఖ. విషయ సూచిక మౌలికమై ఉంటే, గ్రంథం ప్రారంభంలో ఉండాలి లేదా చివరలో ఉండాలి. మధ్యలో విషయ సూచిక అవసరమే లేదు. ఈ అసందర్భ ప్రసంగం వల్ల ఇది ప్రక్షిప్తం.

గ. ఈ ప్రసంగంలోని 111వ శ్లోకానికి 110వ శ్లోకంతోనూ, 118వ శ్లోకానికి 120వ శ్లోకం తోనూ (119వది ప్రక్షిప్తం) ఎటువంటి సంబంధమూ లేకుండా ఉంది. పైగా ప్రసంగక్రమాన్ని విడదీస్తున్నాయి. అందు చేత మౌలికాలు కావు.

ఘ. వర్ణన క్రమం, భాషాశైలి-వీటితో ఈ ప్రసంగం పూర్వపు శ్లోకాలతో (92 నుంచి 107) కలుస్తుంది. 107వ శ్లోకంలో విషయసూచికను ప్రారంభించి, అందులో ఆచార పదం రావడం చేత, [108,110] వాటికి జోడించి ప్రక్షిప్తాలను మౌలికాలుగా రుజువు చేయటానికి, ఆ విషయసూచికను 108-110 శ్లోకాల వెనుక పెట్టారు-కానీ 119వ శ్లోకానికి 110 శ్లోకంతో ఎంత మాత్రమూ కుదరదు. దీనితో 108-110 శ్లోకాలకు ముందు వెనుకల శ్లోకాలతో ఏ సంబంధమూ లేదని తెలుస్తూంది. 111వ శ్లోకంలోని 'చ' అక్షరపు అనువృత్తి దీన్ని 107వ శ్లోకంతో కలుపుతూంది. ఈ విధంగా ఇది మునుపటి 92-107 శ్లోకాల మూల ప్రసంగాలను విడకొట్టి కలిపినవి, అందుకని ప్రక్షిప్తాలు.

2. విషయ వ్యతిరేకం

1.1-5 ప్రారంభశ్లోకాలలో సృష్టి ఉత్పత్తి విషయం మొదలు పెట్టడంలోనూ, 1.144 సమాప్త సూచక శ్లోకంలో **"ఏషా ధర్మస్య వో యోనిః సమాసేన ప్రకీర్తితా । సంభవశ్చాస్య సర్వస్య...॥"** అనటం వల్ల ఇక్కడి విషయ యం సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి అని తెలుస్తూంది. ఈ పరిధిలో విషయాలకు సంబంధించిన శ్లోకాలనే విషయ సంగతాలు అంటారు. కానీ, ఇతరాలు వ్యతిరేకాలు అవుతాయి. 111 నుంచి 118 శ్లోకాలలో మనువు సంకేతించిన విషయాలకు సంబంధం లేని వర్ణనలున్నాయి కనుక, ఇవి విషయవ్యతిరేకాలూ, ప్రక్షిప్తాలూ.

3. శైలీగత ఆధారాలు

క. మనువు శైలిలో ఏ విషయం ప్రారంభించినా, ముగించినా, మొదటా, చివరా సంకేతిత శ్లోకాలుంటాయి. ఈ విషయ సూచికలోని శ్లోకాలలో మొదట కానీ, చివరకానీ, ఎలాంటి సంకేతమూ లేదు. అందువల్ల ఇవి మనుకృతం కావు. ప్రక్షిప్తాలు.

ఖ. మనుస్మృతిది మౌలికంగా 'ప్రవచనశైలి'. మనుస్మృతిలోని అన్ని ప్రసంగాలూ, విషయాలూ, ఈ శైలిలోనే ఉంటాయి. ముందు వెనుకలు కలిసినవై ఉంటాయి. ఈ శైలిలో విషయసూచికను మౌలికరూపంతో చెప్పనూ లేదు, మధ్యలో కూడా దాని అవసరం ఎక్కడా లేదు. ఈ విధంగా విషయసూచిక చెప్పడం శైలితో పొంతన లేనిదిగా కనబడుతూంది. సంకలనం చేసిన తర్వాత తమ సౌకర్యం కోసం ఎవరో రాసి చొప్పించారు.

గ. 118వ శ్లోకంలో మనుస్మృతిని **'శాస్త్రం'** అన్నారు. మౌలికంగా ఈ పదం వ్యవహారంలో లేదు (చూడండి-92-107 శ్లోకాలపై **'శైలీ గత ఆధారాలు'** శీర్షికలోని సమీక్ష సంఖ్య-1). ఇది తరువాతి వారు చేసిన ప్రక్షిప్తశ్లోకమని తెలుస్తూంది. ఇది ప్రక్షిప్తం కనుక, దీనికి సంబంధించిన మిగిలిన అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే !

జ. **'ఉక్తవాన్మనుః'** అనే ఈ ప్రయోగం కూడా మనువు కాక వేరెవరో రచించిన శ్లోకమనీ, మనుకృతం కాదు కనుక దీనికి సంబంధించిన అనగా 'ఉక్తవాన్‌మనుః' అన్న శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలని తేలుతూంది.

4. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలలోని విషయసూచికకూ, గ్రంథంలో ప్రతిపాదించిన విషయసూచికకూ పొంతన లేదు. ఈ రెండిటిలోనూ పరస్పర వ్యతిరేకత కనబడుతూంది- అధ్యాయక్రమంలో చెప్పిన విషయాలు చూస్తే, 118వ శ్లోకంలో చెప్పినవి- దేశధర్మాలు, జాతుల ధర్మాలు (జాతికి 'వర్ణ' మనే అర్థం తీసుకుంటే అదీ సరిపోదు. 107వ శ్లోకంలో చెప్పటం అయిపోయింది), కులాల ధర్మాలు, పాషండుల ధర్మాలు- ఇవి ఈ గ్రంథంలో లేనే లేవు. ధర్మాలను గురించి చెప్పటం అయిపోయింది), కులాల ధర్మాలు, పాషండుల ధర్మాలు- ఇవి ఈ గ్రంథంలో లేనే లేవు. పాషండుల ఆచరణ మనువు దృష్టిలో ధర్మమే కాదు కనుక, అధర్మమూ, నిందనీయమూ (4.30,192-196).

ఖ. ఒకటే విషయంలోని ప్రసంగాలను వేర్వేరు విషయాలుగా పరిగణించి విడివిడిగా చూపారు. అవి -115వ శ్లోకంలో చెప్పిన 'సాక్షి-ప్రశ్న విధానం, స్త్రీ పురుషధర్మాలు, విభాగ ధర్మాలు, ద్యూతం'-అవి 114లో చెప్పిన 'కార్య వినిర్ణయం'లోనివే, ప్రత్యేకమైనవి కావు.

గ. కొన్ని ముఖ్య విషయాలు, ప్రసంగాలను పేర్కొననే లేదు. అవి- ప్రథమ అధ్యాయంలో ధర్మోత్పత్తి, 12వ అధ్యాయంలో మూడు విధాల గతులు, ధర్మనిశ్చయవిధానం. ఇలాంటి దోషాలు ఈ ప్రసంగాన్ని మౌలికమని రుజువు చేయటం లేదు.

*** భృగు ద్వారా ఈ శాస్త్రం బోధించబడుట** ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

> ***యథేదముక్తవాన్ శాస్త్రం పురా పృష్టో మనుర్మయా ।***
> ***తథేదం యూయమప్యద్య మత్సకాశాన్ని బోధత ॥*** ప్రక్షిప్త శ్లోక సం. ***119***

తాత్పర్యం:- "ఓ మహర్షులారా ! నేను అడిగినప్పుడు, మనువు నాకు దీన్ని ఎలా ఉపదేశించాడో, అదేరీతిగా నేను మీకు ఉపదేశించబోతున్నాను. మనువు ఆజ్ఞచేత-మనువుపట్ల నాకు గల గౌరవ భావంచేత నేను మీకు విన్పించబోవు ఈ ధర్మశాస్త్రాన్ని మీరు సావధానచిత్తులై నా నుండి వినెదరు గాక!" అని....(తదుపరి చెప్పబోయే అంశాలకు, ముందుగా ఈ శ్లోకాన్ని చెప్పాడు) భృగు మునీంద్రుడు.॥119॥

ప్రక్షిప్త పరిశీలన

భృగువును ప్రసిద్ధుణ్ని చేయటానికి, భృగువును మనుస్మృతితో కలపటానికి ఈ శ్లోకం ప్రక్షిప్తంగా చేర్చబడింది. ఈ కింది 'ఆధారాల'తో అది ప్రక్షిప్తమని తేలుతూంది.

1. ప్రసంగవ్యతిరేకం

క. ముందు వెనుకటి ప్రసంగం (108-110, 120-144) ధర్మ సంబంధంగా నడుస్తుంది. దాని మధ్య ఇది చెప్పటం సందర్భోచితం కాదు. దీని వల్ల ఒక విషయంలోనికి మరొకటి వచ్చి ప్రసంగ భంగం అయింది. కనుక ప్రసంగవ్యతిరేకం.

ఖ. శ్లోకంలో చెప్పిన విషయానికి ఎలాగూ ఇది సందర్భం కాదు. ఇది మధ్యలో చెప్పటం వల్ల, **'ముందు మనువు వద్ద నేనెట్లా నేర్చుకున్నానో, అదేవిధంగా నా నుంచి మీరు వినండి'** అని వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. ఇది మునుపటి ప్రక్షిప్త శ్లోకాలలో 1.58-60 వచ్చింది. దాన్ని మళ్లీ చెప్పే అవసరమే లేదు. ఇట్లా పదే పదే చెప్పటమే అసూయవల్ల అసంగతమూ, అసందర్భమూ అయిన ప్రక్షిప్తాలని రుజువు చేస్తూంది.

2. విషయ వ్యతిరేకాలు

శ్లోకంలో చెప్పినది ఈ అధ్యాయంలోని విషయాలకు సంబంధించింది కాదు. విషయ వ్యతిరేకం కనుక ప్రక్షిప్తం (చూడండి 92-107 శ్లోకాల పై 'విషయవ్యతిరేకాలు' సమీక్ష).

3. శైలీగత ఆధారాలు

'యథేదం ఉక్తవాంఛాస్త్రం పురా పృష్టో మనుర్మయా' అనడం ఇది మనుకృతం కాదనీ, వేరెవరో రచించిందనీ స్పష్టంగా చెబుతూంది. ఇదే విధంగా మనుస్మృతిలో మనుస్మృతి కొరకే చెప్పిన **'శాస్త్రం'** అనేది తర్వాత ప్రయేగం. ఇది కూడా దీన్ని ప్రక్షిప్తమనే చెబుతూంది. (చూడండి 92-107) శ్లోకాలపై 'శైలీగత ఆధారాలు' సమీక్ష).

4. అంతర్ వ్యతిరేకాలు

(1) మనుస్మృతి మనువు చెప్పిందే కానీ ఇతరులు చెప్పింది కాదు. ఈ శ్లోకంలో భృగువు చెప్పిందనటం పైవిషయానికి వ్యతిరేకం. (చూ. 1.57-63 శ్లోకాలకు **'అంతర్ వ్యతిరేకాలు'** సమీక్ష).

(2) మహర్షులు వచ్చింది మనువును ప్రశ్నించటానికి. అదీ అతడు ఆ విషయాలు బాగా తెలిసినవాడని (1.1-4). కానీ ఇక్కడ సమాధానాలు చెబుతున్నది భృగువు. ఇది అర్థం లేనిదీ, వరుస క్రమానికి వ్యతిరేకమూ అయిన కథనం.

ధర్మోత్పత్తి విషయం

120 నుండి 125వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

విద్వాంసులు ఆచరించిన ధర్మవర్ణన ప్రారంభం-

విద్వద్భిస్సేవితః సద్భిర్నిత్యమద్వేషరాగిభిః । మూలశ్లోక సం. **58**
హృదయేనాభ్యనుజ్ఞాతో యో ధర్మస్తం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **120[2.1]**

టీక:- అద్వేషరాగిభిః సద్భిః విద్వద్భిః నిత్యమ్ సేవితః = రాగ ద్వేషరహితులు, శ్రేష్ఠవిద్వాంసులు, నిత్యమాచరించిన, **యః హృదయేన + అభ్యనుజ్ఞాతః ధర్మః** = దేన్ని హృదయపూర్వకంగా సత్కర్తవ్యమని తెలుసుకొన్నారో, అదే ధర్మం, మాననీయం, కరణీయం కూడా. **తం నిబోధత** = అట్టి ధర్మాన్ని వినండి.

ఋషి దయానందభాష్యం:- వేదాలను తెలిసినవారు, ధార్మికులు, రాగ-ద్వేషాలకు అతీతంగా ఉండగలవారైన (ఇతర జాతులలో అధికంగా కన్పించే ఈ లక్షణాలు అరుదుగా నూటికో కోటికో ఒక్కరిలో గలవారు) అయిన బ్రాహ్మణుల చేత నిత్యం అనుష్ఠించబడేది- శ్రేయస్సాధనమైనది అయిన ధర్మ సూక్ష్మములు చెబుతాను-వినండి !

సత్పురుషులు. రాగద్వేషరహితులు అయిన విద్యాంసులు తమ హృదయాలకు అనుకూలమని తలచి, ఆచరించే దాన్నే ధర్మమని భావించి వినాలి. (సం.వి.గృహస్థాశ్రమం; స.ప్ర.దశమ.స. 1)॥120॥

కర్మపాలన విషయంలో సకామత అకామతావివేచనం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

కామాత్మతా న ప్రశస్తా న చైవేహాస్త్యకామతా । మూలశ్లోక సం. **59**
కామ్యో హి వేదాధిగమః కర్మయోగశ్చ వైదికః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **121[2.2]**

టీక:- హి = ఎందుకంటే, **ఇహ** = ఈ ప్రపంచంలో, **కామాత్మతా** = అత్యంతకాముకత, **చ** = మరియు, **అకామాతా** = నిష్కామకత, **ప్రశస్తా న అస్తి** = శ్రేష్ఠం కాదు. **వేదాధిగమః చ వైదికః కర్మయోగః** = వేదార్థజ్ఞానం, వేదోక్త కర్మలు, **కామ్యః** = ఇవన్నీ కోరిక వల్లనే సిద్ధిస్తాయి.

ఋషి దయానందభాష్యం:- ప్రపంచంలో ఫలాపేక్షతో కార్యాలు చేయడం శ్రేష్ఠంకాదు. అయినా ఇహలోకంలో ఫలాపేక్ష లేకుండా పని చేయడం. అసాధ్యం వేదార్థ భావం,వేదోక్తకర్మలు ఇవన్నీ కోరికలవల్లనే సిద్ధిస్తాయి.

అతికామం, నిష్కామం ఎవరికీ మంచిది కాదు. కారణం-కోరిక (కామన) లేనట్లయితే, వేదాల జ్ఞానంగాని, వేదవిహితములైన ఉత్తమ కర్మలు గాని ఎవరికీ లభించవు. (స.ప్ర.దశమ.స., స.ప్ర.మూడవ.స.) ॥121॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సంకల్పమూలః కామో వై యజ్ఞాః సంకల్పసంభవాః । మూలశ్లోక సం. **60**
వ్రతాని యమధర్మాంశ్చ సర్వే సంకల్పజాః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **122[2.3]**

టీక:- "నేను నిష్కాముడను, నిష్కామి నవుతానని ఎవరైనా అన్నట్లయితే అది జరగని పని. కారణం, **సర్వే** = సర్వకామములు, **యజ్ఞాః వ్రతాని యమధర్మాః** = యజ్ఞాలు, సత్యభాషణాది వ్రతాలు, యమ-నియమాది సర్వ ధర్మాలు, **సంకల్పజాః** = సంకల్పం వల్లనే కలుగుతాయి, **కామః వై** = నిశ్చయంగా ప్రత్యేక కామం, **సంకల్పసంభవాః మూలః** =

సంకల్పమూలమే. అంటే సంకల్పం ద్వారానే ప్రతి కోరిక పూర్తవుతుంది. యమ-నియమాలు 4.204వ శ్లోక సమీక్షను చూడండి.

ఋషి దయానందభాష్యం:- కామము సంకల్పమూలమైనది. ఈ వస్తువులు కావాలని కోరడం సంకల్పం. దాని వల్లనే కామము పుడుతుంది. యజ్ఞములందాసక్తి సంకల్పం వల్లనే పుడుతుంది. వ్రతాలు, నియమాలు అన్నీ సంకల్పం వల్లనే పుడుతున్నవి. (స.ప్ర.10వ సము) ॥122॥

వివరణ:

యమనియమాల సమీక్షను 4.204లో చూడవలయును

ఇది మనుకృతం-ప్రామాణికం

అకామస్య క్రియా కాచిద్దృశ్యతే నేహ కర్హిచిత్ । మూలశ్లోక సం.**61**
యద్యద్ధి కురుతే కించిత్తత్తత్కామస్య చేష్టితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**123**[2.4]

టీక:- హి = ఎందుకంటే, **యత్ యత్ కించిత్ కురుతే** = హస్తపాదనేత్రాలు, మనస్సు మొ॥వి కదలడం, **తత్తత్ కామస్య చేష్టితం** = అవన్నీ కామం వల్లనే జరుగుతున్నవి. **అకామస్య**= ఇచ్ఛ (కోరిక) లేనట్లయితే, **కాచిత్క్రియా** = ఏ పని కూడా అంటే నేత్రాలు తెరచుకోవడం, మూసుకోవడం, **న దృశ్యతే** = జరగదు (కనిపించదు).

ఋషి దయానందభాష్యం:-లోకంలో కోరిక లేనివాడికి ఏ క్రియా లేదు. భోజనం చేయడానికి ఇచ్ఛ కలిగినప్పుడు మానవుడు భోజనం చేస్తాడు. నడచిపోవడానికి ఇచ్ఛ కలిగినప్పుడు నడచిపోతాడు. మనుషుడు చేసే ఒక్కొక్క క్రియకూడా కామము యొక్క వ్యాపారమే కాని, వేరు కాదు.

నిష్కామ పురుషుడిలో నేత్రసంకోచం గాని, వికాసం గాని జరగవు. దాన్ని బట్టి మనకు కచ్చితంగా తెలిసినది ఏమంటే 'మనం చేసే ప్రతి పనికీ కామం కోరికయే కారణం. (స.ప్ర.దశమ సముల్లాసం). ॥123॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తేషు సమ్యగ్వర్తమానో గచ్ఛత్యమరలోకతామ్ । మూలశ్లోక సం.**62**
యథా సంకల్పితాంశ్చేహ సర్వాన్ కామాన్ సమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **124** [2.5]

టీక:- తేషు = ఆ వేదోక్త ధర్మాలలో, **సమ్యగ్ వర్తమానః** = పూర్తిగా నిమగ్నుడైన వ్యక్తి, **అమరలోకతామ్ గచ్ఛతి** = మోక్షాన్ని పొందుతాడు, **చ** = మరియు, **యథా సంకల్పితాన్ సర్వాన్ కామాన్** = సంకల్పించిన సర్వకామములను, **ఇహ సమశ్నుతే**= చక్కగా పొందుతున్నాడు.

తాత్పర్యం:- ఫలేచ్ఛ లేకుండా మంచి తలంపు కలిగి కార్యములు చేసేవాడు మృత్యురహితమైన మోక్షాన్ని పొందుతున్నాడు. అలాంటి అమరత్వాన్ని పొంది ఐహికములైన సర్వ మనోరథాలను పొందుతున్నాడు. ॥124॥

వివరణ:

బూలర్ చేసిన ప్రక్షిప్తాల ఆరోపణ నిరాధారం:-

121-124 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తములని 'బూలర్ మొ॥ పాశ్చాత్య పండితులు చేసిన ఆరోపణ నిరాధారం. ఇక్కడ సకామత, అకామతలకు సందర్భం లేదని వారి వాదన. కానీ ఇది సరికాదు. 120-125 శ్లోకాలలో ధర్మలక్షణం చెప్పబడింది. అందులో వేదాలకు సర్వప్రథమ స్థానం ఉంది. ఈ శ్లోకాలు రాబోయే శ్లోకాలకు భూమికగా ఉన్నాయి. 121వ శ్లోకంలో ప్రయోగింప బడిన 'వేదాధిగమః' శబ్దం ద్వారా ఇది సూచించబడింది. అందువల్ల ఇక్కడ ప్రసంగ విరోధమేమీ లేదు.

ధర్మానికి మూలాధారం-మూలస్రోతస్సు- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదోఽఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్ । మూలశ్లోక సం.**63**
ఆచారశ్చైవ సాధూనామాత్మనస్తుష్టిరేవ చ ॥ ప్రక్షిప్తశ్లోక సం.**125** [2.6]

టీక:- **అఖిలః వేదః** = సంపూర్ణవేదం, ఋక్, యజుః, సామ, అథర్వణములనే నాలుగు వేదాలు, **చ** = మరియు, **తద్విదామ్** = వేదాలలో పారంగతులైన వారి, **స్మృతిశీలే** = విద్వాంసులచే రచిత స్మృతి గ్రంథాలు, వేదానుకూల ధర్మశాస్త్రాలు, వారిశ్రేష్ఠగుణసంపన్నమైన స్వభావం, **చ** = మరియు, **సాధూనాం + ఏవ + ఆచారః** = శ్రేష్ఠసత్యాచారణ తత్పరులైన సత్పురుషుల, సదాచారం గలవారి, **ఆత్మనః తుష్టిః** = తన ఆత్మకు సంతృప్తి అంటే తాను కర్మ చేస్తూన్నప్పుడు భయం గానీ లజ్జ గానీ లేదో, సాత్విక సంతుష్టి ప్రస్నత కలుగుతుందో [12.37] ఈ ఆచారాలు, **ధర్మమూలం** = ధర్మానికి ఆధారాలు.

ఋషి దయానందభాష్యం:- ధర్మానికి మూలాలు వేదాలు. అలాగే మనుస్మృతి, ఋషి ప్రణీత శాస్త్రాలు. సత్పురుషుల ఆచారాలు కూడా ధర్మానికి మూలం. ఏయే కర్మలలో ఆత్మ ప్రసన్నమై ఉండునో అదే ధర్మం.

ఏ పనులు చేసేప్పుడు. ఆత్మ ప్రసన్నమవుతుందో -అంటే సందేహం, భయం, సిగ్గు మొ॥ వి. కలుగవో, అలాంటి పనులు చేయడం ధర్మం. ఎవడైనా మిథ్యాభాషణం, చౌర్యం మొ॥వి. చేయాలని సంకల్పించినట్లయితే అతని ఆత్మకు భయం, శంక, సిగ్గు తప్పక కలుగుతాయి. కాబట్టి అలాంటి పనులను చేయరాదు (స.ప్ర.10వ స.).॥125॥

వివరణ:

ధర్మానికి 4 లక్షణాలు, వాటి స్వరూపం.

మనుస్మృతికి ఆధారభూతమైన శ్లోకాలలో ఈ శ్లోకం ప్రధానమైంది. ధర్మానికి నాలుగు లక్షణాలు తెలిపి వాటి స్వరూపాన్ని వివరిస్తున్నాడు.

1. వేదం

ధర్మానికున్న నాలుగు ముఖ్య సాధనాలలో ముఖ్యమైన సాధనం వేదం. [1.125(2.6).] ధర్మనిర్ణయంలో 4 వేదాలు పరమ ప్రమాణాలు. ధర్మజిజ్ఞా సమానానాం ప్రమాణం మరమం శ్రుతిః (1.32; 1.43) శ్రుతి ప్రామాణ్యతో విద్వాన్ స్వధర్మే నివిశేతవై [1.127]. వేదానికి 1-32; 62.13 'శ్రుతి' అని పేరుంది.[1.132 (2.13), 1.127] వేదాలు 'అపౌరుషేయాలు' ఈశ్వర రచితాలు. నాలుగు వేదాలు ధర్మానికి 'ప్రథమ జ్ఞాన స్రోతస్సులు'. అందువల్ల కుతర్కాన్ని ఆదారంగా చేసికొని వీటిని ఖండించరాదు. ఈ విధంగా వేదాలను అవమానించేవాడు 'నాస్తికుడు'. అతడు సమాజం నుండి 'బహిష్కరణకు యోగ్యుడు' (1.67). త్రయీ విద్యారూపములైన నాలుగువేదాలు-ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం,అథర్వణవేదం-అఖిలవేదాలని, పిలువబడతాయి (1.15, 11-30).

2. స్మృతి మరియు శీలములు

చతుర్వేదజ్ఞులు రచించిన స్మృతులు, వారి శ్రేష్ఠగుణ సంపన్నమైన స్వభావం-ధర్మానికి రెండో స్రోతస్సు (ఆధారం). ఈ స్మృతులకే ధర్మశాస్త్రాలని పేరుంది [1.129 (2.10)]. పూర్ణబ్రహ్మ-చర్యమును పాలించి, ధర్మాచరణపూర్వకంగా సాంగోపాంగంగా వేదాధ్యయనం, మననం చేసిన విద్వాంసులే ప్రామాణికమైన ధర్మశాస్త్ర రచయితలు (ప్రణేతలు) కాగలరు. అన్యులుకారు.

"అనామ్నాతేషు ధర్మేషు కథం స్యాదితి చేత్ భవేత్
యం శిష్టా బ్రాహ్మణాః బ్రూయుః స ధర్మః స్యాదశంకితః" **12-108**

'ధర్మేణాధిగతో యైస్తు వేదః సపరిబృంహణః
తే శిష్టా బ్రాహ్మణాః జ్ఞేయాః శృతిప్రత్యక్షహేతవః" **12-109**

వేదాలకు అనుకూలంగా ఉన్నంతవరకే స్మృతులు ప్రమాణాలు. స్మృతికారుల స్వభావం, శీలం కూడా వేదాలకు అనుకూలంగా ఉన్నంత వరకే ప్రమాణాలు. అప్పుడే అవి ధర్మస్రోతస్సులవుతాయి [12.106;12.94]

3. సదాచారం

ధర్మానికి మూడోది మూల స్రోతస్సు 'సదాచారం'. వేదవేత్తలైన విద్వాంసులు ఆచరించే శ్రేష్ఠమైన సత్యాచరణమే **"సదాచారం"**. ఎందుకంటే- వేదవేత్తల స్వభావం- ధర్మానికి రెండో లక్షణంగా చెప్పబడింది. స్వభావాను సారంగానే ఆచరణ ఉంటుంది. ఆ స్వభావం, ఆచరణం కూడా వేదవేత్తలకు సంబంధించినదిగా ఉండాలి. దీన్ని సమర్థిస్తూ మనుమహర్షి [1.136(2.20)] దివ్యగుణాలు కలిగిన విద్వాంసులచేత సుశోభితమైన దేశం "బ్రహ్మావర్త"మని వర్ణించారు. ఆ దేశమందుండే విద్వాంసుల ఆచారమే **'సదాచారం'**. [1.137(2.18)] వారి నుండే అందరూ శీల శిక్షణ పొందాలని సూచించాడు [1.139 (2.20)]. రాగద్వేషరహితులైన 'సదాచార' సంపన్నులైన విద్వాంసులు సేవించిన, హృదయపూర్వకంగా అభిమానించిన ఆచరణమే సదాచారం. అదే ధర్మమని అంగీకరించాడు. వేదాలలో అపారంగతులైన వారు వేదవిర్ధంగా ఆచరించినది సదాచారం కాదు. (సమీక్ష 1.108-110; 4.156-158 చూడండి).

4. 'ఆత్మనః తుష్టిః-స్వస్య ఆత్మనః ప్రియమ్" యొక్క స్పష్టీకరణ

ధర్మానికి నాల్గో మూలాధారం-**'ఆత్మసంతష్టి'** మరియు **'తన ఆత్మకు ప్రియమైన'** కార్యం. ఈ విషయం స్పష్టంగా ఆలోచించాలి. మానవులందరి ఆత్మలకు ప్రియమైన కార్యం ధర్మమవుతుందా? లేదా ఒక విశేషస్థాయికి చెందినవారి ఆత్మలకు ప్రియమైన కార్యమా? నిజం చెప్పాలంటే ప్రతి మానవుడి ఆత్మకు ప్రియమైన కార్యం ధర్మం కాదు. అయితే, వేదానుకూల ఆచరణ కలిగిన సద్గుణసంపన్నుల, పవిత్రులైన ధార్మిక విద్వాంసుల ఆత్మసంతుష్టి వారికి ప్రసన్నత కలిగించే కార్యమే ధర్మమవుతుంది. ప్రతి వాడికి ప్రియమైన కార్యం ధర్మమని అంగీకరించినట్లయితే ఈ కింద పేర్కొన్న ఆపత్తులు కలుగుతాయి.

విద్వద్భిః సేవితః సద్భిః నిత్యమద్వేషరాగిభిః ।
హృదయేనా భ్యనుజ్ఞాతో యో ధర్మస్తం నిబోధత ॥120॥ [2.1]

ఎవరికైనా... వారి వారి ఇష్టాలను ధర్మాలుగా అంగీకరించినచో ఈ క్రింది ఆటంకములు ఏర్పడును.

క. పై నాలుగు ధర్మ స్రోతస్సుల ఔన్నత్యం గంభీరతస్థాయి సమానంగా ఉండాలి. ఒక వైపు వేదధర్మ స్రోతస్సులుండగా మరొకవైపు నిమ్నాతినిమ్నమైన స్థాయివారుంటారు. ఈ విధంగా వ్యక్తుల సంఖ్యను బట్టి ఆత్మకుగల ప్రియకార్యముల కూడా వేరువేరుగా ఉంటాయి.

ఖ. ఆత్మ ప్రసన్నత యొక్క అభిప్రాయమేమి? ఎవరైనా కూడా నాకు కష్టం కలిగిస్తే, నేను వారికి కష్టం కలిగించరాదనే మాట నాకిష్టం లేదు. ఎదుకంటే? ఈ మాట ఎవరికి చెల్లుబాటవుతుంది? ఎవరికి భయం, శంక, లజ్జ ఉంటుందో వారి విషయంలో ఈ మాట చెల్లుబాటవుతుంది. ఇతరుల విషయంలో కాదు. ఇందులో అవ్యాప్తి దోషముంది. ఒక వ్యక్తి సంధ్యోపాసన, అగ్నిహోత్రం, విద్యాప్రాప్తి, శుద్ధి మొ॥ కర్తవ్యాలను పాటించడు. అతి ఇంద్రియాసక్తి, మూఢవిశ్వాసం గుడ్డినమ్మకాల విషయాలలో మునిగి ఉంటాడు. అలాంటివాడు- "ఈ విషయాలలో, నేను ఎవరిని ఏమన్నా ఇతరులు కూడా నన్నేమీ అనకూడదు. అంటే, నాకు బాధ కలుగుతుంది. అంటాడు కానీ ధర్మవిహితమైన విషయం అతనికి తప్పక చెప్పవలసి ఉంటుంది. అలాంటివాడికి దండించి చెప్పవలసిన విధానముంది.

గ. ఈ విధంగా దుష్టసంస్కారం, రాక్షసత్వం కలిగి, తమోగుణం ప్రధానమైన వాళ్ళు బాల్యం నుండి, జీవహత్య, మద్యమాంస భక్షణాదులు చేస్తూ ఉంటారు. వారికి ఈ పనులలో భయం గాని, లజ్జ గాని ఉండదు. అలాంటి వారి ఆత్మలకు ప్రియమైన కార్యాలన్నీ ధర్మాలు కావలసి వస్తుంది. ఇలాంటి ఆపత్తులున్నందు వల్ల అందరి ఆత్మలకు ప్రియమైనదల్లా ధర్మమని చెప్పడం సమంజసం కాదు.

అందువల్ల 'పుణ్యాత్ముల, విద్వాంసుల ఆత్మలకు ప్రియమైనదే ధర్మ'మని చెప్పబడింది. ఇందుకు కింద పేర్కొన్న ప్రమాణాలు చూపబడినవి.

ఘ. ధర్మకథన ప్రసంగంలో విద్వాంసులు కానివారిని ప్రమాణంగా మనువు స్వీకరించలేదు. వారి ఆత్మలకు ప్రియమైనదల్లా ధర్మమని అంగీకరించినట్లయితే గొప్పహాని కలుగుతుందని తలంచాడు. ఉన్నతస్థాయికి చెందిన విద్వాంసులనే ప్రమాణంగా అంగీకరించాడు (12.113-115). అందువల్ల విద్వాంసులుకానివారి ఆత్మలకు ప్రియమైన కార్యం ధర్మలక్షణం కాజాలదు.

ఙ. ప్రతి విషయంలో వేదాలకు అనుకూలమైన విషయమే ధర్మమని ఇతరం కాదని మనువు యొక్క కచ్చితమైన అభిప్రాయం [1.127(2,8), 128(2.9) 12.94]. ఈ విధంగా వేదాలకు అనుకూలంగా కాని కర్మ, ఆత్మకు ప్రియమైనప్పటికీ ధర్మలక్షణం కాదని ఖండించాడు.

చ. ఆత్మతుష్టి విషయం వచ్చినప్పుడు అన్ని సమయాల్లో విద్వాంసుల కర్తవ్యాలను గురించిన ప్రసంగంలోనే మనువు స్పష్టం చేశాడు. ఉన్నతస్థాయికి చెందిన విద్వాంసులు, ధర్మాత్ములు, సద్గుణసంపన్నులుగా ఉన్నవారి ఆత్మలకు ప్రియమైన కర్మలకే ధర్మమని గట్టిగా చెప్పారు.

ఛ. ఆత్మకు ప్రియమైందంటే అభిప్రాయమేమి? ఏ కర్మ చేయడంలో ఆత్మకు, భయం గాని, శంక గాని, లజ్జ గాని కలుగదో, అలాంటి కర్మే ఆత్మకు ప్రసన్నతను కలిగిస్తుంది. ఇందుకు భిన్నమైన కర్మ 'ఆత్మకు ప్రియమని చెప్పజాలం [4-4.161; 8.96]. అలాంటి కర్మ కేవలం సాత్త్విక కర్మే అవుతుంది [చూడండి 12.27,37 శ్లోకాలు]. ఇందుకు భిన్నంగా రజోగుణ-తమోగుణాలు ప్రధానమైన కర్మలు ఆత్మకు (తుష్టిని) సంతోషాన్ని కలిగించవు, [12.33,35]. ఒకవేళ అన్యకర్మలు ఆత్మకు ప్రసన్నతను కలిగించినా అది వాస్తవికం కాదు. మనువు ఈ విషయాన్ని స్పష్టపరుస్తూ-ఇలా అన్నాడు-

(అ) "సత్త్వస్య లక్షణం ధర్మః" ॥12.38॥

(ఆ) "వేదాభ్యాసస్తపో జ్ఞానం శౌచమిన్ద్రియనిగ్రహః।
ధర్మక్రియాత్మచిన్తా చ సాత్త్వికం గుణలక్షణమ్ ॥ 12-31

యత్ సర్వేణేచ్ఛతి జ్ఞాతుం యన్న లజ్జతి చాచరన్ ।
యేన తుష్యతి చాత్మాస్య తత్ సత్త్వగుణలక్షణమ్॥ 12.31

వేదాభ్యాసం, తపస్సు, జ్ఞానం, శౌచం, ఇంద్రియనిగ్రహం, ధర్మచింతన, ఆత్మచింతన మొ॥వి. సాత్త్విక గుణాలు. ఈ ప్రమాణయుక్త వివేచననుబట్టి-సత్త్వగుణసంబంధి కార్యాలవల్ల 'ఆత్మకు ప్రసన్నత లభిస్తుందని స్పష్టమవుతుంది. సత్త్వగుణం కలిగిన వ్యక్తుల ఆత్మసంతోషమే ధర్మ లక్షణం. అందువల్ల శ్లోకోక్తమైన అర్థమే మను సమ్మతం.

వేదం తరువాత వచ్చిన సర్వధర్మ గ్రంథాలకు వేదానుకూలంగా ఉండుటే అనివార్యమని మను అభిప్రాయం. ప్రతిధర్మాన్ని శ్రుతిప్రామాణ్యతననుసరించే స్వీకరించాలని మను నియమం.

ధర్మమంటే ఏమిటి? ఇందులో జ్ఞానం కోసం 1.2వ శ్లోకం-వివరణ చూడండి. "ఆత్మానుకూల ధర్మాన్ని స్వీకరించాలి".

ఈ శ్లోకం ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* వేదం సర్వజ్ఞాన మయం

* యః కశ్చిత్కస్యచిద్ధర్మో మనునా పరికీర్తితః ।
స సర్వోఽభిహితో వేదే సర్వజ్ఞానమయో హి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***126[2.7]***

తాత్పర్యం:- అలాంటి వేదాల నుంచి ఉద్ధరించబడిన ధార్మికుల ఆచారాలే లోకానికి ప్రమాణం. కాబట్టి ఎవరికి ఏ యే ధర్మాలు మనువుచేత చెప్పబడ్డాయో అవన్నీ వేదంలోనే ఏనాడో ఉన్నట్టివని మొదట తెలియాలి. మనువు సర్వ జ్ఞానస్వరూపుడు కాబట్టి, అతడు చెప్పినదంతా వేద ప్రామాణ్యమున్నదేనని గ్రహించాలి.॥126॥

ప్రక్షిప్త పరిశీలన

126వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం-

1. శైలీగత ఆధారం

క. మనుస్మృతి మౌలికంగా ఏదైనా ఒక గ్రంథమో, శాస్త్రమో కాదు.దీని ప్రవచనశైలి మౌలికంగా దీన్ని ప్రవచనాలు గానే చూపుతుంది. ఈ శ్లోకంలో భూతకాలిక క్రియా ప్రయోగంతో దీన్ని మౌలికంగా ఒక గ్రంథం లేదా శాస్త్రం గానే చూపుతుంది. 'ప్రవచనాం' తర్వాత మనుస్మృతి 'సంకలన' రూపంలో వచ్చిన తర్వాతే పైన చెప్పుకున్న ప్రశంసాత్మక శ్లోకం రచించి మధ్యలో ఇరికించారు. అందువల్ల అది ప్రక్షిప్తం. (దీనిపై విస్తృత సమీక్షకు 1.58-59 శ్లోకాల '**శైలీగత ఆధారాలు**' శీర్షికలో సంఖ్య-1లో చూడండి)

ఖ. 126వ శ్లోకంలో '**మనునా పరికీర్తితః**' అనటం వల్ల, ఇది మనువు కాకుండా వేరెవరో రచించినట్లు తెలిసిపోతుంది. కనుక ప్రక్షిప్తం.

2. ప్రసంగవ్యతిరేకం

క. పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకంగా ఉంది. ముందు వెనుకల గల శ్లోకాలలో ధర్మమూలలు, వాటి వివరణా ఉన్నాయి. 125వ శ్లోకంలో ధర్మమూలాలు, 127-129 శ్లోకాలలో వాటి మూలాలను స్వీకరించిన కథనం, విశ్లేషణ ఉన్నాయి. మధ్యలో ఈ శ్లోకం వల్ల వాటి క్రమం భంగమైంది. అందుచేత ఇది ప్రసంగ వ్యతిరేకం.

ఖ. 126లో మనవు '**ఏది ఎవరి ధర్మమని చెప్పారో**' అని చెప్పాడని ఉంది. కానీ ఇంత వరకు ఏ ధర్మమూ చెప్పలేదు. పైన చెప్పింది మిగిలిన అన్ని ధర్మాలూ చెప్పిన తర్వాతైనా ఉండాలి. లేదా, ఈ ధర్మకథనానికి ప్రారంభంలోనైనా ఉండాలి. ఇక్కడ ఈ రెండూ జరగలేదు. ధర్మాలను గురించి 1.144లో '**వర్ణ ధర్మాన్నిబోధత**' అని చెప్పిన తర్వాత, 2.1తో మొదలవుతుంది. దాని కన్నా ముందే భూతకాలిక ప్రయోగం చేయడం అసంగతం. ఈ విధంగా ఈ శ్లోకం సందర్భోచితం కాదు కనుక ప్రక్షిప్తం.

127 నుండి 134వ శ్లోకం వరకు మనుకృతం ఇవి ప్రామాణికం

ఆత్మానుకూల ధర్మ గ్రహణము

సర్వం తు సమవేక్ష్యేదం నిఖిలం జ్ఞానచక్షుషా । మూలశ్లోక **సం.64**
శ్రుతిప్రామాణ్యతో విద్వాన్ స్వధర్మే నివిశేత వై ॥ ప్రక్షిప్త శ్లోక సం. **127[2.8]**

టీక:- విద్వాన్ = విద్వాంసుడు, **ఇదం సర్వం తు నిఖిలం సమవేక్ష్య** = సంపూర్ణ శాస్త్రం, వేదం, సత్పురుషుల ఆచారం, తన ఆత్మకు విరుద్ధం కానివిగా విచారించి (1.125లో వర్ణించినట్లుగా), **జ్ఞానచక్షుషా** = జ్ఞాననేత్రంద్వారా, **శ్రుతిప్రామాణ్యతః** = శ్రుతిని ప్రామాణికంగా భావించి, **స్వధర్మే వై నివిశేత** = స్వాత్మానుకూల ధర్మంలో ప్రవేశించాలి.

ఋషి దయానందభాష్యం:- వివేచనాశీలుడైనవాడు ఈ ధర్మశాస్త్రాన్నంతటినీ తన జ్ఞాన నేత్రం చేతనే అవలోకించగలడు. 'ఇది వేద విహిత ఆచారాల క్రోడీకరణ' అని ఎవరు గ్రహిస్తారో, వారు స్వధర్మాచరణంలో నిష్ఠగా ఉండగలరు.

వేదాజ్ఞానం గల విద్వాంసులు, మహాఋషులచే రచింపబడిన శాస్త్రాలు, సత్పురుషుల ఆచారాలు, తమ ఆత్మకు అవిరుద్ధమై ఉన్నవి. కాబట్టి వీటినన్నింటిని చక్కగా ఆలోచించి జ్ఞాననేత్రమును పొంది శ్రుతుల యొక్క ప్రమాణాలచే స్వాత్మానుకూల ధర్మమునందు ప్రవేశించాలి. (స.ప్ర.10వ.స.)॥127॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శ్రుతి-స్మృత్యుక్త ధర్మానుష్ఠాన ఫలం

శ్రుతిస్మృత్యుదితం ధర్మమనుతిష్ఠన్ హి మానవః । మూలశ్లోక సం.**65**
ఇహ కీర్తిమవాప్నోతి ప్రేత్య చానుత్తమం సుఖమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**128[2.9]**

టీక:- **హి** = ఎందుకంటే, **మానవః** = మననశీలుడైన మనుషుడు, **శ్రుతిస్మృత్యుదితం** = శ్రుతులు (వేదాలు), **స్మృతులు** = వేదవిరుద్ధం కాని ధర్మశాస్త్రాలు బోధిస్తే, **ధర్మమ్ + అనుతిష్ఠన్** = ధర్మాన్ని ఆచరిస్తూ, **ఇహ కీర్తిం చ ప్రేత్య అనుత్తమం సుఖమ్** = ఈ లోకంలో కీర్తినీ, పరలోకంలో సర్వోత్తమ సుఖాలనూ, **అవాప్నోతి** = పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:- మననశీలురైన మనుషులు శ్రుతులలోను, స్మృతులలోను చెప్పబడిన ధర్మాన్ని అనుష్ఠిస్తూ ఇహలోకంలో సుఖాన్ని, పరలోకంలో మోక్షాన్ని పొందగలుగుతారు.

వేదోక్త ధర్మాన్ని వేదానుకూల స్మృతి ధర్మాన్ని అనుష్ఠించువాడు ఇహలోక కీర్తిని, పరలోక సుఖాన్ని పొందుతాడు. (స.ప్ర.10వ.స.) ॥128॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శ్రుతి స్మృతుల పరిచయం

శ్రుతిస్తు వేదో విజ్ఞేయో ధర్మశాస్త్రం తు వై స్మృతిః । మూలశ్లోక సం.**66**
తే సర్వార్థేష్వమీమాంస్యే తాభ్యాం ధర్మో హి నిర్బభౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**129 [2.10]**

టీక:- **శ్రుతిః తు వేదః విజ్ఞేయః** = శ్రుతి అంటే వేదమే; మరియు **ధర్మశాస్త్రం తు వై స్మృతిః** = స్మృతే ధర్మశాస్త్రం, **తే** = ఈ రెండు (శ్రుతులు, స్మృతులు' **సర్వార్థేషు** = ఏ పరిస్థితులలోనైనా, ఏ విషయాలందైనా, **అమీమాంస్యే** = కుతర్కం చేయవలసినవి కావు. అంటే ఇవి ప్రతిపాదించిన విషయాలను కుతర్కం చేసి ఖండించరాదు. (తరువాత 130 శ్లోకంలో ఈ విషయాన్నే సమర్థించాడు.) (మీ) ఎందుకంటే **తాభ్యాం** = రెండురకాలైన శాస్త్రాల నుండి, **ధర్మః** = ధర్మం, **నిర్బభౌ** = ఉత్పన్నమైంది.

తాత్పర్యం:- ఏవి శ్రుతులు? ఏవి స్మృతులు? అనే సందేహం నివృత్తి చేస్తున్నాను. వేదములనే **'శ్రుతులు'** అంటారు. ధర్మశాస్త్రాలను **'స్మృతులు'** అంటారు. ఈ రెండింటిలోని అంశాలపై వితర్కం-కుతర్కం పనికిరాదు. ఈ రెండింటి వల్లనే మన ధర్మాలు ఎంతో వికసించి వ్యాప్తమవుతున్నాయి.

వివరణ:

వేద-శ్రుతినామములు:-ఈ విషయాలలో శ్రీదయానందులవారిట్లు రాశారు. అర్థభేదాన్ని బట్టి వేదాలకు- వేదాలు, శ్రుతులు అని రెండు పేర్లు వచ్చాయి. **విద్-జ్ఞానే** = జ్ఞానార్థకమొకటి, రెండోది, **విద్ సత్తాయాం** = సత్తార్థకమైంది. మూడోది, **(విద్‌లాభే)**- లాభార్థకం. నాలుగోది**(విద్ విచారే)** = విచారార్థకం. ఈ నాలుగు ధాతువులకు కరణ, అధికరణ కారకాలలో **'ఘఞ్'** ప్రత్యయం చేర్చగా **'వేద'** శబ్దం నిష్పన్నమవుతుంది. అలాగే **శ్రు** = శ్రవణే అర్థంలో "దేన్ని విన్నందువల్ల యథార్థవిద్య జ్ఞానం కలుగుతుందో, దానివల్ల **'ఋక్'** మొదలైన సంహితలకు వేదనామం. అలాగే, సృష్టి ఆరంభం నుండి నేటివరకు. బ్రహ్మ మొ॥ వారి నుండి మను పర్యంతం దేనివల్ల మనం సమస్తమైన సత్యవిద్యలను వింటున్నామో, వాటికే వేదాలని పేరు, వాటికే శ్రుతులని కూడా పేరు (ఋ.భా.భూమిక). ఛందం, మంత్రం ఈ రెండు శబ్దాలు ఏకార్థవాచకాలు. అంటే సంహితాభాగానికి నామాలు. అలాగే 'నిగమం' శ్రుతి, కూడా వేదానికి నామములే (ఋ.భా.భూ.).

శ్రుతి-స్మృతులను అవమానించేవాడు నాస్తికుడు ఇది మనుకృతం-ప్రామాణికం

యోఽవమన్యేత తే మూలే హేతుశాస్త్రాశ్రయాద్ద్విజః । మూలశ్లోక సం.**67**
స సాధుభిర్బహిష్కార్యో నాస్తికో వేదనిందకః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**130[2.11]**

టీక:- యః ద్విజః = ఏమనుషుడైనా, **తే మూలే** = వేదం, వేదానుకూలమైన ఆర్షగ్రంథాలను, **హేతుశాస్త్రాశ్రయాత్** = తర్కశాస్త్రాన్ని ఆధారంగా చేసికొని, **అవమన్యేత** = అవమానిస్తాడో, నిందిస్తాడో, **సః** = అతడు, **సాధుభిః బహిష్కార్యః** = శ్రేష్ఠపురుషుల ద్వారా బహిష్కరింపబడాలి. అంటే జాతిబాహ్యుడిగా వెలివేయాలి. కారణం ఏమంటే, **వేదనిందకః** = వేదాన్ని నిందించువాడు, **నాస్తికః** = నాస్తికుడు.

ఋషి దయానందభాష్యం:- ప్రమాణదాయకమైన శ్రుతి-స్మృతులను హేతువాదం చేతనో, తర్కబుద్ధి చేతనో చర్చించినా-దూషించినా-అవమాన పరిచినా-పరోక్షంగా విమర్శించినా అలాంటి నాస్తికుణ్ణి, వేదదూషణపరుణ్ణి జాతినుంచి బహిష్కరించాల్సి ఉంటుంది.

కుతర్కం ద్వారా ఎవడు వేదాన్ని, ధర్మశాస్త్రాలను అవమానిస్తాడో, వేదవిరుద్ధంగా స్వార్థం కోసం ప్రయత్నిస్తాడో అలాంటి వాడిని సంఘం నుండి వెలివేయాలి. ఇది శ్రేష్ఠ పురుషుల కర్తవ్యం. ఎవడు వేదాన్ని, వేదానుకూలములయిన ఆప్తపురుష నిర్మితశాస్త్రాలను నిందిస్తాడో, అలాంటి నాస్తికుణ్ణి జాతిపంక్తుల నుండి, దేశాల నుండి కూడా బహిష్కరించాలి (స.ప్ర.10వ స.). ॥130॥

వివరణ:

తర్కశబ్దవివేచనం:- ఇక్కడ తర్కమంటే న్యాయోచితమైన తర్కం కాదు కుతర్కమని అభిప్రాయం. మనువు "అవమన్యేత" అనే క్రియాపదాన్ని ప్రయోగించాడు. అంటే **'తర్కశాస్త్రాన్ని అడ్డు పెట్టుకొని కుతర్కం ద్వారా అవమానించడం'** అని అర్థం.

(క) కొన్ని విషయాలు తర్కానికి అందవు. ఉదాహరణకు-ఈశ్వర రచిత జగత్తు యొక్క ప్రళయావస్థ మానవ బుద్ధికి అందదు. అది అప్రతర్క్యం. అంటే మానవ బుద్ధి గమ్యం కానిది. 129-130లో అప్రతర్క్యం అని చెప్పబడింది. అదేవిధంగా ఈశ్వర ప్రదత్త వేదజ్ఞానం కూడా అచిన్త్యం, అప్రమేయం, అప్రతర్క్యం. అంటే మనుష్య బుద్ధికి పూర్ణంగా గమ్యం కాదు (1.3, 21,23). వేదజ్ఞానం బుద్ధిసంగతంగా ఉంటుంది. అందువల్ల ఎవరు కూడా వేదాన్ని తర్కించవలసిన పనిలేదు. కావాలని ఎవరైనా తర్కించినట్లయితే అది కుతర్కమవుతుంది.

(ఖ) ధర్మనిర్ణయంలో తర్కాన్ని ప్రమాణంగా మనువు ఇతర శాస్త్రజ్ఞులు అంగీకరించారు. అయితే తర్కించేవాడు ఎలా ఉండాలో కూడా నిర్ణయించారు. తత్త్వజ్ఞాని, శాస్త్రవేత్త అయిన వాడికే తర్కించే యోగ్యత ఉంటుంది. ఇతరులకు ఆ శక్తి ఉండదు. "తర్కించిన తరవాతనే ధర్మాన్ని స్వీకరించమని మనువు అభిప్రాయం. అయితే తర్కించడానికి యోగ్యుడెవడో స్పష్టపరిచారు.

(అ) **"ప్రత్యక్షం చానుమానం చ శాస్త్రం చ వివిధాగమమ్**
త్రయం సువిదితం కార్యం ధర్మశుద్ధిమభీప్సతా ॥ 12-105

(ఆ) **ఆర్షం ధర్మోపదేశం చ పేదశాస్త్రవిరోధినా ।**
యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః ॥ 12-106

(ఇ) **త్రైవిద్యో హేతుకస్తర్కీ నైరుక్తో ధర్మపాఠకః-పరిషద్స్యాద్దశావరా ।**
త్రయశ్చాశ్రమిణః పూర్వే పరిషత్స్యాద్దశావరా ॥ 12-111

(గ) తర్కమును ఋషిరూపంగా నిరుక్త శాస్త్రం వర్ణించింది.

తద్వారా వేదమంత్రాలకు అర్థం చెప్పాలని శాసించింది. అందుకు సమర్థులు ఋషులు, తపః సంపన్నులు మాత్రమే యోగ్యులు. అల్పవిద్యావంతులు తర్కించడానికి యోగ్యులు కారని స్పష్టం చేసింది.

"అపి శ్రుతితోఽపి తర్కతః, నతు పృథక్త్వేన మన్త్రాః నిర్వక్తవ్యాః,
ప్రకరణశః ఏవ తు నిర్వక్తవ్యాః, నహ్యేషు ప్రత్యక్షమస్త్యనృషే

రతపసో వా । పారోవర్యవిత్సు తు ఖలు వేదితృషు భూయోవిద్యః ప్రశస్యో భవతి'
ఇత్యుక్తం పురస్తాత్. మనుష్యా వా ఋషిషూత్క్రామత్సు వేదానబ్రువన్,
కో న ఋషిర్భవిష్యతీతి? తేభ్య ఏతం తర్కమృషిం
ప్రాయచ్ఛన్ మన్త్రార్థచిన్తాభ్యూహమభ్యూఢమ్; (పరిశిష్ట నిరుక్తం) 11.13

దీని ఆధారంగా, ఉపర్యుక్తమైన యోగ్యతలు లేని వ్యక్తులు తర్కించడానికి అయోగ్యులని మనుమహర్షి భావన. ముఖ్యంగా వేదాల తదనుకూలమైన శాస్త్రాల విషయంలో ఈ ఉదేశాలననుసరించే 1-67వ ఈ శ్లోకాలలో వేదాది శాస్త్రాలు సందేహింపతగవని, తర్కం ద్వారా అవమానించరానివని చెప్పబడింది.

ధర్మానికి 4 ఆధారభూత లక్షణాలు ఇది మనుకృతం-ప్రామాణికం

వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః । మూలశ్లోక సం. **68**
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **131** **[2.12]**

టీక:- వేదః స్మృతిః సదాచారః = వేదం, స్మృతి, సత్పురుషుల ఆచరణ, **చ** = మరియు, **స్వస్య ఆత్మనం ప్రియం** = తన ఆత్మజ్ఞానానికి విరుద్ధం కాని ప్రియాచరణ, **ఏతత్ చతుర్విధం ధర్మస్య లక్షణం** = ఈ నాలుగు ధర్మాలకు లక్షణాలు, అంటే వీటి ద్వారానే ధర్మం తెలియబడుతుంది, **సాక్షాత్** = ప్రత్యక్షం చేసేవి.

ఋషి దయానందభాష్యం:- వేదం, స్మృతి, సదాచారం, తన మనస్సుకు ఇష్టాన్ని చేకూర్చేవి. ఈ నాలుగూ ధర్మానికి గల ప్రత్యక్ష లక్షణాలుగా గుర్తించవలసిందని విజ్ఞుల ఉవాచ.

(1) శ్రుతి (వేదాలు), (2) స్మృతి-వేదానుకూలం, ఆప్తోక్తం అయిన, మనుస్మృత్యాతి శాస్త్రం, (3) సత్పురుషుల ఆచారం, వేదం ద్వారా పరమేశ్వర ప్రతిపాదిత కర్మ, (4) తన ఆత్మకు ప్రియమైంది, ఆత్మకోరునట్టిది సత్యభాషణం- ఈ నాలుగు ధర్మాలకు లక్షణాలు. వీటిద్వారానే ధర్మం నిర్ణయించబడుతుంది. పక్షపాతరహితంగా న్యాయమైన సత్యాన్ని స్వీకరించడం, అసత్యాన్ని సర్వథా త్యజించడమే ఆచారం. దీన్నే ధర్మమంటారు. ఇందుకు భిన్నంగా, పక్షపాతంతో కూడిన అన్యాయాచరణం, సత్యత్యాగం, అసత్యగ్రహణరూపమైన కర్మే అధర్మం (స.ప్ర. 3వ.స.).॥131॥

వివరణ:

(క) ధర్మాధర్మాల మూలస్రోతస్సులను గురించి ప్రామాణికం, విస్తృతమైన వివేచనాన్ని. 1.125 మంత్ర సమీక్షలో చూడగలరు.

(ఖ) ఋషి దయానందులవారు దార్శనిక సిద్ధాంతాల ఆధారంగా ధర్మానికి వ్యాఖ్యచేశారు.

(అ) **"యతోఽభ్యుదయనిఃశ్రేయససిద్ధిః స ధర్మః"** (వైశేషికం-1.1.2)

దేన్ని ఆచరించడం ద్వారా ప్రపంచంలో ఉత్తమ సుఖం, నిఃశ్రేయసం అంటే మోక్షసుఖం లభిస్తుందో-దాని పేరే ధర్మం.

(ఆ) **"చోదనా లక్షణోఽర్థో ధర్మః** (పూర్వమీమాంస-1.1.2)

ఏ కర్మలు చేయుమని ఈశ్వరుడు వేదాల ద్వారా ఆజ్ఞాపించినాడో అదే ధర్మం. ఏ కర్మలు చేయుమని ప్రేరేపించలేదో అవి ధర్మాలు కావు. అధర్మాలు. అధర్మం ఆచరించడం అనర్థదాయకం. ధర్మం ఆచరించడమే మానవత్వం (ఋ.భా.భూ. 115).

ధర్మజిజ్ఞాసలో శ్రుతే పరమప్రమాణం

ఇది మనుకృతం-ప్రామాణికం

అర్థకామేష్వసక్తానాం ధర్మజ్ఞానం విధీయతే । మూలశ్లోక సం. **69**
ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **132 [2.13]**

టీక:- అర్థకామేషు +అసక్తానాం = ఏ పురుషులు, అర్థంలోనూ సువర్ణాది రత్నాలలోనూ, **కామ** = స్త్రీ, సేవనాదులలో చిక్కుకోరో, **ధర్మజ్ఞానం విధీయతే** = వారికి మాత్రమే ధర్మ సంబంధమైన జ్ఞానం కలుగుతుంది, **ధర్మం జిజ్ఞాస మానానాం** = ఎవరికి ధర్మాన్ని తెలిసికోవాలనే జిజ్ఞాస కలదో వారికి, **ప్రమాణం పరమం శ్రుతిః** = వేదం ప్రమాణం. వేదం ద్వారా ధర్మాన్ని నిర్ణయించుకోగలరు. ధర్మాధర్మనిర్ణయం వేదాన్ని చూడకుండా చేయలేము.

ఋషి దయానందభాష్యం:- ధనం మీద, స్త్రీలమీద కోరికలు పెంచుకోని వారికే ధర్మజ్ఞానం సిద్ధిస్తుంది. ధర్మాన్ని తెలుసుకోగోరే వారికి వేదమే పరమప్రమాణం. ద్రవ్యలోభం గాని, విషయసేవాసక్తి గాని లేనివారికి మాత్రమే ధర్మం బోధపడుతుందని తెలుసుకోవాలి. (స.ప్ర. 10వ.స.). ॥132॥

వేదోక్తమైన సర్వవిధానాలు ధర్మమే

ఇది మనుకృతం-ప్రామాణికం

శ్రుతిద్వైధం తు యత్ర స్యాత్తత్ర ధర్మావుభౌ స్మృతౌ । మూలశ్లోక సం. **70**
ఉభావపి హితౌ ధర్మౌ సమ్యగుక్తౌ మనీషిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **133 [2.14]**

టీక:- యత్ర తు శ్రుతి ద్వైధం స్యాత్ = ఎక్కడ వేదాలలో రెండు విభిన్నమైన ఆదేశాలు చెప్పబడినవో, **తత్ర**=అక్కడ, అలాంటి సందర్భంలో, **ఉభౌ** = ఆ రెండు కూడా, **ధర్మౌ స్మృతౌ** = ధర్మాలుగా అంగీకరించాలి, **మనీషిభిః** = విద్వాంసులద్వారా, **తౌ ఉభౌ సమ్యక్ ధర్మౌ ఉక్తౌ** = ఆ రెండు కూడా ధర్మాలుగా స్వీకరించబడినవి.

తాత్పర్యం:- ఎక్కడ ఈ శ్రుతులలో పరస్పరం తేడా కనిపిస్తున్నదో, అక్కడ రెండు ధర్మాలనూ స్వీకరించాలి. విద్వాంసులయినవారు ఈ రెండింటినీ మథించి-మనః ప్రమాణాన్ని అనుసరించి ఆ యా సందర్భాలలో ఆయా ధర్మాచరణ చేయాలి.॥134॥

రెండు ఆదేశాల ఉదాహరణ-నిష్కర్ష

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉదితేఽనుదితే చైవ సమయాధ్యుషితే తథా । మూలశ్లోక సం. **71**
సర్వథా వర్తతే యజ్ఞ ఇతీయం వైదికీ శ్రుతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **134 [2.15]**

టీక:- ఉదితే = సూర్యోదయ సమయంలో, **చ** = మరియు, **అనుదితే** = సూర్యాస్తమయ సమయంలో, **తథా** = అలాగే, **సమయాధ్యుషితే** = ఏదైనా నిర్ణయించిన సమయంలో, లేదా ప్రత్యేకించి ఏర్పరచిన సమయంలో, **సర్వథా యజ్ఞః వర్తతే** = అన్ని పరిస్థితులలోనూ యజ్ఞం చేయవలసిందే, **ఇతీయం వైదికీ శ్రుతిః** = ఈ విధంగా ఈ మూడు కూడా ధర్మాలే, వేదానుకూలాలే ।

తాత్పర్యం:- సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో లేదా ప్రత్యేకించి ఏర్పాటు చేయబడిన సమయంలో లేదా ఎట్టి పరిస్థితులలోనైనా యజ్ఞం చేయాలి. ఇది వైదిక కర్మ. కొన్ని ధర్మాలు అతిసూక్ష్మమైనవి. ఇది చెప్పబడినదా? చెప్పబడలేదా? అని సంశయించక రెండు విధాలా ఆచరించడం శ్రేయోదాయకమే! ॥134॥

ఈ శ్లోకం ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ఈ శాస్త్రాధ్యయనానికి అధికారి-

* నిషేకాదిశ్మశానాంతో మంత్రైర్యస్యోదితో విధిః ।
తస్య శాస్త్రేఽధికారోఽస్మిన్ జ్ఞేయో నాన్యస్య కస్యచిత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***135[2.16]***

తాత్పర్యం:- గర్భాధానం మొదలు శవయాత్ర (మరణం) వరకూ గల షోడశ సంస్కారాలను ఏ ద్విజుడు తర్కాతీతంగా-వేదోక్తంగా గ్రహించి ఆచరిస్తాడో అలాంటివాడికే ఈ మనుస్మృతి చదివే అధికారం ఉంది. ఆచరణ విషయమై బ్రాహ్మణుడి ద్వారానే ఇతర వర్ణాలవారు వినవలసి ఉంది.॥135॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం ఈ కింది 'ఆధారాల' ప్రకారం ప్రక్షిప్తం-

1. ప్రసంగ వ్యతిరేకం

క. ఇది పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకంగా ఉంది. ఇక్కడ ముందు వెనుకల ప్రసంగాలలో ధర్మాల లక్షణాలు, వాటి విశ్లేషణ జరుగుతూంది. 127-134లలో ఇతర లక్షణాలను చెప్పి, 136, 137లలో మిగిలిన 'సదాచారాల'ను వివరించారు. ధర్మపు నాలుగు లక్షణాలను చెప్పవలసిన ఈ ప్రసంగాన్ని ఈ శ్లోకం భంగపరచింది. మధ్యలో అసందర్భంగా శాస్త్రాల అర్హతలను చెప్పింది. పూర్వాపర విషయాలకు వ్యతిరేకం కావడం చేత, ఇది ప్రక్షిప్తం.

ఖ. ఈ శ్లోకం కనుక మౌలికమైతే, స్థానం దృష్ట్యా ఇది గ్రంథ ప్రారంభంలో ఉండాలి కాని చివరలో. లేదా మధ్యలో ఉండడం ఉచితం కాదు. అందువల్ల ఇది అసందర్భమూ, ప్రక్షిప్తమూ.

2. శైలీగత ఆధారం

మౌలికంగా మనుస్మృతి ప్రవచనం. అందుచేత దీన్ని **'శాస్త్రం'** అనటంకుదరదు. ఈ పేరు దీనికి **'సంకలన'** రూపం ధరించాక వచ్చింది. (విస్తార వివరణకు చూడండి 1.58,59 శ్లోకాలపై **'శైలీగత ఆధారాలు'** అనే సమీక్ష). ఈ దృష్టితో ఈ శ్లోకం తరువాతిది, మౌలికం కాదు, అందుచేత ప్రక్షిప్తం.

3. విషయవ్యతిరేకం

1.4, 5,1.44 'సంకేతక' శ్లోకాల ప్రకారం ఈ ధర్మోత్పత్తి విషయం ప్రాచుర్యంలో ఉంది. దీనికి సంబంధించిన శ్లోకాలే ఇక్కడ విషయ సంగతాలు అవుతాయి కానీ, ఇతరాలు కావు. ఇక్కడ శాస్త్ర పఠన అర్హత విషయం విషయవ్యతిరేకం. ఇందులో నాలుగు వర్ణాలవారి కర్తవ్యాలు చెప్పటం వల్ల, నాలుగు వర్ణాల వారూ పఠనార్హులే.

136, 137వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

బ్రహ్మావర్తదేశానికి హద్దులు

సరస్వతీదృషద్వత్యో ర్దేవనద్యోర్యదంతరమ్ । మూలశ్లోక సం. **72**
తం దేవనిర్మితం దేశం బ్రహ్మావర్తం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **136[2.17]**

టీక:- దేవనద్యోః సరస్వతీ దృషద్వత్యోః = దేవనది, దివ్యగుణయుక్తులై దివ్యాచరణ సంపన్నులైన విద్వాంసుల నివాసస్థానమైన సరస్వతీనది, దృషద్వతీనదీ ప్రదేశాల మధ్య, **యదంతరం** = మధ్య ఉన్న ప్రదేశం, **దేవనిర్మితం దేశం** = దివ్య గుణాలతోనూ, దివ్యాచరణాలతోనూ పుణ్యపురుషులు నివసించే దేశానికి, **బ్రహ్మావర్తం** = బ్రహ్మావర్తమని పేరు.

వివరణ:దేవశబ్దానికి-దివ్యగుణాలు, దివ్యాచరణం కలవారనే అర్థం శాస్త్రప్రసిద్ధమైనది. అధికంగా తెలిసికోడానికి 3-82వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

ఋషిదయానందభాష్యం:- సరస్వతి-దృషద్వతి అనే దేవనదుల మధ్య గల ప్రదేశాన్ని దేవనిర్మితం అనీ-దీన్నే బ్రహ్మావర్తమనీ వ్యవహరిస్తున్నారు. కొందరు ఆర్యావర్తమంటున్నారు. 'ఆర్య' గౌరవ వాచకం. ॥136॥

మహర్షి దయానందులవారు 'బ్రహ్మావర్తనమునకు' బదులుగా, 'ఆర్యావర్త' పాఠమును గ్రహించి, ఈ విధంగా వ్యాఖ్య చేశారు. "దేవనద్యోః సరస్వతీ దృషద్వత్యోః" దేవనదులు దేవవిద్వాంసుల సంగమం గల సరస్వతీనది, దృషద్వతీ నదులు. వాటిలో సరస్వతీనది పశ్చిమప్రాంతంలో వర్తమాన ఉత్తరప్రదేశం నుండి ప్రవహించి దక్షిణ సముద్రంలో కలుస్తుంది. దీనికే సింధునది అని పేరు. దృషద్వతీనది పూర్వంలో ఉత్తరం నుండి దక్షిణదిశగా ప్రవహించి దక్షిణ దేశీయ సముద్రంలో కలుస్తుంది ఇదే బ్రహ్మపుత్ర. ఈ రెండు నదుల మధ్య ఉన్న ప్రాంతం దేవ నిర్మితం. ఆర్యుల ద్వారా సుశోభితమైన దేశం ఆర్యావర్తమని పిలువబడుతుంది.

ఉత్తరం హిమాలయం, దక్షిణంలో వింధ్యాచలం, తూర్పు- పశ్చిమాలలో సముద్రం, అలాగే సరస్వతీ, పశ్చిమంలో అటక్‌నది. పూర్వంలో దృషద్వతీ-నేపాలదేశంలో తూర్పుకొండలలో పుట్టి వంగదేశానికి, అస్సామ్ దేశానికి తూర్పుగా, బర్మా (బ్రహ్మ) దేశానికి పడమరగా ప్రవహించి దక్షిణ సముద్రంలో కలుస్తుంది. దీనికే బ్రహ్మపుత్ర అని పేరు. ఉత్తర పర్వతాలలో నుండి పుట్టి సాగి, దక్షిణ సముద్రంలో కలుస్తుంది. హిమాలయం నుండి వింధ్యాచలం వరకున్న కొండలమధ్య ఉన్న ప్రదేశాలు రామేశ్వరం వరకున్న దేశాలన్నింటికీ 'ఆర్యావర్తమని' పేరు. ఆర్యులు అంటే విద్వాంసులు, దేవతలు ఉన్న ప్రదేశం ఆర్యావర్తం. (స.ప్ర. 8వ.స.)

సదాచార లక్షణం ఇది మనుకృతం-ప్రామాణికం

తస్మిన్ దేశే య ఆచారః పారంపర్య క్రమాగతః । మూలశ్లోక సం.73
వర్ణానాం సాంతరాళానాం స సదాచార ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.137[2.18]

టీక:- **తస్మిన్ దేశే** = ఆ బ్రహ్మావర్తదేశంలో, **వర్ణానాం సాంతరాళానాం పారంపర్యక్రమాగతః యః ఆచారః** = వర్ణాలకు ఆశ్రమాలకు, పరంపరాగతంగా వేదాదుల వల్ల క్రమంగా సంక్రమించిన ఆచారమే, **సదాచార ఉచ్యతే** = సదాచారంగా ప్రచలితమైనది.

తాత్పర్యం:- ఈ బ్రహ్మావర్త-ఆర్యావర్త దేశంలో పరంపరగా ఏ ఆచారం అనగా వర్ణాశ్రమధర్మం వచ్చిందో అదే సదాచారమని అనబడుతుంది. ॥137॥

వివరణ:

"సాంతరాళానాం' శబ్దానికి సరియైన అర్థం –

(క) ఈ శ్లోకమందున్న **'సాంతరాళానాం'** శబ్దానికి వ్యాఖ్యాతలు వర్ణసంకరమనీ లేదా సంకరజాతులనీ సంకుచితార్థాన్ని చెప్పి ఉన్నారు. ఇది అశుద్ధమైనదే గాక మనుసిద్ధాంతానికి విరుద్ధమైంది కూడా. ఇక్కడ వర్ణసంకరాన్ని, సంకరజాతిని, వారి ఆచారాన్ని సదాచారంగా మనువు అంగీకరించలేదు. అంతేగాక వర్ణ సంకరత్వం నిందనీయమైన ఆచారమని గర్హించాడు. [10.5-73] అందువల్ల శ్లోకంలో ఉన్న 'సాంతరాళానాం' శబ్దానికి ఆశ్రమం అనే అర్థం మనుసమ్మతం. మనుస్మృతి ప్రతిసాధ్యవిషయాలు రెండు. (1) వర్ణ ధర్మాలు, (2) ఆశ్రమధర్మాలు. ప్రతిపాద్యవిషయం వదలి భిన్న విషయాన్ని పర్యాయవాచకంలో చేర్చడం అసంగతం, అసందర్భం. అందువల్ల ఆశ్రమాలు అనే అర్థమే సంగతం. 1.2, శ్లోకాలలో ప్రయోగించిన 'అంతర ప్రభవాణామ్' అనే పదానికి కూడా ఆశ్రమాలు అనే అర్థమే సరియైనది. మరియు ఇది పర్యాయవాచకపదంగా కూడా ప్రయోగింపబడింది. విశేషపరిజ్ఞానం కోసం 1.2 శ్లోకంలోని వివరణ చూడండి.

ఖ. పారంపర్యక్రమం యొక్క అభిప్రాయం:-

సృష్టి ఆరంభం నుండి వేద విధానాల ద్వారా ప్రచలితమైన ఆచారం. కారణం-వర్ణాశ్రమ ధర్మం. పరంపర కేవలం వేదాల నుండే ప్రారంభమైది (1.23,31) వేదాల నుండే వర్ణవ్యవస్థ నామకరణం మొ॥ ప్రారంభమైనవి (1.21,87). వేద విహితమైన ఆచారమే 'సదాచార'మని మను నిర్ణయం [1.108-110; 4.156-159 అలాగే 1.125 సదాచారం విషయ సమీక్ష చూడండి]

ఈ శ్లోకం ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* బ్రహ్మర్షి దేశానికి హద్దులు-

కురుక్షేత్రం చ మత్స్యాశ్చ పంచాలాశ్శూరసేనకాః ।
ఏష బ్రహ్మర్షిదేశో వై బ్రహ్మావర్తాదనంతరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***138 [2.19]***

తాత్పర్యం:- కురుక్షేత్రం, మత్స్యదేశం, పాంచాల, శూరసేనకం (శౌరసేనికదేశం) అనే ఈ నాలుగు దేశాలకు బ్రహ్మర్షిదేశం అని పేరు. ఇది బ్రహ్మావర్తాన్ని అనుసరించుకొని ఉన్నది.

సమస్త విశ్వమందున్న మానవులు బ్రహ్మావర్తమందున్న విద్వాంసుల నుండి చరిత్ర (శీలం),శిక్షణను పొందాలి.

ప్రక్షిప్త పరిశీలన:- ఈ శ్లోకం ఈ క్రింది విధంగా ప్రక్షిప్తం

1. ప్రసంగవ్యతిరేకం

క. ఈ శ్లోకాన్ని వ్యవహారంలో ఉన్న ముందు వెనుకల ప్రసంగాలను భంగ చేస్తూ కలిపారు. దీని ప్రసంగవ్యతిరేకత ఎంతో స్పష్టంగా కనబడుతూంది. ధర్మలక్షణాలను విశ్లేషిస్తూ 136వ శ్లోకంలో **'సదా చారపు'** విశ్లేషణ ప్రారంభమైంది. ముందు 136లో **'సదాచారపు'** ఆధార భూతమైన ప్రాంతపు బ్రహ్మావర్తపు ఎల్లలు అని ఉంది. తర్వాత 137వ శ్లోకంలో ఆ దేశవాసుల వర్ణాలు, ఆశ్రమాలలోని పరంపరా గత ఆచారాలను **'సదాచారాలు'** పేరిట ప్రమాణాలని చెప్పారు. ఈ విషయాన్ని 139లో ముగించారు. ఈ దేశపు ద్విజులు సచ్చరిత్ర కలవారు కనుక, వారి నుంచి అందరూ ప్రవర్తనను నేర్చుకోవాలన్నారు. ఈ మూడు శ్లోకాలలోనూ వాక్యాలు ఒకదానితో ఒకటి జోడించబడ్డాయి. ఈ శ్లోకం ఆ చర్చాక్రమాన్ని భంగపరచింది. సదాచారపు విశ్లేషణలో ఒక ప్రత్యేక దేశపు హద్దులను అసందర్భంగా చెప్పింది.

ఖ. ఈ శ్లోకం రావటం వల్ల **'సదాచారాల'** విశ్లేషణ అవకతవకగా అయిపోయింది. 136లో సదాచారాల ముఖ్య ఆధార స్థానపు ఎల్లలను వర్ణించారు. 137లో దాన్ని సదాచారం అన్నారు. ఇప్పుడు దేన్నయితే సదాచారమన్నారో దాన్ని నేర్చుకోవటం గురించి చెప్పాలి. కానీ 138లో బ్రహ్మర్షి దేశపు వర్ణన, ఆ ప్రాంతపు బ్రాహ్మణులను చూసి నేర్చుకోవాలని చెప్పారు. 'సదాచార'మైతే బ్రహ్మావర్త ప్రాంతవాసుల ఆచరణ అయింది. కానీ శిక్షణ మాత్రం బ్రహ్మర్షి దేశవాసులనుంచి పొందాలి. ఇది నిష్ప్రయోజనమైన విషయం. ఈ విధంగా ఈ శ్లోకపు వివరణ అస్తవ్యస్తంగా ఉంది. అందువల్ల ఈ శ్లోకం మౌలికం కాదు.

2. అంతర్ వ్యతిరేకాలు

అంతర్వ్యతిరేకాలలో ఈ శ్లోకం కాలానికి వ్యతిరేకంగా ఉంది. ఇందులో వర్ణించిన అన్నిదేశాలూ స్వాయంభువ మనువు తర్వాత వందల తరాలు గడిచాక పుట్టాయి. వీటిని కురువు మొదలైన రాజులు స్థాపించారు. అందుచేత ఈ శ్లోకం తర్వాతెప్పటిదో కాని, మనువుది అయ్యే అవకాశం లేదు.

3. విషయవ్యతిరేకాలు

120లో (2.1) విషయాన్ని ప్రారంభిస్తూ- 'యో ధర్మః తం నిబోధత' - అంటే 'ధర్మాన్ని గురించి విను' అని సంకేతించాడు. 144లో (2.225) ఈ విషయం ముగింపును సంకేతించాడు- 'ఏషా ధర్మస్య యో యోనిః సమాసేన ప్రకీర్తితా'. బ్రహ్మావర్తపు హద్దులను గురించి 'సదాచారాలు' పేరిట ధర్మలక్షణాలను నిర్వచించడానికే రచించారు కనుక విషయానికి సంబంధించినదే; కాని ధర్మ విషయాలలో ఏ దేశపు హద్దులనైనా చెప్పటం విషయాంతరం అవుతుంది. కనుక ఈ శ్లోకం విషయవ్యతిరేకం

139 నుండి 142వ శ్లోకాల వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ప్రపంచంలోని మానవులందరూ ఆర్యావర్త విద్వాంసుల నుండి విద్యను నేర్చుకోవాలి-

ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్రజన్మనః । మూలశ్లోక సం. **74**
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **139[2.20]**

టీక:- ఏతద్దేశప్రసూతస్య = ఈ బ్రహ్మావర్తదేశంలో జన్మించిన, అగ్రజన్మనః సకాశాత్ = బ్రహ్మజ్ఞానులైన విద్వాంసుల సన్నిధిలో, పృథివ్యాం సర్వమానవాః = సమస్త భూగోళంలో ఉన్న సర్వమానవులు, స్వం స్వం = తమతమ, **చరిత్రం శిక్షేరన్** = ఆచరణాలను, అంటే కర్తవ్యాలను గురించి నేర్చుకొందురుగాక !

ఋషిదయానందభాష్యం:- ఈ దేశంలో పుట్టిన విద్వాంసుల వల్లనే భూమిలోని మానవులందరూ, తమ-తమ వర్ణాచారాలను తెలుసుకోవలసి ఉంటుంది. ఈ విప్రులే విజ్ఞులని భావం.

ఈ ఆర్యావర్తంలో జన్మించిన బ్రాహ్మణుల, విద్వాంసుల నుండి భూ మండలంలో ఉన్న మానవులందరూ- బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, దస్యులు, మ్లేచ్ఛులు మొ॥ వారు తమకు యోగ్యమైన చరిత్ర (శీలం) మొ॥ విషయాలలో శిక్షను (నేర్పరితనం), విద్యను అభ్యసించాలి. (స.ప్ర.11వ స.).॥139॥

మధ్యదేశానికి హద్దులు **ఇది మనుకృతం-ప్రామాణికం**

హిమవద్విన్ధ్యయోర్మధ్యం యత్ప్రాగ్వినశనాదపి । మూలశ్లోక సం. **75**
ప్రత్యగేవ ప్రయాగాచ్చ మధ్యదేశః ప్రకీర్తితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **140[2.21]**

టీక:- హిమవద్విన్ధ్యయోర్మధ్యం = ఉత్తరాన హిమాలయపర్వతాలు, దక్షిణాన వింధ్యాచలానికి మధ్యన ఉన్న, **యత్ ప్రాక్ వినశనాత్ అపి** = అలాగే తూర్పున, వినశన-సరస్వతీనది లుప్తమైన స్థానం నుండి మరియు, **ప్రయాగాత్ ప్రత్యక్** = ప్రయాగ నుండి పడమరవైపు వరకు ఉన్న దేశానికి, **మధ్యదేశః ప్రకీర్తితః** = మధ్యదేశమని పేరు.

తాత్పర్యం:- ఉత్తర-దక్షిణ దిక్కులలో గల హిమాలయ వింధ్య పర్వతాలకు మధ్యన ఉన్న సరస్వతీనది అంతరించిన దేశానికి తూర్పున, ప్రయాగకు పశ్చిమం-వీటి నడుమ గల దేశానికి మధ్య దేశం అని పేరు.॥140॥

ఆర్యావర్తదేశానికి హద్దులు **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఆసముద్రాత్తు వై పూర్వాదాసముద్రాత్తు పశ్చిమాత్ । మూలశ్లోక సం. **76**
తయోరేవాంతరం గిర్యోరార్యావర్తం విదుర్బుధాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **141[2.22]**

టీక:- **ఆసముద్రాత్తు వై పూర్వాత్** = పూర్వసముద్రం మొదలుకొని, **ఆ సముద్రాత్తు పశ్చిమాత్** = పశ్చిమ సముద్ర పర్యంతం ఉన్న, **తయోః ఏవ గిర్యోః అంతరం** = ఉత్తరం హిమాలయం దక్షిణమందున్న వింధ్యాచలం వరకున్న మధ్య ప్రదేశాన్ని, **బుధాః ఆర్యావర్తం విదుః**= ఆర్యావర్తమని పిలుస్తారు.

తాత్పర్యం:- తూర్పు సముద్రం ఒక సరిహద్దు- పశ్చిమ సముద్రం ఇంకొక సరిహద్దుగా గల ప్రదేశానికీ ఉత్తరంలో హిమాలయం దక్షిణంలో వింధ్యాచలం వరకున్న మధ్య ప్రదేశానికి ఆర్యావర్తమని పేరు.

ప్రామాణిక దేశపటము-చిత్రవివరణ

క. ఆర్యావర్తపు ఎల్లలు: తూర్పున తూర్పు సముద్రం వరకు, పశ్చిమంలో పశ్చిమ సముద్రం వరకు, ఉత్తరాన హిమాలయ పర్వతాలు, పశ్చిమాన హిందూకుశ్ నుంచి తూర్పున అస్సాం, అరాకాన్ పర్వత మాల వరకు భారత దేశపు సంపూర్ణ ఉత్తర సీమపై వ్యాపించిన పూర్తి పర్వత శ్రేణులను హిమాలయ పర్వతాలు అంటారు. కైలాస పర్వతం మొదలైనవి దీని అంగాలే. దక్షిణాన వింధ్య పర్వతాలు (ఆధునిక భూగోళ వేత్తల ప్రకారం వింధ్య పర్వతాలు పశ్చిమాన మహారాష్ట్ర-గుజరాత్ నుంచి తూర్పున బిహారు వరకు దాదాపు 700 మైళ్ల వరకు వ్యాపించిన సత్‌పురా మొదలైనవి దీని భాగాలే. వాల్మీకి రామాయణంలో సముద్ర తీరాన ఉన్న తమిళనాడు, కేరళలలోని పర్వతాలనే వింధ్య పర్వత భాగా లంటారు. ఉత్తరాన హిమాలయాల వలెనే దక్షిణాన వింధ్య పర్వతాలు ఉన్నాయి. (కిష్కింధాకాండ 60.7) తర్వాతి కాలంలో జనం ఈ వింధ్య పర్వతాలకే వేర్వేరు పేర్లు పెట్టారు. ఈ రెండు పర్వత ప్రదేశాలు, వాటి మధ్య గల భూభాగాన్నే ఆర్యావర్తం అన్నారు. (మను. 1.141.(2.22).

మనుస్మృతిలో ఆర్యావర్తాన్ని సంక్షేపంగా చెప్పాడు. ఇందులో చెప్పిన నాలుగు దిశల చివరి ప్రాంతాలతో ఆర్యావర్తపు ఎల్లలు నిర్ధారించబడతాయి. మిగిలిన అన్ని ప్రదేశాలూ అందులోనే కలసిపోతాయి. 10.43-44 శ్లోకాల ప్రకారం, ఉత్తరాన శక చీనా దేశాల నుంచి దక్షిణంలో ద్రావిడం వరకు (తమిళనాడు), పశ్చిమాన పహ్లవ (ఈరాన్) ప్రదేశం నుంచి పూర్వంలో కిరాత ప్రదేశం (బ్రహ్మపుత్రకు తూర్పు భాగం) వరకు విస్తరించింది. పశ్చిమం నుంచీ తూర్పు సముద్రం కూడా ఇంతగానే విస్తరించి ఉంది.

ఇక్కడ, మనువు ఎందుకని కొన్ని ప్రదేశాలనే పేర్కొన్నాడు? అనే సందేహం కలుగుతుంది. సమాధానంగా కేవలం ఆర్యుల వ్యవస్థ వల్ల ఏర్పడిన ప్రాంతం, దాన్ని పూర్తిగా సొంతం చేసుకున్న కేంద్రీయ భాగాలను ముఖ్యంగా చెప్పాడు. దాన్ని తర్వాతి సాహిత్యంలో 'ధర్మదేశం' అన్నారు. ఆర్యావర్తం లోనివిగా పరిగణించిన ప్రదేశాన్ని 'మధ్యదేశం'గా పిలుస్తారు. దీని వల్ల ఆ సమయంలో ప్రాచ్య, ప్రతీచ్య, ఉదీచ్య, దక్షిణాత్య ప్రదేశాలన్నీ ఆర్యావర్తంలో భాగాలనీ కానీ వాటి మధ్య అక్కడక్కడా అనార్యులు లేదా ఆర్యుల చేత బహిష్కృతులైన జనం ఉండేవారనీ కేంద్రీయ భాగంలో అట్లా జరగలేదనీ తెలుస్తూంది. (మను. 10.45). అందువల్లనే నిరూపించిన 10.43-44 శ్లోకాలను లోకుల నోట నానినవిగా భావిస్తే, వాటి నుంచి కూడా వాటిలో పేర్కొన్న దేశం లేదా జాతులు, ఈ శ్లోకాల రచనకు ముందే ఆర్య మని తెలుస్తుంది. దీని వల్ల ఆర్యులున్న ప్రాంతాలు సుదీర్ఘమూ, విస్తారమూ అయిన వనీ వెల్లడి అవుతూంది. (మహా భారతం, అను. 35.17-18).

ఖ. ఆర్యావర్తంలోని ప్రాంతాలు లేదా జనపదాలు:

1. బ్రహ్మావర్తం: మనుస్మృతిలో బ్రహ్మావర్త ప్రదేశాన్ని అత్యుత్తమ మహత్త్వం గల ప్రదేశంగా భావించారు. అక్కడ నివసించే వారి ఆదర్శ ఆచరణను 'సదాచార' ధర్మ లక్షణంగా భావించేవారు. విద్య, సదాచార బోధనలో ఇది అన్నిటికన్నా ప్రముఖ కేంద్రం (1.136-139; (2.16-18,20)). భౌగోళికంగా ఇది ఒక చిన్న ప్రాంతమైనా, సరస్వతి, దృషద్వతి అనే దేవ నదుల మధ్య గల భూఖండంలో ఉండేది. మహా భారతంలోనూ దీన్ని 'ధర్మ క్షేత్రం' అన్నారు.

వైదిక, లౌకిక సంస్కృత వాఙ్మయాలలో లభించిన విషయాలను బట్టి సరస్వతీనది, హిమాలయ పర్వత శ్రేణులలోని శివాలిక పర్వతాల నుంచి పుట్టి శిమ్లా, పటియాలా (ఇప్పటి పంజాబ్ ప్రాంతం), సిరసా (ఇప్పటి హరియాణా ప్రాంతం) క్షేత్రాలలో ప్రవహిస్తూ బ్రహ్మావర్తంలోని వాయవ్య ప్రాంతపు ఎల్లలుగా నిలిచింది. దీని భౌగోళిక స్థితి మారుతూ వచ్చింది. వైదిక సాహిత్యం ప్రకారం ఇది పశ్చిమ సముద్రంలో కలిసింది. వేర్వేరు సాహిత్యాలలో రాజపుత్రుల (నేటి పశ్చిమ రాజస్థాన్) మరుభూమిలో కలిసి పోయింది. ఈ చోటే 'వినశనం' పేరిట ప్రసిద్ధి పొందింది. (త్తైత్తి.సం.7.2.1.4; శత. బ్రా.1.4.1.14; ఐత. బ్రా. 19.1.2., కౌషీ.బ్రా.12.2.3; మహా.వన.82.111.శల్య.37.1.).

హిమాలయ పర్వత శ్రేణులలోని శివాలిక కొండల నుంచే పుట్టిన దృషద్వతీనది బ్రహావర్తపు తూర్పు, దక్షిణపు ఎల్లలను ఏర్పరుస్తూ, యమునానదితో సమాంతరంగా పారుతూ, కురుక్షేత్రపు దక్షిణం వైపుగా వెళుతూ సరస్వతీ నదిలో కలుస్తుంది. (మహా.వన.5.2, 83.4; 204-205). రెండు నదుల తీరాలూ దేవతలు అంటే ఋషులు, మునులు, విద్వాంసుల నివాసంగా, ఆశ్రమాలతో విరాజిల్లుతూ ఉండేవి. వీటి తీరాలలో యజ్ఞాల అనుష్ఠానం జరిగేది. ఈ కారణం చేతనే మనువు వీటిని 'దేవ నదులు' అన్నాడు. ప్రస్తుతం ఈ రెండు నదుల గుర్తింపులో భూగోళ శాస్త్రజ్ఞులలో అభిప్రాయ భేదాలున్నాయి. ఘగ్గర్‌నే సరస్వతిగానూ, చితంగా లేదా రక్షీనదిని దృషద్వతిగానూ భావిస్తున్నారు. ఈ విషయంపై సునిశ్చితమైన పరిశోధన జరగవలసి ఉంది.

2. బ్రహ్మర్షి దేశం

బ్రహ్మావర్తంతో కలిసే తూర్పు దక్షిణ ప్రాంతాలను 'బ్రహ్మర్షి దేశం' అనేవారు. ఇందులో కింది జనపదాలున్నాయి- "కురుక్షేత్రం (ఇప్పటి హరియాణాలో ఈ పేరుతో ప్రసిద్ధమైన ఒక జిల్లా, దాని చుట్టుపట్ల ప్రాంతం), మత్స్య (ఇప్పటి రాజస్థాన్‌లోని జైపూరు, అల్వర్, భరత్‌పూర్‌లోని కొన్ని ప్రాంతాలు), పాంచాలం (ఇప్పటి ఉత్తర ప్రదేశలోని బరేలీ, బదాయూ ఫర్రూఖాబాద్ జిల్లాలున్న ప్రాంతం), శూరసేనం (మథుర, చుట్టుపట్ల ప్రాంతం) (మను.2.19)

ఈ పరిశోధన ప్రకారం, ఈ శ్లోకం ప్రక్షిప్తంగా రుజువైంది. దీనికి భౌగోళిక వర్ణనతోనే బలం చేకూరింది. కురుక్షేత్రం బ్రహ్మావర్తంలోనిదే అయినా, మిగిలిన మూడు ప్రాంతాలూ 'మధ్య దేశపు' సరిహద్దుల లోపలే ఉన్నాయి. అందువల్ల దీని ప్రత్యేక భౌగోళిక ప్రాంతంగా చెప్పటం మనుసమ్మతం కాదు. బ్రహ్మావర్తాన్ని అనుకరించటం వల్ల, దానికి ఘనతను కట్టబెట్టేందుకు, తర్వాతి కాలంలో ఆ పేరుపెట్టి, ఆ వృత్తాంత మంతటినీ మనుస్మృతిలో చొప్పించారని తోస్తుంది. ఇందులోని అన్ని ప్రాంతాలూ, మనువుకు చాలా కాలం తర్వాత వచ్చిన రాజులు ఏర్పరచినవి కనుక, మనుస్మృతిలో ప్రక్షిప్తాలు.

3. మధ్యదేశం

క. ఉత్తరాన హిమాలయ పర్వతాలు, దక్షిణాన వింధ్య పర్వతాలు, తూర్పున ప్రయాగ క్షేత్రం (ఆధునికంగా అలహాబాదు), పడమటి వినశన ప్రాంతం. (నేటి పశ్చిమ రాజస్థాన్‌లోని మరుభూమిలో సరస్వతీనది లుప్తమైన స్థలం), వీటి మధ్యలోని భూభాగాన్ని 'మధ్యదేశం' అంటారు. (మను.2.29). ఇక్కడ ప్రయాగ నుంచి నగరాలు, జనపదాలు రెండిటినీ స్వీకరించారు. వీటిలో కాశీ కూడా ఉంది.

గ.ఇతర జనపదాలు: మను.10.43-44 శ్లోకాలలో 12 జన సముదాయాలను పేర్కొన్నాడు. అవి దేశాధారాలు, లేదా దేశ విశేషాల పేర్లు కూడా. వీటి వల్ల ఈ జనపదాలు ఒకప్పుడు ఉండేవి అనే సంకేతం లభిస్తూంది. ఈ పరిశోధనలో ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని తేలినా, సంపూర్ణత కొరకు ఈ చిత్రంలో వీటినీ చూపాము. వీటి వల్ల ఇవన్నీ ఒకప్పటి ఆర్య సంస్కృతిలో భాగాలని తెలుస్తూంది -

1. పౌంఢ్రకం- బెంగాల్‌లోని దీనాజపూరు మాలదహం, రాజశాహీ, బీగ్రా, రంగ పూరు (బంగాళాదేశం)లోని పశ్చిమ ప్రాంతం. దీని రాజధాని పుండ్రు వర్ధన పురం. నేటి 'మహా స్థానం' (బోగ్రా జిల్లా).
2. ఓఢ్ర - ఆధునిక ఒడిశాలోని పురీ, భువనేశ్వర్ ప్రాంతం, ఆగ్నేయ ప్రాంతం, ఉత్తరాన జాజ్‌పూర్ వరకు.
3. కిరాతం - బ్రహ్మపుత్రకు తూర్పున గల కనుమల ప్రాంతం.
4. ద్రావిడం - దక్షిణాన కావేరీ నదికి చుట్టుపట్ల గల ప్రాంతం. ఇప్పటి తమిళనాడు ప్రాంతం.
5. పహ్లవం - ఇప్పటి ఈరాన్ (ఫారస్) కు తూర్పు ప్రాంతం.
6. పారదం - ఇప్పటి ఇరాక్, బెలూచిస్తాన్ (పాకిస్తాన్) లో హింగులా నదీ ప్రాంతం, హింగులాజ ప్రాంతపు క్షేత్రం.
7. శకులు - శకుల మూల ప్రాంతం మధ్య ఆసియా. వీరి నివాసం సాయర్, ఆక్సిస్ (వక్షు) నదుల (నేటి రష్యాలోనివి) సమీప ప్రాంతాలుగా భావించారు. చీనాలోని యూచీ జాతివారి చేత వెళ్లగొట్టబడ్డాక, వీరు పశ్చిమ సీమాంత ప్రాంతాలను తమ నివాసం చేసుకుని, మెల్లమెల్లగా భారతదేశపు లోపలి ప్రాంతాలపై విజయం సాధించారు.
8. యవనులు-యవనులని యూనాన్‌లోని నివాసులను అంటారు. భారతదేశంతో వీరికి ప్రాచీన కాలం నుంచీ సంబంధాలున్నాయి. భారత దేశం నుంచి వెళ్లిపోయి కొన్ని యవన అంటే యూనానీ ఆక్సిస్ (వక్షు) నది, హిందూకుశ్ పర్వతపు మధ్య ప్రాంతంలో నివసించేవారు. అందుచేత ఈ క్షేత్రాన్ని కూడా 'యవన దేశం' అనేవారు. బలఖ్ (ఆఫ్గానిస్తాన్) వీరి రాజధానిగా ఉండేది.
9. కంబోజం - నైరృతి ప్రాంతపు కశ్మీరు, ఇప్పటి 'పామీరు', 'బదఖ్షా' ప్రాంతం (అఫ్గనిస్తాన్).
10. దర్ - కశ్మీరులోని గిల్‌గిల్, హుంజా ప్రాంతాలు
11. ఖశ్- గఢ్వాల్, దాని ఉత్తర ప్రాంతం.
12. చీన్- ఇప్పటి చైనా దేశం.

ఇవి కాకుండా పదవ అధ్యాయంలో చాలా జాతుల పేర్లున్నాయి. వీటి పేర్ల మీదుగా తర్వాతి కాలంలో ప్రాంతాలు ఏర్పడ్డాయి. అవి - అంధ్ర, అంబష్ఠ, మగధ మొదలైనవి. అక్కడ ఈ జాతులను దేశాధారితాలుగా కాక 'వర్ణ సంకరం' వల్ల పుట్టిన సంతానంగా భావించడం చేత, ఆయా పేర్లతో పిలవబడ్డాయి. ఇవి ప్రక్షిప్త శ్లోకాలలో స్పష్టంగా కనబడుతున్నాయి. ఈ కారణం చేత దేశపటంలో ఆయాజాతులు లేదా జనపదాలను మనువు పేర్కొన లేదు.

ఆర్యావర్తం యజ్ఞీయ దేశం- తద్భిన్నం మ్లేచ్ఛదేశం

ఇది మనుకృతం-ప్రామాణికం

కృష్ణసారస్తు చరతి మృగో యత్ర స్వభావతః । మూలశ్లోక సం. **77**
స జ్ఞేయో యజ్ఞియో దేశో మ్లేచ్ఛ దేశస్త్వతః పరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **142[2.23]**

టీక:- తు = మరియు, **యత్ర** = ఏ దేశంలో, **స్వభావతః కృష్ణ సారః చరతి** = స్వాభావికంగా కృష్ణమృగం సంచరిస్తుందో, **సః** = అది (76వ శ్లోకం లో తెలిపిన ఆర్యావర్తదేశం), **యజ్ఞియః దేశః జ్ఞేయః** = యజ్ఞాలతో సంబంధించిన దేశం- అంటే, పవిత్రం, శ్రేష్ఠం అయిన దేశం లేదా శ్రేష్ఠకర్మలొనరించే వ్యక్తులున్న దేశమని తెలిసికోవాలి, **'యజ్ఞోవై శ్రేష్ఠ తమం కర్మ'** = శ్రేష్ఠమైన కర్మకే యజ్ఞమని పేరు. అలాంటి వారున్న దేశం యజ్ఞీయ దేశం. **అతఃపరఃతు** = ఈ ఆర్యావర్తానికి వెలుపల ఉన్న దేశం, **మ్లేచ్ఛదేశః** = మ్లేచ్ఛభాషను మాట్లాడేవారు ఉండే దేశం.

తాత్పర్యం:- నల్లనిచారలు, తెల్లని చుక్కలు గల జింకలు ఎక్కడ పుట్టి, స్వాభావికంగా సంచరిస్తుంటాయో అది యజ్ఞాలకు అనువైన ప్రదేశంగా గుర్తించాలి. ఆర్యావర్తానికి అవతల ఉండేది మ్లేచ్ఛదేశం. కర్మ భూమిగా పరిగణింపదగనిది. ఆర్యావర్తదేశానికి భిన్నమైన దేశాలు దస్యులున్న దేశం లేదా మ్లేచ్ఛదేశం (స.ప్ర.11వ.స). ॥142॥

వివరణ:

142వ శ్లోకానికి సరియైన అర్థం:-

ఈ శ్లోకానికి అన్యవ్యాఖ్యాతలు సందర్భాన్ని బట్టి వ్యాఖ్యచేయలేదు. కొన్ని దేశాల హద్దులను గురించిన ప్రసంగమిది. 76వ శ్లోకంలో ఆర్యావర్త దేశానికి (సీమ) హద్దులు చెప్పబడినవి. అందువల్ల ఈ శ్లోకానికి సంబంధం కూడా ఆర్యావర్తంతోనే. పూర్వశ్లోకంలో తెలిపిన ఆర్యావర్తదేశానికి చెందిన విశేషగుణం- అంటే పరంపరగా వచ్చే శ్రేష్ఠపురుషుల (ఆర్యుల) దేశమని చెప్పబడింది. అదే యజ్ఞీయ దేశమని చెప్పడం సందర్భోచితమే.

ఈ అర్థాన్నే యాజ్ఞవల్క్యమహర్షి సమర్థించారు. 'కృష్ణ మృగం సంచరించడం ఆర్యావర్తదేశానికి ఒక విశిష్టత'.

"మిథిలాస్థః స యోగీన్ద్రః క్షణం ధ్యాత్వాऽబ్రవీన్మునీన్ ।
యస్మిన్దేశే మృగః కృష్ణః తస్మిన్ ధర్మాన్నిబోధత"॥

మిథిలా నివాసి యోగీశ్వరుడైన యాజ్ఞవల్క్యుడు క్షణం ఆలోచించి మునులతో ఇలా అన్నాడు" మునులారా ! ఏదేశంలో కృష్ణమృగం సంచరిస్తుందో అదే ఆర్యావర్తం. అక్కడ ఆచరించే ధర్మాలను వినండి.

మ్లేచ్ఛశబ్దాభిప్రాయం: ఈ మ్లేచ్ఛశబ్దం తరవాత కాలంలో 'అపవిత్రుడు, లేదా నీచుడనే అర్థంలో రూఢమైంది. మ్లేచ్ఛ = అవ్యక్తభాష, అనే అర్థంలో, మ్లేచ్ఛ ధాతువుకు ఘఞ్ ప్రత్యయం చేర్చగా, మ్లేచ్ఛశబ్దం నిష్పన్నమవుతుంది. శుద్ధులుకాని జాతులు-అస్పష్టం, శుద్ధంకాని భాషను మాట్లాడేవారని యౌగికార్థం. వర్ణాశ్రమ ధర్మానుసారంగా శిక్షాదీక్షలు లభించని వారని కూడా అర్థం చెప్పవచ్చు. దేశ సరిహద్దులను పేర్కొనే సందర్భంలో, ఆ దేశంలో శిక్షితులు వేరు (Educated). అందువల్ల అన్యదేశవాసులెందెరో ఆర్యావర్తానికి వచ్చి విద్వాంసుల వద్ద శిక్షాదీక్షలు పొందవలసిందని మను ప్రబోధం. అంతేకాని, మ్లేచ్ఛులు హీనులనే భావన మనుమహర్షికి లేదు. కర్మచేతనే మానవుడు హీనుడు కాగలడు. మహాత్ముడు కూడా కాగలడు. జన్మచేత గాని, మరొక దేశవాసుడైనంత మాత్రానగాని ఎవడూ గొప్పవాడు, హీనుడు కాడు.

"ముఖబాహూరుపజ్జానాం యా లోకే జాతయో బహిః ।
మ్లేచ్ఛవాచశ్చార్యవాచః సర్వే తే దస్యవః స్మృతాః॥" 10.10

మ్లేచ్ఛులకోసం 'మ్లేచ్ఛవాచః' శబ్దాన్ని ప్రయోగించారు. ముఖం నుండి, బాహువుల నుండి, తొడల నుండి, పాదాల నుండి పుట్టినవారని చెప్పే వారందరూ లేదా మ్లేచ్ఛులని చెప్పబడేవారు, ఆర్యులని చెప్పబడుతూ-వీరిలో కర్మచేయని వారందరూ దస్యులే. "అకర్మా దస్యుః" ఇది వేదవచనం. సృష్టి- మరియు ధర్మోత్పత్తి విషయ సమాప్తి-వర్ణధర్మాల వర్ణన.

ఈ శ్లోకం ప్రక్షిప్తం-ప్రామాణికం కాదు

ద్విజు లెక్కడ నివసించాలి?

* **ఏతాన్ ద్విజాతయో దేశాన్ సంశ్రయేరన్ ప్రయత్నతః ।**
శూద్రస్తు యస్మిన్ కస్మిన్ వా నివసేద్వృత్తికర్శితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**143[2.24]**

తాత్పర్యం:- ద్విజులు ఇతర దేశాలలో పుట్టినా, ఇతరదేశాలకు వెళ్ళినా ఈ ఆర్యావర్తం, యజ్ఞభూమి, పుణ్యభూమి కనుక, వారు ప్రయత్న పూర్వకంగా ఈ దేశానికి చేరాలి. కానీ శూద్రులు జీవనం నిమిత్తం ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చు

ప్రక్షిప్త పరిశీలన

పై 143వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం అవుతుంది-

ఈ శ్లోకంలో బ్రాహ్మణులు ఆర్యావర్తం నుంచి బయట వెళ్లరాదు, ఎక్కడ నివాసాలు ఏర్పరచుకోకూడదని ధ్వనిస్తూంది. ఇది తరువాతి సంప్రదాయవాద శ్లోకం. మనువు ఎనిమిదవ అధ్యాయంలో తన రాజ్యం నుంచి దేశవిదేశాలలో నౌకల ద్వారా వ్యాపారం జరిగిందని రాశాడు. (8.157,403). దీనికి ప్రాచీన చరిత్రలో ద్విజులు ఇతర దేశాలలో రాజ్యపాలన సాగించారనీ, వివాహ సంబంధాలు నెలకొల్పుకున్నారనీ సాక్ష్యాలు ఉన్నాయి. పైన చెప్పిన విషయం కింది ఆధారాలవల్ల మనువుకు వ్యతిరేకం-

అంతర్ వ్యతిరేకాలు

1. 1.139 [2.20]లో మనువు, బ్రహ్మావర్తంలోని ఏ విద్వాంసులతోనైనా పృథివి మీది సమస్త మానవులూ తమతమ సచ్చరిత్ర-ధర్మాల గురించి నేర్చుకోవచ్చునని స్పష్టంగా రాశాడు. దీనితో రెండు విషయాలు తెలుస్తున్నాయి.

క. భూమి మీది అన్య దేశాలలోనూ వర్ణ వ్యవస్థ ఉండేది. అందుచేతనే మనువు అన్ని వర్ణాల వారినీ బ్రహ్మావర్త నివాసులైన విద్వాంసుల నుంచి ఆచరణలను నేర్చుకోమన్నాడు.

ఖ. ఇతర దేశాలవారు విద్యనేర్చుకుని వెళితే, వారుకూడా బ్రహ్మావర్తంలోని వారిలాగే వర్ణానుసారంగా ఆచరణ చేస్తారు. ఈ విధంగా విద్యావిధానం వల్ల అన్ని దేశాలలోనూ వర్ణవ్యవస్థ ఏర్పడుతుంది. ఇక్కడ ద్విజులను గురించి కేవలం ఆర్యావర్తంలోనే ఉండటానికి అర్హులని చెప్పటం పైన చెప్పిన దానికి వ్యతిరేకం.

గ. కర్మలననుసరించే వర్ణాలని మనువు శాసించాడు. కాని దేశాన్ని బట్టికాదు. కర్మలను అనుసరించి వర్ణ వ్యవస్థను స్వీకరించిన వ్యక్తి ఎక్కడ ఉన్నా, శ్రేష్ఠుడు లేదా శ్రేష్ఠుడు కానివాడుగా పరిగణించబడతాడు. (దీనికి ప్రమాణాన్ని 1.92-107 శ్లోకాలపై పరిశీలించి చేసిన సమీక్షలో అంతర్ వ్యతిరేకాలు ఆధారం) ఈ విధంగా దేశాన్ని బట్టి ద్విజులు, శూద్రుల కర్తవ్యాలను చెప్పటం, మనువు చెప్పిన దానికి వ్యతిరేకం.

ఘ. మనువు చెప్పిన ఈ వ్యవస్థలు కేవలం ఆర్యావర్త దేశంలోనే కాకుండా, సమస్త ప్రపంచానికీ అన్వయిస్తాయి. **"సర్వస్యాస్యతు సర్గస్య గుప్త్యర్థం స మహాద్యుతిః । ముఖబాహూరుపజ్జానాం పృథక్ కర్మాణ్యకల్పయత్ ॥"** (1.87). అందుచేత వీటిని దేశాల సరిహద్దుల పరిమితులలో బంధించడం మనువు ఉద్దేశాలకు వ్యతిరేకం. ఇలా ఇది ప్రక్షిప్తం.

ఙ. దేశాన్ని బట్టి కాక శాస్త్రాన్ని బట్టి, కర్మలను బట్టి వర్ణ వ్యవస్థను మనువు ఏర్పరిచాడు. అందుచేతనే మనువు 10.56 (వేరుచోట్ల 10.45)లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల దీక్షలు లేని వారు, ఆర్యభాషలు మాట్లాడినా సరే, వారు దస్యులే అని స్పష్టంగా చెప్పాడు. దీనివల్ల ఆర్యభాషలు మాట్లాడేవారు ఆర్యావర్తంలో కానీ, మరే ప్రాంతంలో కానీ ఉన్నా, వర్ణాల దీక్షాస్వీకారం చేయకపోతే, వారు దస్యులు; దీక్షితులైనవారు ఎక్కడున్నా సరే, వారు ఆర్యులే అనేది తేటతెల్లమవుతూంది. దీన్ని బట్టి ఈ శ్లోకం ప్రక్షిప్తం.

2. ప్రాచీన చరిత్రావలోకనం చేస్తే, రాజర్షి స్వాయంభువ మనువు కుమారుడు ప్రియవ్రతునికి పదిమంది కొడుకులున్నారనీ, వారిలో ముగ్గురు బ్రాహ్మణులయ్యారనీ తెలుస్తుంది. మిగిలిన ఏడుగురు మనవలకు సప్తద్వీపాలలో విస్తరించిన తన రాజ్యాన్ని మనువు, ఆగ్నీధ్రునికి జంబూద్వీపం, మేధాతిథికి ప్లక్ష ద్వీపం, యజ్ఞబాహునికి శాల్మలీ ద్వీపం, హిరణ్యరేతసునికి కుశద్వీపం, ద్యుతిమంతునికి క్రౌంచద్వీపం, భవ్యునికి శాకద్వీపం, వీతిహోత్రునికి పుష్కరద్వీపం- ఇలా పంచాడు. ఈ అన్ని దేశాలలోనూ వర్ణ వ్యవస్థ, వేదోక్తమైన అనుష్ఠానమూ ఉండేవి-**"సప్తైతాని తు వర్షాణి చాతుర్వర్ణ్యయుతాని చ"** (విష్ణుపురాణం 2.4.12-56). ఈ వర్ణన ఉండగా ద్విజులకు దేశనివాస ప్రతిబంధకం ఉండటం మను సమ్మతం అయ్యే అవకాశమే లేదు. ఈ శ్లోకం మనువు చెప్పిన చారిత్రక తథ్యాలకు వ్యతిరేకం కనుక ప్రక్షిప్తం.

3. ఆర్యావర్త దేశాన్ని వదలిపెట్టి మిగిలిన దేశాలకు ఆర్యులు వెళ్లడం, ఉండటం, వ్యాపారాలు చేయటం, వివాహాది సంబంధాలు నెలకొల్పుకోవటంలో మనుస్మృతిని ఆధారం చేసుకుని దయానందమహర్షి వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ కింది విధంగా ఉన్నాయి-

క. "ఇదే ఆర్యావర్తంలో పుట్టిన బ్రాహ్మణులు అంటే విద్వాంసుల వద్ద భూగోళంలోని అందరూ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు, దస్యులు, మ్లేచ్ఛులు మొ॥ వారు- తమ తమ యోగ్యతకు తగిన విద్యలు, శీల నిర్మాణమూ నేర్చుకోవాలి." (సం.ప్ర.సము. 11)

ఖ. "మనుస్మృతిలో సముద్రప్రయాణం చేసే నౌకలకు పన్ను తీసుకునే వారని ఉంది. ఆర్యావర్తం నుంచి ద్వీపాంతరాలకు వెళ్లే యుధిష్ఠిర మహారాజు రాజసూయం చేసి, భూమండలం మీది రాజులందరినీ ఆహ్వానించేందుకు భీమార్జున నకుల సహదేవులను నాలుగు దిక్కులకూ పంపాడు. అది దోషం అయివుంటే ఆవిధంగా వెళ్లేవారు కాదు కదా! కనుక అప్పటి ఆర్యావర్త దేశీయులు వ్యాపారాలు, రాజకార్యాలు, విహారాల కొరకు భూమండలమంతా తిరిగే వారు. విదేశయానం వల్ల ధర్మహాని కలుగుతుందని నేటికాంలో ఉన్న శంక కేవలం మూర్ఖులు, అజ్ఞానుల సంఖ్య పెరగటం వల్లనే కలిగింది." (స.ప్ర.సము. 10) ॥143॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సృష్ట్యుత్పత్తి-ధర్మోత్పత్తి విషయం సమాప్తం- వర్ణధర్మాల విషయం ప్రారంభం

ఏషా ధర్మస్య వో యోనిః సమాసేన ప్రకీర్తితా । మూలశ్లోక సం. **78**
సంభవశ్చాస్య సర్వస్య వర్ణధర్మాన్నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **144[2.25]**

టీక:- ఏషా = ఇది, ధర్మస్య యోనిః = ధర్మానికి ఉత్పత్తి, అస్య సర్వస్య సంభవః = ఈ సమస్త జగత్తుకు ఉత్పత్తి, సమాసేన = సంక్షిప్తంగా, వః ప్రకీర్తితా = మీకు తెలియ చేయబడింది. ఇంకా, వర్ణధర్మాన్ = వర్ణాల, (బ్రాహ్మణ-క్షత్రియ, వైశ్య, శూద్రుల) ధర్మాలను, కర్తవ్యాలను, నిబోధత = వినండి.

తాత్పర్యం:- ఈ జగత్తుకంతటికీ కారణమైన ధర్మ సంభవం గురించి సంగ్రహంగా చెప్పబడింది. ఇప్పుడు వర్ణధర్మాలు, ఆశ్రమధర్మాలు, వర్ణాశ్రమధర్మాలు, గుణ ధర్మాలు, నైమిత్తిక ధర్మాలు చెప్పబోతున్నాను. వినెదరుగాక!॥144॥

వివరణ:

(1) మనుస్మృతిలో అధ్యాయవిభజన మౌలికం కాదు-

మొదటి అధ్యాయ సమాప్తి ఈ శ్లోకం తర్వాత జరగాలి. ప్రచురణలో 119వ శ్లోకం తర్వాత అధ్యాయాన్ని ముగించడం లోపభూయిష్టం, మనుస్మృతిలో అధ్యాయాల విభజన మౌలికంగా కాక, ఆ తర్వాత జరిగింది.

విభజనకారులు విషయాలను అధ్యాయాల ఆధారంగా గ్రహించారు. తొలి అధ్యాయంలో సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి, రెండవదానిలో బ్రహ్మచర్యాశ్రమ ధర్మాలు, మూడవ దాంట్లో గృహస్థ ధర్మాలు- ఇలా కాని తొలి అధ్యాయపు విభజన సందర్భోచితం కాదు. విభజన కారులు ఎలా పొరపాటు చేశారో తెలియటం లేదు. తొలి అధ్యాయంలో ఒకదానితో సంబంధించిన రెండు విషయాలున్నాయి- సృష్టి ఉత్పత్తి, ధర్మోత్పత్తి. ప్రారంభం నుంచి వస్తున్న గాఢ సంబంధం వల్ల, మనువు ఈ రెండు విషయాలనూ ముఖ్యమైనవిగా భావించి వర్ణించాడు. 1.2లో మహర్షులు మనువును ధర్మాలను వివరించవలసిందిగా ప్రార్థించారు. దీనికి భూమికరూపంలో మనువు ధర్మోత్పత్తి, ధర్మానికి ఆధారం మొదలైనవి చెప్పాలి, పైగా ఇవి జగత్తుకు ఆశ్రయాలు- జగదుత్పత్తి తర్వాతే ధర్మోత్పత్తి, వాటి అవసరం, స్థితి వస్తాయి. అందుచేత

ఈ దృష్టితో సృష్టి ఉత్పత్తి ముఖ్యమని దాన్ని ముందుగా చెప్పాడు. 1.4,5లో ఈ సృష్టి ఉత్పత్తిని సంకేతపూర్వకంగా ప్రారంభించాడు. 1.91లో కర్మలు చెప్పటంతో అది పూర్తవుతుంది. 108వ శ్లోకం నుంచి ధర్మవిషయాలు ప్రారంభమై, 1.144 (మిగిలిన ప్రచురణలలో 2.25)తో ముగుస్తుంది. 1.144లో మనువు ఒక్కసారిగానే ఈ విషయాల ముగింపును సంకేతించాడు- **"ఏషా ధర్మస్య వో యోనిః.... సంభవశ్చాస్య సర్వస్య...."** అన్నాడు. మనువే స్వయంగా 143వ శ్లోకం తర్వాత దాని ముగింపును గురించి చెప్పిన తర్వాత, అంతకు ముందు దాన్ని విడగొట్టడానికి కానీ, ముగించటానికి కానీ ఎలాంటి అవకాశమూ లేదని స్పష్టమవుతూంది. ఈ రెండు విషయాలలోనూ ఒక సృష్టి ఉత్పత్తినే తీసుకుని, దాని ముగింపుతో అధ్యాయ విభజన చేసినట్లయితే, దాన్ని కూడా ఒకటే విషయం ఉన్నందువల్ల స్వీకరించదగిందే అవుతుంది. కానీ, వరుస క్రమంలో ఉన్న అధ్యాయ విభజనలో విషయాన్నే విడదీసేశారు. ధర్మాని ముందుగా 108-110 శ్లోకాలు తొలి అధ్యాయంలో ఉండిపోయాయి, మిగిలిన ధార్మిక విషయాలన్నీ రెండవ అధ్యాయంలోకి వచ్చాయి. ఇలా అసలు విషయమే ముక్కలైపోయింది. 144వ శ్లోకం తర్వాత అధ్యాయవిభజన జరగటంతో, ప్రసంగమూ విడిపోదు, విషయమూ వేరుకాదు, మనువు సంకేతం ప్రకారం అధ్యాయమూ సమగ్రమవుతుంది. ద్వితీయ అధ్యాయానికి చెందిన ఈ 25 శ్లోకాలనూ, మొదటి అధ్యాయంగా పరిగణించినట్లయితే, రెండవ అధ్యాయపు విభజన కూడా శాస్త్రీయంగానూ, క్రమబద్ధంగానూ జరుగుతుంది. తక్కువ అధ్యాయాల మాదిరిగా అందులోని-"బ్రహ్మచర్యాశ్రమ ధర్మాలు" అనేది మాత్రమే అతి ముఖ్యమైన విషయంగా మిగిలి పోతుంది. ఇలాంటి లోపాల వల్ల ఆ క్రమంలోని అధ్యాయ విభజన సరైనది కాదు. ప్రథమ అధ్యాయం ముగింపు 1.144 (2.25- మిగిలిన ప్రచురణలు ప్రకారం) వ శ్లోకం తర్వాతే జరగాలి. (ఈ విషయానికి సంబంధించిన విస్తృత వివరణకు భూమికలోని 'అధ్యాయ విభజన' చూడండి).

(2) మనుస్మృతిలో వర్ణాలు, ఆశ్రమాలను గురించి ఒకేచోట వర్ణన:- ఇక్కడ కేవలం **"వర్ణధర్మాన్నిబోధత"** అని, 10.131లో **"ఏష ధర్మవిధిః కృత్స్నశ్చాతుర్వర్ణ్యస్య కీర్తితః"** అన్నారు. ఈ ఉపసంహారాత్మక పదం (ముగింపు) చదివితే, మనువును వర్ణాలు, ఆశ్రమాలు (1.2) రెండిటిని గురించీ ప్రశ్నించారు కదా, మరి విషయ సంకేతక శ్లోకాలలో కేవలం వర్ణాల ధర్మాలను గురించే చెప్పారేమిటి? అనే సందేహం కలుగుతుంది. మనువు శైలి, మిగిలిన శ్లోకాలతో దీనికి సమాధానం లభిస్తుంది. దీన్ని ఈ కింది విధంగా అర్థం చేసుకోవాలి-

(1) మనువు శైలిలో ఆశ్రమాలు, వర్ణాల ధర్మాలు రెండూ వరుసలో ఉంటాయి. వర్ణాలను గురించి సుదీర్ఘంగా చెప్పినది, అదే ఆరవ అధ్యాయంలో బ్రాహ్మణ వర్ణధర్మాలతో పూర్తవుతుంది. ఆరవ అధ్యాయంలో ఆశ్రమ ధర్మాలను పూర్తిగా చెప్పి వాటితో పాటు, బ్రాహ్మణ వర్ణపు ధర్మాలు, వ్యావహారిక కర్తవ్యాలు చెప్పి ముగించాడు. ఆరవ అధ్యాయం వరకు చెప్పిన నాలుగు ఆశ్రమాల ధర్మాలు, వ్యావహారిక కర్తవ్యాలు అన్నీ అందరు ద్విజులూ పాటించవలసినవే అని చెప్పాడు. ఈ అధ్యాయాలలో చెప్పిన పద్ధతులన్నీ బ్రాహ్మణలకూ అవే ధర్మాలు, కర్మలు అన్నాడు (1.88). ఈ శైలి వల్ల ఆరవ అధ్యాయం చివరలో ఆశ్రమ ధర్మాలనూ ముగించాడు. ఇంకా బ్రాహ్మణ వర్ణంవారు ధర్మాలతో పాటు నాలుగు ఆశ్రమాల కర్తవ్యాలూ ముగిశాయి (6.87-91).

దాని తర్వాత, మిగిలిన వర్ణాల వ్యావహారిక, విధులను చెప్పాడు-'**క్షత్రియు**'ల విషయం ఏడు, ఎనిమిది అధ్యాయాలలో, తొమ్మిదిలో 325వ శ్లోకంతో ముగిసిపోతుంది. వైశ్యుల కర్తవ్యాలు 9.326 నుంచి 333 (ఈ ప్రచురణలో 10.1 నుంచి 10-8 వరకు), శూద్రుల విధులు 9.334-335 (ఈ ప్రచురరణలో 10.9.10 వరకు) లలో ముగుస్తాయి.

(2) వీటి మధ్య రెండవ అధ్యాయంలో బ్రహ్మచర్యా శ్రమం, మూడవ అధ్యాయం నుంచి ఐదవ అధ్యాయంలో గృహస్థాశ్రమం, ఆరులో వానప్రస్థం, సన్న్యాసాశ్రమాలు చెప్పాడు. ఆశ్రమ ధర్మాలు, వర్ణధర్మాల కిందివేనని ఆ యా విషయాలలో వాటి వాటి సంకేత శ్లోకాలనూ, ముగింపు శ్లోకాలనూ చెప్పాడు. అవి (2.43) (2.68), 2.224 (2.249), 3.2,67,286; 4.1, 259; 5.169; 6.1, 33,87-90) మొదలెనవి.

(3) ఇదే విధంగా ఈ అధ్యాయాలలో ద్విజవిప్రులు, బ్రాహ్మణ పదాలకు ఆ యా సందర్భాలలో పర్యాయ పదాలుగా కూడా ప్రయోగించాడు. వాటిని కేవలం 'బ్రాహ్మణ' పదాలకు అర్థాలు సూచించే పదాలే అని భావించకూడదు.

(4) మనువు తన శైలిలో 1.2, 1.137 (2.18) శ్లోకాలలో ఆశ్రమం అనే పదానికి పర్యాయాలుగా **'అంతర ప్రభవ'**, **'సాంతరాళ'** అనే పదాలనూ ఆశ్రమాలకు వాడాడు. వీటికి **'వర్ణానాం అంతరే ప్రభవః ఉత్పత్తిః స్థితిః యేషాం తేః అంతరప్రభవాః ఆశ్రమాః'** అన్నాడు. ఇదే శైలిలో ఆశ్రమాలను వర్ణ ధర్మాలలోనే వివరించాడు. ఇదే మనువు అనుసరించిన శైలి.

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మఱ్ఱి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'జగుదుత్పత్తి-ధర్మోత్పత్తిః' నామాత్మకః ప్రథమోఽధ్యాయః॥

ఇతి ప్రథమోఽధ్యాయః సమాప్తః

⁂

మనుస్మృతి

ద్వితీయాధ్యాయము

విశేష వివరణ సహిత, ప్రక్షిప్తాల పరిశీలన ఋషి దయానంద భాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: 224; మూలశ్లోకాలు: 164 ; ప్రక్షిప్తాలు : 60

సంస్కారాలు-బ్రహ్మచర్యాశ్రమవిషయాలు

సంస్కారాలు-1వ శ్లోకం నుండి 43వ శ్లోకం వరకు

1 నుండి 26వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

సంస్కారాల నిర్దేశం-వాటి లాభాలు-

వైదికైః కర్మభిః పుణ్యైర్నిషేకాదిర్ద్విజన్మనామ్ ।
కార్యశ్శరీరసంస్కారః పావనః ప్రేత్య చేహ చ ॥ మూలశ్లోక సం. 1[2.26]

టీక:- వైదికైః పుణ్యైః కర్మభిః = వేదోక్త పుణ్యరూపకర్మలద్వారా, ద్విజన్మనాం = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు తమ సంతానానికి, నిషేకాది శరీరసంస్కారః కార్యః = గర్భాధానాది సంస్కారాలు చేయాలి. ఇహ ప్రేత్య పావనః = అది ఈ జన్మను, పరజన్మను పవిత్రం చేస్తాయి.

ఋషిదయానంద భాష్యం:- వేదోక్త పుణ్యరూపకర్మలు మానవులందరూ ఆచరించాలి. ముఖ్యంగా ద్విజులనబడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు తమ సంతానానికి గర్భాధానాది షోడశ సంస్కారాలు చేయించాలి. ఈ సంస్కారాలు ఇహ, పరజన్మలను పవిత్రం చేస్తాయి. అంటే ఈ సంస్కారాలను పవిత్రంగా ఆచరించువారు ఈ జీవితంలో, వచ్చే జన్మలో కూడా పవిత్రంగా ఉంటారు.

సంస్కారాలు చేయడంవల్ల, శరీరం, ఆత్మా సంస్కరింపబడతాయి. దాని వల్ల ధర్మార్థకామ మోక్షాలను పొందగలరు. సంతానం యోగ్యులవుతారు. అందువల్ల సంస్కారాలు చేయడం మానవులకు పవిత్రమైన కర్తవ్యం. (స.ప్ర. 10వ సము.) ॥1॥

వివరణ:

1. సంస్కారాల ఉద్దేశ్యం

సంస్కారాలు చేయటం వల్ల శరీరమూ, ఆత్మా సుసంస్కృతం అవుతాయి. అలా చక్కగా సంస్కరించ బడటం వల్ల ధర్మ అర్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలనూ పొందగలుగుతాయి. సంతానం ఎంతో యోగ్యులు అవుతారు. అందుచేత మానవులందరూ సంస్కారాలు చేయించుకోవటం ఎంతో మంచిది. (సం.వి.భూమిక)

2. సంస్కారాల అనుష్ఠానం బాలబాలికలందరికీ అవసరం

అన్ని సంస్కారాలూ బాలబాలికలకు, స్త్రీ పురుషులిద్దరికీ సమానభావంతో, యథాయోగ్యంగా చేయాలి. ముందు శ్లోకాలలో చెప్పిన 'పుంసః' అను పదం స్త్రీ పురుషులిద్దరికీ సమానంగా ప్రయోగించబడినది. సంస్కారాలలో స్త్రీ పురుషులు

సమానం. గర్భంలో ఉండగా బాలికో, బాలకుడో తెలియని స్థితి ఉంటుంది. అందుచేత గర్భంలో ఉండగా చేయవలసిన సంస్కారాలు చేస్తే, ఇద్దరికీ సమానంగానే జరుగుతాయి కదా! అలాగే జాతకర్మ, నామకరణం, అంత్యేష్టి మొదలైనవి కూడా అన్ని సంస్కారాలూ వేదమంత్రాలు, యజ్ఞానుష్ఠానాలతో పూర్తవుతాయి. మేధాతిథి, కుల్లూక భట్టు మొదలైన టీకాకారులందరూ సంస్కారాల అనుష్ఠానం వేదమంత్రాల ఉచ్చారణతోనే చేయాలన్నారు. అయితే ఏ యే శ్లోకాలలో స్త్రీలకు సంస్కారాలు నిషేధించారో అవన్నీ ప్రక్షిప్తాలు. టీకాకారులెవరెవరు స్త్రీలకు వేదాలు, యజ్ఞాలు మొదలైనవాటిని నిషేధమన్నారో, అవన్నీ మనువుకు వ్యతిరేకాలు. (స్త్రీలకు సమాన అధికారాల కొరకు విస్తృతమైన ప్రమాణాలు విశ్లేషణ మనుస్మృతి భూమిక చతుర్థ అధ్యాయంలో చూడండి.)

3. శూద్రులకు సంస్కారాలు నిషేధంకావు

మనువు శూద్రులకు కూడా- **'న ధర్మాత్ ప్రతిషేధనమ్"** (10.126) సంస్కారాలు శూద్రులకు తప్పనిసరీ కాదు, అలాగని నిషేధమూ లేదు. ద్విజులకు మాత్రం తప్పనిసరి పద్ధతి. శూద్రులు చదువుకోనందువల్ల సంస్కార యోగ్యులు, విధ్యుక్త అధికారులు కాలేరు. కానీ వారు ద్విజుల చేత గర్భిణులకు సంస్కారాలు, నామకరణం, వివాహం, అంత్యేష్టి మొదలైనవి చేయించుకోవచ్చు. అధ్యయనం చేసి వారూ ద్విజులు కావచ్చు అని మనువు చెప్పాడు (10.65). ప్రాకృతిక న్యాయం ప్రకారమైతే, సంస్కరించబడి, పైకి వచ్చేందుకు ఒక్క మానవునికి మాత్రమే అధికారముంది. (ఈ అధికారాన్ని గురించిన విస్తృత ప్రమాణాలు, విశ్లేషణ మనుస్మృతి భూమికలో నాలుగవ అధ్యాయంలో ఉంది అక్కడ చూడండి.

సంస్కారాల ద్వారా ఆత్మకు చెడు సంస్కారాల నివారణ- ఇది మనుకృతం-ప్రామాణికం

గార్భైర్హోమైర్జాతకర్మచౌళమౌంజీనిబంధనైః ।
బైజికం గార్భికం చైనో ద్విజానామపమృజ్యతే ॥ మూలశ్లోక సం.2 [2.27]

టీక:- గార్భైః హోమైః = గర్భశుద్ధికారకం గర్భకాలీనమైన అంటే గర్భాధానం, పుంసవన, సీమన్తోన్నయన సంస్కారాల ద్వారా, **జాతకర్మ-చౌళ-మౌంజీనిబంధనైః**= జాతకర్మ [**జాతే జన్మని శైశవావస్థాయాం క్రియతే యత్ సంస్కారం తత్ జాతకర్మ**] = జన్మించిన తరవాత శైశవావస్థలో చేసే సంస్కారానికి **'జాతకర్మ'** అని పేరు. అందులో జాతకర్మ (2-4) నామకరణం, (2.5-8) నిష్క్రమణం, (2.9) అన్న ప్రాశనం (2.9), చౌలం చూడాకర్మ (2.10), మేఖలాబన్ధనం-ఉపనయనం, వేదారంభం మొ॥ (2.11-43,44,46-224), **(హోమైః)** యజ్ఞాలద్వారా చేయబడే సంస్కారాలతో, **ద్విజాతీనాం** = ద్విజ- బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య బాలబాలికలకు చెందిన, **బైజికం** = బీజసంబంధం, పరంపరాగతాలైన, పైతృక = మాతృ-పితృ అంశాల నుండి ఉత్పన్నమైన, **చ** = మరియు, **గార్భికం** = గర్భకాలంలో తల్లిదండ్రుల నుండి సంక్రమించే, **ఏనః** = అనాచార సంస్కారజన్యదోషాలు, అలాగే శారీరక అశుద్ధులు, **అపమృజ్యతే** = దూరమవుతాయి. ఈ సంస్కారాలు చేయడం ద్వారా బాలబాలికలకు ఉన్న చెడ్డ సంస్కారాలు దూరమైపోతాయి. శ్రేష్ఠసంస్కారాలు ప్రాప్తిస్తాయి.

తాత్పర్యం:- ఏ దోషాలు ఏ సంస్కారాల వల్ల నశిస్తాయి అనేదానికి సమాధానంగా-గర్భసంబంధ దోషాలు హోమాది క్రియలచేత; నిషిద్ధమైథునాది దోషాలు జాతకర్మ, చూడాకార్మ, ఉపనయనం చేత; మౌంజీబంధనం- బ్రహ్మచర్యాలచేత మాతృగర్భవాసపు అపరిశుద్ధత తొలగిపోతాయి. ॥2॥

వివరణ:

పూర్వ వ్యాఖ్యాకారులు ఈ శ్లోకానికి సంకుచితార్థాన్ని చెప్పడమే గాక, పూర్తి అర్థాన్ని కూడా ఇవ్వలేదు. పైగా మనుమహర్షి పేర్కొన్న సంస్కారాల సంఖ్యను గురించి కూడా కొంత మందికి భ్రాంతిని కలిగించారు.

ప్రచారంలో ఉన్న వ్యాఖ్యానాలలో ఈ శ్లోకానికి అర్థం సంకుచితంగానూ, అసంపూర్ణంగానూ ఉన్నాయి. పైగా మనువు చెప్పిన ఈ శ్లోకపు అర్థం వ్యాపనం, సంస్కారాలు సంఖ్యకు సంబంధించిన విషయాన్ని గురించి విస్తృతంగా ఆలోచించడం పాఠకులకు ఉపయోగపడుతుంది. సంస్కారాలకు పలువురు వ్యాఖ్యాతలకు పలువిధాల అర్థాలు తోచడమే దీనికి కారణం కనుక.

(క) 'గార్భైః' మొదలైన పదాలలోని అర్థ వ్యాప్తి

(1) మొట్ట మొదట, సంస్కారాలను పరిగణించే విషయంలో మనువు శైలిని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఆ సమయంలో సంస్కారాలు చాలా ప్రాముఖ్యంలో ఉన్న ధార్మిక కార్యాలు. అందుచేత, మనువు ఎక్కడో ఒకచోట సంస్కారాల పేర్లు మాత్రం చెప్పాడు. నిషేక సంస్కారం (2.1,2లో) కాని, దాని విధులేమిటో చెప్పలేదు. మరోచోట సాంకేతికంగా ఒక వర్గపు సంస్కారాలు పరిగణించాడు-**'గార్భైః'** అనటం చేత, గర్భధారణ సమయంలో జరగవలసిన అన్ని సంస్కారాలూ = గర్భాధానం, పుంసవనం, సీమంతోన్నయనం- అందులోనే ఉంటాయని. అందుచేత ఈ శ్లోకంలో వాటన్నిటినీ పేర్కొనకుండా, విధులలో చెప్పాడు- నామకరణం, నిష్క్రమణం, అన్న ప్రాశనం (2.4.9) ఇలా. ఏ సంస్కారాలకు ఎంత స్పష్టీకరణ చేయాలో అంతే చేశాడు.

(2) ఈ శైలిని అర్థం చేసుకున్న తర్వాత, ఈ శ్లోకంలోని పదాల అర్థాల వ్యాప్తిని గురించీ ఆలోచించాలి.

(క) ఈ శ్లోకంలో **'గార్భైః'** పదం బహువచనాంతం. దీని అర్థం **'గర్భ సంబంధమైన'** లేదా 'గర్భకాలంలోని అన్ని సంస్కారాలు' అని. కేవలం గర్భాధానాన్నే చెప్పదలచుకుంటే, బహువచనాంతంగా ఈ పదాన్ని మనువు ప్రయోగించడు. ఈ బహువచన ప్రయోగమే గర్భస్థ బాలకుడూ-బాలికల అన్ని గర్భకాల సంస్కారాలనూ మనువు చెప్పాడన్న సంగతిని వెల్లడి చేస్తూంది. గర్భకాలపు సంస్కారాలు మూడు. అవి గర్భాధానం, పుంసవనం, సీమంతోన్నయనం.

(ఖ) ఇదే విధంగా ఈ శ్లోకంలో **'జాతకర్మ'** అనే పదం కూడా కేవలం ఒక్క సంస్కారాన్ని సూచించేది కాక, పుట్టక తర్వాత బాలబాలికలకు శైశవ ప్రాయంలో జరిగే అన్ని సంస్కారాలనూ సూచిస్తుంది. మనువు విధులను వివరించినపుడు జాతకర్మ తర్వాత ఆ అన్నిటినీ వేరువేరుగా చెప్పాడు. అవి జాతకర్మ (.24), నామకరణం (2.5-8), నిష్క్రమణం (2.9), అన్న ప్రాశనం (2.9).

(గ) ఇలాగే **'మౌంజీ బంధనం'**లో కూడా రెండు సంస్కారాలు కలసి ఉంటాయి- ఉపనయనం, వేదారంభం. బ్రహ్మచారి, బ్రహ్మచారిణి ఉపనయన దీక్షాసమయంలో యజ్ఞోపవీతం మొదలైనవి, బ్రహ్మచారికి నడుముకు మేఖలా బంధనం మొదలైనవి ఉంటాయి. వేదాధ్యయనం పూర్తి అయ్యేవరకు దాన్ని ధరించాలి. ఇలా ఈ పదానికి వ్యాపకభావం ఉంది.

(3) మనుస్మృతిలో షోడశ (పదహారు) సంస్కారాలు

ఈ చర్చ తర్వాత మనువు బాలబాలికలకు లేదా యువతీయువకులకు తన గ్రంథంలో ఎన్ని రకాల సంస్కారాలు చెప్పాడు అనే ప్రశ్నకూ సమాధానం లభిస్తుంది. ఎవరైనా మనువు చెప్పిన 12 సంస్కారాలను అంగీకరిస్తారా అంటే కొందరు తక్కువగా మరి కొందరు ఎక్కువగా అనే చెప్పాలి. నిజమేమిటంటే, మనువు సాంకేతికంగా, పేర్లు చెప్పటం లేదా విధులను వివరించడం అనే పద్ధతులలో 16 సంస్కారాలనూ విశదీకరించాడు అనేది మనం గ్రహించవలసి ఉంది.

షోడశ సంస్కారాల వివరణ పట్టిక ప్రతి సంస్కారం యజ్ఞంతోనే జరుగుతుంది.

	సంస్కారం పేరు	సంస్కార ఉద్దేశం వర్ణనస్థలం	మనుస్మృతిలో
1.	గర్భాధానసంస్కారం గర్భస్థాపన చేయడం	సంతానప్రాప్తికోసం వీర్యనిషేచనం ద్వారా (గృహాశ్రమిఐనప్పుడే).	[2.2లో 'గార్భైః 2.1,117లో]
2.	పుంసవనం	స్త్రీకి గర్భాధాన చిహ్నాలు ప్రకటితం కాగా రెండో లేదా మూడో మాసంలో పుత్రోత్పత్తి ఉద్దేశంతో యజ్ఞపూర్వకంగా చేసే విధి.	[2.2 లో గార్భైః పటాంతర్గతం]
3.	సీమన్తోన్నయనం	గర్భిణికి నాలుగో మాసంలో 'గర్భస్థిరత' పుష్ట్యర్థం, ఆరోగ్యంకోసం చేసే విధి.	[2.2-గార్భైః పదాంతర్గతం]
4.	జాతకర్మ	శిశువు జన్మించినపుడు చేసే సంస్కారం బంగారు శలాకతో బిడ్డకు కొంచెం తేనె-ఘృతం నాకించడం.	[2.4లో]
5.	నామకరణం	జన్మించిన 10, లేదా 12వ రోజున బిడ్డకు నామకరణం చేయడం.	[2.5-8లో]
6.	నిష్క్రమణం	నాలుగో మాసంలో బిడ్డను గృహం నుండి బయటకి తీసుకుపోవడం.	[2.9లో]
7.	అన్నప్రాశనం	దాదాపు 6వ మాసంలో బిడ్డకు సులభంగా జీర్ణమయ్యే పౌష్టిక ఆహారాన్ని తినిపించడానికి ప్రారంభించడం.	[2.9 లో]
8.	ముండనం (చూడాకర్మ) వెంట్రుకలు తీయడం	మొదటి సం॥లో గానీ లేదా 3వ సంవత్సరంలో గానీ ముండన సంస్కారం చేయించడం. (అంటే మొదటిసారి కేశఖండనం) వెంట్రుకలు తీయించడం.	[2.35]
9.	ఉపనయనం	బాలబాలికలను విద్యకోసం గురువు దగ్గర వదలడం. గురువు ద్వారా శిశువుకు యజ్ఞోపవీతదీక్ష ఇవ్వడం.	[2.11,43]
10.	వేదారంభం	గురుకులవాసం చేస్తూ, శ్రేష్ఠమైన శిక్షాదీక్షలను గ్రహిస్తూ వేదాలను అధ్యయనం చేయడం	[2.44-224]

11. కేశాన్త సంస్కారం	యవ్వనావస్థ ప్రారంభంలో కేశములను కత్తిరించడం.	[2.40]
12. సమావర్తనం	వేదాధ్యయనం, శిక్షాదీక్షలు పూర్తిచేసుకొని, గృహస్థాశ్రమంలో ప్రవేశించడానికి స్నాతకులై, గురుకులాన్ని వదిలి గృహం చేరడం.	[3.1-3లో] [2.220-222 చూడండి];
13. వివాహం **గృహస్థాశ్రమసంస్కారం**	గృహస్థాశ్రమంలో ప్రవేశించడానికి స్త్రీ-పురుషులు ఏకమవడం-25సం. వయస్సు దాటిన తరువాత వివాహొపరాన్త గృహస్థుడి ధర్మాలను, కర్తవ్యాలను పాలన చేస్తూ చతుర్థ సంతానాన్ని కనడం.	[3.4-62] [3.67-286, పంచమాధ్యాయాలు పూర్తిగా]
14. వానప్రస్థం	బిడ్డలు స్వావలంబులైన తరవాత లేదా 50 సం॥ వయస్సు అయిన తరవాత-గృహాన్ని వదిలి వనంలో ఉంటూ, తపస్సు చేస్తూ ఈశ్వరభక్తితో కాలం గడపడం. వనంలో ఉండటానికి చేసే దీక్షా సంస్కారం.	[6.1-32]
15. సన్న్యాసం	సాంసారిక భోగాది భావనలు మొదలుకొని సర్వస్వాన్ని త్యజించి, పూర్ణవైరాగియై, పరోపకారార్థం విచారణం (లోకాటనం) చేయాలనే దీక్ష తీసుకొని, బ్రహ్మయందు లీనుడై మోక్షప్రాప్తికి ప్రయత్నించడం. ఈ ఉద్దేశాలతో సన్న్యాస దీక్షానుష్ఠానం చేయాలి.	[6.33-97 వరకు] [12.82-125 వరకు చూడండి]
16. అన్త్యేష్టి	ప్రాణాలు పోయిన తరువాత శరీరానికి చేసే దహనసంస్కారం.	[5.167]

(4) 'ఏనః' శబ్దానికి అర్థం:-

"దుష్టాచరణం వల్ల మానసిక, శారీరిక చెడు సంస్కారాలు ఉత్పన్నమైనవని అర్థం" **ఈయతే ప్రాప్యతే దుఃఖం అనేన ఇతి ఏనః అధర్మాచరణమ్ తజ్జన్యః సంస్కారదోషః శరీరాశుద్ధిశ్చ. "ఇణ్‌గతౌ"** ధాతువుకు **"ఇణఃఆగసి"** (ఉణాది 4.198) సూత్రం వల్ల అసున్ ప్రత్యయం, నుడాగమం వల్ల **'ఏనస్'** శబ్దం సిద్ధమవుతుంది దీనికి సమర్థన-2.77, [2.102] శ్లోకాలు. అక్కడ **'ఏనస్'** ప్రయోగంతో పాటు- సంస్కార దోషమాలిన్యమనే అర్థంలో **'మలమ్'** పర్యాయవాచక శబ్దప్రయోగం చూడగలరు. పూర్వజన్మ సంస్కారదోషాలమలినాలు దూరమవుతాయని తెలిసికోవాలి.

వేదాధ్యయనం, యజ్ఞం, వ్రతాదుల వల్ల బ్రహ్మప్రాప్తి-

ఇది మనుకృతం-ప్రామాణికం

స్వాధ్యాయేన వ్రతైర్హోమై స్త్రైవిద్యేనేజ్యయా సుతైః ।
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః ॥ మూలశ్లోక సం. **3[2.28]**

టీక:- స్వాధ్యాయేన = సకల విద్యలను చదవడం, చదివించడం వల్ల, [3:75,81; 4.35,147; 6.8; 11.83], **వ్రతైః** = బ్రహ్మచర్యం, సత్యపాలనాది నియమాలను పాటించడం ద్వారా [4.259, 260; 6.97], **హోమైః** = అగ్నిహోత్రాది హోమాలు, సత్యగ్రహణం, అసత్యత్యాగం మరియు విద్యలన్నింటిని దానం చేయడం వల్ల, [2.186], **త్రైవిద్యేన** = వేదాలలో గల కర్మ, జ్ఞాన, ఉపాసనల వల్ల [3.1,2; 7.37,38; 12, 111, 112], **ఇజ్యయా**= పక్షేష్ట్యాదులను చేయడం ద్వారా[4.25; 6.9,10,38], **సుతైః** = సంతానోత్పత్తులద్వారా[3.39-42], **మహాయజ్ఞైః** = 'బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం. బలివైశ్వ దేవయజ్ఞం, అతిథియజ్ఞం' ఈ పంచమహాయజ్ఞాలు చేయడం ద్వారా [3.69-82;6.4,5], **యజ్ఞైః** = అగ్నిష్టోమాది అలాగే- శిల్పవిద్యావిజ్ఞానాది యజ్ఞాలను ఆచరించడం ద్వారా[2.118], **ఇయం తనుః** = ఈ శరీరం, **బ్రాహ్మీయం క్రియతే** = బ్రాహ్మీశరీరంగా నిర్మాణమవుతుంది. వేదాలకు, పరమేశ్వర భక్తికి ఆధారమైన బ్రాహ్మణ శరీరం ఈ సాధనాలు లేకుండా బ్రాహ్మణ జన్మ అసంభవం.

ఋషి దయానంద భాష్యం :- స్వాధ్యాయేన = అధ్యయనం అధ్యాపనం చేత, **జపైః** = ధ్యానించడం, ధ్యానం చేయించడం, నానావిధ హోమాలను చేయడం, సంపూర్ణ వేదాలను, శబ్దార్థసంబంధ స్వరోచ్చారణ సహితంగా, చదవడం, చదివించడం. **ఇజ్యయా** = పౌర్ణమాసీ ఇష్టి మొ॥ చేయడం. **సుతైః** = ధర్మంగా సంతానోత్పత్తి, **మహాయజ్ఞైః చ** = పూర్వోక్త బ్రహ్మ-దేవ-పిత్రు-బలివైశ్వదేవ-అతిథి పంచమహాయజ్ఞాలను చేయడం, **యజ్ఞైః చ** = అగ్నిష్టోమాది యజ్ఞాలను చేయడం, విద్వాంసుల సత్సంగం, సత్యభాషణం, పరోపకారాది సత్కర్మలు, సంపూర్ణ శిల్ప-విద్యాదులను చదవడం, దురాచారాలను వదిలి, శ్రేష్ఠాచారాన్ని ఆచరించడం వల్ల, **ఇయం తనుః** = ఈ శరీరం, **బ్రాహ్మీయం** = బ్రాహ్మణ శరీరం కలదిగా, **క్రియతే** = తయారవుతుంది. (స.ప్ర.4వ స; సం.వి,గృహస్థాశ్రమం) ॥3॥

మానవులు- ధర్మాచరణ చేస్తూ వేదాదిశాస్త్రాల పఠనపాఠనం, గాయత్రీ-ప్రణవాదుల అర్థాన్ని పరిశీలించడం. ధ్యానం, అగ్నిహోత్రాది హోమాలు నిర్వహించడం, కర్మోపాసనాజ్ఞానవిద్యలను, పౌర్ణమి అమావాస్యాది ఇష్టులను చేస్తూ, పంచమహాయజ్ఞాలను, అగ్నిష్టామాదులను నిర్వహిస్తూ, న్యాయంగా రాజ్యపాలన చేస్తూ సత్యోపదేశం, యోగాభ్యాసాది ఉత్తమ కర్మలద్వారా ఈ శరీరం బ్రాహ్మీయం అంటే బ్రహ్మకు (జ్ఞానానికి) సంబంధించినదిగా అవుతుంది.

జాతకకర్మ సంస్కార విధానం-

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాఙ్నాభివర్ధనాత్పుంసో జాతకర్మ విధీయతే ।
మన్త్రవత్ప్రాశనం చాస్య హిరణ్యమధుసర్పిషామ్ ॥ మూలశ్లోక సం. **4[2.29]**

టీక:- పుంసః = శిశువు యొక్క, **జాతకర్మ** = జాతకర్మసంస్కారం, **నాభివర్ధనాత్ ప్రాక్** = బొడ్డును కోయడానికి ముందుగా, **విధీయతే** = చేయబడును, **చ** = మరియు ఈ సంస్కారమున, **అస్య** = ఈ బాలుడికి, **మన్త్రవత్** = మంత్రోచ్చారణ పూర్వకంగా, **హిరణ్యమధు సర్పిషాం** = బంగారు శలాకతో తేనె-నేయి కలిపిన దాన్ని, **ప్రాశనం** = శిశువుకు నాకించాలి.

తాత్పర్యం:- నాభిచ్ఛేదానికి ముందు శిశువుకు జాతకర్మ చేయబడుతోంది. ఈ సమయంలో తేనె, నెయ్యి కలిపి బంగారు శలాకతో గృహ్యసూత్రాలలో చెప్పిన మంత్రాలతో శిశువుకు నాకించాలి.॥4॥

వివరణ:

వర్ధనశబ్ద వివేచనం:-1.'వర్ధనమ్' శబ్దం 'వర్ధ-ఛేదన పూరణయోః' అను ధాతువుకు 'ల్యుట్' ప్రత్యయం చేర్చగా 'వర్ధన' శబ్దం నిష్పన్నమవుతుంది. వర్ధనమంటే కోయడం అని అర్థం. బిడ్డ పుట్టిన తరవాత నాభి కత్తిరించడానికి పూర్వమే శ్లోకంలో చెప్పబడ్డ ప్రక్రియ పూర్తిచేయబడుతుంది. [పార.గృ.సూత్ర 1.16.1; గోభి.గృ.సూ.2.7, 13,17 చూడండి]

2. శ్రీమద్దయానందులవారు సంస్కారవిధిలో ఈ ప్రక్రియను ఇలా వివరించారు. జన్మించిన తరువాత ఘృతం, తేనె రెండు సమపాళ్ళుగా కలిపి, బంగారు శలాకను అందులో ముంచి చేతిలో తీసికొని, బిడ్డ నాలుక మీద 'ఓమ్' అనే అక్షరాన్ని రాసి, బిడ్డయొక్క దక్షిణ కర్ణం (కుడిచెవి)లో "వేదో౽సి" నీ గుప్తనామం 'వేదం' అని వినిపించి, కలిపి ఉంచిన తేనె-నెయ్యిలో ముంచిన బంగారు శలాకతో ఈ కింద పేర్కొన్న మంత్రాన్ని పఠిస్తూ కొంచెం కొంచెం నాకించాలి. [సం.వి.జాతకర్మ ప్రకరణం]

"ఓం ప్ర తే దదామి మధునో ఘృతస్య వేద సవిత్రా ప్రసూతం మఘోనామ్ ॥
ఆయుష్మాన్ గుప్తో దేవతాభిః శతం జీవ శరదో లోకే అస్మిన్."

('ఆశ్వ.గృహ్య'1-51-1)(సం.వి.)

3. జాతకర్మకు గృహ్యసూత్ర ప్రమాణాలు:- జాతకర్మకు గృహ్యసూత్రాలు మనుమహర్షి పద్ధతినే సమర్థించినవి. జాతకర్మవిషయంలో ఆశ్వలాయన గృహ్యసూత్రంలో జాతకర్మ విషయంలో నిమ్నవిధానం వర్ణితం.(1-15-1)

"కుమారం జాతం పురా అన్యైరాలంభాత్ సర్పిమధునీ హిరణ్యనికాషం హిరణ్యేన ప్రాశయేత్" బాలకుడు జన్మించిన తరవాత, ఇతరుల చేతికిచ్చే ముందుగా బంగారు శలాకతో, బంగారు పాత్రలో కలిపిన, ఘృతము-తేనె శిశువునాలికపై నాకించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

నామకరణ సంస్కారం-

నామధేయం దశమ్యాం తు ద్వాదశ్యాం వా౽స్య కారయేత్ ।
పుణ్యే తిథౌ ముహూర్తే వా నక్షత్రే వా గుణాన్వితే ॥ మూలశ్లోక సం.5[2.30]

టీక:- **అస్య** = ఈ శిశువు, **నామధేయం** = నామకరణ సంస్కారం, **దశమ్యాం వా ద్వాదశ్యాం** = పదోరోజు లేదా పన్నెండవ రోజు, **వా** = లేదా, **పుణ్యే తిథౌ వా ముహూర్తే** = అనుకూలమైన తిథియందు గానీ లేదా ముహూర్తమునందు గానీ, **వా** = లేదా, **గుణాన్వితే నక్షత్రే** = శుభగుణాలు గల నక్షత్రంలో [ప్రకృతి ప్రశాంతంగా ఉన్న సమయంలో] గాని, **కారయేత్** = చేయించాలి.

తాత్పర్యం:- శిశువు పుట్టిన పదోరోజు గాని, పన్నెండవ దినమున గాని, ఏదైనా ఇతర శ్రేష్ఠ దివసమునందు గాని సుముహూర్తానగాని మంచి నక్షత్రం గల రోజు చూచుకొనిగాని జాతకర్మ చేయాలి. దీన్నే డోలారోహణం, బారసాల, తొట్టెల అంటారు.॥5॥

వివరణ:

గృహ్యసూత్రాలలో నామకరణ ప్రమాణాలు:-

గృహ్యసూత్రాలలో నామకరణ విధానాలలో కొంతమార్పు కనిపిస్తుంది.

క. నామ చాస్మై దద్యుః. ఘోషవదాద్యన్తరన్తస్థమభినిష్ఠాన్తం ద్వ్యక్షరం । చతురక్షరం వా । యుగ్మాని త్వేవ పుంసామ్ । అయుజాని స్త్రీణామ్ (అశ్వ-గృహ్య 1.15.4-10).

ఖ. "దశమ్యాముత్థాప్య పితా నామ కరోతి. ద్వ్యక్షరం చతురక్షరం వా ఘోషవదాద్యన్తరన్త స్థం దీర్ఘాభినిష్ఠానాన్తం కృతం కుర్యాత్ న తద్ధితమ్ అయుజాక్షరమ్-ఆకారాన్తం స్త్రియై" (పార.-గృహ్య. 1.17,1-4.)

భావార్థం:- పదోరోజు తండ్రి నామకరణం చేస్తాడు. బాలుడి పేరు 2 అక్షరాలు లేదా 4 అక్షరాలు కలదిగా ఉండాలి. అవి ఘోషములు-గ ఘ ఙ, జ ఝ ఞ, డ, ఢ ణ, ద, ధ, న, బ, భ, మ, మరియు అంతస్థములు-య,ర,ల,వలతో కూడిన దీర్ఘ కృదంతంగా ఉండాలి. తద్ధితాన్తం ఉండరాదు. అసగా విషమాక్షరాలు-3,5,7 అక్షరాలు ఆకారాన్త నామాలు స్త్రీలకు ఉండాలి.

గ. నామకరణానికి మహర్షి దయానందులవారు చూపించిన సమయం. "జన్మించిన దినం నుండి 10 దినాలు వదిలి, పదకొండో రోజుగానీ లేదా 101వ రోజుగానీ లేదా 2 వ సం॥ ఆరంభంలో గాని, పుట్టిన రోజున గాని నామకరణం చేయవచ్చు.

వర్ణానుసారంగా నామకరణం-

ఇది మనుకృతం-ప్రామాణికం

మఙ్గళ్యం బ్రాహ్మణస్య స్యాత్ క్షత్రియస్య బలాన్వితమ్ ।
వైశ్యస్య ధనసంయుక్తం శూద్రస్య తు జుగుప్సితమ్ ॥ మూలశ్లోక సం. **6[2.31]**

బ్రాహ్మణస్య మఙ్గళ్యం స్యాత్ = శుభాన్నీ, శ్రేష్ఠత్వాన్నీ సూచించే నామములు బ్రాహ్మణుడికి ఉండాలి-ఉదా॥ బ్రహ్మ-విష్ణు-శివ-అగ్ని, వాయు, రవి మొ॥వి., క్షత్రియస్య = క్షత్రియుడికి, బల+అన్వితం = బలపరాక్రమ-భావబోధకాలుగా ఉండాలి. ఇంద్ర-భీష్మ-సుయోధన, నరేశ, జయేన్ద్ర, యుధిష్ఠిర మొ॥, వైశ్యస్య ధనసంయుక్తం = వైశ్యుడికి ధనైశ్వర్య భావబోధక శబ్దం- వసుమాన్, విత్తేశ, విశ్వంభర, ధనేశ మొ॥. శూద్రస్య తు = శూద్రుడికి, జుగుప్సితం = రక్షణీయుడు, పాలనీయుడు అనే భావాలను తెలిపే శబ్దాలు-సుదాసు, దేవదాసు, మొ॥వి, వర్ణసాపేక్ష గుణాలనే ఆధారంగా తీసికొని నామకరణం చేయించాలి.

తాత్పర్యం:- బ్రాహ్మణ శిశువుకు శుభవాచక నామధేయాన్ని, క్షత్రియుడికి బలవాచకం. వైశ్యుడికి ధనవాచకం, శూద్రునికి దాసవాచకంగా పేర్లు పెట్టాలి.॥6॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శర్మవద్బ్రాహ్మణ్యస్య స్యాద్రాజ్ఞో రక్షాసమన్వితమ్ ।
వైశ్యస్య పుష్టిసంయుక్తం శూద్రస్య ప్రేష్యసంయుతమ్ ॥ మూలశ్లోక సం. **7[2.32]**

టీక:- బ్రాహ్మణస్య శర్మవద్ స్యాత్ = బ్రాహ్మణుడి పేరు-శర్మవత్-కల్యాణ శుభ-సౌభాగ్య-సుఖ-ఆనంద-ప్రసన్నతలను సూచించే శబ్దాలను జోడించి నామకరణం చేయాలి. ఉదా: దేవశర్మ-విశ్వామిత్ర- వేదవ్రత-ధర్మదత్త మొ॥వి.

రాజ్ఞః రక్షాసమన్వితం = రక్షక భావం గల శబ్దాలను జోడించి క్షత్రియుడికి నామకరణం చేయాలి. ఉదా-మహీపాల, ధనంజయ, ధృతరాష్ట్ర, దేవవర్మ, కృతవర్మ మొ॥వి.

వైశ్యాయ పుష్టిసంయుక్తం = సమృద్ధిద్యోతకశబ్దాలను జోడించి నామాలుండాలి- ధనగుప్త- ధనపాల, వసుదేవ, రత్నదేవ, వసుగుప్త మొ॥వి.

శూద్రస్య ప్రేష్య సంయుతం = సేవకత్వ భావద్యోతక పదాలను జోడించి పెట్టాలి-దేవదాస- ధర్మదాస, మహీదాస మొ॥వి. అంటే వ్యక్తుల వర్ణగత కర్మలకు ఆధారంగా నామకరణం చేయాలి. ఉదా- బ్రాహ్మణుడికి విష్ణుశర్మ, క్షత్రియుడికి విష్ణువర్మ-వైశ్యుడికి విష్ణుగుప్త-శూద్రుడికి విష్ణుదాస- ఈ విధంగా నామకరణం చేయాలి. ద్విజుడెవడైనా శూద్రుడు కాదలచినట్లయితే తన పేరుకు చివర దాస జోడించి పెట్టుకోవచ్చు.

ఋషి దయానందభాష్యం:-బ్రాహ్మణుడికి సుఖదాయకమైనదిగా, రాజుకు రక్షణయుక్తంగా, వైశ్యుడికి ధనయుక్తంగా శూద్రునికి దాసయుక్తంగా పేరుపెట్టాలి. విప్రుడికి విష్ణుశర్మ, క్షత్రియుడికి బలవర్మ, వైశ్యుడికి వసుభూతి, శూద్రుడికి దీనదాసుడు అనే విధంగా నామాలుండాలి.॥7॥

వివరణ:

6,7 శ్లోకాల అర్థం: 6,7 శ్లోకాలకు మధ్య భేదమున్నట్లు వ్యాఖ్యాతల వ్యాఖ్యవల్ల తెలియడం లేదు. వ్యాఖ్యాతల అభిప్రాయమిలా ఉంది-మొదటి శ్లోకంలో నాలుగు వర్ణాలకు క్రమంగా మంగళయుక్తం గాను, బలయుక్తం గాను, ధనయుక్తం గాను మరియు నిందాయుక్తం గాను పేర్లు పెట్టాలనే విధానాన్ని చూపించారు. రెండో శ్లోకంలో, శర్మయుక్తం గాను, రక్షాయుక్తం గాను, పుష్టియుక్తం గాను మరియు దాసయుక్తం గాను నామకరణం చేయమని విధానం చేశారు. రెండు శ్లోకాలలో భిన్నభిన్నంగా రెండువిధానాలెందుకు చేసినట్లు? పైగా శబ్దాలను జోడించి-దేవశర్మ, దేవవర్మ, మహీపాల-ధనగుప్త, దేవదాస మొ॥ సంయుక్త నామకరణ విధానం ప్రాచీన పరంపరలో లేదు. స్వయం మనుమహర్షి నామం కూడా ఈ పరంపరకు అనుకూలంగా లేదు. ఈ విరోధమెందుకు? ఈ అర్థాలననుసరించి చూసినా కూడా రెండో శ్లోకంలో ఏకరూపత్వం కుదరదు. శర్మ-దాస శబ్దాలు ఉపాధికి సంబంధించగా, 'రక్షా-పుష్టి శబ్దాలు భావబోధకాలు. ఉపాధుల ననుసరించి అయినా నామకరణం చేయాలి లేదా భావబోధకాల ననుసరించి అయినా నామకరణం చేయాలి. ఈ రెండు విధానాలలో చాలా భేదముంది. టీకాకారులందరు **"జుగుప్సితమ్"** శబ్దానికి నిందాయుక్తమని అర్థం రాశారు. అది అశుద్ధమేగాక, మనుసమ్మతం కూడా కాదు.

పై ప్రశ్నలకు సమాధానం-

1. పైన పేర్కొన్న రెండు శ్లోకాలలో వికల్పపూర్వకంగా రెండు విధానాలున్నాయి. ఇవి రెండు భిన్నాలు. మొదటి శ్లోకంలో ఇచ్ఛితవర్ణానుసారంగా వ్యక్తుల గుణాలను, లేదా ప్రవృత్తులను ఆధారంగా చేసుకొని నామకరణం చేయాలనే నిర్దేశం. ఉదాహరణకు-బ్రాహ్మణవర్ణం వారిలో శుభాలు, శ్రేష్ఠాలైన గుణాలు ఉంటాయి. దాన్ననుసరించి భావబోధక శుబ్దాలతో వారికి నామకరణం చేయవలసి ఉంటుంది. క్షత్రియవర్ణస్థులలో బలపరాక్రమమనే గుణాలుంటాయి. అందువల్ల వారి గుణాలను వ్యక్తం చేసే గుణప్రధానమైన నామములుండాలి. అదేవిధంగా వైశ్యులలో ధనవంతులుగా ఉండటం వారిలో గుణం. అందువల్ల వారిపేర్లు-ధనవంతుడు, ఐశ్వర్యవంతుడు మొ॥ పేర్లుంటాయి. అదేవిధంగా శూద్రుడు ద్విజుల ఆశ్రయంలో ఉంటాడు కాబట్టి వారికి ఆ గుణాలను తెలిపే పేర్లు (రక్షణీయుడు-దాసుడు) మొ॥ పేర్లుంటాయి.

ఇక రెండోశ్లోకంలో వ్యక్తుల వర్ణగతకర్మలననుసరించి నామకరణం చేసే విధానముంది- ఉదాహరణకు-పరోపకారం ద్వారా ప్రజలకు కల్యాణం కలిగించడం, విద్యాప్రదానం ద్వారా సుఖాన్ని కలిగించడం మొ॥వి. ఈ కర్మలను సూచించే నామకరణం జరగాలి. ఇదే విధంగా క్షత్రియుడి కార్యం రక్షించడం, పాలించడం మొ॥వి. కాబట్టి వారిపేర్లు ఈ కర్మలను సూచించేవిగా ఉండాలి. పాలన-పోషణ చేయడం వైశ్యుడి కర్మ. అదేవిధంగా సేవచేయడం శూద్రుడి కర్మ. కాబట్టి, వారి

పేర్లతో భావబోధక శబ్దాలను చేర్చడానికే ఈ విధానం. శుభాలను కాంక్షించడం, రక్షించడం, ధనవంతుడుగా ఉండటం, ఆశ్రితుడుగా ఉండటం-ఇవి వర్ణాల వ్యక్తి సాపేక్షగుణాలు లేదా ప్రవృత్తులు. సుఖపెట్టడం, కల్యాణం కలిగించడం, రక్షించడం, పాలన- పోషణ చేయడం, సేవచేయడం-ఇవి వృత్తుల వర్ణగత కార్యాలు. ఈ విధంగా ప్రథమ శ్లోకంలో గుణాలను, ప్రవృత్తులను ఆధారంగా చేసుకొని నామకరణవిధానం, రెండోశ్లోకంలో కర్మానుసారం నామకరణ విధానం చెప్పబడింది.

మొదటి విధానంలో, గుణం లేదా ప్రవృత్తి బోధక శబ్దాలను జోడించి నామకరణం. రెండో విధానంలో కార్యానుసారంగా భావాన్ని ప్రకటించే శబ్దాలతో నామకరణం.

2. రెండో శ్లోకంలో "శర్మవత్" శబ్దాన్ని శాబ్దికరూపంగా టీకాకారులు అర్థం చెప్పారు. అంటే, శర్మ-వర్మ-గుప్త-దాస ఉపాధులను కలిపి నామకరణ విధానం చేసేలాగా భావించారు. ఇది సంకుచితార్థం. సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. వారి కీ భ్రాంతి ఎలా కలిగింది? అర్వాచీనయుగంలో కేవలం ఈ శబ్దాలనే పరంపరగా ఉపయోగిస్తున్నందువల్ల ఈ శ్లోకంలో 'శర్మవత్' ప్రయోగం వల్ల, 'శర్మ' శబ్దం జోడించమని అర్థం కాదు. ఆ భావం గల ఏ శబ్దాన్నయినా ఉపయోగించవచ్చు అని అభిప్రాయం. ఇక్కడ శాబ్దికరూపంగా కాక, భావరూపంగా తీసుకోవాలి. ఈ భావంతోనే భావవాచక శబ్దాలైన రక్ష-పుష్టి శబ్దాలను మనువు ప్రయోగించాడు. క్షత్రియశబ్దంతో పాటు 'రక్షాశబ్దమును ప్రయోగించ కుండా, 'వర్మ' శబ్దాన్నే ప్రయోగించేవాడు కదా? అందువల్ల బ్రాహ్మణనామంతో పాటు-శర్మ చేర్చి దేవశర్మ అని కూడా అనవచ్చు. అలాగే, మిత్ర-ప్రియ శబ్దాలను జోడించి, దేవప్రియ, దేవమిత్ర అనవచ్చు. అదేవిధంగా క్షత్రియుడి నామంతో వర్మను జోడించి-ప్రతాపవర్మ అనవచ్చు. ఇంద్ర చేర్చి ప్రతాపేంద్ర, విజయేంద్ర అని కూడా అనవచ్చు. ఈ ప్రకారంగా ఈ శ్లోకానికి వ్యాపకభావాన్ని తీసుకోవాలి.

3. 'జుగుప్సిత' శబ్దానికర్థం:-"జుగుప్సితమ్" శబ్దానికి, నిందాయుక్తమని, ఘృణాస్పదమని" అర్థం చెప్పడం కూడా ఉచితం కాదు. "గుపూ=రక్షణే" అనే ధాతువుకు స్వార్థంలో "సన్" ప్రత్యయం చేర్చగా, "స్వార్థం"లో వచ్చే ప్రత్యయానికి విశేషమైన స్వీయార్థముండదు కాబట్టి ధాతువు యొక్క మూలార్థాన్నే బోధిస్తుంది. అందువల్ల, 'గుప్' ధాతువుకు-రక్షించడం అనే అర్థముంది. కాబట్టి ఇక్కడ 'జుగుప్సితం' శబ్దానికి రక్షణీయం, పాలనీయం, ఆశ్రయం ఇవ్వతగినవాడు అనే అర్థం వస్తుంది. ఈ శబ్దానికి ఇదే మూలార్థం. నిందావాచకమనే అర్థం కూడా ప్రచలితమే. కానీ, ఇది పరవర్తి. 'జుగుప్సా' శబ్దానికి నేడు నిందా, ఘృణా మొ॥ అర్థంలో అధికంగా ఉపయోగించబడుతుంది.అందువల్ల మన మనస్సులలో మొదట ఈ అర్థమే వస్తుంది. కానీ మనుస్మృతి శ్లోకంలో ఈ అర్థంలో ఆ శబ్దాన్ని ప్రయోగించలేదు. 'రక్షణీయుడు' అనే అర్థం అభిప్రేతం. ఇదే మనుస్మృతి వ్యవస్థలకు అనుకూలం. అందువల్లనే సర్వవర్ణాలకు సేవ చేసే పని కూడా శూద్రుడికి మనువు నిర్ణయించాడు. అందువల్లనే మనుస్మృతిలో ఎక్కడ కూడా శూద్రుడి పట్ల నిందాభావం గాని, ఘృణ గాని ప్రదర్శించలేదు. స్వల్పయోగ్యత కారణంగా, నిర్లిప్తభావంతో అతని కర్మలను నిర్దేశించాడు. శూద్రుడు శుద్ధం, శ్రేష్ఠాలైన ఉత్తమగతికి యోగ్యుడని పేర్కొన్నాడు.

"శుచిరుత్కృష్టశుశ్రూషుర్మృదువాగనహంకృతః ।
బ్రాహ్మణాద్యాశ్రయో నిత్యముత్కృష్టాం జాతిమశ్నుతే ॥మను.10.8

కాబట్టి "జుగుప్సితమ్" శబ్దానికి నిందాయుక్తమనే అర్థం చెప్పటం మనుసమ్మతం కాదు. ఉచితం కూడా కాదు.

స్త్రీల నామకరణ విధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

స్త్రీణాం సుఖోద్యమక్రూరం విస్పష్టార్థం మనోహరమ్ ।
మఙ్గళ్యం దీర్ఘవర్ణాన్తమాశీర్వాదాభిధానవత్ ॥ మూలశ్లోక సం.8[2.33]

టీక:- స్త్రీణాం = స్త్రీల పేర్లు, **సుఖోద్యమ్** = సులభంగా ఉచ్చరించడానికి వీలైనవి, **అక్రూరం** = కోమలాక్షరాలు గలవి, **విస్పష్టార్థమ్** = స్పష్టమైన అర్థం కలిగినవి, **మనోహరమ్** = మనస్సుకు ఆకర్షణ కలిగించేవి. **మఙ్గళ్యం** = శుభభావం కలిగినవి, **దీర్ఘవర్ణాన్తమ్** = చివరలో దీర్ఘాక్షరం కలవి, అలాగే, **ఆశీర్వాద+అభిధాన+వత్** = ఆశీర్వాద భావబోధకాలైనవిగా ఉండాలి. ఉదాహరణకు-కల్యాణీ, వందనా, విద్యావతీ, కమలా, విమలా, సుశీలా, సుషమా, భాగ్యవతీ, సావిత్రీ, యశోదా, ప్రియంవదా మొ॥వి. (ఈ శబ్దాలు సంస్కృత పదాలు- కాబట్టి పేర్లు దీర్ఘాంతాలుగా ఉన్నవి. తెలుగులో మాత్రం హ్రస్వాంతకాలౌతాయి.)

తాత్పర్యం:- స్త్రీ శిశువుల పేర్లు మంగళదాయకమై సులభంగా ఉచ్చరించడానికి వీలుకలిగినవై, మనోహరములై, క్రూరార్థవాచకం కానిదీ, అంతమందు దీర్ఘాచ్చు గల పేర్లు పెట్టాలి. ఆశీదర్థకం గల పేర్లు (ఉదా: సుభద్రా దేవి) స్త్రీలకు మంగళాన్ని కలిగిస్తాయి, (ఇటీవలి కాలంలో ఈ ఆచారాన్ని విస్మరిస్తున్నారు.) ॥8॥

ఒక అక్షరం, మూడు అక్షరాలు లేదా 5 అక్షరాలు గల పేర్లను స్త్రీలకు పెట్టాలి. ఉదా-శ్రీ-యశోదా, సుఖదా, సౌభాగ్యవతీ ఇత్యాదులు-(సం.వి.నామకరణ సంస్కారం).

ఇది మనుకృతం-ప్రామాణికం

నిష్క్రమణం, అన్న ప్రాశన సంస్కారం

చతుర్థే మాసి కర్తవ్యం శిశోర్నిష్క్రమణం గృహాత్
షష్ఠేఽన్న ప్రాశనం మాసి యద్వేష్టం మంగళం కులే ॥ మూలశ్లోక సం. **9[2.34]**

టీక:- శిశోః = బిడ్డను, **గృహాత్ నిష్క్రమణం** = గృహం నుండి బయటికి తీసుకు పోవడానికి నిష్క్రమణ సంస్కారం, **చతుర్థే మాసి** = నాలుగో మాసంలో, **కర్తవ్యం** = చేయాలి. మరియు **అన్నప్రాశనం** = అన్నం తినిపించుట, అన్నప్రాశన సంస్కారం, **షష్ఠే మాసి** = 6వ మాసంలో, **వా** = లేదా, **యత్కులే ఇష్టం మఙ్గళం** = కుటుంబం వారికి ఇష్టమైన రోజు గానీ లేదా శుభమని తోచినప్పుడు గానీ చేయవచ్చు.

ఋషిదయానంద భాష్యమ్:- శిశువుకు 3 నెలలు నిండిన తర్వాత నాలుగో మాసంలో సూర్యదర్శనం చేయించాలి. అంటే బయటికి తీసుకు రావచ్చునని అర్థం. ఆరోనెలలో అన్నప్రాశనం చేయాలి. (అంత వరకు తల్లిపాలే శ్రేష్ఠమని ఇటీవల పరిశోధనలూ రుజువు చేశాయి.). కుటుంబంవారికి ఇష్టమైన రోజు లేదా శుభ తిథులలో ఈ విధులు జరిపించుకోవచ్చు.

బిడ్డను ఇంటి నుండి ఆరుబయటికి- వాయువు పరిశుద్ధంగా ఉన్నచోటికి కొంచెం అటు ఇటు తిప్పడానికి తీసుకుపోయే సంస్కారమే నిష్క్రమణ సంస్కారమంటారు. బయట వాయువు ప్రసన్నంగా ఉన్నప్పుడు మాత్రమే బిడ్డను బయట ప్రదేశంలో అటు ఇటు తిప్పాలి. ఇది 4వ మాసంలో తప్పక చేయాలి (సం.వి.నిష్క్రమణ). ॥9॥

వివరణ: నిష్క్రమణ, అన్న ప్రాశనాలకు ప్రమాణాలు:-

నిష్క్రమణ సంస్కారానికీ, అన్నప్రాశన సంస్కారానికీ గృహ్యసూత్రాల నుండి ప్రమాణాలు.

క. **చతుర్థే మాసి నిష్క్రమణికా సూర్యముదీక్షయతి**
తచ్చక్షురితి. (పార.గృహ్య. 1.75.56)

నాలుగో మాసంలో నిష్క్రమణ సంస్కారం చేయాలి. బిడ్డను బయటకు తీసుకువెళ్ళి సూర్యదర్శనం చేయించాలి.

ఖ. **జననాద్యస్తృతీయో జ్యౌత్స్నస్తస్య తృతీయాయామ్.** (గో.గృహ్య 5.8.1)

లేదా జన్మించిన తరవాత, మూడో శుక్లపక్షంలో తదియ రోజున బిడ్డను-నిష్క్రమణం చేయించాలి.

గ. **షష్ఠేమాసి అన్నప్రాశనమ్. దధిమధుఘృతమిశ్రితమన్నం ప్రాశయేత్** (ఆశ్వ.గృహ్య. 1.16.1-5.)

ఆరోమాసంలో బిడ్డకు అన్నప్రాశనం చేయించాలి. పెరుగు, తేనె, నెయ్యి కలిపిన అన్నాన్ని తినిపించాలి.

ముండన సంస్కారం- ఇది మనుకృతం-ప్రామాణికం

చూడాకర్మ ద్విజాతీనాం సర్వేషామేవ ధర్మతః ।
ప్రథమేఽబ్దే తృతీయే వా కర్తవ్యం శ్రుతిచోదనాత్ ॥ మూలశ్లోక సం.**10[2.35]**

టీక:- **సర్వేషాం + ఏవ ద్విజాతీనాం** = ద్విజాతులందరికి-బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలవారు (తల్లిదండ్రుల కోరికననుసరించి) **చూడాకార్మ** = ముండన సంస్కారం (వెంట్రుకలు తీయించడం), **ధర్మతః** = ధర్మానుసారంగా, **శ్రుతిచోదనాత్** = వేద ఆజ్ఞానుగుణంగా, **ప్రథమే అబ్దే** = మొదటి సంవత్సరంలో గాని, **వా తృతీయే** = లేదా మూడో సంవత్సరంలో గాని, తమ తమ అనుకూల సమయంలో, **కర్తవ్యం** = చేయించాలి.

ఋషి దయానందభాష్యం :- వేదాజ్ఞననుసరించి ద్విజులు శిరోముండన సంస్కారాన్ని వర్ణానుసారం మొదటి సంవత్సరంలో గాని మూడో ఏటగాని జరిపించాలి. ఇది వేదాజ్ఞ.

చూడాకర్మ అంటే, ముండన సంస్కారం (తలవెంట్రుకలు తీయడం). బిడ్డకు ప్రథమ సంవత్సరంలో గాని, మూడో సంవత్సరంలో గాని చేయాలి. ఉత్తరాయణకాలంలో శుక్లపక్షమున శుభమని తోచిన దినమున ఈ సంస్కారం చేయాలి.(సం.వి.చూడా కర్మ) ॥10॥

వివరణ:

చూడాకర్మకు ప్రమాణం

తలవెంట్రుకలు తీయడానికి కాల నిర్దేశం

క. **తృతీయే వర్షే చౌలమ్** ఆశ్వలాయన గృహ్య 1-17-1

మూడో సంవత్సరంలో ముండన సంస్కారం చేయబడుతుంది.

ఖ. **"సాంవత్సరికస్య చూడాకరణమ్"** పార.గృహ్య. 2-1-1

ఒక సంవత్సరం బాలుడికి ముండనం చేయబడుతుంది.

ఉపనయన సంస్కారం ఇది మనుకృతం-ప్రామాణికం

గర్భాష్టమేఽబ్దే కుర్వీత బ్రాహ్మణస్యోపనాయనమ్ ।
గర్భాదేకాదశే రాజ్ఞో గర్భాత్తు ద్వాదశే విశః ॥ మూలశ్లోక సం.**11[2.36]**

టీక:- **బ్రాహ్మణస్య** = బ్రాహ్మణ వర్ణాన్ని కోరేవాడి యొక్క (తల్లిదండ్రుల కోరికకు ఆధారంగా చేయబడు ప్రయోగం) **ఉపనాయనమ్** = ఉపనయనం గురువు వద్దకు పంపించడం అంటే యజ్ఞోపవీత సంస్కారం, **గర్భాష్టమే + అబ్దే** = గర్భం ఏర్పడినప్పటి నుండి ఎనిమిదో సంవత్సరంలో, **కుర్వీత** = చేయాలి. క్షత్రియవర్ణాన్ని కోరేవారికి, **గర్భాత్ + ఏకాదశే** = గర్భమేర్పడినప్పటి నుండి పదకొండో సంవత్సరంలో, మరియు, **విశః** = వైశ్యవర్ణాన్ని కోరేవారికి, **గర్భాత్ ద్వాదశే** = గర్భదినం నుండి పన్నెండో సంవత్సరంలో ఉపనయన సంస్కారం చేయించాలి.

తాత్పర్యం:- బ్రాహ్మణులకు ఎనిమిదో ఏట, క్షత్రియులకు పదకొండో ఏట, వైశ్యులకు పన్నెండో ఏట ఉపనయన విధి (వొడుగు) జరిపించాలి. ఇది బ్రహ్మచర్యవ్రత దీక్షా విధికి ముఖ్యమైనది.॥11॥

వివరణ:

1. బ్రాహ్మణాది పదాలకు మనుసమ్మతమైన అర్థం:-

క. 11-13 శ్లోకాల్లో ఉన్న "బ్రాహ్మణస్య" అనే పదానికి ప్రచలిత వ్యాఖ్యాకారులందరూ 'బ్రాహ్మణ బాలుడు, **క్షత్రియస్య** = క్షత్రియ బాలుడు, **వైశ్యస్య లేదా విశః** = వైశ్య బాలుడు అని అర్థం రాశారు. ఇది పదప్రయోగానికి, మనుభావనకు విరుద్ధం. శ్లోకంలో బాలుడనే పదప్రయోగం లేదు. 'బ్రాహ్మణస్య' అని మాత్రమే ఉంది. దానికి బ్రాహ్మణబాలుడని అర్థం రాయడం సరికాదు. కర్మద్వారానే వర్ణవ్యవస్థను సమర్థించడం మనుమహర్షి అభిప్రాయం. [10.65;1.87-91,101 శ్లోకంలోని వివరణ చూడగలరు.] కర్మద్వారానే వర్ణ పరివర్తనం కూడా జరుగుతుందని మనుమహర్షి దృఢాభిప్రాయం.

ఖ. ఇక్కడ బ్రాహ్మణాది శబ్దాలు జాతివాచకాలు కాదు. వర్ణసంజ్ఞావాచకాలు. దాని ప్రకారంగా బ్రాహ్మణ శబ్దానికి బ్రాహ్మణ వర్ణదీక్షాకాలంగా గుర్తించాలి.

అధ్యాహారం ద్వారా **"బ్రాహ్మణ వర్ణాన్ని కోరేవాడని"** అర్థం. ఇందుకు రాబోయే 2. 12వ శ్లోకంలో ప్రయోగించిన **'బ్రహ్మవర్చసకామస్య'** [2.12] పద ప్రయాగమే సాక్ష్యం. ఈ అర్థం వ్యాపకం. ఇందులో రెండు విధాలైన భావాలు కలిసిపోతాయి. పరంపరానుసారంగా తన వర్ణంలో దీక్ష ఇప్పించాలనుకున్నప్పటికీ, ఈ వ్యవస్థను బట్టి దీక్షాసంస్కారం చేయించవచ్చు. లేదా, పరివర్తన పూర్వకంగా తనబిడ్డకు రెండో సంవత్సరంలో దీక్షితుడిగా చేయదలిస్తే అప్పుడు కూడా ఉపనయన సంస్కారం చేయించవచ్చు.

గ. అల్పవయస్కుడైన పిల్లవాడికి **'ఇష్టం'** ఏముంటుందనే సందేహం రావచ్చు. అందువల్ల ఇది తల్లిదండ్రుల ఇష్టానుసారంగా జరగాలని చెప్పబడింది. ప్రారంభంలో తల్లిదండ్రులు తమ బిడ్డను ఎలా చేయాలనుకుంటారో అలాంటి సంస్కారమే చేస్తారు. మళ్లీ ఆ బిడ్డ శిక్షా-దీక్షలను పరీక్షించి ఏ వర్ణంలో చేరాలనే విషయం ఆచార్యులే నిర్ణయిస్తారు. [2.121 (146), 123 (148) చూడండి]. రాబోయే శ్లోకం 12లో మనువు క్రమంగా **"బ్రహ్మవర్చసకామస్య బలార్థినః, వైశ్యస్య ఇహ అర్థినః"** లాంటి పదాలను ప్రయోగించాడు.

2. ఉపనయన ప్రసంగంలో శూద్రవర్ణాన్ని గురించిన ప్రస్తావన ఎందుకు లేదు?-

11-13 శ్లోకాలలో ఉపనయన, వేదారంభ సంస్కారాల విషయంలో శూద్రుల ప్రస్తావన మనువు చేయలేదు. అతడు దీక్షకు ముందు-ఎవ్వరినీ జన్మచేత బ్రాహ్మణుడిగా అంగీకరించలేదు. ఇది ద్విజ కుటుంబంలో జరిగే దీక్షాసంస్కారం. ద్విజులంటే రెండు జన్మలు కలవారని. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మాత్రమే ద్విజులు. ఏ వ్యక్తి ఏ వర్ణంలో దీక్షతీసుకొంటాడో, ఆ వ్యక్తి ఈ మూడింటిలో ఆ వర్ణంలో ప్రవేశిస్తాడు. బాలుడు గురుకులంలో ప్రవేశించి మళ్ళీ శిక్షా-దీక్షలను పొందిన తర్వాత ఆచార్యుడు మరల అతని వర్ణాన్ని నిర్ణయిస్తాడు [2.121(146)-123(148)].

క. ఈ మూడు వర్ణాలకు చెందినవాడు అనగా వారి గుణాలు లేనివాడు, వేదారంభం, అలాగే ఉపనయన రూపమైన బ్రహ్మజన్మను పొందజాలడు. అతడు శూద్రుడనబడతాడు. ఉపనయనం కాకముందు అంటే ద్విజన్మకు పూర్వం, అన్ని వర్ణాల బాలురు శూద్రులే అవుతారు.

"జన్మనా జాయతే శూద్రః సంస్కారాత్ ద్విజ ఉచ్యతే" స్కందపురాణం.నాగర ఖండం 2-39-31

ఖ. ఈ ప్రకారంగా ఏ పిల్లవాడైనా ఏ వర్ణంలో అయినా దీక్షితుడు కావచ్చు అని స్పష్టంగా మనువు చెప్పాడు. **"చతుర్థ ఏక జాతిస్తు శూద్రః"** (10.4) అందువల్ల ఉపనయనాదులకు పూర్వం శూద్రులకు ఏ నిర్ధారణ లేనందువల్ల ఉపనయన సందర్భంలో శూద్రప్రసక్తి రాలేదు. ద్విజులు-పతితులు గాను, శూద్రులు గాను మార్పుచెందే స్థితి తరువాత తెలుస్తుంది [(2.14,15) (39-40)].

౨. జన్మద్వారానే వర్ణాలేర్పడునని మనువు అంగీకరించడు. అందువల్లనే శూద్రులకు ఉపనయనం నిషేధించలేదు. జన్మద్వారానే వర్ణాలేర్పడతాయనే ఆచారాన్ని అంగీకరించినట్లయితే ఇక్కడ శూద్రులకు ఉపనయనం నిషేధమని చెప్పేవాడు (1.31, 87-91,107; 10.65 శ్లోకాలలో వర్ణ వ్యవస్థ చూడగలరు.).

3. ఉపనయన విధానం గృహ్యసూత్రాలలో కూడా మనుమహర్షికి అనుకూలంగా ఉంది.

"అష్టమే వర్షే బ్రాహ్మణముపనయేత్" గర్భాష్టమే వా"। ఏకాదశే క్షత్రియమ్ । ద్వాదశే వైశ్యమ్ (అశ్వ.గృహ్య). జన్మించిన దినం నుండి, లేదా గర్భం నిలచిన రోజునుండి ఎనిమిదో సం॥ బ్రాహ్మణులకు, పదకొండో సం॥ క్షత్రియులకు, పన్నెండో సంవత్సరంలో వైశ్య బాలురకు యజ్ఞోపవీత సంస్కారం చేయాలి (సం.వి.ఉపనయనం).

ఉపనయనానికి విశేష సమయం- ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రహ్మవర్చసకామస్య కార్యం విప్రస్య పంచమే ।
రాజ్ఞో బలార్థినష్షష్ఠే వైశ్యస్యేహార్థినోఽష్టమే ॥ మూలశ్లోక సం.12[2.37]

టీక:- **ఇహ బ్రహ్మవర్చస కామస్య** = ఈ ప్రపంచంలో ఎవరికి బ్రహ్మతేజస్సు-ఈశ్వర విద్యాదులు శీఘ్రంగా, అధికంగా ప్రాప్తించాలని కోరేవారికి, **విప్రస్య** = బ్రాహ్మణ వర్ణం కావాలని కోరేవారికి, మాతా-పితరుల కోరిక ననుసరించి ఉపనయనసంస్కారం, **పంచమే కార్యం** = 5వ సంవత్సరంలోనే చేయించాలి. **ఇహ బలార్థినః రాజ్ఞః** = ఈ ప్రపంచంలో బలపరాక్రమాది క్షత్రియవిద్యలను శీఘ్రంగా సంపాదించాలనుకొనే క్షత్రియ-వర్ణాన్ని కోరే బాలురకు, **షష్ఠేవర్షే** = 6వ సంవత్సరంలో, **ఇహ+అర్థినః వైశ్యస్య** = ఈ లోకంలో ధనైశ్వర్యాదులు శీఘ్రంగా ప్రాప్తించాలని కోరే, వైశ్య వర్ణం కావాలనే బాలురకు, **అష్టమే** = 8వ సంవత్సరంలో ఉపనయనం చేయించాలి.

తాత్పర్యం:- బ్రహ్మవర్చస్సుకోరే విప్రుడికి 5వ ఏట; చతురంగ బలాలను అపేక్షించే క్షత్రియుడికి ఆరోఏట; వ్యాపారలాభం కాంక్షించే వైశ్యుడికి ఎనిమిదవ యేట ఉపనయనం చేయవచ్చు!

ఋషి దయానందభాష్యం:-ఎవరికి-విద్య, బలం, వ్యవహారజ్ఞానం కావాలనుకుంటారో విద్యార్జనకు సమర్థుడో, అలాంటి బ్రాహ్మణ బాలుడికి పుట్టినప్పటి నుండి గాని లేదా గర్భం నిలిచినప్పటి నుండి గానీ ఐదో సంవత్సరంలో, క్షత్రియ బాలురకు ఆరో సం॥లో, వైశ్యబాలురకు 8వ సం॥లో ఉపనయన సంస్కారం జరిపించాలి (సం.వి. ఉపనయనం).॥12॥

ఉపనయనానికి అంతిమ కాలం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆషోడశాద్బ్రాహ్మణస్య సావిత్రీ నాతివర్తతే ।
ఆద్వావింశాత్ క్షత్రబంధోరాచతుర్వింశతేర్విశః ॥ మూలశ్లోక సం.13[2.38]

టీక:- **బ్రాహ్మణస్య** = బ్రాహ్మణ వర్ణం కావాలనుకునేవారికి, **ఆషోడశాత్** = 16వ సం॥వరకు, **క్షత్రబంధోః** = క్షత్రియవర్ణాన్ని కోరేవారికి, **ఆద్వావింశాత్** = 22వ సం॥వరకు, **విశః** = వైశ్యవర్ణం కావాలని కోరేవారికి, **ఆచతుర్వింశతేః** = 24వ సం॥ వరకు, **సావిత్రీ న + అతివర్తతే** = యజ్ఞోపవీతానికి అతిక్రమణ జరగదు. అంటే పైన చెప్పిన సంవత్సరం వరకు ఉపనయన సంస్కారం చేయించవచ్చు.

తాత్పర్యం:- బ్రాహ్మణవర్ణం కోరువానికి 16 సం॥లు; క్షత్రియ వర్ణం కోరువానికి 22 సంవత్సరాలు, వైశ్యవర్ణం కోరువానికి 24 సంవత్సరాల వయసు వరకు ఉపనయనానికి చివరి సమయం నిర్ణయించబడింది.॥13॥

ఉపనయన కాలాతిక్రమణ విధానం గురించి-గృహ్యసూత్రాలలో ఇలా ఉంది-

"ఆషోడశాత్ బ్రాహ్మణస్య అనతీతకాలః ॥5॥
ఆద్వావింశాత్ క్షత్రియస్య, ఆచతుర్వింశాత్ వైశ్యస్య॥6॥ (ఆశ్వ.గృహ్య. 1. 19. 5,6)

బ్రాహ్మణులకు 16, క్షత్రియులకు 22, వైశ్యులకు-24. వీరికి ఆ యా సంవత్సరాల లోపుగా యజ్ఞోపవీత సంస్కారం జరగాలి, (సం.వి.ఉపనయనం).

ఉపనయనం నుండి పతితులైన వ్రాత్యుల లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

అత ఊర్ధ్వం త్రయోఽప్యేతే యథాకాలమసంస్కృతాః ।
సావిత్రీపతితా వ్రాత్యా భవంత్యార్యవిగర్హితాః ॥ మూలశ్లోక సం. **14[2.39]**

టీక:- **యథాకాలం+అసంస్కృతాః** = నిర్ధారిత సమయంలో సంస్కారం జరపనట్లయితే. **అతః ఊర్ధ్వం** = ఈ 2.13 లో ఉదాహరించిన సమయం గడిచిపోగా, **ఏతే త్రయః+అపి** = ఈ ముగ్గురు బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య బాలకులు, **సావిత్రీ పతితాః** = సావిత్రీ యజ్ఞోపవీతం లేనివారై పతితులై, **ఆర్యవిగర్హితాః** = ఆర్య-శ్రేష్ఠవ్యక్తులద్వారా నిందితులై, **వ్రాత్యాఃభవన్తి** = వ్రతం నుండి పతితులై వ్రాత్యులని పిలువబడతారు.

తాత్పర్యం:- ఈ బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యులు నిర్ధారిత సమయంలో ఉపనయనము జరపనట్లయితే గాయత్రినుండి భ్రష్టులై, ఆర్య-శ్రేష్ఠవ్యక్తుల ద్వారా నిందితులై వ్రాత్యులనబడతారు.॥14॥

వివరణ:

'అతః ఊర్ధ్వం పతితసావిత్రీకా భవన్తి'. (ఆశ్వ.గృహ్యం. 1. 19. 6).

పూర్వోక్త సమయంలో వీరికి యజ్ఞోపవీతసంస్కారం జరపనట్లయితే పతితులనుగా గుర్తించాలి (సం.వి.ఉప).

వ్రాత్యులతో సంబంధ విచ్ఛేద కథనం- ఇది మనుకృతం-ప్రామాణికం

నైతైరపూతైర్విధివదాపద్యపి హి కర్హిచిత్ ।
బ్రాహ్మాన్ యౌనాంశ్చ సంబంధానాచరేద్బ్రాహ్మణస్సహ ॥ మూలశ్లోక సం. **15[2.40]**

టీక:- **బ్రాహ్మణః సహ** = ద్విజులలో ఏ వ్యక్తి అయినా, **ఏతైః + అపూతైః** = ఈ పతితులలో, **కర్హిచిత్ ఆపది + అపి హి** = ఎంతటి ఆపత్కాలమైనా, **విధివత్** = నియమపూర్వకంగా, **బ్రాహ్మాన్** = విద్యాధ్యయన అధ్యాపన సంబంధమైన, **చ** = మరియు, **యౌనాన్** = వివాహసంబంధమైన, **సంబంధాన్** = వ్యవహారాలను, **న ఆచరేత్** = చేయకుందురుగాక!

తాత్పర్యం:- ఇలా అపవిత్రులై యథావిధిగా ప్రాయశ్చిత్తం చేసికొననివారితో బ్రాహ్మణుడు ఎప్పుడు కాని ఆపదలలో కూడా యాజనాది బ్రాహ్మసంబంధాలను, కన్యాదానాది వరసంబంధాలను చేయరాదు.॥15॥

వర్ణానుసారంగా మృగచర్మవిధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

కార్ష్ణరౌరవవాస్తాని చర్మాణి బ్రహ్మచారిణః ।
వసీరన్నానుపూర్వ్యేణ శాణక్షౌమావికాని చ ॥ మూలశ్లోక సం. **16[2.41]**

టీక:- **బ్రహ్మచారిణః** = మూడు వర్ణాలకు చెందిన బ్రహ్మచారులు, **అనుపూర్వ్యేణ** = క్రమంగా, **కార్ష్ణ రౌరవ-వాస్తాని చర్మాణి** = ఆసనరూపంగా పరుచుకోడానికి బ్రాహ్మణులు నల్లటి మృగచర్మాన్నీ, క్షత్రియులు రురుమృగచర్మాన్నీ, వైశ్యులు గొర్రె చర్మాన్నీ, **తథా** = అలాగే కప్పుకోడానికి, కట్టుకోడానికి, **శాణక్షౌమ ఆవికాని** = వరసగా నార బట్టలను, పట్టుబట్టలను, ఉన్నిబట్టలను ధరించాలి.

తాత్పర్యం:- మూడు వర్ణాలకు చెందిన బ్రహ్మచారులు అంటే బ్రాహ్మణులు జింకతోలును, క్షత్రియులు రురుమృగచర్మమును, వైశ్యులు గొర్రెతోలును పరచుకోవడానికి మరియు వీరు వరుసగా నారబట్టలను, వెలిపట్టుబట్టలను, ఉన్నిబట్టలను కట్టుకోవడానికి వాడాలి.॥16॥

వర్ణానుసారంగా మేఖలావిధానం ఇది మనుకృతం-ప్రామాణికం

మౌంజీ త్రివృత్సమా శ్లక్ష్ణా కార్యా విప్రస్య మేఖలా ।
క్షత్రియస్య తు మౌర్వీ జ్యా వైశ్యస్య శణతాంతవీ ॥ మూలశ్లోక సం.**17[2.42]**

టీక:- విప్రస్య = బ్రాహ్మణులకు, మేఖలా = మొలతాడు, మౌంజీ = ముంజనామక గడ్డితో, క్షత్రియస్య మౌర్వీ జ్యా = క్షత్రియులకు ధనుష్షుకు వేసే అల్లె తాడుతో, (ముర అనే గడ్డితో పేనిన), వైశ్యస్య = వైశ్యులకు, శణతాన్తవీ = నారతో తయారైన, త్రివృత్‌సమా = మూడు పేటలుగా పేనిన తాడును మొలతాడుగా ధరింపచేయాలి.

తాత్పర్యం:- బ్రాహ్మణులకు ముంజక నామక గడ్డితో పేనినదై మూడు పేటలుగల మొలతాడునూ, క్షత్రియులకు ముర్వ అనే గడ్డితో మూడు పేటలుగా పేనిన మొలతాడునూ, వైశ్యులకు నారతో మూడుపేటలుగా పేనిన మొలతాడునూ ధరింపచేయాలి. ॥17॥

ఋషి దయానందభాష్యం:-ముందుగా తయారుచేసి ఉంచిన అందమైన గట్టి మొల తాడును ఆచార్యుడు బాలుడి నడుముకు కట్టాలి. దర్భలతో అల్లినది బ్రాహ్మణులకు, మురా అనే పేరుగల తృణాలతో తయారైనది క్షత్రియులకు, ఉన్నితో తయారైనది వైశ్యులకు మేఖలగా కట్టించాలి (సం.వి.వేదారంభ సంస్కారం).

మేఖలాధారణలో వికల్పము- ఇది మనుకృతం-ప్రామాణికం

ముంజాలాభే తు కర్తవ్యాః కుశాశ్మన్తక బల్వజైః ।
త్రివృతా గ్రంథినైకేన త్రిభిః పంచభిరేవ వా ॥ మూలశ్లోక సం.**18[2.43]**

టీక:- ముంజాలాభే తు = ఉపర్యుక్తమైన బ్రహ్మచారి ధరించే ఒక విధమైన దర్భల మొలతాడు, (ముంజి) మొ॥ లభించనట్లయితే, క్రమశః = వరసగా, కుశ-అశ్మన్తక-బల్వజైః = దర్భ, రెల్లు, తుంగ బల్వజ నామక గడ్డితో, త్రివృతా = మూడు పురులుగా పేనిన, ఏకేన గ్రంథినా = ఒక ముడి వేసిన, వా = అథవా, త్రిభిఃపంచభిః+ఏవ = మూడు లేదా 5 ముడులు వేసిన, కర్తవ్యాః = మొలతాడులను తయారుచేయాలి.

తాత్పర్యం:- ముంజకసవు మున్నగునవి దొఱకనప్పుడు దర్భ, రెల్లు, తుంగ వీటితో ముప్పిరిగా పేనిన ఒకముడి, మూడుముళ్ళు, లేదా ఐదుముళ్ళు గల మొల త్రాళ్ళను వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య బ్రహ్మచారులు ధరించాలి.॥18॥

వర్ణానుసారంగా యజ్ఞోపవీత ధారణ- ఇది మనుకృతం-ప్రామాణికం

కార్పాసముపవీతం స్యాద్విప్రస్యోర్ధ్వవృతం త్రివృత్ ।
శణసూత్రమయం రాజ్ఞో వైశ్యస్యావికసౌత్రికమ్ ॥ మూలశ్లోక సం.**19[2.44]**

టీక:- విప్రస్య = బ్రాహ్మణుడికి, ఉపవీతం = యజ్ఞోపవీతం, కార్పాసం = పత్తి నూలుతోనూ, రాజ్ఞః = క్షత్రియులకు, శణసూత్రమయం = జనపనారతోనూ, వైశ్యః = వైశ్యుడికి, ఆవికసౌత్రికం = గొర్రె ఉన్నితోనూ, స్యాత్ = ఉండాలి (యజ్ఞోపవీతం), ఊర్ధ్వవృతం = దక్షిణం వైపునుండి, ఎడమవైపు భుజం మీదికి, ఉండేట్లు, త్రివృత్ = మూడేసి దారాలను కలిపి మూడు పోగులుగా పేని ధరించాలి.

తాత్పర్యం:- బ్రాహ్మణులు ప్రత్తినూలితోను, క్షత్రియులు జనపనారతోను, వైశ్యులు గొర్రె ఉన్నితోను పేనిన పోగులు గల యజ్ఞోపవీతమును కుడివైపు నుండి ఎడమవైపు భుజం మీదికి ఉండే విధంగా ధరించాలి.॥19॥

వర్ణానుసారంగా దండ ధారణ విధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మణో బైల్వపాలాశౌ క్షత్రియో వాటఖాదిరౌ ।
పైలవౌదుంబరౌ వైశ్యో దండానర్హంతి ధర్మతః ॥ మూలశ్లోక సం.**20 [2.45]**

టీక:- **బ్రాహ్మణః** = బ్రాహ్మణ బ్రహ్మచారి, **బైల్వ-పాలాశౌ** = బిల్వం గాని, మోదుగ గాని, **క్షత్రియః** = క్షత్రియబ్రహ్మచారి, **వాటఖాదిరౌ** = మర్రి, చండ్ర, **వైశ్యః** = వైశ్యబ్రహ్మచారి, **పైలవ+ఔదుంబరౌ** = జువ్వి లేదా మేడి, **దండాన్** = దండములను, **ధర్మతః** = నియమానుసారంగా, **అర్హంతి** = ధరించడానికి అర్హులు.

తాత్పర్యం:- బ్రాహ్మణ బ్రహ్మచారి బిల్వంగానీ మోదుగగానీ; క్షత్రియ బ్రహ్మచారి మర్రిగానీ చండ్రగానీ; వైశ్యబ్రహ్మచారి జువ్వి లేదా మేడి దండములను నియమానుసారంగా ధరించడానికి అర్హులు.॥20॥

వర్ణానుసారం దండముల పరిమాణం- ఇది మనుకృతం-ప్రామాణికం

కేశాన్తికో బ్రాహ్మణస్య దండః కార్యః ప్రమాణతః ।
లలాటసమ్మితో రాజ్ఞః స్యాత్తు నాసాంతికో విశః ॥ మూలశ్లోక సం.**21[2.46]**

టీక:- **ప్రమాణతః** = కొలతననుసరించి, **బ్రాహ్మణస్య దండః** = బ్రాహ్మణుడి దండ, **కేశాన్తికః** = తలవెంట్రుకల వరకు (పొడవు), **రాజ్ఞః లలాట సమ్మితః** = క్షత్రియుడి దండ నొసటి వరకు, **విశః** = వైశ్యుడికి, **నాసాన్తికః** = ముక్కు వరకు పొడవు గల దండములు, **స్యాత్** = ఉండాలి.॥21॥

తాత్పర్యం:- బ్రాహ్మణుల దండము తలవెంట్రుకల వరకూ, క్షత్రియదండము నొసటివరకూ, వైశ్యులదండము ముక్కు వరకు ఉండాలి.॥21॥

దండముల స్వరూపం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఋజవస్తే తు సర్వే స్యురవ్రణాః సౌమ్యదర్శనాః ।
అనుద్వేగకరా నృణాం సత్వచోఽనగ్నిదూషితాః ॥ మూలశ్లోక సం.**22[2.47]**

టీక:- **తే తు సర్వే** = ఆ దండములన్ని కూడా, **ఋజవః**= వంకరలేనివిగా, **అవ్రణాః** = ముడులులేనివిగా, **సౌమ్యదర్శనాః** = చూడటానికి ముచ్చటైనవిగా, **నృణాం అనుద్వేగకరాః** = మానవులకు భయం కలిగించనివిగా, **సత్వచః** = పట్టా (తోలు) కలిగినవిగా, **అనగ్ని దూషితాః** = కాలి, నల్లగా ఉండనివిగా, **స్యుః** = ఉండాలి.

తాత్పర్యం:- ఆ దండములు వంకర లేనివిగానూ, ముడులు లేనివిగానూ, సొగసైనవిగానూ, ఇతరులకు భయం కలిగించనివిగానూ, పై పట్టాతో కూడినవిగానూ, అగ్నిలో కాలనివిగానూ ఉండాలి ॥22॥

వివరణ:- 20 నుండి 22 శ్లోకాల భావాన్ని దయానందసరస్వతి ఈ విధంగా ఇచ్చారు. బ్రాహ్మణ బాలకునికి పలాశ లేదా మారేడు దండాన్నీ అతనిలలాటంవరకుండునంత పొడవు గలదిగా ఉండాలి. క్షత్రియునకు మఱ్ఱి, చండ్ర దండాన్ని అతని కనుబొమ్మల వరకు, వైశ్యబాలకునకు జువ్వి, మేడిదండాన్ని అతని నాసికాగ్రం వరకుండునట్లు దండలను ఇవ్వాలి. పుచ్చనివి, వంకరలేనివి, కాల్చనివిగా ఉండాలి. (సం.వి.వేదారంభ ప్రకరణం)

సంస్కారంలో భిక్షావిధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రతిగృహ్యేప్సితం దణ్డముపస్థాయ చ భాస్కరమ్ ।
ప్రదక్షిణం పరీత్యాగ్నిం చరేద్భైక్షం యథావిధి ॥ మూలశ్లోక సం.**23[2.48]**

టీక:- ఈప్సితం దణ్డం ప్రతిగృహ్య = ఉపర్యుక్త దండలలో తనకు యోగ్యమైన దండను ధరించి, **చ** = మరియు, **భాస్కరం ఉపస్థాయ** = సూర్యుడి ఎదుట నిలబడి, **అగ్నిం ప్రదక్షిణం పరీత్య** = యజ్ఞాగ్నికి ప్రదక్షిణ, పరిక్రమ చేసి, **యథావిధి** = విధిననుసరించి (2.24-25), **భైక్షం చరేత్** = భిక్ష అడగాలి.

తాత్పర్యం:- ప్రతి దినం యథాయోగ్య దండమును తీసుకొని, సూర్యోపస్థానము చేసి, అగ్నికి ప్రదక్షిణం గావించి యథావిధిగా భిక్షాటనం చేయాలి.॥23॥

భిక్షావిధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

భవత్పూర్వం చరేద్భైక్ష ముపనీతో ద్విజోత్తమః ।
భవన్మధ్యం తు రాజన్యో వైశ్యస్తు భవదుత్తరమ్॥ మూలశ్లోక సం.**24[2.49]**

టీక:- ఉపనీతః ద్విజోత్తమః = యజ్ఞోపవీత సంస్కారం ద్వారా దీక్షితుడైన బ్రాహ్మణుడు, **భవత్పూర్వం భిక్షం చరేత్** = 'భవత్' శబ్దాన్ని వాక్యానికి ముందు చేర్చి **'భవాన్ భిక్షాం దదాతు"**, (దేహి) లేదా **"భవతీ భిక్షాం దదాతు"** లేదా (దేహి) అని భిక్ష అడగాలి, **తు** = మరియు, **రాజన్యః** = క్షత్రియుడు, **భవత్మధ్యం** = భవత్ శబ్దాన్ని వాక్యం మధ్యలో ఉంచి- **"భిక్షాం భవాన్ దదాతు"** (దేహి) లేదా **'భిక్షాంభవతీ దదాతు"** (దేహి) అని భిక్ష అడగాలి, **వైశ్యః** = వైశ్యుడు, **భవత్ + ఉత్తరమ్** = భవత్ శబ్దాన్ని వాక్యం చివరలో చేర్చి - **భిక్షాం దదాతు భవాన్**, (దేహి) లేదా **'భిక్షాం దదాతు భవతీ' (దేహి)** అని భిక్ష అడగాలి.

తాత్పర్యం:- ఉపనీతుడయిన బ్రాహ్మణుడు **"భవతి భిక్షాం దేహి"** అని భవచ్ఛబ్దం మొదట చెబుతూ, ఉపనీతుడయిన క్షత్రియుడు **"భిక్షాం భవతీ దేహి"** అని భవచ్ఛబ్దం మధ్యలో చెబుతూ. వైశ్యబ్రహ్మచారి **"భిక్షాం దేహి భవతీ"** అని భవచ్ఛబ్దం చివరలో చెబుతూ భిక్షాటనం చేయాలి.॥24॥

ఋషి దయానందభాష్యం:- బ్రాహ్మణ బాలకుడు మగవారిని భిక్షనడుగనప్పుడు **'భవాన్ భిక్షాం దదాతు'** (లేదా) **'దేహి'** అని, స్త్రీలను అడుగునపుడు **'భవతీ భిక్షాం దదాతు' (లేదా) 'దేహి'** అని అడుగాలి.

క్షత్రియబాలకుడు పురుషున్ని **"భిక్షాం భవాన్ దదాతు"** అని, స్త్రీని **"భిక్షాం భవతీ దదాతు"** అని

వైశ్వబాలకుడు పురుషున్ని **"భిక్షాం దదాతు భవాన్"** అని, స్త్రీని **"భిక్షాం దదాతు భవతీ"** అని భిక్షనడగాలి. (సం.వి.వే.సంస్కారం.)

భిక్షను ఎవరినడగాలి?-

ఇది మనుకృతం-ప్రామాణికం

మాతరం వా స్వసారం వా మాతుర్వా భగినీం నిజామ్ ।
భిక్షేత భిక్షాం ప్రథమం యా చైనం నావమానయేత్ ॥ మూలశ్లోక సం.**25[2.50]**

టీక:-ఈ బ్రహ్మచారులు, **మాతరం వా స్వసారం** = తల్లిని గాని, అక్కనుగాని, **వా మాతుఃనిజామ్ భగినీం** = పినతల్లి, తల్లి సొంతచెల్లెలును గాని లేదా, **యా చ ఏనం న + అవమాన యేత్** = ఎవరు ఇతడిని అవమానించరో. అలాంటివారిని, **ప్రథమం భిక్షాం భిక్షేత** = ప్రథమంగా భిక్షను అడగాలి.

టీక:- తాత్పర్యం:- తల్లినిగాని, తోబుట్టినదాన్ని గాని, తల్లి తోడబుట్టినదాన్ని (అంటే పినతల్లి, పెత్తల్లిని గాని) ఎవరు ఇతడిని అవమానింపరో వారిని మొదట భిక్ష అడగాలి.

ఋషి దయానందభాష్యం:- బాలకుడు యజ్ఞకుండానికి ప్రదక్షిణ చేసి కుండానికి పశ్చిమభాగాన నిలబడి తల్లి, తండ్రి, అన్న, అక్క, మేనమామ, మేనత్త, పినతండ్రి మొదలగువారిని, భిక్షపెట్టుటకు తిరస్కరింపనివారిని భిక్షనడగాలి. (సం.వి.వేదారంభ సంస్కారం) ॥25॥

గురువుకు భిక్షాసమర్పణ-

ఇది మనుకృతం-ప్రామాణికం

సమాహృత్య తు తద్భైక్షం యావదన్నమమాయయా ।
నివేద్య గురవేఽశ్నీయాదాచమ్య ప్రాఙ్ముఖఃశుచిః ॥ మూలశ్లోక సం.**26[2.51]**

టీక:- తత్భైక్షంతు సమాహృత్య = ఆ భిక్షాన్నాన్ని అవసరానుసారంగా తెచ్చి, **యావత్ + అర్ధం** = భోజ్యసామాగ్రి ఎంత ఉందో, దాన్ని, **అమాయయా** = నిష్కపటభావంతో, **గురవే నివేద్య** = గురువుకు సమర్పించి, **శుచిః** = నిర్మలుడై, **ప్రాఙ్ముఖః** = తూర్పుముఖం పెట్టి, **ఆచమ్య** = ఆచమనం చేసి, **అశ్నీయాత్** = భుజించాలి.

తాత్పర్యం:- ఇలా భిక్షాన్నాన్ని అవసరానుసారంగా, తెచ్చి భోజ్య సామాగ్రి అంతా గురువుకు సమర్పించి అతడి అనుజ్ఞను పొంది ఆచమించి, తూర్పు ముఖంగా కూర్చుండి పరిశుద్ధుడై అవశిష్టమును భుజించాలి.॥26॥

ఋషి దయానందభాష్యం:- భిక్షలో ఎంత లభించిందో, అంతా గురువు ముందుంచాలి. తరవాత ఆచార్యుడు అందులో నుండి కొంచెం అన్నాన్ని తీసుకొని తక్కిన భిక్షాన్నాన్ని బాలుడికి ఇవ్వాలి. ఆ భిక్షాన్నాన్ని బాలుడు తన భోజనానికి ఉంచుకోవాలి. (సం.వి.వే.సంస్కారం).

ఈ శ్లోకం ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* **నాలుగు దిక్కులలో ముఖముపెట్టి భుజించిన దాని ఫలము-**

* *ఆయుష్యం ప్రాఙ్ముఖో భుంక్తే యశస్యం దక్షిణాముఖః ।*
శ్రియం ప్రత్యఙ్ముఖో భుఙ్క్తే ఋతం భుఙ్క్తే హ్యుదఙ్ముఖః ॥ *ప్ర.స.సం.* ***27[2.52]***

తాత్పర్యం:- కామ్యఫలాన్ని కోరే భోజనం గురించి చెప్పుచున్నాడు;- దీర్ఘాయుష్షు కోరువాడు తూర్పు ముఖంగానూ, కీర్తికామును కోరువాడు దక్షిణాభిముఖుడుగానూ, సంపదను కోరువాడు పడమటి దిక్కుగానూ మోక్షకాముడు ఉత్తరముఖంగానూ, కూర్చుండి భుజించాలి.॥27॥

ప్రక్షిప్తాల పరిశీలన:-

27వ శ్లోకం ఈ కింది ఆధారాలవల్ల ప్రక్షిప్తమవుతుంది-

1. అంతర్ వ్యతిరేకం

26వ శ్లోకంలో ఉపనయన విధిలో కేవలం తూర్పుగా తిరిగి భుజించాలని చెప్పాడు. కానీ ఇందులో నాలుగు దిశలకూ తిరిగి తినాలని ఉంది. ఇది మనుపు చెప్పిన దానికి వ్యతిరేకం కనుక ఇది ప్రక్షిప్తం. ఇదే మనువు అభీష్టమైతే, మనుపు శ్లోకంలోని విధానం చెప్పే అవసరమే ఉండేది కాదు.

2. శైలీగత ఆధారం

ఈ శ్లోకపు శైలి నిరాధారమూ, అయుక్తి యుక్తమూ, అతిశయోక్తితో కూడినది గానూ ఉంది. భోజనం చేసే దిశలు చెప్పటంలో ఎటువంటి తార్కికతా లేదు. 1.ఇంత సులువుగా లాభం వస్తే, ప్రతివారికీ అది కలగాలి. ఎందుకంటే ప్రతివారూ ఏదో ఒక దిక్కుగా కూర్చునే భోజనం చేస్తారు కదా!

ఏ విధమైన కీర్తికానీ, ఇంకేవైనా కానీ లభించటానికి ఎటువంటి అవకాశమూ లేదు.

ఇంత సులభంగా లాభప్రాప్తి అవుతుందంటే, దానికోసం ప్రయత్నించవలసిన అవసరమేమిటి? దీని ప్రకారం ఎవరైనా బీదలుగా ఉంటారా? ఇటువంటి నిరాధారవర్ణన గల శైలి మనువుది కానేకాదు!

28 నుండి 35వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

భోజనానికి ముందు ఆచమన విధానము-

ఉపస్పృశ్య ద్విజో నిత్యమన్నమద్యాత్సమాహితః ।　　మూలశ్లోక సం.27
భుక్త్వా చోస్పృశేత్సమ్యగద్భిః ఖాని చ సంస్పృశేత్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం.28[2.53]

టీక:- ద్విజః = ద్విజుడు, నిత్యం = ప్రతిదినం, ఉపస్పృశ్య = ఆచమనం చేసి, సమాహితః = ఏకాగ్ర మనస్సుతో, అన్నం + అద్యాత్ = భోజనం చేయాలి, చ = మరియు, భుక్త్వా = భోజనం చేసి, సమ్యక్ = చక్కగా, ఉపస్పృశేత్ = పుక్కిలించాలి. అలాగే, అద్భిః+ఖాని సంస్పృశేత్ = నీటితో ముక్కు, ముఖం, నేత్రాదులను శుభ్రపరచుకోవాలి.

"నిత్యం భోజనానికి ముందు శుద్ధజలంతో ఆచమనం చేయాలి" (సం.వి.)

తాత్పర్యం:- ప్రతిరోజూ తన గురువుకు నివేదించనిదే బ్రహ్మచారి భోజనం చేయకూడదు. నివేదించాక ఆచమనం చేసి తూర్పు ముఖంగా కూర్చొని ఇతర ఆలోచనలు లేకుండా భుజించాలి. భోజనానంతరం కాళ్లు-చేతులు, ముఖం కడుక్కోవాలి.॥28॥

భోజనసంబంధంలో మనో వైజ్ఞానిక విధానం-　　ఇది మనుకృతం-ప్రామాణికం

పూజయేదశనం నిత్యమద్యాచ్చైతదకుత్సయన్ ।　　మూలశ్లోక సం.28
దృష్ట్వా హృష్యేత్ప్రసీదేచ్చ ప్రతినన్దేచ్చ సర్వశః ॥　　ప్రక్షిప్త శ్లోక సం. 29[2.54]

టీక:- నిత్యం = ప్రతిదినం భోజనం చేసేటప్పుడు, అశనం పూజయేత్ = భోజ్యపదార్థాన్ని ఆదరించాలి, గౌరవించాలి. చ = మరియు, ఏతత్ + అకుత్సయన్+అద్యాత్ = నిందాభావం లేకుండా, శ్రద్ధతో భుజించాలి. దృష్ట్వా హృష్యేత్ చ ప్రసీదేత్ = భోజన పదార్థాలను చూసి-మనస్సు ప్రసన్నంగా ఉంచాలి. చ = మరియు, సర్వశః ప్రతినన్దేత్ = ఆ భోజన పదార్థాలను పూర్తిగా ప్రశంసించాలి.

తాత్పర్యం:- అన్నాన్ని ధ్యానించాలి. నిందించకుండా భుజించాలి. ఎలాంటి కలవరపాటు చెందక నిర్మల మనస్కులై ఉండాలి. ఈ అన్నం మనకు ఎప్పుడూ లభించాలని ప్రార్థిస్తూ ప్రసన్నతతో భుజించాలి. ॥29॥

వివరణ: 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్'. మన శరీరాన్ని పెంచి పోషించే అన్నం పరబ్రహ్మతో సమానం. కాబట్టి అత్యంత శ్రద్ధతోనూ, అన్నాన్ని గౌరవిస్తూ తినాలి తప్ప-అక్కర్లేదంటూ, తిట్టుకుంటూ, అన్నమ్మీద కోపగించి నిరాదరణతోనూ తినకూడదు.

అన్నం రావడానికి పంచభూతాలూ సహకరిస్తాయి. నేల పండించింది. నీరు మొలకెత్తేలా చేసింది. సూర్యుడి వేడిమి కంకి వచ్చేలా చేసింది. వాయువు ఎక్కువ తేమ కారణంగా పంట నాశనం కాకుండా చేసింది. ఆకాశం తగినంత వర్షాన్ని, భూమిని దున్నడానికీ, పంటమీద ఉన్నప్పుడు అసలు వర్షంలేకుండా చేసి రక్షించడానికీ సహాయపడింది.

కాబట్టి ఎలప్పుడూ అన్నాన్ని ధ్యానిస్తూ తినాలి. కారణాంతరాల వల్ల ఏదైనా కలవరపాటు కలిగినా గాని, భోజనం చేసేప్పుడు వాటిని వదిలిపెట్టాలి. నిర్మలమైన మనస్సుతో భుజించాలి. 'ఇలాంటి అన్నం మనకు ఎల్లప్పుడూ కలుగుగాక' అని భావిస్తూ ఆహారాన్ని గ్రహించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

పూజితం హ్యశనం నిత్యం బలమూర్జం చ యచ్ఛతి ।　　మూలశ్లోక సం.29
అపూజితం తు తద్భుక్తముభయం నాశయేదిదమ్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం. 30[2.55]

టీక:- **హి** = ఎందుకంటే, **పూజితం అశనం**= శ్రద్ధతో-ఆనందంగా భుజించిన అన్నం, **నిత్యం బలం చ ఊర్జం యచ్ఛతి** = సదైవ బలాన్నీ, స్ఫూర్తినీ ఇస్తుంది. **తు తత్ + అపూజితం** = అనాదరంగా, **భుక్తం** = భుజించిన అన్నం, **ఇదం ఉభయం నాశయేత్** = ఈ రెండింటిని- బలాన్నీ స్ఫూర్తినీ నష్టపరుస్తుంది.

తాత్పర్యం:- ఎవరైతే ఈ ప్రకారం స్తుతిస్తూ భోజనం చేస్తారో, వారి వల్ల గ్రహించబడిన ఆహారం బలాన్ని-వీర్యాన్ని ఇస్తుంది. స్తుతి లేకుండా తీసుకోబడినట్టి అన్నం బలవీర్యాన్ని నశింపజేస్తుంది.॥30॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నోచ్ఛిష్టం కస్యచిద్దద్యాన్నాద్యాచ్చైవ తథాంతరా । మూలశ్లోక సం.**30**
న చైవాత్యశనం కుర్యాన్న చోచ్ఛిష్టః క్వచిద్వ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **31[2.56]**

టీక:- **న కస్యచిత్ + ఉచ్ఛిష్టం దద్యాత్** = ఎవరికీ తన ఎంగిలి పదార్థం ఇవ్వరాదు, **తథా ఏవ న అంతరా అద్యాత్** = అదేవిధంగా ఉదయం, సాయంత్రం భోజనాల మధ్య ఏమీ తినరాదు, **న చైవ అత్యశనం కుర్యాత్** = అతిగా భోజనం చేయరాదు, **న ఉచ్ఛిష్టః క్వచిత్ వ్రజేత్** = భోజనానంతరం ముఖం-చేతులు కడుగకుండా అటు ఇటు, ఎక్కడికీ పోరాదు.

తాత్పర్యం:- ఎంగిలి చేసిన అన్నాన్ని ఎవరికీ పెట్టకూడదు. మధ్యాహ్న భోజనం-రాత్రి భోజనం మధ్య ఇతరత్రా ఏ ఆహారపదార్థాలనూ తీసుకోరాదు. (విదేశీయులు 'స్నాక్స్' తీసుకొనే ఆచారం దీనికి విరుద్ధం. అది మ్లేచ్ఛుల ఆహార విధానం.) మితిమీరి భుజించకూడదు. ఎన్నడూ ఎంగిలిచేత్తో ఆహారం వదిలి లేవరాదు. భోజనానంతరం ముఖం, చేతులు కడుక్కోకుండా అటూ ఇటూ తిరుగరాదు, ఎక్కడికీ పోరాదు. ॥31॥

వివరణ:- ఎంగిలి తినడం దోషం

ఇతరుల ఎంగిలి (ఉచ్ఛిష్టం) తినడంలోని దోషాన్ని మహర్షి దయానందులవారిట్లు చెబుతున్నారు.

1. ప్రశ్న-కలిసి భోజనం చేయటంలో దోషముందా? లేదా?

జవాబు: దోషముంది. కారణం? ఒకరి స్వభావం- ప్రకృతి మరొకరికి కలవదు. కుష్ఠువాడితో భోజనం చేయడం వల్ల-మంచి మనుజుడి రక్తం కూడ చెడిపోతుంది. కాబట్టి మరొకడితో భుజించడంవల్ల కొంత చెడు ఉంటుంది.

2. ప్రశ్న-"గురోరుచ్ఛిష్ట భోజనం" ఈ వాక్యానికి అర్థమేమిటి?

జవాబు: గురువు భోజనం చేసిన తరవాత వేరుగా ఉంచిన శుచియైన భోజనం చేయడం. గౌరవార్థం ముందుగా గురువుకు భోజనం పెట్టి, తరువాత భోజనం చేయుమని తాత్పర్యం. అంతే కాని గురువు తినగా మిగిల్చిన ఎంగిలి భోజనం చేయుమని కాదు.

3. ప్రశ్న: ఎంగిలి తినరాదంటే, తేనెటీగల ఎంగిలి, తేనె కూడా ఉచ్ఛిష్టమే గదా? దూడ పాలు తాగిన తరువాత తీసే పాలు కూడా ఎంగిలే కదా? స్వయంగా భోజనం చేసేప్పుడు ఒకరు, తిన్న తరవాత రెండో కబళం కూడా ఎంగిలే కదా? అప్పుడు వీటిని కూడా తినకూడదు, తాగకూడదు గదా?

జవాబు: తేనె కూడా ఉచ్ఛిష్టమనే మాట మాత్రం అనవచ్చు. కానీ అది అనేక ఓషధుల సారం. దూడ తన తల్లిపాలు మాత్రం తాగుతుంది. కానీ లోపలి (చన్ను లోపలి) పాలను తాగదు. అందువల్ల అది ఉచ్ఛిష్టం కాదు. అందువల్లనే దూడ పాలు తాగిన తరువాత పశువు స్తనములు కడిగి శుద్ధపాత్రలో పాలు తీస్తారు. మరియు తన ఎంగిలి తనకు వికారాన్ని కలిగించదు.

చూడండి- ఒకరి ఎంగిలి మరొకరు తినడం స్వభావానికి విరుద్ధం. "ప్రతివారు తమ ముఖాలను, ముక్కును, నేత్రాలను, ఉపస్థను, గుహ్యేంద్రియాల - మలమూత్రాదులను స్పర్శించి శుభ్రం చేసుకోవడంలో ఎవరు అసహ్యించుకోరు.

కానీ ఇతరుల మలమూత్రాలను స్పర్శించడానికి ఇష్టపడరు. అందువల్ల ఈ వ్యవహారం సృష్టి క్రమానికి విపరీతం కాబట్టి, ఒకరి ఎంగిలిని మరొకరు తినకుండా ఉండటమే మంచిది.

4. ప్రశ్న: స్త్రీ పురుషులున్నూ (భార్యాభర్తలు) పరస్పరం ఉచ్ఛిష్టం తినరాదా?
జవాబు: తినకూడదు. కారణం-వారి శరీరాల స్వభావాలు కూడా భిన్నభిన్నంగా ఉంటాయి.

(స.ప్ర.10.స)

ఇది మనుకృతం-ప్రామాణికం

అనారోగ్యమనాయుష్య మస్వర్గ్యం చాతిభోజనమ్ । మూలశ్లోక సం.**31**
అపుణ్యం లోకవిద్విష్టం తస్మాత్తత్పరివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**32 [2.57]**

టీక:- **అతిభోజనం** = అధికంగా మితిమీరి భుజించడం, **అనారోగ్యమ్** = ఆరోగ్యనాశకం, **అనాయుష్యమ్** = ఆయుష్షు తగ్గిపోతుంది. **అస్వర్గ్యం** = సుఖనాశకం, **అపుణ్యం** = అహితకరం, **చ** = మరియు, **లోకవిద్విష్టం** = ప్రజల నిందకు గురవుతుంది, **తస్మాత్** = అందువల్ల, **తత్** = అధిక భోజనం తినడం, **పరివర్జయేత్** = మానాలి.

తాత్పర్యం:- అతిభోజనం అనారోగ్యదాయకం. అంతేకాదు ! ఆయుష్షును హరిస్తుంది. స్వర్గాది పుణ్యసముపార్జనమునకు విరోధి. పుణ్యకార్యాలకు అవరోధం కలిగించేది. లోకులచేత హేళనకు కారణమయ్యేది అధిక భోజనం అని తెలుసుకోవాలి ॥32॥

ఆచమన విధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మేణ విప్రస్తీర్థేన నిత్యకాలముపస్పృశేత్ । మూలశ్లోక సం.**32**
కాయత్రైదశికాభ్యాం వా న పిత్ర్యేణ కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.**33[2.58]**

టీక:- విప్రః = ద్విజుడు, నిత్యకాలం = ప్రతిదినం ఆచమనం చేసే సమయంలో, బ్రాహ్మేణ తీర్థేన = బ్రాహ్మతీర్థంతో (చేతి బొటనవ్రేలి మూలభాగస్థానం, దానినుండి అరచేతివైపు నుండి ఆచమనం చేయాలి). వా = లేదా, కాయత్రైదశికాభ్యాం = కాయతీర్థం ద్వారా గాని, ప్రాజాపత్యం = కనిష్ఠాంగుళి మూలభాగం, (దగ్గర స్థానం), త్రైదశకీభ్యాం = దేవతీర్థం ద్వారాగాని, (వ్రేళ్ళ యొక్క అగ్ర భాగస్థానం) లేదా, **ఉపస్పృశేత్** = ఆచమనం చేయాలి, పిత్ర్యేణ కదాచన న = పిత్రృతీర్థం - బొటన వేలు, తర్జనీల మధ్యస్థానం ద్వారా ఎప్పుడూ ఆచమనం చేయరాదు.

తాత్పర్యం:- ఆచమనం ఎప్పుడూ బ్రహ్మతీర్థం చేతగాని, కాయతీర్థం చేతగాని, దైవతీర్థం చేతగాని చేయాలి. పిత్ర్యతీర్థం చేత చేయరాదు.॥33॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అంగుష్ఠమూలస్య తలే బ్రాహ్మం తీర్థం ప్రచక్షతే । మూలశ్లోక సం.**33**
కాయమంగులిమూలేఽగ్రే దైవం పిత్ర్యం తయోరధః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**34[2.59]**

టీక:- **అంగుష్ఠమూలస్య తలే** = బొటన వ్రేలి మూలభాగానికి కింది స్థానం, **బ్రాహ్మం తీర్థం ప్రచక్షతే** = బ్రాహ్మతీర్థమని పేరు, **అంగులిమూలే కాయం** = వేళ్ళ మూలభాగస్థానం, కాయతీర్థం, **అగ్రే దైవం** = వేళ్ళ అగ్రభాగస్థానం దేవతీర్థం, **తయోః + అధః పిత్ర్యం** = వేళ్ళకు, బొటన వేలికి, తర్జనీమధ్య స్థానం పిత్రృతీర్థమని పేరు.

తాత్పర్యం:- ఇక్కడ-బొటన వ్రేలి యొక్క మధ్యభాగం బ్రహ్మతీర్థంగాను, చిటికెన వేలి మొదటిభాగం వేలి కొనల యందు దైవతీర్థంగాను తర్జని అంగుష్ఠాల మధ్యలో పిత్రృతీర్థంగా భావించాలి.॥34॥

ఇది మనుకృతం-ప్రామాణికం

త్రిరాచామేదపః పూర్వం ద్విః ప్రమృజ్యాత్తతో ముఖమ్ । మూలశ్లోక సం. **34**
ఖాని చైవ స్పృశేదద్భిరాత్మానం శిర ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **35[2.60]**

టీక:- **పూర్వం అపః త్రిః ఆచమేత్** = ముందు నీటితో మూడుసార్లు ఆచమనం చేయాలి, **తతః** = దాని తరువాత, **ముఖమ్ ద్విః ప్రమృజ్యాత్** = రెండుసార్లు ముఖాన్ని కడుక్కోవాలి, **చ** = మరియు, **ఖాని ఏవ** = ఎడమ అరచేతిలో నీళ్ళను ఉంచుకొని కుడిచేతిలో ఇంద్రియాలను, ముక్కు, చెవులు, నేత్రాలు మొ॥ వాటిని స్పృశించాలి. **ఆత్మానం చ శిరః ఏవ** = హృదయాన్ని, శిరస్సును కూడా, **అద్భిః** = నీటితో, **స్పృశేత్** = స్పృశించాలి.

తాత్పర్యం:- ముందు చెప్పిన బ్రాహ్మాది తీర్థములచేత మూడు పర్యాయాలు ఆచమనం చేయాలి. తరువాత పెదవులు రెండు మూసికొని నోటిని నీటితో శుద్ధిచేయాలి. తరువాత ఎడమచేతిలో ఉదకమును ఉంచుకొని, తలలో ఉండే ఇంద్రియాలను-కన్నులు, చెవులు, ముక్కును- బొమ్మను, శిరస్సును స్పృజించాలి. ॥35॥

ఈ క్రింది 36, 37వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *అనుష్ణాభిరఫేనాభిరద్భిస్తీర్థేన ధర్మవిత్ ।*
శౌచేప్సుస్సర్వదాచామేదేకాంతే ప్రాగుదఙ్ముఖః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***36 [2.61]***

తాత్పర్యం:- శౌచము కోరు ధర్మవేత్త అయిన బ్రాహ్మణుడు ఏకాంతప్రదేశంలో తూర్పుముఖముగానో, లేదా ఉత్తరాభిముఖముగానో కూర్చుండి, కాచనివీ, నురుగులు కట్టనివీ అయిన నీటితో బ్రాహ్మాది తీర్థములతో ఎల్లప్పుడు ఆచమనం చేయాలి.॥36॥

* *హృద్గాభిః పూయతే విప్రః కంఠగాభిస్తు భూమిపః ।*
వైశ్యోఽద్భిః ప్రాశితాభిస్తు శూద్రః స్పృష్టాభిరంతతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***37[2.62]***

తాత్పర్యం:- ఆచమన జలపరిమాణం చెబుతున్నాడు- విప్రుడు ఆచమనజలాన్ని హృదయాన్ని చేరువరకు, క్షత్రియుడు కంఠము చేరువరకు, వైశ్యుడు నోటిలోనికి చేరువరకు, శూద్రుడు నాలుక పెదవి తడుపునంత జలంతో ఆచమనం చేయాలి.॥37॥

ప్రక్షిప్తాల పరిశీలన:

36-37 శ్లోకాలు ఈ కింది విధంగా ప్రక్షిప్తాలు.

1. అంతర్ వ్యతిరేకాలు

36వ శ్లోకంలో చెప్పిన పద్ధతి, మనుస్మృతిలోని ఆచమన వర్ణనకు చెందిన ఇతర పద్ధతులలో కలవడం లేదు-

(1) 2.197వ శ్లోకంలో రెండు సంధ్యలలోనూ ఆచమనం చేసి గాయత్రి జపం చేయటం చెప్పబడింది.

(2) 76-77 శ్లోకాలలో కూడా రెండు సంధ్యలలోనూ గాయత్రీ జపవిధానముంది. ఈ శ్లోకాలలో ఫలానా దిశగా కూర్చుని ఆచమనం లేదా సంధ్యావార్చటం చేయాలనే నిర్దేశమేదీ లేదు. సంకేతం కూడా లేదు. ఏ దిక్కుగా కూర్చుని సంధ్యావారుస్తాడో, అదే చోట ఆ స్థితిలోనే ఆచమనం కూడా చేస్తాడు. ఇక్కడ చెప్పిన తూర్పు లేదా ఉత్తరాభి ముఖంగా కూర్చుని ఆచమించే పద్ధతి చెప్పారు. పైన చెప్పినదానికీ, దీనికీ పొంతన కుదరటం లేదు కనుక వ్యతిరేకం వచ్చింది.

(3) ఈ శ్లోకంలో ఒంటరిగా కూర్చుని ఆచమనం చేయాలనే నిర్దేశం ఉంది- దానికీ వ్యతిరేకమైంది. 2.26లో ఉపనయన సంస్కార సమయంలో ఆచమనం చేసే పద్ధతి ఉంది. ఇలాగే అన్ని సంస్కారాలు యజ్ఞాల విషయంలోనూ,

జనం మధ్యకూడా ఆచమనం చేయవచ్చు. అందుచేత, ఏకాంతంగా ఆచమనం చేయాలనే నిర్దేశించే పద్ధతికీ, దీనికీ పొంతన లేదు. కనుక ఇది వ్యతిరేకం.

2. ప్రసంగవ్యతిరేకం

2.1,2,11-14,43 శ్లోకాలకు ముందు, ద్విజాతీయుల కర్మలు, వారి ఉపనయన విధిని గురించిన విషయం స్పష్టంగా ఉంది కాని, శూద్రులకు ఈ విషయంతో ఏ సంబంధమూ లేదు. కాని, 37వ శ్లోకంలో శూద్రుల ఆచమన శుద్ధిని కూడా చెప్పారు. దీనితో పై దానికి ప్రసంగ వ్యతిరేకత స్పష్టంగా కనబడుతూంది.

3. శైలీగత ఆధారం

37వ శ్లోకంలోని శైలి సహేతుకం కానిదీ, నిరాధారమూ, అతిశయోక్తితో కూడినదీ అయి ఉంది. నాలుగు వర్ణాలవారిలో ఎవరికైనా శరీర నిర్మాణంలో ఎటువంటి తేడా లేదు, ఆచమన జలాన్ని స్పృశించినంత మాత్రాన శుద్ధులవుతారా? పైగా అది కూడా కంఠం, హృదయం లేదా నోటిలోనికి ఆ జలం వెళ్లినంత మాత్రం చేత దీన్నే జీవన శుద్ధిగా భావించడం అతిశయోక్తి. కేవలం దీనితోనే శుద్ధి కలుగుతుందంటే, ఇతర వైదిక క్రియల అవసరమేముంటుంది?

38 నుండి 40 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

యజ్ఞోపవీత ధారణకు మూడు స్థితులు-

ఉద్ధృతే దక్షిణే పాణావుపవీత్యుచ్యతే ద్విజః । మూలశ్లోక సం. **35**
సవ్యే ప్రాచీన ఆవీతీ నివీతీ కంఠసజ్జనే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **38[2.63]**

టీక:- **ద్విజః దక్షిణే పాణౌ ఉద్ధృతే** = ద్విజుడు యజ్ఞోపవీతాన్ని కుడిచేతి భుజం కిందుగా ఎడమచేతి భుజంమీద ధరించినప్పుడు ఉపవీతి అనబడును, **సవ్యే** = ఎడమచేయి పైకి పెట్టి కుడిభుజం మీద ఉన్నప్పుడు, **ప్రాచీన ఆవీతీ** = ప్రాచీనావీతి అనిపేరు, **కంఠసజ్జనే** = మెడలో మాలగా వేసుకొన్నప్పుడు, **నివీతీ** = నివీతి, **ఉచ్యతే** = అనబడును.

తాత్పర్యం:- ద్విజుడు జందెం ఎడమభుజం మీద ఉన్నప్పుడు "ఉపవీతి" అనీ, కుడిభుజం మీద వేసికొన్నప్పుడు "ప్రాచీనావీతి" అనీ, జందెం కంఠమున మాలగా వేసికొన్నప్పుడు "నివీతి" అనీ అనబడును.॥38॥

యజ్ఞోపవీతం, మేఖలాదుల పునర్గ్రహణ విధి- ఇది మనుకృతం-ప్రామాణికం

మేఖలామజినం దండముపవీతం కమండలుమ్ । మూలశ్లోక సం. **36**
అప్సు ప్రాస్య వినష్టాని గృహ్ణీతాన్యాని మంత్రవత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **39[2.64]**

టీక:- **మేఖలాం + అజినం దండం + ఉపవీతం కమండలుం** = మేఖలా-మొలతాడు, మృగచర్మం, దండం, యజ్ఞోపవీతం, కమండలం, **వినష్టాని** = పనికిరానప్పుడు, **అప్సు ప్రాస్య** = వీటిని పారేనీటిలో వేసి, **అన్యాని** = నూతనమైనవాటిని, **మన్త్రవత్ గృహ్ణీత** = మంత్రపూర్వకంగా ధరించాలి.

తాత్పర్యం:- మొలత్రాడు, కృష్ణాజినం, యజ్ఞోపవీతం, కమండలం పోయినా, తెగిపోయినా, పారేనీటిలో పడేసి కొత్తవాటిని మంత్రపూర్వకముగా ధరించాలి.॥39॥

వివరణ: తెగిపోయిన యజ్ఞోపవీతం మొదలగువాటిని నీటిలో ఎందుకువేయాలి?

భగ్నమైన లేదా ఉపయోగంలేని పైన పేర్కొన్న వస్తువులను నీటిలో పడవేయమనడానికి- అర్థం-ప్రవహించే నీటిలో వేయమని భావం. కారణం. నిల్వ ఉన్న నీరు చెడిపోయి ఉంటుంది. కాబట్టి ప్రవహించే జలం శుద్ధంగా ఉంటుంది. అందువల్ల స్నానాదుల కన్నిటికీ ప్రవహించే జలాన్నే ఉపయోగించమని మనువు సూచన, (మను. 4.203వ శ్లోకం) చూడండి.

కేశాంత సంస్కారకర్మ-

ఇది మనుకృతం-ప్రామాణికం

కేశాంతః షోడశే వర్షే బ్రాహ్మణస్య విధీయతే । మూలశ్లోక సం. **37**
రాజన్యబంధోర్ద్వావింశే వైశ్యస్య ద్వ్యధికే తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **40[2.65]**

టీక:- బ్రాహ్మణస్య = బ్రాహ్మణులకు, **షోడశే వర్షే** = 16వ సంవత్సరంలో, **రాజన్యబంధోః ద్వావింశే** = క్షత్రియులకు 22వ సంవత్సరంలో, **వైశ్యస్య** = వైశ్యుడికి, **తతః ద్వ్యధికే** = అంతకంటే 2 సం. అధికంగా అంటే 24వ, **వర్షే** = సంవత్సరంలో, **కేశాన్తః విధీయతే** = కేశాంత కర్మ అంటే ముండన సంస్కారం జరపాలి.

తాత్పర్యం:- కేశాలను ఖండించడం 'క్షౌరకర్మ'. బ్రాహ్మణులకు పుట్టిననాటినుంచి 16వ సంవత్సరంలోనూ, క్షత్రియులకు 22వ సంవత్సరంలోనూ, వైశ్యులకు 24వ సంవత్సరంలోనూ చేయవచ్చు. శూద్రజాతులకు ఈ నియమం లేదు. వారెప్పుడైనా జుట్టు పెంచుకోవచ్చు. ఖండన చేసుకోవచ్చు.॥40॥

ఋషి దయానందభాష్యం:- కేవలం 'శిఖ'ను మాత్రముంచుకొని గడ్డం, మీసాలు, తలవెంట్రుకలను ఎప్పుడూ గొరిగిస్తూ ఉండాలి. వాటిని ఎప్పుడూ ఉంచరాదు. శీతలం ప్రధానమైనట్లయితే వాతావరణానికి అనుకూలంగా కేశములను ఉంచుకోవచ్చు. అత్యుష్ణదేశమైనట్లయితే, శిఖతో పాటు కేశములను కూడా తీసివేయాలి. కారణం తలమీద వెంట్రుకలున్నట్లయితే- వేడి అధికమై బుద్ధి తగ్గిపోయేప్రమాదముంది. గడ్డం మీసాలున్నట్లయితే, భోజనపానాదులు-శుభ్రంగా జరగవు. పైగా ఎంగిలి వెంట్రుకలో కలిసిపోతుంది (స.ప్ర.).

ఈ క్రింది **41,42** శ్లోకాలు ప్రక్షిప్తం.ప్రామాణికం కావు

* *అమంత్రికా తు కార్యేయం స్త్రీణామావృదశేషతః ।*
సంస్కారార్థం శరీరస్య యథాకాలం యథాక్రమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **41[2.66]**

తాత్పర్యం:- స్త్రీలకు జాతకర్మ మొదలయిన సంస్కారాలు అన్నీ తప్పక శాస్త్రప్రకారంగా వారి శరీర పరిశుద్ధికోసం అమంత్రకంగా చేయాలి.॥41॥

* *వైవాహికో విధిః స్త్రీణాం సంస్కారో వైదికః స్మృతః ।*
పతిసేవా గురౌ వాసో గృహార్థోఽగ్ని పరిక్రియా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***42[2.67]***

తాత్పర్యం:- స్త్రీలకు వివాహమే ఉపనయనంతో సమానమైన కర్మగా చెప్పబడింది. వీరికి పతిసేవయే పరమ భాగ్యం. ఇదే గురుకుల వాసం. గృహకృత్యాలు నిర్వహించడమే అగ్నిహోత్రాది ధార్మిక క్రియలు.॥42॥

ప్రక్షిప్తాల పరిశీలన

41-42 శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

స్త్రీలకు వేదాధ్యయనం, ఉపనయనం మనుసమ్మతాలు

మనుస్మృతిలోని వేర్వేరు పద్ధతుల ద్వారా లభించే సంకేతాల వల్ల, ప్రతి ధర్మకార్యంలోనూ స్త్రీ పురుషులిద్దరికీ సమాన అధికారాలున్నాయని మనువు చెప్పాడని తెలుస్తూంది. పైన చెప్పిన రెండు శ్లోకాలలోని విషయాలు మనువుకు వ్యతిరేకాలు-

క. 2.4(2.29)వ శ్లోకంలో జాతకర్మ సందర్భంలో శిశువుకు 'ఆడపిల్ల అయినా, మగపిల్లవాడైనా', ఇద్దరికీ మంత్రోచ్చారణ పూర్వకంగా తేనెను నాకించటం అనే పద్ధతి ఉంది- **"మంత్రవత్ ప్రాశనం చాస్య"**. మంత్రోచ్చారణ

లేదా మంత్రశ్రవణం మొదలైన పనులలో స్త్రీ పురుషులిద్దరిలో మనువు వివక్ష చూపలేదని తెలుస్తూంది. ఇదే విధంగా నామకరణం మొదలైనవాటినీ యజ్ఞం, మంత్రపూర్వకంగా చేసే పద్ధతి ఉంది. (2.8). అందువల్ల 41-42 శ్లోకాలలో స్త్రీలకు మంత్రాలు నిషేధం అనే పద్ధతి ఈ విషయానికి వ్యతిరేకం కనుక ఇవి ప్రక్షిప్తాలు.

ఖ. ఇదే విధంగా 3.28లో అగ్నిహోత్రపూర్వకంగా స్త్రీలకు దైవ వివాహం చేసే పద్ధతిని మనువు ఏర్పరిచాడు. అగ్నిహోత్ర మంటే మంత్రోచ్చారణ తప్పకుండా ఉంటుంది. స్త్రీల వ్యవహారాలు మంత్రాలు లేకుండా జరుగుతాయనేది మనువు చెప్పింది కాదు. స్త్రీల అంత్యేష్టి కూడా అగ్నిహోత్రంతోనే జరుగుతుంది (5.167), పెళ్లి కూడా స్వస్తి మంత్రపూర్వకంగానే జరుగుతుంది (5.152). అందుకని 41-42 శ్లోకాలలో స్త్రీలకు మంత్రరహిత క్రియలపద్ధతి మనువు చెప్పినదానికి వ్యతిరేకం కనుక, ఇవి ప్రక్షిప్తాలు.

గ. మనువు తన ఇంట్లో అగ్నిహోత్రం మొదలైన ధర్మకార్యాలను నిర్వహించే ముఖ్య బాధ్యత స్త్రీలకు అప్పజెప్పడమే కాకుండా, పురుషులు ప్రతి ధర్మకార్యాన్నీ స్త్రీలతో పాటుగానే నిర్వహించాలని ఆదేశించాడు కూడా-

(1) **"శౌచే ధర్మే అన్నపక్త్యాం చ"** 9.11 ఇంటి శుభ్రత, ధర్మకార్యాల నిర్వహణ, భోజనం తయారు చేయడం మొదలైనవి స్త్రీలకు అప్పగించండి.

(2) **"అపత్యం ధర్మకార్యాణి"** (9.28) సంతానోత్పత్తి, వారి ఆలనపాలన, అగ్నిహోత్రం మొదలైన ధర్మకార్యాలు స్త్రీ అధీనంలో ఉంటాయి.

(3) **"తస్మాత్ సాధారణో ధర్మః శ్రుతౌ పత్న్యా సహోదితః"** (9.96)

అతిసాధారణమైన ధర్మకార్యాలు సైతం భార్యతో పాటే చేయాలి. ఇలాగే 2.1-3 (2.26-28) శ్లోకాలలో మనువు సంస్కారాలన్నిటినీ అందరికీ సమానమని భావిస్తూ, శారీరక సంస్కారాలు, వాటికి సంబంధించిన దోషాలను తొలగిస్తాయని చెప్పాడు. ఇక్కడ స్త్రీ పురుషుల మధ్య ఎటువంటి భేదాలూ చూపలేదు.

ఒకటి సంస్కారాలూ మంత్రపూర్వకమే కనుక, స్త్రీదో, పురుషునిదో ఎవరిదైనా సరే, సంస్కారాలన్నీ మంత్రపూర్వకంగానే చేయాలి. రెండవది స్త్రీలైనా పురుషులైనా ద్విజాతి వర్గంలోని అందరికీ సంస్కారాలు అవసరం. ఈ రెండు శ్లోకాలలోనూ స్త్రీలకు మంత్రాలు లేని క్రియలు, వివాహాన్నే ఉపనయన సంస్కారంగా భావించడం, పతిసేవనే బ్రహ్మచర్యాశ్రమంగా అనుకోవటం, ఇంటి పనులనే అగ్నిహోత్రంగా భావించటం, పైన చెప్పినవాటికి వ్యతిరేకాలు కనుక, ఇవి ప్రక్షిప్తాలు.

2. ప్రసంగవ్యతిరేకం

2.43 (2.68)వ శ్లోకంలో ఈ ప్రసంగాన్ని ముగిస్తూ ఎంతో స్పష్టంగా **"ఏషః ప్రోక్తః ద్విజాతీనాం ఔపనాయనికో విధిః"** అన్నాడు. అంటే **"ఇది ద్విజుల ఉపనయన సంస్కారంగా చెప్పాను"** అని. దీనివల్ల ఇక్కడ కేవలం ఉపనయన సంస్కారవిధానం గురించే ఉందని తెలుస్తూంది. ఈ రెండు శ్లోకాలలో ఉపనయన సంస్కారం కాకుండా, ప్రసంగానికి భిన్నమైన విషయాలున్నాయి కనుక, ఇవి ప్రసంగ వ్యతిరేకాలు.

3. వేదవ్యతిరేకాలు

స్త్రీల వేదాధ్యయనం-వేదాలలో ప్రమాణాలు

ఈ శ్లోకాలలో స్త్రీలు వేదాధ్యయనం, వేద మంత్రోచ్చారణ చేయటం కూడదని ఉంది. అందువల్ల ఈ విషయంలో వేదాలు ఏమంటున్నాయో తెలుసుకోవటం ఇక్కడ సమంజసమవుతుంది.

క. వేదాలలో అందరికొరకూ వేదవాణి పద్ధతి ఉంది- **"యథేమాం వాచం కల్యాణీం ఆవదాని జనేభ్యః, బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయచారణాయ..."** (యజు. 26.2). అంటే, పరమేశ్వరుడు అంటున్నాడు-(యథా) ఏవిధంగా నేను (జనేభ్యః) అందరు మానవులకోసమూ (ఇమాం) ఈ (కల్యాణీం) శుభమూ,

ప్రపంచానికి కల్యాణం అంటే ముక్తి అనే సుఖాన్ని ఇచ్చే (వాచం) ఋగ్వేదం మొదలైన నాలుగువేదాల వాణిని (ఆవదాని) ఉపదేశిస్తున్నానో, అలాగే మీరు కూడా చేయండి.. (బ్రహ్మ రాజన్యాభ్యాం) బ్రాహ్మణ, క్షత్రియ (అర్యాయ) వైశ్య (శూద్రాయ) శూద్రులు, (స్వాయ) తమ భృత్యులు, స్త్రీలు మొదలైన (అరణాయ) వారికొరకూ, అతి శూద్రులకోసము కూడా వేదాలు వెలుగు నిచ్చాయి." వేదాల ప్రకాశం ఉంది. (సం.ప్ర.సము.3)

ఖ. ఇదే ప్రకారంగా అథర్వవేదంలో **"బ్రహ్మ చర్యేణ కన్యా3 యువానం విందతే పతిం"** (3.5.18) - అంటే బ్రహ్మచర్యాశ్రమంలో ఉండి వేదాధ్యయనం, బ్రహ్మచర్యపాలన చేసిన తర్వాత, కన్య, యువకుడైన పతిని తన బుద్ధిచేత వరిస్తుంది' అని.

గ. స్త్రీల ఉపనయనం విషయంలో ఋగ్.10.109.4వ మంత్రం ప్రమాణమనిపిస్తుంది- **"భీమా జాయా బ్రాహ్మణస్యోపనీతా"**- ఈ ప్రమాణాలతో స్త్రీలకు కూడా బ్రహ్మచర్యాశ్రమం, గురుకులవాసం మొదలైన పద్ధతులున్నాయని తెలుస్తుంది.

ఘ. వైదికకాలపు చరిత్రను పరికించినట్లయితే, అందులోనూ స్త్రీలకు మంత్ర నిషేధం మొదలైనవి సరైనవి కావనిపిస్తుంది. ఆ కాలంలో మంత్రద్రష్టలైన ఎందరో ఋషికలు ఉండేవారు. ఏ యే సూక్తాల మంత్రాల అర్థరహస్యాలను వారు తెలుసుకున్నారో, ఆ యా సూక్తాలు ఋషులరూపంలో వారి పేర్లతోనే లభిస్తున్నాయి. ఒక్క ఋగ్వేదంలోనే ఇటువంటివి దాదాపు 30 మంది ఋషికల (తపస్వినుల) పేర్లు ఉన్నాయి. వారిలో అదితి, జుహూ, ఇంద్రాణి, ఘోష, గోధ, అపాల, రోమశ, లోపాముద్ర మొదలైన పేర్లు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఇలాగే ఉపనిషత్తులలో గార్గి, మైత్రేయి మొదలైన బ్రహ్మతత్త్వం తెలుసుకున్న తపస్వినులను గురించి ఉంది. మనువు తన స్మృతిని వేదానుకూలంగా, వేదం ఆధారంగా చెప్పానని అన్నాడు. [1.125-132 (2.6-13); 12.94, 95,97,99,109,112,113 మొ॥] ఈ ఆధారాలతోనూ ఈ శ్లోకాలు మనువుకు వ్యతిరేకాలు, అందుచేత ప్రక్షిప్తాలు.

4. అవాంతర వ్యతిరేకం

ఈ రెండు శ్లోకాలూ పరస్పర వ్యతిరేకంగా కనబడుతున్నాయి. వేర్వేరు వ్యక్తుల ద్వారా రాయబడి ప్రక్షిప్తాలుగా చేర్చబడ్డాయని తెలిసిపోతూంది. 41లో 'ఈ క్రియలను మంత్రాలు లేకుండా చేయాలి' అని ఉంది. కానీ 42లో ఈ క్రియలను స్త్రీలకు పరోక్షంగా నిషిద్ధం చేశారు. ఇందులో వివాహాన్నే ఉపనయనంగా, పతిసేవనే గురుకులవాసంగా, ఇంటి పనులనే అగ్నిహోత్రంగా చెప్పారు. ఈ ఆధారంతో ఈ శ్లోకాలు మనువు వంటి విద్వాంసుని రచనలు అనిపించటం లేదు.

బ్రహ్మచారి కర్తవ్యాల వర్ణన-43 నుండి 224 వరకు

43,44 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

బ్రహ్మచారి కర్తవ్యాల వర్ణన

ఏష ప్రోక్తో ద్విజాతీనామౌపనాయనికో విధిః । మూలశ్లోక సం.**38**
ఉత్పత్తివ్యంజకః పుణ్యః కర్మయోగం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం.**43**[2.68]

టీక:- **ఏషః** = ఇది, [2.11-42 వరకు] **ద్విజాతీనామ్ ఉత్పత్తివ్యంజకః** = ద్విజాతుల, ద్వితీయజన్మను ప్రకటించే, అంటే మనుషులను ద్విజులను చేయునట్టి-బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను చేయునట్టి, **పుణ్యః** = కల్యాణకారకమైన, **ఔపనాయనికః విధిః** = ఉపనయనసంస్కారవిధి, **ప్రోక్తః** = చెప్పబడింది. **కర్మయోగం నిబోధత** = ఇక ఉపనయనసంస్కారంలో దీక్షితులైన ద్విజ బ్రహ్మచారుల కర్తవ్యాలను వినండి.

తాత్పర్యం:- ద్విజులకు రెండో జన్మతో సమానమైనదై-పుణ్యదాయకమైనట్టి ఉపనయన విధి ఇంతవరకు చెప్పబడింది. ఇప్పుడు వారికి ఇంకా ఉన్న అనుష్ఠానాది విధులు చెప్పబడుతున్నాయి.॥43॥

వివరణ: **"ఉత్పత్తి వ్యంజకః"** ఈ విషయాన్ని సమర్థించే శ్లోకాలను, వాటి సమీక్షను [2.121-125 (2.146-150)] ఉపనయనానంతరం-బ్రహ్మచారికి శిక్షాదీక్షలు వరకు చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపనయనం తర్వాత బ్రహ్మచారి శిక్షణవిధానం-

ఉపనీయ గురుశ్శిష్యం శిక్షయేచ్ఛౌచమాదితః । మూలశ్లోక సం.**39**
ఆచారమగ్నికార్యం చ సన్ధ్యోపాసనమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**44[2.69]**

టీక:- గురుః = గురువు, **శిష్యం ఉపనీయ** = శిష్యులకు యజ్ఞోపవీత సంస్కారం చేసి, **ఆదితః** = ముందు, **శౌచం** = శుభ్రంగా ఉండే విధిని, **ఆచారం** = సదాచారం, సద్వ్యవహారం, **అగ్నికార్యం** = అగ్నిహోత్రం చేసే విధిని, **సంధ్యోపాసనం+ఏవ చ** = మరియు సన్ధ్యా-ఉపాసనా విధిని, **శిక్షయేత్** = నేర్పాలి.

తాత్పర్యం:- గురువు శిష్యుడికి ఉపనయనం చేసిన తదుపరి ఆచారం అంటే ఏమిటో, శుచి అంటే ఏమిటో, సాయంకాలం, ప్రాతఃకాలం అగ్నిహోత్రం ఎలా చెయ్యాలో, సంధ్యావందనం ఎలా చెయ్యాలో నేర్పాలి.॥44॥

ఋషి దయానందభాష్యం:-"సన్ధ్యాయన్తి సన్ధ్యాయతే వా పరబ్రహ్మ యస్యాం సా సన్ధ్యా" పరమేశ్వర ధ్యానాన్ని చక్కగా చేయడమే సంధ్య. ఈ విధంగా గాయత్రీమన్త్రోపదేశం చేసి, సంధ్య-స్నానం ఆచమనం '**ప్రాణాయామం చేసే విధానాన్ని**' నేర్పాలి. మొదట స్నానం. ఎందుకంటే- శరీరమందున్న సర్వావయవాలు శుద్ధమవడమే గాక ఆరోగ్యం చక్కబడుతుంది. (స.ప్ర.)

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* ***అధ్యేష్యమాణస్త్వాచాంతో యథాశాస్త్రముదఙ్ముఖః ।***
బ్రహ్మాంజలికృతోఽధ్యాప్యో లఘువాసా జితేంద్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *45[2.70]*

తాత్పర్యం:- గురువు వద్ద అధ్యయనానికి వెళ్లిన శిష్యుడు శాస్త్రవిధి ప్రకారం ఆచమనాన్ని చేసి, పరిశుద్ధ వస్త్రాన్ని ధరించి, ఇంద్రియాన్ని నిగ్రహించి, బ్రహ్మాంజలి చేసిన (రెండు చేతులు జోడించిన) తరువాతనే గురువు ఆ శిష్యుడికి వేదాధ్యయనం చేయించాలి. ॥45॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తమవుతుంది.

1. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకంలో చెప్పిన వ్యవస్థకు మనువు చెప్పిన ఇతర వ్యవస్థలతో పొంతన కుదరటం లేదు. అంతే కాకుండా వ్యతిరేకం కూడా అవుతుంది.

క. 2.178 (203) శ్లోకంలో 'గురుశిష్యులు ఎటువంటి చోట కూర్చోవాలంటే, గురువు నుంచి వచ్చేగాలి శిష్యుణ్ణి తాకకూడదు, శిష్యుడు నుంచి వచ్చేగాలి గురువును తాకకూడదు అని చెప్పారు. ఈ శ్లోకం ఆధారంగా కేవలం ఉత్తరాభి ముఖంగా కూర్చుని చదువుకునే పద్ధతిని అంగీకరిస్తే, పైన చెప్పిన వ్యవస్థ ఏర్పడే అవకాశమే లేదు. ఎందుకంటే, ఉత్తరదక్షిణ దిశల నుంచి ఎన్నోసార్లు గాలివీస్తూనే ఉంటుంది. ఇది వ్యతిరేకమవుతుంది.

ఖ. చదువుకోవటానికి కావలసిన వ్యవహార విధి 46వ శ్లోకంలో ఉంది. 45వ శ్లోకానికీ, 46వ శ్లోకంతో సంబంధమే లేదు. అదొక స్వతంత్ర వాక్యం. ఎవరైనా 45వ శ్లోకంలోని 'బ్రహ్మాంజలికృతః' అనే దానికి 46వ శ్లోకంలో **"సంహత్య హస్తౌ అధ్యేయం"** - ఇది స్వతంత్ర విధే కాకుండా, "స హి బ్రహ్మాంజలిః స్మృతః"- దాని పేరు చెబుతూంది. రెండు శ్లోకాలలోనూ బ్రహ్మాంజలి విధానం ఏకరీతిగా కనిపించటం లేదు. కనుక, 45వ శ్లోకం ప్రక్షిప్తం. 46వ శ్లోకాన్ని ప్రక్షిప్తమని ఎందుకు అనటం లేదంటే, 72వ శ్లోకంతో దీనికి ప్రసంగపరంగా సంబంధం ఉంది.

గ. మనుస్మృతిలో చాలా చోట్ల యజ్ఞాలు, సంధ్య, ధార్మిక అనుష్ఠానాలు, యజ్ఞంతో కలిసిన వివాహం మొదలైనవాటి పద్ధతి ఉంది. వీటిలోనూ వేదమంత్రాల ఉచ్చారణ ఉంటుంది. అక్కడ ఎక్కడ కూడా ఏ దిక్కుగా కూర్చోవాలి అనేది నిర్దేశించలేదు. కనుక, ఇది యుక్తి యుక్తమూ, వ్యావహారికమూ కాకపోవటం చేత, ఇక్కడ ఉత్తరాభిముఖంగా కూర్చోవాలి అనే నియమం మనువు అంగీకరించింది కాదని తెలుస్తూంది.

46 నుండి 49 వరకు గల శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

వేదాధ్యయనానికి ముందు గురువుకు అభివందనం-

బ్రహ్మారమ్భేఽవసానే చ పాదౌ గ్రాహ్యౌ గురోస్సదా । మూలశ్లోక సం. **40**
సంహత్య హస్తావధ్యేయం స హి బ్రహ్మాఞ్జలిః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **46[2.71]**

టీక:- బ్రహ్మారమ్భే అవసానే చ = వేదాధ్యయన ప్రారంభంలోనూ, సమాప్తమైన తరవాత కూడా, సదా గురోఃపాదౌ గ్రాహ్యౌ = సదైవ గురువు యొక్క రెండుచరణాలను స్పర్శించి నమస్కారం చేయాలి. హస్తాన్ సంహత్య అధ్యేయం = రెండు చేతులు జోడించి అభివాదనం చేసిన తరువాత గురువువద్ద అధ్యయనం చేయాలి, సః హి బ్రహ్మాఞ్జలిః స్మృతః = చేతులు జోడించుటయే 'బ్రహ్మాఞ్జలి' అనబడుతుంది.

తాత్పర్యం:- వేదాధ్యయనం ప్రారంభంలోనూ, అంతంలోనూ గురువుగారి పాదాలను తాకాలి. అధ్యయనం చేసేటప్పుడు చేతులు కట్టుకోవాలి. ఇలా చేతులు కట్టుకోవడం గౌరవభావంతో కూడిన బ్రహ్మాంజలి॥46॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గురువుకు అభివాదనం చేసే విధి (పద్ధతి)-

వ్యత్యస్తపాణినా కార్యముపసంగ్రహణం గురోః । మూలశ్లోక సం. **41**
సవ్యేన సవ్యః స్ప్రష్టవ్యో దక్షిణేన చ దక్షిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **47[2.72]**

టీక:- గురోః ఉపసంగ్రహణం = గురువుపాదాలను స్పర్శించడం, వ్యత్యస్తపాణినా కార్యం = హస్తాలను అటు యిటు మార్చుకొని, శిష్యుడు తన ఎడమచేతితో గురువు ఎడమపాదాన్ని, కుడి చేతితో కుడిపాదాన్ని స్పర్శించాలి. సవ్యేన సవ్యః = ఎడమ చేతితో ఎడమపాదాన్ని, దక్షిణే దక్షిణః = కుడిచేతితో గురువు కుడి పాదాన్ని, స్ప్రష్టవ్యః = స్పృశించాలి.

తాత్పర్యం:- శిష్యుడు కుడి చేతితో గురువుగారి కుడిపాదాన్ని, ఎడమచేతితో ఎడమ పాదాన్ని స్పర్శించి నమస్కరించాలి.॥47॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అధ్యయనారంభం-సమాప్తివిధి-

అధ్యేష్యమాణం తు గురుర్నిత్యకాలమతన్ద్రితః । మూలశ్లోక సం. **42**
అధీష్వ భో ఇతి బ్రూయాద్విరామోఽస్త్వితి చారమేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **48[2.73]**

టీక:- గురుః నిత్యకాలమ్ = గురువు చదివించునప్పుడల్లా, అతన్ద్రితః = అలసత్వం లేకుండా, అధ్యేష్యమాణం తు = చదువుతున్న శిష్యుణ్ణి, భో అధీష్వ" ఇతి బ్రూయాత్ = ఓ శిష్యా ! చదువు అని చెప్పాలి, చ = మరియు, విరామః + అస్తు ఇతి ఆరమేత్ = ఇక చాలు, విశ్రాంతి తీసికో అని చెప్పి అధ్యాపనం సమాప్తం చేయాలి.

తాత్పర్యం:- విద్యార్థి సోమరిపోతు అయినా, సరిగ్గా చదివేవాడైనా వేదాధ్యయనం చేయబోయే శిష్యుణ్ణి "చదువుము" అని చెప్పి ప్రారంభించాలి. ముగించేప్పుడు "ఈ రోజుకు చాలు ! నిలుపు"మని చెప్పి ఆపుదల చేయాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

వేదాధ్యయనానికి ఆద్యంతంలో ప్రణవోచ్చారణ విధానం-

బ్రహ్మణః ప్రణవం కుర్యాదాదావన్తే చ సర్వదా । మూలశ్లోక సం. **43**
స్రవత్యనోంకృతం పూర్వం పురస్తాచ్చ విశీర్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **49[2.74]**

టీక:- **సర్వదా బ్రహ్మణః ఆదౌ చ అన్తే ప్రణవం కుర్యాత్** = శిష్యుడు సదైవ వేదం చదవడానికి ముందు, చివర 'ఓమ్'ను ఉచ్చరించాలి, **పూర్వం అనోంకృతం** = ఆరంభంలో ఓంకారాన్ని ఉచ్చరించ నట్లయితే, **స్రవతి** = చదివినదంతా చెల్లాచెదరైపోతుంది. అంటే చక్కగా గ్రహించలేకపోతాడు, **చ** = మరియు, **పురస్తాత్ విశీర్యతే** = చివరలో ఓంకారాన్ని ఉచ్చరించనట్లయితే, చదివినదంతా స్థిరంగా ఉండదు.

తాత్పర్యం:- వేదాధ్యయనం ప్రారంభించేటప్పుడు మొదట, చివర ఓంకారాన్ని ఉచ్చరించాలి. ప్రారంభంలో చేసే ఓంకారం వల్ల జ్ఞాపకశక్తి వృద్ధిపొందుతుంది. ముగింపులో చెప్పే ఓంకారం వల్ల చదివినది మనస్సులో స్థిరపడిపోతుంది.॥49॥

వివరణ:

1. అధ్యయన ఆద్యంతాలలో చేయు ఓంకారోచ్చారణ వల్ల కలుగు లాభాలు:-

ఓంకారాన్ని ఉచ్చరించిన తరవాత మనస్సును ఏకాగ్రత చేసి అధ్యయనంలో సమాహితం చేయాలని మనుమహర్షి అభిప్రాయం. సంధ్యోపాసన మరియు వేదాధ్యయానానికి ముందు మనస్సును ఏకాగ్రపరచడం చాలా ముఖ్యం. అలా చేయకపోతే పూర్ణజ్ఞానం కలుగదు. మనస్సు చంచలంగా అటు యిటు సంచరిస్తుంది. కొంచెం మాత్రమే గ్రహిస్తుంది. పూర్తిగా గ్రహించజాలదు. అదేవిధంగా చదివిన తరవాత కూడా ఏకాగ్రత లేనట్లయితే చదివినది మనస్సుకు పట్టదు. ఏ ఒక్క ఇంద్రియం ఏకాగ్రతకు దూరమయినా మనసు నిలబడదు. దాంతోపాటు బుద్ధి కూడా తరిగిపోతుంది.

2. ఇందుకు యోగదర్శన ప్రమాణాలు.

క. ఈ ప్రణవ (ఓమ్) శబ్దం అనాది- అనన్తం, సర్వవ్యాపకం సృష్టి రచయితయైన పరమాత్ముడి యొక్క ముఖ్యమైన నామం. ఆయనే సర్వులకు ఆదిగురువు. అలాంటి పరమేశ్వరుడిని- "ఆద్యంతమున స్మరించినందువల్ల, మనస్సు సర్వజ్ఞుడి గుణాల వైపు ప్రవృత్తమై బహుజ్ఞుడవాలనే భావన ఏర్పడుతుంది.

"స ఏవ పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్' ; తస్యవాచకః ప్రణవః"

(యోగదర్శనము. 1.26,27.)

"తజ్జపస్తదర్థ భావనమ్" (యోగదర్శనం 1.28)

ఈ నామాన్నే స్మరించాలి. అందువల్ల ఉపాసకుడి మనస్సు ఏకాగ్రమై, ప్రసన్నమై, జ్ఞానాన్ని గ్రహించి స్థిరపడుతుంది (ఋ.భా.భూ. ఉపాసనావిషయము).

ఈ శ్లోకం ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *ప్రాక్కూలాన్ పర్యుపాసీనః పవిత్రైశ్చైవ పావితః ।*
ప్రాణాయామైస్త్రిభిః పూత స్తత ఓంకారమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***50[2.75]***

తాత్పర్యం:- తూర్పువైపు కొనలు సాగిన దర్భలపై కూర్చొని, రెండు చేతుల్లోను దర్భలుంచుకోవడం వల్ల పరిశుద్ధుడై మూడు ప్రాణాయామాలు ఆచరించి, తదుపరి ఓంకారంతో వేదాధ్యయనం ప్రారంభించాలి.॥50॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ఆధారాల ద్వారా ప్రక్షిప్తం-

1. ప్రసంగ వ్యతిరేకం

ఇది పూర్వాపర ప్రసంగ వ్యతిరేకమే కాక, పూర్వాపర ప్రసంగాలను భంగపరుస్తున్నది. 49వ శ్లోకంలో 'ఓంకారం' విధానమూ, 51వ శ్లోకంలో ఓంకార స్వరూప మహత్త్వం ఉన్నాయి. ఇదెందుకంటే ఓంకార స్మరణం ఆవశ్యకం కనుక. ఇలా 51వ శ్లోకంలో 49వ శ్లోకానికి అర్థవాదం అవుతుంది. 50వ శ్లోకం ఆ సంబంధాన్ని భంగం చేయటమే కాకుండా మధ్యలో ఓంకార ఉచ్చారణ నియమాలను గురించి అనవసరంగా చెప్పింది కనుక, ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఓంకారమూ వేదాల నుంచి తీసుకున్న పదమే. గాయత్రీ మంత్రం కూడా [2.52,53(76-78)] అంతే. మనువు పుణ్యం కలిగించే ధర్మయుక్త విషయాలకు ఎక్కడా ఏ రకమైన నిబంధనా చెప్పక పోవటం ఒకటైతే, రెండవది గాయత్రి, వేదాధ్యయనాలను అన్ని అవస్థలలోనూ అవసరమూ, పుణ్యదాయకం అని చెప్పటం. [2.76-81(101-106)]. పైగా ఇవి వ్యావహారికం కావు. ఎవరైనా ఓంకారజపం చేస్తే, రకరకాల పనులలో ఉంటూ ఆ నిబంధనలు పాటించగలుగుతారా? ఈ విధంగా ఈ వ్యవస్థ మనువు చెప్పినవాటికి వ్యతిరేకం.

51 నుండి 53 వరకు గల శ్లోకాలు మనుకృతం-ప్రామాణికం

ఓంకారం మరియు గాయత్రీ ఉత్పత్తి-

అకారం చాప్యుకారం చ మకారం చ ప్రజాపతిః । మూలశ్లోక సం. **44**
వేదత్రయాన్నిరదుహద్భూర్భువస్స్వరితీతి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **51[2.76]**

టీక:- ప్రజాపతిః = పరమాత్మ, **అకారం, ఉకారం చ మకారం** = ఓం శబ్దంలోని, అ,ఉ,మ్ అక్షరాలను (అ+ఉ+మ్) ఓమ్, (చ) అలాగే **భూః భువః స్వః ఇతి** = గాయత్రీమంత్రంలో ఉన్న 'భూః, భువః, స్వః' అనే ఈ మూడు మహావ్యాహృతులను, **వేదత్రయాత్ నిరదుహత్** = మూడు వేదాల నుండి (ఋక్-సామ-యజుః) పిండి, సారరూపంగా మనకందించాడు. ఇక్కడ **'ఇతి'** శబ్దం రెండోసారి ప్రయోగం పాదపూరణార్థం.

తాత్పర్యం:- ఋగ్యజుస్సామములనే మూడు వేదాల నుంచి ప్రజాపతియైన పరమాత్మ వరుసగా అకార, ఉకార, మకారాలను; 'భూః, భువః, స్వః' అనే ఈ మూడింటిని క్రమంగా గ్రహించాడు.॥51॥

వివరణ: ఓంకారం, మహా వ్యాహృతుల వివేచనం.

"చత్వారి వాక్ పరిమితా పదాని" (ఋక్. 1.164.45) మంత్రానికిని వ్యాఖ్యచేస్తూ, నిరుక్తకారుడు విభిన్న ఆచార్యుల అభిప్రాయాలను ఉదాహరిస్తూ ఇలా రాస్తున్నాడు. **"కానితాని పదాని చత్వారి పదాని ? ఓంకారః, మహావ్యాహృతయశ్చ ఇతి ఆర్షమ్"** (13.9) అంటే, వాక్స్వరూపమైన, బ్రహ్మ = వేదాన్ని వర్ణించే ఈ నాలుగు పదాలేవి? (ఓంకారము) ఓం అక్షరము మరియు భూః, భువః, స్వః. ఈ మూడు మహా వ్యాహృతులు. వీటికి యాస్కాచార్యులు మనువుతో సమానంగా మహత్వం ఇచ్చాడు.

1. **'ఓ3మ్'** అక్షరం యొక్క మహత్వాన్ని గుర్తిస్తూ, **"ఋచో అక్షరే పరమే వ్యోమన్ యస్మిన్ దేవా అధివిశ్వే నిషేదుః"** (ఋ. 1.164.39) మంత్రానికి వ్యాఖ్యచేస్తూ, **'ఆచార్య శాకపూణి'** బ్రాహ్మణ గ్రంథాల వచనాలను ఉదాహరిస్తూ యాస్కాచార్య ఇలా రాస్తున్నారు" అక్షరమంటే **'ఓం'** కారమే. ఈ ఓంకారమే త్రయీవిద్యారూపమైన నాలుగు వేదాలకు ప్రతినిధి. **"కతమత్తదేతత్ అక్షరమ్? ఓమిత్యేషా వాగితి శాకపూణిః। "ఏతద్ధ వా ఏతదక్షరం యత్సర్వాం త్రయీం విద్యాం ప్రతిపత్తిః"** ఇతి చ బ్రాహ్మణమ్" (13-9).

దీన్ని ఆధారంగా చేసికొని **'ఓమ్'** ఈశ్వరుడి సర్వప్రముఖనామమని మహర్షి దయానందులవారు అంగీకరించారు. అకారం, ఉకారం, మకారాల సంయోగం వల్ల **'ఓం'** అక్షరం సిద్ధమవుతుంది. ఇది పరమేశ్వరుడికున్న అనంతనామాలలో ఉత్తమమైన నామం. అన్ని నామముల అర్థం ఇందులో ఉంది. తండ్రి-కొడుకులకు మధ్య ప్రేమసంబంధమున్నట్లు, పరమేశ్వరుడికి ఓంకారంతో సంబంధముంది. ఈ ఒక్క నామం ద్వారా ఈశ్వరుడి నామములన్నీ బోధపడతాయి. (ద.ల.ప.)

2. "మూడు మహా వ్యాహృతులకు అర్థం సంక్షేపంగా ఇలా ఉంది"

"భూరితి వై ప్రాణః" యః ప్రాణయతి చరాచరం జగత్ సః భూః స్వయం భూరీశ్వరః సర్వజగజ్జీవ నాధారం ప్రాణమ్:- "ఆ ప్రాణం కంటే ప్రియమైనవాడు స్వయంభూః. అలాంటి ప్రాణానికి వాచకమైనందువల్ల **'భూః'** పరమేశ్వరనామం, **"భువరిత్యపానః" యః సర్వం దుఃఖం అపానయతి సోఽపానః":-** సర్వదుఃఖరహితుడు పరమేశ్వరుడు. ఆయన సన్నిధిలో జీవుడు సమస్తదుఃఖాలనుండి ముక్తుడవుతాడు. అందువల్ల **'భువః'** అని పరమేశ్వరుడికి పేరు. **"స్వరితి వ్యానః" యో వివిధం జగత్ వ్యానయతి వ్యాప్నోతి సః వ్యానః:-** పరమేశ్వరుడు నానావిధంగా ఉన్న జగత్తులో వ్యాపించి ఉన్నాడు. సర్వాన్ని ధరించి ఉన్నాడు కాబట్టి **"స్వః"** అనేది పరమేశ్వరనామం (స.ప్ర.సం. 3).

ఇది మనుకృతం-ప్రామాణికం

త్రిభ్యః ఏవతు వేదేభ్యః పాదం పాదమదూదుహత్ । మూలశ్లోక సం. **45**
తదిత్యృచోఽస్యాస్సావిత్ర్యాః పరమేష్ఠీ ప్రజాపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52[2.77]**

టీక:- **పరమేష్ఠీ ప్రజాపతిః**= అందరికంటే గొప్పవాడైన పరమేశ్వరుడు, **తత్ +ఇతి+అస్యాః సావిత్ర్యాః ఋచః =** **'తత్'** పదంతో ప్రారంభమవునట్టి సావిత్రీ ఋక్, గాయత్రీమన్త్రం యొక్క **పాదం పాదం** = ఒక్కొక్క పాదాన్ని:-

ప్రథమపాదం -**తత్ సవితుర్వరేణ్యం**

ద్వితీయపాదం - **భర్గో దేవస్య ధీమహి ।**

తృతీయపాదం- **ధియో యో నః ప్రచోదయాత్ ॥**

టీక:- **త్రిభ్యః ఏవ తు వేదేభ్యః =** [ఋగ్వేదం-3.62.10; యజుర్వేదం-3.35,22.9, 30.2, 36-3; సామవేదం ఉ.అధ్యా. 13, ప్రపా. 6, అర్ధం. 3, సూ. 10, మం. 1;(1462)] మూడు వేదాలనుండి, **అదూదుహత్** = పిండి, సారరూపంగా తయారు చేయబడింది.

తాత్పర్యం:- పరమేష్ఠియగు ప్రజాపతి మూడు వేదాల నుండి ఒక్కొక్కపాదాన్ని స్వీకరించి గాయత్రీమంత్రాన్ని రచించాడు.॥52॥

ఓంకార పూర్వక గాయత్రీ జపానికి ఫలితం-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతదక్షరమేతాం చ జపన్ వ్యాహృతిపూర్వికామ్ । మూలశ్లోక సం. **46**
సంధ్యయోర్వేదవిద్విప్రో వేదపుణ్యేన యుజ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **53[2.78]**

టీక:- ఏతత్ + అక్షరం = ఈ 'ఓమ్' అక్షరాన్ని, చ = మరియు, వ్యాహృతి పూర్వికాం = 'భూః భువః, స్వః" ఈ వ్యాహృతులతో సహా, ఏతాం = ఈ గాయత్రీ ఋక్ మంత్రాన్ని.

ఓం భూర్భువః స్వః । తత్సవితుర్వరేణ్యం ।
భర్గో దేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్ ॥

టీక:- వేదవిత్ విప్రః = వేదపాఠియైన ద్విజుడు, సంధ్యయోః జపన్ = రెండు సంధ్యాకాలాలలో, ప్రాతః సాయం సంధ్యలో జపిస్తూ, వేదపుణ్యేన యుజ్యతే = వేదాధ్యయన పుణ్యాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- కాబట్టి రెండు సంధ్యలలోనూ 'ఓం' అనే ఈ అక్షరంతో కూడా ఈ ఋక్కును జపించు వేదవేత్త అయిన విప్రుడు వేదాధ్యయనం వల్ల పుణ్యాన్ని పొందుతున్నాడు.

వివరణ:

1. "ఓమ్" ఈశ్వరుడి ముఖ్యనామం. ఇందుకు ప్రమాణాలు-

క. **'తస్య వాచకః ప్రణవః'** (యోగదర్శనం. 1.27) సర్వేశ్వరుణ్ణి తెలిపే శబ్దం. ఈ నామం ఈశ్వరుడికి పితా-పుత్ర సంబంధం లాంటిది. ఈ నామం ఈశ్వరుడికి మాత్రమే వాచకం. మరెవరినీ బోధించదు. ఈశ్వరుడికి ఉన్న సర్వనామాలలో ఉత్తమమైనది 'ఓంకారం'.

ఖ. **'తజ్జపస్తదర్థభావనమ్'** (యోగ. 1.28)

ఈ నామాన్ని జపించడం (స్మరించడం) అలాగే ఆ నామార్థాన్ని సదా పరిశీలించడం వల్ల ఉపాసకుడి మనస్సు ఏకాగ్రమై ప్రసన్నమై జ్ఞానాన్ని పొంది స్థిరమవుతుంది (ఋ.భా.భూ.ఉపాసనావిషయం).

ఇందుకు అన్యశాస్త్రాల నుండి ప్రమాణాలు

(గ) "ఓమిత్యేకాక్షరముద్గీథముపాసీత-(ఛాందోగ్య)

(ఘ) ఓమితి ఏతదక్షరమిదం సర్వం తస్యోపాఖ్యానమ్ (మాండూక్య)

(ఙ) ఓం ఖం బ్రహ్మ (యజు. 4.17)

2. గాయత్రీ మన్త్రార్థం

ఓం భూర్భువః స్వః ।
తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్ ॥

(యజు. 36-3). ఋగ్వే. 3.62.10లో.

టీక:- ఓమ్ = ఇది పరమేశ్వరుడి ముఖ్యనామం. ఈ నామంలో అన్ని నామములు కలిసిపోతాయి. **భూః** = ఏది ప్రాణానికి ప్రాణమో, **భువః** = సర్వదుఃఖాలను దూరం చేస్తుందో, **స్వః** = స్వయం సుఖస్వరూపమై ఉపాసకులకు సుఖాన్ని కలిగిస్తుందో అలాంటి, **సవితుః** = సర్వ జగత్తును సృష్టించునట్టి సూర్యాది ప్రకాశములకు ప్రకాశకం, సమస్త ఐశ్వర్యాల నిచ్చేది, **దేవస్య** = కామించదగినట్టి, సర్వత్ర విజయాన్ని కలిగించే పరమాత్మ యొక్క, **వరేణ్యం** = అతిశ్రేష్ఠగ్రహణ ధ్యానములకు యోగ్యమైన, **భర్గః** = సర్వక్లేశాలను భస్మం చేసి పవిత్రం చేసే, శుద్ధ స్వరూపమయిన, **తత్** = దాన్ని, మేము, **ధీమహి** = ధ్యానిస్తాం, **యః** = ఈ పరమాత్మ, **నః** = మా, **ధియః** = బుద్ధులను, ఉత్తమ గుణకర్మస్వభావాలను, **ప్రచోదయాత్** = ప్రేరేపించుగాక! (సం.వి.వేదారంభ సంస్కారం.) 2.51శ్లోక వివరణ చూడగలరు.

54 నుండి 62వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* **సహస్రకృత్వస్త్వభ్యస్య బహిరేతత్త్రికం ద్విజః ।**
మహతోఽవ్యనసో మాసాత్త్వచే వాహిర్విముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**54[2.79]**

తాత్పర్యం:- ద్విజుడు సంధ్యాకాలంలోనూ, తక్కిన సమయాలలోనూ గ్రామానికి బయట ఈ ఓంకారంతో కూడిన వ్యాహృతిత్రయాత్మకమైన గాయత్రిని వేయి పర్యాయములు ప్రతిదినం జపించినట్లయితే ఒక్కమాసానికి సర్పం కుబుసము నుండి విడువడునట్లు మహాపాపాల నుండి విడుదల చెందుతాడు.॥54॥

* **ఏతయర్చా విసంయుక్తః కాలే చ క్రియయా స్వయా ।**
బ్రహ్మక్షత్రియవిడ్యోనిర్గర్హణాం యాతి సాధుష ॥ ప్రక్షిప్త శ్లోక సం.**55[2.80]**

తాత్పర్యం:- సంధ్యాకాలంలో గాని, తక్కిన సమయంలో గాని ఈ ఋక్కును జపింపక, సాయం ప్రాతఃకాలములలో హోమాదిరూపమయిన క్రియను చేయని బ్రాహ్మణ క్షత్రియవైశ్యులజాతిలో పుట్టినవాడు సజ్జనులలో నిందాపాత్రుడవుతాడు.॥55॥

* **ఓంకారపూర్వికాస్తిస్రో మహావ్యాహృతయోఽవ్యయాః ।**
త్రిపదా చైవ సావిత్రీ విజ్ఞేయం బ్రహ్మణో ముఖమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**56 [2.81]**

తాత్పర్యం:- ఓంకారపూర్వకమై నాశరహితములైన 'భూర్భువఃస్వః' అనే మహావ్యాహృతులును త్రిపదయగు సావిత్రికూడా వేదమునకు ముఖమని తెలుసుకోవాలి.॥56॥

* **యోఽధీతేఽహన్యహన్యేతాం త్రీణి వర్షాణ్యతంద్రితః ।**
స బ్రహ్మపదమభ్యేతి వాయుభూతః ఖమూర్తిమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**57[2.82]**

తాత్పర్యం:- ఎవడు ప్రతిదినం సోమరి గాక, ఓంకారపూర్వకములైన మహావ్యాహృతులను మూడు సంవత్సరాల కాలం జపిస్తాడో, వాడు పరబ్రహ్మ పదాన్ని పొందుతాడు. అతడు వాయువులాగా కామచారీ, బ్రహ్మస్వరూపుడూ అవుతాడు.॥57॥

* **ఏకాక్షరం పరం బ్రహ్మ ప్రాణాయామాః పరం తపః ।**
సావిత్ర్యాస్తు పరం నాస్తి మౌనాత్సత్యం విశిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***58[2.82]***

తాత్పర్యం:- 'ఓం' అనే ఒక అక్షరమే బ్రహ్మము. ప్రాణాయామములే గొప్ప తపస్సు. గాయత్రిని మించిన మంత్రం లేదు. మౌనంగా ఉండే కంటే సత్యం చెప్పడం శ్రేష్ఠం.॥58॥

* **క్షరంతి సర్వా వైదిక్యో జుహోతి యజతి క్రియాః ।**
అక్షరం దుష్కరం జ్ఞేయం బ్రహ్మ చైవ ప్రజాపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***59[2.83]***

తాత్పర్యం:- వేదవిహితములైన హోమయాగరూపములైన క్రియలన్నీ నశిస్తున్నవి. ఓం అనే అక్షరం బ్రహ్మప్రాప్తి హేతుభూతమవ్వడం వల్ల నశించదు. ఏల అంటే, ప్రజలకు అధిపతీ ఈ బ్రహ్మమే. కాబట్టి ఈ ఓంకారమే బ్రహ్మస్వరూపముగానూ, బ్రహ్మప్రతిపాదకముగానూ ఉండటం వలన, ఓంకారమును జపించడం మోక్షప్రదం అని భావం.॥59॥

* **విధియజ్ఞాజ్జపయజ్ఞో విశిష్టో దశభిర్గుణైః ।**
ఉపాంశుః స్యాచ్ఛతగుణః సాహస్రో మానసః స్మృతః ॥   ప్రక్షిప్త శ్లోక సం. *60[2.85]*

తాత్పర్యం:- జ్యోతిష్టోమాది యాగాలు చేయుటకంటే ఓంకారమహావ్యాహృత్యాదుల జపం పదింతలు మేలు. ఆ జపమునే పక్కన ఉండేవారికి కూడా వినబడకుండా జపించడం నూరింతలు ఎక్కువ. మానసికమైనట్లయితే వెయ్యింతలు అధికం. (మానసికమంటే నాలుకనూ, పెదవినీ ఏ మాత్రం కదలకుండా జపించడం).॥60॥

* మానసజప శ్రేష్ఠత-

* **యే పాకయజ్ఞాశ్చత్వారో విధియజ్ఞ సమన్వితాః ।**
సర్వే తే జపయజ్ఞస్య కలాం నార్హంతి షోడశీమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. *61[2.86]*

తాత్పర్యం:- వైశ్వదేవం, బలికర్మ, నిత్యశ్రాద్ధం, అతిథిభోజనం అనే నాలుగూ; పంచమహా యజ్ఞములలో బ్రహ్మయజ్ఞం తప్ప తక్కినవాటికి పాకయజ్ఞములు అని పేరు. దర్శపూర్ణమాసాదులు విధి యజ్ఞములు. ఈ నాలుగు పాకయజ్ఞములును, విధియజ్ఞములును గాయత్ర్యాది జపయజ్ఞం యొక్క పదహారో భాగానికి కూడా సరితూగవు.॥61॥

* **జప్యేనైవ తు సంసిధ్యేద్బ్రాహ్మణో నాత్ర సంశయః ।**
కుర్యాదన్యన్న వా కుర్యాన్మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే ॥   ప్రక్షిప్త శ్లోక సం. *62 [2.87]*

తాత్పర్యం:- బ్రాహ్మణుడు జపయజ్ఞం చేతనే నిస్సంశయంగా మోక్షాన్ని పొందుతాడు. ఇతర కర్మలను చేసినా చేయకపోయినా అతడు సర్వప్రాణులకు మిత్రుడే.॥62॥

ప్రక్షిప్తాల పరిశీలన

54-62 శ్లోకాలు ఈ కింది ఆధారాల ప్రకారం ప్రక్షిప్తాలు.

1. అంతర్ వ్యతిరేకాలు

54 నుంచి 62 శ్లోకాలలోని విషయం, ఈ అన్ని శ్లోకాలూ పరస్పర వ్యతిరేకాలు. వీటిలో గాయత్రి మొదలైనవాటి మహిమ అతిశయోక్తులతో ఉండటం, మనువు చెప్పినవాటికి వ్యతిరేకమే కాకుండా, ఇతర వ్యవస్థలతో దీనికి పొంతన కుదరటం లేదు.

క. 79,82 శ్లోకాలలో కొన్నిటికి గడువు సమయాన్ని నిర్ధారించి, ఆ సమయం వరకు గాయత్రీజపం చేస్తే పెద్ద పాపాల నుంచి ముక్తి, బ్రహ్మప్రాప్తి కలుగుతాయని ఉంది. మొదటి విషయం- మనువు వట్టి గాయత్రీ జపంతోనే కాకుండా, పరమాత్మ ధ్యానం, ఇంద్రియనిగ్రహం మొదలైన ఎన్నో నిఃశ్రేయస కార్యాల వల్లనూ ముక్తి కలుగుతుందని చెప్పాడు. (12.82-125). అందువల్ల ఇది మనువుకు వ్యతిరేకం.

రెండవది-బ్రహ్మచారి ప్రతిరోజూ తప్పక గాయత్రి చేయాలని ఏర్పరిచాడు. (2.53(78), 76-81 (101-106), 197 (222). కనుక మనిషి 25 లేదా 36 ఏళ్ల-వరకూ బ్రహ్మచారిగా ఉంటే, అప్పుడు జపం చేస్తాడు. అటుపైన దీని సమయాన్ని నిర్ధారించే అవసరం ఉండదు. ఒకవేళ ఇంత మాత్రం చేతనే పాపాలు తొలగిపోవటం, ముక్తికలగటం జరిగితే, బ్రహ్మచారి తన బ్రహ్మచర్యాశ్రమకాలంలో ఎంతో కాలం జపం చేస్తాడు కనుక, సహజంగానే లాభాలు చేకూరుతాయి. ఈ విధంగా కూడా వీటి అవసరం లేదు.

ఖ. 56వ శ్లోకంలో గాయత్రిని వేదానికి ముఖమనీ, ఇది నశించనిదనీ ఉంది. 51-53 శ్లోకాలలో గాయత్రి వేదం నుంచే పుట్టిందనిచెప్పారు. ఎన్నో శ్లోకాలలో మనువు వేదాలను అపౌరుషేయాలని చెప్పాడు. (1.23; 12.93-95). వీటివల్ల గాయత్రీ మంత్రపు శాశ్వతతత్వం సహజంగానే తెలుస్తూంది కనుక, ఈ కథనం కూడా అనవసరం !

గ. 53వ శ్లోకంలో ఓంకారాన్నే పరబ్రహ్మ అనడం (1.23; 2.51 (76); 12.93-94 శ్లోకాలకు వ్యతిరేకం; వీటిలో ఓంకారం వేదాల నుంచి వచ్చిందనీ, వేదాలు పరమాత్మ రచనలనీ ఉంది. పరమాత్మ ప్రదానం చేసిన జ్ఞానం లేదా శబ్దం పరమాత్మ ఎలాగవుతుంది? ప్రాణాయామాన్నే పరమ తపస్సు అనడం 2.139-143 (164-168) శ్లోకాలకు వ్యతిరేకం. వీటిలో వేదాభ్యాసాన్నే అన్నిటినీ మించిన తపస్సు అని ఉంది. ఈ విధంగానే సావిత్రిని మించిన దేదీ లేదని చెప్పడం, వేదాలు, ఈశ్వరుడే అన్నిటికన్నా గొప్పవి అని చెప్పిన (2.51-53(56-78), 139-143(134-138); 12.91-93 మొదలైన అన్ని శ్లోకాలకూ వ్యతిరేకం.

ఘ. 84వ శ్లోకంలో వైదికయజ్ఞాది క్రియలను నాశనకారకాలు అని చెప్పటం, మొత్తం మనుస్మృతిలో ప్రతిపాదించిన విషయాలన్నిటికీ వ్యతిరేకం. ఎందుకంటే మనువు వేదోక్త కర్మలనే ధర్మాలని చెప్పాడు. (1.125, 128-132(2.6,9.13). అంతే కాకుండా ధర్మపాలన వల్లనే పునర్జన్మ గొప్పతనం, ముక్తిప్రాప్తి కలుగుతాయనీ విశ్వసించాడు. (4.238-243; 4.14; 12.82-125); 1.121-123(2.2-14) శ్లోకాలలో యజ్ఞాలు, వ్రతాలు, యమ ధర్మాలు మొదలైనవి నియమబద్ధంగా చేయటం వల్లనే వ్యక్తి మోక్షసుఖాన్ని పొందుతాడని స్పష్టంగా చెప్పాడు. మరి ఈ క్రియలన్నీ నిష్ఫలాలూ, నాశకారకాలని ఎలా చెప్పారు? ఈ విధంగా ఇవన్నీ సంప్రదాయ వ్యతిరేకాలని తెలుస్తుంది.

జ. 85-86 శ్లోకాలలో జపాలు, యజ్ఞాలతో మిగిలిన యాగాదులను పోల్చడం మనువు పద్ధతులకు వ్యతిరేకమని ఉంది. ఎందుకంటే మనువు పంచయజ్ఞాలను సమానంగా అనివార్యమూ, అవసరమూ, పుణ్యప్రదమూ అని చెప్పాడు. కనుక (2.1.15 (176); 3.70-75; 4.21-32; 6.5-12 మొదలైనవి). ఈ శ్లోకాలలో 74వ శ్లోకంతో సంబంధాలు, దానికి అర్థవాదాలు అవుతాయి. అందుచేత ప్రక్షిప్తాలు.

చ. 80వ శ్లోకంలో 'యోనిః' పద ప్రయోగంతో, ఈ శ్లోకం రచయిత జన్మతో బ్రాహ్మణులని భావిస్తాడని తెలుస్తూంది. 87వ శ్లోకంలోనూ బ్రాహ్మణులకు జపం చేయటం మాత్రంతోనే సిద్ధి కలుగుతుంది అనటం చేతనూ, 'జన్మనా' శ్రేష్ఠత అని సంకేతించాడు. జన్మతో వర్ణ వ్యవస్థ మనువుకు వ్యతిరేకం. (దీని విస్తృత వివరణకు 1.9 నుంచి 107 శ్లోకాలకు ఇచ్చిన 'అంతర్ వ్యతిరేకాలు' శీర్షిక చూడండి.)

ఛ. 80వ శ్లోకంలో గాయత్రీ జపం చేయనివారు నిందనీయులవుతారని ఫలితం చెప్పారు. కానీ 2.78 (103)లో అటువంటి వారిని శూద్రులుగా భావించి ద్విజుల నుంచి బహిష్కరించాలని మనువు ఆదేశించాడు. ఒకటే విషయంలో ఈ తేడాలు కూడా వ్యతిరేకతా సూచకాలు.

జ. 87వ శ్లోకంలో కేవలం జపంతోనే బ్రాహ్మణునికి సిద్ధికలుగుతుంది అనడం, మిగిలిన కర్మలన్నీ చేయక పోయినా పరవాలేదనే మినహాయింపు నివ్వడం ఉన్నాయి. అందరు బ్రాహ్మణులూ పంచయజ్ఞాలను తప్పక చేయాలనీ, యజన యాజనాలు (1.88) చేయటం వదల కూడదనీ మనువు చెప్పిన జీవితానికి ఆధారభూతాలైన అన్ని పద్ధతులకూ ఇవి వ్యతిరేకాలు. స్వాధ్యాయం, వ్రతాలు, యజ్ఞాలు, వేదాధ్యయనం, సంస్కారాలతోనే, బ్రాహ్మణుడనేవాడు నిజంగానే బ్రహ్మణుడవుతాడు. (2.3(28). వీటిని పాటించకపోతే అతడు బ్రాహ్మణుడెట్లా అవుతాడు? అంతర్వ్యతిరేకమైన ఈ ఆధారంవల్ల ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

2. శైలీగత ఆధారం

ఈ శ్లోకాలన్నిటి శైలీ అతిశయోక్తులతో నిండి ఉంది. 62వ శ్లోకం పక్షపాత పూరితంగా ఉంది. వేదోక్త కర్మలన్నీ పుణ్యం కలిగించేవే.వీటిని స్వల్పమైన వాటితో పోల్చడం సహేతుకం కాదు.

63వ శ్లోకం నుండి 90వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఇంద్రియ సంయమము-

ఇంద్రియాణాం విచరతాం విషయేష్వపహారిషు । మూలశ్లోక సం. **47[2.88]**
సంయమే యత్నమాతిష్ఠేద్విద్వాన్ యంతేవ వాజినామ్ ॥ ప్రక్షిప్త శ్లోకం సం.**63**

టీక:- **విద్వాన్ యన్తా వాజినామ్ ఇవ** = తెలివి గల సారథి గుర్రాలను అదుపులో పెట్టిన విధంగా, **విషయేషు + అపహారిషు** = మనస్సును, ఆత్మను దుష్టకర్మల వైపు లాగే విషయాలలో, **విచరతాం** = సంచరించే, **ఇంద్రియాణాం సంయమే** = ఇంద్రియాలను నిగ్రహించడానికి, **యత్నం** = ప్రయత్నం, **ఆతిష్ఠేత్** = అన్ని విధాల చేయాలి.

తాత్పర్యం:- విద్వాంసుడు మనస్సునూ, ఆత్మనూ దుష్టకర్మలవైపు లాగే విషయాలలో సంచరించే ఇంద్రియాలను నిగ్రహించడానికి, తెలివిగల సారథి గుర్రాలను అదుపులో పెట్టే విధంగా ప్రయత్నించాలి.॥63॥

ఋషి దయానందభాష్యం:- మనస్సును హరించి, విషయాలలో ప్రవేశింపచేసే ఇంద్రియాలను నిగ్రహించడమే మానవుడికి ముఖ్యమైన ఆచారం. నేర్పరియైన సారథి అశ్వాలను సరియైన మార్గంలో నడిపించిన విధంగా ఇంద్రియాలను వశమందుంచుకొని, అధర్మమార్గం నుండి తప్పించి, ధర్మమార్గంలో నడిపించాలి (స.ప్ర. 10వ స.).

గుర్రాలను సారథి ఎలా దోవతప్పి పోనివ్వడో, అలాగే విద్వాంసుడైన బ్రహ్మచారి ఆకర్షకమైన విషయాలలో పరిగెత్తే ఇంద్రియాలను నిగ్రహించడంలో సదైవ ప్రయత్నశీలుడుగా ఉండాలి (సం. వి. వేదారంభ.).

వివరణ:

ఇంద్రియశబ్దోత్పత్తి-

"ఇది= పరమైశ్వర్యే "ధాతువుకు, "ఋజ్రేన్ద్రాగ్రవజ్ర..... (ఉణాది 2-28) సూత్రం ద్వారా 'రన్' ప్రత్యయం చేర్చగా, 'ఇన్ద్ర' శబ్దం నిష్పన్నమవుతుంది 'ఇంద్ర' ప్రాతిపదికకు "ఇన్ద్రియమిన్ద్రలింగ మిన్ద్రదృష్టమిన్ద్ర.... ఇతి వా" (అష్టాధ్యాయి- 5.2.83) నుండి 'ఘచ్' ప్రత్యయం నిపాతితం.

"ఇంద్రియవాన్ ఇన్ద్రః, ఆత్మా తత్కరణం జ్ఞానకర్మ ఐశ్వర్యప్రాప్తేః, సాధనం లింగం చిహ్నం వా తదింద్రియమ్ శరీరావయవమ్". అంటే ఆత్మకు జ్ఞాన-కర్మ-ఐశ్వర్యాదులను ప్రాప్తింపచేసే సాధనాలైన శరీరావయవాలే ఇంద్రియాలు. నేత్రం, నాసికం, శ్రవణం, హస్తపాదాలు, మనస్సుతో కూడి పదకొండు ఇంద్రియాలు.

ఇది మనుకృతం. ప్రామాణికం

ఇంద్రియాల గణన-

ఏకాదశేన్ద్రియాణ్యాహుర్యాని పూర్వే మనీషిణః । మూలశ్లోక సం. **48**
తాని సమ్యక్ప్రవక్ష్యామి యథావదనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**64[2.89]**

టీక:- **పూర్వే మనీషిణః** = మొదటివిద్వాంసులు, **యాని ఏకాదశ + ఇన్ద్రియాణి** = ఏ పదకొండు ఇంద్రియాలను, **ఆహుః** = చెప్పి ఉన్నారో, **తాని యథావత్ + అనుపూర్వశః** = వాటిని యథోచిత క్రమంగా, **సమ్యక్ ప్రవక్ష్యామి** = చక్కగా తెలియజేస్తాను.

తాత్పర్యం:- గతపు విద్వాంసులు ఏ పదకొండు ఇంద్రియాలు చెప్పారో, వాటిని క్రమంగా వారి పద్ధతి ప్రకారం చెబుతాను.॥64॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శ్రోత్రం త్వక్చక్షుషీ జిహ్వా నాసికా చైవ పఞ్చమీ । మూలశ్లోక సం. *49*
పాయూపస్థం హస్తపాదం వాక్ చైవ దశమీ స్మృతా॥ ప్రక్షిప్త శ్లోక సం.**65[2.90]**

టీకః:- **శ్రోత్రం త్వక్ చక్షుసీ జిహ్వా** = శ్రోత్రం = కర్ణం (చెవులు), **త్వక్** = చర్మం, **చక్షుసీ** = నేత్రాలు, **జిహ్వా** = నాలుక, **చ** = మరియు, **పఞ్చమీ** = ఐదోది, **నాసికా** = ముక్కు, **పాయు ఉపస్థం హస్తపాదం-పాయు** = మలద్వారం, **ఉపస్థం** = మూత్రద్వారం, **హస్తపాదం**= హస్తపాదాలు, **వాక్** = వాణి, **దశమీ స్మృతా** = ఈ పది ఇంద్రియాలు ఈ శరీరంలో ఉన్నాయి (సం.వి.).

తాత్పర్యం:- చెవులు, చర్మం, కళ్లు, నాలుక, ముక్కు...ఈ ఐదూ జ్ఞానేంద్రియాలు. అపాన మార్గం, యోని/మేఢ్రం (స్త్రీ, పురుష లైంగిక అవయవాలు) కాళ్లుచేతులు, వాక్ (మాట) ఈ ఐదూ కర్మేంద్రియాలు.॥65॥

ఇది మనుకృతం-ప్రామాణికం

బుద్ధీన్ద్రియాని పంచైషాం శ్రోత్రాదీన్యనుపూర్వశః । మూలశ్లోక సం.**50**
కర్మేన్ద్రియాణి పంచైషాం పాయ్వాదీని ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**66[2.91]**

టీకః:- **ఏషాం** = వీటిలో, **శ్రోత్రాదీని పంచ బుద్ధీన్ద్రియాణి** = శ్రోత్రం మొ॥ ఐదు జ్ఞానేంద్రియాలు, **పాయ్వాదీని పంచ కర్మేన్ద్రియాణి** = మలద్వారం మొ॥ ఐదు కర్మేంద్రియాలుగా, **ప్రచక్షతే** = పిలువబడుతున్నవి, **అనుపూర్వశః** = క్రమంగా పదకొండవ ఇంద్రియం-మనస్సు.

తాత్పర్యం:- ఈ పది ఇంద్రియాలలోనూ చెవులు మొదలైనవి వినడం, కనడం, రుచిచూడటం లాంటివి జ్ఞానాన్ని కలిగి ఉండటం వల్ల వీటిని జ్ఞానేంద్రియాలనీ, పనులు చేయడం చేత పాయువు మొదలయినవాటిని కర్మేంద్రియాలనీ అన్నారు.॥66॥

పదకొండవ ఇంద్రియం మనస్సు-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకాదశం మనో జ్ఞేయం స్వగుణేనోభయాత్మకమ్ । మూలశ్లోక సం.**51**
యస్మిన్ జితే జితావేతౌ భవతః పంచకౌ గణౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**67[2.92]**

టీకః:- **ఏకాదశం మనః** = పదకొండో ఇంద్రియం మనస్సు, **స్వగుణేన ఉభయాత్మకం** = తనదైన స్తుతి ఆది గుణాలద్వారా రెండు విధాలైన ఇంద్రియాలతో సంబంధించి ఉంటుంది, **యస్మిన్ జితే** = ఏ మనస్సును జయించినట్లయితే, **ఏతౌ** = ఈ జ్ఞానేంద్రియాలు, అలాగే కర్మేంద్రియాలు రెండూ, **జితౌ** = జయింపబడుతున్నవి (స.వి.) **జ్ఞేయం** = ఈ విధంగా తెలిసికోవాలి, **పంచకౌ గణౌ** = ఐదు ఐదు ఇంద్రియాల యొక్క రెండు గణాలు పది ఇంద్రియాలు.

తాత్పర్యం:- ఇక-పదకొండోది మనస్సు అనే ఇంద్రియం. ఇది ఆ యా పనులను బట్టి జ్ఞానేంద్రియంగానూ, కర్మేంద్రియంగానూ కూడ వ్యవహరిస్తుంది. కాబట్టి దీన్ని జయించినవాడు జ్ఞాన/కర్మ ఇంద్రియాల్ని రెండిటినీ జయించినవాడవుతున్నాడు.॥67॥

వివరణ: చరకశాస్త్రంలో ఇంద్రియాల విషయం

చరకశాస్త్రంలో- ఇంద్రియాలు, ఇంద్రియాల విషయాలు, ఇంద్రియాలకు అధిష్ఠానములు, అలాగే విషయాలను గురించి కొంత విషయం మనకు తెలుస్తుంది. విషయ జ్ఞానం కోసం వివరణ ఇస్తున్నాం.

ఇంద్రియాలు

క. **"తత్ర చక్షుః శ్రోత్రం ఘ్రాణం రసనం స్పర్శనమ్ ఇతి పంచేంద్రియాణి. పంచేంద్రియ ద్రవ్యాణి -ఖం వాయుర్జ్యోతిరాపః భూరితి । పంచేంద్రియాధిష్ఠానాన్యక్షిణీ కర్ణౌ నాసికే 'జిహ్వా త్వక్ చేతి'.**

'పంచేంద్రియార్థాః శబ్దస్పర్శరూప రసగంధాః' (సూత్రస్థానే 8.5-6) చక్షువులు, శ్రవణాలు, ఘ్రాణం, రసన, స్పర్శ = ఈ ఐదు ఇంద్రియాలు క్రమంగా-తేజస్సు, ఆకాశం-పృథ్వీ-జలం మరియు వాయువు. ఈ అయిదు ఇంద్రియాల

ద్రవ్యాలు. క్రమంగా, కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం. ఇవి ఇంద్రియాలకు అధిష్ఠానాలు. రూపం, శబ్దం, గంధం-రసం-స్పర్శ, ఇవి ఇంద్రియాలకు అర్థాలు అంటే విషయాలు.

ఖ. కర్మేంద్రియాలు

“హస్తపాదం గుదోపస్థం జిహ్వేంద్రియమథాపి చ ।
కర్మేంద్రియాణి పంచైవ పాదౌ గమనకర్మణి ॥
పాయూపస్థౌ విసర్గార్థే హస్తౌ గ్రహణధారణే
జిహ్వావాక్-ఇంద్రియం వాక్ చ”- శారీరస్థానం. 1.23,24.

చేతులు, కాళ్ళు-గుద-పాయువు-మరియు జిహ్వ ఈ అయిదు కర్మేంద్రియాలు. గ్రహించడం (తీసికోవడం) చేతులపని, నడవడం- పాదాలపని. మలవిసర్జనం గుదం పని, మూత్రవిసర్జనం ఉపస్థ పని, మాట్లాడం జిహ్వపని (శరీరస్థానం) (విమానస్థానం. 1.19).

(గ) పదకొండో ఇంద్రియం మనస్సు- చింత, విచారించడం, సంకల్పించడం మొ॥వి.

“చిన్త్యం విచారమూహ్యం చ ధ్యేయం సంకల్ప్యమేవ చ ॥
యత్కించిత్ మనసో జ్ఞేయం తత్సర్వం హ్యర్థసంజ్ఞకమ్” (విమానస్థానం. 1.19)

ఇంద్రియాలను నిగ్రహించడం వల్ల కార్య సిద్ధి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఇంద్రియాణాం ప్రసజ్గేన దోషమృచ్ఛత్యసంశయమ్ । మూలశ్లోక సం. **53**
సన్నియమ్య తు తాన్యేవ తతస్సిద్ధిం నియచ్ఛతి॥ ప్రక్షిప్త శ్లోక సం. **68[2.93]**

టీక:- ఇంద్రియాణాం ప్రసజ్గేన = జీవాత్మ ఇంద్రియాలతో పాటు మనస్సును లగ్నం చేయడం, అసంశయం = నిస్సందేహంగా, **దోషం + ఋచ్ఛతి** = దోషం అవుతుంది, **తు తాని** సన్నియమ్య ఏవ = పూర్వోక్తములైన ఆ పది ఇంద్రియాలను, వశపరచుకొని **తతః** = తరువాత, **సిద్ధిం నియచ్ఛతి** = సిద్ధిని పొందగలడు.

తాత్పర్యం:- మనోధర్మం అనే ‘సంకల్పం’ చేతనే ఈ ఇంద్రియాలు తరచుగా ప్రవర్తిస్తుంటాయి కదా! ఇక ఇంద్రియనిగ్రహం దేనికీ? అనే ప్రశ్న వస్తుంది. ఈ ‘నియంత్రణ’ అనేదే లేకుంటే ఇహమున-పరమున కూడ కష్టం కలిగించే పాపం తగులుకొంటుంది. దీన్ని నివారించుకోడానికే ఇంద్రియ నిగ్రహం అవసరం.॥68॥

ఋషి దయానందభాష్యం:-“ఇంద్రియాలకు వశీభూతుడైనప్పుడే జీవాత్మ గొప్పగొప్ప దోషాలకు ఆలవాలమవుతుంది.

ఇంద్రియాలకు వశీభూతుడై, జీవుడు- ధర్మాన్ని వదిలి, అధర్మాచరణంలో అవిద్వాంసుడవుతాడు. వారు మానవులలో నీచజన్మలెత్తి, పాపకర్మలుచేసి దుఃఖరూపజన్మలను పొందుతారు (స.ప్ర. 10వ.స.).

ఇంద్రియాలకు విషయాలందు ఆసక్తి కలిగించినట్లయితే మానవుడు నిశ్చితరూపంగా దోషి అవుతాడు. వాటిని జయించి ధర్మంలో ప్రవర్తింప జేసినప్పుడు అభీష్టసిద్ధిని పొందగలడు (స.ప్ర. 10వ.స).

విషయానుభవం వల్ల కోరికలు అభివృద్ధి అవుతాయి- ఇది మనుకృతం-ప్రామాణికం

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి । మూలశ్లోక సం. **53**
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **69[2.94]**

టీక:- ఇది కచ్చితమైన విషయం- ఏదంటే- **కృష్ణవర్త్మే హవిషా ఏవ**= అగ్నిలో కట్టెలు, నెయ్యి వేసినప్పుడు, **భూయఏవ + అభివర్ధతే** = అగ్ని ఏవిధంగా మండుతూనే ఉంటుందో, అదేవిధంగా, **కామానాం+ఉపభోగేన కామః న**

జాతు శామ్యతి = కామములను అనుభవించే కొద్దీ కామం శాంతించదు, పైగా పెరుగుతూనే ఉంటుంది. అందువల్ల మానవుడు ఎప్పుడూ విషయాసక్తుడు కాకూడదు. విషయ త్యాగమే శ్రేష్ఠం.

తాత్పర్యం:- ఈ ఇంద్రియాలు తృప్తి చెందడం అనేదే లేదు. పైగా అగ్నికి నేయి దోహదం చేసినట్లు ఇంద్రియ సుఖాలు ఆశించే కొద్దీ అవి ఇంకా-ఇంకా కావాలనిపిస్తాయి.॥69॥

ఋషి దయానందభాష్యం:- అగ్నిలో సమిధలను, నేయిని వేసినకొలది అగ్ని ప్రజ్వరిల్లునట్లు కోరికలను అనుభవించిన కొద్దీ అవి పెరుగతూనే ఉంటాయి. (స.ప్ర.10వ సము.)

విషయత్యాగమే శ్రేష్ఠం- ఇది మనుకృతం-ప్రామాణికం

యశ్చైతాన్ ప్రాప్నుయాత్సర్వాన్ యశ్చైతాన్ కేవలాంస్త్యజేత్ । మూలశ్లోక సం.**54**
ప్రాపణాత్సర్వకామానాం పరిత్యాగో విశిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**70[2.95]**

టీక:- **యః + ఏతాన్ సర్వాన్ ప్రాప్నుయాత్** = ఎవడు ఈ సర్వకోరికలను లేదా సర్వ విషయాలను అనుభవిస్తాడో, **చ** = మరియు,**యః ఏతాన్ కేవలాం త్యజేత్** = ఎవడు ఈ కోరికలన్నిటిని త్యజిస్తాడో, ఈ రెండు విషయాలలో, **సర్వకామానాం ప్రాపణాత్** = సర్వకామనలను, కోరికలను పొందుటకంటే, **పరిత్యాగః** = పరిత్యజించుటయే, **విశిష్యతే** = సర్వోత్తమం.

తాత్పర్యం:- కోరికలనుకోరి వాటి సాధనకై కష్టాలను కొనితెచ్చుకోవడం కంటే వాటిని త్యజించడం మంచిది.॥70॥

ఇది మనుకృతం-ప్రామాణికం

న తథైతాని శక్యంతే సన్నియంతుమసేవయా । మూలశ్లోక సం.**55**
విషయేషు ప్రజుష్టాని యథా జ్ఞానేన నిత్యశః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**71[2.96]**

టీక:- **విషయేషు ప్రజుష్టాని ఏతాని** = విషయాలలో ఆసక్తమైన ఈ ఇంద్రియాలను, **అసేవయా** = విషయభోగాలను అనుభవించకుండా, **తథా నియన్తుం న శక్యంతే** = సులభంగా నిగ్రహించడానికి వీలుపడదు, **యథా నిత్యశః జ్ఞానేన** = ఏ విధంగా జ్ఞానం ద్వారా వశపరచుకోడానికి వీలుంటుందో, విషయాలను సేవించడం ద్వారా మనుషులకి దోషాలు అధికంగా విషయత్యాగం వల్ల సిద్ధి ప్రాప్తిస్తుంది. విషయాలను త్యజించాలనే జ్ఞానం పొందినప్పుడు ఇంద్రియాలను నిగ్రహించగలం.

తాత్పర్యం:- ఇంద్రియజయోపాయం చెప్పబడుతున్నది- విషయాలలో ఆసక్తమైన ఇంద్రియాలను విషయాలకు దూరంగా ఉంచి నిగ్రహింపవచ్చును. అట్లే విషయాలందున్న దోషాలను గ్రహించే జ్ఞానం వల్ల ఇంద్రియాలను నిగ్రహించవచ్చును.॥71॥

విషయాసక్తుడికి సిద్ధి లభించదు- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసి చ । మూలశ్లోక సం.**56**
న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛన్తి కర్హిచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**72[2.97]**

టీక:- **విప్రదుష్ట భావస్య** = అజితేంద్రియుడు, దుష్టాచారి అయిన పురుషుడికి **వేదాః త్యాగాః యజ్ఞాః నియమాః తపాంసి చ** = వేదాధ్యయనం, చేసిన త్యాగం, నియమం, అగ్నిహోత్రాదులు, బ్రహ్మచర్యాశ్రమపాలన, **తపః** = తపస్సు నిందాస్తుతులను హాని లాభాలు మొ॥ ద్వంద్వములను సహించడం మొ॥ కర్మ (సం.వి.). **కర్హిచిత్** = ఎప్పుడు, **సిద్ధిం న గచ్ఛన్తి** = సిద్ధించవు.

తాత్పర్యం:- కాబట్టి, కట్టుబడని మనస్సు వికారహేతువుగా అవుతుంది. కాబట్టి ఉపాయం చెప్పబడుతుంది. వేదాధ్యయనం, దానం, యజ్ఞములు, నియమములు, తపస్సులు చెడుమనస్సు గలవాడికి ఎలాంటి సిద్ధిని ఎక్కడా కలిగించవు.॥72॥

ఋషి దయానందభాష్యం:- దుష్టాచారం, జితేంద్రియుడు కానివాడు- చదివిన వేదం, చేసిన త్యాగం, యజ్ఞం, నియమ తపస్సులు, ఇతరమైన మంచి పనులు కూడా ఎప్పుడూ సిద్ధిని పొందలేవు. అజితేంద్రియుడైన పురుషుడు విప్రదుష్టుడని పిలువబడతాడు. అతడు ఆచరించిన తపస్సు గాని, చదివిన వేదపఠనం గాని, చేసిన యజ్ఞయాగాదులు గాని, పాటించిన యమ నియమాలుగాని, చేసిన దాన ధర్మాలుగాని సిద్ధించవు. కానీ ఇవన్నీ జితేంద్రియుడైన, ధర్మజ్ఞుడికి (ధర్మం ఆచరించినవాడికి) సిద్ధిస్తాయి (స.ప్ర.ద.స.(మను. 1-58) చూడండి.).

జితేంద్రియుడి పరిభాష ఇది మనుకృతం-ప్రామాణికం

శ్రుత్వా స్పృష్ట్వా చ దృష్ట్వా చ భుక్త్వా ఘ్రాత్వా చ యో నరః । మూలశ్లోక సం. **57**
న హృష్యతి గ్లాయతి వా స విజ్ఞేయో జితేంద్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **73[2.98]**

టీక:- జితేంద్రియః సః విజ్ఞేయః = అతడే జితేంద్రియుడు, **యః నరః** = ఏ మానవుడైతే, **శ్రుత్వా** = స్తోత్రాన్ని విని సంతోషాన్ని, నిందను విని దుఃఖాన్ని, **స్పృష్ట్వా**= మృదువైన వస్తువును స్పర్శించి ఆనందాన్ని, దుష్టమైన వస్తువును స్పర్శించి దుఃఖాన్ని, **దృష్ట్వా** = సౌందర్యాన్ని చూసి సంతోషం, వికృతాకారాన్ని చూసి బాధను, **భుక్త్వా** = ఉత్తమ భోజనం చేసి సంతోషాన్ని, నికృష్ట భోజనంచేసి దుఃఖాన్ని, **ఘ్రాత్వా చ న హృష్యతి గ్లాయతి** = సుగంధాన్ని పీల్చి ప్రసన్నతను, దుర్గంధాన్ని పీల్చి అసహ్యతను తెలియచేయడో అతడే జితేంద్రియుడు.

తాత్పర్యం:- అందువల్ల జితేంద్రియత్వం అవసరం. ఇది ఎలాంటిదంటే....ఇంద్రియాదులు కలిగించే సుఖాలను (ఉదా: మంచి ఆహారాన్ని భుజించడం, మంచి వాసనలు పీల్చడం, పొగడ్తలు వినడం, పట్టువంటి మెత్తని సుఖానుభూతి కలిగించేవి ధరించడం) పొందినప్పుడు సంతోషంగాని-వీటికి భిన్నమైనవి తారసపడినప్పుడు విచారం గాని కలగకుండా ఉండగలుగుతారో....అది జితేంద్రియత్వం అనిపించుకుంటుంది. ॥73॥

ఏ ఒక్క ఇంద్రియాన్ని నిగ్రహించకపోయినా కూడా నష్టమే- ఇది మనుకృతం-ప్రామాణికం

ఇంద్రియాణాం తు సర్వేషాం యద్యేకం క్షరతీంద్రియమ్ । మూలశ్లోక సం. **58**
తేనాస్య క్షరతి ప్రజ్ఞా దృతేః పాత్రాదివోదకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **74[2.99]**

టీక:- సర్వేషాం ఇంద్రియాణాం తు = సర్వేంద్రియాలలో, **ఏకం ఇంద్రియమ్ క్షరతి** = ఒక ఇంద్రియమైనా తన విషయంలో ఆసక్తమైనట్లయితే, **తేన** = దానివల్ల, **అస్య ప్రజ్ఞా క్షరతి** = ఈ మానవుడి బుద్ధి నష్టమైపోతుంది. **దృతేః పాత్రాత్ ఉదకమ్ ఇవ** = తోలుసంచికి పడిన రంధ్రం ద్వారా నీరంతా కారిపోవునట్లు బుద్ధి నష్టభ్రష్టమైపోతుంది.

తాత్పర్యం:- ఈ 5 ఇంద్రియాలలో ఏ ఒక్క ఇంద్రియం, దానిక్కావలసిన సుఖం కోసం వెంపర్లాడినా, అలాంటి జ్ఞానం అంతా సూదిబెజ్జం వల్ల తోలు తిత్తిలోంచి నీరుకారినట్లే వృథాగా పోతుంది.॥74॥

ఇంద్రియనిగ్రహం ద్వారా సర్వార్థసిద్ధి- ఇది మనుకృతం-ప్రామాణికం

వశే కృత్వేంద్రియగ్రామం సంయమ్య చ మనస్తథా । మూలశ్లోక సం. **59**
సర్వాన్ సంసాధయేదర్థానక్షిణ్వన్ యోగతస్తనుమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **75 [2.100]**

టీక:- ఇంద్రియగ్రామం = ఇంద్రియసమూహాన్ని = 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు కలిసి 10 ఇంద్రియాల సమూహానికి, చ = మరియు, మనః = పదకొండోదైన మనస్సును, వశేకృత్వా = వశమందుంచుకొని, **యోగతః తనుమ్ అక్షిణ్వన్** = యోగం, యుక్తాహార విహారం ద్వారా శరీరాన్ని రక్షించుకొంటూ, **సర్వాన్ అర్థాన్ సంసాధయేత్** = సర్వార్థాలను సాధించుకోవచ్చు.

తాత్పర్యం:- కాబట్టి, విద్వాంసుడు, జ్ఞాని అనేవాడు బహిరింద్రియాలన్నిటికి పగ్గంవేసి తన అధీనంలో ఉంచుకొని గట్టిగా పట్టుకొని, దేహాన్ని యాతన పెట్టకుండా పుణ్యం, పురుషార్థం సాధించి తరువాత ఆ దేహాన్ని మోహం లేకుండా వదిలేయగలగాలి. ఇది ఉత్తముడి ధర్మం.॥75॥

ఋషి దయానందభాష్యం:-బ్రహ్మచారియైన పురుషుడు ఇంద్రియాలన్నిటినీ స్వాధీనపరచుకొని మనస్సును ఆత్మతో జోడించి, యోగాభ్యాసం ద్వారా శరీరానికి కొంచెం కొంచెం బాధకలిగిస్తూ తన సమస్త ప్రయోజనాలను సాధించుకోవచ్చు(సం.వి;స.ప్ర.ద.స.).

వివరణ:- "యోగ శబ్దార్థానికి"-6.65 చూడగలరు.

సన్ధ్యోపాసన సమయం: గాయత్రీ జపం- ఇది మనుకృతం-ప్రామాణికం

పూర్వాం సన్ధ్యాం జపం స్తిష్ఠేత్సావిత్రీమర్కదర్శనాత్ । మూలశ్లోక సం.60
పశ్చిమాం తు సమాసీనః సమ్యగృక్షవిభావనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.76 [2.101]

టీక:- అర్కదర్శనాత్ పూర్వాం సన్ధ్యాం = రాత్రి చివర నుండి- 2ఘడియలు మొ॥ ప్రాతః కాల సన్ధ్య, **సమ్యక్ + ఋక్షవిభావనాత్ తు పశ్చిమాం** = సూర్యాస్తమయం నుండి నక్షత్రాలు బాగా కనిపించేంత వరకు సాయంసన్ధ్యతో, **సమాసీనః** = చక్కగా శాంతంగా కూర్చొని, **సావిత్రీమ్ జపం తిష్ఠేత్** = సవితయొక్క ఉపాసన, (అంటే సర్వజగత్ సృష్టికర్తయైన పరమేశ్వరుణ్ణి) నిత్యం గాయత్ర్యాది మంత్రాల అర్థాన్ని మననం చేస్తూ చేయాలి.

తాత్పర్యం:- సూర్యుడు ఉదయించే వేళ-సూర్యోదయం అయ్యేంతవరకూ సాయం సంధ్యవేళ నక్షత్రాలు కనిపించేంత వరకు గాయత్రీ మంత్రాన్ని ప్రశాంతంగా కూర్చొని సంధ్యోపాసన (గాయత్రీజపం) చెయ్యాలి. ॥76॥

ఋషి దయానందభాష్యం:- బ్రహ్మచారి సూర్యోదయానికి ముందే మేల్కొని ప్రాతఃసంధ్య మరియు సాయంత్రం నక్షత్ర దర్శనమగునంతవరకు సమస్త జగత్తును పుట్టించిన పరమేశ్వరుని ఉపాసనను, గాయత్రీమున్నగు మంత్రాలను అర్థయుక్తంగా జపించాలి. (ద.ల.సం.)

సన్ధ్యోపాసనాఫలం- ఇది మనుకృతం-ప్రామాణికం

పూర్వాం సన్ధ్యాం జపంస్తిష్ఠ న్నైషమేనో వ్యపోహతి । మూలశ్లోక సం.61
పశ్చిమాం తు సమాసీనో మలం హంతి దివాకృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.77[2.102]

టీక:- మనుజుడు, **పూర్వాం సన్ధ్యాం జపం తిష్ఠన్** = ప్రాతఃకాలీన సంధ్యలో కూర్చొని, జపంచేసి, నైషం+ఏనః **వ్యపోహతి** = రాత్రికాలీనమైన మానసిక దోషాలను దూరం చేసుకొంటాడు. **తు పశ్చిమాం సమాసీనః** = మరియు సాయంకాలీన సంధ్యను చేసి, **దివాకృతం మలం హన్తి** = పగలుచేసిన మానసిక దోషాలను నాశనం చేసుకుంటాడు. రెండు సమయాల్లో సంధ్యచేయడం వల్ల పూర్వ (ముందు) సమయంలో ప్రాప్తించిన దోషాలను గురించి మననం చేసికొని, పశ్చాత్తాపం చెంది, ఇకముందు చేయను అని సంకల్పించుకొంటాడు. అలాగే గాయత్రీజపంతో తన సంస్కారాలను పవిత్రం చేసుకుంటాడు.

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ఉదయం వేళ (ప్రాతఃకాలపు) గాయత్రీ మంత్రజపం చేసి రాత్రివేళ జరిగిన పాపాలకు అలాగే సాయం సంధ్యవేళ చేసే గాయత్రీ జపంతో, దినమంతా తెలిసో-తెలియకో చేసిన పాపాలను పోగొట్టుకున్నవాడవుతున్నాడు.॥77॥

వివరణ:-"ఏనః" శబ్దానికి పాపమని అర్థం. అది సంస్కారజన్య దోషమని అర్థం. (విస్తృతసమీక్ష 2-2 చూడగలరు).

సన్ధ్యోపాసన చేయనివాడు శూద్రుడు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

న తిష్ఠతి తు యః పూర్వాం నోపాస్తే యశ్చ పశ్చిమామ్ । మూలశ్లోక సం. **62**
స శూద్రవద్బహిష్కార్యః సర్వస్మాద్ద్విజకర్మణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **78[2.103]**

టీక:- **యః** = ఏ మనిషి, **పూర్వాం న తిష్ఠతి, చ, పశ్చిమాం న ఉపాస్తే** = నిత్యం ప్రాతఃకాలం, సాయంకాలం సన్ధ్యోపాసన చేయడో, అతడిని శూద్రుడిలాగే, **సర్వస్మాత్ ద్విజకర్మణః బహిష్కార్యః**= అన్ని ద్విజకర్మల నుండి బహిష్కరించి శూద్రవర్ణంలో-కులంలో ఉంచాలి.

తాత్పర్యం:- ఉదయసంధ్య, సాయంసంధ్య కాలములలో ఎవరైతే గాయత్రిని అనుష్ఠించరో, అలాంటివారిని ద్విజకర్మలన్నిటి నుంచి బహిష్కరించాలి. అతడిని శూద్రుడని భావించాలి.॥78॥

ఋషి దయానందభాష్యం:- ప్రతినిత్యం ప్రాతఃసాయం సంధ్యోపాసనల నొనరించని ద్విజుడిని శూద్రునిగా భావించి ద్విజకులం నుండి వేరుచేసి శూద్రకులముగా పరిగణించాలి. (ద.ల.పం.).

ప్రతిదినం గాయత్రీ జపవిధానం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అపాం సమీపే నియతో నైత్యకం విధిమాస్థితః । మూలశ్లోక సం. **63**
సావిత్రీమప్యధీయీత గత్వారణ్యం సమాహితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **79 [2.104]**

టీక:- **అరణ్యం గత్వా**= అరణ్యానికి - అంటే ఏకాంతప్రదేశానికి వెళ్ళి, **సమాహితః** = సావధానుడై, **అపాం సమీపే నియతః** = జలానికి సమీపంలో కూర్చొని, **సావిత్రీమ్ +అపి+అధీయీత** = గాయత్రీమంత్రాన్ని అర్థజ్ఞానంతో పాటు జపిస్తూ, తదనుసారంగా ప్రవర్తనను దిద్దుకోవాలి (స.ప్ర. 3వ.స.).

తాత్పర్యం:- ఏకాంతప్రదేశంలో గాయత్రీజపం శ్రేష్ఠం. అందుకుగాను, నదీతీరాన గాని, అరణ్య ప్రదేశంలోగాని ఇంద్రియాలపై పట్టుసాధించినవారు ఏకాగ్రచిత్తంతో 'ఓం భూర్భువస్స్వః' అనే ప్రణవవ్యాహృతి త్రయముతో కూడిన గాయత్రీజపం చెయ్యాలి. ॥79॥

వేదం,అగ్నిహోత్రాదులకు అనధ్యయనం (సెలవు) ఉండదు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

వేదోపకరణే చైవ స్వాధ్యాయే చైవ నైత్యకే । మూలశ్లోక సం. **64**
నానురోధోఽస్త్యనధ్యాయే హోమమన్త్రేషు చైవ హి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **80 [2.105]**

టీక:- **వేదోపకరణే చైవ** = వేదాన్ని చవడంలోనూ చదివించడంలోనూ, **చ** = మరియు, **నైత్యకే స్వాధ్యాయే** = నిత్యకర్మలో వచ్చే గాయత్రీ జపం లేదా సంధ్యోపాసనలో, **హోమమన్త్రేషు చైవ** = యజ్ఞం, హోమం చేయడంలో, **అనధ్యాయే అనురోధః న అస్తి** = ఈ వేళ అనధ్యయనం ఉందని పట్టుపట్టరాదు. అంటే ఈ కర్మ ఎలాంటి పరిస్థితులలోనైనా ఆచరించాలి. ఈ పాఠ్యక్రమంలో సెలవు గురించి ఆలోచనే రాకూడదు.

తాత్పర్యం:- వేదాంగాలైన శిక్ష మొదలైనవాటిలో, నిత్యం అనుష్ఠించు బ్రహ్మయజ్ఞరూపమైన వేదాధ్యయనంలోనూ, హోమమంత్రాలలోనూ అనధ్యాయాన్ని పాటించ నవసరం లేదు.॥80॥

ఋషి దయానందభాష్యం:-వేదం చదవడం-చదివించడం, సంధ్యోపసనాది పంచమహా యజ్ఞాలను చేయడానికి 'అనధ్యాయం ఉండాలనే నియమం చెల్లదు (స.ప్ర.).

వేదపాఠం, నిత్యకర్మ, హోమమంత్రాలకు (అనధ్యాయం) సెలవు అంటూ ఉండదు. నిత్యకర్మలు అంటే ప్రతిదినం చేయవలసినవి. దాని అర్థాన్ని పరమేశ్వరుణ్ణి లక్ష్యంగా పెట్టుకొని మనస్సును ఏకాగ్రత చేయడమే నిత్యకర్మ. అందువల్లనే ప్రత్యేక కర్మ సమాప్తం కాగా, చివరలో ఇలా అనుకొంటాడు. నే నీ కార్యాన్ని, దీని ఫలితాన్ని పరమేశ్వరుడికి అర్పించుకొంటున్నాను (స.ప్ర.3వ.సము)

ఇది మనుకృతం-ప్రామాణికం

నైత్యకే నాస్త్యనధ్యాయో బ్రహ్మసత్రం హి తత్స్మృతమ్ । మూలశ్లోక సం.**65**
బ్రహ్మాహుతిహుతం పుణ్యమనధ్యాయవషట్ కృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**81[2.106]**

టీక:- నైత్యకే అనధ్యాయః న + అస్తి = నిత్యకర్మలో సెలవంటూ (అనధ్యాయం) ఉండదు. శ్వాస-నిశ్వాసలు (ప్రశ్వాసలు) సదా జరుగుతుంటాయి, ఆగిపోవు. అలాగే నిత్యకర్మ ప్రతిదినం చేయాలి. ఒక్క దినం కూడా ఆపరాదు. **హి** = ఎందుకంటే, **అనధ్యాయవషట్ కృతం** = సెలవురోజున కూడా అగ్నిహోత్రాది ఉత్తమ కర్మలు చేయడంలో పుణ్యం ప్రాప్తిస్తుంది, **తత్ బ్రహ్మసత్రం స్మృతం** = అది బ్రహ్మయజ్ఞంగా భావింపబడుతుంది.

తాత్పర్యం:- నిత్యమైన వేదాధ్యయనంలో అనధ్యయనదోషం లేదు. అలాంటి నిత్యాధ్యయనం బ్రహ్మసత్రమని చెప్పబడినది. అలాంటి వేదము అనే ఆహుతిని అనధ్యాయంలో ఇచ్చినా పుణ్యప్రదమే కాని, అనధ్యయనదోషం సంభవించదు.॥81॥

ఋషి దయానందభాష్యం:- అబద్దాలు చెప్పడంవల్ల పాపం, సత్యం చెప్పడం వల్ల పుణ్యం వస్తుంది, అలాగే, చెడుపనులు చేయడానికి సదా అనధ్యాయం, మంచి పనులు చేయడంలో సదా స్వాధ్యాయం చేయవలసి ఉంటుంది (స.ప్ర.3వ.స.).

వివరణ:

'వషట్' కారమునకు ఉత్పత్తి

'వహ్' ధాతువుకు **'డషటి'** ని కలపడం వల్ల, **'వషట్'** శబ్దం నిష్పన్నమవుతుంది. ఇది అవ్యయం. దాని అర్థం యజ్ఞాది ధార్మిక క్రియ, లేదా ఆహుతి. ఈ విధంగా **"అనధ్యాయ వషట్కృతమ్ బ్రహ్మాహుతి హుతం పుణ్యం"**, అనధ్యాయస్థితిలో కూడా, చేసిన ధార్మికక్రియ అగ్నిహోత్రాదులలో ఆహుతులివ్వడం మొ॥ కర్మలు బ్రహ్మయజ్ఞంలో చేసిన ఉపాసనారూపమైన ఆహుతులకు సమానమైన పుణ్యకారకమవుతుంది. ఈశ్వర స్మరణ చేయడం పుణ్యదాయకమే అవుతుంది.

స్వాధ్యాయఫలం-

ఇది మనుకృతం-ప్రామాణికం

యస్స్వాధ్యాయమధీతేఽబ్దం విధినా నియతశ్శుచిః । మూలశ్లోక సం.**66**
తస్య నిత్యం క్షరత్యేష పయో దధి ఘృతం మధు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**82[2.107]**

టీక:- యః = ఏ వ్యక్తి, **అబ్దం స్వాధ్యాయం** = జలవర్షక మేఘస్వరూపమైన స్వాధ్యాయాన్ని, వేదాధ్యయనం, గాయత్రీ జపయజ్ఞం, ఉపాసనాదులు, **శుచిః** = పవిత్రుడై, **నియతః** = ఏకాగ్రచిత్తంతో, **విధినా** = విధిపూర్వకంగా, శాస్త్రోక్తంగా, **అధీతే** = చేస్తున్నాడో, **తస్య ఏషః** = ఆ పురుషుడికి ఈ స్వాధ్యాయం, **నిత్యం** = ఎల్లప్పుడు, **పయః దధి, ఘృతం మధు క్షరతి** = పాలు, పెరుగు, నెయ్యి మరియు తేనెను వర్షిస్తుంది. ఏ విధంగా ఉపయుక్త పదార్థ సేవనం వల్ల

శరీరం తృప్తిచెంది, బలశాలియై, రోగరహితంగా ఉంటుందో, అదేవిధంగా స్వాధ్యాయం చేయడం వల్ల కూడా మానవజీవనం శాంతిమయంగాను, గుణమయంగాను, జ్ఞానయుక్తంగాను, ఆనందమయంగాను ఉంటుంది. మరియు ధర్మార్థ కామ మోక్షాలు సిద్ధిస్తాయి.

తాత్పర్యం:- ఈ ప్రకారం ఒక సంవత్సరకాలం జితేంద్రియత్వంతో కూడి వేదాధ్యయనరూప గాయత్రిని అనుష్ఠించినవాడికి, ఆ నిత్యస్వాధ్యాయ మహిమచేత జీవనానికి అవసరమైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి వంటి పంచామృతాలు లభిస్తాయి.॥82॥

వివరణ:

1. స్వాధ్యాయం యొక్క అభిప్రాయం

ఈ శ్లోకంలో ఆలంకారికంగా వర్ణన జరిగింది. పాలు, పెరుగు, నెయ్యి ప్రతీకగా తీసికోబడినవి. ఆయుర్వేద శాస్త్రానుసారంగా- దుగ్ధము యొక్క ముఖ్యగుణం తృప్తిని కలిగించడం, దధి-పుష్టిని కలిగించడం, నెయ్యి-బలాన్ని, ఆయుష్షును పెంచడం, మధు- శరీరదోషాలను నశింపచేయడం మొ॥ ముఖ్య గుణాలు. దీన్ని బట్టి చూసిట్లయితే స్వాధ్యాయం వల్ల మానవ జీవనానికి శాంతి, సద్గుణాలు, జ్ఞానం, ఆనందం లభిస్తాయి. ఆలంకారికంగా చేసిన వర్ణన ఫలితం ఇదే. టీకాకారులు కొందరు వీటిని ధర్మార్థకామ మోక్షాలకు ప్రతీకలుగా వర్ణించారు. ఇక్కడ మనుమహర్షి వేదమంత్రం యొక్క భావాన్ని యథాతథంగా వర్ణించారు.

“పావమానీర్యో అధ్యేత్యృషిభిః సంభృతం రసమ్ ।
తస్మై సరస్వతీ దుహే క్షీరం సర్పిః మధూదకమ్ ॥ (ఋ.9.67-32)

2. ‘అబ్ద’శబ్దానికి సరియైన అర్థం:-ఈ శ్లోకంలో **‘అబ్ద’** శబ్దం- **‘అపోదదాతి ఇతి అబ్దమ్ మేఘస్వరూపం’**. యౌగికార్థంలో ప్రయోగింపబడింది. దీని అర్థం ‘వర్షం కాదు, వృష్టికారక మేఘ స్వరూపం. ఇదే సందర్భానుకూలంగా ఉంది.

కానీ, కొందరు టీకాకారులు **‘వర్ష’**మని అర్థం చెప్పారు. ఏ మానవుడు జితేంద్రియుడు, పవిత్రుడుగా ఉంటూ ఒక్క సంవత్సరం విధిపూర్వకంగా వేదాధ్యయనం చేస్తాడో, అతనికి సర్వదా పాలు, పెరుగు, నెయ్యి, తేనె వర్షిస్తాయి. ఈ వ్యాఖ్య సందర్భోచితం కాదు. మనువు సిద్ధాంతానికి వ్యతిరేకం కూడా. కారణం-

క. **‘వేదాధ్యయనం, యజ్ఞం, ఉపాసన’** ఈ కర్మలు ద్విజులకు ఆవశ్యకమైన కర్మలని [1.88- 90] మను వాదన. అందువల్ల కొద్ది సమయంలో చేసిన వేదాధ్యయన ప్రయోజనం చెప్పవలసిన అవసరం లేదు.[1.77-81 (102-106)]

ఖ. ఈ కర్మలన్ని కూడా ద్విజ బ్రహ్మచారులకు, 9,18,32 సం॥ వరకు నిత్య కర్మల రూపంగా విధించాడు. ఇవన్నీ బ్రహ్మచారులు అనివార్యంగా చేయవలసిన విధులు. ఇక సీమిత (1వ సంవత్సరం) కాల నిర్ణయం చేయవలసిన అవసరం ఏముంది? [3.1-2]

గ. అంతేగాక శ్లోకంలో ప్రయోగించిన నిత్యశబ్దం కూడా సందర్భానికి అనుకూలంగా లేదు. సంవత్సరపర్యంతము చేసిన వేదాధ్యయనం వల్ల ఈ లాభాలన్ని కూడా ఒక సంవత్సరం వరకే లభిస్తాయి. ఇక సదా (నిత్యం) ఎలా లభించగలవు? ఒక సంవత్సరంలోనే ఈ లాభాలన్నీ లభిస్తుండగా, ఇక ఎక్కువ సంవత్సరాలు స్వాధ్యాయం చేయవలసిన అవసరమేముంది? ఇలాంటి చిక్కులున్నందువల్ల వ్యాఖ్యాకారులు నిత్యశబ్దానికి అర్థం రాయడమే మానేశారు, ఇక్కడ **‘అబ్దమ్’** శబ్దం యౌగికార్థంలో ప్రయోగించారు. మేఘం వర్షదాతగా ఉన్నట్లు, స్వాధ్యాయం కూడా ఇన్ని లాభాలను వర్షయితగా (దాతగా) వర్ణించారు. ఈ శ్లోకంలో ప్రయోగించిన **‘క్షరతి’** క్రియాప్రయోగం కూడా మేఘార్థమునే పోషిస్తున్నది. ఆలంకారిక ప్రయోగం కాబట్టి అర్థం కూడా తదనుగుణంగాను గ్రహించడం ఉచితం.

3. 'స్వాధ్యాయ'మంటే? నిరంతరం సాఙ్గోపాంఙ్గ అధ్యయనమని మను అభిప్రాయం. అలాగే సన్ధ్యోపాసన-అగ్నిహోత్రాలు కూడా ఇందుకు ప్రమాణం 2.79-81[2.104-106] శ్లోకాలు. ఇదే కాకుండా నిమ్నశ్లోకాలలో 'వేదాధ్యయనమే' స్వాధ్యాయమని నిరూపించారు. 2.140-143 (2.165-168) 4.17-20,147-149, 11.245.

సమావర్తనం వరకు హోమాదికర్తవ్యాలు చేయడం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అగ్నీన్ధనం భైక్షచర్యామధశ్శయ్యాం గురోర్హితమ్ । మూలశ్లోక సం.**67**
ఆసమావర్తనాత్కుర్యాత్ కృతోపనయనో ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**83[2.108]**

టీక:- **కృతః ఉపనయనః ద్విజః** = యజ్ఞోపవీత సంస్కారంలో దీక్షితుడైన ద్విజుడు, **అగ్నీన్ధనం** = అగ్నిహోత్రం చేయడం, **భైక్షచర్యామ్** = భిక్షువృత్తి, **అధఃశయ్యాం** = నేలమీద పడుకోవడం, **గురోః హితమ్** = గురువుకు సేవచేయడం, **ఆ సమావర్తనాత్** = సమావర్తన సంస్కారం వరకు అంటే వేదాధ్యయనం సమాప్తం చేసి గృహానికి తిరిగివచ్చేవరకు (3-1-3 కుర్యాత్) చేస్తుండాలి.

తాత్పర్యం:- ఉపనయనం జరిగిన ద్విజుడు అగ్నిహోత్రం, మంచం/శయ్య వంటి ఎత్తయిన వాటిపై నిద్రించకుండుట, గురువుకు లాభం- సంతోషం కలిగించే పనులు, భిక్షాటన వంటి విధులు నిర్వర్తిస్తూండాలి. ఇవి కూడ ఆ బ్రహ్మచారికి పెళ్లి జరిగేంతవరకు మాత్రమే విధింపబడిన కృత్యములు.॥83॥

చదువుటకు యోగ్యుడైన శిష్యుడు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఆచార్యపుత్రశ్శుశ్రూషుర్జ్ఞానదో ధార్మికశ్శుచిః । మూలశ్లోక సం.**68**
ఆప్తశ్శక్తోఽర్థదస్సాధుస్స్వోఽధ్యాప్యా దశ ధర్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**84[2.109]**

టీక:- **ఆచార్యపుత్రః** = తన ఆచార్యునికి (గురువుకు) పుత్రుడు, **శుశ్రూషుః** = గురుశుశ్రూష, సేవచేసేవాడు, **జ్ఞానదః** = ఏదైనా ఒక విషయం బోధించేవాడు, **ధార్మికః** = ధర్మనిష్ఠుడైన వ్యక్తి, **శుచిః** = పవిత్రమైన, కపటరహితమైన, ఆచరణ కలవాడు, **ఆప్తః** = యథార్థ వక్త, ఘనిష్ఠ వ్యక్తి, ఆత్మీయుడు-మిత్రాది, **శక్తః** = విద్యాగ్రహణ సమర్థుడు-బుద్ధిమంతుడైనవాడు, పాత్రుడు, **అర్థదః** = ధనం ఇవ్వగలవాడు, **సాధుః** = హితైషి, **స్వః** = తన పరివారానికి సంబంధించినవాడు మొ॥, **దశ ధర్మతః అధ్యాప్యాః** = ఈ పదిమంది ధర్మంగా అవశ్యం చదివించగల యోగ్యులు.

తాత్పర్యం:- సాధారణంగా గురుదక్షిణ ఇచ్చి చదువుకోవాలని శాస్త్రం. అయితే పది రకాలవారి విషయంలో దీనికి మినహాయింపు ఉంది. 1. పరిశుద్ధుడు, 2. బంధువు, 3. ధనికుడు, 4. మేలుకోరువాడు, 5. జ్ఞాతి, 6. గురుపుత్రుడు, 7. వినయంతో శుశ్రూష చేసేవాడు, 8. తనకు ఇంకో విద్య నేర్పేవాడు, 9. చెప్పినది వెంటనే గ్రహించేవాడు, 10. జ్ఞాపకశక్తిపరుడు. ॥84॥

వివరణ:

ఆప్త శబ్దానికి అర్థం:- ఆప్తశబ్దానికి వ్యాకరణశాస్త్రంలో '**యథార్థవక్త**' లేదా '**సత్యవక్త**' అని ప్రచలితమైన అర్థం. కానీ ఘనిష్ఠవ్యక్తి అనే అర్థం కూడా ప్రసిద్ధమే. "**ఆప్లృవ్యాప్తౌ**" ధాతువుకు '**క్త**' ప్రత్యయం చేర్చగా, '**ఆప్త**' శబ్దం సిద్ధమవుతుంది. '**యత్**' ప్రత్యయాన్తశబ్దమైన '**ఆప్త్యా**'కు నిర్వచనం చేస్తూ నిరుక్తకారుడు రాస్తున్నాడు. "**ఆప్త్యా ఆప్నోతేః**" (16-2-19) ఈ ప్రకారంగా ఉపరోక్తమైన అర్థంలో, ఆప్తశబ్దానికి వ్యుత్పత్తి జరిగింది. "**ఆప్నోతి హృదయే ఆత్మీయత్వేన స ఆప్తః**",

అడగనివాడికి ఉపదేశం చేయరాదు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

నాపృష్టః కస్యచిద్బ్రూయాన్నచాన్యాయేన పృచ్ఛతః । మూలశ్లోక సం.**69**
జానన్నపి హి మేధావీ జడవల్లోక ఆచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **85[2.110]**

టీక:- **న అపృష్టః** = ఎప్పుడు కూడా అడగనివాడికి, ప్రశ్నించనివాడికి, **చ** = మరియు, **అన్యాయేన పృచ్ఛతః** = అన్యాయంగా అంటే కపటంతో ప్రశ్నించేవాడికి, **కస్యచిత్ న బ్రూయాత్** = అలాంటివాడెవడైనా కూడా జవాబివ్వరాదు, **మేధావీ** = బుద్ధిమంతుడు, అతనిఎదుట, **జానన్ అపి** = తెలిసికూడా, **లోకే** = ఈ లోకంలో, **జడవత్ ఆచరేత్** = జడునిలాగ ఉండాలి.

తాత్పర్యం:- తనను ఎవరు ఏదీ అడగకుండా ఏదీ ఎవరికీ చెప్పకూడదు. అలాగే వినయం, భక్తి-శ్రద్ధలు లేకుండా ఏదో మాటవరసకు అడిగినట్టు అడిగినవారికి కూడా ఏదీ చెప్పరాదు. బుద్ధిమంతుడైనవాడు తానెంత తెలిసినవాడై ఉన్నప్పటికీ - ఇలాంటివారి పట్ల మౌనంగా ఉండటమే ఉత్తమం. ॥85॥

ఋషి దయానందభాష్యం:- అడుగనివానికి, అన్యాయంగా కపటంతో ప్రశ్నించేవారికి సమాధానమీయరాదు. అలాంటివారి ముందు బుద్ధిమంతులు అజ్ఞానులలాగా జడులలాగా ఉండాలి. నిష్కపటులైనవారికి, జిజ్ఞాసువులైనవారికి అడుగకుండానే ఉపదేశించాలి.(స.ప్ర.10 సము)

దుర్భావనాపూర్వక ప్రశ్నకు జవాబీయరాదు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అధర్మేణ చ యః ప్రాహ యశ్చాధర్మేణ పృచ్ఛతి । మూలశ్లోక సం.**70**
తయోరన్యతరః ప్రైతి విద్వేషం వాఽధిగచ్ఛతి॥ ప్రక్షిప్త శ్లోక సం.**86[2.111]**

టీక:- **యః** = ఎవడైతే, **అధర్మేణ** = అన్యాయంగా, పక్షపాతంతో అసత్యాన్ని ఆధారంగా చేసుకొని, మొండిపట్టుదలతో హఠంగా, అధర్మాచరణ కలవాడై కపటభావనతో, **పృచ్ఛతి** = ప్రశ్నిస్తాడో, **యః** = ఎవడు, **అధర్మేణ** = పూర్వోక్తప్రకారంగా, **ప్రాహ** = జవాబిస్తాడో, ఇలాంటివారిని విద్వాంసుడైనవాడు ప్రశ్నించరాదు- జవాబివ్వరాదు. ఎవరు ఈ విధంగా ప్రవర్తించరో, **తయోః అన్యతరః ప్రైతి**= ఈ ప్రకారంగా ప్రశ్నించేవాడు- లేదా జవాబు చెప్పేవాడు-ఇద్దరిలో ఒకడు తప్పక మృత్యువాతబడతాడు, **వా**= లేదా, **విద్వేషం** = అత్యంత విరోధాన్ని పొందినవారై ఇద్దరూ కష్టాల పాలవుతారు.

తాత్పర్యం:- ఎవరు అన్యాయంగా ప్రతి సమాధానం చెప్పినా; అన్యాయంగా ఎవరైనా ఎవర్నైనా అడిగినా రెండూ దోషాలే! కొన్ని సందర్భాలలో ఇలాంటి దోషాలకు పాల్పడినవారిలో ఒకరికి మరణం సంభవించవచ్చు! లేదా విరోధమైనా ఏర్పడవచ్చు! ॥86॥

వివరణ:

"ప్రైతి" 'మరణించును' అనే శబ్ద ప్రయోగం జవాబివ్వకుండగానే సంబంధ విచ్ఛేదం జరుగునని భావం. ఎప్పుడైనా దుర్బుద్ధితో ప్రశ్నించినా, జవాబు చెప్పినా, వారిద్దరిలో ఒకడు తప్పక శత్రువులాగా దూరమైపోతాడు. అలా దూరంకానిచో వారిద్దరి మధ్య వివాదం, విరోధం తప్పక సంభవిస్తుంది.

ఎవరికి విద్యాదానం చేయరాదు?- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ధర్మార్థౌ యత్ర న స్యాతాం శుశ్రూషా వాఽపి తద్విధా । మూలశ్లోక సం.**71**
తత్ర విద్యా న వక్తవ్యా శుభం బీజమివోషరే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**87[2.112]**

టీక:- యత్ర ధర్మార్థౌ న స్యాతాం = ఎక్కడ ధర్మం, అర్థప్రాప్తి లేదో, **వా** = మరియు, **తద్విధా శుశ్రూషా అపి** = గురువుకు తగినట్లు సేవాశుశ్రూషలు లేవో, **తత్ర విద్యా న వక్తవ్యా** = అలాంటి వాడికి విద్యాదానం చేయరాదు. ఎందుకంటే, **ఊషరే శుభం బీజమ్ +ఇవ** = చవిటి (చవుడు) భూమిలో శ్రేష్ఠమైన విత్తనాలను నాటినట్లుగా ఉంటుంది. అంటే చవిటి భూమిలో నాటిన బీజం వ్యర్థమైనట్లుగా పైన చెప్పినట్లున్నవాడికి బోధించిన విద్య కూడా వ్యర్థమైపోతుంది. అంటే చవిటి భూమిలో నాటిన బీజం వ్యర్థమైనట్లుగా పైన చెప్పినట్లున్నవాడికి బోధించిన విద్య కూడా వ్యర్థమైపోతుంది.

తాత్పర్యం:- ఎవరికి ధర్మం, అర్థం (డబ్బు) రెండూ, వీటితోపాటు గురుశుశ్రూష బుద్ధి లేదో, వారికి విద్య చెప్పరాదు. అలాంటివారికి చెప్పే విద్య చవుడు భూముల్లో వేసిన విత్తనాల లాగా వ్యర్థం అవుతుంది. అందువల్ల అలాంటివారికి చదువు చెప్పడం వృథా.॥87॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అయోగ్యులకు విద్యాదాన నిషేధం-

విద్యయైవ సమం కామం మర్తవ్యం బ్రహ్మవాదినా । మూలశ్లోక సం.**72**
ఆపద్యపి హి ఘోరాయాం న త్వేనామిరిణే వపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**88[2.113]**

టీక:- **బ్రహ్మవాదినా** = వేదపండితుడు, **విద్యయా+ఏవ సమం కామం మర్తవ్యం** = విద్యను తనతో తీసుకొని మరణించడమే మేలు, **హి** = కాని,**ఘోరాయాం ఆపది +అపి** = భయంకరమైన ఆపదలొచ్చినా, **ఏనాం ఇరిణే తు న వపేత్** = ఈ విద్యను చవిటిభూమిలో విత్తవద్దు అంటే, ఎక్కడ విద్య ఫలించదో, ఎవడు విద్యను నష్టపరుస్తాడో లేదా నిరుపయోగం చేస్తాడో, అలాంటి కుపాత్రుడికి (అయోగ్యుడికి) విద్యాదానం చేయరాదు.

తాత్పర్యం:- యోగ్యతగల శిష్యుడు లభించనప్పుడు వేదాధ్యయనం ఎంత గొప్పగా చేసిన అధ్యాపకుడైనా తాను ఆ విద్యతోనూ మృతిచెందడం ఉత్తమం. అంటే-అతడితో ఆ విద్య అంతరించిపోయినా ఏమీ నష్టంలేదుగాని, అపాత్రుడికి విద్యనేర్పడం తగనిపని.॥88॥

ఇది మనుకృతం-ప్రామాణికం

విద్యాదానసంబంధమైన కథ, నిర్దేశం-

విద్యా బ్రాహ్మణమేత్యాహ శేవధిస్తేఽస్మి రక్షమామ్। మూల శ్లోక సం.**73**
అసూయకాయ మాం మా దాస్తథా స్యాం వీర్యవత్తమా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**89[2.114]**

టీక:- ఒక కథ ప్రచారంలో ఉంది. ఒకసారి **విద్యా**బ్రాహ్మణమ్ + ఏత్య + అహ = విద్యాదేవత విద్వాంసుడైన బ్రాహ్మనుణ్ణి సమీపించి, "**తే శేవధిః అస్మి, రక్షమామ్** = నేను నీ కొక ధన నిధిని, నన్ను రక్షించు, **మాం అసూయకాయ, మా దాః** = నన్ను ఉపేక్షించేవాడికి, లేదా నిందించేవాడికి లేదా అసూయ కల వాడికి ప్రదానం చేయవద్దు, **తథా వీర్యవత్తమా స్యాం** = ఈ ప్రకారంగా చేసినందువల్ల, నేను వీర్యవంతురాలను, అంటే మహత్వపూర్ణురాలను, శక్తిసంపన్నురాలను కాగలను.

తాత్పర్యం:- ఇదొక, ఆలంకారికమైన ఒక కథ. ఒకప్పుడు ఈ విధంగా ఆక్రోశించిందట ! ఏమని?....."ఓ వేదాధ్యాపకుడా ! నేను నీకొక నిధిని ! అసూయాగ్రస్తులకు, అపాత్రులకు నన్నిచ్చి అవమానపరచకు. దోషాలు లేనివారికి నన్ను ఇవ్వడం ద్వారా నాలో తేజస్సు నిల్పినవాడివి అవుతావు" అని.॥89॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యమేవ తు శుచిం విద్యాన్నియతం బ్రహ్మచారిణమ్ । మూల శ్లోక సం.**74**
తస్మై మాం బ్రూహి విప్రాయ నిధిపాయాప్రమాదినే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**90[2.115]**

టీక:- **యమ్ + ఏవ తు శుచిం నియతం బ్రహ్మచారిణమ్** = ఏ బ్రహ్మచారి, శుద్ధుడు, జితేంద్రియుడు, శ్రద్ధాభావ సమన్వితుడని, **విద్యాత్** = తెలుసుకొంటారో? **తస్మై అప్రమాదినే నిధిపాయ మాం బ్రూహి** = ఆలస్యరహితుడు, ఈ నిధిని రక్షిస్తూ, అభివృద్ధిపరచడంలో సమర్థుడు, వేదభక్తుడు, జిజ్ఞాసువైన విప్రులకు విద్యను నేర్పుము.

తాత్పర్యం:- అంతేకాదు! "పరిశుద్ధమైన హృదయంగలవాడికి, జితేంద్రియుడైనట్టి బ్రహ్మచారికి, నిధిని కాపాడే జాగ్రత్తపరుడైన శిష్యుడికి నన్ను ఒప్పచెప్పు!" అని కూడ అన్నదట! దీన్ని బట్టి విద్యనేర్వగోరేవారి కీ ఉత్తమ లక్షణాలుండాలని తేటతెల్లమవుతోంది కదా ! ॥90॥

వివరణ: నిరుక్తంలో విద్యా కథ:

ఈ విద్యాకథ నిరుక్తమునందిట్లున్నది. (72,73,74) మనుమహర్షి పైన పేర్కొన్న శ్లోకాలలో వర్ణించిన విద్యాకథ-ప్రాచీనమైనది, చాలా కాలం నుంచి ప్రచలితమై- మార్గనిర్దేశకమైన ఆఖ్యానమిది. యాస్కాచార్యులు నిరుక్తంలో ప్రాచీన గ్రంథాల నుండి కొన్ని శ్లోకాలను ఉదాహరించాడు. ఇందులో విస్తారంగా వర్ణన చేయబడింది. భావాన్ని శబ్దసామ్యాన్ని చూడగలరు.

1. **విద్యా హ వై బ్రాహ్మణమాజగామ గోపాయ మా శేవధిష్టే-హమస్మి ।**
అసూయకాయానృజవేఽ_యతాయ న మా బ్రూయా వీర్యవతీ తథాస్యామ్ ॥

2. **య ఆవృణోత్యవితథేన కర్ణావదుఃఖం కుర్వన్నమృతం సం ప్రయచ్ఛన్ ।**
తం మన్యేత పితరం మాతరం చ తస్మై న ద్రుహ్యేత్ కతమచ్చనాహ ॥

3. **అధ్యాపితా యే గురుం నాద్రియన్తే విప్రా వాచా మనసా కర్మణా వా ।**
యథైవ తే న గురోర్భోజనీయాస్తథైవ తాన్న భునక్తి శ్రుతం తత్ ॥

4. **యమేవ విద్యాః శుచిమప్రమత్తం మేధావినం బ్రహ్మచర్యోపపన్నమ్ ।**
యస్తే న ద్రుహ్యేత్ కతమచ్చనాహ తస్మై మా బ్రూయా నిధిపాయ బ్రహ్మన్॥(నికురుక్తం. 2.1-4)

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *బ్రహ్మ యస్త్వననుజ్ఞాతమధీయానాదవాప్నుయాత్ ।*
స బ్రహ్మస్తేయసంయుక్తో నరకం ప్రతిపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***91[2.116]***

తాత్పర్యం:- గురువు యొక్క ఆజ్ఞ తీసుకొనక అతని శిష్యుని దగ్గర, ఇతర శిష్యులకు అధ్యయనం చేయిస్తున్నప్పుడు విని వేదాన్ని అభ్యసిస్తాడో అతడు వేదాన్ని దొంగిలించినవాడవుతాడు. కాబట్టి వాడు నరకానికి పోతాడు.॥91॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది-

1. అంతర్ వ్యతిరేకం

క. 2.80-81(2.105-106) శ్లోకాలలో వేదాల అధ్యయన అధ్యాపనాలు, శ్రవణ శ్రావణాలు అన్ని పరిస్థితులలోనూ పుణ్యదాయకాలనీ, ద్విజులందరికీ ముఖ్య కర్తవ్యాలలో వేదాధ్యయనం విహితమనీ ఉంది. (1.87-90) అందుచేత ఈ శ్లోకంలో అనుమతి లేకుండా వేదాన్ని వినడం తప్పు అనునది మనువు చెప్పిన పద్ధతికి ప్రతికూలం.

ఖ. 2.166 (2.191) లో మనువు గురువు ప్రేరణతోనైనా లేదా లేకున్నా విద్యార్థిని వేదాధ్యయనంలో నిమగ్నమై ఉండాలని ఆదేశించాడు. దీనివల్ల వేదాధ్యయనం లేదా శ్రవణాలకు ఎటువంటి బంధనమూ మనువుకు ఇష్టం లేదని స్పష్టమవుతూంది.

గ. ఇదేవిధంగా నరకానికి సంబంధించిన విషయాలు కూడా మనుసమ్మతం కావు. దీని కొరకు 4.87 నుంచి 91 వరకు గల శ్లోకాల మీద 'అనుశీలనం' సమీక్ష చూడండి. ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

గురువుకు ప్రథమాభివాదనం- ఇది మనుకృతం-ప్రామాణికం

లౌకికం వైదికం వాఽపి తథాఽధ్యాత్మికమేవ చ । మూలశ్లోక సం.**76**
ఆదదీత యతో జ్ఞానం తం పూర్వమభివాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**92**[2.117]

టీక:- యతః = ఎవరి నుండి, **లౌకికం** = లోకంలో ఉపయోగించేవి శస్త్రవిద్య, అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతి విజ్ఞానం మొ॥, **వా** = లేదా, **వైదికం** = వేదసంబంధమైన, **తథా** = అలాగే, **ఆధ్యాత్మికమ్ + ఏవ** = ఆత్మ-పరమాత్మ సంబంధి, **జ్ఞానం** = జ్ఞానమును, **ఆదదీత** = స్వీకరిస్తాడో, పొందుతాడో, **తం** = అలాంటి జ్ఞానప్రదాతయైన గురువును, **పూర్వం+అభివాదయేత్** = ముందుగా నమస్కరించాలి. ముందు నమస్కరించడానికి తగినవారు. 1) బ్రహ్మజ్ఞానప్రదాత, 2) వేదార్థ ప్రదాత, 3) లౌకిక-జ్ఞానదాత.

తాత్పర్యం:- బ్రహ్మజ్ఞానం, వేదార్థ పరిజ్ఞానం, అర్థశాస్త్రం మొదలైన శాస్త్రముల జ్ఞానం తాము ఎవరివద్ద నుంచి నేర్చుకుంటారో అలాంటివారు పది మంది మధ్యలో ఉండటం తటస్థించినా-ముందుగా ఆ గురుదేవుడికే నమస్కరించాలి. ఈ గురువులు వేర్వేరుగా ఉంటే, మొదట బ్రహ్మజ్ఞానం నేర్పిన వారికే వందనం చేయాలి.॥92॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* విప్రుని శ్రేష్ఠత-అశ్రేష్ఠత-

* *సావిత్రీమాత్రసారోఽపి వరం విప్రస్సుయంత్రితః ।*
నాయంత్రితస్త్రివేదోఽపి సర్వాశీ సర్వవిక్రయీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*93 [2.118]*

తాత్పర్యం:- శాస్త్రాన్ని ఆచరించేవారికి (బ్రాహ్మణుడైతే) గాయత్రీమంత్రం వచ్చినా మేలే! అలా కాకుండా, శాస్త్రాన్ని పాటించక ధర్మవిరుద్ధంగా నడిచేవారు మూడు వేదాలూ సాంగోపాంగంగా అధ్యయనం చేసినా అతడు హీనుడే ! ॥93॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది విషయాల వల్ల ప్రక్షిప్తం.

1. ప్రసంగవ్యతిరేకం

ఇది ప్రసంగవ్యతిరేక శ్లోకం. ముందు వెనుకల గల శ్లోకాలలో గురువు పట్ల పాటించవలసిన శిష్టాచారాలు, అభివాదన విధి మొదలైనవి ఉన్నాయి. ఈ శ్లోకంతో ఆ క్రమం తప్పటమే కాకుండా, దీంట్లో చెప్పిన విషయాలతో వాటికి ఎటువంటి సంబంధమూ లేదు. ప్రసంగ వ్యతిరేకం కనుక ఇది ప్రక్షిప్తం.

2. అంతర్వ్యతిరేకం

ఈ శ్లోకంలో **'అన్నిటినీ అమ్మేవాడు', 'అన్నిటినీ తినేవాడు'** మూడు వేదాలు తెలిసినవాడు జితేంద్రియుడు కాకపోతే బ్రాహ్మణుడైనా శ్రేష్ఠుడు కాదు అని ఉంది. ఇవన్నీ మనువుకు వ్యతిరేకాలే. విక్రయం అంటే వ్యాపారం బ్రాహ్మణుడిది

కాదు. అది వైశ్యుని పని (1.88,9,326-332). మనువు వ్యవస్థ ప్రకారం ఎవడు అమ్మే పని చేస్తాడో, వాణ్ణి బ్రాహ్మణుడు అని పిలవరు. అలాగే ద్విజాతీయులలో మనువు అన్నీ తినొచ్చు అని చెప్పలేదు. తామసిక పదార్థాలు, మాంసం మొదలైనవాటిని నిషేధిస్తూ భక్ష్య-అభక్ష్యాల నియమం నిర్ధారించాడు. (5.5,8.10,24-25,43-51). ఈ ఆధారాలలో అన్నీ తినే వాడిని బ్రాహ్మణుడుగానే కాదు, ద్విజాతులలోనివాడని కూడా అంగీకరించరు. ఈ కథనం మనువు వ్యవస్థకు వ్యతిరేకం. అందుకని తరువాత చేర్చిన ఈ శ్లోకం ప్రక్షిప్తం.

94 నుండి 97వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

గురువుగారి శయ్యమీద గాని, ఆసనం మీదగాని కూర్చోరాదు-

శయ్యాసనేఽధ్యాచరితే శ్రేయసా న సమావిశేత్ । మూలశ్లోక సం.**76**
శయ్యాసనస్థశ్చైవైనం ప్రత్యుత్థాయాభివాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**94[2.119]**

టీక:- శ్రేయసా= గురుజనులు మొ॥ పెద్దల ద్వారా, అధ్యాచరితే = వాడుకొనే, లేదా ఉపయోగించే, శయ్యాఆసనే = మంచం, ఆసనాల మీద, న సమావిశేత్ = కూర్చోరాదు. పడుకోరాదు, నిద్రించకూడదు, చ = మరియు, శయ్యాసనస్థః = తన మంచం మీద పడుకొన్నప్పుడు గాని, ఆసనమందు కూర్చున్నప్పుడు గాని బ్రహ్మచారి, ఏనం = ఈ గురుజనులను చూచినప్పుడు, ప్రత్యుత్థాయ + అభివాదయే = తమ ఆసనాల నుండి లేచి నిలబడి నమస్కారం చేయాలి.

తాత్పర్యం:- గురువుల పెద్దల ఆసనముపై, శయ్యపై పడుకొనరాదు, కూర్చోరాదు. వారితో సమానంగా కూర్చొనరాదు. శిష్యుడు తాను ఆసనం మీదగాని, శయ్యమీదగాని కూర్చొని ఉండగా, యోగ్యుడైన గురుసమానుడు గాని-గురువుగారే గాని వచ్చినట్లయితే లేచి అతడిని గౌరవించి అభివాదం చేయాలి.॥94॥

పెద్దలకు అభివందనం చేయడం వల్ల మానసిక ప్రసన్నత- ఇది మనుకృతం-ప్రామాణికం

ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రామంతి యూనః స్థవిర ఆయతి । మూలశ్లోక సం.**77**
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**95[2.120]**

టీక:- స్థవిరే ఆయతి = విద్యలోనూ, పదవిలోనూ ఆయుష్షు (జీవితకాలం) మొ॥నవి ఎక్కువగా ఉన్న పెద్దలైనవారు వచ్చినప్పుడు, యూనః ప్రాణాః = చిన్నవాళ్ళ ప్రాణాలు, ఉత్క్రామన్తి = పైకి ఉబికినట్లుంటాయి. ప్రాణాలలో అలజడి, వ్యాకులత్వం కలుగుతాయి. హి = కాని, ప్రత్యుత్థాన +అభివాదాభ్యాం = లేవడం, నమస్కారం చేయడం వల్ల, పునః = మళ్ళీ, తాన్ ప్రతిపద్యతే = శిష్యుడి ప్రాణాలు సామాన్య స్వాభావిక స్థితికి రాగలవు. అంటే శిష్యుడి ప్రాణాలందు కలిగిన అలజడి మొ॥వి.దూరమవుతాయి.

తాత్పర్యం:- ఈ విధంగానే జ్ఞానవృద్ధులు గాని- వయోవృద్ధులు గాని వచ్చినప్పుడు ఈ విధంగా మన్నన చేయకపోవడం, పిన్నవాడికి ఆయుక్షీణం, కాబట్టి-చిన్నవారు వృద్ధ/గురువరేణ్యుల పట్ల గౌరవాదరాలు కలిగి మెలగాలని తాత్పర్యం.॥95॥

అభివందనం వల్ల ఆయుర్విద్యాయశోబలప్రాప్తి - ఇది మనుకృతం-ప్రామాణికం

అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః । మూలశ్లోక సం.**78**
చత్వారి తస్య వర్ధన్తే ఆయుర్విద్యా యశో బలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**96[2.121]**

టీక:- అభివాదన శీలస్య = ఎవరికి నమస్కారం చేసే స్వభావం, అలవాటు ఉందో, నిత్యం వృద్ధోపసేవినః = విద్యలో, వయస్సులో పెద్దలైనవారికి నిత్యం సేవ, శుశ్రూషలు చేస్తాడో, **తస్య ఆయుః విద్యా యశః బలమ్ చత్వారి వర్ధన్తే** = అతడికి ఆయుష్షు పెరుగుతుంది, విద్య ప్రాప్తిస్తుంది, కీర్తి కలుగుతుంది, శారీరక, మానసిక బలం లభిస్తుంది. ఈ నాలుగు లాభాలుంటాయి. నాలుగు రకాలైన ఔన్నత్యాన్ని పొందుతారు.

తాత్పర్యం:- ఈ ప్రకారం జ్ఞాన/వయో/గురు వృద్ధులు విచ్చేసినప్పుడు లేచి, వారికి అభివాదం సల్పి సముచిత రీతిన సత్కరించువారికి యశస్సు, ఆయుష్షు, బలం, విద్య అనేవి ఎన్నడూ తరగక వృద్ధి చెందుతాయి.॥96॥

ఋషి దయానందభాష్యం:-నమ్రశీలుడై, శీలసంపన్నుడై, వృద్ధులకు (జ్ఞానవృద్ధులు), విద్వాంసులకు సేవచేస్తాడో, అతడికి ఆయుష్షు-విద్య-కీర్తి-బలం ఈ నాలుగు సదా పెరుగుతుంటాయి. ఇలా చేయనట్లయితే ఈ నాలుగు తగ్గిపోతాయి. (స.ప్ర.3వ స; సం.వి.వేదారంభ)

వివరణ:

నమస్కారం చేయడంవల్ల ఆయుర్విద్యా యశోబలం ఏలా అభివృద్ధి చెందుతాయి?

అభివందనం చేసే శీలం, సేవాస్వభావంగల వ్యక్తి సహజంగా వినమ్రతగా ఉంటాడు. మనోవైజ్ఞానిక దృష్టితో చూసినప్పుడు అధికగుణగ్రాహిగా ఉంటాడు. అభివందనీయులైన వ్యక్తుల గుణప్రభావం వారిమీద ఉంటాయి. వృద్ధులంటే విద్యలో, అనుభవంలో ఆరితేరినవారు, విద్యానుభవ వృద్ధులు. ఈ విషయమే- మనువు ఈ కింది శ్లోకాలలో స్పష్టంచేశాడు (2.103, 2.128 నుండి 133 వరకు ఈ కింది శ్లోకం- తులనాత్మకంగా చూడగలరు).

"న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః
యో వై యువాప్యధీయానః తం దేవా స్థవిరం విదుః॥" మను.2.105

ఈ విషయాన్ని స్పష్టీకరించి, పైన పేర్కొన్న నాలుగు లాభాలను గురించి సమాలోచన చేయబడుతుంది.

క. అభివందనం విధానాన్ని వర్ణించి- అది ప్రతి విద్యార్థికి, వ్యక్తికి ఉండదగిన సుగుణమని మనువు నిర్ణయం. అభివందనశీలుడు, వృద్ధులను సేవించే వ్యక్తి వినమ్రుడుగా ఉంటాడు. ఆదరించే స్వభావం, వినమ్రత, సేవ-శుశ్రూషలు, సుశీలత మొ॥ గుణాలున్నందువల్ల అతడికి అన్నిచోట్ల ప్రశంసలు లభిస్తాయి. ఈ విధంగా అతని యశస్సు పెరిగిపోతుంది.

ఖ. ఉపరోక్త గుణాలున్నందువల్ల అందుకు సంతోషించి గురువులు అధికవిద్యాదానం చేస్తారు. ఈ గుణాల ప్రభావం వల్ల అధికజ్ఞానవృద్ధులైన, వయోవృద్ధులైన పండితులు ఆకర్షింపబడతారు. అందువల్ల విద్యాజ్ఞానం పెరుగుతుంది.

"యథా ఖనన్ ఖనిత్రేణ నరో వార్యధిగచ్ఛతి ।
తథా గురుగతాం విద్యాం శుశ్రూషురధిగచ్ఛతి" ॥ (2.193) [2.218]

గ. ఈ గుణాలు లేనివాడికి విద్య లభించదు. విద్యాప్రాప్తిని కాంక్షించే వ్యక్తికి సేవాభావన అవసరమని మనువే గాక ఇతరశాస్త్రాలన్నీ చెప్పడానికి కారణమిదే.

"ధర్మార్థౌ యత్ర న స్యాతాం, శుశ్రూషా వాఽపి తద్విధా ।
తత్ర విద్యా న వక్తవ్యా శుభం బీజ మివోషరే ॥ (2.87) [2.112]
శుశ్రూషుః.....అధ్యాప్యా దశ ధర్మతః (2.84) [2.109]

ఈ ప్రకారంగా విద్యాభివృద్ధి కలుగుతుంది. అభివందనశీలుడు, సేవాభావం గల వ్యక్తిని చూడగానే ప్రతివ్యక్తి హృదయం స్నేహభావంతో ఉప్పొంగిపోతుంది. 'ఇతడికి ఎంతైనా మేలుచేయాలనే భావం కలుగుతుంది'.

ఘ. ఏ విద్యార్థి అయినా లేదా వ్యక్తి అయినా, అభివందనశీలుడై విద్యానుభవ వయోవృద్ధుల సాన్నిధ్యంలో ఉండటం వల్ల, అతడికి వారివల్ల ధర్మాభిలాష, సదాచారం, శుద్ధి, ఈశ్వరోపాసన, శ్రేష్ఠ గుణాలు, అనుభవం యోగసిద్ధి మొ॥

గుణాలే గాక శిక్షా- దీక్షలు ప్రాప్తిస్తాయి. ఇక్కడ 'ఉపసేవినః' శబ్దం వల్ల, "వృద్ధుల సమీపంలో ఉండి సేవించడం అనే భావం గుర్తించవలసి ఉంది. ఇందుకు- మనువు ఉదాహరణ-

"ఉపనీయ గురుః శిష్యం శిక్షయేత్ శౌచమాదితః ।
ఆచారమగ్నికార్యం చ సన్ధ్యోపాసనమేవ చ" ॥ 2.39

ఇలాంటి శిక్షాదీక్షలు అభివందనశీలురకు విద్యా-వయోవృద్ధులైన గురువుల నుండే ప్రాప్తిస్తాయి. శరీరం, మనస్సు పరిశుభ్రమవుతాయి (2.68). స్వస్థుడుగా ఉండి, సదాచారం, అగ్నిహోత్రం, సన్ధ్యోపాసనాది ధర్మపాలన వల్ల ఆయుష్షు బలం పెరుగుతాయి. ఇందుకే 'మనువు చూపించే ఉదాహరణ'

జ. ఉత్థాయావశ్యకం కృత్వా కృతశౌచః సమాహితః ।
పుర్వాం సన్థ్యాం జపన్ తిష్ఠేత్ స్వకాలేచాపరాం చిరమ్ ॥ 4.27

ఋషయో దీర్ఘసన్ధ్యత్వాత్ దీర్ఘమాయురవాప్నుయుః ।
ప్రజ్ఞాం యశశ్చ కీర్తిం చ బ్రహ్మవర్చసమేవ చ॥ 4.93-94

సదాచారంవల్ల ఆయుష్షు-బలం వృద్ధి చెందుతాయి.
"ఆచారాల్లభతే హ్యాయుః ఆచారాదీప్సితాః ప్రజాః ॥ 4.156

"సర్వలక్షణ హీనోఽపి యః సదాచార వాన్నరః 4.158
శ్రద్ధధానోఽనసూయశ్చ శతం వర్షాణి జీవతి" ॥

సదాచారం వల్ల ఆయుర్వృద్ధి- మరియు దురాచారం వల్ల అల్పాయష్షు కలగడానికి మరికొన్ని ఉదాహరణలు- (4.44,4.31)

చ. ధార్మిక-సాత్త్విక వ్రతాల వల్ల ఆయుష్షు, యశస్సులు మొ॥వి. లభిస్తాయి.

"స్వర్గాయుష్యయశస్యాని వ్రతానీమాని ధారయేత్" 4.14-258

ఆ వ్రతాల గురించి (4.14 నుండి 88వరకు) వర్ణించబడినవి.

ఆయుర్వర్ధక విషయజ్ఞానం, విద్యానుభవం, ఇవన్నీ, వయోవృద్ధవ్యక్తుల సాన్నిధ్యం వల్ల లభిస్తాయి. సేవాశుశ్రూష, అభివందన శీలత వల్ల అలాంటివారి సాన్నిధ్యం ప్రాప్తిస్తుంది. పై శ్లోకోక్త గుణాల ద్వారా బలం, ఆయుష్షు అభివృద్ధిచెందుతాయి.

అభివాదన విధి- ఇది మనుకృతం-ప్రామాణికం

అభివాదాత్పరం విప్రో జ్యాయాంసమభివాదయన్ । మూలశ్లోక సం.**79**
అసౌ నామాహమస్మీతి స్వం నామ పరికీర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**97[2.122]**

టీక:- విప్రః = ద్విజుడు, జ్యాయాంసం +అభివాదయన్ = తనకంటే వయోజ్ఞానానుభవాలలో పెద్దవారికి నమస్కారం చేస్తూ, అభివాదాత్ పరం = అభివాదనసూచక శబ్దానంతరం, "అహం అసౌ నామా అస్మి = నేను ఫలానా పేరుగలవాడను" అని అంటారు. స్వం నామ పరికీర్తయేత్ = తన పేరు చెప్పుకోవాలి. ఉదాహరణకు "అభివాదయేఽహం దేవదత్తః" మిగిలిన విధి గురించి రాబోయే శ్లోకమందున్నది.

తాత్పర్యం:- విప్రుడు తన కంటే పెద్దవారికి అభివాదం చేసి, అటుపైన 'అభివాదయే' అని చెప్పి, 'ఈ పేరుగల్గి-ఈ గోత్రం గల్గిన నేను నమస్కరిస్తున్నాను' అని పలకడం ద్వారా తన నామ గోత్రాలను కీర్తించేవాడవుతున్నాడు.॥97॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *నామధేయస్య యే కేచిదభివాదం న జానతే ।*
తాన్ ప్రాజ్ఞోఽహ మితి బ్రూయాత్ స్త్రియః సర్వాస్తథైవ చ॥ ప్రక్షిప్త శ్లోకసం. ***98[2.123]***

తాత్పర్యం:- ఒక వేళ-ఈ అభివాదం యొక్క అర్థం తెలియక తెల్లముఖం వేసి అజ్ఞానులై ఉంటే, వారు విప్రులైనప్పుడు ప్రాజ్ఞుడు కేవలం తన పేరు చెప్పి వందనం చేయాలి. పెద్దవారైన స్త్రీలకు కూడ ఇదే పద్ధతి పాటించాలి. పేరు మాత్రమే చెప్పి నమస్కరిస్తే సరిపోతుంది.॥98॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం ఈ కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తం.

1. ప్రసంగ వ్యతిరేకం

ఈ శ్లోకం ముందు వెనుకల గల ప్రసంగాలకు వ్యతిరేకంగా ఉంది. దీనివల్ల ఆ శ్లోకాలు భంగమయ్యాయి కూడా. 97వ శ్లోకంలో అభివాదన పద్ధతిని చెప్పటం ప్రారంభించి. 'అభివాదనం చేసేటప్పుడు నీ పేరు చెప్పు' అన్నాడు. 99వ శ్లోక్లంలో దీని తర్వాత చేయవలసింది చెబుతూ, 'మళ్లీ నీ పేరుచివర 'భోః' అనే పదం వాడు అన్నాడు. ఇలా 98వ శ్లోకంలో మొదలైన అభివాదన పద్ధతి 99లో పూర్తవుతుంది. ఈ శ్లోకం వల్ల ఆ క్రమం తప్పిపోయింది. ఈ శ్లోకంలోని విషయాల మధ్య అభివాదనాన్ని గురించి చెప్పవలసిన అవసరమే లేదు. ఇలా ప్రసంగవ్యతిరేకమైనందున ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

క. ఎవరికైతే నామోచ్చారణపూర్వకంగా అభివాదనానికి సమాధానం చెప్పటం రాదో వారు, తమ పేరు చెప్పకుండానే నమస్కరించండి అని ఈ శ్లోకంలో ఉంది. కానీ 2.101 (2.126)లో ఇటువంటివారు నమస్కారం చేయకూడదని ఆదేశించబడింది.

ఖ. ఈ శ్లోకంలో స్త్రీలందరూ పేర్లు చెప్పకుండానే నమస్కరించి వచ్చుననే కథనం ఉంది. కానీ, 2.191 (2.216)లో గురుపత్నులకు పూర్తి పద్ధతిగా పేరు చెప్పుకుంటూ నమస్కరించే విధానం ఉంది. ఈ రెండు పద్ధతులకూ వ్యతిరేకం కాబట్టి ఈ శ్లోకం ప్రక్షిప్తం.

99-104వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

భో శ్శబ్దం కీర్తయేదన్తే స్వస్య నామ్నోఽభివాదనే । మూలశ్లోక సం.**80**
నామ్నాం స్వరూపభావో హి భోభావ ఋషిభిః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**99[2.124]**

టీక:- 2.97వ శ్లోకంలోని విధి పూర్తయిన తరవాత, **అభివాదనే** = నమస్కరించడంలో, **స్వనామ్నః అన్తే** = తన పేరు చెప్పిన తరవాత, **భోః శబ్దం కీర్తయేత్** = భోః శబ్దం చేర్చాలి, **హి** = ఎందుకంటే, **ఋషిభిః** = ఋషులు, **భోభావః నామ్నాం స్వరూపభావః స్మృతః** = భోః శబ్దానికి నామస్వరూపద్యోతకమనే అర్థముంది.

తాత్పర్యం:- ఈ విధంగా వందనం చేసి, అభివాదం చేసేటప్పుడు, తన పేరు చివర 'భోః' అనే శబ్దం చేర్చి చెప్పాలి. ఇలా అనడం వల్ల అది నామ స్వరూపమని ఋషులచే చెప్పబడింది. ఉదాహరణకు '**అభివాదయే అహం దేవదత్తఃభోః**' అని ॥**99**॥

నమస్కారానికి ప్రతినమస్కార విధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆయుష్మాన్ భవ సౌమ్యేతి వాచ్యో విప్రోఽభివాదనే । మూలశ్లోక సం. **81**
అకారశ్చాస్య నామ్నోఽన్తే వాచ్యః పూర్వాక్షరః ప్లుతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **100[2.125]**

టీక:- **అభివాదనే** = అభివందనానికి జవాబిచ్చేప్పుడు, **విప్రః** = ద్విజుడికి, సౌమ్య, **"ఆయుష్మాన్ భవ" ఇతివాచ్యః** = ఓ సౌమ్యుడా ! "ఆయుష్మంతుడవుకమ్ము అని అనాలి, **చ** = మరియు, **అస్యనామ్నః+ అన్తే అకారః పూర్వాక్షరః ప్లుతః** = ప్లుత ధ్వనిలో ఉచ్చరించాలి. ఆయుష్మాన్ భవ దేవదత్త3, ఆయుష్మాన్ భవ దేవదత్త3" లేదా 'ఆయుష్మాన్ భవ సౌమ్య యజ్ఞదత్త3. ప్లుతమంటే మూడు మాత్రల సమయం.

తాత్పర్యం:- ఎవరైనా తనకు అభివాదం చేసినప్పుడు, ప్రత్యభివాదాన్ని ఆచరించేవారు **'ఆయుష్మాన్ భవ సౌమ్యా'** అని దీవించాలి. తనకు అభివాదం చేసేవారి పేరు చివర ఆకారాంతం (ఉదా: మిత్రవింద) ఉంటే విసర్గ (ప్లుతం) చేర్చాలి. **"ఆయుష్మాన్ భవ మిత్రవిందః3"** అనాలి. వైశ్య క్షత్రియులకు ప్రత్యభివాదం విప్రుడు చెప్పినప్పుడు పట్టింపులేదు.॥100॥

నమస్కారానికి జవాబివ్వనివాడికి నమస్కారం చేయరాదు- ఇది మనుకృతం-ప్రామాణికం

యో న వేత్త్యభివాదస్య విప్రః ప్రత్యభివాదనమ్ । మూలశ్లోక సం. **82**
నాభివాద్య స్స విదుషా యథా శూద్రస్తథైవ సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **101[2.126]**

టీక:- **యః విప్రః** = ఏ ద్విజుడు, **అభివాదస్య ప్రత్యభివాదనం** = అభివందనానికి బదులుగా ప్రత్యభివందనం చేయడో, **విధుషా సః న +అభివాద్యః** = అతడికి బుద్ధిమంతుడైనవాడెవ్వడూ నమస్కరించరాదు; ఎందుకంటే, **సః యథా శూద్రః తథా+ఏవ** = అతడు శూద్రుడితో సమానం.

తాత్పర్యం:- ప్రత్యభివందనం ఎలా చెయ్యాలో ఏ బ్రాహ్మణుడెరుగడో అలాంటివారికి విద్వాంసుడైనా/ పండితుడైనా విధి విహితంగా అభివాదాన్ని చేయకూడదు. అలాంటివాడు శూద్రుడితో సమానుడు. ॥101॥

వర్ణానుసారంగా కుశల ప్రశ్న విధి- ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మణం కుశలం పృచ్ఛేత్ క్షత్రబంధుమనామయమ్ । మూలశ్లోక సం. **83**
వైశ్యం క్షేమం సమాగమ్య శూద్రమారోగ్యమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102[2.127]**

టీక:- కలిసినప్పుడు-నమస్కారానంతరం, **బ్రాహ్మణం కుశలం పృచ్ఛేత్** = బ్రాహ్మణుడితో 'కుశలంగా ఉన్నారా? ప్రసన్నంగా ఉన్నారా? వేదాధ్యయనాదులు నిర్విఘ్నంగా సాగుతున్నాయా !' అని అడగాలి. **క్షత్రబన్ధుమ్ అనామయమ్** = క్షత్రియుడు బలవంతుడు కాబట్టి, స్వాస్థ్యమును గురించి 'ఆరోగ్యంగా ఉన్నారా !' అని అడగాలి. **వైశ్యం క్షేమం** = వైశ్యుడితో 'మీరు క్షేమంగా ఉన్నారా' అని, **శూద్రం + ఆరోగ్యవ్+ఏవ** = 'ఆరోగ్యంగా ఉన్నారా!' అని శూద్రుణ్ణి, **పృచ్ఛేత్** = అడగాలి. అభిప్రాయమేమంటే వర్ణానుసారంగా వాళ్ళవాళ్ళ ముఖ్యమైన ఉద్దేశసాధక వ్యవహారాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయా ! అని పరామర్శించడమే ప్రధానం.

తాత్పర్యం:- బ్రాహ్మణుడు కనిపించినపుడు కుశలమా? అని, క్షత్రియుడిని ఆరోగ్యంగా ఉన్నారా? అని వైశ్యుణ్ణి క్షేమమా? అని, శూద్రుణ్ణి బాగున్నావా? అని పలకరించాలి.॥102॥

దీక్షితుడి నామోచ్చారణ నిషేధం- ఇది మనుకృతం-ప్రామాణికం

అవాచ్యో దీక్షితో నామ్నా యవీయానపి యో భవేత్ । మూలశ్లోక సం. **84**
భోభవత్పూర్వకం త్వేనమభిభాషేత ధర్మవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **103[2.128]**

టీక:- దీక్షితః = ఉపనయనదీక్ష తీసికొన్న దీక్షితుడు, యః యవీయాన్+అపి భవేత్ = అతడుచిన్నవాడైనా, అతడిని, నామ్నా అవాచ్యః = పేరెత్తి పిలువరాదు, ధర్మవిత్ = ధర్మమెరిగినవాడు, ఏనం 'భో', 'భవత్' + పూర్వకం అభిభాషేత = 'భోః', 'భవత్' లాంటి ఆదరబోధక శబ్దాలతో సంబోధించాలి.

తాత్పర్యం:- విద్యాదీక్షలో, యాగదీక్షలో ఉన్నవారు చిన్నవారైనా సరే అలాంటివారిని పేరుతో పిలువకూడదు. భోః, భవాన్ శబ్దాలు ఉపయోగించాలని అర్థం. ॥103॥

పరస్త్రీ నామోచ్చారణ నిషేధం- ఇది మనుకృతం-ప్రామాణికం

పరపత్నీ తు యా స్త్రీ స్యాదసంబన్ధా చ యోనితః । మూలశ్లోక సం. **85**
తాం బ్రూయాద్భవతీత్యేవం సుభగే భగినీతి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104[2.129]**

టీక:- **యా పరపత్నీతు చ యోనితః అసంబన్ధా స్త్రీ, స్యాత్** = ఎవరైనా ఇతరుల పత్నితో గానీ, తల్లిగర్భానికి సంబంధించనివారితో గానీ, **తాం** = ఆమెను, **"భవతి, సుభగే, భగినీ ఇతి ఏవం బ్రూయాత్, భవతి** = తమరు, **సుభగే** = సౌభాగ్యవతి, **భగినీ** = అక్కా-చెల్లెలా, ఇలాంటిమాటలతో సంబోధించి మాట్లాడాలి.

తాత్పర్యం:- తన సోదరివర్గంలో చేరని ఇతర స్త్రీలను కూడా సుభగే, అనీ, భగినీ అనీ పిలవాలి. ఈ మాటలకు ఓ అమ్మాయీ ! అని, ఓ అక్కా అని అర్థం ! అంటే పరస్త్రీలను సోదరీ సమానురాలిగా భావించి మన్నన చేయాలని శాస్త్రం. ॥104॥

105-110వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*పరివార సంబంధీకులకు అభివాదనం-

* *మాతులాంశ్చ పితృవ్యాంశ్చ శ్వశురానృత్విజో గురూన్ ।*
అసావహమితి బ్రూయాత్ ప్రత్యుత్థాయ యవీయసః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***105[2.130]***

తాత్పర్యం:- మేనమామలు, పినతండ్రులు, పిల్లనిచ్చిన మామ, ఋత్విజులు, గురువులు వస్తే- వారు తనకంటే చిన్నవాడైనను చెప్పి లేచి నమస్కరించి గౌరవించాలి.॥105॥

* *మాతృష్వసా మాతులానీ శ్వశ్రూరథ పితృష్వసా ।*
సంపూజ్యా గురుపత్నీవత్ సమాస్తా గురుభార్యయా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***106 [2.131]***

తాత్పర్యం:- తన తల్లికి సోదరి (పెద్దమ్మ, చిన్నమ్మ), మేనమామకు భార్య (అత్త), మేనత్త, అత్తగారు...వీరు గురుపత్నులతో సమానులు. వీరిని ఆహ్వానించేటప్పుడు అభివాదం చెయ్యవలసిందని శాస్త్రం.॥106॥

* *భ్రాతుర్భార్యోపసంగ్రాహ్యా సవర్ణా-హన్యహన్యపి ।*
విప్రోష్య తూపసంగ్రాహ్యా జ్ఞాతిసంబంధియోషితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***107[2.132]***

తాత్పర్యం:- అన్నగారి భార్యకు ప్రతిరోజు పాదాభివందనం ఆచరించాలి. తండ్రివైపువారు, పినతండ్రివైపు వారు, మేనమామలు, మామభార్య మొదలైన పెద్దవారు గ్రామం నుండో దూరదేశం నుండో వచ్చినప్పుడు వారికి ప్రతిరోజూ పాదాభివందనం చేయనవసరంలేదు. 'నమస్తే' చేస్తే చాలు.॥107॥

*** నాగరికులతో మైత్రీ వ్యవహారం-**

* *పితుర్భగిన్యాం మాతుశ్చ జ్యాయస్యాం చ స్వసర్యపి ।*
మాతృవద్వృత్తిమాతిష్ఠేన్మాతా తాభ్యో గరీయసీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**108 [2.133]**

తాత్పర్యం:- తండ్రికి సోదరీమణులైన మేనత్తలను, తల్లిసోదరీమణులైన పెదమ్మ- చిన్నమ్మలను, వారి కూతుళ్ళను ఈ అందరికి తల్లికి ఎంత గౌరవం ఇస్తున్నారో అంత గౌరవం ఇవ్వాలి. అందరికంటే తల్లి అత్యంత పూజ్యురాలు అని వేరుగా చెప్పనక్కర్లేదు.॥108॥

***బాల బ్రాహ్మణుడు కూడా వృద్ధ క్షత్రియులకు తండ్రిలాంటివాడు-**

* *దశాబ్దాఖ్యం పౌరసఖ్యం పంచాబ్దాఖ్యం కలాభృతామ్ ।*
త్ర్యబ్దపూర్వం శ్రోత్రియాణాం స్వల్పేనాపి స్వయోనిషు ॥ ప్ర.స.సం.**109 [2.134]**

తాత్పర్యం:- ఒక ఊరిలోనే ఉన్నప్పుడు, తనకంటే పదేళ్లు పెద్దవారైనప్పటికీ వారితో స్నేహం చేయవచ్చు. అలాగే సంగీత-నృత్యాది కళలలో ప్రజ్ఞగలవారితో కూడ మైత్రి నెఱపవచ్చు! వేదాధ్యాయనపరుడు తనకంటె మూడేళ్లు పెద్దవాడైనా, జ్ఞాతులు తనకంటె పెద్ద అయినా స్నేహం అవశ్యం చేయాలి.॥109॥

* *బ్రాహ్మణం దశవర్షం తు శతవర్షం తు భూమిపమ్ ।*
పితాపుత్రౌ విజానీయాద్బ్రాహ్మణస్తు తయోః పితా ॥ ప్ర.స.సం.**110[2.135]**

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి పదేళ్లుండి క్షత్రియుడికి వందేళ్ళున్నా వారి సంబంధం తండ్రీ కొడుకుల బంధం వంటిది. ఆ బ్రాహ్మణుడికి ఆ క్షత్రియుడు పుత్రుడే అవుతాడు. ఇక్కడ వయస్సుకంటే వేదాధ్యయనాది సత్కర్మలాచరించుటవలన బ్రాహ్మణుడు ఎవరికైనా పితృసమానుడే.॥110॥

ప్రక్షిప్తాల పరిశీలన

105 నుంచి 110 వరకు ఉన్న శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలని నిరూపించబడ్డాయి-

1. విషయ వ్యతిరేకం

105 నుంచి 109 శ్లోకాలు విషయ వ్యతిరేకాలుగా ఉన్నాయి. రెండవ అధ్యాయంలోని ముఖ్య విషయం బ్రహ్మచర్యాశ్రమం [2.44 (2.69), 3.1,2); 2.43,44 (2.68,69]. ఆరంభ శ్లోకాలలో స్పష్టంగా, గురువుదగ్గరుండే బ్రహ్మచారి కర్తవ్యాలను సంకేతించాడు. విషయం ముగింపును సంకేతించే శ్లోకంలోనూ 2.139 (2.164) - **"అనేన క్రమయోగేన.... గురౌ వసన్ సంచినుయాత్ బ్రహ్మాధిగమికం తపః"** అన్నాడు. అంటే- ఈ పైన చెప్పిన విధులననుసరించి బ్రహ్మచారి గురువు వద్ద ఉంటూ, వేదజ్ఞాన వృద్ధి కొరకు తపస్సు చేయాలి- అని. అంతేకాకుండా, 2.83 (108), 150(175), 169-178(194-203), 194(219), 216-219(241-244) మొదలైన శ్లోకాల వల్ల కూడా, ఈ అధ్యాయంలో కేవలం గురుకులంలో ఉండే బ్రహ్మచారుల కర్తవ్యాలే చెప్పారన్నది స్పష్టమవుతుంది. కానీ ఈ శ్లోకాలలో చెప్పిన కర్తవ్యాలు గురుకులంలోని బ్రహ్మచారులకు కాక, గృహస్థులవి అయ్యాయి. గురుకులంలో బ్రహ్మచారులకు

మామ, బాబాయి, ఋత్విజులు, మేనత్త మొదలైనవారెవరూ ఉండరు. బ్రహ్మచారికి అత్తమామలూ ఉండరు. గురుకులంలో ఉంటున్న బ్రహ్మచారి రోజూ అన్నభార్యకు ఎలా నమస్కరించగలుగుతాడు? ఇలా విషయవ్యతిరేకం కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు. ఇక్కడ ఇది అర్థవాదం కాదనీ, విధి వాక్యమనీ గ్రహించవలసిన అవసరం ఉంది. అర్థవాదంతో చెప్పిన విషయాలు సంబంధాలూ, విషయ సమ్మతాలూ అవుతాయి.

2. అంతర్ వ్యతిరేకం

క. 2.111-112(2.136-137) శ్లోకాలలో గుణాల ఆధిక్యం ఆధారంగా పెద్దలుగా భావించారు. ఇలాగే 2.125-131(2.150-156) శ్లోకాలలో చెప్పినవి కూడా గుణాలు ఆధారంగానే మనువు పెద్దలని పరిగణించాడని తెలుస్తోంది. 110వ శ్లోకంలో జన్మ ఆధారంగా బ్రాహ్మణుణ్ని పెద్దవాడనటం మనువు చెప్పిన సంప్రదాయానికి వ్యతిరేకం.

ఖ. మనువు కర్మల చేతనే వర్ణ వ్యవస్థను భావించాడు. కర్మల గొప్పతనం వల్లనే బ్రాహ్మనులను అన్ని వర్ణాలలోనూ శ్రేష్ఠులని చెప్పాడు. 110వ శ్లోకంలో పదేళ్ల బాలుడిని క్షత్రియునికి తండ్రితో సమానమని చెప్పటం కూడా, జన్మ ఆధారంగానే వర్ణ వ్యవస్థ అనేది. అందుచేత ఇది మనువుకు వ్యతిరేకం. (దీని విస్తృత సమీక్ష 1.92 మరియు 107 శ్లోకాలది చూడండి)

3. శైలీగత ఆధారం

110వ శ్లోకపు శైలి అతిశయోక్తులతో నిండినది, పక్షపాతంతో ఉన్నది. మనువుశైలిలో ఈ పొరపాట్లు లేవు. ఈ ఆధారంతో ఇది ప్రక్షిప్తం.

111 నుండి 119వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

సన్మానానికి అర్హతలు-

విత్తం బన్ధుర్వయః కర్మ విద్యా భవతి పంచమీ । మూలశ్లోక సం.**86**
ఏతాని మాన్యస్థానాని గరీయో యద్యదుత్తరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**111[2.136]**

టీక:- విత్తం బన్ధుః వయః కర్మ విద్యాభవతి పంచమీ = ఒకటి ధనం, రెండోది బంధుత్వం, మూడోది వయస్సు, నాలుగోది ఉత్తమకర్మ, ఐదోది ఉత్తమవిద్య, **ఏతాని మాన్యస్థానాని** = ఈ ఐదు పూజింపదగినవి. కాని, **యత్‌యత్ +ఉత్తరమ్ గరీయః** = ఏవి ఏవి తరువాత తరువాత ఉన్నవో అవి ముందువాటి కంటే ఉత్తమములు. అంటే ధనం కంటే గొప్ప బంధువు, బంధువుకంటే గొప్ప వయస్సు, వయస్సుకంటే శ్రేష్ఠం కర్మ, కర్మకంటే పవిత్రం విద్య.

తాత్పర్యం:- ఒకర్ని పూజించడానికి అర్హమైనవిగా భావించవలసి ఉన్న వాటిలో ధనం, చుట్టరికం, వయస్సు, కర్మ-అనుష్ఠానాది ఆచారాలు, విద్య. ఇవి అయిదు వరుస క్రమం ప్రకారం దేనికంటే ఏది ఎక్కువ ప్రాధాన్యత గలదో చెప్పాలంటే-ధనం కంటే బంధువూ, బంధువు కంటే వయస్సూ, వయస్సు కంటే కర్మ- అనుష్ఠానమూ, అనుష్ఠానం కంటే విద్య. ॥111॥

ఋషి దయానందభాష్యం:- 1. ధనం, 2. బంధుత్వం-కుటుంబం-కులం, 3.వయస్సు, 4. ఉత్తమకర్మలు, 5. శ్రేష్ఠవిద్య, ఈ ఐదు గౌరవస్థానాలు. ఇందులో ధనంకంటే బంధుత్వం దానికంటే వయస్సు, దానికంటే శ్రేష్ఠకర్మ, దానికంటే పవిత్ర విద్య శ్రేష్ఠము. ఇలా ఒకదానికంటే మరొకటి అధికంగా మాననీయం. (స.ప్ర.ద.స.)

వివరణ: విశిష్ట విద్వాంసుడు సర్వాధికమాన్యుడు

లౌకిక, వైదిక క్షేత్రాలు ఈ రెండింటిలో విశిష్ట విద్వాంసుడు సర్వాధిక సమ్మాన్యుడు. ఇతర ప్రమాణాలను బట్టి ఈ విషయం స్పష్టమవుతుంది.

"యథా జానపదీషు విద్యాతః పురుషవిశేషో భవతి ।
పారోవర్యవిత్సు తు ఖలు వేదితృషు భూయోవిద్యః ప్రశస్తో భవతి" (నిరుక్తం. 1.19)

ప్రపంచంలో అధిక విద్యావంతుడు అందరికంటే విశిష్టుడుగా గౌరవింపబడతాడు. అదేవిధంగా వేదవిద్యావేత్తలలో కూడా, అధికంగా వేదవిద్యలు తెలిసినవాడే మాన్యుడు. గొప్పవాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

పంచానాం త్రిషు వర్ణేషు భూయాంసి గుణవంతి చ । మూలశ్లోక సం.**87**
యత్ర స్యుస్సోఽత్ర మానార్హః శూద్రోఽపి దశమీం గతః॥ ప్రక్షిప్తశ్లోక సం.**112[2.137]**

టీక:- **త్రిషు వర్ణేషు** = మూడువర్ణాలలో అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో పరస్పరం, **పంచానాం యత్ర భూయాంసి గుణవన్తి స్యుః** = 111వ శ్లోకంలో చెప్పిన ఐదు గుణాలలో ఉత్తరోత్తరస్థానంలో ఉన్న అధిక గుణాలు ఎవరియందు ఉంటాయో, **యత్ర సః మానార్హః** = సమాజంలో అతడు తక్కువ గుణాలు గలవారిలో సన్మానించ తగినవాడు, **దశమీం గతః శూద్రః +అపి** = దశమీ అవస్థలో ఉన్న శూద్రుడు కూడా సన్మానానికి యోగ్యుడు (90 సం॥లు దాటిన వాడిని దశమిలో ఉన్నవాడని పిలుస్తారు).

తాత్పర్యం:- బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో ఈ ఐదు గుణాలూ ఉన్నవారు 'గుణాధికులు' అనబడతారు. వీరు అందరికంటే ఎక్కువగా మన్నించదగినవారు. వయస్సుకంటే ధనం-బంధువర్గం అధికంగా గలవారు పూజ్యుడు. ఈ మూడు కలిగి ఉన్నవాడు కర్మిష్ఠి కంటే గౌరవించదగినవాడు. ఈ మూడింటితో పాటు కర్మిష్ఠి కూడా అయితే విద్వాంసుడి కంటే మాన్యుడు.॥112॥

ఎవరు ఎవరికి దారి ఇవ్వాలి?- ఇది మనుకృతం-ప్రామాణికం

చక్రిణో దశమీస్థస్య రోగిణో భారిణః స్త్రియః । మూలశ్లోక సం.**88**
స్నాతకస్య చ రాజ్ఞశ్చ పంథా దేయో వరస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**113[2.138]**

టీక:- **చక్రిణః** = రథం, శకటం (వాహనం) మొ॥ వాటి మీద కూర్చొనిపోయేవారికి, **దశమీస్థస్య** = దశమీ అవస్థలో ఉన్నవారికి (90 సం. దాటిన వృద్ధులకు), అనగా తనకంటే పెద్దమనసుగలవారికి **రోగిణః** = రోగార్తులకు, **భారిణః** = బరువుమోసేవారికి, **స్త్రియః** = స్త్రీలకు, **స్నాతకస్య** = స్నాతకులకు, **రాజ్ఞః** = రాజుకు, **చ** = అలాగే, **వరస్య** = పెండ్లికొడుకుకు, **పంథా దేయః** = మొదట దారి ఇవ్వాలి.

తాత్పర్యం:- తొంభయ్యేళ్ల ముసలికి, లేదా పెద్దవయసు గలవారికి, రోగికి, బరువు మోసేవారికి, స్త్రీకి, వరుడికి, స్నాతక వ్రతుడికి, బండిఎక్కి వెళ్తున్నవాడికి, రాజుకు ఎదురుగా నడిచిపోరాదు. అంటే....గౌరవ మర్యాదల ప్రకారం-దారిలో ఈ విధంగా ఎదురైనవారికి అడ్డం తొలగి దారి ఇవ్వాలని శాస్త్రం.॥113॥

రాజుకంటే స్నాతకుడే అధికమాన్యుడు- ఇది మనుకృతం-ప్రామాణికం

తేషాం తు సమవేతానాం మాన్యౌ స్నాతకపార్థివౌ । మూలశ్లోక సం.**89**
రాజస్నాతకయోశ్చైవ స్నాతకో నృపమానభాక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**114[2.139]**

టీక:- తేషాం తు = పైన శ్లోకంలో పేర్కొన్న వారందరూ, **సమవేతానాం** = ఒకచోట చేరినప్పుడు, **స్నాతకపార్థివౌ** = స్నాతకుడు, పార్థివులలో, రాజు గౌరవనీయుడు. **చ** = మరియు, **రాజస్నాతకయోః** = పృథివీపతి-స్నాతకులలో కూడా, **స్నాతకః** = స్నాతకుడే, **నృపమానభాక్** = రాజు ద్వారా సన్మానింపబడును. అంటే స్నాతకుడైన విద్వాంసుడు అందరికంటే అధిక సన్మాన యోగ్యుడు.

తాత్పర్యం:- పై శ్లోకంలో చెప్పబడినవారు ఒకచోట కూడినప్పుడు స్నాతకుణ్ణి రాజును గౌరవించాలి. రాజు, స్నాతకుడు వీరిద్దరు ఒకచోట చేరినపుడు రాజు స్నాతకుణ్ణి సమ్మానించాలి. అంటే స్నాతకుడైన విద్వాంసుడు అందరికంటే అధిక సన్మానయోగ్యుడు.॥114॥

ఆచార్యుని లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపనీయ తు యశ్శిష్యం వేదమధ్యాపయేద్ద్విజః । మూలశ్లోక సం.**90**
సకల్పం సరహస్యం చ తమాచార్యం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**115[2.140]**

టీక:- యఃఉపనీయః తు = ఎవడు యజ్ఞోపవీత సంస్కారం చేయించి, **సకల్పం సరహస్యం** = ఎవడైతే వేదాంత సహితంగా, **శిష్యం వేదమ్ + అధ్యాపయేత్** = శిష్యుణ్ణి వేదం చదివిస్తాడో, **తం ఆచార్యం ప్రచక్షతే** = ఆయన్ను 'ఆచార్య'డంటారు.

తాత్పర్యం:- శిష్యుడికి ఉపనయనం జరిపి, వేదాలు-కల్పసూత్రాలు-ఉపనిషత్తులతో సహా ఎవడైతే నేర్పుతాడో అతడు 'ఆచార్య'డనబడతాడు.॥115॥

ఋషి దయానందభాష్యం:- బ్రాహ్మణుడుగాని, క్షత్రియుడుగాని, వైశ్యుడుగాని తన శిష్యులకు యజ్ఞోపవీతాది ధార్మిక క్రియలు చేసిన తరువాత వేదాన్ని అర్థయుతంగా చదివించునప్పుడు అతడు **'ఆచార్య'**డనబడతాడు (ద.ల.శి.).

వివరణ:

కల్పమంటే ఏమిటి? కల్పమంటే ఇక్కడ గ్రంథం కాదు వేదోక్తయజ్ఞాలు, ధర్మక్రియాదులను తెలియజేసే విద్య. రహస్య శబ్దం మహత్త్వపూర్ణమైనది. వేదాలలో నిహితమైన గంభీర విద్యలను ఊహ ద్వారా, వ్యాఖ్యానం ద్వారా తెలుపుట అని అర్థం. **'వేదోఽఖిలో ధర్మమూలమ్'**, [1.125(2.6)] **'సర్వం వేదాత్ ప్రసిద్ధ్యతి'** (12.97) మొదలగు శ్లోకాల రహస్యార్థాలను ప్రకటించే వ్యాఖ్యాన శైలినే 'రహస్య' మంటారు. మనువు మొదలగు ఋషుల అభిప్రాయమిదే.

ఉపాధ్యాయుడి లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకదేశం తు వేదస్య వేదాఙ్గాన్యపి వా పునః । మూలశ్లోక సం.**91**
యోఽధ్యాపయతి వృత్త్యర్థముపాధ్యాయస్స ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**116[2.141]**

టీక:- యః = ఎవడు, **వృత్తి+అర్థం** = జీవనార్థం, **వేదస్య ఏకదేశం** = వేదంలోని ఏదైనా ఒక భాగాన్ని, **అపి వా పునః వేదాంగాని** = లేదా, వేదాంగాలను గాని, శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందశ్శాస్త్రం మరియు జ్యోతిష విద్యలను, **అధ్యాపయతి**= చదివిస్తాడో, **సః ఉపాధ్యాయః ఉచ్యతే** = అతడు ఉపాధ్యాయుడని పిలువబడతాడు.

తాత్పర్యం:- జీవనం సాగించడానికి అనువైన పాండిత్యం వేదంలో కొంతభాగం గాని, లేదా వేదాంగాది వ్యాకరణాది అంశాలుగాని నేర్పువాడు ఉపాధ్యాయుడని పిలువబడతాడు.॥116॥

వివరణ:-వేదాంగాలంటే ఆ యా విద్యావిశేషాలని గ్రహించాలి. అంతేకాని వేరే గ్రంథాలు కావు.

తండ్రే గురువు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

నిషేకాదీని కర్మాణి యః కరోతి యథావిధి । మూలశ్లోక సం.**92**
సంభావయతి చాన్నేన స విప్రో గురురుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**117[2.142]**

టీక:- **యః యథావిధి** = ఎవరు విధి, శాస్త్రం ననుసరించి, **నిషేకాదీని కార్యాణి కరోతి** = గర్భాధానం మొ॥ సంస్కారాలను చేస్తారో, **చ** = మరియు, **అన్నేన సంభావయతి** = అన్నాది భోజ్య పదార్థాల ద్వారా బాలకుడి పాలన, పోషణ చేస్తాడో, **సః విప్రః** = అలాంటి విద్వాంసుడైన ద్విజుడు, **గురుః+ఉచ్యతే** = గురువని చెప్పబడతాడు. కని, పెంచి, పెద్దచేసి భోజనాదుల ద్వారా పాలన, పోషణ చేస్తాడో, అలాంటి తండ్రిని కూడా గురువు అంటారు.

తాత్పర్యం:- ఎవరు శాస్త్రం ననుసరించి గర్భాధానం జీవోత్పత్తి క్రియలను చేసి, అన్నం పెట్టి పోషించడం లాంటి సత్కార్యాలు చేసాడో వాడు 'గురువు' నబడతాడు. ॥117॥

ఋషి దయానందభాష్యం:- నిషేకం-అంటే ఋతు ప్రదానం. ఇది ప్రథమ సంస్కారం, తండ్రి నిషేకం చేస్తాడు. వీర్యదానం చేసి పెంచిపోషించే తండ్రిని గురువంటారు. అందువల్ల తండ్రే ముఖ్య గురువు. (ద.ల.ఆ)

ఋత్విజుని లక్షణం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అగ్న్యాధేయం పాకయజ్ఞానగ్నిష్టోమాదికాన్ మఖాన్ । మూలశ్లోక సం.**93**
యః కరోతి వృతో యస్య స తస్యర్త్విగిహోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**118[2.143]**

టీక:- **యః వృతః** = ఎవరిద్వారానైనా వరింపబడిన బ్రాహ్మణుడు, **తస్య** = ఆ వరించువాడి, **అగ్న్యాధేయం** = అగ్ని హోత్రం, **పాకయజ్ఞాన్** = బలివైశ్వదేవం మొ॥వి., అలాగే పూర్ణిమాది విశేష సమయాలలో చేయబడే యజ్ఞాలను, **అగ్నిష్టోమ+ఆదికాన్ మఖాన్** = అగ్నిష్టోమం మొ॥ బృహద్యజ్ఞాలను చేస్తాడో, **సః తస్య ఋత్విక్ ఉచ్యతే** = అతడు ఆ యా యజ్ఞాలను చేయించడానికి పూసుకున్న యజమానికి 'ఋత్వికు'డవుతాడు.

తాత్పర్యం:- అగ్న్యాధేయం, అష్టకాది పాకయజ్ఞాలు, అగ్నిష్టోమాది యాగాలు ఎవరు ఇతరుల ఇష్టానుసారంగా చేయిస్తారో వారిని **'ఋత్విక్'** అంటారు. గురువు, ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, ఋత్వికుణ్ణి ఒకే గాట కట్టరాదు. ఎవరి విధులు వారికున్నాయి. 118

వివరణ:

'ఋత్విక్' కావడానికి ఎవడు అధికారి? అతడు ఎలా ఉండాలి? ఈ విషయాన్ని గురించి మహర్షి దయానందులవారు ఈ విధంగా రాశారు. ఋత్విజుల లక్షణం-'ఉత్తమ విద్వాంసుడు, ధర్మానుయాయి, జితేంద్రియుడు యజ్ఞకర్మ చేయడంలో, నిపుణుడు, నిర్లోభి, పరోపకారి, దుర్వ్యసనాలు లేనివాడు, సుశీలుడు, వైదిక సిద్ధాంత ప్రేమి, వేదజ్ఞుడు, ఇలాంటి గుణాలు ఉన్నవారిలో ఒకరిని గాని, ఇద్దరిని గాని, ముగ్గురిన్ని గాని, లేదా నలుగురిని గాని ఎన్నుకోవాలి (సం.వి. సామాన్యప్రకరణం).

ఆచార్యుడి గొప్పతనము- **ఇది మనుకృతం-ప్రామాణికం**

య ఆవృణోత్యవితథం బ్రహ్మణా శ్రవణావుభౌ । మూలశ్లోక సం.**94**
స మాతా స పితా జ్ఞేయస్తం న ద్రుహ్యేత్కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.**119[2.144]**

టీక:- **యః బ్రహ్మణా** = ఏ గురువు లేదా ఆచార్యుడు, వేదజ్ఞానం ద్వారా, **ఉభౌ శ్రవణౌ అవితథం ఆవృణోత్** = కర్ణ ద్వయాన్ని చక్కగా పరిపూర్ణం చేస్తాడో, వినిపిస్తాడో, చదివిస్తాడో, **సః మాతా సః పితా జ్ఞేయః**= అతడిని తల్లిగాను,

తండ్రిగాను గుర్తించాలి. **తం కదాచన ద్రుహ్యేత్ =** అతడికి ఎప్పుడూ ద్రోహం చేయరాదు. అంటే ఈర్ష్య చూపరాదు, అవమానం చేయరాదు.

తాత్పర్యం:- వర్ణ స్వర స్వరూపం, సత్యం అయిన వేదాలను ఎవరు తన రెండు చెవులకు అమృతోపమానంగా ఉపదేశిస్తారో వారే తల్లి-తండ్రులు. వారికి ఎన్నడూ ద్రోహం చేయరాదు.

వివరణ:

నిరుక్తశాస్త్రంలో మహర్షి యాస్కాచార్యులు ఏదో ఒక ప్రాచీన గ్రంథం నుండి ఉదాహరించిన శ్లోకానికి మనుమహర్షి శ్లోకం లోని భావాలకు, శబ్దాలకు సామ్యత కనిపిస్తుంది. ॥119॥

"య అవృణోత్యవితథేన కర్ణౌ అదుఃఖం కుర్వన్నమృతం సంప్రయచ్ఛన్
తం మన్యేత పితరం మాతరం చ తస్మై న దృహ్యేత్ కతమచ్చనాహ"॥(నిరుక్తం. 2. 1. 4)

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

*** ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, పితరుల తులన-**

* ***ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా ।***
సహస్రం తు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే ॥ *ప్ర. స. సం.* ***120 [2.145]***

తాత్పర్యం:- పదిమంది ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు, వందమంది ఆచార్యులకంటే ఒక తండ్రి, వెయ్యిమంది తండ్రులకంటే ఒక తల్లి గౌరవించదగినవారిలో అధికులు అని చెప్పబడింది.॥120॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం ప్రక్షిప్తం-

1. ప్రసంగవ్యతిరేకం

ఇది పూర్వాపర ప్రసంగ వ్యతిరేకంగా ఉంది. ఇది ముందు వెనుకల ఉన్న ప్రసంగాల క్రమాన్ని భంగపరచింది. ముందరి శ్లోకంలో గురుకులంలో ఉన్నప్పుడు బ్రహ్మచారి తల్లిదండ్రులెవరు? అని చెప్పి, తర్వాతి శ్లోకంలో జన్మనిచ్చిన తండ్రికీ, ఆచర్యరూపమైన తండ్రికీ పోలిక చూపారు. ఆ క్రమాన్ని భంగం చేస్తూ ఇందులో ఉపాధ్యాయుడు మొదలైనవారిని గురించి చెప్పటం అసంగతం. కనుక ఇది ప్రసంగవ్యతిరేకం.

2. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులే గొప్పవారన్నాడు. కానీ తర్వాతి 121-123 (146-148) శ్లోకాలలో కారణాలు చెబుతూ బ్రహ్మజన్మను ఇచ్చే ఆచార్యుణ్ని తల్లిదండ్రుల కన్నా ఎక్కువ అనీ, తల్లిదండ్రుల గౌణతకు కారణాన్ని కూడా చెప్పాడు. ఇక్కడి విషయం గురుకులం కనుక, గురువు గొప్పవాడనటం ప్రసంగానికి అనుకూలం. ఈ వ్యతిరేకత ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

3. శైలీగత వ్యతిరేకం

ఈ శ్లోకంలోని తులవాత్మక శైలి నిరాధారమైన అతిశయోక్తితో నిండినది. ఇందులో చెప్పిన పరస్పరపు గొప్పతనాల తేడాకు కారణమేదీ చూపలేదు, సహేతుకమైన ఆధారమూ లేదు. కనుక శైలీ వ్యతిరేకమనే ఆధారంతో ఈ శ్లోకం ప్రక్షిప్తం.

121-143వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

తండ్రి కంటే వేదజ్ఞాన ప్రదాత అయిన ఆచార్యుడు గొప్పవాడు.

ఉత్పాదకబ్రహ్మదాత్రోర్గరీయాన్ బ్రహ్మదః పితా । మూలశ్లోక సం.**95**
బ్రహ్మ జన్మ హి విప్రస్య ప్రేత్య చేహ చ శాశ్వతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**121[2.146]**

టీక:- ఉత్పాదక+బ్రహ్మదాత్రోః = కన్నతండ్రి, విద్య-వేదజ్ఞానాన్నిచ్చిన ఆచార్యుడు- వీరిద్దరిలో, బ్రహ్మదః పితా గరీయాన్ = వేదజ్ఞాన మొసగిన ఆచార్యుడనే తండ్రే అధికమాననీయుడు, హి = ఎందువల్లనంటే, విప్రస్య= ద్విజుడికి, బ్రహ్మజన్మ = శరీరజన్మకంటే బ్రహ్మ జన్మనే అంటే, ఉపనయన సంస్కారంలో దీక్షనిచ్చి, వేదాధ్యాపనం, ఈశ్వరజ్ఞానాన్ని బోధించడం, ఇహ చ ప్రేత్య చ శాశ్వతమ్ = ఈ జన్మలోనూ, పరజన్మలోనూ స్థిరంగా ఉంచుతుంది. అంటే శరీరమైతే ఈ జన్మలోనే నష్టమైపోతుంది. కానీ యోగం, బ్రహ్మవిద్యా సంస్కారం, ముక్తి ప్రాప్తి, మోక్షం వరకు తోడుగా ఉంటాయి.

తాత్పర్యం:- విప్రుడికి వేదగ్రహణార్థమై ఉపనయనరూపమైన రెండో జన్మను ఇచ్చే ఆచార్యుడూ తండ్రికంటే శ్రేష్ఠుడు. బ్రహ్మగ్రహణార్థమైన జన్మం బ్రహ్మప్రాప్తి ఫలమైనందువల్ల ఇహపరములందు రెంటియందును నిత్యమైనది.॥121॥

వివరణ: బ్రహ్మజన్మ అంటే ఏమిటి? ఆచార్యుడు ఉపనయన సంస్కారం ద్వారా వేదాధ్యయనం,ఈశ్వర జ్ఞానాన్ని కలిగించి ఒక జన్మను ప్రసాదిస్తాడు. దానికే ఈ శ్లోకంలో 'బ్రహ్మజన్మ' అని పేరు పెట్టారు. శాశ్వత సుఖదాయకమైనది ఈ జన్మ. అంటే ముక్తి పర్యంతం ఈ జన్మలో, పరజన్మలో సుఖప్రదాయియైన అనుష్ఠానం వేదాధారితమే గదా! ఉదాహరణకు-ఒక వేదమంత్రాన్ని చూడగలరు. ఇది మనుస్మృతికి అనుకూలమైనది.

"ఆచార్య ఉపనయమానో బ్రహ్మచారిణం కృణుతే గర్భమన్తః ।
తం రాత్రీస్తిస్ర ఉదరే బిభర్తి తం జాతం ద్రష్టుమభిసంయన్తి దేవాః" ॥ (అథర్వ. 11.5.1)

ప్రతిజ్ఞాపూర్వకంగా ఆచార్యుడు బ్రహ్మచారిని రాత్రిత్రయ పర్యంతం తనవద్ద ఉంచుకొని, సన్ధ్యోపాసనాదులైన సత్పురుషుల ఆచారాలను నేర్పి అతడి ఆత్మలోపల గర్భరూపవిద్యను స్థాపించడం ద్వారా పూర్ణ విద్వాంసుణ్ణి చేస్తాడు. బ్రహ్మచారి పూర్ణ బ్రహ్మచర్యాన్ని పాటించి, విద్యను సంపూర్తిచేసి స్వగృహానికి తిరిగి రాగా, అతడిని దర్శించడానికి విద్వాంసులందరూ వచ్చి గౌరవించి సన్మానిస్తారు.

ఇది మనుకృతం-ప్రామాణికం

కామాన్మాతా పితా చైనం యదుత్పాదయతో మిథః । మూలశ్లోక సం.**96**
సంభూతిం తస్య తాం విద్యాద్యద్యోనావభిజాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**122[2.147]**

టీక:- మాతాచ పితాయత్ ఏనం మిథః ఉత్పాదయతః= ఏ బాలకుడికి తల్లి-తండ్రి కలిసి, జన్మనిస్తారో, కామాత్ = సంతానప్రాప్తిని కోరి కామాత్ములై కంటారో, **యత్+యోనౌ+అభిజాయతే** = అలాంటివాడు తల్లి గర్భం నుండి జన్మిస్తాడు, **తస్య తాం సంభూతిం విద్యాత్** = అది అతడికి సాధారణ రూపంలో ఈ ప్రపంచంలోకి వచ్చిన జన్మ. కానీ ఉపనయన సంస్కారంలో దీక్షనిచ్చి చేసే జన్మ రెండోజన్మ. అందువల్లనే అతడు ద్విజుడనబడతాడు. ఆచార్యుడి ద్వారా లభించిన బ్రహ్మజన్మే స్థిరంగా ఉంటుంది. ఈ జన్మతోనే మానవుడవుతున్నాడు.

తాత్పర్యం:- తల్లిదండ్రులు మోహంలో కలిసి శిశువుకు జన్మనిస్తున్నారు. అలాంటి శిశువు తల్లి గర్భం నుండి జన్మిస్తాడు. అది శిశువుకు సాధారణ రూపంలో ఈ ప్రపంచంలోకి వచ్చిన జన్మ.॥122॥

ఆచార్యుడిచ్చిన వర్ణనిర్ధారణయే స్థిరమైనది- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆచార్యస్త్వస్య యాం జాతిం విధివద్వేదపారగః । మూలశ్లోక సం.**97**
ఉత్పాదయతి సావిత్ర్యా సా సత్యా సాఽజరామరా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**123[2.148]**

టీక:- **వేదపారగః ఆచార్యః** = వేదాలలో పారంగతుడైన ఆచార్యుడు. [2.115(2.104)], **విధివత్** = విధ్యనుసారంగా, వేదోక్తంగా, **సావిత్ర్యా** = గాయత్రీమంత్రం దీక్షా పూర్వకంగా [2.44,46,51-53], అంటే ఉపనయనసంస్కారం వల్ల, **అస్య** = ఈ విద్యార్థికి లేదా వ్యక్తికి, **యాం జాతిం ఉత్పాదయతి** = ఏ జన్మను బ్రహ్మజన్మను ప్రదానం చేస్తాడో, [2.121,122,125], **సా తు** = ఆ జన్మే, **సత్యా** = వాస్తవ జన్మ-అదే ద్వితీయజన్మ-మానవ జన్మ, **సా+అజరా+అమరా** = అదే అజరామరమైన జన్మ.

తాత్పర్యం:- వేదాలలో పారంగతుడైన ఆచార్యుడు వేదోక్తంగా గాయత్రీ మంత్రపూర్వకంగా ఉపనయనం చేసి ఆ బాలునికి అజరామరమైన, శాశ్వతమైన జన్మనిస్తున్నందువల్ల తండ్రికంటే అతడు పరమపూజ్యుడు.॥123॥

'అజరం' అంటే క్షీణించనిది. **అమరా** = నశించనిది, 'శాశ్వతమైనది. ఈశ్వర జ్ఞానరూపమైన జన్మను పొందిన మనుష్యుడు అజరామర ముక్తిని పొందుతాడు. ఇదే మానవుడి వాస్తవిక ఉద్దేశం. సుశిక్షితుడు కానంతవరకు మనుష్యుడు వాస్తవంగా మనుష్యుడు కాజాలడు.

వివరణ:

'జాతి' శబ్దార్థ వివేచనం:- 'జన్' ధాతువుకు 'క్తిన్' ప్రత్యయం చేర్చినందువల్ల, జాతిశబ్దం నిష్పన్నమవుతుంది. ఈ జాతి శబ్దం జన్మశబ్దానికి పర్యాయవాచకంగా ప్రయోగింపబడింది. అంతేగాక 'బ్రహ్మజన్మ' అనే అర్థంలో ప్రయుక్తమైంది. కానీ ఏ జాతి విశేషాన్ని గురించి కాదు.

క. పూర్వాపర శ్లోకాలలో ఈ గుణాత్మకమైన బ్రహ్మజన్మ ప్రసంగముంది.

121వ శ్లోకంలో మాతృగర్భ సంజాతమైన జన్మకంటే, ఆచార్యప్రాప్తమైన బ్రహ్మజన్మే ఉత్కృష్టమనీ, శాశ్వతమైందనీ చెప్పడం జరిగింది. 122,123 శ్లోకాలు 122వ శ్లోకానికి అర్థవాదాలు (పోషకాలు). 122వ శ్లోకంలో, తల్లిదండ్రుల వల్ల కలిగిన జన్మ శ్రేష్ఠం కాదని సకారణంగా వివరించారు. అందులోనే 'బ్రహ్మజన్మ' ఏ కారణం వల్ల ఉత్కృష్టమో వివరించబడింది. ఈ ప్రకారంగా ఆ అర్థమునే ఇక్కడ క్రమంగా అనువర్తనం చేశాడు.

ఖ. 125వ శ్లోకంలోను, బ్రహ్మజన్మ ప్రసంగం ఉంది. అది ఆచార్యుడి ద్వారా గాని, గురువు ద్వారా గాని ప్రాప్తిస్తుంది. దీనికే 'జాతి' అనిపేరు. ఈ శ్లోకంలో ప్రయోగించిన **'జాతి'** శబ్దం బ్రహ్మజన్మ అనే అర్థంలో ఉపయోగింపబడింది. మనుమహర్షి ద్వారా ప్రయోగించిన **'సత్యా, అజరా, అమరా'** అనే విశేషణాలే ఈ విషయానికి సమానార్థకాలు. కారణం? ఇవే ముక్తి ప్రాప్తికి సాధకాలు. చూడండి-**"బ్రాహ్మీయం క్రియతే తనుః"** [2.3 (2.27), 2.43 (2.68); 2.224 (2.249); 4.14, 148-149; 6.81-85)].

గ. **'జాతి'** శబ్దానికి అర్థం **'జన్మ'**. దీనికి సమర్థన 9-201వ శ్లోకంలో ఉంది. అక్కడ **"జాత్యన్ధబధిరా"** అంటే జన్మచేత అంధులు, చెవిటివారు. ఈ ప్రకారంగా 'జాతి' శబ్దానికి జన్మ అని చెప్పడమే మనుసమ్మతం. 10.4వ శ్లోకంలో కూడా జన్మార్థంలోనే జాతి శబ్దం ప్రయోగించబడింది. **"చతుర్థః ఏక జాతిస్తు శూద్రః"**-శూద్రులకు ఏకజన్మే ఉంది. రెండో జన్మ లేదు కాబట్టి శూద్రుడైనాడు.

గురువు యొక్క సామాన్య లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

అల్పం వా బహు వా యస్య శ్రుతస్యోపకరోతి యః । మూలశ్లోక సం.**98**
తమపీహ గురుం విద్యాచ్ఛ్రుతోపక్రియయా తయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**124 [2.149]**

టీక:- **యః యస్య** = ఎవరైనా, ఎవరికైనా, **శ్రుతస్య అల్పం వా బహు ఉపకరోతి** = విద్యను బోధించి కొంచెం గాని, అధికంగా గాని ఉపకారం చేస్తాడో, **తమ్+అపి ఇహ** = అతడిని కూడా ఈ ప్రపంచంలో, **తయా శ్రుత+ఉపక్రియయా**= ఆ విద్యను చెప్పి చేసిన ఉపకార కారణంగా, **గురుం విద్యాత్** = గురువుగా భావించాలి.

తాత్పర్యం:- కొద్దిగా గాని, ఎక్కువగాగాని వేదశాస్త్రాల ఉపదేశం నిమిత్తం ఏ ద్విజుడు సహకరిస్తాడో అతడిని గురు సమానుడిగా భావించాలి. వేదోపకారకమైన కార్యాన్ని నిర్వర్తించినందువల్లనే అతడికా మర్యాద.॥124॥

వయోవృద్ధునికంటే విద్వాంసుడైన బాలకుడే పెద్దవాడు- ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మస్య జన్మనః కర్తా స్వధర్మస్య చ శాసితా । మూలశ్లోక సం.**99**
బాలోఽపి విప్రో వృద్ధస్య పితా భవతి ధర్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**125[2.150]**

టీక:- **బ్రాహ్మస్య జన్మనః కర్తా** = ఈశ్వరజ్ఞానం, వేదాధ్యయన రూపమైన జన్మనిచ్చేది, **స్వధర్మస్య చ శాసితా** = తన ధర్మాన్ని ఉపదేశించేది, **విప్రః** = విద్వాంసుడైన, **బాలః+అపి** = బాలుడు కూడా, అంటే అల్పాయుష్షు కలవాడైనా, **ధర్మతః వృద్ధస్య పితా భవతి** = విద్యార్థిగా ఉన్న దీర్ఘాయుష్షు కలిగిన వృద్ధుడికి, ధర్మంగా తండ్రి అవుతాడు. అంటే గురువుతో సమానంగా పెద్దవాడవుతాడు.

తాత్పర్యం:- ఉపనయనాన్ని చేసినవారు, వేదార్థాన్ని వివరించినవారు, వయస్సులో చిన్నవారైనా, పెద్దవారికి తండ్రిగా భావించబడతాడు.॥125॥

ఈ విషయంలో ఆంగిరసుని దృష్టాంతం- ఇది మనుకృతం-ప్రామాణికం

అధ్యాపయామాస పితౄఞ్ఛిశురాఙ్గిరసః కవిః । మూల శ్లోక సం.**100**
పుత్రకా ఇతి హోవాచ జ్ఞానేన పరిగృహ్యతాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**126 [2.151]**

టీక:- ఈ విషయాన్ని తెలిపే గాథ ఒకటుంది, **ఆంగిరసః శిశుః కవిః** = అంగిర వంశంలో పుట్టిన ఆంగిరసుడనే నామం గల విద్వాంసుడైన బాలకుడు ఒకడు ఉండేవాడు. **పితౄన్** = అతడు తన తండ్రితో సమానమైన పిన తండ్రి మొ॥న (చిన్నాయనాది) పితరులకు, **అధ్యాపయామాస** = చదువు చెప్పాడు, **జ్ఞానేన పరిగృహ్య** = జ్ఞాన దాన కారణంగా, **తాన్ "పుత్రకాః" ఇతి హ ఉవాచ** = వారిని "హే పుత్రకాః" ఓ పుత్రులారా ! అనే శబ్దంతో సంబోధించాడు.

తాత్పర్యం:- పూర్వం అంగిరసుడి కుమారుడైన ఆంగిర విద్వాంసుడు బాలుడు. తన పినతండ్రిని, అతని కొడుకులను వయసులో పెద్దవారిని జ్ఞానంలో శిష్యులుగా పరిగ్రహించి, "పుత్రులారా" అని సంబోధించాడు. ॥126॥

వివరణ:

'కవిః' శబ్దోత్పత్తి.

కి-శబ్దే (అదాది) ధాతువుకు, **'అచ ఇః'** (ఉణాది 4-139) సూత్రం ద్వారా **'ఇః'** ప్రత్యయం చేర్చగా 'కవి' శబ్దం నిష్పన్నమవుతుంది. దీనికి నిరుక్తం-

"క్రాన్తదర్శనాః క్రాన్తప్రజ్ఞా వా విద్వాంసః (ఋ.భా.భూ.)
"కవిః క్రాన్త దర్శనో భవతి' (నిరుక్త.12-13)

విద్యల సూక్ష్మ తత్త్వాలనెరిగినవాడు బహుశ్రుతుడైన వ్యక్తి 'కవి' అవుతాడు. 'అనూచాన' శబ్దమున్నూ ఈ సందర్భంలోనే ప్రయోగించారు. దానికి ప్రమాణాలు-

"యే వా అనూచానాస్తే కవయః"- (ఐ.బ్రహ్మ.2.2)

"ఏతే వై కవయో యదృషయః"- (శత.బ్రా. 1.4.2.8)
"యే విద్వాంసస్తే కవయః"- (శత.బ్రా. 7.2.2.4)
"శుశ్రూవాంసో వై కవయః- (తై.బ్రా. 3.2.3.3)

ఇది మనుకృతం-ప్రామాణికం

తే తమర్థమపృచ్ఛంత దేవానాగతమన్యవః । మూల శ్లోక సం. **101**
దేవాశ్చైతాన్ సమేత్యోచుర్న్యాయంవశ్శిశురుక్తవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **127 [2.152]**

టీక:- **ఆగతమన్యవః తే** = ఉక్తసంబోధనను విని కోపోద్రిక్తులైన ఆ పితరులు, **తమ్ అర్థం దేవాన్ అపృచ్ఛన్త** = 'పుత్రులారా' అని చేసిన సంబోధన శబ్దార్థాన్ని వారు దేవతలను అడిగారు, అప్పుడు-**దేవాః సమేత్య ఏతాన్ ఊచుః** = దేవతలందరూ కలిసి ఒకే మాటగా వీరితో ఇలా అన్నారు, **శిశుః వః న్యాయం ఉక్తవాన్** = తత్త్వదర్శియు, బాలకుడైన ఆంగిరసుడు మిమ్ములను **'పుత్రులారా'** అని సంబోధించాడు. అది న్యాయమే గదా!

తాత్పర్యం:- తండ్రితో సమానులైన పినతండ్రి మొదలైనవారు 'బిడ్డలారా' అని సంబోధించగానే వారు కోపావిష్టులై దేవతలను అడిగారు. అంత వేల్పులు వారిని చూసి మిమ్మ అతడు ఇలా "బిడ్డలారా" అని పిలవడం న్యాయమేగదా! అన్నారు. ॥127॥

జ్ఞానాధారంగా 'బాలకుడికి-తండ్రికి' పరిభాష- ఇది మనుకృతం-ప్రామాణికం

అజ్ఞో భవతి వై బాలః పితా భవతి మన్త్రదః । మూలశ్లోక సం. **102**
అజ్ఞం హి బాలమిత్యాహుః పితేత్యేవ తు మన్త్రదమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **128[2.153]**

టీక:- **అజ్ఞో వై బాలః భవతి** = వందసంవత్సరాలు కలవాడైనా విద్యావిజ్ఞానాదులు లేనివాడు బాలుడు, **మన్త్రదః పితా భవతి** = విద్యా-విజ్ఞానాన్ని ఇచ్చేవాడు బాలకుడైనా కూడా వృద్ధుడు. అతడిని పితృదేవతగా భావించి గౌరవించాలి. **హి** = ఎందుకంటే, సర్వశాస్త్రాలు, ఆప్త విద్వాంసులు, **అజ్ఞం బాలమ్ +ఇతి** = అజ్ఞానిని బాలకుడనీ, **మన్త్రదమ్ తు పితా ఇత్యేవ ఆహుః** = జ్ఞానిని "పితా" (తండ్రి) అనీ చెబుతున్నారు.

తాత్పర్యం:- జ్ఞానశూన్యుడైనవాడే బాలుడు. మంత్రం-వేదం చెప్పేవాడే తండ్రి. తండ్రికూడ వేదాన్ని తన కొడుకు దగ్గర చదువవచ్చు.॥128॥

ఋషి దయానందభాష్యం:-వయసురీత్యా గాని, గడ్డం-మీసం-మొదలైనవి తెల్లబడటం వల్లగాని, ధనం వల్లగాని, బంధుత్వ రీత్యా గాని గౌరవం పొందలేరు, సాంగోపాంగంగా వేదాన్ని ఎవరు ఉపదేశిస్తారో వారే గొప్పవారని ఋషి వచనం.

అజ్ఞుడు-ఎవడు? ఏమీ చదవనివాడు ఖచ్చితంగా అజ్ఞుడే. అతడే బాలకుడు. ఎవరు విద్యాదానం చేసి విద్యాప్రచారంలో నిపుణుడుగా ఉంటాడో, అతడు పితాస్థానీయుడవుతాడు. కారణం? సత్పురుషులందరూ అజ్ఞుణ్ణి 'బాలకుడనీ', మన్త్రదాతని 'పితా' అని నిర్ణయించడంవల్ల.కావున బ్రహ్మచర్యాశ్రమంలో ఉండి తప్పక జ్ఞానవంతుడు కావాలి (సం.వి.వేదారంభ).

వయోనిమిత్తం లేకుండా వేదజ్ఞానే శ్రేష్ఠుడు ఇది మనుకృతం-ప్రామాణికం

న హాయనైర్న పలితైర్న విత్తేన నచ బన్ధుభిః । మూలశ్లోక సం. **103**
ఋషయశ్చక్రిరే ధర్మం యోఽనూచానస్స నో మహాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **129[2.154]**

టీక:- హాయనైః= ఎక్కువ సంవత్సరాల వయస్సున్నంతమాత్రం వల్ల గాని, **పలితైః** = వెంట్రుకలు తెల్లబడినందువల్ల గాని, **విత్తేన** = అధికంగా ధనముండటం వల్ల గాని, **బన్ధుభిః** = పెద్దకుటుంబం ఉన్నంతమాత్రం వల్ల గాని, **న**= వృద్ధుడు కాదు, **ఋషయః ధర్మం చక్రిరే** = కాని ఋషులకు, మహాత్ములకు ఒక నియమముంది. **నః యః అనూచానః స మహాన్** = ఎవరు మాలో విద్యా-విజ్ఞానంలో అధికుడో, అతడే వృద్ధపురుషుడు.

తాత్పర్యం:- వయస్సు ఎక్కువ ఉన్నందువల్లగానీ, వెంట్రుకలు తెల్లబడినందువల్ల గానీ, అధిక ధనం చేత గానీ, పెద్ద కుటుంబం ఉన్నందు వల్లగానీ వృద్ధుడుకాడు. ఎవరు విద్యావిజ్ఞానంలో అధికుడో అతడే వృద్ధపురుషుడని ఋషులూ మహాత్ములూ నియమం ఏర్పాటు చేశారు.॥129॥

ఋషి దయానందభాష్యమ్:- అధిక సంవత్సరాల వయస్సు కలవాడు, వెంట్రుకలు నెరసినవాడు అధికధనం కలవాడు, గొప్ప కుటుంబం కలవాడు వృద్ధుడు అనబడడు. విద్యావిజ్ఞానాలలో అధికుడైనవాడే వృద్ధుడు అనబడుతాడని ఋషుల మహాత్ముల నిశ్చితాభిప్రాయం (స.ప్ర.10వ.స.)

వివరణ: అనూచానుడు అందరికంటే గొప్పవాడు

ఈ శ్లోకంలో తెలిపిన అనూచానుడు అను పదం వైదిక క్షేత్రంలో గౌరవనీయమైనది. నిరుక్తకారుడు కూడా దీన్నే సమర్థించాడు.

(క). "యథా జానపదీషు విద్యాతః పురుషవిశేషో భవతి, పారోవర్యవిత్సు తు ఖలు వేదితృషు భూయోవిద్యః ప్రశస్యో భవతి" (1.16) **"తస్మాత్ యదేవ కించిదనూచానః అభ్యూహతి ఆర్షం తత్ భవతి"** (పరిశిష్టం-13-11).

ఏ విధంగా గ్రామప్రాంతంలో అధిక విద్యావిజ్ఞాన వేత్తను విశేషవ్యక్తిగా గౌరవిస్తారో, అలాగే వేదజ్ఞులలో ఎక్కువగా వేదవిద్యలు తెలిసినవాడిని ప్రశంసిస్తారు. అతడే అందరికంటే గొప్పవాడు. వేద-వేదాంగాలలో పారంగతుడైన విద్వాంసుడు తర్కం ద్వారా మంత్రాలకు ఏ అర్థాన్ని తెలుపుతాడో అదే ఋషిదృష్టమైన అర్థం కూడా. శతపథ బ్రాహ్మణమున్నూ **"అనూచాన వ్యక్తే విద్వాంసులలో అధికుడని"** భావించినది.

"యో వై బ్రాహ్మణానాం అనూచానతమః స ఏషాం వీర్యవత్తమః"

బ్రాహ్మణులలో పరమవిద్వాంసుడైనవాడే- వారిలో అత్యంత బలవంతుడు, అందరికంటే గొప్పవాడు. (4-6-6.5).

వర్ణాలలో పరస్పర శ్రేష్ఠత్వానికి ఆధారం- ఇది మనుకృతం-ప్రామాణికం

విప్రాణాం జ్ఞానతో జ్యైష్ఠ్యం క్షత్రియాణాం తు వీర్యతః । మూలశ్లోక సం.**104**
వైశ్యానాం ధాన్యధనతశ్శూద్రాణామేవ జన్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**130[2.155]**

టీక:- విప్రాణాం జ్ఞానతః = బ్రాహ్మణులలో జ్ఞానం వల్ల, **క్షత్రియాణాం** = క్షత్రియులలో బలం వల్ల, **వైశ్యానాం ధనధాన్యతః** = వైశ్యులలో ధనధాన్యాల వల్ల, **శూద్రాణాం జన్మతః ఏవ జ్యైష్ఠ్యం** = శూద్రులలో జన్మను బట్టి అంటే అధిక వయస్సును బట్టి జ్యేష్ఠుడుగా గౌరవింపబడతాడు.

వయస్సుకంటే జ్ఞానం వల్లనే వృద్ధత్వం సంభవిస్తుంది.

తాత్పర్యం:- కాబట్టి, విప్రులకు జ్ఞానం వల్ల, క్షత్రియులకు బలంవల్ల, వైశ్యులకు ధనధాన్యమువల్ల, శూద్రులకు వయస్సు వల్ల శ్రేష్ఠత్వం కలుగుతుంది.॥130॥

ఋషి దయానందభాష్యం:- జ్ఞానంతో బ్రాహ్మణుడు, బలంతో క్షత్రియుడు, ధనంతో వైశ్యుడు, అధిక వయస్సుతో శూద్రుడు వృద్ధుడౌతాడు.

జ్ఞానే పెద్దవాడు- ఇది మనుకృతం-ప్రామాణికం

న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః । మూలశ్లోక సం.**105**
యో వై యువాఽప్యధీయానస్తం దేవాస్స్థవిరం విదుః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**131[2.156]**

టీక:- యేన + ఆస్య శిరః పలితం = తలవెంట్రుకలు నెరిసినంతమాత్రాన, **తేన వృద్ధః న భవతి** = వృద్ధుడు కాదు. **యః వై యువా + అపి అధీయానః** = యువకుడైనా, విద్వాంసుడవుతాడో, **తం దేవాః స్థవిరం విదుః** = అతడినే విద్వాంసులు "వృద్ధ"దని భావిస్తారు.

తాత్పర్యం:- కేవలం తల నెరిసినంత మాత్రాన వృద్ధుడు కాదు. యువకుడైనా విద్వాంసుడవుతాడో అతడే వృద్ధుడని భావిస్తారు. ఇక్కడ వృద్ధాప్యం జ్ఞానరీత్యా అని అర్థం.

ఋషి దయానందభాష్యం:- వెంట్రుకలు నెరిసినంత మాత్రాన వృద్ధుడు కాదు. విద్యను అభసించిన యువకుడే వృద్ధుడు (స.ప్ర. 10వ.స.).

ఇది మనుకృతం-ప్రామాణికం

యథా కాష్ఠమయో హస్తీ యథా చర్మమయో మృగః । మూలశ్లోక సం.**106**
యశ్చ విప్రోఽనధీయాన స్త్రయస్తే నామ బిభ్రతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**132[2.157]**

టీక:- యథాకాష్ఠమయః హస్తీ = కాష్ఠనిర్మిత గజం ఎలాంటిదో, **యథా చర్మమయః మృగః** = చర్మనిర్మిత మృగం ఎలాంటిదో, **యః + చ అనధీయానః విప్రః** = అలాగే విద్యరాని బ్రాహ్మణుడున్నూ, **తే త్రయః నామ బిభ్రతి** = పైన తెలిపిన గజం, మృగం, విప్రుడు ఈ ముగ్గురు నామమాత్రమునకే. విద్వాంసుడు కాని మానవుడికి, మనుష్యనామం మాత్రమే ఉంటుంది. పేరుకు మనుషుడే కాని చదువురాని మూర్ఖుడు.

తాత్పర్యం:- కొయ్యఏనుగును, తోలుతో చేసిన మృగమును, అధ్యయనం చేయని విప్రుడును వీరు ముగ్గురూ నామమాత్రధారులే. కాని, విద్వాంసుడుకాని మానవుడికి మనుష నామం మాత్రమే ఉంటుంది. పేరుకు మనుషుడే కాని చదువురాని మూర్ఖుడు. ॥132॥

ఋషి దయానందభాష్యము:- విద్యను నేర్వనివాడు కఱ్ఱతో చేసిన ఏనుగులాగా, చర్మంతో చేసిన మృగంలాగా నామ మాత్రానికే 'మనుష్యుడు' అని లోకంలో చెప్పబడుతాడు. (స.ప్ర. 10వ.స.).

మూర్ఖజీవితం నిష్ఫలం- ఇది మనుకృతం-ప్రామాణికం

యథా షంఢోఽఫలః స్త్రీషు యథా గౌర్గవి చాఫలా । మూలశ్లోక సం.**107**
యథా చాజ్ఞేఽఫలం దానం తథా విప్రోఽనృచోఽఫలః॥ ప్రక్షిప్త శ్లోక సం.**133[2.158]**

టీక:- యథా స్త్రీషు షండోః అఫలః= ఏ విధంగా స్త్రీల విషయంలో నపుంసకుడు నిరర్థకమో, అంటే సంతానరూపఫలాన్ని పొందజాలడో, **యథా గవి గౌః అఫలా** = ఏ విధంగా ఆవులలో ఆవు నిష్ఫలమవుతుందో, ఆవు ఆవుతో కలిసి (అఫలం) సంతానాన్ని పొందజాలదో, **చ** = మరియు, **యథా అజ్ఞే అఫలం దానం** = ఏ విధంగా అజ్ఞాని వ్యక్తికి దానం నిష్ఫలమో, **తథా** = అలాగే, **అనృచః విప్రః అఫలం** = వేదం చదవని బ్రాహ్మణుడు కూడా నిరర్థకమే, అంటే అతడి బ్రాహ్మణత్వం సఫలం కాదు. వేదాధ్యయనమే బ్రాహ్మణుడి ముఖ్య కర్మ.

తాత్పర్యం:- నపుంసకుడు ఎలా స్త్రీల విషయమై వ్యర్థుడో, ఆవు ఆవునందు ఎలా వ్యర్థమో, అయోగ్యుడికి లేదా అజ్ఞానికి ఇచ్చిన దానం ఎలా వ్యర్థమో, అలా వేదమును అధ్యయనం చేయనివాడు కూడా వ్యర్థుడే. ॥133॥

గురుశిష్యుల వ్యవహారం-

ఇది మనుకృతం-ప్రామాణికం

అహింసయైవ భూతానాం కార్యం శ్రేయోఽనుశాసనమ్ । మూలశ్లోక సం. **108**
వాక్చైవ మధురా శ్లక్ష్ణా ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **134[2.159]**

టీక:- అహింసయా+ఏవ భూతానాం = విద్వాంసులకు, విద్యార్థులకు ధర్మమిది-వారు వైర బుద్ధిని విడిచిపెట్టి మనుషులందరికీ, **శ్రేయః+అనుశాసనం కార్యం** = కల్యాణ మార్గాన్ని ఉపదేశించాలి. **మధురా శ్లక్ష్ణా వాక్ ప్రయోజ్యా** = ఉపదేశకుడు మధురం, సుశీలతాయుక్తమైన వాక్కును ఉపయోగించాలి, **ధర్మమ్ + ఇచ్ఛతా** = ధర్మాన్ని కోరువాడై సదా సత్యం ఆచరిస్తూ, సత్యాన్నే ఉపదేశించాలి.

తాత్పర్యం:- అధ్యాపనం ఎలా ఉండాలో ఇక్కడ వివరించబడింది......పద్ధతి తెలిసిన ఆచార్యుడు శిష్యులను క్రూరంగా దండించడు. మేలు కలిగించే విషయాలు నీతిదాయకమైనవి, ఇంపైనవి దయతో విద్యార్థులకు బోధిస్తాడు. అలాంటి ఆచార్యుడే ఉత్తమనీతి నెరిగినవాడు, ధర్మాన్ని కోరువాడై సదా సత్యాన్నే ఆచరిస్తూ చెప్పాలి.॥134॥

ఋషి దయానందభాష్యం:- "అందువల్ల, విద్యనార్జించి ధర్మాత్ముడై వైరభావాన్ని విడిచిపెట్టి కల్యాణార్థమై ఉపదేశించాలి. ఉపదేశించడంలో మధురం కోమలమైనవాణినే ప్రయోగించాలి. సత్యోపదేశం వల్ల ధర్మం అభివృద్ధి చెందుతుంది. అధర్మం నశిస్తుంది. అలాంటివారే ధన్యులు. (స.ప్ర.10వ.స.)

పవిత్రమనస్సు కలవారికే వైదిక ధర్మఫలితం లభిస్తుంది

ఇది మనుకృత ప్రామాణికం

యస్య వాఙ్మనసీ శుద్ధే సమ్యగుప్తే చ సర్వదా । మూలశ్లోక సం. **109**
స వై సర్వమవాప్నోతి వేదాన్తోపగతం ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **135[2.160]**

టీక:- యస్య వాఙ్మనసి = ఎవడి యొక్క వాక్ -మనస్సులు, **శుద్ధే చ సమ్యగ్గుప్తే సర్వదా** = శుద్ధములుగాను, సదా సురక్షితములుగాను ఉంటాయో, **స వై** = అతడే, **సర్వం వేదాన్తోపగతం ఫలం అవాప్నోతి** = సర్వవేదాల సిద్ధాంతరూప ఫలాన్ని పొందగలడు. ఈ విషయపుష్టికి గాను 1.109 వ శ్లోకాన్ని చూడగలరు.

తాత్పర్యం:- ఎవడి వాక్కు, మనస్సు సురక్షితముగానూ రాగద్వేషాదులతోనూ చెడకుండా నిర్మలములై ఉంటాయో అతడు వేదాంతమందు చెప్పబడిన సర్వజ్ఞత్వ, సర్వేశ్వరత్వ రూపమైన ఫలాన్ని పొందుతాడు.॥135॥

ఋషి దయానందభాష్యం:- వాక్కు, మనస్సు పవిత్రంగా, సురక్షితంగా ఉంచుకొనువారే వేదాలలో ఉన్నసిద్ధాంత రూప ఫలాన్ని (వేదాంతాన్ని) పొందగలరు (స.ప్ర.3వ.స.).॥135॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పరద్రోహం విడిచిపెట్టాలి-

నారున్తుదస్స్యాదార్తోఽపి న పరద్రోహకర్మధీః । మూలశ్లోక సం. **110**
యయాస్యోద్విజతే వాచా నాలోక్యాం తాముదీరయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **136[2.161]**

టీక:- మనుషుడు, **ఆర్తః + అపి** = స్వయంగా బాధపడుతూ కూడా, **అరున్తుదః న స్యాత్** = మరెవరికీ కష్టాన్ని కలిగించరాదు, **న పరద్రోహ కర్మధీః** = ఎవరి మీదా ఈర్ష్య పడటం గానీ, ద్రోహం చేయాలనే భావన గానీ మనస్సుకు రానీయరాదు, **అస్య యయా వాచా ఉద్విజితే** = ఈ మనుషుడి యొక్క ఏ మాట వల్ల మరొకడు దుఃఖితుడవుతాడో, **తాం అలోక్యాం న ఉదీరయేత్** = లోకులు ప్రశంసించనట్టి వాక్కును ప్రయోగించరాదు.

తాత్పర్యం:- ఇతరులూ, తానూ నొచ్చుకొనేలా మాట్లాడకూడదు. ఎవరి మీద ఈర్షపడటంగానీ, ఇతరులకు ద్రోహాన్ని తలపెట్టే పనులుగానీ చేయరాదు. ఎలాంటి మాటల వల్ల ప్రజలు భీతిచెంది దుఃఖితులౌతారో అలాంటివి అనరాదు. లోకులు ప్రశంసించనట్టి వాక్కును ప్రయోగించరాదు.॥136॥

ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మణుడు అవమానాన్ని సహించాలి

సమ్మానాద్బ్రాహ్మణో నిత్యముద్విజేత విషాదివ ।
అమృతస్యేవ చాకాంక్షేదవమానస్య సర్వదా ॥

మూలశ్లోక సం. **111**
ప్రక్షిప్త శ్లోక సం. **137[2.162]**

టీక:- బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, (బ్రహ్మజ్ఞాని), **విషాత్ +ఇవ సమ్మానాత్** = ఉత్తమ సన్మానాన్ని విషంతో సమానంగా, **నిత్యం+ఉద్విజేత** = నిత్యం ఉదాసీనంగా ఉండాలి, **అమృతస్య+ఇవ** = అమృతం మాదిరిగా, **అవమానస్య సర్వదా ఆకాంక్షాత్** = సర్వదా అవమానాన్ని ఆకాంక్షించాలి. బ్రహ్మచర్యాది ఆశ్రమములవారు, భిక్ష అడగడంలో అభిమానాన్ని విడిచిపెట్టాలి.

తాత్పర్యం:- ఇతరులెవరైనా తనను సన్మానిస్తానంటే, సద్విప్రుడు నిజంగా విషంతో సమానంగా భావించి భయపడాలి. అమృతాన్ని కోరినట్లు ఇతరుల వల్ల అవమానాలను కోరాలి, (అంటే-విమర్శలను ఆహ్వానించాలని అర్థం). ఇతరులు తనను విమర్శించినా ఓర్చుకోగలగాలి.॥137॥

ఋషి దయానందభాష్యం:- సన్న్యాసి ప్రజలు చూపే సన్మానాన్ని-విషం లాగా త్యజించాలి. అవమానాన్ని అమృతం లాగా గ్రహించాలి. కారణం ఏమిటి? అవమానానికి భయపడి సన్మానాన్ని కోరేవాడు, ప్రశంసకులోనై మిథ్యావాదియై పతితుడవుతాడు. అందువల్ల నిందించినా, లేదా ప్రశంసించినా, గౌరవించినా, అవమానించినా, మృత్యువు వచ్చినా, హాని కలిగినా, లాభం కలిగినా, ప్రేమతో చూసినా, ద్వేషించినా, అన్నపానాలు, వస్త్రాదులు, ఉత్తమ వసతి లభించకపోయినా, చలి, ఎండ ఎంతగా ఉన్నప్పటికీ వీటన్నిటినీ సహించాలి. అధర్మాన్ని నిరసిస్తూ, ధర్మాన్ని ప్రశంసిస్తూ ఉండాలి. ఇంతకంటే ఉత్తమ ధర్మం మరొకటి లేదు (సం.వి.వేదారంభం).

అలాంటి బ్రాహ్మణుడే సమగ్రవేదాన్ని, పరమేశ్వరుణ్ణి తెలిసినవాడు. అలాంటివాడే ప్రతిష్ఠను విషం లాగా, చూసి భయపడతాడు. అవమానాన్ని అమృతం లాగా చూసి ఆనందపడతాడు (స.ప్ర. 3వ స.).

వివరణ:

అవమానాన్ని సహించమని ఎందుకు చెప్పినట్లు?

సన్మానం లేదా లోకైషణా భావన మానవ మాత్రుణ్ణి సంసారసాగరంలో పడవేస్తుంది. అతడు విరక్తుడు కాజాలడు. సాంసారిక మోహాలను విడిచిపెట్టలేడు. దీనివల్ల అహంకారానికి బలం కలుగుతుంది. దానివల్ల రోజురోజుకు ఉగ్రుడవుతూ ఉంటాడు. శాస్త్రానుసారంగా మానవమాత్రుడికీ, విశేషించి బ్రాహ్మణుడికి బ్రహ్మప్రాప్తే పరమోద్దేశం (2-3[2.28]). బ్రహ్మప్రాప్తికి అహంకారం సర్వాధిక బాధ. అవమానాన్ని కోరడం, సహిష్ణుత వల్ల అహంకారం క్షీణిస్తుంది. సంసారం నుండి విరక్తిభావన కలుగుతుంది. నిందలను సహించడంవల్ల దుర్గుణాలు సమసిపోతాయి. శీలం నిర్మలమవుతుంది. దీనివల్ల బ్రహ్మ ప్రాప్తికి సహాయత లభిస్తుంది.

(6.47,48) శ్లోకాలలో, మనువు ఈ మాన్యతకు కారణాన్ని స్పష్టంచేశాడు. ఇందుకు-

"అభిపూజితలాభాంస్తు జుగుప్సేతైవ సర్వశః ।
అభిపూజితలాభైశ్చ యతిర్ముక్తోఽపి బధ్యతే ॥ (6.58)
అతి వాదాంస్తితీక్షేత నావమన్యేత కంచన (6.52)

సన్మానం కోరనివాడే సుఖవంతుడు-

ఇది మనుకృతం-ప్రామాణికం

సుఖం హ్యవమతశ్శేతే సుఖం చ ప్రతిబుధ్యతే ।
సుఖం చరతి లోకేఽస్మిన్నవమన్తా వినశ్యతి ॥

మూలశ్లోక సం. **112**
ప్రక్షిప్త శ్లోక సం. **138[2.163]**

టీక:- హి = ఎందుకంటే, **అవమతః సుఖం శేతే** = సన్మానంకోరని అవమానితుడు సహనాభ్యాసం వల్ల సుఖంగా నిద్రపోతాడు, **చ** = మరియు, **సుఖం ప్రతిబుధ్యతే** = ఆనందంగా మేల్కొంటాడు. అంటే జాగ్రదావస్థలో కూడా సుఖంగా ఉంటాడు. అన్ని విధాలా మానవుడిని బాధించే మానావమానాలు వాటివల్ల ఉత్పన్నమయ్యే భావనలు, ఉపరోక్త వ్యక్తిని నిద్రలోగాని, జాగ్రదావస్థలోగాని బాధించవు. అతడు నిశ్చింతగా, ప్రశాంతంగా ఉంటాడు. **అస్మిన్ లోకే సుఖం చరతి** = ఈ లోకంలో సుఖంగా జీవిస్తాడు. అలాగే, **అవమన్తా** = అవమానించినవాడు, **వినశ్యతి** = శోకం వల్ల, చింతిస్తూ నశించిపోతాడు.

తాత్పర్యం:- ఇతరుల అవమానాన్ని సహించగల ఓర్పు అలవడినప్పుడే, అలాంటివారు నిద్రిస్తారు. సుఖంగా నిద్రలేస్తారు. ఈ భూమ్మీద సుఖంగా సంచరిస్తారు. ఎదుటివారు అకారణంగా అవమానిస్తే వారు ఆ పాపం చేతనే నశిస్తారు.॥138॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అనేన క్రమయోగేన సంస్కృతాత్మా ద్విజశ్శనైః । మూలశ్లోక సం.**113**
గురౌ వసన్ సంచినుయాద్బ్రహ్మాధిగమికం తపః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**139[2.164]**

టీక:- **అనేన క్రమయోగేన** = ఈ విధంగా, పైన ఉదాహరించిన నిర్దేశానుసారంగా, **సంస్కృతాత్మా ద్విజః** = ఉపనీతుడైన ద్విజబాలకుడు, బ్రహ్మచారిణీ కన్యయు, **శనైః** = మెల్లమెల్లగా, **బ్రహ్మాధిగమికం తపః** = వేదార్థజ్ఞానమనే తపస్సును, **సంచినుయాత్** = పెంపొందించుకుంటూ పోతారు. **గురౌ వసన్** = గురువు వద్ద ఉంటూ, గురుకులంలో నివసిస్తూ, ద్విజులైనవారికి వేదాభ్యాసం అనివార్యం.

తాత్పర్యం:- ఇప్పుడు చెప్పినరీతిగా ఏ బ్రాహ్మణుడు క్రమంగా మనోసంస్కారాన్ని పొందగలుగుతాడో, అలాంటివాడు గురువు ఇంట నివశిస్తూ ఇంతవరకు చెప్పినవీ-ఇకపై చెప్పబడే నియమాలు అనుసరిస్తూ వేదాధ్యయనం చేయాలి.॥139॥

ఋషి దయానందభాష్యం:- ఇలా ఉపనయనాన్ని చేసుకున్న ద్విజులైన బ్రహ్మచారీ బ్రహ్మచా రిణులు క్రమంగా వేదార్థజ్ఞానరూపమైన ఉత్తమ తపస్సును వృద్ధిపరచుకోవాలి (స.ప్ర. 3వ.స.).

ద్విజులకు వేదాభ్యాసం అనివార్యం- ఇది మనుకృతం-ప్రామాణికం

తపోవిశేషైర్వివిధైర్వ్రతైశ్చ విధిచోదితైః । మూలశ్లోక సం.**114**
వేదః కృత్స్నోఽధిగన్తవ్యస్సరహస్యో ద్విజన్మనా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**140[2.165]**

టీక:- **ద్విజన్మనా** = ద్విజుడికి, **విధిచోదితైః తపోవిశేషైః చ వివిధైః వ్రతైః** = శాస్త్రాలలో విధించిన విశేష తపస్సులను, వ్రతములను, బ్రహ్మచర్య పాలన, వేదాభ్యాసం, ధర్మపాలన, ప్రాణాయామం, ద్వంద్వసహనం మొదలైన [1.141,142 (166-167) 6.70-72], **వివిధైః వ్రతైః** = వివిధవ్రతాలను పాలిస్తూ, (2.149-194) **కృత్స్నఃవేదః** = సంపూర్ణ వేదజ్ఞానాన్ని, **సరహస్యః** = గూఢార్థచింతాపూర్వకంగా, (2.115) **అధిగన్తవ్యః** = అధ్యయనంచేసి పొందాలి.

తాత్పర్యం:- ఆచారాలు- నియమాలు పాటిస్తూ, శాస్త్రోక్తంగా చెప్పబడినవి ఆచరిస్తూ మంత్రబ్రాహ్మణ రూపమైన వేదాల్ని-ఉపనిషత్తులను అధ్యయనం చెయ్యాలి.॥140॥

వేదాభ్యాసమే పరమ తపము- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదమేవ సదాభ్యస్యేత్తపస్తప్స్యన్ ద్విజోత్తమః । మూలశ్లోక సం.**115**
వేదాభ్యాసో హి విప్రస్య తపః పరమిహోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**141[2.166]**

టీక:- **ద్విజోత్తమః** = ద్విజోత్తముడు, అంటే బ్రాహ్మణాది ద్విజులలో ఉత్తమ సజ్జనపురుషుడు, **సదా తపః తప్యన్** = సర్వకాలాల్లో తపస్సు నాచరిస్తూ, **వేదమ్ + ఏవ అభ్యసేత్** = వేదాధ్యయనమే చేయాలి. **హి** = ఎందుకంటే, **విప్రస్య** = బ్రాహ్మణుడికి లేదా బుద్ధిమంతుడైనవాడికి, **వేదాభ్యాసః** = వేదాధ్యయనం చేయడమే, **ఇహ** = ఈ లోకంలో, **పరమం తపః ఉచ్యతే** = ఉత్తమోత్తమ తపస్సుగా చెప్పబడింది.

ఋషి దయానందభాష్యం:- ఒక తపస్సు ఆచరించేటప్పుడు ఎంత ఏకాగ్రత అవసరమో ఎంత నియమం, నిష్ఠ అవసరమో వేదాధ్యయనానికీ అవి అంత అవసరం. అంటే బ్రాహ్మణుడికి ఈ లోకంలో వేదాభ్యాసమే ఉత్తమోత్తమ తపస్సుగా చెప్పబడింది(సం.వి.వే.) ॥141॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆ హైవ స నఖాగ్రేభ్యః పరమం తప్యతే తపః । మూలశ్లోక సం.**116**
యః స్రగ్వ్యపి ద్విజోఽధీతే స్వాధ్యాయం శక్తితోఽన్వహమ్॥ప్రక్షిప్త శ్లోకసం.**142[2.167]**

టీక:- **యః ద్విజః**= ఏ ద్విజుడు, **స్రగ్వ్యపి** = మాలాధారణం చేసికూడా, అంటే గృహస్థుడై కూడా, **అను+అహమ్** = ప్రతి దినం, **శక్తితః స్వాధాయం అధీతే** = పూర్ణశక్తితో అంటే అధికాధిక ప్రయత్నంచేసి వేదాలను అధ్యయనం చేస్తూ ఉంటాడో, **ఆ+నఖాగ్రేభ్యః హ +ఏవ** = కచ్చితంగా పాదనఖాగ్రం వరకు (పూర్ణంగా), **పరమం తపః తప్యతే** = శ్రేష్ఠమైన తపస్సు చేసినవాడవుతున్నాడు.

తాత్పర్యం:- ఎవడు బ్రహ్మచర్యనియమంతో శక్తికొద్దీ ప్రతిదినమూ వేదం అభ్యసిస్తాడో, అతడు తలనుండి పాదముల గోళ్ళ కొనలవరకును గొప్ప తపమును చేసినవాడే అవుతాడు.॥142॥

వివరణ:

'స్రగ్వీ' శబ్దాన్ని గురించి:-పుష్పమాలాది అలంకృత వస్తువులను బ్రహ్మచారి ధరించరాదని మనువు నిషేధించాడు (2-157). కానీ గృహస్థుడు కాబోయేవాడికి సమావర్తన సంస్కార సందర్భంలో మాలను ధరించవచ్చునని ఆదేశముంది. 3.3వ శ్లోకంలో **"స్వగ్విణం తల్ప ఆసీనమ్"** పుష్పమాలాధారణం గృహస్థాశ్రమ ప్రవేశ ప్రతీకగా ప్రచలితమైంది. నేడు వధూవరులు పరస్పరం మాలలు వేసుకోవడం ద్వారా ఆచారంలోకి వచ్చింది. ఈ మాల్యార్పణం వివాహసంస్కారానికి ముందు జరుగుతుంది. ఈ విధంగా 'స్రగ్వీ' శబ్దం గృహస్థుడికి రూఢియైనది. అందువల్ల ఇక్కడ 'స్రగ్వీ' అంటే గృహస్థుడని అర్థం.

వేదాధ్యయనం చేయనివాడు శూద్రుడౌతాడు-

ఇది మనుకృతం-ప్రామాణికం

యోఽనధీత్య ద్విజో వేదమన్యత్ర కురుతే శ్రమమ్ । మూలశ్లోక సం.**117**
స జీవన్నేవ శూద్రత్వమాశు గచ్ఛతి సాన్వయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**143[2.168]**

టీక:- **యః ద్విజః** = ఏ బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, **వేదమ్ అనధీత్య** = వేదాన్ని చదవకుండా, **అన్యత్ర శ్రమమ్ కురుతే** = అన్యశాస్త్రాలను చదువుతాడో, **సః** = అతడు, **జీవన్+ఏవ** = జీవించి ఉండగానే, **సాన్వయః** = తన వంశంతో కూడా, **ఆశు** = శీఘ్రంగా, **శూద్రత్వం గచ్ఛతి** = శూద్రస్థితిని పొందుతాడు.

తాత్పర్యం:- ఎవడు వేదమును అధ్యయనం చేయకుండా, ఇతర శాస్త్రాదులలో పరిశ్రమ చేస్తాడో, అతడు జీవించి ఉండగానే తన వంశంతో పాటు శూద్రత్వం పొందుతాడు.॥143॥

ఋషిదయానందభాష్యం:-వేదాన్ని చదవకుండా, అన్యగ్రంథాలను చదువుతాడో, అతడు పుత్రపౌత్రులతో కూడా వెంటనే శూద్రభావాన్ని పొందుతాడు (స.ప్ర. 3వ.స).

వేదాన్ని చదవనందువల్ల-కుటుంబమంతా శూద్రులవడం-ఎందువల్ల? అలాంటి వ్యక్తి శూద్రుడు కాడు. శూద్రత్వాన్ని పొందుతాడు. వేదాధ్యయనాన్ని విడిచిపెట్టి అన్యత్ర శ్రమచేస్తాడో అలాంటివాడికి విద్వత్వం, ధార్మిక జీవనం అలవడదు. విద్వత్తు లేనందువల్ల శూద్రత్వ స్థాయికి దిగజారుతాడు. గృహంలో ఉన్న ప్రముఖ వ్యక్తి విద్వాంసుడు కానప్పుడు, అతడిని ఆశ్రయించి ఉన్న పుత్ర పౌత్రులందరూ చదువుసంధ్యలు లేనందువల్ల శూద్రతుల్యులవుతారు. ద్విజుల ముఖ్య ఉద్దేశమే వేదాధ్యయనం. అలాంటి వేదాధ్యయనాన్ని విడిచిపెట్టి అన్యకార్యాలలో శ్రమచేసే వ్యక్తి ద్విజత్వరహితుడవుతాడు. శూద్రుడి లాగా అతడు కూడా వేదాధ్యయన రహితుడవుతాడు.(సం.వి.వే)

144 నుండి 149వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ద్వితీయజన్మనిరూపణము-

* ***మాతురగ్రేఽధిజననం ద్వితీయం మౌంజిబంధనే ।***
తృతీయం యజ్ఞదీక్షాయాం ద్విజస్య శ్రుతిచోదనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***144[2.169]***

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి 3 జన్మములు. మాతృగర్భంలో నుంచి జనించేటప్పుడు మొదటి జన్మగా పరిగణిస్తారు. ఉపనయన విధి వల్ల ద్వితీయ జన్మం సిద్ధిస్తుంది. దీంతో 'ద్విజు'డవు తాడు. అంటే రెండు సార్లు జన్మించినవాడని అర్థం. ఇక-యజ్ఞం వల్ల తృతీయ జన్మమదనబడతాడు.॥144॥

* ***తత్ర యద్బ్రహ్మజన్మాస్య మౌంజీబంధన చిహ్నితమ్ ।***
తత్రాస్య మాతా సావిత్రీ పితా త్వాచార్య ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***145[2.170]***

* ***వేద ప్రదానాదాచార్యం పితరం పరిచక్షతే ।***
న హ్యస్మిన్ యుజ్యతే కర్మ కించిదామౌంజిబంధనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***146[2.171]***

తాత్పర్యం:- వేదాన్ని తండ్రి తానే స్వయంగా కుమారుడికి ఇవ్వడం ఒక విధానం. అలా కాకుండా ఆచార్యుడివల్ల వేదాన్ని పొందడం వల్ల, ఆయననూ తండ్రిగా పరిగణించడం ఉంది. ఉపనయనం జరుగనంత వరకు శ్రౌత-స్మార్త కర్మలలో బ్రాహ్మణుడనబడడు.॥145,146॥

* ***యజ్ఞోపవీతానికి పూర్వం మంత్రోచ్చారణ నిషేధం-***

* ***నాభివ్యాహారయేద్బ్రహ్మ స్వధానినయనాదృతే ।***
శూద్రేణ హి సమస్తావద్యావద్వేదే న జాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***147 [2.172]***

తాత్పర్యం:- ఉపనయనం అయ్యేంత వరకు శ్రాద్ధకాలంలో చెప్పవలసిన మంత్రాలు తప్ప మరి ఏ వేదమంత్రాన్ని చెప్పరాదు. వేదం వల్ల జన్మం కలిగే వరకు (ఉపనయనసంస్కారమయ్యే వరకు) బ్రాహ్మణుడు శూద్రతుల్యుడే అవుతాడు.॥147॥

* ***కృతోపనయనస్యాస్య వ్రతాదేశనమిష్యతే ।***
బ్రహ్మణో గ్రహణం చైవ క్రమేణ విధిపూర్వకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***148 [2.173]***

తాత్పర్యం:- ఉపనయనం చేసికొన్నవాడికే సమిదాధానం, వేదాధ్యయనమును శాస్త్రవిధి చొప్పున క్రమంగా విధింపబడినవి.॥148॥

* యద్యస్య విహితం చర్మ యత్సూత్రం యా చ మేఖలా ।
యో దణ్డో యచ్చ వసనం తత్తదస్య వ్రతేష్వపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **149[2.174]**

తాత్పర్యం:- బ్రహ్మచారికి ఉపనయన కాలమున వర్ణమును అనుసరించి ఏ చర్మం, ఏ యజ్ఞోపవీతం, ఏ మొలతాడు, ఏ దండం, ఏ వస్త్రం విధింపబడినవో, వాటినే గోదానాదివ్రతకాలము లందుకూడా కొత్తవి ధరించుకోవాలి.॥149॥

ప్రక్షిప్తాల పరిశీలన

144 నుండి 149 వరకు ఉన్న శ్లోకాలలోని విషయం కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు-

1. అంతర్ వ్యతిరేకం:-శూద్రుల మంత్రోచ్చారణ మనుసమ్మతం

క. 144వ శ్లోకంలో ద్విజాతీయుల మూడు జన్మలను గురించి చెప్పారు. ఇది మునుపటి విషయాలకు వ్యతిరేకంగా, ఒక కొత్త కల్పనగా ఉంది. 2.122-123 (2.147-148) శ్లోకాలలో మనువు ద్విజులకు రెండు జన్మలనే చెప్పాడు- మొదటిది పుట్టినప్పుడు, రెండవది ఆచార్యుని ద్వారా ఉపనయన సంస్కారంతో **'ద్విజుడు'** అనే పదంతోనే **'ద్విర్జాయతే ఇతి ద్విజః'** - అంటే ఎవరు సమావర్తన సంస్కారంతో రెండవ జన్మ నెత్తుతారో వారు, అంటే ఈ సంస్కారం జరిగిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులు అనిపిలుస్తారు. శూద్రులను ఏకజాతివారంటారు అని స్పష్టమవుతుంది (10.4). ఈ శ్లోకాలలో ద్విజులకు మూడు జన్మలుంటాయనే కల్పన పైన చెప్పిన వాటికి భిన్నం కనుక వ్యతిరేకమైంది.

ఖ. ఇదే విధంగా 145వ శ్లోకంలోని కొన్ని తేడాలున్న వర్ణనల వల్లనూ ఈ శ్లోకాలు ఇతరులు చెప్పినవి అనిపిస్తుంది. ఇక్కడ **'సావిత్రి'**ని మాత రూపంలో, **'ఆచార్యుణ్ణి'** తండ్రి రూపంలో వర్ణించారు. కానీ కొన్ని శ్లోకాలకు ముందు 119 (144) వాటిలో ఆచార్యుణ్నే తల్లిదండ్రుల సంయుక్త రూపంగా చెప్పారు. ఇలాంటి తేడా ఉండటం పరస్పర వ్యతిరేకం అవుతుంది.

గ. 143-147 శ్లోకాల వల్ల, ఈ శ్లోకాలు 'శూద్రులకు వేదపఠన శ్రవణాలు పనికిరావు' అనే భావనతో రచించినవని - తెలిసిపోతూంది. అందుకనే 147వ శ్లోకంలో ఉపనయనానికి ముందు బాలకుణ్ని శూద్రుడుగా భావించడం చేతనే వేద శ్రవణంపై అతనికి హక్కు లేదన్నారు. ఈ అభిప్రాయం కూడా వ్యతిరేకమే. మనువు కర్మల చేతనే వర్ణవ్యవస్థను ఏర్పరిచాడు. అతని వ్యవస్థను అనుసరించి ఎవడు చదువుకోడో వాడు శూద్రుడు. కానీ ధర్మకార్యాలు చేయటానికి నిషేధం లేదు. అతడు అన్ని ధర్మాలూ నిర్వహించవచ్చు. అందుకే 2.213 (2.238)లో - **'అంత్యాదపి పరం ధర్మం'**- అంటే- **'శూద్రుడు కూడా శ్రేష్ఠ ధర్మాలను నేర్చుకోవాలి'** అని చెప్పాడు. (దీన్ని గురించి 1.107 మీది అంతర్ వ్యతిరేకం సమీక్ష చూడండి)

ఘ. 146,147 శ్లోకాలలో, ఉపనయనానికి పూర్వం వేద మంత్రాలతో వ్యవహారాలు చేయకండి అనటం కూడా మనువు సంప్రదాయానికి వ్యతిరేకం. ఎందుకంటే దానికన్నా ముందు జరిగే జాతకర్మ, నామకరణం మొదలైన అన్ని సంస్కారాలూ వేదమంత్రోచ్చారణతోనే జరుగుతాయి. 2.4(2.29)లో మనువే మంత్రోచ్చారణలతో సంస్కారాలు చేయుమని చెప్పాడు- **'మంత్రవత్ ప్రాశనం చాస్య'.**

జ. 2.80,81(2.105,106) శ్లోకాలలో వేదాధ్యయనం సర్వకాల సర్వావస్థలలోనూ పుణ్యం కలుగజేస్తుందని చెప్పాడు. ఈ శ్లోకాలలో ఉపనయనానికి ముందు వేదాలతో వ్యవహారాలు జరుపవద్దని చెప్పటం ఆ శ్లోకాలకు వ్యతిరేకం. ఇలా అంతర్ వ్యతిరేకాల వల్ల 144-147 వరకుగల శ్లోకాలు ప్రక్షిప్తాలు. 147వ శ్లోకం. 146,147లలోనూ, 149వ శ్లోకం 148లోని **'వ్రతాదేశనం'** విషయంతో కలవటం చేత సహజంగానే ప్రక్షిప్తాలని తెలుస్తుంది.

2. వేదవ్యతిరేకం

146,147 శ్లోకాలలోని శూద్రునికి వేదాధ్యయన, శ్రవణాలకు అధికారం లేదనటం వేదాలకు వ్యతిరేకం. వేదాలలోనే శూద్రులకు వేదపఠనం, శ్రవణాలున్నాయని ఉంది. దీనికి 2.41,42 (2.66,67) శ్లోకాలపై 'వేదవ్యతిరేకాలు' అనే సమీక్ష చూడండి, మనుస్మృతికి మూలాధారాలు వేదాలే. అందుచేత వేదవ్యతిరేక సంప్రదాయాన్ని చెప్పినందున ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

150 నుండి 155 వరకు గల శ్లోకాలు మనుకృతం- ఇవి ప్రామాణికం

గురుకులవాసంలో- బ్రహ్మచారులు పాటించాల్సిన వివిధ నియమాలు-

సేవేతేమాంస్తు నియమాన్ బ్రహ్మచారీ గురౌ వసన్ । మూలశ్లోక సం. **118**
సన్నియమ్యేన్ద్రియగ్రామం తపోవృద్ధ్యర్థమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **150[2.175]**

టీక:- గురౌ వసన్ = గురువుకు సమీపంలో, గురుకులంలో నివసిస్తూ, **బ్రహ్మచారీ** = బ్రహ్మచారి, **ఆత్మనః తపోవృద్ధ్యర్థం** =తన విద్యారూపమైన తపస్సు యొక్క అభివృద్ధికోసం, **ఇన్ద్రియగ్రామం సన్నియమ్య** = ఇంద్రియ సమూహాలను, (2.64-67) వశమందుంచుకొని, **ఇమాంస్తు నియమాన్ సేవేత** = ముందు వర్ణింపబోవు ఈ నియమాలను పాటించాలి.

తాత్పర్యం:- బ్రహ్మచారి గురుకుంలో నివసింస్తూ ఇంద్రియాలను బంధించి, ఆముష్మికము నందలి తపోఽభివృద్ధికోసం ముందు వర్ణించే నియమాలను పాటించాలి. ॥150॥

వివరణ:

'బ్రహ్మచారి' శబ్ద వ్యుత్పత్తి-

"బ్రహ్మన్" శబ్దం ఉప పదంలో ఉండగా, 'చరగతౌ' (భ్వాది) ధాతువుకు 'ణినిః' ప్రత్యయం చేర్చగా, "బ్రహ్మచారీ" శబ్దం నిష్పన్నమవుతుంది. "**బ్రహ్మణి వేదే చరితుం శీలం యస్య సః** = బ్రహ్మచారీ, (విగ్రహం) వేదాధ్యయనంలో నిరంతరం నిమగ్నుడవడం వల్ల "బ్రహ్మచారీ" అనబడును. బ్రహ్మచర్యాశ్రమమే ప్రథమాశ్రమం. ఈ ఆశ్రమంలో ఉంటూ బ్రహ్మచారి యజ్ఞోపవీతం ధరించి దీక్షితుడై గురుకులంలో తన గురువుతోపాటు నివసిస్తాడు. గృహస్థాశ్రమంలో ప్రవేశించనంతవరకు, వేదాధ్యయనంతో పాటు బ్రహ్మచర్యాశ్రమ నియమాలను పాటిస్తూ ఉంటాడు.

బ్రహ్మచారి దైనందిన నియమాలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

నిత్యం స్నాత్వా శుచిః కుర్యాదేవర్షిపితృతర్పణమ్ । మూలశ్లోక సం. **119**
దేవతాఽభ్యర్చనం చైవ సమిదాధానమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **151[2.176]**

టీక:- బ్రహ్మచారి **నిత్యం** = ప్రతిదినం, **దేవ-ఋషి-పితృ-తర్పణం** = దేవ-విద్వాంసులకు, ఋషులకు, పితృ, జ్ఞానవయోవృద్ధులైన వ్యక్తులకు అభివందనాలు చేసి, ప్రసన్నతను కలిగించే కార్యాల ద్వారా వారికి తృప్తి (సంతోషం) ని కలిగించి, **స్నాత్వా శుచిః** = స్నానంచేసి పరిశుద్ధుడై, **దేవతా+అభ్యర్చనం** = పరమాత్మోపాసన, **చ** = మరియు, **సమిత్+ఆధానం** = అగ్నిహోత్రం,హోమం, **కుర్యాత్** = చేయాలి.

తాత్పర్యం:- బ్రహ్మచారి ప్రతిరోజూ స్నానం చేసి పరిశుద్ధుడై, దేవ-ఋషి, పితరులను సంతృప్తిపరచి ఈశ్వరారాధనను, సమిధాయజ్ఞాన్ని (అగ్నికార్యం) నిర్వర్తించాలి.॥151॥

వివరణ: బ్రహ్మచారికి పెద్దలెవరు?

బ్రహ్మచారి పెద్దలకు సేవ చేయాలి. ఆ పెద్దలెవరు? దేవతలు, ఋషులు, పితరులు. కొందరు వ్యాఖ్యాకారులు ఈ శ్లోకానికి భ్రాంతిపూర్ణమైన అర్థాన్ని రాశారు. అది మనుమహర్షి సిద్ధాంతానికి వ్యతిరేకం. ఈ శ్లోకంలో గురుకులమందుండే బ్రహ్మచారి చేయవలసిన దైనందిన కర్మలు పేర్కొనబడినవి. దేవ, ఋషి-పితృతర్పణాలు మరియు దేవతార్చనం. ఇక్కడ ఈ శబ్దార్థాలను భ్రాంతి నివారణార్థం వివరించవలసిన అవసరముంది.

1. పితృయజ్ఞం విధానం ఎవరు చేయాలి?

గృహస్థులు లేదా వానప్రస్థులు చేయవలసింది. "మృతక పితృతర్పణం చేసేవారు కూడా అంగీకరించిన విషయం. అయితే ఇక్కడ గురుకులమందుండే బ్రహ్మచారికి చేయవలసిన విధులుగా చెప్పబడినవి. అందువల్ల ఈ విషయం స్పష్టంగా తెలిసికోవాలి. పితృతర్పణమంటే గతించిన పితరులకు శ్రాద్ధం పెట్టడం కాదు. గురుకులమందుండే బ్రహ్మచారులకు దేవతలెవరు? ఋషులెవరు? పితరులెవరు? వీరు విద్వాంసులు, పాలన పోషణకర్తలు, జ్ఞానవయోవృద్ధులైన వ్యక్తులు. అంతేగాని, కల్పితమైన దేవతలు గాని లేదా మృతపితరులు గాని కాదు. వీరందరూ విభిన్నమైన స్థాయికి చెందినవారు. ఈ విషయంలో వివరంగా తెలియడానికి 3.82వ శ్లోక సమీక్షను చూడగలరు.

2. 'దేవతాభ్యర్చనము' గూర్చి నిరుక్తకథనమేమంటే-

"యో దేవః స దేవతా" (7.4.15) దేవుడికే దేవత అని పేరు. దేవశబ్దానికి **'తల్, టాప్'** ప్రత్యయం చేర్చగా **'దేవతా'**శబ్దం నిష్పన్నమవుతుంది. చేతనదేవతల సందర్భంలో దేవ శబ్దానికి అన్నిటికంటె ముఖ్యమైన అర్థం **"పరమాత్మ"**. పరమాత్మ దేవతే సర్వదేవతలకు **'దేవత'**. ఉపయోగానికి యోగ్యమైనవి జడదేవతలు. విద్వాంసులు, తల్లిదండ్రులు, ఆచార్యుడు మొదలైనవారు చేతన దేవతలు. సత్కారానికి యోగ్యులు. సేవనీయులు, పూజనీయులు. ఆదరించి ప్రసన్నులుగా చేయదగినవారు. కానీ ఉపాసనకు పరమాత్మ ఒక్కడే యోగ్యుడు. ఇతరులు ఉపాసనకు యోగ్యులు కారు. వారందరూ సన్మానానికి తగినవారు మాత్రమే. అందువల్ల ఇక్కడ **'దేవతాభ్యర్చనమ్'** అంటే **'పరమేశ్వరుణ్ణి అర్చించడమే'** అని చెప్పబడింది. ఎక్కడైనా అగ్ని, ఇంద్ర-వరుణ మొ॥ పేర్లతో స్తోత్రాలు చేయబడి ఉన్నవో అక్కడ కూడా ఈ పేర్లద్వారా పరమేశ్వర ప్రార్థనే అని గుర్తించాలి. ఇవన్నీ పరమేశ్వరుని దివ్య శక్తులు లేదా గుణాలని గ్రహించాలి. భిన్న భిన్నమైన దేవస్తుతులన్నీ పరమేశ్వరుడికి చెందిన ఏదో ఒక గుణాన్ని సూచిస్తుంది. ఈ విధంగా దేవతలందరూ ఒక పరమాత్మయందే సమాహితులై ఉంటారు. ఈ విషయాన్నే నిరుక్తకారుడు స్పష్టంచేశాడు.

3. **"మహాభాగ్యాద్దేవతాయాః ఏక ఆత్మా బహుధా స్తూయతే ।**
ఏకస్యాత్మనోఽన్యే దేవాః ప్రత్యంగాని భవన్తి
కర్మజన్మానః ఆత్మజన్మానః, ఆత్మైవైషాం రథో భవతి
ఆత్మాశ్వః, ఆత్మాయుధమ్, ఆత్మేషవః సర్వం దేవస్య దేవస్య." నిరుక్త. 7.1.4

పరమాత్మే ముఖ్యమైన దేవుడు. సర్వశక్తిమంతుడు, సర్వైశ్వర్యసంపన్నుడు. కాబట్టి అనేకనామాలతో, గుణాలతో, స్తుతించబడుతున్నాడు. ఇతరాలైన దేవతలందరూ ఆ మహాదేవుడికి అంగప్రత్యంగాలే. వారందరూ ఇందులోనే సమాహారమవుతారు. అద్వితీయుడైన ఆ పరమేశ్వరుడి ప్రకాశం వల్ల, ధారణ వల్లనే-ఈ వ్యవహార దేవతలందరూ ప్రకాశితులవుతున్నారు. తక్కిన దేవతలందరూ ఈ అద్వితీయ పరమేశ్వరుడి సామర్థ్యం వల్లనే జన్మిస్తున్నారు, కర్మలు

చేస్తున్నారు. వీరి రథం (రమించుస్థానం) అశ్వం అంటే సాధనం, గమనహేతువు, ఆయుధం శత్రునాశనం ద్వారా విజయప్రాప్తికి సాధనం. ఇషుః-బాణంతో సమానంగా, సర్వదుష్టగుణాలను, దుఃఖాలను భేదించునట్టిది-అదే పరమాత్మ. పరమేశ్వరుడు, ఎంతెంత, దేనిదేనియందు దివ్యగుణాలను పెట్టాడో, అంతవరకే ఆ వస్తువులలో దైవత్వముంటుంది. అంతకంటే అధికంగా ఉండదు. ఈ విధంగా మిగతా దేవతలందరూ పరమేశ్వర వాచకములే.

ఇందుకు వేద ప్రమాణాలు.

4. అ. **"ఇన్ద్రం మిత్రం వరుణమగ్నిమాహురథో దివ్యః స సుపర్ణో గురుత్మాన్ ।**
ఏకం సద్విప్రా బహుధా వదన్తి అగ్నిం యమం మాతరిశ్వానమాహుః॥ ఋ. 10.164.46

ఆ. **తదేవాగ్నిస్తదాదిత్యస్తద్ వాయుస్తదు చంద్రమాః ।**
తదేవ శుక్రం తద్బ్రహ్మ తా ఆపః స ప్రజాపతిః ॥ యజు. 31.1

మనుస్మృతి ప్రమాణాలు

ఇ. **ఆత్మైవ దేవతాః సర్వా సర్వమాత్మన్యవస్థితమ్ ।**
ఆత్మాహి జనయత్యేషాం కర్మయోగం శరీరిణామ్ ॥ 12.119

ఈ. **ఏతమేకే వదన్త్యగ్నిం మనుమన్యే ప్రజాపతిమ్ ।**
ఇన్ద్రమేకే పరే ప్రాణం అపరే బ్రహ్మ శాశ్వతమ్ ॥ 12.123

మనుమహర్షి అనేక స్థానములలో కేవలం పరమాత్మే ఉపాసనీయ దేవతగా స్వీకరించాడు. ప్రమాణాలు 2.76-78(2.101-103); 4.92-93, 12.118, 119, 122, 125.

'దేవతా-అభ్యర్చనమ్'-అంటే సన్ధ్యావందనం ద్వారా పరమాత్మ దేవుడే ఉపాసనీయుడని ఈ ప్రమాణాలు, ఈ విమర్శను నిరూపిస్తున్నవి. ఇతరాలైన అర్థాలు భ్రాంతిమూలకాలు. ఈ శ్లోకంలో, శివ, విష్ణు ప్రతిమలను పూజించే కల్పన కపోలికల్పితం, అప్రమాణికం. అజ్ఞానం, అవైదికం, అనాచారం, అర్థరహితం.

5. తర్పణానికి సరియైన అభిప్రాయం

'తృప్తృప్తౌ' ధాతువుకు **'ల్యుట్'** ప్రత్యయం చేర్చగా, **'తర్పణ'** శబ్దం సిద్ధిస్తుంది. ప్రసన్నం చేయడం -దీని అర్థం.

"యేన కర్మణా విదుషః దేవాన్ ఋషీన్ పితౄంశ్చ తర్పయంతి = సుఖయన్తి, తత్ తర్పణమ్." ఏ కర్మలద్వారా, విద్వాంసులను (దేవ), ఋషులను, పితరులను, తృప్తిపరుస్తామో, సుఖపెట్టి ప్రసన్నులను చేస్తామో- ఆ పనిని తర్పణమంటారు. ఇదేవిధంగా.

"యత్తేషాం శ్రద్ధయా సేవనం క్రియతే తత్ శ్రాద్ధమ్"- 'శ్రద్ధ' తో వారికి సేవాదులు చేయడం-'శ్రాద్ధ' మనబడును. ఈ విధంగా తర్పణం చేయడం- మృతవ్యక్తికి కాదు- జీవించిన వ్యక్తికే వీలుపడుతుంది. ఈ శ్లోకంలో మనుమహర్షి చెప్పదలచుకొన్నది ఏమంటే; బ్రహ్మచారి ప్రతిదినం విద్వాంసులకు, ఋషులకు, పితరులకు, పెద్దలకు సంతోషం కలిగించే కర్మలు- అన్నభోజనాదులు, సేవాశుశ్రూషలు, అభివందనాలు, మధురభాషణములు, వినయవిధేయతలు మొ॥వి చేసి సంతృప్తి పరచడమే- తర్పణం. శ్రద్ధతో సేవ చేయడమే శ్రాద్ధం. ఈ విధమైన ప్రవర్తన వల్ల, సేవల వల్ల, బ్రహ్మచారికి విద్యాప్రాప్తి శీఘ్రం గాను, సులభం గాను లభిస్తుంది. తర్పణానికి గల ఈ అర్థాన్ని సమర్థించే శ్లోకాలు.

క. **'యథా ఖనన్ ఖనిత్రేణ నరో వార్యధిగచ్ఛతి ।**
తథా గురుగతాం విద్యాం శుశ్రూషురధిగచ్ఛతి" ॥ 2.193

ఖ. స్వాధ్యాయేనార్చయేద్ ఋషీన్ హోమైర్దేవాన్ యథావిధి ।
పితౄన్ శ్రాద్ధైశ్చ నౄనన్నై ర్భూతాని బలికర్మణా ॥ 3.81

గ. కుర్యాదహరహం శ్రాద్ధమ్ అన్నాద్యేనోదకేన వా ।
పయోమూలఫలైర్వాపి పితృభ్యః ప్రీతిమావహన్ ॥ 3.82

6. ప్రముఖమైన గుణాలనుబట్టి-ఋషులు, దేవతలు, పితరులలో తేడాలున్నాయి. 2-115 నుండి 131 వరకు శ్లోకాల వర్ణననుబట్టి, -అధ్యాపకులైన విద్వాంసుల స్థాయిని బట్టి -ఋషులు, దేవతలు పితరులుగా పిలువబడతారు. ఇందులో ఏదైనా ఒక విద్యకు సాక్షాత్తు ద్రష్టలైన విశేషజ్ఞులు ఋషులు, దివ్యగుణాలు కలిగి ఆచరణకు ప్రాధాన్యాన్నిచ్చే విద్వాంసులు దేవతలనబడతారు. పాలకవర్గానికి సంబంధించి, పాలకగుణ ప్రధానులైన వయోవృద్ధ విద్వాంసులు, అదేవిధంగా తల్లిదండ్రులు మొ॥ వృద్ధగురుజనులు పితరులవుతారు. వీరికి సేవాశుశ్రూషలందించడమే బ్రహ్మచారి కర్తవ్యం.

మద్యమాంసాదుల త్యాగం-

ఇది మనుకృతం-ప్రామాణికం

వర్జయేన్మధుమాంసం చ గన్ధం మాల్యం రసాన్ స్త్రియః। మూలశ్లోక సం. **120**
శుక్తాని యాని సర్వాణి ప్రాణినాం చైవ హింసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **152[2.177]**

టీక:- బ్రహ్మచారి, బ్రహ్మచారిణి **మధుమాంసం-గన్ధం మాల్యం రసాన్ స్త్రియః** = మధుమాంసం మదకారకమైన మద్యం, మాంసం, సుగంధద్రవ్యాలను, పూలదండలు, రసములను, స్త్రీసంగమం, పురుషసంగమం, **సర్వాణి యాని శుక్తాని** = పుల్లని, లేదా పులియబెట్టిన పదార్థాలనన్నిటినీ, **ప్రాణినాం హింసనం**= ప్రాణులను హింసించడం, **వర్జయేత్** = వదలిపెట్టాలి.

తాత్పర్యం:- బ్రహ్మచారులు మద్యం తాగరాదు. మాంసాన్ని భక్షించరాదు. చందనాది సువాసన ద్రవ్యాల్ని వాడకూడదు. పూలు ధరించరాదు. స్వభావరీత్యా సువాసన గలిగిన సుమధుర పదార్థాలు తినకూడదు. అలాగే పులియబెట్టినవీ పనికిరావు. ప్రాణిహింస చేయరాదు. స్త్రీలతో కలియరాదు.॥152॥

ఋషి దయానందభాష్యం:- బ్రహ్మచారి, బ్రహ్మచారిణి మద్యం, మాంసం, గంధం పుష్పహారం, రసాలు స్త్రీ పురుషుల పరస్పర సాంగత్యం. **'పుల్లని పదార్థాలు, ప్రాణిహింస'** అనే వీటిని విసర్జించాలి (స.ప్ర. 3వ.స).

వివరణ:

"మధు"శబ్దం- అర్థం.

ఈ శ్లోకంలో మధుశబ్దానికి అర్థం మద్యం. **"మాద్యతే ఇతి సతః"** మత్తును కలిగించేది మద్యం, గంజాయి మొ॥ మాంసశబ్దంతో పాటు ఈ శబ్ద ప్రయోగం. అది కూడా నిషేధాత్మకంగా ఉన్నందువల్ల, మధుశబ్దం మద్యమునే చెబుతుంది. తేనెకు కూడా ఉపయోగించే మధుశబ్దం అభక్ష్యం కాదు. జాతకకర్మలో బిడ్డకు తేనె నాకించమని విధానముంది. ఉదాహరణార్థం **"మన్త్రవత్ ప్రాశనంచాస్య హిరణ్యమధుసర్పిషామ్"**. 2-4[2.29]

అంజనం, గొడుగు-చెప్పులు మొ॥వి.వాడరాదు-

ఇది మనుకృతం-ప్రామాణికం

అభ్యంగమంజనం చాక్షోరుపానచ్ఛత్రధారణమ్ । మూలశ్లోక సం. **121**
కామం క్రోధం చ లోభం చ నర్తనం గీతవాదనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **153[2.178]**

టీక:- అభ్యంగం = శరీరాన్ని మర్దించడం, కారణం లేకుండా ఉపస్థేన్ద్రియ స్పర్శనం, తలంటు స్నానం, **అక్ష్ణోః అఞ్జనం** = కన్నులకు కాటుక, **ఉపానత్-ఛత్ర-ధారణమ్** = చెప్పులు, గొడుగు ధరించడం, **కామం క్రోధం లోభం చ** = కామం, క్రోధం, లోభం, మోహం, భయం, శోకం, ఈర్ష్య-ద్వేషం, **చ** = మరియు, **నర్తనం గీతవాదనమ్** = నాట్యం, పాటలు, వాద్యం వీటిని కూడా విడిచిపెట్టాలి.

తాత్పర్యం:- తలంటుకొని స్నానం, కళ్లకు కాటుక, పాదరక్షలు-గొడుగు వంటివి ఉపయోగించడం చేయరాదు. స్త్రీసంగమం నిషేధం. (ఇది పై శ్లోకంలోనూ చెప్పబడింది.) క్రోధ లోభాలను వర్జించాలి. నాట్యం, వాద్యం, గానం వంటివి స్వయంగా చేయరాదు. వాటిలో ఆసక్తి తగదు. (కేవలం ఈ కళల్లోనే నిష్ణాతులు కాదలచిన వారి విషయంలో చెప్పబడలేదు). ॥153॥

ఋషి దయానందభాష్యం:- శరీరమర్దనం, కారణం లేకుండా ఉపస్థేన్ద్రియాన్ని తాకుట, కన్నులకు కాటుక పెట్టుట, పాదరక్షలు, ఛత్రం ధరించుట, మరియు కామం, క్రోధం, లోభం, మోహం, భయం, శోకం, ఈర్ష్య, ద్వేషం, నృత్యం గానం, వాద్యవాదనాలు మొ॥వాటిని వీడాలి. (స.ప్ర.3వ.స.)

పేకాట-నింద-స్త్రీదర్శనం మొ॥వి నిషేధం ఇది మనుకృతం-ప్రామాణికం

ద్యూతం చ జనవాదం చ పరివాదం తథానృతమ్ । మూలశ్లోక సం.**122**
స్త్రీణాం చ ప్రేక్షణాలంభముపఘాతం పరస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**154[2.179]**

టీక:- ద్యూతం = జూదం, **జనవాదం** = లేనిపోని పుకార్లు పుట్టించడం, **పరివాదం** = నింద, **అనృతమ్** = మిథ్యాభాషణం, **స్త్రీణాం ప్రేక్షణ+ఆలంభమ్** = స్త్రీలను నిఘాపెట్టి చూడటం. ఆశ్రయించడం, **పరస్య ఉపఘాతం** = ఇతరులకు హానికలిగించడం మొదలైన కుకర్మలను వదిలి పెట్టాలి.

తాత్పర్యం:- జూదమాడటం, పరులతో వృథావాక్కుల కలహం, పరులను నిందించడం, అసత్యమాడటం, స్త్రీలను సంభోగేచ్ఛతోను, కామంతోను చూడటం, కౌగిలించుకోవడం ఇతరులకు అపకారం చేయడం ఇవి అన్నీ చేయరాదు.॥154॥

ఏకాకిగా (ఒంటరిగా) శయనించడం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకశ్శయీత సర్వత్ర న రేతః స్కన్దయేత్క్వచిత్ । మూలశ్లోక సం.**123**
కామాద్ధి స్కన్దయన్ రేతో హినస్తి వ్రతమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**155[2.180]**

టీక:- సర్వత్ర ఏకః శయీత = ఎక్కడైనా ఒంటరిగా నిద్రించాలి, **రేతః క్వచిత్ న స్కన్దయేత్** = ఎప్పుడూ వీర్యస్ఖలితం కారాదు, **కామాత్ హి రేతః స్కన్దయన్** = కామంతో రేతస్సును స్ఖలితం చేస్తే, **ఆత్మనః వ్రతం హినస్తి** = తన బ్రహ్మచర్యవ్రతాలను భంగం చేసినట్లే.

తాత్పర్యం:- బ్రహ్మచారి ఎక్కడైనా ఒంటరిగా నిద్రించాలి ఎప్పుడూ వీర్యస్ఖలితం కారాదు. కామంతో రేతస్సును స్ఖలితం చేస్తే, తన బ్రహ్మచర్య వ్రతాలను భంగం చేసినట్లే. ॥155॥

ఈ శ్లోకం ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

*స్వప్నదోషానికి ప్రాయశ్చిత్తం-

* స్వప్నే సిక్త్వా బ్రహ్మచారీ ద్విజశ్శుక్రమకామతః ।
స్నాత్వాఽర్క మర్చయిత్వా త్రిః పునర్మామిత్యృచం జపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**156[2.181]**

తాత్పర్యం:- కలలో ఏ స్త్రీనైనా ఊహించుకొని, ఆమెతో సంభోగించినట్లుగా భావన వల్ల రేతః స్ఖలనం జరిగినా, అది కూడా తప్పే ! అలాంటి పాపంపని జరిగినప్పుడు ఉదయాన్నే స్నానంచేసి, సూర్యోపాసన చేసి 'పునర్మామైత్రింద్రియం' అనే ఋక్‌ను ముమ్మారు పఠించాలి. "ఇంద్రియం మళ్లీ నన్ను వీర్యవంతుని చేయుగాక' అని దీని అర్థం.॥156॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం

1. ప్రసంగ వ్యతిరేకం

150 (175)వ శ్లోకంలో ఈ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, బ్రహ్మచారి నియమాలు కొన్ని సంకేతించారు. దాని ప్రకారం తర్వాతి అన్ని శ్లోకాలలోనూ బ్రహ్మచారి నియమాలు చెప్పారు. కానీ, ఈ శ్లోకంలో ఏ నియమమూ చెప్పకుండా ప్రాయశ్చిత్త వర్ణన ఉంది. ఇతర నియమాలతో పాటుగా అవి పాటించకపోతే ప్రాయశ్చిత్తాలేవీ చెప్పకుండా ఇది మాత్రం చెప్పటం మనుసమ్మతమూ కాదు, సందర్భోచితమూ కాదు. ఇది సందర్భోచితమైతే, మిగిలిన నియమాలతో పాటుగా వాటి ఉల్లంఘన, ప్రాయశ్చిత్తాలు కూడా ఉండేవి. సందర్భోచితం కానందున- ఇది ప్రక్షిప్తం. ప్రాయశ్చిత్తాలను గురించి 11వ అధ్యాయంలో సమగ్రంగా ఉంది. ఇది అక్కడైతే సందర్భోచితమయ్యేది.

2. అంతర్ వ్యవరేకం

ఈ అధ్యాయంలోనూ, మొత్తం మనుస్మృతి అంతటా మనువు కేవలం ఈశ్వర పూజ, ఉపాసన, అగ్నిహోత్రం మొదలైనవి చెప్పాడు. కానీ, జడపదార్థాల వర్ణన ఎక్కడా చేయలేదు. ఈ శ్లోకంలో సూర్యపూజ చెప్పటం, మనువు పద్ధతులకు అనుకూలంగా లేదు. అందువల్ల ఇది తరువాత చొప్పించిన విషయమే.

3. శైలీగత ఆధారం, విషయవ్యతిరేకం

మనుస్మృతిలోని శైలి ఆధారంగా కూడా ఈ శ్లోకం మౌలికం కాదని తెలుస్తూంది. మనుస్మృతిలోని పది అధ్యాయాలలో ధర్మవిధానాలు, పదకొండవ అధ్యాయంలో ప్రాయశ్చిత్త విధానం ఉన్నాయి. ప్రాయశ్చిత్త విధానం కొరకే మనువు ఒక ప్రత్యేక అధ్యాయం రాశాడంటే, ప్రాయశ్చిత్త విధానాలన్నీ అక్కడే ఉండాలి. ఈ నిర్ధారిత శైలి వల్లనూ ఈ శ్లోకం మనువుశైలికి అనువుగా లేదు.

157 నుండి 161 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

భిక్షాసంబంధ నియమం-

ఉదకుమ్భం సుమనసో గోశకృన్మృత్తికాకుశాన్ । మూలశ్లోక సం.**124**
ఆహరేద్యావదర్థాని భైక్షం చాహరహశ్చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**157[2.182]**

టీక:- **ఉదకుమ్భం** = కుండనిండా నీళ్ళు, **సుమనసః** = పుష్పాలు, **గోశకృత్** = గోమయం, (పేడ), **మృత్తికా** = మట్టి, **కుశాన్** = దర్భలు, **యావత్ అర్థాని** = అవసరమున్నంత వరకే, **ఆహరేత్** = తీసికొచ్చి పెట్టాలి, **చ** = మరియు, **భైక్షం** = భిక్షకూడా, **అహః+అహః చరేత్** = ప్రతిదినం అడిగి తెచ్చుకొని భుజించాలి.

తాత్పర్యం:- నీటితోనింపిన కడవ, పుష్పాలు, గోమయం (ఆవుపేడ) మృత్తిక, దర్భలు, గురువుగారి కోసం సమకూర్చాలి. బ్రహ్మచారికి ఉపనయనంనాడు చెప్పిన భిక్షాటన రోజూ చేయాలి. (లేదా గురువు ఇంట తినవచ్చు.)॥157॥

ఎవరిని భిక్ష అడగాలి?-
ఇది మనుకృతం-ప్రామాణికం

వేదయజ్ఞైరహీనానాం ప్రశస్తానాం స్వకర్మసు । మూలశ్లోక సం.**125**
బ్రహ్మచార్యాహరేద్భైక్షం గృహేభ్యః ప్రయతోఽన్వహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**158[2.183]**

టీక:- **బ్రహ్మచారీ** = బ్రహ్మచారి, **స్వకర్మసు ప్రశస్తానాం** = తమకర్తవ్య పాలనలో సావధానులైనవారు, **వేదయజ్ఞైః+అహీనానాం** = వేదాధ్యయనం, పంచమహాయజ్ఞాలు ఆచరించేవారు అంటే ప్రతిదినం ఆచరించేవారు-ఇలాంటి శ్రేష్ఠవ్యక్తుల, **గృహేభ్యః** = గృహాల నుండి, **ప్రయతః** = ప్రయత్నపూర్వకంగా, **అన్వహం** = ప్రతిదినం, **భైక్షం ఆహరేత్** = భిక్షను తెచ్చుకొందురుగాక ! ॥158॥

తాత్పర్యం:- వేదాధ్యాయనం, పంచమహాయజ్ఞాదులు వదలక ఆచరించేవారూ, స్వకర్మలందు నేర్పరులూ అయిన గృహస్థుల ఇండ్లనుండి బ్రహ్మచారి పరిశుద్ధుడై ప్రతిదినం పక్వాన్న భిక్షను తీసుకురావాలి. ॥158॥

ఎలాంటి గృహాలకు భిక్షకు పోరాదు?-
ఇది మనుకృతం-ప్రామాణికం

గురోః కులే న భిక్షేత న జ్ఞాతికులబంధుషు । మూలశ్లోక సం.**126**
అలాభే త్వస్య గేహానాం పూర్వం పూర్వం విసర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**159 [2.184]**

టీక:- బ్రహ్మచారి, **గురోః కులే న భిక్షేత** = గురుపరివారంలో, అలాగే **న జ్ఞాతి-కుల-బన్ధుష** = దాయాదుల, మిత్రుల గృహాలలో భిక్ష అడగరాదు, **అస్య గేహానాం అలాభే తు** = అన్యగృహాల నుండి భిక్షదొరకనప్పుడు, **పూర్వం పూర్వం వివర్జయేత్** = ముందుముందున్న గృహాలను వదిలివేస్తూ భిక్షను పొందవచ్చు. ముందు మిత్రుల, పరిచితుల, జ్ఞాతుల గృహాలలో భిక్ష అడగాలి. అక్కడ లభించనప్పుడు సంబంధీకుల గృహాలలో అడగాలి. అక్కడ కూడా ప్రాప్తించనప్పుడు, గురుపరివారం నుండి భిక్ష పొందవచ్చు.

తాత్పర్యం:- గురుకులంలోనూ, గురువుల, దాయాదుల ఇండ్లలోనూ, మేనమామలు మొదలైన చుట్టాల ఇండ్లలోనూ భిక్షాటన చేయరాదు. ఇతరుల గృహాలలో భిక్ష దొరకనప్పుడు బంధువుల ఇండ్లు, అవి లేనప్పుడు, దాయాదుల ఇండ్లు, అవి లేనప్పుడు గురుకులంలో భిక్షాటన చేయాలి.॥159॥

పాపకర్మలు చేసేవారిని భిక్ష అడగరాదు-
ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వం వాఽపి చరేద్గ్రామం పూర్వోక్తానామసంభవే । మూలశ్లోక సం.**127**
నియమ్య ప్రయతో వాచమభిశస్తాంస్తు వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**160 [2.185]**

టీక:- **పూర్వోక్తానాం అసంభవే** = పూర్వోక్త (2-158,159 శ్లోకాలు) మైన గృహాలు లేనప్పుడు, **సర్వం వా+అపి గ్రామం చరేత్** = గ్రామమంతటా తిరిగి భిక్ష అడగవచ్చు, **తు** = కాని, **ప్రయతః వాచమ్ నియమ్య** = ప్రయత్నపూర్వకంగా వాక్సంయమం చేసికొని, **అభిశస్తాంస్తు వర్జయేత్** = పాపాత్ముల గృహాలను వదలివేయాలి అంటే పాపాత్ముల ఎదుట ఏ పరిస్థితులలో కూడా భిక్షను యాచించడానికి నోరు తెరవవద్దు.

తాత్పర్యం:- ముందు చెప్పినట్టి సదాచారసంపన్నులు లేనప్పుడు జితేంద్రియుడై, పరిశుద్ధుడై మౌనంతో గ్రామంలోని విప్రగృహాలన్నింటా భిక్షాటనం చేయాలి. అయితే, మహాపాతకములు గలవారి ఇండ్లను మాత్రం వదిలివేయాలి.॥160॥

సాయంప్రాతః-అగ్నిహోత్రానికి పునః విశేషవిధానం-
ఇది మనుకృతం-ప్రామాణికం

దూరాదాహృత్య సమిధః సన్నిదధ్యాద్విహాయసి । మూలశ్లోక సం.**128**
సాయం ప్రాతశ్చ జుహుయాత్తాభిరగ్నిమతంద్రితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**161[2.186]**

టీక:- దూరాత్ సమిధః ఆహృత్య = దూరం నుండి, అంటే అరణ్యం మొ. ప్రాంతాలనుండి సమిధలు, కట్టెలు తీసికొనివచ్చి, **విహాయసి సన్నిదధ్యాత్** = వాటిని ఆరుబయట పెట్టాలి, **తాభిః** = మళ్ళీ వాటితో, **అతంద్రితః** = సోమరి తనం లేకుండా, **సాయం చ ప్రాతః** = సాయంకాలం, ప్రాతః కాలం రెండు సమయాలలో, **అగ్నిం జుహుయాత్** = అగ్నిహోత్రం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- అడవుల నుండి సమిధలను, దర్భలను తెచ్చి వాటిని నేల తగలకుండా ఎండబెట్టి, వాటిని తీసుకొని జాగ్రత్తగా సాయంప్రాతఃకాలములందు అగ్నిహోత్రం చేయాలి. ఈ రెండే రాత్రింబవళ్ళకు సంధివేళలు ఇతరసమయాలు కావు.(స.ప్ర.3వ.స.).॥161॥

వివరణ:

యజ్ఞసమిధలు- ఏ యే వృక్షాల నుండి, ఎలాంటివిగా ఉండాలి. ఈ విషయంలో మహర్షి దయానందులవారి రచనల నుండి ఉద్ధరణ -విశేష లాభదాయకంగా ఉంటుంది.

మోదుగ, జమ్మి-రాగి-మర్రి అత్తి, మామిడి, మారేడు (బిల్వ) మొ॥ చెట్ల నుండి హవనవేదికకు తగినట్లు ముక్కలు చేయాలి. కానీ ఈ సమిధలలో పురుగులుండరాదు. మలిన దేశోత్పన్నములు కారాదు. అపవిత్ర పదార్థాల స్పర్శతో దూషితం కారాదు. సమానంగా వేదికలో పేర్చాలి (సం.వి. సామాన్య ప్ర.).

162 నుండి 165వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** భిక్ష-యజ్ఞం చేయనివారికి ప్రాయశ్చిత్తం**

* **అకృత్వా భైక్షచరణమసమిధ్య చ పావకమ్ ।**
అనాతురస్సప్తరాత్రమవకీర్ణివ్రతం చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***162 [2-187]***

తాత్పర్యం:- అనారోగ్య స్థితిలో తప్ప తక్కిన కాలంలో ఏడురాత్రులు భిక్షాన్నం భుజింపక, సాయంప్రాతఃకాలములందు అగ్నిహోత్రం చేయకుండా ఉన్నవాడు అవకీర్ణి ప్రాయశ్చిత్తం చేయాలి.॥162॥

* **భైక్షేణ వర్తయేన్నిత్యం నైకాన్నాదీ భవేద్వ్రతీ ।**
భైక్షేణ వ్రతినో వృత్తిరుపవాససమా స్మృతా॥ ప్రక్షిప్త శ్లోక సం. ***163[2-188]***

తాత్పర్యం:- బ్రహ్మచారి ప్రతిదినం అనేక ఇండ్ల నుండి తెచ్చిన అన్నమును తినాలి. కానీ ఒకరి ఇంటి అన్నమును తినరాదు. అలా భిక్షాన్నంచేత బ్రహ్మచారి జీవించడం ఉపవాసతుల్యమని మునులంటారు. ॥163॥

*** బ్రాహ్మణ బ్రహ్మచారికి భిక్షాసంబంధ సడలింపు-**

* **వ్రతవద్దేవదైవత్యే పిత్ర్యే కర్మణ్యథర్షివత్ ।**
కామమభ్యర్థితో-శ్నీయాద్వ్రతమస్య న లుప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***164[2-189]***

తాత్పర్యం:- దేవతాకార్యాలలో, పితృకార్యాలలో ఆహ్వానింపబడినవాడై ఋషిలాగా మధ్యమాం సాదులను వదలి ఒకే ఇంటి భోజనాన్ని చేసినచో బ్రహ్మచర్య వ్రతం లోపించదు. ॥164॥

* **బ్రాహ్మణస్యైవ కర్మైతదుపదిష్టం మనీషిభిః ।**
రాజన్యవైశ్యయోస్త్వేవం నైతత్కర్మ విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***165[2-190]***

తాత్పర్యం:- బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య బ్రహ్మచారులలో బ్రాహ్మణుడైన వాడికే ఏకగృహాన్నభోజనం నిషేధింపబడినది. కానీ ఇతరులయిన క్షత్రియ, వైశ్య బ్రహ్మచారులకు కాదని వేదవేత్తలు చెబుతారు.॥165॥

ప్రక్షిప్తాల పరిశీలన

162 నుంచి 165 వరకు గల శ్లోకాలు క్రింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకం

క. 162వ శ్లోకంలో **'అవికీర్ణివ్రతం'** అనేదాని పద్ధతిని మనువు చెప్పనూ లేదు, ఇది మను సమ్మతమూ కాదు, కేవలం తరువాత చేర్చింది. ఈ వ్యతిరేకత ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం. వివరాలకు 11.54 నుంచి 190 శ్లోకాల మీద సమీక్ష చూడండి.

ఖ. 164-165 శ్లోకాలలోని దేవకర్మలు, మృతులైన పితరుల శ్రాద్ధవిధానం కూడా మనువుకు వ్యతిరేకమే. మనువు కేవలం జీవించి ఉన్న తల్లిదండ్రులు మొదలైన పెద్దలకు సేవ శుశ్రూషలు చేయటాన్నే శ్రాద్ధం అన్నాడు. (3.82). ఈ పద్ధతికి వ్యతిరేకం కనుక ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు. **'మృతక శ్రాద్ధం మనువుకు వ్యతిరేకం'** - దీన్ని విస్తారంగా తెలుసుకునేందుకు 3.119 నుంచి 284, శ్లో. 2.151 శ్లోకాల మీద **'అంతర్ వ్యతిరేకం'** పేరిట ఉన్న సమీక్ష చూడండి.

2. ప్రసంగ వ్యతిరేకం

ఖ. 163వ శ్లోకం ప్రసంగ వ్యతిరేకమైనది. 160వ శ్లోకం వరకూ భిక్షా సంబంధ విషయాలు చెప్పి ముగించి, 161వ శ్లోకంలో యజ్ఞాలను గురించి ప్రారంభించారు. ఒక క్రమబద్ధమైన విషయం పూర్తయ్యాక, రెండు శ్లోకాల తర్వాత మళ్లీ భిక్షను గురించి చెప్పడం సందర్భోచితం కాదు. ఇది సందర్భానికి తగినదీ, మౌలికమూ అయితే, 160 నుంచి కలపవలసి ఉంది కానీ, అలా జరగలేదు. అసందర్భంగా చెప్పారు కనుక ఇది ప్రక్షిప్తం. 150 (175)వ శ్లోకంలో దీన్ని ప్రారంభించేటప్పుడు బ్రహ్మచారి నియమాలను చెప్తూ సంకేతించాడు. మిగతా శ్లోకాలలో దానికి అనుగుణంగా నియమాలు చెప్పాడు. కానీ ఇందులో ప్రాయశ్చిత్త విధానం ఉంది. ఈ పద్ధతి ప్రాసంగికం అయితే మిగిలిన నియమాలతో పాటు వాటిని ఉల్లంఘిస్తే చేయవలసిన ప్రాయశ్చిత్తాలు ఇచ్చి ఉండాలి. ఆ విధంగా జరగలేదు కనుక, ఇది మనుసమ్మతం కాదు, అసందర్భ కథనం అవుతుంది.

3. శైలీగత ఆధారం, విషయవ్యతిరేకం

మనుస్మృతిలోని ఈ శైలివల్ల, పది అధ్యాయాలలో ధర్మాలు, పదకొండులో ప్రాయశ్చిత్తం చెప్పాడని తెలుస్తూంది. ప్రాయశ్చిత్తాలను గురించి విడిగా ఒకచోట చెప్పినప్పుడు, మధ్యలో ఇలా వాటిని చెప్పటం మనువు శైలికి అనుగుణంగా లేదు. మధ్యలో ఇంకెక్కడా ప్రాయశ్చిత్త విధానాన్ని మనువు చెప్పలేదు. ఈ ఒకటి రెండు శ్లోకాలే అలా మధ్యలో కనబడుతున్నాయి. ఈ ఆధారంతో 162వ శ్లోకం మౌలికం కాదని తేలుతూంది.

166 నుండి 175 శ్లోకాల వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

గురుసమీపంలో ఉన్నప్పుడు-బ్రహ్మచారిమర్యాదలు (హద్దులు)-

చోదితో గురుణా నిత్యమప్రచోదిత ఏవ వా । మూలశ్లోక సం.**129**
కుర్యాదధ్యయనే యత్నమాచార్యస్య హి తేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**166[2.191]**

టీక:- గురుణా చోదితః = గురువుద్వారా ప్రేరేపించబడినప్పుడు, **వా** = లేదా, **అప్రచోదిత ఏవ** = ప్రేరేపించకపోయిన కూడా, బ్రహ్మచారి, బ్రహ్మచారియైన శిష్యుడు, **నిత్యం** = ప్రతిదినం, **అధ్యయనే** = అధ్యయనం చేయడంలో, వేదాన్ని చదవడంలో, **ఆచార్యస్య హి తేషు చ** = గురుహితకార్యాలలో కూడా, **యత్నం కుర్యాత్** = ప్రయత్నం చేయాలి.॥166॥

తాత్పర్యం:- గురువు నిత్యం చెప్పినను, చెప్పకపోయినను ప్రతిదినమూ వేదాధ్యయనంలో, గురుహిత కార్యాలలో నిమగ్నుడై ఉండాలి.

గురువు ఎదుట సావధానంగా కూర్చోవాలి లేదా నిలబడి ఉండాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

శరీరం చైవ వాచం చ బుద్ధీన్ద్రియమనాంసి చ । మూలశ్లోక సం.**130**
నియమ్య ప్రాంజలిస్తిష్ఠేద్వీక్షమాణో గురోర్ముఖమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**167 [2.192]**

టీక:- గురువుగారి సమ్ముఖమున కూర్చున్నప్పుడు గానీ లేదా నిలబడి ఉన్నప్పుడు గానీ, బ్రహ్మచారి, **శరీరం చ వాచం చ, బుద్ధి+ఇన్ద్రియ+మనాంసి ఏవ చ** = శరీరాన్ని, వాక్కును, జ్ఞానేంద్రియాలను, (త్వక్-చక్షు-శ్రోత్ర-జిహ్వా-ఘ్రాణములు), మరియు మనస్సును కూడా, **నియమ్య** = వశమందుంచుకొని సావధానుడై, **గురోఃముఖమ్ వీక్షమాణః** = గురువు ఎదుట, ఎదురుగా చూస్తూ, **ప్రాంజలిః** = చేతులు కట్టుకొని, **తిష్ఠేత్** = కూర్చోవాలి లేదా నిలుచుండాలి.

తాత్పర్యం:- శిష్యుడు దేహాన్ని, బుద్ధినీ, ఇంద్రియాలనూ, మనస్సునూ వశమందుంచుకొని సావధానుడై గురువు ఎదుట 'ఏమి చెప్తునో' అని అతని ముఖాన్ని చూస్తూ నిలబడి ఉండాలి లేదా కూర్చోవాలి.॥167॥

గురువు ఆదేశానుసారంగా నడవాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

నిత్యముద్ధృతహస్తస్స్యాత్సాధ్వాచారస్సుసంయతః । మూలశ్లోక సం.**131**
అస్యతామితి చోక్తస్సన్నాసీతాభిముఖం గురోః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**168 [2.193]**

టీక:- **నిత్యం + ఉద్ధృతహస్తః స్యాత్** = సదా ఉద్ధృత హస్తం కలవాడుగా ఉండాలి. అంటే కప్పుకొనే వస్త్రం కుడిచేతి కిందుగా, ఎడమచేతి భుజం మీదుగా ఉండాలి. కుడిభుజం కుడిచేయి ఉత్తరీయానికి వెలుపలగా ఉండాలి, **సాధు+ఆచారః** = ఆచరణ మర్యాదగా ఉండాలి, **సుసంయతః** = సావధానుడై, **"ఆస్యతాం" ఇతి ఉక్తః సన్** = కూర్చోమని చెప్పిన తరవాత, **గురోః అభిముఖం ఆసీత** = ఎప్పుడు ఏమి బోధిస్తాడో అనే ఆతురతతో గురువు ఎదుట, వారి ముఖానికి ఎదురుగా కూర్చోవాలి.

తాత్పర్యం:- ఎల్లప్పుడు ఉత్తరీయమునకు వెలుపల తన కుడి భుజాన్ని ఉంచుకొన్నవాడై, మంచి ఆచారం కలవాడై, వస్త్రంచేత దేహాన్ని కప్పుకొని, గురువు 'కూర్చుండుము' అని చెప్పిన తరవాత ఆతడికి ఎదురుగా కూర్చోవాలి.॥168॥

గురువు కంటే తక్కువ స్థాయిలో వేషభూషలుండాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

హీనాన్నవస్త్రవేషస్స్యాత్సర్వదా గురుసన్నిధౌ । మూలశ్లోక సం.**132**
ఉత్తిష్ఠేత్ప్రథమం చాస్య చరమం చైవ సంవిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**169 [2.194]**

టీక:- **గురుసన్నిధౌ** = గురువు సమీపంలో ఉంటూ, **సర్వదా** = ఎల్లప్పుడు, **హీన+అన్న+వస్త్ర+వేషః స్యాత్** = అన్న భోజన పదార్థాలు, వస్త్రాలు, వేషభూషలు గురువుస్థాయి కంటే తక్కువగా ఉండాలి. **చ** = మరియు, **అస్య ప్రథమం ఉత్తిష్ఠేత్** = గురువుగారి కంటే ముందుగా నిద్ర లేవాలి. **చ** = అలాగే, **చరమం సంవిశేత్** = గురువుగారు నిద్రించిన తరవాత నిద్రించాలి.

తాత్పర్యం:- గురువు సమీపంలో తక్కువ ప్రాధాన్యతగల అన్నవస్త్రాలు, వేషభూషలు గలవాడై ఉండాలి. గురువుకంటే ముందే నిద్రలేవాలి. అతడు నిద్రించిన తరువాత పడుకోవాలి.॥169॥

గురువుతో మాట్లాడే పద్ధతి- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రతిశ్రవణసంభాషే శయానో న సమాచరేత్ । మూలశ్లోక సం.**133**
నాసీనో న చ భుంజానో న తిష్ఠన్న పరాఙ్ముఖః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**170 [2.195]**

టీక:- **ప్రతిశ్రవణ+సమ్భాషే** = ప్రతిశ్రవణమంటే-గురువు ఆజ్ఞకు గానీ వారు చెప్పిన మాటకుగానీ, జవాబివ్వడం, సంభాషణలు, ఇవి, **శయానః న సమాచరేత్** = పడుకొని చేయరాదు, **న+ఆసీనః** = కూర్చొని చేయరాదు, **న భుంజానః** = భుజిస్తూ చేయకూడదు, **చ** = మరియు, **న తిష్ఠన్** = దూరంగా నిల్చొని గాని, **న పరాఙ్ముఖః** = ముఖం తిప్పిగాని చేయరాదు.

తాత్పర్యం:- గురువు ఆజ్ఞలకుగానీ చెప్పిన మాటలకు గానీ జవాబు ఇవ్వడం, సంభాషణలు చేయడం లాంటివి శిష్యుడు నిద్రిస్తూగానీ, కూర్చొనిగానీ, భుజిస్తూగానీ దూరంగా నిల్చొనిగానీ, ముఖం తిప్పిగానీ చేయరాదు.॥170॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆసీనస్య స్థితః కుర్యాదభిగచ్ఛంస్తు తిష్ఠతః । మూలశ్లోక సం.**134**
ప్రత్యుద్గమ్య త్వావ్రజతః పశ్చాద్ధావంస్తు ధావతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**171 [2.196]**

టీక:- **ఆసీనస్య స్థితః** = కూర్చున్న గురువుతో నిలబడి, **తిష్ఠతఃతు అభిగచ్ఛన్** = నిలబడి ఉన్న గురువుకు ఎదురుగా వెళ్ళి, **ఆవ్రజతః తు ప్రతి+ఉద్గమ్య** = తనవైపు వస్తున్న గురువు వద్దకు శీఘ్రంగా వెళ్ళి, **ధావతః తు పశ్చాత్ ధావన్** = పరుగెత్తుతున్న గురువును, వెనుకనే పరుగెత్తి, **కుర్యాత్** = ప్రతిశ్రవణం, సంభాషణ చేయాలి.

తాత్పర్యం:- శిష్యుడు గురువు కూర్చొని ఉండి ఆజ్ఞాపిస్తే నిలబడాలి. గురువు నిలబడి ఆజ్ఞాపిస్తే, ఆయన సమీపానికి వెళ్లాలి. గురువు నడుస్తూ ఆజ్ఞ ఇస్తే శీఘ్రంగా వెళ్ళాలి, పరుగెత్తుతున్న గురువును వెనుకనే పరుగెత్తి వెళ్లి ఆ చెప్పబడిన కార్యం నిర్వర్తించి లేదా బదులిచ్చి వినయంగా ఉండాలి.॥171॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పరాఙ్ముఖస్యాభిముఖో దూరస్థస్యైత్య చాంతికమ్ । మూలశ్లోక సం.**135**
ప్రణమ్య తు శయానస్య నిదేశే చైవ తిష్ఠతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**172 [2.197]**

టీక:- **పరాఙ్ముఖస్య+అభిముఖః** = గురువు ముఖం తిప్పి కూర్చున్నట్లయితే, వారికి ఎదురుగావెళ్ళి **చ** = మరియు, **దూరస్థస్య అంతికమ్ ఏత్య** = దూరంగా నిలుచున్న గురువు దగ్గరికి వెళ్ళి, **శయానస్య తు** = పడుకొని ఉన్న గురువు మరియు **నిదేశే ఏవ తిష్ఠతః** = సమీపంలోనే నిలుచున్న గురువుతో **ప్రణమ్య** = వినమ్రుడై నమస్కరించి మాట్లాడాలి.

తాత్పర్యం:- శిష్యుడు, గురువు ముఖం తిప్పి కూర్చున్నప్పుడు ఎదురుగా వెళ్ళడం, దూరంగా నిల్చున్నప్పుడు దగ్గరికి రావడం పదుకుని ఉన్నప్పుడు సమీపంలోనే నిల్చుని వినమ్రుడై మాట్లాడాలి.॥172॥

గురువు కంటే నిమ్నాసనంలో కూర్చోవాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

నీచం శయ్యాసనం చాస్య సర్వదా గురుసన్నిధౌ । మూలశ్లోక సం.**136**
గురోస్తు చక్షుర్విషయే న యథేష్టాసనో భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**173 [2.198]**

టీక:- **గురుసన్నిధౌ** = గురువు సన్నిధిలో ఉంటూ, **అస్య** = ఈ బ్రహ్మచారి యొక్క, **శయ్య+ఆసనం** = శయ్య (పక్క) ఆసనాలు, **సర్వదా** = ఎల్లప్పుడు, **నీచం** = గురువు ఆసనం కంటే నిమ్నంగానూ, తక్కువ గానూ, సాధారణం గానూ ఉండాల్లి, **గురోఃతు చక్షుఃవిషయే** = గురువు సమక్షంలో, **యథేష్టాసనః న భవేత్** = తనకిష్టమైనట్లుగా ఆసనం మీద కూర్చోరాదు, అంటే శిష్టతా పూర్వకంగా కూర్చోవాలి.

తాత్పర్యం:- శిష్యుడు గురువు సన్నిధిలో ఉంటూ, గురువు పడకకూ కూర్చునే పీఠానికీ శిష్యుడి పడక, పీఠం తక్కువుగా ఉండాలి. గురువు సమక్షంలో శిష్యుడు తనకు ఇష్టమైన ఆసనం మీద ఇష్టమున్నట్లు కూర్చోరాదు.॥173॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గురువును పేరుతో పిలువరాదు-

నోదాహరేదస్య నామ పరోక్షమపి కేవలమ్ ।　　మూలశ్లోక సం.137
న చైవాస్యానుకుర్వీత గతిభాషితచేష్టితమ్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం.174 [2.199]

టీక:- పరోక్షమ్ + అపి = గురువు పరోక్షంలో, అస్య = తన గురువు యొక్క **కేవలమ్ నామ న+ఉదాహరేత్** = నామాన్ని ఉచ్చరించరాదు, ఎప్పుడైనా గురువు పేరు చెప్పవలసివచ్చినప్పుడు, "మా గురువుగారనో, లేదా మా ఆచార్యులవారనో చెప్పాలి గాని నామోచ్చారణ చేయరాదు, అస్య = ఈ గురువు యొక్క, **గతి+భాషిత+చేష్టితమ్** = నడకను, మాటలను, చేష్టలను, న అనుకుర్వీత = అనుకరించరాదు, వెక్కిరించరాదు.

తాత్పర్యం:- పరోక్షంలో అయినాసరే గురువుపేరు చెప్పకూడదు. మా గురువు గారనో లేదా మా ఆచార్యుల వారనో సంభాషించాలి తప్ప ఎవరి సమక్షంలో కూడ ఆయన పేరు పలుకరాదు. గురువును అనుకరిస్తూ ఎగతాళి చేయకూడదు. ॥174॥

గురునింద చేయరాదు-

ఇది మనుకృతం-ప్రామాణికం

గురోర్యత్ర పరీవాదో నిన్దా వాఽపి ప్రవర్తతే ।　　మూలశ్లోక సం.138
కర్ణౌ తత్ర పిధాతవ్యౌ గన్తవ్యం వా తతోఽన్యతః ॥　　ప్రక్షిప్త శ్లోక సం.175[2.200]

టీక:- యత్ర = ఎక్కడ, గురోఃపరీవాదః అపి వా నిన్దా ప్రవర్తతే = గురువు గురించి చెడు వినడం గాని, నిందనుగాని జరుగుచున్నప్పుడు. తత్ర = అక్కడ, కరౌ పిధాతవ్యౌ = తన చెవులు మూసుకోవాలి. వా = లేదా, **తతః అన్యతః గన్తవ్యం** = అక్కడ నుండి మరొకచోటికి వెళ్ళి పోవాలి.

తాత్పర్యం:- ఇతరులు తమ గురువుపై అపనిందలు వేయడం, గురుదూషణ వినవలసి రావడం జరిగితే, శిష్యుడు అక్కడ ఉండటం తటస్థిస్తే వెంటనే అక్కడ నుంచి లేచి వెళ్లిపోవాలి. అలా వీలుకాని పక్షంలో చెవులు రెండూ మూసుకోవాలి.॥175॥

వివరణ: "కర్ణౌ పిధాతవ్యౌ" ఇదొక నుడికారం, 'చెవులు మూసుకోవడం' అంటే వినరాదు, మనసు పెట్టరాదు, అని భావం.

ఇది ప్రక్షిప్త శ్లోకం-ప్రామాణికం కాదు

* గురునింద ఫలము-

*　పరీవాదాత్ఖరో భవతి శ్వా వై భవతి నిందకః ।
పరిభోక్తా క్రిమిర్భవతి కీటో భవతి మత్సరీ ॥　　ప్రక్షిప్త శ్లోక సం.*176 [2.201]*

తాత్పర్యం:- శిష్యుడే గురునిందకు పాల్పడినా, అవమానించినా అతడు గాడిద, కుక్క వంటి నీచజన్మ లెత్తడం తథ్యం. గురుధనాన్ని అపహరిస్తే కీటకంగానూ, ద్వేషిస్తే క్రిమిగానూ జన్మించవలసివస్తుంది.

ప్రక్షిప్త పరిశీలన

ఈ 176వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం.

1. అంతర్ వ్యతిరేకం

మనువు 12.9, 25.52, 74 శ్లోకాలలో 'వ్యక్తి సత్త్వరజస్తమో గుణాలు పెరిగితే చేసే పనుల వల్ల ఉత్తమ, మధ్యమ, అధమ లేదా తిర్యక్కులు, స్థావరాలు, మనుష్యులు మొదలైన జన్మలను పొందుతాడు కానీ, కేవలం ఒక కర్మవల్ల మాత్రమేకాదు' అని స్పష్టంగా చెప్పాడు. పైగా ఏదో ఒక కర్మవల్ల ఏ జన్మ వస్తుంది అనేది కచ్చితంగా చెప్పలేదు. శ్లోకంలో ఒకటే కర్మతో ఒకజన్మ వస్తుందని నిర్ధారించడం, ఈ కర్మల వల్లే మరుజన్మల ప్రాప్తికలుగుతుందని చెప్పటం, పైన చెప్పిన దానికి వ్యతిరేకం. అందుకని ప్రక్షిప్తం. 2.117 (2.142)లో గురువే అన్నాదులిచ్చి శిష్యులను పోషిస్తాడని ఉంది. ఈ శ్లోకంలో గురువు పదార్థాలను వాడినవాడు మరుజన్మలో కృమిగా పుడతాడని ఉంది. ఇదిపైన చెప్పినదానికి వ్యతిరేకం.

2. శైలీగత ఆధారం

ఈ శ్లోకంలో చాలామామూలు దోషాల కారణంగా వేర్వేరు జన్మలు కలుగుతాయనటం నిరాధారమూ, నిర్హేతుకమూ, అతిశయోక్తితో నిండిన కథనం. ఇలా పాఠకులను భయభ్రాంతులను చేయటం మనువు శైలికాదు.

177 నుండి 181వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

గురువుకు ఎప్పుడు అభివాదం చేయరాదు?-

దూరస్థో నార్చయే దేనం న క్రుద్ధో నాంతికే స్త్రియాః । మూలశ్లోక సం. **139**
యానాసనస్థశ్చైవైనమవరుహ్యాభివాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **177 [2.202]**

టీక:- ఏనం = శిష్యుడు తన గురువుకు, **దూరస్థః న అర్చయేత్** = దూరంగా ఉండి నమస్కారం చేయరాదు. **న క్రుద్ధః**= క్రోధంతో గాని, **న స్త్రియః అన్తికే** = గురువు తన భార్యతో కలిసి ఉన్నప్పుడు గాని వెళ్ళి నమస్కరించరాదు, **చ** = మరియు, **యాన+ఆసనస్థ** = తాను బండిమీద కూర్చొని ఉంటే, **అవరుహ్య** = దిగి, **ఏనం** = తన గురువుకు, **అభివాదయేత్** = నమస్కరించాలి.

తాత్పర్యం:- శిష్యుడు తన గురువును దూరం నుండిగానీ, కోపంలో గానీ నమస్కరించరాదు, అలాగే గురువు తన భార్యతో కలిసి ఉన్నప్పుడు కూడా దగ్గరకు వెళ్ళి నమస్కరించరాదు, తాను బండిమీద కూర్చొని ఉంటే కిందకి దిగి గురువుకు నమస్కరించాలి.॥177॥

గురువుతో కలిసి కూర్చోడానికి-కూర్చోక పోవడానికి గల నియమాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రతివాతేఽనువాతే చ నాసీత గురుణా సహ । మూలశ్లోక సం. **140**
అసంశ్రవే చైవ గురో ర్న కించిదపి కీర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **178[2.203]**

టీక:- **ప్రతివాతే** = శిష్యుడి వైపు నుండి గురువు వైపు వీచే వాయువు దిశలో, **చ** = మరియు, **అనువాతే** = అందుకు విపరీతంగా గురువు వైపు నుండి శిష్యుడి వైపు వీచే వాయువు దిశలో, **గురుణా సహ న+ఆసీత** = గురువుతో కలిసి కూర్చోరాదు, **గురోఃఅసంశ్రవే ఏవ** = ఎక్కడ గురువుకు ఏ మాత్రం వినిపించని స్థానంలో కూర్చొని, **కించిదపి న కీర్తయేత్** = ఏమీ మాట్లాడరాదు.

తాత్పర్యం:- శిష్యుడు వైపు నుండి గురువు వైపు వీచే వాయువు దిశలోగానీ అందుకు విరుద్ధంగా అంటే గురువువైపు నుండి శిష్యుడి వైపు వీచే వాయువు దిశలోగానీ గురువులో కలిసి కూర్చోరాదు. గురువుగారికి దూరంగా కూర్చొని వినిపించని స్థాయిలో మాట్లాడరాదు.॥178॥

గురువుతో ఎక్కడెక్కడ కూర్చోవచ్చు?- ఇది మనుకృతం-ప్రామాణికం

గోఽశ్వోష్ట్రయానప్రాసాదప్రస్తరేషు కటేషు చ । మూలశ్లోక సం. **141**
ఆసీత గురుణా సార్ధం శిలాఫలకనౌషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **179 [2.204]**

టీక:- గో+అశ్వ-ఉష్ట్రయాన ప్రాసాద ప్రస్తరేషు = ఎద్దులబండి, గుర్రబ్బండి, ఒంటెల బండి, **శిలాఫలకనౌషు చ** = పెద్దభవనాలలో పరిచిన రాళ్ళమీద, చెక్కమీద, నావమీద, **గురుణా సార్థం ఆసీత** = గురువుతో కలిసి కూర్చోవచ్చు.

తాత్పర్యం:- ఎడ్లబండిలోనూ, గుర్రబ్బండిలోనూ, ఒంటె సవారీ, పెద్ద భవనాలలో పరిచినరాళ్ల మీద, చెక్క మీద మాత్రం గురువుతో కలిసి కూర్చోవచ్చు. వీటి విషయంలో ఆక్షేపణ లేదు.॥179॥

గురువు యొక్క గురువుతో గురుసమానమైన ఆచరణ- ఇది మనుకృతం-ప్రామాణికం

గురో ర్గురౌ సన్నిహితే గురువద్వృత్తిమాచరేత్ । మూలశ్లోక సం. **142**
న చానిసృష్టో గురుణా స్వాన్ గురూనభివాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **180 [2.205]**

టీక:- గురోఃగురౌ సన్నిహితే = గురువు యొక్క గురువు-సమీపంలో, **గురువత్ వృత్తిమాచరేత్** = ఆయన్ను తన గురువుతో సమానంగా గౌరవించాలి, **చ** = మరియు, **స్వాన్ గురూన్** = తన తల్లిదండ్రి మొ. పెద్దవారు రాగా, **గురుణా అనిసృష్టో న అభివాదయేత్** = గురువు ఆజ్ఞ లేకుండా అభివందనం చేయడానికి వెళ్ళరాదు.

తాత్పర్యం:- గురువుగారి గురువు వస్తే, తన గురువుకు వందనమాచరించినట్లే వారికీ అభివాదం చేయాలి. కానీ గురుసన్నిధిన ఉండగా తన తల్లిదండ్రులు మొదలైనవారు వచ్చినప్పుడు గురుదేవుని ఆజ్ఞ లేకుండా వారికి అభివాదం చేయకూడదు.॥180॥

ఇతర అధ్యాపకులతో ఎలా వ్యవహరించాలి?- ఇది మనుకృతం-ప్రామాణికం

విద్యాగురుష్వేతదేవ నిత్యావృత్తిః స్వయోనిషు । మూలశ్లోక సం. **143**
ప్రతిషేధత్సు చాధర్మాన్హితం చోపదిశత్స్వపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **181 [2.206]**

టీక:- విద్యా గురుషు = విద్యను నేర్పే గురువులందరిలో, **స్వయోనిషు** = తన వంశస్థులైన పెద్దలందరియందు, **చ** = మరియు, **అధర్మాన్ ప్రతిషేధత్సు ఉపదిశత్సు+అపి** = అధర్మం నుండి తప్పించి, ధర్మోపదేశం చేసేవారి యందు కూడా, **నిత్యా ఏతత్+ఏవ వృత్తిః** = సదైవ పైన చెప్పినట్లుగానే వ్యవహరించాలి.

తాత్పర్యం:- తమ ఆచార్యుడు కాని పక్షంలో - ఇతర ఉపాధ్యాయులు ఎదురైనా, బంధువర్గంలో పెద్దలైన పినతండ్రి-పెత్తండ్రి వంటి వారెదురయినా, మేలుకోరి హితం చెప్పేవారు- అధర్మాన్ని నివారించే పెద్దలు ఎదురైనా వారికి అభివాదం చేయాలి.॥181॥

182 నుండి 187వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

** గురుపుత్రాదులతో వ్యవహారము-*

** శ్రేయస్సు గురువద్వృత్తిం నిత్యమేవ సమాచరేత్ ।*
గురుపుత్రేషు చార్యేషు గురోశ్చైవ స్వబంధుషు ॥ *ప్రక్షిప్త శ్లోక సం. 182 [2.207]*

తాత్పర్యం:- విద్యచేత, తపస్సుచేత గొప్పవారైన వారిపట్ల, తన కంటే పెద్దవారైన గురుపుత్రుల పట్ల, గురువుగారి బంధువుల పట్ల, పితృదేవుని వైపు బంధువుల పట్ల-గురువుయందు తాను ఎలాంటి విధేయత ప్రదర్శిస్తున్నాడో అదే రీతిన వారితో కూడా మెలగాలి.॥182॥

* ***బాలస్సమానజన్మా వా శిష్యో వా యజ్ఞకర్మణి ।***
అధ్యాపయన్ గురుసుతో గురువన్మానమర్హతి ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***183 [2.208]***

తాత్పర్యం:- తన గురువు పుత్రుడు చిన్నవాడైనా, సరి ఈడువాడైనా, వేదాన్ని అధ్యాపనం చేయించగల గురువు కొడుకు; యజ్ఞకర్మలో ఋత్విక్కు; యజ్ఞాన్ని చూడవచ్చిన వేదవిదుడు కూడా గురుసమానులే ! ॥183॥

* ***ఉత్సాదనం చ గాత్రాణాం స్నాపనోచ్ఛిష్టభోజనే ।***
న కుర్యాద్గురుపుత్రస్య పాదయోశ్చావసేజనమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***184[2.209]***

తాత్పర్యం:- కాని, ఏ యే శుశ్రూషలు చేయాలో-ఏవి చేయరాదో ఇక్కడ చెప్పబడింది. గురుపుత్రుడి దేహానికి నలుగు పెట్టి స్నానం చేయించడం, అతడి శేషభిక్షాన్నాన్ని తినడం, అతడి పాదాలు కడగడం.... ఇలాంటివి చేయరాదు.॥184॥

* **గురుపత్నులతో వ్యవహారము-**

* ***గురువత్ప్రతిపూజ్యాః స్యుస్సవర్ణా గురుయోషితః ।***
అసవర్ణాస్తు సంపూజ్యాః ప్రత్యుత్థానాభివాదనైః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***185[2.210]***

తాత్పర్యం:- బ్రాహ్మణ స్త్రీ గురుపత్నిగా ఉన్నప్పుడు మాత్రమే (సవర్ణ) గురువుతో సమానంగా పూజించాలి. గురువుకు ఇతర జాతుల భార్యలున్నట్లయితే, వారికి ఎదుర్కోలు, అభివాదం మాత్రమే సరిపోతుంది.॥185॥

* ***అభ్యంజనం స్నాపనం చ గాత్రోత్సాదనమేవ చ ।***
గురుపత్న్యా న కార్యాణి కేశానాం చ ప్రసాధనమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***186[2.211]***

తాత్పర్యం:- గురుపత్నికి కూడా తలంటి స్నానం చేయించడం, వంటికి నలుగు పెట్టడం, తలదువ్వడం/ జడవేయడం....ఇవి నిషేధం.॥186॥

ప్రక్షిప్తాల పరిశీలన

182 నుంచి 186 శ్లోకాలు ఈ కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తాలవుతాయి.

1. అంతర్ వ్యతిరేకాలు

క. 152 నుంచి 184 వరకు గల శ్లోకాలలో శిష్యుడైనా సరే, గురు పుత్రునితో కూడా గురువుతో లాగే వ్యవహరించాలనే నిర్దేశం ఉంది. ఇది 2.92 (117), 124-131(149-156) శ్లోకాలలోని విషయానికి వ్యతిరేకంగా ఉంది. ఈ శ్లోకాలలో చదివించే వాడే గురువు కనుక అతడే అందరి కన్నా గొప్పవాడు, ఆదరించదగినవాడు అని ఉంది. 126(151)వ శ్లోకంలో ఆంగిరసుని ఉదాహరణ నిచ్చి మనువు ఈ విషయాన్ని మరింత స్పష్టం చేశాడు. కనుక గురువులాగే గురుపుత్రుణ్ణీ గౌరవించాలనేది మొ॥ మౌలికం కావు.

ఖ. 185వ శ్లోకంలో సవర్ణులు, సవర్ణులు కాని భార్యల పట్ల వేర్వేరుగా వ్యవహరించాలనే పద్ధతి ఉంది. ఇది బహుపత్నుల వ్యవస్థ కనుక మనువుకు సమ్మతం కాదు. మనువు కేవలం సవర్ణానికి చెందిన ఒక భార్య మాత్రమే ఉండాలన్నాడు. (3.4;7.77), 5.167, 9.81 శ్లోకాలలో చాలా స్పష్టంగా ఒక భార్య మరణిస్తేనే మరొకరిని వివాహం

చేసుకోవడం లేదా నియోగపద్ధతి అవలంబించమన్నాడు. ఈ విధంగానైతే ఎక్కువమంది భార్యలు ఉండే అవకాశమే ఉండదు. దీనితో పాటుగా, ఈ ఒక్క శ్లోకంలోనే సవర్ణ- అసవర్ణులైన భార్యలతో వ్యవహరించే విధానం ఉంది కనుక, మరోచోట గురుపత్నులతో వ్యవహారం చెప్పి ఉన్నా, మరెక్కడైనా సవర్ణ-అసవర్ణుల భేదం చెప్పి ఉన్నా (2.187-192(2.212-217) ఆ శ్లోకాలన్నీ కూడా తర్వాతి ప్రక్షిప్తాలని తెలుస్తూంది.

గ. 186వ శ్లోకంలో గురుపత్నికి తైలమర్దనం చేయటం వంటివి నిషేధించడమూ మౌలికం కావు. ఎందుకంటే 2.152, 154, 187 (2.177, 179,212) లలో స్త్రీలను చూడటం, స్పర్శ, ఆలింగనం వంటివి బ్రహ్మచారికి పూర్తిగా నిషేధాలు. అలాంటప్పుడు గురుపత్నికి సేవ చేయటమనే ప్రసక్తేరాదు. గురువుకు మాత్రమే సేవచేయాలని మనువు చెప్పాడేకానీ, గురుపత్నికి సేవలు చేయమని ఎక్కడా చెప్పలేదు. వీటిని గురించి ఆలోచించినప్పుడూ, ఈ వ్యతిరేకతలకారణంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని తెలిసిపోతూంది.

187 నుండి 198వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

యువతి అయిన గురుపత్ని పాదస్పర్శ చేయరాదు-అందుకు కారణం-

గురుపత్నీ తు యువతిర్నాభివాద్యేహ పాదయోః । మూలశ్లోక సం.**144**
పూర్ణవింశతివర్షేణ గుణదోషౌ విజానతా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**187 [2.212]**

టీక:- పూర్ణవింశతి వర్షేణ = ఇరవై సంవత్సరాలు నిండిన, **గుణదోషౌ విజానతా** = గుణ-దోషాలు తెలిసికోవడంలో సమర్థుడు, యువకుడైన శిష్యుడికి, **యువతిః పత్నీ తు** = యువతి అయిన గురుపత్ని యొక్క, **పాదయోః న అభివాద్య** = చరణాలను స్పర్శించి అభివందనం చేయకూడదు. అంటే- పాదాలను స్పర్శించకుండా నమస్కారం చేయాలి.

తాత్పర్యం:- గురుపత్ని యౌవనవతియైనచో ఇరవైయేండ్లు దాటిన శిష్యుడు ఆమె పాదాలు తాకి పాదాభివందనం చేయకూడదు. దూరం నుండియే నమస్కరించాలి.॥187॥

యువతి అయిన గురుపత్ని యొక్క చరణస్పర్శవల్ల హాని- ఇది మనుకృతం-ప్రామాణికం

స్వభావ ఏష నారీణాం నరాణామిహ దూషణమ్ । మూలశ్లోక సం.**145**
అతోఽర్థాన్న ప్రమాద్యన్తి ప్రమదాసు విపశ్చితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**188 [2.213]**

టీక:- ఇహ = ఈ ప్రపంచంలో, **ఏషః స్వభావః** = ఇది స్వాభావికమే గదా?, **నారీణాం నరాణాం దూషణం** = స్త్రీ-పురుషుల పరస్పర స్పర్శల (తగులుట) వల్ల దోషాలు ఉత్పన్నమవుతాయి, **అతః అర్థాత్** = ఈ కారణంగా, **విపశ్చితః** = బుద్ధిమంతులైన వ్యక్తులు, **ప్రమదాసు** = స్త్రీలతో కూడిన వ్యవహారాలలో, **న ప్రమాద్యన్తి** = ఎప్పుడూ పొరపాటుచేయరు. అంటే, సదాచారం నుండి పతనమయ్యే ఏ వ్యవహారం చేయరాదు.

తాత్పర్యం:- పురుషుల్ని మోహింపజేయు గుణము, స్త్రీలకు స్వభావసిద్ధమైనది. కాబట్టి విద్వాంసులైనవారు వివేకవంతులైనవారు, స్త్రీల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.॥188॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అవిద్వాంస మలం లోకే విద్వాంసమపి వా పునః । మూలశ్లోక సం.**146**
ప్రమదాహ్యుత్పథం నేతుం కామక్రోధవశానుగమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**189 [2.214]**

టీక:- లోకే = ఈ ప్రపంచంలో, **ప్రమదాః** = స్త్రీలు, **కామ-క్రోధ-వశ+అనుగం** = కామక్రోధాలకు వశీభూతులు, **అవిద్వాంసం** = మూర్ఖుణ్ణి, **విద్వాంసం +అపి** = విద్వాంసుడైన వ్యక్తిని కూడా, **ఉత్పథం నేతుం** = తన మార్గం నుండి పెకిలించి వేయడానికి, అతని ఉద్దేశం నుండి పదభ్రష్టుని చేయడానికి, **హి** = నిశ్చయంగా, **అలం** = సమర్థురాండ్రు.

తాత్పర్యం:- పురుషుడు ఎంత విద్వాంసుడైనా, చదువులేకున్నా స్త్రీల వలలో తగులు కోవడం చాలా సహజం. ఎందుకంటే-స్త్రీ రూపం, నడత, మోహింపజేసే స్వభావాన్ని కలిగించేలా ఉండటమే! కామక్రోధాది అరిషడ్వర్గాల్ని జయించడం విద్వాంసులైనంతమాత్రాన సాధ్యమా?……విద్యవల్ల ఏది మంచో-చెడో-దేని లక్షణమేదో తెలుస్తుంది. ఆచరణలోకి తెచ్చుకోవడానికి చాలా సాధన అవసరం !॥189॥

అభిప్రాయమేమంటే- హావభావాలు, రూప సౌందర్యాల ద్వారా పురుషులను మోహితులను చేయడంలో స్త్రీలకు పూర్ణ సామర్థ్యముంటుంది. వారికున్న ఈ గుణాల వల్ల పురుషులు వారి సంసర్గం వల్ల స్వయంగా గానీ లేదా స్త్రీల ప్రయత్నం వల్ల గానీ సదాచారం నుండి భ్రష్టుడు కాగలడు.

స్త్రీలతో ఏకాంతంగా ఉండరాదు-

ఇది మనుకృతం-ప్రామాణికం

మాత్రా స్వస్రా దుహిత్రా వా న వివిక్తాసనో భవేత్ । మూలశ్లోక సం. **147**
బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **190 [2.215]**

టీక:- మాత్రా-స్వస్రా-దుహిత్రా వా = తల్లితో గాని, తోడబుట్టిన అక్కాచెల్లెళ్ళతో గాని, చివరకు కన్నకూతురితో గాని, **వివిక్త+ఆసనః న భవేత్** = ఏకాంతంలో ఒకే ఆసనం మీద కూర్చోరాదు, లేదా ఉండరాదు. ఏకాంత నివాసం చేయకూడదు. ఎందుకంటే, **బలవాన్+ఇన్ద్రియగ్రామః** = శక్తిశాలియైన ఇంద్రియాలు, **విద్వాంసమ్+అపి** = వివేకవంతుడైన వ్యక్తిని కూడా, **కర్షతి** = లాగి తమ వశంలోకి తీసికోగలవు. అంటే తమ తమ విషయాలలో ఇరికించి, పథభ్రష్టుణ్ణి చేయగలవు.

తాత్పర్యం:- ఈ ఇంద్రియాలున్నాయే-ఇవి అపారమైన బలము గలవి. వీటి ప్రేరణ వల్ల ఏ పాపమైనా జరగవచ్చు! ఇవి మనిషిని చెడుదారికి లాగేయగలవు. కనుకనే-స్త్రీలున్న చోట…. వారు తల్లి అయినా, సోదరీమణులైనా, కూతుర్లయినాగాని ఏకాంతంలో వారితో కూర్చోరాదు, నివసించరాదు. అంటే-ఇంద్రియాలు చాలా శక్తివంతాలు. కాబట్టి సావధానులై మెలగాలి. ॥190॥

యువతి అయిన గురుపత్నికి అభివందన విధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

కామం తు గురుపత్నీనాం యువతీనాం యువా భువి । మూలశ్లోక సం. **148**
విధివద్వన్దనం కుర్యాదసావహమితి బ్రువన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **191 [2.216]**

టీక:- యువా = యువకుడయిన శిష్యుడు, **యువతీనాం గురుపత్నీనాం** = యవ్వనవంతులైన గురుపత్నులకు, **అసౌ+అహమ్+ఇతి బ్రువన్** = నేను ఫలానా వాడినని చెబుతూ **"దేవదత్తోఽహం భవతి"**, **విధివత్** = పూర్ణవిధిననుసరించి, **భువి** = భూమి మీదకు వంగి, **వన్దనం కుర్యాత్** = నమస్కరించాలి.

తాత్పర్యం:- తరుణ వయస్సులో ఉన్న శిష్యులు, లేబ్రాయపు జవరాలైన గురుభార్యకు వందన మాచరించ వలసివస్తే, వారి పాదాలను స్పరించకుండా పాదాల దగ్గర గల భూమిని తాకి శాస్త్రరీత్యా పేరు చెబుతూ అభివాదం చేయాలి.॥191॥

ఇది మనుకృతం-ప్రామాణికం

విప్రోష్య పాదగ్రహణమన్వహం చాభివాదనమ్ । మూలశ్లోక సం. **149**
గురుదారేషు కుర్వీత సతాం ధర్మమనుస్మరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **192 [2.217]**

టీక:- శిష్యుడు, **సతాం ధర్మమ్ + అనుస్మరన్** = శ్రేష్ఠుల ధర్మాన్ని స్మరిస్తూ, స్త్రీలకు అభివందనం చేయడానికి శిష్టవ్యక్తుల కర్తవ్యమని తలుస్తూ, **గురుదారేషు** = గురుపత్నులకు, **అన్వహం అభివాదనమ్ కుర్వీత** = ప్రతిదినం అభివందనం చేయాలి, **చ** = మరియు, **విప్రోష్య** = పరదేశాల నుండి తిరిగి గురుకులం చేరినప్పుడు, **పాదగ్రహణమ్** = చరణస్పర్శచేసి నమస్కరించాలి.

తాత్పర్యం:- శిష్యుడు పరదేశాల నుండి తిరిగి గురుకులం చేరినప్పుడు మాత్రం ధర్మాన్ని స్మరిస్తూ గురుపత్నులకు పాదస్పర్శ చేసి నమస్కరించాలి.॥192॥

గురుసేవాఫలితం- ఇది మనుకృతం-ప్రామాణికం

యథా ఖనన్ ఖనిత్రేణ నరో వార్యధిగచ్ఛతి । మూలశ్లోక సం. **150**
తథా గురుగతాం విద్యాం శుశ్రూషురధిగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **193 [2.218]**

టీక:- యథా ఖనిత్రేణ ఖనన్ నరః = ఏ విధంగా మానవుడు గడ్డపారతో బావిని తవ్వుతూ, **వారి+అధిగచ్ఛతి** = నీటిని పొందుతాడో, **తథా** = అలాగే, **శుశ్రూషుః** = గురుసేవ చేసే శిష్యుడు కూడా, **గురుగతాం విద్యాం** = గురువులు సంపాదించిన విద్యను, **అధిగచ్ఛతి**= పొందుతాడు.

తాత్పర్యం:- గడ్డపారతో బావిని తవ్వి మానవుడు నీటిని పొందునట్లు గురుశుశ్రూష చేసి శిష్యుడు విద్యను సంపాదించాలి.॥193॥

బ్రహ్మచారికి గ్రామనివాస నిషేధం- ఇది మనుకృతం-ప్రామాణికం

ముణ్డో వా జటిలో వా స్యాదథవాస్యాచ్ఛిఖాజటః । మూలశ్లోక సం. **151**
నైనం గ్రామేఽభినిమ్లోచేత్సూర్యో నాభ్యుదియాత్ క్వచిత్ ॥ ప్రక్షిప్తశ్లోక సం. **194[2.219]**

టీక:- బ్రహ్మచారి, **ముణ్డః వా జటిలః వా స్యాత్** = తలజుట్టుగొరిగించుకొని గుండు చేసుకోవచ్చు,లేదా తలజుట్టు పెంచుకోవచ్చు, **అథవా** = లేదా, **శిఖాజటః స్యాత్** = కేవలం శిఖ (పిలక) ఉంచుకొని, మిగిలిన కేశాలను కొరిగించుకోవచ్చు, **ఏనం** = ఈ బ్రహ్మచారి, **క్వచిత్ గ్రామే** = ఏ గ్రామంలోనైనా ఉండగా, **సూర్యః** =సూర్యుడు, **న అభినిమ్లోచేత్** = ఉదయించరాదు. ఏమరపాటు వల్ల అతడు తన గ్రామంలో ఉంటూ ఉండగా సూర్యుడు అస్తమించకూడదు, ఒకవేళ నిద్రిస్తే సూర్యోదయం కారాదు. అయితే, సూర్యోదయం, సూర్యాస్తమయాలకు ముందే సన్ధ్యోపాసనాది నిత్యకర్మల కోసం గురుకుల వనప్రదేశానికి వెళ్ళాలి.

తాత్పర్యం:- బ్రహ్మచారి తలజుట్టు పూర్తిగా కొరిగించుకొని గుండు చేసుకోవచ్చు లేదా తలజుట్టు పెంచుకోవచ్చు, లేదా కేవలం శిఖ ఉంచుకొని మిగిలిన జుట్టు పూర్తిగా గొరిగించుకోవచ్చు. ఈ బ్రహ్మచారి ఏ గ్రామానికైనా వెళ్ళినచో సూర్యాస్తమయంలోపల, లేదా సూర్యోదయం కంటే ముందే తన గురుకులానికి చేరాలి.॥194॥

సూర్యోదయాస్తమయముల సమయంలో నిద్రించినచో ప్రాయశ్చిత్తం- ఇది మనుకృతం-ప్రామాణికం

తం చేదభ్యుదియాత్సూర్యః శయానం కామచారతః । మూలశ్లోక సం. **152**
నిమ్లోచేద్వాఽప్యవిజ్ఞానాజ్జపన్నుపవసేద్దినమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **195 [2.220]**

టీక:- **తం చేత్** = ఒకవేళ **కామచారతః శయానం** = ఇచ్ఛానుసారంగా నిద్రిస్తుండగా, **సూర్యః అభి+ఉదియాత్** = సూర్యుడు ఉదయించినట్లయితే, **అపి వా** =అథవా, **అవిజ్ఞానాత్ నిమ్లోచేత్** = వేమరుపాటువల్లగాని, లేదా ప్రమాదవశాత్తుగా గాని, సూర్యుడస్తమించినట్లయితే, **దినమ్ జపన్+ఉపవసేత్** = దినమంతా గాయత్రీజపం చేస్తూ ఉపవాసం చేయాలి, భుజించరాదు.

తాత్పర్యం:- ఒకవేళ బ్రహ్మచారి మైమరచి నిద్రించినప్పుడు సూర్యుడు ఉదయించినట్లయితే, అథవా ఏమరుపాటు వల్లగానీ లేదా ప్రమాదవశాత్తు గానీ సూర్యుడు అస్తమించినట్లయితే దినమంతా గాయత్రీం చేస్తూ ఉపవాసం చేయాలి, భుజించరాదు.॥195॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సూర్యేణ హ్యభినిర్ముక్తః శయానోఽభ్యుదితశ్చయః । మూలశ్లోక సం.**153**
ప్రాయశ్చిత్తమకుర్వాణో యుక్తః స్యాన్మహతైనసా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**196[2.221]**

టీక:- **యః సూర్యేణ అభినిర్ముక్తః**= ప్రమాదం వల్ల సూర్యుడస్తమించినట్లయితే, **చ** = మరియు, **శయానః అభ్యుదితః** = నిద్రలో ఉండగానే సూర్యుడు ఉదయించినట్లయితే, **ప్రాయశ్చితం అకుర్వాణః** = ప్రాయశ్చిత్తం చేయడో, అతడు, **మహతా+ఏనసా యుక్తః స్యాత్** = గొప్ప అపరాధి అవుతాడు. అంటే అతడిని గొప్పదోషిగా పరిగణిస్తారు. సంధ్యోపాసన బ్రహ్మచారి అనుష్ఠించవలసిన పరమావశ్యకమైన శాస్త్రవిధి. ఈ విధిలో పొరపాటు చేసినందువల్ల బ్రహ్మచారి పాపగ్రస్తుడవుతాడని భయం ఉంటుంది. "ఏనః" శబ్దాన్నిగురించి (2-2)[2.27]లో చూడగలరు.

తాత్పర్యం:- బ్రహ్మచారి సూర్యోదయ-సూర్యాస్తమయ సమయాల్లో మైమరచి నిద్రించినట్లయితే, పాతకం సంప్రాప్తిస్తుంది. దీనికి రోజంతా ఉపవాసం, గాయత్రీ జపం వంటి ప్రాయశ్చిత్త విధి చేయాలి. అలా చేయనిచో అతడు గొప్ప అపరాధి అవుతాడు.॥196॥

సంధ్యోపాసన విధానం-విధి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆచమ్య ప్రయతో నిత్యముభే సన్ధ్యే సమాహితః । మూలశ్లోక సం.**154**
శుచౌ దేశే జపన్ జప్యముపాసీత యథావిధి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**197 [2.222]**

టీక:- బ్రహ్మచారి, **నిత్యం** = ప్రతిదినం, **ఉభే సన్ధ్యే** = ప్రాతఃకాలం, సాయంకాలం రెండు సంధ్యాకాలాల్లో **శుచౌదేశే** = పరిశుద్ధస్థానంలో, **ఆచమ్య** = ఆచమనం చేసి, **ప్రయతః** = ప్రయత్నపూర్వకంగా, **సమాహితః** = ఏకాగ్రచిత్తుడై, **జప్యం జపన్ ఉపాసీత** = పరమేశ్వరుణ్ణి (గాయత్రిని) జపిస్తూ ఉపాసన చేయాలి.(2.51- 53,2.76-78,101-103)

తాత్పర్యం:- బ్రహ్మచారి ప్రతిదినం ఇతర చింతనలేవీ లేకుండా రెండు సంధ్యాకాలాల్లోనూ పరిశుద్ధ స్థానంలో ఆచమనం చేసి, ఏకాగ్రచిత్తుడై శాస్త్ర ప్రకారం గాయత్రిని అనుష్ఠించాలి. నిత్యసంధ్యోపాసనకు పూర్వం శుద్ధ జలంతో ఆచమనం ఆచరించాలి.॥197॥

స్త్రీ-శూద్రాదుల యొక్క ఉత్తమాచారం కూడా అనుకరించదగినదే ఇది మనుకృతం-ప్రామాణికం

యది స్త్రీ యద్యవరజః శ్రేయః కించిత్సమాచరేత్ । మూలశ్లోక సం.**155**
తత్సర్వమాచరేద్యుక్తో యత్ర చాఽస్య రమేన్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**198[2.223]**

టీక:- **యది స్త్రీ యది అవరజః** = స్వాశ్రితమైన స్త్రీ అయినా కూడా, లేదా శూద్రుడైనా కూడా, **కించిత్ శ్రేయః సమాచరేత్** = ఏ కొంచెం శ్రేష్ఠమైన కార్యం చేసినట్లయితే, **తత్సర్వం+ఆచరేత్** = దాన్ని ఆదర్శంగా తీసుకొని ఆచరించాలి,

వా = లేదా, యత్ర = ఎచ్చట, ఏ శాస్త్రోక్తమైన కర్మ, అస్య మనః రమేత్ = ఇతడి మనస్సుకు ఆనందదాయకమో, అలాంటి సత్కర్మ చేస్తూ ఉండాలి.

తాత్పర్యం:- స్త్రీ అయినా, శూద్రులైనా ఒక మంచి పనిని ఆదర్శంగా తీసుకొని ఆచరిస్తున్నట్టైతే వాటిని గౌరవించాలి. వారు దేనిని తలపెట్టినా బాగా ఆలోచించి చేయాలి. శాస్త్రం ఒప్పుకోని పనులు చేయకూడదు. ధర్మశాస్త్ర విరుద్ధంగా లేనట్టి సత్కార్యాలు ఏవైతే మనస్సును రంజింపచేస్తాయో అలాంటి పనులే చేయాలి.॥198॥

199 నుండి 212వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* త్రివర్గ సంబంధ మాన్యతలు-

* **ధర్మార్థావుచ్యతే శ్రేయః కామార్థౌ ధర్మ ఏవ చ ।**
అర్థ ఏవేహ వా శ్రేయస్త్రివర్గ ఇతి తు స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *199 [2.224]*

తాత్పర్యం:- ధర్మం, ధనం కామహేతువులు కావడం చేత శ్రేష్ఠమైనవని చెబుతారు. అర్థం (డబ్బు)-కామం (స్త్రీ సుఖం) ఆనందాన్ని కల్గించడం చేత ఇవే ఉత్తమమైనవని కొందరు అంటారు. ధనమే కామధర్మాలకు హేతువు కాబట్టి ఇదే మేలు అని కొందరి భావం. ఐహిక సుఖాభిలాషులకు ఈ మూడూ ఉత్తమమని- ముముక్షువులకు మోక్షమే సదుపాయమని మనువు అభిప్రాయం. ధర్మార్థకామ స్వరూపాలను తెలుసుకొనుటకు 7.26 సమీక్షను చూడగలరు.॥199॥

* **ఆచార్యశ్చ పితా చైవ మాతా భ్రాతా చ పూర్వజః ।**
నార్తేనాప్యవమంతవ్యా బ్రాహ్మణేన విశేషతః । ప్రక్షిప్త శ్లోక సం. *200[2.225]*

తాత్పర్యం:- ఆచార్యుడు, తండ్రి, అన్న ఈ ముగ్గుర్నీ నొప్పించకూడదు. వీరిని తిరస్కరించడం తగదు. వీరిలో ముఖ్యం విప్రుణ్ణి అసలే తిరస్కరించరాదు. దీనికీ శ్లోకమే ప్రమాణం.॥200॥

* **ఆచార్యో బ్రహ్మణో మూర్తిః పితా మూర్తిః ప్రజాపతే : ।**
మాతా పృథివ్యా మూర్తిస్తు భ్రాతా స్వో మూర్తిరాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *201[2.226]*

తాత్పర్యం:- ఎందుకంటే-ఆచార్యుడు పరమాత్మ స్వరూపుడు, తండ్రి సాక్షాత్ విధాత సమానుడు. తల్లి భూదేవతా సమానురాలు. అన్న ఆత్మస్వరూపుడు. ఈ విధంగా వీరంతా దేవతాస్వరూపులు కాబట్టి వీరిపట్ల వ్యతిరేకత కూడదు.॥201॥

* **యం మాతాపితరౌ క్లేశం సహేతే సంభవే నృణాం ।**
న తస్య నిష్కృతిశ్శక్యా కర్తుం వర్షశతైరపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. *202 [2.227]*

తాత్పర్యం:- పిల్లలు పుట్టాలని తల్లిదండ్రులు ఎంత కష్టపడతారో, వారి శ్రమ తీర్చడానికి నూరేళ్ళ కాలమైనా సరిపోదు. తల్లి నవమాసాలు మోసి, వేదన అనుభవించి పుట్టిన బిడ్డని పెంచి పెద్దచేస్తుంది. పసివయసులో తండ్రి సంరక్షించి ఉపనయనం జరిపించి విద్యాబుద్ధులు చెప్పిస్తాడు. వీరి కష్టం ఎన్ని జన్మలెత్తినా తీర్చలేనిది.॥202॥

* **తయోర్నిత్యం ప్రియం కుర్యాదాచార్యస్య చ సర్వదా ।**
తేష్వేవ త్రిషు తుష్టేషు తపస్సర్వం సమాప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. *203 [2.228]*

తాత్పర్యం:- అలాంటి తల్లిదండ్రుల-గురువుల సంప్రీతికోసం ఏమైనా చెయ్యవలసిందే. వీరు సంతృప్తిచెందితే చాలు అన్నిరకాల తపస్సుల వల్ల కలిగినంత ఫలం లభిస్తుంది. కనుకనే.... ॥203॥

* **తేషాం త్రయాణాం శుశ్రూషా పరమం తప ఉచ్యతే ।**
న తైరభ్యననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *204 [2.229]*

తాత్పర్యం:- గురువు, మాతాపితరులను శుశ్రూషలచేత మెప్పించడమే ఉత్తమమైన తపస్సు అని చెప్పబడింది. వీరి ముగ్గురి అనుమతి లేకుండా ఇతర కార్యాలేవీ....అవి పుణ్యదాకమే అయినా చేయకూడదు. కాబట్టి లోకత్రయ ప్రాప్తికి ఈ ముగ్గురే హేతువులని చెప్పడానికి ఈ కింది శ్లోకమే ప్రమాణం:-॥204॥

* ***త ఏవ హి త్రయో లోకా స్త ఏవ త్రయ ఆశ్రమాః ।***
త ఏవ హి త్రయో వేదా స్త ఏవోక్తా స్త్రయోఽగ్నయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **205[2.230]**

తాత్పర్యం:- గురువు, తల్లిదండ్రులు ఈ ముగ్గురే మూడులోకాలు, మూడు వేదాలు. వేదత్రయ ఫల ప్రాప్తికి కారణభూతులు. అందువల్ల వీరే బ్రహ్మచర్యాది ఆశ్రమములు. వీరే త్రేతాగ్నులు. యజ్ఞఫలదాతలు కూడా.॥205॥

* ***పితా వై గార్హపత్యోఽగ్నిర్మాతాగ్నిర్దక్షిణః స్మృతః ।***
గురురాహవనీయస్తు సాఽగ్నిత్రేతా గరీయసీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***206 [2.231]***

తాత్పర్యం:- తండ్రి గార్హపత్యమనే అగ్ని. తల్లి దక్షిణాగ్ని. గురువు ఆహవనీయమనే అగ్ని.... అని శ్రుతి. ఈ అగ్నిత్రయం ఎంతో శ్రేష్ఠమైనది.॥206॥

* ***త్రిష్వప్రమాద్యన్నే తేషు త్రీన్ లోకాన్ విజయేద్గృహీ ।***
దీప్యమానః స్వవపుషా దేవవద్దివి మోదతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***207 [2.232]***

తాత్పర్యం:- ఈ ముగ్గురి విషయమై ఏ బ్రహ్మచారి పొరపాటు పడక జాగ్రత్తగా మసలుకుంటాడో అతడు అంతటా అందరికంటే ఉత్తమమైనవాడు. అలాంటి గృహస్థుడు కూడ మేటి అని చెప్పవచ్చు. దివ్యశరీరాన్ని పొంది, అంత్యమున దేవలోక నివాసికాగలడు. ॥207॥

* ***ఇమం లోకం మాతృభక్త్యా పితృభక్త్యా తు మధ్యమమ్ ।***
గురుశుశ్రూషయా త్వేవం బ్రహ్మలోకం సమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***208 [2.233]***

తాత్పర్యం:- యోగ్యుడై వీరి సేవలో తరించువాడు మాతృభక్తిచే భూలోకసుఖాన్నీ, పితృభక్తిచే అంతరిక్షాన్నీ, గురుభక్తిచేత బ్రహ్మలోకాన్నీ పొందుతాడు.॥208॥

* ***సర్వే తస్యాదృతా ధర్మా యస్యైతే త్రయ ఆదృతాః ।***
అనాదృతాస్తు యస్యైతే సర్వాస్తస్యాఫలాః క్రియాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***209 [2.234]***

తాత్పర్యం:- ఎవడు తల్లిదండ్రులను, గురువును ఆదరిస్తాడో అతడిని ఆ మూడులోకాలూ ఆదరిస్తాయి. ఎవడు ఈ ముగ్గురినీ తిరస్కరిస్తాడో అతడి శ్రౌతస్మార్తక్రియలన్నీ విఫలాలవుతాయి.॥209॥

* ***యావత్త్రయస్తే జీవేయుస్తావన్నాన్యం సమాచరేత్ ।***
తేష్వేవ నిత్యం శుశ్రూషాం కుర్యాత్ ప్రియహితే రతః॥ ప్రక్షిప్త శ్లోక సం. ***210[2.235]***

తాత్పర్యం:- ఎంతవరకు ఈ ముగ్గురు జీవించి ఉంటారో, అంతవరకూ వేరొక ధర్మమును వారి అనుమతి లేకుండా చేయరాదు. ప్రతిదినం వారికి ప్రియమై హితమగు కార్యమొనర్చువాడై, వారికి శుశ్రూష చేయాలి.॥210॥

* ***తేషామనుపరోధేన పారత్ర్యం యద్యదాచరేత్ ।***
తత్తన్నివేదయేత్తేభ్యో మనోవచనకర్మభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***211 [2.236]***

తాత్పర్యం:- వారి శుశ్రూషకు విరోధం లేకుండా ఏది పరలోకహేతువు అయిన కార్యం మనోవాక్కాయ కర్మములచేత ఆచరించునో అందతా వారికి నివేదించాలి.॥211॥

* **త్రిష్వేతేష్వితి కృత్యం హి పురుషస్య సమాప్యతే ।**
ఏష ధర్మః పరస్సాక్షాదుపధర్మోఽన్య ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***212/2.237/***

తాత్పర్యం:- ఈ ముగ్గురికి శుశ్రూష చేయడమే ముఖ్యధర్మం. తక్కిన యజ్ఞాదికర్మములు అముఖ్యములు.॥212॥

ప్రక్షిప్తాల పరిశీలన

199 నుంచి 212 వరకు గల శ్లోకాలు ఈ కింది ఆధారాలవల్ల ప్రక్షిప్తాలు-

1. విషయ వ్యతిరేకాలు

ఈ 200 నుంచి 211 వరకు ఉన్న శ్లోకాలు విషయవ్యతిరేకాలు. రెండవ అధ్యాయంలోని విషయాలు బ్రహ్మచర్యాశ్రమం, బ్రహ్మచారి కర్తవ్యాలకు సంబంధించినవి. (2.44(2.69), 3.1,2, 2.43,44(2.68,69)) శ్లోకాలలో గురువు దగ్గర ఉన్నప్పుడు శిష్యుడు ఎలా ఉండాలో, వాటి సంకేతాలున్నాయి. 2.139 (2.164)లోనూ - **"అనేక క్రమయోగేన... గురౌ వసన్ సంచినుయాత్ బ్రహ్మాధిగమికం తపః"** అంటే- పైన విధులను అనుసరించి బ్రహ్మచారి గురువు దగ్గర ఉంటూ, వేదజ్ఞానాభివృద్ధి కొరకు తపస్సు చేయాలి- అని. అంతే కాకుండా, 2.83 (108), 150(175), 169-278 (194-203), 194 (219), 216-221 (241-246) శ్లోకాలలోనూ, ఈ అధ్యాయంలోని విషయాలు కేవలం గురుకులంలో ఉండే వారి కర్తవ్యాలు అని స్పష్టంగా చెప్పాడు. కానీ, ఈ శ్లోకాలలో చెప్పినవి బ్రహ్మచారి కర్తవ్యాలు కాకుండా గృహస్థ ధర్మాలు చెప్పారు. 207వ శ్లోకంలో నైతే, **"విజయేత్ గృహీ"** అని ఉంది. ఈ విధంగా ప్రతిరోజూ తల్లిదండ్రులకు ప్రియంకలిగించేవి (203), వారి సేవలు (210), వారి అనుమతితోనే అన్ని ధర్మకార్యాలూ చేయటం (211) మొదలైనవి ఇంటికే దూరంగా గురుకులంలో ఉంటూ చేయటం సాధ్యమయ్యేవి కావు. ఇవన్నీ గృహస్థ ధర్మాలు. ఈ విధంగా ఇక్కడివన్నీ విషయ వ్యతిరేకాలు కావటం చేత ప్రక్షిప్తాలు. ఈ శ్లోకాలన్నీ అర్థవాదాలు కాకుండా విధివాక్యాలుగా ఉండటమూ గమనించవలసిన విషయం.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 199వ శ్లోకంలో వేర్వేరు ఆచార్యుల అభిప్రాయాలు చెబుతూ, ఒకమతం ధర్మార్థాలు, మరొక మతం కేవలం **'అర్థాన్నే'** మేలు చేసేవని చెప్పారు. ఇది మనువుకు అనుకూలం కాదు. మనువు అన్నిచోట్లా ధర్మమే అనివార్యమని చెప్పాడు. 4.176లోనైతే - **"పరిత్యజేత్ అర్థకామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ"**- అంటే ధర్మం కాని అర్థాన్నీ, కామాన్నీ విడిచిపెట్టవలసింది, - అని స్పష్టంగా చెప్పాడు. మళ్ళీ కేవలం 'అర్థాన్నే' మేలు చేసేదని మనువు ఎలా అంగీకరిస్తాడు? మనువు ధర్మ- అర్థ- కామాలను మూడింటినీ అవసరమైనవనీ, వాటిని సమన్వయపరచి వినియోగించుకోవాలనీ చెప్పాడు. ఎటువంటి శుభకార్యానికైనా ఆ మూడింటినీ అభివృద్ధి స్వరూపమైన పరిణామాలుగా భావించి, చెప్పాడు. ఎలాగంటే - **"సమీక్ష్యకారిణం ప్రాజ్ఞం ధర్మకామార్థకోవిదం" "త్రివర్గేణాభివర్ధతే"**. (7.26-27) ఈ విధంగా ఈ అభిప్రాయానికి వ్యతిరేకం కనుక ఈ శ్లోకం ప్రక్షిప్తం.

ఖ. ఇదే విధంగా తల్లిదండ్రులు, ఆచార్యుల సేవలోనే తపస్సుకు పరిపూర్ణత చేకూరుతుందనటం. (204), వీటిలోనే అన్ని కర్తవ్యాలూ ముగుస్తాయి అనడం (212), వారిసేవే పరమధర్మంగా భావించటం (212) మొదలైనవి మనుస్మృతిలోని 1.108; 2.141(2.166), 4.147 శ్లోకాలకు వ్యతిరేకాలు. ఎందుకంటే వీటిలో ప్రాణాయామం, వేదాభ్యాసం మొదలైనవాటినే తపస్సుగానూ, పరమధర్మంగానూ చెప్పారు.

గ. 210లో వీరు బ్రతికి ఉండగా ఇతర కర్తవ్యాలను చేయకూడదనటం మనుస్మృతిలో అన్ని వ్యవస్థలకూ వ్యతిరేకం. దీనివల్ల మనుస్మృతిలోని అన్ని పద్ధతులూ అనవసరమని చెప్పినట్లవుతుంది.

ఘ. ఇలాగే, 205,209 శ్లోకాలలో ఈ మూడింటినే మూడు లోకాలు, మూడు వేదాలు, మూడు ఆశ్రమాలు అనటం కూడా మనుస్మృతి మౌలిక సంప్రదాయానికి విరుద్ధం. అవే మూడు వేదాలు, మూడు ఆశ్రమాలు అని నమ్మితే, ఇక వేదాలు, ఆశ్రమాల అవసరమే ఉండదు.

3. ప్రసంగవ్యతిరేకం

ఈ శ్లోకాల వల్ల ప్రసంగ భంగం అవుతుంది. 169వ శ్లోకంలో స్త్రీలు, కింది స్థాయి వారు చేసే శ్రేష్ఠ కార్యాలను అనుకరించాలని ఉంది. 213వ శ్లోకంలో అదే విషయాన్ని అర్థవాదరూపంలో వివరంగా చెప్పారు. కింది స్థాయివారు విద్యలు, ధర్మగ్రహణం చేయవచ్చని ఉంది. 198వ శ్లోకానికి 213వ శ్లోకంతో సంబంధం ఉంది. ఈ శ్లోకాలు ఆ సంబద్ధతను పాడుచేశాయి. ఈ విధంగా ప్రసంగవ్యతిరేక కథనం ఉన్నందున ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

213 నుండి 218వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

నిమ్నస్తర వ్యక్తుల నుండి కూడా జ్ఞాన ధర్మాల ప్రాప్తి-

శ్రద్ధధానశ్శుభాం విద్యామాదదీతావరాదపి । మూలశ్లోక సం.**156**
అన్త్యాదపి పరం ధర్మం స్త్రీరత్నం దుష్కులాదపి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**213 [2.238]**

టీక:- శుభాం విద్యాం శ్రద్ధధానః = ఉత్తమ విద్యాప్రాప్తికోసం శ్రద్ధగల మానవుడు, **అవరాత్ +అపి ఆదదీత** = తనకంటే తక్కువ వాడి నుండి కూడా విద్యను స్వీకరించాలి. **అన్త్యాత్+అపి పరం ధర్మం** = నీచజాతివాడి నుండి కూడా ఉత్తమధర్మాన్ని స్వీకరించవచ్చు. మరియు **దుష్కులాత్ +అపి, స్త్రీరత్నం** = తక్కువ వర్ణం వారి నుండి కూడా ఉత్తమ స్త్రీని గ్రహించవచ్చు. ఇదేనీతి. ఉత్తమ వస్తువైనట్లయితే ఏ స్థానమందున్నా కూడా తీసికోవచ్చు.

తాత్పర్యం:- శ్రద్ధగలవాడు తనకంటే తక్కువైనవాడి నుండి అయినా ఉత్తమవిద్యను గ్రహించాలి. అంత్యజునివద్దనుండి అయినా ఉత్తమధర్మాన్ని నేర్చుకోవాలి. తక్కువ వర్ణంలో పుట్టినదైనా స్త్రీరత్నమును గ్రహించాలి.॥213॥

ఉత్తమ పదార్థాలను అన్ని స్థానాల నుండి గ్రహించవచ్చు ఇది మనుకృతం-ప్రామాణికం

విషాదప్యమృతం గ్రాహ్యం బాలాదపి సుభాషితమ్ । మూలశ్లోక సం.**157**
అమిత్రాదపి సద్వృత్తమమేధ్యాదపి కాంచనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**214 [2.239]**

టీక:- విషాత్+అపి+అమృతం గ్రాహ్యం = విషం నుండి కూడా అమృతాన్ని గ్రహించాలి. మరియు, **బాలాత్+అపి సుభాషితమ్** = బాలుడి నుండి కూడా సుభాషితం (మంచిమాట) ను గ్రహించాలి, **అన్త్యాత్ +అపి సద్-వృత్తమ్** = నీచజాతివాడి నుండి కూడా మంచి ఆచరణను నేర్చుకోవాలి. అలాగే **అమేధ్యాత్ +అపి కాంచనమ్** = అశుద్ధ స్థానం నుండి కూడా స్వర్ణాన్ని, మూల్యవంతమైన వస్తువును పొందాలి.

తాత్పర్యం:- విషంలోంచి అయినా అమృతాన్ని పొందాలి. బాలుడైనవాడు ఒక మంచి మాట చెప్పినా గ్రహించాలి. సదాచారాన్ని శత్రువు నుంచి అయినా తెలుసుకోవాలి. అశుద్ధ స్థానం నుండి కూడా బంగారాన్ని, మూల్యవంతమైన వస్తువును పొందాలి.॥214॥

ఇది మనుకృతం-ప్రామాణికం

స్త్రియో రత్నాన్యథో విద్యా ధర్మశ్శౌచం సుభాషితమ్ । మూలశ్లోక సం.**158**
వివిధాని చ శిల్పాని సమాదేయాని సర్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**215 [2.240]**

టీక:- **స్త్రియః**= ఉత్తమ స్త్రీలు, **రత్నాని** = అనేక రకాలైన రత్నాలు, **విద్యా** = విద్య, **ధర్మః** = సత్యం, **శౌచం** = పవిత్రత, **సుభాషితం**= శ్రేష్ఠభాషణం, **చ** = మరియు, **వివిధాని శిల్పాని** = అనేక విధాలుగా ఉన్న శిల్ప విద్యలను, **సర్వతః సమాదేయాని** = అన్ని దేశాల నుండి, మానవులందరి నుండి గ్రహించాలి.

తాత్పర్యం:- ఏస్థలంలో ఎక్కడ ఉన్నప్పటికీ, వీటిని గ్రహించడం తప్పుకాదంటుంది ధర్మశాస్త్రం. అవి ఏవి అంటే ఉత్తమ స్త్రీలు, రత్నాలు, విద్య, ధర్మం, సమ్మతి, సుభాషితం, మరియు అనేక విధాలుగా ఉన్న శిల్ప విద్యలను అన్ని దేశాలనుండి, మానవులందరి నుండి గ్రహించాలి.॥215॥

ఋషి దయానందభాష్యం:- ఉత్తమ స్త్రీలు, అనేక రకాల రత్నాలు, విద్య, సత్యం, పవిత్రత, సుభాషితం, నానావిధాలైన శిల్ప విద్యలు, చేతిపనులు మొదలైనవాటిని అన్నిదేశాల నుండి, మానవులందరి నుండి గ్రహించాలి. (స.ప్ర. 4వ.స.)

వివరణ: ఈ అధ్యాయానికి విషయం-విద్య లేక విద్యాప్రాప్తి విద్యాసంబంధమైన విషయాలను ప్రముఖంగా వివరిస్తూ, శిక్షాప్రదమైన విషయాలను కూడా ప్రస్తావించడం జరిగింది. విద్యాసంబంధమైన విషయాలే కాబట్టి ప్రాసంగికమే. విషయ సంగతమే.

ఆపత్కాలంలో బ్రాహ్మణేతరుల నుండి కూడా విద్యాధ్యయనం చేయవచ్చు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అబ్రాహ్మణాదధ్యయనమాపత్కాలే విధీయతే । మూలశ్లోక సం.**159**
అనువ్రజ్యా చ శుశ్రూషా యావదధ్యయనం గురోః॥ ప్రక్షిప్త శ్లోక సం.**216 [2.241]**

టీక:- **ఆపత్కాలే** = ఆపద సమయంలో, **అబ్రహ్మణాత్** = అబ్రాహ్మణుడు అనగా క్షత్రియాదుల నుండి, **అధ్యయనమ్** = విద్యాగ్రహణం, **విధీయతే** = విధింపబడింది, **యావత్ అధ్యయనం** = విద్యను చదివినంతవరకు, **గురోః అనువ్రజ్యా చ శుశ్రూషా** = గురువు ఆజ్ఞాపాలన, సేవాశుశ్రూషలు చేయాలి.

తాత్పర్యం:- ఆపత్కాలం వచ్చినప్పుడు క్షత్రియ వైశ్యులవద్ద అయినా వేదాధ్యయనం చేయాలి. విద్య పూర్తయ్యేంత వరకు గురువుకు సేవాశుశ్రూషలు, వారి ఆజ్ఞాపాలన చేయాలి.॥216॥

వివరణ: బ్రాహ్మణేతరుల నుండి విద్యాగ్రహణ పరంపర మనుమహర్షి తరవాత కూడా ఉంది. విద్యాదానం బ్రాహ్మణుడి ప్రముఖ కర్తవ్యమైనా కూడా అన్యవర్ణాలవారి నుండి కూడా విద్యాగ్రహణం చేయవచ్చు. ఇందుకు సమర్థనగా ఈ కింది శ్లోకాలు మనుధర్మశాస్త్రం నుండి లభిస్తాయి.

క. **శ్రద్ధధానః శుభాం విద్యాం ఆదదీతావరాదపి**
అన్త్యాదపి పరం ధర్మం స్త్రీ రత్నం దుష్కులాదపి (2-213) [238]
ఖ. **స్త్రియో రత్నాన్యథో విద్యా... సమాదేయాని సర్వతః** (2-215) [240]
గ. **సుశ్రుతాచార్యుడు కూడా ఈ విషయాన్ని సమర్థించాడు.** (సుశ్రుతం-ద్వితీయ ప్రకరణం)

"బ్రాహ్మణః త్రయాణాం వర్ణానాం ఉపనయనం కర్తుమర్హతి, రాజన్యో ద్వయస్య, వైశ్యో వైశ్యస్యేవేతి శూద్రమపి కులగుణసంపన్నం మన్త్రవర్జ ముపనీతం అధ్యాపయేదిత్యేకే."

బ్రాహ్మణుడు మూడు వర్ణాలవారికి అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు. క్షత్రియుడు రెండు వర్ణాలవారికి (క్షత్రియ-వైశ్య), వైశ్యుడు వైశ్యవర్ణం వారికి యజ్ఞోపవీతం వేసి, చదువు చెప్పవచ్చు. ఉత్తమ కులీనుడు, శుభలక్షణ గుణాలు కలవాడైన శూద్రుడున్నట్లయితే అతడితో మంత్రసంహితను వదిలి, తక్కిన సర్వశాస్త్రాలను చదివించవచ్చు. కానీ ఉపనయనం చేయరాదు. ఈ అభిప్రాయాన్ని అనేకమంది ఆచార్యులు అంగీకరించారు (స.ప్ర. 3సము).

అయితే ఉపనయన సంస్కారం, మంత్రసంహితలు ఎందుకు నిషేధించినట్లు? నిశ్చితసమయంలో ఈ సంస్కారాల యొక్క అధికారాన్ని పోగొట్టుకున్నాడు. అందువల్లనే అతడు శూద్రుడనబడుతున్నాడు. కానీ, అతడికి కూడా చదువు కావాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

నాబ్రాహ్మణే గురౌ శిష్యో వాసమాత్యంతికం వసేత్ । మూలశ్లోక సం. **160**
బ్రాహ్మణే చాననూచానే కాంక్షన్ గతిమనుత్తమామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **217 [2.242]**

టీక:- అనుత్తమామ్ గతిం కాంక్షన్ శిష్యః = ఉత్తమగతిని, మోక్షాన్ని కోరే శిష్యుడు, **అబ్రాహ్మణే గురౌ** = బ్రాహ్మణేతరుడు గురువైనప్పుడు, అతని వద్ద, **చ** = మరియు, **అన్+అననూచానే బ్రాహ్మణే** = వేదాలలో పారంగతుడు, (సాంగోపాంగ వేదాధ్యయనంలో అసమర్థుడైన బ్రాహ్మణ గురు సమీపంలో కూడా), **అత్యన్తికం వాసమ్ న వసేత్** = ఆజీవనం నివాసం చేయరాదు. కారణం-అతని వద్ద శిష్యుడి ప్రగతి కుంటుపడుతుంది. సాంగోపాంగ వేద విజ్ఞాతయైన గురువు వద్ద ఉండి, ఉన్నతికి ఉత్తమగతియైన మోక్షం వరకు చేరగలడు.

తాత్పర్యం:- మోక్షరూపమగు ఉత్తమగతి కోరు బ్రహ్మచారి బ్రాహ్మణేతరుడయిన గురువు దగ్గర, సాంగవేదాధ్యయనం చేయని బ్రాహ్మణుని దగ్గర యావజ్జీవితం శుశ్రూషను ఆచరించరాదు. అనగా పూర్తిగా అక్కడే అధ్యయనం చేయరాదని భావం. ॥217॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యది త్వాత్యన్తికం వాసం రోచయేత గురోః కులే। మూలశ్లోక సం. **161**
యుక్తః పరిచరేదేనమాశరీరవిమోక్షణాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **218 [2.243]**

టీక:- యది తు = ఒకవేళ బ్రహ్మచారియైన శిష్యుడు, **గురోః కులే** = గురుకులంలో, **అత్యన్తికం వాసం రోచయేత** = జీవన పర్యంతం నివసించాలనుకున్నట్లయితే, **ఆశరీర-విమోక్షణాత్** = శరీరం రాలిపోయేవరకు, ఏనం= తన గురువుకు, **యుక్తః పరిచరేత్** = ప్రయత్నపూర్వకంగా సేవచేస్తూ ఉండాలి.

తాత్పర్యం:- గురుకులంలో నైష్ఠిక బ్రహ్మచర్యరూపమగు వ్రతమును ఆచరించదానికి కోరినట్లయితే జాగరూకుడై గురు శుశ్రూషను ఆతడి జీవితాంతం ఆచరించాలి.॥218॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

*ఆజీవన గురుసేవా ఫలం-

* *ఆ సమాప్తేశ్శరీరస్య యస్తు శుశ్రూషతే గురుమ్ ।*
స గచ్ఛత్యంజసా విప్రో బ్రహ్మణస్సద్మ శాశ్వతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *219 [2.244]*

తాత్పర్యం:- శరీరం నశించేంతవరకు ఎవదు గురుశుశ్రూష చేస్తాడో, అతదు తప్పక శాశ్వతమైన బ్రహ్మలోకాన్ని పొందుతాడు. ॥219॥

ప్రక్షిప్త పరిశీలన

పై శ్లోకం ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తం అవుతుంది.

క. ఈ శ్లోకంలో కేవలం గురుసేవతోనే బ్రహ్మప్రాప్తి కలుగుతుందని ఉంది. మనువు కేవలం ఒక కర్మతోనే కాకుండా, అన్ని నిశ్శ్రేయసకర్మలను చేయుటంవల్లనే మోక్షప్రాప్తి అని చెప్పాడు. (12.83,31).

ఖ. మనువు 12.83, 31లలో పరిగణించిన నిశ్శ్రేయసకర్మలలో ఇది లేదు. కనుక ఇది మనువు పద్ధతులకు వ్యతిరేకం. అందుకని ప్రక్షిప్తం.

గ. ఇందులో గురుసేవకు అనవసరమైన మహత్త్వాన్ని ఆపాదించారు. ఆజన్మాంతమూ గురుసేవ చేయటమే మోక్షాన్ని ఇస్తే మనుస్మృతిలో చెప్పిన మిగిలిన మోక్షప్రాప్తి విధానాల అవసరమేముంటుంది? ఈ విధంగా ఈ శ్లోకం మూలవ్యవస్థకూ, విశ్వాసాలకూ వ్యతిరేకంగా ఉంది.

220,221 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

సమావర్తన సంస్కారంలో గురుదక్షిణ విధానం-

న పూర్వం గురువే కించిదుపకుర్వీత ధర్మవిత్ । మూలశ్లోక సం. **162**
స్నాస్యంస్తు గురుణాఽఽజ్ఞప్తశ్శక్త్యా గుర్వర్థమాహరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **220 [2.245]**

టీక:- **ధర్మవిత్** = విధితెలిసిన శిష్యుడు, **స్నాస్యంస్తు** = స్నాతకుడు కావాలనుకుంటే, అంటే సమావర్తన సంస్కారం చేయించ తలచుకుంటే, **గురుణా+ఆజ్ఞప్తః** = గురువు నుండి అనుజ్ఞనుపొంది, **శక్త్యా** = యథాశక్తి, **గుర్వర్థమ్** = గురువు కోసం, **ఆహరేత్** = దక్షిణ ప్రదానం చేయాలి కానీ, **పూర్వం గురవే కించిత్ న ఉపకుర్వీత** = సమావర్తన సంస్కారానికి ముందు గురువు గారికి దక్షిణ గాని, లేదా కానుక రూపంగా గాని ఏమీ ఇవ్వరాదు.

తాత్పర్యం:- వేదమును అధ్యయనం చేయడానికి ముందు శిష్యుడు గురువుకు ఏవిధమైన దక్షిణను ఇవ్వవరాదు. వేదాధ్యయనం చేసి ముగిసిన తరావత వివాహం చేసికోగోరి, గురువు అనుమతి పొంది, గురువు కోరినదాన్ని దక్షిణను ఇవ్వాలి.॥220॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గురుదక్షిణగా ఇవ్వవలసిన వస్తువులు-

క్షేత్రం హిరణ్యం గామశ్వం ఛత్రోపానహమాసనమ్ । మూలశ్లోక సం. **163**
ధాన్యం శాకం చ వాసాంసి గురవే ప్రీతిమావహేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **221 [2.246]**

టీక:- శిష్యుడు యథాశక్తి, **క్షేత్రం** = భూమిని, **హిరణ్యం** = స్వర్ణమును, **గామ్** = గోవును, **అశ్వం** = అశ్వమును, **ఛత్ర-ఉపానహమ్+ఆసనమ్** = గొడుగు, పాదరక్షలు, ఆసనం, **ధాన్యం** = ధాన్యమును, **వాసాంసి** = వస్త్రాలను, **వా** = లేదా, **శాకం** = కూరగాయలు, **గురవే** = గురువుకు, **ప్రీతిం ఆవహేత్** = ప్రీతిపూర్వకంగా దక్షిణరూపంలో ప్రదానం చేయాలి.

తాత్పర్యం:- భూమి, బంగారం, ఆవులు, గుర్రాలు, గొడుగు, పాదరక్షలు, ఆసనం, ధాన్యం, కూరగాయలు, వస్త్రాలు మొ॥ వాటిని గురువుకు ఇచ్చి సంప్రీతుణ్ణిగా చేయాలి.॥221॥

222,223వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** గురువు మరణించినపుడు గురుదక్షిణ విధానం-**

* *ఆచార్యే తు ఖలు ప్రేతే గురుపుత్రే గుణాన్వితే ।*
గురుదారే సపిండే వా గురువద్వృత్తిమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *222 [2.247]*

తాత్పర్యం:- నైష్ఠిక బ్రహ్మచారి తన గురువు మృతినొందిన పక్షంలో, గుణాన్వితుడైన గురుపుత్రుడి యందు, గురుభార్యయందు, సపిండునియందు దేహపాతమువరకు శుశ్రూష చేయవచ్చు.॥222॥

* *ఏతేష్వవిద్యమానేషు స్థానాసనవిహారవాన్ ।*
ప్రయుంజానోఽగ్ని శుశ్రూషాం సాధయేద్దేహమాత్మనః॥ ప్రక్షిప్త శ్లోక సం. **223 [2.248]**

తాత్పర్యం:- వీరలు లేనప్పుడు గురుపుత్రుడు హోమం చేస్తే అగ్నికుండమునకు సమీపంలో ఆసనం వేసికొని ప్రతిదినం ఆ అగ్నిహోత్రంలో ఆహుతులిస్తూ తన జీవితకాలం గడపాలి. ॥223॥

ప్రక్షిప్తాల పరిశీలన

222, 223 శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

222-223లలో గురుపుత్రుడు, గురుపత్ని గురువుకు సపిండికులు. ఎవరూ లేకపోతే, అగ్నిహోత్రం చేస్తున్న శిష్యుడైనా అని చెప్పాడు. గురువు విషయాని కొస్తే, ఒక గురువు దివంగతుడైతే మరొక గురువును స్వీకరించవచ్చు. మరొక గురువును స్వీకరించరాదనే నియమాలేమీ మనుస్మృతిలో చెప్పలేదు. గురుపత్ని, పుత్రుల వద్దే జీవితాంతం ఉండి పూర్తి చేసుకోవచ్చు. పైగా 2.215[240] లో- **"స్త్రియః రత్నాన్యథో విద్యా.....సమాదేయాని సర్వతః"**- వేర్వేరు గురువుల నుంచి విద్యను గ్రహించే పద్ధతి ఉంది, మరి వేర్వేరు గురువుల నుంచి విద్యాభ్యాసం చేసే అవకాశం ఉన్నప్పుడు, గురువు లేకుంటే, అతని పుత్రుడు, భార్య వద్ద బానిసవలె ఉండి, తన జీవితాన్ని వ్యర్థం చేసుకోవటమో లేదా అక్కడే ఉండి తపస్సు చేసుకోవడమో మను సమ్మతం కాదు. ఈ విషయంలో గురుసేవ తన ఇష్టమే కానీ, గురువువంశానికి సేవకాదు. 222వ శ్లోకం ప్రసంగ దృష్టితో 223వ శ్లోకంతో సంబంధం కలది. 220-221 శ్లోకాలకు ఇది వ్యతిరేకం. అందువల్ల రెండూ ప్రక్షిప్తాలే !

బ్రహ్మాచార్యాశ్రమ పాలన ఫలం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఏవం చరతి యో విప్రో బ్రహ్మచర్యమవిప్లుతః । మూలశ్లోక **సం.164**
స గచ్ఛత్యుత్తమం స్థానం న చేహాజాయతే పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**224**

టీక:- **యః ద్విజః** = ద్విజుడైన విద్వాంసుడు, **ఏవం** = ఈ విధంగా పైన చెప్పినట్లు, **అవిప్లుతః** = అఖండిత రూపంలో, **బ్రహ్మచర్యమ్ చరతి** = బ్రహ్మచర్యాశ్రమాన్ని పాటిస్తాడో, **సః ఉత్తమం స్థానం గచ్ఛతి** = అతడు ఉత్తమస్థానం, బ్రహ్మపదం పొందుతాడు. **చ** = మరియు, **ఇహ** = ఈ సంసారంలో, **పునః న ఆజాయతే** = పునర్జన్మను పొందదు. అంటే జన్మ-మరణ ప్రవాహం నుండి విముక్తుడవుతాడు. కారణం-మోక్షసుఖం కూడా కొన్ని కర్మల ఫలమే. కాబట్టి ఈ శాంత కర్మలకు అనంతఫలం లభించదు. అందువల్ల మోక్షసుఖావధి పూర్తికాగా జీవుడికి జన్మ అవశ్యం లభిస్తుంది.

తాత్పర్యం:- ఇంతవరకు చెప్పబడినరీతిగా ఏ విప్రుడు ఏమరుపాటు లేకుండా బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబిస్తాడో, అతడు ఉత్తమలోకాలను పొందగలడు.॥224॥

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మట్టి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'సంస్కారబ్రహ్మచర్యాశ్రమ'నామాత్మకః ద్వితీయోఽధ్యాయః॥
ఇతి ద్వితీయోఽధ్యాయః సమాప్తః
మనుస్మృతిలో ద్వితీయాధ్యాయం సమాప్తం

❧

మనుస్మృతి

తృతీయాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన*ఋషి దయానందభాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: **286**; మూలశ్లోకాలు: **85** ; ప్రక్షిప్తాలు : **201**

సమావర్తన-వివాహ సంస్కారాలు-పఞ్చ మహాయజ్ఞ విధాన విషయం

1 నుండి 10వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

సమావర్తనం 1 నుండి 3వ శ్లోకం వరకు

బ్రహ్మచర్యం, వేదాభ్యాసకాలం-

షట్ త్రింశదాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్ ।
తదర్ధికం పాదికం వా గ్రహణాన్తికమేవ వా ॥ మూలశ్లోక సం.**1**

టీక:-గురౌ = గురుకులంలో, బ్రహ్మచారి, **త్రైవేదికం వ్రతమ్** = జ్ఞాన-కర్మ-ఉపాసనారూపమైన త్రివిధయజ్ఞాలకు నిలయమైన, వేదాధ్యయన సంబంధమైన బ్రహ్మచర్యవ్రతాన్ని, **షట్ త్రింశత్ + అబ్దికం** = 36 సంవత్సరాలుగాని, **వా** = అథవా, **తత్+అర్ధికం** = ఆ 36లో సగం-18 సంవత్సరాలు గాని, **పాదికం** = ఆ 36 లో 4వ భాగం-9సం॥ గాని, **వా** = లేదా, **గ్రహణ+అన్తికమ్ +ఏవ** = విద్య పూర్తి కానంతవరకు గాని, **చర్యం** = పాటించాలి.

తాత్పర్యం:- ఈ బ్రహ్మచర్య వ్రతావలంబి మూడువేదాలను సాంగోపాంగంగా అధ్యయనం చెయ్యడానికి -గురుకులంలో ముప్పైఆరేళ్లు గాని, లేదా అందులో సగం-అంటే 18 సంవత్సరాలు గాని, లేదా వీలుకానప్పుడు అందులో సగం-అంటే 9 ఏళ్లు గాని బ్రహ్మచర్యవ్రతం అనుష్ఠించాలి, లేదా విద్య పూర్తికానంత వరకు వైదికవ్రతాన్ని పాటించాలి.॥1॥

ఋషి దయానందభాష్యం:- ఎనిమిదో సం॥ నుండి 36 సం॥ వరకు- వేదాలను సాంగోపాంగంగా చదవడానికి (3×12) = 36+8 = 44 సం ॥ పడుతుంది. లేదా 18 సం॥ బ్రహ్మచర్యదీక్ష 8సం॥ కలుపుకొని 26 సం॥ గాని, లేదా 9 సం॥ బ్రహ్మచర్యదీక్ష లేదా, విద్య పూర్తికానంత వరకు వైదిక వ్రతాన్ని అనుసరించాలి (స.ప్ర.4వ సము).

సమావర్తనం ఎప్పుడు చేయాలి?- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదానధీత్య వేదౌ వా వేదం వాఽపి యథాక్రమమ్ ।
అవిప్లుత బ్రహ్మచర్యో గృహస్థాశ్రమమావిసేత్ ॥ మూలశ్లోక సం.**2**

టీక:- వేదాన్, వేదౌ వా వేదం యథాక్రమమ్ +అధీత్య = బ్రహ్మచర్య వ్రతంలో, 4,3,2, లేదా ఒక్క వేదం అయినా క్రమంగా చదివి, **అవిప్లుత బ్రహ్మచర్యః** = అఖండిత బ్రహ్మచర్యాన్ని పాటించి, **గృహస్థాశ్రమమ్ +ఆవసేత్** = గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలి.

తాత్పర్యం:- బ్రహ్మచర్య వ్రతంతో 4గాని, 3గాని, 2గాని ఏదో ఒక వేదాన్ని గాని పూర్తిగా చదివి ఆ తరవాత గురువు అనుజ్ఞ పొంది, గుణకర్మ స్వభావాలతో శుభలక్షణాలు ఉన్న కన్యను-పెళ్లి చేసుకోవాలి.॥2॥

ఋషి దయానందభాష్యం:- క్రమంగా ఆచార్యుడికి అనుకూలంగా ప్రవర్తిస్తూ, బ్రహ్మచారి గాని, బ్రహ్మచారిణి గాని, ధర్మబుద్ధితో నాలుగు గాని, మూడు గాని, రెండు గాని, లేదా ఒక్క వేదం అయినా సాంగోపాంగంగా చదివి, అఖండిత బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ గృహస్థాశ్రమంలో ప్రవేశించాలి.

వివరణ:

1. సమావర్తనమంటే ఏమిటి?

గురుకులంలో ఉండి, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ వేదాలలోనూ, వేదాంగాలలోనూ గల విద్యను గ్రహించి గురుకులం నుండి తన స్వగృహానికి తిరిగి రావడం సమావర్తనమంటారు. ముఖ్యంగా ఈ సంస్కారం గృహస్థుడు కాబోయే ముందు చేయబడును. **'సమ్+ఆ'** = ఉపసర్గలు, **'వృత్ -వర్తనే'** = (భ్వాది) ధాతువుకు **'ల్యుట్'** ప్రత్యయం చేర్చగా **'సమావర్తన'** శబ్దం నిష్పన్నమవుతుంది. తిరిగి రావడం అని అర్థం. దీనికే స్నాతకమని కూడా అంటారు. అందువల్లనే 'సమావర్తనానికి స్నాతకోత్సవమని కూడా పేరు. అతనికి **'స్నాతకుడు'** అని పేరున్నది.

ఈ స్నాతకులు మూడు రకాలు.

'త్రయ ఏవ స్నాతకాః భవన్తి. విద్యాస్నాతకో, వ్రతస్నాతకో, విద్యావ్రతస్నాతకశ్చేతి'. పార.గృ. 25.32

అంటే, గురుకులంలో విద్యను పూర్తి చేసికొని, గృహానికి తిరిగి వచ్చే శిక్షితు(Trained) లైన వ్యక్తులు మూడు రకాలుగా ఉంటారు. **1) విద్యాస్నాతకుడు** -విద్యను పూర్తి చేసినవాడు. కానీ బ్రహ్మచర్యవ్రతాన్ని పూర్తి చేయకముందే సమావర్తనం చేసినవాడు, **2) వ్రతస్నాతకుడు-** బ్రహ్మచర్యవ్రతాన్ని పూర్తిచేసి, విద్యను పూర్తిచేయని వాడు, **3) విద్యావ్రతస్నాతకుడు**-విద్యను, బ్రహ్మచర్య వ్రతాన్ని పూర్తి చేసినవాడు.

2. సమావర్తన కాలం-అందుకు సంబంధించిన నియమాలు

త్రయీ విద్యారూపమైన వేదచతుష్టయ అధ్యయన కాలంలో 36,18 మరియు 9 సంవత్సరాల కాలావధి నిర్ధారితమైనది. ఈ ప్రకారంగా, ప్రత్యేక వ్యక్తికి కనీసం 9సం॥ గురుకులంలో ఉంటూ, బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించాలి. దీంతోపాటు ద్విజుడు కనీసం ఒక వేదం అయినా సాంగోపాంగంగా పూర్తి చేయాలి. అంతుకు మించి రెండుగాని, మూడుగాని, లేదా నాలుగు వేదాలు గాని చదవడం బ్రహ్మచారి అభిరుచిని బట్టి ఉంటుంది.

ఈ రెండు నియమాలను పూర్తి చేసిన ద్విజుడే స్నాతకుడై గృహస్థాశ్రమంలో ప్రవేశించే విధానముంది. అలా కానట్లయితే కుదరదు. సమావర్తన కాలం కనీసం 25 సం॥ దాటాలని మనుమహర్షి కొన్ని సూచనలు చేసారు. కనీసం 8వ సం॥లో బ్రాహ్మణుడికి ఉపనయనం జరుగుతుంది. ఒక వేదాధ్యయనం సాంగోపాంగంగా పూర్తి కావాలంటే 9 సం॥ పడుతుంది. వేదాధ్యయనానికి ముందు వేదాంగాలు చదవవలసి ఉంటుంది.

శిక్షా, కల్పం, వ్యాకరణం, చందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం. ఈ అంగములను చక్కగా తెలియడం ద్వారానే వేదాధ్యయనం సులభంగా గ్రహించగలరు. ఇందులో వర్ణోచ్చారణ శిక్షా నుండి దర్శనాలు, ఉపనిషత్తుల వరకు 7-8 సంవత్సరాలు పడుతుంది. ఈ విధంగా 8+8+9 = 25 సంవత్సరాలు ఒకవేదాన్ని చదవడానికి సరిపోవుతుంది. మనువు 25 సం॥ గురుకుల నివాసమును విధించాడు. తరువాత గృహస్థుడు కావచ్చు అంటాడు.

"చతుర్థమాయుషో భాగముషిత్వాద్యం గురౌ ద్విజః ।
ద్వితీయ మాయుషో భాగం కృతదారో గృహే వసేత్"॥ **(4-1)**

ఆయుష్షులో మొదటి భాగం 25 సంవత్సరాలు. అంతవరకు విద్యార్థి గురుకుల నివాసం చేయాలి. తరువాత సమావర్తనం చేసి గృహస్థుడు కావచ్చు. ఈ విషయంలో విస్తృత సమాచారానికి ఈ క్రింది 3-4 శ్లోకాల వివరణ చూడగలరు. ఈ విధంగా అధ్యయనానికి 25 సం॥ వ్యయమవుతుంది. దాని తరువాతనే సమావర్తనం మను సమ్మతం.

ఇది మనుకృతం-ప్రామాణికం

తం ప్రతీతం స్వధర్మేణ బ్రహ్మదాయహరం పితుః ।
స్రగ్విణం తల్ప ఆసీనమర్హయేత్ప్రథమం గవా ॥ మూలశ్లోక సం.3

టీక:-తం స్వధర్మేణ ప్రతీతం = ఎవరు స్వధర్మాన్ని (అంటే ఆచార్యుడు-శిష్యుడు-తమ తమ ధర్మాలను) ఆచరిస్తారో, **పితుః బ్రహ్మదాయ హరం** = తండ్రి నుండి గాని లేదా ఆచార్యుడి నుండి గాని బ్రహ్మదాయ భాగం అంటే విద్యారూపమైన భాగమును స్వీకరించిన బ్రహ్మచారి తండ్రిని, **స్రగ్విణం** = పూలమాలతోను సత్కరించి, **తల్ప ఆసీనమ్** = తన మంచం మీద కూర్చొని ఉన్న ఆచార్యుణ్ణి, **ప్రథమం గవా అర్హయేత్** = మొదట గోదానం ద్వారా సత్కరించాలి. అలాంటి లక్షణయుక్త విద్యార్థిని కన్య తండ్రి గోదానంతో సత్కరించాలి.

తాత్పర్యం:- ఎవరు స్వధర్మాన్ని తండ్రి నుండిగానీ లేదా ఆచార్యుడి నుండిగానీ వేదాధ్యయనం చేసి బ్రహ్మచర్యవ్రతం చేత ప్రసిద్ధుడైన బ్రహ్మచారి తండ్రిని పూలమాలతో సత్కరించి, తన మంచం మీద కూర్చొని ఉన్న ఆచార్యుణ్ణి మొదట గోదానంతో సత్కరించాలి. అలాంటి లక్షణ యుక్త విద్యార్థిని కన్య తండ్రి కూడా గోదానంలో సత్కరించాలి. ॥3॥

ఋషి దయానందభాష్యం:- వేదాధ్యయన రూప ధర్మాన్ని చక్కగా పాటించి బ్రహ్మదాయమనబడే విద్యారూపభాగాన్ని గ్రహించిన బ్రహ్మచారిని, అతని తండ్రిని, గురువును ఉన్నతాసనంపై కూర్చుండబెట్టి పూలమాలతో అలంకరించి గోదానవ్రతంతో కన్యతండ్రి సత్కరించాలి.

వివాహవిషయం 4 నుండి 66 వరకు

గుర్వాజ్ఞతో వివాహం-

ఇది మనుకృతం-ప్రామాణికం

గురుణానుమతః స్నాత్వా సమావృత్తో యథావిధి ।
ఉద్వహేత ద్విజో భార్యాం సవర్ణాం లక్షణాన్వితామ్ ॥ మూలశ్లోక సం.4

టీక:- యథావిధి సమావృత్తః = విధి ప్రకారం ఉత్తమ పద్ధతితో, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, విద్యాధ్యయనం చేసి, **గురుణా+అనుమతః స్నాత్వా** = గురువుగారి ఆజ్ఞానుసారంగా స్నానంచేసి, **ద్విజః** = బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులలో ఎవరయినా, **సవర్ణాం** = తన వర్ణానికి సంబంధించిన, **లక్షణాన్వితామ్** = ఉత్తమ లక్షణాలు గల, **భార్యాం** = స్త్రీని, **ఉద్వహేత** = వివాహం చేసికోవాలి.

తాత్పర్యం:- విధి ప్రకారం ఉత్తమ పద్ధతిలో బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, విద్యాధ్యయనం పూర్తయిన తరువాత గురువుగారి అనుజ్ఞ పొంది, తరువాత స్నాన (సమావర్తన) వ్రతం ఆచరించాలి. ఆ తరువాత స్వవర్ణానికి చెందిన శుభలక్షణాలు గల కన్యను పెళ్లి చేసుకోవాలి.॥4॥

ఋషి దయానందభాష్యం:-గురువుయొక్క ఆజ్ఞతో స్నానం చేసి గురుకులం నుండి అనుక్రమపూర్వకంగా సమావర్తన సంస్కారాన్ని చేసుకొని వచ్చిన బ్రహ్మచారి స్వవర్ణము అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాలకు చెందినవారు తమ వర్ణానికి అనుకూలమైన, శుభ లక్షణాలు గల కన్యను వివాహమాడాలి.

వివరణ:

1. వివాహమనగా....'వహ-ప్రాపణే' ధాతువుకు ముందు 'వి' ఉపసర్గ నుంచి, తరువాత 'ఘఞ్' ప్రత్యయం చేర్చగా 'వివాహశబ్దం'; 'ఉద్' ఉపసర్గ చేర్చగా వివాహశబ్దానికి పర్యాయవాచకమైన 'ఉద్వాహ' శబ్దం నిష్పన్నమవుతుంది. **"విశేష విధిప్రకారం ఒకరు మరొకరిని కలిసి, పారస్పరిక బాధ్యతను వహించడమే"** వివాహ శబ్దానికి అర్థం. ఇదొక

శాస్త్రసమ్మతమైన సామాజిక విధానం. ఇందులో స్త్రీ, పురుషులు సుఖజీవనం కోసం గృహస్థ కర్తవ్యాలను పాటించడం కోసం దంపతుల రూపంలో ఒకరు మరొకరితో సహజీవనం చేయడానికి నిర్ణయించుకొంటారు. పారస్పరిక బాధ్యతలను నిర్వహిస్తారు. ఈ విధంగా జీవిస్తూ సంతానోత్పత్తి ద్వారా మానవ వంశాభివృద్ధికి తోడ్పడతారు. దీన్నే **"పాణిగ్రహణ"** సంస్కారమని మనువు అంగీకరించాడు. ఉపర్యుక్తమైన ఉద్దేశాల కోసం ఒకరు మరొకరి హస్తమును పట్టుకోవడం అంటే ఒకరు మరొకరికి ఆధారమని భావం.

2. వివాహానికి వయోనియమం

ప్రసిద్ధమైన సంస్కారమైనందువల్ల మనువు వయో నిర్ణయాన్ని గురించి చెప్పలేదు. వేరేచోట ఈ విషయం తెలుపబడినది. సందర్భానుసారం ఇక్కడ ఈ విషయాన్ని విస్తృతంగా పరిశీలిద్దాం.

సాధారణంగా మానవ జీవితం 'వంద సంవత్సరా'లని వేదాలు, ఇతర శాస్త్రాలు అంగీకరించినవి. దీన్ని ఆధారంగా చేసికొని వంద సంవత్సరాలు, వంద సంవత్సరాల కంటే అధికంగా స్వస్థేంద్రియ సహితమైన సుఖజీవితం కోసం వేదాలందు ప్రార్థనలున్నాయి.

ఓం తచ్చక్షుర్దేవహితం పురస్తాత్ శుక్రముచ్చరత్ । పశ్యేమ శరదః శతం,
జీవేమ శరదః శతం, శ్రుణుయామ శరదః శతం,
ప్రబ్రవామ శరదః శతం, అదీనాః స్యామ శరదః శతం, భూయశ్చ శరదః శతాత్ ॥ యజు. 36.24

3. సాధారణమైన ఈ వందసంవత్సరాల ఆయుష్మ ఆధారంగా మానవ జీవితాన్ని నాలుగు అవస్థలుగా విభజించి, వాటికి అవధులను నిర్ణయించారు.

"చతుర్థమాయుషోభాగ ముషిత్వాద్యం గురౌద్విజః ।
ద్వితీయ మాయుషో భాగం కృతదారో గృహే వసేత్" మను. 4-1

"వనేషు చ విహృత్యైవం తృతీయం భాగమాయుషః ।
చతుర్థమాయుషో భాగం త్యక్త్వా సఙ్గాన్పరివ్రజేత్" మను. 6-33

వంద సంవత్సరాల ఆయుష్మను ఈ విధంగా విభజిస్తే 25,25 సం॥ల చొప్పున నాలుగు భాగాలవుతాయి. మొదటి 25 సం॥ వరకు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. రెండో భాగంలో 25 సం. వరకు గృహస్థుడుగా ఉండి పుత్రులను, పౌత్రుడు (మనమడు) పుట్టినంత వరకు గాని, లేదా శరీరం సదలి కేశములు తెల్లవికాగా (6-2) గృహస్థ జీవితాన్ని వదిలి వానప్రస్థుడై మూడో భాగం (50-75) వరకు వనవాసిగా ఉండి, నాలుగో భాగంలో (75 నుండి) సన్యాసి జీవితాన్ని గడపాలి. ఈ విభాగాల వల్ల పురుషుడి వివాహ వయస్సు కనీసం 25 సం॥ ఉండాలని మనువు స్పష్టం చేశాడు. అంతకు ముందు వివాహం చేసుకోకూడదు.

ఖ. స్త్రీలకు వివాహ వయస్సు (9-90)వ శ్లోకంలో నిర్ణయించాడు.

"త్రీణి వర్షాణ్యుదీక్షేత కుమార్యృతుమతీసతీ ।
ఊర్ధ్వం తు కాలాదేతస్మాద్విన్దేత సదృశం పతిమ్"॥ మను. 9.90

మాసిక ధర్మం ప్రారంభమైన (ఋతుమతి అయిన) నాటినుండి మూడు సంవత్సరాల పర్యంతం ప్రతీక్షించిన తరువాత కన్య స్వయంవరం చేసికోవచ్చు.

సామాన్యంగా 13 లేదా 15 సం॥ మధ్య కన్యలు ఋతుమతులవుతుంటారు. 3 సం॥ తరువాత వారికి 16-18 సం॥ వయస్సు వస్తుంది. అందువల్ల కన్యల వివాహ వయస్సు కనీసం 16 సం॥ ఉండాలి. 25 సం॥ పురుషుడికి, 16

సం॥ కన్యతో వివాహం చేయవచ్చు. ఇంత కంటే వయస్సు పెద్దదైనట్లయితే వారిద్దరి మధ్య ఇదే రకమైన తేడాతో వివాహాలు జరపవచ్చు. కారణం ప్రజనన సామర్థ్యం, అలాగే శరీర నిర్మాణ దృష్టితో చూసినట్లయితే 16 సం ॥ కన్య, 25 సం. పురుషుడితో సమానమవుతుంది.

గ. స్త్రీకి వివాహోపరాన్త కర్తవ్యాలను మనువు పేర్కొన్నాడు. గృహకార్యదక్షత, గృహాలంకరణ, శుద్ధి మొ॥ వాటిలో చాతుర్యం, ఆదాయ వ్యయాలను నిర్వహించడం (5-35), గృహస్వామిగా ఉండటం. వస్తువులను జాగ్రత్తపరచడం, ధార్మిక కార్యానుష్ఠానం (9-9, 13,15,37,38). ఈ కర్తవ్యాలన్ని కూడా చిన్న పిల్లలు చేయజాలరు. కాబట్టి 16 సం, పైబడిన వయస్సు గల కన్యలే చేయగలుగుతారు. అందువల్ల కన్యలు వివాహానికి 16,17 సం॥ తరువాతనే యోగ్యులవుతారని నిర్ధారితమైంది.

3. ఆయుర్వేద శాస్త్రంలో వివాహ వయస్సు

ఈ విషయంలో వైద్య గ్రంథాలు సర్వోత్తమ ప్రమాణాలు. కారణం ఆ గ్రంథాలలో విచారణ అంతా కూడా శరీరాన్ని ఆధారంగా చేసికొనే చేయబడుతుంది. శరీరానికి వృద్ధి క్షీణతలను బట్టి నాలుగు అవస్థలున్నవని సుశ్రుతకారుడు నిర్ణయించాడు. దాన్ని బట్టి వివాహానికి వయోనిర్ధారణ చేశాడు.

"చతస్రో అవస్థాః శరీరస్య, వృద్ధిః యౌవనం సంపూర్ణతా, కించిత్ పరిహాణిః చేతి ।
ఆషోడశాత్ వృద్ధిః, ఆపంచవింశతేః యౌవనమ్ ఆచత్వారింశతః
సంపూర్ణతా, తతః కించిత్ పరిహాణిః చేతి॥ సుశ్రుత సూత్రస్థాన 35-25

మనిషి శరీరానికి నాలుగు దశలు ఉన్నాయి. 16 సం॥ నుండి 25 సం॥ వరకు వృద్ధి జరిగే సమయం. 25 సం॥ నుండి యౌవనం ప్రారంభమవుతుంది. 40వ సంవత్సరంలో యౌవనం పరిపక్వత చెందుతుంది. తరువాత, శరీర ధాతువులలో కొంచెం కొంచెంగా క్షీణత రావడం ప్రారంభమవుతుంది. వివాహానికి యోగ్యమైనది ఈ యౌవనావస్థే. ఇంతకుముందు శరీరమందున్న ధాతువులు అపరిపక్వములుగా ఉంటాయి. బాల్య వివాహం వల్ల శరీరమందున్న ధాతువుల వికాసం ఆగిపోతుంది. తత్ఫలితంగా గర్భం, సంతాన సంబంధమైన అరిష్టాలు ఎన్నో ఎదురవుతాయి. గర్భిణి కాకపోవడం, అయినా గర్భస్రావం-గర్భపాతం జరగడం, ప్రసవించినా దుర్బల సంతానం కలగడం, శీఘ్రమృత్యువు, బిడ్డ అనారోగ్యంగా ఉండటం మొ॥వి. ఇందువల్లనే సుశ్రుతకారుడు 25 సం॥ ముందు పురుషుడికి, 16 సం॥ ముందు కన్యకు వివాహాన్ని నిషేధించాడు. 25 సం॥ పురుషుడికి, 16 సం॥ కన్యకు ప్రజననంలో సమానమైన సామర్థ్యముంటుందని అనుభవం గల వైద్యులు సలహా ఇస్తున్నారు. నిమ్న ప్రమాణాల ద్వారా ఈ విషయ గౌరవాన్ని చూడగలరు.

"పంచవింశే తతో వర్షే పుమాన్నారీతు షోడశే
సమత్వాగతవీర్యౌ తౌ జానీయాత్ కుశలో భిషక్" సు.సూత్రం 35.10
"ఉనషోడశ వర్షాయాం అప్రాప్తః పంచవింశతిమ్ ।
యద్యాధత్తే పుమాన్ గర్భం కుక్షిస్థః స విప్యదతే "
"జాతో వా న చిరంజీవేత్, జీవేద్వా దుర్బలేంద్రియః
తస్మాదత్యన్త బాలాయాం గర్భాధానం న కారయేత్" సు.శ.10.47-48

4. వేదంలో గల వివాహ వయస్సు

బ్రహ్మచారిణి అయిన కన్య యువకుడైన పురుషుణ్ణి వరించి వివాహం చేసుకోమని ఉంది. ఉపరోక్త ప్రమాణాల ద్వారా 25 సం॥ అనంతరమే యువావస్థ వస్తుందని చెప్పబడుతున్నందు వల్ల, 25 సం॥ తరువాతనే పురుషుడికి వివాహం చేయడం ధర్మమై ఉంది.

ఈ కింది మంత్రాన్ని చూడండి.

"బ్రహ్మచర్యేణ కన్యా3యువానం విందతే పతిమ్" అథర్వ. 11-5-5

ఏ విధంగా బాలురు, పూర్ణ బ్రహ్మచర్యం ఆచరించి, పూర్ణ విద్వాంసులై, పూర్ణ యువకులై ఆత్మసదృశ కన్యతో వివాహం చేసుకొంటారో అలాగే కన్య కూడా అఖండ బ్రహ్మచారిణిగా ఉండి, పూర్ణ విద్యావతి యువతిగా ఉండి తనకు సమానమైన పూర్ణయౌవనవంతుడైన వాడిని పతిగా పొందుగాక (సం.వి. వేదారంభ ప్రకరణం.)!

వివాహయోగ్యకన్యలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అసపిణ్డా చ యా మాతురసగోత్రా చ యా పితుః ।
సా ప్రశస్తా ద్విజాతీనాం దారకర్మణి మైథునే ॥ మూలశ్లోక సం.**5**

టీక:-యా మాతః అసపిణ్డా = ఏ స్త్రీ తల్లికి 6 తరాలలో, **చ** = మరియు, **పితుః అసగోత్రా** = తండ్రి గోత్రానికి సంబంధించినది కాదో, **సా** = ఆ స్త్రీయే, **ద్విజాతీనాం** = ద్విజులకు, **దారకర్మణి** = వివాహం చేసికోవడంలో, **ప్రశస్తా** = ఉత్తమం. **మైథునే** = మైథున కర్మకు కూడా ఉత్తమం.

తాత్పర్యం:- ఏ స్త్రీ తల్లికి ఆరు తరాలకూ, తండ్రి గోత్రానికి సంబంధించినది కాదో ఆ స్త్రీ ద్విజులకు వివాహం చేసికోవడంలో ఉత్తమం. మైథున కర్మకు కూడా ఉత్తమం.॥5॥

ఋషి దయానందభాష్యం:- తల్లికి సపిండురాలు (తల్లివంశానికి చెందినది) కానిది, తండ్రికి సగోత్రురాలు కానటువంటి కన్యను వివాహమాడటం మంచిది.

వివరణ:- మనుస్మృతి నాలుగు వర్ణాల గురించి:- ఇక్కడ ముఖ్యంగా ద్విజుల గురించే తెలుపబడినా నాలుగు వర్ణాలవారి వివాహం గురించి రాయబడింది, [2.238,420]కావున పైన చెప్పబడిన నియమం శూద్ర వర్ణం వారికి కూడా వర్తిస్తుంది. 'స్త్రీ రత్నం దుష్కులాదపి' [4.20,]వివాహ నియమం శారీరక అవస్థపై ఆధారపడి ఉన్నది. శూద్రస్త్రీతో కూడా ద్విజుల వివాహం జరుగవచ్చునని తెలుపబడినది. మనువు అభిప్రాయం ప్రకారం శూద్రులు కూడా ఆర్యులే. సవర్ణులే-[10.4,57] కావున వివాహ నియమాన్ని శూద్రులు కూడా పాటించాలి.

వివాహంలో త్యాజ్యకులం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

మహాన్త్యపి సమృద్ధాని గోఽజావిధనధాన్యతః ।
స్త్రీసమ్బన్ధే దశైతాని కులాని పరివర్జయేత్ ॥ మూలశ్లోక సం.**6**

టీక:- స్త్రీ సమ్బన్ధే ఏతాని దశకులాని = వివాహ విషయంలో ఈ కింద పేర్కొనబోయే దశ కులాలను, **గో+అజ+అవి+ ధన+ధాన్యతః సమృద్ధాని మహాన్తి+అపి** = గోవులు, మేకలు, గొర్రెలు, ధనం, ధాన్యములు ఎంత సమృద్ధిగా ఉన్నప్పటికీ, **పరి వర్జయేత్** = ఇట్టి కుటుంబంవారి కన్యను వివాహమాడరాదు. (**అజా** = మేక, **అవి** = గొర్రె ఎంత ధనవంతులైనా, ధాన్యంతో నిండి ఉన్నా కూడా ఈ కింది కుటుంబాల నుండి కన్యను వివాహం చేసికోరాదు.)

తాత్పర్యం:- గోవులు, మేకలు, గొర్రెలు, ధనం, ధాన్యములు ఎంత సమృద్ధిగా ఉన్నప్పటికీ వివాహవిషయంలో ఈ కింద పేర్కొనబోయే పదిగోత్రాలను విడిచిపెట్టాలి. ॥6॥

ఋషి దయానందభాష్యం:- ధనం, ధాన్యం, గోవులు, మేకలు, ఏనుగులు గుఱ్ఱాలు, రాజ్యం, ఐశ్వర్యం మొదలైనవి ఎంత సమృద్ధిగా కలిగి ఉన్నా వివాహసంబంధంలో ఈ క్రింద వ్రాయబడిన పది వంశాలవారిని వదలిపెట్టాలి. (స.ప్ర. 4వ సము.)

ఇది మనుకృతం-ప్రామాణికం

హీనక్రియం నిష్పురుషం నిశ్ఛన్దోరోమశార్శసమ్ ।
క్షయ్యామయావ్యపస్మారిశ్విత్రికుష్ఠికులాని చ ॥ మూలశ్లోక సం.7

టీక:- **పదికులాలు ఇవి: 1) హీన క్రియం** = ఏ కులంలో ఉత్తమ కర్మలుండవో, **2) నిష్పురుషం** = ఏ కులంలో ఉత్తమ పురుషులు లేరో, **3) నిశ్ఛన్దః** = ఏ కులంలో విద్వాంసులు లేరో, **4) రోమశ+అర్శసమ్** = శరీరం మీద పెద్ద పెద్ద రోమాలు ఉంటాయో, 5) మూలరోగం, **6) క్షయ** = క్షయరోగం (టి.బి.), **7) ఆమయావీ** = అజీర్ణం, అగ్నిమాంద్యం, రాజయక్ష్మ, **8) అపస్మారి** = అపస్మారక రోగం, **9) శ్విత్ర** = తెల్లకుష్ఠం, బొల్లి, **10) కుష్ఠి** = గలిత కుష్ఠములుంటాయో, అలాంటి కుటుంబంవారి కన్యతో, వివాహం ఎప్పటికీ చేయరాదు. పైన పేర్కొన్న కులంలోని వరుడితో గాని, కన్యలతో గాని వివాహం నిషిద్ధం. కారణం, వీరి వల్ల రోగాలు సంక్రమిస్తాయి.

తాత్పర్యం:- ఏ కులంలో ఉత్తమ కర్మలుండలో, విద్వాంసుడు లేడో, శరీరం మీద పెద్దపెద్ద రోమాలు ఉంటాయో, మూల రోగం, క్షయరోగం, అజీర్ణ రోగం, అపస్మారకరోగం, తెల్లకుష్ఠం, కుష్ఠరోగం లాంటి పది వ్యాధులున్న కులాల్లోది వరుడి తోగానీ, కన్యలతోగానీ వివాహం నిషిద్ధం.॥7॥

ఋషి దయానందభాష్యం:- సత్క్రియలు జరగని, సత్పురుషులు లేని, వేదాధ్యయనం చేయని కులాలలో; శరీరంపై దీర్ఘరోమాలు, మూలవ్యాధి, క్షయ, దమ్ము, దగ్గు, అజీర్ణ రోగము, మూర్ఛ, శ్వేతకుష్ఠ గల వంశాలలో పుట్టిన కన్యలతో, వరులతో వివాహం జరగకూడదు. ఎందుకంటే ఈ దుర్గుణాలు, రోగాలు వివాహం చేసుకొన్నవారి వంశంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి ఉత్తమ వంశంలోని బాలబాలికలకే పరస్పరం వివాహం జరగాలి.

వివాహానికి అయోగ్య కన్యలు- ఇది మనుకృతం-ప్రామాణికం

నోద్వహేత్కపిలాం కన్యాం నాధికాఙ్గీం న రోగిణీమ్ ।
నాలోమికాం నాతిరోమాం న వాచాటాం న పింగలామ్ ॥ మూలశ్లోక సం.8

టీక:-కపిల వర్ణం (Brown) కలది, **అధికాఙ్గీం** = అధికాంగములు కలది (6 వేళ్ళు కలది లేదా పురుషుని కంటె లావు పొడవైనది లేదా బలవతి) **రోగిణీం** = దీర్ఘవ్యాధిగ్రస్తురాలు, **అలోమీకాం** = శరీరంలో రోమాలు లేనిది, **అతిరోమాం** = అధిక రోమాలు కలది, **వాచాటాం** = అనవసరంగా మాట్లాడేది, (రొల్లుడు కాయ) లేదా వదరుబోతు, **పిఙ్గలాం** = పిల్లి కన్నులు ఉన్న కన్యను, **నోద్వహేత్** = వివాహమాడరాదు.

తాత్పర్యం:- కపిలవర్ణం కలది, కొన్ని అవయవాలు ఎక్కువగా మరీ పెద్దవిగా కలదీ, విడువని (దీర్ఘ) రోగాలు కలదీ, రోమాలు ఎక్కువగానో- అసలు లేకుండానో ఉన్నదీ, కఠినమైన వాగ్ధోరణి కలిగినదీ, పచ్చని రంగులో (పిల్లి) కళ్లు కలది అయిన కన్యను వివాహమాడకూడదు.॥8॥

ఋషి దయానందభాష్యం:- కపిల (పీత) వర్ణం ఉన్నదాన్ని, పురుషుని కన్న ఎత్తు, లావు అధిక బలిష్ఠమైన శరీరం ఉన్నదాన్ని, రోగం ఉన్నదాన్ని, శరీరంపై అధికంగా రోమాలు ఉన్నదాన్ని, పూర్తిగా రోమాలు లేనిదాన్ని, వదరుబోతు, పిల్లికన్నుల దాన్ని వివాహం చేసుకోవద్దు.

ఇది మనుకృతం-ప్రామాణికం

నర్క్ష వృక్షనదీనామ్నీం నాన్త్యపర్వతనామికామ్ ।
న పక్ష్యహి ప్రేష్యనామ్నీం న చ భీషణనామికామ్ ॥ మూలశ్లోక సం.9

టీక:-ఋక్ష-వృక్ష-నదీ-నామ్నీం = ఋక్ష-నక్షత్రముల, వృక్షముల, నదుల పేర్లు కలది, **పక్షి+అహి+ప్రేష్య నామ్నీం** = పక్షి, అహి = సర్పం, ప్రేష్య = దాసి మొ॥ **భీషణనామికాం** = భయోత్పాదకమైన పేర్లు గల స్త్రీని వివాహమాడరాదు.

తాత్పర్యం:- నక్షత్రాలు,వృక్షాలు, నదులు పేర్లుగా గలది; హీనజాతి పర్వతాల పేర్లు గలది; పక్షుల, పాముల పేర్లు గలది, దాస శబ్దం పేరులో ఉన్నది, భీకరమైన పేర్లు గలది అయిన కన్యకను పెళ్లిచేసుకోరాదు.॥9॥

ఋషి దయానందభాష్యం:-అశ్విని, భరణి, రోహిణీదేవి, రేవతీబాయి, చిత్ర మొదలైన నక్షత్రాల పేర్లు ఉన్నదాన్ని, తులసి, బంతి, గులాబి, చంపా, చమేలీ మొదలైన వృక్షాల పేర్లు ఉన్నదాన్ని; గంగ, యమున మొదలైన నదుల పేర్లు ఉన్నదాన్ని; చాండాలి మొదలైన హీనజాతి అంత్య పేర్లు ఉన్నదాన్ని; వింధ్య, హిమాలయ మొదలైన పర్వత పేర్లు ఉన్నదాన్ని; కోకిల, గోరువంక మొదలైన పక్షుల పేర్లు ఉన్నదాన్ని; నాగిని, భుజంగాది మొదలైన సర్పాల పేర్లు ఉన్నదాన్ని; మాధవదాసి, మీరాదాసి మొదలైన దాసీ పేర్లు ఉన్నదాన్ని, భీమకుమారి, చండిక, కాళి మొదలైన భీషణ పేర్లు ఉన్నదాన్ని వివాహం చేసుకోవద్దు. ఎందుకంటే ఈ పేర్లు కుత్సితములై ఉండటమే కాక, ఇతర పదార్థాలకు చెందినవై ఉన్నాయి.॥9॥

వివరణ:- వివాహంలో నిషిద్ధకన్యలు:- వివాహ విషయంలో కన్యలు శారీరికంగా, మానసికంగా (స్వాభావికంగా) ఆరోగ్యంగా లేనప్పుడు వారితో వివాహం జరుగరాదు. వారి సంతానంపై ఆనువంశిక ప్రభావం పడుతుంది. కావున ఇది త్యాజ్యము. రెండవది పేరు ఆధారంగా కూడా విడువదగినది. ఈ శ్లోకంలో వర్ణించిన పేర్లు శాస్త్ర విరుద్ధము. 2.33,3.10లో మనువు నామకరణ విధానం చేస్తూ పేర్లు సుఖపూర్వకంగా ఉచ్చారణ చేయగలిగినవై కోమలంగా, మధురంగా, స్పష్టార్థకంగా, మనోహరంగా, మంగళభావబోధకంగా ఉండాలని రాశారు. కావున పైన తెలుపబడిన పేర్లు గల కన్యలతో వివాహం జరుపరాదని విధింపబడినది. ఒకవేల వారితో వివాహం జరుపదలిస్తే పేరుమార్చి జరుపాలి. ఈ విధానం క్రింది శ్లోకంలో తెలుపబడుతుంది. నేటికీ ఈ పేర్లు మార్చే విధానం కొన్ని వర్గాలలో ఉన్నది.

ఇది మనుకృతం-ప్రామాణికం

అవ్యఙ్గాఙ్గీం సౌమ్యనామ్నీం హంసవారణగామినీమ్ ।
తనులోమకేశదశనాం మృద్వఙ్గీముద్వహేత్ స్త్రియమ్ ॥ మూలశ్లోక సం.10

టీక:-అవ్యంగాఙ్గీం = అందమైన అవయవం కలది, **సౌమ్యనామ్నీం** = మంచి పేరు గలది. **హంసవారణ గామినీం** = హంస లాగా, గున్న ఏనుగు మాదిరి మందగమనమూ, **తను లోమకేశ దశనాం** = పలచని రోమాలు, ముచ్చటైన కేశాలు, అందమైన పళ్ళవరుస కలది. **మృదు, అఙ్గీమ్** = కోమలమైన అంగం కలది, **స్త్రియం ఉద్వహేత్** = అయిన స్త్రీని వివాహమాడాలి.

తాత్పర్యం:- అందమైన అవయవం కలదీ, చక్కని పేరున్నదీ, హంసలా-ఏనుగులా నడిచేదీ, పల్చని రోమాలు, దీర్ఘ కురులు-అందమైన దంతాలు కలిగినదీ, కోమలమైన దేహం కలదీ అయిన కన్యను వివాహమాడాలి.॥10॥

ఋషి దయానందభాష్యం:- వంకరటింకరలేని, సుందరమైన, చక్కని, సరళమైన, కోమలమైన అవయవాలు ఉన్నదాన్ని; యశోద, సుఖద మొదలైన సుందరమైన పేర్లు ఉన్నదాన్ని; హంసగమనం, గజ గమనం ఉన్నదాన్ని; సూక్ష్మమైన రోమాలు కలిగి, అందమైన కేశాలు (వెంట్రుకలు), అందమైన దంతాలు ఉన్నదాన్ని, మృదువైన శరీరాంగాలు ఉన్నదాన్ని వివాహం చేసుకోవాలి-

11 నుండి 19వ శ్లోకం వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *యస్యాస్తు న భవేద్భ్రాతా న విజ్ఞాయేత వా పితా ।*
నోపయచ్ఛేత తాం ప్రాజ్ఞః పుత్రికాధర్మ శంకయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.*11*

తాత్పర్యం:- తోడబుట్టినవాడులేని కన్యను, తండ్రి ఎవరో తెలీని కన్యను, తల్లిమాత్రమే ఉండి- తండ్రిని గురించి సమాచారం సరిగ్గా చెప్పక దాటవేయడానికి యత్నించే కన్యను, జ్ఞాతి వంశానికి కూడ చెందియుంటుంది కావున సోదరి, అను భావనతో ఆమెను వివాహం చేసికొనరాదు. ॥11॥

*** సవర్ణాగ్రే ద్విజాతీనాం ప్రశస్తా దారకర్మణి ।**
కామతస్తు ప్రవృత్తానామిమాస్స్యుః క్రమశో వరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**12**

తాత్పర్యం:- బ్రాహ్మణాది నాలుగు వర్ణాలవారు వివాహ విషయంలో, అదే ప్రథమమైనప్పుడు-స్వవర్ణంలోని పుట్టిన కన్యనే ప్రశస్తంగా ఎన్నుకోవాలి. కామం అధికమై ఇతర వివాహాలు చేసుకున్నప్పుడు-ఈ క్రింద చెప్పబడిన అనులోమ విధానాన్ని అనుసరించి వివాహం చేసుకోవాలి.

*** శూద్రైవ భార్యా శూద్రస్య సా చ స్వా చ విశః స్మృతే ।**
తే చ స్వా చైవ రాజ్ఞశ్చ తాశ్చ స్వా చాగ్రజన్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**13**

తాత్పర్యం:- శూద్రుడు తన వంశలో పుట్టిన కన్యనే వివాహమాడాలి. వైశ్యుడు వైశ్య, శూద్ర కన్యలను; క్షత్రియుడు క్షత్రియ, వైశ్య, శూద్రకన్యలను వివాహం చేసుకొనవచ్చును. ॥13॥

*** బ్రాహ్మణ క్షత్రియులకు శూద్ర వివాహనిషేధం-హాని-**

*** న బ్రాహ్మణక్షత్రియయోరాపద్యపి హి తిష్ఠతోః ।**
కస్మింశ్చిదపి వృత్తాంతే శూద్రా భార్యోపదిశ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**14**

తాత్పర్యం:- బ్రాహ్మణులు స్వవర్ణ కన్యను వివాహం చేసుకోవాలి. ఎన్ని కష్టాలలో ఉన్నాసరే-గృహస్థాశ్రమాన్ని కోరే బ్రాహ్మణ క్షత్రియులు శూద్రకన్యను వివాహం చేసుకోవడం మంచిది కాదు.॥14॥

*** హీనజాతిస్త్రియం మోహాదుద్వహంతో ద్విజాతయః ।**
కులాన్యేన నయంత్యాశు ససంతానాని శూద్రతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**15**

తాత్పర్యం:- మోహంతో హీన జాతిలో పుట్టిన స్త్రీని వివాహం చేసుకొన్నట్లయితే, అలాంటి ద్విజులు తమ సంతతిని-తమ కులాన్ని శూద్రత్వంగా మార్చుట జరిగిందని అర్థం. కాబట్టి ఇది నింద్యం. విడువదగింది.॥15॥

*** శూద్రావేదీ పతత్యత్రేరుతథ్యతనయస్య చ ।**
శౌనకస్య సుతోత్పత్త్యా తదపత్యతయా భృగోః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**16**

తాత్పర్యం:- శూద్రస్త్రీని వివాహము చేసికొన్నవాడు భ్రష్టుడగునని అత్రిమహర్షి, గౌతమ మహర్షి చెప్పారు. (ఇది బ్రాహ్మణ విషయం.) శూద్రస్త్రీయందు పుత్రోత్పత్తి గావించుటచేత పతితుడగునని శౌనకమహాముని మతం. (ఇది క్షత్రియవిషయం.) శూద్రకన్యక యందుపుట్టుటచేత పతితుడగునని భృగుమహర్షి మతం. (ఇది వైశ్యవిషయం.)॥16॥

*** శూద్రాం శయనమారోపోప్య బ్రాహ్మణో యాత్యధోగతిమ్ ।**
జనయిత్వా సుతం తస్యాం బ్రాహ్మణ్యాదేవ హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**17**

తాత్పర్యం:- ఏ బ్రాహ్మణుడైనా శూద్ర స్త్రీతో శయనించి సంభోగం జరిపితే, అలాంటివాడు అధోగతని పొందుతున్నట్లే ! ఆ శూద్రస్త్రీకి సంతానం కూడ కలిగించినట్లయితే, తన బ్రాహ్మణత్వాన్నే కోల్పోతున్నాడు. ॥17॥

*** దైవపిత్ర్యాతిథేయాని తత్ప్రధానాని యస్య తు ।**
నాశ్నంతి పితృదేవాస్తన్న చ స్వర్గం స గచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**18**

తాత్పర్యం:- అంతేకాదు, తాను చేసే దైవసంబంధకార్యాలను, పితృసంబంధ శ్రాద్ధాలను, అతిథి పూజలను శూద్రస్త్రీతో కలిసి (భార్యగా తన ప్రక్కన కూర్చో బెట్టుకుని) చేయించినట్లయితే ఆ హవ్యకవ్యాలేవీ దేవతలకు, పితృదేవతలకు అంగీకారం కావు. ఆ బ్రాహ్మణుడికీ నరకమే గతి. ॥18॥

* **వృషలీ ఫేనపీతస్య నిశ్వాసోపహతస్య చ ।**
తస్యాం చైవ ప్రసూతస్య నిష్కృతిర్న విధీయతే ॥ *ప్రక్షిప్త శ్లోక సం. **19***

తాత్పర్యం:- ఇంకా కఠిన నియమమేమిటంటే-శూద్రస్త్రీ పెదవులను చుంబించినా, ఆ స్త్రీ యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసలు సోకినా, శూద్రస్త్రీతో రమించి, ఆమెకు తనవల్ల సంతాన భాగ్యాన్ని ప్రసాదించినా అలాంటి విప్రుడి పాపానికి ప్రాయశ్చిత్తమే లేదు.॥19॥

ప్రక్షిప్తాల పరిశీలన

11 నుంచి 19 వరకు ఉన్న శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. పైన 6-9శ్లోకాల వరకు వివాహానికి పనికిరాని కన్యలను గురించి చెప్పి, 10వ శ్లోకంలో యోగ్యులైన కన్యలను గురించి చెప్పారు. 11వ శ్లోకంలో మళ్లీ పనికిరాని వారిని గురించి చెప్పారు. 9లో ఇది ముగిసిపోయింది. తరువాత 20వ శ్లోకంలోని విషయం 10వ శ్లోకంలోని దానితో కలుస్తుంది. కానీ 11వ శ్లోకంతో కలవదు. అందుచేత ప్రసంగ వ్యతిరేకం. ఈ శ్లోకం 10వ శ్లోకానికి అపవాదం అనుకుంటే, దీని అర్థం ఇలాగుంటుంది- సోదరులు లేని కన్యలను వివాహం చేసుకోకూడదు. అంటే ఆ కన్య ఇక అవివాహితగా మిగిలిపోవాలి లేదా అయోగ్యుడైన వరుడు ఆమెకు లభిస్తాడు అని. ఇలాగైతే ఆ కన్యకు అన్యాయమే జరుగుతుంది. ధర్మం ప్రకారం ఇది సముచిత విధానం కాదు. ఏ కన్య తండ్రి అవిజ్ఞాతుడో అతని పెద్దకొడుకును అవిజ్ఞాతుడైన తాత ఎలా దత్తత చేసుకుంటాడు? అందుచేత 'పుత్రికా ధర్మశంకయా' అనేదాని అర్థానికి ఇది వ్యతిరేకం. దీని అర్థాన్ని కన్యలకు పుత్రికలే పుడతారని గ్రహించిన అదీ వ్యతిరేకమే అవుతుంది. ఎందుకంటే మనువు చెప్పిన పుత్రోత్పత్తి కారణాలతో ఇది కలవడం లేదు.[3.48-49].

ఖ. 6 నుంచి 9 వరకు గల శ్లోకాలలో అన్ని వర్ణాలకూ వివాహంలో వదిలిన కులాలు స్త్రీలకు మామూలు పద్ధతులు చెప్పాడు. తర్వాత 'ఆ వివాహాలు ఏవేవి' అనేది చెప్పాలి. దాన్ని గురించి 20వ శ్లోకంలో ప్రారంభ సంకేతాన్ని **"చతుర్ణాం అపి వర్ణానాం ప్రేత్య చేహ హితాహితాన్..... స్త్రీ వివాహాన్ నిబోధత."** అని చెప్పాడు. ఏదైనా విషయం లేదా ప్రసంగం ప్రారంభించే ముందు ఇలా చెప్పటం మనువు శైలి. ఇంకా నాలుగు వర్ణాల వారి పెళ్లిళ్లను గురించి చెప్పనైనా లేదు కానీ, 12 నుంచి 19శ్లోకాలలో ఏ వర్ణం వారికి ఏ వర్ణపు స్త్రీతో పెళ్లి శ్రేష్ఠమా, కాదా అంటూ విషయం ప్రారంభించక ముందే చెప్పేశారు. వివాహాలను చెప్పిన తర్వాతే వీటిని చెప్పటం సందర్భోచితం అవుతుంది. ఏదైనా విషయాన్ని ఒక క్రమంలో చెప్పటం కన్నా ముందే చెప్పటం ప్రసంగ వ్యతిరేకం. అందుచేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 11వ శ్లోకం 9.127కు వ్యతిరేకం. ఇందులో **'పుత్రికా ధర్మం'**తో పాటు ఆస్తిలో హక్కు కూడా ఉన్నట్లు చెప్పారు.

ఖ. 12,13 శ్లోకాలలో కామభావనతో పెళ్లి చేసుకునేవారికి ఏ పెళ్లి శ్రేష్ఠం లేదా పనికిరాదో చెప్పటంతో పాటు వర్ణాలను అనుసరించి నిశ్చయించారు కూడా. ఈ రెండు విషయాలూ మను సమ్మతాలు అనిపించడం లేదు. ఇక్కడ ఆలోచించవలసిన విషయం- కేవలం కామభావనతోనే పెళ్లాడితే, ఏ వర్ణాలవారికి ఏ వర్ణపు కన్యలు తగినవారు అనేది నిశ్చయించే పనే లేదు. పైగా ఎవరికి ఎవరితో పెళ్లయితే శ్రేష్ఠం, వర్ణం కానివారితో పనికిరాదు అనే స్థితి కూడా ఉండదు అనేది. ఇదే అభిప్రాయాన్ని 3.32లో మనువు స్వయంగా చెప్పాడు-

"ఇచ్ఛయాఽన్యోన్య సంయోగః కన్యాయాశ్చ వరస్య చ ।
గాంధర్వః స తు విజ్ఞేయో మైథున్యః కామ సంభవః"॥

కామప్రేరిత వివాహంలో ఇద్దరి కోరిక మీదే సంయోగం జరుగుతుంది. ఇది ఏ వర్ణపు పురుషునితోనైనా ఏ వర్ణం స్త్రీ అయినా అయ్యే అవకాశం ఉంది. అందు పై చెప్పిన ఆధారం మీద వివాహ వ్యవస్థను నిర్ణయించడం మనుస్మృతి మౌలిక విశ్వాసాలకు అనుకూలంగా లేదు. రెండవ విషయం, మనువు కామవివాహం ఎవరితో ఎవరికి జరిగినా నిందనీయమే అన్నాడు. ఈ శ్లోకాలలో ఉచ్చవర్ణం పురుషునితో నిమ్నవర్ణపు స్త్రీకి వివాహం జరగటం శ్రేష్ఠమని చెప్పటం ["ఇమాః స్యుః క్రమశో వరాః" 3.12] , పైన పేర్కొన్న వ్యవస్థకు వ్యతిరేకం. అందుచేత ఈ రెండుశ్లోకాలూ తర్వాతి కాలపు ప్రక్షిప్తాలు.

గ. 12-13 శ్లోకాలలో నిమ్న వర్గపు స్త్రీతో పెళ్లి శ్రేష్ఠ మన్నారు. 14-19 శ్లోకాలలో మళ్లీ శూద్ర స్త్రీని బ్రాహ్మణుడు, క్షత్రియుడు పెళ్లాడటం నిందనీయమన్నారు. మనువు ప్రాథమికంగా సవర్ణ భార్యావిధానమే చెప్పాడు[3.4], కానీ సవర్ణులతో కాకుండా వేరే వర్ణం స్త్రీతో వివాహం నిందనీయమే అని మనువు చెప్పలేదు. 2.213,240[2.238,265] శ్లోకాలలో **"స్త్రీ రత్నం దుష్కులాదపి", "స్త్రియో రత్నాని....సమాదేయాని సర్వతః"**-అంటే ఏ వర్ణంలోని శ్రేష్ఠ స్త్రీనైనా పెళ్లాడవచ్చు అని చెప్పి, అన్ని వర్ణాల కన్యలనూ పెళ్లాడవచ్చునని మినహాయింపు నిచ్చాడు. ఈ ఆధారంతో ఏ వర్ణపు వాడైనా ఏ కన్యను పెళ్లాడినా అది శ్రేష్ఠమేనని లేదా నిందనీయం కాదని చెప్పవచ్చు. ఈ శ్లోకాలలో శూద్ర కన్యతో పెళ్లి నిందనీయం అనటం, నిమ్న వర్ణాలలోని పలువురు కన్యలను పెళ్లాడటం మంచి దనటం, పైన చెప్పిన సంప్రదాయాలకు వ్యతిరేకం.

ఘ. మనువు వర్ణాల ననుసరించి ఎన్నో వివాహాలను అశ్రేష్ఠం అనుకోలేదు. విధిని మాత్రమే శ్రేష్ఠం-అశ్రేష్ఠం అని భావించాడు. 3.20లో వివాహవిధులకు మేలు చేసేవి **"ప్రేత్య చేహ హితాహితాన్"** అన్నాడు. ఈ సంకేతాన్ని అనుసరించి 3.39-42 శ్లోకాలలో హితకారి విధి ప్రకారం జరిగిన పెళ్లిళ్లు గుణకారులనీ, అహితకారి పద్ధతిలో జరిగిన వాటిని దోషాలున్నవనీ చెప్పాడు. 3.20లో **"చతుర్ణాం అపి వర్ణానాం"** వేదాలలోలు విశేషంగా గమణించదగినవి. ఈ విధులు నాలుగు వర్ణాలకూ అన్వయిస్తాయి. ఈ పద్ధతి ప్రకారం, 11-19 శ్లోకాలలోని వర్ణాలు ఆధారంగా చెప్పిన పద్ధతులు మనువుకు వ్యతిరేకాలని రూఢి అవుతూంది.

ఙ. 12-14 శ్లోకాలలో శూద్రకన్య పట్ల ఏహ్య భావం, అంటరాని భావన చెప్పి, శూద్ర స్త్రీలు, వారి సాహచర్యంలో ఉండే అందరినీ అపవిత్రులని అన్నారు. శూద్రస్త్రీ ఊపిరి తగిలినంత మాత్రాన్నే బ్రాహ్మణుడు భ్రష్టుడై పోతాడు. ఇవన్నీ మను సమ్మతాలు కావు. మనువు ఎక్కడా కూడా శూద్రులపట్ల అసహ్యం, నీచత, అస్పృశ్యత, అపవిత్ర భావాలు ప్రకటించలేదు. మనువు ఏర్పరచిన వ్యవస్థలను గమనిస్తే, మనువు కాలం నాటి శూద్ర, ద్విజవర్ణాలలోనే చదువు లేనివారుండేవారు. ఆ కారణంతో అస్పృశ్యత, అసహ్యాభావనలను చెప్పటం మనువుకు వ్యతిరేకమే. శూద్రులు మిగిలిన మూడు వర్ణాలవారికీ సేవలు చేయాలని శూద్రులను నిర్దేశించాడు. [1.91; 9.334; 10.99] ఇంట్లోనే ఉండి సేవలన్నీ చేసే శూద్రుల స్పర్శ తగలడం ఖాయం. అందువల్ల స్పష్టమయ్యే విషయమేమిటంటే, మనువు శూద్రులను శారీరక దృష్టితో అసహ్యించుకోవడం, అస్పృశ్యులనటం చేయలేదు. అట్లా భావించి ఉంటే శూద్రులను సేవాకార్యాలకు నియోగించి ఉండడు. 9.335లో మనువు శూద్రులకు శుచిః= పవిత్రులు అనే విశేషణం వాడాడు. దీనివల్ల ఈ శ్లోకాలలో చెప్పిన భావనలు మనువువి కావని తేలుతూంది.

చ. 18వ శ్లోకంలో శూద్ర స్త్రీల ప్రాధాన్యంతో జరిపే దేవ, పితృ శ్రాద్ధ కర్మలలో పితరుల ద్వారా హవ్యకవ్యాలు గ్రహించడం పనికిరాదని చెప్పటమూ మనువుకు వ్యతిరేకమే. మనువు మరణించిన వారి శ్రాద్ధాన్ని అంగీకరించలేదు. కనుక, ఈ కథనం ప్రక్షిప్తం. (దీని విస్తృత విశ్లేషణకు 3.119 నుంచి 274 శ్లోకాల మీద ఇచ్చిన **'అంతర్ వ్యతిరేకాలు'** అనే శీర్షిక చూడండి). 12-13 శ్లోకాలను ప్రక్షిప్తాలు చేసిన తర్వాత వాటిని ఖండించటానికి 14-19 శ్లోకాలు ప్రక్షిప్తాలుగా చొరబడ్డాయి. ఈ విధంగా అంతర్ వ్యతిరేకాల కారణంగా ఈ మొత్తం ప్రసంగమే ప్రక్షిప్తం అవుతుంది.

3. శైలీగత ఆధారాలు

క. ఈ ప్రసంగంలో 16వ శ్లోకంలో అత్రి, గౌతముడు, భృగుమహర్షుల అభిప్రాయాలు చెప్పాడు. ఈ ముగ్గురూ మనువు తర్వాతి వారు. 1.35వ శ్లోకం ప్రకారమైతే అత్రి, భృగువు మనువు సంతానం లేదా శిష్యులు. అంటే కచ్చితంగా తర్వాతి వారే. తర్వాతి వారి అభిప్రాయాలు తనకంటే ముందు కాలంలోని రచయిత రచనలో ఉండటం ఎప్పటికీ మౌలికం కాబోదు. ఈ ఆధారంతో ఇవి మనువు రచనలు కావు, తర్వాత చేర్చిన ప్రక్షిప్తాలని తేలిపోతూంది.

ఖ. ఈ మొత్తం ప్రక్షిప్త ప్రసంగంలో శూద్రులపట్ల పక్షపాతం చూపబడింది. మరియు 17-19 శ్లోకాలలో అతిశయోక్తి పూర్వక విషయాలున్నాయి. ఈ పక్షపాత, అతిశయోక్తియుక్త కథనాలు మనుసమ్మతం కాదు. ఇవి ప్రక్షిప్తాలు.

20,21వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

అష్టవిధ వివాహాలు-వాటి పద్ధతులు-

చతుర్ణామపి వర్ణానాం ప్రేత్య చేహ హితాహితాన్ । మూలశ్లోక సం. **11**
అష్టావిమాన్ సమాసేన స్త్రీవివాహాన్నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **20**

టీక:-చతుర్ణామ్ + అపి వర్ణానాం = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య మరియు శూద్రులు అనే నాలుగు వర్ణాలకు, **ప్రేత్య చ+ఇహ హిత+అహితాన్** = పరలోకంలోనూ, ఈ లోకంలోనూ హితకరములు, అహితకరములు అయిన, **ఇమాన్ అష్టా స్త్రీ వివాహాన్** = ఈ ఎనిమిది రకాలైన స్త్రీలతో జరిగే వివాహాలను, **సమాసేన** = సంక్షేపంగా, **నిబోధత** = తెలిసికోండి లేదా వినండి.

తాత్పర్యం:- చాతుర్వర్ణాలవారికీ వివాహ విషయంలో ఇహ-పరసాధకములైన వివాహ భేదాలు ఇక్కడ చెప్పబడ్డాయి. ఈ 8 రకాల వివాహాలలోను కొన్ని హితకారకం. కొన్ని అంత హితకారకం కానివి.॥20॥

వివరణ:

8 విధాల వివాహాలపై మనువు అభిప్రాయం:-స్త్రీ, పురుషుల దాంపత్య విషయంలో నాలుగు వర్ణాల వారికి విశేష ప్రక్రియను బట్టి, యోగ్యతను బట్టి అష్టవిధ వివాహవిధులు మనువు అంగీకరించాడు. అందులో మొదటి నాలుగు వివాహాలనే నాలుగు వర్ణములవారికి హితకరములు, ఉత్తమములు, ధర్మానుకూలములని మనువు భావించాడు. మిగిలిన ఆసురం, గాంధర్వం, రాక్షసం మరియు పైశాచం అనే నాలుగు వివాహాలు నిందితములు, అహితకారకాలని నిర్దేశించాడు (3-20). ఇవి ధర్మానుకూలాలు కావు. ఇవి దుర్వివాహాలని గర్హించాడు. ఇలాంటి నిందిత వివాహాలను ఆచరించే వ్యక్తి, ప్రజలు, రాజు నిందనీయులు. అందువల్ల ఈ వివాహాలు నిషిద్ధాలు. ఇదేవిధంగా ఆర్ష వివాహంలో **"గోయుగళదానప్రథ"** (జంట ఆవుల దానము)ను మనువు నిరసించాడు. ఇలాంటివి ఇచ్చుకోవడం గానీ, పుచ్చుకోవడం గానీ లేకుండానే వివాహం చేసికోవడం ధర్మానుకూలమని భావించాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మో దైవస్తథైవార్షః ప్రాజాపత్యస్తథాఽఽసురః । మూలశ్లోక సం. **12**
గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమోఽధమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **21**

టీక:-బ్రాహ్మః దైవః తథా+ఏవ+ఆర్షః ప్రాజాపత్యః తథా ఆసురః = బ్రాహ్మం, దైవతం, ఆర్షం, ప్రాజాపత్యం, ఆసురం, **గాంధర్వః రాక్షసః చ ఏవ అధమః పైశాచః చ అష్టమః** = గాంధర్వం, రాక్షసం, పైశాచం. ఈ వివాహాలు ఎనిమిది రకారలుగా ఉన్నాయి. అధమః అత్యంత నిందనీయం (సం.వి.).

ఋషిదయానందభాష్యం:- బ్రాహ్మం, దైవతం, ఆర్షం, ప్రాజాపత్యం,ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచికం అని ఎనిమిది రకాలుగా వివాహాన్ని వర్గీకరించారు. వీటిలో అధమాధమమైనది-చివరిదైనది పైశాచికం. (స.వి.వివాహ ప్రకరణం)॥21॥

22 నుండి 26వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* వర్ణానుసారంగా ధర్మ్య వివాహం

* యో యస్య ధర్మ్యో వర్ణస్య గుణదోషా చ యస్య యా ।
తద్వస్సర్వం ప్రవక్ష్యామి ప్రసవే చ గుణాగుణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.22

తాత్పర్యం:- ఏ వర్ణంవారికి ఏది శాస్త్రీయమైనదో, ఎవరికి ఏ రీతి వివాహం వల్ల ఏ యే గుణ దోషాలుంటాయో, ఆ యా వివాహాల వల్ల పుట్టే సంతతి గుణాలేమిటో విశదంగా మీకు తెలియజేస్తాను.॥22॥

* షడానుపూర్వ్యా విప్రస్య క్షత్రస్య చతురో-వరాన్ ।
విట్ఛూద్రయోస్తు తానేవ విద్యాద్ధర్మ్యాన్న రాక్షసాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.23

తాత్పర్యం:- పైన ఇవ్వబడిన వరుసప్రకారం-బ్రాహ్మణుడికి మొదటి 6 రకాల వివాహాలు, క్షత్రియుడికి చివరి 4 రకాల వివాహాలు, వైశ్యశూద్రులకు రాక్షసం/పైశాచికం మినహా మిగిలిన 7 రకాలు ధర్మశాస్త్రం అంగీకరించిందని తెలిసికోవాలి.॥23॥

* చతురో బ్రాహ్మణస్యాద్యాన్ ప్రశస్తాన్ కవయో విదుః ।
రాక్షసం క్షత్రియస్యైకమాసురం వైశ్యశూద్రయోః ॥ ప్రక్షిప్త శ్లోక సం.24

తాత్పర్యం:- బ్రాహ్మ, దైవత, ఆర్ష, ప్రాజాపత్యాలనే 4 రకాల వివాహాలను మాత్రమే విప్రుల విషయమై అంగీకార యోగ్యంగా పరిగణించాలని; క్షత్రియునకు వీటిని మినహాయించి రాక్షసం, వైశ్య-శూద్రులకు ఆసురం మేలని పరిగణించాలని ఒక మతం-(అభిప్రాయం) ఉన్నది. ॥24॥

* పంచానాం తు త్రయో ధర్మ్యా ద్వా వధర్మ్యౌ స్మృతావిహ ।
పైశాచశ్చాసురశ్చైవ న కర్తవ్యౌ కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.25

తాత్పర్యం:- ధర్మసూక్ష్మం ఇంకా ఏం చెబుతుంది ? అంటే-ప్రాజాపత్యం మొదలు చివరి 5 బ్రాహ్మణులకు నిషేధం. కానీ బ్రాహ్మదైవత ఆర్షములు మూడూ ధర్మశాస్త్ర సమ్మతమైనవి. ఆసుర-పైశాచికాలు క్షత్రియుల విషయంలో ధర్మశాస్త్రం అంగీకరించడం లేదు.॥25॥

* పృథక్ పృథగ్వా మిశ్రౌ వా వివాహౌ పూర్వచోదితౌ ।
గాంధర్వో రాక్షసశ్చైవ ధర్మ్యౌ క్షత్రస్య తౌ స్మృతౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.26

తాత్పర్యం:- అయితే- ఇతిహాసాది పురాణాలు శోధించినప్పుడు, గాంధర్వ-రాక్షస వివాహాలు వేరువేరుగా గాని, రెండూగాని క్షత్రియుల విషయంలో సమ్మతమై ఉన్నాయి (ఉదా: శకుంతలా దుష్యంతులు).॥26॥

ప్రక్షిప్తాల పరిశీలన

22 నుంచి 26 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు.

1. ప్రసంగవ్యతిరేకాలు

ఈ శ్లోకాలు ముందువెనుకల విషయాలకు వ్యతిరేకమే కాకుండా, ముందు వెనుకల ప్రసంగాలను భంగం చేస్తున్నాయి. 20వ శ్లోకంలో ఎనిమిది రకాల పెళ్లిళ్లను చెబుతున్నానని విషయం ప్రారంభించిన సంకేతమిచ్చి, 21లో ఆ ఎనిమిది రకాల పెళ్లిళ్లనూ లెక్కించారు. పేర్లు చెప్పిన తర్వాత వాటి లక్షణాలను చెప్పటం సందర్భోచితం అవుతుంది. 25వ శ్లోకంలో ప్రారంభించినదాన్ని, ఆ క్రమాన్ని భంగం చేస్తూ మధ్యలో ఈ శ్లోకాలలో ఏ వర్ణం వారు ఏ పెళ్లి చేసుకుంటే మచిందో, ఏది మంచిది కాదో, చెప్పటం అసందర్భ వర్ణన కనుక, ప్రసంగ వ్యతిరేకమైన ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

20వ శ్లోకంలో ఈ ప్రసంగాన్ని ప్రారంభించినపుడు, మనువు ఇలా చెప్పాడు- **"చతుర్ణాం అపి వర్ణానాం ప్రేత్య చేహ హితాహితాన్"**) ఇందులో రెండు విషయాలు స్పష్టంగా ఉన్నాయి- పెళ్లిళ్ల నియమాలను నాలుగు వర్ణాల వారూ సమానంగానే పాటించాలి- ఇది మొదటిది. రెండవది 'హితాహితాన్' అంటూ, ఈ నియమాలలోనే శ్రేష్ఠతనూ, శ్రేష్ఠతకాని వాటినీ చెప్పాడు. వీటిని బలపరిచే 39 నుంచి 42 శ్లోకాలను ప్రబల ప్రమాణాలుగా తీసుకోవచ్చు. వాటిలో అన్ని వర్ణాలవారికీ తొలినాలుగు వివాహాలూ మేలన్నాడు. మిగిలిన నాలుగూ నిందనీయాలన్నాడు. ఈ శ్లోకాలలో వేర్వేరు వర్ణాలవారికి వేర్వేరు వివాహాలను నిర్ణయించడం, ఆసురం, గాంధర్వం మొదలైనవాటిని కూడా క్షత్రియులకూ, వైశ్యులకూ మేలైనవి, ధర్మానుసారమైనవి అని చెప్పడం పై చెప్పిన వ్యవస్థకు వ్యతిరేకాలు. కనుక ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

3. అవాంతర వ్యతిరేకాలు

వీటిలో అవాంతర వ్యతిరేకాలూ కనిపిస్తున్నాయి. వీటిని పరిశీలిస్తే ఈ రచనలు మనువు వంటి విద్వాంసుడివీ కావు, కేవలం ఒకరిచేతనే రాయబడ్డవీ కావని తేలుతూంది. 23వ శ్లోకంలో ప్రారంభంలో బ్రాహ్మణులకు ఆరు; క్షత్రియ, వైశ్య, శూద్రులకు రాక్షస వివాహాన్ని విడిచి చివరినాలుగు వివాహాలూ శ్రేష్ఠమన్నారు. కానీ తరువాతి 24వ శ్లోకంలో దీనికి భిన్నంగా బ్రాహ్మణుడికి నాలుగు, క్షత్రియుడికి రాక్షసమూ, వైశ్య శూద్రులకు ఆసుర వివాహమూ శ్రేష్ఠమన్నారు. 25వ శ్లోకంలో ఈ శ్లోకాల కన్నా భిన్నమైనవి, 26వ శ్లోకంలో ఒక ప్రత్యేక పద్ధతీ చెప్పారు. ఈ వ్యతిరేక విషయాలు ఆధారంగానే ఈ ప్రసంగ ప్రక్షిప్తమవుతుంది. ఇవి వేర్వేరు వ్యక్తులు, ఒకరి అభిప్రాయాన్ని మరొకరు ఖండించేందుకే వేర్వేరు కాలాలలో రాసి మనుస్మృతిలో ప్రక్షిప్తాలుగా చొప్పించారని తెలుస్తూంది.

27 నుండి 34వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

బ్రాహ్మ-స్వయంవర వివాహ లక్షణం-

ఆచ్ఛాద్య చార్చయిత్వా చ శ్రుతి శీలవతే స్వయమ్ । మూలశ్లోక సం.13
ఆహూయ దానం కన్యాయా బ్రాహ్మో ధర్మః ప్రకీర్తితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.27

టీక:-శ్రుతి శీలవతే అర్చయిత్వా = కన్యకు యోగ్యుడు, సుశీలవంతుడు, విద్వాంసుడైన పురుషుణ్ణి సత్కరించి, **ఆచ్ఛాద్య** = కన్యను వస్త్రాదులతో అలంకరించి, **స్వయమ్ ఆహూయ** = స్వయంగా ఉత్తమపురుషుణ్ణి, ఎవరిని చూసి కన్యకూడా ప్రసన్నమైనదో, **కన్యాయాః దానం** = అతడికి కన్యను ఇవ్వడం, **బ్రాహ్మః ధర్మః ప్రకీర్తితః** = అది బ్రాహ్మ వివాహంగా పిలువబడుతుంది.

ఋషి దయానందభాష్యం:- బ్రాహ్మ వివాహం అంటే- "కన్య ఇష్టపడిన వేదాధ్యయనపరుడైన, ఆచారవంతుడైన ఒక బ్రహ్మచారిని మర్యాదగా రప్పించి, గౌరవించి మర్యాదలు జరిపించి కన్యను అతడికి ఇచ్చి వివిధ కానుకలను కూడ వివాహవేళ ఇవ్వడం బ్రాహ్మవివాహం" అని అర్థం. (సం.వి.వివాహ ప్రకరణం) ॥27॥

వివరణ:

1. బ్రాహ్మ వివాహ లక్షణం:- కన్య తాను స్వయంగా ఎవరిని వరించి ప్రసన్నంగా ఉందో, అలాంటి శ్రేష్ఠ గుణ కర్మ స్వభావాలు కలిగిన వరుణ్ణి ఆదరపూర్వకంగా పిలిచి, వస్త్రాదులతో అలంకరించి, వస్త్రాదులతో అలంకృతమైన కన్యనిచ్చి వివాహం చేయడం బ్రాహ్మ వివాహమనబడును. ఈ వివాహంలో పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడాలు ఉండవు. "స్వయం ఆహూయ" అనే పదం ద్వారా, కన్య ద్వారా వరుణ్ణి ఎన్నిక జరుగుతుందని తెలుస్తుంది. సామాన్యంగా ఇందులో తల్లిదండ్రుల అనుమతి కూడా ఉంటుంది. కన్య అభిప్రాయమే ముఖ్యం. వివాహాలలో ఇదే ఉత్తమ పద్ధతి. వేదాలలో పారంగతులైన విద్వాంసులను అనుమతించినది వారి ఆచరణమునకు అనుకూలమైనందువల్ల ఈ వివాహానికి 'బ్రాహ్మ' వివాహమని పేరు వచ్చింది.

2. బ్రాహ్మ వివాహమే స్వయంవర వివాహం.

కన్యే స్వయంగా వరించి, ఇష్టపడి, వివాహార్థం పిలవడం వల్ల బ్రాహ్మవివాహమే స్వయంవర వివాహం. ప్రాచీన సాహిత్యంలో స్వయంవరమే ఆచారంగా ఉండేది. ఈ పద్ధతే సర్వశ్రేష్ఠం. ఇదే అన్ని వివాహాల కంటే శ్రేష్ఠమైనది. 9.90వ శ్లోకంలో ఇలాంటి స్వయంవర వివాహమే చేసుకోమని కన్యకు మనుమహర్షి ఆదేశమిచ్చాడు. **"విన్దతే సదృశం పతిమ్"** కన్య తనకు సమానమైన యోగ్యుడైన వాడిని పతిగా పొందుతుంది.

దైవవివాహ లక్షణం

ఇది మనుకృతం-ప్రామాణికం

యజ్ఞేతు వితతే సమ్యగృత్విజే కర్మ కుర్వతే । మూలశ్లోక సం.**14**
అలంకృత్య సుతాదానం దైవం ధర్మం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**28**

టీక:-వితతే తు యజ్ఞే = విస్తృత యజ్ఞమున, **సమ్యక్ ఋత్విజే కర్మ కుర్వతే** = గొప్ప గొప్ప విద్వాంసులను ఆహ్వానించి, యజ్ఞం చేస్తున్న విద్వాంసులకు, **అలంకృత్య సుతా దానం** = వస్త్రాభూషణాలతో అలంకరించిన కన్యను దానం చేయడం, **దైవం ధర్మం ప్రచక్షతే** = దైవవివాహమని చెప్పబడుతుంది.

ఋషి దయానందభాష్యం:- జ్యోతిష్టోమం మొదలైన పెద్దపెద్ద యజ్ఞాలు తన ఆధ్వర్యంలో జరిపించే ఋత్విక్కునకు సాలంకృతంగా కన్యను దానం చెయ్యడాన్ని 'దైవ వివాహం' అంటారు. (సంస్కార విధి, వివాహ ప్రకరణం.) ॥28॥

వివరణ:

1. దైవ వివాహ లక్షణం-స్పష్టీకరణ:

వివాహోద్దేశంతో ఏర్పరచిన యజ్ఞంలో వివాహోద్దేశం సమ్మిళితమై, యజ్ఞీయ క్రియలను సంపన్నం చేసే విద్వాంసుడైన వ్యక్తిని వరించిన, (లేదా పూర్వమే వరింపబడి, యజ్ఞంలో పాల్గొని యజ్ఞకర్మను సంపన్నం చేసే విద్వాంసుణ్ణి) కన్యను వస్త్రాభూషణాదులతో అలంకరించి కన్యను ప్రదానం చేయడం దైవవివాహం.

2. 'దేవ' శబ్దానికి అర్థం-సాత్త్విక ప్రవృత్తి గల విద్వాంసులే దేవతలు:

దేవశబ్దవాచ్యులు, (12-24) (3-58). దేవశబ్ద సమీక్ష చూడగలరు. అగ్నిహోత్రానికి కూడా దేవయజ్ఞమని పేరుంది. యజ్ఞానుష్ఠానం అందులో యజ్ఞకర్మలొనరించే విద్వాంసులకు, కన్యాదానం చేయడం ఈ రెండు దైవనామమునకు అనురూపాలే. ఈ విధి దేవతలకు అంటే విద్వాంసులకు సమ్మతమైనవారి కర్మలకు అనురూపమైనదే. అందువల్ల ఈ వివాహానికి 'దైవ వివాహ'మని పేరుంది.

3. “ఋత్విక్” శబ్దానికి ప్రసంగానుకూలమైన అర్థం:

యజ్ఞం చేసే బ్రాహ్మణ విద్వాంసులకు **“ఋత్విక్”** అనే పేరు ప్రసిద్ధంగా ఉంది. ఈ ప్రసంగాన్ని బట్టి ఈ శబ్దానికి విశేషమైన అర్థం ఉంది. **“ఋతుయాజీ భవతీతి వా” ఋతౌ-కాలవిశేషే అవసర విశేషే యాజీ-యజనశీలః, యాజనశీలో వా”** కాలవిశేషం, ఉద్దేశ విశేషం అని ఋతు శబ్దానికి అర్థాలున్నాయి. అవసరాన్ని బట్టి గానీ లేదా ఒకానొక ఉద్దేశాన్ని బట్టి గానీ యజ్ఞం చేసేవారిని కూడా ఋత్విక్ అంటారు. దీన్ని బట్టి మనకు తెలిసినదేమంటే ! వివాహమునుద్దేశించి ఏర్పాటు చేసిన యజ్ఞకర్మలో పాల్గొని యజ్ఞాన్ని సంపన్నం చేసే విద్వాంసుడు వరింపబడి వరుడవుతాడు. వివాహయజ్ఞంలో వరుడే ప్రముఖుడు. దాదాపు యజ్ఞక్రియలన్నీ వరుడి కేంద్రంగా చేసికొనే జరుపబడుతాయి.

కానీ ప్రసిద్ధ వ్యాఖ్యాకారులందరు, ఋత్విక్ శబ్దానికి “యజ్ఞం చేసే బ్రాహ్మణ విద్వాంసుడనే” ప్రసిద్ధార్థాన్ని బట్టి సందర్భాన్ని చూడకుండా ఋత్విక్కుడికే కన్యాదానం చేయాలని రాశారు. ఇది మనుమహర్షి సిద్ధాంతానికి అనుకూలం కాదు. కారణం, ఈ వివాహవిధులన్నీ నాలుగు వర్ణాలవారికి హితకరములని మనువు చెప్పాడు. (3-11). ఎనిమిది వివాహాలలో మొదటి నాలుగు అందరికీ ఉత్కృష్టాలు. చివర నాలుగు అందరికీ నింద్యములని తెలిపాడు. ఏ వివాహం ఏ వర్ణానికి అని నిర్ణయించలేదు. అలాంటి పరిస్థితిలో ‘దైవ వివాహం’ కేవలం ఋత్విక్కుడికే అని వ్యాఖ్యానించడం ఆ వివాహం యొక్క ఉద్దేశాన్ని సీమితం చేయడమే అవుతుంది. ఇది మను సమ్మతం కాదు. తక్కిన వివాహ విధులన్నీ కూడా అన్ని వర్ణాలకు అన్వయించగా దైవవివాహం మాత్రం ఋత్విక్కులైన బ్రాహ్మణులకు విధించడం సందర్భానుకూలం కాదు. అందువల్ల ఋత్విక్ శబ్దానికి యజ్ఞంలో పాల్గొనే ఋత్విక్ అనే అర్థమే కాని బ్రాహ్మణ ఋత్విక్ అని అర్థం కాదు.

ఆర్ష వివాహ లక్షణం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఏకం గోమిథునం ద్వే వా వరాదాదాయ ధర్మతః । మూలశ్లోక సం.**15**
కన్యాప్రదానం విధివదార్షో ధర్మస్స ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**29**

టీక:-వరాత్ = వరుడి నుండి, **ధర్మతః** = ధర్మానుసారంగా, **ఏకం గోమిథునం ద్వే** = ఒక ఆవు, ఒక ఎద్దు, జంట గాని లేదా రెండు జంటలు గాని, **ఆదాయ** = తీసుకొని, **విధివత్ కన్యాప్రదానం** = విధిప్రకారంగా యజ్ఞవిధిపూర్వకంగా కన్యాదానం చేయాలి, **సః ఆర్షః ధర్మః ఉచ్యతే** = అది “ఆర్షవివాహ” మనబడును.

తాత్పర్యం:- కన్యను ఇవ్వడానికిగాను వరుడి దగ్గర్నుంచి ఒక ఆవు-ఒక ఎద్దును లేదా రెండు ఎద్దులను లేదా రెండు ఆవులను శుల్కంగా గ్రహించి శాస్త్రప్రకారం ఆ వరుడికి కన్యను సమర్పించడం ఆర్షవివాహమనబడును. (కొంత కాలానికి ఇది కన్యాశుల్కంగా ధనరూపేణ పరిణమించింది). ॥29॥

వివరణ: ఇది మను విధానం కాదు. 3-33వ శ్లోకంలో మను అభిప్రాయం తెలుపబడింది. ఈ విషయంలో శ్రీ దయానంద సరస్వతులవారు సంస్కార విధిలో ఇలా రాస్తున్నారు. ఈ విధానం అసత్యం. మనుమహర్షి ఈ పద్ధతిని నిషేధించాడు. ఇది యుక్తి యుక్తం కూడా కాదు. అందువల్ల ఇచ్చి పుచ్చుకోవడం లేకుండా వధూవరులకు ప్రసన్నంగా పాణిగ్రహణం చేయడం ఆర్షవివాహం (సం.వి.119.వి.ప్ర.).

1. ఆర్షవివాహ-వివాద-పరిశీలన

ఆర్షవివాహంలో ఈ శ్లోకంలో చెప్పినట్లుగా ఒక్క గోమిథునమును మాత్రమే తీసుకొని కన్యాదానం చేయడం మంచిదని కొంత మంది ఆచార్యుల అభిమతం. కానీ ఈ భావాన్ని మనువు (3-33,34) తీవ్రంగా ఖండించాడు. **“ఆర్షే గోమిథునం శుల్కం కేచిదాహుః మృషైవతత్ । అల్పోఽప్యేవం మహాన్వాఽపి విక్రయస్తావదేవ సః”॥** (3-53). వరుడి నుండి ఏది తీసుకొన్నా కన్యను అమ్ముకొన్నట్లే. అదే విధంగా కన్య నుండి కట్నరూపంలో ఏది తీసికొన్నా వరుడిని అమ్ముకొన్నట్లే. ఈ శ్లోకంలో గోయుగళ విధానముంది. 3-53వ శ్లోకంలో ఈ ఆచారాన్ని నిషేధించాడు. కాబట్టి ఆర్షవివాహ

లక్షణమేమని వ్యాఖ్యాకారులకు సందేహం కలిగింది. మనువు ఈ విషయాన్ని స్పష్టపరచలేదు. వ్యాఖ్యాకారులు సమాధానం చెప్పలేదు. కుల్లూకభట్టు ఈ సందేహానికి సమాధానం ఇలా రాస్తున్నారు. ఈ శ్లోకంలో "ధర్మతః" పద ప్రయోగమున్నందు వల్ల, దానమివ్వడమనే ధర్మాన్ని పాటించుటకుగాను, గోయుగళమును తీసికోవాలి. అంతేగాని లోభం వల్ల కాదు. మనువు 3-31-43 శ్లోకములలో లోభంతో తీసికోవడం పాపమని నిషేధించాడు. ధర్మవిధిని నిర్వహించడానికి గానీ విహిత వస్తువును తీసికోడానికి గానీ నిషేధించలేదు. ఈ సమాధానం బుద్ధిసంగతం కాదు. మను సమ్మతము కూడా కాదు. లోభంతో ధనాన్ని తీసికోరాదని మనువు నిషేధించినది బాగానే ఉంది. కానీ ఈ సమాధానం సంతోషజనకంగా లేదు. 3-54 వివరణలో ఈ విషయ సంబంధమైన వివేచనను చూడగలరు.

2. ఆర్ష వివాహ లక్షణం-

అయితే ఆర్షవివాహ లక్షణమేమిటి? మనుమహర్షి స్పష్టపరిచారా? ఈ విధి నిషేధముల ద్వారానే ఆర్ష వివాహ లక్షణం స్పష్టమయింది. అందువల్ల లక్షణం వేరుగా చెప్పవలసిన అవసరంలేదు. ఏమాత్రం ఇచ్చి పుచ్చుకోవడం లేకుండానే, కేవలం వివాహం సంస్కారపూర్వకంగా, సాదాగా కన్యాప్రదానం చేయడం ఆర్షవివాహం. ఈ శ్లోకంలో కన్యాలంకరణాదుల చర్చ కూడా 14వ శ్లోకంలో ఉన్నట్లుగా లేదు. దీన్ని బట్టి ఈ వివాహంలో వస్త్రాభూషణాదులతో అలంకరించాలనే విధి కూడా లేదు. సాదాగా వివాహం జరిగిపోతుంది. కేవలం వివాహసంస్కారం జరుపుకొని, వధూవరులు, ఋషిత్వానుకూలంగా, త్యాగం, తపస్సు, గంభీర నిష్ఠ మొ॥ భావనలతో ప్రేరితులై వధూవరులు గృహస్థాశ్రమాన్ని స్వీకరించడానికి నిర్ణయించుకొంటారు. ఋషిజన సమ్మతం ఋషుల ఆచరణకు అనుకూలమైనందువల్ల దీనికి 'ఆర్షవివాహమ'ని పేరు.

3. ఋషి అంటే ఎవరు?

'మంత్ర ద్రష్ట' లేదా ఏదైనా ఒకానొక విద్యను పూర్తిగా తెలిసినవాడు. విశేషజ్ఞుడైన వ్యక్తే ఋషి. ఈ విషయంలో విశేషంగా తెలియడానికి 3-58వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

ప్రాజాపత్య వివాహలక్షణం-

ఇది మనుకృతం-ప్రామాణికం

సహోభౌ చరతాం ధర్మమితి వాచాఽనుభాష్య చ । మూలశ్లోక సం.**16**
కన్యా ప్రదానమభ్యర్చ్య ప్రాజాపత్యో విధిః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**30**

టీక:- అభ్యర్చ్య = వధూవరులను యజ్ఞశాలలో, **"ఉభౌ ధర్మం సహ చరతాం"** = మీరిద్దరు కలిసి గృహస్థాశ్రమ ధర్మాలను నిర్వర్తించండి. అందరి ఎదుట, **వాచా అనుభాష్య** = చెప్పి, **కన్యాప్రదానం** = ఇద్దరకు ప్రసన్నంగా పాణిగ్రహణం చేయించడం, **ప్రాజాపత్యః విధిః స్మృతః** = అది ప్రాజాపత్య వివాహమనబడును.

ఋషి దయానందభాష్యం:- యజ్ఞశాలలో "మీరిద్దరూ కలిసి ధర్మాన్ని ఆచరించవలసిం"దని చెప్పి, కన్య తల్లిదండ్రులు వరుణ్ణి పూజించి పిల్లనివ్వడం ప్రాజాపత్య వివాహమనబడుతుంది. (ఈ నాలుగు ఉత్తమ వివాహాలు.) (సం.వి.వి) ॥30॥

వివరణ

1. ప్రాజాపత్య వివాహలక్షణం పరిశీలన:- "మీ రిద్దరు కలిసి ఉంటూ గృహస్థ ధర్మాన్ని పాటించండి" అని చెప్పి, అలంకృత అయిన కన్యను విధిపూర్వకంగా దానం చేయడం ప్రాజాపత్య వివాహం. ఇద్దరి తల్లిదండ్రులు స్వయంగా వరుని-మధువును, వెతికి నిశ్చయించుకొని వివాహం చేయాలని ఈ శ్లోకంలోని ప్రథమ పంక్తిలోని పదాలు తెలియజేస్తున్నాయి. ఇందులో పధూవరుల ఇచ్ఛ గౌణం (అప్రధానం) తల్లిదండ్రుల నిశ్చయమే ప్రధానం. తల్లిదండ్రులకు ఎక్కడ మంచిదని తోస్తే అక్కడనే నిర్ణయించి వివాహం పూర్తిచేసి గృహస్థులుగా జీవించదానికి అనుమతిస్తారు. ఇందులో కూడా ఇచ్చి పుచ్చుకోవడం ఉండదు. దీన్నే పెద్దలుకుదిర్చిన పెళ్ళి అంటారు.

2. 'ప్రజాపతి' అని ఎవరినంటారు?– ప్రజ అంటే సంతానం. సంతానపాలనలో తత్పరులైన తల్లి-దండ్రి మొ॥ గృహస్థ విద్వాంసులే ప్రజాపతులు. ఇందుకు ప్రమాణాలు బ్రాహ్మణాలలోనూ, నిరుక్తంలోనూ లభిస్తాయి.

'ప్రజా అపత్యనామ' నిఘంటువు (2-2).

ప్రజాపతిః పాతా వా పాలియితా వా (నిరుక్తం 10-41)

పితరః ప్రజాపతిః (గో.ఉ.6-15)

పురుషః ప్రజాపతిః (శత.6-2-1)

ప్రజలను కని వారిని పాలించినందువల్ల పురుషుణ్ణి ప్రజాపతి అనబడును. పితరులు అంటే తల్లిదండ్రులు మొ॥ వారు ప్రజాపతులవుతారు. పితరులను గురించి విస్తృత వివేచనం 3-58వ శ్లోకంలో చూడగలరు. సంతానాన్ని పాలించే తల్లి, తండ్రి మొ॥ గృహస్థ విద్వాంసుల ద్వారా అనుమోదితం సమ్మతం మరియు వారి ఆచరణానుగుణంగా ఉన్నందువల్ల ఇలాంటి వివాహానికి "ప్రాజాపత్య"మని పేరు.

ఆసుర వివాహ లక్షణం– **ఇది మనుకృతం-ప్రామాణికం**

జ్ఞాతిభ్యో ద్రవిణం దత్వా కన్యాయై చైవ శక్తితః । మూలశ్లోక సం.**17**
కన్యా ప్రధానం స్వాచ్ఛన్ద్యాదాసురో ధర్మ ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**31**

టీక:–జ్ఞాతిభ్యః చ కన్యాయై = వరుడి జాతి సభ్యులకు మరియు కన్యకు, **శక్తితః ద్రవిణం దత్వా** = యథాశక్తి ధనమిచ్చి, **కన్యా ప్రదానం** = హోమాదులొనరించి కన్యనివ్వడం, **ఆసురః ధర్మః ఉచ్యతే** = ఆసురవివాహమనబడుతుంది. **స్వాచ్ఛన్ద్యాత్** = తాననుకొన్నట్లుగా అంటే వధూవరుల కోరికలను, సంతోషాలను చూడకుండా.

ఋషి దయానందభాష్యం:– వరునకు-కన్యకు ఇవ్వవలసిన డబ్బు ఇచ్చి, హోమం మొదలగు విధిగావించి తన ఇష్టప్రకారం పెళ్లిచేసుకోవడాన్ని ఆసురవివాహం అంటారు. (అత్తగారి లాంఛనాలు-ఆడపడచు కట్నాలు అంటూ గత అర్ధశతాబ్దంగా ఇలా సొమ్ము ముట్టజెప్పడం ఒక ఆచారంగా మారింది). (సం.వి.వివాహప్రకరణం)॥31॥

వివరణ

1. ఆసుర వివాహ లక్షణం-పరిశీలన

అసురుడెవడు? **'న సురాః-అసురాః'** దేవతలతో సమానమైనవారు కారు. దేవతలకున్నట్లుగా నిస్వార్థత, నిర్వైరత్వం, పరహితత్వం, పరోపకారం, త్యాగం, తపస్సు, సహిష్ణుత మొ॥ గుణాలు లేనివారు, తమ దేశాన్ని పోషించుకొంటూ, తమ ప్రాణాలను మాత్రమే రక్షించుకొంటూ తమ యొక్క స్వార్థాన్నీ సుఖాన్నీ ధనాన్నీ చూసుకొని మరియు తమ హితసాధనములందే నిరంతర తత్పరులై, తత్పూర్తి కోసం రకరకాలైన మోసాలను, మాయాజాలాన్ని సృష్టించువారే అసురులు. ఇందుకు నిరుక్తం, బ్రాహ్మణ గ్రంథాల నుండి ప్రమాణాలు ఉన్నాయి.

1. **అసురతాః స్థానేష్వస్తా స్థానేభ్య ఇతి వా అసురితి**
   ప్రాణానామాస్తః శరీరే భవతి, తేన తద్వన్తః (నిరుక్తం 3-7)
2. **మాయాత్యేసురాః ఉపాసతే** (శత-10-5-2-10)
3. **స్వేష్వేవాస్యేషు జుహ్వాతశ్చేరుః** (శత 11-1-8-1)

'అసు=క్షేపణే'(అదాది) ధాతువుకు **'అసేవురన్'** (ఉణాది) (1-42) **'ఉరన్'** ప్రత్యయం చేర్చగా **"అసుర"** శబ్దం తయారవుతుంది.

అసురిడితో సంబంధం కలిగినవాడు అనే అర్థంలో **“అణ్”** ప్రత్యయం చేర్చి **‘ఆసుర’** శబ్దం తయారవుతుంది. ఈ విధంగా ఇతరుల భావనలను ఉపేక్షించి, తమ స్వార్థం కోసం, ధనాది సాధనలందు తత్పరులైన వ్యక్తులు అనుమోదించిన, లేదా వారికి సమ్మతమైన ఆచరణాలకు అనుకూలురైనందువల్ల దీని పేరు ఆసుర వివాహమన్నారు.

గాంధర్వ వివాహ లక్షణం-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఇచ్ఛయాఽన్యోన్యసంయోగః కన్యాయాశ్చ వరస్య చ । మూలశ్లోక సం.**18**
గాంధర్వస్స తు విజ్ఞేయో మైథున్యః కామసంభవః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**32**

టీక:-వరస్య చ కన్యాయాః = వరుడు-కన్య, **ఇచ్ఛయా అన్యోన్య సంయోగః** = ఇష్టపూర్వకంగా పరస్పరం కలవడం, **మైథున్యః** = మేమిద్దరం స్త్రీ పురుషులమనే భావనతో, **కామసంభవః** = కామం వల్ల కలిగింది, **సః తు గాంధర్వః జ్ఞేయః** = అది గాంధర్వవివాహమనబడును.

ఋషి దయానందభాష్యం:- స్త్రీ పురుషులు ఒకరినొకరు ఇష్టపడి, ఒకరిపట్ల ఒకరు అనురాగం కంటే మైథునానికీ-ప్రేమాభిమానాల కంటే కాముకత్వానికీ అధిక ప్రాధాన్యం ఇవ్వడం చేత ఏర్పడినబంధం. ఒక విధంగా చెప్పాలంటే -ఇది కామసంబంధమైనదనడమే సమంజసం. దీనినే గాంధర్వవివాహమంటారు.॥32॥

వివరణ:

1. గాంధర్వ వివాహ లక్షణం-పరిశీలన

వధూవరులిద్దరూ ఇష్టపూర్వకంగా పరస్పరం సంయోగం ద్వారా శారీరక సంబంధాన్ని స్థాపించుకొని, తమకు తామే పతిపత్నులమని తలంచి వివాహం చేసికోవడం గాంధర్వవివాహం. ఇది కామభావన వల్ల సంభవిస్తుంది. ఇది నిందనీయం. అధర్మానుకూలమని మనువు భావన. (3-23, 24) మనువు, ప్రకారం ఇందులో ధనం ఇవ్వటం గానీ తీసికోవడం గాని లేదు. కానీ కౌటిల్యుడి అర్థశాస్త్రం ప్రకారంగా, వివాహం చేసికొనే వ్యక్తి వరుడు వివాహసమయంలో కన్య యొక్క తల్లిదండ్రులకు కన్యాదానమునకు బదులుగా కొంత ధనమివ్వవలసి ఉంటుంది (ప్రక. 58-2).

2. గంధర్వులెవరు?

గంధర్వ శబ్దానికి వ్యుత్పత్తి **‘గామ్ = వాచమ్ ధరతీతి= గంధర్వః’** అంటే గాన సంబంధమైన ఉత్తమ వాక్కు కలవాడు. సంగీతకళలో గాయన, వాదన, నాట్య కళలో ప్రవీణులైనవారు విలాస జీవులు. ఆమోద-ప్రమోదములందు తన్మయులు, శృంగార ప్రియులు, కాముక ప్రవృత్తి ప్రధానంగా కలవారు గంధర్వులు. ఇందుకు ప్రమాణాలు **“రూపమితి గంధర్వాః” (ఉపాసతే)** (శత 10-5-2-20) **“యోషిత్కామా వై గంధర్వాః”** (శత. 3-2-4-3) **“స్త్రీ కామా వై గంధర్వాః”** (ఐతరేయ 1-277, కౌ 12-3), **“గంధో మే, ప్రమోదో మే, తన్మేయుష్మాసు (గంధర్వేషు)** (ఛై. ఉ-3-25-4). ఇలాంటి వ్యక్తుల ద్వారా అనుమోదితమైనందువల్ల, వారి ఆచరణకు అనురూపమైనందువల్ల ఈ వివాహానికి **“గాంధర్వ”** మని పేరు.

రాక్షస వివాహ లక్షణం-

ఇది మనుకృతం-ప్రామాణికం

హత్వా ఛిత్వా చ భిత్వా చ క్రోశన్తీం రుదతీం గృహాత్ । మూలశ్లోక సం.**19**
ప్రసహ్యా కన్యాహరణం రాక్షసో విధిరుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**33**

టీక:- హత్వా ఛిత్వా చ భిత్వా = కన్యను తీసికొని పోకుండా అడ్డుపడేవారిని, చంపిగాని, నరికిగాని, **క్రోశన్తీం రుదతీం గృహాత్ ప్రసహ్యా కన్యాహరణం** = కేకవేస్తున్న, ఏడుస్తున్న, భీతిల్లిన కన్యను బలాత్కారంగా గృహం నుండి లాక్కొనిపోవడం, **రాక్షస విధిః** = రాక్షస వివాహంగా, **ఉచ్యతే** = చెప్పబడుతుంది.

ఋషి దయానందభాష్యం:- కన్య తల్లిదండ్రులు, బంధువులు పరిపూర్ణంగా ఇష్టపడనప్పుడు -వరుడు కన్య తల్లిదండ్రులను, బంధువులను నరికి/చంపి అయినా సరే ! (వారి అంగీకారం ఎలాగూ ఉండదు కాబట్టి) బంధునాశనానికై వగచినప్పటికీ వధువును బలవంతంగా ఎత్తుకొచ్చి వివాహం చేసుకోవడం రాక్షసవివాహమనబడుతుంది. (సం.వి.వి.ప్ర.) ॥33॥

వివరణ

1. రాక్షస వివాహలక్షణం-పరిశీలన:-

కన్యాపక్షంవారితో పోట్లాట పెట్టుకొని, ఏడుస్తున్న కన్యను బలాత్కారంగా ఎత్తుకొనిపోయి ఆమెతో చేసే వివాహానికి రాక్షసవివాహమని పేరు. మనుమహర్షి దృష్టిలో ఇది నిందనీయమైన వివాహం. అధర్మం కూడా (3-23, 24). మనుస్మృతిని బట్టి ఈ వివాహంలో ఇచ్చి పుచ్చుకొనేది లేకపోయినప్పటికీ కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని బట్టి వివాహానికి బదులుగా, కన్య తల్లిదండ్రులకు కన్యాపహర్తా కొంత ధనమివ్వవలసి ఉంటుంది (ప్రక. 58-2).

2. రాక్షసుడెవడు?:-

రక్ష్ = పాలనే ధాతువుకు **"సర్వధాతుభ్యోఽసున్"** (ఉణాది) 4-189) సూత్రం ద్వారా **'అసున్'** ప్రత్యయం, **'ఇదం'** అర్థంలో **'అణ్'** ప్రత్యయం కలపడం ద్వారా **'రాక్షస'** శబ్దం సిద్ధమవుతుంది. నిరుక్తం (4-18)లో రాక్షస శబ్దానికి నిరుక్తం చూపిస్తూ, ఇలా అన్నాడు **"రక్షః రక్షితవ్యమస్మాత్, రహసి క్షణోతీతి వా, రాత్రౌ నక్షత్రే ఇతి వా"** ఎవడి నుండి భయపడి ధన సంపత్తినిగాని, ప్రాణాదులను గాని రక్షించుకోవలసిన ఆవశ్యకం కలుగుతుందో, ఎవరు ఏకాంతంగా ఉన్నప్పుడు హాని కలిగిస్తారో, ఎవరు రాత్రి లూటీచేసి, వ్యభిచారాది దుష్టకర్మలు చేయడంలో సిద్ధహస్తులో వారు రాక్షసులు. ఈవిధంగా తమ స్వార్థసాధన కోసం పరులకు హాని కలిగించేవారు, ఇతరులను బాధిస్తూ పీడించేవారు, అత్యాచారులు, అన్యాయం చేసేవారు, మాంసమదిరాభుక్కులు, తమోగుణాభిభూతులైన (12-28) వ్యక్తులే రాక్షసులు. ఇలాంటి వ్యక్తుల ఆచరణానుకూలంగా వారు అనుమోదించినదే రాక్షస వివాహం.॥34॥

పైశాచిక వివాహ లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

సుప్తాం మత్తాం ప్రమత్తాం వా రహో యత్రోపగచ్ఛతి । మూలశ్లోక సం. **20**
స పాపిష్ఠో వివాహానాం పైశాచశ్చాష్టమోఽధమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **34**

టీక:- సుప్తాం మత్తాం వా ప్రమత్తాం = నిద్రిస్తున్న, పిచ్చెక్కిన లేదా మద్యపానం చేసి ఉన్మత్తురాలైన కన్యను, **రహః యత్ర+ఉపగచ్ఛతి** = ఏకాంత ప్రదేశంలో చెరచడం. **సః వివాహానాం అధమః 'పాపిష్ఠః పైశాచః** = ఇది అన్ని వివాహాలలో, నీచాతినీచం, మహానీచం, దుష్టమేకాదు అతిదుష్టమైన వివాహం (సం.వి.)

ఋషి దయానందభాష్యం:- నిద్రిస్తూన్న కన్యను లేదా మత్తుచేత ఒళ్లు తెలియక ఉన్న ఏమరుపాటుగా ఉన్నదాన్ని బలాత్కారంగా ఏకాంతంలో క్రీడించి, వినోదించడం పైశాచికం. ఇది అధమాధమం, బలత్కారసమం. ఇది వైశాచికవివాహనబడుతుంది. (సం.వి.స.ప్ర) ॥34॥

వివరణ:

1. **పైశాచిక వివాహ లక్షణం:-** నిద్రిస్తున్న, పిచ్చెక్కిన, మత్తెక్కిన కన్యను ఏకాంతసమయం దొరికినప్పుడు చెరచుట, ఆమెను, వివాహం చేసికోవడం 'పైశాచవివాహం'. ఈ వివాహం వివాహాలన్నింటిలో కెల్లా అత్యంతనీచమే గాక పాపభూయిష్టమైనది. కౌటిల్యుడి అర్థశాస్త్రానుసారంగా ఈ వివాహంలో కూడా వివాహం చేసికొన్నవాడు కన్యాపక్షం వారికి కొంత ధనమివ్వాలి. (ప్రక. 58-2).

2. పిశాచుదెవడు?

'పిశ్-అవయవే' (తుదాది) ధాతువుకు, "క", ప్రత్యయం చేర్చగా **'పిశమ్'** పదం ఏర్పడుతుంది. **'పిశ'** ఉపపదంతో **"ఆఙ్ పూర్వక, చము= అదనే"** అను ధాతువు వల్ల 'డ' ప్రత్యయపూర్వక **'పైశాచ'** శబ్దం తయారవుతుంది. అథవా-**'పిశిత'** పూర్వ పదంతో, 'అశ్' ధాతువుతో 'అణ్, ఇత్' కు లోపం రాగా శకారమునకు చకారమొచ్చి, పైశాచ శబ్దం నిష్పన్నమవుతుంది. **"యే పిశితమ్ = అవయవీభూతం పేశితం వా మాంసరుధిరాదికమ్ ఆచమన్తి భక్షయన్తి తే పైశాచాః"** ప్రాణుల యొక్క పచ్చి మాంసాన్ని తినేవారు, రక్తం తాగేవారు, హింసాకారులు, దురాచారులు, అత్యాచారులు, కుసంస్కారులు, అత్యంత తమో గుణస్వరూపులు, అత్యంత ఘృణిత స్వభావులు-నీచాతినీచులు పిశాచులనబడతారు. ఇలాంటి వ్యక్తుల ఆచరణకు అనుకూలం, వారనుమోదించినది కావడం వల్ల ఇది పైశాచ వివాహం.॥34॥

35 నుండి 38వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* **ద్విజుల కన్యాదాన విధి-**

* **అద్భిరేవ ద్విజాగ్ర్యాణాం కన్యాదానం విశిష్యతే ।**
ఇతరేషాం తు వర్ణానా మితరేతర కామ్యయా ॥ ***ప్రక్షిప్త శ్లోక సం.35***

తాత్పర్యం:- జలధారాపూర్వకంగా కన్యాదానం చేయడం బ్రాహ్మణులకు ఉత్తమం. క్షత్రియాదులకు ఈ నియమం లేదు. వధూవరుల పరస్పరాంగీకారం, వారి తల్లిదండ్రుల సమ్మతి ఉంటే సరిపోతుంది.॥35॥

* **వివాహగుణలాభములు-**

* **యో యస్యైషాం వివాహానాం మనునా కీర్తితో గుణః ।**
సర్వం శృణుత తం విప్రాః సర్వం కీర్తయతో మమ ॥ ***ప్రక్షిప్త శ్లోక సం.36***

తాత్పర్యం:- ఓ ద్విజోత్తములారా ! ఏ యే వివాహాలకు ఏ యే ఫలితాలు సిద్ధిస్తాయో-ఆ యా గుణాలను, దోషాలను మనువు చెప్పిన రీతిలో వివరిస్తాను. ఆలంకించండి! అన్నాడు భృగుమహర్షి.॥36॥

* **దశ పూర్వాన్ పరా వంశ్యానాత్మానం చైకవింశకమ్ ।**
బ్రాహ్మీపుత్రస్సుకృతకృన్మోచయేత్ పితౄన్ ఏనసః ॥ ***ప్రక్షిప్త శ్లోక సం.37***

తాత్పర్యం:- బ్రాహ్మ వివాహం వల్ల జన్మించిన పుత్రుడు పుణ్యవంతుడు. అతడు తన ముందు పదితరాలవారిని-వెనుకటి పదితరాలవారిని తనతో కలిపి 21 తరాల్ని తరింపజేస్తారు. అంటే పితృదేవతలను పాపకూపం నుంచి కాపాడి రక్షిస్తాడని భావం. ॥37॥

* **దైవోఢాజస్సుతశ్చైవ సప్త సప్త పరావరాన్ ।**
ఆర్షోఢాజస్సు త స్త్రీం స్త్రీన్ షట్ షట్ కాయోఢాజస్సుతః ॥ ***ప్రక్షిప్త శ్లోక సం.38***

తాత్పర్యం:- దైవవివాహం వల్ల జన్మించిన పుత్రుడు ఏడేడు-మొత్తం పద్నాలుగు తరాల వారిని; ఆర్షవివాహసంజాతుడు ముందు- వెనుక మూడు తరాలవారిని మొత్తం ఏడు తరాల వారిని, ప్రాజాపత్యం వల్ల జన్మించినవాడు ముందు-వెనుక మొత్తం 13 తరాల వారిని ఉద్ధరిస్తాడు.॥38॥

ప్రక్షిప్తాల పరిశీలన

35 నుంచి 38 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు.

1. ప్రసంగ వ్యతిరేకాలు

34వ శ్లోకంలో వివాహ నిర్వచనాలు పూర్తయ్యాయి. వీటి తర్వాత వాటి గుణదోషాల విశ్లేషణ సముచితమూ, సందర్భోచితమూ అవుతుంది. అవి 39-42 శ్లోకాల్లో చెప్పాడు. మధ్యలోని 35వ శ్లోకంలో వివాహ విధులు, మళ్లీ తరాలను గట్టెక్కించే విధులు లేదా పుత్రుల గుణ కథనం అసందర్భం. 36-38 శ్లోకాలలో కూడా వివాహ గుణాలు చెప్పినా, అది మౌలికం కాదు. దీనికి పుష్టికలిగించే రెండుమాటలు ఇక్కడ చెప్పుకోవచ్చు. ఒకటి ఈ శ్లోకాలలోని వివాహ వర్ణన పరోక్షంగా ఉంది కానీ పుత్రుల గుణాలు ప్రత్యక్షంగానే చెప్పడంతో పాటు అవగుణాలను అసలు పేర్కొననే లేదు. రెండవది అన్ని వివాహాల గుణదోషాల సామూహిక విశ్లేషణ 39 నుంచి 42 శ్లోకాలలో క్రమబద్ధంగా పూర్తిగా చెప్పాడు. అందువల్ల ఈ శ్లోకాలు మౌలికాలూ కావు, సందర్భోచితమూ కావు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 35వ శ్లోకంలో వివాహ విధులు ఉన్నాయి. 27 నుంచి 34 వరకు వివాహ వర్ణనలు తమకు తామే ఒకరకం విధులుగా ఉన్నాయి. ఇవి మునుపటివాటికి భిన్నంగా ఉన్నాయి కనుక వ్యతిరేకాలు. ఒకసారి వాటిని చెప్పిన తర్వాత, రెండోసారి చెప్పవలసిన అవసరమేలేదు. ఈ ఆధారం వల్ల 35వ శ్లోకం ప్రక్షిప్తం.

ఖ. 37-38 శ్లోకాలలో ఒకే పుత్రుని ద్వారా తన తర్వాతి, మునుపటి ఎన్నెన్నో తరాలవారి పాపాలు తొలగింపచేసే వర్ణన 4.240కి వ్యతిరేకం. ఆ శ్లోకంలో మనువు 'కర్తనే స్వయంగా పాపపుణ్యాలు అనుభవించేవాడు' అన్నాడు. కర్తే స్వయంగా భోక్త అయితే రెండవ వ్యక్తి అతని పాపాలను ఎలా తొలగించగలుగుతాడు?

గ. ఒక పుత్రుని ద్వారానే పలు తరాలవారి పాపాలను తొలగించుకోగలిగితే, తర్వాత వచ్చేతరాల వారి ధర్మమార్గంలో నడిచే అవసరం ఉంటుందా? ఎందుకంటే ఆ పుత్రుడు వారి పాపాలను కూడా తొలగించేశాడు కదా! ఈ ప్రకారమైతే ఈ సంప్రదాయం మొత్తం మనుస్మృతి కంతటికీ వ్యతిరేకమవుతుంది. ఎందుకంటే మనుస్మృతిలో ఎన్నోచోట్ల ప్రతి వ్యక్తీ ధర్మపాలన చేయాలని చెప్పబడింది. ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా 36-38 శ్లోకాలు ప్రక్షిప్తాలు.

3. శైలీగత ఆధారాలు

క. 36వ శ్లోకంలో **"యో యస్యైషాం వివాహానాం మనునా కీర్తితో గుణః । తం సర్వం శ్రుణుత.....కీర్తయతో మమ॥"**- దీనివల్ల వీటిని చెబుతున్నది మనువు కాదనీ, వేరే వ్యక్తి అని స్పష్టంగా తెలిసిపోతూంది. అందువల్ల ఇది కచ్చితంగా ప్రక్షిప్తశ్లోకమే.

ఖ. 37-38 శ్లోకాలలో ఒక పుత్రుడే ఎన్నో మునుపటి, తర్వాతి, తరాలను ఉద్ధరించే కథనం సహేతుకం కాదు. అతిశయోక్తులు నిండినది. ఈ శైలి మనువుది కాదు.

39 నుండి 42వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ప్రథమ చతుర్వివాహాల వల్ల లాభం-

బ్రాహ్మాదిషు వివాహేషు చతుర్ష్వేవానుపూర్వశః । మూలశ్లోక సం.**21**
బ్రహ్మవర్చస్వినః పుత్రా జాయన్తే శిష్టసమ్మతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**39**

టీక:- **బ్రహ్మ+ఆదిషు చతుర్షు వివాహేషు** = బ్రాహ్మ, దైవ, ఆర్ష మరియు ప్రాజాపత్య వివాహాలలో పాణిగ్రహణం చేయబడిన స్త్రీ, పురుషులకు, **పుత్రాః జాయన్తే** = కలిగే సంతానం (బిడ్డలు), **బ్రహ్మవర్చస్వినః శిష్ట సమ్మతాః** = వేదాది విద్యల ద్వారా తేజస్వంతులై ఆప్తపురుషుల సాంగత్యంలో అత్యుత్తములుగా ఉంటారు. **అనుపూర్వశః** = క్రమంగా, ఆ బాలకులు భవిష్యత్తులో, అంటే పెరిగి పెద్దవారై సద్గుణ సంపత్తి కలవారవుతారు.

ఋషి దయానందభాష్యం:- బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్యములను 4 రకాల వివాహాల వల్ల జన్మించిన పుత్రులు వేదాధ్యయన సంపత్తి వల్ల తేజోవంతులుగా ఉంటారు. క్రమంగా, వారు సద్గుణ సంపత్తి కలవారవుతారు. (సం. వి. వి. ప్ర) ॥39॥

వివరణ:- ఈ వర్ణన శిశువులకు ఉత్తమ సంస్కారాలు వచ్చి భావి జీవితంలో పైన చెప్పిన గుణాలు కలవారవుతారని చేయబడినది.

ఇది మనుకృతం-ప్రామాణికం

రూపసత్త్వగుణోపేతా ధనవన్తో యశస్వినః । మూలశ్లోక సం. 22
పర్యాప్తభోగా ధర్మిష్ఠా జీవంతి చ శతం సమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 40

టీకః:- ఆ పుత్రులు లేదా కన్యలు, **రూప-సత్త్వగుణ+ఉపేతాః** = సుందర రూపం, బలపరాక్రమం, శుద్ధబుద్ధి ఆది ఉత్తమ గుణయుక్తులై, **ధనవన్తః** = అధిక ధనసమన్వితులుగా, **యశస్వినః** = పుణ్యకీర్తి సంపన్నులుగా, **చ** = మరియు, **పర్యాప్తభోగాః** = పూర్ణసుఖానుభోక్తలై, **ధర్మిష్ఠాః** = ధర్మాత్ములై, **శతం సమాః జీవన్తి** = శతాయుష్మంతులుగా జీవిస్తారు.

ఋషి దయానందభాష్యం:- ఆ బాలబాలికలు శిష్టులకు ఇష్టులుగా, రూపం-బలం-గుణం- ధనంచేత ప్రకాశించే వారిగా, కీర్తిప్రతిష్ఠలార్జించి భోగభాగ్యాలు అనుభవించే వారిగా ఉంటారు. వీరు ధర్మాత్ములై నిండు నూరేళ్లు జీవించగలరు. ॥40॥

ద్వితీయ చతుర్విధ వివాహాలు నిందనీయాలు-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఇతరేషు తు శిష్టేషు నృశంసానృతవాదినః । మూలశ్లోక సం. 23
జాయంతే దుర్వివాహేషు బ్రహ్మధర్మద్విషస్సుతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 41

టీకః:- **ఇతరేషు తు శిష్టేషు దుర్వివాహేషు** = మిగిలిన నాలుగు వివాహాలు(-)ఆసుర, గాంధర్వ, రాక్షస మరియు పైశాచ వివాహాలు దుష్ట వివాహాలు. ఈ వివాహాలు చేసికొన్నవారికి కలిగే, **సుతాః** = బిడ్డలు, **నృశంసా+అనృత వాదినః** = నిందిత కర్మకారులు, అసత్యవాదులు, **బ్రహ్మ ధర్మద్వేషః** = వేదధర్మ ద్వేషులుగాను, నీచాతినీచ స్వభావులుగాను, **జాయన్తే** = జన్మిస్తారు.

ఋషి దయానందభాష్యం:-మిగిలిన నాలుగు ఆసుర, గాంధర్వ, రాక్షస, పైశాచ వివాహాల వల్ల జన్మించిన పుత్రులు అసత్యవాదులై, దేవ బ్రాహ్మణ విరోధులై, యజ్ఞ దాన తపో ధర్మ విరోధులై నీచస్వభావం కలిగి సంచరిస్తారు. (సం. వి. వి. ప్ర.) ॥41॥

శ్రేష్ఠ వివాహాల వల్ల శ్రేష్ఠ సంతానం, నీచవివాహాల వల్ల నీచసంతతి-

ఇది మనుకృతం-ప్రామాణికం

అనిన్దితైః స్త్రీవివాహైరనింద్యా భవతి ప్రజా । మూలశ్లోక సం. 24
నిన్దితైర్నిందితా నృణాం తస్మాన్నిన్ద్యాన్ వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 42

టీకః:- **అనిన్దితైః స్త్రీ వివాహైః ప్రజా అనిన్ద్యా భవతి** = శ్రేష్ఠ వివాహాల వల్ల, సంతానం కూడా శ్రేష్ఠ గుణాలు కలదిగా ఉంటుంది, **నిన్దితైః నృణాం నిన్దితా** = నిందిత వివాహాల ద్వారా మానవులకు నిందితులైన బిడ్డలే జన్మిస్తారు; **తస్మాత్** = అందువల్ల, **నిన్ద్యాన్ వివర్జయేత్** = నిందిత వివాహాలను ఆచరించరాదు.

ఋషి దయానందభాష్యం:-నీచ సంతతిని కలిగించే నిందిత వివాహాలను త్యజించి, ఉత్తమ సంతతి కలిగే ఉత్తమ వివాహాలను ఆచరించాలి (సం. వి. వి. ప్ర.). ॥42॥

43,44 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* సవర్ణ అసవర్ణ కన్యల వివాహ విధి-

* *పాణిగ్రహణసంస్కారః సవర్ణాసూపదిశ్యతే ।*
అసవర్ణాస్వయం జ్ఞేయో విధిరుద్వాహకర్మణి ॥ ప్రక్షిప్త శ్లోక సం.43

తాత్పర్యం:- తమ కులానికే చెందిన కులాంగనలను వివాహం చేసుకొంటూ ఆపస్తంబుడు మొదలయినవారు రచించిన గృహ్యసూత్రాలు చెప్పిన రీతిగా సంస్కారాలు జరిపించుకొంటూ సుఖంగా ఉండాలి. అసవర్ణ స్త్రీలను వివాహమాడినట్లయితే, ఇప్పుడు చెప్పబోయే రీతిని అనురించాలి. ॥43॥

* *శరః క్షత్రియయా గ్రాహ్యః ప్రతోదో వైశ్యకన్యయా ।*
వసనస్య దశా గ్రాహ్యా శూద్రయోత్కృష్టవేదనే ॥ ప్రక్షిప్త శ్లోక సం.44

తాత్పర్యం:- క్షత్రియకన్య బ్రాహ్మణుణ్ణి వలచి వరించినప్పుడు అతని చేతిని కాక అతని చేత పట్టుకోబడిన ఒక బాణపు కొనను ఆమె పట్టుకోవాల్సి ఉంటుంది. బ్రాహ్మణ -క్షత్రియులు వైశ్యకన్యను పెళ్లాడాలంటే వారిచేత ధరించబడిన మునుకోల (కర్ర) పట్టుకోవాలి. శూద్ర కన్య విషయంలో పై మూడు జాతులవారు ధరించిన పై పంచె కొంగు పట్టుకొంటే చాలు.॥44॥

ప్రక్షిప్తాల పరిశీలన

43,44 శ్లోకాలు ప్రక్షిప్తాలు- **అంతర్ వ్యతిరేకాలు...**

క. 20,21,27-34 శ్లోకాలలో వివాహాలు, వాటి విధులు నిర్దిష్టంగా చెప్పబడ్డాయి. ఆ వివాహాలలోని భేదాలు వాటి విధులలోని తేడాలవల్లే ఏర్పడ్డాయి. ఈ శ్లోకాలలో వివాహాలలో వాటికన్నా వేరు విధులు ఉన్నాయి కానీ, ఈ భిన్నత వ్యతిరేక సూచకాలు. వివాహాలను గురించి ఒకసారి చెప్పేసిన తర్వాత రెండోసారి చెప్పవలసిన అవసరమే లేదు.

ఖ. 20,21,27-34 శ్లోకాలలో చెప్పినవి అన్ని వర్ణాలవారికీ సమానమే.....వాటిలో సవర్ణులు, కానివారు అంటూ మనువు తేడాలు చూపలేదు (3.20). ఈ శ్లోకాలలో చెప్పిన సవర్ణ-అసవర్ణ భేదాలు పై సంప్రదాయానికి వ్యతిరేకం.

గ. ఈ శ్లోకాలలో చెప్పినవి చివరి మూడు పెళ్లిళ్లకూ అన్వయించవు. **'గంధర్వ వివాహం'**లో స్త్రీ పురుషుల స్వేచ్ఛా సంయోగం ఉంటుంది. **'రాక్షస వివాహం'**లో అపహరణ ఉంటుంది. **'పైశాచ వివాహం'**లో బలాత్కారం జరుగుతుంది. అందువల్ల ఈ శ్లోకాలలో చెప్పిన విధులు, ఈ మూడు రకాల పెళ్లిళ్లలో జరిగే అవకాశమే ఉండదు. ఈ శ్లోకాలకూ, మనువు చెప్పిన వ్యవస్థకూ పొంతనే లేదు. కనుక ఇవి తర్వాతి కాలానికి చెందినవి. ఈ అంతర్ వ్యతిరేకాల కారణంగా ఈ మూడు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

45 నుండి 62వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఋతుకాల సంబంధమైన విధానం

ఋతుకాలాభిగామీ స్యాత్స్వదారనిరతస్సదా । మూలశ్లోక సం.**25**
పర్వవర్జం వ్రజేచ్చైనాం తద్వ్రతో రతికామ్యయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**45**

టీక:- **ఋతుకాలాభిగామీ స్యాత్** = పురుషుడెల్లప్పుడు ఋతుకాలంలోనే స్త్రీతో సంగమించాలి, **స్వదార నిరతః సదా** = త్రన భార్యను తప్ప మరొక స్త్రీతో సంగమించరాదు. అలాగే స్త్రీ కూడా వివాహం చేసికొన్న తన భర్తను తప్ప మరొకరితో కలవకూడదు, **తద్వ్రతః** = అలాంటి వ్రతం కలిగినవాడు స్త్రీ వ్రతుడు, అంటే వివాహితయైన తన స్త్రీతోనే

సంతోషపడేవాడు. అలాగే 'పతివ్రత' అంటే తన పతినే ప్రేమించి, పతితోనే కలిసి ఉండుటయే పతివ్రత లక్షణం, **రతి కామ్యయా** = ఋతుదానం చేయవలసినప్పుడు, **ఏనాం పర్వవర్జం వ్రజేత్** = పర్వములను వదిలి వేయాలి.

ఋషి దయానందభాష్యం:- పురుషుడు ఋతుకాలంలోనే స్త్రీలో సంగమించాలి. తన భార్యతో తప్ప ఇతర స్త్రీతో సంగమించరాదు. అలాగే స్త్రీ కూడా తన భర్తను తప్ప మరొకరిలో కలవ కూడదు. స్త్రీ పురుషులు ఋతుకాల సమయంలో-16 రోజులలో పూర్ణిమ, అమావాస్య, చతుర్దశి, అష్టమి రోజులల్లో రతిక్రియ చేయరాదు.(సం.వి.గృ.ప్ర.) ॥45॥

వివరణ

1. ఋతుకాలంలో వర్జిత పర్వములు

1. అమావాస్య, పూర్ణిమ, అష్టమి, చతుర్దశి ఈ విషయం 4-30వ శ్లోకం లో కూడా నిషేధం గురించి ఉంది.

2. పర్వదినాలలో సమాగమం నిషేధం దేనికి?

పర్వదినాలలో రతిక్రియ నిషేధానికి కారణం ఈ పర్వదినాలను ధార్మిక దినాలుగా పరిగణించాలని మనువు సూచిస్తూ, ఈ రోజులలో విశేషమైన యజ్ఞాలను నిర్వహిస్తూ, వేదాది గ్రంథాల స్వాధ్యాయం చేయవలసిన విధానం ఏర్పరచాడు, (4.25; 6.9, 3.3). ఈ ధార్మిక కృత్యాలను పాటించే సమయంలో జితేంద్రియుడుగా ఉండటం, సంయమనం పాటించడం చాలా ముఖ్యం. అజితేంద్రియ పరిస్థితులలో ఈ ధార్మిక కృత్యాలకు ఫలం సిద్ధించదు.

2. 'ఋతుకాలగమనం' గృహస్థుడికి తప్పని సరి కర్తవ్యం

గృహస్థుడైన తరువాత ఋతుకాలంలో స్త్రీ సంగమం చేయడం ముఖ్య కర్తవ్యం. అందువల్లనే మనువు అంటాడు-**'ఋతుకాలాభిగామీ స్యాత్' 'పర్వవర్జం వ్రజేత్'.** ఈ విషయాన్ని వివరిస్తూ. "ఇది అత్యావశ్యకమైన కర్తవ్యమనీ, ఇది గృహస్థుడి ధర్మవిధానమనీ, ఈ కర్తవ్యాన్ని పాటించని వాడికి దండనవ్యవస్థ కూడా నిర్ణయించాడు. కౌటిల్యుడు, ఋతుకాలంలో పురుషుడు స్త్రీని కలవకపోయి నట్లయితే స్త్రీలు పదభ్రష్టులు కావడానికి, వారి శీలం కళంకితం అవడానికీ అవకాశం ఉంది. ఋతుకాలంలో తన స్త్రీని కలవక పోవడం గృహస్థ ధర్మాన్ని పాటించనట్లే, కర్తవ్యపతితుడైన వ్యక్తికి 96 పణములు (నాణెములు) దండన వేయాలి.

1. **'తీర్థోపరోధో హి ధర్మవధః ఇతి కౌటిల్యః** (ప్రక.60-6-4)
2. **తీర్థగూహామనాగమనే షణ్ణవతిర్దండః** (ప్రక-58-2 అధ్యాయం)

అయితే కామరహితమైన స్వీయ స్త్రీని కూడా బలాత్కారంగా సంగమించరాదు. **"నాకామాముపేయాత్"** (ప్ర.58-2).

అందువల్లనే పతి దీర్ఘకాలం ప్రవాసంలో ఉన్నప్పుడు, నియోగం ద్వారా స్త్రీ సంతతిని కనడానికి మనువు అంగీకరించాడు. కౌటిల్యుడు కూడా దీన్ని సమర్థించాడు(అర్థశాస్త్రం-ప్రకరణం 60-4).

స్త్రీల స్వాభావిక ఋతుకాలం ఇది మనుకృతం-ప్రామాణికం

ఋతుస్స్వాభావిక స్త్రీణాం రాత్రయః షోడశ స్మృతాః । మూలశ్లోక సం.**26**
చతుర్భిరితరైస్సార్ధమహోభిస్సద్విగర్హితైః ॥ ప్రక్షిప్తా శ్లోక సం.**46**

టీక:- **స్త్రీణాం స్వాభావికః ఋతుః** = స్త్రీలకు స్వాభావికమైన ఋతుకాలం, **షోడశ రాత్రయః స్మృతాః** = రజోదర్శనమైన రోజు నుండి 16వ రోజు వరకు ఋతు సమయం, **ఇతరైః సద్విగర్హితైః చతుర్భిః అహోభిః సార్థమ్** = వాటిలో మొదటి నాలుగు రాత్రులు అంటే ఏ రోజు రజస్వల అవుతుందో ఆ రోజు నుండి నాలుగు రోజులు నిందితములు.

ఋషి దయానందభాష్యం:- స్త్రీలకు స్వాభావికంగా పదారుదినముల వరకు ఋతుకాలం. అందు మొదటి నాలుగు దినములు సజ్జననిందితములు. మొదటి, రెండో, మూడో, నాలుగో రాత్రులందు పురుషుడు స్త్రీని స్పృశించడం గాని, స్త్రీ పురుషుణ్ణి స్పృశించడం గాని చేయరాదు. స్త్రీ, పురుష సంబంధమేమీ ఉండకూడదు. అంటే ఆ రజస్వల చేతితో

ఇచ్చిన నీళ్ళను కూడా తాగరాదు. ఆ స్త్రీ ఏమీ పనిచేయరాదు. ఏకాంతంగా కూర్చుని ఉండాలి. కారణమేమంటే ఈ నాలుగు రాత్రులలో సమాగమం చేయడం వ్యర్థమేకాక మహారోగకారకం కూడా (సం.వి.గృ.ప్ర.). ॥46॥

నిందిత రాత్రులు- ఇది మనుకృతం-ప్రామాణికం

తాసామాద్యాశ్చతస్రస్తు నిందితైకాదశీ చ యా । మూలశ్లోక సం.**27**
త్రయోదశీ చ శేషాస్తు ప్రశస్తా దశ రాత్రయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**47**

టీక:- తాసామ్ + ఆద్యాః చతస్రః నిందిత = వాటిలో మొదటి నాలుగు రాత్రులు ఋతుదానమునకు నిందితములు. **యా ఏకాదశీ చ త్రయోదశీ** = పదకొండో, పదమూడో రాత్రులు కూడా, **శేషా తు దశరాత్రయః ప్రశస్తాః** = మిగిలిన పదిరాత్రులు ఋతుదానమునకు శ్రేష్ఠం (సం.వి.గృ.సం.).

ఋషిదయానందభాష్యం:- ఆ ఋతుదినాలలో మొదటి నాలుగింటితో పాటు పదకొండో, పదమూడో రాత్రులు నిందితాలు. మిగిలిన 10 రాత్రులు ఋతుదానమునకు శ్రేష్ఠం.॥47॥

వివరణ

ఋతుగమనంలో నిషిద్ధరాత్రులు:-26వ శ్లోకంలో స్త్రీలకు స్వాభావిక ఋతుకాల సమయం 16 రాత్రులని చెప్పబడింది. వాటిలో రజోదర్శనమైన రాత్రితో కూడా మొదటి నాలుగు రాత్రులు నిందితములు. ఇదే విధంగా రజోదర్శనమైన దినము నుంచి పదకొండో మరియు పదమూడోరాత్రి కూడా నిందితములు. ఈ విధంగా 16 రాత్రులలో 10 రాత్రులు మాత్రమే ఋతుదానమునకు శ్రేష్ఠమైనవిగా ఉంటాయి. కానీ పదిరాత్రుల మధ్యలో కూడా ఏదైనా పర్వదినం అమావాస్య, పౌర్ణమి, అష్టమి మరియు చతుర్దశి వచ్చినట్లయితే ఆ రాత్రులలో ఋతుదానం చేయరాదని 4.29, 3.25, శ్లోకాల ద్వారా స్పష్టంగా నిర్దేశింపబడినవి. దీనివల్ల ఒకప్పుడు 7 లేదా 8 మరొకప్పుడు 10 రాత్రులు మాత్రమే ఋతుదానమునకు మిగిలి ఉంటాయి.

ఋతుదానమునకు నిశ్చితరాత్రుల నిర్ణయానికి కారణం, రజోదర్శనకాలంలో స్త్రీ సంగమం వల్ల, వ్యక్తి ప్రజ్ఞ, తేజస్సు, బలం, జ్యోతి, ఆయుష్షుకు హాని సంభవిస్తుంది. ఇందుకు 4.20, 21 శ్లోకాలు చూడాలి.

పుత్ర-పుత్రీ-ప్రాప్త్యర్థం నిమిత్తంగల రాత్రులు ఇది మనుకృతం-ప్రామాణికం

యుగ్మాసు పుత్రా జాయన్తే స్త్రియోఽయుగ్మాసు రాత్రిషు । మూలశ్లోక సం.**28**
తస్మాద్యుగ్మాసు పుత్రార్థీ సంవిశేదార్తవే స్త్రియమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**48**

టీక:- యుగ్మాసు పుత్రాః జాయన్తే = యుగ్మ అంటే సరిసంఖ్య గల 6,8,10,12,14,16 రాత్రులలో సమాగమం జరిగినట్లయితే, పుత్రులు జన్మిస్తారు, **అయుగ్మాసు రాత్రిషు స్త్రియః** = బేసి సంఖ్య గల-5,7,9,11,15, రాత్రులందు సమాగమం జరిగినట్లయితే, పుత్రికలు జన్మిస్తారు. **తస్మాత్** = అందువల్ల, **పుత్రార్థీ** = పుత్రుడు కావాలనుకొనే పురుషుడు, **ఆర్తవే యుగ్మాను స్త్రియమ్ సంవిశేత్** = ఋతుకాలంలో సరిసంఖ్యగల స్త్రీతో సమాగమం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- పైన చెప్పిన పది రాత్రులలో సుపుత్రుడు కావాలనుకునేవాడు ఆరు-ఎనిమిది వంటి సరిసంఖ్య గల రాత్రులలో; పుత్రికా సంతానం కావాలనుకునే వాడు బేసిరాత్రులలో భార్యతో భర్త సంగమించాలి.॥48॥

పుత్రులు కావాలనుకొనేవారికి ఆరు, ఎనిమిది, పది, పన్నెండు, పద్నాలుగు, పదహారు, ఈ ఆరు రాత్రులు ఉత్తమమని తెలిసికొందురు గాక! కానీ ఇందులోను ఉత్తరోత్తర రాత్రులు శ్రేష్ఠములు. అంటే ఆరు కంటే ఎనిమిది, దాని కంటె పది, పది కంటె పన్నెండు అంత కంటే పద్నాలుగు, అంతకంటే పదహారు శ్రేష్ఠములు. కన్యలు కావాలనుకొనే వారికి ఐదు, ఏడు, తొమ్మిది, పదిహేను, ఈ నాలుగు రాత్రులు ఉత్తమం, దీన్ని బట్టి పుత్రార్థి కోసం సరి సంఖ్య గల

రాత్రులలో స్త్రీ సమాగమం చేయాలి. ఇక్కడ రాత్రులని చెప్పడం ఎందుకంటే పగలు ఋతుదానం స్త్రీ సంగమం నిషేధించబడింది కాబట్టి.

పుత్ర-పుత్రికా జన్మలకు కారణం **ఇది మనుకృతం-ప్రామాణికం**

పుమాన్పుంసోఽధికే శుక్రే స్త్రీ భవత్యధికే స్త్రియాః । మూలశ్లోక సం.**29**
సమేఽపుమాన్ పుంస్త్రియౌ వా క్షీణేఽల్పేచ విపర్యయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**49**

టీక:- పుంస అధికే శుక్రే పుమాన్ = పురుషుడి శుక్రం, వీర్యం అధికమైనప్పుడు పుత్రుడు, స్త్రీ శోణితం అధికమైనప్పుడు కన్య, **సమే+అపుమాన్ =** సమానంగా ఉన్నప్పుడు, నపుంసక పురుషుడుగాని, లేదా వంధ్య గొడ్రాలు గాని జన్మిస్తారు. **క్షీణే చ అల్పేవా విపర్యయః =** క్షీణమైనా, అల్పవీర్యమైనా గర్భమే కలగదు. కలిగినా నిలవదు, **వా పుంస్త్రియౌ =** లేదా పుత్రుడు, పుత్రిక ఇద్దరూ జన్మిస్తారు.

ఋషి దయానందభాష్యం:-పురుషుడి శుక్రం-వీర్యం అధికమైనప్పుడు పురుషుడు, స్త్రీశోణితం అధికమైనప్పుడు కన్య జన్మిస్తారు. పురుషుడి శుక్రం స్త్రీ శోణితం సమమైనప్పుడు నపుంసకుడుగాని లేదా వంధ్య-గొడ్రాలుగాని జన్మిస్తారు. శుక్రశోణితములు క్షీణించినా, అల్పవీర్యమైనా గర్భమే కలుగదు. కలిగినా నిలవదు. లేదా పుత్రుడు, పుత్రిక ఇద్దరూ జన్మిస్తారు.॥49॥

1. 'అధికశబ్ద'వివరణ:

వీర్యశోణితములకు మాత్రాధిక్యత కాదు. సామర్థ్యాధిక్యమని భావన. పురుషుడి వీర్యం అధికసామర్థ్యం కలిగినట్లయితే పుత్రోత్పత్తి, పురుషుడితో పోల్చినప్పుడు స్త్రీ బీజం(శోణితం) అధికసామర్థ్యం కలిగినట్లయితే పుత్రిక, సమానమైన సామర్థ్యమున్నట్లయితే పుత్ర-పుత్రికల జంట, లేదా నపుంసక సంతానం, లేదా క్షీణసామర్థ్యం, లేదా అల్ప సామర్థ్యమున్నట్లయితే గర్భమే కలగదు. కలిగినా గర్భపాతం కలుగుతుంది.

2. ఆధునిక-చికిత్సా-విజ్ఞానానికి వ్యతిరేకం కాదు:

ఆధునిక వైజ్ఞానికుల వాదన పురుషుడి వీర్యంలో రెండు రకాలైన కణాలు ఉంటాయి. X, Y. స్త్రీ క్రోమోజోమ్ శోణితంలో కేవలం X మాత్రం ఉంటాయి. పురుషుడి y కణం x కణంతో కలిసినప్పుడు పుత్రుడు జన్మిస్తాడు. x కణం x కణంతో కలిసినప్పుడు పుత్రిక జన్మిస్తుంది. సంభోగానంతరం ఈ కణాలు గర్భనాళిక గుండా పరిగెత్తి స్త్రీ అండంలో ప్రవేశిస్తాయి. ముందు ప్రవేశించిన శుక్రాణువులే సంతానంగా రూపొందుతాయి.

ఇక్కడ కూడా మూలవిషయం ఒక్కటే. ఏ శుక్రాణువులు ఎంత బలంగా ఉంటయో అవి ముందుగా అండంలో ప్రవేశిస్తాయి. పురుష శుక్రాణువులు ప్రబలంగా ఉంటే అవే పరిగెత్తి ముందుగా అండంలో ప్రవేశిస్తాయి. స్త్రీకి జన్మనిచ్చే కణాలు ప్రబలంగా ఉంటే అవే ముందుగా అండంలో ప్రవేశిస్తాయి. ఇక్కడ కూడా సామర్థ్యం యొక్క ఆధిక్యతే పుత్ర-పుత్రికల ఉత్పత్తికి మూలాధారం. అందువల్లనే పుత్రప్రాప్తిని కోరేవారికి పురుష-శుక్ర-సామర్థ్య వర్ధకమైన ఔషధాలకు ఆయుర్వేద చికిత్సలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

సంయమనం గల గృహస్థులు కూడా బ్రహ్మచారే **ఇది మనుకృతం-ప్రామాణికం**

నిన్ద్యాస్వష్టాసు చాన్యాసు స్త్రియో రాత్రిషు వర్జయన్ । మూలశ్లోక సం.**30**
బ్రహ్మచార్యేవ భవతి యత్ర తత్రాశ్రమే వసన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**50**

టీక:- నిన్ద్యాసు = నిందితమైన ఆరు (3.27) రాత్రులలో, మరియు **అన్యాసు అష్టాసు రాత్రిషు** = వీటికి భిన్నమై మిగిలిన పది రాత్రులలో నుండి ఏవైనా ఎనిమిది రాత్రులలో, **స్త్రియః వర్జయన్** = స్త్రీలను వదిలి, అంటే వారితో సమాగమం చేయకుండా, **యత్ర తత్ర + ఆశ్రమే వసన్** = గృహస్థాశ్రమంలో ఉంటూ కూడా అతడు, **బ్రహ్మచారీ + ఏవ భవతి** = బ్రహ్మచారే అవుతాడు.

ఋషి దయానందభాష్యం:- ఇంతకు ముందు చెప్పిన 4 నిషిద్ధదినాలు, అలాగే 11వ రాత్రి, 13వ రాత్రి, మరియు అమావాస్య, పూర్ణిమగల రాత్రులను మినహాయించి పూర్వనిందితమైన రాత్రులలో భార్యతో సంగమించనివాడు గృహస్థాశ్రమంలో ఉన్నా బ్రహ్మచారిగానే పరిగణించబడతాడు. (సం.వి.గృ.ప్ర) ॥50॥

వివరణ

గృహస్థ బ్రహ్మచారి ఎవరు?

నిందితమైన ఆరు రాత్రులు మిగిలిన ఏవైనా ఎనిమిది రాత్రులు అంటే పదునాలుగు (14) రాత్రులు విడిచిపెట్టి, పదహారు రాత్రులలో కేవలం మిగిలిన ఏవైనా శ్రేష్ఠమైన రెండు (2) రాత్రులు సమాగమం చేసేవాడు గృహస్థ బ్రహ్మచారి అనబడతాడు. కారణం ఇలాంటి వ్యక్తి యొక్క ఆచరణలో సంయమనం, జితేంద్రియత్వానికి ప్రాధాన్యం ఉంటుంది.

వరుడి నుండి కన్యాశుల్కం తీసుకోవడం నిషేధం **ఇది మనుకృతం-ప్రామాణికం**

న కన్యాయాః పితా విద్వాన్ గృహ్ణీయాచ్ఛుల్కమణ్వపి । మూలశ్లోక సం. **31**
గృహ్ణఞ్ఛుల్కం హి లోభేన స్యాన్నరోఽపత్యవిక్రయీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **51**

టీక:- విద్వాన్ కన్యాయాః పితా = బుద్ధిమంతుడైన కన్య తండ్రి కన్యా వివాహంలో, **అణు+అపి శుల్కం నగృహ్ణీయాత్** = కొంచెం కూడా శుల్కం (ధనం లేదా మూల్యం) తీసికోరాదు. **లోభే న శుల్కం గృహ్ణం హి** = లోభియై శుల్కం తీసుకొన్నట్లయితే, **నరః** = ఆ మనుషుడు, **అపత్యవిక్రయీ స్యాత్** = సంతానాన్ని అమ్ముకొన్నవాడుగా పిలువబడుతాడు.

తాత్పర్యం:- వధువు తండ్రి వరుడి నుంచి కొంచెమైనా ఓలి (కన్యాశుల్కం) పుచ్చుకోకుండా ఉండటమే వివేకమనిపించుకుంటుంది. ధనలోభంచేత అతడా విధంగా చేసినా, ఆ తండ్రి తన బిడ్డను అమ్ముకొన్నట్లే అవుతుంది. (దీన్ని బట్టి కన్యాశుల్కాన్ని మనువు ఏనాడో నిషేధించాడని స్పష్టంగా అనవచ్చు!). ॥51॥

ఇది మనుకృతం-ప్రామాణికం

స్త్రీధనాని తు యే మోహాదుపజీవంతి బాంధవాః । మూలశ్లోక సం. **32**
నారీ యానాని వస్త్రం వా తే పాపా యాన్త్యధోగతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52**

టీక:- యే బాంధవాః = వరుడిబాంధవులు, తండ్రి, సోదరుడు మొదలైనవారు, **మోహాత్** = తృష్ణకు గానీ లోభమునకు గాని వశీభూతులై, **స్త్రీ ధనాని** = కన్యాధనాన్ని కన్యకు తల్లిదండ్రులు ఇచ్చింది, **నారీ యానాని వా వస్త్రం** = కన్యకు సంబంధించి యానాదులను, వస్త్రాదులను తీసుకొని, **ఉపజీవన్తి** = వాడుకొంటారో, **తే పాపాః అధోగతిం యాన్తి** = అలాంటి పాపులు నీచగతులను పొందుతారు.

తాత్పర్యం:- కన్యకు వివాహసమయంలో తల్లిదండ్రులు ఇచ్చిన కట్నకానుకలు, ధనకనక వస్తువాహన రూపేణ ఏవి ఉన్నప్పటికీ వాటిని కన్య తరపువారు (చుట్టములు), తల్లిదండ్రులే అయినా గానీ తాము ఉపయోగించుకోడానికి చూస్తే వారికి అధోగతి తప్పదు. ॥52॥

వివరణ: స్త్రీ ధన వివరణ:

స్త్రీ ధన వివరణ గురించి 3.52వ శ్లోకంలో చర్చించిన విషయాన్ని 9.194-197 శ్లోకాలలో మనువు వివరించాడు. ముఖ్యంగా ఈ స్త్రీ ధనం ఆరు విధాలుగా ఉంటుంది. 1) అధ్యగ్ని= వివాహ సంస్కార సమయంలో తల్లిదండ్రులిచ్చిన ధనం. 2) 'అధి= ఆవాహనికమ్' పతి గృహానికి వచ్చేటప్పుడు పితృగృహం నుండి లభించిన ధనం, 3) ప్రీతి కర్మలో వచ్చింది. అంటే సంతోష సమయంలో పతి ద్వారా లభించిన ధనం, 4) సోదరుల వల్ల కన్యకు లభించిన ధనం, 5) తండ్రి ద్వారా వచ్చిన ధనం, 6) తల్లి ద్వారా వచ్చిన ధనం. విస్తృత వివరణ కొరకు 9వ అధ్యాయాన్ని చూడండి.

ఆర్ష వివాహంలో కూడా గోమిథునం తీసుకోవడం నిషేధం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆర్షే గోమిథునం శుల్కం కేచిదాహుర్మృషైవ తత్ । మూలశ్లోక సం.**33**
అల్పోఽప్యేవం మహాన్ వాఽపి విక్రయస్తావదేవ సః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**53**

టీక:- **కేచిత్** = కొందరు మానవులు, **ఆర్షే** = ఆర్ష వివాహంలో, **గోమిథునం శుల్కం** = రెండు ఎద్దులు, లేదా ఆవుల జోడును శుల్క రూపంలో తీసుకోవాలని, **ఆహుః** = చెప్పుతున్నారు, **తత్** = అది, **మృషా + ఏవ** = చాలా పొరపాటు (మిథ్యయే) అబద్ధం మాత్రమే, **అపి+ఏవం** = కారణమేమంటే, ఈ ప్రకారంగా, **అల్పః + అపి వా మహాన్** = కొంచెమైనా, అధికమైనా, ధనం ఇచ్చిపుచ్చుకోవడం, **సః తావత్** = అది నిశ్చయంగా, **విక్రయ ఏవ** = అమ్ముకోవడమే అవుతుంది.

ఋషి దయానందభాష్యం:-కొంచెం కూడా ఇచ్చి పుచ్చుకోవడం లేకుండా, ప్రసన్నంగా పాణిగ్రహణం చేయడం **'ఆర్ష వివాహం'**. (సం.వి.) వివాహ ప్రకరణంలో టిప్పణి.). ॥53॥

ఆర్ష వివాహంలో రెండు ఎద్దులు, లేదా ఆవుల జోడును శుల్కరూపంలో గోమిథునాన్ని పుచ్చుకోవచ్చునని, కొందరిమతం. కానీ అది శాస్త్రం అనిపించుకోదు. ధనం కొద్దిగా పుచ్చుకున్నా, అది విక్రయసమానమే అవుతుందని భావం (ఈ శ్లోకం ప్రక్షిప్తమని పరిశీలకుల భావన).

ఇది మనుకృతం-ప్రామాణికం

యాసాం నాదదతే శుల్కం జ్ఞాతయో న స విక్రయః । మూలశ్లోక సం.**34**
అర్హణం తత్కుమారీణామానృశంస్యం చ కేవలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**54**

టీక:- **జ్ఞాతయః** = కన్య యొక్క తండ్రి లేదా బంధువులు, **యాసాం శుల్కం న+ఆదదతే** = ఏ కన్యల కోసం వరుడిపక్షం వారి నుండి శుల్కం తీసుకొని, అథవా వరుడిపక్షం వారి నుండి వివాహం చేసినందుకు బదులుగా ఏ మాత్రం ధనం తీసికోకుండా, వివాహం చేస్తారో, **సః విక్రయః న** = ఇలా చేసిన వివాహం కన్యను అమ్ముకొన్నట్లు కాదు, **తత్ కుమారీనాం అర్హణం** = ఇలాంటి వివాహం వాస్తవంగా కన్యలకు పూజాసత్కారం చేసినట్లే, **చ** = మరియు, **కేవలమ్ ఆనృశంస్యం** = వాస్తవంగా కన్యల విషయంలో దయాగుణాన్ని, స్నేహాలను ప్రదర్శించడమే అవుతుంది. ఏమీ తీసుకోకుండా వరుడికి కన్యనివ్వడం వరుడిని ఆదరించినట్లే.

తాత్పర్యం:- వివాహవేళ ఏ స్త్రీకి అయినా 'ఓలి'గా బంధువులుగానీ- తల్లిదండ్రులు గానీ ఏదీ తీసుకోరాదు. కన్యకు వచ్చే కట్నకానుకలు కూడ తీసుకోరాదు. ఇలాంటి వివాహం వాస్తవంగా కన్యకు పూజాసత్కారం చేసినట్లే. **మరియు కన్యల విషయంలో దయాగుణాన్ని స్నేహాన్నీ** ప్రదర్శించడమే అవుతుంది.॥54॥

వివరణ

ఆర్ష వివాహంలో శుల్కం (కట్నం) తీసుకోవడం మనుస్మృతికి విరుద్ధం.

3.29వ శ్లోకంలో విధించిన ఆర్ష వివాహ వ్యవస్థకు విరుద్ధంగా 52-54 శ్లోకాలలో చెప్పబడింది. ఈ రెండింటిలో ఏది మౌలికం, ఏదిం ప్రక్షిప్తం? హితకరమైన ధర్మ విధానాన్ని విధించడమే మనువు ఉద్దేశం. హితకరమైనది కానిది ధర్మం కాదు. అందువల్ల అధర్మమని ప్రకటించి, దాన్ని నిషేధించారు. ఈ ప్రసంగంలో మనుస్మృతి కంటే భిన్నమైన శైలి, పదావళి కనిపిస్తూన్నది. అందువల్ల ఈ సందేహానికి సమాధానమివ్వబడుతుంది.

3.27 నుండి 34 వరకు ఉన్న శ్లోకాల్లో ఎనిమిది వివాహాల గురించి చెప్పడం జరిగింది. ఇవి స్వయంగా మనువు చేసిన విధానానికి సంబంధించినవి కావు. ఆనాటి పరిస్థితులలో ప్రచలితంగా ఉన్నవాటిని చెప్పాడు. 3.20వ శ్లోకం **"ప్రేత్య చేహ హితాహితాన్"** అని ప్రయోగించాడు. అహితకరమైనదేది కూడా ధర్మం కాదు. అయినా కూడా ఇక్కడ చెప్పడం వల్ల ఇది మనుమహర్షి విధానం కాదని స్పష్టమవుతుంది. ఆనాటి ప్రచలిత వ్యవస్థ మాత్రమే. అంతిమ నాలుగు వివాహాల నామములను బట్టి ఇవి ధర్మ విధానాలు కావని స్పష్టమవుతుంది. అవే ఆసుర, గాంధర్వ, రాక్షస, అధమ పైశాచములు. వీటి విధులను మనుస్మృతి మాన్యతలను బట్టి నిందనీయములే. 3-41వ శ్లోకం కూడా మనువు ఈ వివాహాలను నిందించాడు. ఇవన్నీ అనార్యుల పరంపరకు సంబంధించినవిగా భావించి నిషేధ రూపంగా పేర్కొన్నాడు. అంతేగాదు,3.32, 33,34 శ్లోకాలలో విధించిన కర్మలకు 8.352-351 శ్లోకాల్లో కఠోర దండన విధానాన్ని నిర్దేశించాడు. ఈ కర్మలన్ని కూడా బలాత్కారాలు, వ్యభిచారాలని భావించాడు. 8.345, 346, 352, 357 మరియు 3.31లో వర్ణిత ఆసుర వివాహాన్ని, 8.51-54శ్లోకాల్లో ఖండించాడు. అది వివాహం కాదు. అమ్ముకోవడమే అన్నాడు.

అయితే మనుమహర్షి మాన్యతలేవి? వారి ధర్మ విధానాలు ఏవి అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఇందుకు జవాబు స్పష్టంగా ఉంది. 3.20వ శ్లోకం ప్రారంభంలో వివరించిన నాలుగు వివాహాలు ఈ జన్మకు, పరజన్మకు హితకరములని తెలియజేయడం వల్ల, ఆ నాలుగు వివాహాలే మనుసమ్మతములని స్పష్టమవుతుంది. అవే బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్యములు. దాయభాగ ప్రకరణంలోనూ, మనువు తన మాన్యతను స్పష్టపరచాడు. 'ఆసుర' మొదటి నాలుగు వివాహాలలో నిస్సంతాన స్త్రీ యొక్క ధనమునకు అధికారం ఆమె మరణానంతరం ఆమె పతికి లభించదు. కారణం ఆ వివాహం మనువు ప్రకారం ధర్మం కాదు. వైధానికమున్నూ కాదు. (Lawful) (9.197) మొదట నాలుగు వివాహాలలో సంతానంలేని స్త్రీ మరణించినప్పుడు ఆ ధనమునకు అధికారం భర్తకు ఉంటుంది. కారణం ఈ వివాహాలన్ని కూడా ధర్మానుకూలములు (9.196). ఈ ప్రకారంగా ఈ శ్లోకాలకు, పూర్వశ్లోకాలకు విరోధమున్నా కూడా ప్రదర్శించిన మాన్యతలను బట్టి రెండు శ్లోకాలు కూడా మౌలికములే.

స్త్రీలను గౌరవించే పద్ధతి-దాని ఫలితం **ఇది మనుకృతం-ప్రామాణికం**

పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా । మూలశ్లోక సం.**35**
పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**55**

టీక:-పితృభిః భ్రాతృభిః పతిభిః తథా దేవరైః = తండ్రులు, సోదరులు, భర్తలు,మరదులు వీరందరి వల్ల, **ఏతాః పూజ్యాః చ భూషయితవ్యాః** = స్త్రీలు, కన్యలు, సోదరీమణులు, భ్రాతృ, వధువు మొ॥ పూజింపదగినవారు, అలంకారాదులు, వస్త్రభూషణాదుల ద్వారా గౌరవింపదగినవారు. యథాయోగ్య మధుర భాషణం, భోజనం, వస్త్రాభూషణాదులిచ్చి సంతోషపరచడమే పూజించడం, **బహుకల్యాణమ్+ఈప్సుభిః** = ఎవరికి శుభం కావాలని కోరతారో, వారు స్త్రీలను ఆదరించాలి.ఎప్పుడూ ఏ మాత్రం కష్టం కలిగించరాదు.

ఋషి దయానందభాష్యం:- తండ్రులు, సోదరులు, భర్తలు, మరదులు వీరందరూ స్త్రీలు, కన్యలు, సోదరీమణులు, భ్రాతృ వధువు మొ॥ వారికి వస్త్రాభూషణాదులిచ్చి సంతోషపరచడమే పూజించడం. ఎవరికి శుభం కావాలనికోరతారో, వారు స్త్రీలను ఆదరిస్తారు. ఎప్పుడూ ఏ మాత్రం కష్టం కలిగించరాదు. (సం.వి.గృ.ప్ర.)॥55॥

స్త్రీలను గౌరవించడం వల్ల గొప్ప లాభం

ఇది మనుకృతం-ప్రామాణికం

యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః । మూలశ్లోక సం.**36**
యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఽఫలాః క్రియాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**56**

టీక:-యత్ర = ఏ కులం (వంశం, కుటుంబం) లో, **నార్యస్తు పూజ్యన్తే** = నారీజనమునకు పూజ అంటే సత్కారం. ఆదరణ జరుగుతుందో, **తత్ర** = ఆ కులంలో వంశంలో లేదా కుటుంబంలో, **దేవతాః** = దివ్య గుణాలు, దివ్యభోగములు గల ఉత్తమసంతానం, **రమన్తే** = ఆనందిస్తూ ఉంటారో, **యత్ర** = ఏ కులంలో, వంశంలో, **ఏతాస్తు న పూజ్యన్తే** = స్త్రీలకు ఆదరణ, ఆప్యాయతలు లేవో, **తత్ర సర్వాః అఫలాః క్రియాః** = అక్కడ వారి క్రియలన్ని కూడా నిష్ఫలములవుతాయి (స.ప్ర.4వ సము).

ఋషి దయానందభాష్యం:- ఏ గృహంలో స్త్రీలకు ఆదరణ, సత్కారాలుంటాయో ఆ గృహంలో విద్వాంసులైన పురుషులుంటారు. దివ్యగుణ సంపన్నులే దేవసంజ్ఞను పొంది ఆనందంతో క్రీడిస్తారు. ఏ గృహంలో స్త్రీలను ఆదరించరో ఆ గృహంలో క్రియలన్నీ కూడా నిష్ఫలాలవుతాయి. (స.ప్ర.4వ సము).॥56॥

వివరణ: 56వ శ్లోకానికి సరియైన అర్థం:-

1. ఈ శ్లోకానికి టీకాకారులు రాసిన అర్థం కపోల కల్పితం అసంగతం, మను సమ్మతం కాదు. "కొంతమంది దేవతలను కల్పన చేసుకొని వారు ప్రసన్నులవుతారని రాస్తున్నారు. కానీ ఈ అర్థానికి రెండో పంక్తి అర్థానికి సంబంధం కుదరలేదు. మొదటి పంక్తిలో స్త్రీలను ఆదరించినందువల్ల దేవతలు ప్రసన్నులవుతారని, రెండో పంక్తిలో స్త్రీలకు జరిగే అనాదరణ వల్ల వారు అప్రసన్నులవుతారనే విషయం చెప్పాలి గదా? దానికి బదులుగా శ్లోకంలో వారి క్రియలన్ని కూడా నిష్ఫలమవుతాయని చెప్పడం జరిగింది. ఈ విధంగా వారి వ్యాఖ్యలో రెండు పంక్తుల మధ్య సంగతి, సందర్భం కుదరలేదు.

2. దేవతల కల్పన మనువు యొక్క మాన్యతకు విరుద్ధం. దేవశబ్దాన్ని గురించి 3.82వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

ఇక్కడ 'పూజ' శబ్దానికి సత్కారం, సన్మానమని అర్థం. యథార్థంగా ఇక్కడ 'దేవత' శబ్దానికి దివ్యగుణాలు, "దివ్యసంతానం లేదా దివ్యభోగాలు" అని అర్థం. ఇందుకు ప్రమాణం. (2.51(2.176)) చూడగలరు. ఈ అర్థమే పూర్వాపర ప్రసంగంతో స్పష్టమవుతుంది. ఎక్కడ స్త్రీలకు ఆదరసత్కారా లుంటాయో అక్కడ నారీమణులు ప్రసన్నంగా ఉంటారు. వారు సంతోషంగా ఉన్నప్పుడు గృహవాతావరణమంతా కూడా ప్రసన్నంగాను, సుఖశాంతులతో కళకళలాడుతుంది. గృహంలో సుఖశాంతులు స్త్రీ మీదనే ఆధారపడి ఉంటాయి. (3.55,60,62, 9.28). ఆమే గృహానికి అధిష్ఠాత్రి ముఖ్యురాలు (9.27,28). మాతృరూపంలో ఆమె నిర్మాత్రి (9.28,29). ఈ ప్రకారంగా గృహానికి సుఖశాంతులు కలిగించడం ద్వారా, గృహంలో ఉత్తమభోగాలు, ఉత్తమ సంతానం, ఉత్తమమైన చదువులు-సంధ్యలు, ఐశ్వర్యం, సుఖం, సఫలత మొ॥ దివ్య గుణాలు చిగురిస్తాయి. ఇందుకు భిన్నంగా స్త్రీలకు అదరణ లేదో, ఆ పరివారంలో అశాంతే ఎక్కువ అవుతుంది. దాని పరిణామంగా ఏ పనులూ సఫలం కావు. అన్నీ నిష్ఫలమవుతాయి. కుటుంబంలో ఉన్నతి-సుఖశాంతులు ఉండవు. ఈ భావానికి మనుమహర్షి చేసిన విస్తృత వ్యాఖ్య ఈ కింది శ్లోకాలలో చూడగలరు (3.57, 58, 59, 60). ఈ ప్రకారంగా ఈ భాష్యం యొక్క అర్థం, సంగతం, మనుసమ్మతం మరియు యుక్తియుక్తం కూడా.

స్త్రీలు శోకగ్రస్తులవడం వల్ల కుటుంబాలకు వినాశప్రాప్తి-

ఇది మనుకృతం-ప్రామాణికం

శోచన్తి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులమ్ । మూలశ్లోక సం.**37**
న శోచన్తి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**57**

టీక:- **యత్ర** = ఏ కులంలో (కుటుంబం లేదా వంశం), (స్త్రియః) స్త్రీలు, **శోచన్తి** = తమ తమ పురుషుల యొక్క వేశ్యాగమనం, అత్యాచారం లేదా వ్యభిచారాది దోషాల వల్ల శోకాతురులై దుఃఖిస్తారో, **తత్కులమ్, అశు వినశ్యతి** = ఆ కులం లేదా కుటుంబం శీఘ్రంగా నష్టమైపోతుంది. **యత్ర ఏతా న శోచన్తి** = ఏ కులంలో, స్త్రీ జనం పురుషుల యొక్క ఉత్తమ ఆచరణల వల్ల ప్రసన్నులుగా ఉంటారో, **తత్+హి సర్వదా వర్ధతే** = ఆ కులం సర్వదా అభివృద్ధి చెందుతూ ఉంటుంది.

ఋషి దయానందభాష్యం:- ఏ కులంలో (తమ బంధువర్గం వారిచేత) స్త్రీలు పూజింపబడతారో, ఆ కులం ధనధాన్యాలలో అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఏ కులంలో స్త్రీలు తమ పురుషుల అత్యాచారం లేదా వ్యభిచారాది దోషాలవల్ల దుఃఖిస్తారో ఆ కులం లేదా కుటుంబం శీఘ్రంగా నష్టపడిపోతుంది.

ఏ గృహంలో గానీ కులంలో గానీ స్త్రీలు ఏడుస్తూ దుఃఖిస్తారో ఆ కులం శీఘ్రంగా నష్ట-భ్రష్టమై పోతుంది. మరియు ఏ గృహంలో గాని, కులంలో గాని స్త్రీలు ఆనందోత్సాహాలతో ప్రసన్నులై ఉంటారో, ఆ గృహం లేదా కులం సర్వదా అభివృద్ధి పథంలో ముందడగువేస్తూ పోతుంది (స.ప్ర.4వ సము). ॥57॥

ఇది మనుకృతం-ప్రామాణికం

జామయో యాని గేహాని శపన్త్యప్రతిపూజితాః । మూలశ్లోక సం.**38**
తాని కృత్యాహతానీవ వినశ్యన్తి సమన్తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**58**

టీక:- **యాని గేహాని** = ఏ కులంలో గాని లేదా గృహాలలో గాని, **అప్రతి పూజితాః జామయః** = గౌరవింపబడని, సత్కరింపబడని స్త్రీలు, **శపన్తి** = ఏ గృహస్థులకు శాపమిస్తారో, ఎవరిని శపిస్తారో, **తాని** = ఆ కులాలు, ఆ గృహస్థులు, **కృత్యాహతాని+ఇవ** = విషమిచ్చి అనేక మందిని ఒక్కసారే నాశనం చేస్తారో, అలాగే, **సమన్తతః వినశ్యన్తి** = అన్నివైపుల నుండి నాశనమైపోతారు. (యజు.35-11.)

ఋషి దయానందభాష్యం:- భర్త, తల్లి-తండ్రి, బంధువులు మరియు మరిది మొ॥ వారి ద్వారా పీడింపబడి దుఃఖితులైన వివాహిత స్త్రీలు ఏ గృహస్థులను శపిస్తారో కుటుంబ సభ్యులందరికీ విషమిచ్చి ఒక్కసారి చంపినట్లుగా, పతి మొ॥ వారందరూ ఒక్కసారిగా నాశనమైపోతారు. ('కృత్యా' శబ్దానికి దుష్కృత్యం అని అర్థం) (సం.వి.గృ.ప్ర)॥58॥

స్త్రీలకు సదా సత్కారం జరగాలి

ఇది మనుకృతం-ప్రామాణికం

తస్మాదేతాస్సదా పూజ్యా భూషణాచ్ఛాదనాశనైః । మూలశ్లోక సం.**39**
భూతికామైర్నరైర్నిత్యం సత్కా రేషూత్స వేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**59**

టీక:- **తస్మాత్** = ఈ కారణం వల్ల, **భూతి కామైః నరైః** = ఐశ్వర్యాన్ని కోరేవారు, **ఏతాః** = ఈ స్త్రీలను, **సత్కారేషు చ ఉత్సవేషు** = సత్కరించవలసిన సమయాలలో, ఉత్సవాలలో, **భూషణ+ఆచ్ఛాదన+అశనైః** = భూషణాలు, వస్త్రాలు, భోజనాదుల ద్వారా, **సదా పూజ్యాః** = సదా పూజనీయులు. అంటే సత్కారాల ద్వారా సదా ప్రసన్నంగా ఉంచాలి.

ఋషి దయానందభాష్యం:-అందువల్ల ఐశ్వర్యాన్ని కోరే ప్రతివారు తమ తమ స్త్రీలను సత్కరిస్తూ, ఉత్సవాదులలో, వస్త్రాభరణాదులిచ్చి ప్రీతి భోజనాదులచే ప్రతినిత్యం ప్రసన్నంగా ఉంచాలి (స.ప్ర.4వ.స). ॥59॥

పతీపత్నుల పరస్పర సంతోషమే కుటుంబ కల్యాణం

ఇది మనుకృతం-ప్రామాణికం

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ । మూలశ్లోక సం. **40**
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **60**

టీక:- ఓ గృహస్థులారా ! **యస్మిన్ కులే** = ఏ కులంలో, **భార్యయా భర్తా సంతుష్టః తథైవ భర్త్రా భార్యా నిత్యం** = భార్య ద్వారా భర్త ప్రసన్నంగా ఉంటాడో, భర్త ద్వారా భార్య ప్రసన్నురాలుగా ఉంటుందో, **తత్ర వై** = ఆ కులంలో, **ధ్రువమ్ కల్యాణం** = కచ్చితంగా శుభం కలుగుతుంది. ఏ భార్యాభర్తలిద్దరు పరస్పరం, అప్రసన్నంగా ఉంటారో, ఆ కులంలో, కుటుంబంలో నిత్యం కలహం నివాసం చేస్తుంది. ॥60॥

ఋషి దయానందభాష్యం:- భర్తకూడ తన భార్యను అన్నివిధాలా మన్నించాలి. అలాగే ఆ భార్యసైతం భర్తకు చేదోడు వాదోడుగా ఉండాలి. వీరిరువురూ అన్యోన్యంగా సంప్రీతులై ఉండేచోట సర్వసౌభాగ్యాలు, ఐశ్వర్యాలు స్థిరనివాసం చేస్తాయి. ఏ భార్యాభర్తలిద్దరూ పరస్పరం, అప్రసన్నంగా ఉంటారో ఆ కులంలో, కుటుంబంలో నిత్యం కలహం నివాసం చేస్తుంది. పరస్పరానురాగాన్ని- మైత్రీభావాన్నీ దంపతులు పాటించి తీరాలని మనువు శాసనం. (స.ప్ర. 4వ.స.)

పతి-పత్నుల మధ్య కలిగే పారస్పరిక అప్రసన్నత వల్ల సంతానం కలగకపోవడం.

ఇది మనుకృతం-ప్రామాణికం

యది హి స్త్రీ న రోచేత పుమాంసం న ప్రమోదయేత్ । మూలశ్లోక సం. **41**
అప్రమోదాత్పునః పుంసః ప్రజనం న ప్రవర్తతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **61**

టీక:- **యది స్త్రీ న రోచేత** = స్త్రీ పురుషుణ్ణి ఇష్టపడక, **పుమాంసం న ప్రమోదయేత్** = పురుషుణ్ణి సంతోషపెట్టనట్లయితే, **అప్రమోదాత్ పునఃపుంసః** = అప్రసన్నత వల్ల, పురుషుడి శరీరంలో, **ప్రజనం న ప్రవర్తతే** = కామోత్పత్తి కలుగనందువల్ల సంతానం కలుగదు. ఒకవేళ సంతానం కలిగినా ఆ సంతానం దుష్టసంతనామవుతుంది.

ఋషి దయానందభాష్యం:- ఏ స్త్రీ పురుషుణ్ణి ఇష్టపడక, సంతోషపెట్టనట్లయితే అలాంటి స్త్రీకి భర్తపై అనురాగం జనించదు. ఆ వనిత ఆ పురుషుణ్ణి రమింపజేయదు. రతిసుఖానికి దూరమైనందువల్ల ఆ దంపతులకు సంతానమూ జనించదు. ఒకవేళ సంతానం కలిగినా ఆ సంతానం దుష్టసంతానమవుతుంది. పతిని ప్రేమించని స్త్రీ వల్ల, పతి ప్రసన్నుడు కాజాలడు. అప్రసన్నుడైన పతికి కామోద్రేకం కలుగదు. (స.ప్ర.గృ.ప్ర). ॥61॥

స్త్రీ ప్రసన్నురాలైతే కుటుంబమంతా ఆనందం

ఇది మనుకృతం-ప్రామాణికం

స్త్రియాం తు రోచమానాయాం సర్వం తద్రోచతే కులమ్ । మూలశ్లోక సం. **42**
తస్యాం త్వరోచమానాయాం సర్వమేవ న రోచతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **62**

టీక:- **స్త్రియాంతు రోచమానాయాం** = పురుషుడు స్త్రీని ప్రసన్నురాలిగా చేయనప్పుడు ఆ స్త్రీ అప్రసన్నురాలుగా ఉంటుంది. ఆమె సంతోషంగా లేనప్పుడు, **సర్వం +ఏవ న రోచతే** = కుటుంబమంతా దుఃఖంగా ఉంటుంది. **తు** = మరియు, **తస్యాం రోచమానాయాం** = పురుషుడి ద్వారా ప్రసన్నురాలుగా ఉన్నప్పుడు, **తత్ సర్వం కులమ్ రోచతే** = ఆ కుటుంబమంతా సంతోషమయంగా ఉంటుంది.

ఋషి దయానందభాష్యం:- స్త్రీ ప్రసన్నంగా ఉన్నప్పుడే కుటుంబమంతా ప్రసన్నంగా ఉంటుంది. ఆమెకు సంతోషం లేనప్పుడు అందరూ అప్రసన్నులుగా ఉంటారు. అందరికీ దుఃఖానుభూతి కలుగుతుంది (స.ప్ర. 4వ స.., సం.వి.గృ.ప్ర.).

63 నుండి 66వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *కువివాహైః క్రియాలోపై ర్వేదానధ్యయనేన చ ।*
కులాన్యకులతాం యాంతి బ్రాహ్మణాతిక్రమేణ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***63***

తాత్పర్యం:- తమ-తమ కులాల్లోని కాంతలను గాక, ఆసురము మొదలైన నిషిద్ధ వివాహాల చేత, జాతకర్మాది సంస్కారాలకు ప్రాధాన్యం ఇవ్వక పోవడం వల్ల వేదాధ్యయనాలు లేకపోవడం వల్ల, బ్రాహ్మణాదరణ లేమిచేత సత్కులములన్నీ హీనస్థితిని పొందగల ప్రమాదమున్నది. ॥63॥

* *శిల్పేన వ్యవహారేణ శూద్రాపత్యైశ్చ కేవలైః ।*
గోభిరశ్వైశ్చ యానైశ్చ కృష్యా రాజోపసేవయా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***64***

* *అయాజ్యయాజనైశ్చైవ నాస్తిక్యేన చ కర్మణాం ।*
కులాన్యాశు వినశ్యంతి యాని హీనాని మంత్రతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***65***

తాత్పర్యం:- చిత్రలేఖన, శిల్ప, కావ్య రచనాది కళల చేత, ద్రవ్యసంపాదనేచ్ఛ చేత, శూద్రసంపర్కం చేత, గోవులు, గుర్రాలు మొదలైన వ్యాపారాలచేత, సేవకవృత్తి చేత, రాజోద్యోగాలచేత, యజ్ఞం చేయడానికి అర్హత లేని వారిచే యజ్ఞాలు చేయించడం చేత, నైష్ఠిక కర్మల పట్ల నిర్లక్ష్యం చేత సత్కులాలు నశిస్తాయి. వేదాధ్యయనం లేనందున, అదే ప్రధానమైన కులం నశిస్తుంది.॥64,65॥

* *మంత్రతస్తు సమృద్ధాని కులాన్యల్పధనాన్యపి ।*
కులసంఖ్యాం చ గచ్ఛంతి కర్షంతి చ మహద్యశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***66***

తాత్పర్యం:- వేద ధర్మ ప్రకాశం చేత వెలుగొందవలసిన కులాలు, ఆ వెలుగుచేతనే కీర్తిప్రతిష్ఠలు పొందగలగాలి. ధనం వల్ల వాటికి కీర్తి లభించదు. బ్రాహ్మణులకు వేద వేదాంగాదుల వల్ల కీర్తి కలగాలని మనువు ఉద్బోధ.॥66॥

ప్రక్షిప్తాల పరిశీలన

63 నుంచి 66 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు.

1. అంతర్ వ్యతిరేకాలు

64వ శ్లోకం మనుస్మృతిలోని ఆధారభూతమైన వ్యవస్థకు వ్యతిరేకంగా ఉంది. ఇందులో చెప్పిన శిల్పం, వ్యవసాయం, పశుసంరక్షణ కర్మలు వైశ్యులవి, రాజులకు సేవ చేయటం క్షత్రియులది, వీటిని ఆధారం చేసుకునే మనువు వైశ్యులు, క్షత్రియులు మొదలైన వర్ణభేదాలు, [1.69,90; 9.325-322] ఆ యా చోట్ల ఈ కర్తవ్యాల నిర్వహణతోనే ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయని చెప్పాడని ఉంది. ఈ శ్లోకంలోని ఈ విషయాలను స్వీకరించకుంటే కులనాశనం జరుగుతుందని నమ్మటం, మనుస్మృతిలోని మూలవ్యవస్థకే వ్యతిరేకమవుతుంది. అందువల్ల ఇది ప్రక్షిప్తం. ముందు వెనుకల ఉన్న మూడు శ్లోకాలూ దీనికి సంబంధించివే కనుక అవీ ప్రక్షిప్తాలే. ఎందుకంటే 64వ శ్లోకంలోని క్రియ 65వ శ్లోకంలో పూర్తవుతుంది. 66లోని **'మంత్రతస్తు సమృద్ధాని'** అనేది 65లోని **'యాని హీనాని మంత్రతః'** అనే పదాలతో కలుస్తుంది కాబట్టి.

2. ప్రసంగవ్యతిరేకాలు

వివాహాల గుణదోషాలు, లాభనష్టాలు చెప్పి, తర్వాత 39-42 శ్లోకాలలో పూర్తయ్యాయన్నారు. మళ్లీ ఇక్కడ వాటిని చెప్పటం అసందర్భం. ఇక్కడి విషయాలు ముందు వెనుకల శ్లోకాలలో పెళ్లి తర్వాత స్త్రీతో ఎలా వ్యవహరించాలో,

వాటి పరిణామాలేమిటో [55-62], భార్యాభర్తల కర్తవ్యాలేమిటి [67] అనేవి. వీటి మధ్య కులాల ఉన్నతి, దిగజారడం వీటిని చెప్పటం సంగతం కాదు.

3. పునరుక్తులు

ఈ శ్లోకాలలో కొన్ని విషయాలు రెండవసారి చెప్పారు. అవి- 63వ శ్లోకంలో చెప్పిన "క్రియాలోపైః" అనేదాన్ని 65లో "అయాజ్యయాజనైః నాస్తిక్యేన చ కర్మణాం" అని మార్చి, 63లోని 'వేదానధ్యయనేన' అనే దాన్ని 'యాని హీనాని మంత్రతః' అని మార్చి మళ్లీ చెప్పారు. ఇలా పునరుక్తులు మనువు వంటి విద్వాంసుని భావగాంభీర్యం గల రచనలలో ఉండవు. అందుకని ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

పంచమహా యజ్ఞ విధి 67వ శ్లోకం నుండి 286 శ్లోకాల వరకు

పంచ మహాయజ్ఞాల విధానం　　67 నుండి 82వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

వైవాహికేఽగ్నౌ కుర్వీత గృహ్యం కర్మ యథావిధి ।　　మూలశ్లోక సం. 43
పఞ్చయజ్ఞవిధానం చ పఙ్క్తిం చాన్వాహికీం గృహీ ॥　　ప్రక్షిప్త శ్లోక సం. 67

టీక:- గృహీ = గృహస్థుడైన పురుషుడు, వైవాహికే అగ్నౌ = వివాహ సమయంలో ప్రజ్వలితమైన అగ్నిలో లేదా గార్హస్థ్య రూపమైన అగ్నిలో, గృహ్యం కర్మయథావిధి = గృహస్థుడి సర్వకర్మలను పాచనం, యాజనం మరియు సంతానోత్పత్తి మొ॥ యథావిధి, కుర్వీత = చేయుగాక, పంచయజ్ఞ విధానం = హోమం దైవయజ్ఞాదులైన (3-70) పంచయజ్ఞాలను, చ = అలాగే, ఆన్వాహికీం పంక్తిం = ప్రతిదినం భోజనం వండటం కూడా చేయుగాక!

తాత్పర్యం:- గృహస్థుడైన పురుషుడు వివాహసమయంలో ప్రజ్వలితమైన అగ్నిలో సర్వకర్మలను పాచనం, యాజనం, సంతానోత్పత్తి మొ॥నవి. యథావిధిగా చేయాలి.॥67॥

పంచ మహాయజ్ఞానుష్ఠానానికి కారణం　　ఇది మనుకృతం-ప్రామాణికం

పఞ్చ సూనా గృహస్థస్య చుల్లీ పేషణ్యుపస్కరః ।　　మూలశ్లోక సం. 44
కణ్డనీ చోదకుంభశ్చ బధ్యతే యాస్తు వాహయన్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం. 68

టీక:- చుల్లీ = పొయ్యి, పేషణీ = తిరగలి, ఉపస్కరః = చీపురు, కణ్డనీ = రోలు, చ = అలాగే, ఉపకుంభః = నీళ్ళ కుండ, (బాన) గృహస్థస్య పంచ సూనాః = గృహస్థులు చేసే అయిదు పాపాలు హింసాస్థానాలు, యాః తు వాహయాన్ = వీటిని ఉపయోగించడం ద్వారా గృహస్థుడు, బధ్యతే = హింసాకృత పాపాల వల్ల బద్ధుడవుతున్నాడు.

తాత్పర్యం:- గృహస్థు ఐదు వస్తువులు వాడటం ద్వారా, కన్పించీ-కన్పించని జీవజాలానికి తెలిసో-తెలియకో హాని కల్గించి పాపం పొందుతున్నాడు. ఆ ఐదూ ఇవి: 1. పొయ్యి, 2. తిరగలి, 3. రోలు, 4. చీపురు, 5. నీళ్లకుండ. రోలు-రోకలి కాక ఇల్లు తుడిచే గుడ్డ కూడా దీనిలో చేర్చారు.॥68॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తాసాం క్రమేణ సర్వాసాం నిష్కృత్యర్థం మహర్షి భిః ।　　మూలశ్లోక సం. 45
పఞ్చక్లృప్తామహాయజ్ఞాః ప్రత్యహం గృహమేధినామ్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం. 69

టీక:- క్రమేణ = క్రమంగా, తాసాం సర్వాసాం నిష్కృత్యర్థం = ఆ సర్వ (3.44) హింసాకృత పాపాల పరిహారార్థం లేదా ప్రతిశోధన కోసం, గృహమేధినాం ప్రత్యహం = గృహస్థులు ప్రతిదినం చేయడానికి, మహర్షిభిః పంచయజ్ఞాః క్లృప్తాః = మహర్షులు పంచ యజ్ఞాల విధానాన్ని విధించారు.

తాత్పర్యం:- ఈ ఐదురకాలుగా జీవజాలానికి జరిగే హానివల్ల కలిగే పాపాన్ని పోగొట్టుకోడానికే గృహస్థులు తప్పని సరిగా 5 రకాల యజ్ఞాలను చేయాలని మహర్షులు విధించారు. ॥69॥

పంచమహాయజ్ఞాల నామాలు-నామాంతరాలు

ఇది మనుకృతం-ప్రామాణికం

అధ్యాపనం బ్రహ్మయజ్ఞః పితృయజ్ఞస్తు తర్పణమ్ । మూలశ్లోక సం.**46**
హోమో దైవో బలిర్భౌతో నృయజ్ఞోఽతిథిపూజనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**70**

టీక:- **అధ్యాపనం బ్రహ్మయజ్ఞః** = వేదాన్ని చదవడం, చదివించడం సంధ్యోపాసనం, (సావిత్రీమప్యధీయీత 2.63,) **బ్రహ్మయజ్ఞః** = బ్రహ్మయజ్ఞమని పేరు, **తర్పణం పితృయజ్ఞః** = తల్లిదండ్రులకు చేసే సేవాశుశ్రూషలు, అలాగే భోజనాదుల ద్వారా తృప్తి పరచడం పితృయజ్ఞమనబడును, **హోమో దైవః** =ప్రాతఃసాయం హవనం చేయడం, దేవ యజ్ఞమనబడును, **బలిః భౌతః**= పక్షులకు, కుక్కలకు మరియు కుష్టురోగులకు అలాగే, భృత్యులు మొ॥ ఆశ్రితులకు భోజనంలో కొంత భాగం మిగిలించి పెట్టడం భూతయజ్ఞమనబడును, **అతిథి పూజనమ్** = అతిథులకు భోజనం పెట్టడం, వారి సేవా శుశ్రూషల ద్వారా సత్కరించడం, **నృయజ్ఞః** = నృయజ్ఞమనబడును లేదా అతిథియజ్ఞమనబడును.

తాత్పర్యం:- వేదాలను చదవడం, వేదాలు అధ్యయనం చేయించడం బ్రహ్మ యజ్ఞం; మాతా పితరులను తృప్తిపరచడం, వారిని ఆదరించడం పితృయజ్ఞం; అగ్నిహోత్రం దైవయజ్ఞం; పక్షులకు, కుక్కలకు, కుష్టురోగులకు, మొ॥న ఆశ్రితులకు భోజనంలో కొంతభాగం మిగిలించి పెట్టడం భూతయజ్ఞం; అతిథులకు భోజన, సేవాశుశ్రూషల ద్వారా సత్కరించడం నృయజ్ఞం లేదా అతిథి యజ్ఞం- అనబడును.॥70॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పఞ్చైతాన్ యో మహాయజ్ఞాన్ న హాపయతి శక్తితః । మూలశ్లోక సం.**47**
స గృహేఽపి వసన్నిత్యం సూనాదోషైర్న లిప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**71**

టీక:- **యః** = ఎవడు, **ఏతాన్ పంచ మహాయజ్ఞాన్ శక్తితః న హాపయతి** = ఈ అయిదు యజ్ఞాలను విడిచిపెట్టకుండా యథాశక్తి ఆచరిస్తాడో, **సః** = అతడు, **గృహే+అపి వసన్** = గృహంలో ఉండి కూడ, **నిత్యం** = ప్రతిదినం, **సూనాదోషైః న లిప్యతే** = పొయ్యి, తిరగలి, చీపురు, రోలు, నీళ్ళకుండ వీటిని ఉపయోగించడం ద్వారా కలిగే హింసాకృత పాపాల నుండి విముక్తుడవుతాడు. అంటే ఆ పాపాలు అయిదు యజ్ఞాలు చేయడం ద్వారా పరిహారమవుతాయి.

తాత్పర్యం:- ఎవరైతే ఈ 5 యజ్ఞాలను ఎన్నడూ విడవకుండా యథాశక్తిగా ఆచరిస్తారో, అతడు ఇంట్లోనే ఉన్నా పంచమహాపాతకాలేవీ అతన్ని అంటవు, (ఇలా జరిపేవారికి ఇల్లు కదలక్కరలేని సుఖజీవితం-అదీ పాపరహితమైనది కలుగుతుందని భావం.). ॥71॥

ఇది మనుకృతం-ప్రామాణికం

దేవతాఽతిథిభృత్యానాం పితౄణామాత్మనశ్చ యః । మూలశ్లోక సం.**48**
న నిర్వపతి పఞ్చానాముచ్ఛ్వసన్న స జీవతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**72**

టీక:- **యః** = ఎవడు, (ఏ గృహస్థుడు) **దేవతా+అతిథి +భృత్యానాం పితౄణాం చ ఆత్మనః పంచానాం** = హవనం చేయడం ద్వారా అగ్న్యాది దేవతలను, అతిథి యజ్ఞం ద్వారా అతిథులను, భూతయజ్ఞం లేదా బలివైశ్వదేవయజ్ఞం ద్వారా భరణ పోషణాదులనపేక్షించువారిని అన్యసహాయా పేక్షకులైన కుష్టులను, భృత్యులను; పితృయజ్ఞరూపంలో తల్లిదండ్రులు, పితామహాదులను, బ్రహ్మ యజ్ఞం ద్వారా స్వీయాత్మను **న నిర్వపతి** = వారి వారి భాగములనిచ్చి పోషించడో అలాంటివాడు, **ఉచ్ఛ్వసన్ న జీవతి** = శ్వాస పీలుస్తున్నా కూడా, వాస్తవంగా జీవించనివాడే, మృతవ్యక్తితో సమానమే.

తాత్పర్యం:- దేవతలకు, సేవకులకు, చిన్నప్రాణులకు, అతిథులకు, పితృదేవతలకు, ఏ గృహస్థుడు ఆహారాన్ని ఇచ్చి తనను తాను రక్షించుకోలేడో అలాంటివాడు జీవన్మృతుడే ! జీవించి ఉన్నా మరణించినవాడితో సమానుడు.॥72॥

పంచయజ్ఞాలకు మరొకపేరు **ఇది మనుకృతం-ప్రామాణికం**

అహుతం చ హుతం చైవ తథా ప్రహుతమేవ చ । మూలశ్లోక సం.**49**
బ్రాహ్మ్యం హుతం ప్రాశితం చ పఞ్చ యజ్ఞాన్ ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**73**

టీక:- **పంచయజ్ఞాన్** = ఈ ఐదు యజ్ఞాలకు, **అహుతం హుతం ప్రహుతమ్ బ్రాహ్మ్యం హుతం చ ప్రాశితం ఏవ** = ఆహుతం, హుతం, ప్రహుతం, బ్రాహ్మ్యహుతం ప్రాశితం అనికూడా **ప్రచక్షతే** = పిలువబడుతున్నవి.

తాత్పర్యం:- పంచమహాయజ్ఞాలకు ఇతర నామాంతరాలు ఇవి: 1.ఆహుతం, 2. హుతం, 3. ప్రహుతం, 4. బ్రాహ్మ్యహుతం, 5. ప్రాశితం. వీటి వివరణ కింద ఇవ్వబడింది (తదుపరి శ్లోకంతో అన్వయం).॥73॥

ఇది మనుకృతం-ప్రామాణికం

జపోఽహుతో హుతో హోమః ప్రహుతో భౌతికో బలిః । మూలశ్లోక సం.**50**
బ్రాహ్మ్యం హుతం ద్విజాగ్ర్యార్చా ప్రాశితం పితృతర్పణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**74**

టీక:- **అహుతః జపః** = ఆహుతమంటే జపయజ్ఞం, దీన్నే బ్రహ్మయజ్ఞమని కూడా పిలుస్తారు, **హుతః హోమః** = హుతమంటే హోమం. ఇదే దేవయజ్ఞం, **ప్రహుతః భౌతికః బలిః** = ప్రహుతమంటే భూతాలకు భోజన భాగాన్ని ఇవ్వడం. బలివైశ్వదేవ యజ్ఞం, ఇదే భూతయజ్ఞం, **బ్రాహ్మ్యం హుతం** = బ్రాహ్మ్యహుతం, **ద్విజాగ్ర్యార్చా** = విద్వాంసులకు సేవలు చేయడం, అంటే అతిథి యజ్ఞం, **ప్రాశితం పితృతర్పణమ్** = తల్లి-తండ్రి మొ॥ వారికి తర్పణం, తృప్తిని కలిగించడమే = పితృయజ్ఞం.

తాత్పర్యం:-ఆహుతం అంటే జపయజ్ఞం. దీన్నే బ్రహ్మయజ్ఞమని అంటారు. **'హుతం'** అంటే అగ్నిహోత్రంతో చెయ్యబడే హోమం. ఇదే దేవయజ్ఞం, ప్రహుతమంటే అల్పప్రాణుల సంరక్షణార్థం చేసే భూతతృప్తి; బ్రాహ్మ్యహుతం అంటే అతిథి పూజ. ఇది అతిథి యజ్ఞం. ప్రాశితం అంటే పితృయజ్ఞమని భావం.

బ్రహ్మయజ్ఞం అలాగే అగ్నిహోత్ర విధానం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

స్వాధ్యాయే నిత్యయుక్తస్స్యాత్ దైవే చైవేహ కర్మణి । మూలశ్లోక సం.**51**
దైవే కర్మణి యుక్తో హి బిభర్తీదం చరాచరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**75**

టీక:- **స్వాధ్యాయే నిత్యయుక్తః స్యాత్** = మానవుడైనవాడు వేదాన్ని చదవడం, చదివించడం మరియు సన్ధ్యోపాసన అంటే బ్రహ్మయజ్ఞాన్ని నిత్యం చేయడం. **చ** = మరియు, **దైవే కర్మణి ఏవ** = దేవకర్మ అంటే అగ్నిహోత్రం, **హోమం** = అవశ్యం చేయాలి. **హి** = ఎందుకంటే, **ఇహ** = ఈ ప్రపంచంలో ఉంటూ, **దైవకర్మణి యుక్తః** = అగ్నిహోత్రం చేసేవ్యక్తి, **ఇదం చర+అచరమ్ బిభర్తి** = ఈ చేతనాచేతన జగత్పాలన పోషణ ద్వారా మేలు చేస్తున్నాడు.

తాత్పర్యం:- ధనలేమి వల్ల నిత్యం అతిథికి అన్నం ఇవ్వడానికి అవకాశంలేని బ్రాహ్మణుడు వేదాధ్యయనం మీద శ్రద్ధ కలిగి ఉండాలి. అగ్నిహోత్రాది దైవపూజను విడువకుండా వాటిని శ్రద్ధగా ఆచరించునప్పుడు, అతడు తనకు తెలియకుండానే ఈ ప్రపంచాన్ని పోషించేవాడవుతున్నాడు.॥75॥

వివరణ

అగ్నిహోత్రం ద్వారా జలవాయువులు శుద్ధమై, భక్ష్యపదార్థాలు పరిశుద్ధమవడమేగాక అవి పుష్టివంతములవుతాయి. హోమాల వల్ల ప్రజలకు, అలాగే అన్య పదార్థాలకు కల్యాణం కలుగుతుంది. ఈ విధంగా చరాచర జగత్తుకు పోషణ కలుగుతుంది. రాబోయే శ్లోకం ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది.

అగ్నిహోత్రం వల్ల లాభం- ఇది మనుకృతం-ప్రామాణికం

అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్యగాదిత్యముపతిష్ఠతే । మూలశ్లోక సం. **52**
ఆదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **76**

టీక:- అగ్నౌ సమ్యక్ ప్రాస్తా+ఆహుతిః = అగ్నిలో బాగావేసిన ఘృతాది పదార్థాల ఆహుతి, **ఆదిత్యమ్ + ఉపతిష్ఠతే** = సూర్యుణ్ణి చేరుతుంది. సూర్యుడి కిరణాల ద్వారా వాతావరణంలో కలిసి తన ప్రభావాన్ని చూపిస్తుంది. మళ్ళా **(ఆదిత్యాత్ జాయతే వృష్టిః)** = సూర్యుడి ద్వారా వర్షం సంభవిస్తుంది. **వృష్టేః + అన్నం** = వర్షం వల్ల అన్నం తయారవుతుంది, **తతః ప్రజాః** = దాని వల్ల ప్రజల పాలన, పోషణ జరుగుతుంది.

తాత్పర్యం:- అగ్నిలో చక్కగా వ్రేల్చబడిన హోమం సూర్యుణ్ణి చేరుతుంది. దానివల్ల వర్షం కురుస్తుంది. ఈ ప్రకారం పరోక్షంగా యజ్ఞకర్మ చేత వర్షం కురిపించి పంటలు పండించడంలో ద్విజుడు కారకుడవుతున్నాడు. ఆ విధంగా ఈ ప్రపంచాన్ని పోషిస్తున్నవాడవుతున్నాడు. ॥76॥

ఋషి దయానందభాష్యం:- యజ్ఞ హోమాలు చేయనందువల్ల పాపం, అవి చేయడం వల్ల సృష్టికి మేలు కలుగుతుంది. ఈ విషయాన్ని స్పష్టపరుస్తూ శ్రీ దయానందమహర్షులు ఇలా రాస్తున్నారు.(సం.వి.గృ.)

ప్రశ్న : ఈ హోమం చేయనందువల్ల పాపం కలుగుతుందా?

జవాబు : అవును, కారణం వినండి. ఏ మనుష్యుడి శరీరం నుండి అధిక దుర్గంధం బయటికి వచ్చి వాయువును, జలాన్ని కలుషితం చేసి రోగోత్పత్తికి కారణమై అన్యప్రాణులకు దుఃఖాన్ని కలిగిస్తుందో, అంత పాపం ఆ మనుష్యుడికి కలుగుతుంది. అందువల్ల ఆ పాప నివారణార్థం అంతగాని లేదా అంతకంటే అధికంగా గాని సుగంధాన్ని వాయువులో జలంలో వ్యాపింపజేయాలి (స.ప్ర. 3వ సముల్లాసం.)

గృహస్థాశ్రమ మహత్త్వం- ఇది మనుకృతం-ప్రామాణికం

యథా వాయుం సమాశ్రిత్య వర్తన్తే సర్వజన్తవః । మూలశ్లోక సం. **53**
తథా గృహస్థమాశ్రిత్య వర్తంతే సర్వ ఆశ్రమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **77**

టీక:- యథా వాయుం సమాశ్రిత్య = ఏ విధంగా వాయువు నాశ్రయించి, **సర్వజంతవః వర్తన్తే** = సర్వప్రాణులు జీవిస్తున్నవో, **తథా** = అలాగే, **గృహస్థమ్ + ఆశ్రిత్య** = గృహస్థుడి ఆశ్రమంలో, **సర్వ+ఆశ్రమాః** = ఆశ్రమాలన్ని కూడా, (బ్రహ్మచారులు, వానప్రస్థులు-సన్న్యాసులు) అంటే అన్ని ఆశ్రమముల యొక్క **వర్తన్తే** = నిర్వాహం జరుగుతున్నది.॥77॥

ఋషి దయానందభాష్యం:-ప్రాణవాయువును పీల్చుకొని సకలప్రాణులు (జీవజాలం) జీవించినట్లే, గృహస్థుడిని ఆశ్రయించి మిగిలిన ఆశ్రమవాసులు (బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్న్యాసులు) జీవిస్తారు (సం.వి.గృ.)

ఇది మనుకృతం-ప్రామాణికం

యస్మాత్త్రయోఽప్యాశ్రమిణో జ్ఞానేనాన్నేన చాన్వహమ్ । మూలశ్లోక సం.54
గృహస్థేనైవ ధార్యంతే తస్మాజ్జ్యేష్ఠాశ్రమో గృహీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.78

టీక:- **యస్మాత్** = దేనివల్ల, **త్రయః+అపి+ఆశ్రమిణః** = బ్రహ్మచారి, వానప్రస్థుడు, మరియు సన్న్యాసి. ఈ మూడు ఆశ్రమాలవారికి, **అన్నేన దానేన అన్వహమ్** = అన్నవస్త్రాదుల దానం వల్ల, నిత్యం, **గృహస్థేన +ఏవధార్యన్తే** = గృహస్థుడే ధారణ, పోషణ చేస్తున్నాడు. **తస్మాత్** = అందువల్ల, **గృహీ-ఆశ్రమః జ్యేష్ఠః** = ఆశ్రమాలలో గృహస్థాశ్రమం సర్వోత్తమం.

ఋషి దయానందభాష్యం:- గృహస్థాశ్రమంలో ఉన్న గృహస్థుడే బ్రహ్మచారి, వానప్రస్థుడు, మరియు సన్న్యాసి అనే మూడు ఆశ్రమాలవారికి అన్న వస్త్రాదుల దానం నిత్యం చేసి పోషిస్తున్నందు వల్ల గృహస్థాశ్రమం సర్వోత్తమం.(సం.వి.గృ)॥78॥

"బ్రహ్మచారి, వానప్రస్థుడు మరియు సన్న్యాసి ఈ మూడు ఆశ్రమములవారికి అన్నాదులను దానమిచ్చి, ప్రతిదినం పోషిస్తున్నందువల్ల, గృహస్థాశ్రమం శ్రేష్ఠాశ్రమం, అంటే అన్ని వ్యవహారాలలో శ్రేష్ఠమని చెప్పబడుతున్నది, (స.ప్ర.4వ స.).

ఆ గృహస్థాశ్రమ జ్యేష్ఠత్వాన్ని గురించి 6.59వ శ్లోకంలో చూడగలరు.

గృహస్థాశ్రమానికి యోగ్యులెవరు? ఇది మనుకృతం-ప్రామాణికం

స సన్ధార్యః ప్రయత్నేన స్వర్గమక్షయ మిచ్ఛతా । మూలశ్లోక సం.55
సుఖం చేహేచ్ఛతా నిత్యం యోఽధార్యో దుర్బలేంద్రియైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.79

టీక:- ఓ స్త్రీ-పురుషులారా ! మీరు **అక్షయమ్ స్వర్గమ్ ఇచ్ఛతా సుఖం ఇచ్ఛతా**= అక్షయమైన ముక్తి సుఖాన్ని, సంసార సుఖాన్ని కోరినట్లయితే, **యః దుర్బలేంద్రియైః ఆధార్యః** = ఈ గృహస్థాశ్రమం దుర్బలేంద్రియులకు, నిర్బుద్ధి పురుషులకు యోగ్యం కాదు. **సః నిత్యం ప్రయత్నేన ధార్యః** = ఆ గృహస్థాశ్రమాన్ని నిత్యం ప్రయత్నంతో నిర్వహించాలి

ఋషి దయానందభాష్యం:- అక్షయమైన ముక్తిసుఖాన్ని సంసారసుఖాన్ని, కోరినట్లయితే ఈ గృహస్థాశ్రమం దుర్బలేంద్రియులకు, నిర్బుద్ధి పురుషులకు యోగ్యంకాదు. స్వర్గసుఖం కోరే గృహస్థు తన ఆశ్రమధర్మాలను చక్కగా నిర్వర్తించాలి. జితేంద్రియులై వర్ణాశ్రమ ధర్మాలను కాపాడాలి. మోక్షానందాన్నీ, భౌతికసుఖాన్నీ కోరేవారు దీన్ని ప్రయత్నించి నిర్వహించవలసి ఉంది (స.ప్ర.4వ స.).॥79॥

వివరణ

స్వర్గమంటే ఏది?

ఈ శ్లోకసందర్భంగా, స్వర్గలోకాన్ని గురించి మను అభిప్రాయం స్పష్టపరచవలసిన అవసరముంది. కారణం ఈ విషయంలో చాలా భ్రాంతులున్నాయి. మను మహర్షిని గురించి కూడా భ్రాంతి ఉండరాదనే అభిప్రాయంతో వివరణ ఇవ్వబడుతుంది.

ఈ ప్రపంచానికి భిన్నమైన స్వర్గలోకం ఒకటి ఉందని మనుమహర్షి అంగీకరించదు. సుఖప్రాప్తియే స్వర్గం, దుఃఖప్రాప్తియే నరకం. ఈ స్వర్గ-నరకాలు ఈ ప్రపంచంలో, ఈ జీవితంలోనే ప్రాప్తిస్తూ ఉంటాయి. ఇందుకు ప్రమాణాలు.

1. మనువు 'స్వర్గ' శబ్దాన్ని, ఇహ సుఖాన్ని మరియు మోక్షసుఖాల కోసం (రెండింటికి) ప్రయోగించాడు. ఈ శ్లోకంలో, అక్షయ సుఖం అనగా మోక్షానికి 'స్వర్గ' శబ్దాన్ని ప్రయోగించాడు. స్వర్గానికి పర్యాయవాచకంగా, ఇహ సుఖం కోసం 'సుఖ' శబ్ద ప్రయోగం చేయబడినది.

2. స్వర్గశబ్దం సుఖార్థంలోనూ సుఖానికి పర్యాయవాచకంగాను ప్రయోగాలున్నాయి.

అ. "అస్వర్గ్యం చాతిభోజనమ్ (2. 32)

ఆ. "దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ (9.28)

ఇ. "స్వర్గ-ఆయుష్య-యశస్యాని వ్రతానీమాని ధారయేత్ (4.13)

3. అక్షయసుఖం అంటే మోక్షసుఖం. ఈ అర్థంలో స్వర్గశబ్దప్రయోగం.

అ. ప్రస్తుతశ్లోకం **3.79 "స్వర్గమక్షయమిచ్ఛతాం స్వర్గమ్**-3.79.

ఆ. ఇదమన్విచ్ఛతాం స్వర్గం ఇదమానన్త్యమిచ్ఛతామ్-6-84.

4. మనుమహర్షి-12.9, 39-52 శ్లోకాల్లో మరణానంతరం జీవుడు తన కర్మలననుసరించి జన్మమెత్తే యోనులను వర్ణించాడు. ఆ సందర్భంలో స్వర్గలోకాన్ని గురించి గానీ లేదా విశేషమైన మరొక యోని ఉన్నట్లు గానీ వర్ణించలేదు.

5. వ్యాకరణశాస్త్రానుసారంగా స్వర్గశబ్దం "స్వర్" ఉపపదానికి "గమ్లృగతౌ" ధాతువుకు "ద" ప్రకరణే 'న్యేష్వపిదృశ్యతే' అ-3/24 వార్తిక సూత్రాన్ననుసరించి, 'ద' ప్రత్యయం చేరగా 'స్వర్గ' శబ్దం తయారవుతుంది. "గతి"కి జ్ఞానం, గమనం ప్రాప్తి అని మూడర్థాలున్నాయి. స్వః = సుఖానుభవం. సుఖంలో ప్రవిష్టుడగుట-సుఖప్రాప్తియే స్వర్గం అంటే సుఖమే.

6. "లోకృ= దర్శనే" అనే ధాతువు వల్ల 'లోక' శబ్దం తయారువుతుంది. దీనికి స్థానమని అర్థం. ఎక్కడ స్వర్గం ప్రాప్తిస్తుందో, సుఖం ప్రాప్తిస్తుందో, అదే స్వర్గలోకం.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఋషయః పితరో దేవా భూతాన్యతిథయస్తథా । మూలశ్లోక సం.**56**
ఆశాసతే కుటుంబిభ్యస్తేభ్యః కార్యం విజానతా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**80**

టీక:- ఋషయః, పితరఃదేవాః భూతాని తథా అతిథయః = తల్లిదండ్రులు, దేవతలు, అగ్ని మొ॥ వారు, భూతాని-భృత్యులు అలాగే కుష్ఠవ్యాధి గ్రస్తులు, మొ॥వారు మరియు అతిథులు, **కుటుంబిభ్యః ఆశాసతే** = గృహస్థుల నుండే ఆశిస్తారు. అంటే సహాయం కోరతారు. **విజానతా తేభ్యః కార్యం** = తమ గృహస్థ సంబంధమైన కర్తవ్యాలను తెలిసి వారు ఈ పైన పేర్కొన్నవారికి సహాయాన్ని అందించాలి. ఋషి, దేవత, దేవుడు మరియు పితర శబ్దార్థాలను తెలియడానికి 3.58వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

తాత్పర్యం:- దేవతలు, పితృదేవతలు, ఋషులు, సకల ప్రాణులు (భూతములు), అతిథులు..... వీరంతా గృహస్థులనే ఆశ్రయించడం జరుగుతుంది. కాబట్టి ఆ యా ఆశ్రమస్థులకు, ఇవ్వదగినవారికి అవి సహాయాన్ని అందించాలి.॥80॥

పంచయజ్ఞాల ముఖ్యకర్మలు- ఇది మనుకృతం-ప్రామాణికం

స్వాధ్యాయేనార్చయేతర్షీన్ హోమైర్దేవాన్ యథావిధి । మూలశ్లోక సం.**57**
పితౄన్ శ్రాద్ధైశ్చ నౄనన్నైర్భూతాని బలికర్మణా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**81**

టీక:- స్వాధ్యాయేన ఋషీన్ = స్వాధ్యాయం, వేదాధ్యయనం ద్వారా ఋషులను, **యథావిధి హోమైః దేవాన్** = యథావిధి శాస్త్రోక్త విధానంగా దేవపూజ చేయడం, **శ్రాద్ధైః** = శ్రాద్ధముల ద్వారా పితృపూజ చేయడం, **అన్నైఃనౄన్** =

అన్నాదుల ద్వారా మనుష్యపూజ చేయడం, **చ** = మరియు, **బలికర్మణా భూతాని** = వైశ్వదేవం బలితో ప్రాణి మాత్రమును సత్కరించాలి.

తాత్పర్యం:- వేదాధ్యయనం చేత ఋషులను, హోమాలచేత దేవతలను, శ్రాద్ధములచేత పితృదేవతలను (తల్లిదండ్రులను), అన్నాదుల ద్వారా అతిథులను, బలి ఆహారం ఇవ్వడం ద్వారా ప్రాణులను సంతృప్తి పరచాలి.॥81॥

ఋషి దయానందభాష్యం:- ఈ శ్లోకాన్ని గురించి మహర్షి దయానందులవారు ఇలా రాశారు. హోమమే దేవపూజ అని ఈ శ్లోకాల ద్వారా తెలుస్తుంది. హోమస్థానములే దేవాలయం మొ॥ శబ్దాల ద్వారా చెప్పబడుతున్నాయి. పూజ అంటే సత్కారమే. కారణం అతిథిపూజ చేయడం **"హోమైర్దేవానర్చయేత్"** అతిథులను పూజించడమంటే అతిథులను సత్కరించుటయే పూజ. అంతేగాని మరొకటి కాదు. ఈ విధంగా అనడం వల్ల నవీన దేవాలయాలు, మందిరాలు అని అర్థం కాదు. దేవాలయమంటే యజ్ఞశాలే.(పూ.ప్ర.)

శ్రద్ధతో చేసే కార్యానికే శ్రాద్ధమని పేరు. శ్రద్ధతో తల్లిదండ్రులకు సేవా శుశ్రూషలు చేయడం సాదరంగా భోజనాదులను వడ్డించడం. ఇదే పితరులకు చేసే తర్పణం లేదా పితృయజ్ఞం. స్వాధ్యాయ విషయకమైన విస్తృత వివేచనం 82వ శ్లోకంను చూడగలరు.

పితృయజ్ఞ విధానం-

ఇది మనుకృతం-ప్రామాణికం

కుర్యాదహరహః శ్రాద్ధమన్నాద్యేనోదకేన వా । మూలశ్లోక సం.**58**
పయోమూలఫలైర్వాఽపి పితృభ్యః ప్రీతిమావహన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**82**

టీక:- గృహస్థుడు, **అన్నాద్యేన వా ఉదకేన అపి వా పయః+మూల+ఫలైః** = అన్నాది భోజన పదార్థాలతో, ఫలాలు, జలం-పాలు, కందమూలాదులతో, **పితృభ్యః ప్రీతిమావహన్** = తల్లిదండ్రులు, మొ॥ పెద్దలకు అత్యంత ప్రేమను చూపుతూ, **అహః అహః శ్రాద్ధం కుర్యాత్** = ప్రతి దినం శ్రద్ధతో చేసే సేవా శుశ్రూషలు, భోజనాదులను ఇవ్వడం మొ॥ కర్తవ్యాలను అనుష్ఠింతురుగాక!

తాత్పర్యం:- గృహస్థుడు పితృదేవతల ప్రీతికోసం అన్నాదులచేత గానీ, ఉదకదానంచేత గానీ, పాలు-దుంపలు-ఫలాలచేత గానీ గృహస్థుడు నిత్యం శ్రాద్ధం ఆచరించాలి. ॥82॥

వివరణ

ఇక్కడ పితృయజ్ఞాన్ని గురించి విస్తృతంగా సమాలోచన చేయబడుతుంది. దీనివల్ల శ్రాద్ధం, తర్పణాలను గురించి భ్రాంతి తొలగుతుంది. పితృయజ్ఞం అంటే వేదాధ్యయన అధ్యాపన కార్యాలలో నిమగ్నులైన ఋషులు, విద్వాంసులు, తల్లిదండ్రులు ఇలాంటి పెద్దలకు సేవచేయడమే. ఈ విషయాన్ని గురించి విస్తృత వివేచన చేయబడుతుంది. పితృయజ్ఞం రెండు విధాలు. 1) తర్పణం, 2) శ్రాద్ధం **"యేన కర్మణా విదుషో దేవాన్, ఋషీన్, పితౄంశ్చ తర్పయన్తి= సుఖయన్తి తత్ తర్పణమ్"** ఏ కార్యం ద్వారా విద్వాంసులరూపంలో ఉన్న దేవతలను, ఋషులను మరియు పితరులను సుఖవంతులుగా చేస్తారో ఆ కర్మకు తర్పణమని పేరు.

"యత్తేషాం శ్రద్ధయా సేవనం క్రియతే, తత్ శ్రాద్ధమ్". పెద్దలను శ్రద్ధతో సేవించడమే శ్రాద్ధం. ఈ తర్పణాది కర్మలు ప్రస్తుతం జీవించినవారికే చెల్లుతుంది. చనిపోయినవారికి చెల్లదు. కారణం మృతులు ప్రత్యక్షం కారు కాబట్టి వారికి ఈ సేవలు అందవు. అందువల్ల వారికి సేవాదులు ఏ ప్రకారం చేయడానికీ వీలుపడదు. వారి పేరును ఉచ్చరించి ఇచ్చిన వస్తువు పదార్థం వారికి ఎప్పటికీ చేరదు. అందువల్ల మృతులకు సుఖాన్ని కలిగించడం పూర్తిగా అసంభవమే. తర్పణాది కర్మలలో సత్కార యోగ్యులు ముగ్గురు. 1) దేవశబ్దవాచ్యులు (దేవతలు) , 2) ఋషులు, 3) పితరులు బ్రతికున్న తల్లిదండ్రులు. (ద.ల.గ్ర.సం.)

1. 'పితరశబ్ద పరిశీలన':- పితరులు "పాన్తి పాలయన్తి రక్షంతి అన్న విద్యా సుశిక్షా ఆది దానైః తే పితరః" ఎవరు అన్న విద్యా-సుశిక్షాదుల ద్వారా పాలన, పోషణ, రక్షణ చేస్తారో వారే పితరులు. ఇందుకు బ్రాహ్మణముల నుండి ప్రమాణాలు.

అ. "దేవా వా ఏతే పితరః" గో.ఉ.1-24

ఆ. "స్విష్టకృతో వై పితరః" గో.ఉ.1-25

సుఖాది సౌకర్యముల ద్వారా పాలన, పోషణ, హిత సంపాదన చేయునట్టి విద్వాంసులైన వ్యక్తులు 'పితరులు'.

ఇ. "మర్త్యాః పితరః" శత.2-1-34-: మనుషులే పితరులు. మృతులు కాదు. దీన్ని బట్టి మృతక పితరులు కల్పితులే. ఇది భ్రాంతే.

"తల్లి-తండ్రి-పితామహుడు, ఆచార్యాదులు పితరులు. మనుస్మృతిలో అనేక స్థలాలలో వీరినే పితరులని చెప్పడం జరిగింది. 4.87వ శ్లోకంలో వారి ఋణం నుండి విముక్తులు కావాలని ప్రబోధం చేయబడింది. **"మహర్షి పితృ దేవానాం గత్వానృణ్యం యథావిధి."** ఈ కర్మ జీవించినవారితోనే సంభవమవుతుంది. మనుస్మృతి నుండి అన్యప్రమాణాలు.

ఎ. "ఆధ్యాపయామాస పితౄన్ శిశురాంగిరసః కవిః
పుత్రకా ఇతి హోవాచ జ్ఞానేన ప్రతి గృహ్యతాన్" (2-126)

బి. పితరశ్చైవ సాధ్యాశ్చ ద్వితీయా సాత్త్వికీ గతిః (12-49)

సి. "పితృదేవ మనుష్యాణాం వేదశ్చక్షుః సనాతనమ్ (12-94)

డి. దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ (9-28)

ఇ. "ఋషయః పితరో దేవా భూతాన్యతిథయస్తథా।
ఆశాసతే కుటుమ్బిభ్యః తేభ్యః కార్యం విజానతా॥ (3-80)

1. మనువు 4-16, 17లో జీవించిన ధార్మికులైన వేదవేత్తలైన విద్వాంసులకే హవ్యకవ్యములివ్వాలని విధించాడు. జీవించిన వ్యక్తులకే హవ్య కవ్యాలు ఇవ్వాల్సిన విషయాన్ని ఈ శ్లోకాల ద్వారా మనుమాన్యత వ్యక్తమవుతుంది. ఇదే శ్రాద్ధం. హవ్య కవ్యాది శ్రాద్ధసంబంధమైన విషయాలకు మృతుల శ్రాద్ధసంబంధమైన విషయం ఏ మాత్రం సంబంధం లేదు.

2. పితరుల సంబంధంగా వేద ప్రమాణం

"ఊర్జం వహన్తీ రమృతం ఘృతం పయః కీలాలం పరిస్రుతమ్
స్వధాస్థ తర్పయత మే పితౄన్"। యజుః2-34

అర్థం: తండ్రి లేదా స్వామి తన పౌత్రులకు, స్త్రీకి, సేవకులకు ఆజ్ఞ ఇచ్చుగాక! **"తర్పయతు మే పితౄన్"** నా తల్లిదండ్రి, పితామహుడు మొ॥ వారిని తల్లి-మాతామహి మొ॥. అలాగే ఆచార్యుడు, వీరి కంటె భిన్నమైన విద్వాంసులు వయస్సులో, విద్యలో వృద్ధులు, మాననీయులు, వారందరి ఆత్మలకు యథాయోగ్య సేవలు చేసి ప్రసన్నులను చేయుదురుగాక. సేవ చేయడానికి పదార్థాలు ("ఊర్జం-వహన్తీ,) ఉత్తమ జలం (అమృతమ్) అనేక రకాలైన రసములు, (ఘృతం) నేయి, పాలు (పయః) (కీలాలమ్) అనేక సంస్కారాలతో రోగనాశకాలైన ఉత్తమోత్తమమైన అన్నం (పరిస్రుతమ్), రకరకాలైన ఉత్తమ ఫలాలు. ఈ పదార్థాలన్నిటితో వారికి సేవలను చేయుదురుగాక! "స్వధాస్థ" ఓ పితృదేవతలారా! మీరందరు మేమిచ్చిన అమృత పదార్థాలను ఆరగించి సదా సుఖంగా ఉందురుగాక! (ద.ల.గ్ర.స్రం.245-255).

3. పితరుల గణన-వారి అభిప్రాయం

ఈ కింద పేర్కొన్నవారికి పితృనామమున్నది. వీరే సేవాయోగ్యులు.

1) సోమసదః, 2) అగ్నిష్వాత్తాః, 3) బర్హిషదః, 4) సోమపాః, 5) హవిర్భుజః, 6) ఆజ్యపాః, 7) సుకాలినః,8)యమరాజాః 9) పితృ-పితామహ-ప్రపితామహాః, 10) మాతృ-పితామహీ-ప్రపితామహ్యాః, 11) సగోత్రాః, 12) ఆచార్యాది సంబంధినః.

1. సోమసదః: "సోమే ఈశ్వరే సోమయాగే వా సీదన్తి యే సోమగుణాశ్చతే సోమసదః।" ఈశ్వరుడిలోనూ, సోమయాగంలోనూ నిపుణులు, శాంతి మొ॥ సద్గుణ సంపన్నులు 'సోమసదులు'.

2. అగ్నిష్వాత్తాః: అగ్నిః ఈశ్వరః సుష్ఠుతయా ఆత్తో గృహీతో యైః తే, యద్వా అగ్నేః గుణజ్ఞానాత్ పృథివీ=జల, వ్యోమ, జ్ఞాన-యన్త్రరచనాదికా పదార్థ విద్యా సుష్ఠుతయా ఆత్తా గృహీతాయైః తే అగ్నిష్వాత్తాః। అగ్ని అంటే పరమేశ్వరుడు లేదా భౌతికాగ్ని. దాని గుణాలనెరిగి సంపూర్ణంగా అగ్ని విద్యలో సిద్ధహస్తులైన వారు 'అగ్నిష్వాత్తులు'.

3. బర్హిషదః: బర్హిషి సర్వోత్కృష్టే బ్రహ్మాని శమదమాదిషు ఉత్తమేషు గుణేషు వా సీదన్తి తే బర్హిషదః" సర్వోత్తమమైన పరబ్రహ్మాయందు స్థిరులై శమ-దమ-సత్య-విద్యా ఆది ఉత్తమ గుణాలు కలిగిన వారికి 'బర్హిషదు'లని పేరు.

4. సోమపాః: "యజ్ఞేన ఉత్తమౌషధిరసం పిబన్తి పాయయన్తివా, తే సోమపాః" యజ్ఞం చేసి సోమలత మొ॥ ఉత్తమ ఓషధుల రసమును పానం చేసినవారు, పానం చేయించేవారు మరియు సోమ విద్యనెరిగినవారు "సోమపులు."

5. హవిర్భుజః: "హవిః హుతమేవ యజ్ఞేన శోధితవృష్టిజలాదికం భోక్తుం, భోజయితుం వా శీలం ఏషాం తే = హవిర్భుజః". ఎవరు అగ్నిహోత్రాది యజ్ఞాలు చేసి వాయువును, వర్షజలాన్ని శుద్ధిచేయడం ద్వారా సర్వజగత్తుకు ఉపకారం చేస్తున్నారో, ఎవరు యజ్ఞంతో శుద్ధం చేసిన భోజనపానాదులు చేస్తారో వారు 'హవిర్భుజులు'.

6. ఆజ్యపాః : "ఆజ్యం ఘృతం, యద్వా 'అజ్‌గతి క్షేపణయోః' ధాత్వర్థాత్ ఆజ్యం విజ్ఞానం తద్దానేన యాన్తి రక్షన్తి పాలయన్తి రక్షయన్తి యే విద్వాంసః తే ఆజ్యపాః" స్నిగ్ధ పదార్థానికి, ఘృతమనీ, విజ్ఞానమనీ, అర్థాలున్నాయి. ఎవరు దానం ద్వారా రక్షిస్తారో వారు 'ఆజ్యపులు'.

7. సుకాలినః : ఈశ్వర విద్యోపదేశకరణస్య గ్రహణస్య చ శోభనఃకాలో యేషాంతే 'సుకాలినః' యదా ఈశ్వర జ్ఞాన ప్రాప్త్యా సుఖరూపః సదైవకాలో యేషాం తే 'సుకాలలినః', మానవ శరీరాన్ని పొంది, ఈశ్వరుడి గురించి, సత్య విద్యలను గురించి ఉపదేశించడంలో తమ అమూల్య సమయాన్ని వెచ్చిస్తారో సదా ఉపదేశంలోనే కాలం గడుపుతారో వారిని 'సుకాలిను'లంటారు.

8. యమరాజాః: "యే పక్షపాతం విహాయ న్యాయవ్యవస్థాకర్తారః సన్తి తే యమరాజాః" పక్షపాతం లేకుండా సదా సత్యన్యాయ వ్యవస్థలో పనిచేస్తారో వారిని 'యమరాజులు' అంటారు.

9. పితృ-పితామహ-ప్రపితామహాః: యే సుష్ఠుతయా శ్రేష్ఠాన్ విదుషో గుణాన్ వాసయన్తః తత్ర వసన్తశ్చ, విజ్ఞానాది అనన్తధనాః స్వాన్ జనాన్ ధారయన్తి పోషయన్తశ్చ చతుర్వింశతి పర్యన్తేన బ్రహ్మాచర్యేణ విద్యాభ్యాసకారిణః స్వే జనకాశ్చ పన్తి, తే పితరః వసవః విజ్ఞేయా ఈశ్వరోఽపి = ఎవరు వీర్యం ద్వారా నిషేకాది కర్మలొనరించి కని, పాలించునో, మరియు 24 సం॥ పర్యంతం బ్రహ్మాచర్యాశ్రమం ద్వారా విద్యనార్జించినట్టి వాడికి 'పితా లేదా వసు' వని పేరు.

పితామహః: యే పక్షపాతరహితాః దుష్టాన్ రోదయన్తః చతుశ్చత్వారింశత్‌వర్షపర్యంతేన బ్రహ్మాచర్యసేవనేన కృతవిద్యాభ్యాసాః తే రుద్రాః స్వే పితామహాశ్చ గ్రాహ్యాః తథా రుద్ర ఈశ్వరోఽపి = ఎవరు తండ్రికి తండ్రియో, 44 సం॥ పర్యంతం బ్రహ్మాచర్య దీక్షతో విద్యనభ్యసించి పక్షపాతం లేకుండా, దుష్టులను ఏడిపిస్తారో వారికి 'పితామహు'లని, 'రుద్రు'లని పేరు.

ప్రపితామహః: ఆదిత్యవత్ ఉత్తమ గుణ ప్రకాశకా విద్వాంసో, అష్టచత్వారింశత్ వర్షేణ బ్రహ్మచర్యేణ సర్వవిద్యాసంపన్నాః సూర్యవత్ విద్యా ప్రకాశాః త ఆదిత్యాః స్వే ప్రపితామహాశ్చ గ్రాహ్యాః తథా ఆదిత్యోఽ వినాశీశ్వరోవాఽత్ర గృహ్యతే"- ఎవరు పితామహుడికి పితయో మరియు ఆదిత్యునితో సమానంగా ఉత్తమ గుణప్రకాశకుడై, 48సం॥ పర్యంతరం బ్రహ్మచర్యాశ్రమం ద్వారా విద్యాధ్యయనం చేసి జగత్తుకు ఉపకారం చేస్తున్నాడో, అలాంటివాడికి ప్రపితామహుడని పేరు లేదా 'ఆదిత్యు'డని అంటారు. అలాగే ఎవరు పిత్రాదులకు సమాన పురుషుడో, వారికిన్నీ వారితో సమానంగా శుశ్రూషలు చేయాలి.

10. **మాతృ-పితామహీ: 'ప్రపితామహ్యాః పిత్రాది సదృశ్యో మాత్రాదయః సేవ్యాః'**- పిత్రాదులతో సమానంగా విద్యాస్వభావం కలిగిన స్త్రీలకు కూడా సేవలు చేయాలి.

11. **సగోత్రా: 'స్వసమీపం పుత్రాదయస్తే శ్రద్ధయా పాలనీయాః**- సమీపవర్తులైన జ్ఞాతులున్నట్లయితే వారు కూడా సేవనీయులే, పాలనీయులే.

12. **ఆచార్యాది సంబంధినః: 'యే గుర్వాది సఖ్యన్తాః సన్తి తే హి సర్వదా సేవనీయాః'** ఎవరు సంపూర్ణంగా చదివిస్తారో వారికి, మామ మొ॥ వారి సంబంధీకులకు, వారి శ్రీమతులకు యథాయోగ్య సేవలు చేయాలి. (ద.ల.గ్ర.).

ఈ విధంగా ఉపరోక్త గుణాలు గల జీవించిన వ్యక్తులే పితరులు. అలాంటి పితరుల సేవచేయడమే పితృయజ్ఞం. మృతపితరుల కల్పన భ్రాంతిజనకమేగాక అజ్ఞానద్యోతకం కూడా.

3. 'దేవ' శబ్ద పరిశీలన

1. **దివు=క్రీడా-విజిగీషా-వ్యవహార-ద్యుతి-స్తుతి మోద-మద-స్వప్న-కాన్తి-గతిషు**

దివాది ధాతువు వల్ల **'పచాద్యచ్'**తో **'అచ్'** ప్రత్యయం లేదా **'దివు = మర్దనే'** (చురాది) లేదా **'దివుపరికూజనే'** (చురాది) ధాతువుకు **'అచ్'** ప్రత్యయం చేర్చగా **'దేవ'** శబ్దం నిష్పన్నమవుతుంది. దేవతలు జడములు, చేతనములని రెండు విధాలుగా ఉన్నారు. విస్తృత వివరణ 1.36వ శ్లోకంలో చూడగలరు. ఈ శ్లోకంలో దేవశబ్దానికి చేతన దేవతలని అర్థం.

2. **ద్వయం వా ఇదం న తృతీయమస్తి "సత్యం చైవానృతం చ సత్యమేవ దేవా అనృతం మనుష్యాః" ఇదమహమనృతాత్ సత్యముపైమీతి 'తన్మనుషేభ్య దేవానుపైతి॥** (శతపథ-1-1-1-4-5)

రెండు లక్షణాల ద్వారా మనుషులకు రెండు సంజ్ఞలు ఉన్నాయి. అవి దేవ మనుషులు. అక్కడ సత్యం, అబద్ధం అని రెండు కారణాలు. సత్యాన్ని అంగీకరించి, సత్యాన్ని చెప్తుతూ, సత్యకర్మలను చేసేవారు దేవశబ్ద వాచ్యులు అంటే దేవతలు. అలాగే అసత్యాన్ని గౌరవిస్తూ, అసత్యాన్నే చెప్పుతూ, అబద్ధపు కర్మలను చేసేవారు మనుషులు. అసత్యాన్ని వదిలి సత్యమార్గాన్ని ప్రవేశించేవారు దేవజాతికి చెందుతారు (ద.ల.గ్ర.సం.).

అ. **"విద్వాంసో హి దేవాః**-(శత 3-7-6-10).

ఆ. **యే బ్రాహ్మణాః శుశ్రువాంసోఽనూచానాస్తే మనుష్య దేవాః॥** (శత-2-4-3-14)

ఇ. **సత్యసంహితా వై దేవాః** (ఐత బ్రా1-16)

విద్వాంసులైన మనుషులనే దేవతలంటారు. దేవశబ్దానికి నిరుక్తకారుడు ఇచ్చిన నిర్వచనం. **'దేవో దానాద్వా దీపనాద్వా, ద్యోతనాద్వా ద్యుస్థానో భవతీతి వా। యో దేవః స దేవతా ॥** (నిరుక్త-7.15) దానమివ్వటం వల్ల, ప్రకాశించడం వల్ల, ప్రకాశింపచేయడం వల్ల, ప్రకాశ (ద్యు) స్థానమందుండటం వల్ల దేవశబ్దవాచ్యుడవుతున్నాడు.

దేవశబ్దాన్నే దేవత అని కూడా అవనచ్చు. ఈ విధంగా విద్యల ద్వారా ప్రకాశితుడు విద్యల దాత, దివ్యగుణాలు ఉత్తమాచరణ కలిగినందువల్ల విద్వాంసులు కూడా దేవతలే. ఇలాంటి విద్వాంసులే దేవతలని మనుస్మృతి అంగీకరించింది.

1. తే తమర్థమపృచ్ఛన్త దేవానాగతమన్యవః ।
దేవాశ్చైతాన్సమేత్యోచుర్న్యాయ్యం వః శిశురుక్తవాన్ 2-127

2. న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః ।
యో వై యువాఽష్యదీయానః తం దేవాః స్థవిరం విదుః 2-131

3. 'ఋషి' శబ్ద పరిశీలన:

'ఋషీగతౌ' ధాతువుకు 'ఇన్' ప్రత్యయం మరియు 'ఇగుపధాత్ కిత్' యొక్క యోగం వల్ల 'ఋషి' శబ్దం సిద్ధిస్తుంది. గతికి జ్ఞానం, గమనం మరియు ప్రాప్తి అనే మూడు అర్థాలున్నాయి. సర్వోత్తమ స్థాయికి చెందిన విద్వాంసుడే ఋషి. వేదమంత్రాల అర్థాన్ని దర్శించినవాడు ఋషి (ద్రష్ట), ధర్మం యొక్క ఈశ్వరుడి యొక్క సాక్షాత్కరం కలిగినవాడు ఋషి. వేదం, వేదార్థాలను; విద్యల యొక్క గూఢార్థాలను ప్రత్యక్షంగా చూపించేవాడు ఋషి. ఆయనే ధర్మోపదేష్ట.

1. యాస్కాచార్యులొనర్చిన ఋషిశబ్ద నిర్వచనం

"ఋషిః దర్శనాత్. స్తోమాన్ దదర్శ ఇత్యౌపమన్యవః (ని.2-11) వేదార్థాలను, విద్యల రహస్యాలను సాక్షాత్కరించుకొని, సాక్షాత్కరింపచేసేవాడు ఋషి. మంత్ర ద్రష్ట కాబట్టి ఋషి అనబడునని ఔపమన్యవ ఆచార్యుని అభిప్రాయం. ఈ విధంగా "సాక్షాత్కృతధర్మాణః ఋషయో బభూవుః", అంటే ఋషులకు ఈశ్వరుడికి చెందిన ధర్మం సాక్షాత్కారమైంది.

2. బ్రాహ్మణములలో కూడా ఈ విశేషాలే వివరించబడ్డాయి.

1. యో వై జ్ఞాతోఽనూచానః స ఋషిరార్షేయః (శత.4.3.4.19)
2. ఏతే వై విప్రాః ఋషయః (శత.1.4.2.7)

మహర్షి మనువున్నూ ఋషిచర్చా ప్రసంగంలో ఈ విశేషతలనే పేర్కొన్నాడు.

3. "న హాయనైర్నపలితైః న విత్తేన న చ బన్ధుభిః
ఋషయశ్చక్రిరే ధర్మం యోఽనూచానః స నో మహాన్ (2.129)
4. "ఋషయో దీర్ఘసన్ధ్యత్వాత్ దీర్ఘమాయురవాప్నుయుః
ప్రజ్ఞాం యశశ్చ కీర్తిం చ బ్రహ్మవర్చసమేవ వా॥ (4.94)
5. "ఆర్షం ధర్మోపదేశమ్" (12.106)
6. అథ యదేవానుబ్రవీత । తేనర్షిభ్య ఋణం జాయతే తద్ధ్యేభ్య ఏతత్
కరోత్యృషీణాం నిధిగోప ఇతి హ్యనూచానమాహుః (శత-1.7.5.3)
7. అథార్షేయం ప్రవృణీతే । ఋషిభ్యశ్చైవేనమేతద్దేశేభ్యశ్చ నివేదయత్యం
మహావీర్యో యో యజ్ఞం ప్రాపదితి తస్మాదార్షేయం ప్రవృణీతే ॥ (శత.1.4.5.3)

అర్థం: సర్వవిద్యలను చదివి, ఇతరులకు విద్య నేర్పడం ఋషి కర్మ. ఆ విధంగా చదివి, చదువు చెప్పడం ద్వారా ఋషులకు ఋణపడతాం. గురువులకు (ఋషులకు) ఉత్తమోత్తమమైన పదార్థాల నివ్వడం ద్వారా ఆ ఋణం తీరిపోతుంది. ఈ ఋషులకు సేవలు చేయడం ద్వారా వారికి సుఖాన్ని కలిగించేవారమవుతాం. ఈ వ్యవహారమే విద్యానిధిని రక్షిస్తుంది. ఎవరు సర్వవిద్యల నెఱిగి, వాటిని ఇతరులకు నేర్పుతారో వారే ఋషులు. అదే ఋషికర్మ.

ఎవరు అధ్యయనం చేసి, అధ్యాపనార్థం విద్యార్థులను స్వీకరిస్తారో వారే ఋషులు, అదే ఋషికర్మ. ఎవడు ఆ కర్మను చేస్తూ ఆ ఋషులకు, విద్వాంసులకు (దేవతలకు) సంతోషం కలిగించే పదార్థాలను నివేదించి, సేవలొనర్చునో,

ఆ విద్వాంసుడు అత్యంత పరాక్రమశీలుడై విశేష జ్ఞానాన్ని పొందుతాడు. ఏ విద్వాంసుడు విద్యను గ్రహించునో, అతడిని ఋషి అని పిలుస్తారు (ద.ల.గ్ర.సం.).

ఈ ప్రమాణయుక్తమైన పరిశీలన వల్ల సిద్ధమైనవిషయమేమంటే జీవించిన మనుషులలో స్థాయిని బట్టిగాని, విశేష గుణాలను బట్టి గాని అనేక నామములు ఉన్నాయి. అవే పితరులు, ఋషులు, దేవతలు. సంక్షేపంగా చెప్పదలచినట్లయితే విద్యను ప్రత్యక్షంగా దర్శించిన ప్రముఖ గుణ సంపన్నులు ఋషులు. ఆచరణలో దివ్యగుణాలే ప్రధానంగా గల విద్వాంసులు దేవతలు (దేవ) పాలకగుణం గల వయోవృద్ధులైన విద్వాంసులు పితరులు.

పితృయజ్ఞ-బలివైశ్వదేవయజ్ఞములలో దేన్ని ఎన్నుకోవాలి?- ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *ఏకమప్యాశయేద్విప్రం పిత్రర్థే పాఞ్చయజ్ఞి కే ।*
న చైవాత్రాశయేత్కంచిద్వైశ్వదేవం ప్రతిద్విజమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*83*

తాత్పర్యం:- పంచ మహాయజ్ఞాలలో ఒకటైన పితృయజ్ఞం కోసం రోజూ ఒక్క బ్రాహ్మణుని కోసమైనా భోజనం పెట్టాలి. భూతయజ్ఞం అనబడే వైశ్వదేవం ద్వారా చిన్నచిన్న ప్రాణులకు ఆహారాన్ని సమకూర్చాలి. (ఉదా:- చీమలకు పంచదార వేయడం, బియ్యపు పిండి మొదలైనవి).

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ప్రమాణాల వల్ల ప్రక్షిప్తం.

1. అంతర్ వ్యతిరేకాలు

క. 82వ శ్లోకంలో ప్రతిరోజూ అన్నపానాలు, కంద మూలాలతో పితరులకు శ్రాద్ధం చేయాలని ఉంది. అంటే తల్లిదండ్రులు మొదలైన వయోవృద్ధులకు సేవాశుశ్రూషలు చేయాలని అర్థం. మనువు వయోవృద్ధులనే 'పితరులు' అన్నాడు చూడండి-2.126 (2.151)లో 'పితౄన్' పద ప్రయోగం ఉంది. ఈ శ్లోకంలోనైతే బ్రాహ్మణులకు తిండిపెట్టాలనీ లేదు, అసలు వాళ్ల ప్రసక్తే లేదు. అందుకని ఇది 83వ శ్లోకానికి వ్యతిరేకంగా ఉంది.

ఖ. 83వ శ్లోకంలో పితరుల కొరకు ఒక బ్రాహ్మణునికి భోజనం పెట్టాలనటం, మృతులైనవారి సంప్రదాయాన్ని ఆధారం చేసుకున్న విషయం, ఇది మనువుకు వ్యతిరేకం. [చూడండి 3.119 నుంచి 284 శ్లోకాలపై అంతర్ వ్యతిరేకాల సమీక్ష].

గ. ఇదే విధంగా వైశ్వదేవ యజ్ఞంలో బ్రాహ్మణుల భోజనాన్ని నిషేధించడం కూడా వ్యవస్థతో పొంతన లేకుండా ఉంది. ఎందుకంటే 84-92 శ్లోకాలలో వైశ్వదేవయజ్ఞంలో ఎవరికైనా తిండిపెట్టడం లేదా పెట్టకపోవడం- వీటిని గురించి ఏమీ చెప్పలేదు. అది భూతాలు = ప్రాణులకు మాత్రమే బలి పెట్టేయజ్ఞం కనుక, ఇక్కడ ఆ విషయం అసంగతం కూడా. ఈ శ్లోకం ఈ అంతర్ వ్యతిరేకాల కారణంగా ప్రక్షిప్తం.

84 నుండి 92వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

బలివైశ్వదేవయజ్ఞ విధానం-

వైశ్వ దేవస్య సిద్ధస్య గృహ్యేऽగ్నౌ విధిపూర్వకమ్ । మూలశ్లోక సం.**59**
ఆభ్యః కుర్యాద్దేవతాభ్యో బ్రాహ్మణో హోమమన్వహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**84**

టీక:- బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, అలాగే ద్విజవ్యక్తి, గృహ్యే అగ్నౌ = పాకశాలాగ్నిలో విధిపూర్వకంగా, సిద్ధస్య వైశ్వదేవస్య = సిద్ధమైన బలివైశ్వదేవయజ్ఞ భాగమైన భోజనాన్ని, అన్వహమ్ = ప్రతిదినం, ఆభ్యః దేవతాభ్యః హోమం కుర్యాత్ = ఈశ్వరీయ దివ్య గుణాలను చింతనం చేస్తూ ఆహుతులిస్తూ హవనం చేయాలి.

తాత్పర్యం:- 'వైశ్వదేవం నిమిత్తం సిద్ధం చేయబడిన ఆహారం, గృహాగ్ని హోమం మొదలైనవి ప్రతిరోజూ చేయాలి. దేవతల కోసం, అతిథులకోసం ఇంట్లో నిరంతరం అగ్నికి స్థానం కల్పించాలి' అని అర్థం. ॥84॥

ఋషి దయానందభాష్యం:- నాల్గోది వైశ్వదేవ యజ్ఞం - భోజనం సిద్ధమైనప్పుడు అందులో నుండి పులుపు, ఉప్పు, కారం లేనిది, నేయి, తీపిగల అన్నాన్ని తీసుకొని, పొయ్యి నుండి నిప్పులు వేరు చేసి, బలివైశ్వదేవ మంత్రాలతో వినయపూర్వకంగా నిత్యం హోమం చేయాలి. ఈ మంత్రాల కొరకు (సత్యా.ప్ర. 4సము చూడండి.).

వివరణ

యజ్ఞంలో లవణయుక్త ఆహార పదార్థాన్ని వేయరాదు: యజ్ఞంలో లవణయుక్త పదార్థాన్ని ఆహుతి ఇచ్చే విధానం లేదు. లవణయుక్తాన్నమును స్వయంగా ఉపయోగించుకొని, లవణరహితమైన అన్నాదులను యజ్ఞంలో ఆహుతులివ్వాలి. 6-11లో ఈ విషయాన్ని సూచించాడు.

ఇది మనుకృతం- ప్రామాణికం

అగ్నేస్సోమస్య చైవాదౌ తయోశ్చైవ సమస్తయోః । మూలశ్లోక సం. **60**
విశ్వేభ్యశ్చైవ దేవేభ్యో ధన్వంతరయ ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **85**

టీక:- ఆదౌ = మొదట, అగ్నేః సోమస్య చ ఏవ = అగ్ని-పూజ్య పరమేశ్వరుడు మరియు సోమ = సర్వ పదార్థాలను ఉత్పన్నం చేసి, పోషించి సుఖాలన్నిచ్చే "సోమరూప" పరమాత్ముడి కోసం "ఓం అగ్నయే స్వాహా, ఓం సోమాయ స్వాహా"' ఈ మంత్రముల ద్వారా, చ = మరియు, తయోః సమస్తయోః = ఆ దేవతల యొక్క సర్వవ్యాప్తరూపముల కోసం, సంయుక్తరూపంలో- "ఓం అగ్నీషోమాభ్యాం స్వాహా" ఈ మంత్రం ద్వారా, అగ్ని = ప్రాణం సర్వజీవకోటి జీవనాలకు కారణం మరియు సోమ = అపానం దుఃఖనాశ కారణం, చ = మరియు, విశ్వేభ్యః దేవేభ్య ఏవ = విశ్వదేవులు విశ్వాన్ని ప్రకాశింపచేస్తూ, సంచాలనం చేసే ఈశ్వరీయ గుణాల కోసం "ఓం విశ్వేభ్యో దేవేభ్యః స్వాహా" ఈ మంత్రం ద్వారా, చ = మరియు, ధన్వన్తరయే = జన్మమరణాది సమయాలలో సంక్రమించే రోగాలను నాశనం చేసే ఈశ్వరీయ గుణాల కోసం "ఓం ధన్వన్తరయే స్వాహా" ఈ మంత్రంతో బలి వైశ్వదేవ యజ్ఞంలో ఆహుతి ఇవ్వాలి.

తాత్పర్యం:- మొదట అగ్నికీ, సోమునకూ, అగ్నీషోములకూ, విశ్వదేవతలకూ, ధన్వంతరికీ హోమం చేయాలి.॥85॥

ఇది మనుకృతం-ప్రామాణికం

1. అగ్నయే స్వాహా **2.** సోమాయ స్వాహా, **3.** అగ్నీషోమాభ్యాం స్వాహా, **4.** వేశ్వేభ్యో దేవేభ్యః స్వాహా, **5.** ధన్వంతరయే స్వాహా.

కుహ్వై చైవానుమత్యై చ ప్రజాపతయ ఏవ చ । మూలశ్లోక సం. **61**
సహద్యావాపృథివ్యోశ్చ తథా స్విష్టకృతేఽన్తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **86**

టీక:- చ = మరియు, కుహ్వై = అమావాస్యకు అధిష్ఠాత్రి అయిన ఈశ్వరీయ శక్తి అంటే కృష్ణపక్షాన్ని సృష్టించిన పరమేశ్వరశక్తి కోసం "ఓం కుహ్వై స్వాహా", చ = మరియు, అనుమత్యై = పూర్ణిమకు అధిష్ఠాత్రి అయిన ఈశ్వరీయ శక్తి అంటే శుక్లపక్షాన్ని నిర్మాణం చేసే పరమాత్మ శక్తి కోసం లేదా పరమేశ్వరుడి చితిశక్తియే "ఓం అనుమత్యై స్వాహా" మంత్రంతో, ప్రజాపతయ ఏవ = సర్వ జగదుత్పాదకుడైన పరమేశ్వరుడి సామర్థ్య గుణాల కోసం "ఓం ప్రజాపతయే స్వాహా" అనే మంత్రం ద్వారా, సహ ద్యావా పృథివ్యః = ఈశ్వరుడి ద్వారా ఉత్పన్నమైన ద్యులోక పృథ్వీ లోకాల పుష్టి కోసం 'ఓం సహ ద్యావాపృథివీభ్యాం స్వాహా' మంత్రంతో, **తథా చ అన్తతః** = అలాగే అంతంలో "**స్విష్టకృతే** = సుఖమిచ్చే ఈశ్వరీయ గుణాల కోసం "ఓం స్విష్టకృతే స్వాహా" మంత్రంతో ఆహుతి ఇవ్వాలి.

తాత్పర్యం:- 6. కుహ్వై స్వాహా, 7. అనుమత్యై స్వాహా, 8. ప్రజాపతయే స్వాహా, 9. **'ద్యావాపృథివీభ్యాం స్వాహా'** అని హోమము చేసి, **'అగ్నయే స్విష్టకృతే స్వాహా'** అని స్విష్టకృద్ధోమం చేయాలి.॥86॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం సమ్యగ్ఘవిర్హుత్వా సర్వదిక్షు ప్రదక్షిణమ్ । మూలశ్లోక సం. **62**
ఇన్ద్రాన్తకాప్పతీన్దుభ్యః సాను గేభ్యో బలిం హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **87**

టీక:- **ఏవం** = ఈ ప్రకారంగా, **సమ్యక్ హవిః హుత్వా** = చక్కగా పైన పేర్కొన్న ఆహుతులనిచ్చి, **సర్వదిక్షు ప్రదక్షిణమ్** = అన్ని దిక్కులవైపు ప్రదక్షిణం చేసి, **సానుగేభ్యః ఇన్ద్ర + అన్తకః+ అప్పతి + ఇన్దుభ్యః** = పరమేశ్వరుడి యొక్క సహచరి గుణాలు, **ఇన్ద్ర** = సర్వైశ్వర్యయుక్తంగా ఉండటం, **అన్తక** = యమ అంటే న్యాయకారిగా ఉండటం లేదా ప్రాణుల యొక్క జన్మ మరణాలను నియంత్రించే గుణం, **అప్పతి**= వరుణుడు. అంటే అందరికీ వరణీయులైన ఇంద్ర సోముడు, అంటే ఆనందదాయకుడుగా ఉండటం. వీటి కోసం స్మరణపూర్వకంగా క్రమశః **"ఓం సానుగాయేన్ద్రాయ నమః'** మంత్రంతో, పూర్వదిక్కున, **"ఓం సానుగాయ యమాయ నమః"** మంత్రంతో దక్షిణపు దిక్కున **"ఓం సానుగాయ వరుణాయ నమః"**తో పశ్చిమ దిక్కున, **"ఓం సానుగాయ సోమాయనమః"** మంత్రంతో ఉత్తర దిక్కున, **బలిం హరేత్**= భోజనభాగాన్ని బలి కోసం ఉంచాలి.

తాత్పర్యం:- ఇలా చక్కగా హోమం గావించి, దిక్కులన్నిటియందు ప్రదక్షిణముగా ఇంద్ర, యమ, వరుణ, సోములకూ, వారి వారి దిక్కులందు బలిహరణం వేయాలి.॥87॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మరుద్భ్య ఇతి తు ద్వారి క్షిపేదప్స్వద్భ్య ఇత్యపి । మూలశ్లోక సం. **63**
వనస్పతిభ్య ఇత్యేవం ముసలోలూఖలే హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **88**

టీక:- **మరుద్భ్యః ఇతి తు ద్వారి మరుత్**=జీవనానికి సంచాలకుడైన ప్రాణ స్వరూపుడైన పరమాత్మ స్మారకపూర్వకంగా **"ఓం మరుద్భ్యోనమః"** మంత్రంతో ద్వారం వద్ద, **అద్భ్యః ఇతి + అపి అప్సు** = సర్వత్ర వ్యాప్తుడై సంపూర్ణ జగత్తుకు "ఆశ్రయరూపుడైన పరమాత్మను స్మరిస్తూ" **"ఓం అద్భ్యో నమః"** అనే మంత్రంతో, బలంతో, **క్షిపేత్** = బలివేయాలి. **ఏవం** = ఈ విధంగానే, **వనస్పతిభ్యః** = వనస్పతుల సమీపంలో, **"ఓం వనస్పతిభ్యో నమః"**తో, **ముసల+ఉలూఖలే** = రోకలి +రోలు దగ్గర, **హరేత్** = బలిని ఉంచాలి.

తాత్పర్యం:- ద్వారం దగ్గర **"మరుద్భ్యః స్వాహా"** అని, మరుత్తులకు, నీటియందును, **"అద్భ్యః స్వాహా"** అని, జలాధిదేవతలకు రోలు, రోకళ్ళయందు **"వనస్పతిభ్యః స్వాహా"** అని వనదేవతలకు బలిని ఉంచాలి.॥88॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉచ్ఛీర్షకే శ్రియై కుర్యాద్భద్రకాల్యై చ పాదతః । మూలశ్లోక సం. **64**
బ్రహ్మవాస్తోష్పతిభ్యాం తు వాస్తుమధ్యే బలిం హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **89**

టీక:- **శ్రియై ఉచ్ఛీర్షకే** = అందరికీ సేవ్యుడైన పరమేశ్వరుడి సేవ వల్ల రాజ్యశ్రీ లేదా లక్ష్మీ ప్రాప్తి కోసం **"ఓమ్ శ్రియై నమః"** అని, ఈశాన్య కోణం వైపు. **చ** = మరియు, **భద్రకాల్యై పాదతః** = పరమాత్మ యొక్క కల్యాణకారకశక్తి ప్రాప్తి కోసం, **"ఓం భద్రకాల్యై నమః"** అని నైరుతి కోణం వైపు, **కుర్యాత్** = బలి భాగం పెట్టాలి. **తు** = మరియు, **బ్రహ్మవాస్తోష్పతిభ్యాం** = బ్రహ్మ-వేదవిద్యా ప్రాప్తి కోసం, వేదవిద్యాప్రదాతయైన పరమాత్మ కోసం, **వాస్తోష్పతిః** =

గృహసంబంధమైన పదార్ధదాయ భాగం ఈశ్వరుడి సహాయం కోసం **"ఓమ్ బ్రహ్మపతయే నమః", 'ఓమ్ వాస్తు పతయే నమః'** వీటి ద్వారా **వాస్తు మధ్యే బలిం హరేత్** = గృహ మధ్యభాగంలో బలిభాగాన్ని పెట్టాలి.

తాత్పర్యం:- ఈశాన్యదిశయైన వాస్తుపురుషుడి శిరోభాగంలో **"శ్రియై నమః"** అని, అతడి పాదభాగంలో **"భద్రకాళ్యై నమః"** అని, నైఋతి దిక్కున వాస్తుమధ్యమున **"బ్రహ్మణే స్వాహా"** అని బ్రహ్మకూ, **"వాస్తోష్పతయే స్వాహా"** అని వాస్తుపురుషుడికీ బలి భాగాన్ని పెట్టాలి.॥89॥

ఇది మనుకృతం-ప్రామాణికం

విశ్వేభ్యశ్చైవ దేవేభ్యో బలిమాకాశ ఉత్క్షిపేత్ । మూలశ్లోక సం.**65**
దివా చరేభ్యో భూతేభ్యో నక్తంచారిభ్య ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**90**

టీక:- **చ** = మరియు, **విశ్వేభ్యః దేవేభ్యః** = ఈ లోకంలో సాధకగుణ ప్రాప్త్యర్థం విశ్వ సంచాలకుడైన పరమాత్మ లేదా విద్వాంసుల దివ్య గుణ ప్రాప్తి కోసం, **ఆకాశే బలిం ఉత్క్షిపేత్, "క్షం విశ్వేభ్యః దేవేభ్యః నమః"** అని, ఆకాశం వైపు లేదా గృహోపరి భాగంలో పెట్టాలి, **చ** = అలాగే **దివాచరేభ్యః భూతేభ్యః** = పగలు తిరిగే ప్రాణులకు **"ఓమ్ దినే చరేభ్యో భూతేభ్యః నక్తం చారిభ్యః ఏవ"**= రాత్రివేళల్లో తిరిగే ప్రాణులకు **"ఓం నక్తం చరిభ్యో భూతేభ్యో నమః"** మంత్రం ద్వారా బలినుంచాలి.

తాత్పర్యం:- ఈ లోకంలో సాధకగుణ ప్రాప్త్యర్థం విశ్వసంచాలకుడైన పరమాత్మ దివ్యగుణ ప్రాప్తికోసం **'ఆకాశే బలిం ఉత్క్షిపేత్, క్షం విశ్వేభ్యః దేవేభ్యం నమః'।** అని. ఆకాశం వైపు లేదా గృహోపరిభాగంలో, **"దివా చరిభ్యో, నక్తం చరేభ్యో భూతేభ్యః స్వాహా"** అని పగలు సంచరించే రాత్రి చరించే భూతాలకూ బయలున బలి ఇవ్వాలి.॥90॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పృష్ఠవాస్తుని కుర్వీత బలిం సర్వాత్మభూతయే । మూలశ్లోక సం.**66**
పితృభ్యో బలిశేషం తు సర్వం దక్షిణతో హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**91**

టీక:- **సర్వాత్మ భూతయే** = సమస్త ప్రాణులలో వ్యాప్తమైన పరమేశ్వరుడి అస్తిత్వం స్మరించడం కోసం **"ఓం సర్వాత్మ భూతయే నమః"** అని, **పృష్ఠవాస్తుని బలిం కుర్వీత** = గృహానికి వెనుక భాగంలో బలిభాగాలను ఉంచాలి. **సర్వం బలిశేషం తు** = మిగిలిన బలిభాగంలో, **పితృభ్యః** = తల్లి, తండ్రి, ఆచార్యుడు, అతిథి, భృత్యుడు మొ॥ వారికి సమ్మానపూర్వకంగా భోజనం చేయించే భావనను స్మరించడం కోసం **"ఓం పితృభ్యః స్వధాయిభ్యః స్వధా నమః", దక్షిణతః హరేత్** = గృహానికి దక్షిణభాగంలో ఉంచాలి.

తాత్పర్యం:- ఇంటి వెనుక భాగంలో "సర్వాత్మభూతయే స్వాహా" అని సర్వాత్మభూతి కోసం బలి భాగం ఉంచాలి. మిగిలిన బలిభాగం తల్లి, తండ్రి, ఆచార్యుడు, అతిథి, భృత్యుడు మొ॥న వారికి సమ్మాన పూర్వకంగా భోజనం చేయించే భావనను స్మరిస్తూ 'పితృభ్యః సాహ్వా' గృహానికి దక్షిణభాగంలో పితరులకు ఉంచాలి.॥91॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శునాం చ పతితానాం చ శ్వపచాం పాపరోగిణామ్ । మూలశ్లోక సం.**67**
వాయసానాం కృమీణాం చ శనకైర్నిర్వపేద్భువి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**92**

టీక:- **చ** = మరియు, **శునాం పతితానాం శ్వపచాం పాపరోగిణామ్ వాయసానాం చ కృమీణాం** = కుక్కలు, పతితులు, చండాలురు, పాపరోగులు, కాకులు-కృములు ఈ ఆరు నామాల పేరిట ఆరుభాగాలు చేసి, **భువి శనకైః నిర్వపేత్** = బలిభాగాలను భూమిపై పెట్టాలి.

ఋషి దయానందభాష్యం:- 'శ్వభ్యః స్వాహా' అని కుక్కలకు, పతితులకు, చండాలులకు, కుష్ఠ మొదలైన దీర్ఘరోగులకు, కాకులకు, ఇతరేతర కీటకాలకు ఇలా ఆరునామాల పేరిట ఆరుభాగాలు చేసి, బలిభాగాలను భూమిపై ఆకులు వేసి ఉంచాలి. మట్టిలో కలువకుండా చూడాలి. ॥92॥

ఈ ప్రకారంగా, **'శ్వభ్యో నమః పతితేభ్యో నమః శ్వపచేభ్యో నమః, పాపరోగిభ్యో నమః, వాయసేభ్యో నమః, కృమిభ్యో నమః'** అని బలి భాగం నుంచి తరవాత ఎవరైనా ఆకలిగా ఉన్న ప్రాణికి, లేదా కుక్కలు, కాకులకు పెట్టాలి. ఇక్కడ నమః శబ్దానికి "అన్నమని అర్థం. కుక్కలకు, చండాలురకు, పాపరోగులకు, కాకులకు, కృములకు, చీమ మొ॥ వాటికి అన్నం పెట్టడం మనుస్మృత్యాదుల యొక్క విధి. (స.ప్ర. 4వ సము.).

ఈ శ్లోకం ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *ఏవం యస్సర్వభూతాని బ్రాహ్మణో నిత్యమర్చతి ।*
స గచ్ఛతి పరం స్థానం తేజోమూర్తిః పథర్జునా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **93**

తాత్పర్యం:- ఇదే విధంగా సకలభూతతృప్తి కోసం బ్రాహ్మణుడు బలిహరణమనే కర్మను ప్రతిదినం ఆచరిస్తూ తేజఃస్వరూపుడై బ్రహ్మతేజంతో వెలుగుతూ సరైన దిశలో పరమాత్మను పొందుచున్నాడు.॥93॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ప్రమాణాల ఆధారంతో ప్రక్షిప్తం.

1. ప్రసంగవ్యతిరేకం

ఈ శ్లోకం ముందు వెనుకల గల వర్ణనక్రమాన్ని భంగం చేసింది. 92వ శ్లోకంలో బలివైశ్వ దేవ విధానం ముగిసింది. 94లో **"కృత్వా ఏతత్ బలికర్మ"** అంటూ చెప్పటం చేత, ఆ విధానం పూర్తయిన తర్వాత ఈ శ్లోకం ఉండాలి. అలా ఉంటేనే రెండు శ్లోకాల భాష ప్రకారం వాక్యాలు క్రమం కలుస్తుంది. ఈ రెండింటికీ మధ్య 93వ శ్లోకంలో బలివైశ్వదేవానికి ఫలం గురించి చెప్పటం సరిగ్గా కలవటం లేదు కనుక, ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలో బలివైశ్వ దేవ యజ్ఞం నుంచి ముక్తి పొందటమే ఉంది. కానీ మనువు ఎన్నెన్నో శ్రేయస కర్మల నుంచి ముక్తి పొందటంగా దీన్ని భావించాడు [12.82-116]. అందుచేత ఈ శ్లోకంలోని విషయం మనుసమ్మతం కాకపోవటం చేత ప్రక్షిప్తం.

ఇది మనుకృతం-ప్రామాణికం

అతిథి యజ్ఞ విధానం-

కృత్వైతద్బలికర్మైవమతిథిం పూర్వమాశయేత్ । మూలశ్లోక సం.**68**
భిక్షాం చ భిక్షవే దద్యాద్విధివద్బ్రహ్మచారిణే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**94**

టీక:- ఏతత్ బలికర్మ కృత్వా = ఉపరోక్త (3.59-67) బలివైశ్వ దేవ యజ్ఞాన్ని చేసి, **పూర్వమ్ అతిథిం ఆశయేత్** = ముందుగా అతిథికి భోజనం పెట్టాలి, చ = అలాగే, **భిక్షవే బ్రహ్మచారిణే విధివత్ భిక్షాం దద్యాత్** = భిక్షకు వచ్చిన బ్రహ్మచారుల-గురుకుల విద్యార్థులకు భిక్ష పెట్టాలి.

తాత్పర్యం:- ఈ బలికర్మ అయిన తరవాత గృహస్థు అతిథికి - సన్న్యాసికి భోజనం పెట్టాలి. ఆ తరువాత భిక్షకు వచ్చిన బ్రహ్మచారులకు-విద్యార్థులకు భిక్షవెట్టాలి.॥94॥

95 నుండి 98వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* భిక్ష-హవ్యకవ్యముల విధానం-

* *యత్పుణ్యఫలమాప్నోతి గాం దత్వా విధివద్గురోః ।*
తత్పుణ్యఫలమాప్నోతి భిక్షాం దద్యాద్ద్విజో గృహీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***95***

తాత్పర్యం:- ఇట్లు భిక్షనిచ్చినందువల్ల గృహస్థుడు తన గురువుకు శాస్త్రమర్యాదననుసరించి గోదానం చేసినంత ఫలితాన్ని పొందుతున్నాడు.॥95॥

* *భిక్షామప్యుదపాత్రం వా సత్కృత్య విధిపూర్వకమ్ ।*
వేదతత్త్వార్థవిదుషే బ్రాహ్మణాయోపపాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***96***

తాత్పర్యం:- వేదవిదుడైన అలాంటి బ్రహ్మచారికి భిక్ష వేసేంత శక్తి చాలనప్పుడు, అతణ్ణి అర్చించి శక్త్యానుసారం శాకమో, ఫలమో చివరికి మంచినీళ్లో ఇవ్వాలి.॥96॥

* *నశ్యన్తి హవ్యకవ్యాని నరాణామవిజానతామ్ ।*
భస్మీభూతేషు విప్రేషు మోహాద్దత్తాని దాతృభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***97***

తాత్పర్యం:- ఏ కారణం వల్ల గానీ, వేదవిదుడైన బ్రహ్మచారిని అర్చించడానికి తగిన అవకాశం లేక, మోహం వల్ల అంతటి సద్విజుని కనుగొనలేకపోతే, దొరికిన అపాత్రుడినే పూజిస్తే అతడికిచ్చే హవ్యకవ్యాలు నిష్ప్రయోజనం. ॥97॥

* *విద్యాతపస్సమృద్ధేషు హుతం విప్రముఖాగ్నిషు ।*
నిస్తారయతి దుర్గాచ్చ మహతశ్చైవ కిల్బిషాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***98***

తాత్పర్యం:- బ్రహ్మ వర్చస్సు గల బ్రాహ్మణుడి నిమిత్తం ఇచ్చే దానాలు ఫలిస్తాయి. అగ్ని ద్వారా వ్రేల్చబడిన హవ్యకవ్యాలకున్నంత శక్తికలిగిన ఈ దానాల వల్ల వ్యాధులు, శత్రుభయం, పాపాలను నివారించుకోవచ్చు. ॥98॥

ప్రక్షిప్తాల పరిశీలన

95 నుంచి 98 వరకు గల శ్లోకాలు కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తాలవుతాయి:

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. 94వ శ్లోకంలో బలివైశ్వదేవ యజ్ఞం పూర్తయిన తర్వాత,**"అతిథిం పూర్వం ఆశయేత్"** అని అతిథి యజ్ఞవర్ణన సంకేతం ఉంది. ఈ శ్లోకంలో ఎంత అవసరమో అంత వరకు భిక్షను గురించి కూడా ఉంది. 99వ శ్లోకంలో చెప్పినట్లుగా వచ్చిన అతిథిని ఎలా సత్కరించాలి అనేది ముందు చెప్పటం తెలివిగల పని అవుతుంది. ఇలాగైతే 94వ శ్లోకం, 99వ శ్లోకం చక్కని పొంతనతో ఉంటాయి. వీటి మధ్య భిక్షాఫలం, బ్రాహ్మణులకు హవ్యకవ్యాలు ఇవ్వటం మొదలైన విషయాలు చెప్పటం ఈ పొంతనను భగ్నం చేశాయి కనుక, ఈ శ్లోకం ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 96-98శ్లోకాలలో విద్యని నేర్చినవారు, నేర్వనివారు అయిన బ్రాహ్మణుల పట్ల చూపిన భేదభావం ఉంది. దీన్ని బట్టి ఈ శ్లోకం కర్మణా వర్ణవ్యవస్థ శిథిలమై, జన్మతో పాటించబడిన కాలంలో రచించబడిందని తెలుస్తోంది. మనువు మాత్రం అధ్యయన అధ్యాపనలు చేసేవారినే బ్రాహ్మణులుగా భావించాడు [1.87-88; 10.74-76]. అందుచేత విద్యలేనివాడు బ్రాహ్మణుడు కాడు. ఈ విధంగా ఈ వర్ణన మనువు సంప్రదాయానికి వ్యతిరేకంగా ఉంది.

ఖ. 98వ శ్లోకంలో పాపాలనుంచి బయట పడే విషయం కూడా మనువు 4.240వ శ్లోకానికి వ్యతిరేకంగా ఉంది. ఆ శ్లోకంలోనూ, 12.3-9 శ్లోకాలలోనూ ప్రతికర్మకూ ఫలితం తప్పక లభిస్తుందని ఉంది.

3. శైలీగత ఆధారాలు

95వ శ్లోకంలో భిక్షాదానానికి ఆవును దానం చేసిన ఫలం కలుగుతుందనటం, 97లో దానఫలం తొలగిపోయే పద్ధతి, 98లో పాపలను తొలగించుకునే పద్ధతి- ఇవి నిరాధారాలు, సహేతుకాలు కానివి, అతిశయోక్తులతో కూడినవి. మనువు చెప్పిన పద్ధతులలో ఈ లోపాలు ఉండవు.

అతిథి యజ్ఞ పద్ధతి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

సంప్రాప్తాయ త్వతిథయే ప్రదద్యాదాసనోదకే । మూలశ్లోక సం.**69**
అన్నం చైవ యథాశక్తి సత్కృత్య విధిపూర్వకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**99**

టీక:- తు = మరియు, **సంప్రాప్తాయ అతిథయే** = అరుదెంచిన అతిథిని, **విధిపూర్వకం సత్కృత్య** = వ్యవహారోచిత విధిననుసరించి, సత్కరించి, **యథాశక్తి** = శక్తిననుసరించి, **ఆసన+ఉదకే చ అన్నం ఏవ** = ఆసనం, నీళ్ళు అలాగే అన్నం కూడా, **ప్రదద్యాత్** = ప్రదానం చేయాలి.

తాత్పర్యం:- తనకు తానై గృహానికి వేంచేసిన అతిథికి ఆసనం, పాద్యం, అర్ఘ్యం మొదలైన ఉపచారాలను చేసి, భోజనం ప్రధానం చేయడం సదాచారం.॥99॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *శిలానప్యుఞ్ఛతో నిత్యం పఞ్చాగ్నీనపి జుహ్వతః ।*
సర్వం సుకృతమాదత్తే బ్రాహ్మణోఽనర్చితో వసన్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***100***

తాత్పర్యం:- పొలంలో రాలు పరిగె గింజలు ఏరి తెచ్చి వాటితో దేహయాత్ర నిర్వర్తిస్తున్నా, పంచాగ్నుల మధ్య నిల్చి, తపస్సు చేసేవారైనా తమ ఇంటికేతెంచిన అతిథిని సత్కరించకపోతే, ఆ తపస్సు వల్ల కలిగిన పుణ్యం సైతం హరించుకు పోతుంది.

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం:

1. ప్రసంగ వ్యతిరేకం

99వ శ్లోకంలో ఇంటికొచ్చిన అతిథికి యథాశక్తి సత్కారాలు జరపాలని ఉంది. 101లో ఆ **'యథాశక్తి'** కి అర్థవాదంలో వ్యాఖ్యాన ముంది. ముఖ్యంగా అతిథి మర్యాదలు చేయకుంటే వచ్చే ఫలితాన్ని గురించిన అసంగత కథనం ఉంది. దీనివల్ల వాటి క్రమం దెబ్బతిన్నది. అందుచేత ప్రసంగ వ్యతిరేకం కనుక ఈ శ్లోకం ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలో 'అతిథిమర్యాదలు చేయని గృహస్థు పుణ్యాలన్నీ అతిథి హరిస్తాడు' అని చెప్పటం మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు 4.240లో కర్తనే కర్మల స్వయంభోక్తగా పేర్కొన్నాడు. అందుచేత ఎవరో రెండవ వ్యక్తి గృహస్థు, పాపపుణ్యాలను తీసుకువెళ్లలేడు. ఈ అంతర్ వ్యతిరేకత కారణంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

3. శైలీగత ఆధారం

ఈ శ్లోకంలో **'అతిథిమర్యాదలు చేయకపోవటం అనే ఒక్కకారణం చేత గృహస్థు చేసిన అన్ని పుణ్యాలూ పోతాయి'** అనడంలోని శైలి ప్రక్షిప్తం. ఇది సహేతుకం కాదు. పైగా అతిశయోక్తి. అందుచేత ఈ శ్లోకం మౌలికం కాదు.

101వ శ్లోకం నుండి 109వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

సజ్జనుల గృహాలలో సత్కారార్థం సదా లభించే వస్తువులు -

తృణాని భూమిరుదకం వాక్ చతుర్థీ చ సూనృతా । మూలశ్లోక సం.70
ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యన్తే కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.101

టీక:- **తృణాని** = కూర్చోడానికి ఆసనం, **భూమిః** = కూర్చోడానికి గాని, పడుకోడానికి గాని స్థానం, **ఉదకం** = నీళ్లు, **చ** = మరియు, **సూనృతా వాక్** = సత్కారయుక్తమైన తియ్యని మాటలు, **ఏతాని+అపి** = సత్కరించడానికి కావలసిన ఈ విషయములు లేదా వస్తువులకు, **సతాం గేహే** = శ్రేష్ఠ వ్యక్తుల గృహాలలో, **కదాచన న +ఉచ్ఛిద్యన్తే** = ఎప్పుడు కూడా లోపముండదు. లేకుండా ఉండవు. శ్రేష్ఠులు సభ్యులైన వ్యక్తుల గృహాలలో వీటి ద్వారా తప్పక సత్కారం జరుగుతూంటుంది.

తాత్పర్యం:- అతిథికి భోజనం సమకూర్చేందుకు శక్తిలేనప్పుడు కూర్చోడానికి గానీ పరుండడానికి గానీ అలసటతీర్చుకోడానికి గాని కాస్త చోటునైనా కల్పించవచ్చు! కాళ్ళు చేతులు కడుక్కోడానికి, దప్పిక తీర్చుకోడానికి మంచి నీళ్లయినా ఇవ్వవచ్చు! చక్కగా మార్గాయాసాన్ని పోగొట్టే తియ్యని మాటలతో సేద తీర్చవచ్చు! సజ్జనులైనవారింట వీటికి కొదువేమీ ఉండదు కదా! ॥101॥

అతిథిలక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకరాత్రం తు నివసన్నతిథిర్బ్రాహ్మణః స్మృతః । మూలశ్లోక సం.71
అనిత్యం హి స్థితో యస్మాత్తస్మాదతిథిరుచ్య తే ॥ ప్రక్షిప్త శ్లోక సం.102

టీక:- **బ్రాహ్మణః** = విద్వాంసుడైన వ్యక్తి, **ఏకరాత్రం తు నివసన్** = ఒక్క రాత్రి మాత్రమే పరగృహమందున్నట్లయితే, **అతిథిః స్మృతః** = అతిథి అనబడును, **యస్మాత్ హి అనిత్యం స్థితః** = ఎందుకంటే, అతడు నిత్యం ఒకేచోట ఉండడు. లేదా ఎవరి స్థానం అనిశ్చితమో, ఆ కారణంగా, అతడిని, **అతిథిః ఉచ్యతే** = అతిథి అంటారు.

ఋషి దయానందభాష్యం:- ఇతరుల ఇళ్లలో ఒక్కరాత్రి మాత్రమే నివసించే బ్రాహ్మణుణ్ణి అతిథి అనాలి. అతడొక్క తిథికాలమైనా ఒక ఇంట స్థిరంగా ఉండడు కాబట్టి అతడు అతిథి అనబడతాడు.

ఎవరి రాకకు ఒక నిశ్చితమైన తిథి లేదో, ఎంతకాలముంటాడో కూడా అనిశ్చితమో, అతణ్ణి అతిథి అనబడును. ఎవరు విద్వాంసులో ఎవరి రాక-పోకలు-నివాసం అనిశ్చితమో, వారు ఏ వర్ణం వారైనా, వారికి సేవలు చేయడం ఒక శ్రేష్ఠ కర్మ (పూ.ప్ర. 143). ॥102॥

ఎవరు అతిథులు కారు?- ఇది మనుకృతం-ప్రామాణికం

నైక గ్రామీణమతిథిం విప్రం సాఙ్గతికం తథా । మూలశ్లోక సం.72
ఉపస్థితం గృహే విద్యాద్భార్యా యత్రాగ్నయోఽపి వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.103

టీక:- **యత్ర భార్యా అపివా అగ్నయః** = ఏ గృహంలో గృహిణి ఉందో మరియు పంచమహా యజ్ఞాల అగ్ని ప్రజ్వరిల్లుతుంటుందో లేదా పాకాగ్ని వెలుగుతుందో అంటే, **ఏక గ్రామీణం తథా సాఙ్గతికం విప్రం గృహే ఉపస్థితం** = ఒకే గ్రామంలో ఉండేవాడు, మిత్రుడైన విద్వాంసుడు గృహానికి వచ్చినట్లయితే అతడిని, **అతిథిం న విద్యాత్** = అతిథి అని అనుకోరాదు.

తాత్పర్యం:- ఏ గృహంలో గృహిణి ఉందో మరియు పంచమహాయజ్ఞాల అగ్ని ప్రజరిల్లుతుంటుందో ఒకే గ్రామంలో ఉండేవాడు, మిత్రుడైన విద్వాంసుడు గృహానికి వచ్చినట్లయితే అతడిని అతిథి అని అనుకోరాదు.॥103॥

పరగృహంలో భోజనం చేయాలనే భావన వల్ల పాపం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఉపాసతే యే గృహస్థాః పరపాకమబుద్ధయః । మూలశ్లోక సం.**73**
తేన తే ప్రేత్య పశుతాం వ్రజంత్యన్నాదిదాయినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**104**

టీక:- **యే గృహస్థాః** = గృహస్థులై ఉండి, **పరాపాకమ్ ఉపాసతే** = పరుల గృహాలలో భోజనం చేయాలని కోరుకొంటారో, **తే అబుద్ధయః తేన** = వారు బుద్ధిహీన గృహస్థులు, ఇతరుల నుండి ప్రతిగ్రహరూపమనే పాపం చేసి, **ప్రేత్య** = మరుజన్మలో, **అన్నాదిదాయినామ్ పశుతాం వ్రజన్తి** = అన్నదాతల గృహాలలో పశువులుగా జన్మిస్తారు. ఎందుకంటే, అన్యుల నుండి అన్నాదులను స్వీకరించడం అతిథుల పని. గృహస్థుల పనికాదు.

ఋషి దయానందభాష్యం:- గృహస్థులై ఉండి పరాన్న భుక్కులకు, బుద్ధిహీనత చేత- సోమరితనం చేత ఏ గృహస్థులు నిత్యం పరాన్నం కోరుతూంటారో అలాంటివారికి పాపం తగిలి, మృతిచెందిన అనంతరం కలిగే జన్మ పశు జన్మ. అది కూడా ఆ యా అన్నదాతల గృహాలలోనే సంభవిస్తుంది. (సం.వి.గృహస్థాశ్రమ ప్రకరణం) ॥104॥

వివరణ:- ఏ గృహస్థుడు లోభలాలసుడై ఇతరుల ఇంటి భోజనానికి అలవాటు పడి తన ఖర్చులను మిగిల్చుకోవాలని భావించి జీవనాన్ని సాగిస్తాడో అట్టివాడు పరజన్మలో వారి ఇంటిలో పశువుగా పుడుతాడు. అతనిలో పశుత్వ సంస్కారం అధికంగా ఉండడం వల్ల, అలా జరుగుతుంది.

ఇంటికి వచ్చిన అతిథిని త్రిప్పి పంపించరాదు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అప్రణోద్యోఽతిథిస్సాయం సూర్యోఢో గృహమేధినా । మూలశ్లోక సం.**74**
కాలే ప్రాప్త స్త్వకాలే వా నాస్యానశ్నన్ గృహే వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**105**

టీక:- **గృహమేధినా** = గృహస్థులకిది ధర్మం, **సూర్యోఢః అతిథిః అప్రణోద్యః సాయం** = సాయంకాలం గానీ సూర్యాస్తమయంలో గానీ వచ్చిన అతిథిని తిరిగి పంపించరాదు, **కాలే ప్రాప్తః వా అకాలే** = సమయానికి వచ్చినా, లేదా సమయం గడిచిన తరవాత వచ్చినా, **అస్యగృహే అనశ్నన్ వసేత్** = ఈ గృహస్థుడి గృహంలో ఏ అతిథి కూడా భోజనం చేయకుండా ఉండరాదు.

తాత్పర్యము:- సూర్యాస్తమయానంతరం వచ్చే అతిథిని గృహస్థుడు వెళ్లిపోనివ్వకూడదు. భోజన సమయానికి గాని- భోజన వేళ అతిక్రమించి వచ్చినా గాని అతిథికి తప్పక భోజనం పెట్టాలి. ఆ విధంగా అతిథి సత్కారపు మర్యాద తెలియని గృహస్థునింట ఉండకూడదు. ॥105॥

అతిథి పూజనం సుఖదాయకం, ఆయుర్వర్ధకం, కీర్తిప్రదం **ఇది మనుకృతం-ప్రామాణికం**

న వై స్వయం తదశ్నీయాదతిథిం యన్న భోజయేత్ । మూలశ్లోక సం.**75**
ధన్యం యశస్య మాయుష్యం స్వర్గ్యం చాతిథిపూజనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**106**

టీక:- **యత్ అతిథిం న భోజయేత్** = ఏ పదార్థాన్ని అతిథి భుజించడో, **తత్ వై స్వయం న అశ్నీయాత్** = ఆ పదార్థాన్ని గృహస్థుడు స్వయంగా భుజించరాదు. అభిప్రాయమేమంటే తాను స్వయంగా భోజనం చేసినట్లుగా, అతిథి కూడా అలాగే భోజనం చేయాలి. **అతిథి పూజనమ్** = అతిథి సత్కారం చేయడం, ధన్యం, యశస్సు, ఆయుష్షు, స్వర్గ్యం = సౌభాగ్యం, యశస్కరం, ఆయుర్వర్ధకం, సుఖకరం, సుఖాభివృద్ధికరం కూడా.

తాత్పర్యము:- ఏ పదార్థాన్ని అతిథి భుజించడో తాను కూడా ఆ పదార్థాన్ని భుజించరాదు. అన్ని విధాలా అతిథిని సంతృప్తుని చేయాలి. (భోజన విషయమై) అలా అతిథిపూజ చేయడంవల్ల ధనం, కీర్తి, ఆయువు పెరుగుతుంది. అది స్వర్గాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టి, అతిథిపూజ చేయగల్గడం ఒక భాగ్యంగా భావించాలి. ॥106॥

వివరణ

ఏ విధంగా అభివందనశీలుడు, వృద్ధసేవకుడైన బ్రహ్మచారి (విద్యార్థి)కి యశస్సు, విద్య, ఆయుష్షు మొ॥వి., బలం అభివృద్ధి చెందుతాయో, అదేవిధంగా మనువు విధించినట్లుగా [3.106] విద్వాంసులు, ధార్మికులు, సద్గుణ సంపన్నులైన అతిథులకు సేవలొనరించినట్లయితే, గృహస్థులకు యశస్సు లభిస్తుంది. వారి సాన్నిధ్యమందుండటం వల్ల మంచి ఆచరణ, శ్రేష్ఠగుణాలందు శ్రద్ధ, ధర్మాభిలాష, ఆయురభివృద్ధి, సౌభాగ్యప్రాప్తి సుఖజీవనం లభిస్తుంది [96(2.121)] వివరణను చూడండి.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆసనావసథౌ శయ్యామనువ్రజ్యాముపాసనమ్ । మూలశ్లోక సం.**76**
ఉత్తమేషూత్తమం కుర్యాద్ధీనే హీనం సమే సమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**107**

టీక:- గృహస్థుడి గృహానికి అతిథి రాగా, **ఆసన+అవసథౌ** = ఆసనం, నివాసం, **శయ్యామ్+అనువ్రజ్యామ్ + ఉపాసనామ్** = కూర్చొనుటకు ఆసనం, సమీపంలో కూర్చోవడం మొ॥ సత్కారాలు వారి వారి స్థాయిని బట్టి, **ఉత్తమేష+ఉత్తమం, సమే సమమ్, హీనే హీనం కుర్యాత్** = ఉత్తముడికి ఉత్తమంగా, సమానులకు సమానంగా, తక్కువ వారికి తక్కువగా మర్యాద చేయాలి.

ఋషి దయానందభాష్యం:- గృహస్థుడి గృహానికి అతిథి రాగా వేసే ఆసనం, ఇచ్చే విడిది ఇల్లు, చూపించే మంచం, వెళ్లేప్పుడు కొంత దూరం వెంబడించడం, మర్యాదలు-సపర్యలు ఇలాంటివన్నీ గొప్పవారికి/ విద్వాంసులకు గొప్పగాను; తక్కువవారికి తక్కువగాను; తమతో సమానులకు సమానంగాను అమర్చాలి. అనగా స్థాయి నెరిగి ప్రవర్తించాలని అర్థం.(సం.వి.గృ.ప్ర) ॥107॥

వివరణ:-3.68వ శ్లోకం నుండి 77వ శ్లోకం వరకు ఉన్న విషయం గురించి స్వామి దయానందులవారు సత్యార్థ ప్రకాశం 4వ సముల్లాసంలో ఇలా రాశారు. అతిథి యజ్ఞం ఐదు యజ్ఞాలలో ఒకటి. అతిథిసేవకు సంబంధించినది ఏ తేదీన వచ్చేది మనకు తెలియదు. అలా వచ్చినవారు అతిథులు. అకస్మాత్తుగా వచ్చిన ధార్మిక సత్యోపదేశకులు సర్వోపకారార్థం సర్వత్ర సంచరించే పూర్ణ విద్వాంసుడు, పరమయోగి, సన్న్యాసి గృహస్థుడి వద్దకు వచ్చినట్లయితే అలాంటి అతిథికి మొదట పాద్యం, అర్ఘ్యం ఆచమనాది త్రివిధమైన జలం ఇచ్చి,తరువాత ఆసనం మీద సత్కారపూర్వకంగా కూర్చోబెట్టి స్నానపానాదులకు ఏర్పాటు చేసి ఉత్తమ పదార్థాలతో సేవాశుశ్రూషలు చేసి, ప్రసన్నుడిని చేయాలి. వారి నుండి జ్ఞాన విజ్ఞానాదులను ప్రశ్నించి ధర్మ-అర్థ-కామ మోక్షాలను గురించిన ఉపదేశాలను శ్రవణం చేసి వారి ఉపదేశానుసారంగా తమ ఆచరణను సరిచేసికొని అభివృద్ధి చెందాలి. సంస్కారవిధి-గృహాశ్రమంలో అతిథియజ్ఞప్రకరణంలో ఈ విధంగా రాశారు. ఐదో యజ్ఞం అతిథి యజ్ఞం. ధార్మికుడు, పరోపకారి, సత్యోపదేశకుడు, పక్షపాతరహితుడు, శాంతస్వభావుడు, సర్వహితకారకుడు అయిన విద్వాంసుడు అతిథి. అలాంటివారిని అన్నాదులతో సంతృప్తిపరచి, వారి ద్వారా అనేక విషయాలను తెలిసికోవడం అతిథియజ్ఞం అనబడుతుంది. ఈ యజ్ఞం నిత్యం చేయాలి.(సం.వి.గృ.ప్ర.)

ఋగ్వేదాది భాష్యభూమిక నుండి-"ఎవడు పూర్ణ విద్వాంసుడో, పరోపకారియో, జితేంద్రియుడో, ధర్మాత్ముడో, సత్యవాదియో, ఛలకపటరహితుడో నిత్యం భ్రమణం చేస్తూ విద్యా ధర్మాలను ప్రచారం చేస్తాడో, అవిద్య అధర్మాలను తెలిపి, వాటి నుండి నివృత్తి చేస్తాడో, అలాంటి మహాత్ములు అతిథులు. ఇందుకు అనేక వేదమంత్రాల ప్రమాణాలున్నాయి.

రెండోసారి భోజనం వండినప్పుడు బలియజ్ఞం అవసరం లేదు. ఇది మనుకృతం-ప్రామాణికం

వైశ్వదేవే తు నిర్వృత్తే యద్యన్యోఽతిథిరావ్రజేత్ । మూలశ్లోక సం.**77**
తస్యాప్యన్నం యథాశక్తి ప్రదద్యాన్నబలిం హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**108**

టీక:- **వైశ్వదేవే తు నిర్వృత్తే** = వైశ్వదేవయజ్ఞం సమాప్తమైన తరవాత, అంటే భోజనపాచనం పూర్తికాగా, వైశ్వదేవయజ్ఞంలో ఆహుతులిచ్చిన తరువాత, **యది+అన్యః+అతిథి+ఆవ్రజేత్** = మరొక అతిథి వచ్చినట్లయితే, **తస్య+అపి యథాశక్తి అన్నం ప్రదద్యాత్** = ఆ అతిథికి కూడా యథాశక్తి భోజనమివ్వాలి, **బలిం న హరేత్** = రెండోసారి అన్నం వండిన తరువాత బలిభాగం తీసి, బలియజ్ఞం చేయనవసరం లేదు.

తాత్పర్యం:- వైశ్వదేవానంతరమున అతిథికి భోజనమైన తరువాత మరొక అతిథి వచ్చినట్లయితే ఆ అతిథికి కూడా యథాశక్తి భోజనమివ్వాలి. రెండోసారి అన్నం వండిన తరువాత బలిభాగం తీసి, బలియజ్ఞం చేయనవసరం లేదు. ॥108॥

అతిథి సత్కార విషయక నియమం- ఇది మనుకృతం-ప్రామాణికం

న భోజనార్థం స్వే విప్రః కులగోత్రే నివేదయేత్ । మూలశ్లోక సం.**78**
భోజనార్థం హి తే శంసన్ వాన్తాశీత్యుచ్యతే బుధైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**109**

తాత్పర్యం:- అతిథి అయిన బ్రాహ్మణుడు భోజనం నిమిత్తం తన కులగోత్రాలను తెలుపరాదు. భోజనం నిమిత్తం వాటిని చెప్పువాడు వాంతియెత్తిన అన్నమును భుజించువాడని పండితులచే పేర్కొనబడినది.

110 నుండి 112వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *న బ్రాహ్మణస్య త్వతిథిగృహే రాజన్య ఉచ్యతే ।*
వైశ్యశూద్రౌ సఖా చైవ జ్ఞాతయో గురురేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***110***

తాత్పర్యం:- బ్రాహ్మణుడి ఇంట క్షత్రియ వైశ్య శూద్రులు అతిథులు కారు. అలాగే (భోజనం వేళ కొచ్చినప్పటికీ) స్నేహితులు, బంధువులు, తనతో పాటే అక్కడే నివసించువారు అతిథులు కారు. గురుదేవులు ఎప్పుడూ అందరికంటే అధికులే కాబట్టి, వారికి జరిపే సత్కారం అతిథి పూజకాదు.॥110॥

క్షత్రియుడికి ఉత్కృష్టుడైన బ్రాహ్మణుడు అతిథి అవుతాడు. సజాతీయుడైన క్షత్రియుడు కూడ అతిథి అవుతాడు. వైశ్య శూద్రాదులు అతిథులు కారు. వైశ్యుడికి ద్విజుడు అతిథి. శూద్రుడు అతిథి కాడు.

* *యదిత్వతిథిధర్మేణ క్షత్రియో గృహ మా వ్రజేత్ ।*
భుక్తవత్సు చ విప్రేషు కామం తమపి భోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***111***

తాత్పర్యం:- అతిథి ధర్మం ప్రకారం-క్షత్రియుడి ఇంటికి బ్రాహ్మణ, క్షత్రియులు ఇద్దరూ వస్తే బ్రాహ్మణ భోజనానంతరం క్షత్రియుడికి భోజనం పెట్టాలి. ॥111॥

* *వైశ్య శూద్రావపి ప్రాప్తౌ కుటుంబే-తిథిధర్మిణౌ ।*
భోజయేత్సహ భృత్త్యైస్తావానృశంస్యం ప్రయోజయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***112***

తాత్పర్యం:- బ్రాహ్మణుడి ఇంటికి వైశ్య శూద్రులు భోజనం వేళకు, బాటసారులై వచ్చినప్పుడు అతిథులుగానే భావించి, వారికి తన ఇంట సేవకులతో పాటు వడ్డించాలి. ॥112॥

ప్రక్షిప్తాల పరిశీలన

110 నుంచి 112 వరకు ఉన్న శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి:

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. అతిథి తన కులగోత్రాలు చెప్పరాదు:-108,109 శ్లోకాలలో 'వైశ్వదేవ యజ్ఞం చేసిన తర్వాత ఎవరైనా **అతిథి వస్తే అతనికీ భోజనం పెట్టాలి. రెండవ సారి బలి పెట్టకూడదు. అతిథి తన కుల గోత్రాలు చెప్పనక్కర లేదు**' అని చెప్పడంతో అతిథుల భోజనానికి సంబంధించిన అన్ని విషయాలూ పూర్తయ్యాయి అనే సంకేతం లభిస్తుంది. ఆ తర్వాత

దానికి సంబంధించిన వేరు వికల్పాత్మక పద్ధతులను 113-116లలో చెప్పారు. 108,109 శ్లోకాలలోని ఏకవాక్యత 113వ శ్లోకంతో కలుస్తుంది. దాన్ని భంగం చేస్తూ 110-112 శ్లోకాలు వేరు విషయాలతో కలిపారు కనుక, ఇది ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తం.

ఖ. **'ఎవరిని అతిథిగా భావించకూడదు?'** ఇది ముందే 103వ శ్లోకంలో చెప్పబడింది. ఈ శ్లోకాలలో ఆ విషయాన్ని భంగం చేస్తూ మళ్లీ అవే విషయాలను మొదలుపెట్టారు. ఇవి మౌలికమైతే 103తో కలిసిపోవాలి. కానీ అక్కడ ఉండకుండా ప్రసంగం ముగింపులో మళ్లీ చెప్పటం వల్ల, ఇది ఇతర వ్యక్తులు తర్వాతి కాలంలో జోడించారని తెలిసిపోతూంది.

2. పునరుక్తి

103వ శ్లోకంలో సాంగతికం అంటే మిత్రుణ్ని అతిథిగా భావించడం ఒకసారి చెప్పారు. అటు తరువాత **"ఇతరాన్ అపి సఖ్యాదీన్....గృహమాగతాన్....భోజయేత్"** (113) అని ఉంది. వికల్పాత్మక విధానంలోనూ మనువు మిత్రుణ్ణి అతిథిగా భావించలేదనే అర్థమౌవుతుంది. 110వ శ్లోకంలో ఇతర వ్యక్తులతో పాటు మళ్లీ ఒకమారు **'సఖుణ్ని' అతిథిగా భావించరాదు'** అని చెప్పబడింది. ఒకసారి ఈ విషయాన్ని చెప్పిన తర్వాత అదే ప్రసంగాన్ని మళ్లీ చెప్పటం పునరుక్తే అవుతుంది. అంటే ఇది ఇంకెవరో రాసిందే కానీ మనువు రచనకాదని తెలిసిపోతుంది. ఈ విధంగా ఈ శ్లోకంతో పాటు, ఇదే విషయ దృష్టితో రాసిన 111,112 శ్లోకాలూ తమ ప్రక్షిప్తతను తామే బయట పెట్టుకున్నాయని గ్రహించవచ్చు.

3. అంతర్వ్యతిరేకాలు

క. మనువు 103వ శ్లోకంలో అతిథులను గురించి చెప్పినదాన్ని బట్టి వర్ణాలు ఆధారంగా ఎవరినీ ప్రత్యేక అతిథులుగా భావించలేదనీ, అందరినీ అతిథులన్నాడనీ తెలుస్తూంది. ఒకవేళ వర్ణాలను బట్టి అతిథులని చెప్పడమే అతని కిష్టమైతే, ఆ శ్లోకంలో ఆ మాటే చెప్పేవాడు 110-112 శ్లోకాలలో ఆ వ్యవస్థకు భిన్నంగా వర్ణాలు ఆధారంగా ఉచ్చనీచతలున్న వ్యవస్థ ఉంది. ఈ భేదం మునుపు చెప్పినదానికి వ్యతిరేకతను సూచిస్తుంది.

ఖ. మనువు వైశ్యశూద్రులలో తగినంత అంతరాన్ని చెప్పాడు. వైశ్యులను ద్విజులుగా పరిగణించవచ్చనీ, శూద్రులు బ్రాహ్మణుల కన్నా కిందివారనీ చెప్పాడు. 112లో చెప్పినట్లు వైశ్యులనూ, శూద్రులనూ సమానస్థాయివారనటం మనువు వ్యవస్థతో కలవడం లేదు. దీనివల్ల దీన్ని ఇంకెవరో రాసినట్లు తేలుతూంది.

గ. 4.29-30లలో అతిథులకు వర్ణానుసారం కాక, కర్మానుసారంగా సేవచేయాలని ఉంది. ఈ శ్లోకంపై దానికి వ్యతిరేకంగా ఉంది.

113,114 శ్లోకాలు మనుకృతం-ప్రామాణికం

అతిథులు కానివారికి భోజనం-

ఇతరానపి సఖ్యాదీన్ సంప్రీత్యా గృహ మాగతాన్ । మూలశ్లోక సం.79
సత్కృత్యాన్నం యథాశక్తి భోజయేత్సహ భార్యయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.113

టీక:- **సంప్రీత్యా** = ప్రేమపూర్వకంగా, **భార్యయా సహ గృహమ్+ఆగతాన్ ఇతరాన్ సఖ్యాదీన్ అపి** = పత్నితో సహా గృహానికి అరుదెంచిన బంధు మిత్రులు మొ॥ వారిని కూడా, **సత్కృత్య** = సత్కారపూర్వకంగా, **యథాశక్తి అన్నం భోజయేత్** = శక్తిని బట్టి భోజనాదులు పెట్టాలి.

తాత్పర్యం:- స్నేహితులు బంధువులు మొదలైనవారు తమ ఇంటికి (భోజన వేళకు) వస్తే వారికి కూడా మర్యాదచేసి, శక్తిని బట్టి భోజనాదులు సమకూర్చాలి.॥113॥

అతిథుల కంటే ముందుగా ఎవరికి భోజనం పెట్టాలి? **ఇది మనుకృతం-ప్రామాణికం**

సువాసినీః కుమారీశ్చ రోగిణీ గర్భిణీః స్త్రియః । మూలశ్లోక సం.**80**
అతిథిభ్యోఽగ్ర ఏవైతాన్ భోజయేదవిచారయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**114**

టీక:- సువాసినీః చ కుమారీః = కొత్తగా వివాహం అయినవారికీ, చిన్న వయస్సులో ఉన్న పిల్లలకు, కన్యలకు, రోగిణీః = రోగులకు, గర్భిణీః స్త్రియః = గర్భవతులైన స్త్రీలకు, **ఏతాన్** = వీరికి, **అతిథిభ్యః అగ్ర ఏవ** = అతిథుల కంటే ముందుగా, **అవిచారయన్** = సందేహించకుండా, అంటే పెద్దవారికి ముందు, చిన్నవారికి తరువాత అని విచారించకుండానే, **భోజయేత్** = వీరికి భోజనం పెట్టాలి.

తాత్పర్యం:- కొత్తగా వివాహం అయినవారికీ, చిన్న వయస్సులో ఉన్న పిల్లలకూ, కన్యలకూ, రోగం చేత బాధపడేవారికీ, గర్భిణీ స్త్రీలకూ వీరందరికీ అతిథిపూజకంటే ముందుగానే నిస్సందేహంగా భోజనం పెట్టాలి.॥114॥

ఈ శ్లోకం ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *అదత్వా తు య ఏతేభ్యః పూర్వం భుఙ్క్తే-విచక్షణః ।*
న భుంజానో న జానాతి శ్వగృధ్రైర్జగ్ధిమాత్మనః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.**115***

తాత్పర్యం:- అతిథులు మొదలుకొని సేవకుల వరకు భోజనం పెట్టకుండా గృహస్థుడు తాను ముందుగా భుజించినట్లయితే అలాంటివాడిని జీవితాంతంలో కుక్కలు, నక్కలు, గద్దలు తింటాయని ఆ గృహస్థుడికి తెలియదు.॥115॥

ప్రక్షిప్త పరిశీలన: ఈ శ్లోకం క్రింది ఆధారాలతో ప్రక్షిప్తమని నిరూపించబడుతున్నది.

1. **ప్రసంగ వ్యతిరేకము:-** దంపతులు ఎప్పుడు భోజనం చేయాలో 116వ శ్లోకంలో చెప్పబడింది. అయితే దాని కంటే ముందే భోజన ఫలము చెప్పబడింది. ఇది పూర్తిగా అసంగతము. అర్థవాదము విధివాక్యము తర్వాత వస్తుంది. మొదటనే రాదు. ఈ ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

2. **అంతర్ వ్యతిరేకం:-** ఈ శ్లోకాన్ని వ్రాసినవానికి మరణానంతరం శరీరం దహనం చేయబడుతుందనే విషయం తెలియనట్లుంది. ఇతని అభిప్రాయం మనువిరుద్ధం. మనువు మరణించినవాని శరీరాన్ని దహనం చేయాలని చెప్పాడు. శరీరం దహనం చేయబడిన తర్వాత అతన్ని కుక్కలు, గద్దలు పీక్కుతినుననే ప్రశ్ననేపుట్టదు. ఇట్టి విరోధం వల్ల ఈ శ్లోకం ప్రక్షిప్తం.

3. **శైలీగత ఆధారం:-** ఈ శ్లోక రచనా శైలి నిరాధారము, అయుక్తియుక్తము, మరియు అతిశయోక్తి పూర్వకంగానూ ఉన్నది. ఇంత చిన్నపాటి అపరాధానికి అనగా అతిథి కంటే ముందే భోజనం చేసిన దానికి ఇంత అధికమైన కష్టాన్ని-శిక్షను అనుభవించవలసి వస్తుందన్నది బుద్ధిసంగతంగా లేదు. ఇది అజ్ఞానపు మాటగా ఉన్నది.

116-118వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

గృహస్థదంపతులు అందరిభోజనాల తర్వాత మిగిలినదాన్ని భుజించాలి.

భుక్తవత్స్వథ విప్రేషు స్వేషు భృత్యేషు చైవ హి । మూలశ్లోక సం.**81**
భుంజీయాతాం తతః పశ్చాదవశిష్టం తు దంపతీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**116**

టీక:- **అథ విప్రేషు భుక్తవత్సు** = విద్వాంసులైన అతిథులు భుజించిన తరవాత, చ = మరియు, స్వేషు భృత్యేషు ఏవ హి = తమ సేవకులు భుజించగా, **తతః పశ్చాత్** = ఆ తరవాత, **అవశిష్టం తు** = మిగిలిన భోజనాన్ని, దంపతీ **భుంజీయాత్** = దంపతులు భుజించాలి.

తాత్పర్యం:- విప్రులు, అతిథులు, భృత్యులు భోజనం చేసిన తరువాత, మిగిలిన భోజనాన్ని గృహస్థుడు-అతని భార్య భుజించాలి.॥116॥

ఇది మనుకృతం-ప్రామాణికం

దేవానృషీన్మనుష్యాంశ్చ పితౄన్ గృహ్యాశ్చ దేవతాః । మూలశ్లోక సం.**82**
పూజయిత్వా తతః పశ్చాద్గృహస్థశ్శేషభుగ్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**117**

టీక:- **దేవాన్** = దివ్యగుణ సంపన్నులైన విద్వాంసులను, **ఋషీన్** = విద్యను ప్రత్యక్షం చేసికొన్న మంత్రార్థ ద్రష్టలైన ఋషులను, **మనుష్యాన్** = సాధారణ మానవులను, చ = మరియు, **పితౄన్** = జీవించిన తల్లిదండ్రి మొదలైన పాలకులైన వ్యక్తులను, చ = మరియు, **గృహ్యాః దేవతాః** = ఈశ్వరీయ దివ్యగుణా (3-59)లను స్మరిస్తూ యజ్ఞాలలో ఆహుతులిచ్చి మరియు గృహస్థుడి ద్వారా భరణ-పోషణం ఆశించే అసహాయులు, అనాథులు, కుష్ఠరోగులు, భృత్యులు (3.66, 67) మొదలైనవారిని, **పూజయిత్వా** = భోజనం దానం ద్వారా సత్కరించి మరియు వారి భాగములను వేరుగా భుజించేవాడుగా ఉండాలి. అందరూ భుజించిన తరువాత భోజనం చేయాలి.

తాత్పర్యం:- దేవతలను, ఋషులను, మనుషులను, పితరులను, గృహదేవతలను అన్నాదులచే పూజించి, తరువాత గృహస్థుడు మిగిలిన అన్నం భుజించాలి.॥117॥

వివరణ

గృహ్యాదేవతలు:- 3.84వ శ్లోకం నుండి 91వ శ్లోకం వరకు వివరించిన ఈశ్వరీయ దివ్యగుణాలు కలవారు. ఆ గుణాలను స్మరించి, ఆహుతులిచ్చి, గృహస్థుణ్ణి ఆశ్రయించేవారు. అలాంటి వారి కోసం భోజన భాగాన్ని వేరుగా ఉంచాలి. ఈ అభిప్రాయాన్ని తెలియజేయడం కోసం (3.81) "**భూతాని బలి కర్మణా**" అనే పదాల ద్వారా, అలాగే (3.72వ శ్లోకంలో) "భృత్యానామ్" పదాలను ప్రయోగించాడు.

దేవత, ఋషి-పితర శబ్దాల యొక్క విస్తృతమైన అర్థజ్ఞానానికి (3.82వ) శ్లోకంలోని వివరణ చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

అఘం స కేవలం భుఙ్క్తే యః పచత్యాత్మ కారణాత్ । మూలశ్లోక సం.**83**
యజ్ఞశిష్టాశనం హ్యేతత్సతామన్నం విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**118**

టీక:- **యః కేవలం ఆత్మకారణాత్ పచతి** = ఏ వ్యక్తి కేవలం తన పొట్టనింపుకోడానికి మాత్రమే భోజనం తయారుచేస్తాడో, సః = అతడు, **అఘం భుఙ్క్తే** = కేవలం పాపమునే తింటున్నాడు. అంటే ఈ ప్రవృత్తి వల్ల స్వార్థభావనే పెరుగుతుంది. హి = ఎందుకంటే, **ఏతత్** = ఈ పైన చెప్పబడిన (3.81), **యజ్ఞశిష్ట+ అశనం** = యజ్ఞం జరుపగా మిగిలిన అన్నమే, **సతాం + అన్నం విధీయతే** = సజ్జనుల అన్నంగా అంగీకరించబడింది. ఇందుకు విపరీతంగా, యజ్ఞం చేయకుండా చేసే భోజనం అసత్పురుషుల అన్నమని చెప్పబడుతుంది.

తాత్పర్యం:- ఎవడు తన నిమిత్తం మాత్రం అన్నం వండి భుజించి, దేవతాదులకు పెట్టడో, అలాంటి అన్నం పాపహేతువు కాబట్టి అతడు పాపమునే భుజించుచున్నాడు. గృహస్థుడికి పంచయజ్ఞములలో మిగిలిన అన్నం భుజించుటయే ఉత్తమం.॥118॥

119 నుండి 284వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* రాజు మొ॥గు వారి సత్కారం-

** రాజర్త్విక్స్నాతకగురూన్ ప్రియశ్వశురమాతులాన్ ।*
అర్హయేన్మధుపర్కేణ పరి సంవత్సరాత్పునః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.119*

తాత్పర్యం:- రాజు, ఋత్విజుడు విద్యావ్రతములచే స్నాతకుడు, గురువు, మిత్రులు, మామ, మేన మామ వీరిలో ఒక సంవత్సరానికి గాని ఆవల గాని వచ్చిరేని మళ్ళీ వారిని మధుపర్కంతో పూజించాలి. ॥119॥

*** రాజా చ శ్రోత్రియశ్చైవ యజ్ఞకర్మణ్యుపస్థితౌ ।**
మధుపర్కేణ సంపూజ్యౌ న త్వయజ్ఞ ఇతి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**120**

తాత్పర్యం:- రాజు, స్నాతకుడు సంవత్సరం తరువాత వచ్చినట్లయితే యజ్ఞవివాహములందే మధుపర్కంచేత పూజించాలి. (అల్లుడు మొ॥నవారు సంవత్సరం తరవాత వచ్చినట్లయితే యజ్ఞాదులు లేకున్నా, మధుపర్కం చేత వారిని పూజించాలి. సంవత్సరం లోపల అయినట్లయితే, అందరికీ యజ్ఞ వివాహములందే మధుపర్కమును ఇవ్వాలి.)॥120॥

*** సాయం త్వన్నస్య సిద్ధస్య పత్న్యమంత్రం బలిం హరేత్ ।**
వైశ్వదేవం హి నామైతత్సాయం ప్రాతర్విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**121**

తాత్పర్యం:- సాయంకాల సమయంలో పశ్వాదులకు, గృహస్థురాలు వండిన అన్నం పెట్టాలి. దీనికి అమంత్రక బలిహరణం అని పేరు. ఇది సాయంసంధ్యాసమయంలో చేయబడే వైశ్వదేవం అని చెపుతారు.॥121॥

మృతకశ్రాద్ధ విధానము- తత్సంబంధ నియమము-122 నుండి 149 వరకు

* మృతకశ్రాద్ధ విధానము-తత్సంబంధ నియమము-

*** పితృయజ్ఞం తు నిర్వర్త్య విప్రశ్చంద్రక్షయే-గ్నిమాన్ ।**
పిండాన్వాహార్యకం శ్రాద్ధం కుర్యాద్మాసానుమాసికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**122**

తాత్పర్యం:- అమావాస్యనాడు పితృయజ్ఞం నెరవేర్చి, అటుపైన నెలనెలా ఆచరించవలసిన 'పిండా న్వాహార్యకం' అనే శ్రాద్ధం చేయాలి (బ్రాహ్మణులు మాత్రమే). ॥122॥

*** పితౄణాం మాసికం శ్రాద్ధమన్వాహార్యం విదుర్బుధాః ।**
తచ్చామిషేణ కర్తవ్యం ప్రశస్తేన ప్రయత్నతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**123**

తాత్పర్యం:- పితృదేవతా ప్రీత్యర్థం నెలనెలా చేసే మాసికశ్రాద్ధాన్ని అన్వాహార్యకం అంటారు. దీన్ని చేయబోవువారు ప్రశస్తమైన మాంసం సంపాదించి, దాంతో ప్రయత్నపూర్వకంగా నిర్వర్తించాలి.॥123॥

*** తత్ర యే భోజనీయాస్స్యు ర్యే చ వర్జ్యా ద్విజో త్తమాః ।**
యావన్తశ్చైవ యైశ్చాన్నైస్తాన్ ప్రవక్ష్యామ్యశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**124**

తాత్పర్యం:- ఆ అన్వాహార్యశ్రాద్ధంలో ఎవరు భోజనానికి అర్హులో-ఎవరు భుజింపదగనివారో, అలాగే భోజనానికి ఏ యే పదార్థాలు అర్హమైనవో- ఏవి కావో అవన్నీ మీకు సవిస్తరంగా వివరిస్తాను.॥124॥

*** ద్వౌ దైవే పితృకార్యే త్రీ నేకైక ముభయత్ర వా ।**
భోజయేత్సు సమృద్ధోఽపి న ప్రసజ్జేత విస్తరే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**125**

తాత్పర్యం:- ఈ శ్రాద్ధమున దేవతాస్థానంలో ఇద్దరు బ్రాహ్మణులు, పితృదేవతా స్థానంలో ముగ్గురు బ్రాహ్మణులు ఉండవచ్చు! ॥125॥

లేదా......దేవతాస్థానంలోను, పితృదేవతా స్థానంలోను ఒక్కొక్కరు బ్రాహ్మణులనైనా నియమించవచ్చు!

బాగా ధనవంతులై, పదిమందికైనా భోజనం పెట్టగలసామర్థ్యం ఉందని చెప్పి నియమిత సంఖ్య కంటే ఎక్కువ మందిని ఈ శ్రాద్ధ భోజనానికి నిమంత్రించి దీన్ని అన్నసంతర్పణగా మార్చరాదు.

* *సత్క్రియాం దేశకాలౌ చ శౌచం బ్రాహ్మణసంపదః ।*
పఞ్చైతాన్విస్తరో హన్తి తస్మాన్నే హేత విస్తరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***126***

తాత్పర్యం:- ఎందుకంటే-గుణవంతులైన బ్రాహ్మణులను సంపాదించడం, దక్షిణలివ్వడం, బ్రాహ్మణ సత్కారక్రియ. అపరాహ్ణకాల విధి, కర్త-భోక్తలకు గల ఆచారం అనే ఈ అంశాలు బ్రాహ్మణ నిమంత్రణంలో ప్రధానం కాబట్టి, ఇవి మాసికశ్రాద్ధం పై ప్రభావం చూపరాదు. జనాధిక్యత వల్ల ఇవి చెడిపోతాయి.॥126॥

* *ప్రథితా ప్రేతకృత్యైషా పిత్ర్యం నామ విధుక్షయే ।*
తస్మిన్ యుక్తస్యైతి నిత్యం ప్రేతకృత్యైవ లౌకికీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***127***

తాత్పర్యం:- అమావాస్య తిథి యందు పితృదేవతలను గురించి చేయబడే ఈ కార్యం చాలా ప్రసిద్ధి. ఈ పితృకార్యములలో శ్రద్ధాళువుగా ఉన్న బ్రాహ్మణులకు సుపుత్రులు, ధన ధాన్యాది విస్తరణ మొదలైన సకల శుభాలు కలుగుతాయి.॥127॥

* *శ్రోత్రియాయైవ దేయాని హవ్యకవ్యాని దాతృభిః ।*
అర్హత్తమాయ విప్రాయ తస్మై దత్తం మహాఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***128***

తాత్పర్యం:- కర్త అంటే చేసేవాడు, నిర్వహించేవాడు. దేవతలకు ఇవ్వబడే హవ్యములైనా- పితృదేవతలకివ్వబడే కవ్యములైనా వేదాధ్యయన పరుడికే ఇవ్వాలి. కనుకనే అధిక ఫలితాలు కలగాలని వేదవిదుని ఇలాంటి కార్యాలలో నిమంత్రించమని కోరతారు.॥128॥

వివరణ:- హవ్య కవ్యములపై విస్తృత వివరణను 4.31 సమీక్షను చూడండి.

* *ఏకైకమపి విద్వాంసం దైవే పిత్ర్యే చ భోజయేత్ ।*
పుష్కలం ఫలమాప్నోతి నామంత్రజ్ఞాన్ బహూనపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***129***

తాత్పర్యం:- దైవసంబంధ పూజల్లోను, పితృదేవతార్చనలలోను ఒక్కొక్క విద్వాంసుడు (విప్రుడు) అయినా భోజనం చేయడం ఉత్తమం. కాబట్టి అలాంటివారిని నిమంత్రించడం పరిపూర్ణ ఫలదాయకం. విద్వత్తులేని అనేకమంది బ్రాహ్మణులు భుజించినా ఫలితం లేదు.॥129॥

* *దూరాదేవ పరీక్షేత బ్రాహ్మణం వేదపారగమ్ ।*
తీర్థం తద్ధవ్యకవ్యానాం ప్రదానే సోఽతిథిః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***130***

తాత్పర్యం:- 'వేదాధ్యయనం చేసిన బ్రాహ్మణుణ్ణి మాత్రమే' అని చెప్పడానికి కారణం ధర్మాధర్మ వివేకజ్ఞానం గలవాడనే అర్థంలో చెప్పబడినట్లుగా గ్రహించి, అలాంటివారిని బాగా పరిశీలించి తెలసుకొని అతిథిగా నియమించాలి. ॥130॥

* *సహస్రం హి సహస్రాణామనృచాం యత్ర భుంజతే ।*
ఏకస్తాన్ మంత్రవిత్ప్రీతః సర్వానర్హతి ధర్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***131***

తాత్పర్యం:- వేదమంత్రాలు తెలియని పదిలక్షలమంది బ్రాహ్మణు లే శ్రాద్ధాదికర్మలందు భుజిస్తారో, అలాంటి కర్మలందు వేదవేత్త అయిన ఒక్క విప్రుడు భుజిస్తే, వేదవిహీనులయిన పదిలక్షలమంది భుజించినంత ఫలం వస్తుంది.॥131॥

* *జ్ఞానోత్కృష్టాయ దేయాని కవ్యాని చ హవీంషి చ ।*
న హి హస్తానసృగ్దిగ్ధౌ రుధిరేణైవ శుద్ధ్యతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***132***

తాత్పర్యం:- జ్ఞానంవల్ల గొప్ప వారికే హవ్యములను గానీ, కవ్యములను గానీ ఇవ్వాలి. రక్తపూతములైన చేతులు రక్తంచేత పరిశుద్ధములు గాక నీటిచే పరిశుద్ధములయినట్లు మూర్ఖులకు ఇచ్చే హవ్యకవ్యములు దాతను పాపవిముక్తుణ్ణి చేయజాలవు. కాబట్టి, యోగ్యుడికి ఇచ్చిన హవ్యకవ్యములు దాతను పరిశుద్ధుణ్ణి జేస్తాయి. దాతకు పాపవిముక్తికూడా అవుతుంది. ॥132॥

* *యావతో గ్రసతే గ్రాసాన్ హవ్యకవ్యేష్వమంత్రవిత్ ।*
తావతో గ్రసతేఽప్రేత్య దీప్తశూలర్ష్ట్యయోగుడాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **133**

తాత్పర్యం:- వేదమును తెలియని విప్రుణ్ణి హవ్యకవ్యములలో నియమించి, అతడికి భోజనం ఇచ్చినట్లయితే ఆ భోక్త ఎన్ని కబళములను భుజిస్తాడో అన్ని శూలర్ష్టులనే మండుతున్న ఇనుపగుండ్లను కర్త అయినవాడు దేహాంతమున నరకమందు నమలుచున్నాడు. ॥133॥

* *జ్ఞాననిష్ఠా ద్విజాః కేచిత్తపోనిష్ఠాస్తథాఽపరే ।*
తపస్స్వాధ్యాయనిష్ఠాశ్చ కర్మనిష్ఠాస్తథాఽపరే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **134**

తాత్పర్యం:- కొందురు విప్రులు ఆత్మజ్ఞానమందాసక్తి కలిగి ఉంటారు. కొందరు తపస్సులో నిలకడ గలిగి ఉంటారు. మరికొందరు తపస్సు, వేదాధ్యయనం అనే రెండింటియందు నిష్ఠగలిగి ఉంటారు. మరి కొందరు యాగములు మొ॥ కర్మలందు ఆసక్తి కలిగి ఉంటారు.॥134॥

* *జ్ఞాననిష్ఠేషు కవ్యాని ప్రతిష్ఠాప్యాని యత్నతః ।*
హవ్యాని తు యథాన్యాయం సర్వేష్వేవచతుర్ష్వపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **135**

తాత్పర్యం:- పితరులను ఉద్దేశించి చేసే శ్రాద్ధాదులయందు ప్రయత్న పూర్వకంగా వెదకి జ్ఞాననిష్ఠులనే నియమించాలి. దేవతోద్దేశంతో చేసే కర్మలయందు పై నలుతెరగులవారిని నియమించ వచ్చు.॥135॥

* *అశ్రోత్రియః పితాయస్య పుత్రః స్యాద్వేదపారగః ।*
అశ్రోత్రియో వా పుత్రస్స్యాత్పితా స్యాద్వేదపారగః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **136**

తాత్పర్యం:- తండ్రి వేదం చదువనివాడై, కుమారుడు వేదాధ్యయనపరుడై ఉంటాడు. తండ్రి వేదాధ్యయనపరుడై ఉన్నట్లయితే, కుమారుడు వేదం చదువనివాడై ఉంటాడు.॥136॥

* *జ్యాయాంసమనయోర్విద్యాద్యస్యస్యాచ్ఛ్రోత్రియః పితా ।*
మంత్రసంపూజనార్థం తు సత్కారమితరోఽర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **137**

తాత్పర్యం:- ఇందు వేదాధ్యయనం చేసిన పుత్రుడి కంటే, వేదాధ్యయనం చేసిన వాడి పుత్రుడే ఉత్కృష్టుడు. తండ్రి వేదాధ్యయనం చేయకుండా పుత్రుడు వేదాధ్యయనం చేసి ఉంటే, వాడిని, వాడు చదివిన వేదమును గౌరవించాలి. కాబట్టి, వేదం చదివిన పుత్రుడినే హవ్యకవ్యములందు గౌరవించాలి.॥137॥

* *న శ్రాద్ధే భోజయేన్మిత్రం ధనైః కార్యోఽస్య సంగ్రహః ।*
నారిం న మిత్రం యం విద్యాత్తం శ్రాద్ధే భోజయేద్ద్విజమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **138**

తాత్పర్యం:- శ్రాద్ధమునందు స్నేహితుణ్ణి వరించరాదు. వేరేవిధంగా ధనం ఇచ్చి వాడిని చేరదీయాలి. కర్త ఎవ్వడిని తనకు శత్రుపుగాను, మిత్రుడిగాను తలంపడో అలాంటివాడిని శ్రాద్ధమున నిమంత్రించాలి. ॥138॥

* *యస్య మిత్రప్రధానాని శ్రాద్ధాని చ హవీంషి చ ।*
తస్య ప్రేత్య ఫలం నాస్తి శ్రాద్ధేషు చ హవిష్షు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **139**

తాత్పర్యం:- ఎవడు శ్రాద్ధములందుగాని, దేవతోద్దేశంతో చేసే క్రియలందుగాని స్నేహితులను వరించునో, అతడికి అలాంటి శ్రాద్ధములవల్ల గాని, హవ్యములవల్ల గాని పరలోకంలో ఫలం గలుగనేరదు. ॥139॥

** యస్సంగతాని కురుతే మోహాచ్ఛ్రాద్ధేవ మానవః ।*
స స్వర్గాచ్చ్యవతే లోకాచ్ఛ్రాద్ధమిత్రో ద్విజాఽధమః॥ ప్రక్షిప్త శ్లోక సం. ***140***

తాత్పర్యం:- ఎవడు వివేకహీనుడై శ్రాద్ధంనందు మిత్రులను వరించునో, అలాంటివాడు స్వర్గలోకం నుండి భ్రష్టుడై కిందపడుతున్నాడు. ॥140॥

** సంభోజనీ సాఽభిహితా పైశాచీ దక్షిణా ద్విజైః ।*
ఇహైవాస్తే తు సా లోకే గౌరంధేవైకవేశ్మని ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***141***

తాత్పర్యం:- స్నేహితులను సంతోషపరిచే నిమిత్తం ఎవడు వారిని శ్రాద్ధములందు వరించి, వారికి దక్షిణలను ఇస్తాడో, వాడిచ్చిన దక్షిణ పైశాచికదక్షిణ అనబడును. ఆ శ్రాద్ధం మిత్ర సంతృప్తికరమై, గుడ్డిదవడం వల్ల ఇంటనే తిరుగులాడు ఎద్దులాగా నిష్ఫలం అవుతుంది.॥141॥

** యథేరిణే బీజముప్త్వా న వప్తా లభతే ఫలమ్ ।*
తథా-నృచే హవిర్దత్వా న దాతా లభతే ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***142***

తాత్పర్యం:- చవిటినేలయందు విత్తనములు చల్లినవాడికి కేవలం శ్రమేకాని, ఫలం లేనట్లు, మూర్ఖుడి శ్రాద్ధాదులందు వరించిన వాడికి అలాంటి శ్రాద్ధం వల్ల ఎలాంటి ఫలం కలుగదు. ॥142॥

** దాతౄన్ ప్రతిగ్రహీతౄంశ్చ కురుతే ఫలభాగినః ।*
విదుషే దక్షిణాం దత్వా విధివత్ప్రేత్య చేహ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***143***

తాత్పర్యం:- యోగ్యుల వరించి పూజించి దక్షిణలు ఇవ్వడంవల్ల, దాతకు ప్రతిగ్రహీతకు ఇహపర లోకముల ఫలం కలుగుతుంది.॥143॥

** కామం శ్రాద్ధేఽర్చయేన్మిత్రం నాభిరూపమపి త్వరిమ్ ।*
ద్విషతా హి హవిర్భుక్తం భవతి ప్రేత్య నిష్ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***144***

తాత్పర్యం:- జ్ఞానవంతులు దొరకనప్పుడు గుణవంతుడైన స్నేహితుడిని శ్రాద్ధంనందు నిమంత్రించాలి గాని, గుణవంతుడైనను శత్రువును నిమంత్రించరాదు. అలా శత్రువును నిమంత్రించి చేసిన శ్రాద్ధం పరలోకమున నిష్ఫలం అవుతుంది. ॥144॥

** యత్నేన భోజయేచ్ఛ్రాద్ధే బహ్వృచం వేదపారగమ్ ।*
శాఖాన్తగమథాధ్వర్యుం ఛన్దోగన్తు సమాప్తిగమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***145***

తాత్పర్యం:- శ్రాద్ధమునందు మంత్రబ్రాహ్మణరూపమగు ఋగ్వేదమును అధ్యయనం చేసినవాడిని గాని, యజుర్వేదశాఖను సొంతంగా అధ్యయనం చేసినవాడిని గాని, పరిపూర్ణంగా సామవేదం అధ్యయనం చేసినవాడిని గాని వరించి ప్రయత్నంతో అతడికి భోజనం పెట్టాలి.॥145॥

** ఏషామన్యతమో యస్య భుంజీత శ్రాద్ధమర్చితః ।*
పితౄణాం తస్య తృప్తిః స్యాచ్ఛాశ్వతీ సాప్తపౌరుషీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***146***

తాత్పర్యం:- పై చెప్పిన వారిలో ఒక్కడైనా ఏ శ్రాద్ధంనందు వరింపబడి పూజింపబడుతున్నాడో అలాంటి శ్రాద్ధకర్త యొక్క పెద్దలకు ఏడుతరాలకు శాశ్వతముక్తి కలుగుతుంది. ॥146॥

* ఏష వై ప్రథమః కల్పః ప్రదానే హవ్యకవ్యయోః ।
అనుకల్పస్త్వయం జ్ఞేయః సదా సద్భిరనుష్ఠితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.147

తాత్పర్యం:- హవ్యకవ్యములను ఇచ్చే విషయంలో పైన చెప్పబడినది ముఖ్య కల్పం. ఇక చెప్పబోవునది అముఖ్య కల్పం. దీన్నే పెద్దలందరూ ఆచరించారు.॥147॥

* మాతామహం మాతులం చ స్వస్త్రీయం శ్వశురం గురుమ్ ।
దౌహిత్రం విట్పతిం బంధుమృత్విగ్యాజ్యౌ చ భోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.148

తాత్పర్యం:- అలాంటి అనుకల్పమేది అంటే-హవ్యకవ్యములందు జ్ఞానుల మొ॥ వారు దొరకనప్పుడు తల్లిదండ్రులను, మేనమామను, మేనల్లుణ్ణి, పిల్లనిచ్చిన మామగారిని, గురువును, కూతురికొడుకు, అల్లుణ్ణి, పినతల్లి కొడుకులను, యజ్ఞములు చేయించిన ఋత్విజుణ్ణి, శిష్యుణ్ణి వరించాలి.॥148॥

* న బ్రాహ్మణం పరీక్షేత దైవే కర్మణి ధర్మవిత్ ।
పిత్ర్యే కర్మణి తు ప్రాప్తే పరీక్షేత ప్రయత్నతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.149

తాత్పర్యం:- ధర్మశాస్త్రవేత్త అయినవాడు దైవకార్యంలో బ్రాహ్మణుడి కులగోత్రయోగ్యతాదులను పరీక్షించవద్దు. శ్రాద్ధంనందు మాత్రం బ్రాహ్మణుడి యోగ్యతాంశమును పరీక్షించాలి.॥149॥

* శ్రాద్ధకర్మకు తగని బ్రాహ్మణులు-

* యే స్తేనపతిత క్లీబా యే చ నాస్తికవృత్తయః ।
తాన్ హవ్యకవ్యయోర్విప్రాననర్హాన్మను రబ్రవీత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.150

తాత్పర్యం:- దొంగతనం చేసినవారు, పతితులు, నపుంసకులు, నాస్తికులు వీరిని ఎల్లరను హవ్యకవ్యములందు అనర్హులుగా తెలుసుకోవాలని మనువు చెప్పియున్నాడు.॥150॥

* జటిలం చానధీయానం దుర్బలం కితవం తథా ।
యాజయన్తి చ యే పూగాం స్తాంశ్చశ్రాద్ధే న భోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.151

తాత్పర్యం:- జటలు గలవాడిని, (ముండనము చేసికొన్నవాడిని) వేదాధ్యయనశూన్యుణ్ణి, బట్టతలవాడిని, అనేకమందితో యాగం చేయించువాడిని-వీరందరిని శ్రాద్ధమందు భుజించడానికి అనుమతించరాదు.॥151॥

* చికిత్సకాన్ దేవలకాన్ మాంసవిక్రయిణ స్తథా ।
విపణే న చ జీవంతో వర్జ్యాః స్యుర్హవ్యకవ్యయోః ॥ ప్రక్షిప్త శ్లోక సం.152

తాత్పర్యం:- వైద్యులను, కూలికోసం గుడిపూజచేయువారిని, మాంసం విక్రయించువారిని, వర్తకంతో జీవించువారిని హవ్యకవ్యములందు అనుమతించకూడదు.॥152॥

* ప్రేష్యో గ్రామస్య రాజ్ఞశ్చ కునఖీ శ్యావదంతకః ।
ప్రతిరోద్ధా గురోశ్చైవ త్యక్తాగ్నిర్వార్ధుషిస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం.153

తాత్పర్యం:- కూలికోసం రాజు ఆజ్ఞను, ఊరివారి ఆజ్ఞను నెరవేర్చువారిని, పుచ్చుడుగోళ్ళుగలవాడిని, నల్లని దంతములు గలవాడిని, గురువుకు విరుద్ధంగా నడిచేవారిని, అగ్నిహోత్రములను వదిలినవాడిని, వడ్డీతో జీవనం చేసేవాడిని హవ్యకవ్యములందు నిమంత్రించి భోజనం పెట్టరాదు.॥153॥

* *యక్ష్మీ చ పశుపాలశ్చ పరివేత్తా నిరాకృతిః ।*
బ్రహ్మద్విట్ పరివిత్తిశ్చ గణాభ్యన్తర ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **154**

తాత్పర్యం:- క్షయరోగం గలవాడూ, జీవనం కోసం గొర్రెలను, మేకలను మొదలైనవాటిని పోషించువాడూ, అన్నకంటే ముందు పెండ్లిచేసికొన్నవాడూ, పంచమహాయజ్ఞములు చేయనివాడు, బ్రాహ్మణాదులను ద్వేషించువాడు, తమ్ముడికి వివాహమైనా తాను వివాహం చేసుకోనివాడు అనేకమంది ద్రవ్యంతో జీవించువాడు.॥154॥

* *కుశీలవోఽవకీర్ణీ చ వృషలీపతి రేవ చ ।*
పౌనర్భవశ్చ కాణశ్చ యస్య చోపపతిర్గృహే । ప్రక్షిప్త శ్లోక సం. **155**

* *భృతకాధ్యాపకో యశ్చ భృతకాధ్యాపితస్తథా ।*
శూద్రశిష్యో గురుశ్చైవ వాగ్దుష్టః కుణ్డగోలకౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **156**

* *అకారణ పరిత్యక్తా మాతాపిత్రోర్గురోస్తథా ।*
బ్రాహ్మైర్యౌనైశ్చ సంబన్ధైః సంయోగం పతితైర్గతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **157**

తాత్పర్యం:- నాట్యంచే జీవించువాడు, స్త్రీ సంపర్కంచే బ్రహ్మచర్యమును చెడగొట్టుకొన్నవాడు, (ప్రథమాశ్రమి అయిన యతి) సవర్ణస్త్రీని విడిచి శూద్ర స్త్రీని వివాహం చేసికొన్నవాడు. రెండోసారి వివాహం చేసుకొన్న దాని కొడుకు, ఇంటిలోనే ఉపపతి గలవాడు, కాయగాచిన కంటివాడు, జీతం తీసుకొని వేదం చెప్పేవాడు, జీతం ఇచ్చి చదువుకొన్నవాడు, శూద్రుడి శిష్యుడు, శూద్రగురుడు, కఠినంగా మాటలాడువాడు, కుండుడు, గోళకుడు, తల్లిదండ్రులకు, గురువుకు శుశ్రూషాదులు చేయనివాడు, పతితులతో కూడా అధ్యయనం, చేసి, పతితులకు పిల్లనిచ్చి సంబంధం చేసికొన్నవాడు.॥155, 156,157 ॥

* *అగారదాహీ గరదః కుణ్డాశీ సోమవిక్రయీ ।*
సముద్రయాయీ బన్దీ చ తైలికః కూటకారకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **158**

తాత్పర్యం:- ఇల్లు తగుల బెట్టువాడు, విషం పెట్టువాడు, కుండగోళకులయన్నం, తినువాడును, సోమలత విక్రయించువాడును, సముద్రయానమొనర్చినవాడు, స్తుతిపాఠకుడు, నూనె కోసం నువ్వులు మొదలైనవాటిని గానుగవేసేవాడు, నూఱువాడును, తప్పుడు సాక్ష్యము చెప్పువాడును.॥158॥

* *పిత్రా వివదమానశ్చ కితవో మద్యపస్తథా ।*
పాపరోగ్యభిశస్తశ్చ దామ్భికో రసవిక్రయీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **159**

తాత్పర్యం:- తండ్రితో శాస్త్రవాదం గాని, లౌకికవాదం గాని చేయువాడు, డబ్బిచ్చి జూదమాడించు వాడు, కల్లుకంటే ఇతరాలైన మద్యముల తాగువాడు, పాపరోగములు గలవాడు, నేరం మోపబడినవాడు, దంభంకోసం ధర్మం గలవాడు, బెల్లం మొదలైన రసవస్తువులను విక్రయించువాడు.॥159॥

* *ధనుఃశరాణాం కర్తా చ యశ్చాగ్రేదిధిషూపతిః ।*
మిత్రధ్రుగ్ ద్యూతవృత్తిశ్చ పుత్రాచార్యస్తథైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **160**

తాత్పర్యం:- విల్లులు బాణములు సేయువాడు, తనకంటే పెద్దది ఉండగా ముందుగా పెండ్లిచేసికొన్నదాని మగడును, మిత్రద్రోహి, జూదమాడి జీవించువాడు, కొడుకువద్ద వేదాధ్యయనం చేసినవాడు. ॥160॥

* భ్రామరీ గణ్డమాలీ చ శ్విత్ర్యమథో పిశునస్తథా ।
ఉన్మత్తోఽన్ధశ్చ వర్జ్యాః స్యుర్వేదనిన్దక ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **161**

తాత్పర్యం:- అపస్మారీ (రోగం గలవాడు) గండమాల రోగం గలవాడు, బొల్లిగలవాడు, కొండెములమారి, పిచ్చివాడు, గుడ్డివాడు, వేదనిందకుడు -వీరందరూ విడువదగినవారు.॥161॥

* హస్తిగోఽశ్వోష్ట్రదమకో నక్షత్రైర్యశ్చ జీవతి ।
పక్షిణాం పోషకో యశ్చ యుద్ధాచార్యస్తథైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **162**

తాత్పర్యం:- ఏనుగులు, గోవులు, ఒంటెలు, గుర్రాలు మొ॥న వాటిని మచ్చిక చేయువాడు, జ్యోతిశ్శాస్త్రం చేత జీవించువాడు, పక్షులను పెంచువాడు, విలువిద్య నేర్పువాడు.॥162॥

* స్రోతసాం భేదకో యశ్చ తేషాం చావరణే రతః ।
గృహసంవేశకో దూతో వృక్షారోపక ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **163**

తాత్పర్యం:- చెరువుకట్టలు తెంచువాడు, వెల్లువలను తగ్గించి కట్టలుకట్టి వేగాన్ని నిలుపువాడు, వాస్తుశాస్త్రం చేత జీవించువాడు, సేవకవృత్తి గలవాడు, కూలికి చెట్లు నాటి పెంచువాడును.॥163॥

* శ్వక్రీడీ శ్యేనజీవీ చ కన్యాదూషక ఏవ చ ।
హింస్రో వృషలవృత్తిశ్చ గణానాం చైవ యాజకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **164**

తాత్పర్యం:- కుక్కలను పెంచి ఆటలాడించువాడు, డేగలను కొని అమ్మువాడు, కన్యను పొందగోరు వాడు, చంపుస్వభావం గలవాడు, శూద్రవృత్తియందాసక్తుడు, వినాయకుడు మొదలైన గణములను గురించి యాగం చేయించువాడు.॥164॥

* ఆచారహీనః క్లీబశ్చ నిత్యం యాచనకస్తథా ।
కృషిజీవీ శ్లీపదీ చ సద్భిర్నిన్దిత ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **165**

తాత్పర్యం:- ఆచారం లేనివాడు, నపుంసకుడు, సదా యాచనచేత జీవించువాడు, తానే కృషి చేసి జీవించువాడు, ఏనుగుకాలివాడు, కారణవశమున పెద్దలచేత నిందితుడు.॥165॥

* ఔరభ్రికో మాహిషికః పరపూర్వాపతిస్తథా ।
ప్రేతనిర్యాపకశ్చైవ వర్జనీయాః ప్రయత్నతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **166**

తాత్పర్యం:- మేకలు విక్రయించి జీవించువాడు, గేదెలవల్ల జీవించువాడు, విధవను వివాహం చేసికొన్నవాడు, డబ్బుతీసికొని శవాలను మోసేవాడు వీరందరినీ హవ్యకవ్యములందు ప్రయత్నంతో వదిలివేయాలి.॥166॥

* ఏతాన్ విగర్హితాచారా నపాఙ్క్తేయాన్ ద్విజాఽధమాన్ ।
ద్విజాతిప్రవరో విద్వానుభయత్ర వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **167**

తాత్పర్యం:- ఈ నిందిత కార్యములొనర్చు చోరాదులను, జన్మాంతకృత పాపములచేత కన్నులు కాయకాచినవారిని, సజ్జనులతోడ సహపంక్తి భోజనమునకు అనర్హులైన బ్రాహ్మణాధములను, విద్వాంసుడైన బ్రాహ్మణోత్తముడు హవ్యకవ్యములందు ప్రయత్నంతో వదిలివేయాలి.॥167॥

** బ్రాహ్మణ స్త్వధీయానస్తృణాగ్నిరివ శామ్యతి ।*
తస్మై హవ్యం న దాతవ్యం న హి భస్మని హూయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**168**

తాత్పర్యం:- గడ్డి నిప్పు ఎలా హవిస్సును దహింపజాలదో, ఎక్కడ హవిస్సు వేసినా, హోమం నిష్ఫలం అవుతుందో, అన్నట్లు వేదరూపమైన అగ్నిలేని బ్రాహ్మణుడు గడ్డినిప్పువంటివాడు. కాబట్టి దేవతోద్దేశంతో అతడికి ఒసగబడిన హవ్యకవ్యములు బూడిదలో హోమం చేయబడిన చందమున నిష్ఫలం అవుతుంది.॥168॥

** అపాఙ్క్త్యదానే యో దాతుర్భవత్యూర్ధ్వం ఫలోదయః ।*
దైవే హవిషి పిత్ర్యే వా తత్ ప్రవక్ష్యామ్యశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**169**

తాత్పర్యం:- పంక్తియోగ్యుడు కానివాడికి దైవకర్మయందుగానీ పితృకర్మయందు గానీ హవ్యకవ్యాములు ఇచ్చేవాడికి ఆ తరువాత ఏ ఫలం కలుగుతుందో సవివరంగా చెబుతాను. వినండి! ॥169॥

* అపాఙ్క్తేయ బ్రాహ్మణులకిచ్చిన దానం ఫలితమివ్వదు

** అవ్రతైర్యద్ ద్విజైర్భుక్తం పరివేత్ర్యాదిభిస్తథా ।*
అపాఙ్క్తేయైర్యదన్యైశ్చ తద్ వై రక్షాంసి భుంజతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**170**

తాత్పర్యం:-వేదగ్రహణార్థమైన వ్రతం లేనివారు, పరివేత్తలు మొదలైనవారు మరియు పంక్తికి అనర్హులయినవారు భుజించిన అన్నమును రాక్షసులు భుజిస్తారు. కాబట్టి అలాంటి హవ్యకవ్యములు నిష్ఫలములు అవుతాయి.॥170॥

** దారాగ్నిహోత్రసంయోగం కురుతే యోఽగ్రజే స్థితే ।*
పరివేత్తా స విజ్ఞేయః పరివిత్తిస్తు పూర్వజః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**171**

తాత్పర్యం:-అన్నకంటే తాను ముందుగా వివాహమును చేసుకున్నవాడిని పరివేత్త అంటారు. అలాంటి పరివేత్తకు అన్న పరివిత్తి అనబడును.॥171॥

** పరివిత్తిః పరివేత్తా యయా చ పరివిద్యతే ।*
సర్వే తే నరకం యాన్తి దాతృయాజక పఞ్చమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**172**

తాత్పర్యం:-పరివేత్త పరివిత్తిలకు సంబంధించిన అనిష్టఫలములను తెలుపుతున్నాడు.-పరివేత్త, పరివిత్తి, అలాంటి వివాహం చేసికొన్న కన్య, ఎవడు కన్యాదాతో వాడు, ఎవడు ఆ వివాహహోమం చేయించువాడో వాడు వీరైదుగురు నరకం పొందుతారు.॥172॥

** భ్రాతుర్మృతస్య భార్యాయాం యోఽనురజ్యేత కామతః ।*
ధర్మేణాపి నియుక్తాయాం స జ్ఞేయోదిధిషూపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**173**

తాత్పర్యం:- ఈ ప్రకారం పంక్తియోగ్యుడైతే మంచిదే ! అలా కాకుండా-పంక్తిబాహ్యులు కొందరు ఉంటారు. వారిని కూడా బాగా పరీక్షిస్తేకాని తెలియదు. ఉదాహరణకు -చనిపోయిన సోదరుడి భార్యయందు కామంగలవాడు అగ్రేదిధిషుడు.॥173॥

** పరదారేషు జాయేతే ద్వౌ సుతౌ కుణ్డగోలకౌ ।*
పత్యౌ జీవతి కుణ్డః స్యాన్ మృతే భర్తరి గోలకః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**174**

తాత్పర్యం:- అలాగే-భర్త జీవించి ఉండగానే, తాను పరపురుషుడిపై ఇష్టపడగా పుట్టినవాడు కుండుడు. భర్త మరణానంతరం పరపురుషుడితో కూడి సంతానం కంటే అతడు గోళకుడు.॥174॥

* తౌ తు జాతౌ పరక్షేత్రే ప్రాణినౌ ప్రేత్య చేహ చ ।
దత్తాని హవ్యకవ్యాని నాశయేతే ప్రదాయినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **175**

తాత్పర్యం:- వీరంతా పితృశ్రాద్ధాదుల విషయంలో పనికిరానివారే ! వేదాధ్యయనపరులైనంత మాత్రాన సరిపోదు. జన్మసంస్కారం-ప్రవర్తన ఇత్యాదులను కూడా పరిగణించాలి. ఇలాంటివారికి ఇవ్వబడిన హవ్యకవ్యాలు దాతలకు ఇహపరాలలో పుణ్యాన్ని నశింపచేస్తాయి.॥175॥

* అపాఙ్క్త్యోయావతః పాఙ్క్త్యాన్ భుంజానాననుపశ్యతి ।
తావతాం న ఫలం తత్ర దాతా ప్రాప్నోతి బాలిశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **176**

తాత్పర్యం:- కాబట్టి-అపాంక్తేయుణ్ణి (పంక్తిలో అనర్హుడిని) కూర్చోబెట్టరాదు. వారి సహపంక్తిన కూర్చొని ఎందరు సజ్జనులు భుజిస్తారో, ఆ భోజనం వల్ల దాతకు (కర్తకు) కలిగే ఫలితం అంతా ఈ పంక్తి బాహ్యుడొక్కడు పోగొట్టగలడు.॥176॥

* వీక్ష్యాన్ధ నవతేః కాణః షష్టేః శ్విత్రీ శతస్య తు ।
పాపరోగీ సహస్రస్య దాతుర్నాశయతే ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **177**

తాత్పర్యం:- ఇంకా-గుడ్డివాడు, కంటికి కాయగాచినవాడు, తెల్లకుష్ఠురోగి, క్షయరోగి మొదలైనవారు కూడా పంక్తిభోజనానికి అనర్హులు. వీరు వరుసగా 90 మందికి, 60 మందికి 100 మందికి 1000 మందికి భోజనం పెట్టడం వల్ల కలిగే ఫలితాన్ని చెడగొడతారు.॥177॥

* యావతస్సంస్పృశేదఙ్గైర్బ్రాహ్మణాన్ శూద్రయాజకః ।
తావతాం న భవేద్దాతుః ఫలం దానస్య పౌర్తికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **178**

తాత్పర్యం:- శూద్రులకు పురోహితుడైనవాడు కూడ శ్రాద్ధభోక్తగా పనికిరాడని శాస్త్రం. కర్తకు/ దాతకు ఫలితాన్ని పోగొట్టడంలో ఇతడి పాత్ర కూడా పెద్దదే. ఎంతమంది బ్రాహ్మణులు పంక్తి భోజనం చేసినా, వారివల్ల కర్తకు కలిగే ఫలితాన్ని రానివ్వడితడు.॥178॥

* వేదవిచ్చాపి విప్రోఽస్య లోభాత్కృత్వా ప్రతిగ్రహమ్ ।
వినాశం వ్రజతి క్షిప్రమామపాత్రమివాంభసి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **179**

తాత్పర్యం:- ఎంతటివేదవేత్తయైన విప్రుడు సైతం ఈ శూద్ర పురోహితుడి వద్ద ఆశ కొద్దీ దానం గాని గ్రహించినట్లయితే కాలని మట్టికుండ నీళ్లలో కరిగినట్టు వెంటనే నశిస్తాడు.॥179॥

* సోమవిక్రయిణే విష్ఠా భిషజే పూయశోణితమ్ ।
నష్టం దేవలకే దత్తమప్రతిష్ఠం తు వార్ధుషౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **180**

తాత్పర్యం:- సోమ(కల్లు) విక్రయం వంటి అబ్రాహ్మణ కృత్యాలు చేసే బ్రాహ్మణులకు దానాదులు ఇస్తే, జన్మాంతరంలో దాత/కర్త ఊరపందిగా జన్మిస్తారు. వైద్యవృత్తిలో ఉన్న విప్రుడికి దానం చేస్తే కీటకజన్మ ప్రాప్తి, గుడిపూజారికీ, వడ్డీలమీద జీవించేవారికీ ఇచ్చేదానం నిష్ఫలం. శ్రాద్ధవేళ వీరిని పిలవరాదు.॥180॥

* యత్తు వాణిజకే దత్తం నేహ నాముత్ర తద్భవేత్ ।
భస్మనీవ హుతం హవ్యం తథా పౌనర్భవే ద్విజే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **181**

తాత్పర్యం:- శ్రాద్ధభోజనానికి పిలువదగనివారిలో-వీరు కూడా చేరతారు. వర్తకం మీద జీవించే బ్రాహ్మణుడు, ద్వితీయ వివాహం వల్ల జన్మించినదాని పుత్రుడు. వీరికి భోజనం పెట్టడం ఇహ-పరలోక ఫలితం కలిగించదు. వీరికి పెట్టే ఈ శ్రాద్ధభోజనం నిష్ఫలం.॥181॥

* ఇతరేషు త్వపాఙ్క్త్యేషు యథోద్దిష్టేష్వసాధుషు ।
మేదో౽సృఙ్మాంసమజ్జాస్థి వదన్త్యన్నం మనీషిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **182**

తాత్పర్యం:- అపాంక్తేయులైనవారికి, ఇతరులకు, (పైన చెప్పబడినట్టివారు మాత్రమే గాక) రోగులకు మొదలైనవారికి పెట్టే శ్రాద్ధభోజనం కూడ నిష్ఫలం. పైగా జన్మాంతరంలో కర్తకు నీచజన్మప్రాప్తిస్తుంది. ॥182॥

* పాఙ్క్తేయబ్రాహ్మణులు -

* అపాఙ్క్త్యోపహతా పఙ్క్తిః పావ్యతే యైర్ద్విజోత్తమైః ।
తాన్నిబోధత కార్త్స్న్యేన ద్విజాగ్ర్యాన్ పఙ్క్తి పావనాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **183**

తాత్పర్యం:- పంక్తిబాహ్యుల విషయాన్ని పక్కన బెట్టి, ఇప్పుడు పంక్తిని పవిత్రం చేసే పావనులయిన బ్రాహ్మణోత్తముల గురించి చెబుతాను. వినండి ! ॥183॥

* అగ్ర్యాస్సర్వేషు వేదేషు సర్వప్రవచనేషు చ ।
శ్రోత్రియాన్వయజాశ్చైవ విజ్ఞేయాః పఙ్క్తి పావనాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **184**

తాత్పర్యం:- వేదాలన్నిటినీ చక్కగా అధ్యయనం చేసినవారు, షడంగములు తెలిసినవారు, శ్రోత్రియ వంశములలో జన్మించినవారు పంక్తిపావనులనబడతారు.॥184॥

* త్రిణాచికేతః పఞ్చాగ్నిః త్రిసుపర్ణః షడఙ్గవిత్ ।
బ్రహ్మదేయాత్మ సన్తానో జ్యేష్ఠసామగ ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **185**

తాత్పర్యం:- అధ్వర్యులు, పంచాగ్నిహోత్రులు, ఋగ్వేదం తెలిసినవారు, శిక్షాది వేదాంగాలు తెలిసినవారు, బ్రాహ్మవివాహం చేసుకున్నందు వల్ల ఆ స్త్రీకి జన్మించిన పుత్రుడు, జ్యేష్ఠ సామగానం తెలిసినవారు కూడా మేలు.॥185॥

* వేదార్థవిత్ప్రవక్తా చ బ్రహ్మచారీ సహస్రదః ।
శతాయుశ్చైవ విజ్ఞేయా బ్రాహ్మణాః పఙ్క్తిపావనాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **186**

తాత్పర్యం:- వేదార్థాలు తెలిసినవారు, వేదార్థప్రవచనం చేసేవారు, బ్రహ్మచర్య వ్రతాన్ని అనుష్ఠించేవారు, వేయిగోవులను దానం చేసిన కీర్తిగలవారు, శతాయుష్కుడు, శ్రోత్రియుడు కూడ పంక్తిపావనులే !॥186॥

* పూర్వేద్యురపరేద్యుర్వా శ్రాద్ధకర్మణ్యుపస్థితే ।
నిమంత్రయేతత్ర్యవరాన్ సమ్యగ్విప్రాన్ యథోదితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **187**

తాత్పర్యం:- శ్రాద్ధ దినానికి రెండు రోజులు ముందుగా గాని, రేపు శ్రాద్ధమనగా ఈ రోజున గాని పైన చెప్పిన సలక్షణయుత విప్రులను ముగ్గురికి తక్కువగాకుండా నిమంత్రించాలి.॥187॥

* నిమంత్రితో ద్విజః పిత్ర్యే నియతాత్మా భవేత్సదా ।
న చ ఛన్దాంస్యధీయాత యస్య శ్రాద్ధం చ తద్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **188**

తాత్పర్యం:- శ్రాద్ధం కోసమై నిమంత్రించబడిన బ్రాహ్మణుడు, శ్రాద్ధం చేయువాడు ఇద్దరూ కూడ శ్రాద్ధం రోజు పూర్తిగా జితేంద్రియులై ఉండాలి. కేవలం గాయత్రీ జపం తప్ప ఆ రోజున ఇతర వేదభాగాల అధ్యయనం చేయరాదు.॥188॥

* నిమంత్రితాన్ హి పితర ఉపతిష్ఠంతి తాన్ ద్విజాన్ ।
వాయువచ్చానుగచ్ఛన్తి తథాసీనానుపాసతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **189**

తాత్పర్యం:- నిమంత్రితులైన విప్రులను పితృదేవతలు సమీపిస్తారు. అంతేకాదు, వాయువులాగా వెంబడిస్తారు. వారు కూర్చుంటే తాము కూడా కూర్చుంటారు. కాబట్టి నియమిత శ్రాద్ధభోక్తలు పరిశుద్ధులై ఉండాలి. ॥189॥

* కేతితస్తు యథాన్యాయం హవ్యకవ్యే ద్విజోత్తమః ।
కథంచిదప్యతిక్రామన్ పాపస్సూకరతాం వ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 190

తాత్పర్యం:- హవ్య కవ్యాలలో నిమంత్రితులై ఉండి, శ్రాద్ధ సమయానికి ఏ కారణం చేతనైనా రాకపోతే అతడు ఊరపందిగా జన్మిస్తాడు.॥190॥

* ఆమంత్రితస్తు యః శ్రాద్ధే వృషల్యా సహ మోదతే ।
దాతుర్యద్దుష్కృతం కించిత్తత్సర్వం ప్రతిపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. 191

తాత్పర్యం:- శ్రాద్ధభోజనానికి వస్తానని ఒప్పుకొన్న బ్రాహ్మణుడు శూద్రస్త్రీతో రతిక్రియలో పాల్గొంటే, కర్త వల్ల జరిగే పాపాలు అన్నీ ఆ నిమంత్రితుడికే చెందుతాయి తప్ప కర్తకు ఇంచుకైనా పాపం అంటదు.॥191॥

* అక్రోధనా శ్శౌచపరాస్సతతం బ్రహ్మచారిణః ।
న్యస్తశస్త్రా మహాభాగాః పితరః పూర్వదేవతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 192

తాత్పర్యం:- పితృదేవతలంటేనే క్రోధం లేనివారు. ఆచారవంతులు. బాగా వేదాధ్యయనం చేసినవారు, జితేంద్రియులు, శస్త్రాస్త్రములు ధరించనివారు, కరుణామయులు, బ్రహ్మచర్య వ్రతావలంబనులు. ఈ అష్టవిధ సద్గుణరూపులైన అనాది దేవతలు కాబట్టి వీరిని అర్చించే కర్త-భోక్త లిరువురూ కూడా క్రోధరాహిత్యంతో ఉండాలి.॥192॥

* యస్మాదుత్పత్తిరేతేషాం సర్వేషామప్యశేషతః ।
యే చ యైరుపచర్యాస్స్యుర్నియమైస్తాన్నిబోధత॥ ప్రక్షిప్త శ్లోక సం. 193

తాత్పర్యం:- ఎవడివల్ల ఈ పితృదేవతలందరు ఉత్పన్నులయ్యారో, ఏ పితరులెవరికెలాంటి నియమాలతో ఉపచరింపతగినవారో చెబుతాను. వినండి! ॥193॥

* మనోర్హైరణ్యగర్భస్య యే మరీచ్యాదయః సుతాః ।
తేషామృషీణాం సర్వేషాం పుత్రాః పితృగణాః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 194

తాత్పర్యం:- హిరణ్యగర్భుడి పుత్రుడైన మనువుకు మరీచిమహర్షి మొదలైన ఏ పుత్రులు గలరో, వారి పుత్రులందరూ పితృగణములు అనబడతారు. (హిరణ్యగర్భుడి పుత్రుడు మనువు. మనువు పుత్రులు మరీచ్యాదులు, వారి పుత్రులు పితరులు.).॥194॥

* విరాట్సుతా స్సోమసదః సాధ్యానాం పితరః స్మృతాః ।
అగ్నిష్వాత్తాశ్చ దేవానాం మారీచా లోకవిశ్రుతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 195

తాత్పర్యం:- విరాట్పుత్రులైన సోమసదులనేవారు, సాధ్యులనేవారి యొక్క పితరులు. అదే విధంగా అగ్నిషాత్వత్తులనే మారీచి మహర్షి యొక్క పుత్రుడు దేవతలకు పితరులుగా ప్రసిద్ధి చెందినారు.॥195॥

* దైత్యదానవయక్షాణాం గంధర్వోరగరక్షసామ్ ।
సుపర్ణకిన్నరాణాం చ స్మృతా బర్హిషదోఽత్రిజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 196

తాత్పర్యం:- దైత్యదానవయక్షులకు, గంధర్వరాక్షసపన్నగులకు, గరుడకిన్నరులకు అత్రిపుత్రులైన బర్హిషదులు పితరులు.॥196॥

* *సోమపా నామ విప్రాణాం క్షత్రియాణాం హవిర్భుజః ।*
వైశ్యానామాజ్యపా నామ శూద్రాణాం తు సుకాలినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***197***

తాత్పర్యం:- హిరణ్య గర్భుడి పుత్రుడైన మనువుకు మరీచి మహర్షి మొ॥ ఏ పుత్రులున్నారో వారి పుత్రులు అంతా పితృగణాలు అనబడతారు. మనుపుత్రులు మన పితరులు. విప్రులకు సోమపులు అనేవారు, క్షత్రియులకు హవిర్భుజులు అనేవారు, వైశ్యులకు ఆజ్యపులు అనేవారు, శూద్రులకు సుకాలినులు అనేవారు పితరులు. వీరు ఎవరెవరి పుత్రులో చెబుతాను.॥197॥

* *సోమపాస్తు కవేః పుత్రా హవిష్మంతోఽఙ్గిరస్సుతాః ।*
పులస్త్యస్యాజ్యపాః పుత్రా వసిష్ఠస్య సుకాలినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***198***

తాత్పర్యం:- సోమపులు శుక్రుడి పుత్రులు. హవిష్మంతులు అంగీరసుడి సుతులు, ఆజ్యపులు పులస్త్యుడి పుత్రులు, సుకాలినులు వశిష్ఠుడి పుత్రులు.॥198॥

* *అగ్నిదగ్ధానగ్నిదగ్ధాన్ కావ్యాన్ బర్హిషదస్తథా ।*
అగ్నిష్వాత్తాంశ్చ సౌమ్యాంశ్చ విప్రాణామేవ నిర్దిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***199***

తాత్పర్యం:- అగ్నిదగ్ధులు, అనగ్ని దగ్ధులు, కావ్యులు, బర్హిషదులు, అగ్నిష్వాత్తులు, సౌమ్యులు అనేవారు బ్రాహ్మణ పితరులు అని తెలియాలి. ॥199॥

వివరణ:- 195 నుండి 199 శ్లోకాలలో వర్ణించబడిన లక్షణాలు- వాటి అర్థాలు 3.82 శ్లోకపు సమీక్షలో చూడగలరు.

* *య ఏతే తు గుణా ముఖ్యాః పితౄణాం పరికీర్తితాః ।*
తేషామపీహ విజ్ఞేయం పుత్రపౌత్రమనంతకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***200***

తాత్పర్యం:- ఇక్కడ-పితృగణాలలో ఎవరు ముఖ్యులని పేర్కొనబడ్డారో వారికందరికీ ఇక్కడ ప్రపంచంలో ఉండేవారు పుత్రపౌత్రులని- పరంపరాభివృద్ధికి చెందినవారని తెలియాలి.॥200॥

* *ఋషిభ్యః పితరో జాతాః పితృభ్యో దేవమానవాః ।*
దేవేభ్యస్తు జగత్సర్వం చరం స్థాన్వనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***201***

తాత్పర్యం:- అది ఏవిధంగా అంటే-ఋషుల వల్ల పితరులు, వారివల్ల దేవదానవులు, దేవతలవల్ల స్థావర జంగమరూప ప్రపంచం ఉద్భవించింది. ॥201॥

* దేవకర్మ కంటే పితృకర్మ శ్రేష్ఠము-

* *రాజతై ర్భాజనై రేషామథో వా రాజతాన్వితైః ।*
వార్యపి శ్రద్ధయా దత్తమక్షయాయోపకల్పతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***202***

తాత్పర్యం:- నిమంత్రితులైన బ్రాహ్మణులకు వెండి పళ్లేలలో గాని, వెండి కలిసిన ఇతర లోహ పాత్రలలో విస్తర్లు వేసిగాని భోజనం పెట్టాలి. ఏదైనా సరే ! దీనికి శక్తి లేకున్నా శ్రద్ధతో మంచినీరిచ్చినా పితృదేవతలకు తృప్తే! ॥202॥

* *దేవకార్యాద్ద్విజాతీనాం పితృకార్యం విశిష్యతే ।*
దైవం హి పితృకార్యస్య పూర్వమాప్యాయనం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***203***

తాత్పర్యం:- బ్రాహ్మణులకు దేవతల కార్యముకంటే పితృకార్యం ముఖ్యం. దైవకార్యం, పితృకార్యం కంటే ముందే చేయదగింది. తృప్తినిచ్చేది. కానీ దేవకార్యం పితృకార్యానికి అంగం లాంటిది. కాబట్టి దీన్నే ముందుగా చెయ్యాలి.॥203॥

* **తేషామారక్షభూతం తు పూర్వం దైవం నియోజయేత్ ।**
రక్షాంసి హి విలుంపంతి శ్రాద్ధమారక్షవర్జితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **204**

తాత్పర్యం:- కాపుదల లేని ఇలాంటి శ్రాద్ధాన్ని రాక్షసులు పాడుచేయకుండా ఉండేందుకు గాను పితరులకు విశ్వేదేవరూపమున ఒక బ్రాహ్మణుణ్ణి ముందుగా నియమించాలి.॥204॥

* **దేవకర్మ-పితృశ్రాద్ధపు విధులు-**

* **దైవాద్యంతం తదీహేత పిత్రాద్యంతం నతద్భవేత్ ।**
పిత్రాద్యంతం త్వీహమానః క్షిప్రం నశ్యతి సాన్వయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **205**

తాత్పర్యం:- పితృశ్రాద్ధానికి ముందు-వెనుక దేవతలుండాలి. పితరులకు ఒక బ్రాహ్మణుడు, శ్రాద్ధ సంరక్షణకు విష్ణురూపంలో ఒక బ్రాహ్మణుడు ఉండాలి. విశ్వేదేవ స్థానం లేకుండా, విష్ణువులేకుండా పితరుల్ని ఆవాహన చెయ్యకూడదు.॥205॥

* **శుచిం దేవం వివిక్తం చ గోమయేనోపలేపయేత్ ।**
దక్షిణాప్రవణం చైవ ప్రయత్నేనోపపాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **206**

తాత్పర్యం:- పరిశుద్ధము, జనసంచారం లేనిచోట శ్రాద్ధకర్త గోమయంతో అలికించాలి. ఆ ప్రదేశానికి దక్షిణం వైపు వాటం ఉండేలా ఏర్పరచాలి.॥206॥

* **అవకాశేషు చోక్షేషు నదీతీరేషు చైవ హి ।**
వివిక్తేషు చ తుష్యంతి దత్తేన పితరస్సదా॥ ప్రక్షిప్త శ్లోక సం. **207**

తాత్పర్యం:- స్వభావరీత్యా పరిశుద్ధమైన అరణ్యాలు మొదలైన ప్రదేశాలు, ఏకాంతస్థలాలు, పుణ్యనదీతీరాలు మొదలైనచోట్ల పెట్టే శ్రాద్ధాలు పితరులకు తృప్తి కలిగిస్తాయి.॥207॥

* **ఆసనేషూపక్ల్పప్తేషు బర్హిష్మత్సు పృథక్పృథక్ ।**
ఉపస్పృష్టోదకాన్ సమ్యగ్విప్రాంస్తానుపవేశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **208**

తాత్పర్యం:- వేర్వేరుగా వేసినట్లుగా రెండు ప్రదేశాలలో అలికి, దేవతాస్థానంలో ఉత్తర కొనలు గల దర్భలు రెండు, పితృస్థానములలో మూడు దర్భలు కింద దక్షిణాగ్రములైన పరిచి, నియమిత బ్రాహ్మణులు స్నానాలు-ఆచమనం చేసి రాగా వారిని ఆ దర్భాసనాల మీద కూర్చోపెట్టాలి.॥208॥

* **ఉపవేశ్య తు తాన్ విప్రానాసనేష్వజుగుప్సితాన్ ।**
గంధమాల్యైస్సురభిరర్చయేద్దేవపూర్వకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **209**

తాత్పర్యం:- ఆ విధంగా దర్భాసనాలపై వారు కూర్చున్న తరవాత, వారు పూజార్హులవుతారు. అప్పుడు వారిని సువాసన గల పుష్పాలతో దేవతాపూర్వకంగా అర్చించాలి.॥209॥

* **తేషాముదకమానీయ స పవిత్రాంస్తిలానపి ।**
అగ్నౌ కుర్యాదనుజ్ఞాతో బ్రాహ్మణో బ్రాహ్మణైస్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **210**

తాత్పర్యం:- పవిత్రమైన దర్భలతో కూడిన అర్ఘ్యోదకం ఇచ్చి, తమ-తమ గృహ్యాసూత్రాలలో తెలుపబడిన రీతిగా వారిని ప్రార్థించి, వారి వల్ల అనుజ్ఞను పొంది. ఈ చెప్పబోయే దేవతలకు అగ్నియందు హోమాన్ని వ్రేల్చాలి.॥210॥

* *అగ్నేస్సోమయమాభ్యాం స కృత్వా-ప్యాయనమాదితః ।*
హవిర్దానేన విధివత్పశ్చాత్సంతర్పయేత్పితౄన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***211***

తాత్పర్యం:- అగ్నిదేవుడికి, సోముడికి, యముడికి ముందుగా ప్రీతికలిగేలా హోమం చెయ్యాలి. ఆ తరువాత పితృదేవతలకు హోమం చేయాలి.॥211॥

* *అగ్న్యభావేతు విప్రస్య పాణావేవోపపాదయేత్ ।*
యో హ్యగ్నిస్స ద్విజో విప్రైర్మంత్రదర్శిభిరుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***212***

తాత్పర్యం:- స్నాతకుడు, బ్రహ్మచారి, భార్యలేనివాడు....వీరికి గార్హపత్యాగ్ని ఉండదు. కాబట్టి వీరికి కుడిహస్తమునందే పై మూడు ఆహుతులను ఇవ్వాలి. అగ్నిహోత్రుడే ద్విజుడని వేదవిదులు చెబుతున్నారు. ॥212॥

* *అక్రోధనాన్ సుప్రసాదాన్ వదంత్యేతాన్ పురాతనాన్ ।*
లోకస్యాప్యాయనే యుక్తాన్ శ్రాద్ధదేవాన్ ద్విజోత్తమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***213***

తాత్పర్యం:- శ్రాద్ధంలో నియమితులైన విప్రులు క్రోధరహితులు, దయామయులు, ప్రాచీనులు అయి లోకానికి మేలుచేసే తలంపుగలవారై ఉంటారు. కాబట్టి వారి హస్తంలోనే అగ్నికార్యం చేస్తే అది హోమసమానమై పుణ్యఫలప్రదం కాగలదు. ॥213॥

* *అపసవ్యమగ్నౌ కృత్వా సర్వమావృత్య విక్రమమ్ ।*
అపసవ్యేన హస్తేన నిర్వపేదుదకం భువి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***214***

తాత్పర్యం:- అగ్నితో చేయాల్సిన హోమానుష్ఠాన క్రమం అంతా దక్షిణ భాగాన ఆచరించి, దక్షిణ(కుడి) హస్తంలో పిండప్రదాన స్థలంలో దర్భలు పరిచిన స్థలంలో నువ్వులు-నీళ్లు వదలాలి.॥214॥

* *త్రీంస్తు తస్మాద్ధవిశ్శేషాత్పిండాన్ కృత్వా సమాహితః ।*
ఔదకేనైవ విధినా నిర్వపేద్దక్షిణాముఖః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***215***

తాత్పర్యం:- హోమావశిష్టమైన అన్నం నుంచి 3 పిండాలు తీసుకుని, దక్షిణముఖంగా కర్త కూర్చొని తిల-జలములు ఉంచిన స్థలంలో ఆ పిండాల నుంచి, వాటిపై మళ్లీ తిలలు- ఉదకం చల్లాలి.॥215॥

* *న్యుప్య పిండాంస్తతస్తాంస్తు ప్రయతో విధిపూర్వకమ్ ।*
తేషు దర్భేషు తం హస్తం విమృజ్యాల్లేపభాగినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***216***

తాత్పర్యం:- తమ తమ గృహ్యసూత్రాల ప్రకారం శ్రద్ధగా ఆ పిండాల నుంచి, ఆ పిండాలున్న చోట అంటుకుని వున్న మెతుకులను, చేతికి అంటుకుని ఉన్న మెతుకులను తీసి లేపభాక్కులైన పితరులకు సమర్పించాలి. (ఇదంతా శ్రాద్ధపురోహితుడి ఆధ్వర్యంలో జరిగే క్రియ. 'అనుక్తం అన్యతో గ్రాహ్యమ్').॥216॥

* *ఆచమ్యోదక్పరావృత్య త్రిరాయమ్య శనైరసూన్ ।*
షదృతూంశ్చ నమస్కుర్యాత్పితౄనేవ చ మంత్రవత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***217***

తాత్పర్యం:- ఉత్తర ముఖుడై కర్త మూడుసార్లు ఆచమించి, మూడుసార్లు ప్రాణాయామం చేసి వసంతం మొదలైన ఆరు ఋతువులకు, తదుపరి పితృదేవతలకు నమస్కరించాలి (ఈ శ్రాద్ధవిధి మనూక్తం కాదని, శ్రాద్ధకర్మ/ అపరం చేయించే పురోహితుల వల్ల చేరిందని ఒక వాదం ఉంది.).॥217॥

* *ఉదకం నినయేచ్ఛేషం శనైః పిండాంతికే పునః ।*
అవజిఘ్రేచ్చ తాన్ పిండాన్ యథా న్యుప్తాన్ సమాహితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***218***

తాత్పర్యం:- పిండదానమునందు ఉంచిన నీటిశేషం ఒక దొన్నెలోకి తీసుకొని, పిండాలకు చేరువగా అపసవ్యంగా 3 సార్లు తిప్పాలి. తర్వాత సావధానంగా వరుసగా ఆ 3 పిండాలను కొంచెం ఎత్తి ఆఘ్రాణించి తదుపరి ఆ మెతుకుల్ని కిందకు పారేయాలి.॥218॥

* *పిండేభ్యస్త్వల్పికాం మాత్రాం సమాదాయానుపూర్వశః ।*
తేనైవ విప్రానాసీనాన్ విధివత్పూర్వమాశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***219***

తాత్పర్యం:- ఆ పిండాలనుంచి క్రమంగా కొంచెం కొంచెం తీసి, నిమంత్రితులయిన బ్రాహ్మణులు కూర్చున్న పాత్రలు/ విస్తర్లలో వారు భుజించేలా ఉంచాలి. పితృస్థానంలో కూర్చున్న విప్రుడికి పితరుణ్ణి ఉద్దేశించిన పిండ శేషాన్ని ఉంచాలి.॥219॥

* *ధ్రియమాణే తు పితరి పూర్వేషామేవ నిర్వపేత్ ।*
విప్రవద్వాఽపి తం శ్రాద్ధే స్వకం పితరమాశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***220***

తాత్పర్యం:- తండ్రి ఉన్నప్పుడూ, కేవలం తల్లికే శ్రాద్ధం పెట్టవలసివస్తే, అప్పుడు పితామహుడు (తాత) మొదలైన ముగ్గురు పితరులకు పిండదానాలు చేయాలి. లేదా జీవించివున్న తండ్రిస్థానాన ఒక బ్రాహ్మణుడికి భోజనం పెట్టాలి (పిండంతో పనిలేదు).॥220॥

* *పితా యస్య తు వృత్తస్స్యాజ్జీవేచ్చాపి పితామహః ।*
పితుస్స నామ సంకీర్త్య కీర్తయేత్ప్రపితామహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***221***

తాత్పర్యం:- తాత ఉండగా తండ్రి గతిస్తే- అప్పుడు తండ్రిని, ముత్తాతను, వారి తండ్రిని (పితుఃప్రపితామహుని) బ్రాహ్మణులయందు ఆవాహనం చేసి శ్రాద్ధాన్ని చెయ్యాల్సి ఉంటుంది.॥221॥

* *పితామహో వా తచ్ఛ్రాద్ధం భుంజీతేత్యబ్రవీన్మనుః ।*
కామం వా సమనుజ్ఞాతః స్వయమేవ సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***222***

తాత్పర్యం:- జీవించివున్న పితామహుడి అనుజ్ఞప్రకారం, పితామహుడిని అతని స్థానంలోనే ఉంచి, పితృ-ప్రపితామహుల స్థానాలకు విప్రులను ఆవాహనం చేసి శ్రాద్ధం నిర్వర్తించవచ్చునని మనుప్రోక్తం.॥222॥

* *తేషాం దత్వా తు హస్తేషు స పవిత్రం తిలోదకమ్ ।*
తత్పిండాగ్రం ప్రయచ్ఛేత స్వధైషామస్త్వితి బ్రువన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***223***

తాత్పర్యం:- ఆవాహితులైన బ్రాహ్మణుల హస్తములందు తిలసహితదర్భోదకముల నుంచి, ముందు పిండముల నుండి ఎత్తిన స్వల్పభాగాన్ని 'పిత్రే స్వధాఽస్తు, పితామహాయ స్వధాఽస్తు, పితామహాయ స్వధాఽస్తు, ప్రపితా మహాయ స్వధాఽస్తు' అని వరుసగా పితృపితామహ ప్రపితామహులకు వారి హస్తములందు ఉంచాలి.॥223॥

* *పాణిభ్యాం తూపసంగృహ్య స్వయమన్నస్య వర్ధితమ్ ।*
విప్రాంతికే పితౄన్ ధ్యాయన్ శనకైరుపనిక్షిపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***224***

తాత్పర్యం:- పిదప శ్రాద్ధకర్త చేతులతో అన్నం మొదలైన పదార్థాలుంచి ఉన్న పాత్రను ఎత్తుకొని వంట ఇంటనుండి తెచ్చి పితృదేవతలను ధ్యానిస్తూ, ఆ బ్రాహ్మణుల ఎదుట మెల్లగా ఉంచాలి.॥224॥

* *ఉభయోర్హస్తయోర్ముక్తం యదన్నముపనీయతే ।*
తద్విప్రలుంపంత్యసురా స్సహసా దుష్టచేతసః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***225***

తాత్పర్యం:- శ్రాద్ధకర్త అన్నముంచిన పాత్రం ఒకచేత ఉంచుకొని, మరొకచేతితో దాన్ని మూసి లేదా, ఒక్క చేతితో పట్టుకొని మూసికొనక తెచ్చెనేని, అలాంటి అన్నమును దుష్టులైన రక్కసులు అపహరిస్తారు. ॥225॥

* *గుణాంశ్చ సూపశాకాద్యాన్ పయో దధి ఘృతం మధు ।*
విన్యసేత్ప్రయతః పూర్వం భూమావేవ సమాహితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***226***

తాత్పర్యం:- వ్యంజములను, పప్పు, కూరగాయలు మొదలైనవాటిని పెరుగు, పాలు, తేనె వీటిని పరిశుద్ధుడై పాత్రయందు వేర్వేరుగా తెచ్చి అన్నముంచుటకు ముందే ఉంచాలి.॥226॥

* *భక్ష్యం భోజ్యం చ వివిధం మూలాని చ ఫలాని చ ।*
హృద్యాని చైవ మాంసాని పానాని సురభీణి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***227***

తాత్పర్యం:- నమిలి తినదగిన వడలు మొదలైన పిండివంటలను, భుజింపదగిన పాయసాదులను, అనేక రకాల మూలఫలాలను, హృద్యములైన సువాసన గల మాంసములను పానీయాలను తెచ్చి చుట్టూ ఉంచాలి.॥227॥

* *ఉపనీయ తు తత్సర్వం శనకైస్సుసమాహితః ।*
పరివేషయేత ప్రయతో గుణాన్సర్వాన్ ప్రచోదయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***228***

తాత్పర్యం:- అలా వాటిని చుట్టూ ఉంచుకొని, పరిశుద్ధుడై పదార్థముల గుణముల తెల్పుతూ, జాగరూకతతో వడ్డించాలి.॥228॥

* *నాస్రమాపాతయేజ్జాతు న కుప్యేన్నానృతం వదేత్ ।*
న పాదేన స్పృశేదన్నం న చైతదవధూనయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***229***

తాత్పర్యం:- అలా వడ్డించు సమయంలో మృతులను తలంచి కన్నీరు విడువరాదు. కోపపడరాదు. కల్లలాడరాదు. చెదరిన అన్నమును కాలితో తొక్కరాదు,. విస్తరిలో అన్నం చెదరునట్లు వడ్డించరాదు.॥229॥

* *అస్రం గమయతి ప్రేతాన్ కోపోఽరీనన్నృతం శునః ।*
పాదస్పర్శస్తు రక్షాంసి దుష్కృతీ నవధూననమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***230***

తాత్పర్యం:- కన్నీరు విడిచినట్లయితే, శ్రాద్ధాన్నమును ప్రేతములు భుజిస్తాయి. కోపం పొందినట్లయితే శత్రువులు పొందుతారు. కల్లలాడినట్లయితే కుక్కలు తింటాయి. కాలితో తాకిన అన్నం రాక్షసులను చేరుతుంది. వడ్డించేప్పుడు చెదరిన అన్నమును పాపాత్ములు తింటారు. కాబట్టి రోదనం మొ॥న వాటిని చేయరాదు.॥230॥

* *యద్యద్రోచేత విప్రేభ్యస్తత్తద్దద్యాదమత్సరః ।*
బ్రహ్మోద్యాశ్చ కథాః కుర్యాత్పితౄణా మేత దీప్సితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***231***

తాత్పర్యం:- బ్రాహ్మణులకు ఏది ఇష్టమో, దాన్ని మత్సరం మాని వారికి వడ్డించాలి. బ్రహ్మతత్త్వ ప్రతిపాదకములైన కథలను చెప్పాలి. పితరులకు అలాంటి కథలే ఇష్టములైనవి. ॥231॥

* *స్వాధ్యాయం శ్రావయేత్పిత్ర్యే ధర్మశాస్త్రాణి చైవ హి ।*
ఆఖ్యానానీతిహాసాంశ్చ పురాణాని ఖిలాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***232***

తాత్పర్యం:- భోజన కాలంలో వేదాలను, ధర్మశాస్త్రాలను వినిపించాలి. సౌవర్ణం, మైత్రావరుణం, త్రిసుపర్ణం వీటిని, ఉపాఖ్యానాలను, ఇతిహాసాలను, పురాణాలను, పురుష సూక్తం, శ్రీసూక్తం మొదలైన సూక్తాలను వినిపించాలి.॥232॥

* హర్షయేద్బ్రాహ్మణాం స్తుష్టో భోజయేచ్చ శనైశ్శనైః ।
అన్నాద్యేనాసకృచ్చైతాన్ గుణైశ్చ పరిచోదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**233**

తాత్పర్యం:- తాను సంతోషభరితుడై బ్రాహ్మణులను సంతోషపెడుతూ మెల్లమెల్లగా వారు భోజనం చేసినట్లు వడ్డన చేయాలి. పదార్థములు వారి దగ్గరకు తెచ్చి **“యీ పిండివంటకం బాగా ఉన్నది. మరొక్కటి వేసికోండీ”** అని ఇలా చెబుతూ వారిని బాగా భుజించే లాగా ఉత్సాహ పరచాలి.॥233॥

* వ్రతస్థమపి దౌహిత్రం శ్రాద్ధే యత్నేన భోజయేత్ ।
కుతపం చాసనం దద్యాత్తిలైశ్చ వికిరేన్మహీమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**234**

తాత్పర్యం:- బ్రహ్మచారి అయినా, కూతురి కొడుకు శ్రాద్ధంనందు శ్రద్ధతో భుజింపచేయాలి. కంబళిని ఆసనంగా పరవాలి. శ్రాద్ధభూమిపై నువ్వులు చల్లాలి.॥234॥

* త్రీణి శ్రాద్ధే పవిత్రాణి దౌహిత్రః కుతపస్తిలాః ।
త్రీణి చాత్ర ప్రశంసంతి శౌచమక్రోధమత్వరామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**235**

తాత్పర్యం:- మనుమడు (కూతురి కొడుకు), మధ్యాహ్నవేళ, నువ్వులు... ఈ మూడూ పరిశుద్ధములైనవి. పరిశుద్ధంగా ఉండటం, క్రోధం లేకపోవడం, సావకాశంగా ఉండటం అనే ఈ 3 లక్షణాలు పితరులకు ఇష్టం.॥235॥

* అత్యుష్ణం సర్వమన్నం స్యాద్భుంజీరంస్తే చ వాగ్యతాః ।
న చ ద్విజాతయో బ్రూయుర్దాత్రాపృష్టా హవిర్గుణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**236**

తాత్పర్యం:- సకల పదార్థములు చల్లపడక ఎక్కువవేడిగా ఉండాలి. భోక్తలైన బ్రాహ్మణులు మౌనంతో భుజించాలి. శ్రాద్ధకర్త పదార్థముల గుణములను అడిగినా, భోక్తలైన బ్రాహ్మణులు హవిస్సుల గుణములను చెప్పరాదు.॥236॥

* పితరులకు ఎటువంటి అన్నం ప్రాప్తించదు?

* యావదుష్ణం భవత్యన్నం యావ దశ్నంతి వాగ్యతాః ।
పితరస్తావదశ్నంతి యావన్నోక్తా హవిర్గుణాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**237**

తాత్పర్యం:- అన్నాదిపదార్థములు ఎంతవరకు వేడిగా ఉంటాయో, భోక్తలు ఎంతవరకు మౌనంతో భుజిస్తారో, ఎంతవరకు హవిస్సుల గుణములను చెప్పరో, అంతవరకు పితరులు భోజనం చేస్తారు.॥237॥

* యద్వేష్టితశిరా భుజ్క్తే తద్భుజ్క్తే దక్షిణాముఖః ।
సోపానత్కశ్చ యద్భుజ్క్తే తద్వై రక్షాంసి భుంజతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**238**

తాత్పర్యం:- భోక్తలు తలకు పాగా మొదలైనవి ధరించకూడదు. దక్షిణాభిముఖులై భుజించకూడదు. పాదుకలు ధరించినా పనికిరాదు. ఇలా చేస్తే పితృదేవతలకు బదులు రాక్షసులకు చెందుతుం దా శ్రాద్ధం.॥238॥

* శ్రాద్ధ సమయపు జాగ్రత్తలు-

* చాండాలశ్చ వరాహశ్చ కుక్కుటశ్శ్వా తథైవచ ।
రజస్వలా చ షండశ్చ నేక్షేరన్నశ్నతో ద్విజాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**239**

తాత్పర్యం:- చండాలులు, పంది, కోడి, కుక్క, రజస్వల, నపుంసకుడు.... వీరు శ్రాద్ధభోక్తలకు కన్పించరాదు. కాబట్టి వీరిని ఆ దరిదాపుల్లోకి రానివ్వరాదు.॥239॥

* *హోమే ప్రదానే భోజ్యే చ యదేభిరభివీక్ష్యతే ।*
దైవే కర్మణి పిత్ర్యే వా తద్గచ్ఛత్యయథాతథమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **240**

తాత్పర్యం:- హోమం, దానం, బ్రాహ్మణభోజనం మొదలగు సమయాల్లోను, దేవకార్యాల్లో, అమావాస్య, పౌర్ణమిల్లోను, శ్రాద్ధాది పితృకార్యాల్లోను పైన చెప్పబడిన చండాలురు కంటబడితే కార్యం చెడుతుంది.॥240॥

* *ఘ్రాణేన సూకరో హన్తి పక్షవాతేన కుక్కుటః ।*
శ్వాతు దృష్టినిపాతేన స్పర్శేనావరవర్ణజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **241**

తాత్పర్యం:- పంది వాసన చూడటంవల్ల, కోడిరెక్కల గాలి సోకడం వల్ల, కుక్క చూపు పడటం వల్ల శూద్రుడు తాకడం వల్ల పదార్థములు అపరిశుద్ధాలవుతాయి. కాబట్టి అలాంటి వాటితో చేసిన శ్రాద్ధాదిక్రియలు నిష్ఫలాలవుతాయి.॥241॥

* *ఖంజో వా యది వా కాణో దాతుః ప్రేష్యోఽపి వా భవేత్ ।*
హీనాతిరిక్తగాత్రో వా తమప్యపనయేత్పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **242**

తాత్పర్యం:- కుంటివాడు గాని, కాయగాచిన కంటివాడు గాని, మరేదైన అంగవైకల్యం గలవాడు గాని శ్రాద్ధకర్త ఇంట పరిచారకులుగా ఉన్నట్లయితే, వారిని అందరూ శ్రాద్ధదినమున శ్రాద్ధం చేసే ఇంటి నుండి వెలుపలికి తరిమివేయాలి.॥242॥

* *బ్రాహ్మణం భిక్షుకం వాపి భోజనార్థముపస్థితమ్ ।*
బ్రాహ్మణైరభ్యనుజ్ఞాతః శక్తితః ప్రతిపూజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **243**

తాత్పర్యం:- శ్రాద్ధ సమయంలో వచ్చిన అతిథికి, సన్న్యాసికి, భోజనం నిమిత్తం వచ్చిన ఇతర బ్రాహ్మణులకు శ్రాద్ధ భోక్తల అనుజ్ఞతో యథాశక్తిగా భోజనాలు పెట్టి సత్కరించవచ్చు!॥243॥

* **శ్రాద్ధములో ఇతర భాగములు-**

* *సార్వవర్ణికమన్నాద్యం సన్నీయాప్లావ్య వారిణా ।*
సముత్సృజేద్భుక్తవతామగ్రతో వికిరన్ భువి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **244**

తాత్పర్యం:- శ్రాద్ధభోక్తలు భుజించగా మిగిలిన అన్నింటిని కొద్దిగా తీసుకొని నీరుపోసి ఒక పిండాన్ని చేసి, శ్రాద్ధభోక్తల ఎదుట దర్భలుపరచిన ప్రదేశంలో వికిరపిండాన్ని వేయాలి.॥244॥

* *అసంస్కృత ప్రతీతానాం త్యాగినాం కులయోషితామ్ ।*
ఉచ్ఛిష్టం భాగధేయం స్యాద్దర్భేషు వికిరశ్చ యః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **245**

తాత్పర్యం:- ఈ వికిరపిండదానం వల్ల అగ్నిసంస్కారమునకు అనర్హులైన బాలాదులకు, కులస్త్రీలకు, త్యాగులయినవారికి (గుర్వాదులను వదిలి ఒంటరిగ ఉండువారికి) తనివి కలుగును గాక! ॥245॥

* *ఉచ్ఛేషణం భూమిగతమజిహ్మస్యాశఠస్య చ ।*
దాసవర్గస్య తత్పిత్ర్యే భాగధేయం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **246**

తాత్పర్యం:- భూమ్మీద పడిపోయినా, బాగా అన్నం మిగిలిపోయినా, దాన్ని వృథాగా పారేయకుండా ఇంట్లో పనిచేసే దాసదాసీ వర్గాలకు పంచేయాలి.॥246॥

* పిండదాన సంబంధ విధానము-

*** అసపిండ క్రియా కర్మ ద్విజాతేస్సంస్థితస్య తు ।**
అదైవం భోజయేచ్ఛ్రాద్ధం పిండమేకం తు నిర్వపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***247***

తాత్పర్యం:- మృతుడైన ద్విజుడికి సపిండీకరణం వరకు విశ్వేదేవ బ్రాహ్మణుడు లేకున్నా, ఒక్క బ్రాహ్మణునే నియమించి శ్రాద్ధ భోజనం పెట్టి ఒక పిండాన్నే పితృనుద్దేశించి ఉంచాలి.॥247॥

*** సహపిండ క్రియాయాం తు కృతాయామస్య ధర్మతః ।**
అనయైవావృతా కార్యం పిండనిర్వపణం సుతైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***248***

తాత్పర్యం:- ఏకోద్దిష్ట విధానంలో శ్రాద్ధం జరిపినప్పుడు, ఆ పితృదేవతకు సపిండీకరణం జరిగిన తరువాత కుమారులు ఈ పార్వణ విధాన రీత్యా విశ్వేదేవపూర్వకంగాను, విష్ణ్వంతంగాను శ్రాద్ధం జరిపి, మూడు పిండాలను వేయాలి.॥248॥

* శ్రాద్ధ భోజనపు తర్వాతి విధుల-

*** శ్రాద్ధం భుక్త్వాయ ఉచ్ఛిష్టం వృషలాయ ప్రయచ్ఛతి ।**
స మూఢో నరకం యాతి కాలసూత్రమవాక్ఛిరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***249***

తాత్పర్యం:- శ్రాద్ధం చేసినవాడు భోక్తలకు ఇవ్వగా, మిగిలిన అన్నాన్ని శూద్రుడికి ఇచ్చినట్లయితే, అతడు మూఢుడై, తలకిందుగా కాలసూత్రమనే నరకాన్ని పొందుతాడు.॥249॥

*** శ్రాద్ధభుగ్వృషలీతల్పం తదహర్యోఽధిగచ్ఛతి ।**
తస్యాః పురీషే తన్మాసం పితరస్తస్య శేరతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***250***

తాత్పర్యం:- శ్రాద్ధభోక్త అయినవాడు ఆనాడు భార్యతో సంగమించరాదు. అతడి పితృదేవతలు ఒక్క నెలవరకు ఆ స్త్రీ యొక్క పురీషంనందు బడి ఉంటారు.॥250॥

*** పృష్ట్వా స్వదితమిత్యేవం తృప్తా నాచమయేత్తతః ।**
ఆచాంతాంశ్చానుజానీయాదభితో రమ్యతా మితి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***251***

తాత్పర్యం:- తృప్తులైన బ్రాహ్మణులను చక్కగా భుజించితిరిగా అని అడిగి వారు చేతులుకడుక్కొని భుక్తాచమనం చేసేట్లు చేయాలి. అలా చేసిన తరవాత, 'భోః అభిరమ్య తామ్ = పెద్దల్లారా, కూర్చోమ"ని వారిని సుఖప్రదేశంలో కూర్చో బెట్టాలి.॥251॥

*** స్వధాఽస్త్విత్యేవ తం బ్రూయుర్బ్రాహ్మణాస్తదనంతరమ్ ।**
స్వధాకారః పరా హ్యాశీః సర్వేషు పితృకర్మసు ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***252***

తాత్పర్యం:- అలా అనుజ్ఞయైన తరువాత బ్రాహ్మణులు కర్తనుద్దేశించి "అస్తు స్వధా" అని చెప్పాలి. పితృకర్మలు అన్నింటిలోను "అస్తు స్వధా" అని స్వధాకారం చెప్పడమే గొప్ప ఆశీర్వాదం.॥252॥

*** తతో భుక్తవతాం తేషామన్నశేషం నివేదయేత్ ।**
యథా బ్రూయుస్తథా కుర్యాదనుజ్ఞాతస్తతో ద్విజైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***253***

తాత్పర్యం:- దాత భోక్తలైన బ్రాహ్మణులకు భుక్తాన్నశేషమును నివేదించి, ఈ అన్నశేషాన్ని ఏం చేయాలి? అని భోక్తల నడిగి, వారి వల్ల అనుజ్ఞపొంది, వారు చెప్పిన ప్రకారం చేయాలి.॥253॥

* *పిత్ర్యే స్వదితమిత్యేవ వాచ్యం గోష్ఠే తు సుశ్రుతమ్ ।*
సంపన్నమిత్యభ్యుదయే దైవే రుచితమిత్యపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **254**

తాత్పర్యం:- పిత్రాదిశ్రాద్ధంలో **'స్వదితం'** అని, గోష్ఠీశ్రాద్ధంలో **'సుశ్రుత'** మనీ, వృద్ధి శ్రాద్ధంలో **'సంపన్న'** మనీ, దేవతోద్దేశ శ్రాద్ధంలో **'రుచిత'** మనీ ప్రశ్న చేయాలి.॥254॥

* *అపరాహ్ణస్తథా దర్భా వాస్తుసంపాదనం తిలాః ।*
సృష్టిర్మృష్టిర్ద్విజాశ్చాగ్ర్యాః శ్రాద్ధకర్మసు సంపదః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **255**

తాత్పర్యం:- అపరాహ్ణం దర్భలు, శ్రాద్ధయోగ్యప్రదేశాన్ని సంపాదించడం, యాచనచేయక వస్తువులు సంపాదించడం, అలాంటి వస్తువులను పచనం చేయడానికి, పంక్తిపావనులైన బ్రాహ్మణులు చిక్కుట శ్రాద్ధక్రియలకు వలసిన సంపదలు.॥255॥

* *దర్భాః పవిత్రం పూర్వాహ్ణో హవిష్యాణి చ సర్వశః ।*
పవిత్రం యచ్చ పూర్వోక్తం విజ్ఞేయా హవ్యసంపదః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **256**

తాత్పర్యం:- దర్భలు, మంత్రాలు, పూర్వాహ్ణం, మునులకు కావాల్సిన అన్నాదులు, ఇంకా ముందు చెప్పిన పావన గృహం మొదలైనవి దైవశ్రాద్ధానికి కావాల్సిన సంపదలు.॥256॥

* *మున్యన్నాని పయస్సోమో మాంసం యచ్చానుపస్కృతమ్ ॥*
అక్షారలవణం చైవ ప్రకృత్యా హవిరుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **257**

తాత్పర్యం:- పాలు, సోమరసం, వికారం, దుర్గంధాదులు లేని మాంసమును, స్వభావం చేత ఉప్పు కారం లేని వస్తువులు, ఈ వస్తువులే మున్యాహారములని మనువు మొ॥ వారు చెప్పారు. ॥257॥

* *విసృజ్య బ్రాహ్మణాంస్తాంస్తు నియతో వాగ్యతశ్శుచిః ।*
దక్షిణాం దిశమాకాంక్షన్ యాచేతేమాన్ వరాన్ పితౄన్ । ప్రక్షిప్త శ్లోక సం. **258**

తాత్పర్యం:- అలా శ్రాద్ధభోక్తలైన బ్రాహ్మణులను పంపిస్తూ వేరుమనస్సు లేక పరిశుద్ధుడై మౌనంతో కొంత దూరం వెంబడించి, దక్షిణదిక్కు చూస్తూ నీ పితరులను ఈ విధంగా ప్రార్థించాలి.॥258॥

* *దాతారో నోఽభివర్ధంతాం వేదా స్సంతతిరేవ చ ।*
శ్రద్ధా చ నో మావ్యగమద్బహుదేయం చ నోఽస్త్వితి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **259**

తాత్పర్యం:- మా కులంలో దాతలైన పురుషులు అభివృద్ధి నొందుదురుగాక! వేదముల అధ్యాపనలు, వాటి అర్థం తెలుసుకోవడం, యాగం చేయడం వల్ల వృద్ధినొందుగాక ! పుత్ర పౌత్ర సంపద అభివృద్ధిగాంచు గాక! మాకు వేదార్థములందు శ్రద్ధ తొలగకుండు గాక! మాకు విస్తారంగా ఇవ్వదగిన ధనం మొ॥వి కలుగు గాక!॥259॥

* *ఏవం నిర్వపణం కృత్వా పిండాంస్తాంస్తదనంతరమ్ ।*
గాం విప్రమజమగ్నిం వా ప్రాశయేదప్సు వాక్షిపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **260**

తాత్పర్యం:- అన్నశేషాన్ని గురించి ఇలా భోక్తలను ప్రశ్న చేసిన తరవాత, ఆ పిండములందు, బ్రాహ్మణులందు ఆవాహనం చేసి ఉన్న పితరులను విసర్జనం చేసి, ఆ పిండములు గోవుకు గాని, బ్రాహ్మనుడికి గాని పెట్టాలి. అగ్నిలో అయినా నీటిలో అయినా వేయవచ్చు.॥260॥

* *పిండనిర్వపణం కేచిత్పరస్తాదేవ కుర్వతే ।*
వయోభిః ఖాదయంత్యన్యే ప్రక్షిపంత్యనలేఽప్సు వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **261**

తాత్పర్యం:- కొందరు భోక్తలు భుజించిన అనంతరం పిండ ప్రదానం చేస్తారు. అంతేకాక, కొందరు అగ్నిలో, నీటిలో, కొందరు కాకులు మొ॥, పక్షులకు పెడతారు. ॥261॥

* *పతివ్రతా ధర్మపత్నీ పితృపూజనతత్పరా ।*
మధ్యమం తు తతః పిండమద్యాత్సమ్యక్ సుతార్థినీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **262**

తాత్పర్యం:- ధర్మార్థకామములలో మనోవాక్కాయ కర్మములచేత భర్తకే శుశ్రూష చేయదలచినదీ, సజాతీయుడు పుట్టినదీ, ప్రథమభార్య, శ్రాద్ధక్రియలందు శ్రద్ధగల పుత్రులను కోరే అతివ ఆ పిండాల మధ్యలో ఉండే పితామహపిండాన్ని తినాలి.॥262॥

* *ఆయుష్మంతం సుతం సూతే యశో మేధాసమన్వితమ్ ।*
ధనవంతం ప్రజావంతం సాత్త్వికం ధార్మికం తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **263**

తాత్పర్యం:- అలా పిండాన్ని తినడం వల్ల ఆ కాంత 'దీర్ఘాయుష్మంతుడు, కీర్తి, బుద్ధి, ధనసంపదగలవాడు, సంతతిగలవాడు, బలవంతుడు, ధర్మతత్పరుడు అయిన పుత్రుణ్ణి కంటుంది'.॥263॥

* *ప్రక్షాళ్య హస్తావాచమ్య జ్ఞాతిప్రాయః ప్రకల్పయేత్ ।*
జ్ఞాతిభ్యస్సత్కృతం దత్త్వా బాంధవానపి భోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **264**

తాత్పర్యం:- తర్వాత కర్త హస్తప్రక్షాళనం గావించి ఆచమనం చేసి, జ్ఞాతులకందరికీ పూజాపూర్వకంగా అన్నం పెట్టించి ఆ వైపు బంధువులకందరికీ భోజనాలు పెట్టాలి. ॥264॥

* *ఉచ్ఛేషణం తు తత్తిష్ఠేద్యావద్విప్రా విసర్జితాః ।*
తతో గృహబలిం కుర్యాదితి ధర్మో వ్యవస్థితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **265**

తాత్పర్యం:- భోక్తలైన బ్రాహ్మణులను అందరిని పంపేవరకు ఆ ఉచ్ఛిష్టం అలాగే ఉంచి, వారు లేవగానే ఆ ప్రదేశాన్ని శుద్ధిచేయాలి. శ్రాద్ధకర్మ పూర్తయిన తరువాత, వైశ్వదేవం, బలిహోమం, నిత్యశ్రాద్ధం, అతిథిభోజనమును జరుపవలసినది.॥265॥

* *హవిర్యచ్చిరరాత్రాయ యచ్చానంత్యాయ కల్పతే ।*
పితృభ్యో విధివద్దత్తం తత్ ప్రవక్ష్యామ్యశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **266**

తాత్పర్యం:- హవిస్సు ఈ విధంగా పితృదేవతలకు ఇయ్యబడినట్లయితే అది వారికి ఎలా చాలా కాలం వరకు ఎలా తృప్తికరంగా ఉంటుందో, ఏ విధంగా ఆచరిస్తే ఎంతకాలం వారికి తృప్తిగలుగుతుందో ఆ విధానాన్ని అంతా తెలుపుతాను. ॥266॥

*** పితరులకు తృప్తిదాయక అన్న-మాంసాదులు-తృప్తి అవధి-**

* *తిలైర్వ్రీహియవైర్మాషైరద్భిర్మూలఫలేన వా ।*
దత్తేన మాసం తృప్యంతి విధివత్పితరో నృణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **267**

తాత్పర్యం:- నువ్వులు, బియ్యం, యవలు, నల్లమినుములు, దుంపలు, పండ్లు, జలం శాస్త్ర ప్రకారం బ్రాహ్మణులకు దానమిస్తే పితృదేవతలు ఒకనెల తృప్తిపడతారు.॥267॥

* ద్వౌ మాసౌ మత్స్య మాంసేన త్రీన్ మాసాన్ హారిణేన తు ।
ఔర భ్రేణాథ చతురః శాకునేనాథ పంచ వై ॥ ప్రక్షిప్త శ్లోక సం. **268**

తాత్పర్యం:- మత్స్యమాంసదానంతో రెండు నెలలు, జింకమాంసదానంలో మూడు నెలలు, గొర్రె మాంస దానం చేత నాలుగు నెలలు, ద్విజులు భక్షింపదగిన పక్షుల మాంసంతో అయిదు మాసములు.॥268॥

* షణ్మాసాం శ్ఛాగమాంసేన పార్షతేన చ సప్త వై ।
అష్టావేణస్య మాంసేన రౌరవేన న వైవతు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **269**

తాత్పర్యం:- మేకమాంసంతో ఆరు మాసాలు, చారలజింక మాంసంతో ఏడు మాసాలు, కృష్ణమృగమాంసంతో ఎనిమిది మాసాలు, దుప్పిమాంసంతో తొమ్మిది మాసాలు.॥269॥

* దశమాసాంస్తు తృప్యంతి వరాహమహిషామిషైః ।
శశకూర్మయోస్తు మాంసేన మాసానేకాదశైవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **270**

తాత్పర్యం:- ముండ్లపంది, అడవిదున్న వీటి మాంసంతో పది మాసాలు, కుందేలు, తాబేలు వీటి మాంసంతో పదకొండు మాసాలు. ॥270॥

* సంవత్సరం తు గవ్యేన పయసా పాయసేన చ ।
వార్ధ్రీణసస్య మాంసేన తృప్తిర్ద్వాదశవార్షికీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **271**

తాత్పర్యం:- గోవుసంబంధమైన పాలు, పెరుగు, నెయ్యి వీటితో శ్రాద్ధమొనర్చినట్లయితే ఒకసంవత్సర కాలం, ముసలి మేకపోతుమాంసంతో శ్రాద్ధమొనర్చిన పండ్రెండు సంవత్సరాల కాలం పితరులు తృప్తి చెందుతారు.॥271॥

* కాలశాకం మహాశల్కాః ఖడ్గలోహామిషం మధు ।
ఆనంత్యాయైన కల్పంతే మున్యన్నాని చ సర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **272**

తాత్పర్యం:- కాలశాకం అనే శాకము, ముండ్లుగల చేపలు, ఖడ్గమృగం, ఎర్రనిపొట్టేలు, వీటి మాంసం, నివ్వరిధాన్యం, తేనె మున్యన్నములు. వీటితో శ్రాద్ధము ఇస్తే పితరులు తుదిలేనంత కాలం తృప్తి చెందుతారు.॥272॥

* యత్కించిన్మధునా మిశ్రం ప్రదద్యాత్తు త్రయోదశీమ్ ।
తదప్యక్షయమేవ స్యాద్వర్షాసు చ మఘాసు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **273**

తాత్పర్యం:- వర్షఋతువులో మఖ నక్షత్రంతో కూడిన భాద్రపద కృష్ణ పక్ష త్రయోదశి నాడు తేనెతో కూడిన ఏ పదార్థాన్నయినా శ్రాద్ధం చేసినట్లయితే అది పితృదేవతలకు అక్షయతృప్తిని కలిగిస్తుంది.॥273॥

* అపి న స్సకులే జాయాద్యో నో దద్యాత్త్రయోదశీమ్ ।
పాయసం మధుసర్పిర్భ్యాం ప్రాక్ఛాయే కుంజరస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **274**

తాత్పర్యం:- మరియు "వర్షఋతువునందు భాద్రపద బహుళ త్రయోదశినాడు లేదా వేరొక్క తిథియందైనను అపరాహ్ణకాలంలో తేనెతోను నేతితోను చేసిన అపూపములతో శ్రాద్ధమొనర్చి మనల్ని తనివి నొందించువాడు మన కులంలో ఎవ్వడైనా పుట్టునా" అని పితరులు నిరీక్షిస్తు ఉంటారు.॥274॥

* యద్యద్దదాతి విధివత్సమ్యక్ శ్రద్ధాసమన్వితః ।
తత్తత్పితౄణాం భవతి పరత్రానంతమక్షయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **275**

తాత్పర్యం:- శ్రద్ధాభక్తులతో కూడినవాడై, మానవుడు ఏవస్తువైనా శాస్త్రప్రకారం ఇస్తాడో అది తరగని పుణ్యాన్ని ఇచ్చి ఇహపరాలలో పితరులకు గొప్పమేలు కలిగిస్తుంది.॥275॥

* కృష్ణపక్షే దశమ్యాదౌ వర్జయిత్వా చతుర్దశీమ్ ।
శ్రాద్ధే ప్రశస్తాస్తిథయో యథైతా న తథేతరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.276

తాత్పర్యం:- కృష్ణపక్షంలో ఒక్క చతుర్దశి తిథి తప్ప దశమి మొదలు అమావాస్య వరకు గల తిథులు పితృకర్మలకు శ్రేష్ఠమైనవి. మిగిలినవి వాటితో సమానం కానివి.॥276॥

* యుక్షు కుర్వన్ దినర్క్షేషు సర్వాన్ కామాన్ సమశ్నుతే ।
అయుక్షు తు పితౄన్ సర్వాన్ ప్రజాం ప్రాప్నోతి పుష్కలామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.277

తాత్పర్యం:- సరితిథులలో, సరినక్షత్రాలైన భరణి, రోహిణి మొదలైనవాటియందు శ్రాద్ధం చేస్తే కర్తకు సకల మనోరథాలు సిద్ధిస్తాయి. బేసితిథులైన పాడ్యమి, అశ్విని లాంటి బేసినక్షత్రాలు అయితే ధనం, విద్య, సంతతి పొందగలడు.॥277॥

* యథా చైవాపరః పక్షః పూర్వపక్షాద్విశిష్యతే ।
తథా శ్రాద్ధస్య పూర్వాహ్ణాదపరాహ్ణో విశిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.278

తాత్పర్యం:- పితృక్రియల విషయంలో కృష్ణ పక్షం, శుక్లపక్షం కంటే ఎంతో ఉత్తమమైనది. అలాగే ఉదయం వేళకంటే సూర్యుడు నడినెత్తిన ప్రకాశించే అపరాహ్ణ వేళ ఉత్తమం.॥278॥

* ప్రాచీనావీతినా సమ్యగపసవ్యమతంద్రిణా ।
పిత్ర్యమానిధనాత్కార్యం విధివద్దర్భపాణినా ॥ ప్రక్షిప్త శ్లోక సం.279

తాత్పర్యం:- కుడిభుజంమీద జంధ్యం వేసుకుని, శ్రద్ధాభక్తులతో దర్భలు దాల్చి, అపసవ్యరీతిలో పితృతీర్థాలలో శాస్త్రం చెప్పబడిన విధంగా మృతి చెందిన దినం నుంచి కర్మలన్నిటిని పూర్తయ్యేదాకా నిర్వర్తించాలి.॥279॥

* రాత్రౌ శ్రాద్ధం న కుర్వీత రాక్షసీ కీర్తితా హి సా ।
సంధ్యయోరుభయోశ్చైవ సూర్యే చైవాచిరోదితే ॥ ప్రక్షిప్త శ్లోక సం.280

తాత్పర్యం:- రాత్రిపూట శ్రాద్ధం నిషిద్ధం. రాత్రికే రాక్షసి అని నామాంతరం. అలాగే ప్రాతఃసంధ్యవేళ, సాయం సంధ్యవేళకూడా చేయకూడదు. అలా అని సూర్యోదయం కాగానే శ్రాద్ధక్రియ మొదలెట్టరాదు.॥280॥

* త్రైమాసిక శ్రాద్ధ విధానము-

* అనేన విధినా శ్రాద్ధం త్రిరబ్దస్యేహ నిర్వపేత్ ।
హేమంత గ్రీష్మ వర్షాసు పాంచయజ్ఞికమన్వహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.281

తాత్పర్యం:- ఈ ప్రకారం సంవత్సరంలోని హేమంత గ్రీష్మ వర్షఋతువులలో మూడు సార్లయినా శ్రాద్ధం జరపాలి. దేశ కాలమాన పరిస్థితులు గాని అనుకూలించినట్లయితే సూర్యుడు కుంభ, వృషభ, కన్యారాశులలో ఉన్నప్పుడు ఒక్క బ్రాహ్మణుడికైనా భోజనం పెట్టాలి.॥281॥

* న పైతృయజ్ఞియో హోమో లౌకికేఽగ్నౌ విధీయతే ।
న దర్శేన వినా శ్రాద్ధమాహితాగ్నేర్ద్విజన్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.282

తాత్పర్యం:- పితృయజ్ఞం సంబంధ హోమాన్ని శ్రౌత స్మార్త సంబంధ లౌకికాగ్నిలో గార్హపత్యాగ్నిలో ఎప్పుడూ చేయకూడదు. అలాగే ఆహితాగ్ని అయినవాడు కృష్ణపక్షం-అమావాస్య తప్ప ఇతర రోజులలో మాస శ్రాద్ధం చేయరాదు.॥282॥

* *యదేవ తర్పయత్యద్భిః పితౄన్ స్నాత్వా ద్విజోత్తమః ।*
తే నైవ కృత్స్నమాప్నోతి పితృయజ్ఞ క్రియాఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*283*

తాత్పర్యం:- ఎక్కడ ద్విజోత్తముడు స్నానమైన తర్వాత నీటితో ప్రతిరోజూ తర్పణాలు విడుస్తాడో, దానిచేతనే పితరులంతా తృప్తినొందగలరు. కర్తకు కూడ పితృయజ్ఞం జరిపిన ఫలం సంపూర్ణంగా అందుతుంది. ॥283॥

*** పితాదులకు వసువాది సంజ్ఞలు**

* *వసూన్ వదంతితు పితౄన్ రుద్రాంశ్చైవ పితామహాన్ ।*
ప్రపితామహాంస్తథాదిత్యాన్ శ్రుతిరేషా సనాతనీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*284*

తాత్పర్యం:- సూర్యరుద్రవసువులే పితృదేవతలనే శ్రుతి ఒకటి ఉంది. కనుకనే పితరులను వసురూపులుగా, పితామహులను రుద్రరూపులుగా, ప్రపితామహులను ఆదిత్యరూపులుగా ధ్యానించాలి. ఈ ప్రకారం ఎవరు భావించి శ్రద్ధతో పితరులను అర్చిస్తారో, వారికి వసు రుద్రాదులు సంప్రీతులవుతారు. ॥284॥

ప్రక్షిప్తాల పరిశీలన

119 నుంచి 284 వరకు గల శ్లోకాలు ఈ కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. 117వ శ్లోకంలో గృహస్థును 'శేషభుక్కు' కావాలన్నాడు. 118లో 'యజ్ఞశేషభుక్కు' కావాలన్నాడు. 295వ శ్లోకంలో వీటి వ్యాఖ్య ఉంది. 285వ శ్లోకం 118కి అర్థవాదరూపమని చెప్పాలి. వాటికి ఏకసూత్రతే ఉంది. మధ్యలోని ఈ అన్ని శ్లోకాలూ పూర్వాపర ప్రసంగాలను ఖండించి వాటి ఏకసూత్రతను భగ్నం చేశాయి.

ఖ. 117-118, 285 శ్లోకాలలో అతిథి యజ్ఞాలకు సంబంధించిన ప్రసంగంలో, గృహస్థు ఎలా అతిథులను ఆదరించాలో ఉంది. దీని మధ్య చుట్టాల పూజ, రాజులు, స్నాతకుల పూజ [119-120], రెండవసారి వైశ్వదేవుల బలి [121], పితృశ్రాద్ధ పద్ధతి [122-284] పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకంగా చెప్పారు.

గ. 122వ శ్లోకంలో 'పితృయజ్ఞం నిర్వర్త్య" అంటూ కొత్తగా పితృశ్రాద్ధ విషయాన్ని మొదలుపెట్టారు. ఇది మౌలికమైతే, ప్రసంగ క్రమం దృష్ట్యా పితృ యజ్ఞాన్ని గురించిన మూల ప్రసంగం [3.81,82]తో పాటు ఉండాలి. కానీ అలా కాకుండా ముక్కలు ముక్కలుగా అక్కడక్కడ ఉంది. క్రమసంగతం కాకపోవటం చేత ఇది మౌలికం కాదు. ఇలాంటి ప్రసంగ వ్యతిరేకాల ఆధారాల వల్ల 119 నుంచి 284 వరకు గల అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే!

2. విషయ వ్యతిరేకాలు

67వ శ్లోకంలో **"వైవాహికాఽగ్నౌ కుర్వీత...పంచయజ్ఞ విధానం చ"** అంటూ దైనందిన పంచయజ్ఞాల వివరాలు, పూర్తయిన దాని సూచనగా **"ఏతత్ వః అభిహితం సర్వం విధానం పంచయజ్ఞికం"** అనే శ్లోకం వల్లనూ, 67 నుంచి 286 శ్లోకాలలోని విషయం కేవలం రోజువారీ పంచయజ్ఞాల విధానమే అని తెలుస్తూంది. 122 నుంచి 284 శ్లోకాలలో దైనికపంచ యజ్ఞాల కన్నా వేరైన మాసిక, త్రైమాసిక మొదలైన శ్రాద్ధాల వర్ణన ఉంది. ఈ విషయమంతా మనువు విషయ సంకేతానికి బాహ్యం కావటం వల్ల విషయ వ్యతిరేకం, ప్రక్షిప్తం.

3. అంతర్ వ్యతిరేకాలు

మృతుల శ్రాద్ధం మనువుకు వ్యతిరేకం

ఇందులో చెప్పిన పద్ధతులు మనుస్మృతిలోని ఇతర పద్ధతుల కన్నా అంతర్ వ్యతిరేకాలుగా కనిపిస్తున్నాయి-

క. 122 నుంచి 284 శ్లోకాల వరకు మృతుల శ్రాద్ధం గురించి ఉంది. ఇది మనువుకు వ్యతిరేకం. మనువు పితృయజ్ఞాల పేరిట ప్రతి రోజూ జీవించి ఉన్నవారికి భోజనాలు పెట్టమన్నాడు [3.80-82]. [దీని విస్తృత వివరణకు 3.85 మీద ఇచ్చిన సమీక్ష చూడండి] మనువు ప్రకారం, పితృ లేదా **'పితరులు'** పదానికి **'పెద్దలు, పాలకులు'** అని అర్థం. చూడండి 9.28; 2.126; [2.151] లలో **'పితృ'** పద ప్రయోగం **'పెద్దలు'** అనే అర్థంలోనే చేశాడు.

ఖ. దైనిక పితృ యజ్ఞం లేదా శ్రాద్ధం ఇంట్లోనే చేయాలి. కానీ ఈ శ్లోకాలలో చెప్పిన శ్రాద్ధం వనాలు, నదీతీరాలు, ఏకాంత స్థానాలలో [207] చేయాలని ఉంది. ఈ తేడా మనువు చెప్పిన వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకం.

గ. మనువు పితృ యజ్ఞాన్నే శ్రాద్ధమన్నాడు కానీ, వేరే క్రియను అందులో అంగీకరించ లేదు [80-82]. కానీ ఈ శ్లోకాలలో **"పితృ యజ్ఞం తు నిర్వర్త్య"** అని, **'పిండాన్వహార్యకం శ్రాద్ధం కుర్యాత్ మాసానుమాసికం'** [122] అనటం, ఇది రాసినవారు ఈ పద్ధతిని పితృయజ్ఞాని కన్నా వేరైనదిగా భావిస్తున్నారని తెలిసిపోతూంది. ఈ ప్రత్యేకమైన శ్రాద్ధవిధానం మనువు వ్యవస్థకు అనుకూలం కాదు.

ఘ. పితృయజ్ఞ విషయంలో కేవలం అన్నం, నీరు, ఫలాలు, మూలాలతోనే శ్రాద్ధం చేయాలి [82]. కానీ ఇక్కడ మాంసంతో శ్రాద్ధం చేస్తే అధిక ఫలం లభిస్తుందని చెప్పారు [266-272].

ఙ. ఇందులో ఎన్నో శ్లోకాలలో మాంస భక్షణ విధానం చెప్పారు. [123, 227, 257, 266-272]. ఇది మనుస్మృతి మౌలిక వ్యవస్థకే వ్యతిరేకం. మనువు మాంస భక్షణాన్ని పాపంగానూ, మాంస భక్షకులను పాపులుగానూ భావించాడు [5.43-51]. అంతే కాకుండా జీవహింస చేసేవారికి ప్రాయశ్చిత్తాలు కూడా చెప్పాడు [3.68-69]. (విస్తృత విశ్లేషణకు 4.26-28 శ్లోకాలను చూడండి].

చ. మనువు కర్తనే స్వయంగా ఫలభోక్త అన్నాడు [4.240]. ఇందులో శ్రాద్ధకర్మ వల్ల పితరులకు ముక్తి కలగటం [220-222], ఒకరు శ్రాద్ధం పెట్టడం వల్ల ఏడుతరాల వంశజులకు పుణ్యఫలాలు కలగటం [146], మొదలైనవి పై వాటికి విరుద్ధం.

ఛ. 136, 137, 152-156, 164-166, 182 మొదలైన శ్లోకాలలో జన్మతో వర్ణ వ్యవస్థ అనే విషయం ఉంది. కాని మనువు కర్మలతో వర్ణ వ్యవస్థను చెప్పాడు [1.88; 2.143 (168), 122-123 (147-148)]. పై శ్లోకాలలో చెప్పిన కర్మలు బ్రాహ్మణులవి కావు. ఒక వేళ అవి బ్రాహ్మణ కర్మలే అయితే, మనువు చెప్పిన వ్యవస్థ ప్రకారం, వారు బ్రాహ్మణులుగా పిలువబడరు.

జ. 2.82 [106] లో వేదాధ్యయనాన్ని సర్వదా పుణ్యదాయకం అని చెప్పాడు. ఇందులో శ్రాద్ధంలో వేదపఠనం నిషిద్ధం [188].

ఝ. మొదటి అధ్యాయంలో పంచభూతాల ద్వారా సృష్టి ఉత్పత్తిని పరమాత్మ చేశాడని ఉంది [1.6,14.20], ఇక్కడ మరీచి మొదలైన ఋషులు ఈ చరాచర జగత్తును సృష్టించారని ఉంది. ఇది ప్రకృతి విరుద్ధమైన కథనం[201].

ఞ. 1.92లో శూద్రుల పని ద్విజుల సేవ అన్నాడు. ఇందులో శ్రాద్ధ సమయాలలో శూద్రులు పదార్థాలను తాకడం కూడా నిషిద్ధ మన్నారు. [241]. 197వ శ్లోకంలో శూద్రుల పితరులు సుకాలీనులన్నారు. శూద్రుల స్పర్శ కూడా నిషిద్ధమైతే, శూద్రుల ఇళ్లలో బ్రాహ్మణులు ఎలా భుజిస్తారు? ఆ విధంగా తినకపోతే శూద్రుల ఇళ్లలో శ్రాద్ధాలెందుకు?

ట. ఈ మొత్తం ప్రసంగంలో పితరులకు హవ్య కవ్యాలిచ్చే పద్ధతి ఉంది. కానీ మనువు అభిప్రాయం ప్రకారం, జీవించి ఉన్న వ్యక్తులకు ఇచ్చే ఆహార పదార్థాలు, హితం కలిగించే వస్త్రాలు, ధనం మొదలైన దానాలను 'హవ్య కవ్యా'లంటారు. 4.30-31లలో చూడండి, మనువు బ్రతికి ఉన్న, ధార్మిక విద్వాంసులకు హవ్య కవ్యా లివ్వాలని స్పష్టంగా

చెప్పాడు. ఈ మొత్తం ప్రసంగం పైన చెప్పిన సంప్రదాయానికి వ్యతిరేకం కావటం చేత ప్రక్షిప్తం. [దేవతలు, పితరులు మొదలైన వారి విషయంలో విస్తృత వివరణ కొరకు 3.82 సమీక్ష చూడండి.]

4. అవాంతర వ్యతిరేకాలు

ఇందులోని ఎన్నో అవాంతర వ్యతిరేక విషయాల వల్ల, ఇవన్నీ మనువు వంటి విద్వాంసుని చేత రాయబడలేదు. ఒకటే సమయంలో ఒకరి చేత కూడా రాయబడలేదని తెలుస్తూంది. అవి-

క. 136-137 శ్లోకాలలో వేదజ్ఞానం లేని పుత్రుడు శ్రాద్ధాలు పెట్టవచ్చని చెప్పాడు. 142-143 శ్లోకాలలో వేదం తెలియనివాడు శ్రాద్ధానికి అనర్హుడని ఉంది.

ఖ. 129లో దేవకర్మలలో వేదం తెలియని బ్రాహ్మణులకు భోజనం పెట్టకూడదని ఉంది. కానీ 149లో వీటిని గురించి పెద్దగా పట్టించుకునే అవసరం లేదనీ ఉంది.

గ. మొత్తం ప్రసంగంలో ఎన్నో చోట్ల మాంసభక్షణ పద్ధతి ఉంది. [123, 227, 257, 266-272], 152లో మాంసం అమ్మే బ్రాహ్మణుడికి భోజనం పెట్టే అర్హత లేదని ఉంది.

ఘ. 152లో బ్రహ్మచారి శ్రాద్ధం పెట్టడానికి అర్హుడు కాదని ఉంది. కానీ 176, 192, 234లలో శ్రాద్ధం పెట్టే విధానం చెప్పారు. పైగా అతడు 'పంక్తిపావనుడు' అనీ చెప్పారు.

ఙ. 196-197 శ్లోకాలలో శూద్రులు మొదలైన అన్ని వర్ణాలవారూ శ్రాద్ధాలు చేయవచ్చునని ఉంది. 241లో శూద్రుల స్పర్శ నిషేధం, శూద్రుల దృష్టి పడితే శ్రాద్ధాల పుణ్యం పోతుందని ఉంది.

చ. 194-201లలో మనువు వంశజులనే పితరులు అన్నారు. 220-222లలో తమ తమ మరణించిన పూర్వీకులను పితరులు అన్నారు.

ఛ. 166-173 వరకు గల శ్లోకాలలో జంతువుల మాంసంతో ఎన్నో నెలలు, సంవత్సరాలు, అనంతకాలం వరకూ పితరులను తృప్తిపరచడం గురించి ఉంది. మళ్లీ మాసికాలు [122], త్రైమాసికాలు [282], మొదలైన శ్రాద్ధాల అవసరం ఏమిటి?

జ. 270లో పందిమాంసంతో శ్రాద్ధం చేసి పదినెలల పాటు పితరులను తృప్తి పరచాలని ఉంది. 242లో పంది వాసన చూసిన శ్రాద్ధ భోజనం పనికి రాదన్నారు.

ఝ. 138లో శ్రాద్ధంలో మిత్రుడికి భోజనం పెట్టవద్దన్నారు. 144లో పెట్టమన్నారు. ఈ విధంగా ఇంకా చాలా అంతర్ వ్యతిరేకాలు కూడా ఇందులో ఉన్నాయి. కానీ విషయం పెద్దదై పోతుందన్న భీతితో అక్కడక్కడా కొన్నిటిని చూపినాను.

5. శైలీగత ఆధారాలు

క. 194-201 శ్లోకాలలో మనువు తర్వాతి తరాలవారిని **'పితరులు'**గా పేర్కొనడం, 150లో **'మనురబ్రవీత్'**, 222లో **'అబ్రవీత్ మనుః'** వంటి ప్రయోగాలు, ఈ శ్లోకాలు, వీటికి సంబంధించిన ఇతర విషయాలను మనువు కాకుండా తర్వాతివారెవరో రాశారని తెలిసిపోయేలా చేస్తున్నాయి. కనుక ఇవి ప్రక్షిప్తాలు.

ఖ. ఈ మొత్తం విషయపు శైలి సహేతుకం కానిది, కాల్పనికమూ, నిరాధారమూ, అతిశయోక్తులతో కూడినది. వీటి ఉదాహరణలు ఇలా ఉన్నాయి-

అ. మిత్రులైన బ్రాహ్మణులకు భోజనం పెట్టడం వల్ల శ్రాద్ధఫలం లభించదు. [138-141].

ఆ. అనర్హులైన బ్రాహ్మణులు తింటే ఆ శ్రాద్ధం రాక్షసులకు చేరుతుంది [170].

ఇ. అనర్హ బ్రాహ్మణులు, శూద్రులు, శ్రాద్ధ భోజనం చేస్తున్న బ్రాహ్మణులను చూస్తే కర్త పుణ్యం నశించి, శ్రాద్ధం ఫలహీనమవుతుంది. [176, 238-242].

ఈ. రాక్షసుల ద్వారా శ్రాద్ధఫలం నష్టం కావడం.

ఉ. శ్రాద్ధభోజనం చేస్తున్న బ్రాహ్మణులను గ్రుడ్డి బ్రాహ్మణుడు చూస్తే తొంబై మంది బ్రాహ్మణులకు పెట్టిన భోజన ఫలం పోవడం, ఒంటి కంటివారు చూస్తే అరవై మంది, కుష్ఠురోగి చూస్తే వంద మంది, క్షయరోగి చూస్తే వెయ్యి మంది భుజించిన ఫలం పోతుంది[177] - గుడ్డివాడు ఎలా చూడగలుగుతాడు? అనేది రాసేటప్పుడు ప్రక్షిప్తకారులు ఆలోచించనే లేదు.

ఊ. ఒంటి చేత్తో పెట్టిన అన్నం బ్రాహ్మణులకు కాక రాక్షసులకు చెందుతుంది - మొదలైనవి.

గృహస్థులకు రెండే విధాల భోజనవిధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

విఘసాశీ భవేన్నిత్యం నిత్యం వాఽమృతభోజనః । మూలశ్లోక సం.**84**
విఘసో భుక్త శేషం తు యజ్ఞశేషం తథాఽమృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**285**

టీక:- గృహస్థుడి ధర్మమేమంటే, అతడు, **నిత్యం విఘసాశీభవేత్** = ప్రతి దినం, విఘస భోజనాన్నే చేసేవాడుగా ఉండాలి, **వా** = లేదా, **అమృతభోజనః** = అమృత భోజనాన్ని భుజించువాడుగా ఉండాలి, **భుక్తశేషం తు విఘసః** = అతిథి, మిత్రాదులు అందరూ భుజించిన తరవాత, మిగిలిన భోజనాన్ని విఘసమనబడును (3-80), **తథా** = అలాగే యజ్ఞశేషం, **అమృతం** = యజ్ఞంలో ఆహుతులిచ్చిన తరవాత మిగిలిన భోజనం, అమృతమనబడును (3. 81,82).

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ఎల్లప్పుడూ అమృతాన్ని భుజించేవాడుగా ఉండాలి. అతిథి భుక్తశేషమును విఘసం అంటారు. ఇది అమృతోపమం. యజ్ఞం చేయకుండా చేయు భోజనం అసత్పురుషుల అన్నమని చెప్పబడింది.॥285॥

వివరణ

యజ్ఞశేషానికీ శేష భుక్తభోజనానికీ తేడా ఏమిటి? 'భుక్తశేషం' అన్నింటిలో ఉప్పు, తీపి కలిసిన ఏ అన్నమైనా కావచ్చు. కానీ యజ్ఞశేషం అన్నంలో ఉప్పు ఉండదు. లవణయుక్తమైన పక్వాన్నంతో ఆహుతి అగ్నిహోత్రంలో ఇవ్వరాదని మను నిషేధం(6-11), బలిభాగాన్ని వేరుగా తీసిన తరవాత, అతిథులు భుజించిన తరవాతనే భోజనం చేయాలి. ఇదే భుక్తశేషం. ఇదే విఘసం. యజ్ఞాహుతులివ్వగా అవశిష్టమైన లవణరహితభోజనమే యజ్ఞశేషం, అమృతం కూడా.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతద్వోఽభిహితం సర్వం విధానం పంచయాజ్ఞికమ్ । మూలశ్లోక సం.**85**
ద్విజాతిముఖ్యవృత్తీనాం విధానం శ్రూయతామితి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**286**

టీక:-ఏతత్ వః = మీకు, సర్వం పంచ మహాయాజ్ఞికం విధానం **అభిహితం** = పంచమహాయజ్ఞసంబంధమైన ఈ విధానాన్ని సంపూర్ణంగా చెప్పడమైంది. ఇక ముందు, **ద్విజాతి ముఖ్య వృత్తీనాం విధానం శ్రూయతాం** = ద్విజాతి ముఖ్యవృత్తుల యొక్క విధానాన్ని వినండి. అంటే ద్విజాతుల ముఖ్య ఆజీవిక మరియు జీవచర్యా విధానాన్ని వినండి.

తాత్పర్యం:- "ఓ మహర్షులారా ! ఈ పంచమహా యజ్ఞ సంబంధ విధానం మీకు నా వల్ల తెలిసినది కద! ఇక వర్ణాలలో ముఖ్యులైన వారు ద్విజులు కాబట్టి వారి ఆచార, విచార, వ్యవహారాలన్నీ వివరిస్తాను" అన్నాడు భృగువు.॥286॥

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మట్టి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'గృహస్థాశ్రమే సమావర్తన-వివాహ పఞ్చయజ్ఞవిధానాత్మకః' తృతీయోఽధ్యాయః॥

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం తృతీయోఽధ్యాయః.

మనుస్మృతి

చతుర్థాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన *ఋషిదయానందభాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: 260; మూలశ్లోకాలు: 89 ; ప్రక్షిప్తాలు : 171

గృహస్థాన్తర్గత ఆజీవిక-వ్రతపాలన విషయం 1 నుండి 12 శ్లోకాల వరకు

1-3వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఆయువు రెండోభాగంలో గృహస్థుడు కావాలి

చతుర్థమాయుషో భాగముషిత్వాఽద్యం గురౌ ద్విజః ।
ద్వితీయమాయుషో భాగం కృతదారో గృహే వసేత్ ॥ మూలశ్లోక సం. 1

టీక:- ద్విజః = ద్విజుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, ఆద్యం = మొదటి, **ఆయుషః చతుర్థమ్ భాగమ్**=ఆయుష్షులో నాలుగో భాగం వరకు కనీసం 25 సం॥ పర్యంతం, **గురౌ ఉషిత్వా** = గురు సమీపంలో ఉండి, అంటే గురుకుల వాసంలో వేదాధ్యయనం, బ్రహ్మచర్య వ్రతపాలనం చేసి, **ఆయుషః ద్వితీయం భాగం** = ఆయుష్షులో రెండో భాగంలో, **కృతదారః** = వివాహం చేసికొని, **గృహే వసేత్** = గృహంలో నివసించాలి.

తాత్పర్యం:- ద్విజులు తమ ఆయుః ప్రమాణ కాలపరిమితిలో 4వ భాగమును అనగా 25 సంవత్సరాలు వేదాధ్యయనం మొదలైనవి చేయడానికి గురుకుల వాసంలో గడపాలి. ద్వితీయభాగంలో-అంటే పాతికేళ్లు పైబడిన తదుపరి గృహస్థాశ్రమాన్ని అవలంబించి గృహంలో గడపాలి.॥1॥

వివరణ: వివాహానికి సంబంధించి వయోనియమాలను గురించి, 3,4వ శ్లోకంలో వివరాలు చూడగలరు.

గృహస్థుడి జీవిక పరపీడారహితంగా ఉండాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

అద్రోహేణైవ భూతానామల్పద్రోహేణ వా పునః ।
యా వృత్తిస్తాం సమాస్థాయ విప్రో జీవేదనాపది ॥ మూలశ్లోక సం. 2

టీక:- విప్రః = ద్విజుడైన వ్యక్తి, **అనాపది** = ఆపత్తిరహిత కాలంలో, **భూతానాం ద్రోహేణ+ఏవ** = ఇతర ప్రాణులకు ఏవిధమైన బాధను కలిగించకుండా, **వా** = లేదా, **పునః** = అలాంటి వృత్తి లభించనట్లయితే, **అల్పద్రోహేణ** = వీలైనంత తక్కువ బాధను కలిగించే, **యా వృత్తిః** = ఏ వృత్తి కలదో, **తాం సమాస్థాయ జీవేత్** = అలాంటి వృత్తినవలంబించి, జీవన నిర్వాహం చేసికోవాలి.

తాత్పర్యం:- ఎలాంటి ఆపదలు లేనప్పుడు ద్విజుడు జీవహింస/ ఇతర ప్రాణులకు ద్రోహం తలపెట్టరాదు. అలా జరగనప్పుడు కొద్దిపాటి ఆపదలొచ్చినప్పటికీ ఏ వృత్తివల్ల జీవిక నడుస్తుందో ఆ వృత్తినే ఎంచుకోవాలి. ఉద్దేశపూర్వకంగా అంటే మాంసభక్షణం కొరకు ఎలాంటి ప్రాణినీ చంపరాదు. వ్యవసాయంలో ఎడ్లకు కష్టం కలుగుతుంది. దున్నేటప్పుడు మొదలుకొని పంట ఇంటికి వచ్చేంత వరకు ఎన్నో రకాల క్రిమికీటకాదులు చనిపోతాయి. మననిమిత్తం లేకుండా జరిగే హింసలో ఎట్టి పాపమూ లేదు. అయినను అట్టి పాపనివారణార్థం క్రిందటి 3వ అధ్యాయంలో పంచమహాయజ్ఞాల గురించి వివరంగా తెలుపబడింది. అలా చేస్తే ఈ చిన్నపాటి పాపం కూడా అంటదు.॥2॥

జీవనయాత్ర సాగించేంత వరకే ధనం నిలవచేసుకోవాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

యాత్రామాత్ర ప్రసిద్ధ్యర్థం స్వైః కర్మభిరగర్హితైః ।
అక్లేశేన శరీరస్య కుర్వీత ధనసంచయమ్ ॥ మూలశ్లోక సం.**3**

టీక:- స్వైః అగర్హితైః కర్మభిః = తన అనిందిత అంటే శ్రేష్ఠకర్మల ద్వారా, శరీరస్య అక్లేశేన = శరీరానికి అధిక శ్రమను కల్గించకుండా, యాత్రా-మాత్ర ప్రసిద్ధ్యర్థం = కేవలం జీవనయాత్ర గడపడానికి మాత్రమే ఉద్దేశంగా అంటే జీవనం కష్టరహితంగా, అధిక ఐశ్వర్య-భోగకామనలు లేనట్టి, ధనసంచయం కుర్వీత = ధనసంచయనం చేయాలి.

తాత్పర్యం:- జీవనయాత్రను బాగా నిర్వహించుకొనుటకు నిందారహితాలు కాని తన కర్మల ద్వారా శరీరానికి బాధలేని రీతిగా ధనాన్ని సంపాదించాలి. ధనాన్ని కూడ బెట్టుటకు గాక బ్రతుకుటకు మాత్రమే సంపాదించాలి. అవసరానికి మించి ధనాన్ని కూడబెట్టరాదు.॥3॥

4 నుండి 10వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ఆజీవికల భేదాలు-

* *ఋతామృతాభ్యాం జీవేత్తు మృతేన ప్రమృతేన వా ।*
సత్యానృతాభ్యా మపి వా న శ్వవృత్త్యా కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***4***

తాత్పర్యం:- ఆపదలేవీ లేనప్పుడు ఋతము, అమృతం, మృతం, ప్రమృతం, సత్యం, అనృతం అనేవాటి వల్ల తమ జీవితం గడపాలి. కాని కుక్కలాగ ఎవరికొలువో చేస్తూ జీవించరాదు. ఈ శ్లోకంలో చెప్పబడిన సత్యామృతాదుల లక్షణాలు క్రింద వివరించబడుతాయి.॥4॥

* *ఋతముఞ్ఛశీలం జ్ఞేయమమృతం స్యాదయాచితమ్ ।*
మృతం తు యాచితం భైక్షం ప్రమృతం కర్షణం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***5***

తాత్పర్యం:- ఋతమనగా విత్తకుండ అడవిలో లభించు పూలు, పండ్లు మొదలగు వానిద్వారా జరుగు జీవనవృత్తి, అమృత మనగా అయాచితముగా లభించువాని ద్వారా జరుగు జీవనవృత్తి, మృతమనగా బిచ్చమెత్తుట ద్వారా జీవించువృత్తి. ప్రమృతమనగా వ్యవసాయవృత్తిచే జీవించుట.॥5॥

* *సత్యానృతం తు వాణిజ్యం తేన చైవాపి జీవ్యతే ।*
సేవా శ్వవృత్తిరాఖ్యాతా తస్మాత్తాం పరివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***6***

తాత్పర్యం:- వర్తకం సత్యావృతం అనబడును. స్వయంగా చేయనిదానితో అయినా, అలాంటి వడ్డీజీవనంతో అయినా జీవనం గడపవచ్చు. కాని, నీచవృత్తి అయిన సేవకవృత్తి ఎన్నటికీ చేయడానికి తగదు. ఆ సేవకవృత్తియందు సేవకుడు దీనంగా చూడటం, యజమానితో చీకొట్టించుకోవడం, నీచపుపనులు చేయవలసి రావడం. ఇవన్నీ చేయాలి కాబట్టి అవి సర్వదా నిషిద్ధం. ॥6॥

* ధాన్యసంగ్రహభేదాలు

* *కుసూలధాన్యకో వా స్యాత్కుంభీధాన్యక ఏవ వా ।*
త్ర్యహైహికో వాఽపి భవేదశ్వస్తనిక ఏవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***7***

తాత్పర్యం:- నిత్యనైమిత్తిక ధర్మకృత్యములు, సేవకపోషణ, గృహనిర్వహణ వీటి నిమిత్తం మూడేండ్ల కంటే ఎక్కువగా కణజములందు ధాన్యం సేకరించువాడు 'కుసూల ధాన్యకుడు' అనబడును. సంవత్సరానికి చాలినంత ధాన్యం

సేకరించుకొనువాడు **'కుంభీధాన్యకుడు'** అనబడును. మూడు దినములకు చాలినంత ధనం గలవాడు **'త్ర్యహైహికుడు'** అనబడును. మరుసటి దినమునకు మాత్రం చాలినంత ఆహారపదార్థ సంచయం గలవాడు **'అశ్వస్తనికుడు'** అనబడును. ఈ నలుగురిలో ఎలాంటివాడుగా అయినా ఉండవచ్చు.॥7॥

* *చతుర్ణామపి చైతేషాం ద్విజానాం గృహమేధినామ్ ।*
జ్యాయాన్ పరః పరో జ్ఞేయో ధర్మతో లోకజిత్తమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **8**

తాత్పర్యం:- పైన చెప్పిన నాలుగు రకాల గృహస్థులయిన ద్విజులలో మొదట చెప్పిన ఇద్దరి కంటే తరువాత చెప్పిన ఇద్దరు ఉత్తములు. ఏల అంటే, అలాంటివారు కేవలం జీవికను మాత్రం జరుపుకొంటూ ఐహిక సుఖములందు ఆపేక్ష మాని, పరమాత్మ చింతనం చేస్తూ ఉంటారు.॥8॥

* *షట్కర్మైకో భవత్యేషాం త్రిభిరన్యః ప్రవర్తతే ।*
ద్వాభ్యామేకశ్చతుర్థస్తు బ్రహ్మసత్రేణ జీవతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **9**

తాత్పర్యం:- ఈ నాలుగు రకాల గృహస్థులలో బహుపోష్యవర్గం గలవాడు **ఋతాయాచితభైక్షకృషి వాణిజ్య వృద్ధిజీవికలు** అను ఆరు కర్మలచేత జీవించవచ్చు. మొదటివాడికంటే తక్కువ పరివారం గలవాడు యాజనాధ్యాపన ప్రతిగ్రహములనే మూడు వృత్తులచేత జీవించవచ్చు. మరొక్కడు పరిగ్రహం నీచం కాబట్టి దాన్ని వదిలి తక్కిన యాజనాధ్యాపనములచేత జీవించవచ్చు. మరి తక్కువ కుటుంబపోషణ కలవాడు వేదాధ్యాపనమాత్రం చేత జీవించవచ్చు.॥9॥

* *వర్తయంశ్చ శిలోంఛాభ్యామగ్నిహోత్రపరాయణః ।*
ఇష్టీః పార్వాయనాంతీయాః కేవలా నిర్వపేత్సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10**

తాత్పర్యం:- అడవి నుండి ఆకు, అలము, పూలు, పండ్లు, ఆహారము, ప్రోవుచేసికొని అగ్నిహోత్రము చేయుచు పర్వదినములకు అన్నము కలిగియుండి నిత్యము యజ్ఞము చేయుచుండవలెను. పరోపకారపరాయణుడగు బ్రాహ్మణుడు అడవినుండి తెచ్చుకొన్న ఫలాదులతో పర్వదినములలో చేయుయజ్ఞముల చేయవలెను.॥10॥

ప్రక్షిప్తాల పరిశీలన

4 నుంచి 10వరకు గల శ్లోకాలలోని విషయం ఈ కింది ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

ఇందులో కొన్ని వృత్తులు, సంచయం వల్ల ఎవరు శ్రేష్ఠులు అనేవి చెప్పారు. 4 నుంచి 10 వరకు ఉన్న శ్లోకాలన్నీ పరస్పర సంబంధం గలవి. వీటిలోని విషయం మనుస్మృతి సంప్రదాయాలకే వ్యతిరేకం, మౌలిక వ్యవస్థలతో ఇవి కలవడం లేదు.

క. 1.87-91 శ్లోకాలలో నాలుగు వర్ణాల వారి పనులను గురించి ఉంది. అందులో కొన్ని పనులు కొన్ని వర్ణాలవారికి జీవనాధారాలు కూడా [9.325-335 (ఇందులో 10.1-3)]. కర్మలను బట్టే మనువు వర్ణాలను విభజించాడు. ఇక్కడ ద్విజులందరికీ మునుపు చెప్పిన ఉపాధులకన్నా భిన్నంగా ఉపాధుల వ్యవస్థను ఏర్పరచడం, అందరి ఉపాధులకూ సమాన వ్యవస్థను ఏర్పరచడం, మునుపటి వ్యవస్థలు, సంప్రదాయాలకు వ్యతిరేకం.

ఖ. ఈ శ్లోకాలలో 'సేవ'ను కూడా ఒక ద్విజాతివారికి [3.286] ఉపాధిగా చెప్పాడు [4.4.5]. కానీ మునుపటి వ్యవస్థ ననుసరించి 'సేవ' ద్విజాతీయులకు కాదు. శూద్రుల పని [1.87-91; 9-334-335]. అందుచేత ఆధారానికే వ్యతిరేకమైన ఈ విషయం ప్రక్షిప్తతను సూచిస్తూంది.

గ. 9వ శ్లోకంలో గృహస్థ ద్విజుల ఉపాధిని ఆధారం చేసుకుని నాలుగు వర్ణాల వారు - ఆరు కర్మల ద్వారా ఉపాధి పొందేవారు, మూడు కర్మలతో ఉపాధి పొందేవారు - వీరిని గురించి చెప్పారు. ఈ వ్యవస్థ కూడా 1.87-91,9.325-335 (ఇందులో 10.1-3) శ్లోకాలకు వ్యతిరేకమే. ఈ శ్లోకాలలో ఏ వర్ణానికి చెందిన వ్యక్తికైనా ఉపాధి కొరకు ఆరు కర్మలు (వైశ్యులను మినహాయించి), నాలుగు కర్మలు చేయతగినవి.

ఘ. ఈ శ్లోకాలలో ద్విజుల ఒక వృత్తి 'యాచన' అంటే 'భిక్షాటన' (4-5) అవుతుంది. ఇది గృహస్థుల విషయం కనుక [3.286; 4.1], ఈ పద్ధతి వారికే అని భావించాలి. మనువు గృహస్థుల వృత్తి యాచన అని ఎక్కడా చెప్పలేదు. ఇంట్లో వంట చేయొచ్చునన్నాడు. తాను వండకుండా ఇతరులు పెట్టేదానిపై ఆశపడే గృహస్థును నిందించాడు కూడా [3.67;104]. భిక్షా విధానం మిగిలిన మూడు ఆశ్రమాలవారిది. [2.159-260 (184-195); 6-55,57]. పైగా వానప్రస్థాశ్రమంలో కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే భిక్షాటన చేయాలనే మినహాయింపు ఉంది. [6.27]. సామాన్యంగానైతే వానప్రస్థుడు కూడా స్వయంగా వండుకుని తినే పద్ధతి ఉంది. [6.5,7,12,13]. ఇటువంటి అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా 4-10 శ్లోకాలలోని ఉపాధి విషయం ప్రక్షిప్తమవుతుంది.

2. ప్రసంగ వ్యతిరేకాలు

2-3 శ్లోకాలలోని విషయం ప్రారంభంలో మనువు 'ఉపాధిని ఎలా సంపాదించాలి?' అని చెప్పాలనుకున్నాడనీ, ఉపాధులను పరిగణించడం కాదనీ తెలుస్తుంది. ఎందుకంటే అది మునుపే వర్ణాల కర్మలలో భాగంగా చెప్పేశాడు [1.87-91]. 11-12 శ్లోకాలలోనూ ఇదే ఉంది. 'ఉపాధి ఎలా **ఉండాలి,** ఎలా ఉండకూడదు?' - ఇది ఇందులో మూడవ శ్లోకం తర్వాత 11లో ఉంది కనుక, మూడవ శ్లోకంతో 11వ శ్లోకానికి విషయపరంగా సంబంధం ఉంది. మధ్యలోని 4-10 శ్లోకాలలోని విషయం భిన్నం కనుక అవి ప్రక్షిప్తాలు.

11 నుండి 17వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

శాస్త్ర విరుద్ధంగా జీవిక ఉండరాదు-

న లోకవృత్తం వర్తేత వృత్తిహేతోః కథంచన । మూలశ్లోక సం.**4**
అజిహ్మామశఠాం శుద్ధాం జీవేద్బ్రాహ్మణజీవికామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**11**

టీక:- గృహస్థుడు, **వృత్తి హేతోః** = జీవిక కోసం కూడా, **లోకవృత్తం న వర్తేత** = ఎప్పుడూ శాస్త్ర విరుద్ధమైన లోకాచారం ప్రకారంగా వ్యవహరించరాదు, (కింతు) కాని, ఆ వృత్తిలో, **అజిహ్మామ్ + అశఠాం శుద్ధాం** = ఏ రకమైన కౌటిల్యం, మూర్ఖత్వం, అసత్యం, అధర్మం ఉండరాదు, **బ్రాహ్మణ జీవికామ్ జీవేత్** = వేదోక్త కర్మసంబంధమైన జీవికావృత్తిని నిర్వహించుగాక !

ఋషిదయానందభాష్యం:-బ్రాహ్మణుడు జీవిక నిమిత్తం ఎప్పుడూ శాస్త్ర విరుద్ధమైన లోకాచారం ప్రకారం వ్యవహరించరాదు. కానీ ఆ వృత్తిలో ఏరకమైన కౌటిల్యం, మూర్ఖత్వం, అసత్యం, అధర్మం ఉండరాదు. వేదోక్తకర్మసంబంధమైన జీవికావృత్తిని నిర్వహించాలి. (సం.వి.గృ.ప్ర.) ॥11॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సంతోషము సుఖమూలము-అసంతోషం దుఃఖమూలము-

సంతోషం పరమాస్థాయ సుఖార్థీ సంయతో భవేత్ । మూలశ్లోక సం.**5**
సంతోషమూలం హి సుఖం దుఃఖమూలం విపర్యయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**12**

టీక:- సుఖార్థీ = సుఖపడాలనుకొనే వ్యక్తి, **పరమమ్ సంతోషం ఆస్థాయ** = అత్యంత సంతుష్టాత్ముడై, **సంయతః భవేత్** = అధిక ధన సంగ్రహేచ్ఛలేనివాడై ఉండాలి, **హి** = ఎందుకంటే, **సంతోషమూలం సుఖం** = సుఖానికి ఆధారం సంతోషమే, **విపర్యయః** = దానికి వ్యతిరేకం సంతోషం కానిది, **దుఃఖమూలమ్** = దుఃఖానికి ఆధారం.

తాత్పర్యం:- సుఖం కోరుకునే వ్యక్తి అత్యంత్య సంతుష్టాత్ముడై, ఎక్కువ ధనం సంపాదించాలనే కోరిక లేనివాడై ఉండాలి. ఎందుకంటే సుఖానికి ఆధారం సంతోషమే, దుఃఖానికి మూలం సంతోషం లేక పోవడమే.॥12॥

స్నాతక గృహస్థుల వ్రతాలు 13 నుండి 260 వరకు

గృహస్థులకు సత్త్వగుణ వర్ధకాలైన వ్రతాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

అతోఽన్యతమయా వృత్త్యా జీవంస్తు స్నాతకో ద్విజః । మూలశ్లోక సం.**6**
స్వర్గాయుష్యయశస్యాని వ్రతానీమాని ధారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**13**

టీక:- **అతః** = ఇందుకోసం, **స్నాతకః ద్విజః** = స్నాతకుడైన గృహస్థుడు, **అన్యతమయా** = నిర్ధారితమైన (1-87 నుండి 91 వరకు) వృత్తులలో ఉండి, ఏదైనా శ్రేష్ఠ, **వృత్త్యా** = ఆ జీవిక జీవనోపాధి ద్వారా, **జీవంస్తు** = జీవన నిర్వాహం చేస్తూ, **స్వర్గ ఆయుష్య-యశస్యాని ఇమాని వ్రతాని ధారయేత్** = సుఖకరం, ఆయుర్వర్ధకం, యశోదాయకమైన వ్రతాన్ని అనుసరించాలి. [3.259,260].

తాత్పర్యం:- కాబట్టి స్నాతకుడైన గృహస్థ ద్విజుడు ఇంతకుముందు పేర్కొన్న వృత్తులలో శుద్ధమైన వృత్తి ద్వారా జీవిస్తూ స్వర్గం, ఆయుస్సు, యశస్సులను ఇచ్చునట్టి ఈ కింది వ్రతాలు అనుష్ఠించాలి.॥13॥

వివరణ:

స్వర్గానికి సుఖమని మను అభిప్రాయం. 3.79లో వివరణను చూడండి.

ఇది మనుకృతం-ప్రామాణికం

వేదోదితం స్వకం కర్మ నిత్యం కుర్యాదతంద్రితః । మూలశ్లోక సం.**6**
తద్ధి కుర్వన్ యథాశక్తి ప్రాప్నోతి పరామాం గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**14**

టీక:- బ్రాహ్మణాది ద్విజులు, **వేదోదితం స్వకం కర్మ** = వేదోక్తమైన తమ కర్మను, **అతన్ద్రితః నిత్యం కుర్యాత్** = అలసత్వాన్ని విడిచిపెట్టి నిత్యం చేయుగాక, **తత్ హి యథాశక్తి కుర్వన్** = ఆ కర్మను తన సామర్థ్యాన్ననుసరించి చేస్తూ, **పరమాం గతిమ్ ప్రాప్నోతి** = ముక్తిపర్యంతం ఉత్తమ పదార్థాలు పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:- వేదాలలో చెప్పబడిన కర్మలన్నీ బ్రాహ్మణాది ద్విజులు ఆచరించాలి. ఏమరుపాటులేకుండా వాటిని ఆచరించడం (స్వకర్మానుష్ఠానం) వల్ల ముక్తిపర్యంతం ఉత్తమగతులు పొందగలడతడు. (సం.వి.గృ.ప్ర.) ॥14॥

అధర్మంగా ధనాన్ని నిలువచేయవద్దు ఇది మనుకృతం-ప్రామాణికం

నేహేతార్థాన్ ప్రసజ్జేన న విరుద్ధేన కర్మణా । మూలశ్లోక సం.**8**
న విద్యమానేష్వర్థేషు నార్త్యామపి యతస్తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**15**

టీక:- గృహస్థుడు, **ప్రసంగేన అర్థాన్ చ ఈహేత** = ఎప్పుడైనా ఏ దుష్టుల ప్రసంగం ద్వారా ద్రవ్యాన్ని నిలువ (పోగు) చేయరాదు. **న విరుద్ధేన కర్మణా** = విరుద్ధమైన కర్మతో గాని, **న విద్యమానేషు+అర్థేషు యతస్తతః** = పదార్థాలు లేకపోయిన కూడా, వాటిని దాచిపెట్టి లేదా ఇతరులను మోసగించి, **న ఆర్త్యామపి** = ఎంత ఆపద వచ్చినా, అధర్మంగా ద్రవ్యాన్ని సంపాదించరాదు.

ఋషి దయానందభాష్యం:- గృహస్థుడు ఎప్పుడైనా ఏ దుష్టుల ప్రసంగం ద్వారా ద్రవ్యాన్ని నిలువ చేయరాదు. విరుద్ధమైన కర్మతో గానీ, పదార్థాలు లేకపోయినా కూడా వాటిని దాచిపెట్టి లేదా ఇతరులను మోసగించి, ఎంత ఆపద వచ్చినా, అధర్మంగా ద్రవ్యాన్ని సంపాదించరాదు. (సం.వి.గృ.ప్ర.) ॥15॥

ఇంద్రియాసక్తి నిషేధం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఇంద్రియార్థేషు సర్వేషు న ప్రసజ్యేత కామతః । మూలశ్లోక సం. **9**
అతిప్రసక్తిం చైతేషాం మనసా సన్నివర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **16**

టీక:- **సర్వేషు ఇంద్రియార్థేషు కామతః** న ప్రసజ్యేత = ఇంద్రియాలకు సంబంధించిన విషయాలలో (శబ్ద స్పర్శ రూప రస గంధాదులు) కామంలో చిక్కుకోరాదు, **చ** = మరియు, **ఏతేషాం అతిప్రసక్తిం** = విషయములందు అత్యంతాసక్తిని, ప్రసంగాన్ని, **మనసా సన్నిర్తయేత్** = మనస్సు నుండి పూర్తిగా దూరం చేస్తూ ఉంది.

ఋషి దయానందభాష్యం:- మోహం వహించి సకల ఇంద్రియాది విషయాల మీద ఆసక్తి ప్రదర్శించకూడదు. ఇంద్రియభోగాలు అభిలషించేవాడు పతనమార్గంలోకి లాగబడి, ఎలాంటి ఘోరాలు చేయడానికైనా వెనుదీయడు. (సం.వి.గృ.ప్ర.) ॥16॥

స్వాధ్యాయం వల్ల కృతకృత్యత- ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వాన్ పరిత్యజేదర్థాన్ స్వాధ్యాయస్య విరోధినః । మూలశ్లోక సం. **10**
యథాతథాఽధ్యాపయంస్తు సా హ్యస్య కృతకృత్యతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **17**

టీక:- **స్వాధ్యాయస్య విరోధినః సర్వాన్ అర్థాన్ పరిత్యజేత్** = స్వాధ్యాయానికి, ధర్మానికి విరోధమైన వ్యవహారాలను, పదార్థాలను పూర్తిగా విడిచిపెట్టాలి, **యథా తథా అధ్యాపయన్ తు** = ఏ విధంగానైనా విద్యాబోధన చేస్తూండటమే, **సా హి+అస్య కృత కృత్యతా** = అదే గృహస్థుడికి చరితార్థత.

తాత్పర్యం:- వేదాధ్యయనానికి అవరోధంగా ఉండే సకలమైనవాటినీ పరిత్యజించాలి. వేదాధ్యయనం, వేదాధ్యాపనం అనేవి రెండే ఈ బ్రాహ్మణజన్మకు కృతకృత్యత, సార్థకత కలిగించేవి. (సం.వి.గృ.ప్ర.)॥17॥

వివరణ:

స్వాధ్యాయమును గురించి విస్తృతార్థం కోసం (2.82)[2.107]వ శ్లోకంలోని వివరణ చూడండి.

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* **వయసును బట్టి వ్యవహారము-**

* ***వయసః కర్మణోఽర్థస్య శ్రుతస్యాభిజనస్య చ ।***
వేషవాగ్బుద్ధిసారూప్యమాచరన్ విచరేదిహ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***18***

తాత్పర్యం:- తన వర్ణానికి తగిన వేషం, యజ్ఞం మొదలైన కార్యాచరణ, తనకు గల సంపద, తన వయస్సుకు తగ్గ వాక్శుద్ధి కుశలతతో కూడిన సత్ప్రవర్తన చేత బ్రాహ్మణుడు సంచరించాలి. ॥18॥

ప్రక్షిప్త పరిశీలన

18వ శ్లోకం ఈ కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తం -

1. ప్రసంగ వ్యతిరేకం

ఇది పూర్వాపర విషయాలకు వ్యతిరేకమే కాకుండా ముందు వెనుకల గల విషయాలను భంగం చేస్తూంది. 17,19వ శ్లోకాలలో ఒకదాని కొకటి సంబద్ధమైన స్వాధ్యాయ విషయం ఉంది. దీన్ని 18వ శ్లోకం భంగపరుస్తూంది. మధ్యలో 'ఎలా వ్యవహరించాలి?' అనేది సందర్భోచితం కాదు కనుక. ఈ శ్లోకం ప్రక్షిప్తం.

2. విషయ వ్యతిరేకం

ఇది ప్రస్తుత విషయం [4.13] తో వ్యతిరేకిస్తుంది. దీనితో ఈ శ్లోకంలోని 'సత్త్వగుణ వర్ధకం' కావటానికి ఎటువంటి సంబంధమూ లేదు. ఇదేదో 'వ్రతం' కూడా కాదు. (విస్తృత విశ్లేషణకు 4.36-39 శ్లోకాల వివరణ చూడండి.).

19 నుండి 21వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

బుద్ధివృద్ధి కరాణ్యాశు ధన్యాని చ హితాని చ । మూలశ్లోక సం.**11**
నిత్యం శాస్త్రాణ్యవేక్షేత నిగమాంశ్చైవ వైదికాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**19**

టీక:- ఓ స్త్రీ పురుషులారా ! మీరు, **ధన్యాని ఆశు బుద్ధివృద్ధి కరాణి చ హితాని శాస్త్రాణి** = ధనాన్ని, బుద్ధ్యాదులను అత్యంత శీఘ్రంగా పెంపొందించే హితకరములైన శాస్త్రాలను, **చ** = మరియు, **వైదికాన్ నిగమాన్** = వేదభాగాలకు సంబంధించిన విద్యలను,**నిత్యం అవేక్షేత** = నిత్యం చేస్తూ ఉందురుగాక !

ఋషి దయానందభాష్యం:- స్త్రీ, పురుషులు వేదానికి మరింత వన్నె తెచ్చేదీ-బుద్ధిని వృద్ధిచేసేవీ అయిన వేదాదిశాస్త్రాలను, స్మృతి పురాణ తర్క వ్యాకరణ మీమాంసాది శాస్త్రాలను, ప్రజోపయోగ కారకములైన జ్యోతిష వైద్యాదిశాస్త్రాలను, వేదార్థాన్ని ప్రస్ఫుటపరిచే నిగమాది గ్రంథాలను అనుదినం పఠించాలి. శీఘ్రంగా బుద్ధిని, ధనాన్ని, హితాన్ని పెంచే శాస్త్రాలను, వేదాలను నిత్యం వినాలి, వినిపించాలి, బ్రహ్మచర్యాశ్రమంలో చదివినవాటిని స్త్రీ- పురుషులు నిత్యం పరిశీలిస్తూ, చదివించాలి. (సం.వి.గృ.ప్ర.)॥19॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యథా యథా హి పురుషః శాస్త్రం సమధిగచ్ఛతి । మూలశ్లోక సం.**12**
తథా తథా విజానాతి విజ్ఞానం చాస్య రోచతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**20**

టీక:- పురుషః= మనుషుడు, **యథా యథా శాస్త్రం సమధిగచ్ఛతి** = ఏ విధంగా శాస్త్రాన్ని విచారించి, దాని యొక్క యథార్థభావాన్ని అవగతం చేసుకొంటాడో, **తథా తథా విజానాతి** = అదే విధంగా, అధికారికంగా తెలిసికొంటూపోతుంటాడు. **చ** = మరియు, **అస్య విజ్ఞానం రోచతే** = ఇతడికి ప్రీతి (ప్రేమ) విజ్ఞానంలోనే స్థిరమవుతుంది.

ఋషి దయానందభాష్యం:- బ్రాహ్మణులలో పురుషోత్తముడనదగినవాడు ఎంతగా శాస్త్రాన్ని విచారించి, దాని యొక్క యథార్థ భావాన్ని అవగతం చేసుకొంటాడో అతడికి ప్రీతి విజ్ఞానంలోనే స్థిరమవుతుంది. ఎప్పుడైతే మానవుడు శాస్త్రాలను యథార్థంగా తెలిసికొంటాడో, తెలిసికొనే కొద్దీ ఆ శాస్త్ర జ్ఞానం దృఢమవుతూ పెరుగుతుంది. ఆ శాస్త్రంలో అభిరుచి ఎక్కువవుతుంది.(స.ప్ర.4వ.సము.) ॥20॥

పంచమహా యజ్ఞాల పాలనకు నిర్దేశం:- ఇది మనుకృతం-ప్రామాణికం

ఋషియజ్ఞం దేవయజ్ఞం భూతయజ్ఞం చ సర్వదా । మూలశ్లోక సం.**13**
నృయజ్ఞం పితృయజ్ఞం చ యథాశక్తి న హాపయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**21**

టీక:- ఋషియజ్ఞం, దేవ యజ్ఞం, భూతయజ్ఞం, నృయజ్ఞం పితృయజ్ఞం = ఋషి యజ్ఞం, దేవయజ్ఞం, భూతయజ్ఞం, అతిథియజ్ఞం మరియు పితృయజ్ఞం. వీటిని, **సర్వదా యథాశక్తి న హాపయేత్** = ఎల్లప్పుడు వీలున్నంతవరకు చేస్తూనే ఉండాలి. ఎప్పుడూ వదిలిపెట్టకూడదు.

తాత్పర్యం:- ద్విజులు ఋషి, దేవ, భూత, పితృ, అతిథియజ్ఞా లనే పంచమహాయజ్ఞాలను నిర్వర్తించాలి. వీటన్నింటినీ నిత్యం ఆచరించాలి. వీటిని ఎప్పుడూ వదిలిపెట్టరాదు. అంటే ఇవి వరుసగా బ్రహ్మయజ్ఞం దేవయజ్ఞం, వైశ్వదేవం, పితృయజ్ఞం అతిథియజ్ఞం అనేవి.॥21॥

22 నుండి 24వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* యజ్ఞాలకు వికల్పం-

* *ఏతానేకే మహాయాజ్ఞాన్ యజ్ఞ శాస్త్రవిదో జనాః ।*
అనీహమానాస్సతతమింద్రియేష్వేవ జుహ్వతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **22**

తాత్పర్యం:- యజ్ఞ శాస్త్రకోవిదులైనవారు కొందరు ఈ పంచమహా యజ్ఞాలను విడివిడిగా ఆచరించక, వీటియందు అపేక్ష వహించక తమ ఐదుజ్ఞానేంద్రియాలలోనే వీటిని హోమం చేస్తారు. ఇదొక సాంకేతిక ప్రక్రియ.॥22॥

* *వాచ్యేకే జుహ్వతి ప్రాణం ప్రాణే వాచం చ సర్వదా ।*
వాచి ప్రాణే చ పశ్యంతో యజ్ఞనిర్వృత్తిమక్షయామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **23**

తాత్పర్యం:- మరికొందరు యజ్ఞఫలితాలు వాక్కుయందు ప్రాణములందు తరగక ఉన్నాయని తలచి, వాక్కుయందు ప్రాణాన్ని, ప్రాణంలో వాక్కుని అణుచుకొని యజ్ఞఫలితాన్ని పొందుతారు.॥23॥

* *జ్ఞానేనైవాపరే విప్రా యజంత్యేతైర్మఖైస్సదా ।*
జ్ఞానమూలం క్రియామేషాం పశ్యంతో జ్ఞానచక్షుషా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **24**

తాత్పర్యం:- బ్రహ్మజ్ఞానులైన కొందరు పెద్దలు బ్రహ్మజ్ఞాన నేత్రాలచేతనే సమస్త క్రియల ఫలితం కలుగుతుందని గ్రహించి ఆ జ్ఞానాన్ని పరిపూర్ణశ్రద్ధతో అధ్యయనం చేస్తారు. ఎవరేం చేసినా జ్ఞానాన్ని పెంచుకోవడం కోసమే.॥24॥

ప్రక్షిప్తాల పరిశీలన

22 నుంచి 24 వరకు ఉన్న శ్లోకాలు ఈ కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

గృహస్థుల కర్తవ్యాలను తెలిపే విషయ మిది. అందరు గృహస్థులూ దైనిక పంచమహా యజ్ఞాలను తప్పకుండా చేయాలని మనువు కచ్చితమైన వ్యవస్థను ఏర్పరిచాడు [3.67-72,75-118]. వానప్రస్థ ఆశ్రమంలోనూ వీటిని తప్పక చేయాలన్నాడు [6.4, 5,7-12]. వీటి కన్నా ముందరి శ్లోకాలలోనూ స్పష్టంగా - **'యథాశక్తి న హాపయేత్'** అన్నాడు. అంటే 'తమ స్తోమతను బట్టి వీటిని వదలకుండా చేయాలి' అని అర్థం. ఈ శ్లోకాలలో వీటికి వికల్పాలను కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయా లంటూ ఇచ్చారు. వీటిని చదివితే పైన చెప్పిన యజ్ఞాలకు మారుగా మరికొన్ని పద్ధతులను పాటించవచ్చునని స్పష్టంగా చెప్పారు. ఈ వికల్పాలు లేదా భిన్న వ్యవస్థలు మనువు చెప్పిన సంప్రదాయాలు, పద్ధతులకు వ్యతిరేకంగా ఉన్నందున, ఇవి ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలు ముందు వెనుకలలో ఉన్నవాటికి వ్యతిరేకాలు. 21వ శ్లోకంలో ఐదు యజ్ఞాలను పేర్లతో సహా పేర్కొని, 25వ శ్లోకంలోనూ, ఆ తర్వాత వాటి వ్యాఖ్యానం క్రమంగా చెప్పారు. ఈ పూర్వాపర సంబద్ధతను ఈ శ్లోకాలు భంగపరుస్తున్నాయి. ప్రసంగ వ్యతిరేకాలు కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు.

3. విషయ వ్యతిరేకాలు

యజ్ఞాల పద్ధతి, వాటిని చేసే విధానాలు, మూడవ అధ్యాయంలోని విషయం. ఇక్కడ నాలుగవ అధ్యాయంలో వట్టి కర్తవ్యాలు లేదా వ్రతాల వర్ణన ఉంది [14,259]. ఈ విషయంలో హోమాల భిన్న రీతులు చెప్పటం విషయ వ్యతిరేకమవుతుంది. ఇవి మౌలికమై ఉంటే, వీటి వర్ణన మూడవ అధ్యాయంలోనే ఉచిత మవుతుంది.

అగ్నిహోత్ర విధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

అగ్ని హోత్రం చ జుహుయాదాద్యంతే ద్యునిశోస్సదా । మూలశ్లోక సం. **14**
దర్శేన చార్ధమాసాంతే పౌర్ణమాసేన చైవ హి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **25**

టీక:- గృహస్థుడు, సదా = ఎల్లప్పుడు, ప్రతిదినం, **ద్యునిశోః ఆద్యన్తే** = దినరాత్రుల ఆద్యంతములలో, అంటే ప్రాతః సాయంకాల సంధివేళలలో, **అగ్నిహోత్రం జుహుయాత్** = అగ్నిహోత్రం చేయాలి. చ = మరియు, **అర్ధ మాసాన్తే** = అర్ధమాసాంతంలో ధర్మయజ్ఞం అంటే అమావాస్య యజ్ఞం. చ = అలాగే, **ఏవ హి పౌర్ణమాసేన** = ఇదేవిధంగా మాసం పూర్ణం కాగా, పూర్ణిమ దినమున "పౌర్ణమాస యజ్ఞం చేయాలి.

తాత్పర్యం:- ప్రాతః సాయం సంధ్యవేళలలో ద్విజుడన్నవాడు అగ్నిహోత్రం చేయాలి. అర్ధమాసాంతంలో అమావాస్య యజ్ఞం, (ధర్మయజ్ఞం), మాసాంతంలో పౌర్ణిమ దినమున పౌర్ణమాస యజ్ఞం చేయాలి.॥25॥

26 నుండి 28 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అయనము-ఋతు యజ్ఞము

* *సస్యాంతే నవసస్యేష్ట్యా తథర్త్వంతే ద్విజో-ధ్వరైః ।*
పశునా త్వయనస్యాదౌ సమాంతే సౌమికైర్మఖైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***26***

తాత్పర్యం:- పాతధాన్యం పూర్తి అవుతుండగా-కొత్తధాన్యం వచ్చేలోగానే ఆగ్రయణేష్టియాగాన్ని ఆచరించాలి. ఋతువుల అంతమందు చాతుర్మాసేష్టి అనే యాగం, దక్షిణాయన-ఉత్తరాయణముల ప్రారంభంలో పశువధరూప యజ్ఞం, చాంద్రమానరీత్యా సంవత్సరాంతాన అగ్నిష్టోమయాగం చేయాలి.॥26॥

* *నానిష్ట్వా నవసస్యేష్ట్యా పశునా చాగ్నిమాన్ ద్విజః ।*
నవాన్నమద్యాన్మాంసం వా దీర్ఘమాయుర్జిజీవిషుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***27***

తాత్పర్యం:- ఆహితాగ్ని అయిన బ్రాహ్మణుడు దీర్ఘకాలం జీవించాలని కోరుకుంటే, కొత్తధాన్యం రాగానే ఆగ్రయణేష్టి చెయ్యకుండా ఆ కొత్త ధాన్యం భుజించకూడదు. పశువధేష్టిచేయకుండా మాంసభక్షణం చేయరాదు. (దీన్ని బట్టి ఒకనాటి బ్రాహ్మణుడు మాంసం తినేవాడని అర్థం అవుతున్నది).॥27॥

* *నవేనానర్చితా హ్యస్య పశుహవ్యేన చాగ్నయః ।*
ప్రాణానేవాత్తుమిచ్ఛంతి నవాన్నామిషగర్ధినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***28***

తాత్పర్యం:- ఆగ్రయణేష్టి, పశువధేష్టి చేయనందువల్ల ఆ ఆహితాగ్ని ఇంట్లోని త్రేతాగ్నులు కొత్తధాన్యపు అన్నం నందు, మాంసం నందు కోరికచేత, ఆ యజమాని ప్రాణాలను హరించివేస్తాయట! ॥28॥

ప్రక్షిప్తాల పరిశీలన

26 నుంచి 28 వరకు గల శ్లోకాలు ఈ కింది ప్రమాణాల వల్ల ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు-

మాంస భక్షణం, జంతు బలులు మనువుకు వ్యతిరేకం

ఇందులో జంతుబలులివ్వటం లేదా యజ్ఞాలలో జంతుమాంసాన్ని ఆహుతి ఇవ్వడమూ; మాంసం తినడం, ఈ రెండిటినీ ఉచితమని భావించారని చెప్పారు. ఈ రెండూ కూడా మనువు సంప్రదాయాలకు వ్యతిరేకమే. వీటిని మను

సమ్మతాలుగా భావిస్తే, మనుస్మృతి ఆధారభూతమైన వ్యవస్థనే ఖండించినట్లవుతుంది. కింద వీటికి సంబంధించిన మనువు చెప్పిన కొన్ని పద్ధతు లిస్తున్నాము. వీటి వల్ల క. అన్నిరకాల జంతుహింసా లేదా మాంసభక్షణం మనువుకు వ్యతిరేకం.

ఖ. జంతు బలులు మనువుకు వ్యతిరేకం.

గ. యజ్ఞం కొరకు జంతుహింస కూడా మనువుకు వ్యతిరేకం అని తేలుతుంది. ఎందుకంటే, మనువు చెప్పినది గృహస్థులూ, వానప్రస్థులూ ప్రతిరోజూ తప్పకుండా పంచయజ్ఞాలు చేయాలని. వీటి వీటి విధానంలోని ప్రధాన ఉద్దేశం హింసను నివారించడమే –

పంచసూనా గృహస్థస్య చుల్లీ పేష ణ్యుపస్కరః ।
కండనీ చోద కుంభశ్చ బధ్యతే యాస్తు వాహయన్ ॥ [3.68]

తాసాం క్రమేణ సర్వాసాం నిష్కృత్యర్థం మహర్షిభిః ।
పంచక్లుప్తా మహాయజ్ఞాః ప్రత్యహం గృహ మేధినాం॥ [3.69]

వీటిలో, ప్రతి రోజూ జరిగే పనులలో తెలిసీ తెలియక జరిగే చిన్నచిన్న హింసల నివృత్తి కొరకే పంచమహాయజ్ఞాలు ఏర్పడినవి. ఈ పంచమహాయజ్ఞాల రూపంలో ఎవరు ప్రాయశ్చిత్తం ఎవరు చేసుకుంటారో, ఎవరికి ఇతర ప్రాణుల పీడనమనే భావమే లేదో, వారు తమ ఉపాధులను సైతం అటువంటివిగానే ఏర్పరచుకుంటారని చెప్పాడు [4.2]. వీటి వల్ల ఇతర ఏ ప్రాణులకూ బాధ కలుగదు. ఎవరు జంతువులపై స్వారీ చేస్తూ వాటికి బాధ కలగని రీతిలో కోల వాడాలని చెబుతారో [4.68], వారు జంతుహింసా, మాంస భక్షణమూ చేయరు. ఇది సర్వథా జరగని పని.

ఘ. ఇవే కాకుండా 5.48, 49,51లలో అన్ని రకాల భక్షణాన్నీ మనువు నిషేధించి, నిందించాడు. మాంసం తినటంలో ఏ కొంచెమైనా సాయం చేసేవారిని 'పాపులు' అని ప్రకటించాడు. దీని వల్ల మనువు మాంస సేవనాన్ని మహాపాపమని భవించాడని తెలుస్తోంది–

అనుమంతా విశసితా నిహంతా క్రయవిక్రయీ ।
సంస్కర్తా చోపహర్తా ఖాదక శ్చేతి ఘాతుకాః॥ [6.51]

అంటే, 'మాంసం తినమని చెప్పేవాడు, పశువును నరికేవాడు, చంపేవాడు, మాంసం అమ్మేవాడు, కొనేవాడు, మాంసభోజనం తయారు చేసేవాడు, వడ్డించే వాడు, తినేవాడు – ఈ అందరూ పాపులే !' అని అర్థం.

మనుస్మృతిలో పలు చోట్ల మాంసభక్షణాన్ని నిషేధించడం, హింసించేవారి నింద, అహింసావాదుల ప్రశంస, అహింసకు ప్రేరణ నీయడం కనిపిస్తాయి.

ఙ. **"వర్జయేత్ మధుమాంసం చ ప్రాణినాం చైవ హింసనమ్"॥** 2.152 [177]
చ. **'వర్జయేత్ మధుమాంసం' ॥** 6.14
ఛ. **'హింసారతశ్చ యోనిత్యం నేహాసౌసుఖమేధతే? ॥** 6.170
జ. **యో అహింసకాని భూతాని హినస్తి ఆత్మసుఖేచ్ఛయా ।**
స జీవంశ్చ మృతశ్చైవ న క్వచిత్ సుఖమేధతే ॥ 5.45
ఝ. **అహింసః దమదానాభ్యాం జయేత్ స్వర్గం తథావ్రతాః ।** 4.246
ఞ. **విచరేత్ నియతః నిత్యం సర్వభూతాని అపీడయన్ ।** 6.52
ట. **అహింసయా చ భూతానాం అమృతత్వాయ కల్పతే ।** 6.60

ఈ అన్ని ప్రమాణాలతో మనువు అహింస పక్షంవాదేననీ, అన్ని రకాల హింసనూ వ్యతిరేకించాడనీ, నిందించాడనీ తెలుస్తూంది. మూడవ అధ్యాయంలో మౌలిక యజ్ఞ విషయాలలో మనువెక్కడా మాంస యజ్ఞాల పద్ధతి చెప్పలేదు. వానప్రస్థం విషయంలో అన్నాలతోనే యజ్ఞాలు చేయమనీ, అది కూడా **'మేధ్యం' = శుభ అన్నాలతో-**

మున్యన్నైః వివిధైః మేధ్యైః శాకమూలఫలేన వా ।
ఏతానేవ మహాయజ్ఞాన్ నిర్వపేత్ విధిపూర్వకమ్ ॥ 6.5

ఈ విధంగా ఈ [26,28] శ్లోకాలలో కనిపించిన పద్ధతికీ, మనువు చెప్పినవాటికీ చాలా వ్యతిరేకతలు కనిపిస్తున్నాయి. కనుక, ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. వేద వ్యతిరేకాలు - మాంసం తినటం, జంతు బలులకు వ్యతిరేకంగా వేదాలలోని ప్రమాణాలు

ఈ ప్రసంగంలో మాంసం తినటం కొరకు ప్రక్షిప్తకారులు యజ్ఞాల సాయం తీసుకున్నారు. యజ్ఞాల మూల విధానం వేదాలలో ఉంది. అందుచేత వాటికి సంబంధించిన వేదాలలోని ప్రమాణాలు ఇస్తున్నాము. వాటి వల్ల తమ స్వార్థం కోసం ప్రజలు మిథ్యాయజ్ఞాలను అడ్డం పెట్టుకుని, వేదాలను అప్రతిష్ఠపాలు చేశారని స్పష్టంగా అర్థమవుతుంది-

క. **'అధ్వరం'** అనే పదం ఋగ్వేదంలో 1.23.17; 1.44.13; 1.134.7; 3.24.2; 7.72.4; 9.6.8ల లోనూ, యజుర్వేదంలో 3.11; 21.47; 37.19 మొదలైన చోట్ల యజ్ఞం అనే అర్థంలో ప్రయోగించబడింది. ఈ పదానికి నిర్వచనం చెబుతూ యాస్కాచార్యుడు - **"అధ్వర ఇతి యజ్ఞనామ, ధ్వరతి హింసా కర్మా తత్ప్రతిషేధః"** - [ని.3.17; 1.7] అంటే **'అధ్వరం'** అనేది యజ్ఞానికి మరో పేరు అని. **'ధ్వరం'** అనేది హింసాత్మకమైన ధాతువు నుంచి వచ్చింది. ఎటువంటి హింసాలేనిది **'అధర్వం'**. యజ్ఞం పేరిట జంతుహింస చేయటం స్వార్థపరుల పొట్టనింపటానికి కల్పించిన మిష.

ఖ. యజుర్వేదాన్ని కర్మకాండల వేదం అంటారు. దాని తొలి మంత్రంలోనే జంతువులను హింసించ వద్దనే కోరిక ఉంది - **"యజమానస్య పశూన్ పాహి"** [యజు.1.1] - అంటే **'యజ్ఞాలు చేసేవారు జంతువులను రక్షించండి"** అని.

గ. మాంసాహారులకు యజ్ఞం చేసే అధికారం లేదు.

యజ్ఞాలలో మాంసవిధానం మాట అటుంచితే, వేదాలలో యజ్ఞవిధానం కేవలం యాజ్ఞిక ప్రవృత్తి గల, అన్నాహారులైన (మాంసాహారులు కాదు) వారే యజ్ఞాలు చేయాలని ఉంది. ఈ కింది వేద మంత్రాన్ని ప్రమాణంగా స్వీకరించ వచ్చు -

"ఊర్జాదః ఉత యజ్ఞియాసః పంచజనాః మమ హోత్రం జుషధ్వం". (ఋ.10.53.4)

అంటే కేవలం అన్నం తినే వారే (మాంసం తినేవారు కాదు), యాజ్ఞిక ప్రవృత్తి కలవారే ఐదు రకాల (బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు, నిషాదులు) వారు యజ్ఞాలు నిర్వహించాలి. నిరుక్తకారుడు **'ఊర్జ'** పదం వ్యుత్పత్తినీ, అర్థాన్నీ ఇచ్చాడు - **ఊర్గితి అన్ననాం, ఊర్జయతి ఇతి సతః.** [నిరు.3.2.7]. అంటే **'ఊర్జ'** అని అన్నాన్నే ఎందు కంటారంటే, అది శరీరానికి ప్రాణశక్తిని ఇస్తుంది కనుక.

3. శైలీగత ఆధారం

27-28 శ్లోకాలలోని శైలి కూడా నిరాధారమూ, సహేతుకం కానిది. కొత్త పంట లేదా జంతు మాంసాన్ని యజ్ఞంలో అర్పించకుండానే తింటే, తిన్నవారి ప్రాణాలను యజ్ఞాగ్ని ఎట్లా తింటుంది? దానికీ, తిండికీ ఏమిటి సంబంధం? ప్రతి ఏడాదీ కొత్త పంట పండుతూనే ఉంటుంది కానీ, కొత్త సంవత్సరంతో పాటు కొత్త మాంసం ఎట్లా వస్తుంది? ఇటువంటి నిర్హేతుకమైన శైలి మను సమ్మతం కాదు.

అతిథిసత్కారవిధానం- 29 నుండి 32వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఆసనాశనశయ్యాభిరద్భిర్మూలఫలేన వా । మూలశ్లోక సం.**15**
నాస్య కశ్చిద్వసేద్గేహే శక్తితోఽనర్చితోఽతిథిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**29**

టీక:- **అస్య గేహే** = ఈ గృహస్థు గృహంలో, **కశ్చిత్ అతిథిః** = ఏ అతిథి అయినా, **శక్తితః** = శక్తిననుసరించి, **ఆసన-అశన-శయ్యాభిః** = ఆసనం, అశనం (భోజనం), పడక, **వా** = లేదా, **అద్భిః మూల ఫలేన** = జలం, కందమూలాలు, మరియు ఫలాదులతో, **అనర్చితః న వసేత్** = సత్కారం చేయకుండా ఉండరాదు. అంటే యథాశక్తి సత్కారం చేయాలి.

తాత్పర్యం:- గృహస్థు గృహంలో అతిథివస్తే శక్తిననుసరించి ఆసనం, శయ్య, భోజనం ఏర్పాటుచేసి తీరాలి. జలం, కందమూలాలు, ఫలాల తోనైనా తృప్తి నొందించాలి. అలా జరగని పక్షంలో ఆ ఇంట అతిథి క్షణమైనా నిలువరాదు.

సత్కారానికి యోగ్యులు కాని వ్యక్తులు- ఇది మనుకృతం-ప్రామాణికం

పాఖండినో వికర్మస్థాన్ బైడాల వ్రతికాన్ శఠాన్ । మూలశ్లోక సం.**16**
హైతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేణాపి నార్చయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**30**

టీక:- **పాఖండినః వికర్మస్థాన్** = ధార్మిక వేషధారులను, కపటాచారులను, వేదాజ్ఞలకు విరుద్ధంగా ప్రవర్తించేవారిని, **బైడాలవ్రతికాన్** = పిల్లిలాగా పొంచి ఉండి అపకారం చేసేవారిని, **శఠాన్** = గూఢంగా అపకారం చేసేవారిని, **హైతుకాన్** = కుతుర్కం చేసేవారిని, **బక వృత్తీంశ్చ** = కొంగ జపం చేసేవారిని సత్కరించక పోవడమే కాదు. కనీసం వారితో మాట్లాడరాదు కూడా.

ఋషిదయానందభాష్యం:- ధార్మిక వేషధారులను, కపటాచార్యులను వేదాజ్ఞలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిని, పిల్లిలాగా పొంచి ఉండి అపకారం చేసేవారిని, రహస్యంగా అపచారం చేసే వారిని, కుతర్కం చేసేవారిని, కొంగజపం చేసేవారిని సత్కరించకపోవడమే మంచిది. అలాంటి వారితో మాట్లాడరాదు. (సం.వి.గృ.ప్ర.) ॥30॥

వివరణ:

ధార్మిక వేషధారులు, వేదనిందకులు, నాస్తికులు, ఈశ్వరుడి వేదాన్ని మరియు ధర్మాన్ని అంగీకరించనివారు, హింసకులు, గూఢంగా అపకారం చేసేవారు, మిథ్యాభిమానులు, బకవృత్తిగలవారు, వేషధారులై అతిథులుగా వచ్చినవారు. వీరందరినీ పలకరించరాదు. పాఖండులు వేదనిందకులు, వేదవిరుద్ధమైన ఆచరణ కలవారు. **వికర్మస్థులు=** మిథ్యాభాషణ ప్రముఖులు, పిల్లి పొంచి ఎలుకను పట్టి చంపి పొట్ట నింపుకొనునట్లుగా ప్రవర్తించే వారు బైడాలవ్రతధారులు. **శఠులు=** గూఢంగా అపకారం చేసేవారు, దురాగ్రహులు, దురభిమానులు అంటే వారికి తెలియదు, మరొకరు చెప్పినా విననివారు, **హైతుకులు=** కుతర్కం చేసేవారు, వాగుడు రాయుళ్ళు, తప్పుడు వేదాంతులు "నేను బ్రహ్మను, జగత్తు మిథ్య అని కోతలు కోసేవారు, **బకవృత్తి కలవారు=** కొంగ ఒక కాలు ఎత్తి పెట్టి ధ్యానం చేస్తున్నట్లు మౌనంగా ఉండి చేపకనపడగానే ముక్కుతో పొడిచి తినేట్లు నేడు బైరాగి వేషధారులు. ఇలాంటి వారికి వాగ్రూపంగా కూడా సత్కారం చేయరాదు. వారితో మాట్లాడకూడదు.

సత్కారానికి యోగ్యులు- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదవిద్యా వ్రతస్నాతాన్ శ్రోత్రియాన్ గృహమేధినః । మూలశ్లోక సం.**17**
పూజయేద్ధవ్యకవ్యేన విపరీతాంశ్చ వర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**31**

టీక:- **వేదవిద్యా వ్రతస్నాతాన్** = వేదవిద్వాంసులు, జ్ఞానులు, బ్రహ్మచర్యవ్రత పాలన చేసిన స్నాతకులైనవారిని, **శ్రోత్రియాన్ గృహమేధినః** = వేదజ్ఞులైన గృహస్థులను, **హవ్యకవ్యేన** = భోజన పదార్థాలతో, వస్త్రాదులతో, **పూజయేత్** = సత్కరించాలి, **విపరీతాన్ చ వర్జయేత్** = ఇందుకు విపరీతంగా ఉండేవారిని తిరస్కరించాలి.

తాత్పర్యం:- విద్యాస్నాతకుడు, వ్రతస్నాతకుడు, విద్యావ్రతస్నాతకుడు అనే మూడు రకాలైన శ్రోత్రియ బ్రాహ్మణులను గృహస్థు హవ్యకవ్యాలతో సత్కరించాలి. వేదములు, వ్రతములు బాగా తెలిసినవారని, ధర్మశాస్త్రప్రవర్తకులని, అధ్యాపనం మొదలైన బ్రాహ్మణాచార శ్రేష్ఠులని ఈ మూడు రకాలవారికి హవ్యకవ్యాలు ఇవ్వమన్నారు. ॥31॥

వివరణ:

హవ్యకవ్య శబ్దాల వివేచనం:-హవ్యకవ్య శబ్దాలు ఈ శబ్దాలకు వ్యాఖ్యాకారులు భ్రాంతిపూర్వక అర్థాలనిచ్చారు. నిమగ్నులయ్యారు. పౌరాణిక రూఢ్యర్థాల ప్రకారంగా వీటిని మృతక పితృశ్రాద్ధాలలో జమచేశారు. మనుస్మృతికారుడి అభిప్రాయంలో ఇది మృతకశ్రాద్ధాలకు సంబంధించినది కాదు. మృతకశ్రాద్ధాలను మనువు అంగీకరించలేదు. ఇక్కడ జీవిత విద్వాంసులకే హవ్యకవ్యాలతో సన్మానించమని ఆదేశం. ఇతర ప్రమాణాలకు, 3.81,82, 3.284వ శ్లోకాలను చూడగలరు.

క. **'హు దానాదానయోః'** (జుహో) ధాతువుకు **'యత్'** ప్రత్యయం చేర్చడం ద్వారా **'హవ్య'** శబ్దం సిద్ధమవుతుంది. ఇది యజ్ఞప్రసంగం. ఇక్కడ హవ్యానికి **హవీంషి=** ఆహుతులు (నిరు. 8.7) అని అర్థం. కానీ వ్యవహారంలో, **"హవ్యం = అత్తవ్యం ద్రవ్యమ్, "దాతవ్యం దానాదికం వా"** ధార్మిక విద్వాంసులకు [4.30.31]భోజన పదార్థాలను దానం చేయడమే **"హవ్యమ్"**.

ఖ. **'కవ్యమ్"** కవి ప్రాతిపదికకు **'సాధ్వర్థంలో లేదా హితార్థంలో "యత్"** చేర్చగా, **'కవ్య'** శబ్దం నిష్పన్నమవుతుంది. కవి శబ్దానికి క్రాంతదర్శీ (క్రాంత ద్రష్టయైన విద్వాంసుడని అర్థం.) (2.126)[2.151] వివరణ చూడగలరు. **"కవయః= క్రాంత ప్రజ్ఞాశ్చ విద్వాంసః తేభ్యో హితాని కర్మాణి కవ్యాని"** (యజు-2.29) **'కవ్యః = హితార్థం ప్రదత్తం ద్రవ్యం'** విద్వాంసుల హితం కోసం ఇచ్చే ధనం **"వస్త్రాదుల దానం"** కవ్యమనబడును.

గ. కాని ఎక్కడ 'హవ్య-కవ్య' రెండు శబ్దాలు జంటగా ప్రయోగించబడునో ఈ శబ్దాలకు సమన్వితమైన విస్తృతార్థం ఉంటుంది. విద్వాంసులకు దానంగా ఇచ్చే భోజనం, ఆచ్ఛాదనం, ఉపహారం మొ॥ సర్వపదార్థాల విధానం.

భిక్ష, బలివైశ్వ దేవముల విధానం ఇది మనుకృతం-ప్రామాణికం

శక్తితోఽపచమానేభ్యో దాతవ్యం గృహమేధినా । మూలశ్లోక సం.**18**
సంవిభాగశ్చ భూతేభ్యః కర్తవ్యోఽనుపరోధతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**32**

టీక:- గృహమేధినా = గృహస్థుడు, **శక్తితః అపచమానేభ్యః** = ఎవరు తమ చేతులతో స్వయంపాకం చేసికోరో, అలాంటి బ్రహ్మచారులకు, సన్న్యాసులకు, **దాతవ్యం** = అన్నాదులివ్వాలి, **చ** = మరియు, **అనుపరోధతః** = కుటుంబ సభ్యుల ఆచరణ పోషణలకు విఘాతం కలిగించకుండా, **భూతేభ్యః సం విభాగః కర్తవ్యః** = అసహాయులు, వికలాంగులైన మనుషులకు, కుక్కలు, పక్షులు మొ॥ వారికి భోజనంలో కొంత భాగాన్ని వేరుచేసి పెట్టాలి.

తాత్పర్యం:- వంట చేయకనే భోజనం సంపాదించే బ్రహ్మచారి, సన్న్యాసి మొదలైనవారికి, వారి ఉదర పోషణ నిమిత్తం గృహస్థే శక్తివంచన లేకుండా భిక్ష నివ్వాలి. అలాగే వృక్షాలు మొదలైన వాటికి నీరుపోసి తృప్తిపరచాలి. అసహాయులు, వికలాంగులైన మనుషులకు, కుక్కలు, పక్షులు మొ॥న వారికి భోజనంలో కొంతభాగాన్ని వేరుచేసి పెట్టాలి. ॥32॥

33,34వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* క్షుధావస్థలో రాజు నుండి ధన గ్రహణము-

* *రాజతో ధనమన్విచ్ఛేత్సంసీదన్ స్నాతకః క్షుధా ।*
యాజ్యాంతేవాసినోర్వాఽపి న త్వన్యత ఇతి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***33***

తాత్పర్యం:- స్వకర్మ నిరతుడు-వేదాధ్యయనపరుడు అయిన గృహస్థు తానే అన్నవస్త్రాలకు కటకటలాడుతున్నప్పుడు ధనం గ్రహించవలసి వస్తే క్షత్రియజాతిలో పుట్టిన రాజు దగ్గర నుంచి గాని, తనచేత యాగం చేయించుకున్నవారి వద్దనుంచి గాని, శిష్యుడైన వాని నుంచి గాని ధనాన్ని తీసుకోవచ్చు! అంతేగాని ఇతరులను అడగరాదు. వీరివల్ల కానప్పుడు సాటిద్విజుల నుంచి పొందడానికి వీలవుతుంది. అదీ అసాధ్యమైనప్పుడే చివరగా పరుల్ని అడగాలి.॥33॥

*　***న సీదేత్స్నాతకో విప్రః క్షుధా శక్తః కథంచన ।***
న జీర్ణమలవద్వాసా భవేచ్చ విభవే సతి ॥　　ప్రక్షిప్త శ్లోక సం. ***34***

తాత్పర్యం:- విద్యాస్నాతకుడు-విప్రుడు అయినవాడు వేదవిద్యాది యోగ్యతలుండీ, దానం తీసుకోగలిగీ మొదట చెప్పబడిన రాజు మొదలైనవారు అందుబాటులో ఉన్నప్పుడు ఆకలికి చిక్కిపోరాదు. జీర్ణవస్త్రధారణ చేయరాదు.॥34॥

ప్రక్షిప్తాల పరిశీలన

33-34 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు-

1. విషయ వ్యతిరేకాలు

ప్రస్తుత విషయానికి సంకేత మిచ్చే శ్లోకాలు 4.13,4.259. ఈ రెండిటిలో విషయ సంకేతం కింది పదాల ద్వారా స్పష్టమవుతుంది

ప్రారంభంలో- **'స్వర్గ - ఆయుష్య - యశస్యాని వ్రతాని ఇమాని ధారయేత్"** (4.13)

అంతంలో- **"స్నాతకవ్రతకల్పశ్చ సత్త్వవృద్ధికరః శుభః".** (4.259)

వీటి వల్ల ఈ అధ్యాయంలోని 13 నుంచి 259 వరకు గల శ్లోకాలలోని విషయం- "స్వర్గం- ఆయుస్సు- కీర్తి ఇచ్చేది సత్త్వగుణాన్ని పెంచే వ్రతాలు" అనేది. ఇప్పుడిక్కడి సత్త్వగుణం అనే దానికి ఏ లక్షణా లుండాలి? దీనికి సమాధానంగా మనువు చెప్పిన శ్లోకాన్నే తీసుకుందాం -

వేదాభ్యాసః తపోజ్ఞానం శౌచమింద్రియ నిగ్రహః ।
ధర్మక్రియాత్మచింతా చ సాత్త్వికం గుణ లక్షణం ॥　　(12.31)

అంటే వేదాభ్యాసం, తపస్సు, జ్ఞానం, శుద్ధి, ఇంద్రియాల అదుపు, ధార్మిక క్రియల నిర్వహణ, పరమాత్మ లేదా ఆత్మచింతనం - ఇవన్నీ సత్త్వగుణ లక్షణాలు అని. ధర్మక్రియా = ధర్మాచరణ, ధర్మ లక్షణాలు చెప్పే శ్లోకం ఇది -

ధృతిః క్షమా దమోఽస్తేయం శౌచమింద్రియ నిగ్రహః ।
ధీర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మ లక్షణం ॥　　(6.92)

మనువు 12.38లో సత్త్వగుణాన్ని మరింత స్పష్టంగా - **"సత్త్వస్య లక్షణం ధర్మః"** అని చెప్పాడు. అంటే - 'ధర్మమే సత్త్వగుణ లక్షణం' అని. ఇలా ఇప్పటి విషయానికి మనువు చెప్పిన ఈ శ్లోకాలనే ఆధారం చేసుకుని 'ధర్మక్రియా' అనే పదంలో మనువు చెప్పిన లక్షణాలను (12.31), అన్ని ధర్మాల లక్షణాలు [6.92], ధర్మాలు - సదాచారం [1.108], అహింస [6.52, 60; 4.170, 246], దానం [4.227] మొదలైనవి, ధార్మిక కార్యాలు, పంచమహాయజ్ఞాలు మొ॥ గ్రహించారు. వీటినే సత్త్వగుణాన్ని పెంచేవిగా చెప్పారు. ఈ ఆధారంతో 13 నుంచి 259 వరకు గల శ్లోకాలలో ఇటువంటి వర్ణన ఉన్న శ్లోకాలు విషయ సమ్మతంగా భావించబడతాయి. అంటే దృఢసంకల్పంతో చేసే వ్రతాలు మొదలైనవి స్వర్గం, ఆయువు, కీర్తి పెంచేవని భావిస్తారు. ఈ కోవకు చెందనివాటిని మనువు చెప్పిన విషయ సంకేతాలకు అనుకూలంగా లేవు. అందుచేత విషయవ్యతిరేకాలు. (1) 33-34 శ్లోకాలు 'సత్త్వగుణ వర్ధకాలు', 'వ్రతాల'తో ఎటువంటి సంబంధమూ లేనివి. కాబట్టి ఇవి విషయ వ్యతిరేకాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలు పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. 21వ శ్లోకంలో పంచ మహా యజ్ఞాల పద్ధతి చెప్పి, తర్వాతి శ్లోకాలలో వాటి విస్తృత వివరణ మొదలు పెట్టారు. దాన్ని అనుసరించి 32వ శ్లోకంలో వైశ్వదేవ యజ్ఞబలి గురించీ, 35లో స్వాధ్యాయం గురించీ ఉండటం వల్ల ఋషి యజ్ఞం లేదా బ్రహ్మయజ్ఞం గురించి ఉందని భావించాలి. ఈ పూర్వాపర యజ్ఞాల విషయంలో స్నాతకులకు ఆకలి వేసిన సమయంలో చేయవలసినవి చెప్పటం అసందర్భం. ఈ ఆధారం వల్ల ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజువవుతున్నాయి.

స్వాధ్యాయంలో తత్పరుడై ఉండాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

క్లృప్త కేశ నఖశ్మశ్రుర్దాంతశ్శుక్లాంబరశ్శుచిః । మూలశ్లోక సం. **19**
స్వాధ్యాయే చైవ యుక్తస్స్యాన్నిత్యమాత్మహితేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **35**

టీక:- క్ళృప్త-కేశ-నఖ-శ్మశ్రుః = గృహస్థుడు కేశాలను, గోళ్ళను, మీసాలను, క్షౌరం చేయించుకొని, **దాంతః** = సంయమిగా ఉంటూ, **శుక్లాంబర ధరః** = స్వచ్ఛమైన తెల్లబట్టలు కట్టుకొంటూ, **శుచిః** = పరిశుద్ధుడై, **చ** = మరియు, **నిత్యం స్వాధ్యాయే చ ఆత్మహితేషు యుక్తః స్యాత్** = ప్రతి దినం వేదాధ్యయనం చేస్తూ తన ఆత్మోన్నతికి ప్రయత్నం చేస్తూ ఉండాలి.

తాత్పర్యం:- విహితకాలరీత్యా బ్రాహ్మణుడు వెంట్రుకలు, మీసములు క్షౌరం చేయించుకుంటూ,గోళ్ళ, కత్తిరించుకుంటూ, తపోదీక్ష వల్ల కలిగే కష్టాలను ఓర్చుకుంటూ, తెల్లని వస్త్రాలు ధరిస్తూ వేదాధ్యయనం-ఔషధసేవలచేత దేహాన్ని పోషిస్తుండాలి. ॥35॥

36 నుండి 39వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* **దండకమండలాదుల ధారణ-**

* *వైణవీం ధారయేద్యష్టిం సోదకం చ కమండలుమ్ ।*
యజ్ఞోపవీతం వేదం చ శుభే రౌక్మే చ కుండలే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***36***

తాత్పర్యం:- చేతియందు వెదురు కర్ర, నీటితో నింపబడిన కమండలం, జందెం, పవిత్రం అనే దర్భముడి ఉంగరం, బంగారు కుండలాలు ధరించాలి.॥36॥

* *నేక్షేతోద్యంతమాదిత్యం నాస్తం యంతం కదాచన ।*
నోపసృష్టం న వారిస్థం న మధ్యం నభసో గతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***37***

తాత్పర్యం:- ఉదయిస్తూండగాను, అస్తమిస్తూండగాను, మిట్టమధ్యాహ్నంవేళ నడినెత్తికి వచ్చి ఉన్నప్పుడు, రాహువు మొదలైన గ్రహములచేత పీడితులై ఉండగా గ్రహణ సమయాల్లోను సూర్యుణ్ణి చూడరాదు. ॥37॥

* *న లంఘయేద్వత్సతంత్రీం న ప్రధావేచ్చ వర్షతి*
న చోదకే నిరీక్షేత స్వం రూపమితి ధారణా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***38***

తాత్పర్యం:- దూడను కట్టిన తాడును దాటకూడదు. మేఘాలు వర్షిస్తూ ఉన్నప్పుడు పరుగు తీయరాదు. నీటిలో ప్రతిఫలించిన తన నీడను తానే చూసుకోరాదు. అంటే నీటిని అద్దంలాగా ఉపయోగించరాదు.॥38॥

* *మృదం గాం దైవతం విప్రం ఘృతం మధు చతుష్పథమ్ ।*
ప్రదక్షిణాని కుర్వీత ప్రజ్ఞాతాంశ్చ వనస్పతీన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***39***

తాత్పర్యం:- ప్రయాణం చేసేటప్పుడు గోవులను, మిట్టగా వున్న మట్టి దిబ్బను, అస్పష్టరూపురేఖలు కలిగి ఉన్నప్పటికీ దేవతా శిలలను, బ్రాహ్మణులను, నేతికుండ, తేనెకుండ, నాలుగుదార్లు కలిసేచోట ఉండే మర్రి/రావి వంటి మహావృక్షాలను మరియు పూజనీయ వస్తువులను కుడి వైపున ఉంచుతూ ప్రదక్షిణగా వెళ్లాలి కాని, నిర్లక్ష్యంగా పోకూడదు.॥39॥

ప్రక్షిప్తాల పరిశీలన

36 నుంచి 39 శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. విషయ వ్యతిరేకాలు

ఈ అన్ని శ్లోకాలూ విషయానికి దూరమైనవే. వీటికి 'సత్త్వగుణ వర్ధనం'తో ఎటువంటి సంబంధమూ లేదు, ఇవి ఎటువంటి వ్రతాలూ కావు. కనుక విషయ వ్యతిరేకాలు అనే ఆధారంతో ఇవి ప్రక్షిప్తాలు (విస్తృత విషయాల కోసం 4.33, 34లలో 'విషయ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి).

2. అంతర్ వ్యతిరేకాలు

క. 2.20[45] లో కొన్ని వర్ణాలవారికి కొన్ని వృక్షాల నుంచి తయారైన దండాలు చెప్పారు. 36లో వెదురు దండం చేసే పద్ధతి చెప్పటం పై దానికి భిన్నం కాబట్టి వ్యతిరేకం.

ఖ. 2.23[48], 76[102] శ్లోకాలలో సూర్యదర్శన విధానం, కథనం ఉన్నాయి. 37లోని సూర్యదర్శన నిషేధం దానికి వ్యతిరేకం.

3. శైలీగత ఆధారాలు

37-39శ్లోకాలలో శైలి రూఢమూ, సహేతుకం కానిదిగా ఉంది. ఇందులో చెప్పిన వాటికి ఒక కారణమూ లేదు, వీటిలో తెలివి గల ఆధారమూ లేదు. 39లో చెప్పినవి వ్యావహారికంగా జరిగే విషయాలే కావు !

40 నుండి 42వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

రజస్వలాగమన నిషేధం, దానివల్ల హాని-

నోపగచ్ఛేత్ప్రమత్తోఽపి స్త్రియమార్తవదర్శనే । మూలశ్లోక సం.**19**
సమానశయనే చైవ న శయీత తయా సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**40**

టీక:- **ప్రమత: + అపి** = కామాతురుడైనా, **ఆర్తవ దర్శనే** = రజోదర్శనకాలంలో (మాసిక ధర్మ దినాలలో), **స్త్రియం +న+ఉపగచ్ఛేత్** = స్త్రీతో సంభోగం చేయరాదు, **చ** = మరియు, **తయా సహ సమాన శయనే న శయీత** = ఆమెతో ఒకే పక్కలో పడుకోరాదు (నిద్రించరాదు).

తాత్పర్యం:- ఎంతగా కామంచేత పీడించబడుతూన్నప్పటికీ, సొంతభార్యే అయినా బహిష్టయిన స్త్రీని సంగమించకూడదు. అంతేకాదు!....అలాంటి స్త్రీతో ఒకేమంచం మీద పరుండినా దోషమే.॥40॥

ఇది మనుకృతం-ప్రామాణికం

రజసాభిప్లుతాం నారీం నరస్య హ్యుపగచ్ఛతః । మూలశ్లోక సం.**21**
ప్రజ్ఞా తేజో బలం చక్షురాయుశ్చైవ ప్రహీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**41**

టీక:- **హి** = ఎందుకంటే, **రజసా+అభిప్లుతాం నారీం** = రజస్వలయైన స్త్రీతో, **ఉపగచ్ఛతః నరస్య** = సంభోగం చేసే పురుషుడికి, **ప్రజ్ఞా తేజః బలం చక్షుః చ ఆయుః ఏవ ప్రహీయతే** = బుద్ధిబలం, తేజస్సు, వీర్యం, దృష్టి-చూపు, ఆయుష్షు ఇవన్నీ తగ్గిపోతాయి.

తాత్పర్యం:- ముట్టుతో ఉన్న స్త్రీతో ఎవరైతే సంగమిస్తారో, అలాంటివారి బుద్ధి, వీర్యం, బలం, దృష్టి, ఆయుష్షు, తేజస్సు నశిస్తాయి.॥41॥

రజస్వలకాలంలో సంగమం చేయకపోవడం వల్ల లాభాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

తాం వివర్జయత స్తస్య రజసా సమభిప్లుతామ్ । మూలశ్లోక సం. **22**
ప్రజ్ఞా తేజో బలం చక్షురాయుశ్చైవ ప్రవర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **42**

టీక:- రజసా అభిప్లుతామ్ తాం వివర్జయతః = రజస్వలయైన స్త్రీతో సంభోగం చేయని, తస్య = వాడికి, ప్రజ్ఞా తేజః బలం చక్షుః చ ఆయుః ఏవ ప్రవర్ధతే = బుద్ధిబలం, తేజస్సు, నేత్రజ్యోతి, ఆయుష్షు అన్నీ అభివృద్ధి చెందుతాయి.

తాత్పర్యం:- ఇలాంటి స్త్రీని పొందక, కామాన్ని అదుపులో ఉంచుకొన్నవారికి బుద్ధి, వీర్యం, బలం, దృష్టి, ఆయుష్షు తేజస్సు వృద్ధి అవుతాయి.॥42॥

43 నుండి 66వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** స్త్రీని ఏ అవస్థలలో చూడరాదు-**

* *నాశ్నీయాద్భార్యయా సార్ధం నైనామీక్షేత చాశ్నతీమ్ ।*
క్షువతీం జృంభమాణాం వా న చాసీనాం యథాసుఖమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***43***

తాత్పర్యం:- భార్యే అయినా సరే-ఇద్దరూ ఒకేపాత్రలో ఒకేసారిగా తినకూడదు. భార్య భోజనం చేస్తుండగా గాని, తుమ్ముతుండగా గాని, ఆవులిస్తుండగా గాని, కాళ్లు చాచుకొని కూర్చోగా గాని భర్త చూడరాదు.॥43॥

* *నాంజయంతీం స్వకే నేత్రే న చాభ్యక్తామనావృతామ్ ।*
న పశ్యేత్ ప్రసవంతీం చ తేజస్కామో ద్విజోత్తమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***44***

తాత్పర్యం:- ఇంకా.....కళ్లకు కాటుక అద్దుకొంటున్నప్పుడు, తలంటుస్నానం చేస్తున్నప్పుడు, పైటలేకుండా ఉన్నప్పుడు, ప్రసవిస్తూ ఉన్నప్పుడు తన భార్యనే అయినా తేజోకామి అయిన భర్త చూడకూడదు. వీటిలో కొన్ని కామాన్ని, కొన్ని వైరాగ్యాన్ని కలిగిస్తాయి. ॥44॥

*** మలమూత్రాది విసర్జనలో విడువదగిన విషయాలు-**

* *నాన్నమద్యాదేకవాసా న నగ్నస్స్నానమాచరేత్ ।*
న మూత్రం పథి కుర్వీత న భస్మని న గోవ్రజే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***45***

తాత్పర్యం:- గృహస్థుడు ఎన్నడూ ఒకేఒక్క బట్టతో భోజనానికి కూర్చోరాదు. భుజం మీద కండువా/ తుండు ఉండితీరాలి. నగ్నంగా స్నానం చేయకూడదు. నడిచే దారిలో గాని, ఆవులమంద ఉండే ప్రదేశంలో గాని, బూడిదలో గాని మలమూత్ర విసర్జన చేయకూడదు.॥45॥

* *న ఫాలకృష్టే న జలే న చిత్యాం న చ పర్వతే ।*
న జీర్ణదేవాయతనే న వల్మీకే కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***46***

తాత్పర్యం:- నాగలితో దున్నిన నేల, నీరు, అగ్నిహోత్రం కోసం ఇటుకలు పరచబడి ఉన్న ప్రదేశం, పర్వతాలు, పెద్దపెద్ద పుట్టలు, పాడుబడిన ఏకాంత ప్రదేశాలలో/ నిర్జనసంచార స్థలాల్లో ఉన్న దేవాలయాల్లో సైతం మలమూత్రవిసర్జన కూడదు.॥46॥

* *న ససత్త్వేషు గర్తేషు న గచ్ఛన్నాపి చ స్థితః ।*
న నదీతీరమాసాద్య న చ పర్వతమస్తకే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***47***

తాత్పర్యం:- జంతువులు నివశించే కలుగులు, బొరియలు మొదలైనవాటిలో గాని, నడుస్తూగాని, నిలబడిగాని, పరుగులిడుతూ గాని, నదీతీరాలందు గాని మలమూత్ర విసర్జన నిషేధం.॥47॥

* *వాయ్వగ్నివిప్రామాదిత్యమపః పశ్యంస్తథైవ గాః ।*
న కదాచన కుర్వీత విణ్మూత్రస్య విసర్జనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***48***

తాత్పర్యం:- వాయువు అధికంగా వీస్తుండగా దానికెదురుగా గాని; సూర్యుడికి, అగ్నికి, బ్రాహ్మణుడికి ఎదురుగా గాని; లేదా వీరిని చూస్తూ గాని; నీటిని, గోవులను చూస్తూ గాని; మలమూత్రాలు విసర్జించకూడదు.॥48॥

* *తిరస్కృత్యోచ్చరేత్కాష్ఠలోష్ఠపత్రతృణాదినా ।*
నియమ్య ప్రయతో వాచం సంవీతాంగోఽవగుంఠితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***49***

తాత్పర్యం:- కొయ్య, గడ్డి, ఆకులు, మట్టిపెళ్లలు మొదలైన చెత్తపదార్థాలు నేలపై వేసి మౌనంగా తలవంచుకొని, తలపై ముసుగు ధరించి మరీ మల మూత్రాలు విసర్జించాలి.॥49॥

* *మూత్రోచ్చారసముత్సర్గం దివా కుర్యాదుదఙ్ముఖః ।*
దక్షిణాభిముఖో రాత్రౌ సంధ్యయోశ్చ తథా దివా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***50***

తాత్పర్యం:- మలమూత్రాదులు విసర్జించేటప్పుడు ముఖాన్ని ఏ దిక్కుగా ఉంచాలన్నదీ ధర్మశాస్త్రం నిర్దేశించింది. పగటిపూట ఉత్తరదిక్కుకు, రాత్రి పూట దక్షిణదిక్కుకు, సంధ్యవేళ కూడ ఉత్తరం దిక్కుగా ముఖంపెట్టి కూర్చోవాలి.॥50॥

* *ఛాయాయామంధకారే వా రాత్రావహని వా ద్విజః ।*
యథాసుఖముఖః కుర్యాత్ప్రాణబాధాదభయేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***51***

తాత్పర్యం:- కొన్నిటియందు విధిగా నిషేధం ఎందుకు పాటించాలంటే, అందుకు కారణం చెప్పబడుతోంది. అగ్నికి, సూర్యుడికి, చంద్రుడికి, నీటికి, బ్రాహ్మణ,గోవు, వాయువులకు ఎదుట మలమూత్రాదుల విసర్జన ప్రజ్ఞను నశింపచేస్తుంది. దీనికీ శ్లోకమే ప్రమాణం-॥51॥

* *ప్రత్యగ్నిం ప్రతిసూర్యం చ ప్రతి సోమోదకద్విజాన్ ।*
ప్రతి గాం ప్రతి వాతం చ ప్రజ్ఞా నశ్యతి మేహతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***52***

తాత్పర్యం:- కనుకనే-నిషేధాలు విధించారు. అయినప్పటికీ..... రాత్రులయందు, చీకటిలోను, పగలైనప్పుడు నీడగా ఉండే ప్రదేశాల్లోను, మంచుకమ్మి ఉన్నప్పుడు, క్రూరజంతువులు-దొంగలు తరుముకొని వచ్చేటప్పుడు ఆపద్ధర్మంగా ప్రాణభయమున్నప్పుడు తన ఇష్టము వచ్చిన దిక్కుకు ముఖం పెట్టి మలమూత్ర విసర్జన చేయవచ్చు.॥52॥

*** వివిధ త్యాజ్య విషయాలు-**

* *నాగ్నిం ముఖేనోపధమేన్నగ్నాం నేక్షేత చ స్త్రియమ్ ।*
నామేధ్యం ప్రక్షిపేదగ్నౌ న చ పాదౌ ప్రతాపయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***53***

తాత్పర్యం:- నిప్పును నోటితో ఎప్పుడూ ఊదరాదు. విసనకర్రతోనో, గొట్టం ఊదడం ద్వారా వచ్చే గాలితోనో ప్రజ్వలింప చేయాలి. ఒంటిమీద నూలు పోగైనాలేని స్త్రీని ఆ స్థితిలో చూడరాదు. మానవ మలమూత్రాలను తెలిసి గాని, తెలీకగాని అగ్నిలో వేయరాదు. అగ్నికి ఎదురుగా కాళ్లు ఉంచరాదు.॥53॥

* *అధస్తాన్నోపదధ్యాచ్చ న చైనమభిలంఘయేత్ ।*
న చైనం పాదతః కుర్యాన్న ప్రాణాబాధ మాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***54***

తాత్పర్యం:- మంచం కింద కుంపటిలాంటివి వెచ్చదనం కోసం పెట్టరాదు. అగ్నిని దాటి వెళ్లకూడదు. నిద్రించేటప్పుడు కాళ్లవైపు నిప్పు ఉండకుండా జాగ్రత్తపడాలి. ఇతరులకు ప్రాణహానిని, హింసను కలిగించే పనులెన్నడూ తలపెట్టరాదు.॥54॥

* *నాశ్నీయాత్సంధివేలాయాం న గచ్ఛేన్నాపి సంవిశేత్ ।*
నచైవ ప్రలిఖేద్భూమిం నాత్మనోపహ రేత్స్రజమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***55***

తాత్పర్యం:- సంధ్యాకాలంలో భుజించరాదు, గ్రామాంతరానికి వెళ్లరాదు. నిద్రించడం పాపం. నేలమీద ఊరకే గీతలు గీయరాదు. జడలో తాను ధరించిన పూలదండను తానే తీసేయరాదు. ఇతరుల సహాయం తీసుకోవాలి.॥55॥

* *నాప్సు మూత్రం పురీషం వా ష్ఠీవనం వా సముత్సృజేత్ ।*
అమేధ్యలిప్తమన్యద్వా లోహితం వా విషాణి వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***56***

తాత్పర్యం:- నీటియందు ఉమ్మివేయడం గాని, మూత్రపురీషాదులు విసర్జించడం గాని చేయకూడదు. రక్తంగాని, విషపదార్థాలుగాని, మైలవస్త్రాలు గాని చిరకాలం ఉంచరాదు.॥56॥

* *నైకస్స్వపేచ్ఛూన్యగేహే శయానం న ప్రబోధయేత్ ।*
నోదక్యయాఽభిభాషేత యజ్ఞం గచ్ఛేన్న చావృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***57***

తాత్పర్యం:- పాడుబడిన ఇళ్లలో ఒంటరిగా గాని, కాపురం గాని ఉండరాదు. ధనం లోను, విద్యలోను తనకంటే అధికుడైనవాడు నిద్రిస్తూంటే అతణ్ణి నిద్రనుండి లేపకూడదు. బహిష్టు అయిన స్త్రీతో మాట్లాడరాదు. యాగానికి పిలుపులేకుండా వెళ్లకూడదు.॥57॥

* *అగ్న్యాగారే గవాం గోష్ఠే బ్రాహ్మణానాం చ సన్నిధౌ ।*
స్వాధ్యాయే భోజనే చైవ దక్షిణం పాణిముద్ధరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***58***

తాత్పర్యం:- యజ్ఞం జరిగేప్రదేశం, పశువుల శాల, బ్రాహ్మణుల సన్నిధి, వేదాధ్యయనం జరిగే ప్రదేశం, భోజనాల వేళ కుడిచేతిని ఉత్తరీయానికి వెలుపల ఉండేలా చూసుకోవాలి.॥58॥

* *న వారయేద్గాం ధయంతీం న చాచక్షీత కస్యచిత్ ।*
న దివీంద్రాయుధం దృష్ట్వా కస్యచిద్దర్శయేద్బుధః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***59***

తాత్పర్యం:- కొన్నిటిని చూసీ చూడనట్లుగా వదిలేయాలి. నీరు తాగుతున్న ఆవును, పాలుతాగుతున్న దూడను చూడకూడదు. పాలు తాగుతున్న దూడను నివారించకూడదు. ఇతరుల దూడలు పాలుతాగుతున్నప్పుడు వారికి చెప్పకూడదు. అలాగే ఇంద్ర ధనస్సును ఆకాశంలో చూచి దాన్ని ఇతరులకు చూపించరాదు.॥59॥

* *నాధార్మికే వసేద్గ్రామే న వ్యాధిబహులే భృశమ్ ।*
నైకః ప్రపద్యేతాధ్వానం న చిరం పర్వతే వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***60***

తాత్పర్యం:- ధార్మికత లోపించిన గ్రామంలోనూ, వ్యాధులు మిక్కుటంగా ఉండే గ్రామంలోనూ నివసించరాదు. దారిలోన ఒంటరిగా నడవరాదు. కొండలపైన అధిక సమయం గడపరాదు.॥60॥

*   న శూద్రరాజ్యే నివసేన్నాధార్మికజనావృతే ।
న పాఖండిగణాక్రాంతే నోపసృష్టేఽంత్యజైర్నృభిః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **61**

తాత్పర్యం:- శూద్రుడు రాజ్యం చేసే చోట ఉండరాదు. ధర్మపరులైన వారు ఒకరిద్దరే ఉన్న గ్రామంలో నివశించరాదు. వేదబాహ్యులు, పాషండులు, చండాలురు, కపటవేషధారులు అధికంగా ఉండే గ్రామంలో నివాసం పనికిరాదు.॥61॥

*   న భుంజీతోద్ధృతస్నేహం నాతిసౌహిత్యమాచరేత్ ।
నాతిప్రగే నాతిసాయం న సాయం ప్రాతరాశితః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **62**

తాత్పర్యం:- నూనెను పిండేసిన గానుగ పట్టేసిన తరవాత మిగిలిన తెలకపిండిని తినకూడదు. పీకలదాకా తిండి పనికిరాదు. బాగా ప్రాతఃకాలం వేళగాని, అసుర సంధ్యవేళకాని తినరాదు. ఉదయం గాని, మధ్యాహ్నం గాని కడుపారా భుజిస్తే రాత్రికి తినకపోవడం మంచిది.॥62॥

*   న కుర్వీత వృధాచేష్టాం చ వార్యంజలినా పిబేత్ ।
నోత్సంగే భక్షయేద్భక్ష్యాన్న జాతు స్యాత్కుతూహలీ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **63**

తాత్పర్యం:- ఇహపరాలలో దేనికీ ప్రయోజనం లేని పనులు చేయరాదు. దోసిలితో నీటిని తాగకూడదు. తొడమీద ఉంచుకొని ఎలాంటి భక్ష్యపదార్థాలను తినకూడదు. ఉపయోగం లేని విషయాలను గురించి తెలుసుకోరాదు.॥63॥

*   న నృత్యేదథవా గాయేన్న వాదిత్రాణి వాదయేత్ ।
నాస్ఫోటయేన్న చ క్ష్వేదేన్న చ రక్తో విరావయేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **64**

తాత్పర్యం:- శాస్త్రవిరుద్ధంగా నృత్యం చేయదానికి తగదు. గానం చేయరాదు. వాద్యాలను వాయించరాదు. ఎంత మైత్రి ఉన్నప్పటికీ భుజంపై తట్టకూడదు. (స్త్రీల విషయమై ఇది ఇంకా నిషేధం). పండ్లు కన్పించేలా దగ్గరాదు. వివిధ జంతువుల అరుపులను అనుకరించరాదు.॥64॥

*   న పాదౌ ధావయేత్కాంస్యే కదాచిదపి భాజనే ।
న భిన్నభాండే భుంజీత న భావప్రతిదూషితే ॥   ప్రక్షిప్త శ్లోక సం. **65**

తాత్పర్యం:- కంచుపాత్రలోని నీటితో కాళ్లు కడుక్కోరాదు. పగిలినవి, మనస్సుకు ఇంపుగాలేనివీ అయిన పాత్రలలో భుజించకూడదు. అలాంటి పాత్రలు వంటకు సైతం వాడకూడదు.॥65॥

*   ఉపానహౌ న వాసశ్చ ధృతమన్యైర్న ధారయేత్ ।
ఉపవీతమలంకారం స్రజం కరక మేవ చ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **66**

తాత్పర్యం:- ఇతరులు ఉపయోగించిన పాదరక్షలు, పాదుకలు వాడకూడదు. వస్త్రములు కూడా అంతే. ఇంకా ఇతరులు వాడినవీ, తమ ఉపయోగానికి వర్తించనివీ మరికొన్ని ఉన్నాయి. అవి: యజ్ఞోపవీతం, ఆభరణాలు, పూలదండలు, కమండలం మొదలైనవి.॥66॥

ప్రక్షిప్తాల పరిశీలన

43 నుండి 66 వరకు గల శ్లోకాలు ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలని రుజువవుతుంది-

1. విషయ వ్యతిరేకాలు

45 నుంచి 66 వరకు ఉన్న శ్లోకాలు విషయానికి దూరంగా ఉన్నాయి. ఇవి వ్రతానికి సంబంధించినవీ కావు, వీటికి 'సత్త్వగుణ వర్ధకం'తో ఎటువంటి సంబంధమూ లేదు. అందుచేత ప్రక్షిప్తాలు. [విస్తృత విశ్లేషణకు 4-33,34శ్లోకాలకు ఉన్న 'విషయ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి].

2. అంతర్ వ్యతిరేకాలు

క. 43వ శ్లోకంలో భార్యతో కలిసి భుజించడం నిషేధించబడింది. కానీ 3.113లో కలిసి భుజించే పద్ధతి ఉంది.

ఖ. 43-44 శ్లోకాలలో భార్యను వేర్వేరు పరిస్థితులలో చూడరాదనే నిషేధం ఉంది. ఏ స్త్రీతో ఎల్లప్పుడూ కలిసే ఉండాలో, అవి జరిగేవి కావు కనుక, ఆమెతో ఇటువంటి సాధారణ విషయాల నిషేధం వ్యతిరేకమవుతుంది.

గ. 55 నుంచి 62 శ్లోకాలలో సంధ్యాసమయాలలో తినటం నిషేధమని ఉంది. కానీ పంచ మహాయజ్ఞాలు సంధ్యలలోనే జరుగుతాయి. వాటి తర్వాత భోజనం చేయవచ్చునని మనువు చెప్పాడు [3.116].

ఘ. మనువు కర్మణా వ్యవస్థనే చెప్పాడు కనుక, 61వ శ్లోకంలోని 'శూద్రరాజు' విషయం మనువు వ్యవస్థతో పొంతన లేకుండా ఉంది. శూద్రుడైనవాడు రాజు కాకపోతే, రాజైనవాడు వర్ణ వ్యవస్థను అనుసరించి క్షత్రియుడవుతాడు [1.87-91].

3. శైలీగత ఆధారాలు

బహుశా పై శ్లోకాల శైలీ సహేతుకం కానిదిగా కనిపిస్తుంది. వీటిలో దేనికీ కారణాలు చెప్పలేదు. చెప్పిన చోట్ల సహేతుక సంబంధమేదీ లేదు. మనువు శైలి రూఢమూ, నిర్హేతుకమూ కాదు.

67,68 శ్లోకాలు మనుకృతం- ఇవి ప్రామాణికం

ఏ పశువులపై సవారి చేయాలి- చేయకూడదు?-

నావినీతైర్వ్రజేద్ధుర్యైర్న చ క్షుద్వ్యాధిపీడితైః । మూలశ్లోక సం.**23**
న భిన్నశృఙ్గాక్షిఖురైర్న వాలాధివిరూపితైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**67**

టీక:- **అవినీతైః** = బండికి అలవాటు కాని కోడెలు, **క్షుత్-వ్యాధి పీడితైః** = ఆకలితో రోగంతో పీడితులైన, **భిన్న-శృఙ్గ-అక్షి-ఖురైః** = కొమ్ములు విరిగినవి, గుడ్డివి, గిట్టలు విరిగినవి, **వాల+అధి విరూపితైః** = తోకలు తెగిన, లేదా గాయపడిన ఎద్దులను, **ధుర్యైః న వ్రజేత్** = అలాంటి గుర్రాలను గాని, పశువులను గాని కట్టిన బండిలో ప్రయాణించరాదు. అలాంటి గుర్రాల మీద స్వారి చేయరాదు.

తాత్పర్యం:- తుంటరివీ, కొమ్ములు విరిగినవీ, గుడ్డివీ, తోకల్లేనివీ, గిట్టలు బాగా చీలిక ఉన్నవీ, ఆకలి, రోగం గలవీ అయిన ఎద్దులను పూన్చి అలాంటి బండిలో ఎన్నడూ ప్రయాణించకూడదు.॥67॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వినీతైస్తు వ్రజేన్నిత్యమాశుగైర్లక్షణాన్వితైః । మూలశ్లోక సం.**24**
వర్ణరూపోపసంపన్నైః ప్రతోదేనాతుదన్ భృశమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**68**

టీక:- **వినీతైః** = అలవాటుపడిన, **లక్షణ+అన్వితైః** = సుందరలక్షణయుక్తములు, **వర్ణ రూప ఉపసంపన్నైః** = సుందరమైన రంగు-రూపం కలిగిన, **ఆశుగైః** = శీఘ్రగామి పశువులతో కట్టిన బండ్లలో, **ప్రతోదేన భృశమ్ అతుదన్** = ముల్లు కర్రతో గాని, చంద్రకోలతో గాని అధికంగా బాధనివ్వకుండా, **వ్రజేత్** = ప్రయాణం చేయాలి.

తాత్పర్యం:- మచ్చిక అయినవి, వేగంగా నడిచేవి, శుభలక్షణాలు కలిగినవి, మంచి వన్నె, చక్కని రూపం గల ఎద్దులను కట్టిన బండిలో ముల్లుగర్ర/కొరడా అతిగా అదిలించక ప్రయాణం చేయాలి.॥68॥

69-78వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* బాలసూర్యాదుల దర్శన నిషేధం-

* *బాలాతపః ప్రేతధూమో వర్జ్యం భిన్నం తథాసనమ్ ।*
న ఛింద్యాన్నఖలోమాని దంతైర్నోత్పాటయేన్నఖాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***69***

తాత్పర్యం:- లేత ఎండ కాస్తున్నప్పుడు అందులో కూర్చోరాదు. పగిలిన పీట/చెక్క ఆసనంగా వాడరాదు. శవధూమం తగలకుండా చూసుకోవాలి. గోళ్లను దంతాలతో కొరికి తీయరాదు.॥69॥

* *న మృల్లోష్ఠం చ మృద్నీయాన్న ఛింద్యాత్కరజైస్తృణమ్ ।*
న కర్మనిష్ఫలం కుర్యాన్నాయత్యామసుఖోదయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***70***

తాత్పర్యం:- అకారణగా మట్టిపెళ్లలను చిదమకూడదు. గోళ్లతో గడ్డిని తుంచకూడదు. ప్రయోజనం లేని పనేదీ చేయరాదు. చివరికి కష్టాలు కలిగించే పనులను కూడా (యోచించినప్పుడు) వదిలివేయాలి. ॥70॥

* *లోష్ఠమర్దీ తృణచ్ఛేదీ నఖఖాదీ చ యో నరః ।*
స వినాశం వ్రజత్యాశు సూచకోఽశుచిరేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***71***

తాత్పర్యం:- పైన చెప్పబడిన అకారణ వృథా పనులు చేసేవాడు; మట్టిపెడ్డలను అకారణంగా నలగగొట్టేవాడు, గడ్డిని త్రుంచేవాడు, గోళ్ళు కొరికేవాడు, కల్లబొల్లి మాటలు చెప్పేవాడు, బాహ్యాంభ్యంతరశుచి లేనివాడు వెంటనే నశిస్తాడు.॥71॥

* *న విగర్హ్యకథాం కుర్యాద్బహిర్మాల్యం న ధారయేత్ ।*
గవాం చ యానం పృష్ఠేన సర్వథైవ విగర్హితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***72***

తాత్పర్యం:- లౌకిక విషయాలుగాని, శాస్త్రవిషయాలను గాని తనకే తెలిసినట్లు చెప్పరాదు. జుట్టునే కప్పేంత వెగటుగా పూలదండలు ధరించకూడదు. గోవుపై స్వారీ నిషేధం. వాటిని బండ్లకు కట్టవచ్చును.॥72॥

* *అద్వారేణ చ నాతీయాద్గ్రామం వా వేశ్మ వా వృతమ్ ।*
రాత్రౌ చ వృక్షమూలాని దూరతః పరివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***73***

తాత్పర్యం:- నలువైపులా ప్రహరీ గాని, ప్రాకారం గాని ఉన్నట్లయితే-అలాంటి ఇంట్లో గాని, గ్రామంలో గాని గోడలెక్కి ప్రవేశించరాదు. రాత్రిపూట చెట్టుకింద ఉండరాదు.॥73॥

* *నాక్షైః క్రీడేత్కదాచిత్తు స్వయం నోపానహౌ హరేత్ ।*
శయనస్థో న భుంజీత న పాణిస్థం న చాసనే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***74***

తాత్పర్యం:- వేడుకకోసమైనా పాచికలాట ఆడరాదు. కాలిచెప్పులను చేత్తో పుచ్చుకొని నడవకూడదు. పాన్పుపై కూర్చొని తినకూడదు. అలాగే ఆసనం మీద కూర్చొని కూడా భుజించరాదు. చేతిలోని ముద్దని కొద్దికొద్దిగా తినరాదు.॥74॥

*　సర్వం చ తిలసంబద్ధం నాద్యాద స్తమితే రవౌ ।
న చ నగ్నశ్శయీతేహ న చోచ్ఛిష్టః క్వచిద్వ్రజేత్ ॥　ప్రక్షిప్త శ్లోక సం. 75

తాత్పర్యం:- సూర్యుడస్తమించాక నువ్వులు చేర్చిన పదార్థాలు తినరాదు. నగ్నదేహంతో నిద్రపోరాదు. మొలవరకు గోచీ అయినా ధరించీ నిద్రించాలి. ఎంగిలి చెయ్యి కడక్కుండా అక్కడ్నుంచి లేవరాదు. బైటకు పోరాదు.॥75॥

*　ఆర్ద్రపాదస్తు భుంజీత నార్ద్రపాదస్తు సంవిశేత్ ।
ఆర్ద్రపాదస్తు భుంజానో దీర్ఘమాయురవాప్నుయాత్ ॥　ప్రక్షిప్త శ్లోక సం. 76

తాత్పర్యం:- కాళ్లు కడుక్కోనిదే భోజనానికి కూర్చోరాదు. తడికాళ్లతో శయనించరాదు. కాని, కాళ్లు కడుక్కొని పాదాల తడి ఆరేలోగా భుజించేవారికి దీర్ఘాయువు కలుగుతుందని శాస్త్రం.॥76॥

*　అచక్షుర్విషయం దుర్గం న ప్రపద్యేత కర్హిచిత్ ।
న విణ్మూత్రముదీక్షేత న బాహుభ్యాం నదీం తరేత్ ॥　ప్రక్షిప్త శ్లోక సం. 77

తాత్పర్యం:- దట్టమైన చీకట్లతో నిండిన కీకారణ్యాలలోనికి ఎన్నడూ చొరబడకూడదు. అలాంటి అరణ్యాలలో మూత్రపురీషాదులువిడవరాదు. బాహువులతో ఈది నదిని దాటకూడదు (ఆవలి ఒడ్డుకు చేరడానికి నావను ఉపయోగించాలని సూచన.).॥77॥

*　అధితిష్ఠేన్న కేశాంస్తు న భస్మాస్థికపాలికాః ।
న కార్పాసాస్థి న తుషాన్ దీర్ఘమాయుర్జిజీవిషుః ॥　ప్రక్షిప్త శ్లోక సం. 78

తాత్పర్యం:- ఎక్కువకాలం బ్రతకాలనుకొనేవారు వెంట్రుకలు, ఊక, ఎముకలు, బూడిద, చిల్లపెంకులు, దూది, పుర్రెలు....వీటిమీద పొరపాటుగానయినా నివశించరాదు. (అంటే-ఇవి ఉన్న ప్రదేశాల్లో కూడ ఉండరాదని అర్థం).॥78॥

ప్రక్షిప్తాల పరిశీలన

69 నుంచి 78 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. విషయ వ్యతిరేకాలు

ఇవన్నీ విషయ సంబంధ శ్లోకాలు కావు. వీటిలో చెప్పినవి వ్రతాలూ కావు, 'సత్త్వగుణ వర్ధకాల'తో వీటికి ఎటువంటీ పొంతనా లేదు. ఈ ఆధారంతో ఇవి ప్రక్షిప్తాలు [వివరణకు 33-34 శ్లోకాల సమీక్ష చూడండి].

2. అంతర్ వ్యతిరేకాలు

క.　69వ శ్లోకంలో ఉదయపు ఎండలో ఉండడం నిషేధం అని ఉంది. కానీ 2.23[48], 76[109] లలో ప్రాతఃకాలీన సూర్యదర్శనం మొదలైనవి చెప్పారు.

ఖ.　69వ శ్లోకంలో గోళ్లు కత్తిరించడం నిషేధం అని ఉంది. కానీ 4.35వ శ్లోకంలో గోళ్లు కత్తిరించుకుని వేళ్లను శుభ్రంగా ఉంచుకునే పద్ధతి ఉంది.

గ.　76లో కాళ్లు కడుక్కుని భోజనం చేయాలని ఉంది. 2.28లో[53] వట్టి ఆచమనం చేసి తినవచ్చునని ఉంది.

3. పునరుక్తులు

75వ శ్లోకంలోని నాలుగవ పాదం, 2.31 [56] వ శ్లోకంలోని నాలుగవ పాదాన్ని పోలి ఉంది. అంటే ఆ నాలుగవ పాదాన్ని 75వ శ్లోకపు నాలుగవ పాదంగా పునరుక్తిగా చెప్పారు- "న చోచ్ఛిష్టః క్వచిత్ వ్రజేత్." ఇది అనవసరమూ, మౌలికం కానిదీ.

4. శైలీగత ఆధారాలు

69,70,72,73,75,78 శ్లోకాలలోని శైలి ప్రాచీనశైలి వలె కనిపిస్తుంది. 71,73ల లోని శైలి నిర్హేతుకము, అతిశయోక్తులతో కూడినది.

ఇది మనుకృతం-ప్రామాణికం

దుష్టుల సహవాసం చేయవద్దు-

న సంవసేచ్చ పతితైర్న చాండాలైర్న పుల్కసైః । మూలశ్లోక సం. **25**
న మూర్ఖైర్నావలిప్తైశ్చ నాన్త్యైర్నాంత్యావసాయిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **79**

టీక:- సజ్జన గృహస్థులకు యోగ్యమైన విధి, న పతితైః న అన్త్యైః న చాండాలైః న పుల్కసైః = భ్రష్టులతో, దుష్టకర్మలు చేసేవారితో, చండాలురతో (శవవాహకులు), బానిసలతోను, న మూర్ఖైః అవలిప్తైః చ న అన్త్యైః అన్త్య+అవ సాయిభిః సంవసేత్ = మూర్ఖులతోను, విద్యాభిమానులతోను, నీచులతోను ఎప్పుడూ నివసించరాదు.

ఋషి దయానందభాష్యం:- సజ్జనులైన గృహస్థులు చండాలురు, భ్రష్టులు, ధనంచేత మదించినవారు, బానిసజాతులు, దుష్టకర్మలు చేసేవారు మొదలైనవారితోను; మూర్ఖులతోనూ, విద్యాభిమానులతోను, నీచులతోనూ ఎప్పుడూ నివసించరాదు. (సం.వి.గృ.ప్ర.). ॥79॥

80 నుండి 91వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* శూద్రులకు ఉపదేశాదుల నిషేధం-

* *న శూద్రాయ మతిం దద్యాన్నోచ్ఛిష్టం న హవిష్కృతమ్ ।*
న చాస్యోపదిశేద్ధర్మం న చాస్య వ్రతమాదిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***80***

తాత్పర్యం:- ఇహపరసాధకమైన అర్థశాస్త్రాన్ని శూద్రుడికి బోధించరాదు. తనకు శిష్యుడిగా ఉండని శూద్రుడికి ఉచ్ఛిష్టాన్నం పెట్టరాదు. హవిశ్శేషం కూడా శూద్రుడికి పెట్టకూడదు. సాటి బ్రాహ్మణుడిని దగ్గర ఉంచుకోకుండా ధర్మం, వ్రతం లాంటివి బోధించరాదు.

* *యో హ్యస్య ధర్మమాచష్టే యశ్చైవాదిశతి వ్రతమ్ ।*
సోఽసంవృతం నామ తమః సహ తేనైవమజ్జతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***81***

తాత్పర్యం:- శూద్రుడికి ధర్మోపదేశం చేసినా, వ్రతాలు వంటివి ఉపదేశించినా, ఆ బ్రాహ్మణుడు అసంవృతం అనే పేరుగల చిక్కని చీకటినరకంలో పడగలడు. అందుండి అతన్ని ఉద్ధరించడం కష్టసాధ్యం. అది చొరరాని నరకం.॥81॥

* *న సంహతాభ్యాం పాణిభ్యాం కండూయేదాత్మ నశ్శిరః ।*
న స్పృశేచ్చైతదుచ్ఛిష్టో న చ స్నాయాద్వినా తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***82***

తాత్పర్యం:- రెండు చేతులూ జోడించి తలగోక్కోకూడదు. భోజనం అయ్యాక చేతులు-కాళ్లు కడుక్కోకుండా ఎడమచేత్తోనైనా శిరస్సును తాకరాదు. రోగాలవల్ల బాధపడేటప్పుడు తప్ప, శిరస్సును వదిలి కంఠం వరకు స్నానం చేయరాదు.॥82॥

* కేశగ్రహాన్ ప్రహారాంశ్చ శిరస్యేతాన్ వివర్జయేత్ ।
శిరస్స్నాతశ్చ తైలేన నాంగం కించిదపి స్పృశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **83**

తాత్పర్యం:- ఎంత కోపమొచ్చినా గాని జుట్టు పట్టుకొని తలవంచి తలపైన కొట్టకూడదు. తలంటి స్నానం చేశాక, మళ్లీ ఆ రోజే తైలాన్ని దేహానికి పూసుకోరాదు.॥83॥

* అక్షత్రియ రాజు నుండి దానగ్రహణ నిషేధం-

* న రాజ్ఞః ప్రతిగృహ్ణీయాదరాజన్య ప్రసూతితః ।
సూనాచక్రధ్వజవతాం వేశేనైవ చ జీవతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **84**

తాత్పర్యం:- శుద్ధ క్షత్రియవంశంలో జన్మించని రాజు వల్ల దానం అందుకోరాదు. జంతుహింస వల్ల జీవించేవాడి దగ్గర, నువ్వులు మొదలైనవి గానుగ పట్టి తైలం తీసేవాడి దగ్గర, మద్యం విక్రయించే వాడి దగ్గర, పడుపు వృత్తి చేత జీవించేవారి దగ్గర దానం తీసుకోకూడదు.॥84॥

* దశసూనాసమం చక్రం దశచక్రసమో ధ్వజః ।
దశధ్వజసమో వేశో దశవేశసమో నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **85**

తాత్పర్యం:- గానుగాడేచోటు అంటే-పది వధ్యస్థానాలు ఉండే ప్రదేశంతో సమానం. మద్య విక్రయస్థలం అంటే-ఇలాంటి 10 గానుగల చోటుతో సమానం. పది కల్లు అంగళ్లతో సాటి ఒక సానివాడ. పది బోగం వాడలతో సమానం క్షత్రియుడి కొలువు.॥85॥

* దశసూనాసహస్రాణి యో వాహయతి సౌనికః ।
తేన తుల్యః స్మృతో రాజా ఘోర స్తస్య ప్రతిగ్రహః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **86**

తాత్పర్యం:- పదివేల జంతువుల్ని తెగనరికే కటికవాడితో సమానుడు ఒక క్షత్రియుడు. ఇందువల్లనే రాజు దగ్గర్నుంచి దానాలు పుచ్చుకోడానికి (ఎవరో తెగించినవారు తప్ప) అందరూ సాహసించరు.॥86॥

* అక్షత్రియరాజు నుండి దానం తీసుకొనుటవలన నరకప్రాప్తి-

* యో రాజ్ఞః ప్రతిగృహ్ణాతి లుబ్ధస్యోచ్ఛాస్త్రవర్తినః ।
స పర్యాయేణ యాతీమాన్నరకానేకవింశతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **87**

తాత్పర్యం:- లోభివాడు, శాస్త్రమర్యాదను అతిక్రమించినవాడు అయిన రాజు దగ్గర్నుంచి ఎవరైతే దానం తీసుకుంటారో, అతడు ఈ కింద చెప్పబడినట్టి 21 రకాల నరకాలను పొందుతాడు.

* తామిస్రమంధతామిస్రం మహారౌరవరౌరవౌ ।
నరకం కాలసూత్రం చ మహానరకమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **88**

* సంజీవనం మహావీచిం తపనం సంప్రతాపనమ్ ।
సంఘాతం చ సకాకోలం కుడ్మలం పూతిమృత్తికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **89**

* **లోహశంకుమృజీషం చ పంథానం శాల్మలీం నదీమ్ ।**
అసిపత్రవనం చైవ లోహదారకమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**90**

తాత్పర్యం:- ఇరవై ఒక్కరకాల నరకాలు: 1. తామిస్రం, 2. అంధతామిస్రం, 3. మహారౌరవం, 4. కాలసూత్రం, 5. మహానరకం, 6. సంజీవనం, 7. మహావీచి, 8. తపనం, 9. సంప్రతాపనం, 10. సంఘాతం 11. కాకోలం, 12. కుడ్మలం, 13. పూతిమృత్తికం, 14. లోహశంకువు, 15. ఋజీషం, 16. మంథానం, 17. శాల్మలీం, 18. నదీం, 19. అసిపత్రవనం, 20. వైతరణినది, 21, లోహదారకం. ॥88, 89,90॥

* **ఏతద్విదంతో విద్వాంసో బ్రాహ్మణా బ్రహ్మవాదినః ।**
న రాజ్ఞః ప్రతిగృహ్ణంతి ప్రేత్య శ్రేయోऽభికాంక్షిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**91**

తాత్పర్యం:- విద్వాంసులు, బ్రహ్మవేత్తలు రాజువల్ల దానం పొందడం ద్వారా కలిగే నరకాల గురించి బాగా తెలిసినవారైనందువల్ల, జన్మాంతాన అలాంటి నరకాల్లో పడటం ఇష్టంలేక దానం తీసుకోరు.॥91॥

ప్రక్షిప్తాల పరిశీలన

80 నుంచి 91 వరకు గల శ్లోకాలు ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 80-81లలో శూద్రులకు విద్య, ధర్మం, వ్రతోపదేశాలు నిషేధమూ, నిందనీయమని ఉంది. ఇవి పుట్టుకతో వర్ణ వ్యవస్థను అనుసరించి ఉన్నాయి. ఇవి మనువు వ్యవస్థకు వ్యతిరేకం. [చూడండి 1.92-107ల సమీక్ష]. మనువు చెప్పిన వ్యవస్థ ప్రకారం చదువు లేనివాడు, బుద్ధిహీనుడూ శూద్రుడవుతాడు. మనువు 10.126లో **"న ధర్మాత్ ప్రతిషేధం"** అని స్పష్టంగా చెప్పాడు. అంటే శూద్రునికి ధర్మపాలన విషయంలో ఏ నిషేధమూ లేదు అని. అదే విధంగా 2.123 [238] లో **"అంత్యాదః పరం ధర్మం"** అని చెప్పి, శూద్రులు మొదలైనవారు చదువుకోవచ్చునని చెప్పాడు. దీనివల్ల ధర్మపాలన విషయంలో శూద్రులకు ఎటువంటి నిషేధాలూ లేవని తెలుస్తూంది. పెళ్లిళ్ల సమయంలో చేసే యజ్ఞాలు మొదలైన ధర్మకార్యాలు, ద్విజులవలెనే శూద్రులూ చేసుకోవచ్చని చెప్పాడు. 4.20లో నాలుగు వర్ణాలవారి పెళ్లిళ్ల విషయం ప్రారంభించి, 28లో దైవవివాహం యజ్ఞానుష్ఠానంతో చేయాలనీ, ద్విజులతో సమానంగా శూద్రులూ చేయవచ్చుననీ చెప్పాడు. వీటి వల్ల శూద్రులకు ధర్మాలు, ఉపదేశాలు, వ్రతాలు మొదలైనవాటిని నిషేధించడం మను సమ్మతం కాదని తెలుస్తూంది కనుక, ఈ మూడు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

ఖ. 84వ శ్లోకంలో క్షత్రియుడు కాని రాజు నుంచి దానం తీసుకోవద్దని ఉంది. ఇది కూడా పుట్టుకతో వర్ణ వ్యవస్థ అనే దాని పై ఆధారపడిన విషయం, ఇది మనువుకు వ్యతిరేకం (దీనికై 1.92-107 శ్లోకాల సమీక్ష చూడండి). మనువు కర్మణా వర్ణ వ్యవస్థను చెప్పాడు కనుక, విధ్యుక్తంగా చదువుకుని కర్మానుసారం రాజైన ప్రతివాడూ క్షత్రియుడే. ఈ విషయం ఆధారంగా 84వ శ్లోకమూ, దానికి సంబంధించిన తర్వాతి 91 వరకు గల శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే.

గ. 86వ శ్లోకంలో రాజు చేసిన దానం నిందనీయమని ఉంది - కానీ 1.89, 7.79, 81,82 శ్లోకాలలో రాజుకు 'దానం చేయటం' మేలని ఉంది.

2. 'నరకం' కల్పన మనువుకు వ్యతిరేకం

81,87,91 శ్లోకాలలో 21 నరకాలు, క్షత్రియుడు కాని రాజు నుంచి దానాలు స్వీకరించే వారందరూ ఈ నరకాలలో పడతారనీ ఉంది. మనువు అభిప్రాయంలో 'నరకం' పేరు గల స్థానమేదీ లేదు. ఈ పద్ధతి కింది ప్రమాణాలతో మనువుకు వ్యతిరేకమని తెలుస్తూంది.

క. నరకమనే పదం స్వర్గానికి వ్యతిరేకపదం. మనువు 2.32 [2.57] లో సుఖం, 379లో 'స్వర్గం' పదాన్ని సుఖం, 'అక్షయ సుఖం' - వీటికి వాడాడు. 9.28లో **"దారాధీన స్తథా స్వర్గః పితౄణా మాత్మన శ్చః"** అని, 'వర్తమాన జీవితపు సుఖం' అనే అర్థంలోనూ వాడాడు. దీని వల్ల స్వర్గానికి వ్యతిరేక భావమిచ్చే 'నరకం' అనేది ఒక స్థాన విశేషం కాదు, దుఃఖమే ! నిరుక్తంలో యాస్కాచార్యులు కూడా 'నరక' పదానికి ఇలాంటి నిర్వచనమే ఇచ్చాడు - "నరకం న్యరకం నీచై ర్గమనం ఇతి వా" -అని. అంటే దుఃఖపు అధః పతనం లేదా దిగజారడం పేరే నరకం అని అర్థం. (నిరుక్తం. 1.3.11).

ఖ. మనువు మృత్యువు తర్వాత జీవునికి కేవలం రెండు స్థితులు చెప్పాడు - ఒకటి ప్రపంచంలో స్థావర జంగమాలుగా పుట్టటం [6.63,74;12.9, 39.52] లేదా బ్రహ్మప్రాప్తి [4.149; 6.81; 12.116,125]. దీని వల్ల కూడా మనువు ప్రకారం నరకమనే ప్రత్యేక స్థానమేదీ లేదని తెలుస్తుంది.

గ. మనువు 12.9, 39 నుంచి 52 శ్లోకాలలో మరణం తర్వాత జీవునికి అతని కర్మానుసారం కలగబోయే జన్మలు చెప్పాడు. ఇందులో నరకాన్ని గురించి చెప్పకపోవటం కూడా, అతడు నరకాన్ని విశ్వసించడని తెలుపుతుంది. 12.52,74,91 శ్లోకాలలో వ్యక్తి కర్మలననుసరించి లభించే జన్మలలో శరీరధారణ చేస్తూ ఈ ప్రపంచంలో సుఖదుఃఖాలు అనుభవిస్తాడని ఎంతో స్పష్టంగా తన అభిప్రాయాన్ని మనువు చెప్పాడు. అందుచేత 'నరకం' కల్పన మనువుకు వ్యతిరేకం.

ఘ. 82, 87-91 శ్లోకాలు మనువు పద్ధతికి వ్యతిరేకాలు. వీటిలో ఒక కర్మను అనుసరించే నరకంలో పడతారని ఉంది. మనువు ఒకటే కర్మ వల్ల ఒక జన్మ కలుగుతుందని చెప్పలేదు. ఎన్నో మంచి-చెడ్డ పనులు చేయటం చేత ఉత్తమ. మధ్యమ, అధమ జన్మలు కలుగుతాయన్నాడు [12.3.-9, 39.52].

2. వేద వ్యతిరేకాలు

80-81 శ్లోకాలలో శూద్రులకు యజ్ఞశేష భోజనం, ధర్మ క్రియలు నిషేధం అని చెప్పటం వేదసంప్రదాయానికి వ్యతిరేకం. వేదాలలో శూద్రులు యజ్ఞాది ధార్మిక కర్మలు, మంత్ర శ్రవణం చేయవచ్చునని చెప్పబడింది. (ప్రమాణాలకు 2.42, 9.335 శ్లోకాలపై 'వేదవ్యతిరేకాలు' సమీక్ష చూడండి.)

3. విషయ వ్యతిరేకాలు

80-83 శ్లోకాలు విషయ సంబంధులు కావు. వీటికి 'సత్త్వగుణ వర్ధకం'తో సంబంధమూ లేదు, ఇవి వ్రతాలూ కావు. ఈ ఆధారంతో ఇవి ప్రక్షిప్తాలు. (విస్తృత వివరణకు 4.33-34 శ్లోకాలు చూడండి).

4. శైలీగత ఆధారాలు

80, 82 శ్లోకాల శైలి పక్షపాతం, ద్వేషభావాలతో ఉంది. 81, 85, 86-91ల శైలి నిరాధారం, నిర్హేతుకం, అతిశయోక్తులతో కూడినది. 82-83 శ్లోకాల శైలి ప్రాచీనం. మనువు శైలిలో ఇటువంటి లోపాలు ఉండవు.

92 నుండి 94వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

బ్రహ్మముహూర్తంలో జాగరణ-

బ్రాహ్మే ముహూర్తే బుధ్యేత ధర్మార్థౌ చానుచింతయేత్ । మూలశ్లోక సం.**26**
కాయక్లేశాంశ్చ తన్మూలాన్ వేదతత్త్వార్థమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**92**

టీక:- **బ్రాహ్మేముహూర్తే బుధ్యేత** = రాత్రిలో నాలుగో జామున బ్రాహ్మముహూర్తం లేదా 4 ఘడియలు రాత్రి ఉందనగా (ఘడియ 24 నిమిషాలు) దాదాపు తెల్లవారు జామున 4 గంటలకు) లేవాలి. లేచి **ధర్మార్థౌ** = అవసరమైన

కాలకృత్యాలను తీర్చుకొని, ధర్మార్థాలను గురించి, **కాయక్లేశాంశ్చ తన్మూలాన్** = శరీరంలో ఉండే రోగాలను, వాటికి కారణాలను, **చ** = మరియు, **వేదతత్త్వార్థం + ఏవ అనుచిన్తయేత్** = పరమేశ్వర ధ్యానం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- రాత్రి చివరి భాగాన్ని (తెల్లవారుజామున 4 గంటలకు) బ్రాహ్మీముహూర్తం అంటారు. అలాంటి బ్రాహ్మీముహూర్తంలో లేచి కాలకృత్యాలు తీర్చుకొని, ధర్మం-అర్థం అనే వాటి గురించి తప్పక చింతించాలి. వేదతత్త్వార్థాల గురించి కూడా చింతన చేయాలి. అధర్మాచరణం ఎప్పుడూ చేయరాదు. (స.ప్ర.4వ సము.)॥92॥

వివరణ:- ఈ శ్లోకంలో బ్రహ్మముహూర్తంలో మేల్కొనే విధానమున్నది. ప్రాతఃకాలం 3 నుండి 6 గం॥ల వరకు గల సమయాన్ని బ్రహ్మముహూర్తమంటారు. 2.102లో తెలిపినట్లుగా ప్రాతఃకాలీన సంధ్య సూర్యోదయానికి పూర్వమే జరగాలి. అంతకుపూర్వమే శౌచవ్యాయామస్నానాదులు పూర్తి చేయాలి. ఈ విధంగా బ్రహ్మముహూర్తంలో లేచే సమయం 4,5 గంటలుగా నిర్ధారింపబడినది. ఉదయం 4 గం॥లకే నిద్రలేవదలచినవారు రాత్రి 9-10 గం॥లకే నిద్రించాలన్న విషయాన్ని గుర్తించాలి. ఆలస్యంగా నిద్రించి తొందరగా లేవడం, తొందరగా నిద్రించి ఆలస్యంగా మేల్కొనడం ఈ రెండూ తప్పే. ఆయుర్వేదానుసారం 6-7 గం॥లు నిద్రించుట తప్పనిసరి.

సన్ధ్యోపాసనాది నిత్యకర్మలపాలన వల్ల దీర్ఘాయుష్షు ప్రాప్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఉత్థాయావశ్యకం కృత్వా కృతశౌచస్సమాహితః । మూలశ్లోక సం.**27**
పూర్వాం సన్ధ్యాం జపం స్తిష్ఠేత్స్వకాలే చాపరాం చిరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**93**

టీక:- ఉత్థాయ = లేచి, **ఆవశ్యకం కృత్వా** = దినచర్యలో ఆవశ్యకమైన శౌచాదికార్యాలను పూర్తిచేసుకొని, **కృతశౌచః** = స్నానాదుల ద్వారా పవిత్రుడై, **సమాహితః** = ఏకాగ్రచిత్తుడై, **పూర్వాం సన్ధ్యాం జపం చిరమ్ తిష్ఠేత్** = ప్రాతఃకాల సంధ్యావందనం చేస్తూ కొంత సమయం కూర్చోవాలి. **చ** = మరియు, **స్వకాలే** = ఉపయుక్త సమయంలో, **అపరాం** = సాయంకాల సంధ్యలో కూడా ఉపాసన చేయాలి.

తాత్పర్యం:- బ్రాహ్మీముహూర్తంలో లేచి, దినచర్యలో అవసరమైన శౌచాది కార్యాలను పూర్తి చేసుకొని, స్నానాదుల ద్వారా పవిత్రుడై, ఏకాగ్రచిత్తుడై ప్రాతఃసాయం సంధ్యా సమయాల్లో ఉపాసన చేయాలి.॥93॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఋషయో దీర్ఘసన్ధ్యత్వాద్దీర్ఘమాయురవాప్నుయుః । మూలశ్లోక సం.**28**
ప్రజ్ఞాం యశశ్చ కీర్తిం చ బ్రహ్మవర్చసమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**94**

టీక:- ఋషయః = ఋషులు, మన్త్రద్రష్టలు, **దీర్ఘసన్ధ్యత్వాత్** = దీర్ఘకాలం సంధ్యోపాసన చేయడం వల్ల, **దీర్ఘం +ఆయుః, ప్రజ్ఞాం, యశః, కీర్తిం, చ బ్రహ్మ వర్చసమ్ అవాప్నుయుః** = దీర్ఘాయుష్షును, విశేషమైన బుద్ధిని, యశస్సును కీర్తి ప్రతిష్ఠలను, బ్రహ్మవర్చస్సును పొందారు.

తాత్పర్యం:- ఋషులు దీర్ఘకాలం సంధ్యావందనం ఆచరించడం వల్లనే చిరకాలం జీవించారు. బుద్ధిని, కీర్తి ప్రతిష్ఠలను, బ్రహ్మవర్చస్సును పొందారు. కాబట్టి ఆయురారోగ్యయశస్సు వర్చస్సులను కోరే ద్విజులు ప్రాతఃసాయం సంధ్యలందు తప్పక సంధ్యావందనం ఆచరించాలి. ॥94॥

వివరణ

దీర్ఘకాలసన్ధ్య వల్ల దీర్ఘాయుష్న ప్రాప్తి

1. గాయత్రీ మొ॥ వేదమంత్రాలను జపించడం-సన్ధ్య (2-79[104]). ఇది నైతిక యజ్ఞాలకు, స్వాధ్యాయానికి సంబంధించినది. స్వాధ్యాయం వల్ల ఆయుష్మ, తేజస్సు, బలం మొ॥వి లభిస్తాయి (2.82[197]).

2. గాయత్రీ మొ॥ వేదమంత్రాలను మనఃపూర్వకంగా అధ్యయనం, దీర్ఘసంధ్య, ఉపాసనచేయడం వల్ల, అలాగే బుద్ధికోసం ఈశ్వరుడిని ప్రార్థించడం వల్ల సద్బుద్ధి ప్రాప్తిస్తుంది. వేదమంత్రాల ప్రకారం ఆచరించినందువల్ల, ఆయుష్యాభివృద్ధి, సదాచరణ వల్ల ప్రసిద్ధి, యశస్సు లభిస్తాయి. వేదమంత్రాలతో, మననం, చింతనం వల్ల, ఆచరణ వల్ల బ్రహ్మతేజస్సు వృద్ధిచెందుతాయి. మనుషుడు ఈశ్వర-వేదజ్ఞానంలో సమర్థుడవుతాడు (2.53[78]). ఈ విధంగా దీర్ఘసంధ్య వల్ల ఈ శ్లోకోక్త లాభాలు సిద్ధిసాయి.

3. సన్ధ్యా శబ్దార్థం కోసం (2.77-79) శ్లోకాల్లో వివరాలు చూడగలరు.

95 నుండి 127వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* శ్రావణీ ఉపాకర్మ-

* *శ్రావణ్యాం ప్రౌష్ఠపద్యాం వా-ప్యుపాకృత్య యథావిధి ।*
యుక్తశ్ఛందాంస్యధీయీత మాసాన్ విప్రోఽర్ధపంచమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***95***

తాత్పర్యం:- శ్రావణపూర్ణిమనాడు గాని, భాద్రపద పున్నానికి గాని, తమ తమ ఇంటి ఆచారాన్ని అనుసరించి, ఉపాకర్మ జరిపించాలి. పట్టుదలతో నాలుగున్నర నెలల కాలం అధ్యయనం చేయాలి.॥95॥

* *పుష్యే తు ఛందసాం కుర్యాద్బహిరుత్సర్జనం ద్విజః ।*
మాఘశుక్లస్య వా ప్రాప్తే పూర్వాహ్ణే ప్రథమేఽహని. ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***96***

తాత్పర్యం:- ఈ నాలుగున్నర నెలలు పూర్తయిన తర్వాత, పుష్యమాస శుక్లపక్షం లేదా మాఘశుక్ల పక్షం పాడ్యమిరోజున ఊరివెలుపలకు వెళ్లి తమ ఇంటి ఆచారాల ప్రకారం ఉత్సర్జనం అనే కర్మ ఆచరించాలి. ॥96॥

* *యథాశాస్త్రం తు కృత్వైవముత్సర్గం ఛందసాం బహిః ।*
విరమేత్పక్షిణీం రాత్రిం తదేవైకమహర్నిశమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***97***

తాత్పర్యం:- ఈ ప్రకారం ఉత్సర్జనం జరిపించిన తరవాత తొంభై ఘడియల కాలం గాని, ఒక రోజుగాని, మూడురోజులపాటు గాని వేదాధ్యయనం నిలిపి ఉంచాలి.॥97॥

* *అత ఊర్ధ్వం తు ఛందాంసి శుక్లేషు నియతః పఠేత్ ।*
వేదాంగాని చ సర్వాణి కృష్ణపక్షేషు సంపఠేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***98***

తాత్పర్యం:- ఉత్సర్గాధ్యాయం తర్వాత శుక్లపక్షాలలో మంత్రబ్రాహ్మణరూపమయిన వేదాలను నియమంతో పఠించాలి. కృష్ణపక్షాలలో వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం మొదలైనవి పఠించాలి.॥98॥

* అనధ్యాయములు ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *నావిస్పష్టమధీయీత న శూద్రజనసన్నిధౌ ।*
న నిశాంతే పరిశ్రాంతో బ్రహ్మాధీత్య పునః స్వపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***99***

తాత్పర్యం:- స్వరం వర్ణములు వీటి భేదం తెలియకుండా వేదాన్ని అధ్యయనం చేయరాదు. అలాగే శూద్రులు చేరువలో ఉండగా వేదాలను చదవరాదు. రాత్రి వేకువజామున లేచి వేదాధ్యయనం అయిందనిపించి, అలసటవల్ల తిరిగి పరుండి, నిద్రించరాదు.॥99॥

*   *యథోదితేన విధినా నిత్యం ఛందస్కృతం పఠేత్ ।*
బ్రహ్మ ఛందస్కృతం చైవ ద్విజో యుక్తో హ్యనాపది ॥   ప్రక్షిప్త శ్లోక సం. **100**

తాత్పర్యం:- విధిప్రకారం ప్రతిరోజు గాయత్ర్యాది ఛందస్సులతో కూడిన మంత్రం మాత్రం పఠించాలి. కర్మాదులు సంభవించినప్పుడు శాస్త్రోక్తవిధానంలో బ్రాహ్మణుడు మంత్రాలు పఠించవచ్చు! ॥100॥

* వివిధ అనధ్యాయాల విధానము-

*   *ఇమాన్నిత్యమనధ్యాయానధీయానో వివర్జయేత్ ।*
అధ్యాపనం చ కుర్వాణః శిష్యాణాం విధిపూర్వకమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **101**

తాత్పర్యం:- వేదాల్ని చెప్పే గురువుగాని, వేదాలను అధ్యయనం చేసే శిష్యుడు గాని, ఈ దిగువ చెప్పబడిన అనధ్యాయాలలో వేదాధ్యయనాన్ని విడిచిపెట్టవలసి ఉంటుంది.॥101॥

వివరణ:- అధ్యయన-అనధ్యయనాల స్వరూప వివేచనాన్ని స్వయంగా వర్ణించాడు. 2.79-82 [104-107] శ్లోకాలను చూడండి.

* వివిధ అనధ్యాయాల విధానము-

*   *కర్ణశ్రవేఽనిలే రాత్రౌ దివా పాంసుసమూహనే ।*
ఏతౌ వర్షాస్వనధ్యాయావధ్యాయజ్ఞాః ప్రచక్షతే ॥   ప్రక్షిప్త శ్లోక సం. **102**

తాత్పర్యం:- వర్షాకాలంలో రాత్రిపూట చెవులకు ఝుమ్మనే చప్పుడు కల్గించే ఈదురు గాలులు వీచినప్పుడు; పగటిపూట విస్తారంగా దుమ్ముకమ్ముకొని ఉన్నప్పుడు ఆ పూటకిక అనధ్యాయమే ! వేదపాఠం ఉండదు.॥102॥

*   *విద్యుత్ స్తనితవర్షేషు మహోల్కానాం చ సంప్లవే ।*
ఆకాలిక మనధ్యాయమేతేషు మనుర బ్రవీత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **103**

తాత్పర్యం:- వర్షఋతువులో మెరుపులు, ఉరుములు, వాన ఒక్కుమ్మడిగా సంఘటిల్లినప్పుడు; అక్కడక్కడ తోకచుక్కలు పడినప్పుడు; ఆ విధంగా సంభవించినది మొదలు మర్నాడు అదేవేళ వరకు అనధ్యాయమే ! ఆ రోజున వేదం అధ్యాపనం గాని, అధ్యయనం గాని ఉండవు. అలాగే......(తదుపరి శ్లోకంలో అన్వయం) ॥103॥

*   *ఏతాం స్త్వభ్యుదితాన్ విద్యాద్యదా ప్రాదుష్కృతాగ్నిషు ।*
తదా విద్యాదనధ్యాయమనృతౌ చాభ్రదర్శనే ॥   ప్రక్షిప్త శ్లోక సం. **104**

తాత్పర్యం:- హోమం మొదలైనవి జరగవలసి ఉన్న సంధ్యవేళ-పైన చెప్పబడిన వర్షఋతు సంరంభం (ఉరుములు, మెరుపులు వగైరా) కనిపించినప్పుడు కేవలం వర్షాకాలంలో మాత్రమే అనధ్యాయం. ఇతర ఋతువుల్లో లేదు. ఇతర ఋతువులలో అగ్నికార్యం ప్రారంభించేటప్పుడు మేఘాడంబరం ఉంటే అనధ్యాయం.॥104॥

*   *నిర్ఘాతే భూమిచలనే జ్యోతిషాం చోపసర్జనే ।*
ఏతానాకాలికాన్ విద్యాదనధ్యాయానృతావపి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **105**

తాత్పర్యం:- వర్షఋతువు కానప్పటికీ-పిడుగులు పడటం, భూకంపాలు సంభవించడం, నక్షత్రాలు రాలడం లాంటివి జరిగినా, ఇతర ఉత్పాతాలు కనిపించినా మరునాడు ఆ వేళవరకు అనధ్యాయం.॥105॥

* *ప్రాదుష్కృతేష్వగ్నిషు తు విద్యుత్ స్తనితనిస్వనే ।*
సజ్యోతిస్స్యాదనధ్యాయః శేషే రాత్రౌ తథా దివా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***106***

తాత్పర్యం:- హోమం నిమిత్తం అగ్నిహోత్రాలు జ్వలింపచేస్తుండగా ప్రాతఃసంధ్యగాని -సాయం సంధ్యగాని ఉరుములు మెరుపులు కనిపిస్తే వెలుగు ఉన్నంత వరకు అనధ్యాయం. రాత్రికూడా వర్షం-మేఘాడంబరం ఉంటే రోజు మొత్తం అనధ్యాయం.॥106॥

* *నిత్యానధ్యాయ ఏవ స్యాద్గ్రామేషు నగరేషు చ ।*
ధర్మనైపుణ్యకామానాం పూతిగంధే చ సర్వదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***107***

తాత్పర్యం:- నైపుణ్యం ఉండీ, ధర్మాన్ని ఆచరించాలన్న పట్టుదల గల శిష్యునిడికి 'ధర్మనైపుణ్య కాముడు' అని పేరు. అలాంటి శిష్యుడికి ఆ ఊరిలో ఏ కారణంగా నైనా దుర్గంధం వ్యాపించి ఉంటే, అది తగ్గేవరకు అనధ్యాయం. వేదాధ్యయనమున విద్యకే ప్రాముఖ్యమిచ్చే శిష్యుడికి **'విద్యానైపుణ్యకాముడు'** అని పేరు. వారికి ఇది వర్తించదు.॥107॥

* *అంతర్గతశవే గ్రామే వృషలస్య చ సన్నిధౌ ।*
అనధ్యాయో రుద్యమానే సమవాయే జనస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***108***

తాత్పర్యం:- గురుకులమునకు చేరువగా ఉన్న గ్రామంలో గాని; గురుకులం ఉన్న గ్రామంలో గాని శవం ఉన్నప్పుడు; అధార్మికులు దగ్గరకు వచ్చినప్పుడు, జనులు సామూహికరోదనం చేస్తున్నప్పుడు శిష్యులకు అనధ్యాయం.॥108॥

* *ఉదకే మధ్య రాత్రే చ విణ్మూత్రస్య విసర్జనే ।*
ఉచ్ఛిష్టశ్రాద్ధభుక్చైవ మనసాఽపి న చింతయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***109***

తాత్పర్యం:- నీటిమధ్యలో ఉన్నప్పుడు, అర్ధరాత్రి వేళ, మలమూత్రాలు విడిచేటప్పుడు, ఎవరైనా శ్రాద్ధభోక్తగా నిమంత్రణం చేసినప్పుడు, ఎంగిలిచేత్తో ఉండగా మనసులోనైనా వేదాన్ని స్మరించరాదు (రాత్రిపూట నాలుగు ముహూర్తముల కాలం వేదాధ్యయనానికి నిషేధం). ॥109॥

* *ప్రతిగృహ్య ద్విజో విద్వానేకోద్దిష్టస్య కేతనమ్ ।*
త్ర్యహం న కీర్తయేద్బ్రహ్మ రాజ్ఞో రాహోశ్చ సూతకే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***110***

తాత్పర్యం:- ఏకోద్దిష్ట శ్రాద్ధ నిమంత్రణం చేసినప్పుడు, నిమంత్రణదినం మొదలు మూడు రోజులు; తమదేశపు ఏలికకు పుత్రోదయం జరిగినప్పుడు మూడు రోజులు, సూర్య-చంద్ర గ్రహణములలో మూడు రోజులు అనధ్యాయం.॥110॥

* *యావదేకానుద్దిష్టస్య గంధో లేపశ్చ తిష్ఠతి ।*
విప్రస్య విదుషో దేహే తావద్బ్రహ్మ న కీర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***111***

తాత్పర్యం:- ఏకోద్దిష్ట శ్రాద్ధం నందు నిమంత్రణం చేసినవాడి దేహంలో కుంకుమాది విలేపనాల గంధం ఎంతవరకు అంటుకొని ఉంటుందో అంతవరకు విద్వాంసుడైన విప్రుడు వేదపఠనం చేయకూడదు. ॥111॥

* *శయానః ప్రౌఢపాదశ్చ కృత్వా చైవావసక్థికామ్ ।*
నాధీయీతామిషం జగ్ధ్వా సూతకాన్నాద్యమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***112***

తాత్పర్యం:- శయ్య (పడక) మీద పరుండి గాని, ఎత్తుగా గల పీఠంపై కూర్చొని కాళ్లు చాచుకొని గాని, నడుముకు-మోకాళ్లకు బట్టకట్టుకొని గాని, మాంసం భుజించి గాని వేదం చదవరాదు.॥112॥

* ***నీహారే బాణశబ్దే చ సంధ్యయోరేవ చోభయోః ।***
అమావాస్యా చతుర్దశ్యోః పౌర్ణమాస్యష్టకాసు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***113***

తాత్పర్యం:- మంచుకమ్మినప్పుడు, బాణధ్వని వినిపించినప్పుడు, సాయం-ప్రాతఃకాలాల్లోను, అమావాస్య చతుర్ధశి తిథుల్లోను వేదాధ్యయనం చేయరాదు.॥113॥

* ***అమావాస్యా గురుం హంతి శిష్యం హంతి చతుర్దశీ ।***
బ్రహ్మాష్టకాపౌర్ణమాస్యౌ తస్మాత్తాః పరివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***114***

తాత్పర్యం:- అమావాస్యనాడు వేదం చదివితే అది గురువును చంపుతుంది. చతుర్దశినాటి వేదపఠనం శిష్యుడికి దెబ్బ. అష్టమి-పూర్ణిమ రోజుల్లో (వీటి ప్రభావంచేత) వేదం తనకు తానే నశిస్తుంది. కాబట్టి నిషేధించారు. ఇంకా......॥114॥

* ***పాంసువర్షే దిశాం దాహే గోమాయువిరుతే తథా ।***
శ్వఖరోష్ట్రే చ రువతి పఙ్క్తౌ చ న పఠేద్ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***115***

తాత్పర్యం:- దుమ్ము వర్షం (ప్రభంజనాల తాకిడికి) కురిసినప్పుడు, దిక్కుల్లో మంటలు కన్పించినప్పుడు, నక్కలు అతిగా ఊళవేసినప్పుడు, కుక్కలు-గాడిదలు, అదే పనిగా రోదిస్తూన్నప్పుడు (ఇవన్నీ ఏదో ఒక ఉత్పాతానికి సూచన), ఎక్కువ మంది జనసమూహం ఉన్నప్పుడు వేదం చదువరాదు.॥115॥

* ***నాధీయీత శ్మశానాంతే గ్రామాంతే గోవ్రజేఽపి వా ।***
వసిత్వా మైథునం వాసః శ్రాద్ధికం ప్రతిగృహ్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***116***

తాత్పర్యం:- శ్మశానానికి చేరువగాను, ఏదో ఒక గ్రామానికి సమీపంలోను (ఆరుబయట), గురుకులం కాని ప్రదేశాల్లోను, పశువులశాలల్లోను, స్త్రీతోరమించి వున్నప్పటి వస్త్రం ధరించి, శ్రాద్ధాన్నం భుజించి వేదం చదువరాదు.॥116॥

* ***ప్రాణి వా యదివాఽపాణి యత్కించిచ్ఛ్రాద్ధికం భవేత్ ।***
తదాలభ్యాప్యనధ్యాయః పాణ్యాస్యో హి ద్విజః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***117***

తాత్పర్యం:- తాను దానంగా పుచ్చుకొన్న వాటిలో ప్రాణంగల గోవులు-గుర్రాలు గాని, అచేతనమైన వస్తువులు వస్త్రం మొదలైనవి ఉన్నట్లయితే ఆ రోజుకు ఇక వేదపఠనం కూడదు. బ్రాహ్మణులకు హస్తమే నోరు అని ప్రతీతి. అదీ కారణం.॥117॥

* ***చోరైరుపప్లుతే గ్రామే సంభ్రమే చాగ్నికారితే ।***
ఆకాలికమనధ్యాయం విద్యాత్సర్వాద్భుతేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***118***

తాత్పర్యం:- దొంగల బెడద అధికంగా ఉండి, ఊళ్లో కలకల పుట్టినప్పుడు; అగ్ని ప్రమాదం సంభవించి గ్రామం ఆపదలో పడినప్పుడు; విపరీతాలు-వింతలు ఊళ్లో బయలుదేరినప్పుడు మర్నాడు ఆ వేళదాకా అనధ్యాయం.॥118॥

* ***ఉపాకర్మణి చోత్సర్గే త్రిరాత్రం క్షపణం స్మృతమ్ ।***
అష్టకాసు త్వహోరాత్రమృత్వంతాసు చ రాత్రిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***119***

తాత్పర్యం:- ఆషాఢ-శ్రావణ మాసాలలో ఉపాకర్మ జరిగిన తరవాత, పుష్యమాసాలలో ఉత్సర్జన వ్రతం ఆచరించినప్పుడు మూడు రోజులు అనధ్యాయం. అలాగే ఆశ్వయుజంలో పౌర్ణమికి తదుపరి మూడు రోజులు, కృష్ణాష్టమి రాత్రి-పగలు, చైత్ర-ఆషాఢ-ఆశ్వీయుజ-పుష్యమాసాల సంక్రమణములలో రాత్రిపూట అనధ్యాయం.॥119॥

* నాధీయీతాశ్వమారూఢో న వృక్షం న చ హస్తినమ్ ।
న నావం న ఖరం నోష్ట్రం నేరిణస్థో న యానగః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **120**

తాత్పర్యం:- చెట్లమీద కాని, గుర్రంమీద గాని, ఏనుగు మీద గాని, గాడిదమీద గాని ఒంటెమీద కాని కూర్చొని వేదం పఠించరాదు. చౌడునేలమీద కూర్చొని వేదం చదవకూడదు. నావ మీద ఎక్కినప్పుడు, బండిమీద ఎక్కినప్పుడు వేదపఠనం కూడదు.॥120॥

* న వివాదే న కలహే న సేనాయాం న సంగరే ।
న భుక్తమాత్రే నాజీర్ణే న వమిత్వా న సూతకే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **121**

తాత్పర్యం:- వాగ్వాదం జరుగుతూండగా, కర్రలతో కొట్లాడుకొంటూండగా, దరిదాపులలో సేనలు లాంటివి ఉండగా, యుద్ధం జరుగుతూండగా, భోజనం చేసినవెంటనే, పులిత్రేన్పులు-వాంతులు వస్తున్నప్పుడు, సూతకం సంభవించినప్పుడు వేదాధ్యయనం పనికిరాదు.॥121॥

* అతిథిం చాననుజ్ఞాప్య మారుతే వాతి వా భృశం ।
రుధిరే చ స్రుతే గాత్రాచ్ఛస్త్రేణ చ పరిక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **122**

తాత్పర్యం:- అతిథి ఉండగా, అతని అనుజ్ఞ లేకుండా వేదం చదువదగదు. గాలి విస్తారంగా వీస్తుండగా వేదం చదువరాదు. కత్తిగాయం తగిలినా, రక్తం కారుతూన్నా వేదాధ్యయనం కూడదు.॥122॥

* సామధ్వనావృగ్యజుషీ నాధీయీత కదాచన ।
వేదస్యాధీత్య వాప్యంతమారణ్యకమధీత్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **123**

తాత్పర్యం:- సామవేదగానం వినిపిస్తుండగా, ఋగ్యజుర్వేదాలు చదువకూడదు. వేదాన్నంతటినీ అధ్యయనం చేశాక, ఆరణ్యకం అనే వేదభాగాన్ని చదివిన తర్వాత ఆనాటికి ఇక వేదాధ్యాయనం లేనట్లే.॥123॥

* ఋగ్వేదో దేవదైవత్యో యజుర్వేదస్తు మానుషః ।
సామవేదః స్మృతః పిత్ర్యస్తస్మాత్తస్యాశుచిర్ధ్వనిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **124**

తాత్పర్యం:- సామవేదధ్వని అంత ప్రశస్తం కానిది. దీనిక్కారణం-పితృదేవతలు దైవతంగా గలది ఈ వేదం. దేవతలది ఋగ్వేదం. మానవులది యజుర్వేదం. పితృదేవతా సంబంధి కావడం వల్ల దీన్ని అంత శ్రేష్ఠంగా పరిగణించలేదు.॥124॥

* ఏతద్విదంతో విద్వాంసస్త్రయీనిష్కర్షమన్వహమ్ ।
క్రమతః పూర్వమభ్యస్య పశ్చాద్వేదమధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **125**

తాత్పర్యం:- ప్రతిరోజూ చేసే బ్రహ్మయజ్ఞంలో ఋగ్యజుస్సామసారమైనట్టి ప్రణవ వ్యాహృతి సావిత్రులను క్రమంగా అధ్యయనం చేసిన తరువాత విద్వాంసులు వేదాలను అధ్యయనం చేస్తారు. ప్రణవం (ఓంకారం) పఠించేటప్పుడు వేదాదులకు అనధ్యాయమని చెప్పబడింది.॥125॥

* పశుమండూకమార్జారశ్వసర్పనకులాఖుభిః ।
అంతరాగమనే విద్యాదనధ్యాయమహర్నిశమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***126***

తాత్పర్యం:- పశువులు, కప్పలు, పిల్లి, కుక్క, పాము, ముంగిస, ఎలుక -ఇవి వేదాధ్యయనం జరుగుతూండగా గురుశిష్యుల నడుమకు వస్తూంటే, ఆ రోజుకు ఇక అనధ్యాయమే.॥126॥

* ద్వావేవ వరయేన్నిత్యమనధ్యాయౌ ప్రయత్నతః ।
స్వాధ్యాయభూమిం చాశుద్ధామాత్మానం చాశుచిం ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***127***

తాత్పర్యం:- విద్యానైపుణ్యాన్ని కోరే శిష్యుడు, వేదాధ్యయన ప్రదేశం అమేధ్యాదులు (అశుద్ధములు) మొదలైనవాటి వల్ల ఆవరించబడినప్పుడు, నిషిద్ధమైనవి కనిపించినప్పుడు మాత్రమే అనధ్యాయం ఆచరించాలి. ॥127॥

ప్రక్షిప్తాల పరిశీలన

95 నుంచి 127 వరకు గల అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలు. వీటి ప్రక్షిప్తత కింది ప్రమాణాలతో రుజువవుతుంది-

1. అంతర్ వ్యతిరేకాలు- 'అనధ్యాయం' మనువుకు వ్యతిరేకం

ఏడాదిలో నాలుగున్నర నెలలు వేదాధ్యయనం చేయటం, తర్వాత వదలిపెట్టడం, మధ్యలో విశ్రాంతి తీసుకోవటం, శుక్లపక్షంలో వేదాధ్యయనం, కృష్ణపక్షంలో వేదాంగాలు చదవటం - ఇవన్నీ మనువుకు తర్వాతి కాలంలో వచ్చాయి. వీటిని గురించి మనుస్మృతిలో చదువుతుంటే, మనువు ఏర్పరచిన వ్యవస్థలు శిథిలమయ్యాయని అనిపిస్తుంది. వీటికీ, మనువు చెప్పిన వాటికీ పొసగటం లేదు. పైగా అన్నీ వ్యతిరేక భావాలు. అవి -

క. మనువు వేదాధ్యాయనం అందరు ద్విజులకూ నిత్య కర్మలుగా, తప్పని సరిగా నిర్దేశించాడు [1.87-90]. వీటిని ఆచరించని వాడు ద్విజుడు కాడు, తన వర్ణ ధర్మాన్ని తప్పిన వాడవుతాడు. ముఖ్యంగా వేదాభ్యాసం వదలి పెట్టే ద్విజుడు, శూద్రుడుగా పరిగణించబడతాడు- **"యోఽనధీత్య ద్విజో వేదమన్యత్ర కురుతే శ్రమం । స జీవన్నేవ శూద్రత్వం ఆశు గచ్ఛతి సాన్వయః"** [2.143 (168)].

ఖ. మనువు వేదాధ్యయనాన్ని దైనందిన చర్యగా చెప్పి, ఇది పవిత్రకార్యం కనుక ఎప్పుడూ మానవద్దన్నాడు- **"వేదోపకరణే చైవ స్వాధ్యాయే చైవ నైత్యకే । నానురోధోఽస్త్యనాధ్యాయే హోమ మంత్రేషు చైవహి॥"** [2.80 (105)]. **"నైత్యకే నా స్త్యనాధ్యాయో బ్రహ్మ సత్రం హి తత్స్మృతం । బ్రహ్మాహుతి హుతం పుణ్య మనధ్యాయం వషట్ కృతం॥"** [(2.8(106)].

గ. నైత్యిక వేదాధ్యయనానికి ఇతర ప్రమాణాలూ చూడండి -

అ. **యః స్వాధ్యాయమధీతేఽబ్దం విధినా నియతః శుచిః ।**
తస్యనిత్యం క్షరత్యేష పయోదధి ఘృతం మధు ॥ మను. 2.82

ఆ. **ఆ హైవ స నఖాగ్రేభ్యః పరమం తప్యతే తపః ।**
యః స్ర గ్వ్యపి ద్విజోఽధీతే స్వాధ్యాయం శక్తితోఽన్వహమ్ ॥మను. 2.142

ఈ విధంగా గృహస్థుల వ్రతాలలో కూడా స్పష్టమైన నిర్దేశమున్నది

ఇ. **సర్వాన్ పరిత్యజేదర్థాన్ స్వాధ్యాయస్య విరోధినః ।**
యథాతథాధ్యాపయంస్తు సా హ్యస్య కృతకృత్యతా ॥ మను. 4.17

ఈ. బుద్ధివృద్ధికరణ్యాశు ధన్యాని చ హితాని చ ।
నిత్యం శాస్త్రాణ్యవేక్షేత నిగమాంశ్చైవవైదికాన్ ॥ మను. 4.19
ఉ. స్వాధ్యాయే చైవ యుక్తః స్యాత్ నిత్యమ్ । మను. 4.64
ఊ. స్వాధ్యాయే నిత్యయుక్తః స్యాత్ ॥ మను. 3.75

ఈ ప్రమాణాల ద్వారా, ప్రతివాడూ వేదాధ్యయనాన్ని ప్రతిరోజూ తప్పక చేయాలని మనువు నిర్దేశించాడని స్పష్టమవుతూంది. రోజూ చేయాలని మనువు పేర్కొన్న పంచ మహాయజ్ఞాలలో 'బ్రహ్మ యజ్ఞం' సంధ్యోపాసన, వేదాధ్యయనం ఉన్నాయి. మనుస్మృతిలో ఇటువంటి ప్రమాణాలు కోకొల్లలుగా లభిస్తాయి. 95-127 శ్లోకాలలో నాలుగున్నర నెలలు వేద పఠనం, తర్వాత దాన్ని గ్రామం వెలుపల వదలిపెట్టడం, శుక్ల పక్షంలో వేద పఠనం, కృష్ణ పక్షంలో వేదాంగాల పఠనం - వీటన్నిటికీ మనువు చెప్పిన వాటితో పొంతనే లేదు, పైగా వ్యతిరేకాలు కూడా. ప్రతిరోజూ చేయవలసిన వేదాధ్యయనానికి, నాలుగున్నర నెలలు చదివే ప్రారంభ అనుష్ఠానం, తర్వాత వదిలే ప్రక్రియ - వీటి అవసరమే రాదు. అందుచేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఈ ప్రసంగంలో మరి కొన్ని అంతర్ వ్యతిరేకాలూ కనబడుతున్నాయి.

ఘ. 99,108 శ్లోకాలలో **'శూద్రులు వేదం చదవరాదు'** అనే దాన్ని ఆధారం చేసుకుని శూద్రులు వేదాధ్యయనం చేయరాదని చెప్పారు. జన్మతో జాతివాదంతో ప్రేరితమైన ఈ పద్ధతి మనువుకే కాక వేదాలకూ వ్యతిరేకం. [దీని విస్తృత వివరాలకు 2.144-149 (169-174) శ్లోకాల 'అంతర్ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి].

జ. 109-111, 117, 124 శ్లోకాలలో మృతుల శ్రాద్ధం చెప్పారు. ఇది కూడా మను విరుద్ధమే. [దీని వివరణకు 3.119-284 శ్లోకాల సమీక్ష చూడండి].

చ. 112లో సూతకం పాటించే ఆచారం చెప్పారు. ఇది మనువు చెప్పినట్లు తోచదు [దీనికి 5.58-104 శ్లోకాల 'విషయ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి.] ఎందుకంటే, సూతకవిధానం ఇదే ప్రసంగంలోని 61-62 శ్లోకాలలో వస్తుంది.

ఛ. 113వ శ్లోకంలో సంధ్యా కాలంలో వేద పఠనం కూడదని ఉంది. కానీ, పంచమహా యజ్ఞాలు, సంధ్యోపాసన సంధ్యాకాలాలలోనే చేయవలసి ఉంటుంది [2.76-78 (101-103), 151 (176,4.92-94].

జ. 113-114వ శ్లోకాలలో పర్వదినాలలో వేదాధ్యయనం నిషిద్ధం అని ఉంది. కానీ 4.24; 6.9 లలో పర్వాలలో విశేష యజ్ఞాల విధానం, అవి వేద మంత్రాలతోనే పూర్తయే విధానం ఉన్నాయి.

ఝ. 116వ శ్లోకంలో శ్మశానంలో వేదం చదవరాదని ఉంది. కానీ 5.167లో అంత్యేష్టి కర్మ యజ్ఞం చేయటం ద్వారానే జరుగుతుందనీ, ఆ యజ్ఞం వేదమంత్రాల ఉచ్చారణతోనే చేయాలనీ ఉంది.

ఞ. 112లోని మాంస భక్షణం మనువుకు వ్యతిరేకం [4.26-28 శ్లోకాలపై 'అంతర్ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి].

ట. 123-125 శ్లోకాలలో వేదాల ధ్వనుల పరస్పర వ్యతిరేకత చూపటం, మనువు చెప్పిన 2.76-78 [51-53] శ్లోకాలకు వ్యతిరేకం. మూడు వేదాల నుంచి ఒక్కొక్క పాదం తీసి కూర్చిన గాయత్రీ మంత్రాన్ని ఒకటిగా పఠిస్తే వేద ధ్వనులకు ఏమి అపకారం జరుగుతుంది? మనువు ప్రకారం వేదాలన్నీ ఈశ్వర ప్రోక్తాలు.

ఠ. 101 నుంచి 126 వరకు గల శ్లోకాలలోని వేదాలను పఠించకుండా ఉండే విధానం, మనువు చెప్పిన 2.79-81 (104-106) శ్లోకాలకు వ్యతిరేకం. ఈ శ్లోకాలలో మనువు చెప్పిన వేదాధ్యయనాన్ని అనధ్యయనం (చదవరాదు అని) గా చెప్పారు. ఇటువంటి అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా 95 నుంచి 127 వరకు గల అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే !

2. విషయ వ్యతిరేకాలు

క. 101 నుంచి 127 వరకు గల శ్లోకాలు విషయ సంబంధులు కావు. వీటికీ, 'సత్త్వ గుణ వర్ధకా'నికీ ఎటువంటి సంబంధమూ లేదు, వ్రతాలూ కావు. అందుచేత ప్రక్షిప్తాలు. [విస్తృత వివరణకు 4.33-34ల సమీక్ష చూడండి].

ఖ. శిష్యుల వేదాధ్యయనం రెండో అధ్యాయంలోని విషయం [2.44-48 (69-73)], 139 (164), 140-142 (165-166);3.1.2]. అందుకని ఈ శ్లోకాలు కూడా విషయ వ్యతిరేకాలు. ఇక్కడ గృహస్థుల వ్రతాల విషయాలున్నాయి [4.13]. అందుచేత ఇక్కడ శిష్యుల అధ్యాపన - అనధ్యాపనలు, అధ్యయన - అనధ్యయనాలు చెప్పటం విషయానికి వ్యతిరేకం. రెండవ అధ్యాయంలో చెప్పటమే ఉచితం.

3. వేద వ్యతిరేకాలు

99-108 శ్లోకాలలో శూద్రులకు వేదాలు చదివే హక్కు లేదనటం వేదాలకు విరుద్ధం. వేదాలలో శూద్రులు యజ్ఞాలు చేయటం, మంత్ర పఠనం చేయటం అంగీకరించబడింది. [ప్రమాణాలకు 2.42, 9.335 లపై 'వేదవ్యతిరేకాలు' సమీక్షలు చదవండి].

4. శైలీగత ఆధారాలు

క. ఇందులో 103వ శ్లోకంలో 'మను రబ్రవీత్' అనటంతో మనువు కాక మరెవరో చెప్పారని తెలిసిపోతూంది.

ఖ. ఇందులో 101 నుంచి 127వరకు గల శ్లోకాల శైలి సంప్రదాయాలు ఆధారంగా ఉంది. 114,124ల శైలి సహేతుకం కాదు.

సామాన్య విధులు

స్త్రీ సంగమంలో పర్వదిన త్యాగం- ఇది మనుకృతం-ప్రామాణికం

అమావాస్యామష్టమీం చ పౌర్ణమాసీం చతుర్దశీమ్ । మూలశ్లోక సం.**29**
బ్రహ్మచారీ భవేన్నిత్యమప్యృతౌ స్నాతకో ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**128**

టీక:- స్నాతకః ద్విజః = గృహస్థుడైన ద్విజుడి విధి అతడు, **ఋతౌఅపి** = ఋతుకాలమయినా, అమావాస్యాం+ అష్టమీం పౌర్ణమాసం చ చతుర్దశీం = అమావాస్య, అష్టమి, పూర్ణిమ మరియు చతుర్దశి దినాలలో, బ్రహ్మచారీ భవేత్ = బ్రహ్మచారిగా ఉండాలి (స్త్రీ సంగమం వర్జ్యం).

ఋషి దయానందభాష్యం:- అమావాస్య, పౌర్ణమి, అష్టమి, చతుర్దశి తిథులలో స్వభార్య అయినప్పటికీ-ఋతుస్నాతగా ఉన్నప్పటికీ, వేదాధ్యయన పరుడైనవాడు ఆమెతో సంగమించకూడదు. ఈ తిథులు విడిచిపెట్టాలి. (సం.వి.గర్భా.).॥128॥

వివరణ:- ఋతుదానానికి 16 దినాలున్నాయి. అందులో ఆ రోజులలో పౌర్ణమాసి, అమావాస్య, చతుర్దశి మరియు అష్టమి వచ్చినట్లయితే వాటిని విడిచిపెట్టాలి. ఈ నిషిద్ధ దినాలలో స్త్రీ, పురుషులు రతిక్రియ చేయరాదు, 3-45వ శ్లోకాన్ని చూడగలరు.

129-132వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* భోజనానంతరం స్నానాదుల నిషేధం-

* న స్నానమాచరేద్భుక్త్వా నాతురో న మహానిశి ।
న వాసోభిస్సహాజస్రం నావిజ్ఞాతే జలాశయే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***129***

తాత్పర్యం:- రోజువారీ చేసే స్నానం భోజనం ముగించాక చెయ్యకూడదు. అతడు రోగి అయినా గానీ, భోజనానంతర స్నానం నిషిద్ధం. చాలా వస్త్రాలు ధరించి కూడ స్నానం చేయరాదు. (నగ్నంగా అసలేచేయరాదు.) తెలీని జలాశయాలు, మొసళ్లున్న జలాశయాల్లో స్నానం నిషిద్ధం.॥129॥

* **దేవతానాం గురో రాజ్ఞః స్నాతకాచార్యయో స్తథా ।**
నాక్రామేత్కామతశ్ఛాయాం బభ్రుణో దీక్షితస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**130**

తాత్పర్యం:- శిల్పాదిరూపమైన దేవతలు, తల్లి, తండ్రి, గురువు, ఆచార్యుడు, రాజు, విద్యావ్రతస్నాతకుడు, యజ్ఞదీక్షను పూనివున్నవాడు, మొదలైవారి నీడ దాటడం గాని, బుద్ధిపూర్వకంగా తొక్కడం గాని నిషిద్ధం.॥130॥

* **మధ్యందినేఽర్ధ రాత్రే చ శ్రాద్ధం భుక్త్వా చ సామిషమ్ ।**
సంధ్యయో రుభయోశ్చైవ న సేవేత చతుష్పథమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**131**

తాత్పర్యం:- మిట్టమధ్యాహ్నవేళ, అర్ధరాత్రి, మాంసంతో కూడిన శ్రాద్ధ భోజనం చేశాక అక్కడ, ప్రాతః-సాయంకాల ఉభయ సంధ్యల్లోను, నాలుగు రహదార్లు కలిసే కూడలిలోను ఎక్కువసేపు గడపకూడదు.॥131॥

* **ఉద్వర్తనమపస్నానం విణ్మూత్రే రక్తమేవ చ ।**
శ్లేష్మనిష్ఠ్యూతవాంతాని నాధితిష్ఠేత్తు కామతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**132**

తాత్పర్యం:- నూరిపెట్టిన విప్పపిండి, స్నానం చేసిన నీళ్లు, మలమూత్రాలు, రక్తం, కఫం, వాంతి, నమిలి ఉమ్మేసిన తాంబూలాలు తొక్కరాదు. తెలీకతొక్కినప్పుడు నీటితో శుద్ధి చేసుకోవాలి.॥132॥

ప్రక్షిప్తాల పరిశీలన

129-132 వరకు గల శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. విషయ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో చెప్పినవి విషయ సంబంధాలు కావు. ఇవి 'సత్త్వగుణ వర్ధకాల' కు సంబంధించినవీ కావు, వ్రతాలూ కావు. [వివరణ 4.33-34 శ్లోకాలది చూడండి].

2. అంతర్ వ్యతిరేకాలు

131వ శ్లోకంలో మరణించిన వారికి శ్రాద్ధం, మాంసభక్షణ పద్ధతి మనువుకు వ్యతిరేకం. ఈ ఆధారంతో ఈ శ్లోకం ప్రక్షిప్తం. [దీనికి వరుసగా 3.119 నుంచి 284, 4-26-28 శ్లోకాల "అంతర్- వ్యతిరేకాలు" సమీక్ష చూడండి.]

133,134 శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

పరస్త్రీ సేవన నిషేధం, ఇంకా త్యాజ్యవ్యక్తులు-

వైరిణం నోపసేవేత సహాయం చైవ వైరిణః । మూలశ్లోక సం.**29**
అధార్మికం తస్కరం చ పరస్యైవ చ యోషితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**133**

టీక:- గృహస్థుడైన ద్విజుడు, **వైరిణం** = శత్రువును, **వైరిణః సహాయం** = శత్రువుకు సహాయపడు వాడిని, **అధార్మికం తస్కరం చ పరస్య యోషితం** = ధార్మికుడుకాని చోరుడిని, పరాయి స్త్రీని **(న సేవేత)**=కలవరాదు. పరస్త్రీ సంగమం చేయరాదు.

తాత్పర్యం:- గృహస్థ ద్విజుడు శత్రువును, శత్రువుకు సహాయం చేసేవాడిని, అధర్మపరుడిని,దొంగను, పరాయి స్త్రీని కలవరాదు. స్వప్రయోజనాన్ని ఆశించి ఈ పని చేసినప్పటికీ -అవి నింద్యమైనవే. కీడు కలిగించేవే.॥133॥

పర స్త్రీ సంబంధం వల్ల హాని-

ఇది మనుకృతం-ప్రామాణికం

న హీదృశమనాయుష్యం లోకే కిం చన విద్యతే । మూలశ్లోక సం. **31**
యాదృశం పురుషస్యేహ పరదారోపసేవనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **134**

టీక:- గృహస్థ ద్విజుడికి, **ఇహలోకే** = ఈ ప్రపంచంలో, **పురుషస్య అనాయుష్యం యా దృశం కించ న హి విద్యతే** = పురుషుడి ఆయుష్షను తగ్గించడంలో ఇలాంటి కర్మ మరొకటి లేదు, **యాదృశం** = ఎలాంటిదంటే, **పరదారా+ఉపసేవనమ్** = పరస్త్రీసంగమం చేయడం లాంటిది.

తాత్పర్యం:- ఈ ప్రపంచంలో పురుషుడికి పరస్త్రీని కలవడం అనేది ఎంత ఆయుక్షీణమో చెప్పనలవి కాదు. ఆయువును హరించడంలో దీనికంటే మించినది వేరొకటి లేదు.॥134॥

135,136 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** ఈ మూడింటిని అవమానించరాదు-**

* ***క్షత్రియం చైవ సర్పం చ బ్రాహ్మణం చ బ్రహుశ్రుతమ్ ।***
నావమన్యేత వై భూష్ణుః కృశానపి కదాచన ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***135***

తాత్పర్యం:- చేతిలో కాసులేనివాడైనప్పటికీ ఎన్నో విషయాలు తెలిసి ఉన్న బ్రాహ్మణుణ్ణి, పామును, క్షత్రియుణ్ణి అవమానించరాదు. ధన-ధాన్య-పశుసమృద్ధిని కోరేవాడు వీరి విషయమై చాలా జాగరూకుడై మెలగాల్సివుంటుంది.॥135॥

* ***ఏతత్త్రయం హి పురుషం నిర్దహేదవమానితమ్ ।***
తస్మాదేతత్త్రయం నిత్యం నావమన్యేత బుద్ధిమాన్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***136***

తాత్పర్యం:- తమను అవమానపరిచినవారిని ఈ ముగ్గురూ దహిస్తారు. వీరికి గల స్వబుద్ధికుశలత, వీరిచేత అంతపనీ చేయించగలదు. కాబట్టి వీరిని అవమానించరాదు.॥136॥

ప్రక్షిప్తాల పరిశీలన

135-136 శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు-

1. విషయ వ్యతిరేకాలు

ఈ రెండు శ్లోకాలూ విషయ వ్యతిరేకాలు. ఇందులో చెప్పినవి 'సత్త్వగుణ వర్ధనా'నికి సంబద్ధమూ కాదు, వ్రతాలూ కావు. అందుచేత ప్రక్షిప్తాలు. [చూడండి 4.33-34ల సమీక్ష].

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో అవమానించిన బ్రాహ్మణుడు, ఎదుటి వ్యక్తిని భస్మం చేస్తాడనే భయం చూపారు. కానీ 2.137[162] లో మనువు అవమానిస్తే దాన్ని అవమానంగా కాక, అమృతంగా స్వీకరించాలని బ్రాహ్మణులను ఆదేశించాడు. 2.136[161] లో స్వయంగా దుఃఖితులైనా, ఎదుటివారిని దుఃఖ పెట్టరాదనీ చెప్పాడు. ఇక్కడ చెప్పింది దానికి వ్యతిరేకం కనుక, అంతర్ వ్యతిరేకమనే ఆధారంతో ఈ రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

137 నుండి 139వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

మనస్సులోకి రాకూడని ఆత్మహీన భావన-

నాత్మానమవమన్యేత పూర్వాభిరసమృద్ధిభిః । మూలశ్లోక సం.**32**
అమృత్యోః శ్రియమన్విచ్ఛేన్నైనాం మన్యేత దుర్లభామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**137**

టీక:- గృహస్థ ద్విజుడు ఎప్పుడూ, **పూర్వాభిః + అసమృద్ధిభిః** = మొదట పుష్కలంగా ధనముండి తరువాత బీదవాడైనట్లయితే, **ఆత్మానమ్ న + అవమన్యేత** = తనను తాను అవమానించుకోరాదు. అయ్యో మేము నిర్ధనులమైతిమే అని విలపించరాదు. (కింతు) కాని, **అమృత్యోః** = మృత్యుపర్యంతం, **శ్రియమ్ +అన్విచ్ఛన్** = లక్ష్మి యొక్క అభివృద్ధికి పురుషార్థ ప్రయత్నం చేయాలి. మరియు, **ఏనాం దుర్లభాం న మన్యేత** = ధనం దుర్లభమని తలంచరాదు.॥137॥

ఋషి దయానందభాష్యం:- గృహస్థ ద్విజుడు ఎప్పుడూ మొదట్లో పుష్కలంగా ధనం ఉండి, తరువాత వ్యాపారాదుల వల్ల నష్టం సంభవించినప్పటికీ, ద్రవ్యమంతా పోయినా ఆత్మన్యూనత కూడదు. తిరిగి సంపాదించడానికి ప్రయత్నించాలి. దుర్లభమని నిందించుకోరాదు.॥137॥

వివరణ:-అభిప్రాయమేమంటే, ధనహీనపరిస్థితులు వచ్చినప్పుడు లేదా ఆపత్తికాలం ఎదురైనప్పుడు మానవుడు ఎప్పుడు కూడా తన మనస్సులోకి ఆత్మహీనత్వం, నిరాశ భావన రానివ్వరాదు. ఈ భావాలను విడిచిపెట్టి ఎల్లప్పుడూ (సతతం) పురుషార్థం కోసం ప్రయత్నం చేస్తూ ఉండాలి. మానవ జీవన సాఫల్యానికి, అభివృద్ధికి, ఔన్నత్యానికి ఇదే ఆధారం.(సం.వి.గృ.ప్ర.)

సత్యాన్ని ప్రియంగా తెలపడం- ఇది మనుకృతం-ప్రామాణికం

సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్న బ్రూయాత్సత్యమప్రియమ్ । మూలశ్లోక సం.**33**
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**138**

టీక:- **సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్** = ఎల్లప్పుడూ సత్యాన్ని ప్రియంగా చెప్పాలి, **అప్రియం సత్యం న బ్రూయాత్** = అప్రియమైన సత్యాన్ని అంటే **అనృతం చ ప్రియమ్, న బ్రూయాత్** = అసత్యాన్ని ఇతరుల ప్రసన్నత కోసం మాట్లాడరాదు, **ఏషః సనాతనః ధర్మః** = ఇది సనాతన ధర్మం.

ఋషి దయానందభాష్యం:- మానవుడు ఎల్లప్పుడూ సత్యాన్ని ప్రియంగా చెప్పాలి. అప్రియంగా చెప్పకూడదు. అసత్యాన్ని ఇతరుల ప్రసన్నత కోసం మాట్లాడరాదు. ఇతరులకు కల్యాణకారకమైన ఉపదేశం ఇవ్వాలి. గుడ్డివాడిని గుడ్డివాడా అని గాని, మూర్ఖుణ్ణి మూర్ఖుడని గాని ఎదుట పిలువరాదు. అబద్ధాల వల్ల ఎవరో సంతోషపడతారనే భావంతో ఎప్పుడూ అసత్యం చెప్పరాదు. ఇదే సనాతనధర్మం.॥138॥

భద్రవ్యవహారముండాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

భద్రం భద్రమితి బ్రూయాద్భద్రమిత్యేవ వా వదేత్ । మూలశ్లోక సం.**33**
శుష్కవైరం వివాదం చ న కుర్యాత్కేనచిత్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**139**

టీక:- **భద్రం భద్రం +ఇతి బ్రూయాత్** = సదా అందరికీ హితకరమైన మాటనే పలకాలి. **శుష్కవైరం వివాదం చ కేనచిత్ సహ న కుర్యాత్** = ఎవరితోనూ శుష్కవైరం అంటే అపరాధం లేకున్నా విరోధం పెట్టుకోవద్దు. **భద్రం +ఇత్యేవ వా వదేత్** = ఏది ఇతరులకు హితకరమో, వారికి ఇష్టం కాకపోయినా, భద్రం శుభకరం, మంగళం అని చెప్పాలి.

ఋషి దయానందభాష్యం:- సదా అందరికీ హితకరమైన మాటలే పలకాలి. ఎవ్వరితోనూ అపరాధం లేకున్నా విరోధం పెట్టుకోవద్దు. ఏది ఇతరులకు హితకరమో, వారికి ఇష్టం కాకున్నా భద్రం శుభకరం అని చెప్పాలి. (స.ప్ర.4వ.ప్ర.).॥139॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* ఎప్పుడు, ఎవవనితో వెళ్ళరాదు?-

*　*నాతికల్యం నాతిసాయం నాతిమధ్యందినే స్థితే ।*
నాజ్ఞాతేన సమం గచ్ఛేన్నైకో న వృషలై స్సహ ॥　ప్రక్షిప్త శ్లోక సం.**140**

తాత్పర్యం:- మరీ వేకువజామున గానీ, ప్రదోషసమయంలోగానీ, పగలు రెండు జాములవేళప్పుడు గానీ, పాపులతో గానీ, కులశీలాదులు తెలీని కొత్తవారితో గానీ ఎన్నడూ పయనించకూడదు. అకారణంగా అయినా హాని కలిగించే గుణం వీరికి ఉంది.॥140॥

ప్రక్షిప్త పరిశీలన:- ఈ 140వ శ్లోకం కింది ప్రమానాల ద్వారా ప్రక్షిప్తము.

విషయవిరోధము:- ఇది బాహ్యవిషయము. దీనికి సత్వగుణ వర్ధనానికి ఎలాంటి సంబంధమూ లేదు. ఇది ఒక వ్రతమూ కాదు. దాని గురించి విస్తారంగా తెలుసుకోవడానికి 4.33,34 సమీక్షను చూడండి.

హేళన చేయకూడని వారు-　ఇది మనుకృతం-ప్రామాణికం

హీనాంగానతిరిక్తాంగాన్ విద్యాహీనాన్ వయోఽధికాన్ ।　మూలశ్లోక సం.**34**
రూపద్రవ్యవిహీనాంశ్చ జాతిహీనాంశ్చ నాక్షిపేత్॥　ప్రక్షిప్త శ్లోక సం.**141**

టీక:- హీన+అంగాన్ = అంగహీనులను, అతిరిక్తా + అంగాన్ = అధికమైన అంగాలు కలవారిని, విద్యాహీనాన్ = మూర్ఖులను, వయ+అధికాన్ = ఆయుష్షు విషయంలో పెద్దలు, చ = మరియు, రూప-ద్రవ్య-విహీనాన్ = రూపం లేనివారిని, ధనహీనులను, చ = మరియు, జాతిహీనాన్ = తన కంటే తక్కువ వర్ణములవారిని, న ఆక్షిపేత్ = ఎప్పుడూ ఆక్షేపించరాదు. వ్యంగ్యోక్తులాడి అపహాస్యం చేయరాదు. కల్యాణకారకాలైన యజ్ఞం సంధ్య మొ॥ చేయాలి.

తాత్పర్యం:- అంగహీనులను, అధికాంగులను, వయసుచెల్లినవారిని, రూపం, ద్రవ్యంలేనివారిని, జాతి హీనులను ఎప్పుడూ ఆక్షేపింపరాదు. అవమానించరాదు. ॥141॥

142 నుండి 144 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* గోవు మొదలగువాటి మలాలను తాకరాదు-

*　*న స్పృశేత్పాణినోచ్ఛిష్టో విప్రో గోబ్రాహ్మణానలాన్ ।*
న చాపి పశ్యేదశుచి స్సుస్థో జ్యోతిర్గణాన్ దివి ॥　ప్రక్షిప్త శ్లోక సం.**142**

తాత్పర్యం:- భోజనం ముగించాక లేదా మలమూత్రాలు వదిలాక చేతులు పరిశుభ్రపరచుకోకుండా సాటివారిని గాని, గోవులను, బ్రాహ్మణులనుగాని తాకరాదు. అపరిశుద్ధుడై సూర్యచంద్రాదులను చూడరాదు.॥142॥

*　*స్పృష్ట్వైతానశుచిర్నిత్యమద్భిః ప్రాణానుపస్పృశేత్ ।*
గాత్రాణి చైవ సర్వాణి నాభిం ప్రాణితలేన తు ॥　ప్రక్షిప్త శ్లోక సం.**143**

తాత్పర్యం:- విప్రుడొకవేళ ఆ విధంగా చేసినట్లయితే, ఆచమనం చేసి ఈ కింద చెప్పబడిన నిష్కృతి ఆచరించాలి.॥143॥

* **అనాతురః స్వాని ఖాని న స్పృశేదనిమిత్తతః ।**
రోమాణి చ రహస్యాని సర్వాణ్యేవ వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **144**

తాత్పర్యం:- రోగం లేని సమయంలో నిష్కారణంగా తన ఇంద్రియాలను తాకరాదు. రహస్యస్థలాల్లో ఉండే రోమాలను సైతం తాకకూడదు. ॥144॥

ప్రక్షిప్తాల పరిశీలన:- 142 నుండి 144 వరకు గల శ్లోకాలు కింది ఆధారాల ద్వారా ప్రక్షిప్తాలు.

1. విషయవిరోధము:- ఈ శ్లోకాలకు 'సత్వగుణవర్ధనము'తో ఎలాంటి సంబంధం లేదు. ఇది ఒక వ్రతమూకాదు. కావున విషయ విరుద్ధమగుట వలన ఇది ప్రక్షిప్తం. [4.33,34ల విషయ విరోధాన్ని చూడగలరు].

2. శైలీగత ఆధారం:- 142-143 శ్లోకాల శైలి రూఢి, అయుక్తి యుక్తము, నిరాధారము. గవాదులను స్పర్శించి అంగస్పర్శ చేసినచో ఎట్లు శుద్ధి అగును? వాటిని కడిగినచో అగును.

145-149వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

యజ్ఞసంధ్యాది కార్యాలు-

మంగళాచారయుక్తస్స్యాత్ ప్రయతాత్మా జితేంద్రియః । మూలశ్లోక సం. **36**
జపేచ్ఛ జుహుయాచ్చైవ నిత్యమగ్నిమతంద్రితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **145**

టీక:- **మంగళ+ఆచార+యుక్తః** = శుభప్రద కార్య కర్తగా లేదా శ్రేష్ఠమైన ఆచారవంతుడుగా, **ప్రయతాత్మా** = ఉన్నతి కోసం సదా ప్రయత్నించువాడుగా, **జితేంద్రియః స్యాత్** = జితేంద్రియుడుగా ఉండుగాక, **చ** = మరియు, **నిత్యం** = ప్రతిదినం, **అతంద్రితః** = అలసత్వం లేకుండా, **జపేత్** = జపోపాసనలు చేయుగాక!, **చ ఏవ** = అలాగే, **జుహుయాత్** = హవనం చేయుగాక!.

తాత్పర్యం:- మంగళాచారాలతో ఉండేవారికి, నిత్యం పరిశుభ్రంగా ఉండేవారికి, జపం-హోమం మొదలైనవాటిపై శ్రద్ధ గలవారికీ ఎన్నడయినాగాని, మనుషుల వల్లనో, దైవాలవల్లనో ఉపద్రవం కలుగదు. ॥145॥

యజ్ఞసంధ్యాది కల్యాణకారి కార్యాల వల్ల లాభాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

మంగళాచారయుక్తానాం నిత్యం చ ప్రయతాత్మనామ్ । మూలశ్లోక సం. **37**
జపతాం జుహ్వతాం చైవ వినిపాతో న విద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **146**

టీక:- **మంగళ+ఆచార+యుక్తానాం** = ఎవరు సదా కల్యాణకారి కార్యములందు లగ్నమై ఉంటారో, లేదా శ్రేష్ఠమైన ఆచారాలను పాటిస్తుంటారో, **చ** = మరియు, **నిత్యం ప్రయతాత్మనాం** = ఎవరు సదా ఆత్మోన్నతి కోసం ప్రయత్నశీలురుగా ఉంటారో, **చ** = మరియు, **జపతాం** = ఎవరు పరమేశ్వరుణ్ణి జపిస్తుంటారో, **జుహ్వతాం** = ఎవరు హవనం చేస్తుంటారో, వారికి, **వినిపాతః** = అవనతి, **న విద్యతే** = ఉండదు. అంటే వారి జీవితం పతనం వైపు మొగ్గదు.

తాత్పర్యం:- ఎవరు సదా కల్యాణకారి కార్యాలలో లగ్నమై ఉంటారో, ఎవరు సదా ఆత్మోన్నతి కోసం ప్రయత్నశీలురుగా ఉంటారో, ఎవరు పరమేశ్వరుణ్ణి జపిస్తుంటారో, ఎవరు హవనం చేస్తుంటారో, వారికి అవనతి ఉండదు. అంటే వారి జీవితం పతనం వైపు మొగ్గదు.॥146॥

వేదాభ్యాసమే పరమ ధర్మం- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదమేవాభ్యసేన్నిత్యం యథాకాలమతన్ద్రితః । మూలశ్లోక సం.**38**
తం హ్యస్యాహుః పరం ధర్మముపధర్మోఽన్య ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**147**

టీక:- ద్విజుడు నిత్యం, **యథాకాలమ్** = సదా, వీలున్నంతవరకు అధికసమయం, **అతన్ద్రితః** = సోమరితనాన్ని వీడి, **వేదమ్+ఏవ+అభ్యసేత్** = వేదాభ్యాసం చేయాలి. **హి** = ఎందుకంటే, **తం అస్య పరం ధర్మమ్ ఆహుః** = ఆ వేదాభ్యాసమే ద్విజులకు సర్వోత్తమ కర్తవ్యం అని చెప్పబడింది, **అన్యః ఉపధర్మః ఉచ్యతే** = అన్యమైన కర్తవ్యాలన్నీ ఉపధర్మాలు.

తాత్పర్యం:- ద్విజుడు నిత్యకృత్యములయిన తరువాత శ్రేయస్సును కోరి, సోమరితనాన్ని వీడి వేదమునే పఠించాలి. అదే బ్రాహ్మణులకు ముఖ్యధర్మమని, ఇతర కర్తవ్యాలన్నీ అముఖ్యధర్మమనీ పెద్దలంటారు.॥147॥

వేదాభ్యాస కథనం-తత్ఫలితం- ఇది మనుకృతం-ప్రామాణికం

వేదాభ్యాసేన సతతం శౌచేన తపసైవ చ । మూలశ్లోక సం.**39**
అద్రోహేణ చ భూతానాం జాతిం స్మరణి పౌర్వికీమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**148**

టీక:- మానవుడు, **సతతం వేదాభ్యాసేన** = నిరంతరం వేదాన్ని అభ్యసించడం వల్ల, **శౌచేన** = ఆత్మికం అలాగే శారీరక పవిత్రత ద్వారా, **చ** = మరియు, **తపస, ఏవ** = తపస్సు వల్ల, **చ** = అలాగే, **భూతానాం అద్రోహేణ** = ప్రాణుల విషయంలో ద్రోహభావన లేనందువల్ల అంటే అహింసాభావన కలిగి ఉండటం వల్ల, **పౌర్వికీమ్ జాతిం స్మరణి** = పూర్వ జన్మస్థితి స్మరణకు వస్తుంది.

తాత్పర్యం:- మానవుడు ఎల్లప్పుడూ వేదాలన్ని అభ్యసించడం వల్ల, శారీరక పవిత్రత ద్వారా మరియు తపస్సువల్ల, ప్రాణుల విషయంలో దోషభావన లేనందువల్ల పూర్వజన్మ స్థితి స్మరణకు వస్తుంది.॥148॥

వివరణ

యోగదర్శనం ద్వారా జన్మాంతరజ్ఞాన సమర్థన

యోగదర్శనకారుడు 2/29 సూత్రంలో ఈ భావాన్ని సమర్థించాడు.

"అపరిగ్రహస్థైర్యే జన్మకథంతాసంబోధః" అపరిగ్రహంలో అహింస, వేదాది శ్రేష్ఠశాస్త్రాల, శ్రేష్ఠపురుషుల సంగతి, విషయాలలో అనాసక్తి మొ॥ విషయాలున్నాయి. పరిగ్రహమునకు సంబంధించిన ఈ విషయాలలో స్థిరత్వం లభించినప్పుడు, భూత=భావి= వర్తమాన జన్మల, అలాగే జన్మకారణాల జ్ఞానం కలుగుతుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

పౌర్వికీం సంస్మరన్ జాతిం బ్రహ్మైవాభ్యసతే పునః । మూలశ్లోక సం.**40**
బ్రహ్మాభ్యాసేన చాజస్రమనన్తం సుఖమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**149**

టీక:- **పౌర్వికీం జాతిం సంస్మరన్** = పూర్వ జన్మస్థితిని స్మరిస్తూ, **పునః బ్రహ్మ+ఏవ+అభ్యసతే** = మళ్ళీ వేదాభ్యాసం చేస్తున్నట్లయితే, **అనన్తం సుఖం అశ్నుతే** = అనంత మోక్షసుఖాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- పూర్వజన్మస్థితిని స్మరిస్తూ, మళ్ళీ వేదాభ్యాసం చేస్తూ, పరమాత్మను చింతిస్తున్నట్లయితే మోక్షసుఖాన్ని పొందుతాడు.॥149॥

వివరణ:- ఈ విషయాలను ఇంకా తెలుసుకోగోరువారు 12-102 చూడగలరు.

150-153వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

వివిధ ధార్మిక చర్చల విషయాలు-

* *సావిత్రాన్ శాంతిహోమాంశ్చ కుర్యాత్పర్వసు నిత్యశః ।*
పిత్యాంశ్చైవాష్టకాస్వర్చేన్నిత్యమన్వష్టకాసు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **150**

తాత్పర్యం:- పర్వములందు సావిత్రీదేవతాకములైన హోమాలను, అనిష్టనివృత్తికరాలైన శాంతి హోమాలను తప్పక చేయాలి. ఆగ్రహాయణికి బయట మూడు కృష్ణాష్టములయందు అష్టకములను శ్రాద్ధములచేత, దానిలో చేరిన కృష్ణనవములయందు చేయునట్టి అన్వష్టకాశ్రాద్ధములను చేయాలి.॥150॥

* ***దూరాదావసథాన్మూత్రం దూరాత్పాదావసేచనమ్ ।***
ఉచ్ఛిష్టాన్నం నిషేకం చ దూరాదేవ సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **151**

తాత్పర్యం:- ఇంటికి నైరుతిభాగంలో చాలా దూరాన మలమూత్రాలను విసర్జించాలి. తర్వాత పాదప్రక్షాళనం చేయాలి, ఉచ్ఛిష్టాలను, నిషేకాలను ఇంటికి దూరాన చేయాలి.॥151॥

* ***మైత్రం ప్రసాధనం స్నానం దంతధావనమంజనమ్ ।***
పూర్వాహ్ణ ఏవ కుర్వీత దేవతానాం చ పూజనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **152**

తాత్పర్యం:- మలవిసర్జనం, దేహాలంకారం, స్నానం, దంతధావనం, కాటుక పెట్టుకోవడం, దేవయజ్ఞం ఈ క్రియలన్నింటిని ఉదయాన్నే చేయాలి.॥152॥

* ***దైవతాన్యభిగచ్ఛేత్తు ధార్మికాంశ్చ ద్విజోత్తమాన్ ।***
ఈశ్వరం చైవ రక్షార్థం గురూనేవ చ పర్వసు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **153**

తాత్పర్యం:- అమావాశ్యాది పర్వములందు పాషాణాది స్వరూపములైన దేవతలను, ధర్మపరులైన, బ్రాహ్మణోత్తములను, రక్షణ నిమిత్తమై రాజును, తల్లిదండ్రులు మొదలైన పెద్దలను చూసే నిమిత్తం ఎదురెళ్ళాలి.

ప్రక్షిప్తాల పరిశీలన

150 నుంచి 153 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. విషయ వ్యతిరేకాలు

151-153 శ్లోకాలు విషయసంబంధులు కాకపోవటం చేత ప్రక్షిప్తాలు. వీటికి 'సత్త్వ గుణవర్ధకా'లతోనూ, వ్రతరూపాలతోనూ ఏ సంబంధమూ లేదు. [చూడండి 4-33, 34లపై సమీక్ష].

2. అంతర్ వ్యతిరేకాలు

క. 140వ శ్లోకంలో అష్టమీ తిథినాడు మృతుల శ్రాద్ధం చేయటం పద్ధతి అని ఉంది. ఇది మనువుకు వ్యతిరేకం [చూడండి 3.119-284లపై సమీక్ష].

ఖ. మనువు పర్వదినాలలో విశేష యజ్ఞాలు చేయాలని చెప్పాడు[4.25], దేవతల దర్శనాలకు వెళ్లటానికి నిషేధం చెప్పలేదు. మనువు హోమాన్నే "దేవ యజ్ఞం"గా భావించే దేవతలను గురించి చెప్పలేదు [3.70]. అందుచేత ఈ రెండు శ్లోకాలలోని పద్ధతులూ మనువుకు వ్యతిరేకం కనుక ఇవి ప్రక్షిప్తాలు.

154 నుండి 164వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

వృద్ధులకు అభివందనం- స్వాగతం-

అభివాదయే ద్వృద్ధాంశ్చ దద్యాచ్చైవాసనం స్వకమ్ । మూలశ్లోక సం.**41**
కృతాంజలిరుపాసీత గచ్ఛతః పృష్ఠతో౽న్వియాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**154**

టీక:- **వృద్ధాన్** = సదా వయోవృద్ధులకు, విద్యావృద్ధులకు, **అభివాదయేత్** = 'నమస్తే' చెప్పాలి. అంటే వారిని గౌరవించాలి, **స్వకమ్ ఆసనం చ ఏవ దద్యాత్** = వారు మీ వద్దకు వచ్చినప్పుడు లేచి నిలబడి వారిని తమ ఆసనం మీద కూర్చోబెట్టాలి, **కృత+అంజలిః+ఉపాసీత** = చేతులు జోడించి వారివద్ద కూర్చోవాలి. అడిగిన దానికి జవాబివ్వాలి, **గచ్ఛతః పృష్ఠతః + అన్వియాత్** = వెళ్ళేప్పుడు కొంచెం దూరం వెనుకనే వెళ్ళి 'నమస్తే' చెప్పి, వీడ్కోలు పలకాలి.

ఋషి దయానందభాష్యం:- ఇంటికొచ్చిన పెద్దలకు నమస్కరించాలి, గౌరవించాలి. అవకాశం ఉంటే ఆసనం చూపించడమో, తానే లేచి తన ఆసనాన్ని వారికివ్వడమో చేసి చేతులు జోడించి వారి వద్ద కూర్చోవాలి. అడిగినదానికి జవాబు ఇవ్వాలి. వారు వెళ్ళేప్పుడు కొంచెం దూరం వెనుకనే వెళ్ళి 'నమస్తే' చెప్పి, వీడ్కోలు పలకాలి.(సం.వి.గృ.ప్ర.). ॥154॥

సదాచార ధర్మ ప్రశంస-తత్ఫలం- ఇది మనుకృతం-ప్రామాణికం

శ్రుతిస్మృత్యుదితం సమ్యఙ్నిబద్ధం స్వేషు కర్మసు । మూలశ్లోక సం.**42**
ధర్మమూలం నిషేవేత సదాచారమతన్ద్రితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**155**

టీక:- గృహస్థుడు ఎల్లప్పుడు, **అతన్ద్రితః** = అలసత్వాన్ని విడిచి, **శ్రుతి-స్మృతి+ఉదితం** = వేదాలలో, ధర్మశాస్త్రాలలో, వేదానుకూలంగా చెప్పిన, **స్వేషు కర్మసు సమ్యఙ్ నిబద్ధం** = తన కర్మల యందు కూడా చెప్పబడిన, **ధర్మమూలం సదాచారం నిషేవేత** = ధర్మానికి ఆధారమైన సదాచారాన్ని, అంటే ఏది సత్యమో, సత్పురుషులు, ఆప్తులు ఆచరించినదేదో, అదే సదాచారం, అలాంటి దాన్ని ఆచరించాలి.

ఋషి దయానందభాష్యం:- వేదస్మృతులలో లెస్సగా చెప్పబడినదీ, స్వకర్మలను అధ్యయనంగా చెప్పబడినదీ, ధర్మాలకు కారణమైన ఆచారములుగా చెప్పబడినవీ ఈవన్నీ సోమరితనం లేకుండా సదా అనుష్ఠించాలి. (సం.వి.గృ.ప్ర). ॥146॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆచారాల్లభతే హ్యాయు రాచారాదీప్సితాః ప్రజాః । మూలశ్లోక సం.**43**
ఆచారా ద్ధనమక్షయ్య మాచారో హన్త్యలక్షణం ॥ ప్రక్షిప్త శ్లోక సం.**156**

టీక:- **ఆచారాత్ హి ఆయుః** = ధర్మాచరణం వల్ల దీర్ఘాయుష్షు, **ఆచారాత్+ఈప్సితాః ప్రజాః** = ధర్మాచరణ వల్లనే ఉత్తమ సంతానం, **ఆచారాత్ అక్షయ్యం ధనం** = ధర్మాచరణ వల్లనే అక్షయ ధనం, **లభతే** = లభిస్తుంది, **ఆచారః అలక్షణమ్ హన్తి** = ధర్మాచరణం అధర్మం వల్ల వచ్చే చెడులక్షణాలను నష్టపరస్తుంది.

ఋషి దయానందభాష్యం:- ధర్మాచరణ వల్ల వేదోక్తమైన దీర్ఘాయువులభిస్తుంది. దీనివల్ల కోరిన సంతానం కలుగుతుంది. ఆచారం వల్ల తరగని ధనం లభిస్తుంది. ధర్మాచరణం వల్లనే అశుభాలన్నీ రూపుమాసిపోతాయి.

అందువల్ల మిథ్యాభాషణరూపమైన అధర్మాన్ని విడిచిపెట్టిన వారికి ధర్మాచరణం, బ్రహ్మచర్యం, జితేంద్రియత్వం ద్వారా పూర్ణాయుష్యము, మరియు ధర్మాచరణం ద్వారా ఉత్తమ సంతతి, అలాగే అక్షయ ధనం ప్రాప్తిస్తుంది. ఎవరు ధర్మాచరణపరులై దుష్టలక్షణాలను నాశనం చేస్తున్నారో వారి ఆచరణాన్ని సదా అనుసరింతురు గాక! (సం.ప్ర.4వ.సము.). ॥147॥

దురాచారాల వల్ల హాని- ఇది మనుకృతం-ప్రామాణికం

దురాచారో హి పురుషో లోకే భవతి నిన్దితః । మూలశ్లోక సం. **44**
దుఃఖభాగీ చ సతతం వ్యాధితోఽల్పాయురేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **157**

టీక:- **దురాచారః హి పురుషః** = దుష్టాచారియైన పురుషుడు, **లోకే నిన్దితః** = లోకం, సజ్జనుల మధ్య నిందకు పాత్రుడవుతాడు, **దుఃఖభాగీ** = దుఃఖాన్ని పొందుతాడు, **చ** = మరియు, **సతతం వ్యాధితః** = నిరంతరం వ్యాధిగ్రస్తుడై, **అల్పాయుః ఏవ భవతి** = అల్పాయుష్కుడవుతాడు.

ఋషి దయానందభాష్యం:- ఇక దురాచారుడైనవాడి స్థితిని చెబుతున్నాడు. ఇటువంటి దురాచారి లోకనిందకు పాత్రుడు, తరగని దుఃఖాలనుభవిస్తాడు., అల్పాయుష్కుడు, నిరంతరం రోగి అవుతాడు. అందుకే సదాచారాలను అవలభించాలని విజ్ఞులంటారు.(స.ప్ర. 4వ.సము.).

దుష్టాచారియైన వాడు, సర్వత్ర నిందలనుభవించి, దుఃఖాలపాలై, వ్యాధిగ్రస్తుడై, అల్పాయుష్ను కలిగి, ఉంటాడు (సం.వి.గృ.ప్ర.).॥157॥

ఇది మనుకృతము-ప్రామాణికం

సర్వలక్షణహీనోఽపి యస్సదాచారవాన్నరః । మూలశ్లోక సం. **45**
శ్రద్ధధానోఽనసూయశ్చ శతం వర్షాణి జీవతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **158**

టీక:- **యః** = ఎవడు, **సర్వలక్షణ హీనః+అపి సదాచారవాన్** = సర్వశుభ లక్షణాలు లేని వాడైనా, **శ్రద్ధధానః** = సత్యాన్ని శ్రద్ధతో పాటిస్తూ, **అనసూయః** = నింద మొ॥ దోషాలు లేనివాడు, అతడు, **శతం వర్షాణి జీవతి** = సుఖంగా నూరు సంవత్సరాల పర్యంతం జీవిస్తాడు (సం.వి. 179).

ఋషి దయానందభాష్యం:- సర్వశుభలక్షణాలు లేకపోయినప్పటికీ, ఎవరు సదాచార సంపన్నులో, ఎవరు శ్రద్ధగలవారో, అసూయ, ఈర్ష్య, కోధం మొదలైన దుర్లక్షణాలు లేనివారో అలాంటి వారు సుఖంగా నిండు నూరేళ్లు జీవిస్తారు. (సం.వి.గృ.ప్ర.). ॥158॥

పరవశకార్యాల త్యాగం- ఇది మనుకృతం-ప్రామాణికం

యద్యత్పరవశం కర్మ తత్తద్యత్నేన వర్జయేత్ । మూలశ్లోక సం. **46**
యద్యదాత్మవశం తు స్యాత్తత్తత్సేవేత యత్నతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **159**

టీక:- మానవుడు, **యత్ యత్ పరవశం కర్మ** = ఏదేది పరవశమైన కర్మో, **తత్ తత్ యత్నేన వర్జయేత్** = ఆ యా కర్మలను ప్రయత్నించి వదిలివేయాలి, **యత్ యత్ ఆత్మవశం తు స్యాత్** = ఏదేది స్వాధీనమైన కర్మో, **తత్ తత్ యత్నతః సేవేత** = అలాంటి కర్మలను ప్రయత్నించి సాధించాలి.

ఋషి దయానందభాష్యం:- ఏ యే పనులు, ఇతరులను ప్రార్థించడం వల్ల సాధించుకోవలసి వస్తుందో వాటిని వీలైనంతవరకు విడిచిపెట్టాలి. తన స్వశక్తిపై ఆధారపడి చేయగలిగినవాటినే, ప్రయత్నించి సాధించాలి. పరాధీన కర్మలను విడిచిపెట్టి, స్వాధీన కర్మలను ప్రయత్నించి చేయాలని భావం (సం.వి.గృ.ప్ర.). ॥159॥

సుఖ-దుఃఖ లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖమ్ । మూలశ్లోక సం. **47**
ఏతద్విద్యాత్సమాసేన లక్షణం సుఖదుఃఖయోః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **160**

టీక:- ఎందుకంటే, **పరవశం సర్వం దుఃఖం** = ఇతరుల వశమందు ఉండటం అంతా దుఃఖమే, **ఆత్మవశం సర్వమ్ సుఖమ్** = స్వతంత్రంగా ఉండటం సర్వమూ సుఖమే, **ఏతత్ సమాసేన సుఖ దుఃఖయోః లక్షణం విద్యాత్** = సంక్షేపంగా ఇదే సుఖదుఃఖాలకు లక్షణం.॥160॥

ఋషి దయానందభాష్యమ్:- ఇతరుల వశమందు ఉండటం అంతా దుఃఖమే. స్వవశమైనది సర్వమూ సుఖకరం. సుఖదుఃఖాలకు ముఖ్యకారణం ఇదేనని సంక్షిప్తంగా తెలియవలసి ఉన్నది. కారణమేమంటే పరుల అధీనంలో ఉండటమే దుఃఖం. స్వతంత్రంగా ఉండటమే సుఖమని తెలిసికోవాలి (స.ప్ర. 4వ.సము.). ॥160॥

ప్రసన్నతను కలిగించే కర్మనే చేయాలి-
ఇది మనుకృతం-ప్రామాణికం

యత్కర్మ కుర్వతోఽస్య స్యాత్పరితోషోఽన్తరాత్మనః । మూలశ్లోక సం.48
తత్ప్రయత్నేన కుర్వీత విపరీతం తు వర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.161

టీక:- యత్ కర్మ కుర్వతః = ఏ పని చేయడం వల్ల, **అస్య అన్తరాత్మనః పరితోషః స్యాత్** = మనుషుడి అంతరాత్మకు సంతోషం కలుగునో అనగా భయంగాని, సందేహంగాని, సిగ్గుగాని కలుగదో, **తత్ ప్రయత్నేన కుర్వీత** = ఆ యా కర్మలను ప్రయత్నించి చేయుదురుగాక ! **విపరీతం తు వర్జయేత్** = ఏ పని చేయడంలో సంతుష్టి కలుగదో, భయం కలుగుతుందో, సిగ్గుగా ఉంటుందో ఆ పని చేయరాదు.

తాత్పర్యం:- ఏ పని చేయడం వల్ల, మనస్సుకు ఆహ్లాదం సంతోషం, కలుగుతుందో, అలాంటి పనిని, ప్రయత్నంతో చేయాలి. ఏ పని చేయడంలో సంతృప్తి, సంతోషం కలుగదో అలాంటి పని చేయరాదు. ॥161॥

వివరణ:- ఆత్మకు ప్రసన్నకారకాలైన పనులేవో 1-125వ శ్లోకంలో గల "ఆత్మ నస్తుష్టిరేవచ" శీర్షికలో గల వివరణను చూడగలరు.

తల్లి-తండ్రి-ఆచార్యాదులను హింసించరాదు
ఇది మనుకృతం-ప్రామాణికం

ఆచార్యం చ ప్రవక్తారం పితరం మాతరం గురుమ్ । మూలశ్లోక సం.49
న హింస్యాద్బ్రాహ్మణాన్ గాశ్చ సర్వాంశ్చైవ తపస్వినః ॥ ప్రక్షిప్త శ్లోక సం.162

టీక:- ఆచార్యం, ప్రవక్తారం పితరం మాతరం గురుమ్ బ్రాహ్మణాన్ గాః చ సర్వాన్ తపస్వినః చ ఏవ = వేదాన్ని చదివించే ఆచార్యుడిని, వేద ప్రవచనం చేసేవారిని (2.140) తండ్రిని, తల్లిని, గురువును (2.142), బ్రాహ్మణుడిని బ్రహ్మజ్ఞానిని, గోవును, తపస్సు చేసేవారిని, **న హింస్యాత్** = హింసించరాదు. వారికి ప్రతికూలంగా ఏ పని చేయరాదు.

తాత్పర్యం:- ఉపనయనం చేయించి- వేదాభ్యాసం ప్రారంభించే ఆచార్యుడిని, వేదాలకు భాష్యాలు చెప్పేవారిని, తల్లిని, తండ్రిని, కొద్దో-గొప్పో చదువు చెప్పే గురువును, సాటి బ్రాహ్మణుడిని, గోవును తపస్సు చేసేవారిని హింసించరాదు, వారికి ప్రతికూలంగా ఏపనీ చేయరాదు.॥162॥

నాస్తికత్వం, వేద నింద మొ॥ నిషిద్ధ కర్మలు-
ఇది మనుకృతం-ప్రామాణికం

నాస్తిక్యం వేదనిందాం చ దేవతానాం చ కుత్సనమ్ । మూలశ్లోక సం.50
ద్వేషం దంభం చ మానం చ క్రోధం తైక్ష్ణ్య చ వర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.163

టీక:- **నాస్తిక్యం వేదనిందాం చ దేవతానాం కుత్సనమ్** = నాస్తికత్వం, వేదనింద మరియు విద్వాంసుల నింద, **ద్వేషం చ దమ్భం చ మానం చ క్రోధం చ తైక్ష్ణ్యం చ వర్జయేత్** = ద్వేషం, గర్వం, నిర్బంధం పాటించడం, క్రౌర్యం మొ॥వాటిని త్యజించాలి.

తాత్పర్యం:- నాస్తికత్వబుద్ధిని విడనాడాలి. వేదాలను-విద్వాంసులను నిందించకూడదు. ద్వేషం,కోపం, దంభం,నిశ్చబ్దం పాటించడం, క్రౌర్యం మొదలగువాటిని వదిలేయాలి.॥163॥

కేవలం శిక్షణార్థమే శిష్యుణ్ణి దండించాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

పరస్య దండం నోద్యచ్ఛేత్క్రుద్ధో నైవ నిపాతయేత్ । మూలశ్లోక సం.**51**
అన్యత్ర పుత్రాచ్ఛిష్యాద్వా శిష్ట్యర్థం తాడయేత్తు తౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**164**

టీక:- **పుత్రాత్ వా శిష్యాత్ అన్యత్ర** = పుత్రుడిని, శిష్యుడిని మినహాయించి, **పరస్య దండం న+ఉద్యచ్ఛేత్** = ఇతరులైన ఏ వ్యక్తి పైకి కర్రఎత్తరాదు. అంటే, దండంతో కొట్టరాదు, **క్రుద్ధః ఏవ న నిపాతయేత్** = కోపమొచ్చినా కొట్టరాదు, వధించరాదు, **తౌ తు శిష్ట్యర్థం తాడయేత్** = ఆ పుత్ర, శిష్యులను కూడా కేవలం శిక్షణ కోసం మాత్రమే దండించాలి.

ఋషి దయానందభాష్యం:- పుత్రుడిని, శిష్యుడిని మినహాయించి ఎవర్నీ కర్రతో కొట్టడంగాని- కొట్టడానికి కర్ర పైకెత్తడం గాని కూడదు. కోపం వచ్చినా, నేరాలు చేసినాగాని, ఆ నేరానికి తగినట్లు వారిని బెత్తంతోగానీ, వెదురుకర్రతోగాని కొట్టరాదు, వధించరాదు. పుత్ర, శిష్యులను కూడా కేవలం శిక్షణ కోసం మాత్రమే దండించాలి. కానీ తల్లి-తండ్రి మరియు అధ్యాపకుడు మొ॥ వారు ఈర్ష్యతో గానీ ద్వేషంతో గానీ బెత్తంతో గానీ కొట్టరాదు. పైకి భయం చూపిస్తూ, హృదయంలో దయాగుణం ఉండాలి (స.ప్ర.2 స).॥164॥

వివరణ:- ఈ సందర్భంలో 4.175వ శ్లోకాన్ని చూడండి.

165 నుండి 169వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** బ్రాహ్మణ హింస వల్ల నరక ప్రాప్తి-**

* *బ్రాహ్మణాయావగూర్యైవ ద్విజాతిర్వధకామ్యయా ।*
శతం వర్షాణి తామిస్రే నరకే పరివర్తతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***165***

తాత్పర్యం:- సాటి బ్రాహ్మణుడిని వధించాలనో-దండించాలనో ప్రయత్నించి కర్రనో, కత్తినో పైకెత్తినాగాని తామిస్రమనే [4.88] నరకలోకంలో వందేళ్లపాటు నానా క్లేశాలు అనుభవించాలి.॥165॥

* *తాడయిత్వా తృణేనాపి సంరంభాన్మతిపూర్వకమ్ ।*
ఏకవింశతమాజాతీః పాపయోనిషు జాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***166***

తాత్పర్యం:- కోపంచేత ఏ వర్ణంవారైనా బ్రాహ్మణుణ్ణి, గడ్డిపరక తీసుకొని బెదిరించినా ఇరవై జన్మలు నీచయోనులలో పుట్టవలసి ఉంటుంది.॥166॥

* *అయుధ్యమానస్యోత్పాద్య బ్రాహ్మణస్యాసృగంగతః ।*
దుఃఖం చ మహదాప్నోతి ప్రేత్యాప్రాజ్ఞతయా నరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***167***

తాత్పర్యం:- తనమీద యుద్ధానికి సిద్ధపడని బ్రాహ్మణుణ్ణి ఏ కారణం చేతనయినా రక్తం కారేలా గాయం చేసేవాడు నరకంలో పడే యాతనలు ఇన్ని అని చెప్పబడనివి.॥167॥

* *శోణితం యావతః పాంసూన్ సంగృహ్ణాతి మహీతలాత్ ।*
తావతో-బ్దానముత్రాన్యై శ్శోణితోత్పాదకో-ఽద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***168***

తాత్పర్యం:- ఈ విధంగా రక్తం కారేలా బ్రాహ్మణుడిని కొట్టినట్లయితే, ఆ రక్తం భూమ్మీద ఎన్ని ఇసుకరేణువుల్ని తడుపుతుందో అంతకాలం ఆ గాయాలు చేసినవాడిని నరకంలో నక్కలు పీక్కుతింటాయి.॥168॥

* **న కదాచిద్ద్విజే తస్మాద్విద్వానవగురేదపి ।**
న తాడయేత్తృణేనాపి న గాత్రాత్ స్రావయేదసృక్॥ ప్రక్షిప్త శ్లోక సం.***169***

తాత్పర్యం:- అందుచేతనే-బ్రాహ్మణుని బాధించినందువల్ల ఎన్నెన్ని నరకాల పాలవ్వాల్సి వస్తుందో తెలిసిన విద్వాంసులు బ్రాహ్మణులను తృణంతో నైనా బెదిరించడానికి వెనుకాడతారు. ఇక రక్తం కారేలా కొట్టడానికేల సాహసిస్తారు?॥169॥

ప్రక్షిప్తాల పరిశీలన:- 165 నుండి 169 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు.

1. **అంతర్వ్యతిరేకాలు:-** 165 శ్లోకంలో తెలుపబడిన నరకవిషయం మనువిరుద్ధము. మిగతా 166-169 శ్లోకాలు కూడా పై శ్లోకానికి అనుబంధం కావడం వలన ఇవి యూ ప్రక్షిప్తాలే. దీనికి విశేష సమీక్షను 4.80-91 శ్లోకాలపై వ్రాసిన అంతర్వ్యతిరేకాల శీర్షికలో చదువగలరు.

170 నుండి 180వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

అధర్మం నిందనీయం-తత్ఫలం దుఃఖప్రాప్తి-

అధార్మికో నరో యో హి యస్య చాప్యనృతం ధనమ్ । మూలశ్లోక సం.**52**
హింసారతశ్చ యో నిత్యం నేహాసా సుఖమేధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**170**

టీక:- యః అధార్మికః నరః = ఎవడు అధార్మికుడైన మానవుడో, **చ** = మరియు, **యస్య హి అనృతం ధనమ్** = ఎవడు అసత్యంతో, (అబద్ధాలాడి) ధనాన్ని సంపాదిస్తాడో, **యో నిత్యం హింసారతః** = ఎవడు నిత్యం హింసారతుడో, వైర ప్రవృత్తుడో, **అసౌ** = అతడు, **ఇహ** = ఈ లోకంలోనూ పరలోకంలోనూ అంటే పరజన్మలో కూడా, **సుఖం న ఏ ధతే** = సుఖాన్ని పొందజాలడు.

ఋషి దయానందభాష్యం:-ఎవడు అధార్మికుడైన మానవుడో మరియు అసత్యంతో ధనాన్ని సంపాదించాడో, నిత్యం వైరప్రవృత్తుడో అతడు ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాన్ని పొందలేదు.(సం.వి.గృ.ప్ర.).॥170॥

ఇది మనుకృతం-ప్రామణికం

న సీదన్నపి ధర్మేషు మనోఽధర్మే నివేశయేత్ । మూలశ్లోక సం.**53**
అధార్మికాణాం పాపానామాశు పశ్యన్ విపర్యయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**171**

టీక:- అధార్మికాణాం పాపానాం ఆశు విపర్యయమ్ = అధార్మికులైన పాపులకు (4.56)వ శ్లోకంలో వివరించినట్లు పాపం వల్ల వారికి ఉన్నతి, ధనసమృద్ధి కలిగినా, శీఘ్రంగా వారికి వినాశం కలుగుతుంది, **పశ్యన్** =ఆ విపర్యయాన్ని చూసి, **ధర్మేషు సీదన్+అపి** = ధర్మాచరణ వల్ల బాధపడుతూ కూడా, **అధర్మే మనః న నివేశయేత్** = అధర్మంలో మనస్సు ఉంచరాదు. అంటే ధర్మాన్నే పాటించాలి.

తాత్పర్యం:- స్వధర్మం నిర్వర్తించడం ద్వారా తాను లేమిచేత బాధలు అనుభవిస్తూన్నా; పాపం వలన తాత్కాలికంగా సుఖం కలిగి-పరలోకంలో కష్టం కలిగించే అధర్మకార్యాల పట్ల విద్వాంసులు ఆసక్తి చూపరు.॥171॥

ఇది మనుకృతము-ప్రామాణికము

నాధర్మశ్చరితో లోకే సద్యః ఫలతి గౌరివ । మూలశ్లోక సం.**54**
శనైరావర్తమానస్తు కర్తుర్మూలాని కృంతతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**172**

టీక:- మనుష్యుడు నిశ్చితంగా తెలిసికోదగినది ఏమంటే, **లోకే** = ఈ ప్రపంచంలో, **గౌః+ఇవ** = ఏ విధంగా గో సేవకు ఫలితం, పాలు వెంటనే లభించునో, ఆ విధంగానే, **చరితః అధర్మః సద్యః న ఫలతి** = చేసిన పాపానికి, (అధర్మం) ఫలితం వెంటనే రాదు, **తు** = కాని, **శనైః కర్తుః ఆవర్తమానః** = మెల్లమెల్లగా అధర్మం సుఖాలను ఆపుతూ, **మూలాని కృన్తతి** = సుఖమూలాలను, కోసివేస్తుంది. తరువాత పాపి దుఃఖాలనే పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:- ఈ ప్రపంచంలో ఏ విధంగా గో సేవకు ఫలితం పాలు వెంటనే లభించునో అలాగే, చేసిన పాపానికి ఫలితం వెంటనే రాదు. మెల్ల మెల్లగా అధర్మం వల్ల పొందిన సుఖాలను, సుఖాల మూలాలను కోసేస్తుంది. చేసిన పాపం నిష్ఫలం కాదు. ఎప్పుడు పాపం చేస్తాడో, అప్పుడే ఫలం లభించదు. అందువల్ల అజ్ఞానులు పాపానికి భయపడరు. అయినా, అధర్మాచరణం మెల్లమెల్లగా మీ సుఖ మూలాలను ఒక్కొక్కటిగా కోస్తూ పోతుంది. (స.ప్ర.4వ సము.). ॥172॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యది నాత్మని పుత్రేషు న చేత్పుత్రేషు నప్తృషు । మూలశ్లోక సం.**55**
న త్వేవ తు కృతోఽధర్మః కర్తుర్భవతి నిష్ఫలః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**173**

టీక:- యది న+ఆత్మని = పాప (అధర్మం) ఫలితం కర్త యొక్క జీవిత కాలంలో లభించనట్లయితే, **పుత్రేషు** = పుత్రులకు, **న చేత్ నప్తృషు** = పౌత్రులకు లభిస్తుంది. పుత్రుల సమయంలో లభించనట్లయితే, మనుమల సమయంలో తప్పక వస్తుంది. **తు**= కాని, **న ఏవతు కర్తుః అధర్మః నిష్ఫలః భవతి** = కర్త చేసిన పాపానికి ఫలితం రాకుండా ఎప్పటికీ ఉండదు. అంటే తప్పక ఫలితం వచ్చి తీరుతుంది. అనుభవించక తప్పదు.

ఋషి దయానందభాష్యం:- అధర్మం వల్ల తనకు జీవితకాలంలో హాని కలిగించకపోయినప్పటికీ- తన పుత్ర-పౌత్ర-ప్రపౌత్రుల తరాలలోనైనా పాప అధర్మ ఫలితాన్ని చూపిస్తూందేగాని వృథాగా పోదు.

"అవశ్యమనుభోక్తవ్యః కృతం కర్మశుభాశుభమ్"

వివరణ:

కర్మ ఫలభోక్త ఎవరు? 4.240వ శ్లోకంలో కర్మ చేసినవాడే (కర్తయే) సుకృతం గాని, దుష్కృతం గాని అనుభవిస్తాడని చెప్పబడింది. ఇక్కడ చేసిన అధర్మ ఫలం పుత్రులకు, పౌత్రుల వరకు అనుభవించాలని చెప్పబడింది. ఇది పరస్పర విరోధం కాదా? అని ప్రశ్న. సమాధానం ఇందులో పరస్పర విరోధం లేదు. అక్కడ వ్యక్తిగత రూపంగా చేసిన సుకృత దుష్కృతాలకు ఫలితం వ్యక్తిగత రూపంగా కర్తే అనుభవించవలసి వస్తుంది. కానీ ఇక్కడ ప్రసంగం, అధర్మ పూర్వకంగా భోగాలను సంగ్రహించడం (4.170, నుండి 174 వరకు), వ్యక్తి హింస, అధర్మం మొ॥ వాటికి సంబంధించినది (4.170). హింస ద్వారా, అధర్మంగా ధనసంగ్రహం చేసేవాడు. అతడు అనుకోకుండా ఒక్కసారిగా ధనవంతుడవుతున్నట్లు కనిపిస్తాడు. కానీ చివరకు సమూలంగా నష్టపడిపోయి వినాశరూపంలో పాపఫలాన్ని అనుభవించవలసి వస్తుంది. (4.170). అధర్మం, హింసాదులచే ప్రాప్తించిన ధనాన్ని అనుభవించడంలో పాల్గొనే పుత్ర, పౌత్రాదులు కూడా అధర్మంలో భాగస్వాములే. కాబట్టి తత్ఫలాన్ని వారు కూడా అనుభవించవలసి ఉంది. ఇందుకు ఉదాహరణ- హింసా ప్రసంగంలో మను ఆలోచనను (5-51)వ శ్లోకంలో గమనించగలరు. (పాపఫలితాన్ని అనుభవించే పాపులు 8 మంది) పాపధనాన్ని అనుభవించినవారందరూ పాపఫలితాన్ని అనుభవించక తప్పదు. [4.240] కానీ కర్త అనుభవించదగిన స్వీయఫలాన్ని ఎవరూ పంచుకోజాలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

అధర్మేణైధతే తావత్తతో భద్రాణి పశ్యతి । మూలశ్లోక సం.**56**
తతస్సపత్నాన్ జయతి సమూలస్తు వినశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**174**

టీక:- తావత్ అధర్మేణ+ఏధతే = ఎప్పుడు మనుషుడు అధార్మికుడై ధర్మ మర్యాదను విడిచిపెట్టి చెరువు కట్టను తెంచుకొని నీళ్ళు నలువైపులా వ్యాపించినట్లుగా, కపటం, దంభం, రక్షించే వేదాల ఖండనం మరియు మిథ్యాభాషణాది కర్మల ద్వారా పరాయివారి పదార్థాలను తీసికొని, మొదట అభివృద్ధి చెందుతూ, **తతః** = పశ్చాత్, **భద్రాణి పశ్యతి** = ధనాది ఐశ్వరాల ద్వారా అన్నపానాలు, వస్త్రాభూషణాలు, యానములు, స్థానములు, మానమర్యాదలు మొ॥ వాటిని పొందుతాడు. **తతః** = తరువాత, **సమూలఃతు వినశ్యతి** = అధర్మి వేరు తెగిన వృక్షం లాగా శీఘ్రంగా నష్టమైపోతాడు.

ఋషి దయానందభాష్యం:- ఎంతవరకు అధర్మం వల్ల జరిగే పాపం పరిపక్వం కాదో అంతవరకు ఆ పాపం చేసేవాడికి తాత్కాలికంగా భోగభాగ్యాలు అనుభవించే స్థితి ఉండొచ్చు! శత్రుజయం కూడ కలుగవచ్చు! కానీ, పాపఫలితం అంటూ ఒకసారి అనుభవంలోకి వచ్చాక, అంతా వినాశమే! (స.ప్ర.4వ.సము.) ॥174॥

వివరణ: అధర్మం దుఃఖానికి కారణం. ధర్మం సుఖకారణం. సమర్థన శ్లోకం (6-64).

సత్య ధర్మాలను పాటించండి- ఇది మనుకృతం-ప్రామాణికం

సత్యధర్మార్యవృత్తేషు శౌచే చైవారమేత్సదా । మూలశ్లోక సం.**57**
శిష్యాంశ్చ శిష్యాద్ధర్మేణ వాగ్బాహూదరసంయతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**175**

టీక:- ఇందువలన మానవుడి ధర్మమేమంటే, **సత్యధర్మ+ఆర్య+వృత్తేషు** = సత్యధర్మం, ఆర్య ఉత్తమ పురుషుల ఆచరణాదులందు, **చ** = మరియు **శౌచే** = బాహ్యాభ్యన్తర పవిత్రత యందు, **సదా ఆరమేత్** = సదా శ్రద్ధ కలిగి ఉండాలి. **వాక్+బాహు+ఉదర+సంయతః చ ధర్మేణ** = తన వాక్కును, బాహువులను, ఉదరమును నియమించుకొని, సత్యధర్మాలలో ప్రవృత్తుడై, **శిష్యాన్** = శిష్యులకు విద్యాదీక్షలను బోధించాలి.

ఋషి దయానందభాష్యం:-వేదోక్త సత్యధర్మాలను పక్షపాతరహితుడై, సత్యాన్ని స్వీకరించి, అసత్యాన్ని విడిచిపెట్టి న్యాయరూపమైన వేదోక్త ధర్మాన్ననుసరిస్తూ సమాన ధర్మంతో, శిష్యులకు శిక్షాదీక్షల నివ్వాలి. (స.ప్ర.4వ. సము).

గృహస్థులు సత్యం, ధర్మం, ఆర్యుల, ఆప్తపురుషుల వ్యవహారం, శౌచం- పవిత్రత మొ॥ విషయాలలో శ్రద్ధాళువులై ప్రవర్తించాలి. సత్యవాణిగలవారై భోజనాదులందు లోభం చేయక, హస్తపాదాదుల కుచేష్టలను త్యజించి ధర్మంగా శిష్యులకు, సంతానానికి ఉత్తమ విద్యను నేర్పించాలి. (స.వి.4వ.సము.). ॥175॥

ధర్మవర్జిత అర్థకామాలను వదలాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

పరిత్యజేదర్థకామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ । మూలశ్లోక సం.**58**
ధర్మం చాప్యసుఖోదర్కం లోకవిక్రుష్టమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**176**

టీక:- అర్థకామౌ యౌ ధర్మవర్జితౌ స్యాతాం పరిత్యజేత్ = ఎక్కువ ధనం, గొప్ప రాజ్యం, ఎక్కువ కోరికలు అధర్మం ద్వారా సిద్ధించినా, అలాంటి అధర్మాన్ని పూర్తిగా త్యజించాలి, **చ** = మరియు, **ధర్మం అపి+అసుఖోదర్కం** = వేదవిరుద్ధమైన ధర్మాభాసమును అనుసరించినందు వల్ల దుఃఖం మరియు, **లోకవికృష్టమ్ ఏవ** = ప్రపంచ ఉన్నతికి నష్టం కలిగించే ధర్మాన్నీ, కర్మనూ ఎప్పుడూ చేయరాదు.

ఋషి దయానందభాష్యం:- ఎక్కువ ధనం, గొప్పరాజ్యం, పెక్కు కోరికలు అధర్మం వల్ల సిద్ధించినా అలాంటి అధర్మాన్ని పూర్తిగా త్యజించాలి. వేదవిరుద్ధమైన అధర్మాన్ని అనుసరించినందువల్ల దుఃఖం కలుగుతుంది. ప్రపంచ ఉన్నతికి నష్టం కలిగించే ధర్మాన్నీ కర్మనూ ఎప్పుడూ చేయరాదు. (సం.వి.గృ.ధ.). ॥176॥

వివరణ:

ధర్మవర్జిత అర్థం:- ధర్మవిరుద్ధాలైన ధనాది పదార్థాలను, కామమును వెంటనే పూర్తిగా విడిచిపెట్టాలి, ధర్మాభాసం ఉత్తరకాలంలో దుఃఖదాయక నిందిత కర్మలున్నవో వీటికి దూరంగా ఉండాలి.

1. ఈ శ్లోకోక్త విషయాలు సోదాహరణంగా స్పష్టం చేయబడుతున్నవి.

క. **'ధర్మవర్జితః' అర్థం:** దొంగతనం, దోపిడి, మోసం మొ॥ వాటి ద్వారా లభించిన ధనం (4.2,3, 4,8.25-31).

ఖ. **ధర్మవర్జితకామం:** అతి విషయాసక్తి 4.9, పరస్త్రీ గమనం.4.30, 31 బాల్యంలో వివాహం 3.1-4 పర్వదినంలో, ఋతుకాలాన్ని అతిక్రమించి స్త్రీ సమాగమం విధిరహిత నియోగం 9.25,27, 3.25,4 మొదలైన కార్యాలన్నీ ధర్మవిరుద్ధాలైన కామభావనలకు చెందినవి.

గ. **ఉత్తరకాలంలో సుఖంలేని ధర్మం:** భార్య పిల్లలుండగా సర్వస్వాన్ని దానం చేయడం లేదా అతి తపస్సు ద్వారా శరీరాన్ని శుష్కింపచేయడం(2.59) ఇవి ధర్మాభాసములు. వీటి వల్ల ఉత్తర కాలంలో దుఃఖం ప్రాప్తిస్తుంది.

ఘ. **లోకవికృష్ట ధర్మం:** ఒంటికంటివాడిని ఒంటికంటి వాడా అని పిలవడం, గుడ్డివాడిని గుడ్డివాడా అని పిలవడం, హీనుణ్ణి హీనుడా అని పిలవడం ఇవి సత్యమైనా లోక నిందితములు మరియు అశిష్ట వచనాలు ప్రయోగించరాదు (4.35).

2. **ధర్మార్థకామ స్వరూపం:** ధర్మార్థకామ స్వరూపాన్ని తెలిసికోడానికి 7.26వ శ్లోకంలోని వివరణ చూడండి.

చపలత్వాన్ని త్యజించు ఇది మనుకృతం-ప్రామాణికం

న పాణిపాదచపలో న నేత్రచపలోఽనృజుః । మూలశ్లోక సం.**59**
న స్యాద్వాక్చపలశ్చైవ న పరద్రోహకర్మధీః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**177**

టీక:- పాణి+పాద+చపలః న = కాళ్లు-చేతులతో చంచలమైన పనులు చేయరాదు. **నేత్ర చపలః న** = నేత్రాలతో చాంచల్యాన్ని ప్రకటించరాదు, **అనృజుః** = కుటిలతను చూపరాదు, **వాక్-చపలః ఏవ న** = వాక్కు ద్వారా చపలత్వాన్ని ప్రకటించరాదు. **చ** = మరియు, **పరద్రోహకర్మధీః న స్యాత్** = పరద్రోహ, ద్వేష, హానికరాలైన పనులలో మనుసు పెట్టరాదు.

తాత్పర్యం:- కాళ్ళు చేతులతో చంచలమైన పనులనూ చేయరాదు. నేత్రాలతో చాంచాల్యాన్ని, కుటిలతను చూపరాదు. వాక్కు ద్వారా చపలత్వాన్ని ప్రకటించరాదు. పరద్రోహ, ద్వేష, హానికరములైన పనులలో మనస్సు పెట్టరాదు. ॥177॥

వివరణ:

లోకనిందకు గురయ్యే ధర్మకార్యాలు చేపట్టరాదు. పనికిరాని వస్తువులు సమకూర్చుకోవడం, వృథాగా తిరగడం, పరస్త్రీ దర్శనం, జననింద, కపటం అనేవి 5 రకాల చాపల్యాలు. వీటిని వదిలివేయాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

యేనాస్య పితరో యాతా యేన యాతాః పితామహాః । మూలశ్లోక సం.**60**
తేన యాయాత్సతాం మార్గం తేన గచ్ఛన్న రిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**178**

టీక:- యేన+అస్య పితరః = ఏ మార్గంలో తండ్రులు, **పితామహాః యాతాః** = తాతలు నడిచారో, ఆ మార్గంలోనే సంతానాన్ని నడిపించాలి. **సతాం మార్గం** = సత్పురుషులైన తండ్రి-తాతలు నడిచిన బాటలో నడవాలి, మరియు తండ్రులు తాతలు దుష్టులు, దుర్మార్గులైనట్లయితే ఆ మార్గంలో ఎప్పుడూ వెళ్ళరాదు, **తేన గచ్ఛన్ న రిష్యతే** = ఎందుకంటే ఉత్తమ పురుషులు, ధర్మాత్ములు పోయిన మార్గంలో నడిచినట్లయితే ఎప్పుడూ దుఃఖముండదు.

తాత్పర్యం:- సత్పురుషులైన తండ్రీ, తాతలు ఏ ధర్మంచేత తరించేలా ప్రవర్తించారో, ఏ ధర్మం అనుష్ఠించి గొప్పవారైనారో అదే మనకు అనుసరణీయం కావాలి. ఉత్తమ పురుషులు, ధర్మాత్ములు అనుసరించిన మార్గంలో నడిచినట్లుయితే ఎప్పుడూ దుఃఖ ముండదు.॥178॥

వివాదం చేయదగని వ్యక్తి-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఋత్విక్పురోహితాచార్యైర్మాతులాతిథిసంశ్రితైః । మూలశ్లోక సం. **61**
బాలవృద్ధాతురైర్వైద్యైర్జ్ఞాతిసంబంధిబాంధవైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **179**

టీక:- ఇక్కడ పేర్కొన్నవారితో మనం వివాదానికి దిగరాదు. **ఋత్విక్** = ఋత్విక్కులు-యజ్ఞం నిర్వహించేవారు,[2.143] **పురోహితః** = పురోహితులు-ఎప్పుడు ఉత్తమ ప్రవర్తనను నేర్పువారు, **ఆచార్యః** = విద్యను నేర్పువాడు[2.140], **మాతులః** = అమ్మసోదరుడు-మేనమామ **అతిథిః** = వేళకు వచ్చిన అతిథి(Guest), **సంశ్రితః** = ఆశ్రితుడు, **బాలః** = బాలకుడు, **వృద్ధః** = వృద్ధుడు, **ఆతురః** = పీడితుడు, **వైద్యః** = ఆయుర్వేదజ్ఞాత, **జ్ఞాతి** = స్వగోత్రస్థుడు లేదా స్వవర్ణస్థుడు, **సంబంధి** = శ్వశురాదులు (పిల్లనిచ్చిన మామ), **బాంధవః** = మిత్రాదులు.

ఋషి దయానందభాష్యం:- ఋత్విక్కులు, పురోహితులు, ఆచార్యులు, మేన మామలు, అతిథులు, ఆశ్రితులు, బాలురు, వృద్ధులు, బావమరదులు, పీడితుడు, ఆయుర్వేదజ్ఞాత, స్వగోత్రస్థుడు, పిల్లనిచ్చిన మామ వీరితో ఎప్పుడూ వివాదానికి దిగరాదు. (స.ప్ర. 4వ.సము.).॥179॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మాతాపితృభ్యాం జామీభిర్భ్రాత్రా పుత్రేణ భార్యయా । మూలశ్లోక సం. **62**
దుహిత్రా దాసవర్గేణ వివాదం న సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **180**

టీక:- మాతా = తల్లి, **పితా** = తండ్రి, **జామీ** = తోడబుట్టవులయిన స్త్రీలు, **భ్రాతా** = సోదరులు, **భార్యా** = గృహిణి, **పుత్రేణ**= పుత్రులు, **దుహిత్రా** = కుమార్తెలు, దాసవర్గేణ = సేవకులతో, **వివాదం న సమాచరేత్** = వివాదం, తగాదాలు పెట్టుకోరాదు.

ఋషి దయానందభాష్యం:- తల్లిదండ్రులు, తోబుట్టువులయిన స్త్రీలు, అన్నదమ్ములు, కొడుకులు, భార్య, కూతుర్లు, సేవకసేవికా జనం మొదలైన వారెవ్వరితోనూ వివాదపడకూడదు. తోటివారు, ఇరుగుపొరుగువారితో సైతం సఖ్యంగా ఉండాలి. (స.ప్ర. 4వ.సము.).॥180॥

181 నుండి 185వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కాదు

వివాదం చేయనందు వల్ల పాప నివృత్తి

* *ఏతైర్వివాదాన్ సంత్యజ్య సర్వపాపైః ప్రముచ్యతే ।*
ఏభిర్జితైశ్చ జయతి సర్వాన్ లోకానిమాన్ గృహీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***181***

తాత్పర్యం:- గృహస్థుడికి ముందు శ్లోకంలో చెప్పినవారెవ్వరితోనూ వివాదం లేనట్లయితే బ్రహ్మలోకప్రాప్తి తథ్యం. అతడు అజ్ఞాతమైన సకల పాపాల్నుంచీ విడుదలవుతాడు. వీరిలో ఏ నేరాలున్నా వెనకేసుకొచ్చేయడం కాక, దండించి తగినదారిలో పెట్టి తరించే వారికి ఈ కింద చెప్పబడిన లోకాలు ప్రాప్తిస్తాయి.॥181॥

* ***ఆచార్యో బ్రహ్మలోకేశః ప్రాజాపత్యే పితా ప్రభుః ।***
అతిథిస్త్వింద్రలోకేశో దేవలోకస్య చర్త్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***182***

తాత్పర్యం:- ఆచార్యుడితో తగువుపడనివాడికి బ్రహ్మలోకప్రాప్తి. తండ్రితో వివాదంలేని తనయుడికి ప్రాజాపత్యలోకం కలుగుతుంది. అతిథితో వివాదపడనివాడికి ఇంద్రలోకం ప్రాప్తిస్తాయి.॥182॥

* ***జామయోఽప్సరసాం లోకే వైశ్వదేవస్య బాంధవాః ।***
సంబంధినో హ్యపాం లోకే పృథివ్యాం మాతృమాతులౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***183***

తాత్పర్యం:- తోబుట్టువులు, కోడళ్లను అనురాగంతో ఆదరిస్తే అప్సరసలోకాలు, తల్లివంక బంధువర్గాన్ని ఆదరించేవారికి విశ్వేదేవతల లోకాలు, వియ్యపుచుట్టాలు-బావమరదులతో ఘర్షణ పడనివారికి వరుణలోకం, మేనమామతో జగడం లేకుంటే తిరిగి భూలోకప్రాప్తి.॥183॥

* ***ఆకాశేశాస్తు విజ్ఞేయా బాలవృద్ధకృశాతురాః ।***
భ్రాతా జ్యేష్ఠస్సమః పిత్రా భార్యా పుత్రః స్వకా తనుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***184***

తాత్పర్యం:- బాలురు, వృద్ధులు, ధనహీనులు, రోగులతో వివాదపడనివారికి అంతరిక్షాది లోకాలు కలుగుతాయి. తండ్రితో సమానుడని అన్నకు ప్రతీతి. అతడు ప్రజాపతిలోకాలను కలిగిస్తాడు. భార్యాపుత్రులు తన కుటుంబ సభ్యులే కాబట్టి వారితో వివాదపడటమేల?॥184॥

* ***ఛాయా స్వో దాసవర్గశ్చ దుహితా కృపణం పరమ్ ।***
తస్మాదేతైరధిక్షిప్తః సహేతాసంజ్వరస్సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***185***

తాత్పర్యం:- దాసదాసీ జనాలు తమకు నీడవంటివారు. కూతురు ఎంతోకనికరంతో చూడదగినది. కాబట్టి వీళ్లు ఒకానొక సందర్భంలో తనను దూషించినా వీరితో వివాదపడరాదు.॥185॥

ప్రక్షిప్తాల పరిశీలన:- 181 నుండి 185 శ్లోకాలు కింది ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తాలు.

1. అంతర్ వ్యతిరేకాలు:-

క. 179-180 శ్లోకాలలో చెప్పబడిన వ్యక్తులతో విరోధం విడిచిపెట్టినచో పాపం తొలగిపోవునని 181 శ్లోకంలో చెప్పబడినది. ఇంతటి తోటే పాపవిముక్తి జరిగినచో మనుస్మృతిలో చెప్పబడిన ధర్మాలన్నీ నిరర్థకాలని సిద్ధమౌతుంది. అలాంటప్పుడు ధర్మాల ఆవశ్యకత ఏముంటుంది?

ఖ. 11.210-232లో మనువు పాపులకు ప్రాయశ్చిత విధిని తెలిపినాడు. ఈ శ్లోకానికి, ఆ శ్లోకాలకు విరోధమేర్పడుతున్నది. కావున 181 శ్లోకంతో పాటు 182-185 శ్లోకాలు కూడా ప్రక్షిప్తమని సిద్ధమగుచున్నది.

గ. ఈ శ్లోకాలలో విభిన్న లోకాల గణనకూడా ఇవ్వబడినది. ఇది మను విరుద్ధము. మనువు జీవునికి రెండే గతులను తెలిపినాడు.

1. **మొదటి:-**సాంసారిక యోనులలో పుట్టుట 6.63, 74; 12.9, 39-52, 74,81 మరియు రెండవది బ్రహ్మప్రాప్తి [4.149,6.81; 12,116,125] ఈ లోకాల వర్ణన ప్రక్షిప్తాలు.

2. **శైలీగత ఆధారాలు:–** ఈ శ్లోకాలలో నిర్దిష్ట వ్యక్తులను భిన్నభిన్న లోకాలకు అధికారుని అనుటయు నిరాధారము, ఈ విధంగా 181-185 శ్లోకాల శైలి అయుక్తియుక్తము, అతిశయోక్తిపూర్ణము.

దానాన్ని ఆశించరాదు–

186,187వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

ప్రతిగ్రహసమర్థోఽపి ప్రసంగం తత్ర వర్జయేత్ । మూలశ్లోక సం.**63**
ప్రతిగ్రహేణ హ్యస్యాశు బ్రాహ్మం తేజః ప్రశామ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**186**

టీక:– బ్రాహ్మణుడు, **ప్రతిగ్రహః సమర్థః** = దానం తీసికోడానికి అధికారి అయినా, **తత్ర ప్రసంగం వర్జయేత్** = దానం పొందాలని ఆశించరాదు. ధనాన్ని నిలవచేయాలనే కోరికను అణచివేయాలి. **హి** = ఎందుకంటే, **ప్రతిగ్రహేణ** = దానం తీసికోవడంలో ఆసక్తి కలగడం వల్ల, **అస్య బ్రాహ్మం తేజః** = అతని బ్రహ్మతేజస్సు, **ఆశు ప్రశామ్యతి** = శీఘ్రంగా తగ్గిపోతుంది.

తాత్పర్యం:– గృహస్థుడికి విద్య-వేదం లాంటివాటి వల్ల దానం పుచ్చుకోగల సామర్థ్యం ఉంటుంది. అర్హత ఉంటుంది. కాని దానం మళ్లీమళ్లీ అందుకోవాలనే ఆశ తగదు. దానం వల్ల తేజం నశిస్తుంది. జీవికకు మించిన దానం తీసుకోరాదు.॥186॥

దానాల విధులు–

ఇది మనుకృతం-ప్రామాణికం

న ద్రవ్యాణామభిజ్ఞాయ విధిం ధర్మ్యం ప్రతిగ్రహే । మూలశ్లోక సం.**64**
ప్రాజ్ఞః ప్రతిగ్రహం కుర్యాదవసీదన్నపి క్షుధా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**187**

టీక:– **ప్రాజ్ఞః** = బుద్ధిమంతుడైన బ్రాహ్మణుడు, **ద్రవ్యాణాం ప్రతిగ్రహే ధర్మ్యం విధిం అభిజ్ఞాయ** = ద్రవ్యాలను దానంగా గ్రహించే ముందు ధర్మ విధానాన్ని గమనించకుండానే, **క్షుధా అవసీదన్+అపి** = ఆకలితో బాధపడుతున్నా, **ప్రతిగ్రహం న కుర్యాత్** = దానాన్ని తీసుకోరాదు.

తాత్పర్యం:– బుద్ధిమంతుడైన బ్రాహ్మణుడు తీసుకోదలచిన దానాల విషయమై ధర్మశాస్త్రం ఏ యే విషయాలను అంగీకరించిందో, అలాంటి దానాలనే తీసుకోవలసి ఉంటుంది గాని, ఆకలితో బాధపడుతున్నా దానాన్ని తీసుకోరాదు.॥187॥

వివరణ

దానగ్రహణానికి సంబంధించిన ధర్మవిధి.

ఈ శ్లోకంలో ప్రతిగ్రహరూపంలో ద్రవ్య దానగ్రహణంలో ఉన్న ధర్మవిధిని తెలిసికోడానికి మనుస్మృతి నుండి ఈ కింది ప్రమాణాలివ్వబడ్డాయి.

1. (1.88వ) శ్లోకంలో వేదాధ్యయన, అధ్యాపన, యజన, యాజన కార్యాలందు నిరంతరం పాల్గొనే వ్యక్తికే దానం తీసికోడానికి అధికారమివ్వబడింది. ఈ కార్యాలు ధర్మాలని భావించి నిరంతరం ఎవరు నిర్వహిస్తూ ఉన్నారో వారే దానగ్రహణానికి అధికారులని అనేక చోట్ల మనువు నిర్ణయించి ఉన్నారు. [2.79-81 (104-107), 140-143 (165-168),4.17-20, 31,147,149;11.245]. ఈ విధంగా అధికారే దానం తీసుకోవాలి అనే విషయం, ధార్మిక విధిలో ఒక భాగం.

2. ఉపర్యుక్త కార్యాలలో తల్లీనుడు కాని వాడు, వేదాన్ని ఒకసారి మాత్రమే చదివి, తదభ్యాసం, మననం చేయనివాడు.తపస్వికానివాడు, ఛలకపట స్వభావం కలవాడు దానం తీసికోడానికి అధికారికాడు [4-30,190,191]. అనధికారికి ఇచ్చిన ధనం నిష్ఫలం కావడమే గాక, గ్రహీత పాపి అవుతాడు.

3. అధార్మికుడి, వేదం యజ్ఞం మొ॥ తెలియనివాని నుండి దానం గ్రహించరాదు [2.158,160 (183,185)].

4. భక్ష్యరూపంలో ఇచ్చిన హిత పదార్థాలు గ్రాహ్యములని మనుభావన. నిషిద్ధమైనవి తినకూడని మాంసాదులు, తామసిక పదార్థాలు అగ్రాహ్యాలు. (5.9, 5.7,12, 6.13), మరియు సాంసారిక విషయాలలో ఆకర్షించే పదార్థాలు కూడా అగ్రాహ్యాలే (6.58,57,55,26). ఈ విషయాలు తెలియాలంటే ప్రతిగ్రహ ధర్మవిధికి సంబంధించిన జ్ఞానమవసరం.

188,189వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అవిద్వాంసుడు దానం తీసుకొని నష్టపోతాడు-

* *హిరణ్యం భూమిమశ్వం గామన్నం వాసస్తిలాన్ ఘృతమ్ ।*
ప్రతిగృహ్ణన్న విద్వాంస్తు భస్మీభవతి దారువత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***188***

తాత్పర్యం:- అన్నం, బంగారం, భూమి, గుర్రం, గోవు, వస్త్రం, తిలలు, నెయ్యి వీటిని విద్యావిహీనుడు గ్రహించినట్లయితే ఎండుగడ్డిలాగ భస్మమైపోగలడు. ॥188॥

* *హిరణ్యమాయురన్నం చ భూర్గౌశ్చాప్యోషతస్తనుమ్ ।*
అశ్వశ్చక్షుస్త్వచం వాసో ఘృతం తేజస్తిలాః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***189***

తాత్పర్యం:- ద్రవ్యం, బంగారం దానంగా పుచ్చుకోవడం ఆయుష్షును హరిస్తాయి. అన్నం,భూమి, గోవు వీటిని దానంగా పుచ్చుకొంటే అవి దేహాన్ని హరిస్తాయి.॥189॥

ప్రక్షిప్తాల పరిశీలన:- 188,189 శ్లోకాలు ప్రక్షిప్తాలు-

1. **ప్రసంగవ్యతిరేకం:-** క. పూర్వాపర శ్లోకాలు దానం తీసుకొనే ధర్మవిధిని [187] మరియు దాని అర్థవాదరూపాన్ని [190] చెప్పినవి. మధ్యలో ఈ ప్రసంగం రావడం అర్థరహితం.

ఖ. 187లో ధర్మవిధిని తెలుసుకునే విషయమే ఉన్నది. వస్తువులను దానం తీసుకుంటే కలిగే నష్టం గురించి లేదు. కావున ఈ రెండు శ్లోకాలు 187 ప్రసంగానికి ఎలాంటి సంబంధం లేదు. కావున ఇది ప్రసంగ విరుద్ధం.

2. **అంతర్ వ్యతిరేకాలు:-** మనువు 1.88లో దానం తీసుకునే అధికారాన్ని వేదబ్రాహ్మణునికే ఇచ్చాడు. అతడు వేదాన్ని అధ్యయనం, అధ్యాపనం చేస్తాడు కాబట్టి. ఈ అధికారం అవిద్వాంసునికి కాదు.

3. **శైలీగత ఆధారాలు:-** వీటి శైలి కూడా నిరాధారము, అయుక్తియుక్తము. దానం తీసుకోవాడానికి, అతడు భస్మం కావడానికి ఎలాంటి కార్యకారణ సంబంధం లేదు. అతిశయోక్తులతో కూడిన మాటలు చెప్పుట మనువు శైలికాదు. మనువు మతానుసారం అవిద్వాంసుడు బ్రాహ్మణుడే కాదు. [1.88].

దానం తీసుకోడానికి అనధికారులు 3 రకాలు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

అతపాస్త్వనధీయానః ప్రతిగ్రహరుచిర్ద్విజః । మూలశ్లోక సం.**65**
అంభస్యశ్మప్లవేనేవ సహ తేనైవ మజ్జతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**190**

టీక:- ఒకడు, **అతపాః** = బ్రహ్మచర్యం, సత్యభాషణాది తపస్సు లేనివాడు, [2.164-167,6.70,71] రెండోవాడు, **అనధీయానః** = చదువు సంధ్యలు లేనివాడు, [2.105,106] మూడోవాడు, **ప్రతిగ్రహరుచిః** = అత్యంత ధర్మార్థం పరుల నుండి దానం తీసికొనేవాడు. ఈ ముగ్గురూ, **అశ్మప్లవేన అంభసి ఇవ** = రాతి నౌకతో సముద్రాన్ని ఈదేవాడితో సమానంగా, **తేన సహ ఏవ మజ్జతి** = తన దుష్టకర్మలతో సహా దుఃఖసాగరంలో మునిగిపోతారు.

ఋషి దయానందభాష్యం:- ఒకడు- బ్రహ్మచర్యం, సత్యభాషణాది తపస్సు లేనివాడు- రెండోవాడు, చదువు సంధ్యలు లేనివాడు, మూడోవాడు- అత్యంత ధర్మార్థం పరులనుండి దానం తీసుకొనే వాడు. ఈ ముగ్గురూ రాతి నౌకతో సముద్రాన్ని

ఈదేవాడితో సమానంగా, తన దుష్టకర్మల వలన తాను మునగడమే గాక దాతలను కూడా ముంచేస్తారు. దుఃఖసాగరంలో మునిగిపోతారు. (స.ప్ర. 4వ.సము.). ॥190॥

వివరణ: "అనధీయానః" శబ్దానికి వ్యాఖ్య 4.192వ శ్లోకాన్ని చూడగలరు.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* అవిద్వాంసుడు దానగ్రహణానికి భయపడాలి-

* తస్మానవిద్వాన్ బిభియాద్యస్మాత్తస్మాత్ప్రతి గ్రహాత్ ।
స్వల్పకేనాప్యవిద్వాన్ హి పంకే గౌరివ సీదతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**191**

తాత్పర్యం:- మూర్ఖుడు హీనద్రవ్యాల్ని పొందడం వల్ల కలిగే పాపాన్ని పోగొట్టుకోలేక ఊబి-బురదలో పశువు కూరుకు పోయిన చందంగా నరకంలో పడిపోతాడు. కాబట్టి-యుక్తాయుక్తత నెరిగి గాని దానం గ్రహించరాదు.॥191॥

192-196వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

న వార్యపి ప్రయచ్ఛేత్తు బైడాలవ్రతికే ద్విజే । మూలశ్లోక సం.**66**
న బకవ్రతికే విప్రే నావేదవిది ధర్మవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**192**

టీక:- **ధర్మవిత్** = ధర్మాన్ని పాలించే వ్యక్తి చేయవలసినదేమిటి?, **బైడాలవ్రతికే ద్విజే** = పిల్లిలాంటి స్వభావం (4-69) గల ద్విజుడికి, **బకవ్రతికే** = కొంగ లాగా జపం చేసే (4.70) బ్రాహ్మణుడికి, **అవేదవిది విప్రే** = వేదం తెలియని విప్రుడికి, **వారి+అపి+న-ప్రయచ్ఛేత్** = నీళ్ళు కూడా ఇవ్వరాదు.

తాత్పర్యం:- ధర్మవేత్త అయినవాడు పిల్లిలా, కొంగలా దానం కోసం కాచుక్కూర్చునే వారికీ, వేదాన్ని అధ్యయనం చేయనివారికీ దానం ఇవ్వరాదు. ॥192॥

వివరణ:

అగౌరవనీయ వ్యక్తులు:-అగౌరవనీయులు ముగ్గురున్నారు. 4.190వ శ్లోకంలో వివరించిన వ్యక్తులతో సమానమైనవాళ్ళు సమాంతరాలతో మరొకచోట చెప్పబడ్డారు. "అనధీయానః, అవేదవిత్, అతపాః, సత్యాచరణ విహీః". వీరు ద్విజనామధారులు. బక వ్రతికులు (మోసగాళ్ళు). ప్రతిగ్రహరుచులు, దానార్థులు = వీరే నయవంచకులు. (4.195,196), వేదానుసారంగా ఆచరణ లేనివారు. ఈ విధంగా ఈ శ్లోకంలో పునరుక్తి లేదు. స్పష్టమైన గుణాలననుసరించి పర్యాయవాచక సంజ్ఞలు.

2. **అనధీయానః లేదా 'అవేదవిత్'** అనే శబ్దాలకు అవిద్వాంసుడని అర్థం కాదు. మరి ఎవరంటే ఒకసారి మాత్రమే వేదాధ్యయనం చేసి తరువాత నిరంతరం అధ్యయనం, చింతనం వదలినవారు. ఇలాంటి వారు వేదవిద్వాంసులుకారు. సదైవ వేదాధ్యయనం చేయడం బ్రాహ్మణ ధర్మమని మనువు నిర్దేశించాడు. [2.79-81 (104-107), 2.140-143(2.165-168); 4.17-20, 147,149; 11.245]. నిరంతరం వేదాభ్యాసం చేయడం, యజన-యాజనశీలుడు, వేదాధ్యయనం, అధ్యాపనం చేయడం. ఈ గుణకర్మలు కలవాడికే దానమివ్వమని మను ఆదేశం(1.88, 4.31). తక్కినవారు శూద్రులలాంటివారే (2.143).

4-30వ శ్లోకంలో ఇలాంటి వ్యక్తులకు, దాన ధర్మాలు చేయరాదని నిషేధముంది.

- ఇది మనుకృతం-ప్రామాణికం

త్రిష్వప్యేతేషు దత్తం హి విధినాఽప్యర్జితం ధనమ్ । మూలశ్లోక సం.**67**
దాతుర్భవత్యనర్థాయ పరత్రాదాతురేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**193**

టీక:- **విధినా ఆర్జితం ధనమ్ అపి** = ధర్మంగా సంపాదించిన ధనాన్ని, **ఏ తేషు త్రిషదత్తం** = బిడాలవ్రతులు, బక వ్రతులు, వేదాధ్యయనం లేనివారు ఈ ముగ్గురికి ఇచ్చిన ధనం, **ధాతుః అనర్థాయహి భవతి** = దాతకు ఈ జన్మలోనే అనర్థాన్ని కలిగిస్తుంది, **ఆదాతుః పరత్ర ఏవ** = తీసుకున్న, **గ్రహీత** = వాడికి పరజన్మలో నాశనం కలిగిస్తుంది.

ఋషి దయానంభాష్యం:- ధర్మంతో సంపాదించిన ధనాన్ని పైన తెలిపిన ముగ్గురికి దానమిస్తే ఆ దానం 'అపాత్రత' అనే అనర్హత వల్ల పుచ్చుకొనేవాడికీ -అజ్ఞానంచేత ఇచ్చేవాడికీ పరజన్మలో నాశనం కలిగిస్తుంది. (స.ప్ర. 4వ.స.).॥193॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యథా ప్లవే నౌపలేన నిమజ్జత్యుదకే తరన్ । మూలశ్లోక సం.**68**
తథా నిమజ్జతోఽధస్తాదజ్ఞే దాతృప్రతీచ్ఛకౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**194**

టీక:- **యథా ఉపలేన ప్లవేన** = రాతి ఓడ మీద కూర్చొని, **ఉదకే తరన్ నిమజ్జతి తథా** = నీటిలో ప్రయాణించేవాడు మునిగిపోయినట్లుగా, **అజ్ఞే దాతృ+ప్రతి+ఇచ్ఛకౌ** = అజ్ఞానియైన దాత, గ్రహీత ఇద్దరూ, **అధస్తాత్ నిమజ్జతః** = అధోగతిని (దుఃఖాన్ని) పొందుతారు.

ఋషి దయానందభాష్యం:- రాతి ఓడ మీద కూర్చొని నీటిలో ప్రయాణించేవాడు అందులో పడి మునిగిపోయినట్లుగా, అజ్ఞానియైన దాత గ్రహీత ఇద్దరూ అధోగతని (దుఃఖాన్ని) పొందుతారు.(స.ప్ర. 4వ.సము). ॥194॥

ఇది మనుకృతం-ప్రామాణికం

బైడాలవ్రతుని లక్షణం-

ధర్మధ్వజీ సదా లుబ్ధశ్ఛాద్మికో లోకదమ్భకః । మూలశ్లోక సం.**69**
బైడాల వ్రతికో జ్ఞేయో హింస్రస్సర్వాభిసన్ధకః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**195**

టీక:- **ధర్మధ్వజీ** = ధర్మమేమీ చేయడు. కానీ ధర్మం పేరుతో ప్రజలను మోసగించేవాడు, **సదాలుబ్ధకః** = ఎల్లప్పుడు లాభాన్ని మాత్రమే కోరేవాడు, లోభి, **ఛాద్మికః** = కపటి, **లోకదమ్భకః** = సాధారణ మానవుల ఎదుట తన బడాయి, (గప్పాలు) కొట్టేవాడు, **హింస్రః** = ప్రాణఘాతకుడు, పరులతో వైరం పెట్టుకొనేవాడు, **సర్వ+అభిసన్ధకః** = అందరితో (మంచి చెడులకు) కలిసి తిరిగేవాడు, **బైడాల వ్రతికః జ్ఞేయః** = బైడాలవ్రతికుడు అంటే పిల్లితో సమానంగా ధూర్తుడు, నీచుడు అని తెలుసికోవాలి (స.ప్ర.). (వీరివర్ణన (4-16, 66)వ శ్లోకం చూడగలరు.)

ఋషి దయానందభాష్యం:- ధర్మాన్ని ఏ మాత్రం ఆచరించక ధర్మం పేరుతో ఇతరులను మోసగించేవాడు, నిరంతరం లోభం లాభాపేక్ష కలవాడు, కపటం కలవాడు, ప్రజలముందు తనగొప్పలు చెప్పకునేవాడు, ప్రాణులను హింసించేవాడు ఇతరులపట్ల వైరబుద్ధికలవాడు, మంచివారితోనూ చెడ్డవారితోనూ సంబంధం పెట్టుకునేవాడు, గోడమీది పిల్లిలాగ ఉండే ధూర్తుడు-నీచుడు అని తెలిసికోవాలి. (స.ప్ర. 4వ.సము).॥195॥

వివరణ:- వీటి వర్ణన 4.30,192లో కూడా చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

బక వ్రతికుడి లక్షణం-

అధోదృష్టిర్నైష్కృతికః స్వార్థసాధనతత్పరః । మూలశ్లోక సం.**70**
శఠో మిథ్యావినీతశ్చ బకవ్రతచరో ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**196**

టీక:- **అధోదృష్టిః** = కీర్తి కోసం నిమ్నదృష్టి కలవాడు, **నైష్కృతికః** = ఈర్ష్యాళువు, ఎవరైనా అతడికి ఒక్క దమ్మిడి (పైసా) చిన్న అపకారం చేసినట్లయితే దానికి ప్రాణాలు తీసేంతటి బదులు తీర్చుకొనేవాడు, **స్వార్థసాధన తత్పరః** = స్వార్థాన్ని సాధించడానికి కపటాన్నీ, అధర్మాన్నీ, విశ్వాసఘాతం అయినా అనుసరించేవాడు. **శఠః** = గూఢంగా అపకారం

చేసేవాడు. **మిథ్యావినీతః** = అబద్ధాల పుట్ట. కానీ పైకి మాత్రం సాధువు లాగా కనిపించేవాడు. అలాంటివాడికి, **బక వ్రతః ద్విజః** = బక వ్రతువుడని పేరు (స.ప్ర.106).

ఋషి దయానందభాష్యం:- కీర్తికోసం నిమ్నదృష్టి కలవాడు, ఈర్ష్యాళువు, స్వార్థాన్ని సాధించడానికి కపటాన్ని, అధర్మాన్ని, విశ్వాసఘాతాన్ని అనుసరించే వాడు, గూఢంగా అపకారం చేసేవాడు అబద్ధాలపుట్ట, అలాంటి వాడికి బకవ్రతుడని పేరు. అంటే కొంగలాంటి వాడు. వారిని నమ్మకూడదు. వారికి సేవ చేయకూడదు. వారి దగ్గరకు వెళ్ళకూడదు. తమ దగ్గరకి రానివ్వకూడదు. (స.ప్ర.4వ.సము.).

వివరణ: బక వ్రతకుల చర్చ నింద-4.16, 4.66 శ్లోకాల్లో చూడగలరు.

197 నుండి 200ల శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** ఛలకపట బ్రాహ్మణులకు దాన ఫలితం-**

* *యే బక వ్రతినో విప్రా యే చ మార్జారలింగినః ।*
తే పతంత్యంధతామిస్రే తేన పాపేన కర్మణా ॥ ప్రక్షిప్త శ్లోక సం.***197***

తాత్పర్యం:- ఎవరు పిల్లి, కొంగ లాంటి ప్రవర్తన గలవారో, అలాంటి వారు దానాలు తీసుకోవడం ద్వారా అంధతామిస్రమనే నరకంలో పడుతారు.॥197॥

* *న ధర్మస్యాపదేశేన పాపం కృత్వా వ్రతం చరేత్ ।*
వ్రతేన పాపం ప్రచ్ఛాద్య కుర్వన్ స్త్రీశూద్రదంభనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***198***

తాత్పర్యం:- చేసిన పాపాలను పోగొట్టడానికి వ్రతాలున్నాయని చెప్పి పాపాలు చేయకూడదు. వ్రతానుష్ఠానంవల్ల పాపం కప్పిపుచ్చి స్త్రీలు-శూద్రులు మొదలైనవారికోసం ధర్మాచరణ చేస్తున్నట్లు చెప్పుకోరాదు. ॥198॥

* *ప్రేత్యేహ చేదృశా విప్రా గర్హ్యంతే బ్రహ్మవాదిభిః ।*
ఛద్మనాచరితం యచ్చ వ్రతం రక్షాంసి గచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.***199***

తాత్పర్యం:- కపట వర్తనులైన ద్విజులను బ్రహ్మవాదులయినవారు ఇహపరములు రెండింటా నిందిస్తారు. కాపట్యంతో చేసే ఏ వ్రతమైనా అది రాక్షసులకు చెందుతుందే తప్ప, అది దేవతలకు చెందదు.ఆ వ్రతం నెరవేరదు.॥199॥

* *అలింగీ లింగివేషేణ యో వృత్తిముపజీవతి ।*
సలింగినాం హరత్యేన స్తిర్యగ్యోనౌ చ జాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***200***

తాత్పర్యం:- తాను గృహస్థుడే అయినా బ్రహ్మచారిగా వేషంవేసి భిక్షమెత్తి జీవనం గడుపువాడు తనకు తెలియకుండానే ఇతర బ్రహ్మచారుల పాపాలను తన తలకెత్తుకుంటూన్నవాడవుతున్నాడు. ఇట్టివాడు మృతిచెంది పశ్వాది నీచయోనుల్లో జన్మిస్తాడు.॥200॥

ప్రక్షిప్తాల పరిశీలన:- 197 నుండి 200ల వరకు గల శ్లోకాలు క్రింద వ్రాసిన ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తాలని సిద్ధమవుతుంది.

1. **అంతర్ వ్యతిరేకాలు:-**

క. 197వ శ్లోకంలో చెప్పబడిన 'అంధతామిస్ర' నామక నరకములోకి వెళ్ళే కథనము మనువుకు విరోధము. మనువు మతానుసారం నరకమను పేరుగల ఏ స్థాన విశేషమూ లేదు.4.80-91 శ్లోకాలపై రాయబడిన **'అంతర్ వ్యతిరేకాలు'** శీర్షికను చదవండి.

ఖ. 199వ శ్లోకంలో వ్రతాలను రాక్షసులకు పంపించుట, అటులనే 200 శ్లోకంలో ఇతరుల పాపాలను తీసుకొనుట అను కథనము మనువు చెప్పిన 4.240వ శ్లోకానికి విరుద్ధము. అందులో కర్తనే స్వయంగా కర్మఫలం అనుభవిస్తాడని ఉంది. ఇలాంటి అంతర్ వ్యతిరేకాల ఆధారంగా అనేక విషయాలలో అసంబద్ధ విషయాలుండటం వలన ఈ నాలుగు శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఇతరులు స్నానం చేసిన నీటిలో స్నానం చేయరాదు-

పరకీయనిపానేషు న స్నాయాచ్చ కదాచన । మూల శ్లోక సం. **71**
నిపానకర్తుస్స్నాత్వా తు దుష్కృతాంశేన లిప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **201**

టీక:- పరకీయనిపానేషు కదాచన న స్నాయాత్ = ఇతరులు స్నానం చేసిన తొట్టి (Tub)లో ఎప్పుడూ స్నానం చేయరాదు, **తు** = ఎందుకంటే, **స్నాత్వా** = అక్కడ స్నానం చేసినందువల్ల, **నిపాన కర్తుః దుష్కృతాంశేన లిప్యతే** = ఆ తొట్టెలో (Tub) స్నానం చేసిన వాడి మురికి, లేదా రోగం మళ్లీ అదే నీటిలో స్నానం చేసినవాడికి వ్యాపిస్తాయి. అంటే ఆ తొట్టి (Tub) లో మొదట స్నానం చేసిన వాడి రోగాలు అంటుకొంటాయి.

తాత్పర్యం:- ఇతరులు స్నానంచేసిన తొట్టిలో ఎప్పుడూ స్నానం చేయరాదు. ఎందుకంటే అందులో స్నానం చేసినందువల్ల, ఆ తొట్టిలో ముందుగా స్నానం చేసిన వాడి మురికి లేదా రోగం మళ్ళీ అదే నీటిలో స్నానం చేసినవాడికి వ్యాపిస్తాయి. అలాగే ఇతరులు స్నానం చేయగా మిగిలిన. నీళ్ళతో కూడా స్నానం చేయరాదు. వాటిని పారబోయాలి.॥201॥

వివరణ: 'దుష్కృత' శబ్దానికి రోగకారకాలని అర్థం.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

*** ఇతరుల సాధనాలవల్ల పాపం-**

* *యానశయ్యాసనాన్యస్యకూపోద్యానగృహాణి చ ।*
అదత్తాన్యుపభుంజాన ఏనసస్స్యాత్తురీయభాక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***202***

తాత్పర్యం:- ఇతరుల వాహనం, పడక (మంచం, పరిచినపరుపు), ఆసనం, బావి, ఉద్యానవనం, ఇల్లు, ఎవరైతే ఉపయోగిస్తారో వాటి సొంతదారుల పాపంలోంచి 4వ భాగాన్ని పొందుతారు.॥202॥

ప్రక్షిప్త పరిశీలన:-

202వ శ్లోకం ఈ ప్రమాణాల ఆధారంగా ప్రక్షిప్తము-

1. ప్రసంగ వ్యతిరేకాలు:- ఇది పూర్వాపర ప్రసంగవిరుద్ధము. 201లో ఎక్కడ ఎందుకు స్నానం చేయకూడదన్న విషయమున్నది. ఇట్టి సంబంధిత చర్చాక్రమాన్ని ఈ శ్లోకం భంగపరచినది. పైగా ప్రసంగభిన్న విషయాలను వర్ణించినది. కావున ఇది ప్రక్షిప్తము.

2. విషయ వ్యతిరేకాలు:- ఇది విషయబాహ్య శ్లోకము. ఇందులో చెప్పబడిన మాటలు 'సత్వగుణవర్ధ'నానికి ఎలాంటి సంబంధం లేదు. పైగా ఇది వ్రతమని చెప్పబడుతున్నది. కావున ఇది ప్రక్షిప్తము.

3. శైలీగత వ్యతిరేకాలు:- దీని శైలి నిరాధారము, అయుక్తియుక్తము. వర్ణిత వస్తు విషయానికి, పాపానికి ఎట్టి సంబంధమూ లేదు. అనుమతి లేకుండా ఇతరుల వస్తువులను తీసుకోవడం నేరమనిపిస్తుందే తప్ప పాపముకాదు.

203,204 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఏ నీటిలో స్నానం చేయాలి?

నదీషు దేవఖాతేషు తటాకేషు సరస్సు చ । మూలశ్లోక సం. 72
స్నానం సమాచరేన్నిత్యం గర్తప్రస్రవణేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 203

టీక:- **నదీషు** = నదులలో, **దేవఖాతేషు** = ప్రాకృతిక జలాశయాలలో, **తటాకేషు** = చెరువులలో, **సరస్సు** = సరస్సులు లేదా సెలయేరులలో, **గర్తప్రస్రవణేషు** = ప్రవహించే నీరు గల గుంతలలో పెద్ద పెద్ద దిగుడు బావులలో, **నిత్యం స్నానం సమాచరేత్** = నిత్యం స్నానం చేయాలి.

తాత్పర్యం:- నదుల్లోను, ప్రాకృతిక జలాశయాల్లోను (జలపాతాల్లోను) చెరువుల్లోనూ, సరస్సుల్లోనూ ప్రవహించే నీరుగల గుంతలలో పెద్ద పెద్ద దిగుడు బావుల్లోనూ స్నానమాచరించ వచ్చు.॥203॥

యమముల సేవించడంలో ప్రాధాన్యం- ఇది మనుకృతం-ప్రామాణికం

యమాన్ సేవేత సతతం న నియమాన్ కేవలాన్ బుధః। మూలశ్లోక సం. 72
యమాన్పతత్యకుర్వాణో నియమాన్ కేవలాన్ భజన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 204

టీక:- **యమాన్ సతతం సేవేత** = యమములను నిత్యం సేవించాలి, ఆచరించాలి. **నిత్యం నియమాన్ న బుధః** = బుద్ధిమంతుడు ఎల్లప్పుడు నియమాలను కాదు, ఎందుకంటే, **యమాన్ అకుర్వాణః** = యమములను ఆచరించకుండా, **కేవలాన్ నియమాన్ భజన్** = కేవలం నియమాలను సేవిస్తుంటే, **పతతి** = తన కర్తవ్యం నుండి పతనమైపోతాడు. అందువల్ల యమములు సేవిస్తూ, నియమాలను నిత్యమాచరించాలి.

ఋషి దయానందభాష్యం:- యమాలను, నియమాలను సేవించేవాడే బుద్ధిమంతుడు. బ్రహ్మచర్యం, దయ, ఓర్పు, సత్యం, పాపాలు చేయకుండుట, అహింస, దొంగతనం చెయ్యకుండుట, ప్రియహిత వచనభాషణం, ఇంద్రియనిగ్రహం అపరిగ్రహత ఇవి యమాలు. నియమాలంటే స్నానం, మౌనం, తపస్సు, యాగం, వేదాభ్యాసం, శుచిశుభ్రతలు, గురుసేవ ఈశ్వరప్రణిభావం మొదలైనవి. యమాలను ఆచరించకుండా కేవలం నియమాలను సేవిస్తుంటే, తన కర్తవ్యం నుండి పతనమైపోతాడు. కాబట్టి యమములను సేవిస్తూ, నియమాలను కూడా నిత్యం ఆచరించాలి. (సం.వి.గృ.ప్ర.).॥204॥

వివరణ

యమాలను ఆచరించనందువల్ల పతనం

1. యమాలను ఆచరించకుండా కేవలం నియమాలనే ఆచరిస్తున్నందువల్ల మానవుడు పతితుడవడానికి అవకాశం ఉంటుందని మనువు సూచన. కారణం ఏమిటి? ముఖ్యంగా యమాలు ఆత్మకు సంబంధమైన ఆచరణయే. నియమాలు ముఖ్యంగా బాహ్యాచరణకు సంబంధించినవి. కేవలం బాహ్యాచరణ వల్ల వ్యక్తిలో ఆత్మోన్నతి అసంభవం. ఆత్మదృఢత్వం కలుగదు. యమాలను పాటిస్తున్నందు వల్లనే ఆత్మకు సంబంధించిన శ్రేష్ఠాచరణ వల్ల మనుషుడు శ్రేష్ఠమైన వ్యక్తిగా రూపొందుతాడు. కేవలం బాహ్యాచరణానుసారి ఒకప్పుడు డాంబికుడు, ధూర్తుడు కావచ్చు. కానీ ఆత్మికమైన ఆచరణ వల్ల అలా కాదు.

2. యమ-నియమాలేవి? యోగశాస్త్రంలో (2.30) వీటి గణన కనిపిస్తుంది. ఇక్కడ యమ-నియమాలను గురించి సంక్షిప్తంగా వివరించబడుతుంది.

"అహింసా-సత్యం-అస్తేయం-బ్రహ్మచర్యం అపరిగ్రహాః యమాః"

1. **అహింస:** అన్ని విధాలా, అన్ని కాలాల్లో సర్వప్రాణులతో వైరం వీడి ప్రేమ చూపడం, ప్రేమతో వ్యవహరించడం. అహింస అనబడుతుంది.

2. **సత్యం:** తనకు తెలిసినంత వరకు సత్యాన్ని అంగీకరించడం, సత్యాన్ని చెప్పడం.

3. **అస్తేయం :** పరుల వస్తువులను వారి అనుమతి లేకుండా తీసుకోకపోవడం. ఇతరుల పదార్థం కావాలనే కోరిక కూడా లేకుండటం. దీని పేరే చౌర్య త్యాగం.

4. **బ్రహ్మచర్యం:** విద్యార్జన కోసం బాల్యావస్థ నుండి 25 సంıı వరకు, ఆపై కూడా జితేంద్రియుడుగా ఉండటం. పర స్త్రీ,వేశ్య మొıı వారితో సంబంధం లేకుండా ఉండటం, గృహస్థుడైనా సదా ఋతుగామిగా ఉండటం. విద్యను చక్కగా చదివి, ఇతరులకు విద్యాదానం చేస్తూ ఉండటం. ఉపస్థేంద్రియ సంయమం. ఇవి బ్రహ్మచర్య లక్షణాలు.

5. **అపరిగ్రహం:** తనకు కావలసినవాటికంటే ఎక్కువ వస్తు సంచయం చేసుకొనకపోవడం. విషయ దోషాలు, అభిమానాదులు లేకుండా ఉండడం (ఋ-భా-భూమిక-ఉపాసనా విషయం).

నియమములు:

“శౌచ-సంతోష-తపః-స్వాధ్యాయ-ఈశ్వర ప్రణిధానాని నియమాః” యోగ. 2.32

1. **శౌచము:** పవిత్రముగా నుండుట. అది రెండు రకములు. ఒకటి ఆంతరిక శౌచము. రెండవది బాహ్యాశౌచము. ఆభ్యంతర శౌచము. సత్యభాషణము, విద్యాభ్యాసము. సత్సంగము మొıı శుభగుణములను ఆచరించినందు వలన కలుగును. బాహ్యపరిశుద్ధత జలాదుల వలన శరీరము, స్థానము, మార్గము-వస్త్రము, భోజనాదులు శుద్ధముగా నున్నప్పుడు శుద్ధి కలుగుతుంది.

2. **సంతోషము:** సదా ధర్మానుష్ఠానము ద్వారా అత్యంత పురుషార్థము చేసి, ప్రసన్నముగా నుండుట మరియు దుఃఖాతురుడు కాకుండుట. అలసత్వము సంతోషము కాదు.

3. **తపస్సు:** అగ్నిలో కాల్చి స్వర్ణమును నిర్మలపరచినట్లుగా, ఆత్మ మనస్సును ధర్మాచరణ శుభగుణచారణమనే అగ్నిలో తపింపచేసి, నిర్మలమొనర్చుటే తపస్సు.

4. **స్వాధ్యాయము:** మోక్షవిద్య విధాయకములైన వేదశాస్త్రాదులను చదువుట- చదివించుట, ఓంకారమును తెలిసికొని, ఈశ్వరుడున్నాడనే నిశ్చిత భావన.

5. **ఈశ్వర ప్రణిధానము:** సామర్థ్యమును సర్వగుణములను, ప్రాణము, ఆత్మ మనస్సును ప్రేమభావములతో ఈశ్వరునకు సమర్పించుట ఈశ్వర ప్రణిధానము. (ఋ-భా-భూ ఉపాసనా విషయము).

205 నుండి 226వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అభక్ష్యభోజనం-

* *నాశ్రోత్రియతతే యజ్ఞే గ్రామయాజికృతే తథా ।*
స్త్రియా క్లీబేన చ హుతే భుంజీత బ్రాహ్మణః క్వచిత్॥ ప్రక్షిప్త శ్లోక సం. ***205***

తాత్పర్యం:- శోత్రియుడు చెయ్యని యాగంలోను, సామూహిక యాగాలలోను, గ్రామపురోహితుడిచేత చేయించబడే యాగాలలోను, స్త్రీలు, నపుంసకులు హోమసహితంగా చేసే యాగాలలోను సత్‌బ్రాహ్మణుడు భుజించరాదు.॥205॥

* *అశ్లీక మేతత్సాధూనాం యత్ర జుహ్వత్యమీ హవిః ।*
ప్రతీతమేతద్దేవానాం తస్మాత్తత్పరివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***206***

తాత్పర్యం:- పైన చెప్పబడినవారిచేత జరుపబడిన యాగాలు వాటిలోని హవిస్సు సద్విప్రుడికి అలక్ష్మీకరం. అవి దేవతలు సైతం గ్రహించరు. కాబట్టి ఆ యాగాలలో భుజించడం నిషిద్ధం.॥206॥

* మత్తక్రుద్ధాతురాణాం చ న భుంజీరన్ కదాచన ।
కేశకీటావపన్నం చ పదా స్పృష్టం చ కామతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*207*

తాత్పర్యం:- పాన మత్తులు, ఉన్మత్తులు, క్రోధం గలవారు, రోగులు మొదలైనవారిచేత వండబడినది, వెంట్రుకలు, పురుగులు మొదలైనవాటితో కూడిందీ, కాలితో తన్నబడిందీ అయిన అన్నం భుజించరాదు.॥207॥

* భ్రూణఘ్నా వేక్షితం చైవ సంస్పృష్టం చాప్యుదక్యయా ।
పతత్రిణావలీఢం చ శునా సంస్పృష్టమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*208*

తాత్పర్యం:-శిశుహత్య, గోహత్యలాంటి ఘోరపాతకాలు చేసినవాళ్లచేత చూడబడిందీ, చేయబడిందీ, రజస్వల అయిన స్త్రీకి పెట్టగా మిగిలిందీ, కాకి-కుక్క మొదలగువాటి ముక్కుతో తాకబడిందీ అయిన అన్నం భుజించరాదు.॥208॥

* గవా చాన్నముపఘ్రాతం ఘుష్టాన్నం చ విశేషతః ।
గణాన్నం గణికాన్నం చ విదుషాం చ జుగుప్సితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*209*

తాత్పర్యం:- గోవుచేత వాసన చూడబడిందయినా-'భోజనానికి వచ్చేవారు రావచ్చు' అంటూ గట్టిగా ప్రకటించి ఆకుల్లో పెట్టి ఇచ్చే అన్నాన్ని కూడా తినరాదు. పదిమంది కలిసి వండిన అన్నం కూడా నిషేధమే! పెద్దలచేత నిందితమైనదీ, వేశ్యలచేత వండబడినదీ పనికిరాదు.॥209॥

* స్తేనగాయనయోశ్చాన్నం తక్ష్ణో వార్ధుషికస్య చ ।
దీక్షితస్య కదరస్య బద్ధస్య నిగడస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*210*

తాత్పర్యం:- దొంగ, సంగీతజ్ఞుడు, వడ్లవాడు, వడ్డీతో జీవనం చేసేవాడు, యజ్ఞదీక్షితుడి కోసం చేయబడిన అన్నం, కృపలేనివాడి చేతి అన్నం, బంధితుడై శిక్ష అనుభవించినవాడిచేతి అన్నం తినరాదు. ॥210॥

* అభిశస్తస్య షండస్య పుంశ్చల్యా దాంభికస్య చ ।
శుక్తం పర్యుషితం చైవ శూద్ర స్యోచ్ఛిష్టమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*211*

తాత్పర్యం:- పాతకుడని పేరు పొందినవాడు, నపుంసకుడు, రంకులాడి, దాంభికుడు మొదలైన వారిచేతి అన్నం, విరిగిన పాలు, చద్ది అన్నం, శూద్రాన్నం, ఇతరులు భుజించగా మిగిలిన అన్నం వదిలి వేయాలి గాని, తినరాదు.॥211॥

* చికిత్సకస్య మృగయోః క్రూరస్యోచ్ఛిష్టభోజినః ।
ఉగ్రాన్నం సూతికాన్నం చ పర్యాచాంతమనిర్దశమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*212*

తాత్పర్యం:- వైద్యవృత్తిలో ఉన్నవాడు, బోయవాడు, ఎంగిళ్లుతినేవాడు, ఉగ్రమైన పనులు చేసేవాడు వీరి, సూతకాన్నం తినరాదు. పంక్తిభోజనాలలో ఒక్కడు లేచిపోయినా, అప్పటికీ ఆచమించి మిగిలినవారు కూర్చొన్నా వారెవ్వరూ భోజనం చేయరాదు.॥212॥

* అనర్చితం వృథామాంసమవీరాయాశ్చ యోషితః ।
ద్విషదన్నం నగర్యన్నం పతితాన్నమవక్షుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*213*

తాత్పర్యం:-అమర్యాదతో వడ్డించబడే అన్నం, దేవతాదుల్ని ఉద్దేశించి వండని మాంసం, భర్త-బిడ్డలు లేని స్త్రీ వండిన అన్నం, శత్రువులు పెట్టే అన్నం, భ్రష్టునిచేతి అన్నం, పైన దుమ్ముపడిన అన్నం.... ఇవన్నీ వర్జింపదగినవి.॥213॥

* **పిశునానృతినోశ్చాన్నం క్రతువిక్రయిణ స్తథా ।**
శైలూషతున్నవాయాన్నం కృతఘ్నస్యాన్న మేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**214**

తాత్పర్యం:- చాటుగా ఇతరుల్ని దూషించేవారి చేతి అన్నం, తప్పుడు సాక్ష్యాలు చెప్పేవారి చేతి అన్నం, యజ్ఞఫలితాన్ని ఇతరులకు అమ్ముకొనేవారి అన్నం, కుట్రలు పన్నేవారిచేతి అన్నం, చేసిన మేలు మరచినవాడి అన్నం.....ఇవీ తినదగినవి కావు.॥214॥

* **కర్మారస్య నిషాదస్య రంగావతారకస్య చ ।**
సువర్ణ కర్తుర్వైణస్య శస్త్రవిక్రయణ స్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**215**

తాత్పర్యం:- లోహపు పనిచేసేవారు, బోయవారు, రంగులు అద్దకం వేసేవారు, బంగారం పని చేసే కంసాలివారు, వెదుళ్లపనివారు, ఆయుధాలు అమ్మేవారు....వీరి చేతి అన్నం కూడా తినకూడదని విజ్ఞులంటారు.॥215॥

* **శ్వవతాం శౌండికానాం చ చేలనిర్ణేజకస్య చ ।**
రజకస్య నృశంసస్య యస్య చోపపతిర్గృహే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**216**

తాత్పర్యం:- వేటనిమిత్తమే కుక్కలు పెంచేవారు, మద్యం అమ్మేవారు, బట్టలు ఉతికేవారు, వస్త్రాలకు రంగులేసేవారు, దయాహీనులు, ఇంట్లోనే పరపురుషుణ్ణి ఉంచుకున్న స్త్రీలు...వీరిచేతి అన్నం తినరాదు.॥216॥

* **మృష్యంతి యే చోపపతిం స్త్రీజితానాం చ సర్వశః ।**
అనిర్దశం చ ప్రేతాన్నమతుష్టికరమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**217**

తాత్పర్యం:- ఇలాంటి అన్నాలు భక్షించడంలో కలిగే దోషాలు చెప్పబడుతున్నాయి. జారుడితో కులికే స్త్రీ చేతి అన్నం, స్త్రీలకు వశుడైనవాడి చేతి అన్నం, మనస్సుకు తుష్టికరం కాదు. ఇవి దుష్టాన్నాలనబడతాయి.॥217॥

* **రాజాన్నం తేజ ఆదత్తే శూద్రాన్నం బ్రహ్మవర్చసమ్ ।**
ఆయుస్సువర్ణ కారాన్నం యశశ్చర్మావకర్తినః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**218**

తాత్పర్యం:- రాజులు పెట్టే భోజనం తేజస్సును హరిస్తుంది. శూద్రుల అన్నం బ్రహ్మవర్చస్సును లాగేస్తుంది. బంగారపు పనివాడి అన్నం దీర్ఘాయువును నశింపచేస్తుంది. చెప్పులు కుట్టేవాడి అన్నం కీర్తిని నాశనం చేస్తుంది.॥218॥

* **కారుకాన్నం ప్రజాం హంతి బలం నిర్ణేజకస్య చ ।**
గణాన్నం గణికాన్నం చ లోకేభ్యః పరికృంతతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**219**

తాత్పర్యం:- శిల్పులచేతి అన్నం సంతతిని, చాకలివాడి అన్నం బలాన్ని, వేశ్యలచేతి అన్నం, ఏదైనా సంఘంవల్ల పెట్టబడే అన్నం స్వర్గాదిపుణ్యలోకాలు కలుగకుండా అడ్డుకుంటుంది.॥219॥

* **పూయం చికిత్సకస్యాన్నం పుంశ్చల్యాస్త్వన్న మింద్రియమ్ ।**
విష్ఠా వార్ధుషికస్యాన్నం శస్త్రవిక్రయిణో మలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**220**

తాత్పర్యం:- వైద్యుల వల్ల కలిగే భోజనం, చీము తినడంతో సమానం. పదిమందితో తిరిగి సంగమించే దానివల్ల దొరికే అన్నం వీర్యం తినడంతో సమానం. వడ్డీ వ్యాపారి అన్నం మలంతో సమానం.॥220॥

*   *య ఏతేఽన్యే త్వభోజ్యాన్నాః క్రమశః పరికీర్తితాః ।*
తేషాం త్వగస్థిరోమాణి వదంత్యన్నం మనీషిణః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***221***

తాత్పర్యం:- ఇక్కడ చెప్పబడినవారేగాక, ఇతర కుల/వృత్తులలో ఉన్నవారిచేతి అన్నం ఎముకలు, చర్మం, రోమాలు భక్షించడంతో సమానం.॥221॥

*   *భుక్త్వాతోఽన్యతమస్యాన్న మమత్యా క్షపణం త్ర్యహమ్ ।*
మత్యా భుక్త్వాఽఽచరేత్కృచ్ఛ్రం రేతో విణ్మూత్రమేవ చ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***222***

తాత్పర్యం:- కాబట్టి, ఇక్కడ చెప్పబడినవారిచేతి అన్నాలు తెలియక వరుసగా మూడు రోజులు భుజించడం జరిగితే మూడురోజులు ఉపవాసం చేయాలి. తెలిసిభుజిస్తే కృచ్ఛ్రాలు పరిహారంగా ఆచరించాలి. రేతస్సు లాంటి వాటితో సమానమైనవి భుజిస్తే ప్రాయశ్చిత్తం ఆచరించాలి.॥222॥

*   *నాద్యాచ్ఛూద్రస్య పక్వాన్నం విద్వానశ్రాద్ధినో ద్విజః ।*
ఆదదీతామమేవాస్మాదవృత్తావేక రాత్రికమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***223***

తాత్పర్యం:- పక్వం చేసినప్పటికీ-శ్రాద్ధాది పంచయజ్ఞవిధి ఆచరించని శూద్రాన్నం భుజించరాదు. మరీ వేరే గతిలేనప్పుడు ఒక్కపూటకు సరిపోయే బియ్యం, శాకపాకాలు పచ్చివి తీసుకొని తాను స్వయంగా శుద్ధిచేసుకుని వండుకోవచ్చు!॥223॥

*   *శ్రోత్రియస్య కదర్యస్య వదాన్యస్య చ వార్ధుషేః ।*
మీమాంసిత్వోభయం దేవాస్సమమన్నమకల్పయన్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***224***

తాత్పర్యం:- దాత అయినప్పటికీ-వడ్డీవ్యాపారి చేతి అన్నం; లోభి అయినప్పటికీ వేదాధ్యయన విప్రుడి చేతి అన్నం.....వీటిలో ఏది మేలు? అని చర్చచేసి, చివరికి రెండూ సమానమైనవే అని దేవతలు నిర్ధారించారు. ॥224॥

*   *తాన్ ప్రజాపతిరాహైత్య మా కృధ్వం విషమం సమమ్ ।*
శ్రద్ధాపూతం వదాన్యస్య హతమశ్రద్ధయేతరత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***225***

తాత్పర్యం:- అప్పుడు-బ్రహ్మ, వారి దగ్గరకొచ్చి "విషమైనదాన్ని, సరిసమానంగా ఎంచకండి. శ్రద్ధచేత దాత అయినప్పుడు వడ్డీవ్యాపారి అన్నమే మేలు. బ్రాహ్మణుడు శ్రద్ధలేని లోభి అయి వేదాధ్యయన పరుడైనా అతడి చేతి అన్నం దూష్యమే" నని నిర్ధారింపజేశాడు.॥225॥

*   *శ్రద్ధయేష్టం చ పూర్తం చ నిత్యం కుర్యాదతంద్రితః ।*
శ్రద్ధాకృతే హ్యక్షయే తే భవతః స్వాగతైర్ధనైః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***226***

తాత్పర్యం:- యజ్ఞములు మొదలైన కర్మలు వేదవిదుడు ఏవేవి లో-లోన చేస్తాడో; కొలనులు, తోటలు వేయించడం లాంటివి బయటికి కనిపించేలా దాత శ్రద్ధచేత చేసినప్పుడు, అవి యజ్ఞాలకంటే మిన్న అయినవి. పుణ్యదాయకం. ॥226॥

ప్రక్షిప్తాల పరిశీలన

205 నుంచి 226 వరకు గల శ్లోకాలు కింది ఆధారాల వల్ల ప్రక్షిప్తాలని రుజువవుతూంది.

1. పరస్పర విరోధాలు

(1) మొత్తం విషయంలో ప్రారంభంలోని ఆధారభూత శ్లోకాలు, 205-206. 205వ దాని నుంచి "న..... భుంజీత బ్రాహ్మణః క్వచిత్" అని ఇక్కడ నిషిద్ధ భోజనాల ప్రసక్తి ప్రారంభమైంది. ఇవి మనువు చెప్పిన ఎన్నోరకాల విషయాల ప్రకారం వ్యతిరేకాలు. ఎలాగంటే -

(క) ఈ శ్లోకాలలో అశ్రోత్రియుడు ప్రారంభించిన యజ్ఞంలో తినటం నిషిద్ధం. మనుస్మృతి మొత్తంమీద యజ్ఞాలలో తినటాన్ని గురించి చెప్పకపోవటం మొదటి విషయం. ప్రక్షిప్తంగా రుజువైన మృతుని శ్రాద్ధంలో దేవతలు, పితృ యజ్ఞంలో విధానం చెప్పారు కాని, ఇది మనువుకు వ్యతిరేకం. రెండవది, మనువు చెప్పిన ప్రకారం, యజ్ఞాలు చేయించడం బ్రాహ్మణుల కర్తవ్యం (1-88); వేద పాఠులు లేదా వేద అధ్యయన అధ్యాపనలు చేయించేవారే బ్రాహ్మణులు. అందుచేత అశ్రోత్రియులు అంటే బ్రాహ్మణులు కానివారు యజ్ఞం ప్రారంభించండమనేది మనువుకు వ్యతిరేకం.

(ఖ) వీటిలో పలువురు చేయించే యజ్ఞాలలోనూ తినటం నిషేధం. అందరు ద్విజులూ యజ్ఞాలు చేయాలి. అది పుణ్యదాయక కార్యమని మనువు చెప్పాడు. ఎంత ఎక్కువగా యజ్ఞాలు చేస్తే అంతగా ధర్మపాలన చేసినట్లవుతుందని మనువు అన్నాడు. అందుచేత ఈ కల్పన కూడా మను సమ్మతం కానిదే.

(గ) స్త్రీలు నపుంసకులు ఆహుతులిచ్చే యజ్ఞాలను నిందించడం మనువు సమ్మతం కాదు. యజ్ఞాలు చేయవద్దని మనువు ఎవరినీ నిషేధించలేదు. స్త్రీలు కూడా యజ్ఞాలు చేయవచ్చనే అన్నాడు (2.41-42 (66-67) శ్లోకాల వివరణ చూడండి). కనుక ఇది కూడా మనువుకు వ్యతిరేకమే. ఈ లోపల వ్యతిరేకాల ఆధారంతో ఈ విషయానికి ఆధారభూతమైన ఈ రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలే. ఇవి ప్రక్షిప్తాలని రుజువు కావడంతో మిగిలిన 207 నుంచి 226 వరకు గల అన్ని శ్లోకాలూ ఈ ప్రక్షిప్తాల కిందికే వస్తాయి.

ఈ విషయంలోని మరికొన్ని లోపలి వ్యతిరేక విషయాలూ ఉన్నాయి -

(ఘ) 210, 220, 224-226 శ్లోకాలలో 'వడ్డీ ఇచ్చేవాడి' తిండి తినరానిది, నిందనీయం అని ఉంది. మనువు వడ్డీ తీసుకోవడం వైశ్యుల పని అన్నాడు (1.90). కనుక, మనువు చెప్పినట్లు ఈ పని నింద్యం కాదు. వడ్డీని నింద్యమని అనుకుంటే, ఈ శ్లోకాలు కూడా మను సమ్మతం కాదు.

(ఙ) 213లో మాంసభక్షణం మనువుకు వ్యతిరేకం, ఘోరపాపం అని ఉంది. (4.26-28 శ్లోకాల వివరణ చూడండి).

(చ) 223లో మరణించినవారి శ్రాద్ధం కూడా మనువుకు వ్యతిరేకమైన ప్రక్షిప్త వర్ణనే (3.119-284 శ్లోకాలపై ఇచ్చిన 'పరస్పర వ్యతిరేకాలు' అనే శీర్షిక చూడండి).

(ఛ) ఈ విషయంలో వేర్వేరు జాతులవారిని గురించిన ఉటంకింపు ఉంది. 214లో నేతపని వారిది; 215లో కమ్మరి, కంసాలులు, చర్మకారులు మొదలైనవారిని పేర్కొన్నారు. మనువు చెప్పిన వర్ణవ్యవస్థలో ఇవన్నీ వేర్వేరు జాతులు కావు, ఇవన్నీ వైశ్యుల పనులు. మనువు వైశ్యులను ద్విజులలోనే గణించాడు, వారు చేసే పనులన్నీ ఆదరించదగినవే అనటం చేత వీరి ఆహారం నింద్యం అనటం మనువుకు వ్యతిరేకం. జాతులను పేర్కొనటం చేత, ఈ శ్లోకాలు జన్మతో వ్యవస్థ అనే విషయంపై ఆధారపడ్డవనీ, మనువు చెప్పినదానికన్నా మార్పులతో ఉన్నాయనీ, అందుచేత, వీటికీ, మనువు చెప్పిన వ్యవస్థకూ పొసగటం లేదనీ తెలుస్తూంది. ఈ లోపలి వైరుధ్యాల వల్ల ఈ శ్లోకాలు, వీటికి సంబంధించిన ఇతర పూర్వాపర శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే!

2. విషయ వ్యతిరేకాలు

205 నుంచి 225 వరకున్న శ్లోకాలు విషయానికి దూరంగా ఉన్నాయి. ఇవి వ్రతాలూ కావు, 'సత్త్వగుణ వర్ధకాల'తో వీటికి ఎటువంటి సంబంధమూ లేదు. పైగా 205-206 శ్లోకాలైతే, సత్త్వగుణ విరోధులు. అందువల్ల, ఈ విషయ వ్యతిరేకత ఆధారంగా, ఇవన్నీ ప్రక్షిప్తాలు. (విస్తృత వివరణకు 4.33-34 శ్లోకాలపై చేసిన 'విషయ వ్యతిరేకాలు' శీర్షిక చూడండి).

3. శైలీగత ఆధారాలు

ఈ విషయంలో 213, 218, 219, 221 శ్లోకాల శైలి నిరాధారము, హేతుయుక్తం కానిది, అతిశయోక్తులతో నిండినది, అప శబ్దాలతో కూడినదిగా ఉంది. ఇలాంటిది మనువు శైలి కాదు.

దానధర్మ పాలన కథనం- ఇది మనుకృతం-ప్రామాణికం

దానధర్మం నిషేవేత నిత్యమైష్టికపౌర్తికమ్ । మూలశ్లోక సం. **73**
పరితుష్టేన భావేన పాత్రమాసాద్య శక్తితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **227**

టీక:- ద్విజుడు, పాత్రమ్ + అసాద్య = సుపాత్రుణ్ణి, యోగ్యుణ్ణి చూసి, **పరితుష్టేన భావేన** = సాత్త్విక భావం, నిస్స్వార్థం, నిర్లోభం అయిన భావంతో, శ్రేష్ఠ కార్యం కోసం (12.11,21), **శక్తితః**= యథాశక్తి, **నిత్యమ్** = ఎల్లప్పుడు, **ఐష్టిక పౌర్తికమ్** = యజ్ఞముల నిర్వహణసంబంధమైనవి, పౌర్తిక ఉపకారార్థం, (కూప) బావి, తటాకం మొ॥ వాటి నిర్మాణ సంబంధమైనవి, **దాన ధర్మం నిషేవేత** = దాన ధర్మాలను చేయాలి. అంటే దానమివ్వాలి.

తాత్పర్యం:- సంతృప్తి చెందిన హృదయంతో పాత్రుడికిచ్చే దానం, శక్తిమేరకు ఆచరించినా యజ్ఞం ఫలితాన్నివ్వగలదు. ప్రజోపయోగకార్యాలు చేయించడం కూడా ఇలాంటిదే.॥227॥

228 నుండి 232వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అడిగినప్పుడు దానం తప్పక ఇవ్వాలి-

* *యత్కించిదపి దాతవ్యం యాచితేనానసూయయా ।*
ఉత్పత్స్యతే హి తత్పాత్రం యత్తారయతి సర్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***228***

తాత్పర్యం:- ఒకడు ఏదైనా యాచిస్తే ద్వేషం లేక దాన్ని తాను ఇవ్వగలిగినంత ఇవ్వాలి. దానశీలుడైనవాడు తెప్పించి మరీ ఇస్తాడు. పాత్రుడు అడిగినప్పుడు దాత ఇస్తే అది అతణ్ణి నరకం నుంచి ఉద్ధరిస్తుంది.॥228॥

* వివిధ దానాల ఫలం-

* *వారిదస్తృప్తిమాప్నోతి సుఖమక్షయ్యమన్నదః ।*
తిలప్రదః ప్రజామిష్టాం దీపదశ్చక్షురుత్తమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***229***

తాత్పర్యం:- నీటిని దానం చేయడం వల్ల పరలోకంలో తనకు తృప్తి కలుగుతుంది. అన్నదానం చేస్తే తరగని సుఖసౌఖ్యాలు ఒనగూడుతాయి. నువ్వులు దానం చేయడం వల్ల కోరిన సంతానం కలుగుతుంది. దీపదానం చేస్తే మేలైన దృష్టి లభిస్తుంది.॥229॥

* *భూమిదో భూమిమాప్నోతి దీర్ఘమాయుర్హిరణ్యదః ।*
గృహదోఽగ్ర్యాణి వేశ్మాని రూప్యదో రూపముత్తమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***230***

తాత్పర్యం:- భూదాన ఫలితంగా భూమి లభిస్తుంది. బంగారం దానం చేస్తే దీర్ఘాయుష్షు కలుగుతుంది. గృహాన్ని దానం చేసేవారికి చక్కని గృహవసతులు సిద్ధిస్తాయి. వెండిని దానం చేస్తే మంచి రూపం వస్తుంది.॥230॥

* *వాసోదశ్చంద్రసాలోక్య మశ్విసాలోక్య మశ్వదః ।*
అనడుద్ధః శ్రియం పుష్టాం గోదో బ్రధ్నస్య విష్టపమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**231**

తాత్పర్యం:- వస్త్రదానం వల్ల చంద్రలోక సాయుజ్యం కలుగుతుంది. గుర్రాలను దానం చేస్తే అశ్వినీ దేవతల లోకం, ఎద్దుల్ని దానంచేస్తే సంపద, గోదానం వల్ల సూర్యలోక ప్రాప్తి తథ్యం.॥231॥

* *యానశయ్యాప్రదో భార్యామైశ్వర్యమభయప్రదః ।*
ధాన్యదశ్శాశ్వతం సౌఖ్యం బ్రహ్మదో బ్రహ్మసార్ష్టితామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**232**

తాత్పర్యం:- పడకను, పల్లకిని దానం చేస్తే చక్కని భార్య లభిస్తుంది. ఎవరికైనా అభయ ప్రదానం చేస్తే అధికారం కలుగుతుంది. వడ్లు, యవలు, మినుములు మొదలైన ధాన్యాలు దానంచేస్తే శాశ్వత సౌఖ్యం లభిస్తుంది. వేదాన్ని దానం చేస్తే శాశ్వతబ్రహ్మలోకం ప్రాప్తి.॥232॥

ప్రక్షిప్తాల పరిశీలన

228 నుంచి 232 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 228వ శ్లోకంలో దానం తీసుకున్నవారి ద్వారా **'దాత తరించడం'** మను విరుద్ధం. 4.240లో మనువు కేవలం కర్తే తన సుకృత దుష్కృతాలకు భోక్త అవుతాడని చెప్పాడు. దాని ప్రకారమే తరువాతి జన్మ లభిస్తుంది. [12.3-9, 39-52,74]. అందు చేత ఒకడి కర్మలకు ఫలం అనుభవించేవాడు మరొకడు ఉండడు.

ఖ. 229, 232 శ్లోకాలలో అన్నం, ధాన్యం దానాల ద్వారా అక్షయసుఖం కలుగుతుందని ఉంది. ఇంత మాత్రం చేతనే అక్షయసుఖం కలిగితే, మనుస్మృతిలో చెప్పిన ధర్మాలు నిఃశ్రేయస్సుకు చేసే కర్మలు అన్నీ దండుగే అవుతాయి. మనువు ధర్మపాలన, నిశ్శ్రేయ కర్మల వల్లనే అక్షయ సుఖం లభిస్తుందన్నాడు [6-97; 12.82-126]. అందుచేత ఇది మను విరుద్ధం-

గ. 231 లోని వేర్వేరు లోకాల ప్రాప్తి కూడా మనువుకు వ్యతిరేకం. మరణం తర్వాత ఏదో లోకం కలుగుతుందనలేదు. మనువు ప్రపంచంలో పునర్జన్మ లేదా ముక్తి- ఈ రెండిటినీ విశ్వసించాడు. [6.63,74,81; 12.116,225]. ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

2. శైలీగత ఆధారాలు

ఈ అన్ని శ్లోకాల శైలీ కాల్పనికమూ, నిర్హేతుకమూ, అతిశయోక్తులు గలదీ. ఎందుకంటే, ఇందులో పరిగణించిన పదార్థాలకూ, వాటి ఫలాలకూ ఏ సంబంధమూ లేదు. ఈ విధంగానైతే ప్రతివాడూ అన్ని లాభాలూ పొందితే, ధర్మపాలన అవసరమేమిటి? మనువు శైలిలో ఇటువంటి దోషాలు ఉండవు.

వేదజ్ఞానదానం-సర్వశ్రేష్ఠం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

సర్వేషామేవ దానానాం బ్రహ్మదానం విశిష్యతే । మూలశ్లోక.సం.**74**
వార్యన్నగోమహీవాసస్తిలకాంచనసర్పిషామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**233**

టీక:- సర్వేషామేవ దానానాం = ప్రపంచంలో ఎన్ని దానాలున్నవో అంటే, **వారి+అన్న-గో- మహీ-వాస-తిల-కాంచన సర్పిషామ్** = జలదానం, అన్నదానం, గోదానం, భూదానం, వస్త్రదానం, తిలదానం, స్వర్ణదానం, ఘృతాదులదానం, వీటన్నిటిలో కల్లా, **బ్రహ్మదానం విశిష్యతే** = వేద విద్యాదానం సర్వశ్రేష్ఠం.

ఋషి దయానందభాష్యం:- లోకంలో చేయబడే ఉదకం, అన్నం, గోవులు, భూమి, వస్త్రాలు, నువ్వులు, బంగారం, నెయ్యి-ఈ అన్ని దానాలన్నిటికంటే వేదాధ్యాపనం-దాని ధర్మాలు, అర్థాలు బోధించడం ఎంతో శ్రేష్ఠం. సాంగవేదాధ్యాపనం చేయించడం గొప్ప దానం. కాబట్టి సాధ్యమైనంతవరకు తనుమనో ధనాలతో విద్యాభివృద్ధికై యత్నించాలి. (స.ప్ర. 3వ.స.).॥233॥

234 నుండి 237వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *యేన యేన తు భావేన యద్యద్దానం ప్రయచ్ఛతి ।*
తత్తత్తేనైవ భావేన ప్రాప్నోతి ప్రతిపూజితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***234***

తాత్పర్యం:- తన వాంఛాఫల సిద్ధి కోసం ఏ యే మానవులు ఏ యే దానాలను చేస్తారో తదుపరి జన్మలో ఆ యా ఫలితాలు పొందుతారు.॥234॥

* *యోఽర్చితం ప్రతిగృహ్ణాతి దదాత్యర్చిత మేవ చ ।*
తావుభౌ గచ్ఛతస్స్వర్గం నరకం తు విపర్యయే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***235***

తాత్పర్యం:- పూజ సహితంగా ఎవరు దానాదులు చేస్తారో, పూజపూర్వకంగా ఎవరు దానాదులు తీసుకుంటారో వారిద్దరూ స్వర్గలోకవాసానికి అర్హులవుతున్నారు. కాబట్టి పూజలేని దానం నిరర్థకం.॥235॥

* *న విస్మయేత తపసా వదేదిష్ట్వా చ నానృతమ్ ।*
నార్తోఽప్యపవదేద్విప్రాన్న దత్వా పరికీర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***236***

తాత్పర్యం:- తాను ఎంతో తపస్సు చేసినందుకుగాను ఎలాంటి వారైనా గర్వపడరాదు. యాగాది సత్కృత్యాలు చేసి కూడా అసత్యాలు పలుకరాదు. విప్రులను దూషించరాదు. చేసిన దానం గురించి చెప్పుకోరాదు.॥236॥

* *యజ్ఞోఽనృతేన క్షరతి తపఃక్షరతివిస్మయాత్ ।*
ఆయుర్విప్రాపవాదేన దానం చ పరికీర్తనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***237***

తాత్పర్యం:- అబద్ధాలాడటం చేత యజ్ఞఫలితం నశిస్తుంది. గర్వంచేత తపఃఫలితం క్షీణిస్తుంది. విప్రుల్ని దూషిస్తే ఆయుక్షీణం. ఇతరులకు వెల్లడి చేస్తే దానఫలితం పోతుంది.॥237॥

ప్రక్షిప్తాల పరిశీలన

234 నుంచి 237 వరకు గల శ్లోకాలు ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి.

1. విషయ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో చెప్పినవి వ్రతం కిందికీ రావు, 'సత్త్వగుణ వృద్ధికరం' తో ఏ సంబంధమూ లేనివి. విషయాంతరం కావటం చేత 'విషయ వ్యతిరేకాలు' అనే ఆధారం ప్రకారం ప్రక్షిప్తాలు [విస్తృత వివరణ కొరకు 4.33-34 శ్లోకాల 'విషయ విరోధాలు' చూడండి].

2. అంతర్ వ్యతిరేకాలు

క. 234-235 శ్లోకాలలోని 'నరక ప్రాప్తి' మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు నరకం పేరిట ఏ ప్రాంతమూ లేదన్నాడు. [చూడండి 4.87-91 శ్లోకాలపై 'అంతర్విరోధాలు'లో నరక సంబంధ సమీక్ష].

ఖ. 236-237 శ్లోకాలలో యజ్ఞాలు, తపస్సు మొదలైన వాటి ఫలాలు నశిస్తాయని ఉంది. మనువు సిద్ధాంతానుసారం, కర్మల ఫలాలు అనుభవించటం చేతనే పోతాయి. వాటి ప్రకారమే పునర్జన్మలూ కలుగుతాయని మనువు అన్నాడు [4.240; 12.3-9, 39-52,74 మొ॥]. చిన్న విషయాలకే ధర్మకార్యాల ఫలాలు నశించిపోతే, యజ్ఞాది ధర్మకార్యాల ఫలాలు వాటికన్నా అల్ప ఫలాలు ఇచ్చేవే అవుతాయి కదా! ఇది వట్టి కాల్పనిక విషయం.

గ. 234వ శ్లోకంలో 'ఏ భావంతో దానం చేస్తే ఆ వస్తువే తిరిగి లభిస్తుంది' అనటం మను సమ్మతం కాదు. మనువు దాన ధర్మాల ద్వారా ఏవో వస్తువులను కాక, సుఖం కలుగుతుందని విశ్వసించాడు. 4.241, 243లలో దీన్నే చెప్పాడు. దీని ఆధారంతో ఈ శ్లోకాలు మనువుకు వ్యతిరేకాలు. ఈ అంతర్ వ్యతిరేకాలతో ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే!

3. శైలీగత ఆధారాలు

ఈ అన్ని శ్లోకాల శైలికీ ఆధారం లేదు. సహేతుకం కాదు. అతిశయోక్తులే ఉన్నాయి. ఇందులో చెప్పిన విషయాలూ, వాటి ఫలాలకు సంబంధమే కనిపించటం లేదు కనుక ఇవి మనువుకు వ్యతిరేకాలు.

238 నుండి 246వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ధర్మసంచయ విధానం-ధర్మప్రశంస

ధర్మం శనైస్సంచినుయాద్వల్మీకమివ పుత్తికాః । మూలశ్లోక సం. **75**
పరలోకసహాయార్థం సర్వభూతాన్యపీడయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **238**

టీక:- పుత్తికాః వల్మీకమ్ + ఇవ = ఏ విధంగా చెదపురుగులు పెద్ద పుట్టను నిర్మిస్తాయో, అదేవిధంగా, **సర్వభూతాన్ +అపీడయన్** = ఏ ప్రాణిని బాధించకుండా, **పరలోక +సహాయార్థం** = పరలోకం -పరజన్మ సుఖం కోసం, **శనైః ధర్మం సంచినుయాత్** = మెల్లమెల్లగా ధర్మాన్ని పోగు చేసికోవాలి. (స.ప్ర.106).

ఋషి దయానందభాష్యం:- సమస్త భూతజాలం పట్ల కరుణ కలిగి, చెదలు పుట్టను పెట్టినట్లు పరలోకం అంటే పరజన్మలో కూడా సుఖాన్ని పొందడానికై స్త్రీ పురుషులందరూ మెల్లమెల్లగా ధర్మాన్ని సంపాదించాలి. (స.ప్ర.4వ.సము.).॥238॥

వివరణ

ఇక్కడ మెల్లమెల్లగా (శనైః) అనడంలో 'జాగ్రత్తగా ధర్మాన్ని పాలిస్తూ'అని అభిప్రాయం. చెదలు తన పుట్టను మెల్లమెల్లగా నిర్మించుకుంటూ, పుట్ట విరిగిపడకుండా ఎలా జాగ్రత్తపడునో, అలాగే మానవుడు కూడా తాను ధర్మం నుండి పడిపోకుండా జాగ్రత్తపడాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

నాముత్ర హి సహాయార్థం పితా మాతా చ తిష్ఠతః । మూలశ్లోక సం. **76**
న పుత్రదారా న జ్ఞాతిర్ధర్మస్తిష్ఠతి కేవలః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **239**

టీక:- హి = ఎందుకంటే, **అముత్ర** = పరలోకంలో, న **పితా-మాతా**, న **పుత్ర దారా** న **జ్ఞాతిః సహాయార్థం తిష్ఠతః** = తల్లిగాని, తండ్రిగాని, పుత్రులుగాని, భార్యగాని, సంబంధీకులు (చుట్టాలు) గాని సహాయం చేయజాలరు. కాని, **కేవలః ధర్మః తిష్ఠతి** = ఒక్క ధర్మమే సహాయపడుతుంది.

ఋషి దయానందభాష్యం:- పరలోకంలో మనకు సహాయపడటానికి తల్లిదండ్రులుగానీ, భార్యా పుత్రాదులు గాని రారు. దాయాదులు అంతకంటే దరిచేరరు. ధర్మమొక్కటే తనకు తోడుగా వచ్చేది. కాబట్టి-కడుపున పుట్టిన బిడ్డల కంటే ధర్మాన్ని అధికంగా ప్రేమించాలి. (స.ప్ర. 4వ సము.)॥239॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకః ప్రజాయతే జన్తురేక ఏవ ప్రలీయతే । మూలశ్లోక సం. **77**
ఏకోఽనుభుఙ్క్తే సుకృతమేక ఏవ చ దుష్కృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **240**

టీక:- **ఏకః జన్తుః ప్రజాయతే ఏక+ఏవ చ ప్రలీయతే** = జీవుడు ఒంటరిగానే జన్మిస్తాడు, మరణిస్తాడు, **ఏకః సుకృతమ్ ఏకః+ఏవ చ దుష్కృతమ్ అనుభుఙ్క్తే** = ఒక్కడే ధర్మఫలితమైన సుఖాన్నీ అధర్మం యొక్క దుఃఖ రూప ఫలాన్నీ అనుభవిస్తాడు.

ఋషి దయానందభాష్యం:- జీవుడు ఒంటరిగానే జన్మిస్తాడు. ఒంటరిగానే మరణిస్తాడు. తాను చేసిన పుణ్యఫలమైన సుఖాన్ని, పాపఫలమైన దుఃఖాన్నీ ఒంటరిగానే అనుభవిస్తాడు. (స.ప్ర. 4వ సము.).॥240॥

వివరణ

1. కర్తే కర్మఫలభోక్త

ఈ శ్లోకంలో వ్యక్తిగతంగా చేసిన సుకృత-దుష్కృతాల ఫలితాన్ని కర్తే అనుభవిస్తాడని చెప్పబడింది. కానీ అధర్మంగా చేసిన కర్మల ఫలితం, భోగాన్ని కర్తతో పాటు సమ్మిళితంగా అన్యులు కూడా భాగస్వాములవుతారు. కాబట్టి ఆ దుష్కర్మ ఫలితాన్ని కర్తతో పాటు అతని వారసులు కూడా పాపఫలితాన్ని అనుభవించవలసి ఉంటుందని మనువు 4.170వ శ్లోకంలో స్పష్టపరిచారు. (4.173).

కర్త అనుభవించవలసిన నిజఫలాన్ని ఎవరూ పంచుకోజాలరు.

2. సత్యార్థ ప్రకాశం 4వ సముల్లాసంలో మహర్షి దయానందులవారు (4.78)వ శ్లోకం తరువాత మనుస్మృతిలో లేని శ్లోకాన్ని ఉదాహరించారు. అది మహాభారతంలో ఉద్యోగ పర్వంలో (33.47) ఉంది.

> **"ఏకః పాపాని కురుతే ఫలం భుఙ్క్తే మహాజనః ।**
> **భోక్తారో విప్రముచ్యన్తే కర్తా దోషేణ లిప్యతే" ॥** మహా.భా.ఉద్యో.33.47

కుటుంబంలో ఒకడు పాపం చేసి పదార్థాలను తెస్తాడు. మహాజనులు అంటే కుటుంబ సభ్యులు మొదలగువారు ఆ పదార్థాలను అనుభవిస్తారు. అనుభవించేవారు దోష-భాగస్తులు కారు. కానీ కర్తే ఆ దోషానికి భాగస్వామి అవుతాడు (స.ప్ర. 4వ.సము.).

ఇక్కడ అపరాధ కర్మ దృష్టితో కర్తే దోషి అని కుటుంబ సభ్యులు కాదని మహర్షి దయానందుల వారు అభిప్రాయపడ్డారు. దోషభాగి కావడం వల్ల ఆ అపరాధంలో దండనీయుడవుతాడు. కుటుంబీకులు ఆశ్రితులు కాబట్టి వారికి కర్త పాపం చేసి సంపాదించాడో లేదా ధర్మంగా సంపాదించాడో అనే విషయం తెలియదు. తెలిసినా ఈ విధంగా కుటుంబీకులు ఆ పాపధనాన్ని అనుభవించినా కర్తలు కారు. కాబట్టి ఆ అపరాధంలో దోషభాగులు కారు. కాజాలరు. కానీ వ్యక్తి స్థాయిలో జరిగిన పాప ఫలప్రాప్తిలో కర్త అవశ్యం దోషభాగి అవుతాడు (4.170).

ఇది మనుకృతం-ప్రామాణికం

మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్టసమం క్షితౌ । మూలశ్లోక సం. **78**
విముఖా బాన్ధవా యాన్తి ధర్మ స్తమనుగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **241**

టీక:- మృతం శరీరం, కాష్ఠ లోష్ఠ సమం క్షితౌ **ఉత్సృజ్య** = ఎప్పుడు ఎవరైనా సంబంధీకులు చనిపోతే, ఆ శవాన్ని మట్టిపెడ్డ లాగా, ఎండుకట్టె లాగా భూమి మీద విడిచిపెట్టి (వీపు చూపించి), **బాన్ధవాః విముఖాః యాన్తి** = బంధువులందరూ విముఖులై వెళ్ళిపోతారు. ఎవరూ ఆ శవంతో పాటు వెళ్ళేవారు కాదు. కాని, **ధర్మః + తమ్+అనుగచ్ఛతి** = ఒక్క ధర్మమే అతడికి తోడై వెళుతుంది.

ఋషి దయానందభాష్యం:- మరణించిన వారి శరీరాన్ని ఒక మట్టిముద్దవలె భూమిపై విడిచి (భూమిలో పాతి లేదా కాల్చి) విముఖులై బంధువులందరూ వెనుదిరిగిపోతారు. అతని వెంట ఎవరూ వెళ్ళరు. కాని, 'ఒక్క ధర్మం మాత్రమే అతని వెంట వెళుతుంది.' (స.ప్ర. 4వ.ప్ర.). ॥241॥

ఇది మనుకృతం. ప్రామాణికం

తస్మాద్ధర్మం సహాయార్థం నిత్యం సంచినుయాచ్ఛనైః । మూలశ్లోక సం. **79**
ధర్మేణ హి సహాయేన తమస్తరతి దుస్తరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **242**

టీక:- **తస్మాత్** = అందువల్ల, **సహాయార్థం** = సహాయం కోసం పరజన్మ సుఖం, ఆ జన్మలో సహాయం కోసం, **నిత్యం ధర్మం శనైః సంచినుయాత్** = నిత్యం కొంచెం కొంచెంగా ధర్మాన్ని కూడబెట్టుకుంటూ ఉండాలి. **హి** = ఎందుకంటే, **ధర్మేణ సహాయేన** = ధర్మ సహాయంతోనే, **దుస్తరమ్ తమః తరతి** = అతి దుస్తరమైన దుఃఖసాగరాన్ని జీవుడు తరించగలడు.

ఋషి దయానందభాష్యం:- అందువల్ల పరజన్మ సహాయం కోసం ఈ జన్మలో నిత్యం కొంచెం కొంచెంగా ధర్మాన్ని కూడబెట్టుకుంటూ ఉండాలి. ఎందుకంటే ఆ ధర్మ సహాయంతోనే అతి దుస్తరమైన దుఃఖసాగదాన్ని జీవుడు తరించగలడు (స.ప్ర. 4వ సము.).॥242॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ధర్మప్రధానం పురుషం తపసా హతకిల్బిషమ్ । మూలశ్లోక సం. **80**
పరలోకం నయత్యాశు భాస్వన్తం ఖశరీరిణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **243**

టీక:- **ధర్మప్రధానం పురుషం** = కాని, ఏ పురుషుడు ధర్మమే ప్రధానమని భావిస్తాడో, **తపసా హతకిల్బిషమ్** = ఎవరికి ధర్మానుష్ఠానం అనే కర్తవ్యం వల్ల పాపం దూరమైపోయిందో అతడిని, **భాస్వన్తం** = ప్రకాశస్వరూపం, **ఖశరీరిణమ్** = ఆకాశమే శరీరం లాగా ఉన్న, **పరలోకం ఆశు నయతి** = పరమ దర్శనీయమైన పరమాత్మ ప్రాప్తికి ధర్మమే చేరుస్తుంది.

ఋషి దయానందభాష్యం:- ముఖ్యంగా ధర్మాచరణే ప్రధానమని తలచాలి. బుద్ధిపూర్వకంగా (లేక -అజ్ఞాన వశాన) ఏదైనా పాపం చేస్తే అందుకు నిష్కృతిక్రియలు చెప్పబడ్డాయి. కాబట్టి వాటిద్వారా పాపం పోగొట్టుకొని ఉత్తమలోక ప్రాప్తికోసం ధర్మాచరణ చేయాలి. (స.ప్ర. 4వ.సము.).॥243॥

ఉత్తముల సహవాసం చేయండి

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉత్తమైరుత్తమైర్నిత్యం సంబంధానాచరేత్సహ । మూలశ్లోక సం. **81**
నినీషుః కులముత్కర్షమధమానధమాంస్త్యజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **244**

టీక:- **కులం+ఉత్కర్షం నినీషుః** = ఏ మనుషుడు తన కులాన్ని ఉత్తమమైనదిగా చేయదలచుకుంటే, **అధమానధమాన్ త్యజేత్** = నీచాతినీచమైన పురుషుల సహవాసాన్ని త్యజించాలి, **నిత్యం ఉత్తమైః ఉత్తమైః సహ సంబంధాన్ ఆచరేత్** = నిత్యం శ్రేష్ఠపురుషులతో సంబంధాన్ని పెంచుకుంటూ పోవాలి.

ఋషి దయానందభాష్యం:- తన కులానికి, తన జన్మవల్ల గొప్పదనాన్ని తీసుకురాదలచుకున్న వాడెన్నడూ అధములతో సాంగత్యం చేయకూడదు. గొప్పవారితోనే సంబంధబాంధవ్యాలు కొనసాగించాలి. ॥244॥

వివరణ: 'ఉత్తమ' శబ్దానికి గొప్ప అని, అర్థం కాదు. 'శ్రేష్ఠమైంద'ని అర్థం. 'అధమ' శబ్దానికి, 'నీచ' మని భావం.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉత్తమానుత్తమాన్ గచ్ఛన్ హీనాన్ హీనాంశ్చ వర్జయన్ । మూలశ్లోక.సం. **82**
బ్రాహ్మణః శ్రేష్ఠతామేతి ప్రత్యవాయేన శూద్రతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **245**

టీక:- **బ్రాహ్మణః** = బ్రాహ్మణుడు, **ఉత్తమాన్ ఉత్తమాన్ గచ్ఛన్** = శ్రేష్ఠులైన వారితో సంబంధం పెంచుకుంటూ, **వ** = మరియు, **హీనాన్ హీనాన్ వర్జయన్** = నీచమైన వ్యక్తులతో సంబంధాలను విడిచిపెడుతూ, **శ్రేష్ఠతామ్ ఏతి** = అధిక శ్రేష్ఠత్వాన్ని పొందుతాడు, **ప్రత్యవాయేన** = ఇందుకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లయితే, **శూద్రతామ్** = శూద్రత్వాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ఉత్తమోత్తములతో చెలిమి చేయడం, వారితో సంబంధానుబంధాలు కలిగి ఉండడం వల్ల విప్రుడికి శ్రేష్ఠత్వం లభిస్తుంది. నీచసాంగత్యం చేత శూద్రత్వం ప్రాప్తిస్తుంది. కాబట్టి నీచమైన వ్యక్తులతో సంబంధాలను విడిచిపెట్టాలి. ॥245॥

వివరణ

బ్రాహ్మణశబ్దాభిప్రాయం

ఇక్కడ బ్రాహ్మణ శబ్దం ఉపలక్షణంగా ప్రయుక్తమైంది. ఇదేవిధంగా అన్య వర్ణాలవారికిన్నీ శ్రేష్ఠత్వం, శూద్రత్వం ప్రాప్తిస్తుంది అనే అభిప్రాయం కూడా ఈ శ్లోకంలో సన్నిహితమైంది. అక్కడక్కడ ఛందపూర్త్యర్థం కోసం గానీ ఉపలక్షణంగా గానీ కొన్ని శబ్దాలను విస్తృతార్థం కోసం ప్రయోగించడం మనువు యొక్క ప్రత్యేక శైలిగా గుర్తించాలి. ఉదాహరణార్థం ప్రాణాయామాల విధానం అందరి కోసమే. కానీ 6.70వ శ్లోకంలో బ్రాహ్మణ శబ్దాన్ని ఉప లక్షణరూపంగా సర్వవర్ణాలకు ప్రయోగించాడు. ఇదే విధంగా 6.91వ శ్లోకంలో ధర్మానికి చెందిన లక్షణాలను నాలుగు ఆశ్రమాలవారికి, విధిస్తూ అదే ప్రసంగంలో 6-88వ శ్లోకంలో విప్ర శబ్దం, 6.94వ శ్లోకంలో ద్విజశబ్దం, ఉపలక్షణ రూపంగానే ప్రయోగించబడింది. 2.15వ శ్లోకంలో కూడా బ్రాహ్మణశబ్దం కూడా ఉపలక్షణాత్మక ప్రయోగం.

స్వర్గప్రాప్తికి సహాయకగుణాలు- ఇది మనుకృతం-ప్రామాదికం

దృఢకారీ మృదుర్దాంతః క్రూరాచారైరసంవసన్ । మూలశ్లోక సం. **83**
అహింస్రో దమదానాభ్యాం జయేత్స్వర్గం తథావ్రతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **246**

టీక:- **దృఢకారీ** = సదా దృఢకారి, **మృదుః** = కోమల స్వభావం కలవాడు, **దాన్తః** = జితేంద్రియుడు, **క్రూరాచారైః+అసంవసన్** = హింసకులు, క్రూరులు, దుష్టాచారులు వీరి నుండి వేరుగా ఉండేవాడు. **తథావ్రతః** = ధర్మాత్మ, **అహింస్రః** = హింసా స్వభావ రహితుడు. **దమ-దానాభ్యాం స్వర్గం జయేత్** = మనస్సును జయించి, విద్యాదుల దానం ద్వారా స్వర్గాన్ని (సుఖాన్ని) పొందాలి.

ఋషి దయానందభాష్యం:- ప్రారంభించిన పనిని మధ్యలో వదిలెయ్యక పూర్తిచేసే వారు, మృదుస్వభావి, సుఖదుఃఖాది ద్వంద్వాలలో ఒకే రీతిగా మెలగగలిగేవారు, పరహింసారహితులు, క్రూర స్వభావుల సాంగత్యం లేనివారు, దాన గుణవంతులు అయిన ధర్మాత్ములు మనస్సును జయించి విద్యాదిదానాలను చేయడంలో సుఖాన్ని పొందుతారు. జితేంద్రియులు స్వర్గాన్ని పొందుతారు. (స.ప్ర.4వ.సము) ॥244॥

వివరణ:- 'స్వర్గ' శబ్దానికి అర్థం ఇహలోక సుఖం, మోక్షసుఖమని అర్థం. ఈ విషయానికి సంబంధించిన విస్తృత వివరణకు 3.79ని చూడగలరు.

247 నుండి 254వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* దానగ్రహణ సంబంధ విషయాలు-

* ఏధోదకం మూలఫలమన్నమభ్యుదితం చ యత్ ।
సర్వతః ప్రతిగృహ్ణీయాన్మధ్వథాభయదక్షిణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **247**

తాత్పర్యం:- కట్టెలు, నీరు, దుంపలు, పండ్లు, ద్రవ్య (ధన) సంబంధ నాణెములు, తేనె....ఇవన్నీ అడక్కుండానే లభించాయి కదా అని వారి దగ్గర్నుంచి తీసుకోరాదు. ఛండాల, భ్రష్ట, వేశ్యల నుంచి అసలు గ్రహించరాదు.॥247॥

* ఆహృతాభ్యుద్యతాం భిక్షాం పురస్తాదప్రచోదితామ్ ।
మేనే ప్రజాపతిర్గ్రాహ్యామపి దుష్కృతకర్మణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **248**

తాత్పర్యం:- ముందుగా చెప్పకుండా తన వద్దకు తెచ్చియిచ్చే స్వర్ణాది వస్తువులను పతితుల నుండి గాక తక్కినవారి నుండి గ్రహించవచ్చును.॥248॥

* నాశ్నంతి పితరస్తస్య దశవర్షాణి పంచ చ ।
న చ హవ్యం వహత్యగ్నిర్యస్తామభ్యవమన్యతే॥ ప్రక్షిప్త శ్లోక సం. **249**

తాత్పర్యం:- నిషిద్ధవ్యక్తుల చేతి దానాన్ని ఎవరైతే తిరస్కరిస్తారో, అలాంటి వారొనర్చే కవ్యములను, పితృదేవతలు తిరస్కరించరు. అలా కాకుండా దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే అగ్నిహోత్రుడైనా హవ్యాలను తీసుకోడు.॥249॥

* శయ్యాం గృహాన్ కుశాన్గంధానపః పుష్పం మణీన్దధి ।
ధానా మత్స్యాన్ పయో మాంసం శాకం చైవ న నిర్ణుదేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **250**

తాత్పర్యం:- పడక, ఇల్లు, దర్భలు, గంధం, కర్పూరం, నీరు, పుష్పాలు, మణులు, పెరుగు, ఒరుగులు, చేపలు, పాలు, నంజుళ్లు, శాకాదులు, ఎవరైనా వీటిని బలవంతంగా ఇస్తామని చెప్పినా వద్దనకూడదు.॥250॥

* గురూన్ భృత్యాంశ్చోజ్జిహీర్షన్నర్చిష్యన్ దేవతాతిథీన్ ।
సర్వతః ప్రతిగృహ్ణీయాన్న తు తృప్యే త్స్వయం తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **251**

* గురుషు త్వభ్యతీతేషు వినా వా తైర్గృహే వసన్ ।
ఆత్మనో వృత్తిమన్విచ్ఛన్ గృహ్ణీయాత్సాధుతస్సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **252**

తాత్పర్యం:- తల్లిదండ్రులు మొదలైన పెద్దలు గతించిన తరవాత గాని, వారు జీవించి ఉన్నాగాని, వారితో పాటుగా కలిసిఉండకుండా, తాము వేరుగా ఉన్నా తన జీవిక సాఫల్యం చెందించుకోగోరువారు సాధువుల వద్దనుంచే దానం పుచ్చుకోవాలి. ॥251,252॥

* ఆర్ధికః కులమిత్రం చ గోపాలో దాసనాపితౌ ।
ఏతే శూద్రేషు భోజ్యాన్నా యశ్చాత్మానం నివేదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **253**

తాత్పర్యం:- తన భూమిని సాగుచేసేవాడు, స్వకులంలో స్నేహితుడు, తన పశువులను మేపేవాడు, తన నౌకరు, తనకు క్షురకర్మ మాత్రం చేసే మంగలి, తన సర్వస్వాన్నీ అర్పించేవాడు, వీరంతా స్వజనం అనబడతారు. కాబట్టి, వీరి చేతి అన్నం తినవచ్చు! అని ఈ శ్లోకం చెబుతున్నది. ॥253॥

* యాదృశోఽస్య భవేదాత్మా యాదృశం చ చికీర్షతమ్ ।
యథా చోపచరేదేనం తథాత్మానం నివేదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **254**

తాత్పర్యం:- కులశీలములచేత, ఆ శూద్రుడి స్వభావం ఎలాంటిదో తెలుసుకోవాలి. ఏ ఉద్దేశంతో అతడు తనకు భోజనం పెట్టదల్చుకున్నదీ విచారించాలి. త్రికరణ శుద్ధిగా తనను సేవించడానికే అని తెలిస్తే అంగీకరించాలి.॥254॥

ప్రక్షిప్తాల పరిశీలన

247 నుంచి 254 వరకు గల శ్లోకాలు ఈ ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి.

1. విషయ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలలో చెప్పినవి విషయానికి దూరంగా ఉన్నాయి. వీటికి, 'సత్త్వగుణ వర్ధక' విషయంతో సంబంధమూ లేదు, ఏదైనా వ్రతమూ కాదు. విషయ వ్యతిరేకాలనే ఆధారంతో ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలు [విస్తృత వివరణకు 4.33-34 శ్లోకాల మీది **'విషయ విరోధాలు'** సమీక్ష చూడండి].

2. అంతర్ వ్యతిరేకాలు

క. 1.88లో **'దాన గ్రహణం'** బ్రాహ్మణుని కర్మగా చెప్పబడింది. కనుక బ్రాహ్మణుడు అన్ని ధర్మ సంబంధమైన వస్తువులనూ దానంగా గ్రహిస్తాడు. 247-250 శ్లోకాలలో చెప్పిన కొన్ని వస్తువులను స్వీకరించకపోవడం, లేదా వాటిని గ్రహించరాదన్న నిషేధం మనువు చెప్పిన వ్యవస్థకు పొంతన లేకుండా ఉంది. అందుచేత వ్యతిరేకం.

ఖ. 248వ శ్లోకంలో ఎవరైనా తెచ్చి ఇచ్చిన భిక్షను తిరస్కరించ కూడదని ఉంది. భిక్ష అనేది అయాచితం కానే కాదు- అంటే యాచించకుండా లభించేది కాదు. యాచించి పొందిన దాన్నే భిక్ష అంటారు. 2.23-24 [48-49], 25-26 [50-51], 157-160 [182-185]. మొదలైన శ్లోకాలలో మనువు యాచించిన దాన్నే భిక్ష అని చెప్పాడు. అందుచేత ఇందులో అయాచితంగా లభించిన దాన్నే భిక్ష అనడం మనువు పద్ధతికి వ్యతిరేకం.

గ. 2.160[185] లో చెడ్డవారి నుంచి భిక్ష పొందడం నిషిద్ధం అని ఉంది. 248 చెడ్డవారి నుంచి భిక్ష పొందవచ్చు అని చెప్పడం దానికి వ్యతిరేకం. ప్రజాపతి పేరును జోడించి తన మాటను ప్రామాణికం చేసుకోవాలనే ప్రవృత్తి, దీని ప్రక్షిప్తతకు బలాన్ని చేకూరుస్తూంది.

ఘ. 294లో మృతులైన పితరుల శ్రాద్ధం మనువుకు వ్యతిరేకం [చూడండి 3.119-284 లపై 'అంతర్ వ్యతిరేకాలు' శీర్షిక].

జ. 250లో మాంసం తినే విధానం మనువుకు వ్యతిరేకం. [చూడండి 4.26-28 శ్లోకాల వ్యాఖ్య- 'అంతర్ వ్యతిరేకాలు'].

చ. 253లో 'క్షురకుల' జాతి గణన మనువు చెప్పిన కర్మణా వ్యస్థకు వ్యతిరేకం. మనువు చెప్పింది కేవలం నాలుగు వర్ణాలనే. కనుక అతని వ్యవస్థలో జాతుల విభజన లేదు. సేవ చేయటం శూద్రుల పని. వారు కోరుకుంటే తమ సేవావిధులలో శూద్రులు స్వతంత్రంగా మార్పు చేసుకోవచ్చు. అందువల్ల ఇది పైన చెప్పుకున్న పద్ధతికి వ్యతిరేకం 254లో 'అస్య', 'ఏనం' పదాలు మునుపటి శ్లోకంతో సంబద్ధాలు. ఈ అంతర్ వ్యతిరేకాలతో ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే [చూడండి 1.92-110 లపై సమీక్ష].

255 నుండి 260వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

అబద్ధమాడేవాడు పాపి

యోఽన్యథా సంతమాత్మానమన్యథా సత్సు భాషతే । మూలశ్లోక సం.**84**
స పాపకృత్తమో లోకే స్తేన ఆత్మాపహారకః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**255**

టీక:- **యః** = ఏ వ్యక్తి, **అన్యథా సన్తమ్ + ఆత్మానమ్** = స్వయం మరొక విధంగా ఉంటూ, **సత్సు** = సజ్జనుల విషయంలో, **అన్యథా భాషతే** = మరొక రకంగా మాట్లాడునో, **సః** = అతడు, **లోకే** = ఈ లోకంలో, **పాపకృత్తమః** = అతిపాపిగా చూడబడతాడు. ఎందుకంటే, **సః** = అతడు, **ఆత్మా+అపహారకః స్తేనః** = తన ఆత్మనే హింసించుకొనునట్టి దొంగ.

తాత్పర్యం:- ఎవరైనా సరే ! తమ అసలు స్వభావాన్ని దాచి, పైకి కపటంతో నటిస్తున్నట్లు తోచినప్పుడు, వాడు లోకంలోని పాపవృత్తులలో మేటి అని, పెద్ద దొంగ అని అర్థం చేసుకోవాలి.॥255॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వాచ్యర్థా నియతాస్సర్వే వాఙ్మూలా వాగ్వినిస్సృతాః । మూలశ్లోక సం. **85**
తాంస్తు యః స్తేనయేద్వాచం స సర్వస్తేయకృన్నరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **256**

టీక:- **వాచి సర్వే అర్థాః నియతాః** = ఏ వాక్కులో సర్వ అర్థాలు, వ్యవహారాలు నిశ్చితమో, **వాక్మూలాః** = వేటికి వాక్కే మూలమో, **వాగ్ వినిః సృతాః** = ఏ వాక్కు ద్వారా సర్వ వ్యవహారాలు సిద్ధిస్తున్నవో, **యః నరః** = ఏ మనుషుడు, **తాం వాచం స్తేనయేత్** = ఆ వాక్కునే దొంగిలిస్తూ ఉన్నాడు. అసత్యభాషణం చేస్తున్నాడో, **సః** = అలాంటివాడు, **సర్వస్తేయ కృత్** = చౌర్యాది పాపాన్ని చేస్తున్నాడు. అందువల్ల మిథ్యాభాషణాన్ని వదిలి సదా సత్యభాషణం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- కానీ ఏ వాక్కులో సకలార్థాలు అంటే సర్వ వ్యవహారాలు నిశ్చితమవుతున్నవో ఆ వాక్కే ఆ వ్యవహారాలకన్నిటికీ మూలం. తద్వారానే సర్వవ్యవహారాలు సిద్ధమవుతున్నాయి. ఆ వాక్కునే ఎవడు చౌర్యం చేస్తాడో అతడు మిథ్యాభాషణరూపంగా పాపాలు చేసినవాడే అవుతున్నాడు (స.ప్ర. 4వ.సము.). ॥256॥

యోగ్య పుత్రుడికి గృహకార్యాలను సమర్పించడం ఇది మనుకృతం-ప్రామాణికం

మహర్షిపితృదేవానాం గత్వాఽఽనృణ్యం యథావిధి । మూలశ్లోక సం. **86**
పుత్రే సర్వం సమాసజ్య వసేన్మాధ్యస్థమాశ్రితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **257**

టీక:- **యథావిధి** = ఉక్త విధిననుసరించి, **మహర్షి-పితృ-దేవానాం ఆనృణ్యం గత్వా** = వ్యక్తి బ్రహ్మచర్య పాలన, అధ్యయన- అధ్యాపనల ద్వారా ఋషి ఋణమును, తల్లిదండ్రి మొ॥ పెద్దలసేవ, మరియు సంతానోత్పత్తి ద్వారా పితృఋణమును, యజ్ఞానుష్ఠానాల ద్వారా దేవఋణమును చెల్లించి, **సర్వం పుత్రే సమాసజ్య** = గృహసంబంధమైన బాధ్యతలన్నింటినీ పుత్రుడికి సమర్పించి, తరవాత వానప్రస్థాశ్రమంలో చేరడానికి ముందుగా ఇంటిలో ఉన్నంత వరకు, **మాధ్యస్థమ్ + ఆశ్రితః** = ఉదాసీన భావం కలవాడై, **వసేత్** = గృహంలో నివసించాలి.

తాత్పర్యం:- గృహస్థు వేదాధ్యయనం చేత ఋషిఋణాన్ని, పుత్రసంతానం పొందడం ద్వారా పితృఋణాన్ని, యజ్ఞాలచేత దేవతాఋణాన్ని చెల్లించిన తరువాత గృహ సంబంధమైన బాధ్యతలన్నింటినీ పుత్రుడికి సమర్పించి, తరువాత వానప్రస్థాశ్రమంలో చేరడానికి ముందు ఇంటిలో ఉన్నంత వరకు, ఉదాసీన భావం కలవాడై గృహంలో నివసించాలి.॥257॥

వివరణ

మహర్షి-దేవ-పితృ శబ్దాలను గురించి విశేషంగా తెలిసికోడానికి 3.82వ శ్లోకంలోని పరిశీలన చూడగలరు.

ఆత్మచింతన కోసం ఆదేశం-తత్ఫలితం ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకాకీ చిన్తయేన్నిత్యం వివిక్తే హితమాత్మనః । మూలశ్లోక సం. **87**
ఏకాకీ చిన్తయానో హి పరం శ్రేయోఽధిగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **258**

టీక:- **నిత్యం** = ప్రతిదినం, **వివిక్తే** = ఏకాంతంలో కూర్చొని, **ఏకాకీ** = ఒంటరిగా, అంటే స్వయంగా తన ఆత్మలో, **ఆత్మనః హితమ్ చిన్తయేత్**= తన కల్యాణాన్ని గురించి ఆలోచించుకోవాలి. అలాంటి వ్యక్తి, **ఏకాకీ చిన్తయానః పరశ్రేయః+అధిగచ్ఛతి** = అధికాధిక కల్యాణాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- ప్రతి దినం తాను ఏకాంతంగా కూర్చుండి, తన కల్యాణం గురించి ఆలోచించుకోవాలి. నిర్విచారంగా బ్రహ్మభావన పొంది వేదాది వేదాంతశాస్త్ర విచారం చేస్తూ, ఆ పరతత్త్వ చింతనతో మోక్షాన్ని పొందాలి. ॥258॥

విషయోపసంహారం-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషోదితా గృహస్థస్య వృత్తిర్విప్రస్య శాశ్వతీ । మూలశ్లోక సం. **88**
స్నాతకవ్రతకల్పశ్చ సత్త్వవృద్ధికరశ్శుభః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **259**

టీక:- **ఏషా** = ఇది, **గృహస్థస్య విప్రస్య** = గృహస్థుడైన విప్రుడి యొక్క, **శాశ్వతీ వృత్తిః** = నిత్య వృత్తి లేదా నిత్య దినచర్య, **ఉదితా** = చెప్పబడింది, **చ** = మరియు, **సత్త్వవృద్ధికరః శుభః** = సత్త్వ గుణాన్ని అభివృద్ధి చేసే శ్రేష్ఠమైన, **స్నాతకవ్రతకల్పః** = స్నాతకుడైన గృహస్థుడి వ్రత విధానాన్ని చెప్పబడింది.

తాత్పర్యం:- ఈ అధ్యాయంలో చెప్పబడిన మితాహార సంపాదన అనేది గృహస్థుడికీ -విప్రుడికీ ముఖ్యం. స్నాతక వ్రతానుష్ఠాన విధి అంతా సత్త్వగుణం వృద్ధి పరచి, శ్రేష్ఠదాయకమై ఉంది. కాబట్టి దాన్నే ఆచరించాలి.॥259॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అనేన విప్రో వృత్తేన వర్తయన్ వేదశాస్త్రవిత్ । మూలశ్లోక సం. **89**
వ్యపేతకల్మషో నిత్యం బ్రహ్మలోకే మహీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **260**

టీక:- **వేదశాస్త్రవిత్ విప్రః** = వేదాశాస్త్రజ్ఞుడైన విప్రుడు (ద్విజుడు), **అనేన వృత్తేన వర్తయన్** = ఈ జీవికతో లేదా వ్యవహారంతో వ్యవహరిస్తూ, **వ్యపేత కల్మషః** = పాపరహిత పుణ్యజీవిగా ఉంటూ, **నిత్యం బ్రహ్మలోకే మహీయతే** = సదా బ్రహ్మలోకంలో బ్రహ్మంలో మగ్నుడై ఉండి ఆనందాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- వేదవిదుడైనవాడు ఈ ప్రకారం నడుస్తూ, పాపాలను పూర్తిగా పోగొట్టుకున్నవాడై, ఇహపరలోకములు రెండిటా పూజ్యుడనిపించుకోవాలి.॥260॥

వివరణ

లోకశబ్దం "**లోకృ**= దర్శనే అనే ధాతువు ప్రకారం లోక శబ్దానికి దర్శనం లేదా స్థానమని అర్థం. ఇక్కడ బ్రహ్మలోకమంటే, బ్రహ్మదర్శనం లేదా పరమాత్మ యందు ఆశ్రయాన్ని పొందడం. అంటే బ్రహ్మంలో లీనం కావడం. మోక్షమంటే జీవుడు పరమాత్ముడి ఆశ్రయంలో ఉండి ఆనందాన్ని పొందుటయే.

"మనుస్మృతిలో" గృహస్థవృత్తి వ్రతాత్మకమైన నాల్గో అధ్యాయం సమాప్తం.

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మట్టి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'గృహస్థ-వృత్తి-వ్రతాత్మకః' చతుర్థోఽధ్యాయః॥
ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం చతుర్థోఽధ్యాయః.
ఇతి చతుర్థోఽధ్యాయః సమాప్తః

మనుస్మృతి

పంచమాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన*ఋషిదయానందభాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: 169; మూలశ్లోకాలు: 41 ; ప్రక్షిప్తాలు : 128

గృహస్థాన్తర్గత-భక్ష్యాభక్ష- దేహశుద్ధి-ద్రవ్యశుద్ధి స్త్రీధర్మవిషయాలు

భక్ష్యాభక్ష విషయం 1వ శ్లోకం నుండి 56వ శ్లోకం వరకు

1 నుండి 4 వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** ఋషులు భృగువును ప్రశ్నించుట-**

* శ్రుత్వైతానృషయో ధర్మాన్ స్నాతకస్య యథోదితాన్ ।
ఇదమూచుర్మహాత్మానమనలప్రభవం భృగుమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 1

తాత్పర్యం:- ఇంత వరకు క్రమానుసారంగా భృగువుచేత చెప్పబడిన స్నాతకుడి ధర్మాలను విన్న తరువాత ఋషులందరూ మహాత్ముడైన భృగుమహర్షిని ఇలా అడిగారు. ॥1॥

* ఏవం యథోక్తం విప్రాణాం స్వధర్మమనుతిష్ఠతామ్ ।
కథం మృత్యుః ప్రభవతి వేదశాస్త్రవిదాం ప్రభో ॥ ప్రక్షిప్త శ్లోక సం. 2

తాత్పర్యం:- ఓ ప్రభూ ! మాకొక్క సందేహం కలిగింది. ఈ రీతిగా శాస్త్రాల్లో చెప్పబడివున్నట్టి సకలధర్మాలను అనుష్ఠించే వేదపారంగతుడైన విద్వాంసుడికి మృత్యువు ఎలా సంభవిస్తుంది? అని అడిగారు. ॥2॥

* స తానువాచ ధర్మాత్మా మహర్షీన్ మానవో భృగుః ।
శ్రూయతాం యేన దోషేణ మృత్యుర్విప్రాన్ జిఘాంసతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 3

తాత్పర్యం:- అందుకు భృగుమహర్షి చిరునవ్వుతో ఇలా అన్నాడు... "మీకు కలిగిన సందేహం సమంజసమైనదే! మృత్యువెంతటివాడినైనా ఉపేక్షించదు. ఎంత జాగరూకుడికైనా ఏదో దోషం మృత్యువుచేత కాటు వేయిస్తుంది! అలాంటి దోషాలను కొన్నింటిని వివరిస్తాను" అంటూ ప్రారంభించాడు.॥3॥

* అనభ్యాసేన వేదానామాచారస్య చ వర్జనాత్ ।
ఆలస్యాదన్నదోషాచ్చ మృత్యుర్విప్రాన్ జిఘాంసతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 4

తాత్పర్యం:- వేదాభ్యాసం చేయక పోవడంవల్ల, ఆచారం లేకపోవడంవల్ల, శక్తి-అవకాశం ఉన్నా చేయవలసిన విధుల పట్ల ఉత్సాహం లేకపోవడంవల్ల, ఆహార వస్తువులలోని గుణదోషాలవల్ల విప్రులకూ మృత్యువు తప్పక కలుగుతుంది. ఆహార వస్తుదోషాలు అనేకవిధాలు. కాబట్టి కొన్నిటిని నిషేధించారు. ॥4॥

ప్రక్షిప్తాల పరిశీలన

మనుస్మృతితో భృగుమహర్షి పేరును కలపటానికి, ప్రక్షిప్తకారులు ఇక్కడ భక్ష్య అభక్ష్యాల విషయాన్ని మూల శ్లోకాలను తొలగించి, కలిపారని స్పష్టంగా తెలిసిపోతూంది. 1.4 వరకు గల శ్లోకాలు ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి.

1. శైలీగత ఆధారాలు

క. వర్ణన శైలిని బట్టి ఋషులు భృగువును ప్రశ్నిస్తున్నారనీ, భృగువు వారికి సమాధానాలిస్తున్నాడనీ తెలుస్తోంది. ఈ విధంగా ఈ శ్లోకాలు మనువు చెప్పినవి కావు. దీన్ని సంకలించినవాడు కూడా భృగువు కాదు, వేరొకడు.

ఖ. మొత్తం మనుస్మృతిలో మనువుది ఒక కచ్చితమైన శైలి ఉంటుంది. దాన్ని అనుసరించి గమనిస్తే, ఏదైనా విషయాన్ని ప్రారంభించినా, ముగించినా, రెండు చోట్లా ఏ విషయం మొదలైందో, ఎక్కడ ముగుస్తుందో సంకేతాలిస్తాడు. [1.120], (2.1), 2.43(68), 3.283;4.259 మొదలైనవి]. మధ్యలో ప్రశ్నలు- జవాబుల శైలితో చెప్పటం మనువు శైలి కాదు. ఈ నాలుగు శ్లోకాలూ మనువు శైలికి భిన్నంగా కనబడుతున్నాయి.

గ. మనుస్మృతిలోని మౌలిక శైలి వల్ల అది మనుప్రోక్తం అని తెలుస్తుంది. ఋషులు విషయాలు తెలుసుకోవాలని మనువునే ప్రశ్నించారు. మనువే సమాధానాలు చెప్పాడు [1.1-4]. భృగువుకు ఆ మౌలిక ప్రవచనంతో ఏ విధమైన సంబంధమూ లేదు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ నాలుగు శ్లోకాలకూ, మనుస్మృతిలోని తర్వాతి భక్ష్య అభక్ష్య సంబంధమైన శ్లోకాలతో పొంతన కుదరటం లేదు.

క. 5.2 లో వేద శాస్త్రాల వేత్తలను గురించే ప్రశ్నలడిగినట్లు ఉంది. భక్ష్య అభక్ష్యాల పద్ధతి అందరు ద్విజులకూ ఉంది. అది - **"అభక్ష్యాని ద్విజాతీనాం"** [5.5], **"స్నేహోక్తం ద్విజాతి భిః"** [5.25].

ఖ. 5.2లో **స్వధర్మం**లో స్థిరులైన వేదవేత్తలకు మృత్యువు ఎలా సంభవిస్తుంది?" అన్న ప్రశ్న ఉంది. ఆ పైన భక్ష్య అభక్ష్యాల విషయం ఉంది. ఇందులో పదార్థాలను మృత్యు కారకాలు లేదా ప్రాణ దాయకాలు అనే విషయాలుగా చెప్పకుండా, సాత్త్విక, తామసిక లేదా రాజసిక, పవిత్రత-అపవిత్ర, శ్రేష్ఠం - శ్రేష్ఠం కానివి, పాపం - పుణ్యం - వీటి ఆధారంతో తినదగినవి, తినకూడనివి అని చెప్పారు. ప్రమాణం కొరకు ఐదవ శ్లోకం చాలు-

"లశునం గృంజనం చైవ... భక్ష్యాణి ద్విజాతీనాం" - ఇక్కడ తామసిక ఆహారం కనుక నిషేధం. **"అమేధ్య ప్రభావాణి చ"** - ఇక్కడ అపవిత్రం కనుక నిషేధం.- వీటికి మృత్యుకారకాలనే విషయంతో ఏ సంబంధమూ లేదు. అదేవిధంగా ఇందులో మునుపు చెప్పిన పదిరోజుల ఆవు పాలు, స్త్రీపాలు, పుల్లని పానీయం, తదితర పదార్థాలకు కూడా మృత్యువుకు సంబంధించిన ప్రశ్నలతో సంబంధమే లేదు. ఇలా తొలి నాలుగు శ్లోకాలలో చెప్పిన ప్రశ్నలకూ, తర్వాతి భక్ష్య అభక్ష్యాల విషయంతో సంబద్ధత లేదు. అయినా వాటిని ఈ విషయానికి ఆధారంగా చెప్పారు. ఈ ఆధారంతో ఈ నాలుగు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

3. అవాంతర వ్యతిరేకాలు

ఈ నాలుగు శ్లోకాలలోని ప్రశ్నలు, జవాబులలోనూ పరస్పర సంబంధం లేదు. దీని వల్ల వీటిని ఎవరో విద్వాంసుడు రాశాడని అనుకునే అవకాశమూ లేదు.

క. రెండవ శ్లోకంలోని ఈ ప్రశ్న చూడండి- 'స్వధర్మంలో ఉన్న ద్విజులకు మృత్యువు ఎలా వస్తుంది? జవాబు- 'వేదాలలో అనభ్యాసం, ఆచార త్యాగం, సోమరితనం, అన్నం (భోజనం)- వీటి దోషాల వల్ల.' ఇక్కడ ఆలోచించవలసిన విషయాలు - ఎవరు శాస్త్రోక్తంగా స్వధర్మ పాలన చేస్తారో, వారు వేదాభ్యాసమూ, సదాచారపాలనా తప్పక చేస్తారు. సోమరులై ఉండరు. తినదగనివాటిని తినరు; ఇవన్నీ ఆ ద్విజులు చేస్తున్నప్పుడు, 'స్వధర్మ స్థితులు కాకుండా ఎలా ఉంటారు? అలాగే వేదవేత్తలు వేదాభ్యాసం చేయకపోవటం ఎలా కుదురుతుంది? ఈ విధంగా ప్రశ్న - జవాబు పరస్పర వ్యతిరేకంగా ఉన్నాయి.

ఖ. మరో ప్రశ్న చూడండి – **'వేద వేత్తలకు మరణ మెలా కలుగుతుంది?'** దీనికి జవాబు – 'అన్నం మొదలైనవాటి దోషాల వల్ల'. అన్నదోషాలు లేని వేదవేత్తలు మరణించడం లేదా? ఇలా ఈ ప్రశ్న కూడా అసంపూర్ణమే అవుతుంది. ప్రశ్న కనుక 'స్వధర్మంలో ఉన్న వేదవేత్తలకు అకాలమరణం ఎలా సంభవిస్తుంది?' అని ఉంటే, కొంత బాగుండేది. ఇటువంటి అంతర్ వ్యతిరేకాల వల్ల ఈ శ్లోకాలు మనువు వంటి ఋషి చెప్పినట్లు అనిపించడం లేదు.

విశేషం

వీటిని పరిశీలిస్తే, మనువు శైలిలోని **'విషయ సంకేతాలిచ్చే'** మూల శ్లోకాన్ని ప్రక్షిప్తాలను కలిపేటప్పుడు తొలగించి ఉంటారనిపిస్తుంది. ఆ పైన అది లుప్తమై ఉంటుంది. 12వ అధ్యాయంలోనూ ఇటువంటిదే జరిగింది. ఆ చోట ఉండవలసిన మూల శ్లోకం కొన్ని ప్రతులలో కనబడుతూంది. ఇదే మను సంహితను భృగుసంహితగా చేసేందుకు జరిగిన తీవ్ర ప్రయత్నానికి ప్రమాణంగా నిలబడుతుంది.

ద్విజులకు అభక్ష (తినకూడని) పదార్థాలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

లశునం గృంజనం చైవ పలాండుం కవకాని చ । మూలశ్లోక సం.**1**
అభక్ష్యాణి ద్విజాతీనామమేధ్యప్రభవాణి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**5**

టీక:-లశునం గుంజనం పలాండుం చ కవకాని = వెల్లుల్లి, ఉల్లి, (నీరుల్లి) పుట్టగొడుగులు, గుమ్మడి, **చ** = మరియు, **అమేధ్య ప్రభవాణి** = అశుద్ధస్థానంలో పుట్టిన సర్వపదార్థాలు, **ద్విజాతీనామ్ అభక్ష్యాణి** = ద్విజులు తినరానివి. ద్విజులంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు.

ఋషి దయానందభాష్యం:- ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయ, పుట్టగొడుగులు,గుమ్మడి మరియు గోంగూర, అలాగే అశుద్ధ స్థానంలో పుట్టిన సర్వపదార్థాలు ద్విజులు తినకూడనివి.॥5॥

వివరణ:-

గృంజన శబ్దార్థం

క. వర్తమాన కాలంలో **'గాజర్'** (హిందీలో) గా ప్రసిద్ధమైంది. కానీ ప్రాచీన కాలంలో **'శలగం'** అనేవారు. ధన్వంతరి నిఘంటువులో గుంజన శబ్దవర్ణన కనిపిస్తూంది (4.10). గుంజనకు మూలభాగం శిఖలాగ గుండ్రంగా ఉంటుంది. ఇది యవనులకు (ముస్లింలకు) చాలా ప్రియమైంది. దీనికే శాఖాకందం,కన్దం, డిండీర మోదకం అనే పేర్లున్నాయి. రుచిలో కారం, ఉష్ణం, దుర్గంధయుక్తంగా ఉంటుంది.

గృంజన మంటే 'శల్గం'

క. **'గృంజనం'** అంటే నేటి కాలంలో **'గాజర్'** అనే అర్థం ప్రసిద్ధం కానీ ప్రాచీనకాలంలో ఇది **'శల్గం'** అనే పేరుతో ఉండేది. ధన్వంతరి నిఘంటువులో కరవీరాది వర్గంలో 4-10లో గృంజనానికి అర్థం చెబుతూ, **'గృంజనం'** అంటే వ్రేళ్ల వద్ద కేశాలుంటాయి, యవనులకు ప్రీతికరమైనది, గుండ్రంగా ఉంటుంది. కణుపులున్న దుంప అన్నాడు. దీని పర్యాయ పదాలు- శిఖాకందము, కంద, డిండీరమోదకం. రుచి కాస్త కారంగా, వేడి కలిగించేది, దుర్గంధంతో ఉంటుంది' అని చెప్పాడు-

"గృంజనం శిఖామూలం చ యవనేష్టం చ వర్తులమ్ ।
గ్రంథిమూలం శిఖాకందమ్ డిండీర మోదకమ్ ॥

గృంజనం కటుకోష్ణం చ దుర్గంధం గుల్మనాశనమ్ ॥

ఈ లక్షణాలు నేటి పసుపు, ఎరుపు లేదా నల్లని రంగులున్న పొడవాటి గాజర్ దుంపలకు లేవు.

ఖ. చెప్పిన పదార్థాలు అభక్ష్యం - తినదగనివి కావటానికి కారణం

ఆయుర్వేదం ప్రకారం వీటిలో దుర్గుణాలు ఎక్కువ కావటం చేత వీటిని తినదగనివిగా పరిగణించారు. ఇవన్నీ దుర్గంధంతో ఉంటాయి. వెల్లుల్లి చాలా రజోగుణం కలది. ఉల్లిపాయ తామస గుణం కలది. శల్గం కూడా రజో గుణం కలది. పుట్ట గొడుగులు పనికిరాని పదార్థమన్నారు. మలినాలు, రాజసిక, తామసిక లక్షణాలు గల వాటిని తినేవారి మనసులూ అలాగే అవుతాయి. అందువల్ల వీటిని నిషేధించారు. [తినకూడని పదార్థాల పద్ధతిని 6.14లో చూడవచ్చు].

గృంజనం శిఖామూలం చ యవనేష్టం చ వర్తులమ్ ।
గ్రంథిమూలం శిఖాకందం కందం డిండీర మోదకమ్ ॥
గుంజనం కటుకోష్ణం చ దుర్గంధం గుల్మనాశనమ్ ।

ఈ లక్షణాలన్ని కూడా ప్రస్తుత కాలంలో పసుపుపచ్చ, ఎరుపు లేదా నలుపు వర్ణం కలిగి, పొడుగ్గా ఉన్న గాజర్‌లో లభిస్తున్నవి. ఆయుర్వేదానుసారంగా వీటిలో దుర్గుణాలే అధికంగా ఉన్నాయి. ఇవి దుర్గంధపూర్ణములు.

వెల్లుల్లిలో రాజసిక గుణం, ఉల్లిలో అత్యంత తామసిక గుణముంది. శలగం కూడా రాజసికమైనదే. గుమ్మడి కూడా దూషితపదార్థమే. రాజసిక తామసిక భోజనం చేసేవారి మనస్సు కూడా రజస్తమోగుణాత్మకంగా మారుతుంది. అందువల్ల ఈ పదార్థాలు నిషిద్ధాలు.

అభక్ష్య పదార్థ విధానం 6.13లో చూడగలరు.

6,7 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***లోహితాన్ వృక్షనిర్యాసాన్ వ్రశ్చనప్రభవాంస్తథా ।***
శేలుం గవ్యం చ పీయూషం ప్రయత్నేన వివర్జయేత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***6***

తాత్పర్యం:- చెట్టుకు కత్తిగాటు పెడితే ఎర్రగా స్రవించే పాలు; లేదా చెట్టునుంచి పుట్టేజిగురులు (ఉదా:ఇంగువ); మునగకాయ, పశుజాతులు ఈనినప్పుడు మొదట ఇవ్వబడే ముర్రుపాలు వీటిని ఎంతరుచిగా ఉన్నప్పటికీ ప్రయత్నంతో విడిచిపెట్టాలి.॥6॥

* ***వృథాకృసరసంయావం పాయసాపూపమేవ చ ।***
అనుపాకృతమాంసాని దేవాన్నాని హవీంషి చ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***7***

తాత్పర్యం:- దేవతానివేదనం కాని నువ్వులపొడి అన్నము, కాచినపాలు, బెల్లము, గోధుమపిండితో కలిపి చేసిన ఒక విధమైన భక్ష్యము, పాయసము, వడలు మొదలైన భక్ష్యములు, యాగమంత్రంతో కాకుండా ఊరికే చంపబడిన జంతుమాంసమును, దేవతలకై వండి నివేదనం చేయని అన్నమును, హోమం కోసం చేసి ఆ హోమం చేయకముందే ఉపయోగించే హవిస్సును భుజించరాదు.॥7॥

ప్రక్షిప్తాల పరిశీలన

6,7 శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి.

1. అంతర్ వ్యతిరేకాలు

ఏడవ శ్లోకంలో మాంస భక్షణాన్ని చెప్పారు. ఇటువంటి మాంస భక్షణము వేదాలతో యజ్ఞాలలో బలి ఇవ్వడము మనువుకు వ్యతిరేకమే [విస్తృత వివరణకు 4.26-29 శ్లోకాల **'అంతర్ వ్యతిరేకాలు'** సమీక్ష చూడండి]. ఎందుకంటే ఆరవ శ్లోకంలోని **'వివర్జయేత్'** అనే క్రియకు ఏడవ శ్లోకంతో సంబంధం ఉంది. రెండిటికీ సంబంధం కొనసాగే క్రియ ఉన్నందు వల్ల రెండూ ఒకేచోట ఉండాలి. ఏడవ శ్లోకం ప్రక్షిప్తమని రుజువైంది కనుక, ఆరవదీ ప్రక్షిప్తమే అవుతుంది. ఆరవ శ్లోకంలోని తినదగని పదార్థాలతో ఏడవ శ్లోకంలోనిదానికి సంబంధమేమీ లేదు.

8-10 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

అనిర్దశాయాగోః క్షీరమౌష్ట్రమైకశఫం తథా । మూలశ్లోక సం.**2**
ఆవికం సంధినీక్షీరం వివత్సాయాశ్చ గోః పయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**8**

టీక:- అనిర్దశాయాః గోః క్షీరమ్ = ఈనిన ఆవు యొక్క మొదటి పది రోజుల పాలు, **ఔష్ట్రమ్** = ఒంటె, **తథా ఏక శఫం** = ఒకే గిట్ట కలిగిన జంతువులు గుర్రం మొదలైన వాటి పాలు, **ఆవికం** = గొర్రె పాలు, **సన్ధినీక్షీరం** = ఎదకొచ్చిన ఆవు పాలు, **వివత్సాయాః గో పయః** = దూడ చనిపోయిన ఆవుపాలు, **వర్జ్యాని** = వదిలి పెట్టాలి. ముందు శ్లోకం నుండి 'వర్జ్యాని' అనే క్రియను అన్వయించుకోవాలి.

తాత్పర్యం:- ఈనిన నాటి నుంచి కనీసం పది రోజులైనా గడవకముందే తీసే ఆవుపాలు, అలాగే ఒంటి, గొర్రె, బర్రె, మేక, గుర్రాల పాలు గాని, దూడ లేని ఆవుపాలుగాని, చూలుతో ఉన్న ఆవు పాలుగాని త్రాగరాదు.॥8॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అరణ్యానాం చ సర్వేషాం మృగాణాం మాహిషం వినా । మూలశ్లోక సం.**3**
స్త్రీక్షీరం చైవ వర్జ్యాని సర్వశుక్తాని చైవ హి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**9**

టీక:- మాహిషం వినా = బర్రె పాలు మినహాయించి, **సర్వేషాం అరణ్యానాం మృగాణాం** = అడవిలో ఉండే అన్ని పశువుల క్షీరం, **చ** = మరియు, **స్త్రీ క్షీరం** = స్త్రీ యొక్క పాలు వర్జితములే, **చ ఏవ** = అలాగే, **సర్వశుక్తాని** = అన్ని రకాలైన పులిసిన పదార్థాలు వర్జనీయాలు.

తాత్పర్యం:- బర్రెపాలు తప్ప ఇతర అరణ్య పశువుల, మృగాలకు చెందిన క్షీరాన్ని గాని, స్త్రీ చనుబాలు గాని, పులియబెట్టిన పాలు గాని తాగరాదు. ॥9॥

భక్ష్య పదార్థాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

దధి భక్ష్యం చ శుక్తేషు సర్వం చ దధిసంభవమ్ । మూలశ్లోక సం.**4**
యాని చైవాభిషూయన్తే పుష్పమూలఫలై శ్శుభైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**10**

టీక:- శుక్తేషు = పులిసిన పదార్థాలు, **దధి చ సర్వం దధి సంభవమ్ భక్ష్యం** = పెరుగు, పెరుగు వల్ల వచ్చే మజ్జిగ, వెన్న మొ॥ పదార్థాలు భుజించదగినవి. **చ** = మరియు, **యాని** = ఎన్ని పదార్థాలు, **శుభైః** = హితకరములు, గుణకారకములు, **పుష్ప-మూల-ఫలైః-అభిషూయన్తే** = పుష్పాలు, మూలాలు (గడ్డలు) ఫలాలతో తయారు చేయబడునో అవన్నీ భక్ష్యములే, భుజింపతగినవే.

తాత్పర్యం:- కాని....పులియ బెట్టిన వస్తువులలో పెరుగు, పెరుగు నుంచి తయారైన మజ్జిగ వంటి పదార్థాలను పూలు, పండ్లు, దుంపలు, నీరు చేర్చి పులియబెట్టిన పక్వముకానివి మాత్రం తినవచ్చును.॥10॥

వివరణ:-శ్రేష్ఠ భక్ష్య పదార్థాల విధానం 6.12,13వ శ్లోకాలలో చూడగలరు.

11 నుండి 23వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు- ఇవి ప్రామాణికం కావు

* *క్రవ్యాదాఞ్ఛకునాన్ సర్వాంస్తథా గ్రామనివాసినః ।*
అనిర్దిష్టాంశ్చైకశఫాంష్టిట్టిభం చ వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*11*

తాత్పర్యం:- పచ్చి మాంసాన్ని భక్షించే గద్దలు మొదలైన పక్షులను భక్షించరాదు. గ్రామాల్లో శాంతి పతాకాలుగా విడిచిన పావురాలను తినరాదు. ఒంటి గిట్టలు ఉండే గాడిద, మొదలైన వాటి మాంసం నిషేధం. టిట్టిభ (లకు ముకిపిట్ట) పక్షులను కూడా వేటాడి భుజించరాదు. అలాగే....॥11॥

* కలవింకం ప్లవం హంసం చక్రాంగం గ్రామకుక్కుటమ్ ।
సారసం రజ్జువాలం చ దాత్యూహం శుకశారికే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **12**

తాత్పర్యం:- తినకూడని ఇతర పక్షిజాతులలో ఊరపిచ్చుకలు, కాకులు, హంసలు, చక్రవాకపక్షి, సారపక్షి, తాటితోకపక్షి, భరతపక్షి, చిలుక, గోరువంక చేరివున్నాయి. కోడిని కూడ తినరాదు. ముక్కుతో పొడుచుకుతినే ఏ పక్షినీ తినకూడదు. ॥12॥

* ప్రతుదాఞ్జాలపాదాంశ్చ కోయష్టినఖవిష్కిరాన్ ।
నిమజ్జతశ్చ మత్స్యాదాన్ సౌనం వల్లూర మేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **13**

తాత్పర్యం:- ముక్కుతో పొడిచి ఆహారం గ్రహించే బెగ్గురు పక్షి, వలవంటి పాదాలు గల జంతవులను, గుడ్డికొంగలను, డేగ మొదలైన పక్షులను, వధ్యస్థానమున పడి ఉండే మాంసాన్ని, నీట్లో మునిగి చేపల్ని వేటాడే పక్షులను తినరాదు.॥13॥

* వకం చైవ బలాకాం చ కాకోలం ఖంజరీటకమ్ ।
మత్స్యాదాన్ విడ్వరాహాంశ్చ మత్స్యానేవ చ సర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **14**

తాత్పర్యం:- కొంగజాతులు ఏవైనాగాని,కాకిజాతులు కూడ నిషేధం. కాటుకపిట్టలు, చేపల్ని భక్షించే పక్షి/జంతుజాతులు తినకూడని వాటిలోనే చేరివున్నాయి.॥14॥

మొసళ్లు, పందులు, కొన్ని విధాల చేపలు తినదగనివి.

* యో యస్య మాంసమశ్నాతి స తన్మాంసాద ఉచ్యతే ।
మత్స్యాదస్సర్వమాంసాదస్తస్మాన్మత్స్యాన్ వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **15**

తాత్పర్యం:- మాంసాన్ని తినే ప్రాణిని మాంసాదమంటారు. చేపను తినేవాడు మాత్రం సకలమాంసాలను భక్షించేవాడిగా పరిగణించబడతాడు. చేపలు నీళ్ళల్లో ఉండే చిన్న ప్రాణులను తింటుంది. ఈ కారణం వల్ల చేపల్ని తినకూడదని విజ్ఞులంటారు.॥15॥

* పాఠీనరోహితావాద్యౌ నియుక్తౌ హవ్యకవ్యయోః ।
రాజీవాన్ సింహతుండాంశ్చ సశల్కాంశ్చైవ సర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **16**

తాత్పర్యం:- భక్షించదగిన మత్స్యజాతులు కొన్ని:-ఎర్రమీను, కొర్రమీను, గుంపులుగా సంచరించే చేపలు, ముండ్లచేపలు సింహపుముఖంగల చేపలు, వీటిని హవ్యకవ్యాలకు నిమంత్రితులైన బ్రాహ్మణులు భుజించవచ్చు. కర్తకు నిషేధం.॥16॥

* న భక్షయేదేక చరానజ్ఞాతాంశ్చ మృగద్విజాన్ ।
భక్ష్యేష్వసి సముద్దిష్టాన్ సర్వాన్ పంచనఖాంస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **17**

తాత్పర్యం:- ఒంటరిగా సంచరించే మృగాలను తినరాదు. ఊర్లు-పేర్లు తెలీని జంతువులను, పక్షులను, ఐదుగోళ్లు ఉండే వానరాదిజాతుల మాంసాన్ని తినరాదు॥17॥

* శ్వావిధం శల్యకం గోధాం ఖడ్గకూర్మశశాంస్తథా ।
భక్ష్యాన్ పంచనఖేష్వాహురనుష్ట్రాంశ్చైకతోదతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **18**

తాత్పర్యం:- కాని, ఐదుగోళ్లుగల జంతువులన్నీ నిషేధం కాదు, ఏదుపంది, ముళ్లపంది, ఉడుము, ఖడ్గమృగం, తాబేలు, కుందేలు వీటిని తినవచ్చు. ఒంటిపలువరుస కలిగిన మృగజాతులలో ఒంటెమాంసం తప్ప ఇతర జాతుల విషయంలో నిషేధం లేదు. అలాగ ఆపదవేళ తిన్నా దోషం కాదు.॥18॥

* ***ఛత్రాకం విద్వరాహం చ లశునం గ్రామకుక్కుటమ్ ।***
పలాండుం గృంజనం చైవ మత్యాజగ్ధ్వా పతేద్ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***19***

తాత్పర్యం:- గోంగూర, ఊరపంది, వెల్లుల్లి, కొన్ని గ్రామకోడిజాతులు, నీరుల్లి, (ఎర్రుల్లి) మొదలైనవి బుద్ధిపూర్వకంగా బ్రాహ్మణుడు భక్షించడం వల్ల భ్రష్టుడవుతున్నాడు.॥19॥

* ***అమత్యైతాని షడ్జగ్ధ్వా కృచ్ఛ్రం సాంతపనం చరేత్ ।***
యతిచాంద్రాయణం వాపి శేషేషూపవసేదహః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***20***

తాత్పర్యం:- అజ్ఞానం చేత ద్విజుడు గాని వీటిని భక్షించినట్లయితే, ఇలాంటి అభక్ష్య భక్షణానికి గాను ప్రాయశ్చిత్తవిధి నిర్దేశింపబడి ఉంది. దాన్ని ఆచరించాలి.

తెలియక వీటిని భక్షించినట్లయితే-సాంతపనం అనే కృచ్ఛ్రాన్ని గాని, యతి చాంద్రాయణ వ్రతాన్ని గాని ఆచరించాలి. మిగతా ఇంగువ వంటివి తింటే ఒకరోజు ఉపవాసం ప్రాయశ్చిత్తం.॥20॥

* ***సంవత్సరస్యైకమపి చరేత్కృచ్ఛ్రం ద్విజోత్తమః ।***
అజ్ఞాత భుక్తశుద్ధ్యర్థం జ్ఞాతస్య తు విశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***21***

తాత్పర్యం:- తెలియక ఏదైనా భక్షించదగని వస్తువును భక్షిస్తే ఒక్కో సంవత్సరానికి ప్రాయశ్చిత్త కృచ్ఛ్రాలు ఒక్కొక్కటైనా చేయాలి. తెలిసికూడా వీటిని తింటే విశేష ప్రాయశ్చిత్తాలు ఆచరించాలి. తదుపరి అధ్యాయాలలో అవి చూడవచ్చు.॥21॥

* ***యజ్ఞార్థం బ్రాహ్మణైర్వధ్యాః ప్రశస్తా మృగపక్షిణః ।***
భృత్యానాం చైవ వృత్త్యర్థమగస్త్యో హ్యాచరత్పురా ॥ ప్రక్షిప్త శ్లోక సం.***22***

తాత్పర్యం:- బ్రాహ్మణులు యజ్ఞాలనిమిత్తం, తమ మీద ఆధారపడిన సేవకుల పోషణనిమిత్తం శాస్త్రాదులలో చెప్పబడిన మృగాలను, పక్షులను వధించవచ్చు. అగస్త్యముని తన తల్లిదండ్రుల పోషణకోసం మునుపు ఇలాగే చేశాడు గదా ! ॥22॥

* ***బభూవుర్హి పురోడాశా భక్ష్యాణాం మృగపక్షిణామ్ ।***
పురాణేష్వపి యజ్ఞేషు బ్రహ్మక్షత్రసవేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***23***

తాత్పర్యం:- పూర్వకాలంలో ప్రాచీన ఋషులొనర్చిన యాగాలలోను బ్రహ్మక్షత్రియులు చేసే యాగాలలోను భక్షింపదగిన మృగ-పక్షి మాంసాలే హవిస్సులుగా ఉండేవి కాబట్టి, యాగం నిమిత్తం జంతుహింస శాస్త్రసమ్మతమే!॥23॥

ప్రక్షిప్తాల పరిశీలన

11-23 శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

అన్ని రకాల మాంస భక్షణమూ, యజ్ఞాలలో మాంసం సమర్పించటమూ మనువుకు వ్యతిరేకాలు. అందుచేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు [విస్తృత వివరణకు 4.26-28 శ్లోకాల సమీక్ష 'అంతర్ వ్యతిరేకాలు' చూడండి].

2. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలు పూర్వాపర శ్లోకాల విషయాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. పూర్వాపర విషయాలను భంగమూ చేస్తున్నాయి. 10వ శ్లోకంలో పెరుగు, పెరుగుతో చేసిన పదార్థాలు తినటం గురించి ఉంది. 24వ శ్లోకంలో పెరుగుతో తయారైనవాటిలో నెయ్యి, నేతితో తయారైనవాటిని తినటం చెప్పారు. మధ్యలో మాంస భక్షణం మొదలైనవాటి వల్ల విషయ భంగమైంది. ఈ విధంగా ప్రసంగ వ్యతిరేకం కావటం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

24,25 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

యత్కించిత్స్నేహసంయుక్తం భోజ్యం భోజ్యమగర్హితమ్ । మూలశ్లోక సం.5
తత్పర్యుషితమప్యాద్యం హవిశ్శేషం చ యద్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.24

టీక:- అగర్హితమ్ = దోషరహితం, అనిందితం అంటే నిందితమైన మాంసాది భోజనాలు (5.7,11,12) లేనట్టిది. **యత్కించిత్ భోజ్య-స్నేహ సంయుక్తం** = తైల ఘృతాదులతో వండిన భోజ్యపదార్థం, **తత్ పర్యుషితమ్ +అపి** = అది చద్దిదైనా, **భోజ్యమ్** = భుజింపతగినది. **చ** = మరియు, **యత్ హవిః శేషం భవేత్** = హవిస్సు యొక్క శేషం కూడా భుజించదగినదే.

తాత్పర్యం:- దోషరహితం, నిందితమైన మాంసాది భోజనాలు లేనట్టిది, తైలం, ఘృతంతో వండిన భోజ్య పదార్థం ఎక్కువకాలం నిలువ ఉంచినా (పర్యుషితం) దాన్ని తినవచ్చు. హవిశ్శేషం కూడా భక్షించవచ్చు!॥24॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చిరస్థితమపి త్వాద్యమస్నేహాక్తం ద్విజాతిభిః । మూలశ్లోక సం.6
యవగోధూమజం సర్వం పయసశ్చైవ విక్రియాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.25

టీక:- ద్విజాతిభిః = ద్విజాతులకు, యవ-గోధూమజం సర్వం = జొన్నలు-గోధుమలతో తయారైన పదార్థాలన్నీ, చ = అలాగే, పయసః విక్రియా ఏవ = పాలతో తయారైన మిఠాయిలు, పాలకోవా మొ॥వి, **అస్నేహాక్తం** = నెయ్యి మొదలైన నూనె పదార్థాలతో చేసినవి కాకపోయినా, **చిరస్థితమ్ +అపి** = వండిన తరువాత కొంతకాలం నిల్వ ఉండినా, **ఆద్యమ్** = భుజించవచ్చు.

తాత్పర్యం:- యవధాన్యం, గోధుమలు మొదలైనవాటితో చేసిన పదార్థం చిరకాలం ఉంచినా, దానికి తైల ఘృతాదులు చేర్చకున్నా భక్షించవచ్చు. పాలతో చేయబడిన పెరుగు, మజ్జిగ, నెయ్యి మొదలైన వాటిని పర్యుషితాలుగా ఉంచినా బ్రాహ్మణులు భక్షించవచ్చు! ॥25॥

26 నుండి 44వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* మాంసభక్షణానికి అనేక విధులు-

* *ఏతదుక్తం ద్విజాతీనాం భక్ష్యాభక్ష్యమశేషతః ।*
మాంసస్యాతః ప్రవక్ష్యామి విధిం భక్షణవర్జనే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*26*

తాత్పర్యం:- బ్రాహ్మణులు తినదగినవీ, తినకూడనివీ ఇంతవరకు చెప్పాను కదా! ఇక మాంసాలలో ఏవి తినవలసినవో, ఏవి తినకూడనివో చెబుతాను-వినండి!॥26॥

* భక్ష్యాభక్ష్య మాంసవిచారం ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *ప్రోక్షితం భక్షయేన్మాంసం బ్రాహ్మణానాం చ కామ్యయా ।*
యథావిధి నియుక్తస్తు ప్రాణానామేవ చాత్యయే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*27*

తాత్పర్యం:- మంత్రజలం చేత సంప్రోక్షించబడి, యజ్ఞంలో వ్రేల్చబడిన అన్ని రకాల మాంసాల శేషం తినవచ్చు. శ్రాద్ధాదులలో నిమంత్రితులైనప్పుడు మాంసంభక్షణంకోసం విప్రులు ఒక్కసారి తనను ప్రార్థన తో పిల్చినప్పుడు- ఇతర ఆహారాలేవీ అందుబాటులో లేనప్పుడు మాంసం భక్షించవచ్చు! ॥27॥

* ప్రాణస్యాన్నమిదం సర్వం ప్రజాపతిరకల్పయత్ ।
స్థావరం జంగమం చైవ సర్వం ప్రాణస్య భోజనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **28**

తాత్పర్యం:- ఇప్పుడు ఇటుపైన చెప్పబోయే దెల్ల బ్రహ్మ జీవుడికి భక్షణార్హమైన మాంసంగా ఏర్పరచాడు. ఈ స్థావర జంగమాలన్నీ నరుడికి ఆహారాలే! ॥28॥

* చరాణామన్నమచరా దంష్ట్రిణామప్యదంష్ట్రిణః ।
అహస్తాశ్చ సహస్తానాం శూరాణాం చైవ భీరవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **29**

తాత్పర్యం:- చరాలైన ప్రాణులకు అచరాలైన ప్రాణులు; కోరలు గల జీవులకు, కోరలు లేనివి, చేతులు గల వాటికి చేతులు లేనివి, బలమైన వాటికి బలహీనమైనవి ఆహారంగా కల్పించబడ్డాయి.॥29॥

* నాత్తా దుష్యత్యదన్నాద్యాన్ ప్రాణినోఽహన్యహన్యపి ।
ధాత్రైవ సృష్టా హ్యాద్యాశ్చ ప్రాణినోఽత్తార ఏవచ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **30**

తాత్పర్యం:- ప్రతిరోజూ ఏదైతే భక్షించదగినదై ఉంటుందో, అదే తినేవారికి (ఉదా:-అన్నం, శాకములు మొ॥) అది తినడం వల్ల దోషం కలుగదు. 'ఇది మీరు తినదగినది. వీటిని మీరు భక్షించాలి' అని బ్రహ్మచేత నిర్దేశించబడినవాటికి ఏ దోషం సంభవించదు.॥30॥

* యజ్ఞాయ జగ్ధిర్మాంసస్యే త్యేష దైవో విధిః స్మృతః ।
అతోఽన్యథాప్రవృత్తిస్తు రాక్షసో విధిరుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **31**

తాత్పర్యం:- యజ్ఞం కోసం పశువులను హింసించినా, అది జీవహింస అనిపించుకోదు. హోమం చేసిన ఆ హవిశ్శేషం మాంసమైనప్పటికీ అది దైవ విధానమే! తన ఉదర పోషణ నిమిత్తం జంతువధకు పాల్పడటం రాక్షస విధానం. ॥31॥

* క్రీత్వా స్వయం వాఽప్యుత్పాద్య పరోపకృతమేవ వా ।
దేవాన్ పితౄంశ్చార్చయిత్వా ఖాదన్ మాంసం న దుష్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **32**

తాత్పర్యం:- కొన్నది, లేదా తానే సమకూర్చుకున్నది, ఇతరుల చేత తెప్పించినది అయిన మాంసాన్ని దేవతలకు, పితరులకు సమర్పించగా ఆ మిగిలినది తాను భక్షించినప్పుడు ఎలాంటి వాడికీ మాంసభక్షణం వల్ల పాపమంటుకోదు.॥32॥

* నాద్యాదవిధినా మాంసం విధిజ్ఞోఽనాపది ద్విజః ।
జగ్ధ్వాహ్యవిధినా మాంసం ప్రేత్య తైరద్యతే-వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **33**

తాత్పర్యం:- మాంసభక్షణ విధిని తెలిసిన విప్రుడికి, శాస్త్రప్రకారం దేవతలకు-పితృదేవతలకు ఇవ్వడం తెలుస్తుంది. ఆపత్సమయాల్లో తప్ప ఈ ప్రకారం దాన్ని భక్షించడు. అలా జరుగనప్పుడు, ఏ పశుమాంసం తాను తింటాడో, జన్మాంతరంలో అతడా పశువుకే ఆహారం అవుతాడు.॥33॥

* *న తాదృశం భవత్యేనో మృగహంతుర్ధనార్థినః ।*
యాదృశం భవతి ప్రేత్య వృధా మాంసాని ఖాదతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**34**

తాత్పర్యం:- జీవనోపాధికై మృగాలను చంపి విక్రయించే బోయవాడికి లేదా కటికవానికి పాపం కలుగదు.॥34॥

* *నియుక్తస్తు యథాన్యాయం యో మాంసం నాత్తిమానవః ।*
స ప్రేత్య పశుతాం యాతి సంభవానేకవింశతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**35**

తాత్పర్యం:- శాస్త్రవిధానం ప్రకారం శ్రాద్ధ మధుపర్కములతో నియమితుడయిన ద్విజుడు పశుమాంసం విధిగా తినితీరాలి. అలా ఆ ద్విజోత్తముడు మాంసభక్షణం చేయకుంటే 21 జన్మలు పశువుగా పుడతాడు. ॥35॥

* *అసంస్కృతాన్ పశూన్ మంత్రై ర్నాద్యాద్విప్రః కదాచన ।*
మంత్రైస్తు సంస్కృతానద్యాచ్ఛాశ్వతం విధి మాస్థితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**36**

తాత్పర్యం:- వేదమంత్రాలతో సంస్కరింపబడకుండా దేవతలకు పితరులకు సమర్పించక కేవలం తన కోసమే మాంసం భుజించేవాడికి వృత్తిచేత మృగాల్ని వేటాడే బోయవాడికెంత పాపమో అంతపాపం కలుగుతుంది అని చెప్పబడింది.॥36॥

* *కుర్యాద్ఘృతపశుం సంగే కుర్యాత్పిష్టపశుం తథా ।*
న త్వేవ తు వృథా హంతుం పశుమిచ్ఛేత్కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.**37**

తాత్పర్యం:- పశు భక్షణమునందు ఆసక్తి కలగడం మానవ జిహ్వాకు సహజం. దీనిలో అసహజమేదీ లేదు. యజ్ఞాదులు లేకుండా ఇలాంటి ఆసక్తి జనిస్తే నేతిని-పిండిని చేర్చి బొమ్మను చేసి భక్షించాలి గాని వ్యర్థంగా జంతుహింస చేయరాదు.॥37॥

* *యావంతి పశురోమాణి తావత్కృత్వో హి మారణమ్ ।*
వృథాపశుఘ్నః ప్రాప్నోతి ప్రేత్య జన్మని జన్మని ॥ ప్రక్షిప్త శ్లోక సం.**38**

తాత్పర్యం:- యజ్ఞాల కోసం గాక, వ్యర్థంగా పశుహింస చేసేవాడు మృతి చెందాక జన్మజన్మకూ పశువుగానే పుడతాడు, తాను హింసించిన పశువు దేహంపై ఎన్ని రోమాలుంటే అన్ని మార్లు పశుజన్మనే పొందుతాడు. ॥38॥

* *యజ్ఞార్థం పశవస్సృష్టాః స్వయమేవ స్వయంభువా ।*
యజ్ఞోఽస్య భూత్యై సర్వస్య తస్మాద్యజ్ఞే వధో-వధః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**39**

తాత్పర్యం:- బ్రహ్మ సహజంగానే యజ్ఞం కోసమే కొన్ని రకాల పశువులను సృజించాడు. ఈ జగత్ యొక్క సంక్షేమం కోసమే యజ్ఞాలున్నాయి. అందువల్ల యజ్ఞాలలో పశువధ నింద్యము కాదు.॥39॥

* *ఓషధ్యః పశవో వృక్షా స్తిర్యంచః పక్షిణస్తథా ।*
యజ్ఞార్థం నిధనం ప్రాప్తాః ప్రాప్నువంత్యుత్సృతీః పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**40**

తాత్పర్యం:- వడ్లు, యవలు మొదలైన ధాన్యాలు, పశువులు, వృక్షాలు, తాబేళ్లు, కొన్ని జాతుల పక్షులు యజ్ఞం నిమిత్తం నశించినా, అవి పవిత్ర కార్యానికి తోడ్పడటంవల్ల ఉత్తమజన్మపొందుతున్నాయి. ॥40॥

* *మధుపర్కే చ యజ్ఞే చ పితృదైవతకర్మణి ।*
అత్రైవ పశవో హింస్యా నాన్యత్రేత్యబ్రవీన్మనుః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**41**

తాత్పర్యం:- మధుపర్కము, జ్యోతిష్టోమాది యజ్ఞం, పితరులను ఉద్దేశించి చేసే శ్రాద్ధం, దైవపూజాదికాలతో మాత్రమే పశుహింస చేయాలి తప్ప, మిగిలినప్పుడు పశువధ నిషేధం.॥41॥

*   ***ఏష్వర్థేషు పశూన్ హింసన్ వేదతత్త్వార్థవిద్ద్విజః ।***
ఆత్మానం చ పశూంశ్చైవ గమయత్యుత్తమాం గతిమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***42***

తాత్పర్యం:- ఈ పైన చెప్పిన అవసరాలలో మాత్రమే పశువధ జరిగినప్పుడు-వధించిన వారికీ, వధింపబడిన వాటికీ ఉత్తమగతులు కలుగుతాయని వేదవిదుల ఉవాచ.॥42॥

*   ***గృహే గురావరణ్యే వా నివసన్నాత్మవాన్ ద్విజః ।***
నావేదవిహితాం హింసామాపద్యపి సమాచరేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***43***

తాత్పర్యం:- గృహస్థాశ్రమంలోగాని, బ్రహ్మచర్యంలో ఉండగా గాని, వానప్రస్థాశ్రమంలో గాని, బ్రాహ్మణుడు ఆపదలో ఉన్నప్పటికీ అశాస్త్రీయమైన హింసకు పాల్పడరాదు. అది సత్ స్వభావం కాదు.॥43॥

*   ***యా వేదవిహితా హింసా నియతాఽస్మింశ్చరాచరే ।***
అహింసామేవ తాం విద్యాద్వేదాద్ధర్మో హి నిర్బభౌ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***44***

తాత్పర్యం:- అయితే.....వేదవిహితమైన పశువధ హింస కాదా? కానేకాదు! స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచంలో సమతుల్యస్థితి నెలకొల్పే నిమిత్తమే బ్రహ్మచే నిర్దేశించబడిన ఈ హింస అహింస అనబడుతోంది.॥44॥

ప్రక్షిప్తాల పరిశీలన

26 నుంచి 44 వరకు గల శ్లోకాలు ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

అన్ని రకాల మాంసం తినటం, జంతు బలులతో యజ్ఞాలు చేయటం మనువుకు అసలు సమ్మతం కాదు. అందుచేత ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే [వివరణకు 4.26-28 శ్లోకాల మీద 'అంతర్ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి].

2. ప్రసంగ వ్యతిరేకాలు

5.24-25 శ్లోకాలలో మాంసం మొదలైనవి లేని అనిందిత భోజనాన్ని గురించి ఉంది. దాని ప్రకారం 45-49, 52 శ్లోకాలలో మాంసభోజనం నిందనీయం. ఏ విధంగా నిందనీయమో కూడా ఉంది. (ఈ విధంగా 24-25 శ్లోకాలకూ, 49వ శ్లోకంతో ప్రసంగ పరంగా సంబంధం ఉంది. ఈ శ్లోకాలలో వీటికి వ్యతిరేకంగా నింద్యభోజన వర్ణన ఉండటం వల్ల ప్రసంగ భంగం కలిగింది. అందుచేత ఈ శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తాలు).

3. శైలీగత ఆధారాలు

41వ శ్లోకంలో **'అబ్రవీత్ మనుః'** అనటం చేత ఇది మనువు కాక మరెవరో రచించిందని తెలుస్తూంది. అందువల్ల ప్రక్షిప్తం. అంతే కాకుండా పూర్వాపర విషయాల మండనాలు (ఖండించటం, పొగడటం) లేదా పేరుతో మండనాత్మక వేదాలరూపంలో (ప్రశంసాత్మకంగా) ఉండటం చేత, పూర్తిగా దీనితో సంబంధం కలది. అందుచేత ఇది ప్రక్షిప్తంగా రుజువైంది కనుక, మొత్తం విషయమే ప్రక్షిప్త మని తెలుస్తూంది.

4. అవాంతర వ్యతిరేకాలు

మాంసభక్షణాన్ని గురించిన శ్లోకాలను ప్రక్షిప్తం చేసినవారు, ఎంత గుడ్డిగా వాటిని చొప్పించారంటే, వారు పూర్వాపర శ్లోకాలను గురించి కూడా ఆలోచించక పోవటం ఆశ్చర్యకరమే ! ఈ ప్రక్షిప్తాలు చేసినవారు కూడా ఒకరిద్దరు కాదు,

చాలామంది. అందుకనే వారి ఆ శ్లోకాలలోని విషయాలే పరస్పరం ఎన్నో వ్యతిరేకాలతో నిండి కనబడుతున్నాయి. ఆ మాంసాహారుల మనసుల్లోకి ఏది వస్తే దాన్ని శ్లోకాలుగా రచించారు. మాంసం తినడం కోసం, పరలోకం, పుణ్యం, యజ్ఞాలు, వేదాలు, ప్రాచీన ఋషులు, అందరినీ, అన్నిటినీ సాయంగా తీసుకున్నారు. తమ మాటలు నిలబడాలని వారు చేసిన యుక్తులన్నీ, నిరాధారం, హాస్యాస్పదం, స్వార్థపూరితాలే.

ఇదే విధంగా ఈ కింది అవాంతర వ్యతిరేకాలతో చిన్న పిల్లలాడే మాటల వంటివి చూడండి-

క. 5.14,15 శ్లోకాలలో చేపలు తినడం పూర్తిగా నిషిద్ధం. 16వ శ్లోకంలో ఎవరైనా భోజనాలకు పిలిచినప్పుడు, చేపలు తినవచ్చునట!

ఖ. 3.268 నుండి 272 వరకు గల శ్లోకాలలో, శ్రాద్ధంలో చేపల మాంసం తినటం చేత పితరులు రెండు నెలల వరకు తృప్తిగా ఉంటారని ఉంది. పంది మాంసంతో పది నెలలు, తాబేలు మాంసంతో 11 నెలలు, ఖడ్గ మృగం మాంసంతో చిరకాలం పాటు పితరులు తృప్తు లవుతారని ఉంది. కానీ 5.18-19లలో వీటి మాంసం తినకూడదనీ, తినటం వల్ల ద్విజులు పతితు లవుతారనీ ఉంది.

గ. 5.22లో స్త్రీలు, సేవకులు మొదలైనవారి పోషణ కొరకు పశుపక్షులను చంపాలన్నారు. 5.38లో యజ్ఞం కోసం కాకుండా జంతువధ చేసేవాడు, ఎన్ని జంతువులను చంపుతాడో అన్ని జన్మలూ ఎత్తి, చేసిన పాపానికి మారుగా చంపబడతాడు అని ఉంది.

ఘ. 5.11-19 శ్లోకాలలో కొన్ని జంతువులను తినవచ్చుననీ, కొన్నిటిని తినరాదనీ ఉంది. 5.30లో బ్రహ్మ దేవుడు అన్ని జంతువులనూ, పక్షులనూ తినటానికే సృష్టించాడని ఉంది. వాటిని తినటం వల్ల మానవునికి ఏ విధమైన లోపాలూ కలుగవు. ఇలా, మాంసభక్షణాన్ని గురించిన అన్ని విషయాలూ హాస్యాస్పదమైన సంగతులతో నిండివున్నాయి. అందువల్లనే అవన్నీ అప్రామాణికాలైన ప్రక్షిప్తాలయ్యాయి.

5. వేద వ్యతిరేకాలు

ఇందులో మాంసభక్షణం కోరిన ప్రక్షిప్తకారులు వేదాలను అడ్డు పెట్టుకుని, మాంసభక్షణ వేదాలలో ఉందన్నారు. స్వార్థపరులు తమ కడుపులు నింపుకోవడానికి, వేదాలనూ, యజ్ఞాలనూ అపకీర్తిపాలుచేయటానికి ప్రయత్నించారు. 'వైదికీ హింసా, హింసా న భవతి' అనే మాటలను ఆసరాగా తీసుకుని, దాన్ని భోజన ప్రకరణంలో పెట్టి, తమ ఆచరణలను శాస్త్ర సమ్మతంగా నిరూపించడానికి ప్రయత్నించారు. ఇక్కడ వీటి ప్రసక్తి లేకుంటే భోజన విషయం, మాంసావధానం వేద సమ్మతమని చెప్పే ప్రయోగా లున్నాయనే అనుమానం రానే రాదు. మాంస భక్షణమూ, యజ్ఞాలలో జంతుబలులూ వేదాలలో కచ్చితంగా నిషేధించారు. మీదు మిక్కిలి శాకాహారు (మాంసాహారులకు కాదు) లకే యజ్ఞాలు చేసే అధికార మిచ్చారు. ఈ ప్రమాణాలు గల వివరణకు 5.26-28ల మీది 'వేద వ్యతిరేకాలు' సమీక్ష చూడండి.

45 నుండి 49వ శ్లోకాల వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

హింసామూలకమవడంవల్ల మాంసభోజనం నింద్యమే-

యోఽహింసకాని భూతాని హినస్త్యాత్మసుఖేచ్ఛయా । మూలశ్లోక సం.**7**
స జీవంశ్చ మృతశ్చైవ న క్వచిత్సుఖమేధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**45**

టీక:- **యః** = ఏ వ్యక్తి, **ఆత్మసుఖ+ఇచ్ఛయా** = తన సుఖం కోసం, **అహింసకాని భూతాని** = ఎప్పుడూ చంపదగని అమాయక ప్రాణులను హత్యచేస్తున్నాడో, అతడు **జీవన్ చ మృతః** = జీవించి ఉండగా, చనిపోయిన తర్వాత కూడా, **క్వచిత్ సుఖం న ఏధతే** = ఎక్కడ కూడా సుఖం అనుభవించదు.

తాత్పర్యం:- ఎవ్వరికీ ఏ హానినీ తలపెట్టని లేడి లాంటి వాటిని, తన సుఖం తన ఆహారం నిమిత్తం ఎవరైతే హింసిస్తారో అలాంటి వారు జీవించివున్నా మృతిచెందినవారితో సమానులే ! వారి పాపానికి నిష్కృతి లేదు.॥45॥

వివరణ: 5.6 శ్లోకాలలో 'అగర్హితమ్' పదం ద్వారా, అనిందింతమైన భోజన విధానం గురించి చెప్పబడింది. మాంసం మొ॥ భోజనం శాస్త్రనిందితమే గాక లోకంలోను నిందితమే. ఈ ప్రసంగంలో 7.11,12 శ్లోకాల ద్వారా, మాంసభోజనం నిందితమనడానికి కారణం వివరించబడింది.

ఇది మనుకృతం-ప్రామాణికం

యో బంధనవధక్లేశాన్ ప్రాణినాం న చికీర్షతి । మూలశ్లోక సం.**8**
స సర్వస్య హితప్రేప్సుః సుఖమత్యంతమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**46**

టీక:- **యః** = ఏ వ్యక్తి, **ప్రాణినాం బంధన-వధ-క్లేశాన్ న చికీర్షతి** = ప్రాణులను బంధించడం, వధించడం, వాటిని హింసించడాన్ని కోరుకోడో, **సః** = అతడు, **సర్వస్య హితప్రేప్సుః** = సర్వప్రాణుల హితాన్ని కోరతాడు. **అత్యంత సుఖమ్+అశ్నుతే** = అధిక సుఖాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- జంతువులను బంధించడం హింసంచడం వధించడం ఎవరైతే చేయరో అలాంటివారు సకల భూతహితులు. వారెన్నటికీ తరగని ఆనందంతో సుఖాలు పొంది, అంత్యమున మోక్షం పొందుతారు. ॥46॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యద్ధ్యాయతి యత్కురుతే ధృతిం బధ్నాతి యత్ర చ । మూలశ్లోక సం.**9**
తదవాప్నోత్యయత్నేన యో హినస్తి న కించన ॥ ప్రక్షిప్త శ్లోక సం.**47**

టీక:- **యః** = ఏ వ్యక్తి, **కించన న హినస్తి** = ఏ ప్రాణిని కూడా హింసించడో, **యత్ ధ్యాయతి** = ఏది ధ్యానిస్తాడో, **యత్ కురుతే** = ఏ పని చేస్తాడో, **చ** = మరియు, **యత్రధృతిం బధ్నాతి** = ఎక్కడ ధైర్యంగా మనస్సును లగ్నం చేస్తాడో, **తత్** = దాన్ని, **అయత్నేన** = సులభంగా, **అవాప్నోతి** = పొందుతాడు.

తాత్పర్యం:- దోమలలాంటి చిన్న క్రిమికీటకాదులకైనా హాని తలపెట్టని, వాటిని హింసంచని వారికి శ్రేయస్సు అగణితంగా లభిస్తుంది. వారికి సకల శుభాలు పిలిస్తే పలుకుతాయి. ఏది ధ్యానిస్తాడో, ఏ పని చేస్తాడో, ఎక్కడ మనస్సు లగ్నం చేస్తాడో దాన్ని సులభంగా పొందుతాడు.॥47॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నాకృత్వా ప్రాణినాం హింసాం మాంసముత్పద్యతే క్వచిత్ । మూలశ్లోక సం.**10**
స చ ప్రాణివధస్స్వర్గ్య స్తస్మాన్మాంసం వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**48**

టీక:- **ప్రాణినాం హింసాం అకృత్వా క్వచిత్ మాంసం న ఉత్పద్యతే** = ప్రాణులను హింసించకుండా ఎప్పుడూ మాంసం లభించదు. **చ** = మరియు, **ప్రాణివధః** = జీవులను హత్యచేయడం, **న స్వర్గ్యః** = సుఖదాయకం కాదు, **తస్మాత్** = ఈ కారణంగా, **మాంసం వివర్జయేత్** = మాంసాన్ని తినరాదు (వదిలివేయాలి).

తాత్పర్యం:- ప్రాణిహింస చేయకుండా మాంసం ఎలా లభిస్తుంది? మరి ప్రాణిహింస అంటే స్వర్గప్రదం కాదు కదా! కాబట్టి శాస్త్రవిధిని దాటి మాంసభక్షణకోసం ప్రయత్నించరాదు.॥48॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సముత్పత్తిం చ మాంసస్య వధబన్ధౌ చ దేహినామ్ । మూలశ్లోక సం.**11**
ప్రసమీక్ష్య నివర్తేత సర్వమాంసస్య భక్షణాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**49**

టీక:- చ = మరియు, **మాంసస్య సముత్పత్తిం** = మాంసాన్ని ఉత్పత్తి చేసే విధానాన్ని, **దేహినాం వధబన్ధౌ** = ప్రాణులను హత్యచేయడం, వాటిని బంధించడం, అందువల్ల కలిగే కష్టాలను, **ప్రసమీక్ష్య** = చూసి, **సర్వమాంసస్య భక్షణాత్** = అన్ని రకాలైన మాంసభక్షణాల నుండి, **నివర్తేత** = దూరంగా ఉండాలి.

తాత్పర్యం:- మాంసాన్ని ఉత్పత్తిచేసే విధానాన్ని, ప్రాణులను హత్య చేయడం, వాటిని బంధించడం అందువల్ల కలిగే కష్టాలను చూసి, అన్నిరకాలైన మాంస భక్షణానికి దూరంగా ఉండాలి. ॥49॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* ***న భక్షయతి యో మాంసం విధిం హిత్వా పిశాచవత్ ।***
స లోకే ప్రియతాం యాతి వ్యాధిభిశ్చ న పీడ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **50**

తాత్పర్యం:- దయ్యం వలెనో, పిశాచం వలెనో తినకుండా ఎవరైతే మాంస భక్షణ మానేస్తారో, అలాంటివారు లోకంలో ఉన్న సమస్త భూతములకు హితులై, రోగాదులకు దూరంగా ఉంటారు. కాబట్టి నియమంలేక చేసే మాంసభక్షణం వల్ల మనిషి ఆపదల పాలవుతాడని కొన్ని పరిమితులు ఏర్పరచారు.॥50॥

ప్రక్షిప్త పరిశీలన

50వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది-

1. అంతర్ వ్యతిరేకాలు

మనువు ప్రకారం అన్ని రకాల మాంసభక్షణం నిషిద్ధమూ, నింద్యమూ. ఈ శ్లోకంలో 'విధి' అనే పదం ద్వారా కేవలం విధిరహితమైన మాంసాన్ని వద్దన్నారు. కాని శేషన్యాయంతో విధిపూర్వకమాంసాన్ని సమర్థించారు. అందుచేత ఇది మనువుకు వ్యతిరేకం విస్తృత సమీక్ష కొరకు 4.26-28 చూడండి.

2. ప్రసంగ వ్యతిరేకాలు

దీని ముందరి, తర్వాతి విషయాలలో అన్ని విధాలుగానూ మాంసభక్షణను నిషేధించారు. 49లో "నివర్తేత సర్వ మాంసస్య భక్షణాత్" అని చెప్పి, 51లో మాంసానికి సంబంధించిన ప్రతి వ్యక్తినీ పాపులు అన్నారు. మధ్యలో విధి, అవిధి ఆధారంగా మాంసభక్షణాన్ని నిందించడం లేదా పొగడటం పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకం. అందుచేత 50వ శ్లోకం ప్రక్షిప్తం.

3. శైలీగత ఆధారాలు

దీని శైలి కూడా నిరాధారమూ, యుక్తియుక్తం కానిది. 'విధి రహితం'గా-పద్ధతి లేకుండా మాంసం తినేవాడు రోగాల బారిన పడతాడు. విధి ప్రకారం తినేవాడికి రోగాలు రావు' అనేది నిరాధారమైన విషయం. మాంసాన్ని యజ్ఞంలో సమర్పించటం వల్ల దాని గుణాలేవీ మారవు. ఇందుచేత ఈ నిర్హేతుక కథనం ప్రక్షిప్తమని తెలుస్తూంది.

మాంసభక్షణ ప్రసంగంలో 8 రకాలైన పాపుల గణన- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అనుమన్తా విశసితా నిహంతా క్రయవిక్రయీ । మూలశ్లోక సం. **12**
సంస్కర్తా చోపహర్తా చ ఖాదకశ్చేతి ఘాతకాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **51**

టీక:- అనుమన్తా = హత్యచేయుమని చెప్పేవాడు, **విశసితా** = మాంసాన్ని కోసేవాడు, **నిహన్తా** = పశువును చంపేవాడు, **క్రయ-విక్రయీ** = చంపవలసిన పశువును కొన్నవాడు, అమ్మేవాడు, **సంస్కర్తా** = మాంసం వండేవాడు. **ఉపహర్తా** = వడ్డించేవాడు, **చ** = మరియు, **ఖాదకః** = తినేవాడు, **ఇతి ఘాతుకాః** = వీరందరూ హంతకులు, పాపులు.

ఋషి దయానందభాష్యం:- జంతువును పట్టి చంపుమని అజ్ఞాపించేవాడు, దానిని చంపువాడు, వాటి అవయవాలను నరికేవాడు, అట్టి మాంసం విక్రయించేవాడు, కొనేవాడు, వంటచేసేవాడు, ఆ మాంసం వడ్డించేవాడు, చివరగా మాంసభక్షణం చేసేవాడు వీరంతా ఘాతుకులనబడతారు. ఇలా ఎనిమిదిరకాల వారందరూ హంతకులూ, పాపులూ దుష్టులూనూ.॥51॥

వివరణ:

ప్రాణి హత్యాపాపంలో ఎనిమిది మంది పాపులు.

ఇదే విధంగా అధర్మకార్యములన్నింటిలోను, వీరందరూ పాపులే. అందరికీ పాపఫలం అనుభవించవలసి ఉంది. ఇందుకు 4.55వ శ్లోకం ప్రమాణం.

52 నుండి 56వ శ్లోకాల వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* **స్వమాంసం పరమాంసేన యో వర్ధయితుమిచ్ఛతి ।**
అనభ్యర్చ్య పితౄన్ దేవాం స్తతోఽన్యో నాస్త్యపుణ్యకృత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***52***

తాత్పర్యం:- ఎవరు యజ్ఞాలు చేయక, దేవతలకు, శ్రాద్ధాదులచేత పితరులను తృప్తిపరచక ఇతరప్రాణుల మాంసం చేత తన మాంసాన్ని పెంచుకోజూస్తాడో అలాంటివాడికంటే నీచుడు ఇంకొక డెవరూ ఉండడు.॥52॥

కాబట్టి, విధివిహితం కానట్టి మాంసభక్షణం విడనాడటం మంచిది.

* **వర్షే వర్షేఽశ్వమేధేన యో యజేత శతం సమాః ।**
మాంసాని చ న ఖాదేద్యస్తయోః పుణ్యఫలం సమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***53***

తాత్పర్యం:- ఎవరు నూరేళ్లు ప్రతిఏటా అశ్వమేధయాగం చేస్తారో, అలాంటివారికి ఎంత పుణ్యం లభించగలదో అంతపుణ్యం మాంసభక్షణం చెయ్యనివారికి కలుగుతుంది.॥53॥

* **ఫలమూలాశనైర్మేధ్యైర్మున్యన్నానాం చ భోజనైః ।**
న తత్ఫలమవాప్నోతి యన్మాంసపరివర్జనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***54***

తాత్పర్యం:- కందమూలాలు, ఫలాలు భక్షించడం వల్ల; మునులు భుజించే నీవార ధాన్యం మొదలైనవి భుజించడం వల్ల ఎంతఫలితం లభిస్తుందో అంతకంటే ఎక్కువ ఫలితం మాంసభక్షణాన్ని విడనాడటం వల్ల పొందవచ్చు! విధివిహితం కాని మాంసభక్షణం కంటే మాంసరహిత భోజనం శ్రేష్ఠం. పుణ్యదాయకం.॥54॥

* **మాంసః భక్షయితాఽముత్ర యస్య మాంసమిహాద్మ్యహం ।**
ఏతన్మాంసస్య మాంసత్వం ప్రవదంతి మనీషిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***55***

తాత్పర్యం:- మాంస శబ్దానికి పండితులు చెప్పే వ్యుత్పత్తి అర్థం ఇదీ:-మాం = నన్ను+, సః= అతడు (అది). దీన్ని విస్తరించి చెప్పాలంటే-"ఈ లోకంలో నేను దేని మాంసం తింటానో, పరలోకంలో అది నన్ను(నా మాంసం) తింటుంది" అని. అంటే "ఈ జన్మలో నేను దాన్ని తింటే వచ్చే జన్మలో అది నన్ను తింటుంది"అని అర్థం.॥55॥

* **న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే ।**
ప్రవృత్తిరేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***56***

తాత్పర్యం:- ఈ మాంసభక్షణం మొదలైనవి, మైథున క్రియ మద్యపానం మొదలైనవి ప్రవృత్తిరీత్యా జీవులన్నిటికీ సర్వసాధారణమైనవే ! కానీ, ప్రయత్నంచేత వాటి పట్ల మక్కువ వదులుకోవడం విశేషఫలదాయకం.॥56॥

ప్రక్షిప్తాల పరిశీలన

52 నుంచి 56 శ్లోకాలు కింది ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

క. 52వ శ్లోకం విధిపూర్వకంగా- ఒక పద్ధతి ప్రకారం మాంసం తినవచ్చునన్నది. 56లో అన్నిరకాల మాంసభక్షణం పాపమన్నది. మనువు అన్నిరకాల మాంసభక్షణాన్ని నిషేధించి, అలా చేయటం పాపమన్నాడు. మాంసం తినేవారే కాకుండా దానికి తోడ్పడిన వారందరూ పాపులే అన్నాడు [5.51]. మనువు మౌలిక పద్ధతికి వ్యతిరేకం కనుక ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు [వివరణకు 4.26-28ల సమీక్ష చూడండి].

ఖ. ఇదే విధంగా మద్యపానాన్ని కూడా మనువు నిషేధించాడు. మనువు "వర్జయేత్ మధు మాంసం చ" [2.152 (177)] అని, మధువు అంటే మద్యాన్ని కూడా కచ్చితంగా నిషేధించాడు. 7.47, 50 శ్లోకాలలో మద్యపానాన్ని నీచమైన వ్యసనంగా పేర్కొన్నాడు. 5.133లో మద్యాన్ని స్పృశించడమే అశుద్ధికారక మన్నాడు.

కనుక 56వ శ్లోకంలోని విషయం మనువుకు వ్యతిరేకం. మద్యమాంసాల సేవనం మానవుల సహజ ప్రవృత్తి అనటం కూడా తప్పే. వీటిని సేవించనివారు కోట్ల మంది ఉన్నారు. నేటి వైద్యవిధానం కూడా మానవుని శరీరనిర్మాణం మాంసభక్షణకు తగినది కాదని చెబుతూంది. కనుక, మాంస భక్షణం, మధుపానం మొదలైనవి సహజ ప్రవృత్తులుగా అంగీకృతం కావు.

గ. 52వ శ్లోకంలో మృతుల శ్రాద్ధంలోనూ మాంసభక్షణ సంకేతం ఉంది. ఇది కూడా మనువుకు వ్యతిరేకమే [చూడండి 3.119 నుంచి 274 శ్లోకాలపై 'అంతర్ వ్యతిరేకాలు' సమీక్ష]. ఇదే విధంగా 55లో ఎవరో ఒకరు చేసిన కర్మ ద్వారా ఆ జీవి మరు జన్మలో ఏ విధంగా పుడతాడనేది నిర్ధారించడమూ మనువుకు వ్యతిరేకమే. మనువు ఎన్నో కర్మలను అనుసరించి ఉత్తమ, మధ్య, అధమ జన్మలు కలుగుతాయని చెప్పాడు[12.3-9, 40.52, 73-74]. ఇలా ఎన్నో అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఘ. పూర్వాపర వ్యతిరేకతా ఇక్కడ ఉంది. 51-55లలో స్పష్టంగా మాంసభక్షణం నిషేధించబడింది. కానీ ఈ శ్లోకంలో దాని సమర్థన ఉంది.

2. శైలీగత ఆధారాలు

క. 53వ శ్లోకంలోని శైలి, వంద ఏళ్ల పాటు జరిగే అశ్వమేధ ఫలాన్ని, మాంసభక్షణం చేయకపోవటం వల్ల వచ్చే ఫలంతో పోల్చడమూ, 54లో మునుల ఆహారాన్ని మించిన ఫలం మాంసాన్ని వదలటం వల్ల కలుగుతుందని నిర్ధారించడం మొదలైనవి, నిరాధారమూ, నిర్హేతుకమూ, అతిశయోక్తులు నిండినది. ఇటువంటి నిర్ధారణలకు ఏ ప్రమాణాలూ లేవు, సంబంధమూ లేదు.

గృహస్థాంతర్గత దేహశుద్ధి విషయం 57 నుండి 110 వరకు

దేహశుద్ధి- ఇది మనుకృతం-ప్రామాణికం

దేహశుద్ధిం ప్రవక్ష్యామి ద్రవ్యశుద్ధిం తథైవ చ । మూలశ్లోక సం. **13**
చతుర్ణామపి వర్ణానాం యథావదనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **57**

టీక:- చతుర్ణాం +అపి వర్ణానాం = ఇప్పుడు నేను నాలుగు వర్ణాల వారికి, **అనుపూర్వశః** = క్రమంగా, **దేహశుద్ధిం** = శరీరం, శరీరానికి సంబంధించిన శుద్ధిని, **తథా+ఏవ** = అదే ప్రకారంగా నాలుగు వర్ణాల వారికి, **ద్రవ్య శుద్ధిం** = పాత్రలు, వస్త్రాలు మొ॥ పదార్థాలకు సంబంధించిన శుద్ధి, గురించి, **ప్రవక్ష్యామి** = తెలియజేస్తాను.

తాత్పర్యం:- ఇప్పుడు బ్రాహ్మణాది చాతుర్వర్ణాలవారికి దేహశుద్ధికి, ద్రవ్యశుద్ధికి సంబంధించిన విషయాలు చెబుతున్నాను....॥57॥

వివరణ

'దేహశుద్ధి' అనే పాఠం మౌలికం. ఈ శ్లోకంలో ప్రథమ పాదంలో, 'ప్రేతశుద్ధిమ్' అనే పాఠం ప్రచలితమైన మనుస్మృతి సంస్కరణలలో ఉన్నది. ఇది ప్రక్షిప్తం. దీనికి బదులుగా 'దేహశుద్ధిమ్' అనే పాఠం ఉండవలసింది. ఇది ప్రక్షిప్తం. కాలాంతరంలో 'ప్రేతజన్మ' మొ॥ వాటిలో శుద్ధి ప్రక్రియ ఒక కర్మకాండగా రూపం దాల్చినప్పుడు, ఈ పాఠభేదాన్ని కల్పించి, ఈ శ్లోకంలో కలిపి ఉండవచ్చు. ఈ 'ప్రేతశుద్ధిమ్' అనే పాఠం మౌలికం కాదని, 'దేహశుద్ధిమ్' అనే పాఠం మౌలికమని నిరూపించడానికి ప్రమాణాలివ్వబడుచున్నవి.

ఒకే విషయాన్ని ప్రారంభించడానికి ముందు సంకేతం ఇవ్వడం, అదే విధంగా సమాప్తికీ సంకేతం చూపించడం మను శైలి. అందుకు ఇక్కడ 'ప్రేతశుద్ధి' ద్వారా ప్రారంభించిన విషయానికి భిన్నంగా ఉంది. సమాప్తి కూడా శరీరశుద్ధి విషయంగానే ఉండాలి. ప్రారంభించిన విషయం దేహశుద్ధి గాత్ర-శరీర-మొ॥ శబ్దాల ద్వారా తెలుపబడింది. అందువల్ల ఇక్కడ దేహశుద్ధి విషయమే గాని, ప్రేతశుద్ధి విషయం కాదు. ఈ ప్రేతశబ్దం ప్రక్షిప్తమే.

58 నుండి 104వ శ్లోకాల వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** అశుద్ధి సమయము-**

* *దంతజాతేఽనుజాతే చ కృతచూడే చ సంస్థితే ।*
అశుద్ధా బాంధవాస్సర్వే సూతకే చ తథోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***58***

తాత్పర్యం:- శుద్ధి గురించి తెలియాలంటే ముందు 'అశుచి' గురించి తెలియాలి కదా! దంతాలు మొలిచిన పసిబిడ్డ మొదలు ఉపనయనం జరిగిన వారివరకూ ఎవరు మృతిచెందినా సపిండులకు, సమానోదకులకు అశౌచం ఉంది. సూతకంలోనూ వారికి అలాగే వక్ష్యమాణ విశేషవిధుల్లో చెప్పినట్లుగా అశౌచం ఉంది.॥58॥

*** సాపిండ్య లక్షణం-**

* *దశాహం శావమాశౌచం సపిండేషు విధీయతే ।*
అర్వాక్ సంచయనాదస్థ్నాం త్ర్యహమేకాహమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***59***

తాత్పర్యం:- బ్రాహ్మణుల్లో సపిండులకు మృతిసంబంధ అశౌచం 10 రోజులు. వేదాధ్యయనం, పరిశుద్ధాచారాలు వంటి సుగుణాలను బట్టి కొందరికి అస్థిసంచయం అయ్యేంతవరకు (4 లేదా 3 రోజులు) అశౌచం ఉండగలదు. అగ్నిహోత్రాది ఆచారాలు గల శిష్యుడికి ఒక్కరోజే అశౌచం. కేవలం వేదాధ్యయన సంపన్నుడికి మూడు రోజులు. ఇవేవీ లేనప్పుడే 10 రోజులు. ॥59॥

సపిండ శబ్దానికర్థం:- పిండమనగా శరీరము. సపిండమనగా ఒకే తల్లిదండ్రికి పుట్టిన అన్నదమ్ములు-అక్కాచెల్లెండ్రు అని అర్థం.

* *సపిండతా తు పురుషే సప్తమే వినివర్తతే ।*
సమానోదకభావస్తు జన్మనామ్నోరవేదనే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***60***

తాత్పర్యం:- ఎవరైనా మృతిచెందినప్పుడు, అతడితో కలిసి ఏడుతరాలవారి వరకు సపిండత్వం ఉంటుంది. తండ్రి-తాత-ముత్తాతలు పిండభాగులు. ముత్తాత యొక్క పితృ-పితామహ-ప్రపితామహులు పిండలేపభాగులు. కాబట్టి-మృతుడు గాక అతడికి పూర్వం 6 తరాలవారు (పెద్దలు) సపిండులు. ఫలానాపేరు గలవారు, వారిపుత్రులు అని పేర్లు తెలిసేంతవరకు సమానోదకత్వం వర్తిస్తుంది. పేర్లు తెలియకుంటే అది నివర్తిస్తుంది.॥60॥

వివరణ:- 'సమానోదకభావః' అనగా ఒక నీటిలో రెండవ నీరు కలిసి ఏకమైపోవునటుల ఒకరి ఆత్మసంబంధం, మనోభావన, వంశసంబంధం ఒకటిగా కలిసిపోవడమని భావం. దీని అభిప్రాయమేమనగా! అన్యోన్యమైన, సన్నిహితమైన, అంతరంగికమైన, దట్టమైన, గాఢమైన, అధికమైన సంబంధమున్నప్పుడే వంశస్థుల మధ్య సమానోదకభావముంటుంది. అది లేనప్పుడు ఆ సంబంధం విడిపోతుంది.

* *యథేదం శావమాశౌచం సపిండేషు విధీయతే ।*
జననేఽ ప్యేవమేవ స్యాన్నిపుణాం శుద్ధిమిచ్ఛతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***61***

తాత్పర్యం:- సపిండులకు ఈ మృతశౌచం ఎలా 10 రోజులపాటు ఉంటుందో అలాగే స్మార్త శ్రౌత కర్మార్హతగలవారికీ జాతాశౌచ మృతాశౌచం నుంచి శుద్ధిని కోరేవారందరికీ ఉంటుంది.॥61॥

*** సూతకము-మృతక సంబంధ విధానము-**

* *సర్వేషాం శావమాశౌచం మాతాపిత్రోస్తు సూతకమ్ ।*
సూతకం మాతురేవ స్యాదుపస్పృశ్య పితా శుచిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***62***

తాత్పర్యం:- మరణవశాన తాకగూడని అశౌచం అనే విధి జ్ఞాతులకు దాయాదులకు అందరికీ (సపిండులకు) సమానమే ! జాతాశౌచం అలాంటిది కాదు. జననం వల్ల తల్లికి 10 రోజులు మైల. తండ్రికి మాత్రం శిశువును తాకిన తరవాత స్నానంతో శుద్ధి.॥62॥

* *నిరస్య తు పుమాన్ శుక్రముపస్పృశ్యైవ శుద్ధ్యతి ।*
బైజికాదభిసంబంధాదనురుంధ్యాదఘం త్ర్యహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***63***

తాత్పర్యం:- కామం చేత పురుషుడు వీర్యం కార్చితే, అది స్నానం వల్ల పరిశుద్ధం కాగలదు. కాని ఇతరుల భార్యల యందు గాని ఆ వీర్యాన్ని విడిచిపెడితే, అతడికి 3 రోజులు అశౌచం. (మృతసంబంధ అశౌచవిషయం చెప్తూ, మధ్యలో ఈ కామ సంబంధాశౌచం గురించి మనువు చెప్పలేదని-ఇది ప్రక్షిప్తమనీ కొందరంటారు).॥63॥

*** సమీపస్థ బంధువుల శుద్ధివిధి-అవధి-**

* *అహ్నా చైకేన రాత్ర్యా చ త్రిరాత్రైరేవ చ త్రిభిః ।*
శవస్పృశో విశుద్ధ్యంతి త్ర్యహాదుదకదాయినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***64***

తాత్పర్యం:- సపిండులు దశాహాశౌచం చేత పరిశుద్ధులవుతారు. అలాగే ప్రేమ-మమకారాలచేత శవాన్ని తాకినవారు, సమీపబంధువులు ఆ ఇంటనే ఉంటే, వారికీ 10వ రోజుతో శుద్ధి. సమానోదకులు మాత్రం 3 రోజులతోనే శుద్ధులవుతారు.॥64॥

* *గురోః ప్రేతస్య శిష్యస్తు పితృ మేధం సమాచరన్ ।*
ప్రేతహారైస్సమం తత్ర దశరాత్రేణ శుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***65***

తాత్పర్యం:- గురువు మరణిస్తే, అతడికి అగ్నిసంస్కారం చేసిన శిష్యప్రముఖుడు కూడ గురువు యొక్క దాయాదులతో పాటు పదిరోజులు అశౌచం పాటించి, తరువాత స్నానం చేత శుద్ధుడవుతాడు.॥65॥

* *రాత్రిభిర్మాసతుల్యాభిర్గర్భస్రావే విశుద్ధ్యతి ।*
రజస్యుపరతే సాధ్వీ స్నానేన స్త్రీరజస్వలా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***66***

తాత్పర్యం:- 3వ నెలలోగా స్త్రీకి గర్భస్రావమైతే మైలలేదు. అశౌచవిధులేవీ పాటించనక్కరలేదు. తదుపరి ఎన్ని నెలల గర్భం పోతే అన్నిరోజుల అశౌచం. ఈ జాతాశౌచ సంపిడులకు లేదు. రజస్వల ఐన స్త్రీకి ఐదోరోజు స్నానం నుంచి శుద్ధి. నాలుగో నాటి స్నానం కొన్ని సందర్భాలకు పనికిరాదు (ఉదా: పూజ మొ॥).॥66॥

* నృణామకృతచూడానాం విశుద్ధిర్నైశికీ స్మృతా।
నిర్వృత్తచూడకానాం తు త్రిరాత్రాచ్ఛుద్ధి రిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**67**

తాత్పర్యం:- చూడాకర్మ కానట్టి శిశువు మరణిస్తే సపిండులు ఒక రాత్రి పగలు మాత్రం అశౌచం పాటించాలి. చౌలం అయినప్పుడు సపిండులకు మూడురోజులు అశౌచం.॥67॥

* ఊనద్వివార్షికం ప్రేతం నిదధ్యుర్బాంధవా బహిః ।
అలంకృత్య శుచౌ భూమావస్థిసంచయనాదృతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**68**

తాత్పర్యం:- చౌలం/చూడాకర్మ కానట్టి రెండేళ్లయినా నిండని శిశువు మృతిచెందినట్లైతే ఆ శిశువును అలంకరించి, గ్రామం వెలుపల గల పరిశుద్ధభూమిలో అస్తిసంచయనం లేదా పూడ్చి పెట్టడం జరగాలి.॥68॥

అంతేగాక....(తదుపరి శ్లోకంతో అన్వయం)

* నాస్య కార్యోఽగ్ని సంస్కారో న చ కార్యోదకక్రియా ।
అరణ్యే కాష్ఠవత్త్యక్త్వా క్షపేయుస్త్ర్యహమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**69**

తాత్పర్యం:- రెండేళ్లయినా నిండని బాలుడికి దహనాది క్రియలు (అగ్నిసంస్కారం) అవసరం లేదు. ఉదకదానం తిలతర్పణాదులూ ఉండవు. అడవిలోని కట్టెను పారవేసిన చందంగా, గోతిలో పూడ్చి మూడు రోజులు అశౌచం పాటిస్తే సరిపోతుంది.॥69॥

* నాత్రివర్షస్య కర్తవ్యా బాంధవైరుదకక్రియా ।
జాతదంతస్య వా కుర్యుర్నామ్ని వాపి కృతే సతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**70**

తాత్పర్యం:- మూడేళ్ల బాలుడైనప్పుడూ తండ్రి-సపిండులు ఉదకదానం చేయనక్కరలేదు. నామకరణం జరిగి, దంతాలు వచ్చి వున్నట్లయితే ఆ శిశుప్రీతికై ఉదకదానం చేయవచ్చు. చేయకున్నా దోషం ఉండదు.॥70॥

* సబ్రహ్మచారిణ్యేకాహమతీతే క్షపణం స్మృతమ్ ।
జన్మన్యేకోదకానాం తు త్రిరాత్రాచ్ఛుద్ధిరిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**71**

తాత్పర్యం:- తనతో కూడా వేదాధ్యయనం చేసినవాడు మృతి చెందినప్పుడు ఏకరాత్రం అశౌచం. పుత్రుడు జన్మించినప్పుడు సోదరులకు మూడు రోజుల వరకు అశౌచం ఉంటుంది.॥71॥

* స్త్రీణామసంస్కృతానాం తు త్ర్యహాచ్ఛుద్ధ్యంతి బాంధవాః ।
యథోక్తేనైవ కల్పేన శుద్ధ్యంతి తు సనాభయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**72**

తాత్పర్యం:- ఒక కన్యకను ఒకరికి ఇస్తానని వాగ్దానంచేశాక, ఆ కన్య గాని మరణిస్తే, ఆ కన్య ఎవరికైతే వాగ్దత్తం చేయబడిందో వారు, వారి దాయాదులు కూడ మూడు రోజులు అశౌచం పాటించాలి. ఆ పిల్ల తల్లిదండ్రులకు కూడా మూడు రోజులు అశౌచం ఉంటుంది.॥72॥

* అక్షారలవణాన్నాస్స్యుర్నిమజ్జేయుశ్చ తే త్ర్యహమ్ ।
మాంసాశనం చ నాశ్నీయుః శయీరంశ్చ పృథక్ క్షితౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**73**

తాత్పర్యం:- చౌడు ఉప్పులేని ఆహారం (చప్పిడికూడు) మాత్రమే ఆ మూడు రోజులు (అశౌచదినాల) పాటు ఆరగించాలి. నదులలో స్నానాలు చేయాలి. స్త్రీసంగమం నిషేధం. నేలమీద ఒంటరిగా పరుండాలి (కేవలం వాగ్దత్తం జరిగితేనే ఇంత తంతు ఉందా? అని ఆశ్చర్య పడనక్కర్లేదు.).॥73॥

* *సన్నిధావేష వై కల్పశ్శావాశౌచస్య కీర్తితః ।*
అసన్నిధావయం జ్ఞేయో విధిస్సంబంధిబాంధవైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***74***

తాత్పర్యం:- ఇక-మృతిచెందినవారు తమకు చేరువగానే ఉంటే, ముందు చెప్పబడిన అశౌచవిధులన్నీ పాటించాలి. గ్రామాంతరాన ఉంటే సపిండులు-సమానోదకులు ఇక చెప్పబోయే రీతి పాటించాలి.॥74॥

* విదేశస్థ బాంధవుల శుద్ధి-అవధి-

* *విగతం తు విదేశస్థం శృణుయాద్యో హ్యనిర్దశమ్ ।*
యచ్ఛేషం దశరాత్రస్య తావదేవాశుచిర్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***75***

తాత్పర్యం:- దేశాంతరాలలో వున్నవారికి సంబంధించిన జనన మరణాలను పదిరోజులు గడిచేలోగా విన్నట్లయితే, వారు విన్న తరువాత - (ఆ దశాహంలో విన్ననాటికి) ఎన్నిరోజులు మిగిలి ఉంటే అన్ని రోజులే అశౌచం పాటించాలి.॥75॥

* *అతిక్రాంతే దశాహే చ త్రిరాత్రమశుచిర్భవేత్ ।*
సంవత్సరేఽ వ్యతీతే తు స్పృష్ట్వైవాపో విశుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***76***

తాత్పర్యం:- మృతుడికి సంబంధించిన విషయం పదిరాత్రులు గడిచాక తెలిస్తే-సపిండ సమానోదకులు మూడురోజులు అశౌచం ఉండాలి. సంవత్సరం తర్వాత గాని తెలిస్తే, కేవలం స్నానం వల్లనే శుద్ధి కలుగుతుంది.॥76॥

* *నిర్దశం జ్ఞాతిమరణం శ్రుత్వాపుత్రస్య జన్మ చ ।*
సవాసా జలమాప్లుత్య శుద్ధో భవతి మానవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***77***

తాత్పర్యం:- దశాహం గడిచాక దాయాదుల మరణం విన్నా-లేదా జనన విషయాన్ని విన్నా సచేలస్నానం చేస్తే చాలు !॥77॥

* *బాలే దేశాంతరస్థే చ పృథక్ పిండే చ సంస్థితే ।*
సవాసా జలమాప్లుత్య సద్య ఏవ విశుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***78***

తాత్పర్యం:- దేశాంతరంలో ఉన్న చౌల సంస్కారం కానట్టి బాలుడు మృతిచెందినప్పుడు; మూడు రాత్రులు అశౌచం (దాయాదులు) పట్టదగిన సమానోదకులు మరణించినప్పుడు సచేలస్నానం చేత శుద్ధి కలుగుతుంది.॥78॥

* *అంతర్దశాహే స్యాతాం చేత్పునర్మరణజన్మనీ ।*
తావత్స్యాదశుచిర్విప్రో యావత్తత్స్యాదనిర్దశం ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***79***

తాత్పర్యం:- పదిరోజుల్లోనే తిరిగి ఇంకొకరి జనన-మరణాదుల అశౌచం సంభవించినా-(దీనిలో అది కలిసిపోవడం వల్ల) మొదటి అశౌచం ప్రకారం 10రోజులు ఉంటే సరిపోతుంది. ॥79॥

* ఇతర అశుద్ధుల శుద్ధి విధి-

* *త్రిరాత్రమాహురాశౌచమాచార్యే సంస్థితే సతి ।*
తస్య పుత్రే చ పత్న్యాం చ దివారాత్రమితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***80***

తాత్పర్యం:- గురువు మృతి చెందితే, శిష్యుడికి 3 రాత్రుల పర్యంతము అశౌచం. ఆచార్యుడి పుత్రుడు భార్య మొదలైనవారు మృతిచెందితే, ఒక రాత్రి ఒక పగలు అశౌచం అని శాస్త్రవిధి.॥80॥

* శ్రోత్రియే తూపసంపన్నే త్రిరాత్రమశుచిర్భవేత్ ।
మాతులే పక్షిణీం రాత్రిం శిష్యర్త్విగ్బాంధవేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 81

తాత్పర్యం:- వేదశాస్త్రాధ్యయన సంపన్నుడైన శ్రోత్రియుడికి దగ్గరివాడుగా మెలగినవాడు మృతిచెందితే మేనమామ, ఋత్విక్, శిష్యులు, బంధువు మృతిచెందినట్లయితే ఒక రాత్రి, ఒక పగటితో కూడిన రాత్రి (ప్రక్షిణి) అశౌచం.॥81॥

* ప్రేతే రాజని సజ్యోతిర్యస్య స్యాద్విషయే స్థితః ।
అశ్రోత్రియే త్వహః కృత్స్నమనూచానే తథా గురౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 82

తాత్పర్యం:- బ్రాహ్మణాది వర్ణాలు నివాసం ఉన్న రాజ్యంలో, ఆ రాజు మృతిచెందితే.... అది పగటి కాలంలో సంభవిస్తే సూర్యాస్తమయం వరకు, రాత్రి గాని అయినప్పుడు చుక్కల వెలుగు ఉన్నంత వరకు అశౌచం పాటించాలి. శ్రోత్రియుడు ఎవడైనా తనింట మరణిస్తే మూడురోజులు అశౌచం. సాంగ వేదాధ్యాయి కానివాడు, కొద్దో-గొప్పో చదువుచెప్పినవాడు అయితే ఒక్కరోజు అశౌచం.॥82॥

* శుద్ధ్యేద్విప్రో దశాహేన ద్వాదశాహేన భూమిపః ।
వైశ్యః పంచదశాహేన శూద్రో మాసేన శుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 83

తాత్పర్యం:- ఉపనయనం జరిగిన సపిండుడు మృతిచెందితే బ్రాహ్మణుడికి పదిరోజులు అశౌచం. క్షత్రియుడైతే పన్నెండురోజులు, వైశ్యుడికైతే పదిహేను రోజులు, శూద్రుడికైతే నెలరోజులు అశౌచం పాటించాల్సి ఉంటుంది.॥83॥

* న వర్ధయేదఘాహాని ప్రత్యూహేన్నాగ్నిషు క్రియాః ।
న చ తత్కర్మ కుర్వాణస్సనాభ్యోఽప్యశుచిర్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 84

తాత్పర్యం:- అశౌచ దినాలను అకారణంగా అధికం పాటించరాదు. అగ్నిహోత్రాది క్రియలకు భంగం కలిగించరాదనే ఈ నియమం పెట్టారు. పుత్రులు మొదలైనవారు ఆ అగ్నిహోత్రాది క్రియలు నిర్వర్తిస్తూ వుండొచ్చు! తండ్రికి అశౌచం కలిగిన అన్ని సందర్భాలలోను, పుత్రాదులకు అగ్నిహోత్రాధికారం ఇవ్వబడింది. దానికి లోపం రానివ్వకూడదు.॥84॥

* దివాకీర్తిముదక్యాం చ పతితం సూతికాం తథా ।
శవం తత్స్పృష్టినం చైవ స్పృష్ట్వా స్నానేన శుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 85

తాత్పర్యం:- కేవలం స్నానం చేయడం చేతనే ఈ కిందివారిని తాకినప్పుడు పరిశుద్ధత కలుగుతుంది వారెవరెవరంటే-భ్రష్టుడు, మంగలి, రజస్వల, పురిటింటిలో ఉన్నది, శవం, శవాన్ని తాకినవారు.॥85॥

* ఆచమ్య ప్రయతో నిత్యం జపేదశుచిదర్శనే ।
సౌరాన్మంత్రాన్ యథోత్సాహం పావమానీశ్చ శక్తితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 86

తాత్పర్యం:- అపరిశుద్ధ వస్తువులను చూచినప్పుడు స్నానం-ఆచమనం చేసి పరిశుద్ధులై దేవతార్చన చేసుకోవచ్చు తమ శక్తికొద్దీ సౌరమంత్రాలను, పావనదాయకమైన ఋక్కులను జపించవచ్చు!॥86॥

* నారం స్పృష్ట్వాస్థి సస్నేహం స్నాత్వా విప్రో విశుద్ధ్యతి ।
ఆచమ్యైవ తు నిస్స్నేహం గామాలభ్యార్క మీక్ష్యవా ॥ ప్రక్షిప్త శ్లోక సం. 87

తాత్పర్యం:- జిడ్డు కలిగిన మనిషి యొక్క ఎముకను తాకినట్లయితే స్నానంచేత పరిశుద్ధి. ఎండిన ఎముక అయితే-ఆచమనం చేసి గోవుని స్పృశిస్తే చాలు! లేదా సూర్యుణ్ణి చూసినా ఆ దోషం పోతుంది. ॥87॥

*   అదిష్టీ నోదకం కుర్యాదావ్రతస్య సమాపనాత్ ।
సమాప్తే తూదకం కృత్వా త్రిరాత్రేణైవ శుద్ధ్యతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **88**

తాత్పర్యం:- బ్రహ్మచర్యం మొదలైన దీక్షలలో ఉన్నవారు-ఆ దీక్ష ముగిసేంత వరకు దాయాదులు అయినప్పుడు అశౌచం పాటించనక్కర్లేదు. సొంత తల్లిదండ్రులైతే పాటించాలి. దీక్షముగిశాక దాయాదుల నిమిత్తం ఉదకదానం చేయాలి. తల్లిదండ్రులు-గురువు అయినప్పుడు యథావిధిగ ఉదకదానం -అశౌచం పాటించి తిరిగి దీక్ష వహించాలి.॥88॥

*   వృథాసంకరజాతానాం ప్రవ్రజ్యాసు చ తిష్ఠతామ్ ।
ఆత్మనస్త్యాగినాం చైవ నివర్తేతోదకక్రియా ॥   ప్రక్షిప్త శ్లోక సం. **89**

తాత్పర్యం:- స్వధర్మాలను తరచు వదిలినవారు; ఉత్తమవంశస్త్రీలకు నీచులవల్ల పుట్టినవారు. (సంకరులు) వేద బాహ్యామైన వస్త్రాలను ధరించి తిరిగేవారు, విషంచేత, ఉరిచేత బలవన్మరణం పొందినవారు ఉదకదానాదులకు అనర్హులు.॥89॥

*   పాఖండమాశ్రితానాం చ చరంతీనాం చ కామతః ।
గర్భభర్తృద్రుహాం చైవ సురాపీనాం చ యోషితామ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **90**

తాత్పర్యం:- వేదంలో లేని క్రియలు ఆచరించేవారు, విచ్చలవిడిగా ఎక్కువ మందితో రమించే స్త్రీలు, వ్యభిచారమే వృత్తిగా పెట్టుకున్నవారు, గర్భస్రావాలకు పాల్పడుతూ, రతిసుఖాసక్తులైన స్త్రీలు, భర్తకు ద్రోహంచేస్తూ పాపాలు చేసే స్త్రీలు, మద్యపానాసక్తులు, ద్విజాతిస్త్రీలకు ఉత్తరక్రియలు కూడ చేయదగదు.॥90॥

* ఏ వర్ణ మృతక శరీరాన్ని ఏ దిశగా తీసుకువెళ్ళాలి?-

*   ఆచార్యం స్వముపాధ్యాయం పితరం మాతరం గురుమ్ ।
నిర్హృత్య తు వ్రతీ ప్రేతాన్ న వ్రతేన వియుజ్యతే ॥   ప్రక్షిప్త శ్లోక సం. **91**

తాత్పర్యం:- తనకు ఉపనయనం చేసి వేదం పూర్తిగా చెప్పిన ఆచార్యుణ్ణి కొద్దో గొప్పో వేదవేదాంగాలు తనచేత అధ్యయనం చేయించిన ఉపాధ్యాయుణ్ణి; గురువును; మాతాపితరులను సంస్కరించిన పక్షంలో వారికి వ్రతలోపం కలుగదు. మిగిలినవారిని సంస్కరింపజూస్తే వ్రతహాని తథ్యం.॥91॥

* ఏ వర్ణ మృతక శరీరాన్ని ఏ దిశగా తీసుకువెళ్ళాలి?-

*   దక్షిణేన మృతం శూద్రం పురద్వారేణ నిర్హరేత్ ।
పశ్చిమోత్తరపూర్వైస్తు యథాయోగం ద్విజన్మనః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **92**

తాత్పర్యం:- పట్టణం/ గ్రామంలో నుంచి ఏ యే జాతుల శవాలను ఏ దిక్కుగా శ్మశానానికి తీసుకెళ్లాలో వివరించబడింది. బ్రాహ్మణశవాన్ని తూర్పుదిశగా, క్షత్రియ శవాన్ని ఉత్తరదిశగా, వైశ్య శవాన్ని పశ్చిమదిశగా, శూద్ర శవాన్ని దక్షిణదిశగా తీసుకువెళ్లాలి.॥92॥

* రాజులకు అశుద్ధి ఉండదు-

*   న రాజ్ఞామఘదోషోఽస్తి వ్రతినాం న చ సత్రిణాం ।
ఐంద్రం స్థానముపాసీనా బ్రహ్మభూతా హి తే సదా ॥   ప్రక్షిప్త శ్లోక సం. **93**

తాత్పర్యం:- ఇంద్రపదవితో తుల్యమైన క్షత్రియాదులు బ్రహ్మస్వరూపులు కాబట్టి, వారి మృతి వల్ల అశౌచదోషం కలుగదు. అలాగే-పట్టాభిషిక్తులైన రాజులు, బ్రహ్మచర్యం-యాగం పాటించేవారికి ఆ యా వ్యక్తుల సపిండుల మరణం వల్ల అశౌచదోషం సంభవించదు.॥93॥

* రాజ్ఞో మాహాత్మికే స్థానే సద్యశ్శౌచం విధీయతే ।
ప్రజానాం పరిరక్షార్థమాసనం చాత్ర కారణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **94**

తాత్పర్యం:- రాజ్యపదవి అనేది ఉండటం వల్ల, అది సర్వాధిపత్యం కావడం వల్ల, రాజు న్యాయవిచారణ, క్షామం మొదలైన ఉపద్రవాల వల్ల బాధితులకు అన్నదానం, శాంతిదాయక హోమాలు నిర్వర్తింపవలసి ఉండటమే ! అలాగే-సర్వం సమాధికారాలున్న ఇతర జాతిపాలకులకూ అశౌచం అంటదు.॥94॥

* డింబాహవహతానాం చ విద్యుతా పార్థివేన చ ।
గో బ్రాహ్మణస్య చైవార్థే యస్య చేచ్ఛతి పార్థివః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **95**

తాత్పర్యం:- రాజు యుద్ధరంగాన లేనప్పుడు మృతిచెందినా, పిడుగుపాటు వల్ల మృతిచెందినా, గో-బ్రాహ్మణ హితార్థం ఏ దుర్మార్గుడిని వధించవలసివచ్చినా...రాజుకు అశౌచం లేదు. ఏ పురోహితులు తాము స్వకార్యం నిమిత్తం పరిశుద్ధి కోరుతున్నారో వారికి వెంటనే అశౌచం తీరిపోతుంది.॥95॥

* సోమాగ్న్యర్కానిలేంద్రాణాం విత్తాప్పత్యోర్యమస్య చ ।
అష్టానాం లోకపాలానాం వపుర్ధారయతే నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **96**

తాత్పర్యం:- అష్టదిక్పాలకులైన అగ్ని, సూర్యుడు, వాయువు, చంద్రుడు, కుబేరుడు, ఇంద్రుడు, యముడు, వరుణుల అంశాలను రాజు పొంది, వాటిని ధరిస్తున్నాడు.॥96॥

* లోకేశాధిష్ఠితో రాజా నాస్యాశౌచం విధీయతే ।
శౌచాశౌచం హి మర్త్యానాం లోకేభ్యః ప్రభవాప్యయౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **97**

తాత్పర్యం:- రాజు లోకేశుల అంశలతో కూడినవాడు కావడం వల్ల అతడికి అశౌచం లేదు. రాజులవల్ల ఇతరులకు శుచి-అశుచి అనేవి కలుగుతున్నాయి. వీటివల్ల కూడ ఉత్పత్తి కారకుడు. అశౌచశూన్యుడు. ॥97॥

* ఉద్యతైరాహవే శస్త్రైః క్షత్రధర్మహతస్య చ ।
సద్యః సంతిష్ఠతే యజ్ఞస్తథాశౌచమితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **98**

తాత్పర్యం:- రాజధర్మయుక్తాలైన యుద్ధం మొదలైనవాటిలో ప్రయోగించబడిన శస్త్రాలచేత వధించబడిన వాడికి అశౌచం వెంటనే తొలగిపోతుంది. అతడికి జ్యోతిష్టోమాది యాగాల వల్ల కలిగేంత పుణ్యం కలుగుతుంది. కాబట్టే రాజులు రణభూమిలో మరణాన్ని ఆశిస్తారు.॥98॥

* విప్రః శుధ్యత్యపః స్పృష్ట్వా క్షత్రియో వాహనాయుధమ్ ।
వైశ్యః ప్రతోదం రశ్మీన్వా యష్టిం శూద్రః కృతక్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **99**

తాత్పర్యం:- అశౌచం ముగింపులో శ్రాద్ధాదికృత్యాలు చేసినవాడై బ్రాహ్మణుడు నీటిని తాకి పరిశుద్ధుడవుతాడు. అదే రాజైతే వాహనాల్ని ఆయుధాల్ని తాకాలి. వైశ్యుడు ములుకోల-పగ్గాలు తాకాలి. శూద్రుడు కర్ర పట్టుకుంటే చాలు!॥99॥

* అసపిండుల ప్రేతశుద్ధి-

* ఏతద్వోఽభిహితం శౌచం సపిణ్డేషు ద్విజోత్తమాః ।
అసపిణ్డేషు సర్వేషు ప్రేతశుద్ధిం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **100**

తాత్పర్యం:- ద్విజ ఋషీశ్వరులారా ! సపిండుల విషయమై శౌచక్రియలు తెలిపి వున్నాను కాబట్టి-ఇప్పుడు అసపిండుల విషయమై శుద్ధి ఏవిధంగా జరపవలసినదీ వివరిస్తాను.॥100॥

* అసపిణ్డం ద్విజం ప్రేతం విప్రో నిర్హృత్య బన్ధువత్ ।
విశుధ్యతి త్రిరాత్రేణ మాతురాప్తాంశ్చ బాన్ధవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **101**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు సపిండుడు గాని విప్రశవాన్ని బంధువు లాగా సంస్కరించి, తల్లితో పాటు జన్మించిన పినతల్లి మొదలైనవారికి సంస్కారం గావించి మూడురోజులలో పరిశుద్ధుడవుతాడు.॥101॥

* యద్యన్నమత్తి తేషాం తు దశాహేనైవ శుధ్యతి ।
అనదన్నన్నమహ్నైవ న చేత్తస్మిన్గృహే వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102**

తాత్పర్యం:- శవసంస్కారానికి వెళ్లినవాడు (బంధువైనా, కాకున్నా), మృతిచెందినవారి ఇంట భుజిస్తే, వారి దాయాదులతో పాటు 10 రాత్రులు అశౌచం పాటించాలి. అలా కాకుండా, ఆ ఇంట ఉండక-అశౌచం పాటించాల్సి వస్తే 3 రోజులు అశౌచం ఉంటుంది.॥102॥

* అనుగమ్యేచ్ఛయా ప్రేతం జ్ఞాతిమజ్ఞాతిమేవ వా ।
స్నాత్వా సచైలః స్పృష్ట్వాగ్నిం ఘృతం ప్రాశ్య విశుధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **103**

తాత్పర్యం:- జ్ఞాతులు గానీ, అజ్ఞాతులుగానీ ఆ ప్రేతంమీద అనురాగం చేత శ్మశానానికి వెళితే, వారు సచేలస్నానం చేసి అగ్నిని తాకి, కొద్దిగ నేతిని ఆచమనం చేస్తే చాలు! పరిశుద్ధులవుతారు.॥103॥

* న విప్రం స్వేషు తిష్ఠత్సు మృతం శూద్రేణ నాయయేత్ ।
అస్వర్గ్యా హ్యాహుతిః సా స్యాచ్ఛూద్రసంస్పర్శదూషితా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104**

తాత్పర్యం:- బంధువులు అందుబాటులో ఉన్నప్పుడు బ్రాహ్మణుని శవం శూద్రులచేత మోయించకూడదు. అది మృతుడికి ఉత్తమలోకాలను కలిగించదు.॥104॥

ప్రక్షిప్తాల పరిశీలన

58 నుంచి 104 వరకు గల శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. విషయ వ్యతిరేకాలు

ప్రస్తుత విషయ ప్రారంభ సంకేతం ఇచ్చే శ్లోకం 57, ముగింపును సూచించేది 110 వది. వీటిలోని "దేహశుద్ధిం.... ప్రవక్ష్యామి", "ఏష శౌచస్య వః ప్రోక్తః శారీరస్య వినిర్ణయంః" అనే సంకేతాల ప్రకారం, "శరీరమూ, దీనికి సంబంధించిన మనసు, బుద్ధి, ఆత్మ మొదలైనవాటి శుద్ధి" చెప్పాలి. [దీనికి బలం చేకూర్చేందుకు 5.57 సమీక్ష చూడండి].

ఈ ఆధారంతో ఈ విషయ సంకేతానికి సంబంధించినవాటినే మౌలికాలుగా భావించాలి. తన సంకేతం ప్రకారమే మనువు 105-106 శ్లోకాలలో ముందుమాట రూపంగా శుద్ధికారక పదార్థాలను చెప్పాడు. తర్వాత 109లో అశుద్ధ శరీరపు **'అద్భిః గాత్రాణి శుధ్యంతి'** అని, శుద్ధి కావడం గురించి చెప్పాడు. క్రోధం, లోభం, అధర్మాచరణ మొదలైనవాటితో

మనిషి మనస్సు, బుద్ధి, ఆత్మ మొదలైన వన్నీ అశుద్ధాలవుతాయి కనుక, వీటికి సంకేతానురూపమైన శరీర సంబంధ శుద్ధి కూడా చెప్పాడు. ఈ విధంగా 105 నుంచి 110 శ్లోకాలు విషయానికి అనురూపంగా ఉన్నాయి. వీటి మధ్య 58 నుంచి 104 వరకు ఉన్న శ్లోకాలలో శరీర శుద్ధత కాకుండా అశౌచం పాటించే సమయం, సపిండులు, సపిండులు కానివారి అశౌచ విధి, సూతకపు మైల, పరదేశాలలో ఉండేవారి మైల మొదలైన విషయ వ్యతిరేకాలైన సంగతులు ఉన్నాయి.

2. అంతర్ వ్యతరేకాలు- ప్రేతశుద్ధి అనే ఆడంబరం మనువుకు వ్యతిరేకం

పైన చెప్పుకున్న విషయ సంకేత శ్లోకాలు ఆధారంగానే **'మైలతో కలిస్తేనే శరీరం మొదలైనవి మైల పడతాయి'** అనేది కూడా మనువు చెప్పాడు. వాటిని శుద్ధి చేసే ఉపాయాలూ చెప్పాడు- **"అద్భిః గాత్రాణి శుధ్యంతి"** (109)- అంటే **"శరీర శుద్ధి జలంతో జరుగుతుంది"** మొదలైనవి. 58 నుంచి 104 శ్లోకాలలో ఉన్నదంతా మనువుకు వ్యతిరేకమే కాకుండా, మునుపు చెప్పినవాటితో దీనికి పొంతన కుదరటం లేదు-

క. 58 నుంచి 60 శ్లోకాలలో సపిండ-అసపిండుల భేదంతో ప్రేత శుద్ధి, మైల పాటించటానికి 1-10 పదిరోజుల వరకు నాలుగు సమయాలను చెప్పి, వాటిని **'ధార్మిక కృత్యం'** గా చెప్పారు. మనువు కేవలం శరీరానికి మైల అన్నాడు. సపిండీకులు కానివారిని సమానులనీ, మైలకు పలుదినాలు అవసరం లేదనీ చెప్పాడు కనుక, పైన చెప్పినవి మనువుకు వ్యతిరేకాలు. శరీరం మైల పడితే స్నానం చేస్తే శుద్ధి కలుగుతుంది. అందుచేత ఈ శ్లోకాలలో చెప్పినవి మను సమ్మతం కావని తెలుస్తోంది. అందుకని ఇవి ప్రక్షిప్తాలు. మిగిలిన శ్లోకాలు వీటి పైనే ఆధారపడ్డాయి కనుక, ఆధారభూత శ్లోకాలు ప్రక్షిప్తాలైతే, ఇవన్నీ కూడా ప్రక్షిప్తాలే !

ఖ. 74 నుంచి 84 వరకు గల శ్లోకాలలో పరదేశంలో ఉండే వారికి శుద్ధి అనటం మనువుకు వ్యతిరేకం. వారికి ఏ విధమైన మైలా అంటనప్పుడు శరీరానికి మైల అని ఎలా చెప్పగలం?

గ. 75-87,104 శ్లోకాలలో శూద్రుణ్ని అస్పృశ్యుడన్నారు. అంటే అపవిత్రుడు అని. మను విలా చెప్పలేదు. శూద్రుణ్ని "శుచిః" అంటే 'పవిత్రుడు' అనే చెప్పాడు [9.335]. కనుక ఈ శ్లోకాల లోనివి మనువుకు వ్యతిరేకాలు.

3. శైలీగత ఆధారాలు

58 నుంచి 104 శ్లోకాలలో - 'సపిండులు, అసపిండులు -వీరి భేదాన్ని నాలుగు రకాలుగా [58-60] అశుద్ధంగా పరిగణించటం' ఉంది. మృతుల సంపర్కం చేత శరీరానికి మైల తగిలితే అశుద్ధి అయితే అది సపిండులకు, కానివారికీ సమానమే అవుతుంది. దాని శుద్ధి నీటితో జరుగుతుంది. దీని కోసం సమయం అవసరం లేదు, వారిద్దరిలో ఆ తేడా కూడా రాదు. మానసికమైన మైల అంటే, మానసిక శోకమైతే, దీనికి వ్యవధిని నిర్ణయించే పని లేదు. ఆ వ్యవధిలో ఆ మైల వీరి నుంచి తొలగిపోదు. అందువల్ల ఈ పరిస్థితే సరైనది కాదు. మనువు చెప్పిన వ్యవస్థలన్నీ సహేతుకంగా ఉంటాయి. ఈ వ్యతిరేకత ఆధారంగా ఈ శ్లోకాలు మను సమ్మతం కానివే.

4. ప్రసంగవ్యతిరేకాలు

ఈ ఆధారంతో ఈ శ్లోకాలను పరిశీలిస్తే అన్నీ ప్రసంగ వ్యతిరేకాలే. 57, 110 శ్లోకాలలో 'శరీరం, శరీర సంబంధ అవయవాల మైలను శుద్ధి చేయటం' అనేది ఉండాలి. వీటి ప్రకారం ఈ ప్రసంగం ఇలా ఉంటుంది-

క. శరీరం, దాని అవయవాల మైలను తొలగించే సంకేతం (57)-

ఖ. తర్వాత 104లో ముందు మాట రూపంలో శుద్ధికారక పదార్థాలు-

గ. శరీరం, దాని అవయవాల శుద్ధి [106-109]. ఇది మామూలు పద్ధతిలో భావగాంభీర్యంతో సంక్షిప్తంగా ఉంది. ఇందులో శరీర సంబంధులైన ఆత్మ, మనసు, బుద్ధి, శీలశుద్ధి చెప్పబడ్డాయి.

ఈ విధంగా మనువు పద్ధతులు, విషయ సంకేతాలు [57-110] ననుసరించి ఒక వరుస క్రమంలో ఉంటాయి. 58 నుంచి 104 శ్లోకాలు ఈ క్రమాన్నే భంగపరచడంతో పాటుగా, శరీరాదుల శుద్ధికి భిన్నంగా అశుద్ధికి (మైలను) 'ధార్మిక కృత్యం'గా చెప్పే ఒక ప్రత్యేకమైన పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకమైన వ్యవస్థను నిర్దేశించాయి. శుద్ధిని చెప్పటానికి ముందు శుద్ధికారక పదార్థాలను చెప్పటమే విషయోచితంగా ఉంటుంది. ఈ ఆధారంతో 57 తర్వాత 104వ శ్లోకం విషయానికి తగిన సంబద్ధత కలిగి ఉంటుంది. మధ్యలోని మిగిలిన శ్లోకాలన్నీ ప్రసంగ వ్యతిరేకాలు లేదా ప్రసంగ భోజకాలు కావటం చేత ప్రక్షిప్తాలు.

105 నుండి 107వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

దేహధారుల శుద్ధికారక పదార్థాల గణన-

జ్ఞానం తపోఽగ్నిరాహారో మృన్మనో వార్యుపాంజనమ్ । మూలశ్లోక సం. **14**
వాయుః కర్మార్కకాలౌ చ శుద్ధేః కర్తృణి దేహినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **105**

టీక:- జ్ఞానం తపః అగ్ని+ఆహారః మృత్ మనః వారి + ఉపానమ్ వాయుః కర్మ+ అర్కకాలౌ = జ్ఞానం, తపస్సు, అగ్ని, మృత్తు (మట్టి), మనస్సు, ఆలోచన, జలం, పూత (లేపనం), వాయువు, కర్మ, సూర్యుడు, కాలం, దేహినామ్ శుద్ధేః కర్తృణి = ఇవి ప్రాణులకు శుద్ధిని కలిగించే పదార్థాలు.

తాత్పర్యం:- జ్ఞానం, తపస్సు, అగ్ని, ఆచారం, మట్టి, మనస్సు, నీరు, పైపూతపూయడం, గాలి, కర్మ, కాలం,సూర్యుడు ఇవన్నీ ప్రాణులకు శుద్ధి కలిగించగలవు. ॥105॥

అర్థశౌచమే సర్వోత్తమశుద్ధి ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేషామేవ శౌచానామర్థశౌచం పరం స్మృతమ్ । మూలశ్లోక సం. **15**
యోఽర్థే శుచిర్హి స శుచిర్న మృద్వారిశుచిః శుచిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **106**

టీక:- అర్థశౌచం సర్వేషామ్+ఏవ శౌచానామ్ పరం స్మృతమ్ = ధర్మానుగుణంగా పదార్థాలను సంపాదించడమే. అన్ని పవిత్రతల కంటే ఉత్తమ పవిత్రత (శుద్ధి), యః+అర్థే శుచిః సః శుచిః = ఎవడు అన్యాయంగా ఏ పదార్థాన్ని సంపాదించడో అతడే పవిత్రుడు. కానీ మృద్-వారి-శుచిః న శుచిః = జలం, మన్ను మొ॥ వాటితో కలిగే పవిత్రత ధర్మంతో సమానంగా ఉత్తమమైన పవిత్రత కాదు.

ఋషి దయానందభాష్యం:- శౌచములన్నిటిలో ద్రవ్యశౌచం మేలయినది. అంటే-అన్యాయంచేత ఒకరిసొమ్మును తీసుకోకుండా ఉండటం. ఎవ రీ అర్థశౌచం పాటిస్తారో వారే పరిశుద్ధులు. నీటిచేత ఇతరశుద్ధులచేత మనిషి ఎంత శుచి పొందినా, అర్థశౌచం లేనప్పుడతడు అది అశుచియే. (సం.వి.గృ.).॥106॥

ధర్మాచరణం వల్ల వివిధ శీలదోషాలకు శుద్ధి ఇది మనుకృతం-ప్రామాణికం

క్షాన్త్యా శుద్ధ్యన్తి విద్వాంసో దానేనాకార్యకారిణః । మూలశ్లోక సం. **16**
ప్రచ్ఛన్నపాపా జప్యేన తపసా వేదవిత్తమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **107**

టీక:- విద్వాంసః క్షాన్త్యా = క్షమ ద్వారా విద్వాంసులు, అకార్యకారిణః దానేన = సత్సంగం వల్ల, విద్యాది శుభగుణాల దానం వల్ల దుష్టకర్మలు చేసినవారు, ప్రచ్ఛన్న పాపా జప్యేన = జపాదులచేత గుప్తపాపకర్తలు, తపసా వేద విత్తమాః = బ్రహ్మచర్యం, సత్యభాషణాది తపస్సు ద్వారా వేదవిదులైన ఉత్తమ విద్వాంసులు, శుద్ధ్యన్తి = పరిశుద్ధులవుతారు.

ఋషి దయానందభాష్యం:- విద్వాంసులు తాము చేసే కార్యాలచేత, క్షమాగుణాలతో, సత్సంగం వల్ల విద్యాది శుభగుణాల దానాలవల్ల, రహస్యపాపాలు చేసేవారు మంత్రజపంచేత, వేదవేత్తలలో ఉత్తములు తపస్సుచేత పరిశుద్ధులవుతారు. (సం.వి.గృ.ప్ర.).॥107॥

వివరణ

దానం వల్ల శుద్ధి "సర్వేషామేవ దానానాం బ్రహ్మ దానం విశిష్యతే" 4.233 వేదాది శాస్త్ర జ్ఞానదానం సర్వదానాలలో శ్రేష్ఠం. ఇందుకు 1.226,227 చూడండి. శుద్ధమవడంలో భావమేమిటి? పాపభావన లేకపోవడమేగాని, పాపఫలితం క్షీణించడం కాదు. 11-227లో వివరణను చూడగలరు.

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *మృత్తోయైశ్శుద్ధ్యతే శోధ్యం నదీ వేగేన శుద్ధ్యతి ।*
రజసా స్త్రీ మనోదుష్టా సన్న్యాసేన ద్విజోత్తమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**108**

తాత్పర్యం:- తోమదగిన పాత్రలు మట్టిచేత, నీటిచేత పరిశుద్ధమవుతాయి. పారుతూ ఉండడం చేత నది శుద్ధమైనది. పరపురుషుణ్ణి వాంఛించడం, అతడితో రమించడం వంటివి చేసే స్త్రీ రజోదర్శనం (బహిష్ఠవడం వల్ల) పరిశుద్ధురాలవుతుంది. అన్నిటికంటే మేలైన సన్న్యాసం చేత బ్రాహ్మణోత్తముడు పరిశుద్ధత పొందుతున్నాడు.॥108॥

ప్రక్షిప్త పరిశీలన:-

108వ శ్లోకం క్రింది ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తము.

1. **శైలీగత-విషయగత ఆధారము:-** ఈ 108వ శ్లోక ప్రక్షిప్త వివరాలను ఎక్కువగా తెలుసుకొనుటకు 58 నుండి 104 శ్లోకాలకు గల సమీక్షను చూడండి. మనస్సుతో దూషితమైన స్త్రీ రజస్వలయై ఎలా శుద్ధి అవుతుంది? ఇందులో ఎలాంటి కార్యకారణ సంబంధం లేదు. ఇది అయుక్తియుక్తశైలి.

2. **అంతర్విరోధము:-** తరువాతి శ్లోకం 109లో 'మనస్సు యొక్క శుద్ధి సత్యపాలనతో జరుగుతుంది' అని చెప్పడంలో ఈ శ్లోక కథనం దీనికి విరుద్ధమని తెలుస్తున్నది.

109-112 శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

శరీర-మనో-ఆత్మ-బుద్ధులశుద్ధి-

అద్భిర్గాత్రాణి శుద్ధ్యన్తి మనః సత్యేన శుద్ధ్యతి । మూలశ్లోక సం.**17**
విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్జ్ఞానేన శుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **109**

టీక:- **అద్భిః గాత్రాణి శుద్ధ్యన్తి** = నీటి ద్వారా శరీరమందున్న బాహ్యమైన అవయవాలు శుద్ధములవుతాయి. **సత్యేన మనః**= సత్యాచరణం వల్ల మనస్సు పవిత్రమవుతుంది. **విద్యాతపోభ్యాం భూతాత్మా** = విద్య వల్ల, తపస్సు అంటే అన్ని విధాలైన కష్టాలను సహించి, ధర్మాన్ని అనుష్ఠించినందు వల్ల, జీవాత్మ, **జ్ఞానేన బుద్ధిః శుద్ధ్యతి** = జ్ఞానం-పృథ్వీ మొ॥కొని పరమేశ్వరుడి పర్యంతం సర్వ పదార్థాల వివేకం వల్ల, దృఢనిశ్చయం వల్ల బుద్ధి పవిత్రమవుతుంది.

ఋషి దయానందభాష్యం:- నీటి ద్వారా శరీర బాహ్యావయవాలు పవిత్రమవుతాయి. కానీ ఆత్మ-మనస్సులు పవిత్రములు కావు. మనస్సు సత్యాన్ని నమ్మడం ద్వారా, సత్యభాషణం, సత్య కర్మలననుసరించడం ద్వారా పవిత్రమవుతాయి.

విద్య-యోగాభ్యాసం, ధర్మాచరణం ద్వారా జీవాత్మ పవిత్రమవుతుంది. ఇక బుద్ధిమాత్రం జ్ఞానం ద్వారా పవిత్రమవుతుంది. జల, మృత్తికాదుల ద్వారా మాత్రం కాదు (స.వి.గృ; స.ప్ర.3వ. సము.). ॥109॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏష శౌచస్య వః ప్రోక్తః శరీరస్య వినిర్ణయః । మూలశ్లోక సం.**18**
నానావిధానాం ద్రవ్యాణాం శుద్ధేశ్శృణుత నిర్ణయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**110**

టీక:- ఏషః = ఈ, శరీరస్య శౌచస్య వినిర్ణయః = శరీరసంబంధమైన అంటే శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మల శుద్ధి నిర్ణయం, వః ప్రోక్తః = మీకు చెప్పబడింది. ఇప్పుడు, నానా విధానాం ద్రవ్యాణాం శుద్ధేః **నిర్ణయమ్ శృణుత** = విభిన్న పదార్థాలకు సంబంధించిన శుద్ధి నిర్ణయాన్ని వినండి.

తాత్పర్యం:- "ఇంతవరకు రకరకాల శౌచములు (శుద్ధి క్రియలు) వివరంగా మీకు చెప్పబడ్డాయి. ఇప్పుడు నానావిధ లోహాలు-ద్రవ్యాలు వస్తువులు, ఏవిధంగా పరిశుద్ధతను పొందేదీ క్రమానుసారంగా వినిపిస్తాను-ఆలకించండి".॥110॥

ద్రవ్యశుద్ధి విషయం 111 నుండి 146 వరకు

పాత్రల శుద్ధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

తైజసానాం మణీనాం చ సర్వస్యాశ్మమయస్య చ । మూలశ్లోక సం.**19**
భస్మనాద్భిర్మృదా చైవ శుద్ధిరుక్తా మనీషిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**111**

టీక:- **తైజసానాం** = తైజసం అంటే మెరిసే బంగారం మొదలైన వాటిని, **చ** = మరియు, **మణీనాం** = మణులు బహు మూల్యం గల రత్నాలు మొ॥ వాటికి, **సర్వస్య అశ్మమయస్య చ** = అన్ని రకాలైన రాళ్ళతో నిర్మించిన పాత్రలకు, **శుద్ధిః** = శుద్ధి, **మనీషిభిః** = విద్వాంసుల చేత, **భస్మన+అద్భిః + చ మృదా ఏవ ఉక్తా** = భస్మం, జలం, మరియు మట్టి ద్వారా చేయబడునని చెప్పబడింది.

తాత్పర్యం:- బంగారం, పచ్చలు, రత్నాలు, రాతిరూపాన ఉండే విలువైన రాళ్లన్నిటికీ నీటిచేత, మట్టిచేత, బూడిదచేత శుద్ధి కలుగుతుంది. ఎంగిలి అయినా నేతిజిడ్డు ఉన్నా బూడిదతో తోమి శుద్ధి చేయాలి. కొన్నిటిని మట్టితో తోమాలి. నీటితో పరిశుభ్రంగా కడగాలని పెద్దలు చెప్పారు.॥111॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిర్లేపం కాఞ్చనం భాణ్డమద్భిరేవ విశుధ్యతి । మూలశ్లోక సం.**20**
అబ్జమశ్మమయం చైవ రాజతం చానుపస్కృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**112**

టీక:- **నిర్లేపం కాఞ్చనం** = జిడ్డులేని బంగారు మొదలగు పాత్రలు, **అబ్జమ్** = నీటిలో పుట్టిన ముత్యం, శంఖం మొ॥ వాటితో నిర్మింపబడిన పాత్రలు, **చ** = మరియు, **అశ్మమయం** = విలువైన రాళ్ళతో తయారైన పాత్రలు, **అనుపస్కృతం రాజతం** = చిత్రాలను చెక్కని రజత పాత్రలు (గీతలులేని), **అద్భిః+ఏవ విశుధ్యతి** = కేవలం నీటి ద్వారానే శుద్ధమవుతాయి.

తాత్పర్యం:- జిడ్డు అంటని బంగారు పాత్రలు, నీటపుట్టిన శంఖం-ముత్యం మొదలైనవి, నగిషీలు చెక్కడపు పనితనం లేని వెండిపాత్రలు నీటితో కడిగి శుద్ధి చేస్తే చాలు ! బంగారం-వెండి అగ్ని -నీరు సంయోగం వల్ల ప్రకాశిస్తాయి.॥112॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *అపామగ్నేశ్చ సంయోగాద్ధేమ రూప్యం చ నిర్బభౌ ।*
తస్మాత్తయోస్స్వయోన్యైవ నిర్ణేకో గుణవత్తరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***113***

తాత్పర్యం:- అగ్నిజలముల సంయోగంవల్ల వెండి, బంగారం ప్రకాశిస్తాయి. కనుక ఆ రెంటినీ వాటిలోనే పరిశుద్ధం చేయటం మిక్కిలి శ్రేష్ఠం.॥113॥

వివరణ:- 113వ శ్లోకం క్రింది ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తము.

1. **అంతర్ వ్యతిరేకం:-** స్వర్ణాది వస్తువుల శుద్ధి 111వ శ్లోకంలోనే చెప్పబడింది. మరల వేరే విధంగా చెప్పడం అనవసరం, విరుద్ధం.

2. **శైలీగత ఆధారం:-** ఈ శ్లోకపు వర్ణన శైలి నిరాధారమూ, అయుక్తియుక్తము. ఇక్కడ చెప్పిన కారణానికి ఎలాంటి సంబంధమూ లేదు. ఎందుకనగా అన్ని ధాతువులు జలాగ్నుల ద్వారానే శుద్ధి అవుతాయి. దీన్ని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు.

114 నుండి 124వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

తామ్రాయః కాంస్య రైత్యానాం త్రపుణస్సీసకస్య చ । మూలశ్లోక సం. **21**
శౌచం యథార్హం కర్తవ్యం క్షారామ్లోదక వారిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **114**

టీక:- తామ్ర+అయః-కాంస్య-రైత్యానాం త్రపుణః చ సీసకస్య శౌచం = రాగి, ఇనుము, కంచు, ఇత్తడి, లక్క సీసంతో చేసిన పాత్రల శుద్ధి, యథార్హం = అవసరాన్ని బట్టి, క్షార+ఆమ్ల+ఉదక-వారిభిః =బూడిద, రాతిఉప్పు, పులుపు కలిసిన నీళ్ళతో శుద్ధి చేయాలి.

తాత్పర్యం:- ఇనుము పాత్రలు నీటిచేత, కంచుపాత్రలు బూడిదచేత, ఇత్తడి-రాగి లాంటివి పులుపు రాతి ఉప్పు చేత, మట్టిపాత్రలు తిరిగి కాల్చడం చేత (అగ్నిచే) పరిశుద్ధమవుతాయి.॥114॥

ఇది మనుకృతం. ప్రామాణికం

ద్రవాణాం చైవ సర్వేషాం శుద్ధిరుత్పవనం స్మృతమ్ । మూలశ్లోక సం. **22**
ప్రోక్షణం సంహతానాం చ దారవాణాం చ తక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **115**

టీక:- సర్వేషాం ద్రవాణాం = ఘృతం, తైలం మొ॥ ద్రవపదార్థాలకు, శుద్ధిః = శుద్ధి, ఉత్పవనం = వడపోత వల్ల, చ = మరియు, సంహతానాం, ప్రోక్షణం = గడ్డ కట్టిన ద్రవాలను వేడి చేయడం వల్ల, చ = మరియు, దారవాణాం తక్షణమ్ = చెక్క పాత్రలకు శుద్ధి చెక్కడం ద్వారా స్మృతమ్ = అని అంగీకరించబడింది.

తాత్పర్యం:- నెయ్యి, నూనె మొ॥ ద్రవపదార్థాలు వడపోతవల్ల, గడ్డకట్టిన ద్రవాలు వేడి చేయడం వల్ల శుద్ధి చేయవచ్చు. కొయ్యసామాగ్రి అపరిశుద్ధమైనపుడు అక్కడికి ఆ భాగాన్ని చిత్రిక పట్టించడం (చెక్కించడం) ద్వారా శుద్ధిచేయాలి.॥115॥

ఇది మనుకృతం. ప్రామాణికం

మార్జనం యజ్ఞపాత్రాణాం పాణినా యజ్ఞకర్మణి । మూలశ్లోక సం. **23**
చమసానాం గ్రహాణాం చ శుద్ధిః ప్రక్షాలనేన తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **116**

టీక:- యజ్ఞకర్మణి = యజ్ఞం చేసే సమయంలో, ఉపయోగించిన, **యజ్ఞ పాత్రాణాం** = యజ్ఞపాత్రలైన, **చమసానాం చ గ్రహాణాం శుద్ధిః** = చమ్చాలను, గిన్నెలను, **పాణినా మార్జనం తు ప్రక్షాలనేన** = చేతితో తోమడం, తుడవడం, నీటితో కడగడం వల్ల శుద్ధమవుతాయి.

తాత్పర్యం:- చమషము అనే యజ్ఞపాత్రలను, గ్రహణపాత్రలను, మిగిలిన యజ్ఞపాత్ర సామాగ్రిని మొదట చేతితో శుభ్రంగా తుడిచి, ఆ తరువాత నీటితో కడగాలి.॥116॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చరూణాం స్రుక్స్రువాణాం చ శుద్ధిరుష్ణేన వారిణా । మూలశ్లోక సం.**24**
స్ఫ్యశూర్పశకటానాం చ ముసలోలూఖలస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**117**

టీక:- చరూణాం = యజ్ఞం కోసం వంటచేసే పాత్రలు చరుస్థాలీ మొదలయినవి, **స్రుక్-స్రువాణాం** = స్రుక్, స్రువ నామకపాత్రలు, **స్ఫ్య-శూర్ప-శకటానాం** = స్ఫ్య = కత్తి ఆకారంలో ఉండే ఖదిర వృక్షం ద్వారా చేయబడిన ఖడ్గం, **శూర్ప** = చేట, **శకట**- యజ్ఞీయ పదార్థాలను చేరవేసిన బండి, **చ** = మరియు, **ముసల+ఉలూఖలస్య చ** = రోకలి, రోలు పదార్థాల, **శుద్ధిః** = శుద్ధి, **ఉష్ణేన వారిణా** = వేడినీళ్ళతో కడగాలి.

తాత్పర్యం:- యజ్ఞంవేళ ఉపయోగించే చరుస్థాలి, స్రుక్-స్రువములు మొదలయిన నామక పాత్రలు జిడ్డుగా ఉన్నప్పుడు సలసల కాగే మంచినీటితో కడిగి శుభ్రం చేయాలి. ఇలాగే యజ్ఞార్థం ఉపయోగించే యూపస్తంభం, చేట, బండి, రోలు-రోకలి లాంటి వస్తువులన్నీ నీటిచేతనే శుద్ధి చేయాలి.॥117॥

వివరణ

యజ్ఞపాత్రల పరిచయం-వివరణ

మను మహర్షి ఇక్కడ సంకేతరూపంగా కొన్ని పాత్రలనే పేర్కొన్నాడు. బ్రాహ్మణ గ్రంథాలలోనూ, శ్రౌత సూత్ర గ్రంథాలలోనూ అనేక యజ్ఞీయ సాధనాల, పాత్రల వివరాల గురించి కనిపిస్తుంది. శ్లోకంలో వివరించిన పాత్రల సామాన్య పరిచయం.

1. స్రుక్-స్రువములు అనేక రకాలుగా ఉన్నాయి. ముఖ్యంగా నాలుగు స్రుక్కులున్నాయి. జుహూః, ఉపభృత్, ధ్రువా, అగ్నిహోత్రహవనీ.

2. స్రువ వైకజ్కత స్రువం-ఖాదిర స్రువం.

3. స్ఫ్య = ఖాదిర వృక్షపు చెక్కతో తయారైన 22 అంగుళాల పొడవు ఉన్న ఖడ్గం.

4. శూర్పం = పదార్థాలను శుభ్రం చేయడానికి ఉపయోగించే చేట.

5. శకటం = యజ్ఞ సామాన్లను మోసుకొచ్చే బండి.

6. ముసలం, ఉలూఖలములు, రోలు సాధారణంగా పలాశ (మోదుగ) చెక్కతో చేసిన మనిషి బొడ్డు వరకు ఎత్తుండేది.

ముసలం-రోకలి, తల వరకు ఎత్తుండేది. ఖదిర వృక్షపు చెక్కతో తయారైనది.

యజ్ఞోపయోగాలైన ఇతర యజ్ఞపాత్రలు.

7. ఆజ్యస్థాలీ 8. పురోడాశ పాత్ర 9. ప్రణీత 10. శమ్యా
11. శృతావదానమ్ 12. ఉపవేషః 13. మకరాకార కూర్చః 14 దృషత్
15. ఉపలః 16. షదవత్తమ్ 17. అధ్రిః 18. అధరారణిః

19. ఉత్తరారణిః 20. చాత్రమ్ 21 ప్రమన్థః 22.నేత్రమ్
అథవా రజ్జుః 23. ఓవిలీ 24. ఇడాపాత్రీ 25. హవిర్ధానపాత్రీ 26.యజమాన పాత్రీ
27. పత్రీపాత్రీ 28. అంతర్ధాన కటః 29. ప్రాశిత్రహరణమ్ 30. కృష్ణాజినమ్
31. యజమానాసనమ్ 32. పత్న్యాసనమ్ 33. బ్రహ్మాసనమ్ 34. హోత్రాసనమ్
35. చమస 36. గ్రహ-ఆది-మొ॥ వస్తువులు.

అన్య వస్త్రాది పదార్థాల శుద్ధి- ఇది మనుకృతం. ప్రామాణికం

అద్భిస్తు ప్రోక్షణం శౌచం బహూనాం ధాన్యవాససామ్ । మూలశ్లోక **సం.25**
ప్రక్షాలనేన త్వల్పానామద్భిః శౌచం విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**118**

టీక:- బహూనాం ధాన్యవాససామ్ శౌచం అద్భిః ప్రోక్షణం = అనేకరకాలైన ధాన్యం ఎక్కువగా ఉన్నప్పుడు, వస్త్రాలు అధికంగా ఉన్నప్పుడు, నీళ్ళు చిలకరించినట్లయితే పరిశుద్ధి కలుగుతుంది. **తు**= కాని; **అల్పానాం** = తక్కువగా ఉన్న ధాన్యవస్త్రాల; **శౌచం** = శుద్ధి, **అద్భిః ప్రక్షాళనేన విధీయతే** = తక్కువగా ఉన్నచోటయితే నీళ్ళలో ముంచినా శుద్ధి కలుగుతుంది.

తాత్పర్యం:- తాను మోయలేని బరువైన ధాన్యం మూటలు, బట్టలమూటలు మొదలయిన వాటిని నీళ్ళను చిలకరిస్తే అవి పరిశుద్ధమవుతాయి. తేలికగా ఉంటే నీటిలో ముంచి తీయవచ్చు.॥118॥

ఇది మనుకృతం.ప్రామాణికం

చైలవచ్చర్మణాం శుద్ధిర్వైదలానాం తథైవ చ । మూలశ్లోక **సం.26**
శాకమూలఫలానాం చ ధాన్యవచ్ఛుద్ధిరిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**119**

టీక:- చర్మణాం శుద్ధిః + చైలవత్ = చర్మనిర్మిత పాత్రల శుద్ధి వస్త్రాలతో సమానంగా చేయాలి. **వైదలానాం తథైవ** = బొంగుతో అల్లిన పాత్రల శుద్ధి కూడా వస్త్రాలకు చేసిన విధంగానే, **శాకమూల ఫలానాం శుద్ధిః ధాన్యవత్ ఇష్యతే** = శాకములు, కందమూలాలు మరియు పండ్లు-ఫలాల శుద్ధి కూడా ధాన్యానికి చేసిన విధంగానే చేయాలి. (5.25).

తాత్పర్యం:- కృష్ణాజినము (జింకచర్మం), పులితోలు మొదలైన విశిష్ట జంతుచర్మాలు, వెదురుతో అల్లిన తడికలు వీటిని నీటితో తడిపి శుద్ధి చేస్తే చాలు! శాకములు, దుంపలు, పండ్లు మొదలయినవి, ధాన్యం గింజదినుసులు కూడా జలం సంప్రోక్షించి శుద్ధిచేస్తే సరిపోతుంది.॥119॥

ఇది మనుకృతం. ప్రామాణికం

కౌశేయావికయోరూషైః కుతపానామరిష్టకైః । మూలశ్లోక సం.**27**
శ్రీఫలైరంశుపట్టానాం క్షౌమాణాం గౌరసర్షపైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**120**

టీక:- కౌశేయ+ఆవికయోః = పట్టు వస్త్రాలకూ, గొర్రె బొచ్చుతో నేసిన కంబళ్ళకూ, **ఊషైః** = క్షారమిశ్రిత పదార్థాలతోను, చవిటిమట్టితోను, **కుతపానాం** = కంబళ్ళను, **అరిష్టకైః** = కుంకుళ్ళ ద్వారా, **అంశు పట్టానాం శ్రీ ఫలైః** = నార వస్త్రాలను మారేడు కాయలతోను, **క్షౌమాణాం గౌరసర్షపైః** = పట్టును తెల్ల ఆవాలతోనూ శుద్ధి జరుగుతుంది.

తాత్పర్యం:- పట్టుపురుగుల దారంతో నేయబడిన పట్టుబట్టలనూ, గొర్రెబొచ్చు లాంటివాటితో నేయబడిన కంబళ్లనూ చవిటిమట్టితో శుభ్రంచేయాలి. నేపాళదేశపు కంబళ్లు వేపవిత్తులచేత, కాశ్మీర దేశపు శాలువలు మారేడు ఫలాలచేత, వెలిపట్టును తెల్ల ఆవాలచేత శుద్ధి చేయాలి.॥120॥

ఇది మనుకృతం. ప్రామాణికం

క్షౌమవచ్ఛంఖశృఙ్గాణామస్థిదంతమయస్య చ । మూలశ్లోక సం.**28**
శుద్ధిర్విజానతా కార్యా గోమూత్రేణోదకేన వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**121**

టీక:- **శంఖ -శృఙ్గాణాం అస్థి దంతమయస్య శుద్ధిః** = శంఖం, శృంగములు, ఎముకలు, దంతాలు వీటి వల్ల తయారైన పదార్థాల శుద్ధి, **విజానతా** = బుద్ధిమంతుడైన వ్యక్తి, **క్షౌమవత్** = పట్టులాగా, **వా** = లేదా, **గోమూత్రేణ+ఉదకేన** = గోమూత్రంతో గానీ నీళ్ళతో గానీ, **కార్యా** = శుద్ధి చేయాలి.

తాత్పర్యం:- శంఖం, దంతం, జింకకొమ్ము మొదలయినవాటిని కూడా వెలిపట్టులాగా తెల్ల ఆవాల పొడితో గాని-గోమూత్రంతో గాని శుభ్రంచేసి, ఆపైన నీటితో బాగా కడగాలి.॥121॥

ఇది మనుకృతం. ప్రామాణికం

ప్రోక్షణాత్తృణకాష్ఠం చ పలాలం చైవ శుధ్యతి । మూలశ్లోక సం.**29**
మార్జనో పాంజనై ర్వేశ్మ పునః పాకేన మృణ్మయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**122**

టీక:- **తృణ-కాష్ఠం చ పలాలం** = గడ్డి, కట్టెలు, తృణధాన్య పదార్థాలను, **ప్రోక్షణాత్ శుధ్యతి** = నీటిలో తడిపి తుడిచినట్లయితే శుద్ధమవుతాయి. **వేశ్మ** = గృహం, **మార్జన+ఉపాంజనైః**= ఊడవడం, తుడవడం లేదా అలకడం వల్ల, **మృణ్మయమ్ పునః పాకేన** = మట్టిపాత్రలు లేదా పదార్థం మళ్ళీ నిప్పు మీద కాల్చినట్లయితే శుద్ధమవుతుంది.

తాత్పర్యం:- గడ్డి-వంటచెరకు, కర్రలు మొదలయినవి జలసంప్రోక్షణ చేత పరిశుద్ధమవుతాయి. నీటితో కడగడం-సున్నం పూయడం-అలకడం మొదలయిన వాటివల్ల ఇళ్లు పరిశుద్ధ మవుతాయి. ॥122॥

ఇది మనుకృతం.ప్రామాణికం

మద్యైర్మూత్రైః పురీషైర్వా ష్ఠీవనైః పూయశోణితైః । మూలశ్లోక సం.**30**
సంస్పృష్టం నైవ శుధ్యేత పునఃపాకేన మృణ్మయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**123**

టీక:- **మద్యైః మూత్రైః పురీషైః ష్ఠీవనైః పూయశోణితైః** = మద్యం, మూత్రం, మలం, ఉమ్మి, చీము, నెత్తురు వీటి వల్ల, **సంస్పృష్టం మృణ్మయమ్** = తడవబడిన మట్టితో చేసిన పాత్రలు, **పునః పాకేన నైవ శుధ్యేత** = మళ్ళీ మళ్ళీ కాల్చినా శుద్ధం కావు.

తాత్పర్యం:- మద్యం, మూత్రం, మలం, ఉమ్మువల్ల పడే తుంపర, చీము, రక్తం వంటి వాటివల్ల అపరిశుద్ధిమైనవి ఎంతకాల్చినా వాటిదోషం పోదు కాబట్టి పారవేయడమొక్కటే మార్గం. ॥123॥

సంమార్జనోపాంజనేన సేకేనోల్లేఖనేన చ । మూలశ్లోక సం.**31**
గవాం చ పరివాసేన భూమిశ్శుధ్యతి పంచభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**124**

టీక:- **సంమార్జన +ఉపాంజనేన సేకేన+ఉల్లేఖనేన చ గవాం పరివాసేన పంచభిః** = ఊడ్వటం వల్ల, అలకడం వల్ల, నీళ్ళు చల్లడం వల్ల, పేరుకుపోయిన దాన్ని తవ్వితీసివేయడం వల్ల, ఆవులను కట్టివేయడం వల్ల ఈ ఐదు పనుల ద్వారా, **భూమిః శుధ్యతి** = భూమి శుద్ధమవుతుంది.

తాత్పర్యం:- చీపురుతో ఊడ్వడం, గోమయం చేత అలకడం, గోమూత్రం చల్లడం, పైపొరవరకు మట్టిని తవ్వి తీసివేయడం, ఒక రాత్రంతా పశువులను అక్కడ కట్టేసి ఉంచడం అనే ఈ 5 పనులవల్ల భూశుద్ధి జరుగుతుంది.॥124॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *పక్షిజగ్ధం గవాఘ్రాతమవధూతమవక్షుతమ్ ।*
దూషితం కేశకీటైశ్చ మృత్ప్రక్షేపేణ శుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***125***

తాత్పర్యం:- పక్షులు ఎంగిలి చేసినవి, పశువులచే వాసన చూడబడినవి, కాలితో తన్నబడినవి, తుమ్ము, ఉమ్ము తుంపర్లు విస్తారంగా పడినవి, వెంట్రుకలు-పురుగులు కనబడినవి అయిన కొద్దిపాటి అన్నం కూడా మట్టిని తప్పి అందులో పారబోయాలి.॥125॥

ప్రక్షిప్త పరిశీలన:- ఈ 125వ శ్లోకం క్రింది ప్రమాణాల ద్వారా ప్రక్షిప్తము.

1. విషయ వ్యతిరేకము:- 110 మరియు 146 శ్లోకాల సంకేతానుసారం ప్రస్తుత విషయం 'దైనిక ఉపయోగాలైన పాత్రలు, వస్త్రాలు మొదలగు వాటి శుద్ధి. కాకుండా ఇతర వస్తువుల శుద్ధి చెప్పడం విషయ విరుద్ధం.

2. ప్రసంగ వ్యతిరేకము:- 124, 126 శ్లోకాల పూర్వాపర ప్రసంగము బాహ్య ఉపయోగపదార్థాల శుద్ధి గురించి చెప్పబడింది. భక్ష్య పదార్థాల గురించి కాదు. కావున ఈ శ్లోకం ప్రసంగ విరుద్ధంగా ఉంది.

3. శైలీగత ఆధారం:- భక్ష్య పదార్థాలపై మట్టి వేసినంత మాత్రాన అవి శుద్ధి కావు. ఈ ప్రకారంగా దీని శైలి నిరాధారము, అయుక్తియుక్తము.

ఇది మనుకృతం-ప్రామాణికం

యావన్నాపైత్య మేధ్యాక్తాద్గంధో లేపశ్చ తత్కృతః । మూలశ్లోక సం. **32**
తావన్మృద్వారి చాదేయం సర్వాసు ద్రవ్యశుద్ధిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **126**

టీక:- యావత్ = ఎంత వరకు, **అమేధ్య + అక్తాత్** = అశుద్ధ వస్తువు వల్ల, **తత్కృతః గంధః లేపః** = ఆ అశుద్ధ వస్తువు దుర్వాసన అంటుకున్న అశుద్ధి, **న అపైతి** = దూరం కాదో, **సర్వాసు ద్రవ్యశుద్ధిషు** = మట్టితో గాని లేదా నీటితో గాని కడగబడే సర్వ వస్తువుల శుద్ధి కోసం, అంతవరకు, **మృత్+వారి అదేయం** = మట్టి నీరుపోసి కడుగుతూనే ఉండాలి.

తాత్పర్యం:- కొన్ని వస్తువులకు అమేధ్యం తగిలి ఎంతకూ ఆ కంపు పోనప్పుడు, మట్టి-నీరు కలిపి బురద మాదిరిగా పులిమి బాగా తోమాలి. రాపిడివల్ల వాసన పోయిందని రూఢమైన తరువాత, తిరిగి నీటిని ధారగా పోస్తూ బాగా కడిగి, నీడన ఆరబెట్టాలి.॥126॥

127 నుండి 145వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* శుద్ధ, అశుద్ధ వస్తువుల గణన-

* *త్రీణి దేవాః పవిత్రాణి బ్రాహ్మణానామకల్పయన్ ।*
అదృష్టమద్భిర్నిర్ణిక్తం యచ్చ వాచా ప్రశస్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***127***

తాత్పర్యం:- దోషాలేవీ ఉన్నట్లుగా చెప్పబడని పదార్థాలు; నీటిచేత పరిశుభ్రపరచిన పదార్థాలు; 'ఇది చాలా శుద్ధి అయినది' అని విప్రుడి చేత ధృవ పరచబడిన పదార్థాలు ఈ మూడురకాలు పరిశుద్ధమైనవే అని దేవతలూ అంగీకరిస్తారు.॥127॥

* *అపఃశ్శుద్ధా భూమిగతా వైతృష్ణ్యం యాసు గోర్భవేత్ ।*
అవ్యాప్తా శ్చేదమేధ్యేన గన్ధవర్ణరసాన్వితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***128***

తాత్పర్యం:- వర్షం కురియడం వల్ల నేలపై పడినవి; పశువులు దప్పిక తీర్చుకుని వెళ్లి పోయాక ఆ నీరు; అమేధ్యం గానట్టి రస-వర్ణ-గంధాదులతో కూడిన జలాలు పరిశుద్ధములే! ॥128॥

*   నిత్యం శుద్ధః కారుహస్తః పణ్యే యచ్చ ప్రసారితమ్ ।
బ్రహ్మచారిగతం భైక్ష్యం నిత్యం మేధ్యమితి స్థితిః ॥   ప్రక్షిప్త శ్లోక సం.***129***

తాత్పర్యం:- దేవతల పూజనిమిత్తం-పువ్వులు కట్టేవాడి చేతిలో ఉండే పత్రి, పూలు మొదలయినవి, అన్నం మినహా అంగడిలో విక్రయం నిమిత్తం ఉంచే ధాన్యశాకాదులు, బ్రహ్మచారి చేతిలో ఉన్న భిక్షాన్నం ఇవి నిత్యం పరిశుద్ధమైనవి.॥129॥

*   నిత్యమాస్యం శుచి స్త్రీణాం శకునిః ఫలపాతనే ।
ప్రస్రవే చ శుచిర్వత్సః శ్వా మృగగ్రహణే శుచిః ॥   ప్రక్షిప్త శ్లోక సం.***130***

తాత్పర్యం:- స్త్రీ యొక్క వదనం నిత్యం పరిశుద్ధం, శుభం, పాలు పితికేటప్పుడు, దూడ పాలుతాగుతూంటే-పాలు కారుతూండగా ఉన్న దూడ నోరు పరిశుద్ధం. పక్షులు ముక్కుతో పొడిచి-పొడిచి కిందకు తోసిన ఫలాలు కూడ శుచి అయినవే! వేటాడేటప్పుడు వేట కుక్కల నోరు పరిశుద్ధం.॥130॥

*   శ్వభిర్హతస్య యన్మాంసం శుచి తన్మనుర బ్రవీత్ ।
క్రవ్యాద్భిశ్చ హతస్యాన్యైశ్చణ్డాలాద్యైశ్చ దస్యుభిః ॥   ప్రక్షిప్త శ్లోక సం.***131***

తాత్పర్యం:- కాబట్టి వేటకుక్కలచేత వేటాడబడిన మాంసం పరిశుద్ధమైనదని మనువు వచించాడు. అలాగే పచ్చిమాంసం తినే పులి మొదలైన మృగాలచేత చంపబడిన మృగమాంసం, వృత్తి చేత వేటగాడు తెచ్చే మాంసం శుద్ధమే! ॥131॥

* శరీరాంగాల మలశుద్ధి-

*   ఊర్ధ్వం నాభేర్యాని ఖాని తాని మేధ్యాని సర్వశః ।
యాన్యధస్తాన్యమేధ్యాని దేహా చ్చైవ మలాశ్చ్యుతాః ॥   ప్రక్షిప్త శ్లోక సం.***132***

తాత్పర్యం:- బొడ్డుకు పైనగల అన్ని ఇంద్రియాల రంధ్రాలు (ఉదా: కన్ను, ముక్కు, చెవులు, నోరు) పరిశుద్ధమైనవి. బొడ్డుకు దిగువ భాగాన గల అవయవాలు, ఇంద్రియరంధ్రాలు అపరిశుద్ధాలు. అలాగే దేహంలోపలి క్రియలచేత జనించే మలములన్నీ అపరిశుద్ధాలు. వాటిని తాకినప్పుడు నీటితో కడుక్కోవాలి. ॥132॥

*   మక్షికా విప్రుషశ్ఛాయా గౌరశ్వః సూర్యరశ్మయః ।
రజో భూర్వాయురగ్నిశ్చ స్పర్శే మేధ్యాని నిర్దిశేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం.***133***

తాత్పర్యం:- అమేధ్యం తాకే ఈగలు అపరిశుద్ధాలు. తాకరానిదాని నీడ గోవు, గుర్రం, సూర్యకిరణాలు, భూమి, ధూళి, అగ్ని. ఇవి తాకినా, నోటి తుంపరలు సోకినా వాటిని అపవిత్రంగా భావించరాదు.॥133॥

*   విణ్మూత్రోత్సర్గశుద్ధ్యర్థం మృద్వార్యా దేయమర్థవత్ ।
దైహికానాం మలానాం చ శుద్ధిష ద్వాదశస్వపి ॥   ప్రక్షిప్త శ్లోక సం.***134***

తాత్పర్యం:- మలమూత్రాలు విసర్జించే అవయవాలకు అంటుకొన్న మలం, దుర్గంధం మొదలయినవి మట్టితో-నీటితో ఆ దుర్వాసనలు పోయేంతవరకు కడగాలి. శారీరకంగా వెలువడేవి 12 రకాల అశుద్ధస్రావాలు. వీటి కంపుపోయేవరకు శుద్ధి చేయడమొక్కటే మార్గం.॥134॥

* *వసా శుక్రమసృఙ్మజ్జా మూత్రవిట్ ఘ్రాణకర్ణవిట్ ।*
శ్లేష్మా శుదూషికా స్వేదో ద్వాదశైతే నృణాం మలాః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***135***

తాత్పర్యం:- మూత్రం, మలం, చెమట, రేతస్సు, రక్తం, కొవ్వు, గులిమి, చీమిడి(కఫం), గోళ్లమురికి, కన్నీరు, కంటిపుసి, దేహంలోని చెడునీరు అనే 12 రకాల విసర్జకాలున్నాయి.॥135॥

* *ఏకా లింగే గుదే తిస్ర స్తథైకత్ర కరే దశ ।*
ఉభయోస్సప్త దాతవ్యా మృదః శుద్ధిమభీప్సతా ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***136***

తాత్పర్యం:- మలమూత్రాలు విడిచేటప్పుడు లింగాన్ని ఒక పర్యాయం, (కుడి చేత్తో ఎన్నడూ కడగరాదు) ఎడంచేతితో గుదస్థానాన్ని మూడు పర్యాయాలు, ఎడమచేతిని పదిసార్లు, అటుపైన రెండు చేతులునూ ఏడుసార్లు కడగాలి.॥136॥

*** బ్రహ్మచారుల, సన్న్యాసుల శుద్ధి ప్రకారం-**

* *ఏతచ్ఛౌచం గృహస్థానాం ద్విగుణం బ్రహ్మచారిణామ్ ।*
త్రిగుణం స్యాద్వనస్థానాం యతీనాం తు చతుర్గుణమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***137***

తాత్పర్యం:- ఇంతవరకు చెప్పబడిన శౌచవిధి గృహస్థుల నిమిత్తం చెప్పబడింది. బ్రహ్మచారులైతే దీనికి రెండింతలుగాను, వానప్రస్థులకైతే మూడు రెట్లు గాను, సన్న్యాసులకు నాలుగింతలు గాను ఈ శౌచవిధి ఉంటుంది.॥137॥

*** విభిన్న విధాల అశుద్ధుల శుద్ధి ప్రకారం-**

* *కృత్వా మూత్రం పురీషం వా ఖాన్యాచాంత ఉపస్పృశేత్ ।*
వేదమధ్యేష్యమాణశ్చ అన్నమశ్నంశ్చ సర్వదా ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***138***

తాత్పర్యం:- మూత్రపురీషాదులు విడిచేటప్పుడు పైన చెప్పిన రీతిగా శుద్ధిపరచుకొని, వేదాధ్యయనానికి వెళ్లేటప్పుడు గాని, ఆహారం భుజించేటప్పుడు గాని మూడు పర్యాయాలు ఆచమనం చెయ్యాలి. బాహ్యేంద్రియాలనెల్ల నీటితో తాకాలి.॥138॥

* *త్రిరాచామేదపః పూర్వం ద్విః ప్రమృజ్యాత్తతో ముఖమ్ ।*
శరీరం శౌచమిచ్ఛన్హి స్త్రీ శూద్రస్తు సకృత్సకృత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***139***

తాత్పర్యం:- దేహశుద్ధిని కోరే బ్రాహ్మణుడు నీటిని ముమ్మారు ఆచమించాలి. తరువాత నీటితో రెండు మార్లు ముఖంలోని ఇంద్రియాలను తాకాలి. స్త్రీలకు, శూద్రులకు ఒక్కమారే ఆచమనం చెప్పబడింది.॥139॥

* *శూద్రాణాం మాసికం కార్యం వపనం న్యాయవర్తినామ్ ।*
వైశ్యవచ్ఛౌచకల్పశ్చ ద్విజో చ్ఛిష్టం చ భోజనమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***140***

తాత్పర్యం:- శాస్త్రప్రకారం ద్విజులకు శుశ్రూష చేసే శూద్రులు నెలకోపర్యాయమైనా క్షౌరం చేయించుకోవాలి. వైశ్యులతో సమానంగా జాతాశౌచమృత శౌచవిధులు ఆచరించాలి. బ్రాహ్మణుల ఎంగిలి శూద్రులకు తప్పు కాదు.॥140॥

* *నోచ్ఛిష్టం కుర్వతే ముఖ్యా విప్రుషో-ంగే పతంతి యాః ।*
న శ్మశ్రూణి గతాన్యాస్యం న దన్తాన్తరధిష్ఠితమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***141***

తాత్పర్యం:- నోట్లోకి చొచ్చుకువెళ్లిన మీసం వెంట్రుకలు, పండ్లసందులలో ఇరుక్కున్న మెతుకుల తునకలు. నోటివెంట వెలువడే తుంపరలు ఇవి ఎంగిలి లేనివి.॥141॥

* స్పృశన్తి బిన్దవః పాదౌ య ఆచామయతః పరాన్ ।
భౌమికైస్తే సమా జ్ఞేయా న తైరాప్రయతో భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **142**

తాత్పర్యం:- ఇతరులు ఆచమనం చేస్తూన్నప్పుడు, పొరపాటుగా గాని విసురుచేత గాని ఆ నీటిబిందువులు ఎదుటివారిపై చిందినా, పాదాలపై పడినా, 'అవి భూమిలోకి వెళ్లిపోయేవే' అని భావించాలి. అపరిశుద్ధతగా భావించరాదు.॥142॥

* ఉచ్ఛిష్టేన తు సంస్పృష్టో ద్రవ్యహస్తః కథంచన ।
అనిధాయైవ తద్ద్రవ్యమాచాంతశ్శుచితామియాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **143**

తాత్పర్యం:- మన దేహం మీద ఉండే వస్త్రాలు-వస్తువులు-ఆభరణాదులు అవి అలాగే ఉండగా చేతికున్న ఎంగిలి వాటికి తగిలినప్పుడు వాటిని కింద పారేయనక్కరలేదు. చేతిని మణికట్టువరకు నీటితో కడిగి, ఒక మారు ఆచమనం చేస్తే తానూ-అవీ కూడా పరిశుద్ధమవుతాయి.॥143॥

* వాన్తో విరిక్తః స్నాత్వా తు ఘృతప్రాశనమాచరేత్ ।
ఆచామేదేవ భుక్త్వాన్నం స్నానం మైథునినః స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **144**

తాత్పర్యం:- వాంతి గాని, విరేచనం గాని అయిన సందర్భాలలో స్నానం చేయడం, నేతిని కొద్దిగా ఆచమనం చేయడం విధి. అన్నం తిన్నాక, ఇవి సంఘటిల్లినప్పుడు ఆచమనం చేస్తే సరిపోతుంది. ఋతుమతి అయిన స్త్రీని సంభోగిస్తే స్నానం చేయడం ద్వారా పరిశుద్ధులవుతారు.॥144॥

* సుప్త్వా క్షుత్వా చ భుక్త్వా చ నిష్ఠీవ్యోక్త్వాఽనృతాని చ ।
పీత్వాఽపోఽధ్యేష్యమాణశ్చ ప్రాచామేత్ప్రయతోఽపి సన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **145**

తాత్పర్యం:- నిద్రించి గాని, తుమ్మిన గాని, భోజనం చేసిన గాని, చీమిడివంటివి ఉమ్మివేశాక గాని, వృథా మాటలాడాక గాని, దాహం పుచ్చుకున్నాక గాని, వేదాధ్యయనానికి వెళ్తూ గాని పరిశుద్ధుడై వున్నప్పటికీ ఆచమనం చేయాలి.॥145॥

ప్రక్షిప్తాల పరిశీలన

127 నుంచి 145 వరకు గల శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. విషయ వ్యతిరేకాలు

విషయాన్ని సూచించే శ్లోకాలు 110, 146లను అనుసరించి ప్రస్తుత విషయం ద్రవ్యాలు = పాత్రలు, వస్త్రాలు మొదలైన పదార్థాల శుద్ధిని గురించిన ఉపాయాలు చెప్పాలి. దీనికి సంబంధించినవే ఇక్కడ విషయ సమ్మతం అవుతాయి, భిన్నమైనవి విషయ వ్యతిరేకాలవుతాయి. ఈ శ్లోకాలలో ఇటువంటి పదార్థాల వర్ణనా లేదు, శుద్ధి చెప్పలేదు సరికదా, ఏది శుద్ధి, ఏదిమైల- ఇవి ఉన్నాయి. అందుచేత ఈ అన్ని శ్లోకాలూ విషయ వ్యతిరేకాలు కావటం చేత ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

ద్రవ్యశుద్ధిని గురించి 111 నుంచి ప్రారంభమై 126వ శ్లోకం వరకు రకరకాల పదార్థాల వివరణనిస్తూ, 126లో మిగిలిన అన్ని పదార్థాలకూ, సామూహికంగా, 'అశుద్ధమైన పదార్థం నుంచి దాని దుర్వాసన తొలగిపోదో, అంత వరకూ ఆ వస్తువును శుద్ధి చేయటానికి మట్టి, (పై పొర) నీరు వాడాలి. దానితో అది పరిశుద్ధమవుతుందని ముగింపు

చెప్పబడింది. అంటే మౌలికంగా ఈ విషయం ఇక్కడితో పూర్తయిపోయిందని సంకేతం లభించినట్లే. ఒక విషయం సంపూర్ణమైన తర్వాత, మళ్లీ దానికి సంబంధించిన వివరాలు ప్రారంభించడం ప్రసంగ వ్యతిరేకం. ఈ ఆధారంతో 127 నుంచి 145 వరకుగల అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే.

3. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో చెప్పిన విషయాలలో చాలావాటికీ, మనువు చెప్పిన వాటికీ తేడాలున్నాయి-

క. 127లో కేవలం బ్రాహ్మణులు చెప్పడంతోనే ఏదైనా వస్తువు పవిత్ర మవుతుందని చెప్పటం 111-126 శ్లోకాలలోని వ్యవస్థలకు వ్యతిరేకం. ఇలాగైతే అన్ని పద్ధతులూ నిరర్థకమై పోతాయి.

ఖ. 130,132, శ్లోకాలలోని మాంసభక్షణం మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు అన్ని విధాల మాంసభక్షణం నిషిద్ధమన్నాడు [వివరణకు 4.26-28 శ్లోకాలకు 'అంతర్ వ్యతిరేకాలు' సమీక్ష చూడండి].

గ. 140వ శ్లోకంలోని బ్రాహ్మణుల ఎంగిలిని శూద్రులు తినే పద్ధతి, 2.31 (56)కు వ్యతిరేకం. అందులో ఎంగిలిని ఎవరికీ పెట్టకూడదని ఉంది. ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగానూ, వీటికి పరస్పర సంబంధం లేనందునా, అన్నీ ప్రక్షిప్తాలే.

4. శైలీగత ఆధారాలు

వీటన్నిటి శైలి కూడా అవ్యవహారికం, నిరాధారం, నిర్హేతుకం, అతిశయోక్తులతో కూడినదని అనిపిస్తుంది. కొన్ని ఉదాహణలు -

క. బ్రాహ్మణులు తమ స్వరాలతో 'ఇది శుద్ధము' లేదా 'ఇది పవిత్రం' అని చెప్పడంతోనే వస్తువులు పరిశుద్ధం కావడం [127].

ఖ. దుకాణాలలోని అన్ని వస్తువులూ పరిశుద్ధం కావడమూ, వాటికి తయారు చేసేవాడి చేతు లెప్పుడూ పరిశుద్ధాంగా ఉండడం.[129]

గ. స్త్రీల నోరు ఎప్పుడూ పరిశుద్ధంగా ఉండడం, కుక్కలు చంపిన జంతువుల మాంసం పరిశుద్ధం కావడం [130,131]

ఘ. నలబై సార్లు, 28 సార్లు మట్టితో రుద్దటం వల్ల చేతుల శుద్ధి పద్ధతి [137],

ఙ. విరేచనాల తర్వాత నెయ్యి తింటే శుద్ధి కావడం [144]. మొదలైన వన్నీ మనువు శైలికి వ్యతిరేకాలు.

చ. 131లో **'మనుర్బ్రవీత్'** అనటం చేత ఈ శ్లోకం వేరెవరో చెప్పారని తెలిసిపోతుంది. ఈ శైలీగత ఆధారాల వల్ల మొత్తం విషయం ప్రక్షిప్తమే !

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏష శౌచవిధిః కృత్స్నో ద్రవ్యశుద్ధిస్తథైవ చ । మూలశ్లోక సం.**33**
ఉక్తో వః సర్వవర్ణానాం స్త్రీణాం ధర్మాన్నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం.**146**

టీక:- **ఏషః**= ఇది, **సర్వవర్ణానాం కృత్స్నః శౌచ విధిః** = సర్వవర్ణాల వారికి సంబంధించిన శౌచవిధానం, **చ** = మరియు, **తథా+ఏవ** = అదే ప్రకారంగా, **ద్రవ్యశుద్ధిః** = వస్తువుల శుద్ధి, **వః ఉక్తః** = మీకు చెప్పబడింది, **స్త్రీణాం ధర్మాన్ నిబోధత** = ఇప్పుడు స్త్రీల ధర్మాలను బోధిస్తాను.

తాత్పర్యం:- సమస్త వర్ణాల వారికి చెందిన అశౌచం ఎలా తొలగించుకోవాలో చెప్పబడింది. (ఇందు విస్మరించినవి పండితులనడిగి తెలుసుకోవాలి.) ఇప్పుడు స్త్రీ, పతివ్రతా, భార్యల ధర్మాలు చెపుతాను. ఆలకించండి.॥146॥

గృహస్థాంతర్గత-పత్నీధర్మ విషయం. 147 నుండి 166 వరకు

స్త్రీల విషయంలో మనువుకున్న గౌరవం.

1. మనువుకు స్త్రీ పురుషుల మధ్య ఏ మాత్రం పక్షపాతం లేదు. స్త్రీ, పురుషులకు దాసి అనే భావన వారంగీకరించరు. పురుషుడి అధీనంలో స్త్రీ బందీగా ఉండరాదు. స్త్రీ పురుషులిద్దరు పరస్పరం ఒకరి భావాలను మరొకరు ఆదరించాలి. అంతేకాదు స్త్రీలను పురుషుల కంటే అధికంగా ఆదరించుమని చెప్పాడు. ఇందుకు ప్రమాణంగా కింద కొన్ని శ్లోకాలను ఉదాహరిస్తున్నాం. స్త్రీ విషయంలో పక్షపాత భావన గాని, దమన పద్ధతి గాని, స్వతంత్రం లేకుండా ఉంచాలనే దృక్పథం గాని వారికి లేదు. పైగా వారికి సమున్నత స్థానాన్ని ఇచ్చారు.

147,148వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* స్త్రీ ధర్మం

* *బాలయా వా యువత్యా వా వృద్ధయా వాఽపి యోషితా ।*
న స్వాతంత్ర్యేణ కర్తవ్యం కించిత్కార్యం గృహేష్వపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **147**

తాత్పర్యం:- బాలిక అయినా, నవయవ్వనవతి అయినా యువతి అయినా, ముదుసలి అయినా ఆడుది స్వతంత్రించి ఇంట్లో ఏ కార్యాన్నీ చేయరాదు.॥147॥

* *బాల్యే పితుర్వశే తిష్ఠేత్పాణిగ్రాహస్య యౌవనే ।*
పుత్రాణాం భర్తరి ప్రేతే న భజేత్ స్త్రీ స్వతంత్రతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **148**

తాత్పర్యం:- స్త్రీ బాల్యంలో తండ్రి సంరక్షణలోనూ, యవ్వనంలో భర్త అధీనంలోనూ, భర్త మరణానంతరం పుత్రుల మాట పాటించడంలోనూ గడపాలని-స్వేచ్ఛగా ఉండరాదని మను శాసనం.॥148॥

ప్రక్షిప్తాల పరిశీలన

147,148 శ్లోకాలు ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. విషయ వ్యతిరేకాలు

ఇక్కడి ముఖ్య విషయం వివాహితులైన స్త్రీపురుషులది. దీని సంకేతం విషయ ప్రారంభంలోనే 4.1లో, ముగింపు సూచన 5.169 "ద్వితీయాయుషో భాగం కృతదారో గృహే వసేత్" లో లభిస్తుంది. ఈ గృహస్థుల విషయంలో భాగంగానే 146 నుంచి 165 వరకు గల శ్లోకాలలో స్త్రీల ధర్మాలను గురించి ఉంది. ఇప్పటి అవాంతర విషయ సంకేత మిచ్చే శ్లోకాలు 5.146, 167. వీటిలో "స్త్రీణాం ధర్మాన్ నిబోధత" [146], "ఏవం వృత్తాం సవర్ణాం స్త్రీం" [167] లను చూస్తే ప్రస్తుత విషయం కేవలం 'వివాహిత స్త్రీల ధర్మాలు' అని తెలుస్తుంది. ముందు విషయం కేవలం గృహస్థుల కర్తవ్యాలు చెప్పటం. తర్వాత ఇందులోనే "ఏవం వృత్తాం సవర్ణాం స్త్రీం" అనటంతో 'ఇలా ఆచరించే సవర్ణురాలైన భార్యను' అని స్పష్టంగా తెలుస్తూంది. ఈ శ్లోకాలలో స్త్రీలకు భర్త ఇంట్లో చేయదగిన పనులనే చెప్పారు. ఈ సంకేతాలు, ప్రమాణాల వల్ల ఈ విషయం. 'పతి ఇంట్లో పాలించవలసిన కర్తవ్యాలు' లేదా భర్తకు సంబంధించిన పనులు అని తెలుస్తూంది. ఈ విషయంతో భేదించే విషయం చెప్పటం చేత ఈ శ్లోకాలు విషయ వ్యతిరేకాలు.

క. ఈ ఆధారంతో 147-148 శ్లోకాలు వివాహిత స్త్రీల కర్తవ్యాలు కాక భిన్న విషయాలు చెప్పటం చేత విషయ వ్యతిరేకాలు. రెండిటిలోనూ బాలిక ఇంటిలో స్వతంత్రంగా పని చేయకూడదని చెప్పటమూ, బాల్యా వస్థలో తండ్రి చెప్పుచేతలలో ఉండాలనటమూ - ఇవి భర్త ఇంటికి సంబంధించినవి కావు. బాలికకు భర్త గృహంతో సంబంధ

మేమిటి? ఎవరైనా ఇందులో చెప్పిన ఇతరమైన రెండు విషయాలకూ భర్తతో సంబంధం ఉంది, దానితో పాటే బాలికనూ చెప్పారు అంటే, ఇది తెలివి గలపని కాదనవచ్చు. ఎందుకంటే, బాలిక లేదా బాలునికీ ఇవి వర్తిస్తాయంటే, బాల్యంలో ఏ బాలిక, బాలుడు పూర్తి స్వాతంత్ర్యంతో వ్యవహరించగలరు? అందువల్ల ఈ మొత్తం విషయం పూర్తిగా అనవసరం, ఇలా ఏ పద్ధతీ ఉండదు అనవచ్చు. ఎవరో రచించి మనుస్మృతిలో ఈ శ్లోకాన్ని చేర్చారని స్పష్టంగా తెలిసిపోతూంది. ఇందులో స్త్రీ పురుషలను ఎల్లప్పుడూ వశంలో ఉంచుకోవా లనుకునే వారి దుర్బుద్ధి బయట పడుతూంది. మనువు పద్ధతులలో ఇటువంటి అసూయ, దుర్బుద్ధి ఉండవు.

ఖ. ఈ శ్లోకాలు, భర్త లేదా భర్త ఇంటికి చెందిన స్త్రీల కర్తవ్యాలను చెప్పేవైనా, విషయాలు వ్యతిరేకంగా ఉన్నాయి. ఇందులో చెప్పినవి కర్తవ్యాలు కావు, ఆదేశాలు. అవీ కఠోరంగా చెప్పారు. ఈ విషయ వ్యతిరేకతలు ఆధారంగా ఈ రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు - మనువు చెప్పిన స్త్రీ సంబంధ విధానాలు

క. మనువు చెప్పిన విషయాలు, ప్రసంగాల క్రమంలో ఉన్న శ్లోకాల వల్ల (మరో విధంగా చెప్పుకుంటే ఇవి మౌలిక శ్లోకా లనవచ్చు), స్త్రీ పురుషుల మధ్య ఎటువంటి పక్షపాతమూ చూపలేదనీ, స్త్రీ, పురుషునికి దాసిగా లేదా అతని వశంలో ఉండాలని చెప్పలేదనీ స్పష్టంగా తెలుస్తుంది. ఇద్దరినీ, పరస్పర భావనలను సమానంగా ఆదరించాలని చెప్పడమేకాక, స్త్రీలను ఎక్కువ ఆదరంగా చూడాలనీ చెప్పాడు. మనువుకు స్త్రీల పట్ల పక్షపాత భావం కానీ, అణచివేత భావం కానీ, వారిని అస్వతంత్రులుగా ఉంచాలని కానీ లేదు అనడానికి, కింద కొన్ని శ్లోకాలు ప్రమాణంగా ఇస్తున్నాము. వీటివల్ల పైన చెప్పినవాటికి బలం చేకూరుతుంది.

1. పితృభిః మాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా ।
పూజ్యాభూషయిత వ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః ॥ (3.55)

2. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఫలాః క్రియాః॥ (3.56)

3. "తస్మాదేతాః సదాపూజ్యాః భూషణాచ్ఛాదనాశనైః ।
భూతికామైర్నరేర్నిత్యం సత్కారేషూ త్సదేషు చ ॥ (3.59)

4. "సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవచ ।
యస్మిన్నేవ కులేనిత్యం కల్యాణం తత్రవై ధ్రువమ్" ॥ (3.60)

స్త్రీలను నిర్బంధంలో ఉంచడం మంచిది కాదు. అది వ్యర్థం అని తెలుపుతూ స్త్రీలు స్వయంగా స్వతంత్రంగా తమ వివేకంతో ఎలా ఎదగాలో, తమ ఆచరణను ఎలా రూపొందించుకోవాలో తెలిపినాడు.

5. 'న కశ్చిత్ యోషితః శక్తః ప్రసహ్యా పరిరక్షితుమ్ । (9.20)

6. "అరక్షితా గృహే రుద్ధాః పురుషై రాప్తకారిభిః ।
ఆత్మానమాత్మనాయాస్తు రక్షేయుస్తాః సురక్షితాః॥ (9.12)

స్త్రీ, పురుషులు ఇద్దరూ గౌరవంలో సమానులే. అని తెలుపుతున్న ప్రమాణాలు.

7. "అన్యోన్యస్య అవ్యభిచారో భవేదామరణాన్తికః ।
ఏష ధర్మః సమాసేన జ్ఞేయః స్త్రీపుంసయోః పరః॥ (9-101)

8. "తథానిత్యం యతేయాతాం స్త్రీపుంసౌ తు కృతక్రియా
యథానాభి చరేతాం తౌ వియుక్తౌ ఇతరేతరమ్" (9-102)

9. ప్రజనార్థం స్త్రియః సృష్టాః సన్తానార్థం చ మానవాః ।
తస్మాత్ సాధారణో ధర్మః శ్రుతౌ పత్న్యాసహోదితః ॥ (9-96)

స్త్రీలను ఎక్కడ కూడా మను మహర్షి హీనభావనతో తక్కువ చేసి చూడలేదు. కొన్నిచోట్ల పురుషులను మించి ఎంతో గౌరవించాడు. కొన్ని ఉదాహరణలు-

గ. ఎటువంటి పక్షపాతం లేకుండా స్త్రీ పురుషులను సమాన స్థాయివారుగా భావిస్తూ మనువు చక్కని సలహాలిచ్చాడు. వాటివల్ల స్త్రీ, పురుషునికి పూర్తిగా వశమై ఉండాలనే పద్ధతి తనంతట తానే ఖండించ బడుతుంది-

ఈ పద్ధతులు ఆధారంగా 147-148 శ్లోకాలలోని అణచివేత భావాలతో చెప్పిన విషయాలు, మనువు చెప్పిన పద్ధతులకు చెందినవి కావని చెప్పవచ్చు. ఇవి మనువుకు వ్యతిరేకం.

ఘ. ఈ శ్లోకాలలో వ్యక్తీకరించిన శైలికి, తర్వాతి శ్లోకం 149లోనే స్పష్టంగా వ్యతిరేకత కనబడుతూంది. 149లో మనువు స్త్రీలకు హితకారి అయిన విషయాలను సలహాల రూపంలో చెబుతున్నాడే కానీ, ఎవరి పైనా తన ఆదేశాలు, ఆజ్ఞలను రుద్దడం లేదు. ఈ శ్లోకంలో 'న ఇచ్ఛేత్' -అంటే 'స్వయంగా కోరకపోతే' అనేది శ్రద్ధగా చూడవలసిన విషయం. 'న ఇచ్ఛేత్' అనటంలోనూ, **"న స్వాతంత్ర్యేణ కర్తవ్యం కించిత్ కార్యం", "న భజేత్ స్త్రీ స్వతంత్రతామ్"** అనటంలో తేడా, వ్యతిరేకత ఉన్నాయి ! 8.28 నుంచి స్త్రీలకు స్వతంత్రంగా ఉండే అధికారం ఉందనేది తెలుస్తూంది. దాన్ని వ్యక్తీకరించే శైలిలోనే ఈ రెండు పద్ధతులనూ పరస్పర వ్యతిరేకాలుగా చేసింది.

ఙ. మనువు స్త్రీలను ఎక్కడా హీన భావంతో చూడలేదు. పైగా అక్కడక్కడా పురుషుల కన్నా గొప్పగానే ఆదరభావం చూపాడు. కొన్ని ఉదాహరణలు చూడండి -

అ. స్త్రీలకు మార్గం వదలాలి-

"స్త్రియః పంథా దేయః" [2.113 (2.138)].

ఆ. భార్యతో గొడవలు పడకూడదు. కలహించరాదు-

"భార్యయా..... వివాదం న సమాచరేత్" (4.180).

ఇ. భార్య మొదలైన స్త్రీలపై అబద్ధపు దోషాలు ఆరోపించ కూడదు. వారిని చెడ్డ మాటలు అనకూడదు. ఎవరైనా అలా చేస్తే అది శిక్షించవలసిన పని అవుతుంది-**"మాతరం పితరం జాయాం....అక్షారయన్ శతం దండ్యః"**(8.280)

149 నుండి 152వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం.

తండ్రికి-భర్తకు-పుత్రునికి దూరంగా ఉన్న స్త్రీకి-హాని జరుగుతుందనే భయం

పిత్రా భర్త్రా సుతై ర్వాపి నేచ్ఛేద్విరహమాత్మనః । మూలశ్లోక సం.**34**
ఏషాం హి విరహేణ స్త్రీ గర్హ్యే కుర్యాదుభే కులే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**149**

టీక:- **స్త్రీ** = ఏ స్త్రీ అయినా, **పిత్రా-భర్త్రా-వా-సుతైః అపి** = తండ్రికి, భర్తకు, పిల్లలకు, **ఆత్మనః విరహమ్ న ఇచ్ఛేత్** = తాను వేరుగా ఉండాలని అనుకోరాదు. **హి** = ఎందుకంటే, **ఏషాం విరహేణ** = వీరి నుండి వేరుగా ఉన్నందువల్ల, **ఉభేకులే గర్హ్యే కుర్యాత్** = ఏదైనా జరగరానిది జరిగితే రెండు కులాలకు అపనింద వచ్చుటకు అవకాశముంది. స్త్రీ ఎల్లప్పుడు పురుషుడి సహాయం సంరక్షణ కోరేదిగా ఉండాలి. పురుషుడి సహకారం లేనట్లయితే ఆమె సురక్షితంగా ఉండజాలదు.

తాత్పర్యం:- స్త్రీ తన తండ్రికి, భర్తకు, పిల్లలకు తాను వేరుగా ఉండాలని అనుకోరాదు. ఎందుకంటే వీరికి దూరంగా ఉండాలని కాంక్షిస్తే-మాతాపితరుల వంశాలు రెండింటికీ చెడ్డపేరు వస్తుంది.॥149॥

భార్యలో ఉండాల్సిన గుణాలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

సదా ప్రహృష్టయా భావ్యం గృహకార్యే చ దక్షయా । మూలశ్లోక సం.**35**
సుసంస్కృతోపస్కరయా వ్యయే చాముక్త హస్తయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**150**

టీక:- స్త్రీ కర్తవ్యం, **సదా ప్రహృష్టయా** = ఆమె ఎల్లప్పుడు అత్యంత ప్రసన్నంగా, **గృహకార్యేషు, దక్షయా** = ఇంటి పనులలో నేర్పరిగాను, **సుసంస్కృత+ఉపస్కరయా** = అన్ని విషయాల్లో ఉత్తమ సంస్కారం, గృహశుద్ధి కలిగినదిగా, **చ** = మరియు, **వ్యయే అముక్తహస్తయా భావ్యం** = ఖర్చుపెట్టుడంలో అత్యంత ఉదారంగానూ, వస్తువులన్నిటినీ పరిశుభ్రంగా, ఉంచుకోవడం. శరీరానికి మనస్సుకు-రోగాలు రానట్టి భోజనాన్ని తయారుచేయడం. గృహవ్యయానికి సంబంధించిన లెక్కాపద్దు రాసి, భర్త మొ॥ వారికి చూపించడం. గృహసేవకులకు తగిన విధులను పురమాయించడం, గృహకార్యాలలో ఏదీ చెడిపోకుండా చూసుకోవడం మొదలైనవి ఆదర్శ గృహిణి కర్తవ్యాలు.

తాత్పర్యం:- భర్తకు తన పట్ల ఇష్టం ఉన్నా-లేకున్నా భార్య చిరునవ్వుతో ఉండటం, ఇంటి పనులలో నేర్పరితనాన్ని కలిగి ఉండటం, గృహసామాగ్రినంతటినీ శుభ్రంగా అమర్చడం, పొదుపరితనాన్ని కలిగి ఉండాలి.॥150॥

ఋషి దయానందభాష్యం:-గృహిణి సదా ఆనందంగా ఉంటూ, గృహకార్యములందు నేర్పరితనంతో వ్యవహరిస్తూ భోజనాది పదార్థాలను రుచికరంగా చేస్తూ, పాత్రలను, వస్త్రాలను, గృహాన్ని పరిశుభ్రం గాను, మనోహరం గాను ఉంచుతూ, దైనిక వ్యయాలను యథాశక్తికి మించకుండా చూసుకుంటూ సదా ప్రసన్నంగా ఉండాలి (స.వి.గృ.ప్ర.).

భర్తకు చేయాల్సిన సేవా శుశ్రూషలు

ఇది మనుకృతం-ప్రామాణికం

యస్మై దద్యాత్పితా త్వేనాం భ్రాతా వాఽనుమతే పితుః । మూలశ్లోక సం.**36**
తం శుశ్రూషేత జీవన్తం సంస్థితం చ న లఙ్ఘయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**151**

టీక:- **పితా తు ఏనాం యస్మై దద్యాత్** = తండ్రి తన కుమార్తెను ఎవరితో వివాహం చేస్తాడో, **వా** = లేదా, **పితుః అనుమతేః భ్రాతా** = తండ్రి అనుమతితో సోదరుడు ఎవరికిచ్చి వివాహం చేస్తాడో, **తం జీవన్తం శుశ్రూషేత** = అతనికి జీవించినంత కాలం సేవా శుశ్రూషలు చేయాలి, **చ** = మరియు, **సంస్థితం న లఙ్ఘయేత్** = పత్నిగా తోడుగా ఉంటూ అవమానించరాదు. ఇతరత్ర చరించరాదు. పతివ్రత ధర్మాన్ని ఉల్లంఘించరాదు.

తాత్పర్యం:- తండ్రి తన కుమార్తెను ఎవరితో వివాహం చేస్తాడో, లేదా తండ్రి అనుమతితో సోదరుడు ఎవరితో వివాహం చేస్తాడో, ఆ భర్తకు జీవించినంతవరకు శుశ్రూషలు చేయాలి. భర్తకు తోడుగా ఉంటూ అవమానించరాదు.॥151॥

వివరణ

'సంస్థిత' శబ్ద వివేచనం

'సం'పూర్వక 'స్థా' ధాతువుకు 'క్త' ప్రత్యయం చేర్చగా "సంస్థిత" శబ్దం నిష్పన్నమవుతుంది. అన్యటీకాకారులు ఈ శబ్దానికి "మరణించిన తరువాత" అని అర్థం చెప్పారు. ఇది ప్రాసంగికం కాదు. సందర్భమసలే కాదు. జీవించి ఉన్నప్పుడు ఒకరికొకరు కలిసి ఉండే సమయంలో స్త్రీ చేయవలసిన కర్తవ్యాల వర్ణన గురించిన సందర్భం. పత్నిగా తోడుగా ఉన్నప్పుడు భర్తను అవమానించరాదని, వ్యభిచారాదుల ద్వారా పతివ్రత ధర్మాన్ని ఉల్లంఘించరాదని చెప్పడం సందర్భోచితం, మను సమ్మతం కూడా.

వివాహానంతరం భార్య మీద భర్తకు గల అధికారం-

ఇది మనుకృతం-ప్రామాణికం

మఙ్గళార్థం స్వస్త్యయనం యజ్ఞశ్చాసాం ప్రజాపతేః । మూలశ్లోక సం.**37**
ప్రయుజ్యతే వివాహేషు ప్రదానం స్వామ్యకారణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**152**

టీక:- **వివాహేషు** = వివాహాలలో, **స్వస్త్యయనం చ ప్రజాపతేః యజ్ఞః** = స్వస్తి పాఠం మంచికోరిక- శుభకామన కోసం మంత్రపాఠం చేసి ప్రజాపతి యజ్ఞం చేయబడుతుంది, **ఆసాం మఙ్గళార్థం ప్రయుజ్యతే** = వీరిద్దరి కల్యాణార్థమే యజ్ఞనిర్వహణ, **ప్రదానం స్వామ్యకారణం** = వివాహంలో స్త్రీలను పతికి సమర్పించడం ద్వారా, పతికి వారి మీద

అధికారం, స్వామ్యత్వమున్నట్లుగా భావించవచ్చు. వివాహంలో సంస్కారపూర్వకంగా వరునికి వధువును ఇవ్వడం వల్ల పతికి పత్నిమీద అధికారం కలుగుతుంది. కన్యాదానమునకు ముందు అధికారముండదు.

తాత్పర్యం:- స్త్రీలకు వివాహ సమయంలో స్వస్తి మంత్రపాఠం మంచికోరిక కోసం ప్రజాపతి యజ్ఞం చేయబడుతుంది. వీరిద్దరి కళ్యాణార్థమే యజ్ఞ నిర్వహణ చేయబడుతుంది. వివాహంలో స్త్రీని పతికి సమర్పించడం ద్వారా పతికి ఆమె మీద అధికారం, స్వామ్యత్వమున్నట్లగా భావించాలి.॥152॥

153-162వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* భార్యసంబంధ విషయాలు-

* *అనృతావృతుకాలే చ మంత్రసంస్కారకృత్పతిః ।*
సుఖస్య నిత్యం దాతేహ పరలోకే చ యోషితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***153***

తాత్పర్యం:- ఒక కన్యను వివాహం చేసుకొన్న వాడు (ఆమెభర్త) ఆమెకు అన్ని విధాలా సుఖాన్ని కల్పించువాడవుతున్నాడు. సంగమసుఖంతో సహా సర్వసౌఖ్యాలను కలిగించడమేగాక, పరలోక సాధనమైన పతి ఆదరణకు సాటిగాగలదేదీ లేదు.॥153॥

* *విశీలః కామవృత్తో వా గుణై ర్వా పరివర్జితః ।*
ఉపచర్యః స్త్రియా సాధ్యా సతతం దేవవత్పతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***154***

తాత్పర్యం:- భర్త సదాచార శూన్యుడైనా, ఇంకో స్త్రీపట్ల అనురాగం ప్రదర్శించేవాడైనా, విద్యాది సుగుణాలు లేకపోయినా భార్య భర్తను నిరాదరణ చేయకూడదు. భర్తను దేవుడిలా పూజించడం పతివ్రతాధర్మం. ॥154॥

* *నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో న వ్రతం నాప్యుపోషణమ్ ।*
పతిం శుశ్రూషతే యేన తేన స్వర్గే మహీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***155***

తాత్పర్యం:- పురుషుడు ఒక భార్యతో కాకుంటే, వేరే ఇంకొక భార్యతో యజ్ఞాదిక్రియలు నెరవేర్చుకోగలడు. కానీ స్త్రీకి భర్తని విడిస్తే మరొకరితో యజ్ఞంలేదు. భర్త అనుమతిలేనిదే ఏ వ్రతమూ లేదు. ఉపవాసం లేదు. భర్తకు చేసే శుశ్రూష చేతనే భార్యకు స్వర్గలోకార్హత కలుగుతుంది.॥155॥

* *పాణిగ్రాహస్య సాధ్వీ స్త్రీ జీవతో వా మృతస్య వా ।*
పతిలోకమభీప్సన్తీ నాచరేత్కిం చిదప్రియమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***156***

తాత్పర్యం:- భర్త బతికున్నా-మృతి చెందినా అతడి భావాలు తెలిసి ఉన్న భార్య అతడి ఇష్టప్రకారం నడుచుకోవడం ఉత్తమం. అందుకు విరుద్ధంగా ఎలాంటి పని తలపెట్టరాదు. మృతిచెందినా భర్తకు ఇష్టంలేనిపని చేస్తే ఆమె పరపురుషుడితో రమించినంత ఒట్టు.॥156॥

* *కామం తు క్షపయేద్దేహం పుష్పమూలఫలైః శ్శుభైః ।*
న తు నామాపి గృహ్ణీయాత్పత్యౌ ప్రేతే పరస్య తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***157***

తాత్పర్యం:- భర్త మరణించాక, పతివ్రత అయిన స్త్రీ శుద్ధ కందమూల ఫలాదులు భక్షిస్తూ, దేహాన్ని కృశింపచేసుకోవడం ద్వారా ఆ భర్త సన్నిధినే నిరంతరం కాంక్షిస్తున్నట్లు! అలాకానట్లయితే పరపురుషుణ్ణి స్మరించినట్లే.॥157॥

* ఆసీతామరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ ।
యో ధర్మ ఏకపత్నీనాం కాంక్షంతీ తమనుత్తమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **158**

తాత్పర్యం:- పతివ్రత అయిన స్త్రీ లక్షణాన్ని మరింత విస్పష్టంగా ఇంకా వివరిస్తున్నాడు.....భర్త గతించాక భార్య ఓర్పు-నియమాలు కలదై, తన భర్తకు ఎలాంటి వ్రతాలు ముఖ్యమో వాటిని అవలంబించినదై, మద్యమాంసాలను-సంభోగాన్ని కోరనిదై, మరణ పర్యంతం సుశీలగా గడపాలి. పుత్రుణ్ణి కనాలన్న కాంక్ష (తీరనప్పుడైనా) పరపురుషుణ్ణి కూడరాదు.॥158॥

* అనేకాని సహస్రాణి కుమార బ్రహ్మచారిణామ్ ।
దివం గతాని విప్రాణామకృత్వా కులసంతతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **159**

తాత్పర్యం:- భార్యగాని, భర్తగాని తమకు సంతతి లేదని ఖేదపడరాదు. బాల్యంలోనే బ్రహ్మచర్యవ్రత దీక్షావలంబకులైన సనక-వాలఖిల్యాదుల బ్రాహ్మణ సంతతిరాహిత్యం జగద్విదితం. కానీ వారు పుణ్యలోకాలు పొందినవారే కదా! పుత్రుణ్ణి కనడం పుణ్యలోక ప్రాప్తికే అయినా, దీనికీ ప్రత్యామ్నాయాలున్నాయి.॥159॥

* మృతే భర్తరి సాధ్వీ స్త్రీ బ్రహ్మచర్యే వ్యవస్థితా ।
స్వర్గం గచ్ఛత్యపుత్రాపి యథా తే బ్రహ్మచారిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **160**

తాత్పర్యం:- కాబట్టి-పుత్రులను పుట్టించి పున్నామనరకం నుంచి రక్షణ పొందాలనే కోరికతో మాత్రమే తాను పరపురుషుడితో (భర్త మృతిచెందడమన్నది జరిగాక) రమించానని నెపం వేస్తే అది అధోగతిపాలవుతుంది.॥160॥

* అపత్యలోభాద్యాతు స్త్రీ భర్తారమతివర్తతే ।
సేహ నిందామవాప్నోతి పతిలోకాచ్చ హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **161**

తాత్పర్యం:- ఏ స్త్రీఅయినా, తనకు పుత్రుడు కలగాలనే ఆశతోనే నిజంగా (తాను తరుణ వయస్కురాలై ఉండగా భర్త చనిపోతే) వేరే పురుషుడితో సంగమిస్తే ఆ స్త్రీ ఇహలోకాన నిందలకు గురవుతుంది. పుణ్యలోక ప్రాప్తీ కలుగదు.॥161॥

* నాన్యోత్పన్నా ప్రజాస్తీహ నచాప్యన్యపరిగ్రహే ।
న ద్వితీయశ్చ సాధ్వీనాం క్వచిద్భర్తోపదిశ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **162**

తాత్పర్యం:- భర్తవల్ల కాక వేరొక పురుషుడి వల్ల పుట్టిన సంతానం, ఆ స్త్రీకి సక్రమసంతానం కాదు. అలాగే తన భార్యయందుగాక పరస్త్రీయందు సంతతి పుట్టించే పురుషుడు ఆ సంతానాన్ని తన సంతానంగా చెప్పరాదు. కాబట్టి-పతివ్రతలైన స్త్రీలకు ద్వితీయ వివాహం అప్రసిద్ధం. ॥162॥

ప్రక్షిప్తాల పరిశీలన

153 నుంచి 162 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

ఇందులో భర్తకు అనవసరపు గొప్పతనం అంటగట్టి, స్త్రీలకే అన్ని కర్తవ్యాలూ నిర్దేశించారు. పురుషులకు అన్ని రకాల మినహాయింపులూ ఇచ్చారు. ఇటువంటి ఏక పక్షమూ, బలవంతంగా ఆదేశించే వ్యవహారం మనువు పద్ధతులలో లేవు, కనుక ఇవి వ్యతిరేకాలు-

క. 153లో పర లోకం లోనూ భర్త సుఖం కలిగించేవాడని ఉంది. కానీ మనువు సిద్ధాంతం ప్రకారం, వారి వారి కర్మలను అనుసరించి సుఖదుఃఖాలు కలుగుతాయి; ఎవరి సహాయం వల్లనో రెండవ జన్మ రాదు, ఎవరెవరి మంచి చెడు పనులు ఆధారంగానే తర్వాతి మంచి లేదా చెడు జన్మ కనబడుతుంది; తన కర్మలకు జీవుడు తానే స్వయంగా భోక్త- వాటిని అనుభవించే వాడవుతాడు [4.240; 12.3; 8.25 39-52, 74 చూడండి].

ఖ. 154లో గుణహీనుడు, పరస్త్రీ లోలుడైన భర్తను దేవతగా భావించి పూజించాలని ఉంది. మనుస్మృతిలో స్త్రీ పురుషుల నిద్దరినీ సమానంగా చూడాలనే నిర్దేశం ఉంది. ఏ వర్గం వారి పట్లా పక్షపాత భావం లేదు.

[చూడండి 3.55, 56, 60; 9.28, 101, 102]; 9.101-102లలో స్త్రీ పురుషులిద్దరూ పరస్పరం ఎంత బాగా వ్యవహరించాలంటే, వారి మధ్య అభిప్రాయ భేదాలూ, లేదా విడిపోయే అవసరమే రాకూడని విధంగా ఉండాలని స్పష్టంగా మనువు చెప్పాడు. 154వ శ్లోకం పైన చెప్పిన వాటికి వ్యతిరేకంగా ఉంది.

గ. 155లో స్త్రీలకు యజ్ఞాలను ప్రత్యేకంగా నిషేధించారు. పతి సేవలోనే అన్ని ధర్మాలూ ఉన్నా యన్నారు. 9.28లో - "అపత్యం ధర్మకార్యాణి దారాధీనః" - అంటే - 'సంతానోత్పత్తి, యజ్ఞాలు మొదలైన ధర్మ కార్యాలు స్త్రీ అధీనంలో ఉంటాయి" అని. 9.11లో కూడా "శౌచే ధర్మేఽన్న పంక్త్యాం చ " అంటే - 'ఇంటి శుభ్రత, ధర్మానుష్ఠానాలు, వంట చేయటానికి స్త్రీలను నియోగించండి' అని. 9.96లో "తస్మాత్ సాధారణో ధర్మః శ్రుతౌ పత్న్యా సహోదితః". 3.118లో 'దంపతులకు యజ్ఞ శేష భోజనంవిధానం' చెప్పబడింది. ఈ అన్ని ప్రమాణాలూ ధర్మకార్యాలలో స్త్రీలకు సైతం స్వతంత్రమూ, సమానమూ అయిన అధికారాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇతర ప్రమాణాలను 2.41-42 [66-67] ల పరిశీలన 'అంతర్ వ్యతిరేకాలు' లో చూండి.

ఘ. 156లో మరు జన్మలో పతిలోకానికి సంబంధించిన కల్పన మనువు చెప్పలేదు. మరణం తర్వాత ఈ ప్రపంచలోనే జన్మ లేదా ముక్తి అనే రెండు విషయాలనే మనువు చెప్పాడు. [12.40-52, 82, 83].

జ. 157 నుంచి 162 శ్లోకాలు 9.56 నుంచి 63, 76 శ్లోకాలకు వ్యతిరేకంగా ఉన్నాయి వీటిలో స్పష్టంగా నియోగ విధానాన్ని గురించి చెప్పారు.

చ. 153 నుంచి 162 వరకు గల శ్లోకాలలోని పద్ధతులు మనువుకు వ్యతిరేకాలు. వీటిని తెలుసుకోవటానికి 5.147-148 శ్లోకాల **'అంతర్ వ్యతిరేకాలు'** అనే సమీక్ష చూడండి ఈ అంతర్ వ్యతిరేకాల ఆధారంతో ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే !

ఇది మనుకృతం-ప్రామాణికం

పూర్వపతిని విడిచిపెట్టి రెండో పతిని స్వీకరించడం నిందనీయం-

పతిం హిత్వాఽపకృష్టం స్వముత్కృష్టం యా నిషేవతే । మూలశ్లోక సం.**38**
నింద్యైవ సాభవేల్లోకే పరపూర్వేతి చోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**163**

టీక:- వివాహానంతరం-తులనాత్మక రూపంలో ఇంకొక మంచి వ్యక్తి లభిస్తాడని, **యా స్వం అపకృష్టం పతిం హిత్వా ఉత్కృష్టం నిషేవతే** = ఏ స్త్రీ తన నిమ్నకులమనో లేదా గొప్ప గుణాలు లేవనో భావించి తన పతిని వదిలిపెట్టి, ఉత్తమ గుణాలు, ఉత్తమ కులం ఉన్నవని భావించి మరొక పతిని సేవిస్తుందో, **సా** = ఆమె, **లోకే నిన్ద్యా+ఏవ భవేత్** = లోకంలో నిందితురాలవుతుంది, **చ** = మరియు, **పరపూర్వా + ఇతి ఉచ్యతే** = ఈమె ముందు మరొకడికి భార్య అని వ్యంగ్యంగా నిందా వాక్యాలు పలుకుతారు.

తాత్పర్యం:- తన భర్తలోని అవగుణాలను ఏవగించుకుంటూ, ఏ స్త్రీ అతనికంటే గుణాధిక్యుని భర్తగా పొందినప్పటికీ ఆమె లోకంలో నిందితురాలే అవుతోంది. ఒకసారి వివాహమై ఉన్నదానికి మళ్లీ పెళ్లా? అని లోకులు నిందిస్తారు.॥163॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* **వ్యభిచారాత్తు భర్తుః స్త్రీ లోకే ప్రాప్నోతి నిన్ద్యతామ్ ।**
సృగాలయోనిం ప్రాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**164**

తాత్పర్యం:- ఈ విధంగా పరపురుషుడితో రమించే స్త్రీ ఈ లోకంలోనే నిందలకు గురవుతుంది. ఆమె మృతి చెంది నక్కగా పుట్టడమే గాక కుష్ఠు మొదలైన దీర్ఘరోగాల పాలవుతోంది.॥164॥

ప్రక్షిప్త పరిశీలన

164వ శ్లోకం కింది ప్రమాణాలతో ప్రక్షిప్తం

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకం వల్ల పూర్వాపర శ్లోకాలు ఖండితమవుతున్నాయి. 163లో ఒక భర్తను వదలి, మరొక మంచి భర్త కోసం స్త్రీ ప్రయత్నిస్తే ఆమెను నిందిస్తారు. దీని పరిపుష్టికి 65వ శ్లోకం చూడండి - అని ఉంది. అందులో త్రికరణశుద్ధిగా ఏ స్త్రీ తన భర్తకు అనుకూలవతియై ఉంటుందో, ఆమెను అందరూ సాధ్వి అని కీర్తిస్తారు-అని ఉంది. ప్రసంగంలోని ఏకసూత్రతను భంగం చేసి, మధ్యలో స్త్రీ వ్యభిచారాన్ని చేయటం వల్ల కలిగే ఫలితాన్ని చెప్పటం అసందర్భం. ఏది అవసరమైన ఫలమో దాన్ని 163లో చెప్పేశారు.

2. శైలీగత వ్యతిరేకాలు

దీని శైలి నిరాధారమూ, సహేతుకం కానిదీ, చెడ్డ మాటలతో ఉంది. ఇది మనువు శైలికి వ్యతిరేకం.

3. అంతర్ వ్యతిరేకాలు

ఒకటే పనికి ఫలితంగా నక్క జన్మ రావటం, పాపపురోగాల బారిన పడతారని నిర్ణయించటం మనువు సిద్ధాంతాలకు వ్యతిరేకం. ఎన్నో కర్మల వల్ల ఒక జన్మ కలుగుతుందని మనువు చెప్పాడు [చూడండి 12.9., 39-52,74].

ఇది మనుకృతం-ప్రామాణికం

పత్యనుకూలాచరణం వల్ల పత్నికి అధిక గౌరవం-

పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా । మూలశ్లోక సం.**39**
సా భర్తృలోకమాప్నోతి సద్భిస్సాధ్వీతి చోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**165**

టీక:- **యా** = ఏ స్త్రీ, **మనః వాక్-దేహ-సంయతా** = మనస్సును, వాక్కును, దేహాన్ని అధీనంలో ఉంచుకొని (సంయమనం), **పతిం న + అభిచరతి** = పతికి విరుద్ధంగా ప్రవర్తించదో, **సా** = ఆమె, **భర్తృలోకమ్ +ఆప్నోతి** = పతి లోకాన్ని పొందుతుంది, అంటే పతి హృదయంలో ఆదర స్థానాన్ని పొందగలుగుతుంది. "పతివ్రత" అని గాని లేదా 'మంచి పత్ని'అని గాని ప్రశంసలను పొందుతుంది,

తాత్పర్యం:- త్రికరణ శుద్ధిగా ఏ స్త్రీ పతికి విరుద్ధంగా ప్రవర్తించదో ఆ స్త్రీ తర్వాతి జన్మలో కూడా ఆ భర్తనే పొందుతుంది. అలాంటి పత్ని ఉదాత్తచరితురాలై పతివ్రత అని లోకంలో పేరుతెచ్చుకుంటుంది.॥165॥

వివరణ:

'లోకశబ్ద వివేచనం' :- లోక-దర్శనే ధాతువు నుండి శబ్దం పుడుతుంది. దృష్టిదర్శనమని అర్థం. **'భర్తృలోకమవాప్నోతి'** అంటే 'పతివ్రత' తన 'పతి హృదయం'లో స్థానమును పొందునని భావం. ఇక్కడ పరలోక ప్రసంగమేలేదు.

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* అనేన నారీవృత్తేన మనోవాగ్దేహసంయతా ।
ఇహాగ్ర్యాం కీర్తిమాప్నోతి పతిలోకం పరత్ర చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**166**

తాత్పర్యం:- స్త్రీ ధర్మమైన ఈ రీతులెల్ల చక్కగా తెలిసినదై, మనో వాక్కాయములచేత పరపురుషుణ్ణి కోరనిది ఏ స్త్రీ అయితే ఉందో-ఆమె ఈ లోకంలో కీర్తి పొందడమేగాక- పరలోకంలోనూ తన పాతివ్రత్యం చేత భర్తనే చేరి సుఖిస్తుంది.॥166॥

ప్రక్షిప్త పరిశీలన

166వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకాలు

మనువు ప్రకారం పర లోకంలో పతి లోకం పేరిట ఒక చోటు కానీ, స్థితి కానీ ఉండదు. ప్రాణులుగా పునర్జన్మలు కలగటమో లేదా ముక్తి కలగటమో జరుగుతాయి. ఎన్నో కర్మలకు ఫలంగా ఒక జన్మ కలుగుతుందనీ కేవలం ఒక భర్తకు సేవ చేసినందువల్ల కాదనీ మనువు చెప్పాడు. [చూడండి.12వ అధ్యాయం]

2. శైలీగత వ్యతిరేకాలు

ఎక్కడైనా విషయాన్ని ముగిస్తే మనువు ఫలాన్ని చెప్పాడు. అక్కడ ఉత్తమ గతులు కలుగుతాయని లేదా బ్రహ్మ ప్రాప్తి కలుగుతుందని చెప్పాడు [చూడండి. 2.249; 4.260; 6.85, 97 మొదలైనవి]. ఇవి కాకుండా వేరే ఏ ఫలాలూ మనువు చెప్పలేదు. ఈ శ్లోకం మనువు శైలికి భిన్నంగా ఉంది కనుక ప్రక్షిప్తం.

3. ప్రసంగ వ్యతిరేకాలు

167వ శ్లోకంలోని 'ఏవం వృత్తాం' పదంవల్ల ఆ శ్లోకమే స్త్రీల ధర్మాలకు సంబంధించిన విషయంతో సరాసరిగా కలిసి ఉందనే సంకేతం లభిస్తుంది. 166వ శ్లోకంలో ఫలకథనంతో విషయమే ముగిసిపోయి, దాని కొనసాగింపు లేకుండా పోయింది. 'ఏవం' (మరియు) పదం దాని కొనసాగింపును సూచించేది. ఈ విధంగా శ్లోకం మధ్యలో ప్రసంగపు కొనసాగింపును ఆపేయటం వల్ల ఇది ప్రక్షిప్తం.

స్త్రీ మరణించినట్లయితే యజ్ఞం ద్వారా అగ్ని సంస్కారం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఏవం వృత్తాం సవర్ణాం స్త్రీం ద్విజాతిః పూర్వమారిణీమ్ । మూలశ్లోక సం.**40**
దాహయేదగ్నిహోత్రేణ యజ్ఞపాత్రైశ్చ ధర్మవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**167**

టీక:- ఏవం వృత్తాం సవర్ణాం స్త్రీం = ఈ విధంగా పూర్వోక్త ప్రకారంగా ఆచరించే స్త్రీని, **పూర్వమారిణీమ్** = భర్త కంటే ముందుగా మరణించినట్లయితే, **ధర్మవిత్** = ధర్మజ్ఞుడైన వ్యక్తి, **యజ్ఞపాత్రైః** = యజ్ఞపాత్రలను ఉపయోగించి, **అగ్నిహోత్రేణ దాహయేత్** = అగ్నిహోత్ర విధిననుసరించి దహన సంస్కారం చేయాలి. యజ్ఞపాత్రల పరిచయం 5.24వ శ్లోకంలో చూడగలరు.

తాత్పర్యం:-ఇలాంటి మంచి నడవడిక కలిగిన పత్ని, పతి(భర్త) కంటే ముందుగా మృతి చెందినట్లయితే, ఆమె భర్త శ్రౌత స్మార్తాగ్నులతోను, యజ్ఞపాత్రలతో ఆమెకు దహనసంస్కారం చేయాలి.॥167॥

వివరణ:- యజ్ఞ పాత్రల పరిచయం మరియు వివరణ 5.117 సమీక్షలో చూడాలి.

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* భార్యాయై పూర్వమారిణ్యై దత్వాఽగ్నీనంత్యకర్మణి ।
పునర్దారక్రియాం కుర్యాత్పునరాధానమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**168**

తాత్పర్యం:- అలాంటి అంత్యక్రియలలో (ఆహవనీయ, గార్హపత్య, దక్షిణాగ్నులు) మూడు అగ్నులను ఇచ్చి, ఆమె వల్ల తనకు పుత్రులున్నా-లేకున్నా మరో స్త్రీని వివాహం చేసుకొని, ఆ యా అగ్నులను తిరిగి ఏర్పరచుకోవాలి. ॥168॥

ప్రక్షిప్త పరిశీలన

168వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం-

1. ప్రసంగ వ్యతిరేకం

క. ప్రసంగ సంకేతక శ్లోకమైన 5.146 ప్రకారం, ముగింపు శ్లోకం 169 కన్నా ముందు వరకు, ఇక్కడ స్త్రీల ధర్మాల విషయం ఉంది. ఈ ప్రసంగంలో పురుషుల విషయం ఉండటం ప్రసంగ సంకేతక శ్లోకం ప్రకారం ప్రసంగ వ్యతిరేకం.

ఖ. 5-146లో ప్రారంభమైన స్త్రీల ధర్మాల విషయం 167లో 'ఏవం వృత్తాం సవర్ణాం స్త్రీం' అని ముగిసింది. దీని వల్ల, దీని తర్వాత దీనికి సంబంధించిన ఏదీ లేకుండా కేవలం ముగింపే ఉంటుందన్న సంకేతం లభిస్తుంది. ప్రసంగ సమాప్తి తర్వాత మళ్లీ ప్రసంగ వ్యతిరేక కథనం అసంగతం. అందుచేత ఈ శ్లోకం ప్రక్షిప్తం.

ఉపసంహారం-

ఇది మనుకృతం-ప్రామాణికం

అనేన విధినా నిత్యం పంచయజ్ఞాన్న హాపయేత్ । మూలశ్లోక సం.**41**
ద్వితీయమాయుషో భాగం కృతదారో గృహే వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**169**

టీక:- **అనేన** = పూర్వోక్త విధిననుసరించి (4.1వ శ్లోకం నుండి 5.41వ శ్లోకం వరకు), **పంచ యజ్ఞాన్ న హాపయేత్** = పంచ యజ్ఞాలను ఎప్పుడూ విడువరాదు, **ద్వితీయమాయుషో భాగం** = ఆయుష్షులో రెండోభాగం వరకు, **కృతదారః** = వివాహం చేసుకొని, భార్యతో పాటు, **గృహే వసేత్** = గృహమందుండాలి.

తాత్పర్యం:- గృహస్థుడు పంచమహాయజ్ఞాలను వదలకుండా ప్రతినిత్యం చేస్తూ తన ఆయుష్షులోని ద్వితీయార్ధభాగం వరకు వివాహం చేసుకొని గృహస్థాశ్రమాన్ని భార్యతో గడపాలి. ॥169॥

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేంద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మర్రి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'గృహస్థాన్తర్గత-భక్ష్యాభక్ష్య- దేహశుద్ధి
ద్రవ్యశుద్ధి-స్త్రీధర్మవిషయాత్మకః' పఞ్చమోఽధ్యాయః॥

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం పఞ్చమోఽధ్యాయః

ఇతి పఞ్చమోఽధ్యాయః సమాప్తః

మనుస్మృతి

షష్ఠాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన*ఋషి దయానందభాష్యోపేతం

మొత్తం శ్లోకాలు: 97; మూల శ్లోకాలు: 64; ప్రక్షిప్త శ్లోకాలు: 33

వానప్రస్థ-సన్న్యాస-ధర్మ విషయము

వానప్రస్థ విషయం 1వ శ్లోకం నుండి 32వ శ్లోకం వరకు

1 నుండి 5వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

వానప్రస్థాన్ని అవలంబించడం-

ఏవం గృహాశ్రమే స్థిత్వా విధివత్స్నాతకో ద్విజః ।
వనే వసేత్తు నియతో యథావద్విజితేంద్రియః ॥ మూలశ్లోక సం. 1

టీక:- ఏవం = ఈ ప్రకారంగా, విధివత్ స్నాతకః ద్విజః = విధిపూర్వకంగా బ్రహ్మచర్యదీక్షతో విద్యలను సంపూర్ణంగా చదివి సమావర్తన సమయంలో స్నానవిధిననుసరించిన ద్విజుడు, (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యుడు), విజితేంద్రియః నియతః యథావత్ గృహాశ్రమే స్థిత్వా = జితేంద్రియుడై, జితాత్ముడై, గృహస్థాశ్రమంలో ఉన్న తరవాత, వనే వసేత్ = వనానికి వెళ్ళాలి.

ఋషి దయానందభాష్యం:- ఈ ప్రకారంగా స్నాతకుడై అనగా బ్రహ్మచర్యపూర్వకంగా గృహస్థాశ్రమంలో ప్రవేశించిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య లను ద్విజులు గృహాశ్రమంలో ఉండి నిశ్చితాత్ములై యథారీతిగా ఇంద్రియాలను జయించి తదుపరి వనంలో నివసించాలి. (స.ప్ర. 5వ సము) ॥1॥

వివరణ

1. 'జితేంద్రియ' లక్షణం:- దీని గురించి 2.73[2.98]వ శ్లోకంలో వర్ణించబడింది. అక్కడ చూడగలరు.
2. వానప్రస్థధారణమునకు- బ్రాహ్మణముల గ్రంథాలు ప్రమాణాలు.

"బ్రహ్మచర్యాశ్రమం సమాప్య గృహీ భవేత్ । గృహీ భూత్వా వనీ భవేత్ । వనీ భూత్వా ప్రవ్రజేత్" (శత.పథ.14).

బ్రహ్మచర్యాశ్రమాన్ని పూర్తిచేసి గృహస్థుడు కావాలి. గృహస్థాశ్రమాన్ని పూర్తి చేసి వానప్రస్థుడు కావాలి. వానప్రస్థాశ్రమాన్ని పూర్తిచేసి సన్యసించాలి.

3. వేదప్రమాణం (ఋ. 10.4.5) 6.2 సమీక్షలో చూపబడినది.

వానప్రస్థధారణ సమయం- ఇది మనుకృతం-ప్రామాణికం

గృహస్థస్తు యదా పశ్యేద్వలీపలితమాత్మనః ।
అపత్యస్యైవ చాపత్యం తదాఽరణ్యం సమాశ్రయేత్ ॥ మూలశ్లోక సం. 2

టీక:- **గృహస్థః తు** = గృహస్థులు, **యదా** = ఎప్పుడు, **ఆత్మనః వలీ-పలితం-పశ్యేత్** = తన శరీరం ముడతలు పడటం, కేశాలు నెరవడం (తెల్లగా అవడం) గమనిస్తారో, **చ** = మరియు, **అపత్యస్య +ఏవ అపత్యం** = పుత్రుడికి-పుత్రుడు జన్మిస్తాడో, **తదా** = అప్పుడు, **అరణ్యం సమాశ్రయేత్** = వనాన్ని ఆశ్రయించాలి.

తాత్పర్యం:- ఏ గృహంలో అయినా తన పుత్రిడికి పుత్రుడు జన్మించినపుడు, లేదా తల వెంట్రుకలు తెల్లబడుటను చూసినప్పుడు అగ్నిహోత్రాది సామగ్రి తీసుకొని వానప్రస్తుడు కావాలి. ఒంటరిగా గానీ లేదా ఇద్దరు భార్యభర్తలు కలిసి గానీ వానప్రస్థులు కావాలి.

ఋషి దయానందభాష్యం:- గృహస్థాశ్రమంలో ఉండగా ఎప్పుడైతే తల నెరిసిపోతుందో, ముఖంపై ముడతలు కనిపిస్తాయో, తన పుత్రుడికి పుత్రుడు జన్మిస్తాడో అప్పుడు వనం చేరుకోవాలి. ఇక్కడ పుత్ర శబ్దానికి పుత్రిక అని కూడా అర్థం తీసుకోవాలి. కేవలం పుత్రికయే కలవారు తమకు మనమడో, మనమరాలో పుట్టిన తరువాత వానప్రస్థం తీసుకోవాలి. (సత్యా. 5వ సము.)॥2॥

వివరణ: వానప్రస్థధారణ విషయంలో 6.2-4 శ్లోకాలలో మనుమహర్షి వేదాలనే అనుసరించాడు. సామ్యత కోసం ఋగ్వేదమందున్న (10.4.5) మంత్రాన్ని చూడగలరు.

"కూచిత్ జాయతే సనయాసు నవ్యో । వనే తస్థౌ పలితో ధూమకేతుః"॥

టీక:- **కూచిత్** = ఏ గృహంలో అయినా, **సనయాసు నవ్యః జాయతే** = ప్రాచీన సంతతిలో అంటే వయోవృద్ధులైన గృహస్థులకు నవీనసంతతి జన్మించగానే అంటే తన పుత్రుడికి పుత్రుడు జన్మించగా, లేదా, **పలితః** = శిరోజాలు నెరియునో (తెల్లబడునో) అప్పుడు, **ధూమకేతుః** = అగ్ని అంటే అగ్నిహోత్రాది సామగ్రీ తీసికొని, **వనే తస్థౌ** = వనానికి ప్రస్థానం చేయాలి. వానప్రస్థుడు కావాలి. [6.4]"**వనర్గౌ**" నిరుక్తం 3-14 ఒంటరిగా గానీ, లేదా పతి, పత్ని ఇద్దరు కలిసిగానీ వానప్రస్థులు కావాలి.

వానప్రస్థధారణ విధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

సన్త్యజ్య గ్రామ్యమాహారం సర్వం చైవ పరిచ్ఛదమ్ ।
పుత్రేషు భార్యాం నిక్షిప్య వనం గచ్ఛేత్సహైవ వా ॥ మూలశ్లోక సం. **3**

టీక:- వానప్రస్థదీక్షను తీసుకోదలచిన ద్విజుడు, **గ్రామ్యం + ఆహారం చ సర్వం ఏవ పరిచ్ఛదం** = గ్రామానికి సంబంధించిన అన్నిరకాల భోజన పదార్థాలను, ఇంటికి సంబంధించిన పశ్వాది ధనసంపత్తులను, **సంత్యజ్య** = వదలివేసి, **భార్యాం పుత్రేషు నిక్షిప్య** = భార్య తన వెంట రావడానికి ఇష్టపడకపోతే తన కొడుకుల దగ్గరనే వదలివేసి అనగా వారికి అప్పజెప్పి, **వా** = లేదా, **సహ ఏవ** = తోడుగాగాని, **వనం గచ్ఛేత్** = వనంలో నివసించడానికి వానప్రస్థదీక్ష తీసుకొని వెళ్ళాలి.

ఋషి దయానందభాష్యం:- గ్రామంలో ఉన్న ఆహారాలను, వస్త్రాలను ఇంకా ఉత్తమోత్తమ పదార్థాలను విడిచిపెట్టి పుత్రుల వద్ద భార్య నుంచి లేదా తనతో కూడా తీసుకొని వెళ్ళి వనంలో నివసించాలి (స.ప్ర. 5వ సము.).॥3॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అగ్నిహోత్రం సమాదాయ గృహ్యం చాగ్నిపరిచ్ఛదమ్ ।
గ్రామాదరణ్యం నిస్సృత్య నివసేన్నియతేంద్రియః ॥ మూలశ్లోక సం. **4**

టీక:- గృహస్థుడు వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించదలచినప్పుడు, **అగ్నిహోత్రం చ గృహ్యం అగ్ని పరిచ్ఛదమ్ సమాదాయ** = అగ్నిహోత్ర సామగ్రినంతా తీసికొని, **గ్రామాత్ నిఃస్సృత్య** = గ్రామాన్ని విడిచిపెట్టి, **అరణ్యం నియతేన్ద్రియః నివసేత్** = అరణ్యంలో జితేంద్రియుడై నివసించడాలి.

ఋషి దయానందభాష్యం:- ఇంట్లో ఉన్న అగ్నిని-అగ్నిహోత్రానికి కావలసిన ఉపకరణాలను పుచ్చుకొని గ్రామం నుంచి/ రాజ్యం నుంచి వనానికి వెళ్లిపోవాలి. అక్కడ ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని జీవనం సాగించాలి. (సం. వి. వాన;స.ప్ర. 5వ సము.).॥4॥

వానప్రస్థుడికి పంచ మహాయజ్ఞ విధానం **ఇది మనుకృతం-ప్రామాణికం**

మున్యన్నైర్వివిధైర్మేధ్యై శ్శాకమూలఫలేన వా ।
ఏతానేవ మహాయజ్ఞాన్నిర్వపేద్విధిపూర్వకమ్ ॥ మూలశ్లోక సం. **5**

టీక:- **వివిధైః మున్యన్నైః** = అనేక రకాలైన మునులు తినదగిన నీవార ధాన్యముల చేతను, **మేధ్యైః శాకమూల-ఫలేన** = మంచి శాకములు, గడ్డలు, ఫలాలు, పూలు, కందాదుల వీటి ద్వారా, **ఏతాన్ +ఏవ మహాయజ్ఞాన్ విధిపూర్వకమ్ నిర్వపేత్** = పూర్వోక్త (3.46, 6.7, 12) వర్ణిత మహాయజ్ఞాలను చేయాలి. (3.46.78) శ్లోకాలలో విధి గురించి వివరించడమైనది.

తాత్పర్యం:- మునులు భుజించే ఆహారపదార్థాలను (కందమూలములు, శాకములు మొ॥) అరణ్యంలోనే/ వనంలోనే లభించే ఫలాలను, నీవార ధాన్యాన్ని గృహస్థాశ్రమంలో ఉన్నప్పుడు పంచమహాయజ్ఞాలు ఆచరించినట్లుగానే ఆచరిస్తూ (అతిథి భుజించాక) భుజించాలి.॥5॥

ఇది ప్రక్షిప్తం-ప్రామాణికం కాదు

* *వసీత చర్మ చీరం వా సాయం స్నాయాత్ప్రగే తథా ।*
జటాశ్చ బిభృయాన్నిత్యం శ్మశ్రులోమనఖాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **6**

తాత్పర్యం:- వానప్రస్థాన సమయంలో జింక, జంతువుల చర్మములనుగానీ, నార బట్టలనుగానీ ధరించాలి. ఉదయం సాయంత్రం స్నానం చేయాలి. జడలను, గడ్డమును, మీసములను, వెంట్రుకలను పెరగడాన్ని భరించాలి.॥6॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్త మవుతుంది -

1. ఇది పూర్వాపర శ్లోకాలకు వ్యతిరేకమే కాకుండా, వాటిని భంగపరుస్తూంది. 5వ శ్లోకంలో "ఏతాన్ ఏవ మహా యజ్ఞాన్ నిర్విపేత్ విధిపూర్వకం" అని ఉంది. అంటే విధిపూర్వకంగా ఈ (తర్వాత వస్తాయి) యజ్ఞాలు చేయాలి. ఈ శ్లోకంలోని సంకేతం ప్రకారం, తర్వాత వానప్రస్థ ఆశ్రమంలో పంచ యజ్ఞాలు చేయాలి, వాటిని గురించి 7-12 శ్లోకాలలో ఉంది-అని. ఏడవ శ్లోకంలో అతిథి యజ్ఞం పద్ధతి ఉంది. ఇలా ఈ శ్లోకం ఏకసూత్రత గల ముందు వెనుకల ప్రసంగ క్రమాన్ని భంగం చేసింది.

7 నుండి 16వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

అతిథియజ్ఞం-బలివైశ్యదేవయజ్ఞ విధానం-

యద్భక్ష్యం స్యాత్తతో దద్యాద్బలిం భిక్షాం చ శక్తితః । మూలశ్లోక సం. **6**
అమ్మూలఫలభిక్షాభిరర్చయేదాశ్రమాగతాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **7**

టీక:- **యత్ భక్ష్యం స్యాత్** = తినదగిన పదార్థాలను, **బలిం దద్యాత్** = బలివైశ్వ దేవయజ్ఞం చేయాలి. **చ** = మరియు, **శక్తితః** = యథాశక్తి భిక్షను ఇవ్వాలి. **ఆశ్రమ+ఆగతాన్** = ఆశ్రమానికి వచ్చిన అతిథులకు, **అప్-మూల-ఫల-భిక్షాభిః** = జలం, కందమూలములు, ఫలాలు మొ॥ ఇచ్చి, **అర్చయేత్** = వారిని సత్కరించాలి.

తాత్పర్యం:- తాను ఏ యే పదార్థాలు భుజిస్తాడో, ఆ పదార్థాలనే బలివైశ్వ దేవయజ్ఞానికి ఉపయోగించాలి. వాటినే భిక్షగా వేయాలి. అలాగే తన ఆశ్రమానికి వచ్చినవారికి జలం, కందమూలాలు, పండ్లు మొదలైనవి ఇచ్చి సత్కరించాలి.॥7॥

బ్రహ్మయజ్ఞ విధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

స్వాధ్యాయే నిత్యయుక్తస్స్యాద్దాంతో మైత్రస్సమాహితః । మూలశ్లోక సం.7
దాతా నిత్యమనాదాతా సర్వభూతానుకంపకః ॥ ప్రక్షిప్త శ్లోక సం.8

టీక:- **స్వాధ్యాయే** = స్వాధ్యాయంలో అంటే చదవడం, చదివించడంలో, **నిత్యయుక్తః** = నియుక్తుడై, **సమాహితః** = జితాత్ముడై, **మైత్రః** = అందరికీ మిత్రుడై (అంటే అందరిని మిత్రభావంతో చూస్తూ), **దాన్తః** = ఇంద్రియాలను వశపరచుకొని, **దాతా** = విద్యాదులను దానం చేస్తూ, **సర్వభూత+అనుకంపకః** = అన్ని ప్రాణులందు దయకలవాడై, **అనాదాతా** = ఎవరి నుండి ఏ పదార్థం తీసుకోకుండా, **నిత్యమ్ స్యాత్** = ఈ ప్రకారంగా ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- వేదాధ్యయనంలో ఎల్లప్పుడూ ఆసక్తిగలవాడై ఉండటం, ఎండ-వాన-, చలి మొదలైన ప్రకృతి సహజములను ఓర్చుకోగలగటం, సదా మనస్సును వశపరచుకొని ఉండటం, విద్యాదులను దానం చేస్తూ అందరికీ మేలును మాత్రమే తలపెట్టడం, ఇతరుల నుంచి ఏదీ పుచ్చుకోకపోవడం, అన్నిప్రాణుల పట్ల దయకలిగి ఉండటం వానప్రస్థంలో ప్రధానంగా ఆచరించాలి. అరణ్యంలో వేదాది శాస్త్రాలను చదువుతూ చదివిస్తూ నియుక్తుడై, ఇంద్రియాలను జయించి, ఒకవేళ పత్నికూడా వెంట ఉన్నట్లయితే, ఆమె ద్వారా సేవాసహాయం పొందుతూ ఉన్నా విషయ ప్రసంగం ఆమెతో ఎప్పుడూ చేయరాదు. (స.ప్ర. 5వ సము.).॥8॥

అగ్నిహోత్ర విధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

వైతానికం చ జుహుయాదగ్నిహోత్రం యథావిధి । మూలశ్లోక సం.8
దర్శమస్కందయన్ పర్వం పౌర్ణమాసం చ యోగతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.9

టీక:- వానప్రస్థుడు, **యథావిధి** = పూర్వోక్త విధిననుసరించి, **అగ్నిహోత్రం** =దైనిక పంచమహా యజ్ఞాలను. **చ** = మరియు, **వైతానికం** = విశేషమైన అవసరాలతో చేయబడు, **దర్శమ్ చ పౌర్ణమాసం పర్వం అస్కన్దయన్** = అమావాస్య పౌర్ణమాసి మొ॥ పర్వములలో చేయబడు పర్వయజ్ఞాలను కూడా వదలకుండా, **యోగతః జుహుయాత్** = నిష్ఠాపూర్వకంగా నిర్వహించాలి.

తాత్పర్యం:- 'వితానము' అంటే గార్హపత్యాగ్నిని ఆహవనీయదక్షిణాగ్ని కుండములలోనికి చేర్చడం అని అర్థం. ఆ అగ్నికే వైతానికం అని పేరు. ఆ అగ్నితో దర్శ పూర్ణమాసాల యజ్ఞాలను ఆ యా కాలాల్లో వదలకుండా శాస్త్రప్రకారం అనుష్ఠించాలి.వీటి వివరణ కొరకు 7.78,79; 2.118[2.143], 2.3[2.28] శ్లోకాలలో ఇలాంటి మహాయజ్ఞాల విధానాన్ని చూడగలరు.॥9॥

విశేష యజ్ఞాలను నిర్వహించడం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఋక్షేష్ట్యాగ్రయణం చైవ చాతుర్మాస్యాని చాహరేత్ । మూలశ్లోక సం.9
తురాయణం చ క్రమశో దాక్షస్యాయనమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.10

టీక:- ఋక్షేష్టి = నక్షత్రయజ్ఞం, **ఆగ్రయణం** = నూతనాన్న యజ్ఞం, **చ** = మరియు, **చాతుర్మాస్యాని** = చాతుర్మాస్య యజ్ఞం. **చ** = మరియు, **క్రమశః తురాయణం చ దక్షస్యాయనం ఏవ ఆహరేత్** = క్రమంగా ఉత్తరాయణ, దక్షిణాయనం ఈ సమయాల్లో విశేష యజ్ఞాలను నిర్వహించాలి.

తాత్పర్యం:- నక్షత్రేష్టిని, ఆగ్రయణేష్టిని (కొత్తపంటలకాలమందు జరిపేది) చాతుర్మాస్యాది వ్రతాలను, ఉత్తరాయణ-దక్షిణాయణ కాలాల్లో చేసే శ్రౌతకర్మలను వరుస ప్రకారం ఆచరించాలి.॥10॥

వివరణ:

1. నక్షత్రాల గణన. నక్షత్ర పరివర్తన సమయాల్లో విశేషంగా బృహత్ యజ్ఞాలను అనుష్ఠించాలి. నక్షత్రాలు-27.

1. అశ్విని
2. భరణి
3. కృత్తిక
4. రోహిణి
5. మృగశిర
6. ఆర్ద్ర
7. పునర్వసు
8. పుష్యమి
9. ఆశ్లేష
10. మఖ
11. పుబ్బ
12. ఉత్తర
13. హస్త
14. చిత్త
15. స్వాతి
16. విశాఖ
17. అనూరాధ
18. జ్యేష్ఠ
19. మూల
20. పూర్వాషాఢ
21. ఉత్తరాషాఢ
22. శ్రవణం
23. ధనిష్ఠ
24. శతభిషం
25. పూర్వాభాద్ర
26. ఉత్తరాభాద్ర
27. రేవతి.

2. **చాతుర్మాస్య యజ్ఞాలు:** ప్రతి నాలుగు మాసాలకు అనుష్ఠించాల్సిన యజ్ఞాలు. కార్తీకం, ఫాల్గుణ ఆషాఢమాసాల ప్రారంభంలో

3. **ఉత్తరాయణం:** భూమధ్య రేఖకు ఉత్తరంలో సూర్యుడు ఉండే స్థితి, మకరం నుండి కర్కాటకరాశి సంక్రాంతి వరకు ఉండే కాలం ఉత్తరాయాణం.

4. **దక్షిణాయనం:** భూమధ్య రేఖకు దక్షిణంలో సూర్యుడు ఉండే స్థితి దక్షిణాయనం అయనాలను గురించి 1-67వ శ్లోకంలోని వివరణలో చూడగలరు.

ఈ సమయాల్లో విశేష యజ్ఞాలను అనుష్ఠించాలి.

బలివైశ్వ దేవయజ్ఞ విధానం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

వాసంత శారదైర్మేధ్యైర్మున్యన్నైః స్వయమాహృతైః । మూలశ్లోక సం.**10**
పురోడాశాంశ్చ రూంశ్చైవ విధివన్నిర్వపేత్పృథక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**11**

టీక:- వాసన్తశారదైః మేధ్యైః స్వయమ్ + ఆహృతైః అన్నైః = వసంత ఋతువు, శరదృతువులలో లభించే పవిత్రములు, స్వయంగా తెచ్చుకొన్న నీవారాది మునుల అన్నములతో, **పురోడాశాన్ చ చరూన్ విధివత్ పృథక్ నిర్వపేత్** = పురోడాశం, చరు అనే పేరుగల యజ్ఞీయ హవ్యములను విధిప్రకారంగా వేరు వేరుగా తయారుచేసికోవాలి. పిండితో తయారుచేసిన హోమద్రవ్యం, **చరు** = హోమంలో ఆహుతి ఇవ్వడానికి తయారుచేసిన పక్వాన్నం హవ్యం.

తాత్పర్యం:- వసంత ఋతువు, శరదృతువులలో ఫలించేవి పరిశుద్ధమైనవి, తామే స్వయంగా తెచ్చినవీ అయిన ముని సమ్మతమైన ఆహారధాన్యాలచేత పురోడాశం-హోమంలో ఆహుతి ఇవ్వడానికి తయారు చేసిన పక్వాన్నం వేర్వేరుగా శాస్త్రప్రకారం చేయాలి.॥11॥

వివరణ:- పురోడాశ మరియు చరు:- అన్నాది పదార్థాలను రుబ్బి యజ్ఞం కొరకు తయారు చేయు ఆహుతి పదార్థాన్ని **'పురోడాశ'** మంటారు. దీన్ని పురోడాశ పాత్రలో ఉంచుతారు. ఈ పాత్రను **'చరు'** అంటారు.

ఇది మనుకృతం-ప్రామాణికం

దేవతాభ్యస్తు తద్ధుత్వా వన్యం మేధ్యతరం హవిః । మూలశ్లోక సం.**11**
శేషమాత్మని యుఞ్జీత లవణం చ స్వయం కృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**12**

టీక:- తత్ మేధ్యతరం వన్యం హవిః దేవతాభ్యః హుత్వా = ఆ పవిత్రమైన నీవార ధాన్యములతో తయారైన హవిస్సులను దేవతలకు ఆహుతిగా యిచ్చి (3.59, 69), మిగిలిన భోజనాన్ని, **స్వయంకృతమ్ లవణం** = తన కోసం తయారు చేసుకొన్న లవణయుక్త పదార్థాలను, **ఆత్మని యుఞ్జీంత** = తాను భుజించడానికి ఉపయోగించాలి. 'లవణ శబ్దం' ప్రత్యేకంగా ఉప్పుతో తయారుచేసిన ఆహార పదార్థమని అర్థం.

తాత్పర్యం:- ఆ వనాలలో లభించే నీవార ధాన్యం మొదలైన వాటితో చేయబడినవి, యాగాలకు తగినవీ అయిన పురోడాశం, 'చరు'వులను, హవిస్సులను దేవతలకి సమర్పించి, ఆ హవిశ్శేషం తాను ఉపయోగించుకోవాలి. తనకు తానే తయారుచేసుకున్న ఉప్పును ఉపయోగించాలి.॥12॥

పవిత్ర భోజనం చేయాలి ఇది మనుకృతం-ప్రామాణికం

స్థలజౌదకశాకాని పుష్పమూలఫలాని చ । మూలశ్లోక సం.**12**
మేధ్యవృక్షోద్భవాన్యద్యాత్స్నేహాంశ్చ ఫలసంభవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**13**

టీక:- స్థలజ-ఔదక-శాకాని = భూమిలోను, నీటిలోను పుట్టిన శాకములను, **మేధ్యవృక్ష+ఉద్భవాని పుష్ప-మూల-ఫలాని** = పవిత్ర వృక్షాలకు కలిగిన, పుష్పాలు, చల్లగడ్డలు ఫలములను, **చ** = మరియు, **ఫలసంభవాన్ స్నేహాన్** = ఫలాల, రసాలను, తైలములను, **అద్యాత్** = భుజించాలి. (5.8,10 చూడగలరు.).

తాత్పర్యం:- మెట్టభూములలో పండే పండ్లు, ఆకుకూరలు, పూచే పుష్పాలు, దుంపలు, యజ్ఞసంబంధ వృక్షాలకు చెందిన ఫలాలు, గారచెట్టులాంటి వాటి నుంచి తీసిన తైలాలు, ఫలాలరసాలు నిత్యం దేహయాత్ర సాగించడానికి ఉపయోగించుకోవాలి.॥13॥

వివరణ: భక్ష్యపదార్థాల విధానము 5.8-10; 24,25లలో చూడగలరు.

అభక్ష్య పదార్థాలు ఇది మనుకృతం-ప్రామాణికం

వర్జయేన్మధు మాంసం చ భౌమాని కవకాని చ । మూలశ్లోక సం.**13**
భూస్తృణం శిగ్రుకం చైవ శ్లేష్మాతకఫలాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**14**

టీక:- మధు = మత్తును కలిగించే మద్యం, గంజాయి భంగు, **మాంసం** = అన్ని రకాలైన మాంసం, **చ** = మరియు, **భౌమాని కవకాని** = భూమిలో ఉత్పన్నమైన పుట్టగొడుగులు, **చ** = మరియు, **భూస్తృణం** = గోంగూర, **శిగ్రుకం** = మునగకాడలు, **చ** = మరియు, **శ్లేష్మాత్మక ఫలాని** = శ్లేష్మమును, కఫం-తెమడ కలిగించే పండ్లు, **వర్జయేత్** = భోజనంలో ఉపయోగించరాదు.

తాత్పర్యం:- మత్తును కలిగించే మద్యం, గంజాయి, మాంసాన్ని, భూమిలో ఉత్పన్నమైన పుట్టగొడుగులు, గోంగూర, మునగకూర, మునగకాడలు, అశ్లేష్మం, కఫం-తెమడ కలిగించే పండ్లు లాంటివి పూర్తిగా వాడటం మానేయాలి. ॥14॥

ఇంకా.....విసర్జించవలసిన వేవో చెప్పబడుతున్నాయి...

వివరణ: ఇక్కడ మధు శబ్దానికి అర్థం మద్యం, మత్తును కలిగించే పదార్థాలు గంజాయి మొ॥. (2.152 [2.177]శ్లోక సమీక్ష చూడగలరు).

అభక్ష్య పదార్థవర్ణన 5.5, 2.152[2.177] ఈ శ్లోకాలలో వర్ణించిన పదార్థాలు ఆశ్రమవాసులందరికీ అభక్ష్యాలే.

ఇది మనుకృతం.ప్రామాణికం

త్యజేదాశ్వయుజే మాసి మున్యన్నం పూర్వసఞ్చితమ్ । మూలశ్లోక సం.**14**
జీర్ణాని చైవ వాసాంసి శాకమూలఫలాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**15**

టీక:- **పూర్వసఞ్చితమ్ మున్యన్నం** = ముందు పోగుచేసి ఉంచిన నీవార ధాన్యమును, **చ** = మరియు, **జీర్ణాని వాసాంసి** = పాత వస్త్రాలను, **చ** = మరియు, **శాక-మూల-ఫలాని** = ముందుగా కూడ బెట్టిన శాకములు, కందమూలాలు, ఫలాలు, వీటిని **ఆశ్వయుజే మాసి త్యజేత్** = ఆశ్వయుజ మాసంలో వదిలివేసి, నూతనమైన వాటిని స్వీకరించాలి.

తాత్పర్యం:- ప్రతిఏటా ఆశ్వయుజ మాసానికి ముందు సమకూర్చుకొని పెట్టుకున్న ఋషులు భుజించే నీవార ధాన్యం మొదలైనవి, పాత వస్త్రాలు, ముందురోజు వాడక వదిలేసిన కూరలు, దుంపలు, పండ్లు.....వీటిని ఆశ్వయుజ మాసంలో పూర్తిగా వదిలిపెట్టాలి.॥15॥

వానప్రస్థుడు గ్రామోత్పన్న పదార్థాలను తినరాదు ఇది మనుకృతం-ప్రామాణికం

న ఫాలకృష్టమశ్నీయాదుత్సృష్టమపి కేనచిత్ । మూలశ్లోక సం.**15**
న గ్రామజాతాన్యార్తోఽపి మూలాని చ ఫలాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**16**

టీక:- **ఫాలకృష్టం** = నాగలితో దున్నిన భూమిలో పెరిగిన, **కేనచిత్ ఉత్సృష్టం + అపి** = ఎవరిచ్చినా, **చ** = మరియు, **గ్రామజాతాని మూలాని ఫలాని చ** = గ్రామంలో ఉత్పన్నమైన గడ్డలు గానీ ఫలాలను గానీ, **ఆర్తః అపి న అశ్నీయాత్** = ఆకలితో ఉన్నా, తినరాదు.

తాత్పర్యం:- వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు, నాగలితో దున్నగా పండినట్టి ధాన్యాలు ఏవీ భుజించరాదు. అడవిలో/ వనంలో ఉండగా రోగపీడితుడైనప్పటికీ ఊర్లో లభించే ఫలాలను గాని-దుంపలను గాని వాడరాదు.॥16॥

వివరణ: వానప్రస్థుడు గ్రామాలలో పండించే కాయగూరలు, పండ్లు, గడ్డలు, తినరాదని నిషేధించడానికి కారణం గృహస్థులకు లాగా సుఖాసక్తిలో ప్రవృత్తులు కాకూడదని. ఈ విషయం రాబోయే 26వ శ్లోకంలో వివరించబడింది.

17 నుండి 25వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *అగ్నిపక్వాశనో వా స్యాత్కాలపక్వభుగేవ వా ।*
అశ్మకుట్టో భవేద్వాపి దంతోలూఖలికోఽపి వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.*17*

తాత్పర్యం:- అగ్ని ప్రక్వం చేయబడిన (వండబడిన) ఆహారం పనికిరాదు. కాలానికంటే ముందే పండిన పండ్లు (అనగా-కృత్రిమ పద్ధతుల ద్వారా పంటవేసిగాని/ మగ్గబెట్టికాని) భుజించకూడదు. తమకు తామే పండిన ఫలాలు తినాలి. రోలు-రోకలి వంటివి ఉపయోగించకూడదు. తమ దంతాలతో తాము నమిలి తినగలిగిన ఆహారాన్ని మాత్రమే భుజించాలి.॥17॥

* *సద్యః ప్రక్షాళకో వా స్యాన్మాససంచయికోఽపి వా ।*
షణ్మాసనిచయో వా స్యాత్సమానిచయ ఏవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**18**

తాత్పర్యం:- ఏ రోజుకు సరిపోయే నీవారధాన్యం ఆ రోజేగాని, ఒక నెలకాలం వరకు సరిపోయే ధాన్యాన్ని గాని, ఋతుధర్మం ప్రకారం కొన్ని కాలాల్లో సేకరణ కష్టం అవుతుంది కాబట్టి ఆర్నెల్ల కాలానికి సరిపోయే ధాన్యం కాని దాచి ఉంచవచ్చు! కొత్తపంట వచ్చాక పాతవి వాడరాదు. ॥18॥

* *నక్తం చాన్నం సమశ్నీయాద్దివా వాఽహృత్య శక్తితః ।*
చతుర్థకాలికో వా స్యాత్స్యా ద్వాప్యష్టమకాలికః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**19**

తాత్పర్యం:- శక్తికొద్దీ ఆహారాన్ని పైన చెప్పిన వాటిప్రకారం తెచ్చుకోవాలి. ప్రదోషకాలంలోగాని, లేదా పగటిపూట నాలుగో జాము కాలంలో గాని లేదా ఒకరోజు ఉపవాసం చేసి గాని, (మరుసటి రోజు సాయంకాలంవరకు) ఓపికను బట్టి మూడురోజులు ఉపవాసం చేసిగాని భోజనం చేయాలి. క్రమంగా మనస్సును వైరాగ్యం వైపు మళ్లించడానికే ఇన్ని నియమాలు పెట్టారు.॥19॥

* *చాంద్రాయణవిధానైర్వా శుక్లే కృష్ణే చ వర్తయేత్ ।*
*పక్షాంతయోర్వాఽపృశ్నీయాదయవాగూం క్వథితాం సకృత్ ॥*ప్రక్షిప్త శ్లోక సం.**20**

తాత్పర్యం:- చాంద్రాయణ విధానాల చేత, కృష్ణపక్షంలో ఒక్కొక్క ముద్ద తగ్గించాలి. శుక్ల పక్షాంతంలో గాని, కృష్ణ పక్షాంతంలో గాని ఒక్కసారి మాత్రం కాచిన గంజి తాగవచ్చు! ప్రాతఃకాలంలో అయినా-సాయం సంధ్యానంతరం గాని, రెండుపూటలా గాని పుచ్చుకోవచ్చు!॥20॥

* *పుష్పమూలఫలైర్వాపి కేవలైర్వర్తయేత్సదా ।*
కాలపక్వై స్స్వయం శీర్ణైర్వైఖానసమతే స్థితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**21**

తాత్పర్యం:- వానప్రస్థాశ్రమంలో ఉండేవారు దాచిన/ నిల్వ ఉంచిన/ కొద్దిగా పాడైన ఫలాలు భుజించరాదు. చెట్లనుంచి రాలినవి, వాటికి అవే పండినవి, తమంత తామై ఎండినవి అయిన ఫలాలు-దుంపలు తింటూ కాలం గడపాలి. ధర్మశాస్త్ర గ్రంథాలు అందుబాటునందుంచుకొని దైవ భక్తిపరత్వం కలిగి ధర్మాలు ఆచరిస్తూండాలి.॥21॥

*** వివిధ తపస్సుల విధానం**

* *భూమౌ విపరివర్తేత తిష్ఠేద్వా ప్రపదైర్దినమ్ ।*
స్థానాసనాభ్యాం విహరేత్సవనేషూపయన్నపః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**22**

తాత్పర్యం:- ఆవశ్యకాలైన స్నాన భోజనాది సమయాల్లో తప్ప, మిగిలిన వేళల్లో కటిక నేలపైనే మసలాలి. నిలబడటం, కూర్చోవటం, శయనించడం అన్నీ కఠిన నియమాలే అయినప్పటికీ ఆచరించాలి. రోజుకు మూడు సార్లు (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) స్నానం చెప్పబడినది.॥22॥

* *గ్రీష్మే పంచతపాస్తు స్యాద్వర్షాస్వభ్రావకాశికః ।*
ఆర్ద్రవాసాస్తు హేమంతే క్రమశో వర్ధయంస్తపః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**23**

తాత్పర్యం:- తపస్సును పెంచడానికి వేసవికాలంలో నాలుగువైపులా అగ్నిహోత్రాన్ని ఉంచి, వర్షాకాలంలో ఆరుబయట వానలకు తడుస్తూ, చలికాలంలో తడి వస్త్రాలతో కూడి తపస్సు ఆచరించాలి. ॥23॥

* **ఉపస్పృశం స్త్రిషవణం పితౄన్ దేవాంశ్చ తర్పయేత్ ।**
తపశ్చరంశ్చోగ్రతరం శోషయేద్దేహమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***24***

తాత్పర్యం:- ప్రాణమాత్రావశిష్టంగా దేహాన్ని నిలుపుకోవడం కోసం ఇంకా అవలంబించదగిన కఠిన నియమాలు ఉన్నాయి. ముప్పూటలా స్నానంతో పాటు దేవ-ఋషి-పితృ తర్పణాలు విస్మరించరాదు. పక్షోపవాసాలు, మాసోపవాసాలను ఆచరించడం మరువరాదు. దేహాన్ని కృశింప చేయడమే లక్ష్యం.॥24॥

* **అగ్నీనాత్మని వైతానాన్ సమారోప్య యథావిధి ।**
అనగ్నిరనికేతస్స్యాన్మునిర్మూలఫలాశనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***25***

తాత్పర్యం:- ఇంతకాలం నానావిధాలుగా సంరక్షించుకుని మమకారం పెంచుకున్న ఈ దేహాన్ని కృశింపజేయడం అంత సులభసాధ్యమేమీ కాదు. కాబట్టి క్రమంగా అభ్యసించాలి. మౌనవ్రతంతో ప్రారంభించి క్రమంగా ఇతర (ఉపవాసాది) వ్రతాలు మొదలుపెట్టాలి. ఆశ్రమాలలో నివాసానికి బదులు చెట్లకింద ఉండాలి.॥25॥

ప్రక్షిప్తాల పరిశీలన

17నుంచి 25 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. ఇక్కడి పూర్వాపర విషయం వానప్రస్థంలో భక్ష్య - అభక్ష్య పదార్థాలను గురించినది. ఈ శ్లోకం ఈ ప్రసంగం కన్నా భిన్నంగానూ, క్రమ భంజకంగానూ ఉంది. 13వ శ్లోకం, నుంచి వానప్రస్థంలో తినదగిన, తినదగని వాటి ప్రసంగం ప్రారంభమైంది. 14-16 శ్లోకాలలో చెప్పిన ఈ పద్ధతి వానప్రస్థంలో ఉండాలని చెప్పటానికి, 16వ శ్లోకంలో జబ్బు చేసినవారు సైతం గ్రామ్య భక్ష్య పదార్థాలు తినకూడదని ఉంది. 26లో వాటిని ఎందుకు తినకూడదో కారణం చెప్పారు. ఈ విధంగా భక్ష్య - అభక్ష్య విషయం పూర్తయిన సంకేతాన్ని ఇస్తుంది. దీని తర్వాత దానికి సంబంధించిన వికల్పాలు ఉంటాయి. ఈ వర్ణనతో 16వ శ్లోకం తర్వాత దాని కారణాన్ని చెప్పే 26వ శ్లోకం భక్ష్యా భక్ష్య విషయానికి సంబంధించిన వికల్పాలు చెప్పే 27వ శ్లోకం ఉండాలి. మధ్యలో ఈ శ్లోకాలు వాటి క్రమాన్ని పాడు చేశాయి. ఈ శ్లోకాలలో తినే పద్ధతులు [17], సంచయ పద్ధతి [18], మళ్లీ భక్ష్య పదార్థాల పద్ధతి[19-21], హఠయోగంతో కూడిన తపస్సు [22-24] మొదలైన సారహీనమైన విషయాలతో 26-27 శ్లోకాలతో క్రమం భంగమైంది.

ఖ. వానప్రస్థంలో తినదగిన పదార్థాలను గురించి 13వ శ్లోకంలో ఉంది. తినేవాటిని గురించి కావలసిన సమాచారం పూర్తి అయ్యాక 14-16లలో అభక్ష్యాలను గురించి ఉంది. దీని వల్ల, తినదగిన వాటిని గురించి ఎంత చెప్పాలనుకున్నాడో 13వ శ్లోకంతో మనువు ముగించాడనీ, ఆ తర్వాతే ఇతర విషయాలను ప్రారంభించాడనీ తెలుస్తూంది. 19-21లలోనూ, 25లోనూ మళ్లీ భక్ష్య సంబంధ విషయం, అదీ 13లోని కొన్ని అంశాలతో కలిసిన విషయం కొత్త పద్ధతిలో ప్రారంభమైంది. ఒకటే ప్రసంగంలో ఒకటి ముగిశాక మళ్లీ అవే మాటలను కొత్తగా ప్రారంభించడం సందర్భోచితం కాదు. కనుక ఇది ప్రసంగ వ్యతిరేకం.

గ. ఈ విధంగా ధాన్యాదిసంచయ చర్చ 15వ శ్లోకంలో వర్ణించబడింది. మధ్యలో వేరే చర్చను ప్రారంభించి మరల 18లో సంచయ చర్చను లేవనెత్తుట అప్రాసంగికమగుటవలన ఇది ప్రక్షిప్తమని సిద్ధమగుచున్నది.

2. అంతర్వ్యతిరేకాలు

ఈ ప్రసంగంలోని అన్ని శ్లోకాలు మనువు ముందు చెప్పబోవు విషయాలకు వ్యతిరేకము.

క. 18-19 శ్లోకాలలో ఒక దినము, ఒక మాసము, 6 మాసాలు, ఒక సంవత్సరము వరకు ధాన్యాది సంచయానికి వికల్పమీయబడినది. ఎందుకంటే 15లో సంవత్సరం మొత్తం ధాన్యాది సంచయం చేయాలని సంకేతించబడింది. 11లో వసంతము, శరదృతువులలో అన్న సంచయం చేయాలని ఉంది. ఈ విధంగా సంచయ సంబంధ సంకేతం మొదటనే చేసినందున మరల 18లో సంచయ సంబంధ ఆవశ్యకత లేనేలేదు. పైగా అన్న సంగ్రహ వ్యవస్థ సంవత్సరం పొడుగునా జరుగనే జరుగదు. ఎందుకనగా ! నీవారాది ధాన్యము ఆ ఋతువులోనే దొరుకుతుంది.

ఖ. 22-25 శ్లోకాలలో హఠయుక్త విధానాన్ని చేస్తూనే శరీరాన్ని శుష్కింప చేయాలని ఉంది. ఈ విధానము మనుసమ్మతం కాదు. ఎందుకనగా, మనువు ప్రాణాయామాన్ని వేదాధ్యయనాన్ని, జితేంద్రియతను తపస్సుగా భావించాడు. దీనిని అంగీకరించడు. [2.139 (164), 141 (166), 142 (167), 150(175), 6.70-72] వీటితో పాటు శరీరాన్ని శుష్కింపచేయని తపస్సు గురించి మనువు ఆదేశించాడు.

గ. 19వ శ్లోకంలో భోజనానికి నాలుగు సమయాలని చెప్పారు. కానీ 7,12 లలో బలి మొదలైనవి ముగించి, యజ్ఞాల తర్వాత రెండు సమయాలలో తినాలని చెప్పారు. 19లో చెప్పినది అసలు పద్ధతే కాదు. రోజులో నాలుగు సార్లు తినవచ్చు అంటే, మనిషి తన ఇష్టం వచ్చినప్పుడు తింటాడు. దీని వల్ల ఏ నియమమూ ఏర్పడదు. 20లో అమావాస్య, పూర్ణిమల దినాలలో కేవలం ఒకసారి మాత్రం నియమంగా తినాలన్నారు. కానీ మునుపటి శ్లోకాలలో అటువంటి నియమమేదీ లేదు. పైగా రకరకాల పదార్థాలు తినొచ్చు నన్నారు[5,7,12,13].

ఘ. 24వ శ్లోకంలో వానప్రస్థులు పితరులకు తర్పణా లీయాలని చెప్పాడు. మృతులైన పితరులకు తర్పణా లివ్వడం మనువుకు వ్యతిరేకం. దీనికి 3.119 నుంచి 284 శ్లోకాలపై 'అంతర్ వ్యతిరేకాలు' శీర్షిక చూడండి. ఇలా ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే!

3. పునరుక్తులు

ఒకటే ప్రసంగంలో కొన్ని అనవసరమైన విషయాలను మళ్లీ చెప్పారు -

1. 13లో వానప్రస్థులు పళ్లు కందమూలాలు తినాలని చెప్పి, ఇందులో 21లోనూ, 25లోనూ మళ్లీ అదే చెప్పారు.

2. 2-3లలో గృహాన్ని వదలిపెట్టాలని చెప్పి, 25లో మళ్లీ 'అనికేతః స్యాత్' అని గృహం వదలే పద్ధతి చెప్పారు. ఈ పునరుక్తుల వల్ల ఈ శ్లోకాలున్న విషయాన్ని ఇంకెవరో రాశారని తెలుస్తుంది.

26,27వ శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

సాంసారిక సుఖాలలో ఆసక్తుడు కాకుండా బ్రహ్మచర్యాన్ని పాటించాలి

అప్రయత్నః స్సుఖార్థేషు బ్రహ్మచారీ ధరాశయః । మూలశ్లోక సం.**16**
శరణేష్వమమశ్చైవ వృక్షమూలనికేతనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**26**

టీక:- సుఖార్థేషు అప్రయత్నః= శరీర సుఖాల కోసం అతిప్రయత్నం చేయకుండా ఉండాలి. కానీ, **బ్రహ్మచారీ** = బ్రహ్మచారి అంటే తన భార్య వెంట ఉన్నా ఆమెతో విషయసుఖాన్ని అనుభవించరాదు, **ధరాశయః** = నేలమీద నిద్రించాలి, **శరణేషు+అమమః+చ+ఏవ** = స్వకీయ పదార్థాలలో మమకారం ఉంచరాదు. **వృక్షమూల నికేతనః** = చెట్టు మూలం వద్ద నివసించాలి.

ఋషి దయానందభాష్యం:- స్త్రీ సంపర్కాన్ని (భార్య ఉన్నాసరే) వదిలిపెట్టి, జితేంద్రియత్వాన్ని అలవర్చుకొని, సుఖవిషయ ప్రయత్నాలు విరమించి, నివాసం-భోజనం-నిద్ర మొదలైన వాటిపట్ల, ఆశ్రితుల పట్ల, స్వంత వస్తువులపట్ల మమకారం/ పట్టింపులేనివాడై చెట్ల మొదళ్లవద్దనే ఉండాలి. (స.ప్ర.5వ సము.)॥26॥

వివరణ:

26వ శ్లోకానికి వివరణ:

26వ శ్లోకంలో గ్రామోత్పన్నాలైన పదార్థాలను ఎవరు బహూకరించినా గ్రహించరాదని నిషేధం. ఈ శ్లోకంలో అందుకు కారణం చెప్పబడింది. వానప్రస్థుడు సుఖసాధనాలలో ఆసక్తుడు కాకూడదు. అప్పుడే అతను మోహ- మమకారాల నుండి విముక్తుడు కాగలడు. అలా కానట్లయితే విషయలోలుడయ్యే అవకాశముంది. సన్న్యాసి విషయంలో ఈ విషయాన్నే మరొకరకంగా స్పష్టపరచాడు.

శ్లో॥ "భైక్షే ప్రసక్తో హి యతిర్విషయేష్వపిసజ్జతి" మను.6.55

అంటే భిక్షను ఆశించే సన్న్యాసి విషయజాలంలో చిక్కుకొనే అవకాశముంది. ఇదే భావన 16 మరియు 26 శ్లోకాలకు మూలం.

తాపసికుల గృహాలనుండే భిక్షా గ్రహణం **ఇది మనుకృతం-ప్రామాణికం**

తాపసేష్వేవ విప్రేషు యాత్రికం భైక్షమాహరేత్ । మూలశ్లోక సం.**17**
గృహమేధిషు చాన్యేషు ద్విజేషు వనవాసిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**27**

టీక:- తాపసేషు + ఏవ విప్రేషు = ఎవరు అరణ్యంలో వేదాధ్యాపనం చేయడానికి, యోగాభ్యాసం చేయడానికి వెళ్ళిన తాపసికులు, విద్వాంసులున్నారో వారి గృహాలకు, **అన్యేషు గృహమేధిషు ద్విజేషు వనవాసిషు** = వనవాసం చేస్తున్న గృహస్థులు లేదా వాసప్రస్థులు ఉన్నట్లయితే వారి గృహాల నుండి, **భైక్ష్యం +ఆహరేత్** = భిక్షను తీసికోవాలి, **యాత్రికం** = జీవనయాత్రకు అవసరమైనంతవరకే.

ఋషి దయానందభాష్యం:- వానప్రస్థియైనవాడు అవసరమొచ్చినప్పుడు తపస్వులైన బ్రాహ్మణులనుండి అన్యగృహస్థులనుండి, అడవిలో నివసించు బ్రాహ్మణుల నుండి భిక్ష గ్రహింపవచ్చు. (స.వి.వా.ప్ర.) ॥27॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *గ్రామాదాహృత్య వాశ్నీ యాదష్టౌ గ్రాసాన్ వనే వసన్ ।*
ప్రతిగృహ్య పుటేనైవ పాణినా సకలేన వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.***28***

తాత్పర్యం:- ఆ ప్రకారం తమ వర్ణంవారైనా వానప్రస్థుడై కనిపించినప్పుడు, ఒక చిల్లపెంకులలోనో, ఆకులోనో, చివరికి దోసిటిలోనైనా ఎనిమిది కబళాల (ముద్దల) ఆహారాన్ని సమీప గ్రామంలోని ఉత్తముల నుంచి భిక్షగా తీసుకోవచ్చు! ఈ పరిమాణం మించరాదు.॥28॥

ప్రక్షిప్త పరిశీలన

1. అంతర్ వ్యతిరేకాలు

16వ శ్లోకంలో బాధలలో ఉన్న గ్రామవాసుల నుంచి వానప్రస్థులు అన్నం, ఫలాలు తీసుకోవడం నిషేధమని ఉంది. ఈ శ్లోకంలో దానికి వికల్పంగా గ్రామాల నుంచి భిక్ష తీసుకోవచ్చుననటం ఆ శ్లోకానికి వ్యతిరేకంగా చెప్పబడి ఉంది. 27వ శ్లోకంలో వానప్రస్థులు భిక్ష తీసుకోవచ్చునని కూడా ఉంది. అక్కడ కూడా కేవలం వనవాసులైన వానప్రస్థులు

బ్రాహ్మణుల నుంచి భిక్ష గ్రహించ వచ్చని ఉంది- **"తాపసే ష్వేవ విప్రేషు...వనవాసిషు."** ఇందులోనూ గ్రామం నుంచి భిక్ష నిషేధం అని ఉంది. ఈ శ్లోకం పైన చెప్పిన పద్ధతులకు వ్యతిరేకం.

29,30 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఆత్మశుద్ధి కోసం వేదమంత్రాల మననం-

ఏతాశ్చాన్యాశ్చ సేవేత దీక్షా విప్రో వనే వసన్ । మూలశ్లోక సం.**18**
వివిధాశ్చౌపనిషదీరాత్మసంసిద్ధయే శ్రుతీః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**29**

టీక:- వనే వసన్ = ఈ ప్రకారంగా వనంలో నివసిస్తూ, **ఏతాః చ +అన్యాః దీక్షాః సేవేత** = వీటిని మరికొన్ని అన్య దీక్షలను పాటించాలి, **చ** = మరియు, **ఆత్మ సంసిద్ధయే** = ఆత్మ పరమాత్మ జ్ఞానం కోసం, **వివిధాః ఔపనిషదీః శ్రుతీః** = నానా విధాలైన ఉపనిషత్తులను, జ్ఞాన ఉపాసనా విషయయుక్త శ్రుతులను అర్థసహితంగా తెలిసికొని ఆచరించాలి.

ఋషి దయానందభాష్యం:- వానప్రస్థాశ్రమ నియమాలు కఠినతరములని భావించరాదు. జీవితంలో అంత్యదశయందైనా మమకారం వీడనివారికి ముక్తిరమ్మంటే రాదు కదా! మోక్ష సాధనకవసరమైన అన్ని ఏర్పాట్లను చేసుకోడానికి ఇది మంచి తరుణం. బ్రహ్మజ్ఞానం పొందడానికి ధార్మికత అవలంబించాలి. (సం.వి.వా.ప్ర.).॥29॥

వివరణ: ఇక్కడ ఉపనిషత్తులంటే పుస్తక విశేషమని కాదు. ఉపనిషద్విద్య అని అభిప్రాయం.

ఇది మనుకృతం. ప్రామాణికం

ఋషిభిర్బ్రాహ్మణైశ్చైవ గృహస్థైరేవ సేవితాః । మూలశ్లోక సం.**19**
విద్యాతపోవివృద్ధ్యర్థం శరీరస్య చ శుద్ధయే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**30**

టీక:- ఋషిభిః+బ్రాహ్మణైః గృహస్థైః ఏవ = ఋషులు, బ్రాహ్మణులు, గృహస్థులు కూడా, **విద్యా+తపః వివృద్ధ్యర్థం** = విద్య తపస్సు అభివృద్ధి కోసం, **చ** = మరియు, **శరీరస్య శుద్ధయే** = శరీరశుద్ధి కోసం, **సేవితాః** = ఈ దీక్షలను శ్రుతులను సేవించాలి.

తాత్పర్యం:- ఋషులు, బ్రాహ్మణులు, గృహస్థులు కూడా విద్య, తపస్సు అభివృద్ధికోసం, శరీర శుద్ధికోసం ఈ దీక్షలను, శ్రుతులను సేవించారు.॥30॥

31,32 శ్లోకాలు ప్రక్షిప్తం-ప్రామాణికం కావు

* *అపరాజితాం వాఽఽస్థాయ వ్రజేద్ధిశమజిహ్మగః ।*
ఆనిపాతాచ్ఛరీరస్య యుక్తో వార్యనిలాశనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*31*

తాత్పర్యం:- చికిత్సలకు లొంగని వ్యాధులు ఏవైనా అంకురిస్తే, ఈశాన్య దిక్కుకు అభిముఖంగా వెళ్లగలిగినంత దూరం సాగిపోతూ, (ఇక త్వరలో తన దేహయాత్ర ముగియనున్నదని గ్రహించి) జలం, గాలి, తీసుకొంటూ (నిరాహారుడై) శరీరం భూపతనం చెందేవరకు మహాప్రస్థానం కొనసాగించాలి.॥31॥

* *ఆసాం మహర్షిచర్యాణాం త్యక్త్వాఽన్యతమయా తనుమ్ ।*
వీతశోకభయో విప్రో బ్రహ్మలోకే మహీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**32**

తాత్పర్యం:- ఈపైన చెప్పబడిన యావత్ చర్యలలో క్రమంగా ఒక్కొక్క దానిచేత దేహాభిమానాన్ని పరిత్యజిస్తూ, చివరిదైన మహాప్రస్థానం (సాగిపోవడం) రోగరహితులయిన వారుకూడా చేయవచ్చు.

ప్రక్షిప్తాల పరిశీలన

31-32 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

అంతర్విరోధాలు

క. 31వ శ్లోకంలో వానప్రస్థులు కేవలం నీరు, గాలి స్వీకరించాలని 6.5,7,11,12 శ్లోకాలకు వ్యతిరేకంగా ఉంది. వీటిలో అనేక భోజ్య పదార్థాలు చెప్పారు.

ఖ. 32లో వ్యక్తులు మరణపర్యంతం వానప్రస్థులై ఉండాలని సంకేతం ఉంది. ఇది 33-34 శ్లోకాలకు వ్యతిరేకం. ఎందుకంటే మనువు సమయానుకూలంగా ఆశ్రమాలు మార్చాలనీ, అది అందరికీ వర్తిస్తుందనీ చెప్పాడు.

గ. 31వ శ్లోకంలో 'అపరాజిత దిశ'లో వెళ్లటాన్ని గురించి చెప్పటం మనువు చెప్పినట్లు తోచదు. మనువు చెప్పింది కేవలం ముక్తి లేదా బ్రహ్మశరణు పొందటమే [6.82; 4.260; 12.116,125].

సన్న్యాస ధర్మ విషయం

33వ శ్లోకం నుండి 85వ శ్లోకం వరకు

సన్న్యాస గ్రహణ విధానం ఇది మనుకృతం-ప్రామాణికం

వనేషు చ విహృత్యైవం తృతీయం భాగమాయుషః । మూలశ్లోక సం.**20**
చతుర్థమాయుషో భాగం త్యక్త్వా సఙ్గాన్పరివ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**33**

టీక:- ఏవం వనేషు ఆయుషః తృతీయం భాగమ్ విహృత్య = ఈ ప్రకారంగా అరణ్యాలలో ఆయుష్షులో మూడోభాగం (25 సం॥) అంటే అధికాధికం 25 సం॥లు, న్యూనాతిన్యూనం 12 సం॥ విహరించి, **ఆయుషః చతుర్థమ్ భాగం** = ఆయుష్షులో నాలుగో భాగం అంటే 70 సం॥ తరువాత, **సఙ్గాన్ త్యక్త్వా** = అన్ని రకాలైన మోహాది సంగమాలను వదిలి, **పరివ్రజేత్** = పరివ్రాజకుడు (సన్న్యాసి) కావాలి.

ఋషి దయానందభాష్యం:- ఈ విధంగా తన ఆయుష్షులో మూడో భాగాన్ని వానప్రస్థాశ్రమంలో గడిపి, ఆయుష్షులో నాలుగో భాగం అంటే 70 సం॥ తరవాత అన్నిరకాలైన మోహాది సంగమాలను వదిలి సన్న్యాసి కావలి. ఈ విధంగా ఆయుష్షులో మూడో భాగంలో అంటే 55 సం ॥ నుండి 75 సం॥ వరకు వానప్రస్థుడుగా ఉండి, ఆయుష్షులో 4వ భాగంలో సర్వసంగములను విడిచిపెట్టి పరివ్రాట్ (సన్న్యాసి) కావాలి. (స.ప్ర. 5వ సము.)॥33॥

వివరణ:

పరివ్రాజక శబ్దోత్పత్తి-పరివ్రజనమంటే సన్న్యాసం తీసికోవడం

"పరితాం వ్రజతి ఇతి పరివ్రాజకః" సాంసారిక కోరికలను వదిలిపెట్టి లోకోపకారానికి తిరుగుతుండాలి. ఇదే సన్న్యాసం. సన్న్యాసి గురించి శ్రీ దయానంద మహర్షి ఇలా రాశారు. ఎవరు మోహాది ఆవరణంలో పక్షపాతాన్ని వదిలి విరక్తుడై లోకమంతా పరోపకారార్థం భ్రమణం చేస్తాడో అతడు పరివ్రాజకుడు. అదే సన్న్యాస-సంస్కారం **"సమ్యజ్ న్యస్యన్తి" అధర్మాచరణాని, యేన వా సమ్యజ్ నిత్యం సత్కర్మస్వాస్తే ఉపవిశతి స్థిరీభవతి యేన సన్న్యాసో విద్యతే యస్య స సన్న్యాసీ"** (సం.వి.సన్న్యాస ప్రకరణం).

34,35వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *ఆశ్రమాదాశ్రమం గత్వా హుతహోమో జితేంద్రియః ।*
భిక్షాబలిపరిశ్రాంతః ప్రవ్రజన్ ప్రేత్య వర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**34**

తాత్పర్యం:- ఒక ఆశ్రమవ్యవస్థ నుంచి మరో ఆశ్రమవ్యవస్థ లోకి మారడానికి, శక్తిమేరకు కృషి చేయాలి. గృహస్థాశ్రమమే బాగుందని చివరివరకు దానిలోనే ఉండిపోరాదు. అలాగే-కష్టతరంగా తోస్తున్నదని సన్న్యాసాశ్రమాన్ని కోరకుండా ఉండరాదు. పరలోక సౌఖ్యానికి కూడా ఈ దేహం ఉన్నప్పుడే బాటలు వేసుకోగలవాడే బ్రహ్మజ్ఞాని.॥35॥

* *ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ।*
అనపాకృత్య మోక్షం తు సేవమానో వ్రజత్యధః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**35**

తాత్పర్యం:- మూడురకాల ఋణాలుంటాయి. దేవ ఋణం, ఋషి ఋణం, పితరుల ఋణం. వీటిని తీర్చాకనే మనస్సును మోక్షమార్గంలోకి మళ్లించాలి. ఈ మూడు తీర్చక సన్న్యాసం స్వీకరించినవాడు నరకాన్నే పొందుతాడు.

ప్రక్షిప్తాల పరిశీలన

34,35 శ్లోకాలు ఈ క్రింది ఆధారల ప్రకారం ప్రక్షిప్తాలు.

1. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకంలో ముందుగల మూడు ఆశ్రమాలను పాటించకుండా మోక్ష ప్రాప్తిని కోరువాడు అధోగతి పొందుతాడని రాయబడింది. ఇది మనువిరుద్ధము. మనువు 6.88లో 'అన్ని ఆశ్రమాలు పరమ గతిని ఇచ్చేవే' అని తెలిపాడు. కావున నేరుగా సన్న్యాసాశ్రమాన్ని పొందువాడు అధోగతి చెందుతాడనడం మనువిరుద్ధం.

ఖ. 6.38-41 శ్లోకాలలో గృహస్థా శ్రమం నుండి నేరుగా సన్న్యాసం తీసుకోవాలని ఉంది. కావున ఈ శ్లోకం మనువిరుద్ధము.

గ. 2.244లో కూడా బ్రహ్మచర్యాశ్రమం నుండి కూడా నేరుగా సన్న్యాసం తీసుకోవచ్చునని ఉన్నది. కావున దీనికి కూడా ఈ శ్లోకం విరుద్ధం. కావున ఈ రెండు శ్లోకాలు ప్రక్షిప్తాలు.

సన్న్యాస ధారణ-

ఇది మనుకృతం-ప్రామాణికం

అధీత్య విధివద్వేదాన్ పుత్రాంశ్చోత్పాద్య ధర్మతః । మూలశ్లోక సం.**22**
ఇష్ట్వా చ శక్తితో యజ్ఞైర్మనో మోక్షే నివేశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**36**

టీక:- విధివత్ వేదాన్ అధీత్య = శాస్త్ర విధిననుసరించి బ్రహ్మచర్యాశ్రమంలో వేదాలన్నిటినీ అధ్యయనం చేసి, **ధర్మతః పుత్రాన్ చ ఉత్పాద్య** =గృహాశ్రమియై ధర్మానుసారంగా బిడ్డలను కని, **శక్తితః యజ్ఞైః ఇష్ట్వా** = వానప్రస్థాశ్రమంలో సామర్థ్యానుసారంగా యజ్ఞాలొనరించి, **మోక్షే మనః నివేశయేత్** = మోక్షంలోనూ, సన్న్యాసాశ్రమంలోనూ మనస్సును లగ్నం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- విధిప్రకారం వేదాలను అధ్యయనం చేయడం; గృహాశ్రమంలో, సన్మార్గవర్తనుడై పుత్రులను కనడం; శక్తికొద్దీ జ్యోతిష్టోమాది యాగములు నిర్వర్తించాలి. మోక్షం వైపు, సన్న్యాసం వైపు మనస్సు మరల్చాలి. బాధ్యతలను విస్మరించి సన్న్యాసాశ్రమ స్వీకారం చేయకూడదు. (సం.వి.స.ప్ర.)॥36॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* అనధీత్య ద్విజో వేదాననుత్పాద్య తథా సుతాన్ ।
అనిష్ట్వా చైవ యజ్ఞైశ్చ మోక్షమిచ్ఛన్ వ్రజత్యధః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **37**

తాత్పర్యం:- వేదాలను అధ్యయనం చేయకపోవడం, ధర్మబద్ధంకాని వేళల్లో నిజభార్యయందు పుత్రోత్పత్తి చేయడం, యజ్ఞయాగాదులను చేయకపోవడం అబ్రాహ్మణ కృత్యములు. ఇలాంటివారికి నరకమే గతి.

ప్రక్షిప్త పరిశీలన

అంతర్ వ్యతిరేకాలు:- మునుపటి మూడు ఆశ్రమాలను పాలించకుండానే మోక్షేచ్ఛతో సన్న్యాసాన్ని స్వీకరించడం అధోగతి పొందడమని చెప్పడం మనువుకు విరుద్ధం. దీని గురించి వివరంగా తెలుసుకొనుటకు 6.35వ శ్లోకంలో గల అంతర్విరోధ శీర్షికను చదువగలరు.

38 నుండి 43వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

గృహస్థాశ్రమం నుండి కూడా సన్న్యాసం తీసికోవచ్చు

ప్రాజాపత్యాం నిరూప్యేష్టిం సర్వవేదసదక్షిణామ్ । మూలశ్లోక సం. **22**
ఆత్మన్యగ్నీన్ సమారోప్య బ్రాహ్మణః ప్రవ్రజేద్గృహాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **38**

టీక:- **ప్రాజాపత్యాం సర్వ వేదసదక్షిణామ్ ఇష్టిం నిరూప్య** = ప్రజాపతి అయిన పరమాత్మ ప్రాప్త్యర్థం - ప్రాజాపత్యేష్టిని నిర్వహించి, అందులో యజ్ఞోపవీతాన్ని, శిఖ (పిలకజుట్టు)ను వదిలివేసి, **అగ్నీన్ ఆత్మని సమారోప్య** = ఆహవనీయ, గార్హపత్య దాక్షిణాత్యాలనే పేరు గల అగ్నులను ఆత్మలో ఆరోపించుకొని, **బ్రాహ్మణః గృహాత్ ప్రవ్రజేత్** = బ్రాహ్మణుడు గృహస్థాశ్రమం నుండే సన్న్యాసం తీసికోవచ్చు.

ఋషి దయానందభాష్యం:- ప్రజాపతి అయిన పరమాత్మ ప్రాప్త్యర్థం- ప్రాజాపత్యేష్టిని నిర్వహించి అందులో యజ్ఞోపవీతాన్ని, శిఖ వదిలివేసి, ఆహవనీయ, గార్హపత్య దాక్షిణాత్యాలనే పేరు గల అగ్నులను ఆత్మలో ఆరోపించుకొని, బ్రాహ్మణుడు గృహస్థా శ్రమం నుండే సన్న్యాసం తీసికోవచ్చు. (సం.వి.స.ప్ర.).

ప్రజాపతి అంటే పరమాత్మ, తత్ప్రాప్తి కోసం, ఇష్టి (యజ్ఞం) నిర్వహించి అందులో యజ్ఞాది శిఖాచిహ్నాలను వదిలిపెట్టి, ఆహావనీయాది పంచాగ్నులను, ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమానమనే పంచప్రాణాలలో ఆరోపించి బ్రాహ్మణుడు అంటే బ్రహ్మవిదుడు గృహం నుండి బయటికి వచ్చి సన్న్యాసి కావాలి (స.ప్ర.6వ సము.). ॥38॥

వివరణ

మొదటి పద్ధతి:-వానప్రస్థాశ్రమం నుండి సన్న్యాసాశ్రమం స్వీకరించడానికి సామాన్య పద్ధతి (6-20). ఈ క్రమాన్ననుసరించి మనుషుడు సంసారం నిస్సారమని, అందుండే కష్టాలను అనుభవించి, కామాది వికారాలు శాంతం కాగా, అతడిలో వైరాగ్య సంస్కారాలు ఉత్పన్నం కావడం మొదలవుతాయి. కానీ విశేష పరిస్థితులలో బ్రహ్మచర్యాశ్రమం నుండి, గృహస్థాశ్రమం నుండి కూడా నేరుగా సన్న్యాసాశ్రమ విధానాన్ని స్వీకరించవచ్చని 6.36-40శ్లోకాలలో చెప్పబడింది. ఎప్పుడు మానవుడు కామాది వికారాలను జయించగలుగుతాడో, అప్పుడు పూర్ణ విరాగిగా మారిపోతాడు. అప్పుడు వానప్రస్థాశ్రమానికి ముందుగనే సన్న్యాసాన్ని స్వీకరించవచ్చు అని 6.25వ శ్లోకంలో స్పష్టపరచారు. ఈ ప్రకారంగా 38,42 శ్లోకం వైకల్పిక విశేష విధానాన్ని సూచిస్తుంది. ఈ కారణంగా 6.33 శ్లోకంతో దీనికి విరోధం లేదు.

రెండో పద్ధతి

"యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్, వనాద్వా
గృహాద్వా (బ్రాహ్మణం, గ్రంథవాక్యమిది")

అర్థం: ఏ రోజు, వైరాగ్యం తీవ్రతరంగా కలుగుతుందో, అదే రోజున వానప్రస్థాశ్రమ సమయం పూర్తి అయినా, కాకపోయినా, వానప్రస్థానుష్ఠానం చేయకుండానే గృహస్థాశ్రమం నుండే, సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించవచ్చు. కారణమేమంటే సన్న్యాసానికి ముఖ్యంగా కావలసినది-దృఢమైన వైరాగ్యం, యథార్థ జ్ఞానమే.

మూడో పద్ధతి

"బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్"

ఇది కూడా బ్రాహ్మణం గ్రంథంలోనిదే. బ్రహ్మచర్యాన్ని పూర్ణంగా, అఖండితంగా ఆచరించి పూర్ణంగా జ్ఞాన-విజ్ఞానాలను సంపాదించి, విషయాసక్తి కోరిక మనస్సు నుండి పూర్ణంగా దూరమైనప్పుడు పక్షపాతరహితంగా సర్వప్రాణులకు ఉపకారం చేయాలనే సంకల్పమున్నప్పుడు. "మరణపర్యంతం సన్న్యాసాశ్రమ ధర్మాలను నిర్వహించగలననే దృఢమైన నమ్మకమున్నప్పుడు, అప్పుడతడు గృహస్థాశ్రమం వానప్రస్థాశ్రమం కూడా స్వీకరించకుండానే, బ్రహ్మచర్యాశ్రమాన్ని పూర్తిచేసిన తర్వాత మాత్రమే సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించవచ్చు (సం.వి.సన్న్యాస).

ఇది మనుకృతం-ప్రామాణికం

యో దత్త్వా సర్వభూతేభ్యః ప్రవ్రజత్యభయం గృహాత్ । మూలశ్లోక సం.23
తస్య తేజోమయా లోకా భవన్తి బ్రహ్మవాదినః ॥ ప్రక్షిప్త శ్లోక సం.39

టీక:- యః సర్వభూతేభ్యః అభయం దత్త్వా = ఏ పురుషుడు సర్వప్రాణులకు అభయ దానం, సత్యోపదేశం ఇచ్చి, **గృహాత్ ప్రవ్రజతి** = గృహస్థాశ్రమం నుండి సన్న్యాసాన్ని స్వీకరిస్తాడో, **తస్య బ్రహ్మవాదినః తేజోమయా లోకా భవన్తి** = బ్రహ్మవాది వేదోక్త సత్యోపదేశకుడైన ఆ సన్న్యాసికి మోక్షలోకం, లోకలోకాంతరాలు తేజోమయమవుతాయి. జ్ఞానం వల్ల ప్రకాశమయమవుతాడు. ఎవరు సర్వప్రాణులకు అభయ దానమిచ్చి గృహాన్ని వదిలి సన్న్యాసం స్వీకరిస్తాడో, బ్రహ్మవాదిగా, పరమేశ్వర ప్రకాశిత వేదోక్త ధర్మం మొ॥ విద్యలను ఉపదేశిస్తూ ఉంటాడో, అలాంటి సన్న్యాసికి ప్రకాశమయ లోకాలు ముక్తికి సంబంధించిన ఆనందస్వరూప లోకాలు ప్రాప్తిస్తాయి.

ఋషి దయానందభాష్యం:- ప్రాణిహింస తలపెట్టక, సృష్టిలోని సకల భూతములు తన వంటివే అని తలచి గృహస్థాశ్రమాన్నుంచి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరిస్తాడో; బ్రహ్మప్రతిపాదకములయిన ఉపనిషత్తులయందు ఎవరికి శ్రద్ధ ఉందో అలాంటివారి తేజస్సు చేతనే బ్రహ్మలోకంలో వెలుగులు తేజోమయమవుతాయి. (సం.వి.స.ప్ర.).॥39॥

వివరణ:

సన్న్యాసి ద్వారా అభయప్రదానం-సన్న్యాసికి సర్వప్రాణులందు ద్వేషభావముండదు. ఈ కారణంగా సన్న్యాసి అందరికీ అభయదానం చేస్తాడు. ఈ అభయదానమునకు సంబంధించిన ప్రతిజ్ఞ బ్రాహ్మణ గ్రంథాలలో ఈ ప్రకారంగా ఉంది.

"పుత్రైషణా విత్తైషణా లోకైషణా మయాపరిత్యక్తా, మత్తః ।
సర్వభూతేభ్యోఽభయమస్తు" శత.14-6-4-1

ఈ ప్రపంచంలో మూడు (3) ఈషణలు (కోరికలు) ఉన్నాయి.

1. సంతానప్రాప్తి, 2. ధనప్రాప్తి, 3. ప్రసిద్ధి ప్రాప్తి. వీటికి వశీభూతుడై ఈర్ష్యాద్వేషాదులలో చిక్కుకుంటాడు. వీటి నుండి పూర్తిగా బయటపడిన మానవుడే సన్న్యాసి అవుతాడు. అప్పుడు అతడిని చూసి ఎవరూ భయపడరు. నిర్భయంగా ఉంటారు.

ఇది మనుకృతం-ప్రామాణికం

యస్మాదణ్వపి భూతానాం ద్విజాన్నోత్పద్యతే భయమ్ । మూలశ్లోక సం. **24**
తస్య దేహాద్విముక్తస్య భయం నాస్తి కుతశ్చన ॥ ప్రక్షిప్త శ్లోక సం. **40**

టీక:- యస్మాత్ ద్విజాత్ = అలాంటి ద్విజుడి నుండి, **భూతానాం అణు+అపి భయమ్ న ఉత్పద్యతే** = ప్రాణులకు కొంచెం కూడా భయముండదు, **తస్య** = అతడికి, **దేహాత్ విముక్తస్య** = దేహవిమోచనానంతరం, **కుతశ్చన భయం న అస్తి** = ఎక్కడ నుండి కూడా భయముండదు.

తాత్పర్యం:- ఏ ద్విజుడి వల్ల సకలభూతాలకు కొంచెమైనా భీతికలుగదో అలాంటి వాడి దేహ విముక్తి పుణ్యదాయకం. అతని వల్ల ఏ ప్రాణికీ ఆపద వస్తుందన్న భయం లేదు. ఏ ప్రాణివల్లా అతడికీ ఆపద ఉండదు.॥40॥

పూర్ణవైరాగ్యంతో నేరుగా సన్న్యాసాన్ని స్వీకరించవచ్చు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఆగారాదభినిష్క్రాంతః పవిత్రోపచితో మునిః । మూలశ్లోక సం. **25**
సముపోఢేషు కామేషు నిరపేక్షః పరివ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **41**

టీక:- కామేషు సముపోఢేషు నిరపేక్షః = సర్వకామములను జయించినప్పుడు వాటి మీద అపేక్ష ఉండదు, **పవిత్ర+ఉపచితః** = పవిత్రాత్మ, పవిత్రాంతఃకరణ గల, **మునిః** = మనన శీలుడవుతాడో, **ఆగారాత్ + అభినిష్క్రాన్తః** = అప్పుడు గృహాశ్రమాన్ని త్యజించి, **పరివ్రజేత్** = సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించవచ్చు, లేదా బ్రహ్మచర్యాశ్రమం నుండి నేరుగా సన్న్యాసాన్ని తీసికోవచ్చు.

ఋషి దయానందభాష్యం:-సర్వకామములను జయించినప్పుడు వాటిమీద అపేక్ష ఉండదు. పవిత్రాత్మ గల మననశీలుడవుతాడో అప్పుడు గృహాశ్రమాన్ని త్యజించి, సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించవచ్చు. లేదా బ్రహ్మచర్యాశ్రమం నుండి నేరుగా సన్న్యాసాన్ని తీసుకోవచ్చు. (స.ప్ర. 6వ సము.). ॥41॥

సన్న్యాసి ఏకాకిగా పర్యటించాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఏక ఏవ చరేన్నిత్యం సిద్ధ్యర్థమసహాయవాన్ । మూలశ్లోక సం. **26**
సిద్ధిమేకస్య సంపశ్యన్న జహాతి న హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **42**

టీక:- ఏకస్య సిద్ధిమ్ సంపశ్యన్ = ఏ ఒక్కరికైనా ముక్తిలభించుననే భావనతో, **సిద్ధ్యర్థమ్** = మోక్షసిద్ధి కోసం, **అసహాయవాన్** = ఎవరిని ఆశ్రయించకుండా, **నిత్యం** = సర్వదా, **ఏకః+ఏవ చరేత్** = ఒంటిరిగానే సంచరిస్తూ ఉండాలి. ఏ మిత్ర-పుత్ర-పౌత్ర సంబంధాల నుండి సహాయం తీసికోకుండా ఉన్నందువల్ల, **న జహాతి నహీయతే** = అతడు ఎవరికీ సన్నిహితుడు కాడు. అతడికి ఎవరూ సన్నిహితులు కారు. అంటే అతడు మోహరహితుడు అవుతాడు. మృత్యుసమయంలో దూరమవుతున్నాననే బాధ సమాప్తమైపోతుంది.

ఋషి దయానందభాష్యం:- మోక్షసిద్ధి కోసం ఒంటరిగానే తపించాలి తప్ప, తోడు కోరరాదు. మోక్షప్రాప్తికి ఈ నిబంధన మరింత ముఖ్యం. ఒంటరిగా ప్రయత్నించడం అంటే అన్నిటినీ వదిలి వేయడం. దీనివల్ల మొదట ఆ యా వస్తుసంచయం వల్ల కలిగే సుఖదుఃఖాది ద్వంద్వాలనుంచి బయటపడతాడు. తద్వారా వాటిపట్ల మమకారాన్ని వదులుకోగలవాడవుతాడని అర్థం. (సం.వి.సన్న్యా.ప్ర.)॥42॥

సన్న్యాసి నిర్లిప్త భావనతో గ్రామంలో భిక్షను స్వీకరించాలి-

ఇది మనుకృతం-ప్రామాణికం

అనగ్నిరనికేతస్స్యాద్గ్రామమన్నార్థమాశ్రయేత్ ।
ఉపేక్షకోఽసంకుసుకో మునిర్భావసమాహితః ॥

మూలశ్లోక సం. **27**
ప్రక్షిప్త శ్లోక సం. **43**

టీక:- ఆ సన్న్యాసి, **అనగ్నిః** = ఆహవనీయాది అగ్నులను వదిలిపెట్టి, **అనికేతః** = మరియు ఎక్కడ కూడా స్వాభిమతమైన గృహబంధముండదో, **అన్నార్థం గ్రామమ్ ఆశ్రయేత్** = అన్న వస్త్రాదుల కోసమే గ్రామాన్ని ఆశ్రయించాలి. **ఉపేక్షకః** = దుష్టులను ఉపేక్షిస్తూ, **అసంకుసుకః** = మరియు స్థిరబుద్ధి గలిగి, **మునిః** = మననశీలుడై, **భావసమాహితః** = పరమేశ్వరుడి యందు స్థిరబుద్ధి కలవాడై, **స్యాత్** = చరించాలి.

ఋషి దయానందభాష్యం:- ఆ సన్న్యాసి ఆహవనీయాది అగ్నులను వదిలిపెట్టి, ఎక్కడ కూడా స్వాభిమతమైన గృహబంధముండక, అన్న వస్త్రాదుల కోసమే గ్రామాన్ని ఆశ్రయించాలి. దుష్టులను ఉపేక్షిస్తూ, స్థిరబుద్ధి గలిగి, మననశీలుడై పరమేశ్వరుడి యందు స్థిరబుద్ధి కలవాడై చరించాలి.॥43॥

వివరణ

'అనగ్నిః' అనగా :- అనగ్నిపద ప్రసంగంలో మహర్షి దయానందులవారు ఈ కింది విధంగా విశిష్టమైన వ్యాఖ్య (టిప్పణి) చేశారు.

ఈ పదం వల్ల భ్రాంతి చెంది సన్న్యాసులకు దహన సంస్కారం చేయడం లేదు. సన్న్యాసులు అగ్నిని తాకడం లేదు. ఈ పాపం సన్న్యాసులను పట్టి పీడుస్తుంది. ఇక్కడ ఆహవనీయాది నామకమైన అగ్నులను విడువమని సూచన. అంతేకాని అగ్ని స్పర్శను లేదా దహనకర్మను విడువమని కాదు (సం.వి.అన్త్యేష్టి).

'ఉపేక్షకః' అనే పదానికి శరీరం రోగగ్రస్థమైనా చికిత్స కోసం ప్రయత్నించరాదని వ్యాఖ్యాకారులు చేసిన వ్యాఖ్య అవ్యవహారికమే కాక యుక్తియుక్తం కూడా కాదు.

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* **కపాలం వృక్షమూలాని కుచేలమసహాయతా ।**
సమతా చైవ సర్వస్మిన్నేతన్ముక్తస్య లక్షణమ్ ॥

ప్రక్షిప్త శ్లోక సం. **44**

తాత్పర్యం:- భిక్షకోసం మట్టిమూకుడు చిప్పగాని, చెట్లవేర్లతో తయారైన/ఆకులతో తయారైన దొన్నెగాని, కపాలపు చిప్పగాని ఉపయోగించాలి. మాన సంరక్షణార్థ కౌపీనంగా చెట్ల ఆకులు గాని, నారవస్త్రం గాని ధరించాలి. బ్రహ్మమును అన్నింటా దర్శించే సమత్వబుద్ధి ఉండాలి.॥44॥

ప్రక్షిప్త పరిశీలన: 44వ శ్లోకం క్రింది ప్రమాణాల ఆధారంగా ప్రక్షిప్తము.

ప్రసంగ వ్యతిరేకము: క. ఇక్కడ సన్న్యాసుల- పరివ్రాజకుల నిర్దేశ విధివిధానాల చర్చనడుస్తున్నది. ముక్తి గురించి పూర్వాపర ప్రసంగమే లేదు. కావున ఈ శ్లోకం ప్రసంగ విరుద్ధం కావడం వలన ఇది ప్రక్షిప్తము.

ఖ. నడుస్తున్న ప్రసంగం మధ్యలో వేరే విషయాన్ని తీసుకురావడం దాన్ని చర్చించడం అప్రసంగము-ప్రసంగ విరుద్ధము అవుతుంది. చెప్పాలనుకున్న విషయాన్ని ముందుగాని తర్వాత గాని చెప్పాలి కాని ఇంకొక విషయం మధ్యలో చెప్పకూడదు. ఈ కారణంతో ఈ శ్లోకంలో గల విషయం ప్రక్షిప్తం.

45 నుండి 49వ శ్లోకాల వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

జనన మరణాలపై సమదృష్టి-

నాభినందేత మరణం నాభినందేత జీవితమ్ । మూలశ్లోక సం.**28**
కాలమేవ ప్రతీక్షేత నిర్దేశం భృతకో యథా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**45**

టీక:- **న జీవితమ్ అభినందేత** = తన జీవితాన్ని అభినందించరాదు, **న మరణం అభినందేత** = మృత్యువును చూసి దుఃఖపడరాదు, **యథా** = ఏ విధంగా, **మృతకః నిర్దేశం** = క్షుద్రసేవకుడు తన యజమాని ఆజ్ఞ కోసం ఎదురు చూస్తూ ఉంటాడో, అలాగే, **కాలమ్+ఏవ+ప్రతీక్షేత** = కాలం కోసం మృత్యువు కోసం ప్రతీక్షిస్తూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- తిరిగి జన్మించాలన్న కోరిక గాని (ఇష్టమైన జన్మకోసం), మరణం త్వరగా సంఘటిల్లాలని గాని కోరుకోకూడదు. తనకు తానుగా కాలం తీరినప్పుడు వచ్చే, మరణం కోసం నిరీక్షిస్తూ గడపాలి. అది కూలివాడు కూలికోసం నిరీక్షించడంతో పోల్చబడింది. (సం.వి.సన్న్యా.ప్ర.) ॥45॥

వివరణ

కాలప్రతీక్ష ఎలా చేయాలి? యజమాని-సేవికుని ఉదాహరణ: సన్న్యాసి మృత్యు భయాన్ని తన మనస్సులోకి రానీయకూడదు. అయితే సృష్టి నియమాన్ననుసరించి ప్రాప్తించే మృత్యువును ప్రసన్నతా పూర్వకంగా స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి. యోగదర్శనం సాధన పాదంలో, 9వ సూత్రంలో, మృత్యుభయమును 'అభినివేశ' మన్నారు. అది పంచక్లేశాలలో ఒకటి. "స్వరసవాహీ విదుషోఽపి తథా రూఢోఽభినివేశః" సన్న్యాసికి భయంగాని, క్లేశంగాని ఉండకూడదు. "**స్వామి ఆజ్ఞను విని సంతోషపడే సేవకుడి లాగా, మృత్యురూపంలో ఉన్న ఈశ్వరీయ నియమానుభూతిని పొంది భయరహితుడై ప్రసన్నతతో ఉండాలి**".

పవిత్ర సత్యాచరణ చేయాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

దృష్టిపూతం న్యసేత్పాదం వస్త్రపూతం జలం పిబేత్ । మూలశ్లోక సం.**29**
సత్యపూతాం వదేద్వాచం మనః పూతం సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**46**

టీక:- **దృష్టిపూతం పాదం న్యసేత్** = సన్న్యాసి మార్గంలో నడిచేటప్పుడు అటు యిటు చూడకుండా కింద భూమి మీద దృష్టి ఉంచాలి. **వస్త్రపూతం జలం పిబేత్** = సదా వస్త్రంలో వడగట్టిన జలాన్నే తాగాలి, **సత్యపూతాం వాచం వదేత్** = నిరంతరం సత్యాన్నే పలకాలి, **మనః పూతం సమాచరేత్** = సర్వదా మనస్సుతో ఆలోచించి, సత్యాన్ని గ్రహించి అసత్యాన్ని విడిచిపెట్టాలి.

ఋషి దయానందభాష్యం:-సన్న్యాసి "నడిచేటప్పుడు అటుయిటు చూడకుండా, పాదాన్ని చూసి పెట్టాలి. ఎల్లప్పుడు వస్త్రంతో, వడిబోసిన నీటినే తాగాలి. అందరితో సత్యవాక్కునే ప్రయోగించాలి. అంటే సత్యోపదేశమునే ఇవ్వాలి. ఏ వ్యవహారం చేసినా పవిత్రమైన మనస్సుతో చేయాలి (సం.వి.సన్న్యా.ప్ర.; స.ప్ర.5వ సము.).॥46॥

అవమానాన్ని సహించాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

అతివాదాంస్తితిక్షేత నావమన్యేత కంచన । మూలశ్లోక.సం.**30**
న చేమం దేహమాశ్రిత్య వైరం కుర్వీత కేనచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**47**

టీక:- అతివాదాన్ తితీక్షేత = అవమానం కలిగించే మాటలను సహించాలి, **కంచన న అవమన్యేత** = ఎప్పుడు ఎవరిని అవమానించవద్దు, **చ** = మరియు, **ఇమం దేహమ్ ఆశ్రిత్య** = ఈ శరీరాన్ని ఆశ్రయంగా తీసుకొని, తన శరీరం మనస్సు-వాక్-కర్మల ద్వారా, **కేనచిత్ వైరం న కుర్వీత** = ఎవరితో విరోధం పెట్టుకోవద్దు. ఎవరినీ ద్వేషించరాదు.

తాత్పర్యం:- ఇతరులెవరో మిమ్మల్ని నిందించారని ఆవేశపడరాదు. ఎప్పుడూ ఎవరినీ అవమానించవద్దు. ఓర్పు అవసరం. మనం ఇతరులను నిందించక జాగ్రత్తవహించాలి. ఎవరినీ ద్వేషించరాదు. ఈ దేహము నాశ్రయించి ఎవరితోనూ వైరం పెట్టుకోరాదు.॥47॥

క్రోధాదులను చూపరాదు-

ఇది మనుకృతం-ప్రామాణికం

క్రుధ్యంతం న ప్రతిక్రుధ్యేదాక్రుష్టః కుశలం వదేత్ ।
సప్తద్వారావకీర్ణాం చ న వాచమనృతాం వదేత్ ॥

మూలశ్లోక సం. **31**
ప్రక్షిప్త శ్లోక సం. **48**

టీక:- క్రుధ్యన్తం = ఎప్పుడైనా, ఎక్కడైనా ఉపదేశించేప్పుడు గానీ, లేదా సంవాదం జరిగేప్పుడుగానీ ఎవరైనా సన్యాసి మీద కోపపడినట్లయితే, లేదా **ఆక్రుష్టః** = నిందించినట్లయినా, సన్యాసి ధర్మమేమంటే, **న ప్రతి క్రుధ్యేత్** = అతని మీద కోప్పడరాదు, **కుశలం వదేత్** = కానీ, సదా అతని కల్యాణాన్ని కోరి ఉపదేశమే చేయాలి. **చ** = మరియు, **సప్త ద్వార+అవకీర్ణాం వాచమ్ + అనృతాం న వదేత్** = సప్త ఛిద్రములలో ఒక ముఖం, రెండో నాసికారంధ్రాలు, రెండు నేత్రాలు, రెండు చెవులు వ్యాపించిన వాక్కును అసత్యకారణంగా ఉపయోగించరాదు.

ఋషి దయానందభాష్యం:- తనపై ఇతరులు కోపం చూపించిప్పటికీ-తాను వారి మీద క్రోధం పెంచుకోరాదు. ఇతరులు పరుష వాక్యాలు ప్రయోగించినా తిరిగి వారిని మనం తిట్టరాదు. దుష్టవాక్యాలను తెలిసి పలుకరాదు. ఉపనిషత్ ప్రమాణం ప్రకారం మంచిమాటలే నిరంతరం మాట్లాడుతూండాలి. (స.ప్ర. 5వ సము.) ॥48॥

వివరణ: 47,48 శ్లోక భావాల సమర్థన, సామ్యత కోసం 2-136,137[2.161-162] చూడగలరు. అక్కడ ఈ భావమునే మనుమహర్షి వ్యక్తం చేశాడు. 6.60వ శ్లోకంలో ఇందుకు కారణం తెలుపబడింది.

ఆధ్యాత్మిక ఆచరణలో స్థిరంగా ఉండాలి-

ఇది మనుకృతం-ప్రామాణికం

అధ్యాత్మరతిరాసీనో నిరపేక్షో నిరామిషః ।
ఆత్మనైవ సహాయేన సుఖార్థీ విచరేదిహ ॥

మూలశ్లోక సం. **32**
ప్రక్షిప్త శ్లోక సం. **49**

టీక:- ఇహ అధ్యాత్మరతిః+ఆసీనః = ఈ ప్రపంచంలో ఆత్మనిష్ఠుడై, **నిరపేక్షః** = సర్వదా అపేక్షారహితుడై, **నిరామిషః** = మద్యమాంసాలను త్యజించి, **ఆత్మనః+ఏవ సహాయేన** = ఆత్మ సహాయంతోనే, **సుఖార్థీ** = సుఖార్థియై, **విచరేత్** = భ్రమణం చేస్తూ అందరికి సత్యోపదేశం చేస్తూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:-ఈ ప్రపంచంలో ఆత్మనిష్ఠుడై సర్వదా అపేక్షారహితుడై, మద్యమాంసాలను త్యజించి, ఆత్మ సహాయంతోనే సుఖార్థియై భ్రమణం చేస్తూ అందరికి సత్యోపదేశం చేస్తూ ఉండాలి. (స.ప్ర. 5వ సము.).॥49॥

50,51వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* భోజనం కొరకు పాఖండం చేయరాదు-

* *న చోత్పాతనిమిత్తాభ్యాం న నక్షత్రాంగవిద్యయా ।*
నానుశాసనవాదాభ్యాం భిక్షాం లిప్సేత కర్హిచిత్ ॥

ప్రక్షిప్త శ్లోక సం. *50*

తాత్పర్యం:- భిక్షాటనం చేసేటప్పుడు వివిధ జనోపకారకమైన జనాసక్తి దాయకమైన విషయాలు వల్లించరాదు. (ఉదా:-కన్ను అదరడం, బల్లి శకునం మొదలగు జ్యోతిష్యాలు చెపుతాననిగాని; నీతి వాక్యాలను, శాస్త్రార్థాలు విడమరచి చెప్పుతానని గాని ప్రయత్నిస్తూ భిక్షపొందకూడదు).॥50॥

* *న తాపసైర్బ్రాహ్మణైర్వా వయోభిరపి వా శ్వభిః ।*
ఆకీర్ణం భిక్షుకైర్వాన్యైరగారముపసంవ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***51***

తాత్పర్యం:- తాపసులు, తిండిపోతులైన బ్రాహ్మణుల గుంపులు భిక్షం కోసం వచ్చినప్పుడు మరియు పక్షులు, కుక్కలు ఆహారం తీసుకొంటున్నప్పుడు ఆ ఇంటికి భిక్షకోసం వెళ్ళరాదు.

ప్రక్షిప్తాల పరిశీలన

50-51 రెండు శ్లోకాలూ కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. 49,52 శ్లోకాలలోని విషయంలో ఏకసూత్రత ఉంది. వీటికీ పూర్వాపర, ప్రసంగాల 'సన్న్యాసిని ఎలా విచారించాలి?' అనే దానికీ సంబద్ధత ఉంది - "విచరేత్ ఇహ" [49]. "విచరేత్- నియతః" [52]. ఈ రెండు శ్లోకాలూ ఆ ప్రసంగం లేదా ఏకసూత్రతను భంగం చేశాయి. అందుచేత ఇవి ప్రసంగ వ్యతిరేకాలు.

ఖ. వీటిలో 'భిక్ష ఏ యే విధాలుగా అడగకూడదు?' దీనికి సంబంధించిన నిషేధాలున్నాయి. భిక్ష అడిగే విషయం 55వ శ్లోకంలో మొదలైంది. ప్రసంగం మొదలు కాక ముందే భిక్ష అడగటం గురించి చెప్పటం అప్రాసంగికం అవుతుంది. ముందు విధి వాక్యం వచ్చిన తర్వాతే 'నిషేధ వాక్యాలు' రావాలి. విధానానికి ముందే నిషేధ వాక్యం రావటం పొంతనలేని దవుతుంది. అందుచేత ఈ రెండు శ్లోకాలూ ప్రసంగ వ్యతిరేకాలు ఆధారంగా ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. మనువు జీవిక కోసం కేవలం ఒకటేపూట భిక్ష స్వీకరించాలన్నాడు [55], 40లో చెప్పినవాటితో భిక్ష అడిగే ప్రసక్తే రాదు. దీనితో పాటు మనువు సన్న్యాసికి అన్ని రకాల సంగాల నుంచీ (లోభమోహాలు మొదలైనవి) దూరంగా ఉండాలన్నాడు [33,57]. ఇవన్నీ సన్న్యాసికి నిషిద్ధాలు. ఇలా ఈ వ్యవస్థకు మనువు చెప్పిన వాటితో పొసగటం లేదు. సన్న్యాసి నిజమైన సన్న్యాసి కాకుండా, వేర్వేరు ఆడంబరాలతో భిక్ష స్వీకరిస్తూ ఉన్న తర్వాతి కాలంలో రచించిన శ్లోకాలలా ఉన్నాయి. పొంతన లేకపోవటం పరస్పర వ్యతిరేకతను తెలుపుతూంది.

ఖ. మనువు చెప్పిన జీవికలతో ఈ శ్లోకాలలో చెప్పినవాటికి పొంతన కుదరటం లేదు. [1.87-91; 9-325-335 (10.1-11)]. మనువు ఈ శ్లోకాలలోని విద్యలను ఎక్కడా చెప్పలేదు. అందుచేత భవిష్య కథనం మొదలైన విద్యలు మనుసమ్మతం కావు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ముండనపూర్వక కాశాయవస్త్రాలను ధరించాలి-

క్లృప్త కేశనఖశ్మశ్రుః పాత్రీ దణ్డీ కుసుంభవాన్ । మూలశ్లోక సం.**33**
విచరేన్నియతో నిత్యం సర్వభూతాన్యపీడయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**52**

టీక:- సన్న్యాసి, నిత్యం = ఎల్లప్పుడు క్లృప్త-కేశ-నఖ-శ్మశ్రుః = వెంట్రుకలను, గోళ్ళను, గడ్డాన్ని, మీసాలను తొలగించుకొని, పాత్రీ-దండ- కుసుమ్భవాన్ = పాత్ర-భిక్షాపాత్ర, దండం, కమండలం తీసుకొని, **నియతః** = నిశ్చితాత్ముడై, సర్వభూతానిఅపీడయన్ = సర్వ ప్రాణులకు బాధను కలిగించకుండా, **విచరేత్** = సర్వత్ర సంచరించుగాక!

ఋషి దయానందభాష్యం:-తలవెంట్రుకలను, గడ్డం, మీసాలు, గోళ్ళు వీటిని సమయాసమయానికి తీసివేస్తూ ఉండాలి. భిక్షాపాత్ర, దండం, కాషాయ వస్త్రాలను ధరించాలి. ఏ ప్రాణికి బాధ కలిగించకుండా, దృఢాత్ముడై నిత్యం సంచారం చేస్తూ ఉండాలి. (స.ప్ర.5వ సము.).॥52॥

53,54వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *అతైజసాని పాత్రాణి తస్య స్యుర్నిర్వ్రణాని చ ।*
తేషామద్భి స్మృతం శౌచం చమసానామివాధ్వరే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***53***

తాత్పర్యం:- సన్న్యాసి భిక్షపాత్ర వెండి, బంగారం లాంటి లోహాలతో చేసినవి కాకూడదు. ఇతర లోహాలు కూడ వాడరాదు. యజ్ఞపాత్రలను శుద్ధి చేసినట్లే, వీటినీ తోమి, కడిగి శుభ్రం చేయాలి.॥53॥

* *అలాబుం దారుపాత్రం చ మృన్మయం వైదళం తథా ।*
ఏతాని యతిపాత్రాణి మనుస్స్వాయంభువోఽబ్రవీత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***54***

తాత్పర్యం:- 'యతి' అనబడే విశిష్టసన్న్యాసికి పాత్రలుగా ఉపయోపడే వాటిలో సొరకాయడిప్ప, మట్టిమూకుడు, వెదురు గొట్టం, కొయ్య తొలచి చేసిన సహజపాత్రలు ఉండాలి.॥54॥

ప్రక్షిప్తాల పరిశీలన

53-54 శ్లోకాలు ఈ కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. శైలీగత ఆధారాలు

54వ శ్లోకంలో "మనుః స్వయం భువోఽబ్రవీత్" అనటం చేత రెండు విషయాలు తెలుస్తున్నాయి- ఒకటి మనువు ఇది రాయలేదు, మరొకరెవరో రాశారు అని. రెండు మనువు తర్వాతి కాలపు రచన అని. ఈ ఆధారాలతో ఈ శ్లోకం ప్రక్షిప్తం. 53వ శ్లోకం ఈ శ్లోకంతో సంబంధం కలిగి ఉంది. అందుచేత ఇది ప్రక్షిప్తమే.

ఒకసారి మాత్రమే భిక్ష అడగాలి-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏక కాలం చరేద్భైక్షం న ప్రసజ్జేత విస్తరే । మూలశ్లోక సం.**34**
భైక్షే ప్రసక్తో హి యతిర్విషయేష్వపి సజ్జతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**55**

టీక:- **ఏక కాలం భైక్షం చరేత్** = సన్న్యాసి రోజులో ఒక్కసారి మాత్రమే భిక్ష అడగాలి. **విస్తరే న ప్రసజ్జేత** = అదికూడా అధికంగా కావాలని ఆశించరాదు. కారణం ఏమంటే, **భైక్షే ప్రసక్తః యతిః** = అధిక భిక్షనాశించడం, భోజన రుచిలో కూడా ఆసక్తుడైన సన్న్యాసి, **విషయేషు + అపి సజ్జతి** = విషయ సుఖాలకు కూడా వశుడవుతాడు.

తాత్పర్యం:- యతి దినమునకు ఒక్కపూట మాత్రమే భిక్షాటనం చేయాలి. అది కూడా రెండు పూటలకు సరిపోయేంతగా ఉండాలని కోరుకోకూడదు. ఇలాచేస్తే ప్రధాన ధాతువులు దేహంమీద విజయాన్ని సాధించడమే గాక, యతులను సైతం స్త్రీసుఖం మొదలైనవాటి వైపు లాగేస్తాయి.॥55॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *విధూమే సన్నముసలే వ్యంగారే భుక్తవజ్జనే ।*
వృత్తే శరావసంపాతే భిక్షాం నిత్యం యతిశ్చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***56***

తాత్పర్యం:- వంట పూర్తయి, పొగ ఆరిపోయింది, రోకలిచప్పుడు తగ్గింది, నిప్పు ఆర్పేసి ఉన్నట్టి ఇళ్లకు మాత్రమే గృహస్థుతోపాటు ఆ ఇంటివారంతా భుజించాక యతి భిక్షకు వెళ్లాలి.॥56॥

ప్రక్షిప్త పరిశీలన

56వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది -

1. ప్రసంగ వ్యతిరేకం

ఇది పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకం. 66వ శ్లోకంలో భిక్షా పద్ధతి చెప్పి, 57వ శ్లోకంలో యతి అయినవాడికి భిక్షపట్ల ఆసక్తి ఉండకూడ దని ఉంది. 56వ శ్లోకం దీనికి సంబద్ధమైన ప్రసంగాన్ని భంగం చేసింది. అందువల్ల ఈ శ్లోకం ఈ ఆధారంతో ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలో చెప్పిన పద్ధతి మనువు పద్ధతికి వ్యతిరేకం. ఇందులో ఇంట్లోని అందరూ భుజించిన తర్వాత ఎంగిలి వస్తువులను విడిగా ఉంచిన తర్వాత యతి భిక్షకు వెళ్లాలని ఉంది. కానీ 3.94లో గృహస్థు బలివైశ్వదేవయజ్ఞం చేసిన తర్వాతనే భిక్ష ఇవ్వాలని ఉంది. పైగా అతిథులకు పెట్టి ఆ తర్వాత, అంటే భిక్ష మొదలైనవి ఇచ్చిన తర్వాతనే మిగిలింది తినాలని ఉంది. [3.116,117]. ఈ వ్యతిరేకతతో ఈ శ్లోకం మనువు కాక వేరెవరో రాసినదని తెలుస్తూంది కనుక ఇది ప్రక్షిప్తం.

57 నుండి 67వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

భిక్ష లభించనపుడు దుఃఖపడరాదు-

అలాభే న విషాదీ స్యాల్లాభే చైవ న హర్షయేత్ । మూలశ్లోక సం.**35**
ప్రాణయాత్రికమాత్రః స్యాన్మాత్రాసంగాద్వినిర్గతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**57**

టీక:- **అలాభే న విషాదీస్యాత్** = భిక్ష దొరకనప్పుడు దుఃఖపడరాదు. **చ** = మరియు, **లాభే న హర్షయేత్** = భిక్ష లభించినప్పుడు సంతోషానుభూతిని పొందవద్దు, **మాత్రాసంగాత్ వినిర్గతః** = లభించిన భిక్ష అధికమా లేదా స్వల్పమా అనీ, లేదా షడ్రసోపేత భోజనమా లేదా గంజిమెతుకులు అనీ కూడా ఆలోచించకుండా, ఎలాంటి భిక్ష లభించినా, సంతోషంగా స్వీకరించి, **ప్రాణయాత్రిక మాత్రః స్యాత్** = కేవలం తన జీవయాత్ర సాగడానికి అవసరమైనంత వరకే భిక్షను స్వీకరిస్తూ ఉండాలి.

తాత్పర్యం:- భిక్ష దొరకలేదని విచారం పనికిరాదు. దొరికిందని పొంగిపోరాదు. లభించిన భిక్ష అధికమా లేదా స్వల్పమా అని కూడా ఆలోచించకూడదు. అదొక దేహనిమిత్త మాత్ర కృత్యమని- ప్రాణసంరక్షణ కోసం ఎలాంటి భిక్ష లభించినా సంతోషంగా స్వీకరించాలి. విమర్శ చేయకూడదు.॥57॥

నిందా ప్రశంసలకు దూరంగా ఉండాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అభిపూజితలాభాంస్తు జుగుప్సేతైవ సర్వశః । మూలశ్లోక సం.**36**
అభిపూజితలాభైశ్చ యతిర్ముక్తోఽపి బధ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**58**

టీక:- **తు** = మరియు, **అభిపూజిత లాభాం** = అధికమైన ఆదర సత్కారాల వల్ల లభించిన భిక్ష లేదా లాభాలన్నిటిని, **సర్వశః ఏవ జుగుప్సేత** = పూర్తిగా ఉపేక్షించాలి, ఎందుకంటే, **అభిపూజిత లాభైః ముక్తః + అపి యతిః బధ్యతే** = అధికాదర సత్కార ప్రాప్తికి భిక్షకు దూరమైనా,అధిక లాభాలకు విముఖుడైనా సన్న్యాసీ విషయబంధనాలలో చిక్కుపడిపోతాడు.

తాత్పర్యం:- తనను సత్కరించి మరీ ఇచ్చే భిక్షాదులను యతులు పుచ్చుకోరాదు. ఆ విధంగా తనను గౌరవించి ఇచ్చే భిక్షవల్ల సత్కరించినవారి వాత్సల్యం చేత ముక్తిమార్గాన్ని అపేక్షించే యతి కూడా బదులు వాత్సల్యం చూపించి, తిరిగి బంధితుడు కాగలడు.॥58॥

ఇంద్రియాలను నియంత్రించి మోక్షానికి సమర్థతను పెంచుకోవాలి ఇది మనుకృతం-ప్రామాణికం

అల్పాన్నాభ్యవహారేణ రహఃస్థానాసనేన చ । మూలశ్లోక సం. **37**
హ్రియమాణాని విషయైరిన్ద్రియాణి నివర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **59**

టీక:- **విషయైః హ్రియమాణాని ఇన్ద్రియాణి** = విషయాలచేత లాగబడే ఇంద్రియాలను, **అల్ప+అన్న+అభ్యవహారేణ** = మితభోజనం (కొంచెం) చేసి, **చ** = మరియు, **రహః స్థాన+ఆసనేన** = ఏకాంత స్థానంలో నివసిస్తూ, **నివర్తయేత్** = వశపరచుకోవాలి.

తాత్పర్యం:- విషయాలచేత లాగబడే ఇంద్రియాలను, మిత భోజనం చేసి, ఏకాంత స్థానంలో నివసిస్తూ వశపరుచుకోవాలి.॥59॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఇన్ద్రియాణాం నిరోధేన రాగద్వేషక్షయేణ చ । మూలశ్లోక సం. **38**
అహింసయా చ భూతానామమృతత్వాయ కల్పతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **60**

టీక:- **ఇంద్రియాణాం నిరోధేన** = ఇంద్రియాలను అధర్మాచరణం నుండి నిరోధించి, **రాగద్వేష క్షయేణ** = రాగ-ద్వేషాలను వదిలి, **చ** = మరియు, **భూతానామ్ అహింసయా** = సర్వప్రాణులతో విరోధాన్ని విడిచిపెట్టి జీవించినట్లయితే, **అమృతత్వాయ కల్పతే** = మోక్షప్రాప్తికి సమర్థతను పెంచుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- ఇంద్రియాలను అధర్మాచరణం నుండి నిరోధించి, రాగద్వేషాలను వదిలి, సర్వప్రాణులతో విరోధాన్ని విడిచిపెట్టి మోక్షప్రాప్తికి సమర్థతను పెంచుకోవాలి. స.ప్ర. 5వ సము.॥60॥

వివరణ

ఇంద్రియ నిరోధానికి యోగశాస్త్ర ప్రమాణం. యోగదర్శన సూత్రం ద్వారా ఈ శ్లోకం వ్యాఖ్యను సులభంగా తెలిసికోగలరు. **"యోగశ్చిత్త వృత్తి నిరోధః (1.2)** యోగం ద్వారా విషయాల వైపు పోయే ఇంద్రియాలను నిరోధించవచ్చు. ఈ నిరోధ మార్గమేమిటి? **"అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః" (1.12)** అభ్యాసం వైరాగ్యాల ద్వారా ఇంద్రియాలను వశపరచుకోవచ్చు. **"సుఖానుశయీ రాగః" "దుఃఖానుశయీ ద్వేషః"** (2.7,8) సుఖాభిలాషయే రాగం, దుఃఖవిషయంలో కలిగే క్రోధ భావనే ద్వేషం. వీటిని త్యజించడం వల్ల, మరియు **"అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః"** (2.35) అహింసా సిద్ధి ద్వారా, నిర్వైరత్యాన్ని సాధించి, వ్యక్తి మోక్షసామర్థ్యాభివృద్ధిలో సఫలుడవుతాడు.

ఇది మనుకృతం. ప్రామాణికం

మానవ జీవనంలో దుఃఖమయ స్థితిగతులకు చెందిన చింతన

అవేక్షేత గతీర్నృణాం కర్మదోషసముద్భవాః । మూలశ్లోక సం. **39**
నిరయే చైవ పతనం యాతనాశ్చ యమక్షయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **61**

టీక:- **కర్మదోష సముద్భవాఃనృణాం గతీః** = మానవులకు కర్మదోష జనిత నానా కష్టాలు, వివిధ యాతనలు, **చ** = మరియు, **నిరయే పతనం** = కష్టాలను అనుభవించడం వల్ల, **చ** = అలాగే, **యమక్షయే యాతనాః** = ప్రాణక్షయం కాగా మృత్యుసమయాలలో సంభవించే బాధలు, **అవేక్షేత** = చూసి విచారించి, ముక్తికోసం ప్రయత్నించాలి.

తాత్పర్యం:- మానవుకు కర్మదోష జనిత నానాకష్టాలు, వివిధ యాతనలు, కష్టాలను అనుభవించడం వల్ల ప్రాణక్షయం కాగా మృత్యుసమయాలలో సంభవించే బాధలు చూసి విచారించి, ముక్తి కోసం ప్రయత్నించాలి.॥61॥

ఇది మనుకృతం. ప్రామాణికం

విప్రయోగం ప్రియైశ్చైవ సంయోగం చ తథాఽప్రియైః । మూలశ్లోక సం. **40**
జరయా చాభిభవనం వ్యాధిభి శ్చోపపీడనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **62**

టీక:- చ = మరియు, ప్రియైః విప్రయోగం = ప్రియజనులతో వియోగం కలగడం, **తథా అప్రియైః సంయోగం** = శత్రువులతో సంపర్కం కలగడం మళ్ళీ వారి వల్ల కష్ట నష్టాలు సంభవించడం. చ = మరియు, **జరయా అభి భవనమ్** = వార్ధక్య బాధలు, చ = అలాగే, వ్యాధిభిః ఉపపీడనమ్ = రోగాలతో పీడనం.

తాత్పర్యం:- అలాగే- ఇష్టులైన పుత్రాదులు మొదలైనవారి ఎడబాటును, ఇష్టులు కానివారితో కలిసి మెలగవలసి రావడం, వార్ధక్యపు బాధలను, రోగబాధలను (ఇహలోకపు కష్టాల్ని) గురించి చింతించాలి.॥62॥

ఇది మనుకృతం. ప్రామాణికం

దేహాదుత్క్రమణం చాస్మాత్పునర్గర్భే చ సంభవమ్ । మూలశ్లోక.సం. **41**
యోనికోటిసహస్రేష సృతీశ్చాస్యాన్తరాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **63**

టీక:- **అస్మాత్ దేహాత్ + ఉత్క్రమణం** = మళ్ళీ ఈ శరీరం నుండి జీవుడు నిర్గమించడం, **గర్భే పునః సంభవమ్** = మళ్ళీ గర్భం నుండి జన్మించడం, చ = మరియు ఈ ప్రకారంగా, **అస్య+అన్తరాత్మనః** = ఈ జీవుడికి, **యోనికోటి సహస్రేష సృతీః** = అనంతకోటి యోనులలో ఆవాగమనం, ఈ కష్టాలనన్నింటినీ విచారించుకొని ముక్తి కోసం మనస్సు ఉంచి ప్రయత్నించాలి.

తాత్పర్యం:- ఈ దేహం నుంచి జీవుడు నిష్క్రమించడం, రోగాలబారినపడిన దేహం పడే యాతన, తిరిగి గర్భవాసాన ఉండి జన్మించడం, నీచయోనులలో పుట్టవలసిరావడం లాంటి వాటిగురించి ఒక్కసారైనా ఆలోచించాలి.॥63॥

అధర్మం వల్ల దుఃఖం, ధర్మం వల్ల సుఖ ప్రాప్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

అధర్మప్రభవం చైవ దుఃఖయోగం శరీరిణామ్ । మూలశ్లోక సం. **42**
ధర్మార్థప్రభవం చైవ సుఖసంయోగమక్షయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **64**

టీక:- **శరీరిణాం దుఃఖయోగం అధర్మ ప్రభవం ఏవ** = ప్రాణులకు అధర్మం వల్లనే నానా విధాలైన దుఃఖాలు కలుగుతున్నాయి. చ = మరియు, **అక్షయం సుఖ సంయోగం ధర్మార్థ ప్రభవం ఏవ** = మోక్షం వరకు ఉండే అక్షయ సుఖాలు కేవలం ధర్మం వల్లనే ప్రాప్తిస్తున్నాయి. ఈ సత్యాన్ని గురించి ఆలోచించి తదనుసారంగా ధర్మం ఆచరించాలి.

తాత్పర్యం:- జీవాత్మలకు అధర్మం వల్ల జనించే దుఃఖసంబంధం అయినవీ, ధర్మం వల్ల కలిగే బ్రహ్మసాక్షాత్కారం చేత కలిగే మోక్షసాధనకు ఉపకరించేవీ ఎప్పటికప్పుడు ఆలోచన చేస్తూ ఉండాలి.॥64॥

వివరణ: అధర్మం వల్ల దుఃఖప్రాప్తి ఎలా కలుగుతుందో ఈ విషయం (4.170-176)శ్లోకాలు చూడగలరు.

యోగం ద్వారానే పరమాత్మ దర్శనం- ఇది మనుకృతం-ప్రామాణికం

సూక్ష్మతాం చాన్వవేక్షేత యోగేన పరమాత్మనః । మూలశ్లోక సం. **43**
దేహేషు చ సముత్పత్తిముత్తమేష్వధమేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **65**

టీక:- చ = మరియు, **యోగేన పరమాత్మనః సూక్ష్మతాం** = యోగాభ్యాసం ద్వారా పరమాత్మ యొక్క సూక్ష్మ స్వరూపాన్ని, **ఉత్తమేషు చ అధమేషు దేహేషు సముత్పత్తిమ్** = ఉత్తమ శరీరాలలో జన్మించడం, అధమ శరీరాలలో జన్మించడం ఈ విషయాలను, **అవేక్షేత** = చూసి విచారించుకోవాలి.

తాత్పర్యం:- విషయసుఖాల నుండి చిత్తాన్ని మరలించలేకపోవడం వల్ల కలిగే అధమలోకాల ప్రాప్తి గురించి, పశ్వాది నీచజన్మల ప్రాప్తిగురించి ఈ రీతిగా అప్పుడప్పుడైనా ఆలోచించేవాడికి సన్మార్గవర్తనం మీద ఒకనాటికి కాకున్నా ఒక నాటికైనా ధ్యాస కుదురుతుంది.॥65॥

వివరణ:

యోగ పరిభాష- యోగం ద్వారా పరమేశ్వర ప్రాప్తి:- యోగదర్శమున, యోగపరిభాషలో పరమేశ్వరప్రాప్తి ఈ కింది విధంగా చెప్పబడింది.

1. **"యోగశ్చిత్తవృత్తినిరోధః" (1.2)** చిత్తవృత్తులను నిరోధించుటయే యోగం.

2. చిత్తవృత్తులను నిరోధించినందువల్ల సమాధి సిద్ధి కలుగుతుంది. 'తదుపరి **"తదా ద్రష్టుః స్వరూపేऽవస్థానమ్"** (1-3) అప్పుడు సర్వద్రష్టయైన ఈశ్వరుడి స్వరూపంలో జీవాత్మస్థితి ఉంటుంది. ఇందుకు వేదప్రమాణం.

"యుంజానః ప్రథమం మనస్తత్త్వాయ సవితా ధియః ।
అగ్నేర్జ్యోతిర్నిచాయ్య పృథివ్యా అధ్యాభరత్"॥ (యు. 1.4.2)

టీక:- యుంజానః = యోగయుక్తుడైన మానవుడు, **తత్త్వాయ** = తత్త్వం అంటే బ్రహ్మజ్ఞానం కోసం, ప్రథమం **మనః** = తన మనస్సును మొదట పరమేశ్వరుడి యందు లగ్నంచేయునో, అప్పుడు, **సవితా** = పరమేశ్వరుడు అతడి, **ధియః** = బుద్ధిని, తన కృపతో తన యందు చేర్చుకొంటాడు, **అగ్నేః జ్యోతిః** = మళ్ళీ పరమేశ్వర జ్యోతిని నిశ్చయంగా, **అధ్యాభరత్** = ఉన్నదున్నట్లుగా ధరిస్తాడు. **పృథివ్యాః** = పృథివి యందు ఇదే యోగి లక్షణం. (యు.భా.భూ.ఉపాసనా విషయం.).

దూషించిన పరిస్థితులలోనూ ధర్మపాలన ముఖ్యం **ఇది మనుకృతం-ప్రామాణికం**

దూషితోऽపి చరేద్ధర్మం యత్ర తత్రాశ్రమే రతః । మూలశ్లోక సం.**44**
సమః సర్వేషు భూతేషు న లిఙ్గం ధర్మకారణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**66**

టీక:- దూషితః + అపి ధర్మం చరేత్ = సన్న్యాసిని మూర్ఖులైన ప్రజలు నిందలతో దూషించినా, అవమానించినా, అతడు మాత్రం ధర్మాన్ని ఆచరించాలి, **యత్ర తత్ర ఆశ్రమే రతః** = అలాగే ఇతరమైన బ్రహ్మచర్యాది ఆశ్రమాలందున్నవారు కూడా ధర్మాన్నే ఆచరించాలి, **సర్వేషు భూతేషు సమః** = సర్వప్రాణులతో పక్షపాతం లేకుండా సమబుద్ధి ఉంచాలి. ఇలాంటి ఉత్తమకర్మలొనరించుటయే సన్న్యాసుల విధి. కానీ, **లిఙ్గం ధర్మకారణమ్ న** = కేవలం దణ్డాది చిహ్నాలను ధరించడం ధర్మానికి లక్షణం కాదు.

ఋషి దయానందభాష్యం:- సన్న్యాసిని మూర్ఖులైన ప్రజలు నిందలు వేసి దూషించినా, అవమానించినా ధర్మాన్ని ఆచరించాలి. ఏ ఆశ్రమవాసం చేస్తున్నా (బ్రహ్మచర్య, గృహస్థాదులు) దానికి విరుద్ధమైన ఆచారాలు అనుసరించరాదు. ఆ ఆశ్రమపు చిహ్నాలైన దాన ధర్మాదులు ఆచరించాలి. కేవలం బాహ్యంగా ధరించే చిహ్నాలు కాకుండా, విహిత కృత్యాలాచరించడమే ధర్మసాధనం. సర్వప్రాణులలో పక్షపాతం లేకుండా సమబుద్ధితో ఉత్తమకర్మలో చరించడమే సన్న్యాసుల విధి.

సన్న్యాసి స్వయం ధర్మాత్ముడై అందరినీ ధర్మాత్ములనుగా మార్చడానికి ప్రయత్నించాలి. దండం-కమండలం, కాషాయ వస్త్రాలను ధరించడమే ధర్మానికి కారణం కాదని దృఢంగా నమ్మి మనుష్యాది ప్రాణులకు సత్యోపదేశం, విద్యాదానం ద్వారా ఉన్నతి మార్గంలో నడిపించడమే సన్న్యాసి యొక్క ముఖ్య కర్మ.(స.ప్ర. 5వ సము.) ॥66॥

ధర్మాచరణ లేకుండా కేవలం బాహ్యాడంబరంతో శ్రేష్ఠఫలితముండదు **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఫలం కతకవృక్షస్య యద్యప్యంబు ప్రసాదకమ్ । మూలశ్లోక సం.**45**
న నామగ్రహణాదేవ తస్య వారి ప్రసీదతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**67**

టీక:- యద్యపి కతక వృక్షస్య ఫలం = చిల్లగింజ, అమ్బుప్రసాదకమ్ = నూరి మురికినీటిలో కలిపితే జలం పరిశుద్ధమవుతుందనే మాట నిజమైనా, తస్యనామగ్రహణాత్ + ఏవ = దాన్ని నీటిలో కలపకుండానే దానిపేరు చెప్పినంత మాత్రం చేతనే, వారి న ప్రసీదతి = నీరు పరిశుభ్రం కాజాలదు.

ఋషి దయానందభాష్యం:- చిల్లగింజ నీటిలోంచి మలినాలను వేరు చేస్తుంది. కేవలం దాని పేరు చెప్పినంత మాత్రాన నీటిలోంచి మురికి తొలగదు కదా! దాన్ని అరగదీసి నీటిలో కలపాలి. అలాగే ధర్మాలు తెలిస్తే చాలదు. ఆచరించాలి. తాను స్వీకరించిన ఆశ్రమ ధర్మాలను ఆచరించినప్పుడే ఆశ్రమ స్వీకార ఫలితముంటుంది. (సం.వి.స.ప్రక.॥67॥

వివరణ:- 'కతక' వృక్షఫలాన్ని తెలుగులో కుంకుడుకాయ అంటారు.

68,69వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *సంరక్షణార్థం జంతూనాం రాత్రావహని వా సదా ।*
శరీరస్యాత్యయే చైవ సమీక్ష్య వసుధాం చరేత్ ॥ ***ప్రక్షిప్త శ్లోక సం.68***

తాత్పర్యం:- సమస్త జంతువుల ప్రాణ సంరక్షణార్థం రాత్రిగానీ-పగలు గానీ అన్ని వేళలా తన దేహానికి కష్టం కలిగినప్పటికీ భూమ్మీద చూసుకుంటూ అడుగులు వేయాలి. దీనివల్ల చిన్న కీటకాదులు కూడ మనకాళ్లకింద నలిగిపోకుండా రక్షించబడతాయి. ॥68॥

* *అహ్నా రాత్ర్యా చ యాన్ జంతూన్ హినస్త్యజ్ఞానతో యతిః ।*
తేషాం స్నాత్వా విశుద్ధ్యర్థం ప్రాణాయామాన్ షడాచరేత్ ॥ ***ప్రక్షిప్త శ్లోక సం.69***

తాత్పర్యం:- యతి ఒకప్పుడు రాత్రి అయినా, పగలు అయినా అజ్ఞానం చేత జంతువులను హింసించడం జరిగితే, ఆ దోష పరిహారం నిమిత్తం అతడు ఆరు ప్రాణాయామాలు ఆచరించాల్సి ఉంటుంది. ॥69॥

ప్రక్షిప్తాల పరిశీలన

68-69 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. వీటిలో చెప్పినవి మనువు వ్యవస్థ ప్రకారం లేవు. వీటిలో 'నడిచేటప్పుడు జరిగే చిన్న ప్రాణుల హింస వల్ల కలిగే పాపం పోయేందుకు ప్రాణాయామం చేయాలి' అని ఉంది. ఇది సన్న్యాసికి చెప్పిన ప్రాయశ్చిత్తం. మనువు 70-72 శ్లోకాలలో ప్రాణాయామం యతి దినచర్యలో ఒకటని చెప్పాడు. ప్రతి రోజూ యతి ప్రాణాయామం చేస్తున్నట్లయితే, విడిగా మళ్లీ ప్రాయశ్చిత్తం ఎందుకు? అంటే 'ప్రాణాయామం' ప్రాయశ్చిత్తం కాదన్న మాట. 71-72 శ్లోకాలలో ప్రాణాయామంతో పాపనివారణ చేసుకోవడం మనువు చెప్పిన పద్ధతికి వ్యతిరేకం.

2. శైలీగత ఆధారాలు

క. పాపం పోవడానికీ, ప్రాణాయామానికీ ఏ సంబంధమూ లేదు. రాత్రి చీకటిలో ఎవరైనా చిన్న ప్రాణులను ఎలా చూడగలుగుతారు? ఈ విధంగా ఈ రెండు శ్లోకాల శైలీ అసంగతం.

ఖ. మనువు శైలి ప్రకారం, ప్రాయశ్చిత్త విధానం 11వ అధ్యాయంలో ఉంది. అందుచేత ఇక్కడ ప్రాయశ్చిత్తం చెప్పటం మనువు శైలితో పొసగటం లేదు. ఇది మౌలికం కాదు.

3. పునరుక్తి

68లో 46వ శ్లోకంలోని 'దృష్టి పూతం న్యసేత్ పాదం' అనేది పునరుక్తి మాత్రమే. ఈ పునరుక్తి ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

70 నుండి 75వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ప్రాణాయామం తప్పనిసరి

ప్రాణాయామా బ్రాహ్మణస్య త్రయోऽపి విధివత్కృతాః । మూలశ్లోక సం. **46**
వ్యాహృతిప్రణవైర్యుక్తా విజ్ఞేయం పరమం తపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **70**

టీక:- **బ్రాహ్మణస్య** = బ్రాహ్మణుడు అంటే బ్రహ్మవిదుడు లేదా సన్న్యాసి ద్వారా, **విధివత్** = శాస్త్రానుసారంగా, **వ్యాహృతి-ప్రణవైః యుక్తాః** = ప్రణవం అంటే ఓంకారపూర్వకంగానూ భూః భువః స్వః మొ॥ సప్తవ్యాహృతులను జప సహితంగానూ, అనుశీలనంలో ప్రదర్శితమైన, **త్రయః+అపి** = మూడు విధాలైన బాహ్య-అభ్యంతర స్తమ్భక ప్రాణాయామాలు అథవా కనీసం మూడు ప్రాణాయామాలు, **కృతాః** = చేయబడును, **పరమం తపః విజ్ఞేయం** = అదే పరమ తపస్సని తెలిసికోవాలి.

ఋషి దయానందభాష్యం:- కనుక యతి అనేవాడు ప్రాణాయామాది ప్రక్రియలచేత, అనురాగాది దోషాలు దహించుకుంటున్నాడు. కోరిన చోట పరబ్రహ్మను ధ్యానించడం వల్ల పాపాల్ని తొలగించుకుంటున్నాడు. విషయాసక్తినుంచి ఇంద్రియాదులను మరల్చడం వల్ల విషయసంబంధము నివారించుకుంటున్నాడు.

బ్రహ్మవిదుడైన సన్న్యాసి ఓంకారపూర్వకంగా సప్తవ్యాహృతులను విధిపూర్వకంగా శక్తి కొద్దీ ప్రాణాయామాలను చేయాలి. కానీ మూడు కంటె తక్కువగా ఎప్పుడూ చేయరాదు. ఇదే సన్న్యాసికి పరమ ధర్మం (స.ప్ర.5వ సము.).॥70॥

వివరణ: 1.ప్రాణాయామవిధి-లక్షణం:-ప్రాణాయామ విధి యోగ దర్శనమందు చూడగలం. (1.27,28) ఓంకారపూర్వకంగా ఈశ్వర జపవిధానం కూడా ఉంది. ఇక్కడ అదే విధి. వ్యాసభాష్యం ఆధారంగా రాసిన ఋషి దయానందుని భాష్యం కూడా రాయబడుతుంది. ఈ విధిని అనుసరించి ఉపసాకుడు అశుద్ధి క్షయం, ఈశ్వర సిద్ధీ, బలపరాక్రమ వృద్ధీ పొందుతాడు.

1. ప్రాణాయామ లక్షణం

క. **"తస్మిన్ సతి శ్వాస ప్రశ్వాసయోః గతివిచ్ఛేదః ప్రాణాయామః"** (2.49) బయట నుండి లోనికి పీల్చుకొనే వాయువు శ్వాస అనబడును. లోపల నుండి బయటికి వచ్చే వాయువు ప్రశ్వాసం. ఆ రెండింటిని అంటే వాయువు యొక్క రాక పోకడలను ఆపడం (గతి విచ్ఛేదం) ప్రాణాయామం. వ్రేలుతో ముక్కును ఎప్పుడూ మూయరాదు. కానీ జ్ఞానం ద్వారానే అపాలి.

ఖ. "ప్రచ్ఛర్దనవిధారణాభ్యాం వా ప్రాణస్య" (1.34)

భోజనానంతరం ఏదో కారణం వల్ల ఏలా వమనమవుతుందో అదేవిధంగా లోపలి వాయువును బయటికి రప్పించి, సుఖపూర్వంగా ఎంత సమయం బయట ఆపగలుగుతారో అంత సమయం బయట ఆపాలి. మళ్ళీ మెల్లమెల్లగా లోపలికి గాలిని పీల్చి అలానే ఆపి ఉంచాలి. ఇదే విధంగా మాటి మాటికి అభ్యాసం చేయడం వల్ల ప్రాణవాయువు ఉపాసకుడి వశమవుతుంది. ప్రాణం స్థిరమైనప్పుడు మనస్సు, మనస్సు స్థిరం కాగా ఆత్మ స్థిరమవుతుంది. ఈ మూడు (ప్రాణవాయువు-మనస్సు-ఆత్మ) స్థిరమైన సమయంలో స్వీయాత్మ మధ్యలో ఉన్న ఆనందస్వరూపుడు, అంతర్యామి, వ్యాపక పరమేశ్వరుడు ఉన్నాడో, ఆయన స్వరూపంలో మగ్నమైపోవాలి. జలప్రవాహంలో మానవుడు మునిగి మునకలువేసి

పైకి వచ్చి, మళ్ళీ మునకలు వేయునట్లుగా, తన ఆత్మను పరమేశ్వరుడిలో మాటిమాటికి మగ్నం చేయాలి (ఋ.భా.భూ.ఉపాసన).

2. ప్రాణాయామంలో ముఖ్యంగా మూడు భేదాలు.

"స తు బాహ్యాభ్యంతరఃస్తమ్భవృత్తిర్దేశకాలసంఖ్యాభిః పరిదృష్టో దీర్ఘసూక్ష్మః" 2-50

"బాహ్యాభ్యంతర విషయాపేక్షీ చతుర్థః"-(2.51)

అవి మూడు భేదాలు

అ. బాహ్య విషయం-రేచకం

ఆ. అభ్యంతర విషయం-పూరకం

ఇ. స్తంభవృత్తి-స్తంభకం

ఇది దేశ-కాల-సంఖ్యానుసారంగా దీర్ఘం-సూక్ష్మం అని రెండు భేదాలు, నాల్గోది గౌణభేదం. బాహ్యాభ్యంతర విషయాపేక్షీ. ఇందుకు విధి కింద పేర్కొనబడింది.

అ. **రేచకం:** శ్వాసను లోపలినుండి వాంతి చేసికొనినట్లుగా బయటికి పంపించడం. దాన్ని ఆ స్థితిలోనే ఉంచడం, నియంత్రించడం రేచకమని అంటారు.

ఆ. **పూరకం:** శ్వాసను బయటి నుండి లోపల నింపుట, ఆ స్థితిలోనే ఆపడం, నియంత్రించడం పూరకమని అంటారు.

ఇ. **స్తంభకం (కుంభకం):** లోపలకి బయటికి వచ్చిపోయే శ్వాసను ఎక్కడ ఉన్న దాన్ని అక్కడనే నియంత్రించడం లేదా లోపల నియంత్రించిన శ్వాస బయటికి వచ్చేటప్పుడు, మాటి మాటికి లోపల ఉంచడానికి ప్రయత్నించి ఆపడం అదేవిధంగా బయట నియంత్రించిన శ్వాస లోపలికి వచ్చేటప్పుడు మాటి మాటికి రాకుండా ఆపడం లాంటి ప్రక్రియను స్తంభక (కుంభక) ప్రాణాయామమంటారు.

ఈ. యోగదర్శనంలో చెప్పినట్లుగా బాహ్యాభ్యంతర విషయాపేక్షీ అంటే శ్వాస లోపల నుండి బయటికి వచ్చినప్పుడు బయటనే కొంచెం కొంచెంగా శ్వాసను ఆపుతూ ఉండటం, అదే విధంగా బయట నుండి లోపలికి వచ్చే శ్వాసను లోపలనే కొంచెం కొంచెం ఆపుతూ ఉంచడం. ఇది గౌణ భేదం. అందువల్ల ఇది వేరేగా చెప్పబడింది. బాహ్యాభ్యంతరం మీద ఆధారపడింది. అందువల్ల ఇవే గాక అన్యభేదాలు కూడా ప్రముఖమైన మూడు ప్రాణాయామాలలో అంతర్భాగమవడం వల్ల ఇవి అవాంతర భేదాలు.

కొంత మంది బాహ్యరేచకంతో పాటు, అభ్యంతర పూరకంతో పాటు శ్వాసను నియంత్రించడాన్ని అంగీకరించడం లేదు. ఇది సరికాదు. ఉచ్ఛ్వాస, నిశ్శ్వాస ప్రశ్వాసలు మాత్రమే అవుతున్నవి. ఇక ప్రాణాయామ శబ్దానికి అర్థమే వ్యర్థమవుతుంది. "ఆయామ" శబ్దానికి ప్రసారం, విస్తారం వ్యాపింపజేయడం, నియంత్రించడం. దీని ప్రకారంగా విస్తరింపజేయడం నియంత్రించడమే ప్రాణాయామమవుతుంది.

అందువల్ల వాటి అర్థాలను కూడా ప్రాణాయామ శబ్దార్థాలతో కలిపి చెప్పాలి. ఎలా అంటే బాహ్యప్రాణాయామం, ఆభ్యంతర ప్రాణాయామం, స్తంభక ప్రాణాయామమని.

3. ప్రాణాయామ మంత్రం

శాస్త్రాలలో వ్యాహృతులు మూడు గాను, ఏడు గాను కనిపిస్తున్నవి. ఋషి దయానందుల వారు ఏడు వ్యాహృతులను స్వీకరించి, ప్రాణాయామ విధిని నిర్ణయించారు. కారణం? మూడు వ్యాహృతులు ఏడు వ్యాహృతులలో అంతర్భూతమైనవి. వారు చూపించిన వ్యాహృతులు, మంత్రం ఈ కింద పేర్కొనబడినవి.

పవిత్రమైన ఈ సన్న్యాసాశ్రమమును సార్థకపరచడానికి, విధిననుసరించి యోగశాస్త్రాను సారంగా, ఈ ఏడు వ్యాహృతులకు ముందు ఏడు ప్రణవములను 'ఓం' జోడించి, ప్రాణాయామ మంత్రాన్ని మనస్సుతో జపిస్తూ మూడు ప్రాణాయామాలను చేసినట్లయితే అతడు గొప్ప తపస్సు చేసినవాడవుతాడు (సం.వి.ప.ప్ర.).

ఓం భూః, ఓం భువః, ఓం స్వః, ఓం మహః, ఓం జనః
ఓం తపః, ఓం సత్యమ్ (సం.వి.)

ప్రాణాయామం వల్ల ఇంద్రియాల దోషక్షయం ఇది మనుకృతం-ప్రామాణికం

దహ్యన్తే ధ్మాయమానానాం ధాతూనాం హి యథా మలాః । మూలశ్లోక సం.**47**
తథేంద్రియాణాం దహ్యన్తే దోషాః ప్రాణస్య నిగ్రహాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**71**

టీక:- హి = ఎందుకంటే, **యథా ధ్మాయమానానాం ధాతూనాం మలాః దహ్యన్తే** = ఏ విధంగా లోహాలను అగ్నిలో కాల్చి కరిగించినందువల్ల మలం (మురికి) పోతుందో, అదే విధంగా, **తథా ప్రాణస్య నిగ్రహాత్** = ప్రాణవాయువును నిగ్రహించినందువల్ల, **ఇంద్రియాణాం దోషాః దహ్యన్తే** = మనస్సు మొ॥ ఇంద్రియాల దోషాలు భస్మమైపోతాయి.

ఋషి దయానందభాష్యం:- ఎలాగైతే లోహాలను మూసయందుంచి అగ్నిపై పెట్టి ఊదినట్లయితే అవి కరిగి వాటి మురికి పోతాయో, అలాగే మనస్సులోని రాగద్వేషాదులు, ఇంద్రియాల విషయములకు లొంగుట మున్నగు దోషాలు ప్రాణాయామంలో భస్మీభూతమౌతాయి.(స.ప్ర.5వ సము.) ॥71॥

వివరణ:

ప్రాణాయామం వల్ల దోషనివారణ

క. ఇందుకు యోగదర్శన ప్రమాణం **"యోగాంగానుష్ఠానాత్ అశుద్ధి క్షయే జ్ఞానదీప్తిః ఆవివేకఖ్యాతేః"** (2.28) ప్రాణాయామం కూడా యోగానికి ఒక ప్రముఖ అంగం.

ప్రాణాయామం చేసే వ్యక్తికి ప్రతిక్షణం ఉత్తరోత్తర కాలంలో అశుద్ధిక్షయం, జ్ఞాన ప్రకాశం కలుగుతూ ఉంటుంది. ముక్తి ప్రాప్తి పర్యంతం అతడికి ఆత్మజ్ఞానం క్రమంగా పెరుగుతూనే ఉంటుంది. (స.ప్ర.తృ.స).

ఇదే విధంగా మాటి మాటికి అభ్యాసం చేసే కొద్దీ ఉపాసకుడికి ప్రాణం వశమవుతుంది. ప్రాణం స్థిరం కాగా మనస్సు స్థిరమవుతుంది. మనస్సు స్థిరం కాగా ఆత్మకూడా స్థిరమయిపోతుంది (ఋ.భా.భూ.ఉపాసన).

ఖ. **"తతః క్షీయతే ప్రకాశావరణమ్"** (2.52)

ప్రాణాయామ సిద్ధి, ప్రాణాయామ పూర్వకమైన ఉపాసనానంతరం ఆత్మజ్ఞానాన్ని మూసి ఉంచిన ఇంద్రియాల దోషాలు, అజ్ఞానరూపమైన ఆవరణం నష్టమైపోతుంది. అప్పుడు ఆత్మజ్ఞాన ప్రకాశం మెల్లమెల్లగా పెరుగుతూపోతుంది. ఈ విషయంలో ఋషి దయానందులవారిట్లు రాశారు. ప్రాణం (ప్రాణవాయువు) వశమైనప్పుడు, మనస్సు, ఇంద్రియాలు కూడా స్వాధీనమవుతాయి. బలం, పురుషార్థం అభివృద్ధి చెందగా బుద్ధి తీవ్రమై సూక్ష్మరూపంగా మారుతుంది. అప్పుడు బుద్ధి చాలా కఠినమైన విషయాన్ని సూక్ష్మాతి సూక్ష్మమైన విషయాన్నీ శీఘ్రంగా గ్రహించగలదు. దీని వల్ల మానవ శరీరంలో వీర్యాభివృద్ధి కలుగగా స్థిరమైన బలం, పరాక్రమం, జితేంద్రియత్వం, సర్వశాస్త్రాలను స్వల్ప సమయంలోనే గ్రహించే శక్తి కలుగుతుంది (స.ప్ర.తృ.స).

ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణలతో దోషక్షయము- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాణాయామైర్దహేద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషమ్ । మూలశ్లోక సం.**48**
ప్రత్యాహారేణ సంసర్గాన్ ధ్యానేనానీశ్వరాన్ గుణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**72**

టీక:- సన్న్యాసులు, **ప్రాణాయామైః దోషాన్** = ప్రాణాయామాభ్యాసాల ద్వారా దోషాలను, **ధారణాభిః కిల్బిషమ్**=ధారణ వల్ల అంతఃకరణం యొక్క మలినాన్ని, **ప్రత్యాహారేణ సంసర్గాన్** = ప్రత్యాహారమనే యోగాంగం ద్వారా సహవాస దోషాలను, **చ** = మరియు, **ధ్యానేన అనీశ్వరాన్ గుణాన్** = ధ్యానం ద్వారా అవిద్యా పక్షపాతాది అనీశ్వరత్వ దోషాలను వదిలించుకొని, పక్షపాత రహితమైన ఈశ్వరీయ గుణాలను అలవరచుకొని, **దహేత్** = సర్వదోషాలను భస్మం చేస్తారు.

ఋషి దయానందభాష్యం:-అందువల్ల సన్న్యాసులు ప్రతినిత్యం ప్రాణాయామాల వల్ల అంతఃకరణాన్ని, ఇంద్రియ దోషాలను, ధారణ వల్ల పాపాన్ని, ప్రత్యాహారం వల్ల సంగదోషాలను, ధ్యానం ద్వారా అనీశ్వరత్వ గుణాలను-హర్షి-శోక, అవిద్య మొదలయిన జీవుడి దోషాలను భస్మీభూతం చేస్తారు. (స.ప్ర.5వ సము.). ॥72॥

వివరణ:

ధారణ, ప్రత్యాహార వివేచనంలో యోగప్రమాణం

ప్రాణాయామం ద్వారా ఇంద్రియదోషం ఎలా దహనమవుతుందో 6.47వ శ్లోకంలో చూడగలరు.

క. ధారణ వల్ల అంతఃకరణానికి సంబంధించిన కిల్బిషాలను, చెడులను దూరం చేయాలి. **"దేశబన్ధశ్చిత్తస్య ధారణా"** (యోగ.3.1) మనస్సును చాంచల్యం నుండి దూరంచేసి, నాభి, హృదయం, మస్తకం, నాసిక, నాలుక యొక్క అగ్రభాగం మొ॥ స్థానములందు స్థిరం చేసి, ఓంకార జపం తదర్థమైన పరమేశ్వరుణ్ణి ధ్యానించడం లేదా చింతన చేయడం ధారణ. (ఋ.భా.భూ-ఉపాసన) లేదా పాపాలను, దోషాలను గుర్తెరిగి, వాటిని వదిలివేయడానికి వ్రతాలను పాటించుటయే ధారణ.

"కించ ధారణాసు చ యోగ్యతా మనసః" (యోగ 2.53) ధారణ వల్ల మనస్సులో జ్ఞానయోగ్యత, వివేకం అభివృద్ధి చెందుతాయి. దాని వల్ల చెడుభావాలు దూరమవుతాయి. (కిల్బిషమ్) పాపం దీన్ని గురించి విశేషమైన వివరణ 8.191లో చూడగలరు.

ఖ. ప్రత్యాహారం ద్వారా సంసర్గజన్య దోషవర్జనం

"స్వవిషయాసంప్రయోగే చిత్తస్య స్వరూపానుకార ఇవ ఇంద్రియాణాం ప్రత్యాహారః"(2.24)

పురుషుడు ఎప్పుడు తన మనస్సును జయిస్తాడో అప్పుడు ఇంద్రియాలను జయించడం సులభమవుతుంది. కారణమేమంటే, ఇంద్రియాలను నడిపించేది మనసే కాబట్టి. ఇదే ప్రత్యాహారం, (ఋ.భా.భూ.ఉపాస). దీని వల్ల ఇంద్రియాలు, తమ తమ విషయాలతో సంబంధాన్ని, అభిమానాలు మొ॥ దోషాల నుండి నివృత్తములవుతాయి. ప్రత్యాహారం వల్ల మనస్సు స్వవశంలో ఉంటుంది. ఇంద్రియాల మీద దృఢత్వం కలుగుతుంది.

"తతః పరమావశ్యతేంద్రియాణామ్" యోగ.2.55

అప్పుడు మనుషుడు జితేంద్రియుడై ఎక్కడ తన మనస్సును ఉంచాలనుకొంటాడో అక్కడ ఆపగలడు. మళ్ళీ కావాలనుకుంటే అక్కడ నుండి నడిపించగలడు. మళ్ళీ ఆ మనస్సుకు జ్ఞానోదయమైనప్పుడు, సదా సత్యమంటే ప్రేమ కలుగుతుంది. అసత్యం నుండి దూరమవుతుంది (ఋ.భా.భూ.ఉపా.).

యోగదర్శనానికి గల వ్యాసభాష్యంలో కూడా అపరిగ్రహాన్ని గురించి స్పష్టంగా రాయబడింది.

"విషయాణామార్జన రక్షణ-క్షయ-సఙ్గ-హింసాదోషదర్శనాత్ అస్వీకరణమ్ అపరిగ్రహః" (2.20) విషయాలలో అర్జన దోషం, రక్షణదోషం, క్షయదోషం, సంగదోషం, అలాగే హింసాదోషం ఇన్ని దోషాలున్నాయని తెలిసి వాటిని స్వీకరించకుండా ఉండుటయే అంటే వాటిని త్యజించుటయే అపరిగ్రహం.

3. ధ్యానం ద్వారా అనీశ్వర గుణాలను అవిద్య, అజ్ఞానం మొ॥ వాటిని త్యజించి ఈశ్వరీయ గుణాలను స్వీకరించి, పాటించడం జరుగుతుంది.

"తత్ర ప్రత్యయైకతా ధ్యానమ్" (యోగ. 3.2)

ఆశ్రయ యోగ్యుడు, అంతర్యామీ, వ్యాపకుడైన పరమేశ్వరుడి యందు ధ్యానముంచాలి. అలాంటి మహాత్ముడి ప్రకాశంలో, ఆనందంలో అత్యంత విచారంతో, ప్రేమభక్తితో, సముద్రంలో నది ప్రవేశించినట్లు ప్రవేశించాలి. ఆ సమయంలో ఈశ్వరుడు తప్ప మరొక అన్యపదార్థమే స్మరణకు రాకూడదు. కానీ, ఆ అంతర్యామి యొక్క స్వరూపంలో జ్ఞానంలో మగ్నమైపోవాలి. దీనికే ధ్యానమని పేరు (ఋ.భా.భూ.ఉపాసన).

"కిల్బిషనాశనం" కోసం 11.227వ శ్లోకం వివరణను, శబ్దార్థం కొరకు 8.316ను చూడగలరు.

ధ్యానం వల్ల పరమాత్మ జ్ఞానం

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉచ్చావచేషు భూతేషు దుర్జ్ఞేయామకృతాత్మభిః । మూలశ్లోక సం. **49**
ధ్యానయోగేన సంపశ్యేద్గతిమస్యాంతరాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **73**

టీక:- ఉచ్చ+అవచేషు భూతేషు = చిన్న, పెద్ద ప్రాణులు మరియు అప్రాణులలో, **అకృతాత్మభిః దుర్జ్ఞేయాం అస్య+అన్తరాత్మనః గతిమ్** = అశుద్ధాత్ములచే చూడటానికి యోగ్యుడు కానట్టి అంతర్యామి అయిన పరమాత్ముడి గతి అంటే ఈశ్వర సాక్షాత్కారాన్ని, **ధ్యానయోగేన సంపశ్యేత్** = ధ్యానం, యోగం ద్వారానే సన్న్యాసి చూడగలడు.

ఋషి దయానందభాష్యం:-ఉత్కృష్టమైన దేవ యోనులలోగాని, నీచాలైన పశ్వాదియోనులలో గాని ఈ జీవుడెప్పుడు ఏ విధంగా ప్రవేశిస్తాడనేది మూఢులకు తెలీదు. ధ్యానయోగం వల్ల యతి దాన్ని సాధించగలడు.(సం.వి.స.ప్ర.).॥73॥

వివరణ: ధ్యానయోగం కోసం 6.72శ్లోకంలో చూడగలరు. వివరణ సంఖ్య 4లో చూడగలరు.

యథార్థజ్ఞానంతో కర్మబంధన వినాశం

ఇది మనుకృతం-ప్రామాణికం

సమ్యగ్దర్శనసంపన్నః కర్మభిర్న నిబద్ధ్యతే । మూలశ్లోక సం. **50**
దర్శనేన విహీనస్తు సంసారం ప్రతిపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **74**

టీక:- సమ్యక్-దర్శన సంపన్నః = ఏ సన్న్యాసి యథార్థ జ్ఞానసంపన్నుడో లేదా షడ్దర్శ విజ్ఞానియో అతడు, **కర్మభిః న నిబద్ధ్యతే** = దుష్టకర్మలందు బద్ధుడు కాడు, **తు** = మరియు, **దర్శనేన విహీనః** = ఎవడు జ్ఞాన-విద్యాయోగాభ్యాస-సత్సంగ-ధర్మానుష్ఠాన విహీనుడో, షడ్దర్శన జ్ఞానంలేదో విద్యావిహీనుడై సన్న్యాసాన్ని స్వీకరిస్తాడో, అతడు సన్న్యాస పదవిని, మోక్షాన్ని పొందనివాడై, **సంసారం ప్రతిపద్యతే** = జన్మమరణ రూప సంసారాన్ని మాత్రమే పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:-జ్ఞానంతో కూడినవాడు దుష్టకర్మలు చేయడు. జ్ఞానం లేనివాడే జననమరణరూపమైన సంసారంలో పడుతూ ఉంటాడు. యథార్థజ్ఞాన సంపన్నుడు, జ్ఞాన విద్యాయోగాభ్యాస సత్సంగ ధర్మానుష్ఠానపరుడే మోక్షాన్ని పొంది జన్మమరణ రూపబంధాల నుండి ముక్తుడౌతాడు. (సం.వి.స.ప్ర).॥74॥

వివరణ

ధ్యానయోగ వివేచన:- ఉపరోక్తమైన (72,73) యథార్థ జ్ఞానం వల్ల ధ్యానయోగ సిద్ధి కలుగగా పరమాత్మ దర్శనం కలుగుతుంది.

1. "తత్ర ధ్యానజమనాశయమ్" (యోగ. 4.6)

ధ్యాన యోగం వల్ల చిత్తం సిద్ధం కాగా, యోగికి యథార్థ జ్ఞానం కలుగుతుంది. ఆ యథార్థ జ్ఞానం వల్ల **అనాశయమ్** = కర్మవాసన, క్లేశ వాసనల నుండి ముక్తుడవుతాడు. కర్మబద్ధుడుకాడు. అతడి కర్మలు దగ్ధబీజంతో సమానంగా ఫలోన్ముఖాలు కావు. ఇదే ముక్తి మోక్షస్థితికి చేర్చుతుంది.

2. దర్శనములంటే పుస్తక విశేషమైన దర్శన గ్రంథాలు కావు. ఈశ్వర 'దర్శన విద్య'లని తాత్పర్యం. ఈశ్వరాది తత్త్వాలకు చెందిన ప్రత్యక్ష జ్ఞానాన్ని కలిగించే విద్యే 'దర్శన విద్య'.

అహింసాది వైదిక కర్మల ద్వారా పరమాత్మ పద ప్రాప్తి ఇది మనుకృతం-ప్రామాణికం

అహింసయేన్ద్రియాసంగైర్వైదికైశ్చైవ కర్మభిః । మూలశ్లోక సం.**51**
తపసశ్చరణైశ్చోగ్రైస్సాధయంతీహ తత్పదమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**75**

టీక:- అహింసయా = సర్వప్రాణులలో నిర్వైర భావన, **ఇంద్రియ+అసంగైః** = ఇంద్రియాల ద్వారా విషయ సుఖాలను త్యజించడం, **వైదికైః కర్మభిః** = వేదోక్త కర్మలు, **చ** = మరియు, **ఉగ్రైః తపశ్చరణైః** = అత్యుగ్రమైన తపశ్చరణాల ద్వారా, **ఇహ** = ఈ ప్రపంచంలో, **తత్పదమ్ సాధయన్తి** = మోక్షపదాన్ని పూర్వోక్త సన్న్యాసి మాత్రమే సాధించగలడు. ఇతరులు కారు.

ఋషిదయానందభాష్యం:- ఎవరు నిషిద్ధమైన హింసను వదిలివేశారో, నిర్వైరులో, ఇంద్రియ బంధనాల నుండి ముక్తులో, ఉత్తమ కర్మలు-సత్యభాషణ, ప్రాణాయామం, ఉత్తమమైన ఉగ్రకర్మానుష్ఠానం ద్వారా సన్న్యాస స్వీకారం చేస్తారో, అలాంటి సన్న్యాసులు మాత్రమే ఈ జన్మలో ఈ వర్తమాన సమయంలోనే పరమేశ్వర ప్రాప్తిరూప పదాన్ని పొందుతారు. వారు సన్న్యాసాన్ని స్వీకరించడం సఫలమే గాక ధన్యవాదానికి యోగ్యులు (స.ప్ర.).॥75॥

76 నుండి 79వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అపవిత్ర శరీర త్యాగం-

* *అస్థిస్థూణం స్నాయుయుతం మాంసశోణితలేపనమ్ ।*
చర్మావనద్ధం దుర్గంధిపూర్ణం మూత్రపురీషయోః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***76***

* *జరాశోకసమావిష్టం రోగాయతనమాతురమ్ ।*
రజస్వల మనిత్యం చ భూతావాసమిమం త్యజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***77***

తాత్పర్యం:- దేహం ఎలాంటిదో మనకు తెలిసిందే! ఎముకలు, కీళ్లు, నరాలు కలిగినది. మాంసంచేత- రక్తంచేత కప్పబడినది, చర్మంచేత కట్టబడినది, దుర్గంధభూయిష్టమైన మూత్రపురీషాదులు గలది. వృద్ధాప్యం, రోగాలు, బాధలు, ఆకలిదప్పులు-వీటిచేత, శీతోష్ణాల చేతను బాధలు పడేది. నశించే స్వభావం గలది. ఇటువంటి ఈ దేహాన్ని; దీనితోపాటు గేహాన్ని (గృహం) ప్రతివారూ ఏదో ఒకరోజు వదిలేయాల్సిందే.॥76,77॥

* *నదీకూలం యథా వృక్షో వృక్షం వా శకునిర్యథా ।*
తథా త్యజన్నిమం దేహం కృచ్ఛ్రాద్గ్రాహాద్విముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***78***

తాత్పర్యం:- చెట్టు తన పతనం ఎరుగక ఏటిగట్టును ఎలా వదులుతున్నదో -ఎటు వీడిపోతున్నదో అదేరీతిగా మానవుడు కర్మాధీనమై ఉన్న దేహం తననెటు పడదోస్తుందో తెలుసుకోలేడు. పక్షి తన గూటిని స్వేచ్ఛగా వదిలిపెట్టినట్లు జ్ఞానవంతుడైన వాడు ఈ దేహాన్ని దాని ఇచ్ఛకు వదిలి, సంసారమనే మొసలిపట్టునుంచి తప్పుకోవచ్చు! ॥78॥

* *ప్రియేషు స్వేషు సుకృతమప్రియేషు చ దుష్కృతమ్ ।*
విసృజ్య ధ్యానయోగేన బ్రహ్మాభ్యేతి సనాతనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***79***

తాత్పర్యం:- బ్రహ్మవేత్త అయినవాడు తనకు ఇష్టులైన వారిపట్ల తన పుణ్యాన్ని-తనకు అప్రియం చేసినవారి పట్ల తన పాపాన్ని వదిలిపెట్టి ధ్యాన నిష్ఠగలవాడై బ్రహ్మైక్యం చెందుతున్నాడు. ॥79॥

ప్రక్షిప్తాల పరిశీలన

76 నుంచి 79వరకు గల శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలు పూర్వాపర శ్లోకాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. ముందు వెనుకల గల ప్రసంగంలో 'సంగాల' నుంచి బయట పడి నిఃస్పృహతో ఉండాలని చెప్పారు. 75వ శ్లోకంలో 'అసంగైః' పదంతో విషయాల నుంచి నిఃస్పృహత్వం చెప్పారు. మళ్లీ 80వ శ్లోకంలో సంగాల నుంచి ముక్తులై అనాసక్తులు కావటానికి ఫలమూ, 81లో **‘త్యక్త్వా సంగాన్ శనైః శనైః"** అనటం చేత దీని ఉపసంహారం చెప్పబడింది. ఇలా 75వ శ్లోకం 80-81లతో సంబద్ధాంగా ఉంది. 80వ శ్లోకం 75 శ్లోకానికి అర్థవాదం అవుతుంది. ఈ శ్లోకాలు ఆ ప్రసంగాన్నీ, దాని సంబద్ధతనూ భంగం చేశాయి పైగా వాటిలో చెప్పినవి ముందు వెనుకలుగా అసంబద్ధాలు.

ఖ. వీటిలోని శరీర త్యాగానికి సంబంధించిన విషయం కూడా తర్వాతి విషయంతో సంబంధం లేనిదే. 80 లో అనాసక్తులు కావటానికి ఫలితం చెబుతూ, ఈ జన్మలోనూ, పర జన్మలోనూ సుఖం కలుగుతుందన్నారు. ఈ శ్లోకాల ప్రకారం ముందే శరీర త్యాగాన్ని ఉపయుక్తం అనుకుంటే, ‘ఈ జన్మలో సుఖ ప్రాప్తి’ అనే ఫలితం సంగతేమిటి? దీని వల్ల 80వ శ్లోకానికి ముందు శరీర త్యాగ మనేది మనువుకు నచ్చని విషయమని తెలుస్తూంది. 81-82 శ్లోకాలలో ఉన్నట్లుగా ఇటువంటి వర్ణన విషయంలో చివర రావాలి.

గ. ఇక్కడ పూర్వాపర స్థానాలలో భర్త కర్తవ్యాలు పూర్తి అయ్యే ముందుగానే వాటి ఫలితాలు, 78-79లలో చెప్పినట్లుగా, చెప్పటం అసంగతం అవుతుంది. ఇలా చెప్పటం, 81-82లలో ఉన్నట్లుగా అన్ని కర్తవ్యాలూ చెప్పిన తర్వాత రావటమే సబబవుతుంది.

ఈ విధంగా 78-79 శ్లోకాలు, వీటికి సంబంధించిన ఇతరమైన మునుపటి శ్లోకాలూ సందర్భోచితం కావు. ఈ ప్రసంగ వ్యతిరేకాలు ఆధారంగా ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే !

2. అంతర్ వ్యతిరేకాలు

క. 6.66లో సన్న్యాసి అంటే అన్ని ప్రాణుల పట్లా సమాన భావం కలవాడని చెప్పారు. అతడు రాగద్వేషాల నుంచి ముక్తుడై (6.60) ఒంటరిగా చరిస్తాడు. (33, 42). మనువు చెప్పిన సన్న్యాసి లక్షణా లివే. 79లో సన్న్యాసులకూ ప్రియమైన వారు, శత్రువులూ ఉంటారనటం మనువు చెప్పిన దానికి వ్యతిరేకం. మనువు చెప్పిన పద్ధతిలో సన్న్యాసం తీసుకున్నవాడికి మిత్రులు, శత్రువుల ప్రసక్తే ఉండదు.

ఖ. 4.240లో మనువు కర్మఫలాలు అనుభవించేవాడు కర్తే అని చెప్పాడు. 79లో ‘యతి మంచి పనులను తన ఇష్టులకూ, చెడ్డపనులను శత్రువులకూ విడచిపెడతాడు’ అనటం పైన చెప్పిన పద్ధతికి వ్యతిరేకం. ఈ ఆధారంతో 79వ శ్లోకం ప్రక్షిప్తం. విషయ దృష్టితో మునుపటి శ్లోకాలు దీనికి సంబంధించినవే అయినా, మునుపటిది ప్రక్షిప్తమని తేలింది కనుక, ఇవన్నీ కూడా ప్రక్షిప్తాలే అవుతాయి.

80 నుండి 82వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఆశలేనివానికే సుఖం, మోక్షప్రాప్తి-

యదా భావేన భవతి సర్వభావేషు నిస్స్పృహః । మూలశ్లోక సం.**52**
తదా సుఖమవాప్నోతి ప్రేత్య చేహ చ శాశ్వతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**80**

టీక:- **యదా**= ఎప్పుడు సన్న్యాసి, **సర్వభావేషు భావేన నిఃస్పృహః భవతి** = సర్వ పదార్థాలు తనకు సంబంధించినవి కావనే భావనతో, నిస్పృహుడై ఆశలేనివాడై ఉంటాడో, **తదా** = అప్పుడు మాత్రమే, **ఇహ చ ప్రేత్య శాశ్వతమ్**

సుఖమ్+అవాప్నోతి = ఈ లోకంలో మరణానంతరంలో, పరలోకంలో, ముక్తిలో పరమాత్మను పొంది నిరంతరం సుఖంగా ఉంటాడు.

ఋషి దయానందభాష్యం:- తన మనసులో సమస్త వస్తువుల మీదా ఎప్పుడు వ్యామోహం లేనివాడవుతున్నాడో, అప్పుడు మాత్రమే ఈ లోకంలో మరణానంతరంలో, పరలోకంలో ముక్తిలో పరమాత్మను పొంది, నిరంతరం సుఖంగా ఉంటాడు.

ఎప్పుడు సన్న్యాసి సర్వభావన (పదార్థాలు) లందు నిస్పృహుడై, కాంక్షారహితుడై బాహ్యాభ్యంతర వ్యవహారాలలో పవిత్ర భావంతో ఉంటాడో, అప్పుడు మాత్రమే ఈ జన్మలో లేదా మరణానంతరం నిరంతరం సుఖంగా ఉంటాడు.(సం.వి.స.ప్ర)॥80॥

పరమాత్మలో స్థానం **ఇది మనుకృతం. ప్రామాణికం**

అనేన విధినా సర్వాంస్త్యక్త్వా సంగాన్ శనైశ్శనైః । మూలశ్లోక సం.**53**
సర్వద్వంద్వ వినిర్ముక్తో బ్రహ్మణ్యేవావతిష్ఠతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**81**

టీక:- అనేన విధినా = ఈ విధిననుసరించి, **శనైః శనైః** = మెల్ల మెల్లగా, **సర్వాన్ సంగాన్ త్యక్త్వా** = సంగం వల్ల సంభవించే దోషాలను త్యజించి, **సర్వ-ద్వన్ద్వ-వినిర్ముక్తః** = హర్ష శోకాది ద్వన్ద్వాల నుండి విముక్తుడై, **బ్రహ్మణి+ఏవ+అవతిష్ఠతే** = విద్వాంసుడైన సన్న్యాసి బ్రహ్మయందే స్థిరంగా ఉంటాడు.

ఋషి దయానందభాష్యం:-పుత్ర, క్షేత్ర, కళత్రాదులపై మమకారాన్ని కట్టిపెట్టి వారి సాంగత్యాన్ని వీడి, మానావమానాలనే ద్వంద్వాలను వీడి, ఇంతకు ముందు చెప్పిన జ్ఞాన కర్మానుష్ఠానాల వల్ల పునరావృత్త రహితమైన మోక్షాన్ని పొందగలడు.(సం,వి.స.ప్ర.). ॥81॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ధ్యానికం సర్వమేవైతద్యదేతదభిశబ్దితమ్ । మూలశ్లోక సం.**54**
న హ్యనధ్యాత్మవిత్కశ్చిత్ క్రియాఫలముపాశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**82**

టీక:- యత్+ఏతత్+అభిశబ్దితమ్ = ఇంతకు ముందు చెప్పినదంతా, **ఏతత్ సర్వమ్+ఏవ ధ్యానికం** = ఇదంతా ధ్యానం, యోగం ద్వారా సిద్ధిస్తుంది. **అన్+అధ్యాత్మవిత్ కశ్చిత్** = అధ్యాత్మ జ్ఞాన విహీనుడైన వాడెవడుకూడా, **క్రియాఫలమ్ నహి ఉపాశ్నుతే** = ఉపర్యుక్త కర్మల ఫలితాలను పొందజాలడు.

ఋషి దయానందభాష్యం:-ధ్యానయోగం ద్వారానే సిద్ధి కలుగుతుందనే భావం. అలవర్చు కొన్నవాడికి తప్ప పైన చెప్పబడినవి వదలడం సాధ్యం కాదు. అది సాధ్యపడనిదే మోక్షం పొందజాలరు.॥82॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *అధియజ్ఞం బ్రహ్మ జపేదాధిదైవికమేవ చ ।*
ఆధ్యాత్మికం చ సతతం వేదాంతాభిహితం చ యత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*83*

తాత్పర్యం:- యజ్ఞాలను గురించి, దేవతల గురించి, జీవాత్మగురించి, వేదాలలో ప్రతిపాదింప బడిన వేదాంతాన్ని నిత్యం మననం చేస్తూ ఉండాలి. వేదాంత వాక్యసారం ఒంటబట్టించుకోవాలి.॥83॥

ప్రక్షిప్త పరిశీలన

83వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది -

1. ప్రసంగ వ్యతిరేకం

క. ఈ శ్లోకం ముందు వెనుకల శ్లోకాలను భంగం చేస్తుంది. 82వ శ్లోకంలో ధ్యానం సన్న్యాసికి ఆధారమంటూ ముగించారు. అలాగే 84తో సన్న్యాసపు గొప్పతనాన్ని చెబుతూ ముగింపు జరిగింది. 'ఇదం' అనేక ఏకవచన ప్రయోగంతో 84వ శ్లోకం విషయ దృష్ట్యా 82వ శ్లోకంతో కలుస్తుంది. ఈ పదంతో 'సన్న్యాసం' అనే దాని అర్థం చెప్పబడింది. ఈ శ్లోకం ఈ సంకేతించిన సంబద్ధతను భంగం చేసింది కనుక, ఇది ప్రసంగ వ్యతిరేకం.

ఖ. సన్న్యాస ఆశ్రమపు పద్ధతులు ముగిశాక 81 నుంచి 85 శ్లోకాల వరకు దాని ముగింపుతో కూడిన ఫలితాలు చెప్పారు. ఇది 81 నుంచి మొదలైంది. దీని మధ్య 83వ శ్లోకంలో కర్తవ్యాల విధానం చెప్పడం ప్రాసంగికం కాదు. ఇది మౌలికమై ఉంటే విధాన వచనాలతో పాటుగా కర్తవ్యాల ప్రసంగంలోనే 82వ శ్లోకాని కన్నా ముందే రావాలి. ఇక్కడ ముందు వెనుకల ప్రసంగాలకు భిన్నంగా చెప్పటం చేత ఇది ప్రసంగ వ్యతిరేకం, కనుక ప్రక్షిప్తం.

84, 85వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

పరమాత్మయే సుఖస్థానం-

ఇదం శరణమజ్ఞానా మిదమేవ విజానతామ్ । మూలశ్లోక సం.**55**
ఇదమన్విచ్ఛతాం స్వర్గమిదమానంత్యమిచ్ఛతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**84**

టీక:- **ఇదం అజ్ఞానామ్ శరణమ్** = ఈ పరమాత్మే అజ్ఞానులకు గౌణ సన్న్యాసులకు, **ఇదమ్+ఏవ విజానతామ్** = ఈ పరమాత్మే విద్వాంసులైన సన్న్యాసులకు, **ఇదం స్వర్గమ్ ఇచ్ఛతాం** = ఇదే సుఖేచ్ఛుకులకు, **ఇదమ్+అన్వయ్ +ఇచ్ఛతామ్** = ఇదే అనంత సుఖాన్ని కోరే మనుషులకు ఆశ్రయం.

ఋషి దయానందభాష్యం:- ఈ వేద రూపమైన అర్థం అందరికీ బోధపడదు. బ్రహ్మము, తత్ పదానికి అర్థం అనే జ్ఞానం లేనప్పుడు జీవన్మరణ చక్రమే శరణ్యం. స్వర్గం కోరేవారికి సత్కార్యాచరణమే శరణం. వేదార్థజ్ఞానం గల వారికిదే మోక్షం.॥84॥

ఎవరు జిజ్ఞాసువులై సన్న్యాసాన్ని స్వీకరిస్తారో, వారు కూడా విద్యాభ్యాసం చేసి, సత్పురుషుల సంగం నుండి యోగాభ్యాసం చేసి ఓంకార జపాన్ని చేస్తూ, తదర్థమైన పరమేశ్వరుడిని ధ్యానిస్తారు. (సం.వి.స.ప్ర.).

వివరణ

1. **మోక్షసుఖానికి ఆశ్రయం పరమాత్మే:-** పరమేశ్వరుడు మోక్షసుఖానికీ అన్యసుఖాలకూ ఆశ్రయుడు. ఈ విషయాన్ని సూచించే వేదమంత్రాన్ని తులనాత్మకంగా ఉదాహరిస్తున్నాం.

"యుక్తేన మనసా వయం దేవస్య సవితుః సవే స్వర్గ్యాయ శక్త్యా" ఋ. 1.4.3

టీక:- **అర్థం:వయం** = మనం, **స్వర్గ్యాయ** = మోక్ష సుఖం కోసం, **శక్త్యా** = యథా యోగ్యమైన సామర్థ్య బలంతో, **దేవస్య** = పరమేశ్వర సృష్టిలో ఉపాసనా యోగాన్ని పూర్తిచేసి, స్వీయాత్మను శుద్ధం, పరిశుద్ధం చేసుకోవాలి. **యుక్తేన మనసా** = తమ పరిశుద్ధమైన మనస్సుతో, పరమేశ్వరుడి ప్రకాశరూపమైన ఆనందాన్ని పొందాలి. (ఋ.భా. భూ.ఉపా).

2. ఈ శ్లోకానికి సందర్భం వేదం కాదు. పరమాత్మే మోక్ష సుఖాదులకు శరణ్యం కాగలదు. టీకాకారులు ఈ శ్లోకానికి వేద సంబంధంగా వ్యాఖ్య చేశారు. ఇది ప్రసంగానుకూలం కాదు. ఇక్కడ ప్రసంగం పరమాత్మ ప్రాప్తి మాత్రమే.

ఉపసంహారము-

ఇది మనుకృతం-ప్రామాణికం

అనేన క్రమయోగేన పరివ్రజతి యో ద్విజః । మూలశ్లోక సం.**56**
స విధూయేహ పాప్మానం పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**85**

టీక:- అనేన క్రమయోగేన = ఈ క్రమానుసారంగా సన్న్యాస యోగం వల్ల, **యః ద్విజః పరివ్రజతి** = ఏ ద్విజుడు (అంటే బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు) సన్న్యాసమును స్వీకరిస్తాడో, **సః** = అతడు, **ఇహ** = సంసారం నుండి, శరీరం నుండి, **పాప్మానం విధూయ** = పాపాన్ని వదిలించుకొని, **పరంబ్రహ్మ+అధి గచ్ఛతి** = పరబ్రహ్మన్ని పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:- ఈ ప్రకారంగా ఎవరు సన్న్యాసాశ్రమాన్ని గడపగలుగుతారో, అలాంటివారే ఈ లోకంలో పాపాలను వదిలించుకొని శాశ్వత పరబ్రహ్మైక్యం పొందుతారు.॥85॥ (సం.వి.సన్న్యాసాశ్రమ)

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* *ఏష ధర్మోఽనుశిష్టో వో యతీనాం నియతాత్మనాం ।*
వేదసన్న్యాసికానాం తు కర్మయోగం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***86***

తాత్పర్యం:- జితేంద్రియులు 4 రకాలు. కుటీచర, బహూదక, హంస, పరమహంస. ఈ 4 రకాలవారికి కర్మయోగం వేదవిహితమైన కర్మాచరణమే ! అదే చెప్పబడింది. ॥86॥

ప్రక్షిప్త పరిశీలన

86వ శ్లోకం ఈ కింది ప్రమాణాలతో ప్రక్షిప్త మవుతుంది -

1. ప్రసంగ వ్యతిరేకం

ఈ శ్లోకం ప్రసంగ వ్యతిరేకంగా ఉంది. ఇందులో 'వేద సన్న్యాసుల' పనులు చెప్పబడతాయన్న సంకేతం ఉంది. కాని దీని తర్వాతి శ్లోకాలలో ఆశ్రమ ధర్మాలు చెప్పాక, వాటి ముగింపు ఉంది. ఇది మౌలికమై ఉంటే, దీని తర్వాతి శ్లోకం 'వేద సన్న్యాసుల' పనులతో ప్రారంభం కావలసి ఉంది. మనుస్మృతి మొత్తంలో సంకేతాల తర్వాత దానికి సంబంధించినవే ఉంటాయి. ఇది మనువుకే ఉన్న ప్రత్యేక శైలి. కాని ఇక్కడ ఆ విధంగా లేదు. పైగా ముందు వెనుకల యతుల ధర్మాల కథనం ఉంది. ఇలా ఈ సంకేతం ప్రాసంగికం కాక పోవడం చేత ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

క. మనువు నాలుగు ఆశ్రమాలే చెప్పాడు. వాటిని క్రమంగా చెబుతూ సంన్యాసాశ్రమ ధర్మాలను 33 నుంచి 85 వరకు వివరించాడు. దీనితో నాలుగు ఆశ్రమాల విషయమూ పూర్తయింది. ఈ ఆధారంతో 'వేద సంన్యాసుల'ను విడిగా చెప్పటం మనువుకు వ్యతిరేకం.

ఖ. ఒకవేళ, 'వేద సన్న్యాసులు' అంటే, 'వేదాలలో చెప్పిన కర్మ కాండలను వదిలేసిన వ్యక్తులు' అనే అర్థం ఉంటే, ఇది కూడా మనువుకూ, మనుస్మృతిలోని విషయాలకూ వ్యతిరేకమే అవుతుంది. అటువంటి వాణ్ని మనువు సన్న్యాసిగా కాదు కదా, 'ద్విజుడు' అని కూడా అంగీకరించడు. శూద్రు డనే అంటాడు.[2.143 (168)]. మనుస్మృతికి మూలాధారం వేదాలే కనుక, వేదాలలో చెప్పిన వాటిని వదిలేసే పద్ధతి మనువుకు వ్యతిరేకం. ఇదంతా 'వేదాలలో చెప్పిన కర్మల, పద్ధతిలో ఉండే మనువు ఆదేశాలకూ వ్యతిరేకమే[2.1(26); 4.14].

87 నుండి 93 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఆశ్రమ ధర్మ సమాప్తికి ఉపసంహారం-

బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థో యతి స్తథా । మూలశ్లోక సం. 57
ఏతే గృహస్థప్రభవాశ్చత్వారః పృథగాశ్రమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 87

టీక:- బ్రహ్మచారీ గృహస్థః వానప్రస్థః తథా యతిః = బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, మరియు సన్న్యాసం, ఏతే చత్వారః పృథక్ ఆశ్రమాః = ఈ నాలుగు వేరు వేరు ఆశ్రమాలు, గృహస్థ ప్రభవాః = గృహస్థాశ్రమం నుండి పుట్టినవే.

తాత్పర్యం:- బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్న్యాసం అనే ఈ నాలుగు రకాల ఆశ్రమాలు మానవజాతిని మోక్షగాములుగా చేసే సముద్ధరణ కృషిలో భాగమైన గృహస్థాశ్రమం నుండే పుట్టినవి.॥87॥

ఆశ్రమధర్మపాలన వల్లనే మోక్షమార్గంలో ప్రగతి-

ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేఽపి క్రమశస్త్వేతే యథా శాస్త్రం నిషేవితాః । మూలశ్లోక సం.58
యథోక్తకారిణం విప్రం నయంతి పరమాం గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.88

టీక:- ఏతే సర్వే +అపి క్రమశః యథా శాస్త్రం నిషేవితాః = ఈ ఆశ్రమాలన్నింటినీ క్రమానుసారంగా, శాస్త్రోక్త విధులననుసరించి పాటించినట్లయితే, యథా + ఉక్త కారిణం విప్రం = కర్తవ్యాలను యథోక్త రీతిగా పాటించిన ద్విజుడు, పరమాం గతిమ్ నయన్తి = ఉత్తమ గతిని పొందుతాడు.

తాత్పర్యం:- ఈ నాలుగింట్లో శాస్త్రం చెప్పిన ప్రకారం నడుచుకొన్నప్పుడు, అందులో ఏ ఒక్కటైనా, రెండైనా, మూడైనా మానవులకు 'మోక్షప్రాప్తి' అనే ఉత్తమగతిని కలిగిస్తాయి.॥88॥

గృహస్థుడి శ్రేష్ఠత్వం-

ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేషామపి చైతేషాం వేదస్మృతివిధానతః । మూలశ్లోక సం.59
గృహస్థ ఉచ్యతే శ్రేష్ఠః స త్రీనేతాన్ బిభర్తి హి ॥ ప్రక్షిప్త శ్లోక సం.89

టీక:- వేదస్మృతి విధానతః = వేదాలలోనూ, స్మృతులలోనూ చెప్పిన విధులననుసరించి, ఏషాం సర్వేషామ్ + అపి = ఈ ఆశ్రమాలన్నింటిలో , గృహస్థః శ్రేష్ఠః ఉచ్యతే = గృహస్థుడు దాయిత్వపూర్ణుడవడం వల్ల అందరికంటే శ్రేష్ఠుడు, హి = ఎందుకంటే, సః = అతడు, ఏతాన్ త్రీన్ బిభర్తి = ఈ మూడు ఆశ్రమాల వారికి భరణ పోషణ చేస్తున్నాడు. అంటే ఉత్పత్తి, జీవన యాపన దృష్టితో ఈ మూడు ఆశ్రమాలు (బ్రహ్మచర్య-వానప్రస్థ-సన్న్యాసం) గృహస్త్రాశ్రమం మీద ఆధారపడి ఉన్నాయి. ఇందుకు కారణం (3.78,80) చూడగలరు. 3.77లో గృహస్థుడే ఆధారమని చెప్పబడ్డాడు.

తాత్పర్యం:- ఈ నాలుగింట్లో గృహస్థాశ్రమమే ఉత్తమమైనదని మరొక్కమారీ శ్లోకంలో నొక్కి వక్కాణించబడింది. ఇతడేగదా మిగిలిన మూడురకాల ఆశ్రమములను పోషిస్తున్నాడు. వేద స్మృతుల సారం కూడ ఇదే !॥89॥

గృహస్థుడు సముద్రం లాంటి వాడు-

ఇది మనుకృతం-ప్రామాణికం

యథా నదీనదాస్సర్వే సాగరే యాన్తి సంస్థితిమ్ । మూలశ్లోక సం.60
తథైవాశ్రమిణస్సర్వే గృహస్థే యాన్తి సంస్థితిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.90

టీక:- యథా సర్వే నదీ-నదాః సాగరే సంస్థితిమ్ యాన్తి = పెద్ద పెద్ద నదులు, నదములు సాగరంలో చేరి స్థిరపడునట్లు, తథైవ = ఆవిధంగా, సర్వే ఆశ్రమిణః = సర్వాశ్రమవాసులు, గృహస్థే సంస్థితిమ్ యాన్తి = గృహస్థుడివద్ద స్థిరపడతారు.

ఋషి దయానందభాష్యం:- నదీ నదాలన్నీ చివరికి సముద్రాన్ని చేరినట్లుగా మిగిలిన ఆశ్రమాల వారందరూ గృహస్థాశ్రమం నందు ఉన్నవారినే చేరుతున్నారు. వారిపైనే ఆధారపడుతున్నారు.

ఏ విధంగా పెద్ద పెద్ద నదీనదాలు సముద్రాన్ని చేరనంత వరకు అటు యిటు పారుతుంటాయో, అదే విధంగా గృహస్థుడి ఆశ్రయం చేరినప్పుడు మాత్రమే ఆశ్రమదారు లందరూ స్థిరపడతారు. ఈ ఆశ్రయం లేకుండా ఏ ఆశ్రమ వ్యవహారం సిద్ధం కాజాలదు (స.ప్ర.4వ సము.).॥90॥

వివరణ: సామ్యత కోసం 3.77వ శ్లోకాన్ని చూడండి.

ఇది మనుకృతం. ప్రామాణికం

చతుర్భిరపి చైవైతైర్నిత్యమాశ్రమిభిర్ద్విజైః । మూలశ్లోక సం.**61**
దశలక్షణకో ధర్మః సేవితవ్యః ప్రయత్నతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**91**

టీక:- **ఏతైః చతుర్భిః ఆశ్రమిభిః ద్విజైః** = అందువల్ల, బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు మరియు సన్న్యాసుల ధర్మమేమంటే, **ప్రయత్నతః** = ప్రయత్నించి, **దశలక్షణకః ధర్మః సేవితవ్యః** = పది లక్షణాలు గల (నిమ్న నిఖిత) ధర్మాన్ని నిత్యం ఆరించాలి.

తాత్పర్యం:- ఈ నాలుగు ఆశ్రమాలలో దేనియందున్నా ఈ కింద చెప్పబడే 10 ధర్మాలను అందరూ ఆచరించాలి. అవి:- (తదుపరి శ్లోకంతో అన్వయం) ॥91॥

ధర్మానికి పది లక్షణాలు ఇది మనుకృతం-ప్రామాణికం

ధృతిః క్షమా దమోఽస్తేయం శౌచమింద్రియనిగ్రహః । మూలశ్లోక సం.**62**
ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**92**

టీక:- **1.ధృతిః**= సదా ధైర్యంగా ఉండటం. **2. క్షమా**= నిందాస్తుతులను, మానావమానాలను, హాని లాభాలను మొ॥ దుఃఖాలను సహించడం. **3. దమః**= మనస్సును సదా ధర్మంలో ఉంచి అధర్మం నుండి వేరు చేయడం. అంటే అధర్మం చేయాలనే కోరిక కూడా ఉండరాదు. **4.అస్తేయం**= దొంగతనాన్ని త్యజించడం. అనుమతి లేకుండా ఒకరి వస్తువును తీసుకోవడం మోసం, నమ్మకద్రోహం, వేద విరుద్ధమైన ఉపదేశాలు. ఇవన్నీ చౌర్యానికి సంబంధించినవే. **5.శౌచం**= రాగ, ద్వేషాలు, పక్షపాతాన్ని వదిలిపెట్టడం ఆభ్యంతర శౌచం, జలమృత్తికాదులతో బాహ్యశౌచం పవిత్రంగా ఉండటం. **6. ఇంద్రియ నిగ్రహః**= అధర్మాచరణలను త్యజించి, ఇంద్రియాలను సదా ధర్మమార్గంలో నడిపించడం. **7. ధీః**= బుద్ధిమాదక ద్రవ్యాలను, బుద్ధి నాశకాలైన అన్య పదార్థాలను, దుష్టుల సహవాసం, అలసత్వ ప్రమాదం మొ॥ వాటిని వదిలి, శ్రేష్ఠ పదార్థాలను సేవించడం. సత్పురుషుల సంగం, యోగాభ్యాసం వల్ల బుద్ధిని పెంచుకోవడం. **8.విద్యా**= పృథివి నుంచి పరమేశ్వర పర్యంతం వరకు గల సర్వ పదార్థాల యథార్థ జ్ఞానం వాటి నుండి యథాయోగ్యమైన ఉపకారాన్ని పొందడం, మనో వాక్కాయాలతో సత్యం అనుసరించడం విద్య అవుతుంది. తద్విరుద్ధమైనది అవిద్య. **9. సత్యమ్**= వేదార్థాన్ని ఉన్నదున్నట్లుగా తెలిసికోవడం, ఆ విధంగానే పలకడం, అలాగే చేయడం కూడా సత్యమే. **10.అక్రోధః**= క్రోధాది దోషాలను వదిలి, శాంతి మొ॥న గుణాలను గ్రహించడం, **ధర్మలక్షణమ్** = ధర్మ లక్షణం- ధర్మ స్వరూపం.॥92॥

వివరణ

ఋషి దయానందభాష్యం:-ధర్మ లక్షణాల విశేష వ్యాఖ్య

సత్యార్థప్రకాశం, సంస్కార విధిలో కూడ, మహర్షి దయానందుల వారు ఈ శ్లోకాన్ని పేర్కొని ధర్మ లక్షణాలకు విశేషించి వ్యాఖ్యానం చేసి ఉన్నారు. అక్కడ వారు ధర్మ లక్షణాలలో అహింసను కూడా 11వ లక్షణంగా చేర్చి ఉన్నారు.

పక్షపాతాన్ని వదిలి. ధర్మంగా, న్యాయంగా, సత్యాన్నే ఆచరించడం, మరియు అసత్యాన్ని సర్వదా పరిత్యజించడం, ధర్మానికి పదకొండో (11) లక్షణం.

1. అహింస: ఎవరికైనా వైరబుద్ధితో అనిష్టం కలిగించకుండా ఉండటం.

2. ధృతిః : సుఖ దుఃఖాలు హాని లాభాలలో కూడా వ్యాకుల పడి ధర్మాన్ని వదలకుండా ఉండటం. ధైర్యంగా ధర్మం కోసం నిలబడటం.

3. క్షమా: నిందాస్తుతులను, మానావమానాలను సహించికూడా ధర్మాన్నే ఆచరించడం.

4. దమః : మనస్సును అధర్మం నుండి మళ్ళించి, ధర్మంనందే ప్రవర్తించడం.

5. అస్తేయమ్ : మనోవాక్కాయ కర్మలతో, అన్యాయంగా, అధర్మంగా పరాయి ద్రవ్యాన్ని స్వీకరించకుండా ఉండటం.

6. శౌచమ్: రాగ-ద్వేషాదులను త్యజించడం ద్వారా ఆత్మను, మనస్సును పవిత్రంగా ఉంచుకోవడం అంతఃశౌచం. జలాదుల ద్వారా శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం బాహ్యశౌచం.

7. ఇంద్రియనిగ్రహః: శ్రోత్రాది బాహ్యేంద్రియాలను అధర్మం నుండి దూరం చేసి, ధర్మమందే ప్రవర్తింపజేయడం ఇంద్రియనిగ్రహం.

8. ధీః : బుద్ధి వేదాది సత్య విద్యలను సాధించడం, బ్రహ్మచర్య పాలన, సత్సంగమొనర్చడం, కుసంగం, దుర్వ్యసనం, మద్యపానాదులను త్యజించడం వల్ల బుద్ధిని ఎప్పుడూ అభివృద్ధిపరచుకోవడం.

9. విద్యా: దేని వల్ల భూమి మొదలుకొని పరమేశ్వర పర్యంతమున్న సర్వ పదార్థాల జ్ఞానం కలుగునో, అలాంటి విద్యను పొందడమే మనోవాక్కాయాల ద్వారా సత్యాన్ని నుసరించడం విద్య. తద్విరుద్ధమైనది అవిద్య.

10. సత్యం: సత్యాన్ని అంగీకరించడం, సత్యాన్ని పలకడం, సత్యం ఆచరించడం.

11. అక్రోధః: క్రోధాది దోషాలను వదిలి, శాంతి మొ॥ గుణాలను గ్రహించడం ధర్మమనబడును.

అ ధర్మాన్ని స్వీకరించడం, అన్యాయంగా, పక్షపాతంగా ప్రవర్తించడం అధర్మం. ఇందులో చేరినవే హింస, వైరబుద్ధి, అధైర్యం, అసహనం. మనస్సును అధర్మమందు ప్రవేశింపజేయడం, కుసంగం, దుర్వ్యసనం, మద్యపానాదుల ద్వారా బుద్ధిని నాశనం చేయడం, అధర్మాచరణం, అజ్ఞానమనే అవిద్యయందు చిక్కుకోవడం, అసత్యాన్ని అంగీకరించడం, పలకడం, క్రోధాది దోషాలందు నిమగ్నుడై అధర్మిగాను, దుష్టాచారిగాను మారడం. ఈ పదకొండు అధర్మలక్షణాల నుండి దూరంగా ఉండాలి.

దశలక్షణాత్మక ధర్మపాలనవల్ల ఉత్తమ గతి-

ఇది మనుకృతం-ప్రామాణికం

దశ లక్షణాని ధర్మస్య యే విప్రాస్సమధీయతే ।
అధీత్య చానువర్తంతే తే యాంతి పరమాం గతిమ్ ॥

మూలశ్లోక సం.63
ప్రక్షిప్త శ్లోక సం.93

టీక:- ధర్మస్య దశ లక్షణాని = ధర్మానికి ఉన్న దశ లక్షణాలను, యే విప్రాః = ఏ ద్విజుడు, సమ్ + అధీయతే = అధ్యయనం చేస్తాడో, చ = మరియు అధీత్య = చదివి మననం చేస్తాడో, అనువర్తన్తే= వాటిని పాలన చేస్తాడో, తే = వారు, పరమాం గతి యాన్తి = ఉత్తమగతిని పొందుతారు.

తాత్పర్యం:- ఎవరీ 10 ధర్మాలను తెలుసుకొని అనువర్తిస్తూన్నారో వారు ఉత్తమగతిని పొందగలరు.॥93॥

94-96వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *దశలక్షణకం ధర్మమనుతిష్ఠన్ సమాహితః ।*
వేదాంతం విధివచ్ఛ్రుత్వా సన్న్యసేదనృణో ద్విజః ॥

ప్రక్షిప్త శ్లోక సం.94

తాత్పర్యం:- ద్విజుడు ఈ చెప్పబడిన 10 లక్షణాలను ధర్మాలుగా అనుష్ఠిస్తూ, వేదాంతం-ఉపనిషత్తుల అర్థాలను గురువు దగ్గర్నుంచి గృహస్థాశ్రమదశలో నేర్చుకుని, మూడు రకాల ఋణాలను తీర్చుకోవాలి.॥94॥

* *సన్న్యస్య సర్వకర్మాణి కర్మదోషానపానుదన్ ।*
నియతో వేదమభ్యస్య పుత్రైశ్వర్యే సుఖం వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **95**

తాత్పర్యం:- అంత్యదశలో మానవుడు అన్యచింతన మాని, అగ్నిహోత్రాది కర్మలున్నీ విడిచి, అజ్ఞాన వశాన జరిగిన పాపాలను పోగొట్టుకోడానికి ప్రాణాయామాలు చేస్తూ, పుత్రుని ఇంట అతడి కలిమిచేత జీవికను వెళ్లదీయాలి. ఇది కుటీచరుని ధర్మం.॥95॥

* *ఏవం సన్న్యస్య కర్మాణి స్వకార్యపరమోఽస్పృహః ।*
సన్న్యాసే నాపహత్యైనః ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **96**

తాత్పర్యం:- ఈ విధంగా నివశిస్తున్నా, జీవనచింత మాని-ఆత్మసాక్షాత్కారమే ముఖ్యమని భావించి ఉపనిషదాది వేదాంత విషయాలపై సదా మనసు లగ్నం చేస్తూ, బ్రహ్మసాక్షాత్కారం చేత మోక్షాన్ని పొందాలి. ॥96॥

ప్రక్షిప్తాల పరిశీలన

94 నుంచి 96 వరకు గల శ్లోకాల ఈ ప్రమాణాలతో ప్రక్షిప్తా లవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో చెప్పిన పద్ధతులు మనువు పద్ధతులకు వ్యతిరేకం -

క. 94లో ధర్మాల పది లక్షణాలను విని, సన్న్యాసం స్వీకరించాలి అని ఉంది. ముందు వచ్చే ప్రశ్న ఏమిటంటే, ఆ లక్షణాలు విని సన్న్యాసాన్నే ఎందుకు స్వీకరించాలి? అనేది. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం- వీటిలో ఉన్నవారందరూ జీవితాంతం పాటించవలసిన ధర్మాలు అవి. 6.91లో వీటిని గురించి ఉంది.

వాటిని విని సన్న్యాసం ఎందుకు తీసుకోవాలి? ఈ శ్లోకం 91కి వ్యతిరేకం. ఇక రెండవది మనుస్మృతిలో ఈ నాలుగు ఆశ్రమాలు తప్ప ఐదవది లేనే లేదు. మనువు సన్న్యాసాన్ని గురించి 6.33-75లలో చెప్పాడు. కనుక ఈ భిన్నమైన వ్యవస్థ మనువుకు వ్యతిరేకం.

ఖ. మనువు వెనుకటి [33-75] శ్లోకాలలో ఇంటినీ, సంగాలను (కామ లోభ మోహాదులు) విడిచిపెట్టి సంన్యాసం తీసుకోమని చెప్పాడు. మరి ఈ శ్లోకాలలోని ధర్మ లక్షణాలు తెలుసుకుని సన్న్యాసి కావడం, ఇంట్లో ఉండడాన్ని చెప్పడం, ధన సంపదలతో ఉండడం మొదలైనవి మునుపు చెప్పిన అన్ని వ్యవస్థలకూ వ్యతిరేకం. సన్న్యాసుల సంగతి పక్కన పెడితే, మనువు వానప్రస్థులను కూడా ఇల్లూ వాకిలీ వదిలేసి అడవుల్లోకి వెళ్లమని చెప్పాడు [6.1-4]. ఈ విధంగా మనువు వ్యవస్థలకు వ్యతిరేకం కావటం చేత, ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఆశ్రమ ధర్మాల బ్రాహ్మణ ధర్మాల ఉపసంహారం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏష వోఽభిహితో ధర్మో బ్రాహ్మణస్య చతుర్విధః । మూలశ్లోక సం. **64**
పుణ్యోఽక్షయఫలః ప్రేత్య రాజ్ఞాం ధర్మం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **97**

టీక:- ఏషః చతుర్విధః బ్రాహ్మణస్య ధర్మః = ఈ నాలుగు విధాలైన బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలను ఆచరించడం బ్రాహ్మణుడి ధర్మం. పుణ్యః ప్రేత్య అక్షయ ఫలః = ఇక్కడ వర్తమాన కాలంలో పుణ్య

స్వరూపమైన శరీరాన్ని వదిలిన తరువాత ముక్తి రూపమైన అక్షయానందాన్ని ఇచ్చే, సన్న్యాస ధర్మం చెప్పబడింది. రాజ్ఞాం ధర్మం నిబోధత = ఇక ముందు రాజుల (దేశపాలకుల) యొక్క ధర్మాలను వినండి.

ఋషి దయానందభాష్యం:- మునులారా! బ్రాహ్మణునికి సంబంధించిన 4 ఆశ్రమాల వాటి ధర్మాలను చెప్పాను. ఇప్పుడు రాజధర్మాలను తెలుపుతాను వినండి! (స.ప్ర. 5వ సము.) ॥97॥

వివరణ:

1. బ్రాహ్మణ శబ్ద ఉపలక్షణాత్మక ప్రయోగము-

ఈ శ్లోకంలో బ్రాహ్మణ శబ్దం ఉపలక్షణ రూపంగా ప్రయోగింపబడింది. 1.144వ శ్లోకంలో వర్ణాశ్రమ ధర్మాలను ప్రారంభించాడు. తదనుసారంగా, ఇంత వరకు బ్రాహ్మణ వర్ణానికి సంబంధించిన సంపూర్ణ ధర్మం, లౌకిక ధార్మిక కర్తవ్యాలు పూర్తయిపోయాయి. దాంతో పాటు ద్విజుల యొక్క నాలుగు ఆశ్రమాల ధర్మాలు, రెండో అధ్యాయంలో బ్రహ్మచర్యాశ్రమ ధర్మాలు, 3 నుండి 5 వరకు గల అధ్యాయాలలో గృహస్థాశ్రమ ధర్మాలు, 6వ అధ్యాయంలో వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమ ధర్మాలు పూర్తయ్యాయి. ఈ విధంగా బ్రాహ్మణ శబ్దానికి క్షత్రియ-వైశ్యులని కూడా అర్థం చేసుకోవాలి.

ఇక్కడ బ్రాహ్మణ శబ్ద ప్రయోగానికి ఒక విశేషమైన అభిప్రాయముంది. ద్విజులందరూ (బ్రాహ్మణ- క్షత్రియ-వైశ్యులు) సన్న్యాసాశ్రమంలో ప్రవేశించి సన్న్యాస ధర్మాలను పాలించి బ్రహ్మత్వాన్ని పొందుతారు. బ్రహ్మవ్యాప్తికి ఒకే ఉద్దేశం ఉన్నందు వల్ల వారి కర్తవ్యాలలో ఏమీ భేదాలు (తేడాలు) ఉండవు. అందువల్ల బ్రాహ్మణ శబ్దం ద్వారానే వారు కూడా తీసుకోబడ్డారు. ఈ అధ్యాయాలలో భిన్న స్థానాలలో ద్విజ-విప్ర శబ్దాలు బ్రాహ్మణ శబ్దానికి పర్యాయవాచక రూపంలోనే తీసుకోవడమైంది.

ద్విజః- 6.1,40,85,91,94; విప్రః- 6.29, 88,93, బ్రాహ్మణః- 6.30, 38,70,96లలో ప్రయోగించబడిన శబ్దాలు పర్యాయవాచకాలు.

వానప్రస్థ-సన్న్యాస ధర్మవిషయమైన ఆరోఅధ్యాయం సమాప్తం

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మఱ్ఱి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'వానప్రస్థ-సన్న్యాస ధర్మవిషయకః' షష్ఠోఽధ్యాయః॥

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం షష్ఠోఽధ్యాయః.

ఇతి షష్ఠోఽధ్యాయః సమాప్తః

మనుస్మృతి

సప్తమాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన * ఋషి దయానంద భాష్యోపేతం

మొత్తం శ్లోకాలు: 226, మూలశ్లోకాలు : 184; ప్రక్షిప్త శ్లోకాలు: 42

రాజధర్మ-విషయం

1వ శ్లోకం నుండి 226వ శ్లోకం వరకు

రాజు నియుక్తి 1వ శ్లోకం నుండి 35వ శ్లోకం వరకు

1వ శ్లోకం నుండి 7వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

రాజు నియుక్తి మరియు సిద్ధి -

> రాజధర్మాన్ ప్రవక్ష్యామి యథావృత్తో భవేన్నృపః ।
> సంభవశ్చ యథా తస్య సిద్ధిశ్చ పరమా యథా ॥ మూలశ్లోక సం. 1

టీక:- రాజ ధర్మాన్ ప్రవక్ష్యామి = రాజధర్మాల గురించి వివరిస్తాను. యథా వృత్తః నృపః భవేత్ = రాజు ఎలాంటి వాడుగా ఉండాల్సిందీ, చ = మరియు, తస్య యథా సంభవః = అతడి పుట్టుక ఎలాంటి, చ = మరియు, యథా పరమా = ఏ విధంగా రాజుకు పరమసిద్ధి ప్రాప్తిస్తుందో, ఇప్పుడు మను మహారాజు ఋషులతో అంటున్నారు. నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాల వ్యవహారాలను వివరించిన తరువాత, రాజధర్మాలన్నిటినీ వివరిస్తాను.

ఋషి దయానందభాష్యం:- రాజు ఎలాంటి వాడు, పుట్టుక ఎలాంటిది, ఏ విధంగా రాజుకు పరమసిద్ధి ప్రాప్తిస్తుందో, రాజు అనేవాడు ఎలాంటి ధర్మాలను అనుసరించాలో, ఎలాంటి ప్రవర్తన కలిగి ఉండాలో-వాటిని వివరిస్తాను."(స.ప్ర. 6వ సము) ॥1॥

ఇది మనుకృతం-ప్రామాణికం

రాజుకావడానికి అధికారి ఎవరు? -

> బ్రాహ్మం ప్రాప్తేన సంస్కారం క్షత్రియేణ యథావిధి ।
> సర్వస్యాస్య యథాన్యాయం కర్తవ్యం పరిరక్షణమ్ ॥ మూలశ్లోక సం. 2

టీక:- బ్రాహ్మం సంస్కారం ప్రాప్తేన క్షత్రియేణ = ఏ విధంగా బ్రాహ్మణుడు పరమవిద్వాంసుడో, అలాగే పరమ విద్వాంసుడైన క్షత్రియుడు, అస్య సర్వస్య = ఈ సమస్త రాజ్యం (ప్రజలు) యొక్క పరిరక్షణమ్= రక్షణాన్ని, పాలనను, యథాన్యాయం కర్తవ్యం = న్యాయంగా విద్యుక్త ధర్మాన్ని, యథావిధి = పూర్వ విధిననుసరించి, అంటే ఉపనయన సంస్కారంలో దీక్షితుడై సమావర్తనకాలం వరకు బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తూ ఉండాలి.

ఋషి దయానందని భాష్యం:-శాస్త్రవిధి రీత్యా ఉపనయన సంస్కారం పొందినట్టి క్షత్రియుడు తన సమస్త రాజ్యాన్నీ సకలప్రజలయొక్క సంరక్షణను, పాలనను న్యాయం తప్పకుండా చేయవలసి వుంటుంది. శ్రేష్ఠ విద్వాంసుడు బ్రాహ్మణుడైనట్లు మంచి విద్వాంసుడు సుశిక్షుడైనవాడు క్షత్రియుడై రాజాన్ని రక్షించాలి. యథావిధిగా ప్రజలకు న్యాయాన్ని కలిగించాలి. (స.ప్ర. 6వ సము) ॥2॥

రాజు కావలసిన అవసరమేమిటి?- ఇది మనుకృతం-ప్రామాణికం

అరాజకే హి లోకేఽస్మిన్ సర్వతో విద్రుతే భయాత్ ।
రక్షార్థమస్య సర్వస్య రాజానమసృజత్ప్రభుః ॥ మూలశ్లోక సం. 3

టీక:- **హి** = ఎందుకంటే, **అరాజకే అస్మిన్ లోకే** = రాజ్యాన్ని నియంత్రణ చేసే పాలకుడు లేనప్పుడు, **సర్వతః భయాత్ విద్రుతే** = అన్ని వైపుల నుండి భయం వల్ల ప్రజలు వ్యాకులం చెందుతారు. **అస్య సర్వస్య రక్షణార్థమ్** = ఈ సమస్త సమాజాన్ని, రాజ్యాన్ని రక్షించడం కోసం, **ప్రభుః రాజానమ్ +అసృజత్** = పరమేశ్వరుడు రాజపదవిని సృష్టించాడు. అంటే రాజును ఏర్పాటు చేసుకోవాలనే ప్రేరణను మానవులకు కల్పించాడు.

తాత్పర్యం:- రాజ్యాన్ని నియంత్రణ చేస్తే పాలకుడు లేనప్పుడు అన్ని వైపుల నుండి భయంవల్ల ప్రజలు వ్యాకులం చెందుతారు. ఈ సమస్త రాజ్యాన్ని రక్షించడం కోసం పరమేశ్వరుడు రాజపదవిని సృష్టించాడు. ॥3॥

రాజుకు ఉండాల్సిన ఎనిమిది (8) విశిష్ట గుణాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

ఇంద్రాఽనిలయమార్కాణామగ్నేశ్చ వరుణస్య చ ।
చంద్ర విత్తేశయోశ్చైవ మాత్రా నిర్హృత్య శాశ్వతీః ॥ మూలశ్లోక సం. 4

టీక:- ఈ సభాధ్యక్షుడైన రాజు, **ఇన్ద్ర** = ఇన్ద్ర అంటే విద్యుత్తుతో సమానంగా ఐశ్వర్యకర్త, **అనిల** = వాయువుతో సమానంగా అందరికీ ప్రాణంలాగా ప్రియుడు, మనస్సులో ఉన్న భావాలను తెలిసినవాడు, **యమ** = యముడి లాగా పక్షపాతరహితుడై, న్యాయాధీశుడిలాగా ప్రవర్తించేవాడు, **అర్కాణామ్** = సూర్యుడితో సమానంగా న్యాయ-ధర్మ-విద్యలను ప్రకాశింపచేసేవాడు, అంధకార నిరోధకుడు అంటే అవిద్య-అన్యాయాలను నిరోధించేవాడు, **అగ్నేః** = అగ్నితో సమానంగా దుష్టులను భస్మంచేసేవాడు, **వరుణస్య** = వరుణుడు అంటే బంధించువాడి లాగా, దుష్టులను అనేక విధాలుగా శిక్షించేవాడు, **చంద్ర-విత్తేశయోః** = చంద్రుడిలాగా శ్రేష్ఠ పురుషులకు ఆనందం ఇచ్చేవాడు, ధనాధ్యక్షుడితో సమానంగా కోశాలను (ధనాగారాలను) నింపేవాడుగా ఉండాలి. **శాశ్వతీః మాత్రాః నిర్హృత్య** = వీరి యందున్న స్వాభావికమైన గుణాంశాల సారాన్ని, గ్రహించి ఈశ్వరుడు, **"రాజు"** యొక్క వ్యక్తిత్వాన్ని నిర్మించాడు, **చ** = పూర్వ శ్లోకోక్తమైన **"రాజానం అసృజత్"** అనే క్రియ అనువృత్తి అవుతుంది.

ఋషి దయానందభాష్యం:-రాజు ఐశ్వర్యకర్తగా, వాయువులాగా అందరికీ ప్రాణంలాగా ప్రియుడు, యముడిలాగా పక్షపాతరహితుడై న్యాయాధీశుడిలాగా ప్రవర్తించే వాడుగా, సూర్యుడిలాగా న్యాయ, ధర్మ విద్యలను ప్రకాశింప చేసేవాడుగా, అగ్నిలాగా దుష్టులను భస్మం చేసేవాడుగా, వరుణుడులాగా దుష్టులను అనేక విధాలుగా శిక్షించేవాడుగా, చంద్రుడులాగా శ్రేష్ఠ పురుషులకు ఆనందం ఇచ్చేవాడుగా, ధనికుడిలాగా ధనాగారాలను (కోశాలను) నింపే వాడుగా ఉండాలి. వీరియందున్న స్వాభావికమైన గుణాంశాలసారాన్ని గ్రహించి ఈశ్వరుడు "రాజు" వ్యక్తిత్వాన్ని నిర్మించాడు. (స.ప్ర. 6వ సము.). ॥4॥

వివరణ: రాజుకు ఉండవలసిన 8 విశిష్ట గుణాలు

ఈ శ్లోకంలో, రాజైనవాడికి ఎనిమిది విశిష్ట గుణాలుండాలని మనుమహారాజు సూచించాడు. కింద చెప్పబోయే ఎనిమిది ఈశ్వరీయ శక్తుల కార్యకలాపాలు ఎంత స్వాభావికమో అలాగే రాజు స్వభావం, ఆచరణ ఉండాలి. మనుమహర్షి 9-303వ శ్లోకం నుండి 310వ శ్లోకం వరకు ఉన్న శ్లోకాలకు స్వయంగా ఈ కింది విధంగా వ్యాఖ్య చేశారు.

1. **ఇంద్రుడు-జల (వృష్టి) కారకశక్తి:** కావలసినంత జలాన్ని వర్షింపజేసి, ప్రాణికోటిని తృప్తిపరుస్తున్న విధంగా రాజు కూడా ప్రజలకు సుఖాలను కలుగజేసి, ఐశ్వర్యాన్ని ప్రదానంచేసి, ప్రజల కోరికలను తీర్చి సంతోషంగా ఉంచాలి.

(9.304) **'ఇది = పరమైశ్వర్యే'** భ్వాది ధాతువు వల్ల, **"ఋజ్రేంద్రాగ్రవజ్ర"** (ఉణాది) 2.28 సూత్రం ద్వారా **'రన్'** ప్రత్యయం చేర్చగా **'ఇంద్ర'** శబ్దం సిద్ధమవుతుంది. **"ఇన్ద్రతే వా ఐశ్వర్య కర్మణః"** (నిరుక్తం 10.8) ఐశ్వర్య ప్రదాత కావడం వల్ల **"ఇంద్రు"** డనబడును. 7.7 శ్లోకంలో, పర్యాయవాచకంగా **'మహేన్ద్ర'** శబ్దం ప్రయోగింపబడింది.

2 **వాయువు:** ఏ విధంగా వాయువు ప్రాణులందరిలో అన్ని స్థానములలో ప్రవేశించి, వ్యాపిస్తున్న విధంగా రాజు (Ruler) తన గుప్తచరుల ద్వారా సర్వత్రా ప్రవేశించి- సర్వ ప్రాంతాలలో - తనకు సంబంధించిన, శత్రువుకు సంబంధించిన ప్రదేశాలలో ప్రజల విషయాలను తెలిసికొంటూ ఉండాలి. **'వాయుః-వా-గతి గన్ధనయోః'** అదాది ధాతువు క్రవాపాజి (ఉణాది 1-1) సూత్రం వల్ల, **"ఉః"**, ప్రత్యయం చేర్చగా **'వాయు'**శబ్దం నిష్పన్నమవుతుంది. **"వాయుర్వాతే ర్వేత్తేర్వా స్యాత్ గతి కర్మణః"** (నిరుక్తం 11.5 (9.307)లో మారుత శబ్ద ప్రయోగముంది.

3. **యముడు:** ఈశ్వరుడి మారణశక్తి లేదా నియంత్రణశక్తి, కర్మఫలసమయం రాగా 'నీ, నా,' అనే భావాన్ని చూపకుండా **'శత్రు-మిత్ర'** భావం లేకుండా ధర్మాన్ననుసరించి, న్యాయానుకూలంగా దండనచేస్తాడో, అదే ప్రకారంగా రాజుకు కూడా- అపరాధులైన ప్రజలను ఆత్మీయ-పరాయిభావం లేకుండా, న్యాయపూర్వకంగా దండన చేయాలి. ప్రజలను తన నియంత్రణలో ఉంచుకోవాలి. (9-307) ఈ శ్లోకంలో మనువు యముడికి ధర్మరాట్ అని ప్రయోగించాడు. ఇది పర్యాయవాచకం. ధర్మం అంటే న్యాయంగా శాసనం చేసేవాడని అర్థం. అతడికే ధర్మరాట్ (ధర్మరాజు) అని పేరు. **"యము ఉపరమే"** భ్వాది ధాతువుకు **'కర్తరి పచాద్యచ్'** చేర్చినట్లయితే యమ శబ్దం సిద్ధమవుతుంది. **"యమః యచ్ఛతీతి సతః"** నిరుక్తం (10-19).

4. **అర్క:** సూర్యుడు తన కిరణాల ద్వారా తపింప చేయకుండా జలాన్ని తీసికొన్నట్లే రాజుకూడా ప్రజలకు కష్టం కలిగించకుండా (7-127, 131), పన్ను వసూలు చేయడం. (9.305) **అర్చ** = పూజాయామ్, భ్వాది ధాతువు వల్ల **"కృదాధారార్చి కలిభ్య కః"** (ఉణాది 3.40) సూత్రం ద్వారా **'క'** ప్రత్యయం చేర్చగా -అర్క శబ్దం తయారవుతుంది. 9.340వ శ్లోకంలో పర్యాయవాచకంగా **'ఆదిత్యశబ్దం'** ప్రయోగింపబడింది.

5. **అగ్ని:** అగ్ని ఏ విధంగా అశుద్ధిని నాశనం చేసి శుద్ధి చేయునో, తేజోవంతంగా ఉంటుందో, అదే విధంగా, ప్రభువైనవాడు ప్రభావశాలిగా ఉండి-అపరాధం, హాని, దౌష్ట్యాన్ని కలిగించే ప్రజాపీడకులైనవారిని దండన చేసి అదుపులో ఉంచుకోవాలి. (9.310) **'అగ్ని-గతౌ'** అనే ధాతువుకు **"అంగేర్నలోపశ్చ"** (ఉణాది 4-50) సూత్రం ద్వారా **'నిః'** ప్రత్యయం, నిలోపం = అగ్నిః).

6. **వరుణుడు:** నీరు, తన తరంగాలలో లేదా గుండంలో ప్రాణులను ముంచేట్లు చేసే విధంగా పరిపాలకుడు కూడా అపరాధులను, శత్రువులను కారాగారంలోనే నిర్బంధించాలి. (9-308) **'వృఞ్ = వరణే'**, **'భ్వాది'** ధాతువుతో, **'కృవృదారిభ్య ఉనన్'** (ఉణాది 3-53) వల్ల ఉనన్ ప్రత్యయం రాగా-**'వరుణ'** శబ్దమేర్పడుతుంది.

7. **చంద్రుడు:** ఏ విధంగా చంద్రుడు వెలుగును ప్రసరింపజేస్తున్నాడో, పూర్ణిమనాటి చంద్రుడిని చూసినప్పుడు-హృదయం ఎలా ప్రసన్నమవుతుందో, అదేవిధంగా రాజైనవాడు ప్రజలకు శాంతిప్రదాతగా, ప్రసన్నతను కలిగించేవాడుగా ఉండాలి. **"వీరు మా ప్రభువు"**లని ప్రజలు సంతోషంగా చెప్పుకొనే విధంగా ఉండాలి." **"చది ఆహ్లాదనే దీప్తౌ చ"** భ్వాది ధాతువుకు **"స్ఫాయిత ఞ్చ వఞ్చి"** (ఉణాది) (2-13) సూత్రం వల్ల **'రక్'** ప్రత్యయం చేర్చగా **'చన్ద్ర'** శబ్దం ఏర్పడుతుంది. 7.80లో ఉన్న-సోమ శబ్దం పర్యాయవాచకం.

8 **విత్తేశుడు:** అనగా ధనాఢ్యుడు. 7.7లో కుబేర శబ్దం, 9-11లో ధరా, పృథ్వీ శబ్దాలను ప్రయోగించాడు. ఏవిధంగా పృథ్వీ, లేదా ధనాధిపతి పరమేశ్వరుడితో పక్షపాతరహితుడై సమానభావంతో ప్రజలను పుత్రులలాగా పాలించాలి.(9-309) వేదంలో ప్రభువు యొక్క అష్ట గుణాల వర్ణన. మనువు యొక్క ఈ విధానానికి ఆధారం వేదమే. ఈ క్రింది మంత్రాన్ని చూడండి.

శ్లో॥ "సోమస్య రాజ్ఞో వరుణస్య ధర్మణి బృహస్పతే రనుమత్యా ఉశర్మణి ।
తవాహమద్య మఘవన్నుపస్తుతౌ ధాతర్విధాతః కలశాం అభక్షయన్"॥ ఋ. 10.167.3

టీక:- రాజ్ఞః సోమస్య వరుణస్య ధర్మణి, రాజు = అగ్ని, సోమ = చంద్రుడు మరియు, వరుణస్య = జలం యొక్క ధర్మంలో, ఉ = అలాగే బృహస్పతేః అనుమత్యా శర్మణి బృహస్పతి = సూర్యుడు, అనుమాత్యా-లక్ష్మి అంటే విశ్రేషుడు లేదా పృథ్వి ఆశ్రయంలో, మఘవన్+ధాత+విధాత+మరియు, ఓ ఇంద్రా ! ఓ వాయో, ఓ యమ!, **అహం అద్య తవ ఉపస్తుతా** = నేను మీ ఉపస్థితిలో = సాన్నిధ్యంలో, ఉంటూ తమ గుణాలను స్వీకరించి, **సోమకలశాన్ అభక్ష్యమ్** = ఐశ్వర్య కలశాలను, అంటే రాజ్యైశ్వర్యాలను సేవించాను. అంటే ఈ గుణాల యొక్క అంశాలను స్వీకరించి, తదనుసారంగా ఆచరించి రాజ్యపరిపాలనలో విజయాన్ని పొందుదునుగాక!

రాజు దివ్యగుణాల వల్ల ప్రభావశాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

యస్మాదేషాం సురేంద్రాణాం మాత్రాభ్యో నిర్మితో నృపః ।
తస్మాదభిభవత్యేష సర్వభూతాని తేజసా ॥ మూలశ్లోక సం.**5**

టీక:- **యస్మాత్** = ఎందువల్ల, **ఏషాం సురేంద్రాణాం** = ఈ (7.4) శక్తిశాలి ఇంద్రాది దివ్యశక్తుల యొక్క **మాత్రాభ్యః** = సారభూతములు గుణరూపాలైన అంశాలతో, **నృపః నిర్మితః** = 'రాజ' పదవి నిర్మితమైందో, **తస్మాత్** = అందువల్ల, **ఏషః** = ఈ రాజు (ప్రభువు), **తేజసా** = తన శక్తి ప్రభావంతో, **సర్వభూతాని అభి భవతి** = సర్వ ప్రాణులను వశీభూతం చేసుకొని, పరాజితులను చేస్తాడు.

తాత్పర్యం:-ఏ కారణం చేత రాజు దేవతా శ్రేష్ఠుల అంశాల చేత సృజించబడ్డాడో, ఆ కారణంచేతనే అతడు తన వెలుగుచేత ఇతర ప్రాణులకెల్ల మేటిగా ఉన్నాడు. ॥5॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తపత్యాదిత్యవచ్చైష చక్షూంషి చ మనాంసి చ ।
న చైనం భువి శక్నోతి కశ్చి దప్యభివీక్షితుమ్ ॥ మూలశ్లోక సం.**6**

టీక:- **ఏషః** = ఈ ప్రభువు, **ఆదిత్యవత్** = సూర్యుడి లాగా ప్రతాపవంతుడుగా, **చక్షూంసి** = చూసేవారి కన్నులను, **మానాంసి చ** = అందరి మనస్సులను, **తపతి** = తన తేజస్సుతో తపింపచేస్తాడు, **ఏనం భువి** = ఇతడిని ఈ భూలోకంలో, **అభివీక్షితుమ్** = నిఘా పెట్టి చూడటానికి, **కశ్చిత్+అపి న శక్నోతి** = ఎవడూ సమర్థుడు కాదు, ఎవరికీ ధైర్యముండదు.

ఋషి దయానందభాష్యం:- తనను చూచువారి చూపులను-మనస్సులను సూర్యుడి లాగా దహించువాడు రాజు. ఇట్టిరాజును ఈ భూలోకంలో నిఘాపెట్టి చూడటానికి ఎవడూ సమర్థుడుకాదు. ఎవరికీ ధైర్యం చాలదు. పరిపాలకుడైన ప్రభువులో తేజస్సు, ప్రభావము మొ॥ గుణాలుండాలి. ఈ గుణాలు ఉన్నందువల్ల ప్రభువు విజయవంతంగా, ప్రజల మీద ప్రభావశాలిగా శాసనం చేయగలడు. (స.ప్ర.6వ సము.).॥6॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సోఽగ్నిర్భవతి వాయుశ్చ సోఽర్కస్సోమస్స ధర్మరాట్ ।
స కుబేరస్స వరుణస్స మహేంద్రః ప్రభావతః ॥ మూలశ్లోక సం.**7**

టీక:- సః = ఆ ప్రభువు, **ప్రభావత:** = తన ప్రభావ సామర్థ్యాల కారణంగా, **అగ్ని:** = అగ్నితో సమానంగా దుష్టులను అపరాధులను, వినాశం చేసేవాడి గాను, చ = మరియు, **వాయు:** = వాయువుతో సమానంగా గుప్తచరుల ద్వారా సర్వత్ర గతిశీలుడై ప్రత్యేక పరిస్థితిని తెలిసికొనేవాడుగాను, **అర్క:** = సూర్యుడు తన కిరణాలతో జలాన్ని గ్రహించేట్లుగా, కష్టం కలిగించకుండా పన్ను వసూలు చేయువాడుగాను, **సోమ:** = చంద్రుడి లాగా శాంతిని, ప్రసన్నతను ప్రదానం చేసేవాడుగాను, ధర్మరాట్ = న్యాయానుసారంగా దండన చేసేవాడుగాను, **కుబేర:** = ఐశ్వర్యప్రదాత అయిన పరమేశ్వరుడి లాగా సమభావంతో ప్రజలను పాలించేవాడుగాను, **వరుణ:** = జలీయ తరంగాలు లేదా సుడిగుండాల లాగా అపరాధులను లేదా శత్రువులను కారాగారాలలో బంధించేవాడుగాను, మరియు, సః = అతడే, **మహేంద్ర** = వర్షకారకశక్తి గల ఇంద్రుడితో సమానంగా సుఖ-సమృద్ధులను వర్షించేవాడుగాను, సుఖ ప్రదాతగాను, **భవతి** = అవుతున్నాడు.

ఋషి దయానందభాష్యం:- ఎవడు-అగ్ని, వాయువు, సూర్య, సోముడి లాగా ధర్మ ప్రకాశకుడో, ధన వర్ధకుడో, దుష్టులను బాధించగలడో, గొప్ప ఐశ్వర్యవంతుడో అతడే సభాధ్యక్షుడు లేదా ప్రభువుకాగల యోగ్యుడు.॥7॥

వివరణ:

పై శబ్దాలకు మనువు స్వయంగా వ్యాఖ్యానం చేశాడు. 7.4 సమీక్ష-9.303-311 వివరణలో చూడగలరు.

8 నుండి 12వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***బాలోఽపి నావమంతవ్యో మనుష్య ఇతి భూమిప: ।***
మహతీ దేవతా హ్యేషా నరరూపేణ తిష్ఠతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***8***

తాత్పర్యం:-బాలుడైనప్పటికీ రాజును మానవ మాత్రుడని ఎంచరాదు. గొప్ప దైవతమే మానుష రూపంలో రాజుగా అవతరించినట్లు తెలుసుకోవాలి. ॥8॥

* ***ఏకమేవ దహత్యగ్నిర్నరం దురపసర్పిణమ్ ।***
కులం దహతి రాజాగ్ని: సపశుద్రవ్యసంచయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***9***

తాత్పర్యం:-రాజు అగ్నిలాంటివాడని తెలీక ఎవడైతే దగ్గరకు చేరతాడో వాడు అన్నివిధాలా చెడుతాడు. అగ్ని అయితే కేవలం తనను దరిచేరినవారినే దహిస్తాడు. కానీ రాజు దరిచేరేవారి పశుధనధాన్య బంధుసమూహంతో సహా సర్వం హరిస్తాడు. అనగా తనదిగా చేసుకుంటాడు. ॥9॥

* ***కార్యంసోఽవేక్ష్య శక్తిం చ దేశకాలౌ చ తత్త్వత: ।***
కురుతే ధర్మసిద్ధ్యర్థం విశ్వరూపం పున: పున: ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10***

తాత్పర్యం:-జరగవలసిన పనిని బట్టి రాజు దేశకాలాల కనుగుణంగా, తనశక్తిమేరకు రకరకాల రూపాలు ధరిస్తాడు. శక్తిలేనప్పుడే ఇతరుల ధాటిని ఒప్పుకొంటాడు. అయినప్పటికీ శక్తిసంపాదించుకోవడంలో కృతకృత్యుడై ఎప్పటికైనా అవతలివారిపై (తన ఓర్పును పరీక్షించిన వారిపై) ప్రతీకారం తీర్చుకుంటాడు. సందర్భాన్ని బట్టి మారిపోగల ఇలాంటి గుణమున్న రాజు తనకు మిత్రుడని పొంగిపోరాదు. ॥10॥

* ***యస్య ప్రసాదే పద్మా శ్రీర్విజయశ్చ పరాక్రమే ।***
మృత్యుశ్చ వసతి క్రోధే సర్వతేజో మయో హి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***11***

తాత్పర్యం:- ఎవరి అనుగ్రహం చేత గొప్ప సంపద, ఎవరి చల్లని చూపు సోకినప్పుడు విజయం కలుగుతాయో అలాంటి క్షత్రియుణ్ణే సకల తేజస్స్వరూపుడనాలి. కాబట్టి-కలిమి కోరేవాడు, బలిమికోరేవాడు రాజుతో చెలిమి చేస్తాడు. జీవనం కోరేవాడెన్నడూ రాజుతో విరోధపడరాదు. సూర్యచంద్రాదుల శక్తి ఉన్నవాడు కాబట్టి ఆశ్రయించదగ్గవాడు.॥11॥

* **తం యస్తు ద్వేష్టి సమ్మోహాత్సవినశ్యత్యసంశయమ్ ।**
తస్య హ్యాశు వినాశాయ రాజా ప్రకురుతే మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***12***

తాత్పర్యం:-అలాంటి రాజును అజ్ఞానం చేత ఎవరైనా విరోధ భావంతో చూస్తే, అతడు తప్పక నశిస్తాడు. ఎందుకంటే...రాజు తనతో విభేదించిన వాడిని రూపు మాపనిదే నిద్రపోడు. అతడి అంతు చూడ్డానికే ప్రయత్నిస్తాడు.॥12॥

ప్రక్షిప్తాల పరిశీలన

8-12 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ ఐదు శ్లోకాలూ పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. 7వ శ్లోకంలో రాజుకు గల విశేష గుణాలు, 13లో మళ్లీ 'అందుచేత రాజు చెప్పిన కర్తవ్యాలను పాలించు' అని ఉంది. ఇలా 13వ శ్లోకం 7వ శ్లోకంతో సంబద్ధత కలిగి ఉంది. 7వ దాని భావం 13వ శ్లోకంతో సంపూర్ణమవుతుంది. మధ్యలో ఈ శ్లోకాలు ముందు వెనుకల ప్రసంగపు సంబద్ధతను చెడగొడుతున్నాయి. రాజు స్వభావానికి సంబంధించిన, పూర్వాపర ప్రసంగాలకు సంబంధించనివి చెబుతూ, మనువుకు వ్యతిరేక విషయాలతో ఉన్నాయి. ఇలా ప్రసంగ వ్యతిరేకాలు కావటం చేత ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. గత 7.2 శ్లోకంలో మనువు ఏ విద్వాంసుడైన క్షత్రియుడు విధిపూర్వకంగా సురక్షితంగా ఉండగలడో అతడే రాజు కావటానికి అర్హుడని చెప్పాడు. 7.8లో బాలుడు రాజు కావడం మనువు చెప్పినదానికి వ్యతిరేకం. మనుస్మృతి 7.2 ప్రకారం, బాలుడు లేదా విద్య నేర్వనివాడు రాజు కాలేడు. కనుక దానికి సంబంధించిన అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే.

ఖ. ఈ శ్లోకాలలో తన వ్యక్తిగత స్వభావం ఆధారంగా రాజు ధనాన్ని అనుగ్రహిస్తాడు, మృత్యుకారకుడవుతాడు అంటూ అతని అన్యాయమూ, వినాశక రూపాన్ని వర్ణించారు. ఈ వర్ణనకూ, మనువు చెప్పిన దానికీ పొంతన లేదు. వ్యక్తిగత ఆధారాలను బట్టి కాకుండా, ధర్మ, అధర్మాలను బట్టి రాజు న్యాయానుసారం ఉచిత దండన విధించే అధికారం గలవాడని మనువు చెప్పాడు [7.2, 19, 26-28,9,349, 307,311]. అంతే కాకుండా అనుచిత దండనను నిషేధిస్తాడు కూడా [7.48,51]. కనుక ఇవి మనువు పద్ధతులకు వ్యతిరేకాలైనందున ప్రక్షిప్తాలు.

రాజును అవమానించరాదు- **13, 14 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం**

తస్మాద్ధర్మం యమిష్టేషు సంవ్యవస్యేన్నరాధిపః । మూలశ్లోక సం. **8**
అనిష్టం చాప్యనిష్టేషు తం ధర్మం న విచాలయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **13**

టీక:- తస్మాత్ = అందువల్ల, **సః నరాధిపః** = ఆ రాజు, **యం ధర్మం** = ఏ ధర్మాన్ని (చట్టాన్ని), **ఇష్టేషు వ్యవస్యేత్** = పాలనీయ విషయాలలో నిర్ధారణ చేస్తాడో, **చ** = మరియు, **అనిష్టేషు అపి అనిష్టం** = పాలనీయం కాని విషయాలలో నిషేధిస్తాడో, **తం ధర్మం న విచాలయేత్** = ఆ ధర్మాన్ని అంటే చట్టాన్ని ఉల్లంఘించరాదు.

తాత్పర్యం:-కనుకనే, రాజు తనకు కావలసిన దేది శాస్త్రసమ్మతమో, ఏది ఇష్టమో, ఏది శాస్త్రానికి విరుద్ధమో అనేదాన్ని విచారించి నిర్ణయిస్తాడు. అనిష్టంగా ఉన్నవి నియమానుసారంగానే ఉన్నా అనవసరంగా గ్రహించడు.॥13॥

దండన విధాన విధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

తస్యార్థే సర్వభూతానాం గోప్తారం ధర్మ మాత్మజమ్ । మూలశ్లోక సం.**9**
బ్రహ్మతేజోమయం దండమసృజత్పూర్వమీశ్వరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**14**

టీక:- తస్య + అర్థే = అలాంటి రాజు కోసం, **పూర్వమ్** = సృష్టి ప్రారంభంలోనే, **ఈశ్వరః** = ఈశ్వరుడు, **సర్వభూతానాం గోప్తారం** = సర్వప్రాణులకు రక్షణ కల్పించేట్టి, **బ్రహ్మ తేజోమయం** = బ్రహ్మతేజోమయం అంటే శిక్షాప్రదం అపరాధనాశక గుణం గల, **ధర్మమాత్మజమ్** = ధర్మ స్వరూపాత్మకమైన, **దణ్డం + అసృజత్** = దండాన్ని శిక్షించే విధానాన్ని సృష్టించాడు.

తాత్పర్యం:-రాజు యొక్క కార్యసాఫల్యత కోసం ఈశ్వరుడు సకల ప్రాణి సంరక్షణ రూప తేజస్స్వరూప న్యాయదండాన్ని సృష్టించాడు. ॥14॥

ఇది ప్రక్షిప్తం- ప్రామాణికం కాదు

* **తస్య సర్వాణి భూతాని స్థావరాణి చరాణి చ ।**
భయాద్భోగాయ కల్పంతే స్వధర్మాన్న చలంతి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***15***

తాత్పర్యం:-ఆ దండమనే దాని భయంవల్లనే నీతి కలిగి సకల భూతాలు భోగాలనుభవిస్తున్నాయి. అంతేగాక తమకు విహితమైన స్వధర్మాల నుంచి తొలగకుండా ఉన్నాయి. ॥15॥

ప్రక్షిప్త పరిశీలన

15వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తమవుతుంది-

1. విషయ వ్యతిరేకం

ఈ శ్లోకం పూర్వాపర ప్రసంగ వ్యతిరేకంగానూ ఉంది. ముందు వెనుకల రాజు ప్రజలకు విధించే శిక్షలు, వాటి ప్రభావాలను గురించి ఉంది. 14వ శ్లోకంలో **"తస్యార్థే"** అని స్పష్టంగా రాజు దండించే అధికారం కలవాడు అనీ, 16లో స్పష్టంగా **"అన్యాయ వర్తిషు"** పదాన్ని ప్రయోగించి అన్యాయాలు చేసే ప్రజలపై తన శిక్షలను అమలు చేయాలనీ చెప్పాడు. మధ్యలో స్థావరాలకు శిక్షను చెప్పటం పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకం. 16వ శ్లోకంలో **"తమ్"** పదం వల్లనూ ఈ శ్లోకంలోని విషయం 14తో కలుస్తుంది కానీ, 15 లోని ఫల ప్రదర్శనతో కలవదు. కనుక ఈ శ్లోకం ప్రక్షిప్తం.

16 నుండి 19వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

తం దేశకాలౌ శక్తిం చ విద్యాం చావేక్ష్యతత్త్వతః । మూలశ్లోక సం.**10**
యథార్హతస్సంప్రణయేన్నరేష్వన్యాయవర్తిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**16**

టీక:- దేశకాలౌ శక్తిం చ విద్యాం = దేశం, సమయం, శక్తి, మరియు విద్యా అంటే అపరాధాన్ననుసరించి ఉచిత దండన విధాన జ్ఞానం. ఈ విషయాలను, **తత్త్వతః అవేక్ష్య** = క్షుణ్ణంగా విచారించి, **అన్యాయవర్తిషు** = అన్యాయాచరం గల, **నరేషు** = నరులందు, **తాం** = ఆ దండమును (శిక్షను), **యథార్హతః సంప్రణయేత్** = యథాయోగ్యంగా ప్రయోగించాలి.

తాత్పర్యం:-రాజు ఆ దండం యొక్క శక్తినీ, దేశకాలాదులనీ, ఏ యే దోషాలకు యే దండనలు విధింగాలో శాస్త్రం ప్రకారం వాటిని విచారించి; అపరాధులైనవారిపట్ల మాత్రమే దాన్ని ప్రయోగించాలి.॥16॥

దండన మహత్త్వం-

ఇది మనుకృతం. ప్రామాణికం

స రాజా పురుషో దండస్స నేతా శాసితా చ సః । మూలశ్లోక సం. 11
చతుర్ణామాశ్రమాణాం చ ధర్మస్య ప్రతిభూః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 17

టీక:- **సః దణ్డః పురుషః రాజా** = అతడే దండం, దండించే పురుషుడు, రాజు, **సః నేతా** = నాయకుడు న్యాయప్రచారకర్త, **చ** = మరియు, **శాసితా** = ఆ దండమే అందరినీ శాసించేది. **సః** = అతడే, **చతుర్ణామ్ +ఆశ్రమాణాం ధర్మస్య చ ప్రతిభూః స్మృతః** = అదే నాలుగు వర్ణాల యొక్క, నాలుగు ఆశ్రమాల యొక్క ధర్మాలకు, **ప్రతిభూః** = అంటే జామీను ఉండేవాడు (ఆశ్రయభూతుడు).

ఋషి దయానంద భాష్యం:- దండమేరాజు. ఆ దండములో రాజబలం ఉన్నందువల్ల అదే గొప్పది. మిగిలిన వారంతా దానికి లోబడి ఉండవలసినందువల్ల ఆ దండమే పురుషుడు. అందువల్లనే అన్నికార్యాలు నెరవేరడంచేత అదే నేత శాసిస్తూన్నందువల్ల శాసనకర్త అని ఋషులు పలుకుతున్నారు. (స.ప్ర. 6వ సము.) ॥17॥

దండశ్శాస్తి ప్రజాస్సర్వా దండ ఏవాభిరక్షతి । మూలశ్లోక సం. 12
దండస్సుప్తేషు జాగర్తి దండం ధర్మం విదుర్బుధాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 18

టీక:- వాస్తవంగా **దణ్డః సర్వాః ప్రజాః శాస్తి** = దండన విధానమే సర్వప్రజలను శాసిస్తుంది, **దణ్డః +ఏవ** = దండనే, **అభిరక్షతి** = ప్రజలను అన్ని విధాలా దుష్టుల నుండి రక్షిస్తుంది, **సుప్తేషు** = నిద్రించే ప్రజలలో, **దణ్డం జాగర్తి**= దండనమే మేల్కొని ఉంటుంది. ఏకాంతంలో జరిగే అపరాధాల సమయంలో దండన గుర్తుకు రాగా అది భయం కలిగించి అపరాధిని ఆపుతుంది. అందువల్ల, **బుధాః** = బుద్ధిమంతులు, **దండః ధర్మం విదుః** = యథాపరాధ దండన విధానమే రాజుకు పరమ ధర్మమని భావిస్తున్నారు.

ఋషి దయానందభాష్యం:-రాజదండమే జనులందరికీ ఆజ్ఞ ఇస్తోంది. అదే అందర్నీ సంరక్షిస్తోంది. రక్షకులు (మానవ మాత్రులు గనుక) నిద్రిస్తూన్నా దండమే (న్యాయమే) మేల్కొని ఉండి కావలికాస్తోంది. ధర్మహేతువు అవడం వల్ల దండన ప్రజలను శాసింస్తుంది. నిద్రించే ప్రజలలో మేలుకొని ఉండేది దండనమే. అందువల్ల దండనమే ధర్మమని బుద్ధిమంతులవాదన. చోరులు, దుష్టులు మొ॥వారు దండన లభించుననే భయంతో ఏ పాపకర్మలు చేయజాలరు. (స.ప్ర. 6వ.సము.) ॥18॥

న్యాయానుసారమైన దండనే హితకారి-

ఇది మనుకృతం-ప్రామాణికం

సమీక్ష్య స ధృత స్సమ్యక్ సర్వా రంజయతి ప్రజాః । మూలశ్లోక సం. 13
అసమీక్ష్య ప్రణీతస్తు వినాశయతి సర్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 19

టీక:- **సమ్యక్ సమీక్ష్య ధృతః** = చక్కగా ఆలోచించి చేసే దండన, **సః** = అది, **సర్వాః ప్రజాః రంజయతి** = ప్రజలందరికీ సంతోషం కలిగిస్తుంది, **అసమీక్ష్య ప్రణీతః తు** = అనాలోచితంగా చేసిన దండన, **సర్వతః వినాశయతి** = అన్ని విధాలా రాజును నష్టపరుస్తుంది.

ఋషి దయానంద భాష్యం:-శాస్త్రం చేత చక్కగా శోధించి, అపరాధానుగుణంగా శిక్షింపబడి అది ప్రజలను రంజింపచేయడం వల్ల రాజదండం శ్రద్ధగా కాపాడాల్సి ఉంది. విచారించకుండా ప్రయోగించబడితే అదే అన్ని దిక్కులనుండి అన్ని విధాలా రాజును నాశనం చేస్తుంది. (స.ప్ర. 6వ సము.) ॥19॥

20-23వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

దండన లేనిచో హాని-

* *యది న ప్రణయేద్రాజా దండం దండ్యేష్వతంద్రితః ।*
శూలే మత్స్యానివాపక్ష్యన్ దుర్బలాన్ బలవత్తరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***20***

తాత్పర్యం:- రాజు ఏమరుపాటున (దండ్యులందు) శిక్షించాల్సిన వారిని చక్కగా దండమును ప్రయోగింపడేని, బలవంతులైనవారు బలహీనులను శూలమునందు మత్స్యాలలాగా గ్రుచ్చి వేస్తారు. అంటే బలవంతుల అధికారం ఎక్కువగా చెల్లుతుంది. బలహీనులు అన్యాయం పాలవుతారు. ॥20॥

* *అద్యాత్కాకః పురోడాశం శ్వా చ లిహ్యాద్ధవిస్తథా ।*
స్వామ్యం చ న స్యాత్కస్మింశ్చిత్ప్రవర్తేతాధరోత్తరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***21***

తాత్పర్యం:- రాజు దండమును చక్కగా ఒనర్పడేని, అప్పుడు యజ్ఞాలలోని పురోడాశమను హవిస్సు బొత్తుగా హవిర్గ్రహణమునకు యోగ్యం గాని కాకులగుంపు (కాకము) భక్షిస్తుంది. అలాగే కుక్కకూడా పాయసాన్ని, హవిస్సును నాకి ఉంటుంది. ఒకడికి ఒక వస్తువునందు స్వాతంత్ర్యం లేకపోయి ఉంటుంది. తక్కువవారు అధికులుగాను అధికులు తక్కువవారుగాను అవుతారు. ॥21॥

* *సర్వో దండజితో లోకో దుర్లభో హి శుచిర్నరః ।*
దండస్య హి భయాత్సర్వం జగద్భోగాయ కల్పతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***22***

తాత్పర్యం:- ఈ లోకమంతా దండంచేతనే నియమింపబడినదై, సన్మార్గంలో ఉంది. లోకంలో దండనం లేదా స్వాభావికంగా పరిశుద్ధుడయిన మానవుడు ఉండటం అరుదు. దండన భయం వల్లనే ఈ జగమంతా ఆవశ్యకమగు భోజనాదికార్యమును జరుపుకో గలిగి ఉంది. ॥22॥

* *దేవదానవగంధర్వా రక్షాంసి పతగోరగాః ।*
తేఽ పి భోగాయ కల్పంతే దండేనైవ నిపీడితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***23***

తాత్పర్యం:- దేవదానవగంధర్వులు, రాక్షసగరుడపన్నగులు, జగదీశ్వరుడైన పరమేశ్వరుడి దండనకు భయపడే (నొచ్చియే) వానకురిపించడం మొ॥న స్వకార్యములు నిర్వహిస్తున్నారు. ॥23॥

ప్రక్షిప్తాల పరిశీలన

20 నుంచి 23 వరకు గల శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

5.1, 14 శ్లోకాల ప్రకారం, విషయం రాజు ప్రజలకు విధించే శిక్షలు, వాటి పరిణామాలు అనేది. 22, 23లలో జగత్తు, చేపలు, పక్షులు, సర్పాలు మొదలైనవి రాజు విషయం కిందికి రావు. ఇక్కడ భగవంతుని శిక్షా విధానం చెప్పటం విషయ వ్యతిరేకం కనుక, ఇది ప్రక్షిప్తం.

2. ప్రసంగ వ్యతిరేకం

క. 24వ శ్లోకం 29లోని 'అసమీక్ష్యం' యొక్క అర్థవాద రూపం. 18వ శ్లోకంలో శిక్ష గొప్పతనాన్ని, 19లో దాని వల్ల కలిగే హానినీ చెప్పారు. ఇలా 19,24వ శ్లోకాలకు ఒక ఏకసూత్రత ఉంది. మధ్యలో 20-23 శ్లోకాలు ఆ ప్రసంగాన్ని భంగం చేయటం చేత అవి మౌలికాలు కావని తేలిపోయింది.

ఖ. శిక్షలు లేక పోవటం వల్ల ఏర్పడే అవ్యవస్థలను 18వ శ్లోకం వరకు చెప్పి, మళ్లీ 19 తర్వాత వాటినే చెప్పటం ప్రసంగ వ్యతిరేకం. ఈ కారణం చేతనూ ఇవి మౌలికాలు కావని తేలిపోయింది.

24-28వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

దుష్యేయుస్సర్వవర్ణాశ్చ భిద్యేరన్ సర్వసేతవః । మూలశ్లోక సం. **14**
సర్వలోక ప్రకోపశ్చ భవేద్దండస్య విభ్రమాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **24**

టీక:- సర్వవర్ణాః దుష్యేయుః = దండన విధానం లేనట్లయితే సర్వవర్ణాలన్నీ చెడిపోతాయి, దూషితాలవుతాయి. చ = మరియు, **సర్వసేతవః భిద్యేరన్** = సర్వమర్యాదలు, ఆచారాలు, ధర్మాలు ఛిన్నాభిన్నమైపోతాయి, **దండస్య విభ్రమాత్** = దండన విధానం యథా ప్రకారం లేనట్లయితే **సర్వలోక ప్రకోపః భవేత్** = ప్రజలందరూ క్రోధోద్రిక్తులవుతారు.

ఋషి దయానంద భాష్యం:- దండన విధానం లేనట్లయితే బ్రాహ్మణాదులైన నాలుగు వర్ణాలవారు స్త్రీలను పొంది సంకరజాతివారు అవుతారు. సకలశాస్త్రాలలో చెప్పిన ధర్మార్థకామమోక్షములనే నాలుగు కూడా నశిస్తాయి. దొంగతనం, సాహసం మొ॥న వాటి మూలమున సకలలోకం (జనులందరిలో కలవరపాట్లు) కలత చెందుతుంది. యథోచితమైన దండన లేకపోతే అందరూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు. (స.ప్ర.6వ సము.) ॥24॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యత్ర శ్యామో లోహితాక్షో దండశ్చరతి పాపహా । మూలశ్లోక సం. **15**
ప్రజాస్తత్ర న ముహ్యంతి నేతా చేత్సాధు పశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **25**

టీక:- యత్ర = ఎక్కడ, **శ్యామః లోహితాక్షః పాపహా** = కృష్ణ వర్ణంతో, ఎర్రటి కన్నులతో భయంకరమైన పురుషుడితో సమానంగా పాపాలను నశింపజేసేదైన, **దణ్డః చరతి** =దండన విధానం అమలులో ఉంటుందో, **తత్ర ప్రజాః న ముహ్యన్తి** = అక్కడ ప్రజలు మోహితులు (అజ్ఞులు) కాకుండా ఆనందిస్తారు, **నేతాః సాధు పశ్యతి చేత్** = కాని, దండన విధానం అమలుచేసే వ్యక్తి పక్షపాత రహితుడైన విద్వాంసుడుగా ఉన్నప్పుడు అది సాధ్యమౌతుంది.

ఋషి దయానంద భాష్యం:- ఏ దేశంలో నల్లని వన్నెగలది, ఎర్రని కన్నులు గలదియైన దండం పాపాలన్నిటినీ నశింపజేసేదైన దండనవిధానం అమలులో ఉంటుందో, అమలు చేసే వ్యక్తి పక్షపాతరహితుడైన విద్వాంసుడుగా ఉంటాడో అక్కడ ప్రజలు మోహితులు కాకుండా ఆనందిస్తారు. (స.ప్ర.6వ సము.) ॥25॥

వివరణ:

అలంకారికంగా దండన గురించి వర్ణన: నల్లటి రంగు కలిగి క్రోధంతో ఎర్రనైన కనుగుడ్లు కలిగిన వ్యక్తి చూడటానికి భయం కలిగించేట్లుగా దండన (శిక్ష) భయం కలిగిస్తుంది. అపరాధులను, పాపులను క్రోధాగ్నిలో కాల్చేదిగా కనిపిస్తుంది. అలాంటి భయంకర రూపం మనసులోకి రాగా, ప్రజలు తమ తమ కర్తవ్యాలలో ప్రమాదాలు (పొరపాట్లు) చేయరు. ఇదంతా రాజు పక్షపాతరహితుడై, న్యాయానుసారంగా అపరాధులను దండించినప్పుడు సంభవిస్తుంది, లేదా సాధ్యపడుతుంది.

దండించడానికి అధికారం గల రాజు ఎవరు? - ఇది మనుకృతం-ప్రామాణికం

తస్యాహుస్సంప్రణేతారం రాజానం సత్యవాదినమ్ । మూలశ్లోక సం. **16**
సమీక్ష్యకారిణం ప్రాజ్ఞం ధర్మకామార్థకోవిదమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **26**

టీక:- తస్య సంప్రణేతారం రాజానం ఆహుః = ఆ దండన విధానాన్ని చక్కగా అమలు చేసే, ప్రయోగించే వాడిని రాజు అంటారు, **సత్యవాదినమ్ సమీక్ష్య కారిణం** = ఎవడు సత్యవాదియో, విమర్శించి కార్యమొనర్చునో, **ప్రాజ్ఞం** = బుద్ధిమంతుడైన విద్వాంసుడో, **ధర్మ-కామ-అర్థ-కోవిదమ్** = ధర్మాన్ని, కామాన్ని మరియు అర్థాన్ని యథార్థంగా తెలిసినవాడు దండన విధానాన్ని చక్కగా ప్రయోగిస్తాడు.

ఋషి దయానంద భాష్యం:-ధర్మార్థ కామమోక్షాల గురించి శాస్త్రాలు ఎంతో చర్చించాయి. కానీ ఇక్కడ కొంత విస్తృతంగా స్పష్టపరచడం ప్రయోజనకరంగా ఉంటుంది. వీటికే **'పురుషార్థ చతుష్టయమని'** కూడా పేరుంది. ధర్మ-అర్థ-కామములను త్రివర్గమనీ చెబుతారు.

అలాంటి దండన విధానాన్ని చక్కగా అమలుచేసే, ప్రయోగించేవాడిని రాజు అంటారు. సమర్థుడుగాను, బుద్ధిమంతుడిగానూ, ధర్మార్థకామములు తెలిసిన వాడుగానూ, ఉంటే దండన విధానాన్ని చక్కగా ప్రయోగిస్తాడు. (స.ప్ర. 6వ సము; సం.వి.గృహ.) ॥26॥

వివరణ:

1. **ధర్మ స్వభావం: "ధారణాత్ ధర్మః" "ధ్రియతే అనేన లోక ఇతి"** వ్యుత్పత్తి ననుసరించి మనమాచరించే ప్రతి సదాచరణం శ్రేష్ఠ విధానం లేదా సమాజవ్యవస్థే ధర్మం, **"యతో అభ్యుదయ నిఃశ్రేయస సిద్ధిః స ధర్మః"** (వై.శే. 1.1.2) అంటే దేన్ని ఆచరించినందువల్ల ఉత్తమ సుఖం, ఆత్మిక-మానసిక -శారీరకమైన త్రివిధాలైన అభ్యుదయం, మోక్ష సుఖప్రాప్తి కలుగుతాయో అదే ధర్మమని అంగీకరించింది. వైశేషికంలో చెప్పబడిన ధర్మాన్ని విభిన్న శ్లోకాలలో మనువు ఈ మాన్యతలను స్పష్టపరచారు. (4.238, 239,156,242,175,227; 6.92; 2.9[1.128]) 1.66, దీనికి సంబంధించిన విస్తృత వివేచన 1.2వ శ్లోకవివరణ చూడగలరు.

2. **కామం :** కామనల పూర్తి-కామ వికారాలకు శాంతి

3. **అర్థం :** ధనం-జగత్తులో ఐశ్వర్య ప్రాప్తి

4. **మోక్షం:** జనన-మరణ బంధనాల నుండి దూరమైపోయి ముక్తి స్థితిలో ఉండటం.

ప్రత్యేక స్థితిలో స్వీకరించతగినది, పాలింపతగినది-ధర్మం. మోక్ష ప్రాప్తి పరమోద్దేశమే, కానీ కామానికి అర్థానికి మాత్రం మినహాయింపు లేదు. కానీ మనువు వీటిని సీమితంగా, విహిత రూపంలో మాత్రమే గ్రాహ్యమని అంగీకరించాడు. ధర్మానుకూలమైన అర్థ-కామములే గ్రాహ్యములు, అన్యములు త్యాజ్యములు.

క. **పరిత్యజేదర్థకామౌ యౌ స్యాతాం ధర్మ వర్జితౌ** 4.176
ధర్మరహితమైన అర్థకామాలు పరిత్యాజ్యాలు.

ఖ. **"అర్థకామేష్వసక్తానాం ధర్మజ్ఞానం విధీయతే** [1.132 (2.13)]
అర్థ-కామాలందు ఆసక్తి లేనివాడికే ధర్మజ్ఞానం, ధర్మసిద్ధి లభిస్తాయి.

గ. అర్థసిద్ధికి నియమాలు

"నేహేతార్థాన్ ప్రసంగేన అవిరుద్ధేన కర్మనా
న విద్యమానేష్వర్థేషు నార్త్యామపి యతస్తతః ॥ 4.15

ఘ. కామసిద్ధికి హద్దులు

"ఇన్ద్రియార్థేషు సర్వేషు న ప్రసజ్యేత కామతః ।
అతిప్రసక్తిం చైతేషాం మనసా సంనివర్తయేత్॥ 4.16

అయితే ధర్మానుకూలమైన కామార్థాలేవి? వీటిని గురించి మనుమహర్షి అనేక చోట్ల చర్చించారు. మరొకచోట కూడా వీటికి హద్దులను సూచించారు.

జ. కామ సంతుష్టి విషయంలో "ప్రతి మనిషికీ" రాజైనవాడికీ మను మహర్షి సూచన ఏమంటే-జితేంద్రియుడుగా ఉంటూ కామమును సేవించవచ్చు. (7.44) **"ఋతుకాలాభిగామీస్యాత్ స్వదారనిరతస్సదా" "ఋతుకాలాభిగామిగా ఉండుమని"** నిర్దేశించాడు. అలాంటి నియమాన్ని పాలించేవాడు బ్రహ్మాచారి అవుతాడు. (3-45) (3-50), అతి కామాసక్తి నిషేధించబడింది. కారణం-ఇది హానికారకం. (7-27,48). ఒక హద్దులోనే కామసిద్ధి సంభవిస్తుంది.

చ. ధనైశ్వర్యప్రాప్తికూడా ధర్మపూర్వకంగానే ఉండాలి. ఈ విషయంలో పిసినారి వ్యక్తి నుండి ధర్మాదులు సర్వం నష్టమైపోతాయి. జీవితంలో అర్థశౌచం ముఖ్యమని మనువు భావించాడు. [7.49]. అందువల్ల అర్థప్రాప్తికోసం-సాధారణ వ్యక్తులకు కూడా ఒక హద్దు ఏర్పరచాడు. మానవుడు సంతోషంగా, ఇతర ప్రాణులకు ఏ మాత్రం బాధకలిగించకుండా ధనం నిల్వచేయుగాక! (4.2, 3,11,12) రాజులకు కూడా ధనాన్ని నిలవ చేయడం (కూడ బెట్టడం) కోసం సముచితమైన నిర్దేశం చేశాడు (7.227, 129, 139, 9.305).

ఈ ధర్మాదుల సిద్ధికి అవశ్యకమైన నియమాలను, విధానాలను తెలిసినవారు, తదనుసారంగా ఆచరించేవారు **"ధర్మ-కామార్థకోవిదులు"** అని పిలువబడతారు. వీటిని సాధించడమే మానవ జీవిత పరమార్థం. ఇవి సిద్ధించుటే మానవ జీవన సాఫల్యానికి, సుఖానికి ప్రతీకగా గుర్తించబడతాయి.

అన్యాయమైన దండన ప్రయోగం వల్ల రాజుకు వినాశనం - ఇది మనుకృతం-ప్రామాణికం

తం రాజా ప్రణయన్ సమ్యక్ త్రివర్గేణాభివర్ధతే । మూలశ్లోక సం. **17**
కామాత్మా విషమః క్షుద్రో దండేనైవ నిహన్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **27**

టీక:- **తం రాజా సమ్యక్ ప్రణయన్** = ఏ రాజు దండనాన్ని చక్కగా ప్రయోగిస్తాడో ఆ రాజు, **త్రివర్గేణ +అభివర్ధతే** = ధర్మార్థకామముల సిద్ధిని పెంపొందించుకొంటాడు. ఏ రాజు, **కామాత్మా** = విషయలంపటుడై, **విషమః** = విరుద్ధంగా, ఈర్ష్యాళువైనవాడు, **క్షుద్ర** = నీచ బుద్ధి కలిగిన రాజు, **దండేన + ఏవ నిహన్యతే** = తాను విధించిన దండన విధానం ద్వారానే చంపబడతాడు.

ఋషి దయానందభాష్యం:- ఏ రాజు ఆ దండమును చక్కగా (సరిగా) ప్రయోగిస్తాడో ఆ రాజు ధర్మార్థకామములను పొందుతాడు. అలా కాకుండా విషయాభిలాషతో ఉండటం వల్ల పక్షపాతియై, నీచుడై ప్రవర్తించునేని, అదే దండన విధానం ద్వారా తానూ చంపబడతాడు. ॥27॥

వివరణ:

'విషమః' అను పదానికర్థం:- న్యాయంలో ఈర్ష్యాదుల వల్ల పక్షపాతం చూపించవద్దని అర్థం. పక్షపాతంతో కూడిన దండన విధానం రాజవినాశనానికి కారణమవుతుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

దండో హి సుమహత్తేజో దుర్ధరశ్చాకృతాత్మభిః । మూలశ్లోక సం. **18**
ధర్మాద్విచలితం హంతి నృపమేవ సబాంధవమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **28**

టీక:- **దణ్డః హి సుమహత్తేజః** = దండం గొప్ప తేజస్సు గలది, **అకృతాత్మభిః దుర్ధరః** = దాన్ని అవిద్వాంసులు, అధర్మాత్ములు ధరించలేరు. **ధర్మాత్ విచలితం నృపమ్ + ఏవ** = ఆ దండం ధర్మరహితుడైన ఆ రాజునే, **హన్తి** = నాశనం చేస్తుంది, **సబాంధవమ్** = కుటుంబసహితంగా అందరినీ కూడా నాశనం చేస్తుంది.

ఋషి దయానంద భాష్యం:- దండం గొప్ప తేజస్సు గలది. అసమర్థులు, అవిద్వాంసులు, అధర్మాత్ములు దాన్ని ధరించలేరు. కాబట్టి దండం రాజనీతి నుండి తప్పిన రాజునే బంధుపుత్రమిత్రాదులతోడ నాశనం చేస్తుంది.॥28॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ***తతో దుర్గం చ రాష్ట్రం చ లోకం చ సచరాచరమ్ ।***
అంతరిక్షగతాం శ్చైవ మునీన్ దేవాంశ్చ పీడయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***29***

తాత్పర్యం:- ఆ తరువాత దండం దుర్గమును, రాజ్యాన్ని, స్థావరజంగమరూపమైన భూతాలను, ఆకాశంలో సంచరిస్తున్న దేవతలను, మునులను బాధిస్తుంది. ॥29॥

ప్రక్షిప్త పరిశీలన

29వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్త-

1. ప్రసంగ వ్యతిరేకం

క. పూర్వాపర శ్లోకాలలో రాజు ప్రజలకు విధించే శిక్షలను గురించి ఉంది. 29లో రాజు విధించే అసంబద్ధమైన శిక్షలను చెప్పటం, పూర్వాపర చర్చలకు భిన్నం కనుక ప్రసంగ వ్యతిరేకం.

ఖ. పై శ్లోకాలలో వాడిన పదాల వల్లనూ 28, 30 శ్లోకాలకే పరస్పరం సంబద్ధత వ్యక్త మవుతూంది. 28లో **"దండో హి సుమహత్ తేజః"** అనేది ఉంది. దాని ప్రకారం 30లో **"సః అసహాయేన"** అనే ప్రయోగం ఉంది. మధ్యలో 29వ శ్లోకం ఈ భాషలోని సంబద్ధతను భంగం చేసినందున, ఈ ప్రసంగ వ్యతిరేక శ్లోకం ప్రక్షిప్తం.

2. విషయ వ్యతిరేకం

ఈ చరాచర జగత్తులోని పదార్థాలకు విధించే శిక్షలు, రాజు వేసే శిక్షల కిందికి రావు. అవి భగవంతుని శిక్షా ప్రభావాలు కనుక, విషయ వ్యతిరేకం (విస్తృత సమీక్షను 7.23 మీద 'విషయ వ్యతిరేకాలు'లో చూడండి).

3. శైలీగత వ్యతిరేకం

అంతరిక్షంలో ఎవరో దేవతలు, మునుల నివాసా లున్నాయని నమ్మటం, రాజులు వారిని బాధించటం, ఇవి కట్టుకథలు. రాజ్యాంగ రచనలో కల్పనలు ఉండవు. ఇది కాల్పనికమూ, నిరాధారమూ, సహేతుకం కానిదీ. ఈ శైలి మనువుది కాదు, ప్రక్షిప్త కర్తది. కనుక ఈ శ్లోకం ప్రక్షిప్తం.

ఇది మనుకృతం-ప్రామాణికం

సోఽసహాయేన మూఢేన లుబ్ధేనాకృతబుద్ధినా । మూలశ్లోక సం. **19**
న శక్యో న్యాయతో నేతుం సక్తేన విషయేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **30**

టీక:- **అసహాయేన మూఢేన** = ఏ రాజుకు ఉత్తమ సహాయకులు లేరో, ఎవడు మూఢుడో, **లుబ్ధేన** = లోభియో, (పిసినారి), **అకృత బుద్ధినా** = ఎవడు బ్రహ్మచర్యాది ఉత్తమ కర్మ ద్వారా, విద్యాబుద్ధులను పెంచుకోలేదో, **విషయేషు సక్తేన** = విషయాలందు, భోగాలందు మునిగి ఉన్నాడో, **సః** = అతడు ఆ దండన విధానాన్ని, **న్యాయతః నేతుం న శక్యః** = ఎప్పుడూ న్యాయంగా అమలు పరచలేడు.

ఋషి దయానంద భాష్యం:- అలాంటి దండమును ఆప్తులైన మంత్రులు మొ॥న వారు తోడులేనివాడు, లోభి, మూఢుడు, విద్యాగంధం లేనివాడు, విషయాలందు భోగాలందు మునిగి ఉన్నవాడు, ఆ దండనవిధానాన్ని ఎప్పుడూ న్యాయంగా అమలు పరచలేడు. ఎందుకంటే, ఎవరికి ఆప్తపురుషుల సహాయం లేదో, విద్య సుశిక్షణ లభించలేదో, కామాసక్తుడైన మూఢుడో, అతడు న్యాయంగా దండన విధానాన్ని విధించడంలో ఎప్పుడూ సమర్థుడు కాజాలడు. (స.ప్ర. 6వ సము.) ॥30॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శుచినా సత్యసంధేన యథాశాస్త్రానుసారిణా । మూలశ్లోక సం. **20**
ప్రణేతుం శక్యతే దండస్సుసహాయేన ధీమతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **31**

టీక:- మరియు,**శుచినా** = ఎవడు పవిత్రుడో, **సత్యసన్ధేన** = సత్య సంధుడో, సత్యాచారంలోను, సత్పురుషుల సంఘంలో ఉంటాడో, **యథాశాస్త్ర+అనుసారిణా** = నీతిశాస్త్రానుగుణంగా ప్రవర్తిస్తాడో, **సుసహాయేన** = శ్రేష్ఠపురుషుల సహాయం లభించినవాడో, **ధీమతా** = బుద్ధిమంతుడో, **దండః ప్రణేతుం శక్యతే** = న్యాయరూపమైన దండనాన్ని విధించడంలో సమర్థుడవుతాడు.

ఋషి దయానంద భాష్యం:- లంచం మొ॥నవి తీసుకోనివాడు, పవిత్రుడు, మాటతప్పనివాడు, శాస్త్రపద్ధతిని అనుసరించువాడు, మంత్రులు మొదలైన సహాయకు గలవాడు, జ్ఞానవంతుడు అయిన రాజు న్యాయరూపమైన దండన విధించడంలో సమర్థుడవుతాడు.

అందువల్ల, పవిత్రుడు, సత్పురుషుల సహవాసి, రాజనీతిశాస్త్రానికి అనుకూలంగా ప్రవర్తించేవాడు, ధార్మిక పురుషుల సలహాలను పాటించేవాడు బుద్ధిమంతడు అయిన రాజు మాత్రమే ఈ దండన విధానాన్ని చలాయించగలడు. (స.ప్ర. 6వ సము) ॥31॥

ఇది ప్రక్షిప్తం-ప్రామాణికం కాదు

* **స్వరాష్ట్రే న్యాయవృత్తస్స్యా ద్భృతదండశ్చ శత్రుషు ।**
సుహృత్స్వజిహ్మః స్నిగ్ధేషు బ్రాహ్మణేషు క్షమాన్వితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***32***

తాత్పర్యం:- రాజు స్వరాజ్యంలో నీతిశాస్త్రాన్ని అనుసరించిన వ్యవహారం గలవాడు గాను, శత్రుపక్షంలో కఠినదండన గలవాడు గాను, స్నేహితులయందు కౌటిల్యం లేనివాడు గాను, దోషులయినా బ్రాహ్మణులందు ఓర్పు గలవాడు గాను అయి ఉండాలి. ॥32॥

ప్రక్షిప్త పరిశీలన:

32వ శ్లోకము క్రింది విధంగా ప్రక్షిప్తము.

1. ప్రసంగ వ్యతిరేకము

31, 33 శ్లోకాలలో దేశంలో న్యాయానుసారంగా, శాస్త్రానుసారంగా దండించే విధానం దాని లాభాలు తెలుపబడినవి. మధ్యలో శత్రువులతో, మిత్రులతో, బ్రాహ్మణులతో ఎలా వ్యవహరించాలను విషయం పూర్వాపర ప్రసంగ విరుద్ధము.

2. అంతర్ వ్యతిరేకము

క. మనువు రాజనీతి శాస్త్రానికి చెందిన 7-9 అధ్యాయాలలో మొత్తం న్యాయానుసార దండన వ్యవహారాది విషయాలను తెలిపినాడు. ఈ శ్లోకంలో గల బ్రాహ్మణులను క్షమించు విషయం దీనికి వ్యతిరేకంగా ఉన్నది. పైగా నేరం చేసినప్పుడు అందరికంటే ఎక్కువగా బ్రాహ్మణునకే దండన విధించాలని ఆదేశమున్నది.

[(8.306,335,336; 7.17,18; 9.249,307,311)]ఈ విధంగా అంతర్ వ్యతిరేకాల కారణంగా ఈ శ్లోకము ప్రక్షిప్తము.

ఖ. 8.347వ శ్లోకంలో కూడా మిత్రులు-శత్రువులు అని చూడకుండా అందరికి సమాన దండన విధించాలని స్పష్టంగా ఉన్నది. కావున ఈ శ్లోకం ప్రక్షిప్తమని తేలినది.

33 నుండి 39వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

న్యాయానుసార దండన విధానం వల్లనే రాజుకు కీర్తి ప్రతిష్ఠలు-

ఏవం వృత్తస్య నృపతేశ్శిలోంఛేనాపి జీవతః । మూలశ్లోక సం.**21**
విస్తీర్యతే యశో లోకే తైలబిందురివాంభసి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**33**

టీక:- **ఏవం వృత్తస్య నృపతేః** = ఈ విధంగా న్యాయపూర్వకంగా (13-31) దండనచేసే, **శిలోంఛ్ఛేన+అపి జీవతః** = శిల ఉంఛతో నిర్వాహం చేసే అంటే ధనహీన ప్రభువు యొక్క, **యశః** = యశస్సు, **అమ్భసి తైలబిందుః ఇవ** = నీటి మీద పడిన నూనె బిందువు నాలుగు వైపుల వ్యాపిస్తున్నట్లు, **లోకే విస్తీర్యతే** = ప్రపంచమంతా వ్యాపిస్తుంది.

తాత్పర్యం:- రాజు ఇలాంటి న్యాయపూర్వకమైన నడవడి కలవాడై ఉన్నట్లయితే అతడు ద్రవ్యహీనుడైనను, నీటియందు తైలబిందువులాగా వ్యాపిస్తున్నట్లు అతడి కీర్తి లోకంలో ప్రఖ్యాతి గాంచుతుంది. ॥33॥

వివరణ:

పైరు కోయగా జారిపోయిన కంకులకు **'శిల'** అని పేరు. చేలో రాలిపోయిన ధాన్యానికి **'ఉంఛ'** అని పేరు. **'శిల-ఉంఛతో'** జీవించడమంటే -ధనం గానీ, ఐశ్వర్యంగానీ లేనివాడని భావం. న్యాయానుసారంగా ప్రవర్తించే రాజు స్వల్పధన సంపత్తి కలవాడైనా అతని కీర్తి నలువైపుల వ్యాపిస్తుంది.

న్యాయవిరుద్ధాచరణ వల్ల రాజుకు అపకీర్తి- **ఇది మనుకృతం. ప్రామాణికం**

అతస్తు విపరీతస్య నృపతేరజితాత్మనః । మూలశ్లోక సం.**22**
సంక్షిప్యతే యశో లోకే ఘృతబిందురివాంభసి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**34**

టీక:- **అతః తు విపరీతస్య** = ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే (న్యాయంగా, జాగ్రత్తగా దండన వ్యవహారం చేయని) **అజితాత్మనః నృపతేః** = జితేంద్రియుడు కాని రాజు యొక్క, **యశః** = యశస్సు, **అప్సుసి ఘృత బిందుః+ఇవ** = నీటిలో పడిన నేతి బిందువులాగా, **లోకే సంక్షిప్యతే** = లోకంలో తరిగిపోతుంది. ఈ ప్రకారంగా రాజనిర్మాణం జరుగుతుందనే విషయం ఉపసంహారం చేయబడుతుంది.

తాత్పర్యం:- ఈ నడవడికంటే విరుద్ధంగా వ్యవహరించే నడవడిక గల జితేంద్రియుడు కాని రాజు కీర్తి నీటిలో బడిన నేతి బిందువులాగా లోకంలో నశించిపోతుంది. ॥34॥

ఇది మనుకృతం-ప్రామాణికం

స్వే స్వే ధర్మే నివిష్టానాం సర్వేషామనుపూర్వశః । మూలశ్లోక సం. **23**
వర్ణానామాశ్రమాణాం చ రాజా సృష్టోఽభిరక్షితా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **35**

టీక:- **స్వేస్వే ధర్మే నివిష్టానాం** = తమ తమ ధర్మాలలో ప్రవేశించిన, **అనుపూర్వశః సర్వేషాం వర్ణానాం చ ఆశ్రమాణాం** = క్రమంగా సర్వవర్ణాలను, ఆశ్రమాలను, **రాజా అభిరక్షితా సృష్టః** = రక్షించే వాడిగా రాజు సృష్టింపబడినాడు-అంటే రాజపదవిలో ఉన్న వ్యక్తి అన్నివర్ణాల వారిని, అన్ని ఆశ్రమాలందున్నవారిని వారి వారి ధర్మాలలో ప్రవృత్తులయ్యేట్లు చూడాలి. సమాజాన్ని ధర్మవ్యవస్థలో నడిపించడానికి రాజ్యం-రాజు సృష్టింపబడ్డాడు.

తాత్పర్యం:-తమ తమ ధర్మాలందు గల గట్టి పట్టుదల చేత, చాతుర్వర్ణాలను బ్రహ్మచర్యాద్యా శ్రమాలను రక్షించడానికే దేవుడు రాజును సృజించాడు. ॥35॥

వివరణ:

వర్ణాశ్రమ ధర్మాలను రక్షించడం రాజు కర్తవ్యం-

మను మహర్షి ఈ శ్లోకంలో వర్ణించిన పద్ధతినే అనుసరించి కౌటిల్యుడు కూడా వర్ణాశ్రమధర్మాలను, మర్యాదలను కాపాడుటయే రాజు ముఖ్య కర్తవ్యమని బోధించాడు.

శ్లో॥ చతుర్వర్ణాశ్రమస్యాయం లోకస్యాచార రక్షణాత్ ।
నశ్యతాం సర్వధర్మాణాం రాజధర్మప్రవర్తకః ॥ ప్ర. 56. 57, 1అధ్యా

రాజు దినచర్య-భృత్యుడి నియుక్తి విధానం

ఇది మనుకృతం-ప్రామాణికం

తేన యద్యత్సభృత్యేన కర్తవ్యం రక్షతా ప్రజాః । మూలశ్లోక సం. **24**
తత్తద్వోఽహం ప్రవక్ష్యామి యథావదనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **36**

టీక:- **తేన** = ఆ రాజు ద్వారా, **సభృత్యేన** = తన అమాత్యులు మొ॥ సహాయకులతో కూడా, **ప్రజాః రక్షతా** = ప్రజలను రక్షించే, **యత్ యత్ కర్తవ్యం** = ఏ యే కర్మ చేయాలో, **తత్ తత్** = ఆ యా కర్తవ్యాన్ని, **అనుపూర్వశః** = క్రమంగా, **యథా వత్ ప్రవక్ష్యామి** = ఉన్నదున్నట్లుగా వివరిస్తాను.

తాత్పర్యం:-అలాంటి ప్రజాసంరక్షకుడైన రాజు తన అమాత్యులు మొదలగు పరివార సమేతంగా నడుచుకోవలసిన విధులన్నీ వరుసగా మీకు చెబుతాను వినండి. ॥36॥

వివరణ:

'భృత్యులంటే ఎవరు? రాజుగారి నుండి భరణపోషణాలను ఆశించేవారందరూ భృత్యులే. **'భృత్యః-బిభర్తేః'** భృధాతువుకు **'క్యప్ తక్ చ'** ఈ విధంగా అమాత్యులు, మొ॥ సాధారణ సేవకులు కర్మచారులందరూ భృత్యవర్గంలోకి

వస్తారు, (7.226వ) శ్లోకం చూడగలరు. రాబోయే సంపూర్ణ ప్రసంగమంతా మంత్రులు మొ॥ సాధారణ సేవకుల నియుక్తి విధానం ఉంది. ఈ విషయంలో 7.226వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

రాజు వేదవేత్తలైన ఆచార్యుల నియంత్రణలో ఉండాలి - ఇది మనుకృతం-ప్రామాదికం

బ్రాహ్మణాన్ పర్యుపాసీత ప్రాతరుత్థాయ పార్థివః । మూలశ్లోక సం. **25**
త్రైవిద్యవృద్ధాన్ విదుష స్తిష్ఠేత్తేషాం చ శాసనే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **37**

టీక:- **పార్థివః** = ప్రభువు(రాజు), **ప్రాతః ఉత్థాయ** = ఉదయమే లేచి, 7.145వ శ్లోకంలో వర్ణించిన దినచర్యను పూర్తి చేసిన తరవాత, **త్రైవిద్యవృద్ధాన్ విదుషః బ్రాహ్మణాన్** = ఋక్, సామ-యజుర్వేదాల రూపమైన త్రయీవిద్యలో, (1.23,11.263,264) గొప్ప-అంటే పారంగతులైన ఆచార్యులు- ఋత్విక్కులు, మొ॥ (7.43, 7.78) బ్రహ్మజ్ఞానులైన విద్వాంసులను, **పరి+ఉపాసీత** = అభివాదనాది సత్కారాలొనరించి, శిక్షణ కోసం వారిని సంప్రదించాలి. **చ** = మరియు, (7.36) **తేషాం** = శిక్షకులైన ఆ విద్వాంసుల యొక్క, **శాసనే తిష్ఠేత్** = క్రమశిక్షణలో తమ జీవితాలను సరిదిద్దుకోవాలి.

తాత్పర్యం:-రాజు ఉదయాన్నే లేచి, ఋగ్యజుస్సామాలనే మూడు వేదాలను సాంగంగా చదువుకున్న విద్వాంసులైన బ్రాహ్మణుల సలహాలను తీసుకొని వారి ఆనతి మేరకే రాచకార్యాలు నిర్వహించాలి. ॥37॥

వివరణ:

1. రాజు యొక్క జీవనచర్య:

రాజుకు కావలసిన సంపూర్ణ జీవనవిధానమంతా ఈ జీవన దినచర్యలో కలసి ఉంది. ఈ నియమాలన్నిటినీ రోజూ పాటించకపోయినా, జీవనానికి అవసరాన్ని బట్టి ఆచరించవలసి ఉంటుంది. ఇవన్నీ 7.37వ శ్లోకం నుండి, 9.325వ శ్లోకం వరకు వివరించడమైంది. (7.145వ శ్లోకం నుండి 226వ శ్లోకం వరకు) రాజుగారి దైనికచర్య గురించి వివరించడమైంది. విషయ దృష్టితో దినచర్యలో అంతర్గతమవుతుంది. 7.145వ శ్లోకంలోని వివరణ చూడగలరు.- ప్రతిదినం ఆచరించాల్సిన కర్తవ్యాలు చెప్పబడినవి.

2. **37వ శ్లోకార్థవివరణ:** జీవనచర్యను దృష్టిలో పెట్టుకొని ఈ విధానం చేయడమైంది. ఆ భావంతోనే ప్రాతఃకాలం విద్వాంసుల చెంత శిక్షాగ్రహణం చేయమని చెప్పటం జరిగింది. కానీ దీని వ్యాఖ్య-7.145వ శ్లోకంతో సంపూర్ణమవుతుంది. రాజు, తెల్లవారుజామునలేచి, సంధ్య, అగ్నిహోత్రాది ఆవశ్యకమైన దినచర్య చేయాలనే విధానముంది. తరువాత విద్వాంసుల సన్నిధానంలో ఉండి విద్యాశిక్షణాదులు గ్రహించాలని ఉంది. అందువల్ల ఇక్కడ ఆ శ్లోకాన్ననుసరించి వ్యాఖ్య చేయబడింది. అది మనుసమ్మతమే.

3. **రాజు-దినచర్య, కౌటిల్యుని అర్థశాస్త్రం:** కౌటిల్యుని అర్థశాస్త్రంలో అన్యశాస్త్రాల సారాన్ని గ్రహించినప్పటికీ, స్వతంత్ర ఆలోచనను కూడా చూడగలం. కౌటిల్యుని అర్థశాస్త్రంలో వివరించిన రాజు దినచర్య వివరణ క్రమానికి ముఖ్యాధారం మనుశాస్త్రమే. అందులో ప్రథమ ప్రకరణలో ఉన్న మొదటి మూడు అధ్యాయాలలో వర్ణాశ్రమధర్మాలు, తరువాత దండన మహిమ వివరించడమైంది. అక్కడ రాజు దినచర్య మొ॥వి. మనుస్మృతి క్రమంలోనే అనుసరించి వివరిస్తూ ఈ కింది విధంగా అతని అభిప్రాయాన్ని సూచించాడు.

1. "వృద్ధసంయోగేన ప్రజ్ఞామ్" (ప్ర.3, అధ్యా 6)
2. మర్యాదాం స్థాపయేదాచార్యాన్ అమాత్యాన్ వా । య ఏనమపాయస్థానేభ్యో వారయేయుః (ప్ర-3-6)

3. పురోహితమ్-కుర్వీత తమాచార్యం శిష్యః

పితరం పుత్రో, భృత్యః స్వామినమివ చానువర్తేత (ప్ర 5- అధ్యా 3)

రాజైనవాడు విద్వాంసుల సమక్షంలో ఉండి బుద్ధిని వికసింప చేసికోవాలి. ఆచార్యాది గురుజనులు అమాత్యులు-రాజుగారికి మర్యాదను (హద్దులను) నిర్ధారణ చేయాలి. వారే రాజును చెడు పనుల నుండి ఆపుతుండాలి. ఆచార్యుడి ఆజ్ఞలో శిష్యుడుండేట్లుగా, పితరాజ్ఞలో పుత్రుడుండేట్లుగా ప్రభువు ఆజ్ఞననుసరించి సేవకులు నడుచుకునేట్లుగా, ఋత్విక్కులు ఆచార్యుల నిర్దేశానుసారంగా రాజు నడుచుకోవాలి.

రాజు వేదవేత్తలైన శిక్షకులను ఆదరిస్తూ, సత్కరిస్తూ ఉండాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

వృద్ధాంశ్చ నిత్యం సేవేత విప్రాన్ వేదవిదశ్శుచీన్ । మూలశ్లోక సం. **26**
వృద్ధసేవీ హి సతతం రక్షోభిరపి పూజ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **38**

టీక:- **చ** = మరియు, **శుచీన్ వేదవిదః** = శుద్ధహృదయులు వేదజ్ఞులు, **వృద్ధాం విప్రాన్** = జ్ఞాన-తపస్సులందు వృద్ధులైన బ్రహ్మజ్ఞానులను, **నిత్యం సేవేత** = ప్రతిదినం సేవించాలి, ఆదరసత్కారాలతో గౌరవిస్తూ ఉండాలి. **హి** = ఎందుకంటే, **సతతం వృద్ధసేవీ** = సదైవ జ్ఞానాదులలో ఉన్నత స్థితినందుకొన్న విద్వాంసులను సేవించే రాజు, **రక్షోభిః+అపి పూజ్యతే** = రాక్షసుల ద్వారా కూడా పూజలందుకొంటాడు. అంటే మర్యాదలను నీతినియమాలను కాలరాసే పాపిష్ఠులైన రాక్షసులు కూడా భయపడి రాజుకు వశీభూతులవుతారు. ఇక సామాన్య మానవుల గురించి వేరే చెప్పవలసిన పనిలేదు. వారు స్వయంగా రాజు వశంలో ఉంటారు.

తాత్పర్యం:-వయస్సు చేత-తపస్సు చేత పెద్దవారైనట్టి, వేదాలను సాంగోపాంగంగా తెలిసినట్టి, బాహ్యాంతర పరిశుద్ధులైనట్టివారిని రాజు సేవించాలి. అలాంటి విప్రులను పూజించేవాడు రాక్షసులకే పూజ్యుడైనప్పుడు సామాన్య మానవుల సంగతి చెప్పనేల? ॥38॥

వివరణ:

'అభివాదన శీలస్య' (2.121) శ్లోకంలో కూడా వృద్ధసేవీ అభివాదనశీల వ్యక్తికి ఆయువు, విద్య, యశము, బలము కలుగునని చెప్పబడినది. అందరికి ఇదొక శిష్టాచారము. **"అభివాదయేత్ వృద్ధాంశ్చ"** [(4.154)]

రాజు వేదవేత్తల నుండి క్రమశిక్షణ అనుశాసనం నేర్చుకోవాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

తేభ్యోఽధిగచ్ఛేద్వినయం వినీతాత్మాపి నిత్యశః । మూలశ్లోక సం. **27**
వినీతాత్మా హి నృపతిర్న వినశ్యతి కర్హిచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **39**

టీక:- **వినీత+ఆత్మా+అపి** = వినీతుడైనా, అంటే అనుశాసనం క్రమశిక్షణ కలవాడైనా, రాజు, **తేభ్యః** = ఆ (25-36) శ్లోకాలలో వివరించిన వర్ణింపబడిన వేదవేత్తలైన గురుజనుల నుండి, **నిత్యశః** = ప్రతిదినం, **వినయం అధిగచ్ఛేత్** = క్రమశిక్షణ అనుశాసనాన్ని నేర్చుకోవాలి. **హి** = ఎందుకంటే, **వినీత+ఆత్మా+నృపతిః** = స్వచ్ఛందంగా గాని, లేదా ఉద్రిక్తుడై గాని అనర్థకార్యాలు చేసేవాడుకానందువల్ల ఎప్పుడూ వినాశనాన్ని పొందదు.

తాత్పర్యం:-సహజ బుద్ధిచేత అర్థశాస్త్రం మొదలైన వాటియందుండే జ్ఞానంచేత శిక్షితుడైనప్పటికీ, రాజు ప్రతిదినం ధర్మశాస్త్రకోవిదులైన విప్రపండితుల నుంచి నీతి నేర్చుకోవాలి. ఇది లౌకిక జ్ఞాన దాయకమైనవి. అనుభవంచేత సంపాదించబడింది. అన్నీ శాస్త్రమే చెప్పదు కదా! ॥39॥

వివరణ:

రాజుయొక్క అనుశాసన విషయంలో కౌటిల్యుడి అభిప్రాయం

1) "విద్యావినీతో రాజా హి ప్రజానాం వినయే రతః ।
అనన్యాం పృథివీం భుఙ్క్తే సర్వభూతహితే రతః ॥ ప్ర. 2. అ. 4

విద్వాంసుడై అనుశాసనమందుండి ప్రజాహిత తత్పరుడైన రాజు మాత్రమే సంపూర్ణ పృథ్విని భోగించగలడు.

"ఇంద్రియజయస్య మూలం వినయః ।
వినయస్య మూలం వృద్ధోపసేవా ।
వృద్ధోపసేవయాం విజ్ఞానమ్"॥ (చాణ.సూ. 5-7)

ఇంద్రియజయానికి మూలం-వినయం. అంటే అనుశాసనబద్ధ జీవితం. వినయానికి మూలం వృద్ధులసేవ. వృద్ధులు- పారంగత విద్వాంసులు. విద్వాంసుల సంగతికి మూలం-విజ్ఞానం విశిష్టమైన జ్ఞానాన్ని సంపాదించడమే.

3. "అవినీతి స్వామిలాభాత్ అస్వామిలాభః శ్రేయాన్" (చా.సూ. 14)

వినయహీనుడైన రాజు సేవ కంటే అలాంటి రాజుసేవ లభించకపోవడమే శ్రేష్ఠం.

40 నుండి 42 వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అనుశాసన విహీనరాజుల వినాశనానికి ఉదాహరణ-

* బహవోఽవినయాన్నష్టా రాజానస్సపరిచ్ఛదాః ।
వనస్థా అపి రాజ్యాని వినయాత్ప్రతిపేదిరే ॥ ప్రక్షిప్త శ్లోక సం. *40*

తాత్పర్యం:-ఎంతోమంది ప్రభువులకు గొప్ప ఖజానా, గజబలం, ఆశ్విక బలం ఉన్నప్పటికీ పండితుల అనుభవసారం అందక నశించారు. కొందరు రాజులు అడవుల్లో ఉన్నప్పటికీ, విద్వాంసుల సాహచర్యం వల్ల తిరిగి రాజ్యాలు పొందారు. ॥40॥

* వేనో వినష్టోఽవినయాన్నహుషశ్చైవ పార్థివః ।
సుదాసో యావనశ్చైవ సుముఖో నిమిరేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *41*

తాత్పర్యం:-అవిధేయత అనే అవగుణంచేతనే కదా-వేనుడు, సహుషుడు, సుధానుడు, సుముఖుడు, నిమి అనేవారు పతనమయ్యారు. వీరిలో చాలామంది పెద్దల మాటలను పెడచెవిన పెట్టిన వారే. ॥41॥

* పృథుస్తు వినయాద్రాజ్యం ప్రాప్తవాన్ మనురేవ చ ।
కుబేరశ్చ ధనైశ్వర్యం బ్రాహ్మణ్యం చైవ గాధిజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *42*

తాత్పర్యం:-పృథు చక్రవర్తి, మనువు పెద్దల మాటవిని రాజ్యాలను పొందినవారే. కుబేరుడు ధనాధిపుడైనదీ-రాజర్షి విశ్వామిత్రుడు బ్రహ్మర్షిగా మారినదీ శ్రేష్ఠుల శుశ్రూషచేతనే. ॥42॥

ప్రక్షిప్తాల పరిశీలన

40-42 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

అంతర్ వ్యతిరేకాల కిందికి కాల వ్యతిరేకం ఆధారంగా ఈ శ్లోకాలు తర్వాత చేర్చబడిన ప్రక్షిప్తాలుగా తేలుతున్నాయి. ఎందుకంటే వీటిలో చెప్పిన అందరు రాజులు, ఋషులు, మునులు, స్వాయంభువ మనువుకు ఎన్నో తరాల తర్వాత

పుట్టారు. వైవస్వత మనువుతో సహా మిగిలిన 13 మంది మనువులూ, మనుస్మృతి ప్రవక్త స్వాయంభువ మనువు తర్వాతి వారే. అంగదేశపు రాజు అనంగుని కుమారుడైన వేనుడు ఎన్నో తరాల తర్వాత పుట్టాడు [మహాభారతం శాంతిపర్వం 59.96-99]. పాంచాల దేశపు రాజు పిజమనుని కుమారుడు సుదాసుడు ఏడవ వైవస్వత మనువు తర్వాత దాదాపు 95వ తరంవాడు. కాన్యకుబ్జపు మునుపటి రాజు గాధిపుత్రుడు విశ్వామిత్రుడు ఏడవ మనువు తర్వాత దాదాపు 40వ తరం వాడు. ఇలాగే మిగిలిన రాజులు చాలా మంది తర్వాతి వారే. ఎన్నో తరాలు ముందువాడైన స్వాయంభువ మనువు మౌలిక ప్రవచనాలలో వీరందరి ఉటంకింపు జరగని పని ! ఉదాహరణ లిచ్చేందుకు, తర్వాతి ప్రక్షిప్తకర్తలు చాలా కాలం తర్వాతే వీటిని మనుస్మృతిలో చొప్పించారని తెలిసిపోతూంది.

2. ప్రసంగ వ్యతిరేకాలు

39వ శ్లోకంలోని **'అధిగచ్ఛేత్ = నేర్చుకోండి'** అనే క్రియా పదాన్ని అనుకరించి 43వ శ్లోకంలో వాడారు. ఇదే క్రియతో 43వ శ్లోకపు వాక్యం పూర్తవుతుంది. ఇలా ఈ రెండు శ్లోకాలలోనూ ఏకవాక్యాత్మక సంబంధం ఉంది. మధ్యలో 40-42 శ్లోకాలు ఈ ఏకవాక్యాత్మకతను భంగపరిచాయి. ఇవి మౌలికం కావు కనుక ప్రక్షిప్తాలు.

3. శైలీగత ఆధారాలు

40-42 శ్లోకాలలోని ప్రసంగంలో అవినయం వల్ల రాజుల పతనం, వినయం వల్ల కొందరు రాజుల వృద్ధి ఉదాహరణ పూర్వకంగా ఉన్నాయి. 42లో మనువు పేరు కూడా ఉంది. కచ్చితంగా ఇది మనువుది కాక ఇతరు లెవరో రాసినదని తెలిసిపోతూంది. ఇతర శ్లోకాలు ఇందులోని ప్రసంగంతో సంబద్ధత కలిగినవి కనుక, అవన్నీ ప్రక్షిప్తాలే !

43 నుండి 57 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

రాజు విద్వాంసుల నుండి విద్యలను నేర్చుకోవాలి-

త్రైవిద్యేభ్యస్త్రయీం విద్యాం దండనీతిం చ శాశ్వతీమ్ । మూలశ్లోక సం.**28**
అన్వీక్షికీం చాత్మవిద్యాం వార్తారంభాంశ్చ లోకతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**43**

టీక:- రాజుకు, రాజసభా సదస్సులకు ఉండాల్సిన యోగ్యతలు, **త్రైవిద్యేభ్యః** = నాలుగు వేదాలలో ఉన్న కర్మ-జ్ఞాన-ఉపాసన అనే మూడు విద్యలు తెలిసినవారి నుండి, **త్రయీవిద్యాన్** = మూడు విద్యలను, **శాశ్వతీమ్ దణ్డనీతిం** = సనాతనమైన దండనీతి శాస్త్రాన్ని, **అన్వీక్షికీం** = న్యాయవిద్యను, **ఆత్మ విద్యాం** = ఆత్మ విద్య అంటే పరమాత్మ యొక్క గుణకర్మ స్వభావాన్ని యథార్థంగా తెలిపే బ్రహ్మ విద్యను, **చ** = మరియు **లోకతః వార్తా రంభాన్** = ప్రపంచం నుండి వార్తల ఆరంభాన్ని చెప్పడం-వినడం నేర్చుకొని, సభాపతి కావాలి.

ఋషి దయానంద భాష్యం:-వేదాలలోని జ్ఞానకర్మ ఉపాసనలు మూడూ తెలిసివున్నవారి నుంచి ఋగ్యజుస్సామాలనే వేదాలను, నిత్యావసరమైన దండనీతిని, తర్కశాస్త్రాన్ని, బ్రహ్మవిద్యని నేర్వడం సుఖదుఃఖాలలో ఒకేరీతిగా ఉండటం, కృషి-వాణిజ్యం మొదలగు విషయాలను ఆ యా విషయ పరిజ్ఞానం గలవారి వద్దనుంచి నేర్వడం, పరమాత్ముని గుణకర్మ స్వభావాలను ఉన్నదున్నట్లు తెలుసుకోవడం, ప్రజలతో ప్రవర్తించే పద్ధతి మొదలగువాటిని రాజు అలవర్చుకోవాలి. (స.ప్ర. 6వ సము.) ॥43॥

వివరణ:

'త్రయీ విద్యా' అనగా -

1. త్రయీ విద్యా సంబంధ విశేష విస్తృత జ్ఞానం కొరకు 1.23; 3.1; 2.3; 11.263, 264; 12.112 శ్లోకాలను చూడగలరు. అలాగే అనేక స్థలాలలో 'ఋక్, యజు, సామ ఈ మూడు వేదాల నామోల్లేఖనానికి ముందు

వీటిని 'త్రయీ' విద్యా అని కూడా చెప్పబడును. వాటిని తెలిసినవాడు 'త్రైవిద్యుడు' అనబడును. మనువు ఒక శ్లోకంలో దీన్ని వ్యాఖ్యానించాడు.

ఋచో యజూంషి చాన్యాని సామాని వివిధాని చ ।
ఏషః జ్ఞేయస్త్రివృత్ వేదో యో వేదైనం స వేదవిత్ ॥ (11.264)

అనగా- ఋగ్వేద, యజుర్వేద, సామవేదములను ఈ మూడింటిని త్రివృత్ వేదమంటారు. ఈ మూడు వేదాలను తెలిసినవాడిని 'వేదవిత్' అంటారు. 1.23 శ్లోకంలో ఋక్కు, యజు, సామ - ఈ మూడు వేదాలను 'అగ్ని, వాయు, ఆదిత్యుడు' అను ఋషులు దర్శించినారు.

2. విద్యాగ్రహణ సంబంధంలో కౌటిల్యుని భావన.

క. **వృత్తోపనయనః త్రయీం ఆన్వీక్షికీం చ శిష్టేభ్యః, వార్తామధ్యక్షేభ్యః దండనీతిం వక్తృప్రయోక్తృభ్యః శ్రుతాద్ధి ప్రజ్ఞోపజాయతే, ప్రజ్ఞయా యోగో, యోగాదాత్మవత్తేతి విద్యాసామర్థ్యమ్** (కౌ.అర్థ-ప్ర.2-అధ్యా 4).

ఉపనయనానంతరం రాజు, శిష్టులు 12.59ల-సదాచారులైన వేదవేత్తల నుండి -త్రయీవిద్యను, న్యాయవిద్యను నేర్చుకోవాలి, వివిధ విభాగీయులైన అధ్యక్షులనుండి వ్యాపారాన్నీ, వక్తృ-ప్రయోక్త మొదలైన విశేషజ్ఞుల నుండి దండనీతినీ నేర్చుకోవాలి. ఎందుకంటే శాస్త్రాదుల శ్రవణం వల్ల బుద్ధి వికసిస్తుంది. దాని వల్ల యోగంలో శ్రద్ధ పెరుగుతుంది. యోగం వల్ల ఆత్మబలం ప్రాప్తిస్తుంది.ఇదే విద్య వల్ల కలిగే సుపరిణామం.

ఖ. **"వృద్ధసేవయా విజ్ఞానమ్' విజ్ఞానేన ఆత్మానం సంపాదయేత్. సంపాదితాత్మా జితాత్మా భవతి.**(చా.సూ.8,9)

వేదవేత్తలైన విద్వాంసుల నుండి విశేషమైన విద్యాజ్ఞానాన్ని సంపాదించి ఆత్మోన్నతిని సాధించాలి.

జితేంద్రియుడైన రాజు మాత్రమే ప్రజలను వశపరచుకోగలడు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశమ్ । మూలశ్లోక సం.**29**
జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**44**

సభాసదులు-సభాపతుల కర్తవ్యాలు, **ఇంద్రియాణాం జయే సమాతిష్ఠేత్** = ఇంద్రియాలను జయించడానికి అంటే తన వశమందుంచుకోడానికి ధర్మాలనాచరిస్తూ, అధర్మం నుండి దూరంగా ఉండాలి. **దివానిశమ్ యోగం** = రాత్రింపగళ్ళు నియతసమయంలో యోగాభ్యాసాన్ని చేస్తూ ఉండాలి. **హి** = ఎందుకంటే, **జితేంద్రియః** = ఇంద్రియాలను-మనస్సు, ప్రాణం, శరీరాన్ని జయించిన తరువాతనే, **ప్రజాఃవశే స్థాపయితుం శక్నోతి** = బయట ఉండే ప్రజలను జయించడానికి సమర్థుడవుతాడు. అంటే జితేంద్రియుడే ప్రజలను తన వశమందుంచుకోగలడు.

ఋషి దయానంద భాష్యం:-పగలయినా-రాత్రయినా జితేంద్రియుడిగా ఉండటానికే రాజు ప్రయత్నించాలి. ఇంద్రియ నిగ్రహం కలవాడే ప్రజలను తన వశంలో ఉంచుకోగలడు. సభాసదులు కూడా జితేంద్రియులై నిరంతరం ధర్మమందే ప్రవర్తిస్తూ అధర్మం నుండి తొలగి ప్రజలను కూడా తొలగిస్తూ ఉండాలి. (స.ప్ర.6వ ప్రక.)॥44॥

వివరణ:

1. ఇంద్రియాలను జయించడం గురించి కౌటిల్యుడి అభిప్రాయం.

రాజ్య వశీకరణానికి జితేంద్రియత్వమే ప్రధానకారణమని మనువు అభిప్రాయం. రాజుకు శిక్షాదీక్షలు అనుశాసనాభ్యాసం మొ॥ఉండాలని చెప్పినదంతా జితేంద్రియుడుగా ఉండటం కోసమే.వీటిన్నింటికీ పరస్పర సంబంధముంది. ఈ విషయమే 37,39,43 శ్లోకాలలో సూచించబడింది. కౌటిల్యుడు కూడా మనుమహర్షిలాగా ఇంద్రియ జయత్వానికే తన అర్థశాస్త్రంలో వివరించిన సూత్రాలలో కూడా అధిక ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు.

"విద్యావినయహేతుః ఇంద్రియ జయః, కామ-క్రోధ-లోభ- మాన-మద-హర్ష-త్యాగాత్ కాయః. కర్ణ త్వగక్షి జిహ్వా ఘ్రాణేంద్రియాణామ్". శబ్ద స్పర్శరూపరసగంధేషు అవిప్రపత్తిః ఇంద్రియజయః। శాస్త్రానుష్ఠానం వా కృత్స్నం హి శాస్త్రమిదమిన్ద్రియజయః। తద్విరుద్ధ వృత్తిః అవశ్యేన్ద్రియశ్చాతురన్తోఽపి రాజా సద్యో వినశ్యతి (కౌ. 6.365)

"జితాత్మా సర్వార్థైః సంయుజ్యతే" (చా.సూ. 10)

అంటే- విద్యకు, వినయానికి ధ్యేయం ఇంద్రియజయమే. అందువల్ల విజయాన్ని సాధించగలుగుతారు. చెవులు, చర్మం (త్వక్), నేత్రాలు, నాలుక మరియు నాసికను వాటికి విషయములైన, శబ్దం, స్పర్శ రూపం, రసం మరియు గంధములందు ప్రవర్తించకుండా ఆపడమే ఇంద్రియజయం. లేదా సంక్షేపంగా చెప్పాలంటే, శాస్త్రాలలో ప్రతిపాదించబడిన కర్తవ్యాలను చక్కగా అనుష్ఠించడమే ఇంద్రియజయం. శాస్త్రవిహిత కర్తవ్యాలకు విరుద్ధంగా ఆచరించే ఇంద్రియలోలుడైన రాజు సమస్త పృథ్వికి అధిపతి అయి కూడా శీఘ్రంగా వినాశనం చెందుతాడు. జితేంద్రియుడైన రాజు మాత్రమే సమస్త సమృద్ధిని సాధిస్తాడు.

2) ఇంద్రియ జయమునకు మనుప్రోక్త లక్షణం 2.73 (2.98) వేదంలో కూడా ఈ విషయం స్పష్టంగా చెప్పబడింది. అంటే రాజైనవాడు బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, తపస్సంపన్నుడుగా ఉన్నప్పుడు రాజ్యాన్ని రక్షించగలడు. ప్రజలను తన వశంలో ఉంచుకోగలడు. ఆ భావాన్నే మంత్రంలో వ్యక్తం చేశాడు.

"బ్రహ్మచర్మేణ తపసా రాజా రాష్ట్రం విరక్షతి" అథర్వణ-11.5.4

వ్యసనాలెన్ని? -

ఇది మనుకృతం-ప్రామాణికం

దశ కామసముత్థాని తథాఽష్టౌ క్రోధజాని చ । మూలశ్లోక సం. **30**
వ్యసనాని దురంతాని ప్రయత్నేన వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **45**

టీక:- దృఢమైన ఉత్సాహంతో, **దశకామ సముత్థాని తథా చ అష్టౌ క్రోధజాని** = కామం వల్ల వచ్చే వ్యసనాలు 10.(7-47), క్రోధం వల్ల కలిగే వ్యసనాలు 8.(7-48), **వ్యసనాని దురంతాని** = దుష్టవ్యవసనాలో చిక్కుకొన్న మానవుడు చాలా కష్టంతో బయటికి రాగలుగుతాడు. అలాంటి వాటిని, **ప్రయత్నేన వివర్జయేత్** = ప్రయత్నించి వదిలిపెట్టాలి, లేదా విడిపించుకోవాలి.

ఋషి దయానంద భాష్యం:-కామం వల్ల జనించిన పది దుర్లక్షణాలను, క్రోధం వల్ల ఉత్పన్నమయిన ఎనిమిది దుర్లక్షణాలను విడవాలి. చివరికి పతనస్థాయికి తెచ్చే అన్ని వ్యసనాలను రాజు దూరం చేసుకోవాలి. ప్రజలను కూడా ఈదుర్వ్యసనాల నుండి విడిపించాలి (స.ప్ర. 6వ సము.). ॥45॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కామజేషు ప్రసక్తో హి వ్యసనేషు మహీపతిః । మూలశ్లోక సం. **31**
వియుజ్యతేఽర్థధర్మాభ్యాం క్రోధజేష్వాత్మనైవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **46**

టీక:- **హి** = ఎందుకంటే, **మహీపతిః** = ప్రభువు లేదా రాజు, **కామజేషు ప్రసక్తః** = కామజన్యాలైన పది దుష్టవ్యసనాలలో చిక్కుకున్నప్పుడు, **అర్థ-ధర్మాభ్యాం వియుజ్యతే** = అలాంటి రాజ్యంలో ధనానికి, ధర్మానికి వైరం అవుతాడు. వ్యసనాల వల్ల ధనం నష్టమవడమే గాక, అధర్మానికి కూడా గురవుతాడు. **తు** = మరియు, **క్రోధజేషు** = క్రోధోత్పన్నాలైన అష్ట దుర్వ్యసనాలలో చిక్కుకున్నప్పుడు అతడు, **ఆత్మనా ఏవ** = శరీరానికి కూడా దూరమవుతాడు.

తాత్పర్యం:-కామం వల్ల ప్రవర్తిల్లిన నృపాలుడు రాజ, ధనాలను రెండింటినీ కోల్పోతున్నాడు. క్రోధజనితమైన వ్యసనాలతో తగుల్కొనేవాడు చివరికి తన దేహానికే చేటు తెచ్చుకుంటున్నాడు. (స.ప్ర. 6వ సము.) ॥46॥

కామజ వ్యసనాలు-10 (పది)

ఇది మనుకృతం-ప్రామాణికం

మృగయాఽక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియో మదః । మూలశ్లోక సం. **32**
తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **47**

టీక:- కామం వల్ల ఉత్పన్నమయ్యే వ్యసనాలు 10.వాటి గణన, **మృగయా** = వేటాడటం, **అక్ష** = జూదమాడటం, పేకాట మొ॥, **దివాస్వప్నః** = పగటి నిద్ర, **పరివాదః** = కామకథలు, లేదా పరనిందలు, **స్త్రియః** = స్త్రీలతో అతిసంగమం, మదః = మాదక ద్రవ్యాలు అంటే మద్యం, నల్లమందు, గంజాయి, (గంజాయి బంక చిలంలో మత్తు కోసం వాడుకొనేది). చరస్ మొ॥ వాటిని సేవించడం. **తౌర్యత్రికం** = పాట-వాద్యం, నృత్యం, వినడం-చూడటం. ఈ మూడు విషయాలు **వృథాట్యా** = వ్యర్థంగా అటు-ఇటు తిరగడం, **దశకః కామజః గణః** = ఈ పది కామోత్పన్న వ్యసనాలు.

తాత్పర్యం:-కోరిక (కామం) నుంచి జనించిన పది వ్యసన లక్షణాలు **ఇవి:** 1. వేట, 2. జూదం, 3. పగటి నిద్ర, 4. పరనింద, 5. స్త్రీలతో కూడటం, 6. మద్యపానం వల్ల కలిగే మత్తు, 7. నృత్యాభిలాష, 8. సంగీతాభిలాష, 9. వృథాసంచారం, 10. అకారణంగా ఇతరుల్ని శిక్షించడం. ॥47॥

వివరణ:

'తౌర్యత్రికమ్, మృగయా, స్త్రియః' శబ్దాల మీద విశేష వివరణ:

1. **తూర్యమంటే వాద్యం.** త్రికమ్ = న్యాటం చేయడం, పాటపాడటం-వాద్యం వాయించడం-ఈ మూడు క్రియల సమూహానికి 'త్రికమ్' అని పేరు. ఈ విధంగా వాద్యాలతో పాటు నృత్యం చేయడం, పాటపాడటం, వాద్యాలను వాయించడం. ఇదే తౌర్యత్రిక శబ్దానికి అర్థం.

2. స్త్రియః= స్త్రీ శబ్దానికి బహువచనం 'స్త్రియః' (7.50) అంటే రాజైనవాడికి కూడా ఒకరికంటే అధిక స్త్రీలను సేవించరాదని మను మహర్షి భావన. ఒక స్త్రీనే వివాహం చేసుకోవాలి.

3. **మృగం యాతి అనయా సామృగయా, ఘఞ్ అర్థే కః** మృగాల వెంటబడి వేటాడటం.

క్రోధజ వ్యసనాలు-8

ఇది మనుకృతం-ప్రామాణికం

పైశున్యం సాహసం ద్రోహ ఈర్ష్యాఽసూయార్థదూషణమ్ । మూలశ్లోక సం. **33**
వాగ్దండజం చ పారుష్యం క్రోధజోఽపి గణోఽష్టకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **48**

టీక:- క్రోధం వల్ల కలిగే వ్యసనాలు పది.వాటి గణన- **పైశున్యం** = చాడీలు చెప్పడం, **సాహసం** = అనాలోచితంగా బలాత్కరించి ఏ స్త్రీతోనైనా చెడుగా వ్యవహరించడం, లేదా స్త్రీని చెరచడం, **ద్రోహః** = ద్రోహం చేయడం, **ఈర్ష్యా** = ఇతరుల ఔన్నత్యాన్ని చూచి సహించలేకపోవడం, **అసూయా** = దోషాలను ఆరోపించడం, **అర్థదూషణమ్** = అర్థ దూషణమంటే, అధర్మంగా చెడు పనులలో ధనాదులను వ్యయంచేయడం, **వాక్ దండజం** = కఠోరమైన మాటలను ఉపయోగించడం, అపరాధం లేకున్నా కఠినంగా మాట్లాడటం, **పారుష్యమ్** = విశేషంగా దండించడం, **అష్టకః క్రోధజః + అపి గణః** = ఈ ఎనిమిది దుర్గుణాలు క్రోధం వల్ల పుడుతున్నాయి.

తాత్పర్యం:-1. చాడీలు చెప్పటం, 2. ఏ స్త్రీతో అయినా చెడుగా ప్రవర్తించడం,3.ద్రోహం చేయడం 4. ఇతరుల సద్గుణాలను ఓర్వలేకపోవడం, 5. దోషాలను ఆరోపించడం, 6. ఇతరుల ధనాన్ని బలవంతంగా లాక్కోవడం 7. అపరాధం లేకున్నా కఠినంగా మాట్లాడటం, 8. దండించడంలో కాఠిన్యం ఈ ఎనిమిది దుర్గుణాలు కోపం వల్ల కలిగే వ్యసన లక్షణాలు. ॥48॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఈ వ్యసనాలన్నింటికి మూలం లోభం-

ద్వయోరప్యేతయోర్మూలం యం సర్వే కవయో విదుః । మూలశ్లోక సం.**34**
తం యత్నేన జయేల్లోభం తజ్జావేతావుభౌ గణౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**49**

టీక:- ఏతయోః ద్వయోః + అపి మూలం యం లోభం = ఈ కామజాలు పది (10), క్రోధజాలు ఎనిమిది (8) కలిసి, సర్వే కవయః విదుః = లోభమే మూలమని విద్వాంసులందరికి తెలుసు, **తం యత్నేన జయేత్** = దాన్ని అంటే అన్ని వ్యసనాలకు మూలమైన లోభాన్ని రాజైనవాడు ప్రయత్నించి జయించాలి. ఎందుకంటే, **తజ్జౌ+ఏతౌ+ఉభౌ+గణౌ** = ఈ రెండు (కామజ-క్రోధజ) దుర్వ్యసనాలు లోభం నుండే పుట్టినవి.

ఋషి దయానందభాష్యం:-కామ-క్రోధాల వల్ల ఉత్పన్నమయ్యే 18 వ్యసనాలు లోభం వల్లనే పుడుతున్నవన్న విషయం విద్వాంసులందరికీ తెలుసు. అందువల్ల అలాంటి లోభాన్ని రాజు ప్రయత్నించి వదలాలి. ప్రజలతో విడిపించాలి. (-స.ప్ర. 6వ సము.).॥49॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కామజ-క్రోధజ గుణాలలో-అధిక కష్టదాయక వ్యసనాలు-

పానమక్షాః స్త్రియశ్చైవ మృగయా చ యథాక్రమమ్ । మూలశ్లోక సం.**35**
ఏతత్కష్టతమం విద్యాచ్చతుష్కం కామజే గణే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**50**

టీక:- కామజే గణే = కామజన్య దశ వ్యసనాలలో అధిక దుర్వ్యసనాలు, **1) (పానమ్)** = మద్యపానం మొ॥వి. అంటే మత్తు కలిగించే పదార్థాలను సేవించడం, **2) అక్షాః** =పాచికలతో జూదమాడటం-పేకాట మొ॥వి. **3) స్త్రియః ఏవ** = స్త్రీలతో అధిక సంగమం, **4) మృగయా** = షికార్ చేయడం వేటాడటం, **ఏతత్** = ఈ, **చతుష్కం కష్టతమం విద్యాత్** = నాలుగు మహా కష్టతమములైన వ్యసనాలు, **యథాక్రమమ్** = క్రమంగా పూర్వాపూర్వములు, అధికాధికాలు.

ఋషి దయానంద భాష్యం:- కామం వల్ల జనించిన పది లక్షణాలలో మద్యపానం, జూదం, స్త్రీ సంభోగవాంఛ, వేటాడడం-షికారు ఈ నాలుగు కష్టతమములైన వ్యసనాలు. కాబట్టి వదిలివేయడానికి కష్టసాధ్యాలని చెప్పబడ్డాయి.॥50॥

ఇది మనుకృతం-ప్రామాణికం

దండస్య పాతనం చైవ వాక్పారుష్యార్థదూషణే । మూలశ్లోక సం.**36**
క్రోధజేఽపి గణే విద్యాత్కష్టమేతత్త్రికం సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**51**

టీక:- చ = మరియు, **క్రోధజే+అపి+గణే** = క్రోధోత్పన్నాలైన వ్యసనాలలో, **దండస్యపాతనం** = అపరాధం లేకున్నా దండించడం, **వాక్ పారుష్య+అర్థదూషణే** = కఠోరంగా మాట్లాడటం, తిట్టడం, దూషించడం మరియు ధనాదులను అన్యాయంగా ఖర్చుపెట్టడం, **ఏతత్ +త్రికం సదా కష్టమ్** = క్రోధం వల్ల కలిగే ఈ మూడు అధిక దుఃఖదాయకమైన దోషాలుగా, **విద్యాత్** = తెలిసికోవాలి.

ఋషి దయానంద భాష్యం:- కొట్టడం, తిట్టడం, ద్రవ్యమును అపహరించడం లేదా దుర్వినియోగం చేయడం అనేవి మూడు కోపంవల్ల పుట్టిన గుణాలతో దోషాలతో నిండినవి. కాబట్టి ఇవి మిక్కిలి దుఃఖకరాలైన దోషాలు. ॥51॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సప్తకస్యాస్య వర్గస్య సర్వత్రైవానుషంగిణః । మూలశ్లోక సం. **37**
పూర్వం పూర్వం గురుతరం విద్యాద్వ్యసనమాత్మవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52**

టీక:- **అస్య సప్తకస్య వర్గష్య** = (35.36) శ్లోకాలలో వివరించిన ఈ ఏడు దుర్గుణాల వర్గంలో, **సర్వత్ర-ఏవ+అనుషంగిణీః** = అన్నిచోట్ల అందరిలోనూ కలిగి ఉంటాయి. కాబట్టి, **ఆత్మవాన్** = ఆత్మోన్నతిని కోరేవాడు, (రాజు) **పూర్వం పూర్వం వ్యసనం గురుతరం విద్యాత్** = ముందు ముందున్న వ్యసనం ఒకదానికొకటి అధిక కష్టప్రదమని గుర్తుంచుకోవాలి.

ఋషి దయానంద భాష్యం:- కామక్రోధ సంభవములైన సప్తవ్యసనాలలోను ముందు ముందటి వ్యసనం వెనుక వెనుకటిదానికంటే మిక్కిలి కష్టమైందని విద్వాంసుడు తెలుసుకోవాలి.

మద్యపానం, జూదం, స్త్రీ సంగమం, వేట, దండన వాక్పారుష్యం, అర్థదూరణం ముందు ముందున్నవి అధిక కష్టదాయకాలు. అంటే అర్థదూషణం కంటే వాక్పారుష్యం దానికంటే దండన, దానికంటే వేట, ఆ దానికంటే స్త్రీ సంగమం, దానికంటే జూదం, జూదం కంటే మద్యపానం వదలడం కష్టమని భావం. (స.ప్ర. 6వ.సము.) ॥52॥

వ్యసనం మృత్యువు కంటే భయంకరమైనది- ఇది మనుకృతం-ప్రామాణికం

వ్యసనస్య చ మృత్యోశ్చ వ్యసనం కష్టముచ్యతే । మూలశ్లోక సం. **38**
వ్యసన్యధోఽధో వ్రజతి స్వర్యాత్యవ్యసనీ మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **53**

టీక:- **వ్యసనస్య చ మృత్యోః చ** = వ్యసనం, మృత్యువు ఈ రెండింటిలో, **వ్యసనం కష్టమ్+ఉచ్యతే** = వ్యసనమే అధిక కష్టదాయకమని చెప్పబడుతుంది. ఎందుకంటే వ్యసనానికి బానిస అయిన వ్యక్తి, **అధః అధః వ్రజతి** = ప్రతిదినం దుర్గుణాలకు కష్టాలకు గురై అధఃపతనం చెందుతాడు. కానీ, **అవ్యసనీ** = వ్యసనాలకు దూరంగా ఉన్నవాడు, **మృతః** = మరణానంతరం, **స్వర్యాతి** = ఈ జన్మలో సుఖంగా శాంతిగా ఉండుటయే గాక స్వర్గాన్ని కూడా పొందుతాడు. అంటే పరజన్మలో కూడా సుఖం లభిస్తుంది.

ఋషి దయానందభాష్యం:-వ్యసనమరణముల రెండింటిలోను వ్యసనమే మిక్కిలి చెడ్డది. వ్యసనవంతుడు నానాటికి క్షీణిస్తాడు. వ్యసనారహితుడు మృతుడై కూడా సుఖాన్నే పొందుతాడు. కనుక మద్యపానాది వ్యసనాలను విడువాలి.

దుష్ట వ్యసనాలకు లోనవడం కంటే మరణించడమే మేలు. ఇది కచ్చితమైన విషయం. కారణమేమంటే దుష్టాచారి ఎంత ఎక్కువ కాలం జీవిస్తాడో అంత అధికంగా పాపాలు చేసి, నీచగతిని పొంది అనంతదుఃఖాల ననుభవిస్తాడు. అలా గాక వ్యసనాతీతుడు చనిపోయినా సుఖాన్నే పొందుతాడు. అందువల్ల విశేషించి రాజుకూ మానవులందరికీ ధర్మమేమంటే, ఎప్పుడూ మద్యపానం, వేట, జూదం మొ॥ దుష్కర్మలందు చిక్కుకోకుండా ధర్మిష్ఠుడై గుణకర్మస్వభావాలతో నీతిగా జీవిస్తూ, ఉత్తమోత్తమ కర్మలు చేస్తూ ఉండాలి. (స.ప్ర. 6వ సము). ॥53॥

మంత్రుల నియుక్తి-వారి లక్షణాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

మౌలాన్ శాస్త్రవిదశ్శూరాన్ లబ్ధలక్షాన్ కులోద్భవాన్ । మూలశ్లోక సం. **39**
సచివాన్ సప్త చాష్టౌ వా ప్రకుర్వీత పరీక్షితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **54**

టీక:- **మౌలాన్** = స్వరాజ్యంలో స్వదేశంలో జన్మించిన, **శాస్త్రవిదః** = వేదాది శాస్త్రజ్ఞులు, **శూరాన్** = శూరవీరులు, **లబ్ధలక్షాన్** = ఎవరి లక్ష్యాలు, ఆలోచనలు నిష్ఫలం కావో, **కులోద్భవాన్** = కులీనులు, **పరీక్షితాన్** = చక్కగా పూర్తిగా పరీక్షింపబడినవారు, **సప్త వా అష్టౌ** = ఏడుగురు గానీ, లేదా ఎనిమిది మంది గానీ, **సచివాన్** = ఉత్తములు, ధార్మికులు మరియు చతురులైన మంత్రులను, **ప్రకుర్వీత** = నియమించుకోవాలి.

ఋషి దయానంద భాష్యం:- స్వదేశంలో పుట్టినవారిని, శాస్త్రం తెలిసినవారిని, శూరులను, ఆయుధ ప్రయోగ నిపుణులను, మంచి వంశంలో పుట్టిన వారిని ఏడుగురినిగానీ, ఎనిమిది మందినిగానీ పరీక్షించి మంత్రులుగా నియమించుకోవాలి.

తన దేశంలో జన్మించినవారు, శాస్త్రజ్ఞులు, శూరవీరులు, ఎవరి ఆలోచనా విధానాలు సర్వత్రా సఫలీకృతమవునో, కులీనులు, ధర్మాత్ములు, స్వరాజ్యభక్తులు అయిన వారిని ఏడుగురినో లేదా ఎనిమిది మందినో మంత్రులుగా నియమించుకోవాలి. వారితో పాటు సభలో రాజు ఏడో వాడిగానో, ఎనిమిదోవాడిగానో ఉండాలి. వీరందరూ కలిసి కర్తవ్యాకర్తవ్యాలను గురించి ఆలోచించుకోవాలి. తన దేశస్థులుగాను, వేదశాస్త్ర విద్వాంసులు గాను, శూరవీరులు, గృహస్థులు అనుభవజ్ఞులైన వారిని ఏడుగురినో లేదా ఎనిమిదిమందినో ధార్మిక బుద్ధికలిగినవారిని రాజు తనకు మంత్రులుగా నియమించుకోవాలి (పూ.ప్ర.111 స.ప్ర.6వ సము.) ॥54॥

వివరణ:

నియుక్తికి ముందు అమాత్యుల పరీక్షావిధి

నియమించడానికి ముందు అమాత్యులను దృఢంగా పరీక్షించాలి. అర్థశాస్త్రంలో మంత్రుల పరీక్షకు ప్రకటంగానూ, గుప్తరీతిలోనూ కొన్ని విధులను కౌటిల్యుడు సూచించాడు.

1. **ప్రకటనవిధి:** నియుక్తికి ముందు రాజు-ప్రామాణికులు, సత్యవాదులు మరియు ఆప్తపురుషుల ద్వారా మంత్రులను పరీక్షించాలి. వారి నివాసస్థానములను వారి ఆర్థిక పరిస్థితులను తెలిసికోవాలి. సహపాఠకుల ద్వారా వారి యోగ్యతలను, వారి శాస్త్రీయ ప్రతిభలను, నూతన కార్యములను సమర్పించి, వారి బుద్ధిని, స్మరణశక్తిని, నేర్పరితనాన్ని, వ్యాఖ్యానాల ద్వారా, సభలద్వారా వారి వాక్పటుత్వాన్ని-ప్రాగల్భ్యమును మరియు వారి ప్రతిభను పరీక్షించాలి. ఆపత్తిని సృష్టించి ఆ సమయంలో వారి ఉత్సాహాన్ని, సద్యః స్ఫురణశక్తిని, ప్రభావాన్ని మరియు సహనశక్తిని, వ్యవహారాల ద్వారా వారి పవిత్రతను, మిత్రత్వాన్ని మరియు దృఢమైన స్వామిభక్తిని, సహవాసుల ద్వారా మరియు ఇరుగుపొరుగు వారి ద్వారా వారి శీలం, శక్తిని, ఆరోగ్యాన్ని, గౌరవాన్ని ప్రమాదరహితమైన వారి స్థిరప్రవృత్తిని తెలిసికోవాలి. వారి మధురభాషణ స్వభావాన్ని అలాగే ద్వేషరహిత స్వభావాన్ని పరీక్షించాలి. (కౌ.అర్థ 4 ప్ర.8 అధ్యా). ద్వేషరహిత స్వభావాన్ని పరీక్షించాలి (కౌ.అర్థ 4 ప్ర.8 అధ్యా).

2. **గుప్తవిధిః**

క. **ధర్మోపధా :** గుప్తంగా ధార్మికోపాయాల ద్వారా అమాత్యుల హృదయ పవిత్రతను పరీక్షించాలి.

ఖ. **అర్థోపధా :** గుప్తంగా ఆర్థికప్రలోభాలను చూపించి

గ. **కామోపధా:** గుప్తంగా కామసంబంధమైన ఆకర్షణల ద్వారా

ఘ. **భయోపధా:** గుప్తమైన భయాదులను ప్రదర్శించి అమాత్యుల హృదయ పవిత్రతను పరీక్షించాలి.

గుప్తచరుల ద్వారా ఈ పరీక్షలన్నీ నిర్వహించిన తరువాతనే ఆ వ్యక్తిని యథాయోగ్యంగా అమాత్యపదవిలో నియమించాలి. కౌటిల్యుడి సిద్ధాంతమేమంటే ధర్మపరీక్షలో పవిత్రులుగా ఉత్తీర్ణులైన అమాత్యులను న్యాయాలయంలోనూ, అర్థ పరీక్షలో ఉత్తీర్ణులైన అమాత్యులను కోశ సంరక్షణలోనూ, కామ సంబంధమైన పరీక్షలో ఉత్తీర్ణులైన అమాత్యులను అంతఃపురంలోనూ, విలాస స్థానములందునూ, అలాగే భయపరీక్షలో విజేతలైన అమాత్యులను అంగ రక్షకులుగానూ నియమించుకోవాలి. (కౌ.అర్థ 5.9).

అ. "తేషాం జనపదమవగ్రహం చాప్తతః పరీక్షేత । సమాన విద్యేభ్యః
శిల్పం, శాస్త్రచక్షుష్మతాం చ, కర్మారంభేషు ప్రజ్ఞాం ధారయి
ష్ణుతాం దాక్ష్యంచ, కథాయోగేషు వాగ్మిత్వం ప్రాగల్భ్యం ప్రతిభా

పత్త్వం చ, అపద్యుత్సాహప్రభావౌ క్లేశసహత్వం చ, సంవ్యవ
హారాచ్ఛౌచం, మైత్రతాం దృఢ భక్తిత్వం చ, సంవాసిభ్యః
శీలబలారోగ్యసత్త్వయోగం అస్తమ్భమ్ అచాపల్యం చ, ప్రత్యక్షతః
సం ప్రియత్వమ్ అవైరిత్వం చ" (ప్ర. 5. అ. 9).

అ. మంత్రిపురోహితసఖః సామాన్యేష్వధికరణేషు, స్థాపయిత్వా అమాత్యానుపధాభిః శోధయేత్-తత్ర ధర్మోపధాశుద్ధాన్ ధర్మస్థీయ కంటక శోధనేషు స్థాపయేత్। అర్థోపధా శుద్ధాన్ సమాహర్త సన్నిధాతృ నిచయకర్మసు కామోపధాశుద్ధాన్ బాహ్యాభ్యంతర విహారరక్షాసు భయోపధాశుద్ధాన్ అసన్నకార్యేషు రాజ్ఞః సర్వోపధాశుద్ధాన్ మన్త్రిణం కుర్యాత్ సర్వత్రాశుచీన్ ఖనిద్రవ్యవహరిత వన కర్మాన్తేషు ఉపయోజయేత్।

సహాయం సాధ్యం రాజత్వమ్ చక్రమేకం న వర్తతే।
కుర్యాత్ సచివాంస్తస్మాత్ తేషాంచశృణుయాన్మతమ్ ॥ (కౌటిల్యుని అర్థశాస్త్రం. 3-7)

రాజుకు సహాయకుల అవసరానికి కారణం- ఇది మనుకృతం-ప్రామాణికం

అపి యత్సుకరం కర్మ తదప్యేకేన దుష్కరమ్ । మూలశ్లోక సం. **40**
విశేషతోఽసహాయేన కిన్ను రాజ్యం మహోదయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **55**

టీక:- **అపి** = ఎందుకంటే, **విశేషతః + అసహాయేన** = ప్రత్యేకమైన సహాయం లేకుండా, **యత్ సుకరం కర్మ** = ఏది సుగమమైన కర్మయో, **తత్+అపి** = అదికూడా, **ఏకేన దుష్కరమ్** = ఒక్కడే చేయడం కష్టమవుతుంది, **కింతు** = కానీ అలాంటి పక్షంలో, **మహోదయమ్ రాజ్యం** = గొప్ప రాజ్య కర్మ ఒకడి వల్ల ఎలా అవుతుంది? అందువల్ల ఒకే రాజు ద్వారా ఒకే బుద్ధితో రాజ కార్యాన్ని నిర్వహించడం చాలా బుద్ధిహీనత.

ఋషి దయానంద భాష్యం:-తరచూ ఒకడు ఒకే పనిచేయాలంటే ఎంతో కష్టం. అలాంటిది రాజ్యపాలన ఒంటరిగా చేయవీలవుతుందా? సాధారణ కార్యాలు కూడా సహాయం లేకుండా ఒక్కడే నిర్వహించడం చాలా కష్టం. ఇక ఒక గొప్ప రాజకార్యం ఒక్కడి ద్వారా ఎలా పూర్తి కాగలదు? అందువల్ల ఒకణ్ణే రాజుగా చేసి, అతడి బుద్ధికి సర్వకార్యాలను అప్పగించడం బుద్ధిమంతుల లక్షణం కాదు. (స.ప్ర. 6వ సము.) ॥55॥

మంత్రులతో మంతనాలు చేయాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

తైస్సార్ధం చింతయేన్నిత్యం సామాన్యం సంధివిగ్రహమ్ । మూలశ్లోక సం. **41**
స్థానం సముదయం గుప్తిం లబ్ధప్రశమనాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **56**

టీక:- దీని వల్ల సభాపతి కర్తవ్యం, **నిత్యం** = ప్రతిరోజు, **తైః సార్థం (7.39)** = రాజ్యకార్యకుశలురైన, విద్వాంసులైన మంత్రలతో కూడి, **సామాన్యం** = సామాన్యవిధులైన, **సన్ధి-విగ్రహమ్** = సంధి విగ్రహాలు ఎవరితో సంధి మిత్రత్వం చేయాల్సిందీ, ఎవరితో విగ్రహం విరోధం చేయాల్సిందీ, **స్థానం** = పరిస్థితిని చూచి, తటస్థంగా (మౌనంగా ఉండి తన రాజ్యాన్ని రక్షించుకుంటూ ఉండాలో) **సముదయం** = తన రాజ్యం వృద్ధినొందగా, దుష్ట శత్రువుల మీద దండెత్తడం, **గుప్తిం** = మూలభూతమైన రాజును, సైన్యాన్ని, ధనాగారాన్ని రక్షించుకోవడం, **లబ్ధ ప్రశమనాని చ** = ఆక్రమించిన దేశంలో శాంతిని స్థాపించడం, ఉపద్రవాలు లేకుండా చూసుకోవడం మొదలైన ఈ, **చిన్తయేత్** = ఆరు గుణాల గురించి ప్రతినిత్యం విచారిస్తూ ఉండాలి.

ఋషి దయానంద భాష్యం:- కాబట్టి రాజు మంత్రుల దగ్గర దాచరాని సాధారణ విషయాలు మొదలు సంధి-విగ్రహం, ద్రవ్య, పుర, రాష్ట్ర వ్యవహారాలు, ధాన్యం-బంగారం మొదలైనవి దొరికే స్థలాలు, సైన్యాన్ని, ధనాగారాన్ని రక్షించుకోవడం, లాంటి ముఖ్య విషయాల వరకు మంత్రులతో ప్రతినిత్యం విచారిస్తూ ఉండాలి. ॥56॥

వివరణ:

షడ్గుణాల విస్తృత వర్ణన:

మంత్రులతో ఈ ఆరు విషయాలను గురించి విచార విమర్శచేయడం మహారాజు కర్తవ్యం. 1) మిత్రులు, 2) శత్రువులందున్న చాతుర్యం, 3) ఆత్మోన్నతి (తన ఉన్నతి) 4) తన స్థానం 5) శత్రువుల నుండి దేశరక్షణ, 6) విజితదేశ రక్షణ, స్వాస్థ్యం మొ॥ ప్రత్యేక విషయాలను చర్చించి, నిర్ణయించి తనకు-ఇతరులకు శుభకర విషయాలని తేల్చినవాటిని అమలుపరచడం. (పూ.ప్ర. 111; స.ప్ర. 6వ.సము).

ఇది మనుకృతం-ప్రామాణికం

తేషాం స్వం స్వమభిప్రాయముపలభ్య పృథక్ పృథక్ । మూలశ్లోక సం. **42**
సమస్తానాం చ కార్యేషు విదధ్యాద్ధితమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **57**

టీక:- తేషాం = ఆ సభాసదుల యొక్క **పృథక్-పృథక్ స్వం-స్వమ్ + అభిప్రాయం ఉపలభ్య** = వేరు వేరుగా వారి వారి అభిప్రాయాలను సేకరించి, (విని), **సమస్తానాం కార్యేషు** = అందరూ వ్యక్తపరచిన కార్యాలలో, **ఆత్మనః హితమ్** = ఏ కార్యం తనకు-అన్యులకు హితకారకమో, ఆ కార్యాన్ని, **విదధ్యాత్** = ప్రారంభించాలి

ఋషి దయానంద భాష్యం:-ఆ మంత్రులలో ఒక్కొక్కడి అభిప్రాయాన్ని వేర్వేరుగా ఆంతర్యంగానూ, అందరి సమీష్టి అభిప్రాయాన్ని బహిరంగంగానూ తెలిసికొని రాజకీయకార్యాలలో తనకు మేలు ఏదో నిర్ణయించుకొని దాన్ని ప్రారంభించాలి. ఇతరులకు హితాన్ని కలిగించే వారినే అధికారులుగా నియమించుకోవాలి. (స.ప్ర. 6వ సము).॥57॥

58,59వ శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *సర్వేషాం తు విశిష్టేన బ్రాహ్మణేన విపశ్చితా ।*
మంత్రయేత్పరమం మంత్రం రాజా షాడ్గుణ్యసంయుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *58*

తాత్పర్యం:- వీరందరిలో గొప్పవాడై, ధార్మికత్వం మొ॥ సుగుణాలలో అందరికి మిన్నయైన విద్వాంసుడైన బ్రాహ్మణుడితో "శత్రువుతో సంధిచేసికోవడం, అతడి తోడి యుద్ధం మొ॥ ముఖ్య విషయాల గురించి" ముఖ్య ఆలోచనలను చేయాలి. ॥58॥

* *నిత్యం తస్మిన్ సమాశ్వస్తః సర్వకార్యాణి నిఃక్షిపేత్ ।*
తేన సార్ధం వినిశ్చిత్య తతః కర్మ సమారభేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *59*

తాత్పర్యం:- అలా చేసి, ఎల్లప్పుడు అతనియందు మిక్కిలి విశ్వాసంగలవాడై, చేయవలసిన పనులను అతనియందు నివేదించి, అతనితో మంతనం గావించి అతని ఆలోచన ప్రకారం చేయాలి. ॥59॥

ప్రక్షిప్తాల పరిశీలన

58-59 శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ రెండు శ్లోకాలూ పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకాలు. ముందు వెనుకల శ్లోకాల విషయం అవసరాన్ని బట్టి అనేక మంత్రుల నియామకం, వారందరి సాయంతో పనులు చేయటం. మధ్యలోనే బ్రాహ్మణుల చేత మంత్రాంగం, కేవలం వారి సలహాలతోనే పనులు ప్రారంభించడం మొదలైన ముగింపు శైలి, పూర్వాపర ప్రసంగ వ్యతిరేకాలు. 60వ శ్లోకపు "అన్యానపి ప్రకుర్వీత్" పదాలు స్పష్టంగా దీన్ని 54-57 శ్లోకాలతో కలుపుతున్నాయి. మధ్యలోని ఈ శ్లోకాలు ప్రసంగపు సంబద్ధతను భంగం చేయటంతో పాటు పూర్వాపరాలకు భిన్నంగా చెబుతున్నాయి.

2. అంతర్ వ్యతిరేకాలు

క. రాజుకు అనారోగ్యం వస్తే ముఖ్య అమాత్యుడికి రాజ్య కార్యాలు అప్పగించాలని మనువు 7.141వ శ్లోకంలో చెప్పాడు. ఈ శ్లోకాలలో ఎవరైనా ఒక బ్రాహ్మణునికి పనులు అప్పగించాలనీ, అదీ ప్రత్యేక పరిస్థితి ఏదీ లేకుండానే అని ఉంది. ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు పద్ధతిలో నచివుడు/అమాత్యుడు క్షత్రియులు[7.54]. 7.226లో రాజు ఆ యా శాఖలకు చెందిన అమాత్యులకు పనులు అప్పగించాలనీ ఉంది.

ఖ. 56-57 శ్లోకాలలో సంధి, విగ్రహం, మొదలైన మంత్రాంగం పలువురు మంత్రులతో చేయాలని ఉంది. వారి సమ్మతితోనే స్వయంగా నిర్ణయం తీసుకోవాలి. ఈ శ్లోకాలలో ఒక బ్రాహ్మణుడితో విశేష మంత్రాంగం, అతనికే రాజ్య భారం అప్పగించటం, అతని సలహాల పైనే పనులు ప్రారంభించటం మొదలైన పద్ధతులు పైన చెప్పిన శ్లోకాలకు వ్యతిరేకం.

గ. ఇప్పటి విషయం రాజులు, క్షత్రియుల కర్తవ్యాలు చెప్పటం. రాజ్యం నడపటం, రక్షణ- ఈ పనులు క్షత్రియులవి [7.1,2]. వీటి కొరకు అమాత్యులు కూడా శూరులు, వీరులైన క్షత్రియులే ఉంటారు[7.54,62]. బ్రాహ్మణ అమాత్యుని నియామకం, అతనికే రాజ్య కార్యాలు అప్పగించడం మొదలైనవి మనువు చెప్పిన వర్ణాశ్రమ వ్యవస్థకు, పూర్వాపరాలలో చెప్పిన వాటికీ వ్యతిరేకం. అందుచేత ఈ శ్లోకాలు మనువు చెప్పినవి కావు.

60 నుండి 71వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

అవసరాన్ననుసరించి ఇతర అమాత్యుల నియుక్తి-

అన్యానపి ప్రకుర్వీత శుచీన్ ప్రాజ్ఞానవస్థితాన్ । మూలశ్లోక సం. **43**
సమ్యగర్థసమాహర్తౄనమాత్యాన్ సుపరీక్షితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **60**

టీక:- అవసరమైనప్పుడు, అన్యాన్ +అపి శుచీన్ = పవిత్రాత్ములు, ప్రాజ్ఞాన్ = బుద్ధిమంతులు, అవస్థితాన్ = నిశ్చిత బుద్ధి కలిగిన, సమ్యక్ అర్థ సమాహర్తౄన్ = చక్కగా పదార్థాలను సంగ్రహించడంలో నిపుణులు, సుపరీక్షితాన్ = పరీక్షించి, సమర్థులైన, అమాత్యాన్ ప్రకుర్వీత = ఇతర-అమాత్యులను కూడా నియోగించుకోవాలి.

ఋషి దయానంద భాష్యం:- ద్రవ్యదానం మొదలైనవాటిలో పరిశుద్ధులు, ప్రజ్ఞచేత ఒప్పినవారు, ధీరులు, చక్కని ధనసంపాదకులు అయినవారిని ధర్మం మొదలైన వాటి వల్ల పరీక్షించి కార్యమంత్రులుగా చేయాలి.

అదే విధంగా రాజ్యానికి, సైన్యానికి కావలసిన అధికారులను ఎవరి వల్ల రాజకార్యాలు సిద్ధిస్తాయో, అందుకు కావలసిన పవిత్రులు, చతురులు, ధార్మికులు, స్థిరబుద్ధిగల విద్వాంసులను అమాత్యులుగా నియోగించుకోవాలి. (స.ప్ర. 6వ సము.)॥60॥

ఇది మనుకృతం. ప్రామాణికం

నిర్వర్తేతాస్య యావద్భి రితికర్తవ్యతా నృభిః । మూలశ్లోక సం.**44**
తావతో౽తంద్రితాన్ దక్షాన్ ప్రకుర్వీత విచక్షణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**61**

టీక:- **అస్య** = ఈ రాజకు, **యావద్భిఃనృభిః ఇతి కర్తవ్యతా నివర్తేత** = ఎంత మంది మనుషులతో కార్యం సిద్ధిస్తుందో, **తావతః** = అంతమందినే, **అతన్ద్రితాన్** = సోమరితనం లేనివారు, **దక్షాన్** = సమర్థులు, బలవంతులైనవారు మరియు, **విచక్షణాన్** = గొప్ప గొప్ప చతురత కలిగిన ప్రధాన పురుషులు, వీరిని మాత్రమే, **ప్రకుర్వీత** = అధికారులుగా నియోగించుకోవాలి.

తాత్పర్యం:- ఆ మంత్రులలో నేర్పరులు, కులధర్మమనెడు అంకుశమునకు లొంగనవారు, ద్రవ్యాశ లేని వారు అయిన వారిని ధనాదాయస్థలంలో నియమించాలి. సోమరితనం లేనివారు, బలవంతులు, మిక్కిలి చాతుర్యం కలవారైన ప్రధాన పురుషులను అధికారులుగా, రాజ్యకార్య సిద్ధికి అవసరమైనంత మందిని నియమించాలి. (స.ప్ర.6వ. సము.).॥61॥

వివరణ:

ఇతికర్తవ్యతా: అభిప్రాయం పూర్ణతా లేదా సమాప్తి

ఎంతమంది అమాత్యులతో, అధికారులతో రాజ్య సంచాలన కార్యమంతా పూర్ణమగువుతుందో అంతమంది అధికారులను రాజు నియోగించుకొని, వారి అధీనంలో పనిచేసే యోగ్యులైన భృత్యులను కూడా నియమించుకోవచ్చు.

అమాత్యులకు కావలసిన సహాయాధికారుల నియుక్తి - ఇది మనుకృతం-ప్రామాణికం

తేషామర్థే నియుంజీత శూరాన్ దక్షాన్ కులోద్గతాన్ । మూలశ్లోక సం.**45**
శుచీనాకరకర్మాంతే భీరూనంతర్నివేశనే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**62**

టీక:- ఇంతకుముందు వర్ణితులైన, **తేషామర్థే** = వారి అధీనంలో, **శూరాన్** = శూరవీరులు, **దక్షాన్** = సమర్థులు లేదా బలవంతులు, **కులోద్గతాన్** = పవిత్ర వంశంలో జన్మించిన, **శుచీన్** = పవిత్రాచరణ సంపన్నులైన మనుషులను, **ఆకరకర్మాన్తే** = బంగారపుగనులలో, **భీరూన్ అన్తర్నివేశనే** = భీరువులను ప్రాసాదంలో అంతఃపురంలో పలు కార్యాల కోసం, **నియుంజీత** = నియమించాలి.

తాత్పర్యం:- నగరం లోపలి కార్యములందు భయశాలురైనవారిని నియమించాలి. శూరులైనవారిని అంతఃపురంలో నియమించినట్లయితే, అక్కడ తరచుగా స్త్రీతో ఒంటరిగా మంతనం గావించెడి రాజును శత్రువుల దగ్గర లంచం తీసుకొని సంహరించ వచ్చు. కాబట్టి శూరులను అక్కడ నియమించరాదు. రాజు అమాత్యులకు సహాయాధికారులుగా పవిత్రాచరణ సంపన్నులైన ధైర్యంగల మనుషులను నియమించాలి. భీరువులను ప్రాసాదంలో అనేక కార్యాల కోసం నియమించాలి. ॥62॥

ప్రధాన దూతను రాయబారిగా నియమించడం- ఇది మనుకృతం-ప్రామాణికం

దూతం చైవ ప్రకుర్వీత సర్వశాస్త్రవిశారదమ్ మూలశ్లోక సం.**46**
ఇంగితాకారచేష్టజ్ఞం శుచిం దక్షం కులోద్గతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**63**

టీక:- **కులోద్గతమ్** = ప్రశంసనీయమైన వంశమందు జన్మించిన, **దక్షం** = సమర్థుడు, నేర్పరి, **శుచిం** = పవిత్రుడు, **ఇఙ్గిత+ఆకార+చేష్టజ్ఞం** = హావభావాలను, చేష్టలను చూసి, వారి హృదయంలో ఉన్న భవిష్యత్తులో ఉండబోయే విషయాలను పసిగట్టగలవాడు, **సర్వశాస్త్ర విశారదమ్** = సర్వశాస్త్ర పారంగతుడైనవాడిని, **దూతం ఏవ ప్రకుర్వీత** = దూతను రాయబారిగా నియమించుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- ఉత్తమ కులములో పుట్టి చతురుడు, ఐహికాముష్మిక శాస్త్రాల నెల్ల తెలిసినవాడు, ఇతరుల మనసెరిగి మాట్లాడే స్వభావం-గలవాడు ఆకారం, హస్త సంజ్ఞలు లాంటివి తెలిసున్నవాడు, పరిశుద్ధ చరితుడు, నేర్పరి అయిన వాణ్ణి దూతగా నియమించాలి. (స.ప్ర.6వ.సము) ॥63॥

శ్రేష్ఠ దూతలక్షణాలు-

ఇది మనుకృతం-ప్రామాణికం

అనురక్తశ్శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్ । మూలశ్లోక సం.**47**
వపుష్మాన్ వీతభీర్వాగ్మీ దూతో రాజ్ఞః ప్రశస్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**64**

టీక:- శ్రేష్ఠమైన దూత ఈ విధంగా ఉండాలి, **అనురక్తః** = రాచకార్యాలలో అత్యంత ఉత్సాహవంతుడు, ప్రీతియుక్తుడుగా ఉండాలి, **శుచిః** = నిష్కపటుడు-పవిత్రాత్ముడు, **దక్షః** = సమర్థుడు-నేర్పరి, **స్మృతిమాన్** = చాలాకాలం కింద జరిగిన విషయాన్ని జ్ఞప్తియందుంచుకొనేవాడు, **దేశ కాలవిత్** = దేశకాలాలను తెలిసినవాడు, **వపుష్మాన్** = సుందర రూపవంతుడు, **వీతభీః** = నిర్భయుడు, మరియు, **వాగ్మీ** = గొప్ప వక్త అయినవాడు, **రాజ్ఞః దూతః ప్రశస్యతే** = రాజుకు దూతగా ఉండటం ప్రశంసనీయం.

ఋషి దయానంద భాష్యం:- రాచకార్యాలలో అనురాగం గలవాడు, స్త్రీల విషయంలోనూ- ధన విషయంలోనూ పరిశుద్ధుడు, జ్ఞప్తిగలవాడు, నైపుణ్యంగలవాడు, దేశకాలాదుల జ్ఞానం గలవాడు, నిర్భయుడు గొప్ప వక్త, రూపసి, పలు భాషలలో నేర్పరి అయిన దూతను రాజు తన సమక్షంలో ఉంచుకోవాలి. (స.ప్ర.6వ సము.) ॥64॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అమాత్యే దండ ఆయత్తో దండే వైనయికీ క్రియా । మూలశ్లోక సం.**48**
నృపతౌ కోశరాష్ట్రే చ దూతే సంధివిపర్యయౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**65**

టీక:- **అమాత్యే దండః** = అమాత్యుడికి దండనాధికారం, **దండే వైనయికీ క్రియా** = దండనలో, వినయం-అనుశాసన క్రియ అంటే అన్యాయరూపమైన దండన లేకుండే విధంగా, **నృపతౌ కోశరాష్ట్రే** = రాజు అధీనంలో ధనాగారం (కోశము) రాష్ట్రాలు ఉండాలి. **చ** = అలాగే, సభాధీనంలో సర్వకార్యాలు, **దూతే సంధి విపర్యయౌ** = దూత అధీనంలో సంధి విపర్యయాలు అంటే ఎవరితో సంధి చేసుకోవాలి,ఎవరితో విరోధం ఉండాలి అనే విషయాలు దూత అధీనంలో ఉండాలి. (స.ప్ర.6వ సము.)

ఋషి దయానంద భాష్యం:- అమాత్యుడికి దండనాధికారం ఉండాలి. సేనాపతికి చతురంగబలం అధీనమై ఉండాలి. రాజు అధీనంలో బొక్కసములు, రాజ్యం ఉండాలి. తన ధనమును, రాజ్యమును తానే చూస్తూండాలి. సంధి, యుద్ధం ఈ రెండూ దూత అధీనంలో ఉండాలి. దూతలవల్ల సంధి కావచ్చు. దూతవల్లనే యుద్ధం జరగవచ్చు. కాబట్టి దూత నేర్పరియై ఉండాలి. ॥65॥

వివరణ:

రాజు-అమాత్యుల మధ్య కార్య విభజన -

రాజు అధీనంలో రాష్ట్రం, రాష్ట్రీయ స్థాయికి సంబంధించిన కార్య విభాగం, సేన, మరియు కోశం (ఖజానా) మొ॥వి. ఉంచుకోవాలి. అమాత్యులకు దండ-న్యాయాధికారాలను అప్పగించాలి. దండాధికారులను అనుశాసనమందుంచడానికి వారికి తగిన శిక్షాపద్ధతులకు సంబంధించిన అధికారమివ్వాలి. దూత అధీనంలో, సంధి-విగ్రహ (విరోధ) = సంబంధమైన నీతి నిర్ధారణ చేసే అధికారం ఉండాలి. ఈ ప్రధానామాత్యులు తమ తమ విభాగాలను నిర్వహిస్తూ రాజుతో సంప్రదిస్తూ ఉండాలి. ఈ విధంగా కార్యములన్నీ సుసంపన్నమవుతాయి.

దూత విధులు (కర్తవ్యాలు)- **ఇది మనుకృతం-ప్రామాణికం**

దూత ఏవ హి సంధత్తే భినత్త్యేవ చ సంహతాన్ । మూలశ్లోక సం. **49**
దూతస్తత్కురుతే కర్మ భిద్యంతే యేన మానవాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **66**

హి = ఎందుకంటే, **దూత ఏవ** = దూత మాత్రమే (రాయబారి), **సంధత్తే** = శత్రువుకు తన రాజుకు మధ్య సంధి కుదిరిస్తాడు. **చ** = మరియు, **సంహతాన్ భినత్తి ఏవ** = కలిసి ఉన్న శత్రువుల మధ్య భేదాన్ని కలిగించి వేరు చేయగలడు, **దూతః తత్ కర్మ కురుతే** = దూత చేయునదేమంటే, **యేన మానవాః భిద్యన్తే** = శత్రువులు పరస్పరం వేరయ్యేట్లుగా చేయగలడు.

ఋషి దయానంద భాష్యం:- ఎవరెవరి వల్ల ఏవేవీ లొంగి సంచరించాలో చెబుతూ, దూత సంధికీ-యుద్ధానికీ ప్రతినిధి అన్నాడు మనువు. ఇవి దూతకు లొంగి వున్నవి. దూతవల్లనే సంధీ సంభవించవచ్చు! యుద్ధమూ జరగవచ్చు! ఏ పనిని మధ్యవర్తులు చేయగలరో అది దూత చేయగలడు. వేరైన వారిని కలపడం, కలిసి ఉన్న దుష్టులను వేరుచేయడం దూతవిధి. (స.ప్ర.6వ సము). ॥66॥

వివరణ: కౌటిల్యుని అనుసారం దూతకార్యాలు

కౌటిల్యుడు దూత విధులు గురించి చాలా వివరంగా వర్ణించాడు.

"ప్రేషణం సన్ధిపాలత్వం ప్రతాపో మిత్రసంగ్రహః
ఉపజాపః సుహృద్ భేదో దండగూఢాతి పారణమ్
బన్ధు రత్నాపహరణం చారజ్ఞానం పరాక్రమః
సమాధిమోక్షః దూతస్య కర్మయోగస్య చాశ్రయః" (ప్ర.11,అధ్యా 15).

తన రాజు యొక్క సందేశాన్ని అన్యరాజు వద్దకు తీసుకుపోవడం, అక్కడ నుండి సందేశాన్ని తేవడం సంధిభావాన్ని అమలులో ఉంచడం, తన రాజు ప్రతాపాన్ని పెంచడం, అధికాధికంగా మిత్రులను సంపాదించడం, శత్రువులను, వారి నుండి వేరుచేయడం, కార్యరహితులైన తన గుప్తచరులను, సైనికులను ఆపత్తికి ముందే వారిని దూరం చేయడం, శత్రువుల బంధువుల నుండి రత్నాలను మొ॥ వాటిని అపహరించడం. శత్రుదేశంలో పనిచేస్తున్న తమ గుప్తచరుల కార్యాలను నిరీక్షించడం, సమయమొచ్చినప్పుడు పరాక్రమాన్ని చూపించడం, బంధించి ఉంచిన శత్రుబాంధవులను షరతులుపెట్టి వదలడం, ఇద్దరు రాజుల మధ్య సమావేశాలనేర్పాటు చేయడం దూత కర్తవ్యాలు.

ఇది మనుకృతం - ప్రామాణికం

స విద్యాదస్య కృత్యేషు నిగూఢేంగితచేష్టితైః । మూలశ్లోక సం. **50**
ఆకారమింగితం చేష్టాం భృత్యేషు చ చికీర్షితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **67**

టీక:- సః = ఆ దూత, **అస్యకృత్యేషు** = శత్రురాజుతో అసంతుష్టులై విరోధులుగా ఉన్న వారిలో, **చ** = మరియు, **భృత్యేషు** = రాజకర్మచారులలో, **నిగూఢ+ఇఙ్గిత + చేష్టితైః** = గుప్త సంకేతాల-చేష్టల ద్వారా, **ఆకారం** = శత్రురాజుల ఆకార భావాలను, **చేష్టాం** = ప్రయత్నాన్నీ, అలాగే, **చికీర్షితమ్** = వారు చేయదలచుకొన్న కార్యాన్ని, వారి కోరికలను, **విద్యాత్** = తెలిసికోవాలి.

తాత్పర్యం:-శత్రురాజు వద్దకు వెళ్లేదూత, రకరకాల (గూఢచర్య) వేషాలతో ఆ రాజ్యం -రాజు మనోభిప్రాయం, చర్యలు, రాజ సేవకుల రీతులు అన్నీ గ్రహించాలి. ॥67॥

వివరణ:

1. **'కృత్య' శబ్దానికి-రాజనీతిపరంగా అర్థం-**

ఇక్కడ కృత్య శబ్దం రాజనీతికి సంబంధించిన యోగ రూఢం. ధనాన్ని, స్త్రీలను, సంపత్తి మొ॥ వాటిని చూపించి, ఆశ పెట్టి శత్రుపక్షం నుంచి మన వశంలోకి తీసికోగల వారిని కృత్యులంటారు. అర్థశాస్త్రంలో వీరు నాలుగు విధాలుగా ఉంటారు.

"కృద్ధ-లుబ్ధ-భీత-అవమానినస్తు పరేషాం కృత్యాః" (కౌ.అర్థ.ప్ర. 9.2)

శత్రు రాజ్యంలో ఉండేవారు తమ రాజుమీద కోపపడినప్పుడు వారు "కృద్ధకృత్యులు, ఎవరు లోభులో వారు లుబ్ధకృత్యులు. భయం వల్ల అణిగి ఉంటారో వారు భీతకృత్యులు. ఎవరు రాజు వల్ల అవమానితులో, వారు 'అపమానిత కృత్యులు' అనబడతారు. ఉపర్యుక్తమైన లుబ్ధ-క్లుబ్ధ వ్యక్తుల ద్వారా, ఆ రాజు కర్మచారుల ద్వారా శత్రురాజు యొక్క గుప్త రహస్యాలను తెలిసికోవడం దూతల పని.

2 **'ఇంగితం', 'ఆకారా'నికి అర్థాలు:**

"ఇంగితమన్యథావృత్తిః । ఆకృతిగ్రహణమాకారః" కౌ.అ. 1.14

స్వాభావిక క్రియలను విపరీతంగా చేసే చేష్టలే "ఇంగితం"

చేష్టలను ప్రకటించే అంగముల ఆకృతియే "ఆకారం".

ఇది మనుకృతం-ప్రామాణికం

బుద్ధ్వా చ సర్వం తత్త్వేన పరరాజచికీర్షితమ్ । మూలశ్లోక సం. **51**
తథా ప్రయత్నమాతిష్ఠేద్యథాత్మానం న పీడయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **68**

టీక:- సభాపతి, సభాసదులు మరియు దూతలు మొదలైనవారు, **తత్త్వేన** = యథార్థంగా, **పరరాజచికీర్షితమ్ సర్వం** = ఇతర విరోధి రాజుల రాజ్యాల గురించి అభిప్రాయాలను, **బుద్ధ్వా** = తెలిసికొని, **తథా ప్రయత్నం ఆతిష్ఠేత్** = తగిన ప్రయత్నం చేయాలి, **యథా ఆత్మానం న పీడయేత్** = తనకు బాధ కలగకుండా ఉండేటట్లుగా చూసుకోవాలి.

తాత్పర్యం:- శత్రురాజుల కోరికలను చక్కగా తెలుసుకొని అవి తనకు ఏ విధంగా అపాయం సంభవించదో ఆ విధంగా తాను నడచుకోవాలి. ॥68॥

రాజు నివాసస్థానం ఎలా ఉండాలి?- ఇది మనుకృతం-ప్రామాణికం

జాంగలం సస్యసంపన్నమార్యప్రాయమనావిలమ్ । మూలశ్లోక సం. **52**
రమ్యమానతసామంతం స్వాజీవ్యం దేశమావసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **69**

టీక:- **జాఙ్గలం** = జాఙ్గలప్రదేశం అంటే ఉపయోగపడే విధంగా వర్షాలుండే చోటు, నదులుపొంగి వెల్లువలు రాని స్థలం, గాలి ప్రసరించే చోటు, కావలసినంత సూర్యరశ్మి ప్రసరించే చోటు, ధాన్యాదులు అధికంగా పండే చోటు, **సస్య సంపన్నం** = పచ్చిక ఉండే చోటు, **ఆర్యప్రాయమ్** = శ్రేష్ఠ పురుషులుండుచోటు, **అనావిలమ్** = రోగరహితం, **రమ్యమ్** = రమణీయప్రదేశం, **ఆనతసామన్తం** = వినమ్రులైన ప్రజలుండేది, **స్వ+ఆజీవ్యం** = జీవనోపాధులున్నచోటు.

తాత్పర్యం:- నీరు, పచ్చిక గల ప్రదేశం; బహుధాన్య సమృద్ధి నిచ్చే పొలములు, ఎక్కువమంది వర్తకులు ఉండే ప్రదేశం; రోగాలు-ఉపద్రవాలకు చోటివ్వని ప్రదేశం; పుష్పఫలభరిత వృక్షాలతో ఇంపుకలిగించు ప్రదేశం, జనులకు కృషి-వాణిజ్యం లాంటి జీవనోపాధి కలిగించే ప్రదేశం రాజు నివశించదానికి అనువైనది. సమీపంలో అదవి ఉందటం కూడ మంచిది. ॥69॥

ఆరు(6) రకాలుగా దుర్గ (కోట) నిర్మాణం - ఇది మనుకృతం-ప్రామాణికం

ధన్వదుర్గం మహీదుర్గమబ్దుర్గం వార్క్షమేవ వా । మూలశ్లోక సం. **53**
నృదుర్గం గిరిదుర్గం వా సమాశ్రిత్య వసేత్పురమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **70**

టీక:- ధన్వదుర్గం = రాకపోకలకు కష్టదాయకమైన మరుగుస్థలాల్లో నిర్మించిన దుర్గం (కోట), **మహీదుర్గం** = భూమిలోపల గుహాకారంలో నిర్మించిన కోట (దుర్గం), **అబ్దుర్గం** = నాలుగు వైపుల నీరుండేట్లు నిర్మించినది. **వార్క్షమేవ** = వృక్షదుర్గం. దట్టంగా పెరిగిన వృక్షాలతో చుట్టబడిన కోట, **నృదుర్గం** = సైనికులు చుట్టూ నివసించే కోట. వా = లేదా, గిరి దుర్గం = కొండల మీద నిర్మించిన, చుట్టూ కొండలచేత, ఆక్రమించబడిన దుర్గం, **సమాశ్రిత్య** = ఆశ్రయించి, **పురమ్వసేత్** = తన నివాసాన్ని ప్రభువు ఏర్పాటు చేసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:-'**ధన్వదుర్గ**' శబ్దానికి బదులుగా '**ధనుర్దుర్గమ్**' అనే పాఠంతరాన్ని గ్రహించి మహర్షి దయానందులవారు ఈ విధంగా రాశారు. అందమైన ధనధాన్య సంపన్నమైన దేశంలో, **ధనుర్దుర్గమ్** = ధనుర్ధారులైన వీరులతో నిండిన, **మహీదుర్గం** = మట్టితో కట్టబడిన కోట, **అబ్దుర్గం** = చుట్టూ నీటితో నిండిన కందకాలు ఉండే విధంగా, **వార్క్షమ్** = నాలుగు వైపుల ఎత్తయిన గుబురుగా ఉన్న చెట్లతోనిండిన, **నృదుర్గం** = నాలుగు వైపుల సైనికులతో నిండిన, **గిరిదుర్గం** = నాలుగువైపుల కొండలతో కూడిన చోట వీటి మధ్యలో నగరాన్ని నిర్మించుకోవాలి(స.ప్ర. 6వ సము.).

ఐదు యోజనముల దూరం నీరులేని మరుదుర్గం, రాళ్ళతోగాని, ఇటుకలతో గాని ఎక్కువ వెడల్పును పంన్రెండు బారల ఎత్తుగలిగి యద్ధం కోసం పైననే తిరగడానికి తగినంత వైశాల్యంగల ప్రాకారంలో చుట్టబడిన భూదుర్గం, చుట్టూ లోతునీటితో కూడిన జలదుర్గం, వెలుపల చుట్టూ జనదూరం చెట్లతో చుట్టబడి ఉన్న వృక్షదుర్గం, చతురంగబలంతో కూడిన సేనలచేత కాపాడబడు మనుష్య దుర్గం, నలువైపుల కొండలచేత చుట్టబడి లోపలికి పోనువీలుకాక సన్నని ఇరుకుదారితో కూడి లోపల నదులు, సెలయేళ్ళు కలిగి బహుధాన్య సమృద్ధితో ఒప్పిన గిరిదుర్గం వీటిలో ఏదేని ఒక దాని నడుమ తన నగరాన్ని నిర్మించాలి. ॥70॥

వివరణ: కౌటిల్యుని అర్థ శాస్త్రంలో 4 రకాల దుర్గములు:

తన అర్థశాస్త్రంలో కౌటిల్యుడు నాలుగు దుర్గాలను మాత్రమే పేర్కొన్నాడు. 1) ఔదక దుర్గం, (జల దుర్గం), 2) పార్వత దుర్గం (గిరి దుర్గం), 3) ధాన్వన (ధన్వదుర్గం), 4) వన దుర్గం (వృక్ష దుర్గం).

పర్వత దుర్గపు గొప్పతనం- ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేణ తు ప్రయత్నేన గిరిదుర్గం సమాశ్రయేత్ । మూలశ్లోక సం. **54**
ఏషాం హి బాహుగుణ్యేన గిరిదుర్గం విశిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **71**

టీక:- రాజైనవాడు, **సర్వేణ తు ప్రయత్నేన** = అన్ని విధాలా ప్రయత్నించి, **గిరి దుర్గం సమాశ్రయేత్** = పర్వత దుర్గాన్నే ఆశ్రయించాలి. **హి** = ఎందువల్లనంటే, **బాహు గుణ్యేన** = సర్వదుర్గాల కంటె అధిక సురక్షా సదుపాయాలున్నందువల్ల, **గిరి దుర్గం విశిష్యతే** = పర్వత దుర్గమే సర్వశ్రేష్ఠమైనది. అందువల్ల పర్వతదుర్గ నిర్మాణానికే ప్రయత్నించాలి.

తాత్పర్యం:-పైన చెప్పబడిన చోట కోట నిర్మించుకుని రాజు నివశిస్తే, అది రాజధాని అనబడుతుంది. కాని, ఇలాంటి కోటలన్నిట్లో గిరి దుర్గం (కొండమీద కోట) శ్రేష్ఠమైనది. అదీ శత్రుదుర్భేద్యకంగా ఉండాలి. ॥71॥

72, 73వ శ్లోకాలు ప్రక్షిప్తాలు- ఇవి ప్రామాణికం కావు

* **త్రీణ్యాద్యాన్యాశ్రితా స్త్వేషాం మృగగర్తాశ్రయాప్సరాః ।**
త్రీణ్యుత్తరాణి క్రమశః ప్లవంగమనరామరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **72**

తాత్పర్యం:- ఈ దుర్గములలో మొదటి మూడింటిని అంటే మరుదుర్గంలో మృగములు, మహీ దుర్గంలో ఎలుకలు మొదలైనవి, జలదుర్గంలో మొసళ్ళు మొదలైన జంతువులు, తక్కిన మూడింటిలో వృక్ష దుర్గంలో వానరములు, నృదుర్గంలో మనుషులు, గిరిదుర్గంలో దేవతలు ఆశ్రయించి ఉంటారు. ॥72॥

* **యథా దుర్గాశ్రితానేతాన్నోపహింసంతి శత్రవః ।**
తథాఽరయో న హింసంతి నృపం దుర్గం సమాశ్రితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **73**

తాత్పర్యం:- దుర్గములందున్న మృగాదులను వ్యాధాదిజనులెలా హింసింపజాలరో, అలాగే శత్రువులు గిరిదుర్గాదులలో ఉన్న రాజులను హింసింప జాలరు. ॥73॥

ప్రక్షిప్తాల పరిశీలన

72-73 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలలో వేర్వేరు దుర్గాలలో వేర్వేరు ప్రాణులు ఉంటారని చెప్పారు. మనుష్యులు కేవలం **'నృదుర్గం'** లో ఉంటారని ఉంది. కానీ 70వ శ్లోకంలో అన్ని దుర్గాలూ మనుష్యుల నివాసానికే అని చెప్పారు.

ఖ. 71వ శ్లోకంలో రాజుకు గిరి దుర్గపు గొప్పతనాన్ని చెబుతూ, అందులోనే ఉండే ప్రయత్నం చేయాలన్న నిర్దేశం ఉంది. కానీ ఈ శ్లోకాలలో **'గిరి దుర్గం'**లో దేవతలు నివాసం ఉండాలన్నారు. ఈ అంతర్ వ్యతిరేకతలు కారణంగా ఈ రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

70వ శ్లోకంలో అన్ని దుర్గాలను గురించీ చెప్పి, మళ్లీ 71లో ముగింపు రూపంలో గిరి దుర్గపు ప్రత్యేకత చెప్పారు. దీని వల్ల రచయితకు వేరే దుర్గాలను గురించి చెప్పటం ఇష్టం లేనట్లు కనబడుతూంది. ఇలా ఈ శ్లోకాలలో మళ్లీ అన్ని దుర్గాలనూ కొత్తగా వర్ణించటం మౌలికంగా గోచరించదం లేదు. "త్రీణి ఆద్యాని" పదాల ప్రయోగం వల్ల కూడా ఈ శ్లోకాలకు 71వ శ్లోకంతో సంబంధం ఉన్నట్టు తోచదం లేదు. ఇవి కనుక 70వ శ్లోకం తర్వాత ఉంటే, వీటి సంబద్ధతను అంగీకరించ వచ్చేమో ! ఇలా ప్రసంగ క్రమం నుంచి వేరైపోవటం చేత ఇవి ప్రక్షిప్తాలు.

3. శైలీ వ్యతిరేకాలు

ఈ రెండు శ్లోకాలలోనూ అప్సరసలూ, దేవతల కల్పన ఉంది. ఇటువంటి ప్రాణు లేవీ ఉండవనేది మనకు తెలిసిన సంగతే. మనువు శైలి ఈ విధంగా కాల్పనికమూ, నిరాధారమూ, నిర్హేతుకంగా ఉండదు.

74-82వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

దుర్గ మహత్త్వం-

ఏకశ్శతం యోధయతి ప్రాకరస్థో ధనుర్ధరః । మూలశ్లోక సం. **55**
శతం దశసహస్రాణి తస్మాద్దుర్గం విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **74**

టీక:- ప్రాకారస్థః = నగరానికి నాలుగు వైపులలో ఉన్న ప్రాకారం మీద ఉన్న ఒక ధనుర్ధారి, **శతం** = నూర్గురు శత్రువులతో యుద్ధం చేయగలడు, ఆపగలడు. **శతం దశసహస్రాణి** = ప్రాకారమందున్న వందమంది ధనుర్ధారులు, 10 వేల మంది శత్రువులతో పోరాడగలరు. **తస్మాత్ దుర్గం విధీయతే** = అందువల్ల దుర్గనిర్మాణం చాలా ముఖ్యం.

ఋషి దయానందభాష్యం:- నగరానికి నాలుగువైపులా ప్రాకారాన్ని కట్టాలి. దుర్గం యొక్క ప్రాకారంపైన ఉన్న ఒక విలుకాడు వందమంది శత్రువులతో యుద్ధం చేయగలడు. అలాంటి వందమంది విలుకాండ్రు పదివేలమంది శత్రువులతో పోరాడగలరు కాబట్టి దుర్గం రాజుకు చాలా ముఖ్యం. (స.ప్ర.6వ.సము).॥74॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తత్ స్యాదాయుధసంపన్నం ధనధాన్యేన వాహనైః । మూలశ్లోక సం.**56**
బ్రాహ్మణైశ్శిల్పిభిర్యంత్రైర్యవసేనోదకేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**75**

టీక:- **తత్** = ఆ దుర్గం, **ఆయుధ సంపన్నం** = అస్త్ర శాస్త్రాలతో కూడినదై ఉండాలి, **ధన ధాన్యేన, వాహనైః** = ధన-ధాన్య వాహనాలతో నిండుగా ఉండాలి, **బ్రాహ్మణైః** = బ్రాహ్మణులు అంటే విద్యను నేర్పించే, ధర్మోపదేశాన్నిచ్చే సుశిక్షితులైన అధ్యాపకులు ఉండాలి, **శిల్పిభిః** = భవననిర్మాణ, నేర్పరులైన పనివారు ఉండాలి. **యన్త్రైః** = అనేకవిధాలైన యంత్ర సామాగ్రి ఉండాలి, **యవసేన** = పశుగ్రాసం, **ఉదకేన** = సమృద్ధిగా నీరు ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- ఆ దుర్గం యుద్ధసాధనాలు, ధనం, ధాన్యం, వాహనాలు, బ్రాహ్మణులు, శిల్పులు, అనేక రకాలైన యంత్రాలు, పశుగ్రాసం, జలసమృద్ధి సంపూర్ణంగా కలిగి ఉండాలి (స.ప్ర.6వ.సము). ॥75॥

రాజు నివాసగృహం (రాజ భవనం)- ఇది మనుకృతం-ప్రామాణికం

తస్య మధ్యే సుపర్యాప్తం కారయేద్గృహమాత్మనః । మూలశ్లోక సం.**57**
గుప్తం సర్వర్తుకం శుభ్రం జలవృక్షసమన్వితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**76**

టీక:- **తస్య మధ్యే** = ఆ దుర్గం మధ్యలో, **జలవృక్ష సమన్వితమ్** = పర్యాప్తజలం, వృక్షాలతో నిండిన, **గుప్తం** = సురక్షితమైన, **సర్వ+ఋతుకం** = అన్ని ఋతువులకు అనుకూలమైన, **శుభ్రం** = శ్వేతవర్ణంగల, **ఆత్మనః గృహమ్** = తన కోసం గృహాన్ని, (భవనాన్ని), **సుపర్యాప్తం** = రాజు పరివారమంతా సుఖంగా ఉండగలిగిన, భవనాన్ని నిర్మించుకోవాలి.

ఋషి దయానందభాష్యం:-ఆ దుర్గానికి మధ్యలో వేర్వేరుగా స్త్రీల గృహాలు, ఆయుధాగారాలు, వంటశాలలు, మొదలైనవి విశాలంగా ఏర్పరచబడాలి. కోటప్రాకారాలతో అలరారుతూ, అగడ్త కలదై వివిధ ఫలవృక్షభరితమై, నీటి వసతి కలిగినదై చెట్లు చుట్టూ ఉంటూ మధ్యలో రాజగృహం ఉండేలా నిర్మించబడాలి. (స.ప్ర.6వ.సము.) ॥76॥

రాజుకు వివాహ యోగ్యమైన భార్య- ఇది మనుకృతం-ప్రామాణికం

తదధ్యాస్యోద్వహేద్భార్యాం సవర్ణాం లక్షణాన్వితామ్ । మూలశ్లోక సం.**58**
కులే మహతి సంభూతాం హృద్యాం రూపగుణాన్వితామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**77**

టీక:- **తదధ్యాస్య** = బ్రహ్మచర్యవ్రతం ద్వారా విద్యాధ్యయనం చేసి, రాజకార్య నిర్వహణానంతరం, **రూపగుణ+అన్వితామ్** = సౌందర్య రూపగుణాలు కలది. **హృద్యామ్** = హృదయానికి ప్రియమైనది (నచ్చినది), **మహతికులే సంభూతామ్** = ఉత్తమవంశంలో జన్మించినది, **లక్షణాన్వితామ్** = సుందర లక్షణాలు కలిగినది. **సవర్ణాం భార్యాం ఉద్వహేత్** = తన క్షత్రియ వర్ణానికి సంబంధించినట్టి తన వంటి విద్యాది గుణకర్మ స్వభావం కలిగిన ఒకే స్త్రీని వివాహం చేసుకోవాలి. ఇతర స్త్రీలు అగమ్యాలని భావించి, కన్నెత్తి చూడరాదు.

ఋషి దయానందభాష్యం:- అలాంటి గృహం నుండి అనగా సజాతిలోనూ, గొప్పకులంలోనూ పుట్టినది, శుభలక్షణాలతో కూడినది, మనసున కిష్టురాలు, రూపగుణాలు గల క్షత్రియ కన్యను స్వయంవరంలో వివాహమాడాలి. తర్వాత ఇతర స్త్రీలందరూ తాను కోరదగనివారని ఎంచి వారివైపు చూడకుండా ఉండాలి. (స.ప్ర.6వ. సము)॥77॥

వివరణ:

శ్లోకానికి ఆధారభూతమైన గొప్ప పదాలు - ఈ శ్లోకంలోని అన్ని ఏకవచనాంత పదాలు ఒకటే నియమం వైపు మన దృష్టిని ఆకర్షిస్తాయి. అదేమిటంటే, ఒక భార్యే ఉండాలి, బహుభార్యత్వం పద్ధతి కాదు అనేది. ఆ భార్య 'సవర్ణురాలై' ఉండాలి. ఎవరైనా స్త్రీ 'సవర్ణురాలు' ఎప్పుడవుతుందంటే, ఆ వర్ణపు విద్యాబుద్ధులు గురుకులంలో ఆమె పొంది ఉండాలి. ఆచార్యులు ఆమెను ఆ వర్ణపు వనిత అని ప్రకటించాలి. ఎందుకంటే, మనువు ఏర్పరచిన వ్యవస్థలో జన్మను బట్టి వర్ణం నిర్ధారితం కాదు. కాని విద్యాబుద్ధులు, వృత్తి శిక్షణలనుబట్టి ఆచార్యులు నిర్ధారిస్తారు (2.148). భార్య 'హృద్య' అయినా, అంటే మనసుకు నచ్చినా, ఆమె దీనివల్ల వివాహంలో భార్యాభర్తలు స్వయంగా వరించే స్వాతంత్ర్యం కలుగుతుంది. ఇలాంటి వివాహాలను మనువు **'స్వయంవర వివాహం'** అన్నాడు.

పురోహితుణ్ణి ఎన్నుకోవడం, అతని కర్తవ్యాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

పురోహితం ప్రకుర్వీత వృణుయాదేవ చర్త్విజః । మూలశ్లోక సం.**59**
తేఽస్య గృహ్యాణి కర్మాణి కుర్యుర్వైతానికాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**78**

టీక:- పురోహితం చ ఋత్విజః వృణుయాత్ ఏవ కుర్వీత = పురోహితుణ్ణి, అలాగే ఋత్విక్కుల్ణి ఎన్నుకోవాలి, ఎందుకంటే, **తే** =వారు, **గృహ్యాణి చ వైతాని కాని అస్యకర్మాణి కుర్యుః** = అగ్నిహోత్రం, పక్షేష్టి మొ॥ సమస్త రాచ గృహ కర్మలను చేస్తారు. పురోహితులు ఎల్లప్పుడూ రాచకార్యాలలో తత్పరులుగా ఉండాలి.

తాత్పర్యం:- అథర్వణవిధి ప్రకారం పురోహితుణ్ణి నియమించాలి. యజ్ఞాదికర్మలు జరపడానికి ఋత్విజులను వరించాలి. ఆ ఋత్విక్కుడు, పురోహితుడు యజ్ఞాదిశ్రౌత కర్మలను, గృహ కార్యాలను జరిపించాలి.

ఋషి దయానందభాష్యం:- వైతానిక గృహకర్మలు. ఇక్కడ వైతానిక శబ్దం విస్తృతార్థాన్ని బోధిస్తుంది. దీర్ఘకాలం వరకు నిర్వహించే యజ్ఞాలు యాగాలు గృహంలో చేసే ధార్మిక అనుష్ఠానాలైన దైనిక పంచమహా యజ్ఞాలే కాకుండా బృహత్ యజ్ఞాలను కూడా చేయవలసి ఉంటుంది. ఈ కార్యాల కోసం పురోహితులను, ఋత్విక్కులను నియమించుకోవలసి వస్తుంది. (స.ప్ర.6వ సము) ॥78॥

వివరణ:

వైతానికం, గృహ్యా కర్మలు

ఇక్కడ 'వైతానికం' అనే పదానికి అర్థం, దీర్ఘకాలం జరిగే **'యజ్ఞాలు'**, **'గృహకర్మలు'** నుంచి ఇంట్లోని ధార్మిక అనుష్ఠానాలు, దైనందిన పంచ మహాయజ్ఞాల వరకు, అని గ్రహించాలి. 79వ శ్లోకంలో వైతానిక యజ్ఞాలను స్పష్టంగా చెప్పారు. వానప్రస్థంలో కూడా వైతానిక - విస్తృత యజ్ఞాలు చేయాలని నిర్దేశించారు.

"వైతానికం చ జుహుయాద్ - అగ్నిహోత్రం యథావిధి" (6.9)

రాజు సమయానుసారంగా పంచ మహాయజ్ఞాలు లేకుండా పెద్ద యజ్ఞాలు, రాజ్య సంబంధమైన అనుష్ఠానాలు ఏర్పాటు చేస్తూ ఉండాలి. ఈ పనుల కొరకు ఋత్విక్కులను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. 2.118 (2.143) వ శ్లోకంలో ఋత్విక్కు లక్షణాలు చెబుతూ మనువు, అగ్నిహోత్ర పంచ యజ్ఞాలు, అగ్నిష్టోమం మొదలైన యజ్ఞాలు చేసే వ్యక్తిని ఎంపిక చేసుకుంటే అతన్ని **'ఋత్విజుడు'** అంటారని చెప్పాడు.

"అగ్న్యాధేయం పాక యజ్ఞాన్
అగ్నిష్టోమాదికాన్ మఖాన్ ।
యః కరోతి వృతో యస్య
సః తస్య - ఋత్విగిహోచ్యతే ॥"

బ్రహ్మ, ఉద్గాత, హెూత, అధ్వర్యుడు అని వీరు నలుగురు ఉంటారు. పెద్ద యజ్ఞాలలో 16 మంది వరకు ఉంటారు.

'పురోహితుడు' ఏదైనా ఒక కులంలో ధార్మిక అనుష్ఠానం చేసేవాడు, ధర్మ సంబంధ విషయాలకు మార్గదర్శనం చేసే ప్రముఖుడు అయి ఉంటాడు. రాజ సభలో ఈ ధర్మాధికారి అమాత్యుడవుతాడు. ఇతడు అన్ని ధార్మిక అనుష్ఠానాలు, ధార్మిక సంబంధ నిర్ణయాలు తీసుకునేవాడు, లేదా రాజుకు సలహాలు ఇస్తుంటాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

యజేత రాజా క్రతుభిర్వివిధైరాప్తదక్షిణైః । మూలశ్లోక సం. **60**
ధర్మార్థం చైవ విప్రేభ్యో దద్యాద్భోగాన్ ధనాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **79**

టీక:- రాజా = రాజు, **ఆప్తదక్షిణైః వివిధైః క్రతుభిః** = అధిక దక్షిణలిచ్చే అనేక యజ్ఞాలను, **యజేత** = చేస్తూ ఉండాలి, చ = మరియు, **ధర్మార్థం** = ధర్మం కోసం, **విప్రేభ్యః** = విద్వాంసులైన వేదపాఠకులకు, **భోగాన్ ధనాని చ దద్యాత్** = భోగ్యవస్తువులతో పాటు భూరి ధనాన్ని దక్షిణగా ఇవ్వాలి.

తాత్పర్యం:- రాజు యథేష్టదక్షిణలు ఇస్తూ, అనేక విధాలుగా యజ్ఞాలను చేయించాలి. ధర్మం కోసం విద్వాంసులైన వేదపాఠకులకు, భూమి, శయ్య, బంగారు, వెండి ఆభూషణాలను, ధనాన్ని దక్షిణగా ఇవ్వాలి. ॥79॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సాంవత్సరిక మాప్తైశ్చ రాష్ట్రాదాహారయేద్బలిమ్ । మూలశ్లోక సం. **61**
స్యాచ్చామ్నాయపరో లోకే వర్తేత పితృవన్నృషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **80**

టీక:- సాంవత్సరికమ్ బలిమ్ = వార్షికమైన పన్ను, **ఆప్తైఃహారయేత్** = ఆప్త పురుషుల ద్వారా వసూలు చేయించాలి, చ = మరియు సభాపతి రూపంలో ఉన్న రాజు మొ॥ పురుషులు, **ఆమ్నాయ పరః** = సభ మరియు వేదానుకూలంగా ఉండి, **నృషు పితృవత్ వర్తేత** = ప్రజలలో తండ్రితో సమానంగా వ్యవహరించాలి, **రాష్ట్రాత్** = రాజ్యకర్మచారుల నుండి, **లోకే** = రాజ్యంలో.

ఋషి దయానందభాష్యం:- రాజు తగిన ఆప్తులైన మంత్రులను నియమించి, సంవత్సరానికి వసూలు చేయాల్సిన పన్నులను వసూలు చేయాలి. రాజు, సభ వేదానుకూలంగా ఉండి, తన దేశవాసులైన ప్రజలతో తండ్రిలాగా వాత్సల్యం కలిగి ఉండాలి.(స.ప్ర. 6వ సము).॥80॥

వివరణ:

ఆప్త, బలి శబ్దాలకు విశేషార్థం:- ఆప్త, బలి శబ్దాలు పరంపారగతమైన శాస్త్రీయ శబ్దాలు. శాస్త్రాలలో బహుళంగా ప్రయోగింపబడినందువల్ల వీటికి విశేషమైన అర్థాలలో రూఢములైనవి.

1. ఆప్తః: "ఆప్ల = వ్యాప్తౌ (స్వాది) = ధాతువుకు 'క్త' ప్రత్యయం చేర్చగా సిద్ధమవుతుంది. తన విషయంలో వ్యాపకం, ప్రత్యక్ష జ్ఞానం కలిగిన ధార్మిక వ్యక్తిని ఆప్తుడంటారు. రాజకు సంబంధించిన ప్రత్యేక విభాగంలో ఇలాంటి ఆప్త పురుషులే, ముఖ్య అధికారులుగా ఉంటారు.

2. **బలి:** శబ్దానికి అర్థం-అన్నం నుండి యజ్ఞార్థం కోసం తీసిన మిగిలిన భోజనం. బలివైశ్వదేవ యజ్ఞాలలో, భోజనం నుండి కొంత భాగం వేరుగా తీసినట్లు ఇక్కడ ధాన్యంలో 6వ భాగంలో రాజు ప్రజల నుండి పన్నుగా తీసికొంటాడు. దానికే 'బలి' అని పేరు. రకరకాలైన (బలులు) పన్నులు వాటి మధ్య తేడాలు తెలిసికోడానికి (8-300)వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

విభిన్నాధ్యక్షుల నియుక్తి - ఇది మనుకృతం-ప్రామాణికం

అధ్యక్షాన్ వివిధాన్ కుర్యాత్తత్ర తత్ర విపశ్చితః । మూలశ్లోక సం.**62**
తేఽస్య సర్వాణ్యవేక్షేరన్నృణాం కార్యాణి కుర్వతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**81**

టీక:- వివిధాన్ = అనేక మంది, **విపశ్చితః అధ్యక్షాన్** = మేధావులు, ప్రతిభావంతులు, యోగ్యులైన విద్వాంసులను వివిధ విభాగాలకు అధ్యక్షులుగా నియమించాలి. **తత్ర తత్ర** = అవసరం బట్టి విభిన్న విభాగాలకు, **కుర్యాత్** = నియమించాలి, **అస్య** = ఈ రాజు ద్వారా నియుక్తులైన, **సర్వాణి** = సమస్తమైన, **కార్యాణి కుర్వతామ్** = తన అధీనంలో పనులు చేసే, **నృణాం** = కర్మచారులను, **అవేక్షేరన్** = నిరీక్షిస్తారు.

రాజ్యకార్యంలో వేరువేరుగా అధ్యక్షులను సభ నియమించాలి. ఎంతెంతమంది ఎన్ని ఎన్ని విభాగాలకు రాజపురుషులు ఉండాలనే నియమానుసారంగా ఉంటూ, వారందరూ తమ తమ పనులు నిర్వహిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని చూడటమే వీరి పని. నియతకర్మలను శ్రద్ధగా చేసేవారిని సత్కరిస్తూ చేయనివారిని దండిస్తూ ఉండాలి.

ఋషి దయానంద భాష్యం:-రాజు అనేకమంది మేధావులు, ప్రతిభావంతులు యోగ్యులైన విద్యాంసులను విభాగాలకు అధ్యక్షులుగా నియమించాలి. అవసరాన్ని బట్టి విభిన్న విభాగాలకు నియమించాలి. రాజు ద్వారా నియుక్తులైనవారు తమ అధీనంలో ఉన్న సమస్త పనులను వారే నిరీక్షిస్తారు. (స.ప్ర.6వ సము). ॥81॥

వివరణ:

1. కౌటిల్యుడి అర్థశాస్త్రానుసారంగా విభాగాధ్యక్షులు -

అర్థశాస్త్రం-22వ ప్రకరణం, 6వ అధ్యాయం నుండి 52వ అధ్యాయం వరకు గల అధికరణంలో యోగ్యత, శక్తి మరియు పరీక్షానుసారంగా అనేక మంది విభాగాధ్యక్షుల, ఉపవిభాగాధ్యక్షుల నియుక్త విధానముంది. కార్యానుసారంగా అధ్యక్ష పదవులను విభజించాలి. కౌటిల్యుడి ద్వారా పరిగణితమైన కొన్ని పదవుల విభాగాధ్యక్షుల విధానం ఇలా ఉంది.

1) సేనాధ్యక్షుడు – సంపూర్ణ సేనా నిరీక్షణ
2) కోశాగారాధ్యక్షుడు – ధనాగారాధ్యక్షుడు
3) ఆకరాధ్యక్షుడు – గనుల అధ్యక్షుడు
4) అక్షపలాధ్యక్షుడు – ఆదాయ వ్యయాలకు సంబంధించిన పనులు
5) కోష్ఠగారాధ్యక్షుడు – గడ్డుగల మహా నిరీక్షకుడు పెద్ద ధాన్యపుకొట్టుకు అధికారి
6) ఆయుధాగారాధ్యక్షుడు – యుద్ధసామాగ్రికి అధికారి
7) పణ్యాధ్యక్షుడు – మార్కెట్‌ను నియమించి, పరీక్షించే అధికారి
8) కుప్యాధ్యక్షుడు – అరణ్య వస్తువులకు అధ్యక్షుడు
9) స్వర్ణాధ్యక్షుడు – బంగారు, వెండిని నియంత్రించే అధికారి
10) లోహాధ్యక్షుడు – లోహం మొ॥ వస్తువులకు అధ్యక్షుడు

11) సీతాధ్యక్షుడు - కృషి విభాగానికి లేదా పన్ను రూపంగా వసూలైన ధాన్యానికి అధికారి.
12) శుల్కాధ్యక్షుడు - శుల్కం వసూలు చేసేవారి మీద అధికారి
13) పౌతవాధ్యక్షుడు - తూకములు, కొలతలు-పరీక్షించే అధికారి
14) మానాధ్యక్షుడు - దేశకాలమానములను నియంత్రించే అధికారి
15) సూత్రాధ్యక్షుడు - వస్త్రాలు, లేదా నూలు పరిశ్రమలకు అధికారి
16) సూనాధ్యక్షుడు - వధ్యస్థానమునకు అధ్యక్షాధ్యక్షుడు
17) నగరాధ్యక్షుడు - నగరానికి సంబంధించిన ప్రముఖ అధికారి
18) నావాధ్యక్షుడు - నౌకల పరివహనమునకు అధికారి
19) గో అధ్యక్షుడు - గోవు మొ॥ పాలిచ్చే పశువుల ఏర్పాటుకు అధికారి
20) అశ్వాధ్యక్షుడు - అశ్వ సేనకు సంబంధించిన అధికారి
21) హస్తి+అధ్యక్షుడు - గజ సేనకు సంబంధించిన అధికారి
22) రథాధ్యక్షుడు - రథసేనకు అధికారి
23) పత్త్యధ్యక్షుడు - పదాతిదళ అధికారి
24) ముద్రాధ్యక్షుడు - ముద్రణ వ్యవస్థకు అధికారి
25) వివితాధ్యక్షుడు - పశుగ్రాసాధికారి
26) లక్షణాధ్యక్షుడు - నాణ్యముద్రణాధికారి
27) ధర్మాధ్యక్షుడు - ధర్మనిర్ణయాధికారి

2. విపశ్చిత్ శబ్దానికి అర్థం-

విపశ్చిత్ = ప్రతిభాశాలి, మేధావి, విద్వాన్ అని అర్థం. 'విపశ్చిత్ మేధావీనామ'-నిరుక్తం. 3.15 యోగ్యులు, ప్రతిభావంతులైన, మేధావంతులనే రాజు వివిధ విభాగాలకు అధ్యక్షులుగా నియమించాలి.

రాజు స్నాతక విద్వాంసులను సత్కరించాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

ఆవృత్తానాం గురుకులాద్విప్రాణాం పూజకో భవేత్ । మూలశ్లోక సం. **63**
నృపాణామక్షయో హ్యేషనిధి బ్రాహ్మోఽభిధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **82**

టీక:- నృపాణాం బ్రాహ్మః ఏషః అక్షయః నిధిః అభిధీయతే = గురుకులంలో బ్రహ్మచర్య వ్రతధారియై వేదాన్ని అధ్యయనం చేసి స్నాతకుడై వచ్చిన విద్వాంసుడు ప్రభువులకు అక్షయమైన బ్రహ్మనిధి అవుతాడు. అంటే అతడు జ్ఞాననిధి. అలాంటి విద్యాస్నాతకులను తయారు చేసే వేద పండితులను కూడా రాజు దక్షిణల ద్వారా సన్మానిస్తూ ఉండాలి. తద్వారా, జ్ఞాననిధి తరగకుండా అధ్యయనాధ్యాపనాదులు నిర్విఘ్నంగా జరుగుతుంటాయి. దేశంలో జ్ఞానినిధి నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. అంటే ప్రభువు (ప్రభుత్వం) విద్యాభివృద్ధి కోసం గురుకులాలకు నిరంతరం సంపూర్ణంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:-గురుకులంలో వేదాధ్యయనాన్ని సాగించి వచ్చిన ద్విజ బ్రహ్మచారులను యోగ్యత తెలుసుకొని సమ్మానించాలి. ఈ విధమైన సత్కారం వల్ల, ఆ ద్విజుల ఆశీర్వచనాలు రాజుకు తరగని పెన్నిధులై నిలిచి

ఎల్లపుడూ కాపాడుతూంటాయి. వారి ద్వారా అక్షయలోకం పొందదగిన వేదప్రచారాన్ని యథావిధిగా చేయించాలి. (సం.ప్ర.6వ సము.)॥82॥

83 నుండి 86వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* న తం స్తేనా న చామిత్రా హరంతి న చ నశ్యతి ।
తస్మాద్రాజ్ఞా నిధాతవ్యో బ్రాహ్మణేష్వక్షయో నిధిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**83**

తాత్పర్యం:-ఈ ప్రకారం బ్రాహ్మణుల యందు రాజు ఉంచిన పుణ్యమనే నిధి దొంగలు అపహరించరు. శత్రువులకు వశం కాదు. దానికోసం అది తరగదు. కాబట్టి రాజు ఎన్నటికీ తరగని ధనధాన్యరూపమైనట్టి నిధిని బ్రాహ్మణుల అధీనంలో ఉంచాలి. అంటే బ్రాహ్మణులను సత్కరించి ఇవ్వాలని అర్థం! ॥83॥

* న స్కందతే న వ్యథతే న వినశ్యతి కర్హిచిత్ ।
వరిష్ఠమగ్ని హోత్రేభ్యో బ్రాహ్మణస్య ముఖే హుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**84**

తాత్పర్యం:-అగ్నిలో వ్రేల్చబడిన హవిస్సు అగ్నిలో పడక జారిపోవచ్చు. కిందపడవచ్చు! నలిగిపోవచ్చు! ఎండిపోవచ్చు! కాని బ్రాహ్మణుడి ముఖంలో వ్రేల్చబడిన హవిస్సు తొలగిపోదు. కిందపడదు. చెడిపోదు. ఎండిపోదు. కాబట్టి-అగ్నిలో పడవేయడం కంటే బ్రాహ్మణుడికి ఇవ్వడం మేలు! ॥84॥

* సమమబ్రాహ్మణే దానం ద్విగుణం బ్రాహ్మణబ్రువే ।
ప్రాధీతే శతసాహస్రమనంతం వేదపారగే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**85**

తాత్పర్యం:-బ్రాహ్మణేతరుడికి ఇచ్చేదానం సరికి సరైన ఫలితం కలిగిస్తుంది. బ్రాహ్మణుడి కిచ్చిన దానం రెండింతలు ఫలితాన్నిస్తుంది. వేదాధ్యయన సంపన్నుడైన విప్రుడికి ఇచ్చేదానం లక్షరెట్లు ఫలితదాయకం, చతుర్వేదపారంగతుడికి ఇచ్చినదానం అంతులేని ఫలితమిస్తుంది. ॥85॥

* పాత్రస్య హి విశేషేణ శ్రద్దధానతయైవ చ ।
అల్పం వా బహు వా ప్రేత్య దానస్య ఫలమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**86**

తాత్పర్యం:-దానం పుచ్చుకొనే బ్రాహ్మణుడి విద్య, తపస్సు, జీవిత విధిని బట్టి-దాతకు గల శ్రద్ధను బట్టి దానం కొద్దో-గొప్పో అయినా పరలోకంలో ఫలితమిస్తుంది. ॥86॥

ప్రక్షిప్తాల పరిశీలన

83 నుండి 86 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

82లో గురుకులం నుండి వచ్చిన స్నాతకులైన (విద్వాంసులు) రాజు స్వాగతం చెప్పాలని ఉంది. దాని మహిమను గురించి లేదు; అందుచేత దానితో జోడించి బ్రాహ్మణులకు దానం చేయటమూ, దానపు అతిశయించిన మహిమను చెప్పటమూ ఇక్కడ అసంగతం. 7.82వ శ్లోకంలో విద్యారూపమైన నిధిని అక్షయమని చెప్పారు కానీ, బ్రాహ్మణుల కిచ్చే దాన్ని గురించి కాదు. బ్రాహ్మణుల ధనం కూడా ఇతరుల ధనంలాగే నష్టమవుతుంది.

2. అంతర్ వ్యతిరేకాలు

83-84 శ్లోకాలలో బ్రాహ్మణులకు దానం చేయటం అగ్ని హోత్రం కన్నా గొప్ప దన్నారు. ఇది మనువుకు వ్యతిరేకం.

క. ఈ శరీరం అగ్నిహోత్రం వల్ల బ్రహ్మ ప్రాప్తికి యోగ్యమవుతుంది కనుక, మనువు దానం కన్నా అగ్నిహోత్రమే గొప్ప దన్నాడు. [2.3(28)].

ఖ. అక్కడక్కడా అగ్నిహోత్రం చేయటాన్ని తప్పనిసరిగా, చాలా అవసరంగా భావించాడే కానీ, దానాన్ని ఆ విధంగా చెప్పలేదు. [2.3(28), 44(69), 80-81 (105-106), 83(108), 161(286); 3.67-76; 4.21-25; 5.169; 6.4-11 మొదలైనవి].

గ. దానం పంచయజ్ఞాలలో ఒక భాగంగా చెప్పాడు - భిక్షాదానం వగైరా [3.94]. దానం అంగం, పంచయజ్ఞాలు అంగి అయితే, సహజంగానే అగ్నిహోత్రపు ప్రాముఖ్యం తెలుస్తూంది. ఇలా ఈ శ్లోకాలు మనువుకు వ్యతిరేకాలు.

ఘ. 85-86 శ్లోకాలలో పాత్రతను వర్ణన చేస్తూ 'అబ్రాహ్మణుల'కూ దానం గ్రహించే పాత్రత ఉందన్నారు. ఇది మనువు చెప్పిన కర్మణా వర్ణవ్యవస్థకే వ్యతిరేకం. మనువు కేవలం బ్రాహ్మణులకే దానం గ్రహించే అధికారం ఉందని ప్రకటించాడు[1.88,10.75-76]. మిగిలిన వర్ణాల వారు దానం చేయవలసినవారని చెప్పాడు.

ఙ. మనువు చెప్పిన కర్మణా వర్ణ వ్యవస్థను అనుసరించి నిర్ధారించిన కర్తవ్యాల పాలన చేసిన విద్వాంసుడే బ్రాహ్మణుడు, కేవలం 'బ్రాహ్మణ బ్రువ' - అంటే బ్రాహ్మణ నామధారి బ్రాహ్మణుడు కాదు. 'అవేద విద్' వేద విదుడు కాని బ్రాహ్మణుడికి దానం చేయటాన్ని కూడా నిషేధించాడు మనువు [4.190-194]. ఈ శ్లోకాలలోని వర్ణన మనువు మౌలిక వ్యవస్థకే వ్యతిరేకం. ఇలా పలు అంతర్ వ్యతిరేకా లున్నాయి కనుక, 83-86 శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజువవుతూంది.

3. శైలీగత ఆధారాలు

అన్ని శ్లోకాల శైలీ నిరాధారమూ, అతిశయోక్తులు నిండినదీ, పైగా 85-86 శ్లోకాల శైలి సహేతుకం కాదు. సమానం, రెట్టింపు, వెయ్యి రెట్లు మొదలైన ఫలాలను నిర్ణయించటమూ నిరాధారమే. ఈ శైలి ఆధారంగా ఇవి మనువు చెప్పినవి కావని తేలిపోతూంది.

యుద్ధానికి వెళ్ళడం- యుద్ధసంబంధమైన వ్యవస్థ - **ఇది మనుకృతం-ప్రామాణికం**

సమోత్తమాధమై రాజా త్వాహూతః పాలయన్ ప్రజాః । మూలశ్లోక సం. 64
న నివర్తేత సంగ్రామాత్ క్షాత్రం ధర్మమనుస్మరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 87

టీక:- ప్రజాః పాలయన్ రాజా = ప్రభువు ప్రజలను పాలిస్తూ, **సమ+ ఉత్తమ+అధమైః ఆహూతః తు** = సమానమైనవారు గాని, అధికులు గాని, లేదా అధములు గాని యుద్ధానికి ఆహ్వానించినప్పుడు, **క్షాత్రం ధర్మమ్ అనుస్మరన్** = క్షత్రియ ధర్మమైన వీరత్వాన్ని స్మరిస్తూ, **సంగ్రామాత్ న నివర్తేత** = సంగ్రామానికి రానని చెప్పకూడదు. ప్రతాపాన్ననుసరించి యుద్ధం చేయాలి. తద్వారా తాను విజయాన్ని పొందాలి.

తాత్పర్యం:-ప్రభువు ప్రజలను పాలిస్తూ తనతో సమానుడైనా, అధికుడైనా, నీచుడైనా సరే ! యుద్ధానికి పిలిచినట్లయితే రాజు క్షత్రియధర్మాన్ననుసరించి భయపడక యుద్ధానికి వెళ్లాలి. భీతి చేత అక్కడ నుంచి వెనుతిరగరాదు. తద్వారా తాను విజయాన్ని పొందాలి. ఎల్లపుడు తనకు విజయం లభించునట్లు మిక్కిలి నేర్పుతో సాధన చేయాలి. (స.ప్ర. 6వ సము.).॥87॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* సంగ్రామేష్వనివర్తిత్వం ప్రజానాం చైవ పాలనమ్ ।
శుశ్రూష బ్రాహ్మణానాం చ రాజ్ఞాం శ్రేయస్కరం పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *88*

తాత్పర్యం:-ఎందుకంటే-యుద్ధం నుంచి మరలకపోవడం, ప్రజలను పరిపాలించడం, బ్రాహ్మణులకు శుశ్రూష చేయడం అనేవి రాజుకు మిక్కిలి శ్రేయస్కరమైనవి. (ప్రధానమైన యుద్ధధర్మాలు ఇలా ఉంటాయి....) ॥88॥

ప్రక్షిప్త పరిశీలన

88వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది -

1. ప్రసంగ వ్యతిరేకం

ఈ 88వ శ్లోకం పూర్వాపర ప్రసంగాలను భంగం చేస్తూంది. పూర్వాపర ప్రసంగాలలో యుద్ధం నుంచి వెనుదిరగకూడ దని ఉంది. 87వ శ్లోకంలో ఈ విషయమూ, 89లో దాని ఫలితమూ ఉన్నాయి. మరొక విధంగా చెప్పాలంటే, 87వ యుద్ధం నుంచి పరాఙ్ముఖం కాకూడదనీ, 89లో అపరాఙ్ముఖం (వెనుదిరగటం) కావచ్చుననీ, దాని ఫలితమూ ఉంది. ఇలా 87వ శ్లోకం, 89కి అర్థవాద రూపం అవుతుంది. అందుచేత పరస్పర సంబద్ధం అవుతుంది. మధ్యలో ఈ శ్లోకం ఆ సంబద్ధతను భంగం చేయటమే కాకుండా, రాజుకు పరమ శ్రేయస్కరమైన కర్తవ్యాలను గురించి ప్రసంగ వ్యతిరేకమైన విషయాన్ని చెబుతూంది. ఎవరైనా **"సంగ్రా మేషు అని వర్తిత్వం"** అని ఈ ప్రసంగంతో సంబద్ధమవుతుందంటే, అది కూడా పద్ధతి కాదు. ఎందుకంటే 87, 89 శ్లోకాలలో ఇదే చెప్పారు. ఇలా ప్రసంగ వ్యతిరేకం కావటం చేత ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఇందులో రాజుకు శ్రేయస్సు కలిగించే పనులు చెబుతూ, 'బ్రాహ్మణుల సేవ' కూడా రాజుల ముఖ్య కర్తవ్యంగా చెప్పారు. 1.87; 7.144 శ్లోకాల ప్రకారం, క్షత్రియ ధర్మాలలో ప్రజల పాలన మొదలైనవే ముఖ్య కర్తవ్యా లన్నారు. మనువు మౌలిక వ్యవస్థలో బ్రాహ్మణుల సేవ క్షత్రియులకు ప్రత్యేక కర్తవ్యం కాదు. అందుచేత ఇది మనుసమ్మతం కాదు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆహవేషు మిథోఽన్యోన్యం జిఘాంసంతో మహీక్షితః । మూలశ్లోక సం. **65**
యుద్ధ్యమానాః పరం శక్త్యా స్వర్గం యాంత్యపరాఙ్ముఖాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **89**

టీక:- **ఆహవేషు** = యుద్ధాలలో **అన్యః అన్యం జిఘాం సన్తః** = ఒకరు మరొకరిని చంపాలనే కోరిక కలవారై, **మహీక్షితః** = భూపతులు (రాజులు), **పరం శక్త్యా, అపరాఙ్మఖాః** = సామర్థ్యమున్నంత వరకు భయభీతులు కాకుండా, **యుద్ధ్య మానాః** = సంగ్రామం చేస్తారో, వారు **స్వర్గం యాన్తి** = స్వర్గాన్ని పొందుతారు. అంటే సుఖవంతులవుతారు.

ఋషి దయానందభాష్యం:- రాజులు యుద్ధాలలో ఒండొరులను చంపగోరినవారలై, తమ శక్తికొద్దీ యుద్ధం చేస్తూ, యుద్ధం నుండి మరలక అక్కడ మృతినొందిరేని, స్వర్గం పొందుతారు.

రాజులు యుద్ధంలో ఒకర్నొకరు జయింపకోరినవారై తమ శక్తివంచన లేకుండా రణోత్సాహం ప్రదర్శించాలి. అలా ఉత్సహించి యుద్ధం చేస్తుండగా, రణభూమిలో మరణిస్తే స్వర్గమే.

అప్పుడప్పుడు శత్రువులను జయించడానికి, ఉద్రేకంలో కండ్లు మూసుకొని శత్రువును జయించడం కూడా రాజనీతి. ఏ విధంగానైనా శత్రువును జయించడమే ధ్యేయం. క్రోధావేశంలో సింహం శస్త్రాగ్నిలో దుముకి భస్మమైనట్లుగా, మూర్ఖంగా శత్రుచేతిలో నశించరాదు. (స.ప్ర. 6వ సము.) ॥89॥

ఇది ప్రక్షిప్తం-ప్రామాణికం కాదు

*   న కూటైరాయుధైర్హన్యాద్యుధ్యమానో రణే రిపూన్ ।
న కర్ణిభీర్నాపి దిగ్ధైర్నాగ్నిజ్వలిత తేజనైః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***90***

తాత్పర్యం:-యుద్ధంలో కొన్ని నీతులు-రీతులు పాటించాలి. పైకి కట్టెలాగా కన్పింపచేస్తూ లోపల ఆయుధం దాచి శత్రువును కొట్టరాదు. కర్ణములు గల ఆయుధంతో చంపరాదు. అగ్నిలో ప్రజ్వలింపచేసినదీ-విషం పూసినదీ అయిన బాణాలను ప్రయోగించరాదు. ॥90॥

ప్రక్షిప్త పరిశీలన

90వ శ్లోకం ప్రక్షిప్తం-

1. ప్రసంగ వ్యతిరేకం

ఇక్కడున్న పూర్వాపర ప్రసంగంలో **'పరస్పర యుద్ధాలలో ఎవరెవరిని చంపకూడదు?'** అనేది దీనితో కలుస్తుంది. ఏ ఆయుధాలతో చంపా లనేది విషయం కాదు. మధ్యలో ఆయుధాలతో చంపకూడ దనటం పూర్వాపర ప్రసంగ వ్యతిరేకం కనుక ప్రక్షిప్తం. శాస్త్రాలలో ప్రయోగించదగినవి, ప్రయోగించదగనివి అనే విషయం తర్వాత వస్తుంది.

91-108వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

యుద్ధంలో ఎవరిని చంపకూడదు? -

న చ హన్యాత్ స్థలారూఢం న క్లీబం న కృతాంజలిమ్ ।   మూలశ్లోక సం. **66**
న ముక్తకేశం నాసీనం న తవాస్మీతి వాదినమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **91**

టీక:-తాను రథం మీద నుండి నేలమీద ఉన్న శత్రువును వధించరాదు. యుద్ధ సమయంలో అటు ఇటు తిరుగరాదు. నపుంసకుణ్ణి వధించరాదు, **స+కృత+అంజలిమ్** = చేతులెత్తి నమస్కరించువాణ్ణి, **న ముక్తకేశం** = తల వెంట్రుకలు మూడివేసికొన్న వాడిని, కూర్చున్న వాడిని, **న తహ +అస్మి +ఇతి + వాదినమ్** = నేను మీ వాడినని చెప్పుకొనేవాడిని చంపరాదు.

ఋషి దయానందభాష్యం:-తాను రథంమీద నిలిచి, రథశూన్యుడై నేలపడి ఉన్నవాణ్ణి ఏ ఆయుధంతోనూ కొట్టరాదు. యుద్ధాన్ని చూస్తూ దూరంగా ఉన్నవాణ్ణి, యుద్ధంలో నపుంసకుణ్ణి చంపరాదు. యుద్ధం జరుగుతూండగా గాని-విరామవేళలో గాని తనను శరణుకోరినవారిని చంపరాదు. తల విరబోసుకున్నవాడిని, కూర్చొని ఉన్నవాడిని, పాదాక్రాంతుణ్ణి చంపకూడదు. (స.ప్ర.6వ.సము).॥91॥

ఇది మనుకృతం-ప్రామాణికం

న సుప్తం న విసన్నాహం న నగ్నం న నిరాయుధమ్ ।   మూలశ్లోక సం. **67**
నాయుధ్యమానం పశ్యంతం న పరేణ సమాగతమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **92**

టీక:- **న సుప్తం** = నిద్రిస్తున్నవాడిని, **న విసన్నాహం** = మూర్ఛితుణ్ణి, **న నగ్నం** = దిసిమొల వాడిని, **న నిరాయుధమ్** = ఆయుధం చేతిలో లేని వాడిని, **న పరేణ సమాగతమ్** = మరొకరితో యుద్ధం చేసేవాడిని, **న అయుధ్యమానం** = యుద్ధం చేయకుండా కేవలం యుద్ధం చూసేవాడిని. **పశ్యంతం** = ఇతరులలో యుద్ధం చేస్తూ ఉండేవాడిని చాటుగా అయిన చంపరాదు.

ఋషి దయానందభాష్యం:- నిద్రిస్తున్నవాడిని, మూర్ఛితుణ్ణి, వస్త్రహీనుడిని, ఆయుధహీనుడిని, తనతో యుద్ధం చేయనివాడిని, కేవలం యుద్ధం చూసేవాడిని, ఇతరులతో యుద్ధం చేస్తూ ఆ లక్ష్యంలో ఉండేవాడిని చాటుగా కూడా చంపకూడదు. (స.ప్ర. 6వ సము.). ॥92॥

ఇది మనుకృతం.ప్రామాణికం

నాయుధవ్యసనప్రాప్తం నార్తం నాతిపరిక్షతమ్ । మూలశ్లోక సం. **68**
న భీతం న పరావృత్తం సతాం ధర్మమనుస్మరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **93**

టీక:- **న ఆయుధ వ్యసన ప్రాప్తం** = ఆయుధం విరిగిపోయినవాడిని, **నాతి పరిక్షతమ్** = ఎక్కువగా దెబ్బలు తగిలిన వాడిని, **న భీతం** = భయపడినవాడిని, **పరావృత్తం** = వెనక్కి మరలడానికి సిద్ధమై వెన్ను చూపినవాడిని, **సతాం ధర్మమనుస్మరన్** = సత్పురుషులైన క్షత్రియుల ధర్మాన్ని స్మరించుకొని చంపరాదు.

ఋషి దయానందభాష్యం:- ఆయుధాలు కోల్పోయినా-విరిగిపోయినా తెల్లబోయి నిల్చిన వాడిని, విపరీతంగా భయపడినవాడిని, దెబ్బలచేత బాగా నొచ్చి వున్న వాడిని, వెనక్కి వెళ్ళడానికి సిద్ధమై వెన్నుచూపినవాడిని చంపడం శిష్టక్షత్రియధర్మం అనిపించుకోదు. (స.ప్ర. 6వ.సము.)

కానీ వారిని, పట్టుకొని, మంచివారిని బంధీగృహంలో బంధించి, భోజనాచ్ఛాదనాదులు యథావిధిగా ఇవ్వాలి. క్షతగాత్రులైనవారిని ఔషధాదులు ఇచ్చి చికిత్స చేయించాలి. వారిని అవమానించరాదు, దుఃఖపెట్టరాదు, వారు చేయగలిగిన పనిని వారిచేత చేయించాలి. స్త్రీలు, పిల్లలు, గాయపడినవారు, వృద్ధులు, చింతాగ్రస్తులైనవారి మీద ఆయుధాన్ని ప్రయోగించరాదు. వారి పిల్లలను తమ బిడ్డలలాగా పాలించాలి. స్త్రీలను కూడా పోషించాలి. తమ చెల్లెండ్రలాగా, కన్యల లాగా చూడాలి. వారిని ఎప్పుడూ విషయాసక్తితో చూడరాదు. మన రాజ్యం స్థిరపడి, శాంతంగా ఉన్నప్పుడు, మళ్ళీ మళ్ళీ శత్రువులు యుద్ధసన్నాహాలు చేసే స్థితిలో లేనప్పుడు వారిని సత్కారపూర్వకంగా వదిలిపెట్టి వాళ్ళ వాళ్ళ ప్రదేశాలకు పంపించాలి. ఎవరి వల్ల భవిష్యత్తులో విఘ్నాలు కలుగగలవని అనుమానమున్నట్లయితే వారిని సదా కారాగారంలో ఉంచాలి. ॥93॥

యుద్ధం నుండి పారిపోయేవాడు అపరాధియే అవుతాడు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

యస్తు భీతః పరావృత్తః సంగ్రామే హన్యతే పరైః । మూలశ్లోక సం. **69**
భర్తుర్యద్దుష్కృతం కించిత్తత్సర్వం ప్రతిపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **94**

టీక:- **యః తు** = ఎవడైతే, **సంగ్రామే** = యుద్ధ క్షేత్రంలో, **పరావృత్తః** = వీపు చూపించి పారిపోవునో లేదా, **భీతః పరైః హన్యతే** = భయపడి పారిపోతూ, శత్రువుల ద్వారా చంపబడునో, అతడికి, **భర్తుః** = రాజుగారి వైపు నుండి లభించే, **యత్ కించిత్ దుష్కృతం** = ఏ కొంచెం దండన, అపరాధం లేదా పాపం ఉందో, **తత్సర్వం ప్రతిపద్యతే** = ఆ సమస్తానికి పాత్రుడై, అంటే రాజు అతనికున్న సుఖాస్పదమైన అవకాశాలనన్నిటిని తగ్గించి దండిస్తాడు.

ఋషి దయానందభాష్యం:-"ఎవడు యుద్ధం నుండి వెనుజూపి పరుగెత్తి పోవునో, లేదా భయపడి శత్రువుల చేత చంపబడునో, అతడు ప్రభువు ద్వారా అపరాధానికి దండనీయుడవుతాడు" (స.ప్ర. 6వ సము.).॥94॥

వివరణ:

దుష్కృతం = పాపం. పాపానికి పర్యాయపదాలను 8-91వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

యచ్చాస్య సుకృతం కించిదముత్రార్థముపార్జితమ్ । మూలశ్లోక సం.70
భర్తా తత్సర్వమాదత్తే పరావృత్తహతస్య తు ॥ ప్రక్షిప్త శ్లోక సం.95

టీక:- చ = మరియు, **యత్ కించిత్ అస్య సుకృతం** = అతడు సంపాదించిన సుకృతం, పుణ్యం ప్రతిష్ఠ ఏది ఉందో, **అముత్రార్థమ్ + ఉపార్జితమ్** = ఈ లోకంలో, పరలోకంలో సుఖాన్ని ఇస్తుందో, **తత్ సర్వం భర్తా ఆదత్తే** = దానినంతటినీ అతని ప్రభువు స్వీకరిస్తాడు, **పరావృత్తవాతస్య తు** = పారిపోతూ చంపబడినవాడికి కొంచెం కూడా సుఖం (పుణ్యం) లభించదు.

ఋషి దయానందభాష్యం:- ఈ విధంగా కుటిలంగా చంపబడినవాడు (ఎంతపాపి అయినప్పటికీ) చంపినవాడు సంపాదించిన పుణ్యం, సుకృతం ఏ కొంచెం ఉన్నా ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాన్ని ఇస్తుందో, దాన్నంతా అతడి ప్రభువు స్వీకరిస్తాడు. పారిపోతూ చంపబడిన వాడికి ఏ కొంచెం సుఖంగానీ పుణ్యంగానీ లభించదు.

అతడి పుణ్యరూపమైన ఫలం నష్టమైపోతుంది. అతడి పుణ్యం ధర్మానుసారంగా యుద్ధం చేసిన రాజుకు చెందుతుంది. (స.ప్ర. 6వ సము.).॥95॥

ఇది మనుకృతం-ప్రామాణికం

రథాశ్వం హస్తినం ఛత్రం ధనం ధాన్యం పశూన్ స్త్రియః । మూలశ్లోక సం.71
సర్వద్రవ్యాణి కుప్యం చ యో యజ్జయతి తస్య తత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.96

టీక:- ఈ వ్యవస్థను ఎప్పుడూ వదలరాదు, **యః యత్** = యుద్ధంలో, అమాత్యుడు గానీ అధ్యక్షుడుగానీ, ఏ ఏ వస్తువులను, **రథ+అశ్వం హస్తినం ఛత్రం ధనం ధాన్యం పశూన్ స్త్రియః** = అశ్వం, గజం, రథం, ధనం గాని, గోవుగాని, స్త్రీలుగాని, **చ** = అలాగే,**సర్వ ద్రవ్యాణి** = ఇతరాలైన సర్వద్రవ్యాలు, **కుప్యం** = నెయ్యి, నూనె మొ॥ వాటిని, **జయతి** = జయిస్తాడో, **తత్ తస్య** = అవి వారికే చెందుతాయి. జయించినవారికే చెందుతాయి.

ఋషి దయానందభాష్యం:- యుద్ధంలో జయించిన అమాత్యుడు గానీ,అధ్యక్షుడుగానీ ఓడిన వాడికి గల రథాలు, గజములు, గుర్రాలు, గొడుగులు, ధనం, ధాన్యం, పశువులు, స్త్రీలు, సకల ద్రవ్యములు, వెండి, బంగారు మొదలైన వన్నీ కూడా వారికే చెందుతాయి. (స.ప్ర. 6వ సము.).॥96॥

జయించిన ధనం నుండి రాజుకు కొంత ఇవ్వాలి -

ఇది మనుకృతం-ప్రామాణికం

రాజ్ఞశ్చ దద్యురుద్ధారమిత్యేషా వైదికీ శ్రుతిః । మూలశ్లోక సం.72
రాజ్ఞా చ సర్వయోధేభ్యో దాతవ్యమపృథగ్జితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.97

టీక:- చ = కాని, సేనలో ఉన్నవారు జయించిన పదార్థాల నుండి, **ఉద్ధారం రాజ్ఞః దద్యుః** = 16వ భాగాన్ని రాజుకు ఇవ్వాలి! **రాజా** = రాజు కూడా, **సర్వయోధ్యేభ్యః** = సేనలో ఉన్న సైనికులందరికీ, **అపృథక్ జితమ్** = అందరూ కలిసి జయించిన ధనం నుండి (16వ భాగాన్ని) ఇవ్వాలి.

ఋషి దయానందభాష్యం:-రాజుకు ఉదార్ధ 16వ భాగాన్ని ఇవ్వాలని వైదిక శ్రుతి చెబుతున్నది. రాజుకూడా యుద్ధంలో సమష్ఠిగా జయించిన వస్తువులను యుద్ధవీరుల బలశక్తులకు తగినట్లు బహుమతులుగా పంచిపెట్టాలి.

యుద్ధంలో మృతులైనవారి భార్యలకు, సంతానానికి వారి భాగములు ఇవ్వాలి. విధవలైన స్త్రీలను, అసమర్థులైన బాలబాలికలను, సమర్థులయ్యేంతవరకు వారిని పోషించాలి. వారికి తగిన అధికారం ఇవ్వాలి.

స్వీయరాజ్యం యొక్క అభివృద్ధిని, ప్రతిష్ఠను, విజయాన్ని ఆనందాభివృద్ధిని కోరి ఏ ప్రభువైనా ఈ మర్యాదను ఎప్పుడూ ఉల్లంఘించరాదు. (స.ప్ర. 6వ సము.). ॥97॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషోఽనుపస్కృతః ప్రోక్తో యోధధర్మస్సనాతనః । మూలశ్లోక సం. **73**
అస్మాద్ధర్మాన్న చ్యవేత క్షత్రియో ఘ్నన్ రణే రిపూన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **98**

టీక:- **ఏషః** = ఇది **అనుపకృతః** = అనిందింతం, **సనాతనః** = సర్వదా మాన్యం అయిన, **యోధధర్మః** = యోధులకున్న ధర్మం, **క్షత్రియో** = క్షత్రియ వ్యక్తి, **రణే రిపూన్ ఘ్నన్** = యుద్ధంలో శత్రువులను హత్య చేస్తూ, **అస్మాత్ ధర్మాత్ న చ్యవతే** = ఈ ధర్మానికి దూరం కారాదు.

తాత్పర్యం:- యుద్ధవీరులకిది శాశ్వతంగా ఏర్పడి ఉండు ధర్మం, క్షత్రియుడు యుద్ధంలో శత్రువులను చంపుతూ ఈ ధర్మం నుండి దూరం కారాదు. ॥98॥

రాజు ఆలోచించాల్సిన విషయాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

అలబ్ధం చైవ లిప్సేత లబ్ధం రక్షేత్ ప్రయత్నతః । మూలశ్లోక సం. **74**
రక్షితం వర్ధయేచ్చైవ వృద్ధం పాత్రేషు నిక్షిపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **99**

టీక:- రాజు, రాజసభ్యులు, **అలబ్ధం చ +ఏవ లిప్సేత** = లభించని రాజ్యాన్ని పొందడం కోసం ఆశించాలి. **లబ్ధం ప్రయత్నతః రక్షేత్** = లభించిన దాన్ని, ప్రయత్నించి రక్షించుకోవాలి. **రక్షితం వర్ధయేత్** = రక్షించిన దాన్ని అభివృద్ధి చేసుకోవాలి, **వృద్ధం పాత్రేషు నిక్షిపేత్** = పెరిగిన ధనాన్ని వేద విద్యాభివృద్ధికి, ధర్మప్రచారానికి, విద్యార్థులకు, వేదమార్గోపదేశకులకు, అలాగే అసమర్థులైన అనాథలను పాలించడం కోసం వ్యయం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- రాజు తనకు లభించని రాజ్యాన్ని పొందడం కోసం ఆశించాలి. లభించిన్న దాన్ని పూనికతో సంరక్షించుకోవాలి. రక్షింపబడిన దాన్ని వృద్ధిచేయాలి. అలా వృద్ధియైన ధనాన్ని వేదవిద్యాభివృద్ధికీ, ధర్మప్రచారానికి, విద్యార్థులకూ వేద మార్గోప దేశకులకూ అలాగే అసమర్థులైన అనాథలను పాలించడం కోసం వ్యయం చేయాలి. (స.ప్ర. 6వ సము.) ॥99॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతచ్చతుర్విధం విద్యాత్పురుషార్థప్రయోజనమ్ । మూలశ్లోక సం. **75**
అస్య నిత్యమనుష్ఠానం సమ్యక్కుర్యాదతంద్రితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **100**

టీక:- **ఏతత్ చతుర్విధం** = ఈ నాలుగు విధానాలే, **పురుషార్థప్రయోజనమ్** = రాజ్యం కోసం పురుషార్థం చేయడంలో ఉద్దేశమని, **విద్యాత్** = తెలిసికోవాలి ప్రభువు, **అతంద్రితః** = ఆలస్యరహితుడై, (సోమరితనాన్ని వదిలి), **అస్య నిత్యం సమ్యక్ అనుష్ఠానం కుర్యాత్** = ఈ ఉద్దేశాన్ని సదైవ పాలిస్తూ ఉండాలి.

తాత్పర్యం:- ఈ నాలుగు విధానాలే పురుషార్థం చేయడంలో ఉద్దేశమని తెలుసుకోవాలి. ప్రభువు ఆలస్యరహితుడై ఈ ఉద్దేశాన్ని సదైవ పాలిస్తూ ఉండాలి. (స.ప్ర. 6వ సము.) ॥100॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అలబ్ధమిచ్ఛేద్దండేన లబ్ధం రక్షేదవేక్షయా । మూలశ్లోక సం. **76**
రక్షితం వర్ధయేద్వృద్ధ్యా వృద్ధం పాత్రేషు నిఃక్షిపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **101**

టీక:- **దండేన అలబ్ధమ్ + ఇచ్ఛేత్** = దండం, యుద్ధం వల్ల రాని రాజ్యాన్ని రాబట్టుకోడానికే ఆశించాలి, **అవేక్షయా** = నిత్యం జాగరూకతతో, **లబ్ధం రక్షేత్** = లభించిన రాజ్యాన్ని రక్షించుకోవాలి, **రక్షితం వృద్ధ్యా వర్ధయేత్** = రక్షించుకొన్న రాజ్యాన్ని వ్యాపారాదుల ద్వారా పెంచాలి, **వృద్ధం** = పెరిగిన ధనాన్ని పూర్వోక్త పద్ధతిలో (74) నిత్యం వ్యయం చేస్తూ ఉండాలి. **అర్థాత్** = అంటే, **పాత్రేషు నిక్షిపేత్** = యోగ్యులకు యోగ్య మార్గంలో వ్యయం చేయాలి.

ఋషి దయానందభాష్యం:-రాజాధి రాజ పురుషుడు, రాని రాజ్యాన్ని పొందాలని తలంచిట్లయితే, దండమే (యుద్ధమే) మూలం. ప్రాప్తించిన రాజ్యాన్ని రక్షించుకోవాలి. రక్షితమైన రాజ్యాన్ని, ధనాన్ని సత్పాత్రులకు, సత్య విద్యలకు సత్య ధర్మప్రచారం మొ॥ ఉత్తమ సత్కార్యాలకు వ్యయం చేయాలి. ఆ విధంగా రాజ్యం ద్వారా రక్షిత ధనాదుల ద్వారా ప్రజాభ్యున్నతి కోసం వ్యయం చేస్తూ ఉండాలి. (స.ప్ర. 6వ సము.).॥101॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిత్యముద్యతదండః స్యాన్నిత్యం వివృతపౌరుషః । మూలశ్లోక సం. **77**
నిత్యం సంవృత సంవార్యో నిత్యం ఛిద్రానుసార్యరేః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102**

టీక:- రాజైనవాడు; **నిత్యమ్+ఉద్యత దండః స్యాత్** = ఎల్లప్పుడు న్యాయానుసారంగా దండన(శిక్షను) విధించడంలో జాగ్రత్తగా ఉండాలి, **నిత్యం వివృతపౌరుషః** = సదా పరాక్రమాన్ని ప్రదర్శించడానికి సిద్ధంగా ఉండాలి. **నిత్యం సంవృత సంవార్యః** = ఎప్పుడూ, రాజ్య వ్యవహారాలను గుప్తంగా ఉంచాలి, **నిత్యం అరేః ఛిద్రానుసారీ** = సదైవ శత్రువు యొక్క ఛిద్రాలను (లోపాలను) వెతుకుతుండాలి. ఆ లోపాలను తెలిసికొని సమయం దొరికినప్పుడు వెంటనే తన హితాన్ని నేర్పరితనంగా పూర్తి చేసికోవాలి.

తాత్పర్యం:- ఎల్లప్పుడు దండధారియై చతురంగబలమును సిద్ధపరుచుకొని, తన పరాక్రమం ప్రదర్శించడానికి సిద్ధంగా ఉండాలి ఎల్లప్పుడు తన రహస్యాలను గుప్తంగా ఉంచాలి. శత్రువుల లోపాలను వెతుకుతూ ఉండాలి.॥102॥

వివరణ:

'ఛిద్ర' శబ్ద వ్యుత్పత్తికోసం (7-80వ) శ్లోకంలోని వివరణ చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

నిత్యముద్యతదండస్య కృత్స్నముద్విజతే జగత్ । మూలశ్లోక సం. **78**
తస్మాత్సర్వాణి భూతాని దండేనైవ ప్రసాధయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **103**

టీక:- **నిత్యమ్+ఉద్యత దండస్య** = ఏ రాజు యొక్క రాజ్యంలో సర్వదా దండప్రయోగం (నిరంకుశంగా శిక్షలు వేయబడుననే భావం) ప్రజలలో వ్యాపించినప్పుడు ఆ రాజును చూచి, **కృత్స్నం జగత్ ఉద్విజతే** = సమస్త ప్రజలు భయభీతులవుతారు, **తస్మాత్** = అందువల్ల, **సర్వాణి భూతాని** = సర్వప్రాణులను, **దండేనైవ ప్రసాధయేత్** = దండన భయం ద్వారానే అనుశాసనంలో ఉంచాలి అనగా క్రమశిక్షణలో పెట్టాలి.

తాత్పర్యం:- ఏ రాజ్యంలో రాజు ఎల్లప్పుడు దండధారి అయి ఉంటాడో సకలజనులు భయపడతారు. కాబట్టి సకల జంతువులను దండం చేతనే స్వాధీనపరుచుకోవాలి. ॥103॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అమాయయైవ వర్తేత న కథంచన మాయయా । మూలశ్లోక సం. **79**
బుద్ధ్యేతారిప్రయుక్తాం చ మాయాం నిత్యం స్వసంవృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104**

టీక:- **కథంచన** = ఎప్పుడు కూడా , **మాయయా న వర్తేత** = ఎవరితోనూ మోసపూర్వకంగా ప్రవర్తించరాదు, కానీ , **అమాయయా+ఏవ** = నిష్కపటంగా అందరితో వ్యవహరించాలి, **చ** = మరియు, **నిత్యం స్వసంవృత్తః** = ఎల్లప్పుడూ తనను రక్షించుకొంటూ, **అరిప్రయుక్తాం మాయాం బుధ్యేత** = శత్రు ప్రయుక్తమైన మాయను (మోసాన్ని) గుర్తించి నివృత్తుడు కావాలి.

తాత్పర్యం:- తన మంత్రుల పట్ల రాజు మోసపు నడవడితో ఉండరాదు. అలా ఉన్నట్లయితే అందరికీ నమ్మదగనివాడవుతాడు కాబట్టి ధర్మ సంరక్షణ కోసం వారిపట్ల వాస్తవమైన మార్గంలోనే నడచుకోవాలి. రాజు తనను రక్షించుకొంటూ, శత్రువు చేసే మాయలను ఎల్లప్పుడు చారుల ద్వారా గుర్తించి నివృత్తుడు కావాలి.(స.ప్ర.6వ.సము.)॥104॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నాస్య ఛిద్రం పరో విద్యాద్విద్యాచ్ఛిద్రం పరస్య తు । మూలశ్లోక సం.80
గూహేత్కూర్మ ఇవాంగాని రక్షేద్వివరమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.105

టీక:- **పరః అస్య ఛిద్రం న విద్యాత్** = ఏ శత్రువుకు కూడా తన ఛిద్రం (నిర్బలత) తెలియనీయరాదు, **తు** = మరియు, **పరస్య ఛిద్రం విద్యాత్** = స్వయంగా శత్రువుల బలహీనతలను తెలిసికోవాలి, **కూర్మ+ఇవ+ అంగాని** = తాబేలు తన అవయవాలను గోప్యంగా ఉంచుకొన్న విధంగా, అలాగే, **ఆత్మనః వివరం గూహేత్ రక్షేత్** = తన లోపాలను, బలహీనతలను శత్రువుకు తెలియకుండా రక్షించుకోవాలి.

ఋషి దయానంద భాష్యం:- తన దోషాలను శత్రువులకు తెలియనీయరాదు. స్వయంగా శత్రువుల బలహీనతలను తెలుసుకోవాలి. తాబేలు తన అవయవాలను గోప్యంగా ఉంచుకొన్న విధంగా తన రాజ్యాంగాలను లోపాలను, బలహీనతలను శత్రవుకు తెలియకుండా సంరక్షించుకోవాలి.(స.ప్ర.6వ సము) ॥105॥

వివరణ:

1. ఛిద్రమంటే...

ఛిద్రమంటే లోపం, బలహీనత, నిర్బలత్వం మొదలయిన బలహీనతలు- వీటిని పసిగట్టి శత్రువు మన మీదికి దండెత్తి రాగలడు. కాబట్టి మన లోపాలు శత్రువుకు తెలియకుండా జాగ్రత్తపడాలి. **"ఛినత్తియత్ తత్ ఛిద్రమ్ = న్యూనత్వం, ఛిదిర్ ద్వైధీకరణే**-ధాతువు నుండి 'స్ఫాయిత ఞ్చి'- ఉణాది 2.13 సూత్రం ద్వారా 'రక్' ప్రత్యయం చేర్చగా 'ఛిద్ర' శబ్దం ఉత్పన్నమవుతుంది.

2. కౌటీల్యుడి ద్వారా ఉద్ధృత శ్లోకం-పైన పేర్కొన్న మనువు యొక్క శ్లోకాన్ని కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో 10వ ప్రకరణం, 14వ అధ్యాయంలో సామాన్య పాఠభేదంతో ఉదాహరించాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

బకవచ్చింతయే దర్థాన్ సింహవచ్చ పరాక్రమేత్ । మూలశ్లోక సం.81
వృకవచ్చావలుంపేత శశవచ్చ వినిష్పతేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.106

టీక:- **బకవత్ అర్థాన్ చిన్తయేత్** = కొంగ నిశ్చల ధ్యానంలో చేపను పట్టుకోడానికి కదలికలను గమనిస్తున్నట్లుగా, ప్రభువు ధనాగమమున మార్గాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి, ద్రవ్యాది పదార్థాలను సంగ్రహిస్తూ, బలాన్ని పెంచుకొని శత్రువును జయించడానికి, **సింహవత్ పరాక్రమేత్** = సింహం లాగా పరాక్రమించాలి, **వృకవత్ అవలుంపేత** = తోడేలులాగా

పొంచి ఉండి శత్రువులను పట్టుకోవాలి. **శశవత్ వినిష్పతేత్** = కుందేలు లాగా దూరంగా పారిపోయి, తరువాత మోసగించి పట్టుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- కొంగ ఎట్లు నీటిలోపల చరించుచున్న మత్స్యములను పట్టడంలో గమనముంచి ఉంటుందో, అలాగే రాజు శత్రురాజుల ధనాగమము వచ్చుమార్గాలు పరిశీలిస్తూ ఉండాలి. సింహమెలా తన పెద్ద అయిన ఏనుగును బలవంతంగా లాక్కోడానికి చూస్తుందో, అలాగే శత్రురాజును జయించడానికి సింహంలాగా పరాక్రమించాలి. తోడేలు లాగా పొంచి ఉండి శత్రువులను పట్టుకోవాలి. కుందేలు లాగా దూరంగా పారిపోయి తరవాత మోసగించి పట్టుకోవాలి. (స.ప్ర.6వ.సము) ॥106॥

ఇది మనుకృతం.ప్రామాణికం

ఏవం విజయమానస్య యేఽస్య స్యుః పరిపంథినః । మూలశ్లోక సం. **82**
తానానయేద్వశం సర్వాన్సామాదిభిరుపక్రమైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **107**

టీక:- ఏవం విజయమానస్య = ఈ ప్రకారంగా, విజయాన్ని సాధించే సభాపతి రాజ్యంలో, **యే పరిపన్థినః స్యుః** = దొంగలు, దోపిడీ దార్లు ఉన్నారో, **తాన్ సర్వాన్** = వారిని, **సామ+ఆదిభిః** = తియ్యటి మాటల ద్వారా, ఏదైనా ఇచ్చిగాని, **ఉపక్రమైః** = ఈ ఉపాయాలతో, **భేద** = శత్రుపక్షం వారిలో భయాన్ని కలిగించి తన పక్షంలోకి చేర్చుకోవడం ద్వారా, **వశం+ఆనయేత్** = వశపరచుకోవాలి.

తాత్పర్యం:- ఈ ప్రకారంగా విజయాన్ని సాధించాలనుకునే నృపాలుడు తన రాజ్యంలో దొంగలు, దోపిడీదార్లూ ఉన్నారో, వారిని తియ్యని మాటల ద్వారా తగిన ఉపాయాలతో వశపరచుకోవాలి. ॥107॥

వివరణ:

(క) పరిపంథిన్ - వివరణ

'పరిపంథిన్' పదం **'ఛందసి పరిపంథి పరి పరిణౌ పర్యవస్థాతరి'** (అ. 5.2.89) అనే సూత్రం ప్రకారం, వేదంలో నిపాతరూపంలో ఉంది. పాణిని ప్రకారం వేదంలోనే నిపాతం ఉంది కాని, దీనితోపాటు సంస్కృత సాహిత్యంలోనూ ఈ పదం ఇదేవిధంగా ప్రాచుర్యంలో ఉంది. **'శత్రువు' 'రాజ్య కార్యాలలో ఆటంకం', 'చోరుడు', 'దొంగ', 'పనులకు అడ్డంకి కలిగించేవాడు'** - ఇలా దీనికి పలు అర్థాలున్నాయి. 107, 110 శ్లోకాలలో పైచెప్పిన 'పరిపంథి' పదానికి అర్థం చాలా విస్తృతం. ఇందులో దొంగ, చోరుడు, దోపిడిదారులని దీనికి అర్థాలుగా గ్రహించవచ్చు. ప్రజలకే కాకుండా, రాజ్య వికాసానికీ ఆటంకం కలిగించి, బాధ కలిగించేవారు, వ్యతిరేకంగా ఉండి, అరాజకాన్ని వ్యాపింపజేసేవారు, రాజ్యాపహరణం కోసం పన్నాగాలు పన్ని, శత్రువులకు సాయం చేసేవారు - ఇలాంటి వారన్నమాట. ఇలాంటివారిని రాజు చాలా కఠినంగా వ్యవహరించి అదుపు చేయాలి.

2 సామం మొదలైన ఉపాయాల అర్థం

సామ, దాన, భేద, దండాలు - ఇవి రాజనీతిలోని నాలుగు ప్రముఖ అంగాలు. వీటిని నాలుగు ఉపాయాలు అని కూడా అంటారు. వీటిని అనుసరించి రాజు, శత్రు రాజులతో వ్యవహరించాలి.

1 సామం: ఏ రాజైనా ఇబ్బంది కలిగిస్తే, వ్యతిరేకిస్తే, లేదా యుద్ధాన్ని కోరేవాడైతే, అతనితో శాంతితో, స్నేహపూర్వకంగా మాట్లాడి, సమావేశాలలో కలిసి ఒప్పించే ప్రయత్నం చేయాలి.

2 దానం: శాంతి పద్ధతిలో ఒప్పుకోకపోతే, ప్రలోభపెట్టి, అంటే ధనం, భూములు మొదలైన వాటిని ఎర చూపించి తన మిత్రపక్షంగా కూర్చుకోవాలి.

3. **భేదం:** ఈ ఉపాయంతోనూ లొంగకపోతే, లోభం, ధనం మొదలైన వాటి ద్వారా అతని మంత్రులు, అధికారులు, సేవకులు, ప్రజల మధ్య విభేదాలు సృష్టించి తన పక్షంలో కలుపుకోవాలి. వారి రహస్యాలు గ్రహించి, శత్రురాజును దుర్బలుణ్ని చేయాలి.

4. **దండం:** ఈ మూడు ఉపాయాలూ పని చేయకపోతే, అతనితో యుద్ధం చేసి, బల ప్రయోగంతో పట్టుకుని దండించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

యది తే తు న తిష్ఠేయురుపాయైః ప్రథమైస్త్రిభిః । మూలశ్లోక సం.**83**
దండేనైవ ప్రసహ్యైతాన్ శనకైర్వశమానయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**108**

టీక:- యది = ఒకవేళ, తే = వారు శత్రువులు, చోరులు, దోపిడీదార్లు, **ప్రథమైః త్రిభిః ఉపాయైః న తిష్ఠేయుః తు** = పూర్వోక్తాలైన సామ-దాన-భేదాలను ఈ మూడు ఉపాయాల ద్వారా శాంతించనట్లయితే, లేదా వశమునకు రానట్లయితే ప్రభువు, ఏతాన్ = వీరిని, దణ్డేన+ఏవ = దండన ద్వారానే, ప్రసహ్య = బలవంతంగా, **శనకైః వశమ్+ఆనయేత్** = సావధానంగా వశపరచుకోవాలి. అప్పటికీ వశం కానివారిని ప్రత్యేకమైన దండన ద్వారా వశపరచుకోవాలి.

తాత్పర్యం:- ఒకవేళ శత్రువులు, చోరులు, దోపిడీదార్లు, సామదాన భేద ఉపాయాల ద్వారా శాంతించనట్లయితే లేదా లోబడినట్లయితే, రాజు వీరిని దండన ద్వారానే బలవంతంగా వశంపరచుకోవాలి. ॥108॥

ఇది ప్రక్షిప్తం-ప్రామాణికం కాదు

* ***సామాదీనాముపాయానాం చతుర్ణామపి పండితాః ।***
సామదండౌ ప్రశంసంతి నిత్యం రాష్ట్రాభివృద్ధయే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***109***

తాత్పర్యం:- సామం మొ॥న నాలుగు ఉపాయాలలో సామమున ప్రయాస, ద్రవ్యవ్యయం, సైన్యనాశనం మొదలైనవి లేనందువల్ల, దండంవల్ల అవి ఉన్నప్పటికీ కార్యసిద్ధి ఉంది కాబట్టి సామ దండములను రెంటిని మాత్రమే విద్వాంసులు రాజ్యాభివృద్ధి కోసం ఉపయోగిస్తారు. ॥109॥

ప్రక్షిప్త పరిశీలన

109వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది -

1. ప్రసంగ వ్యతిరేకం

ఈ శ్లోకం పూర్వాపర ప్రసంగ వ్యతిరేకంగా ఉంది. మునుపటి 107-108 శ్లోకాలలోనూ, తర్వాతి 110వ శ్లోకంలోనూ, **'పరిస్థితులను అదుపులో ఉంచుకోవటం, వాటిని నశింప చేయటం'** దీని చర్చ ఉంది. ఇలా 110వ శ్లోకపు వాక్య క్రమం దృష్ట్యా 108వ శ్లోకంతో ఇది కలుస్తుంది. మధ్యలో ఈ శ్లోకం ఆ సంబద్ధతను భంగం చేయటమే కాకుండా, సామ-దండాలను ప్రశంసిస్తూ పూర్వాపర ప్రసంగ వ్యతిరేకమైన విషయాన్ని చెబుతూంది. ప్రసంగ వ్యతిరేకం కనుక ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలో సామం మొదలైన నాలుగు ఉపాయాలలో కేవలం, సామం దండం - వీటినే ప్రశంసనీయంగా భావించారు. ఇది మనువుకు వ్యతిరేకం. మనువు సామం, దానం, భేదం, దండం ఈ నాలుగింటినీ యోగ్యాలని చెప్పాడు. పద్ధతి చెప్పినప్పుడు అవి అతని అభిప్రాయంలో పొగడతగినవే కదా! [7.56,159,160,161,

164,167,170,198]. సరిగ్గా దీనికి ముందే 107వ శ్లోకంలో ముందు సామ దాన భేదాలనే మూడు ఉపాయాల ప్రాథమికతను గురించి చెప్పాడు. దీనికి వ్యతిరేకంగా చెప్పటం చేత, అంతర్ వ్యతిరేకమనే ఆధారంతో ఈ శ్లోకం ప్రక్షిప్తం.

110 నుండి 117వ శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం.

యథోద్ధరతి నిర్దాతా కక్షం ధాన్యం చ రక్షతి । మూలశ్లోక సం.**84**
తథా రక్షేన్నృపో రాష్ట్రం హన్యాచ్చ పరిపంథినః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**110**

టీక:- **యథా** = ఏ విధంగా, **నిర్దాతా** = కలుపు తీసేవాడు, **కక్షం ఉద్ధరతి ధాన్యం చ రక్షతి** = కలుపు తీసి పైరును రక్షిస్తాడో, అదేవిధంగా, **నృపః** = రాజు, **పరిపంథినః హన్యాత్** = దొంగలను, దారి దోపిడీదారులను, బంధించి, **రాష్ట్రం రక్షేత్** = రాష్ట్రాన్ని రక్షించాలి.

తాత్పర్యం:- రైతు పొలంలో కలుపును పీకివైచి, పంటను మాత్రం కాపాడునట్లు రాజు దుష్టులను చంపి, సజ్జనులను కాపాడాలి. రాష్ట్రాన్ని రక్షించాలి. (స.ప్ర.6వ సము) ॥110॥

రాజు ప్రజలను పీడించరాదు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

మోహాద్రాజా స్వరాష్ట్రం యః కర్షయత్యనవేక్షయా । మూలశ్లోక సం.**85**
సోఽచిరాద్భ్రశ్యతే రాజ్యాజ్జీవితాచ్చ సబాంధవః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**111**

టీక:- **యః రాజా** = ఏ ప్రభువు, **మోహాత్ అనవేక్షయా** = అజ్ఞానం వల్ల గాని, తాత్సారం వల్ల గాని, **స్వరాష్ట్రం కర్షయతి** = తన రాజ్యాన్నే దుర్బలం చేస్తాడో, లేదా, **సః** = ఆ ప్రభువు, **రాజ్యాత్** = రాజ్యం నుండి, **చ** = మరియు, **సబాంధవః జీవితాత్** = బంధువులతో కూడా జీవించడానికి ముందుగానే, **అచిరాత్** = వెంటనే, **భ్రశ్యతే** = నష్ట భ్రష్టమైపోతాడు.

ఋషి దయానందభాష్యం:- మోహంవలన, ఆలోచింపక చేసే పనుల వలన రాజ్యాన్ని దుర్బలపరచే రాజు తాను బంధువులతో పాటు జీవితం నుండి, రాజ్యం నుండి భ్రష్టుడవుతారు. (స.ప్ర.6వ సము.). ॥111॥

ప్రజాశోషణము వల్ల హాని కలుగుతుంది- **ఇది మనుకృతం-ప్రామాణికం**

శరీరకర్షణాత్ ప్రాణాః క్షీయంతే ప్రాణినాం యథా । మూలశ్లోక సం.**86**
తథా రాజ్ఞామపి ప్రాణాః క్షీయంతే రాష్ట్రకర్షణాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**112**

టీక:- **యథా** = ఏ విధంగా, **ప్రాణినాం ప్రాణాః** = ప్రాణుల ప్రాణాలు, **శరీర కర్షణాత్** = శరీరాన్ని కృశింప చేసినందువల్ల క్షీణించిపోతాయో, **తథా** = అలాగే, **రాష్ట్రకర్షణాత్** = ప్రజలను పీడించి బలహీనులను చేసినట్లయితే, **రాజ్ఞామపి ప్రాణాః** = రాజుల ప్రాణాలు అంటే శక్తి సామర్థ్యాలు, బంధువులతో పాటు, **క్షీయన్తే** = నష్టపోతారు. (స.ప్ర.153).

ఋషి దయానందభాష్యం:- శరీరాలను కృశింప చేయటం వలన ప్రాణుల యొక్క ప్రాణాలు క్షీణించునట్లు ప్రజలను దుర్బలపరచినచో రాజుతో పాటు అతని ప్రాణాలైన సైన్యాదిబలం కూడా బంధుసహితంగా నష్టమవుతుంది. (స.ప్ర.6వ సము.) ॥112॥

వివరణ:

రాష్ట్రకర్షణమంటే-

బందిపోటు దొంగల ద్వారాగాని, ఆకతాయుల ద్వారాగాని, లేదా స్వయం ప్రభువు ద్వారా గాని, లేదా ఇతర ప్రజలు లేదా రాజ కర్మచారుల వల్ల గాని, ఏ రకంగానైనా ప్రజలను కష్టపెట్టడం ఎక్కువగా పీడించడం జరుగుతుందో

అది 'కర్షణం' అనబడుతుంది. ప్రజలలో ఇలాంటి శోషణం, ఉత్పీడనం ప్రబలినట్లయితే ఆ ప్రభువు యొక్క రాజ్యరూపమైన శరీరం నష్టమైపోతుంది.

రాష్ట్ర నియంత్రణోపాయాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

రాష్ట్రస్య సంగ్రహే నిత్యం విధానమిదమాచరేత్ । మూలశ్లోక సం.**87**
సుసంగృహీతరాష్ట్రో హి పార్థివస్సుఖమేధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**113**

టీక:- అందువల్ల రాజు, రాష్ట్రస్య సంగ్రహే = రాష్ట్ర సువ్యవస్థ నియంత్రణ అలాగే అభివృద్ధి కోసం, **నిత్యం** = ఎల్లప్పుడు, ఇదం విధానమాచరేత్ = ఈ కింద చెప్పబోయే వ్యవస్థను అమలుపరచాలి, హి = ఎందుకంటే, **సుసంగృహీతరాష్ట్ర పార్థివః** = సురక్షితం, సునియంత్రితం, సువ్యవస్థితమైన రాష్ట్రాధిపతే (రాజు), **సుఖం ఏధతే** = సుఖపూర్వకంగా ఉంటూ, దినదినాభివృద్ధిని పొందుతాడు.

తాత్పర్యం:- కాబట్టి రాష్ట్ర సువ్యవస్థ నియంత్రణ, అభివృద్ధికోసం, ఎల్లప్పుడు ముందు చెప్పబోయే వ్యవస్థను అమలుపరచాలి. ఎందుకంటే సురక్షితం, సునియంత్రితం, సువ్యవస్థితమైన రాష్ట్రాధిపతే (రాజు) సుఖపూర్వకంగా ఉంటూ దినదినాభివృద్ధిని పొందుతాడు. ॥113॥

నియంత్రణ కేంద్రాలు-రాచకార్యాలయాల ఏర్పాట్లు- ఇది మనుకృతం-ప్రామాణికం

ద్వయో స్త్రయాణాం పంచానాం మధ్యే గుల్మమధిష్ఠితమ్ । మూలశ్లోక సం.**88**
తథా గ్రామశతానాం చ కుర్యాద్రాష్ట్రస్య సంగ్రహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**114**

టీక:- అందువల్ల, ద్వయోః త్రయాణాం పంచానాం మధ్యే = రెండు, మూడు లేదా ఐదు గ్రామాల మధ్య ఒక నియంత్రణ కేంద్రాన్ని, లేదా ఉన్నత రాచకార్యాలయాన్ని నిర్మించుకోవాలి, **తథా** =అలాగే, **గ్రామ శతానాం** = శత గ్రామాలకు కేంద్రంగా ఒక రాచకార్యాలయం ఉండాలి. **రాష్ట్రస్య సంగ్రహమ్ కుర్యాత్** = రాష్ట్రాన్ని సురక్షితం గాను, సువ్యవస్థితం గాను మరియు వశీభూతం గాను ఉంచుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- రెండు, మూడు లేదా అయిదు గ్రామాల మధ్య ఒక నియంత్రణ కేంద్రాన్ని, లేదా ఉన్నత రాచకార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే నూరు గ్రామాలకు కేంద్రంగా ఒక రాచకార్యాలయం ఉండాలి. రాష్ట్రాన్ని సురక్షితంగాను, సువ్యవస్థితం గాను మరియు వశీభూతంగానూ ఉంచుకోవాలి.

ఈ విధంగా 2,3,5 మరియు వంద గ్రామాల మధ్య ఒక రాచకార్యాలయాన్ని ఏర్పాటు చేసికొని, యోగ్యులైన భృత్యులను, కర్మచారులను నియమించుకొని, సమస్త రాచకార్యాలను సంపూర్తి చేసికోవాలి. (స.ప్ర.6వ సము).॥114॥

చిన్న అధికారుల నియుక్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

గ్రామస్యాధిపతిం కుర్యాద్దశగ్రామపతిం తథా । మూలశ్లోక సం.**89**
వింశతీశం శతేశం చ సహస్ర పతిమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**115**

టీక:- 1. గ్రామస్య + అధిపతిం కుర్యాత్ = ఒక్కొక్క గ్రామమునకు ఒక్కొక్క ప్రధాన పురుషుని (అధికారిని) నియమించవలెను. అదేవిధంగా **2. దశగ్రామ పతిం** = దశ గ్రామములకు ఒక్క ప్రధాన పురుషుని, తరువాత **3.వింశతి+ఈశమ్** = 20 గ్రామములకొక ప్రధాన పురుషుని, అలా **4. శతి+ఈశమ్** = వంద వంద గ్రామములకొక రాజ పురుషుని తరువాత, **5. సహస్ర పతిమ్** = వేయి వేయి గ్రామములకొక్క ప్రధాన పురుషుని నియమించవలెను.

నేడు గ్రామమునకు పట్వారి కరణం లేక మున్సబ్ (పటేల్ ఉంటాడు. 10 గ్రామములకు థానా రెండు థానాలకు ఒక పెద్ద థానా, ఐదు థానాలకు ఒక తహసీల్ (తాలూక), పది తాలూకాలకు ఒక జిల్లా ఏర్పాటు చేయబడుచున్నది.

ఋషి దయానందభాష్యం:- ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క ప్రధానపురుషుని ఉంచాలి. ఇలా పది గ్రామాలకు రెండవ ప్రధానపురుషుని, ఇలా ఇరవై గ్రామాలకు మూడవ ప్రధానపురుషుని, ఇలా వందగ్రామాలకు నాల్గవ అధికారిని, ఇలా వేయి గ్రామాలకు ఐదవ అధికారిని నియమించాలి. ఉదాహరణకు నేడు ఒక గ్రామానికి ఒక పట్వారి, అట్టి పది గ్రామాలకు ఒక పోలీసు కార్యాలయం, ఇలా రెండు పోలీసు కార్యాలయాలకు ఒక తహసీలు కార్యాలయం, ఇలా పది తహసీలు కార్యాలయాలకు ఒక జిల్లా ఏర్పరచబడింది. ఈ పద్ధతి మన మనుధర్మశాస్త్రాలనుండి గ్రహించిన రాజనీతి విధానమే. (స.ప్ర.6వ సము.) ॥115॥

ఇది మనుకృతం.ప్రామాణికం

గ్రామే దోషాన్ సముత్పన్నాన్ గ్రామికశ్శనకైః స్వయమ్ । మూలశ్లోక సం.**90**
శంసేద్గ్రామదశేశాయ దశేశో వింశతీశినే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**116**

టీక:- ఈ ప్రకారంగా ఏర్పాట్లు చేసి, **ఆజ్ఞాపించాలి, గ్రామికః** = ఒక్కొక్క గ్రామాధిపతి, **గ్రామ దోషాన్ సముత్పన్నాన్** = గ్రామాలలో ప్రతి నిత్యం జరిగే దోషాలను, **శనకైః స్వయమ్** = గుప్తంగా, **గ్రామదశేశాయ** = దశ గ్రామాధీశులకు, **శంసేద్** = తెలియజేయాలి, **దశేశః** = దశ గ్రామాధిపతి, అదేవిధంగా, **వింశతి +ఈశినే** = 20 గ్రామాల అధిపతికి వర్తమాన స్థితిని తెలియజేస్తూ ఉండాలి.

తాత్పర్యం:- గ్రామాధికారి తన గ్రామంలో జరుగు నేరాలను తాను బాగుగా విచారించి తెలిసికొని ఆ నేరాలను దశ గ్రామాధికారికి తెలుపవలెను. దశ గ్రామాధికారి తాను విచారించి ఇరువది గ్రామాల అధికారిగారికి తెలుపవలెను. ॥116॥

ఇది మనుకృతం.ప్రామాణికం

వింశతీశస్తు తత్సర్వం శతేశాయ నివేదయేత్ । మూలశ్లోక సం.**91**
శంసేద్గ్రామశతేశస్తు సహస్రపతయే స్వయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**117**

టీక:- **తు** = మరియు, **వింశతీశః** = 20 గ్రామాల అధిపతి, **తత్ సర్వం** = 20 గ్రామాల పరిస్థితులన్నిటినీ, **శతేశాయ నివేశయేత్** = శత గ్రామాధిపతికి ప్రతి నిత్యం నివేదిస్తూ ఉండాలి, **శతేశ తు** = శత గ్రామాధిపతి, **సహస్రాధిపతిం** = సహస్ర గ్రామాధిపతికి నిత్యం, **శంసేగ్** = తెలియజేస్తూ ఉండాలి. (స.ప్ర.6వ సము.)

ఋషి దయానందభాష్యం:-గ్రామాధికారి తన గ్రామంలో జరిగే నేరాలను తాను నింపాదిగా విచారించి తెలిసికొని, ఆ నేరాల గురించి దశగ్రామాధికారికి తెలపాలి, దశగ్రామాధికారి తాను విచారించి, ఇరివై గ్రామాల అధికారికి తెలియజేయాలి. అలాగే ఇరవై గ్రామాల అధికారి, నూరు గ్రామాల అధికారికి, శతగ్రామాధికారి సహస్రగ్రామాధికారికి తెలుపగా అతడలాంటి నేరాలను విచారించి, కింది అధికారులు విధించిన శిక్ష సక్రమమైనదా కాదా? అని విచారిస్తాడు.(స.ప్ర.6వ సము.)॥117॥

వివరణ: రాజ్య సంరక్షణ కోసం మనుప్రోక్తమైన నియంత్రణ కేంద్ర వ్యవస్థా సూచిక-

1. కేంద్రీయ కార్యాలయం రాజధాని. రాజుగారి కోట 7.96-76
2. ప్రత్యేక నగరంలో ఒక సచివాలయం. 7.121

3. 100 గ్రామాలకు ఒక ముఖ్య కార్యాలయం. 7.114,117
4. 20 గ్రామాలకు ఒక కార్యాలయం. 7.114,117
5. 10 గ్రామాలకు ఒక కార్యాలయం. 7.114,117
6. 5 గ్రామాలకు ఒక కార్యాలయం. 7.114,117
7. 2 గ్రామాలకు ఒక కార్యాలయం. 7.114,117

పై కార్యాలయాలకు కింద కార్యాలయంవారు తమ తమ విషయాలను తెలియజేస్తూ ఉండాలి. 7-114-117.

118,119వ శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *యాని రాజప్రదేయాని ప్రత్యహం గ్రామవాసిభిః ।*
అన్నపానేంధనాదీని గ్రామికస్తాన్యవాప్నుయాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**118**

తాత్పర్యం:- అదీకాక గ్రామాధికారి ప్రతిదినం గ్రామప్రజలు రాజుకు ఇవ్వాల్సిన అన్నం, నీరు, వంటచెరకు మొ॥వాటిలో నుండి తాను తన జీవిక నిమిత్తమై కొంత తీసుకోవాలి. ॥118॥

* *దశీ కులం తు భుంజీత వింశీ పంచ కులాని చ ।*
గ్రామం గ్రామశతాధ్యక్షః సహస్రాధిపతిః పురమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**119**

తాత్పర్యం:- పదిగ్రామాల అధికారి ఒక కులాన్ని, ఇరవై గ్రామాల అధిపతి అయిదు కులాలను నూరుగ్రామాల అధిపతి యొక్క సామాన్య గ్రామాన్ని, వేయిగ్రామాల అధిపతి సామాన్యమైన ఒక పట్టణాన్ని అనుభవించాలి. ॥119॥

ప్రక్షిప్తాల పరిశీలన

'కులం' అర్థం

'కులం' అంటే ఇక్కడ విశేషాభిప్రాయం ఉంది. హరీత స్మృతిలో ఇచ్చిన నిర్వచనం ప్రకారం, ఆరు ఎడ్లతో ఒకేసారి నడిపించే నాగలిని 'మధ్యమమైన నాగలి' అంటారు. ఇలాంటి రెండు నాగళ్లు అంటే 12 ఎడ్లతో దున్నే భూమిని 'కులం' అంటారు. 118-119 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తా లవుతాయి -

1. ప్రసంగవ్యతిరేకం

ఈ రెండు శ్లోకాలూ పూర్వాపర ప్రసంగ వ్యతిరేకాలు. ముందు వెనుకల శ్లోకాలలో రాజ్యాంగ వ్యవస్థను నడపటానికి కార్యాలయాల స్థాపన, అధ్యక్షుల నియామకం, వారి కార్య ప్రణాళిక ఉన్నాయి. 117వ శ్లోకంలో 'సహస్రపతి' వరకు పనుల అవధి చెప్పారు. మళ్లీ **"తేషాం గ్రామ్యాణి కార్యాణి"** పదాలు ప్రయోగించి, వాటి పైన ఒక అమాత్యుని నియామకపు పద్ధతి, అతని కార్యవిధులు ఉన్నాయి. ఇలా 120వ శ్లోకపు భాష, భావ క్రమాల దృష్టితో చూస్తే, 117తో ఇది కలుస్తుంది. ఈ రెండు శ్లోకాలూ ఆ సంబద్ధతను, పూర్వాపర ప్రసంగాలనూ భంగం చేస్తున్నాయి. వీటిలో కొందరు అధ్యక్షుల జీవికను గురించే చెప్పటం, పూర్వాపర ప్రసంగ వ్యతిరేకం, అందుచేత ఇవి ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. ప్రజల నుంచి పన్నులను కేవలం రాజే తీసుకోవాలని చెప్పాడు మనువు [7.127-130]. ఈ శ్లోకాలలో కొన్ని అధ్యాయాలలో తన కోసం పదార్థాలు తీసుకోవటం పైన చెప్పిన పద్ధతికి వ్యతిరేకం.

ఖ. 7.125లో రాజ్యంలోని పురుషుల ఉపాధులు నిర్ణయించే పద్ధతి ఉంది. ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం.

గ. ఇటువంటి వ్యవస్థ మను సమ్మతం కాదు. ఈ శ్లోకాలలో కేవలం కొందరు పెద్ద పదవులవారికే ఉపాధి చెప్పారు. మిగిలిన అమాత్యులు మొదలైన ఉపాధి విషయాలేమీ చెప్పలేదు. మనువు రాజపురుషు లందరికీ వేతనా లిచ్చే పద్ధతిని చెప్పాడు[7.125]. ఇది అందరి విషయంలోనూ వర్తిస్తుంది. ఈ అంతర్ వ్యతిరేకాలతో ఈ శ్లోకాలు మౌలికాలు కావని తెలిసిపోతూంది.

120-132వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

తేషాం గ్రామ్యాణి కార్యాణి పృథక్కార్యాణి చైవ హి । మూలశ్లోక సం.92
రాజ్ఞోఽన్యస్సచివ స్స్నిగ్ధస్తాని పశ్యేదతంద్రితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.120

టీక:- తేషాం = పూర్వోక్తమైన అధ్యక్షులు చేయాల్సిన, **గ్రామ్యాణి కార్యాణి** = గ్రామ సంబంధమైన రాచకార్యాలను, **చ** = మరియు, **పృథక్ కార్యాణి ఏవ హి** = అన్యమైన భిన్న భిన్న కార్యాలను కూడ, **రాజ్ఞః +అన్యః స్నిగ్ధ సచివః** = రాజుకు సంబంధించిన విశ్వాసపాత్రుడైన ఒక ప్రముఖమంత్రి, **అతంద్రితః** = అలసత్వం లేకుండా, **పశ్యేత్** = చూడాలి.

ఋషి దయానందభాష్యం:- గ్రామాధిపతి మొదలైనవారు చేసిన తీర్పులు ఒండొంటికి విరుద్ధములై ఉండి గ్రామజనులు రాజుకు చెప్పికొన్నయెడల, అలాంటి వివాదములను రాజుకు ప్రియుడయిన మంత్రి జాగరూకుడై గ్రామ వ్యవహారాలను, తక్కిన కార్యమును విచారించాలి.

పదివేల గ్రామాలకు ఇద్దరు సభాపతులు ఉండి, ఒకరు సభాసంబంధమైన కార్యాలను, మరొక అధ్యక్షుడు అలసత్వం లేకుండా న్యాయాధీశులైన రాజపురుషుల కర్మకలాపాలను తిరుగుతూ గమనిస్తూ ఉండాలి. (స.ప్ర.6వ సము.) ॥120॥

వివరణ:

మను మహర్షి విభిన్న శ్లోకాల ద్వారా, రాజ్యవ్యవహారాలు చక్కగా నిర్వహించడం కోసం 3 సభలను సూచించాడు. అందుకు తగిన అధికారులను నియమించాడు. సులభంగా తెలిసికోడానికి రాబోయే పాలిక ద్వారా తెలియజేస్తున్నాడు. అయితే వాటిని సభ అనకుండా, పాలికలన్నాడు. నేడు రాజ్య సంబంధమైన వ్యవస్థలను నిర్వహించడానికి మూడు పాలికలు ఉన్నాయి.

1. విధానపాలికా - విధాన పరిషత్తు (విధానాలను తయారుచేసే పరిషత్)
2. కార్యపాలికా (విధానాలను, నియమాలను క్రియారూపమొనర్చునట్టి అధికార వర్గం)
3. న్యాయపాలికా (న్యాయాన్ని నిర్ణయించే అధికార వర్గం.) పట్టికను పక్క పుటలో చూడగలరు.

నగరంలో సచివాలయ నిర్మాణం ఇది మనుకృతం-ప్రామాణికం

నగరే నగరే చైకం కుర్యాత్సర్వార్థచింతకమ్ । మూలశ్లోక సం.93
ఉచ్చైః స్థానం ఘోరరూపం నక్షత్రాణామివ గ్రహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.121

టీక:- రాజు, **నగరే నగరే** = ప్రత్యేకంగా పెద్ద పెద్ద నగరాలలో, **ఏకం** = ఒక్కొక్క, **నక్షత్రాణాం గ్రహమ్ ఇవ** = నక్షత్రాలలో చంద్రుడి లాగా, విశాలం, చూడటానికి ప్రభావశాలి అయిన, **ఘోరరూపమ్** = చూడగానే లేదా మనస్సుకు రాగానే ప్రజావిరుద్ధమైన కర్మలు చేసినప్పుడు- అనుభవించబోయే శిక్షలు జ్ఞాపకం రాగా భయోత్పాదకంగా కనిపించేవి, **సర్వం +అర్థ చింతకమ్** = సర్వరాజకార్యాలు, ప్రజా వ్యవస్థకు సంబంధించిన కార్యకలాపమంతటి గురించి ఆలోచించడానికి వీలైన, **ఉచ్చైః స్థానం** = సచివాలయాన్ని(Secretariat), **కుర్యాత్** = నిర్మించుకోవాలి.

ఋషిదయానందభాష్యం:- ఒక్కొక్క నగరమునందును ఒక్కొక్క ఉచ్చస్థానము గలిగి వర్ణములో గొప్పవాడై గజాశ్వాదులచే భయంకరుడై, నక్షత్రములనడుమ శుక్రాదిగ్రహమువలె వెలిగెడి కార్యదర్శకుడగు నగరాధిపతిని ఒక్కన్ని నియమించాలి.

పెద్ద పెద్ద నగరాలలో నగరానికి ఒక్కొక్క విచార-విమర్శలు చేసికోడానికి ఒక సుందరం, ఉన్నతమైన భవనాన్ని నిర్మించాలి. అందులో గొప్ప విద్యావృద్ధులు, సర్వోన్నత విద్యాస్నాతకులు కూర్చొని దేశభవిష్యత్తును గురించి ఆలోచించాలి. రాజు, దేశప్రజల సర్వతోముఖ అభివృద్ధికి మార్గాలను సూచించాలి. అందుకవసరమైన నియమాలను, విద్యాభివృద్ధి నియమాలను సూచించాలి. (స.ప్ర. 6వ సము.) ॥121॥

ప్రభుత్వోద్యోగుల కార్యకలాపాలను గమనించుట - ఇది మనుకృతం-ప్రామాణికం

స తాననుపరిక్రామేత్సర్వానేవ సదా స్వయమ్ । మూలశ్లోక సం. **94**
తేషాం వృత్తం పరిణయేత్సమ్యగ్రాష్ట్రేషు తచ్చరైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **122**

టీక:- సః = అధికారి (7.120వ శ్లోకంలో వర్ణించినట్లు) సచివుడు, ప్రముఖమంత్రి, **తాన్ సర్వాన్ సదా స్వయమ్ అనుపరిక్రామేత్** = (7.121) ప్రకారం నిర్మించిన సచివాలయాలను పలు విధాలుగా నిరీక్షణ చేస్తూ ఉండాలి, చ = మరియు, రాష్ట్రే = దేశంలో, **తత్+చరైః** = తన దూతల ద్వారా, **తేషాం వృత్తం పరిణయేత్** = ప్రభుత్వోద్యోగం, యే = చేస్తూన్నవారి ఆచరణలను గుప్తరీతిగా తెలిసికొంటూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:-నిత్యం రాజ్య నిరీక్షణచేసే సభాపతి తన వద్ద కొంతమంది గుప్త చరులను, కొంతమంది ప్రభుత్వ కర్మచారులను నియమించుకొని వారి ద్వారా ప్రజల యొక్క రాచకర్మచారుల యొక్క గుణదోషాలను గుప్తరీతిగా తెలుసుకోవాలి. అపరాధులైనవారికి దండన, గుణవంతులకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తూ ఉండాలి (స.ప్ర. 6వ సము.). ॥122॥

లంచాలు తీసుకునే ప్రభుత్వాధికారులపై దృష్టి- ఇది మనుకృతం-ప్రామాణికం

రాజ్ఞో హి రక్షాధికృతాః పరస్వాదాయినశ్శఠాః । మూలశ్లోక సం. **95**
భృత్యా భవంతి ప్రాయేణ తేభ్యో రక్షేదిమాః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **123**

టీక:- హి = ఎందుకంటే, రాజ్ఞం రక్షాధి కృతాః భృత్యాః = ప్రజలను రక్షించడానికి రాజుచేత నియమించిన అధికారులు, ప్రాయేణ = తరచుగా, పరస్వాదాయినః = పరుల సొమ్మును అపహరించువారుగా ఉంటారు. అంటే లంచగొండిదారులుగా ఉంటారు, శఠాః = అంతేకాదు మోసగించేవారుగా, రహస్యంగా అపకారం చేసేవారుగా, భవన్తి = ఉంటారు, తేభ్యః = అలాంటి వారి నుండి, ఇమాః ప్రజాః రక్షేత్ = ఇలాంటి ప్రజలను రక్షించాలి. ఇలాంటి మోసాలు, పీడన కలుగకుండా ప్రజలను రక్షిస్తూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- లోకంలో రాజు నియమించిన ప్రభుత్వాధికారులు, రక్షాధికారులు తరచుగా పరులసొమ్మును అపహరించడానికి మోసగాళ్ళుగా ఉంటారు. అలాంటి వారి దగ్గర నుండి బాధలను తప్పించి, ప్రజలను తనబిడ్డలతో సమానంగా చూసుకోవాలి.

ప్రజా రక్షణలో నియమించవలసిన కర్మచారులు-ధార్మికులుగాను, అన్ని విధాల పరీక్షించిన వారుగాను ఉండాలి. ఉత్తమ వంశస్థులుగా ఉండాలి. (స.ప్ర. 6వ. సము.) ॥123॥

లంచగొండి ఉద్యోగులకు దండన - ఇది మనుకృతం-ప్రామాణికం

యే కార్యి కేభ్యోఽర్థమేవ గృహ్ణీయుః పాపచేతసః । మూలశ్లోక సం. **96**
తేషాం సర్వస్వమాదాయ రాజా కుర్యాత్ప్రవాసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **124**

టీక:- పాపచేతసః = పాపాత్ములు, యే = లంచగొండులుగా మోసగించే రాచకర్మచారులు, **కార్యికేభ్యః** = కార్యాలయంలో తమ వ్యవహారాలు చూసుకొనేవారి నుండి, **అర్థం గృహ్ణీయుః** = లంచం తీసికొని వారి వ్యవహారాలకు హాని కలిగిస్తారో, **తేషాం సర్వస్వమ్ +ఆదాయ** = వారి సమస్త ధనాన్ని తీసికొని, **రాజా** = రాజు, **కుర్యాత్ ప్రవాసనమ్** = దేశం నుండి పంపించాలి.

ఋషి దయానందభాష్యం:- పాపబుద్ధులైన ప్రభుత్వోద్యోగులు తమ దగ్గర వ్యవహారాలను తీర్చుకోడానికి వచ్చిన వారి దగ్గర లంచం తీసుకొని వ్యవహారాలను చెడగొడతారు. రాజు అలాంటి వారిని కనిపెట్టి వారి సర్వస్వాన్ని తీసుకొని వారిని రాజ్యం నుండి వెళ్ళగొట్టాలి.

వాద ప్రతివాదుల నుండి రహస్యంగా ధనం తీసికొని, పక్షపాతంగా అన్యాయం చేయునో, అలాంటి కర్మచారుల నుండి వారి ధనమంతా తీసికొని వారు తిరిగిరానట్టి సుదూర ప్రదేశాలకు పంపించాలి.కారణం-ఒకరికి తీవ్ర దండన ఇచ్చినప్పుడు, మరొకరు సాహసించరు. అలా లేనట్లయితే భయం లేనందువల్ల ప్రతివారూ లంచగొండులవడానికి అవకాశముంది.(స.ప్ర. 6వ సము.) ॥124॥

ఉద్యోగస్థుల వేతన నిర్ధారణ- ఇది మనుకృతం-ప్రామాణికం

రాజా కర్మసు యుక్తానాం స్త్రీణాం ప్రేష్యజనస్య చ । మూలశ్లోక సం. **97**
ప్రత్యహం కల్పయేద్వృత్తిం స్థానం కర్మానురూపతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **125**

టీక:- రాజా = రాజు, కర్మసు యుక్తానాం = రాజు కార్యాలలో నియుక్తులైన కర్మచారులకు, స్త్రీణాం = స్త్రీలకు, చ = మరియు, ప్రేష్యజనస్య = సేవక వర్గానికి, (కర్మ+అనురూపతః) = పదవి, మరియు కర్మననుసరించి, ప్రత్యహం = ప్రతిదినం, స్థానం వృత్తిం కల్పయేత్ = కర్మస్థానం, జీవికను నిశ్చయం చేయాలి.

తాత్పర్యం:- రాజు తనకు కావాల్సిన కార్యాలు చేసే వారికీ, పనికత్తెలు మొ॥న వారికీ, పనిచేసే వారికీ ఉత్తమమధ్యమనీచస్థితులను, అలాంటి యోగ్యతలను అనుసరించి దిన దినం పనికి తగినట్లు వేతనం ఇవ్వాలి.

ఋషి దయానంద భాష్యం:-రాజకర్మచారులు సుఖంగా జీవించడానికి కావలసినంత వేతానాన్ని, ధనాన్ని భూమిని రాజ్యం నుండి ఇవ్వాలి, లేదా మాసికంగా గానీ లేక వార్షికంగా గానీ లేక ఒకేసారి లభించేటట్లు గాని ఇవ్వాలి. వృద్ధులైన కర్మచారులకు కనీసం సగం వేతనం ఇవ్వాలి. వారు జీవించినంతవరకు వారి జీవితం నిర్విచారంగా జరిగేట్లు చూడాలి. మరణానంతరం ఇవ్వనవసరంలేదు. అయితే వారి సంతానాన్ని ఆదరించి వారి బిడ్డలను వారి గుణకర్మానుసారంగా వారికి జీవనభృత్తిని కల్పించాలి. పిల్లలు చిన్నవారైతే, భార్య జీవించి ఉంటే, ఆ పిల్లలు యుక్తవయస్కులైన, సమర్థులైన తమ జీవితాలను నిర్వహించుగలుగు వరకు వారికి సరిపోయేంత ధనాన్ని రాజ్యం నుండి ఇవ్వాలి. కానీ, వారి స్త్రీలుగాని, పిల్లలు గాని పాపకర్మలు చేసేవారయినట్లయితే వారికేమీ రాజ్యం నుండి లభించకుండా ఉండే విధంగా రాజు చూడాలి (స.ప్ర. 6వ సము.). ॥125॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పణో దేయోఽవకృష్టస్య షడుత్కృష్టస్య వేతనమ్ । మూలశ్లోక సం. **98**
షాణ్మాసిక స్తథాచ్ఛాదో ధాన్యద్రోణస్తు మాసికః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **126**

టీక:- అవకృష్టస్య పణః = నిమ్నస్థాయికి చెందిన సేవకులకు వూడ్చి, నీళ్ళు చల్లే వాడికి కనీసం ఒక పణం (ఒక రాగి నాణం) ఇవ్వాలి. ఉత్కృష్టస్య షట్ = ఉన్నత స్థాయికి చెందిన సేవకులకు ఆరు పణాలు ఇవ్వాలి. **తథా** = అలాగే

వారికి, షాణ్మాసికః ఆచ్ఛాదః = ప్రతి 6 నెలలకు కట్టుకోడానికి, కప్పుకోడానికి వస్త్రాలు ఇవ్వాలి, తు = మరియు, మాసికః ధాన్య ద్రోణః = ఒక నెలకు ఒక ద్రోణం ధాన్యం (64 సేర్లు) ఇవ్వాలి.

తాత్పర్యం:- (ఇవి ఆనాటి లెక్కలు) నగరసంమార్జకులు, నీరుతెచ్చువారు, మొ॥ తక్కువ (చిన్న) పనివారికి దినమునకు ఒక రూక కూలి ఇవ్వాలి. ఉత్తమ పనిచేసే నౌకరికి ఆరురూకలు ఇవ్వాలి. తక్కువ పని చిన్నపని వారికి ఆరునెలల కొక సారి ఒక జత బట్టలు, నెలకొకటి కిద్దుము ధాన్యాన్ని ఇవ్వాలి. ఉత్తమభృత్యుడికి కూలి ఆరురూకలు ఇవ్వాలి. ఆరునెలలకు ఆరుజతలబట్టలు, నెలకు పండెండు తూముల ధాన్యం ఇవ్వాలి. మధ్య తరగతి కూలివాడికి దినమునకు మూడు రూకలు కూలి, ఆరు నెలలకు మూడు జతల వస్త్రాలు, నెలకు ఆరు తూముల ధాన్యము ఇవ్వాలి.॥126॥

వివరణ: మంత్రుల, సేవకుల భరణ, పోషణ వ్యవస్థ:-

కౌటిల్యుని అర్థశాస్త్రం ననుసరించి, మంత్రుల నుండి మొదలుకొని సేవకుల వరకు- భరణ పోషణ వ్యయం గురించి ఇక్కడ వివరించాం. ధనం, భూమి రెండు కూడా సేవకులకు భరణ-పోషణ వ్యయం కింద ఇవ్వాలి. అయితే ప్రభుత్వం భరణ పోషణ కింద ఇచ్చిన భూములు అమ్మరాదు. ఎవరికీ తాకట్టు పెట్టరాదు. ప్రకరణం. 10, అధ్యాయం 1-1).

కౌటిల్యుడు సూచించిన భరణం లేదా వేతన నిర్ధారణ -

1. ఋత్విక్, ఆచార్యుడు, మంత్రి, పురోహితుడు, సేనాపతి, యువరాజు, రాజమాత మరియు రాణి-వీరికి ప్రతి సంవత్సరం 48వేల పణాలు ఇవ్వాలి.

2. ద్వారపాలకుడు, అంతఃపురాధ్యక్షుడు, ఆయుధాధ్యక్షుడు, సమాహర్త, (పన్ను వసూలు చేసేవాడు) కోష్ఠాగారాధ్యక్షుడు- వీరికి ప్రతి సంవత్సరం 24వేల పణాలు ఇవ్వాలి.

3. రాజకుమారుడి-తమ్ముళ్ళు, ఉపసేనాపతి, వ్యాపారాధ్యక్షుడు, నగరాధ్యక్షుడు కృషి అధ్యక్షుడు మొ॥ వారికి ఒకవెయ్యి పణాలు (10,000) ఇవ్వాలి.

4. ప్రథమ శ్రేణికి చెందిన వాస్తుకర్మ విశేషజ్ఞుడు, హస్తి అశ్వరథాధ్యక్షుడు, దండాధికారి మొ॥ వారికి 8000 పణాలు ఇవ్వాలి.

అదేవిధంగా సేనయందుండే వివిధ విభాగీయాధ్యక్షులు సైన్య శిక్షకులకు రెండు వందల పణాల నుండి ఎనిమిది వందల పణాల వరకు ఇవ్వాల్సి ఉంటుంది.

శిల్పి ఆ యా విభాగకర్మచారులు, గుమస్తాలు, గుప్తచారులు, వైద్యుడు, గాయకుడు, వాదకుడు మొ॥ వారికి వెయ్యి పణాల నుండి 1200 పణాల వరకు ప్రతి సంవత్సరం వేతన విధానముంది (ప్ర.క్ర.91 అధ్యా-3).

పన్ను వసూలు వ్యవస్థ- **ఇది మనుకృతం-ప్రామాణికం**

క్రయ విక్రయమధ్వానం భక్తం చ సపరివ్యయమ్ । మూలశ్లోక సం.**99**
యోగక్షేమం చ సంప్రేక్ష్య వణిజో దాపయేత్కరాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**127**

టీక:- **క్రయవిక్రయమ్** = కొనడం-అమ్మడం, **భక్తం** = భోజనం, చ = మరియు, **అధ్వానమ్** = మార్గం యొక్క దూరాన్ని, స **పరివ్యయమ్** = భరణ పోషణ వ్యయం, చ = మరియు, **యోగక్షేమం** = లాభనష్టాలను, **సంప్రేక్ష్య** = వీటన్నింటి గురించి ఆలోచనచేసి, **వణిజః కరాన్** = రాజు వ్యాపారి నుండి పన్ను వసూలు చేయాలి.

తాత్పర్యం:- వర్తకుడు ఎంత ధరకుకొన్నాడు? ఎంత ధరలకు విక్రయించాడు? ఎంత దూరం నుండి ఈ సరుకు తెప్పించాడు? అతడికి ఆహారవ్యయం ఎంత? ఇతరవ్యయాలు ఎంత? మనవల్ల రక్షణ భారం ఎంత పొందుతున్నాడు? అనే విషయాలన్నింటినీ పరిశీలించి వర్తకుల నుంచి సరియైన పన్ను తీసుకోవాలి. ॥127॥

ఇది మనుకృతం.ప్రామాణికం

యథా ఫలేన యుజ్యేత రాజా కర్తా చ కర్మణామ్ । మూలశ్లోక సం.**100**
తథావేక్ష్య నృపో రాష్ట్రే కల్పయేత్సతతం కరాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**128**

టీక:- **యథా** = ఏవిధంగా, **రాజా** = రాజు, **చ** = మరియు, **కర్మణామ్ కర్తా** = కర్మలకు కర్తయైన రాజ పురుషుడు, ప్రజ, **ఫలేన యుజ్యేత** = సుఖరూపమైన ఫలం కలవాడవుతాడో, **తథా** = అలాగే, **అవేక్ష్య** = ఆలోచించి, **నృపః** = రాజు అలాగే, **రాష్ట్రే కరాన్ సతతం కల్పయేత్** = రాజ్యంలో పన్ను విధానాన్ని ఏర్పాటు చేయాలి.

ఋషి దయానందభాష్యం:- వ్యాపారి, తమ వ్యాపారం వల్ల, రైతు వ్యవసాయం వల్ల ఎలా లాభం పొందుతారో, తనకు ఎలా రాజ్యాధారము జరుగుతుందో అని పరిశీలించి రాజ్యంలో ప్రజల నుండి రాజు పన్నులు తీసుకోవాలి. (స.ప్ర.6వ సము) ॥128॥

ఇది మనుకృతం.ప్రామాణికం

యథాఽల్పాఽల్పమదంత్యాద్యం వార్యోకోవత్సషట్పదాః । మూలశ్లోక సం.**101**
తథాఽల్పాఽల్పో గృహీతవ్యో రాష్ట్రాద్రాజ్ఞాబ్దికః కరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**129**

టీక:- **యథా** = ఏ విధంగా, **వార్యోకః+వత్స-షట్పదాః** = జలగ, దూడ, భ్రమరం, **అల్ప+అల్పమ్** ఆద్యం **అదంత** = భోజ్య పదార్థాన్ని కొంచెం కొంచెం తీసుకొంటాయో, **తథా** = అలాగే, **రాజా రాష్ట్రాత్** = రాజు ప్రజల నుండి, **అల్పః అల్పః** = కొద్ది కొద్దిగా, **ఆబ్దికః కరః గృహీతవ్యః** = సాంవత్సరికమైన పన్నును వసూలు చేయాలి.

ఋషి దయానందభాష్యం:- జలగలు రక్తాన్నీ, తేనెటీగలు తేనెను, దూడలు పాలను ఎలా కొద్ది కొద్దిగా తీసుకుంటున్నాయో, అలాగే రాజు కూడా ప్రజల, నుండి మూలధనమును చెడనీయక పన్ను కొంచెం కొంచెంగా తీసుకోవాలి.(స.ప్ర.6వ సము) ॥129॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పంచాశద్భాగ ఆదేయో రాజ్ఞా పశుహిరణ్యయోః । మూలశ్లోక సం.**102**
ధాన్యానామష్టమో భాగః షష్ఠో ద్వాదశ ఏవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**130**

టీక:- **రాజా** = రాజు, **పశుహిరణ్యయోః** = పశువుల నుండి, బంగారు నుండి లభించే లాభాల నుండి, **పంచాశత్ భాగః** = 50వ భాగం, మరియు **ధాన్యానాం షష్ఠః,అష్టమఃవా, ద్వాదశః ఏవ ఆదేయః** = ధాన్యంలో 6,8 లేదా అధికాధికంగా 12వ భాగం వరకు మాత్రమే వసూలు చేయాలి.

ఋషి దయానందభాష్యం:- పశువులలోను, బంగారంలోను రాజు నూటికి ఏభయ్యో వంతు పన్ను తీసుకోవాలి. ధాన్యంలో ఆరోభాగం, ఎనిమిదో భాగం గాని పంద్రెండో భాగం గాని సంవత్సరానికి ఒకసారి పన్ను తీసుకోవాలి. ఈ భేదం భూముల తారతమ్యం వ్యవసాయంలో కష్టసుఖాలను బట్టి ఉంటుంది.(స.ప్ర.6వ సము.) ॥130॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆదదీతాథ షడ్భాగం ద్రుమాంసమధుసర్పిషామ్ । మూలశ్లోక సం.**103**
గంధౌషధిరసానాం చ పుష్పమూలఫలస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**131**

టీక:- **అథ**= మరియు, **ద్రుమాంస-సర్పిషామ్** = చెట్ల బోదెల నుండి వచ్చే బంక, తేనె, నేయి, **చ** = మరియు, **గంధ+ఓషధీ-రసానాం** = గంధము, ఓషధులు, రసములు, **చ** = మరియు, **పుష్ప-మూల-ఫలస్యచ** = పుష్పములు, మూలములు, గడ్డలు ఫలములు వగైరా వీటి నుండి, **షడ్+భాగమ్ ఆదదీత** = ఆరవ భాగము తీసికొనవలెను.

రాజ్య సంచాలనార్థం మనుప్రోక్తమైన-సభ/ మన్త్రి / అధికారి/ కర్మచారుల-ప్రణాళికా పట్టిక

రాజు-ముఖ్యసభాధ్యక్షుడు ఎవరైనా సరే విద్వాంసుడు, జితేంద్రియుడై ఉండాలి. (7.27)

1. రాజ్యసభ (రాజ్య సంచాలనకార్యం నీతినిర్ధారణ)	**2.** బ్రహ్మ లేదా న్యాయసభ (న్యాయమును నిర్ణయించి (8.1,11,26) నిర్వహించు కార్యం	**3.** ధర్మ నిర్ణయసభ లేక విధాన పరిషత్ (ధర్మ నిర్ణయము ధర్మ సంశయములో నిర్ణయించుట 12.108, 110, 112) (క) పదిమంది సభ్యులు గల పరిషత్తు
1. 7-8 ప్రముఖమంత్రి-అవసరాన్ని బట్టి అధికంగా కూడ 7.54-57,60,61	1. రాజు లేదా రాజు నియమించిన విద్వాంసుడు వేదవేత్తయైన ముఖ్య న్యాయాధీశుడు (8.1, 11)	1. ఋక్ విద్యాజ్ఞాత (12.111)
2. సంబంధిత మంత్రి = (7.120,121)	2. వేద విద్యావేత్తలైన ముగ్గురు విద్వాంసులు కేసును బట్టి ఆయా విషయాలకు సలహా ఇచ్చేవారు (8.1).	2. యజుర్విద్యాజ్ఞాత (12.111)
3. సహకారులైన అధికారులు అలాగే దూతాధికారి (7.62,63,68)		3. సామవిద్యాజ్ఞాత (12.111)
4. విభాగాధ్యక్షులు (7.81)		4. కారణాకారములు తెలిసిన విద్వాంసుడు (హేతుక) ,,
5. సహస్ర గ్రామాధీశుడు (7.115,117)		5. నిరుక్త శాస్త్రం తెలిసినవాడు (12.111)
6. శతగ్రామాధీశుడు (7.117)		6.ధర్మ శాస్త్రజ్ఞుడు ,,
7. వింశతిగ్రామాధీశుడు ,,		7. బ్రహ్మచర్యాశ్రమ ప్రతినిధి ,,
8. దశగ్రామాధికారి ,,		8. గృహస్థాశ్రమ ప్రతినిధి ,,
9. ఏకగ్రామాధికారి ,,		9. వానప్రస్థాశ్రమ ప్రతినిధి ,,
10. కర్మచారి గణం (7.81, 120, 122, 125)		10. న్యాయశాస్త్రజ్ఞుడు, తర్కం తెలిసిన విద్వాంసుడు ,,
వీరందరూ ఒక ప్రముఖమంత్రి అధీనమందు ఉంటారు. ప్రతి ప్రముఖమంత్రి తమ తమ విభాగ మందుండే కర్మచారులను నిరీక్షిస్తూ ఉండాలి (7.120)		(ఖ) సదస్యత్రయపరిషత్ 1. ఋక్ విద్య తెలిసినవాడు (12.112) 2. యజుర్విద్యను తెలిసినవాడు ,, 3. సామవిద్యనెరిగినవాడు ,,

ఇది మనుకృతం-ప్రామాణికం

పత్రశాకతృణానాం చ చర్మణాం వైదళస్య చ । మూలశ్లోక సం. **104**
మృణ్మయానాం చ భాండానాం సర్వస్యాశ్మమయస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **132**

టీక:- చ = మరియు, పత్ర +శాక+తృణాణాం = ఆకులు, కూరగాయలు గడ్డి, **చర్మణాం వైదలస్య** = చర్మములు (తోళ్ళు) వెదురు నుండి తయారైన వస్తువులు, **మృణ్మయానాం భాండానామ్** = మట్టి కుండలు, **చ** = మరియు, సర్వస్య **అశ్మమయస్య** = రాళ్ళతో నిర్మించిన పాత్రలు, వీటి వల్ల వచ్చే లాభంలో ఆరో భాగాన్ని కప్పంగా తీసికోవచ్చు.

తాత్పర్యం:- చెట్టు, మాంసం, తేనె, నెయ్యి, గంధం, ఓషధులు, రసములు, పుష్పములు, మూలములు వేళ్ళు, పండ్లు, ఆకులు, కూరగాయలు, గడ్డి, తోళ్ళు, వెదుళ్ళు, మట్టిపాత్రలు రాళ్ళతో నిర్మించిన పాత్రలు వీటి లాభంలో ఆరో భాగంగా పన్ను తీసుకోవాలి. ॥131, 132॥

వివరణ:

మనువు సూచించిన పన్ను విధానం: (Income tax) = సర్వప్రాచీనమే గాక, సర్వాధిక మాన్యం కూడా. సమాజ వ్యవస్థకు మనువే సర్వప్రథమ వ్యవస్థాపకుడు. ఒక ప్రభువుగా ఈ వ్యవస్థలన్నింటినీ ఏర్పాటు చేసి, అమలుపరచి, సంఘటనం ఏర్పాటు చేశాడు. అన్యమైన వ్యవస్థల లాగా, కర (పన్ను) వ్యవస్థను నిర్ధారణ చేశాడు. దాదాపు అదేవిధంగా నేటికీ అమలులో ఉంది. దీన్ని బట్టి మను వ్యవస్థలకు మనుస్మృతికి-సమాజంలో అత్యధిక గౌరవముందని మనకు తెలుస్తున్నది. ఈ కింద పేర్కొన్న కౌటిల్యుడి అర్థశాస్త్రంలోని సమాచారం వల్ల మను గౌరవానికి పుష్టి లభిస్తుంది.

"మాత్స్యన్యాయాభిభూతః ప్రజాః మనుం వైవస్వతం రాజానం చక్రిరే, ధాన్య షడ్భాగం, పణ్య దశభాగం, హిరణ్యంచాస్య భాగదేయం పరికల్పయామాసుః. తేన భృతాః రాజానః ప్రజానాం యోగక్షేమమావహ. తేషాం కిల్బిషం దండకరాహరన్తి యోగక్షేమవహాశ్చ ప్రజానామ్" (ప్ర. 8,అధ్యా. 12).

అంటే, పెద్ద పెద్ద చేపలు, చిన్న చిన్న చేపలను తినేసినట్లుగా బలవంతుల చేతిలో బలహీనులు జీవించడం దుర్లభమైపోయింది. ఈ విధంగా వైవస్వంతుడి పుత్రుడైన మనువును తమకు రాజుగా ఎన్నుకొన్నారు. అప్పటి నుండి మాత్రమే ప్రజలు తమ పొలాల నుండి వచ్చే ఆదాయం నుండి 6వ భాగం, వ్యాపారలాభాల నుండి 10వ భాగాన్ని, అదేవిధంగా కొంత బంగారాన్ని కూడా రాజుకు పన్ను రూపంగా ఇచ్చే విధంగా నిశ్చయం చేశారు. ఈ పన్నులు తీసుకొన్న రాజులు ప్రజలను రక్షించే సమస్త బాధ్యతను స్వీకరించారు. ఈ ప్రకారంగా నిర్ణయించిన కరం (పన్ను), దండన వ్యవస్థకు-ప్రజల కష్ట నివారణకు, రక్షణకు సహాయకరంగా ఉపయోగపడింది.

133-136వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

బ్రాహ్మణులకు పన్నువేయరాదు-

* *మ్రియమాణోఽప్యాదదీత న రాజా శ్రోత్రియాత్కరమ్ ।*
న చ క్షుధాఽస్య సంసీదేచ్ఛ్రోత్రియో విషయే వసన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***133***

తాత్పర్యం:- వేదాధ్యయనపరుడయిన శ్రోత్రియుడి నుండి రాజు కప్పమును తీసుకోరాదు. ఆ రాజు దేశంలో ఉన్న శ్రోత్రియబ్రాహ్మణుడు పస్తులుతో నకనకలాడరాదు. ॥133॥

* *యస్య రాజ్ఞస్తు విషయే శ్రోత్రియస్సీదతి క్షుధా ।*
తస్యాపి తత్క్షుధారాష్ట్రమచిరేణైవ సీదతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***134***

తాత్పర్యం:- ఏ రాజుదేశంలో శ్రోత్రియుడు ఆకలిచేత నకనకలాడునో, అలాంటి రాజు దేశంలో ప్రజలు క్షామపీడితులై ఆకలిచేత చిక్కిపోతారు. ॥134॥

* ***శ్రుతవృత్తే విదిత్వాఽస్య వృత్తిం ధర్మ్యాం ప్రకల్పయేత్ ।***
సంరక్షేత్సర్వతశ్చైనం పితా పుత్ర మివౌరసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***135***

తాత్పర్యం:- కాబట్టి రాజు శ్రోత్రియుడి శాస్త్రజ్ఞానమును, నడవడిని పరిశీలించి, అతడికి న్యాయం తప్పని వృత్తిని కల్పించాలి. తండ్రి కుమారుడు లాగా రాజు తన దేశంలోని శ్రోత్రియుణ్ణి కాపాడాలి. ॥135॥

* ***సంరక్ష్యమాణో రాజ్ఞాయం కురుతే ధర్మమన్వహమ్ ।***
తేనాయుర్వర్ధతే రాజ్ఞో ద్రవిణం రాష్ట్రమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***136***

తాత్పర్యం:- అలాగే శ్రోత్రియుడు ప్రతిదినం రాజుచేత కాపాడబడుతూ, స్వధర్మాన్ని తప్పక అనుష్ఠిస్తాడు. దానివల్ల రాజుకు ఆయుష్షు, ధనమూ రాజ్యమూ వృద్ధి చెందుతాయి. ॥136॥

ప్రక్షిప్తాల పరిశీలన

133 నుంచి 136 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలు పూర్తిగా ప్రసంగ వ్యతిరేకాలు. పూర్వాపర 132-137 శ్లోకాలలోని విషయం వ్యాపారుల నుంచి ఏ విధంగా ఏ వస్తువులపై పన్నును కొంచెమా లేక ఎక్కువగానా ఎలా వసూలు చేయాలనేది. మధ్యలో క్షత్రియుల నుంచి పన్నులు తీసుకునే పద్ధతి చెప్పే ఈ శ్లోకాలు ఆ ప్రసంగాన్ని భంగం చేస్తున్నాయి. ఇలా చెప్పటమూ ప్రాసంగికం కాదు. అందువల్ల ఈ ఆధారంతో ఇవి ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 135-136 శ్లోకాలలో క్షత్రియుల వృత్తిని నిర్ణయించడం బ్రాహ్మణులకు ఏర్పరచిన జీవిక పద్ధతికి వ్యతిరేకం. బ్రాహ్మణులకు యాజనం, అధ్యాపనం, దాన గ్రహణం- ఇవి జీవిక కోసం చెప్పాడే కానీ వృత్తులు స్వీకరించాలని చెప్పలేదు. [1.88; 4.2, 3,11,183]. బ్రహ్మచారి అయితే భిక్షాటన ఉంది [2.158-160 (183-185)]. ఈ శ్లోకాలలో చెప్పిన వ్యవస్థ మనువు వ్యవస్థకు వ్యతిరేకం కనుక, ఈ శ్లోకాలు, వీటికి సంబంధించిన పూర్వ శ్లోకాలు, ఈ ఆధారంతో ప్రక్షిప్తాలు.

ఖ. ఈ శ్లోకాలలో వేద పారులు, బ్రాహ్మణుల ఉపాధులు నిర్ణయించడానికి మారుగా, వారి ధర్మపాలన చేత రాజుకు ఆయువు, ధనమూ, వృద్ధి చెందుతాయని, దేశాభివృద్ధి కూడా జరుగుతుందని ప్రలోభ పెట్టారు.

మనువు సిద్ధాంతం ఏమిటంటే, ధర్మాధర్మాల ఆచరణ ఫలాలు కర్తకే లభిస్తాయని [4.240,241]. వేదపారుల ధర్మపాలనకూ, రాజు ధనమూ, ఆయుస్సూ వృద్ధి చెందటానికీ ఏ సంబంధమూ లేదు. మనువు వ్యవస్థకు వ్యతిరేకం కావటం చేత, ఈ 133-136 శ్లోకాలు ప్రసంగంలో చొప్పించిన ప్రక్షిప్తాలని రుజువవుతూంది.

3. శైలీగత ఆధారాలు

134,136 శ్లోకాల శైలి నిరాధారమూ, అతిశయోక్తులతో కూడినదీ, సహేతుకం కానిదీ అని తెలుస్తూంది. మనువు శైలి ఇటువంటి లోపాలతో కూడినది కాదు.

ఇది మనుకృతం. ప్రామాణికం

యత్కించిదపి వర్షస్య దాపయేత్కరసంజ్ఞితమ్ ।　　మూలశ్లోక సం. **105**
వ్యవహారేణ జీవంతం రాజా రాష్ట్రే పృథగ్జనమ్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం. **137**

టీక:- రాష్ట్రే = రాజ్యంలో, వ్యవహారేణ జీవంతం పృథక్ జనమ్ = వ్యాపారం ద్వారా జీవనం గడిపే ప్రత్యేక వ్యక్తికి, రాజా = ప్రభువు, **యత్‌కించిత్+అపి** = ఏ కొంచెమైనా, **వర్షస్య సంజ్ఞితం** = సాంవత్సరిక శుల్కంగా నిర్ణయింపబడిందో, ఆ భాగాన్ని, **దాపయేత్** = రాజ్యం కోసం తీసికోవాలి.

తాత్పర్యం:- రాజు తన దేశంలో కూరగాయలు, ఆకులు అలములు మొ॥న స్వల్పములైన వస్తువులు మారుబేరానికి అమ్మి, జీవించువారి నుండి సంవత్సరానికి ఒకసారి తక్కువ పన్నును తీసుకోవాలి. ॥137॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

*　**కారుకాఞ్ఛిల్పినశ్చైవ శూద్రాంశ్చాత్మోపజీవినః ।**
ఏకైకం కారయేత్కర్మ మాసిమాసి మహీపతిః ॥　　ప్రక్షిప్త శ్లోక సం. ***138***

తాత్పర్యం:- శిల్పులకంటే ఇంచుక ఉత్తములయి, పిండివంటలు, మొదలైనవి చేసేవారిని, లోహకారులు మొదలైన శిల్పులను, దేహపరిశ్రమచేత జీవిస్తున్న శూద్రులనూ, నెలకు ఒకదినం పని చేయించుకోవాలి. ॥138॥

ప్రక్షిప్త పరిశీలన

138వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకం

వ్యాపారం మొదలైనవి వైశ్యుల పనులు. ఒకవేళ శూద్రులు కూడా ఏదేనా స్వయం ఉపాధిని చేపడితే అది వ్యాపారం కిందికే వస్తుంది. అటువంటి చిన్న వ్యాపారుల నుంచి 7.137లో కొద్ది పన్ను తీసుకునే పద్ధతి ఉంది. ఇక్కడ పని చేయించే పద్ధతి దానికి వ్యతిరేకం. ఈ అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

139 నుండి 148వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

పన్ను వసూలులో అత్యాశ హానికారకం-

నోచ్ఛింద్యాదాత్మనో మూలం పరేషాం చాతితృష్ణయా ।　　మూలశ్లోక సం. **106**
ఉచ్ఛిందన్ హ్యాత్మనో మూలమాత్మానం తాంశ్చ పీడయేత్ ॥　　ప్రక్షిప్త శ్లోక సం. **139**

టీక:- **అతితృష్ణయా** = అతిలోభం వల్ల, **ఆత్మనః** = తన యొక్క, **పరేషాం మూలమ్** = ఇతరుల సుఖాలకు, న **ఉచ్ఛిన్ద్యాత్** = ఎప్పుడూ నష్టం కలిగించరాదు, **హి** = ఎందుకంటే, **మూలం ఉచ్ఛిన్దన్** = ఎవడు వ్యవహారం, సుఖాల మూలాలను నరికివేస్తాడో, అతడు, **ఆత్మానం చ తాన్ పీడయేత్** = తనకు, పరులకు బాధ కలిగించినవాడవుతాడు.

ఋషి దయానందభాష్యం:- అతి లోభం వల్ల ఇతరుల సుఖాలకు ఎప్పుడూ నష్టం కలిగించరాదు, ఎవడు వ్యవహారం, సుఖాలమూలాలను నరికి వేస్తాడో, అతడు తనకు మరియు పరులకు బాధ కలిగించిన వాడవువాడు. (స.ప్ర. 6వ.సము.) ॥139॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తీక్ష్ణశ్చైవ మృదుశ్చ స్యాత్కార్యం వీక్ష్య మహీపతిః ।　　మూలశ్లోక సం. **107**
తీక్ష్ణశ్చైవ మృదుశ్చైవ రాజా భవతి సమ్మతః ॥　　ప్రక్షిప్త శ్లోక సం. **140**

టీక:- మహీపతిః = రాజైనవాడు, **కార్యం వీక్ష్య** = కార్యమును బట్టి, **తీక్ష్ణః చ మృదుః ఏవ స్యాత్** = తీక్ష్ణంగాను, మృదువుగాను ఉండాలి, **తీక్ష్ణః చ ఏవ** = ప్రభువు దుష్టుల పట్ల తీక్షణంగాను, **మృదుః** = శ్రేష్ఠుల విషయంలో మృదువుగాను ఉండే, **రాజా సమ్మతః భవతి** = ప్రభువు అతి మాననీయుడవుతాడు.

ఋషి దయానందభాష్యం:- రాజు తన కార్యావసరాన్ని బట్టి కఠినుడుగాను, మృదువుగానూ కూడా మారాలి. సందర్భానుసారం ఇలా మారగల ప్రభువునే ప్రజలు ప్రస్తుతిస్తారు (స.ప్ర.6వ.సము.). ॥140॥

అనారోగ్యావస్థలో రాచసభాకార్యాన్ని ప్రధానామాత్యుడికి అప్పగించాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

అమాత్యముఖ్యం ధర్మజ్ఞం ప్రాజ్ఞం దాంతం కులోద్గతమ్ । మూలశ్లోక సం.**108**
స్థాపయేదాసనే తస్మిన్ ఖిన్నః కార్యేక్షణే నృణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**141**

టీక:- నృణామ్ కార్యే క్షణే ఖిన్నః = ప్రజాకార్య నిరీక్షణంలో అనారోగ్యం వల్ల అశక్తుడైనప్పుడు, **తస్మిన్ ఆసనే** = తన స్థానంలో, **ధర్మజ్ఞం** = న్యాయకారీ, ధర్మజ్ఞుడూ, **ప్రాజ్ఞం** = బుద్ధిమంతుడు, **దాన్తం** = జితేంద్రియుడు, **కులోద్గతమ్** = ఉత్తమ వంశస్థుడు, **అమాత్య ముఖ్యం** = అందరికంటే పెద్దవాడైన ప్రధానమంత్రిని, **స్థాపయేత్** = కూర్చోపెట్టాలి, అంటే అనారోగ్య పరిస్థితిలో తన స్థానంలో ప్రధానమంత్రిని రాచకార్య సంపాదనార్థం నియమించాలి.

తాత్పర్యం:-రాజు తానే స్వయంగా అనారోగ్యకారణాలతో రాచకార్యనిర్వహణలో ఇబ్బంది పడుతూన్న సందర్భాలలో, వివేకి-ధర్మజ్ఞుడైన మంత్రిని అందుకు నియమించాలి. ॥141॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం సర్వం విధాయేదమితికర్తవ్యమాత్మనః । మూలశ్లోక సం.**109**
యుక్తశ్చైవాప్రమత్తశ్చ పరిరక్షేదిమాః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**142**

టీక:- ఏవం = ఈ ప్రకారంగా, **సర్వం ఇతి కర్తవ్యం విధాయ** = తాను చేయవలసిన కర్తవ్యాన్ని చేసి, అంటే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి, **యుక్తః** = పట్టుదల కలిగి, **చ** = మరియు, **అప్రమత్తః** = ఏ పొరపాటు లేకుండా, **ఆత్మనః ఇమాః ప్రజాః పరిరక్షేత్** = తన ప్రజలను నిరంతరం రక్షించాలి.

తాత్పర్యం:-ఈ ప్రకారంగా నిర్వర్తించవలసిన కార్యాల విషయంలో ఎలాంటి ఏమరుపాటులేక పట్టుదలతో ప్రజాసంరక్షణం చేసే ప్రభువే ప్రజారంజకుడనబడతాడు. ॥142॥

ఇది మనుకృతం-ప్రామాణికం

విక్రోశంత్యో యస్య రాష్ట్రాద్ధ్రియంతే దస్యుభిః ప్రజాః । మూలశ్లోక సం.**110**
సంపశ్యత స్సభృత్యస్య మృతస్స న తు జీవతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**143**

టీక:- యస్య సభృత్యస్య సంపశ్యతః = ఏ రాజూ, మంత్రీ, సేవకులూ చూస్తూ ఉండగా, **రాష్ట్రాత్** = రాజ్యంలో, **దస్యుభిః విక్రోశన్త్యః ప్రజాః హ్రియంతే** = దోపిడీదారులు ప్రజలను బాధించి, ఏడిపించి, పదార్థాలను దోచుకొని పోతారో, ప్రాణాలను తీస్తారో, **సః మృతః** = ఆ రాజు సేవకులతోడ బ్రతికియున్నా చచ్చినవాడితో సమానం.

తాత్పర్యం:-ఏ రాజ్యంలో రాజు, మంత్రి, భటవర్గం అదుపులో ఉంచలేక చెలరేగిపోయే దొంగలదాడికి ప్రజల్ని బలిపెడతారో, ఆ ప్రభువు బ్రతికుండీ చచ్చినవాడితో సమానుడే! ॥143॥

ఇది మనుకృతం-ప్రామాణికం

క్షత్రియస్య పరో ధర్మః ప్రజానామేవ పాలనమ్ । మూలశ్లోక సం.111
నిర్దిష్టఫలభోక్తా హి రాజా ధర్మేణ యుజ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.144

టీక:- అందువల్ల, క్షత్రియస్య = రాజుకు, ప్రజానాం +ఏవ పాలనమ్ = ప్రజా సంరక్షణమే, పరః ధర్మః = పరమ ధర్మం, నిర్దిష్ట ఫలభోక్తా హి రాజా = (మనుస్మృతిలో సప్తమాధ్యాయంలో 99-104లో చెప్పినట్లు)- సభ నిర్ణయించినట్లుగా పన్ను వసూలు చేసి అనుభవించే రాజు, **ధర్మేణ యుజ్యతే** = ధర్మాత్ముడై సుఖాన్ని అనుభవిస్తాడు. ఇందుకు భిన్నంగా ప్రవర్తించినట్లయితే దుఃఖం అనుభవిస్తాడు.

ఋషి దయానందభాష్యం:-కాబట్టి ప్రజలను పాలించుటయే రాజుల పరమధర్మం. మనుస్మృతి సప్తమాధ్యాయంలో వ్రాయబడినట్లు సభ నియమించిన విధంగా పన్నును తీసుకునే రాజు ధర్మయుక్తుడై సుఖాన్ని పొందుతాడు. దీనికి విరుద్ధంగా చేసేరాజు దుఃఖాన్ని అనుభవిస్తాడు. ॥144॥

రాజుల దైనందిన కర్తవ్యాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఉత్థాయ పశ్చిమే యామే కృతశౌచస్సమాహితః । మూలశ్లోక సం.112
హుతాగ్ని ర్బ్రాహ్మణాంశ్చార్చ్య ప్రవిశేత్స శుభాం సభామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.145

టీక:- రాజు, **పశ్చిమే యామే ఉత్థాయ** = తెల్లవారు జామున 3-4 గం॥లకు లేచి, **కృతశౌచః** = కాలకృత్యాలు, శౌచః = నిర్వర్తించి, **సమాహితః** = సావధానచిత్తుడై పరమేశ్వరుడిని ధ్యానించి, **హుతాగ్నిః** = అగ్నిహోత్రం నిర్వహించి, **బ్రాహ్మణాం అర్చ్య** = విద్వాంసులనర్చించి, **చ** = మరియు, **శుభాం సభామ్ ప్రవిశేత్** = సభలో ప్రవేశించాలి.

ఋషి దయానందభాష్యం:-ఇంతకుముందే చెప్పబడిన రీతిగా ప్రభాతవేళ సూర్యోదయాత్పూర్వమే 3-4 గం॥లకు లేచిన రాజు ఆ యా కృత్యాలాచరించాక పరమేశ్వరుణ్ణి ధ్యానించి, అగ్నిహోత్రం నిర్వహించి, విద్వాంసుల నర్చించి అలంకృత సభాభవనంలో అందరి సందర్శనార్థం ప్రవేశించాలి (స.ప్ర. 6వ సము.). ॥145॥

వివరణ:

'బ్రాహ్మణాన్ అర్చ్య' అను శబ్దానికర్థం

ఈ శ్లోకంలో రాజుగారి నిత్యచర్య సందర్భంలో -"**బ్రాహ్మణాన్ అర్చ్య**" అనే శబ్దాలున్నాయి. వీటి అభిప్రాయమేమిటి? ఇక్కడ కొందరు టీకాకారులూ భాష్యకారులూ "**రోజూ రాజుగారు ప్రాతఃకాలం బ్రాహ్మణులను పూజించాల**"నే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ అర్థం మనుసమ్మతం కాదు. వేద విద్వాంసులే బ్రాహ్మణులని చెబుతారు. ఈ విషయంలో సప్రమాణ వివేచనం అవసరముంది. 1.50, 51, శ్లోకాలలోని వివరణ చూడగలరు.

'**అర్చ్ = పూజాయాం**' అనే ధాతువు నుండి 'అర్చ్య' శబ్దం ఏర్పడుతుంది. ఇక్కడ అర్చ-పూజా శబ్దాలకు-సత్కారం, సమ్మానం, లేదా అభివందనమని అర్థం. ఇదే మను సమ్మతం. ఈ విధంగా రాజు ప్రాతఃకాలంలో లేచి, విద్వాంసులకు అభివందనం చేయాలని మనువు అభిప్రాయం. ఈ విధంగా రాజు విద్వాంసుల యందు ఆదర భావముంచుగాక! ఇదే మనుభావన అని తెలియజేయడానికి "**అర్చ్ = పూజాయాం, సత్కారం అభివందనం**" అనే అర్థాలలో మను ప్రయోగాలే ప్రమాణం.

క. గురువుకు అభివందన చేసే విధానాన్ని సూచించే సందర్భంలో **"దూరస్థో న అర్చయేత్ ఏనమ్"** (2.139)

ఖ. పర్యాయ వాచకరూపంలో అభివాదయేత్ ప్రయోగం **"స్వాన్ గురూనభివాదయేత్"** (2.142)

గ. అభివందనం, సత్కారం, సమ్మానార్థంలో నిమ్న ప్రయోగాలు **"అవృత్తానాం గురుకులాత్ విప్రాణాం పూజకో భవేత్"** (7.63)

ఇతరత్రా కూడా విద్వాంసులకు అభివందన చేయమని రాజుకు సూచన చేయబడింది.

ఘ. **"రాజా స్నాతకయో శ్చైవ- స్నాతకో నృపమానభాక్"** (2.8,9) అయితే ప్రాతఃకాలంలో రాజుగారికి దైనందిన అగ్నిహోత్రాదులు నిర్వర్తించే వారు. (7.28,59, 60శ్లోకాల్లోని వివరణ చూడగలరు.) రాజుగారి సామాన్య దినచర్య-ఈ శ్లోకం నుండి 225 వరకు మనువు- రాజు యొక్క సామాన్య దినచర్యను సూక్ష్మంగా వర్ణించాడు.

కొంచెం అటు యిటు కొంత మార్పుతో కౌటిల్యుడుకూడా తన అర్థశాస్త్రంలో రాజు దినచర్యను వర్ణించాడు. ఇందులో రాజు వీలును బట్టి లేదా దేశకార్యాదులననుసరించి కొంత పరివర్తనం చేసుకోగలరు.

తులనాత్మక రూపంలో దినచర్య పట్టిక చూడగలరు.

మనుప్రోక్తమైన రాజు దినచర్య

	కాలవిశేషం	సమయం	దైనందిన కార్యం	శ్లోకం
1.	రాత్రి అంతిమయామం (సమయం అష్టమ ప్రహరము)	ఉ॥ 3 గం॥ నుండి 6 గం॥ల వరకు	మేలుకోవడం నైత్యిక కార్యం, సంధ్యా అగ్నిహోత్రం అల్పాహారం ఆచార్య- ఋత్విక్ మొదలయిన విద్వాంసుల సంగతి వారి నుండి అధ్యయనం అలాగే స్వాధ్యాయం	7.37-145
2.	పగటి మొ॥ జాము	ఉ॥ 6 నుంచి 9	ప్రజాసభ (దర్బార్) సమావేశం ప్రజల నుండి- కష్టాలను వినడం, సమాధానం, ధర్మార్థకామాలు, రాజ్యమండల ప్రకృతులు దూతలు గుప్తచరులు కర్తవ్యాలు. యుద్ధ సంబంధమైన ప్రణాళిక గురించి మంత్రులు, అమాత్యులతో గుప్త మంత్రణ.	7.147-215
3.	ద్వితీయ యామం	ఉ॥ 10 నుంచి మ॥	1వరకు శస్త్రాస్త్రాల అభ్యాసం తరువాత స్నానం, భోజనం, విశ్రాంతి	7.216-221
4.	తృతీయ యామం		మ॥ 1 నుంచి సా॥ 4వరకు వ్యాజ్యాలు రాజ్య సంబంధమైన కార్యాలు	7.221
5.	చతర్థ యామం	సా॥ 4 నుంచి 7వరకు	స్వతంత్ర వ్యవహారము సేన, శస్త్రాస్త్ర యుద్ధ వాహనాల నిరీక్షణ	7.222
6.	పంచమ యామం	రాత్రి సంధ్యాకాలం	7 నుంచి 10 సంధ్యాకాలీన నైత్యిక కార్యం	7-224

7.	షష్ఠ యామం రాత్రి 10 నుంచి ఉ॥ 3	సంధ్యాకాలీన గుప్తచారుల దూతల నుండి సమాచారం వినడం, వారికి తరువాత కార్యక్రమం, గురించి తెలిపి పంపడం.	7-180
8.	సప్తమయామం	శయనం.	7-225

కౌటిల్య ప్రోక్తమైన రాజు దినచర్య

(అర్థశాస్త్ర ప్రకరణం.14.అ.28.)

యామం	పగలు చేసే పనులు దానికి నిశ్చితమైన కాలావధి
రాత్రి 8వ జాము	జాగరణ (మేల్కొనుట) నైత్యిక అలాగే శాస్త్రీయ కర్తవ్యాలు, గుప్త మంత్ర, పూర్వకంగా గుప్తచారులను పంపించడం.
1వ యామం	ఋత్విక్ ఆచార్యాదుల సాంగత్యం, వైద్యుడితో కలయిక, రక్షా-వ్యవస్థ, ఆయవ్యయవ్యవస్థను తెలిసికోవడం.
2వ యామం	పురవాసుల, జనపదవాసుల కార్యాల విచారణ (రాజదర్బార్), స్నానం, భోజనం, స్వాధ్యాయం.
3వ యామం	ఆదాయ-వ్యయ- నిర్వహణ, వివిధాధికారుల నియుక్తి మొ॥., మంత్రి పరషత్ పరామర్శించడం, గుప్తచారుల కార్యాలను నిర్ణయించడం.
4వ యామం	స్వతంత్రతాపూర్వకంగా విహరించడం, మంత్ర-సేన అలాగే సైన్య సామాగ్రి నిరీక్షణ.
5వ యామం	సేనాపతితో యుద్ధ సంబంధమైన మంత్ర, సంధ్యోపాసన, గుప్తచారుల నుండి సమాచారం తెలిసికోవడం, స్నానం, భోజనం.
6వ యామం	శయనం.

సభలోకి వెళ్ళి ప్రజల కష్టాలను వినాలి **ఇది మనుకృతం-ప్రామాణికం**

తత్ర స్థితః ప్రజా స్సర్వాః ప్రతినంద్య విసర్జయేత్ ।
విసృజ్య చ ప్రజాస్సర్వా మంత్ర యేత్సహ మంత్రిభిః ॥

మూలశ్లోక సం.**113**
ప్రక్షిప్త శ్లోక సం.**146**

టీక:- తత్ర (7.122 లో వర్ణించిన) సభలో ప్రవేశించి, **స్థితః** = కూర్చొని, లేదా నిల్చొని, **సర్వాః ప్రజాః ప్రతినన్ద్య** = అక్కడ ఉన్న ప్రజల సమస్యలకు, కష్టాలకు సంతోషకరంగా సమానధానమిచ్చి, వారిని ప్రసన్నులను చేసి, **విసర్జయేత్** = పంపించివేయాలి, **చ** = మరియు మళ్ళా, **సర్వాః ప్రజాః విసృజ్య** = ప్రజలందరినీ పంపించిన తరవాత, **మన్త్రిభిః సహ మన్త్రయేత్** = మంత్రులతో పాటు రాజ్య వ్యవస్థను గురించి విచార, విమర్శ చేయాలి.

ఋషి దయానందభాష్యం:- అక్కడ నుండి రాచకార్యనిర్వహణలో నిమగ్నుడై ఉండాలి. తనను దర్శించడానికి వచ్చిన వివిధ స్థాయి వ్యక్తులతో సంభాషించి, సముచిత రీతి నిర్ణయాలు తీసుకొని, వారిని పంపిన తరవాత మంత్రులతో మంతనాలు సాగించాలి (స.ప్ర.6వ.సము).॥146॥

రాజ్య సంబంధమైన ఆలోచనలు చేయాల్సిన స్థానములు **ఇది మనుకృతం-ప్రామాణికం**

గిరిపృష్ఠం సమారుహ్య ప్రాసాదం వా రహోగతః ।
అరణ్యే నిశ్శలాకే వా మంత్రయేదవిభావితః ॥

మూలశ్లోక సం.**114**
ప్రక్షిప్త శ్లోక సం.**147**

టీక:- గతః = తరువాత ముఖ్యమంత్రితో కలిసి వ్యాహానికి వెళ్ళాలి. **గిరిపృష్ఠం వా రహః ప్రాసాదం** = పర్వత శిఖరానికి, లేదా ప్రత్యేకంగా ఉన్న గృహం, **వా** = లేదా, **అరణ్యే నిఃశలాకే** = నిర్జనారణ్యంలో గాని, **సమారుహ్య** = ఎక్కి కూర్చుండి, **అవిభావితః** = విరుద్ధ భావాలను త్యజించి, **మన్త్రయేత్** = మంత్రితో కలిసి ఆలోచించాలి.

ఋషి దయానందభాష్యం-మారువేషాలలో సంచరించడం; ఆ తర్వాత ముఖ్యమంత్రితో కలిసి పర్వత శిఖర మెక్కిగాని, మేడమీద విహరిస్తూగాని, నిర్జనారణ్యంలో గాని ఎవ్వరూ లేని ఏకాంత ప్రదేశంలో కూర్చొని ఏక మనస్కులై ఆలోచించాలి. పిదప శత్రువులను ఒక కంట కనిపెట్టడం. కార్యానుకూలత కోసం శ్రమించడం; పరిపాలన నిమిత్తమై ద్రవ్య సేకరణ; ఆపదలను తొలగించుకొనే ఉపాయాలు వెతకడం అనే ఈ 5 విధాల యోచనలతోనే రాజు గడపాలి.॥147॥

వివరణ:

"నిఃశలాకే అరణ్యే" అభిప్రాయం గుప్త మంత్రణా భేదకమైన చిన్న గడ్డిపరక లాంటి ప్రాణి కూడా లేని ప్రదేశం.

"తదుద్దేశః సంవృతః కథానామనిఃస్రావీ పక్షిభిరప్యనాలోక్యః స్యాత్ ।
శ్రూయతే హి శుకసారికాభిర్మంత్రో భిన్నః శ్వభిరప్యన్యైశ్చ తిర్యగ్యోనిభిః"॥ (ప్ర.20. అధ్యా.14).

మంత్రణాస్థలం అత్యంత సురక్షితంగాను, గోపనీయంగాను ఉండాలి. పక్షులు కూడా తొంగిచూడరానట్టి ప్రదేశంగా ఉండాలి. ఇక మనుషులు చేసే ప్రశ్నే లేదు. కారణమేమంటే- పూర్వకాలంలో ఏదో ఒక రాజు రహస్యాలోచనలను చిలుక, గోరువంకలు విని బయట చెప్పినవట. ఇదే విధంగా కుక్కలు, అన్య పశుపక్ష్యాదులు కూడా రహస్యాలను విని బయటపెట్టునని వినికిడి.

మంత్రాలోచనాన్ని రహస్యంగా ఉంచడం - ఇది మనుకృతం-ప్రామాణికం

యస్య మంత్రం న జానంతి సమాగమ్య పృథగ్జనాః । మూలశ్లోక సం.**115**
స కృత్స్నాం పృథివీం భుఙ్క్తే కోశహీనోఽపి పార్థివః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**148**

టీక:- యస్య = ఏ రాజు యొక్క, **మన్త్రం** = గూఢమైన ఆలోచనను, **పృథక్ జనాః సమాగమ్య +న జానన్తి** = అన్య జనులందరూ తెలిసికోజాలరో, అంటే ఎవరి యొక్క ఆలోచనలు గంభీరంలో, పరిశుద్ధంలో, పరోపకారార్థం వాటిని ఎల్లప్పుడు గుప్తంగా ఉంచాలి, **సః** = అలాంటి రాజు, **కోశహీనః + అపి పార్థివం** = ధనహీనుడైనా, **కృత్స్నాం పృథివీం భుఙ్క్తే** = సమస్త పృథ్విని పాలించడానికి సమర్థుడవుతాడు.

తాత్పర్యం:-ఏ రాజు గూఢమైన ఆలోచనను అన్యజనులందరూ తెలిసికోజాలరో అంటే ఎవరి ఆలోచనలు గంభీరాలై, పవిత్రాలై, పరోపకారార్థాలై సదా గుప్తంగా ఉంటాయో అలాంటి రాజు ధనహీనుడైనా, సమస్త పృథ్విని పాలించడానికి సమర్థుడవుతాడు. కాబట్టి సభాసదుల అనుమతి లేకుండా తనంతట తాను ఏ కార్యాన్ని చేయరాదు. (స.ప్ర.6వ సము). ॥148॥

వివరణ:

1. "మన్త్ర" శబ్దానికి రాజనీతి పరమైన అర్థం.

మన్త్ర శబ్దార్థాన్ని గురించి ఇక్కడ చాలా వివరించవలసి ఉంది. కానీ (రాజనీతి ప్రసంగంలో) మన్త్రమంటే **'గోపనీయాలోచన'** అని అర్థం. రహస్యమైన విషయాలను గురించి చేసే ఆలోచనే **'మన్త్రణ'** అవుతుంది. **'మత్రి = గుప్తభాషణే'** గుప్తంగా ఆలోచించే అనే అర్థంలో **'మత్రి'** ధాతువుకు **'ఘఞ్'** ప్రత్యయం చేర్చగా **"మన్త్ర"** శబ్దం ఉత్పన్నమవుతుంది. **"మననాత్ = మన్త్రః"** అని నిరుక్తకారు తెలిపాడు. రాజనీతి రహస్యాలకు మంత్రాలని పేరు.

2. కోశహీనోఽపి పార్థివః" ప్రయోగం. ఇది భాషాసంప్రదాయం ఇడియం రూపంలో ప్రయోగించబడింది. ఇలాంటి భావాలను అభివ్యక్తం చేయడం. (7.21) లో కూడా చూడగలరు.

149, 150 శ్లోకాలు ప్రక్షిప్తం. ప్రామాణికం కావు

* *జడమూకాంధబధిరాంస్తైర్యగ్యోనాన్ వయోధికాన్ ।*
స్త్రీమ్లేచ్ఛవ్యాధితవ్యంగాన్మంత్రకాలేఽపసారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***149***

తాత్పర్యం:-జడులు, మూగవారు, గుడ్డివారు, చెవిటివారు మొదలయినవారిని; ముదుసలులు, స్త్రీలు, మ్లేచ్ఛులు, రోగులు, అంగహీనులు మొదలయినవారిని; చిలుకలు-గోరువంకలు మొదలయిన వాటి పలుకులు తెలిసిన పక్షులను మంత్రాలోచన సమయంలో పారద్రోలాలి. ॥149॥

* *భిందంత్యవమతా మంత్రం తైర్యగ్యోనాస్తథైవ చ ।*
స్త్రియశ్చైవ విశేషేణ తస్మాత్తత్రాదృతో భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***150***

తాత్పర్యం:-వీరంతా పూర్వజన్మ కర్మ వశాన హీనజన్మలెత్తి అధార్మికులై-అవమానాలు పడుతున్నందు వల్ల రహస్యాలోచనలు వెల్లడిస్తారు. చిలుకలు, స్త్రీలు కూడ విన్నమాటలు విన్నట్లుగా అనకూడని చోట అనేస్తే ప్రమాదం. కాబట్టి మంత్రాంగం జరిపే సమయంలో వీరిని/వీటిని దరిచేరనివ్వరాదు. ॥150॥

ప్రక్షిప్తాల పరిశీలన

149-150 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ రెండు శ్లోకాలలోని వ్యవస్థకూ, మనువు వ్యవస్థకూ పొంతన కుదరటం లేదు. 147లో శూన్యం, ఏకాంతంగా, గడ్డిపరక కూడా లేని చోటికి వెళ్లి గుప్తంగా మంత్రాంగం జరపాలని స్పష్టంగా ఉంది. ఇక్కడ ఈ శ్లోకాలలో చెప్పిన ప్రాణులు ఉండటమనే సమస్యే లేదు. అందుచేత ఇది చెప్పటమే అనవసరం !

ఖ. రెండవది - గుప్తంగా ఏకాంత స్థలంలో రాజు మంత్రాంగం చేస్తున్నప్పుడు అక్కడ మూగ, చెవిటి వంటి వికలాంగులు వెళ్లే అవకాశమే ఉండదు. తాను మంత్రాంగం నెరపుతున్న చోటికి రోజు ఎవ్వరినీ రానీయడు.

గ. మూడవది - మూగ, చెవిటి వారు వచ్చినా వారు ఆ మంత్రాంగాన్ని వినటం, మరొకరికి చెప్పటం ఎలా సాధ్యమవుతుంది? శత్రువు లెవరైనా అలాంటివారి ద్వారా ఈ రాజు మంత్రాంగం తెలుసుకోవాలనుకుంటే, ఇతరు లెవరి వల్లనైనా ప్రయత్నించ వచ్చు కదా, ఈ వికలాంగులే ఎందుకు? ఇలా ఈ శ్లోకాలలోని విషయానికీ, మనువు వ్యవస్థకు పొసగటం లేదు. ఇది అనవసరం !

2. ప్రసంగ వ్యతిరేకాలు

పూర్వాపర విషయం గుప్త మంత్రాంగం, దాని ఫలితం, కాలం - వీటికి సంబంధించింది. దీని మధ్య కొన్ని ప్రాణులను తొలగించటమనేది పానకంలో పుడకలా విషయంతో పొసగటం లేదు. మంత్రాంగ స్థానం 147లో ఉంది. దానితో పాటు ఉంటే, ఈ విషయానికి ప్రాసంగిక ఔచిత్యమైనా దక్కి ఉండేది. కాని దాని తర్వాత మనువు గుప్త మంత్రాంగపు ఫలితం చెప్పాడు. మళ్లీ చోటు, అక్కడ నుంచి ఎవరినో తొలగించటం ఇవన్నీ ప్రసంగ వ్యతిరేకాలు. ఈ అసంబద్ధత వల్ల ఇలాంటి వర్ణన మనువుకు ఇష్టం లేదని తేలిపోతూంది. ప్రసంగ క్రమంలో లేనందున ఇవి ప్రక్షిప్తాలు!

151 నుండి 181వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ధర్మార్థకామాల గురించి ఆలోచించాలి-

మధ్యందినేఽర్ధరాత్రే వా విశ్రాంతో విగతక్లమః । మూలశ్లోక సం.116
చింతయేద్ధర్మకామార్థాన్ సార్ధం తైరేక ఏవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.151

టీక:- మధ్యదినే = రెండు జాముల సమయం, దినమధ్యంలో, మధ్యాహ్నం, వా = లేదా, విశ్రాంతః విగతక్లమః = విశ్రాంతి తీసికొని, అలసట, బడలికలు వదిలి, స్వస్థుడై, ప్రసన్నుడై, అర్ధరాత్రే = మధ్య రాత్రి సమయమందైనా, ధర్మ-కామ-అర్థాన్ = ధర్మం, కామం మరియు అర్థసంబంధమైన విషయాలను, తైః సార్ధం = ఆ మంత్రులతోనే కలిసిగాని, వా = లేదా విశేష పరిస్థితిని బట్టి, ఏక ఏవ = ఒంటరిగానే, చిన్తయేత్ = ఆలోచన చేయాలి. "చిన్తాయేత్" క్రియ 158వ శ్లోకం వరకు అన్వయిస్తుంది.

తాత్పర్యం:- మిట్టమధ్యాహ్నమునగాని, నడిరేయిని గాని, మనోవిచారం లేదా విశ్రాంతి తీసుకొని బడలికలు వదిలి, మధ్య రాత్రి సమయంలో అయినా, మంత్రులతో గానీ ఒంటరిగా గాని ధర్మార్థకామముల గురించి ఆలోచించాలి.॥151॥

వివరణ:

రాజు, ధర్మ-కామ-అర్థాలను గురించి ఆలోచన చేయడం.

రాజు ప్రసన్నమైన మనస్సుతో ధర్మ-కామ-అర్థాలకు సంబంధించిన విషయాలను దేశ-కాల-కార్యాలననుసరించి ఒంటరిగా గానీ, లేదా అన్య మంత్రులతో గానీ కలిసియైనా ప్రతిదినం ఆలోచిస్తూ ఉండాలి. కౌటిల్యుడు కూడా ఈ విధంగా తెలిపాడు. "దేశ-కాల-కార్యవశేన త్వేకేన సహ, ద్వాభ్యామ్, ఏకో వా యథాసామర్థ్యం మన్త్ర యేత" (ప్ర.10.6,14).

1. 'ధర్మ-కామ-అర్థాల' స్వరూపాల గురించి విస్తృతమైన వివేచన చేయాలి. (7.26వ శ్లోక వివరణ చూడగలరు).
2. ఈ శ్లోకంలో అర్ధశబ్దం 'నగరార్ధ' శబ్దంలాగ ఒక భాగమనే అర్థంలో ప్రయుక్తం అంటే ఏదైనా రాత్రి సమయమని అర్థం. అర్ధరాత్రి అని అర్థంకాదు.

ధర్మార్థ కామముల మధ్య విరోధముండరాదు - ఇది మనుకృతం-ప్రామాణికం

పరస్పరవిరుద్ధానాం తేషాం చ సముపార్జనమ్ । మూలశ్లోక సం.117
కన్యానాం సంప్రదానం చ కుమారాణాం చ రక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.152

టీక:- చ = మరియు, తేషాం పరస్పర విరుద్ధానాం సముపార్జనమ్ = ఆ ధర్మార్థ -కామాలలో పరస్పరం విరోధం వచ్చినట్లయితే, ఆ విరోధాన్ని తొలగించి, సమన్వయపరచడం. చ = మరియు, కన్యానాం కుమారాణాం సంప్రదానం చ రక్షణమ్ = కన్యలను, కుమారులను, గురుకులానికి పంపించి వారికి రక్షణ కల్పించి, వారి వివాహాలకు తగిన వ్యవస్థను కూడా కల్పించాలి.

ఋషి దయానందభాష్యం:- ఆ ధర్మార్థ కామములలో తరచుగా పరస్పరం విరోధం వచ్చినట్లయితే అలాంటి విరోధాన్ని తొలగించి కన్యలను, కుమారులను గురుకులానికి పంపించి వారికి రక్షణ కల్పించి, వారి వివాహాలకు తగిన వ్యవస్థను కూడా కల్పించాలి.

కన్యలను, కుమారులను ఉక్త సమయముననుసరించి గురుకులములకు పంపించి తగు సమయం వరకు బ్రహ్మచర్యాశ్రమమందుంచి, విదుషీమణులను, విద్వాంసులనుగా తయారు చేయవలయును. ఈ ఆజ్ఞలను పాలించని తల్లిదండ్రులను దండించవలయును. ప్రభుత్వాజ్ఞల ననుసరించి ఎనిమిది సంవత్సరముల వయస్సు దాటిన తరువాత

బాలబాలికలు ఎవరూ యిండ్లలో ఉండరాదు. సమావర్త సమయం రానంత వరకు, వివాహం కానంత వరకు ఆచార్యుల కులమునందే ఉండవలయును. (స.ప్ర.6వ సము.) ॥152॥

రాయబారుల గుప్తచారుల ఆచరణలను పరికించడం - **ఇది మనుకృతం-ప్రామాణికం**

దూతసంప్రేషణం చైవ కార్యశేషం తథైవ చ । మూలశ్లోక సం.**118**
అంతఃపురప్రచారం చ ప్రణిధీనాం చ చేష్టితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**153**

టీక:- చ = మరియు, **దూతసంప్రేషణం** = దూతలను అటు ఇటు పంపించడం, **తథైవ కార్యశేషం** = అదే విధంగా మిగిలిపోయిన అన్యకార్యాలను పూర్తి చేయడం, **చ** = మరియు, **అంతఃపురప్రచారం** = అంతఃపురానికి సంబంధించిన స్థితిగతులను, **చ** = మరియు, **ప్రణిధీనాం చ చేష్టితమ్** = నియుక్తులైన గుప్తచరుల ఆచరణలను గురించి, వారి గతివిధులను గమనించి విచారించాలి.

తాత్పర్యం:- దూతలను అటుఇటు పంపించడం, అదే విధంగా అన్యకార్యాలను పూర్తి చేయడం, అంతఃపురానికి సంబంధించిన స్థితిగతులను నియుక్తులైన గుప్తచరుల ఆచరణలను గురించి, వారి గతివిధులను గమనించి, విచారించడం. ॥153॥

అష్టవిధాలైన కర్మలను గురించి ఆలోచన- **ఇది మనుకృతం-ప్రామాణికం**

కృత్స్నం చాష్టవిధం కర్మ పంచవర్గం చ తత్త్వతః । మూలశ్లోక సం.**119**
అనురాగాపరాగౌ చ ప్రచారం మండలస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**154**

టీక:- చ = మరియు, **కృత్స్నం అష్ట విధం కర్మ** = సమస్తమైన అష్ట విధాలుగా ఉన్న కర్మసముదాయం, **చ** = అలాగే, **పంచవర్గమ్** = పంచవర్గ వ్యవస్థా, **అనురాగాపరాగౌ** = అనురాగం, స్నేహం, అపరాగం (ద్వేషం), **చ** = అలాగే, **మండలస్య ప్రచారం** = మండల గతివిధులు, ఆచరణ, (7.155,157) శ్లోకాల్లో చెప్పబోయేది, **తత్త్వతః** = ఈ విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

తాత్పర్యం:- సమస్తమైన అష్టవిధాలుగా ఉన్న కర్మసముదాయం, అలాగే పంచవర్గ వ్యవస్థా, అనురాగం, స్నేహం, ద్వేషం, అలాగే మండల గతివిధులు ఆచరణ మొదలైన విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ॥154॥

వివరణ:

అష్టవిధకర్మల వివాదానికి సమాధానం.

మనుమహర్షి-ఇక్కడ రాజుకు సంబంధించిన అష్టవిధ కర్మలను సంకేత మాత్రంగా వివరించ కుండా, **"కృత్స్నం చ అష్టవిధం కర్మ"** అని మాత్రమే సూచించాడు. ఈ వ్యవస్థను గురించి భాష్యకారులు తమ తమ అభిప్రాయాలను తెలుపుతూ రాజుగారికున్న కర్మలను సూచించారు. ఈ కర్మలలో మతభేదమున్నందు వల్ల ఈ విషయం వివాదాస్పదమైంది. పరవర్తులైన వ్యాఖ్యాకారులు పూర్వవర్తులైన ఆచార్యుల అభిప్రాయాలను ఉదాహరించి ముందుకు వెళ్ళారు.

ఇక్కడ ఆలోచించాల్సిన విషయమేమంటే, 7-147-215, వరకు మనువు రాజుగారి దినచర్యను తెలుపుతూ-ఆ సందర్భంలోనే, గుప్తమంత్రణ లేదా మంత్రి పరిషత్ ద్వారా సమాలోచన చేయాల్సిన విషయాలను పేర్కొన్నాడు. ఈ ప్రసంగంలో (7-147-215) కొన్ని విషయాలను స్పష్టంగా చెప్పి ఉన్నాడు. కానీ, ఈ శ్లోకంలో సంఖ్యను మాత్రం చెప్పాడు. కానీ ఫలానా అని మాత్రం చెప్పలేదు. అందువల్ల ఈ శ్లోక వ్యాఖ్యలో రెండు విషయాలను గమనించాలి.

1. మంత్రణకు పరిగణితమైన విషయాల కంటే ఈ అష్టవిధ కర్మలు భిన్నమై ఉండాలి. కారణం-ఒక స్థానంలో పునరుక్తి రాకూడదు గదా!

2. కృత్స్నం విశేషణం తనకున్న విశేషార్థాన్నిబట్టి, ఈ అష్టవిధ కర్మలు రాజు చేయాల్సిన సమగ్ర కర్మలను సూచిస్తుంది. దీన్ని ఆధారంగా చేసికొని, మనుస్మృతిలో ఈ అష్టవిధ కర్మలు చెప్పబడినట్లు తెలుస్తోంది. ఇంకొక విధంగా చెప్పాలంటే ఇది రాజుగారి జీవనచర్య అని నిష్కర్షగా చెప్పవచ్చు. (7.147,215) (7.114,175) కాబట్టి అష్టవిధకర్మలు మనుస్మృతిలోనే లభిస్తాయి. కింది విధంగా ఉన్నాయి.

క. మనుప్రోక్తమైన రాజు యొక్క అష్టవిధ కర్తవ్యాలు

1. ఆచార్య-ఋత్విక్ మొ॥ వేదవిద్వాంసుల సంగతి, వారి నుండి విద్యాగ్రహణం (7.37,39,43).
2. ఇంద్రియజయం, వ్యసనాల నుండి రక్షణ (7.44,53).
3. మంత్రులు, అమాత్యులు, దూతలు, అధ్యక్షాదుల నియుక్తి మరియు వారి ద్వారా కార్య సంపాదన (7.54-68).
4. దుర్గ నిర్మాణం (7.69-77).
5. యుద్ధం కోసం ప్రశిక్షితుడవడం, సన్నద్ధుడవడం (7.87-106).
6. అపరాధులను న్యాయపూర్వకంగా దండించడం, తద్వారా ప్రజలకు శాంతిని, సమృద్ధిని, సురక్షత కల్పించడం (7.107-124).
7. వేతనాలివ్వడం మొ॥(7.125-126).
8. కరసంగ్రహం = పన్నులు వసూలు చేయడం (7.127-142).

ఖ. ఉశనస్ స్మృతిలో రాజు యొక్క అష్టవిధకర్మలు ఈ విధంగా ఉన్నాయి.

"ఆదానే చ విసర్గే చ తథా ప్రైషనిషేధయోః ।
పంచమే చార్థవచనే వ్యవహారస్య చేక్షణే ॥
దణ్డశుద్ధ్యోస్తథా యుక్తస్తేనాష్ట గతికోనృపః" ।

రాజు కర్తవ్యాలు ఎనిమిది-

1. ఆదాన పన్ను (Tax) తీసికోవడం.
2. విసర్గ- కర్మచారులకు వేతనమివ్వడం.
3. ప్రైష-మంత్రులు, రాయబారులు మొ॥ వారిని విధులకు పంపడం.
4. నిషేధం-విరుద్ధ కర్మలు చేయకుండా ఉండటం.
5. అర్థవచనం-రాజాజ్ఞలను అమలు చేయడం.
6. వ్యవహారాలను చూడటం.
7. దండం (దండించడం-శిక్షించడం).
8. శుద్ధి-పాపులను, అపరాధులను-ప్రాయశ్చిత్తాదుల ద్వారా పరిశుద్ధం చేయడం.

గ. మేధాతిథి (మనుస్మృతి వ్యాఖ్యాకారుడు) చెప్పిన అష్టవిధ కర్మలు

1. ఇంతవరకు ఆరంభించని పనులు ప్రారంభించడం.
2. ప్రారంభించిన పనులను పూర్తిచేయడం.
3. పూర్ణమైన పనులను విస్తరించడం.
4. కర్మల ఫలితాలను సంగ్రహించడం.

5. సామ.
6. దాన.
7. భేద.
8. దండ (లేదా)

1. వ్యాపారానికి మార్గాలు.
2. జలసేతు బంధనం.
3. దుర్గ నిర్మాణం.
4. పూర్తి చేసిన కర్మల యొక్క సంస్కార నిర్ణయం.
5. గజబంధనం.
6. గనులను ఏర్పాటు చేయడం.
7. శూన్యస్థాన ప్రవేశం.
8. వృక్షారణ్యాలను నరికించడం.

ఘ. పంచవర్గమంటే ఏమిటి?

కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో మంత్రప్రసంగంలో "పంచాఙ్గ మన్త్ర" మనే పేరుతో, విచారణీయములైన ఐదు విషయాలను వివరించాడు. ఈ ప్రసంగంలో పరంపరగా ప్రచలితమైన ఈ వ్యాఖ్యానమే పంచవర్గంగా ప్రసిద్ధమైంది. మంత్రణా ప్రసంగంలో మనువు కూడా ఈ పంచాంగమునే పేర్కొన్నాడు. పంచాంగములు.

1. కార్యాలను ఆరంభించడానికి-ఉపాయం.
2. పురుష, ద్రవ్యసంపత్తి.
3. దేశకాల విభాగం.
4. విఘ్నాలను ఛేదించడం (విఘ్నాలకు ప్రతీకారం చేసే).
5. కార్యసిద్ధి.

"కర్మణామారంభోపాయః పురుష ద్రవ్యసంగ్రహః దేశకాల విభాగః
వినిపాత ప్రతీకారః-కార్యసిద్ధిః ఇతి పంచాంగో మన్త్రః అర్థశాస్త్రం" (10-6-14)

ఙ. గుప్తచరుల వ్యవస్థే పంచాంగమని కుల్లూక భట్టు అభిప్రాయం

ఈ వ్యాఖ్యలో ఒకటి, రెండు ఆపత్తులున్నాయి.

1. 7.153లో గుప్తచరుల వ్యవస్థ సంపూర్ణంగా వివరించబడింది. 2) గుప్తచరుల గురించి, శాస్త్రాలలోనూ, పరంపరగా కూడా గుప్తచరులు ఐదు రకాలే కాదు. ఇంకా ప్రముఖ గుప్తచరుల వర్గాలున్నాయి. అందువల్ల ఈ ప్రసంగంలో కౌటిల్యుడు సూచించిన పంచవర్గం సమంజసమైనదిగా ఉంది. అయితే, కుల్లూక భట్టు వివరించిన ఐదుగురు గుప్తచరులు వీరు-

1. **కాపాటికులు-** మోసం, కపట వ్యవహార భేదాలు-తెలిసినవారు.

2. ఉదాస్థితులు సన్న్యాసి లేదా సాధువేషంలో మహా వ్యక్తిగా ప్రసిద్ధి పొంది కూర్చొనే వారు. ఈ విధంగా గుప్తభేదాల సమాచారమందించేవారు.

3. **కృషకులు-** రైతు వేషంలో ఉంటూ, గుప్తసమాచారమందించేవారు

4. **వాణిజకుడు**- నకిలీ వ్యాపారిగా ఉండి గుప్తవిషయాలు తెలిసికొని రాజుకు తెలిపేవాడు.

5. **తాపసవ్యంజకులు**-దొంగ సన్యాసులు.

3. **అనురాగం, అపరాగం:**- తన దేశప్రజలలో, శత్రురాజు ప్రజలలో-ఎవరు తన రాజుగారి యందు స్నేహంగా ఉన్నారు లేదా ఎవరు అపరాగం అంటే ద్వేషంగా ఉన్నారో తెలిసికొని వారి గురించి విచారించడం. ఈ రెండు తత్త్వాలకే కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో "కృత్య అకృత్య" పక్షంగా వర్ణించాడు. ఏదైనా ఆశ చూచి, రాజుతో దూరం అయినవారు అసంతుష్టులు, అపరాగులు. ముఖ్యంగా కోపం వల్ల గాని, లోభంవల్ల గాని భయపడి గానీ లేదా అవమానింప బడి గానీ అపరాగులవుతారు. వీరు నాలుగు విధాలుగా ఉంటారు. (7.67)వ శ్లోకంలోని వివరణ చూడగలరు. అకృత్యులు = ఎవరిని రాజు నుండి వేరుచేయలేమో-వారు సంతుష్టులైన ప్రజలు, వీరికే అనురాగులని పేరు. స్వీయ ప్రజలు, శత్రు ప్రజలు లాగా, అన్యరాజుల స్నేహం, ద్వేషం గురించి కూడా విచారించాలి.

4. **మండలం:**(155,157)వరకు వర్ణించిన 'ప్రకృతులను' మండలమంటారు. రాజు -వీరందరి గతి విధులను గురించి, పరిస్థితులను గురించి, వారి ఆచరణాలను గురించి గంభీరంగా విచారించాలి. అర్థశాస్త్రం (ప్ర 97-అధ్యా-2)లో ఆచార్య కౌటిల్యుడు ఈ 72 ప్రకృతులు గల మండలాలను, నాలుగు ప్రకృతి మండలాలుగా విభజించాడు. ఆ సంబంధమైన వివరణ 157వ శ్లోకంలో ఉంది.

రాజ్యమండలం విచారించాల్సిన 4 మూల ప్రకృతులు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

మధ్యమస్య ప్రచారం చ విజిగీషోశ్చ చేష్టితమ్ । మూలశ్లోక సం. **120**
ఉదాసీనప్రచారం చ శత్రోశ్చైవ ప్రయత్నః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **155**

టీక:- చ = మరియు, మధ్యమస్య ప్రచారం = మధ్యమరాజు యొక్క ఆచరణ, గతివిధులు, అలాగే, విజిగీషోః చేష్టితమ్ = జయించాలనే కోరికగల రాజు యొక్క ప్రయత్నం, అలాగే, ఉదాసీన ప్రచారం = ఉదాసీన రాజు యొక్క స్థితి గతివిధులు (7.158), శత్రోఃఏవ = శత్రు రాజు యొక్క ఆచరణ, స్థితి-గతి విధులను కూడా, ప్రయత్నతః = ప్రయత్నపూర్వకంగా ఆలోచించాలి. ఆలోచించడమే కాదు తగిన ప్రయత్నం చేసి ఆచరించాలి.

తాత్పర్యం:- 1.మధ్యమరాజు యొక్క ఆచరణ, గతివిధులు అలాగే 2. జయించాలనే కోరిక గలరాజు ప్రయత్నం 3. ఉదాసీన రాజు స్థితి గతివిధులు, 4. శత్రురాజు ఆచరణ స్థితి గతువిధులు కూడా ప్రయత్నపూర్వకంగా విచారించాలి. ॥155॥

వివరణ:

మధ్యమాది నాలుగు మూల ప్రకృతిరూపమైన రాజుల లక్షణాలు

ఆచార్య కౌటిల్యుడు మండల ప్రకృతులకు వ్యాఖ్య చేస్తూ తన అర్థశాస్త్రంలో (ప్ర.97) ఈ రాజుల లక్షణాలను ఈ విధంగా రాశాడు.

1. **మధ్యమః రాజా:**- "అరివిజిగీష్వోర్భూమ్యనంతర సంహతాసంహతయోరనుగ్రహసమర్థో నిగ్రహే చాసంహత యోర్మధ్యమః"

2. **విజిగీషుః:**- **ఆత్మద్రవ్య ప్రకృతి సంపన్నో నయస్యాధిష్ఠానం విజిగీషుః** = ఆత్మ సంపన్నుడు, అమాత్యుడు మొ॥ ద్రవ్య ప్రకృతులతో సంపన్నుడు, నీతిని ఆశ్రయించువాడు, విజయమును పొందాలని కోరేవాడు విజిగీషురాజు.

3. **ఉదాసీనః:**- **అరి విజిగీషు మధ్యానాం బహిః ప్రకృతిభ్యో బలవత్తరః, సంహతా సంహతానాం అరి. విజిగీషు మధ్యమానాం అను గ్రహేసమర్థో నిగ్రహే చా సంహతానామ్, ఉదాసీనః**

అరి విజిగీషు మరియు మధ్యమరాజు- వీరి కంటె భిన్నమైన రాజు, శక్తిశాలియైన మధ్యమరాజు కంటెను గూడా బలవంతుడో, అలాగే అరి, విజిగీషు మరియు మధ్యముల సంధిలో, సంధిని సమర్థించువాడు, అదేవిధంగా ఆ ముగ్గురు కలహించుచో, కలహమును సమర్థించువాడు "ఉదాసీన" మైన ఆచరణకల రాజు(7-123).

4. **శత్రు:-** మనువుననుసరించి, జయించాలనే కోరికగల సీమను తాకువాడు (శత్రువు) రాజవుతాడు, అనంతరమరింవిద్యాత్ (7-158) శత్రువులకు భేదోపదేశం చేస్తూ కౌటిల్యుడు ఇలా రాశాడు.

"భూమ్యన్తర: ప్రకృత్సమిత్ర: తుల్యాభిజన: సహజ:
విరుద్ధో విరోధయితా వా కృత్రిమ:".

విజిగీషు రాజసీమను ఆనుకొని ఉండేవాడు. లేదా విజిగీషు వంశంలో జన్మించిన సమాన దాయ భాగాన్ని కోరే రాజు- ఈ ఇద్దరు సహజ శత్రువులు. ఏదైనా కారణం వల్ల విరోధించేవాడు లేదా మరొకరిని విరోధిగా మార్చగలవాడు 'కృత్రిమ శత్రువు'.

రాజ్యమండలం ఆలోచించాల్సిన 8 ఇతర మూల ప్రకృతులు ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతా: ప్రకృతయో మూలం మండలస్య సమాసత: । మూలశ్లోక సం. **121**
అష్టౌ చాన్యాస్సమాఖ్యాతా ద్వాదశైవతు తా: స్మృతా: ॥ ప్రక్షిప్త శ్లోక సం. **156**

టీక:- **సమాసత:** = సంక్షిప్తంగా, **ఏతా: మండలస్య మూలం ప్రకృతయ:** = ఈ నాలుగు-మధ్యమ, విజిగీషు, ఉదాసీన, మరియు శత్రువులు రాజ్యమండలికి మూల ప్రకృతులు. అంటే మూలరూపంగా విచారణీయ విషయాలు, చ = మరియు, **అష్టౌ అన్యా: సమాఖ్యాతా:** = ఇంకా 8 మూల ప్రకృతులుగా చెప్పబడినవి, **తా: తు ద్వాదశ ఏవ స్మృతా:** = ఈ ప్రకారంగా అవన్నీ కలిసి (4+8) 12 అవుతాయి.

తాత్పర్యం:- మధ్యమ, విజిగీషు, ఉదాసీన, శత్రువులు నలుగురు సంగ్రహంగా రాజ్యానికి కారణ భూతులు. ఇక చెప్పబోవు ప్రకృతులకు కూడా ఈ మధ్యమాదులే ముఖ్యులని చెప్పబడును. శత్రుభూములకు ముందువారు మిత్రుడు, అరిమిత్రుడు, మిత్రమిత్రుడు, అరిమిత్రమిత్రుడు అనే నాలుగు ప్రకృతులును, ఆ శత్రూభూమికి వెనుకటివారు పార్ష్ణిగ్రాహుడు, ఆక్రందుడు, పార్ష్ణిగ్రాహా సారుడు, ఆక్రందాసారుడు అనే నలుగురు మొత్తానికి ఎనిమిది ప్రకృతులు ముందటి మధ్యమాదులు నలువురు చేరి పండెండు ప్రకృతులు అవుతాయి. ॥156॥

వివరణ:

అష్టమూల ప్రకృతుల రాజుల లక్షణాలు:-

మిగిలిన అష్టమూల ప్రకృతిరూప రాజుల లక్షణాల మండలంలో మూలప్రకృతులు 12. ఇందులో-4 మధ్యమ, విజిగీషు, ఉదాసీన మరియు శత్రునామక ప్రకృతుల వర్ణన 7-155వ శ్లోకంలో తెలియజేయడమైంది. మిగిలిన అష్ట ప్రకృతులు, వాటి గణన బహుశా అతిప్రసిద్ధాలైనందువల్ల మనువు ఈ శ్లోకంలో వివరించలేదు. కౌటిల్యుడు మనువు యొక్క క్రమాన్ననుసరించి, విధానాన్ననుసరించి, తన అర్థశాస్త్రంలో వర్ణించాడు. చాణక్యుడు అనుసరించిన అష్టప్రకృతులు ఇలా ఉన్నాయి.

తస్మాత్ మిత్రం, అరిమిత్రమ్, మిత్రమిత్రమ్, అరిమిత్రమిత్రమ్, చాన్తర్యేణ భూమీనాం ప్రజ్యతే పురస్తాత్. పశ్చాత్ పార్ష్ణిగ్రాహ:, ఆక్రన్దాసార: ఇతి (ప్రక. 97. అ. 2.).

1. **మిత్రరాజు**-మనుస్మృతిననసరించినట్లయితే-శత్రురాజు రాజ్యసీమను అనుసరించి ఉండే శత్రురాజ్యానికి ఆనుకొని ఉండేవాడు. **"విజిగీషుకు మిత్రుడవుతాడు"**. **"అరేరనంతరం మిత్రం"** (7-123) కౌటిల్యుడు కూడా "ఇదే అంగీకరించాడు. **"భూమ్యేకాన్తరా మిత్ర ప్రకృతి:"** (ప్రక. 97-అధ్యా2).

2. శత్రువు-యొక్క మిత్రరాజు

3. మిత్రుడి మిత్రరాజు

4. శత్రు మిత్రుల యొక్క మిత్రరాజు

5. పార్ష్ణిగ్రాహుడు,

వెనుక ఉండే రాజు– విజిగీషువు మరొక రాజ్యాక్రమణకు వెళ్ళగా, వెనుక నుండి విజిగీషు రాజ్యాన్ని ఆక్రమించేవాడు.

6. ఆక్రన్ద-మరొకరికి సహాయపడే మిత్రరాజును అడ్డగించే వాడు, లేదా తన రాజధానికి ఎవరి రాజ్యం దగ్గరగా ఉంటుందో ఆ రాజు.

7. పార్ష్ణి గ్రాహసారుడు– పార్ష్ణి గ్రాహుడి చుట్టు ముట్టి ఉండేవాడు లేదా అతని మీద ఆక్రమణ చేసేవాడు.

8. ఆక్రన్దాసారుడు 'ఆక్రన్ద' రాజును చుట్టుముట్టి ఉండేవాడు లేదా అతడి మీద ఆక్రమణ చేసేవాడు. ఈ రాజులందరి మీద, వీరి స్థితిగతుల మీదా రాజు ఎల్లప్పుడూ ఒక దృష్టి పెట్టి ఉంచాలి.

రాజ్యమండలం యొక్క ప్రకృతుల 72 భేదాలు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

అమాత్య రాష్ట్రదుర్గార్థదండాఖ్యాః పంచ చాపరాః । మూలశ్లోక సం. **122**
ప్రత్యేకం కథితా హ్యేతాస్సంక్షేపేణ ద్విసప్తతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **157**

టీక:- అమాత్య-రాష్ట్ర-దుర్గ-అర్థ-దండాఖ్యాః = మంత్రి, రాష్ట్రం-కోట-కోశం-దండం, **అపరాః పంచ** = మరికొన్ని ఐదు ప్రకృతులున్నాయి, **ప్రత్యేకం కథితా హి ఏతాః** = పూర్వోక్తమైన (120,121) ద్వాదశ ప్రకృతులతోపాటు కలిసి **సంక్షేపేణ ద్విసప్తతిః** = సంక్షేపంగా 72 ప్రకృతులు. అంటే విచారణీయ విషయాలు. (5×12 = 60 +12 =72).

తాత్పర్యం:- ఈ మూలప్రకృతులు నాలుగింటి యొక్క, ఎనిమిది శాఖాప్రకృతుల యొక్క అమాత్యుడు (మంత్రి), రాజ్యం, దుర్గం, ద్రవ్యం, దండం అనే అయిదు ప్రకృతులు ఉన్నాయి. అలాగే మూల ప్రకృతులు నాలుగు, శాఖా ప్రకృతులెనిమిది మొత్తం పండెండింటికి ఒక్కొక్క దానికి అమాత్యాదులైదువంతున అరవై ప్రకృతులవుతాయి. అలా ఈ అరవై ప్రకృతులు, మూలప్రకృతులు నాలుగు, శాఖా ప్రకృతులు ఎనిమిది మొత్తము డెబ్బది రెండు ప్రకృతులు గలవని మునులు తెలిపారు. ॥157॥

వివరణ:

72 ప్రకృతులు. ఈ శ్లోకాలననుసరించి 12 మూల ప్రకృతులు: 1) విజిగీషువు, 2) మధ్యముడు, 3) ఉదాసీనుడు, 4) శత్రువు, 5) మిత్రరాజు, 6) మిత్రుని యొక్క మిత్రరాజు, 7) శత్రువు మిత్రరాజు, 8) శత్రువు యొక్క మిత్రుడికి సంబంధించిన మిత్రరాజు, 9) పార్ష్ణిగ్రాహుడు, 10) ఆక్రందుడు, 11) పార్ష్ణిగ్రాహాసారుడు, 12) ఆక్రాందాసారుడు.

5 ద్రవ్య ప్రకృతులు-1.మంత్రి, 2.రాష్ట్రం, 3.కోట, 4.కోశం, 5.దండం. ఒక్కొక్క మూల ప్రకృతితో పంచ ప్రకృతులతో కలిసి 5 భేదాలవుతాయి. అంటే-ఒక మూల ప్రకృతి, దాని భేదాలు అయిదు. ఈ విధంగా ఒక మూల ప్రకృతికి ఆరు భేదాలయ్యాయి. ప్రథమ మూల ప్రకృతి విజిగీషు దానికి 6 భేదాలు :1) విజిగీషు రాజు, 2) విజిగీషు మంత్రి, 3) విజీగీషు రాష్ట్రం, 4) విజీగీషు కోట, 5) విజీగీషు కోశం, 6) విజిగీషు దండం. ఈ విధంగా కలిసి అన్య మూల ప్రకృతుల భేదాలు. ఈ విధంగా 12 మూల ప్రకృతులు (12×6 =72) 72 భేదాలవుతాయి.

కౌటిల్యుడు మూల ప్రకృతుల నుండి మూడింటికి– మూడింటికి ఒక వర్గంగా చేసి వాటితో 5 ప్రకృతులను కలిపి 3×5 = 15+3=18తో ఒక ప్రకృతి మండలాన్ని చేశాడు. ఈ ప్రకారంగా నాలుగు ప్రకృతి మండలాలకు ఒక మండలాన్ని అంగీకరించాడు. (అర్థశాస్త్రం-ప్రకరణం 97).

ఈ విధంగా రాజు ప్రత్యేక మూలప్రకృతిని గురించి, దానికి సంబంధించిన ప్రత్యేక ద్రవ్య ప్రకృతులను (అమాత్యాదుల 5గురు) సంపూర్ణంగా తెలిసికొని విచారణ చేస్తూ, యథోచితంగా ఉపాయాన్ని ఆలోచించాలి. విఘ్నాలను దూరం చేసుకొంటూ ఉండాలి. మళ్ళీ విజయార్థ యాత్ర చేయాలి.

శత్రు-మిత్ర-తటస్థుల లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

అనంతరమరిం విద్యాదరిసేవినమేవ చ । మూలశ్లోక సం. **123**
అరేరనంతరం మిత్రముదాసీనం తయోః పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **158**

టీక:- **అనంతరమ్** = తన రాజ్యానికి సమీపవర్తి రాజు, **చ** = మరియు, **అరిసేవినమ్** = శత్రురాజుకు సేవ-సహాయం చేసే రాజు, **అరిం విద్యాత్** = శత్రువుగా భావించు, శత్రువే అనుకో, **అరేః+అనంతరం మిత్రం** = శత్రువునకు భిన్నంగా ఆచరణ చేసేవాడు. శత్రురాజు దేశానికి ఆనుకొని ఉండేరాజు మిత్రుడని తెలిసికో, **తయోః పరమ్** = ఈ ఇద్దరి కంటే భిన్నమైన పరవర్తి రాజు, **ఉదాసీనమ్** = సహాయం చేయడు, విరోధం కూడా చేయడు. అలాంటివాడిని ఉదాసీనుడని, **విద్యాత్** = తెలిసికోవాలి.

తాత్పర్యం:- తన రాజ్యానికి సమీపవర్తి రాజు శత్రురాజుకు సేవ. సహాయం చేసేరాజును శత్రువుగా భావించు. శత్రువుకు భిన్నంగా ఆచరణ చేసేవాడు, శత్రురాజు దేశానికి ఆనుకొని ఉండేరాజు మిత్రుడని తెలిసికో. ఈ ఇద్దరి కంటే భిన్నమైన పరివర్తిరాజు సహాయం చేయడు, విరోధం కూడా చేయడు. అలాంటి వాడిని తటస్థుడని తెలుసుకోవాలి. ॥158॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తాన్ సర్వానభిసందధ్యా త్సామాదిభి రుపక్రమైః । మూలశ్లోక సం. **124**
వ్యస్తైశ్చైవ సమస్తైశ్చ పౌరుషేణ నయేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **159**

టీక:- **తాన్ సర్వాన్** = అనేక విధాలైన ఆ రాజులందరిని, **సామ+ఆదిభిః+ఉపక్రమైః** = సామాదులు (సామ-దాన-దండ-భేదాలనే ఉపాయాల ద్వారా, **వ్యస్తైః** = ఒక్కొక్క ఉపాయం ద్వారా గాని, లేదా, **సమస్తైః** = ఉపాయాలన్నిటిని ఒక్కసారిగా ప్రయోగించి గాని, **పౌరుషేణ** = పరాక్రమంతో, **నయేన** = రాజనీతి ద్వారాగాని, **అభిసందదధ్యాత్** = వశపరచుకోవాలి.

తాత్పర్యం:- అనేక విధాలుగా ఆ రాజులందరినీ సామదానభేదదండోపాయాలు ఉపయోగించి వారితో వేరువేరుగగాని కలిసి ప్రవర్తించిగాని అందరినీ పరాక్రమంతో గానీ రాజనీతి ద్వారా గానీ లేదా, కేవలదండంతో గానీ కేవలసామంతో గానీ వారిని వశపరచుకోవాలి. ॥159॥

సంధి-విగ్రహాది షాడ్గుణ్య వర్ణన - ఇది మనుకృతం-ప్రామాణికం

సంధిం చ విగ్రహం చైవ యానమాసన మేవ చ । మూలశ్లోక సం. **125**
ద్వైధీభావం సంశ్రయం చ షడ్గుణాంశ్చింతయేత్సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **160**

టీక:- **సంధిం** = సంధిచేసికోవడం, **విగ్రహం యానం ఆసనం ద్వైధీభావం చ సంశ్రయం** = విగ్రహం, యుద్ధం చేయడం, యుద్ధయాత్ర, ముట్టడి, వేరుపరచడం, బలవంతుణ్ణి ఆశ్రయించడం, **షడ్గుణాన్ ఏవ** = ఈ ఆరు గుణాల గురించి మాత్రమే, **సదా చిన్తయేత్** = ఎల్లప్పుడు ఆలోచించాలి.

తాత్పర్యం:- ఆ తరువాత ఉభయుల ప్రయోజనాలను తలచి రాజులతో సంధి, యుద్ధం, యుద్ధయాత్ర, ముట్టడి, వేరుపరచడం, శత్రుబాధకు ఓర్వక శత్రువుకంటే మించిన రాజును ఆశ్రయించడం, ఈ ఆరు ఉత్తమగుణాల గురించి మాత్రమే ఎప్పుడూ ఆలోచించాలి. ఏ గుణమును ఆశ్రయిస్తే తనకు మేలు, శత్రువుకు కీడు కలుగుతుందో అలాంటి గుణమును అవలంభించాలి. ॥160॥

వివరణ:

షడ్గుణాల వివరణ

1. సంధి- సుఖపూర్వకంగా జీవించడానికి-శత్రురాజుకు ఏ కొంచెమైనా ఇచ్చి గాని, లేదా ఏదైనా మరొక రాజుతో కలిసి శత్రురాజు మీద ఆక్రమణ కోసం సిద్ధపడటం సంధి.
2. యుద్ధం: విరోధం, కొట్లాటకు దిగడం-యుద్ధం
3. యానం: యుద్ధం కోసం ఆక్రమణ చేయడం
4. ఆసనం: శత్రువును ఆక్రమించి ఉండిపోవడం లేదా తన శక్తి క్షీణిస్తున్న విషయం గమనించి-రాజులతో గిల్లికజ్జాలు పెట్టుకోకుండా ఉండిపోవడం.
5. ద్వైధీభావం: తన విజయం కోసం తన సేననే రెండుగా విభజించడం లేదా శత్రుసేనను రెండుగా విభజించడం.
6. సంశ్రయం: ఏ బలవంతుడైనా రాజును ఆశ్రయించడం.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆసనం చైవ యానం చ సంధిం విగ్రహమేవ చ । మూలశ్లోక సం. **126**
కార్యం వీక్ష్య ప్రయుంజీత ద్వైధం సంశ్రయమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **161**

టీక:- రాజా = రాజు, సంధిం విగ్రహం యానం+ఆసనే ద్వైధం చ సంశ్రయః = సంధి, విగ్రహం, యుద్ధము = యానం, ఆసనం, ద్వైధీభావం మరియు సంశ్రయం, ద్వివిధం తు = రెండు రెండుగా భేదించడాన్ని, విద్యాత్ = ఉన్నదున్నట్లుగా తెలిసికోండి.

ఋషి దయానందభాష్యం:-ఇలా తన అభివృద్ధిని శత్రువులక్షీణదశను ఈ మొదలైనవాటిని ఆలోచించి ముట్టడిని, యుద్ధయాత్రను, సంధిని, యుద్ధమును, ద్వైధమును, సంశ్రయమును, కార్యమును పరికించి ఏ వేళకు ఏ గుణం తగునో, దాన్ని ప్రయోగించాలి.(స.ప్ర.6వ సము.) ॥161॥

సంధి-వాటిలో భేదాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

సంధింతు ద్వివిధం విద్యాద్రాజా విగ్రహమేవ చ । మూలశ్లోక సం. **127**
ఉభే యానాసనే చైవ ద్వివిధః సంశ్రయః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **162**

టీక:- రాజా = రాజు, సంధి విగ్రహంయాన - ఆసనే ద్వివిధః చ సంశ్రయః = సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము మరియు సంశ్రయము ద్వివిధం తు = రెండు రెండు విధాలుగా ఉండును. వాటిని విద్యాత్ = తెలుసుకొనవలెను.

ఋషి దయానందభాష్యం:- సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సంశ్రయం అనే ఈ ఆరూ ఇరువైపులా ఉన్నవని తెలుసుకోవాలి. దీనిని రాజు యథారీతిగా తెలుసుకోవాలి. (స.ప్ర.6వ సము.) ॥162॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సమానయానకర్మా చ విపరీతస్తథైవ చ । మూలశ్లోక సం. **128**
తదా త్వాయతిసంయుక్తః సంధిర్జ్ఞేయో ద్విలక్షణః॥ ప్రక్షిప్త శ్లోక సం. **163**

టీక:- **తదా తు ఆయతి సంయుక్తః** = తాత్కాలికమైన ఫలాన్నిచ్చేది, మరియు భవిష్యత్తులో కూడా ఫలితాన్నిచ్చేది, **సంధిః** = సన్ధి, **ద్విలక్షణః జ్ఞేయః** = రెండు రకాల వల్ల తెలుస్తుంది.

1) సమాన యాన కర్మా = శత్రురాజు మీద ఆక్రమణచేయడానికి, అన్య రాజుతో సంధిచేసుకొని ఆక్రమణ చేయడం, అలాగే, **2) విపరీతః** = మొదటి నుండి ఏ విపరీతం అంటే శత్రురాజు మీద ఆక్రమణ చేయకుండా ఉండటం కూడా శత్రురాజుతో కలిసి ఏదైనా సర్దుబాటు చేసికోవడం, ఇదంతా తన శక్తి సామర్థ్యాలను బట్టి ఉచితం, అవసరం వరకే.

ఋషి దయానందభాష్యం:- సంధి రెండు రకాలు. సమానయానకర్మ, అసమానయానకర్మ అని. ప్రస్తుత లాభోద్దేశంతోగాని, అనంతరలాభోద్దేశంతోగాని వేరొకరాజుతో కూడి మరొకరాజుపై యుద్ధానికి పోవడం సమానయానకర్మ. 'ఒక రాజును ఒక వైపు నుంచి పంపించి తాను మరొకవైపుకు వెళ్తానని చెప్పి వేరువేరు ప్రదేశాలకు వెళ్ళటం అసమానయాన కర్మ అంటారు. (స.ప్ర. 6వ.సము.) ॥163॥

వివరణ:

ఈ శ్లోకంలో ప్రయోగించిన 'విపరీత' శబ్దానికి అర్థం మను సమ్మతమే. ప్రచలిత టీకాకారు చేసిన అర్థం (వ్యాఖ్య) సంధి అనిపించుకోదు.

విగ్రహం దాని భేదాలు -

ఇది మనుకృతం-ప్రామాణికం

స్వయం కృతశ్చ కార్యార్థమకాలే కాల ఏవ వా । మూలశ్లోక సం. **129**
మిత్రస్య చైవాపకృతే ద్వివిధో విగ్రహః స్మృతః॥ ప్రక్షిప్త శ్లోక సం. **164**

టీక:- **విగ్రహః ద్వివిధః స్మృతః** (7.135) విగ్రహం (యుద్ధము) రెండు విధాలుగా ఉంటుంది. **కాలే** = యుద్ధం కోసం నిర్ణయించిన సమయంలో ఒకటి, **వా** = లేదా, **అకాలే ఏవ** = అనిశ్చితమైన ఏ సమయంలో అయినా, **కార్యార్థమ్** = కార్యసిద్ధికోసం, **స్వయం కృతః** = స్వయంగా చేసినది, **చ** = మరియు, **మిత్రస్య అపకృత్** = ఎవ్వరి ద్వారానైనా మిత్రరాజు మీద ఆక్రమణ జరిగినప్పుడు లేదా మిత్రరాజుకు హాని కలిగించినప్పుడు మిత్రరాజు రక్షణార్థం చేసే యుద్ధం రెండోది. కార్యసిద్ధి కోసం ఉచిత సమయంలో గాని, అనుచిత సమయంలో గాని చేసేది మొదటిది. మిత్ర రాజుకు అపరాధం కలిగించే సమయంలో శత్రురాజుతో చేసే యుద్ధం రెండోది.

ఋషి దయానందభాష్యం:- యుద్ధం రెండు రకాలుగా ఉంటుంది. యుద్ధం కోసం నిర్ణయించిన సమయంలో ఒకటి, లేదా అనిశ్చితమైన ఏ సమయంలో అయినా కార్యసిద్ధి కోసం స్వయంగా చేసినది, ఎవ్వరి ద్వారానైనా మిత్రరాజు మీద ఆక్రమణ జరిగినప్పుడు లేదా మిత్రరాజుకు హాని కలిగించినప్పుడు మిత్రరాజు రక్షణార్థం చేసే యుద్ధం రెండోది. (స.ప్ర. 6వ సము.) ॥164॥

యానం దాని భేదాలు -

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకాకినశ్చాత్యయికే కార్యే ప్రాప్తే యదృచ్ఛయా । మూలశ్లోక సం. **130**
సంహతస్య చ మిత్రేణ ద్వివిధం యానముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **165**

టీక:- ఆత్యాయికే కార్యే ప్రాప్తే = అకస్మాత్తుగా ఏదైనా కార్యం ప్రాప్తమైనప్పుడు, ఏకాకినః = ఒంటరిగా గాని, వా = లేదా, **మిత్రేణ సంహతస్య** = మిత్రరాజుతో కలిసి, శత్రువువైపు వెళ్ళి ఆక్రమణచేయడం, **ద్వివిధం యానమ్+ఉచ్యతే** = యానం రెండువిధాలని చెప్పబడింది. **యదృచ్ఛయా** = స్వతంత్రంగా గమనం, **ఆసనం** = ముట్టడి.

ఋషి దయానందభాష్యం:- శత్రువుపై అకస్మాత్తుగా ఏదైనా కార్యం సంభవించినప్పుడు శత్రువుపైకి తానొక్కడే దండెత్తడం, లేదా బలవంతుడైన మిత్రరాజుతో కలిసి శత్రువు వైపు వెళ్ళి ఆక్రమణ చేయడం అని. యానం రెండు విధాలని చెప్పబడింది. (స.ప్ర. 6వ సము.) ॥165॥

ఆసనం దాని భేదాలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

క్షీణస్య చైవ క్రమశో దైవాత్పూర్వకృతేన వా । మూలశ్లోక సం.**131**
మిత్రస్య చానురోధేన ద్వివిధం స్మృతమాసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**166**

టీక:- క్రమశః = స్వయం ఏదో పద్ధతిగా, **క్షీణస్య ఏవ** = క్షీణించిపోగా లేదా నిర్బలుడవునో, **వా** = లేదా, **మిత్రస్య అనురోధేన** = మిత్రుడు ఆపినందువల్ల గాని, తన స్థానంలో ఉండటం గానీ, **ద్వివిధం ఆసనమ్ స్మృతమ్** = ఇది రెండు విధాలుగా ఉంటుంది. **దైవాత్ వా పూర్వకృతేన** = అకస్మాత్తుగా గానీ లేదా పూర్వజన్మలో చేసిన పాపం వల్లగానీ.

ఋషి దయానందభాష్యం:- పూర్వజన్మలోగాని ఈ జన్మలోగాని చేసిన పాపం వల్ల గానీ చతురంగ బలమును పోగొట్టుకొన్న అతడు తన సంపదను పెంచుకొనడానికి గానీ, మిత్రుడి అభిప్రాయం ప్రకారం అతడి లాభం నిమిత్తం గానీ పరదేశాన్ని ముట్టడించడం అని. ముట్టడి (ఆసనం) రెండు రకాలుగా ఉంది. (స.ప్ర. 6వ సము.). ॥166॥

ద్వైధీభావం దాని భేదాలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

బలస్య స్వామినశ్చైవ స్థితిః కార్యార్థసిద్ధయే । మూలశ్లోక సం.**122**
ద్వివిధం కీర్త్యతే ద్వైధం షాడ్గుణ్యగుణవేదిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**167**

టీక:- షాడ్గుణ్య గుణవేదిభిః = షడ్గుణాల మహత్త్వం తెలిసినవారు, **ద్వైధం ద్వివిధం కీర్త్యతే** = ద్వైధీభావం రెండు విధాలని చెబుతున్నారు. **కార్యార్థసిద్ధయే** = కార్యసిద్ధి కోసం **1) బలస్య స్థితిః** = సేనను రెండు భాగాలుగా చేసి, ఒక భాగాన్ని సేనాధిపతి స్వాధీనమందుంచాలి, **2) స్వామినః** = సేనలో మరొక భాగాన్ని రాజు అధీనమందుంచాలి, **ఆత్మ రక్షణార్థము** = కార్యార్థ సిద్ధి కోసం సేనను రెండు భాగాలు చేయడమే ద్వైధీభావమనబడును.

ఋషి దయానందభాష్యం:- షడ్గుణాలు, మహత్త్వం తెలిసినవారు ద్వైధీ భావం రెండు రకాలని చెబుతున్నారు. కార్యసిద్ధి కోసం సేనను రెండు భాగాలుగా చేసి ఒకభాగాన్ని సేనాధిపతి స్వాధీనంలోనూ, మరొక భాగాన్ని రాజు అధీనంలోనూ ఉంచాలి. ॥167॥

సంశ్రయం దాని భేదాలు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అర్థసంపాదనార్థం చ పీడ్యమానస్య శత్రుభిః । మూలశ్లోక సం.**133**
సాధుషు వ్యపదేశార్థం ద్వివిధః సంశ్రయః స్మృత ॥ ప్రక్షిప్త శ్లోక సం.**168**

టీక:- శతృభిః పీడ్యమానస్య = శత్రువుల ద్వారా పీడింపబడి, **అర్థ సంపాదనార్థం** = తన ఉద్దేశ సిద్ధికోసం లేదా ఆత్మరక్షణార్థం, ఏవరైనా రాజును ఆశ్రయించడం, **చ** = మరియు, **వ్యపదేశార్థం సాధుషు** = ఓటమి కలుగుతాయనిగానీ లేదా కష్టాల నుండి తప్పించుకోవడానికి గానీ, ఏదైనా ఒక బలవంతుడైన రాజును ఆశ్రయించడానికి, **ద్వివిధః సంశ్రయః స్మృతః** = సంశ్రయం రెండు విధాలుగా ఉంటుంది.

ఋషి దయానందభాష్యం:- శత్రువులవల్ల, బాధించబడుతున్న తనకు శత్రుబాధ తొలగించుకోడానికి స్వకార్య సిద్ధికోసం లేదా ఆత్మ రక్షణార్థం ఎవరైనా రాజును ఆశ్రయించడం, ఓటమి కలుగుతుందని గానీ లేదా కష్టాల నుండి తప్పించుకోడానికి గానీ ఏదైనా ఒక బలవంతుడైన రాజును ఆశ్రయించడం అని. సంశ్రయం రెండు రకాలుగా ఉంటుంది. (స.ప్ర. 6వ సము.) ॥168॥

సన్ధి చేసుకొను సమయం-

ఇది మనుకృతం-ప్రామాణికం

యదాఽవగచ్ఛేదాయత్యామాధిక్యం ధ్రువమాత్మనః । మూలశ్లోక సం. **134**
తదాత్వే చాల్పికాం పీడాం తదా సంధిం సమాశ్రయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **169**

టీక:- యదా+అవగచ్ఛేత్ = ఎప్పుడు నీకు తెలియునో, **తదాత్వే** = అప్పుడు యుద్ధం చేసినట్లయితే, **అల్పికాం పీడామ్** = కొంచెం మాత్రమే బాధకలుగునని, **ఆయత్యామ్** = భవిష్యత్తులో చేసినట్లయితే, **ఆత్మనః ధ్రువమ్ ఆధిక్యం** = తనకు వృద్ధి, విజయం లభించునో, **తదా సంధిం సమాశ్రయేత్** = అప్పుడు శత్రువుతో సంధి చేసికొని అనుకూల సమయం కోసం ధైర్యంగా ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- నీకు తెలిసిన వెంటనే యుద్ధం చేసినట్లయితే కొంచెం మాత్రమే బాధ-నష్టం కలుగుననీ, ఆలస్యంతో చేసినట్లయితే తనకు నష్టం ఎక్కువగా కలుగునని తెలిసినప్పుడు శత్రువుతో సంధి చేసుకొని, అనుకూల సమయం కోసం ధైర్యంగా ఉండాలి. (స.ప్ర. 6వ. సము.) ॥169॥

విగ్రహమునకు సమయం-

ఇది మనుకృతం-ప్రామాణికం

యదా ప్రహృష్టా మన్యేత సర్వాస్తు ప్రకృతీర్భృశమ్ । మూలశ్లోక సం. **135**
అత్యుచ్ఛ్రితం తథాఽత్మానం తదా కుర్వీత విగ్రహమ్॥ ప్రక్షిప్త శ్లోక సం. **170**

టీక:- యదా సర్వాః ప్రకృతీః = ఎప్పుడు తన సేన మరియు సర్వ ప్రజలు, **భృశమ్** = అత్యంత, **ప్రహృష్టామ్** = సంతుష్టులు, ప్రసన్నులు, **అత్యుచ్ఛ్రితం** = ఉన్నతశీలురు, శ్రేష్ఠులు అని, **మన్యేత** = తలంచునో, తెలిసికొనునో, అలాగే, **ఆత్మానం** = తాను కూడా సంతుష్టుడనని తలంచునో, **తదా విగ్రహమ్ కుర్వీత** = అప్పుడే శత్రువుతో యుద్ధం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- ఎప్పుడు తన సేన, సకల జనులు అత్యంత సంతుష్టులు ప్రసన్నులు ఉన్నతశీలురు, శ్రేష్ఠులు అని తెలుసుకొంటారో, అలాగే తాను కూడా సంతుష్టుడనని తెలుసుకొంటాడో, అప్పుడు శత్రువుల పైకి యుద్ధయాత్రకు వెళ్ళాలి. (స.ప్ర. 6వ సము) ॥170॥

యానమునకు సమయం-

ఇది మనుకృతం-ప్రామాణికం

యదా మన్యేత భావే న హృష్టం పుష్టం బలం స్వకమ్ । మూలశ్లోక సం. **136**
పరస్య విపరీతం చ తదా యాయాద్రిపుం ప్రతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **171**

టీక:- యదా స్వకమ్ బలం = ఎప్పుడు ప్రభువు తన బలం అంటే సైనికులు, **హృష్టం భావేన మన్యేత** = సంతోషంగాను, బలయుక్తంగాను ప్రసన్నులుగా ఉంటారో, **చ** = మరియు, **పరస్య** = శత్రుసైనికులు, **విపరీతం** = తన కంటే విపరీతంగా ఉంటుందో అంటే సంతోషంగా లేరో, **తదా రిపుం ప్రతియాయాత్** = అప్పుడు శత్రువు పైకి దండెత్తాలి.

ఋషి దయానందభాష్యం:- ఎప్పుడు నృపాలుడు తన సైనికులు సంతుష్టి, పుష్టి కలిగి ఉంటారో తన శత్రుబలం దుఃఖం కలిగి శోషించి ఉంటుందో అప్పుడు శత్రుసేనపై దండెత్తాలి (స.ప్ర. 6వ సము.). ॥171॥

ఆసనమునకు సమయం- ఇది మనుకృతం-ప్రామాణికం

యదా తు స్యాత్పరిక్షీణో వాహనేన బలేన చ । మూలశ్లోక సం. 137
తదాసీత ప్రయత్నేన శనకైః సాంత్వయన్నరీన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 172

టీక:- యదా = ఎప్పుడు శత్రువు, బలేన వాహనేన = సేన, బలం, వాహనాలతో, పరిక్షీణః స్యాత్ = క్షీణించిపోతుందో, తదా = అప్పుడు, అరీన్ శనకైః ప్రయత్నేన సాంత్వయన్ = శత్రువులను మెల్లమెల్లగా ప్రయత్నంతో శాంతపరుస్తూ, ఆసీత = తన స్థానంలో ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- ఎప్పుడు శత్రువు రథగజాశ్వములు సైన్యం క్షీణించిపోతుందో అప్పుడు మంచి మాటలతోను, దానం చేతను, స్నేహం చేసికోవాలి (స.ప్ర. 6వ సము.). ॥172॥

ద్వైధీభావమునకు సమయం- ఇది మనుకృతం-ప్రామాణికం

మన్యేతారిం యదా రాజా సర్వథా బలవత్తరమ్ । మూలశ్లోక సం. 138
తథా ద్విధా బలం కృత్వా సాధయేత్కార్యమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 173

టీక:- యదా రాజా = ఎప్పుడు ప్రభువు, అరిం సర్వదా బలవత్తరమ్ మన్యేత = శత్రువు అన్ని విధాల తన కంటే బలవంతుడని గుర్తించినట్లయితే, తదా = అప్పుడు, ద్విధా బలం కృత్వా = సైన్యాన్ని రెట్టింపుచేసుకోవడం గానీ లేదా సైన్యాన్ని రెండుగా విభజించి గాని ఒక భాగాన్ని ఆత్మరక్షణకు ఉంచుకొని, రెండోభాగాన్ని శత్రువు మీదికి పంపించి, ఆత్మనః కార్యమ్ సాధయేత్ = తన కార్యాన్ని సాధించుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- ఎప్పుడు రాజు తన శత్రువు బలవంతుడని సామదానములకు లోబడడని తెలిసికొంటాడో, అప్పుడు తన సేనను రెండుగా విభజించి ఒక భాగాన్ని ఆత్మ సంరక్షణకు ఉంచుకొని, రెండో భాగం సైన్యాన్ని శత్రువుమీదికి పంపి తన కార్యాన్ని సాధించుకోవాలి. ఇలా సైన్యమును విభజించి స్నేహితులను చెర్చడం మొ॥న స్వకార్యాన్ని సాధించాలి (స.ప్ర. 6వ సము.)॥173॥

సంశ్రయమునకు సమయం- ఇది మనుకృతం-ప్రామాణికం

యదా పర బలానాం తు గమనీయతమో భవేత్ । మూలశ్లోక సం. 139
తదాతు సంశ్రయేత్ క్షిప్రం ధార్మికం బలినం నృపమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 174

టీక:- యదా = ఎప్పుడు నీకు తెలియునో, పరబలానాం తు గమనీయతమః భవేత్ = శీఘ్రంగా పరసైన్యం నా మీదికి దండెత్తి వచ్చునని, తదాతు = అప్పుడే, ధార్మికం బలినం నృపమ్ క్షిప్రం సంశ్రయేత్ = బలవంతుడు, ధర్మాత్ముడైన ప్రభువును వెంటనే ఆశ్రయించాలి.

ఋషి దయానందభాష్యం:- శత్రు సైన్యం తన మీదికి దండెత్తి వచ్చునని రాజుకు ఎప్పుడు తెలుస్తుందో అప్పుడే బలవంతుడు,ధర్మాత్ముడైన ప్రభువును వెంటనే ఆశ్రయించాలి. (స.ప్ర. 6వ.సము.) 174.

ఇది మనుకృతం-ప్రామాణికం

నిగ్రహం ప్రకృతీనాం చ కుర్యాద్యోఽరి బలస్య చ । మూలశ్లోక సం. 140
ఉపసేవేత తం నిత్యం సర్వయత్నైర్గురుం యథా॥ ప్రక్షిప్త శ్లోక సం. 175

టీక:- యః = ఏ ప్రభువు, ప్రకృతీనాం = ప్రజలు, తన సైన్యం, చ = మరియు, అరిబలస్య నిగ్రహం కుర్యాత్ = శత్రు సైన్యాన్ని ఆపగలుగునో, తం సర్వయత్నైః = అతడిని, గురుం యథా = గురువుతో సమానంగా, నిత్యం ఉపసేవేత = నిత్యం సేవిస్తూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- రాజు ఎలాంటి బలవంతుడో చెబుతున్నాడు.-ఏ రాజు ప్రజలు, తన సైన్యం శత్రుసేనలను ఆపగలుగుతుందో అలాంటి రాజును సర్వ ప్రయత్నములచేత గురువుతో సమానంగా నిత్యం సేవిస్తూ ఉండాలి. (స.ప్ర. 6వ సము) ॥175॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యది తత్రాపి సంపశ్యేద్దోషం సంశ్రయకారితమ్ । మూలశ్లోక సం.**141**
సుయుద్ధమేవ తత్రాపి నిర్విశంకస్సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**176**

టీక:- సంశ్రయకారితమ్ యదితత్ర +అపి దోషం సంపశ్యేత్ = ఆశ్రయమిచ్చిన పురుషుడి కర్మలలో దోషం కనిపించినట్లయితే, **తత్ర +అపి** = అక్కడ కూడా, **సుయుద్ధమ్ +ఏవ** = ఉత్తమ పద్ధతిలో యుద్ధాన్నే, **నిర్విశంకః సమాచరేత్** = నిస్సందేహంగా చేయాలి.

ఋషి దయానందభాష్యం:- ఆశ్రయమిచ్చిన పురుషుడి కర్మలలో దోషం కనిపించినట్లయితే అప్పుడు కూడా నిస్సంశయుడై ఉత్తమ పద్ధతిలో యుద్ధాన్నే నిస్సందేహంగా చేయాలి (స.ప్ర.6వ సము.).॥176॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వోపాయై స్తథా కుర్యాన్నీతిజ్ఞః పృథివీ పతిః । మూలశ్లోక సం.**142**
యథాఽస్యాభ్యధికా నస్యుర్మిత్రోదాసీన శత్రవః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**177**

టీక:- నీతిజ్ఞః పృథివీ = రాజనీతి తెలిసిన ప్రభువు, **యథా** = ఏ ప్రకారంగా, **అస్య** = తనకున్న, **మిత్ర-ఉదాసీన-శత్రవః** =మిత్రులు, ఉదాసీనులు, శత్రువులు, **అధికాః న స్యుః** = అధికం కారో, **తథా సర్వ+ఉపాయైః కుర్యాత్** = సర్వోపాయాల ద్వారా ప్రయత్నించాలి.

ఋషి దయానందభాష్యం:-రాజనీతి తెలిసిన ప్రభువు తనకున్న మిత్రులు, ఉదాసీనులు, శత్రువులు తనకంటే అధికులు కాకుండునట్లు అన్ని ఉపాయాల ద్వారా ప్రయత్నించాలి (స.ప్ర. 6వ.సము.).॥177॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆయతిం సర్వకార్యాణాం తదాత్వం చ విచారయేత్ । మూలశ్లోక సం.**143**
అతీతానాం చ సర్వేషాం గుణదోషౌ చ తత్త్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**178**

టీక:- సర్వకార్యాణాం తదాత్వం = వర్తమాన కాలంలో చేయవలసిన సర్వ కార్యములు, **ఆయతిం** = భవిష్యత్తులో చేయవలసిన కార్యములు, **చ** = మరియు, **అతీతానాం సర్వేషాం** = ఏ యే కార్యములు పూర్తిచేయబడినవో, వాటన్నిటి యొక్క, **తత్త్వతః గుణ దోషౌ విచారయేత్** = గుణదోషాలను యథార్థంగా విచారించవలయును.

ఋషి దయానందభాష్యం:- వర్తమాన కాంలో చేస్తున్న, భవిష్యత్తులో చేయవలసిన, భూతకాలంలో చేసిన సమస్త కార్యాలనూ, వానిలోగల యథార్థమైన గుణదోషాలనూ ఆలోచించాలి. (స.ప్ర.6వ.సము.) ॥178॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆయత్యాం గుణదోషజ్ఞః తదాత్వే క్షిప్రనిశ్చయః । మూలశ్లోక సం.**144**
అతీతే కార్యశేషజ్ఞః శత్రుభిర్నాభిభూయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**179**

టీక:- ఆయత్యాం గుణదోషజ్ఞః = ఏ ప్రభువు భవిష్యత్తులో చేయబోయే కార్యాలలో గుణదోషాలను గుర్తించగలుగుతాడో, **తదాత్వే క్షిప్ర నిశ్చయః** = వర్తమానకాల కార్యాలలో ఉన్న గుణదోషాలను వెంటనే నిర్ణయించగలడు

అతీతే కార్యశేషజ్ఞః = ఇంతకు ముందు నిర్ణయించిన కార్యాలలో శేషించిన కార్యాలేవో తెలిసికోగలడు. **శత్రుభిః న+అభిభూయతే** = శత్రువులచేత పరాభవాన్ని పొందదు.

ఋషి దయానందభాష్యం:-ఏ ప్రభువు భవిష్యత్తులో చేయబోయే కార్యాలలో గుణదోషాలను గుర్తించగలుగుతాడో, వర్తమానకాల కార్యాలలో ఉన్న గుణదోషాలను వెంటనే నిర్ణయించగలడు. ఇంతకు ముందు నిర్ణయించిన కార్యాలేవో తెలిసికోగలడు, శత్రువుల చేత పరాభవాన్ని పొందదు.(స.ప్ర. 6వ. సము.) ॥179॥

రాజనీతి యొక్క నిష్కర్ష- **ఇది మనుకృతం-ప్రామాణికం**

యథైనం నాభిసంధధ్యుర్మిత్రోదాసీన శత్రవః । మూలశ్లోక సం.**145**
తథా సర్వం సంవిదధ్యాదేష సామాసికో నయః॥ ప్రక్షిప్త శ్లోక సం.**180**

టీక:- **యథా** = ఏ విధంగా, **మిత్ర-ఉదాసీన-శత్రవః** = మిత్రరాజులు, ఉదాసీనరాజులు, శత్రురాజులు, **న+అభిసంధధ్యుః** = తనకు వ్యతిరేకం చేయకుండా ఉండే విధంగా, **సర్వం తథా విదధ్యాత్** = రాజపురుషులందరూ విశేషంగా సభాపతి, రాజు ప్రయత్నించాలి. **ఏషః సామాసికో నయః** = ఇదే సంక్షేపంగా 'నయము' అంటే రాజనీతి.

ఋషి దయానందభాష్యం:-మిత్రరాజులు, శత్రురాజులు తటస్థరాజులు తనను బాధించనట్లు, వ్యతిరేకం చేయకుండా ఉండేవిధంగా దూతలను నియమించి సర్వకార్యాలను నిర్వర్తించాలి. ఇదే ప్రధాన రాజనీతి. (స.ప్ర. 6వ.సము).॥180॥

వివరణ:

మిత్రులు-తటస్థులు-శత్రువులు వీరి లక్షణాలను (7.209,210,211) వర్ణించాడు.

ఆక్రమణకు వెళ్ళడం-వ్యూహరచనా వ్యవస్థ - **ఇది మనుకృతం-ప్రామాణికం**

యదా తు యానమా తిష్ఠేదరిరాష్ట్రం ప్రతి ప్రభుః । మూలశ్లోక సం.**146**
తదాఽనేన విధానేన యాయాదరిపురం శనైః॥ ప్రక్షిప్త శ్లోక సం.**181**

టీక:- **ప్రభుః** = ప్రభువు, **యదా** = ఎప్పుడు, **అరిరాష్ట్ర ప్రతి** = శత్రురాజ్యం మీద, **యానమ్+అతిష్ఠేత్** = ఆక్రమణ చేస్తాడో, **తదా** = అప్పుడు, **అనేన విధానేన** = ఈ చెప్పబోయే విధిననుసరించి, **శనైః** = మెల్లగా సావధాన పూర్వకంగా, **అరిపురం యాయాత్** = శత్రురాజ్యం మీద దండెత్తాలి.

తాత్పర్యం:- ఎప్పుడు నృపాలుడు శత్రు రాజ్యంపైకి దండయాత్ర చేస్తాడో అప్పుడు ఈ చెప్పబోయే విధిననుసరించి శత్రువుపట్టణంపైకి మెల్లగా సావధానంగా దండయాత్ర చేయాలి. ॥181॥

182,183వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *మార్గశీర్షే శుభే మాసి యాయాద్యాత్రాం మహీపతిః ।*
ఫాల్గునం వాఽథ చైత్రం వా మాసౌ ప్రతి యథాబలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***182***

తాత్పర్యం:- రాజు చతురంగబలసమేతుడై మార్గశిర్షమాసంలో రథగజతురగపదాతులను వానిని నడపించి కొంటూ పోయి అనేకపంటలతో నిండిన శత్రురాజ్యం పైకి దండెత్తాలి. అలాంటి అనేక ధాన్యములతో నిండిన పరరాష్ట్రం పైకి ఫాల్గుణమాసంలో గానీ చైత్ర మాసంలో గానీ దండయాత్ర చేయాలి. ॥182॥

* *అన్యేష్వపి తు కాలేషు యదా పశ్యేద్ధ్రువం జయమ్ ।*
తదా యాయాద్విగృహ్యైవ వ్యసనే చోత్థితే రిపోః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***183***

తాత్పర్యం:- ఇతర సమయాలలో రాజు తనకు తప్పక జయం కలుగుతుందని గట్టినమ్మకమున్నప్పుడు తన బలానికి అనుకూలమై ఉన్న గ్రీష్మాదిఋతువులలో గుర్రాలు, ఏనుగులు మొదలైన బలం మెండుగా ఉన్నప్పుడు శత్రువుపైకి దండయాత్ర చేయవచ్చు. శత్రువు మంత్రులు మొ॥న వారిపట్ల కఠినదండన ఇవ్వాలి. వారు వ్యసనంలో ఉన్నప్పుడూ తక్కిన సమయాలలోనూ దండయాత్ర చేయాలి. ॥183॥

ప్రక్షిప్తాల పరిశీలన

182-183 శ్లోకాలు ప్రక్షిప్తాలు-

1. అంతర్ వ్యతిరేకాలు

(క) వీటికి ముందు ఈ ప్రసంగానికి సంబంధించిన శ్లోకం నుంచే వీటికి వ్యతిరేకతలున్నాయి. 182లో స్పష్టంగా "యదా తు యాన మాతిష్ఠేత్....తదా.... యాయాత్" అని ఉంది. అంటే రాజు తన స్థితిని పరిశీలించుకుని ఎవరి మీదైనా దాడి చేయటానికి వెళ్లటం, తన ఇష్టాన్ని బట్టే ఉంటుంది అని. మళ్లీ ఈ శ్లోకాలలో నెలను నిర్ణయించడం దానికి భిన్నమూ, వ్యతిరేకమూ అవుతుంది.

(ఖ) 7.171లో కూడా అప్పుడప్పుడు ఆక్రమణలు చేయవచ్చునని ఉండటం, పైదాని కన్నా వ్యతిరేకం. 'యానం' అనే నీతికే ఇది వ్యతిరేక మని భావించవచ్చు.

2. ప్రసంగవ్యతిరేకాలు

181లో ప్రసంగాన్ని సంకేతించటం ఉంది. దాని ప్రకారం ఈ ప్రసంగం 'దాడి కొరకు వెళుతున్నప్పుడు ఎటువంటి ఏర్పాట్లు ఉండాలి?" అనే దాన్ని గురించి. ఇదే విషయం తర్వాతి 7.184-207లతో బలం పుంజుకుంటుంది. ఇక్కడ సమయ నిర్ధారణ వ్యతిరేకం. 183వ శ్లోకంలోని కథనం మునుపటి శ్లోకాలలోనే అయిపోయింది.

3. అవాంతర వ్యతిరేకాలు

4.182, 183లలో పరస్పరం కూడా అంటే అవాంతర వ్యతిరేకతలున్నాయి. 182లో ఒక శుభసమయాన్ని నిశ్చయించారు. అయితే 183లో ఎటువంటి నిశ్చయమూ లేదు. మొదటిది పాటిస్తే రెండవది వ్యర్థమవుతుంది. రెండవది పాటిస్తే మొదటిది నిష్ప్రయోజనం !

184-192వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

కృత్వా విధానం మూలే తు యాత్రికం చ యథావిధి । మూలశ్లోక సం. **147**
ఉపగృహ్యాస్పదం చైవ చారాన్ సమ్యగ్విధాయ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **184**

టీక:- శత్రువులతో యుద్ధం చేయడానికి ప్రయత్నించినప్పుడు రాజు, **మూలే విధానం తు** = తన రాజ్యరక్షణకు తగిన ఏర్పాట్లుచేసి, **చ** = మరియు, **యాత్రికం** = దండయాత్రకు సంబంధించిన సమస్త సామాగ్రిని, **యథావిధి కృత్వా** = శాస్త్ర పద్ధతిననుసరించి తయారు చేసికొని, **ఆస్పదం ఏవ ఉపగృహ్యా** = సేనను, యానములను శస్త్రాస్త్రాలు మొ॥ వాటిని పూర్తిగా తీసికొని, **చారాన్ సమ్యక్ విధాయ** = నాలుగు వైపుల నుండి సమాచారాలను అందించే చారులను గుప్తంగా నియమించి, శత్రువులతో యుద్ధం చేయడానికి సిద్ధం కావాలి.

ఋషి దయానందభాష్యం:- శత్రురాజులతో యుద్ధం చేయడానికి ప్రయత్నించినప్పుడు, రాజు తన రాజ్యరక్షణకు తగిన ఏర్పాటు చేసుకొని, దండయాత్రకు సంబంధించిన సామగ్రిని శాస్త్రపద్ధతిననుసరించి సేనను యానములను శస్త్రాస్త్రాలను తీసుకొని నాలుగు వైపుల నుండి సమాచారాలను అందించే గూఢచారులను నియమించి శత్రువులతో యుద్ధం చేయడానికి సిద్ధం కావాలి. (స.ప్ర. 6వ సము) ॥184॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సంశోధ్య త్రివిధం మార్గం షడ్విధం చ బలం స్వకమ్ । మూలశ్లోక సం.148
సాంపరాయికకల్పేన యాయాదరిపురం శనైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.185

టీక:- త్రివిధం మార్గం సంశోధ్య = మూడు విధాలైన మార్గాలను (ఒకటి భూమార్గం, రెండు జలమార్గం (సముద్రం లేదా నదులలో) మూడు ఆకాశ మార్గాలను శుద్ధం చేసికొని, భూమార్గం గుండా రథాలు, అశ్వాలు, ఏనుగులు, జలమార్గం గుండా నౌకలు; ఆకాశమార్గం గుండా విమానం మొ॥ యానముల ద్వారా వెళ్ళాలి. చ = మరియు, షడ్విధం = ఆరు రకాలుగా కాల్బలం, రథాలు, ఏనుగులు, అశ్వాలు, అస్త్ర-శస్త్రాలు, భోజనాది సామాగ్రివి పూర్తిగా వెంట తీసికొని, బలం స్వకమ్ = సంపూర్ణ సేనాబలంతో, సాంపరాయిక కల్పేన = ఏదైనా ఒక ప్రసిద్ధ కారణాన్ని చూపించి, అరిపురం శనైః యాయాత్ = శత్రునగరానికి మెల్లగా వెళ్ళాలి.

ఋషి దయానందభాష్యం:- మూడు రకాలైన మార్గాలు 1) భూ మార్గం, 2) జల మార్గం 3) ఆకాశ మార్గం. వీటిని శుద్ధి చేసుకొని ఆరురకాలైన కాల్బలం, రథాలు, ఏనుగులు, అశ్వాలు అస్త్ర-శస్త్రాలు, భోజనాది సామాగ్రివి పూర్తిగా వెంట తీసికొని సంపూర్ణ సైన్యబలంతో ఏదైనా ఒక ప్రసిద్ధకారణం చూపించి శత్రురాజ్యంపైకి మెల్లగా వెళ్ళాలి (స.ప్ర.6వ సము).॥185॥

వివరణ:

త్రివిధ మార్గాలను సంశోధించాలి-

త్రివిధ మార్గాలను సంశోధించడం అని చెప్పడానికి ప్రచలిత టీకాకారులు చేసిన వ్యాఖ్యననుసరించి ఇసుక ఎడారులు, అనూపం (జలం), ఆటవికం (అడవి). ఇవి మనుసమ్మతం కాదు. ఈ విధంగా వ్యాఖ్య చేసినందువల్ల ఇవన్నీ కేవలం భూమార్గాంతర్గతమే అవుతాయి. ఇక్కడ మేము రాసిన అర్థం మను సమ్మతం. ఇందుకు సూచన జలయుద్ధ వర్ణనలున్నాయి. అందువల్ల త్రివిధ మార్గాలంటే భూ-జల-ఆకాశ మార్గాలలో సిద్ధమవుతుంది (8.157,406,409) అనూపమంటే జలమార్గం-సముద్రయానం.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆక్రమణ సమయంలో శత్రువులు-శత్రుమిత్రుల విషయంలో విశేష దృష్టి ఉంచడం -

శత్రుసేవిని మిత్రే చ గూఢే యుక్తతరో భవేత్ । మూలశ్లోక సం.149
గతప్రత్యాగతే చైవ స హి కష్టతరో రిపుః ॥ ప్రక్షిప్త శ్లోక సం.186

టీక:- శత్రుసేవిని గూఢే మిత్రే = లోలోపల శత్రువుకు సహాయం చేస్తూ, పైకి మాత్రం ప్రభువుతో కలిసి మిత్రుడుగా నటించేవాడు, గుప్తంగా శత్రువుకు రహస్యాలు చెప్పేవాడు, గత ప్రత్యాగతే ఏవ = అలాంటి వాడి రాకపోకలను, యుక్తతరః భవేత్ = జాగ్రత్తగా గమనించాలి, హి = ఎందుకంటే అలాంటి, కష్టతరః రిపుః = అతడు గొప్ప శత్రువని భావించాలి. యుక్తతరః కష్టదాయకుడు.

ఋషి దయానందభాష్యం:- లోలోపల శత్రువుకు సహాయం చేస్తూ, పైకి మాత్రం ప్రభువుతో కలిసి మిత్రుడిగా నటించేవాడు, గుప్తంగా శత్రువుకు రహస్యాలు చేరవేసేవాడు, అలాంటి వాణ్ణి జాగ్రత్తగా గమనించాలి. ఎందుకంటే ఇలాంటి రెండు లక్షణాలు గలవాడు గొప్ప శత్రువని భావించాలి (స.ప్ర.6వ సము.). ॥186॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వ్యూహరచనలు-

దండవ్యూహేన తన్మార్గం యాయాత్తు శకటేన వా । మూలశ్లోక సం. **150**
వరాహమకరాభ్యాం వా సూచ్యా వా గరుడేన వా ॥ తత్ప్రక్షిప్త శ్లోక సం. **187**

టీక:- దండవ్యూహేన = దండంలాగా-సేనను నడిపించాలి. ఇది దండ వ్యూహం, **శకటేన** = శకటం లాగా వ్యూహ రచన చేసి సేనను నడిపించడం, **వరాహ-మకరాభ్యాం** = వరాహం లాగా ఒక దాని వెంట ఒకటి పరుగెత్తడం మరొకప్పుడు అన్నీ కలిసి పరుగెత్తుతాయి. అలాగే సైనికులు ఒకరి వెనుక ఒకరు గానీ లేదా అందరూ కలిసి గానీ ప్రస్థానం చేయడం, మకర వ్యూహం-మొసలి నీటిలో మునుగుతూ తేలుతూ పోవునట్లుగా, సెనికుడుకూడా ఒకచోట స్పష్టంగా కనిపిస్తూ మరొకచోట ప్రచ్ఛన్నంగా ఆక్రమణ చేయడం. **సూచ్యా వా గరుడేన వా**= సూచీ వ్యూహం-సూది మొన మొదట సన్నగా ఉంటూ, తరువాత దారం లావు అవుతూ ఉంటుందో, అలాగే సేన మొదట సన్నంగాను, వచ్చేకొద్దీ అధికంగాను కనిపించే విధంగా సైనికులను నడిపించడం, గరుడవ్యూహం - గరుత్మంతుడు పైన క్రిందా ఆక్రమణ చేసే విధంగా సేనను నడిపించాలి.

ఋషి దయానందభాష్యం:- శత్రురాజ్య ఆక్రమణ చేసే మార్గంలో దండవ్యూహం, శకటవ్యూహం, వరాహవ్యూహం, మకరవ్యూహం, సూచీవ్యూహం, గురుడవ్యూహం ఈ వ్యూహాలతో వెళ్ళి శత్రు రాజాన్ని ముట్టడించాలి. (స.ప్ర. 6వ సము) ॥187॥

వివరణ: వివిధ వ్యూహాల పరిచయము

1. **దండ వ్యూహం:** సేనకు ముందు సైన్యాధ్యక్షుడు, మధ్యలో ప్రభువు- అంతంలో సేనాపతి, మరియు అతడికి అటు ఇటు ఒకటి గజసైనికుల పంక్తి, వాటితో పాటు ఒక అశ్వసైనికుల పంక్తి, మళ్ళీ వారి పార్శ్వంలో కాల్బల సైనికుల పంక్తి ఈ విధంగా దండం లాగా దీర్ఘ పంక్తులతో సైనికులను నిలబెట్టడం దండవ్యూహం.

2 **శకట వ్యూహం:** శకటం లాగా ముందు సన్నంగాను, రానురాను అధికంగాను ఉండేవిధంగా- సైనికులను ఏర్పరచడం శకట వ్యూహం.

3. **వరాహ వ్యూహం:** ముందు-వెనుక భాగాలలో సన్నగాను, మధ్యభాగంలో అధికంగా వ్యాపించి వరాహంలాగా ఉండటం వరాహవ్యూహం. ఇందులో సైనికులు ఒక దళం వెనుక ఒక దళం పెరుగుతూ ఉంటుంది. ముందు దళం చిన్నగా కనిపించగా శత్రువును ఆక్రమించడానికి ప్రయత్నిస్తుంది. కానీ వచ్చేకొద్దీ ఒకదాని వెనుక ఒకటి అధికంగా ఉండి శత్రువుకు భయం కలిగిస్తుంది. ముందు సైనికులను రక్షించడానికి గాను చివరలో ఒక చిన్న దళం ఉండి రక్షిస్తుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

యతశ్చ భయమాశంకేత్తతో విస్తారయేద్బలమ్ । మూలశ్లోక సం. **151**
పద్మేన చైవ వ్యూహేన నివిశేత సదా స్వయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **188**

టీక:- యతః భయమ్ +ఆశంకేత్ = ఎటువైపు నుండి భయం కలుగుతుందని తెలియగానే, **తతః** = ఆ వైపుకే **బలమ్ విస్తారయేత్** = ముట్టడికి సైన్యాన్ని పంపాలి, **పద్మేన ఏవ వ్యూహేన** = పద్మాకారంలో సేనాపతులందరినీ నాలుగు వైపుల మోహరింపజేసి, **స్వయం నివిశేత** = తాను స్వయంగా మధ్యలో ఉండాలి. కమల పుష్పం లాగా ఒక రేకు తరువాత మరొక రేకు ఉన్నట్లు ఒక దళం వెనుక గోళాకారంగా మరొక దళముండటం మధ్యలో ప్రభువు లేదా సేనాపతి ఉండటం పద్మవ్యూహమవుతుంది.

ఋషి దయానందభాష్యం:- ఏ వైపు నుండి శత్రుభయం ఎక్కువగా ఉన్నట్లు సంశయం కలుగుతుందో, ఆ వైపుకు ఎక్కువ బలాన్ని పంపాలి. పద్మాకారంలో సేనాపతులందరినీ నాలుగు వైపుల మోహరింపజేసి,తాను స్వయంగా మధ్యలో ఉండాలి. ఇదే పద్మవ్యూహం. అలాంటి వ్యూహంతో పురం నుండి బయటికి వెళ్ళి ఎల్లప్పుడు కపటపు సేనానివేశాన్ని చేయాలి.(స.ప్ర.6వ సము.) ॥188॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సేనాపతిబలాధ్యక్షౌ సర్వధిక్షు నివేశయేత్ । మూలశ్లోక సం.**152**
యతశ్చ భయమాశంకేత్ ప్రాచీం తాం తల్పయేద్దిశమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**189**

టీక:- సేనాపతి-బలాధ్యక్షౌ = సేనాపతీ, బలాధ్యక్షుడూ ఆజ్ఞాపించడం, సేనతో పాటు యుద్ధం చేస్తూ, యుద్ధం చేసే వీరులను, **సర్వదిక్షు నివేశయేత్** = అష్ట దిక్కులందున్నట్లు ఆజ్ఞాపించాలి, **యతః భయమ్ + ఆశఙ్కేత్** = ఏ వైపు నుండి యుద్ధం జరుగుతుందో, **తాం ప్రాచీం దిశమ్ తల్పయేత్** = ఆ వైపు సైనికులందరూ ప్రస్థాన చేసేట్లు చూడాలి.

ఋషి దయానందభాష్యం:-సేనాధ్యక్షుబలాధ్యక్షులను ఆజ్ఞాపించడం, సేనతోపాటు యుద్ధం చేస్తూ, యుద్ధం చేసే వీరులను, అష్టదిక్కులందున్నట్లు ఆజ్ఞాపించాలి, ఏ వైపు నుండి యుద్ధం జరుగుతుందో, ఆ వైపు సైనికులందరూ ప్రస్థానం చేసేట్లు చూడాలి.

పది రథాలు, పది ఏనుగులు, పది గుర్రాలు, పదుగురు కాలిబంట్లు వీటి అధికారి పత్తికుడు. పదిపత్తులకు అధికారి సేనాపతి. పదుగురు సేనానాయకుల అధ్యక్షుడు బలాధ్యక్షుడు. ఇలాంటి సేనాపతి బలాధ్యక్షులను అన్ని దిశలందు నిలిపి ఏ దిక్కులో భయం తోస్తుందో, ఆ దిక్కులో ముందుగా యుద్ధం చేయాలి.(స.ప్ర.6వ సము.)॥189॥

వివరణ:

తాం ప్రాచీం దిశం కల్పయేత్ = అదే పూర్వదిశగా, అంటే సైన్యం అంతా కూడా ఆ దిక్కువైపే నడిపించాలి.

కానీ రెండో వైపు కూడా గట్టి ఏర్పాట్లు చేయాలి. అలా కానట్లయితే వెనుక వైపు నుండి శత్రువు ఆక్రమించడానికి అవకాశముంటుంది.

'తాం ప్రాచీం దిశం కల్పయేత్' దాన్నే పూర్వదిశగా భావించండి. ఇదొక భాషా సంప్రదాయం లేదా జాతీయము(Idiom). ఆ దిక్కునే ముఖ్యమని తలచి, అటు వైపే ముఖ్యమని భావించి-శక్తినంతా ఉపయోగించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

గుల్మాంశ్చ స్థాపయేదాప్తాన్ కృతసంజ్ఞాన్ సమంతతః । మూలశ్లోక సం.**153**
స్థానే యుద్ధే చ కుశలానభీరూనవికారిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**190**

టీక:- గుల్మాన్ = దృఢస్తంభాల లాగా, **ఆప్తాన్** = యుద్ధవిద్యా విశారదులు, సుశిక్షితులు, ధార్మికులు, **స్థానే చ యుద్ధే కుశలాన్** = నిలబడి, సిద్ధమై = పోరాటంలో పటిమగల, **అభీరూన్** = నిర్భయులు, **చ** = మరియు, **అవికారిణః** = మనస్సులో ఏ విధమైన మార్పులేనివారిని, **సమంతతః స్థాపయేత్** = సేనకు నాలుగువైపుల ఉంచాలి **కృత సంజ్ఞాన్** = నిశ్చిత సంకేతాలు తెలిసినవారు.

ఋషి దయానందభాష్యం:- నిశ్చిత సంకేతాలు తెలిసినవారు, దృఢ స్తంభాలలాగా యుద్ధవిద్యా విశారదులు, సుశిక్షితులు, ధార్మికులు, నిలబడి పోరాడటంలో పటిమగల నిర్భయులు, మనస్సులో ఏ విధమైన మార్పు లేనివారిని సేనకు నాలుగు వైపుల ఉంచాలి.(స.ప్ర.6వ సము) ॥190॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సంహతాన్ యోధయేదల్పాన్ కామం విస్తారయేద్బహూన్ । మూలశ్లోక సం. **154**
సూచ్యా వజ్రేణ చైవైతాన్ వ్యూహేన వ్యూహ్య యోధయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **191**

టీక:- అల్పాన్ సంహతాన్ యోధయేత్ = అల్ప సైనికులతో, గొప్ప సైనికులకు ఎదురుగా యుద్ధం చేయవల్సి వచ్చినట్లయితే, **కామం విస్తారయేత్ బహూన్** = అవసరమని తోచినప్పుడు ఈ కొద్ది మందినే విస్తరింప చేయాలి. శత్రునగరంలోగాని, దుర్గంలో గాని ప్రవేశించి యుద్ధం చేయవలసివచ్చినట్లయితే, **సూచ్యా వజ్రేణ వ్యూహ్య** = సూచీ వ్యూహంలో గాని, వజ్ర వ్యూహంలోగాని రెండు వైపుల పదునున్న ఖడ్గాలతో రెండు వైపుల యుద్ధం చేస్తూ ప్రవేశించాలి. అలాగే నానా రకాలైన వ్యూహాల నేర్పరచి, **యోధయేత్** = యుద్ధం చేయించాలి.

ఋషి దయానందభాష్యం:- అల్పులైన యుద్ధభటులతో ఎక్కువ సైన్యాలతో యుద్ధం చేయాల్సి వస్తే, అవసరమని తోచినప్పుడు కావాల్సినంతమందిని విస్తరింప చేయాలి. వీరిని సూచీవ్యూహంతో గానీ వజ్రవ్యూహంతోగానీ రెండు వైపుల పదునున్న ఖడ్గాలతో రెండు వైపుల నిలిపి యుద్ధం చేయించాలి. ॥191॥

ఎదుట శతఘ్నులున్నా, భయంకరమైన ఫిరంగులున్నా, లేదా తుపాకి గుండ్లు వర్షం కురిపిస్తున్నా- "సర్పవ్యూహమేర్పరచి, స్రోతస్సు (ధార)లాగా వెళ్ళిపోవాలి. అక్కడికి వెళ్ళి వారిని చంపి ఆ ఫిరంగులనే వెనుకకు త్రిప్పి వాటిద్వారానే శత్రువులను వధించాలి, మరియు పురుషులను అశ్వాల మీద సవారు చేయించి ఫిరంగులకు ఎదురుగా ఉంచి చంపించాలి. మధ్యలో బలవంతులైన అశ్వసైనికులున్నట్లయితే, వారందరూ ఒక్కసారిగా ఆక్రమణచేసి శత్రుసేనను చిన్నాభిన్నం చేయాలి (స.ప్ర. 6 సముల్లాసం).

వివరణ:

రెండు వైపుల పదునున్న కరవాలం శరీరంలో ప్రవేశించి రెండువైపుల శరీరాన్ని కోస్తూ పోతుందో, అదేవిధంగా సేనావ్యూహాన్ని ఏర్పరచుకొని, ఎదురుగా ఉండి పోట్లాడుతున్న శత్రుసేనలో ప్రవేశించి, విభిన్న భాగాల నుండి, సహాయక సైనికులు యుద్ధం చేయాలి. ఈ విధంగా శత్రుసేన నుండి ఆత్మరక్షణ చేసికొంటూ, శత్రుసేనలు మన వైపు ప్రవేశించకుండా పక్కకు తిరిగి శత్రువులు మనల్ని చుట్టుముట్టకుండా జాగ్రత్తపడాలి. ఇదే వజ్రవ్యూహం.

ఇది మనుకృతం-ప్రామాణికం

స్యందనాశ్వైస్సమే యుద్ధ్యేదనూపే నౌద్విపైస్తథా । మూలశ్లోక సం. **155**
వృక్షగుల్మావృతే చాపైరసి చర్మాయుధైః స్థలే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **192**

టీక:- సమే యుధ్యేత్ స్యన్దన +అశ్వైః = సమ భూమిలో యుద్ధం చేయాల్సి వచ్చినట్లయితే, రథాలు, అశ్వాలు పదాతులతో యుద్ధం చేయాలి. **అనూపే నౌద్విపైః** = సముద్రంలో యుద్ధం చేయాల్సి వచ్చినట్లయితే, నౌకల ద్వారా, నీరు తక్కువగా ఉంటే, గజాలతో, **వృక్ష-గుల్మ+ఆవృతే** = వృక్షాలు, పొదలు మొదలైనవి ఉన్నట్లయితే, **చాపైః** = బాణాలతో అలాగే, **స్థలే** = భూమిపై, ఇసుక ఎడారిలో, **అసి-చర్మ+ఆయుధైః** = కత్తులు, ఢాలుతో యుద్ధం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- సమ ప్రదేశంలో (బయలునందు) రథాశ్వపదాదులతో యుద్ధం చేయాలి. సముద్రంలో నౌకలతో, నీళ్ళు తక్కువగా ఉన్నచోట ఏనుగులతో యుద్ధం చేయాలి. చెట్లు, పొదలు మొ॥వి., ఉన్నట్లయితే బాణాలు, ఖడ్గాలు, కుంతములు మొదలైన ఆయుధాలతో యుద్ధం చేయాలి. (స.ప్ర. 6వ సము.) ॥192॥

మనుప్రోక్తమైన యుద్ధనీతి, మరియు తదంగ ప్రత్యంగాలు (పట్టిక)

యుద్ధనీతికి ఆధారాలు	యుద్ధార్థసేన	సేనాధికారులు
1. సామ 7.151,7.198,200 (ముఖ్యనాయకుడు)	1. కాల్బలం 7.185,192	1.రాజు
2. దాన 7.151,7.198,200	2. రథికులు 7.185,192	2.సేనాపతి 7.189
3. భేద 7.151, 7.198,200	3. అశ్వసైనికులు 7.185,192	3. వాయుసేన7.189
4. దణ్డ 7.151, 7.198,200	4. గజసైనికులు 7.185,192	4. దూత 7.63,68
5. సన్ధి 7.160,162,163,169	5. జలసేన 7.185,192	
6. విగ్రహం 7.160,164,170	6. వాయుసేన 7.185,192	
7. యానం 7.160,164,171		
8. ఆసనం 7.160, 166, 172		
9. ద్వైధీభావం 7.160,167,173		
10. సంశ్రయం 7.160,168,174		

యుద్ధవ్యూహ రచన-శస్త్రాస్త్ర సంకేత వర్ణన

1.	దండ వ్యూహం	7.187	ధనుష్ష	7.74,192
2.	శకట వ్యూహం	7.187	బాణం	7.90,192
3.	వరాహ వ్యూహం	7.187	కృపాణం	7.192
4.	మకర వ్యూహం	7.187	డాలు	7.192
5.	సూచీ వ్యూహం	7.191	కూటాయుధం	7.90
6.	గరుడ వ్యూహం	7.191	శక్తి	8.315
7.	పద్మ వ్యూహం	7.188	వరుణపాశం	9.308
8.	వజ్ర వ్యూహం	7.191	లోహదండం	8.315

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ***కురుక్షేత్రాంశ్చ మత్స్యాంశ్చ పంచాలాన్ శూరసేనజాన్ ।***
దీర్ఘాన్ లఘూంశ్చైవ నరానగ్రానీకేషు యోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***193***

తాత్పర్యం:- కురుక్షేత్రం, మత్స్యదేశం, పంచాలం, శూరసేవం అనే ఈ శాలలో పుట్టి, శౌర్యం, అహంకారం, దృఢశరీరం కలిగినవారిని సేనల ముందు భాగంలో నిలిపి యుద్ధం చేసేట్లు చేయాలి. ॥193॥

ప్రక్షిప్త పరిశీలన

193వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తమవుతుంది -

1. ప్రసంగ వ్యతిరేకం

ఇక్కడ పూర్వాపర ప్రసంగం యుద్ధపు సర్వ సామాన్య నియమాలు, వాటి రకాలు అనేదే తప్ప, ఫలానా దేశపు సైనికులకు లేదా ఏదో ఒక దేశపు పద్ధతిగా చెప్పలేదు. అందుచేత ఈ శ్లోకం పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకం.

2. అంతర్ వ్యతిరేకాలు

(1) ఈ శ్లోకంలో కొన్ని దేశాలలో సైనికులను సేనకు ముందు భాగంలో నిలపాలనే నిర్దేశం ఉంది. ఏ దేశాలలో ఈ సైనికులు ఉండరు? వారికి ఎక్కడికి తీసుకెళ్లాలి? అనేది ప్రశ్న. ఇది సార్వజనిక పద్ధతి కాదు. మనుస్మృతిలోని పద్ధతులు అన్ని దేశాలలోని అన్ని వర్ణాలవారికీ సర్వసామాన్యంగా ఉండే విధంగా ఉంటాయి. వీటిని ఏ ప్రాంతానికీ పరిమితం చేసి చెప్పే అవకాశం లేదు. 1.139[2.20]లో మనువే స్వయంగా 'ఈ ధర్మాలను భూమి మీది సమస్త దేశాల ప్రజలూ నేర్చుకోవాలి' అని స్పష్టంగా చెప్పాడు. మరి ఈ స్మృతిని కేవలం ఈ శ్లోకంలో చెప్పిన దేశాలవారే పాటించాలని ఎలా పరిమితం చేయగలం? ఈ అంతర్ వ్యతిరేకాల కారణంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

(2) ఈ దేశాల స్థాపన ఏ యే రాజుల పేర్ల మీద జరిగిందో, ఆ రాజు ఎందరో స్వాయంభువ మనువులకు చాలా తర్వాతి వారు. (దీనికి 1.138 (2.19) మీది సమీక్ష చూడండి). ఈ విధంగా కాల వ్యతిరేకత ఆధారంగా ఈ శ్లోకం మనువు చెప్పింది కాదు.

194 నుండి 198వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

సేనకు ఉత్సాహ వర్ధనం-

ప్రహర్షయేద్బలం వ్యూహ్య తాంశ్చ సమ్యక్పరీక్షయేత్ । మూలశ్లోక సం. **156**
చేష్టాశ్చైవ విజానీయాదరీన్ యోధయతామపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **194**

టీక:- వ్యూహ్య బలం ప్రవార్షయేత్ = యుద్ధం ప్రారంభ సమయంలో యుద్ధం చేయబోయే సైనికులను ఉత్సాహపరచాలి. యుద్ధం ఆపబోయే సమయంలో వారికి ధైర్య ఉత్సాహ వర్ధక వ్యాకాలతో అస్త్ర-శస్త్రాలతో, వస్తువులతో, ప్రీతి భోజనంతో అవసరమైన ఔషధాలతో అందరి చిత్తాలను అలరించాలి, వ్యూహరచన చేయకుండా యుద్ధం చేయరాదు. చేయించరాదు. **యోధయతామ్ + అపి చేష్టాం విజానీయాత్** = యుద్ధంలో పాల్గొని పోరాడుతున్న తమ సైనికుల చేష్టలను, **సమ్యక్ పరీక్షయేత్** = చక్కగా తెలిసికొంటూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- యుద్ధం ప్రారంభంలో ఉత్సాహపరచాలి. యుద్ధం ఆపబోయే సమయంలో వారికి ధైర్య, ఉత్సాహ వర్ధక వాక్యాలతో అస్త్ర శాస్త్రాలతో, వస్తువులతో, ప్రీతి భోజనంతో అవసరమైన ఔషధాలతో అందరి మనస్సులను అలరించాలి. వ్యూహరచన చేయకుండా యుద్ధం చేయరాదు, చేయించరాదు. యుద్ధంలో పాల్గొని పోరాడుతున్న తమ సైనికుల చేష్టలను చక్కగా తెలుసుకొంటూ ఉండాలి. (స.ప్ర. 6వ సము.) ॥194॥

శత్రురాజును పీడించడానికి ఉపాయాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపరుధ్యారి మాసీత రాష్ట్రం చాస్యోపపీడయేత్ । మూలశ్లోక సం. **157**
దూషయేచ్చాస్య సతతం యవసాన్నోదకేంధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **195**

టీక:- సముచిత సమయమని గుర్తించినప్పుడు, **అరిమ్ ఉపరుధ్య ఆసీత** = శత్రువును ముట్టడించాలి, **చ** = మరియు, **అస్య రాష్ట్రం ఉపపీడయేత్** = ఇతని రాజ్యాన్ని (ప్రజలను) పీడించాలి. **అస్య** = శత్రువు యొక్క, **యుపస+అన్న+ఉదక+ఇంధనమ్** = దేశంలోని ఆహారం, గడ్డి, నీరు, వంట చెరకు వీటన్నింట్లో విషద్రవ్యాలు కలిపి, **సతతం దూషయేత్** = ఎల్లవేళల విషమయం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- దుర్గంలో ఉన్నప్పుడు గానీ, దుర్గంలో లేనప్పుడుగానీ, రాజును బట్టి అతని రాజ్యాన్ని ముట్టడించాలి. అతని రాజ్యాన్ని పీడించాలి. అతని దేశంలోని గడ్డి, ఆహారం, నీరు వంట చెరుకు వీటన్నింటిలో విషద్రవ్యాలు కలిపి, వారికి ఉపయోగపడకుండా ఉండేవిధంగా ఎల్లప్పుడూ విషమయం చేయాలి. (స.ప్ర. 6వ సము) ॥195॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఖింద్యాచ్చైవ తటాకాని ప్రాకారపరిఖాస్తథా । మూలశ్లోక సం.**158**
సమవస్కందయేచ్చైనం రాత్రౌ విత్రాసయేత్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**196**

టీక:- శత్రువు యొక్క **తటాకాని** = చెరువులను, **ఖింద్యాత్** = తెగ్గొట్టాలి, **ప్రాకార** = కోట గోడలను పడగొట్టాలి, **పరిఖాః** = అగడ్తలను పూడ్చాలి, **రాత్రౌ ఏవం విత్రాసయేత్** = రాత్రి సమయాల్లో శత్రు రాజుకు భయం కలిగించాలి, **చ** = మరియు, **సమ్+అవస్కందయేత్** = జయించడానికి ఉపాయాలను కనుక్కోవాలి.

ఋషి దయానందభాష్యం:- వారికి ఉపయోగపడు చెరువులను, కుంటలను తెగ్గొట్టాలి, ఆగడ్తలను పూడ్చాలి ఈ విధంగా శత్రువులను నిర్భయంగా అడ్డగించుటయే కాక రాత్రులందు ధక్క భేరి మొ॥న వాద్యముల మ్రోతలచే భయం కలిగించాలి, జయించడానికి ఉపాయాలను కనుక్కోవాలి. (స.ప్ర.6వ సము) ॥196॥

శత్రురాజుల అమాత్యులలో భేదాలను సృష్టించడం-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపజప్యానుపజపేద్బుధ్యేతైవ చ తత్కృతమ్ । మూలశ్లోక సం.**159**
యుక్తే చ దైవే యుద్ధ్యేత జయప్రేప్సురపేతభీః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**197**

టీక:- ఉపజప్యాన్ = శత్రువర్గంలో ఉన్న అమాత్యులు, సేనాధిపతులు మొ॥ వారిలో భేదాలు కలిగించగలగాలి. **ఉపజపేత్** = ద్వేషం, కలహాలు వారి మధ్య కలిగించాలి. **చ** = మరియు, ఈ ప్రకారంగా, **తత్ కృతం బుద్యేత** = శత్రురాజుల యోజనలను, ఎత్తుగడలను తెలిసికోవాలి, **జయప్రేప్సుః** = విజయాభిలాషియైన ప్రభువు ఈ విధంగా, **అపేత భీః** = భయం వదిలి నిర్భయంగా, **యుక్తే దైవే** = ఉచితమయిన సమయంలో, **యద్ధ్యేత** = యుద్ధాక్రమణ ప్రారంభించాలి.

తాత్పర్యం:- శత్రువర్గంలో ఉన్న అమాత్యులు, సేనాధిపతుల మధ్యలో భేదాలు, ద్వేషం, కలహాలు కలిగించాలి. శత్రురాజు యోజనలను, ఎత్తుగడలను తెలుసుకోవాలి. విజయాభిలాషియైన ప్రభువు సముచిత సమయంలో ఈ విధంగా, నిర్భయంగా యుద్ధం చేయాలి. ॥197॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సామ్నా దానేన భేదేన సమస్తైరథవా పృథక్ । మూలశ్లోక సం.**160**
విజేతుం ప్రయతేతారీన్న యుద్ధేన కదాచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.**198**

టీక:- సామ్నా = సామం చేత అంటే ప్రియమైన మాటల ద్వారాగానీ, **దానేన** = దానం, స్వర్ణ రత్నాదులు ఇవ్వడం ద్వారా గాని, **భేదేన** = రాజ్యాపేక్ష గల ఆ రాజు దాయాదులలో భేదాలు కలిగించి గాని, **అథవా** = లేదా, **సమస్తైః**= సామ-దాన భేదాలనే ఈ మూడు ఉపాయాలను ఒక్కసారిగా ప్రయోగించి గాని, **అరీన్ విజేతుం ప్రయతే** = శత్రువులను జయించడానికి ప్రయత్నించాలి, **కదాచన యుద్ధేన న** = కానీ ఎప్పుడూ యుద్ధం ద్వారా జయించడానికి ప్రయత్నించవద్దు.

తాత్పర్యం:-ప్రీతిపూర్వకమైన మాటలు సామమనే ఉపాయం. అవతలి వ్యక్తి స్థాయిని బట్టి కొద్దో గొప్పో ధనకనకవస్తువాహనాలు ఎరవేసేలా చూడటం దానమనే ఉపాయం. ఎదుటివారి బలహీనతలను బట్టి ఇతరులకూ-వారికీ జగడం పెట్టడం భేదోపాయం. సామదానభేదా లనే ఈ మూడు ఉపాయాలను ఒక్కసారిగా ప్రయోగించి గానీ శత్రువులను జయించడానికి ప్రయత్నించాలి. అన్నివేళలా యుద్ధం ద్వారా శత్రువును లొంగదీయాలనుకోవడం అవివేకం. ॥198॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *అనిత్యో విజయో యస్మాద్దృశ్యతే యుద్ధ్యమానయోః ।*
పరాజయశ్చ సంగ్రామే తస్మాద్యుద్ధం వివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***199***

తాత్పర్యం:-ఏ ఇద్దరు రాజులకైనా యుద్ధం సంభవించినప్పుడు జయాపజయాలనిత్యం. పరాపజయమూ కలుగవచ్చు. కాబట్టి యుద్ధమే అన్నిటికీ అంతిమ పరిష్కారం కాదు. కానక్కర్లేదు కూడా!

ప్రక్షిప్త పరిశీలన

199వ శ్లోకం కింది ఆధారాల ప్రకారం ప్రక్షిప్తమవుతుంది.

1. విషయ వ్యతిరేకం

(1) ముందు, వెనుక ఉన్న 198, 200 శ్లోకాలలో నీతిపూర్వకమైన, సామాది ఉపాయాలు చెప్పారు. చివరి ఉపాయమైన యుద్ధాన్ని చివర మాత్రమే పాటించాలన్న నిర్దేశం ఉంది. ఈ విధంగా పైనచెప్పిన రెండు శ్లోకాలకూ వాక్యాత్మక సంబంధం ఉంది. ఈ శ్లోకంలోని యుద్ధ నిషేధ వర్ణన ఈ విషయాన్ని, సంబంధాన్ని భంగం చేస్తుంది. అందుచేత, ఇది విషయ భంజక ప్రక్షిప్తం.

(2) 181వ శ్లోకం నుంచి యుద్ధ విషయాలే మొదలయ్యాయి. 201 వరకూ యుద్ధ విధానాలు ఉన్నాయి. ఈ విషయం మధ్య యుద్ధం వదిలెయ్యటం చెప్పటం అనేది విషయ వ్యతిరేకం.

2. పరస్పర వ్యతిరేకత

181 నుంచి 200వ శ్లోకం వరకు మనువు యుద్ధం చేయాలనే చెప్పాడు. ఇక్కడ యుద్ధంలో ఓడిపోతామనే భయంతో మానేయమనటం ఈ మొత్తం శ్లోకాలకు వ్యతిరేకం. ఈ ఆధారంతోనూ ఇది ప్రక్షిప్తం.

200 నుండి 204 శ్లోకాల వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

త్రయాణామప్యుపాయానాం పూర్వోక్తానామసంభవే । మూలశ్లోక సం. **161**
తథా యుద్ధ్యేత సంపన్నో విజయేత రిపూన్ యథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **200**

టీక:- పూర్వోక్తానామ్ త్రయాణాం +అపి+ఉపాయానాం అసంభవే = పూర్వోక్తాలైన సామ-దాన-భేదాలనే ఉపాయ త్రయం ద్వారా విజయం లభించే అవకాశం లేనప్పుడు, **సంపన్నః** = సర్వ విధాల సిద్ధమై, **యథా రిపూన్ విజయేత** = ఏ విధంగా యుద్ధం చేసినట్లయితే శత్రువులను జయించగలరో, **తథా యుద్ధ్యేత** = ఆ విధంగా యుద్ధం చేయాలి.

తాత్పర్యం:- మొదటి మూడు ఉపాయాల ద్వారా విజయం లభించే అవకాశం లేనప్పుడు, ఎలా శత్రువులను జయించగలరో, ఆవిధంగా యుద్ధం చేయాలి. ॥200॥

రాజుకు విజయానంతరం కర్తవ్యం- ఇది మనుకృతం-ప్రామాణికం

జిత్వా సంపూజయేద్దేవాన్ బ్రాహ్మణాంశ్చైవ ధార్మికాన్ । మూలశ్లోక సం. **162**
ప్రదద్యాత్పరిహారాంశ్చ ఖ్యాపయేదభయాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **201**

టీక:- జిత్వా = విజయాన్ని సాధించి, **ధార్మికాన్ దేవాన్ బ్రాహ్మణాం ఏవ** = ధర్మాచరణపరులైన విద్వాంసులనే, **పూజయేత్** = సత్కరించాలి. అంటే వారికి అభివందనం చేసి వారి ఆశీస్సులను గ్రహించాలి. **చ** = మరియు, **పరిహారాన్**

ప్రదద్యాత్ = యుద్ధంలో నష్టపడిన వారికి సహాయపడాలి. **చ** = అలాగే, **అభయాని ఖ్యాపయేత్** = ఈ ప్రకారంగా ప్రజలకు ఇక ఏమీ కష్టం కలిగించం అని మీరు ఇక నిర్భయంగా మీ మీ పనులు ప్రశాంతంగా నెరవేర్చుకోండని అభయప్రదానం చేయాలి.

తాత్పర్యం:- శత్రురాజ్యములను జయించి, ధర్మాత్ములైన బ్రాహ్మణులను, పుణ్యాత్ములను పూజించి సత్కరించాలి. యుద్ధంలో నష్టపడినవారికి సహాయపడాలి. అలాగే ప్రజలకు నిర్భయంగ తమ తమ పనులు ప్రశాంతంగా సాగించుకోవచ్చునని దేశంలో అభయప్రధానం చేయాలి. ॥201॥

ఓడిపోయిన రాజు ద్వారా ప్రతిజ్ఞాపత్రం రాయించడం- ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేషాం తు విదిత్వైషాం సమాసేన చికీర్షితం । మూలశ్లోక సం. **163**
స్థాపయేత్తత్ర తద్వంశ్యం కుర్యాచ్చ సమయక్రియామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **202**

టీక:- ఏషాం సర్వేషాం = ఓడిపోయిన దేశప్రజలందరికీ, **చికీర్షితమ్** = కోరికను, **సమాసేన విదితా** = సంక్షేపంగా తెలిసికొని ప్రజలు ఎవరిని రాజుగా కోరుతున్నారో, లేదా మరెవరినైనా రాజుగా చేయాలనుకొంటున్నారో పూర్తిగా తెలిసికొని, **తత్ర** = అక్కడ ఆ రాజసింహాసనం మీద, **తత్ వంశ్యం** = ఆ రాజు వంశానికి చెందినవాడినే, **స్థాపయేత్** = అభిషేక్షించాలి, **చ** = మరియు, **సమయక్రియామ్ కుర్యాత్** = అతనిచేత సమ్మతి పత్రం (Agreement) షర్తనామా అంటే నీవు చేయవలసిన పనులేవో, నేను చేయాల్సిన పనులేవో నిర్ణయించి, అతడిచేత సంతకం చేయించుకోవాలి.

తాత్పర్యం:- ఓడి పోయిన శత్రురాజు మంత్రులు, మొదలైనవారి అందరి అభిప్రాయాన్ని తెలుసుకొని ఆ రాజ్యంలో ఆ శత్రురాజువంశంవాడినే ఆ రాజసింహాసనం మీద రాజుగా పట్టం కట్టాలి. అతని చేత సమ్మతి ప్రతంలో అతనిని, అతని మంత్రులకు ఈ ఈ పనులే వారు చేయవలసినందనీ ఈ ఈ పనులు చేయరాదనీ నిర్ణయించి, సంతకం చేయించుకోవాలి. ॥202॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రమాణాని చ కుర్వీత తేషాం ధర్మ్యాన్ యథోదితాన్ । మూలశ్లోక సం. **164**
రత్నైశ్చ పూజయేదేనం ప్రధానపురుషైస్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **203**

టీక:- తేషాం యథోధితాన్ ధర్మ్యాన్ = ఓడిపోయిన దేశప్రజలు, నియుక్తమైన రాజపురుషులు చెప్పిన న్యాయోచితమైన విషయాలను, **ప్రమాణాని చ కుర్వీత** = ప్రమాణాలు చేయించాలి, **ప్రధాన పురుషైః సహ ఏనమ్** = ప్రధాన పురుషులతో కలిసి బంధింపబడిన ఆ రాజును కూడా, **రత్నైః పూజయేత్** = యథా యోగ్యంగా సత్కరించాలి.

ఋషి దయానందభాష్యం:- ఓడిపోయిన దేశప్రజలు, నియుక్త రాజపురుషులు చెప్పిన న్యాయోచితమైన విషయాలను ప్రమాణాలు చేయించాలి. ప్రధాన పురుషులతో కలిసి బంధించిన ఆ రాజును కూడా యథా యోగ్యంగా సత్కరించాలి.

జయించిన తరవాత ఆ రాజు వంశంలో నుండి ధార్మికుడు యోగ్యుడని తోచినవాడికి రాజ్యాభిషేకం చేయించాలి. అతడితో ఈ కింది విధంగా రాతపూర్వకంగా ప్రతిజ్ఞ చేయించాలి. **"నేను మీ ఆజ్ఞలననుసరించి ధర్మయుక్తమైన రాజనీతిననుసరించి, ప్రజలను న్యాయంగా పాలిస్తాను"** అని. మళ్ళీ ఉపద్రవం కలిగించకుండా చూడటానికి కొంత మంది ముఖ్యులను అక్కడ ఉంచాలి. ఓడిపోయినవారికి ప్రధాన పురుషులతో కలిసి రత్నాది ఉత్తమ వస్తుదానాదుల ద్వారా సత్కరించాలి. ఓడిపోయినరాజు యొక్క యోగక్షేమాలను కూడా చూస్తూ ఉండాలి. కారాగృహంలో ఉంచినా యథా యోగ్య సత్కారం జరుపుచుండాలి. దానివల్ల పరాజితుడనైతిననే భావన లేకుండా ఆ రాజు ఆనందంగా ఉండగలడు. (స.ప్ర. 6వ సము.) ॥203॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆదానమప్రియకరం దానం చ ప్రియకారకమ్ । మూలశ్లోక సం. **165**
అభీప్సితానామర్థానాం కాలే యుక్తం ప్రశస్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **204**

టీక:- ఎందుకంటే **ఆదానమ్ +అప్రియకరమ్** = ప్రపంచంలో ఇతరుల వస్తువులను గ్రహించడం (తీసికోవడం) అప్రియం, ప్రీతికరంగాదు. **చ** = మరియు, **దానం ప్రియ కారకమ్** = ఇవ్వడం ప్రీతికారకం, **కాలే** = సమయ-సందర్భాలలో ఉచితక్రియ చేయడం, **అభీప్సితానామ్ +అర్థానాం** = ఆ పరాజితుడైన రాజు యొక్క మనోవాంఛిత పదార్థాలనివ్వడం, **ప్రశస్యతే** = చాలా ఉత్తమం.

ఋషి దయానందభాష్యం:- ప్రపంచంలో ఇతరులు కోరిన వస్తువులను రాజు తీసుకోకూడదు. వారు కోరిన వస్తువులు ఇవ్వగలగాలి. కానీ సమయాన్ని బట్టి ఇవ్వడం- పుచ్చుకోవడం యుక్తమే ! పరాజితుడైన రాజు యొక్క మనోవాంఛిత పదార్థాలను ఇవ్వడం చాలా ఉత్తమం. వారినెప్పుడూ కోపగించరాదు. పరిహసించరాదు. ఎగతాళి చేయరాదు. మేము మిమ్ములను పరాజితులను చేసితిమని వారి ఎదుట ఎప్పుడూ పలుకరాదు. మీరు మా సోదరులు అనే మాటలతో సదా వారి గౌరవ ప్రతిష్ఠలను కాపాడాలి. (స.ప్ర.6వ సము) ॥204॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ***సర్వం కర్మేదమాయత్తం విధానే దైవమానుషే ।***
తయో ర్దైవమచింత్యం తు మానుషే విద్యతే క్రియా ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***205***

తాత్పర్యం:- ఏ యే కార్యములు చేయదగియున్నవో అవన్నీ జన్మాంతరసంపాదితమైన పుణ్యపాపరూపమైన దైవమనెడి (గ్రహచారమనెడి) కర్మకు అధీనమై ఉన్నవి. వాటిలో దైవమెలా ఉందో ఆలోచించడానికి వీలు కాదు. మానుష ప్రయత్నం చేయవలసి ఉంది కాబట్టి ప్రయత్న మూలమున కార్యసిద్ధికోసం యత్నిస్తూ ఉండాలి. ॥205॥

ప్రక్షిప్త పరిశీలన

205వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. ప్రసంగ వ్యతిరేకం

ఈ శ్లోకం పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకంగా ఉంది. మునుపటి 202-204 శ్లోకాలలో గెలిచిన రాజును బంధించి ఉంచాలి అతని స్థానంలో అతని వంశజుణ్ని రాజును చేయాలనే నిర్దేశం ఉంది. 206లో దానికి వికల్పంగా రాజును బంధించకపోతే, అతన్ని మిత్రుణ్ని చేసుకుని అతన్నే రాజుగా నియమించి తిరిగి వెళ్లవచ్చు. ఇలా పూర్వాపర శ్లోకాల సంబద్ధతను ఈ శ్లోకం భంగం చేసింది. ఇందులో చెప్పిన మానుష దైవ కర్మలకూ, పూర్వాపర ప్రసంగాలకూ ఏ సంబంధమూ లేదు. ఈ ప్రసంగ వ్యతిరేకత ఆధారంగా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

206 నుండి 217వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

సహ వాపి వ్రజేద్యుక్త స్సంధిం కృత్వా ప్రయత్నతః । మూలశ్లోక సం. **166**
మిత్రం హిరణ్యం భూమిం వా సంపశ్యంస్త్రివిధం ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **206**

టీక:- పూర్వోక్త కథనానుసారంగా (7-202,203) విజితుడైన రాజును బంధించకుండా అతడి స్థానంలో రెండో రాజును ప్రతిష్ఠించక, అతడినే రాజుగా ఉంచినట్లయితే, **అపి వా** = లేదా, **సహయుక్తః** = ఆ రాజుతోనే, **ప్రయత్నతః సంధిం కృత్వా** = జాగ్రత్తగా సంధి చేసికొని-సంధి పత్రం రాయించి, **మిత్రం హిరణ్యం వా భూమిం స్త్రివిధం ఫలమ్ సంపశ్యన్** = మిత్రత్వం, సైన్యం-భూమి ప్రాప్తియే ఫలంగా భావించి, **వ్రజేత్** = తిరిగి రావాలి.

తాత్పర్యం:- పరాజితుడైన రాజును బంధించకుండా అతడి స్థానంలో రెండో రాజును ప్రతిష్ఠించకుండా, అతడినే రాజుగా ఉంచినట్లయితే, లేదా ఆ రాజుతోనే జాగ్రత్తగా సంధి చేసుకొని, సంధి పత్రం రాయించి మిత్రత్వం సైన్యం-భూమి ప్రాప్తియే ఫలంగా భావించి తిరిగిరావాలి. ॥206॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పార్ష్ణిగ్రాహం చ సంప్రేక్ష్య తథా క్రందం చ మండలే । మూలశ్లోక సం. **167**
మిత్రాదథాప్యమిత్రాద్వా యాత్రాఫలమవాప్నుయాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **207**

టీక:- **మండలే** = తన రాజ్యంలో, **పార్ష్ణిగ్రాహణ** = పార్ష్ణిగ్రాహణ పేరుగల రాజు అలాగే, **ఆ క్రందం సంప్రేక్ష్య** = ఆక్రందుడనే పేరుగల రాజు-గురించి, ధ్యానముంచి, **మిత్రాత్ +అథాపి+అమిత్రాత్** = మిత్రుడైనా లేదా పరాజిత శత్రువైనా, **యాత్రాపలమ్ అవాప్నుయాత్** = యుద్ధయాత్రా ఫలాన్ని పొందాలి. తన ఇరుగు పొరుగు రాజుల నుండి, సురక్షణ కోసం లేదా వారిని తన వశంలో ఉంచుకోడానికి గాని, అధిక లాభదాయకమైన ఫలాన్ని-మిత్రుడి నుండి గాని, శత్రువు నుండి గాని తీసికోవాలి.

తాత్పర్యం:- జయం కోరి శత్రువు పైకి పోవుచున్నట్టి రాజుకు వెనుక ప్రక్కనున్న రాజు దేశాదులను ఆక్రమిస్తాడు. అలాంటివాడు పార్ష్ణిగ్రాహి అతనికి నియామకుడై వాడి వెంబడి ఉన్న రాజు ఆక్రందుడు. వారిని సహాయం తీసుకొని దండయాత్రకు పోవాలి. ఆ పార్ష్ణిగ్రాహాక్రందులు మిత్రులయినా శత్రువులైనా, వారు ఇచ్చే యాత్రాఫలాన్ని పొందాలి.॥207॥

వివరణ:

పార్ష్ణిగ్రాహణ = శత్రువు పైకి యుద్ధానికి పోతున్న రాజు యొక్క రాజ్యాన్ని, వెనుక ఉన్న తన రాజ్యాన్ని ఆక్రమించే అవకాశముంది. అలాంటివాడు పార్ష్ణిగ్రాహి. అదే సమయంలో పక్కనున్న రాజు యుద్ధానికి వెళ్ళిన రాజు యొక్క రాజ్యాన్ని ఆక్రమించేవాడు ఆక్రందుడు.

మంచిమిత్రుడు అన్నింటికంటే గొప్పబలము **ఇది మనుకృతం-ప్రామాణికం**

హిరణ్యభూమి సంప్రాప్త్యా పార్థివో న తథైధతే । మూలశ్లోక సం. **168**
యథా మిత్రం ధ్రువం లబ్ధ్వా కృశమప్యాయతిక్షమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **208**

టీక:- **పార్థివః** = ప్రభువు, **హిరణ్య-భూమి-సంప్రాప్త్యా** = స్వర్ణ భూమి ప్రాప్తించినా అనుకున్నంతగా అభివృద్ధి చెందదు. **యథా** = ఏవిధంగా, **ధ్రువం** = నిశ్చల ప్రేమయుక్తుడు, **ఆయతిక్షమమ్** = భవిష్యద్విషయాల గురించి ఆలోచనచేసి కార్యసిద్ధి ప్రాప్తిలో సమర్థుడైన మిత్రుడు, **అపికృశమ్** = దుర్బలుడైన మిత్రుణ్ణి, **లబ్ధ్వా** = పొంది అభివృద్ధిని పొందుతాడు.

తాత్పర్యం:- రాజు స్వర్ణభూమి ప్రాప్తించినా అనుకున్నంతగా అభివృద్ధి చెందదు. ఎందుకంటే నిశ్చల ప్రేమయుక్తుడు, స్థిరచిత్తుడు భవిష్యద్విషయాల గురించి ఆలోచన చేసి కార్యసిద్ధిప్రాప్తిలో సహకరించు మిత్రుడిని పొంది అభివృద్ధి పొందుతాడు.॥208॥

ప్రశంసనీయ మిత్రరాజు లక్షణం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ధర్మజ్ఞం చ కృతజ్ఞం చ తుష్టప్రకృతిమేవ చ । మూలశ్లోక సం. **169**
అనురక్తం స్థిరారంభం లఘుమిత్రం ప్రశస్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **209**

టీక:- ధర్మజ్ఞం = ధర్మశాస్త్రజ్ఞుడు మరియు, **కృతజ్ఞం** = చేసిన వేలును మరువని వాడు, **తుష్ట ప్రకృతిం** = ప్రసన్న స్వభావుడు, **అనురక్తం** = అనురాగి, **స్థిర ప్రకృతిమ్** = నిలకడగా మిత్రత్వాన్ని నిర్వహించేవాడు, లేదా స్థిరకార్యకర్త అయినవాడు, **లఘుమిత్రం** = చిన్న మిత్రుణ్ణి పొందినవాడు, **ప్రశస్యతే** = ప్రశంసాపాత్రుడవుతాడు.

ఋషి దయానందభాష్యం:- చేసిన మేలు మరువనివాడు, ధర్మశాస్త్రజ్ఞుడు, నిలకడగా పనిచేయువాడు ప్రేమ స్వభావం గలవాడు అయిన మిత్రుడు శ్రేష్ఠుడు. కాబట్టి అలాంటి మిత్రుణ్ణి సంపాదించాలి. (స.ప్ర. 6వ సము)॥209॥

కష్టదాయక శత్రు లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాజ్ఞం కులీనం శూరం చ దక్షం దాతారమేవ చ । మూలశ్లోక సం. **170**
కృతజ్ఞం ధృతిమంతం చ కష్టమాహురరిం బుధాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **210**

టీక:- ప్రాజ్ఞం = బుద్ధిమంతుడు, **కులీనం** = ఉత్తమ వంశజుడు, **శూరం** = శూరవీరుడు, **దక్షం** = సమర్థుడు, **దాతారమ్** = దాత, **కృతజ్ఞం** = చేసిన మేలును గుర్తించుకొనేవాడు, **చ** = మరియు **ధృతిమంతం** = ధైర్యవంతుడైన పురుషుణ్ణి, **అరిం-కష్టమ్+ఆహుః** = అలాంటి వాడితో శత్రుత్వం మంచిదిగాదు. సంధి చేసుకోవడం ఉత్తమం. **"బుధాః ఆహుః"** = విచారశీలురైన (దూర దృష్టి గల) = విద్వాంసుల అభిప్రాయం.

ఋషి దయానందభాష్యం:- విద్వాంసుడు (చదువరి), మహాకులంలో పుట్టినవాడు, పరాక్రమవంతుడు, చేసిన మేలును గుర్తించుకొనేవారు, నేర్పరి, దాత కష్టసుఖాలలో ఒక్క తీరున ఉన్నవాడు అయిన శత్రువును జయించడం కష్టమని తెలివి గలవాళ్ళు చెబుతారు. కాబట్టి అలాంటి శత్రువుతో సంధిచేయడం యుక్తం. ఇలాంటి వారిని శత్రువులుగా చేసుకొనేవాడు నిరంతరం దుఃఖాన్ని అనుభవిస్తాడు అనే విషయాన్ని దృఢంగా నమ్మాలి. (సం.ప్ర. 6వ సము)॥210॥

తటస్థుల లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆర్యతా పురుషజ్ఞానం శౌర్యం కరుణవేదితా । మూలశ్లోక సం. **171**
స్థౌలలక్ష్యం చ సతతముదాసీనగుణోదయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **211**

టీక:- ఆర్యతా = ఆర్యత్వం, సాధుత్వం **పురుషజ్ఞానం** = పురుషులలో మంచి చెడులను గుర్తించే జ్ఞానం, **శౌర్యం** = వీరత్వం, **కరుణ వేదితా** = దయాశీలత, **స్థౌల లక్ష్యం సతతమ్** = స్థూలలక్ష్యం అంటే పై పైన మాటలను నిరంతరం వినిపిస్తుండువాడు, **ఉదాసీన గుణోదయః** = తటస్థులని పిలువబడుతారు. తటస్థుడైనా ఏదో ఒకరోజున అభివృద్ధి చెందునని భావించి అతడిని ఒక కంట కనిపెడుతూ ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- సాధుత్వం (మంచితనం), మనుష్యస్వభావాన్ని తెలిసిన శక్తి, పరాక్రమం, దయాశీలత్వం, నిరంతరం విశేషమగుదాతృస్వభావం ఇవన్నీ మధ్యవర్తియైన వాడికి ఉండే గుణాలు. ఇలాంటి మధ్యవర్తియైన రాజును బాసటగొని ముందటి గుణాలు గల శత్రువుతో యుద్ధం చేయవచ్చు. (స.ప్ర. 6వ సము)॥211॥

ప్రభువుకు అన్నిటి కంటే ఆత్మరక్షణ చాలా ముఖ్యం ఇది మనుకృతం-ప్రామాణికం

క్షేమ్యాం సస్యప్రదాం నిత్యం పశువృద్ధికరీమపి । మూలశ్లోక సం. **172**
పరిత్యజేన్నృపో భూమిమాత్మార్థమవిచారయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **212**

టీక:- నృపః = ప్రభువు, **ఆత్మార్థమ్** = తన రాజ్యరక్షణ కోసం, **క్షేమ్యాం** = క్షేమకరం, ఆరోగ్యదాయకం, **సస్యప్రదాం** = ధాన్యం, గడ్డి మొ॥వాటికి సారవంతమైనదీ, **నిత్యం పశువృద్ధి కరీమ్** = నిత్యం పశువులు వృద్ధి చెందడానికి

అనుకూలమైనది అయినప్పటికీ, **భూమిం** = భూమిని, (దేశాన్ని కూడా), **అవిచారయన్** = ఆలోచన చేయకుండానే, పరిత్యజేత్ = వదిలివేయాలి. నిన్ను జయించిన విజేతకు ఇవ్వవలసివచ్చినట్లయితే ఆలోచించకుండానే మమకారం విడిచి ఇవ్వాలి.

తాత్పర్యం:- ప్రభువు తన రాజ్యరక్షణ కోసం క్షేమకరం, ఆరోగ్యదాయకం, ధాన్యం, గడ్డి మొ॥ వాటికి సారవంతమైనదీ నిత్యం పశువులు వృద్ధి చెందడానికి అనుకూలమైనది అయినప్పటికీ, అలాంటి భూమిని ఆలోచన చేయకుండానే వదిలివేయాలి. ॥212॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆపదర్థం ధనం రక్షేద్దారాన్ రక్షేద్ధనైరపి । మూలశ్లోక సం. **173**
ఆత్మానం సతతం రక్షేద్దారైరపి ధనైరపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **213**

టీక:- **అపత్+అర్థం** = ఆపదలొచ్చినప్పుడు తన్ను రక్షించుకోడానికి, **ధనం రక్షేత్** = ధనాన్ని రక్షించుకోవాలి, **ధనైః+అపి** = ధనం కంటే, **దారాన్ రక్షేత్** = స్త్రీలను అంటే కుటుంబాన్ని రక్షించుకోవాలి, **దారైః అపి ధనైః+అపి** = స్త్రీల కంటే ధనం కంటే కూడా ముందుగా, **ఆత్మానం** = తనను తాను రక్షించుకోవాలి. ఆత్మరక్షణ అన్నిటికంటే చాలా ముఖ్యం.

తాత్పర్యం:-ఆపదలు పోగొట్టుకోడానికి ధనాన్ని కాపాడుకోవాలి. ధనం కాపాడు కోలేకపోయినా అంతఃపురస్త్రీలను, కుటుంబాన్ని కాపాడుకోవాలి. ద్రవ్యాన్ని, భార్యను కాపాడుకునే ముందు తనను తాను రక్షించుకోవాలి. ఆత్మరక్షణ అన్నిటికంటే చాలా ముఖ్యం. ॥213॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సహ సర్వాస్సముత్పన్నాః ప్రసమీక్ష్యాపదో భృశమ్ । మూలశ్లోక సం. **174**
సంయుక్తాంశ్చ వియుక్తాంశ్చ సర్వోపాయాన్ సృజేద్బుధః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **214**

టీక:- **సర్వాః ఆపదః భృశమ్ సహ సముత్పన్నాః ప్రసమీక్ష్య** = ఆపదలన్నీ ఒక్కసారి తీవ్రంగా వచ్చినప్పుడు బుధుడు-తెలివిగల ప్రభువు బాగా విచారించి, **సంయుక్తాన్** = అన్నింటినీ కలిపి ఒక్కసారిగా గాని, **వియుక్తాన్** = లేదా ఒక్కొక్కసారి ఒక్కొక్క ఆపదను పోగొట్టడానికి గాను ఏది ఉచితమని తోస్తుందో, అలాగే, **సర్వ+ఉపాయాన్ సృజేత్** = సమస్త ఉపాయాలను ఉపయోగించి నివారించుకోవాలి.

తాత్పర్యం:- ఆపదలన్నీ ఒక్కసారి తీవ్రంగా వచ్చినప్పుడు తెలివిగల ప్రభువు బాగా విచారించి, అన్నింటినీ కలిపి ఒక్కసారిగాని లేదా ఒకొక్కసారి ఒక్కొక్క ఆపదను పోగొట్టడానికి గాను ఏది ఉచితమని తోస్తుందో, అలాగే సమస్త ఉపాయాలను ఉపయోగించి నివారించుకోవాలి. ॥214॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపేతారముపేయం చ సర్వోపాయాంశ్చ కృత్స్నశః । మూలశ్లోక సం. **175**
ఏతత్త్రయం సమాశ్రిత్య ప్రయతేతార్థసిద్ధయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **215**

టీక:- **ఉపేతారమ్ ఉపేతా** = పొందునట్టివాడు (తానే ప్రభువు), **ఉపేయం** = శత్రువు, **చ** = మరియు, **సర్వ+ఉపాయాన్** = సమస్త విజయ ప్రాప్తికి ఉపాయాలు-సామ-దాన భేదాలు మొ॥వి., **ఏతత్+త్రయం** = ఈ మూడు

విషయాలను, **కృత్స్నశః సమాశ్రిత్య** = పూర్తిగా ఆశ్రయించి, విచారించి, తన సామర్థ్యాన్ని గమనించి, **అర్థ సిద్ధయే ప్రయతేత** = కార్యసిద్ధికి ప్రయత్నించాలి.

తాత్పర్యం:-దేనికైనా ప్రయత్న పడునట్టివాడు, అతడెవరయినా గానీ.... పొందదగిన దాన్ని అన్ని ఉపాయాలచేత పొందడానికే ప్రయత్నించాలి. కార్యసిద్ధికి ఈ మూడు ముఖ్యమైనవి. 1) కార్యసాధకుడు, 2) సాధించవలసిన కార్యం 3) కార్యసాధనోపాయాలు. ఈ మూడూ ముఖ్యం. ॥215॥

మంత్రణ-శస్త్రాభ్యాసమయిన మీదట భోజనార్థం అంతఃపురానికి పోవడం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం సర్వమిదం రాజా సహ సమ్మంత్ర్య మంత్రిభిః । మూలశ్లోక సం. **176**
వ్యాయామ్యాప్లుత్య మధ్యాహ్నే భోక్తుమంతః పురం విశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **216**

టీక:- **ఏవం** = ఈ విధంగా, **రాజా** = రాజు లేదా ప్రభువు, **ఇదం సర్వమ్** = పూర్వోక్తమైన ఈ విషయాన్నంతా, **మంత్రిభిః సహ సంమన్త్ర్య** = మంత్రులతో కలిసి విచార-విమర్శలు చేసి, **వ్యాయమ్య** = వ్యాయామ శస్త్రాస్త్రాభ్యాసం చేసి, **ఆప్లుత్య** = స్నానంచేసి, **మధ్యాహ్నే** = మధ్యాహ్న కాలంలో, **భోక్తుం** = భోజనం చేయడానికి, **అన్తఃపురం విశేత్** = అంతఃపురానికి పత్న్యాదుల నివాసస్థానానికి వెళ్ళాలి.

తాత్పర్యం:- రాజు వివిధ విషయాల మీద మంత్రులతో మంతనాలు చేసి ఆ తరవాత కొంతసేపు వ్యాయామ శస్త్రాస్త్రాభ్యాసం చేసి, మధ్యాహ్న స్నానం చేసి, భోజనం చేయడం కోసం అంతఃపురంలోకి వెళ్లాలి. ॥216॥

రాజు సుపరీక్షిత భోజనమునే చేయాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

తత్రాత్మభూతైః కాలజ్ఞైరహార్యైః పరిచారకైః । మూలశ్లోక సం. **177**
సుపరీక్షితమన్నాద్య మద్యాన్మంత్రైర్విషాపహైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **217**

టీక:- **తత్ర** = అక్కడ, అంటే అంతఃపురంలో, **ఆత్మ భూతైః** = ఆత్మభూతులు, ఆత్మీయులు గంభీర ప్రేమ కలిగినవారు, **కాలజ్ఞైః** = ఋతువును బట్టి స్వాస్థ్యంననుసరించి, వయస్సుననుసరించి, భోజన పదార్థాలను, భోజన సమయం తెలిసినవారు, **అహార్యైః** = శత్రువుల ప్రలోభాలకు లొంగనివారైనా, **పరిచారకైః** = సేవకుల ద్వారా పాకశాలాధ్యక్షులు, వైద్యుల ద్వారా, **విషాపహైః మంత్రైః** = విషనాశక యుక్తుల ద్వారా, ఉపాయాల ద్వారా, **సుపరీక్షితమ్** = చక్కగా పరీక్షింపబడిన, **అన్నాద్యమ్** = భోజనాన్ని, **అద్యాత్** = భుజించాలి. (విషాపహములు-అంటే విషాన్ని దూరం చేసే గారుడాది మంత్రాలను జపించి భోజనం చేయమని ప్రచలితార్థం).

తాత్పర్యం:-అక్కడ స్నానాదికాలు అయ్యాక, భోజనకాలాన్ని సరిగ్గా తెలిసినవారు, తనతో సమానులు, పరులమాటలకు లొంగని వారు అయిన సాటి సుక్షత్రియ మిత్రులు (ఉంటే) వారితోను కలిసి భోజనం చేయాలి. అది వంటవాళ్లచేత పరీక్షించబడిన ఆహారమై, విషాహర మంత్రాలచేత అభిమంత్రితమై ఉండాలి.

భోజనం-సుపరీక్షితమంటే, బుద్ధి-బల-పరాక్రమవర్ధకం, రోగ వినాశకం, రకరకాలైన అన్న-వ్యంజన-పాన ఆది, సుగంధిత మిష్టాది అనేక రసయుక్తమైన భోజనాన్ని భుజించాలి. ॥217॥

వివరణ:

కాలజ్ఞ శబ్దానికి మనుసమ్మతమైన అర్థం:-

ఈ శ్లోకంలో "కాలజ్ఞైః విషాపహైః మన్త్రైః" అను శబ్దాలున్నాయి. ఈ పదాల గురించి భ్రాంతి కలగకూడదని ఈ విషయంలో విస్తృత పరిశీలన చేయబడుతుంది. ఎందుకంటే ఈ శబ్దాలు-వాక్యాలు అన్యార్థాలలో రూఢమైనవి. టీకాకారులు యుక్తిసంగతమైన అర్థాన్ని చెప్పలేదు.

1) కాలజ్ఞ శబ్దానికి ప్రాసంగికం సందర్భోచితం, మనుసమ్మతమైన అర్థం-కాలజ్ఞ శబ్దానికి 'కాలం తెలిసిన వాడని అర్థం. ఏ కార్యానికైనా ఉచిత సమయం లేదా అవసరాన్ని గుర్తించినవాడనీ చెప్పవచ్చు. ఇక్కడ కూడా ఇదే అర్థం సంగతం. ఇక్కడ సందర్భం భోజన సమయం. అందువల్ల భోజన సమయంలో దాని అర్థం పొసగుతుంది. అందువల్ల ఈ శ్లోకంలో కాలజ్ఞ శబ్దానికి స్వాస్థ్యం అవస్థ (Age), ఋతువు (Season) మొదలైన వాటిననుసరించి భోజ్య పదార్థాలను, భోజన సమయంలో తెలిసినవారని అర్థం- ఉపయుక్తం, సందర్భోచితం కూడా.

2) విషాపహైః మన్త్రైః - ఈ శబ్దాలను గురించి ఆలోచన

మన్త్ర శబ్దానికి అర్థాలు: విచారణ, యుక్తి విచారాత్మకమైన ఉపాయం. ప్రమాణం- ఋగ్వేదాన్ని చూడండి-ఋ.-1.152.2.1.6, 7.2 మంత్రాలకు ఋషిదయానందుల వారి భాష్యం విషాపహా మంత్రాలకు పైన రాసిన అర్థమే ఉచితం, యుక్తి సంగతం కూడా- అన్య టీకాకారుల అర్థం బుద్ధిగమ్యం కాదు. యుక్తిసంగతం కూడా కాదు. కేవలం మన్త్రోచ్చారణం వల్ల విషం దూరం కావడం అసంభవం.

3) కౌటిల్యుడి అర్థశాస్త్రంలో ప్రభువుకు భోజనసంబంధమైన నిర్దేశం. మను మహర్షి సూచించినట్లుగానే కౌటిల్యుడు కూడా- రాజుకు (ప్రభువుకు) పరీక్షించిన, సురక్షితమైన విషాదులు లేని సుస్వాదు భోజనం పాకశాలతో తయారు కావాలి. అక్కడ విషాదులను పరీక్షించే వైద్యుడు ఉండాలి. వైద్యులు అలాగే పాకశాలాధ్యక్షుడి ద్వారా రాజు ఎదుట స్వయం భుజించి పరీక్షింపబడింది, అగ్ని, పశు పక్షులకు వేసి పరీక్షించిన భోజనం, జలపానం మొ॥ రాజు భుజించాలి. విభిన్నమైన విషనాశక యుక్తుల ద్వారా, వైద్యులు భోజనాన్ని పరీక్షించాలి. విషమారక ఉపాయాలను సిద్ధంగా ఉంచుకోవాలి. (ప్రక. 16-అధ్యాయం 20) కౌటిల్యుడి వాక్యాలు కూడా మేము చేసిన వ్యాఖ్యను సమర్థిస్తున్నవి.

218,219వ శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *విషఘ్నైరగదైశ్చాస్య సర్వద్రవ్యాణి యోజయేత్ ।*
విషఘ్నాని చ రత్నాని నియతో ధారయేత్సదా॥ ప్రక్షిప్త శ్లోక నం. **218**

తాత్పర్యం:-సమస్త భోజన పదార్థాలలోనూ విషహరమైన ఔషధాలను చేర్చాలి. కొన్ని రత్నాలు విషానికి విరుగుడుగా పనిచేస్తాయి. అవి ధరించాలి. ॥218॥

* *పరీక్షితాః స్త్రియశ్చైనం వ్యజనోదకధూపనైః ।*
వేషాభరణసంశుద్ధాః స్పృశేయుస్సుసమాహితాః ॥ ప్రక్షిప్త శ్లోక నం. **219**

తాత్పర్యం:-విషం పూసిన ఆయుధాల వంటివైన, అంతఃపుర స్త్రీలను లోబరుచుకొని పరరాజ్యగూఢచారులు విషం ప్రయోగించవచ్చు! అందువల్ల అలాంటివి పరీక్షించిన తరవాతనే, తనకు శుశ్రూష చేయుపరిచారకులను, వింజామరలు వీయడం లాంటి సేవలకు అనుమతించాలి. ॥219॥

ప్రక్షిప్తాల పరిశీలన

218-219 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. 216-217లలో రాజు భోజనాన్ని పరీక్షించాలి అని ఉంది. 220లో అదే విధంగా వాహనం, ఆసనాలను కూడా పరీక్షించాలని ఉంది. ఇలా 210-217, 220 లలోని విషయానికి పరస్పర ప్రసంగ సంబద్ధత ఉంది. వీటి మధ్య రత్నాలు ధరించడం, స్త్రీలు సేవ చేయటం మొదలైనవి ఆ పూర్వాపర ప్రసంగాల సంబద్ధతను భంగం చేస్తున్నాయి.

(ఖ) 220లో 'ఏవం' అనే పదం సహజంగానే దాని ప్రసంగ సంబద్ధతను 217తో రుజువు చేస్తుంది. ఎలా భోజనం మొదలైన వాటి పరీక్ష, రక్షణ, విశ్వసనీయత మొదలైన విషయాలలో జాగ్రతలు తీసుకోవాలో, అలాగే వాహనాలు, ఆసనాలు తదితరాలలోనూ జాగ్రత వహించాలి-అని. ఈ విధంగా 217 నుంచి 220 లలో వాక్యాల పరంగా ఏకత ఉంది. దాన్ని ఈ శ్లోకాలు భంగ పరచాయి కనుక, ఇది ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకాలు

(క) 217వ శ్లోకంలో రాజుకు పురుష సేవకులనే తప్ప స్త్రీ సేవికలను నియమించుకోరాదని ఉంది. 219లో స్త్రీ సేవికలను నియమించుకోవా లనటం పైదానితో పొసగదు.

(ఖ) మనువు రెండు నుంచి నాలుగవ అధ్యాయం వరకు ఏ వేషభూషలు, వస్త్రధారణల గురించి చెప్పాడో [2.11, 38-39; 4.35 మొదలైనవి], వాటిలో యజ్ఞోపవీతాన్ని ఒక్కదాన్నే ఎప్పుడూ ధరించాలన్నాడు. రత్నాలు మొదలైనవి ధరించవలసి ఉంటే వాటినీ చెప్పేవాడు. ఇక్కడ రత్నాలు మొదలైనవి ధరించాలని చెప్పటం మనువు చెప్పిన ముందు విషయాలతో కలవటం లేదు. ఎందుకంటే కేవలం రత్నధారణతోనే కడుపులోని విషం హరించబడుతుంది అనేది యుక్తియుక్తమూ కాదు, బుద్ధికీ అందనిది. ఇలా 218వ శ్లోకం కూడా ప్రక్షిప్తమే.

220-226వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఖాద్య పదార్థాలతో సహా ఇతర ప్రయోజ్య సాధనాలతో జాగ్రత్త-

ఏవం ప్రయత్నం కుర్వీత యానశయ్యాసనాశనే । మూలశ్లోక సం. **178**
స్నానే ప్రసాధనే చైవ సర్వాలంకారకేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **220**

టీక:- రాజా = రాజు, **యాన-శయ్య-ఆసన-అశనే** = ప్రయాణార్థం ఉపయోగించే వాహనాలు, నిద్రించడానికి ఉపయోగించే శయ్య మొ॥ వాటి విషయాన్ని కూడా,(ఆసనం) మొ॥ వాటి విషయమునను అశనం భోజనాదుల విషయమునను, **స్నానే చ ప్రసాధనే** = స్నానం, శృంగారం మొ॥ **సర్వ+అలంకారకేషు** = సమస్తమైన రాజ చిహ్నాలను అలంకరించడంలోను కూడా, **ఏవం ప్రయత్నం కుర్వీత** = ఇదేవిధంగా యోగ్యసేవకుల ద్వారా పరీక్షించేట్లు జాగ్రత్తపడాలి. (217 శ్లో) భోజన విషయంలో పైన చెప్పినట్లుగా సర్వపరీక్షలు జరపాలి.

తాత్పర్యం:- రాజు ప్రయాణార్థం ఉపయోగించే ఒక్కటేమిటి? వాహనాలు, పాన్పులు,ఆసనాలు, భోజనం, స్నానం, సకల అలంకారాలు, కావలివారు అన్నిటినీ/ అందర్నీ ఆంతరంగిక భటులచే పరీక్షచేయించాలి. ఇది నిత్యకృత్యం.॥220॥

వివరణ: కౌటిల్యుని యానాది ప్రయోగవిధ:

కౌటిల్యుడు కూడా యానం మొ॥ వాటి విషయాలను నిర్దేశించాడు. ఎందువల్లనంటే- రాజుకు విరుద్ధంగా శత్రురాజుల ద్వారా ప్రతిక్షణం ఏదో ఒక కుట్ర జరుగుతూనే ఉంటుంది. అందువల్ల ప్రత్యేక కార్యంలో రాజు విషయంలో జాగ్రత్తలు తీసికోవలసి ఉంటుంది. ఈ విషయాన్ని ఎంతో విస్తృతంగా వర్ణించాడు. వారి సూచన ప్రకారంగా గడ్డం. మీసాలు వగైరా శుభ్రపరిచే సాధనాలు, వస్త్రాలు, రాజాలంకారాలు, స్నాన పాన, యాన-అశనాదులు, పశువాహనాలు మొ॥ ప్రతి విషయంలో విశ్వసనీయులైన సేవకుల ద్వారా రాజు ఎదుటనే పరీక్షలు జరగాలి. ఎక్కడైనా, ఏవిధమైనా విషప్రయోగం గాని లేదా మోసం గాని జరగనట్లు నమ్మకం కలగాలి. ఆ తరువాతనే రాజు వాటిని ఉపయోగించుకోవాలి.

భోజనానంతరం విశ్రాంతి - రాజ్యకార్యాల చింతన- ఇది మనుకృతం-ప్రామాణికం

భుక్తవాన్ విహరేచ్చైవ స్త్రీభిరంతఃపురే సహ । మూలశ్లోక సం. **179**
విహృత్య తు యథాకాలం పునః కార్యాణి చింతయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **221**

టీక:- **చ** = మరియు (216,217)లో చెప్పినట్లుగా, **భుక్తవాన్** = భోజనం చేసి, **అంతఃపురే** = రాణివాసంలో, **స్త్రీ భిః సహ** = పత్ని మొ॥ పారివారిక జనులతో, **విహరేత్** = ఆమోద-ప్రమోదాలతో విశ్రాంతి తీసికోవాలి. **తు** = మరియు, **విహృత్య** = విహరించి, **పునః** = తదనంతరం, **యథాకాలం** = సమయాన్ని బట్టి, **కార్యాణి చిన్తయేత్** = కార్యాణి కార్యాలను దావాలు, ఫిర్యాదులు, ఛార్జీలు మొ॥న కేసులను రాజ్యకార్యాలను విచారించాలి.

తాత్పర్యం:- ఇలా భుజించి అక్కడనే యంతఃపురమున స్త్రీలతో కొంతతడవు విహరించి పగటిపూట ఎనిమిదో భాగంలో మళ్ళీ కార్యములను గురించి విచారించాలి.॥221॥

వివరణ:

"స్త్రీభిః" పదానికి అభిప్రాయం.

టీకాకారులు 'స్త్రీభిః' అనుపదానికి "బహుపత్నులు లేదా రాణు"లని రాశారు. ఇది మను మహర్షికి విరుద్ధం. ఈ శ్లోకంలో స్త్రీభిః = స్త్రీలలో అన్న పదానికి పత్నీ మొదలైన పారివారిక స్త్రీలని అర్థం. ఇందుకు పోషకంగా ప్రమాణాలు కింద ఇవ్వడమైనది.

1. ద్విజులకు, రాజుకు స్పష్టంగా, ఏకపత్నీ విధానాన్నే విధించాడు. **"ఉద్వహేత ద్విజో భార్యాం సవర్ణాం, లక్షణాన్వితామ్** (3-4) **తదధ్యాస్య ఉద్వహేత్ భార్యాం సవర్ణాం లక్షణాన్వితామ్** 1-(7-77) ఇదే కాక మరొకచోట కూడా పతి-పత్నులలో ఎవరున్నూ జీవన పర్యంతం వియోగానికి అవకాశం కలిగించే ఏ పనులూ చేయరాదని ఆదేశించాడు.

"అన్యోన్యస్య అవ్యభిచారో భవేదామరణాన్తికః" 9.101,102 దీన్ని బట్టి మను దృష్టిలో ఒకరి కంటే అధిక పత్నుల విధానం లేదని స్పష్టమవుతుంది.

2. రాజైనవాడు ఒకరికంటే అధిక స్త్రీలను సేవించరాదని స్పష్టంగా నిర్దేశించాడు (7.47,50).

3. మహర్షి దయానందులవారు కూడా ఈ శ్లోకానికి భావాన్ని తన అమరగ్రంథమైన సత్యార్థ ప్రకాశంలో ఇదే రాశారు. **"భోజనం కోసం రాజు అంతఃపురం అంటే పత్నీ మొ॥ వారు నివసించే చోటుకు వెళ్ళా"**లని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాణాలను బట్టి ఈ భాష్యం మనుసిద్ధమని స్పష్టమవుతుంది.

సైనికుల, శస్త్రాస్త్రాదుల నిరీక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

అలంకృతశ్చ సంపశ్యేదాయుధీయం పునర్జనమ్ । మూలశ్లోక సం. **180**
వాహనాని చ సర్వాణి శస్త్రాణ్యాభరణాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **222**

టీక:- **చ** = మరియు, **పునః** = మళ్ళీ, **అలంకృతః** = కవచం, శస్త్రాస్త్రాలు, అదేవిధంగా రాజ చిహ్నాలు, రాజవేషభూషాదులతో చక్కగా అలంకరించుకున్నవాడైనా, **ఆయుధీయం జనమ్** = శస్త్రధారులైన సైనికులను, **చ** = మరియు, **వాహనాని** = రథం, గజం, అశ్వం మొ॥ వాహనాలను, **సర్వాణి శస్త్రాణి** = పలువిధాలైన సర్వశస్త్రాస్త్రాలను, శస్త్రభండారులను, **చ** = మరియు, **ఆభరణాని** = ఆభరణాలు మొ॥ వాటిని, **సంపశ్యేత్** = పూర్తిగా నిరీక్షించాలి.

తాత్పర్యం:-అటుపైన చక్కగా అలంకారాలు ధరించి, ఆయుధజీవులైన యోధులను -నమస్త వాహనాది బలాలను-శస్త్రాలను ఆభరణాలను పూర్తిగా పరీక్ష చేయాలి. ॥222॥

వివరణ:

శ్రీ మహర్షి దయానంద సరస్వతులవారు 7-112, 113, 176, 179 మరియు 180 శ్లోకాల భావాన్ని సంక్షిప్తంగా తన అమర గ్రంథమైన సత్యార్థ ప్రకాశంలో ఈ కింది విధంగా ప్రకటించారు.

"పూరోక్తమైన ప్రాతఃకాల కాలసమయంలో మేల్కొని సన్ధ్యోపాసన, అగ్నిహోత్రం చేసి లేదా చేయించి, సభలో ప్రవేశించి సర్వకర్మచారులు (భృత్యులు), సేనాధ్యక్షులతో కలిసి, వారిని సంతోషపరిచి, నానా రకాలైన వ్యూహ శిక్ష (సైనికశిక్ష) కసరత్ చేసి, చేయించి, అశ్వ-గజ-గోశాలలను దర్శించి, తరువాత అస్త్ర-శస్త్రాగారాలను, వైద్యాలయాన్ని, ధనాగారాన్ని తనిఖీ చేసి, వీటన్నిటి మీద నిత్యం దృష్టినుంచుతూ, వాటిలో ఉన్న దోషాలను తొలగించి, వ్యాయామశాలకు పోయి వ్యాయామం చేసి, భోజనానికి అంతఃపురానికి, **పత్నీ నివాసస్థానము** = వెళ్ళాలి. (స.ప్ర.165.)

సన్ధ్యోపాసన, గుప్తచారుల, ప్రతినిధుల నుండి సందేశాలు వినడం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

సంధ్యాం చోపాస్య శృణుయాదంతర్వేశ్మని శస్త్రభృత్ । మూలశ్లోక సం. **181**
రహస్యాఖ్యాయినాం చైవ ప్రణిధీనాం చ చేష్టితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **223**

టీక:- **చ** = మరియు, మళ్ళా, **సంధ్యాం ఉపాస్య** = సాయంకాలీన సంధ్యో పాసన చేసి, **శస్త్ర భృత్** = శస్త్రాస్త్రాలను ధరించిన రాజు, **అన్తర్వేశ్మని** = రాజభవనంలో ఉన్న గుప్తచర గృహంలో, **రహస్య +ఆఖ్యాయినాం** = రాజ్యమందున్న రహస్య సమాచారాలను తెచ్చుటకు నియోగింపబడిన, గుప్తచరుల యొక్క **ప్రణిధీనాం** = దూతల, గుప్తచరాధికారుల యొక్క **చేష్టితమ్** = కార్యాలను, సమాచారాలను, **శృణుయాత్** = వినాలి.

తాత్పర్యం:-సాయంకాల సంధ్యావందనం ఆచరించి, అంతఃపురంలోనే తాను శస్త్రధారియై, ఇతరప్రాంతాలకు పంపిన గూఢచారులు నివేదించే వర్తమానాలను వినాలి. గూఢచారుల నివేదనలకుగాను... తర్వాతి శ్లోకంలో....॥223॥

వివరణ:

ఇక్కడ 7-153 శ్లోకం పునరుక్తం కాదు. అక్కడ ఈ విషయాల ప్రణాళికను గురించిన ప్రసంగం. ఇక్కడ ఆ ప్రణాళికననుసరించి నియోగింపబడిన అధికారుల, గుప్తచరుల సూచలను(Reports) వినడం, రాజుగారి సాయంకాల దినచర్య.

ఇది మనుకృతం-ప్రామాణికం

గుప్తచరులతో ఆలోచించిన తరవాత సాయంకాల భోజనార్థం అంతఃపురానికి వెళ్ళడం -

గత్వా కక్షాంతరం త్వన్యత్సమనుజ్ఞాప్య తం జనమ్ । మూలశ్లోక సం. **182**
ప్రవిశేద్భోజనార్థం చ స్త్రీవృతోఽన్తః పురం పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **224**

టీక:- **తు** = మరియు, మళ్ళా, **తం జనమ్** = వారందరికీ, **అన్యత్ సమ+అనుజ్ఞాప్య** = ముందుచేయబోయే కార్యాల గురించి ఆలోచనలను తెలియజేసి, **అంతఃపురం గత్వా** = అంతఃపురానికి వెళ్ళి, అక్కడ **స్త్రీ వృతః** = స్త్రీ (పత్ని)తో కూడా (అంగరక్షికలైన స్త్రీల మధ్య సురక్షితుడై), **కక్ష్యాన్తరం భోజనార్థం ప్రవిశేత్** = భుజించడం కోసం భోజనాలయంలో ప్రవేశించాలి.

తాత్పర్యం:-వారందరికీ ముందుచేయబోయే కార్యాల గురించి ఆలోచనలను తెలియజేసి అక్కడ నుంచి అంతఃపురానికి వెళ్ళి, గూఢచారుల్ని పంపించి వేశాకనే అక్కడ స్త్రీతో కూడి రాత్రిభోజనానికి వెళ్లాలి. ॥224॥

వివరణ:(తరువాత వారిని పంపించి పరిచారికలు (దాసీలు) చుట్టూరాగా, భోజనార్థం మళ్ళీ అంతఃపురంలో ప్రవేశించాలి. ఇది ప్రచలితార్థం.

"స్త్రీ వృతః" ఈ శబ్దాలకు మనుసమ్మతమైన అర్థం. దాసీలచేత నలువైపులా చుట్టబడినవాడై రాజు అంతఃపురంలో ప్రవేశించాలని టీకాకారులు రాసిన అర్థం మనుసమ్మతం కాదు. 2) రాజధర్మ విషయంలో ఎక్కడా రాజుకు విధానం చెప్పలేదు. రాజుకు పత్నికి తప్ప అన్య స్త్రీల సంబంధాన్నే నిషేధించాడు. చూడండి (7-208,221) వివరణలో చూడగలరు. కాబట్టి 'స్త్రీవృతః' అంటే అంగరక్షికలైన పరిచారికలతో సురక్షితుడై అని అర్థం మనుసమ్మతం.

2 **కౌటిల్యునిదృష్టిలో:**

1. రాణులు షడ్యంత్రానికి లోబడి అనేక మంది రాజులను చంపినట్లు ఉదాహరణలున్నాయి. అందువల్ల తన రాణివాసానికి రాజు ఏకాకిగా వెళ్ళరాదు. అంగరక్షికలైన ప్రౌఢాంగనలు వెంట ఉండాలి.

2. రాజుగారి అంతః కక్ష సమీపంలో ఉన్న రెండో గదిలో ఒకదానిలో ధనుర్ధారులైన అంగ రక్షికలుండాలని నిర్దేశించాడు. రెండో దానిలో పురుష అంగరక్షకులుండాలని ఆదేశించాడు. ఇదంతా కేవలం సురక్షణ కోసమే. అందువల్ల 'స్త్రీవృతః' అనే పదాలకు- ధనుర్ధారులైన అంగరక్షికలతో కూడినవాడై అంతఃపురానికి వెళ్ళాలి-కౌటిల్యుడు.

"అంతర్గృహగతః స్థవిరస్త్రీ పరిశుద్ధాం దేవీం పశ్యేత్ । న కాంచిదభి గచ్ఛేత్(ప్ర. 15-అధ్యా19)

శయానాదుత్థితః స్త్రీ గణైర్ధన్విభిః పదిగృహ్యేత (ప్ర. 16-అధ్యా 20)

రాత్రి శయనకాలం-

ఇది మనుకృతం-ప్రామాణికం

తత్ర భుక్త్వాపునః కించిత్తూర్యఘోషైః ప్రహర్షితః । మూలశ్లోక సం.**183**
సంవిశేత్తు యథాకాలముత్తిష్ఠేచ్చ గతక్లమః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**225**

టీక:- **తత్ర** = అక్కడ, **భుక్త్వా** = భోజనం చేసి, **పునః** = తరువాత, **తూర్యఘోషైః ప్రహర్షితః** = షహనాయీ వాద్యాలతో కొమ్మువాద్యాలతో చేసే - సంగీతం ద్వారా ప్రసన్నుడై, **సంవిశేత్** = నిద్రించాలి, **తు** = మరియు, **గతక్లమః** = విశ్రాంతుడై, **యథాకాలమ్ ఉత్తిష్ఠేత్** = నిశ్చితసమయంలో (బ్రహ్మముహూర్తంలో) (7.145) నిద్ర నుండి మేల్కొనాలి.

తాత్పర్యం:-అంతఃపురంలో భోజనానంతరం కొంతసేపు నృత్యగీతవాద్యాలవల్ల వినోదం పొంది, బడలిక మరచి నిద్రించాలి. మరియు విశ్రాంతుడై నిశ్చిత సమయంలో (బ్రహ్మముహూర్తంలో) నిద్ర నుండి మేల్కొనాలి.

రాత్రి ఆవిధంగా శ్రమదీర్చుకుని కడపటి యామమున నిద్రించాక, తిరిగి పూర్వము చెప్పిన చొప్పున (7.145) రాత్రి చివరి జామున నిద్రలేచి మర్నాటి నిత్యకృత్యాలు ఆచరించాలి. ॥225॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతద్విధానమాతిష్ఠేదరోగః పృథివీపతిః । మూలశ్లోక సం.**184**
అస్వస్థస్సర్వమేతత్తు భృత్యేషు వినియోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**226**

టీక:- **అరోగః** = స్వస్థస్థితిలో (ఆరోగ్యంగా ఉండగా), **పృథివీపతిః** = రాజు, **ఏతత్ విధానమ్ + ఆతిష్ఠేత్** = పూర్వోక్తమైన ఈ విధిననుసరించి కార్యాలను చేయాలి, **అస్వస్థః** = అస్వస్థుడైనప్పుడు, **ఏతత్ సర్వమ్** = ఈ కార్యభారాన్నంతా, **భృత్యేషు** = వేరు వేరు విభాగాలలో నియమింపబడిన ప్రముఖులైన మంత్రులు మొ॥వారికి, **వినియోజయేత్** = అప్పగించాలి. (7.54,7.120, 141,8.9-11).

తాత్పర్యం:-ఆరోగ్యవంతుడైన రాజు ఈ ప్రకారం ప్రజాసంరక్షణ మొదలైన కార్యకలాపములు నిర్వర్తించాలి. తనకు అస్వస్థతగా ఉంటే పైన చెప్పబడిన పాలనాకృత్యములలో మంత్రులలో మేటివారిని నియోగించాలి. ॥226॥

226వ శ్లోకవర్ణనను గురించిన ఆలోచన

7-141 మొ॥ శ్లోకాలకు ఇది పునరుక్తికాదు. ఈ శ్లోకానికి అభిప్రాయమిది-రుగ్ణావస్థ పరిస్థితులలో-ఆ యా విభాగాలకు సంబంధించిన ప్రముఖ అమాత్యులకు (రాజు) తన కార్యాలను అప్పగించాలి. కేవలం ఒక్కరికి మాత్రం కాదు. ఇది రాజుగారి సంక్షిప్త దినచర్య. వేరు వేరు విభాగాల వారికి సందర్భానుసారంగా ఇదే పద్ధతి (7-54,81,120,141,8.9,11) శ్లోకాలలో చెప్పబడింది. ఈ శ్లోకంలో ఉపసంహారం జరిగింది.

2 భృత్యశబ్దార్థాన్ని గురించిన ఆలోచన-భృత్యుడంటే మామూలుగా నౌకరని అర్థం. ఒక పక్షంలో ఇది రూఢమైంది. కాని ఈ శ్లోకంలో **'భృత్య'** శబ్దానికి **'నౌకర్'** అనే భ్రాంతి కలుగరాదు. భృత్యులంటే-రాజును ఆశ్రయించి ఉన్న సమస్త కర్మచారులందరికీ -మంత్రులతో సహా అందరికీ వర్తిస్తుంది. "మంత్రికి అమాత్యుడ"నీ అర్థముంది. (7.36,62) మంత్రులు- అమాత్యుల దగ్గర నుండి సాధారణ కర్మచారులందరికీ భృత్య శబ్దం వర్తిస్తుంది. కారణం వీరందరూ రాజుగారి నుండి భృతిపొందేవారే. అదేవిధంగా ఆచార్యుడు, పురోహితుడూ భృత్యులే-"భృత్యభరణీయ" అనే 91వ ప్రకరణాన్ని చూడండి.

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మర్రి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రాభాషానువాదాత్మకః 'రాజధర్మాత్మకః' సప్తమోఽధ్యాయః॥

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం
రాజధర్మో నామ సప్తమోఽధ్యాయః.

* * *

మనుస్మృతి

అష్టమాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన*ఋషి దయానందభాష్యోపేతం
మొత్తం శ్లోకాలు: 420; మూల శ్లోకాలు: 237; ప్రక్షిప్త శ్లోకాలు: 183

రాజ ధర్మాంతర్గత వ్యవహార నిర్ణయము 1 నుండి 251 వరకు

1 నుండి 19వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

రాజు న్యాయసభలో ప్రవేశించుట-

> **వ్యవహారాన్ దిదృక్షుస్తు బ్రాహ్మణైస్సహ పార్థివః ।**
> **మంత్రజ్ఞైర్మంత్రిభిశ్చైవ వినీతః ప్రవిశేత్సభామ్ ॥** మూలశ్లోక సం.**1**

టీక:- వ్యవహారాన్ = వివాదాలను (8.4-7), దిదృక్షుః తు = నిర్ణయం చేయాలని కోరే విధంగా, పార్థివః = రాజు, బ్రాహ్మణైః = న్యాయకోవిదులైన విద్వాంసులు (8.11), మన్త్రజ్ఞైః = సలహాకారులయిన, మన్త్రిభిః = మంత్రులతో (7.54,56), సహ = కూడి, వినీతః = తగిన వేశధారణతో(8.2), సభామ్ = న్యాయాలయంలోకి, ప్రవిశేత్ = ప్రవేశించాలి. [8.12]

తాత్పర్యం:- ప్రభువైనవాడు వివాదాలను పరిశీలించ గోరువాడై ఆలోచనా దక్షులైన మంత్రులతో- బ్రాహ్మణులతో కూడి, అణకువతో కూడిన దర్పంతో సభాభవనంలో ప్రవేశించాలి. ॥1॥

వివరణ: మంత్రజ్ఞులు, బ్రాహ్మణులు అంటే ఎవరు?

1. **మంత్రజ్ఞులు:** వివాద సంబంధమైన వివిధ విషయాల గురించి సలహా ఇచ్చేవారు.

2. **మంత్రులు:** న్యాయవిభాగానికి సంబంధించిన ప్రముఖ మంత్రులు. న్యాయ విభాగం కోసం నియమింపబడిన విద్వాంసులు అమాత్యులు. (7.54,60; 8.11).

3. **బ్రాహ్మణులు:** వేద విద్యలకు సంబంధించిన న్యాయాధీశులు, శ్రోత్రియ విద్వాంసులు. వీరి వర్ణ న్యాయాధీశులు విద్వాంసుల సభకు సంబంధించిన వర్ణన 8.11వ శ్లోకంలో ఉంది.

బ్రాహ్మణ శబ్దాన్ని బట్టి బ్రాహ్మణ కులంలో పుట్టినవాడనే భ్రాంతి కలుగరాదు. వేద విద్యలనధ్యయనం చేసిన వేదజ్ఞులకే విప్ర-బ్రాహ్మణ శబ్ద ప్రయోగాలున్నాయి. (8.11, 1.88) వివరణ చూడగలరు. బ్రాహ్మణ శబ్ద ప్రయోగం ఒక విశేషమైన అభిప్రాయంలో ప్రయోగించబడింది. న్యాయాధీశుడు బ్రహ్మ = వేదాలు విశేషంగా తెలిసినవాడు, ధార్మికుడు, గుణప్రధానమైన విద్వాంసుడై ఉండాలి. అందువల్లనే 8.11లో 'వేదవిదః' శబ్దం ప్రయోగింపబడినది.

4. **వినీతుడంటే ఎవరు?** దాని ఉద్దేశమేమిటి? వినీత భావం కలిగి వినీత వేషభూషణాలు కలవాడని భావం. సాక్షులు మొ॥న వారు వీరి భయంకర వేషాన్ని చూసి భయభీతులు కాకుండా అదురు బెదురు లేకుండా, సహజంగా తమ భావాలను, సాక్షాలను చెప్పగలగడమే దీని ఉద్దేశం. ఈ శ్లోకంలో ఈ భావాన్ని తెలుపుటకే 'వినీతవేశాభరణః' అనే శబ్దాన్ని రాజు కోసం ప్రయోగించాడు.

5. ఇలాంటి వర్ణననే వేదమంత్రాలలో కనిపిస్తూంది. మనువు దాన్ననుసరించే తగినట్లు వ్యవస్థ ఏర్పాటు చేశారు.

శ్రుతి శ్రుత్కర్ణ వహ్నిభిః దేవైరగ్నే స యావభిః ।
ఆ సీదన్తు బర్హిషి మిత్రోఽర్యమా ప్రాతర్యావాణోఽధ్వరమ్ ॥ యజు. 33-15

టీక:- **శ్రుత్కర్ణ**= ప్రార్థించేవాడి మాటలు వినునట్టి కర్ణములు గల, **అగ్నే** = అగ్నితో సమానంగా తేజస్వియైన విద్వాంసుడవైన రాజా!, **స యావభిః** = తోడుగా వెళ్ళునట్టి, **వహ్నిభిః** = కార్య నిర్వాహకులైన, **దేవైః** = విద్వాంసులతో పాటు, **అధర్వస్** = హింసారహిత రాజవ్యవహారాలను, (వివాదాలను) ఎవరికీ అన్యాయం కలగనట్టి వివాదాలు, **శ్రుతి** = వినండి, **ప్రాతర్యావాణః** = ప్రాతఃకాలంలో, రాచకార్యాలను చూసే, **మిత్రః** = పక్షపాతరహితుడై అందరికీ మిత్రులు, **అర్యమా** = వైశ్యుడు లేదా స్వామి, ప్రజలను గౌరవంగా చూసే న్యాయాధీశుడు, **బర్హిషి** = ఆకాశ సదృశమైన విశాల సభలో, **ఆసీదన్తు** = కూర్చొందుగాక!

ఋషి దయానంద భాష్యం: సభాపతియైన రాజు సుపరీక్షితులైన అమాత్యులను స్వీకరించి, వారితో పాటు సభలో కూర్చొని వివాదం చేసేవారి వాఙ్మూలాలను విని యథార్థంగా న్యాయం చేయాలి (మహర్షి-దయానంద భాష్యం).

న్యాయసభలో వివాద విషయాలను చూడాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

తత్రాసీనః స్థితో వాపి పాణిముద్యమ్య దక్షిణమ్ ।
వినీతవేషాభరణః పశ్యేత్కార్యాణి కార్యిణామ్ ॥ మూలశ్లోక సం. **2**

టీక:- **తత్ర** = ఆ న్యాయాలయంలో, **వినీత వేషాభరణః** = వినీత వేషం-ఆభరణాలు ధరించినవాడై, **ఆసీనః అపి వా స్థితః** = కూర్చొనిగాని లేదా నిల్చొనిగాని, **దక్షిణం పాణిమ్ + ఉద్యమ్య** = కుడిచేతిని ఎత్తి, **కార్యిణామ్** = కార్యార్థం వచ్చిన వారి, **కార్యాణి** = వివాదాలను, **పశ్యేత్** = చూచుగాక (నిర్ణయించుగాక!)! (7.146).

తాత్పర్యం:- ఆ న్యాయాలయంలో వినీత వేషం-ఆభరణాలు ధరించినవాడై వివిధ వ్యవహారాలు తీర్చవలసిన పని వత్తిడి అధికంగా ఉన్నప్పుడు సావధానంగా కూర్చొనిగాని లేదా నిల్చొనిగాని కుడిచేతిని ఎత్తి, తనవద్దకు వ్యవహారాల తీర్పు నిమిత్తం వచ్చినవారి అభియోగాలను విచారించాలి. ॥2॥

వివరణ:

ఈ శ్లోకంలో **"దక్షిణం పాణిమ్ ఉద్యమ్య"** ఇదొక భాషా సంప్రదాయం. (Idiom)కుడిచేయి ఎత్తడం అంటే తన అభిప్రాయాన్ని తెలియజేయడం, లేదా తన నిర్ణయాన్ని (Judgement) చెప్పబోతున్నాడని విషయాన్ని తెలియజేయడం. నిర్ణయాన్ని తెలిపే వరకు కుడిచేతిని అలానే ఉంచమని కాదు. వివాద విషయంలో వాద ప్రతివాదుల వాఙ్మూలాన్ని విని, తన నిర్ణయాన్ని ప్రకటించే సమయంలో కుడిచేతిని ఎత్తి తెలియజేయాలి. కుడిచేయి ఎత్తడాన్ని చూసి న్యాయాధీశుడి నిర్ణయం ప్రకటించబోతున్నాడని వాద ప్రతివాదులు సావధానులై ఎదురుచూస్తారు. నిర్ణయం రాబోతుందని తెలియగానే న్యాయస్థానమందున్న వారందరూ నిశ్శబ్దంగా ఉండి నిర్ణయాన్ని వినడానికి శాంతంగా ఉద్యుక్తులవుతారు.

18 విధాలైన వివాదాలు (దావాలు)- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రత్యహం దేశదృష్టైశ్చ శాస్త్రదృష్టైశ్చ హేతుభిః ।
అష్టాదశసు మార్గేషు నిబద్ధాని పృథక్పృథక్ ॥ మూలశ్లోక సం. **3**

టీక:- సభ = సభికులు, రాజు (ప్రభువు), రాజ పురుషులు అందరూ, **దేశ దృష్టైః చ శాస్త్ర దృష్టైః చ హేతుభిః** = దేశ ఆచారాలను, శాస్త్రాలలో ఉన్న హేతువుల ద్వారా, **అష్టాదశసు మార్గేషు** = కింద వివరించబోయే 18 [8.126] వివాదాస్పదాల నిర్ణయాన్ని, **పృథక్ పృథక్** = వేరు వేరుగా, **ప్రత్యహం** = ప్రతిరోజు చేస్తూ ఉండాలి.

ఋషి దయానందభాష్యమ్:-18 రకాలుగా ఉండే ఈ వ్యవహార జ్ఞానంలో నిపుణులైనవారు నీతిశాస్త్రం చెప్పినట్టి సాక్షిద్రవ్యాది హేతువులచేత-దేశం, జాతి, కులం వీటిచేత ఏ యే అభియోగాలను ఏవిధంగా విచారణ చేస్తే న్యాయం జరుగుతుందో తన సమక్షంలో వాద-ప్రతివాదులను ప్రవేశింపచేయాలి. ॥3॥

రాజుకు, ప్రజలకు సుఖకారకాలు, ధర్మయుక్తాలైన వాటిని పూర్ణ విద్వాంసులతో నిండిన రాజసభ నిర్ణయించాలి. (స.ప్ర. 6వ సము.)

వివరణ:

18 విధాలైన ప్రజల వివాదాలను ఒక్కొక్క వివాదాన్ని -దానికి సంబంధించిన విద్వాంసులు, సలహాదారులు మంత్రులతో కలిసి విచారించి నిర్ణయించాలి.

ఇవి మనుకృతం-ప్రామాణికం

తేషామాద్యమృణాదానం నిక్షేపోఽస్వామి విక్రయః ।
సంభూయ చ సముత్థానం దత్తస్యానపకర్మ చ ॥ మూలశ్లోక సం. 4

వేతనస్యైవ చాదానం సంవిదశ్చ వ్యతిక్రమః ।
క్రయవిక్రయానుశయో వివాదః స్వామిపాలయోః ॥ మూలశ్లోక సం. 5

సీమావివాదధర్మశ్చ పారుష్యే దండవాచికే ।
స్తేయం చ సాహసం చైవ స్త్రీసంగ్రహణమేవ చ ॥ మూలశ్లోక సం. 6

స్త్రీపుంధర్మో విభాగశ్చ ద్యూతమాహ్వాయ ఏవ చ ।
పదాన్యష్టాదశైతాని వ్యవహారస్థితావిహ ॥ మూలశ్లోక సం. 7

4వ శ్లోకం : తేషామ్= వాటిలో

1. ఋణదానం = ఎవరి నుండి అయినా అప్పుతీసికోవడం /ఇవ్వడంలో వివాదం (8.47, 178).
2. నిక్షేపం = తాకట్టు పెట్టడం, ధనం మరొకరి వద్ద దాచిపెట్టడం (8.179, 196).
3. అస్వామి విక్రయః = ఇతరుల వస్తువును అడిగినప్పుడు ఇవ్వకుండా తనదని అమ్మడం. (8.197-205).
4. సంభూయ చ సముత్థానం = ఉమ్మడిగా వ్యాపారం మొ॥ చేయడం, మోసగించడం లేదా గుంపుగా వెళ్ళి ఎవరి మీదనైనా అత్యాచారం చేయడం (8.206-211).
5. దత్తస్య అనపకర్మ = ఇచ్చిన దాన్ని తీసికోవడం [(దానమిచ్చి తీసికోవడం)] (8.212, 213)

5వ శ్లోకం:

6. వేతనస్య+ఏవ చ అదానం = కూలి ఇవ్వకుండా లేదా జీతమివ్వకుండా లేదా తక్కువ ఇవ్వడం. (8.214-217)
7. సంవిదః + చ వ్యతిక్రమః = ప్రతిజ్ఞకు విరుద్ధంగా నడవడం, ఒప్పందానికి (Contract)భిన్నంగా ప్రవర్తించడం (8.218-221).
8. క్రయ-విక్రయ+అనుశయః = కొనడం-అమ్మడం వివాదం (8.222, 228).
9. వివాదః స్వామిపాలయోః = పశువులకాపరికి-యజమానుడికి మధ్య వివాదం (8.229-244).

6వ శ్లోకం:

10. సీమావివాద ధర్మః = సరిహద్దుల వివాదం (8.245-265).

11. పారుష్యే దండవాచికే -ఎవరినైనా తిట్టడం (8.278-300).

12. పారుష్యే దండవాచికే- ఎవరినైనా కొట్టడం (8.266-277).

13. స్తేయం - దొంగతనం మొ॥ (8.301-343).

14. సాహసం-ఏవ = దోపిడి, బలాత్కరించి ధనం దోచుకోవడం. (8.344-351).

15. స్త్రీ సంగ్రహణమ్ + ఏవ చ = స్త్రీ -పర పురుషుణ్ణి పొందడం (8.352-387) లేదా పురుషుడు పరస్త్రీని పొందడం.

7వ శ్లోకం

16. స్త్రీ పుం + ధర్మః = స్త్రీ -పురుష ధర్మాలలో వ్యతిక్రమం (9.1-102).

17. విభాగః-(అంటే దాయ భాగాలలో వివాదం (9.103-219).

18. **ద్యూతం-ఆహ్వాయ+ఏవచ ద్యూతమ్** = (జూదం) జడ పదార్థాలను పణంగా పెట్టి ఆడటం, **ఆహ్వాయం** = చేతనాలను (కోళ్ళు మొ॥ పణంగా పెట్టి ఆడటం, ఆహ్వాయము **అష్టాదశ + ఏతాని** = ఈ 18 విధాలైన (వ్యవహారస్థితా పదాని) పరస్పర విరుద్ధమైన వివాదాలకు స్థానములు. (9.220-250).

ఋషి దయానందభాష్యమ్:- ఆ 18 రకాలూ ఇవీ: 1. అప్పుతీసుకోవడం, 2. ఇతరులవద్ద ధనం దాచిపెట్టడం, 3. తన సొంతం కానిది విక్రయించడం, 4. ఉమ్మడిగా నిర్వర్తించే వ్యాపారాదులు, 5. ఇవ్వనిదే తీసుకోవడం, 6. కూలివారికి కూలిఎగవేత, 7. ఒప్పుదలలు ఉల్లంఘించడం, 8. క్రయవిక్రయాల తగవులు, 9. ఊరి/పొలాల పొలిమేరల వివాదాలు, 10. మోసం చేత ధనం అపహరించడం, 11. బలాత్కరించి ధనం లాక్కోవడం, 12. స్త్రీ పరపురుషుణ్ణి పొందడం, 13. స్త్రీ పురుషుల వివాదాలు, 14. తల్లిదండ్రుల ఆస్తిపంపకాలు, 15. జూదములు-పందెములు, 16. చౌర్యం, 17. తిట్టడం, 18. కొట్టడం-ఇవి వర్ణాలనుబట్టి, లింగభేదాన్ని బట్టి విచారించి తీర్పులు చెప్పాలి. (స.ప్ర. 6వ సము) ॥4,5,6,7॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషు స్థానేషు భూయిష్ఠం వివాదం చరతాం నృణామ్ ।
ధర్మం శాశ్వతమాశ్రిత్య కుర్యాత్కార్యవినిర్ణయమ్ ॥ మూలశ్లోక సం. **8**

టీక:- ఏషు స్థానేషు (8.4-7) = ఈ వివాదులలో, **భూయిష్ఠం వివాదం చరతాం నృణామ్** = అనేకమైన వివాదాలు చేసే పురుషుల మధ్య, **కార్య వినిర్ణయమ్** = న్యాయాన్ని, **శాశ్వతం ధర్మం ఆశ్రిత్య** = సనాతన ధర్మాన్ని ఆశ్రయించి నిర్ణయం చేయాలి. ఎవరి పట్ల పక్షపాతం చూపించరాదు.

ఋషి దయానందభాష్యం:- ఈ వివాదాల్లో అప్పు తీసుకోవడం మొదలైన వ్యవహారాల్లో అభియోగం చేసేవారు తరచు తిరుగుతూంటారు కాబట్టి వారి నిత్యధర్మాలను బట్టి నిర్ణయం చేయాలి. ఎవరిపట్ల పక్షపాతం చూపించరాదు. (స.ప్ర. 6 సము)॥ 8॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రభువు లేనప్పుడు-వివాదాలను నిర్ణయించడానికి ఒక ముఖ్యమైన న్యాయాధీశుణ్ణి నియమించడం -

యదా స్వయం న కుర్యాత్తు నృపతిః కార్యదర్శనమ్ ।
తదా నియుంజ్యాద్విద్వాంసం బ్రాహ్మణం కార్యదర్శనే ॥ మూలశ్లోక సం. **9**

టీక:- యదా = ఎప్పుడైనా, ఏదైనా విశేషకారణం లేదా కార్యాధిక్యత వల్లగాని, **నృపతిః** = ప్రభువు, **స్వయం కార్యదర్శనమ్** = స్వయంగా వ్యవహారాలను (వివాదాలను) చూడజాలకపోయినట్లయితే, **తదా** = అప్పుడు తన అనుప

స్థితిలో, **బ్రాహ్మణం విద్వాంసం** = ధార్మికుడు, వేదవేత్త అయిన విద్వాంసుణ్ణి (8.11) **కార్యదర్శనే** = వివాదాలను నిరీక్షించి, నిర్ణయం తెలియజేయడానికి, **నియుంజ్యాత్** = నియోగించాలి.

తాత్పర్యం:- రాజు ఇతర ముఖ్య కార్యములలో నిమగ్నుడై ఉన్నప్పుడు గాని, రోగాలబారిన పడి విశ్రాంతి తీసుకొంటూన్నప్పుడుగాని, యుద్ధసంరంభంలో ఉన్నప్పుడు గాని, తనకు తానే స్వయంగా ఇలాంటి వ్యవహారాలు పర్యవేక్షించే అవకాశం లోపించినపుడు గాని, ఈ న్యాయవిచారణవ్యవహారాలపై విద్వాంసుడైన ఒక బ్రాహ్మణుణ్ణి నియమించాలి. ధార్మిక విద్వాంసుడే ధర్మసభకు అధికారి ॥9॥

వివరణ:

బ్రాహ్మణుడంటే-ధర్మాత్ముడు, వేదవేత్త అయిన న్యాయాధీశుడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ముఖ్యన్యాయాధీశుడు ముగ్గురు విద్వాంసులతో కలిసి, న్యాయనిర్ణయం చేయాలి-

సోఽస్య కార్యాణి సంపశ్యేత్సభ్యైరేవ త్రిభిర్వృతః ।
సభామేవ ప్రవిశ్యాగ్ర్యా మాసీనః స్థిత ఏవ వా॥ మూలశ్లోక సం.**10**

టీక:- సః = అతడు ఆ న్యాయాధీశుడు, **త్రిభిః సభ్యైః వృతః** = మిగిలిన ముగ్గురు సభా సదస్యులతో (8.11) కలిసి, **సభామ్ ప్రవిశ్య** = న్యాయాలయంలో ప్రవేశించి, **ఆసీనః వా స్థితః ఏవ** = సభాపతి ఆసనమందు కూర్చొని గాని లేదా నిల్చొని గాని, **అస్య** = ఈ రాజు యొక్క, **కార్యాణి** = కార్యాలను, వివాదాలను (కేసులను), **సంపశ్యేత్** = చక్కగా పరిశీలించుగాక!

తాత్పర్యం:- ఆ బ్రాహ్మణుడు, మరి ముగ్గురు పండితోత్తములను సభ్యులుగా చేసుకొని సభాభవనమున ప్రవేశించి, రాజుకు ప్రతినిధిగా కూర్చొని గాని, నిలిచి గాని విచారణ చేయాలి. రాజు కూర్చొనే ఆసనంపై కూర్చోరాదు. అటూ ఇటూ పచార్లు చేస్తూ పర్యవేక్షించరాదు. ॥10॥

వివరణ:- న్యాయ విషయంలో బ్రాహ్మణులు, బ్రహ్మ సభ అంటే అర్థాలు

మొదటి 8.11వ శ్లోకంలో బ్రహ్మసభను నిర్వచించారు. అందులో తొలి 9-10 శ్లోకాలలో న్యాయ సభ నిర్మాణ పద్ధతి ఉంది. ఈ శ్లోకాలలో చెప్పిన విద్వాంసులతో 8.11లో చెప్పిన బ్రహ్మసభ ఏర్పాటవుతుంది. బ్రహ్మసభ అంటే - **'వేదవేత్తలు న్యాయాధీశులు విద్వాంసుల సభ'** అని అర్థం. ఇదేవిధంగా 9వ శ్లోకంలో 'బ్రాహ్మణులు' అనే పదప్రయోగం బ్రాహ్మణ వర్ణానికి కాదు - అనే విశేషార్థం ఉంది. రాజు చేత నియమితుడైన విద్వాంసుడైన న్యాయాధీశుడు, వేద పారంగతుడు, ధార్మిక గుణాలు గలవాడై ఉండాలి. వేదవేత్తలు, న్యాయాధీశులు, విద్వాంసులు ఉన్న సభ కనుకనే 9.11లో న్యాయసభను 'బ్రహ్మసభ' అంటారు. అక్కడ స్పష్టంగా **'వేదవిదః'** అనే విశేషణం కూడా పైనచెప్పిన అర్థానికి బలం చేకూరుస్తుంది. ఈ విషయంలో బ్రాహ్మణ పదం బ్రాహ్మణ వర్ణానికి కాక, వేదవేత్తలు, న్యాయాధీశులు, విద్వాంసులను ఉద్దేశించినది.

7.142లో బ్రాహ్మణ పద ప్రయోగం చేయకుండా, **'అమాత్య ప్రముఖ'**లకు తన తర్వాత పనులు అప్పగించడం గురించి ఉంది కదా! అనే సందేహం రావచ్చు. దీనికి, అక్కడ రాజ్యసభ నడిపేందుకు అందరికన్నా ప్రముఖ మంత్రికి పనులు అప్పగించే పద్ధతి ఉంది, అది కూడా కేవలం అనారోగ్య పరిస్థితులలో అనేది సమాధానం. ఇక్కడ బ్రహ్మసభ అంటే, న్యాయసభకు పాలక లక్షణాలున్న వ్యక్తి వారసుడు అవుతాడు. న్యాయం కొరకు న్యాయ గుణాలు, విశేష యోగ్యత ఉన్న వ్యక్తి అవుతాడు అని అర్థం. కనుక ఆ శ్లోకం, దాని విషయమే వేరు. రెండవది; అనారోగ్య పరిస్థితులలో నియమించేవారి

పద్ధతే చెప్పలేదు. అంతేకాక, రాజు ఒక్కడే అన్ని కార్యాలూ చేయలేడు. సమయాభావం మొదలైన కారణాలవల్ల తన స్థానంలో అతడు ఎవరైనా విద్వాంసుణ్ని ముఖ్య న్యాయాధీశుడుగా నియమిస్తాడు - అనేది ఇక్కడి అర్థం. ఎన్ని న్యాయసభలు ఉంటాయో, వాటికి తగినట్లుగా ఆ అధికారులు అధిక సంఖ్యాకులు కావచ్చు.

ఈ విషయంపై 1.88, 8.1 - వీటి మీద వివరణ - 2 కూడా చూడదగినది). మనుస్మృతిలో అన్ని వర్ణాల వేదవేత్తలకూ బ్రాహ్మణులు, ద్విజులు, విప్రులు మొదలైన పదాలను పర్యాయవాచకాలుగా ప్రయోగించబడ్డాయి. (చూడండి 4.245 మీది వివరణ).

న్యాయ ప్రసంగంలో 9వ శ్లోకంలో ప్రయోగించిన **'విద్వాంసం బ్రాహ్మణం'**, 10వ శ్లోకంలో ఉన్న 'సభా' శబ్దాలకు వివరణ.

"వేదవిదః త్రయః" ముగ్గురు వేద విద్వాంసులతో న్యాయసభ ఏర్పాటవుతుంది. వేదవేత్తలైన న్యాయాధీశులున్న ఈ సభకే 'బ్రహ్మాసభ' అని పేరు.

రాజు ద్వారా నియుక్తుడైన విద్వాంసుడు న్యాయాధీశుడు. అతడు విశేషించి సర్వ వేదజ్ఞుడుగానూ ధార్మిక గుణసంపన్నుడుగానూ ఉండాలి. ఇక్కడ ఉపయోగించిన 'బ్రాహ్మణ శబ్దం' బ్రాహ్మణ వర్ణానికి సంబంధించినది కాదు. అంటే జన్మతః బ్రాహ్మణుడు కాడు. వేద వేత్తలైన అన్ని వర్ణాల విద్వాంసులకు బ్రాహ్మణ, ద్విజ, విప్ర మొ॥ శబ్దాలు మనుస్మృతిలో సమానార్థకాలుగానూ, పర్యాయవాచకాలుగానూ ప్రయోగింపబడినవి.

న్యాయసభకు పరిభాష- **ఇది మనుకృతం-ప్రామాణికం**

యస్మిన్ దేశే నిషీదంతి విప్రా వేదవిదస్త్రయః ।
రాజ్ఞశ్చాధికృతో విద్వాన్ బ్రహ్మణస్తాం సభాం విదుః ॥ మూలశ్లోక సం. **11**

టీక:- **యస్మిన్ దేశే** = ఏ స్థానంలో, **వేద విదః** = వేదాలు తెలిసిన, **త్రయః విప్రాః** = ముగ్గురు విద్వాంసులు, **నిషీదన్తి** = ఆసీనులవుతారో, **చ** = మరియు, **రాజ్ఞః అధికృతః విద్వాన్** = రాజు ద్వారా నియమింపబడిన, ఆ విషయం తెలిసిన, వేదవేత్తయైన విద్వాంసుడు కూర్చొంటాడో, **తాం బ్రహ్మణః సభాం విదుః** = ఆ సభను 'బ్రహ్మాసభ'-అంటే **'న్యాయసభ'** అని అంటారు. అదే న్యాయాలయం.

తాత్పర్యం:- ఏ సభలో ఋగ్యజుస్సామ వేదాలు సాంగోపాంగంగా తెలిసిన ముగ్గురు బ్రాహ్మణులు, రాజుచేత నిర్ణయింపబడిన విద్వాంసుడు ఉంటారో-ఆ నలుగురూ ఉండే విచారణ సభ సాక్షాత్ చతుర్వేదుడైన బ్రహ్మాసభకు సాటి అని విజ్ఞులు చెబుతారు. ॥11॥

వివాదాలను పరిష్కరించడం, నిర్ణయించడంలో ధర్మ రక్షణే ప్రేరణగా ఉండాలి - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ధర్మో విద్ధస్త్వధర్మేణ సభాం యత్రోపతిష్ఠతే ।
శల్యం చాస్య న కృంతంతి విద్ధాస్తత్ర సభాసదః ॥ మూలశ్లోక సం. **12**

టీక:- **యత్ర** = ఏ సభలో, **అధర్మేణ విద్ధః ధర్మః** = అధర్మం ద్వారా గాయపడి ధర్మం, **ఉపతిష్ఠతే** = ఉంటుందో, **చ అస్య శల్యం న కృన్తన్తి** = సభాసదులు, ధర్మానికి కలిగిన ఈ శల్యాన్ని తీసివేసి అధర్మాన్ని ఖండించరో, అంటే ధర్మాత్ముడికి గౌరవం, అధర్మాత్ముడికి దండన చేయరో, **తత్ర** = ఆ సభలోని, **సభాసదః** = సభాసదులందరూ, **విద్ధాః** = అధర్మంలో చిక్కుపడినవారే అవుతారు. అధర్మం ద్వారా ధర్మం ఏ సభలో గాయపడుతుందో ఆ గాయాన్ని సభాసదులు మాన్పకపోయినట్లయితే అలాంటి సభలోని వారందరూ గాయపడినట్లే భావించాలి.

ఋషి దయానందభాష్యం:- ఏచోట ధర్మానికి గండిపడి, వీరి సమక్షంలో తీర్పు కోసం వస్తుందో, అక్కడ సభ్యులు అధర్మానికి పాల్పడితే, ధర్మబద్ధమైన న్యాయం జరగదు. కాబట్టి-విచారణలో ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. (స.ప్ర. 6వ.సము.) ॥12॥

ఇది మనుకృతం-ప్రామాణికం

న్యాయ సభలో న్యాయమే చెప్పాలి. న్యాయాన్నే నిర్ణయించాలి-

సభాం వా న ప్రవేష్టవ్యం వక్తవ్యం వా సమంజసమ్ ।
అబ్రువన్ విబ్రువన్ వాఽపి నరో భవతి కిల్బిషీ ॥ మూలశ్లోక సం. **13**

టీక:- ధార్మిక మానవుడి కర్తవ్యం ఇది, **సభాం న ప్రవేష్టవ్యం** = సభలో న్యాయాలయంలో ఎప్పుడూ ప్రవేశించరాదు. ఒకవేళ ప్రవేశించినట్లయితే, **సమంజసమ్** = సత్యాన్నే, **వక్తవ్యం** = చెప్పాలి, **నరః అబ్రువన్** = సభలో అన్యాయం జరుగుతూండగా చూస్తూ మౌనంగా ఉంటాడో, **అపి వా** = లేదా, **విబ్రువన్** = సత్య న్యాయాలకు విరుద్ధంగా పలుకుతాడో, అతడు, **కిల్బిషీ భవతి** = మహాపాపి అవుతాడు.

ఋషి దయానందభాష్యం:- సామాన్య సభ అని తెలిసికూడా వ్యవహారాల తీర్పులకోసం ఆ సభలో మాత్రం ప్రవేశించరాదు. అలా ప్రవేశించినా ఏదైనా సంశయం వల్ల సభ్యులు ప్రశ్నిస్తే సత్యమే చెప్పాలి. అలాగాక మౌనంగా ఉన్నా, అబద్ధాలు పలికినా, అతడు పాపం చేసినవాడు అవుతాడు. (స.ప్ర. 6వ సము.) ॥13॥

వివరణ:

'కిల్బిషమ్' ఈ శబ్దాన్ని గురించి విశేషంగా తెలిసికోవడానికి 8.316 శ్లోకంలోని వివరణ చూడగలరు. పాపి శబ్దానికి దోషి లేదా అపయశోభాగి అని భావం.

ఇది మనుకృతం-ప్రామాణికం

అన్యాయం చేసే న్యాయసభా సభ్యుడు మృతకుడితో సమానం-

యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ ।
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః ॥ మూలశ్లోక సం. **14**

టీక:- **యత్ర** = ఏ న్యాయ సభలో, **ప్రేక్ష్యమాణానాం** = కూర్చొన్న సభాసదుల ఎదుట, **అధర్మేణ హి ధర్మః** = అధర్మం వల్ల ధర్మం, **చ** = మరియు, **అనృతేన సత్యం** = అసత్యం ద్వారా సత్యం, **హన్యతే** = హత్య చేయబడుతుందో, **తత్ర** = ఆ సభలో, **సభాసదః హతాః** = సభాసదులందరూ మరణించిన వారితో సమానం.

ఋషి దయానందభాష్యం:- ఏ సభలో సభాసదులందరూ చూస్తూ ఉండగా అధర్మం వల్ల ధర్మం, అసత్యం వల్ల సత్యం హత్య చేయబడుతుందో (అణచి వేయబడుతుందో) ఆ సభా సభ్యులందరూ జీవించినట్లు కాదు. అందరూ మృతులతో సమానమే. (స.ప్ర. 6వ సము.) ॥14॥

వివరణ:

ఇదే భావం 8.12లో వర్ణించబడింది. ఈ శ్లోకాలతో మనువు యొక్క న్యాయప్రియత, ధర్మప్రియత తెలియబడుతుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

చంపబడిన ధర్మం చంపినవాడినే చంపుతుంది-

ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మాద్ధర్మో న హంతవ్యో మా నో ధర్మో హతోఽవధీత్ ॥ మూలశ్లోక సం. **15**

టీక:- **హతః ధర్మః ఏవ** = చంపబడిన ధర్మమే, **హన్తి** = ధర్మ హానికారులను నాశనం చేస్తుంది. మరియు, **రక్షితః ధర్మః** = ధర్మాన్ని రక్షించినవారిని, **రక్షతి** = రక్షిస్తుంది, **తస్మాత్** = అందువల్ల, **ధర్మః న హంతవ్యః** =ధర్మాన్ని ఎప్పుడూ

హత్య చేయరాదు, బాధించరాదు. కారణం?, **హతః ధర్మః** = హింసించబడ్డ ధర్మం, **నః మా అవధీత్** = ఎప్పుడూ మమ్మల్ని హత్య చేయకుండుగాక!.

తాత్పర్యం:- **'ధర్మోరక్షతి రక్షితః'** అనే సుప్రసిద్ధ వాక్యం ఈ మనుస్మృతిలోనిదే ! ఇక్కడ అదే వివరించబడినది. ధర్మాన్ని కాపాడండి. అది మిమ్ములను కాపాడుతుంది అని ఈ సూక్తికి అర్థం. ధర్మాన్ని ఎప్పుడూ హత్య చేయరాదు. హింసించబడ్డ ధర్మం ఎప్పుడూ మమ్మల్ని హత్య చేయకుండుగాక!

ఋషి దయానందభాష్యం:- ధర్మాన్ని నాశనం చేసేవాడిని ధర్మమే నాశనం చేస్తుంది. ధర్మాన్ని రక్షించువాడిని ధర్మమే రక్షిస్తుంది. అందువల్ల, హత్యగావింపబడ్డ ధర్మమే మనల్ని హత్య చేస్తుందనే భయంతో మనమెప్పుడూ ధర్మాన్ని వదలరాదు.(సం.వి. 6వ సము) ॥115॥

వివరణ:

ధర్మపాలనతో రక్షణ: ధర్మము అనగా కానూన్ - న్యాయం. కర్తవ్యపాలన చేయని వ్యక్తి దానికి విరుద్ధంగా చేస్తూ దొరికిపోయినప్పుడు అతనికి శిక్షగా దండన, సజా, అవమానము, జుర్మానా భరించవలసి వస్తుంది. అనగా ధర్మాన్ని - కర్తవ్యాన్ని చంపినవాడిని అదే అతనిని చంపుతుంది. ఎవరు చట్టపరంగా కర్తవ్యపాలన చేస్తాడో అతనికి ఎలాంటి దండన, సజా, అవమానము జరుగదు. ధర్మరక్షణ - న్యాయపాలన ద్వారా మనిషి రక్షించబడుతాడు. ఇటులనే అన్యాయం చేసే సభాసదులు కూడా అధర్మ, అసత్య ఫలాన్ని అనుభవించవలసి వస్తుంది.

ధర్మహంతకుడు 'వృషలు'డని పిలువబడతాడు-

ఇది మనుకృతం-ప్రామాణికం

వృషో హి భగవాన్ ధర్మ స్తస్య యః కురుతే హ్యలమ్ ।
వృషలం తం విదుర్దేవా స్తస్మాద్ధర్మం న లోపయేత్ ॥ మూలశ్లోక సం.**16**

టీక:- **యః** = ఏది, **భగవాన్ వృషః హి ధర్మః** = సర్వైశ్వర్య ప్రదమో, సుఖవర్ష ప్రదాతయో, అదే ధర్మం. **తస్య హి+అలం కురుతే** = అలాంటి ధర్మానికి హాని (లోపం) కలిగించేవాడిని, **దేవాః** = విద్వాంసులు, **వృషలం విదుః** = వృషలుడు-శూద్రుడనీ, నీచుడనీ గుర్తిస్తాడు. అంటే జాతిచేత వృషలుడు గాడు. ధర్మహీనత చేతనే వృషలుడవుతాడు. అందువల్ల, ఎవరున్నూ ధర్మానికి లోపం కలిగించడం ఉచితంకాదు. ధర్మం లోపించినప్పుడు సుఖవంతుడు కాడు. కాలేదు.

ఋషి దయానందభాష్యం:- సంపూజ్యమైనది ధర్మం. కోర్కెలనన్నిటినీ వర్షించుచున్నందువల్ల వృషమని చెప్పబడింది. అలాంటి వృషమును ఎవడైతే అడ్డుకుంటూంటాడో అతడే వృషలుడు (శూద్రుడు). కాబట్టి-జాతిశూద్రుడి కంటే కర్మశూద్రుడు ప్రమాదకారి.(స.ప్ర. 6వ సము.) ॥16॥

ధర్మమే పరజన్మలో కూడా తోడుగా ఉంటుంది-

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏక ఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః ।
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి ॥ మూలశ్లోక సం.**17**

టీక:- ఈ ప్రపంచంలో, **ఏకః ధర్మః ఏవ సుహృత్** = ధర్మమొక్కటే మిత్రం, (స్నేహితుడు), **యః** = ఏది, **నిధనే+అపి అనుగచ్ఛతి** = మరణానంతరం కూడా వెంటనంటి ఉంటుంది, **అన్యత్ సర్వమ్** = మనతో ఉండే ఇతరమైన పదార్థాలన్నీ, **శరీరేణ సమం నాశం** = శరీర నాశనంతో పాటు అవన్నీ కూడా నశింస్తాయి. అంటే అన్నీ మనల్ని వీడిపోతాయి. కానీ ధర్మం మాత్రం మనల్ని ఎప్పుడూ విడిచిపెట్టి పోదు.

ఋషి దయానంద భాష్యం:- ధర్మమనేదే ముఖ్యమైన స్నేహితుడు. ఎందుకంటే- మన మరణానంతరం అదొక్కటే మనల్ని మిత్రుడిగా వెంబడిస్తుంది. మిగిలినవన్నీ మన దేహంతోనే నాశనం పొందుతున్నాయి కదా! (స.ప్ర. 6వ సము.) ॥17॥

అన్యాయం వల్ల సభాసదులందరూ నిందలపాలవుతారు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

పాదోఽ ధర్మస్య కర్తారం పాదస్సాక్షిణమృచ్ఛతి ।
పాద స్సభాసద స్సర్వాన్ పాదో రాజాన మృచ్ఛతి ॥ మూలశ్లోక సం.**18**

టీక:- రాజసభలో పక్షపాత బుద్ధితో చేసిన అన్యాయం, అధర్మం ఇచ్చే పాపం. ఈ పాప ఫలాలే, **పాదః** = 1/4 ఒక భాగం, **అధర్మస్యకర్తారం** = అన్యాయ నిర్ణయం చేసిన వాడికి, **పాదః** = ఒక నాల్గో భాగం, **సాక్షిణమ్** = సాక్షిని, **ఋచ్ఛతి** = పొందుతాడు (తగులుతుంది), **పాదః** = ఒక నాల్గవ భాగం, **రాజానమ్** = రాజుకు, ప్రభువుకు పాలకుడికి, **ఋచ్ఛతి** = చెందుతుంది. అంటే ఆ పాపం వల్ల వచ్చే చెడ్డ పేరు, **కళంకం** = అందరికీ వస్తుంది.

ఋషి దయానందభాష్యం:- రాజసభలో పక్షపాత బుద్ధితో అన్యాయంగా నిర్ణయం జరిగినప్పుడు- ఆ అధర్మం (పాపం) నాలుగు భాగాలుగా విభజింపబడును. అందులో ఒక భాగం అధర్మకర్తకు, రెండో భాగం సాక్షికి, (సాక్ష్యం చెప్పిన వాడికి), 3వ భాగం సభాసదులకందరికీ, నాల్గో భాగం న్యాయ సభాపతి అయిన అధర్మాత్ముడైన రాజుకు చెందుతుంది. ॥18॥

వివరణ:

"అధర్మ" శబ్దం యొక్క అభిప్రాయం అన్యాయి లేదా దోషభాగి వీరందరూ అపకీర్తిపాలై చెడ్డవారుగా ప్రజలచేత నిందింపబడతారు. ఈ విషయానికి సంబంధించిన విస్తృత వివేచనం, గురించి (8.191)వ శ్లోకంలో వివరణ చూడగలరు.

ఇది మనుకృతం-ప్రామాణికం

యథాయోగ్యమైన వ్యవహారం వల్ల ప్రభువు పాపి అనిపించుకోడు -

రాజా భవత్యనేనాస్తు ముచ్యంతే చ సభాసదః ।
ఏనో గచ్ఛతి కర్తారం నిందార్హో యత్ర నింద్యతే ॥ మూలశ్లోక సం.**19**

టీక:- యత్ర = ఏ సభలో, **నిందా+అర్హః నిన్ద్యతే** = నిందకు యోగ్యుడైన వాడికి నింద, స్తుతికి యోగ్యుడైనవాడికి స్తుతి, దండనకు యోగ్యుడైనవాడికి దండన, మాన్యతకు యోగ్యుడైనవాడికి మాన్యత లభిస్తుందో, అక్కడ **రాజా చ సభాసదః** = రాజు, సభాసదులందరూ, **అనేనాః +తు ముచ్యన్తే** = పాపం నుండి ముక్తులై పవిత్రులవుతారు, **కర్తారం ఏనః గచ్ఛతి** = పాపం చేసిన కర్తకు మాత్రమే పాపం లభిస్తుంది.

ఋషి దయానందభాష్యం:-ఏ సభలోనైతే నేరగాళ్లు కనిపెట్టబడి దండించబడతారో, ఆ సభలో రాజుకు పాపం అంటదు. వారి బృందానికి/ సభ్యులకూ అంటదు. అంటే నిందకు యోగ్యుడైన వాడికి నింద స్తుతికి యోగ్యుడైన వాడికి స్తుతి, దండనకు మోగ్యుడైన వాడికి దండన లభిస్తుందో అక్కడ రాజు, సభాసదులందరూ, పాపం నుండి ముక్తులై పవిత్రులవుతారు. పాపం చేసిన వాడికే పాపం లభిస్తుంది.(స.ప్ర. 6వ సము.) ॥19॥

20-24వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

శూద్రుడు ధర్మ ప్రవక్త కాకూడదు -

* *జాతిమాత్రోపజీవీ వా కామం స్యాద్బ్రాహ్మణబ్రువః ।*
ధర్మప్రవక్తా నృపతే ర్నతు శూద్రః కథంచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.***20***

తాత్పర్యం:- కొన్ని చోట్ల ధర్మశాస్త్రం బాగా అధ్యయనం చేసినట్టి విద్వాంసుడు లభించక పోవచ్చు! అప్పుడు కేవలం జాతి బ్రాహ్మణునైనా వ్యవహార పరిశీలకుడిగా రాజు నియమించాలి. అలాకాక పోయినప్పుడు మేలుజాతి క్షత్రియుణ్ణి గాని-వైశ్యుణ్ణిగాని ఆ స్థానంలో ఉంచవచ్చు! శూద్రుణ్ణి మాత్రం నియమించరాదు. పరాధీనతచేత గానీ, తన ఇష్టపూర్వకంగా గాని శూద్రుణ్ణి ఆ స్థానంలో నియమించడం తగదు. ॥20॥

* *యస్య శూద్రస్తు కురుతే రాజ్ఞో ధర్మవివేచనమ్ ।*
తస్య సీదతి తద్రాష్ట్రం పంకే గౌరివ పశ్యతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **21**

తాత్పర్యం:- ఏ రాజ్యంలో ధర్మ వివేచన చేసేస్థానంలో శూద్రుడుంటాడో ఆ రాజ్యం, రాజు చూస్తుండగానే అడుసులో/ఊబిలో దిగబడిపోయిన గోవులా నాశనమవుతుంది. ॥21॥

* *యద్రాష్ట్రం శూద్రభూయిష్ఠం నాస్తికాక్రాంతమద్విజమ్ ।*
వినశ్యత్యాశు తత్కృత్స్నం దుర్భిక్షవ్యాధిపీడితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **22**

తాత్పర్యం:- ఎవరిరాజ్యం శూద్రులచేత నిండిపోయి ఉంటుందో, దేవుడులేడని వాదించే నాస్తికులతో పరివేష్టితమై ఉంటుందో, ద్విజులు లేకుండా శోభాహీనంగా ఉంటుందో, ఆ రాజు రాజ్యమంతా క్షామం వల్ల, రోగాల వల్ల కొట్టుమిట్టాడుతూ త్వరలోనే నశిస్తుంది. ॥22॥

* *ధర్మాసనమధిష్ఠాయ సంవీతాంగ స్సమాహితః ।*
ప్రణమ్య లోకపాలేభ్యః కార్యదర్శనమారభేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **23**

తాత్పర్యం:- ధర్మపాలకుడు ధర్మపరిశీలనానికై ఏర్పడ్డ ఆసనంపై కూర్చొని-దేహాన్ని కప్పుకొని-పరాకు ప్రదర్శించక, లోకపాలుడికి నమస్కరించి, కార్యపరిశీలన ఆరంభించాలి. ॥23॥

* *అర్థానర్థావుభౌ బుద్ధ్వా ధర్మాధర్మౌ చ కేవలౌ ।*
వర్ణక్రమేణ సర్వాణి పశ్యేత్కార్యాణి కార్యిణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **24**

తాత్పర్యం:- ప్రజారక్షణమేదో-ప్రజలకు చేటు తెచ్చేదేదో తెలిసి, ఐహిక ప్రయోజనం -ఆముష్మిక ప్రయోజనం తెలిసి, వాటికి విరోధం రాకుండా. వాది-ప్రతివాదుల కార్యాలను పూర్తిగా విచారించాలి. వివిధ వర్ణాలకు చెందిన అభియోగాలుంటే, ముందుగా బ్రాహ్మణులకు చెందిన వ్యవహారాలు పూర్తిచేయాలి. ॥24॥

ప్రక్షిప్తాల పరిశీలన

20-24 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. ముందు వెనుకల శ్లోకాలలో 'ధర్మ- అధర్మాల వివేచనకు ప్రేరణ, ధర్మంతో లాభం, అధర్మంతో హాని' అనే ప్రసంగం ఉంది. దీని మధ్య 'ధర్మ ప్రవక్త ఎవరు?' అనేది ప్రాసంగికం కాదు. దీని వల్ల ప్రసంగ భంగం అవుతుంది.

ఖ. ధర్మ ప్రవక్త నిర్ణయం 8.9-11 శ్లోకాలలో చెప్పాడు. 12లో మరొకటి ప్రారంభ మవుతుంది. చెప్పేసిన విషయాన్ని మళ్లీ మొదలు పెట్టటం కూడా అసంగతమే. అందుచేత 20-24 శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 20-22 శ్లోకాలలో జన్మతో జాతి అనే పద్ధతి ఉంది, ఇది మనువుకు వ్యతిరేకం. మనుస్మృతిలో కర్మతోనే వర్ణ వ్యవస్థ అన్నాడు. (దీనికి 1.92-10శ్లోకాల మీది 'పరిశీలన-చూడండి).

ఖ. 8.9-11 శ్లోకాలలో స్పష్టంగా వేదవేత్తలైన విద్వాంసులను 'ధర్మ ప్రవక్తలు'గా చెప్పారు. మళ్లీ ఈ శ్లోకాలలో జన్మతో జాతి అనే ఆధారంతో బ్రాహ్మణ వ్యతిరేక నామధారులను 'ధర్మ ప్రవక్తలు' గా భావించటం పైన చెప్పిన శ్లోకాలకు వ్యతిరేకం. శ్లోకాలలో చెప్పిన సంప్రదాయాలు శిథిలమై పోయాక, రచించి కలిపిన శ్లోకాలని స్పష్టంగా తెలుస్తోంది. కొన్ని శ్లోకాలలో ముందు స్పష్టంగా పద్ధతి చెప్పిన తర్వాత వీటి అవసరమే లేదు. మనువు చెప్పిన వర్ణ వ్యవస్థ ననుసరించి ఏ కులంలో పుట్టినవాడైనా చదువు లేకపోవటం, మునుపటి మూడు వర్ణాల వారి విద్యా శిక్షణ లేకపోతే, అతడు శూద్రుడవుతాడు. చదువు లేనివాడి పని, యోగ్యత న్యాయం చేయటం కాదు. అందుచేత న్యాయం చేసే విషయమే ఇక్కడ వచ్చేది కాదు. కచ్చితంగా ఇవి జన్మతో జాతివాద కాలం నాటి శ్లోకాలే ! ఇటువంటి వ్యాఖ్యాలలో వర్ణాలను గురించి వివేచించడం గురించి ఎక్కడా రాయలేదు. ఈ విధంగా అంతర్ వ్యతిరేకా లుండటం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

3. పునరుక్తులు

23వ శ్లోకంలో పునరుక్తి ఉంది. 8.2లో ఇదే చెప్పారు. మళ్లీ దాన్నే చెప్పటం అనవసరం.

25-36వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

నిర్ణయంలో హావభావాల వల్ల మనస్సును గుర్తించడం -

బాహ్యైర్విభావయేల్లింగైర్భావమంతర్గతం నృణామ్ । మూలశ్లోక సం. **20**
స్వరవర్ణేంగితాకారైశ్చక్షుషా చేష్టితేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **25**

టీక:- న్యాయకర్త, **బాహ్యైః** = బాహ్యమైన, **లింగైః** = గుర్తుల ద్వారా వేషం, భూషణం, నడక, శరీర ముద్రల మొ॥ గుర్తుల ద్వారా, **స్వర-వర్ణ-ఇంగిత-ఆకారైః స్వర** = మాట్లాడించినప్పుడు ఆగిపోవడం, గాబరాపడటం, మాట తడబడటం, **వర్ణ** = ముఖం తెల్లగా అవడం, సిగ్గు పడటం, **ఇంగితం** = దోషులలో జరిగే పరస్పర సంకేతాలు ఎదురుగా చూడలేకపోవడం, అటు ఇటు చూడటం, **ఆకారైః** = ముఖనేత్రాదులలో మార్పు, వణుకడం, చెమటబట్టడం, **చక్షుషా** = నేత్రాలలో ఉత్పన్నమయిన భావాల ద్వారా, **చ** = మరియు, **చేష్టితేన** = చేష్టల ద్వారా చేతులు నలుపుకోవడం, వేళ్ళు విరుచుకోవడం, బొటనవేలి ద్వారా భూమిని గీయడం, తలగోక్కోడం, **నృణామ్** = దావాలో పాల్గొన్న ప్రజల ద్వారా, **అంతర్గతం భావమ్** = దోషి మనస్సులో ఉన్న నిజమైన భావాలను, **విభావయేత్** = పసిగట్టాలి. ॥25॥

తాత్పర్యం:- న్యాయకర్త బాహ్యమైన గుర్తుల ద్వారా వేషం, భూషణం, నడక, శరీర ముద్ర మొ॥ గుర్తుల ద్వారా మాట్లాడించినప్పుడు ఆగిపోవడం, గాబరాపడటం, ముఖం తెల్లగా అవడం, సిగ్గుపడటం, అటుఇటు చూడటం, ముఖనేత్రాదులలో మార్పు, వణుకడం చెమటపట్టడం, చేతులు నలుపుకోవడం, లాంటి చేష్టల ద్వారా దావాలో పాల్గొన్న ప్రజల ద్వారా దోషి మనస్సులో ఉన్న నిజమైన భావాలను పసిగట్టాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆకారై రింగితైర్గత్యా చేష్టయా భాషితేన చ । మూలశ్లోక సం. **21**
నేత్ర వక్త్ర వికారైశ్చ గృహ్యతేఽంతర్గతం మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **26**

టీక:- **ఆకారైః** = ఆకారాలు, **ఇఙ్గితైః** = సంకేతాలు, **గత్యా** = నడకలు, **చేష్టయా**= చేష్టలు, **భాషితేన** = మాటలు, **చ** = అలాగే, **నేత్ర-వక్త్ర-వికారైః** = నేత్ర-వక్త్ర వికారాలు, హావభావాల ద్వారా, **అంతర్గతం మనః** = మనషుల మనస్సులలో ఉన్న భావం, **గృహ్యతే** = తెలుస్తుంది.

తాత్పర్యం:- ఆకారాలచేత, మనోభిప్రాయాల చేత, కాలితొట్రుపాటు మొదలైనవాటిచేత, చేష్టలు, మాటలు, కంటిచూపు, ముఖవికారం వీనిచేత మనోభావం నిర్ణయింపబడుతుంది కాబట్టి వీటిన్నిటినీ గమనించాలి. ॥26॥

బాల ధన రక్షణ- ఇది మనుకృతం-ప్రామాణికం

బాలదాయాదికం రిక్థం తావద్రాజానుపాలయేత్ । మూలశ్లోక సం. **22**
యావత్స స్యాత్సమావృత్తో యావచ్చాతీతశైశవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **27**

టీక:- **రాజా** = రాజు, **బాల-దాయ+ఆదికం రిక్థం** = బాలకుడు అంటే పద్దెనిమిది సంవత్సరాలు రానివాడు గాని (మైనర్) లేదా అనాథబాలకుడికి గాని చెందిన పైత్రుక సంపత్తిని లేదా అన్య ధనసంపత్తిని, **తావత్** = అంతవరకు, **అనుపాలయేత్** = రక్షించాలి. **తావత్ సః** = ఆ బాలకుడు, **సమావృతః స్యాత్** = సమావర్తన సంస్కారం జరిగి, అంటే గురుకులం నుండి స్నాతకుడై (3.1,2) వచ్చేంత వరకు మరియు **యావత్** = ఎంత వరకు అతడు, **అతీత శైశవః** = యువకుడవుతాడో (మేజర్) అంత వరకు.

తాత్పర్యం:- దిక్కులేని బాలుడిసొత్తు పినతండ్రి మొదలైనవారు అన్యాయమున అపహరించునప్పుడు, అలాంటి పిల్లవాడి సంపద అన్యులకు పోనివ్వకుండా, ఆ బాలుడు గురుకులం నుండి చదువు పూర్తికావించుకొని వచ్చేంత వరకు లేదా వాడి బాల్యం పోయి యౌవనదశ వచ్చేంత వరకు వాడి సంపదకు సంరక్షకుడు కాపాడాలి. ॥27॥

వన్ధ్యాదుల ధన రక్షణ- ఇది మనుకృతం-ప్రామాణికం

వన్ధ్యాఽపుత్రాసు చైవం స్యాద్రక్షణం నిష్కులాసు చ । మూలశ్లోక సం. **23**
పతివ్రతాసు చ స్త్రీషు విధవాస్వాతురాసు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **28**

టీక:- **వన్ధ్యా + అపుత్రాసు** = పిల్లలు లేనివారు, **స్యాద్రక్షనం** = మగపిల్లలు లేనివాళ్ళు, **నిష్కులాసు** = కులహీనులు అంటే పురుషుడు లేని కుటుంబాలు గలవారు, **పతివ్రతాసు** = పతి పరదేశం వెళ్ళినప్పుడు, ఒంటరిగా ఉండే స్త్రీలు, **విధవాసు** = భర్తలు చనిపోగా విధవలైనవారు, **చ** = మరియు, **ఆతురాసు** = రోగగ్రస్తులైన, **స్త్రీషు** = స్త్రీలకు సంబంధించిన సంపత్తిని కూడా రాజు రక్షించాలి. **ఏవం** = ఈ విధంగానే వారు సమర్థులయ్యేంత వరకు వారి సంపత్తిని రక్షించడం రాజు కర్తవ్యం.

తాత్పర్యం:- పిల్లలు లేనివారు, మగపిల్లలు లేనివారు, నాథుడు లేని స్త్రీలు, పతిపరదేశం వెళ్లినప్పుడు ఒంటరిగా ఉండే స్త్రీలు, భర్తలు చనిపోగా విధవలైనవారు, రోగగ్రస్తులైన స్త్రీలకు సంబంధంచిన సంపత్తిని వారు సమర్థులయ్యేంత వరకు రక్షించడం రాజు కర్తవ్యం. ॥28॥

ఇది మనుకృతం-ప్రామాణికం

జీవంతీనాం తు తాసాం యే తద్ధరేయుః స్వబాంధవాః । మూలశ్లోక సం. **24**
తాఞ్ఛిష్యాచ్చౌరదండేన ధార్మికః పృథివీపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **29**

టీక:- **తాసాం జీవన్తీనాం** = పై శ్లోకంలో పేర్కొన్న జీవించి ఉన్న స్త్రీలు, **తత్** = ధనాన్నీ, సంపదనూ, **యే స్వబాంధవాః** = వారి స్వీయ బంధువులు, **అరేయుః** = కాజేస్తారో, **తు** = అప్పుడు, **ధార్మికః పృథివీ పతిః** = ధర్మాత్ముడైన రాజు, **తాన్** = ఆ ధనాపహారులను, **చౌరదండేన** = చోరులకు ఇచ్చే శిక్షతో, **శిష్యాత్** = శిక్షించాలి, (8.301-343) వారిని ధర్మమార్గం వైపు మళ్ళించాలి.

తాత్పర్యం:- వారు జీవించి ఉన్నప్పుడు వారి సొత్తులను వారి బంధువులు తీసుకొందురేని, ధర్మపరుడైన రాజు వారిని దొంగలను దండించినట్లు దండించాలి. ॥29॥

వారసులు లేని వారి ధనరక్షణ-

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రణష్టస్వామికం రిక్థం రాజా త్ర్యబ్దం నిధాపయేత్ । మూలశ్లోక సం. **25**
అర్వాక్ త్ర్యబ్దాద్ధరేత్స్వామీ పరేణ నృపతిర్హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **30**

టీక:- **ప్రణష్ట స్వామికం రిక్థం** = సొంతదారుడు లేనట్టి సంపత్తిని అంటే, వారసులున్నారా? లేరా? అని విచారించడం కోసం రాజు, **త్రి+అబ్దం** = మూడు సంవత్సరాల వరకు, **నిధాపయేత్** = సురక్షితంగా ఉండాలి, **త్రి+అబ్దాత్ అర్వాక్** = మూడు సంవత్సరాల లోపల, సొంతదారుడు గానీ వారసుడు గానీ వచ్చినట్లయితే, వారికి ఇవ్వాలి, (8.31). **పరేణ నృపతిః హరేత్** = అప్పటికీ ఎవరు రానప్పుడు, ఆ సంపదను రాజు స్వాధీనం చేసుకోవచ్చు.

తాత్పర్యం:- సొంతదారుడు లేనట్టి సంపత్తి విషయంలో రాజు ఆ సొత్తుకు వారసులు ఉన్నారా? లేరా? అని విచారించడం కోసం మూడు సంవత్సరాల లోపల, సొంతదారుడుగానీ వారసుడుగానీ వచ్చినట్లయితే వారికి ఇవ్వాలి. ఆ నిర్ణీత గడువుకు ఎవ్వరూ రానప్పుడు ఆ సంపదను రాజు స్వాధీనం చేసుకోవచ్చు. ॥30॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మమేదమితి యో బ్రూయాత్సోఽనుయోజ్యో యథావిధి । మూలశ్లోక సం. **26**
సంవాద్య రూపసంఖ్యాదీన్ స్వామీ తద్ద్రవ్యమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **31**

టీక:- **యః** = ఎవడైనా, **మమ+ఇదం ఇతి బ్రూయాత్** = ఆ ఆస్తి నాది అని అడిగినట్లయితే, అప్పుడు,**సః యథావిధి అనుయోజ్యః** = తగినట్టి, **రూప-సంఖ్యా-ఆదీన్** = ఆ ధనం, ఎంత ధనం, ఏలాంటిది మొ॥ ప్రశ్నలు వేసి, **సంవాద్య** = సరిగా చెప్పగలిగినట్లయతే, **స్వామీ తత్ ద్రవ్యమ్ అర్హతి** = సొంతదారుడు ఆ ధనం తీసుకోవడానికి అర్హుతవుతాడు. అంటే ఉన్నదున్నట్లు చెప్పి గుర్తించగలిగితే ప్రభువు ఆ ధనాన్ని సొంతదారు కలిగినవాడికి ఇవ్వాలి.

తాత్పర్యం:- ఎవడైనా ఆ ధనం ఆస్తి నాది అని ఆడిగినట్లయితే, అప్పుడు వాణ్ణి "ఆ ధనం ఎలాంటిది? అది ఎంత ధనం" మొదలైన ప్రశ్న లడిగి, వాటికి అతడు తగిన సమాధానం ఇచ్చినట్లయితే సొంతదారుడు ఆ ధనం తీసుకోవడానికి అర్హత పొందుతాడు. ॥31॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అవేదయానో నష్టస్య దేశం కాలం చ తత్త్వతః । మూలశ్లోక సం. **27**
వర్ణం రూపం ప్రమాణం చ తత్సమం దండమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **32**

టీక:- ఏ వ్యక్తి, **నష్టస్య** = నష్టమైన లేదా పోయిన ద్రవ్యం, **దేశం కాలం వర్ణం రూపం చ ప్రమాణం** = ఎక్కడ పోయింది, ఏ సమయంలో పోయింది, దాని రంగేమిటి? దాని ఆకారమేమిటి? ఎంత ధనం, **తత్త్వతః అవేదయానః** = యథార్థం చెప్పి నిరూపించలేక పోయినట్లయితే, **తత్ సమం దండమర్హతి** = ఆ ధనానికి సరిపడ దండన విధించడానికి అర్హుడవుతాడు. అంటే ఆ ధనానికి సమానంగా జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- అలా పోయిన ద్రవ్యం ఎప్పుడు పోయింది, ఎక్కడ పోయింది, ఏ రూపమైనది, ఏ వర్ణం గలది, ఎంతధనం అని ప్రశ్నలడిగినప్పుడు వాటికి తగిన యథార్థం చెప్పనివాడికి ఆ నష్టద్రవ్యమునకు తగినంత అపరాధం విధించాలి. అంటే ఆ ధనానికి లేదా సంపద విలువకు సమానంగా జుర్మానా వేయాలి. ॥32॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆదదీతాథ షడ్భాగం ప్రణష్టాధిగతాన్నృపః । మూలశ్లోక సం. **28**
దశమం ద్వాదశం వాపి సతాం ధర్మమనుస్మరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **33**

టీక:- ఎవరిదైనా, **ప్రణష్ట+అధిగతాత్** = పోగొట్టుకున్న ధనం లభించినప్పుడు, అందులో నుండి, **నృపః** = రాజు, **సతాం ధర్మమ్ +అనుస్మరన్** = సజ్జన ధర్మానుసారంగా, అంటే న్యాయపూర్వకంగా, అంతకాలం కాపాడినందుకుగాను, **షడ్ భాగం దశమం అపి, ద్వాదశం ఆదదీత్** = దొరికిన దానిలో, ఆరో భాగం గాని, పదో భాగం గాని, లేదా పన్నెండో భాగం గాని పన్ను రూపంగా తీసుకోవచ్చు.

తాత్పర్యం:- నష్టద్రవ్యం దొరికినప్పుడు దాన్ని సొంతదారుడికి ఇవ్వాలి. రాజు దాన్ని అంతకాలం కాపాడినందుకై దొరికిన దానిలో ఆరోభాగం గాని, పదోభాగం గాని, పండెండో భాగం గాని పన్ను తీసుకోవచ్చు. మిగిలిన ద్రవ్యమును సొంతదారుడికి ఇవ్వాలి.

సురక్షిత ధనాన్ని దొంగిలించినవానికి దండన - ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రణష్టాధిగతం ద్రవ్యం తిష్ఠేద్యుక్తైరధిష్ఠితమ్ । మూలశ్లోక సం.29
యాంస్తత్ర చోరాన్ గృహ్ణీయాత్తాన్ రాజేభేన ఘాతయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.34

టీక:- **ప్రణష్టాధిగతం ద్రవ్యం** = దొంగిలించిన ధనం లభించినప్పుడు ఆ ధనాన్ని రాజు, **యుక్తైః** = యోగ్యులైన రక్షకుల ద్వారా, **అధిష్ఠితమ్ తిష్ఠేత్** = ఆ ధనాన్ని రక్షించాలి, **తత్ర** = ఆ కాపలా ఉంచిన ధనాన్ని, **యాత్తాన్ చోరాన్ గృహ్ణీయాత్** = ఏ చోరులు దొంగిలిస్తారో, లేదా కాపలా దారులే దొంగిలించినట్లయితే, **తాన్ రాజా + ఇభేన ఘాతయేత్** = వారిని ఏనుగుల ద్వారా తొక్కించి చంపాలి.

తాత్పర్యం:- ఎవరిదైనా ద్రవ్యం దొంగ లెత్తుకొనిపోయి రాజపురుషులకు దొరకినట్లయితే, అలాంటి ధనాన్ని కోశాగారాధిపతి వద్దగానీ లేదా యోగ్యులైన రక్షకుల ద్వారా గానీ కాపాడాలి. అలాంటి ద్రవ్యమును అపహరించిన దొంగలు దొరకినట్లయితే వారిని ఏనుగులచేత తొక్కించి చంపాలి. ॥34॥

దొంగిలించిన ధనము దొరికినప్పుడు - ఇది మనుకృతం-ప్రామాణికం

మమాయ మితి యో బ్రూయాన్నిధిం సత్యేన మానవః । మూలశ్లోక సం.30
తస్యాదదీత షడ్భాగం రాజా ద్వాదశమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.35

టీక:- **నిధిం** = దొంగతనంగా లభించిన ధనాన్ని, **యః మానవః** = ఏ మానవుడు, **అయంమమ + ఇతి సత్యేన బ్రూయాత్** = రంగు, రూపం, బరువు, సంఖ్య మొ॥ వాటిని గుర్తించి ఇది నాదేనని వాస్తవం చెప్పినట్లయితే, **రాజా** = రాజు, **తస్య షడ్ భాగం వా ద్వాదశమ్+ ఆదదీత** = అందులో నుండి ఆరో భాగం గాని, లేదా పన్నెండో భాగం గాని పన్ను (Tax)రూపంలో తీసుకొని, శేషభాగాన్ని ఆ ధన భాగదారుడికి ఇవ్వాలి.

తాత్పర్యం:- ఎవడు తన నిధిని కనిపెట్టి కాని, మరొక్కడి మూలమున గాని నిధి ఇతరులకు దొరికినప్పుడది ఆ నిధి తనదియని ప్రమాణపూర్వకముగా పలికినప్పుడు రాజు ఆ నిధి గల వాడి నుండి అతడు గుణహీనుడయితే, ఆ నిధి నుండి పండెండో భాగాన్ని గుణవంతుడయితే, దాని నుండి ఆరో భాగాన్ని పన్ను రూపంలో తీసుకొని మిగిలిన భాగాన్ని ఆ ధన (నిధి) భాగదారుడికి ఇవ్వాలి. ॥35॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అనృతం తు వదన్ దండ్యస్స్వవిత్తస్యాంశమష్టమమ్ । మూలశ్లోక సం.31
తస్యైవ వా నిధానస్య సంఖ్యాయాల్పీయసీం కళామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.36

టీక:- **అనృతం తు వదన్** = ఎవడైనా అబద్ధం చెప్పినట్లయితే, అంటే ఏ ధనాన్ని గురించియైనా అది నాదని అబద్ధం చెప్పినట్లయితే అలాంటి అపరాధికి, **స్వవిత్తస్య + అష్టమమ్ + అంశం దండ్యః** = అతడి సొంత ధనంలో 8వ

భాగం జుర్మానా విధించాలి. వా = లేదా లెక్క వేసి, తస్య + ఏవ నిధానస్య **అల్పీయసీం కళామ్** = ఆ దావా ధనంలో నుండే కొంతభాగం తీసికోవాలి.

తాత్పర్యం:- ఎవడు తనది కానిదాన్ని తనది అని చెబుతాడో, అలాంటి వాడికి వాడి సొంతధనం నుండి ఎనిమిదో భాగం జుర్మానా విధించాలి. లేదా, ఆ నిధినుండి కొంత భాగం తీసుకోవాలి. ॥36॥

37 నుండి 41వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు- ఇవి ప్రామాణికం కావు

పాతిపెట్టబడిన ధనానికి బ్రాహ్మణుడే స్వామి-

* *విద్వాంస్తు బ్రాహ్మణో దృష్ట్వా పూర్వోపనిహితం నిధిమ్ ।*
అశేషతోఽప్యాదదీత సర్వస్యాధిపతిర్హి సః । ప్రక్షిప్త శ్లోక సం. ***37***

తాత్పర్యం:- పూర్వీకులెవ్వరిచేతనైనా ఉంచబడిన నిధి నిక్షేపాలను బ్రాహ్మణుడు కనుగొన్నట్లయితే, అందులో రాజుకేమి భాగంగా ఇవ్వనక్కర్లేదు. ఆ నిధి పూర్తిగా అతని సొంతమే. ॥37॥

* *యం తు పశ్యేన్నిధిం రాజాపురాణం నిహితం క్షితౌ ।*
తస్మాద్ద్విజేభ్యో దత్త్వార్ధమర్ధం కోశే ప్రవేశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***38***

తాత్పర్యం:- సొంతదారులంటూ ఎవరూలేని నిధిని రాజు తానే స్వయంగా కనుగొన్నట్లయితే, ఆ నిధిలో సగం బ్రాహ్మణులకు సత్కారాల కింద ఇచ్చి, మిగిలిన సగభాగాన్ని ఖజానాకు తరలించాలి. ॥38॥

* *నిధీనాం తు పురాణానాం ధాతూనామేవ చ క్షితౌ ।*
అర్ధభాగ్రక్షణాద్రాజా భూమేరధిపతిర్హి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***39***

తాత్పర్యం:- ఎప్పటికాలంనాటివో ఎరుగనివి, తమవికానివి, బ్రాహ్మణులవీ కానివి అయిన బంగారం మొదలైనవి ఎవరికి దొరికినా ఆ యా నిధులలో అర్ధభాగం రాజుకు చెందుతాయి. ఎందుకంటే సకల భూమికీ అతడేకదా కాపుదల, భూపతి అనిపించుకున్నవాడు రాజే కదా! ॥39॥

* *దాతవ్యం సర్వవర్ణేభ్యో రాజ్ఞా చోరైర్హృతం ధనమ్ ।*
రాజా తదుపయుంజానశ్చో రస్యాప్నోతి కిల్బిషమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***40***

తాత్పర్యం:- రాజు దొంగలు దొంగిలించిన సొత్తును కనిపెట్టి దాన్ని వారి వద్ద నుండి తీసుకొని, ఆ సొత్తుగల సొంతదారుడికి ఇవ్వాలి. ఇలా ఇవ్వకుండా రాజు తాను తీసుకోనట్లయితే, ఆ దొంగయొక్క పాపమును పొందుతాడు.॥40॥

* *జాతిజానపదాన్ ధర్మాన్ శ్రేణీధర్మాంశ్చ ధర్మవిత్ ।*
సమీక్ష్య కులధర్మాంశ్చ స్వధర్మం ప్రతిపాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***41***

తాత్పర్యం:- ధర్మవేత్త అయిన రాజు బ్రాహ్మణాది సమస్త జాతిధర్మాలు, దేశధర్మాలు, వర్తకులు మొదలైన వారి ధర్మాలు, కులవృత్తి పనివారి ధర్మాలు విశేషంగా పరిశీలించి ఆ యా వ్యవహారాలలో వారికి వర్ణములరీత్యా అన్యాయం జరగకుండా కాపాడాలి. ॥41॥

ప్రక్షిప్తాల పరిశీలన

37 నుంచి 41 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. ప్రసంగ వ్యతిరేకాలు

ముందు వెనుకల శ్లోకాలలో దొంగిలించిన ధనాన్ని ఇవ్వటాన్ని గురించి ఉంది. ఆ ప్రసంగాన్ని ఈ 37 నుంచి 39 శ్లోకాలు భంగం చేస్తున్నాయి. ముందు వెనుకల వాటిలో పాతిపెట్టిన ధనాన్ని గురించి ఏమీ చెప్పలేదు. అది 8.30-33లలో వారసులు లేని ధనం అనే దాంట్లో చెప్పేశారు. అందుకని ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలలో జాతి ఆధారంగా పక్షపాత భావంతో బ్రాహ్మణులను అందరికీ అధిపతిగా చెప్పారు. ఇది మనువు చెప్పిన కర్మ చేత వ్యవస్థ అనే దానికి వ్యతిరేకం. [1.92-10ల మీది 'పరిశీలన' సమీక్ష చూడండి].

ఖ. బ్రాహ్మణుల ద్వారా లభించే ఏ విధమైన ధనాన్నైనా 'దౌర్జన్యంగా సొంతం చేసుకోవడం' మనువు వ్యవస్థకు వ్యతిరేకం. మనువు బ్రాహ్మణులకు, తమ పనుల చేతనే ఉపాధిని సంపాదించుకుని, సంతోషంగానూ, త్యాగపూర్వకంగానూ జీవనయాత్రను సాగించవలసిందిగా చెప్పాడు [1.87; 4.2, 3, 12]. దానం తీసుకునే అధికారం ఉన్నప్పటికీ దానానికి దూరంగా ఉండమని బ్రాహ్మణులకు సలహా ఇచ్చాడు, మనువు [4.186]. మరి బ్రాహ్మణులకు ఊరికే వచ్చే ధనం మనువుకు సమ్మతం ఎలా అవుతుంది?

గ. ధర్మ నిర్ణయం కొరకు కులం, జాతి వీటిని మనువు ఆధారం చేసుకోలేదు. ధర్మ శాస్త్రాలు, ధర్మాలు, సత్యం వీటినే ప్రధాన ఆధారాలుగా చేసుకున్నాడు. సాధారణ విషయాలలో దేశ కాలాలను కూడా[8.8,44, 45,126] పరిగణించాడు. నిర్ణయాలలో కులం, జాతులను ఆధారంగా స్వీకరిస్తే, ఇక ధర్మ శాస్త్రాల అవసరం ఏముంటుంది? ప్రతి కులానికీ వాటి వాటి ధర్మాలు ప్రచారమై పోతాయి. ఈ విధంగా ఈ శ్లోకాలు, పైన చెప్పిన వాటికీ, మనువు ఉద్దేశ్యాలకూ వ్యతిరేకాలు కనుక ప్రక్షిప్తాలు. 40వ శ్లోకం కూడా ప్రక్షిప్తమే. దీనికి ముందున్న 8.35లో కొంత భాగం రాజు తీసుకుని ఎవరి ధనం వారి కివ్వాలని ఉంది. ఇది పరస్పర వ్యతిరేక విషయం.

42 నుండి 45వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

కర్తవ్య నిర్వాహకుడు అందరికీ ప్రియుడు-

స్వాని కర్మాణి కుర్వాణా దూరే సంతోఽపి మానవాః । మూలశ్లోక సం. **32**
ప్రియా భవంతి లోకస్య స్వే స్వే కర్మణ్యవస్థితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **42**

టీక:- **స్వాని కర్మాణి కుర్వాణాః దూరేసన్తోఽపి మానవాః** = తమ తమ కర్తవ్యాలను నిర్వహిస్తూ, మానవులు, **దూరే సంతః అపి** = దూరంగా ఉన్నా, **లోకస్య ప్రియా భవన్తిః** = సమాజానికి ప్రియులవుతారు, లోకప్రియులవుతారు.

తాత్పర్యం:- తమకై ఏర్పరచబడి ఏనాడో నిర్ణయమై ఉన్న కులధర్మాల్ని అనుష్ఠించేవారు -నిత్య నైమిత్తిక ధర్మాలు పాటించేవారు తమకు దరిదాపులలో ఉన్నప్పుడే కదా! ధర్మనిర్ణయం చక్కగా జరిగిందని లోకుల ప్రశంసలు అందుకుంటారు. కనుక విద్వాంసుల్ని నియమించాలి. ॥42॥

ఇది మనుకృతం-ప్రామాణికం

రాజుగాని, ప్రభుత్వాధికారులు గాని వివాదాలను పెంచరాదు-

నోత్పాదయేత్స్వయం కార్యం రాజా నాప్యన్యపూరుషః । మూలశ్లోక సం. **33**
న చ ప్రాపితమన్యేన గ్రసేదర్థం కథంచన ॥ ప్రక్షిప్త శ్లోక సం. **43**

టీక:- **రాజా అపి+అన్య పూరుషః** = రాజుగాని, మరొక రాజకర్మచారిగాని, **స్వయంకార్యం న + ఉత్పాదయేత్** = స్వయంగా ఏ విధమైన లేని వివాదాన్ని సృష్టించరాదు, ఉన్నదాన్ని పొడిగించరాదు. **చ** = మరియు, **అన్యేన ప్రాపితమ్ అర్థం** = అన్యుల ద్వారా వచ్చిన ధనాన్ని లోభం వల్ల, **కథంచన** = ఏ పరిస్థితిలో కూడా, **న గ్రసేత్** = స్వయంగా

మింగివేయాలనే కోరిక ఉండరాదు, ఈ ధనం ఎవరిది అనే విషయం తెలియనంత వరకు, ఎవడూ సొంతదారుడు లేడని తెలియనంత వరకు మధ్యలో ఏ రాజ కర్మచారి అయినా, దాన్ని కాజేయకుండా ఉండటం, కోసం రాజు ఆ ధనాన్ని తన అధీనంలో ఉంచుకోవాలి.

తాత్పర్యం:- రాజుగానీ-రాజుచేత నియమితుడైన వ్యవహారవేత్త గానీ స్వయంగా ధనం మొదలైన వాటి లోభం వల్ల వివాదం కల్పించకూడదు. లేదా వివాదాన్ని పొడిగించరాదు. అన్యుల ద్వారా వచ్చిన ధనాన్ని లోభం వల్ల ఏ పరిస్థితిలో కూడా స్వయంగా కాజేయాలనే కోరిక ఉండరాదు. ॥43॥

వివరణ:- స్థానభ్రష్టి శ్లోకాలు

8.26వ శ్లోకానికి, 8.44వ శ్లోకానికి సంబంధం ఉంది. ఇక్కడ 8.7 వరకు 18 రకాల వ్యాజ్యాల గణన చేసి 8.45 వరకు 'నిజమైన, సరైన నిర్ణయం ఎలా చేయాలి?' - అనే విషయాన్ని మనువు చెప్పాడు. సంకేతించిన క్రమం ప్రకారం తొలి వ్యాజ్యం కూడా 8.47 నుంచి ప్రారంభమవుతుంది. ఈ మధ్యలోనే పిల్లల ధనం, స్త్రీ ధనం, వారసులు లేని ధనం, నష్టమైన ధనం మొదలైన వాటికి సంబంధించిన విషయాలు విషయానుకూలంగా లేవు. ఇదేవిధంగా మిగిలిన అన్ని పద్ధతుల వ్యాజ్యాల నిర్ణయాలు చివరా 9.151 తర్వాత చెప్పారు. వీటిలో నష్టమైన లేదా అపహృత ధనాన్ని గురించి వివరాలతో పాటుగా, అపహృత - వివాదాల శిక్షలున్నాయి. చూడబోతే అన్ని శ్లోకాలూ స్థానభ్రంశం చెంది ఇక్కడికొచ్చి ముడిపడ్డట్టు తోస్తుంది. ఈ అపహృత, వివాదాల నిర్ణయాల (8.301-343) మధ్య ఇవి ఉండాలి.

8.26కు 8.44కు విషయ సంబంధం కూడా ఉంది. ఇది ఆధారంగా ఈ అన్నిటినీ ప్రక్షిప్తాలనే అవకాశం కూడా కలుగుతూంది. కాని వీటన్నిటిలో దేనికీ ప్రక్షిప్త లక్షణాలు లేవు. ఇది అతి సాధారణమైన అవసరమైన పద్ధతి, మనువు చెప్పిన దేనికీ వ్యతిరేకం కాదు. శైలి కూడా మను సమ్మతమే. అందువల్ల వీటిని మేము ప్రక్షిప్తాలని అంగీకరించడంలేదు.

న్యాయ నిర్ణయంలో అనుమాన ప్రమాణ సహాయత- ఇది మనుకృతం-ప్రామాణికం

యథా నయత్యసృక్పాతైర్మృగస్య మృగయుః పదమ్ । మూలశ్లోక సం.**34**
నయేత్తథానుమానేన ధర్మస్య నృపతిః పదమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**44**

టీక:- **యథా** = ఏవిధంగా, **మృగయుః** = వేటకాడు, **అసృక్పాతైః** = రక్తపు మరకలను బట్టి, **మృగస్య పదమ్ నయతి** = జింక యొక్క స్థానమును కనుగొంటాడో, **తథా** = అలాగే, **నృపతిః** = రాజు లేదా న్యాయాధిపతి, **అనుమానేన** = అనుమాన ప్రమాణం ద్వారా, **ధర్మస్య** = ధర్మ తత్త్వాన్ని అంటే వాస్తవిక న్యాయాన్ని, **నయేత్** = నిర్ణయించాలి.

తాత్పర్యం:- వేటగాడు తన బాణం చేత కొట్టబడి, ఎక్కడో దాగిన మృగం యొక్క ఉనికిపట్టును దాని రక్తపుచారికలు ఆనవాలుగా వెతికి పట్టుకొనేరీతిగా, రాజు విచారణలో ప్రశ్నించి, మథించి అసలు నేర వైఖరి కనిపెట్టాలి. ॥44॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సత్యమర్థం చ సంపశ్యేదాత్మానమథ సాక్షిణః । మూలశ్లోక సం.**35**
దేశం రూపం చ కాలం చ వ్యవహారవిధౌ స్థితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**45**

టీక:- **వ్యవహార విధౌ స్థితః** = న్యాయ నిర్ణయానికి కూర్చున్న రాజు గానీ లేదా న్యాయాధిపతిగానీ, **సత్యం చ అర్థం** = ఈ వివాదం సత్యమా? కాదా? ఉద్దేశమేమిటి?, **ఆత్మానమ్** = తాను రాజునని, న్యాయం చేయాలనే విషయాన్ని గుర్తుంచుకోవడం, అలాగే, **దేశం రూపం చ కాలం** = దేశ స్వరూపం అలాగే సమయాన్ని, **అథ సాక్షిణః** = అలాగే సాక్షులను, **సంపశ్యేత్** = చక్కగా చూడాలి, ఆత్మ నిర్ణయాన్ని తెలిసికోవడానికి 1.125 (2-6) శ్లోకాల వివరణలను చూడగలరు.

తాత్పర్యం:- వ్యవహారాల్ని తీర్చవలసిన రాజు ఫలితం కోసం కాక, సత్యశోధనదిశగా శ్రమించాలి. మొదట ఆ వ్యవహారాన్ని ఏ కోణం నుంచి ప్రశ్నల వర్షం కురిపించడానికి అనువుగా ఉంటుందో కనిపెట్టాలి. అది ఎలాంటి వ్యవహారం కోవలోకి వస్తుందో, సాక్షులసత్యవాదిత్వమెంతవరకు ఉందో కూడ కనుక్కోవాలి. ॥45॥

వివరణ:

'ఆత్మ నిర్ణయ' మనగా ఆత్మ ప్రేరణతో, ఆత్మసాక్షిగా సత్యనిర్ణయం చేయుట. దీన్ని తెలుసుకొనుటకు 1.125 (2.6) పైగల వివరణను చూడగలరు.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* **సద్భిరాచరితం యత్స్యాద్ధార్మికైశ్చ ద్విజాతిభిః ।**
తద్దేశకులజాతీనా మవిరుద్ధం ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***46***

తాత్పర్యం:- ధర్మ నిర్దేశకులైన బ్రాహ్మణులచేత-సజ్జనులచేత ఏ కార్యమెట్లు పరిష్కరించబడిందో (అంతకు ముందు అలాంటి వివాదాల విషయమై తీర్పెలా జరిగిందో) దానికి విరుద్ధంగా లేని విధంగా ప్రభువు అనేవాడు ఆ వ్యవహారాన్ని తాను పరిష్కరించాలి. ॥46॥

ప్రక్షిప్త పరిశీలన

46వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

అంతర్ వ్యతిరేకాలు

1. నిర్ణయాలకు ఆధారంగా మనువు ధర్మ శాస్త్రాలు, ధర్మం, సత్యం- వీటిని తీసుకుని, సాధారణ విషయాలలో దేశ కాలాలను కూడా [8.8, 44-45,126] తీసుకున్నాడే కాని, కులాలు, జాతులను కాదు. కిందటి శ్లోకంలోనే అన్నీ స్పష్టంగా చెప్పాడు. మళ్లీ తర్వాతి శ్లోకంలో ప్రక్షిప్త కారుడు మరొక పద్ధతి చెప్పాడు. దీనితో దేశంతో పాటు కులం, జాతి కూడా కలిపాడు. కులాలు, జాతుల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే, ధర్మశాస్త్రాల అవసరం ఏముంది? ఇలా పై శ్లోకాలకూ, మనుస్మృతిలోని ప్రధాన ఉద్దేశ్యానికీ ఇవి వ్యతిరేకాలయ్యాయి.

2 కులాన్నీ, జాతినీ ఏదైనా నిర్ణయానికి ఆధారంగా భావిస్తే, అది మనుస్మృతి మూల వ్యవస్థ అయిన వర్ణ వ్యవస్థకే వ్యతిరేకమవుతుంది. మనువైతే బ్రహ్మచారిని తన వర్ణం వారి దగ్గర భిక్ష తీసుకోవటాన్నే నిషేధించాడు. [2.184] అలాంటప్పుడు నిర్ణయాలకు కులాన్ని ఆధారంగా ఎన్నటికీ స్వీకరించడు. పుట్టుకతోనే జాతి అనే వాదం ప్రబలిన కాలంలో ఈ శ్లోక రచన జరిగిందని తెలిపోతూంది.

1. అప్పు తీసుకోవడం-ఇవ్వడంలో జరుగు వివాదాల విచారణ అప్పు తీసికొని ఇవ్వకుండా ఉండటం.

ఇది మనుకృతం-ప్రామాణికం

1) **ఋణ న్యాయం**

అధమర్ణార్థసిద్ధ్యర్థముత్తమర్ణేన చోదితః । మూలశ్లోక సం. **36**
దాపయేద్ధనికస్యార్థమధమర్ణాద్విభావితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **47**

టీక:- **అధమర్ణ+అర్థ సిద్ధ్యర్థం** = అప్పుతీసికొన్నవాడి నుండి, తన ధనం రాబట్టుకోవడం కోసం, **ఉత్తమర్ణేన చోదితః** = అప్పిచ్చినవాడు ఫిర్యాదు చేసినట్లయితే రాజు, **ధనికస్య విభావితమ్ అర్థం** = ధనికుడి వద్ద ఉన్న అప్పుతీసికొన్నవాడు రాసిచ్చిన పత్రమును చూసి, లెక్కచూసి, **అధమర్ణాత్ దాపయేత్** = అప్పు తీసికొన్నవాడి నుండి అప్పిచ్చినవాడికి ధనాన్ని ఇప్పించాలి.

తాత్పర్యం:- అప్పు ఇచ్చినవాడు, అప్పుతీసుకున్న వాడి మీద రాజుదగ్గర ఫిర్యాదు చేసినప్పుడు, అతడి వద్ద గల ఋణపత్రం మొదలైనవి పరిశీలించి అందలి నిబంధనలు తెలుసుకొని, అప్పు తీసుకున్నవాడి నుంచి ధనాన్ని రాబట్టి ఋణదాతకు ఇప్పించాలి. ॥47॥

48 నుండి 50వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *యైర్యైరుపాయైరర్థం స్వం ప్రాప్నుయాదుత్తమర్ణికః ।*
తైస్తైరుపాయై స్సంగృహ్య దాపయేదధమర్ణికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***48***

తాత్పర్యం:- ఋణగ్రహీత నుంచి ధనాన్ని రాబట్టడానికి ఈ ఉపాయాలలో ఏదో ఒకటి ప్రయోగించి, అప్పు ఇచ్చినవాడికి సొమ్ము తిరిగి అందేలా చూడడంలో కృతకృత్యులు కావాలి. ॥48॥

* *ధర్మేణ వ్యవహారేణ ఛలేనాచరితేన చ ।*
ప్రయుక్తం సాధయేదర్థం పంచమేన బలేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***49***

తాత్పర్యం:- ధర్మమార్గాన్ని అవలంబించడం (అంటే.....మంచి మాటలతో బంధువుల/ హితులచేత చెప్పించడం), తాను సౌమ్యంగా చెప్పిచూడటం, ప్రారంభంలో జరగాలి. అప్పటికీ అతడు విననివాడైతే, అతని పశువులను, భార్యాబిడ్డలను నిర్బంధిస్తామని బెదిరించాలి. చివరగా వారిని దండించడానికికూడా వెనుకాడకపోవడం లాంటి చర్యలచేత ధనాన్ని ఋణగ్రహీత నుంచి రాబట్టి, ఋణదాతకు అందేలా చూడాలి.॥49॥

* *యః స్వయం సాధయేదర్థముత్తమర్ణోఽధమర్ణికాత్ ।*
న స రాజ్ఞాఽభి యోక్తవ్యః స్వకం సంసాధయన్ ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***50***

తాత్పర్యం:- అప్పు ఇచ్చినవాడు తన ధనమును ఋణగ్రహీతనుండి రాబట్టుకోడానికి అధమర్ణుణ్ణి ఏ ఉపాయాలచేత పీడించినా, రాజు తనతో చెప్పకుండా ఎలా నిర్బంధిస్తావని అప్పు ఇచ్చినవాడిని విచారించరాదు. ॥50॥

ప్రక్షిప్తాల పరిశీలన

48 నుంచి 50 వరకున్న శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి.

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. పూర్వాపర శ్లోకాలలోని విషయం, న్యాయస్థానంలో షావుకారు విన్నపం చేసే విధానాన్ని గురించి మధ్యలో 'ఏ యే ఉపాయాలతో ధనం ఇప్పించాలి?' మొదలైన విషయా లుండటం అసంగతం.

ఖ. షావుకారు న్యాయాలయంలో విన్నపం చేయటానికి వచ్చినప్పుడు, న్యాయస్థానం ద్వారా ధనం అతనికి లభిస్తుంది. 50వ శ్లోకంలో 'స్వయంగా ధనాన్ని వసూలు చేసుకోవటం' గురించి చెప్పటం పూర్వాపర ప్రసంగాలకు వ్యతిరేకం న్యాయస్థానంలో అతడు విన్నపం చేస్తుంటే, స్వయంగా ధనం వసూలు చేసే అవకాశం ఉంటుందా?

ఇక్కడ కేవలం నిర్ణయాలు తీసుకోవటం, శిక్షా వ్యవస్థల విషయమే ఉంది. వ్యవహారం, మోసం మొదలైన విషయాలు చెప్పటం అసంగతం.

గ. 47, 51వ శ్లోకాలలో ఏకవాక్యత ఉంది. మధ్యలోని శ్లోకాలు దీన్ని భంగం చేస్తున్నాయి. ఈ విధంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో వ్యవహారం, మోసం మొదలైన వాటి ద్వారా షావుకారుకు ధనం ఇప్పించడం, స్వయంగా ధనం వసూలు చేసుకోవటం తదితర విషయాలు, మనువు చెప్పిన వ్యవహార నిర్ణయపు మొత్తం వ్యవస్థకూ వ్యతిరేకాలు. ఈ వ్యవస్థలో వివాదం చెలరేగితే సాక్షి మొదలైన వారి ద్వారా ధర్మ యుక్త నిర్ణయం చేయటానికి రాజుకు అధికారం ఉండని ఉంది. [8.8-9, 52-122].వీటిలో పైన చెప్పిన ఆ వ్యవస్థతో ఎటువంటి అవసరమూ ఉండదు.

51 నుండి 61వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

అర్థేఽపవ్యయమానం తు కరణేన విభావితమ్ । మూలశ్లోక సం.**37**
దాపయేద్ధనికస్యార్థం దండలేశం చ శక్తితః । ప్రక్షిప్త శ్లోక సం.**51**

టీక:-**కరణేన విభావితమ్** = ప్రామిసరీ నోటు ద్వారా గాని, సాక్ష్యముల ద్వారా గాని, అప్పుతీసికొన్నట్లు నిర్ధారణ కాగా, **తు** = మరియు, **అర్థే+అపవ్యయమానమ్** = అప్పుకలవాడు తీసికొనిన ధనము చెల్లించనని తిరస్కరించినప్పుడు, రాజు, **ధనికస్య+అర్థం దాపయేత్** = ధనికునకు ధనము తిరిగి యిప్పించవలెను. **శక్తితః దండలేశమ్** = అంతేగాక, వాని శక్తికి తగినట్లు దండమును (జుర్మానా) విధించవలెను.

తాత్పర్యం:- అప్పుతీసుకొని తీసుకోలేదని వాదించే వాడి విషయమై పత్రం, సాక్షి మొ॥ వాటివల్ల వాడి అప్పును నిర్ధారించి, అప్పును సొంతగాడికి ఇప్పించుటయే కాకుండా, వాడి శక్తికి తగినట్లు దండమును విధించాలి. ॥**51**॥

ఋణదాత నుండి పత్రాది ప్రమాణాలను స్వీకరించుట- **ఇది మనుకృతం-ప్రామాణికం**

అపహ్నవేఽధమర్ణస్య దేహీత్యుక్తస్య సంసది । మూలశ్లోక సం.**38**
అభియోక్తాదిశేద్దేశ్యం కరణం వాఽన్యదుద్దిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52**

టీక:- **సంసది** = న్యాయ సభలో, **దేహి + ఇతి + ఉక్తస్య** = ధనము చెల్లించుమని న్యాయాధిపతి అడిగినప్పుడు, **అధమర్ణస్య అపహ్నవే** = తీసికొన్నవాడు, నేను ధనం తీసికోలేదనియు, నాకేమాత్రము తెలియదనియు బుకాయించినప్పుడు, **అభియుక్తా** = అప్పిచ్చిన దాత తన వద్ద నున్న, **దేశ్యమ్** = ప్రమాణ పత్రమును, ప్రామిసరీనోటు (లేఖ) ను ప్రత్యక్ష సాక్ష్యమును, **దిశేత్** = చూపించవలెను. **అన్యం కరణం ఉద్దిశేత్** = ఇతర ప్రమాణములను చూపించవలెను.

తాత్పర్యం:- అప్పు ఇచ్చినవాడి సొమ్ము చెల్లించుమని న్యాయమూర్తి అధమర్ణుడితో చెప్పినప్పుడు వాడు నేను ఋణం తీసికోలేదని చెప్పినట్లయితే అప్పు ఇచ్చినవాడు తాను ఋణమిచ్చినట్లు, సాక్షిని, అప్పుతీసికొన్నవాడు రాసియిచ్చిన పత్రం మొదలైన సాధనములను న్యాయమూర్తికి చూపించాలి. ॥52॥

దావాలో అప్రమాణిక వ్యక్తులు- **ఇవి మనుకృతం-ప్రామాణికం**

అదేశ్యం యశ్చ దిశతి నిర్దిశ్యాపహ్నుతే చ యః । మూలశ్లోక సం.**39**
యశ్చాధరోత్తరానర్థాన్ విగీతాన్నావబుధ్యతే । ప్రక్షిప్త శ్లోక సం.**53**

అపదిశ్యాపదేశ్యం చ పునర్యస్త్వపధావతి । మూలశ్లోక సం.**40**
సమ్యక్ ప్రణిహితం చార్థం పృష్టస్సన్నాభినందతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**54**

అసంభాష్యే సాక్షిభిశ్చ దేశే సంభాషతే మిథః । మూలశ్లోక సం.**41**
నిరుచ్యమానం ప్రశ్నం చ నేచ్ఛేద్యశ్చాపి నిష్పతేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**55**

బ్రూహీత్యుక్తశ్చ న బ్రూయాదుక్తం చ న విభావయేత్ । మూలశ్లోక సం.**42**
న చ పూర్వాపరం విద్యాత్తస్మాదర్థాత్స హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**56**

ఈ కింది కారణాల వల్ల మనుషుడు దావా ఓడిపోతాడు.

53వ శ్లోకం-

1. ఋణదాత, **అదేశ్యం దిశతి**= అబద్ధపు సాక్ష్యాన్ని చూపినా, తప్పుడు ప్రమాణ పత్రాన్ని చూపినప్పుడు.
2. **యః** = ఎవడు, **నిర్దిశ్య** = ప్రమాణ పత్రాన్ని దాఖలుపరచి, తిరిగి కాదని చెప్పినప్పుడు.
3. **యః** = ఎవడు, **విగీతాన్ అధం-ఉత్తరాన్ అర్థాన్ న అవబుధ్యతే** = ముందు చెప్పిన మాటకు తరువాత చెప్పే మాటకు సంబంధం ఉండదో-పూర్వాపరవాక్కులు పరస్పర విరుద్ధంగా ఉంటుందో.

54వ శ్లోకం

4. **యః** = ఎవడు, **అపదేశ్యం + అపదిశ్య పునః అపధావతి** = తన తర్కాన్ని చూపించి, మళ్ళా మార్చుకొంటాడో
5. **యః** = ఎవడు, **సమ్యక్ ప్రణిహితం అర్థం పృష్టఃసన్** = మొదట ప్రమాణం చేసి, న్యాయాధీశుడు మళ్ళా అడిగినప్పుడు, **న+అభినందతి** = అంగీకరించడో, సమర్థించడో.

55వ శ్లోకం

6. **అసంభాష్యే దేశే సాక్షిభిః మిథః సంభాషతే** = ఏకాంత స్థానానికి వెళ్ళి, సాక్షులతో కలిసి గుసగుస చేస్తాడో.
7. **నిరుచ్యమానం ప్రశ్నం న + ఇచ్ఛేత్** = పరీక్షించడానికి ప్రశ్నించినప్పుడు కలవరపడునో, ఇష్టపడడో
8. **చ యః అపి నిష్పతేత్** = ప్రశ్నించినప్పుడు అటు యిటు తిరుగునో

56వ శ్లోకం

9. **బ్రూహి+ఇతి+ఉక్తః+న బ్రూయాత్** = అడిగినప్పుడు ఏమీ చెప్పడో
10. **ఉక్తం న విభావయేత్** = చెప్పిన విషయాన్ని సమర్థించుకోలేదో
11. **న పూర్వాపరం విద్యాత్** = ముందు వెనుకలు తెలియక మాట్లాడునో

సః తస్మాత్ అర్థాత్ స ప్రహీయతే = అలాంటివాడు తన వ్యాజ్యాన్ని చెడగొట్టుకొన్న వాడవుతాడు. అంటే న్యాయాధీశుడు అలాంటివాడిని ఓడిపోయినవాడుగా భావించి ఆ ధనాన్ని ఇప్పించరాదు. ॥53-56॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సాక్షిణస్సంతి మేత్యుక్త్వా దిశేత్యుక్తో దిశేన్న యః । మూలశ్లోక సం.**43**
ధర్మస్థః కారణైరేతైర్హీనం తమపి నిర్దిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**57**

టీక:- మే సాక్షిణః సన్తి ఇతి ఉక్త్వా = మొదట నాకు సాక్షులున్నారని చెప్పి, తరువాత న్యాయాధీశుడి ద్వారా, **దిశ ఇతి+ఉక్తః** = సాక్షులను చూపించుమని న్యాయాధీశుడు అడగ్గా, **యః న దిశేత్** = సాక్షులను చూపించలేకపోయినట్లయితే, **ధర్మస్థః** = ధర్మాసనమందున్న న్యాయాధీశుడు, **ఏతైః కారణైః** = ఈ కారణాల నాధారం చేసికొని, **తమ్+అపి హీనం నిర్దిశేత్** = ఆ వ్యాజ్యం చెల్లదని కొట్టివేయవచ్చు.

తాత్పర్యం:- అప్పుతీసికొన్నవాడు తీర్పరిచే నీవెక్కడ అప్పుతీసికొంటివని అడిగినప్పుడు, ఎవడు నేను ఆ ప్రదేశంలో అప్పుడు లేనని చెప్పుతాడో, తాను మొదట అప్పుతీసుకొన్న చోటు మొదలైనవి చెప్పి నేనట్లు చెప్పనే లేదని మాట తప్పునో, ఎవడు ముందొక్కటి చెప్పి, వెనుక ఒక్కటి చెప్పి, తారుమారుగా మాటలాడునో, ఎవడు నాచేత నుండి ఒక ఫలం బంగారు తీసికొన్నాడని మొదట చెప్పి, ఆవల నా కొడుకు చేతినుండి తీసికొన్నాడని ముందుదానికి విరుద్ధంగా చెబుతాడో, తీర్పరి అప్పును నీ విదివరకే చెల్లించితివంటివే, ఏల ఎవరిని సాక్షిని దగ్గర నుంచుకొనక చెల్లించితివని

అడిగినట్లయితే, బదులు చెప్పలేక ఊరుకుంటాడో, ఎవడు మాటలాడ తగని ప్రదేశంలో నుండి సాక్షులతో ముందుగా ఇలా చెప్పండని రహస్యంగా మాటలాడుతాడో, చెప్పినసంగతి స్థిరపరచడం కోసం తీర్పరివేసే ప్రశ్నను వేయవలదని చెప్పుతాడో, ఎవడు ముందుచెప్పిన సంగతులను మళ్ళీ చెప్పమని తీర్పరి అడిగినప్పుడు చెప్పక చోటు విడిచి వేరొక చోటుకు పోతాడో, ఎవడు చెప్పుమని తీర్పరి అడిగినప్పుడు ఏమీ చెప్పకుండా ఉంటాడో, చెప్పినసంగతి ఋజువు చేయమన్నప్పుడు ఎవడు ఋజువుచేయడో, ఎవడు ముందువెనకలు తెలియక మాట్లాడతాడో, ఎవడు తనకు సాక్ష్యులున్నారని మొదట చెప్పి, వారిని పిలుచుకొని రమ్మని తీర్పరి అడిగినట్లయితే సాక్షులను, పిలిపించడో, అలా వాడు తన వ్యవహారమును చెడగొట్టుకొన్నవాడని ధర్మాధికారి ఈ పై కారణాల వల్ల అతడి వ్యాజ్యం చెడినదని తీర్పు చెప్పాలి. ॥57॥

ఇది మనుకృతం.ప్రామాణికం

అభియోక్తా న చేద్బ్రూయాద్బధ్యో దండ్యశ్చ ధర్మతః । మూలశ్లోక సం.**44**
నచేత్త్రిపక్షాత్ ప్రబ్రూయాద్ధర్మం ప్రతి పరాజితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**58**

టీక:- అభియోక్తా న చేత్ బ్రూయాత్ = వాది న్యాయాలయంలో, (కోర్టులో) దావావేసి, మళ్ళా తన దావా గురించి ఏమీ తెలియజేయనట్లయితే, అతడు, **ధర్మతః వధ్యః** = శిక్షణీయుడవుతాడు , **చ** = మరియు, **దండ్యః** = జుర్మానా వేయతగినవాడవుతాడు. ఇదేవిధంగా, **త్రిపక్షాత్ న చేత్ బ్రూయాత్** = మూడు పక్షాల (45 రోజుల) వరకు తన పక్షాన్ని గురించి ఏమీ మాట్లాడనట్లయితే, **ధర్మం ప్రతి పరాజితః** = ధర్మాన్ననుసరించి అంటే చట్టం ప్రకారం అతడు ఓడిపోయినవాడవుతాడు.

తాత్పర్యం:- ఎవడు కార్యం కోరి రాజసభలో నివేదించి తగిన కారణం మొదలైనవి నిరూపించడేని, స్వల్పవిషయంలో వాణ్ణి కట్టివేయాలి. గొప్ప విషయంలో న్యాయానుసారంగా దండన విధించాలి. అధమర్ణుడు మూడు పక్షములలోపల తన వ్యవహారం గురించి ఏమీ చెప్పుకోలేకపోతే అతడు ఓడి ఉత్తమర్ణుడికి పైకం చెల్లించుకోవాల్సినవాడవుతాడు. ॥58॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యో యావన్నిహ్నువీతార్థం మిథ్యా యావతి వా వదేత్ । మూలశ్లోక సం.**45**
తౌ నృపేణ హ్యధర్మజ్ఞౌ దాప్యౌ తద్ద్విగుణం దమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**59**

టీక:- యః = ఏ అప్పుతీసికొన్నవాడు, **యావత్ అర్థం నిహ్నువీత** = ఎంత ధనాన్ని దాస్తాడో, అంటే అధిక ధనం తీసికొని, తక్కువ తీసుకొన్నానని అబద్ధమాడతాడో, **వా** = లేదా, అప్పు ఇచ్చినవాడు, ధనికుడు, **యావతి మిథ్యావదేత్** = ఎంత అబద్ధం చెప్పుతాడో అంటే అప్పుగా ఇచ్చిన ధనం కంటే ఎక్కువ చెప్పుతాడో, **నృపేణ** = రాజు, **తౌ అధర్మజ్ఞౌ** = అబద్ధమాడే ఇద్దరు-అప్పు తీసికొన్నదానికంటే తక్కువ తీసికొన్నానని చెప్పి అప్పుదారుడు తాను అప్పుగా ఇచ్చిన ధనం కంటే అధికంగా ఇచ్చానని చెప్పే దాత ఆ ఇద్దరు అధర్మజ్ఞులే అంటే అబద్ధం చెప్పినట్లే, వారిద్దరికీ, **తత్ ద్విగుణం ధనమ్ దాప్యౌ** = ఎంత రావాలో అబద్ధం చెప్పినదానికి రెట్టింపు జుర్మానా వేసి దండించాలి.

తాత్పర్యం:- ఏ ప్రతివాది (అప్పుతీసుకొన్నవాడు) నేను అంతపైకం తీసికోలేదని అబద్ధం చెబుతాడో (అప్పిచ్చినవాడు) తానిచ్చిన దానికంటే ఎక్కువుగా ఇచ్చానని అబద్ధం చెబుతాడో ఆ ఇద్దరూ అధర్మజ్ఞులే. న్యాయమూర్తి వారు చెప్పిన అబద్ధపు ధనం కంటే రెండింతలు జుర్మానా విధించాలి. ॥59॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పృష్టోఽపవ్యయమానస్తు కృతావస్థో ధనైషిణా । మూలశ్లోక సం.**46**
త్ర్యవరైస్సాక్షిభిర్భావ్యో నృపబ్రాహ్మణసన్నిధౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**60**

టీక:- **ధనైషిణా కృతావస్థ** = ధనాన్ని తిరిగి ఇవ్వాలని అప్పిచ్చినవాడు కోరగా, **స్పష్టః** = న్యాయాధీశుని ద్వారా అప్పుతీసుకున్నవాడిని పిలిపించి అడిగిన మీదట, **అపవ్యయమానః** = తీసుకున్న వాడిని పిలిపించి అడిగిన మీదట; అపవ్యయమానః = తీసుకున్నవాడు “నేను అప్పు తీసుకొనలేదని, తిరిగి ఇవ్వవలసిన అవసరం లేదని చెప్పిన మీదట; అప్పిచ్చినవాడు, **నృపబ్రాహ్మణ సన్నిధౌ** = రాజు లేదా నియుక్త విద్వాంసుడైన న్యాయాధీశుని సమీపంలో; **త్ర్యవరైః సాక్షిభిః భావ్యః** = కనీసము ముగ్గురి సాక్షుల ద్వారా తన పక్షాన్ని నిరూపించుకోవాలి.

తాత్పర్యం:- ధనం కోరునట్టి ఉత్తమర్ణుడు రాజువద్ద చెప్పగా, అధమర్ణుడు రాజపురుషులచేత పిలిపింపబడి, ధర్మజ్ఞుడిచేత అడుగబడి నేను బాకీ పడలేదని చెప్పినట్లయితే అప్పుడు రాజునియమించిన బ్రాహ్మణుల సమక్షంలో ఉత్తమర్ణుడు ముగ్గురుకంటే తగ్గని సాక్షులచేత తన బాకీని రుజువు పరచాలి.॥60॥

సాక్షుల స్వరూపం:సాక్షి ఎవడు?- ఇది మనుకృతం. ప్రామాణికం

యాదృశా ధనిభిః కార్యా వ్యవహారేషు సాక్షిణః । మూలశ్లోక సం. **47**
తాదృశాన్ సంప్రవక్ష్యామి యథా వాచ్యమృతం చ తైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **61**

ధనిభిః = అప్పు ఇచ్చేవారికి, **వ్యవహారేషు** = దావాలలో, **యాదృశాః సాక్షిణః కార్యాః** = ఎలాంటివారిని సాక్షులుగా పెట్టుకోవాలో, **తాదృశాన్** = అలాంటివారిని, **చ** = మరియు, **తై** = ఆ సాక్షులకు, **యథా ఋతం వాచ్యమ్** = సత్యమెలా చెప్పాలో, అలాంటి విధానాన్ని, **సంప్రవక్ష్యామి** = ముందు తెలుపుతాను.

తాత్పర్యం:- అప్పు ఇచ్చేవారికి దావాలలో ఎలాంటివారిని సాక్షులుగా నియమించాలో- అలాంటివారిని, ఆ సాక్షులకు సత్యమెలా చెప్పాలో, అలాంటి విధానాన్ని ముందు తెలుపుతాను వినండి. ॥61॥

ఇది ప్రక్షిప్తం.ప్రామాణికం కాదు

* ***గృహిణః పుత్రిణో మౌలాః క్షత్రవిట్శూద్రయోనయః ।***
అర్థ్యుక్తా స్సాక్ష్యమర్హంతి న యే కేచిదనాపది ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***62***

తాత్పర్యం:- ఆలుబిడ్డలున్నవారైనట్టి స్వదేశంలో గల క్షత్రియులు-వైశ్యులు-విప్రులు కోరినమీదట వచ్చినవారై, సాక్ష్యం చెప్పదగినవారు, ఆపత్సమయాల్లో వచ్చి సాక్ష్యం చెప్పేవారే తప్ప, మిగిలిన వేళల్లో వారు సాక్షులు కారు. (అంటే-వృత్తి సాక్షులు కారు) ॥62॥

ప్రక్షిప్త పరిశీలన

62వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 63-73 శ్లోకాలలో చెప్పిన సాక్షుల సాధారణ లక్షణాలకు వ్యతిరేకమైనవి ఈ శ్లోకంలో ఉన్నాయి. ఇవి సాక్షుల గొప్పతనాన్ని చూపడం లేదు. 63వ శ్లోకానికి వ్యతిరేకంగా ఉండటం చేత ఇది ప్రక్షిప్తం.

ఖ. ఈ శ్లోకంలో బ్రాహ్మణులను ఈ వ్యవస్థలో పరిగణించలేదు. కానీ, 63వ శ్లోకంలో సాక్ష్యానికి అన్ని వర్ణాల వారూ రావచ్చునని ఉంది.

2. ప్రసంగ వ్యతిరేకం

61వ శ్లోకానికి 63తో ప్రసంగ సంబద్ధత ఉంది. 61లో ‘సాక్షి ఎలా ఉండాలో నేనిప్పుడు చెబుతాను’ అని ఉంది. దాన్ని 63లో చెప్పారు. 61, 63లలో **‘కార్యః’** అనే పదం వాటి పరస్పర సంబద్ధతను చేకూరుస్తూంది. 62లో ‘సాక్షులెవరు?

ఎవరు కారు?'- అనే విషయం పూర్వాపర శ్లోకాల సంబద్ధతను భంగం చేస్తూంది. అందుచేత ఇది ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తం.

63,64వ శ్లోకం మనుకృతం-ఇవి ప్రామాణికం

అప్తాస్సర్వేషు వర్ణేషు కార్యాః కార్యేషు సాక్షిణః । మూలశ్లోక సం. **48**
సర్వధర్మవిదోఽలుబ్ధా విపరీతాంస్తు వర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **63**

టీక:- సర్వేషు వర్ణేషు = వర్ణాలన్నిటిలో, **అప్తాః** = ధార్మికులు, విద్వాంసులు, కపటంలేనివారు, **సర్వధర్మ విదః** = అన్ని విధాల ధర్మం తెలిసినవారు, **అలుబ్ధాః** = లోభం లేనివారు సత్యవాదులైనవారిని, **కార్యేషు** = న్యాయ వ్యవహారాల్లో, **సాక్షిణః కార్యాః** = సాక్షులుగా పెట్టుకోవాలి, **విపరీతాంస్తు వర్జయేత్** = ఇందుకు విరుద్ధమైనవారిని సాక్షులుగా అంగీకరించరాదు.

ఋషి దయానందభాష్యం:- అన్ని వర్ణాలలోను ధార్మికులు, విద్వాంసులు, కపటం లేనివారు, అన్నివిధాల ధర్మం తెలిసినవారు, లోభం లేనివారు, సత్యవాదులైనవారిని న్యాయవ్యవహారాల్లో సాక్షులుగా పెట్టుకోవాలి. ఇందుకు విరుద్ధమైనవారిని సాక్షులుగా అంగీకరించరాదు.(స.ప్ర. 6వ సము) ॥63॥

వివరణ:

సాక్షి శబ్దాన్ని గురించి పరిశీలన-వాస్తవంగా ఆ సంఘటనను ప్రత్యక్షంగా చూసినవాడే సాక్షి. సహపూర్వక 'అక్షి'కి ఇన్ ప్రత్యయం లేదా, **'సాక్షాత్'** అవ్యయం నుండి **"సాక్షాత్ ద్రష్టరితి సంజ్ఞాయామ్"** (అష్టా 5-2-91) నుండి 'ఇని' ప్రత్యయం చేర్చగా, **'సాక్షిన్'** శబ్దం సిద్ధమవుతుంది. **సాక్షిన్-యః సాక్షాత్ కర్తా = సాక్షాత్ ద్రష్టా యః సః సాక్షీ** ఈ శ్లోకంలో **'అప్తా'** శబ్దం విశేషణం. ఈ పై అర్థాన్నే **'అప్త'** శబ్దం సూచిస్తుంది. (స.ప్ర. 6వ సము.)

సాక్ష్యానికి అనర్హులెవరు?- ఇది మనుకృతం-ప్రామాణికం

నార్థ సంబంధినో నాప్తా న సహాయా న వైరిణః । మూలశ్లోక సం. **49**
న దృష్టదోషాః కర్తవ్యా న వ్యాధ్యార్తా న దూషితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **64**

టీక:- **అర్థ సంబంధినః** = అప్పిచ్చేవాడితో ఆర్థికపరమైన లావాదేవీలు కలవారు, **న కర్తవ్యా** = సాక్షులుగా ఉండటానికి అనర్హులు, **న ఆప్తాః** = సన్నిహిత మిత్రులు, **న సహాయః** = సేవకులు (నౌకర్లు), **న వైరిణః** = విరోధులు, **న దృష్ట దోషాః** = తప్పుడు సాక్షిగా ప్రసిద్ధమైనవారు, **న వ్యాధి+ఆర్తాః** = రోగ పీడితులు, **న దూషితాః** = అపరాధులు కోర్టులో శిక్షపడినవారు. వీరు సాక్షులుగా ఉండటానికి అనర్హులు.

తాత్పర్యం:- డబ్బు సంబంధం గలవారు, మిత్రులు, విరోధులు, రోగపీడితులు, సేవకులు, తప్పుడు సాక్ష్యమిచ్చేవారు, అపరాధులు కోర్టులో శిక్ష పడినవారు. ॥64॥

65 నుండి 67వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *న సాక్షీ నృపతిః కార్యో న కారుకకుశీలవౌ ।*
న శ్రోత్రియో న లింగస్థో న సంగేభ్యో వినిర్గతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***65***

తాత్పర్యం:- రాజును సాక్షిగా ఉంచరాదు. అలాగే వంటపనివారు, నాట్యమేళాల వారు తమ తమ పనుల్లో నిమగ్నమై ఉంటారు కాబట్టి వారు కూడ పనికిరారు. బ్రహ్మచారి, సన్న్యాసి తమ కృత్యములలో అసక్తులై ఉంటారు కాబట్టి సాక్షిగా ఉండదగనివారు. ॥65॥

* నాధ్యధీనో న వక్తవ్యో న దస్యుర్న వికర్మకృత్ ।
న వృద్ధో న శిశుర్నైకో నాంత్యో న వికలేంద్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***66***

తాత్పర్యం:- ఆగర్భదాసుణ్ణి గాని, క్రూరకార్యాలుచేసే దొంగను గాని, నిషిద్ధమైన పనులు చేసేవారిని గాని, వృద్ధులను, బాలురను, ఒంటరివారిని, చండాలాదులను, చాంచల్యం గలవారినీ సాక్షులుగా ఉంచరాదు. ॥66॥

* నార్తో న మత్తో నోన్మత్తో న క్షుత్తృష్ణోపపీడితః ।
న శ్రమార్తో న కామార్తో న క్రుద్ధో నాపి తస్కరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***67***

తాత్పర్యం:- బంధు వినాశం వల్ల బాధపడేవాణ్ణి, మద్యపానాదులు సేవించువాణ్ణి, పిచ్చివాణ్ణి, ఆకలిదప్పులు గలవారిని దారినడక మొదలైన వాటి వల్ల అలసిపోయినవారిని, కామార్తుణ్ణి, కోపం గలవాడిని, దొంగను సాక్షులుగా ఉండటానికి అనర్హులు. ॥67॥

ప్రక్షిప్తాల పరిశీలన

65 నుంచి 67 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

1. 65లో కార్మికుడు, నటుడు మొదలైనవారిని సాక్షులుగా పిలవడం నిషిద్ధం అని ఉంది. సంప్రదాయాలు వికృతమైపోయిన తర్వాత, వర్ణ వ్యవస్థ జాతి ఆధారంగా మారిపోయిన కాలంలో రచించిన శ్లోకం అనిపిస్తుంది. ఎందుకంటే- కార్మికుడిది వేరు జాతి కాదు, ఇది వైశ్యులు చేసే పని. వైశ్యులు సాక్షులుగా రావచ్చునన్నప్పుడు[8.63,68], కార్మికుణ్ని ప్రత్యేకించి నిషేధించడం ఈ వ్యవస్థకు అనుకూలం కాదు.

2. 66వ శ్లోకంలో అంత్యజులను సాక్ష్యానికి పనికి రారని నిషేధించారు. కానీ 68లో చక్కని పద్ధతి ఉంది ఈ వ్యతిరేకత కారణంగా ఇది ప్రక్షిప్తం.

2. పునరుక్తులు

66-67 శ్లోకాలలో చెప్పినట్లుగా, బహుశా అందరూ 64వ శ్లోకం కిందికే వస్తారు- 'వ్యాధిగ్రస్తుల'లో వికలాంగులు, ఆర్తులు, మత్తులు,ఉన్మత్తులు, శ్రమించేవారు, కామర్తులు మొదలైనవారు. **'దూషితాః దృష్ట దోషాః'** తో దస్యులు, వికర్మకృతులు, అంత్యులు, చోరులు మొదలైనవారు. ఇట్లా ఈ శ్లోకం 64కు పునరుక్తే అయింది. దీంట్లో స్వతంత్రమూ, కొత్తదీ అయిన విషయమేదీ లేదు.

68, 69 శ్లోకాలు మనుకృతం- ఇవి ప్రామాణికం

విశేష సందర్భంలో విశేషమైన సాక్షి -

స్త్రీణాం సాక్ష్యం స్త్రియః కుర్యుర్ద్విజానాం సదృశా ద్విజాః । మూలశ్లోక సం.**50**
శూద్రాశ్చ సంత శ్శూద్రాణామంత్యానా మంత్యయోనయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**68**

టీక:- **స్త్రీణాం సాక్ష్యం స్త్రియః** = స్త్రీలకు సాక్షిగా స్త్రీలు, **ద్విజానాం ద్విజాః** = ద్విజులకు ద్విజులు. బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు, **శూద్రాణాం శూద్రాః** = శూద్రులకు శూద్రులు, **అన్త్యానాం +అన్త్యయోనయః కుర్యుః** = అన్త్యజులకు అన్త్యజులే సాక్షిగా ఉండాలి, **సదృశః** = సమాన బల సంపన్నులు, **సంతః** = సాధు స్వభావులు.

తాత్పర్యం:- .....ఋణదానాది విషయాలలో స్త్రీలకు స్త్రీలు ఉండవచ్చును. ద్విజులకు అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, శూద్రులకు శూద్రులు సమాన బలసంపన్నులు సాధుస్వభావులు సాక్షులుగా ఉండవచ్చు. ॥68॥

వివరణ:

1.సాక్షి విశేష కథనానికి-అభిప్రాయం

పూర్వాపర సాక్షివర్ణన సందర్భ శ్లోకాల వల్ల-విశేషంగా 8.63,64,69,72 శ్లోకాల వల్ల-ఎవరైనా సాక్షిగావచ్చునని స్పష్టమవుతుంది. ఈ శ్లోకంలో ఉన్న విశేషమైన సాక్షికథనానికి ఒక విశేషమైన అభిప్రాయముంది. స్త్రీల సంబంధమైన ప్రసంగంలో-స్త్రీలే సరియైన సాక్షులుగా ఉండటం, సత్యానుకూలం. అదే విధంగా ద్విజులలో, శూద్రులలో ఆ వర్ణాలకు సంబంధించిన వారే ప్రామాణికంగా సరైన సాక్షులు.

2. (అన్త్యయోనయః) అన్త్యజుడెవడు: నాలుగు వర్ణాలలో దీక్షితుడు కాకుండా, వర్ణ బాహ్యుడుగా ఉండేవాడు. అతడు అన్త్యజుడు అంటే అంత్యస్థానీయుడు.

ఏకాంతంలో జరిగిన అపరాధాలకు సాక్షులందరూ అర్హులే- ఇది మనుకృతం. ప్రామాణికం

అనుభావీ తు యః కశ్చిత్కుర్యాత్సాక్ష్యం వివాదినామ్ । మూలశ్లోక సం. **51**
అంతర్వేశ్మన్యరణ్యే వా శరీరస్యాపి చాత్యయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **69**

టీక:- **అంతః + వేశ్మని** = ఇంటిలోపల, ఏకాంతలో జరిగిన సంఘటనలో, సన్నివేశంలో, **వా** = లేదా, **అరణ్యే** = అరణ్యంలో ఏకాంతంగా జరిగిన సందర్భంలో, **అపి చ** = మరియు, **శరీరస్య అత్యయే** = రక్తపాదాదుల వల్ల క్షతగాత్రులైన సందర్భంలో, **యః కశ్చిత్ అనుభావీ** = ఎవడు కన్నులారా చూసి అనుభవించాడో (Feel) అతడు, **వివాదినామ్** = వివాదం చేసేవారికి, **సాక్ష్యం కుర్యాత్** = అతడెవడైనా సాక్షికావచ్చు.

ఋషి దయానందభాష్యం:- ఇంటిలోపల, అరణ్యంలో రక్తపాతం వల్ల క్షతగాత్రులైన సందర్భంలో ఎవడు కన్నులార చూసి అనుభవించాడో అతడు, వాది ప్రతివాదులవిషయంలో అతడెవడైనా సాక్షికావచ్చు.(స.ప్ర. 6వ సము.) ॥69॥

70,71వ శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *స్త్రియాఽప్యసంభవే కార్యం బాలేన స్థవిరేణ వా ।*
శిష్యేణ బంధునా వాఽపి దాసేన భృతకేన వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***70***

తాత్పర్యం:- ఇంటిలోపలగాని, వెలుపలగాని చౌర్యసంబంధమైనవి చూసినవారిలో స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, బంధువులు, కూలివాడు, సేవకుడు సాక్షులుగా ఉండదగినవారు. ॥70॥

* *బాలవృద్ధాతురాణాం చ సాక్ష్యేషు వదతాం మృషా ।*
జానీయాదస్థిరాం వాచముత్సిక్తమనసాం తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***71***

తాత్పర్యం:- అయితే-బాలురు వృద్ధులు, రోగులు, అబద్ధాలు చెప్పేవారు, తత్తరపాటు మనస్సుగలవారు వీరి సాక్ష్యం నిలకడగా ఉండదు కాబట్టి వీరిని విచారించేటప్పుడు జాగ్రత్తగా కనిపెట్టాలి. బలాత్కారం మొ॥ సన్నివేశాలలో అందరూ సాక్షులు కావచ్చు. ॥71॥

ప్రక్షిప్తాల పరిశీలన

70-71 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

1. 69,72లలో సాక్షులను పరీక్షించకూడదనే విషయంలో ఏకవాక్యత ఉంది. వీటి మధ్య విశేషసాక్షుల పరిగణన, వారిని పరీక్షించటాలు చెప్పటం ప్రసంగభంగం చేస్తున్నది. అందుచేత ప్రసంగ వ్యతిరేకం.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 70వ శ్లోకంలో ఆపత్కాలంలోనే స్త్రీలు సాక్ష్యం చెప్పాలన్న ధ్వని ఉంది. ఈ భావన 68వ శ్లోకానికి వ్యతిరేకం.

ఖ. 70లో దాసుల పద్ధతిని గురించి ఉంది. ఇది మనువుకు వ్యతిరేకం. మనువు శూద్రులను, వారి పనులు స్వేచ్ఛా సేవాకార్యాలని అంగీకరించాడే కాని, దాసులను ఒప్పుకోలేదు[1.91].

గ. 71లో వృద్ధులు, బాలురు మొదలైనవారి సాక్ష్యానికి పరీక్ష ఉందని ఉంది. కానీ ఇతర శ్లోకాలలో అందరికీ ఇదే నిర్దేశమే ఉంది [8.25,26,78] మళ్లీ విడిగా చెప్పటం అనవసరం.

ఘ. 69లో ఏకాంతంలో ప్రతి ఒక్కరినీ సాక్ష్యానికి వాడుకోవచ్చని ఉంది. మళ్లీ ఈ శ్లోకాలలో సాక్షుల లెక్కింపు నిరర్థకం. పై శ్లోకంలోని భావనకు వ్యతిరేకం కూడా. ఈ ఆధారంతో ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

72 నుండి 76వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

బలాత్కారాది కార్యాలలో అందరూ సాక్షులు కావచ్చు-

సాహసేషు చ సర్వేషు స్తేయసంగ్రహణేషు చ । మూలశ్లోక సం.**52**
వాగ్దండయోశ్చ పారుష్యే న పరీక్షేత సాక్షిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**72**

టీక:- **సర్వేషు సాహసేషు** = బలాత్కారానికి సంబంధించిన సర్వవ్యవహారాలలో, **స్తేయ సంగ్రహణేషు చ** = దొంగతనం, వ్యభిచారం, **వాక్ దండయోః చ పారుష్యే** = తిట్టడం, కొట్టడం మొ॥ అపరాధాలు. వీటిలో, **సాక్షిణః న పరీక్షేత** = సాక్షులను పరీక్షించాల్సిన పనిలేదు. సాక్షుల అవసరమే లేదు. ఈ పనులన్నీ గుప్తంగా జరగడమే కారణం.

ఋషి దయానందభాష్యం:- బలాత్కారానికి సంబంధించిన సర్వ వ్యవహారాల్లో, గృహదహనం లాంటి దుస్సాహస కార్యాల్లోనూ, దొంగతనం, తిట్టడం-కొట్టడం లాంటి నేరాల్లోనూ సాక్షులను విచారించాల్సిన అవసరం లేదు. (స.ప్ర.6వ సము.) ॥72॥

వివరణ:- సాక్షి పరీక్షా నిషేధానికి కారణం. వీటిని ప్రత్యక్షంగా చూసినవారే సాక్షులుగా ఉంటారు. ఇవన్నీ రహస్యంగా గాని, ఏకాంత ప్రదేశంలో గాని సంభవిస్తుంది. అందువల్ల ఉత్తమాచరణ సంపన్నుడైన వ్యక్తి అక్కడ ఉండటం సంభవం కాదు.

సాక్ష్యములలో నిశ్చయము- ఇది మనుకృతం-ప్రామాణికం

బహుత్వం పరిగృహ్ణీయాత్సాక్షిద్వైధే నరాధిపః । మూలశ్లోక సం.**53**
సమేషు తు గుణోత్కృష్టాన్ గుణిద్వైధే ద్విజోత్తమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**73**

టీక:- **నరాధిపః** = రాజు గాని లేదా న్యాయాధీశుడు గాని, **సాక్షిద్వైదే బహుత్వం** = రెండు వైపులా సాక్షులున్నప్పుడు, వారిలో బహుపక్షానుసారంగా నిర్ణయించాలి, **సమేషు చ గుణోత్కృష్టాన్** = సాక్షులు రెండు పక్షాలలో సమానంగా ఉన్నప్పుడు, ఉత్తమ గుణసంపన్నులు ఎటువైపు ఉంటారో అటువైపు న్యాయనిర్ణయం ఉండాలి. **గుణిద్వైధే ద్విజోత్తమాన్** = రెండు వైపులా సాక్షులు, ఉత్తమ గుణవంతులయితే, ద్విజోత్తములు-అంటే ఋషులు, మహర్షులు లేదా యతీంద్రుల సాక్ష్యాలననుసరించి న్యాయనిర్ణయం చేయాలి.

ఋషి దయానందభాష్యం:- రాజు గాని లేదా న్యాయాధీశుడు గాని, రెండు వైపులా సాక్షులు ఉన్నప్పుడు వారిలో బహుపక్షానుసారంగా నిర్ణయించాలి. సాక్షులు రెండు పక్షాలలో సమానంగా ఉన్నప్పుడు ఉత్తమగుణ సంపన్నులు ఎటు వైపు ఉంటే అటువైపు న్యాయ నిర్ణయం జరగాలి. రెండు వైపులా సాక్షులు సమానంగా ఉన్నప్పుడు ఋషులు, మహర్షులు లేదా యతీంద్రుల సాక్షాల ననుసరించి న్యాయనిర్ణయం చేయాలి. (స.ప్ర.6వ సము.) ॥73॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సమక్షదర్శనాత్సాక్ష్యం శ్రవణాచ్చైవ సిద్ధ్యతి । మూలశ్లోక సం. **54**
తత్ర సత్యం బ్రువన్ సాక్షీ ధర్మార్థాభ్యాం న హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **74**

టీక:- **సాక్ష్యం సిద్ధ్యతి** = రెండు విధాలుగా సాక్షిగా ఉండటానికి తగినవాడిని, **సమక్ష దర్శనాత్** = ఒకటి-కంటితో చూసినది చెప్పినా, **చ** = మరియు, **శ్రవణాత్** = చెవులతో విన్నది చెప్పినా, **తత్ర సాక్షీ సత్యం బ్రువన్** = సభలో అడిగినప్పుడు ఏ సాక్షి నిజం చెబుతాడో, **ధర్మ+అర్థాభ్యాం న హీయతే** = అతడు ధర్మహీనుడు కాడు. దండనకు యోగ్యుడూ కాడు. అలాగాక అబద్ధం తెలిపిన సాక్షి, చట్టాన్ననుసరించి దండనీయుడవుతాడు.

ఋషి దయానందభాష్యం:- రెండు రకాలుగా సాక్షిగా ఉండటానికి తగినవాడిని ఒకటి- కంటితో చూసినది చెప్పినా, రెండు- చెవులతో విన్నది చెప్పినా అలాంటి సాక్ష్యం అంగీకరించబడును. అలాంటి సమయంలో తాను చూసినది, తాను విన్నది ఉన్నదున్నట్లు చెప్పినా, సభలో అడిగినప్పుడు ఏ సాక్షి నిజం చెబుతాడో అతడు ధర్మహీనుడు కాడు. అనగా దండనకు వాడు యోగ్యుడు కాడు. (స.ప్ర. 6వ సము.) ॥74॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సాక్షీ దృష్టశ్రుతాదన్యద్విబ్రువన్నార్యసంసది । మూలశ్లోక సం. **55**
అవాఙ్నరకమభ్యేతి ప్రేత్య స్వర్గాచ్చ హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **75**

టీక:- **ఆర్యసంసది** = ఎవడు రాజసభలోగాని లేక ఉత్తమ పురుషులున్న సభలోగాని, **సాక్షీ** = సాక్ష్యం చెప్పువాడు, **దృష్ట శ్రుతాత్ + అన్యత్ విబ్రువన్** = చూసిన దానికి, విన్న దానికి విరుద్ధంగా సాక్ష్యమిచ్చినట్లయితే, **అవాఙ్ నరకమ్ + అభ్యేతి** = అవాఙ్ నరకం అంటే జిహ్వాఛేదనం వల్ల కలిగే దుఃఖరూప నరకాన్ని, (దుఃఖాన్ని) పొందుతాడు. **చ** = మరియు, **ప్రేత్య స్వర్గాత్ హీయతే** = మరణానంతరం సుఖానికి దూరమవుతాడు అంటే నిందనీయుడై అపకీర్తిని పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:-రాజసభలోగానీ లేదా ఉత్తమ పురుషులు ఉన్న సభలో గానీ సాక్ష్యం చెప్పేవాడు చూసిన దానికి, విన్నదానికి విరుద్ధంగా సాక్ష్యమిచ్చినట్లయితే నాలుక ఛేదనం వల్ల కలిగే దుఃఖరూప నరకాన్ని పొందుతాడు. మరణానంతరం సుఖానికి దూరమవుతాడు. (స.ప్ర. 6వ సము.) ॥75॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యత్రానిబద్ధోఽపీక్షేత శృణుయాద్వాపి కించన । మూలశ్లోక సం. **56**
పృష్టస్తత్రాపి తద్బ్రూయాద్యథాదృష్టం యథాశ్రుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **76**

టీక:- ప్రత్యక్ష దర్శియైన మనుష్యుడు, **అనిబద్ధః+అపి** = వాది ప్రతివాదులు సాక్షిగా తనను కోరుకున్నా, **యత్ర కించన ఈక్షేత అపివా శృణుయాత్** = తానేది కన్నులార చూసిందీ, చెవులార విన్నదీ, **పృష్టః** = న్యాయాధీశుడు ప్రశ్నించినప్పుడు, **తత్ర+అపి** = అక్కడ, **యథా దృష్టం యథాశ్రుతమ్ తత్ బ్రూయాత్** = చూసినది చూసినట్లుగా, విన్నది విన్నట్లుగా చెప్పాలి. అంటే న్యాయార్థం స్వయం సాక్షిగా నిజం తెలుపాలి.

తాత్పర్యం:- వాది ప్రతివాదులు తన్ను సాక్షినిగా కోరకున్నా, తానేది కన్నులార చూసిందీ, చెవులార విన్నదీ, దాన్ని న్యాయాధీశుడు ప్రశ్నించినప్పుడు అక్కడ తనకు తెలిసినది చూసినది చూచినట్లుగా విన్నది విన్నట్లుగా చెప్పాలి. అంటే న్యాయార్థం స్వయం సాక్షిగా నిజం తెలుపాలి. ॥76॥

ఇది ప్రక్షిప్తం-ప్రామాణికం కాదు

* *ఏకోఽలుబ్ధస్తు సాక్షీ స్యాద్బహ్వ్యః శుచ్యోఽపి న స్త్రియః ।*
స్త్రీబుద్ధేరస్థిరత్వాత్తు దోషైశ్చాన్యేఽపి యే వృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **77**

తాత్పర్యం:- లోభాదిగుణాలు లేనివాడు ఒకడైనా సాక్షి చాలు. శౌచాదిగుణాలు గల స్త్రీలు అనేక మంది అయినా చపలబుద్ధిగలవారు కాబట్టి అప్పు తీసుకోవడం లాంటివి విచారించవలసిన వ్యవహారాలలో సాక్షులుగా ఉండ కూడదు. మరియు ఎవరు దొంగతనం మొ॥న దోషాలతో కూడినవారెందరున్నా వారి సాక్ష్యం పనికి రాదు.॥77॥

ప్రక్షిప్త పరిశీలన

77వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలో స్త్రీ సాక్ష్యం చెప్పటానికి నిషేధం ఉంది. కానీ ప్రసంగ సమ్మతమైన 68లో దీన్ని స్పష్టంగా అంగీకరించారు. దానికి వ్యతిరేకం కావటం చేత ఇది ప్రక్షిప్తం.

2. ప్రసంగ వ్యతిరేకాలు

క. ఇక్కడ ముందు వెనుకల విషయంలో సాక్ష్యం తీసుకోవడం గురించి ఉంది. మధ్యలో స్త్రీ సాక్ష్యానికి పనికి రాదు అనటం ప్రసంగ భంజకం అవుతుంది.

ఖ. సాక్షులుగా ఎవరు అర్హులు, ఎవరు కారు, దీన్ని ముందే [8.63-64] చెప్పేశారు. ప్రసంగం ముగిసిన తర్వాత మళ్లీ కొత్తగా చెప్పటం ప్రాసంగికం కాదు.

78 నుండి 81 శ్లోకం వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

స్వాభావికమైన సాక్ష్యాన్నే అంగీకరించాలి-

స్వభావేనైవ యద్బ్రూయుస్తద్గ్రాహ్యం వ్యావహారికమ్ । మూలశ్లోక సం.**57**
అతో యదన్యద్విబ్రూయుర్ధర్మార్థం తదపార్థకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**78**

టీక:- తద్ గ్రాహ్యం = సాక్షి యొక్క ఆ మాటనే అంగీకరించాలి, **యత్** = ఏది, **స్వభావేన +ఏవ వ్యావహారికమ్ బ్రూయుః** = స్వాభావికంగా ఏది పలుకుతారో, అదే వ్యవహారార్థం గ్రహించాలి, **అతః+అన్యత్+యత్+విబ్రూయుః** = అందుకు విరుద్ధంగా (ఎవరో నేర్పించిన దాన్ని బట్టి) పలుకుతారో, **తత్** = ఆ సాక్ష్యాన్ని, **ధర్మార్థం** = నిజమైన న్యాయం కోసం, **అపార్థకమ్** = న్యాయాధీశుడు అంగీకరించరాదు. వ్యర్థమని భావించాలి.

ఋషి దయానందభాష్యం:- భయం, మొహమాటం అలాంటివేమీ లేక స్వాభావికంగా సాక్షులేమి పలుకుతారో వ్యవహార నిర్ణయానికి అదే గ్రహించాలి. కారణాంతరాల వల్ల అందుకు విరుద్ధంగా చెబుతారో, ఆ సాక్షాన్ని నిజమైన న్యాయంకోసం న్యాయాధీశుడు అంగీకరించరాదు. వ్యర్థమని భావించాలి.(స.ప్ర. 6వ సము.) ॥78॥

సాక్ష్యాన్ని స్వీకరించే పద్ధతి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

సభాంతస్సాక్షిణః ప్రాప్తానర్థిప్రత్యర్థిసన్నిధౌ । మూలశ్లోక సం.**58**
ప్రాడ్వివాకోఽనుయుంజీత విధినాఽనేన సాంత్వయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**79**

టీక:- **అర్థి ప్రత్యర్థి సన్నిధౌ** = **అర్థీ** = వాది, **ప్రత్యర్థీ** = ప్రతివాదుల ఎదుట, **సభాన్తః ప్రాప్తాన్ సాక్షిణః** = సభకు సమీపంలో ఉన్న సాక్షులను, **సాన్త్వయన్** = శాంతి పూర్వకంగా, **ప్రాడ్వివాకః** = న్యాయాధీశుడు, వకీలు లేదా బారిస్టర్, **ఆనేన విధినా** = ఈ ప్రకారంగా, **అనుయుంజీత** = ప్రశ్నించాలి.

ఋషి దయానందభాష్యం:- సభలోకి వచ్చిన సాక్షులను వాది ప్రతివాదుల సన్నిధానమున శాంతిపూర్వకంగా న్యాయాధీశుడు ప్రియవాక్యములు పలుకుతూ ఇవ్విధనమున ప్రశ్నించాలి.(స.ప్ర. 6వ సము.)॥79॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యద్ద్వయోరనయో ర్వేత్థ కార్యేఽస్మిన్ చేష్టితం మిథః । మూలశ్లోక సం.**59**
తద్బ్రూత సర్వం సత్యేన యుష్మాకం హ్యత్ర సాక్షితా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**80**

టీక:- ఓ సాక్షులారా ! **అస్మిన్ కార్యే** = ఈ కార్యంలో (వివాదంలో), **అనయోః ద్వయోః మిథః చేష్టితం** = ఈ ఇద్దరి యొక్క పరస్పర కార్యాలలో, **యత్‌వేత్థ** = ఏది మీకు తెలియునో, **తత్ సర్వం** = ఆ విషయాన్నంతా, **సత్యేన బ్రూత** = నిజం చెప్పండి, **హి** = ఎందుకంటే, **అత్ర** = ఈ కార్యంలో, **యుష్మాకం** = మీరు, **సాక్షితా** = సాక్షులు.

ఋషి దయానందభాష్యం:-ఈ వాది ప్రతివాదులలో ఈ ఇద్దరి కార్యాలలో, జరిగిన విషయం ఏది మీకు తెలియునో ఆ విషయాన్నంతా నిజం చెప్పండి. ఎందుకంటే ఈ కార్యంలో మీరు సాక్షులు. (స.ప్ర.6వ సము.) ॥80॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సత్యం సాక్ష్యే బ్రువన్ సాక్షీ లోకానాప్నోతి పుష్కలాన్ । మూలశ్లోక సం.**60**
ఇహ చానుత్తమాం కీర్తిం వాగేషా బ్రహ్మపూజితా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**81**

టీక:- సాక్షీ = ఏ సాక్షి, **సాక్ష్యే** = సత్య వ్యవహారంలో, **సత్యం బ్రువన్** = సత్యాన్ని చెప్పినట్లయితే, **పుష్కలాన్ లోకాన్ + ఆప్నోతి** = మరు జన్మలో ఉత్తమ జన్మను పొంది సుఖాలననుభవిస్తాడు, **ఇహ చ+అనుత్తమాం కీర్తిం** = ఈ జన్మలో ఉత్తమ కీర్తిని పొందుతాడు. **ఏషావాక్ బ్రహ్మ పూజితా** = ఎందుకంటే, ఈ వాక్కే వేదాలలో సత్కారానికైనా తిరస్కారానికైనా కారణమని రాయబడింది. సత్యవక్త ప్రతిష్ఠను పొందుతాడు. మిథ్యావక్త నిందను పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:-సాక్ష్యం విషయంలో సాక్షి సత్యం చెప్పినట్లయితే పుణ్యలోకాలకు వెళ్తాడు. అంతేగాక ఇహలోకంలో ఉత్తమ కీర్తి పొందుతాడు. ఎందుకంటే సత్యవాక్కు సాక్షాత్ బ్రహ్మదేవుడి చేతనే పూజింపబడినది కదా! సత్యవక్త ప్రతిష్ఠను పొందుతాడు, మిథ్యావక్త నిందను పొందుతాడు. (స.ప్ర.6వ సము.) ॥81॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *సాక్ష్యేఽనృతం వదన్ పాశైర్బధ్యతే వారుణైర్భృశమ్ ।*
వివశః శతమాజాతీస్తస్మాత్సాక్ష్యం వదేదృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***82***

తాత్పర్యం:- సాక్ష్యం చెప్పేవాడు అబద్ధాలాడితే వాడు కరుణపాశాలచేత గట్టిగా లాగబడినవాడై, జలోదర రోగపీడితుడై, ఇతరుల వశవర్తియై నూరు జన్మలు నానా యాతనపడతాడు. కాబట్టి సాక్షి ఎప్పుడూ సత్యమే చెప్పాలి.॥82॥

ప్రక్షిప్త పరిశీలన

82వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తమవుతుంది-

1. ప్రసంగ వ్యతిరేకం

పూర్వాపర శ్లోకాలలో నిజమైన సాక్ష్యం వల్ల కలిగే లాభాలు చెప్పారు. దీని వల్ల ఈ రెండు శ్లోకాలూ పరస్పర సంబద్ధా లని తెలుస్తూంది. మధ్యలో అబద్ధాలు చెబితే పడే శిక్షను చెప్పటం వల్ల వీటి ప్రసంగ సంబద్ధతలకు భంగం కలిగింది. అందుచేత ఈ శ్లోకం ప్రసంగ భంజకమైన ప్రక్షిప్తం.

2. శైలీగత ఆధారం

ఈ శ్లోకపు శైలి నిర్హేతుకమూ, నిరాధారము, అతిశయోక్తులు నిండినదీ. వంద జన్మలు నిశ్చితం చేయటం, వరుణ పాశాలతో బంధితులు కావటం - వీటికి ఏ ఆధారమూ లేదు. మనువు శైలి ఇలా ఆధారాలు లేనిది, అతిశయోక్తులు నిండి, కాల్పనికమైనది కాదు.

3. అంతర్ వ్యతిరేకం

ముందు చెప్పిన 8.75లో దొంగ సాక్ష్యం చెప్పిన వారి శిక్షతో ఈ శ్లోకానికి వ్యతిరేకత కనిపిస్తూంది. అందుకని ఇది ప్రక్షిప్తం.

ఇది మనుకృతం-ప్రామాణికం

సత్యేన పూయతే సాక్షీ ధర్మస్సత్యేన వర్ధతే । మూలశ్లోక సం. **61**
తస్మాత్సత్యం హి వక్తవ్యం సర్వవర్ణేషు సాక్షిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **83**

టీక:- సత్యేన సాక్షీ పూయతే = సత్యాన్ని పలకడం (చెప్పడం) వల్ల సాక్షి పవిత్రుడవుతాడు, సత్యేన ధర్మః వర్ధతే = సత్యాన్ని చెప్పడం వల్ల ధర్మం అభివృద్ధి చెందుతుంది. తస్మాత్ = అందువల్ల, సర్వవర్ణేషు = అన్ని వర్ణస్థులైన, సాక్షిభిః = సాక్షులు, సత్యం హి వక్తవ్యం = సత్యాన్నే చెప్పాలి.

ఋషి దయానందభాష్యం:- సత్యం చెప్పడం ద్వారా సాక్షి జన్మాంతర కృత పాపం నుంచి కూడా విముక్తుడవుతాడు. సత్యంపలికితే అతని పుణ్యం ఇంకా వృద్ధి చెందుతుంది. కాబట్టి అన్నివర్ణస్థులైన సాక్షులు (వర్ణభేదంలేక) సత్యమే చెప్పాలి. (స.ప్ర. 6వ సము.) ॥83॥

సాక్షి ఆత్మవిరుద్ధంగా సాక్ష్యమివ్వరాదు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆత్మైవ హ్యాత్మనస్సాక్షీ గతిరాత్మా తథాత్మనః । మూలశ్లోక సం. **62**
మావమంస్థాః స్వమాత్మానం నృణాం సాక్షిణముత్తమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **84**

టీక:- ఆత్మనః సాక్షీ ఆత్మా+ఏవ హి = ఆత్మకు సాక్షి ఆత్మే, తథా ఆత్మనః గతిః + ఆత్మా = అలాగే, ఆత్మకు గతి ఆత్మే, ఈ కారణంగా, ఓ మానవుడా ! నృణాం ఉత్తమమ్ సాక్షిణమ్ = సర్వ మానవులకు ఉత్తమ సాక్షియైన, త్వమ్ + ఆత్మానం = నీ ఆత్మను, మా+అవమంస్థాః = అవమానించకు, అంటే సత్యభాషణమే నీ ఆత్మ, అదే సత్యం, తద్విపరీతం మిథ్యా భాషణం.

ఋషి దయానంద భాష్యం:- శుభాశుభకర్మ ప్రతిష్ఠ అయిన ఆత్మే హృదయసాక్షి. తన ఆత్మకు సమాధానం చెప్పుకోగల వాడే సత్యవాక్కుపలకగలడు. అలాంటి ఆత్మను అసత్యంతో అపవిత్రపరచడం, అవమానించడం ఏల? (స.ప్ర. 169). ॥84॥

వివరణ:

'ఆత్మే ఆత్మకు ఎలా సాక్షి అవుతుంది?' ఈ విషయానికి 1-125 (2.6)వ శ్లోకంలోని వాఖ్య వివరణలో "ఆత్మనః తుష్టిః" శీర్షికను చూడగలరు.

85 నుండి 90వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *మన్యంతే వై పాపకృతో న కశ్చిత్పశ్యతీతి నః ।*
తాంస్తు దేవాః ప్రపశ్యంతి స్వస్యైవాంతరపూరుషః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***85***

తాత్పర్యం:- పాపం చేసేవారు తమను ఎవరూ చూడటంలేదని భావిస్తారు. కాని అంతరాత్మ, దేవతలు చూస్తుంటారు. కంటికి కనిపించలేదని వీరి ఉనికి కాదనగలమా? ॥85॥

* *ద్యౌర్భూమిరాపో హృదయం చంద్రార్కాగ్నియమానిలాః ।*
రాత్రిస్సంధ్యే చ ధర్మశ్చ వృత్తజ్ఞాస్సర్వదేహినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***86***

తాత్పర్యం:- ఆ దేవతలు ఎవరెవరంటే.....భూమ్యాకాశాది పంచభూతాలు, జీవాత్మ, సూర్యచంద్రులు, సాయం సంధ్య-ఉదయసంధ్యలు, రాత్రి, అష్టదిక్పాలకులు....వీరంతా సర్వప్రాణి చరిత్రకు సాక్షులు అయినందువల్ల, విషయం ఆగమ ప్రసిద్ధం కాబట్టి ఇక్కడ ప్రస్తావించబడిందని గ్రహించాలి. ॥86॥

* ***దేవబ్రాహ్మణసాన్నిధ్యే సాక్ష్యం పృచ్ఛేదృతం ద్విజాన్ ।***
ఉదఙ్ముఖాన్ ప్రాఙ్ముఖాన్వా పూర్వాహ్ణే వై శుచిశ్శుచీన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***87***

తాత్పర్యం:- ధర్మ పరీక్షకుడు తాను పరిశుద్ధుడై, దేవబ్రాహ్మణ సమక్షంలో సాక్షులను తూర్పు ముఖంగా గాని-ఉత్తరముఖంగా గాని నిలబెట్టి మధ్యాహ్నం లోపుగానే వారిని విచారించాలి. ॥87॥

* ***బ్రూహీతి బ్రాహ్మణం పృచ్ఛేత్సత్యం బ్రూహీతి పార్థివమ్ ।***
గోబీజకాం చ నైర్వైశ్యం శూద్రం సర్వైస్తు పాతకైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***88***

తాత్పర్యం:- ఆ విధంగా నిలబెట్టిన సాక్షులలో బ్రాహ్మణులుంటే 'చెప్పు' అనీ; క్షత్రియులుంటే "సత్యంపలుకు" అనీ; వైశ్యుడుంటే" అబద్ధాలాడితే గో, సువర్ణ, బీజహరణ పాతకం నీకు సంభవిస్తుంది" అనీ; శూద్రుడైతే "అబద్ధం చెబితే నానా పాపాలూ నీకు అంటుతాయి" అనీ చెప్పాక సాక్ష్యం అడగాలి. ॥88॥

* ***బ్రహ్మఘ్నో యే స్మృతా లోకా యే చ స్త్రీ బాలఘాతినః ।***
మిత్రద్రుహః కృతఘ్నస్య తే తే స్యుర్బ్రువతో మృషా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***89***

తాత్పర్యం:- అసత్యం వల్ల బ్రహ్మహత్య, స్త్రీ-భ్రూణ-శిశుహత్య మొదలైనవి చేసిన మేలు మరిచే కృతఘ్నుడికి ఏయే నరకాలు కలుగుతాయో అవి నీకు తప్పవని చెప్పి సాక్షిని ఆపైన అడగాలి. ॥89॥

* ***జన్మ ప్రభృతి యత్కించిత్పుణ్యం భద్ర ! త్వయా కృతమ్ ।***
తత్తే సర్వం శునో గచ్ఛేద్యది బ్రూయా స్తమన్యథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***90***

తాత్పర్యం:- ఓ శుభాచారుడా! జన్మించింది మొదలు ఏ పుణ్యాలు చేసి ఉన్నావో అబద్ధాలు చెబితే అవి కాస్తా కరిగిపోగలవు. ఆ పుణ్యం కాస్తా నీ కుక్కలకు చేరుతుంది. ॥90॥

ప్రక్షిప్తాల పరిశీలన

85 నుంచి 90 వరకు గల శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. ముందు వెనుకల శ్లోకాలు 84, 91లలో ఆత్మను సాక్షిగా భావించి నిజమైన సాక్ష్యం చెప్పాలని ఉంది. దీనివల్ల ప్రసంగ దృష్టితో ఈ రెండు శ్లోకాలకూ సంబద్ధతతో పాటు ఏకవాక్యతా ఉంది. మధ్యలో ఈ ప్రసంగ భిన్నమైన శ్లోకాలతో దానికి భంగం కలిగింది. అందుచేత ఇవి ప్రసంగ వ్యతిరేకాలు.

ఖ. సాక్షులను న్యాయమూర్తి ఎలాంటి ప్రశ్నలు అడగాలి అనేది 78-90 శ్లోకాలలో ముగిసింది. తర్వాత నిజమైన సాక్ష్యపు గొప్పతనం చెప్పారు. ఒక విషయం పూర్తయిన తర్వాత కొత్త పద్ధతిలో మళ్లీ దాన్నే 87-90 శ్లోకాలలో మొదలు పెట్టడం ప్రసంగ వ్యతిరేక మవుతుంది.

2. అంతర్ వ్యతిరేకాలు

న్యాయమూర్తి రాజు, విద్వాంసుల ద్వారా సాక్షులను ప్రశ్నించే పద్ధతిని 79-80 శ్లోకాలలో చెప్పారు. ఇక్కడ 87-88లలో దానికి భిన్నమైన పద్ధతి చెప్పారు. మళ్లీ భిన్న పద్ధతి చెప్పటం వ్యతిరేకత అవుతుంది. ఇలాంటి వ్యతిరేకత

కారణంగా ఇవి, వీటిని ఆధారం చేసుకున్న 89-90 శ్లోకాలు ప్రక్షిప్తాలు. న్యాయస్థానంలో సాక్షులు న్యాయమూర్తి వైపు తిరిగి చెప్తారు కనుక, 87లో చెప్పిన పద్ధతి జరిగేది కానే కాదు !

3. శైలీగత ఆధారాలు

శైలీ దృష్టితో చూస్తే ఈ శ్లోకాలలో చెప్పినవి నిరాధారాలు, సహేతుకం కానివి. [85,86,89,90] అతిశయోక్తులతో నిండినవే [89, 90] కాకుండా, అమర్యాదాకరమైనవి కూడా. మనువు శైలిలో ఇటువంటి దోషాలు ఉండవు. 85-86లలో చెప్పిన జడ వస్తువులను ద్రష్ట రూపంలో స్వీకరించడం సహేతుకం కాని విషయం. ఇందులోని జడ పదార్థాలు, ప్రాణుల మంచి చెడు పనులను ఎలా నిర్ధారించగలవు?

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకోఽహమస్మీత్యాత్మానం యత్త్వం కల్యాణ! మన్యసే । మూలశ్లోక సం. **63**
నిత్యం స్థిత స్తే హృద్యేష పుణ్యపాపేక్షితా మునిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **91**

టీక:- **కల్యాణ** = ఓ కల్యాణాన్ని కాంక్షించే మానవుడా ! **యత్ త్వం** = ఏ నీవు, **అహం ఏకః అస్మి+ఇతి** = నేను ఒక్కడనే అని, **ఆత్మానం మన్యసే** = నీ ఆత్మలో అనుకొని అబద్ధం చెప్పడం ఉచితం కాదు. కానీ, **ఏషః తే హృది** = నీ హృదయంలో ఉన్న రెండో వాడు, **నిత్యం పుణ్యపాపేక్షితా మునిః స్థితః** = అంతర్యామి రూపంగా నీ పుణ్య, పాపాలను చూసే ఆ పరమాత్మను చూసి భయపడి సత్యం పలుకుతూ ఉండు.

ఋషి దయానందభాష్యం:- ఓ పుణ్యాత్ముడా! నేనొక్కడనే ఉన్నానని జీవాత్మకుడనని నీ ఆత్మలో అనుకొని అబద్ధం చెప్పడం ఉచితం కాదు. ఏల అంటే నీ హృదయంలో ఉన్న రెండో వాడు అంతర్యామి రూపంగానీ పాపపుణ్యాలను చూసే మునిగానీ ఉన్నాడు. ఆ పరమాత్మను చూసి భయపడి సత్యం పలుకుతూ ఉండు. (స.ప్ర. 6వ సము.) ॥91॥

92 నుండి 95వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *యమో వైవస్వతో దేవో యస్తవైష హృది స్థితః ।*
తేన చేదవివాదస్తే మా గంగాం మా కురూన్ గమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***92***

తాత్పర్యం:- వైవస్వతుడైన (సూర్యపుత్రుడైన) ఏ యముడు లోకంవల్ల నీ చెవినిబడి నీ హృదయంలో ఉన్నాడో, అతడితో ధర్మాచరణవల్ల నీకు వివాదం లేనట్లయితే, అప్పుడు నీవు గంగకు గాని, కురుక్షేత్రమునకు గాని పోనవసరంలేదు.॥92॥

* *నగ్నో ముండః కపాలేన భిక్షార్థీ క్షుత్పిపాసితః ।*
అంధశ్శత్రుకులం గచ్ఛేద్యస్సాక్ష్య మనృతం వదేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***93***

తాత్పర్యం:- ఎవరు తప్పుడు సాక్ష్యాలు చెబితే, వారు దిగంబరులై, ముండిత శిరస్కులై భిక్షార్థులై శత్రుకులానికి పోతారు. ॥93॥

* *అవాక్ఛిరాస్తమస్యంధే కిల్బిషీ నరకం వ్రజేత్ ।*
యః ప్రశ్నం వితథం బ్రూయాత్పృష్టస్సన్ ధర్మనిశ్చయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***94***

తాత్పర్యం:- ధర్మం నిర్ణయించే నిమిత్తం ఏ ధర్మజ్ఞాని చేత ప్రశ్నలడగబడినప్పుడు ఎవరైతే అబద్ధం చెబుతారో. వారు మహా పాపియై తలక్రిందులై మహాంధకారమనే నరకంలో పడిపోతారు. ॥94॥

* *అంధో మత్స్యానివాశ్నాతి స నరః కంటకైస్సహ ।*
యో భాషతేఽర్థవైకల్యమప్రత్యక్షం సభాం గతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***95***

తాత్పర్యం:- ఎవడు సభకు వచ్చి, వాస్తవంగా తనకు దెలియనిది తెలుసు అనిగానీ, తెలిసినది తెలియదనిగానీ చెబుతాడో అతడు గుడ్డివాడి లాగా ముండ్లతో కూడిన చేపలను తింటాడు. అంటే సుఖానుభవ బుద్ధితో ప్రవర్తించి మహాకష్టాన్ని అనుభవిస్తాడు. ॥95॥

ప్రక్షిప్తాల పరిశీలన

92 నుంచి 95 వరకు గల శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఆత్మ ఆధారంగా సాక్ష్య కథనం ఉంది కనుక 91,95వ శ్లోకాలలో ప్రసంగ సంబద్ధత ఉంది. మధ్యలోని శ్లోకాలతో ఈ ప్రసంగ సంబద్ధత దెబ్బ, తింటూది. అందుకని ఇవి ప్రసంగ వ్యతిరేక ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 92-95 శ్లోకాలలోని విషయంలో అంతర్ వ్యతిరేకాలలో కాల వ్యతిరేకత ఉంది. కురుక్షేత్ర నగర స్థాపన చేసిన కురుమహారాజు, స్వాయంభువ మనువుకు కొన్ని వందల తరాల తర్వాత జన్మించినవాడు. వందల తరాలకు ముందు రచించబడిన గ్రంథంలో కురురాజు. కురుక్షేత్రాల గురించి చెప్పడం అసంభవం ! తర్వాతి విషయాలు ముందుగానే చెప్పటమనేది తర్వాతి విషయ ప్రక్షిప్తం అవుతుంది. ఇదే విధంగా గంగను తీర్థంగా భావించడం కూడా పురాణ కాలీనం కావటం చేత తర్వాతి విషయాన్ని చెప్పటమే అవుతుంది.

ఖ. ఈ ప్రసంగంలో చెప్పిన అబద్ధపు సాక్ష్యానికి పడే శిక్షలను గురించినది, మునుపటి ప్రసంగంలోని 75వ శ్లోకానికి వ్యతిరేకంగా ఉంది.

గ. గంగనూ, కురు క్షేత్రంలోని తీర్థాలనూ దర్శిస్తే పుణ్యం వస్తుం దనేది మనువు అభిప్రాయం కాదు. జలంతో కేవలం శరీర శుద్ధిని మాత్రమే మనువు చెప్పాడు [అద్భిః గాత్రాణి శుద్ధ్యంతి 5.109] కాని, ఆత్మ శుద్ధిని చెప్పలేదు.

ఘ. 91లో గంగనూ, కురుక్షేత్రాన్నీ తీర్థ స్థానాలుగా భావించినట్లు ఉంది. కానీ మనువు ఏ ప్రాంతాన్నీ తీర్థ స్థానంగా భావించలేదు. అన్ని చోట్లా ఉత్తమ ఆచరణ, నిరాకార ఈశ్వరుని యందు విశ్వాసం ఉంచే విధానమూ చెప్పాడు. [2.69,76-78,101-107, 6.49,60,65,73,84]. కనుక ఈ శ్లోకాలు మనువు విధానాలకు వ్యతిరేకాలు. 94లో చెప్పిన నరకం, మనువుకు వ్యతిరేకం. మనువు నరకమనే దాన్ని విశ్వసించడు. [4.87-91 ల మీది 'పరిశీలన' చూడండి]- ఇలా ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే.

3. శైలీగత ఆధారాలు

93-94 శ్లోకాల శైలి నిరాధారమూ, కాల్పనికమూ, నిర్హేతుకమూ, అతిశయోక్తులతో నిండినది. మనువు శైలిలో ఇటువంటి లోపాలు ఉండవు.

ఇది మనుకృతం-ప్రామాణికం

యస్య విద్వాన్ హి వదతః క్షేత్రజ్ఞో నాభిశంకతే । మూలశ్లోక సం.**64**
తస్మాన్న దేవాః శ్రేయాంసం లోకేఽన్యం పురుషం విదుః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**96**

యస్య వదతః = సాక్ష్యం చెప్పబోయే పురుషుడి యొక్క, **విద్వాన్ క్షేత్రజ్ఞః** = విద్వాంసుడు, అంటే శరీరాన్ని ఎరిగినవాడైన ఆత్మ, **న+అభిశంకతే** = శంకించదో, **"సర్వజ్ఞుడైన అంతర్యామి అయిన పురుషుడు సత్యం పలుకుతున్నాడా, అసత్యం పలుకుతున్నాడా"** అని సందేహింపడో అలాంటి పురుషుడు ఉత్తముడు. **తస్మాత్ + అన్యం** = అతని కంటె భిన్నమైన వాడిని, **దేవాః** = విద్వాంసులు, **శ్రేయాంసం పురుషం న విదుః** = ఆత్మసాక్షిగా సత్యం పలికేవాడే ఉత్తమ పురుషుడని, **లోకే** = జగత్తులో విద్వాంసులు భావింతురు.

ఋషి దయానందభాష్యం:- ఇలా సత్యాన్నే చెప్పే పురుషుని గురించి విద్వాంసుడైన క్షేత్రజ్ఞుడు అంటే శరీరాన్ని గురించి సర్వం తెలిసినవాని ఆత్మ తనలో శంకించదు. దీనికి భిన్నంగా ఉండేవారిని ఉత్తమపురుషులుగా విద్వాంసులు అంగీకరించరు. (స.ప్ర.6వ సము.) ॥96॥

వివరణ:

ఏ ఏ విషయాలలో లేదా కార్యాలలో ఆత్మకు సందేహం, భయాదులు కలుగునో, ఈ విషయంలో విస్తృత వివేచనం కోసం 1-125[2.6] వ శ్లోక వివరణలో ఉన్న 'ఆత్మనః తుష్టిః' 'ఆత్మనః ప్రియమ్' అనే శీర్షికను చూడండి.

97 నుండి 116వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *యావతో బాంధవాన్ యస్మిన్ హంతి సాక్ష్యేఽనృతం వదన్ ।*
తావతస్సంఖ్యయా తస్మిన్ శృణు సౌమ్యానుపూర్వశః॥ ప్రక్షిప్త శ్లోక సం.**97**

తాత్పర్యం:- ఎవడు తన అనృతసాక్ష్యం వల్ల ఎంతమంది పుత్రపౌత్రాదులను నరకంలో పడదోస్తాడో, లేదా ఎందరు బంధువులను చంపినంత ఫలమును పొందుతాడో, అందరి గురించి నేను తెలుపుతాను వినండి (అనృతనిందకై ఈ వాక్యం చెప్పబడింది.) ॥97॥

* *పంచ పశ్వనృతే హంతి దశ హంతి గవానృతే ।*
శతమశ్వానృతే హంతి సహస్రం పురుషానృతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**98**

తాత్పర్యం:- నాలుగు కాళ్ళ జంతువు విషయమై అసత్యం పలికినప్పుడు ఐదుగురు బంధువులను, (నరకమున త్రోయును.) గోవుల విషయమై అబద్ధం చెబితే పదుగురు బంధువులను, గుర్రాల విషయంలో అబద్ధం చెబితే నూరుమంది బంధవులను, మనుషుల విషయంలో అబద్ధం చెబితే వేయ్యి మంది బంధువులను చంపి పాపాన్ని పొందుతాడు. ॥98॥

* *హంతి జాతానజాతాంశ్చ హిరణ్యార్థేఽనృతం వదన్ ।*
సర్వం భూమ్యనృతే హంతి మా స్మ భూమ్యనృతం వదీః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**99**

తాత్పర్యం:- ధనం (బంగారు) నిమిత్తం అబద్ధం పలికినట్లయితే పుట్టినవారిని పుట్టనివారిని చంపిన పాపం పొందుతాడు. భూమి విషయమై అబద్ధం పలికినప్పుడు సర్వప్రాణిహింసాఫలం పొందుతాడు. కాబట్టి భూమివిషయమై అబద్ధం ఎప్పుడూ చెప్పకూడదు. ॥99॥

* *అప్సు భూమివదిత్యాహుః స్త్రీణాం భోగే చ మైథునే ।*
అబ్జేషు చైవ రత్నేషు సర్వేష్వశ్మ మయేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**100**

తాత్పర్యం:- గుంతలు, బావులు మొదలైన వాటి నుండి నీటిని తీసుకోవడం. స్త్రీ సంభోగం, శంఖాలు-ముత్యాలు-వజ్ర వైఢూర్యాది రత్నాల విషయంలో అబద్ధాలాడినా, భూమి విషయమైనా ప్రాణి హింస పాపం అంటుతుంది.॥100॥

* *ఏతాన్ దోషానవేక్ష్య త్వం సర్వాననృతభాషణే ॥*
యథాశ్రుతం యథాదృష్టం సర్వమేవాంజసా వద ॥ ప్రక్షిప్త శ్లోక సం.**101**

తాత్పర్యం:- అబద్ధం చెప్పినందువల్ల ఇన్ని దోషాలు కలుగుతాయని చెప్పి నీవు చూచిన దానిని, విన్నదానిని వాస్తవమే చెప్పుమని న్యాయం నిర్ణయించే అధికారి పలుకవలెను. ॥101॥

* గోరక్షకాన్వాణిజికాం స్తథా కారుకుశీలవాన్ ।
ప్రేష్యాన్ వార్ధుషికాంశ్చైవ విప్రాన్ శూద్రవదాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102**

తాత్పర్యం:- గోవుల మేపరులు, వర్తకంలో జీవించువారు, వంటవాళ్ళు, శిల్పులు, సేవకులు, వడ్డీ జీవనం చేసే విప్రులను, శూద్రులను అడిగినట్లే ధర్మాధికారి ప్రశ్న వేయాలి. ॥102॥

* తద్వదన్ ధర్మతోఽర్థేషు జానన్నప్యన్యథా నరః ।
న స్వర్గాచ్చ్యవతే లోకా ద్దైవీం వాచం వదంతి తామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **103**

తాత్పర్యం:- మనిషి సాక్ష్యంలో కొన్ని సమయాల్లో అబద్ధం చెప్పినా, వాడు స్వర్గం నుండి భ్రంశం నొందడు. వాడి సాక్ష్యాన్ని దైవవాక్యమని చెబుతారు. ॥103॥

* శూద్రవిట్ క్షత్రవిప్రాణాం యత్రర్తోక్తౌ భవేద్వధః ।
తత్ర వక్తవ్యమనృతం తద్ధి సత్యాద్విశిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104**

తాత్పర్యం:- అలా చెప్పవలసిన చోట్లు ఏవి అంటే, ఏ సంగతి నిజంగ చెప్పినట్లయితే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు ప్రాణహాని గల్గునో, అలాంటి సమయాల్లో సత్యం పలుకరాదు. అప్పుడు చెప్పిన అసత్యం సత్యం కంటే మేలైనదే అవుతుంది. ॥104॥

* వాగ్దైవత్యైశ్చ చరుభిర్యజేరంస్తే సరస్వతీమ్ ।
అనృతస్యైనసస్తస్య కుర్వాణా నిష్కృతిం పరామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **105**

తాత్పర్యం:- అలా అసత్యం చెప్పినవారు ఆ అనృతదోషం పోవడానికి సరస్వతీ దేవతాకమైన మంత్రాలతో అన్నంతో ఆ సరస్వతిని గురించి యాగం చేస్తారు. దాని వల్లన అనృతదోషం పోగొట్టుకోడానికి ఉద్దేశించి వారు ఆ సరస్వతిని గురించి చరుహోమం చేస్తారు. ॥105॥

* కూశ్మాండైర్వాపి జుహుయాద్ఘృతమగ్నౌ యథావిధి ।
ఉదిత్యృచా వా వారుణ్యా త్ర్యృచేనాబ్దైవతేన వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **106**

తాత్పర్యం:- యజుర్వేదీయములైన కూష్మాండమంత్రాలచేత, **'ఉదుత్తమ'** మను వరుణదేవతాకమైన ఋక్కుతోనూ, అబ్దేవతాకమైన **'ఆపోహిష్ఠా మయోభువ'** అను మంత్రంతోనూ అగ్నియందు ఆజ్యహోమం చేయాలి. ॥106॥

* త్రిపక్షాదబ్రువన్ సాక్ష్యమృణాదిషు నరో-గదః ।
తదృణం ప్రాప్నుయాత్సర్వం దశ బంధం చ సర్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **107**

తాత్పర్యం:- రోగహీనుడయిన నరుడు ఋణాదుల విషయమై మూడు పక్షముల లోపల సాక్ష్యం ఇవ్వలేనట్లయితే ఉత్తమర్ణుడు ఋణాన్ని పొందదానికి అనర్హుడు. ఆ ఋణాన్ని పదోభాగం రాజుకు పన్నుగా చెల్లించాలి. ॥107॥

* యస్య దృశ్యేత సప్తాహాదుక్తవాక్యస్య సాక్షిణః ।
రోగోఽగ్నిర్జ్ఞాతిమరణమృణం దాప్యో దమం చ సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **108**

తాత్పర్యం:- సాక్ష్యమొసగిన ఏ సాక్షికైనను ఏడు దినాల లోపల రోగం, ఇండ్లు మొ॥వి కాలిపోవడం, జ్ఞాతులచావు సంభవించినట్లయితే తప్పుసాక్ష్యం చెప్పడంవల్లనే అతడికి అలా సంభవించి ఉంటుందని నిర్ధారణ చేసి, ఆ సాక్షికి ఇలా కీడు సంభవించడం వల్ల ఉత్తమర్ణుడికి అతడి ద్రవ్యమును ఇప్పించాలి. అదీకాక, వాడికి కొంత పన్ను, విధించాలి.॥108॥

సాక్ష్యంతో ప్రమాణం చేయించుట -

* ***అసాక్షికేషు త్వర్థేషు మిథో వివదమానయోః ।***
అవిందంస్తత్త్వతః సత్యం శపథేనాపి లంభయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***109***

తాత్పర్యం:- సాక్షులు లేని వ్యవహారాలలో వాది ప్రతివాదులిరువురు వాదులాడుచుండగా, వారి వాద ప్రతివాదముల బలిమివల్ల వాస్తవాన్ని తెలియ జాలనివాడై, చెప్పబోవు విధంగా ప్రమాణాల మూలమున అయినా న్యాయాన్ని కనిపెట్టాలి. ॥109॥

* ***మహర్షిభిశ్చ దేవైశ్చ కార్యార్థం శపథాః కృతాః ।***
వసిష్ఠశ్చాపి శపథం శేపే పైజవనే నృపే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***110***

తాత్పర్యం:- సప్తర్షులను, దేవతలను సందిగ్ధకార్యనిర్ణయ నిమిత్తమై ప్రమాణాలు గావించారు. వసిష్ఠ మునీంద్రుడిపై ఇతడే నూరువురు కొడుకులను భక్షించాడు అని విశ్వామిత్రుడు నింద మోపగా, తన పరిశుద్ధి తెలియజేయడానికి పైజవనుడి పుత్రుడైన సుదాముడు అనే నృపుడి సన్నిధానమున తాను భక్షింపలేదని ప్రమాణం గావించాడు. ॥110॥

* ***న వృథాశపథం కుర్యాత్స్వల్పేఽప్యర్థేనరో బుధః ।***
వృథా హి శపథం కుర్వన్ ప్రేత్య చేహ చ నశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***111***

తాత్పర్యం:- స్వల్పకార్యం విషయంలో పండితుడు వృథాగా ప్రమాణం చేయరాదు. అలా వృథాగా శపథం చేసినట్లయితే మానవుడు ఇహపరములందు రెండింటిలో చెడిపోతాడు. ॥111॥

* ***కామినీషు వివాహేషు గవాం భక్ష్యే తథేంధనే ।***
బ్రాహ్మణాభ్యుపపత్తౌ చ శపథే నాస్తి పాతకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***112***

తాత్పర్యం:- స్త్రీలవిషయమై ఆడే అబద్ధాలలోను, పెళ్లికోసం చెప్పే అబద్ధాలలోను, గోవులకు గడ్డి నిమిత్తం, అగ్నిహోత్రానికి సమిధలు కోసం, బ్రాహ్మణ సంరక్షణకోషం ఏవైనా అబద్ధాలాడినా పాపం అంటదు. ॥112॥

* ***సత్యేన శాపయేద్విప్రం క్షత్రియం వాహనాయుధైః ।***
గోబీజకాంచనైర్వైశ్యం శూద్రం సర్వైస్తు పాతకైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***113***

తాత్పర్యం:- ప్రమాణం చేయమన్నప్పుడు బ్రాహ్మణుణ్ణి "సత్యంగా పలుకుము" అనీ, రాజు అసత్య మాడినట్లయితే "నా వాహనాయుధములు నిష్ఫలం అవును గాక" అనీ, వైశ్యుడు "అసత్యం పలికినట్లయితే" **నా గోధనధాన్యములు నిష్ఫలములు అవునుగాక**" అనీ, శూద్రుడు "**అనృతవచనముచేత సకలపాపాలు నన్ను చుట్టుకొనుగాక**" అనీ చెప్పాలి.॥113॥

* ***అగ్నిం వాహారయేదేనమప్సు చైనం నిమజ్జయేత్ ।***
పుత్రదారస్య వాప్యేనం శిరాంసి స్పర్శయేత్పృథక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***114***

తాత్పర్యం:- ఎర్రగా కాలిన ఎనిమిది అంగుళాల వెడల్పుగల ఇనుపగుండును శూద్రాదులకు రెండుచేతులలో నేడు రావియాకులను ఉంచి "ఈ కార్యం చేయలే" దని ఏడడుగులు బ్రహ్మోక్త విధానంలో ప్రమాణం చేయించాలి, లేదా జలగలు మొ॥వి లేని నీటి లోపల ఇతడిని ముంచాలి. లేదా వీడి పుత్రులూ భార్యలూ శిరస్సున చేయి ఉంచి ప్రమాణం చేయుమనాలి. ॥114॥

*   యమిద్ధో న దహత్యగ్ని రాపో నోన్మజ్జయంతి చ ।
న చార్తిమృచ్ఛతి క్షిప్రం స జ్ఞేయశ్శపథే శుచిః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **115**

తాత్పర్యం:- మండుతున్న అగ్ని ఎవడిని దహింపదో, నీరు ఎవడిని ముంచదో, ఎక్కువ నొప్పిని ఎవడు పొందడో, అతడు ప్రమాణంలో పరిశుద్ధుడని తెలుసుకోవాలి. ॥115॥

*   వత్సస్య హ్యభిశస్తస్య పురా భ్రాతా యవీయసా ।
నాగ్నిర్దదాహ రోమాపి సత్యేన జగతః స్పశః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **116**

తాత్పర్యం:- పూర్వం వత్సుడనే మహర్షిని ఆతడి సవతితమ్ముడు "నీవు బ్రాహ్మణుడవు కావు. శూద్ర పుత్రుడవని నిందించాడు. అంత ఆ వత్సుడు అగ్ని ప్రవేశం చేయగా, సకల జగత్తు యొక్క శుభాశుభ కర్మలకు సాక్షీభూతుడైన అగ్ని సత్యమును బట్టి ఆ ఋషియొక్క రోమం ఒక దాన్ని కూడా దహించలేదు. కాబట్టి ఇలా ప్రమాణంచేత మానవుల సత్యాసత్యాలను ధర్మాధికారి తెలుసుకోవాలి. ॥116॥

ప్రక్షిప్తాల పరిశీలన

97 నుంచి 116 శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 109-116 శ్లోకాలలోని శపథ ప్రసంగంలో చెప్పిన పై జవన పుత్రుడు సుదాసుడు, వత్సుడు మొదలైనవారు స్వాయంభువ మనువుకు ఎన్నో తరాల తర్వాత పుట్టారు. తర్వాతి వారి వివరాలు, తర్వాతి ప్రక్షిప్తకారుల రచన. ఈ అంతర్ వ్యతిరేకతలోని కాల వ్యతిరేకత వల్ల ఈ శ్లోకమూ, దీనికి సంబంధించిన మొత్తం విషయమూ ప్రక్షిప్తాలే. ఈ జనమంతా మనువుకు దాదాపు 60-65 తరాల తర్వాత పుట్టారు.

ఖ. 100 నుంచి 113లలో స్త్రీలతో సంబంధాలను గురించి కల్లలు చెబితే బంధువులు నశిస్తారని చెప్పటం, మళ్లీ అబద్ధాలు చెబితే పరవాలేదని మినహాయింపు నివ్వడం ఎన్నో వివాహాల విషయాలు ఆధారంగా చెప్పినది. పలు వివాహాలు మనువు వ్యవస్థకు వ్యతిరేకం. అతడు సవర్ణానికి చెందిన ఒకటే స్త్రీని పెళ్లాడాలని చెప్పాడు. [3-4; 7.77].

గ. 97-101 శ్లోకాలలో ఒక వ్యక్తి కర్మల ఫలితాలను ఎందరో అనుభవించాలని ఉంది. ఇది 4.240 కి వ్యతిరేకం. అందులో మనువు కర్తే భోక్త అని చెప్పాడు.

ఘ. 102 లో వైశ్యులు, శూద్రుల కర్మలు చేసే వారినీ బ్రాహ్మణులుగా భావించాలని చెప్పటం మనువు పద్ధతికి వ్యతిరేకం [1.88]. కర్మల చేత వర్ణ వ్యవస్థ అనేది భంగమై, జన్మల చేత అనేది ప్రాచుర్యం పొందిన రోజులలో రాసి కలిపిన శ్లోకాలుగా కనబడుతున్నాయి.

జ. మునుపటి పూర్తి ప్రసంగంలో నిజమైన సాక్ష్యం చెప్పటానికి ప్రేరణ, పద్ధతి చెప్పారు [74-76, 81-84, 91, 96]. కానీ, 104 -106 లలో కొన్ని సమయాలలో అబద్ధపు సాక్ష్యమూ చెప్పవచ్చునని మినహాయింపు నిచ్చారు.

చ. 109-113 లలో సాక్షులు దొరకనపుడు, శపథం చేయించాలని ఉంది. కానీ 8.182లో సాక్షులు దొరకక పోతే, గూఢచారుల ద్వారా విషయాలు తెలుసుకోవాలనే నిర్దేశం ఉంది. ఇటువంటి శపథం మనువుకు సమ్మతం కాదు.

ఛ. 109-116లలో శపథాన్ని కూడా న్యాయానికి ఆధారంగా భావించారు. కానీ 7.52లో చదువుకున్న సాక్షినే నిర్ణయాలకు ఆధారం అన్నారు. శపథం చేయటం మను సమ్మతం కాదు. ఎందుకంటే మనువు విశేష గుణాలున్నవారినే సాక్షులుగా స్వీకరిస్తాడు, [8.63] అందరినీ కాదు. శపథం ఎవరైనా చేయగలరు. అందుచేత మనువు ప్రకారం నిర్ణయాలలో శపథం ప్రామాణికం కాదు.

జ. 109-116లలోని శపథ పద్ధతి మనువుకు వ్యతిరేకం. మనువు మునుపటి 8.79-84లలో 'సాక్ష్యం ఇవ్వటం-అడగటమనే పద్ధతి'ని చెప్పాడు. అక్కడ శపథాన్ని గురించి గణించనూ లేదు, చెప్పనూ లేదు. పైగా సత్యమే సాక్ష్యానికి ఆధారమన్నాడు. ఈ శ్లోకాలలోని సాక్ష్యంలోనివాటి కన్నా భిన్న పద్ధతి వ్యతిరేకం రావటం చేత మను సమ్మతం కాదు.

2. శైలీగత ఆధారాలు

ఈ అన్ని శ్లోకాల శైలి నిరాధారమూ, నిర్హేతుకమూ, అతిశయోక్తులు నిండినదీ.

క. 97-101 శ్లోకాలలో చెప్పిన బంధువుల మృత్యువు, మృతుల సంఖ్య - వీటికి ఏ ప్రామాణిక ఆధారమూ లేదు, అంతా నిరాధారమే !

ఖ. 114-115లలో అగ్ని, జలం మొదలైన వాటి పరీక్షలున్నాయి. అగ్ని లక్షణం దహించడమే, జలం లక్షణం ముంచడమే ! పవిత్రమైన అపవిత్రమైన దేన్నయినా అగ్ని తప్పక కాలుస్తుంది. జడ పదార్థాలు, అగ్ని మొదలైనవాటిని జ్ఞాని, పవిత్ర సాక్ష్యానికి ఆధారంగా భావించడం పనికిరాని మాట! ఇలా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజువవుతూంది.

3. అవాంతర వ్యతిరేకాలు

క. వీటిలో చాలా అంతర్ వ్యతిరేకాలు ఉన్నాయి కానీ, 104,105లలోని అవాంతర వ్యతిరేకత చెప్పుకోదగింది. 104లో సత్యం కన్నా అసత్యమే గొప్పదని భావించి పాపం కాదన్నారు. 105-106లలో అదే అబద్ధాన్ని పాపంగా భావించి, శుద్ధి, ప్రాయశ్చిత్తాల కొరకు 'వాగ్దైవత్య' మంత్రాలతో యజ్ఞం చేయాలన్నారు. ఎంత వ్యతిరేకమూ, హాస్యాస్పదమూ అయిన మాట ఇది.

ఖ. 100, 113 శ్లోకాలలో స్త్రీల కలయికలో అబద్ధాలు చెబితే వినాశం కలుగుతుందన్నారు. తర్వాత అబద్ధం చెప్పవచ్చునని మినహాయింపు నిచ్చారు.

గ. 103-108 శ్లోకాలలో అబద్ధపు సాక్ష్యంతో బంధువులు నశిస్తారని ఉంది. 112-116లలో అబద్ధపు శపథం చేయవచ్చునని మినహాయింపూ ఉంది. పరస్పర వ్యతిరేకాలైన ఇవి ఒకే వ్యక్తి రాసినవీ కావు, మనువు వంటి ఋషి కూడా ఇటువంటి వ్యతిరేకతలు చెప్పనూ లేదు ! కనుక ఈ శ్లోకాలు అప్రామాణికాలూ, ప్రక్షిప్తాలు.

117 నుండి 122 వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం

అబద్ధపు సాక్షపు వివాదముపై పునర్విచారణ

యస్మిన్ యస్మిన్ వివాదే తు కౌటసాక్ష్యం కృతం భవేత్ । మూలశ్లోక సం.**65**
తత్తత్కార్యం నివర్తేత కృతం చాప్యకృతం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**117**

టీక:- యస్మిన్ యస్మిన్ వివాదే తు = ఏ ఏ వివాదాలలో, **కౌటసాక్ష్యం కృతం భవేత్** = తప్పుడు సాక్ష్యం చెప్పినట్లు తెలిసినదో, **తత్+తత్ కార్యం నివర్తేత** = ఆ యా కార్యాల నిర్ణయాన్ని రద్దుచేసి పునర్విచారణకు తీసుకోవాలి. **కృతం చ + అపి+అకృతం భవేత్** = తీర్పు చెప్పిన ఆ దావా, తీర్పు చెప్పని దానితో సమానం అంటే మళ్ళా విచారించాలి.

తాత్పర్యం:- ఏ యే వివాదాలలో సాక్షులు తప్పుడు సాక్ష్యము చెప్పినారని నిర్ణయించబడిందో, ఆ యా కార్యాల నిర్ణయాన్ని రద్దుచేసి న్యాయమూర్తి మళ్ళీ పునర్విచారణకు తీసుకోవాలి. తీర్పు చెప్పిన ఆ దావా తీర్పు చెప్పని దానితో సమానం అంటే మళ్ళీ విచారించాలి. ॥117॥

అసత్య సాక్ష్యానికి ఆధారం - ఇది మనుకృతం-ప్రామాణికం

లోభాన్మోహాద్భయాన్మైత్రాత్కామాత్క్రోధాత్తథైవ చ । మూలశ్లోక సం.**66**
అజ్ఞానాద్బాలభావాచ్చ సాక్ష్యం వితథముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**118**

టీక:- **లోభాత్** = లోభం వల్ల, దురాశ వల్ల, **మోహాత్** = అజ్ఞానం వల్ల, **భయాత్** = భయం వల్ల, **మైత్రాత్** = మిత్రత్వం వల్ల, **కామాత్** = కామం వల్ల, **క్రోధాత్** = క్రోధం వల్ల, **అజ్ఞానాత్** = తెలియకనో, **బాలభావాత్** = పిల్లతనం వల్ల చెప్పిన, **సాక్ష్యం** = సాక్ష్యం, **వితథమ్ + ఉచ్యతే** = అబద్ధపు సాక్ష్యమవుతుంది.

ఋషి దయానందభాష్యం:- కొన్ని దండనల భేదములను తెలుపుతూ లోభాదులను వేరుగా నిరూపిస్తున్నాడు- లోభం (పేరాస) వల్లనో, మోహం (అవివేకం) వల్లనో, భీతివల్లనో, మైత్రివల్లనో, కోరికవల్లనో, ఆగ్రహంవల్లనో, అజ్ఞానం వల్లనో, పరాకువల్లనో తప్పు సాక్ష్యం జనులు పలుకుతారని భావం. (స.ప్ర. 6వ సము.) ॥118॥

అసత్య సాక్ష్యానికి నేరాన్ని బట్టి దండన వ్యవస్థ - ఇది మనుకృతం. ప్రామాణికం

ఏషామన్యతమే స్థానే యస్సాక్ష్యమనృతం వదేత్ । మూలశ్లోక సం. **67**
తస్య దండవిశేషాంస్తు ప్రవక్ష్యామ్యనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **119**

టీక:- **ఏషామ్** = (8.118)లో చెప్పబడిన కారణాలలో ఉండి, **అన్యతమే స్థానే** = ఏ కారణం వల్లనైనా, **యః అనృతం వదేత్** = అసత్యం చెప్పునో, **తస్య** = అతడికి, **దండ విశేషాన్** = విశేష దండనలను, **అనుపూర్వశః** = క్రమంగా, **ప్రవక్ష్యామి** = వచింతును. (8.120, 8.122) వీటికంటే భిన్నమైన కారణాలున్నట్లయితే అతడికి చెప్పబోయే విధంగా అనేక విధాలైన దండనలను విధించాలి.

ఋషి దయానందభాష్యం:- ఈ పై చెప్పిన గుణాలలో ఒక్కదాన్ని బట్టి ఎవడు తప్పు సాక్ష్యం చెబుతాడో వాడికి ఈ క్రింద చెప్పబోయే అనేక విధాలైన శిక్షలను వేయాలి. (స.ప్ర. 6వ సము.)॥119॥

ఇది మనుకృతం-ప్రామాణికం

లోభాత్సహస్రం దండ్యస్తు మోహాత్పూర్వం తు సాహసమ్ । మూలశ్లోక సం. **68**
భయాద్వౌ మధ్యమౌ దండ్యౌ మైత్రాత్పూర్వం చతుర్గుణమ్॥ ప్రక్షిప్త శ్లోక సం. **120**

టీక:- **లోభాత్ సహస్రం దండ్యః** = లోభం వల్ల అబద్ధపు సాక్ష్యం చెబితే ఒక వేయి పణాలు జుర్మానా వేయాలి, **మోహాత్ పూర్వం సాహసమ్** = మోహం వల్ల అబద్ధపు సాక్ష్యం చెప్పిన వాడికి ప్రథమ సాహసం, **భయాత్ ద్వౌమధ్యమౌ దండౌ** = భయం వల్ల అబద్ధపు సాక్షికి-మధ్యమ సాహస దండం, **మైత్రాత్** = మిత్రత్వ కారణంగా అబద్ధపు సాక్షికి 15 రూపాయల 10 అణాల దండన ఇవ్వాలి.

ఋషి దయానందభాష్యం:- లోభంతో అసత్యసాక్ష్యమిచ్చిన వానినుండి 15 రూపాయిల 10 అణాలు. (రు. 15-10 అణాలు) (1 అణా = 6 పైసలు, 4 అణాలు = 25 పైసలు, 1 రూపాయి = 16 అణాలు = 100 పైసలు) దండుగగా తీసుకోవాలి. మోహంతో అసత్యసాక్ష్యమిచ్చినవాని నుండి 3 రూపాయిల 2 అణాలు (రూ. 3-అ2) దండుగగా తీసుకోవాలి. భయంతో అసత్యసాక్ష్యమిస్తే అతని నుండి 6 రూపాయిల నాలుగు అణాలు (రు. 6-అ4) దండుగగా తీసుకోవాలి. మిత్రత్వంతో మిథ్యాసాక్ష్యమిస్తే అతనినుండి 12 రూపాయిల ఎనిమిది అణాలు (రు. 12-అ8) దండుగగా తీసుకోవాలి. (స.ప్ర. 6వ సము.) ॥120॥

ఇది మనుకృతం. ప్రామాణికం

కామాద్దశగుణం పూర్వం క్రోధాత్తు త్రిగుణం పరమ్ । మూలశ్లోక సం. **69**
అజ్ఞానాద్వే శతే పూర్ణే బాలిశ్యాచ్ఛతమేవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **121**

టీక:- కామాత్ దశగుణం పూర్వం = కామం వల్ల అబద్ధపు సాక్ష్యం చెప్పినవాడికి పదింతలు ప్రథమ సాహసం, **క్రోధాత్ త్రిగుణం పరమ్** = క్రోధం వల్ల అబద్ధం చెప్పినవాడికి మూడింతలు ప్రథమ సాహసం, **అజ్ఞానాత్ద్వేశతే** = తెలియక చెప్పినదానికి 200 పణాలు దండన వేయాలి. **బాలిశ్యాత్ శతం ఏవతు** = బాల్యచాపల్యం వల్ల జరిగితే, **శతమ్+ఏవతు** = వంద పణాలు దండన ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- కామంతో అసత్యపుసాక్ష్యమిచ్చినవాని నుండి 25 రూపాయిలు (25-00) దండుగగా తీసుకోవాలి. క్రోధంతో అబద్ధపు సాక్ష్యమిచ్చినవాని నుండి 46 రూపాయిల 14 అణాలు (రు.46-అ14) దండుగగా, అజ్ఞానంతో అబద్ధపుసాక్ష్యమిచ్చిన వాని నుండి ఆరు రూపాయిలను (రు.6-00) దండుగా, బాల్యతనంతో మిథ్యాసాక్ష్యమిచ్చినవాని నుండి ఒక రూపాయి తొమ్మిది అణాలు (రు.1-అ9) దండుగగా తీసుకోవాలి. ॥121॥

వివరణ:

1) సాహస దండం-వాటి ప్రమాణం. నేటి ముద్రణలతో పట్టిక.

(క) శ్లో. 8.138లో వర్ణననుబట్టి

సాహసం పేరు	పణం	రూపాయలు అణాలలో
ప్రథమ లేదా పూర్వసాహసం	250	3 రూ 14 1/2 అణాలు
మధ్యమ సాహసం	500	7 రూ 13 అణాలు
ఉత్తమ పూర్వసాహసం	1000	15 రూ 10 అణాలు

(ఖ) 1 పణము - 1 పైస లేదా కాణి
4 కాసులు - 1 అణ
16 అణాలు - 1 రూపాయి
64 పణాలు - 1 రూపాయి

2) అబద్ధం సాక్షులకు-అర్థదండన-నేటి ముద్రణలతో సమాన పట్టిక

8.120, 121వ శ్లోకంలో చెప్పినట్లు

	అపరాధము	వర్ణిత దండన	పణం	రూ, అణాలు, పైసలలో
1.	లోభం వల్ల అబద్ధపు సాక్షికి	వేయి పణాలు	1000	(15-10 పదిహేను రూపాయల పది అణాలు)
2.	మోహం వల్ల అబద్ధపు సాక్షికి	పూర్వ సాహసం	250	(3-14 1/2అణాలు మూడు రూపాయల 14.5 అణాలు)
3.	భయం వల్ల అబద్ధపు సాక్షికి	2 మధ్యమ సాహసం	1000	(15-10 పదిహేను రూపాయల పది అణాలు)
4.	మిత్రత్వం వల్ల అబద్ధపు సాక్షికి	నాలుగింతల ప్రథమ సాహసం	1000	(15-10 పదిహేను రూపాయల పది అణాలు)
5.	కామం వల్ల అబద్ధపు సాక్షికి	దశగుణ ప్ర.సాహసం	2500	(39 రూపాయల 1అణా)
6.	క్రోధం వల్ల అబద్ధపు సాక్షికి	3 రెట్లు ఉ.సాహసం	3000	(46-1 నలభై ఆరు రూపాయల 14 అణా)

7.	అజ్ఞానం వల్ల అబద్ధపు సాక్షికి	రెండు వందల పణాలు	200	(3-2 మూడు రూపాయల రెండు అణాలు
8.	బాల్యం వల్ల అబద్ధపు సాక్షికి	100 పణాలు	100	1 రూపాయి 9 అణాలు

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతానాహుః కౌటసాక్ష్యే ప్రోక్తాన్ దండాన్ మనీషిభిః । మూలశ్లోక సం. **70**
ధర్మస్యావ్యభిచారార్థమధర్మనియమాయ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **122**

టీక:- ధర్మస్య + అవ్యభిచారార్థం = ధర్మం లోపించకుండా ఉండటానికి, అధర్మ నియమాయ = అధర్మ వ్యాప్తిని ఆపడానికి, కౌటసాక్ష్యే = తప్పుడు సాక్ష్యం పలికినప్పుడు, ఋషిభిః ప్రోక్తాన్ = ఋషులు ఈ దండనలు విధించారని, మనీషిభిః = మనీషులు (9.119-121) చెప్పి ఉన్నారు.

తాత్పర్యం:- సత్యధర్మము లోపించకుండా ఉండటానికి, అసత్యరూప అధర్మ వ్యాప్తిని ఆపడానికి తప్పుడు సాక్ష్యం పలికినప్పుడు ఋషు లీదండనలు విధించారని పెద్దలు చెప్పి ఉన్నారు. ॥122॥

123 నుండి 125వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

అబద్ధపు సాక్షికి శరీర దండన -

* కౌటసాక్ష్యం తు కుర్వాణాం స్త్రీన్వర్ణాన్ ధార్మికో నృపః ।
ప్రవాసయేద్దండయిత్వా బ్రాహ్మణం తు వివాసయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***123***

తాత్పర్యం:- నృపాలుడు తప్పుడు సాక్ష్యం పలుకువారైన క్షత్రియ, వైశ్య, శూద్రులను పైన పేర్కొన్న ప్రకారం దండన విధించి స్వరాజ్యం నుండి బయటికి వెడలగొట్టాలి. బ్రాహ్మణులకు దండన విధించక, దేశం నుండి మాత్రం వెడలగొట్టాలి. ॥123॥

* *దశ స్థానాని దండస్య మనుస్స్వాయంభువోఽబ్రవీత్ ।*
త్రిషు వర్ణేషు యాని స్యురక్షతో బ్రాహ్మణో వ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***124***

తాత్పర్యం:- దండించే విషయమై దేహం మీద 10 స్థానాలను మనువు చెప్పాడు. బ్రాహ్మణుడికి మాత్రం శరీరం మీద ఎలాంటి గాయం కలిగించక అతన్ని దేశబహిష్కృతుణ్ణి చేస్తే చాలు అన్నాడు. ॥124॥

* ఉపస్థముదరం జిహ్వా హస్తౌ పాదౌ చ పంచమమ్ ।
చక్షుర్నాసా చ కర్ణౌ చ ధనం దేహ స్తథైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***125***

తాత్పర్యం:- ఉపస్థ (స్త్రీలకు యోని/పురుషులకు లింగము) కడుపు, నాలుక, చేతులు, కాళ్లు, కన్ను, ముక్కు, చెవి, మొత్తం శరీరం, ధనం ఈ 10 స్థానాలు దండించదగినవి. దండించవలసి వస్తే వీనిపైననే దండించాలి. తక్కువ నేరానికి స్వల్పదండనం, పెద్దనేరానికి అధికదండనం పడటం అనాదిగా ఉన్నదే! ॥125॥

ప్రక్షిప్తాల పరిశీలన

1. 123,124 శ్లోకాలలో బ్రాహ్మణులను శిక్షించకుండా వారికి దేశ బహిష్కరణ విధించాలని ఉంది. మిగిలిన అన్ని వర్ణాల వారిని దండించాలనటం పక్షపాత భావనతో ఉంది. పైగా ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు నాలుగు వర్ణాలవారూ శిక్షార్హులే అన్నాడు. పైగా బాగా చదువుకున్న వారు, గౌరవించదగిన వారు కావటం చేత, వారు అపరాధాలు చేస్తే, అన్ని వర్ణాలవలె బ్రాహ్మణులు కూడా అత్యధికంగానూ, తప్పక దండనీయులే అనీ చెప్పాడు [7.17,8.335-338]

2 శైలీగత ఆధారాలు

1. 124-125 శ్లోకాలలో **"మనుః స్వాయం భువః అబ్రవీత్"** అనటం వల్ల, మనువు కాక వీటిని మరెవరో రచించారని స్పష్టంగా తెలిసి పోతూంది. అందువల్ల ఇవి ప్రక్షిప్తాలు.

2 123లో పక్షపాత భావన ఉంది. మనువు వ్యవస్థలో ఇటువంటి పక్షపాత ధోరణి లేనే లేదు. అపరాధాలు చేస్తే అందరూ తప్పక దండనార్హులే అన్నాడు [8.335,347].

126 నుండి 138వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

దండించేప్పుడు విచారించాల్సిన విషయాలు-

అనుబంధం పరిజ్ఞాయ దేశకాలౌచ తత్త్వతః । మూలశ్లోక సం.**71**
సారాఽపరాధౌ చాలోక్య దండం దండ్యేషు పాతయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**126**

టీక:- న్యాయాధిపతి, **అనుబంధం** = అపరాధి యొక్క సంకల్పం, ఉద్దేశం, షడ్యంత్రం-కుట్రయేమైనా ఉందా? లేదా? మాటిమాటికి నేరం చేస్తున్నాడా? అనే విషయాన్ని, **తత్త్వతః దేశకాలౌ** = వాస్తవంలో అతడి దేశం, ఏ సమయంలో జరిగింది అనే విషయాన్ని, **పరిజ్ఞాయ** = పరిశీలించి, **చ** = అట్లే, **సార-అపరాధౌ** = అపరాధి యొక్క శారీరక-ఆర్థిక శక్తిని, అపరాధం యొక్క స్థాయిని, **ఆలోక్య** = విచారించి, **దండ్యేషు దండం పాతయేత్** = దండనీయులకు దండనమును విధించాలి.

ఋషి దయానందభాష్యం:- మాటిమాటికీ చేసిన తప్పునే చేస్తే అదీ బుద్ధిపూర్వకంగా చేస్తే శిక్షించాలి. ఇంకా దేశ, కాలాలు, రాత్రింబవళ్లు, దేహ ధనబలాలు, నేరంయొక్క లాఘవం తీవ్రతలు కూడ విచారించి గాని దండనీయులకు, దండనమును విధించాలి.

కానీ ఏ ఏ దండన రాయబడిందో, ముందు రాయబోతారో లోభం వల్ల సాక్ష్యమిచ్చినట్లయితే, పదిహేను రూపాయల, పది అణాలు రాయబడింది. కాని, అత్యంత నిర్ధనుడైనట్లయితే, అతని నుండి తక్కువ, ధనాఢ్యుడైనట్లయితే రెండు రెట్లు, మూడు రెట్లు లేదా నాలుగు రెట్లు ఎక్కువ తీసికోవచ్చు. అంటే దేశకాల పరిస్థితులను, వ్యక్తులను, అపరాధం స్థాయిని బట్టి దండన విధించాలి.(స.ప్ర.6వ సము.) ॥126॥

అన్యాయపూర్వక దండన నీయరాదు- ఇది మనుకృతం-ప్రామాణికం

అధర్మదండనం లోకే యశోఘ్నం కీర్తినాశనమ్ । మూలశ్లోక సం.**72**
అస్వర్గ్యం చ పరత్రాపి తస్మాత్తత్పరివర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**127**

టీక:- లోకే అధర్మ దండనం = ఈ ప్రపంచంలో, అధర్మంగా దండించడం, **యశోఘ్నం కీర్తి నాశనమ్** = పూర్వ ప్రతిష్ఠ, భవిష్యత్తులో, పరజన్మలో కలుగబోయే కీర్తికి నాశనకరం. **చ** = మరియు, **పరత్ర+అపి అస్వర్గ్యం** = పరజన్మలోను దుఃఖదాయకమవుతుంది, **తస్మాత్** = అందువల్ల, **తత్ పరివర్జయేత్** = అధర్మంగా ఎవరినీ దండించరాదు.

ఋషి దయానందభాష్యం:- ఎవరైన ఈ లోకంలో అధర్మంగా దండిస్తే అతడు ఇంతకు పూర్వం తనకున్న ప్రతిష్ఠను పోగొట్టుకోవటమే గాక వర్తమాన, భవిష్యత్కాలంలో, పరజన్మలో లభించే కీర్తిని నాశనం చేస్తుంది. అది అతనికి పరజన్మలో కూడ దుఃఖాన్నే కలిగిస్తుంది. కాబట్టి అధర్మంగా ఎవరినీ దండించరాదు. (స.ప్ర.6వ సము.)॥127॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అదండ్యాన్ దండయన్రాజా దండ్యాంశ్చైవాప్యదండయన్ । మూలశ్లోక సం.**73**
అయశో మహదాప్నోతి నరకం చైవ గచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**128**

టీక:- రాజా = రాజు, **దండ్యాన్ అదండయన్** = దండింప తగినవారిని దండించకుండా, **అదండ్యాన్ దండయన్** = దండనీయులు కానివారిని దండించే ప్రభువు, **మహత్ అయశః ఆప్నోతి** = జీవించి ఉండగానే మహానిందలకు గురవుతాడు, **చ** = మరియు, **నరకం ఏవ గచ్ఛతి** = మరణంలోనూ, తరువాత నరకంలోనూ దుఃఖాలననుభవిస్తాడు. అందువల్ల అపరాధిని దండించాలి, నిరపరాధిని ఎప్పుడూ ఎవ్వడూ దండన చేయరాదు.

ఋషి దయానందభాష్యం:- లోభ-క్రోధాలు పూని ఏ రాజైనా దండనార్హులు కానివారిని దండించినా; స్నేహ-మమకారాలచేత దండించదగినవారిని విడిచిపెట్టినా ఆ రాజు గొప్ప అపకీర్తిపాలౌతాడు మరణంలోనూ, తరువాత నరకంలోనూ దుఃఖాలను అనుభవిస్తాడు. అందువల్ల అపరాధిని దండించాలి, నిరపరాధిని ఎప్పుడూ ఎవ్వడూ దండన చేయరాదు. (స.ప్ర. 6వ సము)॥128॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వాగ్దండం ప్రథమం కుర్యాద్ధిగ్దండం తదనంతరమ్ । మూలశ్లోక సం. **74**
తృతీయం ధనదండం తు వధదండమతః పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **129**

టీక:- రాజు = ప్రభువు, **ప్రథమం వాక్+దండం** = మొదట వాక్కు ద్వారా అపరాధిని నిందించాలి, **తత్+అనంతరమ్** = తరువాత, రెండోది, **ధిక్+దండం** = అంటే మళ్ళా అపరాధమెందుకు చేసితివని ఛీకొట్టాలి. **తృతీయం ధనదండం** = మూడోది ధన దండనను ఎక్కువగా జుర్మానా వేయడం. దీని వల్ల కూడా మారకపోయినట్లయితే. **అతఃపరమ్** = దీని తరువాత, **వధ దండమ్** = బెత్తంతో కొట్టడం లేదా తల నరికివేయడం చేయాలి.

ఋషి దయానంద భాష్యం:- నేరం మొదటిసారి అయినప్పుడు, ఇతరత్రా అతడు గుణవంతుడైనప్పుడు 'ఈ పాడుపని మళ్లీ చేయకు' అని ప్రథమ తప్పు కింద హెచ్చరించి విడిచిపెట్టాలి. తిరిగివాడు రెండోసారి ఆ కార్యాన్ని కొనసాగిస్తే వాణ్ణి పదిమందిచేత తిరస్కరింపజేయాలి. ఇంకా అలాగే ఉంటే మూడోది అపరాధరుసుం విధించాలి. దీనివల్ల కూడా మారనట్లయితే చివరగా మాత్రమే దేహ దండనకు లేదా మరణ దండనకు ఆదేశించాలి. (స.ప్ర. 6వ సము.) ॥129॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వధేనాపి యదా త్వేతాన్నిగ్రహీతుం న శక్నుయాత్ । మూలశ్లోక సం. **75**
తదైషు సర్వమప్యేతత్ ప్రయుంజీత చతుష్టయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **130**

టీక:- రాజు, **ఏతాన్** = ఈ అపరాధులను, **యదా** = ఎప్పుడూ, **వధేన +అపి** = శారీరక దండన వల్ల కూడా, **నిగ్రహీతుం న శక్నుయాత్** = నియంత్రించలేక పోయినట్లయితే, **తదా+ఏషు** = అప్పుడు వీరి మీద, **సర్వమ్+అపి+ఏతత్ చతుష్టయమ్ ప్రయుంజీత** = అప్పుడు ఉపర్యుక్తమైన (8.129) నాలుగు విధాలైన దండనలను ఒక్కసారి తీవ్రరూపంగా అమలు చేయాలి.

తాత్పర్యం:- అయితే, రాజు ఈ అపరాధులను అంగచ్ఛేదాది దండనతో కూడ వీరిని దారికి తీసుకురాలేక పోతే అప్పుడు వీరిమీద ఏకకాలంలో పై శ్లోకంలో పేర్కొన్న నాలుగు రకాలైన దండనలను ఒక్కసారి తీవ్రరూపంగా అమలు చేయాలి. ॥130॥

నాణెముల విలువలు

ఇచ్చిపుచ్చుకోవడానికి ఉపయోగపడే నాణేల-ముద్రల విలువలు ఇది మనుకృతం-ప్రామాణికం

లోక సంవ్యవహారార్థం యాస్సంజ్ఞాః ప్రథితా భువి । మూలశ్లోక సం. **76**
తామ్రరూప్యసువర్ణానాం తాః ప్రవక్ష్యామ్యశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **131**

టీక:- ఇప్పుడు నేను మీకు, **తామ్ర-రూప్య-సువర్ణానాం యా సంజ్ఞాః** = రాగి, వెండి, బంగారం మొ॥న వాటి యొక్క మాష మొ॥ నాణ్యముల సంజ్ఞలను (పేర్లను), **లోకవ్యవహారార్థం** = మూల్యమివ్వడం తీసికొనే క్రయ విక్రయ వ్యవహార నిమిత్తం, **భువి ప్రథితాః** = లోకంలో ప్రసిద్ధంలో, **తాః** = వాటిన్నిటినీ, **అశేషతః ప్రవక్ష్యామి** = సంపూర్ణంగా చెబుతాను.

తాత్పర్యం:- బంగారు, వెండి, రాగి, నాణెములకు లోకంలో క్రయవిక్రయవ్యవహారాల నిమిత్తం ఏ సంజ్ఞలు ప్రసిద్ధములయి ఉన్నవో, వాటిని దండాద్యుపయోగములకూ (అపరాధములు మొదలైనవి వేయడం కోసం) ఆ సంజ్ఞలను అన్నిటిని సంపూర్ణంగా మీకు తెలిపెదను వినండి. ॥131॥

కొలతలకు ముందుగా మాపక తూకాలకు సంబంధించిన త్రసరేణు పరిభాష - ఇది మనుకృతం-ప్రామాణికం

జాలాంతరగతే భానౌ యత్సూక్ష్మం దృశ్యతే రజః । మూలశ్లోక సం. **77**
ప్రథమం తత్ ప్రమాణానాం త్రసరేణుం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **132**

భానౌ జాలాంతరగతే = సూర్యుడు గవాక్షం నుండి లోన ప్రవేశించినప్పుడు ఆ ఎండలో, **యత్ సూక్ష్మం రజః దృశ్యతే** = ఏ సూక్ష్మమైన దుమ్ము ధూళిలో ఏ నలుసు కణాలు (సూక్ష్మ పదార్థం కనిపిస్తుందో, దాన్ని పరిమాణంలో, **తత్ ప్రమాణానాం ప్రథమం** = ప్రథమ ప్రమాణంగా గుర్తించారు (కొలమానం). **త్రసరేణుం ప్రచక్షతే** = దాన్నే 'త్రసరేణువు' అంటారు.

తాత్పర్యం:- సూర్యుడు గవాక్షములనుండి లోన ప్రవేశించినప్పుడు ఆ ఎండలో ఏ సూక్ష్మమైన దుమ్ము ధూళిలో ఏ నలుసు కణాలు కనిపిస్తున్నాయో, దాన్ని ప్రథమ ప్రమాణంగా (కొలమానం) గుర్తించారు. దానికే త్రసరేణువని పేరు.॥132॥

లిక్షా-రాజసర్షపము-గౌరసర్షపముల పరిభాష - ఇది మనుకృతం. ప్రామాణికం

త్రసరేణవోఽష్టౌ విజ్ఞేయా లిక్షైకా పరిమాణతః । మూలశ్లోక సం. **78**
తా రాజసర్షపస్తిస్రస్తే త్రయో,గౌరసర్షపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **133**

టీక:- తూకంలో, **పరిమాణతః** = కొలతననుసరించి, **అష్టౌ త్రసరేణవః ఏకా లిక్షా విజ్ఞేయా** = ఎనిమిది త్రసరేణువులు ఒక లిక్ష అనబడును, **తాః తిస్రః** = మూడు లిక్షలు-ఒక రాజసర్షపం ఒక ఆవగింజ, **తే త్రయః** = మూడు రాజ సర్షపములు ఒక గౌరసర్షపముతో సమానం.

తాత్పర్యం:- కొలతననుసరించి మూడు త్రసరేణువులు ఒక లిక్ష. మూడు లిక్షలు ఒకరాజసర్షపం (పెద్ద ఆవగింజ). మూడు ఆవగింజలు ఒక గౌరసర్షపం. ॥133॥

మధ్య యవ-కృష్ణల-మాష-సువర్ణాల పరిభాష ఇది మనుకృతం. ప్రామాణికం

సర్షపాష్షడ్యవో మధ్యస్త్రియవం త్వేక కృష్ణలమ్ । మూలశ్లోక సం. **79**
పంచకృష్ణలకో మాషస్తే సువర్ణస్తు షోడశ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **134**

టీక:- **షట్ సర్షపాః మధ్యయవం** = ఆరు గౌర సర్షపాలు ఒక మధ్యయవ పరిమాణం. **తు** = మరియు, **త్రియవం ఏక కృష్ణలమ్** = మూడు మధ్యయవల పరిమాణం ఒక కృష్ణలం = రత్తి, **పంచ కృష్ణలకః మాషం** = ఐదు కృష్ణల-రత్తుల పరిమాణం ఒక మాష,(స్వర్ణం), **తే షోడశ సువర్ణః** = ఆ పదహారు మాషల పరిమాణం ఒక సువర్ణం.

తాత్పర్యం:- ఆరు గౌరసర్షపములు గొప్పదికాక, చిన్నదికాక ఉండు మధ్యతరమైన యవం. మూడు యవలు ఒక గురిగింజ. అయిదు గురిగింజ లొకమాషము, పదహారుమాషములు ఒక సువర్ణం. ॥134॥

పల-ధరణ-రౌప్యమాషకముల పరిభాష - ఇది మనుకృతం. ప్రామాణికం

పలం సువర్ణాశ్చత్వారః పలాని ధరణం దశ । మూలశ్లోక సం. **80**
ద్వే కృష్ణలే సమధృతే విజ్ఞేయో రౌప్యమాషకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **135**

టీక:- చత్వారః సువర్ణాః పలం = నాలుగు సువర్ణాలు కలిసి ఒక పలమవుతుంది, దశ పలాని ధరణం = దశ ఫలాలు ఒక ధరణమవుతుంది, ద్వే కృష్ణలే సమధృతే రౌప్యమాషకః విజ్ఞేయః = రెండు కృష్ణలు (రత్తులు) గురిగింజలు తక్కెడలో పెట్టినప్పుడు తూకం సరాసరి ఉన్నట్లయితే, ఒక రౌప్యమాషకమని తెలుసుకోవాలి.

తాత్పర్యం:- నాలుగు సువర్ణములు ఒకపలం. పది పలములు ఒకధరణం. రెండు గురిగింజల ఎత్తు రూప్యమాషకం అనబడును. ॥135॥

రౌప్యధరణ రజతపురాణ-కార్షాపణల పరిభాష ఇది మనుకృతం. ప్రామాణికం

తే షోడశ స్యాద్ధరణం పురాణశ్చైవ రాజతః । మూలశ్లోక సం. **81**
కార్షాపణస్తు విజ్ఞేయస్తామ్రికః కార్షికః పణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **136**

టీక:- తే షోడశ దరణం స్యాత్ = ఆ పదారు రూప్యమాషములు ఒక రూప్యధరణం తూకంతో సమానం. చ = మరియు ఒక, రాజతః పురాణః = వెండి 'పురాణ' నామకమైన నాణెమవుతుంది. తామ్రికః కార్షికః పణః = రాగితో చేసిన కార్షాపణం అంటే 16 మాషల బరువు గలది. ఒక పణం, కార్షాపణః విజ్ఞేయః = కార్షాపణమనే నాణెంగా తెలుసుకోవాలి.

తాత్పర్యం:- పదారు రూప్యమాషములు ఒక రూప్యధరణమనబడును. దీనికే పురాణమని పేరు. ఇది వెండితో చేయబడింది. రాగితో చేయబడిన కార్షికం కార్షాపణనాణమనబడును. కార్షికం శాస్త్రీయపలచతుష్టయమున నర్ధభాగమని తెలుసుకోవాలి. ॥136॥

రౌప్యశతమాన-నిష్కముల పరిభాష - ఇది మనుకృతం. ప్రామాణికం

ధరణాని దశ జ్ఞేయః శతమానస్తు రాజతః । మూలశ్లోక సం. **82**
చతుః సౌవర్ణికో నిష్కో విజ్ఞేయస్తు ప్రమాణతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **137**

టీక:- దశ ధరణాని = పది రూప్యధరణములు కలిసి, రాజతః శతమానః జ్ఞేయః = ఒక వెండి శతమానమవుతుంది. మరియు, ప్రమాణతః = ప్రమాణానుసారంగా, చతుః సౌవర్ణికః నిష్కః విజ్ఞేయః = నాలుగు సువర్ణం గల ఒక నిష్కం. "అశర్ఫీగా గుర్తించాలి".

తాత్పర్యం:- పది రూప్య ధరణములు ఒక వెండి శతమానమనబడును. నాలుగు సువర్ణములు తూనికచేత ఒక నిష్కమవుతుంది. ॥137॥

వివరణ:

1. తూచే ప్రమాణాల వివేచన-పట్టిక.

క. శ్లో॥ 8-132 నుండి 136 వరకు ఇచ్చి పుచ్చుకొనే వ్యవహారంలో (దావాలో) వచ్చే తూచే నాణెములు వర్ణన. వాటిలో త్రసరేణువు నుండి కృష్ణం = రత్తీ గురిగింజ వరకున్న ప్రమాణాలు. భూమిలో పుట్టిన పదార్థాల మీద ఆధారపడినవి. మాషం నుండి ధరణ వరకు స్వర్ణమునకు, కృష్ణల నుండి రూప్యశత మానం వరకు వెండి నాణెములు పట్టికననుసరించి, వాటి వివరణ ఈ కింది విధంగా ఉంటుంది.

8 త్రసరేణువులు - 1 లిక్షా.

3 లిక్షలు - 1 రాజసర్షపం (చిన్న నలుపు ఆవగింజ).

3 రాజ సర్షపములు = 1 గౌర సర్షపం (తెల్లటి ఆవగింజ).

6 గౌరసర్షపములు = 1 మధ్యయవ (పెద్దవి కాని చిన్నవి కాని ఎవ్వగింజ).

3 మధ్యయవలు = 1 కృష్ణల (గురిగింజ లేక రత్తి).

స్వర్ణ నిర్మిత తూకములు

5 కృష్ణలములు = రత్తి = 1 మాష (స్వర్ణ నిర్మితం) దాదాపు అణా బరువు.

16 మాషలు = సువర్ణం లేదా కర్ష అణా బరువు (దాదాపు రూపాయ బరువు).

4 సువర్ణములు = 1 పలం (దాదాపు ఛటాకు).

10 పలములు = 1 ధరణం.

వెండితో నిర్మితమైన తూకములు

2 కృష్ణలు -రత్తి = 1 రూప్య మాషకం.

16 రూప్య మాషములు = 1 రూప్య ధరణం.

10 రూప్య ధరణములు = 1 రూప్య శతమానం.

1) కౌటిల్యుడు వర్ణించిన తౌల్య ప్రమాణాలు-దాదాపు మను మహర్షి మాదిరిగానే ఉన్నాయి.

అ. కౌటిల్యుడు వర్ణించిన తూకం నాణెములు. 5 రత్తులు గాని లేదా 10 మినప గింజలకు సమానంగా గాని ఒక స్వర్ణమాషకముంటుంది.

16 స్వర్ణమాషములతో సమానంగా ఒక సువర్ణం లేదా ఒక కర్షం. నాలుగు కర్షములకు ఒక పలం.

2) వెండి తూకముల ప్రమాణములు. 88 తెల్ల ఆవాలతో సమానం ఒక రూప్యమాషకం. మనుమహర్షి ననుసరించి 2 కృష్ణలు లేదా 36 ఆవాలకు సమానం. ఒక రూప్య (వెండి), మినపగింజ 16 రూప్యమాషములు ఒక ధరణతో సమానం అవుతుంది.

ముద్రలు (నాణెములు) వాటి పట్టిక

1) మనువు- తూకం ననుసరించి అర్ధముద్రల నిర్మాణం శ్లో 8.136,137 ముద్రలన్నీ రాగి, వెండి, బంగారంతో చేయబడినవే. వాటి పట్టిక ఈ కింది విధంగా ఉంది.

2) 16 రూప్యమాషములకు సమానమైన బరువు కలది.

రాజత పురాణం (వెండి ముద్ర).

1 కార్షాపణం (రాగి ముద్ర).

4 సువర్ణములతో సమానభారం దాదాపు 1 ఛటాకు = 1 నిష్కం (స్వర్ణ అశీర్ష).

3. కౌటిల్యుడు వర్ణించిన ముద్రలు

వెండి-రాగి ముద్రలను పేర్కొంటూ, వాటి నిర్మాణపద్ధతిని కూడా వర్ణించాడు. కార్షాపణ విషయంలో-“తామ్రికః కార్షికః పణః” అని వర్ణించిన మనువులాగా కౌటిల్యుడుకూడా ఈ కింది విధంగా తయారు చేసే పద్ధతిని వర్ణించాడు. మనువు వర్ణించిన ‘రాజత పురాణ’ మునే కౌటిల్యుడు ‘పణ’ మన్నాడు. వెండితో నిర్మిస్తున్నందువల్ల, ఇదే తరువాత కాలంలో రూప్యకం లేదా రూపాయ (రూపైయా)గా మారి ఉండవచ్చు. కౌటిల్యుడి ప్రకారంగా లవణాధ్యకుడు లేదా టంకసాలాధ్యక్షులు (నాణ్య), ముద్రణాలయాధ్యక్షులు ఈ నాలుగు విధాల నాణాలు ముద్రించాలి.

పణం-అర్ధపణం-పాదపణం అష్టభాగ పణం పేర్లతో నాలుగు రజత ముద్రలు, తప్పనిసరిగా ముద్రించాలి. ఒక పణంలో 16 మాషముల బరువుండాలి. అందులో 11 మాషల వెండి, 4 మాషల రాగి, తగరం, లోహం, సీసం-వీటిలో నుండి ఒక్కొక్క భాగముండాలి. ఈ అనుపాతమునసుసరించి, చిన్న చిన్న ముద్రలుండాలి.

4) రాగి నాణెమునకు-'మాష'మని, కౌటిల్యుడు వర్ణించాడు. కానీ ఇది కూడా 16 మాషములకుండాలి. దీన్నే మనువు కార్షాపణమన్నాడు. దీనికి కూడా 4 రకాల ముద్రలు ఉండాలి. "మాషం, అర్ధమాషం, పాదమాషం (కాకణీ), అష్టభాగ మాషం (అర్ధకాకణీ), [ఇవే తెలుగులోకి కాణీ, అరకాణీగా మారి ఉండవచ్చు]. ఇందులో 11 మాషలు రాగి, 4 మాషలు వెండి, 1 మాషలోహం, సీసం, తగరములలో ఏదైనా ఒక ధాతువు ఉండాలి. చిన్న నాణెములలో ఈ అనుపాతం ననుసరించి ఉండాలి.

పూర్వ-మధ్యమ-ఉత్తమ సాహస పరిభాష- **ఇది మనుకృతం-ప్రామాణికం**

పణానాం ద్వే శతే సార్ధే ప్రథమస్సాహసః స్మృతః । మూలశ్లోక సం.**83**
మధ్యమః పంచవిజ్ఞేయః సహస్రం త్వేవ చోత్తమః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**138**

టీక:- ద్వేశతే సార్ధే పణానాం ప్రథమం సాహసః స్మృతః = 250 పణములు ప్రథమ సాహసం, **పంచ మధ్యమః విజ్ఞేయః** = 500 పణములు-మధ్యమ సాహసం. **సహస్రం తు + ఏవ ఉత్తమః** = (1000) ఒక వెయ్యి పణములు ఉత్తమ సాహసమని తెలిసికోవాలి.

తాత్పర్యం:- రెండువందలయాభై పణములు ప్రథమ సాహసమని, ఐదువందల పణములు మధ్యమ సాహసమనీ, వెయ్యిపణములు ఉత్తమసాహసమనీ చెప్పబడును (పణము= రూక.) ॥138॥

వివరణ: పూర్వ-మధ్యమ-మరియు ఉత్తమ సాహసాలకు హద్దు. కౌటిల్యుడి ననుసరించి 250 పణముల వరకు పూర్వ సాహసం. 251 నుండి 500 వరకు మధ్యమసాహసం. 500 నుండి 1000 వరకు ఉత్తమ సాహసం. కానీ ఇందులో కొంత భేదాన్ని సూచించాడు. 48 పణముల నుండి 200 వరకు ప్రథమ సాహసం. అదేవిధంగా 200-500 వరకు మధ్యమ, 500-1000 వరకు ఉత్తమ సాహసం. నేరాన్ని బట్టి ఈ అవధుల వరకు ఏ సాహసం అయినా విధించవచ్చు.

*** ఋణంపై పన్ను -** **ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు**

* ***ఋణే దేయే ప్రతిజ్ఞాతే పంచకం శతమర్హతి ।***
అపహ్నవే తద్ద్విగుణం తన్మనోరనుశాసనమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***139***

తాత్పర్యం:- నేను అప్పులవాడికి అప్పు చెల్లింపవలసినదే అని అధమర్ణుడు ఒప్పుకొన్నప్పుడు, నూరు పణముల ఐదురూకలు పన్ను చెల్లించాలి. సభలో సైతం నేను ఇతడికి బాకీలేదని అధమర్ణుడు అపద్ధాలు చెబితే, నూటికి పదిరూకలు పన్ను విధించాలని మనువు ఆజ్ఞ. ॥139॥

ప్రక్షిప్త పరిశీలన:-

ఈ 139వ శ్లోకం కింది ప్రమాణాల ప్రకారం ప్రక్షిప్తం.

1. అంతర్ వ్యతిరేకాలు

ఈ దండన విధానం 8.59లో చెప్పబడిన దానికి విరుద్ధంగా ఉన్నది. కావున ఇది ప్రక్షిప్తము.

2. శైలీగత ఆధారము

'తన్మనోదనుశాసనమ్' అను పదము ద్వారా ఈ శ్లోకము మనువుది కాదని ఇతరుడెవడో తర్వాతి కాలంలో చేర్చినాడని తెలుస్తున్నది. ఇది తరువాతిది కావడంచేత ప్రక్షిప్తము.

ఋణం మీద వడ్డీ విధానం- ఇది మనుకృతం. ప్రామాణికం

వసిష్ఠవిహితాం వృద్ధిం సృజేద్విత్తవివర్ధినీమ్ । మూలశ్లోక సం. **84**
అశీతిభాగం గృహ్ణీయాన్మాసాద్వార్ధుషికశ్శతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **140**

టీక:- వసిష్ఠ విహితాం = ఇచ్చిన ఋణం మీద, అర్థశాస్త్ర విద్వాంసుడి ద్వారా విహితమైన, **విత్త వివర్ధినీమ్** = ధనాన్ని పెంపొందించే, **వృద్ధిం** = వడ్డీని, **సృజేత్** = వసూలు చేయవచ్చు కానీ, **వార్ధుషికః** = వడ్డీ తీసుకొనే మనుషుడు, **శతే అశీతి భాగం** = నూటిలో 80వ భాగం అంటే నూటికి రూపాయపావలా మాత్రమే. **మాసాత్** = నెలవారీగా, **గృహ్ణీయాత్** = తీసికోవచ్చు. అంటే ఇంతకు మించి ఎక్కువ వసూలు చేయరాదు. ఇదే అత్యధికమైన హద్దు.

ఋషి దయానందభాష్యం:- వడ్డీజీవనం చేసేవాడు తన ధనం పెంపొందించే వడ్డీని వసూలు చేయవచ్చు. వడ్డీ తీసుకొనేవానికి నూటికి ఎనభైవంతున అంటే నూటికి రూపాయపావలా చొప్పున వడ్డీ నెలవారీగా తీసుకోవచ్చు.॥140॥

నెలకు 100కి రూపాయపావలా కంటే అధికం గాని, 4 అణాల కంటె తక్కువగాను వడ్డీ ఇవ్వరాదు. తీసుకోరాదు. (స.ప్ర. 6వ సము.)

వివరణ:

ఈ శ్లోకంలో ప్రయోగింపబడిన 'వసిష్ఠ' శబ్దానికి అర్థం ఎవరో ఒక వసిష్ఠుడనే వ్యక్తి ఉన్నాడని, ఆయనే ఈ వడ్డీ వ్యవస్థ చేశాడని భ్రమపడరాదు. మనువు కూడా ఆయనను ప్రమాణంగా తీసికొని ఇక్కడ ప్రయోగించాడని తలంచరాదు. టీకాకారులు కొందరు ఈ భ్రమకు లోనై, వసిష్ఠ శబ్దాన్ని చూచి, వసిష్ఠుడనే ఒక ఋషి ఉన్నాడని అర్థం రాశారు.

ఈ శబ్దానికి అర్థశాస్త్రజ్ఞుడని మాత్రమే అర్థం. దీనికి సమర్థనగా ఈ కింది యుక్తులివ్వబడుచున్నవి. 1) ప్రసంగానుసారంగా మనువు మరికొన్ని సందర్భాలలో కూడా ఆ యా విషయాలు తెలిసినవాడని అర్థం చెప్పారు. ఉదాహరణకు-8.157లో శుల్క నిర్ధారణలో, 8.398లో శుల్క నిర్ణయ విషయంలో-విశేషజ్ఞులకు వదిలిపెట్టాడు. ఈ శబ్దానికి పర్యాయవాచకరూపం **'అర్థదర్శినః'** శబ్ద ప్రయోగం కనిపిస్తుంది. ఈ శబ్దం ఉద్దేశమిదే.

2) వేదాదులలో (ఋ. 1.112.9, 7.33.13) వసిష్ఠ శబ్దం **"విశేషజ్ఞ"** దనే అర్థంలోనే ప్రయోగముంది. ప్రసిద్ధ వేద వ్యాఖ్యాకారులైన శ్రీ దయానంద సరస్వతీ స్వాముల వారు కూడా ఈ అర్థాన్నే సూచించారు.

"యో వసతి ధనాది కర్మసు సోఽతిశయస్తమ్ ఉత్తమ విద్వాంసమ్" దీన్ని బట్టి ఇక్కడ ఈ అర్థమే ఉచితమనిపిస్తుంది.

అర్థశాస్త్రజ్ఞులు చేసిన వృద్ధి వ్యవస్థను సూచిస్తూ మనుమహర్షి వడ్డీకి అత్యధికతమమైన వ్యవస్థను నిర్ణయించాడు. ఇంతకంటే అధికంగా వడ్డీ తీసికోరాదనే వారి అభిప్రాయం.

141,142 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *ద్వికం శతం వా గృహ్ణీయా త్సతాం ధర్మమనుస్మరన్ ।*
ద్వికం శతం హి గృహ్ణానో న భవత్యర్థకిల్బిషీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***141***

తాత్పర్యం:- సజ్జనుల ధర్మమును గమనిస్తూ నూటికి నెలకు రెండు రూపాయలు వడ్డియైనను తీసుకోవాలి. అలా నెలకు నూటికి రెండు రూపాయాలు చొప్పున వడ్డి తీసుకొనువాడు ధన గ్రహణమూలమున పాపి కానేరదు. ॥141॥

* ద్వికం త్రికం చతుష్కం చ పంచకం చ శతం సమమ్ ।
మాసస్య వృద్ధిం గృహ్ణీయాద్వర్ణానామనుపూర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**142**

తాత్పర్యం:- బ్రాహ్మణాదివర్ణక్రమంలో నూటికి నెలకు వడ్డిని రెండు, మూడు, నాలుగు, ఐదు రూపాయల చొప్పున తీసుకోవాలి. అంటే బ్రాహ్మణుడి వద్ద నూటికి రెండు, క్షత్రియుడి వద్ద నూటికి మూడు, వైశ్యుడి వద్ద నూటికి నాలుగు, శూద్రుడి వద్ద నూటికి ఐదురూపాయలు వడ్డి తీసుకోవాలి. ॥142॥

ప్రక్షిప్తాల పరిశీలన

141-142 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

(క) మనువు 140వ శ్లోకంలో వంద రూపాయలకు రూపాయపావలా నుంచి వడ్డీ తీసుకోవడం, దాని విలువ పెంచడం - ఇవి అన్ని వర్ణాల వారికీ సమానంగా నిర్ధారించాడు. ఆ శ్లోకం తర్వాతి రెండు శ్లోకాలలో మళ్లీ రెండు నుంచి ఐదు రూపాయల వరకూ వడ్డీ తీసుకోవాలని వ్యతిరేక పద్ధతి చెప్పటం, వర్ణాల వారీగా వడ్డీ పద్ధతి - ఈ రెండూ ముందు చెప్పిన మౌలిక వ్యవస్థకు వ్యతిరేకాలు. అందుకని ఇవి ప్రక్షిప్తాలు.

(ఖ) 141వ శ్లోకంలోని భాష, ఇది తర్వాతి రచన అని చెబుతూంది. **'సతాం ధర్మం అనుస్మరన్'** అని పదే పదే అనటం, **'న భవతి అర్థ కిల్బిషీ'** అనటం రచయిత హీనభావనను ప్రకటిస్తున్నది.

(గ) 143లో శాస్త్ర వ్యతిరేకంగా వడ్డీ తీసుకోవద్దని ఉంది. శాస్త్ర సమ్మతమైన వడ్డీ 140వ శ్లోకంలో చెప్పారు. ఈ శ్లోకాలలో చెప్పినవి శాస్త్ర వ్యతిరేకాలు కనుక, ఇవి ప్రక్షిప్తాలు.

143 నుండి 146 వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

లాభాన్నిచ్చే కుదువ వస్తువులకు వడ్డి లేదు -

న త్వేవాధౌ సోపకారే కౌసీదీం వృద్ధిమాప్నుయాత్ । మూలశ్లోక సం.**85**
న చాధేః కాలసంరోధాన్నిసర్గోఽస్తి న విక్రయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**143**

టీక:- సోఽపకారే = ఉపకారం-వెంటనే లాభం కలిగించే, **ఆధౌ** = తాకట్టు పెట్టినప్పుడు (భూమి, గృహం, అవ మొ॥),**కౌసీదీం వృద్ధిం నతు + ఏవ ఆప్నుయాత్** = వడ్డీ రూపంగా ఏమీ తీసుకోరాదు. **చ** = మరియు , **కాల సంరోధాత్** = చాలా కాలం గడచినా, **ఆధేః** = తాకట్టు కింద పెట్టిన వస్తువులను గాని, భూమి, గోవు మొ॥ వాటి మీద, **న నిసర్గః** = తాకట్టు పెట్టిన వాడికే అధికారం ఉంటుంది. **న విక్రయః** = అప్పిచ్చినవాడు వాటిని ఇతరులకు అమ్మరాదు.

తాత్పర్యం:- భూమి, గోవులు మొదలైనవి కుదువ తాకట్టు ఉంచినప్పుడు ఉత్తమర్ణుడు వడ్డీ తీసుకోరాదు. చాలా కాలం గడిచినా, తాకట్టు కింద పెట్టిన వస్తువులు గానీ, భూమి, గోవు మొ॥ వాటి మీద తాకట్టు పెట్టిన వాడికే అధికారం ఉంటుంది. అప్పిచ్చినవాడు తాకట్టు పెట్టిన వస్తువులను ఇతరులకు అమ్మరాదు. ॥143॥

ఇది మనుకృతం.ప్రామాణికం.

కుదువ-వడి సంబంధ వ్యవస్థలు-144-150

న భోక్తవ్యో బలాదాధిర్భుంజానో వృద్ధిముత్సృజేత్ । మూలశ్లోక సం.**86**
మూల్యేన తోషయేచ్చైనమాధిస్తేనోఽన్యథా భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**144**

టీక:- **బలాత్** = బలాత్కరించి తాకట్టు పెట్టిన వస్తువును పెట్టుకొన్నవాడు, **ఆధిః** = **న భోక్తవ్యః** = ఉపయోగించుకోరాదు. **భుంజానః** = తాకట్టులో ఉన్న వస్తువును ఉపయోగించుకొన్నట్లయితే, **వృద్ధిమ్+ఉత్సృజేత్** = వడ్డీని తీసికోరాదు. అథవా, ఏనం **మూల్యేన తోషయేత్** = కుదువపెట్టిన వ్యక్తికి ఆ మూల్యం ఇచ్చి సంతోషపెట్టాలి, **అన్యథా** = అలా చేయనట్లయితే, **ఆధిః+స్తేనః భవేత్** = కుదువ దొంగ అనబడును. అంటే కుదువ పెట్టిన వస్తువులను దొంగిలించినవాడవుతాడు. దొంగకు వేసే జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- కుదువ బెట్టిన వస్తువులు మొదలైనవి ఉపయోగించుకోరాదు. అనుభవించువాడు వడ్డీ తీసుకొనరాదు. మరియు అలాంటి కుదువసొమ్ము తన అనుభవం మొదలైన వాటివల్ల చెడిపోయినట్లయితే ఆ వస్తువు విలువను సొంతదారుకు ఇవ్వాలి అలా ఇవ్వనట్లయితే కుదువ దొంగ అవుతాడు. ॥144॥

ఇది మనుకృతం. ప్రామాణికం

ఆధిశ్చోపనిధిశ్చోభౌ న కాలాత్యయమర్హతః । మూలశ్లోక సం.**87**
అవహార్యౌ భవేతాం తౌ దీర్ఘకాలమవస్థితౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**145**

టీక:- **ఆధిః** = తాకట్టులో ఉన్న వస్తువులు, **ఉపనిధిః** = దాచిపెట్టుమని ఇచ్చిన వస్తువులు, **కాల+అత్యయమ్** = ఫలాన సమయమని నిర్ణయం లేదు. **తౌ** = ఈ రెండు, **దీర్ఘకాలమ్ + అవస్థితౌ** = దీర్ఘకాలమున్నా, **అవహార్యౌ + భవేతాం** = తిరిగి ఇవ్వవలసినవే. తాకట్టు పెట్టినవాడు అడిగినప్పుడు ఇచ్చి వేయవలసినదే.

తాత్పర్యం:-తాకట్టులో ఉన్న వస్తువులు కుదువపెట్టిన సొమ్ము బహుకాలం ఉమత్తమర్ణుడి అధీనతయం దున్నా వాడివి గానేరవు. వాటిని ఎప్పుడు సొంతదారు అడుగుతాడో అప్పుడు వాడికి ఆ వస్తువులను ఇవ్వాలి. ॥145॥

ఇది మనుకృతం. ప్రామాణికం

సంప్రీత్యా భుజ్యమానాని న నశ్యంతి కదాచన । మూలశ్లోక సం.**88**
ధేనురుష్ట్రో వహన్నశ్వో యశ్చ దమ్యః ప్రయుజ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**146**

టీక:- **సంప్రీత్యా భుజ్యమానాని** = పరస్పరం ప్రేమపూర్వకంగా ఉపయోగించు కొంటున్న, **ధేనుః** = ఆవు, **వహన్** = బరువుమోయుదానికి, **ఉష్ట్రః** = ఒంటె, **అశ్వః** = గుఱ్ఱం, **చ** = మరియు, **దమ్యః** = నాగలి దున్నుటకు ఉపయోగించే ఎద్దు, మొ॥వి, **ప్రయుజ్యతే** = ఉపయోగవడుతున్నవో, **అవి కదాచన న నశ్యన్తి** = ఎప్పుడు పూర్వం వాడుకున్న సొంతదారుడికే చెందుతుంది. అంతేకాని తాకట్టులో తన వద్ద ఉండి వాడుకొన్నా, అవి ఉత్తమవర్ణుడికి (దాతకు) చెందవు.

తాత్పర్యం:- సొంతదారు అనుభవం నిమిత్తం ఇచ్చిన ఆవు, ఒంటె, స్వారిగుఱ్ఱం, ఎద్దు మొదలైనవి అనుభవించువాడికి సొంతములు కానేరవు. ఎప్పటికైనా అవి సొంతదారుడికే చెందుతాయి. ॥146॥

147 నుండి 150వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *యత్కించిద్దశవర్షాణి సన్నిధౌ ప్రేక్షతే ధనీ ।*
భుజ్యమానం పరైస్తూష్ణీం న స తల్లబ్ధుమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.*147*

తాత్పర్యం:- ఏదేని ఒక వస్తువును ఇతరులు అనుభవించునప్పుడు సమక్షంలో ఉండు సొంతదారుడిచే ప్రేమ చేత అడుగబడక ఉండి అలా పది సంవత్సరాలు గడిచినట్లయితే ఆ వస్తువులో సొంతగాడికి స్వాతంత్ర్యం తొలగిపోతుంది. అది అనుభవించువాడిదే అవుతుంది. ॥147॥

* *అజడశ్చేదపోగండో విషయే చాస్య భుజ్యతే ।*
భగ్నం తద్వ్యవహారేణ భోక్తా దద్ద్రవ్యమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **148**

తాత్పర్యం:- ఆ ధనస్వామి వెఱ్ఱివాడు కాడేని, పదారు సం॥ వయసు లోపలివాడు కాడేని, అలాంటివాడు చూస్తుండగానే, వాడి సొమ్ము ఇతరులచేత అనుభవించినట్లయితే ఆ సొమ్ము అనుభవించినవారికే చెందుతుంది.॥148॥

* *ఆధిస్సీమా బాలధనం నిక్షేపోపనిధిః స్త్రియః ।*
రాజస్వం శ్రోత్రియస్వం చ న భోగేన ప్రణశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **149**

తాత్పర్యం:- కుదువపెట్టిన సొమ్ము, ఎల్లలు, బాలురసొత్తు, ఇంత అని ముద్రించి ఎత్తిపెట్టిన ద్రవ్యం, ఎంత అని చెప్పక ముద్రించి ఉంచిన ద్రవ్యం, పనికత్తెలు మొదలైన స్త్రీలు, రాజద్రవ్యం, బ్రాహ్మణద్రవ్యం అనుభవం గలవాడికి సొంతం కావు.ఎన్నిదినములకైనా అవి మొదటివాడివే. ॥149॥

* *యస్స్వామినాననుజ్ఞాత మాధిం భుఙ్క్తేఽవిచక్షణః ।*
తేనార్ధవృద్ధిర్మోక్తవ్యా తస్య భోగస్య నిష్కృతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **150**

తాత్పర్యం:- ఏ మూర్ఖుడు సొంతగాడి ఉత్తరువు లేకుండా కుదువ ఉంచిన సొత్తును అనుభవిస్తున్నాడో, వాడు అలా అనుభవించినందున ఆ వడ్డీ ధనం నుండి సగమును తీసివేయాలి అలా సొంతగాడి అనుమతి లేకుండా అనుభవించినందుకు అది ప్రాయశ్చిత్తమని తెలుసుకోవాలి. బలత్కారం చేత అనుభవించినట్లయితే, వడ్డీ అంతా తీసివేయాలి. ॥150॥

ప్రక్షిప్తాల పరిశీలన

147 నుంచి 150 వరకు గల శ్లోకాలు ఈ కింది ఆధారాల ప్రకారం ప్రక్షిప్తాలు -

పరస్పర విరోధాలు

ఈ శ్లోకాలలో చెప్పిన పద్ధతులు, మునుపు చెప్పిన 143-146 శ్లోకాలలోని పద్ధతులకు వ్యతిరేకంగా ఉన్నాయి. అందుచేత ప్రక్షిప్తాలు.

(క) 147 - 148 శ్లోకాలలో కొన్ని పరిస్థితులలో కుదువపెట్టిన వస్తువులపై యజమాని తన అధికారాన్ని కోల్పోతాడు అని ఉంది. 143-146 శ్లోకాలలో ఆ అధికారం ఎప్పటికీ పోదు అని స్పష్టంగా ఉంది.

(ఖ) మునుపటి శ్లోకాలలో యజమానికి అధికారం పోదు అంటే, 149లో కొన్ని వస్తువులకు వేరుగా నియమం చేయవలసిన అవసరమే లేదు. అందుచేత ఈ పద్ధతి వ్యర్థం.

(గ) 149లో స్త్రీని కూడా కుదువపెట్టే వస్తువుగా చెప్పారు. ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం. ముందు వెనుకల విషయాలను పూర్తిగా పరిశీలించినట్లయితే, మనువు జడమైన ధనం, సంపదలను, పశువులను మాత్రమే కుదువపెట్టదగిన వస్తువులని చెప్పాడని స్పష్టంగా తెలుస్తుంది (8.27-30, 143, 146) భార్యను 'భర్త'కు తోడుగా ఉండే వ్యక్తిగానే చెప్పాడు (5-151, 165).

(ఘ) కుదువపెట్టిన వస్తువు వల్ల వచ్చిన ధనం వాడుకున్న తర్వాత, దానికి చెల్లించవలసిన వడ్డీ పూర్తిగా వదిలేయటం, నష్టాన్ని పూర్తిగా చెల్లించటం - ఈ పద్ధతి 144వ శ్లోకంలో ఉంది. 150లో దానికి వ్యతిరేకమైన పద్ధతి ఉంది. అందుచేత ఇది ప్రక్షిప్తమే!

ఇచ్చిన ధనానికి రెట్టింపు కంటే అధికం తీసుకోరాదు - ఇది మనుకృతం. ప్రామాణికం

కుసీదవృద్ధిర్ద్వైగుణ్యం నాత్యేతి సకృదాహృతా । మూలశ్లోక సం. 89
ధాన్యే సదే లవే వాహ్యే నాతిక్రామతి పంచతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 151

టీక:- సకృత్ + ఆహృతా = ఒకసారి తీసికొన్న ఋణం మీద, **కుసీదవృద్ధిః** = వడ్డీ ధనం, **ద్వైగుణ్యం న + అత్యేతి** = రెండింతల మూల ధనాన్ని మించ రాదు, **ధాన్యే** = అన్నాది ధాన్యం, **సదే** = వృక్షాల ఫలాలు, **లవే** = ఉన్ని, **వాహ్యే** = భారవాహక పశువులు మొ॥వి, **పంచతామ్ న+ అతిక్రామతి** = మూలమునకు 5 రెట్లు కంటే అధికం కారాదు.

ఋషి దయానందభాష్యం:- ఒకసారి నిర్ణయించుకొన్న వడ్డీ రెండింతలకంటే ఎక్కువ కాకూడదు లేదా మించరాదు. ధాన్యం, పండ్లు, కాయలు, బొచ్చు, ఎద్దులు మొదలైన వాటికి ఎర్పరచుకొన్న క్రయధనం మొదటికంటే అయిదు పాళ్ళకంటే ఎక్కువ కాకూడదు.

రూపాయ పావలాకు మించి గాని, నాలుగు అణాలకు తక్కువగా గాని వడ్డీ ఇవ్వరాదు, తీసికోరాదు. ఇచ్చిన ధనానికి వడ్డీతో కలిసి రెట్టింపు అవుతుందో, అప్పుడు ఒక పైసా కూడా ఇవ్వరాదు. తీసికోరాదు. ఎంత తక్కువ వడ్డీ తీసుకొంటాడో, అంత అధికంగా అతడి ధనం పెరుగుతుంది. అంతేగాదు అతడి ధనమెప్పుడు నష్టం కాదు. అతడి వంశంలో కుసంతానం కలుగదు (సం.వి.గృహస్థ.టిప్పణి.). ॥151॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *కృతానుసారాదధికా వ్యతిరిక్తా న సిధ్యతి ।*
కుసీదపథమాహా స్తం పంచకం శతమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***152***

తాత్పర్యం:- నూటికి రెండని, మూడని వర్ణముల ప్రకారం శాస్త్రం చొప్పున విధింపబడిన వడ్డీ కృత మనబడును. దానికంటే నవ్యమైనది (నెలకు ఇంత అని నిర్ణయించుకోబడింది) అకృతమనబడును. కృతమైన వడ్డీ అంతకంటే అధికంగా సిద్ధించదు. అకృతమయినవడ్డీ ఎన్నటికీ నూటికి అయిదింటి కంటే అధికం కాదు. అలా వర్ణవిభేదం లేదా అయిదు వడ్డీ తీయడం నింద్యమైనదని మనువు మొదలైన వారు చెప్పారు. ॥152॥

ప్రక్షిప్త పరిశీలన

152వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం-

1. అంతర్ వ్యతిరేకాలు

క. 140వ శ్లోకంలో వంద రూపాయలకు రూపాయ పావలా అని వడ్డీని నిర్ధారించారు. మళ్లీ ఈ శ్లోకంలో వందకు ఐదు రూపాయల దాకా తీసుకోవచ్చునటం దానికి వ్యతిరేకం. అందువల్ల ఇది ప్రక్షిప్తం.

ఖ. 153లో వడ్డీకి సంబంధించిన అన్ని నిషేధాలూ ఒక చోటే చెప్పారు. అక్కడ నిర్ధారించిన వడ్డీ కన్నా ఎక్కువ తీసుకోకూడదని ఉంది. ఈ శ్లోకంలోనూ, తర్వాతి శ్లోకంలోనూ ఒకటే విషయాన్ని చెప్పారు. ఇది అనవసరం!

2 ప్రసంగ వ్యతిరేకం

వడ్డీ నిర్ణయించిన విషయం 140 వ శ్లోకంలోనూ, దీని ముగింపు 153 వ శ్లోకంలోనూ ఉన్నాయి. మధ్యలో ఈ కొత్త పద్ధతి వీటి ఏకవాక్యతను భంగం చేసింది. ఇది ప్రసంగ వ్యతిరేకం కనుక ప్రక్షిప్తం.

153 నుండి 167 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఎవరెవరి నుండి వడ్డీ తీసికోరాదు -

నాతిసాంవత్సరీం వృద్ధిం న చాదృష్టాం పునర్హరేత్ । మూలశ్లోక సం. **90**
చక్రవృద్ధిః కాలవృద్ధిః కారితా కాయికా చ యా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **153**

టీక:- అతి సాంవత్సరీం వృద్ధిం పునర్హరేత్ = ఒక సంవత్సరానికి మించిన సమయానికి వడ్డీని ఒక్కసారిగా వసూలు చేయరాదు. **చ** = మరియు, **అదృష్టాంపునః హరేత** = ఏ కారణము చేతనైనను ఒకసారి వసూలు చేయకుండా వదిలి పెట్టిన వడ్డీని తీసుకోరాదు. వడ్డీకి వడ్డి కట్టడము- చక్రవడ్డీ అగును. 2 మాసములకో లేదా మూడు మాసాలకొకసారి వడ్డీని తీసికొని, తరవాత మాసిక వడ్డీల రేటును పెంచడం, "కాలవృద్ధి". అప్పులవాడు విపత్తులందున్నప్పుడు దబాయించి, చెల్లింపు తేదీని పెంచడం లేదా అసలు పెంచడం "కారిత వడ్డి". వడ్డీకి బదులుగా అతని చేత శరీరశ్రమ చేయించుకోవడం. "కాయిక వడ్డి". ఈ నాలుగు వడ్డీలు-చక్రవడ్డి, కాలవడ్డి, కారిత వడ్డి, కాయిక వడ్డి నిషిద్ధం. ఇలాంటి వడ్డీలను తీసుకోకూడదు.

తాత్పర్యం:- అప్పిచ్చినవాడు నాకొక నెలకో, లేక రెండు నెలలకో, మూడు నెలలకో ఇంతవడ్డి చేర్చి మొత్తంగా ఇయ్యాలని ఒక ఏర్పాటును ఒక సంవత్సరం వరకు చేయవచ్చు. సంవత్సరం కాకమునుపే ఏర్పరచుకొన్నదానికి వడ్డీ తీసికోరాదు. మరియు శాస్త్రంలో చెప్పినదానికి మించిన వడ్డీని తీసుకోరాదు. చక్రవృద్ధిః = వడ్డీకి వడ్డికట్టడం చక్రవృద్ధి, **కాలవృద్ధిః** = నెలకింత అని రోజు కింత అని నూటి కంటే అధిక వడ్డీ తీసుకోవడం కాలవృద్ధి; **కారితా** = అప్పుగొన్నవాడు అప్పు ఇచ్చినవాడి బాధవల్ల ఆపదలేనికాలంలో ఇచ్చెదనని ఒప్పుకొన్న ఎక్కువవడ్డి కారితవృద్ధి; **కాయికవృద్ధి**= దేహశ్రమ చేసేటట్లు నియమించినది కాయికవృద్ధి. ఈ నాలుగు విధములైన వడ్డీలు వసూలు చేయడం అశాస్త్రీయమైనవి కాబట్టి ఇలాంటి వాటిని తీసుకోరాదు. ॥153॥

పునః ఋణపత్రాది లేఖనం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఋణం దాతుమశక్తో యః కర్తుమిచ్ఛేత్పునః క్రియామ్ । మూలశ్లోక సం. **91**
స దత్వా నిర్జితాం వృద్ధిం కరణం పరివర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **154**

టీక:- యః = ఏ అప్పులవాడు, **ఋణం దాతుమ్ + అశక్తః** = నిర్ధారిత సమయానికి ఋణం ఇవ్వలేడో, **పునః క్రియామ్ కర్తుమ్ + ఇచ్ఛేత్** = మళ్ళా ఆ ఋణాన్ని జారీ చేయదలచుకొన్నట్లయితే, **సః** = అతడు, **నిర్జితాం వృద్ధిం దత్వా** = ఆ సమయానికి అయిన వడ్డీని చెల్లించి, **కరణం పరివర్తయేత్** = ఇచ్చి పుచ్చుకొనే పత్రాన్ని, నూతనంగా రాయించుకోవాలి.

తాత్పర్యం:- ఏ అప్పులవాడు ఋణం దీర్చడానికి అసమర్థుడై, వడ్డీతో చేర్చి మూలధనమునకు పత్రం రాసి ఇచ్చెదను అని చెప్పినట్లయితే, ఋణదాత తనకు రావలసిన వడ్డీని తీసికొని అసలుకు పత్రం రాయించుకోవాలి.॥154॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అదర్శయిత్వా తత్రైవ హిరణ్యం పరివర్తయేత్ । మూలశ్లోక సం. **92**
యావతీ సంభవేద్వృద్ధిస్తావతీం దాతుమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **155**

టీక:- అదర్శయిత్వా = ఒకవేళ అప్పులవాడు వడ్డీ చెల్లించలేక పోయినట్లయితే, **తత్ర + ఏవ హిరణ్యం పరివర్తయేత్** = వడ్డీని మూల ధనంతో కలిపి ఆ మొత్తాన్ని మూలధనంగా భావించి, కొత్త పత్రాన్ని (Promissary Note) రాయాలి. **యావతీ వృద్ధిః సంభవేత్** = దాని మీద మళ్ళా ఎంత వడ్డీ అవుతుందో, **తావతీం దాతుమ్ + అర్హతి** = అంత అతడు ఇవ్వాలి.

తాత్పర్యం:- అప్పులవాడు వృద్ధిద్రవ్యం కూడా చెల్లించలేని అశక్తుడయితే, అప్పుడు ఉత్తమర్ణుడికి అసలుకు రాసియిచ్చిన పత్రంలో వడ్డీధనాన్ని కూడాచేర్చాలి. దానిమీద ఎంతవడ్డీ అవుతుందో అంతధనం అతడు ఇవ్వాలి.॥155॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చక్రవృద్ధిం సమారూఢో దేశ కాలవ్యవస్థితః । మూలశ్లోక సం. **93**
అతిక్రామన్ దేశకాలౌ న తత్ఫలమవాప్నుయాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **156**

టీక:- చక్రవృద్ధిం సమారూఢః = పైన పేర్కొన్న 155వ శ్లోకంలో చెప్పినట్లుగా సాంవత్సరిక వృద్ధిని మూలధనంతో కలిపి చక్రవృద్ధిని (వడ్డీని) వసూలు చేసే వ్యక్తి, **దేశ-కాల-వ్యవస్థితః** = దేశ-కాల-వ్యవస్థను అతిక్రమించినట్లయితే, **తత్ఫలం న అవాప్నుయాత్** = వడ్డీ వసూలు చేసేవాడు ఆ వడ్డీ తీసికోవడానికి హక్కుదారు కాదు.

తాత్పర్యం:- పైన పేర్కొన్న 155వ శ్లోకంలో వివరించినట్లుగా సాంవత్సరిక వృద్ధిని మూలధనంలో కలిపి చక్రవడ్డీని వసూలు చేసే వ్యక్తి, దేశ-కాల-వ్యవస్థను అతిక్రమించినట్లయితే వడ్డీ వసూలు చేసేవాడు ఆ వడ్డీ తీసుకోవడానికి హక్కుదారు కాదు. ॥156॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సముద్ర యానములపై అద్దె-కిరాయ నిర్ధారణ -

సముద్రయానకుశలా దేశకాలార్థదర్శినః । మూలశ్లోక సం. **94**
స్థాపయంతి తు యాం వృద్ధిం సా తత్రాధిగమం ప్రతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **157**

టీక:- సముద్రయానకుశలాః = సముద్రం దాటి అన్య దేశాలలో వ్యాపారం చేయడంలో అనుభవజ్ఞులు, **దేశకాలార్థ దర్శినః** = దేశం, కాలంననుసరించి అర్థశాస్త్రజ్ఞులైన విద్వాంసులు, **యాం వృద్ధిం స్థాపయన్తి** = ఎంత వడ్డీని, ఎంత బాడుగ నిర్ణయిస్తారో, **తత్ర+అధిగమం ప్రతి** = అదే వడ్డీ, అదే బాడుగ-లాభ వృద్ధులకు సరిపోతుందని తెలిసికోవాలి.

తాత్పర్యం:- సముద్రం దాటి అన్య దేశాలలో వ్యాపారం చేయడంలో అనుభవజ్ఞులు దేశం కాలం ననుసరించి అర్థశాస్త్రజ్ఞులైన విద్వాంసులు ఎంత వడ్డీని ఎంత బాడుగ నిర్ణయిస్తారో, అంతవడ్డీ, అంతబాడుగ లాభవృద్ధులకు సరిపోతుందని తెలిసికోవాలి. ॥157॥

ఇది మనుకృతం-ప్రామాణికం

జమానత్ సంబంధ విధానం-

యో యస్య ప్రతిభూస్తిష్ఠేద్దర్శనాయేహ మానవః । మూలశ్లోక సం. **95**
అదర్శయన్ స తం తస్య ప్రయచ్ఛేత్స్వధనాదృణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **158**

టీక:- యః = ఏ మనుషుడు, **యస్య** = అప్పుగలవాడికి, **ఇహ దర్శనాయ** = మహారాజు ఎదుట లేదా న్యాయాధిపతి ఎదుట హాజరుపరచడానికి, **ప్రతి భూః** = జామీను ఉంటాడో, **అదర్శనయన్** = అప్పులవాడిని చూపించకపోయినట్లయితే, **తస్య ఋణమ్** = అతడు తీసికొన్న ఋణాన్ని, **స్వధనాత్ ప్రయచ్ఛేత్** = జామీన్ గా ఉన్నవాడే తన ధనం నుండి ఇవ్వాలి.

తాత్పర్యం:- ఏ మనుష్యుడు అప్పుగలవాడికి మహారాజు ఎదుట లేదా న్యాయాధిపతి ఎదుట హాజరుపరచడానికి జామీను ఉంటాడో అప్పువాడిని చూపించక పోయినట్లయితే అతడు తీసుకొన్న ఋణాన్ని జామీన్‌గా ఉన్నవాడే, తన ధనం నుండి ఇవ్వాలి. ॥158॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాతిభావ్యం వృథాదానమాక్షికం సౌరికం చ యత్ । మూలశ్లోక సం. **96**
దండశుల్కావశేషం చ న పుత్రో దాతుమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **159**

తండ్రి చేసిన అప్పును పుత్రుడు తీర్చనవసరంలేని పరిస్థితులు.

1) ప్రాతిభావ్యం = జామీను ఉండిన ధనం.

2) వృథాదానమ్ = నిష్ప్రయోజనమైన దానం (కుపాత్ర దానం).

3) ఆక్షికమ్ = జూదం కోసం అయిన అప్పు.

4) యత్ శౌరికమ్ = కల్లు, సారాయి మొ॥న వాటికోసం అయిన అప్పు.

5) దండ శుల్కావశేషం = జరిమానా చెల్లించకుండా మిగిలినది. పన్ను మొ॥వి.

పుత్రః న దాతుమ్+అర్హతి = పుత్రుడు చెల్లించవలసిన పనిలేదు.

తాత్పర్యం:- జామీను ఉండిన ధనం, నిష్ప్రయోజనమైన దానం, జూదం కోసం అయిన అప్పు, కల్లు, సారాయి మొ॥న వాటి కోసం అయిన అప్పు, జరిమానా చెల్లించకుండా మిగిలినది పన్ను మొ॥వి., పుత్రుడు చెల్లించవలసిన పనిలేదు. ॥159॥

ఇది మనుకృతం-ప్రామాణికం

దర్శనప్రాతిభావ్యే తు విధిస్స్యాత్పూర్వచోదితః । మూలశ్లోక సం.**97**
దానప్రతిభువి ప్రేతే దాయాదానపి దాపయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**160**

టీక:- దర్శన-ప్రాతిభావ్యేతు = ఎవరినైనా హాజరుపరచడానికి జామీనుగా ఉండి హాజరుపరచ జాలకపోయినట్లయితే, అందుకుగాను జరిమానా విధించినప్పుడు, **పూర్వచోదితః విధిఃస్యాత్** = 8.159వ శ్లోకంలో తెలిపినట్లు కుమారుడు చెల్లించనవసరం లేదు. దాన-ప్రతిభువిప్రేతే = ఋణం చెల్లిస్తానని చెప్పినట్లయితే, అప్పు ఇచ్చినవాడు ఇవ్వనట్లయితే నేనిస్తానని చెప్పి జామీనిచ్చినతడు, **పశ్చాత్** = చనిపోయినట్లయితే, **దాయాదాన్+అపి దాపయేత్** = ప్రభువు జామీను ఉన్నవారి దాయాదులు (పుత్రుడు మొ॥న) ద్వారా దాతకు ఇప్పించాలి.

తాత్పర్యం:- ఎవరినైనా హాజరుపరచడానికి జామీనుగా ఉండి హాజరుపరచలేక పోయినట్లయితే, అందుకుగాను జరిమానా విధించినప్పుడు ఇదివరకు తెలిపినట్లు కుమారుడు చెల్లించనవసరం లేదు. కాని అప్పు ఇచ్చినవాడు ఇవ్వనప్పుడు దానికి హామీ ఇచ్చిన జామీను చనిపోయినట్లయితే, రాజు, జామీనుకు సంబంధించిన కుటుంబ సభ్యుల ద్వారా ఋణదాతకు ఇప్పించాలి. ॥160॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అదాతరి పునర్దాతా విజ్ఞాతప్రకృతావృణమ్ । మూలశ్లోక సం.**98**
పశ్చాత్ప్రతిభువి ప్రేతే పరీప్సేత్కేన హేతునా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**161**

టీక:- అదాతరి పునః విజ్ఞాత ప్రకృతౌ = ఋణమిస్తానని జామీను ఇచ్చినవాడు అన్నట్లయితే, (అంటే దాయాదులు, పుత్రుడు మొ॥న) అప్పుతీసికొన్నవాడిని కేవలం అప్పిచ్చిన వాడి ఎదుట హాజరు పరుస్తానని, చూపిస్తానని మాత్రమే చెప్పినట్లయితే, అది ఋణదాతకు తెలిసినట్లయితే, ప్రతిభువిప్రేతే = జవాబుదారుడు చనిపోయినట్లయితే, దాతాకేన **హేతునా ఋణమ్ పరీప్సేత్** = ఋణదాత ఏ కారణాన్ని ఆధారంగా చేసికొని ప్రతిభువుడి పుత్రుడి నుండి ఋణం వసూలు చేయగలడు?

తాత్పర్యం:- అప్పు తీసుకొన్నవాణ్ణి అప్పు ఇచ్చినవాడి ఎదుట హాజరు పరుస్తానని జామీను చెప్పినట్లయితే ఈ విషయం ఋణదాతకు తెలిసినట్లయితే, ఆ సమయంలో జామీను (జవాబుదారుడు) చనిపోయినట్లయితే ఋణదాత ఏ కారణాన్ని ఆధారం చేసుకొని జామీను ఉన్న పుత్రుని నుండి ఋణం వసూలు చేయగలడు? ॥161॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిరాదిష్టధనశ్చేత్తు ప్రతిభూః స్యాదలంఘనః ।   మూలశ్లోక సం. **99**
స్వధనాదేవ తద్దద్యాన్నిరాదిష్ట ఇతి స్థితిః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **162**

టీక:- **చేత్** = ఒకవేళ, **ప్రతిభూః నిరాదిష్ట ధనః** = ఋణీ తన పూచీదారుడికి ధనమిచ్చినట్లయితే, **చ** = మరియు, అలం ధనఃస్యాత్ = ఋణీ ధన దాతకు ఋణం తీర్చమని చెప్పినట్లయితే, అలాంటి పరిస్థితిలో, **నిరాదిష్ట** = అలా చెల్లించబడిన సమయంలో, ఆ జవాబుదారుడు చనిపోతే అతని పుత్రుడు, **తత్ స్వధనాత్ +ఏవ దద్యాత్** = ఋణదాత అడిగినప్పుడు తన ధనం నుండే ఆ ధనం ఇవ్వాలి. ఇది శాస్త్ర మర్యాద.

తాత్పర్యం:- ఒకవేళ జామీను ఉండే వాడికి ఋణకర్త (అప్పు తీసుకొన్నవాడు) ఋణదాతకు అప్పుచెల్లించుమని ధనమిచ్చినట్లయితే అలాంటి పరిస్థితిలో జామీను చనిపోయినట్లయితే, అతని పుత్రుడు ఋణదాత అడిగినప్పుడు తన ధనం నుండి ఆ అప్పు సొమ్ము ఇవ్వాలి. ఇది శాస్త్ర మర్యాద. ॥162॥

ఎనిమిది రకాలైన వారితో జరిగే దావా చెల్లదు-   ఇది మనుకృతం-ప్రామాణికం

మత్తోన్మత్తార్తాధ్యధీనైర్బాలేన స్థవిరేణ వా ।   మూలశ్లోక సం. **100**
అసంబంధకృతశ్చైవ వ్యవహారో న సిద్ధ్యతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **163**

టీక:- **మత్తః** = సారాయి నిషాలో ఉన్నవాడు, **ఉన్మత్తః** = పిచ్చివాడు, **ఆర్తః** = శరీర రోగగ్రస్తుడు, **ఆధిః** = మానసిక రోగి లేదా దుఃఖి, విపత్తిగ్రస్తుడు, **అధీనైః** = ఒకరి అధీనంలో ఉండిన నౌకరు మొ॥ **బాలేన** = మైనర్ అయినవాడు, **వా** = లేదా, **స్థవిరేణ** = అతి వృద్ధుడు, **చ** = మరియు, **అసంబద్ధ కృతః** = పూర్వాపరాలు తెలియకుండా చేసిన వ్యవహారాలు (దావాలు), **న సిద్ధ్యతి** = చెల్లవు, అంగీకరించవలసినవి కావు.

తాత్పర్యం:- మత్తుడు, పిచ్చివాడు, దుఃఖితుడు, పరాధీనుడు, బాలకుడు, అతివృద్ధుడు నైనవారు పూర్వాపరములు విచారింపకుండ చేసిన వ్యవహారము ప్రామాణికముగా నంగీకరింపబడవు. ॥163॥

శాస్త్ర నియమ విరుద్ధాలైన దావాలు ప్రమాణాలు కావు-   ఇది మనుకృతం-ప్రామాణికం

సత్యా న భాషా భవతి యద్యపి స్యాత్ ప్రతిష్ఠితా ।   మూలశ్లోక సం. **101**
బహిశ్చేద్భాష్యతే ధర్మాన్నియతాద్వ్యావహారికాత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **164**

టీక:- **భాషా** = ఏదైనా విషయం లేదా పారస్పరిక ప్రతిజ్ఞ, **చేత్** = అయినా, **యది ధర్మాత్** = లేదా ధర్మ శాస్త్రం అంటే చట్ట ప్రకారంగా, **నియతాత్ వ్యావహారికాత్** = నిశ్చితమైన వ్యవహారానికి, **బహిః భాష్యతే** = బాహ్యం అంటే విరుద్ధంగా చేయడినట్లయితే, **యద్యపి ప్రతిష్ఠితా స్యాత్** = అది పత్రం (Promissary Note) ద్వారా ప్రమాణితమైనా, **సత్యా న భవతి** = సత్యం (ప్రామాణికం) కాదు.

తాత్పర్యం:- శాస్త్రోక్తవ్యవహారము ధర్మవిరుద్ధంగా కాగితములు వ్రాసికొని ఖరారు చేసికొన్నను నది ప్రామాణికము కాదు. అనగా చెల్లనేరదు. ॥164॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యోగాధమనవిక్రీతం యోగదానప్రతిగ్రహమ్ ।   మూలశ్లోక సం. **102**
యత్రవాఽ_ప్యుపధిం పశ్యేత్తత్సర్వం వినివర్తయేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **165**

టీక:- యోగ + అధమన-విక్రీతం = మోసం చేసి తాకట్టు పెట్టినా, అమ్మినా, యోగదాన-ప్రతిగ్రహమ్ = మోసంతో ఇచ్చినా, తీసికొన్నా, వా = లేదా, యత్ర అపి + ఉపధిం పశ్యేత్ = ఏ దావాలోనైనా ఏ కొంచెం మోసం కనపడినా, తత్ సర్వం వినివర్తయేత్ = వాటినన్నింటిని రద్దుచేయడం లేదా స్వీకారయోగ్యం కాదని చెప్పాలి.

తాత్పర్యం:- మోసము చేసి తాకట్టు పెట్టినను, మోసముతో అమ్మినను, మోసముతో నిచ్చినను పుచ్చుకొన్నను, ఏ వ్యవహారమందైనను మోసము ప్రకటమగుచో ఆ వ్యవహారమంతయు రాజు రద్దు చేయవచ్చును. ॥165॥

కుటుంబార్థం చేసిన ఋణాన్ని కుటుంబీకులే తీర్చాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

గ్రహీతా యది నష్టః స్యాత్కుటుంబార్థే కృతో వ్యయః । మూలశ్లోక సం. **103**
దాతవ్యం బాంధవై స్తత్స్యాత్ ప్రవిభక్తైరపి స్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **166**

టీక:- కుటుంబార్థే వ్యయః కృతః = ఏ వ్యక్తి అయినా, తన పరివారం కోసం ఋణం తీసికొని ఖర్చుచేసినా, లేదా, యది గ్రహీతా నష్టః స్యాత్ = ఋణం చేసినవాడు మరణించినట్లయితే, **తత్** = ఆ ఋణం, బాంధవైః = అతడి కుటుంబ సభ్యులు, విభక్తైః + అపి = వారు విడిపోయి (వేరుబడి) ఉన్నా, స్వతః = తమ ధనం నుండి, దాతవ్యం స్యాత్ = చెల్లించాలి.

తాత్పర్యం:- కుటుంబము కొఱకు ఋణము తెచ్చినవాడు మరణించినచో భాగము పంచుకొన్నవారు కాని, బంధువులు కాని ఆ ఋణాన్ని అందఱు కలిసి తీర్చాలి. ॥166॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కుటుంబార్థేఽధ్యధీనోఽపి వ్యవహారం సమాచరేత్ । మూలశ్లోక సం. **104**
స్వదేశే వా విదేశే వా తం జ్యాయాన్న విచాలయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **167**

టీక:- అధి+అధీనః +అపి = తన అధీనమందున్న వ్యక్తులు (పుత్ర పత్నీ) మొ॥ వారు కూడా, కుటుంబార్థే = కుటుంబ భరణ పోషణ కోసం, స్వదేశే వా విదేశేవా = స్వదేశంలో గాని, విదేశంలో గాని, యం వ్యవహారం + ఆచరేత్ = ఇచ్చి-పుచ్చుకొనునట్టి లావాదేవీలు చేస్తారో, జ్యాయాన్ = ఇంటి పెద్ద అంటే ముఖ్యుడు, పెత్తందారు, తం న విచాలయేత్ = తోసివేయరాదు. ఆ దావాను బాధ్యత వహించి స్వీకరించి చెల్లించాలి.

తాత్పర్యం:- కుటుంబము కొరకు పుత్రాదులు స్వదేశములో కాని విదేశములోగాని యిచ్చి పుచ్చుకొను వ్యవహారము చేసినచో ఆ కుటుంబపు పెద్ద దానికి బాధ్యత వహించాలి. ॥167॥

168 నుండి 177వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* బలాత్కారాలన్నీ అమాన్యములు -

* *బలాద్దత్తం బలాద్భుక్తం బలాద్యచ్చాపి లేఖితమ్ ।*
సర్వానేతాన్ బలకృతానకృతాన్మనురబ్రవీత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *168*

తాత్పర్యం:- ఏదైనా ఒక వ్యవహారం ధన/శక్తి/బల/సామూహిక ఒత్తిడి లాంటి వాటిచేత బలవంతంగా చేయబడి, అది విచారణ కొచ్చినప్పుడు, ఆ విషయం విచారణలో తేలితే, ఆ వ్యవహారం మొత్తం కొట్టివేయబడుతుంది. ॥168॥

* *త్రయః పరార్థే క్లిశ్యంతి సాక్షిణః ప్రతిభూః కులమ్ ।*
చత్వారస్తూపచీయంతే విప్ర ఆఢ్యో వణిజ్ నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *169*

తాత్పర్యం:- సాక్షులుగా, మధ్యవర్తులుగా ఉండటానికి అంగీకరించినవారు గాని, జామీను ఇచ్చినవారుగాని ఈ ముగ్గురికి గొప్ప కష్టాలుంటాయి. కాబట్టి పై విధంగా ఎవర్నీ బలవంతంగా ఇరికించరాదు. అలాగే ఒక్కొక్కరొక్కొక్క విధంగా ధనం సంపాదించుకోగల అవకాశం ఉంది. కాబట్టి-వారికి వారి వృత్తులయందు ఆశ కల్పించి వివాదం సృష్టించరాదు. ॥169॥

* *అనాదేయం నాదదీత పరిక్షీణోఽపి పార్థివః ।*
న చాదేయం సమృద్ధోఽపి సూక్ష్మమప్యర్థముత్సృజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **170**

తాత్పర్యం:- ఎంత ధనహీనుడైనప్పటికీ సుక్షత్రియుడు గ్రహించకూడని ధనం కోసం చేయి చాచరాదు. ఇక అతడెంత ధనికుడైనప్పటికీ తీసుకోదగిన ధనాన్ని ఆవగింజంతైనా వదలరాదు. ॥170॥

* *అనాదేయస్య చాదానాదాదేయస్య చ వర్జనాత్ ।*
దౌర్బల్యం ఖ్యాప్యతే రాజ్ఞః స ప్రేత్యేహ చ నశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **171**

తాత్పర్యం:- ఈ విధంగా రాజు తీసుకోరానిది తీసుకున్నా, తప్పక తీసుకోదగినది విడిచినా జనులు ఆ రాజును అసమర్థుడని ముద్రవేస్తారు. అదీగాక-అతడు రాజధర్మం తప్పడం వల్ల ఈ లోకంలో కీర్తినీ-పరలోక స్వర్గసౌఖ్యాలనూ చేజారవిడిచినవాడే కాగలడు. ॥171॥

* *స్వాదానాద్వర్ణసంసర్గాత్త్వబలానాం చ రక్షణాత్ ।*
బలం సంజాయతే రాజ్ఞః స ప్రేత్యేహ చ వర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **172**

తాత్పర్యం:- న్యాయధనాన్ని రాబట్టుకోవడం చేత, వర్ణసాంకర్యాదిదోషాలను కట్టుదిట్టంగా నివారించడం చేత, బలహీనులని బలవంతులబారి నుంచి రక్షించడం చేత రాజు ప్రజారంజకుడని ఖ్యాతి పొందగలడు. ఇహపర సౌఖ్యాలను పొందగలడు. ॥172॥

* *తస్మాద్యమ ఇవ స్వామీ స్వయం హిత్వా ప్రియాప్రియే ।*
వర్తేత యామ్యయా వృత్త్యా జితక్రోధో జితేంద్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **173**

తాత్పర్యం:- అందువల్ల ప్రభువన్నవాడు యముడి లాగా కోపాన్ని అణచుకొని, ఇంద్రియాదులను గెలిచి, ఇష్టాయిష్టాలకతీతంగా సమబుద్ధిని కలిగి ఉండాలి. ॥173॥

* *యస్త్వధర్మేణ కార్యాణి మోహాత్కుర్యాన్నరాధిపః ।*
అచిరాత్తం దురాత్మానం వశే కుర్వంతి శత్రవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **174**

తాత్పర్యం:- ఏ రాజు లోభ మోహాలచేత అధర్మపూరితంగా వ్యవహారాలు తీరుస్తాడో, ధర్మవిరుద్ధమైన తీర్పులకు పాల్పడతాడో అలాంటి రాజు పట్ల ప్రజలు విముఖులై ఉంటారు కాబట్టి, అది శత్రువుల చేతికి సులభంగా వశమవుతుంది. ॥174॥

* *కామక్రోధౌ తు సంయమ్య యోర్థాన్ ధర్మేణ పశ్యతి ।*
ప్రజాస్తమనువర్తంతే సముద్రమివ సింధవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **175**

తాత్పర్యం:- ఏ రాజు రాగద్వేషాలను వీడి, కార్యములను నీతితో పరిశీలిస్తాడో, అలాంటి రాజును ప్రజలు సేవిస్తారు. మరియు వారు నదులు సముద్రంతో ఐక్యము నొంది, అతని నుండి వేరు పడకుండునట్లు తమ నృపాలుడితో కలిసిమెలసి ఉంటారుకాని అతడికి భిన్నులై ఉండరు. ॥175॥

* *యస్సాధయంతం ఛందేన వేదయేద్ధనికం నృపే ।*
స రాజ్ఞా తచ్చతుర్భాగం దాప్యస్తస్య చ తద్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **176**

తాత్పర్యం:- ఏ అప్పులవాడు తాను రాజుకు ఇష్టుడని గర్వించి అప్పిచ్చినవాడు ధనికుడని, ఎక్కువ ధనం వడ్డీమూలమున తీసుకొనుచున్నాడని కొండెములు చెప్పునో అలాంటి అప్పులావాడికి అప్పు మొత్తంలో నాలుగో భాగం దండన విధించి ఆ అప్పిచ్చినవాడికి సొమ్ము ఇప్పించాలి. ॥176॥

* *కర్మణాపి సమం కుర్యాద్ధనికాయాధమర్ణికః ।*
సమోఽవకృష్టజాతిస్తు దద్యాచ్ఛ్రేయాంస్తు తచ్ఛనైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **177**

తాత్పర్యం:- అప్పు తీసుకొన్నవాడు ఋణద్రవ్యం ఇవ్వనప్పుడు అప్పుఇచ్చినవాడికి తక్కువ జాతివాడు, సమానజాతివాడు అయినట్లయితే తనచేతనైన పనిచేసి ఇచ్చి కూలి తీసుకోకుండా చెల్లు పెట్టాలి. ఎక్కువ జాతివాడయినట్లైతే అప్పును కొంచెం కొంచెంగా అయినా చెల్లించాలి. ॥177॥

ప్రక్షిప్తాల పరిశీలన

168 నుంచి 177 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. శైలీగత ఆధారాలు

168వ శ్లోకంలో **"మనుః అబ్రవీత్"** అనే పదాల వల్ల, ఇది మనువు రచన కాదనీ, తర్వాతి వారెవరి రచనో అనీ స్పష్టంగా తెలుస్తూంది. కనుక, ఇది ప్రక్షిప్తం. ఇది ప్రక్షిప్తమైతే దీనికి సంబంధించిన అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే అవుతాయి.

2. ప్రసంగ వ్యతిరేకాలు

క. పూర్వాపర శ్లోకాలలో **'ఋణం ఇవ్వటం - పుచ్చుకోవటం'** అనే విషయం ఉంది. 169 నుంచి 175 వరకు గల శ్లోకాలలో ఇక్కడి విషయానికి సంబంధం లేని రాజు కర్తవ్యాలు చెప్పారు. ఈ అసంగత ప్రసంగం కారణంగా ఇవి ప్రక్షిప్తాలు.

ఖ. అప్పు తీసుకోవటం, ఇవ్వటానికి సంబంధించిన విషయం 167తో పూర్తయింది. ఆ ప్రసంగం ముగిసిన తర్వాత 176-177లలో మళ్లీ షావుకారు, ఋణగ్రస్తుణ్ని గురించి చెప్పటం ప్రసంగ వ్యతిరేకం. ఈ ఆధారంతో ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

3. అంతర్ వ్యతిరేకాలు

177లో గొప్ప వారిచ్చిన అప్పులకు బదులుగా పనులు చేయించటం అనేది, మనువు అంతకు ముందు చెప్పిన వ్యవస్థకు వ్యతిరేకం[8.153]. ఇక్కడ రాజు ద్వారా శిక్ష నిర్ణయించాలే కానీ, అప్పిచ్చిన ధనవంతుడు కాదు. న్యాయ స్థానంలో వేడుకున్న తర్వాత రాజు నిర్ణయం తీసుకోవటం లేదా డబ్బు తిరిగి ఇప్పిస్తాడు లేదా శిక్షిస్తాడు. ఆ ధనాన్ని ఎలా తిరిగి ఇవ్వాలనేదీ రాజే నిర్ణయిస్తాడు[8.116]. ఈ ఆధారంతోనూ ఈ శ్లోకం ప్రక్షిప్తం.

178 నుండి 189 వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

అనేన విధినా రాజా మిథో వివదతాం నృణామ్ । మూలశ్లోక సం. **105**
సాక్షిప్రత్యయసిద్ధాని కార్యాణి సమతాం నయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **178**

టీక:- రాజా = ప్రభువు, **మిథః వివదతాం నృణామ్** = పరస్పరం పేచీబడు మానవుల యొక్క, **సాక్షి-ప్రత్యయ సిద్ధాని కార్యాణి** = కార్యాలను సాక్షులు- లేఖ, పత్రం (Promissary Note) మొ॥ ప్రమాణాలు ద్వారా, **అనేన విధినా** = పైన

పేర్కొన్న (8.9 నుండి 117వరకు) విధిననుసరించి, **సమతాం నయేత్** = అందరికీ సమానంగా న్యాయం చేస్తూ నిర్ణయం చేయాలి.

తాత్పర్యం:- వాదిప్రతివాదులు ఇతరులు కలహించుచున్నట్లయితే, నృపాలుడు ఈ విధంగా సాక్షులు మొ॥ ఆధారాలచేత విషయాలను నిర్ణయించి వివాదాలను ఖండించి అందరికీ సమానంగా న్యాయం చేస్తూ నిర్ణయం చేయాలి.॥178॥

2. తాకట్టు పెట్టిన వస్తువుకు సంబంధించిన వివాదాల (వ్యాజ్యముల) నిర్ణయం

ఇది మనుకృతం-ప్రామాణికం

కులజే వృత్తసంపన్నే ధర్మజ్ఞే సత్యవాదిని । మూలశ్లోక సం. **106**
మహాపక్షే ధనిన్యార్యే నిక్షేపం నిక్షిపేద్బుధః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **179**

టీక:- **బుధః** = బుద్ధిమంతుడైనవాడు గుమనించవలసినది తాకట్టు పెట్టే విషయంలో, **కులజే** = మంచి వంశంలో పుట్టినవాడు, **వృత్త సంపన్నే** = సదాచారవంతుడు, **ధర్మజ్ఞే** = ధర్మాత్ముడు, **సత్యవాదిని** = సత్యసంధుడు, **మహాపక్షే** = విస్తృతవ్యాపారం లేదా బృహత్కుటుంబం కలవాడు అయిన, **ఆర్యే ధనిని** = శ్రేష్ఠుడైన ధనవంతుడి వద్దనే, **నిక్షేపం నిక్షిపేత్** = తాకట్టు పెట్టవచ్చు (కుదవపెట్టవచ్చు).

తాత్పర్యం:- బుద్ధిమంతుడైనవాడు తాకట్టును మంచివంశమునందు పుట్టినట్టి, సదాచారి యైనట్టి, ధర్మాత్ముడైనట్టి, సత్యవాదియైనట్టి, పెద్దకుటుంబము వాడైనట్టి ధనవంతుని వద్దనే ఉంచవలెను. ॥179॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యో యథా నిక్షిపేద్ధస్తే యమర్థం యస్య మానవః । మూలశ్లోక సం. **107**
స తథైవ గ్రహీతవ్యో యథా దాయస్తథా గ్రహః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **180**

టీక:- **యః మానవః** = తాకట్టు కింద వస్తువులను పెట్టే, మానవుడు, **యమ్+అర్థం** = ఏ ధనాన్ని, **యస్య హస్తే** = ఎవడి చేతిలో, **యథా నిక్షిపేత్** = ముద్రవేసి గాని, లేదా ముద్ర వేయకుండా గాని, సాక్షుల ఎదుట గాని లేదా ఏకాంతంలో గాని, ఏ విధంగా పెట్టునో, **సః** = అతడు, **తథా + ఏవ** = అలాగే అంటే అదే రూపంలో, అదేవిధంగా, **గ్రహీతవ్యః** = తిరిగి తీసికోవాలి. ఎందుకంటే, **యథాదాయఃతథా గ్రహః** = ఎలా ఇచ్చాడో అలానే తీసికోవాలి. (తులనార్థం 8-195 చూడగలరు).

తాత్పర్యం:- ఎవడైనను తాకట్టుమీద తెచ్చుకొన్న సొమ్మును దొంగలపహరించినను, నీటిలో మునిగిపోయినను, అగ్నిలో కాలిపోయినను, తెచ్చినదానిని వాడనుభవింపలేదు కావున తిరిగి యీయ నక్కఱలేదు. ॥180॥

ఇచ్చినట్లు పుచ్చుకోవడం ధర్మం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

యో నిక్షేపం యాచ్యమానో నిక్షేప్తుర్న ప్రయచ్ఛతి । మూలశ్లోక సం. **108**
స యాచ్యః ప్రాడ్వివాకేన తన్నిక్షేప్తుర సన్నిధౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **181**

టీక:- **యః నిక్షేప్తుః** = వస్తువులు కుదువ (తాకట్టు) పెట్టుకున్నవాడు, **నిక్షేపం** = కుదువపెట్టినవాడు, **యాచ్యమానః** = తిరిగి ఇవ్వమని అడిగినప్పుడు, **న ప్రయచ్ఛతి** = తిరిగి ఇవ్వడో, కుదువపెట్టినవాడు న్యాయాలయానికి వెళ్ళి ప్రార్థించినప్పుడు, **తత్+నిక్షేప్తుః + అసన్నిధౌ** = కుదువపెట్టినవాడు లేకున్నా, లేదా ఎదుట ఉన్నా, **ప్రాడ్వివాకేన సః యాచ్యః** = న్యాయాధీశుడు అతని నుండి నిక్షేపాన్ని అడగాలి. అంటే కుదువ వస్తువు గుర్తించి ఏమయింది?, ఎక్కడున్నది? ఎందుకు ఇవ్వలేదు? అని ప్రశ్నించాలి.

తాత్పర్యం:- తాకట్టు పెట్టి తీసికొన్న డబ్బులు తిరిగి యీయనివాడును, తాకట్టు పెట్టుకొని వస్తువీయనివాడును ఇద్దఱునూ దొంగలే కావున అట్టివారిని చోరులనువలె శిక్షింపవలెను. ఆ ధనముతో సమానమైన ధనమును వారి నుండి జరిమానాగా వసూలు చేయవలెను. ॥181॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సాక్ష్యభావే ప్రణిధిభిర్వయోరూప సమన్వితైః । మూలశ్లోక సం.**109**
అపదేశైశ్చ సన్న్యస్య హిరణ్యం తస్య తత్త్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**182**

టీక:- సాక్షి+అభావే = కుదువ (తాకట్టు) పెట్టిన వస్తువులకు సాక్షులు లేనప్పుడు పరీక్షించడానికి ఒక ఉపాయముంది. ప్రభువు లేదా న్యాయాధిపతి సమయానుసారంగా, సమాన వయస్సు వివిధ రూపాలను తయారుచేసే కళలో నిపుణులైన, **ప్రణిధిభిః** = గుప్తచారుల ద్వారా, **అపదేశైః** = విభిన్న నెపముల ద్వారా, **తత్త్వతః** = స్వాభావిక పద్ధతుల ద్వారా, **తస్య** = ఆ దావా వేసినవాడి వద్ద, **హిరణ్యం సంన్యస్య** = బంగారం మొ॥ వాటిని పెట్టించి మళ్ళా అడగాలి.

తాత్పర్యం:- కుదువ పెట్టిన వస్తువులకు సాక్షి లేనప్పుడు పరీక్షించడానికి ఒక ఉపాయం ఉంది. వేగులరూపు దాల్చి వయస్సు మీరిన తన సభ్యులచేత బంగారు మొదలైన వస్తువును ఇచ్చి, గుప్తచారుల ద్వారా విభిన్న నెపముల ద్వారా, స్వాభావిక పద్ధతుల ద్వారా ఆ దావా వేసినవాడి వద్ద బంగారం మొ॥ వాటిని పెట్టి మళ్ళీ అడగాలి. ॥182॥

వివరణ:

'హిరణ్యం' శబ్దానికి స్వర్ణం', ఏదైనా అతిమూల్య వస్తువుకూ 'హిరణ్య' మనడం లోకాచారం. 'హిరణ్యం' పెట్టి పరీక్షించడం-ఇదో మనో విజ్ఞానానికి సంబంధించిన విషయం. అతి లోభియైనవాడు విలువైన వస్తువును చూసి ఆశపడటం సహజం. దాన్ని బట్టి వాస్తవం ప్రకటితమవుతుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

స యది ప్రతిపద్యేత యథాన్యస్తం యథాకృతమ్ । మూలశ్లోక సం.**110**
న తత్ర విద్యతే కించిద్యత్పరైరభియుజ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**183**

టీక:- సః = తాకట్టుపెట్టుకున్నవాడు, **యథా న్యస్తం యథా కృతం ప్రతిపద్యేత్** = కుదువపెట్టిన వస్తువులను పెట్టినవి పెట్టినట్లుగా నమ్మకంగా తిరిగి ఇచ్చినట్లయితే, **యత్ పరైః + అభియుజ్యతే** = అతని మీద ఇతరులు చేసిన అభియోగం, **తత్ర న కించిత్ విద్యతే** = అందులో మాత్రం నిజం లేదని తెలుసుకోవాలి.

తాత్పర్యం:- ఒక వస్తువును తాకట్టుపెట్టుకొన్నవాడు వారు వచ్చి అడిగినప్పుడు ఆ స్వర్ణాది వస్తువులను యథాప్రకారంగా అప్పగించినట్లయితే అప్పుడు న్యాయమూర్తి దగ్గర ఫిర్యాదు చేసినవాడు తాను ఇంట్లో పెట్టినట్లు చెప్పినది అబద్ధం అని తెలుసుకోవాలి. ॥183॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తేషాం న దద్యాద్యది తు తద్ధిరణ్యం యథావిధి । మూలశ్లోక సం.**111**
ఉభౌ నిగృహ్య దాప్యస్స్యాదితి ధర్మస్య ధారణా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**184**

టీక:- యది తు = మరియు, **తేషాం హిరణ్యం** = ఆ గుప్తచారుల ద్వారా పెట్టిన స్వర్ణాది కుదువ ధనాన్ని **యథావిధి** = ఉన్నదున్నట్లుగా, **న దద్యాత్** = తిరిగి ఇవ్వనట్లయితే, **నిగృహ్య** = అతన్ని బంధించి, **ఉభౌ దాప్యః స్యాత్** = ఇద్దరి తాకట్టు వస్తువులను తిరిగి ఇప్పించడమేగాక దండన కూడా విధించాలి, **ఇతి ధర్మస్య ధారణా** = ఇది ధర్మానుసారంగా నిర్ణయం (తీర్పు).

తాత్పర్యం:- ఆ గుప్తచారుల ద్వారా పెట్టిన బంగారు కుదువ ధనాన్ని ఉన్నదున్నట్లుగా ఇవ్వదేని అప్పుడు మొదటిది, రెండోది తిరిగి ఇవ్వనట్లయితే అతన్ని బంధించి ఇద్దరి తాకట్టు వస్తువులను తిరిగి ఇప్పించడమే కాకుండా దండన కూడా విధించాలి. ఇది ధర్మానుసారంగా నిర్ణయమైన తీర్పు. ॥184॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిక్షేపోపనిధీ నిత్యం న దేయౌ ప్రత్యనంతరే । మూలశ్లోక సం. **112**
నశ్యతో వినిపాతే తావనిపాతే త్వనాశినౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **185**

టీక:- నిత్యం = ఎప్పుడైనా, నిక్షేప + ఉపనిధీ = దాచిన సొమ్ము ముద్రలు లేని, తాకట్టు పెట్టిన వస్తువులు-ముద్ర వేసినవి, అనన్తరేప్రతి = ఇచ్చేవాడి కంటే వేరైన, సన్నిహిత వ్యక్తికి (వారు పుత్రాదులైనా), న దేయౌ = ఇవ్వరాదు-తిరిగి ఇవ్వరాదు. ఇచ్చినవాడు మృతుడు కాగా నష్టమైపోతుంది, తిరిగి ఇవ్వవలసి ఉండదు. తు = మరియు, అనిపాతే = జీవించి ఉండగా, అనాశినౌ = ఎప్పుడూ నష్టపడదు.

తాత్పర్యం:- ఎప్పుడైనా దాచిన సొమ్ము ముద్రలు లేని, తాకట్టు పెట్టిన వస్తువులు- ముద్ర వేసినవి, ఇచ్చేవాడి కంటే వేరైన, సన్నిహిత వ్యక్తికి (వారు పుత్రాదులైనా) ఇవ్వరాదు. ఇచ్చినవాడు మృతుడు కాగా నష్టమైపోతుంది. తిరిగి ఇవ్వవలసి ఉండదు. మరియు జీవించి ఉండగా ఎప్పుడూ నష్టపడదు. ॥185॥

ఇది మనుకృతం-ప్రామాణికం

స్వయమేవ తు యో దద్యాన్మృతస్య ప్రత్యనంతరే । మూలశ్లోక సం. **113**
న స రాజ్ఞా నియోక్తవ్యో న నిక్షేప్తుశ్చ బంధుభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **186**

టీక:- మృతస్య అనన్త రే ప్రతి = తాకట్టు తిరిగి పొందవలసిన వ్యక్తి గతించినట్లయితే, అతడి వారసులకు, యః స్వయం ఏవ దద్యాత్ = స్వయంగా ఎవరి తాకట్టు తిరిగి ఇచ్చునో, సః = ఆ వ్యక్తి మీద, న రాజ్ఞా = రాజుగానీ, న నిక్షేప్తుః బంధుభిః = తాకట్టు పెట్టినవాడి బంధువులుగానీ, (ఉత్తరాధికారులు గానీ), న నియోక్తవ్యః = ఏ విధమైన దావా చేయరాదు.

తాత్పర్యం:- తాకట్టు పెట్టిన వాడు మృతి చెందితే, దాన్ని పదిలపరచినవాడు మృతిచెందినవాడి పుత్రాదులకు తాకట్టు పెట్టిన సొమ్ము/నిధి/వస్తువు అప్పగించాలి. అలా ఇచ్చేటప్పుడు, రాజుగాని-తాకట్టు పెట్టిన వాడి బంధువులుగానీ, వారసులుగాని ఏ విధమైన దావా వేయరాదు. ॥186॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అచ్ఛలేనైవ చాన్విచ్ఛేత్తమర్థం ప్రీతిపూర్వకమ్ । మూలశ్లోక సం. **114**
విచార్య తస్య వా వృత్తం సామ్నైవ పరిసాధయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **187**

టీక:- తమ్+అర్థం = అతని వద్ద కొంత తాకట్టు ధనం మిగిలి ఉంటే ఆ ధనాన్ని, అచ్ఛలేన = మోసం లేకుండా, ప్రీతి పూర్వకమ్ + ఏవ = ప్రేమతో, అను+ఇచ్ఛేత్ = ఇష్టపడితే, వా = మరియు, తస్యవృత్తం విచార్య = అతడి అమాయకత్వాన్ని గమనించి, (అతను స్వయంగా కొంత ధనం తిరిగి ఇచ్చాడు కాబట్టి), సామ్నా+ఏవ పరిసాధయేత్ = శాంతిపూర్వకంగా లేదా మిత్ర భావంతో ధన ప్రాప్తి కార్యాన్ని పూర్తి చేసికోవాలి.

తాత్పర్యం:- అతని వద్ద తాకట్టుకు సంబంధించిన ధనం మిగిలి ఉంటే, ఆ ధనాన్ని మోసం లేకుండా, ప్రేమతో ఇష్టపడితే అతడి అమాయకత్వాన్ని గమనించి శాంతిపూర్వకంగా లేదా మిత్రభావంతో ధన ప్రాప్తికార్యాన్ని పూర్తి చేసుకోవాలి.॥187॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిక్షేపేష్వేషు సర్వేషు విధిస్స్యాత్పరిసాధనే ।   మూలశ్లోక సం.**115**
సముద్రేనాప్నుయాత్కించిద్యది తస్మాన్న సంహరేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం.**188**

టీక:- **ఏషు సర్వేషు నిక్షేపేషు** = పై శ్లోకంలో చెప్పిన ముద్రవేయని కుదువ వస్తువుల విషయంలో, **పరిసాధనే** = వివాదాలను నిర్ణయించడంలో, **విధిఃస్యాత్** = ఈ విధి (పద్ధతి), (8-182) నిర్దేశింపబడింది. వాటిలో నుండి ముద్రను తుంచివేసి ఏమీ తీసికోకపోయినట్లయితే, **కించిత్ న + ఆప్నుయాత్** = అతడు దోషికాడు.

తాత్పర్యం:- నిక్షేపముల విషయమై అపకారం జరిగినప్పుడు "సాక్ష్యభావే" అని మొదలైన శ్లోకాలలో ముందు చెప్పిన ప్రకారం తీర్మానం చేయాలి. ముద్రతో కూడిన నిక్షేపం ఇచ్చినప్పుడు, ఆ నిక్షేపంపై ఉన్న ముద్ర చెడిపోయినా ధనమంతా యజమానికి అప్పగిస్తే ధనం దాచిపెట్టుకొన్న వానిపై ఎట్టి అభియోగం పెట్టరాదు. ॥188॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చౌరైర్హృతం జలేనోఢమగ్నినా దగ్ధమేవ వా ।   మూలశ్లోక సం.**116**
న దద్యాద్యది తస్మాత్స న సంహరతి కించన ॥   ప్రక్షిప్త శ్లోక సం.**189**

టీక:- **తస్మాత్** = కుదువ సొమ్ములో నుండి, **యది సః కించన న సంహరతి** = కుదువపెట్టిన వాడు కొంచెం కూడా తీసికొని ఉండకపోయినట్లయితే, ఆ కుదువ సొత్తు, **చౌరైః హృతం** = దొంగలు దొంగిలించినట్లయితే, **జలేన ఊఢం** = నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లయితే, **వా** = లేదా, **అగ్నినా ఏవ దగ్ధమ్** = అగ్నిలో కాలిపోయినట్లయితే, **న దద్యాత్** = కుదువదారు ఆ సొత్తును తిరిగి ఇవ్వనవసరం లేదు.

తాత్పర్యం:- కుదువ పెట్టిన సొమ్ము దొంగలెత్తుకొని పోయినా, వెల్లువలో కొట్టుకొని పోయినా, అగ్నిలో కాలిపోయినా, అందునుండి కుదువదారు ఎలాంటి సొమ్ము తీసుకోకపోయినా కుదువదారు ఆ సొమ్మును తిరిగి ఇవ్వనవసరం లేదు.॥189॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *నిక్షేపస్యాపహర్తారమనిక్షేప్తారమేవ చ ।*
సర్వైరుపాయైరన్విచ్ఛేచ్ఛపథైశ్చైవ వైదికైః ॥   ప్రక్షిప్త శ్లోక సం.***190***

తాత్పర్యం:- తాకట్టు ఉంచుకొని లేదనువాడిని, తాకట్టును ఉంచకుండానే ఇమ్మని అడిగేవాణ్ణి అన్ని విధాలైన ఉపాయాలచేత వేదసంబంధాలైన ప్రమాణాలచేత ఆలోచించి కనుక్కోవాలి. ॥190॥

ప్రక్షిప్త పరిశీలన

190వ శ్లోకం కింది అధారాలననుసరించి ప్రక్షిప్తమవుతుంది –

1. పరస్పర విరోధాలు

(క) ఈ శ్లోకంలో కుదువ మొదలైన వాటి నిర్ణయాలు శపథం, సామం, దానం మొదలైన ఉపాయాలతో చెప్పారు. ఆ తర్వాతి మొత్తం విషయం ఈ మాటను స్పష్టం చేస్తూంది. అందులో వివాదాల తీర్పు చదవటం, రాయటం వచ్చినవారు, సాక్షుల ద్వారా చేయాలి అని ఉంది. (8.52, 57; 8.44, 45)

(ఖ) మనువు శపథం చేయటాన్ని సత్యం, న్యాయాలకు ఆధారమని అంగీకరించలేదు. శపథాన్ని సత్యానికి ఆధారంగా ఒప్పుకుంటే, అందరూ శపథాలు చేసేస్తారు! ఈ విధంగా ఆకృతి సంకేతాలు మొదలైన వాటితో ప్రజల మనసులో ఏముందో తెలుసుకునే (8.25, 26) అవసరం రాజుకు ఎలా లభిస్తుంది? మనువు దీన్ని సత్యానికి ఆధారంగా

అంగీకరించలేదు, అందుచేత అబద్ధపు సాక్షులను తెలుసుకునే మాటే చెప్పాడు. సాక్షులు లేకుంటే, గూఢచారుల ద్వారా విషయం తెలుసుకునే పద్ధతినే ఏర్పరిచాడు (8.182, 184). ఈ పరస్పర వ్యతిరేక విషయాల వల్ల, ఈ శ్లోకం ప్రక్షిప్తమే!

ఇది మనుకృతం. ప్రామాణికం

యో నిక్షేపం నార్పయతి యశ్చానిక్షిప్య యాచతే । మూలశ్లోక సం. **117**
తావుభౌ చౌరవచ్ఛాస్యౌ దాప్యౌ వా తత్సమం దమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **191**

టీక:- **యః నిక్షేపం నార్పయతి** = ఎవడు కుదువ వస్తువును తిరిగి ఇవ్వడో, **చ** = మరియు, **యశ్చ** = ఎవడు, **అనిక్షిప్య యాచతే** = వస్తువు కుదువపెట్ట కుండానే కుదువపెట్టానని అబద్ధంగా చెప్పునో, **తౌ+ఉభౌ** = వారిద్దరు, **చౌరవత్ శాస్యౌ** = చోరుని వలె దండనీయులు, **వా** = లేక, **తత్ సమం దమం దాప్యౌ** = కుదువపెట్టానని చెప్పే ధనమునకు సమానంగా దండనీయులు.

తాత్పర్యం:- ఎవడు నిక్షేపమును ఉంచకయు ఇమ్మని అడుగునో, ఎవడు నిక్షేపము నుంచికొని లేదనునో వారిని దొంగలను దండించినట్లు దండింపవలయును. అంతేకాక స్వల్పమైన నిక్షేపముల విషయమున, ఆ నిక్షేపముతో సాటిగా దండుగ విధింపవలయును. ॥191॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ***నిక్షేపస్యాపహర్తారం తత్సమం దాపయేద్దమమ్ ।***
తథోపనిధిహర్తారమవిశేషేణ పార్థివః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***192***

తాత్పర్యం:- నిక్షేపమును దొంగిలించిన వానికి నిక్షేపసమముగా దండుగ విధింపవలయును. ముద్రాదుల తోడ ఉంచిన ధనమును దొంగిలించిన వానికిని అలాగే దండుగ విధింపవలయును. మొదటితడవ తప్పుసేసిన వానికీ శ్లోకమున జెప్పినట్లును, పలుతడవలు చేసినవానికి పూర్వశ్లోకమున చెప్పిన చొప్పునను దండనము విధింపవలయును. ఇందు పునరుక్తి లేదు. ॥192॥

ప్రక్షిప్త పరిశీలన

192వ శ్లోకం క్రింది ప్రకారం ప్రక్షిప్తం -

పునరుక్తి 191వ శ్లోకంలో నిక్షేపహర్తకు సమానంగా దండన విధానం చేయబడింది. ఉపనిధి విధానం కూడా అందులోనే అంతర్భూతమౌతుంది. 192లో మరల ఆ విషయం చెప్పడం పునరుక్తి అవుతుంది. కావున ఇది ప్రక్షిప్తం.

193 నుండి 203వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఉపధాభిశ్చ యః కశ్చిత్పరద్రవ్యం హరేన్నరః । మూలశ్లోక సం. **118**
ససహాయస్స హంతవ్యః ప్రకాశం వివిధైర్వధైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **193**

టీక:-యః కశ్చిత్ నరః = ఏ మనుష్యుడైనను, **ఉపధాభిః** = మోసంచేసి, **పర ద్రవ్యం హరేత్** = ఇతరుల ధనమును దొంగిలించినట్లైతే, **సః** = అతనిని రాజు (న్యాయాధిపతి), **ససహాయః** = అతని స్నేహితులతో కలసి, **ప్రకాశం** = ప్రజల ఎదుట, **వివిధైః వధైః హన్తవ్యః** = బెత్తములతో కొట్టుట, కాళ్ళు చేతులు నరకుట మొ॥ రకరకములైన వ్యధల ద్వారా హత్యచేయవలెను. లేదా దండించవలయును.

తాత్పర్యం:- ఎవడైన ఇతరులను రాజుగారితోనో, అధికారులతోనో చెప్పి నీకు సాయము చేయింతును వారినెఱుగుదును వీరి నెఱుగుదునని చెప్పి మోసగించి ధనమును తీసికొన్నచో వానిని వాని స్నేహితులతో గూడ బాహాటముగా ప్రజలయెదుట ననేక విధముల హింసింపవలెను. ॥193॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిక్షేపో యః కృతో యేన యావాంశ్చ కులసన్నిధౌ । మూలశ్లోక సం.**119**
తావానేవ స విజ్ఞేయో విబ్రువన్ దండమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**194**

టీక:-కులసన్నిధౌ = సాక్షుల ఎదుట, **యేన** = ఎవడు, **యః చ యావాన్ నిక్షేపః కృతః** = ఏ వస్తువు, ఎంత కుదవగా పెట్టెనో, **సః** = వాడు, **తావాన్ +ఏవ జ్ఞేయః** = అంతే అని అనుకొనవలెను, అంటే కుదువ సొమ్ము తగ్గిపోవడంగానీ, పెరగడం కానీ జరుగనప్పుడు, **విబ్రువన్** = అందుకు విరుద్ధంగా పలుకువాడు గూడా, **దండమ్ +అర్హతి** = దండనీయుడగును.

తాత్పర్యం:- బంగారు మొదలగు నిక్షేపములు ఇన్ని పలములు గలది అని ఎవడు సాక్షుల సమక్షమున అప్పగించునో అప్పుడా నిక్షేపము ఉంచుకొన్నవాడు సాక్షుల సమక్షమున దానినలాగే అప్పగించవలయును. అట్టి నిక్షేపముల తూనిక మొదలగువాని విషయమై వాదము వచ్చినప్పుడు సాక్షులు చెప్పినప్రకారమంత తూనికకలదానినే అప్పగింపవలయును. నిక్షేపధారి అలా వాదము చేసెనేని, సాక్షులు చెప్పిన చొప్పున వానికి దండము విధింపవలయును.॥194॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మిథో దాయః కృతో యేన గృహీతో మిథ ఏవ వా । మూలశ్లోక సం.**120**
మిథ ఏవ ప్రదాతవ్యో యథా దాయస్తథా గ్రహః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**195**

టీక:- **యేన మిథః దాయః కృతః** = ఏ వ్యక్తి సాక్ష్యం లేకుండగనే, పరస్పర సమ్మతితో ధనం కుదువ పెట్టియున్నాడో, **వా** = లేక, **మిథః ఏవ గృహీతః** = అదే ప్రకారంగా ఏకాంతంగానే తిరిగి తీసుకొన్నాడో వారికి, **మిథః ఏవ ప్రదాతవ్యః** = అదే ప్రకారంగా ఏకాంతంగా తిరిగి యిప్పించాలి. **యథా దాయః తథా గ్రహః** = ఎందుకనగా ఎలా ఇచ్చాడో, అలానే తీసుకోవాలి (తుల నార్థము) 8-180లో చూడగలరు.

తాత్పర్యం:- ఎవడు నిక్షేపమును రహస్యంగా దాపటికము చేయుచున్నాడో వాని నిక్షేపమును దాచి యుంచుకొన్నవాడును రహస్యంగా ఇవ్వవలయును. అలా మఱలనొసంగునప్పుడు సాక్షులుండవలసిన అక్కరలేదు. ఎట్లీయబడెనో అట్లు ప్రత్యర్పించుట సమంజసము కావున నిక్షేపధారి ఆ విధముగా ఇవ్వవలయును. అలాగే నిక్షేపముంచినవాడును తీసికొనవలయును. ॥195॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిక్షిప్తస్య ధనస్యైవం ప్రీత్యోపనిహితస్య చ । మూలశ్లోక సం.**121**
రాజా వినిర్ణయం కుర్యాదక్షిణ్వన్న్యాసధారిణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **196**

టీక:-ఏవం = ఈ విధంగా (8.179 నుండి 195 వరకు), **నిక్షిప్తస్య ధనస్య** = కుదవగా పెట్టిన, **చ** = మరియు, **ప్రీత్యా+ఉపనిహితస్య ధనస్య** = ప్రేమ పూర్వకంగా ఉపనిధి రూపంలో పెట్టిన ధనము యొక్క, **న్యాస ధారిణమ్ అక్షిణ్వన్** = సొత్తు కుదువపెట్టిన వానికి ఏ విధంగానూ హానికలుగకుండా, **రాజా వినిర్ణయం కుర్యాత్** = రాజు నిర్ణయం చేయవలెను.

తాత్పర్యం:- తాకట్టుగా ధనమిచ్చినను, ప్రీతిపూర్వకముగా ధనమప్పగించినను తాకట్టు పెట్టుకొన్న ధనవంతునకు మరియు తాకట్టుపెట్టువానికి కష్టము కలుగనిరీతిలో రాజు నిర్ణయము చేయవలెను. ॥196॥

3వ వివాదం "అస్వామి విక్రయం'(197-205)

ఇతరుల వస్తువును అమ్మడం-

ఇది మనుకృతం-ప్రామాణికం

విక్రీణీతే పరస్య స్వం యోఽస్వామీ స్వామ్యసంమతః । మూలశ్లోక సం. **122**
న తం నయేత సాక్ష్యం తు స్తేనమస్తేనమానినమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **197**

టీక:- **యః** = ఏ మనుషుడు, **అస్వామీ** = ఏ వస్తువుకు స్వామి కాకపోయినా, **స్వామీ + అసంమతః** = ఆ వస్తువు మీద అధికారం కలవాడి సమ్మతి లేకుండగానే, **పరస్య స్వం విక్రీణీత్** = అన్యుల సంపత్తిని విక్రయం చేస్తాడో, **అస్తేన మానినమ్** = వాడు దొంగ అయి కూడా, తాను దొంగనుకానని తలంచునో, **స్తేనం తమ్** = ఆ చోరుడి, **సాక్ష్యం న నయేత**= సాక్షిగా ఉండటానికి అనర్హుడు. అతడి మాటలు ప్రామాణికాలు కావు.

తాత్పర్యం:- హక్కులేని వస్తువును హక్కుదారుని అనుమతిలేకుండ అమ్మినచో వాడు దొంగయయ్యుండి దొంగకానని చెప్పినచో అతనిని సాక్షిగా అంగీకరింపరాదు. ॥197॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అవహార్యో భవేచ్చైవ సాన్వయః షట్శతం దమమ్ । మూలశ్లోక సం. **123**
నిరన్వయోఽనపసరః ప్రాప్తస్స్యాచ్చౌరకిల్బిషమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **198**

టీక:- **అవహార్యః సాన్వయః ఏవ భవేత్** = ఈ ప్రకారంగా (8.197) సంపత్తిని అమ్మేవాడు గృహస్వామికి ఉత్తరాధికారి అయినప్పుడు, అతడికి, **షట్ శతం దమమ్** = 600 పణాలు జుర్మానా వేయాలి. అలాగే, **నిరన్వయః** = స్వామి వంశానికి చెందినవాడు కానట్లయితే, **అనపసరః** = జబర్దస్తీగా ఆ సంపత్తి మీద అధికారం చేసేవాడయినట్లయితే, **చౌరకిల్బిషమ్ ప్రాప్తః స్యాత్** = వాడిని దొంగను దండించినట్లు (8.301-343) జుర్మానాతో దండించాలి.

తాత్పర్యం:- అమ్మువాడు హక్కుదారుని వంశమువాడగుచో ఆఱువందల పణములు దండన విధింపవలెను. వంశమువాడుకాకయు, అమ్మునధికారము గైకొనకయు అమ్మినచో దొంగతనము వలన పాపము కలుగును. కావున దొంగనువలె శిక్షింపవలెను. ॥198॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అస్వామినా కృతో యస్తు దాయో విక్రయ ఏవ వా । మూలశ్లోక సం. **124**
అకృతస్స తు విజ్ఞేయో వ్యవహారే యథాస్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **199**

టీక:- **అస్వామినా** = వాస్తవిక స్వామి లేకుండానే, **యస్తు దాయః వా విక్రయః కృతః** = ఎవడు ఏ కొంచెమైనా ఇవ్వడం లేదా అమ్మడమో చేసినట్లయితే, **వ్యవహారే యథాస్థితిః** = దావా నియమాన్ని బట్టి, **సః తు అకృతః విజ్ఞేయః** = ఆ పని చేయనట్లే భావించాలి. ఈ విధంగా ఇవ్వడం అమ్మడం చెల్లదు.

తాత్పర్యం:- హక్కు లేనివాడిచ్చినను, అమ్మినను అది శాస్త్రవిరుద్ధమగుటచే దానిని అనర్హముగా భావింపవలెను.॥199॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సంభోగో దృశ్యతే యత్ర న దృశ్యేతాగమః క్వచిత్ । మూలశ్లోక సం. **125**
ఆగమః కారణం తత్ర న సంభోగ ఇతి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **200**

టీక:- **యత్ర సంభోగః దృశ్యతే** = ఎక్కడ, ఏ వస్తువును అయినా, వాడుకోవడం లేదా అనుభవించినట్లయితే, **ఆగమః కృచిత్ న దృశ్యతే** = కానీ ఆ వస్తువు రావడానికి కారణం లేదో, **తత్ర** = అక్కడ, **ఆగమః కారణం** = వస్తు ప్రాప్తికి హేతుభూతం, సాధనానికి ప్రమాణాన్ని కొనడం మొ॥ అంగీకరించాలి. **సంభోగః స** = అనుభవించడం వల్ల ఆ వస్తువుకు అతడు స్వామి అనడానికి వీలులేదు. **ఇతి స్థితిః** = ఇదే శాస్త్రవ్యవస్థ. ఏ వస్తువునైనా అనుభవించినంత మాత్రం చేత ఆ వస్తువుకు అతడు స్వామి అనడానికి వీలులేదు. మరియు ఆ వస్తువు ఎలా లభించిందో సరియైన కారణం తెలిసినప్పుడే, ఆ వస్తువుకు అతడు స్వామి కాగలడు.

తాత్పర్యం:- ఒకడు ఒక ఆస్తిని అనుభవిస్తున్నప్పుడు ఆ యాస్తి ఆతనికెట్లు సంక్రమించిందో ప్రమాణం చూపకుండా అనుభవించుట హక్కు కాదు. అచట చట్ట ప్రకారమే హక్కు నిర్ధారితమవుతుంది. అనుభవం స్వామిత్వానికి ప్రమాణం కాదు. క్రయాదులు, తత్పత్రం మొ॥వి స్వామిత్వానికి కారణాలు. ॥200॥

ఇది మనుకృతం-ప్రామాణికం

విక్రయాద్యో ధనం కించిద్గృహ్ణీయాత్కులసన్నిధౌ । మూలశ్లోక సం. **126**
క్రయేణ స విశుద్ధం హి న్యాయతో లభతే ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **201**

టీక:- **యః**= ఏ వ్యక్తి, **కించిత్ విక్రయాత్** = ఏ వస్తువునైనా అమ్మి, **ధనం గృహ్ణీయాత్** = ధనాన్ని పొందదలచినట్లయితే, **కులసన్నిధౌ** = సాక్షుల లేదా స్వకులస్థుల మధ్య, **విశుద్ధం క్రయేణ హి** = అమ్ముతున్న ఆ వస్తువును కొన్నట్లు ధ్రువీకరించిన తరువాతనే, **న్యాయతః ధనమ్ లభతే** = న్యాయానుసారంగా ఆ ధనాన్ని తీసికోడానికి అధికారం వస్తుంది. అంటే, తాను అమ్మదలచుకొన్న వస్తువు వాస్తవంగా తనదేనని లేదా చట్టపరంగా తాను కొన్నదని నిరూపించిన తరువాతనే ఆ వస్తువును అమ్మి, అందుకు ధనం తీసికోవాలి. న్యాయంగా అలా కానట్లయితే తాను ధనాన్ని తీసికోరాదు. చట్టపరంగా తాను కొన్నట్లు చూపించినప్పుడే ఆ వస్తువును అమ్ముకొనవచ్చును. ఆ విక్రయ ధనాన్ని పొందవచ్చు.

తాత్పర్యం:- ఎవడైనను జనులసమక్షంలో ఏదైన పదార్థముకొన్నచో అది హక్కులేని వస్తువైనచో స్వంతదారు ఫిర్యాదుచేసినచో విచారణ జరిపి కొన్నవానికి న్యాయానుసారము ధనము తిరిగిఇవ్వవచ్చును. ॥201॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అథ మూలమనాహార్యం ప్రకాశక్రయశోధితః । మూలశ్లోక సం. **127**
అదండ్యో ముచ్యతే రాజ్ఞా నాష్టికో లభతే ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **202**

టీక:- **అథ మూలమ్ + అనాహార్యం** = ఏదైన వస్తువు కొనరానిదైనప్పుడు, ఆ వస్తువు ఎవరిది? ఎలా వచ్చింది? అసలు ఆ వస్తు సొంతదారుడెవడో తెలియనప్పుడు కొనేవాడు ఆ వస్తువును, **ప్రకాశ-క్రయ శోధితః** = ప్రజల ఎదుట ఆ వస్తువును కొన్నట్లయితే, **రాజ్ఞా అదండ్యః ముచ్యతే** = రాజు ద్వారా దండనీయుడుకాడు. రాజు అతడిని వదిలివేయాలి. మరియు **నాష్టికః ధనమ్ లభతే** = మూలరూపంలో ఆ ధనం ఎవరిదో వారికి ఆ ధనం ఇప్పించాలి.

తాత్పర్యం:- అనర్హమైన వస్తువును బూటకపు మాటలు నమ్మి బహిరంగముగ కొన్నచో రాజుచేత దండింపబడదు. కాని అసలు వస్తువుయొక్క హక్కుదారుడు నష్టపోకుండ ధనము నాతని కిప్పింపవలెను. ॥202॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నాన్యదన్యేన సంసృష్టరూపం విక్రయమర్హతి । మూలశ్లోక సం. **128**
న చాసారం న చ న్యూనం న దూరే న తిరోహితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **203**

టీక:- **అన్యేన అన్యత్ సంస్పృష్ట రూపం** = ఒక వస్తువు దాదాపు అలాంటి రంగు గల, తక్కువ ధర గల వస్తువును కలిపి (నేతిలో నూనెను) పెట్రోల్లో కిరోసిన్ మొ॥ లేదా చెడిపోయిన వస్తువును మంచి వస్తువుతో కలిపి, **న విక్రయం అర్హతి** = అమ్మరాదు, **చ** = మరియు, **న అసారమ్** = పనికిమాలిన వస్తువును మేలైన వస్తువుతో కలిపి అమ్మరాదు, **న చ న్యూనం** = తూనికలో శేరు అని చెప్పి తగ్గించి అమ్మకూడదు, **న దూరేన తిరోహితమ్** = వస్తువు దూరంగా కనిపించకుండా ఉంచి అమ్మరాదు. ఈ అమ్మకాలు ప్రమాణాలు కావు. చెల్లుబడి కావు.

తాత్పర్యం:- అసలు వస్తువును కాక నకిలీ వస్తువును గాని, చెడిన, పనికిరాని వస్తువును కాని, తక్కువతూకము తూచికాని, వస్తువును సరిగా కనబడకుండ దూరము నుంచి కాని అమ్మరాదు. ॥203॥

వివరణ:

పాతదానికి రంగు మొ॥నవి వేసి భ్రమింపజేసి అమ్మరాదు. ఇది సొంతగాడుగాని వాని విక్రయముతో సమానమే కనుక, ఇట్టి విక్రయములోను అబద్ధానికి విధించు దండనయే దీనికీ వేయాలి.

ఇలాంటి వస్తువులను అమ్మడం-ఇతర వస్తువులను తనవని చెప్పినచో, అమ్మినవాడి లాగా దండనీయుడు (197,198) లేదా (9.286-287) అనుసారంగా దోషాన్ని చూసి తగిన విధంగా దండించాలి.

204 నుండి 209 వరకు ప్రక్షిప్తాలు- ఇవి ప్రామాణికం కావు.

*** వివాహంతో మోసం చేయువానికి దండన**

* *అన్యాం చేద్దర్శయిత్వాఽన్యా వోఢుః కన్యా ప్రదీయతే ।*
ఉభే తే ఏకశుల్కేన వహేదిత్యబ్రవీన్మనుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***204***

తాత్పర్యం:- ఓలీ తీసుకొని కన్యను ఇచ్చువాడు, మొదట మంచి లక్షణాలు గల కన్యను చూపి, ఆ తరవాత అవలక్షణాలు గల కన్యను వరుడికి ఇచ్చినట్లయితే ఆ వరుడీ ఓలికే మంచికన్యను, చెడుకన్యను తీసుకొను హక్కు కలిగి ఉన్నాడు. (ఓలి ఇచ్చి కన్యను తీసుకోవడం వస్తువులను కొన్నట్లే కాబట్టి, ఇక్కడ ఈ విషయం చెప్పబడినది.)॥204॥

* *నోన్మత్తాయా న కుష్ఠిన్యా న చ యా స్పృష్టమైథునా ।*
పూర్వం దోషానభిఖ్యాప్య ప్రదాతా దండమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***205***

తాత్పర్యం:- ఏ కన్య ఉన్మాదం గలదో (వెర్రిదో), ఏ కన్య కుష్ఠురోగంగలదో, ఏ కన్య వివాహానికి పూర్వమే పురుష సంసర్గం గలదో అలాంటి కన్యను వరుడికి ఇస్తున్నప్పుడు దానికి గల దోషాలను ముందే ఓలి తీసుకొనువాడు వరుడికి తెలిపినట్లయితే, వాడు దండనార్హుడు కాడు. లేనట్లయితే వాడు దండనకు అర్హుడవుతాడు. ॥205॥

ప్రక్షిప్తాల పరిశీలన

204-205 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. శైలీగత ఆధారాలు

204లోని 'ఇతి అబ్రవీత్ మనుః' పదాల ద్వారా ఈ శ్లోకం మనువు కాకుండా వేరెవరో చెప్పినదని రుజువవుతూంది. అందుచేత ఇది ప్రక్షిప్తం. 205 వ శ్లోకం దీనికి సంబంధించినది. అందువల్ల పైది ప్రక్షిప్తం కనుక, ఇది కూడా ప్రక్షిప్తమే!

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలోని వాటితో రెండు పెళ్లిళ్లు చేసుకోవచ్చని ధ్వనిస్తూంది. ఇది మనువు మౌలిక వ్యవస్థకు వ్యతిరేకం. మనువు సవర్ణురాలైన ఒకే స్త్రీతో పెళ్లి అని నిర్దేశించాడు. [3.4,77 మొదలైనవి] ఈ శ్లోకాలు రాసినవాడు కన్యను

విక్రయ వస్తువుగా భావించాడు. ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు కట్నాలు లేకుండా పెళ్లిళ్లు జరిగే పద్ధతిని చెప్పటమే కాకుండా, కట్నాలను నిషేధించాడు కూడా [3.51-54]. పైన చెప్పిన రెండు వ్యవస్థలూ మనువు చెప్పినవి కావు. మనువు పేరిట ఎవరో ప్రక్షిప్త రచయిత మిథ్యా విషయాలు చొప్పించాడు.

4వ వివాదము - సామూహిక వ్యాపారము నిర్ణయము

* ఋత్విక్ వివరణలో దక్షిణ వ్యవస్థ -

* ఋత్విగ్యది వృతో యజ్ఞే స్వకర్మ పరిహాపయేత్ ।
తస్య కర్మానురూపేణ దేయోఽంశ సహ కర్తృభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **206**

తాత్పర్యం:- నిర్ణీతకాలం యజ్ఞం చేయించడం నిమిత్తం ఒక ఋత్విక్కు ఒప్పుకొని కొంత కార్యం నిర్వర్తించాక, అసాధారణ పరిస్థితులలో (అనారోగ్యము మొ॥) పూర్తిగా చేయలేక మధ్యలో వదిలేస్తే అతడికి అంతవరకు చేసినక్రియకు దక్షిణ ఇవ్వక అమర్యాద చేయరాదు. ॥206॥

* దక్షిణాసు చ దత్తాసు స్వకర్మ పరిహాపయన్ ।
కృత్స్నమేవ లభేతాంశమన్యేనైవ చ కారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **207**

తాత్పర్యం:- కొన్ని సందర్భాలలో దక్షిణలిచ్చే సమయం వరకూ క్రియ కొనసాగించి, మహదాశీర్వచన వేళ వ్యాధులు మొదలైనవాటి వల్ల ఋత్విక్కు ఆ కొద్ది కర్మ పూర్తిచేయలేకపోయినా, మిగిలిన ఋత్విక్కులతో ఆలోచించి అతడికి పూర్తి దక్షిణ ఇప్పించాలి. ॥207॥

* యస్మిన్ కర్మణి యాస్తు స్యురుక్తాః ప్రత్యంగదక్షిణాః ।
స ఏవ తా ఆదదీత భజేరన్ సర్వ ఏవవా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **208**

తాత్పర్యం:- కొన్ని యజ్ఞాలలో ఒక్కొక్క అంగము (కర్మ విభాగం) నకు ఎవరి కే రీతి సంభావనలు ముట్టజెప్పవలసి ఉందో అవి వారికే చెందాలా? లేదా వాటిని అందరూ విభజించి తీసుకోవాలా? అనేది ప్రశ్న. ॥208॥

* రథం హరేత చాధ్వర్యుర్బ్రహ్మాధానే చ వాజినమ్ ।
హోతా వాపి హరేదశ్వ ముద్గాతా చాప్యనః క్రయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **209**

తాత్పర్యం:- కొన్ని శాఖలవారికి ఆధానంలో అధ్వర్యుడికి రథం, బ్రహ్మకు వేగం గల అశ్వం, హోతకు సాధారణ అశ్వం, ఉద్గాతకు సోమక్రయం మోసే బండి దక్షిణగా విధించబడింది. ఆ ఏర్పాటును బట్టి వారు అవే తీసుకోవాలి.॥209॥

ప్రక్షిప్తాల పరిశీలన

206-209 వరకు గల శ్లోకాలు కింది ప్రకారంగా ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ప్రసంగాన్ని సూచించే శ్లోకం [8.4] ప్రకారం, ఇక్కడ భాగస్వామ్య వ్యాపారం గురించి ఉంది. ఇందులో ప్రతి భాగస్వామ్య వ్యాపారానికీ సంబంధించిన సాధారణ వ్యవస్థ ఉందే కానీ, ఋత్విజులు వస్తువులు విభాగించుకునే వ్యవస్థ లేదు. ఈ శ్లోకాలలో కేవలం యజ్ఞకార్యాలలో లభించిన దక్షిణ, వస్తువుల విభజన అనేది పైన సూచించిన ప్రసంగానికి అనుకూలంగా లేదు. యజ్ఞ కార్యం భాగస్వామ్య వ్యాపారం కాదు, ఋత్విజుల మధ్య భాగస్వామ్యపు లాభాల అవసరమూ లేదు. ఇది పరస్పర సహకారంతో జరిగేది. ఇలా ప్రసంగ వ్యతిరేకత ఉండటం చేత, 206 నుంచి 209 వరకు ఉన్న శ్లోకాలు ప్రక్షిప్తాలు.

210 నుండి 216వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాదీకం

కలిసి వ్యాపారం చేయుట-లాభాన్ని పంచుకొనుట-

సర్వేషామర్ధినో ముఖ్యాస్తదర్ధేనార్ధినోఽపరే । మూలశ్లోక సం. **129**
తృతీయినస్తృతీయాంశాశ్చతుర్థాంశాశ్చ పాదినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **210**

టీక:- తమ ధన వ్యయంననుసరించి, సర్వేషాం ముఖ్యాః అర్ధినః = వాటాదారులందరిలో ఎవరు ముఖ్యులో, వారు మొత్తం ఆదాయంలో సగభాగం తీసికోవాలి. అపరే అర్ధినః తత్ అర్ధేన = రెండో రకమైన వాటాదారులు, ముఖ్యులనుండి 1/2 అర్ధ భాగాన్ని తీసికోవాలి. తృతీయినః తృతీయాంశాః = మూడో రకం భాగస్థులు 1/3 భాగాన్ని, చతుర్థాంశాః పాదినః = నాల్గో భాగానికి చెందిన భాగస్థులకు 1/4 భాగం తీసికోవాలి. ఈ ప్రకారంగా సామూహిక వ్యాపారస్థులు-లాభాలు పొందేట్లు వ్యాపారం చేయాలి. (48-24-16-12).

తాత్పర్యం:- తమ ధన వ్యయం ననుసరించి వాటాదారులందరిలో ఎవరు ముఖ్యులో, వారు మొత్తం ఆదాయంలో సగభాగం తీసుకోవాలి. రెండో రకమైన వాటా దారులకు ముఖ్యుల నుండి అర్ధభాగం, మూడోరకం భాగస్థులు 1/3వ భాగాన్ని, నాల్గోభాగానికి చెందిన భాగస్థులకు 1/4 భాగం తీసుకోవాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

సంభూయ స్వాని కర్మాణి కుర్వద్భిరిహ మానవైః । మూలశ్లోక సం. **130**
అనేన విధియోగేన కర్తవ్యాంశప్రకల్పనా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **211**

ఇహ = ఈ ప్రపంచంలో, సంభూయ స్వాని కర్మాణి కుర్వద్భిః మానవైః = ఈ విధంగా కలిసి తమ పనులు చేసే మానవులకు, అనేన విధియోగేన = ఈ విధిననుసరించి, అంశ ప్రకల్పనా కర్తవ్యా = పరస్పరం లాభ భాగాలను పంచుకోవాలి.

తాత్పర్యం:- ఈ ప్రపంచంలో ఈ విధంగా కలిసి తమ పనులు చేసే లాభభాగాలను వంచుకోవాలి. ॥211॥

5వ వివాదం దానాన్ని తిరిగి తీసుకొను సందర్భం -212-213

ఇచ్చిన వస్తువును తిరిగి ఇవ్వకుండా ఉండటం- ఇది మనుకృతం-ప్రామాణికం

ధర్మార్థం యేన దత్తం స్యాత్కస్మైచిద్యాచతే ధనమ్ । మూలశ్లోక సం. **131**
పశ్చాచ్చ న తథా తత్స్యా న్న దేయం తస్య తద్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **212**

టీక:- యేన = ఎవరు, కస్మైచిత్ యాచతే = అడిగినవాడికి (యాచకుడికి), ధర్మార్థం ధనమ్ దత్తం స్యాత్ = ధర్మకార్యార్థం ధనమిచ్చినట్లైతే, చ = మరియు, పశ్చాత్ = తరువాత, తథా తత్‌న స్యాత్ = తీసికొన్నవాడు చెప్పినట్లు ఆ కార్యం చేయకపోయినట్లయితే, తస్య తత్ దేయం = అలాంటి యాచకుడికి, ఆ ధనం ఇవ్వకూడదు. వెంటనే వాడి నుండి ఆ ధనాన్ని తీసుకోవాలి.

తాత్పర్యం:- అడిగిన వాడికి ధర్మకార్యాలనిమిత్తం (యాగాలు మొ॥) ఎవరైనా ధనాన్ని కావాలని కోరితే వారికి ఆ ధనం ఇచ్చినా-ఇస్తానని వాగ్దానం చేసినా, అతడా కార్యం నెరవేర్చనప్పుడు ఆ ధనం తిరిగి స్వాధీనం చేసుకోవచ్చు! వాగ్దానం చేసినా ధనం ఇవ్వనవసరం లేదు. ॥212॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యది సంసాధయేత్తత్తు దర్పాల్లోభేన వా పునః । మూలశ్లోక సం. **132**
రాజ్ఞా దాప్యస్సువర్ణం స్యాత్తస్య స్తేయస్య నిష్కృతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **213**

టీక:- **పునః** = తిరిగి ఇవ్వమన్నప్పుడు, **దర్పాత్ వా లోభేన** = గర్వం వల్ల గానీ లేదా లోభం వల్లగానీ, తిరిగి వాడు ఇవ్వకపోయినా, లేదా వేరే పనికి ఉపయోగించినా, **రాజ్ఞా** = ప్రభువు, **తస్య స్తేయస్య నిష్కృతిః** = చౌర్య రూపమైన ఆ అపరాధానికి గాను, **సువర్ణం దాప్యం స్యాత్** = 16 మాషల సువర్ణం జరిమానా వేయడమే గాక, ఇచ్చిన ధనాన్ని వసూలు చేసి ఇప్పించాలి.

తాత్పర్యం:- ఈ ప్రకారం ధర్మకార్యంనిమిత్తం యాచించి సంపాదించినది అతడు పేరాశచేత లేదా అహంకారం చేత తిరిగి ఇవ్వకపోవడం, గర్వం వల్లగానీ లేదా లోభం వల్లగానీ తిరిగి వాడు ఇవ్వకపోయినా లేదా వేరేపనికి ఉపయోగించినా, ప్రభువు చౌర్యరూపమైన ఆ అపరాధానికి గాను 16 మాషల సువర్ణం జరిమానా వేయడమే గాక, ఇచ్చిన ధనాన్ని వసూలు చేసి ఇప్పించాలి. ॥213॥

6వ వివాదం-వేతన వివాదాలు

వేతనం ఇవ్వడం గురించి

ఇది మనుకృతం-ప్రామాణికం

దత్తస్యైషోదితా ధర్మ్యా యథావదనపక్రియా । మూలశ్లోక సం.**133**
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి వేతనస్యానపక్రియామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**214**

టీక:- **ఏషా** = ఇది (8.212,213), **దత్తస్య** = ఇచ్చిన దానమును, **యథావత్ అనపక్రియా**= ఇచ్చినది ఇచ్చినట్లు తిరిగి ఇవ్వనందుకు, **ధర్మ్యా** = ధర్మానుసారంగా చెప్పబడింది, **అతః ఊర్ధ్వం** = దీని తరువాత (ఇక ముందు), **వేతనస్య + అనపక్రియామ్** = వేతనం ఇవ్వని విషయాన్ని గురించి వివరిస్తాను.

తాత్పర్యం:- ఇచ్చిన దానం తిరిగి ఇవ్వనప్పుడు అనుసరించవలసిన పద్ధతులు ధర్మానుసారంగా చెప్పబడ్డాయి. ఇక వేతనం, కూలి మొదలైనవి ఇవ్వని విషయాన్ని గురించి వివరిస్తాను. ॥214॥

ఇది మనుకృతం-ప్రామాణికం

భృతో నార్తో న కుర్యాద్యో దర్పాత్కర్మ యథోదితమ్ । మూలశ్లోక సం.**134**
స దండ్యః కృష్ణలాన్యష్టౌ న దేయం చాస్య వేతనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**215**

టీక:- **యః** = ఎవడు, **భృతః** = సేవకుడు, **అనార్తః** = రోగం లేనివాడై కూడా (ఆరోగ్యంగా ఉండి), **యథా+ఉదితమ్ కర్మ** = నిశ్చయించుకున్న కర్మను, **దర్పాత్** = అహంకారం వల్ల, **న కుర్యాత్** = చేయడో, **సః అష్టౌ కృష్ణలాని దండ్యః** = న్యాయాధిపతి అతడికి, 8 కృష్ణలు జరిమానా విధించాలి, మరియు, **అస్య వేతనమ్ న కుర్యాత్** = అతడికి ఆ సమయానికి ఇవ్వాల్సిన వేతనం కూడా ఇవ్వరాదు.

తాత్పర్యం:- సేవకుడు ఒక పనికి ఒప్పుకొన్నాడనుకొందాం. కాని, అతడికి రోగం లేకపోయిన కూడా నిశ్చయించుకున్న కర్మలు అహంకారం చేత కావచ్చు ! వా డా పనిని చేయడు. వీటిని రాజు విచారించి, వాడికి 8 కృష్ణల జరిమానా విధించాలి. ఒప్పుకున్న కూలిగానీ, వేతనంగానీ ఇవ్వనవసరం లేదు. ॥215॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆర్తస్తు కుర్యాత్ స్వస్థస్సన్ యథాభాషితమాదితః । మూలశ్లోక సం.**135**
స దీర్ఘస్యాపి కాలస్య తల్లభేతైవ వేతనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**216**

టీక:- ఒకవేళ సేవకుడు, **ఆర్తః స్వస్థః సన్** = ఆరోగ్యంగా ఉంటూ, **యథా భాషితమ్ +ఆదితః కుర్యాత్** = మొదట నిశ్చయించినట్లుగా సరిగ్గా పనిచేసేవాడైనట్లయితే, **సః తత్ దీర్ఘస్య కాలస్య అపి వేతనం లభేత** = అతడు జబ్బుపడిన కాలమంతటికీ జీతం పొందడానికి అతడు అర్హుడు.

తాత్పర్యం:- జబ్బుపడ్డనౌకరు ఆరోగ్యవంతుడై మొదట మాట్లాడుకొనిన రీతిగా పనిచేసినచో అతనికి జబ్బుపడినరోజులకు గూడ జీతమీయవలెను. ॥216॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *యథోక్తమార్తస్సుస్థో వా యస్తత్కర్మ న కారయేత్ ।*
న తస్య వేతనం దేయమల్పోనస్యాపి కర్మణః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***217***

తాత్పర్యం:- జబ్బుపడినను, ఆరోగ్యముగానున్నను చెప్పినపనిని చేయకున్నను, పని పూర్తి చేయక మిగిల్చినను అతనికి జీతమీయరాదు. ॥217॥

ప్రక్షిప్త పరిశీలన

217వ శ్లోకం కింది ఆధారాలతో ప్రక్షిప్తమవుతుంది -

1. అంతర్ వ్యతిరేకాలు

216లో బాగా పనిచేసే వాడికి అనారోగ్య సమయంలో వేతనం ఇవ్వాలని ఉంది. కానీ 217లో పని పూర్తిగా చేస్తేనే వేతన మివ్వాలని, లేక పోతే లేదనీ ఉంది. 215, 216 రెండు శ్లోకాలూ దీనికి వ్యతిరేకాలు కావటం చేత తర్వాత వచ్చిన ఈ పద్ధతి ప్రక్షిప్తమని రుజు వవుతూంది.

7వ వివాదం

218 నుండి 223 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

చేసుకున్న ఒడంబడిక తప్పడం ప్రతిజ్ఞోల్లంఘనం-

ఏష ధర్మోఽఖిలేనోక్తో వేతనాదానకర్మణః । మూలశ్లోక సం.**136**
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి ధర్మం సమయభేదినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**218**

టీక:- **ఏషః** = ఈ (8-214-216), **వేతనాదాన కర్మణః** = వేతనమిచ్చే విషయానికి సంబంధించిన, **ధర్మః** = నియమం, **అఖిలేన ఉక్తః** = పూర్వంగా అందరి కోసం తెలియజేయడమైంది, **అతః ఊర్ధ్వం** = ఇకముందు, తరువాత, **సమయభేదినామ్** = అనుకున్న నిర్ణయాన్ని (మాటను) తప్పిన వారి విషయానికి సంబంధించిన, (ధర్మం) ధర్మాన్ని, **ప్రవక్ష్యామి** = తెలుపుతాను.

తాత్పర్యం:- మునీంద్రులారా! కూలికి-వేతనానికి పనులు ఒప్పుకొన్న వారి విషయంలో ఆచరించవలసిన ధర్మాలతో సహా న్యాయంగా అవలంబించవలసినరీతి చెప్పడమైంది. ఇప్పుడు పని చేస్తామని చెప్పి చెయ్యనివారికి దండన రీతులు చెప్పబడతాయి. ॥218॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యో గ్రామదేశసంఘానాం కృత్వా సత్యేన సంవిదమ్ । మూలశ్లోక సం.**137**
విసంవదేన్నరో లోభాత్తం రాష్ట్రాద్విప్రవాసయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**219**

టీక:- **యః నరః** = ఏ మనుజుడు, **గ్రామ దేశ సంఘానాం** = గ్రామవాసులు గాని, దేశవాసులుగాని, ఒక సంఘం ఏర్పరచుకొని, **సత్యేన సంవిదమ్ కృత్వా** = సత్యవచన పూర్వకంగా ప్రతిజ్ఞలుచేసి, ఒక ఒడంబడిక చేసికొని **లోభాత్ విసంవదేత్** = ఎవడేని లోభం వల్ల ఆ ప్రతిజ్ఞను అమలుపరచలేనప్పుడు, **తం రాష్ట్రాత్ విప్రవాసయేత్** = ప్రభువు అతడిని దేశం నుండి బహిష్కరించాలి.

తాత్పర్యం:- సామూహికంగా కొందరు గ్రామవాసులుగానీ, దేశవాసులుగానీ ఒక జట్టుగా సంఘంగా ఏర్పడి, ఈ కార్యం మనవల్ల తీరవలసి ఉన్నది అని ప్రమాణపూర్వకంగా సంకల్పించుకొని, స్వచ్ఛందంగా నిర్వర్తిస్తుండగా, అందులో కొందరు పనిని ఎగ్గొట్టి కుంటిసాకులు చెప్పే సందర్భాలలో రాజు అలాంటి వారిని దేశాన్నుంచి బహిష్కరించాలి. సోమరుల వల్ల ఏదీ సవ్యంగా సాగదు. ॥219॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిగృహ్య దాపయేచ్చైనం సమయవ్యభిచారిణమ్ । మూలశ్లోక సం. **138**
చతుస్సువర్ణాన్ షణ్నిష్కాన్ శతమానం చ రాజతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **220**

టీక:- **చ** = మరియు, **ఏనం సమయవ్యభిచారిణమ్** = ఈ విధంగా చేసిన ఒడంబడికను, ప్రతిజ్ఞను ఉల్లంఘించిన వాడిని, అపరాధంననుసరించి, **నిగృహ్య** = బంధించి, **చతుః సువర్ణాన్** = నాలుగు సువర్ణాలు (8.134), **షట్ నిష్కాన్** = ఆరు నిష్కములను (8.137), **రాజతమ్ శతమానం** = వెండి శతమానమును (8.137), **దాపయేత్** = దండన (జుర్మానా) విధించాలి.

తాత్పర్యం:- ఈ విధంగా చేసిన ఒడంబడికను, ప్రతిజ్ఞను ఉల్లంఘించినవాడిని బంధించి నాలుగు సువర్ణాలు, ఆరు నిష్కములను, వెండిశతమానమును జుర్మానాగా విధించాలి. ॥220॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతద్దండవిధిం కుర్యాద్ధార్మికః పృథివీపతిః । మూలశ్లోక సం. **139**
గ్రామజాతిసమూహేషు సమయవ్యభిచారిణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **221**

టీక:- **ధార్మికః పృథివీ పతిః** = ధర్మాత్ముడైన రాజు, **గ్రామ జాతి సమూహేషు** = గ్రామం, వర్ణాల మరియు సముదాయ సంబంధమైన సంఘాలలో, **సమయ-వ్యభిచారిణామ్** = ప్రతిజ్ఞను (ఒడంబడికను) ఉల్లంఘించినవాడికి, **ఏతత్** = ఈ పైన చెప్పబడిన (8-219, 220), **దండ విధిం** = దండన, **కుర్యాత్** = అమలుపరచాలి.

తాత్పర్యం:- ధార్మికుడైన రాజు గ్రామం, వర్ణాల సముదాయమైన సంఘాలలో ప్రతిజ్ఞను (ఒడంబడికను) ఉల్లంఘించినవాడికి పై శ్లోకంలో పేర్కొన్న శతాంశ దండన (జుర్మానా) అమలుచేయాలి. ॥221॥

8వ వివాదం-'క్రయ-విక్రయ సంబంధాలు'

క్రయ-విక్రయ వివాద నిర్ణయం-

ఇది మనుకృతం-ప్రామాణికం

క్రీత్వా విక్రీయ వా కించిద్యస్యేహానుశయో భవేత్ । మూలశ్లోక సం. **140**
సోఽంతర్దశాహాత్తద్ద్రవ్యం దద్యాచ్చైవాదదీత వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **222**

టీక:- **కించిత్ క్రీత్వా** = ఏదైనా వస్తువును కొని, **వా** = లేదా, **విక్రీయ** = అమ్మి, **యస్య** = ఏ వ్యక్తికి, **ఇహ+అనుశయః భవేత్** = మనస్సులో పశ్చాత్తాపం కలిగినట్లయితే, **సః** = అతడు, **అన్తర్దశాహాత్** = పది రోజుల లోపలే, **తత్ ద్రవ్యం** = ఆ వస్తువును ఉన్నదున్నట్లుగా, తిరిగి ఇవ్వాలి, **అథవా** = లేదా, **ఆదదీత ఏవ** = తీసికోవాలి.

తాత్పర్యం:- క్రయవిక్రయాలను గురించి న్యాయమార్గం ఇది....

ఏ వస్తువునైనా సరే ! కొన్నవాడుగాని- అమ్మినవాడుగాని తాము మోసపోయామని భావించిన పక్షంలో, మనస్సులో పశ్చాత్తాపం కలిగినట్లయితే ఆ వస్తువును పదిరోజులలోపల కొన్నవాడు ఆ వస్తువును ఉన్నదున్నట్లుగా తిరిగి ఇవ్వాలి. అమ్మినవాడు పుచ్చుకోవాలి. అమ్మినవాడు కోరినా కొన్నవాడు తిరిగి ఇవ్వాలి. ॥222॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పరేణ తు దశాహస్య న దద్యాన్నాపి దాపయేత్ । మూలశ్లోక సం. **141**
ఆదదానో దదచ్చైవ రాజ్ఞా దండ్యశ్శతాని షట్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **223**

టీక:- తు = కాని, దశ + అహస్య పరేణ = పదిరోజుల తరువాత, న దద్యాత్ = తిరిగి ఇవ్వకూడదు, అపి న దాపయేత్ = తిరిగి తీసికోరాదు. ఈ అవధి దాటిన తరువాత, ఆదదానః = ఎవడైనా తిరిగి తీసికొన్నట్లయితే, చ + ఏవ చైవ = యా లేదా, దదత్ = ఇచ్చినట్లైతే, రాజా = రాజు, షట్ శతాని దండ్యః = అతడికి 600 పణాలు జుర్మానా వేయవచ్చు.

తాత్పర్యం:- పదిరోజుల తరువాత కొన్నవాడు ఆ వస్తువును తీసుకోవలసిందిగా విక్రేతను నిర్బంధించరాదు. అలాగే తాను అమ్మినది తెచ్చివ్వమని అమ్మినవాడు కొన్నవాడిని వేధించరాదు. దీనికి విపర్యయంగా జరిగితే, రాజు అతడికి 600 (ఆరు వందలు) పణాలు జుర్మానా వేయవచ్చు. ॥223॥

224 నుండి 227వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

కన్యా వివాహ విషయ వివాదంలో దండన -

* *యస్తు దోషవతీం కన్యామనాఖ్యాయ ప్రయచ్ఛతి ।*
తస్య కుర్యాన్నృపో దండం స్వయం షణ్ణవతిం పణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***224***

తాత్పర్యం:- ద్వేషంచేత ఎవడయినా కన్యను, ఆమె కన్యత్వం గురించి నిందిస్తే, విచారణలేకుండానే రాజు అలాంటి మూఢుడికి నూరురూకల (100 నాణేలు) అపరాధరుసుం శిక్షగా విధించాలి. ॥224॥

* *అకన్యేతి తు యః కన్యాం బ్రూయాద్ద్వేషేణ మానవః ।*
స శతం ప్రాప్నుయాద్దండం తస్యా దోషమదర్శయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***225***

తాత్పర్యం:- ఏ మానవుడైనను ద్వేషముతో కన్యను కన్యకాదని జెప్పి ఋజువు చేయలేకపోయినచో ఆతనికి వందపణములు జరిమానా (శిక్ష) విధింపవలెను. ॥225॥

* *పాణిగ్రహిణికా మంత్రాః కన్యాస్వేవ ప్రతిష్ఠితాః ।*
నాకన్యాసు క్వచిన్నౄణాం లుప్తధర్మ క్రియా హి తాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***226***

తాత్పర్యం:- పాణిగ్రహణమంత్రములు వివాహ లక్షణమును చెప్పునవిగా నున్నవి. విద్వాంసులు వివాహము సప్తపదితో పూర్తియైనట్లు గ్రహింపవలెను. ॥226॥

* *పాణిగ్రహణికా మంత్రా నియతం దారలక్షణమ్ ।*
తేషాం నిష్ఠా తు విజ్ఞేయా విద్వద్భిస్సప్తమే పదే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***227***

తాత్పర్యం:- పాణిగ్రహణ మంత్రాలవల్ల స్త్రీ భార్యగా మారుతున్నది. ఆ మంత్రాలలో కూడ సప్తపదికి సంబంధించిన మంత్రాలు చాలా ప్రధానమైనవి. అందువల్ల సప్తపది మంత్రాలవల్ల స్త్రీ భార్య అవుతున్నది. ॥227॥

ప్రక్షిప్తాల పరిశీలన

224-227 శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

(1) ఇప్పటి విషయం 'క్రయ విక్రయాల వివాదం' అనేది. ఇందులో కన్య వివాహం సంగతి చెప్పటం అసంగతం. కన్య వివాహం విషయం క్రయ విక్రయాల మధ్య రాదు.

(2) ముందు వెనుకల 223,228 శ్లోకాలలో వస్తువుల కొనుగోలుకు సంబంధించిన పద్ధతి ఉంది. వాటిలో సంబద్ధత ఉంది. ఈ శ్లోకాలలోని భిన్న వర్ణన వల్ల ఆ క్రమానికి భంగం కలుగుతుంది. పూర్వాపర శ్లోకాలు, పశ్చాత్తాపం కలిగిన తర్వాత ఆ వస్తువును తిరిగి ఇచ్చేయటానికి సంబంధించినవి. వాటి మధ్య శ్లోకాలు ప్రసంగ భంజనం చేయటం వల్ల ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాల రచయిత స్థాయి కన్యను కూడా విక్రయించే వస్తువుగా భావించటమైతే, అది మనువుకు వ్యతిరేకం. మనువు నాలుగు రకాల వివాహాలను ఉచితమని భావించటంతో పాటు, వాటన్నిటిలో కట్నం ఇవ్వటం, తీసుకోవటం నిషేధించాడు [3.20; 29-34, 39-41, 51-54]. పెళ్లిలో కట్నాలివ్వటమనే దుర్నీతి ప్రబలిన తర్వాతి కాలంలోని రచయిత ఎవరో రాసి ప్రక్షిప్తం చేసిన శ్లోక మిది.

228 నుండి 241వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

యస్మిన్ యస్మిన్ కృతే కార్యే యస్యేహానుశయో భవేత్ । మూలశ్లోక సం. 142
తమనేన విధానేన ధర్మే పథి నివేశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 228

యస్మిన్ యస్మిన్ కృతే కార్యే = ఏయే కార్యాలు చేసిన తరువాత, **యస్య** = ఏ వ్యక్తికి, **ఇహ + అనుశయః భవేత్** = హృదయంలో పశ్చాత్తాపం కలిగినట్లయితే, **తమ్** = ఆ వ్యక్తిని రాజు, **అనేన విధానేన** = ఈ (8-222-223) విధిననుసరించి, **ధర్మేపథి నివేశయేత్** = ధర్మమార్గాన్ని అనుసరించేట్లు చేయాలి.

తాత్పర్యం:- ఏ యే కార్యాలు చేసిన తరువాత ఏ వ్యక్తికి హృదయంలో పశ్చాత్తాపం కలుగుతుందో ఆ వ్యక్తిని, రాజు ఈ 8.222-223 శ్లోకాల్లో పేర్కొన్న విధి ననుసరించి ధర్మమార్గాన్ని అనుసరించేట్లు చేయాలి. ॥228॥

9వ వివాదం - 'పాలక-స్వామి' నిర్ణయం 229-244

ఇది మనుకృతం-ప్రామాణికం

పశువుల యజమాని-పశువుల కాపరుల వివాదం - పశువులు, పశుస్వామి, పశుసంరక్షణ వివాదము

పశుషు స్వామినాం చైవ పాలానాం చ వ్యతిక్రమే । మూలశ్లోక సం. 143
వివాదం సం ప్రవక్ష్యామి యథావద్ధర్మతత్త్వతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 229

టీక:- ఇప్పుడు నేను, **పశుషు** = పశువుల విషయంలో, **స్వామినాం చ పాలానాం చ వ్యతిక్రమే** = పశువుల అధిపతికి, ఆ పశువులను కాచే పశుపాలకులకు మధ్య భేదాభిప్రాయం కలిగినట్లయితే, తగాదా వచ్చినట్లయితే, **వివాదం** = ఆ వివాదాన్ని, **ధర్మతత్త్వతః** = ధర్మానుసారంగా, **యథావత్** = స్పష్టంగా, **వక్ష్యామి** = తెలుపుతాను.

తాత్పర్యం:- పశువుల యజమానులకు పశులకాపులకు వివాదము సంభవించినచో ఆ విషయంలో యథార్థంగా ధర్మానుకూలంగా కర్తవ్యన్యాయం చెబుతాను. ॥229॥

ఇది మనుకృతం-ప్రామాణికం

దివా వక్తవ్యతా పాలే రాత్రౌ స్వామిని తద్గృహే । మూలశ్లోక సం. 144
యోగక్షేమేఽన్యథా చేత్తు పాలో వక్తవ్యతామియాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 230

టీక:- దివా పాలే వక్తవ్యతా = సొంతదారు పశువులను కాయమని పశువులకాపరికి అప్పగించినప్పుడు, పగలు ఆ పశువులకు ఏమి అపకారం జరిగినా పశువులకాపరే బాధ్యుడు, **రాత్రౌ తద్గృహే స్వామిని** = పశువులను రాత్రికి యజమానుడి గృహంలో అప్పగించినట్లయితే అప్పుడు బాధ్యత అంతా యజమానుడిదే, **అన్యథా** = ఇందుకు భిన్నమయినట్లయితే, **యోగ క్షేమే చేత్తు** = అలాకుండా రాత్రింబవళ్ళు పశువుల యోగక్షేమాలు పశువులకాపరే జిమ్మేదారైనట్లయితే, **పాలః వక్తవ్యతామ్ ఇయాత్** = పశువులకాపరే బాధ్యుడవుతాడు.

తాత్పర్యం:- పశువుల యోగక్షేమమును పగలు పశులకాపరి చూడవలెను. రాత్రులందు యజమానుడు చూడవలెను. ఆ విధంగా కాకుండా రాత్రిపూట గూడ పశువులకాపరి అధీనంలో పశువులుంటే వాటి బాధ్యత పశులకాపరిదే. ॥230॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గోపః క్షరభృతో యస్తు స దుహ్యోద్దశతో వరామ్ । మూలశ్లోక సం. **145**
గోస్వామ్యనుమతే భృత్యః సాస్యాత్పాలేఽభృతే భృతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **231**

టీక:- యః తు గోపః క్షీరభృతః = ఏ పశువుల కాపరి యజమాని నుండి వేతనం లేకుండా పాలు మాత్రమే తీసుకొంటాడో, **సః భృత్యః దశతః వరామ్** = ఆ పశుపాలకుడు మొదటి పది గోవులలో శ్రేష్ఠమైన ఆవుపాలను, **గోస్వామీ + అనుమతే : దుహ్యాత్** = గోస్వామి అనుమతితో పిండుకోవచ్చు. **అభృతే భృతిః** = భరణ పోషణకు వేతనం తీసుకోనందుకు గాను పాలు మాత్రమే అతని జీవనాధారం.

తాత్పర్యం:- జీతముగా పాలుతీసికొను నౌకరు పదియావులలో నొక దాని పాలు యజమానుని అనుమతితో తీసికొనవలెను. పది యావులకు జీతము ఒక అవు పాలు. ॥231॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నష్టం వినష్టం కృమిభిః శ్వహతం విషమే మృతమ్ । మూలశ్లోక సం. **146**
హీనం పురుషకారేణ ప్రదద్యాత్పాల ఏవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **232**

టీక:- నష్టం = ఏ పశువు అయినా కనిపించకుండా తప్పిపోయినా, **కృమిభిః వినష్టం** = పురుగులుపడి మరణించినా, **శ్వహతం** = కుక్కలు తినివేసినా, **విషమేమృతమ్** = విపత్తిలో చిక్కుకొని, లేదా కొండచరియల నుండి జారిపడి మరణించినా, లేదా ఉపేక్షించినందువల్ల నష్టమైనా, **పాలః ఏవ ప్రదద్యాత్** = కాపరే ఆ పశువును ఇవ్వవలసి ఉంటుంది.

తాత్పర్యం:- ఏ పశువైనా కంటికి కనబడకపోయినా, పురుగుపడి మరణించినా, కుక్కలచే తినబడినా, విపత్తిలో చిక్కుకొని లేదా కొండచరియల నుండి జారిపడి మరణించినా కాపరే ఆ గోవును ఇవ్వవలసి ఉంటుంది. ॥232॥

ఇది మనుకృతం-ప్రామాణికం

విఘుష్య తు హృతం చౌరై ర్న పాలో దాతు మర్హతి । మూలశ్లోక సం. **147**
యది దేశే చ కాలే చ స్వామినః స్వస్య శంసతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **233**

టీక:- విఘుష్య తు చోరైః హృతం = పశువును బలాత్కారంగా దొంగలు తోలుకొని పోయినట్లయితే, **చ** = మరియు, **యది దేశే చ కాలే స్వామినః స్వస్య శంసతి** = పశుపాలకుడు ఆ ప్రదేశం, ఆ సమయంలో ఉండి వెంటనే ఆ విషయాన్ని పశుస్వామికి పశుచౌర్య విషయం తెలిపినట్లయితే, **పాలః దాతుం న అర్హతి** = ఆ పశువును ఇవ్వాల్సిన బాధ్యత ఆ పశువుల కాపరికి ఉండదు.

తాత్పర్యం:- దొంగలు దొమ్మిచేసి గోవులను బలత్కారంగా దొంగలు అపహరించికొని పోయినట్లయితే, ఆ సంగతిని పశువులకాపరి వెంటనే యజమానికి తెలిపినట్లయితే పశువులకాపరి ఆ గోవులను ఇవ్వాల్సిన బాధ్యత లేదు. ॥233॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కర్ణౌ చర్మ చ బాలాంశ్చ వస్తిం స్నాయుం చ రోచనామ్ । మూలశ్లోక సం.**148**
పశుషు స్వామినాం దద్యాన్మృతేష్వంగాని దర్శయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**234**

టీక:- **పశుషు మృతేషు** = పశువులు స్వయంగా మృతిచెందినట్లయితే, పశువుల కాపరి, ఆ పశువు యొక్క, **కర్ణౌ** = రెండు చెవులను, **చర్మ** = తోలు, **బాలాన్** = తోక-దాని వెంట్రుకలు, **వస్తిం** = మూత్రస్థానాన్ని, **స్నాయుం** = నరాల, **రోచనామ్** = కొవ్వు, **అంగాని దర్శయేత్** = గిట్టలు, కొమ్ములు మొ॥ అంగములను గుర్తులుగా చూపించాలి.

తాత్పర్యం:- పశువులు తమంత తాము చచ్చినచో వాని చెవులు, చర్మము, తోక, పొత్తికడుపు, నరములు, అవుల కడుపులో నుండు ఒక వస్తువు (గోరోజనము) యజమానునకు ఇచ్చి వాని యంగములను చూపవలెను.॥234॥

వివరణ:

ఈ గుర్తులను చూపించినందువల్ల, పశువు సహజంగా మరణించిందని పశుస్వామికి తెలియును. లాభాన్ని ఆశించి గాని, లేదా పగదీర్చుకొనే భావనతో విషమిచ్చి గాని చంపబడలేదని గ్రహించగలడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

అజావికే తు సంరుద్ధే వృకైః పాలే త్వనాయతి । మూలశ్లోక సం.**149**
యాం ప్రసహ్య వృకో హన్యాత్పాలే తత్కిల్బిషం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**235**

టీక:- **అజా+అవికే** = మేకలు, గొర్రెలు, **వృకైః సంరుద్ధే** = తోడేళ్ళ ద్వారా చుట్టు ముట్టబడినప్పుడు, **పాలేతు అనాయతి** = కాపరి వాటిని తోడేళ్ళ నుండి రక్షించడానికి రాకపోయినట్లయితే, **యాం ప్రసహ్య వృకో హన్యాత్** = ఏ మేకను, గొర్రెను ఆక్రమించి బలాత్కరించి తోడేలు చంపివేసినట్లయితే, అప్పుడు, **పాలే తత్ కిల్బిషం భవేత్** = ఆ దోషం పశువులకాపరికి చెందుతుంది. అంటే అతడే ఆ పశువులకు బాధ్యుడు.

తాత్పర్యం:-మేకలను గొఱ్ఱెలను తోడేలు అడ్డగించి చంపునపుడు పశుల కాపరి రక్షింపకున్నచో ఆ పాపము పశుల కాపరికే కలుగును. ఆ పశువులకు అతడే బాధ్యుడు. ॥235॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తాసాం చేదవరుద్ధానాం చరంతీనాం మిథో వనే । మూలశ్లోక సం.**150**
యాముత్ ప్లుత్య వృకో హన్యా న్న పాలస్తత్ర కిల్బిషీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**236**

టీక:- **తాసాం చేత్ + అవరుద్ధానాం** = పశువుల కాపరి పశువుల చుట్టూ చేరి జాగ్రత్తగా కాపలా కాస్తూన్నా, **వనే మిథః చరన్తీనాం** = అడవిలో గుంపుగా మేస్తున్నప్పుడు, **యాం ఉత్ప్లుత్య వృకః హన్యాత్** = ఏ మేకనైనా, గొర్రెనైనా తోడేలు అకస్మాత్తుగా పైనబడి చంపినట్లయితే, **తత్ర పాలః న కిల్బిషీ** = అలాంటి పరిస్థితిలో కాపరి దోషికాదు. అంటే ఆ పశువు చనిపోవడానికి అతడు బాధ్యుడు కాడు. కాబట్టి పశువును ఇవ్వాల్సిన పనిలేదు.

తాత్పర్యం:- మేకలను, గొర్రెలను కాపరి మేపుతున్నప్పుడు గుంపుగా మేస్తున్నప్పుడు ఏ తోడేలు వచ్చి బలాత్కారమున అకస్మాత్తుగా పైనబడి చంపినట్లయితే అలాంటి పరిస్థితిలో కాపరి దోషికాదు. అది చనిపోవడానికి అతడు బాధ్యుడు కాడు. ॥236॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ధనుశ్శతం పరీహారో గ్రామస్య స్యాత్సమంతతః । మూలశ్లోక సం.**151**
శమ్యాపాతాస్త్రయో వాఽపి త్రిగుణో నగరస్య తు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**237**

టీక:- పశువులు విశాలంగా తిరగడానికి, పడుకోడానికి, **గ్రామస్య సమన్తతః** = గ్రామానికి నాలుగు వైపులా, **ధనుః శతం** = నాలుగు వందల చేతుల పొడవు, **వా** = లేదా, **త్రయః శమ్యా పాతాః** = మూడు బారల కర్రను విసిరి వేసిన ఎంత దూరం పోతుందో అంతవరకు, **అపితు** = మరియు, **నగరస్య త్రిగుణః** = నగరమయినట్లయితే ఇంతకంటే మూడురెట్లు ఎక్కువగా, **పరిహారః** = భూఖండం, **స్యాత్** = ఉండాలి. అంటే బీడు గాని లేదా బంజరభూమి గాని పశువులు తిరగడానికి కేటాయించాలి.

తాత్పర్యం:- గ్రామమునకు నాలుగువైపుల నాలుగు వందలచేతుల పొడవు లేదా చేతిలోని కఱ్ఱత్రిప్పి మూడుసార్లు వేసిన నెంత దూరముపోవునో అంత భూమిని రాజు (బంజరు భూమి) వదల వలెను. నగరమున కైనచో దానికిమూడు రెట్లు విడువవలెను. దానిలో పైరు, పంటలు ఉండరాదు. ॥237॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తత్రాపరివృతం ధాన్యం విహింస్యుః పశవో యది । మూలశ్లోక సం. **152**
న తత్ర ప్రణయేద్దండం నృపతిః పశురక్షిణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **238**

టీక:- **తత్ర** = ఆ పశుస్థానమునకు దగ్గర, **యది అపరివృతం ధాన్యం పశవః విహింస్యుః** = అక్కడ కంచె లేనట్లయితే, పైరును (ధాన్యమును) పశువులు నష్టపరిచినట్లయితే, **నృపతిః** = రాజు, **తత్ర** = ఆ విషయంలో, **పశు రక్షిణామ్ దండం న ప్రణయేత్** = పశువులకాపరిని దండించరాదు.

తాత్పర్యం:- ఆ భూమిలో కంచెవగైరాలు లేనిచోట మొలచినపైరువగైరాలను పశువులు మేసినచో ఆ పశులకాపరులను రాజు దండింపరాదు. ॥238॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వృతిం తత్ర ప్రకుర్వీత యాముష్ట్రో న విలోకయేత్ । మూలశ్లోక సం. **153**
ఛిద్రం చ వారయేత్సర్వం శ్వసూకరముఖానుగమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **239**

టీక:- **తత్ర** = ఆ పశుస్థానంలో, **యాం ఉష్ట్రః న విలోకయేత్** = ఒంటె చూసినా కనిపించనంత ఎత్తు గల, **వృతిం కుర్వీత్** = కంచెను కల్పించాలి, **చ** = మరియు అందులో నుండి, **శ్వ-సూకర-ముఖ-అనుగమ్** = కుక్కల, పందుల ముఖం దూరనంతటి చిక్కగా, **సర్వం ఛిద్రం వారయేత్** = అన్ని రకాలైన కంతలు లేకుండా చూడాలి.

తాత్పర్యం:- ఆ పశుస్థానంలో పొలంచూట్టూ వేసిన కంచె ఒంటె చూసినా కనిపించనంత ఎత్తులో ఉండాలి. కుక్కలు, పందులు లోన దూరనంతటి చిక్కగా ఏ విధమైన సందులు లేకండా రక్షణ ఉండాలి ॥239॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పథి క్షేత్రే పరివృతే గ్రామాంతీయేఽథవా పునః । మూలశ్లోక సం. **154**
స పాలశ్శతదండార్హో విపాలాన్వారయేత్పశూన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **240**

టీక:- **పరివృతే** = కంచె వేసినా, **పథి** = పశువుల రాకపోకల మార్గంలో, **క్షేత్రే** = పొలాల్లో, **అథవా** = లేదా, **గ్రామ+అంతీయే** = గ్రామ సమీపంలో గల పశు స్థానములలో పశువుల ద్వారా నష్టం జరిగినట్లయితే, **సపాలః శతదండ+అర్హః** = ఆ పశువుల కాపరి వంద పణముల జరిమానాకు అర్హుడు (8.219), **విపాలాన్ పశూన్ పాలయేత్** = కాని, పశువులకాపరి లేకుండా, వాటికి అవే తిరుగుతున్నట్లయితే, వాటిని తోలాలి.

తాత్పర్యం:- పశువు దారికి దాపున ఉండు గ్రామ సమీపంలో పొలం చుట్టూ వేసిన కంచెలో గోవులు దూరి పంటకు నష్టం చేసినట్లయితే గోవులు మేపు కాపరి నూరుపణముల జరిమానాకు అర్హుడు. పశువుల కాపరి లేకుండా,

వాటికి అవే పొలంలో తిరుగుతున్నట్లు కనిపిస్తే వాటిని తరిమి వేయాలి. గోవులను దండించరాదు. పశువుల కాపరిని దండించాలి. ॥240॥

ఇది మనుకృతం-ప్రామాణికం

క్షేత్రేష్వన్యేషు తు పశుస్సపాదం పణమర్హతి । మూలశ్లోక సం. **155**
సర్వత్ర తు సదో దేయః క్షేత్రికస్యేతి ధారణా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **241**

టీక:- **అన్యేషు క్షేత్రేషు తు పశుః**= (8.240)లో వర్ణించిన క్షేత్రాలకు భిన్నమైన స్థానములలో, పశువులు నష్టం కలిగించినట్లయితే, **సపాదం పణమ్ + అర్హతి** = 1 1/4 ఒకటింపాతిక పణం దండనముండాలి. అది పశువులకాపరికి, లేదా పశువుల సొంతదారుడికి, **సర్వత్ర తు** = అధికం గానీ అదే ఆ పొలమంతటికీ గానీ నష్టం కలిగించినట్లయితే, **క్షేత్రికస్య సదః దేయః** = ఆ క్షేత్రం కలవాడికి నష్టపరిహారాన్ని పూర్తిగా ఇవ్వాలి, **ఇతి ధారణా** = ఇదే నియమం, లేదా వ్యవస్థ.

తాత్పర్యం:- మార్గగ్రామసమీపేతర ప్రదేశాలలోని పొలాల్లో పశువులు నష్టం కలిగించినట్లయితే, ఒకటింబాతిక పణం పశువులకాపరికి గానీ పశువుల సొంతదారుడికిగాని దండన విధించాలి. పొలంలో అధికంగానీ పూర్తిగాగానీ నష్టం కలిగించినట్లయితే ఆ పొలం యాజమానికి పూర్తి నష్ట పరిహారం చెల్లించాలి. ఇదే నియమం. ॥241॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *అనిర్దశాహాం తాం సూతాం వృషాన్ దేవపశూంస్తథా ।*
సపాలాన్వా విపాలాన్వా న దండ్యాన్మనురబ్రవీత్॥ ప్రక్షిప్త శ్లోక సం. ***242***

తాత్పర్యం:- ఈని పది దినములు కూడా గడవని ఆవులను, చక్రం, శూలం మొదలైనవి అచ్చులేసి విడిచిపెట్టిన ఎద్లను, దేవతలకోసం అచ్చువేసిన ఎద్దులను, కాపరి ఉన్నా, లేకున్నా పొలంలో ఉన్న పంటను తినుచున్న వాటిని దండించరాదని మనువు తెలిపాడు. ॥242॥

ప్రక్షిప్త పరిశీలన

242వ శ్లోకం ఈ క్రింది ప్రకారం ప్రక్షిప్తము.

శైలీగత ఆధారము

ఈ 242వ శ్లోకంలో 'మనురబ్రవీత్' అని అన్నందున దీన్ని వేరే వ్యక్తి వ్రాసి ఇందు చొప్పించినట్లు తెలుస్తున్నది. కావున ఇది ప్రక్షిప్తము.

243 నుండి 255వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

క్షేత్రియస్యాత్యయే దండో భాగాద్దశగుణో భవేత్ । మూలశ్లోక సం. **156**
తతోఽర్ధదండో భృత్యానామజ్ఞానాత్ క్షేత్రికస్య తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **243**

టీక:- **క్షేత్రియస్య అత్యయే** = స్వంత పొలం గలవాని పశువులే ఆ పంటను తిన్నట్లయితే **భాగాత్** = రాజుకు చెల్లించవలసిన భాగానికి, **దశగుణః దండః భవేత్** = పదింతల అపరాధం చెల్లించాలి. **క్షేత్రికస్య + అజ్ఞానాత్ భృత్యానాంతుం** = స్వంత పొలం వాని భృత్యుని పొరపాటుతో తన పశువులే ఆ పంటను తినివేసినచో, **తతః అర్ధదండః** = అయిదింతల దండనను విధించవలెను.

తాత్పర్యం:- పొలం దున్నినవాడి సొంతపశువులే పంటను తిన్నట్లయితే సమయం తప్పి చేలలో విత్తనాలు చల్లినప్పుడు రాజుకు రావలసిన దానికి పదింతలు అపరాధం విధించాలి. రైతుకు తెలియక అతడి భృత్యుడి వల్ల ఈ అపరాధం సంభవించినట్లయితే, పొలం రైతుకే పదింతల్లో సగం అంటే ఐదింతలు దండన విధించాలి. ॥243॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతద్విధానమాతిష్ఠేద్ధార్మికః పృథివీపతిః । మూలశ్లోక సం.**157**
స్వామినాం చ పశూనాం చ పాలానాం చ వ్యతిక్రమే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**244**

టీక:- **ధార్మికః పృథివీ పతిః** = ధార్మికుడైన రాజు, **స్వామినాం పశూనాం చ పాలానాం వ్యతిక్రమే** = పశువులు, పశువుల యజమానులు, పశుపాలకులు వీరి మధ్య సస్యరక్షణ సస్యభక్షణ విషయంలో తగాదా సంభవించినప్పుడు, **ఏతత్ విధానామ్ + ఆతిష్ఠేత్** = పైన పేర్కొన్న (8.229-241), పద్ధతిననుసరించి, నిర్ణయించాలి.

తాత్పర్యం:- పశువులు, పశువుల యజమానులు, పశుపాలురు పశుసంరక్షణ చేయనందువల్ల పశువులు పొలాల్లోని పంటను నాశనం చేసిన 8.229-241 శ్లోకాల్లో వివరించిన పద్ధతి ననుసరించి నేరానికి ధర్మపరుడైన రాజు దండన నిర్ణయించాలి. ॥244॥

10వ వివాదం:-సరిహద్దుల తగాదాలు-వాటి నిర్ణయం 245-265

ఎల్లల వివాదం-

ఇది మనుకృతం-ప్రామాణికం

సీమాం ప్రతి సముత్పన్నే వివాదే గ్రామయోర్ద్వయోః । మూలశ్లోక సం.**158**
జ్యేష్ఠే మాసి నయేత్సీమాం సుప్రకాశేషు సేతుషు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**245**

టీక:- **ద్వయోః గ్రామయోః** = రెండు గ్రామాల మధ్య, **సీమాం ప్రతి వివాదే సముత్పన్నే** = సరిహద్దుల విషయంలో వివాదం వచ్చినప్పుడు, **జ్యేష్ఠే మాసి** = జ్యేష్ఠమాసంలో, **సేతుషు సుప్రకాశేషు** = సీమా చిహ్నాలు స్పష్టంగా కనిపించనప్పుడు, **సీమాం న యేత్** = సీమా నిర్ణయం చేయాలి. వర్షాకాలంలో గడ్డి మొ॥ మొలచినందువల్ల స్పష్టంగా కనిపించనప్పుడు నిర్ణయం చేయడానికి వీలుకానప్పుడు, ఎండాకాలంలో ఈ వివాదాన్ని నిర్ణయించవచ్చు.

తాత్పర్యం:- రెండు గ్రామముల మధ్య సరిహద్దు తగాదా యేర్పడినచో జ్యేష్ఠమాసములో గడ్డిగాదము ఎండి హద్దులు బాగుగా కనబడునపుడు రాజు సరిహద్దు నిర్ణయము చేయవలెను. ॥245॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సీమావృక్షాంశ్చ కుర్వీత న్యగ్రోధాశ్వత్థకింశుకాన్ । మూలశ్లోక సం.**159**
శాల్మలీన్ సాలతాలాంశ్చ క్షీరిణశ్చైవ పాదపాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**246**

టీక:- సీమ (హద్దు) నిర్ణయానికి ప్రభువు, **సీమా వృక్షాన్ కుర్వీత** = హద్దులకు గుర్తుగా వృక్షాలను పెంచాలి. "**న్యగ్రోధ** = మర్రి, **అశ్వత్థ** = రావి, **కింశుకాన్** = మోదుగు, **శాల్మలీన్** = బూరుగు, **సాల-తాలాన్** = మద్ది, తాటి, **క్షీరిణః పాదపాన్+ఏవ** = పాలుకారే అన్యవృక్షాలను, అత్తి మొ॥ చెట్లను.

తాత్పర్యం:- గ్రామముల సరిహద్దులలో మర్రి, రావి, మోదుగు, బూరుగు, మద్ది, తాడి, పాలు కాఱెడు చెట్లను నాటవలెను. ॥246॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గుల్మాన్ వేణూంశ్చ వివిధాఞ్ఛమీవల్లీస్థలాని చ । మూలశ్లోక సం. **160**
శరాన్ కుబ్జకగుల్మాంశ్చ తథా సీమా న నశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **247**

టీక:- గుల్మాన్ = పొదలుగా పెరిగే, **వివిధాన్ వేణూన్** = రకరకాలైన వెదురు చెట్లు, **శమీ-వల్లీ-స్థలాని** = జమ్మి, బూరుగు, భూమి మీద పెరిగే లతలు, **శరాన్** = పేము వంటి తీగెలు, **కుబ్జక గుల్మాన్** = మాలతీ తీగెల పొదలను నాటించాలి, **తథా సీమా న నశ్యతి** = ఆ విధంగా చేసినప్పుడు, **సీమా** = సరిహద్దు చెరిగిపోదు, సురక్షితంగానే ఉంటుంది.

తాత్పర్యం:- పొదలను, రకరకముల వెదురు మొదలగు ముండ్ల చెట్లను, జమ్మి, లతలు, తుప్పలు, తెల్లు, గొజగ (ఒక రకము పూలచెట్టు) మొదలగువానిని నాటిన గ్రామ సరిహద్దులు నశింపవు. ॥247॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తటాకాన్యుదపానాని వాప్యః ప్రస్రవణాని చ । మూలశ్లోక సం. **161**
సీమాసంధిషు కార్యాణి దేవతాయతనాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **248**

టీక:- తటాకాని = చెరువులు, **ఉదపానాని** = కూపములు, పెద్ద పెద్ద బావులు, **ప్రస్రవణాని** = నీటి కాల్వలు, **దేవతాయతనాని** = యజ్ఞశాలలు మొ॥, **సీమాసన్ధిషు కార్యాణి** = రెండు గ్రామాల హద్దులు కలిసేచోట నిర్మించాలి.

తాత్పర్యం:- చెఱువులు, బావులు, లోతైన చిన్న చెఱువులు, కుంటలు, ప్రవహించు సెలయేళ్లు, యజ్ఞశాలలు గ్రామసరిహద్దులలో ఏర్పాటు చేయాలి. ॥248॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపచ్ఛన్నాని చాప్యాని సీమాలింగాని కారయేత్ । మూలశ్లోక సం. **162**
సీమాజ్ఞానే నృణాం వీక్ష్య నిత్యం లోకే విపర్యయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **249**

టీక:- రాజు **లోకే** = ప్రపంచంలో, **సీమాజ్ఞానే** = సరిహద్దు విషయంలో, **నృణాం** = మనుషులకు, **నిత్యం విపర్యయమ్ వీక్ష్య** = ఎప్పుడూ భ్రమ కలుగుతుండుటం చూసి, ఈ విషయాన్ని గురించి ఆలోచించి, **అన్యాని ఉపచ్ఛన్నాని సీమాలిఙ్గాని కారయేత్** = కొన్ని వేరుగా గుప్తంగా కొన్ని సీమా హద్దులను తెలిపే గుర్తులను ఏర్పరచాలి ఎలా అంటే.

తాత్పర్యం:- ప్రపంచంలో సరిహద్దుల విషయంలో ప్రజలలో అభిప్రాయ భేదాలు కలుగవచ్చు. కాబట్టి ముందు చెప్పబడుచున్న రహస్యంగా నుండు సరిహద్దు చిహ్నాలను స్థాపించాలి. ॥249॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అశ్మనోఽస్థీని గోవాలాంస్తుషాన్ భస్మకపాలికాః । మూలశ్లోక సం. **163**
కరీషమిష్టకాంగారాంశ్ఛర్కరా వాలుకాస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **250**

టీక:- అశ్మనః = రాళ్ళు, **అస్థీని** = ఎముకలు, **గోబాలాన్** = ఆవు మొ॥ పశువుల వెంట్రుకలను, **తుషాన్** = వరిపొట్టు, **భస్మ** = బూడిద, **కపాలికాః** = పుర్రెలు, **కరీషమ్** = పిడకలు, **ఇష్టక** = ఇటుకలు, **అంగారాన్** = బొగ్గు, **శర్కరా** = కంకర ముక్కలు, **తథా** = అలాగే, **బాలుకాం** = ఇసుక, **చ** = మరియు, **యాని ఏవం ప్రకారాణి** = ఈ రకమైన పదార్థాలను....

తాత్పర్యం:- రాళ్లు, ఎముకలు, ఆవుతోకలు, పొట్టు, బూడిద, కుండపెంకులు, ఎండిన పేడ, కాల్చిన ఇటుకలు, రాతిముక్కలు, ఇసుకయు సరిహద్దున నుండవలెను. ॥250॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యాని చైవం ప్రకారాణి కాలాద్భూమిర్న భక్షయేత్ । మూలశ్లోక సం. **164**
తాని సంధిషు సీమాయా మప్రకాశాని కారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **251**

టీక:- కాలాత్ భూమిః న భక్షయేత్ = భూమిలో పెట్టినందువల్ల, చెదలుపట్టి గానీ లేదా మరేవిధంగా గానీ మట్టి తినకుండా ఉండే వస్తువులను సీమా చిహ్నాలుగా, **అప్రకాశాని** = గుప్తరూపంగా అంటే భూమిలో పాతిపెట్టి, **సీమాయాం కారయేత్** = సరిహద్దులలో ఉంచాలి.

తాత్పర్యం:- పైన జెప్పిన వానిని మరియు భూమిలో త్వరగా నశించిపోనట్టి వానిని సరిహద్దుల కూడలిలో కనబడకుండ లోతుగా పాతిపెట్టాలి. ॥251॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతైర్లింగైర్నయేత్సీమాం రాజా వివదమానయోః । మూలశ్లోక సం. **165**
పూర్వభుక్త్యా చ సతతముదకస్యాగమేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **252**

టీక:- రాజా = రాజు, **వివద మానయోః** = సరిహద్దుల విషయంలో వివాదం చేసేవారి యొక్క **ఏతైః లింగైః** = 8.246-251 ఈ గుర్తుల ద్వారా, **చ** = అలాగే, **పూర్వ భుక్త్యా** = ఇంతకు ముందు అనుభవించేవారిననుసరించి, **చ** = మరియు, **సతతం+ఉదకస్య+ఆగమేన** = నిరంతరం జలప్రవాహం ఎటునుండి వస్తున్నదో, గమనించి, **సీమాం నయేత్** = హద్దును నిర్ణయించాలి.

తాత్పర్యం:- రాజు పూర్వము చెప్పినగుర్తులతోను, పూర్వము భుక్తమును బట్టి, నిరంతర జల ప్రవాహముతోను వివాదపడువారి సరిహద్దులను నిర్ణయింపవలెను. ॥252॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యది సంశయ ఏవ స్యాల్లింగానామపి దర్శనే । మూలశ్లోక సం. **166**
సాక్షిప్రత్యయ ఏవ స్యాత్సీమావాదవినిర్ణయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **253**

టీక:- యది లింగానామ్ + అపి దర్శనే = గుప్తము, ప్రకాశములైన సీమా చిహ్నములను చూచినను, **సంశయ ఏవ స్యాత్** = ఇంకను సందేహమున్నచో, **సాక్షి ప్రత్యయ ఏవ** = సాక్షుల ప్రమాణములను బట్టి, **సీమావాదః వినిర్ణయః స్యాత్** = గ్రామ సరిహద్దు నిర్ణయమును చేయవలెను.

తాత్పర్యం:- గుర్తులు చూచినను సందేహము తీఱనిచో సాక్షుల యొక్క విశ్వాసముతోనే సరిహద్దుల వివాదమును తీర్చవలెను. ॥253॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గ్రామీయకకులానాం చ సమక్షం సీమ్ని సాక్షిణః । మూలశ్లోక సం. **167**
ప్రష్టవ్యాస్సీమలింగాని తయోశ్చైవ వివాదినోః॥ ప్రక్షిప్త శ్లోక సం. **254**

టీక:- రాజు, **గ్రామీయక కులానాం చ తయోః వివాదినోః సమక్షం** = గ్రామంలోని కులీన పురుషుల ఎదుట, ఆ వాది, ప్రతివాదుల ఎదుట, **సీమ్ని** = సీమస్థానంలో, **సాక్షిణః** = సాక్షులను, (8.62, 63), **సీమాలింగాని ప్రష్టవ్యాః** = హద్దుల(ఎల్లల) గుర్తులను అడగాలి. ప్రశ్నించాలి.

తాత్పర్యం:- గ్రామములోని మంచి గుణములు గలవారి యెదుటను వాది ప్రతి వాదులయెదుటను సరిహద్దు విషయంలో రాజు సాక్షులను గుర్తులడుగ వలెను. ॥254॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తే పృష్టాస్తు యథా బ్రూయుస్సమస్తాస్సీమ్ని నిశ్చయమ్ ।   మూలశ్లోక సం.**168**
నిబధ్నీయాత్తథా సీమాం సర్వాంస్తాంశ్చైవ నామతః ॥   ప్రక్షిప్త శ్లోక సం.**255**

టీక:- రాజు ద్వారా, పృష్టాః = అడిగినప్పుడు, అంటే పరీక్షించగా, సీమ్ని నిశ్చయమ్ = హద్దుల విషయంలో, తే సమస్తాః యథా బ్రూయుః = వారందరూ, సాక్షులందరూ, హాజరైన గ్రామంలో ఉన్న కులీన పురుషులందరూ ఒకే అభిప్రాయాన్ని చెప్పినట్లు హద్దులను నిర్ణయించాలి, చ = మరియు, త్వాన్ సర్వాన్ ఏవ నామతః = హాజరైన సాక్షులందరి పేర్లను, గ్రామ పెద్దల పేర్లను రాసి రికార్డు కోసం పెట్టుకోవాలి. (మళ్ళా వివాదం వచ్చినప్పుడు ఎవరి ఎదుట, ఏ సాక్షుల ద్వారా ఈ నిర్ణయం జరిగిందో-చూసుకోడానికిగాను).

తాత్పర్యం:- రాజు ద్వారా అడిగినప్పుడు, హద్దుల విషయంలో సాక్షులందరూ హాజరైన గ్రామంలో ఉన్న కులీన పురుషులందరూ ఒకే అభిప్రాయం అందరూ చెబుతారో, ఆ ప్రకారం పత్రంలో హద్దులను నిర్ణయించాలి. ఆ సాక్షులందరి పేర్లను, గ్రామపెద్దల పేర్లను రాసి రికార్డు కోసం పెట్టుకోవాలి. ॥255॥

256,257 శ్లోకాలు ప్రక్షిప్తం-ఇవి ప్రామాణికం కావు

*   *శిరోభిస్తే గృహీత్వోర్వీం స్రగ్విణో రక్తవాససః ।*
సుకృతైశ్శాపితాః స్వైస్స్వైర్నయేయుస్తే సమంజసమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం.***256***

తాత్పర్యం:- సరిహద్దుల విషయములో సాక్ష్యము చెప్పువాడు పుష్పమాలను, ఎఱ్ఱని వస్త్రములను, ధరించి, నెత్తిపై మట్టి పెళ్ళపెట్టుకొని, నే నీ విషయములో నసత్యము చెప్పినచో నాపుణ్య కర్మలు నశించునని యొట్టుపెట్టుకొని సాక్ష్యము చెప్పవలెను. ॥256॥

*   *యథోక్తేన నయంతస్తే పూయంతే సత్యసాక్షిణః ।*
విపరీతం నయంతస్తు దాప్యాః స్యుర్ద్విశతం దమమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం.***257***

తాత్పర్యం:- ఏ సత్యపరాయణులైన సాక్షులు శాస్త్రప్రకారం నిర్ణయం కావింతురో, వారు పాపరహితులు అవుతారు. తప్పుగా నిర్ణయించువా రొక్కొక్కరు రెండువందల రూకలు దండనకు గురువుతారు. ॥257॥

ప్రక్షిప్తాల పరిశీలన

256-257 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

సాక్షులకు సంబంధించిన అన్ని నియమాలు, పద్ధతులు మునుపటి సాక్షి నిర్ణయ ప్రసంగంలో [8.57-130] ముగిసి పోయాయి. ఈ శ్లోకాలలో వాటి కన్నా భిన్నమైన పద్ధతి ఉండటం వల్ల, ఇవి మనువు మునుపు చెప్పిన వ్యవస్థ కన్నా వేరైనది. మనువుకు వ్యతిరేకంగానూ, కొత్త వ్యవస్థగానూ ఉండటం చేత, ఇవి ఇంకెవరో రాసినట్లు రుజువవుతూంది.

ఇలాగే సాక్షులకు దండన వ్యవస్థ కూడా అక్కడ చెప్పారు. ఇక్కడ చెప్పిన శిక్షలు కూడా వేరుగా ఉండటం వల్ల వ్యతిరేకాలు. ఒట్లు వేసే పద్ధతీ ప్రక్షిప్తమే. [దీని కొరకు 8.97-116 శ్లోకాల మీది సమీక్ష 'అంతర్ వ్యతిరేకాలు' చూడండి].

ఇది మనుకృతం-ప్రామాణికం

సాక్ష్యభావే తు చత్వారో గ్రామాః సామంతవాసినః । మూలశ్లోక సం.169
సీమావినిర్ణయం కుర్యుః ప్రయతా రాజసన్నిధౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.258

టీక:- సాక్షి+అభావే = ఎల్లల నిర్ణయంలో సాక్షులు కూడా లేనప్పుడు, సామన్త వాసినః చత్వారః గ్రామాః = సమీపవర్తులైన 4 గ్రామాలకు సంబంధించిన ప్రతిష్ఠితులైన వ్యక్తులు, రాజసన్నిధౌ = రాజుగానీ లేదా న్యాయాధీశుడి ఎదుట గానీ, ప్రయతాః = పక్షపాతం లేకుండా, సీమా వినిర్ణయం కుర్యుః = సీమా నిర్ణయాన్ని చేయాలి. సీమా నిర్ణయ విషయంలో తమ అభిప్రాయాన్ని తెలుపాలి.

తాత్పర్యం:- సాక్షులు లేకున్నచో చుట్టు ప్రక్కల నాలుగు గ్రామాలలోనివారు నమ్మకమైనవారు రాజు సన్నిధిలో ధర్మానుకూలంగా సరిహద్దు నిర్ణయం చేయాలి. ॥258॥

259 నుండి 261 వరకు శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *సామంతానామభావే తు మౌలానాం సీమ్ని సాక్షిణామ్ ।*
ఇమానప్యనుయుంజీత పురుషాన్వనగోచరాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*259*

తాత్పర్యం:- రాజు సమక్షంలో సాక్షి ధర్మంచేత గ్రామవాసులు సరిహద్దులను నిర్ణయం చేయలేనప్పుడు, గ్రామనిర్మాణ కాలం నుండి మూలపురుషులను, వంశపారంపర్యమున సరిహిద్దులను తెలిసిన ఆ గ్రామవాసులు ఎవ్వరూ లేనప్పుడు ఈ కింద శ్లోకంలో చెప్పబడు సమీపవాసులను అడగాలి. ॥259॥

* *వ్యాధాఞ్ఛాకునికాన్ గోపాన్ కైవర్తాన్మూలఖానకాన్ ।*
వ్యాలగ్రాహానుంఛవృత్తీనన్యాంశ్చ వనచారిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*260*

తాత్పర్యం:- వేటగాళ్ళను, పక్షులవధచేత జీవించువారిని, గొల్లలను, బెస్తలను, వేళ్ళు పెరికి జీవించువారిని, పాములవాళ్ళను, బిచ్చగాళ్ళను, పువ్వులు, పండ్లు, వంటచెరుకులు వీటికోసం అడవులలలో తిరిగే వారిని అడగాలి. వీరు తమ పనులకోసం ఆ గ్రామం మీదుగా ఎల్లపుడు వనాలకు పోతుండటం వల్ల వారు గ్రామాల ఎల్లలు తెలిసి ఉంటారు. ॥260॥

* *తే పృష్టాస్తు యథా బ్రూయు స్సీమాసంధిషు లక్షణమ్ ।*
తత్తథా స్థాపయేద్రాజా ధర్మేణ గ్రామయోర్ద్వయోః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*261*

తాత్పర్యం:- ఆ బోయలు మొ॥ వారు గ్రామం ఎల్లలు ఏరీతిని గుర్తులు చెబుతారో, ఆ విధంగా రెండు గ్రామాలకు సరిహద్దులను ఏర్పరచాలి. ॥261॥

ప్రక్షిప్తాల పరిశీలన

259 నుంచి 261 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

క. మొదటి విషయం- నాలుగేసి గ్రామాల వ్యక్తులు కావటం చేత సాక్షులు దొరకక పోవటం అనేది ఉండదు. అయినా ఒక వేళ సాక్షులు లభించక పోతే గూఢచారుల ద్వారా విషయ సేకరణ పద్ధతి మనువు చెప్పాడు. [8.282] కానీ, అయోగ్యులైన సాక్షుల సాక్ష్యం వద్దన్నాడు.

ఖ. సాక్షుల విషయ ప్రకరణంలో సాక్షులకు ఏ లక్షణాలు [8.63,64] మనువు చెప్పాడో ఆ పద్ధతిలో ఇక్కడి సాక్షులు లేరు. పైగా అక్కడ **'న దూషితాః'** [8.64] అని కపట వ్యవహారాలున్న వారి సాక్ష్యం వద్దని కచ్చితంగా నిషేధించాడు. కనుక ఈ పద్ధతి మనువు రాసింది కాదు. ఈ ఆధారాల ననుసరించి ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

262 నుండి 266వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

క్షేత్రకూపతటాకానామారామస్య గృహస్య చ । మూలశ్లోక సం. **170**
సామంతప్రత్యయో జ్ఞేయస్సీమాసేతువినిర్ణయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **262**

టీక:- క్షేత్ర-కూప-తటాకానామ్ ఆరామస్య = **క్షేత్రం** (పొలం), **కూప** = బావి, **తటాకానామ్** = చెరువులు, **ఆరామస్య** = తోట, **గృహస్య** = గృహం మొ॥ వాటియొక్క, **సీమాసేతు వినిర్ణయః** = హద్దుల గుర్తును నిర్ణయించడం, **సామంత-ప్రత్యయః జ్ఞేయః** = ప్రతిష్ఠితులైన, ధార్మికులైన ఆ గ్రామ పెద్దల సాక్ష్యం ననుసరించి నిర్ణయం చేయాలి.

తాత్పర్యం:- ఒక గ్రామంలో పొలం, బావులు, చెరువులు, తోట, మొ॥న వాటి గృహాలు ఎల్లలకు, కట్టలకు వివాదం సంభవించినప్పుడు ప్రతిష్ఠితమైన ధార్మికులైన ఆ గ్రామ పెద్దల సాక్ష్యం ననుసరించి సరిహద్దుల నిర్ణయం చేయాలి. ॥262॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సామంతాశ్చేన్మృషా బ్రూయు స్సేతౌ వివదతాం నృణామ్ । మూలశ్లోక సం. **171**
సర్వే పృథక్పృథగ్దండ్యా రాజ్ఞా మధ్యమసాహసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **263**

టీక:- నృణామ్ సేతౌ వివదతాం = రెండు గ్రామాల మధ్య గల హద్దు, ఎల్లల విషయంలో వివాదం రాగా, **సామన్తాః చేత్ మృషా బ్రూయుః** = గ్రామస్తులు అబద్ధం (అసత్యం) పలికినట్లైతే, **రాజ్ఞా** = రాజు ద్వారా, **పృథక్ పృథక్ సర్వే** = అబద్ధం చెప్పిన వారందరికీ, ప్రతి ఒక్కరికీ, **మధ్యమ సాహసమ్ దండ్యాః** = మధ్యమ సాహస జుర్మానా(8.138) వేయాలి.

తాత్పర్యం:-ఎల్లల నిమిత్తం గ్రామవాసులు వివాదపడుతుండగా, సాక్షులైవచ్చిన చుట్టుపక్కల ఉండువారు అబద్ధం చెప్పినట్లయితే అప్పుడు వారందరికీ రాజు మధ్యమసాహస దండన విధించాలి. ॥263॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గృహం తటాకమారామం క్షేత్రం వా భీషయా హరన్ । మూలశ్లోక సం. **172**
శతాని పంచ దండ్యస్స్యాదజ్ఞానాద్ద్విశతో దమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **264**

టీక:- భీషయా = ఎవడైనా భయం చూపించి, **గృహం తటాకమ్ + ఆరామం వా క్షేత్రం హరన్** = ఇల్లు చెరువు, తోట లేదా పొలాన్ని కాజేసినట్లయితే రాజు అతడిని, **శతాని పంచ దండ్యః** = 500 పణముల జుర్మానా వేయవచ్చు, **అజ్ఞానాత్ ద్విశతః దమః స్యాత్** = అజ్ఞానం వల్ల, తెలియక కాజేసినట్లయితే, అతడికి 200 పణములు జుర్మానా వేసి, హరించిన వస్తువును తిరిగి ఇప్పించాలి.

తాత్పర్యం:- ఇండ్లు, చెరువులు, గుంటలు, తోటలు, పొలములు మొ॥న వాటిని కాజేసినట్లయితే రాజు అతడికి 500 పణములు జుర్మానా వేయవచ్చు. అజ్ఞానం వల్ల తెలియక ఆక్రమించి నట్లయితే, అతడికి 200 పణములు జుర్మానా వేసి, ఆక్రమించిన వాటిని తిరిగి ఇప్పించాలి. ॥264॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సీమాయామవిషహ్యాయాం స్వయం రాజైవ ధర్మవిత్ । మూలశ్లోక సం. **173**
ప్రదిశేద్భూమిమేతేషాముపకారాదితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **265**

టీక:- సీమాయామ్+అవిషహ్యాయాం = చిహ్నాల ద్వారా పైన చెప్పినట్లు ధర్మజ్ఞులైన సాక్షుల (8.245-263) ద్వారాగాని, సీమా నిర్ణయ నిర్ధారణ కాకపోయినట్లయితే, **ధర్మవిత్ రాజా స్వయం ఏవ** = ధర్మవిదుడైన రాజు, న్యాయాధిపతి స్వయంగా, **ఏతేషాం ఉపకారాత్** = వాది ప్రతివాదుల మధ్య-ఆ భూమి ఎవరికి ఎక్కువ మేలు కలుగుతుందో, హితకామియై నిష్పక్షపాతంగా ఆలోచించి అధికలాభం కలిగినవాడికి, **భూమిమ్ ప్రదిశేత్** = భూమి సీమను నిశ్చయించాలి, **ఇతి స్థితిః** = ఇదే శాస్త్రవ్యవస్థ.

తాత్పర్యం:- ఏదైన సరిహద్దుల విషయ నిర్ణయములో సాక్షులు లభించనిచో ధర్మజ్ఞుడైన రాజే స్వయంగా చూచి ఉపకారబుద్ధితో వివాదులకు భూమి పంచిపెట్టవలెను. ఇది ధర్మమర్యాద. ॥265॥

11వ వివాదం- 'కటువాక్య కథనసంబంధమైన వివాదం దాని నిర్ణయం' 266-277

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషోఽఖిలేనాభిహితో ధర్మస్సీమావినిర్ణయే । మూలశ్లోక సం. **174**
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి వాక్పారుష్యవినిర్ణయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **266**

టీక:- ఏషః = ఇది (8.245-265), **సీమా-వినిర్ణయే** = హద్దుల నిర్ణయ విషయంలో, **ధర్మః** = న్యాయ విధానం, **అఖిలేన+అభిహితః** = సంపూర్ణంగా చెప్పబడింది, **అతః + ఊర్ధ్వం** = దీని తరువాత ఇప్పుడు, **వాక్పారుష్య వినిర్ణయమ్** = కఠోర వచనాలు, దుష్టవచానాలు ప్రయోగించినప్పుడు వాటి నిర్ణయాన్ని తెలియజేస్తున్నాను.

తాత్పర్యం:- ఇంతవరకు సరిహద్దు నిర్ణయం గూర్చి ధర్మం చెప్పబడింది. ఇకముందు వాక్పారుష్యమును (తిట్లు) గూర్చి నిర్ణయం చెప్పబడుతుంది. ॥266॥

267 నుండి 272వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *శతం బ్రాహ్మణమాక్రుశ్య క్షత్రియో దండమర్హతి ।*
వైశ్యోఽప్యర్ధశతం ద్వే వా శూద్రస్తు వధమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***267***

తాత్పర్యం:- క్షత్రియుడు, బ్రాహ్మణుని తిట్టినచో వందపణములు జరిమానా చెల్లింపవలెను. వైశ్యుడు వందలేక రెండు వందలయేబది చెల్లింపవలెను. శూద్రుడు దెబ్బలకర్హుడగును. ॥267॥

* *పఞ్చాశద్బ్రాహ్మణో దండ్యః క్షత్రియస్యాభిశంసనే ।*
వైశ్యే స్యాదర్ధపంచాశచ్ఛూద్రే ద్వాదశకో దమః॥ ప్రక్షిప్త శ్లోక సం. ***268***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు క్షత్రియుని తిట్టినచో ఏబది పణములును, వైశ్యునితిట్టిన ఇరువది యైదు పణములును, శూద్రుని తిట్టినచో పంద్రెండు పణములను జరిమానా విధింపవలెను. ॥268॥

* *సమవర్ణే ద్విజాతీనాం ద్వాదశైవ వ్యతిక్రమే ।*
వాదేష్వవచనీయేషు తదేవ ద్విగుణం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***269***

తాత్పర్యం:- ద్విజులలో సమవర్ణమువారు తిట్టుకొన్నచో పండ్రెండు పణములును, వారిలోనే అనరానికఠినమైన తిట్టు అనచో (అమ్మ, అలి) రెట్టింపు జరిమానా ఇరువది నాలుగు పణములు జరిమానా విధింపవలెను. ॥269॥

* ఏకజాతిర్ద్విజాతీంస్తు వాచా దారుణయా క్షిపన్ ।
జిహ్వాయాః ప్రాప్నుయాచ్ఛేదం జఘన్యప్రభవో హి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **270**

తాత్పర్యం:- శూద్రుడు ద్విజులను పాపిష్ఠి మొ॥న దారుణమైన పేర్లతో పిలిచినా-తిట్టినా వారి నాలుక తెగ్గోయాలి. వారు బ్రహ్మదేవుడి పాద జన్ములు. ॥270॥

* నామజాతిగ్రహం త్వేషామభిద్రోహేణ కుర్వతః ।
నిక్షేప్యోఽ యోమయశ్శంకుర్జ్వలన్నాస్యే దశాంగుళః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **271**

తాత్పర్యం:- 'ఓరి యజ్ఞదత్తా, నీవు చెడ్డబాపనవాడవు' అలాంటి పేర్లతో పిలిచి దూషించినట్లయితే, అట్లా దూషించిన వాడి నాలుక మీద భగభగ మండుచున్న పది అంగుళాల నిలువు గల కర్రను కాల్చి పెట్టాలి. ॥271॥

* ధర్మోపదేశం దర్పేణ విప్రాణామస్య కుర్వతః ।
తప్తమాసేచయేత్తైలం వక్త్రే శ్రోత్రే చ పార్థివః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **272**

తాత్పర్యం:- ఎట్లనో ఇంచుకంత ధర్మం తెలిసికొని, అహంకారంచేత 'ఇది నీ వనుష్ఠింపవలసిన ధర్మం' అని బ్రాహ్మణుడికి ఉపదేశం చేసే శూద్రుడికి చెవిలోనూ నోటిలోనూ కాచిన తైలాన్ని రాజు పోయించాలి. ॥272॥

ప్రక్షిప్తాల పరిశీలన

267 నుంచి 272 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి. ఇవి జన్మతో వర్ణ వ్యవస్థా, ఉచ్చ నిమ్న వర్గాలలో వివక్ష పెరిగిన తర్వాతి కాలపు ప్రక్షిప్తాలు.

1. అంతర్ వ్యతిరేకాలు

క. మనువు శిక్షా పద్ధతి భేద భావాలు లేదా ఈర్ష్య, ద్వేషం వంటి వాటితో ఏర్పడలేదు. నిర్లిప్తమూ, సమమూ అయిన భావనలతో అందరు ప్రజలకూ తగిన విధంగా, న్యాయబద్ధంగా శిక్షా విధానం తయారు చేశాడు మనువు [9.307,311; 7.2,16,27,30]. తెలివి గలవారు, బాధ్యత తెలిసినవారు అయినందువల్ల పెద్దవర్ణాల వారికి ఎక్కువ శిక్షలు విధించాలన్న తర్కం గల పద్ధతి అది [8.335-338, 306]. ఈ శ్లోకాలలో వర్ణాలను బట్టి అధిక శిక్ష అనే పద్ధతిలో అన్నిటికీ వ్యతిరేకంగా చెప్పారు. ఇందులో 273-275 శ్లోకాలలోనూ అందరికీ సామాన్యమూ, సమానమూ అయిన వ్యవస్థ ఉంది. ఈ విధంగా ఈ పద్ధతిలో అంతర్ వ్యతిరేకతలు ఉండటం చేత, ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఖ. 270లో శూద్రులను 'జఘన్య ప్రభావః' అన్న విశేషణంతో చెప్పినందున ఈ శ్లోకాల రచయిత స్థాయి జన్మతో వర్ణ వ్యవస్థదని తెలుస్తుంది. ఇది కూడా మనువుకు వ్యతిరేకమే. మనువు కర్మల చేత వర్ణాలన్నాడు, జన్మల వల్ల ఉన్నత నిమ్నాలను అంగీకరించలేదు. మనువు చెప్పిన కర్మణా వర్ణ వ్యవస్థలో ఏ కులానికి చెందినవారైన ఏ వర్ణానికి చెందిన విద్యనైనా నేర్చుకుని ఆ వర్ణం వాడై పోవచ్చు, [చూడండి 1.92-101ల పరిశీలన].

2. అవాంతర వ్యతిరేకాలు

ఒకటే విషయంలో 267-272 శ్లోకాలలో కొన్ని వేరు పద్ధతులు, 276-277 లలో వేరు పద్ధతులు ఉన్నాయి. ఇక్కడ అందరు ద్విజులతో కఠినంగా మాట్లాడితే శూద్రుల నాలుకలు కోయాలనే శిక్ష ఉంది. కానీ 277లో వైశ్యులతో కఠినంగా మాట్లాడితే ఈ శిక్షను నిషేధించినట్లు ఉంది. వీటివల్ల వేర్వేరు కాలాలలోని వేర్వేరు వ్యక్తులు రాసిన శ్లోకాలను

కలిపేశారనీ, వీటికి మనువు వ్యవస్థతో పొసగటం లేదనీ తెలిసిపోతూంది. 273-275 శ్లోకాలలో అందరూ స్వీకరించగలిగిన సర్వసామాన్య సహజ న్యాయ వ్యవస్థ ఉంది. ఇదే మనువు మౌలిక వ్యవస్థ.

3. శైలీగత ఆధారాలు

ఈ అన్ని శ్లోకాలలో, ముఖ్యంగా 270-272 లలో శూద్రుల పట్ల ఆక్రోశమూ, ఏవగింపూ ఉన్నాయి. ఇది పక్షపాత పూర్వకమూ, మొండి వైఖరీ. మనువు శైలి నాలుగువర్ణాలవారి పట్లా నిర్లిప్తంగా ఉంటుంది. కనుక, ఇది మనువు శైలికాదు. మనువు వ్యవస్థలో శూద్రులను ద్వేషంతోనూ, అస్పృశ్యులుగానూ చూడలేదు. నాలుగు వర్ణాలవారిలోనూ విద్యలేనివారే శూద్రులవుతారనే ఆ పద్ధతి గౌరవించదగినది. [చూడండి ఈ విషయాన్ని గురించిన మనువు పద్ధతులను భూమికలో]. ఈ ఆధారంతోనూ ఈ శ్లోకాలు మనువు రాసినవి కావని తేలుతూంది.

273 నుండి 275వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

శ్రుతం దేశం చ జాతిం చ కర్మ శారీరమేవ చ । మూలశ్లోక సం. **175**
వితథేన బ్రువన్ గర్వాద్దాప్యః స్యాద్ద్విశతం దమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **273**

టీక:- ఎవరయినా, ఏ మనుష్యుడి యొక్క **శ్రుతం** = విద్యను, **దేశమ్** = దేశాన్ని, **జాతిం** = వర్ణాన్ని, **చ** = మరియు, **శారీరమ్ ఏవ కర్మ** = శరీర సంబంధమైన కర్మ విషయంలో, **గర్వాత్** = గర్వపడి, **వితథేన బ్రువన్** = అసత్యంగా నిందిస్తూ, అవమానిస్తాడో, అతడికి, **ద్విశతం దమమ్** = 200 పణములు జుర్మానా విధించాలి.

తాత్పర్యం:- ఎవడైనను అహంకారంతో ఇతరునియొక్క విద్య, దేశం, జాతి, సంస్కారం, మొదలగువానిని గూర్చి అబద్ధపు ప్రచారం చేసిన అతనికి రెండు వందల పణములు జరిమానా విధించాలి. ॥273॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కాణం వాఽప్యథవా ఖంజమన్యం వాఽపి యథావిధమ్ । మూలశ్లోక సం. **176**
తథ్యేనాపి బ్రువన్ దాప్యో దండం కార్షాపణావరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **274**

టీక:- **కాణం** = ఒంటికంటి వాణ్ణి, **అపి అథవా** = లేదా, **ఖంజమ్** = కుంటివాడిని, **వా** = లేదా, **యథావిధమ్** = ఇదేవిధంగా, అన్య వికలాంగులను, **తథ్యేన + అపి బ్రువన్** = వాస్తవంగా అలాగే ఉన్నప్పటికీ, ఒంటికంటివాడా, కుంటివాడా అని పిలిచేవాడికి, **కార్షాపణా వరమ్ దణ్డం** = కనీసం ఒక కార్షాపణం జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- గ్రుడ్డి, కుంటి మొదలగు అవయవహీనుని, కుంటివాడా! గ్రుడ్డివాడా! అని సంబోధించి పిలిచినచో కార్షాపణము (ఇరువది చిన్నాముల యెత్తు వెండి) జరిమానా విధించాలి. ॥274॥

వివరణ:

దీనికి పోషకంగా అన్యత్ర కూడా చూడగలరు.

మను మహర్షి (4.141)లో వికలాంగ వ్యక్తులను కఠిన మాటల ద్వారా బాధించరాదని నిషేధించారు. అందుకు విపరీతంగా ఆచరించినవారికి ఇక్కడ దండనను విధించారు.

ఇది మనుకృతం-ప్రామాణికం

మాతరం పితరం జాయాం భ్రాతరం తనయం గురుమ్ । మూలశ్లోక సం. **177**
ఆక్షారయంచ్ఛతం దాప్యః పంథానం చాదదద్గురోః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **275**

టీక:- మాతరం, పితరం, జాయాం, భ్రాతరం, తనయం, గురుమ్ = తల్లి, తండ్రి, భార్య, సోదరుడు, కొడుకు, గురువు వీరిని, అక్షారయన్ = దోషారోపణ చేసి నిందించినవాడికి, చ = మరియు, గురోః = గురువుకు, పన్థానమ్ +అదదత్ = దారి ఇవ్వని వాడికి, శతం దాప్యః = వంద పణముల జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- తల్లిని, తండ్రిని, భార్యను, తోబుట్టువును, కొడుకును, గురుదేవుణ్ణి నిందించేవాడికి, గురువుకు దారి ఇవ్వక అవిధేయతతో ప్రవర్తించే వాడికి రాజు నూరు రూకలు దండగ (జరిమానా) విధించవలసిందిగా ధర్మశాస్త్రం నిర్దేశిస్తోంది. ॥275॥

వివరణ:

ఇందుకు పుష్టి మనువు (4.279,280)లో 'వివాదం న సమాచరేత్' ఈ వ్యక్తులందరితో ఏ విధమైన వాదవివాదాలు, పోట్లాడటం చేయరాదని విధించారు.

276,277 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ప్రామాణికం కావు

* బ్రాహ్మణక్షత్రియాభ్యాం తు దండః కార్యో విజానతా ।
బ్రాహ్మణే సాహసః పూర్వః క్షత్రియేత్వేవ మధ్యమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 276

తాత్పర్యం:- బ్రాహ్మణుడు-క్షత్రియుడు ఒకర్నొకరు తిట్టుకుంటే దండనీతి తెలిసిన రాజు ఇద్దరికీ దండన విధించాలి. అది ఎవరు ఎవర్ని మొదట తిట్టారనే దాన్ని విచారించి నిర్ణయించాలి. ॥276॥

* విట్శూద్రయోరేవ మేవ స్వజాతిం ప్రతి తత్త్వతః ।
ఛేదవర్జం ప్రణయనం దండస్యేతి వినిశ్చయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 277

తాత్పర్యం:- వైశ్య శూద్రులు ఒకకర్నొకరు తిట్టుకొంటే, పైన చెప్పబడినట్లే అపరాధరుసుం విధించాలి. నాలుక తెగ్గోయడం లాంటి పరుష దండనలు తప్ప, జుర్మానా విధించడం శాస్త్రసమ్మతమే. ॥277॥

ప్రక్షిప్తాల పరిశీలన

276, 277 శ్లోకాలు క్రింది ప్రకారంగా ప్రక్షిప్తాలు.

అంతర్విరోధము:

ఈ శ్లోకాలలో పరస్పర విరోధమున్నది. 267-272 శ్లోకాలలో ఇవ్వబడిన దండన వ్యవస్థ ఈ 276, 277 శ్లోకాలతో కలవడంలేదు. కావున వీటిని వేరే ఎవరో వ్రాసి ఇందు చేర్చినట్లు తెలుస్తున్నది.

12వ వివాదం

ఇది మనుకృతం. ప్రామాణికం

కర్రతో గాయపడేట్లు కొట్టిన వాటికి సంబంధించిన వివాదాలు-వాటి నిర్ణయాలు

ఏష దండవిధిః ప్రోక్తో వాక్పారుష్యస్య తత్త్వతః । మూలశ్లోక సం. 178
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి దండపారుష్యనిర్ణయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 278

టీక:- ఏషః = ఈ, వాక్పారుష్యస్య = కఠోరవచనాలు లేదా దుష్టభాషణమునకు, దండ విధిః = దండన విధానం, ప్రోక్తః = చెప్పబడింది, అతః + ఊర్ధ్వం = దాని తరువాత, ఇప్పుడు దండపారుష్య నిర్ణయమ్ = కఠోర దండంతో గాయపరచడం లేదా కొట్టడం అలాంటి నేరాలకు నిర్ణయాన్ని, ప్రవక్ష్యామి = తెలియజేస్తాను.

తాత్పర్యం:- ఇంతవరకు వాక్పారుష్యము (తిట్టుట) నకు దండన చెప్పబడినది. ఇకముందు కొట్టుటకు దండన చెప్పబడును. ॥278॥

279 నుండి 285వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *యేన కేన చిదంగేన హింస్యాచ్ఛ్రేష్ఠమంత్యజః ।*
ఛేత్తవ్యం తత్తదేవాస్య తన్మనోరనుశాసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***279***

తాత్పర్యం:- తనకంటే శ్రేష్ఠులైనబ్రాహ్మణులను, శూద్రుడు సాహసించి వారిపై తన అవయవం (కాలు-చేయి) ఏది ప్రయోగించినా, ఆ శూద్రుడికి ఆ అంగం ఛేదించాలి. కర్రతో కొట్టినా చేయి నరికేయాలి. ఇది మన్వాదులు విధించిన శాసనం. (శూద్రుడి కంటే పైన ఉన్న జాతుల వారే బ్రాహ్మణిపట్ల భయభక్తులతో సంచరిస్తూండగా శూద్రుడీ సాహసం చేయదగదు.). ॥279॥

* *పాణిముద్యమ్య దండం వా పాణిచ్ఛేదనమర్హతి ।*
పాదేన ప్రహరన్ కోపాత్పాదచ్ఛేదనమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***280***

తాత్పర్యం:- ఇందులో చెప్పబడిన శిక్ష కూడా ఇంతకుపూర్వపు శ్లోకానికిచ్చిన వివరణే బ్రాహ్మణున్ని కొట్టేందుకు కర్ర ఉపయోగించినప్పుడు ఆ చేతిని; తన్నబోయిన కాలిని నరికేయడమే శిక్ష. ॥280॥

* *సహాసనమభిప్రేప్సురుత్కృష్టస్యాపకృష్టజః ।*
కట్యాం కృతాంకో నిర్వాస్యః స్ఫిచం వాఽస్యావకర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***281***

తాత్పర్యం:- బ్రాహ్మణుడితో సమానస్థాయి ఆసనం ఆశించేవాడికీ ఆ విధంగా కూర్చొనే శూద్రుడికి నడుంమీద ఒక కర్రు కాల్చి వాతవేయాలి. అతడి పెదవుల్ని కత్తిరించాలి. ॥281॥

* *అవనిష్ఠీవతో దర్పాద్ద్వావోష్ఠౌఛేదయేన్నృపః ।*
అవమూత్రయతో మేఢ్రమవశర్ధయతో గుదమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***282***

తాత్పర్యం:- గర్వంచేత ఎవరయినా శూద్రుడు బ్రాహ్మణుడిపై ఉమ్మడం జరిగితే కూడ వాడి పెదవులను కోసేయాలి. మూత్రవిసర్జన చేత అవమానిస్తే పురుషాంగ ఛేదనం, అపాన వాయువు విడిస్తే పిర్రలను కోసి వేయాలి. ప్రభు వీ శిక్షలు అమలుజరపాలి. ॥282॥

* *కేశేషు గృహ్ణతో హస్తౌ ఛేదయేదవిచారయన్ ।*
పాదయోర్దాఢికాయాం చ గ్రీవాయాం వృషణేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***283***

తాత్పర్యం:- గర్వంవల్ల బ్రాహ్మణుడి కేశాలు పట్టుకుంటే, అలాంటి శూద్రుడికి రెండు చేతులూ ఖండించాలి. అంతేగాక వీటికి ఈ పనిలో సహకరించేవారికీ హస్తద్వయ ఖండనమే శిక్ష. (బ్రాహ్మణుడిపై ఈగనైనా వాలనివ్వని రీతిగా ఉన్న ఈ శిక్షాస్మృతి నేడేదీ?). ॥283॥

* *త్వగ్భేదకశ్శతం దండ్యో లోహితస్య చ దర్శకః ।*
మాంసభేత్తా తు షణ్నిష్కాన్ ప్రవాస్య స్త్వస్థిభేదతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***284***

తాత్పర్యం:- చర్మము చిట్లినట్లు కొట్టినవానికి వందపణములును, రక్తము వచ్చునట్లు కొట్టిన వానికి కూడ వందపణములు, మాంసము ఛేదింపబడిన ఆఱుటంకములును జరిమానా విధింపవలెను. ఎముకలు విఱుగగొట్టిన దేశము నుండి వెడలగొట్టవలెను. ॥284॥

* *వనస్పతీనాం సర్వేషాముపభోగో యథా యథా ।*
తథా తథా దమః కార్యో హింసాయామితి ధారణా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **285**

తాత్పర్యం:- పుష్పఫలాదులు ఇచ్చే వృక్షాలకు ఎలా అనుభవమో దానిదానికి తగినట్లుగా వాటిని విరిచిన వారికి తారతమ్యాన్ని అనుసరించి దండన విధించాలి. (అంటే ఫలవృక్షాలను నరికే వాడికి ఉత్తమసాహసమును, తీగలు పొదలు మొదలైనవానిని నరికే వాడికి నూరు కార్షాపణములును, గడ్డి కోయువాడికి ఒక కార్షాపణమును (రూకయు) దండన మనువు విధించినట్లుగా తెలుసుకోవాలి. ॥285॥

ప్రక్షిప్తాల పరిశీలన

279-285 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. శైలీగత ఆధారాలు

279లో **'మనోః అనుశాసనం'** పదాల వల్ల ఇది మనువు కాక, వేరెవరో తర్వాతివారు రచించారని తెలిసిపోతూంది. ఇదే ప్రక్షిప్తమైనప్పుడు. దీనితో సంబంధం గల 280-285 శ్లోకాలుకూడా ప్రక్షిప్తాలే అవుతాయి. ఈ శ్లోకాల శైలికూడా మనువు శైలివలె నిర్లిప్తమూ, గంభీరమూ, సమభావయుక్తమూ కాకుండా, పక్షపాతం, పీడన, ఈర్ష్యపూరితమై ఉంది. ఈ కారణంతోనూ ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

1. 286-288 శ్లోకాలలో సంక్షిప్తంగా మామూలు శైలిలో సమభావంతో మనువుకు అనుకూలమైన దండ పారుష్యపు శిక్షా వ్యవస్థ ఉంది. ఇది 286 నుంచే ప్రారంభమైనదని ఈ శ్లోకాల శైలితోనే తెలిసిపోతూంది. దానికి ముందు వేర్వేరు వ్యవస్థలు మరొక ప్రసంగం అసంగతం. ఈ ఆధారంతోనూ ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

286 నుండి 288వ శ్లోకాల వరకు మనుకృతం-ఇవి ప్రామాదీకం

మనుష్యాణాం పశూనాం చ దుఃఖాయ ప్రహృతే సతి । మూలశ్లోక సం. **179**
యథా యథా మహద్దుఃఖం దండం కుర్యాత్తథా తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **286**

టీక:- **మనుష్యాణాం పశూనాం** = మనుషులకు, పశువులకు, **దుఃఖాయ ప్రహృతే సతి** = దుఃఖం కలిగించడానికి కర్రతో కొట్టినట్లయితే, **యథా యథా మహత్ దుఃఖం** = ఎంత ఎక్కువ బాధకలిగించునో దాన్ని బట్టి, **తథా తథా దణ్డం కుర్యాత్** = అధికంగా గానీ లేదా తక్కువగా గానీ దండించాలి.

తాత్పర్యం:- మనుష్యులకు పశువులకు దుఃఖము కలుగునట్లు కొట్టినవానికి మహద్దుఃఖము కలుగునట్లుగా దండింపవలెను. ॥286॥

ఇది మనుకృతం-ప్రామాదీకం

అంగావపీడనాయాం చ వ్రణశోణితయోస్తథా । మూలశ్లోక సం. **180**
సముత్థానవ్యయం దాప్యః సర్వదండమథాపి వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **287**

టీక:- **అంగ + అవపీడనాయాం** = ఏ అంగమైనా విరిగిపోయినా, లేదా కొంత గాయపడినా, **తథా** = అలాగే, **వ్రణ+శోణితయోః** = గాయపడినా, రక్తం ప్రవహిస్తున్నా, **సముత్థాన వ్యయం** = రోగి నయమై పూర్వస్థితికి వచ్చే వరకు సంపూర్ణ-ఔషధం మొ॥ వాటికయ్యే వ్యయాన్ని దెబ్బకొట్టినవాడిచేత ఇప్పించాలి, **అథాపి వా** = దాంతోపాటు, **సర్వదండమ్** = కొట్టినవాడికి పూర్ణదండనమివ్వాలి.

తాత్పర్యం:- కాళ్లు చేతులు మొదలగు అంగములకు పీడకలిగించినను, పుండు, నెత్తురు కలుగునట్లు కొట్టినను చికిత్సకగు ఖర్చును ఇప్పించుటగాని, పూర్ణదండనము కాని విధింపవలెను. ॥287॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ద్రవ్యాణి హింస్యాద్యో యస్య జ్ఞానతోఽజ్ఞానతోఽపి వా । మూలశ్లోక సం. **181**
స తస్యోత్పాదయేత్తుష్టిం రాజ్ఞో దద్యాచ్చ తత్సమం ॥ ప్రక్షిప్త శ్లోక సం. **288**

టీక:- యః = ఎవడయినా, **యస్య** = ఏ వ్యక్తికి, **జ్ఞానతః అపి వా అజ్ఞానతః** = తెలిసిగాని, తెలియకగాని, **ద్రవ్యాణి హింస్యాత్** = వస్తువులను నష్టపరిచినట్లయితే, **సః** = ఆ అపరాధి, **తస్య తుష్టి+ఉత్పాదయేత్** = యజమానికి వస్తువు గాని, ధనం గాని ఇచ్చి సంతోషపెట్టాలి, **చ** = అలాగే, **తత్సమమ్ రాజ్ఞే దద్యాత్** = దానికి సమానరూపంగా దండనరూపంలో రాజుకు సమర్పించుకోవాలి.

తాత్పర్యం:- ప్రత్యేక వస్తువులు గాని, బంగారు సొమ్ములు, రాగిపాత్రలు మొదలైన వస్తువులెవ్వడైనను తెలిసిగాని తెలియకగాని నష్టపరిచినట్లయితే, అతడు యజామనికి వేరొకవస్తువుగాని, ధనంగాని ఇచ్చి సంతోషపెట్టాలి. పోగొట్టిన వస్తువు క్రయమునకు సమాన రూపంగా సరియైన దండమును రాజుకు సమర్పించుకోవాలి. ॥288॥

289 నుండి 300వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *చర్మచార్మిక భాండేషు కాష్ఠలోష్ఠమయేషు చ ।*
మూల్యాత్పంచగుణో దండః పుష్పమూలఫలేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***289***

తాత్పర్యం:- ఇతరులవైన చర్మం, చర్మపాత్రం, మన్ను, కొయ్య, వీటితో జేసిన పాత్రము లెవరి వైనా పోగొట్టినట్లయితే, వాడు దానివిలువకంటే ఐదింతలు దండన రాజుకు ఇవ్వాలి. యజమానికి ఏదైనా ఇచ్చి అతన్ని సంతోషపెట్టాలి. ॥289॥

* *యానస్య చైవ యాతుశ్చ యానస్వామిన ఏవ చ ।*
దశాతివర్తనాన్యాహుశ్శేషే దండో విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***290***

తాత్పర్యం:- రథాదులైన యానములకు, సారథి మొదలైనవారికి, రథాదులసొంతగాడికి శరీరం గాయమవడం మొదలైన పదినేరాలకు దండన లేదు. ఈ కారణాలు కలిగినప్పుడు ప్రాణులకు హాని సంభవించినా, ద్రవ్యం పోయినా, యానముల యజమానికి దండన లేదని మనువు మొ॥వారు చెప్పారు. వీటికంటే తక్కిన నేరాలలో దండన విధించాలి. ॥290॥

* *ఛిన్ననాస్యే భగ్నయుగే తిర్యక్ ప్రతిముఖాగతే ।*
అక్షభంగే చ యానస్య చక్రభంగే తథైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***291***

* *ఛేదనే చైవ యంత్రాణాం యోక్త్రరశ్మ్యో స్తథైవ చ ।*
ఆక్రందే చాప్యపైహీతి న దండం మనురబ్రవీత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***292***

తాత్పర్యం:- ఆ పది విషయాలు ఏవి అంటే:- ముక్కుతాడు తెగిపోవడం, కాడివిరగడం, నేల మిట్టపల్లములై ఉన్నందువల్ల రథాదులు అడ్డంగా తిరిగినప్పుడు, ఇరుసు విరిగినప్పుడు, కాడి విరిగినప్పుడు, ఎడ్ల మెడత్రాడు సగం తెగినప్పుడు, సెలకోల, మునికోల మొదలైనవి విరిగినప్పుడు, తొలగి పొమ్మని సారథి చెబుతుండుగా రథాదులవల్ల ప్రాణహాని, ద్రవ్యనష్టం కలిగినప్పుడు సారథి మొదలైనవారికి దండన వేయరాదని మనువు తెలిపాడు. ॥291,292॥

* యత్రాపవర్తతే యుగ్మం వైగుణ్యాత్ప్రాజకస్య తు ।
తత్ర స్వామీ భవేద్దండ్యో హింసాయాం ద్విశతం దమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**293**

తాత్పర్యం:- సారథి యొక్క అజాగ్రత్తవలన శకటము అడ్డదిడ్డముగా నడచికాని, పడిపోయికాని యితరులక హానికలిగించునో ఆ బండి యజమానునకు రెండువందలు పణములు జరిమానా విధింపవలెను. ॥293॥

* ప్రాజకశ్చేద్భవేదాప్తః ప్రాజకో దండమర్హతి ।
యుగ్యస్థాః ప్రాజకేనాప్తే సర్వే దండ్యా శ్శతం శతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**294**

తాత్పర్యం:- బండినడపువాడు నేర్పరియైయుండి ప్రమాదము కలిగించినవానికి దండన వేయవలెను. వాడ నేర్పరికానిచో వానికి, బండిమీదనున్న వారికి వందవంద జరిమానా వేయవలెను. ॥294॥

* స చేత్తు పథి సంరుద్ధః పశుభిర్వా రథేన వా ।
ప్రమాపయేత్ ప్రాణభృతస్తత్ర దండో-విచారితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**295**

తాత్పర్యం:- మార్గములో పశువులుకాని రథము కాని అడ్డము వచ్చినపుడు బండిని ఆపకుండ నడపి జీవహింసకలిగించినచో యోచింపకయే అతనిని శిక్షింపవలెను. ॥295॥

* మనుష్యమారణే క్షిప్రం చౌరవత్కిల్బిషం భవేత్ ।
ప్రాణభృత్సు మహత్స్వర్ధం గోగజోష్ట్రహయాదిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**296**

తాత్పర్యం:- ఆ సారథిమూలమున మనుషులకు హింస సంభవించినట్లయితే దొంగకు విధించినట్లుగా అతడికి వెయ్యి రూకలు; గోవులు, ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు, మొ॥న వాటికి అలాంటి ఆపద సంభవించినట్లయితే చోరదండంనందు సగం అంటే ఐదునూర్ల రూకలు దండన విధించాలి. ॥296॥

* క్షుద్రకాణాం పశూనాం తు హింసాయాం ద్విశతో దమః ।
పంచాశత్తు భవేద్దండః శుభేషు మృగపక్షిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం.**297**

తాత్పర్యం:- గేదెలు, ఆవులు మొ॥న పశువులకు సారథిమూలమున హింస కలిగినట్లయితే, ఇన్నూరు రూకలు, జింకలు మొదలైనవి, చిలుక, హంస, భిక్షగాడు మొ॥న. సాధువులైన పక్షులు వీటికి హింస సంభవించినట్లయితే ఏభై రూకలు దండన విధించాలి. ॥297॥

* గర్ధభాజావికానాం తు దండస్స్యాత్పంచమాషికః ।
మాషికస్తు భవేద్దండః శ్వసూకరనిపాతనే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**298**

తాత్పర్యం:- గాడిద, మేక, గొర్రె వీటిని యజమానుడు హింసిస్తుంటే అతడికి ఐదురూకలు జరిమానా. అతడి పెంపుడు పంది, కుక్క హింసవల్ల మృతి చెందితే ఒక వెండి రూక జరిమానా.

* భార్యా పుత్రశ్చ దాసశ్చ శిష్యో భ్రాతా చ సోదరః ।
ప్రాప్తాపరాధా స్తాడ్యాః స్యూ రజ్జ్వా వేణుదళేన వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**299**

తాత్పర్యం:- భార్య, పుత్రుడు, నౌకరు, శిష్యుడు, భార్యాదులు, తోబుట్టిన తమ్ముడు నేరాలు చేసినట్లయితే, వీరిని తాటితోనైనా, బెత్తంతోనైనా కొట్టాలి. ॥299॥

* పృష్ఠతస్తు శరీరస్య నోత్తమాంగే కథంచన ।
అతోఽన్యథాతు ప్రహరన్ ప్రాప్తః స్యాచ్చౌరకిల్బిషమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 300

తాత్పర్యం:- భార్యా పుత్రాదులను దండించాల్సి వస్తే తాటితో గానీ, వెదురు బెత్తంతో గానీ వీపు లాంటి వెనుక భాగాలలో కొట్టాలి తప్ప, తలమీద కొట్టరాదు. తోచినట్లు ఎక్కడపడితే అక్కడ కొడితే, దొంగకు విధించిన శిక్షను అతడికి విధించాలి. ॥300॥

ప్రక్షిప్తాల పరిశీలన

289 నుంచి 300 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. శైలీగత ఆధారాలు

292లో **"మనుః అబ్రవీత్"** అనటంతో ఇది మనువు కాక, వేరొకరు రాశారు కనుక ప్రక్షిప్తమని తెలుస్తుంది. 290 నుంచి 298 వరకు గల ముందు వెనుక శ్లోకాలన్నీ ప్రసంగక్రమ దృష్టితో దీనికి సంబంధించినవీ, దీన్ని ఆధారంగా చేసుకున్నవే. ఈ శ్లోకం ప్రక్షిప్తమని తేలినప్పుడు, మిగిలిన అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే అవుతాయి. ఈ ఆధారంతో ఇవన్నీ మనువు రచనలు కావని రుజు వవుతుంది.

2 ప్రసంగ వ్యతిరేకాలు

క. ఇప్పటి విషయం [8.278] **'ప్రాణులను కావాలని కఠోర దండనతో గాయ పరచటం'** అనేదే కానీ, పొరపాటున జరిగే దుర్ఘటనలు కాదు. ఇందులో రథాలు, ఎద్దుల బండ్లు మొదలైన వాటి వల్ల జరిగే దుర్ఘటనలను గురించి చెప్పటం అసంగతం- ఈ ఆధారంతో ప్రసంగం కానిది చెప్పటం వల్ల, 290-298 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఖ. 288లో అన్ని వస్తువుల నష్టానికీ ఒక్కసారిగా శిక్షలు చెప్పి విషయాన్ని ముగించారు. దీని తరువాత 289లో కొన్ని వస్తువులను విడిగా మళ్లీ చెప్పటం అనవసరమూ, ప్రసంగ వ్యతిరేకమూ. ఎన్నో వస్తువులున్నాయి, వాటికి నష్టం కలిగితే శిక్షించవలసిందే. అసంపూర్ణమైన ఈ రకపు పద్ధతి మౌలికం కాదు.

గ. ఇదే విధంగా 299-300 శ్లోకాలు కూడా ప్రసంగ బాహ్యాలు. ఇక్కడ పైన చెప్పిన శిక్షా వ్యవస్థ ఉంది కానీ కొట్టడం గురించి కాదు.

3. అంతర్ వ్యతిరేకాలు

క. 299లోని **'దాస'** పదం, ఈ శ్లోకాలు తరువాతివనీ, మనువువి కావనీ చెబుతుంది. మను వెక్కడా దాసుల పద్ధతిని చెప్పనే లేదు. శూద్రులను సేవకుల రూపంలో చెప్పాడు[1.91]. వీరు తమ ఇష్ట ప్రకారమే ఏ ద్విజులకైనా సేవలు చేస్తారు. [9.334-335] కానీ దానికి బాధ్యులు కారు.

ఖ. 4.164 లో పుత్రులు, శిష్యులు కాక వేరెవరినైనా కొట్టడం నిషేధం అని ఉంది. ఈ శ్లోకాలలో స్త్రీలు, భృత్యులు మొదలైనవారిని కొట్టడం దానికి వ్యతిరేకం. మనువు, స్త్రీలను ఆదర, సమ్మానాలతో చూడాలని చెప్పిన అన్ని శ్లోకాలకూ స్త్రీలను కొట్టడ మని ఇక్కడ చెప్పినది వ్యతిరేకం.[3.55-62; 10, 101, 102].

గ. కొట్టడం దాకా ఎందుకు, మనువు భార్యతో గొడవపడటం కూడా నిషేధించాడు. [4.180] మనువటి మౌలిక విధానాలకు వ్యతిరేకం కనుక, **ఈ శ్లోకాలు** ప్రక్షిప్తాలు.

13వ వివాదం చోరదండన తీర్పు నిర్ణయం

301 నుండి 303వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

చోరదండన-

ఏషోఽఖిలేనాభిహితో దండపారుష్యనిర్ణయః । మూలశ్లోక సం. **182**
స్తేనస్యాతః ప్రవక్ష్యామి విధిం దండవినిర్ణయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **301**

టీక:- **ఏషః** = ఈ (8.278-288), **దండపారుష్య నిర్ణయః** = కర్రతోకొట్టి గాయపరచిన విషయంలో నిర్ణయం, **అఖిలేన అభిహితః** = పూర్ణంగా చెప్పబడింది, **అతః** = దీని తరువాత ఇప్పుడు, **స్తేనస్య దండ వినిర్ణయే** = దొంగకు వేయవలసిన దండన నిర్ణయించే, **విధిం ప్రవక్ష్యామి** = విధిని తెలియజేస్తాను.

తాత్పర్యం:- మునీంద్రులారా ! కూలికి-వేతనానికి పనులు ఒప్పుకొన్నవారి విషయంలో ఆచరించవలసిన ధర్మాలతో సహా న్యాయంగా అవలంబించవలసినరీతి చెప్పడమైనది. ఇప్పుడు పని చేస్తామని చెప్పి చెయ్యనివారికి దండన రీతులు చెప్పబడతాయి. ॥301॥

దొంగలను అదుపులో ఉంచినప్పుడే రాష్ట్రాభివృద్ధి - ఇది మనుకృతం-ప్రామాణికం

పరమం యత్నమాతిష్ఠేత్ స్తేనానాం నిగ్రహే నృపః । మూలశ్లోక సం. **183**
స్తేనానాం నిగ్రహాదస్య యశో రాష్ట్రం చ వర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **302**

టీక:- **నృపః** = రాజు, **స్తేనానాం నిగ్రహే** = చోరులను పట్టుకొనే విషయంలో, **పరమం యత్నమ్ + అతిష్ఠేత్** = గొప్ప ప్రయత్నం చేయాలి. ఎందుకంటే, **స్తేనానాం నిగ్రహే** = దొంగలను అదుపులో ఉంచడం వల్ల, **అస్య** = ఈ రాజు యొక్క **యశః చ రాష్ట్రం వర్ధతే** = యశస్సు, దేశాభివృద్ధి పెరుగుతాయి.

తాత్పర్యం:- దొంగలను పట్టే విషయమై రాజు ఎంతో జాగరూకుడై ఉండాలి. ప్రభు వీ విషయంలో చేసే కృషి వల్లనే అతని కీర్తీ-రాజ్యం వర్ధిల్లి, ప్రజలూ సుఖసంతోషాలతో ఉంటారు. ॥302॥

దొంగల నుండి ప్రజలను రక్షించడం శ్రేష్ఠ ధర్మం- ఇది మనుకృతం-ప్రామాణికం

అభయస్య హి యో దాతా స పూజ్యస్సతతం నృపః । మూలశ్లోక సం. **184**
సత్రం హి వర్ధతే తస్య సదైవాభయదక్షిణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **303**

టీక:- **యః నృపః అభయస్య హి దాతా** = ఏ రాజు ప్రజలకు అభయ ప్రదాతగా ఉంటాడో, అంటే ఏ రాజు రాజ్యంలో ప్రజలకు దొంగలు మొ॥వారి నుండి ఏ విధమైన భయముండదో, **సః సతతం పూజ్యః** = ఆయన ఎల్లప్పుడు పూజింపబడుతుంటాడు. ప్రజలు ఆయనను ఆదరించి సత్కరిస్తూ ఉంటారు, మరియు, **తస్య** = ఆయన యొక్క, **అభయ దక్షిణమ్ సత్రం హి** = అభయ దక్షిణగా గల యజ్ఞ రూపమైన రాజ్యం, **సదైవ వర్ధతే** = ఎల్లప్పుడూ అభివృద్ధి చెందుతూనే ఉంటుంది.

తాత్పర్యం:- ప్రజలకు రాజు అనేవాడు నిత్యం అభయప్రదాత అయినప్పుడు మాత్రమే అతడు జన పూజితుడవుతాడు. అలాంటి ప్రభువే ప్రజాసంరక్షణమనే పెనుయాగం ద్వారా అన్నింటా వృద్ధి పొందగలడు. ॥303॥

304, 305వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *సర్వతో ధర్మషడ్భాగో రాజ్ఞో భవతి రక్షతః ।*
అధర్మాదపి షడ్భాగో భవత్యస్య హ్యరక్షతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***304***

తాత్పర్యం:- ప్రజాసంరక్షణం చేసే రాజుకు ప్రజలు చేసే పుణ్యకార్యాలలో ఆరో వంతు పుణ్యం లభిస్తుంది. అలా జరగక-తన సుఖం చూసుకుంటూ ధర్మం మరచిన వాడికి ప్రజలు చేసే పాపాలలో ఆరోవంతు అధర్మరీత్యా సంక్రమిస్తుంది. ॥304॥

* ***యదధీతే యద్యజతే యద్దరాతి యదర్చతి ।***
తస్య షడ్భాగభాగ్రాజా సమ్యగ్భవతి రక్షణాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***305***

తాత్పర్యం:- ఆ రాజ్యంలో ఎవరు జప-యాగ-దాన-దేవతాపూజనం మొదలైన సత్కార్యాలు చేస్తారో, ఆ సత్కార్యాలు చేసే వారికి కలిగే ఫలితంలో ఆరోవంతు న్యాయరీత్యా ప్రజాసంరక్షణం చేసే ప్రభువుకు చేరుతుంది.॥305॥

ప్రక్షిప్తాల పరిశీలన

304,305 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. ప్రసంగవ్యతిరేకాలు

ఈ శ్లోకాల పూర్వాపర 303, 306 శ్లోకాలలో రాజ్య రూపమైన యజ్ఞాన్ని గురించి ఉంది కనుక, వాటికి సంబద్ధత, ఏకవాక్యత ఉన్నాయి. ఈ శ్లోకాలు ఈ సంబద్ధతనూ, ఏక వాక్యతనూ భగ్నం చేశాయి. ప్రసంగ భంజకాలు కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో ప్రజల ధర్మాలు, అధర్మాలు, ప్రతిపనిలోనూ రాజుకు ఆరవభాగం వస్తుంది అని ఉంది. ఇది 4.240 కి వ్యతిరేకం. అందులో కర్తనే ప్రతి కర్మ ఫలితానికి భోక్త అని ఉంది.

3. శైలీగత ఆధారాలు

ఈ శ్లోకాలలోని ఆరవభాగం పంచటం అనేదానికి ఏ ఆధారమూ లేదు, సహేతుకమైన వివరణా లేదు. వీటి కాల్పనికత నిరాధారమూ, సహేతుకం కాని శైలి కావటం చేత మనువు చెప్పినవి కావని తెలుస్తూంది. మనువు నిరాధారమూ, నిర్హేతుక విషయాలను చెప్పనే చెప్పడు.

306 నుండి 311వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

రాష్ట్ర యజ్ఞానికి అభయ ప్రదానమే దక్షిణ-

రక్షన్ ధర్మేణ భూతాని రాజా వధ్యాంశ్చ ఘాతయన్ । మూలశ్లోక సం. **185**
యజతేఽహరహర్యజ్ఞైస్సహస్రశతదక్షిణైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **306**

టీక:- ధర్మేణ భూతాని రక్షన్ = ధర్మపూర్వకంగా అంటే న్యాయంగా ప్రజలను కాపాడుతూ, **వధ్యాం ఘాతయన్** = దండనీయులను దండిస్తూ, వధ్యులను వధిస్తూ, **రాజా** = ప్రభువు, **అహః +అహః సహస్రశత దక్షిణైః యజ్ఞైః యజతే** = ప్రతి దినం వందలు-వేలు దక్షిణలతో కూడా యజ్ఞాలను చేస్తున్నాడు. ఇంత గొప్ప యజ్ఞాలు-పుణ్యకార్యాలు చేసేవాడి రాజ్యం అభివృద్ధి చెందుతుంది.

తాత్పర్యం:- ప్రతిరోజూ దానంగానో/దక్షిణగానో గోవులను ఇచ్చి యాగాలు చేసేవారికి ఎంత పుణ్యం వస్తుందో, ప్రజాహితంగా పరిపాలించేరాజు అలాంటి ఫలితాన్ని పొందుతున్నాడు. ఇంత గొప్ప యజ్ఞాలు- పుణ్యకార్యాలు చేసేవాడి రాజ్యం అభివృద్ధి చెందుతుంది. ॥306॥

ప్రజా రక్షణ చేయకుండానే పన్ను వసూలు చేసే రాజు పాపాత్ముడు - ఇది మనుకృతం-ప్రామాణికం

యోఽ_రక్షన్ బలిమాదత్తే కరం శుల్కం చ పార్థివః । మూలశ్లోక సం.**186**
ప్రతిభాగం చ దండం చ స సద్యో నరకం వ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**307**

టీక:- **యః పార్థివః** = ఏ రాజు, **అరక్షన్** = ప్రజలను రక్షించకుండానే వారి నుండి, **బలిమ్** = 6వ భాగం ధాన్యాదులు, **కరం** = పన్ను, **శుల్కమ్** = బాడుగ, అద్దె, **ప్రతిభాగం** = చుంగీ (దిగుమతి పన్ను) (అన్య దేశాల నుండి వచ్చే వస్తువులపై వేసే పన్ను), **దండం** = జుర్మానా మొ॥ తీసికొంటాడో, **సః** = అతడు, **సద్యః నరకం వ్రజేత్** = వెంటనే కష్టాలపాలవుతాడు. ప్రజల విషయంలో శ్రద్ధ చూపనందువల్ల వారి సహకారం లేనందువల్ల ఏదో ఒక విపత్తికి లోనవుతాడు.

తాత్పర్యం:- రాజు ధర్మపూర్వకముగా పరిపాలన చేయక వారిదగ్గర నుండి సుంకము మొదలైనవాటిని తీసుకొంటే అతడు వెంటనే నరకాన్ని పొందుతాడు. ॥307॥

వివరణ:

బలి = ధాన్యంలో పన్నుగా తీసికొనే ఆరోభాగం = బలి.
కరం: ఇవి ప్రతిమాసం గాని, ప్రతి 6 మాసాలకు గాని లేదా వార్షికం గాని తీసికొనేది (కరం).
శుల్కం: వ్యాపారుల నుండి తీసికొనేది **'శుల్కం'**.
ప్రతి భాగం: ఫలాలు, కూరలు మొ॥ వాటి మీద తీసికొనే శుల్కం.
దండం- అపరాధానికి వసూలు చేసేదే జుర్మానాయే దండం.
చుంగీ-దిగుమతుల మీద వసూలు చేసే శుల్కం

ఇది మనుకృతం-ప్రామాణికం

అరక్షితారం రాజానం బలిషడ్భాగహారిణమ్ । మూలశ్లోక సం.**187**
తమాహుః సర్వలోకస్య సమగ్రమలహారకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**308**

టీక:- **బలి షడ్భాగ హారిణమ్** = బలి (పన్ను) రూపంలో పండిన ధాన్యం నుండి ఆరోభాగం తీసికొనే, **తం రాజానం** = అలాంటి రాజు, **సర్వలోకస్య సమగ్రమల హారకమ్ +ఆహుః** = సర్వ ప్రజల యొక్క సమస్త పాపాలను పంచుకొన్నవాడని తలంతురు. అంటే అలాంటి రాజు ప్రజల నిందలకు, పాత్రుడవుతాడు.

తాత్పర్యం:- రాజు రక్షణ చేయకుండ ప్రజలనుండి ఆఱవ భాగము తీసికొన్నచో ప్రజలయొక్క పాపమునంతటిని పంచుకొన్నవాడగును. ॥308॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అనపేక్షితమర్యాదం నాస్తికం విప్రలుంపకమ్ । మూలశ్లోక సం.**188**
అరక్షితారమత్తారం నృపం విద్యాదధోగతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**309**

టీక:- అందువల్ల, రాజు **అనపేక్షితమర్యాదం** = శాస్త్రోక్తమర్యాదను పాటించనివాడు, **నాస్తికం** = వేదాన్ని, ఈశ్వరుణ్ణి విశ్వసించనివాడు, **విప్రలుంపకమ్** = అత్యంత లోభీ, **అరక్షితారం** = ప్రజారక్షణ చేయనివాడు, **అత్తారం** = ప్రజల ధనాన్ని ప్రజాహితానికి వ్యయపరచకుండా, స్వయంగా హరించే వాడవుతాడు, **నృపం** = రాజును, **అధోగతిం విద్యాత్** = నీచుడని గుర్తించాలి. లేదా, శీఘ్రంగా పతితుడవుతాడని గుర్తించాలి.

తాత్పర్యం:- నీతిశాస్త్ర మర్యాద నెఱుగనివాడును, నాస్తికుడును, అనుచితంగా ధనం గ్రహించువాడును, లోభి,రక్షింపనివాడును నైన రాజును నీచునిగా గ్రహింపవలెను. ॥309॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అధార్మికం త్రిభిర్న్యాయైర్నిగృహ్ణీయాత్ప్రయత్నతః । మూలశ్లోక సం.189
నిరోధనేన బంధేన వివిధేన వధేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.310

టీక:- అందువల్ల, రాజు **నిరోధనేన** = కారాగారంలో నిర్బంధించడం, **బంధేన** = బంధించడం అంటే వాళ్ళ చేతులకు సంకెళ్ళు వేయడం, **చ** = మరియు, **వివిధేన వధేన** = నానారకాలుగా కొట్టడం, అంగచ్ఛేదనం మొ॥, **త్రిభిః న్యాయైః** = ఈ మూడు ఉపాయాల ద్వారా, **ప్రయత్నతః** = ప్రయత్నించి, **అధార్మికం నిగృహ్ణీయాత్** = దొంగతనం మొ॥ నీచాపరాధులను అదుపులో ఉంచుకోవాలి.

తాత్పర్యం:- అపరాధిని కారాగారంలో పెట్టి కాని, బేడీలు వేసికాని, వివిధములుగా దండించికాని ఈ మూడు రకాలైన న్యాయంతో ప్రయత్నపూర్వకంగా దండించి లొంగదీయవలెను. ॥310॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిగ్రహేణ హి పాపానాం సాధూనాం సంగ్రహేణ చ । మూలశ్లోక సం.190
ద్విజాతయ ఇవేజ్యాభిః పూయంతే సతతం నృపాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 311

టీక:- **హి** = ఎందుకంటే, **పాపానాం నిగ్రహేణ** = దుష్టులను వశమందుంచుకొని దండించడంవల్ల, **చ** = అలాగే, **సాధూనాం సంగ్రహేణ** = శ్రేష్ఠపురుషులకు రక్షణ కల్పించడం ద్వారా, ప్రభువులు, **ద్విజాతయః+ఇవ+ఇజ్యాభిః సతతం పూయన్తే** = ఏ విధంగా ద్విజవర్ణస్థులు యజ్ఞాల (సత్కర్మలు) ద్వారా పవిత్రులవుతారో, అలాగే ప్రభువులు కూడా దుష్టశిక్షణ-శిష్టరక్షణద్వారా పవిత్రులై, పుణ్యాత్ములై, నిర్మల యశస్సంపన్నులవుతారు.

తాత్పర్యం:- రాజులు ఎల్లపుడును దుష్టులను శిక్షించుచు శిష్టులను రక్షించుచున్నచో యజ్ఞములు చేయుటవలన ద్విజాతులు పవిత్రులైనట్లు వారును పవిత్రులగుదురు. ॥311॥

312,313 శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *క్షంతవ్యం ప్రభుణా నిత్యం క్షిపతాం కారిణాం నృణామ్ ।*
బాలవృద్ధాతురాణాం చ కుర్వతా హితమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*312*

తాత్పర్యం:- తన మేలు కోరువారైనను ప్రజలు ఎప్పుడైన దుఃఖముకలవారై రాజును ఆక్షేపించినచో దావా వారిని కాని, బాలురను, వృద్ధులను, రోగులను కాని, విని వారిని క్షమింపవలెను. వారిని దుఃఖనివృత్తుల చేయవలెను. ॥312॥

* *యః క్షిప్తో మర్షయత్యార్తైస్తేన స్వర్గే మహీయతే ।*
యస్త్వైశ్వర్యాన్న క్షమతే నరకం తేన గచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.*313*

తాత్పర్యం:- రాజు దుఃఖితులచే చేయబడిన ఆక్షేపములను సహించినచో స్వర్గములో పూజితుడగును. ఐశ్వర్యమదముతో సహింపనివాడు ఆచరణతో పతితుడగును. ॥313॥

ప్రక్షిప్తాల పరిశీలన

312,313 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఇక్కడ ముందు వెనుకల శ్లోకాలలో అపరాధులకు దండన గురించి ఉంది. దీని మధ్య వాది-ప్రతివాది మొదలైన

వారి ఆక్షేపణలతో కూడిన మాటలను క్షమించడం, వాటి ఆధారంగా స్వర్గ నరకాల వర్ణన ప్రసంగానికి సంబంధించినవి కావు. ఇవన్నీ న్యాయ విధిలోకి రావు.

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో రాజుకు స్వర్గ - నరక ప్రాప్తిని గురించి ఉంది. స్వర్గం, నరకం పేరిట వేరే లోకాలున్నాయనటం మనువు పద్ధతికి వ్యతిరేకం [చూడండి 4.87-91ల మీది 'పరిశీలన']. ఈ ఆధారంతో ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు. క్షమించడం కూడా న్యాయ వ్యవస్థకు వ్యతిరేకమే. అపరాధు లందరూ దండనార్హులే, నిరపరాధులు శిక్షార్హులు కారు.

3. శైలీగత ఆధారాలు

ఈ శ్లోకాలలో ఒక సాధారణ విషయంతో స్వర్గ నరకాల ప్రాప్తిని చెప్పారు. ఇది నిరాధారమూ, సహేతుకం కాని శైలిలో. మనువు శైలిలో ఇటువంటి లోపాలు ఉండవు. కనుక ఇవి మనువు రచించినవి కావు.

314 నుండి 324వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

చోరుడికి స్వయంప్రాయశ్చిత్త విధి-

రాజా స్తేనేన గంతవ్యో ముక్తకేశేన ధావతా । మూలశ్లోక సం.**191**
ఆచక్షాణేన తత్ స్తేయమేవం కర్మాస్మి శాధి మామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**314**

టీక:- దొంగతనం చేసిన దొంగ తాను చేసిన పని మహాపాపకరమని గ్రహించినట్లయితే అతడికి ఈ కింది ప్రాయశ్చితం విధించబడింది. తద్వారా పాపవిముక్తి, **స్తేనేన** = చోరుడు, **ముక్త కేశన** = తలవెంట్రుకలు విరబోసికొని పరుగెత్తుతూ, **తత్ స్తేయమేవమ్ ఆచక్షాణేన** = తాను చేసిన నేరాన్ని నేను ఫలానా ఫలానా చౌర్యాలను చేశానని తెలుపుతూ, **రాజా గంతవ్యః** = ప్రభువు వద్దకు వెళ్ళాలి. **ఏవం కర్మా+అస్మి** = నేను ఇలాంటి దొంగతనం చేశాను. నేను అపరాధిని, **మాం శాధి** = నన్ను శిక్షించండి నాకు శిక్ష వేయండి.

తాత్పర్యం:- వెంట్రుకలు విరియబోసికొని దొంగ రాజుగారి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చి నేను దొంగతనము చేసితిని. నన్ను శిక్షింపుమనిన వానిని క్షమించి విడువవలెను. ॥314॥

వివరణ:

చౌర్యానికి ప్రాయశ్చిత్తం:- ఆ రోజుల్లో స్వయంగా ప్రాయశ్చిత్తంగా చేసికొనే విధానం ఉన్నట్లు తోస్తున్నది. ఏదో మనస్సులో ఆవేశపడి దొంగతనం చేసినవాడు తరువాత ఇది తప్పని తెలుసుకొని, పట్టుబడి బాధపడే కంటే ముందుగా, తప్పును తెలిపి న్యాయాధీశుడి ద్వారా శిక్ష అనుభవించాలనేవారికి ఇది రాయబడింది. అందరి ఎదుట-దొంగగా నిలబడటమే ఒక ప్రాయశ్చిత్తం. అంతకు మించి స్వయంగా ప్రభువు ఎదుట 'దొంగతనం చేశాను శిక్షించ'మని ప్రార్థించడం కూడా గొప్ప ప్రాయశ్చిత్తమే. ఈ విధంగా ప్రాధేయపడిన వ్యక్తి మళ్ళా అపరాధం చేస్తాడని ఊహించలేం. ఇతడు స్వయంగా దొంగతనం-నేరం చేశానని అందరి ఎదుట అంగీకరించాడు. శిక్షించమని ప్రార్థించాడని-తెలిసిన ప్రజలు కూడా ఇతడిని శిక్షించడం అవసరంలేదని భావిస్తారు. ఈ శ్లోకం ద్వారా, మరియు (8-316) శ్లోకం ద్వారా మనకు తెలిసినదేమంటే, ఈ విధంగా ప్రాయశ్చిత్తం చేసికొనే వాడిని క్షమించడం మంచిదనే భావన కలగడం, ఆ వ్యక్తి దోషముక్తుడు అని అనుకోవడం కూడా జరుగుతుంది.

ప్రాయశ్చిత్త క్రియ ద్వారా స్వయంగా తనను శిక్షించుకొనే పద్ధతి- ఇది మనుకృతం-ప్రామాణికం

స్కంధేనాదాయ ముసలం లగుడం వాపి ఖాదిరమ్ । మూలశ్లోక సం.**192**
శక్తిం చోభయతస్తీక్ష్ణామాయసం దండమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**315**

టీక:- **స్కంధేన ముసలం అపివా ఖాదిరమ్ లగుడం** = దొంగ రోకలి గాని చంద్రకొయ్యను గాని, రెండు వైపుల పదును గల, **శక్తిం చోభయత స్తీక్ష్ణామాయసం దండమేవ వా** = శక్తి ఆయుధాన్ని గాని భుజం మీద పెట్టుకొని రాజ సమీపమునకేగి అయ్యా ! నేను దొంగను, 'నన్ను దండించండి' అని ప్రార్థించాలి.

తాత్పర్యం:- నేరం చేసిన వాడు తానే రోకలిగాని, చంద్రకొయ్యగాని, రెండు వైపులా పదునుగల శక్తిగల ఆయుధాన్ని భుజంమీద వేసుకొని అందరికీ వెల్లడయ్యేలా స్వయంగా నేరాన్ని వెల్లడించుకుంటూ, రాజు మందిరానికి వేగంగా వెళ్లి, రాజు ఎదుట నిల్చి, తన నేరాన్ని వివరించి తనను ఆ ఆయుధంతో చంపమని కోరాలి. ॥315॥

నేరస్తుణ్ణి దండించనట్లయితే రాజు పాపభాగి- ఇది మనుకృతం-ప్రామాణికం

శాసనాద్వా విమోక్షాద్వా స్తేనః స్తేయాద్విముచ్యతే । మూలశ్లోక సం.**193**
అశాసిత్వా తు తం రాజా స్తేనస్యాప్నోతి కిల్బిషమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**316**

టీక:- **శాసనాత్** = శిక్షను పొంది, **వా** = లేదా, **విమోక్షాత్** = స్వయం ప్రాయశ్చిత్తం చేసికొన్న తరువాత, రాజు క్షమించిన తరువాత, **స్తేనః** = దొంగ, **స్తేయాత్ విముచ్యతే** = దొంగ నేరం నుండి విముక్తుడవుతాడు. **తం అశాసిత్వా తు** = దొంగను శిక్షించనందువల్ల, **రాజా** = రాజు, **స్తేనస్య కిల్బిషమ్ ఆప్నోతి** = దొంగ యొక్క పాపాన్ని పంచుకొంటాడు.

తాత్పర్యం:- దొంగ దొంగతనమువలన పాపము నుండి శిక్షనుపొంది కాని, ఒప్పుకొనుటచే క్షమించుట చేతగాని రెండు విధముల విముక్తుడగును. రాజు దొంగకు శిక్ష విధింపకున్నచో రాజే స్వయముగా అపరాధియగును.॥316॥

వివరణ:

క. రామాయణంలో ఉదాహరింపబడిన మనుస్మృతి శ్లోకాలు:-ఈ శ్లోకం మరియు 8.318 శ్లోకం, ఈ రెండూ కొంత పాఠాంతరంతో రామాయణంలో కలిసినట్లున్నవి. రాముడు వాలి వధలో కొంత అధర్మం ఆచరించినట్లు వాలి ఆరోపణ. ఇందుకు రాముడు జవాబిస్తూ, తన ఆచరణ ధర్మసమ్మతమని, శాస్త్రసమ్మతమని మనుధర్మ శాస్త్రంలోని ఈ కింది శ్లోకాలను ప్రమాణంగా చూపిస్తాడు.

దీన్ని బట్టి మనుస్మృతి రచనాకాలం వాల్మీకి రామాయణం కంటే ముందు అని స్పష్టమవుతుంది. రామాయణం కంటే ముందు సమయంలోనే మనుస్మృతి శ్లోకబద్ధంగా రచింపబడిందని తెలుస్తుంది.

రామాయణంలో ఉదాహరించిన మను శ్లోకాలు.

శ్లో॥ **శ్రూయాతే మనునా గీతౌ శ్లోకౌ చరిత్రవత్సలౌ ।**
గృహీతౌ ధర్మకుశలైస్తథా తచ్చరితం మయా॥ కిష్కింధ.18-30

శ్లో॥ **రాజభిర్ధృత దండాశ్చ కృత్వా పాపాని మానవాః ।**
నిర్మలాః స్వర్గమాయాన్తి సన్తః సుకృతినో యథా ॥ కిష్కింధ.18-31

శ్లో॥ **శాసనాద్వాపి మోక్షాద్వా స్తేనః పాపాద్విముచ్యతే ।**
రాజా త్వశాసన్ పాపస్య తదవాప్నోతి కిల్బిషమ్॥ కిష్కింధ.18-31,32

2 రామాయణంలో మనుస్మృతి శ్లోకాలు:- కిల్బిషమ్, దుష్కృతమ్, పాపమ్, ఏనః, అధర్మః మొ॥ శబ్దాలు అనేక చోట్ల ఉపయోగించబడినవి. అయితే పాపం మొ॥ శబ్దాలను మరెవడో చేసిన పాపం-ఇంకొకడికి సంక్రమించిందని అర్థంకాదు. ఎక్కడెక్కడ-8-13లో **"నరో భవతి కిల్బిషీ"**, 8-135 **'చౌర కిల్బిషమ్'**, 8-198 **"స్తేనస్య" ఆప్నోతి కిల్బిషమ్**, 8-192 **స్తేనో రాజని కిల్బిషమ్** ఈ ప్రయోగాలందున్న కిల్బిష శబ్దానికి నింద, దోషం, అధర్మం లేదా చెడు అని అర్థాలు. నిరుక్తకారుడు ఈ అర్థాన్నే సమర్థించాడు. **"కిల్బిషమ్ కిల్భిదమ్ = కీర్తిం అస్య భినత్తీతి"** అంటే కీర్తిని నాశనం చేసేది"

కిల్బిషమ్ చెడ్డపేరు తెచ్చేది. చెడు లేదా దోషం 'కిల శ్వైత్యే' ధాతువుకు "కిలేర్వుక్చ" (ఉణాది 1-50) సూత్రం ద్వారా టిషచ్ ప్రత్యయం చేరగా 'కిల్బిష' శబ్దం సిద్ధమవుతుంది. ఇతర స్థలాలల్లో దీనికి పర్యాయవాచకరూపంలో కూడ పైన పేర్కొన్న అర్థాన్ని సూచించే శబ్ద ప్రయోగాలే ఉన్నాయి. ఉదాహరణకు 'మలహారకమ్' (8.308) 'ఏనస్' -ఏనో ద్విజానామప మృజ్యతే (2-2) (పాదో౽ధర్మసః) = అధర్మ శబ్దం ఏనః (8-19) ఏనో గచ్ఛతి కర్తారం ఇవన్నీ నిందార్థంలో ప్రయోగింపబడినవి.

పాపుల సహవాసంతో పాపం లభిస్తుంది - **ఇది మనుకృతం-ప్రామాణికం**

అన్నాదే భ్రూణహా మార్ష్టి పత్యౌ భార్యాపచారిణీ । మూలశ్లోక సం. **194**
గురౌ శిష్యశ్చ యాజ్యశ్చస్తేనో రాజని కిల్బిషమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **317**

టీక:- **భ్రూణహా అన్నాదే మార్ష్టిన్** = భ్రూణ హత్య చేసిన వాడింట్లో భోజనం చేసినవాడికి, పాపం సంక్రమిస్తుంది. నింద కల్గుతుంది. అంటే తాను నిందచేయక పోయినా భ్రూణహత్య చేసిన పాపి ఇంట్లో అన్నం తిన్నందువల్ల, అన్నం తిన్నవాడికి ఆ పాపమంటుతుంది. **అపచారిణీ భార్యా పత్యౌ** = వ్యభిచారం చేసిన స్త్రీ యొక్క పాపం, (చెడు, నింద, అపకీర్తి) ఆమె భర్తకు చెందుతుంది, **శిష్యః గురౌ** = చెడ్డ శిష్యుడు చేసిన పాపం, అతడి గురువుకు లభిస్తుంది, **చ** = మరియు, **యాజ్యః** = యజమానుడు చేసిన పాపం-ఆ యజ్ఞం చేయించిన ఋత్విజుడైన పురోహితుడికి చెందుతుంది. అదే విధంగా, **స్తేనః కిల్బిషమ్ రాజని** = దండన చేయనందువల్ల, దొంగ చేసిన పాపం (నింద) రాజుకు చెందుతుంది.

తాత్పర్యం:- భ్రూణహత్యాపాపం అతని కన్నం పెట్టిన వానికిని, భార్య వ్యభిచారిణియైన భర్తకును, యజ్ఞము చేయుశిష్యుడెవడైన తప్పుచేసిన గురువునకును, దొంగ దొంగతనము చేసిన ఆతని పాపం రాజునకును సంప్రాప్తించును. ॥317॥

రాజు వల్ల శిక్ష అనుభవించినట్లయితే దోషముండదు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

రాజభిః కృతదండాస్తు కృత్వా పాపాని మానవాః । మూలశ్లోక సం. **195**
నిర్మలాః స్వర్గమాయాంతి సంతస్సుకృతినో యథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **318**

టీక:- మానవాః పాపాని కృత్వా= మానవులు పాపాలు (అపరాధాలు) చేసి **రాజభిః కృతదండాః తు** = ప్రభువుల చేత దండితులై, ప్రభువు ద్వారా ఇవ్వబడే దండన రూపమైన ప్రాయశ్చిత్తంనాచరించి, **నిర్మలాః** = దోషవిముక్తులై, **యథా సుకృతినః** = ఏ విధంగా సత్కర్మలు చేసే శ్రేష్ఠ సజ్జనులు సుఖంగా, **స్వర్గం ఆయాంతి** = ఆనందంగా ఉంటారో అదేవిధంగా ప్రాయశ్చితమాచరించినట్లయితే ఆ పాప రూపమైన అపరాధ సంస్కారాలు క్షీణించిపోగా, దోషిననే భావన తగ్గిపోతుంది. శ్రేష్ఠ కర్మలందు ప్రవేశించగల సత్పురుషులకు లాగా మానసిక శాంతి, సుఖం లభిస్తాయి.

తాత్పర్యం:- బంగారం దొంగిలించడం లాంటి వాటికి రాజదండనలు పొందడం వల్ల ఆ యా నేరాలు చేసినవారు పుణ్యవంతులవుతున్నారు. అంటే రాజదండన మనేది, నేరాలవల్ల ఒనగూడే పాపానికి ప్రాయశ్చిత్తం లాంటిది. కాబట్టి రాజదండన పుణ్యదాయకం అని గ్రహించుకోవాలి. ॥318॥

వివరణ:

'స్వర్గ' శబ్దానికి 'సుఖ'మని అర్థం. 6.79 వివరణను చూడండి.

విభిన్న చౌర్యాలకు దండన వ్యవస్థ- **ఇది మనుకృతం-ప్రామాణికం**

యస్తు రజ్జుం ఘటం కూపాద్ధరేద్భింద్యాచ్చ యః ప్రపామ్ । మూలశ్లోక సం. **196**
స దండం ప్రాప్నుయాన్మాషం తచ్చ తస్మిన్ సమాహరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **319**

యః తు = ఏ వ్యక్తి, **కూపాత్** = బావి నుండి, **రజ్జుం ఘటం హరేత్** = తాడును, కుండను దొంగిలించునో, లేదా పగలగొట్టినా, **సః** = అతడు, **మాషం దండం ప్రాప్నుయాత్** = ఒక బంగారు మాషం జుర్మానాకు పాత్రుడవుతాడు (8.134). **చ** = మరియు, **తథా** అలాగే, **తత్ తస్మిన్ సమాహరేత్** = తాడు, ఘటమును, తెచ్చి వాడే అక్కడ పెట్టాలి.

తాత్పర్యం:- ఎవడు బావి నుండి నీటిని తోడుట కోసం వేసి ఉన్న కుండను పగుల గొట్టినా తాడును అపహరించినా, వాడికి బంగారు మాడను అపరాధం విధించాలి. మళ్ళా తాడును, కుండను తెచ్చి వాడే అక్కడ పెట్టాలి. ॥319॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ధాన్యం దశభ్యః కుంభేభ్యో హరతోఽ_ప్యధికం వధః । మూలశ్లోక సం. **197**
శేషేఽ_ప్యేకాదశగుణం దాప్యస్తస్య చ తద్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **320**

టీక:- **దశభ్యః కుమ్భేభ్యః అధికం ధాన్యం హరతః** = పది పెద్ద కుండల కంటే అధిక ధాన్యాన్ని దొంగిలించిన వాడికి, **వధః** = శారీరక దండన ఉంటుంది, **శేషే అపి** = పది కుంభముల వరకే దొంగిలించిన వాడికి, **ఏకాదశ గుణం దాప్యం** = పదకొండు రెట్లు జుర్మానా వేయాలి, **తస్య తత్ ధనమ్ చ** = మరియు, ఆ వ్యక్తి ధాన్యాన్ని తిరిగి ఇప్పించాలి.

తాత్పర్యం:- పది కడవలకంటె ఎక్కువ ధాన్యం దొంగిలించిన వానికి బెత్తంతో కొట్టు శిక్షను, అంతకంటె తక్కువ దొంగతనం చేసిన దానికి పదునొకండు రెట్లు విధింపవలెను. ॥320॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తథా ధరిమమేయానాం శతాదభ్యధికే వధః । మూలశ్లోక సం. **198**
సువర్ణరజతాదీనాముత్తమానాం చ వాససామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **321**

టీక:- **తథా** = ఇదే విధంగా, **ధరిమమేయానాం** = **ధరిమ** = త్రాసుతో, **మేయ** = తూచదగినట్టి, **సువర్ణ-రజత + ఆదీనామ్** = బంగారం, వెండి మొ॥ పదార్థాలు 100 పలముల కంటే అధికం దొంగిలించినప్పుడు, **చ** = మరియు, **ఉత్తమానాం వాససామ్** = ఉత్తమ వస్త్రాలు, **శతాత్ + అభ్యధికే** = 100 కంటే అధికం దొంగిలించినట్లయితే, **వధః** = శారీరక దండన విధించాలి. తూకం వేసి అమ్మే వస్తువుకు **'ధరిమ'** అని పేరు.

తాత్పర్యం:- కొలవదగిన ధాన్యాదులందు ఎలా దండం విధింపబడెనో, అలా త్రాసుతో తూచదగిన బంగారు, వెండి మొదలైనవాటికీ, విలువగల మేలైన పట్టుబట్టలు మొదలైన వాటికీ, నూరు పలములకంటే ఎక్కువ అపహరించినప్పుడు శారీరక దండన విధించాలి. ॥321॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పంచాశతస్త్వభ్యధికే హస్తచ్ఛేదనమిష్యతే । మూలశ్లోక సం. **199**
శేషే త్వేకాదశగుణం మూల్యాద్దండం ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **322**

టీక:- **పంచాశతః తు + అభ్యధికే** = ఉపరోక్తమైన (8.321) వస్తువులు 50 నుండి 100 పలముల వరకు దొంగిలించినట్లయితే, **హస్త చ్ఛేదనమ్ + ఇష్యతే** = హస్తచ్ఛేదన దండం ఇవ్వాలి, **శేషేతు** = 50 కంటే తక్కువ దొంగిలించిన దానికి రాజు, **మూల్యాత్** ఏకాదశ గుణం దండం **ప్రకల్పయేత్** = మూల్యమునకు పదకొండు రెట్లు ఎక్కువ దండన వేయాలి. దొంగిలింపబడిన వస్తువును ఇప్పించాలి.

తాత్పర్యం:- ముందు పేర్కొన్న వస్తువులను యాభైనుండి వంద పలముల వరకు దొంగిలించినప్పుడు చేతులు నరికివేయడమే దండమని తెలిపారు. యాభై కంటే తక్కువ వరకు దొంగతనం చేసినట్లయితే, దొంగలింపబడిన వస్తువు మూల్యానికి పదకొండురెట్లు దండం తీసికోవాలి దొంగిలించిన వస్తువును తిరిగి ఇప్పించాలి. ॥322॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పురుషాణాం కులీనానాం నారీణాం చ విశేషతః । మూలశ్లోక సం. **200**
ముఖ్యానాం చైవ రత్నానాం హరణే వధమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **323**

టీక:- కులీనానాం పురుషాణాం = కులీన పురుషులను, చ = మరియు, **విశేషతః నారీణాం** = విశేషించి, స్త్రీలను **హరణే** = అపహరించినప్పుడు, చ = తథా, **ముఖ్యానాం చైవ రత్నానాం హరణే వధమర్హతి** = ముఖ్యమైన వజ్రవైఢూర్యాదులు, రత్నాలను అపహరించినప్పుడు చంపడమే దండన.

తాత్పర్యం:- గొప్ప వర్ణంలో పుట్టిన పురుషులను ముఖ్యంగా స్త్రీలను, వజ్రవైఢూర్యాదులైన మేలయిన రత్నాలను అపహరించినప్పుడు, దొంగిలించినవాణ్ణి చంపడమే దండన. ॥323॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మహాపశూనాం హరణే శస్త్రాణామౌషధస్య చ । మూలశ్లోక సం. **201**
కాలమాసాద్య కార్యం చ దండం రాజా ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **324**

టీక:- **మహా పశూనాం** = ఏనుగు, అశ్వం మొ॥ పెద్ద పశువులను, **శస్త్రాణం** = శస్త్రాస్త్రాలు, **చ** = మరియు, **ఔషధస్య** = ఓషధులు, **హరణే** = దొంగిలించినప్పుడు, **కాలం చ కార్యం చ ఆసాద్య** = సమయం, చౌరకార్యం యొక్క గంభీరతను చూసి, **రాజా దండం ప్రకల్పయేత్** = దొంగను దండించాలి.

తాత్పర్యం:- ఏనుగులు, గుర్రాలు, ఆవులు, గేదెలు మొదలైన పెద్దపశువులను, శాస్త్రాస్త్రాలను, మందులను దొంగలు దొంగిలించినప్పుడు, దుర్భిక్షం మొదలైన కాలమును, ప్రయోజాన్ని, దొంగలు మంచిపని కోసం ఉపయోగించిరా, లేక చెడుపనికోసం ఉపయోగించిరా? అని ఆలోచించి, రాజు దొంగను దండించాలి. ॥324॥

325 నుండి 331వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *గోషు బ్రాహ్మణసంస్థాసు చ్ఛురికాయాశ్చ భేదనే ।*
పశూనాం హరణే చైవ సద్యః కార్యోఽర్ధపాదికః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***325***

తాత్పర్యం:- బ్రాహ్మణులకు చెందిన గోవులను అపహరించినప్పుడు బరువులు మోయించడానికి గొడ్డుటావుల్ని వినియోగించుకో దానికి చూసినప్పుడు, యాగం కోసం పశువులను అపహరించినప్పుడు రాజదండన తథ్యం. ॥325॥

* *సూత్రకార్పాసకిణ్వానాం గోమయస్య గుడస్య చ ।*
దధ్నః క్షీరస్య తక్రస్య పానీయస్య తృణస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***326***

తాత్పర్యం:- కంబళి మొదలైన వాటికి ఉపయోగించిన దారములు, దూది, గంజాయి, గోమయం, బెల్లం, పెరుగు, పాలు, మజ్జిగ, తాగ దగిన నీరు, కసువును. ॥326॥

* *వేణువైదలభాండానాం లవణానాం తథైవ చ ।*
మృణ్మయానాం చ హరణే మృదో భస్మన ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***327***

తాత్పర్యం:- వెదురు, పేము వీటితో అల్లిన బుట్టలు మొ॥ వాటిని, ఉప్పును, మట్టిపాత్రలను, మట్టిని, బూదిని.॥327॥

* *మత్స్యానాం పక్షిణాం చైవ తైలస్య చ ఘృతస్య చ ।*
మాంసస్య మధునశ్చైవ యచ్చాన్యత్పశుసంభవమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***328***

తాత్పర్యం:- చేపలు, పక్షులు, తైలం, నెయ్యి, మాంసం, తేనె, పశువువల్ల కలుగు మరేయితర వస్తువులు తోలు, గిట్టలు, కొమ్ములు మొ॥వి., ॥328॥

* *అన్యేషాం చైవమాదీనాం మద్యానామోదనస్య చ ।*
పక్వాన్నానాం చ సర్వేషాం తన్మూల్యాద్ద్విగుణో దమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***329***

తాత్పర్యం:- ఇతర ఉపయుక్తములుకాని శిలలు 12 రకాల మద్యాలు, పక్వాన్నాలు, ఇతర పిండి వంటలు మొదలైన వాటిని దొంగింలించినప్పుడు రెండింతల అపరాధం విధించాలి. ॥329॥

* *పుష్పేషు హరితే ధాన్యే గుల్మవల్లీనగేషు చ ।*
అన్యేష్వపరిపూతేషు దండస్స్యాత్పంచకృష్ణలాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***330***

తాత్పర్యం:- పూలు, పొలంలో ఉన్న పచ్చికర్ర మీద ఉన్న ధాన్యం, వెలుగులేని పొదలు, తీగలు, చెట్లు, సమర్థుడైన పురుషుడు మోయతగినంత తక్కిన ఫలమునకురాని ధాన్యములును దొంగలు అపహరించినప్పుడు దేశకాలములను అనుసరించి అయిదు బంగారు రూకలుగాని, వెండిరూలుగాని దండం విధించాలి. ॥330॥

* *పరిపూతేషు ధాన్యేషు శాకమూలఫలేషు చ ।*
నిరన్వయే శతం దండస్సాన్వయేఽర్ధశతం దమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***331***

తాత్పర్యం:- తూర్పారబెట్టిన ధాన్యాలు, కూరగాయలు, దుంపలు, పండ్లు మొ॥ వానిని దొంగిలించినవాడు కుటుంబం లేక ఒంటివాడైతే 100 రూకలు, కుటుంబమున్నవాడైతే 50 రూకలు దండన విధించాలి. ॥331॥

ప్రక్షిప్తాల పరిశీలన

325-331 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

మనుష్యుల అపహరణ, అన్నం, ధాతువులు, వస్త్రాలు మొదలైన ముఖ్య వస్తువుల అపహరణకూ ఒక దండన పద్ధతిని చెప్పి, 324లో వేరే సాధారణ- విశేష వస్తువులను అపహరిస్తే శిక్షా విధానాన్ని మనువు రాజుల వివేకానికే వదిలిపెట్టాడు. శ్లోకాన్ని 'సమయం, కార్యం- వీటి ప్రకారం రాజు స్వయంగా దండించ వచ్చు' అని ముగించాడు. ఈ వాక్యంతో రెండు విషయాలు తెలుస్తున్నాయి - ఒకటి - మనువు తర్వాతి వస్తువుల విషయంలో శిక్షలు చెప్పలేదు. రెండవది - ఈ వాక్యంతో వస్తు చౌర్యం సంగతి ముగించేశాడు. ముగింపు చెప్పకపోతే, ఇతర వస్తువుల చౌర్యానికి ప్రతి దానికీ శిక్షలు తానే నిర్ధారించి ఉండేవాడు. అందుచేత శిక్షా విధానపు విషయం పూర్తయిందని భావించాలి. దీని తర్వాత దొంగతనానికి సంబంధించిన వికల్పాల, లేదా సర్వసామాన్య పద్ధతు లేవైనా చెప్పినవి ఉంటే అవి ప్రాసంగికం అవుతాయి కానీ, ఇతర విషయాలు కావు. 325-331 శ్లోకాలలో అతి సాధారణ వస్తువులకు శిక్షా విధానం ఉంది. విషయం ముగిసిపోయిన తర్వాత మళ్లీ దాన్నే చెప్పటం మనువుకు వ్యతిరేకం, మనుస్మృతి కర్త సంకేతాలకూ వ్యతిరేకం. అందువల్ల ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే.

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో ఎన్నో మామూలు వస్తువులతో పాటు చేపలు, మాంసం, మద్యం, మొదలైన వాటి చౌర్యానికి దండన పద్ధతి ఉంది. అందుచేత ఈ శ్లోకాలు మనువు రాసినవి కావని తెలుస్తూంది. ఎందుచేతనంటే, నాలుగు వర్ణాల సమాజంలో ఈ వస్తువుల 'అస్తిత్వాన్నే' మనువు అంగీకరించ లేదు. ఇవి సమాజంలో ఉండనే ఉండ కూడదు అన్నాడంటే, వాటికి శిక్షా వ్యవస్థను చెప్పనే. చెప్పడు ![చూడండి 3.120-284; 4.23-28లపై 'అనుశీలనం'లో మాంసం, మద్య సంబంధిత సమీక్ష].

ఇది మనుకృతం. ప్రామాణికం

దౌర్జన్యం-చౌర్య లక్షణం

స్యాత్సాహసం త్వన్వయవత్ ప్రసభం కర్మ యత్కృతమ్ । మూలశ్లోక సం. **202**
నిరన్వయం భవేత్ స్తేయం హృత్వాఽపవ్యయతే చ యత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **332**

టీక:- **అన్వయవత్** = వస్తువు గల వాడి ఎదుటనే, **ప్రసభంయత్ కర్మ కృతం** = బలాత్కార పూర్వకంగా చేసిన బందిపోటు దొంగతనానికి, **సాహసం స్యాత్** = అది సాహసమంటారు, **నిరన్వయం** = కుటుంబ సభ్యులు లేనప్పుడు చేసిన దొంగతనానికి, **చ** = మరియు, **యత్ హృత్వా+అపవ్యయతే** = ఏ వస్తువునైనా, ప్రత్యక్షంగా గాని, లేదా పరోక్షంగా గాని, దొంగిలించి, పారిపోవడాన్ని, **స్తేయం భవేత్** = దొంగతనమని చెబుతారు.

తాత్పర్యం:- యజమాని ఎదుటనే బెదిరించి బలవంతంగా చేయు దోపిడిని సాహసమని అంటారు. యజమానికి తెలియకుండా ఎత్తుకొనిపోయి ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టే దానిని దొంగతనమని అంటారు. ॥332॥

వివరణ:

దౌర్జన్యం-చౌర్యం-వీటి లక్షణం

మనుస్మృతిలోని శబ్దాలను గ్రహించి కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో 'సాహసం-చౌర్యముల' లక్షణాలను పేర్కొన్నాడు.

సాహసం అన్వయవత్ ప్రసభంకర్మ = అందరూ చూస్తుండగా బలత్కారంగా పరద్రవ్య హరణం : 'సాహసం - దౌర్జన్యం.'

నిర్వ్యయే స్తేయమ్, అపవ్యయే చ = ఎవరూ లేనప్పుడు ఆ గృహంలో ద్రవ్యాపహరణం :'స్తేయం'

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *యస్త్వేతాన్యుపక్లృప్తాని ద్రవ్యాణి స్తేనయేన్నరః ।*
తమాద్యం దండయేద్రాజా యశ్చాగ్నిం చోరయేద్గృహాత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***333***

తాత్పర్యం:- అగ్నిని దొంగతనం చేస్తే అతనికి ప్రథమసాహసదండాన్ని విధించాలి. ప్రథమసాహస మంటే రెండువందల యాభైరూపాయలు (8.138). ॥333॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ శ్లోకం కూడా ప్రసంగ విరోధపు ఆధారంగా ప్రక్షిప్తము. దీని విస్తృత వివేచనకు 325-331 శ్లోకాల వివరణను చూడగలరు.

334 నుండి 338 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

దోపిడీదారులైన దొంగలకు అంగచ్ఛేదనం -

యేన యేన యథాంగేన స్తేనో నృషు విచేష్టతే । మూలశ్లోక సం. **203**
తత్తదేవ హరేత్తస్య ప్రత్యాదేశాయ పార్థివః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **334**

స్తేనః = దొంగ, **యథా** = ఏ ప్రకారంగా, **యేన యేన + అంగేన** = ఏ ఏ అవయవాలతో, **నృషు** = మనుషులలో, **విచేష్టతే** = విరుద్ధ చేష్టలు చేస్తాడో, **తస్య తత్ తత్ + ఏవ** = ఆ యా అంగాలను, **ప్రత్యాదేశాయ** = సర్వ మానవులకు భయం కలిగించే, **పార్థివః హరేత్** = రాజు హరించాలి. అంటే ఛేదించాలి.

ఋషి దయానంద భాష్యం:- దొంగ ఏ ప్రకారంగా ఏ యే అవయవాలతో మనుషులతో విరుద్ధ చేష్టలు చేస్తాడో ఆ యా అంగాలను సర్వమానవులకు భయంకలిగే విధంగా రాజు ఛేదించాలి. (స.ప్ర.6వ సము.).॥334॥

తల్లి, తండ్రి, ఆచార్యులందరూ రాజుతో దండనీయులే- ఇది మనుకృతం-ప్రామాణికం

పితాఽఽచార్యః సుహృన్మాతా భార్యా పుత్రః పురోహితః । మూలశ్లోక సం.**204**
నాదండ్యో నామ రాజ్ఞోఽస్తి యస్స్వధర్మే న తిష్ఠతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**335**

టీక:- పితా, ఆచార్యః సుహృత్ మాతా భార్యా పుత్రః పురోహితః = తండ్రి అయినా, ఆచార్యుడయినా, మిత్రుడైనా తల్లిగాని, భార్యగాని, పుత్రుడుగాని, పురోహితుడుగాని, **యః స్వధర్మే న తిష్ఠతి** = ఎవడు స్వధర్మంలో స్థిరంగా ఉండడో, **రాజ్ఞః అదండ్యః నామ న అస్తి** = రాజ దండనను తప్పించుకోజాలడు.

ఋషి దయానందభాష్యం:- తండ్రి ఆచార్యుడు, మిత్రుడు, తల్లి, భార్య, పుత్రుడు, పురోహితుడు, అనువారు దొంగతనం చేసినచో రాజు దండించాలి. న్యాయాసనంలో కూర్చున్నప్పుడు రాజు లేదా న్యాయాధిపతి న్యాయం చేయాలి. పక్షపాతం చూపించరాదు. యథోచిత దండన చేయాలి.(స.ప్ర.6వ సము).॥335॥

రాజు నేరం చేస్తే వెయ్యిరెట్లు అధికంగా దండించాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

కార్షాపణం భవేద్ దణ్డ్యో యత్రాన్యః ప్రాకృతో జనః । మూలశ్లోక సం.**205**
తత్ర రాజా భవేద్ దణ్డ్యః సహస్రమితి ధారణా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**336**

టీక:- యత్ర = ఏ అపరాధానికి, **అన్యః ప్రాకృతః జనః** = సాధారణ మనుషుడికి, **కార్షాపణం దండ్యః భవేత్** = ఒక కార్షాపనం దండముంటుందో, **తత్ర** = అలాంటి అపరాధాన్ని, **రాజా సహస్రః దండ్యః** = రాజు చేసినట్లయితే సహస్ర కార్షాపణములతో దండించాలి.

ఋషి దయానందభాష్యం:-అంటే సాధారణ మనుష్యున కంటే వెయ్యి రెట్లు అధికంగా రాజుకు జుర్మానా విధించాలి. అదే మంత్రికి 800 రెట్లు అధికం. అంతకంటే తక్కువ హోదా గలవాడికి 600 రెట్లు కంటె తక్కువ కారాదు. కారణం సాధారణ ప్రజల కంటే రాజ పురుషులకు ప్రభుత్వ కర్మచారులకు = అధిక దండన లేనట్లయితే రాజ కర్మచారులు ప్రజలను నాశనం చేస్తారు. సింహాన్ని అధిక దండనతో, మేకను కొంచెం దండనతో వశపరచుకోవచ్చు గదా. అందువల్ల రాజు దగ్గర నుండి అతి చిన్న సేవకుడి వరకు- అపరాధాలలో రాజపురుషులకు సేవకుల కంటే అధిక దండన ఉండాలి. ॥336॥

ఏ అపరాధంలో సామాన్యజనులకు ఒక కార్షాపణం దండనం విధించామో అలాంటి అపరాధం రాజు చేసినట్లయితే వేయి కార్షాపణాలు విధించాలి. (స.ప్ర.6వ సము.)

ఉన్నత వర్ణ వ్యక్తులకు అధిక దండన- ఇది మనుకృతం-ప్రామాణికం

అష్టాపాద్యం తు శూద్రస్య స్తేయే భవతి కిల్బిషమ్ । మూలశ్లోక సం.**206**
షోడశైవ తు వైశ్యస్య ద్వాత్రింశత్ క్షత్రియస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**337**

బ్రాహ్మణస్య చతుఃషష్టిః పూర్ణం వాఽపి శతం భవేత్ । మూలశ్లోక సం.**207**
ద్విగుణా వా చతుఃషష్టిస్తద్దోషగుణవిద్ధి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**338**

టీక:- అలాగే, **తద్దోష గుణ విద్ధి సః** = వివేకవంతుడై, **స్తేయే** = దొంగతనం చేసినట్లయితే, **శూద్రస్య అష్టా అపాద్యమ్** = శూద్రుడికి ఎనిమిది రెట్లు అధికం, **వైశ్యస్య తు షోడశ ఏవ** = వైశ్యుడికి 16 రెట్లు, **క్షత్రియస్య ద్వాత్రింశత్**

= క్షత్రియుడికి 32 రెట్లు ఎక్కువ, **బ్రాహ్మణస్య చతుః షష్టిః** = బ్రాహ్మణుడికి 64 రెట్లు అధికం, **అపి వా శతం** = లేదా 100 రెట్లు అధికం. ఈ విధంగా దండన (జుర్మానా) వేయాలి. **అథవా** = లేదా, **ద్విగుణా చతుః షష్టిః** = 128 రెట్లు అధికం. **కిల్బిషమ్ భవతి** = పాపం ఉంటుంది కాబట్టి, దండించాలి.

ఋషి దయానందభాష్యం:- వివేకవంతుడై దొంగతనం చేసినట్లయితే శూద్రుడికి 8 రెట్లు, వైశ్యుడికి 16 రెట్లు, క్షత్రియుడికి 32 రెట్లు, బ్రాహ్మణుడికి 64 రెట్లు, లేదా 100 రెట్లు గాని లేదా 128 రెట్లు గాని అధికంగా దండన విధించాలి.

ఎవరికి జ్ఞానమెంత అధికంగా ఉంటుందో, లేదా అధిక ప్రతిష్ఠ సమాజంలో ఉంటుందో, అతడికి నిర్ణీత అపరాధానికి అంతే అధికంగా జుర్మానా వేయాలి. కారణం అతడు, దోష గుణవిద్ది = దోష గుణాలు తెలిసికూడా అపరాధం చేసినవాడైనందువల్ల అధికంగా దండనీయుడవుతాడు. (స.ప్ర.6వ సము.)

బ్రాహ్మణశ్చైషాం క్షైష్ఠశ్చ నియమ్యేత (ప్ర.16-6.10)

హత్య మొదలైన అపరాధాలలో ఒక వేద బ్రాహ్మణుడు తోడుపడినట్లయితే అతడికి అన్య వర్ణాలవారి కంటే అధిక దండన విధించాలి. ॥337, 338॥

339 నుండి 342వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* ***వానస్పత్యం మూలఫలం దార్వగ్న్యర్థం తథైవ చ ।***
తృణం చ గోభ్యో గ్రాసార్థమస్తేయం మనురబ్రవీత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***339***

తాత్పర్యం:- చుట్టూ కంచె వేయని ఫలవృక్షభరితమైన తోటలోని పండ్లుగాని, కాయలుగాని, గోవుకు గడ్డిగాని, హోమానికి గాని ఎవరైనా దొంగతనం చేస్తే అవి దొంగతనం అన్పించుకోవు. దానికేం శిక్షలేదు. ॥339॥

* ***యోఽదత్తాదాయినో హస్తాల్లిప్సేత బ్రాహ్మణో ధనమ్ ।***
యాజనాధ్యాపనేనాపి యథా స్తేనస్తథైవ సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***340***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు యజ్ఞదక్షిణను కాని విద్యాబోధ దక్షిణ కాని అన్యాయార్జిత ధనము కలవాని నుండి ధనము గ్రహించినచో వానివలె తానును దొంగ యగును. ॥340॥

* ***ద్విజోఽధ్వగః క్షీణవృత్తిర్ద్వావిక్షూ ద్వే చ మూలకే ।***
ఆదదానః పరక్షేత్రాన్న దణ్డం దాతుమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***341***

తాత్పర్యం:- 'ఇవ్వనిదే పుచ్చుకోవడం' అనేది చౌర్యం. పరధనం అని తెలిసీ, అలాంటి చోరుడి చేత యాగం చేయించడం-ఆ ధనానికి తాను ఆశ పడటం జరిగితే, ఆ విప్రుడూ చోర సమానుడే ! దండనలో అతనికీ భాగం ఉంది. ॥341॥

* ***అసందితానాం సందాతా సందితానాం చ మోక్షకః ।***
దాసాశ్వరథహర్తా చ ప్రాప్తః స్యాచ్చోరకిల్బిషమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***342***

తాత్పర్యం:- ఇతరుల గుర్రాలు మొ॥నవి; కట్టబడక స్వేచ్ఛగా తిరుగుచున్నట్లయితే వాటిని కట్టివేస్తే వాటిని విడిచిపెట్టేవాడినీ, దాసులను, గుర్రాలను, రథాలను అపహరించువాడినీ కొద్దో గొప్ప నేరాలను ఆలోచించి వాటికి తగినట్లు చంపడం, అంగచ్ఛేదం, ధనమును తీసుకోవడం మొ॥న దండనలు విధించాలని తెలుసుకోవాలి. ॥342॥

ప్రక్షిప్తాల పరిశీలన

339 నుంచి 342 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. శైలీగత ఆధారాలు

339వ శ్లోకంలోని "మనుః అబ్రవీత్" పదాలతో ఇది మనువుది కాదనీ, వేరెవరో తర్వాతి వారు రచించారనీ తెలిసిపోతూంది కనుక, ఇది ప్రక్షిప్తం. మిగిలిన శ్లోకాలలోని విషయం దీని మీదే ఆధారపడి ఉంది కనుక, అవీ ప్రక్షిప్తాలే.

2. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలన్నీ ప్రసంగ వ్యతిరేకాలనే ఆధారంతోనూ ప్రక్షిప్తాలు. దీనికోసం 325-331 శ్లోకాల మీది 'అనుశీలనం'లో ఆధారాలు చూడండి.

343 నుండి 347వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం.

అనేన విధినా రాజా కుర్వాణః స్తేననిగ్రహమ్ । మూలశ్లోక సం. **208**
యశోఽస్మిన్ ప్రాప్నుయాల్లోకే ప్రేత్య చానుత్తమం సుఖమ్॥ ప్రక్షిప్త శ్లోక సం. **343**

టీక:- రాజా = రాజు(న్యాయాధిపతి) అనేన విధినా = పైన చెప్పిన పద్ధతి ద్వారా (8.301-338), **స్తేన నిగ్రహమ్ కుర్వాణః** = దొంగలను, బందిపోటు దొంగలను, బంధిస్తూ, శిక్షిస్తూ ఉన్నట్లయితే, **అస్మిన్ లోకే యశః** = ఈ జన్మలో లేదా ఈ లోకంలో యశస్సును, చ = మరియు, ప్రేత్య = పరజన్మలో, **అనుత్తమం సుఖమ్** = ఉత్తమోత్తమ సుఖాన్ని, ప్రాప్నుయాత్ = పొందుతాడు.

తాత్పర్యం:- రాజు పైశ్లోకంలో చెప్పిన పద్ధతి ద్వారా దొంగలను, బందిపోటు దొంగలను బంధిస్తూ, శిక్షిస్తూ ఉన్నట్లయితే, ఈ జన్మలో లేదా ఈ లోకంలో యశస్సును, పరజన్మలో ఉత్తమోత్తమ సుఖాన్ని పొందుతాడు. ॥343॥

14వ వివాదం

ఇది మనుకృతం-ప్రామాణికం

దౌర్జన్యం, దారిదోపిడి, గృహదహనం, హత్యలు, బలాత్కారం మొదలగు అపరాధాల నిర్ణయం 344-351

ఐన్ద్రం స్థానమభిప్రేప్సుర్యశశ్చాక్షయమవ్యయమ్ । మూలశ్లోక సం. **209**
నోపేక్షేత క్షణమపి రాజా సాహసికం నరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **344**

టీక:- ఐన్ద్రం స్థానమ్ = రాజ్యంలో సర్వాధికారత్వమనే పదవిని, **అక్షయం అవ్యయం యశః** = నశించకుండా ఎల్లప్పుడు తరగని కీర్తిని, అభిప్రేప్సుః = పొందగలరు. రాజా = రాజు, **సాహసికం నరమ్** = బలాత్కారంగా గృహదహనం, జన హత్యలు చేస్తూ ధనాన్ని దోచుకొనే బందిపోటు దొంగలను, **క్షణమ్ + అపి న + ఉపేక్షేత** = ఒక్క క్షణం కూడా ఉపేక్షించకూడదు.

ఋషి దయానందభాష్యం:- రాజు రాజ్యంలో సర్వాధికారత్వమనే పదవి నశించకుండా ఎల్లప్పుడు తరగని కీర్తిని పొందగలరు. బలాత్కారంగా గృహదహనం, జనహత్యలు చేస్తూ ధనాన్ని దోచుకొనే బందిపోటు దొంగలను ఒక్క క్షణం కూడా ఉపేక్షించకూడదు. (స.ప్ర. 6వ సము.) ॥344॥

వివరణ:

దౌర్జన్య లక్షణాన్ని 8.332 శ్లోకంలో దాని సమీక్షా వివరణలో చూడుము.

దౌర్జన్య వ్యక్తి దొంగకంటే అధిక పాపాత్ముడు- ఇది మనుకృతం-ప్రామాణికం

వాగ్దుష్టాత్తస్కరాచ్చైవ దణ్డేనైవ చ హింసతః । మూలశ్లోక సం. **210**
సాహసస్య నరః కర్తా విజ్ఞేయః పాపకృత్తమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **345**

టీక:- సాహసిక పురుషుడి లక్షణం, **వాక్ దుష్టాత్** = బూతులు తిట్టేవాడి కంటే, **తస్కరాత్** = దొంగలించే వాడి కంటే, దండేన ఏవ హింసతః = అపరాధం లేకుండానే హింసించేవాడి కంటే, **సాహసస్య కర్తా** = బలాత్కరించి ధనాపహరణం, గృహదహనం మొ॥ సాహసకార్యాలొనర్చే నరుడు, **పాపకృత్తమః** = మహా పాపాత్ముడని, **విజ్ఞేయః** = తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- సాహసిక పురుషుడి లక్షణం బూతులు తిట్టే వాడి కంటే, దొంగిలించె వాడి కంటే, అపరాధం లేకుండానే హింసించే వాడికంటే, బలాత్కరించి ధనాపహరణం, గృహ దహనం మొ॥ సాహస కార్యాలు చేసే నరుడు మహా పాపాత్ముడని తెలుసుకోవాలి. (స.ప్ర. 6వ సము.) ॥345॥

దొంగలను దండించని రాజు నశించిపోతాడు- ఇది మనుకృతం-ప్రామాణికం

సాహసే వర్తమానం తు యో మర్షయతి పార్థివః । మూలశ్లోక సం. **211**
స వినాశం వ్రజత్యాశు విద్వేషం చాధిగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **346**

టీక:- యః పార్థివ ః = ఏ రాజు, **సాహసే వర్తమానం తు మర్షయతి** = సాహసిక కర్మలు చేసే ఆకతాయులను దండన చేయకుండా సహిస్తూ ఉంటాడో, ఆ రాజు, **సః ఆశు వినాశం వ్రజతి** = శీఘ్రంగా నష్టపడిపోతాడు. **చ** = మరియు, **విద్వేషం + అధిగచ్ఛతి** = ప్రజలకు రాజు మీద ద్వేషం ఎక్కువవుతుంది.

ఋషి దయానందభాష్యం:- బందిపోటు దొంగతనాన్ని సహించిన రాజు వెంటనే నాశనం పొందుతాడు. అతని రాజ్యంలో ద్వేషం చెలరేగుతుంది. (స.ప్ర. 6వ సము.) ॥346॥

మిత్రత కోసమో, ధనం కోసమో నేరస్థులను క్షమించరాదు- ఇది మనుకృతం-ప్రామాణికం

న మిత్రకారణాద్ రాజా విపులాద్ వా ధనాగమాత్ । మూలశ్లోక సం. **212**
సముత్సృజేత్ సాహసికాన్ సర్వభూతభయావహాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **347**

టీక:- స మిత్ర కారణాత్ వా విపులాత్ ధన + ఆగమాత్ = మిత్రుడని గానీ లేదా భూరి ధన ప్రాప్తిని ఆశించి గానీ, రాజా = రాజు, సర్వభూతభయ+ఆవహాన్ సాహసికాన్ = సర్వప్రాణులకు భయం కలిగించే నరరాక్షసులను, దుష్టులను, న సముత్సృజేత్ = బంధన-ఛేదనాదుల చేయకుండా విడిచిపెట్టరాదు.

ఋషి దయానందభాష్యం:- మైత్రివలన గాని, ఎక్కువ ధనము తనకు లభించగలదని గాని సర్వప్రాణులకు భయంకరులైన బందిపోటుదొంగలను శిక్షింపక విడువరాదు. ॥347॥

348,349వ శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *శస్త్రం ద్విజాతిభిర్గ్రాహ్యం ధర్మో యత్రోపరుధ్యతే ।*
ద్విజాతీనాం చ వర్ణానాం విప్లవే కాలకారితే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***348***

తాత్పర్యం:- ధర్మమునకు హానికలిగినపుడు ద్విజాతులవారు శస్త్రమును గ్రహింపవలెను. కాలవశమున ద్విజాతులలో తిరుగుబాటు కలిగినను శస్త్రము గ్రహింపవలెను. ॥348॥

* *ఆత్మనశ్చ పరిత్రాణే దక్షిణానాం చ సంగరే ।*
స్త్రీవిప్రాభ్యుపపత్తౌ చ ఘ్నన్ ధర్మేణ న దుష్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***349***

తాత్పర్యం:- తన ప్రాణమును రక్షించుకొనుటకు, సంపత్తి నెవరైన లాగుకొనునపుడును, స్త్రీలకు, విప్రులకు ఆపత్తి సంభవించినపుడు దుష్టసంహారము ధర్మప్రకారము చేసినచో పాపమంటదు. ॥349॥

ప్రక్షిప్తాల పరిశీలన

348-349 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

8.4-7 శ్లోకాల సంకేతం ప్రకారం, ఇక్కడ 344 శ్లోకంలో దోపిడి, హత్య వంటి సాహసోపేత అపరాధాలను నిర్ణయించడం ఉంది. వీటి ముందు వెనుకల శ్లోకాలలోనూ ఇదే వర్ణన ఉంది. మధ్యలోని ఈ శ్లోకాలలోని ప్రస్తుత విషయం కన్నా భిన్నమైన **'ద్విజాతీయుల ద్వారా ధర్మ విరోధం, పరస్పర విద్రోహ స్థితిలో శాస్త్రవిధానం' 'స్త్రీలు, విప్రుల రక్షణార్థం ఆయుధాలు ధరించటం'** మొదలైన విషయాలు ప్రసంగ వ్యతిరేకాలు. ఈ రెండు శ్లోకాలూ ఒకటే క్రియతో జోడించబడి ఉన్నాయి. అందుచేత మొదటిదే కాక రెండవదీ ప్రక్షిప్తమే!

2. అంతర్ వ్యతిరేకాలు

ధర్మపాలన అది చేయకపోవటం వల్ల శిక్ష, ధర్మపాలనలో ఎదురయ్యే అవరోధాలు తొలగించుకోవటం, స్త్రీలు, విప్రులు మొదలైనవారిని రక్షించటం - ఇవి రాజు కర్తవ్యాలు. ఒక వేళ ద్విజులు స్వయంగా ఆయుధాలు పూని అరాజకాన్ని వ్యాపింప చేయటం, ధర్మ విరుద్ధ కార్యాలను ఆపడం చేయకపోతే వీటివల్ల అరాజకత్వం ప్రబలుతుంది. ఆపైన రాజు, శిక్షా విధానాల అవసరం ఏముంటుంది? [7.3, 17, 24, 35, 143, 144]. ఈ విధంగా ఈ రెండు శ్లోకాలూ మనువు రాజ్య వ్యవస్థకు వ్యతిరేకాలు కావటం వల్ల ప్రక్షిప్తాలు.

దొంగలను చంపుట అపరాధం కాదు- **350 నుండి 352వ శ్లోకం వరకు మనుకృతం- ప్రామాణికం**

గురుం వా బాలవృద్ధౌ వా బ్రాహ్మణం వా బహుశ్రుతమ్ । మూలశ్లోక సం.**213**
ఆతతాయినమాయాన్తం హన్యాదేవావిచారయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**350**

టీక:- గురుం వా బాల వృద్ధౌ వా = గురువైనా లేదా బాలుడైనా, వృద్ధుడైనా, **బ్రాహ్మణం వా బహుశ్రుతమ్** = బ్రాహ్మణుడు కావచ్చు లేదా బహుశాస్త్రవేత్త అయినా కావచ్చు, **ఆతతాయినమ్ + ఆయాన్తం** = ఎవడు ధర్మాన్ని విడిచిపెట్టి అధర్మాన్ని ఆచరిస్తూ, నిరపరాధులను చంపుతాడో వారిని, **అవిచారయన్ + ఏవ హన్యాత్** = ఏ మాత్రం ఆలోచించకుండానే చంపివేయాలి. అంటే ముందు చంపి, తరువాత విచారణ మొదలు పెట్టాలి.

ఋషి దయానందభాష్యం:- శస్త్రము చేతబట్టి చంపుటకువచ్చిన ఆతతాయిని అతడు గురువైనను, బాలుడైనను, వృద్ధుడైనను, శాస్త్రములు, చదివిన బ్రాహ్మణుడైనను మంచిచెడ్డలు ఆలోచించక రాజు అతనిని చంపవలెను. (స.ప్ర. 6వ సము.) ॥350॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నాతతాయివధే దోషో హన్తుర్భవతి కశ్చన । మూలశ్లోక సం.**214**
ప్రకాశం వాఽప్రకాశం వా మన్యుస్తం మన్యుమృచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**351**

టీక:- ఆతతాయి వధే = నరహంతకులను వధించడంలో, **హన్తుః కశ్చనదోషః న భవతి** = చంపేవాడికి ఏ పాపం అంటదు. **ప్రకాశం వా + అప్రకాశం వా** = ప్రకాశం అంటే అందరి ఎదుట గానీ లేదా **అప్రకాశం** = ఏకాంతమున గానీ, **మన్యుః తం మన్యుం ఋచ్ఛతి** = ఎందుకంటే, క్రోధిని క్రోధంతో చంపటం అంటే క్రోధంతో క్రోధమునకే యుద్ధం జరిగిందని తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:-బాహాటముగా గాని, రహస్యముగా గాని ఆకతాయిని చంపినచో చంపినవారికి దోషమంటదు. క్రోధము క్రోధమును చంపునని తెలిసికోవాలి. (స.ప్ర.6వ సము.) ॥351॥

15వ వివాదం

స్త్రీ-సంగ్రహణ సంబంధమైన వివాద నిర్ణయం (352-387) ఇది మనుకృతం-ప్రామాణికం

పరదారాభిమర్శేషు ప్రవృత్తాన్నౄన్మహీపతిః । మూలశ్లోక సం.**215**
ఉద్వేజనకరైర్దణ్డైశ్ఛిన్నయిత్వా ప్రవాసయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**352**

టీక:- **పరదారా + అభిమర్శేషు ప్రవృత్తాన్ నౄన్** = బలాత్కరించి గానీ లేదా సహమతి పూర్వకంగా గానీ పర స్త్రీలతో వ్యభిచారం చేయడంలో నిమగ్నమైన పురుషులను, **మహీపతిః** = రాజు, **ఉద్వేజన కరైః దండైః ఛిన్నయిత్వా** = వ్యాకులత్వాన్ని కలిగించే భయానకమైన శిక్షలద్వారా (ముక్కు, చెవులు, చేతులు మొ॥ అంగములను ఖండించడం, **ప్రవాసయేత్** = దేశం నుండి వెళ్ళగొట్టాలి.

తాత్పర్యం:- ఇతరుల భార్యలను ఎత్తుకొని పోవు దుష్టునికి లేదా పరస్త్రీ సంభోగము చేసినవారికి భయానకమైన శిక్షగా ముక్కు, చెవి మొదలగునవి ఖండించి దేశమునుండి బహిష్కరించవలెను. ॥352॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *తత్సముత్థో హి లోకస్య జాయతే వర్ణసఙ్కరః ।*
యేన మూలహరోఽధర్మః సర్వనాశాయ కల్పతే ॥ *ప్రక్షిప్త శ్లోక సం.353*

తాత్పర్యం:- ఏ కారణం వల్లగానీ ఇతరుల భార్యలపై మోజువల్ల వర్ణసాంకర్య మేర్పడినప్పుడు, స్వచ్ఛమైన నడవడిగల భార్యలు లేని గృహస్థులకు యజ్ఞాదులు చక్కగా నడువవు. దీనివల్ల వర్షములు పడటం మొదలైన జగత్ సౌఖ్యదాయక క్రియలు నాశనమై, అరాచకం-అనావృష్టి తాండవించగలదు.

ప్రక్షిప్త పరిశీలన

353వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకంలోని కారణం, యుక్తియుక్తంగానూ, మనువుకు అనుకూలంగానూ లేదు. దీనిలోని విషయానికి/మునుపటి శ్లోకంతో పొంతన లేదు-

1. మునుపటి శ్లోకంలో వ్యభిచారం చేసిన అన్ని వర్ణాల వారినీ శిక్షించాలని ఉంది. ఈ శ్లోకంలో 'దానివల్ల వర్ణ సంకర సంతానం పుట్టుక'ను గురించి ఉంది. రెండు వేర్వేరు కులాల వారి సంబంధంతో పుట్టే వారి వల్ల 'వర్ణ సంకరం' కలుగుతుంది. కానీ వ్యభిచారమనేది వేర్వేరు కులాల వారు, ఒకటే కులం వారిలోనూ జరగవచ్చు. కనుక, దీని వల్ల 'వర్ణ సంకరం' అవుతుందనే మాట ఉచితం కాదు. అంటే శ్లోక రచయిత కేవలం భిన్న వర్ణాల వ్యభిచారాన్నే ఆపాలని చూస్తున్నాడా? ఏక వర్ణుల వారిది కాదా? కానీ మునుపటి శ్లోకంలో వ్యభిచారం చేసే అన్ని వర్ణాల వారూ దండనార్హులని ఉంది. ఈ విధంగా మునుపటి శ్లోకంలోని వ్యవస్థతో ఈ శ్లోకానికి పొంతన లేదు. కనుక ఇది వేరెవరో రాసింది.

2 ఈ శ్లోకంలో 'వర్ణ సంకరాన్ని' సర్వనాశనంలో సమర్థకంగానూ, ధర్మానికి మూల నాశనంగానూ భావించారు. దీని వల్ల 'వర్ణ సంకరం' అనే దాన్ని ధర్మం తన ఇచ్ఛానుసారం మలచుకోరాదు, అది ధర్మానికి హాని కలిగిస్తుందని తెలుస్తోంది. ఈ భావన పుట్టుకతో వర్ణ వ్యవస్థ ఆధారంతో ఏర్పడింది. ఇది మనువుకు వ్యతిరేకం. ఎందుకంటే మనువు కర్మలతో వర్ణ

వ్యవస్థను చెప్పాడు. అతని ప్రకారం ఏ కులంలో పుట్టిన బాలుడైనా, వ్యక్తి అయినా, జీవితంలో ఎప్పుడైనా ఇతర వర్ణపు విద్యను నేర్చుకుని దీక్ష తీసుకుంటే, ఆ వర్ణాల ధర్మాన్ని అవలంబించవచ్చు. అందుచేత మనువు వ్యవస్థలో వర్ణ సంకరం అనే దాని ప్రభావం లేనే లేదు. ఎందుకంటే, అక్రమసంతానం చట్టవ్యతిరేకం [1.92-101 లపై **'అనుశీలనం'**, 4.245; 2.167; 9.22-24; 10.65 శ్లోకాలు చూడండి]. ఈ విధంగా మనువు మౌలిక వ్యవస్థకు వ్యతిరేకం కావటం చేత ఈ శ్లోకం ప్రక్షిప్తం.

354,355వ శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

పరస్య పత్న్యా పురుషః సంభాషాం యోజయన్ రహః । మూలశ్లోక సం. **216**
పూర్వమాక్షారితో దోషైః ప్రాప్నుయాత్పూర్వసాహసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **354**

టీక:- పూర్వమ్ దోషైః ఆక్షారితః పురుషః = ఎవడు మొదట పరస్త్రీ సంగమ సంబంధిత దోషాల వల్ల అపరాధిగా ప్రకటింపబడి, **రహః పరస్య పత్న్యా సంభాషాం యోజయత్** = రహస్యంగా పరస్త్రీతో కామకలాపాలలో ఉన్నట్లు కనిపించినట్లయితే, **పూర్వసాహసమ్ ప్రాప్నుయాత్** = అతడికి పూర్వసాహసమనే జుర్మానా 250 పణములు విధించాలి.

తాత్పర్యం:- లోగడ తప్పుచేసి చెడ్డపేరుగలవాడు పర స్త్రీతో రహస్య ప్రదేశమున సంభాషణ చేసినచో నాతనికి పూర్వసాహస దండనను విధించాలి. ॥354॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యస్త్వనాక్షారితః పూర్వమభిభాషేత కారణాత్ । మూలశ్లోక సం. **271**
న దోషం ప్రాప్నుయాత్కించిన్న హితస్య వ్యతిక్రమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **355**

టీక:- యః తు పూర్వం అనాక్షారితః = కాని పూర్వం అపరాధిగా నిరూపించబడనివాడు, **కారణాత్ అభిభాషేత** = ఉచిత కారణం వల్ల సంభాషణ చేసినట్లయితే, **కించిత్ దోషం న ప్రాప్నుయాత్** = ఏ దోషానికి గురికాడు, **హి** = ఎందుకంటే, **తస్య న వ్యతిక్రమః** = అతడేమీ మర్యాదను అతిక్రమించలేదు.

తాత్పర్యం:- లోగడ తప్పు చేయనివాడు కారణాంతరముచే మాట్లాడవలసివచ్చినచో అతనిని నిర్దోషిగా భావించి దండింప నక్కరలేదు. ॥355॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *పరస్త్రియం యోఽభివదేత్తీర్థేఽరణ్యే వనేఽపి వా ।*
నదీనాం వాఽపి సంభేదే స సంగ్రహణమాప్నుయాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***356***

తాత్పర్యం:- పర స్త్రీతో తీర్థస్థలములందుకాని, అరణ్యమందుకాని, వనములందుకాని నదీసంగమములందు కాని సంభాషించిన పర స్త్రీ హరణదోషమంటును. అందుచే అతడు ఆ శిక్షకు పాత్రుడగును. ॥356॥

ప్రక్షిప్త పరిశీలన

353వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 354, 355 శ్లోకాలలోని వ్యవస్థకు భిన్నమైన వ్యవస్థ ఈ శ్లోకంలో ఉంది. ఏకాంతంలో మాటలాడేవారిలో ఎవరు దోషి, ఎవరు కాదు అనేది మునుపటి శ్లోకాలలో స్పష్టంగా ఉంది. ఇక్కడ అందరినీ మాట్లాడుకోవటం చేత స్త్రీల **'అపహరణ'**కు దోషులను చేయటం, పూర్వ శ్లోకాలకు వ్యతిరేకం.

ఖ. తర్వాతి 357 వ శ్లోకం లోనిది 'అపహరణ' దోషానికి నిర్వచనం. ఈ శ్లోకంలో చెప్పినవి దాని కిందికి రావు కనుక, ఈ శ్లోకం వేరెవరో రాసి చేర్చిన ప్రక్షిప్తమే!

పర స్త్రీ సంగ్రహణ విషయం - ఇది మనుకృతం. ప్రామాణికం

ఉపచారక్రియా కేళిః స్పర్శో భూషణవాససామ్ । మూలశ్లోక సం. **218**
సహ ఖట్వాసనం చైవ సర్వం సంగ్రహణం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **357**

టీక:- విషయగమనార్థం, **ఉపచారక్రియా=** పరస్పరాకర్షణం కోసం, పుష్పాలు, సుగంధాలు మొ॥ శృంగారిక వస్తువుల ఆదాన ప్రదానం చేయడం ఇవ్వడం-పుచ్చుకోవడం, **కేళిః=** విలాసక్రీడలు, **భూషణ వాససామ్ స్పర్శః =** పరస్పరం వస్త్ర-ఆభూషణములను స్పర్శించడం, (ఇందులో శరీర స్పర్శ చెప్పనవసరం లేదు) **చ** = మరియు, **సహ-ఖట్వా+ఆసనం** = కలిసి మంచం మీద కూర్చోవడం, కలిసి పడుకోవడం, కలిసి నివసించడం, **సర్వం సంగ్రహణం స్మృతమ్** = ఈ చేష్టలన్నీ 'సంగ్రహణమ్' పరస్త్రీ వలపుకు గుర్తు, ఇదంతా పరస్త్రీ హరణదోషమవుతుంది. అతడు శిక్షకు పాత్రుడు.

తాత్పర్యం:- పూలమాలలు, గంధం మొదలైనవి ధరింపజేయుటకాని, సరసములాడుట కాని, ఆభరణములు వస్త్రములనంటుకొనుట, పడకమీద, ఆసనము మీద కలిసికూర్చుండుట, స్త్రీ యొక్క గుప్తాంగములను స్పృశించుట పరస్త్రీ సంగ్రహణదోషమనబడును. ॥357॥

ఇది మనుకృతం. ప్రామాణికం

స్త్రియం స్పృశేదదేశే యః స్పృష్టో వా మర్షయేత్తయా । మూలశ్లోక సం. **219**
పరస్పరస్యానుమతే సర్వం సంగ్రహణం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **358**

టీక:- యః స్త్రియం అదేశే స్పృశేత్ = ఎవరైతే స్త్రీని తాకగూడని స్థలాలలో అనగా పిరుదులు, స్తనాలు మొదలగు ప్రదేశాలలో, **వా** = లేదా, **తయా స్పృష్టః మర్షయేత్** = ఆ స్త్రీ కూడా తనను తాకరాని చోట తాకుతుందో, **పరస్పరస్య + అనుమతే** = ఒకరికొకరు ఇష్టపడి చేసినా, **సర్వం సంగ్రహణం స్మృతం** = ఇవన్నియు కామ సంబంధమైనవని తెలుసుకోవాలి.

తాత్పర్యం:- ఎవరైతే స్త్రీని తాకకూడని పిరుదులు, స్తనాలు మొదలైన ప్రదేశాలలో తాకుతాడో-ఆ స్త్రీ కూడా తనను అలాంటి తాకరాని ప్రదేశాలలో తాకుతుందో, అలా ఒకర్నొకరు స్పృశించకూడని చోట్ల తాకినా ఊరుకొంటారో, వారిద్దరూ సంభోగాభిలాషగలవారని తెలుసుకోవాలి. ఇది పరస్త్రీల విషయంలో దోషమే. ॥358॥

359 నుండి 385 వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* ***అబ్రాహ్మణః సంగ్రహణే ప్రాణాన్తం దణ్డమర్హతి ।***
చతుర్ణామపి వర్ణానాం దారా రక్ష్యతమాస్సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***359***

తాత్పర్యం:- తనను వలచి రాని బ్రాహ్మణ స్త్రీని బ్రాహ్మణేతరుడెవరైనా కోరితే, అతడు దండనార్హుడే అవుతాడు. ఇలాగే ఇతర వర్ణస్థులు కూడా తమ భార్యల్ని ధనం కంటే అధికంగా కాపాడుకోవాలి. ॥359॥

* ***భిక్షుకా బన్దినశ్చైవ దీక్షితాః కారవస్తథా ।***
సంభాషణం సహ స్త్రీభిః కుర్యురప్రతివారితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***360***

తాత్పర్యం:- వృత్తి భిక్షుకులు, స్తుతి పాటగాళ్లు, యజ్ఞదీక్షలో ఉన్నవారు, వంటలు మొదలగు పనులు చేయువారు పరస్త్రీలతో మాట్లాడినచో అనుమానపడకూడదు. ॥360॥

* న సంభాషాం పరస్త్రీభిః ప్రతిషిద్ధస్సమాచరేత్ ।
నిషిద్ధో భాషమాణస్తు సువర్ణం దణ్డమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 361

తాత్పర్యం:- యజమాని వద్దని చెప్పాక, ఆ సేవకుడు ఏ స్త్రీతోను సంభాషించరాదు. అప్పటికీ వాడు చొరవ చూపినప్పుడు రాజు ఆ తుంటరికి 16 మినుముగింజల పరిమాణం గల సువర్ణం అపరాధం చెల్లించడానికిగాను శిక్షించవచ్చు. ॥361॥

* నైష చారణదారేషు విధిర్నాత్మోపజీవిషు ।
సజ్జయన్తి హి తే నారీర్నిగూఢాశ్చారయన్తి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 362

తాత్పర్యం:- నటులు-గాయకుల భార్యలకు పరస్త్రీ-దండనకు వర్తించే నియమాలు వర్తించవు. కొందరు నటులు కేవలం భార్య మూలాన జీవిస్తారు. ధనలాభంకోసం తమ-తమ భార్యల వెంతకు వచ్చేవారిని భర్త ఓర్చి ఉన్నప్పుడు నిషేధం పనిచెయ్యదు. కొందరు చారణులు, పరపురుషుల్ని తామే స్వయంగా తెచ్చి భార్యలకు అప్పగిస్తారు. వారికీ ఈ నిషేధం వర్తించదు. ॥362॥

* కిఞ్చిదేవ తు దాప్యస్స్యాత్సంభాషాం తాభిరాచరన్ ।
ప్రైష్యాసు చైకభక్తాసు రహః ప్రవ్రజితాసు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 363

తాత్పర్యం:- నిర్జన ప్రదేశంలో జారిణులైన స్త్రీలకు జీవనాధారం కోసం మధ్యవర్తిత్వం నెరిపే స్త్రీలతో సంభాషించేవాడు ఆమె పరస్త్రీ కాబట్టి కొంత అపరాధరుసుము చెల్లించాలి.

ఇతరులను పొందరాదని ముందే కట్టడిచేసి తానుంచుకొన్న వేశ్యతో ఎవరైన పరపురుషుడు సంభాషించినా అది అపరాధమవుతుంది. బ్రహ్మచారిణులు-బౌద్ధ సన్యాసినులతో సంభాషించినా అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ॥363॥

* యోఽకామాం దూషయేత్ కన్యాం స సద్యో వధమర్హతి ।
సకామాం దూషయంస్తుల్యో న వధం ప్రాప్నుయాన్నరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 364

తాత్పర్యం:- ఎంత హీనజాతి వాడైనా, తనను కోరని స్త్రీని పొందడం (బలాత్కారంగా) జరిగితే, అలాంటి వాడు లింగచ్ఛేదనమనే దండనకు అర్హుడు. ఆమె వలచి, అలాంటి వాడికోరిక తీరిస్తే దండన లేదు. ॥364॥

* కన్యాం భజన్తీముత్కృష్టం న కించిదపి దాపయేత్ ।
జఘన్యం సేవమానాం తు సంయతాం వాసయేద్గృహే ॥ ప్రక్షిప్త శ్లోక సం. 365

తాత్పర్యం:- సంభోగాపేక్షచేత తనకంటే అధిక జాతిలో పుట్టిన పురుషుడి చేత తన కోరిక తీర్చుకున్న ఇంతికి దండనలేదు. కాని, తనకంటే హీనజాతి పురుషుడితో సంభోగించ కోరు స్త్రీకి, గృహనిర్బంధం-కాళ్లకి సంకెళ్లు వేయడంలాంటి శిక్షలు కామం మరల్చేందుకు వేయవచ్చు! ॥365॥

* ఉత్తమాం సేవమానస్తు జఘన్యో వధమర్హతి ।
శుల్కం దద్యాత్ సేవమానః సమామిచ్ఛేత్పితా యది ॥ ప్రక్షిప్త శ్లోక సం. 366

తాత్పర్యం:- కన్య ఉత్తమకులంలో ఉన్నప్పుడు, కామి అధమజాతివాడైతే ఆ కన్య ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేక ఆ పురుషుణ్ణి దండించాలి. లింగచ్ఛేదం-వధ వంటి శిక్షలుంటాయి.

సమాన జాతి గల పురుషుడి వలపుచేత, కన్య సమ్మతితో రమించినట్లయితే, దానికి ఆ పిల్లతండ్రి ఆమోదం తెల్పితే, అతను అడిగినంత ఓలి చెల్లించాలి. అంతేగాని ఆ పురుషుడు దండనార్హుడు కాడు. ఆ కన్యను అతడే తదుపరి వివాహం ఆడాలి. ॥366॥

* అభిషహ్య తు యః కన్యాం కుర్యాద్ దర్పేణ మానవః ।
తస్యాశు కర్త్యే అంగుల్యౌ దణ్డం చార్హతి షట్ఛతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **367**

తాత్పర్యం:- ఏ పురుషుడైనా బలాత్కారంగా సమాన జాతి స్త్రీని అహంకారం చేత, దాని యోనిలోకి వేళ్లు చొప్పించి నొప్పి కలిగిస్తే, అతని వ్రేళ్లు కోసివేయడం, ఆరువందల బంగారు నాణేలు జరిమానా శిక్ష. ॥367॥

* సకామాం దూషయంస్తుల్యో నాంగులిచ్ఛేదమాప్నుయాత్ ।
ద్విశతం తు దమం దాప్యః ప్రసంగవినివృత్తయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **368**

తాత్పర్యం:- తనయందు వలపు గల కన్యక రహస్యాంగంలో వ్రేళ్లు జొనిపినవాడికి శిక్షలేదు. కానీ అమిత కామాసక్తి నివారించడానికి మాత్రం రెండొందల సువర్ణాల జరిమానా విధించవచ్చు! ॥368॥

* కన్యైవ కన్యాం యా కుర్యాత్ తస్యాస్స్యా ద్విశతో దమః ।
శుల్కం చ ద్విగుణం దద్యాచ్ఛిఫాశ్చైవాప్నుయాద్దశ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **369**

తాత్పర్యం:- సాటి కన్యను మరొక కన్య (స్త్రీ) అయినప్పటికీ ఇదే విధంగా యోనిలోనికి వ్రేళ్లు చొప్పించి బాధిస్తే పైన చెప్పినట్లే దండన విధించాలి. ఇది ఉపరతి క్రియ కాబట్టి దీన్ని స్త్రీ పట్ల పురుషుడాచరించినా మరోస్త్రీచేసినా నేరము. దీనిగ్గాను ఆ పిల్లతండ్రి అడిగినంత శుల్కం ఇప్పించి మర్రి ఊడల చేత పది దెబ్బలు కొట్టించే శిక్ష స్త్రీకి అదనం. ॥369॥

* యా తు కన్యాం ప్రకుర్యాత్ స్త్రీ సా సద్యో మౌణ్డ్యమర్హతి ।
అంగల్యోరేవ వా ఛేదం ఖరేణోద్వహనం తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **370**

తాత్పర్యం:- కన్యకు, ఒక వివాహిత యువతి ఇలాగే రహస్యాంగంలో వేళ్లుచొప్పించి బాధిస్తే, ఆ యువతికి తలనున్నగా గొరిగించి, గాడిద మీద ఊరేగించాలి. ॥370॥

గర్వంతో వ్యభిచరించే స్త్రీకి దండన - **371, 372**వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* భర్తారం లంఘయేద్యాతు స్త్రీ జాతిగుణదర్పితా ।
తాం శ్వభిః ఖాదయేద్ రాజా సంస్థానే బహుసంస్థితే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **371**

టీక:- యాతు స్త్రీ = ఏ స్త్రీ అయితే, జాతి-గుణ-దర్పితా = తన జాతిని గుణాలను, (సౌందర్యాదులు) చూసుకొని గర్వపడి, భర్తారం లంఘయేత్ = భర్తను వదిలి వ్యభిచరిస్తుందో, తాం = ఆమెకు, బహుసంస్థితే సంస్థానే శ్వభిః రాజా ఖాదయేత్ = అనేక మంది స్త్రీల, పురుషుల ఎదుట జీవించి ఉండగానే కుక్కలచేత కరిపించి, తినిపించి చంపివేయాలి.

ఋషి దయానందభాష్యం:- ఏ స్త్రీ ధనికులైన తండ్రి మొ॥ వారివల్ల గర్వం చేతను, చక్కదనం మొదలైన గుణాలవల్ల, గర్వం చేత పరపురుష గమనాదులచేత భర్తను వదిలి వ్యభిచరిస్తుందో, ఆ స్త్రీని రాజు పెక్కండ్రు జనులతో నిండిన ప్రదేశంలో కుక్కలచేత కరిపించి, తినిపించి చంపించాలి. (స.ప్ర. 6వ సము.) ॥371॥

గర్వంతో వ్యభిచరించే పురుషుడికి దండన- ఇది మనుకృతం-ప్రామాణికం

* పుమాంసం దాహయేత్పాపం శయనే తప్తఆయసే ।
అభ్యాదధ్యుశ్చ కాష్ఠాని తత్ర దహ్యేత పాపకృత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **372**

టీక:- పాపం పుమాంసం = అదేవిధంగా పురుషుడు, తన భార్యను వదిలి పర స్త్రీ లేదా వేశ్యాగమనం చేసే పాపిని, **ఆయసే తప్తశయనే** = అగ్నితో కాల్చిన ఇనుప మంచం మీద పడుకోబెట్టి, జీవించి ఉండగానే, **తత్ర పాపకృత్ దహ్యేత** = ఆ పాపి అనేక పురుషుల ఎదుట కాలి భస్మమైపోవాలి, **కాష్ఠాని అభ్యాదధ్యుః** = ప్రజలు ఆ పాపి మీద కాలిపోవడానికి సమిధలను ఉంచాలి.

ఋషి దయానందభాష్యం:- పురుషుడు తన భార్యను వదిలి పరస్త్రీ లేదా వేశ్యాగమనం చేస్తే ధగధగమండుతున్న ఇనుప మంచం మీద పరుండబెట్టి, జీవించి ఉండగానే ఆ పాపిని అనేక పురుషుల ఎదుట కాలి భస్మమై పోవుటకు, ప్రజలు సమిధలను వేయాలి. (స.ప్ర.6వ సము) ॥372॥

వివరణ:

371-372 శ్లోకాలు ప్రసంగమునకు విరోధంగా ఉన్నా...

1. ప్రక్షిప్తాంతర్గతమని చెప్పజాలం. కారణం-'స్త్రీ సంగ్రహణమునకు సంబంధించిన విశేష పరిస్థితులలో విశేష దండ వ్యవస్థ ఇది. తన రూప సౌందర్యం వల్ల లేదా ఉన్నతకులమని గాని గర్వించి తన జీవిత భాగస్వామిని తిరస్కరించి, గర్వకారణంగా స్త్రీ గాని, పురుషుడు గాని, పర పురుషగమనం లేదా పరస్త్రీ సంగమం చేసినట్లయితే-వారికి ఈ దండవ్యవస్థ చేయబడింది.

2. ఇది చాలా కఠోరమైన దండన వ్యవస్థ. ఇంతటి కఠోర దండన చేయడానికి కారణాలివి. గర్వపోతు, అహంకారి అయిన వ్యక్తి తన బలాన్ని చూసుకొని సమస్తమైన సాంఘిక మర్యాదలను ఉల్లంఘించి, ప్రభుత్వాన్ని (Law & Order) కూడా లక్ష్య పెట్టకుండా నిరంకుశంగా ప్రవర్తించినందువల్ల అతడికి బహిరంగంగా ప్రజల ఎదుట కఠోరదండన చేసే వ్యవస్థ చేయడమైనది. మహర్షి దయానందులవారు సత్యార్థ ప్రకాశమనే గ్రంథంలో 6వ సముల్లాసంలో, ప్రశ్నోత్తర రూపంలో చేసిన వివరణ-ఉదాహరణీయం.

1. **ప్రశ్న:** రాజుగాని, రాణిగాని లేదా న్యాయాధీశుడుగాని, ఆయన భార్య గాని వ్యభిచారాది కుకర్మలు చేసినప్పుడు వారినెవరు దండిస్తారు?

   జవాబు: సభ. వారికి సాధారణ ప్రజల కంటే అధిక దండన ఉండాలి.

2. **ప్రశ్న:** రాజాదులు వారి వల్ల ఎందుకు దండింపబడాలి?

   జవాబు: రాజు కూడా ఒక పుణ్యాత్మ భాగ్యశాలి అయిన పురుషుడు. అలాంటివాడికి దండన లేకపోయినా, ఆయన దండనమును స్వీకరించనిచో ఇక సామాన్య ప్రజలు ఎందుకు స్వీకరిస్తారు? ప్రజల ప్రధాన రాజ్యాధికారులు, సభ (అందరు సభికులు) ధర్మాన్ననుసరించి దండన చేస్తూ రాజు ఒక్కడు మాత్రం ఏమి చేయగలడు? ఇలాంటి వ్యవస్థే లేనట్లయితే, రాజు గాని, ప్రధాని గాని, మిగిలిన సమర్థులైన పురుషులందరూ అన్యాయంలో మునిగి, న్యాయధర్మాలను వదిలి, సర్వప్రజలను నాశనం చేసి తాము కూడా నష్టపోతారు. న్యాయపూర్ణమైన దండనే రాజు. అదే ధర్మం. అలాంటి ధర్మాన్ని పాటించనివాడి కంటే నీచుడెవ్వడున్నాడు?

3. **ప్రశ్న:** ఈ కఠిన దండన ఉచితం కాదు. ఎందుకంటే మానవుడు ఏ అంగమును నిర్మించేవాడు కాదు. బ్రతికించేవాడు కాదు. అందువల్ల అంగచ్ఛేదన దండన ఉచితం కాదు.

   జవాబు: ఈ దండన కఠినమైన దండనగా భావించేవారికి రాజనీతి తెలియదని చెప్పవలసివస్తున్నది. ఎందుకంటే ఈ ప్రకారంగా ఒకరికి కఠినమైన దండన ఇచ్చినప్పుడు తక్కిన ప్రజలు చెడు పనులు చేయడానికి భయపడి పాపకర్మలకు దూరంగా ఉంటారు. ధర్మకార్యాలను చేయడానికి ప్రయత్నిస్తారు. ఇక ఎవరికీ ఇంతటి కఠిన శిక్ష ఇవ్వాల్సిన పని ఉండదు. అలా కాకుండా దండన సులభంగా ఉంటే ఇక కోట్ల కొద్దీ పాపకర్మలలో నిర్భయంగా ప్రయత్నిస్తారు. అప్పుడు ఇంకా ఎంతో మందికి ఈ కఠిన దండన ఇవ్వాల్సి వస్తుంది.

* సంవత్సరాభిశస్తస్య దుష్టస్య ద్విగుణో దమః ।
వ్రాత్యయా సహ సంవాసే చాణ్డాల్యా తావదేవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **373**

తాత్పర్యం:- పరస్త్రీని పొంది అందుచే భ్రష్టుడై ఒకసంవత్సర కాలం దండనను పొందక ఉన్నట్లయితే వాణ్ణి ముందు చెప్పిన దండమునకంటే రెండింతలుగా దండమును విధించాలి. వ్రాత్య స్త్రీతో (కర్మభ్రష్టుని భార్యతో) ఉండువాడు చండాలస్త్రీని పొందినవాడితో సమానంగా దండం చెల్లించాలి. చండాల స్త్రీతో కూడినవాడికి వేయిరూకలు దండన విధింపబడినది కాబట్టి వాడితో సమంగా వ్రాత్యాగమనం చేసినవాడికి కూడా దండన విధించాలి. అలా మొదట దండనం పొంది మళ్ళీ వ్రాత్యచండాలగమనములు కలిగి ఉన్నట్లయితే వాడు మొదటి దండమునకు రెట్టింపుగా రెండువేల రూకలు దండం చెల్లించాలి. ॥373॥

* శూద్రో గుప్తమగుప్తం వా ద్వైజాతం వర్ణమావసన్ ।
అగుప్తమంగసర్వస్వైర్గుప్తం సర్వేణ హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **374**

తాత్పర్యం:- భర్తలు మొదలైన వారిచేత కాపాడబడేది గానీ, కాపాడబడనిది గానీ ద్విజాతి స్త్రీని శూద్రుడు గాని పొందినా, అరక్షితస్త్రీని రమించినా అలాంటి వాడికి పురుషాంగం కోసి, వాడి ధనమంతా ప్రభుత్వపరం చేయాలి. రక్షితను బలాత్కారం చేస్తే, వాడిని వధించి ఆ పిల్లకు అతడి సమస్త ఆస్తి అప్పగించాలి. ॥374॥

* వైశ్యః సర్వస్వదణ్డః స్యాత్ సంవత్సరనిరోధతః ।
సహస్రం క్షత్రియో దణ్డ్యో మౌణ్డ్యం మూత్రేణ చార్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **375**

తాత్పర్యం:- భర్తచేత రక్షితురాలైన బ్రాహ్మణస్త్రీని వైశ్యుడు బలాత్కరింపజూస్తే, అతణ్ణి చెరలో వేసి-అతడి సమస్త ధనాన్ని లాక్కోవాలి. క్షత్రియు డీ పనికి పాల్పడితే వేయిరూకలు జరిమానా, దండనగా గాడిద మూత్రంతో తలగొరిగించడం జరగాలి. ॥375॥

* బ్రాహ్మణీం యద్యగుప్తాం తు గచ్ఛేతాం వైశ్యపార్థివౌ ।
వైశ్యం పంచ శతం కుర్యాత్ క్షత్రియం తు సహస్రిణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **376**

తాత్పర్యం:- భర్త మొ॥ వారిచేత సంరక్షింపబడని బ్రాహ్మణ స్త్రీని వైశ్యక్షత్రియులు పొందిరేని, అప్పుడు వైశ్యులకు ఐదువందలురూకలు దండమును, క్షత్రియుడికి వేయిరూకలు దండమును విధించాలి. వైశ్యుడు బ్రాహ్మణ స్త్రీని శూద్రస్త్రీ భ్రమచేత కలిసినప్పుడు, ఆ బ్రాహ్మణి కేవలం బ్రాహ్మణజాతియందు పుట్టి నిషిద్ధ కార్యములు ఆచరించునప్పుడు మాత్రం తప్ప తక్కినప్పుడు వేయిరూకలు దండం. ఇతర బ్రాహ్మణ స్త్రీగమనమందు వాటికి వేయిరూకలు దండం విధించాలి. ॥376॥

* ఉభావపి తు తావేవ బ్రాహ్మణ్యా గుప్తయా సహ ।
విప్లుతౌ శూద్రవద్దణ్డ్యౌ దగ్ధవ్యౌ వా కటాగ్నినా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **377**

తాత్పర్యం:- ఆ వైశ్యక్షత్రియులిద్దరూ భర్త్రాదులచేత సంరక్షిత అయ్యేదాన్ని చేరిరేని,శూద్రుడిలాగా వారిని చాపతో చుట్టి నిప్పుపెట్టి కాల్చాలి. వైశ్యుణ్ణి ఇనుపదర్భలతోనూ, క్షత్రియుణ్ణి రంపములతోనూ చుట్టి కాల్చాలి, శ్లోకమున క్షత్రియుడికి వేయిరూకలు, వైశ్యుడికి సర్వస్వమును అపకారంగా తీసుకోవాలని చెప్పినందువల్ల, ఇందు చెప్పిన ప్రాణాంతిక దండం గుణవతి అయిన బ్రాహ్మణిని పొందువిషయంలో అని తెలుసుకోవాలి. ॥377॥

* *సహస్రం బ్రాహ్మణో దణ్డ్యో గుప్తాం విప్రాం బలాద్వ్రజన్ ।*
శతాని పంచ దణ్డ్యః స్యాదిచ్ఛన్త్యా సహ సంగతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***378***

తాత్పర్యం:- భర్త్రాదులచేత రక్షిత అయిన బ్రాహ్మణిని బలాత్కారంతో పొందు విప్రుడికి వేయిరూకలు దండమును, కోరివచ్చిన దాంతో ఒకతడవ కూడినవాడికి వేయిరూకలును దండం విధించాలి. ॥378॥

* *మౌణ్డ్యం ప్రాణాన్తికం దణ్డో బ్రాహ్మణస్య విధీయతే ।*
ఇతరేషాం తు వర్ణానాం దణ్డః ప్రాణాన్తికో భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***379***

తాత్పర్యం:- రక్షితస్త్రీని (బ్రాహ్మణి అయినప్పుడు) ఇతరులు ఎవరైనా బలాత్కరిస్తే వేయి రూకలు దండన, ఆమె కోరి సంగమించినా వేయిరూకలు దండన. సాటి బ్రాహ్మణుడే ఈ పనికి పాల్పడినా దండనలో మార్పులేదు. ఇంతకంటే హీనమైన నేరాలవల్ల బ్రాహ్మణుడికి 'వధం' శిక్షగా పడితే, అతడి తల నున్నగా గొరగడమే వధతో సమానమైన శిక్ష. ॥379॥

* *న జాతు బ్రాహ్మణం హన్యాత్ సర్వపాపేష్వపి స్థితమ్ ।*
రాష్ట్రాదేనం బహిః కుర్యాత్ సమ గ్రధనమక్షతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***380***

తాత్పర్యం:- సకలపాపాలు చేసే బాహ్మణుడిని వధించ కూడదు. అతడిని అన్ని విధాలా నిర్ధనుడిని చేసి, ఒక్కదెబ్బనైనా కొట్టక కట్టుబట్టల్తో దేశాన్నుంచి వెళ్ళగొట్టాలి. ॥380॥

* *న బ్రాహ్మణవధాద్ భూయానధర్మో విద్యతే భువి ।*
తస్మాదస్య వధం రాజా మనసాపి న చిన్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***381***

తాత్పర్యం:- ఈ లోకంలో బ్రాహ్మణ వధ కంటే మించిన గొప్ప అధర్మం ఇంకొకటి లేదు. కాబట్టి ప్రభువు బ్రాహ్మణ హత్యను మనస్సులో నైనా తలచరాదు. ॥381॥

* *వైశ్యశ్చేత్ క్షత్రియాం గుప్తాం వైశ్యాం వా క్షత్రియో వ్రజేత్ ।*
యో బ్రాహ్మణ్యామగుప్తాయాం తావుభౌ దణ్డమర్హతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***382***

తాత్పర్యం:- రక్షిత అయిన క్షత్రియ కన్యను వైశ్యుడు పొందినా, రక్షిత అయిన వైశ్యస్త్రీని క్షత్రియుడు పొందినా అరక్షితబ్రాహ్మణ స్త్రీని పొందినవారి కెలా దండం విధింపబడిందో ఆ విధంగా వైశ్యుడికి నూరురూకలును, క్షత్రియుడికి వేయి రూకలు దండం విధించాలి. రక్షితక్షత్రియ స్త్రీని బొందిన వైశ్యుడికి విధించిన అయిదువందలరూకలు దండం చులకనగా ఉన్నందువల్ల, గుణవద్వైశ్యుడు నిర్గుణజాతి మాత్రంచేత బ్రతికి ఉండు క్షత్రియను శూద్రభ్రాంతి మొదలగువానిచే పొందు విషయంలో ఏర్పడింది. క్షత్రియుడు బుద్ధిమంతుడై ఉండి రక్షితవైశ్యను పొందుట తప్పిదం కాబట్టి వేయిరూకలు దండం విధించడం యుక్తమని తెలుసుకోవాలి. ॥382॥

* *సహస్రం బ్రాహ్మణో దణ్డం దాప్యో గుప్తే తు తే వ్రజన్ ।*
శూద్రాయాం క్షత్రియవిశోః సాహస్రో వై భవేద్ దమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***383***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు రక్షితలైన క్షత్రియవైశ్య స్త్రీలను పొందినప్పుడు వేయిరూకలు దండం విధించాలి. రక్షితశూద్ర స్త్రీని క్షత్రియవైశ్యులు పొందినప్పుడు వేయిరూకలే దండం విధించాలి. ॥383॥

* క్షత్రియాయామగుప్తాయాం వైశ్యే పఞ్చశతం దమః ।
మూత్రేణ మౌణ్ఢ్యమిచ్ఛేత్ తు క్షత్రియో దణ్డమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **384**

తాత్పర్యం:- అరక్షితయగు క్షత్రియస్త్రీని పొందినపుడు వైశ్యునకు అయిదురూకలు దండము విధింపవలయును, అలా రక్షితయగు వైశ్య స్త్రీని పొందిన క్షత్రియునకు గాడిదమూత్రముతో ముండనము చేయుటగాని, అయిదునూర్లరూకల దండనగాని విధింపవలయును. ॥384॥

* అగుప్తే క్షత్రియావైశ్యే శూద్రాం వా బ్రాహ్మణో వ్రజన్ ।
శతాని పఞ్చదణ్డ్యః స్యాత్ సహస్రం త్వన్త్యజస్త్రియమ్ । ప్రక్షిప్త శ్లోక సం. **385**

తాత్పర్యం:- అరక్షితలైన క్షత్రియవైశ్యశూద్ర స్త్రీలను పొందు బ్రాహ్మణునికి అయిదువందలురూకలును, చండాలకాంతను పొందు ఆ బ్రాహ్మణుడికి వేయిరూకలును దండం విధించాలి. ॥385॥

ప్రక్షిప్తాల పరిశీలన

359 -385 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలన్నీ మనువు మౌలిక వ్యవస్థకు వ్యతిరేకాలు. మనువు అపరాధులందరికీ నిర్లిప్తమూ, సమభావ దండన పద్ధతే చెప్పాడు. [7.2,66,8.345,9.307,311]. కానీ తెలివిగల, బాధ్యత గల వాడు కావడం చేత, ఉన్నతస్థాయి, ఉన్నత వర్గీయులకు మిగిలినవారి కన్నా ఎక్కువ శిక్ష విధించాడు. ఈ శ్లోకాలలో ఉన్నత, నిమ్న వర్ణాలననుసరించి పక్షపాతపూర్వకంగా క్రమంగా ఎక్కువ తక్కువలుగా శిక్షలు విధించారు. ఇది మనువు చెప్పిన దానికి వ్యతిరేకమూ, పక్షపాతభావనతో ఉన్నది. ఇందులోని 352,357, 371, 372 శ్లోకాలను వీటి పుష్టికొరకు చూడండి, వాటిలో మనువు శైలిని పోలి, అందరి అపరాధాలకూ సమాన పద్ధతులే ఉన్నాయి. ఈ వ్యతిరేకత కారణంగా ఇవి ప్రక్షిప్తాలు.

ఖ. స్త్రీల అపహరణతో మొదలైన 8.352వ శ్లోకంలో, ఈ అపరాధం చేసినవారిని దండించి దేశం నుంచి వెళ్లగొట్టాలనే ఆదేశం ఉంది. 8.371-372లలోని స్త్రీ పురుషులకు సార్వజనిక మృత్యుదండన పై శ్లోకంలోని ఆదేశానికి వ్యతిరేకంగా ఉంది. ఇటువంటి క్రూర దండన విధానం మనుస్మృతిలోని మౌలిక శ్లోకాలతో ఎక్కడా చెప్పలేదు.

గ. ఈ శ్లోకాలలో భార్యద్వారా జీవిస్తున్న జనం గురించీ, దాసీ స్త్రీలను గురించీ ఉంది. మనువు వ్యవస్థలో వీరిని గురించి ఎక్కడా చెప్పలేదు. భార్య ద్వారా ఉపాధి ఏర్పడటం కానీ, దాసీ వ్యవస్థను కానీ మనువు అంగీకరించలేదు. అన్ని విధాలుగానూ పరస్త్రీ-పురుషుల సంబంధాలను దండనార్హమని చెప్పాడు. [8.352] శూద్రులకు తమ ఇష్ట ప్రకారమే ఏ ద్విజాతీయులకైనా సేవ చేసే స్వతంత్రం ఉందన్నాడు [1.91,9.334,335]. కనుక ఇది తర్వాత వచ్చిన వికృత సంప్రదాయాల కాలంలో చేర్చిన శ్లోకం.

ఘ. 359, 364-365 శ్లోకాలు, 8.352కు వ్యతిరేకంగా ఉన్నాయి. సకాములైనా, అకాములైనా మనువు దృష్టిలో వ్యభిచారిణులందరూ శిక్షలకు పాత్రులే.

ఙ. 366వ శ్లోకం, 3.5-54 శ్లోకాలకు వ్యతిరేకంగా ఉంది. మనువు వివాహాలలో ఎటువంటి కట్నాలూ వద్దని నిషేధించాడు.

చ. ఈ అన్ని శ్లోకాలలోనూ రక్షితం-అరక్షితం అనే భేదాలతో బహువివాహాల సమర్థన ఉంది. ఇది కూడా మనువు పద్ధతికి వ్యతిరేకమే. మనువు ప్రతివారికీ ఒకటే వివాహపద్ధతిని ఏర్పరిచాడు[3.4-5; 5.167-168, 7.77].

2. ప్రసంగ వ్యతిరేకాలు

352 నుంచి 'స్త్రీల అపహరణ'కు సార్వజనీనమైన శిక్షా వ్యవస్థను ఏర్పరచి, 357-358లలో 'స్త్రీల అపహరణ'కు నిర్వచనం చెప్పారు. ఇలా నిర్వచించడం ప్రసంగం ముగింపునకు సంకేతమవుతుంది. ప్రసంగం ముగిసిన తర్వాత మళ్లీ దాన్నే మరో పద్ధతిలో నడిపించడం ప్రసంగవ్యతిరేకం. అందుచేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

పంచవిధ మహాపరాధులను వశపరచుకొనే రాజు ఇంద్రుడితో సమానం

386 నుండి 389వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

యస్య స్తేనః పురే నాస్తి నాన్యస్త్రీగో న దుష్టవాక్ । మూలశ్లోక సం.**220**
న సాహసికదణ్డఘ్నౌ స రాజా శక్రలోకభాక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**386**

టీక:- **యస్య** = ఏ రాజు రాజ్యంలో, **స్తేనః న + అస్తి** = దొంగలు లేరో, **న అన్యస్త్రీ గో** = పర స్త్రీ సంపర్కం చేసేవాడులేడో, **న దుష్టవాక్** = పరుష వాక్కులు (తిట్లు) బూతులు ప్రయోగించేవాడులేడో, **న సాహసిక దండఘ్నౌ** = బలాత్కారంతో హింసించేవారు లేరో మరియు రాజుగారి ఆజ్ఞలను భంగపరిచేవారు లేరో, **సః రాజా శక్రలోకభాక్** = ఆ రాజు అత్యంత శ్రేష్ఠుడు, సుఖవంతుడు.

ఋషి దయానందభాష్యం:- ఏ రాజ్యములో దొంగ, వ్యభిచారి, తిట్టువాడు, కొట్టువాడు, చంపువాడు ఉండరో ఆ రాజు, స్వర్గాన్ని పొందుతాడు. అనగా సుఖంగా ఉంటాడు. (స.ప్ర.6వ సము.) ॥386॥

వివరణ:

"శక్రలోకభాక్" అనే పదానికి "ఇంద్ర లోకానికి వెళ్ళేవాడు లేదా స్వర్గానికి పోవువాడు" అని కొందరు వ్యాఖ్య చేశారు. అది ఉచితం కాదు. "రాజు ఇంద్రపదవికి అధికారి. ఇంద్రుని లాగా శ్రేష్ఠుడు, శక్తిశాలి అని భావన. ఇంద్రుని లాగా ప్రసిద్ధుడు, ప్రభావశాలి అని అర్థం. రాబోయే శ్లోకముకూడా ఈ అర్థాన్నే సూచిస్తుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతేషాం నిగ్రహో రాజ్ఞః పఞ్చానాం విషయే స్వకే । మూలశ్లోక సం.**221**
సామ్రాజ్యకృత్సజాత్యేషు లోకే చైవ యశస్కరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**387**

టీక:- **స్వకే విషయే** = తన రాజ్యంలో, **ఏతేషాం పంచానాం నిగ్రహః** = ఈ ఐదుగురిని అణచివేసే రాజు, **సజాత్యేషు సామ్రాజ్యకృత్** = సజాతీయులైన అన్యరాజులలోను సామ్రాజ్యాలను ఏలే అన్య రాజులలో శిరోమణి రాజుగా ప్రసిద్ధిని పొందుతాడు. **చ ఏవ** = మరియు, **లోకే యశస్కరః** = లోకంలో యశస్సుకు పాత్రుడవుతాడు.

తాత్పర్యం:- పై జెప్పిన యైదుగురుని అణచివేయురాజునకు తోటిరాజులలోను లోకములోను యశస్సు అభివృద్ధి చెందును. ॥387॥

ఋత్విక్-యజమానుల మధ్య పరస్పర ఎడబాటుతో దండన - ఇది మనుకృతం-ప్రామాణికం

ఋత్విజం యస్త్యజేద్యాజ్యో యాజ్యం చర్త్విక్ త్యజేద్యది । మూలశ్లోక సం.**222**
శక్తం కర్మణ్యదుష్టం చ తయోర్దణ్డః శతం శతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**388**

టీక:- **యః యాజ్యం** = ఏ యజమాని, **కర్మణి శక్తం చ అదుష్టం** = కర్మలో సమర్థుడు, శ్రేష్ఠుడైన, **ఋత్విజం** = పురోహితుణ్ణి, **త్యజేత్** = విడిచిపెట్టినా, **చ** = మరియు, **యాజ్యం ఋత్విజం త్యజేత్** = అలాంటి యజమానిని పురోహితుడు విడిచిపెట్టినా, **తయోః** = వారిద్దరికీ, **శతం శతమ్ దండ్యః** = వంద వంద పణములు (8.136) జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- ఏ యజమాని యాగం చేయించగల పురోహితుణ్ణి మహాపాతకాదిదోషాలు లేని వాడిని విడిచిపెట్టినా అలాగే ఏ ఋత్విజుడు ఏ దోషంలేని యజమానిని (యాగం చేయువాడిని) విడిచిపెట్టినా, వారిద్దరికీ వందవందపణములు జుర్మానా విధించాలి. ॥388॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తల్లి, తండ్రి, భార్య పుత్రులను దండించకుండా వదిలినందుకు దండన

న మాతా న పితా న స్త్రీ న పుత్రస్త్యాగమర్హతి । మూలశ్లోక సం. **223**
త్యజన్న పతితానేతాన్రాజ్ఞా దణ్డ్యశ్శతాని షట్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **389**

టీక:- న మాతా, న పితా, న స్త్రీ, న పుత్రః త్యాగమ్ + అర్హతి = తల్లి, తండ్రి, భార్య, పుత్రుడు త్యజించతగినవారు కారు, **అపతితాన్ ఏతాన్ త్యజన్** = నిర్దోషులైనా, వీరిని వదిలినా, విడిచిపెట్టినా, **రాజ్ఞా షట్ శతాని దండ్యః** = రాజు ద్వారా వారికి 600 పణముల జుర్మానా వేయబడును.

తాత్పర్యం:- తల్లి, తండ్రి, భార్య, పుత్రుడు వీరిని పోషించకుండా, శుశ్రూష చేయదగిన వారిని శుశ్రూష చేయకుండా ఉంటే వదిలిపెట్టరాదు. నిర్దోషులైన వీరిని విడిచి పెట్టినా రాజుద్వారా వారికి 600 పణములు జుర్మానా విధించాలి.॥389॥

వివరణ:

388-389 శ్లోకాలలో విషయ విరోధమున్నప్పటికీ, ప్రక్షిప్తములు కావు, స్థాన భ్రష్టములు మాత్రమే, కారణం-మను సిద్ధాంతాలతో విరోధం లేదు. ఇంకొక విధంగా ప్రక్షిప్తాలనడానికి అన్యమైన ఆధారాలేవీ లేవు. ఈ అధ్యాయంలో, వీటికి సంబంధితమైన ప్రసంగముంది. ఈ శ్లోకాలు నాల్గో వివాదంలో, (8.206-211లలో) ఉన్న శ్లోకాలతో కాకుండా విడిగా ఇక్కడ చేర్పబడినవి.

390 నుండి 397వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *ఆశ్రమేషు ద్విజాతీనాం కార్యే వివదతాం మిథః ।*
న విబ్రూయాన్నృపో ధర్మం చికీర్షన్ హితమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***390***

తాత్పర్యం:- ద్విజులు తమ ఆశ్రమాచారవిషయాలలో ఇతరులు వివాదపడునప్పుడు, తన మేలు కోరే రాజు 'ఇదే శాస్త్రార్థం', ఇది శాస్త్రార్థం కాదని' సమానులతో తీర్మానించరాదు. ॥390॥

* *యథార్హమేతానభ్యర్చ్య బ్రాహ్మణైః సహ పార్థివః ।*
సాన్త్వేన ప్రశమయ్యాదౌ స్వధర్మం ప్రతిపాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***391***

తాత్పర్యం:- అలాగే వ్యాజ్యం చేసేవారిలో ఎవరికేని సన్మానం చేయదగునో, వారి కలాంటి సన్మానం గావించి, ఇతర బ్రాహ్మణులతో సమానంగా వారిని మంచిమాటలచేత ప్రశాంతకోపుల చేసి ఆవల వారి కేది స్వధర్మమో దాన్ని బ్రాహ్మణులను ఉంచికొని బోధించాలి. ॥391॥

* *ప్రాతివేశ్యానువేశ్యౌ చ కల్యాణే వింశతిద్విజే ।*
అర్హావభోజయన్ విప్రో దణ్డమర్హతి మాషకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***392***

తాత్పర్యం:- పెండ్లి మొదలైన ఉత్సవాలలో ఇరవై మంది కంటే ఎక్కువ భోజనం పెట్టునప్పుడు వారితోడ భోజనానికి అర్హులయిన పక్క ఇంటివాడిని, వాడికి ఆవలి ఇంటివాడిని, భోజనానికి పిలువని బ్రాహ్మణుడు ఒక వెండి రూక అపరాధం చెల్లించాలి. ॥392॥

* *శ్రోత్రియః శ్రోత్రియం సాధుం భూతికృత్యేష్వభోజయన్ ।*
తదన్నం ద్విగుణం దాప్యో హిరణ్యం చైవ మాషకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***393***

తాత్పర్యం:- విద్యాచారవంతుడు అయినట్టి బ్రాహ్మణుడు ఇలాంటి గుణవంతుడైన పక్క ఇంటివాడు, ఆవలి ఇంటివాడయిన బ్రాహ్మణుడికి వివాహాదులైన శుభకార్యాలలో భోజనం ఇవ్వకపోయినట్లయితే, అప్పుడు పెట్టిన అన్నం కంటే రెండింతలన్నం అతడికి ఇప్పించాలి. ఒక బంగారు మాడ దండన విధించాలి. ॥393॥

* *అన్ధో జడః పీఠసర్పీ సప్తత్యా స్థవిరశ్చ యః ।*
శ్రోత్రియేషూపకుర్వంశ్చ న దాప్యః కేన చిత్ కరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***394***

తాత్పర్యం:- గ్రుడ్డివాడు, చెవిటివాడు, కుంటివాడు, డెబ్బది యేండ్ల వృద్ధుడు, విద్వాంసులకు ఉపకారం చేయువాడు అనువారిపై ఎట్టిపన్నును రాజు విధింపరాదు. ॥394॥

* *శ్రోత్రియం వ్యాధితార్తౌ చ బాలవృద్ధావకిఞ్చనమ్ ।*
మహాకులీనమార్యం చ రాజా సంపూజయేత్సదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***395***

తాత్పర్యం:- వేదపారకుడు, రోగి, దుఃఖితుడు, బాలకుడు, వృద్ధుడు, దరిద్రుడు, శ్రేష్ఠపురుషులగువారిని రాజెల్లప్పుడు సమ్మానము చేయవలెను. ॥395॥

సాకలి, సాలెల వ్యవస్థ -

* *శాల్మలీఫలకే శ్లక్ష్ణే నేనిజ్యాన్నేజకశ్శనైః ।*
న చ వాసాంసి వాసోభిర్నిర్హరేన్న చ వాసయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***396***

తాత్పర్యం:- సన్నని బూరుగుపలకమీద చాకలి నెమ్మదిగా గుడ్డలనుతుకవలెను. ఒకరి గుడ్డలతో మఱొకరి గుడ్డలు కలుపుట కాని, మార్పుచేయుటకాని తాను ధరించుట కాని లేక ఎక్కువ కాలము తన ఇంటిలో ఉంచుకొనుట కాని చేయరాదు. ॥396॥

* *తన్తువాయో దశపలం దద్యాదేకపలాధికమ్ ।*
అతోఽన్యథా వర్తమానో దాప్యో ద్వాదశకం దమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***397***

తాత్పర్యం:- గుడ్డలు నేయువాడు పదిపలముల బరువుగల (పలమనగా మూడు రూపాయల బరువు) అనగా ముప్పది రూపాయల బరువుగల నూలు తీసికొని గంజివగైరాలు కలియుటచే బరువధికమగును కావున ముప్పది మూడు రూపాయల బరువుగల వస్త్రము నేసి ఈయవలెను. దీనికి భిన్నముగా జేసిన పంద్రెండు పణములు జరిమానా విధింపవలెను. ॥397॥

ప్రక్షిప్తాల పరిశీలన

390 నుంచి 3971 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

ఎనిమిదవ అధ్యాయం ప్రారంభంలో 8-9 అధ్యాయాలలోని 18 ముఖ్య విషయాలను గురించి మనువు సంకేతమిచ్చాడు [8.4-7]. ఆ నిర్ధారణను అనుసరించి 8వ అధ్యాయంలో 15వ విషయమైన 'స్త్రీల అపహరణ' వరకు ఉన్నది, 387 వ శ్లోకంతో పూర్తవుతుంది. ఆ తర్వాత 16 విషయంగా 'స్త్రీల అపహరణ', తొమ్మిదవ అధ్యాయంలోని మొదటి శ్లోకంలో మళ్లీ ప్రారంభమైనది. ఈ మధ్యలోని శ్లోకాలు ఏ విషయానికీ సంబంధించినవి కావు. పైగా సంకేతించిన విషయ క్రమానికి వ్యతిరేకాలు. అందుచేత ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

ఈ మొత్తం శ్లోకాలు మనువు పద్ధతికి వ్యతిరేకాలు కనుక అన్నీ ప్రక్షిప్తాలు -

క. 390-391 శ్లోకాలు, 12.108-113 శ్లోకాలకు వ్యతిరేకాలు. వాటిలో రాజు నియమించిన పరిషత్తు ద్వారా ధర్మ నిర్ణయం జరగాలన్న ఆదేశం ఉంది.

ఖ. 392-393 లలోని వ్యవస్థను మనువు ఎక్కడా అంగీకరించలేదు. మనువు ప్రకారం, బ్రాహ్మణులు తమ పనుల ద్వారా డబ్బు సంపాదించి జీవితం గడపాలి, ఇతరుల వద్ద భోజనం చేయటం నిందనీయం [3.104; 4.3, 10.71-76].

గ. 394-395 లలోని పద్ధతి అనవసరం. ఎందుకంటే వీటిలో రాజు సంపాదించేవారి నుంచే పన్నులు తీసుకోవాలని ఉంది. [8.307]

ఘ. 395లో 'ఉత్తమకులంలో పుట్టుక'ను ఆదరించే పద్ధతి ఉంది. [2.136-137,154].

ఙ. 396-397లలో తర్వాతి జాతుల వ్యవస్థ ఉంది, ఇది మనువుకు వ్యతిరేకం [1.87-91,1.110లపై సమీక్ష చూడండి]. ఈ ఆధారంతో ఇవి ప్రక్షిప్తాలు.

విశేషం

ఇవి విషయ వ్యతిరేకాలు కావడంతో పాటుగా మనువు పద్ధతులకూ వ్యతిరేకాలు. ఈ అధ్యాయంలో వీటికి సంబంధించిన విషయాలేవీ లేవు కూడా. అందుకని స్థాన భ్రష్టాలయ్యాయి అనటానికి కూడ లేదు. అందుచేత ఇవి ప్రక్షిప్తాలు.

398 నుండి 406వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

వ్యాపారంలో పన్ను-వస్తు విలువల నిర్ధారణ-

శుల్కస్థానేషు కుశలాస్సర్వపణ్యవిచక్షణాః । మూలశ్లోక సం. **224**
కుర్యురర్ఘం యథాపణ్యం తతో వింశం నృపో హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **398**

టీక:- శుల్కస్థానేషు కుశలాః = శుల్కములను విధించే స్థానములలో చతురులైన శుల్కవ్యవహారజ్ఞులు, **సర్వపణ్య విచక్షణాః** = అమ్మబడుతున్న యోగ్య వస్తువులకు మూల్యనిర్ధారణ చేసే సమర్థులైన వ్యక్తులు, **యథా పణ్యం అర్ఘం కుర్యుః** = బజారును బట్టి మూల్యాన్ని నిశ్చయించాలి. **తతః** = ఆ లాభంలో, **నృపః వింశం హరేత్** = రాజు 20వ భాగం పన్ను రూపంలో తీసుకోవాలి.॥398॥

తాత్పర్యం:- ఎగుమతి దిగుమతి ద్వారా వచ్చు పన్నులోగాని, కొన్ని అమ్మకాలలో వచ్చు ఆదాయంలో గాని, వెల నిర్ణయించుటలో గాని, వచ్చుదానిలో ఇరువదవవంతు రాజు పన్ను విధించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

రాజ్ఞః ప్రఖ్యాతభాణ్డాని ప్రతిషిద్ధాని యాని చ । మూలశ్లోక సం. **225**
తాని నిర్హరతో లోభాత్ సర్వహారం హరేన్నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **399**

టీక:- రాజ్ఞః ప్రఖ్యాత భాండాని = రాజుకు సంబంధించిన ప్రసిద్ధమైన పాత్రలు, **చ** = మరియు, **యాని ప్రతిషిద్ధాని** = ఇతర దేశాలకు పంపడానికి వీలు లేని నిషిద్ధ వస్తువులు, **లోభాత్ తాని నిర్హరతః** = లోభం వల్ల దేశాంతరానికి తీసుకుపోయే వ్యాపారుల నుండి, **నృపః** = రాజు, **సర్వహారం హరేత్** = సర్వస్వాన్ని తన వశం చేసికోవాలి.

తాత్పర్యం:- రాజుకు సంబంధించిన ప్రసిద్ధమైన పాత్రలు, ఇతరదేశాలకు పంపడానికి వీలులేని వస్తువులు లోభంవల్ల దేశాంతరానికి తీసుకుపోయే వర్తకుల నుండి సర్వస్వాన్ని రాజు తన వశం చేసికోవాలి.॥399॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శుల్కస్థానం పరిహరన్నకాలే క్రయవిక్రయీ । మూలశ్లోక సం. **226**
మిథ్యావాదీ చ సంఖ్యానే దాప్యోఽష్టగుణమత్యయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **400**

టీక:- శుల్కస్థానం పరిహరన్ = సుంకం చెల్లించాల్సిన స్థానాన్ని వదిలి రెండో మార్గంలో సామాన్లు తీసుకుపోయేవారు, **అకాలే** = సమయంలో గాని, వేళగాని సమయంలో గాని, రాత్రులలో గుప్తరూపంగా గాని, **క్రయవిక్రయీ** = సామాన్లు కొని అమ్మేవాడు, **చ** = మరియు, **సంస్థానే మిథ్యావాదీ** = తూకం కొలతలలో అబద్ధం చెప్పేవాడు, వీరికి, **అష్టగుణం + అత్యయమ్ దాపః చ** = మూల్యమునకు 8 రెట్లు ఎక్కువగా జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- ఇతర స్థలముల నుండి వచ్చు వస్తువులపై వేయుపన్నును తప్పించుకొని అనగా ప్రభుత్వము వారు నిర్ణయించిన స్థానములందు సరుకు గొనకుండ అన్యమార్గములద్వారా తెప్పించి అమ్మువారికి, ప్రభుత్వము నిర్ణయించిన సమయాన్ని అతిక్రమించి క్రయవిక్రయాలు చేసినవానికి అసత్యమాడువానికి (తూకము వగైరాలలో) ఎనిమిది రెట్లు జరిమానా విధించాలి. ॥400॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆగమం నిర్గమం స్థానం తథా వృద్ధిక్షయావుభౌ । మూలశ్లోక సం. **227**
విచార్య సర్వపణ్యానాం కారయేత్ క్రయవిక్రయౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **401**

టీక:- ఆగమం నిర్గమం స్థానం తథా వృద్ధిక్షయౌ+ ఉభౌ= వస్తువులు ఎక్కటి నుండి దిగుమతి అవుతున్నాయి, ఏ ఏ దేశాలకు వస్తువులు ఎగుమతి అవుతున్నవో గమనించడం. ఎంతకాలం నిలవ ఉంచాలి? ఎంత లాభం వస్తుంది? వృద్ధి క్షయములు, **సర్వ పణ్యానాం విచార్యం** = క్రయవిక్రయాలకు సంబంధించిన అన్ని వస్తువుల గురించి ఆలోచించి, **క్రయవిక్రయౌ కారయేత్** = రాజు మూల్యమును నిర్ణయించాలి. ఎగుమతి, దిగుమతి ఖర్చులు, లాభనష్టాలు విచారించి వస్తువుల క్రయ విక్రయ ధరలను నిర్ణయించాలి.

తాత్పర్యం:- ఎగుమతి, దిగుమతి ఖర్చులు, లాభనష్టములు విచారించి వస్తువు యొక్క క్రయవిక్రయ ధరలను నిర్ణయించాలి. ॥401॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పఞ్చరాత్రే పఞ్చరాత్రే పక్షే పక్షేఽథవాగతే । మూలశ్లోక సం. **228**
కుర్వీత చైషాం ప్రత్యక్షమర్ఘసంస్థాపనం నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **402**

పంచరాత్రే పంచరాత్రే = ఐదు ఐదు రోజులకుగానీ లేదా, **పక్షే పక్షే గతే** = 15-15 రోజులకు గానీ, **నృపః** = రాజు, **ఏషాం ప్రత్యక్షమ్** = వ్యాపారుల సమక్షంలో, **అర్ఘం సంస్థాపనం కుర్వీత** = ధరలు నిర్ణయించాలి.

తాత్పర్యం:- అయిదు రోజుల కొకసారి గాని, పదునైదు రోజుల కొకసారి గాని రాజు వ్యాపారులు తెచ్చిన వస్తువుల ధరను ప్రత్యక్షంగా నిర్ణయించాలి. ॥402॥

తూకాల-కొలతల సాధనాలను 6 మాసాలకొకసారి పరీక్షించాలి ఇది మనుకృతం-ప్రామాణికం

తులామానం ప్రతీమానం సర్వం చ స్యాత్ సులక్షితమ్ । మూలశ్లోక సం. **229**
షట్సు షట్సు చ మాసేషు పునరేవ పరీక్షయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **403**

టీక:- తులామానం = తూచే త్రాసులు మొ॥వి, ప్రతీమానం = కొలిచే పాత్రలు, సర్వంసులక్షితమ్ స్యాత్ = అన్ని సరిగా ఉండాలి, షట్సు షట్సు చ మాసేషు = 6,6 మాసాలకు, పునః ఏవ పరీక్షయేత్ = రాజు వీటిని పరీక్షింప చేయాలి.

ఋషి దయానందభాష్యం:- తూకము కొలతలు ప్రభుత్వమువారిచే నిర్ణయింపబడి ఆరు నెలలకొకసారి పరీక్ష చేయాలి.

మనుస్మృతిలో-'ప్రతిమ' శబ్దం ద్వారా 'రత్తీ, ఛటాంక్, పావుసేరు, పావుకిలో, అర్ధకిలో, ఒకకిలో మొ॥ తూకపు రాళ్ళు పేర్కొనబడినవి. అదేవిధంగా కొలత సాధనాలగు పావుసేరు, అర్ధసేరు, సేరు మొదలగు వాటిని ఆరు నెలలకొకసారి పరీక్షించేటట్లు చూడాలి. లేనట్లయితే వ్యాపారులు తూకంలో, కొలతలలో హెచ్చు తగ్గులు చేసి ప్రజలను మోసగించడానికి అవకాశముంది. ఈ పరీక్షలు-పక్ష, పక్షానికి లేదా 6 మాసాలకు ఒకసారి తప్పనిసరిగా చేయించాలి. (ఋ.భా.భూ.)॥403॥

పడవల రేవు నౌకా వ్యాపారంలో బాడుగ నిర్ణయ వ్యవస్థ **ఇది మనుకృతం-ప్రామాణికం**

పణం యానం తరే దాప్యం పౌరుషోఽర్ధపణం తరే । మూలశ్లోక సం.**230**
పాదం పశుశ్చ యోషిచ్చ పాదార్ధం రిక్తకః పుమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**404**

టీక:- యానం తరే పణం = నౌకమీద అవతల తీరానికి పోయినప్పుడు బరువులు లేని బండ్లను ఒక (1) పణం బాడుగ తీసికోవాలి; **పౌరుషః పరే** = ఒక పురుషుడు మోయదగిన భారానికి, **అర్ధపణం దాప్యం** = అర్ధపణం బాడుగ ఇప్పించాలి, **చ** = మరియు, **పశుః పాదం** = పశువులకు 1/4 పణం, **యోషిత్ రిక్తకః పుమాన్ పాద అర్ధం** = స్త్రీకి, బరువులు, లేని పురుషుడికి 1/8 పణం, (పణంలో ఎనిమిదో భాగం) బాడుగ తీసుకోవాలి.

తాత్పర్యం:- పణమనగా 80 గవ్వల నాణెము. వంతెన మీదుగా గాని నావద్వారాగాని నదిని దాటునపుడు బరువు లేని బండియైన నౌకపణము, మోయగలిగిన బరువుతో వెళ్లు పురుషునకు అర్ధపణము, పశువుగాని, స్త్రీగాని యైనచో పావుపణము, బరువు మోయని పురుషునకు 1/8 వంతు పణము తీసికొనవలెను. ॥404॥

ఇది మనుకృతం-ప్రామాణికం

భాణ్డపూర్ణాని యానాని తార్యం దాప్యాని సారతః । మూలశ్లోక సం.**231**
రిక్తభాణ్డాని యత్ కించిత్ పుమాంసశ్చాపరిచ్ఛదాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**405**

టీక:- భాండా పూర్ణాని యానాని తార్యం సారతః దాప్యాని = సరుకులతో నిండిన బండ్లకు-తీరం చేర్చడానికి బాడుగ వాటి బరువును బట్టి ఇవ్వాలి. **రిక్తభాండాని** = ఖాళీ కుండలు, పాత్రలు, **ఛ అపరిచ్ఛదాః పుమాంస** = నిర్ధన వ్యక్తులు, **యత్ కించిత్** = కొంచెం,(ఇవ్వగలిగినంత) బాడుగ తీసికోవాలి.

తాత్పర్యం:- బరువుగల బండ్లను దాటవేయునపుడు బరువును బట్టి సుంకము వసూలు చేయాలి. తోలు మొదలగువానిచే చేయబడిన ఖాళీ భాండములతో ఉన్న బండియైనను, వాడు దరిద్రుడైనను ఏదో కొంత తీసికొని పంపాలి. ॥405॥

ఇది మనుకృతం-ప్రామాణికం

దీర్ఘాధ్వని యథాదేశం యథాకాలంతరో భవేత్ । మూలశ్లోక సం.**232**
నదీతీరేషు తద్ విద్యాత్ సముద్రే నాస్తి లక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**406**

టీక:- నదిలో చాలా దూరం వెళ్ళవలసి వచ్చినప్పుడు, **యథా దేశం** = స్థానం (దేశం) ననుసరించి ప్రవాహం వేగాన్ని లేదా మందతనమును, దుర్గమ స్థలం మొ॥ వాటిననుసరించి, **యథాకాలం** = సమయాన్ననుసరించి, **తరః భవేత్** = బాడుగ ఉంటుంది, **తత్ నదీ తీరేషు విద్యాత్** = ఈ నియమం నదీ తీరాలకు సంబంధించినది, **సముద్రే నాస్తి లక్షణమ్** = సముద్రానికి ఈ నియమం లేదు. అంటే సముద్రంలో అక్కడి పరిస్థితిననుసరించి బాడుగ నిర్ణయించాలి.

తాత్పర్యం:- నదిలో ప్రయాణంచేయునట్టి దూరాన్ని, కాలాన్ని బట్టి సుంకం వసూలు చేయాలి. సముద్రంలో నైతే సుంకమెక్కువగా వసూలు చేయాలి. ॥406॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *గర్భిణీ తు ద్విమాసాదిస్తథా ప్రవ్రజితో మునిః ।*
బ్రాహ్మణా లింగినశ్చైవ న దాప్యాస్తారికం తరే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **407**

తాత్పర్యం:- రెండు నెలలు నిండిన గర్భిణీ స్త్రీని, సన్యాసి, వానప్రస్థుడు, బ్రాహ్మణులు బ్రహ్మచారులు వీరిని పడవకు బాడుగ తీసుకోకుండా దాటించాలి. ॥407॥

408,409వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

యన్నావి కిం చిద్ దాశానాం విశీర్యేతాపరాధతః । మూలశ్లోక సం. **233**
తద్దాశైరేవ దాతవ్యం సమాగమ్య స్వతోఽంశతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **408**

టీక:- **దాశానాం అపరాధతః** = నావను నడిపేవారి అజాగ్రత్త వల్ల, నావి **యత్కించిత్ విశీర్యేత** = ఏ వస్తువైనా జారి నీళ్ళలో పడిపోయినట్లయితే, **తత్+దాశైః+ఏవ** = నావికులే, **సమాగమ్య స్వతో అంశతః దాతవ్యం** = అందరూ కలిసి ఆ వస్తువు మూల్యమును ఇవ్వాలి.

తాత్పర్యం:- నావ నీటిలో పోవునప్పుడు, ఏదైన ఒకవస్తువు నావికుల అజాగ్రత్త వల్ల నీటిలో పడి పోయినట్లయితే దాన్ని నావ ఎక్కిన నావికులే అందరూ కలిసి ఆ వస్తువు మూల్యమును ఇవ్వాలి. ॥408॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏష నౌయాయినాముక్తో వ్యవహారస్య నిర్ణయః । మూలశ్లోక సం. **234**
దాశాపరాధతస్తోయే దైవికే నాస్తి నిగ్రహః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **409**

టీక:- **ఏషః**= (8.404-408) ఇదే, **నౌయాయినామ్ వ్యవహారస్య నిర్ణయః** = నావికులకు సంబంధించిన వివాదాల నిర్ణయం, **దాశాపరాధతః ఉక్తః** = నావికుల అజాగ్రత్త వల్ల నీటిలో సరుకులు పడి నష్టమైనట్లయితే, దాని బాధ్యత నావికులదే నష్టపరిహారం వారే ఇవ్వాలి, **దైవికే నిగ్రహః నాస్తి** = దైవ విపత్తి వల్ల నష్టపడినట్లయితే దానికి నావికులు బాధ్యులు కారు. వారు నష్టపరిహారం చెల్లించాల్సిన పనిలేదు.

తాత్పర్యం:-నావికాపరాధముల వల్ల ఏదైనా సరుకు నష్టమైనట్లయితే నావికులే నష్టపరిహారం ఇవ్వాలి. దైవ విపత్తి వల్ల కలిగిన తుపాను మొదలైన వాటివల్ల ద్రవ్యనాశం కలిగినట్లయితే అలాంటి వాటికి నావికులు బాధ్యులు కారు. వారు నష్టపరిహారం చెల్లించాల్సిన పనిలేదు. ॥409॥

389 నుండి 409 వరకు ఉన్న శ్లోకాలు ప్రసంగానుకూలం కాకపోయినా సర్వసాధారణ విధానంలో ఉన్నా. మన సిద్ధాంతాలకు వ్యతిరేకత లేనందువల్ల ఇవి ప్రక్షిప్తాలు కావు. ఇవి అందరూ కలిసి వ్యాపారం చేసే సందర్భంలో ఉండాల్సినవి. కాని స్థానభ్రష్టమై ఇక్కడ రాయబడినవి. విషయానికి సంబంధించినవే. అందువల్ల ఇవి ప్రక్షిప్తములు కావు.

వివరణ:

389 నుంచి 409 వరకు గల శ్లోకాలలో 390-397, 407 వేర్వేరు ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి. మిగిలిన వాటిలో 389, 398-406 వరకు, 408,409లో సర్వసామాన్య విధానాలు ఉండటం చేత ఎటువంటి ప్రక్షిప్త లక్షణాలూ లేవు. వీటిలో ఏవీ మనువుకు వ్యతిరేకంగా లేవు, శైలికూడా మనువుకు అనుకూలంగానే ఉంది. కనుక, ప్రసంగానికి

అనుకూలంగా లేకపోయినా మేము వీటిని ప్రక్షిప్తాలుగా ప్రకటించటం లేదు. ఇవి స్థాన భ్రష్టాలయ్యాయని మాత్రమే అంటున్నాము. వీటన్నిటిలోనూ ఉన్న విషయం 'కలిసి అభివృద్ధి చెందడం లేదా వ్యాపారం చేయడం' అనేది [8.206-211]. విషయానికి సంబంధించినవి కానీ అదే ప్రసంగం నుంచి ఎందుకనో వేరుగా ఉంచబడ్డాయి.

410 నుండి 420వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* వైశ్య శూద్రులతో వారి పనులు చేయించాలి -

*   *వాణిజ్యం కారయేద్ వైశ్యం కుసీదం కృషిమేవ చ ।*
పశూనాం రక్షణం చైవ దాస్యం శూద్రం ద్విజన్మనామ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **410**

తాత్పర్యం:- రాజు వైశ్యుడిచేత వర్తకం, వడ్డీజీవనం, సేద్యం, పశురక్షణమును చేయించాలి. శూద్రుడి చేత ద్విజశుశ్రూష చేయించాలి. ఇవి చేయని వైశ్యశూద్రులను రాజు దండించాలి. ॥410॥

*   *క్షత్రియం చైవ వైశ్యం చ బ్రాహ్మణో వృత్తికర్శితౌ ।*
బిభృయాదానృశంస్యేన స్వాని కర్మాణి కారయేన్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **411**

తాత్పర్యం:- క్షత్రియ-వైశ్యులిరువురూ బ్రాహ్మణుడిని కొలువ వచ్చినప్పుడు, వారిని విప్రుడు దయతో పరామర్శించి, వారికి విహితములైన రక్షణ-కృషియందు వారిని నియమించి సంరక్షణ-పోషణ బాధ్యత వహించాలి. ॥411॥

*   *దాస్యం తు కారయన్లోభాద్ బ్రాహ్మణః సంస్కృతాన్ ద్విజాన్ ।*
అనిచ్ఛతః ప్రాభవత్వాద్ రాజ్ఞా దణ్డ్యః శతాని షట్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **412**

తాత్పర్యం:- రాజు యొక్క అండచేత బ్రాహ్మణుడు ఉపనయనాది సంస్కారాలు పొందిన ద్విజులను నీచకార్యాలలో ప్రయోగించడం గాని జరిగితే, రాజు అలాంటి బ్రాహ్మణుడికి ఆరువందలరూకలు అపరాధ రుసుముగా విధించాలి.॥412॥

* శూద్రులతో సేవ చేయించాలి -

*   *శూద్రం తు కారయేద్ దాస్యం క్రీతమక్రీతమేవ వా ।*
దాస్యాయైవ హి సృష్టో-సౌ బ్రాహ్మణస్య స్వయంభువా ॥   ప్రక్షిప్త శ్లోక సం. **413**

తాత్పర్యం:- శూద్రుణ్ణి సృష్టించడంలో బ్రహ్మ ఉద్దేశం- బ్రాహ్మణుడికి సేవచేయడమే ! భత్యం పుచ్చుకొని గాని-భక్తిచేత గాని శూద్రుడు బ్రాహ్మణసేవ చేసితీరాలి. ॥413॥

*   *న స్వామినా నిసృష్టోఽపి శూద్రో దాస్యాద్ విముచ్యతే ।*
నిసర్గజం హి తత్ తస్య కస్తస్మాత్ తదపోహతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **414**

తాత్పర్యం:- శూద్రుడికి దాస్యవృత్తి స్వాభావికం. ఇతడు ప్రభుత్వాన్ని నడుపుతూండగా ఏ విధంగానైనా పదవీచ్యుతుడైతే, జయించినవాడికి దాసుడవుతూన్నాడు. కానీ అవతలి రాజు ఉదారుడై ఈ శూద్రుడికి దాస్యవృత్తి నుంచి విముక్తి కల్పించినా, ఐహిక సుఖంకోసం కాక, ఆముష్మిక సుఖం కోసం శూద్రుడు బ్రాహ్మణ శుశ్రూష చేసి తీరాలి.॥414॥

* **7** రకాల శూద్రదాసులు -

*   *ధ్వజాహృతో భక్తదాసో గృహజః క్రీతదత్త్రిమౌ ।*
పైత్రికో దణ్డదాసశ్చ సప్తైతే దాసయోనయః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **415**

తాత్పర్యం:- యుద్ధంలో పరాజితుడు, వేశ్య పుత్రుడు, విక్రయంవల్ల కొనబడినవాడు, బానిసగా ఇతరులకు ఇవ్వబడినవాడు, తండ్రితాతల కాలం నుంచీ నమ్మకంగా పనిచేస్తున్నవాడు, భత్యంమీద ఆశచేత స్వయంగా వచ్చేవాడు, దండన వల్ల కుదిరినవాడు ఇలా ఏడు (7) రకాలదాసులు ఉన్నారు. ॥415॥

* భార్యా పుత్రశ్చ దాసశ్చ త్రయ ఏవాధనాః స్మృతాః ।
యత్ తే సమధిగచ్ఛన్తి యస్య తే తస్య తద్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **416**

తాత్పర్యం:- మనువు మొదలైన మహర్షుల వచనం ప్రకారం పుత్రిక-భార్య-సేవకుడు అనే ఈ ముగ్గురూ ధనానికి ప్రత్యక్షంగా యోగ్యత లేనివారు. ఒక వేళ వీరిచేత ధనం సంపాదించబడినప్పటికీ, అది వారెవరి సంరక్షణలో ఉంటే, వారి పరమవుతుంది. ॥416॥

* విస్రబ్ధం బ్రాహ్మణః శూద్రాద్ ద్రవ్యోపాదానమాచరేత్ ।
న హి తస్యాస్తి కిం చిత్స్వం భర్తృహార్యధనో హి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **417**

తాత్పర్యం:- నిస్సంశయంగా బ్రాహ్మణుడు తన సేవకుడి ధనాన్ని ఆశించవచ్చు. కారణం- దాస్యరికం చేసేవారికి సొంతధనం ఉండదు. (అయితే ఇలా చేయడం ఆపత్సమయంలోనే) బలిమీన యజమానిగా ఉన్న విప్రుడు తన సేవకుడి ధనం తీసుకున్నా రాజదండన లేదు. ॥417॥

* వైశ్య శూద్రౌ ప్రయత్నేన స్వాని కర్మాణి కారయేత్ ।
తౌ హి చ్యుతౌ స్వకర్మభ్యః క్షోభయేతామిదం జగత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **418**

తాత్పర్యం:- గట్టి ప్రయత్నం చేసి అయినాసరే....వైశ్యుడి చేత సేద్యాన్ని -శూద్రుడు చేత బ్రాహ్మణ శుశ్రూషని చేయించాలి. స్వకర్మల నుంచి వీరిని తప్పించడం జరిగితే, అశాస్త్రీయ విధానాల ద్వారా ధనం సంపాదించి వీరు లోకాన్ని తలక్రిందులు చేయగల సమర్థులు. ॥418॥

* అహన్యహన్యవేక్షేత కర్మాన్తాన్ వాహనాని చ ।
ఆయవ్యయౌ చ నియతావాకరాన్ కోశమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **419**

తాత్పర్యం:- ప్రతిదినం రాజు ఆ యా కార్యాలలో విచారణాధికారుల మూలమున ప్రారంభించిన ఐహికాముష్మిక ఫలాలైన కర్మలు జరగడాన్ని గమనించాలి. అలాగే గుర్రాలు, ఏనుగులు మొదలైన వాటిని, ఏమి వచ్చింది? ఏమి పోయింది అనడాన్ని బంగారు రత్నాలు పుట్టు స్థలాల్లో రాకపోకల బండ్లను, బొక్కసములను పరీక్షించాలి. వ్యవహారాలను విచారించువాడు అక్కడ ఉన్నా రాజు ధర్మములను విడువరాదని చెప్పడం కోసం ముందుకు చెప్పినా, మళ్ళీ చెప్పబడింది.॥419॥

* ఏవం సర్వానిమాన్ రాజా వ్యవహారాన్ సమాపయన్ ।
వ్యపోహ్య కిల్బిషం సర్వం ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **420**

తాత్పర్యం:- రాజు పూర్వము చెప్పబడిన వ్యవహారాల నన్నింటిని నిర్ణయములద్వారా పూర్తిచేసి సమస్తపాపాన్ని పోగొట్టుకొని మోక్షాన్ని పొందును. ॥420॥

ప్రక్షిప్తాల పరిశీలన

410 నుంచి 420 వరకు గల శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు-

1. విషయ వ్యతిరేకాలు

మనువు నిర్ధారించిన 18 వ్యాజ్యాల వర్ణనలకు భిన్నంగా ఉండటం చేత, ఈ వైశ్య-శూద్ర విషయక శ్లోకాలు విషయ వ్యతిరేకాలు. అందుకని ప్రక్షిప్తాలు (విస్తృత వివరణకు 390-397లపై 'విషయ వ్యతిరేకాలు' అనే సమీక్ష చూడండి).

2. ప్రసంగ వ్యతిరేకాలు

క. మనువు స్వయంగా సంకేతాలిచ్చిన శ్లోకాల [8.4-7] ప్రకారం, 18 వ్యవహారాల నిర్ణయపు ముగింపు 9.250లో ఉంది. వ్యవహారాల ముగింపునకు ముందే 419-420లలో అన్ని వ్యవహారాల ముగింపూ, వాటి ఫలితాలూ చెప్పేయటం అసంగతం.

ఖ. వైశ్య-శూద్రుల కర్మల విషయం [9.326-335(10.1-10)] ఉంది. ఇక్కడ ఇది ప్రసంగ వ్యతిరేకం.

3. అంతర్ వ్యతిరేకాలు

క. 412-428 శ్లోకాలలో దాస వ్యవస్థను గురించి ఉంది. దాంట్లో బలవంతంగా పని చేయించే పద్ధతి ఉంది. మనువుకు వ్యతిరేకం. పని చేయించుకుని, దానికి వేతన మిచ్చే విధానం మనువు ఏర్పరిచాడు. [8.214-216]. శూద్రులను, వారి సేవాకార్యాలను నిర్ధారించాడు కానీ బలవంతంగా కాక, శూద్రులు తమ ఇష్టప్రకారం ఏ ద్విజాతీయులకైనా సేవలు చేసుకునే అధికారమిచ్చాడు[1.91;9.334-335;10.99].

ఖ. 416,5.150,9.114,130,131 మొదలైన వాటికి వ్యతిరేకంగా వీటిలో కన్యలు, స్త్రీలకు ధనంపై అధికారం ఉందని చెప్పారు. ఇలా అంతర్ వ్యతిరేకాలు ఆధారంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

4. శైలీగత ఆధారాలు

ఈ శ్లోకాల శైలి మనువువలె సమభావయుక్తము కాకుండా, పక్షపాతమూ, పట్టుదలా, ద్వేషభావంతో కూడి ఉంది. ఈ ఆధారంతో ఇవి మనువు రచించినవి కావని రుజువవుతూంది. ఈ ప్రక్షిప్త శ్లోకాలలో బ్రాహ్మణుడు కర్తవ్యభ్రష్టుడైనా ఎటువంటి శిక్షా రాయలేదు. కానీ వేరుచోట్ల కర్తవ్యం విడిచి, అపరాధాలు చేసిన బ్రాహ్మణునికి మిగిలిన అన్ని వర్ణాల వారికన్నా ఎక్కువ శిక్ష విధించే పద్ధతి ఉంది. ఈ అసంగతాల కారణంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

విశేషం

వీటిని స్థానభ్రష్టం అనకుండా ప్రక్షిప్తాలని ఎందుకన్నా మంటే, ఇవి

1. విషయ వ్యతిరేకతలతో పాటుగా ఇతర 'ఆధారాల' ద్వారానూ ప్రక్షిప్తాలని రుజువవుతూంది.
2. ఈ అధ్యాయంలో ఈ శ్లోకాలకు సంబంధించిన ఏ ప్రసంగమూ లేదు. కావున వీటిని స్థాన భ్రష్టములని చెప్పాలి.

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మత్తి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రభాషానువాదాత్మకః రాజధర్మాత్మకోఽష్టమోఽధ్యాయః.

మనుస్మృతి

నవమాధ్యాయము

విశేష వివరణ సహిత, ప్రక్షిప్తాల పరిశీలన * ఋషి దయానంద భాష్యోపేతం
మొత్తం శ్లోకాల సంఖ్య: 325; మూలశ్లోకాలు: 166 ; ప్రక్షిప్తాలు : 159
రాజధర్మాంతర్గత ~~వ్యవహార నిర్ణయం-1~~ నుండి 250 వరకు
స్త్రీ పురుష ధర్మ సంబంధమైన వివాదాలు- వాటి నిర్ణయం 1 నుండి 102 వరకు

ఇది మనుకృతం-ప్రామాణికం

పురుషస్య స్త్రియాశ్చైవ ధర్మ్యే వర్త్మని తిష్ఠతోః ।
సంయోగే విప్రయోగే చ ధర్మాన్ వక్ష్యామి శాశ్వతాన్ ॥ మూలశ్లోక సం. 1

టీక:- ప్రస్తుతం నేను, ధర్మ్యే వర్త్మని తిష్ఠతోః = ధర్మ మార్గంలో ప్రవర్తించు, స్త్రియాః పురుషస్య ఏవ = స్త్రీ పురుషుల యొక్క, సంయోగే విప్రయోగే = సంయోగకాలానికి-కలిసి ఉండే సమయానికి, వేరుగా ఉండే సమయానికి సంబంధించిన, శాశ్వతాన్ ధర్మాన్ వక్ష్యామి = ఎల్లప్పుడు పాటించదగిన యోగ్యమైన శాశ్వత కర్తవ్యాలను తెలుపుతాను.

తాత్పర్యం:- ధర్మమార్గముననున్నట్టి స్త్రీ పురుషులు కలిసి గాని వేఱుగా గాని ఉండుటకు వలసిన శాశ్వత ధర్మాలను చెప్పుచున్నాను. ॥1॥

2,3 శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *అస్వతన్త్రాః స్త్రియః కార్యాః పురుషైః స్వైర్దివానిశమ్ ।*
విషయేషు చ సజ్జన్త్యః సంస్థాప్యా ఆత్మనో వశే ॥ *ప్రక్షిప్త శ్లోక సం. 2*

తాత్పర్యం:- యజమానులు (పురుషులు) తమ భార్యలను రాత్రింబవళ్లు తమ అధీనంలో ఉంచుకోవాలి. విషయాలందాసక్తిగల స్త్రీలను భర్తలు తమ వశంలో ఉంచుకోవాలి. ॥2॥

* *పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే ।*
రక్షన్తి స్థవిరే పుత్రా న స్త్రీ స్వాతన్త్ర్యమర్హతి ॥ *ప్రక్షిప్త శ్లోక సం. 3*

తాత్పర్యం:- చిన్నతనంలో తండ్రి రక్షించును. యౌవనంలో భర్త రక్షించును. ముసలితనంలో పుత్రుడు రక్షించును. కావున ఏ పరిస్థితిలోనూ స్త్రీకి రక్షణ భారముండదు. రక్షణ విషయంలో స్వతంత్రురాలు కాదు. ॥3॥

ప్రక్షిప్తాల పరిశీలన

2, 3 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు-

1. అంతర్ వ్యతిరేకాలు

వీటిని స్త్రీల స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించే వ్యక్తి ప్రక్షిప్తాలుగా చేర్చాడు. స్త్రీల స్వాతంత్ర్యాన్ని బలవంతంగా మనువు ఎన్నడూ అణచలేదు. అతడు పక్షపాతికాడు. స్త్రీలను గౌరవంగా చూడమనీ, బలవంతంగా నిర్బంధించ వద్దనీ స్పష్టంగా చెప్పాడు[3.55-62;9.10-12]. తాను రాసిన వాటిలో స్త్రీలహితాన్ని దృష్టిలో పెట్టుకుని, నిర్దేశాలు మాత్రం చేశాడు. 9.10,12 శ్లోకాలలో మనువు స్పష్టంగా,స్త్రీలు చేసే ఏ పనినైనా బలవంతంగా మాన్పించ వద్దనీ, అక్కడ వారి వివేకాన్ని

వారి ఆచరణకు నియంత్రణ అనీ చెప్పాడు. పైగా 9.28లో ఇంట్లోని పెద్దల సుఖం ఇల్లాలి చేతిలోనే ఉందన్నాడు. 8.28,29 శ్లోకాలలో స్త్రీల రక్షణ మొదలైనవి రాజు బాధ్యత అని ప్రకటించాడు. భార్యాభర్తలను సమానస్థాయివారిని మనువు ఎన్నో పద్ధతులు ఏర్పరిచాడు. ఆ శ్లోకాలలోని పద్ధతులలో, భర్తతో కలసి ఉండటం, ఉండకపోవటం భార్య స్వాతంత్ర్యం మీదే ఆధారపడి ఉందని చెప్పాడు [9.101,102,9.96]. అందుచేత ఈ రెండు శ్లోకాలూ మనువు పద్ధతులకు అనుకూలంగా లేనందున ప్రక్షిప్తాలు. [147,148ల పరిశీలన చూడండి].

4 నుండి 13 శ్లోకాల వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

స్త్రీ విషయంలో తమకర్తవ్యాలను పాలించని తండ్రి, భర్త, పుత్రుడు నిందనీయులు-

కాలేఽదాతా పితా వాచ్యో వాచ్యశ్చానుపయన్ పతిః । మూలశ్లోక సం. 2
మృతే భర్తరి పుత్రస్తు వాచ్యో మాతురరక్షితా ॥ ప్రక్షిప్త శ్లోక సం. 4

టీక:- **కాలే** = కన్యకు వివాహం చేయడానికి తగిన వయస్సు వచ్చినప్పుడు, **అదాతా** = వివాహం చేయని, **పితా వాచ్యః** = తండ్రి నిందనీయుడు, **చ** = మరియు, **అనుపయన్ పతిః** = వివాహానంతరం, ఋతుకాలానంతరం భార్యతో సంగమం చేయని పతికూడా నిందనీయుడు, **భర్తరి మృతే** = పతి మరణానంతరం, **మాతుః+అరక్షితా పుత్రః వాచ్యః** = తల్లిని భరణ పోషణాదులచేత రక్షించని పుత్రుడుకూడా నిందనీయుడే.

తాత్పర్యం:- వివాహ సమయం వచ్చినను పుత్రికకు పెండ్లిచేయని తండ్రి, ఋతుకాలంలో తన భార్యతో సంగమం చేయని భర్త, తన తండ్రి చనిపోగా తన తల్లిని అన్నాదులతో రక్షింపని పుత్రుడును నిందింపదగినవారు. ॥4॥

ప్రతిచిన్న చెడు సహవాసం నుండి స్త్రీలను తప్పక రక్షించాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

సూక్ష్మేభ్యోఽపి ప్రసంగేభ్యః స్త్రియో రక్ష్యా విశేషతః । మూలశ్లోక సం. 3
ద్వయోర్హి కులయోః శోకమావహేయు రరక్షితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 5

టీక:- **సూక్ష్మేభ్యః ప్రసంగేభ్యః అపి** = చెడు సహవాసాలు చిన్నవైనా వాటి నుండి, **స్త్రియః విశేషతః రక్ష్యాః** = స్త్రీలను విశేషంగా రక్షించాలి. **హి** = ఎందుకంటే, **అరక్షితాః** = అలా రక్షించబడని స్త్రీలు, **ద్వయోః కులయోః శోకమ్ + ఆవహేయుః** = ఉభయ కులాలవారికి (పుట్టింటి వారికి, అత్తింటి వారికి) దుఃఖాన్ని కలిగిస్తారు.

తాత్పర్యం:- దుష్టుల బారినుంచి (కొంచెమైనా అజాగ్రత్త వహించక) స్త్రీలను కాపాడాలి. వారు ఆ విధంగా కాపాడబడకపోతే, ఉభయవంశస్థులకు వారివల్ల అపకీర్తి, దుఃఖం సంప్రాప్తిస్తుంది. ॥5॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఇమం హి సర్వవర్ణానాం పశ్యన్తో ధర్మముత్తమమ్ । మూలశ్లోక సం. 4
యతన్తే రక్షితుం భార్యాం భర్తారో దుర్బలా అపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 6

టీక:- **సర్వ వర్ణానాం ఇమం ఉత్తమమ్ ధర్మం పశ్యన్తః** = సర్వ వర్ణాల వారికిది ఉత్తమోత్తమ ధర్మమని తెలిసిన, **దుర్బలాః భర్తారః అపి** = భర్తలు బలహీనులైనా, **భార్యాం రక్షితుం యతన్తే** = తమ భార్యలను రక్షించుకోడానికి ప్రయత్నిస్తారు.

తాత్పర్యం:- బ్రాహ్మణాదులైన చాతుర్వర్ణాలవారికీ తమతమభార్యల శీల సంరక్షణ, అన్ని ఇతర ధర్మాల కంటే ముఖ్యమని తెలియాలి. భర్తలు తాము వికలాంగులైనా-దుర్బలులైనా తమతమ భార్యలను కాపాడుకోవాలి. ॥6॥

కుటుంబ మర్యాద అంతా స్త్రీ మీదనే ఆధారపడి ఉంటుంది- ఇది మనుకృతం-ప్రామాణికం

స్వాంప్రసూతిం చరిత్రం చ కులమాత్మాన మేవ చ । మూలశ్లోక సం. 5
స్వం చ ధర్మం ప్రయత్నేన జాయాం రక్షన్ హి రక్షతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. 7

టీక:- ప్రయత్నేన జాయాం రక్షన్ హి = ప్రయత్న పూర్వకంగా తన భార్యను చెడు సహవాసం నుండి రక్షించుకొనేవాడు, స్వాం ప్రసూతిం = తన సంతానాన్ని, చరిత్రం = శీలాన్నీ, కులం చ ఆత్మానమ్ + ఏవ = తన కులాన్నీ, తననూ, చ = మరియు, స్వం ధర్మం = తన ధర్మాన్నీ, రక్షతి = రక్షించుకొంటాడు, స్త్రీ చెడు సహవాసం వల్ల సమస్తం కళంకితమవుతుంది. కారణం స్త్రీయే గదా-సుఖానికీ ధర్మానికీ ఆధారం.

తాత్పర్యం:- ప్రయత్నించి భార్యను రక్షించుకొనినవాడు తన సంతానాన్ని తన చరిత్రను, తన కులాన్ని, తనను, తన ధర్మాన్ని రక్షించుకొంటాడు. ॥7॥

జాయా (భార్య) లక్షణం - ఇది మనుకృతం-ప్రామాణికం

పతిర్భార్యాం సమ్ప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే । మూలశ్లోక సం. 6
జాయాయాస్తద్ధి జాయాత్వం యదస్యాం జాయతే పునః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 8

టీక:- పతిః భార్యాం సంప్రవిశ్య = భర్త వీర్య రూపంలో పత్నియందు ప్రవేశించి, గర్భఃభూత్వా+ఇహ జాయతే = గర్భంగా మారి సంతానరూపంగా ప్రపంచంలో జన్మిస్తున్నాడు. జాయాయాః తత్ + హి జాయాత్వం = ఇదే జాయాత్వం, యత్ = ఏది, అస్యాం పునః జాయతే = ఈ స్త్రీలో సంతానరూపంలో భర్త మళ్ళీ జన్మిస్తున్నాడు.

తాత్పర్యం:- పతి భార్యగర్భములో ప్రవేశించి లోకములో జన్మించును. పతి భార్య ద్వారా తిరిగి జన్మను పొందును. కావున ఆమెకు 'జాయ' అని పేరు. పురుషునియొక్క వీర్యము స్త్రీ యోనిలో ప్రవేశించి గర్భరూపం ధరిస్తుంది. పురుషుడి యొక్క అవయవమునుండి పిండబడిన సత్త్వము కావున యోని నుంచి వచ్చిన బిడ్డను 'సుతుడు'-'సుత' అంటారు. ॥8॥

వివరణ:

'జాయా' శబ్ద నిర్వచనం- బ్రాహ్మణాది గ్రంథాల ప్రమాణం:- జాయా శబ్దం 'జనీ ప్రాదుర్భావే' (దివా) ధాతువు నుండి 'జనేర్యక్' ఉణాది 4-111 సూత్రం ద్వారా యక్ ప్రత్యయం రాగా స్త్రీ లింగంలో టాప్ ప్రత్యయం చేర్చగా 'జాయా' శబ్దం సిద్ధమవుతుంది. "జాయతే యస్యాం సా జాయా అథవా" 'జాయన్తే యస్యాం అపత్యాని సా జాయా' ఎవరి యందు సంతానముత్పనమవుతుందో ఆమెకు 'జాయా' అని పేరుంటుంది. ఈ శ్లోకంలో 'జాయా' శబ్దానికిచ్చిన పరిభాష చాలా ప్రసిద్ధమైనది. అలాంటి భావమే ఐతరేయ బ్రాహ్మణం 7/13 సంబంధించిన పరిభాష కూడా చూడగలం.

క. **"పతిర్జాయాం ప్రవిశతి, గర్భో భూత్వా స మాతరం తస్యాం పునర్నవో భూత్వా దశమే మాసి జాయతే, తజ్జాయా జాయా భవతి యదస్యాం జాయతే పునః"**

ఖ. **ఆభిర్వా అహమిదం సర్వం జనయిష్యామి యదిదం కించేతి తస్మాజ్జాయా అభవంతస్తజ్జాయానాం జాయాత్వం యచ్చాసు పురుషో జాయతే** (గో.బ్రా.పూ. 1-2)

గ. నిరుక్తంలో కూడా పతి యొక్క ఆత్మ రూమే పుత్రుడని చెప్పబడింది. **"అఙ్గాదఙ్గాత్ సంభవసి హృదయాదధిజాయసే ఆత్మా వై పుత్రనామాసి స జీవ శరదః శతమ్"** (నిరుక్తమ్ 3-1-4).

పతి ఎలాంటివాడో సంతానం కూడా అలాంటిదే - ఇది మనుకృతం-ప్రామాణికం

యాదృశం భజతే హి స్త్రీ సుతం సూతే తథావిధమ్ । మూలశ్లోక సం. 7
తస్మాత్ ప్రజావిశుద్ధ్యర్థం స్త్రియం రక్షేత్ ప్రయత్నతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 9

టీక:- **స్త్రీ యాదృశం హి భజతే** = స్త్రీ ఎలాంటి పురుషుడితో సంబంధం కలిగి ఉంటుందో, **తథా విధమ్ సుతం సూతే** = అలాంటి సంతానాన్నే కంటుంది. **తస్మాత్** = అందువల్ల, **ప్రజా విశుద్ధ్యర్థం** = సంతాన శుద్ధి కోసం, **ప్రయత్నతః స్త్రియం రక్షేత్** = ప్రయత్నించి, స్త్రీని కుసంగమం నుంచి రక్షించాలి.

తాత్పర్యం:- స్త్రీ ఎలాంటి పురుషుణ్ణి పొందుతుందో, అలాంటి సంతానమే కలుగుతుంది. అంటే గుణం-గుణహీనం అనేవి మాత్రమే భర్తకు చెందినవైతే, క్షేత్రం కాబట్టి భార్యను అతడు మరింత శ్రద్ధగా కాపాడుకోవాలి. పరిశుద్ధమైన సంతానాన్ని పొందాలి. ॥9॥

స్త్రీలను బలవంతంగా రక్షించలేం - ఇది మనుకృతం-ప్రామాణికం

న కశ్చిద్యోషితశ్శక్తః ప్రసహ్య పరిరక్షితుమ్ । మూలశ్లోక సం. **8**
ఏతైరుపాయయోగైస్తు శక్యా స్తాః పరిరక్షితుమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10**

టీక:- **కశ్చిత్** = ఏ వ్యక్తి అయినా, ప్రసహ్య = బలాత్కారంగా, **యోషితః పరిరక్షితుమ్ న శక్తః** = స్త్రీలను కుసంగం నుండి కాపాడటంలో అశక్తుడు, **తు** = కాని, **ఏతైః+ ఉపాయైః** = ముందు చెప్పబోయే ఉపాయ ప్రయోగాల వల్ల, **తాః పరిరక్షితుం శక్యాః** = వారిని రక్షింపవచ్చు.

తాత్పర్యం:- స్త్రీలను బలవంతంగా ఎవరూ కాపాడలేరు. (అయితే-లోకంలో ఒక అపవాదు ఉంది. ఎన్ని ఉపాయాలున్నాయో, స్త్రీల వద్ద అంతకు రెట్టింపు మాయలున్నాయి.) కాబట్టి వారిని కాపాడటం ఎవరికీతరం కాదు. కాబట్టి-కొన్ని ప్రీతికరమైన ఉపాయాలచేత వారిని రక్షించాలి. ॥10॥

స్త్రీలను గృహకార్యాల్లోనూ ధర్మ విధుల్లోనూ నిమగ్నులను చేయాలి -

ఇది మనుకృతం-ప్రామాణికం

అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్ । మూలశ్లోక సం. **9**
శౌచే ధర్మేఽన్నపక్త్యాం చ పారిణాహ్యస్య చేక్షణే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **11**

టీక:- **ఏనాం** = తన స్త్రీని, **అర్థస్య సంగ్రహే చ వ్యయే** = ధనాన్ని దాచిపెట్టడం, ఖర్చుపెట్టే బాధ్యతలకు, **శౌచే** = ఇల్లు-ఇంటి వస్తువులను పరిశుభ్రం చేయడానికి, **ధర్మే** = ధర్మ సంబంధమైన కార్యాలు చేయడానికి (6.93), (అగ్నిహోత్రం, సంధ్యా స్వాధ్యాయాదులు) అనుష్ఠానాలకు, **అన్నపక్త్యాం** = భోజనం చేయడానికి గృహ సంబంధమైన సర్వ వస్తు పరిరక్షణానికి, **నియోజయేత్** = నియమించినట్లయితే ఆమె రక్షించబడును. స్త్రీలు స్వాత్మ నియంత్రణ వల్లే చెడు సహవాసాల నుండి రక్షింపబడతారు వారు స్వతహాగా ప్రయత్నించినట్లయితే ఉత్తమంగా రక్షితులవుతారు.

తాత్పర్యం:- స్త్రీని ధనాన్ని దాచి పెట్టుటకు, ఖర్చుపెట్టుటకు, శుద్ధిచేయుటకు, యజ్ఞాది ధర్మకార్యాలు చేయుటకు, భోజనం, తయారు చేయుటకు, ఇంటిలోని సామాను మంచి చెడ్డలు చూచుటకు నియమించినచో ఆమె రక్షింపబడును.॥11॥

స్త్రీలు ఆత్మ నియంత్రణతోటే చెడుల నుండి రక్షించబడుతారు - ఇది మనుకృతం-ప్రామాణికం

అరక్షితా గృహే రుద్ధాః పురుషైరాప్తకారిభిః । మూలశ్లోక సం. **10**
ఆత్మానమాత్మనా యాస్తు రక్షేయుస్తాః సురక్షితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **12**

టీక:- ఎందుకంటే, **ఆప్తకారిభిః పురుషైః** = విశ్వసనీయులైన తండ్రి, భర్త మొ॥ పురుషుల ద్వారా, **గృహే రుద్ధాః** = గృహంలో పర్యవేక్షణలో ఉంచిన స్త్రీలు కూడా, **అసురక్షితాః** = చెడు సహవాసాల నుండి తప్పించుకోలేరు, **యాః తు** = ఎవరైతే, **ఆత్మానమ్ ఆత్మనా రక్షేయుః** = తమను తామే రక్షించుకొంటారో, **తాః సురక్షితాః** = వారే వాస్తవంలో చెడు నుండి సురక్షితులుగా ఉంటారు.

తాత్పర్యం:- పురుషుడు తనకాప్తులైన సేవకులు వగైరాలతో ఇంటినుండి బయట పోనీయక, నిర్బంధంగా అడ్డగింపబడిన స్త్రీలు రక్షింపబడినట్టివారు కారు. తమకుతాము సద్బుద్ధికలవారై రక్షించుకొనినపుడే సురక్షిత స్త్రీలగుదురు.॥12॥

స్త్రీలు చెడిపోవడానికి 6 కారణాలు -

ఇది మనుకృతం-ప్రామాణికం

పానం దుర్జనసంసర్గః పత్యా చ విరహోఽటనమ్ । మూలశ్లోక సం.**11**
స్వప్నోఽన్యగేహవాసశ్చ నారీసందూషణాని షట్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**13**

టీక:- పానం = మాదక ద్రవ్యాల ఉపయోగం మద్యపానం, దుర్జన సంసర్గః = దుష్ట పురుషుల సహవాసం, పత్యా చ విరహః = పతి వియోగం పతికి దూరంగా ఉండటం, అటనమ్ = ఒంటరిగా ఎక్కడికైనా ధూర్తుల బాబాల దర్శనమనే పేర తిరగడం, **(చ)** = మరియు, స్వప్నం = నియమం లేకుండా నిద్రించడం, అన్యగేహవాసః = పరాయి గృహానికి వెళ్ళడం, అక్కడనే నిద్రించడం లేదా ఉండిపోవడటం, షట్ నారీ సందూషణాని = ఈ ఆరు స్త్రీని చెడగొట్టే దుర్గుణాలు, ఈ ఆరు దుర్గుణాలు లేకుండా స్త్రీని రక్షించగలిగితే స్త్రీ రక్షింపబడినట్లే.

ఋషి దయానందభాష్యం:- మద్యపానం, దుష్టసహవాసం, భర్తనెడబాసి ఉండటం, ఒకచోట కాలు నిలువక ఎప్పుడూ ఎటో వెళ్తూ తిరుగుతూండాలనిపించడం, నిద్ర, పొరుగిళ్లకు పలుమార్లు వెళ్తూ ఉండటం అనే ఈ ఆరూ స్త్రీలు చెడిపోడానికి మార్గాలు.(స.ప్ర.6వ సము.) ॥13॥

14 నుండి 24వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

స్త్రీల నింద్య స్వభావ వర్ణన -

* *నైతా రూపం పరీక్షన్తే నాసాం వయసి సంస్థితిః ।*
సురూపం వా విరూపం వా పుమానిత్యేవ భుంజతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*14*

తాత్పర్యం:- ఎందుకంటే.....వీరికి యవ్వనం ఉండే ప్రాయంలోనే అంటే ఎక్కువకాలం ఆ యవ్వనం నిల్చి ఉండదు కాబట్టి రూపం-ప్రాయం మంచి స్థితిలో ఉన్నప్పుడే పురుషుడి వల్ల ఏదోలా సుఖపడదామనుకుంటారు. ॥14॥

* *పౌంశ్చల్యాచ్చలచిత్తాచ్చ నైస్నేహ్యాచ్చ స్వభావతః ।*
రక్షితా యత్నతోఽపీహ భర్తృష్వేతా వికుర్వతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*15*

తాత్పర్యం:- కొందరు పురుషులమీద మనస్సు పారేసుకున్న స్త్రీలు, తమ మనసుల్ని నిల్పుకోలేక కొంత-భర్తతో తగినంత చనువులేక కొంత, ప్రయత్న పూర్వకంగా వారిని కట్టడిచేయచూసినప్పటికీ భర్తలపైన వారు పూర్తి అనురాగంతో ఉంటారన్నది కల్ల. ॥15॥

* *ఏవం స్వభావం జ్ఞాత్వాఽసాం ప్రజాపతినిసర్గజమ్ ।*
పరమం యత్నమాతిష్ఠేత్ పురుషో రక్షణం ప్రతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.*16*

తాత్పర్యం:- సృష్ట్యాది నుండే వీరి సహజ స్వభావం ఇలాంటిదని తెలిసి ఉన్న పురుషుడు వీరిని ఎంతవరకు నియంత్రించాలో అంతవరకు నియంత్రించడానికే ప్రయత్నించాలి. ॥16॥

* *శయ్యాఽఽసనమలంకారం కామం క్రోధమనార్జవమ్ ।*
ద్రోహభావం కుచర్యాం చ స్త్రీభ్యో మనురకల్పయత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*17*

తాత్పర్యం:- పాన్పు, పీఠం, ఆభరణాలు, కామక్రోధాలు, కపటం, పరద్రోహ చింతన, పరహింస, కుత్సిత నడవడిక, తమ కంటికి నచ్చిన పురుషుణ్ణి పొందాలన్న యోచన....వీటి నన్నింటినీ స్త్రీలను పుట్టించిననాడే మనువు కల్పించాడు. కాబట్టి వీరిని కట్టుబాట్లలో ఉంచాలి. ॥17॥

* *నాస్తి స్త్రీణాం క్రియా మన్త్రైరితి ధర్మే వ్యవస్థితిః ।*
నిరిన్ద్రియా హ్యమన్త్రాశ్చ స్త్రీయోఽనృతమితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **18**

తాత్పర్యం:- జాతకర్మ, నామకరణం స్త్రీలకు మంత్రంతో కూడిలేవని ధర్మశాస్త్రాలు అంటున్నాయి. కాబట్టి స్త్రీలు పాపం నుంచి విముక్తత పొందని వారని అభిప్రాయం. మంత్రం సంస్కారాలు లేకపోవడం చేత, వారిని ధర్మజ్ఞులుగా పరిగణించరాదు. వారి పాపాలు పోకార్చగల మంత్రాలు లేనందువల్ల, ప్రయత్నంచేతనే వారిని పాపాలు చెయ్యనివ్వక కాపాడుకోవాలి. ॥18॥

* *తథా చ శ్రుతయో బహ్వ్యో నిగీతా నిగమేష్వపి ।*
స్వాలక్షణ్యపరీక్షార్థం తాసాం శృణుత నిష్కృతీః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **19**

తాత్పర్యం:- స్త్రీలకు వ్యభిచారశీలత స్వాభావికం. ఈ విషయమై వేదవాక్యాలే ప్రమాణాలు. ఆ విధంగా చాలా వేదవాక్యాలు స్త్రీల వ్యభిచార శీలతను ప్రకటిస్తున్నాయి. అందులో ఒకటి దానికి ప్రాయశ్చిత్తంగా చెప్పబడిన వాక్యం చెబుతాను-వినండి. ॥19॥

ఒకానొక పుత్రుడు, తన తల్లియొక్క మానసిక వ్యభిచారాన్ని తెలిసి ఉన్నవాడై ఇలా అంటున్నాడు....

* *యన్మే మాతా ప్రలులుభే విచరన్త్యపతివ్రతా ।*
తన్ మే రేతః పితా వృఙ్క్తామిత్యస్యైతన్నిదర్శనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **20**

తాత్పర్యం:- తన పతిని తప్ప ఇతర పురుషుణ్ణి కోరనిది పతివ్రత. అలా లేనిది వ్యభిచారిణి. మా తల్లి పొరుగిళ్లకు వెళ్లి పరపురుషుణ్ణి కోరింది. అలాంటి 'పరపురుషుణ్ణి తలచుట' అనే పాపం చేసిన మా తల్లి రజోరూపమైన రేతస్సును మా తండ్రి శోధించుగాక! అంటూ కొడుకు పలికిన పలుకులే స్త్రీ స్వభావానికి నిదర్శనం. ॥20॥

* *ధ్యాయత్యనిష్టం యత్కించిత్పాణిగ్రాహస్య చేతసా ।*
తస్యైష వ్యభిచారస్య నిహ్నవస్సమ్యగుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **21**

తాత్పర్యం:- స్త్రీ భర్తకు ఏ కొంచెం కీడును తలపెట్టినా అలాంటి వ్యభిచారదోషానికి ఈ మంత్రం చక్కటి ప్రాయశ్చిత్తమని పండితులు చెప్పుచున్నారు. 'మాతా' అనేది పుత్రునికి ప్రాయశ్చిత్తం కాని తల్లికి కాదు. ॥21॥

* *యాదృగ్గుణేన భర్త్రా స్త్రీ సంయుజ్యేత యథావిధి ।*
తాదృగ్గుణా సా భవతి సముద్రేణేవ నిమ్నగా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **22**

తాత్పర్యం:- భర్త మంచివాడో-చెడ్డవాడో గాని, ఏ స్త్రీ అయితే అతణ్ణి పెళ్లి చేసుకుంటుందో అలాంటి స్త్రీ అలాంటిదిగా మారుతుంది. ఉప్పుసముద్రంలో మంచి నీరు కలిసి ఉప్పగా మారినట్లు భర్తగుణాల్ని పొందుతోంది.॥22॥

* *అక్షమాలా వసిష్ఠేన సంయుక్తాధమయోనిజా ।*
సారంగీ మన్దపాలేన జగామాభ్యర్హణీయతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **23**

తాత్పర్యం:- ఈ విషయమై మరొక ఉత్తమమైన దృష్టాంతం చెప్పబడుతోంది. అక్షమాల అనే ఒక నీచజాతి కన్యక వశిష్ఠుని పెళ్లిచేసుకుని ఉత్తమురాలైంది. చటక అనే అధమజాతిది మందపాలుడనే ఋషిని పెళ్లాడి ప్రజలలో ఖ్యాతిగన్నది.॥23॥

* ఏతాశ్చాన్యాశ్చ లోకేస్మిన్నపకృష్ట ప్రసూతయః ।
ఉత్కర్షం యోషితః ప్రాప్తాః స్వైస్వైర్భర్తృగుణైశ్శుభైః ॥   ప్రక్షిప్త శ్లోక సం. *24*

తాత్పర్యం:- వీళ్లిద్దరే కాక, ఇంకా ఎందరెందరో తక్కువ జాతి స్త్రీలు మేటి గుణాలు కలిగిన భర్తలను పొంది, వారి మంచి గుణాలచేత తాము గొప్పతనాన్ని పొందిన వారయ్యారు. ॥24॥

ప్రక్షిప్తాల పరిశీలన

14-24 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి-

1. శైలీగత ఆధారాలు

క. 17వ శ్లోకంలో 'మనుః అకల్పయత్' పదాలతో ఈ శ్లోకమూ, దీనికి సంబంధించిన 14-24 శ్లోకాల పూర్వాపర ప్రసంగం మనువు చెప్పినదానికి భిన్నంగా ఉండటం చేత వేరెవరో రాశారని తెలిసిపోతూంది.

ఖ. ఈ అన్ని శ్లోకాలలో పట్టుదలతోనూ, పక్షపాత ధోరణిగల నిందాత్మక కథనం ఉంది. మనువు శైలి ఈ విధంగా ఉండదు. గుణదోషాలను అనుసరించి నిందస్తుతులు ఉంటాయి. ఈ శైలి ఆధారంతోను ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే!

2. విషయ వ్యతిరేకాలు

విషయ సంకేతకాలైన 9.1, 9.25, శ్లోకాలతో ప్రస్తుత విషయమైన స్త్రీ పురుషులదైనిక దాంపత్య జీవిత ధర్మాల నిర్ణయం జరుగుతుంది. 9.14-24 శ్లోకాలలో అవి కాకుండా, స్త్రీ స్వభావాన్ని నిందాత్మకంగా విశ్లేషించారు. ఇది విషయ బాహ్యం. ఇట్లా సంకేతించిన విషయం కాకుండా ఇంకేదో చెప్పటం చేత ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే!

3. ప్రసంగ వ్యతిరేకాలు

పురుషుడు స్త్రీని రక్షించాలన్న విషయం 9.11తో పూర్తి అయింది. కానీ 12,13 లలో స్త్రీలదూషణ ఉంది. 14,15లలో పురుషులు రక్షించాలనే విషయాన్ని మళ్లీ కొత్తగా ప్రారంభించారు. ఇది ముగిసిన తర్వాత మళ్లీ మొదలు పెట్టటం ప్రసంగ వ్యతిరేకం. అందుకని ఇవన్నీ ప్రక్షిప్తాలు.

4. అంతర్ వ్యతిరేకాలు

క. 9.22-24 శ్లోకాలలోని అంతర్ వ్యతిరేకాలలో 'కాల వ్యతిరేకత' ఉంది. అక్షమాల - వశిష్ఠుడు, శార్ఙ్గి-మందపాలుడు- ఇవి స్వాయంభువ మనువు తర్వాత ఎన్నో తరాల తర్వాతి ఋషి దంపతుల జంటలు. తర్వాతి తరాల ఉదాహరణలు, మునుపటి తరాలలో చెప్పటం కుదరని పని. కనుక ఇవి తర్వాతి కాలపు వ్యక్తులు ప్రక్షిప్తంగా చేర్చినవి.

ఖ. మనువు కర్మల చేత వర్ణ వ్యవస్థను ఏర్పరచాడు. ఈ శ్లోకాలలో జన్మ ఆధారంగా అక్షమాల, శార్ఙ్గాలను తక్కువ జాతివారని చెప్పడం, మనువు మౌలిక వ్యవస్థకు వ్యతిరేకం. మనువు కాలంలో జన్మ చేత జాతి వ్యవస్థ లేదు. ఇవి జన్మతో జాతి అనే తర్వాతి వారు ప్రక్షిప్తం చేసినవి.

గ. ఈ శ్లోకాలలో స్త్రీని సహజంగానే ఎన్నో దుర్గుణాలు గలదిగా చూపి, నిందించ దగినదిగానూ, అబద్ధాలకు మారు రూపంగానూ చెప్పారు. ఇది స్త్రీల విషయంలో మనువు మౌలిక భావాలకు వ్యతిరేకంగా ఉంది. మనువు స్త్రీలను ఆదరణీయలనీ, సమాన స్థాయివారనీ,ఇంటి శోభగా, పవిత్రంగానూ భావించాడు [9.26,28,96,101, 102, 3.55-63].

ఘ. 18వ శ్లోకంలో స్త్రీలకు మంత్రాలపై అధికారం ఇవ్వకపోవడం కూడా మనువుకు వ్యతిరేకమే. అన్ని ధర్మ కార్యాలకూ స్త్రీలే ఆధారమని, పురుషులతో సమానంగా అధికార మిచ్చాడు మనువు [9.28,96]. [విస్తృత విశ్లేషణకు 2.66 మీది సమీక్ష చూడండి]. స్త్రీల గర్భాధానం నుంచి అన్ని సంస్కారాలు, యజ్ఞాలు, మంత్ర పూర్వకంగా చేసే అధికారం మనువు ఇచ్చాడు [2.1-8;5.167] కనుక, స్త్రీల అనుష్ఠానాలన్నీ మంత్రరహితాలనటం మనువు మౌలిక పద్ధతికి వ్యతిరేకం.

సంతానోత్పత్తి సంబంధమైన ధర్మాలు- **25 నుండి 28 వరకు మనుకృతం- ఇవి ప్రామాణికం**

ఏషోదితా లోకయాత్రా నిత్యం స్త్రీపుంసయోః శుభా । మూలశ్లోక సం. **12**
ప్రేత్యేహ చ సుఖోదర్కాన్ ప్రజాధర్మాన్ని బోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **25**

టీక:- **ఏషా** = ఇది (9-1-13) **స్త్రీ-పుంసయోః నిత్యం శుభా** = స్త్రీ-పురుషులకు సదా కల్యాణకారి అయిన, **లోకయాత్రా ఉదితా** = లోక వ్యవహారం చెప్పబడింది, ఇప్పుడు, **ప్రేత్య చ ఇహ సుఖోదర్కాన్** = పరజన్మలో ఈ జన్మలో కూడా పరిణామ సుఖదాయకాలైన, **ప్రజా ధర్మాన్ నిబోధత** = సంతానోత్పత్తి ధర్మాలను వినండి.

తాత్పర్యం:- స్త్రీ పురుషులకు సంబంధించిన నిత్యముందు శుభమైన లోకగమనం చెప్పబడింది. ఇప్పుడు ఈ లోకంలో పరలోకంలో సుఖమునిచ్చు సంతానమునకు సంబంధించిన ధర్మాలను తెలిసికొనుడు. ॥25॥

స్త్రీలు గృహలక్ష్ములు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ప్రజనార్థం మహాభాగాః పూజార్హా గృహదీప్తయః । మూలశ్లోక సం. **13**
స్త్రియః శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన ॥ ప్రక్షిప్త శ్లోక సం. **26**

టీక:- ఓ పురుషులారా ! **ప్రజనార్థం మహాభాగాః** = సంతానోత్పత్తి కోసమే మహాభాగ్య శాలులు, **పూజార్హాః** = పూజనీయులు, **గృహదీప్తయః** = గృహ జ్యోతులు (గృహస్థాశ్రమాన్ని ప్రకాశింప చేసేవారు), **గేహేషు స్త్రియః** = గృహాలందుండే స్త్రీలే, **శ్రియః** = లక్ష్మీ స్వరూపులు, (గృహలక్ష్ములు), **విశేషః కశ్చన న అస్తి** = ఎందుకంటే లక్ష్మి-శోభ-ధనం మరియు స్త్రీలలో ఏమీ తేడా లేదు భేదం లేదు అందరూ ఒక్కటే.

ఋషి దయానందభాష్యం:- స్త్రీలు సంతానోత్పత్తికి కారణాలు, మహాభాగ్యశాలులు, పూజనీయలు, గృహజ్యోతులు. స్త్రీలే గృహలక్ష్ములు. గృహిణికి లక్ష్మికి భేదం లేదు. (సం.వి.గృ.ప్ర.) ॥26॥

వివరణ:

స్త్రీలు లక్ష్మీ స్వరూపిణులు. మనువు స్త్రీలకు చాలా గొప్ప స్థానాన్నిచ్చాడు. ఇదే సమస్త ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తున్నది. ఈ భావానికి ఉదాహరణగా బ్రాహ్మణ గ్రంథంలో ఇలా ఉంది.

క. శ్రియై వా ఏతద్ రూపం యత్పత్న్యః. శత. 13.2.6.7.

ఖ. 'గృహా వై పత్న్యై ప్రతిష్ఠా'. శత. 3.3.1.10.

స్త్రీలు లోకయాత్రకు ఆధారం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఉత్పాదనమపత్యస్య జాతస్య పరిపాలనమ్ । మూలశ్లోక సం. **14**
ప్రత్యహం లోకయాత్రాయాః ప్రత్యక్షం స్త్రీ నిబన్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **27**

టీక:- ఓ పురుషులారా ! **అపత్యస్య ఉత్పాదనమ్** = బిడ్డలను కనడం, **జాతస్య పరిపాలనమ్** = పుట్టిన బిడ్డలను సాకడం, పోషించడం మొ॥, **లోకయాత్రాయాః ప్రత్యహం** = నిత్యం లోక వ్యవహారాన్ని, గృహాశ్రమ కార్యం, సాగించడంలో, **స్త్రీ నిబంధనమ్ ప్రత్యక్షమ్** = స్త్రీ ప్రత్యక్ష సాధనం. స్త్రీ లేకుండా ఏమీ సాగదు.

ఋషి దయానందభాష్యం:- బిడ్డలను కనటం, వారిని పోషించటం, ప్రతిరోజూ మిత్ర బాంధవ అతిథి అభ్యాగతులకు భోజనసదుపాయాలు కలుగజేయడం మొదలైన పనులు ప్రత్యక్షంగా భార్య పర్యవేక్షణలోనే కదా జరిగేది ! అందువల్ల గృహనిర్వహణ అనే బృహత్తర బాధ్యత నిర్వర్తించే స్త్రీలు సమ్మానార్హులే. (సం.వి.గృ.ప్ర.) ॥27॥

గృహసుఖమంతా స్త్రీ మీదనే ఆధారపడి ఉంది - **ఇది మనుకృతం-ప్రామాణికం**

అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషా రతిరుత్తమా । మూలశ్లోక సం.**15**
దారాఽధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**28**

టీక:- **అపత్యం** = సంతానోత్పత్తి, **ధర్మకార్యాణి** = ధర్మ కార్యాలు, **ఉత్తమా శుశ్రూషా రతిః** = ఉత్తమమైన సేవా శుశ్రూషలు, రతి, అలాగే, **ఆత్మనః చ పితౄణాం హ స్వర్గః** = తనకు, తల్లిదండ్రులకు ఎంత సుఖం ఉండాలో, **దారాధీనః** = అదంతా స్త్రీ అధీనంలోనే ఉంటుంది.

ఋషి దయానందభాష్యం:- సంతతి, స్వధర్మానుష్ఠానం, శుశ్రూష, పతియందు అనురాగం, యజమానికి-పితరులకు స్వర్గం ఇవన్నీ భార్య అధీనంలో ఉన్నాయి. నీటముంచినా-పాలముంచినా ఆమెదే భారం.(సం.వి.గృ.ప్ర.) ॥28॥

వివరణ:

పితౄణాం-అంటే పితా-పితామహ-ప్రపితామహాదులందరూ గృహంలో ఆనందం పొందడానికి స్త్రీ యే ప్రత్యక్ష కారణం.

ఈ విషయం గురించి విస్తృత సమీక్ష 2.151 [2.176] మరియు 3.82లో చూడగలరు.

29,30 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా ।*
సా భర్తృలోకమాప్నోతి సద్భిః సాధ్వీతి చోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*29*

తాత్పర్యం:- మాటకు కట్టుబడేది, తన దేహాన్ని పరులకు అప్పగించక అదుపులో ఉండేది, భర్తనే నిరంతరం స్మరించగలిగేది, భర్తవల్ల సంపాదించబడిన పుణ్యంలో భాగం పంచుకొని 'సాధ్వి' అనబడుతోంది. అలాంటి స్త్రీయే పుణ్యలోకాలు పొందుతూంది. ॥29॥

* *వ్యభిచారాత్ తు భర్తుః స్త్రీ లోకే ప్రాప్నోతి నిన్ద్యతామ్ ।*
సృగాలయోనిం చాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*30*

తాత్పర్యం:- మరొక పురుషుణ్ణి కోరడం చేత స్త్రీ నిందలతో దూషితురాలవుతోంది. జన్మాంతరంలో నక్కజన్మ పొందుతుంది. పాపాది రోగాలచేత పీడించబడుతోంది. ॥30॥

ప్రక్షిప్తాల పరిశీలన

29,30 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

9.25లో విషయ సంకేత శ్లోకం ప్రకారం, అప్పటి విషయం సంతానోత్పత్తి ధర్మాలను గురించినది. వీటిలో విషయ బాహ్యమైన 'స్త్రీల ప్రవర్తనదాని ఫలితాలు' ఉంది. ఈ విషయ వ్యతిరేకం ఆధారంగా ఈ రెండు శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. పునరుక్తులు

ఈ రెండు శ్లోకాలూ క్రమంగా 5.135,136లకు మక్కీకి మక్కీగా పునరుక్తులు. ఈ ఆధారంతో ఇక్కడ వీటి అనవసరమైన పునరుక్తి కనుక ఇవి ప్రక్షిప్తాలు.

3. ప్రసంగ వ్యతిరేకాలు

ముందు వెనుకల [28-31] శ్లోకాలలో పుత్ర సంబంధమైన విషయం ఉంది. మధ్యలో 'స్త్రీల ప్రవర్తన, దాని ఫలితాలు' అనేది ప్రసంగ వ్యతిరేకాలు, ప్రసంగ భంజకం కూడా. కనుక ప్రక్షిప్తాలు.

31 నుండి 33 శ్లోకాల వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

పుత్రునిపై అధికార సంబంధ కథనం-

పుత్రం ప్రత్యుదితం సద్భిః పూర్వజైశ్చ మహర్షిభిః । మూలశ్లోక సం.**16**
విశ్వజన్యమిమం పుణ్యముపన్యాసం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం..**31**

టీక:-ఓ మానవులారా ! **సద్భిః చ పూర్వజైః మహర్షిభిః** = శ్రేష్ఠులు, ప్రాచీన మహర్షులు, **పుత్రం ప్రతి** = పుత్రుడి విషయంలో, **విశ్వజన్యం పుణ్యం ఉదితం** = సర్వజనహితకరం, పుణ్యదాయకమైన, **ఇమం ఉపన్యాసం నిబోధత** = ఈ శిక్షాప్రదమైన అభిప్రాయాన్ని వినండి.

తాత్పర్యం:- పురుష శ్రేష్ఠులారా ! పుత్రుడి గురించి శిష్టులయిన మనువు మొదలైన మహర్షులు-పూర్వఋషులు చెప్పిన సర్వజనహితకరం, పుణ్యదాయకమైన ఈ శిక్షాప్రదమైన అభిప్రాయాన్ని వినండి. ॥31॥

పుత్రుడి మీద అధికార విషయంలో భిన్నాభిప్రాయాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

భర్తుః పుత్రం విజానన్తి శ్రుతిద్వైధం తు భర్తరి । మూలశ్లోక సం.**17**
ఆహురుత్పాదకం కేచిదపరే క్షేత్రిణం విదుః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**32**

టీక:- భర్తుః పుత్రం విజానన్తి = పుత్రుడు భర్తకు చెందునని మునులు భావిస్తారు, **భర్తరి తు శ్రుతిద్వైధం** = కానీ భర్త విషయంలో రెండు భిన్నాభిప్రాయాలున్నాయి. **కేచిత్ ఉత్పాదకం ఆహుః** = పుత్రుడి ఉత్పన్నం చేసిన వాడే పుత్రుడికి హక్కుదారుడని కొందరు తలంతురు. **అవరే క్షేత్రిణం విదుః** = మరికొందరు స్త్రీ యొక్క భర్తనే హక్కుదారుడంటారు. ఉత్పాదకుడు ఎవరైనా కావచ్చు అతడు దత్తపుత్రుడు, నియోగ పుత్రుడు అని చెప్పబడుతుతాడు.

తాత్పర్యం:- భర్త తన భార్యను తన అధీనంలో ఉంచుకోవాలి. వారు తరచుగా నిషిద్ధ రూప-రస-గంధాది విషయాలలో ప్రవర్తిస్తుంటారు. (అంటే.....వద్దన్నవి చేయడం) వారినట్లు పోనివ్వక పురుషులు తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలి. పుత్రుడు భర్తకు చెందుతాడని మునులు భావిస్తారు. కానీ భర్త విషయంలో రెండు భిన్నాభిప్రాయాలున్నాయి పుత్రుడు ఉత్పన్నం చేసిన వాడికే పుత్రుడని, అతడే పుత్రుడికి హక్కుదారుడని, మరికొంత మంది స్త్రీ యొక్క భర్తనే హక్కుదారుడంటారు.॥32॥

స్త్రీ పురుషులకు-క్షేత్ర-బీజ రూపంలో సామ్యత - ఇది మనుకృతం-ప్రామాణికం

క్షేత్రభూతా స్మృతా నారీ బీజభూతః స్మృతః పుమాన్ । మూలశ్లోక సం. **18**
క్షేత్రబీజసమాయోగాత్సంభవస్సర్వదేహినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **33**

నారీ క్షేత్ర భూతా స్మృతా = స్త్రీని క్షేత్రంతో సమానమని భావిస్తారు, మరియు, **పుమాన్ బీజ భూతః స్మృతః** = పురుషుడు బీజంతో సమానమని భావిస్తారు. **క్షేత్ర-బీజ-సమయోగాత్** = పొలం-విత్తనాలు కలిసినప్పుడే అంటే స్త్రీ-పురుష సంయోగం వల్లనే, **సర్వదేహినామ్ సంభవః** = సర్వప్రాణులు ఉత్పన్నమవుతాయి.

తాత్పర్యం:- స్త్రీని క్షేత్రంతో సమానమని భావిస్తారు. పురుషుడు బీజతుల్యుడు. ఈ రెండింటి చేరిక చేతనే కదా సకల ప్రాణుల ఉత్పత్తి జరుగుతోంది! మరి పరస్త్రీతో లేదా పరపురుషునితో పుత్రోత్పత్తి జరిగినప్పుడు, పుత్రుడి మీద అధికారం స్త్రీకి ఉంటుందా? లేదా స్త్రీ భర్తకు ఉంటుందా? ॥33॥

34 నుండి 48వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *విశిష్టం కుత్ర చిద్ బీజం స్త్రీయోనిస్త్వేవ కుత్రచిత్ ।*
ఉభయం తు సమం యత్ర సా ప్రసూతిః ప్రశస్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***34***

తాత్పర్యం:- ఒక్కొక్కసారి బీజానికి, ఒక్కొక్కసారి క్షేత్రానికి ప్రాధాన్యత ఉంటుంది. అటులగాక బీజము, క్షేత్రము రెండూ మంచివైతే సంతానమూ మంచిదౌతుంది. ॥34॥

* *బీజస్య చైవ యోన్యాశ్చ బీజముత్కృష్టముచ్యతే ।*
సర్వభూతప్రసూతిర్హి బీజలక్షణలక్షితా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***35***

తాత్పర్యం:- పంచభూతార్ధ రీత్యా సకలజీవరాశుల ఉత్పత్తి; బీజమునకు గల చిహ్న, వర్ణ, రూపాదులు...వీటిని యోచించి చూడగా క్షేత్ర బీజాలలో బీజమే ప్రధానమని చెప్పబడింది. కారణం సమస్త సంతానోత్పత్తిలో బీజలక్షణాలే కనిపిస్తాయి. ఏ విత్తనం నాటితే ఆ చెట్టే మొలుస్తుంది. ॥35॥

* *యాదృశం తూప్యతే బీజం క్షేత్రే కాలోపపాదితే ।*
తాదృగ్ రోహతి తత్ తస్మిన్ బీజం స్వైర్వ్యంజితం గుణైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***36***

తాత్పర్యం:- వర్షాదుల వల్ల పదును చేయబడి, ఏ క్షేత్రంలో బీజాలు విత్తబడతాయో ఆ బీజం తన రంగు-రూపు మొదలైన వాటితో ఆ క్షేత్రంలో పుడుతోంది. ఆ విధంగానే పురుషుడి బీజం ఏ స్త్రీ యోనిలో పడుతూన్నదో, అలాంటి లక్షణాలతోనే ఆ బీజం వృద్ధి చెందుతోంది. ॥36॥

* *ఇయం భూమిర్హి భూతానాం శాశ్వతీ యోనిరుచ్యతే ।*
న చ యోనిగుణాన్ కాంశ్చిద్ బీజం పుష్యతి పుష్టిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***37***

తాత్పర్యం:- ఈ భూమి సమస్త జీవులకు నిత్యకారణమైన క్షేత్రం. అయినా అందుంచబడే బీజం భూమిగుణాలను పొందడం లేదు. బీజగుణమే కలిగి ఉంటుంది. కాబట్టి క్షేత్రమునకంటే బీజమే ప్రధానం. ॥37॥

* *భూమావప్యేకకేదారే కాలోప్తాని కృషీవలైః ।*
నానారూపాణి జాయన్తే బీజానీహ స్వభావతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***38***

తాత్పర్యం:- రైతుచేత ఆ యా కాలానుగుణంగా భూమిలో వేయబడిన ధాన్యాలు-కాయధాన్యాలు ఒక్కొక్క పొలంలో ఆ యా బీజాలకు తగినట్లు అనేకరూపాలుగా భూమిలో మొలిచినా భూమి గుణాలను పొందవు. ॥38॥

* *వ్రీహయః శాలయో ముద్గాస్తిలా మాషాస్తథా యవాః ।*
యథా బీజం ప్రరోహన్తి లశునానీక్షవస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **39**

తాత్పర్యం:- కాయధాన్యాలు, వడ్లు, పెసలు-యవలు, నువ్వులు ఉలవలు, మినుమలు మొ॥ పప్పుధాన్యాలు, ఉల్లి-చెరకు లాంటి పంటలు ఇవన్నీ బీజములకు తగినట్లుగా పుడుతూన్నాయి. ॥39॥

* *అన్యదుప్తం జాతమన్యదిత్యేతన్నోపపద్యతే ।*
ఉప్యతే యద్ హి యద్ బీజం తత్ తదేవ ప్రరోహతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **40**

తాత్పర్యం:- విత్తొకటి వేస్తే చెట్టొక్కటి మొలిచిందని ఎక్కడా వినలేదు. ఏ యే విత్తనం వేయబడునో ఆ యా విత్తనమే మొలుస్తున్నది. ఇలా ధాన్యాదులందు బీజగుణం అనుసరించడం వల్లా, క్షేత్రగుణాన్ని అనుసరించాలి, మనుష్యులందురూ బీజమే ప్రధానమని తెలుసుకోవాలి. ॥40॥

పరస్త్రీలతో సంతానోత్పత్తి చేయరాదు -

* *తత్ప్రాజ్ఞేన వినీతేన జ్ఞానవిజ్ఞానవేదినా ।*
ఆయుష్కామేన వప్తవ్యం న జాతు పరయోషితి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **41**

తాత్పర్యం:- ఇక క్షేత్ర ప్రాధాన్యతను గురించి చెబుతున్నాడు-కాబట్టి అలాంటి బీజాన్ని, సహజ ప్రజ్ఞావంతుడు శిష్టాచారసంపన్నుడు, జ్ఞానం = వేదాలను, విజ్ఞానం = వేదాంగాలైన శిక్షావ్యాకరణాదులను తెలిసినవాడు, ఎక్కువ కాలం జీవింపగోరువాడు ఎన్నడునూ పరస్త్రీయందు తన బీజాన్ని వేయరాదు. ॥41॥

* *అత్ర గాథా వాయుగీతాః కీర్తయన్తి పురావిదః ।*
యథా బీజం న వప్తవ్యం పుంసా పరపరిగ్రహే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **42**

తాత్పర్యం:- ఇదే విషయాన్ని తొలినాటి పెద్దలు 'వాయువు గానం చేసిన విధంగా పరపురుషుడు పరస్త్రీయందు బీజాన్ని ఉంచరాదు అంటారు. అంటే, గాలి ద్వారా ఒకపొలంలోని ధాన్యవు గింజలు మరో పొలంలో పడి మొలిచి పంట పండినప్పుడు అది ఆ పండిన భూమియజమానికే చెందునట్లు పరపురుషులు పరస్త్రీలో వేసిన బీజం ఆ స్త్రీ భర్తకే చెందుతుందని సారాంశం. ఆ బీజపు యజమాని మాత్రం ఆ ధాన్యం నాదేనని చెప్పుకోలేక, అడగలేక బాధపడుతుంటాడు. ॥42॥

* *నశ్యతీషుర్యథా విద్ధః ఖే విద్ధమనువిధ్యతః ।*
తథా నశ్యతి వై క్షిప్రం బీజం పరపరిగ్రహే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **43**

తాత్పర్యం:- ఒకడి చేత ఒక మృగానికి గురిపెట్టి బాణం వేసినప్పుడు, ఆ బాణం ఏర్పరచిన కన్నంలో ఇంకొకడు బాణం వేస్తే ఆ బాణం ఎలా నిష్ఫలమవుతూన్నదో (ఆ మృగం మొదట బాణంవేసినవానికే ఎలా చెందుతూన్నదో) అలాగే పరక్షేత్రంలో వేయబడిన బీజం త్వరగానే నిష్ఫలమవుతుంది. ॥43॥

* *పృథోరపీమాం పృథివీం భార్యాం పూర్వవిదో విదుః ।*
స్థాణుచ్ఛేదస్య కేదారమాహుశ్శల్యవతో మృగమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **44**

తాత్పర్యం:- దీనికి ఉదాహరణగా-భూమినే చెప్పవచ్చు! మొదట ఈ పృథ్విని పృథు చక్రవర్తి చేపట్టాడు కదా! తదుపరి రాజులు ఈ నేలను ఏలినప్పటికీ ఆమెను పృథ్వి అనే అన్నారు కాని, ఆయా పరిపాలకుల పత్నిగా ఎందుకు గుర్తించలేదు? కాబట్టి ఎవడు పొలం సాగుచేసుకుంటాడో ఆ పొలం అతని పేరిట చెలామణీ అవుతున్నది. అలాగే ఏ విలుకాని వల్ల మృగం బాణపు దెబ్బకు గురవుతున్నదో ఆ మృగం ఆ విలుకానిదే అవుతోంది. అలాగే మొదట స్త్రీని

ఎవరైతే పెళ్లాడతారో అతడే ఆమె క్షేత్రాధికారి. ఇతరులు బిడ్డ పుట్టించడానికి కారకులైనా, క్షేత్రస్వామికే ఆ బిడ్డ చెందుతాడు. అంతేగాని ఆ స్త్రీ యందు బిడ్డ పుట్టించిన వాడు సంతానాధికారి కాదు. ॥44॥

* *ఏతావానేవ పురుషో యజ్ఞాయాఽఽత్మా ప్రజైతి హ ।*
విప్రాః ప్రాహుస్తథా చైతద్యో భర్తా సా స్మృతాంగనా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **45**

తాత్పర్యం:-తాను ఒక్కడే కుటుంబ యజమానికాడు. ఇక్కడ 'పురుష' శబ్దం యాజమాన్యానికి చిహ్నం. తాను-భార్య-పుత్రుడు ముగ్గురినీ చేర్చి పురుష శబ్దానికి అన్వయించాలి. కాబట్టి ఆ భార్యయందు తాను పుట్టించిన పుత్రుడైనా; ఇతరులచేత పుట్టించబడినా అతడు తొలి యజమాని అయిన పురుషుడికే చెందిన వాడవుతాడు. ॥45॥

* *న నిష్క్రయవిసర్గాభ్యాం భర్తుర్భార్యా విముచ్యతే ।*
ఏవం ధర్మం విజానీమః ప్రాక్ ప్రజాపతినిర్మితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **46**

తాత్పర్యం:- విక్రయధనం తీసుకొన్నా గాని, లేదా భర్తచేత దానంగా ఇచ్చివేయబడినా గాని భార్య భర్త నుంచి విడుదల పొందినట్లు కాదు. ఇది బ్రహ్మ నిర్దేశించిన ధర్మం. కాబట్టే ఇతరుల భార్యను తాను కొనుక్కొని దానికి సంతానం పుట్టించినా, ఆ సంతతి క్షేత్రస్వామికే గాని బీజస్వామికి చెందదు. ॥46॥

* *సకృదంశో నిపతతి సకృత్కన్యా ప్రదీయతే ।*
సకృదాహ దదానీతి త్రీణ్యేతాని సతాం సకృత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **47**

తాత్పర్యం:- పుత్రులందరికీ తండ్రి ధనాదుల పంపకం ఒక్కసారే చేస్తాడు. అదే మార్చి మార్చి తిరిగి పంచడు కదా! అలాగే -కన్య కూడా ఒక్కరికి ఒక్కమారే ఇవ్వబడుతుంది. దాన్ని పరిగ్రహించువాడు ఇతరులకు ఆమెను ఇవ్వజాలడు. కన్య ఒకరికి ఇవ్వబడ్డాక ఏ కారణంచేతనైనా మరొకరి పరమైతే ఆమెకు జన్మించిన బిడ్డ మొదట ఆమె ఎవరికి సొంతమైందో ఆ క్షేత్రస్వామికే తప్ప బీజస్వామికి చెందదు. అలాగే-గోవులు మొదలైనవి మొదట ఒకరికి ఇస్తామని ఒప్పందం జరిగాక వేరొకరికి ఇవ్వడానికి వీలుకాదు. ధనం-కన్య-గోవు అనే ఈ మూడింటినీ సజ్జనులు ఒక్కసారే చేస్తారు గాని మళ్ళీ-మళ్ళీ దానం చేయరు. లేదా పంపకం చేయరు. ॥47॥

* *యథా గోఽశ్వోష్ట్రదాసీషు మహిష్యజావికాసు చ ।*
నోత్పాదకః ప్రజాభాగీ తథైవాన్యాంగనాస్వపి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **48**

తాత్పర్యం:- గోవులు, గుర్రాలు, ఒంటెలు, బానిసకత్తెలు గేదెలు (ఎనుములు,మేకలు, గొర్రెలు మొదలగు వాటి సంతానం యజమానికి చెందునట్లు పరస్త్రీలయందు కన్న సంతానం కూడా భర్తకే దక్కుతుంది కాని తక్కినవారికి చెందదు. ॥48॥

ప్రక్షిప్తాల పరిశీలన

34-48 వరకు గల శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. 9.31-33 శ్లోకాలలో కొత్త విషయం ప్రారంభమైంది. పుత్రులు రెండు రకాలుగా పుడతారు. ఒకటి - 'విధ్యుక్తంగా పెళ్లి చేసుకున్న భర్త వల్ల; రెండు - పరస్త్రీ వల్ల సంతానం పొందే అవివాహితుడైన పురుషుడు.' దీంట్లో కలిగే సందేహం 'పుత్రుడి మీద ఎవరికి అధికారం ఉంటుంది?' అనేది. ఈ విషయంలో 33 శ్లోకానికి 49వ శ్లోకానికి సంబద్ధత ఉంది. ఏక వాక్యతా ఉంది. మధ్యలోని 34-48 శ్లోకాలలోని విషయం వాటిని భంగం చేస్తూంది. ఈ కారణం చేత ఆ శ్లోకాలు ప్రక్షిప్తాలుగా రుజు వవుతూంది!

ఖ. ఈ విషయం పుత్రుడి మీది అధికార నిర్ణయానిది. కాని 34లో ఒక కొత్త భిన్నమైన విషయానికి బీజం, స్థానశ్రేష్ఠత తలెత్తాయి. అది 48 వరకూ సాగింది. ఈ సంకేతించిన ప్రసంగం కన్నా వేరైనది [9.32,33,53] కావటం చేత, ప్రసంగ బాహ్యం, అందువల్ల ప్రక్షిప్తం.

2 అంతర్ వ్యతిరేకాలు

క. 9.34-48 శ్లోకాలతో ఈ విషయంలో ఒక చోట బీజంవలె కొద్దిగా సంతానం గొప్పతనం[34], ఒక చోట బీజం ప్రధానత [35-42], మరొకచోట ప్రాంతపు ప్రాముఖ్యం [43-48] చెప్పారు. ఇవన్నీ 49, 52, 53లలో చెప్పిన వాటికి వ్యతిరేకంగా ఉన్నాయి. 49,52, 53లలో పరిస్థితులను బట్టి బీజానికీ, క్షేత్రానికీ అధికార నిర్ణయం ఉంది. బీజ, ప్రాంతాల గొప్ప తనానికి కాదు.

ఖ. ఈ శ్లోకాలలో చెప్పిన వాయువు, జింక మొదలైనవి [42-44], పురుషుని సంపూర్ణత [45], ఒకసారి కన్యాదానం[46,47], మృగాల సంప్రదాయం[48] మొదలైన ఉదాహరణలతో మనుష్య ప్రవృత్తికి, సంప్రదాయానికీ పొంతన లేదు. వాటి ప్రకారం వంశం నడవదు, సొంతమూ కాదు. అందుకని వీటిని చెప్పడంతో పొసగటం లేదు. ఈ అంతర్ వ్యతిరేకాల కారణంగా ఇవి ప్రక్షిప్తాలని రుజు వవుతూంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

పరస్త్రీకి పుత్రోత్పత్తి కలిగిస్తే ఆ పుత్రునిపై ఆమెకు లేదా ఆమె భర్తకు అధికారం-

యేఽక్షేత్రిణో బీజవన్తః పరక్షేత్రప్రవాపిణః । మూలశ్లోక సం. **19**
తే వై సస్యస్య జాతస్య న లభన్తే ఫలం క్వచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **49**

టీక:- **యే + అక్షేత్రిణః బీజవంతః** = ఎవరికి క్షేత్రం లేదో కాని బీజం కలవారు, **పరక్షేత్ర ప్రవాపిణః** = ఇతరుల క్షేత్రంలో అంటే పరస్త్రీలో బీజావాపనం చేస్తారో, అంటే సంతానం కంటారో, **తే** = వారు నిశ్చయంగా, **క్వచిత్** = ఎక్కడయినా, **జాతస్య సస్యస్య ఫలం న** = పెరిగిన ధానాన్ని,(సన్తాన ఫలం) పొందజాలరు. అంటే భూయజమానికి వలె ఆ సంతానం మీద స్త్రీ యొక్క పతికే అధికారముంటుంది. కానీ విత్తనం నాటిన వాడికి ఉండదు.

తాత్పర్యం:- సొంత పొలం లేనివారు, తమ దగ్గరున్న విత్తనాల్ని ఇతరుల పొలాల్లో చల్లినప్పటికీ, ఆ యా క్షేత్రాలలో పండిన పంటను వారు అనుభవించలేరు కదా! అలాగే.... ॥49॥

50, 51వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***యదన్యగోషు వృషభో వత్సానాం జనయేచ్ఛతమ్ ।***
గోమినామేవ తే వత్సా మోఘం స్కన్దితమార్షభమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***50***

తాత్పర్యం:- ఇతరుల గోవుల యందు ఆబోతు యజమాని, తన ఆబోతు చేత సంతతి కలిగించినా, ఆ సంతతి అంతా ఆ గోవుల యజమానిదే అవుతుంది. కేవలం వృషభ వీర్యం తరగడం మాత్రమే-ఇతడికి కలిగే ఫలం. ॥50॥

* ***తథైవాక్షేత్రిణో బీజం పరక్షేత్రప్రవాపిణః ।***
కుర్వన్తి క్షేత్రిణామర్థం న బీజీ లభతే ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***51***

తాత్పర్యం:-అలాగే.....తాను పరస్త్రీల యందు తన బీజాన్ని ఉంచినా ఆ ఫలం పరస్త్రీ యొక్క భర్తదే గాని బీజావాపనం చేసిన వాడిది కాదు. కానేరదు. ॥51॥

ప్రక్షిప్తాల పరిశీలన

50, 51 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

50వ శ్లోకం 52,53 శ్లోకాలకు విరుద్ధంగా ఉంది. ఎందుకనగా, పశువుల పద్ధతికి జ్ఞాన స్మరణ గల మనుష్యుల వంశ పరంపరకు సంబంధం కుదరదు.

2. ప్రసంగ వ్యతిరేకం

49తో 52వ శ్లోకంతో ప్రసంగ సందర్భం కుదురుతుంది. 49లో పరస్త్రీలో బీజారోపణ చేసే విషయమున్నది. దాని వికల్పం 52వ శ్లోకంలో ఉన్నది. ఈ మధ్యలో గల రెండు శ్లోకాలు ఈ సంబంధాన్ని భంగం చేస్తున్నాయి.

3. పునరుక్తి

51వ శ్లోకంలో 49వ శ్లోక విషయమే పునరుక్తమైనది. 50వ శ్లోకం కూడా దీనికి ఆధారం కావడంతో ఈ రెండూ ప్రక్షిప్తాలే.

52, 53 శ్లోకాలు మనుకృతం-ప్రామాణికం

బిడ్డపై ఆ స్త్రీ లేదా ఆ స్త్రీ యజమానిదే అధికారానికి కారణం-

ఫలం త్వనభిసంధాయ క్షేత్రిణాం బీజినాం తథా । మూలశ్లోక సం. **20**
ప్రత్యక్షం క్షేత్రిణామర్థో బీజాద్యోనిర్గరీయసీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52**

టీక:- ఎందుకంటే, **క్షేత్రిణాం తథా బీజినాం** = క్షేత్రం కలవారు క్షేత్రిణులు (పొలం కలవారు) అంటే సంతానం కను స్త్రీలలో, బీజినామ్-పరస్త్రీలో సంతానాన్ని కనేవారు బీజులు. **ఫలం తు అనభి సంధాయ** = ఫలమును తీసుకొనేవారెవరనే విషయంలో నిశ్చియం లేకుండా, అంటే ఈ క్షేత్రం (స్త్రీలో) సంతానం (ఫలము) ఎవరికీ చెందాలనే ఒడంబడిక లేనప్పుడు, **ప్రత్యక్షం క్షేత్రిణామ్ + అర్థః** = స్పష్టంగా ఆ ఫలితం క్షేత్రస్వామికి మాత్రమే చెందుతుంది. అంటే ఆ సంతానం స్త్రీకి మాత్రమే చెందుతుంది. కారణం, **బీజాత్ యోనిః గరీయసీ** = అలాంటి స్థితిలో బీజం కంటే యోనికే (క్షేత్రానికి) ప్రాధాన్యం ఉంటుంది.

తాత్పర్యం:- క్షేత్రస్వాములు-బీజస్వాములు ఒక ఏర్పాటు లేదా ఒడంబడిక చేసుకోకపోయినప్పటికీ కొన్ని స్థలాలలో బీజం కంటే యోనియే ముఖ్యమవడం చేత,సంతానం ఆ యోని సొంతదారుడైన క్షేత్రస్వామికే చెందుతుంది అనేది సుస్పష్టం. ॥52॥

ఒడంబడిక చేసికొన్న బిడ్డమీద ఇద్దరికీ సమానాధికారం - ఇది మనుకృతం-ప్రామాణికం

క్రియాఽభ్యుపగమాత్ త్వేతద్ బీజార్థం యత్ప్రదీయతే । మూలశ్లోక సం. **21**
తస్యేహ భాగినౌ దృష్టౌ బీజీ క్షేత్రిక ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **53**

టీక:- ఒకవేళ, **క్రియా + అభ్యుపగమాత్** = (బీజీ-క్షేత్ర) పరస్పరం కలిసి, ఈ పుట్టబోయే బిడ్డ మనిద్దరిది అని నిశ్చయం చేసికొన్నట్లయితే ఈ సంధితో పాటు, **ఏతత్ బీజార్థం ప్రదీయతే** = ఏ క్షేత్రం (పొలము) బీజార్థం ఒడంబడికననుసరించి ఏ స్త్రీ బీజార్థం ఇవ్వబడుతుందో, ఆమె ఎవరికోసమైనా సంతతిని కంటుందో, **ఇహ అస్య** = ఈ లోకంలో, **బీజీ చ క్షేత్రికః + ఏవ భాగినౌ దృష్టౌ** = బీజీ అంటే బీజమిచ్చినవాడు పొలం వాడు (స్త్రీ గలవాడు) ఆ ఇద్దరూ ఆ ఫలమునకు అధికారులు.

తాత్పర్యం:- ఈమెకు సంతానం కలిగితే అది మనిద్దరికీ సంబంధిచినదౌతుందని నియమం చేసుకొని విత్తనం వేస్తే అప్పుడా సంతానానికి బీజవంతుడు, క్షేత్రస్వామి ఇద్దరూ యజమానులవుతారు. ॥53॥

54,55వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ప్రామాణికం కావు

* *ఓఘవాతాహృతం బీజం యస్య క్షేత్రే ప్రరోహతి ।*
క్షేత్రికస్యైవ తద్బీజం న వప్తా లభతే ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***54***

తాత్పర్యం:- గాలికి, నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన బీజం ఏ క్షేత్రంలో మొలుస్తుందో ఆ పంట ఆ భూ స్వామిదే ఐనట్లు తెలియక పరభార్యయందు కన్న సంతానం ఆమె భర్తకే చెందుతుంది కాని బీజస్వామికి చెందదు.॥54॥

* *ఏష ధర్మో గవాశ్వస్య దాస్యుష్ట్రాజావికస్య చ ।*
విహంగమహిషీణాం చ విజ్ఞేయః ప్రసవం ప్రతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***55***

తాత్పర్యం:- ఆవులు, గుర్రాలు, పనికత్తెలు, ఒంటెలు, గొర్రెలు, మేకలు, ఎనుములు (గేదెలు) వీటికి దూడలు పుట్టినప్పుడు ఈ ఏర్పాటే అనుసరింపదగినది. అంటే ఆడవి ఎవడివో వాటి సంతతి వాడిదే. కాని పోతులు కలవాడివి కావు. అలాకాక ఒక ఏర్పాటు (తనదొకటి క్షేత్రస్వామిది ఒకటి అని) ఒప్పందం చేసుకొన్న సమయంలో అప్పుడు వాటి సంతతి విషయంలో ఇరువురు అధికారులే అవుతారు. ॥55॥

ప్రక్షిప్తాల పరిశీలన

54, 55 శ్లోకాలు క్రింది ఆధారాల ప్రకారం ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు:

ప్రసంగ సంకేతిక శ్లోకాలైన 9.32,33ల అనుసారం ఇక్కడ పుత్రునిపై అధికారాన్ని నిర్ణయించే వర్ణన ఉంది. దానికి క్షేత్రీయ - బీజ ఉదాహరణ (9.49,52,53) స్పష్టంగా చెప్పి పుత్రుడిపై అధికారం నిర్ణయించడం ఉంది. ఈ శ్లోకాలలో నీరు-వాయువుల ఉదాహరణ (54), మృగ సంప్రదాయ పద్ధతి (55) పైన చెప్పిన వాటికి బాహ్యమైనది. ఇది మానవుల సంప్రదాయానుకూలంగా లేవు. పైగా ముఖ్య విషయానికి వ్యతిరేకం కావడంచేత రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకులు:

9.32,33లలో కలిగిన సందేహానికి సమాధానం 49, 52, 53లలో ఇచ్చారు. ఆపత్కాలంలో సంతానం పొందే పద్ధతి 53 తర్వాత మళ్ళీ పూర్వ విషయాన్ని ప్రస్తావించడం ప్రసంగ వ్యతిరేకం.

3. పునరుక్తి:

55వ శ్లోకం 48కి పునరుక్తి. 54లోని విషయం కూడా మునుపటి శ్లోకాలలో వచ్చింది. అందువల్ల ఇవి ప్రక్షిప్తాలు.

56 నుండి 59వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఏతద్ వః సారఫల్గుత్వం బీజయోన్యోః ప్రకీర్తితమ్ । మూలశ్లోక సం. **22**
అతః పరం ప్రవక్ష్యామి యోషితాం ధర్మమాపది ॥ ప్రక్షిప్త శ్లోక సం. **56**

టీక:- **ఏతత్** = ఇది 9.31-53, **బీజ-యోన్యోః సార ఫల్గుత్వం** = బీజమునకు, యోనికి గల ప్రాధాన్యం, అప్రాధాన్యం తెలిపాను. **అతః పరం** = ముందు, **ఆపది యోషితాం ధర్మమ్** = ఆపత్కాలంలో, (సంతానం లేనప్పుడు) స్త్రీల ధర్మమేమో, **ప్రవక్ష్యామి** = తెలియజేస్తాను.

తాత్పర్యం:- బీజయోనులలో ఏది ప్రధానమో ఏది అప్రధానమో ఇది మీకు చెప్పాను. ఇంకా స్త్రీలకు సంతానం కలిగినప్పుడు అవలంభించవలసిన ధర్మముల గురించి చెప్పెదను. ఆలకించండి. ॥56॥

అన్న భార్య గురుపత్నితో, తమ్ముని భార్య కోడలితో సమానం- ఇది మనుకృతం-ప్రామాణికం

భ్రాతుర్జ్యేష్ఠస్య భార్యా యా గురుపత్న్యనుజస్య సా । మూలశ్లోక సం. **23**
యవీయసస్తు యా భార్యా స్నుషా జ్యేష్ఠస్య సా స్మృతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **57**

టీక:- **జ్యేష్ఠస్య భ్రాతుః యా భార్యా** = జ్యేష్ఠ సోదరుడి పత్ని (అన్న భార్య), **అనుజస్య గురుపత్నీ** = చిన్న సోదరుడికి గురుప్నతితో సమానం, **తు** = మరియు, **యా యవీసః భార్యా** = చిన్న సోదరుడి పత్ని, **సా జ్యేష్ఠస్య స్నుషా** = ఆమె పెద్ద అన్నకు కోడలితో సమానం (లేదా కూతురుతో సమానం). **స్మృతా** = చెప్పబడింది. అంటే సోదరులకు జ్యేష్ఠ సోదరుడి పత్ని విషయంలో ఈ విధంగా పవిత్రభావన ఉండాలి.

తాత్పర్యం:- అన్న భార్య తమ్ముడికి గురుపత్నితో సమానురాలు. తమ్ముడి భార్య అన్నకు కోడలితో (కూతురుతో) సమానమని పెద్దలు చెపుతారు. ॥57॥

వారితో సంగమం పాపం - ఇది మనుకృతం-ప్రామాణికం

జ్యేష్ఠో యవీయసో భార్యాం యవీయాన్వాగ్రజస్త్రియమ్ । మూలశ్లోక సం. **24**
పతితౌ భవతో గత్వా నియుక్తావప్యనాపది ॥ ప్రక్షిప్త శ్లోక సం. **58**

టీక:- **జ్యేష్ఠః యవీయసః భార్యాం** = అన్న తమ్ముడి భార్యతో మరియు, **యవీయాన్ + అగ్రజ స్త్రియమ్** = తమ్ముడు అన్న భార్యతో, **అనాపది** = ఆపత్కాలం లేకుండా అంటే సంతానమున్నప్పుడు, **నియుక్తా + అపి గత్వా** = నియోగం ద్వారా, విధిపూర్వకంగానైనా, సరే సంభోగించినట్లయితే, వారు, **పతితౌ భవతః** = పతితులుగా భావింపబడతారు.

తాత్పర్యం:- అన్న తమ్ముడి భార్యతోనూ, తమ్ముడు అన్న భార్యతోనూ సంతాన ముండియూ నియోగం ద్వారా, విధి పూర్వకంగానైనా సరే సంభోగించినట్లయితే వారు పతితులుగా భావింపబడుతారు. ॥58॥

సంతానం లేనప్పుడు నియోగం ద్వారా సంతాన ప్రాప్తి ఇది మనుకృతం-ప్రామాణికం

దేవరాద్ వా సపిణ్డాద్ వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా । మూలశ్లోక సం. **25**
ప్రజేప్సితాధిగన్తవ్యా సంతానస్య పరిక్షయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **59**

టీక:- **సంతానస్య పరిక్షయే** = పతిద్వారా సంతానం కలుగనప్పుడు లేదా ఏ ప్రకారంగానైనా సంతానం కలుగనప్పుడు, **సమ్యక్ నియుక్తయా స్త్రియా** = సరియైన పద్ధతిలో, (పరివారంలో, సమాజంలో వివాహం లాగ ప్రసిద్ధి పూర్వకంగా) నియోగం కోసం నియమింపబడిన స్త్రీకి, **దేవరాత్ వా సపిండాత్ వా** = మరది వల్ల గాని,సపిండుని వల్లగాని, స్వజాతీయుడు లేదా తన కంటే ఉత్తమ వర్ణస్థుడైన పురుషుడితో లేదా భర్తకు ఆరు తరాలవారైనవాడు, భర్త యొక్క చిన్న సోదరుడు లేదా పెద్ద సోదరుడితో, **ఈప్సితా ప్రజా అధిగంతవ్యా** = తాను కోరిన సంతానాన్ని పొందాలి.

ఋషి దయానందభాష్యం:- సంతానం లేనప్పుడు ఒక స్త్రీ తన భర్త, గురువు, తల్లిదండ్రుల అనుమతితో మరిది వల్లగాని, భర్త అన్న (సపిండదాయాది) వల్లగాని సమర్థుడైన పుత్రుణ్ణి కనవచ్చు! ॥59॥

సపిండుడు: భర్త యొక్క ఆరు తరాలలో భర్తకు చిన్న సోదరుడు గాని లేదా పెద్ద సోదరుడుగాని లేదా స్వజాతీయుడు అలాగే తనకంటే ఉత్తమ జాతి పురుషుడితో విధవా స్త్రీకి నియోగం జరగాలి. కానీ బిడ్డలు పుట్టి చనిపోతున్న స్త్రీకి గాని, లేదా విధవాస్త్రీ సంతానం కావాలని కోరినప్పుడే నియోగం చేయాలి. సంతానమంతా సర్వథా క్షీణమై పోయినప్పుడు మాత్రమే నియోగం జరపాలి.

భర్తకు ఆరు (6) తరాల వారిలో చిన్న సోదరుడు, లేదా పెద్ద సోదరుడుగాని, సజాతీయుడు, తన కంటే ఉత్తమ జాతిస్థ పురుషుడితో విధవకు నియోగం జరపాలని మనువు సూచించాడు. కాని, మృత స్త్రీ పురుషుడు, మరియు విధవా స్త్రీ సంతానం కనాలని కోరిక ఉన్నట్లయితే -నియోగం జరపడం ఉచితం. సంతానం పూర్తిగా నష్టమైపోయినట్లయితే-అప్పుడు కూడా నియోగం ఉచితమే. ఆపత్కాలంలో, సంతానం కావాలనే ఇచ్ఛ లేకపోయినా, పెద్ద సోదరుడి భార్యతో తమ్ముడు, తమ్ముడి భార్యతో పెద్దన్నకు నియోగం జరిగి, సంతానోత్పత్తి జరిగినప్పుడు కూడా, మళ్ళా పరస్పరం సమాగమం జరిగినట్లైతే పతితులవుతారు. అంటే ఒకసారి నియోగానికి అవధి రెండో పుత్రుడు గర్భంలో ఉన్నంత వరకు మాత్రమే. తరువాత సమాగమం చేయరాదు (స.ప్ర.చ.సముల్లాసం.).

వివరణ: 1) నియోగవిధి-అంటే సమాజంలో పరివారంలో ఏ విధంగా ప్రసిద్ధంగా వివాహం జరుగుతుందో, అదే ప్రకారంగా నియోగం కూడా జరుగుతుంది. వీరి ఎదుటనే పుత్రాదులను పొందడం అనే విషయం కూడా నిశ్చతమవుతుంది. ఆ నిశ్చయానుసారంగా నడవడమే "విధి". అందుకు విరుద్ధంగా నడవడం-విధిని వదిలినట్లే, ఈ విషయాన్నే ఋషిదయానంద సరస్వతులవారు ప్రశ్నోత్తర రూపంలో స్పష్టపరచారు.

1. ప్రశ్న: నియోగంలో ఏయే విషయాలుంటాయి?

జవాబు: వివాహం ఎంత ప్రసిద్ధంగా చేస్తారో, అదే విధంగా నియోగం కూడా అంత ప్రసిద్ధంగా జరపాలి. వివాహంలో పెద్దల అనుమతి, వధూవరుల సహమతి, సంతోషాలుండేట్లు నియోగంలో కూడా అలాగే ఉండాలి. స్త్రీ పురుషుల మధ్య నియోగం జరగవలసినప్పుడు, తమతమ కుటుంబానికి సంబంధించిన స్త్రీ-పురుషుల ఎదుట మేమిద్దరం సంతానోత్పత్తి కోసం మాత్రమే నియోగ విధిననుసరిస్తున్నాం. నియోగ నియమం పూర్తయిన తరవాత మేము సంయోగం చేయం. ఇందుకు భిన్నంగా నడిచేవాడు పాపి. అతడిని సంఘంగానీ ప్రభుత్వంగానీ దండించాలి. నెలకు ఒక్కసారి మాత్రమే గర్భాదానం చేస్తారు. గర్భం నిలిచినట్లైతే తరువాత ఒక సంవత్సరం వరకు వేరుగా ఉంటారు. (స.ప్ర. 4వ సముల్లాసం.)

2. దేవర శబ్దానికి అర్థం 'భర్త తమ్ముడు' అని. ఇది ప్రాచీనమైన అర్థం. కానీ నిరుక్తంలో విస్తృతమైన అర్థముంది. దేవర శబ్దానికి నిరుక్తి -

"దేవరః కస్మాత్ ద్వితియో వర ఉచ్యతే" (3-15)

అంటే- విధవకు రెండో పతి అయినవాడు. అతడు ఆమెకు భర్త చిన్న తమ్ముడు కావచ్చు. పెద్ద సోదరుడు కావచ్చు లేదా తన వర్ణంవాడు గాని, లేదా ఉత్తమ వర్ణస్థుడు గాని కావచ్చు. అతడితో నియోగం జరిగినప్పుడు అతడి పేరే "దేవర" అనబడుతుంది. (స.ప్ర. 116)

3. కానీ, ప్రస్తుతం దేవర శబ్దం భర్త చిన్న తమ్ముడనే అర్థంలో 'మరిది'గా రూఢి అయింది. ఈ రూఢికి కారణం-స్త్రీ విధవ అయినప్పుడు, మృతపతి చిన్న తమ్ముడితోనే ఆమెకు సంబంధం కుదిరిస్తారు. ఇది నియోగ విధి పరివర్తిత రూపాంతరమే. ఈ పరంపర వల్ల, ప్రాచీన కాలంలో నియోగ ప్రథ ఉందని తెలుస్తున్నది.

4. వేదాలలో నియోగ విధానం:

ఉదీర్ష్వ నార్యభిజీవలోకం గతాసుమేతముపశేష ఏహి ।
హస్తగ్రాభస్య దిధిషోస్తవేదం పత్యుర్జనిత్వమభి సంబభూథ ॥ ఋ. 10.18.8

నారి = ఓ విధవా నీవు, **ఏతం గతాసుం** = మరణించిన ఈ పతిని గురించిన ఆశ వదలుకొని, తతిమ్మా పురుషులతో, **అభి జీవలోకం** = జీవించి ఉన్న రెండో భర్తను, **ఉపైహి** = పొందు. మరియు, **ఉదీర్ష్వ** = ఈ విషయాన్ని విచారించి, నిశ్చయించుకో, **హస్త గ్రాభస్య దిధిషోః** = నీవు మళ్ళా విధవకు పాణిగ్రహణం చేయబోవు నియుక్తపతి సంబంధం కోసం నియోగం జరుగుతుంది. కాబట్టి నీ కోసం నియోగం జరిగినట్లయితే, అప్పుడు ఈ సంతానం నీదే అవుతుంది. ఇలాంటి నిశ్చయరాలవు, **అభిసంబభూథ** = కావాలి. నియోగింపబడిన పురుషుడు కూడా ఇలాంటి నిశ్చయభావం కలవాడై ఉండాలి (స.ప్ర.చ.స.).

5.ప్రశ్న: నియోగం భర్త చనిపోతేనే జరుగుతుందా? లేక పతి జీవించి ఉండగా కూడా జరుగుతుందా?

జవాబు: పతి జీవించి ఉన్నా నియోగం జరగవచ్చు.

“అన్యమిచ్ఛస్వ సుభగే పతిం మత్” ఋ.10.సూ.10.12.

పతి సంతానోత్పత్తికి అసమర్థుడైనప్పుడు తన భార్యకు (ఓ సుభగే) సౌభాగ్యాన్ని కోరే స్త్రీవైన నీవు (మత్) నాకుంటే, అన్యం = ఇతరమైన పతిని, ఇచ్ఛస్వ = కోరుకో. ఎందుకంటే, నావల్ల సంతానాన్ని ఆశించవద్దు. అప్పుడు స్త్రీ రెండోవాడితో నియోగం ఏర్పాటు చేసుకొని సంతానాన్ని కంటుంది కానీ వివాహితుడైన పతి సేవ చేస్తూ ఉండాలి. అదే విధంగా రోగాది దోషాల వల్ల స్త్రీ కూడా సంతానోత్పత్తికి అయోగ్యురాలైనప్పుడు ఆమె తన పతికి ఈ విధంగానే అనుమతి ఇవ్వాలి. ఓ స్వామీ ! సంతానోత్పత్తి కోరిక నా నుండి నెరవేరదు కాబట్టి మరొకరెవరైనా విధవా స్త్రీతో నియోగం చేసికొని, సన్తానాన్ని కనండి.

ఏ విధంగా పాండురాజు భార్య కుంతి, మాద్రి చేశారో; వ్యాసులవారు చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు చనిపోగా, తన సోదరుల భార్యలతో నియోగ విధిననుసరించి అంబిక ద్వారా ధృతరాష్ట్రుణ్ణి, అంబాలిక ద్వారా పాండురాజును, దాసీద్వారా విదురుడిని కన్నారో మొ॥ ఇతిహాసం కూడా ఇందుకు ప్రమాణాలు. (స.ప్ర.చ.స).

60,61వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** నియోగంలో గమన విధి-**

* *విధవాయాం నియుక్తస్తు ఘృతాక్తో వాగ్యతో నిశి ।*
ఏకముత్పాదయేత్ పుత్రం న ద్వితీయం కథం చన ॥ *ప్రక్షిప్త శ్లోక సం.60*

తాత్పర్యం:- సంతతిని పుట్టించలేని అసమర్థ భర్తవల్ల భార్య బాధ నొందక, అతడి అనుమతిచేత పైన చెప్పిన వారిలో ఎవరినైనా కోరితే, వారు రాత్రివేళ నిలువెల్లా నేతిని పూసుకుని మౌనంగా ఆమెను రమించి ఒక పుత్రుణ్ణి కలిగించవచ్చు! అవకాశం దొరికింది కదా అని రెండో పుత్రుణ్ణి పుట్టించరాదు. ॥60॥

* *ద్వితీయమేకే ప్రజనం మన్యన్తే స్త్రీషు తద్విదః ।*
అనిర్వృతం నియోగార్థం పశ్యన్తో ధర్మతస్తయోః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.61*

తాత్పర్యం:- నియోగంచేత పుత్రోత్పాదన విధిజ్ఞులయిన మరికొందరు పెద్దలు ‘ఒక్కకొడుకు కొడుకు గాదు-ఒక్క కన్ను కన్నుగాదు’ అని పెద్దలవాడుక వల్ల నియోగ ప్రయోజనం నెరవేరనట్లే అని ఎంచినవారై, అలాంటి స్త్రీల యందు రెండోపుత్రుణ్ణి కనుట యుక్తమే అని తలంచారు. ॥61॥

ప్రక్షిప్తాల పరిశీలన

60,61 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలలో నియోగం ద్వారా ఒకరిద్దరు పుత్రులను పొందే విధానం చెప్పారు. ఇది 9.59కి వ్యతిరేకం. ఎందుకంటే, ఆ శ్లోకంలో నియోగం ద్వారా కోరుకున్న సంతానాన్ని పొందడం ఉంది కానీ, దానికి పరిమితికి నిర్ధారించలేదు.

ఖ. ఈ శ్లోకాలలో నియోగాన్ని పరిమితం చేసే భావనతో ఉంది. ఇది మనువు మునుపు చెప్పిన వాటికి వ్యతిరేకం[9.56-59].

62, 63వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

నియోగం ద్వారా పుత్రప్రాప్తి కలిగిన పిదప శారీరక సంబంధం అపరాధం -

విధవాయాం నియోగార్థే నిర్వృత్తే తు యథావిధి । మూలశ్లోక సం.**26**
గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**62**

యథావిధి = విధిననుసరించి, **విధవాయాం నియోగార్థే నిర్వృత్తే తు** = విధవతో నియోగం ఉద్దేశ్యపూర్వకంగా పూర్తియినట్లయితే, తరువాత, **గురువత్ చ స్నుషావత్ పరస్పరం వర్తేయాతామ్** = పరస్పరం పెద్దసోదరుడి పత్నిని గురుపత్నిగాను, చిన్నసోదరుడి పత్నిని కోడలుగాను పరస్పరం ప్రవర్తించాలి (9-57).

తాత్పర్యం:- విధిననుసరించి విధవతో నియోగం ఉదేశపూర్వకంగా పూర్తయినట్లుయితే, పరస్పరం అన్న భార్యను గురు పత్నిగాను, తమ్ముడి భార్యను కోడలిగాను పరస్పరం ప్రవర్తించాలి. ॥62॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నియుక్తౌ యౌ విధిం హిత్వా వర్తేయాతాం తు కామతః । మూలశ్లోక సం.**27**
తావుభౌ పతితౌ స్యాతాం స్నుషాగ గురుతల్పగౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**63**

నియుక్తౌ యౌ = నియోగం కోసం నియుక్తులైన అన్న లేదా తమ్ముడు, **విధిం హిత్వా** = నియోగవిధిని వదిలి. (సమాజంలో లేదా పరివారంలో, కుదుర్చుకున్న పూర్వ నిశ్చయాలను వదిలి, **కామతః వర్తేయాతామ్ తు** = కామికులై సంభోగాదులొనర్చినట్లయితే, **తౌ + ఉభౌ** = వారిద్దరు, **స్నుషాగ-గురుతల్పగౌ పతితౌ స్యాతామ్** = పుత్రవధూగమనం. గురుపత్నీ గమనమనే అపరాధం చేసినవారవుతారు.

తాత్పర్యం:- నియోగం కోసం నియుక్తులైన అన్న లేదా తమ్ముడు. నియోగవిధిని వదిలి కామికులై సంభోగాదుల చేసినట్లయితే వారిద్దరూ పుత్రవధూగమనం, గురుపత్నీగమనమనే అపరాధం చేసిన వారవుతారు. ॥63॥

64 నుండి 68వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** నియోగ విధాన ఖండన-**

* *నాన్యస్మిన్ విధవా నారీ నియోక్తవ్యా ద్విజాతిభిః ।*
అన్యస్మిన్ హి నియుంజానా ధర్మం హన్యుః సనాతనమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.64*

తాత్పర్యం:- ద్విజాతియైన విధవ ద్విజాతులవారితోనే నియోగం చేసుకోవాలిగాని ఇతరులతో చేయరాదు. అట్లాచేసినచో ధర్మహాని చేసినవారవుతారు. ॥64॥

* *నోద్వాహికేషు మన్త్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్ ।*
న వివాహవిధావుక్తం విధవావేదనం పునః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***65***

తాత్పర్యం:- వివాహమంత్రాలలో ఎక్కడకూడా సంతానం లేని స్త్రీ పెద్దల అనుమతిచే సంతానం పొందవచ్చునని చెప్పబడలేదు. మరియు వివాహ విధియందును విధవకు వేరొక్క పురుషుడితోడి పునర్వివాహం ఎక్కడా చెప్పలేదు. ॥65॥

* *అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః ।*
మనుష్యాణామపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***66***

తాత్పర్యం:- ఈ పశుధర్మమైన పునర్వివాహం పెద్దలైన విద్వాంసులచేత నిందితం కాబట్టి ఇది ఆచరించడానికి వీల్లేదు. ఇలాంటి అధర్మాన్ని వేనుడు అనే అధర్మిష్ఠుడైన నృపాలుడు రాజ్యం చేస్తుచుండగా అతడు దీన్ని ప్రవర్తింపచేశాడు. అతడి కాలమునుండే ఈ అధర్మం వ్యాపించింది. ॥66॥

* *స మహీమఖిలాం భుంజన్రాజర్షిప్రవరః పురా ।*
వర్ణానాం సంకరం చక్రే కామోపహతచేతనః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***67***

తాత్పర్యం:- ఆ రాజర్షి శ్రేష్ఠుడగు వేనుడు తొల్లి ముందు భూమండలాన్నంతా పరిపాలిస్తూ, కామంచేత బుద్ధి చెడినవాడై భ్రాతృభార్యసంగమం అనేడి వర్ణ సంకరాన్ని ప్రవర్తింపజేశాడు. ॥67॥

* *తతః ప్రభృతి యో మోహాత్ ప్రమీతపతికాం స్త్రియమ్ ।*
నియోజయత్యపత్యార్థం తం విగర్హన్తి సాధవః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***68***

తాత్పర్యం:- వేనుడు కాలం నుండి విధవ అయిన స్త్రీని, శాస్త్రార్థజ్ఞానం లేని కారణం వల్ల దేవరాదులయందు ఎవ్వరు (సుతోత్పత్తికై) పుత్ర సంతానంకోసం నియోగిస్తున్నారో, వారిని పెద్దలు దూషిస్తారు. (నియోగమును మనువే మొదట విధించి, దాన్ని నిషేధించడం వల్ల ఇది యుగాంతరానికే గాని కలియుగానికి నిషిద్ధమని భావం). ॥68॥

ప్రక్షిప్తాల పరిశీలన

64-68 శ్లోకాలు కింది 'ఆధారాలతో' ప్రక్షిప్తాలు-

1. అంతర్ వ్యతిరేకాలు

64-68 శ్లోకాలలో మునుపు చెప్పిన [9.56-63] నియోగ వ్యవస్థ నిషేధమూ, నిందా ఉన్నాయి. మనువు పద్ధతికి వ్యతిరేకం కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు. ఈ రెండు పద్ధతులలోనూ నియోగ పద్ధతి మునుపు చెప్పినదీ, ఆధార భూతమైనదీ అనేది చెప్పుకోవటం అవసరం.

ఖ. విషయ సంకేతక శ్లోకాలలో నియోగ పద్ధతి ప్రారంభమూ, ముగింపుల సంకేతం ఉంది [9.56,9.103]. ఈ శ్లోకాలు ముందు వెనుకల శ్లోకాలతో జోడించబడి ఉన్నాయి. కనుక, ఈ పద్ధతి మౌలికమని తెలుస్తుంది.

గ. 9.145-146లలో నియోగం వల్ల పుట్టిన పుత్రునికి ఆస్తిలో భాగంపై పూర్తి అధికారం ఉందని ఉంది. ఇది కూడా ఈ పద్ధతి మను సమ్మతమనే రుజువు చేస్తుంది.

ఘ. నియోగ పద్ధతిలో కాకుండా పుట్టిన వాడికి ధనాధికారం ఉండదని 9.147లో ఉంది. దీని వల్ల మనువు నియోగ పద్ధతినే స్వీకరించదగిం దన్నాడనీ, నియోగ పద్ధతిని వదలటం కాదనీ రుజు వవుతుంది.

జ. ఏదైనా విషయాన్ని అంతకు ముందు వాడుకలో ఉంటేనే, దాన్నే ఖండించటం జరుగుతుంది. ఈ ఖండనతో మునుపు ఈ పద్ధతి ప్రాచుర్యంలో ఉండేదని తెలుస్తూంది. ఈ 66-68 శ్లోకాలలో ఆ సంగతిని స్వయంగానే అంగీకరించడం జరిగింది. ఈ విధంగా నియోగ పద్ధతి మునుపటిదే కాక, మౌలికం కూడా. నియోగ ఖండన పద్ధతి తర్వాతిదీ, ప్రక్షిప్తం కూడా.

చ. 66-67లలో వేనరాజు కాలంలోని నియోగ పద్ధతిని గురించి అధికంగా చెప్పబడింది. వేన మహారాజు మనువుకు ముప్పై నలబై తరాల తర్వాతివాడు. అందుచేత ఈ శ్లోకాలు కూడా తర్వాతి వారెవరో రచించి మనుస్మృతిలో కలిపినవే. వీటికి మనుస్మృతితో కాల వ్యతిరేకత ఉంది. సమకాలీనత లేదు. ఇన్ని తరాల తర్వాతి వర్ణన ముందే జరగటం అసంభవం!

2. విషయ వ్యతిరేకాలు

విషయ సంకేతక [9.56,103] శ్లోకాలలోని విషయం ఆపత్కాలంలో స్త్రీల ధర్మాలు, ఆపత్కాలంలో సంతానప్రాప్తి అనేది. నియోగ పద్ధతి ఆ విషయానికి సంబంధించినది కనుక మౌలికం. ఖండన పద్ధతికి సంకేతించిన విషయంతో ఎటువంటి సంబంధమూ లేదు కనుక ప్రక్షిప్తం.

నిశ్చితార్థం తరువాత వరుడు చనిపోతే ఇతర వివాహ విధానం - **ఇది మనుకృతం-ప్రామాణికం**

యస్యా మ్రియేత కన్యాయా వాచా సత్యే కృతే పతిః । మూలశ్లోక సం. **28**
తామనేన విధానేన నిజో విన్దేత దేవరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **69**

వాచాసత్యే కృతే = వాగ్దానం (నిశ్చితార్థమయిన తరువాత) వివాహానికి ముందు, **యస్యాః, కన్యాయాః పతిః మ్రియేత** = ఏ కన్య యొక్క పతి మరణించినట్లయితే, **తామ్** = ఆ కన్యను, **నిజః దేవరః** = భర్త తమ్ముడు, **అనేన విధానేన విందేత** = ఈ పద్ధతి ద్వారా పొందవచ్చు (వివాహం చేసికోవచ్చు). [3.27-30]

తాత్పర్యం:- నియోగప్రకరణమవడం వల్ల కన్యాగత విశేషం ఇక్కడ చెప్పబడుతూంది. ఒక కన్యకను ఒకడికి వాగ్దత్తంగా ఇచ్చాక, ఆమెతో పెళ్లి జరుగవలసిన వరుడు గాని మరణిస్తే, ఆమె మరిది ఆమెను పెళ్లాడవచ్చు! ॥69॥

వివరణ: ఈ శ్లోకం సంకేతితమైన (9.56,103) విషయంతో సంబంధముంది. విషయానుసారంగా, ఇందులో ఆపత్కాలీన స్థితిలో స్త్రీ కర్తవ్యం తెలుపబడింది. ఈ విధాన సమర్థన 9.176 శ్లోకం తెలుపుతుంది. ఇందులో పునర్వివాహానికి స్పష్టమైన విధానముంది. (దేవర శబ్దార్థం 9.59 సమీక్ష వివరణ చూడండి.)

70 నుండి 73వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *యథావిధ్యధిగమ్యైనాం శుక్లవస్త్రాం శుచివ్రతామ్ ।*
మిథో భజేతా ప్రసవాత్ సకృత్సకృదృతావృతౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *70*

తాత్పర్యం:- తల్లిదండ్రులు ఒక కన్యకను ఎవడికి వాగ్దత్తం చేసి ఉండిరో, వాడి మరిది ఆమెను శాస్త్ర ప్రకారం పెండ్లాడి, తెల్లని వస్త్రం కట్టినదీ, వాఙ్మనఃకాయశుద్ధి కలదీ అయిన ఆ కన్యను గర్భధారణం వరకు ఒక్కొక్క ఋతువులో నొక్కతడవను బొందాలి. ఇలా కన్యకకు నియమం విధింపబడినందువల్ల దానిబిడ్డడు మొదట వాగ్దత్తం చేయబడిన వాడిదే అవుతుంది. ॥70॥

* *స దత్త్వా కస్య చిత్ కన్యాం పునర్దద్యాద్విచక్షణః ।*
దత్త్వా పునః ప్రయచ్ఛన్ హి ప్రాప్నోతి పురుషానృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *71*

తాత్పర్యం:- ఒకసారి తన కూతురిని ఒకనికిత్తునని మాటిచ్చి తరువాత ఇంకొకరి కా కన్య న్వీరాదు. ఆ విధంగా చేసినచో ఆ కన్య యొక్క తండ్రి పురుషానృతమనే దోషాన్ని పొందుతాడు. ॥71॥

*   *విధివత్ప్రతిగృహ్యాపి త్యజేత్కన్యాం విగర్హితాం ।*
వ్యాధితాం విప్రదుష్టాం వా ఛద్మనా చోపపాదితాం ॥   ప్రక్షిప్త శ్లోక సం. **72**

తాత్పర్యం:- అలా ఒకవేళ ఆ కన్యను శాస్త్ర విధిచొప్పున ప్రతిగ్రహించి, వైధవ్యలక్షణాలు కలదీ, రోగిణీ, క్షతయోనిత్యాదులగు దుర్లక్షణాలు కలదీ, ఎక్కువ అంగములు కలిగి ఉండటం మొదలైన వాటిని కలిగినదీ, మోసంతో పెండ్లి అయిన ఆ కన్యను సప్తపదులకు ముందే తెలిసెనేని వదిలి పెట్టాలి. అలా చెప్పడంవల్ల దాన్ని వదిలి పెట్టడంలో దోషం లేదని భావం. ॥72॥

*   ***యస్తు దోషవతీం కన్యా మనాఖ్యాయోపపాదయేత్ ।***
తస్య తద్ వితథం కుర్యాత్కన్యాదాతుర్దురాత్మనః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **73**

తాత్పర్యం:- దోషవతియైన కన్యను దోషము కప్పిపుచ్చి పెండ్లి చేసిన కన్యాదాత యొక్క కృషిని వ్యర్థం చేయుటకు ఆ కన్యను వరుడు విడిచిపెట్టాలి. ॥73॥

ప్రక్షిప్తాల పరిశీలన

70-73 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలవుతాయి -

1. అంతర్ వ్యతిరేకాలు

71వ శ్లోకంలో మళ్లీ కన్యాదానం గురించి, అంటే పునర్వివాహ నిషేధం 9.69, 176లకు వ్యతిరేకం. వాటిలో ఇదే పరిస్థితిలో పునర్వివాహం చేయాలని ఉంది. మిగిలిన శ్లోకం ఈ విషయానికి సంబంధించినదే. ఇది ప్రక్షిప్తమని రుజువు కావడంతో, మిగిలినవన్నీ ప్రక్షిప్తాలే !

2. విషయ వ్యతిరేకాలు

విషయ సంకేతం గల శ్లోకాలు 9.56,103లను బట్టి విషయం స్త్రీల ఆపద్ధర్మాలు, ఆపత్కాలంలో సంతాన ప్రాప్తి అనేది. ఈ శ్లోకాలలోని దేవర న్యాయ పద్ధతి[70], మళ్లీ కన్యాదానం చేయకపోవడం [71], మోసగించి దానం చేసిన కన్యను తిరిగి ఇచ్చేయటం [72,73] మొదలైనవి సంకేతించిన విషయాలకు వ్యతిరేకంగా ఉన్నాయి కనుక మౌలికాలు కావు.

3. ప్రసంగ వ్యతిరేకాలు

69,74 శ్లోకాలలో స్త్రీల ఆపద్ధర్మాలను గురించి ఉంది. ఈ శ్లోకాలు ప్రసంగ దృష్టితో పరస్పర సంబద్ధాలు. ఈ శ్లోకాలు ఈ సంబద్ధ ప్రసంగాన్ని భంగ పరిచాయి కనుక, ఇవి ప్రక్షిప్తాలు.

74 నుండి 84 వరకు మనుకృతం-ప్రామాణికం

ప్రవాసానికి వెళ్ళే భర్త స్త్రీకి జీవనోపాధిని కల్పించి వెళ్ళాలి -

విధాయ వృత్తిం భార్యాయాః ప్రవసేత్ కార్యవాన్నరః ।   మూలశ్లోక సం. **29**
అవృత్తికర్శితా హి స్త్రీ ప్రదుష్యేత్ స్థితిమత్యపి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **74**

టీక:- కార్యవాన్నరః = ఏదో అత్యావశ్యక కార్యార్థం పరదేశం వెళ్ళే మానవుడు, **భార్యాయాః వృత్తిం విధాయ**

ప్రవసేత్ వాన్నరః = తన భార్యకు భరణ- పోషణార్థాన్ని ఏర్పాటు చేసి పరదేశానికి వెళ్ళాలి, హి = ఎందుకంటే, అవృత్తి కర్శితా స్థితిమతీ + అపి స్త్రీ = జీవనోపాధివసతులు లేనందువల్ల, బాధపడి, శుద్ధ ఆచరణ కలిగిన స్త్రీ అయినా, ప్రదుష్యేత్ = దూషితురాలై పోతుంది.

తాత్పర్యం:- తానేదైనా ముఖ్యమైన కార్యంపై దేశాంతరాలకు వెళ్లవలసివస్తే, భార్యకు కూటికి-వస్త్రాలకు లోపం లేకుండా వనరులు ఏర్పరచి వెళ్లాలి. ఎందుకంటే జీవనోపాధి వసతులు లేనందువల్ల బాధపడి, శుద్ధ ఆచరణ కలిగిన స్త్రీ అయినా దూషితురాలై పోతుంది. ॥74॥

ఇది మనుకృతం.ప్రామాణికం

విధాయ ప్రోషితే వృత్తిం జీవేన్నియమమాస్థితా । మూలశ్లోక సం. **30**
ప్రోషితే త్వవిధాయైవ జీవేచ్ఛిల్పైరగర్హితైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **75**

టీక:- వృత్తిం విధాయ ప్రోషితే = జీవనానికి తగిన వసతులు కల్పించాలి. పతి పరదేశం వెళ్ళినప్పుడు, **నియమమ్ + ఆస్థితా జీవేత్** = స్త్రీ తన పాతివ్రత్య నియమాన్ని పాటిస్తూ, జీవయాత్ర సాగించాలి. **అవిధాయ + ఏవతు ప్రోషితే** = భర్త స్త్రీకి జీవనోపాధిని చూపించకుండానే వెళ్ళిపోయినప్పుడు, **అగర్హితైః శిల్పైః జీవేత్** = ఆనందనీయమైన శిల్ప కార్యాల ద్వారా, (కుట్టుపని, అల్లిక నూలు వడకడం మొ॥ చేతి పనుల ద్వారా) తన జీవన యాత్రను గడుపుకోవాలి.

తాత్పర్యం:- భార్యకు కూటికి-వస్త్రాలకు లోపం లేకుండా తగిన వనరులు కల్పించాలి. స్త్రీ తన పాతివ్రత్య నియమాన్ని పాటిస్తూ జీవయాత్ర సాగించాలి. భర్త జీవనోపాధిని చూపించకుండానే వెళ్ళినప్పుడు ఆనందనీయమైన శిల్పకార్యాల ద్వారా (కుట్టుపని, నూలువడకం మొ॥ చేతి పనులు) తన జీవనయాత్రను గడుపుకోవాలి. ॥75॥

పతి కోసమై ప్రతీక్షించే అవధి తరువాతనే నియోగం లేదా పునర్వివాహం - ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రోషితో ధర్మకార్యార్థం ప్రతీక్ష్యోఽష్టౌ నరః సమాః । మూలశ్లోక సం. **31**
విద్యార్థం షడ్యశోఽర్థం వా కామార్థం త్రీంస్తు వత్సరాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **76**

టీక:- వివాహిత స్త్రీ, **నరః ధర్మకార్యార్థం ప్రోషితః** = వివాహితుడైన పురుషుడు ధర్మకార్యం కోసం పరదేశం వెళ్ళినట్లైతే, **అష్టౌ సమాః** = ఎనిమిది సంవత్సరాలు, **విద్యార్థం వా యశః + అర్థం షట్** = విద్యార్జన కోసం గానీ లేదా కీర్తి కోసం గానీ వెళ్ళినట్లయితే ఆరు సంవత్సరాలు, **కామార్థం త్రీం తు వత్సరాన్** = ధనాదికామనల కోసం వెళ్ళినట్లయితే మూడు సంవత్సరాలు, **ప్రతీక్ష్యః** = ఎదురుచూసిన, (ప్రతీక్షించిన) తరవాత నియోగం చేసికొని, సంతానోత్పత్తిని చేయవచ్చు. వివాహితుడైన తన భర్తరాగా, నియుక్తపతిని వదిలి వేయాలి.

ఋషి దయానందభాష్యం:- గుర్వాజ్ఞ మొదలైన పనులపై ధర్మసాధన నిమిత్తం భర్త దేశాంతరాలకు వెళ్ళినప్పుడు అతడి రాకకోసం భార్య ఎనిమిదేళ్లు నిరీక్షించాల్సి ఉంటుంది. చదువు-కీర్తి మొదలైనవి సంపాదిచడానికి పోయినప్పుడు ఆరేళ్లకాలం ఆగాలి. ధనాదికామనల కోసం కనిపించకుండాపోతే మూడేళ్లపాటు ఆగాలి. నిర్దేశించిన ఈ సమయాలు ఎదురుచూసిన తరవాత నియోగం చేసుకొని, సంతానోత్పత్తిని చేయవచ్చు. వివాహితుడైన తన భర్త రాగా, నియుక్త పతిని వదిలివేయాలి. (స.ప్ర.4వ సము.) ॥76॥

వివరణ:

ఈ నియోగ వ్యవస్థ ప్రాచీనపరంపరాగతం. అలాగే కౌటిల్యుడు కూడా, ఈ వ్యవస్థను సమర్థించాడు. ఆచార్య కౌటిల్యుడి వరకు ఈ నియోగ వ్యవస్థ ప్రచలితంగా ఉండినది. గౌరవింపబడుతూ ఉండేది. ఆయన ప్రకరణ 60, అధ్యాయం 4లో, కారణాన్ని ప్రదర్శనపూర్వకంగా, విభిన్న నియోగముల యొక్క విధానాన్ని వర్ణించాడు.

విస్తృతమైన వివేచనాన్ని భూమికలో ఉన్న 'నియోగ ఆచారం' అనే శీర్షికను చూడగలరు.

ఇది వరకు మనుకృతం-ప్రామాణికం.

సంవత్సరం ప్రతీక్షేత ద్విషన్తీం యోషితం పతిః । మూలశ్లోక సం. **32**
ఊర్ధ్వం సంవత్సరాత్ త్వేనాం దాయం హృత్వా న సంవసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **77**

టీక:- పతిః ద్విషంతీం యోషితం = భర్త తనను ద్వేషించే భార్య కొరకు, **సంవత్సరం ప్రతీక్షేత** = ఒక ఏడాది వరకూ (మారటానికి) వేచి ఉండాలి. **సంవత్సరాత్ ఊర్ధ్వేన**= ఏడాదిలో మారకపోతే ఆ తర్వాత ఆమెకు, దాయం హృత్వా-తానిచ్చిన ధనం, నగలు మొదలైనవన్నీ వెనక్కు తీసుకుని, **న సంవసేత్** = ఆమెను త్యజించాలి.

తాత్పర్యం:- తన విషయమై ద్వేషం గల పతి, తనను విడిచి పరదేశ మేగినప్పుడు, ఒక ఏడాదికాలం అతని కోసం ఎదురుచూసి వివాహ సమయంలో ఇచ్చిన వస్త్ర ఆభూషణాదులను తీసుకొని వేరే వివాహం చేసుకోవాలి. లేదా భర్తకు ఇష్టం లేకపోతే వివాహ సమయంలో తీసుకొన్న ధనాన్ని తిరిగిఇచ్చి తల్లిగారింటికి పంపించాలి. ॥77॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అతిక్రామేత్ ప్రమత్తం యా మత్తం రోగార్తమేవ వా । మూలశ్లోక సం. **33**
సా త్రీన్ మాసాన్ పరిత్యాజ్యా విభూషణపరిచ్ఛదా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **78**

టీక:- యా = ఏ భార్య, **ప్రమత్తం మత్తం వా రోగార్తం ఏవ అతి క్రామేత్** = ప్రమాదవశాత్తు హాని కలిగితే, విక్షిప్త లేదా రోగపీడితుడైతే తన భర్తను అవహేళన చేస్తుందో, **సా** = ఆమెను, **విభూషణ పరిచ్ఛదా**= తానిచ్చిన వస్త్రాభరణాదులు తీసేసుకుని, **త్రీన్ మాసాన్ పరిత్యాజ్యా**= మూడు నెలలకు వదివేయాలి.

తాత్పర్యం:- జూదం మొదలైన దుర్వ్యసనాలున్నవాడు, మద్యపానం చేత మత్తు కలిగి సంచరించేవాడు, రోగపీడితుడు అయిన భర్తను శుశ్రూష చేయక అవమానపరిచే స్త్రీని ఆభరణాలు, మంచం మొదలైనవి లాక్కొని మూడు నెలలుపాటు అమెను వేరేగా ఉంచాలి. ॥78॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉన్మత్తం పతితం క్లీబమబీజం పాపరోగిణమ్ । మూలశ్లోక సం. **34**
న త్యాగోఽస్తి ద్విషన్త్యాశ్చ న చ దాయాపవర్తనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **79**

టీక:-ఉన్మత్తం పతితం క్లీబం అబీజం పాపరోగిణం ద్విషంత్యా= పిచ్చివాడు అపరాధాలవల్ల పతితుడు, నపుంసకుడు, బీజాలు లేని వీర్యం కలవాడు, **పాపరోగీ**= అసహ్యంచుకోదగిన చికిత్స లేని రోగాలతో పీడితుడు అయిన భర్తను ఉపేక్షించే భార్యను, **త్యాగః న అస్తి**= వదిలే వీలు లేదు, **చ**= పైగా, **న దాయ అపవర్తనం**= ఆమె కిచ్చిన ధనాదులు తిరిగి లాక్కునే వీలూ లేదు.

తాత్పర్యం:- వాతాధిప్రకోపం చేత సుస్తితప్పినవాడిని, పతితుణ్ణి, నపుంసకుణ్ణి, ఇంద్రియరహితుణ్ణి, కుష్ఠు రోగిని పరిచర్య చేయకున్నా అలాంటి స్త్రీని భర్త విడువరాదు. ఆమె ధనాన్ని తీసుకోరాదు. ॥79॥

ఇది మనుకృతం-ప్రామాణికం

మద్యపాఽసాధువృత్తా చ ప్రతికూలా చ యా భవేత్ । మూలశ్లోక సం.35
వ్యాధితా వాఽధివేత్తవ్యా హింస్రార్థఘ్నీ చ సర్వదా ॥ ప్రక్షిప్త శ్లోక సం.80

టీక:- యా = ఏ భార్య, మద్యపా = తాగేదీ, అసాధువృత్తా = దురాచారిణి, ప్రతికూలా= భర్తకు అనుకూలవతి కానిది, వ్యాధితా= సంక్రామక వ్యాధులు గలదీ, హింస్రా= భర్త మొదలైన వారిని కొట్టేదీ, వ = ఇంక, **సర్వథా అర్థఘ్నీ** = ఎప్పుడూ ధన నష్టం కలిగించేదీ, **భవేత్** = అవుతుందో, అధి వేత్తవ్యా= ఆమెను వదిలి రెండవ పెళ్లి చేసుకోవాలి.

తాత్పర్యం:- నిషిద్ధమైనట్టి మద్యపానం చేసేది, దుర్వర్తనం కలిగినది, భర్తకు ప్రతికూలంగా సంచరించేది, కుష్ఠ మొదలైన దీర్ఘరోగాలు కలిగినది, తీరని వ్యాధులున్నది, సేవకులు మొదలైన వారి పట్ల కఠినంగా వ్యవహరించేది, వృథా చేసేలా ఆహారపదార్థాలు వండి వార్చేది, తిండిపోతుగుణం అధికంగా ఉండేది....ఇలాంటి దుర్లక్షణాలు కలిగిన స్త్రీని వెంటనే విడిచిపెట్టి వేరొక వివాహం చేసుకోవాలి. ॥80॥

పురుషుడు మరొక స్త్రీ యందు సంతానోత్పత్తి ఎప్పుడు చేయవచ్చు?- ఇది మనుకృతం-ప్రామాణికం

వన్ధ్యాష్టమేఽధివేద్యాబ్దే దశమే తు మృతప్రజా । మూలశ్లోక సం.36
ఏకాదశే స్త్రీజననీ సద్యస్త్వప్రియవాదినీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.81

టీక:- **వన్ధ్యా+అష్టమే అబ్దే** = అంటే స్త్రీకి వివాహానంతరం 8 సం॥ల వరకు గర్భం రానట్లయితే, **మృతప్రజా: తు దశమే** = బిడ్డలు పుట్టి చనిపోతూ ఉంటే పదో సంవత్సరంలో, **స్త్రీ జననీ ఏకాదశే అబ్దే** = పుట్టిన సంతతి అంతా స్త్రీలే అయినట్లయితే 11 సంవత్సరాలకు, **తు** = మరియు, **అప్రియ వాదినీ** = స్త్రీ అప్రియాలనే మాట్లాడేది అయితే, **సద్య:** = వెంటనే, ఆ స్త్రీని వదిలి, **అధివేద్యా** = రెండో స్త్రీతో నియోగం చేసికొని సంతానాన్ని కనాలి.

ఋషి దయానందభాష్యం:- స్త్రీకి వివాహానంతరం 8 సం॥వరకు గర్భం రానట్లయితే, బిడ్డలు పుట్టి చనిపోతూ ఉంటే పదో సంవత్సరంలో, పుట్టిన సంతతి అందరూ స్త్రీలే అయినట్లయితే, ఎప్పుడూ అప్రియంగా మాట్లాడేది అయితే వెంటనే ఆ స్త్రీని వదిలి రెండో స్త్రీతో నియోగం చేసుకొని పిల్లలను కనాలి. (స.ప్ర.4వ సము)

ఇది మనుకృతం- ప్రామాణికం

యా రోగిణీ స్యాత్ తు హితా సమ్పన్నా చైవ శీలత: । మూలశ్లోక సం.37
సానుజ్ఞాప్యాధివేత్తవ్యా నావమాన్యా చ కర్హిచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.82

టీక:- **యారోగిణీస్యాత్** = ఏ స్త్రీ రోగిగానే ఉంటూందో, **తు** = కానీ, **హితా చ శీలత: సంపన్నా:** = భర్త హితం కోరేది, సుశీల అయినది అయితే, **సా అనుజ్ఞాప్య అధి వేత్తవ్యా**= భర్త ఆమె అనుమతితో రెండవ పెళ్లిచేసుకోవచ్చు. **చ**= ఇంకా, **కర్హి చిత్ న అవమాన్యా**= ఆమె నెప్పుడూ అవమానించ రాదు.

తాత్పర్యం:- ఏ స్త్రీ రోగియై, భర్తకు అనుకూలురాలూ పాతివ్రత్యం కలదీ అయినట్లయితే ఆమె అనుమతి పొంది వేరొక వివాహం చేసికోవాలి. కానీ ఆమెను ఎప్పుడూ అవమానపరచరాదు. ॥82॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అధివిన్నా తు యా నారీ నిర్గచ్ఛేద్ రుషితా గృహాత్ । మూలశ్లోక సం.38
సా సద్య: సంనిరోద్ధవ్యా త్యాజ్యా వా కులసన్నిధౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం.83

టీక:- **అధి విన్నాతు యా నారీ**= [మునుపు చెప్పిన 9.80-82ల పరిస్థితిలో] రెండో పెళ్లి చేసుకుంటే, ఏ స్త్రీ, **రుషితా గృహాత్ నిర్గచ్ఛేత్** = కోపగించి ఇల్లు వదిలి పోతే, **సా సద్యః సం నిరోద్ధవ్యా**= ఆమెను వెంటనే ఆపాలి. **వా**= లేదా, **కుల సన్నిధౌ త్యాజ్యా**= ఆమె కుటుంబ సభ్యుల వద్ద దిగ విడిచి రావాలి.

తాత్పర్యం:- భర్త వేరొక పెళ్లి చేసుకున్నట్లు తెలిస్తే, (పైన చెప్పబడిన బాల్యవివాహం పట్టించుకోక) పెళ్లయినప్పటికీ కన్నెచెరవీడని ఆ బాలికను భర్తకు అప్పగించడమో, అతడు నిరాదరిస్తే తమ దగ్గరకే తెచ్చి సంరక్షించడమో తల్లిదండ్రులదే బాధ్యత. అంతేకాని, ఆ కన్యను విడిగా ఉంచరాదు. ॥83॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రతిషిద్ధాపి చేద్యా తు మద్యమభ్యుదయేష్వపి । మూలశ్లోక సం. **39**
ప్రేక్షాసమాజం గచ్ఛేద్వా సా దణ్ద్యా కృష్ణలాని షట్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **84**

టీక:- **యా తు**= ఏ స్త్రీ, **ప్రతిషిద్ధా అపి**= పతి నిషేధించినప్పటికీ, **అభ్యుదయేషు మద్యం అపి**- ఉత్సవాలలో మద్యపానం చేస్తుందో, **వా** = లేదా, **ప్రేక్షా సమాజం గచ్ఛేత్** = అందరూ నాట్య గానాదులు చేసేచోటికి వెళుతుందో, **సా షట్ కృష్ణలాని దండ్యా** = ఆమెను ఆరు కృష్ణాల (8.134) సువర్ణ ముద్రికలతో రాజు దండించాలి.

తాత్పర్యం:- క్షత్రియ స్త్రీ భర్త మొదలైవారు నివారించినా, వివాహాది ఉత్సవాలలో నిషిద్ధమద్యపానమును కోరినా, నాట్యశాల మొదలైన కూటములకు వెళ్ళినా అలాంటి స్త్రీలకు వ్యవహారకాండంలో చెప్పిన ప్రకారం రాజు ఆరు బంగారు కృష్ణలోని అపరాధం విధించాలి. ॥84॥

85 నుండి 87 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* అనేక పత్నులున్నా గౌరవ వ్యవహారము -

* *యది స్వాశ్చాపరాశ్చైవ విన్దేరన్ యోషితో ద్విజాః ।*
తాసాం వర్ణక్రమేణ స్యాజ్జైష్ఠ్యం పూజా చ వేశ్మ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***85***

తాత్పర్యం:- ద్విజులు సవర్ణ స్త్రీలను గానీ లేదా ఇతర వర్ణ స్త్రీలను వివాహం చేసికొన్నట్లయితే అప్పుడు వారికి ద్విజాతి క్రమంలో మాట్లాడటం, దాయభాగం మొదలైన వాటికోసం జ్యేష్ఠత్వమును (పెద్దతనమును), వస్త్రాలు, భూషణాలు మొదలైనవాటిని ఇవ్వడం వల్ల గౌరవించుడమూ, గృహవాసంలో కలుగుతాయి (అంటే పై వాటిని బ్రాహ్మణ స్త్రీకి తర్వాత క్షత్రియకాంతకూ, వైశ్యభామకూ, శూద్ర కన్యకూ జరపాలని భావం.) ॥85॥

* *భర్తుః శరీరశుశ్రూషాం ధర్మకార్యం చ నైత్యకమ్ ।*
స్వా చైవ కుర్యాత్ సర్వేషాం నాన్యజాతిః కథంచన ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***86***

తాత్పర్యం:- భర్తకు అన్ని విధాలా సపర్యలు చేయడం, అతిథిపూజ, గృహానికి భిక్షార్థం వచ్చినవారికి భోజనం పెట్టడం, అగ్ని హోత్రానికి కావలసినవి సిద్ధం చేయడం వంటి దైనందిన కార్యాలకు ద్విజా (బ్రాహ్మణ) స్త్రీలు చేయవలసిన తప్పని సరి కార్యములు. వీటిని ఇతర జాతి పరిచారకుల చేత చేయించరాదు. ॥86॥

* *యస్తు తత్ కారయేన్ మోహాత్ సజాత్యా స్థితయాఽన్యయా ।*
యథా బ్రాహ్మణచాణ్డాలః పూర్వదృష్టస్తథైవ సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***87***

తాత్పర్యం:- సజాతీయమైన స్త్రీ (భార్య) సమీపంలో ఉండగా, తనకు చేయవలసిన దేహశుశ్రూషాదులను విజాతి స్త్రీలచేత చేయించుకొనువాడు బ్రాహ్మణ చండాలుడితో సమానుడని అంటారు. ॥87॥

ప్రక్షిప్తాల పరిశీలన

85-87 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు-

1. అంతర్ వ్యతిరేకాలు

85-87 శ్లోకాలలో ఇతర వర్ణాల స్త్రీలతో వివాహం, బహుపత్నుల పద్ధతీ ఉన్నాయి. ఇది మనువుకు వ్యతిరేకం. మనువు సవర్ణురాలైన ఒక స్త్రీతోనే వివాహ మని, ఒక భార్యే ఉండా లనీ ఆ దేశించాడు (3.4, 5; 5.167, 7.77, 9.101-102). ఈ కారణం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

ఉత్తమ వరుడు లభించగా వెంటనే కన్యా వివాహం జరపాలి-

88 నుండి 91వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ఉత్కృష్టాయాభిరూపాయ వరాయ సదృశాయ చ । మూలశ్లోక సం.40
అప్రాప్తామపి తాం తస్మై కన్యాం దద్యాద్ యథావిధి ॥ ప్రక్షిప్త శ్లోక సం.88

టీక:- తల్లిదండ్రులు తమ కన్యలకు వివాహం చేయాలనుకొన్నప్పుడు, **ఉత్కృష్టాయ + అభిరూపాయ వరాయ** = గుణవంతుడు, రూపవంతుడగు అయిన సదృశ గుణసంపన్నుడైన వరుడు లభించినప్పుడు, **తాం + అప్రాప్తమ్ కన్యాం + అపి** = కన్యకు 16 సం॥ల వయసులో లేదా వయస్సుకొంచెం తక్కువైనా, **తస్మై దద్యాత్** = అట్టి వరుడికి కన్యనిచ్చి వివాహం చేయాలి, వారిద్దరూ అతి ప్రసన్నులై గృహస్థాశ్రమం ఔన్నత్యాన్ని పెంపొందిస్తూ, ఉత్తమ సంతానాన్ని కనగలరు.

ఋషి దయానందభాష్యం:- ఉత్కృష్టమైన వాడిని, చక్కని రూపంగల వాడిని, గుణసంపన్నుడైన వరుడు అభించినప్పుడు, వయసు కొంచెం తక్కువైనా కన్యను బ్రాహ్మ వివాహ విధానం చేత వివాహం జరిపించాలి. (స.వి.వి.ప్ర.) ॥88॥

"తల్లిదండ్రులు కుమార్తెలకు పెళ్లి చేయాలనుకుంటే, గొప్పవాడు, మంచి గుణా లున్నవాడు, మంచి పనులు, మంచి స్వభావం, గుణాలు గల వరుడికిచ్చి వివాహ జరిపించాలి అటువంటి దంపతులు చాలా సంతోషంగా గృహస్థాశ్రమప ఉన్నతి, ఉత్తమ సంతానాన్ని పొందుతారు." (సం.వి. వివాహ ప్రకరణం)

వివరణ:

స్త్రీకి పెళ్లి వయసు

వేదాలు, ఆయుర్వేద శాస్త్రం, మనస్మృతుల ద్వారా మనకు కన్యకు వివాహ వయసు కనిష్ఠంగా పదహారేళ్లని తెలుస్తూంది. శరీర శాస్త్రం కూడా అంతకు ముందైతే ఆడపిల్ల శరీర నిర్మాణం వివాహ యోగ్యం కాదని చెబుతూంది. 9.90లో ఋతుమతి అయ్యాక, మూడేళ్ల తర్వాత పెళ్లి చేయవచ్చునని ఉంది. గృహస్థాశ్రమంలో ఋతుమతి అయిన కన్యకే ప్రాధాన్యం ఉంటుంది కనుక, వివాహ వయసు 16 సంవత్సరాలుగా నిర్ధారించారు. సుశ్రుతుని ఆయుర్వేద గ్రంథంలో **"పంచవింశే తతో వర్షే పుమాన్నారీతు షోడశే"** [సూత్రస్థానం 35.10] అనే శ్లోకంలో అమ్మాయికి 16 ఏళ్లు పెళ్లి వయసని ఉంది. అథర్వ వేదంలో **"బ్రహ్మచర్యేణ కన్యా యువానం విందతే పతిం"** [11.5.5] మంత్రంలో యువావస్థలోనే వివాహం చేయాలనే ఆదేశం ఉంది. దీని వల్ల మరీ చిన్న వయసులో పెళ్లి శాస్త్రవ్యతిరేకం, అవైజ్ఞానికం, మను వ్యతిరేకం, వికృత సంప్రదాయమూ అవుతుంది. అందుచేత 16 ఏళ్లకు తక్కువ వయసులోనూ, ఋతుమతి అవక పూర్వమూ కన్యకు పెళ్లి చేయాలనే వారి అభిప్రాయం మనుస్మృతిలోని పద్ధతికి వ్యతిరేకమూ, తప్పు అవుతుంది. (వివరణకు భూమికలోని తృతీయ అధ్యాయంలోని 'స్త్రీకి పెళ్లి వయసు' శీర్షిక చూడండి).

గుణహీనుడైన పురుషుడితో వివాహం చేయరాదు - ఇది మనుకృతం-ప్రామాణికం

కామమామరణాత్ తిష్ఠేద్గృహే కన్యర్తుమత్యపి । మూలశ్లోక సం.41
న చైవైనాం ప్రయచ్ఛేత్ తు గుణహీనాయ కర్హి చిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.89

టీక:- కామమ్ = అవసరమయినట్లయితే, **ఆమరణాత్** = మరణపర్యంతం, **కన్యా** = కన్య, **గృహే** = గృహంలో, (పుట్టింటి యందు), **తిష్ఠేత్** = వివాహం లేకుండా, ఉండుగాక, **తు** = కాని, **గుణహీనాయ** = గుణహీనుడు, అమ్మాయికి సమానుడు కాని, దుష్టుడు, గుణహీనుడితో, **ఏనాం కర్హిచిత్ న ప్రయచ్ఛేత్** = కన్యకు వివాహం ఎప్పుడూ చేయరాదు.

ఋషి దయానందభాష్యం:- ఋతుమతియై/కన్యగా/ అవివాహితగా మరణ పర్యంతం తండ్రి ఇంట ఉన్నా మేలే కాని, విద్యా-గుణహీనులతో కన్యకు వివాహం చేయరాదు.

మహర్షి దయానందుల వారు ఈ శ్లోకాన్ని పూనా ప్రవచనంలో ఉదాహంచారు. ఇదేవిధంగా మనుమహర్షి కూడా సూచించారు. కన్య మరణ పర్యంతం కుమారిగానైనా ఉంచవచ్చు కాని, గుణహీనుడికిచ్చి మాత్రం వివాహం ఎప్పుడూ చేయరాదు.

వర-వధువులు మరణ పర్యంతం కుమారులుగానే ఉంచవచ్చు గాని, సమాన గుణ-కర్మ స్వభావాలు లేనివారికి వివాహం చేయరాదు. (స.ప్ర.4వ సము.) ॥89॥

కన్య స్వయంవర వివాహం చేసికోవచ్చు - ఇది మనుకృతం-ప్రామాణికం

త్రీణి వర్షాణ్యుదీక్షేత కుమార్యర్తుమతీ సతీ । మూలశ్లోక సం.42
ఊర్ధ్వం తు కాలాదేతస్మాద్ విన్దేత సదృశం పతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.90

టీక:- కుమారీ + ఋతుమతీ = కన్య రజస్వల అయిన తరువాత, **త్రీణి వర్షాణి + ఉదీక్షేత + ఏతస్మాత్ కాలాత్ + ఊర్ధ్వం** = మూడు సంవత్సరాల తర్వాత పతి విషయంలో అన్వేషించి, **సదృశం పతిమ్ విన్దేత** = తనకు యోగ్యుడైన వరుడిని పొందాలి.

ఋషి దయానందభాష్యం:- కన్య తాను రజస్వల అయిన నాటినుంచి మూడేళ్లకాలం తర్వాత తల్లిదండ్రులు సవ్యమైనట్టి వరుణ్ణి వెతికి తెచ్చి అతడికి ఇచ్చి వివాహం చేయాలి. లేదా కన్యకే గుణాలలో తనతో సాటిరాగలవాడిని, అంతకంటే మేటిగుణాలు గలవాడిని స్వయంగా వెతుక్కొని పరిణయమాడే హక్కు ఉంది. వివాహం చేసుకోవాలనే కోరిక కన్యకు కలిగినప్పుడు రజస్వల అయిన 4వ సంవత్సరంలో వివాహం చేసికోవాలి. ॥90॥

స్వయంవర వివాహంలో దోషం లేదు - ఇది మనుకృతం-ప్రామాణికం

అదీయమానా భర్తారమధిగచ్ఛేద్ యది స్వయమ్ । మూలశ్లోక సం.43
నైనః కించిదవాప్నోతి న చ యం సాఽధిగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.91

టీక:- అదీయమానా = తండ్రి మొ॥ పెద్దల ద్వారా వివాహం చేయబడనప్పుడు, **యది స్వయమ్ భర్తారమ్ + అధిగచ్ఛేత్** = కన్య స్వయంగా పతిని వరించినట్లయితే, **కించిత్ ఏనః న అవాప్నోతి** = ఆ కన్యకు ఏ పాపం అంటదు, **చ** = మరియు, **న సా యం అధిగచ్ఛతి** = ఆమె ఎవరిని వరించినదో అతడికి కూడా ఏ పాపమంటదు.

తాత్పర్యం:- తగిన సమయంలో తల్లిదండ్రులు కన్యను యోగ్యుడైన వరుడికిచ్చి పెండ్లి చేయడమనేది ఏ కారణంచేతనైనా వీలు కాకపోయినప్పుడు మాత్రమే కన్య, ఆమెని వరించినాతనికి గాని ఎటువంటి పాపములేదు. స్వయంగా భర్తను వరించినట్లయితే ఆ కన్యకు గానీ అతడికిగానీ ఏ దోషం అంటదు. ॥91॥

92-95వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *అలంకారం నాదదీత పిత్ర్యం కన్యా స్వయంవరా ।*
మాతృకం భ్రాతృదత్తం వా స్తేనా స్యాద్ యది తం హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***92***

తాత్పర్యం:- స్వయంగా వివాహానికి పూసుకొన్న కన్య, తాను ఆ వివాహం చేసుకోడానికి ముందు-తల్లిదండ్రులు గాని, అన్నదమ్ములు గాని ఏవయినా సొమ్ములు/ఆభరణాలు ఇచ్చి ఉన్నట్లయితే అవి వారికే తిరిగి ఇచ్చివేయాలి. లేకుంటే ఆ కన్య చోరత్వం చేసినట్లవుతుంది. ॥92॥

* *పిత్రే న దద్యాచ్ఛుల్కం తు కన్యాం ఋతుమతీం హరన్ ।*
స చ స్వామ్యాదతిక్రామేదృతూనాం ప్రతిరోధనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***93***

తాత్పర్యం:- రజస్వల అయిన కన్యను పెళ్లాడితే, ఆ వరుడు, ఆ పిల్లతండ్రికి ఎలాంటి కన్యాశుల్కాన్ని (ఓలి) చెల్లించనక్కర్లేదు. ఎందుకంటే....తన పిల్లకు ఋతుకార్యమైనట్టి సంతతిని ఆపే అధికారం అతడికి లేదు. రక్షణ బాధ్యత నుంచి కూడ అతణ్ణి తప్పించాలి. అది ఆ క్షణం నుంచీ పెళ్లాడిన వారిది అవుతుంది. ॥93॥

* *త్రింశద్వర్షో వహేత్ కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్ ।*
త్ర్యష్టవర్షోఽష్టవర్షాం వా ధర్మేసీదతి సత్వరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***94***

తాత్పర్యం:- ముప్పయ్యేళ్ల వరుడు చక్కని పన్నెండేళ్ల కన్యను పెళ్లాడాలని (నాటి) ధర్మశాస్త్రం విధి. ఇరవై నాలుగేళ్లవాడు ఎనమిదేళ్ల కన్యను పెళ్లాడవచ్చు. కానీ అంతకుముందే అంటే నియమిత వయస్సు కంటే చిన్న వయస్సులో వధువులను-వరులను అనుమతించలేదు. ॥94॥

* *దేవదత్తాం పతిర్భార్యాం విన్దతే నేచ్ఛయాత్మనః ।*
తాం సాధ్వీం బిభృయాన్నిత్యం దేవానాం ప్రియమాచరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***95***

తాత్పర్యం:- దేవతల సంకల్పంచేత తనకు ఏ కన్య ఇవ్వబడినదో ఆ దేవతలకు ప్రియం చేకూర్చేలా ఆమెనే తాను భార్యగా పొందాలి. ఆ విధంగా వరుడికి స్వయంవరాధికారం ఇవ్వబడలేదు. వేల్పులచేత నిర్దేశించబడిన అలాంటి కన్యక తన పట్ల అనురాగంగా లేనప్పటికీ ఆమె పోషణ బాధ్యత భర్తదే! ॥95॥

ప్రక్షిప్తాల పరిశీలన

92 నుంచి 95 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

1. వర్ణాలను అనుసరించి పెళ్లిలో ఆదర సత్కారాలు, ఆస్తి పంపకాలు మొదలైనవి కూడా మనువుకు వ్యతిరేకమే. ఎందుకంటే, మనువు సవర్ణురాలైన స్త్రీనే పెళ్లాడమని చెప్పాడు[3.4;7.70 మొదలైనవి.]

2. గాంధర్వ పద్ధతితో ఇతర వర్ణాలలోనూ పెళ్లి అయితే, దాన్ని మిగిలిన గౌరవనీయ వివాహాలలోనే పరిగణించాలి. అప్పుడు కూడా ఆదర సత్కారాల విషయంలో వర్ణాలకు భిన్నంగా జరిపే పద్ధతి ఉండదు.

3. ఇదే విధంగా 92, 93లకు 90,91లతోనూ, 94,95లకు 3.1-5 శ్లోకాలతోనూ వ్యతిరేకత ఉంది. అక్కడ యుక్త వయసులోనే స్త్రీతో పెళ్లి అని ఉంది.

2. విషయ వ్యతిరేకాలు

విషయ సంకేతక శ్లోకాలు [9.1,103] ప్రకారం, దీన్ని స్త్రీలకు ఆపద్ధర్మంగా చెప్పారు. స్వయం వర వివాహం చేసుకునే అమ్మాయికి పిత్రార్జితంపై అధికారం [92], వివాహ వయసు [93-94] మొదలైన వాటి కన్నా భిన్న వర్ణన ఉంది. అందుచేత విషయ వ్యతిరేకం. ఈ ఆధారంతో 92 నుంచి 95 శ్లోకాలు ప్రక్షిప్తాలు.

స్త్రీ పురుషునికి అర్ధాంగిని -

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రజనార్థం స్త్రియః సృష్టాస్సంతానార్థం చ మానవః । మూలశ్లోక సం.**44**
తస్మాత్ సాధారణో ధర్మః శ్రుతౌ పత్న్యా సహోదితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**96**

టీక:- ప్రజనార్థం స్త్రియః సృష్టాః = గర్భధారణ చేసి, సంతానాన్ని కనడానికి స్త్రీల సృష్టి జరిగింది, **చ** = మరియు, **సంతానార్థం మానవాః** = సంతానార్థం, గర్భాధానం చేయడానికీ పురుష సృష్టి జరిగింది. స్త్రీ పురుషులిద్దరు పరస్పరం సహకరించుకోవడం వల్ల, లేదా ఒకరి తరుగును మరొకరు పూర్తిచేయడం ద్వారా, **తస్మాత్** = అందువల్ల, **శ్రుతౌ** = వేదంలో, **సాధారణః ధర్మః** = అతి చిన్న ధర్మకార్యానుష్ఠానం కూడా, **పత్న్యా సహ + ఉదితః** = పత్నితో కలిసి చేయాలనే విధానముంది.

తాత్పర్యం:- గర్భం ధరించి సంతానాన్ని కనడానికి స్త్రీల యొక్క; సంతానార్థం గర్భధానం చేయడానికీ పురుషుల యొక్క సృష్టి జరిగింది. అందువల్ల వేదంలో అతిచిన్న ధర్మకార్యానుష్ఠానం కూడా పత్నితో కలిసి చేయాలనే విధానం ఉంది. ॥96॥

వివరణ:

ప్రతి ధర్మకార్యాన్ని భార్యతో కలిసి చేయాలి:- ప్రతి ధర్మకార్యం పత్నిని సహభాగినిగా చేసికొని చేయాలనే ధర్మముంది. అయితే ఇక్కడ పత్ని పురుషుడికి పూరకం, సహభాగిని అని మనువు ఈ శ్లోకంలో అంగీకరించాడు. ప్రతి ఒక్క ధర్మకార్యం ఆమె తోడుగా లేకుండా పూర్తికాదు. పత్నికి ఇలాంటి మర్యాద ఇచ్చినట్లు సమస్త ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తుంది. స్త్రీ పురుషుడి యొక్క అర్ధభాగమని అంగీకరించినప్పుడు ఇద్దరి స్థితి సమానమే. అందులో ఏ విధమైన పక్షపాత భావనలేదు.

క. **"అర్ధో వా హ వా ఏష ఆత్మనో యజ్జాయా, తస్మాత్ యావజ్జాయాం**
న విన్దతే నైవ తావత్ ప్రజాయతే అసర్వోఽహి తావత్
భవతి, అథ యదైవ జాయాం విన్దతేఽథ ప్రజాయతే, తర్హి హి సర్వో భవతి॥

శతపథ బ్రాహ్మణం 5.2.1.10

భార్య రానంత వరకు పురుషుడు సగమే. పూర్ణుడు కాదు. భార్యతో కలిసినప్పుడు అతడు సంపూర్ణుడవుతాడు.

ఖ. **అథో అర్ధో వా ఏష ఆత్మనః యత్పత్నీ** (తైత్తిరీయ. 3.3.5)

97-100వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** కట్నం విషయంలో ఖండన మండనాలు -**

* *కన్యాయాం దత్తశుల్కాయాం మ్రియేత యది శుల్కదః ।*
దేవరాయ ప్రదాతవ్యా యది కన్యానుమన్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***97***

తాత్పర్యం:- వరుడు ఒక కన్యను పెళ్లి చేసుకొనే నిమిత్తం ఓలి ఇచ్చిన అనంతరం అతడు మృతి చెందితే-ఒకవేళ అతనికి తమ్ముడుంటే, కన్యను అతడికిచ్చి వేయాలి. లేదా ఓలి తిరిగివ్వాలి. ॥97॥

* **ఆదదీత న శూద్రోఽ పి శుల్కం దుహితరం దదత్ ।**
శుల్కం హి గృహ్ణన్ కురుతే ఛన్నం దుహితృవిక్రయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **98**

తాత్పర్యం:- శాస్త్రాలేవీ తెలీని శూద్రుడైనాగాని కన్యనిచ్చి ఓలి గ్రహించరాదు. ఇక-అన్నీ తెలిసిన బ్రాహ్మణుడి సంగతి చెప్పనేల? ఓలిని గ్రహించినట్లయితే, అతడు రహస్యంగా కన్యావిక్రయం చేసినవాడితో జమ. ॥98॥

* **ఏతత్తు న పరే చక్రుర్నాపరే జాతు సాధవః ।**
యదన్యస్య ప్రతిజ్ఞాయ పునరన్యస్య దీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **99**

తాత్పర్యం:- ఒకరికి పిల్లనిస్తాని మాట ఇచ్చి, ఇంకొకరికి ఆ కన్యను ఇచ్చి వివాహం చేయడమనేది శాస్త్ర విరుద్ధం. దీన్ని పురాణాల్లో గాని, శాస్త్రాల్లో గాని ఎక్కడా గమనించం. ప్రకృతకాలంలోనూ ఇది నిషేధమే ! ఎన్నటికీ తగనిది. ఎవరికివ్వదలచామో వారికి కన్యను ఇచ్చి వివాహం చేయాలి. ॥99॥

* **నానుశుశ్రుమ జాత్వేతత్ పూర్వేష్వపి హి జన్మసు ।**
శుల్క సంజ్ఞేన మూల్యేన ఛన్నం దుహితృవిక్రయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **100**

తాత్పర్యం:- ఓలి తీసుకొని కన్యావిక్రయం చేయడం అనే హీనకార్యం పెద్దలు ఒకప్పుడు చేశారని ఏ శాస్త్రంలోనూ ఎక్కడా చెప్పబడలేదు. అది జరిగిందనేందుకు ఒక్క ప్రమాణమైనా చూపడం అసాధ్యం. ॥100॥

ప్రక్షిప్తాల పరిశీలన

97 నుంచి 100 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలవుతాయి-

1. అంతర్ వ్యతిరేకాలు, పునరుక్తులు

ప్రక్షిప్త శ్లోకాల ఈ ప్రసంగంలో 97వ శ్లోకం, మనువు చెప్పిన విధానాలకు వ్యతిరేకంగా ఉంది. మనువు వివాహ ప్రసంగంలో స్పష్టంగా కట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం నిషేధించాడు [3.53, 54]. తర్వాతి 98-100 శ్లోకాలలో 97వ శ్లోకాన్ని, ఇది మనువుకు అనుకూలంగా ఉందని ఖండించారు.

కానీ దీన్ని 3.53, 54లలో ముందే చెప్పినందున ఇక్కడ మళ్లీ చెప్పటం వ్యర్థమే. కట్నాన్ని పొగడడం, ఖండించడం వల్ల, ఇవి తర్వాతి సంప్రదాయాలు వికృతమయ్యాక రచించి చేర్చిన కలిపిన శ్లోకాలని రుజువవుతూంది.

2. విషయ వ్యతిరేకాలు

విషయ సంకేతం గల శ్లోకాల [9.1,103] ప్రకారం, విషయం స్త్రీల ఆపద్ధర్మం గురించి. ఈ శ్లోకాలలో మరిదితో పెళ్లి, కట్నం తీసుకోకపోవడం [98-100] అనే విషయాల భిన్న వర్ణన ఉంది. విషయ వ్యతిరేకం కావడం చేత 97-100 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఈ వర్ణన 9.69; 3.51-54లలోనూ చెప్పబడింది కనుక ఇక్కడ అనవసరం !

3. ప్రసంగ వ్యతిరేకాలు

పూర్వాపర శ్లోకాలలో [96,101-103] విషయపు ఉపసంహారం చేస్తూ, స్త్రీ పురుషులను ఒకటిగా భావించి, ఎప్పుడూ కలిసే ఉండాలని, ఎప్పటికీ విడిపోకూడదనీ చెప్పారు. ఈ విధంగా పూర్వాపర శ్లోకాలలో ఏకవాక్యత ఉంది. ఈ శ్లోకాలు ఆ పూర్వాపర ప్రసంగాన్ని భంగపరచి, వేరు విషయాలు చెప్పాయి. అందుకని ఇవి ప్రసంగ వ్యతిరేకాలు కావడంతో పాటుగా ప్రక్షిప్తాలూ అయ్యాయి.

101 నుండి 105 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

భార్యాభర్తలు పారస్పరిక గౌరవాన్ని ఎప్పుడూ అతిక్రమించకూడదు-

అన్యోన్యస్యావ్యభిచారో భవేదామరణాన్తికః । మూలశ్లోక సం. **45**
ఏష ధర్మః సమాసేన జ్ఞేయః స్త్రీపుంసయోః పరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **101**

టీక:- **ఆమరణాన్తికః** = మరణ పర్యంతం, **అన్యోన్యస్య + అవ్యభిచారః భవేత్** = పతి-పత్నుల మధ్య పరస్పరం ఏ విధంగానైనా ధర్మాన్ని ఉల్లంఘించరాదు, వివాహవిచ్ఛేదం రాకూడదు, **సమాసేన** = సంక్షేపంగా, **స్త్రీ-పుంసయోః** = స్త్రీ పురుషులకు, **ఏషః ధర్మః పరః జ్ఞేయః** = ఇదే సారరూపమైన ముఖ్య ధర్మం.

తాత్పర్యం:- భార్యాభర్తలకు జీవితమున్నంతకాలం ధర్మార్థకామములనేవాటిలో ఒకర్నొకరు కలిసుండాలనే ముఖ్యధర్మం సంగ్రహంగా చెప్పబడినది. వివాహ లక్ష్యం అదే! ॥101॥

విడిపోయే అవసరమే రాకూడదు - ఇది మనుకృతం-ప్రామాణికం

తథా నిత్యం యతేయాతాం స్త్రీపుంసౌ తు కృతక్రియౌ । మూలశ్లోక సం. **46**
యథా నాభిచరేతాం తౌ వియుక్తావితరేతరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102**

టీక:- **కృత-క్రియౌ స్త్రీ పుంసౌ** = వివాహితులైన స్త్రీ పురుషులు, **నిత్యం తథా యతే యాతాం** = ఎల్లప్పుడు ఈ విధంగా ప్రయత్నించాలి, **యథా తౌ** = వారిద్దరూ ఏ విధంగానైనా, **ఇతరేతరమ్** = ఒకరు మరొకరితో (పరస్పరం), **వియుక్తౌ న + అభిచరేతాం** = వేరు కాకూడదు. సంబంధం విచ్ఛేదం కారాదు.

తాత్పర్యం:- పెళ్లి జరిగిన, స్త్రీ పురుషులు ఒకటయ్యాక ధర్మార్థకామాలలో ఒకర్నొకరు ఎన్నడూ ఎడబాయక ఉండటానికే ప్రయత్నం చేయాలి. ॥102॥

ఇది మనుకృతం-ప్రామాణికం

17వ వివాదం. దాయభాగ వివాద వర్ణన-103 నుండి 219 వరకు

ఏష స్త్రీ పుంసయోరుక్తో ధర్మో వో రతిసంహితః । మూలశ్లోక సం. **47**
ఆపద్యపత్యప్రాప్తిశ్చ దాయభాగం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **103**

టీక:- **ఏషః** = ఇది (9-1 నుండి 102) వరకు, **స్త్రీ-పుంసయోః** = స్త్రీ-పురుషులకు సంబంధించిన, **రతిసంహితః ధర్మః** = రతి-స్నేహ లేదా సంయోగ కాలానికి (వియోగకాలానికి) ధర్మం, **చ** = మరియు, **ఆపది + అపత్యప్రాప్తిః** = ఆపత్కాలంలో నియోగ విధి ద్వారా సంతానప్రాప్తి (9.56-63) (9.22-27), **వః ఉక్తః** = మీకు తెలుపబడింది. **దాయభాగం నిబోధత** = దాయభాగ విధానం వినండి.

తాత్పర్యం:- భార్యాభర్తలకు అనురాగంతో కూడిన ధర్మం చెప్పబడింది. సంతతి లేనప్పుడు సంతతిపొందే విధం కూడ చెప్పబడింది. ఇక దాయభాగవ్యవస్థను కొంతవరకు తెలుపవలసివుంది. అది వినండి. ॥103॥

వేరుబడేటప్పుడు దాయభాగాన్ని సమానంగా విభజన చేయడం - ఇది మనుకృతం-ప్రామాణికం

ఊర్ధ్వం పితుశ్చ మాతుశ్చ సమేత్య భ్రాతరస్సమమ్ । మూలశ్లోక సం. **48**
భజేరన్ పైతృకం రిక్థమనీశాస్తే హి జీవతోః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104**

టీక:- **పితుః చ మాతుః ఊర్ధ్వం** = తల్లి-తండ్రి చనిపోయిన తరువాత, **భ్రాతరః సమేత్య** = సోదరులందరూ ఒకచోట చేరి, **పైతృకం రిక్థమ్ సమమ్ భజేరన్** = పైతృక సంపత్తిని సమానంగా పంచుకోవాలి, **జీవతోః తే అనీశాః** = తల్లిదండ్రులు జీవించి ఉండగా, బిడ్డలు ఆ సంపత్తికి అధికారులు కారు. కాజాలరు.

తాత్పర్యం:- తల్లిదండ్రులు జీవించి ఉండగా, వారి ధనానికి పుత్రులు అధికారులు కారు కాబట్టి, వారి అనంతరమే ఆయన సంతానానికి సంబంధించిన అందరూ కలిసి వారి ధనాన్ని పంచుకోవాలి. ॥104॥

సమిష్టిగా ఉన్నప్పుడు విభజనలో వికల్పం - ఇది మనుకృతం-ప్రామాణికం

జ్యేష్ఠ ఏవ తు గృహ్ణీయాత్ పిత్ర్యం ధనమశేషతః । మూలశ్లోక సం. **49**
శేషాస్తముపజీవేయుర్యథైవ పితరం తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **105**

టీక:- లేదా అందరూ కలిసి ఒకే కుటుంబంగా ఉండదలచుకొన్నట్లయితే, **పిత్ర్యం ధనం + అశేషతః జ్యేష్ఠః ఏవతు గృహ్ణీయాత్** = తండ్రి ధనమంతా జ్యేష్ఠ కుమారుడే తీసుకోవాలి, **శేషాః** = మిగిలిన సోదరులందరూ, **యథా + ఏవ పితరం** = తండ్రితో ఉన్నట్లుగానే, **తథా తమ్ ఉప జీవేయుః** = పెద్ద సోదరుడితో ఉంటూ జీవనం గడపాలి.

తాత్పర్యం:- సాధారణంగా తండ్రి సంపాదించిన దానికి పెద్ద కొడుకే అధికారి. అతడు తమ్ములనందరిని తండ్రి రక్షించునట్లు రక్షించాలి. జ్యేష్ఠుడు పుట్టగానే అతడు పుట్టబోవు వారందరికి తండ్రితో సమానం. ॥105॥

వివరణ:

ఇక్కడ తండ్రి ధనాన్ని గురించి చెప్పబడింది. తల్లి ధనం విషయంలో 9-192వ శ్లోకం నుండి తెలియజేయడం జరుగుతుంది.

106,107 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***జ్యేష్ఠేన జాతమాత్రేణ పుత్రీ భవతి మానవః ।***
పితౄణామనృణశ్చైవ స తస్మాత్సర్వమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***106***

తాత్పర్యం:- జ్యేష్ఠ సంతానం పుత్రుడైనప్పుడు మనిషికి పితృఋణం అప్పటితో తీరిపోతుంది. లేదా ఎప్పుడు పుత్రసంతానం కలిగితే అప్పుడు తీరిపోతుంది. పుత్రికానంతానం ఇతర వంశాలను వృద్ధిచేస్తుంది. కాబట్టి, ఆమె జ్యేష్ఠసంతానమైనా పితృఋణం తీర్చడానికి అర్హురాలు కాదు. పుత్రులలో అగ్రజుడే సర్వధనాధికారి. ॥106॥

* ***యస్మిన్నృణం సంనయతి యేన చానన్త్యమశ్నుతే ।***
స ఏవ ధర్మజః పుత్రః కామజానితరాన్విదుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***107***

తాత్పర్యం:- జ్యేష్ఠ పుత్రుడు పుట్టిన తరువాత ఎవరు పిత్రురుణం తీర్చుకొంటాడో, మోక్షం పొందుతాడో అతడు ఒక్కడే శాస్త్ర ప్రకారం పుట్టిన ధర్మజ పుత్రుడు. మిగిలిన వారందరూ కామజనితులని మునులు తెలుపుతారు. కాబట్టి జ్యేష్ఠ పుత్రుడే సర్వసంపదలకు అర్హుడు. ॥107॥

ప్రక్షిప్తాల పరిశీలన

106, 107 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలు పూర్వాపర శ్లోకాల ఏకవాక్యతను భంగ పరుస్తున్నాయి. 105లో అగ్రజుడే ధనం తీసుకునే వాడనీ, ఆ పరిస్థితిలో చిన్న తమ్ములు ఎలా ఉండాలో 108లో ఉన్నాయి. 105వ శ్లోకానికి 108తో ఏకవాక్యత ఉంది. మధ్యలో పెద్దకొడుకు మహిమను గురించిన విషయం ఆ వాక్య క్రమాన్ని భంగం చేస్తూంది. అలా ప్రసంగ వ్యతిరేకం కావటం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 106లో మహిమ గల జ్యేష్ఠ పుత్రుడే మొత్తం ధనానికీ అధికారి అనటం 104కు వ్యతిరేకం. మనువు ఈ వికల్పాన్ని ప్రధానంగా కాక, రెండవ వికల్పంగా భావించాడు.

ఖ. 107లో జ్యేష్ఠ పుత్రుణ్నే 'ధర్మజుడు'గా అనుకోవడం, ఇతరులను 'కామజులు' అనుకోవడం మనువుకు వ్యతిరేకం. మనువు పలువురు పుత్రులు పుట్టడం ధర్మపూర్వకమని భావించాడు.

తమ్ముళ్ళ విషయంలో అన్న కర్తవ్యం - ఇది మనుకృతం-ప్రామాణికం

పితేవ పాలయేత్ పుత్రాన్ జ్యేష్ఠో భ్రాతౄన్ యవీయసః । మూలశ్లోక సం. **50**
పుత్రవచ్చాపి వర్తేరన్ జ్యేష్ఠే భ్రాతరి ధర్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **108**

టీక:- జ్యేష్ఠః = పెద్ద సోదరుడు కూడా కలిసి ఉంటూ, **యవీయసః భ్రాతౄన్** = తన చిన్న సోదరులను, **పితేవ + ఇవ పుత్రాన్** = తండ్రి తన పుత్రులను పాలించి పోషించునట్లుగా, **పాలయేత్** = పాలించాలి. **చ** = మరియు, **జ్యేష్ఠే భ్రాతరి** = పెద్ద అన్న మీద, **ధర్మతః** = ధర్మానుసారంగా, **పుత్రవత్ +అపి వర్తేరన్** = పుత్రులలాగా సాదరంగా చూడాలి. అంటే పుత్రులు తండ్రిని చూసినట్లుగా అన్నను చూడాలి.

తాత్పర్యం:- పుత్రులలో పెద్దవాడైన అన్న, తనకంటే చిన్నవారైన తమ్ముళ్లను (తండ్రిలాగా) ఆలనాపాలనా చూడడంలో జాగ్రత్త వహించాలి. వారు కూడా అన్న పట్ల అదే పితృ-పుత్ర సంబంధాన్ని పాటిస్తూ భక్తితో మెలగాలి. ఇది అనాదిగా వస్తున్న అవినాభావ సంబంధానికి తార్కాణం. ॥108॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ***జ్యేష్ఠః కులం వర్ధయతి వినాశయతి వా పునః ।***
జ్యేష్ఠః పూజ్యతమో లోకే జ్యేష్ఠః సద్భిరగర్హితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***109***

తాత్పర్యం:- గుణవంతుడైన పెద్దకొడుకు కులదీపకుడు కూడ. ఇతడు 'తాను సన్మార్గంలో పయనిస్తూ, ధర్మం తప్పక వర్తిస్తూ తన సోదరులు తనను అనుసరించేలా చేయగలిగితే ధర్మం నిలుస్తుంది' అన్న అధర్మాన్ని ఆశ్రయిస్తే అతని తమ్ములు కూడ అదే మార్గాన్ని పట్టి, కుల నాశకులవుతారు.॥109॥

ప్రక్షిప్త పరిశీలన

109వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. ప్రసంగవ్యతిరేకం

పూర్వాపర శ్లోకాలలో పెద్ద, చిన్న సోదరుల పరస్పర వ్యవహారం ఉంది. ఈ శ్లోకంలో మళ్లీ జ్యేష్ఠుని గొప్పతనం చెప్పడం ఆ ఏక వాక్యాత్మకతను భంగం చేస్తూంది. ఒకసారి 106,107లలో ఇది చెప్పడం అయింది కనుక, ఇక్కడ ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తం. ఆస్తుల పంపకం చెప్పిన చోట ఈ మహిమాత్మక శ్లోకం అసంగతమూ, అనవసరమూ!

110-112వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

పెద్దన్న పట్ల తమ్ముళ్ళ కర్తవ్యం

యో జ్యేష్ఠో జ్యేష్ఠవృత్తిః స్యాత్ మాతైవ స పితైవ సః । మూలశ్లోక సం.**51**
అజ్యేష్ఠవృత్తిర్యస్తు స్యాత్సః సంపూజ్యస్తు బన్ధువత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**110**

టీక:- కాని, **యః జ్యేష్ఠః** = పెద్దవాడైన సోదరుడు (జ్యేష్ఠుడు), **జ్యేష్ఠ వృత్తిః స్యాత్** = తండ్రి లాగా, తమ్ముళ్ళను చూసేవాడుగా ఉండాలి. **సః పితా + ఇవ, సః మాతా ఇవ సంపూజ్యః** = జ్యేష్ఠుడు తండ్రి మాదిరిగా, తల్లి మాదిరిగా పూజనీయుడు, **యః తు** = ఎవరు, **అజ్యేష్ఠ వృత్తిః స్యాత్** = జ్యేష్ఠ సోదరుడు, తండ్రి లాగా తమ్ముళ్ళను చూడనట్లయితే, **సః తు బన్ధువత్** = కనీసం సోదరుడి లాగా, మిత్రుడి లాగా, బంధువు లాగా చూడాలి.

తాత్పర్యం:- జ్యేష్ఠపుత్రుడు తల్లీ, తండ్రిలాగా తమ్ముళ్ళను ఆదరించినప్పుడు అతడెప్పుడూ పూజనీయుడుగా గౌరవించబడతాడు. అలా ఆదరించనప్పుడు కనీసం సోదరుడిగా, మిత్రుడిగా, బందువుగా చూడాలి. ॥110॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం సహ వసేయుర్వా పృథగ్వా ధర్మ కామ్యయా । మూలశ్లోక సం.**52**
పృథగ్వివర్ధతే ధర్మస్తస్మాద్ధర్మ్యా పృథక్క్రియా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**111**

టీక:- ఏవం = ఈ ప్రకారంగా, **సహ వసేయుః** = సోదరులందరూ కలిసి ఉండాలి, (9.105,108,110) లేదా, **ధర్మకామ్యయా** = ధర్మాభిలాషతో, **పృథక్** = వేరు వేరుగా (9.104) గాని ఉండాలి. వేరు వేరుగా ఉన్నందువల్ల, ధర్మం విస్తరిస్తుంది. అంటే అందరూ వేరువేరుగా పంచ మహా యజ్ఞాలను చేయడం ద్వారా ధర్మం విస్తరిస్తుంది, **తస్మాత్** = ఈ కారణంగా, **పృథక్ క్రియా ధర్మ్యా** = వేరుగా ఉండటం ధర్మానుకూలమే.

తాత్పర్యం:- పై శ్లోకంలో చెప్పిన ప్రకారంగా సోదరులందరూ కలిసి ఉండాలి. లేదా ధర్మాభిలాషలో వేరువేరుగా ఉండవచ్చు. అందరూ వేరువేరుగా ఉంటే పంచమహాయజ్ఞాలను చేయడం ద్వారా ధర్మం విస్తరిస్తుంది. ఈ కారణంగా లేరుగా ఉండటమే ధర్మానుకూలం. ॥111॥

కలిసి ఉండి వేరుపడినట్లయితే "ఉద్ధార అంశ విభాజనం" - ఇది మనుకృతం-ప్రామాణికం

జ్యేష్ఠస్య వింశ ఉద్ధారః సర్వద్రవ్యాచ్చ యద్వరమ్ । మూలశ్లోక సం.**53**
తతోఽర్ధం మధ్యమస్య స్యాత్తురీయంతు యవీయసః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**112**

టీక:- కలిసి ఉంటూ, జ్యేష్ఠ సోదరుడి పాలన పోషణలో ఉండి, తరువాత వేరు పడినట్లయితే, **జ్యేష్ఠస్య వింశ ఉద్ధారః** = తండ్రి ఆస్తిలో నుండి (జ్యేష్ఠుడికి) పెద్దన్నకు 20వ భాగం ఉద్ధారంగా అతిరిక్త భాగం ఇవ్వాలి. **చ** = మరియు, **సర్వ ద్రవ్యాత్ యత్వరమ్** = అది కూడా ఉన్న సంపత్తిలో ఏది విలువైనదో, అందులో నుండి 20వ భాగం, **తతః + అర్ధం** = జ్యేష్ఠుడికి ఇచ్చిన ఉద్ధారంలో సగభాగం, **మధ్యమస్య** = మధ్యమ సోదరుడికి 40వ భాగం, **తృతీయం తు యవీయసః స్యాత్** = మూడో భాగం (60) వ భాగం అందరికంటే కనిష్ఠ సోదరునికి 80వ భాగం ఉద్ధారమివ్వాలి.

తాత్పర్యం:- కలిసి ఉంటూ, జ్యేష్ఠ సోదరుడి పాలన, పోషణలో ఉండి, తరవాత వేరు పడినట్లయితే, తండ్రి ఆస్థి నుండి పెద్దన్నకు 20వ భాగం ఉద్ధారంగా అతిరిక్త భాగం, అదీ విలువైన దాన్నుంచి 20వ భాగం జ్యేష్ఠుడికి ఇచ్చిన ఉద్ధారంలో సగభాగం మధ్యమ సోదరుడికి 40వ భాగం, మూడో భాగం మూడవ సోదరునికి 60వ భాగం నాల్గో భాగం (80వ భాగం) అందరికంటే కనిష్ఠ సోదరుడికి ఉద్ధారం ఇవ్వాలి. ॥112॥

వివరణ:

1.ఉద్ధారభాగ విభజనం: పైతృక సంపత్తిలో నుండి వేరు చేసిన భాగానికి ఉద్ధారమని పేరు. ఈ భాగం (సంపత్తి) నుండి జ్యేష్ఠ సోదరుడికి (20 శాతం) లభిస్తుంది. (105-111) శ్లోకాలననుసరించి, ఆ ఉద్ధారం జ్యేష్ఠుడు తతిమ్మా సోదరులను తండ్రి లాగా చూసేటట్లయితే అప్పుడు ఆ ఉద్ధారం జ్యేష్ఠుడికి లభిస్తుంది.

వివరణకు ఒక ఉదాహరణ. పైతృక సంపత్తి రూ.960లు అనుకోండి. అందులో నుండి జ్యేష్ఠ సోదరుడికి 20వ భాగం అంటే 960÷20 = 48 ఉద్ధారమవుతుంది. మధ్య సోదరుడికి 40వ భాగం (960÷40 = 24 రూ) ఉద్ధారం. కనిష్ఠ సోదరుడికి (960÷80 = 12 రూపాయలు ఉద్ధారం) మొత్తం ఉద్ధారం (48+24+12 = 84) మిగిలినది 876 పంచుకొన్న తరువాత మిగిలిన ధనాన్ని సోదరులందరూ సమానంగా పంచుకోవాలి. ఒక్కొక్కరికి మొత్తం 1) మొదటి వాడికి రూ.340లు, 2) రెండోవాడికి రూ.316లు 3) మూడోవ వాడికి 304 రూపాయలు వస్తుంది.

2) ఉద్ధారభాగ విధానమెందుకు? (9.104)లో పైత్రుక సంపత్తికి సమాన విభాగం ఉండాలని చెప్పడం జరిగింది. ఈ శ్లోకంలో ఉద్ధారాంశ విభాజనానంతరం సమాన భాగవిధానముంది. ఈ విధానంలో వ్యతిరేకమనిపిస్తుంది. కానీ వ్యతిరేకత ఏమీలేదు. ఈ విభాజనంలో ద్వితీయ వికల్పం 105లో ప్రసంగాంతర్గతం, జ్యేష్ఠ సోదరుడు, తన సోదరులను తండ్రి లాగా ఆదరించి పోషించినప్పుడు విధానం అమలుకు వస్తుంది. కలిసి ఉన్నా, తండ్రి లాగా చిన్నవాళ్ళను అభివృద్ధి చేయడంలో శ్రమ పడాలి. ఈ శ్రమ పరిణామ స్వరూపంగా, జ్యేష్ఠుడు వేరుగా ఉన్నప్పటికి, అతనికి అధికభాగం లభిస్తుంది. కారణం, చిన్న వాళ్ళ కంటే జ్యేష్ఠుడు ఎక్కువగా సేవచేసినందువల్ల.

113-115వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *జ్యేష్ఠశ్చైవ కనిష్ఠశ్చ సంహరేతాం యథోదితమ్ ।*
యేఽన్యే జ్యేష్ఠకనిష్ఠాభ్యాం తేషాం స్యాన్మధ్యమం ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***113***

తాత్పర్యం:- పెద్దవాడు, చిన్నవాడు పై విధముగా భాగములు తీసికొనవలెను. కాక మిగిలిన వారు మధ్యమ భాగమును తీసికొనవలెను. ॥113॥

* *సర్వేషాం ధనజాతానామాదదీతాగ్ర్యమగ్రజః ।*
యచ్చ సాతిశయం కించిద్దశతశ్చాప్నుయాద్వరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***114***

తాత్పర్యం:- సంపూర్ణధనములో శ్రేష్ఠమైన ధనమును ఉత్తమ వస్తువును, పదియావులలో నొక శ్రేష్ఠమైన దానిని అగ్రజుడు తీసికొనుట కర్తుడు. ॥114॥

* *ఉద్ధారో న దశస్వస్తి సంపన్నానాం స్వకర్మసు ।*
యత్కించిదేవ దేయం తు జ్యాయసే మానవర్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***115***

తాత్పర్యం:- అన్ని ధనాల్లోకీ మేలైన వాటిని పెద్దవాడు తీసుకోవాలి. ఒకవేళ అన్నింటిలోకీ ఒక్కటే మేలైనది ఉంటే దాన్నే పెద్దవాడు తీసుకోవాలి. గోధనం అయినప్పుడు పదింటికి ఒకటి చొప్పున మేలైనదాన్ని పెద్దవాడు తీసుకోవచ్చు! అయితే-ఇది జ్యేష్ఠుడు గుణవంతుడైన సందర్భాల్లో (మిగిలినవారు అంతగా కానపుడు) చెప్పబడింది. అందరూ సద్గుణులైతే...... ॥115॥

ప్రక్షిప్తాల పరిశీలన

113-115 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. అంతర్వ్యతిరేకాలు

క. 114లో అన్ని విధాల వస్తువులలోనూ శ్రేష్ఠమైన దాన్ని గ్రహించాలనటం, 104,112 శ్లోకాలకు వ్యతిరేకంగా ఉంది. వాటిలో మొత్తం ధనంలో సమానమైన ధనాన్ని స్వీకరించాలని ఉంది.

ఖ. 115లోని పద్ధతి 112లోని విధానానికి వ్యతిరేకంగా ఉంది. అందుకని రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

పూర్వాపరాలలోని 112,116 శ్లోకాలలో ఉద్ధారభాగం తీసే పద్ధతి ఉంది - ఇట్లా ఈ రెండు శ్లోకాలకూ ఏకవాక్యత ఉంది. ఈ రెండు శ్లోకాలూ దాని కన్నా భిన్నమైన కొత్త విషయం చెప్పి, దాన్ని భంగం చేశాయి కనుక, ఇవి ప్రసంగ వ్యతిరేకాలు.

116-121వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఏవం సముద్ధృతోద్ధారే సమానాంశాన్ ప్రకల్పయేత్ । మూలశ్లోక సం. **54**
ఉద్ధారేఽనుద్ధృతే త్వేషామియం స్యాదంశకల్పనా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **116**

టీక:- ఏవం సముద్ధృత + ఉద్ధారే = ఈ ప్రకారంగా (9.112) ఉద్ధారం తీసిన తరువాత, **సమాన్ అంశాన్ ప్రకల్పయేత్** = మిగిలిన సంపత్తిని సమాన భాగాలుగా పంచాలి. **తు ఉద్ధారే + అనుద్ధృతే** = ఉద్ధారం వేరుగా తీయనట్లైతే, **ఏషాం అంశకల్పనా ఇయంస్యాత్** = ఆ సోదరులు ఈ విధంగా పంచుకోవాలి.

తాత్పర్యం:- నూటికి 20వ భాగం పెద్దవాడికి ఇచ్చేసిన, తరవాత మిగిలినది సమాన భాగాలుగా చేయాలి. అటుపైన సోదరుల సంఖ్యనుబట్టి, చిన్నవానికి 5వ వంతు ఇచ్చివేసి మిగిలిన దాన్ని మధ్యలో ఉన్న వారు పంచుకోవాలి. మిగిలిన అందరూ గుణవంతులు కానప్పుడు... ॥116॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏకాధికం హరేజ్జ్యేష్ఠః పుత్రోఽధ్యర్ధం తతోఽనుజః । మూలశ్లోక సం. **55**
అంశమంశం యవీయాంస ఇతి ధర్మో వ్యవస్థితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **117**

టీక:- **జ్యేష్ఠః ఏక + అధికం హరేత్** = పెద్ద సోదరుడు ఏకాధికం అంటే రెండు భాగాలు తీసికోవాలి. **తతః + అనుజః + పుత్రః అధ్యర్ధం** = అతడి తరువాత సోదరుడు (1 1/2) ఒకటిన్నర భాగం, **యవీయాంస అంశమ్ + అంశమ్** = చిన్న సోదరులు ఒక్కొక్క అంశం సంపత్తిలో తీసికోవచ్చు. **ఇతి ధర్మః వ్యవస్థితః** = ఇది ధర్మ వ్యవస్థ. విభజన పద్ధతి.

తాత్పర్యం:- జ్యేష్ఠుడు మొత్తం ధనంలో రెండుపాళ్ళు గ్రహించాలి. తరువాతివాడు ఒకటిన్నర పాళ్లు, మిగిలిన వారు ఒక్కొక్క పాలు తీసుకోవాలి. పెద్దవాడు-అతని తర్వాతివాడు ఎక్కువ తీసుకోవడం దేనికంటే-వారు మిగిలిన వారికంటే విద్యలోను-గుణాల్లోనూ ఆధిక్యత కలిగి ఉన్నందు చేతనే ! మిగిలినవారు నిర్గుణులైతేనే ఇలా పంచాలి.॥117॥

ఇది మనుకృతం-ప్రామాణికం

స్వేభ్యోఽంశేభ్యస్తు కన్యాభ్యః ప్రదద్యుర్భ్రాతరః పృథక్ । మూలశ్లోక సం. **56**
స్వాత్స్వాదంశాచ్చతుర్భాగం పతితాః స్యురదిత్సవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **118**

టీక:- **భ్రాతరః** = సోదరులందరూ, **కన్యాభ్యః** = అవివాహిత సోదరీమణులకు, **పృథక్** = వేరుగా, **చతుర్భాగం** = వేరువేరుగా చతుర్థాంశ భాగాన్ని, **స్వేభ్యః ప్రదద్యుః** = తమ భాగములు నుండి ఇవ్వాలి. **స్వాత్ స్వాత్ భాగాత్ + అంశాత్**

అదిత్సవః = తమ తమ భాగముల నుండి ఇవ్వని సోదరులు, **పతితాస్యుః** = పతితులువుతారు. అంటే నిందనీయులుగా గుర్తింపబడతారు.

తాత్పర్యం:- అన్నదమ్ములు పై విధంగా ఆస్తి పంపకాలు జరుపుకొన్నప్పుడు, అప్పటికీ ఆ ఇంట పెళ్ళికానట్టి సోదరీమణులుంటే ఒక్కొక్కరూ తమ విభాగాల్లోంచి 4వ వంతు తీసి ఇవ్వాలి. తమ తమ భాగముల నుండి ఇవ్వని సోదరులు నిందనీయులుగా గుర్తింపబడతారు. సోదరి లేనివారు, సవతి తల్లి బిడ్డలు ఉంటే (స్త్రీ సంతానం) ఆమెకు ఇవ్వాలి. ॥118॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అజావికం సైకశఫం న జాతు విషమం భజేత్ । మూలశ్లోక సం. **57**
అజావికం తు విషమం జ్యేష్ఠస్యైవ విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **119**

టీక:- అజా+అవికం స + ఏకశఫం విషమం = ఒకే గిట్టగల మేక, గొర్రె గుర్రం మొ॥ ఉన్నప్పుడు అవి సరిసంఖ్యలో లేనప్పుడు, **న జాతు భజేత్** = విభజించడానికి వీలుకానప్పుడు (వాటిని అమ్మివచ్చిన ధనాన్ని విభజించరాదు), **విషమం అజావికం తు** = విషమంగా ఉంటే అవి, **జ్యేష్ఠస్య + ఏవ విధీయతే** = పెద్ద సోదరుడికి చెందుతాయి.

తాత్పర్యం:- ఒంటిగిట్ట జంతువులు (మేకలు, గొర్రెలు, గుర్రాలు మొ॥) ఉన్నా-అవి బేసిసంఖ్యలో ఉన్నా వాటిని జ్యేష్ఠుడే తీసుకోవాలి. ఆ విలువకు సమానమైనవిగాని; వాటిని అమ్మి సొమ్ముచేసి గాని మిగతా సోదరులు తీసుకోరాదు.॥119॥

నియోగంతో పుట్టిన సంతానం భార్యల ప్రకారం ఆస్తిలో వాటాల వ్యవస్థ- ఇది మనుకృతం-ప్రామాణికం

యవీయాన్జ్యేష్ఠభార్యాయాం పుత్రముత్పాదయేద్యది । మూలశ్లోక సం. **58**
సమస్తత్ర విభాగస్స్యాదితి ధర్మో వ్యవస్థితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **120**

టీక:-యది యవీయాన్= చిన్నతమ్ముడు, **జ్యేష్ఠ భార్యాయాం పుత్రం ఉత్పాదయేత్** = పెద్దవాడి భార్యకు నియోగంతో కొడుకును పుట్టిస్తే [9.58-62], **తత్ర** = ఆస్థితిలో, **సమః విభాగః స్యాత్**= ఆ పుత్రునికి తన పినతండ్రులు మొదలైన వారితో సమానంగా తండ్రి భాగం వస్తుంది. అంటే తన అసలు తండ్రి సంపూర్ణ భాగానికి అధికారి అవుతాడు. కానీ, ఉద్ధార భాగానికి [9.112-114] కాదు. **ఇతి ధర్మః వ్యవస్థితః**= ఇటువంటి ధర్మవ్యవస్థ ఉంది -120.

తాత్పర్యం:- ఏ కారణం చేతనైనా జ్యేష్ఠుడి భార్యకు మిగిలిన సోదరులలో ఒకరు పుత్రుణ్ణి పుట్టిస్తే ఆ పుత్రుడు క్షేత్రజుడన బడతాడు. ఇతడికి పినతండ్రితో సమానమైన వాటా ఇవ్వాలి. ఇది ధర్మబద్ధంగా పుత్రుణ్ణి పుట్టించిన సందర్భాలలోనే! కామంచేత జన్మింపచేసే పుత్రుడికి భాగం లేదు. ॥120॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉపసర్జనం ప్రధానస్య ధర్మతో నోపపద్యతే । మూలశ్లోక సం. **59**
పితా ప్రధానం ప్రజనే తస్మాద్ధర్మేణ తం భజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **121**

టీక:-ఉపసర్జనం = గౌణపుత్రుడు అంటే నియోగ విధితో చిన్నతమ్ముడి ద్వారా పెద్ద అన్న భార్యకు పుట్టినవాడు, **ధర్మతః** = ధర్మానుసారంగా, **ప్రధానస్య న ఉపపద్యతే-ముఖ్యపుత్రుడు**= అంటే చిన్నవారి పోషణ చేసే తన తండ్రికి పుట్టిన వాడివలె పూర్తి ఉద్ధారాది భాగానికి [9.112-114] అధికారి కాదు, **ప్రజనే ప్రధానం పితా** = సంతానోత్పత్తిలో తండ్రి యొక్క బీజానికే ప్రధానత ఉంటుంది, **తస్మాత్**= అందుచేత, **ధర్మేణ తం భజేత్** = ధర్మం ప్రకారం ఆ పుత్రుడు పితృవ్యుల లాగా సమభాగాన్నే స్వీకరించాలి.

తాత్పర్యం:- ఇట్లు కామ సంబంధం చేత పుట్టినవాడు అప్రధానుడు. క్షేత్రస్వామి అయిన తండ్రి (ఎవరిచేత పుట్టించబడుతున్నాడో అతడు) యొక్క ఆస్తికి కూడ ఇతడు అర్హుడు కాడు. కొన్ని సందర్భాలల్లో ధర్మం కొరకు, పెద్దల అనుమతితో వంశాభివృద్ధికరమైన ప్రయోజనం నిమిత్తం పుట్టించబడిన పుత్రునికే, కనిష్ఠునితో సమానంగా దాయభాగం ఇవ్వబడుతుంది. ॥121॥

122-126వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *పుత్రః కనిష్ఠో జ్యేష్ఠాయాం కనిష్ఠాయాం చ పూర్వజః ।*
కథం తత్ర విభాగః స్యాదితి చేత్ సంశయో భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *122*

తాత్పర్యం:- ఒకనికి ఇద్దరు భార్యలుండి, వారిలో పెద్ద భార్యకు పుట్టినవాడు చిన్నవాడుగా; రెండో భార్య పుత్రుడే పెద్దవాడుగా ఉన్న సందర్భాలలో ఏ రీతిగా పంచుకోవాలి? అనే సంశయానికి ఇదీ సమాధానంగా చెప్పబడింది-(తదుపరి శ్లోకంతో అన్వయం) ॥122॥

* *ఏకం వృషభముద్ధారం సంహరేత స పూర్వజః ।*
తతో౽పరే జ్యేష్ఠవృషాస్తదూనానాం స్వమాతృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. *123*

తాత్పర్యం:- మొదట పెండ్లాడబడిన భార్యకు పుట్టినవాడు కనిష్ఠుడైనాగానీ జన్మరీత్యా జ్యేష్ఠుడని ధర్మ నిర్ణయం. వయస్సు రీత్యా చిన్నవాడయినప్పటికీ 15 గోవులకు- ఒక ఆబోతుకు (గోధనం విషయంలో) అర్హుడు. మిగిలినవారు. మిగతా మేటి వృషభాలు ఎన్నయితే ఉన్నాయో వాటిని తమ తల్లుల చిన్న-పెద్ద తారతమ్యాన్ని బట్టి పంచుకోవాలి.॥123॥

* *జ్యేష్ఠస్తు జాతో జ్యేష్ఠాయాం హరేద్ వృషభషోడశాః ।*
తతః స్వమాతృతశ్శేషా భజేరన్నితి ధారణా ॥ ప్రక్షిప్త శ్లోక సం. *124*

తాత్పర్యం:- మొదట పెండ్లాడిన భార్యకు పుట్టినవాడు, జన్మరీత్యా అందరి కంటే పెద్దవాడై ఉన్నట్లయితే, అతడు 15 ఆవుల్ని-ఒక ఆబోతును తీసుకోవచ్చు! తర్వాత వారు తారతమ్యాల్ని బట్టి మొదట చెప్పిన విధంగా తమ భాగాలు పంచుకోవచ్చు! ॥124॥

* *సదృశ స్త్రీషు జాతానాం పుత్రాణామవిశేషతః ।*
న మాతృతో జ్యైష్ఠ్యమస్తి జన్మతో జ్యైష్ఠ్యముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. *125*

తాత్పర్యం:- ఒకడికి ఒకే కులానికి చెందిన ఇద్దరు ముగ్గురు భార్యలుంటే (వర్ణ తారతమ్యం లేనప్పుడు) తల్లుల వరసరీత్యా జ్యేష్ఠత్వం సిద్ధించదు. ఇంతకుముందు ప్రారంభంలో చెప్పబడినరీత్యా మొదట పుట్టినవాడు నూరింట ఇరవయ్యోవంతు భాగానికి అర్హుడు. ఈ అన్నదమ్ముల గుణ-నిర్గుణాలనే ప్రధానంగా పరిగణించాలి. ॥125॥

* *జన్మజ్యేష్ఠేన చాహ్వానం సుబ్రహ్మణ్యాస్వపి స్మృతమ్ ।*
యమయోశ్చైవ గర్భేషు జన్మతో జ్యేష్ఠతా స్మృతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. *126*

టీక:-సుబ్రహ్మణ్యాం అపి= 'సుబ్రహ్మణ్యం' పేరున్న ఋక్కులలోనూ, **జన్మ జ్యేష్ఠేన ఆహ్వానం స్మృతం=** జన్మ క్రమంలో ముందు పుట్టిన వాణ్నే పరిగణిస్తారు, **చ** = ఇంకా, **గర్భేషు యమయోః ఏవ** = గర్భంలో ఒకటేసారి కవల పిల్లలు పుట్టినా, వారిలోనూ, జన్మతః జ్యేష్ఠతా స్మృతా ముందు పుట్టిన వాణ్నే జ్యేష్ఠుడు అంటారు.

తాత్పర్యం:- కేవలం జన్మం వల్ల జ్యేష్ఠత్వం (పెద్దతనం) కలగదు. 'సుబ్రహ్మణ్య' మనే జ్యోతిష్టోమయాగాంతర్గత ఇంద్రాహ్వాన మంత్రం చేత తండ్రిని గురించి ప్రథమపుత్రుడు ఆహ్వానం చేయడంతో గర్భం కలుగుతుంది. అందుచే మొదట పుట్టినవాడికే జ్యేష్ఠత్వం అనబడింది. ॥126॥

ప్రక్షిప్తాల పరిశీలన

122 నుంచి 126 వరకు గల శ్లోకాలు ఈ ప్రకారం ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

122-126 శ్లోకాలలో ఏక కాలంలో పలువురు భార్యలు గల వ్యక్తి ధనాన్ని గురించి ఉంది. బహు భార్యాత్వం మనువుకు వ్యతిరేకం. అందుచేత అతని ఆస్తి పంపకాలు మనువు రాసి ఉండడు. ఇట్లా అంతర్ వ్యతిరేకతల ఆధారంగా ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే !

పుత్రికా ధర్మ నిర్ణయం చేయడంలో ఉద్దేశం - ఇది మనుకృతం-ప్రామాణికం

అపుత్రోఽనేన విధినా సుతాం కుర్వీత పుత్రికామ్ । మూలశ్లోక సం. **60**
యదపత్యం భవేదస్యాం తన్ మమ స్యాత్స్వధాకరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **127**

టీక:- అపుత్రః = పుత్రహీనుడైన తండ్రి, **అస్యాంయత్ + అపత్యం భవేత్ తత్ మమ స్వధాకరమ్ స్యాత్** = ఈ కన్యకు పుట్టబోయే పుత్రుడు వృద్ధావస్థలో ఉన్న నాకు భోజనాదులతో పాలించి, పోషించేవాడుగా నాకు సుఖకారిగా ఉండాలి. **అనేన విధినా సుతాం పుత్రికామ్ కుర్వీత** = ఈ విధంగా అల్లుడితో చెప్పి కన్యను పుత్రికగా మార్చుకోవాలి.

తాత్పర్యం:- పుత్రులు లేనివాడు, తన కూతురికి వివాహం చేసేటప్పుడే అల్లుడి చేత మాట తీసుకోవాలి. "సోదరులు లేని ఈ కన్యను నీచేతిలో పెడుతున్నాను. **"దీనికి జన్మించే పుత్రుడు నాకు ఉత్తరక్రియలు చేయాలి."** అని ఒడంబడిక ద్వారా దౌహిత్రుడిని ఉత్తర కర్మాధికారిగా చేసుకోవచ్చు! ॥127॥

వివరణ:

1. "స్వధా" శబ్దానికి మను సమ్మతమైన అర్థం : ఈ శ్లోకానికి వ్యాఖ్యాకారులు 'స్వధా' శబ్దానికి శ్రాద్ధ ప్రసంగంలో పిండ దానమనే అర్థం రాస్తున్నారు. ఇది మనుస్మృతి సమ్మతం కాదు. ఇక్కడ ఇవ్వబడుతున్న అర్థం మనుసమ్మతమే గాక ప్రామాణికం కూడా. అందుకు నిమ్న ప్రమాణాలు యుక్తులు ఇలా ఉన్నాయి.

క. మనువు మృతక శ్రాద్ధమును అంగీకరించడు. అందువల్ల ఈ ప్రసంగానికి సంబంధించిన అర్థం రాయడం మను విరుద్ధం. ఇందుకు విస్తృత వ్యాఖ్య (3.91,92) శ్లోకాల సమీక్షను చూడగలరు.

ఖ. నిరుక్తకారుడు స్వధా శబ్దానికి అర్థం **"స్వధా అన్ననామ"** (2.7) స్వధా ఉదకనామ (1.12) అనిరాశారు. దీన్ని బట్టి **'స్వధాకార'** శబ్దానికి **"అన్న-జలాదుల ద్వారా పాలనపోషణ చేయడం"** అనే అర్థం సమర్థింపబడింది. ఈ అర్థం 3.82 శ్లోకం ద్వారా కూడా సమర్థింపబడింది.

గ. "స్వ" స్వజనులకు కూడా ఉపయోగిస్తారు. **"స్వాన్ పితౄన్ దధాతి యయా క్రియయా సా స్వధా"** ఈ వ్యుత్పత్తిని ఆధారంగా చేసికొని, వృద్ధావస్థలో-అన్న, జల, సేవా, శుశ్రూషాదుల ద్వారా సుఖాన్ని కలిగించడం వృద్ధావస్థలో సహాయపడుగాక. **"స్వధా"** శబ్దానికి సరియైన అర్థం.

ఘ. పుత్రోత్పత్తి వల్ల, కూడా వ్యక్తికి ఈ అభిప్రాయమే ఉంటుంది. కష్టాల నుండి రక్షించుగాక ! (9.138 శ్లోకంలో దాని వివరణ సమీక్ష చూడండి.)

ఙ. తమ సంతానం తమను కష్టాల నుండి రక్షిస్తూ తమకు ఆనందం కలిగించాలనేది అన్నిటికంటే ముఖ్యమైన కోరిక తల్లిదండ్రులకుంటుంది. అందువల్ల పుత్రహీనుడైన వ్యక్తి విధిగా కన్యను పుత్రికనుగా భావిస్తాడు. ఈ విధంగా 'స్వధాకారక' శబ్దానికి ఇదే ఉపయుక్తమైన అర్థం.

2. పుత్రికాధర్మం: ఏ వ్యక్తికి పుత్రులు లేరో, పుత్రికమాత్రం ఉందో అప్పుడు తండ్రి పుత్రికకు వివాహం చేస్తున్నప్పుడు అల్లుడి పక్షం వారితో "ఈమెకు పుట్టే ప్రథమ పుత్రుణ్ణి "నేను పుత్రుడిగా పెంచుకుంటాను" (ఇల్లిటం) అని ఒప్పందం కుదుర్చుకుంటాడు. అంటే అమ్మ తండ్రి సంపత్తికి ఈ బిడ్డ ఉత్తరాధికారిగా ఉంటాడని నిశ్చయించుకొని పెండ్లి చేస్తాడు. ఇలాంటి నిశ్చయానికి 'పుత్రికా ధర్మ' మంటారు.

128, 129 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* **అనేన తు విధానేన పురా చక్రేఽథ పుత్రికాః ।**
వివృద్ధ్యర్థం స్వవంశస్య స్వయం దక్షః ప్రజాపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***128***

తాత్పర్యం:- పూర్వం ఒకప్పుడు పుత్రోత్పాదన విధి నెరిగిన దక్షప్రజాపతి తన వంశాభివృద్ధికై తన పుత్రికలను ఈ విధంగానే ఒడంబడిక మేరకు అల్లుళ్లకు ఇచ్చాడు. ॥128॥

* **దదౌ స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ ।**
సోమాయ రాజ్ఞే సత్కృత్య ప్రీతాత్మా సప్తవింశతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***129***

తాత్పర్యం:- ఆ దక్షుడు కలుగబోవు పుత్రుల లాభం కోసం ప్రీతితో సకలభూషణాలతో అలంకరించి, పదిమంది కూతుర్లను ధర్మునకును, పదమూడుమందిని కశ్యపుడికీ ఇరవై ఏడుమందిని చంద్రుడికీ ఇచ్చి వివాహం చేసారు. ॥129॥

ప్రక్షిప్తాల పరిశీలన

128-129 శ్లోకాలు కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

127,130 శ్లోకాలకు పరస్పరం వాక్యాత్మక సంబద్ధత ఉంది. 130వ శ్లోకం 127వ దానికి అర్థవాద మవుతుంది. మధ్యలోని శ్లోకాలు ఆ వాక్యగత సంబద్ధతను భంగం చేశాయి. ప్రసంగ భంజకాలు కనుక ఈ శ్లోకాలు మౌలికం కావు.

2. అంతర్ వ్యతిరేకాలు

కాల దృష్టితో దక్షప్రజాపతి పుత్రిక పార్వతిని పేర్కొనడం వల్ల, ఈ రెండూ శ్లోకాలూ కాల వ్యతిరేకమనే ఆధారంతో తర్వాతివని తెలుస్తూంది. దక్షుడు స్వాయంభువ మనువు తర్వాతి వాడు కనుక, ఈ శ్లోకాలు తర్వాతి వారెవరో రచించి కలిపేసి ఉంటారు.

130, 131 శ్లోకాలు మనుకృతం- ఇవి ప్రామాణికం

పుత్రులు లేనప్పుడు తండ్రి సమస్త సంపదకు పుత్రికే సర్వాధికారిణి-

యథైవాత్మా తథా పుత్రః పుత్రేణ దుహితా సమా । మూలశ్లోక సం. **61**
తస్యామాత్మని తిష్ఠన్త్యాం కథమన్యో ధనం హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **130**

టీక:- **యథా ఏవ ఆత్మా తథా పుత్రః** = ఆత్మ తనకెట్టిదో పుత్రడుకూడా అలాంటివాడే అంటే ఆత్మతో సమానమే, **పుత్రేణ దుహితా సమా** = పుత్రుడెట్టివాడో, అలాగే పుత్రిక కూడా, **తస్యాం + ఆత్మని తిష్ఠన్త్యాం** = ఆత్మరూపమైన పుత్రిక ఉండగా, **అన్యః కథమ్ ధనం హరేత్** = మరొకడు ధనాన్ని ఏలా తీసుకోగలడు? పుత్రులు లేనప్పుడు పుత్రికే ధనానికి అధికారిణి అవుతుంది.

తాత్పర్యం:- తానెలాగో కొడూకూ అలాగే ! అంటే కొడుకు తన ప్రతిరూపమే. అట్లే కూతురు కూడా కొడుకుతో సమానురాలే ! మానవుడు పుత్రులు లేనప్పుడు తానే పుత్రికరూపంలో ఉన్నట్లుగా భావించాలి. ఆ తండ్రి ధనం కూతురికంటే ఇతరులకు ఎలా లభిస్తుంది? ॥130॥

వివరణ:

పుత్రీ-పుత్రులు ఆత్మరూపులు

దాయభాగమును విశ్లేషణ చేస్తూ, నిరుక్తకారుడు మను సిద్ధాంతం ననుసరించి పుత్ర-పుత్రికలిద్దరూ దాయభాగార్హులని అంగీకరించాడు. ఏదో ప్రాచీన గ్రంథ శ్లోకాలను ఉదాహరిస్తూ మనువు యొక్క ఈ అభిప్రాయాన్ని ధ్రువపరచాడు.

అఙ్గాదఙ్గాత్సమ్భవసి హృదయాదధి జాయసే
ఆత్మా వై పుత్ర నామాఽసి స జీవ శరదః శతమ్
అవిశేషేణ పుత్రాణాం దాయో భవతి ధర్మతః
మిథునానాం విసర్గాదౌ మనుః స్వాయంభువోఽబ్రవీత్ (నిరుక్తం 3.1.4).

ఓ పుత్రుడా ! నీవు నా అంగ-అంగం నుండి జన్మించావు. మరియు నా ఆత్మ నుండి ప్రకటింపబడినావు. ఓ పుత్రా! నీవు నా ఆత్మ యొక్క రూపమే. నీవు శతశరత్తులు జీవించు. పుత్రుడు గానీ ధర్మానుసారంగా పుత్రికగానీ ఇద్దరికీ దాయభాగంలో సమానాధికారం ఉంటుంది. ఈ గౌరవం సృష్ట్యాదిలో స్వాయంభువ మనువు వ్యక్తం చేశాడు.

తల్లి ధనం పుత్రికకే చెందుతుంది - **ఇది మనుకృతం-ప్రామాణికం**

మాతుస్తు యౌతకం యత్స్యాత్కుమారీభాగ ఏవ సః । మూలశ్లోక సం.**62**
దౌహిత్ర ఏవ చ హరేదపుత్రస్యాఖిలం ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**131**

టీక:- **మాతుః తు యత్ యౌతకం స్యాత్** = వివాహాది అవసరాలలో, తండ్రి-సోదరుల నుండి నిజధన రూపంలో ప్రాప్తించిన ధనం, సః **కుమారీ భాగః** ఏవ = కుమారీ ధనమే అవుతుంది, **అపుత్రస్య అఖిలం ధనమ్** దౌహిత్ర ఏవ హరేత్ = పుత్రులు లేని తాతగారి (మాతామహుడు) ఆస్తి అంతా పుత్రికాపుత్రుడికి (దౌహిత్రుడికి) మాత్రమే చెందుతుంది.

తాత్పర్యం:- తల్లికి గల స్త్రీ ధనం, తల్లి మృతి చెందిన తరవాత పెండ్లికాని కూతుళ్లకు చెందుతుంది. కానీ కొడుకులకు అందులో భాగం లేదు. అలాగే పుత్రులు లేనట్టి మాతామహుని ద్రవ్యం అంతా కూడా పుత్రిక యొక్క పుత్రుడికే చెందాలి. ॥131॥

132,133 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *దౌహిత్రో హ్యఖిలం రిక్థమపుత్రస్య పితుర్హరేత్ ।*
స ఏవ దద్యాద్ ద్వౌ పిణ్డౌ పిత్రే మాతామహాయ చ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.132*

తాత్పర్యం:- పుత్రికా పుత్రుడే, పుత్రులులేని మాతామహుడికి తన ధనాన్ని-తన తండ్రి ధనాన్ని ఇస్తాడు. అలాంటి మనుమడిచేత తనకూ-తన తండ్రికి శ్రాద్ధాదులు జరిపిస్తాడు. ॥132॥

* *పౌత్రదౌహిత్రయోర్లోకే న విశేషోఽస్తి ధర్మతః ।*
తయోర్హి మాతాపితరౌ సంభూతౌ తస్య దేహతః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***133***

తాత్పర్యం:- పౌత్రుడికిగాని, దౌహిత్రుడికి గాని ధర్మకార్యాలు చేసే విషయమై భేదం లేదు. ఎందుకంటే వారికి కారణభూతులైన మాతా-పితలు ఒకే తండ్రికి జన్మించిన వాళ్ళు కదా? కాబట్టి వీరిలో తేడా లేదు. ॥133॥

ప్రక్షిప్తాల పరిశీలన

132,133 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. విషయవ్యతిరేకాలు

మనువు చెప్పిన దాని ప్రకారం, ఇప్పటి విషయం ఆస్తి వాటాల పంపకం [9.103]. వీటిలో శ్రాద్ధంలో పిండ ప్రదానం చెప్పబడింది. కూతుళ్ల మొదలైన వారి అభిప్రాయాలకు కష్టం కలిగించకుండా ఉండటమే కాని పిండ ప్రదానం కాదు [9.138 సమీక్ష చూడండి]. ఇట్లా 127 నుంచి మాతామహుని ఆస్తిని గురించిన సంబద్ధ ప్రసంగం ఉంది. అందుచేత పిత్రార్జితాన్ని చెప్పడం అవసరం లేనిది. ఇట్లా విషయ వ్యతిరేకం కావటం చేత 132వ శ్లోకం ప్రక్షిప్తం, 133 దానిపై ఆధారితం కనుక, అదీ ప్రక్షిప్తమే!

2. అంతర్ వ్యతిరేకాలు

మనువు ప్రకారం, మరణించిన వారి శ్రాద్ధం, పిండ ప్రదానం మొదలైనవి అంగీకృతం కావు [3.284 మీది సమీక్ష చూడండి]. మనువుకు వ్యతిరేకం కావటం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

3. శైలీగత ఆధారాలు

133వ శ్లోకపు శైలి సహేతుకం కాదు. శ్లోకంలో చెప్పినట్లుగా పుట్టుకతో కొడుకు, దౌహిత్రుల తేడా పోతే, 127లో విడిగా 'పుత్రిక'ను చెప్పే అవసరం ఏముంటుంది? ఈ సిద్ధాంతం ప్రకారం పుత్రులతో పాటు దౌహిత్రులకూ ఆస్తిలో వాటాపై తప్పకుండా అధికారం సహజంగా ఉండవలసిందే ! సహేతుకం కాని శైలి కావటం చేత ఈ శ్లోకం ప్రక్షిప్తం.

4. పునరుక్తులు

ఈ శ్లోకాలలో చెప్పిన ధనాధికార కథనం మునుపటి 131వ శ్లోకంలో జరిగింది. మళ్లీ ఇక్కడ చెప్పటం అనవసం.

ఇది మనుకృతం-ప్రామాణికం

పుత్రికా ధర్మ నిర్ణయం జరిగిన తరువాత పుత్రుడు జన్మించినప్పుడు దాయవ్యవస్థ-

పుత్రికాయాం కృతాయాం తు యది పుత్రోఽనుజాయతే । మూలశ్లోక సం. **63**
సమస్తత్ర విభాగస్స్యాజ్జ్యేష్ఠతా నాస్తి హి స్త్రియాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **134**

టీక:- **పుత్రికాయాం కృతాయాం తు** = పుత్రికను వారసురాలిగా అంగీకరించిన తరువాత, **యది పుత్రః+ అనుజాయతే** = ఎవరికైనా పుత్రుడు జన్మించినప్పుడు, **తత్ర సమః విభాగః స్యాత్** = ఆ పరిస్థితిలో ఆ ఇద్దరికీ (దౌహిత్రుడికీ, తన నిజ పుత్రుడికీ) సమాన భాగధనం లభిస్తుంది. ఎందుకంటే, **స్త్రియాః జ్యేష్ఠతా నాస్తి** = పెద్ద పుత్రుడికి లాగా స్త్రీకి జ్యేష్ఠత్వం లేదు. అంటే జ్యేష్ఠ పుత్రుడికి మాదిరిగా ఉద్ధార భాగం లభించదు.

తాత్పర్యం:- ఒకదు కొంతకాలం పుత్రులు లేనివాడై ఉండి తనకూతురును వివాహంలో పుత్రికను తన వారసురాలిగా చేసికొన్న తరువాత (కూతురికి పుట్టు పుత్రుడు నాకు పుత్రుడగుగాక అని ఏర్పరచుకొన్న తరవాత) అతడికి పుత్రుడు పుట్టినట్లయితే ఆ పుత్రికా పుత్రుడికీని, తన పుత్రుడికీ సమభాగమే కాని స్త్రీకి జ్యేష్ఠతనుబట్టి ఉద్ధారం లేదు. ॥134॥

135 నుండి 137వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***అపుత్రాయాం మృతాయాం తు పుత్రికాయాం కథంచన ।***
ధనం తత్పుత్రికాభర్తా హరేతైవావిచారయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*135*

తాత్పర్యం:- పుత్రికగా చేయబడిన కూతురు పుత్రులు లేక మృతి చెందినట్లయితే, ఆమె ధనాన్ని ఆమె భర్తే నిరాక్షేపంగా తీసుకొంటాడు. అందులో సందేహం లేదు. ॥135॥

* ***అకృతా వాకృతా వాపి యం విన్దేత్సదృశాత్సుతమ్ ।***
పౌత్రీ మాతామహస్తేన దద్యాత్పిణ్డం హరేద్ ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*136*

తాత్పర్యం:- పుత్రికగా జేయబడిందికాని, అలా చేయబడనిది కాని కూతురు సవర్ణుడైన భర్తవల్ల పుత్రుణ్ణి పొందితే, ఆ పుత్రుడి వల్ల మాతామహుడు పౌత్రులు గలవాడవుతాడు. పుత్రుడి పుత్రుడు చేసే ఉదక దానాదులు దుహిత్ర పుత్రుడు చేస్తాడు కాబట్టి ఆతడు మాతామహుడి ధనాన్ని హరింపగల వాడవుతాడు. ॥136॥

* ***పుత్రేణ లోకాన్జయతి పౌత్రేణానన్త్యమశ్నుతే ।***
అథ పుత్రస్య పౌత్రేణ బ్రధ్నస్యాప్నోతి విష్టపమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*137*

తాత్పర్యం:- ఈలోకంలో పుత్రుడు జన్మించడంతోనే మానవుడికి స్వర్గాది పుణ్య లోకాలు కలుగుతున్నాయి. మనుమడి వల్ల ఆ లోకాల్లో చిరకాల నివాస అర్హత కలుగుతోంది. ప్రపౌత్రుడి జననంచేత సూర్యలోకాన్ని పొందిన వాడవుతున్నాడు.॥137॥

ప్రక్షిప్తాల పరిశీలన

135-137 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 135వ శ్లోకం లోనిది మనువు చెప్పిన 'పుత్రికా ప్రక్రియ'కు వ్యతిరేకం. పుత్రిక ఎందుకంటే 'ఆమెవల్ల కలిగే పుత్రుడు నాకు సుఖం కలిగిస్తాడు' అని. అప్పుడతనికి మాతామహుని సంపద లభిస్తుంది. కానీ పుత్రిక సంతానవతి కాకుండానే మరణిస్తే, దానికి ఆధారం పోతుంది కనుక, ఆ ప్రక్రియ ఆగిపోతుంది. అందువల్ల భర్త ద్వారా ధనం పొందటం మనువుకు సమ్మతం కాదు. ఇటువంటి ఆస్తి 211, 212లోని వ్యవస్థ ద్వారా సోదరీ సోదరులకు వెళుతుంది. ఈ శ్లోకం వ్యతిరేక పద్ధతిని చెబుతూంది కనుక ప్రక్షిప్తం.

ఖ. 136లోని పద్ధతి 127కు వ్యతిరేకం. ఈ విధంగానైతే 'పుత్రిక' అనే వ్యవహారానికి ఎటువంటి మహత్త్వమూ లేదు, దాని అవసరమే లేదు.

గ. 137వ శ్లోకంలో సూర్య లోకం మొదలైన వాటి ప్రాప్తి మనువుకు వ్యతిరేకం. [మనువు ఇలాంటి ప్రత్యేక స్థానాంన్నాయని అంగీకరించడు. అతడు కేవలం ముక్తిని నమ్ముతాడు [2.249, 4.260, 6.81, 75, 88 మొదలైనవి]. అంతే కాకుండా మనువు కర్మలు చేసే కర్తే వాటి ఫలితాలు అనుభవిస్తాడని చెబుతాడు. ఇతరులు చేసే పనుల వల్ల ఎవరూ స్వర్గానికి పోరు [4.240]. ఇలాగైతే మంచి పనుల అవసరమే లేదు, పుత్రులు, మనవలు మొదలైన వారితో నిండిన ప్రపంచమంతా స్వర్గానికే పోతుంది.

ఘ. మరణించిన వారి శ్రాద్ధంలో పిండ ప్రదానం మొదలైనవి మనువు పద్ధతికి వ్యతిరేకం [3.284 మీద సమీక్ష చూడండి].

2. విషయ వ్యతిరేకాలు

ఇప్పటి విషయం ఆస్తిలో వాటా – అని మనువే స్వయంగా చెప్పాడు [9.103]. 136లో శ్రాద్ధంలో పిండ ప్రదానం విషయ బాహ్యం. అందుచేత ఈ శ్లోకం విషయ వ్యతిరేకం.

పుత్రుని లక్షణం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

పున్నామ్నో నరకాద్యస్మాత్త్రాయతే పితరం సుతః । మూలశ్లోక సం.**64**
తస్మాత్పుత్ర ఇతి ప్రోక్తః స్వయమేవ స్వయంభువా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**138**

టీక:- **యః** = ఏ, **సుతః** = పుత్రుడు, **పితరం** = తల్లిదండ్రులను, **పున్నామ్నః నరకాత్** = **పుమ్** = వృద్ధావస్థ మొ॥ వాటి వల్ల సంభవించే దుఃఖాల నుండి, **త్రాయతే** = రక్షిస్తాడు, **తస్మాత్** = అందువల్ల, **స్వయంభువా స్వయమేవ పుత్ర ఇతి ప్రోక్తః** = స్వయంభూ ఈశ్వరుడే వేదాలలో పుత్రుడని పేరు పెట్టాడు, (సర్వేషాంతు స నామాని... వేదశబ్దేభ్య ఏవాదౌ.......నిర్మమే) (1.21వ) శ్లోక వ్యాఖ్య చూడాలి.

తాత్పర్యం:- 'పుత్' వృద్ధాప్యమనే నరకాన్నుంచి కొడుకు తండ్రిని తరింపజేస్తాడు కాబట్టి పుత్రుడన్నారు. ఈశ్వరుడే ఈ పేరును వేదాలలో పెట్టాడు. ఏవిధంగా చూసినా పుత్రుడు మహోపకారి కాబట్టి పుత్రుడికి-ఆ పుత్రసంతతికి తండ్రిధనం చేరుతుంది. ॥138॥

వివరణ:

పుత్ర శబ్దార్థం, ఉద్దేశం

ఈ శ్లోకంలో మనుమహర్షి 'పుత్ర' శబ్దానికి పరిభాషను ఇచ్చాడు. ఆ విషయం ఇక్కడ విస్తారంగా వివరిస్తాను. దీనివల్ల-పుత్రప్రాప్తికి ఉద్దేశమేమిటో గృహస్థులకు ఈ విధంగా తెలియజేస్తున్నాడు. జీవితంలో, వృద్ధావస్థలో కష్టాల నుండి రక్షించువాడు పుత్రుడని, అంతేగాక ధనం, అన్నవస్త్రాదులిచ్చి పాలన పోషణ చేయువాడే పుత్రుడు. దీన్ని బట్టి చనిపోయిన తరువాత, పిండ దానం, శ్రాద్ధం మొ॥ వాటి కోసమే పుత్రుడు కావాలనే భావన ఖండితమవుతుంది. ఇక్కడ ప్రమాణాల ద్వారా పుత్ర శబ్ద నిర్వచనం చేయబడుతుంది.

పూఞ్ పవనే = క్ర్యాది ధాతువునుండి **'పువో హ్రస్వశ్చ'** (ఉణాది) (4.165) సూత్రం వల్ల **'క్త్ర'** ప్రత్యయం చేర్చగా పుత్రశబ్దం సిద్ధమవుతుంది. ఈ శబ్దాన్ని నిర్వచిస్తూ, యాస్కాచార్య మహర్షి ఈ విధంగా రాస్తున్నారు. **"పురు త్రాయతే పిపరణాద్వా పుమ్ = నరకం తతః త్రాయత ఇతి వా"** (2-11) అంటే అన్ని విధాలుగా రక్షించేవాడు. పాలన, పోషణ సంభవించు కష్టాల నుండి రక్షించేవాడు. అందువల్లనే పుత్రుడికి **'పుత్రు'**డని చెప్పబడుతుంది.

నరకమంటే ఏమిటి? ఈ విషయాన్ని నిరుక్తకారుడు స్పష్టీకరించాడు. నరకమనే పేరు గల వేరే లోకం ఒకటుందనే భ్రాంతి కలుగకుండా ఉండటానికి. **"నరకం న్యరకం నీచైర్గమనం, నాస్మిన్ రమణం స్థానం అల్పమప్యస్తీతి వా"** (1-10). అంటే నరకం కష్టపూర్ణస్థితి-అధఃపతనానికి సూచన- ఈ కష్టపూర్ణస్థితిలో కొంచెం కూడా సుఖానికి-ఆరామమునకు అవకాశం లేదు. ఈ విధంగా కష్ట పూర్ణస్థితి లేదా అధఃపతనమునకు **'నరక'**మని పేరు. తన తల్లిదండ్రులను ఈ కష్టాలనుండి రక్షిస్తాడు. తులనార్థం గోపథ బ్రాహ్మణంలో చూపిన పరిభాషకూడా ఉల్లేఖనీయం.

"పుత్రః పున్నామ నరకం అనేక శతధారం తస్మాత్ త్రాతి పుత్రః తత్పుత్రస్య పుత్రత్వమ్" నరకమంటూ వేరే లోకం లేదు. ఈ విషయంలో విస్తృతమైన వివరణ (4.91)లో చూడగలరు. మహర్షి దయానందులవారు యజుర్వేద మంత్రం (8.5) వ్యాఖ్యానంలో పుత్రార్థ ప్రసంగంలో ఈ శ్లోకాన్ని ఉదాహరించారు.

139,140వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***పౌత్రదౌహిత్రయోర్లోకే విశేషో నోపపద్యతే ।***
దౌహిత్రోऽపి హ్యముత్రైనం సంతారయతి పౌత్రవత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***139***

తాత్పర్యం:- పుత్రికా పుత్రుడు సైతం ఈ మనుమడి వల్ల (పౌత్రుడు) మాతామహుడికి పరలోకసద్గతి కలిగిస్తాడు. కాబట్టి-ఇహలోకంలో పౌత్రుడికి-దౌహిత్రుడికీ తేడా లేదు. ఒక వేళ దౌహిత్రుడికి అన్ని అధికారాలు ఇచ్చాక, పుత్రుడు తనకు జన్మించడం జరిగితే ఇద్దరికీ దాయభాగం సమానంగా ఇవ్వాలి. ॥139॥

* ***మాతుః ప్రథమతః పిణ్డం నిర్వపేత్ పుత్రికాసుతః ।***
ద్వితీయం తు పితుస్తస్యాస్తృతీయం తత్పితుః పితుః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***140***

తాత్పర్యం:- పుత్రికా పుత్రుడు మొదట తల్లికి పిండాన్ని, రెండోది తల్లి తండ్రికి, మూడోది తండ్రికి తండ్రియైన వాడికి ఇవ్వాలి. ॥140॥

ప్రక్షిప్తాల పరిశీలన

139-140 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

క. మనువు కర్తే కర్మల భోక్త అన్నాడు [4.240]. అతని ప్రకారం, ఇతరుల కర్మల వల్ల ఎవరూ స్వర్గం చేరుకోరు. ఈ ఆధారంతో 139లోని 'ఆవలికి చేరటం' మనువుకు వ్యతిరేకం, అందుకని ప్రక్షిప్తం. 140వ శ్లోకం దీనికి సంబంధించిందే కనుక అదీ ప్రక్షిప్తమే !

ఖ. పుత్రుడు అంటే దుఃఖాల నుంచి రక్షించేవాడు అనే కానీ, పిండాలు పెడతాడని కాదు [9.138 సమీక్ష చూడండి].

గ. మరణించిన వారి శ్రాద్ధంలో పిండాలు పెట్టడం మనువుకు వ్యతిరేకం కనుక ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు [3.284 మీది సమీక్ష చూడండి].

దత్త పుత్రుడికి దాయభాగ విధానం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఉపపన్నో గుణైస్సర్వైః పుత్రో యస్య తు దత్త్రిమః । మూలశ్లోక సం.**65**
స హరేతైవ తద్రిక్థం సంప్రాప్తోऽప్యన్యగోత్రతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**141**

టీక:- యస్య తు దత్త్రిమః పుత్రః = ఎవడి యొక్క దత్తపుత్రుడు, **సర్వైః గుణైః ఉపపన్నః** = శ్రేష్ఠ సర్వగుణసంపన్నుడు, లేదా తన వర్ణోచితమైన సమస్త గుణాలున్న వాడు, **అన్యగోత్రతః సంప్రాప్తః + అపి** = అతడు ఇతర వంశం వాడైనా, **సః తత్‌రిక్థం హరేత+ఏవ** = అతడు దత్తత తీసుకొన్న తండ్రి ధనాన్ని కచ్చితంగా పొందుతాడు.

తాత్పర్యం:- ఒక సందర్భంలో తనకు పుత్రసంతానంగానీ, పుత్రికా సంతానంగానీ లేకపోతే ఇంకొక గోత్రం నుండి దత్తతకు తెచ్చుకున్న పుత్రుడు సద్గుణ సంపన్నుడైతే అతనికి తన ఆస్తి అంతా వస్తుంది.

142 నుండి 144వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *గోత్రరిక్థే జనయితుర్న హరేద్ దత్త్రిమః క్వచిత్ ।*
గోత్రరిక్థానుగః పిణ్డో వ్యపైతి దదతః స్వధా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***142***

తాత్పర్యం:- దత్తపుత్రుడెన్నటికీ తన జనకుడి గోత్రధనాదులను పొందడానికి అర్హుడు కాడు. అతడు ఎవరికి దత్తతగా ఇవ్వబడతాడో అతడికే పిండశ్రాద్ధం ఇస్తాడు. కాబట్టి పుత్రుణ్ణి దానం చేసినవాడు, ఆ పుత్రుడిచేత ఇవ్వబడే పిండదానం-శ్రాద్ధం లాంటివి పొందజాలడు. ॥142॥

* *అనియుక్తాసుతశ్చైవ పుత్రిణ్యాప్తశ్చ దేవరాత్ ।*
ఉభౌ తౌ నార్హతో భాగం జారజాతక కామజౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***143***

తాత్పర్యం:- భర్త చనిపోయినందున పెద్దల అనుమతి లేక మరిదివల్ల పుట్టినవాడు, పెద్దల అనుమతి ఉన్నా మరిదివల్ల పుట్టిన రెండో పుత్రుడు ఈ ఇద్దరు వారి తండ్రి ఆస్తికి వారసులు కారు. వారిని కామజాతుడు, జారజాతులంటారు. ॥143॥

* *నియుక్తాయామపి పుమా న్నార్యాం జాతోఽవిధానతః ।*
నైవార్హః పైతృకం రిక్థం పతితోత్పాదితో హి సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***144***

తాత్పర్యం:- నియుక్తమైన స్త్రీయందైనను నేతిపూత మొదలైన శాస్త్రవిధి లేక పుట్టిన పుత్రుడు క్షేత్రస్వామి యొక్క ధనాన్ని పొందుటకు అర్హుడుగాడు. ఏలనంటే, వీడు పతితుడివల్ల జన్మించిన వాడుగదా ! ॥144॥

ప్రక్షిప్తాల పరిశీలన

142-144 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 142వ శ్లోకం 3.81,82లకు వ్యతిరేకంగా ఉంది. మృతులకు శ్రాద్ధం, పిండ ప్రదానం మొదలైనవి మనువుకు వ్యతిరేకం [3.284 మీది అంతర్ వ్యతిరేకాలు సమీక్ష చూడండి]. అందుకని ప్రక్షిప్తం.

ఖ. 143,144 పరస్పర సంబద్ధ శ్లోకాలు - వీటిలో సంతానవతి అయిన స్త్రీ ద్వారా నియోగంతో మళ్లీ పుత్రుణ్ని పొందితే, ఆ పుత్రుడు ఆస్తిలో వాటాకు పనికి రాడని ఉంది. అటువంటి వాణ్ని **'వృథా పుత్రుడు'** అంటారు. ఈ పద్ధతి 9.59కి వ్యతిరేకం. అందులో మనువు నియోగ పద్ధతితో ఇచ్ఛానుసారంగా సంతానం పొందవచ్చు అన్నాడు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

143,144 శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకాలు కూడా. నియోగ పుత్రులకూ ఆస్తిలో భాగం ఉందన్న ప్రసంగం మొదలు పెట్టే శ్లోకం 145. 146లో ధన గ్రహణ పద్ధతి ఉంది. కానీ ఈ శ్లోకాలలో వాటి సంబద్ధతను ముందే నిషేధించాయి. పద్ధతి చెప్పేముందే నిషేధం చెప్పటం అసంగతం కనుక ఇవి ప్రసంగ వ్యతిరేకాలు. ఇవి మౌలికమైతే, 146 తర్వాత ఉండేవి. అక్కడ వీటితో కలిసే భావాలున్న మరొక శ్లోకం ఉంది. అది ఉండగా వీటి అవసరం కనిపించదు. కానీ 'పుత్త్రవతి ద్వారా మళ్లీ నియోగం చేయించకూడదు' అని నొక్కి చెప్పి సమ్మతింప జేసేందుకు, ప్రక్షిప్త కారుడు ఈ శ్లోకాన్ని ముందే ఎందుకు చేర్చవలసి వచ్చిందంటే, 147లో దాని అభిప్రాయం రుజువు కాలేదు కనుక !

3. విషయ వ్యతిరేకాలు

మనువు ప్రకారం ఈ విషయం ఆస్తిలో వాటాల విభజనే [9.103]. కానీ, మృతుల శ్రాద్ధంలో పిండ ప్రదానం కాదు. 142వ శ్లోకమూ, దానికి సంబంధించిన మిగిలిన రెండు శ్లోకాలూ కూడా విషయ వ్యతిరేక ప్రక్షిప్తాలు.

145 నుండి 147వశ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

నియోగజుడు, అక్షేత్రజుడైనా దాయ భాగవిధానం-

హరేత్తత్ర నియుక్తాయాం జాతః పుత్రో యథౌరసః । మూలశ్లోక సం.**66**
క్షేత్రికస్య తు తద్బీజం ధర్మతః ప్రసవశ్చ సః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**145**

టీక:- **తత్ర నియుక్తాయాం** = నియోగార్థం నియుక్తమైన స్త్రీకి, **యథా + ఔరసః జాతః పుత్రః** = ఔరస పుత్రుడి లాగా జన్మించిన క్షేత్రజ పుత్రుడు, **హరేత్** = పితృధనానికి హక్కుదారుడవుతాడు. ఎందుకంటే, **యత్ క్షేత్రికస్య బీజం** = అది క్షేత్ర స్వామి యొక్క బీజంగానే భావించబడుతుంది. **సః ధర్మతః ప్రసవః** = ఆ బిడ్డడు ధర్మానుసారంగా నియోగం ద్వారా (9.59) జన్మించాడు.

తాత్పర్యం:- అలా నియుక్తమైన స్త్రీయందు పుట్టిన వాడు ఔరసపుత్రుడి లాగా జన్మించిన క్షేత్ర పుత్రుడు పితృధనానికి హక్కుదారుడవుతాడు. వాడి పుట్టుకకు కారణమైన బీజం ఆ క్షేత్రస్వామిదే కాబట్టి, వాడి క్షేత్రమందు పుట్టిన సంతతీ ఆ క్షేత్రస్వామిదే అవుతుంది. కాబట్టి అతడూ తండ్రికి ధర్మమున జన్మించినవాడే అవుతాడు. అతడూ తండ్రి ధనానికి ఔరసుడిలాగా ఉద్ధారమునకు అర్హుడగువుతాడు. ॥145॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ధనం యో బిభృయాద్భ్రాతుర్మృతస్య స్త్రియమేవ చ । మూలశ్లోక సం.**67**
సోఽపత్యం భ్రాతురుత్పాద్య దద్యాత్తస్యైవ తద్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**146**

మృతస్య భ్రాతుః = మృతిచెందిన సోదరుడి యొక్క, **ధనం చ స్త్రియమ్ + ఏవ యః బిభృయాత్** = ధనాన్నీ, స్త్రీనీ రక్షిస్తాడో, **సః + అపత్యం + ఉత్పాద్య** = అతడు సోదరుడి భార్య స్త్రీ యందు బిడ్డను కని, **భ్రాతుః తత్ ధనమ్ తస్యైవ దద్యాత్** = సోదరుడి ఆ ధనమంతా సోదరుడి కుమారుడికే ఇవ్వాలి.

తాత్పర్యం:- సంతానం లేక భర్త చనిపోతే మరిది తన వదినను, ఆమె ఆస్తిని తన దగ్గరనే ఉంచుకొని ఆమెకు నియోగధర్మంతో కొడుకును కని అన్న ఆస్తిని తిరిగి వదినకివ్వవలెను. ॥146॥

నియోగవిధి లేకుండా కన్న పుత్రుడు దాయభాగానికి అధికారి కాదు - ఇది మనుకృతం-ప్రామాణికం

యాని యుక్తాఽన్యతః పుత్రం దేవరాద్వా వ్యవాప్నుయాత్ । మూలశ్లోక సం.**68**
తం కామజమరిక్థీయం వృథోత్పన్నం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**147**

టీక:- **యా అనియుక్తా** = ఏ స్త్రీ నియోగవిధి (9.59) లేకుండానే, **అన్యతః వా దేవరాత్ అపి** = అన్యజాతీయ పురుషుడి ద్వారా గానీ లేదా మరది ద్వారా గానీ, **పుత్రం అవాప్నుయాత్** = పుత్రుణ్ణి కన్నట్లయితే, **తం** = ఆ పుత్రుణ్ణి, **కామజం వృథోత్పన్నం అరిక్థీయం** = కామజుడనీ, (9.58,63) వృథాగా జన్మించిన వాడనీ, పితృ ధనానికి అనధికారుడని, **ప్రచక్షతే** = చెబుతున్నారు.

తాత్పర్యం:- ఏ స్త్రీ నియోగవిధి లేకుండానే అన్యజాతీయ పురుషుడి ద్వారా గానీ లేదా మరిది ద్వారా గానీ పుత్రుణ్ణి కన్నట్లయితే ఆ పుత్రుణ్ణి కామజుడనీ, వృథాగా జన్మించిన వాడనీ తండ్రి ధనానికి అనర్హుడని చెబుతున్నారు.॥147॥

వివరణ:

147వ శ్లోక-ప్రసంగ సంబంధవిచారణ. ఈ శ్లోకంలో నియోగ విధిననుసరించకుండా కన్న పుత్రుడు వృథా ఉత్పన్న పుత్రుడనే పేరు పెట్టారు. ఈ విధానం వివాహితురాలికీ, లేదా విధవా స్త్రీ కోసం కాదు. అక్షతయోని స్త్రీ కోసం ఇందులో అపవాదముంది. ఆమె పునర్వివాహం చేసికోగలదు. ఆమెకు పుట్టిన పుత్రుడు వైధుడు. అలాగే పైత్రిక ధనానికి అధికారిగా అంగీకరింపబడినాడు. ఈ భావాన్ననుసరించి ఈ శ్లోక ప్రసంగం 9-176తో కలిసి ఉంది.

148 నుండి 175వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *ఏతద్విధానం విజ్ఞేయం విభాగస్యైక యోనిషు ।*
బహ్వీషు చైకజాతానాం నానాస్త్రీషు నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***148***

తాత్పర్యం:- ఈ చెప్పిన పంపకం అంతా సవర్ణలైన భార్యలయందు పుట్టిన పుత్రుల విషయమై చెప్పబడినది. ఇక నాలుగు జాతుల వారయిన స్త్రీలయందు పుట్టిన పుత్రులకు దాయవిభాగాన్ని చెప్పెద వినండి. ॥148॥

* *బ్రాహ్మణస్యానుపూర్వ్యేణ చతస్రస్తు యది స్త్రియః ।*
తాసాం పుత్రేషు జాతేషు విభాగేఽయం విధిః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***149***

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి వరుసగా నాలుగు వర్ణాలలో భార్యలుండి, వారికి పుట్టిన పుత్రుల విషయమైన దాయ భాగమును గురించి విధానమిలా మన్వాదులు చెప్పారు దాన్ని చెప్పెద వినండి. ॥149॥

* *కీనాశో గోవృషో యానమలంకారశ్చ వేశ్మ చ ।*
విప్రస్యోద్ధారికం దేయమేకాంశశ్చ ప్రధానతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***150***

తాత్పర్యం:- సేద్యగాడు, ఆంబోతు, గుర్రాలు మొదలైనవి, ఉంగరాలు మొ॥ ఆభరణాలు సొమ్ములు, ఇండ్లు, వాకిళ్ళు మొదలైనవీ ఎన్నిభాగాలు కలవో వాటిలో ప్రధాన భాగం బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన వాడికి ఇవ్వాలి. తక్కినది కింద చెప్పిన ప్రకారం విభాగించాలి. ॥150॥

* *త్ర్యంశం దాయాద్ధరేద్విప్రో ద్వావంశౌ క్షత్రియాసుతః ।*
వైశ్యాజస్సార్ధమేవాంశమంశం శూద్రాసుతో హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***151***

తాత్పర్యం:- బ్రాహ్మణీపుత్రుడు దాయమున మూడు భాగములను, క్షత్రియాసుతుడు రెండు భాగములను, వైశ్యాసుతుడు ఒకటిన్నర భాగమును. శూద్రాపుత్రుడు ఒకభాగమును తీసుకోవాలి. అంటే ఎక్కడ బ్రాహ్మణీపుత్ర క్షత్రియాపుత్రులు మాత్రం కలరో, అక్కడ సంపదను ఐదుభాగములు చేసి, మూడు భాగములు బ్రాహ్మణీపుత్రుడును, క్షత్రియాసుతుడు రెండు భాగములును తీసుకోవాలి. ॥151॥

* *సర్వం వా రిక్థజాతం తద్ దశధా పరికల్ప్య చ ।*
ధర్మ్యం విభాగం కుర్వీత విధినాఽనేన ధర్మవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***152***

తాత్పర్యం:- అలా చేయలేకపోయినట్లయితే ఉన్న ధనమంతా పదిభాగాలు చేసి విభాగధర్మజ్ఞుడు ఈ కింద పేర్కొన్న ప్రకారం పంపకం చేయాలి. ॥152॥

* *చతురోఽంశాన్ హరేద్విప్రస్త్రీనంశాన్ క్షత్రియాసుతః ।*
వైశ్యాపుత్రో హరేద్ద్వ్యంశమంశం శూద్రాసుతో హరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***153***

తాత్పర్యం:- బ్రాహ్మణ స్త్రీ పుత్రుడు నాలుగు భాగాలను, క్షత్రియ స్త్రీ పుత్రుడు మూడు భాగాలను, వైశ్య స్త్రీ పుత్రుడు రెండు భాగాలను, శూద్ర స్త్రీ పుత్రుడు ఒక భాగాన్ని తీసుకోవాలి. ॥153॥

* *యద్యపి స్యాత్తు సత్పుత్రోఽ ప్యసత్పుత్రోఽ పి వా భవేత్ ।*
నాధికం దశమాద్దద్యాచ్ఛూద్రాపుత్రాయ ధర్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **154**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ద్విజాతి స్త్రీలయందు పుత్రులు కలిగి ఉన్నా లేకున్నా అతడి సంపదకు వారసుడు అయినవాడు శూద్ర పుత్రుడికి పదోభాగం కంటే ఎక్కువగా ఇవ్వరాదు. ఆ బ్రాహ్మణుడు సవర్ణ స్త్రీయందు సంతతి లేనివాడైతే, క్షత్రియ, వైశ్య పుత్రులు ఆ ధనమంతా తీసుకోవాలి. ॥154॥

* *బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాపుత్రో న రిక్థభాక్ ।*
యదేవాస్య పితా దద్యాత్తదేవాస్య ధనం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **155**

తాత్పర్యం:- బ్రాహ్మణక్షత్రియవైశ్య పుత్రుల ధనాన్ని శూద్రపుత్రుడు పొందలేడు. ఇతడికి తండ్రి ఎంత ధనం ఇస్తాడో అదే అతని ధనం అవుతుంది. శూద్రాపుత్రుడు గుణవంతుడయినట్లయితే పదోభాగం తీసుకోవాలి. లేనట్లయితే ఆతడికి పదోభాగం కూడా లేదని తాత్పర్యం. ॥155॥

* *సమవర్ణాసు యే జాతాః సర్వే పుత్రాః ద్విజన్మనామ్ ।*
ఉద్ధారం జ్యాయసే దత్వా భజేరన్నితరే సమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **156**

తాత్పర్యం:- ద్విజులు సజాతి స్త్రీలయందు సంతతి పొందినట్లయితే, వారు పెద్దవాడికి ఉద్ధారం ఇచ్చి, తక్కిన దాన్ని సమంగా పంచుకోవాలి. ॥156॥

* *శూద్రస్యతు సవర్ణైవ నాన్యా భార్యా విధీయతే ।*
తస్యాం జాతాః సమాంశాస్స్యుర్యది పుత్రశతం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **157**

తాత్పర్యం:- శూద్రుడికి సవర్ణ స్త్రీ ఒక్కతే భార్యగా ఉండదగింది. అధిక జాతిదిగాని, తక్కువ జాతిది గాని ఉండ తగదు. ఆ స్త్రీయందు అతడికి ఎందరు పుత్రులు కలుగుదురో, వారందరూ సమభాగులవుతారు. ఉద్ధారమెవ్వడికీ ఇవ్వకూడదు. ॥157॥

*** 12 రకాల పుత్రులు -**

* *పుత్రాన్ ద్వాదశ యానాహ నృణాం స్వాయంభువో మనుః ।*
తేషాం షడ్బన్ధుదాయాదాష్షడదాయాదబాన్ధవాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **158**

తాత్పర్యం:- స్వాయంభువ మనువుచేత చెప్పబడిన 12రకాల పుత్రులలో, తొలి ఆరుగురూ బంధువులు-దాయాదులు అవుతారు. తదుపరి ఆర్గురూ గోత్ర-ధనాదులకు అర్హులు కారు గాని, బంధుమర్యాదకు అర్హులు.॥158॥

*** దాయ భాగానికి 6గురు పుత్రులు అధికారులు -**

* *ఔరసః క్షేత్రజశ్చైవ దత్తః కృత్రిమ ఏవ చ ।*
గూఢోత్పన్నోఽ పవిద్ధశ్చ దాయాదా బాన్ధవాశ్చ షట్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **159**

తాత్పర్యం:- ఔరసుడు, క్షేత్రజ్ఞుడు దత్తుడు, కృత్రిముడు, గూఢోత్పన్నుడు, అపవిద్ధుడు వీరు ఆరుగురు బాంధవులును దాయభాగమునకు అర్హులును అవుతారు. ॥159॥

*** దాయ భాగానికి 6గురు పుత్రులు అనధికారులు -**

* *కానీనశ్చ సహోఢశ్చ క్రీతః పౌనర్భవస్తథా ।*
స్వయందత్తశ్చ శౌద్రశ్చ షడదాయాదబాన్ధవాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***160***

తాత్పర్యం:- కానీనుడు, సహోఢుడు, క్రీతుడు, పౌనర్భవుడు, స్వయందత్తుడు, శూద్రాసుతుడు వీరు కేవలం బంధువులే కాని దాయాదులు గారు. ॥160॥

* *యాదృశం ఫలమాప్నోతి కుప్లవైః సంతరఞ్జలమ్ ।*
తాదృశం ఫలమాప్నోతి కుపుత్రైస్సంతరంస్తమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***161***

తాత్పర్యం:- దాటనలవికాని సముద్రజలాన్ని తృణాదులచేత నిర్మితమైన దోనెచే దాటువాడు ఎంతటి ఫలం పొందుతాడో, అంతటి ఫలాన్ని కుపుత్రుని వలన పొందుతాడు. పారలౌకిక దుఃఖాన్ని దాటలేడు. ॥161॥

* *యద్యేకరిక్థినౌ స్యాతామౌరసక్షేత్రజౌ సుతౌ ।*
యస్య యత్పైతృకం రిక్థం స తద్గృహ్ణీత నేతరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***162***

తాత్పర్యం:- ఒకడు పరభార్యయందు నియోగంచేత పుత్రుణ్ణి పుట్టించిన తరవాత, స్వభార్యయందు పుత్రుని కలిగినట్లయితే, అప్పుడు ఆ ఔరసుడు క్షేత్రజుడును ఒక్కతండ్రి యొక్క ధనమునకు అర్హులేయైనా, ఏది ఎవడిపితదో, వాడు దాన్ని తీసుకోవాలి. కాని, క్షేత్రజుడు క్షైత్రిక పితయొక్క ధనమునకు అర్హుడు కాడు. ॥162॥

* *ఏక ఏవౌరసః పుత్రః పిత్ర్యస్య వసునః ప్రభుః ।*
శేషాణామానృశంస్యార్థం ప్రదద్యాత్తు ప్రజీవనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***163***

తాత్పర్యం:- ఒకడికి వ్యాధులవల్ల మొదట ఔరసపుత్రుడు లేదా క్షేత్రజపుత్రుడు కలిగినా, అతడినికి ఔషధాదులచేత తన వ్యాధి నిమ్మళించిన తరువాత తనకు ఔరసపుత్రుడు కలిగినట్లయితే, ఆ ఔరసపుత్రుడు తండ్రి ధనమునకు అంతటికీ అర్హుడు. క్షేత్రజుడు గాక తక్కిన అందరికీ పక్షపాతం లేకుండా జీవనోపాధికి ఏదైనా ఒకింత ధనమును ఇవ్వాలి. ॥163॥

* *షష్ఠం తు క్షేత్రజస్యాంశం ప్రదద్యాత్పైతృకాద్ధనాత్ ।*
ఔరసో విభజన్ దాయం పిత్ర్యం పంచమమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***164***

తాత్పర్యం:- ఔరసపుత్రుడు తండ్రి ధనమును తీసుకొంటూ, క్షేత్రజుడు గుణవంతుడైనట్లయితే, ఐదో భాగమును, అలాంటివాడు కానట్లయితే ఆరో భాగమును ఇవ్వాలి. ॥164॥

* *ఔరసక్షేత్రజౌ పుత్రౌ పితృరిక్థస్య భాగినౌ ।*
దశాపరే తు క్రమశో గోత్రరిక్థాంశభాగినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***165***

తాత్పర్యం:- ఔరసక్షేత్రజపుత్రులు పైన చెప్పిన విధంగా, తండ్రి ధనమునకు అర్హులవుతారు. తక్కిన పదిమంది గోత్రధనమును పంచుకొంటారు. దత్తుడు లేనట్లయితే కృత్రిముడు, వాడు లేనట్లయితే అపవిద్ధుడు ఈ విధంగా ఒకరివెంబడి ఒకరు అర్హులవుతారు. ॥165॥

*** ఔరస పుత్రుని లక్షణము -**

* *స్వే క్షేత్రే సంస్కృతాయాం తు స్వయముత్పాదయేద్ధియమ్ ।*
తమౌరసం విజానీయాత్పుత్రం ప్రథమకల్పితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***166***

తాత్పర్యం:- సవర్ణ స్త్రీని పెళ్లాడి, ఆమెకు ధర్మబద్ధంగా పుట్టించిన పుత్రుణ్ణి 'ఔరసపుత్రు'డంటారు. ముఖ్యంగా పుత్రుడనేది ఇతడినే. ॥166॥

*** క్షేత్రజ పుత్రుని లక్షణము -**

* *య స్తల్పజః ప్రమీతస్య క్లీబస్య వ్యాధితస్య వా ।*
స్వధర్మేణ నియుక్తాయాం స పుత్రః క్షేత్రజః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***167***

తాత్పర్యం:- భర్త మృతిచెందినా, నపుంసకుడైనా, సంతానం పుట్టించలేనంత వ్యాధిగ్రస్తుడైనా అతని భార్య తల్లి, తండ్రి గురు సమ్మతి చేత, నేతిని పూసుకొని తనను సంగమించిన వాని ద్వారా కన్న సంతానం '**క్షేత్రజు**' డనబడతాడు.॥167॥

*** దత్రిమ పుత్రుని లక్షణము -**

* *మాతా పితా వా దద్యాతాం యమద్భిః పుత్రమాపది ।*
సదృశం ప్రీతిసంయుక్తం స జ్ఞేయో దత్రిమస్సుతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***168***

తాత్పర్యం:-తల్లి గాని, తండ్రి గాని, ఇద్దరూ గాని తమకు కలిగిన పుత్రుణ్ణి, పుత్రసంతానం లేనివారికి ఆపద్ధర్మంగా ప్రీతిపూర్వకంగా ఇచ్చేస్తే అలాంటి వాడిని '**దత్తుడు**' అంటారు. ॥168॥

*** కృత్రిమ పుత్రుని లక్షణము -**

* *సదృశం తు ప్రకుర్యాద్యాం గుణదోష విచక్షణమ్ ।*
పుత్రం పుత్రగుణైర్యుక్తం స విజ్ఞేయశ్చ కృత్రిమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***169***

తాత్పర్యం:- సవర్ణస్థుడైనవాడు తల్లిదండ్రులకు పరలోక సంబంధిక్రియలు చేయడం పుణ్యమని-అవి చేయకపోవడం పాపమని తెలియడం చేత, తమకు అన్ని విధాలా శుశ్రూష చేసేవాడిని ఒకడిని ఎన్నుకొని, ఆ సవర్ణుడి చేతనే అన్నీ చేయించుకొనే యోగ్యత కల్గిస్తే అతడు '**కృత్రిముడు**'. ॥169॥

గూఢోత్పన్న పుత్రుని లక్షణము-

* *ఉత్పద్యతే గృహే యస్య న చ జ్ఞాయేత కస్య సః ।*
స గృహే గూఢ ఉత్పన్నస్తస్య స్యాద్ యస్య తల్పజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***170***

తాత్పర్యం:- ఎవడి ఇంట తన భార్య ఉండగా పుత్రుడు పుడతాడో, అతడు సవర్ణుడని తెలిసినా, ఆ పుత్రుడెవరి బీజం వల్ల పుట్టినవాడో ఎరుగబడని జన్మ వల్ల '**గూఢోత్పన్ను**'డనబడుతున్నాడు. ॥170॥

అపవిద్ధ పుత్రుని లక్షణము-

* *మాతా పితృభ్యాముత్సృష్టం తయోరన్యతరేణ వా ।*
యం పుత్రం పరిగృహ్ణీయాదపవిద్ధస్స ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***171***

తాత్పర్యం:- తల్లిదండ్రులచేత గాని, వారిలో ఒకరు మృతిచెందగా మరొకరిచేతగాని విడువబడిన వాడిని పుత్రవంతుడు కానివాడు పరిగ్రహించెనేని, అతడు '**అపవిద్ధుడు**' అనబడును. ॥171॥

*** కానీన పుత్రుని లక్షణము -**

* *పితృవేశ్మని కన్యా తు యం పుత్రం జనయేద్రహః ।*
తం కానీనం వదేన్నామ్నా వోఢుః కన్యాసముద్భవమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***172***

తాత్పర్యం:- తండ్రి ఇంటిలో తాను కన్యగా ఉన్నప్పుడే రహస్యంగా కన్న పిల్లవానిని 'కనీనుడు' అని అంటారు.॥172॥

సహోఢ పుత్రుని లక్షణము -

*   *యా గర్భిణీ సంస్క్రియతే జ్ఞాతాఽజ్ఞాతాపి వా సతీ ।*
వోఢుః స గర్భో భవతి సహోఢ ఇతి చోచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***173***

తాత్పర్యం:- గర్భిణిగా ఉన్నదాన్ని, కన్యగా భ్రమించి పెళ్లాడిన తరువాత భర్త ఇంట ప్రసవించబడిన పుత్రుడు 'సహోఢజుడు'. ఇక్కడ కూడ వాడి తండ్రి విషయం గోప్యమే! ॥173॥

క్రీతపుత్రుని లక్షణము-

*   *క్రీణీయాద్ యస్త్వపత్యార్థం మాతాపిత్రోర్యమన్తికాత్ ।*
స క్రీతకస్సుత స్తస్య సదృశోఽ సదృశోఽ పివా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***174***

తాత్పర్యం:- తనకు పుత్రులు లేనందువల్ల వేరొక తల్లిదండ్రులకు ధనము నిచ్చి పుత్రునిగా కొనుక్కొన్నవాడు 'క్రీతుడు'. ॥174॥

పౌనర్భవ పుత్రుని లక్షణము-

*   *యా పత్యా వా పరిత్యక్తా విధవా వా స్వయేచ్ఛయా ।*
ఉత్పాదయేత్పునర్భూత్వా స పౌనర్భవ ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***175***

తాత్పర్యం:- ఏ స్త్రీ భర్తచేత వదిలేయబడిన వెంటనే గాని, మృతిపొందిన తరవాత (ఏడాదిలోగా) వేరొకర్ని పెండ్లాడి అతడివల్ల పుత్రునికంటే, వాడు 'పౌనర్భవు'డనబడతాడు. ॥175॥

148 నుండి 175 శ్లోకాలు ప్రక్షిప్తాలు. 177-191 శ్లోకాల సమీక్షను చూడగలరు. ఈ శ్లోకాలన్నీ అంతర్ వ్యతిరేకాలు, ప్రసంగ వ్యతిరేకాలు, విషయవిరోధాలు మరియు శైలీగత ఆధారాలతో ప్రక్షిప్తాలని తెలుసుకోవాలి. ఇవి మనురచితాలు కావు.

అక్షతయోనికి పునర్వివాహ విధానం- ఇది మనుకృతం-ప్రామాణికం

సా చేదక్షతయోనిస్స్యాద్గతప్రత్యాగతాపి వా । మూలశ్లోక సం. **69**
పౌనర్భవేన భర్త్రా సా పునస్సంస్కారమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **176**

సాచేత్ + అక్షత యోనిః స్యాత్ = ఆ స్త్రీ అక్షత యోని ఏ స్త్రీకి ఎవరితో సంభోగ సంబంధం లేదో, లేదా, **గతప్రత్యాగతా+అపి** = భర్తృ గృహానికి వెళ్ళి తిరిగివచ్చినదో, **సా** = ఆమె, **పౌనర్భవేన భర్త్రా** = రెండో భర్తతో, **పునః సంస్కారమ్ + అర్హతి** = మళ్ళీ వివాహం చేసికోవచ్చు.

ఋషి దయానందభాష్యం:- అక్షత యోని ఏ స్త్రీకి ఎవ్వరితోనూ సంభోగ సంబంధం లేదో, లేదా భర్త గృహానికి వెళ్ళి తిరిగి వచ్చినదో ఆమె రెండో భర్తతో మళ్ళీ వివాహం చేసుకోవచ్చు.

ఏ స్త్రీ పురుషులకు పాణిగ్రహణ సంస్కారం మాత్రం జరిగి సంయోగం జరగలేదో, అంటే అక్షత యోని స్త్రీ మరియు అక్షత వీర్య పురుషులకు, వారి అన్య స్త్రీ-పురుషుడితో, పునః సంస్కారమర్హతి = మళ్ళీ వివాహం చేసుకోడానికి అర్హులు (స.ప్ర. 4వ సము.) ॥176॥

177-191వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* స్వయందత్త పుత్రుని లక్షణం-

*   *మాతాపితృవిహీనో యస్త్యక్తో వా స్యాదకారణాత్ ।*
ఆత్మానం స్పర్శయేద్యస్మై స్వయందత్తస్తు స స్మృతః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***177***

తాత్పర్యం:- తన తల్లిదండ్రులెవరో తెలియనట్టివాడు, ఊహతెలిశాక తనకుతానై ఎవరికైనా విక్రయించుకుంటే అలాంటివాడు '**స్వయందత్తు**'డనబడతాడు. ॥177॥

* పారశవ పుత్రుని లక్షణము-

*   *యం బ్రాహ్మణస్తు శూద్రాయాం కామా దుత్పాదయేత్సుతమ్ ।*
స పారయన్నేవ శవస్తస్మాత్పారశవః స్మృతః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***178***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ఏ పుత్రుణ్ణి శూద్ర స్త్రీయందు మోహంచేత పొందుతాడో, వాడు జీవించి ఉండీ, శవసదృశుడు కావడం వల్ల '**పారశవుడు**' అనబడును. అతడు పిత్రాదుల కోసం శ్రాద్ధాదులను చేసినా, అసంపూర్ణోపకారి కాబట్టి శవం అని చెప్పబడును. ॥178॥

*   *దాస్యాం వా దాసదాస్యాం వా యః శూద్రస్య సుతో భవేత్ ।*
సోఽనుజ్ఞాతో హరేదంశమితి ధర్మో వ్యవస్థితః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***179***

తాత్పర్యం:- దాసీయందు-దాసదాసియందు గాని శూద్రుడికి పుట్టినవాడు, అతడు వివాహం చేసుకున్న స్త్రీ పుత్రులతో సమానభాగం అనుభవించాలని తండ్రి శాసించినప్పుడు, అది చెల్లుతుంది. ॥179॥

*   *క్షేత్రజాదీన్సుతానేతానేకాదశ యథోదితాన్ ।*
పుత్రప్రతినిధీనాహుః క్రియాలోపాన్ మనీషిణః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***180***

తాత్పర్యం:- పైన చెప్పిన క్షేత్రజుడు మొదలైన పదకొండు రకాల పుత్రులు క్రియలోపం వల్ల ఔరసపుత్రులకు ప్రతినిధులనే పేర్కొనబడతారు. ॥180॥

*   *య ఏతేఽభిహితాః పుత్రాః ప్రసంగాదన్యబీజజాః ।*
యస్య తే బీజతో జాతాస్తస్య తే నేతరస్య తు ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***181***

తాత్పర్యం:- ప్రసంగ వశమున ఈ క్షేత్రజుడు మొదలైన ఏ పుత్రులు ఔరసపుత్ర ప్రస్తావ వశమున పేర్కొనబడిరో, వారందరూ ఎవ్వడి బీజమునకు పుట్టినవారో, వాడి పుత్రులే అవుతారు కాని, ఇతరుల పుత్రులుకారు. కాబట్టి ఔరస పుత్రుడు, పుత్రికయు ఉండగా, అలాంటివారిని బడయనక్కరలేదని చెప్పబడింది. ॥181॥

*   *భ్రాతృణా మేకజాతానా మేకశ్చేత్పుత్రవాన్భవేత్ ।*
సర్వాంస్తాంస్తేన పుత్రేణ పుత్రిణో మనురబ్రవీత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***182***

తాత్పర్యం:- అన్నదమ్ముల్లో ఒక్కరికి మాత్రం పుత్రుడు కలిగినా, వాడి వల్లనే మిగతా సోదరులందరూ పుత్రవంతులుగా భావించబడుతున్నారు. వారికి నిజంగా పుత్రసంతానం లేకున్నా చింతించ పనిలేదు. ఆ సోదరుడి పుత్రుడే వీరందరికీ కర్మాధికారి. ॥182॥

*   *సర్వాసా మేకపత్నీనామేకా చేత్పుత్రిణీ భవేత్ ।*
సర్వాస్తాస్తేన పుత్రేణ ప్రాహుః పుత్రవతీర్మనుః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***183***

తాత్పర్యం:- ఒకడికి ఇద్దరుగానీ-ముగ్గరుగానీ భార్యలుంటే, అందులో ఒక్కరికే పుత్రులుంటే, అతడి వల్ల ఆ తల్లులంతా పుత్రవతులనే చెప్పాలి. ॥183॥

* *శ్రేయసశ్శ్రేయసోలాభే పాపీయాన్రిక్థమర్హతి ।*
బహవశ్చేత్తు సదృశాః సర్వే రిక్థస్య భాగినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***184***

తాత్పర్యం:- ఇంతవరకు చెప్పబడిన 12 రకాల పుత్రులలో ఔరసుడు అందరికంటే ఉత్తముడు. అదేక్రమంలో వరుసగా క్షేత్రజుడు మొదలైనవారు. ఒకరికంటే ఒకరు తక్కువ వారిగా పరిగణించబడి అందరికంటే అధమ స్థాయిలో పౌనర్భవుడుంటాడు. అందరికంటే ఔరసుడు ముఖ్యుడైనందువల్ల అతడే మిగిలిన వారిని (ఒకవేళ ఉంటే) పోషించాలి. అరుదుగానే అయినా వీరంతా తండ్రి ఆస్తిలో దాయభాగానికి అర్హులు. ॥184॥

* *న భ్రాతరో న పితరః పుత్రా రిక్థహరాః పితుః ।*
పితా హరేదపుత్రస్య రిక్థం భ్రాతర ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***185***

తాత్పర్యం:- సోదరులు అయిన అన్నదమ్ములు గాని, తండ్రికి తోబుట్టువులు గాని, తండ్రియొక్క ధనానికి అర్హులు కారు. ఔరసపుత్రుడు లేనప్పుడు క్షేత్రజుడు మొదలైనవారే ఆ తండ్రి ధనానికి అర్హులు. వీళ్లెవరూ లేనప్పుడే ఆ ధనం సోదరులపరమవుతుంది. ॥185॥

* *త్రయాణా ముదకం కార్యం త్రిషు పిండః ప్రవర్తతే ।*
చతుర్థస్సంప్రదాతైషాం పంచమో నోపపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***186***

తాత్పర్యం:- తండ్రి మొదలైన ముగ్గరికి ఉదకదానం చేయాలి. ఆ మువ్వురకే పిండమును ఇవ్వాలి. నాలుగోవాడు వారికి పిండోదకములు ఇచ్చేవాడు. కానీ అయిదోవాడికి ఈ విషయంలో సంబంధం లేదు.కాబట్టి అపుత్రులైన పితామహాదుల ధనంలో గౌణపౌత్రులకు అధికారం కలదని ఇక్కడ చెప్పబడింది. ఔరసపుత్ర పౌత్రుల విషయం ఇంతకు మున్నే "పుత్రేణ లోకాన్ జయతి పౌత్రేణానంత్యమశ్నుతే" అనే శ్లోకంలో చెప్పబడింది. ॥186॥

* *అనంతరస్సపిండాద్యస్తస్య తస్య ధనం భవేత్ ।*
అత ఊర్ధ్వం సకుల్యస్స్యాదాచార్యశ్శిష్య ఏవ వా॥ ప్రక్షిప్త శ్లోక సం. ***187***

తాత్పర్యం:- సపిండులలో ఎవడు సన్నిహితుడైన సపిండుడో, వాడు పురుషుడైనా (స్త్రీయైనను) తన సన్నిహితుడయిన సపిండుని ధనమును గ్రహించాలి. అలాంటి వాడు ఔరసపుత్రుడు ఒక్కడే మృతుడి ధనమునకు అధికారి. అలాంటి ఔరసుడు లేనప్పుడు కూతురు, దాని కొడుకు, అధికారులు. వారు లేనప్పుడు శూద్రాపుత్రుడికి పదోభాగం ఇచ్చి తక్కినది సపిండులు తీసుకోవాలి. ముందు చెప్పినట్టి పుత్రులు లేనప్పుడు భార్యే భర్తయొక్క సలక ధనమునకు అర్హురాలు.. భార్య లేనప్పుడు పుత్రులు లేని కూతురు, కూతురు లేనప్పుడు, తండ్రి, తల్లి, వారూ లేనప్పుడు తోడబుట్టినవాడు, వాడు లేనట్లయితే వాడి కుమారుడు, వాడులేనట్లయితే సన్నిహితదాయాదుడును తీసుకోవాలి. వారెవ్వరూ లేనట్లయితే సమానోదకుడుగాని, వాడి అభావమున ఆచార్యుడుగాని, శిష్యుడుగాని, క్రమంగా ఆ ధనమునకు అర్హులు. ॥187॥

* *సర్వేషామప్యభావే తు బ్రాహ్మణా రిక్థభాగినః ।*
త్రైవిద్యాశ్శుచయో దాంతా స్తథా ధర్మో న హీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***188***

తాత్పర్యం:- పై శ్లోకంలో చెప్పిన వారందరూ లేనప్పుడు వేదాలను మూటిని సాంగంగా చదివినవారుగాని, బాహ్యాభ్యంతర శౌచముగల వారుగాని, జితేంద్రియులును అయిన వారి పుత్రులుగాని ధనగ్రహణమునకు అర్హులు. వారే పిండం ఇచ్చే వారు. అలా జరిగినట్లయితే ధనికుడయిన మృతుడికి శ్రాద్ధాదిధర్మ క్రియలకు హాని కలుగనేరదు.॥188॥

*   *ఆహార్యం బ్రాహ్మణద్రవ్యం రాజ్ఞా నిత్యమితి స్థితిః ।*
ఇతరేషాం తు వర్ణానాం సర్వాభావే హరేన్నృపః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***189***

తాత్పర్యం:- దాయాదులు ఎవ్వరూ లేకపోయినా బ్రాహ్మణ ద్రవ్యాన్ని రాజు ఆశించ కూడదని శాస్త్రాలు చెప్పినవి. కాబట్టి అలాంటి స్థితిలో ఆ ద్రవ్యాన్ని సద్గుణ బ్రాహ్మణులకు రాజు పంచిపెట్టాలి. సాటి క్షత్రియుడికి దాయాదులు లేనప్పుడు మాత్రం అది రాజు ఖజానానికి చేరాల్సిందే ! ॥189॥

*   *సంస్థితస్యానపత్యస్య సగోత్రాత్పుత్రమాహరేత్ ।*
తత్ర యద్రిక్థజాతం స్యాత్తత్తస్మిన్ ప్రతిపాదయేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***190***

తాత్పర్యం:- సంతానం లేక మృతి చెందిన వాడి భార్య సమాన గోత్రుడి వల్ల పెద్దల అనుమతి పొంది పుత్రుణ్ణి పొందవచ్చు! మృతుడి ధనమంతా ఆ పుత్రుడికి చెందుతుంది. ॥190॥

*   *ద్వౌ తు యౌ వివదేయాతాం ద్వాభ్యాం జాతౌ స్త్రియా ధనే ।*
తయోర్యద్యస్య పిత్ర్యం స్యాత్తత్స గృహ్ణీత నేతరః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***191***

తాత్పర్యం:- ఒక స్త్రీ మొదట ఒకడిని పెండ్లాడి వాడివల్ల పుత్రుణ్ణి పొంది, అతడు పసివాడుగా ఉన్నప్పుడే తండ్రి మృతిచెందగా, ఆ భర్త ధనమును స్వీకరించి, మళ్ళీ ఒకడిని వివాహం చేసికొని వాడివల్ల పుత్రుణ్ణి పొంది, వెంటనే ఆ భర్త మృతిచెందాడు. వాడి ధనం కూడా ఆ స్త్రీవశమయింది. దీని చేత ఉన్న ద్రవ్యం విషయమై ఆ పుత్రులిద్దరూ వివాదపడినట్లయితే, వాడు వాడు వాడివాడి తండ్రి ధనమును తీసుకోవాలి గాని, ఒకడికి పుట్టినవాడు మరొకడి ధనమును తీసుకోరాదు. ॥191॥

ప్రక్షిప్తాల పరిశీలన

148 నుంచి 175 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు. వీటి ఆధారాలను బట్టి, 177-192 శ్లోకాల మీద సమన్విత రూప సమీక్షను చూడండి. ఈ అన్ని శ్లోకాలూ అంతర్ వ్యతిరేకాలూ, ప్రసంగ వ్యతిరేకాలూ, విషయ వ్యతిరేకాలూ, శైలీగత 'ఆధారాల'ను అనుసరించి ప్రక్షిప్తాలు. ఇవి మనువు రచించి ఉండదు.

1. అంతర్వ్యతిరేకం: క. 148-175,177-191 శ్లోకాలలో పలు వర్ణాల వారికి బహు భార్యల వల్ల పుట్టిన పుత్రులకు ఆస్తిలో వాటాల గురించి ఉంది. ఒకటేసారి పలువురిని వివాహ మాడట మనేదే మనువుకు వ్యతిరేకం. మనువు ఒకరినే, అదీ సవర్ణురాలైన స్త్రీని వివాహ మాడాలని చెప్పాడు. అన్ని చోట్లా ఏకవచనమే వాడి, ఒకటే భార్య అనే సంకేత మిచ్చాడు. [3. 4-5; 5. 167;7. 77].

ఖ. 158-175, 177-184, 190,191 శ్లోకాలలోని ఆస్తి వాటా పుట్టుకతో వర్ణ వ్యవస్థ ఆధారంగా చెప్పింది. కొందరు పుత్రులను వాటాకు అధికారులు కారనీ, తొలి కుమారుడు తప్ప మిగిలిన వారందరూ అనధికారులనీ అన్నారు. మనువు బీజాన్నే ప్రధానంగా గణిస్తాడు[9. 33-56]. బీజానికి ప్రాధాన్యం ఉన్నపుడు ఎవరికి ఏ పుత్రుడు పుడితే, వాడు ఆ స్థాయి సంతాన మవుతాడు; వారిలో హెచ్చు తగ్గుల సమస్యే ఉండదు కదా! మనువు కర్మణా వర్ణ వ్యవస్థను చెప్పాడు [1. 192-207ల సమీక్ష చూడండి]. కర్మణా వర్ణ వ్యవస్థలో అందరు పుత్రులూ సమానులే. ఈ శ్లోకంలోని పుత్రుల మధ్య తేడా పుట్టుకతో జాతి వాదంపై ఆధారపడింది కనుక, మను సమ్మతం కాదు.

గ. 185వ శ్లోకంలోని వ్యవస్థ 211, 212కు వ్యతిరేకం.

ఘ. 187-189లలో బ్రాహ్మణులు మొదలైన వారి ధనం తీసుకోవడం గురించిన సంగతి 9.30కి వ్యతిరేకం. అక్కడ రాజే ధన గ్రహణానికి అధికారి అని ఉంది.

జ. 190,191లలో క్షేత్రజ్ఞుడైన కొడుకుకు వాటా నిషేధించడం 9.145-146లకు వ్యతిరేకం.

చ. 148-175,177-180 మొదలైన వాటిలో చెప్పిన పుత్రులలో భేదాలు మను సమ్మతం కావు. ఆస్తుల వాటాలకు మనువు కేవలం మూడు విధాలైన పుత్రుల స్థితినే అంగీకరించాడు. అవి 1. ఔరసపుత్రుడు [104-138],

దత్తపుత్రుడు [141], 3. నియోగజుడు [145-147]. వేరే ఎవరినీ మనువు చెప్పలేదు.

2. శైలీగత ఆధారాలు

158లో **“ఆహ స్వయంభువః మనుః”** అనే పదాల వల్ల, ఈ శ్లోకం మనువుది కాదనీ, తరువాతి వారెవరో రచించి చేర్చారనీ రుజు వవుతూంది కనుక ఇది ప్రక్షిప్తం. మిగిలిన 159-184 శ్లోకాలు దీన్ని ఆధారం చేసుకున్నవే, దీనికి సంబంధించినవే కనుక, ఇవి ప్రక్షిప్తం కనుక, అవన్నీ ప్రక్షిప్తాలే!

3. విషయ వ్యతిరేకాలు

148-175,177-184 శ్లోకాలలో పన్నెండు రకాల పుత్రులను గురించి చెప్పారు. 186లో శ్రాద్ధంలో పిండ ప్రదానం గురించి ఉంది. ఇది విషయ సంకేతక శ్లోకాలలో [9.103,120] చెప్పిన దానికి సంబంధం లేనిది. అక్కడి విషయం ఆస్తుల వాటాలది. ఇట్లా విషయ వ్యతిరేకం కావటం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

4. ప్రసంగ వ్యతిరేకాలు

క. 158-175, 177-184 శ్లోకాలలోని పుత్రులలోని భేదాలు ప్రసంగం ప్రారంభంలో చెప్పినట్లయితే, అవి ప్రసంగ సమ్మతాలు అయి ఉండేవి. మధ్యలో పుత్రులను గురించి రావడం అసంగతం కనుక, ఇవి ప్రసంగ వ్యతిరేకాలు.

ఖ. 185-189లలో ఆస్తివాటాలకు కొన్ని వికల్పాలు చెప్పారు. ఆ వికల్పాలు ప్రసంగం చివర ఉన్నట్లయితే సరైనవని చెప్పవచ్చు. ఇంకా ఆస్తి వాటాల సంగతి మిగిలే ఉంది, దాని కన్నా ముందే ఈ వికల్పాలు చెప్పటం అసంగతమవుతుంది.

గ. 147కూ, 176కూ విధ్యాత్మకమైన సంబద్ధత ఉంది [147,176ల పరిశీలన చూడండి].మధ్యలోని ఈ శ్లోకాలు ఆ ప్రసంగాన్ని భంగం చేశాయి.

5. పునరుక్తులు

190లో చెప్పినవి 9.120, 145,146లలో చెప్పేశారు. మళ్లీ వాటినే చెప్పటం పునరుక్తి కనుక ఇది ప్రక్షిప్తం. 191వ శ్లోకం దీనితో సంబద్ధం కనుక, అది కూడా ప్రక్షిప్తమే !

మాతృధన-విభాగం

192 నుండి 197వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

మాతృసంపదను సోదర-సోదరీమణులు సమానంగా పంచుకోవాలి-

జనన్యాం సంస్థితాయాం తు సమం సర్వే సహోదరాః । మూలశ్లోక సం. **70**
భజేరన్మాతృకం రిక్థం భగిన్యశ్చ సనాభయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **192**

టీక:- **జనన్యాం సంస్థితాయాం తు** = తల్లి మరణానంతరం, **సర్వే సహోదరాః చ సనాభయః భగిన్యః** = సొంత సోదరులు, సోదరీమణులు, **మాతృకం రిక్థం సమం భజేరన్** = తల్లి సంపత్తిని సమానంగా పంచుకోవాలి.

తాత్పర్యం:- తల్లిమరణించాక పుత్రులు-పెండ్లికాని కూతుళ్లు కూడ తల్లి ధనం సమానంగా పంచుకోవాలి. పెళ్లయిన కూతుళ్లున్నా తల్లిధనంలోని 4వ భాగం పంచి ఇవ్వాలి. ॥192॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యాస్తాసాం స్యుర్దుహితరస్తాసామపి యథార్హతః । మూలశ్లోక సం. **71**
మాతామహ్యా ధనాత్కించిత్ప్రదేయం ప్రీతిపూర్వకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **193**

తాసాం యాః దుహితరః స్యుః = ఆ సొంత సోదరీమణులకు కలిగిన పుత్రికలకు కూడా, **తాసామ్ + అపి యథార్హతః** = వారికి కూడా యథా యోగ్యంగా, **ప్రీతిపూర్వకమ్ మాతామహ్యాః ధనాత్ కించిత్** ప్రదేయం = మాతామహి (అమ్మమ్మ) ధనం నుండి కొంత ప్రేమపూర్వకంగా ఇవ్వాలి.

తాత్పర్యం:- ఆ కూతుళ్లలో కన్యలకు తల్లిధనం నుంచి మర్యాదకు తగినట్లుగా భాగం ఇచ్చేయాలి. సమానమైనా మంచిదే! ॥193॥

స్త్రీ ధనం ఆరు విధాలు ఇది మనుకృతం-ప్రామాణికం

అధ్యగ్న్యధ్యావాహనికం దత్తం చ ప్రీతికర్మణి । మూలశ్లోక సం. **72**
భ్రాతృమాతృపితృప్రాప్తం షడ్విధం స్త్రీధనం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **194**

టీక:- **స్త్రీ ధనం షడ్ విధం స్మృతమ్** = స్త్రీ ధనం 6 విధాలుగా అంగీకరించబడింది. 1) అధి+అగ్ని = వివాహ సంస్కార సమయంలో ఇచ్చిన ధనం, **2) అధి+ఆవాహనికమ్** = అత్తవారింటికి వచ్చిన సమయంలో కన్యకు, అత్తవారింటి నుండి లభించిన ధనం, **3) ప్రీతి కర్మణి చ దత్తం ధనం** = సంతోష సమయంలో భర్త నుండి లభించిన ధనం, **4) భ్రాతృ-మాతృ-పితృ-ప్రాప్తం** = సోదరుడి ద్వారా వచ్చిన ధనం, 5) తల్లి నుండి లభించిన ధనం 6) తండ్రి నుండి లభించిన ధనం.

తాత్పర్యం:- స్త్రీ ధనం ఆరు రకాలు. 1. వివాహ సంస్కార సమయంలో తల్లిదండ్రులు ఇచ్చిన ధనం 2. అత్తవారింటికి వచ్చిన సమయంలో అత్తగారు కన్యకు ఇచ్చిన ధనం, 3. సంతోష సమయంలో భర్త నుండి లభించిన ధనం, 4. సోదరుడి ద్వారా 5. తల్లి నుండి 6. తండ్రి నుండి లభించిన ధనం. ॥194॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అన్వాధేయం చ యద్దత్తం పత్యా ప్రీతేన చైవ యత్ । మూలశ్లోక సం. **73**
పత్యౌ జీవతి వృత్తాయాః ప్రజాయాస్తద్ధనం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **195**

టీక:- **యత్ అన్వాధేయం** = ఏది అన్వాధేయం అంటే వివాహానంతరం తండ్రి గానీ భర్త గానీ ఇచ్చిన ధనం, **చ** = మరియు, **యత్ ప్రీత్యే పత్యా దత్తం** = ఏది ప్రీతి పూర్వకంగా పతిచే ఇవ్వబడిన ధనం, **వృత్తాయాః** = స్త్రీ చనిపోగా, **పత్యౌ జీవతి** = పతి జీవించి ఉండగా, **తద్ధనం ప్రజాయాః భవేత్** = ఆ ధనం సంతతికి లభిస్తుంది.

తాత్పర్యం:- వివాహనంతరం తండ్రిగానీ భర్తగానీ ఇచ్చిన ధనం. వివాహానంతరం పుట్టింట-మెట్టింట లభించేది, తల్లీ, తండ్రీ సోదరులు ఇచ్చిన ధనం. భర్త జీవించి ఉండగా భార్య మృతి చెందినా ఆ స్త్రీ ధనమంతా ఆమె సంతతికి వెంటనే చేరుతుంది. ॥195॥

బ్రాహ్మాది వివాహాలలో స్త్రీ సంపదకు అధికారి పతియే -భర్తే - ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రాహ్మదైవార్షగాన్ధర్వప్రాజాపత్యేషు యద్ వసు । మూలశ్లోక సం.**74**
అప్రజాయామతీతాయాం భర్తురేవ తదిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**196**

టీక:- బ్రాహ్మ-దైవ-ఆర్ష-గాంధర్వ-ప్రాజాపత్యేషు **యత్** వసు = బ్రాహ్మం, దైవం, ఆర్షం, గాంధర్వం, ప్రాజాపత్యం. ఈ వివాహాలలో స్త్రీకి లభించిన ధనం, **అప్రజాయామ్ అతీతాయాం** = సంతానహీనురాలైన స్త్రీ చనిపోయిన తరువాత, **తత్ భర్తుః** + ఏవ ఇష్యతే = ఆ ధనం మీద భర్తకే అధికారముంటుంది.

తాత్పర్యం:- బ్రాహ్మ, దైవ, ఆర్ష, గాంధర్వ, ప్రాజాపత్య వివాహాలైదింట స్త్రీకి మునుపు చెప్పిన ఆరువిధాల ధనం (ఉంటే) ఆమె సంతానానికి చేరుతుంది. సంతానం లేనట్లయితే ఆమె భర్తకే చెందుతుంది. ॥196॥

ఆసురాది-వివాహాలలో స్త్రీ సంపదకు ఉత్తరాధికారి - ఇది మనుకృతం-ప్రామాణికం

యత్త్వస్యాస్స్యాద్ధనం దత్తం వివాహేష్వాసురాదిషు । మూలశ్లోక సం.**75**
అప్రజాయామతీతాయాం మాతాపిత్రోస్తదిష్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**197**

టీక:- యత్ తు అస్యాః = ఈ, **ఆసురాదిషు వివాహేషు దత్తం ధనం స్యాత్** = ఆసురాది-వివాహంలో ఇచ్చిన ధనం, **అప్రజాయాం + అతీతాయామ్** = సంతానం లేకుండా స్త్రీ మృతిచెందినట్లయితే, **తత్ మాతా పిత్రోః ఇష్యతే** = ఆ ధనం స్త్రీ యొక్క తల్లిదండ్రులకు చెందుతుంది.

తాత్పర్యం:- అయితే.....ఆసుర-రాక్షస-పైశాచ వివాహాలలో మాత్రం స్త్రీకి పైన చెప్పబడిన ఆరురకాల స్త్రీధనం ఏదైతే ఉందో, ఆ స్త్రీకి సంతానం లేనట్లయితే మృతి చెందినప్పుడు ఆ స్త్రీధనం ఆమె తల్లిదండ్రులకు చెందుతుంది.॥197॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *స్త్రియాం తు యద్భవేద్విత్తం పిత్రా దత్తం కథంచన ।*
బ్రాహ్మణీ తద్ధరేత్కన్యా తదపత్యస్య వా భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***198***

తాత్పర్యం:- బ్రాహ్మణుడే నాలుగు వర్ణాల స్త్రీలను పెళ్లాడినప్పుడు క్షత్రియాది స్త్రీలు సంతతి లేక మృతి చెందితే వారికి తమతమ తండ్రులిచ్చినది మొదలైన స్త్రీ ధనం అంతా అందరికంటే పెద్దదైన బ్రాహ్మణ భార్య సంతానానికే చెందుతుంది. ఇటు భర్తకు గాని, ఆ యా మృతస్త్రీల తల్లిదండ్రులకుగాని చెందదు. ॥198॥

ప్రక్షిప్త పరిశీలన

198వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలోని బహుభార్యాత్వం మనువుకు వ్యతిరేకం[5.167,168]. అందుకని ఇది ప్రక్షిప్తం.

స్త్రీలు రహస్యంగా ధనాన్ని నిలవచేయరాదు- 199 నుండి 203వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

న నిర్హారం స్త్రియః కుర్యుః కుటుంబాద్బహుమధ్యగాత్ । మూలశ్లోక సం.**76**
స్వకాదపి చ విత్తాద్ధి స్వస్య భర్తురనాజ్ఞయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**199**

టీక:- స్త్రియః = స్త్రీలు, **కుటుంబాత్ బహుమధ్యగాత్** = అనేక మంది కుటుంబ సభ్యుల మధ్యలో, కనిపించకుండా ధనాన్ని తీసుకొని, **నిర్హారం న కుర్యుః** = తన కోసం ధనాన్ని దాచటం గాని, ఖర్చు పెట్టడం గాని చేయరాదు, **చ** = మరియు, **స్వకాత్ విత్తాత్ అపి** = తన ధనంలో నుండి కూడా, **స్వస్య భర్తుః అనాజ్ఞయా** = తన భర్త అనుమతి లేకుండా ఖర్చుపెట్టరాదు.

తాత్పర్యం:- ఉమ్మడి కుటుంబాలై ఉన్నప్పుడు, సాధారణంగా గృహానికై వ్యయమయ్యే ధనం అధికంగా అవసరపడుతుంది కాబట్టి, స్త్రీలు ఆభరణాలు-సొమ్ముల నిమిత్తం ధనం వేరే చేర్చి పెట్టుకోరాదు. భర్త అనుమతి లేకుండా, అతని ధనంలోంచి అయినా, వేరేగా డబ్బుదాచరాదు, ఖర్చుపెట్టరాదు. ఆ విధంగా చేర్చి పెట్టినది స్త్రీ ధనం కాజాలదు.॥199॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పత్యౌ జీవతి యః స్త్రీభిరలఙ్కారో ధృతో భవేత్ । మూలశ్లోక సం. **77**
న తం భజేరన్ దాయాదా భజమానాః పతన్తి తే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **200**

టీక:- పత్యౌ జీవతి = భర్త జీవించి ఉండగా, **స్త్రీభిః యం అలంకారః ధృతః భవేత్** = స్త్రీలు, ఏ అలంకారాలను, ఆభూషణాలను ధరిస్తూ ఉంటారో, భర్త మరణానంతరం, **దాయాదాః తం న భజేరన్** = మాతా-పిత్రుల ధనానికి అధికారులైన పుత్రుడు, తల్లి జీవించి ఉండగా వాటిని పంచుకోరాదు. **భజమానాః తే పతన్తి** = వాటిని కాజేసినట్లైతే - వారు **'పతితులుగా'** చెప్పబడతారు.

తాత్పర్యం:- భర్తజీవించి ఉండగానే, భర్త అనుమతితో, అతని భార్యలేవేవి ఆభరణాలు ధరిస్తారో, ఆ భూషణాదులను భర్త గతించాక వారి పుత్రులు పంచుకోరాదు. అంటే తల్లి ఆభరణాలకోసం తనయులు ఆశించరాదని అర్థం. అలా ఆశించి ఆ సొమ్ములు పంచుకుంటే వారు పాపాత్ములవుతారు. ॥200॥

వికలాంగులు సంపదకు అనధికారులు

ఇది మనుకృతం-ప్రామాణికం

అనంశౌ క్లీబపతితౌ జాత్యన్ధబధిరౌ తథా । మూలశ్లోక సం. **78**
ఉన్మత్తజడమూకాశ్చ యే చ కేచిన్నిరిన్ద్రియాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **201**

టీక:- క్లీబపతితౌ = నపుంసకులు, **జాతి+అన్ధః బధిరౌ** = పుట్టుకతో గుడ్డివాళ్ళు-చెవిటివాళ్ళు, **ఉన్మత్త- జడ-మూకాః** = పిచ్చివాళ్ళు, వజ్ర మూర్ఖులు, మూగివాళ్ళు, **చ** = మరియు, **యే కేచిత్ నిరింద్రియాః** = ఏదైనా ఇంద్రియం లేనివారు పూర్ణ వికలాంగులు, అసమర్థులు, **అనంశౌ** = ఈ గుడ్డి, కుంటివాళ్ళు వీళ్ళందరూ సంపత్తికి భాగస్వాములుకారు. ఎందుకంటే-వీరందరూ ధనాన్ని ఉపయోగించు కోలేరు. సంరక్షించుకోలేరు.

తాత్పర్యం:- పుట్టుకతోనే నపుంసకుడు, పుట్టుకుంటి/మూగ/ చెవుడు/ గుడ్డి మొదలైన వికలాంగులు పితృధనానికి అర్హులు కారు. కాబట్టి, వారిని మినహాయించి మిగిలిన వారు ధనం పంచుకొన్నప్పుడు వీరికి తిండికీ-బట్టకూ లోటు లేకుండా చూడవలసిన బాధ్యత వారిదే. ॥201॥

వీరికి భోజనాచ్ఛాదనమును ఇస్తూ ఉండాలి-

ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వేషామపి తు న్యాయ్యం దాతుం శక్త్యా మనీషిణా । మూలశ్లోక సం. **79**
గ్రాసాచ్ఛాదనమత్యన్తం పతితో హ్యదదద్ భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **202**

టీక:- కింతు = కాని, **మనీషిణా** = బుద్ధిమంతుడు చేయవలసింది, **సర్వేషామ్+అపి శక్త్యా** = వీరందరికీ యథాశక్తి, **గ్రాస+ఆచ్ఛాదనమ్** = భోజనం, వస్త్రం మొ॥, **అత్యంతం** = తప్పనిసరిగా, **దాతుం** = ఇవ్వడమే, **న్యాయ్యం** = న్యాయోచితం, **అదద్ హి పతితః భవేత్** = ఈ విధంగా ఇవ్వనివాడు పతితుడుగా, పాపిగా చూడబడతాడు.

తాత్పర్యం:- పైన చెప్పబడిన వికలాంగల పోషణనిమిత్తం అందరూ గాని, వారి బాధ్యత తీసుకొన్న వాడుగాని బ్రతికి ఉన్నంతకాలం వారిని పోషించాలి. అలా పోషింపకుంటే వాడు పాపాత్ముడే అవుతాడు. ॥202॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యద్యర్థితా తు దారై స్స్యాత్క్లీబాదీనాం కథంచన । మూలశ్లోక సం. **80**
తేషా ముత్పన్న తంతూనామపత్యం దాయమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **203**

టీక:- **యది క్లీబాదీనాం కథంచన దారైః అర్థితాస్యాత్** = నపుంసకుడు మొదలైన పూర్వోక్తులైన వారికి వివాహం చేసుకోవాలనే కోరిక కలిగినట్లయితే, **తేషామ్ + ఉత్పన్న తన్తూనాం** = వీరికి కలిగిన క్షేత్రజులు, నియోగజులు మొదలయిన, **అపత్యం** = సంతానం, **దాయమ్+అర్హతి** = ధనానికి భాగస్వాములు. వీరికి భాగం పంచి ఇవ్వాలి.

తాత్పర్యం:- నపుంసకుడు మొదలైన పూర్వోక్తులైన వారికి వివాహం చేసుకోవాలనే కోరిక కలిగినట్లయితే, వీరికి కలిగిన క్షేత్రజులు, నియోజులు మొ॥న., సంతానం పితృధనానికి భాగస్వాములు. వీరికి భాగం పంచి ఇవ్వాలి.॥203॥

204,205 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ***యత్కించిత్పితరి ప్రేతే ధనం జ్యేష్ఠోఽధిగచ్ఛతి ।***
భాగో యవీయసాం తత్ర యది విద్యానుపాలితాః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***204***

తాత్పర్యం:- మరొక ధర్మసూక్ష్మమిక్కడ చెప్పబడుతోంది....

తండ్రి మృతిచెందినా, సోదరులతో పంపకం చేసుకోని అన్న తన మేధాశక్తియుక్తుల చేత, ప్రయత్నం చేత ధనాన్ని వృద్ధిచేసినచో, ఆ ధనాన్ని విద్యాగుణాలున్న తన తమ్ములందరికీ అందులో భాగం ఇవ్వాలి. ॥204॥

* ***అవిద్యానాం తు సర్వేషామీహాతశ్చేద్ధనం భవేత్ ।***
సమస్తత్ర విభాగస్స్యాదపిత్ర్య ఇతి ధారణా ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***205***

తాత్పర్యం:- ఆ విధంగాకాక, సోదరులంతా సమానంగా సేద్యమో-వర్తకమో చేసి ధనం సంపాదించి ఉమ్మడిగా ఒకచోట ఉంచి, భాగస్తులుగా కొంతకాలానికి విడిపోదలిస్తే, తండ్రిధనాన్ని తప్ప మిగిలిన దాన్ని సమానంగా పంచుకోవాలి. దీనిలో పెద్దవాడికీ ఏమీ ప్రమేయముండరాదు. ॥205॥

ప్రక్షిప్తాల పరిశీలన

204, 205 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలలో పైతృక సంపత్తిలో చదువుకోని వారికి ఆస్తిలో వాటా నిషేధం, చదువుకున్న వారికే ఆస్తిపై అధికారం - ఈ రెండు విషయాలూ మునుపు చెప్పిన వాటికి భిన్నమూ, వ్యతిరేకమూ. మునుపటి విభాగ విషయంలో ఇటువంటి నిషేధం ఎక్కడా లేదు. 9.104, 105,112,116,117, 192,218 మొదలైనవి చూడండి.

ఖ. వీటి కన్నా ముందు 201-202లలో ఆస్తిపై అధికారం లేనివారి గణన ఉంది. అందులో చదువుకోని వారిని చెప్పలేదు. కానీ ఇక్కడ 'జడం' అనే పద ప్రయోగం ఉంది. దీని వల్ల ఈ పద్ధతి మౌలికం కాదని రుజు వవుతూంది. 'చదువుకోనివారు' అధికారులు కాకపోతే, అక్కడే వీరిని గురించి చెప్పేవారు. ఇలా అంతర్ వ్యతిరేకత ఉండటంచేత ఇవి ప్రక్షిప్తాలు.

గ. మనువు చెప్పిన కర్మణా వర్ణ వ్యవస్థ ననుసరించి అందరు ద్విజులూ తప్పనిసరిగా చదువుకుంటారు. చదువుకోనివారు ద్విజులు కారు. కనుక, ఇది ద్విజులు కూడా చదువుకోని తర్వాతి కాలపు ప్రక్షిప్తం.

స్వార్జితానికి అతడే యజమాని

206-218వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

విద్యాధనం తు యద్యస్య తత్తస్యైవ ధనం భవేత్ । మూలశ్లోక సం. **81**
మైత్ర్యమౌద్వాహికం చైవ మాధుపర్కికమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **206**

టీక:- విద్యా ధనం మైత్ర్యమ్ ఔద్వాహికం = విద్య వల్ల వచ్చిన ధనం, మిత్రుడి వల్ల వచ్చిన ధనం, వివాహంలో వచ్చిన ధనం, **చ** = మరియు, **మాధుపర్కికమ్+ఏవ** = పూజ్యత, ఆదర సత్కారాల వల్ల వచ్చినది, **యత్ యస్యధనం** = ఏది ఎవరి ధనమో, **తత్ తస్య+ఏవ భవేత్** = అది అతడికే చెందుతుంది.

తాత్పర్యం:- అయితే, విద్యవల్ల లభించిన ధనం, స్నేహంలో గాని, వివాహంలో గాని, మధుపర్కపూజలో గాని లభించేది పంపకానికి పెట్టబడవు. ఏది ఎవరి ధనమో అది అతడికే చెందుతుంది. ॥206॥

ఇది మనుకృతం-ప్రామాణికం

భ్రాతౄణాం యస్తు నేహేత ధనం శక్తః స్వకర్మణా । మూలశ్లోక సం. **82**
స నిర్భాజ్యః స్వకాదంశాత్కించిద్దత్త్వోపజీవనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **207**

టీక:- భ్రాతౄణాం యః స్వకర్మణా శక్తః = సోదరులలో ఎవరైనా తన ఉద్యోగం ద్వారా సమృద్ధుడైనట్లయితే మరియు, **ధనం నేహేత** = పితృధనంలో నుండి భాగం కావాలని కోరనట్లయితే, **సః** = అతడికి కూడా, **స్వకాత్ + అంశాత్ కించిత్ ఉపజీవనమ్ దత్త్వా** = తమ తమ పితృ ధన సంపత్తి భాగముల నుండి కొంత ధనమిచ్చి, **నిర్భాజ్యః** = వేరు చేయాలి, కానీ ఏ మాత్రం ఇవ్వకుండా వేరుచేయరాదు.

తాత్పర్యం:- సోదరులలో ఎవడు రాజోద్యోగం మొదలైనవాటిచేత ద్రవ్యసంపాదనా సమర్థుడైతే, పితృధనం నుండి భాగం కావాలని కోరనట్లయితే, అతడికి కూడా తమ తమ పితృధన సంపత్తి భాగముల నుండి కొంత ధనమిచ్చి వేరు చేయాలి. కానీ, ఏ మాత్రం ఇవ్వకుండా వేరు చేయరాదు. ॥207॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అనుపఘ్నన్ పితృద్రవ్యం శ్రమేణ యదుపార్జితమ్ । మూలశ్లోక సం. **83**
స్వయమీహిత లబ్ధం తన్నాకామో దాతుమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **208**

టీక:- పితృద్రవ్యం అనుపఘ్నన్ = తండ్రి ధనాన్ని ఏ మాత్రం ఉపయోగించకుండానే, ఏ పుత్రుడైనా, **శ్రమేణ యత్ ఉపార్జితమ్** = తన శ్రమచే ధనాన్ని సంపాదించినట్లయితే, **స్వయమ్ + ఈహిత -లబ్ధం తన్** = స్వీయ పరిశ్రమ ధనం నుండి, **దాతుం అకామః** = ఏ సోదరుడుకైనా ఏ మాత్రం ఇవ్వనన్నప్పుడు, **న అర్హతి** = ఇవ్వకుండుగాక -ఇవ్వవలసిన బాధ్యత అతడికి లేదు.

తాత్పర్యం:- తండ్రి ఆస్తిని అలాగే ఉంచి, సేద్యం మొదలైన వాటిచేత-తన సామర్థ్యం మేరకు సోదరుల్లో ఒకరెవరైనా కొంత ధనం సంపాదిస్తే, దాన్ని తాను పంచి ఇవ్వడానికి మనసు రాకుంటే, అది తోబుట్టువులాశించరాదు. ॥208॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పైతృకం తు పితా ద్రవ్యమనవాప్తం యదాప్నుయాత్ । మూలశ్లోక సం. **84**
న తత్పుత్రైర్భజేత్సార్ధమకామః స్వయమర్జితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **209**

టీక:- పితా తు = ఒకవేళ ఏ తండ్రి అయినా, **అన్ + అవాప్తం పైతృకం ద్రవ్యమ్** = దాయరూపంలో పొందని పైత్రుక ధనం-అంటే పరంపరగా పైత్రుక ధనమే. కానీ కారణాంతరం వల్ల ఆ పైతృక ధనం తండ్రి స్వాధీనంలో లేదు,

దాన్ని, **యత్ ఆప్నుయాత్** = ఏ కుమారుడైనా స్వీయపరిశ్రమచే తిరిగి పొందగలిగినట్లైతే, **తత్ స్వయమ్ + అర్జితమ్** = అది అతడు సంపాదించుకొన్న ధనం, **పుత్రైః సార్థమ్ న భజేత్** = ఆ ధనాన్ని, తన పుత్రులలో పంచవచ్చు. ఇష్టం లేకపోతే పంచకుండా కూడా ఉండవచ్చు. ఇదంతా తండ్రి ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంది.

తాత్పర్యం:- ఒకవేళ ఏ తండ్రి అయినా దాయరూపంలో పొందని పైతృక కధనం దాన్ని ఏ కూమారుడైనా స్వీయపరిశ్రమచే తిరిగి పొందగలిగినట్లయితే అది అతడు సంపాదించుకొన్న ధనం, ఆ ధనాన్ని తన పుత్రులకు పంచవచ్చు.పంచకపోవచ్చు. ॥209॥

మళ్ళా కలిసి తరువాత వేరుపడినప్పుడు ఉద్ధార భాగముండదు - ఇది మనుకృతం-ప్రామాణికం

విభక్తాస్సహ జీవంతో విభజేరన్ పునర్యది । మూలశ్లోక సం.**85**
సమస్తత్ర విభాగస్స్యాజ్జ్యైష్ఠ్యం తత్ర న విద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**210**

టీక:- సోదరులందరూ, **విభక్తాః** = ఒకసారి వేరుపడి, **సహజీవన్తః** = మళ్ళా కలిసి జీవిస్తూ, **యది పునః విభజేరన్** = మళ్ళా వేరుపడదలచుకొన్నట్లయితే, **తత్ర సమవిభాగః స్యాత్** = ఆ స్థితిలో అందరికీ సమాన భాగం రావాలి, **తత్ర జ్యైష్ఠ్యం న విద్యతే** = అక్కడ జ్యేష్ఠ సోదరుడికి 'ఉద్ధార' భాగముండదు.

తాత్పర్యం:- సోదరులందరూ ఒకసారి వేరుపడి మళ్ళా కలిసి జీవిస్తూ, మళ్ళా వేరుపడదలచుకొన్నట్లయితే, ఆ స్థితిలో ఆస్థి అంతా అందరికీ సమానభాగం రావాలి, అక్కడ జ్యేష్ఠ సోదరుడికి **'ఉద్ధార'** భాగముండదు.

సోదరుడు చనిపోగా అతడి ధన విభాగం ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషాం జ్యేష్ఠః కనిష్ఠో వా హీయేతాంశప్రదానతః । మూలశ్లోక సం.**86**
మ్రియేతాన్యతరో వాఽపి తస్య భాగో న లుప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**211**

టీక:- **ఏషాం జ్యేష్ఠః వా కనిష్ఠః** = ఏ సోదరులలో జ్యేష్ఠ సోదరుడు గానీ కనిష్ఠ సోదరుడు గానీ, **అంశ ప్రధానతః హీయేత** = తన భాగ స్వామ్యం నుండి వంచితుడైనట్లయితే, **మ్రియేత వా అన్యతరః అపి** = మరణించవచ్చు లేదా అన్యమైన కారణాల వల్ల, గృహత్యాగం మొ॥ భాగం గ్రహించనట్లయితే, **తస్య భాగః న లుప్యతే** = అతని భాగం నష్టం కాదు. అతడి పుత్రుడికో లేదా పత్ని మొ॥ వారికో ప్రాప్తిస్తుంది.

తాత్పర్యం:- సోదరులలో జ్యేష్ఠ సోదరుడుగానీ కనిష్ఠ సోదరుడు గానీ తన భాగస్వామ్యం నుండి వంచితుడైనట్లయితే, అనగా మరణించినా లేదా అన్యకారణాల వల్ల గృహత్యాగం చేసినా, అతడి భాగం నష్టం కాదు. అతడి పుత్రుడికి గానీ పత్నికిగానీ ప్రాప్తిస్తుంది. ॥211॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సోదర్యా విభజేరంస్తం సమేత్య సహితాస్సమమ్ । మూలశ్లోక సం.**87**
భ్రాతరో యే చ సంసృష్టా భగిన్యశ్చ సనాభయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**212**

టీక:- పుత్రుడు, భార్య-ఎవరులేనట్లయితే, **సహితాః సోదర్యాః** = సొంత సోదరులు, సోదరీమణులు, **యే సంసృష్టాః భ్రాతరః** = సోదరులందరూ కలిసి, అలాగే, **సనాభయః భగిన్యః** = తోడబుట్టిన సోదరీమణులందరూ, **సమేత్య** = ఒకచోట చేరి, **తం సమమ్ విభజేరన్** = ఆ ధనాన్ని సమాన భాగాలుగా చేసి పంచుకోవాలి.

తాత్పర్యం:- పుత్రుడు, భార్య-ఎవరు లేనట్లయితే తక్కిన తోడబుట్టిన అన్నదమ్ములును, అక్క చెల్లెంద్రును ఒకచోట చేరి ఆ ధనాన్ని సమాన భాగాలుగా చేసి పంచుకోవాలి. ॥212॥

కర్తవ్య పాలనం చేయని జ్యేష్ఠుడికి ఉద్ధారం లేదు - ఇది మనుకృతం-ప్రామాణికం

యే జ్యేష్ఠో వినికుర్వీత లోభాద్భ్రాతౄన్ యవీయసః । మూలశ్లోక సం.**88**
సోఽ జ్యేష్ఠస్స్యాదభాగశ్చ నియంతవ్యశ్చ రాజభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**213**

టీక:- **యః జ్యేష్ఠః** = జ్యేష్ఠ సోదరుడు, **యవీయసః భ్రాత్రూన్ లోభాత్ వినికుర్వీత** = లోభమునకు దాసుడై చిన్న సోదరులకు పూర్తి భాగమును పంచి ఇవ్వకున్నట్లయితే, **సః + అజ్యేష్ఠః** = అతడు జ్యేష్ఠుడు కాడు. అతడి జ్యేష్ఠత్వం నిందనీయం. జ్యేష్ఠ సోదరుడికి ఇవ్వవలసిన ఉద్ధారం కూడా అతడికి ఇవ్వరాదు. (9.112,115), **నియంతవ్యశ్చ రాజభిః** = రాజు ద్వారా దండనీయుడు.

తాత్పర్యం:- జ్యేష్ఠుడు అయినవాడు లోభంచేత తనకంటె చిన్నసోదరులకు పూర్తి భాగం మొదలైన వాటిలో మోసం చేసినట్లయితే, అతడు జ్యేష్ఠ భ్రాతృత్య గౌరవానికి తగడు. వాడికి ఉద్ధారం కూడా ఇవ్వకూడదు. అతడు రాజదండనకు అర్హుడు అవుతాడు. ॥213॥

దాయధన వంచితులు- ఇది మనుకృతం-ప్రామాణికం

సర్వ ఏవ వికర్మస్థా నార్హంతి భ్రాతరో ధనమ్ । మూలశ్లోక సం.**89**
న చాదత్వా కనిష్ఠేభ్యో జ్యేష్ఠః కుర్వీత యౌతకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**214**

టీక:- **వికర్మస్థాః సర్వ + ఏవ భ్రాతరః** = పేకాడటం, దొంగతనం చేయడం మొ॥న పాపకర్మలలో ఆసక్తులైన సోదరులందరూ, **ధనం నార్హంతి** = ధనభాగార్హులు కారు. **చ** = మరియు, **కనిష్ఠేభ్య అదత్వా** = చిన్న సోదరులకు ఇవ్వకుండా, పంచకుండా, **జ్యేష్ఠః యౌతుకమ్ న కుర్వీత** = జ్యేష్ఠ సోదరుడు పితృ ధనం నుండి వేరుగా ధనం తీసికోరాదు.

తాత్పర్యం:- ఏ సోదరులు జూదం, వేశ్యాసంగమం, దొంగతనం దుర్వ్యసనాలకు ద్రవ్యం పాడుచేసేవారయి ఉంటారో వారు అలాంటి ధనభాగమునకు అర్హులుకారు. సర్వసాధారణ ధనం నుండి మరియు జ్యేష్ఠుడు తమ్ములకు భాగం ఇవ్వకుండా పంచకుండా, జ్యేష్ఠ సోదరుడు పితృధనం నుండి వేరుగా ధనం తీసుకోరాదు. ॥214॥

పితృ ధనాన్ని అసమానంగా విభాగం చేయరాదు - ఇది మనుకృతం-ప్రామాణికం

భ్రాతౄణామవిభక్తానాం యద్యుత్థానం భవేత్సహ । మూలశ్లోక సం.**90**
న పుత్రభాగం విషమం పితా దద్యాత్కథంచన ॥ ప్రక్షిప్త శ్లోక సం.**215**

టీక:- **భ్రాత్రూణాం అవిభక్తానాం యది సహ ఉత్థానం భవేత్** = సోదరులందరూ కూడా ఉంటూ అందరూ కలిసి ధనాన్ని సంపాదించినట్లైతే, **పితా** = తండ్రి, **కథంచన పుత్రభాగం విషమం న దద్యాత్** = తండ్రి పుత్రభాగాన్ని విషమంగా కొందరికి ఎక్కువగా మరికొందరికి తక్కువగా ఇవ్వరాదు. అందరికి సమానంగా ఇవ్వాలి.

తాత్పర్యం:- తోడబుట్టినవారందరూ అవిభక్తులై తండ్రితో కలిసి ఉండి వ్యాపారం మున్నగు కార్యాలచేత ధనాన్ని ఆర్జించినట్లయితే, తండ్రి పుత్రులకందరికీ ధనాన్ని సమంగా పంచి ఇవ్వాలి. కాని, ఒక్కరికి ఎక్కువగాను, మర్యొకరికి తక్కువగానూ పంపకం చేయరాదు. ॥215॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఊర్ధ్వం విభాగాజ్జాతస్తు పిత్ర్యమేవ హరేద్ధనమ్ । మూలశ్లోక సం.**91**
సంసృష్టా స్తేన వా యే స్యుర్విభజేత స తైస్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**216**

టీక:- విభాగాత్ ఊర్ధ్వ జాతః తు = ధనాన్ని పంచిన తరువాత, తండ్రి జీవించి ఉండగానే, ఇంకో పుత్రుడు జన్మించినట్లయితే, ఆ బిడ్డ, **పిత్ర్యమ్ + ఏవ ధనమ్ హరేత్** = అప్పుడు తండ్రికున్న ధనాన్ని మాత్రమే పొందగలడు. **వా** = లేదా, **యే తేన సంసృష్టా స్యుః** = ఏ పుత్రుడైనా తండ్రితో కలిసి ఉంటున్నట్లయితే, అప్పుడు, ఈ బిడ్డ తండ్రితో కలిసి ఉండే సోదరులతో, **సః తైః సహ విభజేత** = అతడు ధనాన్ని సమానంగా పంచుకోవచ్చు.

తాత్పర్యం:- తండ్రి జీవించి ఉండగానే, ధనాన్ని పుత్రులకు పంపకం చేసి ఇచ్చిన తరువాత జన్మించిన పుత్రుడు తండ్రి గతించిన తరవాత అతడి ధనమునకు మాత్రమే అర్హుడవుతాడు. లేదా పుత్రులందురూ తండ్రితో పాటు కలిసి ఉంటారో, అప్పుడు తండ్రికి తరవాత ఆ ధనం సమంగా పంచుకోవాలి. ॥216॥

సంతానం లేని ఒంటరి పుత్రుడి సంపదకు ఉత్తరాధికారి ఎవరు? ఇది మనుకృతం-ప్రామాణికం

అనపత్యస్య పుత్రస్య మాతా దాయమవాప్నుయాత్ । మూలశ్లోక సం. **92**
మాతర్యపి చ వృత్తాయాం పితుర్మాతా హరేద్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **217**

టీక:- అనపత్యస్య పుత్రస్య దాయమ్ = సంతాన హీనుడు పత్నీహీనుడైన పుత్రుడి సంపద, **మాతా + అవాప్నుయాత్** = తల్లికి లభించాలి, **మాతరి + అపివృత్తాయాం** = తల్లి కూడా మృతురాలైనట్లయితే, **పితుః మాతా ధనం హరేత్** = తండ్రి తల్లికి, (దాదీ నాయనమ్మకు) ఆ ధనం చెందుతుంది.

తాత్పర్యం:- సంతతి లేక పుత్రుడు మృతి చెందినట్లయితే, వాని భాగము తల్లికి చెందుతుంది. (ఇంతకు ముందు 'పితా హరే దపుత్రస్య' అని చెప్పినందువల్ల తల్లిదండ్రులు సమంగా పంచుకోవాలని తెలుసుకోవాలి) తల్లికూడా మృతిచెందినట్లయితే, భార్య, తల్లి, తోబుట్టువులు, తోబుట్టువుల పుత్రులును, వారును లేనప్పుడు తండ్రి తల్లి ఆ భాగమును తీసుకోవాలి. ॥217॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఋణే ధనే చ సర్వస్మిన్ ప్రవిభక్తే యథావిధి । మూలశ్లోక సం. **93**
పశ్చాద్దృశ్యేత యత్కించిత్తత్సర్వం సమతాం నయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **218**

టీక:- సర్వస్మిన్ ఋణే చ ధనే = తండ్రి చేసిన సమస్త రుణం, ధనాన్ని, **యథావిధి ప్రవిభక్తే** = శాస్త్రాను సారంగా విభజన జరిగిన తరువాత, **యత్ కించిత్ పశ్చాత్ దృశ్యేత** = ఇంకా కొంత రుణం, ధనం ఉన్న విషయం తెలిసినప్పుడు, **తత్ సర్వం సమతాం నయేత్** = ఆ రుణాన్ని, ధనాన్ని సమానంగా పంచుకోవాలి.

తాత్పర్యం:- తండ్రిచేసిన ధనంగాని, ఋణంగాని, పంచుకొన్న తరవాత, ఏదైనా ధనం దొరికినా, ఋణం ఉన్నా దాన్ని సమానంగా పంచుకోవాలి. కానీ దానియందు జ్యేష్ఠుడికి ఉద్ధారం ఇవ్వాల్సిన అవసరం లేదు. ॥218॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *వస్త్రం పత్రమలంకారం కృతాన్నముదకం స్త్రియః ।*
యోగక్షేమం ప్రచారం చ న విభాజ్యం ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***219***

తాత్పర్యం:- వస్త్రాలు, వాహనాలు, భూషణాలు, పక్వం చేసిన సత్తుపిండి మొదలైనవి, నూతిలోని నీరు, పనికత్తెలు, మంత్రిపురోహితాదులు, గోవులు మొదలైనవి పోవుదారిలో వాటన్నిటినీ పంపకం చేసికోరాదు. ఎవరెవరి వద్ద ఉండేవి

వారువారు అనుభవించాలి. పైన చెప్పిన వస్త్రాదులు విలువగలవిగా ఉంటే, వాటికి సమమైన విలువకట్టి ఆ ధనం అందరూ పంచుకోవాలి. పక్వపదార్థాలకు బదులు అపక్వపదార్థాలను ఇవ్వాలి. నూతినీటిని అందరూ వాడుకోవాలి. కానీ విభజించరాదు. పనివారిని, పనికత్తెలను సమంగా పంచుకోక వారిచేత పని చేయించుకోవాలి.॥219॥

ప్రక్షిప్త పరిశీలన

219వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. అంతర్ వ్యతిరేకాలు

క. 219వ శ్లోకం వెనుక చెప్పిన ఆస్తి భాగాల విధానాత్మక శ్లోకాలకు వ్యతిరేకం. వాటిలో మొత్తం పైతృక సంపదను విభజించాలని ఉంది [9.104,218].

ఖ. ఈ శ్లోకంలో స్త్రీలకు భాగం లేదని చెప్పటం వల్ల శ్లోకకారుడు దాసీల సంప్రదాయాన్ని అంగీకరించినట్లు తోస్తుంది. ఇది కూడా మనువుకు వ్యతిరేకం. మనువు దాసదాసీల ఆచారాన్ని అంగీకరించడు. శూద్రులనే సేవకులుగా అంగీకరిస్తాడు. అది కూడా వారి ఇష్ట ప్రకారమే[1.91, 9.334-335,10.99]. అందువల్ల ఇది ప్రక్షిప్తం.

18వ వివాదం. ద్యూత సంబంధమైన వివాద నిర్ణయం 220 నుండి 250 వరకు

220-228వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

అయముక్తో విభాగో వః పుత్రాణాం చ క్రియావిధిః । మూలశ్లోక సం.**94**
క్రమశః క్షేత్రజాదీనాం ద్యూతధర్మం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం.**220**

టీక:- అయం = ఇది(9.103-219), వః = మీకు, విభాగః = దాయభాగ విధానం, చ = మరియు, క్షేత్రజ+ఆదీనాం క్రియావిధిః = క్షేత్రజుడు మొ॥ పుత్రులకు (9.145-147) ధన విభజన విధి, క్రమశః+ ఉక్తః = క్రమంగా చెప్పబడింది, ఇప్పుడు, **ద్యూత ధర్మం నిబోధత** = జూదం గురించి విధానం వినండి.

తాత్పర్యం:- పుత్రులకును, క్షేత్రజాదులకును వరుసగా ఈ దాయభాగ విధానం మీకు చెప్పిబడింది. జూదం గురించి నియమాలు చెబుతాను వినండి. ॥220॥

కుటుంబానికి, దేశానికి నష్టం కలిగించే జూదాన్ని నివారించాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

ద్యూతం సమాహ్వాయం చైవ రాజా రాష్ట్రాన్నివారయేత్ । మూలశ్లోక సం.**95**
రాజాంతః కరణావేతౌ ద్వౌ దోషౌ పృథివీక్షితామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**221**

టీక:- రాజా = రాజు, **ద్యూతం** = జడ వస్తువులను పణంగా పెట్టి ఆడే జూదాన్ని, **చ** = మరియు, **సమాహ్వాయం + ఏవ** = చేతన ప్రాణులను పణంగా పెట్టి, ఇవ్వడం-పుచ్చుకోవడం. సమాహ్వాయ నామకమైన జూదం (9.223), **రాష్ట్రాత్ నివారయేత్** = తన దేశంలో లేకుండా చేయాలి. ఎందుకంటే. **ఏతౌ ద్వౌ దోషౌ** = ఈ రెండు చెడులు, **పృథివీక్షితామ్ రాజాంతః కరణౌ** = రాజుల రాజ్యాలను నష్టపరచేవి.

తాత్పర్యం:- జూదం, సమాహ్వాయం (చేతన ప్రాణులను పణంగాపెట్టడం) అనే రెండు దోషాలు రాజులకు రాజ్యనాశకాలు కాబట్టి రాజు అనేవాడు ఈ రెండూ తన రాజ్యంలో లేకుండా చెయ్యాలి. ॥221॥

వివరణ:

1. జూదం వల్ల నష్టం:- ఈ శ్లోక భావాన్ని తెలియజేయడానికి ఉదాహరణ మహా భారతం నుండి లభిస్తుంది. ద్యూతం, సమాహ్వయమనే వ్యసనాల వల్లనే పాండవులు తమ గౌరవాన్ని, సమస్తరాజ్యాన్నీ పోగొట్టుకోవలసి వచ్చింది. దాని పరిణామమే కౌరవ పాండవుల మధ్య జరిగిన మహాభారత యుద్ధం. దానివల్ల కౌరవులు నాశనమైపోగా, పాండవులు నానావిధ కష్టాలను ఎదుర్కొవలసి వచ్చింది.

2. వేదాలలో జూదనిషేధం:- తీవ్ర శబ్దాలతో వేదం జూదాన్ని నిందించినది. నిషేధించినది. (ఋగ్వేదం-10-34 సూక్తంలో) జూదం యొక్క దయనీయ దశను వర్ణించినది. ఈ సూక్తంలోని 13వ మంత్రం ఈ విధంగా ఆదేశిస్తుంది.

"అక్షైర్మా దీవ్యః" పాచికలు (జూదం) ఆడవద్దు

జూదం కూడా ప్రత్యక్షంగా చేసే ఒక దొంగతనమే - ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రకాశమేతత్తాస్కర్యం యద్దేవనసమాహ్వయౌ । మూలశ్లోక సం. **96**
తయోర్నిత్యం ప్రతీఘాతే నృపతిర్యత్నవాన్ భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **222**

టీక:- యత్ దేవన-సమాహ్వయౌ = జూదం, సమాహ్వయం, **ఏతత్ ప్రకాశమ్ తాస్కర్యం** = ఈ రెండూ ప్రత్యక్షంగా జరిగే దొంగతనాలే, **నృపతిః** = రాజు, **తయోః ప్రతీఘాతే** = వీటిని సమాప్తం చేయడానికి, **నిత్యం యత్నవాన్ భవేత్** = సదా ప్రయత్నశీలుడుగా ఉండాలి.

తాత్పర్యం:- జూదం, పందెం అనేవి రెండూ బహిరంగంగా చేసే దొంగతనం లాంటివి. కాబట్టి రాజు గట్టిగా వీటిని ప్రతిఘటించాలి. ॥222॥

జూదం - సమాహ్వయాలలో భేదం - ఇది మనుకృతం-ప్రామాణికం

అప్రాణిభిర్యత్ క్రియతే తల్లోకే ద్యూతముచ్యతే । మూలశ్లోక సం. **97**
ప్రాణిభిః క్రియతే యస్తు స విజ్ఞేయస్సమాహ్వయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **223**

టీక:- అప్రాణిభిః యత్ క్రియతే = డబ్బులు, పావులు, చదరంగం మొ॥ పందెంగా పెట్టి అడటం జూదం, **యః తు ప్రాణిభిః క్రియతే** = చేతన ప్రాణులలో కోడి, మేక, గొర్రె, పక్షులు, గుర్రం పందెములుగా పెట్టి ఆడేది, **సః సమాహ్వయః విజ్ఞేయః** = సమాహ్వయమంటారు.

తాత్పర్యం:- ప్రాణంలేనట్టి డబ్బు పాచికలు మొదలైన వాటితో ఆడబడేది జూదమనీ, ప్రాణం ఉన్న పొట్టేళ్లు, కోళ్లు, ఎడ్లు, మేకలు మొదలైన వాటితో పందెం ఒడ్డి ఆడబడేది సమాహ్వయం అనీ అంటారు. ॥223॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ద్యూతం సమాహ్వయం చైవ యః కుర్యాత్ కారయేత వా । మూలశ్లోక సం. **98**
తాన్ సర్వాన్ ఘాతయేద్రాజా శూద్రాంశ్చ ద్విజలింగినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **224**

టీక:- యః = ఏ మనుషుడు, **ద్యూతం చ సమాహ్వం + ఏవ** = జూదం, సమాహ్వయమును, **కుర్యాత్, వా కారయేత్** = స్వయంగా ఆడినా లేదా ఇతరుల చేత ఆడించినా, **రాజా** = రాజు, **తాన్ సర్వాన్** = వారినందరినీ, **చ** = మరియు, **ద్విజలిఙ్గినః శూద్రాం** = కపట పూర్వంగా ద్విజుల వేషధారణచేసే శూద్రులను, **ఘాతయేత్** = శారీరక దండన (కొట్టడం, అంగచ్ఛేదనం) మొ॥ చేయాలి.

తాత్పర్యం:– ఎవరైనా ఈ రెండూ క్రీడలుగా భావించి ఆడటంగానీ-ఆడించటం గానీ చేస్తే వారి నేరానికీ, అక్కడ పందెంగా పెట్టి ఆడుతూన్న ద్రవ్యానికీ తగినట్లుగా చేతులు ఖండించడం లాంటి శిక్షలను రాజు అమలు చేయాలి. అట్లే బ్రాహ్మణాది వేశాల్లో ఉండే శూద్రులుగా భావించి శిక్షించాలి. ॥224॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కితవాన్ కుశీలవాన్ క్రూరాన్పాఖండస్థాంశ్చ మానవాన్ । మూలశ్లోక సం. **99**
వికర్మస్థాఞ్ఛౌండికాంశ్చ క్షిప్రం నిర్వాసయేత్పురాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **225**

టీక:– **కితవాన్** = జూదరులు, **కుశీలవాన్** = నర్తకులు (అసభ్యంగా నాట్యం చేస్తూ జీవించేవారు), **క్రూరాన్** = అత్యాచారం చేసేవారు, **పాఖండస్థాన్** = నాటకం చేస్తూ తిరిగేవారు, **వికర్మస్థాన్** = శాస్త్రవిరుద్ధమైన పాపకర్మలు చేసేవారు, **శౌండికాన్** = మద్యం తయారు చేస్తూ అమ్మేవారైన, **మానవాన్** = ఈ మానవులను, **పురాత్ క్షిప్రం నిర్వాసయేత్** = రాజు వీరిని వెంటనే నగరం నుండి బహిష్కరించాలి.

తాత్పర్యం:– జూదం ఆడేవారినీ, కపట చిహ్నాలు ధరించేవారినీ, నటగాయక విట ధూర్తులను ఆపద్ధర్మంగా గాక నిత్యం తమ వర్ణధర్మాలని విడిచిపెట్టి సంచరించేవారినీ, మద్యం తయారుచేస్తూ ఆమ్మేవారినీ రాజు తన దేశం నుంచి తక్షణం బహిష్కరించాలి. ॥225॥

వివరణ:

'కుశీలవ' శబ్దానికి అర్థం:– **"కుత్సితం శీలమ్ = కుశీలమ్, కుశీలం యస్య అస్తి = సః కుశీలవః** మత్వర్థీయ 'వ' ప్రత్యయం. అంటే ఎవరి స్వభావం నిందనీయమో, చేష్టలు అసభ్యంగా ఉంటాయో, అసభ్యంగా నాట్యం చేసేవారు, వారు కుశీలవులు. వీరే అహితకరమైన విషయాలను వ్యాపింపచేస్తూ సంచరించేవారు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతే రాష్ట్రే వర్తమానా రాజ్ఞః ప్రచ్ఛన్నతస్కరాః । మూలశ్లోక సం. **100**
వికర్మక్రియయా నిత్యం బాధంతే భద్రికాః ప్రజాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **226**

టీక:– **ఏతే ప్రచ్ఛన్న తస్కరాః** = వీరు (225 శ్లో) ప్రచ్ఛన్న తస్కరులు (కనపడని దొంగలు మారువేషంలో ఉండి దొంగతనం చేసేవారు), **రాష్ట్రే వర్తమానాః** = రాజ్యంలో ఉంటూ, **వికర్మ క్రియయా** = తప్పుడు పనులు చేస్తూ, **నిత్యం** = సదా, **రాజ్ఞః** = రాజు యొక్క, **భద్రికాః ప్రజాః** = సజ్జనులైన ప్రజలకు, **బాధన్తే** = హాని చేస్తూ, దుఃఖదాయకులుగా ఉంటారు.

తాత్పర్యం:– దీనికి కారణం ఏమనగా–పై జెప్పబడిన ఈ జూదరులు మొదలగు వారంతా వేషం మార్చిన దొంగలే! వీళ్లు రాజ్యంలోని సజ్జనులను సైతం తమ వంచన చేత ఆకర్షించి వారి ధనమానాలను హరించడానికి వెనుకాడరు. ॥226॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ద్యూతమేతత్ పురాకల్పే దృష్టం వైరకరం మహత్ । మూలశ్లోక సం. **101**
తస్మాద్ద్యూతం న సేవేత హాస్యార్థమపి బుద్ధిమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **227**

టీక:- **ఏతత్ ద్యూతమ్** = ఈ జూదం, **పురాకల్పే మహత్ వైరకరం దృష్టం** = ఇంతకు ముందు రాజులలో కూడా మహా కష్టాలను కలిగించి, శత్రుత్వాన్ని పెంచేదిగా గుర్తించబడింది, **తస్మాత్** = అందువల్ల, **బుద్ధిమాన్** = బుద్ధి కలిగిన మానవుడు, **హాస్యార్థమ్ + అపి ద్యూతం న సేవేత** = తమాషాకైనా, కాలక్షేపానికైనా జూదం ఆడరాదు.

తాత్పర్యం:- కేవలం ఈ సందర్భంలో మాత్రమే కాదు! పూర్వపు రాజులలో ఈ జూదం ఎంతెంతో వైరాన్ని కలిగించింది. కాబట్టి బుద్ధిమంతులు వేడుకనిమిత్తమైనా జూదమాడరాదు. ॥227॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రచ్ఛన్నం వా ప్రకాశం వా తన్నిషేవేత యో నరః । మూలశ్లోక సం. **102**
తస్య దణ్డవికల్పస్స్యాద్యథేష్టం నృపతేస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **228**

టీక:- **ప్రచ్ఛన్నం వా ప్రకాశం వా** = రహస్యంగా గానీ లేదా బహిరంగంగా గానీ అందరి ఎదుట గానీ, **యః నరః తత్ నిషేవేత** = ఏ మనుషుడు జూదమాడతాడో, **తస్య దండవికల్పః** = అతడికి దండ విధానం నిశ్చితమేమి కాదు, **నృపతేః యథేష్టం స్యాత్** = రాజు యిష్టానుసారం దండన ఉంటుంది. కారణం జూదం సహించ రాని దుష్కర్మ, (221-224) ఈ జూదాల వల్ల కలిగే హానిని చూచి రాజు తన ఇష్టమైన దండన జూదరికి విధించవచ్చు.

తాత్పర్యం:- ఏ మనుజుడైనా అలాంటి నిషేధిత జూదాన్ని రహస్యంగా గాని, ఇతరులను మభ్యపెట్టిగాని ఆడినట్లు తెలిసినా రాజు ఆ ప్రదేశాన్ని దాడులకు గురిచేసి, ఆటగాళ్లను తన ఇచ్ఛప్రకారం దండించవచ్చు! ॥228॥

229,230 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *క్షత్రవిద్ శూద్ర యోనిస్తు దణ్డం దాతుమశక్నువన్ ।*
ఆనృణ్యం కర్మణా గచ్ఛేద్విప్రో దద్యాచ్ఛనైశ్శనైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***229***

తాత్పర్యం:- ఈ నేరం చేసిన క్షత్రియాదులు నిర్ధనులై, జూదంలో సర్వం కోల్పోయి జరిమానా చెల్లించలేని స్థితిలో ఉంటే రాజే ఆ జరిమానా చెల్లించాలి. ఈ నేరంలో బ్రాహ్మణుడుంటే దండగలేవీ చెల్లించకుండా హెచ్చరించి వదలాలి. వారిచేత పనిచేయించి ఆ జరిమానా చెల్లించేలా చేయాలన్నది కొందరి మతం. ॥229॥

* *స్త్రీబాలోన్మత్తవృద్ధానాం దరిద్రాణాం చ రోగిణామ్ ।*
శిఫావిదలరజ్జ్వాద్యైర్విదధ్యాన్నృపతిర్దమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***230***

తాత్పర్యం:- ఏవైనా పొరపాట్లు జరిగితే (తప్పులంత తీవ్రమైనవి కానిచో) స్త్రీ బాలవృద్ధుల విషయంలోగాని, పిచ్చివారి విషయమై గాని, దరిద్రులు వ్యాధిపీడితులైతే వెదురుకర్ర, తాడు ఉపయోగించి తగుమాత్రం దండన చేయాలి. ॥230॥

ప్రక్షిప్తాల పరిశీలన

229, 230 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

క. విషయ సంకేతక శ్లోకం 9.220 ప్రకారం, అక్కడి విషయం 'ద్యూత సంబంధమైన. పద్ధతులను గురించి, ఈ శ్లోకాలలో చెప్పిన సామాన్య దండన పద్ధతి పైదానికి వ్యతిరేకం కనుక, అసంగత మైనందున ఈ రెండు శ్లోకాలూ ప్రక్షిప్తాలు.

ఖ. 229వ శ్లోకంలో ఇతర వర్ణాలవారితో పనులు చేయించుకోవచ్చు కానీ, బ్రాహ్మణుల చేత చేయించుకోకూడదు

అనేది పక్షపాత దండన పద్ధతిని తెలుపుతూంది. మనువు అందరికీ పక్షపాత రహితమైన, సర్వ సామాన్యమైన సమాన దండన పద్ధతిని చెప్పాడు[9.307,311]; పైగా బ్రాహ్మణులు ఎక్కువ తెలివిగల వారు, బాధ్యత గలవారు కనుక, వారికి అధిక దండన అని కూడా చెప్పాడు [8.338]. కనుక ఈ పక్షపాత పూర్వక వ్యవస్థ మనువుకు వ్యతిరేకం.

దావాల అనంతరం ఉపసంహారం

231 నుండి 234వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

లంచం తీసికొని అన్యాయం చేసేవారికి దండన -

యే నియుక్తాస్తు కార్యేషు హన్యుః కార్యాణి కార్యిణామ్ । మూలశ్లోక సం.103
ధనోష్మణా పచ్యమానాస్తాన్నిఃస్వాన్ కారయేన్నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం.231

టీక:- **కార్యేణ నియుక్తాః తు యే** = వాదవివాద కార్యాలలో నియుక్తులైన అధికారులు కర్మచారులు (న్యాయాధిపతులు మొ॥ వారు), **ధన+ఊష్మణా పచ్యమానాః** = ధనోష్ణంతో కాలిపోయేవారు-లంచాలు తీసుకొనే ఆసక్తులైనవారు, **కార్యిణాం కార్యాణి హన్యుః** = వాది-ప్రతివాదుల కేసులను (వివాదాలను) చెడగొడతారో, **తాన్** = వారిని, **నృపః** = రాజు, **తాన్ నిఃస్వాన్ కారయేత్** = వారి ఆస్తినంతటినీ జప్తు చేయాలి.

తాత్పర్యం:- వ్యవహార విచారణ నిమిత్తం రాజుచేత నియమితులైన విద్వాంసులు, పరిశీలకులు, వివాదగ్రస్తుల తగవులు పరిష్కరించకుండా, లంచాలు తీసుకొనే ఆసక్తులైన వారు రాజుకు చెడ్డపేరు తెస్తే ప్రభువు వారి సొత్తునంతటినీ జప్తుచేసుకొని,ఖజానాకు జమవేయాలి. ॥231॥

వివరణ:

'ధనోష్మణా పచ్యమానాః' ఇదొక నుడికారం = ధనాశలో మునిగిన వారు లేదా లంచాలు తీసుకొనేవారని అర్థం. అలాగే లంచకారుల ఆస్తిని రాజు తీసుకొని వారిని ధనహీనులుగా చేయాలి.

వివాదాలను నిర్ణయించడంలో కపటంగా ప్రవర్తించేవారికి దండన- **ఇది మనుకృతం-ప్రామాణికం**

కూటశాసనకర్తౄంశ్చ ప్రకృతీనాం చ దూషకాన్ । మూలశ్లోక సం.104
స్త్రీబాల బ్రాహ్మణఘ్నాంశ్చ హన్యాద్ద్విట్ సేవినస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం.232

టీక:- **కూటశాసన కర్తౄన్** = రాజు నిర్ణయాలను కపట పూర్వకంగా (తప్పుడుగా) రాసేవారు, **ప్రకృతీనాం దూషకాన్** = ప్రకృతులు (9.294) రాజు, మంత్రి, సేనాపతి మొ॥వారిని, లంచం మొదలైన తప్పుడు పనులలో ఇరికించి చెడగొట్టేవారు, **స్త్రీ-బాల-బ్రాహ్మణఘ్నాన్ చ** = స్త్రీలను, భాలబాలికలను, విద్వాంసులను హత్య చేసేవారు **(తథా)**, **ద్విట్ సేవినః** = శత్రువుతో కలిసి, వారికి సహాయపడేవారు.(వీరికి), **హన్యాత్** = వధరూపమైన దండన, మృత్యు దండన = ఇవ్వాలి. అంటే కఠోరాతి కఠోరమైన, కష్టప్రదమైన దండన ఇవ్వాలి.

తాత్పర్యం:- రాజు నిర్ణయాలను కపట పూర్వకంగా రాసేవారు, తప్పుడు ఉత్తర్వుల చేత రాజాధికారులను-మంత్రులను, సైనికాధికారులను, తనతో తీవ్రంగా విభేదించేవారిని, స్త్రీలను-పిల్లలను-బ్రాహ్మణులను వేధించేవారిని, శత్రు గూఢచారుల్ని రాజు కనికరించరాదు. లంచం మొ॥ తప్పుడు పనులలో ఇరికంచి చెడగొట్టేవారు, స్త్రీలను బాలబాలికలను, విద్వాంసులను హత్య చేసేవారు, శత్రువుతో కలిసి, వారికి సహాయపడేవారు, వీరికి రాజు మరణదండన విధించాలి. ॥232॥

ఎవరి ఒత్తిడి వల్ల గాని, లేదా ధనాశకు పాల్పడి గాని న్యాయనిర్ణయాన్ని మార్చరాదు - ఇది మనుకృతం-ప్రామాణికం

తీరితం చానుశిష్టం చ యత్ర క్వచన యద్ భవేత్ । మూలశ్లోక సం. **105**
కృతం తద్ధర్మతో విద్యాన్న తద్భూయో నివర్తయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **233**

టీక:- యత్ర క్వచన = ఏ వివాదంనందైనా, **తీరితం** = సరీగా న్యాయం నిర్ణయించబడినదో, **చ** = మరియు, **అనుశిష్టం భవేత్** = ఏదైనా దండన చేయమని ఆదేశింపబడినదో, **ధర్మతః తత్ విద్యాత్** = అది ధర్మపూర్వకంగా చేసిన నిర్ణయం కాబట్టి దాన్ని పూర్తిగా అమలు చేయాలి, **తత్ భూయః న నివర్తయేత్** = ఆ కేసును (దావాను) మళ్ళీ నిర్ణయించరాదు. లోభం వల్ల గాని, మమకారం వల్ల గాని లేదా కారణమేమీ లేకుండ గానే న్యాయ నిర్ణయాన్ని మార్చరాదు. అయితే విశేషమైన బలవత్తరమైన కారణమున్నట్లయితే మళ్ళీ నిర్ణయం చేయవచ్చు.

తాత్పర్యం:- ఏ వ్యవహారమైనా, అది న్యాయరీత్యా ముగించబడిందా-లేదా దండన వరకూ వెళ్లిందా అని విచారించి రాజు తెలుసుకోవాలి. తుది తీర్పుపై ఏమైనా ఫిర్యాదులుంటేనే రాజు మళ్ళీ విచారణకు పూనుకోవాలి తప్ప, మిగిలిన సందర్భాలలో న్యాయసభ తీర్పు ఆమోదించాలి. ॥233॥

అన్యాయం చేసిన అమాత్యులను-న్యాయాధీశులను దండించాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

అమాత్యాః ప్రాడ్వివాకో వా యత్కుర్యుః కార్యమన్యథా । మూలశ్లోక సం. **106**
తత్స్వయం నృపతిః కుర్యాత్తాన్సహస్రం చ దండయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **234**

టీక:- **అమాత్యాః వా ప్రాడ్వివాకః** = మంత్రిగాని, న్యాయాధీశుడుగాని, **యత్ కార్యమ్ + అన్యథా కుర్యుః** = ఏ వివాదాన్ని అన్యాయంగా నిర్ణయిస్తారో, **తత్** = ఆ వివాద నిర్ణయాన్ని, **నృపతిః** = రాజు, **స్వయం కుర్యాత్** = స్వయంగా నిర్ణయించాలి. **చ** = మరియు, **తాన్** = వారిని అన్యాయ నిర్ణయం చేసినట్టి అధికారులను, **సహస్రం దండయేత్** = ఒక వేయి పణముల జరిమానా వేసి దండించాలి.

తాత్పర్యం:- రాజుచే నియమితులైన మంత్రులు, న్యాయాధీశులు, వ్యవహారాలను చక్కగా పరిష్కరించక వివాదాన్ని అన్యాయంగా నిర్ణయిస్తారో ఆ వివాద నిర్ణయాన్ని, రాజు స్వయంగా నిర్ణయించాలి, అన్యాయ నిర్ణయం చేసిన అధికారులను వెయ్యిపణముల జరిమానా వేసి దండించాలి. ॥234॥

235-248వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** ఆ నలుగురు మహా పాతకులు-వారికి దండన-**

* *బ్రహ్మహా చ సురాపశ్చ స్తేయీ చ గురుతల్పగః ।*
ఏతే సర్వే పృథగ్ జ్ఞేయా మహాపాతకినో నరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***235***

తాత్పర్యం:- బ్రహ్మహత్య, మద్యపానం, బ్రాహ్మణుల బంగారం దొంగిలించడం, గురుభార్యను రమించడం అనే నాలుగు పాపాలూ మహాపాపాలు అనబడుతున్నాయి. ॥235॥

* *చతుర్ణామపి చైతేషాం ప్రాయశ్చిత్తమకుర్వతామ్ ।*
శారీరం ధనసంయుక్తం దండం ధర్మ్యం ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***236***

తాత్పర్యం:-ఈ పాతకులు ప్రాయశ్చిత్తం చేసుకోకుంటే, ధన రూపంలోను, శారీరక దండన రూపంలోను రాజుకు శిక్షించడానికి అధికారం ఉంది. ॥236॥

* *గురుతల్పే భగః కార్యః సురాపానే సురాధ్వజః ।*
స్తేయే చ శ్వపదం కార్యం బ్రహ్మహణ్యశిరాః పుమాన్॥ ప్రక్షిప్త శ్లోక సం. ***237***

తాత్పర్యం:- గురుభార్యను సంగమించిన మహాపాతకుడికి నుదుట భగం గుర్తుతో కాల్చిన ఇనుప శలాకతో వాతవేయాలి. మద్యపానం చేసినవాడి నుదుట కల్లుచెట్టుగుర్తు, సువర్ణం దొంగిలించినవాడి నుదుట కోడిపాదం లాంటి కాల్చినవాతలు పెట్టాలి. బ్రహ్మహత్య చేసిన వాడి నుదుట తలలేని మొండెం గుర్తు వాత వేయాలి. ఇంకా.... ॥237॥

* అసంభోజ్యా హ్యసంయాజ్యా అసమ్పాఠ్యాఽ వివాహినః ।
చరేయుః పృథివీం దీనాః సర్వధర్మబహిష్కృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*238*

తాత్పర్యం:- ఈ మహాపాతకులకు ఎవరూ భోజనం పెట్టకూడదు. వీరిచేత యాగాలు చేయించరాదు. వివాహం అసలే కూడని పని. వేదాధ్యాపనం నాస్తి. నిర్ధనులై, శూద్రులింట భిక్ష మెత్తే వారై, శ్రౌత-స్మార్త కర్మలకు దూరులై అడవుల్లో సంచరిస్తాడు. ॥238॥

* జ్ఞాతిసంబన్ధిభిస్త్వేతే త్యక్తవ్యాః కృతలక్షణాః ।
నిర్దయా నిర్నమస్కారాస్తన్మనోరనుశాసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*239*

తాత్పర్యం:- ఈ గుర్తులు వేయబడ్డవారిని దాయాదులు-బంధువులు విడిచివేయాలి. వీరిపట్ల జాలి చూపరాదు. వీరిని ఎవరూ చూడకూడదు. నమస్కరించ కూడదు అని మనువు శాసనం. మహా పాతకుల పాట్లు ఇలాంటివి.॥239॥

* ప్రాయశ్చిత్తం తు కుర్వాణా స్సర్వవర్ణా యథోదితమ్ ।
నాంక్యా రాజ్ఞా లలాటే స్యుర్దాప్యాస్తూ త్తమసాహసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*240*

తాత్పర్యం:- ఈ మహాపాతకులు ప్రాయశ్చిత్త విధి నిర్వర్తిస్తే మాత్రం, నుదుట గుర్తులు వేయడం బ్రాహ్మణ క్షత్రియ వైశ్య- ఈ మూడు వర్ణాల వారికి జరగదు. కానీ మహాసాహసం కాబట్టి ఏడువందల రూకలు జరిమానా విధించాలి. ॥240॥

* ఆగస్సు బ్రాహ్మణస్యైవ కార్యో మధ్యమసాహసః ।
వివాస్యో వా భవేద్రాష్ట్రాత్స ద్రవ్య స్సపరిచ్ఛదః ॥ ప్రక్షిప్త శ్లోక సం.*241*

తాత్పర్యం:- ఇవే అపరాధాలు బ్రాహ్మణుణి వల్ల జరగడం సంభవిస్తే ప్రాయశ్చిత్తకాండ నిర్వర్తిస్తే ఆ బ్రాహ్మణుడికి మధ్యమ సాహస దండన విధించి అతని పూర్వగుణాలను కూడా పరిశీలించి ఈ తప్పులకు శిక్షగా దేశ బహిష్కారం విధించాలి. ॥241॥

* ఇతరే కృతవన్తస్తు పాపాన్యేతాన్యకామతః ।
సర్వస్వహారమర్హన్తి కామతస్తు ప్రవాసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*242*

తాత్పర్యం:- బ్రాహ్మణేతరులైన క్షత్రియాదులీ అకృత్యాలకు పాల్పడితే అదీ బుద్ధిపూర్వకంగా అయితే-వారి సర్వ సంపదులను రాజు తీసుకోవాలి. అనంతరం వారికి మరణ దండన లేదా దేశబహిష్కరణ విధించాలి. ॥242॥

* నాదదీత నృపస్సాధుర్మహాపాతకినో ధనమ్ ।
ఆదదానస్తు తల్లోభాత్తేన దోషేణ లిప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.*243*

తాత్పర్యం:- ధార్మికుడైన రాజు మహాపాతకులకి సంబంధించిన అపరాధ ధనాన్ని తీసుకోరాదు. అధికమైన ఆశచేత వారి ధనాన్నిగాని ఆశించినట్లయితే వారి పాతకంలో కొంతపాలు రాజుకు వచ్చి చేరుతుంది. ॥243॥

* అప్సు ప్రవేశ్య తం దండం వరుణాయోపపాదయేత్ ।
శ్రుతవృత్తోపపన్నే వా బ్రాహ్మణే ప్రతిపాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.*244*

తాత్పర్యం:- ఇంకా మరో మార్గం ఉంది. దండన ధనాన్ని నదులనీటిలోకి వదిలి వేయాలి. లేదా వేదాధ్యయన సంపన్నుడైన బ్రాహ్మణుడికి ఇవ్వాలి ! పాతక దోషాలు పోగొట్టుకోగల కృచ్ఛ్రాలను ఆచరించగలవాడతడొక్కడే! రాజు మాత్రం గ్రహించనప్పుడు జనులకు సుఖశాంతులుంటాయి. ॥244॥

* *ఈశో దణ్డస్య వరుణో రాజ్ఞాం దణ్డధరో హి సః ।*
ఈశస్సర్వస్య జగతో బ్రాహ్మణో వేదపారగః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **245**

తాత్పర్యం:- వరుణుడు మహాపాతకుల దండ ధనమునకు ప్రభువు. ఆ వరుణుడే రాజులకు ప్రభువు. అలాగే సకల వేదాధ్యాయి అయిన బ్రాహ్మణుడే సకల ప్రజలకు ప్రభువు. అలాంటి ప్రభుత్వం వల్లనే వారిరువురు దండధనార్హులు. ॥245॥

* *యత్ర వర్జయతే రాజా పాపకృద్భ్యో ధనాగమమ్ ।*
తత్ర కాలేన జాయన్తే మానవా దీర్ఘజీవినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **246**

తాత్పర్యం:- ఏ దేశంలో రాజు ఈ మహాపాతక ధనాన్ని ఆశించడో అక్కడ జనులు దీర్ఘాయుర్దాయంతో జీవిస్తారు.॥246॥

* *నిష్పద్యన్తే చ సస్యాని యథోప్తాని విశాం పృథక్ ।*
బాలాశ్చ న ప్రమీయన్తే వికృతం న చ జాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **247**

తాత్పర్యం:-వైశ్యులు వేసిన ధాన్యాలన్నీ ఫలిస్తాయి. ఆ కాలంలో బాలురు మరణించరు. వికృత రూపులుగా పుట్టరు. ॥247॥

* *బ్రాహ్మణాన్ బాధమానం తు కామాదవరవర్ణజమ్ ।*
హన్యాచ్చిత్రైర్వధోపాయైరుద్వేజనకరైర్నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **248**

తాత్పర్యం:- బ్రాహ్మణులను బుద్ధిపూర్వకంగా దెబ్బలు కొట్టడం, డబ్బు దోచుకోవడం మొదలైన విధాలుగా బాధించే నీచజాతి శూద్రులకు హింసతో కూడినట్టివి -ఇతరులకు భయంపుట్టి ఆ పాపాలు చేయకుండా చూసే కఠినశిక్షలు (అంగములు ఖండించడం మొదలైనవి) విధించాలి. ॥248॥

ప్రక్షిప్తాల పరిశీలన

235-248 శ్లోకాలు కింది 'ఆధారాలతో' ప్రక్షిప్తాలు -

1. శైలీగత ఆధారాలు

229లో “**ఇతి మనోః అను శాసనం**” పదాలతో ఇది మనువు కాక ఇతరు లెవరో రచించారనీ, అందువల్ల ప్రక్షిప్తమనీ, ఇది ప్రక్షిప్తం కనుక, దీనికి సంబంధించిన మిగిలిన అన్ని పూర్వాపర శ్లోకాలూ ప్రక్షిప్తాలనీ తేలుతూంది.

2. విషయ వ్యతిరేకాలు

క. విషయసంకేత శ్లోకమైన 9.220 ప్రకారం, ఇక్కడ 'ద్యూత సంబంధ' విధానాల విషయం ఉంది. విషయ సంకేత శ్లోకమైన 8.7, 9.250ల వల్ల ఇది 18 రకాల వ్యాజ్యాలలో చివరిదనీ, దీని తర్వాత కేవలం ఉపసంహార శ్లోకాలు [9.231-234,249] ఉండడమే సముచితమనీ, ఇతరాలు కావనీ స్పష్ట మవుతూంది. ఈ శ్లోకాలలో ఉపసంహారం కాని విషయం ఉంది కనుక ఈ అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే ! మనువు చెప్పిన వాటిలో ఈ అందరు అపరాధుల దండన పద్ధతిని మనువు ముందే చెప్పాడు. కనుక వాటినే ఇక్కడ మళ్లీ చెప్పటం అనవసరం!

ఖ. 7-9 అధ్యాయాలలో రాజు దండన వ్యవస్థను గురించే ఉంది కానీ, ప్రాయశ్చిత్తం లేదు. కనుక 236లో ప్రాయశ్చిత్తం చేసుకోక పోయినా దండన ఉందనటం ఈ విషయానికి వ్యతిరేకం. రాజు తన నియమాల ప్రకారమే దండన విధిస్తాడు. ప్రాయశ్చిత్తాల విషయం 11వ అధ్యాయంలో ఉండాలి. కనుక ఇవి విషయ వ్యతిరేకాలు.

3. ప్రసంగ వ్యతిరేకాలు

234, 250 శ్లోకాలలో మొత్తం 18 వ్యాజ్యాల తర్వాత ముగింపు ఉంది. ఈ శ్లోకాలు ఆ ప్రసంగాన్ని భంగం చేయటంతో పాటు, మునుపటి ప్రసంగం మధ్య మళ్లీ వచ్చాయి. ప్రసంగ భంజకాలు కనుక ఇవన్నీ ప్రక్షిప్త శ్లోకాలే!

4. అంతర్ వ్యతిరేకాలు

1. ఈ శ్లోకాలకు ఆధారమైనది 235వ శ్లోకం. ఇందులోని పద్ధతికీ, ఆయా విషయాలలో మనువు చెప్పిన పద్ధతులకూ పొంతన కుదరటం లేదు. 9.386లో విశిష్ట అపరాధులను పేర్కొంటూ మనువు, చోరులు, పరస్త్రీ గాములు, దుర్భాష లాడేవారు, దోపిడి దారులు, హంతకులు - వీరిని చెప్పాడు. మహా పాతకులను వీరిలో చెప్పలేదు. మామూలు ఆధారాలతో విశిష్ట అపరాధులను గణించాడు. కానీ ఇక్కడ కేవలం బ్రాహ్మణులు, గురువులు ఆధారంగా చెప్పాడు. ఇది ఉచితం కాదు.

2. ఈ శ్లోకాలలో చెప్పిన శిక్షా పద్ధతి కూడా మనువు చెప్పిన శిక్షావిధానానికి భిన్నం కావటం చేత వ్యతిరేక మవుతుంది. [ఎలా గంటే - హత్య 8.286-288, పరస్త్రీగామి 8.352-372, తాగుబోతు 9.225].

3. 241, 242, 247లలో పక్షపాత ధోరణిలో దండన పద్ధతి ఉంది. ఇది 9.307, 311, 8.335-338లలోని భావనలకూ, పద్ధతికీ వ్యతిరేకంగా ఉంది.

4. 8.343-347 శ్లోకాలలోని పద్ధతి, వాటి ముందు చెప్పిన అన్ని శ్లోకాలకూ వ్యతిరేకంగా ఉంది. వాటిలో దోషులకు జుల్మానా విధించడం, వారి సర్వస్వాన్నీ తీసుకోవటం వంటి రాజాజ్ఞలు ఉన్నాయి. (8.288, 320, 322, 335-338 మొదలైనవి.)

249 నుండి 272వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

యావానవధ్యస్య వధే తావాన్ వధ్యస్య మోక్షణే । మూలశ్లోక సం.**107**
అధర్మో నృపతేర్దృష్టో ధర్మస్తు వినియచ్ఛతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**249**

అవధ్యస్య వధే = నిరపరాధికి దండన చేసేప్పుడు, **నృపతేః** = రాజుకు, **యావాన్ + అధర్మః దృష్టః** = అది రాజుకు ఎంత అధర్మమని శాస్త్రాలు నిర్ణయించినవో, **తావాన్ వధ్యస్య మోక్షణే** = అపరాధిని దండించకుండా వదలడంలో కూడా అంతే అధర్మమని శాస్త్ర నిర్ణయం, **వినియచ్ఛతః తు ధర్మః** = న్యాయానుసారంగా దండించడమే ధర్మం.

తాత్పర్యం:- వధించకూడని వాడిని వధించడం ఎంత పాపమో, వధించదగిన వాడిని వదిలేయడం వల్ల కూడా అంత పాపం సంభవిస్తుంది. శాస్త్ర ప్రకారం దండన విధించినట్లయితే, పుణ్యం వస్తుంది కాబట్టి, ప్రభువు న్యాయానుసారంగా దండించడమే ధర్మం. ॥249॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉదితోఽయం విస్తరశో మిథో వివదమానయోః । మూలశ్లోక సం.**108**
అష్టాదశసు మార్గేషు వ్యవహారస్య నిర్ణయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**250**

టీక:- **అయం** 8-1 నుండి 9-249 వరకు, **మిథః వివద మానయోః** = పరస్పరం పోట్లాడుకొనే వారికి సంబంధించిన, **అష్టాదశసు మార్గేషు** = 18 రకాలైన, **వ్యవహారస్య నిర్ణయః** = కేసుల (లేక) వాదవివాదాల నిర్ణయం, **విస్తరశః ఉదితః** = విస్తారపూర్వకంగా తెలియజేయడమైంది.

తాత్పర్యం:- ఇంతవరకు ఋణం తీసుకోవడం మొదలైన అష్టాదశ వివాదాల వ్యవహారాలకు సంబంధించిన అంశాలు చెప్పబడ్డాయి. వీటికోసం దండనలు-ప్రభువు అనుసరించవలసిన ధర్మాలు, వాదవివాదల నిర్ణయం విస్తార పూర్వకంగా తెలియజేయడమైంది. ॥250॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం ధర్మ్యాణి కార్యాణి సమ్యక్కుర్వన్మహీపతిః । మూలశ్లోక సం. **109**
దేశానలబ్ధాంల్లిప్సేత లబ్ధాంశ్చ పరిపాలయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **251**

టీక:- **ఏవం** = పూర్వోక్తమైన ఈ విధిననుసరించి, **ధర్మ్యాణి కార్యాణి కుర్వన్** = ధర్మయుక్తమైన కార్యాలను నిర్వహిస్తూ, **మహీపతిః** = రాజు, **అలబ్ధాన్ దేశాన్ లిప్సేత** = ఇంతవరకు స్వాధీనం కాని దేశాలను స్వాధీనం చేసికోవాలి, **చ** = మరియు, **లబ్ధాన్ పరిపాలయేత్** = స్వాధీనమైన దేశాలను చక్కగా పాలించాలి.

తాత్పర్యం:- ఈ రీతిగా న్యాయం తప్పక, వ్యవహారాలను తీర్చే రాజులు ధర్మయుక్తమైన కార్యాలను నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలకు పాత్రులై, కొత్తదేశాలను జయిస్తూ-జయించిన దేశాలను చక్కగా పరిపాలిస్తూ కీర్తి ప్రతిష్ఠలార్జించాలి. ॥251॥

లోకకంటకులను రాజు ఏరివేయాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

సమ్యఙ్నివిష్టదేశస్తు కృతదుర్గశ్చ శాస్త్రతః । మూలశ్లోక సం. **110**
కణ్టకోద్ధరణే నిత్యమాతిష్ఠేద్యత్నముత్తమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **252**

టీక:- రాజా **సమ్యక్ నివిష్టదేశః** = సస్యాది సంపన్నమైన ఉత్తమ దేశం నాక్రమించి, **చ** = మరియు అక్కడ, **శాస్త్రతః కృతదుర్గః** = శాస్త్రాను సారంగా (7.69) దుర్గాన్ని నిర్మించుకొని, **కణ్టకోద్ధరణే** = తన రాజ్యంలో ప్రజలను, ప్రభుత్వాన్ని పీడించే దుష్టులను (256-260) నిర్మూలించడానికి, **నిత్యమ్ ఉత్తమమ్ యత్నమ్ + ఆతిష్ఠేత్** = అన్నివేళల తీవ్రంగా ప్రయత్నించాలి.

తాత్పర్యం:- రాజు సస్యాది సంపన్నమైన ఉత్తమ దేశాన్ని ఆక్రమించి, అక్కడ అక్కడ అన్ని సదుపాయాలతో కూడిన రాచనగరం నిర్మించి, దుర్గ నిర్మాణం గావించి అటుపైన చోరులు, జారులు వంటి అరాచక శక్తులను అణిచివేయడంలో తీవ్ర కృషి చేయాలి. ॥252॥

వివరణ:

"లోకకంటకులు" ఎవరు? సామాజిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేవారు, దేశంలో ఉన్న సుఖ-శాంతులను భగ్నపరచేవారు, నియమవిరుద్ధంగా కర్మలాచరించేవారు వీరందరూ లోకకంటకులు. **కంటకం** = ముల్లు, ముల్లు గుచ్చుకొని బాధించునట్లుగా ప్రజలను నానావిధాలుగా బాధించేవారు.

వీరివర్ణన-9.256-260లో చేయబడినది.

ఇది మనుకృతం.ప్రామాణికం

రక్షణాదార్యవృత్తానాం కంటకానాం చ శోధనాత్ । మూలశ్లోక సం. **111**
నరేన్ద్రా స్త్రిదివం యాన్తి ప్రజాపాలనతత్పరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **253**

టీక:- ఆర్యవృత్తానాం రక్షణాత్ = శ్రేష్ఠమైన సదాచార సంపన్నులను రక్షించడం ద్వారా, **చ** = మరియు, **కంటకానాం చ శోధనాత్** = ప్రజాపీడకులను అణచడం ద్వారా, **ప్రజాపాలన తత్పరాః నరేంద్రాః** = ప్రజారక్షణతత్పరులైన ప్రభువులు, **త్రిదివం యాన్తి** = విస్తృత రాజ్యంలో ఉత్తమ సుఖాన్ని అనుభవిస్తారు.

తాత్పర్యం:- సదాచారులను రక్షించడం వల్ల-దుష్టులను శిక్షించడం వల్ల ప్రజాపాలన సవ్యంగా జరుగుతుంది. ఈ రీతిగా జనరంజకంగా పరిపాలించే రాజులు స్వర్గం పొందుతారు. కాబట్టి ప్రజాకంటకులను ఏరి పారేయడంలో ప్రభువెప్పుడూ నిర్లక్ష్యంగా ఉండరాదు. ॥253॥

వివరణ:

'త్రిదివంయాన్తి' ఇదొక నుడికారం. మూడులోకాలకు సంబంధించిన రాజ్యాన్ని పొందుతారు. అంటే వారి రాజ్యం దిన-ప్రతిదినం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం.

ఇది మనుకృతం.ప్రామాణికం

అశాసంస్తస్కరాన్ యస్తు బలిం గృహ్ణాతి పార్థివః । మూలశ్లోక సం.**112**
తస్య ప్రక్షుభ్యతే రాష్ట్రం స్వర్గాచ్చ పరిహీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**254**

టీక:- యః తు పార్థివః = ఏ ప్రభువు, **తస్కరాన్ అశాసన్** = చోరులు (9.257) మొ॥ వారిని నియంత్రించి దండించకుండా, **బలిం గృహ్ణాతి** = ప్రజల నుండి పన్ను మొ॥ వసూలు చేస్తున్నాడో, **తస్య రాష్ట్రం ప్రక్షుభ్యతే** = అలాంటి రాజుకు రాజ్యంలో నివసించే ప్రజలు క్షుబ్ధులై విద్రోహం చేస్తారు. **చ** = మరియు, **స్వర్గాత్ పరిహీయతే** = రాజ్య సుఖాలకు దూరుడైపోతాడు.

తాత్పర్యం:- దొంగలు మొదలైనవారిని అణచకుండా, కేవలం కప్పములు మాత్రమే కట్టించుకొనే రాజులపై ప్రజలకు ద్వేషభావం తప్ప ఆరాధనాభావం ఉండదు. దీనివల్ల రాజుకు మరో నష్టం కూడా! ఇతరత్రా రాజు తాను సంపాదించిన పుణ్యాన్ని కోల్పోతాడు. ॥254॥

వివరణ:

'తస్కర' శబ్ద వ్యుత్పత్తి:- తస్కరుడు = చోరుడు కానీ విశేషంగా, ప్రత్యక్షంగా గానీ లేదా రహస్యంగా గానీ రకరకాలైన దొంగతనాలు చేసే చోరుణ్ణి 'తస్కరు'డంటారు. మోసగించి గాని, మాయ మాటల ద్వారా గాని లేదా బలాత్కారంగా దోచుకొనే దోపిడీదారుడు తస్కరుడు. ధనాపహరణానికి వీలైన అన్ని పద్ధతులను ఉపయోగించేవాడు తస్కరుడు. **"తస్కరః తత్కరో భవతి। కరోతి యత్ పాపకమితినైరుక్తాః। తనోతేర్వా స్యాత్ సన్తత కర్మాభవతి అహోరాత్రకర్మా వా.** (నిరుక్తం-3-14).

పాపకర్మలలో తలమునకలైనవాడు, తస్కరుడు చౌర్యాన్ని విస్తారం చేస్తాడు. రాత్రింబవళ్ళు సమయాన్ననుసరించి, పరిస్థితులకనుగుణంగా ఏదో ఒక విధమైన దొంగతనంలో నిమగ్నుడయ్యేవాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

నిర్భయం తు భవేద్యస్య రాష్ట్రం బాహుబలాశ్రితమ్ । మూలశ్లోక సం.**113**
తస్య తద్ వర్ధతే నిత్యం సిచ్యమాన ఇవ ద్రుమః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**255**

టీక:- యస్య బాహుబలాశ్రితమ్ = ఏ రాజు బాహులబలాన్నాశ్రయించి, దండనశక్తిననుసరించి, **రాష్ట్రం నిర్భయం తు భవేత్** = రాష్ట్రం అంటే ప్రజలు, దొంగలు-దోపిడీదారుల నుండి నిర్భయంగా ఉంటారో, **తస్యతత్** = ఆ ప్రభువు రాజ్యం(ప్రజలు), **సిచ్యమానః ద్రుమః ఇవ** = నీళ్ళు పోసే వృక్షంలాగా, **నిత్యం వర్ధతే** = ఎప్పుడూ అభివృద్ధి చెందుతుంది.

తాత్పర్యం:- ఏ రాజు రాజ్యం, అతని బాహుబల ప్రభావం వల్ల, దొంగలభయాలేమీ లేకుండా ఉంటుందో; అతని రాజ్యం అనుదినం నీరుపోస్తే పచ్చగా ఉండే చెట్టులాగా వృద్ధి చెందుతూంటుంది. ॥255॥

తస్కరులు రెండు విధాలు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ద్వివిధాంస్తస్కరాన్ విద్యాత్పరద్రవ్యాపహారకాన్ । మూలశ్లోక సం. **114**
ప్రకాశాంశ్చాప్రకాశాంశ్చ చారచక్షుర్మహీపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.. **256**

టీక:- చారచక్షుః మహీపతిః = రాజుకు గూఢచారులే నేత్రాలు. (గుప్తచరుల ద్వారానే సర్వ ప్రజల కర్మలను రాజు చూస్తూ ఉంటాడు) చారులే (గుప్తచారులే), **చక్షుః** = నేత్రములుగా గలవాడు, **ప్రకాశాన్, చ + అప్రకాశాన్ పరద్రవ్య అపహారకాన్** = చూస్తుండగా, లేదా గుప్తంగా గాని పరద్రవ్యములను అపహరించేవారు. **ద్వివిధాన్ తస్కరాన్ విద్యాత్** = తస్కరులు రెండు విధాలని గుర్తించాలి. పట్టపగలే దోచుకొనేవారు, రాత్రులందు దొంగిలించేవారు.

తాత్పర్యం:- రాజుకు గూఢచారులే నేత్రాలు. నేత్రాలుగా గలవాడు చూస్తుండగా లేదా గుప్తంగా గాని పరద్రవ్యాలను అపహరించే తస్కరులు రెండు రకాలని గుర్తించాలి. పట్టపగలే దోచుకొనేవారు, రాత్రిళ్ళో దొంగలించేవారు. ॥256॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రకాశవంచకాస్తేషాం నానాపణ్యోపజీవినః । మూలశ్లోక సం. **115**
ప్రచ్ఛన్న వంచకాస్త్వేతే యే స్తేనాటవికాదయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **257**

టీక:- తేషాం = రెండు రకాలైన ఆ చోరులలో, **నానాపణ్య ఉపజీవినః ప్రకాశ వంచకాః** = చూస్తుండగనే దొంగిలించేవారు. ప్రకాశవంచకులు (మోసగాండ్రు) అంటే, తప్పుడు తూకాలు కొలతలువేసి ప్రజలను మోసగించేవారు పగటి దొంగలు. **యే** = ఎవరు, **స్తేన ఆటవికాదయః** = అరణ్యాలలో దాగి ఉండి దోచుకొనేవారు, **ప్రచ్ఛన్న వంచకాః** = రాత్రిదొంగలు లేదా కనిపించని దొంగలు, గుప్తచోరులు.

తాత్పర్యం:-రాజు ఈ రెండురకాలైన దొంగల్ని గూఢచారుల ద్వారా ఎప్పటి కప్పుడు గమనిస్తూ ఉండాలి. వారిలో తప్పుడు తూనికలు మొదలగు వాటిచే పగటిదొంగలు, రహస్యంగా ఉండి దొంగతనం చేసేవారు రాత్రిదొంగలు.॥257॥

లోకకంటకుల గణన **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఉత్కోచకాశ్చౌపధికా వంచకాః కితవాస్తథా । మూలశ్లోక సం. **116**
మంగళాదేశవృత్తాశ్చ భద్రాశ్చేక్షణికైస్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **258**

టీక:- ఉత్కోచకాః = లంచగొండ్లు, **ఔపధికాః** = భయంచూపి ఇతరుల సొమ్మును దోచుకొనేవారు, **వంచకాః** = మోసగాండ్రు, **కితవాః**=జూదరులు, **మంగళదేశ వృత్తాశ్చ** = అంటే మీకు పుత్రుడు కలుగుననీ, లేదా శుభం కలుగునని, మంగళం కలుగునని చెప్పి ధనం కాజేసేవారు, **భద్రాః** = సాధు-సన్న్యాసి వేషాలలో వచ్చి మోసగించేవారు, **ఈక్షణికైస్సహ** = చేతులు చూసి భవిష్యత్తును చెప్పి ధనం కాజేసేవారు.

తాత్పర్యం:- లంచగొండులు, బెదిరించి సొమ్ములు దోచేవారు, జూదరులు, పిల్లలు, ధనం కలుగుతాయని చెప్పి సొమ్ము కాజేసేవారు, కపటవేషధారణతో ఆకట్టుకునే వంచకులు, హస్తరేఖాదులు చూసి మేలు-కీడు చెప్పి ధనం కాజేసేవారు. ॥258॥

వివరణ:

'ఔపిధిక' శబ్దార్థం:- ఔపధిక మంటే "ఏదో ఒక ప్రయోజనాన్ని నెపాన్ని కల్పించి మోసంలో ధనాన్ని దోచుకోవాలనుకునే వ్యక్తి. నేటి లౌకిక వ్యవహారంలో చెప్పాలంటే 'బ్లాక్ మెయిలింగ్' చేసే వ్యక్తి.

ఇది మనుకృతం-ప్రామాణికం

అసమ్యక్కారిణశ్చైవ మహామాత్రాశ్చికిత్సకాః । మూలశ్లోక సం. **117**
శిల్పోపచారయుక్తాశ్చ నిపుణాః పణ్యయోషితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **259**

టీక:- అసమ్యక్ కారిణః మహామాత్రాః = ధనమును, వస్తువులను తీసుకొని, తప్పుడు మార్గాల ద్వారా పనులు చేసి పెట్టే ఉన్నత ప్రభుత్వోద్యోగులు మంత్రి మొ॥, **చికిత్సకాః** = అనుచితంగా ధనం తీసికొనే అయోగ్యులైన వైద్యులు, **శిల్పోపచార యుక్తాః** = అనుచితంగా ధనం తీసికొనే శిల్పులు, చిత్రకారులు మొ॥, **నిపుణాః పణ్యయోషితః** = ధనాన్ని లాగడంలో నిపుణులైన వేశ్యలు.

తాత్పర్యం:- ధనమును, వస్తువులను తీసుకొని, తప్పుడు మార్గాల ద్వారా పనులు చేసిపెట్టే సామాన్య-ఉన్నత ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు మొ॥ వారు, అనుచితంగా ధనం తీసుకొనే అయోగ్యులైన వైద్యులు, శిల్పులు, చిత్రకారులు ధనాన్ని లాక్కోవడంలో నిపుణులైన వేశ్యలు. ॥259॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవమాదీన్ విజానీయాత్ ప్రకాశాంల్లోకకణ్టకాన్ । మూలశ్లోక సం. **118**
నిగూఢచారిణశ్చాన్యాననార్యానార్యలింగినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **260**

టీక:- ఏవమ్ + ఆదీన్ = ఇత్యాదులను, **చ** = మరియు, **అన్యాన్** = ఇతరులను, **ఆర్యలింగినః నిగూఢచారిణః అనార్యాన్** = సాధు సన్న్యాసి వేషాలు ధరించి, విభూది పూసి, రుద్రాక్ష మాలలు ఒంటినిండా వేసి, **ఆర్య లింగినః** = పెద్దలవలె వేషధారణలో కనిపించేవారు, గుప్తరూపంగా ఉండే గూఢచారులను, **ప్రకాశాన్ లోకకంటకాన్ విజానీయాత్** = పగటి దొంగలుగా గుర్తించాలి. ప్రజలను పీడించే దొంగలుగా గుర్తించాలి.

తాత్పర్యం:- సాధువేషాలు ధరించి, విభూదిపూసి, రుద్రాక్షమాలలు ఒంటి నిండా వేసి, పెద్దల లాగా వేషధారణలో కనిపించేవారు, గుప్తరూపంగా ఉండే గూఢచారులను పగటి దొంగలుగా గుర్తించాలి. ప్రజలను పీడించే దొంగలుగా గుర్తించాలి. ॥260॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తాన్విదిత్వా సుచరితైర్గూఢైస్తత్కర్మకారిభిః । మూలశ్లోక సం. **119**
చారైశ్చానేకసంస్థానైః ప్రోత్సాద్య వశమానయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **261**

టీక:- తత్ కర్మకారిభిః = ఏ విషయం గురించి వివరంగా తెలిసికోవాలని ఉందో, అలాంటి కర్మను చేసే, **గూఢైః** = గుప్తంగా తిరిగే, **సుచరితైః** = సత్ప్రవర్తనగల, **అనేక సంస్థానైః** = వివిధ స్థానములందు నియోగింపబడిన, **చారైః** = గుప్తచారుల ద్వారా, **తాన్ విదిత్వా** = ఆ మోసగాండ్లను, లేదా లోకకంటకులను గుర్తించి, **చ** = మరియు, **ప్రోత్సాద్య** = వారిని పట్టుకొని బంధించి, **వశమ్ ఆనయేత్** = వశపరచుకొని, కారాగృహంలో నిర్బంధించాలి. అంటే వారు మళ్ళీ అలాంటి పనులు చేయకుండా ఉండేవిధంగా నిగ్రహించాలి.

తాత్పర్యం:-ఏ విషయం గురించి వివరంగా తెలిసికోవాలని ఉందో, అలాంటి కర్మను చేసే గుప్తంగా తిరిగే సత్ప్రవర్తనగల వివిధ స్థానములలో నియోగించబడిన గుప్తచారుల ద్వారా ఆ మోసగాళ్ళను గుర్తించి వారిని పట్టుకొని బంధించి వశపరచుకొని కారాగృహంలో నిర్బంధించాలి. ॥261॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తేషాం దోషానభిఖ్యాప్య స్వే స్వే కర్మణి తత్త్వతః । మూలశ్లోక సం. **120**
కుర్వీత శాసనం రాజా సమ్యక్ సారాపరాధతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **262**

టీక:- **రాజా** = రాజు, **స్వేస్వే కర్మణి తత్త్వతః తేషాం దోషాన్ + అభివ్యాప్య** = వారు చేసిన పాపకర్మలను విపులంగా ప్రకటించి, **సార+అపరాధతః** = వారు చేసిన నేరాలకు తగినట్లు, **సమ్యక్ శాసనం కుర్వీత** = న్యాయోచితంగా దండించాలి.

తాత్పర్యం:- రాజు, వారు చేసిన పాపకర్మలను వివరంగా ప్రకటించి వారు చేసిన నేరాలకు తగినట్లు న్యాయోచితంగా దండించాలి. ॥262॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నహి దండాదృతే శక్యః కర్తుం పాపవినిగ్రహః । మూలశ్లోక సం. **121**
స్తేనానాం పాపబుద్ధీనాం నిభృతం చరతాం క్షితౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **263**

టీక:-**స్తేనానాం** = బహిరంగంగా దొంగతనం చేస్తూ, **క్షితౌ విభృతం చరతాం** = లోకంలో రహస్యంగా సంచరించే చోరులను, లేదా అపరాధులను, అలాగే, **పాపబుద్ధీనాం** = పాపబుద్ధుల, **పాపవినిగ్రహః** = పాపాలను ఆపడం, **దండాత్ + ఋతే నహి కర్తుం శక్యః** = కఠినమైన దండన లేకుండా శక్యం కాదు. అందువల్ల దండించడంలో, తాత్సారం చేయరాదు.

తాత్పర్యం:- బహిరంగంగా దొంగతనం చేస్తూ, లోకంలో రహస్యంగా సంచరించే చోరులను, పాపబుద్ధుల పాపాలను ఆపడం కఠినమైన దండన లేకుండా శక్యం కాదు. అందువల్ల దండించడంలో ఉపేక్షించరాదు. ॥263॥

గుప్తచరుల ద్వారా అపరాధులను గుర్తించే స్థలాలేవి?

ఇది మనుకృతం-ప్రామాణికం

సభాప్రపాపూపశాలావేశమద్యాన్నవిక్రయాః । మూలశ్లోక సం. **122**
చతుష్పథాశ్చైత్యవృక్షా స్సమాజాః ప్రేక్షణాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **264**

టీక:- **సభాప్రపా+అపూపశాలాః** = సభలు జరిగే ప్రాంతాలు, చలివేంద్రాలుండే ప్రాంతాలు, మిఠాయి దుకాణాలు, భోజనాలయాలు, **వేశ-మద్య-అన్న-విక్రయాః** = వివిధ వస్త్రాలు, మద్యం, ధాన్యం అమ్మే స్థలాలు (మార్కెట్లు), **చతుష్పథాః** = చౌరస్తాలు నాలుగు బజార్లు కలిసే స్థలాలు, **చైత్యవృక్షాః** = ప్రజలు గుంపుగా కూర్చొనే పెద్ద పెద్ద వృక్షాలు, **సమాజాః** = సార్వజనిక స్థానాలు, **ప్రేక్షణాని** = మనోరంజన స్థానములు.

తాత్పర్యం:- ప్రజలందరు చేరు సభలు, బహిరంగసభలు, రచ్చబండలు, చలిపందిళ్ళు మిఠాయి అంగళ్ళు, భోగం వారి ఇండ్లు, మద్యం, అన్నం, అమ్మే స్థలాలు, నాలుగు దార్లు కలిసేచోట్లు, మంచి నీడనిచ్చు చెట్లు జనులు గుమిగూడు స్థలాలు. ॥264॥

ఇది మనుకృతం-ప్రామాణికం

జీర్ణోద్యానాన్యరణ్యాని కారుకావేశనాని చ । మూలశ్లోక సం. **123**
శూన్యాని చాప్యగారాణి వనాన్యుపవనాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **265**

టీక:-**జీర్ణ+ఉద్యాన+అరణ్యాని** = పాత తోటలు, అడవులు, **కారుక+ఆవేశనాని** = శిల్ప సంగ్రహాలయాలు (మ్యూజియమ్‌లు) మొ॥వి, **శూన్యాని అగారాణి** = పాడుబడ్డ శిథిలగృహాలు, **వనాని ఉపవనాని** = పెద్ద తోటలు, చిన్నతోటలు.

తాత్పర్యం:- పాతతోపులు, అడవులు, శిల్ప సంగ్రహాలయాలు మొ॥వి., పాడుబడ్డ శిథిలగృహాలు, పెద్దతోటలు, చిన్నతోటలు. ॥265॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవంవిధాన్నృపో దేశాన్ గుల్మైః స్థావరజంగమైః । మూలశ్లోక సం. **124**
తస్కరప్రతిషేధార్థం చారైశ్చాప్యనుచారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **266**

టీక:- రాజా = రాజు, **ఏవం విధాన్ దేశాన్** = ఇలాంటి ప్రదేశాలను, **తస్కరాన్ ప్రతిషేధార్థం** = దొంగలను నివారించడానికి, **స్థావర-జఙ్గమ-గుల్మైః** = సంచారం చేసే లేదా నిలకడగా ఉండే పోలీసులను లేదా చౌకీదారులను, **చ** = మరియు, **చారైః** = చారులను, **అనుచారయేత్** = గస్తీ తిరిగేట్లుగా ఉంచాలి. లేదా నియోగించాలి.

తాత్పర్యం:- ఎంత విశాలమైన రాజ్యం రాజుకు ఉన్నా, చోరుల భయం నుంచి ప్రజలకు విముక్తి లేకపోయినప్పుడు ఏం ప్రయోజనం?..... ॥266॥

అందుచేత-ప్రభువు ప్రతిచోటా.....ఒకటేమిటి? ఎక్కడెక్కడ చోరులు ఆవాసం చేయడానికి వీలుంటుందో అవన్నీ కనిపెట్టి. **ఉదా:-** అన్నసత్రాలు, వనాలు, మద్యశాలలు, జనులుగుమిగూడు చోట్లు, పాడుబడిన ఆలయాలు, తోటలు మొదలైనవి సంచారం చేసే లేదా నిలకడగా ఉండే పోలీసులను లేదా చౌకీదారులను, చారులను గస్తీ తిరిగేట్లుగా నియోగించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

తత్సహాయై రనుగతైర్నానాకర్మప్రవేదిభిః । మూలశ్లోక సం. **125**
విద్యాదుత్సాదయేచ్చైవ నిపుణైః పూర్వతస్కరైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **267**

టీక:- తత్ + సహాయైః అనుగతైః = ఆ యా దొంగలకు సహాయపడేవారు, లేదా వారిననుసరించి తిరిగేవారు, **నానా కర్మ ప్రవేదిభిః నిపుణైః పూర్వతస్కరైః** = వివిధచోర కర్మ ప్రవీణులు, నిపుణులు, పూర్వతస్కరుల ద్వారా, **విద్యాత్** = దొంగల జాడలు గుర్తించాలి. గుర్తించిన తరువాత, **ఉత్సాదయేత్** = వారిని దండించాలి.

తాత్పర్యం:- ఆ యా దొంగలకు సహాయపడేవారు, వివిధచోర కర్మ ప్రవీణులు, నిపుణులు, పూర్వదొంగల ద్వారా దొంగల జాడలు గుర్తించాలి. గుర్తించిన తరువాత వారిని దండించాలి. ॥267॥

ఇది మనుకృతం-ప్రామాణికం

భక్ష్యభోజ్యోపదేశైశ్చ బ్రాహ్మణానాం చ దర్శనైః । మూలశ్లోక సం. **126**
శౌర్యకర్మాపదేశైశ్చ కుర్యుస్తేషాం సమాగమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **268**

టీక:- ఆ అనుయాయులయిన గుప్తచరులు, **భక్ష్య-భోజ్య-అపదేశైః** = మంచి భోజన పదార్థాలుంటాయని ఆశ కల్పించి, **చ** = మరియు, **బ్రాహ్మణానాం దర్శనైః** = బ్రహ్మవేత్తలైన విద్వాంసుల దర్శనం కల్పిస్తామనే నేపంతో, **శౌర్యకర్మ-అపదేశైః** = పెద్ద పెద్ద పహిల్వాన్ల కుస్తీ చూడవచ్చనే నెపంతో, **తేషాం సమాగమం కుర్యుః** = ఆ చోరులను సిపాయిలకు అప్పగించాలి. బంధించాలి.

తాత్పర్యం:- ఈ వేగులవారు మారువేషాలు దాల్చడమేగాక, దొంగలకే మాటలమాయాజాలంతో టోకరా ఇవ్వగల ధీరులై ఉండాలి. మంచిభోజనం దొరుకుతుందని ఆశ కల్పించిగాని, గొప్పశౌర్యం గలవాడి బలప్రదర్శన ఉందనిగాని, బ్రహ్మవేత్తలైన విద్వాంసుల దర్శనం కల్పిస్తామనే నెపంతోగాని, ఆ చోరులను సిపాయిలకు అప్పగించి బంధించాలి.॥268॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యే తత్ర నోపసర్పేయుర్మూల ప్రణిహితాశ్చ యే । మూలశ్లోక సం. **127**
తాన్ ప్రసహ్య నృపో హన్యాత్సమిత్రజ్ఞాతిబాంధవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **269**

టీక:- **యే** = ఏ దొంగలు, **తత్ర న + ఉపసర్పేయుః** = పైన పేర్కొన్న స్థానములకు రారో, **చ** = మరియు, ఏ దొంగలు , **మూల ప్రణిహితాః** = పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతున్నారో, **నృపః** = రాజు, **సమిత్ర-జ్ఞాతి-బాంధవాన్ తాన్** = మిత్రులు, బంధువులతో కలిపి ఆ చోరులను, **ప్రసహ్య** = బలాత్కారంగా బంధించి, **హన్యాత్** = దండించాలి, లేదా చంపాలి.

తాత్పర్యం:- ఏ దొంగలు పైశ్లోకంలో పేర్కొన్న స్థానాలకు రారో ఏ దొంగలు పట్టుబడకుండా తిరుగుతున్నారో, రాజు మిత్రులు, బంధువులతో కలిపి ఆ చోరులను బలాత్కారంగా బంధించి దండించాలి లేదా చంపాలి. ॥269॥

సాక్షం లభించినప్పుడే దండించాలి లేదా చంపాలి -

ఇది మనుకృతం-ప్రామాణికం

న హోఢేన వినా చౌరం ఘాతయేద్ధార్మికో నృపః । మూలశ్లోక సం. **128**
సహోఢం సోపకరణం ఘాతయేదవిచారయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **270**

టీక:- **ధార్మికః నృపః** = ధర్మాత్ముడైన రాజు, **హోఢేన వినా** = దొంగిలించిన వస్తువులు, దొంగతనానికి ఉపయోగించిన సాధనాలు వగైరా లేకుండా, **చౌరం న ఘాతయేత్** = చోరుణ్ణి దండించరాదు, హింసించరాదు. కానీ, **సహోఢం స ఉపకరణం** = దొంగిలించిన వస్తువులు కన్నం వేయడానికి ఉపయోగించిన పనిముట్లు మొ॥ ప్రమాణాలు సాక్షాలు లభించినప్పుడు, **అవిచారయన్ ఘాతయేత్** = విచారించకుండానే దండించాలి లేదా చంపాలి.

తాత్పర్యం:- ధర్మాత్ముడైన రాజు, దొంగలుగా దొరికిన వారిదగ్గర ద్రవ్యం లేకపోయినా కన్నం వేయడానికి తగిన పరికరాలు కనుక్కోకపోయినా- ఇతరుల్ని బాధించే ఆయుధాలు వారి దగ్గర చూడకున్నా వెంటనే చోరుణ్ణి దండించరాదు. హింసించరాదు. కానీ దొంగిలించిన వస్తువులు కన్నం వేయడానికి ఉపయోగించిన పనిముట్లు మొ॥ ప్రమాణాలు, సాక్ష్యాలు లభించినప్పుడు విచారించకుండానే దండించాలి లేదా చంపాలి. ॥270॥

దొంగలకు సహకరించిన వారిని కూడా దండించాలి

ఇది మనుకృతం-ప్రామాణికం

గ్రామేష్వపి చ యే కేచిచ్చోరాణాం భక్తదాయకాః । మూలశ్లోక సం. **129**
భాణ్డావకాశదాశ్చైవ సర్వాంస్తానపి ఘాతయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **271**

టీక:- ఇంకా, **గ్రామేషు + అపి యే కేచిత్** = గ్రామాలలో ఉండేవారు ఎవరైనా, **చౌరాణాం భక్తదాయకాః భాండ అవకాశదాః** = చోరులకు అన్నం పెట్టి, పాత్రలనిచ్చి ఆశ్రయమిచ్చారో, **తాన్ సర్వాన్ అపి ఘాతయేత్** = వారినందరినీ కూడా దండించాలి.

తాత్పర్యం:- కొందరు గ్రామాలలో ఉండేవారు దొంగల దొంగతనాన్ని తెలిసీ వారికి రహస్యంగా భోజనాదులను సమకూర్చుడం- పరికరాలు, ఆయుధాలు చేరవేయడం లాంటివి కొంత సొమ్ముకోసం దొంగ సొత్తుకాశపడి చేస్తుంటారు. అలాంటివారినందరినీ కూడా దండించాలి. ॥271॥

ఇది మనుకృతం-ప్రామాణికం

రాష్ట్రేషు రక్షాధికృతాన్ సామన్తాంశ్చైవ చోదితాన్ । మూలశ్లోక సం. **130**
అభ్యాఘాతేషు మధ్యస్థాశ్శిష్యాచ్చౌరానివ ద్రుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **272**

టీక:- రాజా = రాజు, **రాష్ట్రేషు రక్షాధికృతాన్** = రాజ్యంలో రక్షార్థం నియుక్తులైన రాజకర్మచారులను, **సామన్తాన్ చోదితాన్** = సరిహద్దు వద్ద నియమించిన రాజపురుషులు, **అభ్యాఘాతేషు మధ్యస్థాన్** = దొంగతనం మొ॥ పరిస్థితులలో సమ్మిళితులైనట్లు కనుగొన్నట్లయితే, వారిని కూడా, **చౌరాన్ + ఇవ ద్రుతమ్ శిష్యాత్** = దొంగలతో సమానంగా వెంటనే దండించాలి.

తాత్పర్యం:- మరో రకంగాదొంగలకు సహకరించే వారుంటారు....వీరు రాజ్యసంరక్షణచే నియమితులైనా, సరిహద్దులలో ఉండేవారు దుష్టులయి దొంగలకు సహకరించవచ్చు! వీరు దొంగలకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తే, అలాంటి వారినీ పట్టి దండించాలి. ॥272॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *యశ్చాపి ధర్మసమయాత్ ప్రచ్యుతో ధర్మజీవనః ।*
దండేనైవ తమప్యోషేత్స్వకాద్ధర్మాద్ధి విచ్యుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**273**

తాత్పర్యం:- యజ్ఞాలు చేయించడం-దానాలు తీసుకోవడం మొదలైన వాటి వల్ల జీవించేవారు కొన్ని సందర్భాలలో ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని అధర్మానికి పాల్పడితే వారూ చోరుల సరసన చేరుతారు. అలాంటివారూ దండనార్హులే! ॥273॥

ఈ శ్లోకం ప్రక్షిప్తం. ప్రసంగవిరోధం:- ఇక్కడ పుర్వాపర ప్రసంగం చోరులకు వారికి సహకరించిన వారికి నడుస్తున్నది. ఈ మధ్యలో ధర్మభ్రష్టులైన బ్రాహ్మణుల గురించి చెప్పడం అప్రాసాంగికం. కాబట్టి ఇది ప్రక్షిప్తం.

274 నుండి 279 వరకు మనుకృతం-ప్రామాణికం

సామూహిక హాని జరిగేప్పుడు-సహకరించని వారికి దండన-

గ్రామఘాతే హితాభంగే పథి మోషాభిదర్శనే । మూలశ్లోక సం.**131**
శక్తితో నాభిధావంతో నిర్వాస్యాః సపరిచ్ఛదాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**274**

టీక:- గ్రామఘాతే = చోరులు ప్రవేశించి గ్రామాన్నంతా దోచుకొనే సమయంలో, **హితాభంగే** = నదులను, ఆనకట్టలను తెగ్గొట్టే సమయంలో, **పథి మోష+అభిదర్శనే** = మార్గ మధ్యలో దొంగలు మొ॥ దారి దొంగలను ఎదుర్కొనే సమయంలో, **శక్తితః న+అభిధావన్తః** = యథాశక్తి పరిగెత్తి రక్షించని వారిని, **సపరిచ్ఛదాః నిర్వాస్యాః** = గృహ సామాగ్రి సహితంగా ఆ దేశం నుండి బహిష్కరించాలి.

తాత్పర్యం:- చోరులు గ్రామంలో ప్రవేశించి దాడి జరుగుతూన్నపుడు, తమ శక్తి కొద్దీ సాయం చేయక చోద్యం చూసేవారిని; నదులను ఆనకట్టలను తెగ్గొట్టే సమయంలో, మార్గం మధ్యలో దారిదొంగలను ఎదుర్కొనే సమయంలో యథాశక్తి పరిగెత్తి రక్షించనివారినీ పరివారసమేతంగా దేశ బహిష్కారం విధించాలి. ॥274॥

వివరణ:

హితాభఙ్గే = హితా శబ్దానికి 'నది' అని అర్థం. 'హి గతౌ వృద్ధౌ చ' ధాతువుకు 'క్త' ప్రత్యయం చేర్చగా, స్త్రీ లింగంలో 'టాప్' వల్ల 'హితా' శబ్దం సిద్ధమవుతుంది. "హిన్వన్తి = గచ్ఛన్తి యాః తాః నద్యః" ఈ విగ్రహం వల్ల-ప్రవహించునట్టి-గమనం చేసే (హితా) నది. సామూహికమైన ఉపకారం కలుగజేసేవి నదులు. అందువల్ల అలాంటి నదులకు గండి కొట్టినవారిని సామూహికంగానే ఎదిరించాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

రాజ్ఞః కోశాపహర్తృాంశ్చ ప్రతికూలేషు చ స్థితాన్ । మూలశ్లోక సం.**132**
ఘాతయేద్వివిధైర్దండైరరీణాం చోపజాపకాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**275**

టీక:- **రాజ్ఞః కోశాపహర్తౄాంశ్చ** = రాజు ఖజానా నుండి ధనాన్ని దొంగిలించినవారిని, **చ** = మరియు, **ప్రతికూలేషు స్థితాన్** = రాజ్యానికి విరోధమైన కర్మలందు లగ్నమైన వారిని, **చ** = మరియు, **అరీణాం ఉపజాపకాన్** = శత్రువులకు రహస్యాలు చేరవేసే వారిని-రాజు, **వివిధైః దండైః ఘాతయేత్** = వివిధ దండనల ద్వారా దండించాలి.

తాత్పర్యం:- రాజుగారి ఖజానాకే కన్నంవేసే వారిని, రాజాజ్ఞ మీరేవారిని, శత్రురాజులకు రహస్యాలు చేరవేసే వారిని తీవ్ర నేరస్థులుగా పరిగణించి రాజు వివిధ దండనలు విధించాలి. ॥275॥

విభిన్న అపరాధులకు దండన -

ఇది మనుకృతం-ప్రామాణికం

సంధిం ఛిత్వా తు యే చౌర్యం రాత్రౌ కుర్వన్తి తస్కరాః । మూలశ్లోక సం.**133**
తేషాం ఛిత్వా నృపో హస్తౌ తీక్ష్ణే శూలే నివేశయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**276**

టీక:- **యే తస్కరాః** = ఏ దొంగలు, **రాత్రౌ సంధిం ఛిత్వా** = రాత్రివేళల్లో కన్నం వేసి, **చౌర్యం కుర్వన్తి** = దొంగతనం చేస్తారో, **నృపః** = రాజు, **తేషాం హస్తౌ ఛిత్వా** = వారి చేతులను నరికి, **తీక్ష్ణే శూలే నివేశయేత్** = పదునైన త్రిశూలం లేదా కొర్రు మీదకు ఎక్కించాలి.

తాత్పర్యం:- రాత్రులందు అందరూ నిద్రిస్తూండగా, దొంగలు కన్నంవేసి సొమ్ము దొంగిలించడం లాంటివి అతిహేయం కాబట్టి, రాజు వారి చేతులు నరికేయాలి, పదునైన త్రిశూలం మీదకు ఎక్కించాలి. ॥276॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అంగులీగ్రంథిభేదస్య ఛేదయేత్ప్రథమే గ్రహే । మూలశ్లోక సం.**134**
ద్వితీయే హస్తచరణౌ తృతీయే వధమర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**277**

టీక:- రాజు-**గ్రన్థి భేదస్య** = జేబుదొంగలను, **ప్రథమే గ్రహే** = మొదటిసారి పట్టుబడ్డప్పుడు, **అఙ్గులీః ఛేదయేత్** = దొంగ వేళ్ళను నరికివేయాలి, **ద్వితీయే హస్తచరణౌ** = రెండోసారి పట్టుబడ్డప్పుడు కాళ్ళు, చేతులు నరికివేయాలి, **తృతీయే వధమర్హతి** = మూడోసారి పట్టుబడ్డప్పుడు వధించ తగినవాడు.

తాత్పర్యం:- జేబు దొంగలకు అదే మొదటిసారి తప్పు (ప్రథమసాహసం) అయితే వేళ్లు నరకాలి. రెండోసారి అదే తప్పు చేస్తూ దొరికితే చేతులు, కాళ్లు ఖండించాలి. తిరిగి అదే నేరం చేస్తే వధించాలి. ॥277॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అగ్నిదాన్ భక్తదాంశ్చైవ తథా శస్త్రావకాశదాన్ । మూలశ్లోక సం.**135**
సన్నిధాతౄాంశ్చ మోషస్య హన్యాచ్చౌరమివేశ్వరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**278**

టీక:- **ఈశ్వరః** = ప్రభువు, **మోషస్య అగ్నిదాన్ భక్తదాన్, శస్త్ర-అవకాశదాన్ చ సంనిధాతౄాన్** = చోరులకు అగ్ని, భోజనం, వస్త్రాలు, వసతిని ఇచ్చేవారినీ, దొంగసొత్తును దాచిపెట్టినవారికీ, **చౌరమ్ ఇవ హన్యాత్** = దొంగను మాదిరిగా (9.277) శిక్షించాలి.

తాత్పర్యం:- వారు దొంగలని తెలిసీ, వారికి నిప్పు, అన్నం, వస్త్రాలు, వసతి సమకూర్చి, దొంగిలించిన సొమ్ము దాచి పెట్టడంలో సహకరిస్తే వారిని కూడా రాజు దొంగలను శిక్షించినట్లే శిక్షించాలి. ॥278॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తడాగభేదకం హన్యాదప్సు శుద్ధవధేన వా । మూలశ్లోక సం. **136**
యద్వాఽపి ప్రతిసంస్కుర్యాద్దాప్యస్తూత్తమసాహసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **279**

టీక:- రాజు, **తడాగభేదకం హన్యాత్** = ప్రజల కోసం నిర్మించిన చెరువు మొ॥ వాటికి గండి కొట్టేవాడిని వధించాలి, **వా** = లేదా, **అప్సు శుద్ధ వధేన** = నీటిలో ముంచి గానీ లేదా సాధారణ పద్ధతిలో గానీ చంపివేయాలి, **యద్ వా+అపి** = ఒకవేళ, **ప్రతి సంస్కుర్యాత్** = గండి కొట్టిన దాన్ని తిరిగి పూడ్చివేసినట్లయితే, **ఉత్తమ సాహసమ్ + దాప్యః** = అతడికి ఉత్తమ సాహసం జరిమానా వేయాలి (8.238).

తాత్పర్యం:- కొందరు ప్రజలకు సామూహికంగా చెరువు చేస్తారు. (ఉదా: చెరువు కట్టలు గండికొట్టి నీళ్లు వదిలెయ్యడం). ఇలాంటి వారిని వధించాలి. లేదా నీటిలో ముంచిగానీ లేదా సాధారణ పద్ధతిలో చంపివేయాలి. ఒక వేళ ఆ కట్టనిర్మిస్తానని చెప్పి ఆ పని చేస్తే, అతడికి ఉత్తమసాహస జరిమానా విధించాలి.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *కోష్ఠాగారాయుధాగారదేవతాగారభేదకాన్ ।*
హస్త్యశ్వరథహర్తౄంశ్చ హన్యాదేవావిచారయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***280***

తాత్పర్యం:- ప్రభువు అంతఃపురంలో గాని రాచనగరులో గాని రాజుగారి ఖజానా, దేవతాగృహం, ఆయుధాగారం మొదలైనవాటికి కన్నం వేసినా గుర్రాల్ని-రథాల్ని అపహరించినా తక్షణం వాడిని విచారణ లేకనే వధించవచ్చు॥280॥

ప్రక్షిప్త పరిశీలన:

280వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. ప్రసంగ వ్యతిరేకం

ఇక్కడ పూర్వాపర ప్రసంగం చెరువులకు హాని కలిగించడం, దానికి సంబంధించిన శిక్షలను గురించి. దీని మధ్య దాని కన్నా వేరైన అసంగతమూ, పూర్వాపర 279, 281 శ్లోకాల వర్ణన క్రమానికి భంజకమూ అయిన ఈ శ్లోకం ప్రక్షిప్తం.

281-289వ శ్లోకం వరకు మనుకృతం ప్రామాణికం

యస్తు పూర్వనివిష్టస్య తడాగస్యోదకం హరేత్ । మూలశ్లోక సం. **137**
ఆగమం వాఽప్యపాం భింద్యాత్స దాప్యః పూర్వసాహసమ్॥ ప్రక్షిప్త శ్లోక సం. **281**

టీక:- **యః తు** = ఏ వ్యక్తి, **పూర్వనివిష్టస్య తడాగస్య** = మరొకరి ద్వారా నిర్మింపబడిన చెరువు యొక్క, **ఉదకం హరేత్** = నీటిని దొంగిలించినట్లైతే, **వా** = లేదా, **అపాం + ఆగమం భిద్యాత్** = చెరువుకు నీరు వచ్చే మార్గానికి గండి గొట్టిన, **సః పూర్వసాహసమ్ దాప్యః** = అతడికి పూర్వ సాహసం (8.138) జుర్మానా వేయాలి.

తాత్పర్యం:- ప్రజలందరికీ ఉపయోగపడే జలవనరులను కేవలం తన స్వార్థానికే వినియోగించుకొనేవాడిని, నదీప్రవాహం మొదలైన వాటికి అడ్డుకట్టలు వేసి నీటిని మళ్లించుకొనేవాడికి పూర్వసాహసం జుర్మానా వేయాలి. ॥281॥

సముత్సృజేద్రాజమార్గే యస్త్వమేధ్యమనాపది । మూలశ్లోక సం. **138**
స ద్వౌ కార్షాపణౌ దద్యాదమేధ్యం చాశు శోధయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **282**

టీక:- **యః తు** = ఏ వ్యక్తి, **అనాపది** = ఆరోగ్యంగా ఉండి కూడా, **రాజమార్గే** = ముఖ్యమైన తోవలో గానీ, లేదా వీథిలోగానీ, **అమేధ్యం సముత్సృజేత్** = మలమూత్రాలు మొ॥వి వదిలినట్లయితే, **సః** = అతడికి, **ద్వౌ కార్షాపణౌ దద్యాత్** = రెండు కార్షాపణాలు జుర్మానా వేయాలి.(8-136) **చ** = మరియు, **ఆశు అమేధ్యం శోధయేత్** = వెంటనే ఆ మురికిని శుభ్రం చేయించాలి.

తాత్పర్యం:- రాచమార్గాన గానీ, విధిలోగానీ మలమూత్రాలు వదలుట నిషేధం. రోగంతో పీడించబడుతున్నవాడికి మినహాయింపు ఉంది. ఆరోగ్యవంతు డీ పనిచేస్తే, అతడికి రెండు కార్షాపణములు జరిమానా విధించడమేగాక, ఆ మలమూత్రాదులు ఆతడి చేతనే శుభ్రం చేయించాలి.॥282॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆపద్గతోఽథవా వృద్ధో గర్భిణీ బాల ఏవ వా । మూలశ్లోక సం. **139**
పరిభాషణమర్హన్తి తచ్చ శోధ్యమితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **283**

టీక:- **ఆపద్గతః** = రోగి గానీ లేదా ఆపదలందున్న వ్యక్తి గానీ, **వృద్ధా గర్భిణీ వా బాలః** = వృద్ధురాలు, గర్భవతి, లేదా బాలుడు రాజమార్గాన్ని మురికి పట్టించినట్లయితే, **పరిభాషణమ్ అర్హన్తి** = అలా చేయవద్దని చెప్పడం గానీ లేదా గట్టిగా మందలించడం గానీ చేయాలి, **చ** = మరియు, **తత్ శోధ్యమ్** = దాన్ని శుభ్రం చేయించాలి. **ఇతి స్థితిః** = ఇదే శాస్త్ర మర్యాద.

తాత్పర్యం:- రోగి, ఆపదులందున్న వ్యక్తి, వృద్ధుడు, బాలురు, గర్భిణి వీరి విషయమై రాజమార్గాన్ని మురికి పట్టించినట్లయితే ఎందుకలా చేయాల్సి వచ్చిందో విచారించి మందలించడం, తక్షణమే వారిచేత ఆ ప్రాంతాన్ని శుద్ధిచేయించడం జరగాలి. అపరాధరుసుం వసూలు చేయకూడదు. ఇదే శాస్త్రమర్యాద. ॥283॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చికిత్సకానాం సర్వేషాం మిథ్యాప్రచరతాం దమః । మూలశ్లోక సం. **140**
అమానుషేషు ప్రథమో మానుషేషు తు మధ్యమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **284**

టీక:- **సర్వేషాం చికిత్సకానాం** = వైద్యులందరికీ, **అమానుషేషు మిథ్యా ప్రచరతాం** = పశువులకు తప్పుడు వైద్యం చేసేవారికి, **ప్రథమః దమః** = ప్రథమ సాహసం 250 పణాలు (8-138) జుర్మానా వేయాలి. మరియు, **మానుషేషు మధ్యమః** = మానవులకు తప్పుడు చికిత్స చేసినట్లయితే, మధ్యమ సాహస దండన (500) వేయాలి. వారికి అతడి ద్వారానే చికిత్స చేయించాలి.

తాత్పర్యం:- వైద్యులు శాస్త్రజ్ఞానం శూన్యత చేతగాని- పరాకున ఉండిగాని రోగికి శ్రద్ధగా వైద్యం చేయకపోతే వారినీ వదిలి పెట్టరాదు. అతనికి ద్వితీయ సాహస దండనను (500 పణములు) జూర్మానా విధించాలి. పశువుల చికిత్సకుణ్ణి పొరపాటన కూడా ఉపేక్షించరాదు. అతనికి ప్రథమ సాహస దండన (250 పణములు) విధించాలి. ॥284॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సంక్రమధ్వజయష్టీనాం ప్రతిమానాం చ భేదకః । మూలశ్లోక సం. **141**
ప్రతికుర్యాచ్చ తత్సర్వం పఞ్చ దద్యాచ్ఛతాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **285**

టీక:- **సంక్రమ-ధ్వజ-యష్టీనాం** = సంక్రమ= అంటే రథం, ఆ రథ ధ్వజమునకున్న యష్టి, దాని మీద ధ్వజమును, **చ** = మరియు, **ప్రతీమానాం భేదకః** = మూర్తులను పగులగొట్టేవాడు, **తత్ సర్వం ప్రతి కుర్యాత్** = వాటిని వారి చేతనే రాజు బాగుచేయించాలి, **చ** = మరియు, **పంచశతాని దద్యాత్** = ఎవడికి ఎంత ధనమున్నదో దాన్ని బట్టి

దండించాలి-దరిద్రుడైనట్లయితే అతడికి 500 తక్కువ ధనవంతుడైనట్లయితే 500 రూపాయలు, అధిక ధన్యాద్యుడైనట్లయితే 500 బంగారు నాణెములు జుర్మానా వేయాలి. రథాదులను వారి చేతనే నిర్మింపచేయాలి.

ఋషి దయానందభాష్యం:-రథం, రథానికి ఉన్న యష్టి, దాని మీద ధ్వజం, మూర్తులను పగులగొట్టేవారిని వాటిని వారిచేతనే రాజు బాగుచేయించాలి, ఎవ్వరికి ఎంత ధనముందో దాన్ని బట్టి దండించాలి. పేదవాడికి 500 దమ్మిడీలు, తక్కువ ధనవంతునికి 500 రూపాయలు అధిక ధనవంతుడికి 500 బంగారు నాణెములు జుర్మానా విధించాలి. దయానంద శాస్త్రార్థ సంగ్రహః-51.పంచమహాయజ్ఞ విధి-12. ॥285॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అదూషితానాం ద్రవ్యాణాం దూషణే భేదనే తథా । మూలశ్లోక సం.**142**
మణీనామపవేధే చ దణ్డః ప్రథమసాహసః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**286**

టీక:- అదూషితానాం ద్రవ్యాణాం దూషణే = దోషం లేని మంచి వస్తువులతో, చెడు వస్తువులను కలిపి, వాటిని చెడగొట్టినట్లయితే, (**ఉదాహరణ:** నవరత్న రాళ్ళలో ముక్కలు, నేతిలో నూనె కలుపుట వగైరా) **తథా** = అలాగే, **భేదనే** = మంచి వస్తువులను చెడగొట్టినట్లయితే, **చ** = మరియు, **మణీనాం అపవేధే** = మణి మొదలైన రత్నాలను విరగగొట్టిన అపరాధానికి, **ప్రథమ సాహసః దండః** = ప్రథమ సాహసం జుర్మానా వేయాలి. (8.138).

తాత్పర్యం:- కల్తీలు, రత్నాల్ని పగలగొట్టడం, ముత్యాలు లాంటివి సరిగ్గా తొల్వక పాడుచేయడం వంటి నేరాలకు, ప్రథమ సాహసం జుర్మానా విధించాలి. ॥286॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సమైర్హి విషమం యస్తు చరేద్వై మూల్యతోఽపివా । మూలశ్లోక సం.**143**
సమాప్నుయాద్దమం పూర్వం నరో మధ్యమమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**287**

టీక:- యః తు నరః = ఏ వ్యక్తి, **సమైః**= సమాన మూల్యం గల వస్తువులకు బదులుగా, **అపి వా మూల్యతః** = లేదా, సమానమైన మూల్యమునకు, **విషమం చరేత్** = తక్కువ వస్తువును ఇచ్చినట్టి వ్యవహారం చేసినట్లయితే, **పూర్వం మధ్యమమ్ + ఏవ దమం సమాప్నుయాత్** = పూర్వ సాహసమో లేదా మధ్యమ సాహసమో దండమునకు యోగ్యుడవుతాడు. (8-138).

తాత్పర్యం:- ఒకేరీతిగా వెలపుచ్చుకొని, కొందరికి మంచివి, మరికొందరికి కల్తీవి ఇచ్చే వారిని; ఒకే కొలత కలిగిన వస్తువుకు ఒకరివద్ద ఎక్కువ వెల-మరొకరి వద్ద తక్కువ వెల పుచ్చుకొనేవారిని ప్రథమతప్పు అయితే హెచ్చరించడం; తిరిగిజరిగితే దండన. పూర్వసాహసమో లేదా మధ్యమ సాహసమో దండమునకు యోగ్యుడవుతాడు.॥287॥

ఇది మనుకృతం-ప్రామాణికం

బన్ధనాని చ సర్వాణి రాజా మార్గే నివేశయేత్ । మూలశ్లోక సం.**144**
దుఃఖితా యత్ర దృశ్యేరన్ వికృతాః పాపకారిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**288**

టీక:- రాజా = రాజు, **బన్ధనానిచ సర్వాణి** = కారాగారం మొదలైన బంధన గృహాలను, జైళ్ళను, **మార్గే నివేశయేత్** = ప్రధాన మార్గాలకు దగ్గరగా నిర్మించాలి, **యత్ర** = ఎక్కడ, **దుఃఖితాః వికృతాః పాపకారిణః దృశ్యేరన్** = చేతులకు సంకెళ్ళు, కాళ్ళకు ఇనుపగొలుసులు వేసినందువల్ల చూచేవారు దుఃఖంతో బాధపడాలి.

తాత్పర్యం:- బందిఖానాలను రచ్చ చావిళ్లను నలుగురూ సంచరించే ప్రధాన మార్గాల్లో ఏర్పరచి, దొంగలను-పాపాత్ములను అక్కడ అందరికీ వెల్లడయ్యేలా ప్రదర్శించడం వల్ల, కొందరైనా వారి హీనస్థితిని ప్రత్యక్షంగా చూడడం చేత అలాంటి పనులకు సాహించరు. రాజద్రోహ నేరాలేవి చేసినా దేశ బహిష్కారమే వారికి శిక్ష.

అనారోగ్య పీడితులు గాను, తల విరబోసుకొని, గడ్డములు పెంచుకొని మురికిగా ఉన్న కారాగారవాసులు వచ్చిపోయే బాటసారులకు కనిపించేట్లుగా ఉండాలి. దాని వల్ల చూసే ప్రజలలో-అపరాధుల బాధలు చూసి **"భయం కలుగాలి."** -అపరాధములు చేసినందువల్లనే వా రిలాంటి కష్టాలపాలైనారు. నేరములు చేసినట్లయితే మనకు కూడా ఇలాంటి దుర్గతియే పట్టుతుందనే భావం ప్రజలను నేర ప్రవృత్తి నుండి విముఖులను చేస్తుంది.॥288॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాకారస్య చ భేత్తారం పరిఖాణాం చ పూరకమ్ । మూలశ్లోక సం.**145**
ద్వారాణాం చైవ భఙ్క్తారం క్షిప్రమేవ ప్రవాసయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**289**

టీక:- రాజు **ప్రాకారస్య భేత్తారం** = నగర ప్రాకారాన్ని విరగ్గొట్టేవారిని, **చ** = మరియు, **పరిఖాణాం చ పూరకమ్** = నగరానికి నాలుగు వైపుల ఉన్న అగడ్తలను పూడ్చేవారిని, **ద్వారాణాం భఙ్క్తారం** = నగర ద్వారాన్ని పగలగొట్టే వారిని, **క్షిప్రమ్ + ఏవ ప్రవాసయేత్** = వెంటనే దేశం నుండి బహిష్కరించాలి.

తాత్పర్యం:- నగర ప్రాకారాన్ని విరగ్గొటేవారిని, నగరానికి నాలుగు వైపుల ఉన్న అగడ్తలను పూడ్చేవారిని, నగర ద్వారాన్ని పగలగొట్టే వారిని, వెంటనే దేశం నుండి బహిష్కరించాలి. ॥289॥

290 నుండి 293వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *అభిచారేషు సర్వేషు కర్తవ్యో ద్విశతో దమః ।*
మూలకర్మణి చానాప్తేః కృత్యాసు వివిధాసు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***290***

తాత్పర్యం:- అభిచార క్రియలు చేస్తామంటూ కొందరు, దయ్యాలను వదలగొడతా మంటూ కొందరు, ప్రజలను ఏమార్చి ధనం మానం వశీకరణల వంటి వాటికి పాల్పడితే ఆ యా నేరాల తీవ్రతను బట్టి వివిధరీతుల దండించే అధికారం రాజుకు ఉంది. దండగచెల్లించమనడం గాని-దండనకు గురిచేయడం గాని చేయవచ్చు! ॥290॥

* *అబీజవిక్రయీ చైవ బీజోత్కృష్టం తథైవ చ ।*
మర్యాదాభేదకశ్చైవ వికృతం ప్రాప్నుయాద్వధమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***291***

తాత్పర్యం:- మొలకెత్తని విత్తనాలు మంచివని అమ్మినా; పుచ్చు విత్తనాలతో మంచి విత్తనాలు కలిపి (కల్తీచేసి) అమ్మినా; అలాంటివారి కాళ్లు, చేతులు ఖండించాలి. ॥291॥

* *సర్వకణ్టకపాపిష్ఠం హేమకారం తు పార్థివః ।*
ప్రవర్తమానమన్యాయే ఛేదయేల్లవశః క్షురైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***292***

తాత్పర్యం:- వన్నె తక్కువ బంగారం కల్తీ చేయడం, తప్పుడు తూకం వెయ్యడం, కొంత బంగారం కాజేయడం లాంటి నేరాలకు పాల్పడేవాడు పాపాత్ములలో కెల్ల పాపాత్ముడైన అలాంటి కంసాలిని ముక్కలు ముక్కలుగా నరకాలి.॥292॥

* *సీతాద్రవ్యాపహరణే శస్త్రాణామౌషధస్య చ ।*
కాలమాసాద్య కార్యం చ రాజా దణ్డం ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***293***

తాత్పర్యం:- భూమి దున్నడానికి ముఖ్యమైన కర్రు, నాగలివంటివి; కత్తులు మొదలైన ఆయుధాలు; విలువైన ప్రజోపయోగ ఔషధాలు, వస్త్రాలు దొంగిలిస్తే అలాంటివి ఉపయోగిస్తూ పట్టుబడినప్పుడు రాజదండనానికి గురికావలసి ఉంటుంది. ॥293॥

ప్రక్షిప్తాల పరిశీలన

290-293 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

290లో ఉన్నది హత్య విషయం (8.283-288). ఇందులో 291వ శ్లోకంలోని కల్తీ సంగతిని (8.203), 293లోని చోరీ విషయం (8.301-338) లో చెప్పారు. ఇది మౌలికమైతే దీన్నే ప్రసంగంలో చెప్పటం ఉపయోగపడేది. మునుపటి దాన్ని మళ్లీ చెప్పటం ప్రసంగ వ్యతిరేకం కనుక ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

292వ శ్లోకం పుట్టుకతో వర్ణ వ్యవస్థ ఆధారంగా చెప్పింది. మనువు కర్మణా వర్ణ వ్యవస్థనే చెప్పాడు. అందులో 'స్వర్ణకారుడు' (కంసాలి) పేరిట జాతి లేదా వృత్తిని గురించి విడిగా చెప్పలేదు. ఇది వైశ్యుల పని. (9.326, 329). ఇది వృత్తులు ఆధారంగా జాతులు నిర్ణయించినప్పటి తర్వాతి కాలంలోని శ్లోకం. ఇలా వ్యతిరేకం కావటం చేత ఇది ప్రక్షిప్తం.

3. పునరుక్తి

293వ శ్లోకం, 324వ శ్లోకానికి దాదాపుగా పునరుక్తి మాత్రమే ! ఈ ఆధారంతోనూ ఇది ప్రక్షిప్తం.

294 నుండి 312వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం.

7 రాజప్రకృతులు వాటి మహత్త్వం-

స్వామ్యమాత్యౌ పురం రాష్ట్రం కోశదణ్డౌ సుహృత్తథా । మూలశ్లోక సం. **146**
సప్త ప్రకృతయో హ్యేతాః సప్తాంగం రాజ్యముచ్యతే॥ ప్రక్షిప్త శ్లోక సం. **294**

టీక:- **స్వామీ-అమాత్యౌ, పురం రాష్ట్రం కోశదండౌ సుహృత్** = 1. స్వామి (ప్రభువు) 2. మంత్రి, 3. పురం రాజభవనం (కోట), 4. రాష్ట్ర ప్రజలు, 5. కోశం (ఖజానా), 6. దండం (సేన), 7. చతురంగబలాలు. **ఏతాః సప్త ప్రకృతయః** = ఈ ఏడు ప్రకృతులు, **సప్తాంగం రాజ్యమ్ + ఉచ్యతే** = వీటితో కూడి ఉన్నందువల్ల రాజ్యం ఏడు అంగములు కలదిగా చెప్పబడుతుంది.

తాత్పర్యం:- రాజ్యానికి ఏడు ప్రకృతులుంటాయి కాబట్టి, దీనికి 'సప్తాంగ' మనే మరో పేరుంది. 1.రాజు, 2.మంత్రి, 3. రాజధాని., 4. రాచనగరు/ దుర్గం, 5. ఖజానా, 6. దండన-సేన, 7. చతురంగబలాలు.॥294॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సప్తానాం ప్రకృతీనాం తు రాజ్యస్యాసాం యథాక్రమమ్ । మూలశ్లోక సం. **147**
పూర్వం పూర్వం గురుతరం జానీయాద్వ్యసనం మహత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **295**

టీక:- **రాజ్యస్య + ఆసాం సప్తానాం ప్రకృతీనాం తు** = రాజ్యానికి సంబంధించిన ఈ ఏడు ప్రకృతులలో, **యథాక్రమమ్ పూర్వం పూర్వం వ్యసనం మహత్ గురుతరం జానీయాత్** = క్రమంగా మొదటి ప్రకృతి సంబంధించిన ఆపత్తి గొప్పదని తెలుసుకోవాలి, (రాజు కంటే మంత్రి కొచ్చిన ఆపత్తి తక్కువది. మంత్రి కంటె తక్కువ కోటకు కలిగిన ఆపత్తి చిన్నది.)

తాత్పర్యం:- రాజు ఈ సప్తాంగాన్ని ఎప్పుడూ కాపాడుకుంటూ ఉండాలి. ఇవి చివరి నుంచి ఒక క్రమం ప్రకారం ఒకదానికంటే ఒకటి బలవత్తరమైనవి. రాజుకు చతురంగబలాల కంటె సేన ముఖ్యం. దానికంటే ఖజానా ముఖ్యం. దానికంటే ప్రజలు, ప్రజలకంటే అంతఃపురం, దానికంటే మంత్రి, అతని కంటే రాజు ముఖ్యం. ॥295॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సప్తాంగస్యేహ రాజ్యస్య విష్టబ్ధస్య త్రిదణ్డవత్ । మూలశ్లోక సం. **148**
అన్యోన్యగుణవైశేష్యాన్న కించిదతిరిచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **296**

టీక:- **ఇహ**= ఇందులో, **త్రిదండవత్** = మూడు కాళ్ళ మీదనున్న ముక్కాలు పీటతో సమానంగా, **సప్తాంగస్య విష్టబ్ధస్య రాజ్యస్య** = సప్త ప్రకృతి రూపాంగముల మీద ఆని వున్న ఈ రాజ్యంలో, **అన్యోన్య గుణవైశేష్యాత్** = అన్ని అంగములు తమ తమ విశేషగుణములతో, పరస్పరాశ్రితులైనందున, **కించిత్ న అతిరిచ్యతే** = ఏ అంగము మరొక దాని కంటె విశిష్టము కాని లేక తక్కువ కాని కాదు. అనగా సందర్భమును బట్టి అన్నిటికి విశేష మహత్త్వమున్నది.

తాత్పర్యం:- ఈ ఏడు అంగాలలో ఒకదానితో మరొకదానికి పరస్పరమైత్రి ఉంటుంది. ఒక దాని తోడ్పాటు మరో అంగానికి చాలా అవసరం. సన్న్యాసికి త్రిదండములలాగా, రాజుకీ సప్తాంగాలూ ముఖ్యమైనవే ! దేనినీ తక్కువగా అంచనా వేయరాదు. ॥296॥

ఇది మనుకృతం-ప్రామాణికం

తేషు తేషు తు కృత్యేషు తత్తదంగం విశిష్యతే । మూలశ్లోక సం. **149**
యేన యత్సాధ్యతే కార్యం తత్తస్మిన్ శ్రేష్ఠముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **297**

టీక:- ఎందువలననగా, **తేషు తేషు చ కృత్యేషు** = ఆ ప్రకృతులకు తమ తమ కార్యములందు, **తత్-తత్+అఙ్గం విశిష్యతే** = ఆ యా ప్రకృతి అంగము విశేషంగా ఉంటుంది. **యత్ కార్యం యేన సాధ్యతే** = ఏ కార్యము ఏ ప్రకృతి వలన సఫలమవుతుందో, **తస్మిన్ తత్ శ్రేష్ఠమ్ + ఉచ్యతే** = ఆ కార్యమునకు-ఆ ప్రకృతియే శ్రేష్ఠమగును. అనగా సమయానుసారంగా ప్రకృతులన్నియు శ్రేష్ఠములే. అందువలన ఏదైనా ఒక ప్రకృతికి ప్రాధాన్యత లేదని భావించి త్యాజ్యమని భావించరాదు.

తాత్పర్యం:- ఆ యా కార్యనిర్వహణకు ఆ అంగమే ముఖ్యమైనది. ఒకదానివల్ల జరుగవలసినది మరో అంగంచేత జరుగదు. చేతులతో చేసే అన్నం తినడం వంటివి కాలితో చేయగలమా? చతురంగబలాలు చేయవలసినపని చెలికానితో కాదు గదా! కాబట్టి అన్నీ అవసరమే. ॥297॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చారేణోత్సాహయోగేన క్రియయైవ చ కర్మణామ్ । మూలశ్లోక సం. **150**
స్వశక్తిం పరశక్తిం చ నిత్యం విద్యాన్మహీపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **298**

టీక:- **చారేణ** = గుప్తచారుల ద్వారా,**ఉత్సాహ యోగేన** = సేన సంబంధమైన ఉత్సాహముతో, **చ** = మరియు, **కర్మణాం క్రియయా** = రాజ్యశక్తి వర్ధకములైన నవ్యాతినవ్య కార్యములను చేయుట ద్వారా, **మహీపతిః** = రాజు, **స్వశక్తిం చ పరశక్తిం నిత్యం విద్యాత్** = తన శక్తిని- పరశక్తిని అనగా శత్రువుల శక్తిని నిత్యం అంచనా వేసుకొనుచుండవలెను.

తాత్పర్యం:- అందువల్లనే రాజు మారువేషాలు ధరించి గాని, తన గూఢచారులచేత ఆ పని చేయించి గాని ప్రజల మనోభావాలను పరిశీలిస్తూ వారికి ఉపయోగదాయకమైన పనులను ఎప్పటికప్పుడు చేయిస్తూ, స్వశక్తినీ-వైరిరాజులశక్తినీ అంచనా వేయిస్తూ ఉండాలి. ॥298॥

ఇది మనుకృతం-ప్రామాణికం

పీడనాని చ సర్వాణి వ్యసనాని తథైవ చ । మూలశ్లోక సం. **151**
ఆరభేత తతః కార్యం సఞ్చిన్త్య గురులాఘవమ్ । ప్రక్షిప్త శ్లోక సం. **299**

టీక:- సర్వాణి పీడనాని = తన రాజ్యంలో, శత్రురాజ్యంలో సంభవించిన సర్వవ్యాధులు, ఆపదలు మొదలైన బాధలను, **తథైవ వ్యసనాని** = అలాగే వ్యసనాల (7.45-53) వ్యాప్తిని, **చ** = మరియు, **గురు-లాఘవమ్ సంచిన్త్య** = వ్యసనాలు నావి ఎక్కువనా లేక శత్రు వ్యసనాలు అధికమా అని చక్కగా ఆలోచించి, **తతః కార్యమ్+ఆరభేత** = తరువాత రాజు సంధి-విగ్రహం మొదలైన (7.160-210) కార్యముల నారంభించాలి.

తాత్పర్యం:- తన రాజ్యంలో, శత్రురాజ్యంలో సంభవించిన సర్వవ్యాధులు, ఆపదలు మొదలైన బాధలను అలాగే వ్యసనాల వ్యాప్తిని, వ్యసనాలు నావి ఎక్కువనా లేక శత్రువుల వ్యసనాలు ఎక్కువనా అని చక్కగా ఆలోచించి, తరువాత రాజు సంధి-విగ్రహం మొదలైన కార్యాలను ఆరంభించాలి. ॥299॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఆరభేతైవ కర్మాణి శ్రాన్తః శ్రాన్తః పునః పునః । మూలశ్లోక సం. **152**
కర్మాణ్యారభమాణం హి పురుషం శ్రీర్ని షేవతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **300**

టీక:- శ్రాన్తః శ్రాన్తః = మాటి మాటికి ఓటమిపాలైనా లేదా అలసిపోయినా, రాజు **కర్మాణి పునః పునః ఆరభేత ఏవ** = కార్యాలను (సంధి విగ్రహాదులు 7.160-200) మళ్ళీ మళ్ళీ అవశ్యం ఆరంభిస్తూనే ఉండాలి. ఎందుకంటే. **కర్మాణి + ఆరభమాణం హి పురుషం** = కర్మలను ప్రారంభించే పురుషుణ్ణే, **శ్రీః నిషేవతే** = విజయలక్ష్మి సేవిస్తుంది.

తాత్పర్యం:- సొంతరాజ్యాన్ని వృద్ధిచేయడానికీ-పరరాజ్యాలను వశపరచుకోడానికీ మళ్ళీమళ్ళీ ప్రయత్నాలు ఆరంభించడం సుక్షత్రియుడి లక్షణం. వీటికి ఎన్ని అవాంతరాలెదురైనా వీటిని ఎప్పటికప్పుడు కొత్తగా ఆరంభిస్తూ ఉండేవారినే రాజ్యలక్ష్మి కరుణిస్తుంది. ॥300॥

రాజ శాసనంలోనే నాలుగు యుగాలు -

ఇది మనుకృతం-ప్రామాణికం

కృతం త్రేతాయుగం చైవ ద్వాపరం కలిరేవ చ । మూలశ్లోక సం. **153**
రాజ్ఞో వృత్తాని సర్వాణి రాజా హి యుగముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **301**

టీక:- కృతం-త్రేతాయుగం ద్వాపరం చ కలిః = కృతయుగం (సత్య యుగం), త్రేతాయుగం, ద్వాపర యుగం మరియు కలియుగం, **సర్వాణి రాజ్ఞః వృత్తాని** = ఈ యుగాలన్నీ మహీపతి ఆచార వ్యవహార విశేషాలే. అంటే ప్రభువు ఎలాంటి రాజ్యాన్ని నిర్మిస్తాడో ఆ రాజ్యంలో అలాంటి యుగమే తయారవుతుంది. **రాజాహి యుగమ్ + ఉచ్యతే** = వాస్తవంగా, రాజే యుగమనబడుతాడు. అంటే యుగనిర్మాత రాజే.

తాత్పర్యం:- రాజు చేసే చర్యలనే యుగ విభాగంగా భావించాలి. అంటే రాజే కృతయుగం, అతడే త్రేతాయుగం, అతడే ద్వాపర, కలియుగాలు కూడా! ఆ యా యుగస్వరూప ప్రతినిధి రాజే ! ఈ యుగాలన్నీ మహీపతి ఆచార వ్యవహార విశేషాలే. ॥301॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కలిః ప్రసుప్తో భవతి స జాగ్రద్ద్వాపరం యుగమ్ । మూలశ్లోక సం. **154**
కర్మస్వభ్యుద్యత స్త్రేతా విచరంస్తు కృతం యుగమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **302**

టీక:- ప్రసుప్తః కలిః భవతి = ఎప్పుడు రాజు నిద్రిస్తాడో అంటే రాజ కార్యములలో ఉపేక్ష చేస్తాడో అది కలియుగమవుతుంది. **సః జాగ్రత్ ద్వాపరం యుగమ్** = ఎప్పుడు ప్రభువు మేల్కొంటాడో అంటే రాజ్యకార్యములను మామూలుగా నెరవేర్చునో అది ద్వాపరయుగం మరియు, **కర్మసు+అభ్యుద్యతః త్రేతా** = రాజ్యము, ప్రజాహిత కార్యములలో రాజు ఎప్పుడు ప్రయత్నిస్తున్నాడో, అది త్రేతా యుగం. **విచరన్ తు కృతం యుగమ్** = రాజు సర్వకర్తవ్యాలను తత్పరతతో నిర్వహిస్తాడో తన ప్రజల బాధలను తెలుసుకోడానికి రాజ్యంలో నిజమైన ప్రయత్నంచేస్తాడో, తెలిసిన తరువాత న్యాయానుసారంగా ప్రజల సుఖం కోసం నిరంతర ప్రయత్నంలో నిమగ్నుడవుతాడో అది రాజుకి సత్యయుగం.

తాత్పర్యం:- అజ్ఞానం, సోమరితనం, నిర్లక్ష్యం మొదలైనవి కలిరాజ లక్షణాలు. ఈ యుగంలో రాజు ప్రయత్నహీనుడిగా ఉంటాడు. ఇక ద్వాపరంలో రాజు జ్ఞాని అయికూడా నిర్లిప్తుడు. తమ కృత్యములలో జాగ్రత్తపరులై ఉండే రాజలక్షణం త్రేతాయుగానిది. శాస్త్రరీత్యా అన్ని కార్యాలు నిర్వహించే లక్షణం గలవారు కృతయుగ క్షత్రియులు. ఆదర్శవంతమైన ఈ లక్షణం పాటించాలి. ఇది రాజుకు సత్యయుగం. ॥302॥

రాజు యొక్క అష్ట రూపాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

ఇన్ద్రస్యార్కస్య వాయోశ్చ యమస్య వరుణస్య చ । మూలశ్లోక సం. **155**
చన్ద్రస్యాగ్నేః పృథివ్యాశ్చ తేజోవృత్తం నృపశ్చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **303**

టీక:- నృపః = రాజు, **ఇంద్రస్య+అర్కస్య, వాయోః యమస్య వరుణస్య, చంద్రస్య + అగ్నేః పృథివ్యాః తేజః వృత్తమ్ చరేత్** = ఇంద్ర, సూర్య, వాయు, యమ, వరుణ, చంద్రమా, అగ్ని, పృథివీలకు సంబంధించిన తేజస్వీ స్వభావానుసారంగా ఆచరణ-వ్యవహారం చేయాలి.

తాత్పర్యం:- రాజు ఇంద్ర, సూర్య, వాయు, యమ, వరుణ, చంద్రమా, అగ్ని పృథివి-వీటికి సంబంధించిన తేజస్వీ స్వభావానుసారంగా ఆచరణ వ్యవహారం చేయాలి. ॥303॥

వివరణ:

అన్యత్ర వర్ణిత భావాలకు ప్రమాణం. సప్తమాధ్యాయంలో మనువు ప్రభువుకుండవలసిన విశిష్ట గుణాలను సూచించాడు. ఈ భావాన్ని మనువు వేదమంత్రాల నుండే గ్రహించాడు. (7.4-7) శ్లోకాల, వాటికి సంబంధించిన వివరణ చూడగలరు.

రాజుకున్న ఇంద్రరూపాచరణం - ఇది మనుకృతం-ప్రామాణికం

వార్షికాంశ్చతురో మాసాన్ యథేన్ద్రో-భిప్రవర్షతి । మూలశ్లోక సం. **156**
తథాఽభివర్షేత్ స్వం రాష్ట్రం కామైరిన్ద్రవ్రతం చరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **304**

టీక:- యథా+ఇన్ద్రః వార్షికాన్ చతురః మాసాన్ = ఏ విధంగా ఇంద్రుడు, వృష్టికారక శక్తి ప్రత్యేక సంవత్సరం శ్రావణాది నాలుగు మాసాలలో, **అభివర్షతి** = వర్షం కురిపిస్తాడో, **తథా ఇన్ద్ర వ్రతం చరన్** = అదేవిధంగా ఇంద్రవ్రతాన్ని, ఆచరణలో అమలుపరుస్తూ, రాజు, **స్వం రాష్ట్రం కామైః అభివర్షేత్** = తన రాష్ట్ర ప్రజల కోరికలను పూర్తి చేయాలి. ఇదే రాజు అనుసరించవలసిన ఇంద్రవ్రతం.

తాత్పర్యం:- ఇంద్రుడి వైఖరి ఎలా ఉంటుందంటే-శ్రావణం మొదలు 4 నెలలపాటు వర్షాలు కురిపించి సస్య ఫలములు ఇస్తాడు. ఆ విధంగా ప్రభువు కొంతకాలం పాటు తన దేశానికి వచ్చే సుజనుల మనోభీష్టాలను గమనించి, వారికి ఆ యా వాంఛితాలను ఇచ్చి సంతోషపరిచేలా ఇంద్రవ్రతం అనుష్ఠించాలి. ॥304॥

రాజుకున్న సూర్యరూపాచరణం - ఇది మనుకృతం-ప్రామాణికం

అష్టౌ మాసాన్ యథాఽఽదిత్యస్తోయం హరతి రశ్మిభిః । మూలశ్లోక సం. **157**
తథా హరేత్కరం రాష్ట్రాన్నిత్యమర్క వ్రతం హి తత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **305**

టీక:- యథా + ఆదిత్యః = ఏ విధంగా సూర్యుడు, **రశ్మిభిః** = తన కిరణాల ద్వారా, **అష్టౌ మాసాన్ తోయం హరతి** = ఎనిమిది మాసాల వరకు నీటిని గ్రహిస్తాడో, **తథా** = అదే ప్రకారంగా, **రాజా** = రాజు, **రాష్ట్రాత్ నిత్యం కరం హరేత్** = రాష్ట్రము నుండి-అనగా ప్రజల నుండి పన్ను వసూలు చేయాలి. **అర్క వ్రతం హి తత్** = ఇదే రాజు అనుసరించవలసిన అర్క-సూర్య వ్రతము.

తాత్పర్యం:- సూర్య భగవానుడు మార్గశిరం మొదలు ఎనిమిది నెలలు, తన కిరణాలచేత కొద్దికొద్దిగా జలవనరుల్లోంచి జలాన్ని సంగ్రహించే రీతిగా ప్రజలకు భారం లేకుండా, నీతి మార్గాన పన్నులు వసూలు చేయాలి. రాజులకు ఇది సూర్యవ్రతం అనుష్ఠించినట్లే ! ॥305॥

రాజు అనుసరించాల్సిన వాయు వ్రతం - ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రవిశ్య సర్వభూతాని యథా చరతి మారుతః । మూలశ్లోక సం. **158**
తథా చారైః ప్రవేష్టవ్యం వ్రతమేతద్ధి మారుతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **306**

టీక:- యథా మారుతః = ఏవిధంగా వాయువు, **సర్వభూతాని ప్రవిశ్య** = సర్వ ప్రాణులయందు ప్రవేశించి, **చరతి** = విచరిస్తుందో (ప్రసరిస్తుందో), **తథా** = అదేవిధంగా, **చారైః ప్రవేష్టవ్యం** = గుప్తచరుల ద్వారా రాజు అన్నిచోట్ల ప్రవేశించాలి, **ఏతత్ మారుతమ్ వ్రతమ్** = ఇదే రాజు కున్న మారుతవ్రతం.

తాత్పర్యం:- గాలి (వాయుదేవుడు) అన్ని ప్రాణుల్లోకీ ప్రవేశించి ఏ విధంగా శోధించి శుద్ధి చేస్తుందో-ఎలా వాటి ప్రాణాలు నిల్పుతున్నదో అదే రీతిగా గూఢచారుల చేత రాజ్యాన్ని సంశోధింపజేస్తూ ప్రజలకు సుఖశాంతులు కలుగజేయాలి. రాజు ఈ తీరుగా చేయడం అంటే మారుత వ్రతాన్ని అనుష్ఠించడంతో సమానం. ॥306॥

రాజు-యమరూప ధారణ - ఇది మనుకృతం-ప్రామాణికం

యథా యమః ప్రియద్వేష్యౌ ప్రాప్తే కాలే నియచ్ఛతి । మూలశ్లోక సం. **159**
తథా రాజ్ఞా నియంతవ్యాః ప్రజాస్తద్ధి యమవ్రతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **307**

టీక:- యథా యమః = ఏ ప్రకారంగా యముడు, ఈశ్వరుడి మృత్యు కారకశక్తి = మృత్యువు, **కాలే ప్రాప్తే** = కర్మఫల సమయం ప్రాప్తించగా, **ప్రియ-ద్వేష్యౌ నియచ్ఛతి** = ప్రియులను, శత్రువులను అందరినీ తన వశంలోకి తీసుకొని, దండిస్తాడో లేదా మృత్యుముఖమున నెట్టునో, **రాజ్ఞా తథా ప్రజా నియన్తవ్యాః** = రాజుకూడా అదేవిధంగా, అపరాధం చేసినవారు శత్రువులైనా, మిత్రులైనా, న్యాయపూర్వకంగా పక్షపాతరహితంగా దండించాలి. **తత్ హి యమవ్రతమ్** = అదే యమవ్రతం.

తాత్పర్యం:- తనను పూజించినా, నిందించినా యముడు జీవులందరి పట్ల ఒక్కలాగానే సమావర్తిత్వం ప్రదర్శించి మరణకాలంలో అందరినీ దరి చేర్చుకుంటాడు. శత్రు-మిత్రులు లేని యమ వైఖరిని రాజులూ పాటించాలి. అంటే-అనురాగ ద్వేషాలకు అతీతంగా మెలగాలని అర్థం. అపరాధం చేసినవారు శత్రువులైనా, మిత్రులైనా న్యాయపూర్వకంగా పక్షపాత రహితంగా దండించాలి. ఇదే యమవ్రతం. ॥307॥

రాజు యొక్క వరుణరూపాచరణం ఇది మనుకృతం-ప్రామాణికం

వరుణేన యథా పాశైర్బద్ధ ఏవాభిదృశ్యతే । మూలశ్లోక సం. **160**
తథా పాపాన్నిగృహ్ణీయాద్వ్రతమేతద్ధి వారుణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **308**

టీక:- యథా = ఏవిధంగా, అపరాధి, **వరుణేన పాశైః బద్ధః ఏవ + అభిదృశ్యతే** = వరుణుడి పాశముల ద్వారా జలీయ లేదా సముద్ర తరంగాల మధ్య గల సుడిగుండాలనే బంధనాలలో-చిక్కుల్లోబడి బంధితుడవుతాడో, రాజు

కూడా, **పాపాన్ నిగృహ్ణీయాత్** = పాపులను, అపరాధులను, నిరపరాధులై, సత్ప్రవర్తనులయ్యే వరకు సామ, దాన, భేద దండాదులచేత వశపరచుకొని గానీ లేదా కారాగారంలో బంధించిగానీ ఉంచాలి. **ఏతత్ హి వారుణమ్ వ్రతమ్** = ఇదే రాజుకున్న వరుణవ్రతం.

తాత్పర్యం:- వరుణపాశాలకు కట్టుబడాలని ఎవరూ కోరుకోరు. కానీ అందరూ ఏదో నాటికి వరుణపాశాలకు చిక్కక తప్పదు. పాపం చేసేవారిని తప్పించుకోనివ్వకుండా తగిన దండన విధించడానికి సదా సంసిద్ధుడై ఉండాలి. ఇది రాజులు ఆచరించే వరుణ వ్రతం. ॥308॥

వివరణ:

'వరుణపాశ శబ్దానికి' అర్థం:- ప్రసంగానుసారంగా అనేకమైన అర్థాలున్నప్పటికీ ఇక్కడ మహాభూతాది దివ్యశక్తుల గుణాలతో రాజు గుణాలు పోల్చబడినవి. అందువల్ల ఇక్కడ వరుణ శబ్దానికి జలమనే అర్థాన్ని గ్రహించాలి. భయంకరమైన జలతరంగాలు, లేదా సుడిగుండాలు ఏ వస్తువునైనా లేదా ఏ వ్యక్తినైనా తమ వశం చేసికొన్నట్లుగా, రాజు వివిధ బంధనముల ద్వారా అపరాధులను వశపరచుకొనాలి. ఇదే వరుణపాశములకున్న ఆలంకారికమైన అభిప్రాయం.

రాజు యొక్క చంద్ర రూపాచరణం - ఇది మనుకృతం-ప్రామాణికం

పరిపూర్ణం యథా చన్ద్రం దృష్ట్వా హృష్యన్తి మానవాః । మూలశ్లోక సం. **161**
తథా ప్రకృతయో యస్మిన్ స చాన్ద్రవ్రతికో నృపః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **309**

టీక:- యథా = ఏవిధంగా, **పరిపూర్ణం చంద్రం దృష్ట్వా మానవాః హృష్యన్తి** = పూర్ణచంద్రుణ్ణి దర్శిస్తే మానవులు ప్రసన్నులవుతారో, **తథా** = ఆ విధంగానే, **యస్మిన్ ప్రకృతయః** = ఏ రాజును చూసి, ఆయన కల్పించిన సుఖసాధనాల ద్వారా ప్రజలు స్వయంగా హర్షానుభూతులననుభవింతురో, **సః నృపః చాన్ద్రవ్రతికః** = ఆ రాజు చాంద్రవ్రతం ఆచరించేవాడు.

తాత్పర్యం:- చంద్రుణ్ణి చూసి ప్రజలు ఎలా ఆనందించగలుగుతారో- తమ ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారో రాజును చూసి ప్రజలూ, అతని మంత్రీ, సైన్యాధిపతీ, సామంతాదులూ ఆ విధంగానే సంతోషించగలిగేలా ప్రభువు ప్రవర్తించాలి. రాజులు అనుష్ఠించే చంద్రవ్రతం ఇలా ఉంటుంది. ॥309॥

రాజు యొక్క అగ్నివ్రతాచారణం ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రతాపయుక్తస్తేజస్వీ నిత్యం స్యాత్పాపకర్మసు । మూలశ్లోక సం. **162**
దుష్టసామన్తహింస్రశ్చ తదాగ్నేయం వ్రతం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **310**

టీక:- రాజు, **పాపకర్మసు** = పాపకర్మలొనరించే వారిని, **నిత్యం** = సదైవ, **ప్రతాపయుక్తః తేజస్వీస్యాత్** = శిక్షించడంలో సంతాపకారకుడు గాను, తేజస్సంపన్నుడు గాను, ఉండాలి. **చ** = మరియు, **దుష్టసామన్త హింస్రః** = దుష్టసామంతులను హింసించేవాడుగా ఉండాలి, **తత్+ఆగ్నేయం వ్రతం స్మృతమ్** = ఇదే రాజుకున్న ఆగ్నేయ వ్రతం.

తాత్పర్యం:- తన ప్రతాపం-శౌర్యం అనే తేజస్సుతో ప్రభువు అవిధేయులను అనుచితవర్తనులను దండించడానికి వెనుకాడకూడదు. దహించడానికి అదీ -ఇదీ అనే తేడాలేకుండా అగ్నిదేవుడెలా వర్తిస్తాడో ఇదీ అంతే ! రాజు అనుష్ఠించే అగ్ని వ్రతం ఇదే. ॥310॥

రాజు-పృథ్వీరూపాచరణం - ఇది మనుకృతం-ప్రామాణికం

యథా సర్వాణి భూతాని ధరా ధారయతే సమమ్ । మూలశ్లోక సం. **163**
తథా సర్వాణి భూతాని బిభ్రతః పార్థివం వ్రతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **311**

టీక:- **యథా** = ఏవిధంగా, **ధరా** = ధరతి (భూమి), **సర్వాణి భూతాని సమమ్ ధారయతే** = సర్వప్రాణులను సమాన రూపంగా ధరిస్తుందో, భరిస్తుందో ఆశ్రయమిస్తుందో, **తథా** = అదేవిధంగా, **సర్వాణి భూతాని బిభ్రతః** = సమాన భావంతో సర్వప్రాణులను ధారణ-పోషణ చేసేవాడుగా రాజు యొక్క **పార్థివం వ్రతమ్** = పార్థివ వ్రతమనబడును.

తాత్పర్యం:- ఉత్తములనూ-నీచులనూ కూడా భూమి ఏ విధంగా సమానదృష్టితో పోషిస్తుందో రాజు కూడా అదే విధంగా పండితులను-పామరులను దీనులను-సంపన్నులను సమదృష్టితో చూసి పరిపాలించాలి. ఇది ప్రభువు నెరవేర్చదగిన పృథ్వీవ్రతం అనిపించుకుంటుంది. ॥311॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతైరుపాయైరన్యైశ్చ యుక్తో నిత్యమతన్ద్రితః । మూలశ్లోక సం. **164**
స్తేనాన్రాజా నిగృహ్ణీయాత్స్వరాష్ట్రే పర ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **312**

టీక:- **రాజా** = రాజు, **ఏతైః + ఉపాయైః చ అన్యైః యుక్తః** = ఈ పూర్వోక్తమైన ఉపాయాల ద్వారా, వీటికి భిన్నమైన ఉత్తమ ఉపాయాల ద్వారా, **నిత్యమ్ + అతంద్రితః** = సదా ఏమరుపాటు లేకుండా, **స్వరాష్ట్రే చ పర + ఏవ** = తన దేశంలో, ఉన్న దొంగలు, పరరాష్ట్రంలో ఉండి తన రాష్ట్రంలో దొంగిలించే, **స్తేనాన్ నిగృహ్ణీయాత్** = చోరులను వశపరచుకోవాలి.

తాత్పర్యం:- ఇంత వరకు పైన చెప్పిన దేవతల తత్త్వాలను అనుసరిస్తూ-వారి వలెనే వర్తిస్తూ, ఇతర ఉపాయాల చేత, తన బుద్ధి కుశలత చేత, స్వదేశ-విదేశాలలో ఉన్న దొంగలను కనిపెట్టి వారిని శిక్షిస్తూ, రాజ్యంలోని ప్రజలకు సుఖశాంతులు అందిచాల్సినది ప్రభువులే! ॥312॥

313-323వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇది ప్రామాణికం కావు

బ్రాహ్మణుని ఉగ్రరూప క్రోధము -

* *పరామప్యాపదం ప్రాప్తో బ్రాహ్మణాన్న ప్రకోపయేత్ ।*
తే హ్యేనం కుపితా హన్యుః సద్యః స బలవాహనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***313***

తాత్పర్యం:- ఖజానా తరిగిపోవడం లాంటి అవాంతరాలెదురైనా రాజు తన రాజ్యంలో విప్రులకు ఆగ్రహం కలిగించరాదు. వారికి కోపం వస్తే రాజుని శపించి, మంత్రాలచేత రూపుమాపగలరు. ॥313॥

* *యైః కృత స్సర్వభక్ష్యోఽగ్ని రపేయశ్చ మహోదధిః ।*
క్షయీ చాప్యాయితస్సోమః కో న నశ్యేత్ప్రకోప్య తాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***314***

తాత్పర్యం:- ఏ బ్రాహ్మణులు బాగా విసిగిపోయి, దేవతారూపుడైన అగ్నినే సర్వభక్షకునిగా శపించారో, చంద్రుని క్షయరోగ పీడితుణ్ణి చేసి తిరిగి చక్కబరిచారో అలాంటి బ్రాహ్మణులకు ఆగ్రహం కలిగిస్తే సుఖమా? ॥314॥

* *లోకానన్యాన్సృజేయుర్యే లోకపాలాంశ్చ కోపితాః ।*
దేవాన్ కుర్యురదేవాంశ్చ కః క్షిణ్వంస్తాన్సమృధ్నుయాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***315***

తాత్పర్యం:- ఏ విప్రులు కోపిస్తే స్వర్గాది లోకాల్ని-ఇంద్రాది దిక్పాలురను సృజింపగలరో, దేవతల్ని సైతం శపించి మానవ జన్ములుగా మార్చగలరో, అలాంటివారిని నొప్పిస్తే క్షేమమా? ॥315॥

* *యానుపాశ్రిత్య తిష్ఠంతి లోకా దేవాశ్చ సర్వదా ।*
బ్రహ్మ చైవ ధనం యేషాం కో హింస్యాత్తాన్ జిజీవిషుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***316***

తాత్పర్యం:- యజనం-యాజనం చేసే ఏ బ్రాహ్మణుల్ని భూమ్యాది లోకాలును, దేవతలును ఆశ్రయించి ఉంటారో అలాంటి వేద విద్యాధిపత్యమున్న బ్రాహ్మణులకు హాని కలిగించ సాహసమా? ॥316॥

* *అవిద్వాంశ్చైవ విద్వాంశ్చ బ్రాహ్మణో దైవతం మహత్ ।*
ప్రణీతశ్చాప్రణీతశ్చ యథాఽగ్నిర్దైవతం మహత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***317***

తాత్పర్యం:- సంస్కరింపబడినా-సంస్కరించ బడకపోయినా అగ్ని ఏవిధంగా గొప్పదో అలాగే విద్వాంసుడయినా, కాకున్నా బ్రాహ్మణుడే అందరికీ ముఖ్య దైవం. నిప్పు లాంటి వాడే బ్రాహ్మణుడు. తెలిసి పట్టుకున్నా-తెలీక పట్టుకున్నా అగ్నీ-విప్రులిద్దరూ కాల్చగల సమర్థులే! కాబట్టి వారిని ప్రజ్వలింపచేయరాదు. భూసురోత్తములని ఎంచి పూజించమని చెప్పేది ఇందుకే! ॥317॥

* *శ్మశానేష్వపి తేజస్వీ పావకో నైవ దుష్యతి ।*
హూయమానశ్చ యజ్ఞేషు భూయ ఏవాభివర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***318***

తాత్పర్యం:- అగ్ని ఎక్కువ తేజస్సు కలదై అటు శ్మశానంలో ఇటు యజ్ఞ కార్యములలో పవిత్రమైనదిగా పరిగణించబడుతూందో, అలాగే - ॥318॥

* *ఏవం యద్యప్యనిష్టేషు వర్తంతే సర్వకర్మసు ।*
సర్వదా బ్రాహ్మణాః పూజ్యాః పరమం దైవతం హి తత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***319***

తాత్పర్యం:- విప్రులు నీచకార్యాలలో ప్రవర్తిల్లినా అన్ని విధాలా వారు పూజ్యులే ! వారే గొప్పదైవత. ॥319॥

ప్రక్షిప్తాల పరిశీలన

313-319 శ్లోకాలను ప్రక్షిప్తాలుగా భావిస్తూ, వీటిని పేర్కొంటూ దయానంద మహర్షి ఇలా రాశారు -

"బ్రాహ్మణుల పట్ల విముఖులు కావాలని ఇలాంటి శ్లోకాలు చొప్పించారు....అగ్ని ఉదాహరణతో, చదువుకున్న వాడైనా, కాకపోయినా బ్రాహ్మణుడు సాక్షాత్తూ దేవత అని స్పష్టమవుతూంది. ప్రాచీన గ్రంథాలలో ఇలాంటి కృత్రిమ శ్లోకాలు చొప్పించి, కొత్త రచనలు సృష్టించి బ్రాహ్మణులు తమ శక్తిని పెంచుకున్నారు. మన్వాది స్మృతులలో సైతం తమ మహత్త్వాన్ని గురించిన వాక్యాలు కలిపేశారు... దుష్కార్యాలు చేసేవారు బ్రాహ్మణులను నిందిస్తే, వారిని బ్రహ్మ విరోధులని ఎముకలు విరిగేలా కొట్టేవారు." (పూనా ప్రవచనం పుట. 134).

* *క్షత్రస్యాతి ప్రవృత్తస్య బ్రాహ్మణాన్ ప్రతి సర్వశః ।*
బ్రహ్మైవ సన్నియంతృ స్యాత్ క్షత్రంహి బ్రహ్మసంభవమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***320***

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి బాధ కలిగించే క్షత్రియులను వారే శాపాదులచేత శిక్షిస్తారు. క్షత్రియుడు బ్రహ్మ (బ్రాహ్మణ) పుత్రుడు. బాహు సంభవుడు కదా! ॥320॥

* *అద్భ్యోఽగ్నిర్బ్రహ్మతః క్షత్రమశ్మనో లోహముత్థితమ్ ।*
తేషాం సర్వత్రగం తేజః స్వాసు యేనిషు శామ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***321***

తాత్పర్యం:- నీటిలోంచి అగ్ని, బ్రాహ్మణుడి నుంచి క్షత్రియుడు, రాతినుంచి లోహాలు పుట్టాయి. ఇవి తమ పరాక్రమం చూపగలవేమోగాని, తమ జన్మకు కారణమైనవారిపై ఏమీ చెయ్యజాలవు. ॥321॥

* *నా బ్రహ్మ క్షత్రమృధ్నోతి నాక్షత్రం బ్రహ్మ వర్ధతే ।*
బ్రహ్మ క్షత్రం చ సంపృక్తమిహ చాముత్ర వర్ధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***322***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు లేకుండా రాజు వర్ధిల్లజాలడు. రాజులేని బ్రాహ్మణుడు యజ్ఞయాగాదులు చేయజాలడు. వీరు ఒకరికొకరు పరస్పరం సహకరించుకుంటూ ఇహపరములకు కావలసిన ధర్మార్థ మోక్షాలను పెంపుచేస్తుంటారు.॥322॥

* *దత్వా ధనం తు విప్రేభ్యస్సర్వం దండసముత్థితమ్ ।*
పుత్రే రాజ్యం సమాసృజ్య కుర్వీత ప్రాయణం రణే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***323***

తాత్పర్యం:- రాజు తీరని వ్యాధిచేత అంత్యదశలో ఉంటే పుత్రుడికి రాజ్యాభిషేకం జరిపి, అన్యాయార్జితం కానట్టి ధనాన్ని విప్రులకు ఇచ్చి, ఉత్తమగతి పొందగోరడమో, లేదా యుద్ధంలో మరణించి వీర స్వర్గం పొందడమో లేదా ప్రాయోపవేశం చేసి ప్రాణాలు వదలడమో చేయాలి. ॥323॥

ప్రక్షిప్తాల పరిశీలన

313 నుంచి 323 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాల మొత్తం విషయం అంతర్ వ్యతిరేకాల ఆధారంగా ప్రక్షిప్తం.

క. 313లో బ్రాహ్మణులు చాలా క్రోధం గలవారని చెప్పారు. కానీ 6.16లో బ్రాహ్మణులకు కోపం సర్వథా త్యజించవలసిం దన్నారు. మనువు ప్రకారమైతే, ఇటువంటి స్వభావం గలవాడు బ్రాహ్మణుడు కానే కాడు!

ఖ. 314-316లలో సముద్రం, లోకపాలకులు మొదలైనవారిని సృష్టించినవారు బ్రాహ్మణులన్నారు. కానీ 2.160, 178; 4.163లలో ఈ అన్నిటి సృష్టికర్తా పరమాత్మ అన్నారు. మనిషి ఎవరైనా వీటి సృష్టి చేయటం అనేది హాస్యాస్పదమూ, మూర్ఖపు ఆలోచన, సృష్టి క్రమానికి వ్యతిరేకమూ అవుతుంది.

గ. 317-319లలో చదువు లేనివాడు, చెడ్డపనులు చేసేవాళ్ళను కూడా బ్రాహ్మణులు, పూజనీయు లన్నారు. ఇది మనువు మౌలిక వ్యవస్థకే వ్యతిరేకం. మనువు కర్మణా వర్ణవ్యవస్థ అన్నాడు (2.103; 4.245; 10.65).

ఘ. 323లో జుర్మానా ధనం బ్రాహ్మణుల కివ్వాలని ఉంది. కానీ 7-9 అధ్యాయాలలో ప్రతి జుర్మానా ధనమూ రాజు తీసుకోవాలని ఉంది. ఇలా ఈ రెండు శ్లోకాలు, వీటికి సంబంధించిన అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే ! ఈ అన్ని శ్లోకాలూ జన్మతో జాతి వాదం ప్రాచుర్యంలో ఉన్నప్పటి రచనలు, మనుస్మృతిలో కలపబడ్డాయి.

2. విషయ వ్యతిరేకాలు

విషయ సంకేత శ్లోకాలైన 9.252-253ల లోనిది ఇక్కడ 'లోక కంటకుల నివారణ' అనేది విషయం. ఈ శ్లోకాలు వీటికి వ్యతిరేకంగా ఉన్నాయి. కనుక ప్రక్షిప్తాలు.

3. శైలీగత ఆధారాలు

ఈ అన్ని శ్లోకాల శైలీ నిరాధారం, సహేతుకం కానిది, పక్షపాతం గలది, అతిశయోక్తులు నిండినది. మనువు శైలిలో ఇలాంటి లోపాలుండవు. ఈ విధంగా ఈ శ్లోకాలన్నీ ప్రక్షిప్తాలే !

324-325 శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఏవం చరన్ సదా యుక్తో రాజధర్మేషు పార్థివః । మూలశ్లోక సం. **165**
హితేషు చైవ లోకస్య సర్వాన్ భృత్యాన్నియోజయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **324**

పార్థివః = ప్రభువు, **ఏవం చరన్** = పూర్వోక్త పద్ధతి ననుసరించి (7-1 నుండి 9-312) ఆచరిస్తూ, **సదా రాజ ధర్మేషు యుక్తః** = సదా రాజధర్మాలలో స్వయంగా లగ్నమై, **సర్వాన్ భృత్యాన్ ఏవ** = సమస్త రాజకర్మచారులను కూడా,

లోకస్య హితేషు నియోజయేత్ = ప్రజల హిత సంపాదనంతో నియోగించాలి.

తాత్పర్యం:- ఈ ప్రకారం గతంలో చెప్పబడివున్న రాజధర్మాలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తూ, (స్వధర్మానుష్ఠాన పరతంత్రుడై) సదా జాగ్రత్తపరుడై ప్రజల హితంకోరి, భృత్యులను నియమించాలి.॥324॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషోఽఖిలః కర్మవిధిరుక్తో రాజ్ఞస్సనాతనః । మూలశ్లోక సం. **166**
ఇమం కర్మవిధిం విద్యాత్ క్రమశో వైశ్యశూద్రయోః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **325**

టీక:-ఏషః = ఈ (7-1 నుండి 9-156 వరకు), **రాజ్ఞః సనాతనః అఖిలః కర్మవిధిః ఉక్తః** = ఇది రాజుకు సంబంధించిన సంపూర్ణ సనాతన కర్మవిధి చెప్పబడినది. ఇప్పుడు, **వైశ్వశూద్రయోః** = వైశ్యుల యొక్క శూద్రుల యొక్క **కర్మ విధిం ఇమం విద్యాత్** = కర్తవ్యముల విధానము ముందు చెప్పబోవునట్లు తెలుసుకొనవలెను. (వీటి వర్ణన 10వ అధ్యాయమునందున్నది.)

తాత్పర్యం:- వంశ పారంపర్యంగా క్షత్రియులు అనుసరించదగిన ధర్మాలన్నీ చెప్పబడినవి. ఇక వైశ్యులు, శూద్రులు నిర్వర్తించగల ధర్మాలు చెబుతాను. ॥325॥

వివరణ:

నవమాధ్యాయ విభాగ నిర్ణయం

ప్రస్తుతం లభించే మనుస్మృతిలో - నవమాధ్యాయంలో 336 శ్లోకాలు ఉన్నాయి. సప్తమ, అష్టమ, మరియు నవమ అధ్యాయంలో 325 శ్లోకాల వరకు విషయం రాజనీతి ప్రకరణం ఉంది. మనుస్మృతిలోని అధ్యాయ విభాజనం కూడా ప్రకరణాను సారంగానే ఉంది. కాని, కొన్ని అధ్యాయాల విభజనలో విభాజన కర్త ద్వారా పొరపాట్లు జరిగినవి. ప్రకరణాన్ని (సందర్భం, ప్రసంగం) గుర్తించకుండానే అధ్యాయ విభాజన జరిగింది. ఈ విషయం భూమికలో "మనుస్మృతి-అనుశీలన" శీర్షికలో చర్చించబడింది. అదేవిధంగా ఈ అధ్యాయంలో కూడా పొరపాటు జరిగింది. రాజధర్మ విషయంతో పాటు 9-326వ శ్లోకం నుండి 336వ శ్లోకం వరకు గల వైశ్య శూద్ర కర్తవ్యాల వర్ణన చేర్చబడింది. వీటితో పాటు చాతుర్వర్ణ్య ధర్మం (2-144) (2-25) నుండి 9-336తో సమాప్తమవుతుంది. మళ్ళీ 10వ అధ్యాయంలో 'చాతుర్వర్ణ్య ధర్మంతో ఉపసంహారం చేయబడింది. ఎందుకంటే వైశ్య-శూద్ర ధర్మ వర్ణనకు సంబంధించిన పదకొండు శ్లోకాలు ప్రకరణానికి ఉపయుక్తం కాదు. అందువల్ల ఈ శ్లోకాలను 10వ అధ్యాయంతో ఉపసంహార వర్ణనతో కలిపి వేశాం. 9-325 శ్లోక కథనానుసారంగా ఇక్కడే ఈ రాజధర్మాత్మకమైన అధ్యాయం సమప్తం చేయబడింది.
(నవమ అధ్యాయంలోని 326 నుండి 336వరకు ఉన్న శ్లోకాలు.దశమ అధ్యాయాంతర్గతంగా గుర్తించగలరు.)

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః 'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మట్టి కృష్ణారెడ్డి కృత ఆంధ్రభాషానువాదాత్మకః 'రాజధర్మాత్మకః' నవమోఽధ్యాయః.

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయం సంహితాయాం నవమోఽధ్యాయః
ఇది మనుధర్మ శాస్త్రమున తొమ్మిదో అధ్యాయం
ఇతి నమమోఽధ్యాయః సమాప్తః

మనుస్మృతి

దశమాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన * ఋషి దయానంద భాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: **131**; మూలశ్లోకాలు: **15** ; ప్రక్షిప్తాలు : **116**

చాతుర్వర్ణ్య ధర్మాన్తర్గత వైశ్య శూద్ర కర్తవ్యాలు * చాతుర్వర్ణ్య ధర్మాల ఉపసంహారము

వైశ్యుల కర్తవ్యాలు-

ఇది మనుకృతము-ప్రామాణికము

వైశ్యస్తు కృతసంస్కారః కృత్వా దారపరిగ్రహమ్ ।　　మూలశ్లోక సం. **1**
వార్తాయాం నిత్యయుక్తస్స్యాత్పశూనాం చైవ రక్షణే ॥　　ప్రక్షిప్త శ్లోక సం. **9.326**

టీక:-కృత సంస్కారః = యజ్ఞోపవీతాది సంస్కార విధి పూర్తి అయిన మీదట, సమావర్తనానంతరము, వైశ్యః = వైశ్యుడు, దారపరి గ్రహం కృత్వా= వివాహ సంస్కారము అయిన మీదట, వార్తాయాం చ పశూనాం రక్షణే నిత్యయుక్తః స్యాత్ = వ్యాపారమునందు, మరియు పశుపాలనమందు సదా నిమగ్నుడు కావలెను.

తాత్పర్యం:- ఉపనయన సంస్కారం జరిగాక వైశ్యుడు వివాహం చేసుకొని జీవిక కోసం సేద్యం మొదలైన పనులలోను-పశుసంరక్షణంలోను లేదా వర్తకంలోను జాగ్రత్త కలిగి జీవనోపాధి చేసుకోవాలి. వీరికి వర్తకమేగాక పై రెండూ కూడా చెప్పబడ్డాయి.

327,328వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*　*ప్రజాపతిర్హి వైశ్యాయ సృష్ట్వా పరిదదే పశూన్ ।*
బ్రాహ్మణాయ చ రాజ్ఞే చ సర్వాః పరిదదే ప్రజాః ॥　　ప్రక్షిప్త శ్లోక సం. ***9.327***

తాత్పర్యం:- మొదట బ్రహ్మదేవుడు గోవులను సృష్టించి, వాటి సంరక్షణను వైశ్యుల అధీనంలో ఉంచాడు. ప్రజలను సృష్టించి వారి సంరక్షణ బాధ్యత బ్రాహ్మణులకు-రాజులకు ఇచ్చాడు. ॥327॥

*　*న చ వైశ్యస్య కామస్స్యాన్న రక్షేయం పశూనితి ।*
వైశ్యే చేచ్ఛతి నాన్యేన రక్షితవ్యాః కథంచన॥　　ప్రక్షిప్త శ్లోక సం. ***9.328***

తాత్పర్యం:- పశు సంరక్షిణ చేయనని వైశ్యుడెన్నడూ పలుకరాదు. సేద్యం లాంటి వృత్తులున్నప్పటికీ గోసంరక్షణ తప్పక చేయాలి. వైశ్యుడే ఈవృత్తిలో ఉండగా ఇతరులెవరూ ఆ గ్రామంలో ఆ వృత్తి చేపట్టరాదు. ॥328॥

ప్రక్షిప్తాల పరిశీలన

327-328 శ్లోకాలు ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

పూర్వాపర ప్రసంగం వైశ్యుల సమగ్ర వ్యావహారిక కర్తవ్యాలను గురించి జరుగుతూంది. దీని మధ్య 'ప్రజాపతి పశువులను సృష్టించడం' మొదలైనవి ప్రసంగ భంజకమూ, వ్యతిరేకమూ అవుతాయి. ఇందులో వారి ఇచ్ఛ అనే ప్రసక్తే రాదు. 326వ శ్లోకపు వాక్యాత్మక సంబంధం 329తో ఉంది.

2. శైలీగత ఆధారాలు

వీటి శైలి వల్ల ఇవి వైశ్యులకు పశుపాలన పట్ల విముఖత కలిగిన తర్వాతి కాలపు రచనలని తెలిసి పోతూంది. లేకపోతే, వైశ్యులే ఈ పని చేయాలని నిర్ధారించి ఉంటే, తప్పకుండా వారే చేయవలసి ఉంటుంది. అందులో ప్రజాపతి పేరు చెప్పటం, 9.328లోని కథనం అవసరమే ఉండదు. 327వ శ్లోకం కూడా యుక్తిసహం కాదు. వైశ్యులు కూడా ప్రజల ఆలన పాలన చేస్తారు.

3. అంతర్ వ్యతిరేకాలు

328లో 'వైశ్యుడు ఎంతవరకు పశుపాలన చేస్తాడో అంత వరకు మిగిలిన వర్ణాలవారు ఆ పని చేయకూడదు' అనడం మనువు చెప్పిన దానికి వ్యతిరేకం. పశుపాలన వైశ్యులదే (1.90; 9.326) కానీ, మిగిలిన వర్ణాల వారిది కాదు. వారు తమ కర్తవ్య పాలన చేయకపోతే మిగిలిన వారు చేయాలనేది దాని ఉపాయం కాదు. ఎందుకంటే అలా చేస్తే రాజు ద్వారా దండన పొందుతారు (7.17, 35). ఎందుకంటే రాజు వర్ణాశ్రమ ధర్మపాలనకు బాధ్యత వహించవలసి ఉంటుంది. కనుక ఈ ఆధారం ప్రకారం, పరస్పర సంబద్ధాలైన ఈ శ్లోకాలు రెండూ ప్రక్షిప్తాలే !

329-335వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

మణిముక్తా ప్రవాళానాం లోహానాం తాంతవస్య చ । మూలశ్లోక సం.**2**
గంధానాం చ రసానాం చ విద్యాదర్ఘబలాబలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**9.329**

టీక:- వైశ్యుడు, మణి-ముక్త-ప్రవాళానాం = మణులు, ముత్యాలు, ప్రవాళములు మొ॥ వాటి యొక్క, లోహానాం = వెండి, బంగారు మొ॥ లోహాల యొక్క, చ = మరియు, తాన్తవస్య = వస్త్రాల యొక్క, గన్ధానాం రసానాం చ = సుగంధితములైన కర్పూరం, కస్తూరి మొ॥ పదార్థాల యొక్క మరియు రసములు- రసాయనాల (పాదరసం, లవణం) యొక్క, అర్ఘ, బల-అబలమ్ విద్యాత్ = మూల్యములలో జరిగే హెచ్చు తగ్గులు తెలుసుకొంటూ ఉండాలి.

తాత్పర్యం:- వైశ్యుడు ఇంకా మణులు, ముత్యాలు, బంగారం, వెండి, లోహాలు, సుగంధద్రవ్యాలు, లవణాదిరసాలు, వస్త్రాలు వీటికి దేశకాలానుసారం పెరిగే -తరిగే విలువలను కనిపెడుతూండాలి. ॥329॥

ఇది మనుకృతము-ప్రామాణికం

బీజానాముప్తివిచ్చస్యాత్ క్షేత్రదోషగుణస్య చ । మూలశ్లోక సం.**3**
మానయోగం చ జానీయాత్తులాయోగాంశ్చ సర్వశః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**9.330**

టీక:- వైశ్యుడు, **బీజానామ్ + ఉప్తవిత్ స్యాత్** = అన్ని విధాలైన విత్తానాలను నాటే పద్ధతిని తెలుసుకోవాలి. **చ** = మరియు, **క్షేత్ర-దోషగుణస్య చ** = క్షేత్రముల (పొలముల) గుణదోషాలు అంటే ఏ పొలం వ్యవసాయానికి పనికి వస్తుంది. ఏది (చౌడు) పనికిరాదో తెలిసి ఉండాలి, **తథా** = అలాగే, **మాన యోగం** = కొలిచే పరికరాలను, **తులాయోగాం** = తూచే పరికరాలను, వాటికి సంబంధించిన, **సర్వశః జానీయాత్** = సమస్తమును వివరంగా తెలిసి ఉండాలి.

తాత్పర్యం:- అన్ని రకాల విత్తనాలు నాటే పద్ధతిని తెలుసుకోవాలి, ఈ పొలం చౌడు భూమి, ఇది మంచి పొలం అనే విషయాలను తెలుసుకొని ధాన్యం చల్లితే బాగా పెరుగుతుంది, ఈ పొలంలో ధాన్యం చల్లితే పెరగదు అనే భూముల గుణదోషాలను తెలుసుకోవాలి. ఇతరులను మోసగించకుండా ఉండే విధంగా త్రాసు, గుండు మొ॥నవాటిని, పళ్ళు మొ॥ వాటి తూనికలు కొలతలు గురించి చక్కగా తెలుసుకోవాలి. ॥330॥

ఇది మనుకృతము-ప్రామాణికం

సారాసారం చ భాండానాం దేశానాం చ గుణాగుణాన్ । మూలశ్లోక సం.**4**
లాభాలాభం చ పణ్యానాం పశూనాం పరివర్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**9.331**

టీక:- భాండానాం సార-అసారం = వస్తువుల మంచి చెడ్డలను, **దేశానాం గుణ-అగుణాన్** = పొలాల యొక్క గుణదోషాలను, **పణ్యానాం లాభ-అలాభం** = అమ్మవలసిన వస్తువుల లాభనష్టాలను, అలాగే, **పశూనాం పరివర్ధనమ్** = పశుసంవర్ధనోపాయాలను వైశ్యులు తెలిసి ఉండాలి.

తాత్పర్యం:- ద్రవ్యముల ఉత్తమ-అధమ గుణాలు, వ్యాపారాది వస్తువుల లాభనష్టాలు, గో సంరక్షణ విధానాలు వైశ్యులు బాగా తెలిసి ఉండాలి. ॥331॥

ఇది మనుకృతము-ప్రామాణికం

భృత్యానాం చ భృతిం విద్యాద్భాషాశ్చ వివిధా నృణామ్ । మూలశ్లోక సం.**5**
ద్రవ్యాణాం స్థానయోగాంశ్చ క్రయవిక్రయమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**9.332**

టీక:- భృత్యానాం భృతిం = నౌకర్లకు వేతనం, **నృణామ్ వివిధాః భాషాః** = వివిధ దేశాంలో ఉండే ప్రజల భాషలను, **ద్రవ్యాణాం స్థానయోగాన్** = ద్రవ్యాలు లభించే ప్రదేశాలు, ద్రవ్య సంమిశ్రమణ విధులు, దానివల్ల కలిగే లాభనష్టాలు. **క్రయ-విక్రయ + ఏవ** = క్రయ-విక్రయాల విధానాన్ని తెలిసికోవాలి.

తాత్పర్యం:- వైశ్యులు, క్షత్రియులులకు ఈ పనికి ఇంత జీతమివ్వాలని తెలిసుకొని ఉండాలి. దేశవిదేశాలందలి భాషలను తెలిసికొని ఉండాలి.... ఈ వస్తువును ఇట్లుంచాలి. దీనితో చేర్చి ఉంచిన బహుకాలముండునని తెలిసికోవాలి. ఈ దేశంలో ఈ ఈ వస్తువు ఇంతవెలకు తీసుకోవచ్చునని, దీనిని ఇంతవెలకు అమ్మవచ్చునని కూడా తెలిసికోవాలి.॥332॥

ఇది మనుకృతము-ప్రామాణికం

ధర్మేణ చ ద్రవ్యవృద్ధావాతిష్ఠేద్యత్నముత్తమమ్ । మూలశ్లోక సం.**6**
దద్యాచ్చ సర్వభూతానామన్నమేవ ప్రయత్నతః॥ ప్రక్షిప్త శ్లోక సం.**9.333**

టీక:- వైశ్యుడు ఈ ప్రకారంగా **(9.326, 333) ధర్మేణ** = ధర్మపూర్వకంగా, **ద్రవ్య వృద్ధౌ ఉత్తమమ్ యత్నమ్ + అతిష్ఠేత్** = ధనాభివృద్ధి కోసం అత్యధిక ప్రయత్నం చేయాలి. **చ** = మరియు, **సర్వభూతానామ్ ప్రయత్నతః అన్నమ్ + ఏవ దద్యాత్** = సర్వప్రాణులకు ప్రయత్నించి అన్నోత్పాదన చేసి సహాయపడాలి.

తాత్పర్యం:- న్యాయమార్గంలో వస్తువులను విక్రయించి ధనాన్ని వృద్ధి చేయడం కోసం అధికప్రయత్నం చేస్తుండాలి. ప్రాణులకు బంగారం లాంటి వాటికంటే అన్నమే ప్రధానమని తెలిసి, అది ఇవ్వగలవాడై ఉండాలి. ॥333॥

ఇది మనుకృతము-ప్రామాణికం

విప్రాణాం వేదవిదుషాం గృహస్థానాం యశస్వినామ్ । మూలశ్లోక సం.**7**
శుశ్రూషైవ తు శూద్రస్య ధర్మో నైఃశ్రేయసః పరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**9.334**

టీక:- వేదవిదుషాం విప్రాణాం = వేదవేత్తలైన విప్రులకు-బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు, **యశస్వినామ్ గృహస్థానాం** = యశోధనులైన గృహస్థులకు, **శుశ్రూషా + ఏవ తు** = సేవ లొనరించుటయే, **శూద్రస్య నైశ్రేయసః పరమ్ ధర్మః** = శూద్రుడికున్న కల్యాణ కారకమైన ఉత్తమ ధర్మం.

తాత్పర్యం:- వేదాధ్యయనం చేత, స్వకర్మానుష్ఠానం చేత కీర్తిపొందినట్టి విప్రులకు శుశ్రూష చేయడమే శూద్రుడికి ముఖ్యంగా చెప్పబడింది. బ్రాహ్మణులు కాకుంటే క్షత్రియ, వైశ్యులను ఆశ్రయించడం-వారికి సపర్యలు చేయడం విధించబడింది. ॥334॥

ఇది మనుకృతము-ప్రామాణికం

శుచిరుత్కృష్టశుశ్రూషుర్మృదువాగనహంకృతః । మూలశ్లోక సం. **8**
బ్రాహ్మణాద్యాశ్రయో నిత్యముత్కృష్టాం జాతి మశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **9.335**

టీక:- **శుచిః** = శుద్ధపవిత్రుడు, (శరీరం-మనస్సులందు పవిత్రుడు), **ఉత్కృష్ట శుశ్రూషః** = తనకంటే ఉత్కృష్ట వర్ణస్థులకు సేవా శుశ్రూషలు చేసేవాడు, **మృదువాగ్** = మధురభాషి, **అనహంకృతః** = నిరహంకారి, **నిత్యం బ్రాహ్మణ+ఆది+ఆశ్రయః** = సదా బ్రాహ్మణాది వర్ణత్రయం వారి సేవలో నిమగ్నుడైన శూద్రుడు కూడా, **ఉత్కృష్టాం జాతిమ్ + అశ్నుతే** = ఉత్తమ బ్రహ్మ జన్మాంతర్గతమైన ద్విజవర్ణాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- శుద్ధపవిత్రుడు, తనకంటే ఉత్కృష్ట వర్ణస్థులకు సేవా శుశ్రూషలు చేసేవాడు, మధురభాషి, నిరంహకారి, సదా బ్రాహ్మణాది వర్ణత్రయం వారి సేవలో నిమగ్నుడైన శూద్రుడు కూడా ఉత్తమ బ్రహ్మజన్మాంతర్గతమైన ద్విజవర్ణాన్ని పొందుతాడు. ॥335॥

వివరణ:

శూద్రుడు ఉత్కృష్ట వర్ణమును పొందుట: ఈ శ్లోకముల వర్ణన ద్వారా శూద్రులను గురించి మను భావన స్పష్టమవుతుంది. మనువు దృష్టిలో శూద్రుడు హీనుడుగాడు. అంతేగాదు- శూద్రుడు పవిత్రుడు, ఉత్కృష్టుడు, ఉత్తమ కర్మల ద్వారా ఉత్తమ గుణముల ద్వారా ఉత్తమ వర్ణమును పొందుటకు అధికారి అని వారి దృఢనమ్మకము. (10.65) శ్లోకము ద్వారా గూడా వర్ణింపబడినది.

చదువు సంధ్యలు లేనందువలననే వ్యక్తి శూద్రుడనబడుచున్నాడు. జన్మచేత మాత్రం కాదు. ఇదే మనుమహర్షి భావన.

ఈ విషయమును గురించిన విస్తృత వివేచన (1-31,91) చూడగలరు.

2) శూద్రులకు యజ్ఞవిధానమును వేదమంగీకరించినది. ఋక్ 10.53.4,5 మంత్రములో **"పంచజనాః మమ హోత్రం జుషధ్వమ్"** ఈ విషయమును గురించిన విస్తృత వివేచనము. భూమికలో శూద్ర విషయం చూడగలరు.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *ఏషోఽనాపది వర్ణానాముక్తః కర్మవిధిశ్శుభః ।*
ఆపద్యపి హి యస్తేషాం క్రమశ స్తన్నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***9.336***

తాత్పర్యం:- నాలుగు వర్ణాల వారికి ఆపద లేనప్పుడే అనుష్ఠించాల్సిన విధానం ఇంతవరకు పేర్కొనబడింది. ఇక ముందు నాలుగువర్ణాలవారు ఆపదలలో అనుష్ఠించాల్సిన ఒకదానిలో మరొకటి కలిసిన ధర్మవిధానాన్ని తెలుపుతాను వినండి. ॥336॥

ప్రక్షిప్త పరిశీలన

9.336వ శ్లోకం, దీని విషయం కింది ప్రమాణాలతో ప్రక్షిప్తాలు-

1. విషయ వ్యతిరేకాలు

క. ఇక్కడ 1.2 నుంచి మొదలై 10.131లో నాలుగు వర్ణాల వారి సామాన్య కర్తవ్యాలు, వృత్తుల విషయం ముగుస్తుంది. మధ్యలో ఆపత్కాలంలోని కర్తవ్యాల విషయం మొదలైంది. ఇది ముఖ్య విషయాన్ని భంగం చేస్తూంది కనుక విషయ వ్యతిరేకం.

ఖ. 1.1.3,10.131 విషయ సంకేత శ్లోకాల వల్ల, మనువు వర్ణాల కర్తవ్యాలను ఆపత్కాలీనం, ఆపద లేని కాలానివని విభజించనే లేదని తెలుస్తూంది. కనుక ఈ ఆపత్కాలీన విషయం మనువు చెప్పిన దానికి వ్యతిరేకంగా పొసగకుండా ఉంది.

2. అంతర్ వ్యతిరేకాలు

క. ఇక్కడ మొదలైన వర్ణాల ఆపత్కాలీన వృత్తుల పద్ధతి, మనువు మౌలిక కర్మణా వర్ణ వ్యవస్థకు ఎంత మాత్రం పొసగటం లేదు. అంటే, ఇది వర్ణాలకు అన్వయించనే అన్వయించదు. మొదటి పరిశీలన విషయం ఏమిటంటే, ఈ విషయంలో ఆపత్కాలానికి నిర్వచనం చెప్పలేదు. రెండవది ఈ ఆపత్కాలీన కర్మలు వ్యావహారికమేనా? ఒకటి రెండు ఉదాహరణలు చూద్దాం - శస్త్రాస్త్రాల అభ్యాసం లేకుండా బ్రాహ్మణుడు క్షత్రియుని వృత్తిని ఎలా అనుసరించగలడు? అది ఇంకా కఠినమైన వృత్తి కదా! వ్యవసాయం చేయటానికి భూమిని ఎలా తెచ్చుకుంటాడు? ఆపద్ధర్మంగా బ్రాహ్మణుడు వైశ్యుని వ్యవసాయాన్ని సాధనా లేవీ లేకుండా ఎలా చేపట్టగలడు? పైగా వ్యవసాయ ఫలం వెంటనే లభించదు. మరి అంత కాలమూ ఆపత్కాలంలోనే ఉంటూ, ఆకలితో అలమటిస్తాడా? ఒకవేళ వ్యవసాయానికి తగిన సాధనాలు లభిస్తే అది ఆపద్ధర్మం అవుతుందా? ఛాందోగ్య ఉపనిషత్తులో ఆ పద్ధర్మానికి ఒక ఉదాహరణ ఉంది. అదేమిటంటే, ఒక ఋషి ఆపత్కాలంలో ఎంగిలి ఆహారం తీసుకున్నాడు కానీ, ఎంగిలి నీరు తాగలేదు. అంటే తాత్కాలికమైన ఆపత్కాలాన్ని దీర్ఘకాలిక మని భావించి వ్యవసాయం మొదలైనవి చేయటం, వర్ణ వ్యవస్థలో తర్వాత ఏర్పడిన వికృతులని స్పష్ట మవుతూంది. ఇది మనువు పద్ధతి కాదు. మనువు కర్మల ప్రకారం వర్ణ వ్యవస్థ అన్నాడు [1.87-91]. ఆ కర్మలు అన్ని పరిస్థితులలోనూ ఆచరణీయాలే ! ఎవరైనా తనకు నిర్ధారించిన కర్మలు వదిలేస్తే, తాను స్వీకరించిన వర్ణానికి చెందిన వాడు కాదు. ఈ వర్ణాల ఆపత్కాలీన వ్యవస్థకూ, మనువు మౌలిక కర్మణా వర్ణ వ్యవస్థకూ ఎటువంటి పొంతనా లేక పోవటం చేత, ఈ ప్రసంగం మనువు చెప్పింది కాదు.

ఖ. ఎవరు తమకు నిర్దేశించిన పనులు, వృత్తులను వదలి పెడతారో, వారు ఉచ్చ వర్ణం నుంచి పతితులై నిమ్న వర్ణస్థులవుతారనేది మనువు మౌలిక అభిప్రాయం (2.103,168; 4.245). ఇది తెలిసి కూడా ఎవరైనా ఉచ్చ లేదా నిమ్న వర్ణాల వృత్తులు చేపడితే, వారికి నచ్చిన వర్ణంలో పరివర్తన కలుగుతుంది.(10.65). ఇక్కడ చెప్పిన ఆపద్ధర్మ వ్యవస్థ మనువు మౌలిక వ్యవస్థకు వ్యతిరేకం కనుక, ఇది మనువు చెప్పిన వ్యవస్థ కాదు.

*** వేదోపదేశ అధికారం బ్రాహ్మణులదే- 1-3వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు**

* *అధీయీరంస్త్రయో వర్ణాః స్వకర్మస్థా ద్విజాతయః ।*
ప్రబ్రూయాద్బ్రాహ్మణస్త్వేషాం నేతరావితి నిశ్చయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.1***

తాత్పర్యం:- బ్రాహ్మణాది త్రివర్ణద్విజులు స్వకర్మానుష్ఠానతత్పరులై వేదాలను అధ్యయనం చెయ్యాలి. అయినా వారిలో బ్రాహ్మణుడు మాత్రమే వేదాధ్యాపనం చెయ్యాలి. కాని తక్కిన క్షత్రియ వైశ్యులు చెయ్యరాదు. ఇది నిశ్చయము.॥1॥

* *సర్వేషాం బ్రాహ్మణో విద్యా ద్వృత్త్యుపాయాన్ యథావిధి ।*
ప్రబ్రూయాదితరేభ్యశ్చ స్వయం చైవ తథా భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.2***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు మిగిలిన అన్ని వర్ణాలవారికి, తన జీవన ఉపాధేయమైన శాస్త్రజ్ఞానం బోధించాలి. అందరూ ఇలాగే వేదాధ్యాపనం చేస్తే విప్రుడికి ఉపాధి ఏదీ? ఇతరులకు చెప్పడమేకాక తానూ ఆచరించాలి. ॥2॥

* *వైశేష్యాత్ప్రకృతిశ్రైష్ఠ్యా న్నియమస్య చ ధారణాత్ ।*
సంస్కారస్య విశేషాచ్చ వర్ణానాం బ్రాహ్మణః ప్రభుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.3***

తాత్పర్యం:- జాత్యౌన్నత్యంవల్లను, వేదాధ్యయనాధ్యాపనవ్యాఖ్యానాది విషయాలు తెలిసి ఉండటంవల్లను, ఉత్తమసంస్కారము వల్లను, బ్రాహ్మణుడు తక్కిన అన్ని వర్ణాలకు ప్రభువు అయినాడు.

ప్రక్షిప్తాల పరిశీలన

10.1-3 శ్లోకాలు కింది ప్రమాణాల ప్రకారం ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

అధ్యయన - అధ్యాపనల విషయంలో 2.213-217 [2.238-242] శ్లోకాలలో బ్రాహ్మణుడు కాని గురువు నుంచి కూడా విద్యను పొందవచ్చునని ఉంది. కానీ ఇక్కడ 10.1వ శ్లోకంలో దానికి వ్యతిరేకంగా బ్రాహ్మణుడు కాని వేరే వర్ణాల వారికి చదివించే అధికారం లేదని చెప్పారు. పఠన - పాఠన విషయాలు మనువు బ్రాహ్మణులకే నిర్దేశించినా, మళ్లీ ఇతర వర్ణాల వారిని కూడా, అవసర మైనప్పుడు, నిషేధించ లేదు. అందువల్ల ఈ శ్లోకాలు మనువుకు వ్యతిరేక మైనవి కనుక ప్రక్షిప్తాలు.

2. విషయవ్యతిరేకాలు

ఆరవ అధ్యాయంలో మనువు బ్రాహ్మణ ధర్మాలను చెప్పాడు. అక్కడ స్పష్టంగా - **ఏషవోఽభిహితో ధర్మో బ్రాహ్మణస్య చతుర్విధః** - అని చెప్పాడు. తర్వాతి ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలలో రాజధర్మం చెప్పాడు.

ఇక్కడ నాలుగు వర్ణాల కర్తవ్యాల తర్వాత,ఉపసంహారాత్మక విషయం ఉంది. ఆ విషయంలో బ్రాహ్మణుల కర్తవ్యాలు చెప్పటం, మునుపు చెప్పిందే మళ్లీ చెప్పటం అనవసరమూ, విషయ వ్యతిరేక మైనది. అందుకని ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

3. ప్రసంగ వ్యతిరేకాలు

నాలుగు వర్ణాల వారి కర్తవ్యాల తర్వాత ముగింపు చెబితే ప్రసంగ బద్ధత ఉంటుంది. అది 104లో ఉంది. ఈ శ్లోకాలు పూర్వాపర సంబద్ధతను వేరే విషయం చెప్పటం ద్వారా భంగం చేశాయి. ఇక్కడ మళ్లీ బ్రాహ్మణుల కర్తవ్యాలు, ప్రశంస చెప్పటం ఉచితం కాదు. అందువల్ల ఈ శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకాలు.

ఇది మనుకృతం.ప్రామాణికం

బ్రాహ్మణః క్షత్రియో వైశ్యస్త్రయో వర్ణా ద్విజాతయః । మూలశ్లోక సం. **9**
చతుర్థ ఏకజాతిస్తు శూద్రో నాస్తి తు పంచమః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.4**

టీక:- ఆర్యుల సమాజంలో, సమూహంలో **బ్రాహ్మణః క్షత్రియః వైశ్యః** = బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, **త్రయః వర్ణాః ద్విజాతయః** = ఈ మూడు వర్ణాలు ద్విజాతులు. విద్యాధ్యయనరూపమైన ద్వితీయ జన్మ పొందినవారు. (2.121,123) ఈ సంస్కారాన్ని బట్టి ద్విజులనబడతారు, **చతుర్థః ఏక జాతిః శూద్రః** = విద్యాధ్యయన రూపమైన నాల్గో విద్య (ద్విజ జన్మ) లేనందువల్ల, ఏక జన్మ కలిగినవాడు, బ్రహ్మ జన్మరహితుడు శూద్రవర్ణస్థుడు, **నాస్తి తు పంచమః**=ఐదో వర్ణం లేనే లేదు. నాలుగే వర్ణాలు.

తాత్పర్యం:- 'ద్విజ' శబ్దానికి అర్హులైనవారు మూడు జాతులవారు మాత్రమే. ఉపనయనం అనే గొప్ప సంస్కారం చేత ఈ మూడు జాతుల వారికీ ద్విజత్వం ప్రాప్తిస్తుంది. నాలుగోది శూద్రజాతి. ఇవి తప్ప అన్యజాతులనేవి లేవు. ॥4॥

వివరణ:

1. వర్ణములు నాలుగు

క. ఇక్కడ మనుమహర్షి-వర్ణములు నాలుగేనని స్పష్టపరిచాడు. మనుస్మృతిలో మరొకచోట కూడా వర్ణనాత్మక రూపంగా నాలుగు వర్ణాల వర్ణనే ఉంది. నాలుగు వర్ణాల దీక్షలేని అన్య వ్యక్తులు అందరూ దస్యులే. (10-45). వీరే సంకరులను పేరుగలవారు. ఏ వర్ణంలో చేరరు. ఈ శ్లోకానికి దోహదంగా మనుస్మృతిలోని ఈ కింది శ్లోకాలను చూడగలరు. (1.31,87,91;3.20, 5.57, 7.68, 10.45,65,131,12.97).

2. నాలుగు వర్ణాలకు శాస్త్రీయ ప్రమాణాలు:- శాస్త్రీయ గ్రంథంలో నాలుగు వర్ణాలే చెప్పబడినవి. ఈ నాలుగు వర్ణాలకు గాక మిగిలిన వారందరూ ఆర్యేతరులు. వారే నిషాదులు, అసురులు, రాక్షసులు మొ॥ విభిన్న వర్గకృత నామాలతో పిలువబడ్డారు.

క. **"ఊర్జాదః ఉత యజ్ఞియాసః పఞ్చజనాః మమ హోత్రం జుషధ్వమ్"** ఋ.10.53.4. **పంచజనాః= చత్వారో వర్ణాః నిషాదః పంచమ ఇతి ఔపమన్యవః.** నిరుక్తం 3.2.7 నాలుగు వర్ణాలు- బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు. వీరి కంటే భిన్నమైన వారు ఐదోవారు నిషాదజనులు. ఇవే వేదోక్తమైన ఐదు రకాలైన మనుషులు.

ఖ. **చత్వారో వర్ణాః । బ్రాహ్మణో రాజన్యో వైశ్యః శ్రూదః** (శత బ్రాహ్మ 5.5.4.9)

చత్వారో వై పురుషాః బ్రాహ్మణో, రాజన్యో వైశ్యః శూద్రః (మైత్రా.సం.4.4.6)

5 నుండి 44వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

*** వర్ణసంకర వర్ణన -**

* ***సర్వవర్ణేషు తుల్యాసు పత్నీష్వక్షతయోనిషు ।***
అనులోమ్యేన సంభూతా జాత్యా జ్ఞేయాస్త ఏవ తే ॥ ప్రక్షిప్త శ్లోక సం.***10.5***

తాత్పర్యం:- బ్రాహ్మణాదులైన నాలుగు జాతులవారు, తమ-తమ స్వవర్ణస్థులైన వారినే పెళ్లి చేసుకొని వ్యభిచార దోషం లేకుండా జీవించాలి. సవర్ణులనగా -బ్రాహ్మణుడికి బ్రాహ్మణి, క్షత్రియుడికి క్షత్రియ, ఇలాగే మిగతా జాతులలో ఆయా జాతి స్త్రీలకు పుట్టినవారే అని గ్రహించాలి. ॥5॥

* ***స్త్రీష్వనంతరజాతాసు ద్విజైరుత్పాదితాన్ సుతాన్ ।***
సదృశానేవ తానాహుర్మాతృదోషవిగర్హితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***10.6***

తాత్పర్యం:- ద్విజుడికి ఇతర జాతుల వల్ల సంతానం కలిగినా, వారు పితృసజాతీయులే అవుతారు. అయినప్పటికీ వృత్తులలో తేడా ఉంటుంది. ఉదాహరణకు బ్రాహ్మణుడికి క్షత్రియ స్త్రీ యందు జన్మించిన పుత్రుడికి వృత్తి పెంపుడు జంతువులైన గుర్రం, ఏనుగు మొ॥ వాటిని మచ్చిక చేయడం, రథం తోలడం లాంటివి వృత్తులు-అవుతాయి. క్షత్రియుడికి వైశ్య స్త్రీ యందు జన్మించిన వాడికి వ్యాపారం, వ్యవసాయం, పశుపాలనాల చేత జీవనం గడపడం వృత్తి అవుతుంది.॥6॥

*** భిన్న వర్ణ స్త్రీలకు పుట్టిన అపసద సంతానము -**

* ***అనంతరాసు జాతానాం విధిరేష సనాతనః ।***
ద్వ్యేకాంతరాసు జాతానాం ధర్మ్యం విద్యాదిమం విధిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***10.7***

తాత్పర్యం:- చాలా మందికి వర్ణాలకు-వృత్తిచేత ఏర్పడిన కులాలకు తేడా తెలియడం లేదు. శూద్ర కులంలోనే అనంతవృత్తులు ఏర్పడి ఉన్నాయి. నాలుగు వర్ణములకు (జాతులకు) మించి జాతులు లేవని మనువు సృష్టంచేసి ఉన్నాడు.॥7॥

వర్ణ సంకరం చేత, (దోష బుద్ధి గల స్త్రీ చేతగానీ /కామ ప్రవృత్తిగల పురుషునిచేత కానీ) కలిగే సంతానం వల్ల ఎన్నుకోబడిన వృత్తులతో కులాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు, బ్రాహ్మణుడికి వైశ్య స్త్రీ యందు సంతానం కలిగితే...

* *బ్రాహ్మణా ద్వైశ్యకన్యాయామంబష్టో నామ జాయతే ।*
నిషాదః శూద్రకన్యాయాం యః పరాశవ ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.8**

తాత్పర్యం:- .....అలాంటి వాన్ని అంబష్టుడంటారు. అలాగే బ్రాహ్మణుడికి శూద్ర స్త్రీ వల్ల సంతానం కలిగితే అతడిని **'నిషాదు'**డంటారు. **'పరాశవుడు'** అనే నామాంతరం కూడా ఇతడికి ఉన్నది. ఇలాంటి వారు తండ్రి యొక్క బ్రాహ్మణత్వాన్ని లేదా తండ్రి యొక్క కుల వృత్తిని స్వీకరించజాలరు. తమ ప్రవృత్తి చేత ఇతర వృత్తులను ఎన్నుకుంటారు.॥8॥

* *క్షత్రియాచ్ఛూద్రకన్యాయాం క్రూరాచారవిహారవాన్ ।*
క్షత్రశ్శూద్రవపుర్జంతురుగ్రో నామ ప్రజాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.9**

తాత్పర్యం:- క్షత్రియుడికి శూద్ర స్త్రీ వల్ల జన్మించిన వాడు ఉగ్ర/ క్రూర కర్మల పట్ల ఆసక్తి కలిగి ఉంటాడు. మొండి/ బండ పనులు సైతం చేయగల సమర్థుడై క్షత్రియ-శూద్ర శరీర సమ్మిశ్రితుడై 'ఉగ్రుడు' అనబడతాడు. ॥9॥

* *విప్రస్య త్రిషు వర్ణేషు నృపతేర్వర్ణయోర్ద్వయోః ।*
వైశ్యస్య వర్ణే చైకస్మిన్ షడేతేఽపసదాః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.10**

తాత్పర్యం:- బ్రాహ్మణునికి క్షత్రియ-వైశ్య-శూద్ర స్త్రీల వల్ల జన్మించేవారు; క్షత్రియుడికి వైశ్య-శూద్రల వల్ల జన్మించేవారు; వైశ్యుడికి శూద్ర స్త్రీ వల్ల జన్మించేవారు (మొత్తం ఈ 6 రకాల వారు సాంకర్యదోషం చేత) స్వజాతి స్త్రీల యందు పుట్టిన వారి కంటే భిన్నంగా ఉండి నీచులవుతారు. అంటే-తమ కులధర్మాలు అనుష్ఠించేందుకు మొగ్గు చూపరని భావం. వీరు నికృష్టులని చెప్పబడుతారు.

* *క్షత్రియాద్విప్రకన్యాయాం సూతో భవతి జాతితః ।*
వైశ్యాన్మాగధవైదేహౌ రాజవిప్రాంగనాసుతౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.11**

తాత్పర్యం:- క్షత్రియుడికి బ్రాహ్మణ స్త్రీ వల్ల పుట్టినవాడు **'సూతుడు'**. వైశ్యుడికి క్షత్రియ స్త్రీల వల్ల పుట్టినవాడు **'మాగధుడు'**. వైశ్యుడికి బ్రాహ్మణ స్త్రీ వల్ల పుట్టినవాడు **'వైదేహికుడు'**. ॥11॥

* *శూద్రాదాయోగవః క్షత్తా చండాలశ్చాధమో నృణామ్ ।*
వైశ్యరాజన్యవిప్రాసు జాయంతే వర్ణసంకరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.12**

తాత్పర్యం:- ఇక శూద్రునికి వరుసగా వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ స్త్రీల యందు జన్మించిన వారిని **'అయోగవుడు'**, **'క్షత్త'**, **'ఛండాలుడు'** అని పేర్కొనడం జరిగింది. వర్ణ సాంకర్య దోషరీత్యా వీరిలో ఛండాలుడిని అథమాథముడని పరిగణించమన్నాడు. (ఇక్కడ కామదోషం పురుషుడిదా? స్త్రీదా అని విచారించనవసరం లేదు. సంతానానికీ పేరు తథ్యం). ॥12॥

* *ఏకాంతరే త్వామలోమ్యాదంబష్ఠోగ్రౌ యథాస్మృతౌ ।*
క్షత్తృ వైదేహకౌ తద్వత్ ప్రాతిలోమ్యేఽపి జన్మని ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.13**

తాత్పర్యం:- అనులోమంలో పుట్టిన అంబష్ఠుడు, ఉగ్రుడు ఎలా తాకదగినవారో అలాగే విలోమంలో పుట్టిన సూతుడు, మాగధుడు కూడా తాకదగినవారే. అలాగే ప్రతిలోమంలో పుట్టిన క్షత్ర, వైదేహుడు, సూత మాగధ ఆయోగవులు కూడా స్పర్శార్హులే. ప్రతిలోమాదులలో ఒక్క చండాలుడే స్పర్శాదుల కనర్హుడు. ॥13॥

* పుత్రా యేఽనంతరస్త్రీజాః క్రమేణోక్తా ద్విజన్మనామ్
తాననంతరనామ్నస్తు మాతృదోషాత్ప్రచక్షతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.14**

తాత్పర్యం:- ద్విజులకు తమ తరువాత జాతిస్త్రీలకు అనులోమవిధిలో పుట్టినవారు తల్లి హీనజాతిని బట్టి హీనజాతిసంభవులుగా పరిగణింపబడుతారు. కాబట్టి మాతృజాతికి తగిన సంస్కారానికి అర్హులవుతారు. ॥14॥

*** సంకీర్ణ జాతులు**

* బ్రాహ్మణాదుగ్రకన్యాయామావృతో నామ జాయతే ।
ఆభీరోఽంబష్ఠకన్యాయామాయోగవ్యాం తు ధిగ్వణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.15**

తాత్పర్యం:- (ఇంతవరకు పురుష సంతతి సాంకర్యం గురించి చెప్పబడింది. అదే స్త్రీ సంతానమైతే...? ఆ విషయాలు వివరిస్తున్నాడిక్కడ.) క్షత్రియుడికి శూద్ర స్త్రీ వల్ల జన్మించినది **'ఉగ్ర'**. ఈమెకు బ్రాహ్మణ సంపర్కం తగిలితే, పుట్టేవాడిని **'ఆవృతు'**డనాలి. బ్రాహ్మణుడికి వైశ్యస్త్రీ వల్ల పుట్టిన, అంబష్ఠకు తిరిగి బ్రాహ్మణ సంపర్కం తగిలితే పుట్టేవాడు **'ఆభీరుడు'**. ఇలాగే శూద్రస్త్రీని కామించిన వైశ్యుడికి అయోగ జన్మిస్తే, ఆమెకు విప్రుడివల్ల పుట్టేవాడు **'ధిగ్వణుడు'**. ॥15॥

* ఆయోగవశ్చ క్షత్తా చ చండాలశ్చాధమో నృణామ్ ।
ప్రాతిలోమ్యేన జాయంతే శూద్రాదపసదాస్త్రయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.16**

తాత్పర్యం:- విలోమంగా జన్మించిన **'అయోగవుడు'**, **'క్షత్త'**, **'ఛండా'**లుడనే మానవాధములు శూద్ర వర్ణాల వారికంటే నీచులు. అంటే.....వీరు శూద్ర వర్ణాల్లోకి చేర్చడానికి కూడా తగనివారు. ఆయా తండ్రులకు తగిన సంస్కారాలు ఏవీ వీరికి జరపడానికి వీలు లేదు. ॥16॥

* వైశ్యాన్మాగధవైదేహౌ క్షత్రియాత్సూత ఏవ తు ।
ప్రతీపమేతే జాయంతే పరేఽప్యపశదాస్త్రయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.17**

తాత్పర్యం:- వైశ్యుడికి క్షత్రియ స్త్రీ వల్ల; బ్రాహ్మణ స్త్రీ వల్ల పుట్టిన **'మాగధ, వైదేహులు'**, క్షత్రియుడి వల్ల బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన **'సూతుడు'** అనే 3 తెగల వారు ప్రతిలోమం వల్ల కలిగిన జన్మలు కాబట్టి వీరు కూడ పుత్ర సంస్కారాలకి అనర్హులే ! కాబట్టి హీనులుగానే పరిగణించాలి. ॥17॥

* జాతో నిషాదాచ్ఛూద్రాయాం జాత్యా భవతి పుక్కసః ।
శూద్రాజ్జాతో నిషాద్యాం తు సవై కుక్కుటకః స్మృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.18**

తాత్పర్యం:- అప్పటికే వర్ణ సాంకర్యం వల్ల పుట్టిన నిషాదుడి వల్ల, శూద్ర స్త్రీకి (తిరిగి) సంతానం కలిగితే **'పుక్కసు'**డని; నిషాద కన్యకు శూద్ర సంపర్కం చేత సంతానం కలిగితే **'కుక్కుటు'**డని పిలుస్తారు. హీనాతి హీన జన్మలివి.॥18॥

(అంటే రాను రాను అధమాధమ స్థాయికి వెళ్తూన్న వైనమిది అని అర్థం.)

* క్షత్తుర్జాతస్తథోగ్రాయాం శ్వపాక ఇతికీర్త్యతే ।
వైదేహకేన త్వంబష్ఠ్యాముత్పన్నో వేణ ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.19**

తాత్పర్యం:- శూద్రుడి వల్ల వైశ్య స్త్రీకి సంతానం కలిగితే **'క్షత'**; క్షత్రియుడి వల్ల శూద్ర స్త్రీకి సంతానం కలిగితే **'ఉగ్ర'** అనీ అంటారు. ఈ సంకర కన్యలకు 'బ్రాహ్మణేతర జాతులలో తిరిగి సంపర్కం కలిగితే వారు **'శ్వపాకులు'** అవుతారు. వైదేహకుడికి అంబష్ఠ వల్ల పుట్టేవాడు **'వేణు'**డనబడతాడు. ॥19॥

* వ్రాత్యులు-వారి సంతానం

* **ద్విజాతయస్సవర్ణాసు జనయంత్యవ్రతాంస్తు యాన్ ।**
తాన్ సావిత్రీపరిభ్రష్టాన్ వ్రాత్యానితి వినిర్దిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.20***

తాత్పర్యం:- బ్రాహ్మణుడై ఉండీ, బ్రాహ్మణ స్త్రీ యందు పుత్రులను కన్నప్పటికీ - ఆ సంతానానికి ఉపనయనాది సంస్కారాలు లేకపోయినప్పుడు (ద్విజులకు 16 సంవత్సరాల వరకు ఉపనయన అర్హత ఉంది.) అలాంటి వారిని 'వ్రాత్యులు'గా పరిగణించాలి. ద్విజత్వం ప్రాప్తించేదీ ఉపనయన సంస్కారం వల్లనే! ॥20॥

* **వ్రాత్యాత్తు జాయతే విప్రాత్పాపాత్మా భూర్జకంటకః ।**
ఆవంత్యవాటధానౌ చ పుష్పధశ్శైఖ ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.21***

తాత్పర్యం:- ఇలాంటి వ్రాత్యుడికి ఇతరేతర వర్ణాల వల్ల గాక, సవర్ణ స్త్రీయందే జన్మించినప్పటికీ, అతడి సంతానాన్ని భూర్జకంటకుడంటారు. దేశ/రాజ్య భేదాలను బట్టి **అవంత్యుడు, వాటధానుడు, పుష్పధుడు, శైఖుడు** అని ఇతని పేర్లు. ॥21॥

* **ఝల్లో మల్లశ్చ రాజన్యాద్వ్రాత్యాన్నిచ్ఛివిరేవ చ ।**
నటశ్చ కరణశ్చైవ ఖసో ద్రవిడ ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.22***

తాత్పర్యం:- వ్రాత్య శబ్దానికి అర్హుడైన క్షత్రియుడి సంతానానికి, (అంటే సవర్ణ అయిన క్షత్రియ స్త్రీకి) పుట్టిన వారికి **'ఝల్ల-మల్ల-నిచ్ఛివి-నట-కరణ-ఖస-ద్రవిడులు'** అనే శబ్దం దేశ భేదాన్ని బట్టి కలుగుతుంది. ॥22॥

* **వైశ్యాత్తు జాయతే వ్రాత్యాత్సుధన్వాచార్య ఏవ చ ।**
కారూశశ్చ విజన్మా చ మైత్రస్సాత్వత ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.23***

తాత్పర్యం:- వ్రాత్యుడైన వైశ్యుడి వల్ల సవర్ణ స్త్రీకి పుట్టినా, దేశ భేదాన్ని బట్టి ఆ వైశ్యసంతానానికి **'సుధన్వ, కారూశ, విజన్మ, మైత్ర, సాత్వత'** నామధేయాలు ఏర్పడుతూన్నాయి. ॥23॥

* వర్ణ సంకరోత్పత్తికి కారణము -

* **వ్యభిచారేణ వర్ణానామవేద్యా వేదనేన చ ।**
స్వకర్మణాం చ త్యాగేన జాయంతే వర్ణ సంకరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.24***

తాత్పర్యం:- వ్రాత్యులుగా పరిగణింపదగిన ఇతరులలో....సగోత్రులను పెండ్లాడుట వల్ల కలిగిన వారు, ఉపనయనాది సంస్కార హీనత్వం చేత స్వధర్మాచరణ దూరులై వర్ణ సాంకర్యానికి బీజభూతమైన వారు, ఇతర వర్ణాల స్త్రీలని కామించడం/ పొందడం చేత సంతానాన్ని పొందేవారు కూడ చేరతారు. ॥24॥

* సంకీర్ణ యోనుల వర్ణన -

* **సంకీర్ణయోనయో యే తు ప్రతిలోమానులోమజాః ।**
అన్యోన్యవ్యతిషక్తాశ్చ తాన్ ప్రవక్ష్యామ్యశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.25***

తాత్పర్యం:- అనులోమ-విలోమ సంబంధాల కారణంగా సంకరజాతులుగా జన్మించే వారినేమంటారో చెప్పబడింది. ఇప్పుడు వారి-వారి ఉత్కృష్టతను-అపకర్షను చర్చిద్దాం. ॥25॥

* *సూతో వైదేహకశ్చైవ చండాలశ్చ నరాధమః ।*
మాగధః క్షత్తృజాతిశ్చ తథాఽ యోగవ ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.26**

* *ఏతే షట్ సదృశాన్వర్ణాన్ జనయంతి స్వయోనిషు ।*
మాతృజాత్యాం ప్రసూయంతే ప్రవరాసు చ యోనిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.27**

తాత్పర్యం:- సూతుడు, వైదేహికుడు, ఛండాలుడు, మాగధుడు, క్షత్త, అయోగవుడు......అనే ఆరుగురూ ప్రతిలోమ జాతులను పెంపుచేస్తారు. ఉదాహరణకు శూద్రుడికి వైశ్యజాతిస్త్రీ యందు జన్మించిన అయోగవ-అయోగవిల సంతానం అలాంటి జాతిని పెంపు చేస్తుందని అర్థం !

ఇలా మాతృపక్షం రీత్యా చూసినప్పుడు-పోలికలు కలిగిన (వైశ్యజాతి స్త్రీకి బ్రాహ్మణ పురుషుడి వల్ల జన్మించే సంతానం) వారు జన్మించినప్పటికీ, లక్షణాల రీత్యా హీన జాతికే చెందిన వారవుతారు. ॥26,27॥

* *యథా త్రయాణాం వర్ణానాం ద్వయోరాత్మాఽ స్య జాయతే ।*
ఆనన్తర్యాత్స్వయోన్యాం తు తథా బాహ్యేష్వపి క్రమాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.28**

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి అనులోమ సంబంధం చేత క్షత్రియ-వైశ్య స్త్రీలకు సంతానం కలిగితే, వారు ఉపనయన సంస్కారానికి (తండ్రిరీత్యా) అర్హులవుతున్నారు. ఇలాగే వైశ్యులకు క్షత్రియ-బ్రాహ్మణ స్త్రీల యందు; క్షత్రియడికి బ్రాహ్మణి యందు జన్మించేవారికి ఉత్కృష్టత-అపకర్షత రెండూ కలుగుతాయి. శూద్రుడికి జన్మించిన ప్రతిలోముల కంటే వైశ్యులకు జన్మించిన ప్రతిలోములే కొంత వరకు ఉత్కృష్టులు. ॥28॥

* *తే చాపి బాహ్యాన్ సుబహూంస్తతోఽ ప్యధికదూషితాన్ ।*
పరస్పరస్య దారేషు జనయంతి విగర్హితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.29**

తాత్పర్యం:- పైన చెప్పబడిన 6 రకాలవారు, ఒకరికొకరు సంబంధాలు చేసుకొంటే, వీరి అనులోమ సంబంధాల వల్ల జన్మించే సంతానం దుష్టులుగా సత్క్రియలకు బాహ్యమైనవారుగా తయారవుతారు. ఉదాహరణకు....అయోగవుడు క్షత్తజాతి స్త్రీయందు తన కంటే హీనుణ్ణి పుట్టిస్తాడు. ఇదే విపర్యయంగాను సంభవించవచ్చు! ఇతర ప్రతిలోమజాతుల బంధాలు కూడా ఇంతే ! ॥29॥

* *యథైవ శూద్రో బ్రాహ్మణ్యాం బాహ్యం జంతుం ప్రసూయతే ।*
తథా బాహ్యతరం బాహ్యశ్చాతుర్వర్ణ్యే ప్రసూయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.30**

తాత్పర్యం:- బ్రాహ్మణ స్త్రీ యందు శూద్రుడు, తన కంటే కర్మ బాహ్యుడైన చండాలుడికి ఎలా కారణమవుతున్నాడో-అలాగే బాహ్యుడైన చండాలుడు పై నాలుగు జాతుల వారితో కూడినప్పుడు మరింత చండాలుడి కర్మ విదూరుణ్ణి పుట్టించగలడు. సాంకర్యంలోనూ అతి హీనత్వానికి ఇది పరాకాష్ఠ. ॥30॥

* *ప్రతికూలం వర్తమానా బాహ్యా బాహ్యతరాన్ పునః ।*
హీనా హీనాన్ ప్రసూయంతే వర్ణాన్ పంచదశైవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.31**

తాత్పర్యం:- శూద్రుడి వల్ల పై ఉత్తమ జాతి స్త్రీలకు పుట్టే సంతానం, (కర్మ బాహ్యులైన వారు) ఇలాంటి సంకరజాతి స్త్రీలను పెండ్లాడి సంతానాన్ని కంటే తమ కన్నా హీనమైన సంతానాన్ని 15 రకాలుగాను, విలోమ జాతులు తిరిగి సంకరమైతే 30 రకాలుగాను సంకరజాతి వర్ణాల వారు తయారవుతారు. అయోగవుడు తన అయోగ విజాతి స్త్రీతోపాటు; ప్రతిలోమ జాతులతో కూడితే 7 రకాల వారు జన్మించడానికి కారకుడవుతున్నాడని అర్థం. ॥31॥

* ప్రసాధనోపచారజ్ఞమదాసం దాసజీవనమ్ ।
సైరంధ్రిం వాగురావృత్తిం సూతే దస్యురయోగవే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.32**

తాత్పర్యం:- తలదువ్వటం, (కేశాలంకరణ) కాళ్ళు పిసుకుట వంటి ఉపచారాలు చేస్తూ, శూశ్రూషలు- సపర్యలు తెలిసినవాడు సైరంధ్రి పేరుగల దాన్ని కూడి (దస్యుడు శూద్రస్త్రీని కూడి) అయోగవి అనే సంతానాన్ని పుట్టిస్తాడు. ॥32॥

* మైత్రేయకం తు వైదేహో మాధూకం సంప్రసూయతే ।
నౄన్ ప్రశంసత్యజస్రం యో ఘంటాతాడోఽరుణోదయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.33**

తాత్పర్యం:- వైదేహుడు (వైశ్యపురుష-బ్రాహ్మణస్త్రీ సంతానం) అయోగవిని కూడి మైత్రేయుణ్ణి పుట్టిస్తాడు. ఇతడు విదూషకుడుగా-హాస్యము లాడు వాడిలాగా జీవించడానికి రాజుల చెంత చేరి, రాజనగరు వాకిట ఘంటా నాదాన్ని ప్రతి ఉదయం పలికించడంలో నేర్పరి అవుతాడు. ॥33॥

* నిషాదో మార్గవం సూతే దాసం నౌకర్మజీవనమ్ ।
కైవర్తమితి యం ప్రాహూరార్యావర్తనివాసినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.34**

తాత్పర్యం:- బ్రాహ్మణ పురుష-శూద్ర స్త్రీ సంతానం నిషాద జన్మ, ఇలాంటి వానికి అయోగని వల్ల కలిగిన సంతానాన్ని దాసుడని-మార్గవుడని పిలుస్తారు. ఆర్యావర్తంలో నివసించేవారు ఇలాంటి దాసుణ్ణి కైవర్తుడని అంటారు. తొమ్మిది రకాల సపర్యలలో ఏదో ఒకటి జీవనం కోసం స్వీకరించేవాడితడు. ॥34॥

* మృతవస్త్రభృత్సునారీషు గర్హితాన్నాశనాసు చ ।
భవంత్యాయోగవీష్వేతే జాతిహీనాః పృథక్ త్రయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.35**

తాత్పర్యం:- సైరంధ్ర, మైత్రేయ, మార్గవ నామధేయాలకు అర్హులైన ఇలాంటి వారు హీన జాతులు కాబట్టి పీనుగు మీద వస్త్రాలకు ఆశపడుట-క్రూర చేష్టలకు భయపడకుండుట-ఎంగిలి తినడం లాంటివి (తండ్రుల తేడాని బట్టి) చేయడానికి వెనుకాడరు. ॥35॥

* కారావరో నిషాదాత్తు చర్మ కారః ప్రసూయతే ।
వైదేహికాదన్ధ్రమేదౌ బహిర్గ్రామ ప్రతిశ్రయౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.36**

తాత్పర్యం:- నిషాదుడి వల్ల వైదేహ స్త్రీకి పుట్టినవాడు కారావరుడు. ఇతడికి చర్మకార వృత్తి (మాదిగ) చెప్పబడింది. ఇలాగే ఇతరులు చేయరాని-చేయదగని పనులు చేసే సైరంధ్రి, వైదేహికుడు మొ॥వారు గ్రామాలకు వెలుపలనే ఉండదగిన వారు. ॥36॥

* చండాలాత్పాండుసోపాక స్త్వక్సారవ్యవహారవాన్ ।
ఆహిండికా నిషాదేన వైదేహ్యామేవ జాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.37**

తాత్పర్యం:- వైదేహి వనితకి చండాలుడి వల్ల పాండుసోపాకుడనేవాడు జన్మిస్తే అతడు వెదుళ్ల నరికి జీవించే మేదరి వాడవుతున్నాడు. నిషాదుడికి వైదేహివల్ల జన్మించే హిండకుడనే వాడు కారాగార కావలి అవుతున్నాడు. ॥37॥

* చండాలేన తు సోపాకో మూలవ్యసనవృత్తిమాన్ ।
పుక్కస్యాం జాయతే పాపస్సదా సజ్జనగర్హితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.38**

తాత్పర్యం:- శూద్రస్త్రీకి నిషాద పురుషుడికీ పుట్టిన పుక్కస కన్యను చండాలుడు చేపడితే జన్మించే సంతానాన్ని సోపాకుడంటారు. తలారి వృత్తి ఇతడిది. రాజాజ్ఞ ప్రకారం తలలు తీసే వాడు కాబట్టి వృత్తిరీత్యా నిందితుడు పాపి కూడా!॥38॥

* ***నిషాద స్త్రీతు చండాలాత్పుత్రమంత్యావసాయినమ్ ।***
శ్మశానగోచరం సూతే బాహ్యానామపి గర్హితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.39***

తాత్పర్యం:- నిషాద వనితకు చండాలుడితో సంపర్కం సంఘటిల్లగా జన్మించే వాడు అంత్యావసాయి అనబడతాడు. ఇతడిది శ్మశాన జీవనం. కాటికాపరి వృత్తి గల ఇతడు చండాలుడి కంటే హీనుడు. ॥39॥

* ***సంకరే జాతయస్త్వేతాః పితృమాతృ ప్రదర్శితాః ।***
ప్రచ్ఛన్నా వా ప్రకాశా వా వేదితవ్యాః స్వకర్మభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.40***

తాత్పర్యం:- ఇంతవరకు చెప్పబడిన వర్ణ సాంకర్యం వల్ల ఏయే జాతులకు-ఏయే వృత్తులో బయటకు తెలుస్తాయి. ఇలా కాకుండా రహస్య సంబంధాల వల్ల వ్యభిచారం వల్ల ఎవరికి ఎవరి వల్ల ఎవరు జన్మించారో తెలియని స్థితి ఏర్పడినప్పుడు వారి జీవనోపాధిని బట్టి జన్మ తెలుస్తుంది. ॥40॥

* ***సజాతిజానంతరజాః షట్ సుతా ద్విజధర్మిణః ।***
శూద్రాణాం తు సధర్మాణస్సర్వేఽపధ్వంసజాః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.41***

తాత్పర్యం:- బ్రాహ్మణులకు సవర్ణ స్త్రీలయందు-అనులోమ సంబంధ రీత్యా (వైశ్య, క్షత్రియ సంబంధాల వల్ల) పుట్టినవారు; అలాగే క్షత్రియుల-వైశ్యుల విషయంలోనూ మొత్తం 6 రకాల వారికి ద్విజధర్మం ప్రకారం ఉపనయనం జరుగుతుంది. ద్విజస్త్రీయే తల్లి అయినా ప్రతిలోమ సంబంధం వల్ల పుట్టిన వారికీ సంస్కారం చెప్పబడలేదు. ॥41॥

* ***తపోబీజప్రభావైస్తు తే గచ్ఛంతి యుగే యుగే ।***
ఉత్కర్షం చాపకర్షం చ మనుష్యేష్విహ జన్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.42***

తాత్పర్యం:- తపస్సు చేతను, వీర్య ప్రభావము చేతను మనుష్యులలో ఈ జన్మలో గొప్ప తనమును, నీచత్వమును ప్రతియుగములో పొందుదురు. తపః ప్రభావముచే విశ్వామిత్రుడు, వీర్య ప్రభావముచే ఋష్యశృంగుడు ఉచ్చపదము పొందిరి. ॥42॥

ధర్మపాలన చేయనందువల్ల శూద్రత్వాన్ని పొందిన జాతులు -

* ***శనకైస్తు క్రియాలోపాదిమాః క్షత్రియజాతయః ।***
వృషలత్వం గతా లోకే బ్రాహ్మణాదర్శనేన చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.43***

తాత్పర్యం:- క్షత్రియజాతులు ఉపనయనాది క్రియల లేమి చేత; బ్రాహ్మణులు యజ్ఞ యాగాదుల లేమి-అధ్యాపన ప్రాయశ్చిత్తాల లేమి చేత మెల్లమెల్లగా శూద్రులవుతుంటారు. ఇది ఏయే రాజ్యాలలో అధికంగా ఉన్నదీ చెప్పాడు మనువు.॥43॥

* ***పౌండ్రకాశ్చౌడ్రద్రవిడాః కాంభోజా యవనాశ్శకాః ।***
పారదాఃపహ్లవాశ్చీనాః కిరాతా దరదాః ఖశాః॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.44***

తాత్పర్యం:- పౌండ్రకులు, ఓఢ్రులు, ద్రవిడులు, కాంభోజులు, యవనులు, శకులు, పారదులు, పహ్లావులు, చీనులు, కిరాతులు, దరదులు, శఖరాజ్యం వారు ఉపనయనాది సంస్కారాల లేమి చేత శూద్రులయ్యారు. ॥44॥

ప్రక్షిప్తాల పరిశీలన

10.5 నుంచి 10.44 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

మనువే స్వయంగా మనుస్మృతిలో ముఖ్యంగా ప్రతిపాదించిన విషయం 'నాలుగు వర్ణాల కర్తవ్యాలు, వర్ణాలు నాలుగే, అయిదవది లేనేలేదు' అనేది [1.1-3; 10.4, 131 మొదలైనవి]. నాలుగు వర్ణాల విషయం మధ్యలో వర్ణ సంకరపు విషయం విషయ వ్యతిరేకమే కాక, సంకేతించిన ముఖ్య ప్రతిపాద్య విషయానికీ వ్యతిరేకమే. [దీని మీది విస్తృత వివరణకు 1.2 మీది 'అంతర ప్రభవాణాం' పద సమీక్ష చూడండి].

2. ప్రసంగ వ్యతిరేకాలు

10.4 శ్లోకానికీ 10.45వ శ్లోకానికీ ఏక వాక్యాత్మక సంబద్ధత ఉంది. 10.4లో నాలుగు వర్ణాలు పేర్కొన్నారు, 10.45లో నాలుగు వర్ణాలకూ భిన్నమైన వారిని దస్యులు అన్నారు. మధ్యలో వర్ణ సంకరాల వేరు విషయం ఆ ఏక వాక్యాత్మకతను భంగం చేసింది. అందుకని 10.6 నుంచి 10.44 వరకు గల అన్ని శ్లోకాలూ ప్రసంగ వ్యతిరేకమైన ప్రక్షిప్తాలు. మనుస్మృతిలో నాలుగు వర్ణాలను మించి అయిదవ వర్ణం లేదా వర్ణ సంకరాల కర్తవ్యాలు మొదలైనవి ఔచిత్యం కావు. (10.4).

3. అంతర్ వ్యతిరేకాలు

క. వర్ణ వ్యవస్థకు ఆధారం కర్మే కానీ, జన్మ కాదనేది మనువు మౌలిక పద్ధతి [1.31, 87-91, 107 శ్లోకాలు, వాటి సమీక్ష చూడండి]. అందుకనే 10.4లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో ఎవరైనా ఆ వర్ణాల వారు కాలేక పోతే, విద్య వల్ల మరొక పుట్టుక లేని కారణం చేత, ఏక జాతి = ఒకటే జన్మ గలవాడు, ద్విజన్ముడు కాడని చెప్పాడు. వర్ణ వ్యవస్థకు ఆధారం జన్మ అయివుంటే, ద్విజాతి, ఏకజాతుల భేదం నిర్ధారణ అయ్యేదే కాదు. ఈ శ్లోకాలలో జన్మ ఆధారంగా అన్ని విషయాలూ చెప్పారు. ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం.

ఖ. మనువు నాలుగు వర్ణావారి పెళ్లి విషయంలో ఇలా స్పష్టంగా చెప్పాడు -

ఉద్వహేత ద్విజో భార్యాం సవర్ణాం లక్షణాన్వితాం (3.4).

అంటే ద్విజులు సవర్ణురాలైన స్త్రీనే పెళ్లాడాలి.

ఉద్వహేత ద్విజోభార్యాం సవర్ణాం లక్షణాన్వితాం (7.7) అంటే వివాహానికి ద్విజులకు తమ వర్ణపు స్త్రీయే కావాలి. కానీ (10.5లో) అనులోమ్య వివాహం, (10.13లో) ప్రతిలోమ్య వివాహాల వల్ల కలిగే సంతానం కూడా చెప్పారు. అంటే సవర్ణురాలు కాని స్త్రీతో పెళ్లి వల్ల కలిగే సంతాన మన్నమాట ! ఇది మనువుకు వ్యతిరేకమైనది. జన్మ చేత జాతివాదం ఉన్న కాలం నాటి ప్రక్షిప్తం.

గ. మనువు 9.35లో బీజం గొప్పతనాన్ని బట్టి ఉత్తమ సంతానం కలుగుతా రన్నాడు. 9.26.27లలో స్త్రీలు పూజనీయలనీ, గృహదీప్తలనీ ప్రశంసించాడు. కానీ 10.17, 25 శ్లోకాలలో ద్విజుల స్త్రీలను కూడా నిందనీయ లనీ, సంతానంలో దోషం బీజానిది కాదనీ, తల్లిదేననీ ఉంది. ఇది మనువు మౌలిక పద్ధతికి వ్యతిరేకం.

ఘ. మొత్తం మనుస్మృతిలో అందరూ అంగీకరించే ఉత్తమ ఆచరణలు మర్యాద, గొప్ప ఆలోచనలు, అహింసాపాలన మొదలైన ధర్మాలున్నాయి: ఇందులో వర్ణసంకరాలు, వారి వృత్తులు నిందనీయాలని ఉంది. కనుక ఇక్కడ చెప్పిన వృత్తులు మనువు ప్రకారం ధర్మాలు కావు. ఇవి మనువుకు వ్యతిరేక పద్ధతులు గల జన్మతో జాతివాదం ప్రబలిన తర్వాతి కాలం నాటివి కనుక, ప్రక్షిప్తాలు.

4. శైలీగత ఆధారాలు

విధులను చెప్పే గ్రంథం కనుక, మనుస్మృతిలోని శైలి చారిత్రికంగా కాకుండా, విధానాత్మకంగా ఉంటుంది. కానీ ఈ శ్లోకాల శైలి చారిత్రికంగా ఉంది. ఈ విషయంలో కిందివి పరికించండి -

కైవర్తమితి యం ప్రాహురార్యావర్త నివాసినః ॥ 10.34
శనకైస్తు క్రియాలోపాదిమాః క్షత్రియజాతయః ॥
వృషలత్వం గతా లోకే...... । 10.43
పౌండ్రకాశ్చౌండ్ర ద్రవిడాః కామ్బోజా యవనాః శకాః ॥ 10.44
ద్విజైరుత్పాదితాన్ సుతాన్...సదృశానేవ తానాహుః ॥ 10.6

ఈ చారిత్రిక శైలి వల్ల వర్ణ వ్యవస్థలో దోషం కలగటం చేత, జన్మ వల్ల వేర్వేరు ఉపజాతులు ఏర్పడి ప్రబలాయి. ఆ సమయంలో ఈ శ్లోకాలు ప్రక్షిప్తం కావడం జరిగింది. మనువు కాలంలో ఈ జాతులూ లేవు, వీటి వర్ణ పతనమూ జరగలేదు. ఇవన్నీ మనువుకు చాలా కాలం తర్వాత వచ్చినట్లు చరిత్ర సాక్ష్యం చెబుతూంది.

5. అంతర్ వ్యతిరేకాలు

క. 12వ శ్లోకంలో చెప్పిన వర్ణ సంకరాల కారణానికి భిన్నమైన కారణం 24వ శ్లోకంలో ఉంది.

ఖ. 32వ శ్లోకంలో సైరంధ్రి జీవిక కొరకు కేశాలంకరణ చేస్తుందని ఉంది. 33లో మైత్రేయుని జీవిక గంటలు వాయించడం లేదా చాటు పద్యాలు రాయడం అని ఉంది. 34లో మార్గవుని జీవిక నావ నడపటం అని ఉంది. కానీ 35లో ఈ ముగ్గురి జీవితాలూ మరణించిన వారి బట్టలు ధరించడం, ఎంగిలి కూడు తినటం వల్ల గడుస్తాయి అని ఉంది.

గ. 36,39 శ్లోకాలలో కారావరులు, ధిగ్వణ జాతులు చర్మపు పని చేస్తారని ఉంది. కానీ కారావరులు నిషాదుల సంతానం, ధిగ్వణులు బ్రాహ్మణుల సంతానం.

(ఘ) 43వ శ్లోకంలో క్రియాలేపం = కర్మల త్యాగంతో క్షత్రియులలో జాతి భేదాలు, 24 లోనూ బంగారపు పని విడిచి పెట్టడాన్నే కారణంగా చెప్పారు. కానీ 12వ శ్లోకంలో ఒక వర్ణం వారు మరొక వర్ణపు స్త్రీతో లేదా పురుషునితో సంపర్కం వల్ల వర్ణ సంకరం అవుతుందని ఉంది. ఇవి పరస్పర వ్యతిరేక కథనాలు కావటం చేత మనువు చెప్పినవి కానే కావు!

ఇది మనుకృతం. ప్రామాణికం

నాలుగు వర్ణాలలో విభిన్న వ్యక్తుల సంజ్ఞలు-

ముఖబాహూరుపజ్జానాం యా లోకే జాతయో బహిః । మూలశ్లోక సం.**10**
మ్లేచ్ఛవాచశ్చార్యవాచస్సర్వే తే దస్యవః స్మృతాః॥ ప్రక్షిప్త శ్లోక సం.**10.45**

టీక:- లోకే = లోకంలో, **ముఖ-బాహు+ఉరు-పత్ జానాం** = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణముల కంటే, **బహిః** = భిన్నమైన వారు -అంటే శ్రేష్ఠ కర్తవ్యపాలన చేయనందువల్ల బహిష్కరింపబడ్డారు. లేదా వీరిలో **యా జాతయః** = ఏ జాతులు, **మ్లేచ్ఛవాచః ఆర్యవాచః** = మ్లేచ్ఛ భాషను మాట్లాడేవారు గాని, ఆర్యభాషలు మాట్లాడేవారు గాని, **తే సర్వే** = వారందరూ, **దస్యవః స్మృతాః** = దస్యులని పిలువబడతారు.

తాత్పర్యం:- బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రు లను నాలుగు వర్ణముల కంటే భిన్నమైన జాతుల వారు అనగా మ్లేచ్ఛ భాషను మాట్లాడేవారుగాని; ఆర్యభాషలు మాట్లాడే వారు గానీ వారందరూ దస్యులని పిలువబడతారు.

"ఆర్యావర్త దేశానికి చెందనివారు- దస్యులు, లేదా మ్లేచ్ఛులు అని పిలువ బడతారు." మహర్షి దయానందులవారు, ఈ శ్లోకం యొక్క రెండో పాదానికి వ్యాఖ్య చేస్తూ పైవిధంగా రాశారు. (స.ప్ర.6వ సము.) ॥45॥

వివరణ:

1. ఈ శ్లోక ప్రసంగం గురించి వివేచన-10.4 తరువాత వర్ణన క్రమంలో 10.45 శ్లోకం సంబంధానుగుణంగానే ఉంది. కారణం-నాలుగో శ్లోకంలో మను విహిత సమాజంలో చాతుర్వర్ణాస్తిత్వం భూమికా రూపంలో సూచింపబడింది. అంతేకాదు పంచమ వర్ణం లేదనీ పేర్కొన్నాడు. ఇప్పుడు వర్ణములలో దీక్షితులు కాని వారు, బహిష్కృతులైన వ్యక్తులు ఏ వర్ణంలో చేరతారనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ విషయం 45వ శ్లోకంలో మిగిలిన వ్యక్తులు దస్యులని తెలుపబడింది.

2. దస్యు శబ్దం యొక్క అభిప్రాయం. వేదాలలోనూ ప్రాచీన సంస్కృత సాహిత్యంలోనూ 'దస్యు' శబ్దం ఎక్కువగా ప్రయోగింపబడింది. ఇక్కడ దస్యుడంటే ఎవడు? మనువు స్పష్టపరిచాడు.

మానవులు రెండు వర్గాలుగా విభజింపబడినారని వేదాలలో ఉంది. **ఒకటి**-ఆర్యులు-అంటే శ్రేష్ఠులు. **రెండు**-దస్యులు-శ్రేష్ఠులు కాని వారు. ఆర్యులలో నాలుగు వర్ణములున్నాయి. ఈ నాలుగు వర్ణములకు వెలుపల అంటే వర్ణాశ్రమ ధర్మాలలో దీక్షితులు (10.57) కాని వారు ధర్మమును పాలించకుండా అధర్మాచరణ చేసేవారు. చతుర్వర్ణబాహ్యులైన వారందరూ 'దస్యు'లని పిలువ బడతారు. దస్యు శబ్దోత్పత్తీ, అర్థమూ వీరి యొక్క ఈ అధర్మాచరణమునే సూచిస్తుంది. **"దసు = ఉపక్షయే"** అనే ధాతువుకు **"యజిమనిశున్ధిదసి జనిభ్యో యుచ్"** (ఉణాది 3/20)కు యుచ్ ప్రత్యయం చేర్చగా **'దస్యు'** శబ్ద నిర్మాణం జరుగుతుంది. నిరుక్తంలో (7.23) దీని వ్యుత్పత్తి ఇలా ఉంది. **"దస్యు దస్యతే క్షయార్థాత్-ఉపదాసయతి కర్మాణి"** శుభకర్మల నుండి క్షీణించినవాడు లేదా శభకర్మలందు విఘ్నాలు కలిగించేవాడు-దస్యుడు.

46-56వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

అపసదుల-అపధ్వంసజుల కర్మలు-

* *యే ద్విజానామసదా యే చాపధ్వంసజాః స్మృతాః ।*
తే నిన్దితైర్వర్తయేయుర్ద్విజానామేవ కర్మభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.46***

తాత్పర్యం:- ద్విజాతులలో అపసదులు, అపధ్వంసజులైన వారందరు ద్విజాతులకుపయోగించు ఈ ఈ కర్మలు చేయుచు బ్రతికేవారు. ॥46॥

* *సూతానామశ్వసారథ్యమంబష్ఠానాం చికిత్సనమ్ ।*
వైదేహకానాం స్త్రీకార్యం మాగధానాం వణిక్ పథః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.47***

తాత్పర్యం:- గుర్రాలకు మచ్చిక-మాలిమి చేయడం, రథసారథ్యం, అశ్వసేనాధిపత్యం సూతులకు; వైద్యం అంబష్ఠులకు; అంతఃపురవ్యవహారాలు వైదేహికులకు; మెట్టప్రాంతం/ఎడారి వర్తకం మాగధులకు వృత్తులవుతాయి.॥47॥

* *మత్స్యఘాతో నిషాదానాం త్వష్టిస్త్వా యోగవస్య చ ।*
మేదాంధ్రచుంచుమద్గూనామారణ్యపశుహింసనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.48***

తాత్పర్యం:- నిషాదులకు చేపలు పట్టడం, అయోగవులకు వడ్రంగం, మేదులు-ఆంధ్రులు- చుంచులు-మద్గులు-వీరికి అరణ్య మృగాలను హింసించడం వృత్తులు కాగలవు. ॥48॥

* *క్షత్త్రుగ్రపుక్కసానాం తు బిలౌకోవధబంధనమ్ ।*
ధిగ్వణానాం చర్మకార్యం వేణానాం భాండవాదనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.49***

తాత్పర్యం:- క్షత్త, ఉగ్ర, పుక్కసులకు ఉడుములు మొదలైన కలుగులలోని జంతువులను చంపుట-వాటిని పట్టుట; ధిగ్వణులకు తోళ్లు శుభ్రం చేసే పని, వేణులకు తప్పెట మొ॥ సంగీత వాద్యవృత్తులు చెప్పబడ్డాయి. ॥49॥

* చైత్యద్రుమశ్మ శానేషు శైలేషూపవనేషు చ ।
వసేయురేతే విజ్ఞానా వర్తయంతః స్వకర్మభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.50**

తాత్పర్యం:- పైన చెప్పబడిన వారందరూ గ్రామాలకు దరిదాపుల్లో చెట్ల కిందగాని, వెలుపల గుడిసెలు వేసుకొని గాని, పర్వతాలు-అడవులు-శ్మశానాలు ఆక్రమించిగాని నివశిస్తూ తమ తమ వృత్తుల చేత జీవిస్తూంటారు. ॥50॥

* చండాలశ్వపచానాం తు బహిర్గ్రామాత్ప్రతిశ్రయః ।
అపపాత్రాశ్చ కర్తవ్యా ధనమేషాం శ్వగర్దభమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.51**

* వాసాంసి మృతచేలాని భిన్న భాండేషు భోజనమ్ ।
కార్ష్ణాయసమలంకారః పరివ్రజ్యా చ నిత్యశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.52**

తాత్పర్యం:- శ్వపచులు, చండాలులు వీరికి గ్రామం వెలుపలనే నివాసం. వీరికి వంట పాత్రలుండవు. కుక్కలు-గాడిదలే వీరికి ధనం. పీనుగు బట్టలే వీరికి వస్త్రాలు. పగిలిన కుండపెంకులే ఆహారం ఆరగించే పళ్లెరములు. ఇనుపచట్రాలే ఆభరణాలు. దేశసంచారం చేస్తూ జీవిస్తుంటారు. ॥51,52॥

* న తైస్సమయమన్విచ్ఛేత్పురుషో ధర్మమాచరన్ ।
వ్యవహారో మిథస్తేషాం వివాహస్సదృశైస్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.53**

తాత్పర్యం:- కాబట్టే ధర్మానుష్ఠాన సమయాల్లో వీరిని చూడటం, మాట్లాడటం శాస్త్ర నిషిద్ధం. వీరిలో వీరికి ఇచ్చుకొను- పుచ్చుకొను ఆచారాలున్నట్లే పెళ్లిళ్లు వగైరా కూడా ఉన్నాయి. అయినప్పటికీ వీరు ఇతరులందరిచేత దూషణాది తిరస్కారాలకు అర్హులు. ॥53॥

* అన్నమేషాం పరాధీనం దేయం స్యాద్భిన్నభాజనే ।
రాత్రౌ న విచరేయుస్తే గ్రామేషు నగరేషు చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.54**

తాత్పర్యం:- వీరికి ఎదురుగా నిల్చి అన్నం ఇవ్వదగదు. పనివాళ్లచేత వీళ్ల కుండ పెంకుల్లోకి ఎత్తి పడవేయించాలి. రాత్రుల్లో కూడ వీరు ఊరిలో తిరగరాదు. ॥54॥

* దివా చరేయుః కార్యార్థం చిహ్నితా రాజశాసనైః ।
అబాంధవం శవం చైవ నిర్హరేయురితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.55**

తాత్పర్యం:- పగటిపూట క్రయవిక్రయాలు చాటించడానికై రాజుగారి ముద్ర చేబూని వీరు గ్రామాల్లో తిరగవచ్చు! అంతేగాక దిక్కులేని శవాలను గ్రామాల్లోనుంచి ఊరవతలకి ఈడ్చవచ్చు. ॥55॥

* వధ్యాంశ్చ హన్యుస్సతతం యథాశాస్త్రం నృపాజ్ఞయా ।
వధ్యవాసాంసి గృహ్ణీయుశ్శయ్యాశ్చాభరణాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.56**

తాత్పర్యం:- వధింపదగిన వారిని శాస్త్రానుసారంగా శూలారోపణం (కొర్రుకు దిగవేయుట) మొదలైన రక్తం చిందే శిక్షల విషయమై రాజు ఆనతి ప్రకారం నడవాలి. అలాంటివారి వస్త్రాలను, పాన్పులను వారే సంగ్రహించాలి.॥56॥

ప్రక్షిప్తాల పరిశీలన

10.46 నుంచి 10.56 వరకు గల శ్లోకాలు ఈ కింది 'ప్రమాణాలతో' ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

1.1-3, 10.131 శ్లోకాల ప్రకారం, ఈ అధ్యాయంలోని విషయం కేవలం 'నాలుగు వర్ణాల ధర్మాలు.' కానీ, వీటిలో వర్ణ సంకరం వల్ల పుట్టిన చండాలురు, సూతులు మొదలైన వారి పనులు చెప్పారు. ఇది నాలుగు వర్ణాల ధర్మాల విషయం కానందున, విషయ వ్యతిరేకం. వర్ణ సంకరాలను గురించి చెప్పటం మనుస్మృతిలో ప్రతిపాదించిన విషయం కానే కాదు. (చూడండి 1.2 మీది సమీక్ష).

2. ప్రసంగ వ్యతిరేకాలు

10.45లో నాలుగు వర్ణాల వారిలో దీక్షితులు కాని వారందరినీ దస్యులు లేదా అనార్యులు అన్నారు. 10.47లో వారిని గుర్తించే ఆధారాలు, వారి పనులు లేదా కర్మలను అంగీకరించారు. ఈ విధంగా ఈ రెండు శ్లోకాలకూ ఏక వాక్యాత్మక సంబద్ధత ఉంది. మధ్యలోని 10.46 నుంచి 10.56 వరకు గల శ్లోకాలలో వేరే విషయం ఉండటం చేత, ఆ ఏక వాక్యాత్మక ప్రసంగం భంగమైంది కనుక, ఇవన్నీ ప్రసంగ వ్యతిరేక ప్రక్షిప్తాలు.

3. అంతర్ వ్యతిరేకాలు

క. మను మహర్షి కర్మానుసారమే వర్ణ వ్యవస్థ, జన్మను బట్టి కాదన్నాడు. కర్మల ప్రకారం ఉచ్చవర్ణంలో పుట్టినవాడు కింది వర్ణానికీ, కింది వర్ణంలో పుట్టినవాడు ఉచ్చవర్ణానికీ చెందవచ్చు. ఇది 1.87-91; 1.31; 2.168, 4.245, 10.65లలో చూడవచ్చు. ఈ [46-56] శ్లోకాలలో జన్మ ఆధారంగా అంబష్ఠులు, వైదేహులు, మాగధులు మొదలైన వారి పనులు చెప్పారు. [ప్రత్యేక వివరణకు 1.88-91,107 చూడండి].

ఖ. మనువు పద్ధతి ప్రకారం, అన్ని రకాల హింసలూ మహా పాపాలే [5.51] మాంస భక్షణాన్ని రాక్షసుల భోజనం అన్నాడు మనువు. 10.32, 48, 49 శ్లోకాలలో జంతుహింస, బిలాలలో ఉండే ప్రాణులను చంపడం, చేపలు పట్టడం మొదలైనవి వృత్తులని చెప్పారు. ఇది మనువుకు వ్యతిరేకం. [విశేష వివరణకు 4.26-28లపై సమీక్ష చూడండి].

గ. 10.46లో కింది వర్గాల వారు, నిందనీయ కర్మలను వృత్తులు చేసుకోవచ్చన్నారు. ఆ నిందనీయ కర్మలను ద్విజుల కర్మలనీ చెప్పారు, మాగధులు వ్యాపారం చేసినట్లు [10.47లో] అన్నారు. వ్యాపారం వంటి వైశ్యుల పనులను నిందనీయం అనడం మనువుకు వ్యతిరేకం.

ఘ. మానవసమాజాన్ని కేవలం నాలుగు వర్ణాలుగానే మనువు విభజించాడు. వీటికి భిన్నమైన వారిని అనార్యులు (దస్యులు) [10.45లో] అని చెప్పాడు. ఈ ఆధారంతో వర్ణ సంకరం వల్ల జనించే అనేక వర్గాల వారు మను సమ్మతం కారు.

ఙ. శూద్రులను మనువు ఆర్య వర్ణం వారు అన్నాడు. 9.335లో వారిని శుచిః = పవిత్రులు (అంట దగినవారు), ఉత్తమగతులు పొందే హక్కు గలవారు అన్నాడు. కానీ ఇక్కడ శూద్రులను ద్వేషించదగిన, నిందనీయ, అస్పృశ్యులని [10.53లో] చెబుతూ, వారితో సంపర్కం కూడా నిషేధించారు. ఇది మనువు పద్ధతికి వ్యతిరేకం. శూద్రుల పని ద్విజులకు సేవ చేయటం. వారితో సంబంధం లేకుండా సేవలు జరిగిపోతాయా? [చూడండి 9.335 మీది సమీక్ష].

చ. గొప్ప ఆచరణలు, అహింస మొదలైనవి ధర్మాలని మనువు అన్నాడు. ఉత్తమ కర్మలను వృత్తులుగా ఏర్పరిచాడు. ఈ ప్రసంగంలో చెప్పిన నిందనీయ కర్మలు, హింస మొదలైన వృత్తులు మనువు వ్యవస్థకు వ్యతిరేకం కావటం చేత ప్రక్షిప్తాలు.

57 నుండి 59వ శ్లోకం వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

అనార్యులను వారి కర్మలను బట్టి గుర్తించాలి- ఇది మనుకృతము-ప్రామాణికం

వర్ణాపేతమవిజ్ఞాతం నరం కలుషయోనిజమ్ । మూలశ్లోక సం. **11**
ఆర్యరూపమివానార్యం కర్మభిః స్వైర్విభావయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.57**

టీక:- వర్ణ+ అపేతమ్ = వర్ణాలకు సంబంధించిన దీక్ష లేనివాడు లేదా వర్ణముల నుండి బహిష్కృతులైనవాడు, **ఆర్యరూపమ్ + ఇవ + అనార్యం** = శ్రేష్ఠమైన గుణ స్వభావాలు కలవాడి లాగా కనిపిస్తాడు కానీ వాస్తవంగా సద్గుణరహితుడు, అన్యారుడు, **కలుష యోనిజమ్ = కలుషయోనౌ** = దుష్టయోనౌ జాయతే ఇతి, **కలుష యోనిజః తం విజ్ఞాతం** = దుష్ట సంస్కారాలు కలవాడికి జన్మించిన వ్యక్తి, దుష్ట సంస్కారి, **స్వైః కర్మభిః విభావయేత్** = అతని స్వకర్మల ద్వారానే తెలియతగినవాడు. శ్రేష్ఠకర్మలు చేయక, పాప కర్మలనాచరించువాడు అనార్యుడు.

తాత్పర్యం:- వర్ణముల నుంచి వెలివేయబడినా, సంకర జాతివాడైనా, పైకి ఆర్యజాతి వాడిలా కనిపించి అనార్యుడయినా, ఆయా నిందిత జాతులకుండే లక్షణాలని బట్టి వారు అనార్యజాతులని తెలుసుకోవాలి. ॥57॥

వివరణ:

అనార్యుడు, అతని లక్షణం- 1. ప్రత్యేక వ్యక్తి ఏదో ఒక వర్ణంలో దీక్షను పొంది, ఉత్తమ ధర్మానుకూలంగా ఆచరించాలని మనుమహర్షి భావన. దుష్ట సంస్కారం కలిగిన కొందరు వ్యక్తులకు ధర్మాచరణమందు అభిలాష ఉండదు. వారు ఏదైనా ఒక వర్ణానికి సంబంధించిన దీక్షా సంస్కారాలను అవలంబించరు. వారే వర్ణాపేతులు. వారిలో స్వాభావికంగానే అశ్రేష్ఠత్వం, కఠోరత్వం, నిర్దయత్వం ఉంటుంది. ధార్మిక కార్యాలను ఉపేక్షిస్తారు. అలాంటి వ్యక్తే అనార్యుడు, లేదా దస్యుడు, దుష్ట సంస్కారయుక్తమైన వ్యక్తులకు జన్మించిన, దుష్టసంస్కారులైన వ్యక్తులే కలుషయోనిజులు. వీరిలో కుసంస్కారాలు ఏదో ఒక రూపంలో ప్రకటితమై గుర్తింపబడతారు. (3.41,42)లో మనువు దుష్ట కర్మల వల్ల దుష్ట సంస్కారం కలిగిన సంతతి జన్మిస్తాడని సూచించాడు. వాడే కలుషయోనిజుడు లేదా దస్యుడు.

"ఇతరేషు తు శిష్టేషు నృశంసానృతవాదినః ।
జాయన్తే దుర్వివాహేషు బ్రహ్మధర్మ ద్విషః సుతాః ॥ మను. 3.41
.... భవతి ప్రజా నిన్దితైర్నిందితా నృణామ్ ॥ మను. 42

2. ఈ శ్లోకంలో ఉచ్చజాతి-నీచజాతిపరమైన అర్థాన్ని సూచించడం మను సమ్మతం కాదు. ఇక్కడ ఆర్య రూపంలో ఉంటూ అనార్యులుగా జీవితం గడుపుతారో అలాంటి వారెవరైనా దుష్టోత్పన్నులైనందువల్ల దుష్ట, గుణ, కర్మ, స్వభావం కలవారవుతారు. వారు ఏ వర్ణంలో ఉన్నప్పటికీ **"కలుషయోనిజులుగా"** పరిగణింపబడతారు.

అనార్యుల లేదా దస్యుల లక్షణాలు- ఇది మనుకృతము-ప్రామాణికం

అనార్యతా నిష్ఠురతా క్రూరతా నిష్క్రియాత్మతా । మూలశ్లోక సం. **12**
పురుషం వ్యఞ్జయంతీహ లోకే కలుషయోనిజమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.58**

టీక:- అనార్యతా = నీచప్రవర్తన, **నిష్ఠురతా** = కఠోర స్వభావం, **క్రూరతా** = నిర్దయత్వం, **నిష్క్రియాత్మతా** = అధార్మిక క్రియలు. యజ్ఞాదుల గురించి ఉపేక్షాభావం. అంటే యజ్ఞాదులు చేయరాదనే భావన, ఈ లక్షణాలు, **లోకే** = లోకంలో, **పురుషం కలుషయోనిజమ్ వ్యఞ్జయన్తి** = పురుషుడు దుష్ట ప్రవృత్తి కలవాడని, అనార్యుడని సూచిస్తున్నవి. వీడు ఆర్యవర్ణాంతర్గతుడు కాడు. ఎందుకంటే ఈ దుర్గుణాలు ఆర్యులకు నిషిద్ధాలు, వర్జనీయాలు.

తాత్పర్యం:- చెడు నడవడి, కఠోర స్వభావం, చంపే స్వభావం, అధార్మిక క్రియలు, లోకంలో పురుషుడు దుష్టప్రవృత్తి కలవాడిని, 'అనార్యుడు' ధస్యుడు అని పిలుస్తారు. ॥58॥

వివరణ:

(10.57,58) శ్లోకాల ద్వారా మనుమహర్షి కర్మలే వర్ణ వ్యవస్థకు అధారమని మరొకసారి స్పష్టం చేసినట్లైనది.

ఇది మనుకృతము-ప్రామాణికం

పిత్ర్యం వా భజతే శీలం మాతుర్వోభయమేవ వా । మూలశ్లోక సం. **13**
న కథంచన దుర్యోనిః ప్రకృతిం స్వాం నియచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.59**

టీక:- **దుర్యోనిః** = అధర్మ జీవితం గడిపేవాడు లేదా చెడ్డ తల్లిదండ్రులకు జన్మించినవాడు, **పిత్ర్యం యా మాతుః శీలమ్, వా ఉభయమ్ + ఏవ** = లేదా, తల్లిదండ్రుల-ఇద్దరి స్వభావాలను, **భజతే** = తప్పనిసరిగా పొందుతాడు. మరియు వారు, **స్వాం ప్రకృతిం కథం చ న నియచ్ఛతి** = తన స్వభావాన్ని ఏ విధంగాను నియంత్రించుకోలేరు. అంటే తల్లిదండ్రుల కున్న ఆ పాప స్వభావం ఏదో రూపంలో ప్రకటితమవుతుంది. అందువల్ల అతడిని దుష్ట స్వభావిగా గుర్తించాలి.

తాత్పర్యం:- ఈ శూద్ర జాతివారైనా లేదా సంకరజాతి వారైనా ఇటు తల్లినడవడినిగాని, అటు తండ్రి నడవడినిగాని అనుసరిస్తారే తప్ప తమ పుట్టుకను, జాతి లక్షణాన్ని కప్పిపుచ్చుకోజాలరు. అంటే తల్లిదండ్రులకు ఉన్న ఆ పాప స్వభాం ఏదో రూపంలో ప్రకటితమవుతుంది. అందువల్ల అతడిని దుష్టస్వభావిగా గుర్తించాలి. ॥59॥

60 నుండి 64వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* *కులే ముఖ్యేఽపి జాతస్య యస్య స్యాద్యోనిసంకరః ।*
సంశ్రయత్యేవ తచ్ఛీలం నరోఽల్పమపి వా బహు ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.60***

తాత్పర్యం:- గొప్ప కులంలో పుట్టిన వాడికైనా ఎవరికి గోప్యమైన యోని సంకరం కలుగుతుందో, అతడు కొద్దిగానో-ఎక్కువగానో తండ్రిగుణాన్ని కలిగి ఉంటాడు. ॥60॥

* *యత్ర త్వేతే పరిధ్వంసాజ్జాయంతే వర్ణదూషకాః ।*
రాష్ట్రికైస్సహ తద్రాష్ట్రం క్షిప్రమేవ వినశ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.61***

తాత్పర్యం:- ఏ రాజ్యంలో ఈ వర్ణసంకరులు వ్యభిచారం వల్ల గానీ, ఇతరత్రా రహస్య సంగమాల వల్ల గానీ జన్మిస్తారో ఆ రాజ్యం అక్కడున్న జనులతో కూడి ప్రకృతి ఉత్పాతాలకు ఇతర పరిణామాలకు లోనై వేగమే వినాశం పొందుతుంది. ॥61॥

* *బ్రాహ్మణార్థే గవార్థే వా దేహత్యాగోఽనుపస్కృతః ।*
స్త్రీబాలాభ్యవపత్తౌ చ బాహ్యానాం సిద్ధికారణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.62***

తాత్పర్యం:- గో బాల, బ్రాహ్మణ, స్త్రీలను కాపాడేందుకు ఇతరదురుద్దేశాలు లేని వారై ఈ ప్రతిలోమజాతులవారు ప్రాణాలు విడిచినట్లయితే వారిక్కూడా స్వర్గాది పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది. ॥62॥

* *అహింసా సత్యమస్తేయం శౌచమింద్రియ నిగ్రహః ।*
ఏతం సామాసికం ధర్మం చాతుర్వర్ణ్యేఽబ్రవీన్మనుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.63***

తాత్పర్యం:- అహింస నాచరించుట, సత్యం పలుకుట, దొంగతనం చేయకుండుట, శుచిగా ఉండుట, ఇంద్రియాలను నిగ్రహించుకొనుట అనే అన్నికులాలవారికి ఉండవలసిన ధర్మాలు. ॥63॥

* ***శూద్రాయాం బ్రాహ్మణాజ్జాతః శ్రేయసా చేత్ప్రజాయతే ।***
అశ్రేయాన్ శ్రేయసీం జాతిం గచ్ఛత్యాసప్తమాద్యుగాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***64***

తాత్పర్యం:- శూద్ర స్త్రీయందు బ్రాహ్మణుడి వల్ల స్త్రీ పుట్టినట్లయితే, అలాంటి స్త్రీని బ్రాహ్మణుడు వివాహమాడితే ఆమెకు కూతరే పుడితే ఆ స్త్రీని మరొక్క విప్రుడు వివాహమాడినట్లయితే మళ్ళా ఆ స్త్రీకి స్త్రీయే పుడితే అలా ఏడో జన్మమున బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. ఈ విధంగా ఆ పారశవుడు సప్తమ జన్మమున బ్రాహ్మణత్వం పొందుతాడు.॥64॥

ప్రక్షిప్తాల పరిశీలన

10.59 నుంచి 10.64 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

10.45లో నాలుగు వర్ణాలకూ భిన్నమైన వారిని దస్యులు అని చెప్పి, 10.57-58లలో దస్యులకు కర్మలను బట్టి గుర్తింపు ఉంటుందన్నాడు. ముఖ్య విషయం నాలుగు వర్ణాల ధర్మాలు కనుక, 10.65లో మనువు, నాలుగు వర్ణాలనే చెప్పాడు. ఆ నాలుగు వర్ణాలను ఆధారం చేసుకునే, వారి కర్మలు ఉంటాయి. అగ్ర వర్ణపు వ్యక్తి నీచపు పనులు చేస్తే కింది వర్ణం వాడవుతాడు, కింది వర్ణం వాడు ఉత్తమ కర్మలు చేస్తే పెద్ద కులం వాడవుతాడు. ఈ నాలుగు వర్ణాల ధర్మాల విషయంలో కర్మల ప్రసంగం మధ్య 10.61 మొదలైన శ్లోకాలలో వర్ణ దూషకులను చెప్పటం ప్రసంగ వ్యతిరేకం.

2. శైలీగత వ్యతిరేకాలు

ఇక్కడ 10.63లో ప్రక్షిప్తకారులు **'అబ్రవీన్మనుః'** అనటం వల్ల, ఈ శ్లోకం మనువు కాక తర్వాతి వారెవరో రాసి కలిపేశారని స్పష్ట మవుతూంది. పూర్వాపర శ్లోకాలు దీనితో సంబద్ధం కావటం చేత, మొత్తం ప్రసంగమే ప్రక్షిప్తం !

3. అంతర్ వ్యతిరేకాలు

క. కర్మానుసారమే వర్ణ వ్యవస్థ అన్నాడు మనువు [1.107 సమీక్ష చూడండి]. కానీ ఇక్కడ 10.59-60లలో జన్మ మూల మని రుజువు చేసేందుకు జన్మ గొప్పతనం చెప్పారు.

ఖ. మనువు సవర్ణంలోని వారితో వివాహమే గొప్ప దన్నాడు [3.4; 7.77], కానీ ఇక్కడ 10.64లో బ్రాహ్మణుని వివాహం శూద్రస్త్రీతో చేయించి పుట్టిన సంతానాన్ని వర్ణ సంకరంగా చెప్పారు. ఇది సవర్ణ వివాహ పద్ధతికి వ్యతిరేకం. ఇటువంటి సంతానం కలిగినా; వారు కర్మణా వర్ణాన్ని స్వీకరించి ఆ వర్ణం వారు కావచ్చు, అదీ ఈ జన్మలోనే ! ఎందుకంటే మనువు కర్మలు ఆధారంగానే వర్ణా లన్నాడు.

గ. 10.65లో మనువు కర్మలను బట్టి వర్ణాలు మారుతా యని చెప్పాడు. మరొక చోట కూడా కర్మల వల్లే బ్రాహ్మణులు మొదలైనవారు ఏర్పడతారని చెప్పాడు -

"మహా యజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః" [2.28] అంటే పుట్టుకతో బ్రాహ్మణుడి శరీరం తయారు కాదు, యజ్ఞాలు మొదలైన శ్రేష్ఠమైన పనులు చేయటం వల్ల తయా రవుతుంది. విద్య, దీక్షల వల్ల ఆచార్యుడే శిష్యుని వర్ణం నిర్ణయిస్తాడు [2.148] అన్నాడు. కానీ ఇక్కడ 10.64లో ఏడు తరాల తర్వాత బ్రాహ్మణుని వల్ల శూద్ర స్త్రీకి జన్మించిన సంతానం ఉత్తమ వర్ణానికి చెందుతారు అన్నారు. ఈ జన్మ మూలక వర్ణ వ్యవస్థ మను సమ్మతం కాదు. జన్మ ఆధారంగా ఏడు తరాలలో సంతానం పెద్ద వర్ణానికి కర్మలేవీ లేకుండా దీక్షితులు కావచ్చు ననేది యుక్తి యుక్తం కాదు. ఇట్లా జరిగితే, మనువు నిర్ధారించిన వర్ణాల కర్మల ఔచిత్యం ఎక్కడుంటుంది? [1.87-91].

కర్మానుసారంగా వర్ణ పరివర్తనం - ఇది మనుకృతం. ప్రామాణికం

శూద్రో బ్రాహ్మణతామేతి బ్రాహ్మణశ్చైతి శూద్రతామ్ । మూలశ్లోక సం. **14**
క్షత్రియాజ్జాతమేవం తు విద్యాద్వైశ్యాత్తథైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.65**

టీక:- **శూద్రః బ్రాహ్మణతామ్ + ఏతి** = శూద్రుడు, బ్రాహ్మణుడు కావచ్చు, **చ** = మరియు, **బ్రాహ్మణః శూద్రతామ్ + ఏతి** = బ్రాహ్మణుడు శూద్రుడు కావచ్చు అంటే గుణ కర్మలననుసరించి బ్రాహ్మణుడైతే, బ్రాహ్మణుడనబడును. అలాగే ఎవడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల గుణాలు కలవాడో, అతడు బ్రాహ్మణుడు, క్షత్రియుడు. వైశ్యుడు-శూద్రుడవుతాడు. అలాగే శూద్రుడు కూడా, **ఏవం** = యథా యోగ్యంగా బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడవుతాడు. **క్షత్రియాత్ జాతమ్ + ఏవం తు తథైవ వైశ్యాత్ విద్యాత్** = అలాగే, క్షత్రియులు, వైశ్యుల విషయంలో కూడా తెలుసుకోవాలి.

తాత్పర్యం:- శూద్ర కులంలో పుట్టినవాడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాల వారితో సమానమైన గుణ, కర్మ స్వభావాలు కలవాడైతే ఆ శూద్రుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాలలో చేరుతాడు. అలాగే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలలో జన్మించి శూద్రుని వంటి గుణ, కర్మ స్వభావాలు కలవారు శూద్రులు అవుతారు. క్షత్రియ, వైశ్యవర్ణాలలో జన్మించి, బ్రాహ్మణ లేక శూద్ర వర్ణాల వారితో సమానంగా వున్నవారు బ్రాహ్మణులో లేక శూద్రులో అవుతారు. నాలుగు వర్ణాలలో ఏ యే వర్ణాలతో సమానంగా ఏ యే స్త్రీ పురుషులుంటారో వారు ఆ యా వర్ణాలలో లెక్కింపబడతారు.॥65॥

ఉత్తమ గుణకర్మ స్వభావం గల శూద్రుడు వైశ్యుడు, క్షత్రియుడు బ్రాహ్మణుడు కావచ్చు. అలాగే ఉత్తమ గుణకర్మ స్వభావం గల వైశ్యుడు క్షత్రియుడు బ్రాహ్మణుడు కావచ్చు. అలాగే ఉత్తమ గుణకర్మ స్వభావంగల క్షత్రియుడు బ్రాహ్మణ వర్ణం యొక్క అధికారాన్ని, కర్మలను పొందవచ్చు..

అలాగే నీచ కర్మ, నీచ గుణాలు కలిగిన బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడుగాను; క్షత్రియుడు వైశ్యుడు, శూద్రుడుగాను ; వైశ్యుడు శూద్ర వర్ణముల అధికారాన్ని, కర్మలను పొందుతాడు. (సం.వి.గృ.ప్ర.).

శూద్రకులంలో జన్మించినా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో సమాన గుణకర్మ స్వభావం కలవాడయినట్లయితే, ఆ శూద్రుడు, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు అవుతాడు. అలాగే బ్రాహ్మణుడు క్షత్రియుడు, వైశ్యుడు ఆయా కులంలో జన్మించినా, వారికున్న గుణకర్మ స్వభావాలు శూద్రుడితో సమానంగా ఉన్నట్లయితే వాడు శూద్రుడవుతాడు. అలాగే క్షత్రియ వైశ్య కులంలో జన్మించినా అతడి గుణాలు బ్రాహ్మణుడితో శూద్రుడితో సమానంగా ఉంటే బ్రాహ్మణుడు శూద్రుడవుతాడు. నాలుగు వర్ణములలో ఏఏ వర్ణానికి సమానమైన ఏఏ గుణాలు ఏ పురుషుడి యందు ఏ స్త్రీ యందుండునో, వారు వారు ఆ వర్ణములలోనే గుర్తింపబడతారు. (స.ప్ర.4వ సము.)

శ్రీ దయానంద మహర్షి పూనా ప్రసంగంలో ఈ శ్లోకం ఉదాహరించి, ఇలా వ్రాస్తున్నారు.

"శూద్రుడు బ్రాహ్మణుడవుతాడు, బ్రాహ్మణుడు శూద్రుడవుతాడు. ఇది మను వచనం- ఆలోచింపదగినది". (10.14)

వివరణ:

1. (10.57,58) కర్మానుసారంగా మ్లేచ్ఛవ్యక్తుల గుర్తింపును సూచించి, 10.65లో కర్మానుసారంగా వర్ణ పరివర్తనం జరుగునని చెప్పబడింది. అంటే కర్మానుసారంగా అనార్య వ్యక్తిని గుర్తించడం, కర్మను ఆధారంగా చేసుకొని ఉచ్చ, నిమ్న వర్ణాల వారిలో వర్ణ పరివర్తనం కూడా జరగవచ్చు. ఈ విధంగా 57,58 శ్లోకాల తరవాత 65వ శ్లోకం సందర్భానుగుణంగా ఉంది.

2. కర్మణా వర్ణవ్యవస్థకు అతిస్పష్టమైన ఉదాహరణం. మనువు ఈ శ్లోకంలో వర్ణ వ్యవస్థ కర్మల మీదనే ఆధారపడిందని ధ్రువపరచాడు. ఇందుకు అనేక ప్రమాణాలు ఉదాహరణలు లభించును (2.31, 87,91,107, 11.114) ఈ శ్లోకాల సమీక్ష చూడండి.

3. ఈ 65వ శ్లోకానికి సంబంధించిన ప్రమాణాలు - ప్రాచీన కాలంలో వర్ణ వ్యవస్థ కర్మననుసరించే జరగడం ప్రసిద్ధమే. ఇందుకు ఎన్నో ప్రమాణాలు-ఉదాహరణలు లభిస్తున్నవి. ఆపస్తంబ ధర్మసూత్రాలు. (1.5,10.11).

ధర్మచర్యయా జఘన్యో వర్ణః పూర్వం పూర్వం వర్ణ మాపద్యతే జాతిపరివృత్తౌ-1.
అధర్మచర్యయా పూర్వోవర్ణో జఘన్యం జఘన్యం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ-2.

ధర్మాచరణవల్ల తక్కువ వర్ణస్థుడు (శుద్రుడు) ఉత్తమ వర్ణాన్ని పొందుతాడు.

అధర్మాచరణం వల్ల పూర్వం అంటే ఉత్తమవర్ణస్థుడు తన కంటే కింది వర్ణాన్ని పొందుతాడు. (స.ప్ర.4 సముల్లాసం)

3. వర్ణ పరివర్తనానికి ఉదాహరణ

ఐతరేయ బ్రాహ్మణం 2.19లో కవష-ఐలూష నామక వ్యక్తికి సంబంధించిన ఒక సన్నివేశంలో ఇలా వర్ణింపబడింది. అది వర్ణపరివర్తనానికి చక్కటి ప్రమాణం. జన్మచేత నిమ్నవ్యక్తి ఋషిత్వకారణంగా ఋషులలో పరిగణింపబడి ఉన్నత వర్ణస్థుడుగా పిలువబడినాడు.

“ఋషయో వై సరస్వత్యాం సత్రమాసత । తే కవషమైలూషం సోమాదన యన్
దాస్యాః పుత్రః కితవో అబ్రాహ్మణః కథం నో
మధ్యే దీక్షిష్టేతి ।....స బహిర్ధన్వోదూఢహ పిపాసయా విత్త
ఏతత్ అపోనప్త్రీయమపశ్యత్-ప్రదేవత్రా బ్రహ్మణే గాతురేతు ఇతి.

అర్థం: ఋషులు సరస్వతీ తీరంలో యజ్ఞాన్ని ఏర్పాట్లు చేసికొన్నారు. యజ్ఞంలో పాల్గొనడానికి ప్రయత్నించిన **‘కవచ ఐలూష’**డికి సోమరసం ఇవ్వలేదు. ఇతడు దాసీపుత్రుడు. కపటాచారవంతుడు అబ్రాహ్మణుడు మన మధ్య ఏలా దీక్షితుడైనాడని తలచి యజ్ఞం నుండి బహిష్కరించగా, ఆ కవచ ఐలూషుడు పిపాసా పీడితుడై అడవిలోకి వెళ్ళిపోయాడు. అరణ్యంలో అతడికి **“అపోనప్త్ర”** దేవతకు సంబంధించిన సూక్తం యొక్క అర్ధ దర్శనం కలిగినది. మళ్ళీ ‘వేదార్థ ద్రష్ట’ కావడం చేత, అతడిని తమ మధ్యకు పిలిచి యజ్ఞంలో దీక్షితుణ్ణి చేశారు.

ఈ సూక్తం ఋగ్వేదంలో 10వ మండలం 30వ సూక్తం. వేదంలో ఈ సూక్తమునకు ఈ ఋషి పేరే ఉంది. ఈ ఋషి ద్వారా అర్థ దర్శనం కలిగిన అన్య సూక్తము (10-31-34) లున్నాయి.

సూక్తముల మీద రాసిన ఋషులు ఆయా సూక్తముల యొక్క అర్థ ద్రష్టలని సిద్ధమవుతుంది.

66 నుండి 130వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* బీజ-క్షేత్ర శ్రేష్ఠతా నిర్ణయము-

* *అనార్యాయాం సముత్పన్నో బ్రాహ్మణాత్తు యదృచ్ఛయా ।*
బ్రాహ్మణ్యామప్యనార్యాత్తు శ్రేయస్త్వం క్వేతి చేద్భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***10.66***

తాత్పర్యం:- ఒకడు వివాహిత స్త్రీకి బ్రాహ్మణుడివల్ల పుట్టినవాడు. మరొకడు అవివాహిత బ్రాహ్మణస్త్రీకి శూద్రుడివల్ల పుట్టినవాడు. వీరిద్దరిలో ఎవరు శ్రేష్ఠులు అనే నిర్ణయం ఈ విధంగా చేయబడుతున్నది. ॥66॥

* *జాతో నార్యామనార్యాయామార్యాదార్యో భవేద్గుణైః ।*
జాతోఽ ప్యనార్యాదార్యాయామనార్య ఇతి నిశ్చయః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***10.67***

తాత్పర్యం:- శూద్రస్త్రీయందు బ్రాహ్మణునివల్ల పుట్టినవాడు పాకయజ్ఞం మొదలైన కర్మముల అనుష్ఠించుటచేత శ్రేష్ఠుడవుతాడు. శూద్రుడిచేత బ్రాహ్మణ స్త్రీయందు పుట్టినవాడు ప్రతిలోమమున పుట్టినవాడగుటంజేసి, శూద్రధర్మములందు సైతం అధికారి కానందు వల్ల శ్రేష్ఠుడు కానేరడు. లోకన్యాయంచేత సిద్ధమైన ఈ విషయం వచన ప్రమాణత్వాన్ని బట్టి ఇక్కడ చెప్పబడింది. ॥67॥

* *తావుభావప్యసంస్కార్యావితి ధర్మో వ్యవస్థితః ।*
వైగుణ్యాజ్జన్మనః పూర్వ ఉత్తరః ప్రతిలోమతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.***10.68***

తాత్పర్యం:- పారశవ చండాలురు ఇరువురు ఉపనయన సంస్కారమునకు అర్హులుగారు. ఇందు మొదటి వాడు శూద్రాపుత్రుడగుటవలన, రెండోవాడు ప్రతిలోమజాతుడు అగుటవలన ఉపనయనానికి తగడు.

*   *సుబీజం చైవ సుక్షేత్రే జాతం సంపద్యతే యథా ।*
తథార్యాజ్జాత ఆర్యాయాం సర్వం సంస్కార మర్హతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **10.69**

తాత్పర్యం:- మంచిక్షేత్రంలో విత్తిన మంచి విత్తనం ఎలా చక్కగా మొలచి మెండుగ ఫలిస్తుందో, అలా ఆర్యుడిమూలమున సవర్ణస్త్రీయందు పుట్టినవాడును, అనులోమ్యమున క్షత్రియవైశ్య స్త్రీలయందు పుట్టినవాడును సవర్ణ సంస్కారమును, క్షత్రియ వైశ్యులకు తగిన సంస్కారమును పొందుతారు. సకల శ్రౌతస్మార్తసంస్కారములకును తగినవాడవుతారు. ॥69॥

*   *బీజమేకే ప్రశంసంతి క్షేత్ర మన్యే మనీషిణః ।*
బీజక్షేత్రే తథైవాన్యే తత్రేయం తు వ్యవస్థితిః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **10.70**

తాత్పర్యం:- కొందరు బీజం గొప్పదని పొగుడుతారు. ముఖ్యం అంటారు. మరికొందరు క్షేత్రానిదే గొప్పంటారు. బీజక్షేత్రాలు రెండూ గొప్పవంటారు కొందరు. అవి ఇలా నిర్ణయించాలి.॥70॥

*   *అక్షేత్రే బీజముత్సృష్టమంతరైవ వినశ్యతి ।*
అబీజకమపి క్షేత్రం కేవలం స్థండిలం భవేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **10.71**

తాత్పర్యం:- చౌడునేలలో విత్తనం విత్తితే ఏమైనా ప్రయోజనం ఉందా? అది మొలకెత్తదే ! మేలైన క్షేత్రం ఉన్నా ఎలాంటి బీజాలూ విత్తనప్పుడు అది కొన్నాళ్లకి బీడు భూమిగా మారిపోదా? కాబట్టి క్షేత్రం-బీజం రెండూ మంచివై ఉండాలి. ॥71॥

*   *యస్మాద్బీజ ప్రభావేణ తిర్యగ్జా ఋషయోఽభవన్ ।*
పూజితాశ్చ ప్రశస్తాశ్చ తస్మాద్బీజం ప్రశస్యతే ॥   ప్రక్షిప్త శ్లోక సం. **10.72**

తాత్పర్యం:- బీజం ప్రధానం అనే పక్షంలో-ఏ కారణంచేత బీజం ముఖ్యమైనదో తిర్యక్ యోనులలో పుట్టినా వారు గొప్ప గొప్ప ఋషులై అందరిచేతా పూజితులైరో ఆ కారణం చేత బీజం శ్లాఘించబడాలి. ॥72॥

*   *అనార్యమార్యకర్మాణమార్యం చానార్యకర్మిణమ్ ।*
సంప్రధార్యాబ్రవీద్ధాతా న సమౌ నాసమావితి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **10.73**

తాత్పర్యం:- ద్విజధర్మాల ననుష్ఠించు శూద్రుడు. శూద్రధర్మాల ననుష్ఠించు ద్విజుడు సమానులు కారని, సమానులును కాకపోరు అని సృష్టికర్త చెప్పాడు. శూద్రుడు ద్విజధర్మాలను అనుసరించటంవల్ల ద్విజసముడు కాడు. అలాగే బ్రాహ్మణుడు శూద్రధర్మాలను పాటించినా జాతి ఉన్నతికి లోపం లేదు. కావున శూద్రతుల్యుడు కాడు. అయినా నిషిద్ధాచరణం యిద్దరికీ నింద్యమే. అందువల్ల నిందితకర్మ ఎవరూ చేయకూడదని చాతుర్వర్ణ్యం మొదలు సంకరజాతుల వరకు అందరికీ ఉపదేశింపబడుతున్నది. ॥73॥

ప్రక్షిప్తాల పరిశీలన

10.66 నుంచి 10.73 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు-

1. విషయ వ్యతిరేకాలు

ఈ అధ్యాయంలోని చివరి శ్లోకం 10.131, 1.1-3ల వల్ల, ఈ అధ్యాయంలోని విషయం నాలుగు వర్ణాల ధర్మాలని తెలుస్తూంది. కాని దీంట్లో వర్ణ సంకరాలను గురించి (ఈ నాలుగు వర్ణాల కిందికీ రాని బయటి విషయం

కనుక) చెప్పారు. బీజపు గొప్పతనం అస్థానంలో - అంటే చెప్పవలసిన చోట కాకుండా వేరే చోట - చెప్పారు. ఇది సంకేతించిన విషయానికి వ్యతిరేకం.

2. అంతర్ వ్యతిరేకాలు

క. మను మహర్షి శూద్రులనూ ఆర్యులనే అన్నాడు [10.4, 45, 1.88-91]. మనువు ప్రకారం మనుషులలో రెండే భేదాలు - ఆర్యులు, దస్యులు. నాలుగు వర్ణాలకూ భిన్నమైనవారు, 10.45 ప్రకారం దస్యులు. కనుక శూద్రులూ ఆర్య వర్ణం వారే, కానీ 10.66, 10.73లలో శూద్రులను 'అనార్యులు' పదంతో పేర్కొన్నారు. అందుకని ఇది వ్యతిరేకం.

ఖ. మనువు ద్విజులకు సవర్ణులతో పెళ్లినే చెప్పాడు [3.4; 7.77] మొదలైనవి. కానీ ఇక్కడ 10.78లో బ్రాహ్మణులకు శూద్ర స్త్రీ వల్ల కలిగిన సంతానం గురించి చెప్పటం వల్ల, ఇక్కడ అసవర్ణులతోనూ అంగీకరించినట్లనిపిస్తుంది. కానీ ఇది మనువు వ్యవస్థకు వ్యతిరేకం [ఈ విషయం మీద విశేష సమీక్షకు 3.4 మీది వివరణ చూడండి].

గ. మనువు ప్రకారం వర్ణ వ్యవస్థ కర్మ మూలకం, జన్మ మూలకం కాదు. కానీ 10.68, 10.73లలో జన్మ మూలక వర్ణ వ్యవస్థే చెప్పారు. పైగా వర్ణాలను మార్చలే మనీ చెప్పారు. ఇది 10.65కు వ్యతిరేకం.

ఘ. మను మహర్షి 'ఋషి' పదాన్ని దేవతలు, పితరులు, మొదలైన వారివలె మనుష్యులలో భేదం అనుకున్నాడు. అందుకని మనువు 12.49లో ఋషులు, దేవతలు, పితరులు, సాధ్యులను కూడా రెండవ సాత్త్విక గతి వారని చెప్పాడు. ఇక్కడ చెప్పిన తిర్యక్కులు పశువులు, పక్షులు మొదలైనవి. ఎలాగంటే - **'తిర్యక్ త్వం తామసా నిత్యం'** [12.40]. అందువల్ల మనువు ప్రకారం ఋషులు, తిర్యక్కులు వేర్వేరు. దానికి వ్యతిరేకంగా ఇక్కడ చెప్పారు. **'తిర్యగ్జా ఋషయోऽభవన్"** [10.72] .అంటే తిర్యక్కులు = పశు పక్ష్యాదులు ఋషు లయ్యాయా? పశు పక్ష్యాదులకు మనుషులు పుట్టటం జరుగుతుందా? ఇది సృష్టి నియమాలకు వ్యతిరేకం, మనువుకూ వ్యతిరేకం కనుక, కచ్చితంగా మిథ్యే. మనువు వంటి మహాత్ముడు ఇటువంటి మిథ్యా ప్రవచనం ఎప్పుడూ చెయ్యడు! [ఈ విషయం మీద విశేషంగా 32-42ల పైని సమీక్ష చూడండి].

3. శైలీగత వ్యతిరేకాలు

మనువు వర్ణన శైలి విధానాత్మకంగా ఉంటుంది. కానీ **'తిర్యగ్జా ఋషయోऽభవన్'** [10.72] లోనిది చారిత్రిక శైలి, మనువుది కాదు. ఇట్లా చెప్పిన ఋషులు వంశ పరంపర దృష్టితో చూస్తే, మనువుకు చాలా కాలం తర్వాతే వచ్చింది. వారి వర్ణన ఎన్నో తరాలకు పూర్వమే చెప్పే వీలు లేనే లేదు!

* ***బ్రాహ్మణా బ్రహ్మయోనిస్థా యే స్వకర్మణ్యవస్థితాః ।***
తే సమ్యగుపజీవేయుః షట్కర్మాణి యథాక్రమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.74***

తాత్పర్యం:- బ్రాహ్మణులు బ్రహ్మప్రాప్తి కారణమయిన బ్రహ్మము నందు (వేదము నందు) నిలుకడ గలవారై స్వధర్మానుష్ఠాననిరతులై షట్కర్మలను యథాక్రమంగా ఆచరించాలి. ॥74॥

* ***అధ్యాపనమధ్యయనం యజనం యాజనం తథా ।***
దానం ప్రతిగ్రహశ్చైవ షట్కర్మాణ్యగ్రజన్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.75***

తాత్పర్యం:- సాంగవేదాధ్యయనం, అధ్యాపనం, యజ్ఞాలు చేయటం, చేయించటం దానం చెయ్యటం, గ్రహించటం యీఆరు కర్మలూ బ్రాహ్మణుడికి ముఖ్యకర్మలు. ॥75॥

* ***షణ్ణాం తు కర్మణామస్య త్రీణి కర్మాణి జీవికాః ।***
యాజానాధ్యాపనే చైవ విశుద్ధాచ్చ ప్రతిగ్రహః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.76***

తాత్పర్యం:- ఈ షట్కర్మలలోనూ, వేదాలను బోధించటం, యజ్ఞాలు చేయించటం, విశుద్ధద్విజులనుంచి దానాన్ని స్వీకరించటం అనే మూడుకర్మలు బ్రాహ్మణుడికి జీవనాధారాలు. ॥76॥

* **త్రయో ధర్మా నివర్తంతే బ్రాహ్మణాత్ క్షత్రియం ప్రతి ।**
అధ్యాపనం యాజనం చ తృతీయశ్చ ప్రతిగ్రహః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.77***

తాత్పర్యం:- బ్రాహ్మణుడి తరువాత క్షత్రియుడి విషయానికొస్తే అధ్యయనం-యగాలు చేయడం- దానమివ్వడం అతడిచేత జరగాల్సినవి. ॥77॥

* **వైశ్యం ప్రతి తథైవైతే నివర్తేరన్నితి స్థితిః ।**
న తౌ ప్రతిహితాన్ ధర్మాన్ మనురాహ ప్రజాపతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.78***

తాత్పర్యం:- వైశ్యుడికి కూడా యాగాలు చేయించడానికీ, వేదాలు బోధించడానికీ, దానాలు తీసుకోవడానికీ శాస్త్రం అంగీకరించదు. ॥78॥

* **శస్త్రాస్త్రభృత్త్వం క్షత్రస్య వణిక్పశుకృషిర్విశః ।**
ఆజీవనార్థం ధర్మస్తు దానమధ్యయనం యజిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.79***

తాత్పర్యం:- క్షత్రియుడికి శస్త్రములు (ఖడ్గములు మొదలైనవి), అస్త్రములు (బాణములు మొ॥.) వీటిని ప్రజాసంరక్షణమునకూ, జీవికకూ నియమించాడు. వైశ్యుడికి వర్తకం, సేద్యం, పశువుల పాలించడం ఇవి జీవికకు ధర్మములు. వీరికిరువురకు అధ్యయనయాగదానములు స్వాత్మార్థములు. ॥79॥

* **వేదాభ్యాసో బ్రాహ్మణస్య క్షత్రియస్య చ రక్షణమ్ ।**
వార్తాకర్మైవ వైశ్యస్య విశిష్టాని స్వకర్మసు ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.80***

బ్రాహ్మణుడికి సాంగ వేదాధ్యయనం, క్షత్రియుడికి ప్రజాసంరక్షణం, వైశ్యుడికి వర్తకం, జీవనం కోసం అనుష్ఠించాల్సిన ధర్మాలు. ॥80॥

* **అజీవం స్తు యథోక్తేన బ్రాహ్మణః స్వేన కర్మణా ।**
జీవేత్ క్షత్రియధర్మేణ స హ్యస్య ప్రత్యనంతరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.81***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు తన ధర్మాన్ని నిర్వర్తించడం ద్వారా నిత్యజీవికకు విఘాతం ఏర్పడితే, దానిని వదలి క్షత్రియవృత్తి అయిన నగర గ్రామపాలనచేత జీవితం గడపవచ్చు! ॥81॥

* **ఉభాభ్యామప్యజీవం స్తు కథం స్యాదితి చేద్భవేత్ ।**
కృషిగోరక్షమాస్థాయ జీవేద్వైశ్యస్య జీవికామ్॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.82***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు తన వృత్తిచేతగాని, క్షత్రియవృత్తిచేత గాని జీవిక చేయజాలడేని అప్పుడెట్లు జీవనం చేయదగునని సంశయం గలిగెనేని అప్పుడు వైశ్యవృత్తి అయిన సేద్యం, పశుపాలనం, వర్తకం వీటిని అవలంబించి జీవించాలి. విక్రయించదగిన వస్తువులు ముందు చెప్పబడును. స్వయంకృత మైన కృష్యాదులు బ్రాహ్మణుడికి ఆపద్ధకర్మములు. ఆపద లేనప్పుడు ఋతం, అమృతం వీటివల్ల జీవించాలని ముందే చెప్పబడింది. ॥82॥

* **వైశ్యవృత్త్యాపి జీవం స్తు బ్రాహ్మణః క్షత్రియోఽపి వా ।**
హింసాప్రాయం పరాధీనాం కృషిం యత్నేన వర్జయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.83***

తాత్పర్యం:- ఆపద్ధర్మంగానైనా క్షత్రియోచిత వృత్తి ఉపకరించనప్పుడు లేదా అందుకు అవకాశం లేకపోయినప్పుడు గాని వైశ్యవృత్తి అయిన పశుపాలన, సేద్యం, వర్తకం మొదలైనవి అవలంబించవచ్చు!

అట్లని అన్ని రకాల సరకులూ విక్రయించరాదు. (అవి ముస్ముందు చెప్పబడును.) ॥83॥

* కృషిం సాధ్వితి మన్యంతే సా వృత్తిస్సద్విగర్హితా ।
భూమిం భూమిశయాంశ్చైవ హంతి కాష్ఠమయోముఖమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.84

తాత్పర్యం:- కొందరు సేద్యమే ఉత్తమమైన కృషి అంటారు. ఇది సజ్జనులకు నింద్యమైనది. ఎందుకంటే నాగలి, గొడ్డలి, పార మొదలైన ఇనుప మొనలు గల సాధనాలు భూమిని భూమిలోపల తలదాచుకొనే ప్రాణులను చంపే అవకాశం ఉన్నందువల్ల అది అనర్హమైనదే అని అందరూ ఒప్పుకొంటారు. ॥84॥

* ఇదం తు వృత్తివైకల్యాత్త్యజతో ధర్మనైపుణమ్ ।
విట్పణ్యముద్ధృతోద్ధారం విక్రేయం విత్తవర్ధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.85

తాత్పర్యం:- బ్రాహ్మణుడికి గాని, క్షత్రియుడికి గాని తన వృత్తివల్ల జీవనం దుర్లభమైనప్పుడు, ధర్మం కోసం పస్తులతో మాడకుండా కేవలం జీవిక నిలుపుకోవడం కోసం (ధన సంపాదన నింద్యము కానివి) ఇప్పుడు చెప్పబడును.॥85॥

* సర్వాన్ రసానపోహేత కృతాన్నం చ తిలైస్సహ ।
అశ్మనో లవణం చైవ పశవో యే చ మానుషాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.86

తాత్పర్యం:- నూలి బట్టలు రంగువేసినవి అమ్మరాదు. గోగునార, ఆషసినారు వీనితో నిర్మించిన బట్టలు విక్రయించరాదు. కంబళ్ళు విక్రయించరాదు. పండ్లు, దుంపలు, ఓషధులు వీటిని కూడా విక్రయించరాదు. ॥86॥

* సర్వం చ తాంతవం రక్తం శాణక్షౌమావికాని చ ।
అపిచేత్స్యురరక్తాని ఫలమూలే యథౌషధీః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.87

తాత్పర్యం:- నూలి బట్టలు రంగు వేసినవి అమ్మరాదు. గోగునార, ఆగసినార, వీనితో నిర్మించిన బట్టలు అమ్మరాదు. కంబళ్ళు విక్రయించరాదు. పండ్లు, దుంపలు, ఓషధులు వీటిని కూడా విక్రయించరాదు. మొదట విడువదగినవి చెప్పబడుతున్నవి... తెల్ల ఆవాలు, నువ్వులు, నువ్వులపొడి కలిపినట్టి అన్నం, రకరకాల రాళ్లు-పలకలు, ఉప్పు, జంతుజాలం (పక్షులు-మృగాలు) వీటి విక్రయం నిషేధం. ఇలాగే....॥87॥

* అపశ్శస్త్రం విషం మాంసం సోమం గంధాంశ్చ సర్వశః ।
క్షీరం క్షౌద్రం దధి ఘృతం తైలం మధు గుడం కుశాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.88

తాత్పర్యం:- నీరు, శస్త్రాలు, విషం, మాంసం, సోమలత, సుగంధద్రవ్యాలు, పాలు, తేనె, పెరుగు, నెయ్యి, నూనె, దర్భలు, బెల్లం....వీటిని కూడ విప్రుడు విక్రయించరాదు. ॥88॥

* అరణ్యాంశ్చ పశూన్ సర్వాన్ దంష్ట్రిణశ్చ వయాంసి చ ।
మద్యం నీలీం చ లాక్షాం చ సర్వాంశ్చైకశఫాంస్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.89

తాత్పర్యం:- అడవుల్లో పుట్టిన ఏనుగులు, కోరలు గల క్రూరమృగాలు, మత్స్యాలు, పక్షులు, జలజంతువులు, మద్యం, నీలి లక్క, ఒంటె గిట్టలు గల జంతుజాలాన్ని విక్రయించరాదు. ॥89॥

* కామముత్పాద్య కృష్యాం తు స్వయమేవ కృషీవలః ।
విక్రీణీత తిలాఞ్ఛుద్ధాన్ ధర్మార్థమచిరస్థితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 10.90

తాత్పర్యం:- ఇతర తృణధాన్యాలతోపాటు, తిలలను కూడ సేద్యగాడు పండించినప్పుడు, ఆ నువ్వులపంటను ఎక్కువకాలం ఉంచక వెంటనే విక్రయించేయాలి. బ్రాహ్మణుడు సేద్యం చేసినా ఇలాగే! తిలవిక్రయం నిషిద్ధం. ॥90॥

* *భోజనాభ్యంజనాద్దానాద్యదన్యత్కురుతే తిలైః ।*
కృమిభూతః శ్వవిష్ఠాయాం పితృభిస్సహ మజ్జతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.91**

తాత్పర్యం:- భోజనం, తలంటు, దానం....ఈ మూడు పనులలోను కాక ఇతరత్రా తిలలను ఉపయోగించేవాడికి కుక్కమలంలో తిరుగాడే పురుగు జన్మ ప్రాప్తిస్తుంది. ॥91॥

* *సద్యః పతతి మాంసేన లాక్షయా లవణేన చ ।*
త్ర్యహేణ శూద్రో భవతి బ్రాహ్మణః క్షీరవిక్రయాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.92**

తాత్పర్యం:- లక్క, మాంసం, ఉప్పు వీటిని విక్రయిస్తే, వాడు వెంటనే భ్రష్టత్వం పొందుతాడు. పాలు అమ్మడం వల్ల విప్రుడికి మూడు రోజుల్లో శూద్రత్వం ప్రాప్తిస్తుంది. ॥92॥

* *ఇతరేషాం తు పణ్యానాం విక్రయాదిహ కామతః ।*
బ్రాహ్మణస్సప్తరాత్రేణ వైశ్యభావం నియచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.93**

తాత్పర్యం:- ఇంతవరకు చెప్పిన మాంసాదుల కంటే తక్కిన వస్తువులలో శాస్త్ర నిషిద్ధమైనవి ఏవి అమ్మినా, జీవిక కోసమే అయినా విప్రుడు వారం రోజుల్లో వైశ్యుడవుతాడు. ॥93॥

* *రసా రసైర్నిమాతవ్యా న త్వేవ లవణం రసైః ।*
కృతాన్నం చాకృతాన్నేవ తిలా ధాన్యేన తత్సమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.94**

తాత్పర్యం:- బెల్లం మొదలైన రసద్రవ్యాల్ని సరికిసరి పరిమాణంలో ద్రవ్యమార్పిడి చేసుకోవచ్చు! కానీ ఉప్పును మాత్రం దేనికీ మార్చి తీసుకోరాదు. వండిన అన్నాన్ని, వండని బియ్యానికి మార్చుకోవచ్చు! నువ్వులను కూడ సరికిసరి మార్చుకోవచ్చు. ॥94॥

*** ఆపత్కాలంలో క్షత్రియుల ఆజీవిక కర్మ -**

* *జీవేదేతేన రాజన్యస్సర్వేణాప్యనయం గతః ।*
నత్వేవం జ్యాయసీం వృత్తిమభిమన్యేత కర్హిచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.95**

తాత్పర్యం:- క్షత్రియుడికి ఆపద్ధర్మంగా చెప్పబడినవి ఇవి:-పైన బ్రాహ్మణుడికి నిషిద్ధంగా చెప్పబడినవస్తువులను రాజు తన జీవికకు లోపం ఏర్పడినప్పుడు విక్రయించవచ్చు! అంటే వైశ్యవృత్తి చేపట్టవచ్చు! క్షత్రియేతరుడైనా బ్రాహ్మణవృత్తి చేత జీవించరాదు. ॥96॥

* *యో లోభాదధమో జాత్యా జీవేదుత్కృష్టకర్మభిః ।*
తం రాజా నిర్ధనం కృత్వా క్షిప్రమేవ ప్రవాసయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.96**

తాత్పర్యం:- హీన జాతులలో పుట్టినప్పటికీ-ఉత్కృష్టమైన జాతిధర్మాలతో ఎవరైతే జీవిస్తారో అలాంటి వారిని కనిపెట్టి-వారి ధనాన్ని రాజుచేత కొల్లగొట్టించి అలాంటి వారికి దేశ బహిష్కార శిక్ష విధింపజేయాలి. ॥96॥

* *వరం స్వధర్మో విగుణో న పారక్యః స్వనుష్ఠితః ।*
పరధర్మేణ జీవన్ హి సద్యః పతతి జాతితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.97**

తాత్పర్యం:- గుణవంతమైనదా-కాదా అనే యోచనపక్కన బెట్టి తనకు నిర్దేశించిన ధర్మాన్నే తాను అనుష్ఠించాలి. ఇది అన్ని జాతులకూ వర్తిస్తుంది. పరధర్మాలు పాటించడం వల్ల జాతి భ్రష్టుడూ-తుదకు దేశభ్రష్టుడూ అవుతాడు.॥97॥

ఆపత్కాలంలో వైశ్యుల ఆజీవిక కర్మ-

* *వైశ్యోఽజీవన్స్వధర్మేణ శూద్రవృత్త్యాపి వర్తయేత్ ।*
అనాచరన్నకార్యాణి నివర్తేత చ శక్తిమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.98**

తాత్పర్యం:- సొంత వృత్తి అయిన వ్యాపారాదులు కలిసిరాక, వాటివల్ల జీవింపజాలక, ఇతరుల ఉచ్ఛిష్టాలు భుజించలేక జీవికకై అలమటించే వైశ్యుడు, బ్రాహ్మణులకు మాత్రం శుశ్రూషచేసి జీవించవచ్చు! ఆపద తొలగాక, కావాలనుకుంటే శుశ్రూష మానవచ్చు! ॥98॥

ఆపత్కాలంలో శూద్రుల ఆజీవిక కర్మ -

* *అశక్నువంస్తు శుశ్రూషాం శూద్రః కర్తుం ద్విజన్మనామ్ ।*
పుత్రదారాత్యయం ప్రాప్తో జీవేత్కారుకకర్మభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.99**

తాత్పర్యం:- శూద్రుడు ద్విజన్ములకు శుశ్రూషచేయుటకు అసమర్థుడయినచో కుటుంబమును పోషించుటకు కారుకకర్మ (శిల్పము మొదలైన) లతో జీవింపవచ్చును. ॥99॥

* *యైః కర్మభిః ప్రచరితైశ్శుశ్రూష్యంతే ద్విజాతయః ।*
తాని కారుకకర్మాణి శిల్పాని వివిధాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.100**

తాత్పర్యం:- ద్విజాతులకు శుశ్రూష చేయుకర్మలను వివిధములగు శిల్పాదికర్మలను కారుకర్మలందురు. ఆడపిల్లలచే చిత్రలేఖనాదులు వ్రాయించి జీవింపవచ్చును. ఈ శ్లోకములలో శూశ్రూషయనగా ద్విజుల యిండ్లలో వంట చేయుట, దుకాణము పెట్టి రొట్టెలమ్ముట మొదలగునవి కారుకము. గృహనిర్మాణము మొదలగునవి కూడ కారుకములే.॥100॥

* *వైశ్యవృత్తిమనాతిష్ఠన్ బ్రాహ్మణః స్వే పథి స్థితః ।*
అవృత్తికర్శితస్సీదన్నిమం ధర్మం సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.101**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు వేరేజీవనంలేక కృశిస్తూన్నప్పుడు మాత్రం క్షత్రియ వైశ్య వృత్తులను అవలంబించవచ్చు! అలా 'జరగని సందర్భాలలో' జీవికకు లోటు ఏర్పడితే ఆ ఆపద్ధర్మాలు ఆచరించవచ్చు! ॥101॥

* *సర్వతః ప్రతిగృహ్ణీయాద్బ్రాహ్మణ స్త్వనయం గతః ।*
పవిత్రం దుష్యతీత్యేతద్ధర్మతో నోపపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.102**

తాత్పర్యం:- బ్రాహ్మణుడి ఉనికికి ప్రమాదం వాటిల్లినప్పుడు, ఎవ్వరిచేతిదానమైనా తీసుకోవచ్చు! గంగా జలం నిత్యం పవిత్రం, అది కాలిబాటల్లోని నీటినైనా పునీతం చేస్తుందే కాని పాడు చేయదు కదా! ॥102॥

* *నాధ్యాపనాద్యాజనాద్వా గర్హితాద్వా ప్రతిగ్రహాత్ ।*
దోషో భవతి విప్రాణాం జ్వలనాంబుసమాహి తే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.103**

తాత్పర్యం:- తమ స్వభావం చేతనే పరిశుద్ధులైన విప్రులకు యాజనం-అధ్యాపనం-దానం పుచ్చుకోవడం అనేవి ఉండనే ఉన్నాయి. ఉదకంతోను-అగ్నిహోత్రంతోను సమానులైన ఇలాంటి విప్రులకు స్వభావ శుద్ధత వల్ల దోషమంటదని తాత్పర్యం. ॥103॥

* *జీవితాత్యయమాపన్నో యోఽన్నమత్తి యతస్తతః ।*
ఆకాశమివ పంకేన న స పాపేన లిప్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.104**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ప్రాణాంతికస్థితిని పొంది ప్రతిలోమజాతుని ఇంట భోజనం చేసినా ఆకాశానికి రొంపి అంటనట్లు, ఆ బ్రాహ్మణుడికి పాపం అంటదు. ॥104॥

* *అజీగర్తస్సుతం హంతుముపాసర్పద్బుభుక్షితః ।*
న చాలిప్యత పాపేన క్షుత్ప్రతీకారమాచరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.105**

తాత్పర్యం:- పూర్వము అజీగర్తుడను ఋషి ఆకలిగొని తన కొడుకును తానే విక్రయించి, యజ్ఞానికి వంద ఆవులు దొరకునన్నఆశచేత తానే వపదీయువాడై చంపడానికి పూనుకొన్నాడు. ఆ ఋషి ఆకలి తీర్చుకోడానికి అలా చేయదలచాడు కాబట్టి అతడు పాపహతుడు కాలేదు. ॥105॥

* *శ్వమాంసమిచ్ఛన్నార్తోఽత్తుం ధర్మాధర్మవిచక్షణః ।*
ప్రాణానాం పరిరక్షార్థం వామదేవో న లిప్తవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.106**

తాత్పర్యం:- వామదేవమహర్షి ధర్మాధర్మముల గురించి ఆలోచించకుండా ఆకలిచేత బాధపడి ప్రాణసంరక్షణం కోసం కుక్క మాంసాన్ని తినగోరి పాపపీడితుడు కాలేదు. ॥106॥

* *భరద్వాజః క్షుధార్తస్తు సపుత్రో విజనే వనే ।*
బహ్వీర్గాః ప్రతిజగ్రాహ వృధో స్తక్ష్ణో మహాతపాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.107**

తాత్పర్యం:- మహాతపస్సు చేసిన వాడైన భరద్వాజమహర్షి నిర్జనారణ్యంలో ఉండి ఆకలిగొని వృధువను పేరుగల వడ్రంగి వద్ద నుండి పెక్కు గోవులు తీసుకొన్నాడు. ॥107॥

* *క్షుధార్తశ్చాత్తుమభ్యాగాద్విశ్వామిత్రః శ్వజాఘనీమ్ ।*
చండాలహస్తాదాదాయ ధర్మాధర్మవిచక్షణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.108**

తాత్పర్యం:- ధర్మాధర్మజ్ఞుడైన విశ్వామిత్రమునీంద్రుడు ఆకలిగొని మాలవాడివద్ద నుండి కుక్క పొత్తికడుపు మంసాన్ని తినడానికి ఇష్టపడ్డాడు. ॥108॥

*** దానలోభము నిందనీయము -**

* *ప్రతి గ్రహాద్యాజనాద్వా తథై వాధ్యాపనాదపి ।*
ప్రతిగ్రహః ప్రత్యవరః ప్రేత్య విప్రస్య గర్హితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.109**

తాత్పర్యం:- అలాంటి నిందితాలైన అధ్యాపన యాజన ప్రతిగ్రహాలలో బ్రాహ్మణుడికి అసత్ప్రతిగ్రహం మిక్కిలి నింద్యం; అది పరలోకంలో నరకం ఇచ్చును. కాబట్టి ఆపదలో మొదట నికృష్టులకు యాజనాధ్యాపనాల కోసం అడిగి అంతట జీవిక జరుగనప్పుడే అసత్ప్రతిగ్రహం తీసుకోవాలి. పై రెంటితోనే జీవక జరుగునేని, అసత్ప్రతి గ్రహం వీడుట మేలు.

* *యాజనాధ్యాపనే నిత్యం క్రియేతే సంస్కృతాత్మనామ్ ।*
ప్రతిగ్రహస్తు క్రియతే శూద్రాదప్యంత్యజన్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.110**

తాత్పర్యం:- దీనికి కారణమేమంటే -ఆపద్ధర్మంలో యాజనం, వేదాధ్యాపనం ఇవి రెండూ ఉపనయన సంస్కారం గలవారికే చేయబడుచున్నది. అసత్ప్రతిగ్రహం శూద్రుడి వద్ద నుండి కూడా తీసుకొవచ్చు కాబట్టి అది పై రెండింటికంటే నిందితమైనది. ॥110॥

* *జపహోమైరపైత్యేనో యాజనాధ్యాపనైః కృతమ్ ।*
ప్రతిగ్రహనిమిత్తం తు త్యాగేన తపసైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.111**

తాత్పర్యం:- అసద్యాజనాధ్యాపనముల వల్ల కలిగిన పాపం ప్రాయశ్చిత్త ప్రకరణంలో చెప్పబడిన జపహోమములచేత నశిస్తుంది. అసత్ప్రతిగ్రహజనితమైన పాపం తీసికొన్న ద్రవ్యం వదిలి, ఒక నెల రోజులు ఆలమందయందు పాలు త్రావి ప్రాయశ్చిత్త ప్రకరణంలో చెప్పినతీరున జపం మొదలైనవి చేయడం వల్ల నశిస్తాయి.

* ***శిలోఞ్ఛమప్యాదదీత విప్రోజీవన్ యతస్తతః ।***
ప్రతిగ్రహాచ్ఛిలః శ్రేయాం స్తతోఽప్యుంఛః ప్రశస్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.112***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు స్వవృత్తిచేత జీవిస్తూ ఏ విధంగా అయినా శిలోంఛములను తీసుకోవాలి. అవి దొరికినప్పుడు అసత్ప్రతిగ్రహమును తీసుకోరాదు. ఏల అంటే, అలాంటి అసత్ప్రతిగ్రహమున కంటే శిలం శ్రేష్ఠం. దానికంటే ఉంఛం శ్రేష్ఠం. ఎన్నులను కోసి తెచ్చుట శిలం. గింజలు గింజలుగా ఏరడం ఉంఛం. ॥112॥

* ***సీదద్భిః కుప్యమిచ్ఛద్భిర్ధనం వా పృథివీపతిః ।***
యాచ్యస్స్యాత్స్నాతకైర్విప్రైరదిత్సంస్త్యాగమర్హతి॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.113***

తాత్పర్యం:- కుటుంబ భారాన్ని మోసే నిమిత్తం శ్రమించే విప్రుడు బంగారం వెండి-తప్ప ఇతర ధాన్యాదులను-యాగం లాంటి వాటికోసం రాజును ఆశ్రయించి తెచ్చుకోవచ్చు! ఒక వేళ రాజు అన్యాయార్జితుడే అయినా, లోభి కాకుంటే అడగాలి. లేకుంటే వదిలివేయాలి. ॥113॥

* ***అకృతం చ కృతాత్ క్షేత్రాద్గౌరజావికమేవ చ ।***
హిరణ్యం ధాన్య మన్నం చ పూర్వం పూర్వమదోషవత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.114***

తాత్పర్యం:- దున్నిన చేల్లో పండిన ధాన్యంకంటే, దున్నక దానికి అదే పండే ధాన్యాలు వంటివి కోరాలి. గోవులు, మేకలు, గొర్రెలు, బంగారం, ధాన్యం, అన్నం....ఈ వరసక్రమంలో అతి అధమస్థాయిలో ఉన్నది అన్నం. కాబట్టి ఆఖరుగా కోరదగినదీ-జీవిక నిల్పుకోడానికి తప్పనిదీ ఇది మాత్రమే! ॥114॥

*** ధర్మానుకూల 7 రకాల ఆదాయం -**

* ***సప్త విత్తాగమా ధర్మ్యా దాయో లాభః క్రయో జయః ।***
ప్రయోగః కర్మయోగశ్చ సత్ప్రతిగ్రహ ఏవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.115***

తాత్పర్యం:- దాయ భాగం, సంక్రమించినదీ, వంశపారంపర్యంగా సంక్రమించినదీ, స్నేహం వల్ల లభించే ద్రవ్యం, కొన్న వస్తువులు ఇవి నాలుగు వర్ణాల వారికీ ధర్మబద్ధమైనవి. జయించినందువల్ల లభ్యమైనది కాబట్టి రాజుకు ధర్మం, వర్తకం-వడ్డీ ద్వారా లభించే సొమ్ము వైశ్యుడికి ధర్మం. ధర్మ బద్ధంగా ఏదీ లభించనప్పుడే విప్రుడు దానాదుల వెంట పడవలసింది. ॥115॥

*** పది రకాల ఆజీవికలు - వృత్తులు -**

* ***విద్యా శిల్పం భృతిస్సేవా గోరక్షం విపణిః కృషిః ।***
ధృతిర్భైక్ష్యం కుసీదం చ దశ జీవన హేతవః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.116***

తాత్పర్యం:- చాతుర్వర్ణాల వారికి ఆపద్ధర్మాలుగా జీవికనిలుపుకోడానికి ఇవీ ధర్మాలు:

ఆపత్సమయాల్లో వైద్యం, తర్కం, శిల్పం, మొదలైన వృత్తులు అవలంబించడం, రాజులకొలువు, గోపాలనం, సేద్యం, వర్తకం, బిచ్చమెత్తడం, వడ్డీ మీద జీవించడం దూష్యం కావు. అయితే.... ॥116॥

* ***బ్రాహ్మణః క్షత్రియో వాఽపి వృద్ధిం నైవ ప్రయోజయేత్ ।***
కామం తు ఖలు ధర్మార్థం దద్యాత్పాపీయసేఽల్పికామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10.117***

తాత్పర్యం:- బ్రాహ్మణ-క్షత్రియులు ఆపద్ధర్మంగానైనా ధనాన్ని వడ్డీకి ఇవ్వడం అనేది చేయరాదు. కానీ వారి ధనం వల్ల వచ్చే వడ్డీ ధార్మిక ప్రయోజనాల నిమిత్తం వినియోగపడేటప్పుడు పాతిక/అర వడ్డీగా తీసుకోవచ్చు!॥117॥

ప్రక్షిప్తాల పరిశీలన

10.74-117 వరకు గల శ్లోకాలు కింది కారణాలతో ప్రక్షిప్తాలు -

1. విషయ వ్యతిరేకాలు

తొమ్మిదవ అధ్యాయం ముగింపులో మనువు ఇలా రాశాడు-

ఏషోఖిలః కర్మవిధిరుక్తో రాజ్ఞః సనాతనః ।
ఇమం కర్మవిధిం విద్యాత్ క్రమశో వైశ్య శూద్రయోః ॥ 9.325

అంటే నాలుగు వర్ణాల ధర్మాలలో క్షత్రియ ధర్మాలున్నాయి. క్రమంగా వైశ్య, శూద్రుల కర్మల పద్ధతి ఏర్పరుస్తాము.

పదవ అధ్యాయంలోని చివరి శ్లోకంలోనూ ఇదే చెప్పాడు-

ఏష ధర్మవిధిః కృత్స్నః శ్చాతుర్వర్ణ్యస్య కీర్తితః ॥

అంటే - నాలుగువర్ణాల ధర్మాల విధానం పూర్తిగా చెప్పాను.

ఈ రెండు శ్లోకాలలోనూ ఈ అధ్యాయం లోని విషయం స్పష్టంగా ఉంది. కానీ ఇక్కడ 74 నుంచి 82లలో బ్రాహ్మణులు జీవనం కోసంచేసే (పనుల పద్ధతి, 94లో క్షత్రియుల జీవికకు, 98లో వైశ్యుల, 99లో శూద్రుల జీవికకు చేసే పనులు చెప్పడం, నిర్దేశించిన శ్లోకాలకు వ్యతిరేకం. ఆ క్రమంలో వైశ్యులవి 9.326 నుంచి 9.333లలో, శూద్రులవి 9.334, 335లలో కర్మల విధానం చెప్పారు. మనువు (10.4లో) నాలుగు వర్ణాల ధర్మాల ముగింపు తర్వాత, జన్మ మూలక ఉప జాతులతో వాటిని కలిపే విధంగా వాటిలోని భేదాలను చెప్పటం- ఇది పూర్తిగా అనుచితం. ఇది మనువు చెప్పే అవకాశం లేదు. ఎందుకంటే ఒక విషయ ప్రతిపాదనను మనువు ఒకటే చోట చెబుతాడు కానీ, మరొక చోట చెప్పనే చెప్పడు !

2. శైలీ వ్యతిరేకాలు

వీటి శైలి మను సమ్మతం కాదు. ఎలాగంటే -

క. 78లో - **'మను రాహ ప్రజాపతిః'** అన్నారు. అంటే ఈ శ్లోకం మనువు కాక, అతని తర్వాతి వారెవరో రాసి మనువు పేరిట చేర్చారని తెలుస్తూంది.

ఖ. 91-93 శ్లోకాల శైలి అతిశయోక్తులు, ద్వేషం, భయం కలిగించేది, సంప్రదాయ బద్ధమైనది కావడం చేత మనువు చెప్పినది కాదు. ఎలాగంటే, 91లో పితరులతో పాటు పురుగులై శునకపు విసర్జనలో పడి ఉండటం 103లో ఉప్పు, మాంసం అమ్మటం వల్ల తత్క్షణం పతితులు కావడం, బ్రాహ్మణుడు పాలు అమ్మితే మూడు రోజులలో శూద్రుడు కావడం, నిషిద్ధ వస్తువులను అమ్మటం చేత బ్రాహ్మణుడు ఏడు రాత్రులలో వైశ్యుడై పోవడం[104లో].

గ. 106వ శ్లోకంలో నిమ్న వర్ణాలకు చెందిన వారెవరూ ఉచ్చ వర్ణాల వారి వృత్తులు చేపట్ట కూడదు అనేది కూడా మనువు పద్ధతులకు వ్యతిరేకమే కాక, భీతి కలిగించేది కూడా. ఏ వర్ణపువాడైనా నిమ్న వర్ణాల వారి పనులు చేయగలిగితే, ఉచ్చ వర్ణపు కర్మల మీద నిషేధం ఎందుకు? మనువు 10.65లో **'శూద్రో బ్రాహ్మణతా మేతి'** మొదలైనవి చెప్పి, సత్కర్మలతో శూద్రుడు బ్రాహ్మణుడవుతాడనీ, కర్మ హీనుడైన బ్రాహ్మణుడు శూద్రుడవుతా డనీ స్పష్టపరిచాడు. కనుక, ఉచ్చ వర్ణాల వారి వృత్తులు చేపట్టడంలో నిషేధం మనువు చెప్పింది కాదు. ఇవన్నీ జన్మతో వర్ణ వ్యవస్థ ప్రభావమే.

ఘ. 105,106 శ్లోకాల శైలి విధి పూర్వకంగా కాక, పురాణాల లోనిదీ, సహేతుకం కానిదీ. ఇది మనువు శైలి కాదు. ఎలాగంటే - అజీగర్తుడు ఆకలితో అలమటిస్తూ పుత్రుణ్ణి హత్య చేసేందుకు ప్రయత్నించినా, అతనికి పాపం అంటలేదు [116]. వామదేవుడు ఆకలితో పీడితుడై కుక్క మాంసం తినటానికి సిద్ధపడినా అతనికి పాపం రాలేదు

[117]. భరద్వాజుడు ఆకలికి తట్టుకో లేక వడ్రంగి నుంచి గోవులను దానంగా పుచ్చుకున్నా, అతినికి పాపం రాలేదు[118]. విశ్వామిత్రుడు ఆకలితో చండాలుడు పెట్టిన కుక్క మాంసం తినటానికి సిద్ధపడినా పాపగ్రస్తుడు కాలేదు. ఇవన్నీ పౌరాణిక శైలిలో ఉండటం వల్ల మనువు చెప్పినవి కావు. అజీగర్తుడు మొదలైన వారు మనువుకు ఎన్నో తరాల తర్వాతి వారు. మరి మనువు వారి ఉదాహరణలు ఎలా ఇవ్వగలడు?

జ. 10.104లో బురదలో ఆకాశం ఎట్లా పడదో, అట్లాగే బ్రాహ్మణునికి పాపం అంటదు అన్నారు. ఇది సహేతుకం కాదు, పక్షపాత ధోరణితో చెప్పినందున మనువు చెప్పింది కాదు. మనువు బ్రాహ్మణులు దోషాలు కలిగే పనులు చేస్తే బ్రాహ్మణ వర్ణం నుంచి పతన మవుతారని చెప్పాడు.

3. అంతర్ వ్యతిరేకాలు

1. 82లో బ్రాహ్మణుడు క్షత్రియ వృత్తితో జీవితం గడపలేక పోతే వైశ్య వృత్తిని అవలంబించి గో రక్షణ, వ్యవసాయాలతో గడపవచ్చని చెప్పారు. కానీ 83,84లలో వ్యవసాయాన్ని నిందించి, బ్రాహ్మణులు వ్యవసాయం చేయటాన్ని నిషేధించారు. వ్యాపారం చేయాలని చెప్పారు.

2. 88.89లలో మద్య మాంసాదుల విక్రయం నిషేధించారు. మనువు పద్ధతి ప్రకార మైతే, మద్య మాంసాదులు రాక్షసుల ఆహారం. మాంసం అమ్మే వాడు సైతం పాపి అవుతాడు[5.52]. దీనివల్ల మాంసాదులు తీసుకోవడం పెరగడం వల్ల అమ్మకాలూ బాగా జరిగాయి.

3. 101-107 శ్లోకాలలో బ్రాహ్మణులు దానాలు తీసుకోవడం నిందనీయం అన్నారు. కానీ వేరే స్థలాల్లో [4.191,194లలో] అందరి నుంచీ దానం తీసుకోవాలని ఉంది. 105,199లలో మాంస భక్షణం సరైనదే అన్నారు. మనువు ఆపత్కాలంలో కూడా జంతు హింస నిషేధించాడు [5.51;5.43].

4. 106లో బ్రాహ్మణ క్షత్రియులకు వడ్డీకి ధన మివ్వ వచ్చునని మినహాయింపు నిచ్చారు. కానీ 10.82లో వడ్డీ వ్యాపారం సరైనది కాదని ఉంది. 120 నుంచి 128 వరకు గల శ్లోకాలలో ఇలా చెప్పారు. ఇది 101-108 వరకు ఉన్న శ్లోకాలలో చెప్పిన వాటికి వ్యతిరేకం.

5. 10.74-82 వరకూ, 10.95, 98, 99 శ్లోకాలలో విశేషంగా వైకల్పిక పద్ధతులు చెప్పారు. అవేమిటంటే, నాలుగు వర్ణాలవారూ తమ తమ పనుల వల్ల జీవితం గడవక పోతే కింది వర్ణాల వృత్తులు చేపట్టవచ్చు అని. వీటిని చూసే బహుశా వ్యాఖ్యానకారులు వీటిని ఆపత్కాల ధర్మా లనుకుని, వాటికీ వ్యాఖ్యానాలు రాసేశారు. కానీ వీటిని గురించి ఆలోచిస్తే ఇవి ప్రక్షిప్తాలు, పుట్టుకతో వర్ణ వ్యవస్థను చెప్పిన వారెవరో రాశారనీ తెలిసిపోతుంది. వీటి వల్ల కలిగే కొన్ని ప్రమాదాలు పరికించండి -

క. ఈ శ్లోకాలలో బ్రాహ్మణులు తమ పనులతో జీవితం గడపలేక పోతే, క్షత్రియ ధర్మం అంటే శస్త్రాస్త్రాలు ధరించి ప్రజలను రక్షించాలి. లేదా వైశ్యుల ధర్మాలు అంటే వ్యవసాయ వాణిజ్యాలు చేసి జీవించాలి అని చెప్పారు. ఇట్లాగే ఇతర వర్ణాల వారు కూడా చేయవచ్చు. వీటిని చదివే కొందరు ఈ అధ్యాయాన్ని ఆపద్ధర్మాలు చెప్పిన అధ్యాయంగా భావిస్తున్నారు. ఇది మనువు చెప్పింది కానే కాదు. గుణాలు, కర్మలు, స్వభావాలతోనే వర్ణ వ్యవస్థను మనువు చెప్పాడు, జన్మ మూలకంగా కాదు. ఎవడు గుణాలు, కర్మలు, స్వభావం చేత నిజమైన బ్రాహ్మణుడో, అతడు జీవితం గడపలేకపోవటం కేవలం అబద్ధం ! బ్రాహ్మణుని ఇంట్లో పుట్టి తన కర్మలు చేయని వాడు అలాంటి స్థితికి రావచ్చు. జన్మ వల్ల వర్ణ వ్యవస్థ పట్ల పక్షపాతం గల తర్వాతి వారెవరో ఈ శ్లోకాలను కలిపా రని చెప్పవచ్చు. వారి అభిప్రాయం ప్రకారం, చదువుకున్నా, లేకున్నా, బ్రాహ్మణుని ఇంట్లో పుట్టిన వాడే బ్రాహ్మణు డవుతాడని.

ఖ. ఎవరైనా దీన్ని ఆపద్ధర్మం అనడమూ నిజం కాదు. ఆపద్ధర్మానికి కూడా నిర్వచనం లేదా ఏమిటి? ఆపద్ధర్మం ఎంత వరకు ఉంటుంది? దీన్ని ఎవరూ నిర్ధారించలేదు. దుర్జనతోషన్యాయం ప్రకారం ఆపద ఎవరికైనా వస్తుందని ఆలోచించినా, ఆ ఆపద రూపం ఏమిటి? బ్రాహ్మణుడు తన విధ్యుక్త ధర్మాలను చేయక పోవడమే ఆపదా? ఇలాంటి స్థితి రెండు విధాలుగా రావచ్చు -

1. అనారోగ్య స్థితి వల్ల
2 బ్రాహ్మణుల ధర్మాలు నిర్వహించే అర్హత లేకపోవటం.

జబ్బుల వల్ల అటువంటి స్థితి వస్తే, అప్పు డా బ్రాహ్మణుడు క్షత్రియ లేక వైశ్య ధర్మాలనైనా ఎలా చేయగలుగుతాడు?

అతడు అనర్హుడైతే, మనువు చెప్పిన కర్మ మూలక వర్ణ వ్యవస్థ ప్రకారం, అతడు బ్రాహ్మణుడే కాడు. తిండికి లేక మరణించే స్థితి వస్తే, క్షత్రియ ధర్మాలను సాధనాలు లేకుండా పాటించగలడా?

గ. వర్ణ వ్యవస్థకు కర్మలే ఆధారమని మనువు చెప్పాడు [చూడండి 1.107 సమీక్ష]. ఇందులో చదువుకున్నా కర్మ హీనుడైతే, అతడు బ్రాహ్మణులు మొదలైన ద్విజులలో పరిగణితుడు కాడు! మనువు పద్ధతి ప్రకారం ద్విజుల వర్ణ వ్యవస్థను విద్య పూర్తయ్యే సమయంలో గురువు నిర్ధారిస్తాడు. ఆచార్యుడు, విద్యార్థులు విద్యాభ్యాసం చేసే సమయంలో వారి గుణాలు, కర్మలు స్వభావాలు తెలుసుకునే వారి వర్ణాలు నిర్ణయిస్తాడు. ఎవరి గుణాలు, కర్మలు, స్వభావం, బ్రాహ్మణుని వలె ఉంటే, వారు ఆపద సమయంలో తమ గుణ,కర్మ, స్వభావాలను మార్చేసుకుని వేరొకరి పనులు చేయ గలుగుతారా? బ్రాహ్మణవృత్తి వాడు క్షత్రియ వృత్తి కార్యాలను, లేదా వైశ్యవృత్తి కార్యాలను ఎట్లా చేయ గలుగుతాడు? కనుక బ్రాహ్మణ వర్ణం వాడు ఇతర వర్ణాల పనులను జీవికకు స్వీకరిస్తే, అటువంటి వైకల్పిక వ్యవస్థ, ఎవరో జన్మతో వర్ణం అనే వారి బుద్ధిలో పుట్టిందే కానీ, మనువు చెప్పింది కాదు.

ఇదే విధంగా 10.95లో క్షత్రియునికి వైశ్య వృత్తి పనుల పద్ధతి, 10.98లో వైశ్యునికి శూద్ర వృత్తి కార్యాలూ, 10.99లో శూద్రునికి శిల్ప కారుల వైకల్పిక పద్ధతులూ, తర్వాతివి కనుక ప్రక్షిప్తాలు. బ్రాహ్మణుల వలె క్షత్రియులు మొదలైన వారికి ఆపత్కాలం ఏముంటుంది? ప్రజా పాలనలో అసమర్థుడైన క్షత్రియుడు, వైశ్యుని వ్యవసాయం మొదలైనవి వ్యాపారాలు చేస్తే, అసమర్థుడైన వైశ్యుడు శూద్రులు చేసే పనులు చేయ గలుగుతాడా? జీవిక కొరకే ఆపత్కాలం అంటే, జీవికకు ధనార్జనకు ఇదే సర్వోత్తమం కనుక, అన్ని వర్ణాల వారికీ వైశ్యుల కర్మలు చేసే అధికారం ఇవ్వాలి.

ఘ. మనువు ప్రకారం, బ్రాహ్మణాది మూడు వర్ణాలలోనూ దీక్షితుడు కానివాడు శూద్రు డవుతాడే కానీ, జన్మతో కాదు. ఇలాంటి వాడు శారీరక శ్రమ చేసి (ద్విజులకు సేవలు చేసి) జీవితం గడుపుతాడు. అతనికి (ఆపద్ధర్మం) ఈ వైకల్పిక వ్యవస్థను చెప్పటం - అంటే శిల్పకారకర్మ చేసి జీవితం గడప మనటం పూర్తిగా అసంగతం. శూద్రునికి ఆపత్కాలం అంటే ఏమిటి? ఒక వేళ అతని కేదో తీవ్రమైన జబ్బు వచ్చినట్లయితే, శిల్ప కర్మ మాత్రం ఎలా చేయ గలడు? కనుక, జన్మ వల్ల ఏర్పడిన వర్ణ వ్యవస్థ ప్రాచుర్యం లోనికి వచ్చాక, ఇలాంటి స్థితి వచ్చిందనుకుందాం. శూద్ర కులంలో పుట్టి, ద్విజుల సేవ చేయటంలో అసమర్థుడై, గుణ కర్మ స్వభావాలతో శూద్రుడే కాకపోతే, అప్పుడెవరో ఈ వైకల్పిక వ్యవస్థను కల్పించి ఉంటారు శిల్ప కర్మ చేయమని. కానీ ఇది మను సమ్మతం కాదు కనుక మౌలికం కాదు.

జ. మనువు ఆర్యులను నాలుగు వర్ణాలుగా విభజించి స్పష్టంగా ఇలా చెప్పాడు -

చతుర్థ ఏక జాతిస్తు శూద్రో నాస్తి తు పంచమః । (మను. 20.4)

అంటే మానవ సమాజంలో బ్రాహ్మణులు మొదలైన నాలుగు వర్ణాలే ఉన్నాయి. ఐదవది ఏదీ లేదు; కానీ ఇక్కడ ప్రక్షిప్తకారులు, మనువు చెప్పిన ఈ పద్ధతికి వ్యతిరేకంగా జన్మ మూలకంగా వడ్రంగులు, కంసాలులు మొదలైన ఉపజాతులు తయారయ్యాయి కనుక, వాటిని ఆధారం చేసుకుని, శూద్రులు, శిల్ప కారుల పనులు చేయ వచ్చని రాసేశారు. ఈ ఉపజాతుల పద్ధతే మనువుకు వ్యతిరేకమూ, ఎంతో కాలం తర్వాతివీ కనుక, ప్రక్షిప్తాలు.

చ. మనువు ఈ శాస్త్రంలో శిల్పకర్మను వైశ్యుల కార్యాలలోనే అంతర్నిహితంగా చెప్పాడు. కారుకుడు= శిల్పి అనే ప్రత్యేక విభాగమేదీ మనువు చెప్పనే లేదు.

4. పునరుక్తులు, క్రమ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో పునరుక్తులూ, క్రమ వ్యతిరేకాలూ అయిన విషయాలు ఉండటం చేత, ఇవి మనువు చెప్పినవి కానే కావు ! ఎలాగంటే -

క. 74-82 శ్లోకాలలో బ్రాహ్మణుల జీవికకు ఎన్నో వైకల్పిక విధానాలు చెప్పారు (వీటిలో పరస్పర వ్యతిరేక విషయాలూ ఉన్నాయి). 10.101లో బ్రాహ్మణులకు ఉపాధి లేకుంటే, **'ఇమం ధర్మం సమాచరేత్'** - అంటే తర్వాతి శ్లోకాలలో చెప్పినట్లుగా బ్రతకండి అని. ఇవి మనువు చెప్పి ఉంటే, అవన్నీ, క్రమ పద్ధతిలో ఒకే చోట ఉండేవి. శూద్రుల వృత్తుల తర్వాత బ్రాహ్మణుల విషయం కావటం అసంగతం.

* రాజు యొక్క ఆపత్కాలీన కర్మ-

* **చతుర్థమాదదానోఽపి క్షత్రియో భాగమాపది ।**
ప్రజా రక్షన్ పరం శక్త్యా కిల్బిషాత్ ప్రతిముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.118**

తాత్పర్యం:- క్షత్రియుడికి ఎంత ఆపద ఎదురైనా, పురజనులనుంచి 4వ భాగం మించకుండా పన్ను తీసుకోరాదు. అధిక శ్రద్ధతో ప్రజాపాలన చేసే రాజుకు ఇది వర్తించదు. విలువను బట్టి పన్నులు వేయవచ్చు! తన ఆపత్సమయంలోనూ రాజు ప్రజారక్షణకే ప్రాధాన్యం ఇవ్వాలి. ॥118॥

* **స్వధర్మో విజయస్తస్య నాహవే స్యాత్పరాఙ్ముఖః ।**
శస్త్రేణ వైశ్యాన్ రక్షిత్వా ధర్మ్యమాహారయేద్బలిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.119**

తాత్పర్యం:- ఎందుకంటే.....క్షత్రియుడికి యుద్ధమే స్వధర్మం.....యుద్ధంలో రాజెన్నడూ విముఖత ప్రదర్శించకూడదు. అస్త్రశస్త్రాదులు ప్రయోగించి అయినా సరే! వైశ్యులను చోరాదుల నుంచి రాజే కాపాడాలి. వారి దగ్గర్నుంచి కప్పం గ్రహించాలి. అమ్మకపు పన్ను తీసుకోవాలి. ॥119॥

* **ధాన్యేఽష్టమం విశాం శుల్కం వింశం కార్షాపణావరమ్ ।**
కర్మోపకరణా శ్శూద్రాః కారవః శిల్పిన స్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.120**

తాత్పర్యం:- వైశ్యుల నుండి ధాన్యములో నెనిమిదవ భాగము, బంగారము, వెండి వ్యాపారలాభములో నిరువదవ భాగము రాజు తీసికొనవలెను. శూద్రులైన కార్మికులు శిల్పులు మొదలైన వారితో పని చేయించవలెను. పైమూడు శ్లోకములు ఆపత్కాల సంబంధమైనవి. ॥120॥

* అభావ అవస్థలో శూద్రుని కర్తవ్యము-

* **శూద్రస్తు వృత్తిమాకాంక్షన్ క్షత్రమారాధయేద్యది ।**
ధనినం వాప్యుపారాధ్య వైశ్యం శూద్రో జిజీవిషేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.121**

తాత్పర్యం:- శూద్రుడు బ్రాహ్మణుడికి శుశ్రూష చేయడానికి ఒప్పుకోకపోతే అతడిని క్షత్రియ-వైశ్యులకు శుశ్రూష చేయడానికి రాజు ఒప్పించాలి. వీటికి కూడా అతడు విముఖుడైన పక్షంలో ఇంతకుముందు చెప్పబడిన వృత్తులను ఆశ్రయించాలి. ॥121॥

* **స్వర్గార్థ ముభయార్థం వా విప్రానారాధయేత్తు సః ।**
జాతబ్రాహ్మణశబ్దస్య సా హ్యస్య కృతకృత్యతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.122**

తాత్పర్యం:- స్వర్గాభిలాషతో గాని, ఈ లోకమందు సుఖముకోరికాని శూద్రుడు బ్రాహ్మణుని సేవింపవలెను. బ్రాహ్మణ సేవకుడని పేరుపొందినచో వాడు సఫలుడగును. ॥122॥

* **విప్రసేవైవ శూద్రస్య విశిష్టం కర్మ కీర్త్యతే ।**
యదతోఽన్యద్ధి కురుతే తద్భవత్యస్య నిష్ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.123**

తాత్పర్యం:- ఏది ఏమయినా శూద్రుడికి బ్రాహ్మణసేవ జన్మసాఫల్యాన్ని కలిగిస్తుంది. కాబట్టి-ఇతర వృత్తుల కంటే బ్రాహ్మణ శుశ్రూష ముఖ్య కార్యమని శాస్త్రవచనం. ఇలాంటి వెన్ని చేసినా నిష్ఫలమే ! ॥123॥

* ప్రకల్ప్యా తస్య తైర్వృత్తిః స్వకుటుంబాద్యథార్హతః ।
శక్తిం చావేక్ష్య దాక్ష్యం చ భృత్యానాం చ పరిగ్రహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.124**

తాత్పర్యం:- శూద్రుడికి పరిచర్యలో గల సామర్థ్యాన్ని బట్టి, పనుల్లో వాడికున్న ఉత్సాహాన్ని బట్టి-కుటుంబంలో వాడిపై ఆధారపడిన వారిని బట్టి జీవికకు కావలసినవన్నీ విప్రుడు తమ ఇంటినుంచే సమకూర్చాలి. ॥124॥

* ఉచ్ఛిష్ట మన్నం దాతవ్యం జీర్ణాని వసనాని చ ।
పులాకాశ్చైవ ధాన్యానాం జీర్ణాశ్చైవ పరిచ్ఛదాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.125**

తాత్పర్యం:- తననే ఆశ్రయించిన శూద్రుడికి మిగిలిన అన్నం, పాతబట్టలు, అంతగా వాడని బట్టలు, ఒక పంట కొత్తగా చేతి కొచ్చేటప్పుడు పాతధాన్యం వంటివి అతడికి ఇవ్వాలి. ॥125॥

* న శూద్రే పాతకం కించి న్న చ సంస్కారమర్హతి ।
నాస్యాధికారో ధర్మేఽస్తి న ధర్మాత్ ప్రతిషేధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.126**

తాత్పర్యం:- శూద్రున కే పాపమంటదు. అతడు సంస్కారమున కనర్హుడు. ధర్మములో అతనికి అధికారములేదు. అతనికి ధర్మప్రతిషేధము లేదు. అనగా శూద్రుడజ్ఞానుడగుటచే నతనికి కర్తవ్యములుండవు. ఏదైన పాపము మాటలవలనకలిగినచో ప్రాయశ్చిత్తముతో పోవును. ధర్మము విషయములో ఆతనికి బాధ్యతలేదు. ॥126॥

* ధర్మేప్సవస్తు ధర్మజ్ఞాస్సతాం వృత్తమనుష్ఠితాః ।
మంత్రవర్జ్యం న దుష్యంతి ప్రశంసాం ప్రాప్నువంతి చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.127**

తాత్పర్యం:- ధర్మానుష్ఠానం కోరే స్వధర్మనిరతులైన శూద్రులు పెద్దల అనుష్ఠానాలు ఆచరిస్తూ, వేరే మంత్రాలను ఉచ్చరించక పంచయజ్ఞాలను ఆచరిస్తే వారికి దోషం లేదు. పైగా వారు లోకంలో కీర్తిమంతులవుతారు. ॥127॥

* యథా యథా హి సద్వృత్తమాతిష్ఠత్యనసూయకః ।
తథా తథేమం చాముం చ లోకం ప్రాప్నోత్యనిందితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.128**

తాత్పర్యం:- శూద్రుడు దురభిమానము విడిచి ఉత్తమాచరణము చేయుచు నిందారహితుడగుచో ఈ లోకములో పరలోకములో ఉత్కృష్టత పొందును. ॥128॥

* శక్తే నాపి హి శూద్రేణ న కార్యో ధనసంచయః ।
శూద్రో హి ధనమాసాద్య బ్రాహ్మణానేవ బాధతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.129**

తాత్పర్యం:- శూద్రునికి ధన సంపాదనలో సమర్థత ఉన్నప్పటికీ, కుటుంబాన్ని పోషించుకోడానికి మించిన ధనాన్ని సంపాదించకూడదు. ఆ విధంగా విరివిగా ధనసంపాదన చేస్తే, ధర్మశాస్త్ర పరిజ్ఞాన శూన్యత చేత బ్రాహ్మణులనే హింసించగలడు. ॥129॥

ప్రక్షిప్తాల పరిశీలన

1. ప్రసంగ వ్యతిరేకాలు

10.118 నుండి 129 వరకు గల శ్లోకాలు క్రింది విధంగా ప్రక్షిప్తాలు.

క. మనువు 9.325 వరకు క్షత్రియ కర్మల పద్ధతి. తర్వాత వైశ్య, శూద్రుల విషయాలు క్రమంగా చెప్పాడు. కానీ క్షత్రియ కర్మలను మళ్లీ చెప్పటం అప్రాసంగికం. ఇదే విధంగా శూద్రుల వృత్తి, కర్మలను కూడా ముందే చెప్పేసినవి, మళ్లీ కొత్త పద్ధతిలో చెప్పటమూ అసంగతమే.

ఖ. విషయాలు చెప్పవలసిన అవసరమే ఉంటే, అన్ని వర్ణాలను గురించీ క్రమంగా చెప్పాలి. ఇక్కడ క్షత్రియుల తర్వాత శూద్రులను చెప్పటం పునరుక్తి, అసంగతమూ, క్రమ వ్యతిరేకం కనుక ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకాలు

క. 121-123 శ్లోకాలలో శూద్రులకు బ్రాహ్మణ సేవ చేయటమే పరమ ధర్మమని చెప్పి, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో క్షత్రియులు, వైశ్యుల వద్ద కూడా జీవిక కోసం పనిచేయ వచ్చన్నారు. ఇది మనువు చెప్పిన దానికి వ్యతిరేకమే కాక, పక్షపాతధోరణి గలది కావడం చేత ఆదరించ దగింది కాదు. ఎందు కంటే మనువు [1.96, 9.334,335] ద్విజన్ములు = బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు- ఈ మూడు వర్ణాలవారి సేవ చేయడమే శూద్రుల ధర్మ మని చెప్పాడు.

ఖ. 10.127లో చెప్పిన శూద్రులకు మంత్రాలు లేని యజ్ఞ విధానం మనువుకు వ్యతిరేకం. ఈ విషయంలో 2.172 మీది టిప్పణి చూడండి.

గ. 10.127లో శూద్రులకు ఎంగిలి అన్నం, చినిగిన వస్త్రా లివ్వటం కూడా వారి పట్ల గల ద్వేష భావాన్ని తెలియజేస్తున్నాయి. మనువు శూద్రులను 9.335లో పవిత్రులనీ, వారికీ గొప్ప వర్ణం పొందటానికి పూర్తి అధికారం ఉందనీ చెప్పాడు. కనుక మనువు పద్ధతిని గౌరవించటానికి ఆధారం గుణాలు, కర్మలు, స్వభావాలే. ఎవరూ ఎవరి పట్లా ద్వేష భావనను కలిగి ఉండటం అనే విషయానికి మనువు శాస్త్రంలో ఎటువంటి స్థానము లేదు.

ఘ. మనువు రాజుకు 7.130-132 శ్లోకాలలో పన్ను పద్ధతిని, పన్ను ఎవరి నుంచి, ఎట్లా తీసుకోవాలో చెప్పాడు. మళ్లీ ఇక్కడ 10.118-120 శ్లోకాలలో పన్ను పద్ధతి చెప్పటం పునరుక్తం కావటం చేత దండుగే ! కనుక అక్కడ చెప్పిన వాటి కంటే విభిన్నమైన పన్ను పద్ధతి ఏమీ చెప్పలేదు వీటిని ఆపధర్మంగానూ అంగీకరించలేము. వర్ణాల ప్రకారం, కాకుండా కేవలం వ్యాపారాలు మొదలైన ఆదాయం వచ్చే పద్ధతుల మీదే పన్ను పద్ధతి చెప్పాడు మనువు. కానీ ఇక్కడ (10.120లో) శూద్రుల చేత పన్నుకు బదులుగా సేవలు చేయించుకోవటం విపరీత ధోరణి. క్షత్రియునికి ప్రజలందరినీ రక్షించటమే ధర్మం. వారిలో బ్రాహ్మణులు మొదలైన అన్ని వర్ణాలవారూ ఉంటారు. 10.119లో వైశ్యులను రక్షించి వారి నుంచి బలి = పన్ను వసూలు చేయాలని ఉంది. అంటే ఆపత్కాలంలో ఇతర వర్ణాలవారిని రక్షించ కూడదా?

ఙ. 10.118లో క్షత్రియులైన వారిని రక్షించకపోతే పాపాల నుంచి విముక్తుడువుతాడనటం మనువుకు వ్యతిరేకం. ప్రజలను రక్షించడం క్షత్రియుని ధర్మం. క్షత్రియులు దుర్మార్గాలు చేస్తే, వాటి ఫలితం వారికీ లభిస్తుంది. మనువు ప్రకారం కర్మలు చేసినవాడే వాటి ఫలితాలనూ అనుభవించే వాడవుతాడు [4.173].

3. శైలీగత ఆధారాలు

ఈ శ్లోకాలలో శూద్రులను గురించి చెప్పిన వాటి శైలి పక్షపాతంలోనూ, ద్వేషించే విధంగానూ, బలవంతంగానూ తమ అభిప్రాయాలను ఇతరులపై రుద్దే పద్ధతితోనూ ఉండటం చేత మను సమ్మతం కాదు.

* ***ఏతే చతుర్ణాం వర్ణానామాపద్ధర్మాః ప్రకీర్తితాః ।***
యాన్ సమ్యగనుతిష్ఠంతో వ్రజంతి పరమాం గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**10.130**

తాత్పర్యం:- ఈ నాలుగు వర్ణాల వారికి ఆపదలందు అనుష్ఠించాల్సిన ధర్మాలతో సహా వివరించడం జరిగింది. వీటిని చక్కగా అనుష్ఠించేవారు, అవి చెయ్యడం వల్ల-నిషేధించినవి చెయ్యక ఉండటం వల్ల పాపరహితులై మోక్షాన్ని పొందగలరు. ॥130॥

ప్రక్షిప్త పరిశీలన

10.130వ శ్లోకం కింది కారణాలతో ప్రక్షిప్తం -

1. శైలీ వ్యతిరేకం

మనువు శైలిలో ఏదైనా విషయం ముగించేటప్పుడు మునుపటి విషయపు ముగింపు, తర్వాతి విషయ ప్రారంభం తప్పకుండా సూచించబడతాయి. ఈ శ్లోకంలో ఈ శైలి లేదు. కానీ, తర్వాతి శ్లోకమైన 10.131లో మునుపటి విషయపు ముగింపూ, తర్వాతి విషయ ప్రారంభ సూచనా ఉన్నాయి కనుక, అది మౌలికమూ, ఈ 10.130వ శ్లోకం ప్రక్షిప్తమూ అవుతాయి.

2. అంతర్ వ్యతిరేకాలు

1. ఎవరో తర్వాతి ప్రక్షిప్త కారుడు, ఆపద్ధర్మం పేరిట తర్వాత ఏర్పడిన జన్మ మూలక వర్ణ వ్యవస్థను ఆధారం చేసుకుని. ఈ శ్లోకాన్ని కలిపేశాడు. ఎందుకంటే ఇక్కడ 'ఆపద్ధర్మ' మనే విషయమే ఉండదు కనుక ఇతర వర్ణాల వారి వృత్తులను చేయా లనేదీ ఉండదు. బ్రాహ్మణ కర్మలు చేసేవాడు, క్షత్రియ లేదా వైశ్య కర్మలు ఎలా చేయగలడు?

2. 'ఆపద్ధర్మం' అంటే ఏమిటి? అదెంత కాలం ఉంటుంది? దాన్ని గురించి ఇక్కడి శ్లోకాలలో ఎక్కడా లేదు. కనుక ఆపద్ధర్మాన్ని గురించిన మౌలిక శ్లోకం లేనే లేదని స్పష్ట మవుతూంది. పదవ అధ్యాయంలో కొన్ని శ్లోకాలలో తప్పితే ఆపద్ధర్మం లేనే లేదు! ఇందులో పెద్ద వర్ణాల ఉత్పత్తి, వారి పనులు చెప్పారే కానీ, వాటిలో ఏ రకమైన ఆపద్ధర్మమూ చెప్పలేదు. కనుక, 10.130, 9.336 శ్లోకాలు రెండూ తర్వాతి ప్రక్షిప్తాలు.

3. విషయ వ్యతిరేకాలు

10.131వ శ్లోకంలో "నాలుగు వర్ణాల ధర్మాలు" అనే విషయమే ఈ అధ్యాయంలో ఉంటాయి కానీ, ఆపద్ధర్మం కాదు అని ఉంది. కనుక ఆపద్ధర్మం అనేది విషయ వ్యతిరేకం.

ఇది మనుకృతం. ప్రామాణికం

ఏష ధర్మవిధిః కృత్స్నశ్చాతుర్వర్ణ్యస్య కీర్తితః । మూలశ్లోక సం. **15**
అతః పరం ప్రవక్ష్యామి ప్రాయశ్చిత్తవిధిం శుభమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10.131**

టీక:- **ఏషః** = [1.1 నుండి 10-15,] **చాతుర్వర్ణ్యస్య** = నాలుగు వర్ణాలకు సంబంధించిన వ్యక్తుల యొక్క, **కృత్స్నః** = సంపూర్ణమైన, **ధర్మవిధిః కీర్తితః** = ధర్మ విధానం చెప్పబడింది, **అతః పరం** = ఇక ముందు, ఇప్పుడు, **శుభమ్ ప్రాయశ్చిత్త విధిం ప్రవక్ష్యామి** = శుభకరమైన ప్రాయశ్చిత్త విధిని తెలియజేస్తాను.

తాత్పర్యం:- నాలుగు వర్ణాలవారి ఆచారవ్యవహారాలు పూర్తిగా వివరించాను. ఇంకా మేలు కలిగించే ప్రాయశ్చిత్త విధానం చెబుతాను. ॥131॥

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మత్తి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రభాషానువాదాత్మకః 'చాతుర్వర్ణ్యధర్మాన్తర్గతవైశ్య, శూద్రధర్మాత్మకో దశమోఽధ్యాయః'॥
ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం దశమోఽధ్యాయః.
ఇతి దశమోఽధ్యాయః సమాప్తః

మనుస్మృతి

ఏకాదశాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన * ఋషి దయానంద భాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: 266; మూలశ్లోకాలు: 32 ; ప్రక్షిప్తాలు : 234

ప్రాయశ్చిత్తవిషయము 44 నుండి 265 వరకు

1-43వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* దానము మరియు యజ్ఞ సంబంధ విధానము-

* *సాంతానికం యక్ష్యమాణమధ్వగం సర్వవేదసమ్ ।*
గుర్వర్థం పితృమాత్రర్థం స్వాధ్యాయార్థ్యుపతాపినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***1***

* *న వైతాన్ స్నాతకాన్ విద్యాద్బ్రాహ్మణాన్ ధర్మభిక్షుకాన్ ।*
నిస్స్వేభ్యో దేయమేతేభ్యో దానం విద్యావిశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***2***

తాత్పర్యం:- స్నాతకులైన తొమ్మిది మంది బ్రాహ్మణులను ధర్మ భిక్షువులనుగా తెలిసికొనవలెను. విద్యావిశేషము కలవారగుటచే నిర్ధనులైనవీరికి దానమీయవలెను. ॥1॥

1. సంతానేచ్ఛతో వివాహేచ్ఛకలవానికి 2. యజ్ఞము చేయుకోరికగలవానికి 3. మార్గమున పోవు యాత్రికునకు 4. తనకున్న దంతయు దానము చేసినవానికి 5. గురువుకొఱకు (6.7) తల్లిదండ్రుల కొఱకు 8. వేదపఠనముచేయు కోరికగల వానికి 9. రోగియైన వానికి దానమీవలెను. ॥2॥

* *ఏతేభ్యో హి ద్విజాగ్ర్యేభ్యో దేయమన్నం సదక్షిణమ్ ।*
ఇతరేభ్యో బహిర్వేది కృతాన్నం దేయముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***3***

తాత్పర్యం:- ఈ తొమ్మిది రకాల వారికి దక్షిణతో పాటు అన్నం పెట్టవచ్చు. మిగిలిన వారికి యజ్ఞవేదికకు ఆవల అన్నం పెట్టాలి? అయితే ధనదాన విషయంలో ఏ నియమాలూ లేవు. ॥3॥

* *సర్వరత్నాని రాజా తు యథార్హం ప్రతిపాదయేత్ ।*
బ్రాహ్మణాన్ వేదవిదుషో యజ్ఞార్థం చైవ దక్షిణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***4***

తాత్పర్యం:- రాజులు మణులు, ముత్యాలు మొ॥ సర్వరత్నాలను, యాగయోగ్యములైన వస్తువులను వేదవేత్తలైన బ్రాహ్మణులకు యోగ్యతను బట్టి యాగదక్షిణలకోసం దానం ఇవ్వాలి. ॥4॥

* *కృతదారోఽపరాన్ దారాన్ భిక్షిత్వాయోఽధిగచ్ఛతి ।*
రతిమాత్రం ఫలం తస్య ద్రవ్యదాతుస్తు సంతతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***5***

తాత్పర్యం:- ఏ బ్రాహ్మణుడు తాను భార్యగలవాడయ్యు, కుటంబపోషణ మొదలైనవాటికి గాక, యాచించిన ద్రవ్యాన్ని ఇతరులభార్యలకోసం వినియోగిస్తాడో, అతడికి రతిసుఖ మొక్కటియే ఫలం. కాని అలాంటి దాన సంబంధంవల్ల

సంతతి కలిగితే అది ధనదాతకుగలిగిన సంతతియే అవుతుంది. కాబట్టి అలాంటి బ్రాహ్మణుడు ఈ విధంగా యాచించి వేరొకదానికి ఇవ్వరాదు. అలాంటి వాడికి రాజు ధనం ఇవ్వరాదు. ॥5॥

* *ధనాని తు యథాశక్తి విప్రేషు ప్రతిపాదయేత్ ।*
వేదవిత్సు వివిక్తేషు ప్రేత్య స్వర్గం సమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **6**

తాత్పర్యం:- ధనం, గోవులు, భూమి, బంగారం మొదలైనవి శక్తిననుసరించి భార్యాపుత్రాదులుగల వేదవిదులైన బ్రాహ్మణులకు దానంగా ఇవ్వాలి. అలాంటి దానాల వల్ల దాతలకు స్వర్గాది పుణ్యలోకప్రాప్తి కలుగుతుంది. ॥6॥

* సోమయజ్ఞ విధానము -

* *యస్య త్రివార్షికం భక్తం పర్యాప్తం భృత్య వృత్తయే ।*
అధికం వాపి విద్యేత స సోమం పాతు మర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **7**

తాత్పర్యం:- ఎవడికి తన కుటుంబ పోషణకోసం మూడువత్సరాలకు చాలినంత కాని లేదా అంత కంటే ఎక్కువగాని ఆహారపదార్థాలు మొ॥నవి కలవో అలాంటి విప్రుడు కామ్యసోమయాగాన్ని చేయాలి. ॥7॥

* *అతః స్వల్పీయసి ద్రవ్యే యస్సోమం పిబతి ద్విజః ।*
స పీతసోమపూర్వోఽపి న తస్యాప్నోతి తత్ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **8**

తాత్పర్యం:- మూడు సంవత్సరాలకు చాలినంత ధనం లేనప్పుడు ఎవడు సోమయాగం ప్రారంభించి మధ్యలో ఆపివేస్తాడో అతడు సోమయాగ ఫలాన్ని పొందలేడు. అది వ్యర్థమవుతుంది. యజ్ఞం పూర్తికాదు. ॥8॥

* *శక్తః పరజనే దాతా స్వజనే దుఃఖజీవిని ।*
మధ్వాపాతో విషాస్వాదః స ధర్మః ప్రతిరూపకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **9**

తాత్పర్యం:- తన యింటిలోని కుటుంబము వారు ఆకలితో బాధపడుచుండగా ఇతరులకు దానము చేయువాడు తేనెను విడిచి విషపానము చేసినవానితో సమానుడగును. అది ధర్మ విరుద్ధము. ॥9॥

* *భృత్యానాముపరోధేన యత్కరోత్యౌర్ధ్వదైహికమ్ ।*
తద్భవత్యసుఖోదర్కం జీవతశ్చ మృతస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **10**

తాత్పర్యం:- ఆలు బిడ్డలు మొదలైన కుటుంబవర్గాన్ని పోషించక వారిని కష్టపెట్టి కేవలం పరలోకపుణ్య చింతతో చేయబడుదానాదులు దాతకు అతడు జీవించి ఉన్నా మృతినొందినా దుఃఖప్రదమవుతుంది, కాబట్టి అలాంటి దానం చేయతగదు. ॥10॥

* యజ్ఞార్థం బలవంతంగా ధనాన్ని తీసుకొనుట -

* *యజ్ఞశ్చేత్ ప్రతిరుద్ధస్స్యాదేకేనాంగేన యజ్వనః ।*
బ్రాహ్మణస్య విశేషేణ ధార్మికే సతి రాజని ॥ ప్రక్షిప్త శ్లోక సం. **11**

* *యో వైశ్యః స్యాద్బహుపశుర్హీనక్రతురసోమపః ।*
కుటుంబాత్తస్య తద్ద్రవ్య మాహరేద్యజ్ఞసిద్ధయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **12**

తాత్పర్యం:- క్షత్రియాదులైన యజమానులు (యాగంచేసేవారు) ముఖ్యంగా బ్రాహ్మణుడు యజ్ఞానికి కావలసిన తక్కిన అన్ని అంగములు కలిగి, ఒక అంగముచే పూర్తి కాకుండునేని, అప్పుడు వైశ్యుడొకడు పశుసమృద్ధిగలిగి,

పాకయజ్ఞాదులు లేక, సోమయాజికాకుండెనేని అతడి ఇంటి నుండి ఆ యజ్ఞాంగానికి వలసిన ద్రవ్యాన్ని అడిగిగాని, అపహరించి గాని తేవచ్చు. రాజు ధర్మప్రధానుడై ఉండునప్పుడు ఈ కార్యం చేయదగును. ॥11,12॥

*   *ఆహరేత్త్రీణి వా ద్వేవా కామం శూద్రస్య వేశ్మనః ।*
న హి శూద్రస్య యజ్ఞేషు కశ్చిదస్తి పరిగ్రహః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***13***

తాత్పర్యం:- యజ్ఞానికి వలసిన రెండు మూడంగములు లోపించినప్పుడు ఆ అంగములు రెంటినైనా, మూడింటినైనా శూద్రుడి ఇంటినుండి బలాత్కారం చేత గాని, అపహరించికొని కాని తేవచ్చు. ఏలన, శూద్రునికడనుండి యజ్ఞసంబంధి వస్తువులను తీసుకోరాదు. అంటే శూద్రుడిని యాచించి తీసుకోరాదు కానీ బలవంతంగా తీసుకోవచ్చు.॥13॥

*   *యో౽నాహితాగ్నిశ్శతగురయజ్వా చ సహస్రగుః ।*
తయోరపి కుటుంబాభ్యా మాహరేదవిచారయన్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***14***

తాత్పర్యం:- ఎవడు ఆహితాగ్నికాక, నూరుగోవుల పరిమితిధనం గలవాడో, ఎవడు ఆహితాగ్ని అయి వేయిగోవుల పరిమితి ధనం కలవాడో, అలాంటి బ్రాహ్మణ క్షత్రియుల ఇరువురి గృహాల నుండి యజ్ఞాంగాలను బ్రాహ్మణుడు ఆలోచించకుండానే వెంటనే తీసుకోవచ్చు. ॥14॥

*   *ఆదాననిత్యాచ్చాదాతు రాహరేదప్రయచ్ఛతః ।*
తథా యశో౽స్య ప్రథతే ధర్మశ్చైవ ప్రవర్ధతే ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***15***

తాత్పర్యం:- ఎల్లప్పుడు ఇతరుల నుండి దానం తీసికొంటూ ఇతరుల యజ్ఞ పరిపూర్తికై ఏమి ఇవ్వని బ్రాహ్మణుని నుండి బలవంతంగానైనా ధనం తీసికొని వచ్చి యజ్ఞాన్ని పూర్తి చేస్తే ఆ విధంగా చేసినవానికి కీర్తి కలుగుతుంది. ధర్మకార్యం పూర్తిఔతుంది. ॥15॥

*   *తథైవ సప్తమే భక్తే భక్తాని షడనశ్నతా ।*
అశ్వస్తనవిధానేన హర్తవ్యం హీనకర్మణః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***16***

తాత్పర్యం:- అదేవిధంగా మూడురోజులు నియతంగా ఉపవాసంచేసి నాల్గవరోజు తప్పని సరిగా పారణ చేయాలి. కావున ఆ పారణకై ధనం లేకపోతే కావలసిన ధనాన్ని హీనకర్ముని ఇంటి నుండి దొంగతనం చేసియైనా పూర్తిచేయవచ్చు. ॥16॥

* **ఆకలిగొన్నవాడు ఎట్లైనా భోజనాన్ని సంపాదించాలి -**

*   *ఖలాత్ క్షేత్రా దగారాద్వా యతో వా ప్యుపలభ్యతే ।*
ఆఖ్యాతవ్యం తు తత్తస్మై పృచ్ఛతే యది పృచ్ఛతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***17***

తాత్పర్యం:- ఆ దొంగతనం చేసిన ధనధన్యాలు కళ్ళంలో నుండిగాని, పొలంలోనుండిగాని, ఇంటినుండిగాని మరింకే ప్రదేశం నుండి గాని హీనకర్ముని దగ్గరి నుండి తెస్తే అతడీవిషయాన్ని అడిగితే నిర్భయంగా చెప్పవచ్చు.॥17॥

*   *బ్రాహ్మణస్వం న హర్తవ్యం క్షత్త్రియేణ కదాచన ।*
దస్యునిష్క్రియయోస్తు స్వమజీవన్ హర్తుమర్హతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***18***

తాత్పర్యం:- క్షత్రియుడు బ్రాహ్మణుని ధనాన్ని ఎప్పుడూ అపహరింపకూడదు. అతడు కష్ట దశలో ఉన్నప్పుడు మాత్రం దస్యులు, విహితకార్యాలు చేయని వారి ధనాన్ని అపహరింపవచ్చు. ॥18॥

* దుష్టుల నుండి ధనాన్ని గుంజుకొని శ్రేష్ఠులకు దానమిచ్చుటలో పుణ్యము -

* యోఽసాధుభ్యోఽర్థ మాదాయ సాధుభ్య స్సంప్రయచ్ఛతి ।
స కృత్వా ప్లవ మాత్మానం సంతారయతి తావుభౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **19**

తాత్పర్యం:- అసాధు పురుషుల ధనాన్ని బలవంతంగా తీసికొని మంచివారికి పంచిపెట్టే తాను, అసాధుపురుషులు, సాధుపురుషులు అందరూ బాగుపడతారు. ॥19॥

* యద్ధనం యజ్ఞశీలానాం దేవస్వం తద్విదుర్బుధాః ।
అయజ్వనాం తు యద్విత్తమాసురస్వం తదుచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **20**

తాత్పర్యం:- యజ్ఞం చేసేవారి ధనం దేవతల ధనమని యజ్ఞం చేయక ఉండేవారి ధనం రాక్షస ధనమని పెద్దలు చెప్పుతారు. ॥20॥

* ఆకలిగొన్న బ్రాహ్మణునికి రాజు జీవికను కల్పించాలి -

* న తస్మిన్ ధారయే ద్దండం ధార్మికః పృథివీపతిః ।
క్షత్రియస్య హి బాలిశ్యా ద్బ్రాహ్మణ స్సీదతి క్షుధా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **21**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు యజ్ఞాన్ని పూర్తి చేయుటకుకై పైన చెప్పినవారి దగ్గర ధనాన్నిగాని, ద్రవ్యాన్నిగాని, బలాత్కారంగా తీసికొన్నా, రాజతనిని మాత్రం శిక్షించకూడదు. బ్రాహ్మణుడు ధనహీనుడగుటకు రాజేకారణం.॥21॥

* తస్య భృత్యజనం జ్ఞాత్వా స్వకుటుంబా న్మహీపతిః ।
శ్రుతశీలే చ విజ్ఞాయ వృత్తిం ధర్మ్యాం ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **22**

తాత్పర్యం:- అందువల్ల రాజు శ్రోత్రియుడు, సజ్జనుడైన ఆ బ్రాహ్మణుని చదువు సంధ్యలు, ప్రవర్తన మొదలగునవి తెలిసికొని ఆ బ్రాహ్మణునింటనుండు సేవకులు భార్యా పుత్రులు జీవించునట్లు తన ఇంటి నుండి ధన ధాన్యాల్ని అతని ఇంటికి పంపించాలి. ॥22॥

* కల్పయిత్వాఽస్య వృత్తిం చ రక్షేదేనం సమంతతః ।
రాజా హి ధర్మషడ్భాగం యస్మాత్ప్రాప్నోతి రక్షితాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **23**

తాత్పర్యం:- ఇట్లు సద్బ్రాహ్మణునికి జీవికను కల్పించి శత్రు, చోరులవల్ల అతనికి అపాయం కలుగకుండ రక్షించాలి. ఆ విధంగా సద్బ్రాహ్మణులను రక్షించినందువల్లనే రాజు ఆరవ భాగం పన్ను పొందటానికి అర్హుడౌతున్నాడు.॥23॥

* శూద్రుని నుండి భిక్ష వద్దు -

* న యజ్ఞార్థం ధనం శూద్రాద్విప్రో భిక్షేత కర్హిచిత్ ।
యజమానో హి భిక్షిత్వా చండాలః ప్రేత్య జాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **24**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు యజ్ఞనిర్వహణకై శూద్రుని ఎప్పుడు కూడ యాచింపరాదు. అవిధంగా యాచన చేస్తే అతడు చనిపోయిన తరువాత చండాలుడౌతాడు. ॥24॥

* యజ్ఞ ధనాన్ని స్వార్థం కొరకు ఉపయోగించువాడు పాపి -

* యజ్ఞార్థమర్థం భిక్షిత్వా యోన సర్వం ప్రయచ్ఛతి ।
స యాతి భాసతాం విప్రః కాకతాం వా శతం సమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **25**

తాత్పర్యం:- యజ్ఞమునకై ధనద్రవ్యాలను యాచించి ఆ ధనద్రవ్యాలనన్ని ఆ యజ్ఞానికై వినియోగించకపోతే ఆ పాపాత్ముడు చనిపోయిన తరువాత నూరేండ్లు కాకిగానో, గ్రద్దగానో పుట్టాడు. ॥25॥

* *దేవస్వం బ్రాహ్మణస్వం వా లోభేనోపహినస్తి యః ।*
స పాపాత్మా పరే లోకే గృధ్రోచ్ఛిష్టేన జీవతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***26***

తాత్పర్యం:- ఆశకు లోనై దేవాలయానికి చెందిన ధనాన్నో, బ్రాహ్మణునికి చెందిన ధనాన్నో అపహరించు పాపాత్ముడు జన్మాంతరమున గద్దలు తినగా మిగిలిన ఆహారం తిని బ్రతుకుతాడు. ॥26॥

* *ఇష్టిం వైశ్వానరీం నిత్యం నిర్వపేదబ్దపర్యయే ।*
క్ళృప్తానాం పశుసోమానాం నిష్కృత్యర్థమసంభవే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***27***

తాత్పర్యం:- ఒక సంవత్సరం పశుసోమయాగాలు చేయకపోతే ఆ దోషపరిహారానికై తన దగ్గర ధనం లేనప్పుడు శూద్రాదుల నుండైనా ధనం తీసికొని వైశ్వానరేష్టిని చేయాలి. ॥27॥

అనాపత్కాలంలో ఆపత్కాల ధర్మాలకు ఫలముండదు -

* *ఆపత్కల్పేన యో ధర్మం కురుతేఽనాపది ద్విజః ।*
స నాప్నోతి ఫలం తస్య పరత్రేతి విచారితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***28***

తాత్పర్యం:- ఆపద కలిగినప్పుడు విధించిన ధర్మాన్ని ఆపదలు లేనప్పుడు అనుష్ఠించిన బ్రాహ్మణుడు ఆ యజ్ఞాది కార్యఫలాన్ని అనుభవించలేడు. ॥28॥

* *విశ్వైశ్చ దేవైస్సాధ్యైశ్చ బ్రాహ్మణైశ్చ మహర్షిభిః ।*
ఆపత్సు మరణాద్భీతైర్విధేః ప్రతినిధిః కృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***29***

తాత్పర్యం:- విశ్వేదేవులు, సాధ్యులు, మహర్షులు, బ్రాహ్మణులు, ముఖ్యయాగాలు చేయడానికి భయపడినట్లయితే, అప్పుడు వైశ్వానరేష్టి లాంటివి వాటికి బదులుగా చెప్పబడ్డాయి. ముఖ్యేష్టులు జరిగించడానికి వీలున్నప్పుడు, వాటినే చెయ్యాలి. ॥29॥

* *ప్రభుః ప్రథమకల్పస్య యోఽనుకల్పేన వర్తతే ।*
న సాంపరాయికం తస్య దుర్మతేర్విద్యతే ఫలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***30***

తాత్పర్యం:- ప్రధానమైన కర్మానుష్ఠానాలు చెయ్యగలిగేశక్తి వున్నా, అవి మానివేసి ఆపత్కాలం కోసం చెప్పబడిన కర్మాచరణం మీద దృష్టి పెట్టడం దుర్బుద్ధి అవుతుంది. దీనివల్ల పరలోకంలో ఉత్తమ గతులుగాని, దోషపరిహారాలు గాని లభించవు. ॥30॥

*** బ్రాహ్మణ అపరాధులను స్వయంగా దండించాలి-**

* *న బ్రాహ్మణో వేదయేత కించిద్రాజని ధర్మవిత్ ।*
స్వవీర్యేణైవ తాఞ్ఛిష్యాన్మానవానపకారిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***31***

తాత్పర్యం:- రాజు చక్కగా పరిపాలిస్తున్నప్పుడు ధర్మములన్నీ తెలిసిన బ్రాహ్మణుడు తనకు జరిగిన అన్యాయాలను చెప్పక అభిచారహోమాదులు మొదలగు స్వశక్తి చేతనే వారిని శిక్షించాలి. ॥31॥

* *స్వవీర్యాద్రాజవీర్యాచ్చ స్వవీర్యం బలవత్తరమ్ ।*
తస్మాత్స్వేనైవ వీర్యేణ నిగృహ్ణీయాదరీన్ ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***32***

తాత్పర్యం:- కాని తన విరోధులను చంపుట మాత్రం తగదు. బ్రాహ్మణ బలం, రాజుబలం ఈ రెండింటిలో బ్రాహ్మణ బలమే చాలా మిన్న కాబట్టి బ్రాహ్మణుడు బ్రహ్మతేజస్సుచేతనే తనకు కీడు చేసిన వానిని శిక్షించాలి. ॥32॥

*   *శ్రుతీరథర్వాంగిరసీః కుర్యాదిత్యవిచారయన్ ।*
వాక్ శస్త్రం వై బ్రాహ్మణస్య తేన హన్యాదరీన్ ద్విజః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***33***

తాత్పర్యం:- తనకు కీడు చేసిన వారిని అధర్వవేదమున అంగీరస ఋషి తెల్పిన అభిచార మంత్రములచే నిగ్రహించాలి. బ్రాహ్మణునికి అతని వాక్కే శస్త్రమువంటిది. ॥33॥

*   *క్షత్రియో బాహువీర్యేణ తరేదాపదమాత్మనః ।*
ధనేన వైశ్యశూద్రౌ తు జపహోమైర్ద్విజోత్తమః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***34***

తాత్పర్యం:- క్షత్రియుడు తనకు కలిగిన ఆపదను తనపరాక్రమంతో దాటాలి. వైశ్యుడు శూద్రుడు ధనంతో కష్టాలనెదుర్కోవాలి. బ్రాహ్మణుడైతే జపహోమాదులతో తనకష్టాలనెదుర్కోవాలి. ॥34॥

*   *విధాతా శాసితా వక్తా మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే ।*
తస్మై నాకుశలం బ్రూయాన్న శుష్కాం గిరమీరయేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***35***

తాత్పర్యం:- శాస్త్రవిహితకర్మలననుష్ఠించేవాడు, పుత్రశిష్యాదులను శాసించేవాడు, ప్రాయశ్చిత్తాది ధర్మాలను చెప్పేవాడు, అందరితో స్నేహంగా ఉండేవాడే బ్రాహ్మణుడు. అతడు కనిపిస్తే అతని క్షేమాన్ని అడగాలే తప్ప శుష్కవచనాలు మాట్లాడగూడదు. ॥35॥

* యజ్ఞానికి అనధికారులు -

*   *న వై కన్యా న యువతిర్నాల్పవిద్యో న బాలిశః ।*
హోతా స్యాదగ్నిహోత్రస్య నార్తో నాసంస్కృతస్తథా ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***36***

తాత్పర్యం:- కన్య, యువతి, తక్కువ చదువుకలవాడు, మూర్ఖుడు, రోగబాధితుడు, ఉపనయన సంస్కారము జరుగనివాడు వీరందరు యజ్ఞ యాగములు చేయుటకనర్హులు. ॥36॥

*   *నరకే హి పతంత్యే తే జుహ్వన్తస్స చ యస్య తత్ ।*
తస్మాద్వైతానకుశలో హోతా స్యాద్వేదపారగః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***37***

తాత్పర్యం:- వీరు యజ్ఞయాగాదులు చేస్తే నరకంతో పడుతారు. కావున వేదములు చదువుకొని శ్రౌతకర్మలలో నేర్పరియైన బ్రాహ్మణుడు మాత్రమే యాగం చేయాలి. ॥37॥

*   *ప్రాజాపత్యమదత్వాశ్వమగ్న్యాధేయస్య దక్షిణామ్ ।*
అనాహితాగ్నిర్భవతి బ్రాహ్మణో విభవే సతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***38***

తాత్పర్యం:- బాగా ధనమున్న బ్రాహ్మణుడు అగ్న్యాధేయం చేసేటప్పుడు ప్రజాపతి దేవతాకమైన ప్రాజాపత్యాశ్వాన్ని దక్షిణగా ఇవ్వకపోతే అతడు అనాహితాగ్నితో సమానుడై అగ్న్యాధేయ ఫలాన్ని పొందజాలడు. ॥38॥

*   *పుణ్యాన్యన్యాని కుర్వీత శ్రద్దధానో జితేంద్రియః ।*
న త్వల్పదక్షిణైర్యజ్ఞైర్యజేతేహ కథంచన ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***39***

తాత్పర్యం:- శ్రద్ధ కలవాడు, జితేంద్రియుడు ఐన బ్రాహ్మణుడు యజ్ఞం కంటె ఇతరమైన తీర్థయాత్రల వంటి పుణ్యకార్యాలు చేయాలి. అతడు యజ్ఞం చేస్తే వేదవిహిత దక్షిణలకంటె తక్కువ దక్షిణనియ్యరాదు.॥39॥

* ***ఇంద్రియాణి యశః స్వర్గమాయుః కీర్తిం ప్రజాః పశూన్ ।***
హంత్యల్పదక్షిణో యజ్ఞస్తస్మాన్నాల్పధనో యజేత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***40***

తాత్పర్యం:- యజ్ఞం చేసి తక్కువ దక్షిణనిస్తే ఇంద్రియాల్ని, కీర్తిని, స్వర్గాన్ని, ఆయుస్సును, సంతానాన్ని, పశువులను, నశింపచేస్తుంది. కావున తక్కువ ధనమున్నవాడు యాగం చేయుట మంచిదికాదు. ॥40॥

* ***అగ్నిహోత్ర్యపవిధ్యాగ్నీన్ బ్రాహ్మణః కామకారతః ।***
చాంద్రాయణం చరేన్మాసం వీరహత్యాసమం హి తత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***41***

తాత్పర్యం:- నిత్యాగ్నిహోత్రియైనవాడు సాయం ప్రాతః కాలాల్లో అగ్నిని ఉపాసించకపోతే అది వీరుడైన పుత్రుని చంపిన దానితో సమానం కాబట్టి ఒక నెల వరకు చాంద్రాయణ వ్రతాన్ని ఆచరించాలి. ॥41॥

* ***యే శూద్రాదధిగమ్యార్థ మగ్నిహోత్రముపాసతే ।***
ఋత్విజస్తే హి శూద్రాణాం బ్రహ్మవాదిషు గర్హితాః ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***42***

తాత్పర్యం:- శూద్రుల దగ్గర ధనాన్ని యాచించి అగ్నిహోత్రాన్ని ఉపాసించే వాడు శూద్రులకు పురోహితుడౌతాడే కాని వేద వాదుల నిందకు పాత్రుడై తానాచరించిన అగ్న్యాధాన ఫలితాన్ని మాత్రం పొందలేడు. ॥42॥

* ***తేషాం సతతమజ్ఞానం వృషలాగ్న్యుపసేవినామ్ ।***
పదా మస్తకమాక్రమ్య దాతా దుర్గాణి సంతరేత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* ***43***

తాత్పర్యం:- ఆ విధంగా శూద్రుల దగ్గరినుండి ధనం తీసికొని అగ్నినుపాసిస్తే ఆ మూర్ఖుని శిరస్సుపై పాదముంచి ధనదాత నరకం దాటుతాడు కాని యాగం చేసినవానికి ఫలితం లభించదు. ॥43॥

ప్రక్షిప్తాల పరిశీలన

11.1 నుంచి 43 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

1. పూర్వాపర శ్లోకాలకు వ్యతిరేకంగా ఉండటం చేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు. 10.131లో ప్రాయశ్చిత్త ప్రసంగం ప్రారంభమైంది. ఆ క్రమం 11.44వ శ్లోకంతో కలుస్తూంది. ఆ శ్లోకంతోనే ముందుకు సాగుతూంది. ఈ మధ్యలోని 1-43 శ్లోకాలు ఆ ప్రసంగాన్ని భంగం చేస్తున్నాయి కనుక ఇవి ప్రసంగ వ్యతిరేకాలు.

2. 10.131 నుంచి 11.43 శ్లోకాల వరకు ప్రసంగ దృష్టితో ఎటువంటి సంబంధమూ లేకుండా ఉన్నాయి. ఈ అసంగత పద్ధతి కూడా ఇవి ప్రసంగ వ్యతిరేకా లని రుజువు చేస్తున్నాయి.

2. అంతర్ వ్యతిరేకాలు

1. 1.88, 7.79, 82, 83, 10.75,76 మొదలైన వాటిలో అందరు బ్రాహ్మణులకూ సమానంగా దానం తీసుకునే అధికారం. ఉందని ఉంది. 'దానం తీసుకోవడం' అనేది బ్రాహ్మణుడికి నిర్దేశించిన విధానం. మరి ఇక్కడ (1.2) ధర్మభిక్షువు పేరిట దానం ఇవ్వటాన్ని గురించి చెప్పటం అనవసరం. 1-4,6 శ్లోకాలలో ఇది విశిష్టమూ, భిన్న వ్యవస్థ అనటం అంటే - కొందరిని వేదిక మీదకి పిలిచి, కొందరికి వేదికకు దూరంగా దానమివ్వటం మునుపు చెప్పిన పద్ధతికి భిన్నం కనుక, వ్యతిరేకం.

2. 5వ శ్లోకంలో రెండవ పెళ్లి పద్ధతి, 5.167,168లో చెప్పిన 'ఒక సమయంలో ఒకటే పెళ్లి' పద్ధతికి వ్యతిరేకం.

3. 10.76; 11.194 శ్లోకాలలో బ్రాహ్మణులకు శ్రేష్ఠులైన వారి నుంచే దాన గ్రహణం చేయాలనీ, కాని వారి నుంచి దానం తీసుకుంటే ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ ఉంది. 16, 19 శ్లోకాలలో అశ్రేష్ఠుల నుంచి దానం తీసుకునే పద్ధతి, 13.16,19లలో అపరాధ విధితో దానం తీసుకునే పద్ధతి పై శ్లోకాలకు వ్యతిరేకం.

4. మనుస్మృతిలోని యజ్ఞ విషయాలలో 2.69, 105,108; 3.65-118, 285,286; 4.21-25, 6.4-12లలో ఎక్కడా కూడా సోమ యజ్ఞం, వైశ్వానర యజ్ఞాల పద్ధతి మనువు చెప్పినది కాదు. ఇక్కడ అప్రాసంగికంగా చెప్పటం, తప్పొప్పులున్న విధానాలను సైతం సరి చూసి బాగున్నాయనటం భిన్న వ్యవస్థలు కావడం చేత వ్యతిరేకాలు.

5. 37లో నరక పద్ధతి మనువుకు వ్యతిరేకం (4.91; 12.75-80 శ్లోకాల సమీక్ష చూడండి).

6. కొద్దిపాటి ధనంతో యజ్ఞం చేయకూడదనే విధానం (శ్లోకాలు 7,8) కూడా మను సమ్మతం కాదు. మనువు 6.5,11లలో నీవారం మొదలైన వాటితోనూ యజ్ఞాలు చేయవచ్చు నని నిర్దేశించాడు.

7. 2.105,106లలో యజ్ఞం వంటి కర్మలను సర్వదా, సర్వథా పుణ్యదాయకా లని భావించాడు. ఇక్కడ 8.38-40 శ్లోకాలలో తక్కువ ధనం గలవారూ, తక్కువ దక్షిణ లిచ్చేవారి వల్ల యజ్ఞాలకు హాని కలుగుతుం దనటం వాటికి వ్యతిరేకం.

8. 36,37లలో కన్య, స్త్రీ మొదలైన వారు యజ్ఞాలు చేయకూడదని నిషేధించడం, 9.28, 96,11 శ్లోకాలకు వ్యతిరేకం. వాటిలో స్త్రీలకు కూడా పురుషులతో పాటుగా అన్ని ధర్మకర్మాలూ సమానంగా నిర్వహించే పద్ధతి ఉంది.

9. 27లో జంతు యజ్ఞాల పద్ధతి మనువుకు వ్యతిరేకం. మనువు సర్వ హింసా విరోధి. (చూడండి 4.26-28లపై సమీక్ష).

10. బ్రాహ్మణులకు 11-17, 19-21లలో దొంగతనం, బలవంతంగా ధనం గ్రహించే పద్ధతి, 2.161; 8.302, 332, 335-338, 344-351 శ్లోకాలకు వ్యతిరేకం. వీటిలో బ్రాహ్మణులను ఎవరూ బాధపెట్ట కూడదు, దొంగతనం, సాహస కార్యాలు చేస్తే శిక్ష అధికం అని ఉంది.

11. 31,32లలో బ్రాహ్మణులు, అపరాధుల విషయం రాజుకు తెలియజేయకుండా, తామే శిక్షించాలనే ఆదేశం ఉంది. ఇది ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలలోని పద్ధతులకు వ్యతిరేకం. ఇక్కడ దండించే అధికారం కేవలం ఒక్క రాజుకే ఉందని చెప్పాడు. ఈ విధంగా ఇందులోని అనేక శ్లోకాలు మనువుకు వ్యతిరేకంగా ఉన్నాయి. కనుక మొత్తం ప్రసంగమే ప్రక్షిప్తం. ఎందు కంటే అన్ని శ్లోకాలూ పరస్పర సంబద్ధాలు.

3. విషయ వ్యతిరేకాలు

10.131లో మనువు తర్వాతి విషయం - ప్రాయశ్చిత్తం గురించి అని సంకేతించాడు. అది 11.44లో మొదలై 11.264 వరకు నడుస్తుంది. ఈ మధ్యలో 1-43 శ్లోకాలలో ఆ ప్రాయశ్చిత్తానికి భిన్నమైన దానానికి అధికారి, యజ్ఞ విధానం మొదలైన ప్రసంగాలు ఉండటం విషయ వ్యతిరేకం. ఇక్కడ ప్రాయశ్చిత్తానికి సంబంధించినవే ఉండటం-44తో మొదలయ్యే విషయానికి అనుకూలమవుతాయి.

4. శైలీగత ఆధారాలు

1. మనువు శైలి ఏదైనా విషయాన్ని ప్రారంభించే ముందు దాన్ని సంకేతించేదై ఉంటుంది. ప్రసంగం ప్రారంభం, చివర, లేదా ఈ రెండు చోట్ల ఫలానా విషయమని సంకేతం ఉంటుంది. కనుక ఇవి మనువు శైలివి కాక ప్రక్షిప్తాలు.

2. ఇందులో ఎక్కువ శ్లోకాల శైలి మనువుది కాదు. ఎలా గంటే- 3, 7, 8, 19, 20, 23 -26, 28, 30, 37, 40, 43 శ్లోకాల శైలి నిరాధారం. 12-16,21-23,31,32, 35,42,43 శ్లోకాల శైలి పక్షపాతంతో నిండినది, 13, 19, 24, 37, 41, 43ల శైలి దోష పూర్ణం, 12-16, 38,39ల శైలి షరతులతో నిండింది. 24-26, 37లది కనిపించకుండా భయ పెట్టేది. మనువు శైలిలో ఇలాంటి లోపా లుండవు'. ఎక్కువ శ్లోకాల శైలి మనువుకు వ్యతిరేకం కావడం చేతా, మిగిలిన శ్లోకాలు కూడా ఈ శైలీ వ్యతిరేక శ్లోకాలతో సంబద్ధం కావడం చేతా, మొత్తం ప్రసంగమే ప్రక్షిప్తం.

5. అంతర్ వ్యతిరేకాలు

13, 16, 18, 19, శ్లోకాలలో శూద్రులు, నీచ వ్యక్తుల ధనం యజ్ఞాలకు మేలైనది, స్వీకరించ దగింది అని ఉంది. కానీ, 24, 42, 43 శ్లోకాలలో వీరి ధనం స్వీకరించ దగనిది, అశుభం అని ఉంది. ఇట్లా ఈ ప్రసంగం పరస్పర వ్యతిరేకం కావటం చేత ప్రక్షిప్తం.

ప్రాయశ్చిత సంబంధ విధానం

ప్రాయశ్చిత్తం ఎప్పుడు చేయాలి?

44 నుండి 47 శ్లోకాల వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

అకుర్వన్విహితం కర్మ నిందితం చ సమాచరన్ । మూలశ్లోక సం.**1**
ప్రసక్తశ్చేంద్రియార్థేషు ప్రాయశ్చిత్తీయతే నరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**44**

టీక:-విహితం కర్మం అకుర్వన్ = శాస్త్ర విహితమైన కార్యాలను చేయనందువల్ల (యజ్ఞోపవీత సంస్కారం, వేదాభ్యాసం) (11.191,192) సన్ధ్యోపాసనం మొ॥ యజ్ఞ కర్మలను చేయనందువల్ల, **చ** = మరియు **నిన్దితం సమాచరన్** = శాస్త్రాలలో నిందితమని చెప్పబడిన కర్మలను చేయడం వల్ల, (అధర్మ కర్మలతో ధన సంపాదన) చేయడం చేత (11.193) మద్యపానం, హింస మొ॥ చేయడం, **చ** = మరియు, **ఇంద్రియార్థేషు ప్రసక్తః** = ఇంద్రియ-విషయాలలో ఆసక్తుడవ్వడం, కామ, క్రోధ, మోహాలలో ఆసక్తుడవ్వడం, **నరః ప్రాయశ్చిత్తీయతే** = మానవుడు ప్రాయశ్చిత్తమునకు (11.47) యోగ్యుడవుతున్నాడు.

తాత్పర్యం:- శాస్త్ర విహితములైన నిత్య సంధ్యాద్యనుష్ఠానాలు, అశుచి కార్యాలలో స్నానాదులయిన నైమిత్తిక క్రియలు అనుష్ఠించకుండా ప్రతిషిద్ధములైన హింస మొదలైన వాటిలో ప్రవర్తించి ఇంద్రియవిషయాలలో ప్రవృత్తి గలిగినవాడు సామాన్యమైన ప్రాయశ్చిత్తాన్ని చేయాలి. ॥44॥

ఇది మనుకృతం-ప్రామాణికం

అకామతః కృతే పాపే ప్రాయశ్చిత్తం విదుర్బుధాః । మూలశ్లోక సం.**2**
కామకారకృతేऽప్యాహురేకే శ్రుతినిదర్శనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**45**

టీక:- బుధాః = కొంత మంది విద్వాంసులు, **అకామతః కృతే పాపే ప్రాయశ్చిత్తం విదుః** = అజ్ఞానం వల్ల (తెలియక) చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని చెబుతున్నారు. **ఏవ + ఏకే** = మరికొందరు, **శ్రుతి నిదర్శనాత్** = వేదాలలో సూచించినట్లు, **కామకారకృతే అపి ఆహుః** = తెలిసి చేసిన పాపానికీ ప్రాయశ్చిత్తం చేసికోవాలని చెబుతున్నారు.

తాత్పర్యం:- తెలియక చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని పండితులు చెబుతున్నారు. మరికొందరు ఋషులు వేదాలలో సూచించినట్లు బుద్ధిపూర్వకంగా పాపం చేసినట్లయితే దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని చెబుతున్నారు. (ఇలా చెప్పుటచే బుద్ధిపూర్వకంగ చేసిన దోషానికి ఎక్కువ ప్రాయశ్చిత్త మనీ, అబుద్ధిపూర్వకమైన దానికి తక్కువ ప్రాయశ్చిత్తమనీ ఏర్పడుతుంది.) ॥45॥

వివరణ:

యజుర్వేదం 39.12లో ప్రాయశ్చిత్తం విధించబడింది. "నిష్కృత్యై స్వాహా ప్రాయశ్చిత్యై స్వాహా భేషజాయ స్వాహా.

అర్థం : నిష్కృత్యై = నివారణ కోసం, స్వాహా = సత్యక్రియ ప్రాయశ్చిత్యై= పాపనివారణాయ, స్వాహా = సత్యక్రియ, మరియు, **భేషజాయ** = సుఖం కోసం, **స్వాహా** = సత్యక్రియను సదా ప్రయోగించాలి. (మహర్షి దయానంద భాష్యం)

ఇది మనుకృతం-ప్రామాణికం

అకామతః కృతం పాపం వేదాభ్యాసేన శుద్ధ్యతి । మూలశ్లోక సం.**3**
కామతస్తు కృతం మోహాత్ప్రాయశ్చిత్తైః పృథగ్విధైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**46**

టీక:-అకామతః కృతం పాపం = చేయాలనే సంకల్పం లేకుండా చేసిన పాపం, **వేదాభ్యాసేన శుద్ధ్యతి** = వేదాభ్యాసం తదనుసారంగా చింతన-మననం, ఆచరణం ద్వారా శుద్ధమవుతుంది. పాపభావన నష్టమైపోతుంది. తద్వారా ఆత్మ పవిత్రమవుతుంది. **మోహాత్ కామతః తు కృతం** = ఆసక్తి కలిగి, కావాలని చేసిన పాపం, **పృథక్ విధైః ప్రాయశ్చిత్తైః** = అనేక విధాలైన ప్రాయశ్చిత్తాలను (11.211,226) చేయడం ద్వారా, ఆత్మ శుద్ధమవుతుంది. పాప ఫలం అనుభవించక తీరదు. కానీ ప్రాయశ్చిత్తం వల్ల పాప భావన తొలుగుతుంది. మళ్ళీ పాపం చేయాలనే సంకల్పం కలుగదు.

తాత్పర్యం:- తెలియక దోషం చేసినప్పుడు దోషి పాపాలు వేదాభ్యాసం చేత నశిస్తాయి. రాగద్వేషాదులచేత బుద్ధిపూర్వంగా చేసిన దోషాలకు అనేక విధాలైన ప్రాయశ్చిత్తాలను చేయడం ద్వారా (వేదాధ్యయనం, తపస్సు, దానం వీటిచేత) ఆత్మ శుద్ధమవుతుంది. ॥46॥

ప్రాయశ్చిత్తానికి అర్థం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ప్రాయో నామ తపః ప్రోక్తం చిత్తం నిశ్చయ ఉచ్యతే । మూలశ్లోక సం.**4**
తపోనిశ్చయసంయుక్తం ప్రాయశ్చిత్తమితి స్మృతమ్॥ ప్రక్షిప్త శ్లోక సం.**47**

టీక:-ప్రాయః నామ తపః ప్రోక్తం = ప్రాయః అంటే తపస్సు, **చిత్తం నిశ్చయః ఉచ్యతే** = చిత్తమంటే నిశ్చయం, **తపః నిశ్చయ సంయుక్తం ప్రాయశ్చిత్తమ్ ఇతి స్మృతమ్** = తపస్సు, నిశ్చయం కలవడమే 'ప్రాయశ్చితమని' పేరు.

తాత్పర్యం:- ప్రాయమంటే తపస్సు, చిత్తమంటే నిశ్చయం. తపస్సు, నిశ్చయం కలవడమే ప్రాయశ్చితమని పేరు. ॥47॥

వివరణ:

ప్రాయశ్చిత్త శబ్దానికి అర్థం, ఉద్దేశం:- ప్రాయ-చితి పదాల సమాసంలో, **"పారస్కర ప్రభృతీని చ సంజ్ఞాయాం"** అష్టా (6-1-157) అనే సూత్రం వల్ల **'సుట్'** ఆగమం వల్ల **"ప్రాయశ్చిత్త"** పదం సిద్ధమవుతుంది. **"తపాది సాధన పూర్వకం కిల్బిషనివారణార్థం చిత్తమ్ నిశ్చయమ్ ప్రాయశ్చిత్తమ్"**. వ్యక్తి ఎప్పుడు ఏదైనా నిందనీయమైన చేయరాని పనులు (అకర్తవ్యాలు) చేసి, "అయ్యో" పాపం చేసితినని మనస్సులో బాధ కలిగినట్లయితే ఇక చేయనని సంకల్పించుకోవడమే ప్రాయశ్చిత్తమనబడుతుంది. అలా చేసినందు వల్ల మనస్సులో భిన్నతా భావం పోతుంది. మళ్ళా అదే పాపం చేయకుండా ఉండటానికి జాగ్రత్త పడటం జరుగుతుంది. ఈ కారణం వల్ల చేసిన పాపం క్షీణించి పోదు. కానీ, పాపం మాత్రం తగ్గిపోతుంది. (11.227) వివరణ చూడగలరు. మళ్ళీ 'ఆ పాపం చేయను' అని నిశ్చయించుకుంటాడు. జాగ్రత్తగా ఉంటాడు. (11.229,230) ప్రాయశ్చిత్తం ద్వారా మనుషుడిలో ఉన్న పాపబుద్ధి ఆగిపోతుంది. అతడు ధర్మం వైపు ఉన్ముఖుడవుతాడు.

48-52వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* చెడు కర్మలతో శరీర వికారాలు-

* *ఇహ దుశ్చరితైః కేచిత్కేచిత్పూర్వకృతైస్తథా ।*
ప్రాప్నువంతి దురాత్మానో నరా రూపవిపర్యయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **48**

తాత్పర్యం:- ఈ జన్మమున చేసిన పాపకృత్యములచేతను, జన్మాంతరకృత పాపకృత్యముల చేతను కొందరు చెడ్డవారు వికృతరూపాలను పొందుతారు. ॥48॥

* *సువర్ణచౌరః కౌనఖ్యం సురాపః శ్యావదంతతామ్ ।*
బ్రహ్మహా క్షయరోగిత్వం దౌశ్చర్మ్యం గురుతల్పగః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **49**

తాత్పర్యం:- బంగారు దొంగిలించువాడు పుచ్చుగోళ్ళవాడవుతాడు. నిషిద్ధమద్యపానం చేసేవాడు నల్లనిదంతాలు గలవాడవుతాడు. బ్రహ్మహత్య చేసినవాడు క్షయరోగి అవుతాడు. గురుదారగమనం చేసిన వాడు వృషణహీనుడవుతాడు.॥49॥

* *పిశునః పౌతినాసిక్యం సూచకః పూతివక్త్రతామ్ ।*
ధాన్యచోరోఽంగహీనత్వ మాతిరైక్యం తు మిశ్రకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **50**

తాత్పర్యం:- కొండెగాడు దుర్గంధపు ముక్కుగలవాడవుతాడు. లేని నేరాలు మోపువాడు దుర్గంధపు నోరు గలవాడును, ధాన్యచోరు డంగహీనుడును, మంచి వస్తువుతో చెడ్డది కలిపి అమ్మువాడు ఎక్కువ అంగం గలవాడును. ॥50॥

* *అన్నహర్తామయావిత్వం మౌక్యం వాగపహారకః ।*
వస్త్రాపహారకః శ్వైత్ర్యం పంగుతామశ్వహారకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **51**

తాత్పర్యం:- అన్నచోరుడు అజీర్ణ రోగియు, గురువు ఆజ్ఞ లేక అధ్యయనం చేసేవాడు మూగయు, శస్త్రచోరుడు తెల్లకుష్ఠరోగం గలవాడును, గుర్రాన్ని దొంగిలించినవాడు కుంటివాడును, (దీపపుదొంగ గ్రుడ్డివాడు, దీప మార్పినవాడు కాయగాచిన కంటివాడును. ॥51॥

* *ఏవం కర్మ విశేషేణ జాయంతే సద్విగర్హితాః ।*
జడమూకాంధభధిరా నికృతాకృతయ స్తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52**

తాత్పర్యం:- ఒకరిని హింసించువాడు రోగియు, అలా హింసచేయనివాడు ఆరోగ్యవంతుడును అవుతాడు. ఇలా జడులు, మూగలు, గ్రుడ్డులు, కుంటులు, చెవిటివారు వికృత రూపులై పెద్దలచేత నిందితులై జన్మాంతరానుభూత పాపశేషముల వల్ల నీచజాతులందు జన్మిస్తారు. ॥52॥

ప్రక్షిప్తాల పరిశీలన

11.48 నుంచి 52 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలలో చెప్పిన పరిణామాలు మనువు చేసిన ఇతర వర్ణనలకు వ్యతిరేకాలు -

క. మరుజన్మలోని ఒకటే పరిణామాన్ని నిర్ణయించటం, లేదా ఏదైనా ఒక పని ఆధారంగా భవిత యొక్క ఒకటే ఫలితాన్ని నిర్ణయించడం మనువు చేయ లేదు. ఆయన సాత్త్విక, రాజసిక, తామసిక కర్మల, అది కూడా ఎన్నో కర్మల ఆధారంగానే ఫలితా లన్నాడు (12.24-52, 73,74).

ఖ. ఈ పన్నెండవ అధ్యాయంలో కర్మ ఫలం కింద వచ్చే విషయాలను చెప్పాడు. కానీ ఇక్కడ ఈ ఫలాలు లేదా ఫలం లభించబోయే పద్ధతిని గురించిన సంకేత మేదీ లేదు.

గ. 49లో బ్రహ్మహత్య మొదలైన పాతకాల వర్గీకరణ మౌలికం కాదు, తర్వాతి కాలపుది (చూడండి-11.54-190 శ్లోకాల మీది సమీక్ష).

2. ప్రసంగ వ్యతిరేకాలు

11.47 శ్లోకం నుంచి 11.53 వరకు గల శ్లోకాలకు ఏక వాక్యాత్మక సంబద్ధత ఉంది. అందులో ప్రాయశ్చిత్తపు నిర్వచనం, ఎందుకు చేసుకోవాలో చెప్పారు. మధ్యలోని ఈ శ్లోకాల వల్ల ఆ సంబద్ధత భంగమైంది. ప్రాయశ్చిత్తం చేసుకునే ముందే దాని ఫలితం చెప్పటం అప్రాసంగికం. కనుక, ఈ శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకాలు.

3. శైలీగత ఆధారాలు

ఈ ఐదుశ్లోకాల శైలీ నిరాధారమూ, సహేతుకం కానిదీ. మనువు శైలిలో ఈ లోపాలు లేవు. చెప్పిన దొంగతనం, దాని ఫలితం- వీటికి పరస్పర సంబంధమే లేదు. ఇది వట్టి మొండి కత్తితో బెదిరించటం వంటిది.

ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాయశ్చిత్తమెందుకు చేసుకోవాలి?-

చరితవ్యమతో నిత్యం ప్రాయశ్చిత్తం విశుద్ధయే । మూలశ్లోక సం. **5**
నింద్యైర్హి లక్షణైర్యుక్తా జాయంతేऽనిష్కృతైనసః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **53**

టీక:-(46,47) శ్లోకాలలో, వర్ణించిన లాభాలు, **అతః** = అందువల్ల, **విశుద్ధయే** = సంస్కారాల శుద్ధి కోసం, **నిత్యం ప్రాయశ్చిత్తం చరితవ్యమ్** = పాపకార్యం జరిగినప్పుడల్లా ప్రాయశ్చిత్తం చేసికొంటూ ఉండాలి. ఎందుకంటే, **అనిష్కృత ఏనసః** = పాపశుద్ధి జరగనంతవరకు మనుషుడు, **నింద్యైర్హి లక్షణైః యుక్తాః జాయన్తే** = నింద్యమైన లక్షణాలు కలవారవుతారు లేదా నింద్య లక్షణాలతో మళ్ళా జన్మిస్తారు.

తాత్పర్యం:- సంస్కారాల శుద్ధి కోసం ఎల్లప్పుడూ పాపకార్యం జరిగినప్పుడల్లా ప్రాయశ్చిత్తం చేసుకొంటూ ఉండాలి. ఎందుకంటే పాపశుద్ధి జరగనంత వరకు మనుషుడు నింద్యమైన లక్షణాలు గల వారవుతారు లేదా నింద్య లక్షణాలతో మళ్ళా జన్మిస్తారు. ॥53॥

54-190వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** మహాపాతకముల వర్ణన -**

* *బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వంగనాగమః ।*
మహాంతి పాతకాన్యాహుస్సంసర్గశ్చాపి తైస్సహ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.54*

తాత్పర్యం:- తానుగాని, ఇతరుల ప్రేరణతోగాని గోవులు, హిరణ్యం మొదలైనవి హరించు నిమిత్తమయి బ్రాహ్మణుడి చంపించడం బ్రహ్మహత్య అనబడును. నిషిద్ధమైన సురను పానము చేడడం, బ్రాహ్మణ స్వర్ణమును అపహరించడం, గురుభార్యాగమనం, వీటిని చేసిన వారితోడి సంసర్గమును మహాపాతకములు అనబడును. ॥54॥

*** మహాపాతకములకు సమాన కర్మ -**

* *అనృతం చ సముత్కర్షే రాజగామి చ పైశునమ్ ।*
గురోశ్చాలీకనిర్బంధః సమాని బ్రహ్మహత్యయా ॥ ప్రక్షిప్త శ్లోక సం.*55*

తాత్పర్యం:- బ్రాహ్మణుడు కానివాడు 'నేను బ్రాహ్మణుడను' అని అధికజాతిని గురించి చెప్పినమాటా, రాజు ఎదుట దొంగలు మొదలైనవారిపై మరణం కలిగించు కొండెములు చెప్పడమూ, గురువుపై నింద మోపడమూ ఇవన్నీ బ్రహ్మహత్యాసమములు అంటారు. ॥55॥

*   *బ్రహ్మోజ్ఝుతా వేదనిందా కౌటసాక్ష్యం సుహృద్వధః ।*
గర్హితానద్యయోర్జగ్ధిస్సురాపానసమాని షట్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***56***

తాత్పర్యం:- వేదం చదివి వల్లింపకమరిచి పోవడం, అసచ్ఛాస్త్రమును (తర్క శాస్త్రాదులను) వినడం వల్ల వేదములను నిందించడం, బ్రాహ్మణేతరుడైన మిత్రుణ్ణి వధించడం, నిషిద్ధాలైన పదార్థాలు అయిన ఉల్లి మొదలైన వాటిని తినడం, తినతగని అభక్ష్యపదార్థాలను తినడం ఇవి సురాపాన సమములు. ॥56॥

*   *నిక్షేపస్యాపహరణం నరాశ్వరజతస్య చ ।*
భూమివజ్ర మణీనాం చ రుక్మస్తేయసమం స్మృతమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***57***

తాత్పర్యం:- దాచిపెట్టిన ధనాన్ని అపహరించుట, వెండి, గుఱ్ఱములు, మానవులు, భూమి వజ్రములు, మణులు మొదలైనవి అపహరించుట బంగారాన్ని అపహరించిన దానితో సమానం. ॥57॥

*   *రేతస్సేకః స్వయోనీషు కుమారీష్వంత్యజాసు చ ।*
సఖ్యుః పుత్రస్య చ స్త్రీషు గురుతల్పసమం విదుః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***58***

తాత్పర్యం:- తోడ పుట్టినది, కన్య, చండాల స్త్రీ, స్నేహితుని భార్య, కోడలు వీరితో సంభోగము చేయుట గురుభార్యతో సంభోగించుట వంటిది. ॥58॥

ఉపపాతకముల వర్ణన -

*   *గోవధోఽయాజ్య సంయాజ్య పారదార్యాత్మ విక్రయాః ।*
గురుమాతృపితృత్యాగః స్వాధ్యాయాగ్న్యోః సుతస్య చ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***59***

తాత్పర్యం:- గోవధ, జాతిదుష్టులచే కర్మదుష్టులచే యాగం చేయించుట, ఇతరుని భార్యతో వ్యభిచారం చేయుట, తన్నుతాను విక్రయించుకొనుట, గురువును, తల్లిదండ్రులను పోషించకపోవుట. వేదాధ్యయనాన్ని, స్మార్తాగ్నిని, పుత్రుని వదిలి పెట్టుట. ॥59॥

*   *పరివిత్తితాఽనుజేఽనూఢే పరివేదనమేవచ ।*
తయోర్దానం చ కన్యాయాస్తయోరేవ చ యాజనమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***60***

తాత్పర్యం:- చిన్నవాడు అన్న కంటే ముందు పెండ్లిచేసికొనుట, తమ్ముడు పెండ్లిచేసికొన్న తరువాత అన్న పెండ్లిచేసికొనుట వీరిద్దరికి కన్యనిచ్చుట, వారిద్దరిచే యాగం చేయించుట. ॥60॥

*   *కన్యాయా దూషణం చైవ వార్ధుష్యం వ్రతలోపనమ్ ।*
తటాకారామదారాణామపత్యస్య చ విక్రయః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***61***

తాత్పర్యం:-కన్యను చెరచుట, వడ్డిచే బ్రతుకుట, బ్రహ్మచర్యవ్రతాన్ని పోగొట్టుకొనుట, చెరువులు, ఉద్యానవనాలు, భార్యాపుత్రుల నమ్ముకొనుట. ॥61॥

*   *వ్రాత్యతా బాంధవత్యాగో భృత్యాధ్యాపనమేవచ ।*
భృత్యా చాధ్యయనాదానమపణ్యానాం చ విక్రయః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***62***

తాత్పర్యం:- సకాలమునకు ఉపనయనం చేయకపోవుట, పినతండ్రి మొదలగు పెద్దలననుసరింపకపోవుట, జీతం తీసికొని వేదం చెప్పుట, అట్లే వేదం చదువుట, అమ్మతగనివస్తువు నమ్ముట. ॥62॥

* *సర్వాకరేష్వధీకారో మహాయంత్రప్రవర్తనమ్ ।*
హింసౌషధీనాం స్త్ర్యాజీవోఽభిచారో మూలకర్మ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***63***

తాత్పర్యం:- గనులపై అధికారం, గొప్ప ఆనకట్టలు కట్టుట, ఓషధులను భస్మం చేయుట, తన భార్యవల్ల బ్రతుకుట, అభిచారహోమములచే నేరము చేయనివారిని చంపుట, మంత్రములు ఓషధులచే ఇతరులను వశపరుచుకొనుట.॥63॥

* *ఇంధనార్థమశుష్కాణాం ద్రుమానామవపాతనమ్ ।*
ఆత్మార్థం చ క్రియారంభో నిందితాన్నాదనం తథా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***64***

తాత్పర్యం:- వంటచెఱుకుకై పచ్చని చెట్లను నరుకుట, దేవతా నివేదన చేయక ఆహారం తీసికొనుట, నిషిద్ధపదార్థముల భుజించుట. ॥64॥

* *అనాహితాగ్నితా స్తేయమృణానామనపక్రియా ।*
అసచ్ఛాస్త్రాధిగమనం కౌశీలవ్యస్య చ క్రియా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***65***

తాత్పర్యం:- చేతనైనను అగ్న్యాధానం చేయకుండుట, దొంగతనం చేయుట, నృత్యగీతవాద్యముల నభ్యసించుట.॥65॥

* *ధాన్యకుప్యపశుస్తేయం మద్యపస్త్రీనిషేవణమ్ ।*
స్త్రీశూద్రవిట్ క్షత్రవధో నాస్తిక్యం చోపపాతకమ్ ప్రక్షిప్త శ్లోక సం. ***66***

తాత్పర్యం:- ధాన్యం, లోహాలు, పశువులు, వీనిని దొంగిలించుట, సురాపానంచేసే స్త్రీని పొందుట, స్త్రీలను, శూద్రులను క్షత్రియులను సంహరించుట, నాస్తిక్యము ఇవన్నియు ఉపపాతకములు. ॥66॥

* *బ్రాహ్మణస్య రుజః కృత్యా ఘ్రాతిరఘ్రేయమద్యయోః ।*
జైహ్మ్యం చ మైథునం పుంసి జాతిభ్రంశకరం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***67***

తాత్పర్యం:- బ్రాహ్మణుని కొట్టుట, కంపు ఉన్నవస్తువులను మద్యమును వాసనచూచుట, మోసం, పురుషుడు పురుషునితో మైధునం చేయుట ఇవన్ని జాతిభ్రంశాన్ని కలిగిస్తాయి. ॥67॥

*** వర్ణ సంకరము చేయు కర్మలు -**

* *ఖరాశ్వోష్ట్రమృగేభానా మజావికవధస్తథా ।*
సంకరీకరణం జ్ఞేయం మీనాహిమహిషస్య చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***68***

తాత్పర్యం:- గాడిద, గుఱ్ఱం, ఒంటె, మృగం, జింక, ఏనుగు, గొఱ్ఱె, మేక, చేపలు, సర్పం, గేదె వీనిని చంపుటను సంకరికరణమందురు. ॥68॥

*** అపాత్రీకరణ కర్మలు --**

* *నిందితేభ్యో ధనాదానం వాణిజ్యం శూద్ర సేవనమ్ ।*
అపాత్రీకరణం జ్ఞేయమసత్యస్య చ భాషణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***69***

తాత్పర్యం:- నిందితుల దగ్గరినుండి దానం తీసికొనుట, వర్తకం, శూద్రుని కొలువు, అబద్ధమాడుట వీటిని అపాత్రీకరణమందురు. ॥69॥

*** మలినము చేయు కర్మలు -**

* *క్రిమికీటవయోహత్యామద్యానుగతభోజనమ్ ।*
ఫలైధఃకుసుమస్తేయమధైర్యం చ మలావహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **70**

తాత్పర్యం:- క్రిములు, కీటకాలు, పక్షులు వీనిని చంపుట, మద్యంతో కలిపి తెచ్చిన ఆహారం, పండ్లు, పూవులు, కట్టెలు దొంగిలించుట, అధైర్యం అనేవి మలమును కలిగిస్తాయి. ॥70॥

*** మహా పాతకాలకు, ఉప పాతకాలకు ప్రాయశ్చిత్తము -**

* *ఏతాన్యేనాంసి సర్వాణి యథోక్తాని పృథక్పృథక్ ।*
యైర్యైర్వ్రతైరపోహ్యంతే తాని సమ్యఙ్నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **71**

తాత్పర్యం:- ఈ చెప్పబడిన బ్రహ్మహత్యాదిసకలపాపాలు వేర్వేరుగా ఏయే ప్రాయశ్చిత్తములచేత తొలగుతాయో వాటిని చెబుతాను, విను. ॥71॥

*** బ్రహ్మహత్యకు ప్రాయశ్చిత్తము -**

* *బ్రహ్మహా ద్వాదశసమాః కుటీం కృత్వా వనే వసేత్ ।*
భైక్షాశ్యాత్మవిశుద్ధ్యర్థం కృత్వా శవశిరోధ్వజమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **72**

తాత్పర్యం:- బ్రహ్మహత్య చేసిన విప్రుడు 12 సం॥కాలం అడవిలో/వనంలో ఒక పూరిపాక వేసుకొని జీవించాలి. తన చేత హతుడైన వాడి పుర్రెనిగాని, ఏదైనా కపాలాన్ని గాని చేత్తో ధరించి భిక్షాటన చేయాలి. బుద్ధిపూర్వకంగానే బ్రాహ్మణ హత్యచేస్తే, ఈ ప్రాయశ్చిత్త కాండ రెట్టింపుకాలం (24 సం॥) ఆచరించాలి. భిక్షాటనలో ఏమీ దొరకనప్పుడు, కేవలం జలం తాగి గడపాలి. ఈ బ్రాహ్మహత్యాదోషం క్షత్రియులకు రెండింతలు. వైశ్యుడికైతే 36 సం॥లు, శూద్రుడికైతే నాల్గింతలు 48 సం॥. ॥72॥

* *లక్ష్యం శస్త్రభృతాం వా స్యాద్విదుషామిచ్ఛయాఽఽత్మనః ।*
ప్రాస్యేదాత్మానమగ్నౌ వా సమిద్ధే త్రిరవాక్ఛిరాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **73**

తాత్పర్యం:- బుద్ధిపూర్వక బ్రహ్మహత్య చేసినప్పుడు బాణములకు గుర్రై ఉండి, మృతుడుగాని, మృతకల్పుడుగాని అయ్యేవరకు అలాగే ఉండాలి. లేదా చక్కగా మండుతున్న అగ్నిలో ముమ్మారు తలకిందుగా పడాలి. ॥73॥

* *యజేత వాఽశ్వమేధేన స్వర్జితా గోసవేన వా ।*
అభిజిద్విశ్వజిద్భ్యాం చ త్రివృతాగ్నిష్టుతాపి వా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **74**

తాత్పర్యం:- అశ్వమేధయాగం చేత గాని, సర్వజిత్ అనెడి యాగంచేత గాని గోసవం అనేయాగం చేతగాని అభిజిత్తు, విశ్వజిత్తుయాగములచేత గాని, త్రివృదగ్నిష్టోమయాగం చేత గాని యజ్ఞం చేయాలి. ఈ ప్రాయశ్చిత్తాలన్నీ బుద్ధిపూర్వకహననంనందే త్రైవర్ణికులకు ప్రాయశ్చిత్తములుగా విధింపబడినవి. (అశ్వమేధం క్షత్రియుడికి విహితం.)॥74॥

* *జపన్ వాఽన్యతమం వేదం యోజనానాం శతం వ్రజేత్ ।*
బ్రహ్మహత్యాపనోదాయ మితభుఙ్నియతేంద్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **75**

తాత్పర్యం:- వేదాలలో దేన్నైనా ఒకదాన్ని జపిస్తూ, మితాహారియై, ఇంద్రియాలను జయించి, బ్రహ్మహత్యాపాపనివాణం కోసం నూరు యోజనాలు నడవాలి. ॥75॥

*   *సర్వస్వం వేదవిదుషే బ్రాహ్మణాయోపపాదయేత్ ।*
ధనం వా జీవనాయాలం గృహం వా సపరిచ్ఛదమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **76**

తాత్పర్యం:- వేదవేత్త అయిన బ్రాహ్మణుడికి తన ధనాన్నంతా ఇవ్వాలి. జీవనానికి చాలినంత ధనం అయినా ఇవ్వాలి. గృహానికి కావాల్సిన ధనధాన్య పశుసమృద్ధితో కూడిన గృహం అయినా ఇవ్వాలి. ఇదంతా బ్రాహ్మణుడు బద్ధిపూర్వకంగ చేసినట్లయితే జాతిమాత్ర బ్రాహ్మణవధమున కలిగిన బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తం. ॥76॥

*   *హవిష్యభుగ్వానుసరేత్ ప్రతిస్రోతస్సరస్వతీమ్ ।*
జపేద్వా నియతాహార స్త్రిర్వై వేదస్య సంహితామ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **77**

తాత్పర్యం:- జాతిమాత్ర బ్రాహ్మణుణ్ణి బుద్ధిపూర్వకంగా హత్యచేసినట్లయితే గుణవంతుడయిన బ్రాహ్మణుడు నివ్వరి ధాన్యమును ఏరి తెచ్చి దాంతో భోజనం చేస్తూ సరస్వతీనది యొక్క ప్రసిద్ధ ప్రవాహం మొదలు పడమటిసముద్రం వరకు ఒడ్డును ఎదురునడిచి పోవాలి లేదా, నియతమైన ఆహారం గలవాడై మూడుపర్యాయాలు వేదసంహితను పారాయణం గావించాలి. మూడు వేదాలను ముమ్మారు పఠించాలని కొందరు ఋషులు తెలిపారు. ॥77॥

*   *కృతవాపనో నివసేద్గ్రామాంతే గోవ్రజేఽ పి వా ।*
ఆశ్రమే వృక్షమూలే వా గోబ్రాహ్మణహితే రతః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **78**

తాత్పర్యం:- ఈ 12 సంవత్సరాల పాటు వ్రతం చేసేవాడు క్షౌరం చేయించుకొని గోళ్ల తీసేసి గో బ్రాహ్మణహితం కోరి, వారికి ఉపకారం చేస్తూ గ్రామసమీపంలో ఆవులమంద/ పుణ్యాశ్రమం / వృక్షమూలం వీటిలో ఏ ఒక్కదానిలోనైనా ఉండవచ్చు! ॥78॥

*   *బ్రాహ్మణార్థే గవార్థే వా సద్యః ప్రాణాన్ పరిత్యజేత్ ।*
ముచ్యతే బ్రహ్మహత్యాయా గోప్తా గోర్బ్రాహ్మణస్య చ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **79**

తాత్పర్యం:- ఈ 12 సంవత్సరాల వ్రతం మధ్యలో అగ్ని, ఉదకం, లేదా వధించేవాడికి చేజిక్కిన ఆవును గాని-బ్రాహ్మణుణ్ణిగాని కాపాడినట్లయితే ఆ యత్నంలో తన ప్రాణం కోల్పోవడం తటస్థిస్తే బ్రహ్మహత్యాదోషం నుంచి అతడు వెంటనే విడుదల పొందిన వాడవుతున్నాడు. ఆ వ్రత సమాప్తి చేసినవాడితో సమానుడవుతున్నాడు. ॥79॥

*   *త్రివారం ప్రతిరోద్ధా వా సర్వస్వమవజిత్య వా ।*
విప్రస్య తన్నిమిత్తే వా ప్రాణాలాభే విముచ్యతే ॥   ప్రక్షిప్త శ్లోక సం. **80**

తాత్పర్యం:- దొంగలు మొదలైనవారు బ్రాహ్మణుల ధనాన్ని దొంగిలించినప్పుడు దాన్ని తేవడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించినప్పుడు, దొంగలతో ముమ్మారు యుద్ధం సంఘటిల్లితే, ఆ ప్రయత్నంలో విజయం సాధించి ఆ సొమ్మును దాని యజమానికి ఇచ్చినా-మరణం తటస్థిస్తే ధనం యజమానికి చేరకపోయినా బ్రహ్మహత్యాపాతకం పోతుంది.

అయితే-ఈ ఉపకార ప్రయత్నం చేసినందుకుగాను, దొంగలచేతిలో బ్రాహ్మణుడు మరణించినప్పుడు అపహృతద్రవ్యంతో సమానమైన ధనాన్ని, ధనంకోల్పోయిన వాడే మృతున్ని జ్ఞాతులకివ్వాలి. ॥80॥

*   *ఏవం దృఢవ్రతో నిత్యం బ్రహ్మచారీ సమాహితః ।*
సమాప్తే ద్వాదశే వర్షే బ్రహ్మహత్యాం వ్యపోహతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. **81**

తాత్పర్యం:- ఈ విధంగా ఎవరు నియమాలచేత స్త్రీ సంభోగాది అనుభవాలు మాని, జితేంద్రియులై ఉండి 12 సంవత్సరాలు పూర్తి చేస్తారో, వారే బ్రహ్మ హత్యాపాతకం నుంచి విముక్తులవుతారు. ॥81॥

* *శిష్ట్వా వా భూమిదేవానాం నరదేవసమాగమే ।*
స్వమేనోఽవభృథస్నాతో హయమేధే విముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **82**

తాత్పర్యం:- అశ్వమేధయాగంలో ఋత్విక్కులంతా చేరి ఉండగా రాజు యజ్ఞనిర్వాహకుడై ఉండగా బ్రహ్మాహత్యా పాతకుడు తన పాతకాన్ని తనకు తానుగా వివరించి, ఆ యాగంలో అవభృథస్నానం ఆచరించినట్లయితే, బ్రహ్మాహత్యాపాతకం నుంచి విముక్తుడవుతాడు. ॥82॥

* *ధర్మస్య బ్రాహ్మణో మూలమగ్రం రాజన్య ఉచ్యతే ।*
తస్మాత్సమాగమే తేషామేనో విఖ్యాప్య శుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **83**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ఉపదేశించే ధర్మమే రాజు అనుష్ఠిస్తాడు కాబట్టి-ధర్మవృక్షానికి వేర్లు-బ్రాహ్మణుడు. చిగురుకొన-రాజు అవుతున్నారు. ఈ విధంగా వృక్షమంతా ఉన్నచోట పాపి తన పాపాన్ని వెల్లడిచేసుకోవడం వల్ల పరిశుద్ధుడవుతున్నాడు. ॥83॥

* *బ్రాహ్మణ స్సంభవేనైవ దేవానామపి దైవతమ్ ।*
ప్రమాణం చైవ లోకస్య బ్రహ్మాత్రైవ హి కారణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **84**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు జన్మచేతనే లోకపూజ్యుడు. లోకానికి ప్రత్యక్ష ప్రమాణమూ అయి వున్నవాడు. దీనిక్కారణం సర్వధర్మాలకు మూలమయిన వేదమే అతని యందున్నది. ॥84॥

* *తేషాం వేదవిదో బ్రూయుస్త్రయోఽప్యేనః సు నిష్కృతమ్ ।*
సా తేషాం పావనాయ స్యాత్పవిత్రా విదుషాం హి వాక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **85**

తాత్పర్యం:- వారిలో వేదజ్ఞులైన ముగ్గురు బ్రాహ్మణులైనను బ్రహ్మాహత్యాపాపమును తొలగించుప్రాయశ్చిత్తము చెప్పెదరు. విద్వాంసుల వాక్కు చాలా పవిత్రమైనది. కావున విద్వత్పరిషత్తును పాపపరిహారార్థం అడుగాలి. ॥85॥

* *అతోఽన్యతమమాస్థాయ విధిం విప్రస్సమాహితః ।*
బ్రహ్మాహత్యాకృతం పాపం వ్యపోహత్యాత్మవత్తయా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **86**

తాత్పర్యం:- కాబట్టి-బ్రహ్మాహత్య చేసినవాడు పైన చెప్పబడిన ప్రాయశ్చిత్తాలలో ఏదైనా ఒక ప్రాయశ్చిత్తం జితేంద్రియుడై నిర్వర్తించిన, ఆ హత్యాపాతకం నుంచి నివృత్తి పొందగలడు. ॥86॥

* *హత్వా గర్భమవిజ్ఞాతమేత దేవ వ్రతం చరేత్ ।*
రాజన్యవైశ్యౌ చేజానావాత్రేయీమేవ చ స్త్రియమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **87**

తాత్పర్యం:- బ్రాహ్మణస్త్రీ గర్భాన్ని విచ్ఛిన్నం చేసినా, యాగంలో ఉండగా క్షత్రియ-వైశ్యుల్ని చంపినా, రజస్వలై వున్న స్త్రీని చంపినా, ఈ మూడు హత్యలూ బ్రహ్మాహత్యాపాతకంతో సమానమైనవి కాబట్టి, దానికి చేసే ప్రాయశ్చిత్తమే వీటికీ వర్తిస్తుంది. ॥87॥

* *ఉక్త్వా చైవానృతం సాక్ష్యే ప్రతిరుధ్య గురుం తథా ।*
అపహృత్య చ నిక్షేపం కృత్వా చ స్త్రీసుహృద్వధమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **88**

తాత్పర్యం:- బంగారు, భూమి మొదలైన విషయాలలో తప్పుడు సాక్ష్యమును పలికి, గురువుపై నేరాలుమోపి, బ్రాహ్మణుడి సువర్ణమున కంటే ఇతర నిధులను, క్షత్రియాదుల సువర్ణమును, నిక్షేపమును (దాచిన వస్తువును) హరించినా, బ్రాహ్మణేతరులైన మిత్రుడ్ని చంపినా బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తమును చేయాలి. ॥88॥

* ***ఇయం విశుద్ధిరుదితా ప్రమాప్యా కామతో ద్విజమ్ ।***
కామతో బ్రాహ్మణవధే నిష్కృతిర్న విధీయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**89**

తాత్పర్యం:- ఈ ప్రాయశ్చిత్త విధానమంతా విశేషవిధి లేక సామాన్యంగా అజ్ఞానం చేత బ్రాహ్మణ వధ జరిగినప్పుడు చెప్పబడింది. ఇచ్ఛతో బ్రాహ్మణవధ జరిగినప్పుడు నిష్కృతియుకాదు, ప్రాయశ్చిత్తమునూ కాదు. అయినా, బుద్ధిపూర్వక బ్రాహ్మణహత్యయందు రెండింతలని ప్రాయశ్చిత్త గౌరవమునకే గాని, ప్రాయశ్చిత్తం లేదనడానికి కాదు. ॥89॥

*** సురాపానానికి ప్రాయశ్చిత్తము -**

* ***సురాం పీత్వా ద్విజో మోహాదగ్నివర్ణాం సురాం పిబేత్ ।***
తయా స కాయే నిర్దగ్ధే ముచ్యతే కిల్బిషాత్తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**90**

తాత్పర్యం:- ముఖ్యంగా కల్లును లేదా పులియబెట్టిన మద్యాలను ఆసక్తిచేతగాని, మోహంచేతగాని, ఇతరుల బలవంతం మీదగాని ఒక్కసారి తాగినా- బ్రాహ్మణుడా అపరాధానికి ప్రాయశ్చిత్తంగా సలసల కాగే కల్లును తెచ్చి తాను తాగవలసిందే ! దీనితో నోరుకాలితేనే ఆ పాపం పోయినట్లు.॥90॥

* ***గోమూత్రమగ్నివర్ణం వా పిబేదుదకమేవ వా ।***
పయో ఘృతం వాఽఽమరణాద్గోశకృద్రసమేవ వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**91**

తాత్పర్యం:- చచ్చేంత పనిజరిగేలా (కొన్ని సందర్భాల్లో మృతి చెందినా) ఆవు మూత్రాన్ని లేదా ఆవు పాలను లేదా ఆవు నెయ్యిని బాగా సలసల కాచి కల్లుదాగిన విప్రుని నోటిలో పోయాలి. ॥91॥

* ***కణాన్వా భక్షయేదబ్దం పిణ్యాకం వా సకృన్నిశి ॥***
సురాపానాపనుత్త్యర్థం వాలవాసా జటీ ధ్వజీ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**92**

తాత్పర్యం:- ఆవు రోమాల చేత నేసిన కంబళ్లు ధరించి, జడలు పెరిగేలా దేశ దిమ్మరి అయి, కల్లు ముంతవంటి పాత్రను నెత్తిన బెట్టుకొని రాత్రి ఒకపూట మాత్రం గానుగ ఆడిన తెలకపిండిని తింటూ కాలం గడపాలి. ఇది సాధారణ మద్యపానం విషయమై అజ్ఞాన వశాన త్రాగినదానికి విధించినది. బుద్ధిపూర్వకంగా చేయబడిన దానికి కాదు. ॥92॥

* ***సురాం వై మలమన్నానాం పాప్మా చ మలముచ్యతే ।***
తస్మాద్బ్రాహ్మణరాజన్యౌ వైశ్యశ్చ న సురాం పిబేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**93**

తాత్పర్యం:- పైష్టి అనే ఒక రకం మద్యం బియ్యపు పిండితో చేయబడి, నిల్వ ఉంచడం చేత దీన్ని అన్నసారపు మలం అన్నారు. ఇక్కడ 'మల' శబ్దానికి పాపమని అర్థం. కల్లు పాపసదృశం కాబట్టి పై మూడు వర్ణాల వారికిది నిషిద్ధం.॥93॥

* ***గౌడీ పైష్టీ చ మాధ్వీ చ విజ్ఞేయా త్రివిధా సురా ।***
యథైవైకా తథా సర్వా న పాతవ్యా ద్విజోత్తమైః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**94**

తాత్పర్యం:- గౌడి, పైష్టి, మాధ్వి అని 3 రకాలమద్యాలున్నాయి. గౌడి బెల్లంచేత చేయబడినది. పైష్టి పిండిచేత తయారైనది. మాధ్వి విప్పపూల సారాయి. వీటిలో ద్విజులు దేన్నీ పానం చేయరాదు. ఉపనయనం జరిగిన వారెవ్వరికైనా ప్రాయశ్చిత్త కాండ మద్యం సేవిస్తే తప్పదని తెలుసుకోవాలి. ॥94॥

* యక్షరక్షః పిశాచాన్నం మద్యం మాంసం సురాఽఽసవమ్ ।
తద్బ్రాహ్మణేన నాత్తవ్యం దేవానామశ్నతా హవిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.95

తాత్పర్యం:- ఇంకా ఈ మూడు రకాలే గాక మొత్తం ఉపజాతి మద్యాలతో కలిసి 9 రకాల మద్యాలు ఉన్నాయి. (పులియబెట్టినవి వగైరా॥) ఆసవం లాంటి మద్యాలు కూడా రాక్షసులు పానం చేయదగినవే! దేవతా సంబంధమైన విప్రుడీ వైపు కూడా చూడరాదు. యజ్ఞవేత్తకివి నిషిద్ధాలు. ॥95॥

* అమేధ్యే వా పతేన్మత్తో వైదికం వా వ్యుదాహరేత్ ।
అకార్యమన్యత్కుర్యాద్వా బ్రాహ్మణో మదమోహితః ॥ ప్రక్షిప్త శ్లోక సం.96

తాత్పర్యం:- మద్యపానం చేశాక ఒళ్లు తెలీని స్థితిలో ఎవరైనా ఏం చేస్తారో చెప్పడం కష్టం. తీసుకున్న పరిమాణాన్ని బట్టి కలిగే మత్తువల్ల విప్రుడికి-తాను మలంలో పడినా, వేద మంత్ర పఠనం ఇలాంటి సందర్భాల్లో నిషిద్ధమైనప్పటికీ అది తన నోటి కొచ్చేసినా, లేదా ఒళ్లు వశం తప్పి హత్యకైనా పాల్పడవచ్చు! కాబట్టియే దీన్ని కఠినంగా నిషేధించారు. ॥96॥

* యస్య కాయగతం బ్రహ్మ మద్యేనాప్లావ్యతే సకృత్ ।
తస్య వ్యపైతి బ్రాహ్మణ్యం శూద్రత్వం చ స గచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.97

తాత్పర్యం:- వేదరూపుడైన బ్రాహ్మణుడు మద్యం సేవిస్తే వేదార్హత కోల్పోతాడు. బ్రాహ్మణ్యాన్ని కోల్పోతాడు. శూద్రత్వం సంభవిస్తోందని అర్థం. కాబట్టే విప్రుడి విషయంలో మద్యపానాన్ని తీవ్రమైన పాపంగా పరిగణించారు.॥97॥

*** బంగారపు దొంగతనానికి ప్రాయశ్చిత్తము -**

* ఏషా విచిత్రాఽభిహితా సురాపానస్య నిష్కృతిః ।
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి సువర్ణస్తేయనిష్కృతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.98

తాత్పర్యం:- ఈ ప్రకారం సురాపానం వల్ల కలిగే పాపం, ప్రాయశ్చిత్తాల గురించి చెప్పబడింది. ఇప్పుడు బంగారం దొంగిలించిన వారికి ప్రాయశ్చిత్తాలు చెప్పబడుతుంది. ॥98॥

*** సువర్ణస్తేయప్రాయశ్చిత్తం-**

* సువర్ణ స్తేయకృద్విప్రో రాజానమభిగమ్య తు ।
స్వకర్మ ఖ్యాపయన్ బ్రూయాన్మాం భవాననుశాస్త్వితి ॥ ప్రక్షిప్త శ్లోక సం.99

తాత్పర్యం:- బ్రాహ్మణుడి బంగారాన్ని బ్రాహ్మణుడే దొంగిలిస్తే అతడే స్వయంగా రాజు దగ్గరకెళ్లి "నేను బంగారం విప్రుడిది అపహరించాను. నన్ను శిక్షించండి" అని చెప్పాలి. (రాజుకు చెప్పడం వల్ల) 'చేసిన పాపం కొంత చెప్తే పోతుందని' నానుడి కాబట్టి అలా చెప్పాలి. తిరిగి ఇంటికి వచ్చి, తపస్సు చేత ఆ పాపం పోగొట్టుకోవాలి. ॥99॥

* గృహీత్వా ముసలం రాజా సకృద్ధన్యాత్తు తం స్వయమ్ ।
వధేన శుద్ధ్యతి స్తేనో బ్రాహ్మణస్తపసైవ తు ॥ ప్రక్షిప్త శ్లోక సం.100

తాత్పర్యం:- ఇతరులు ఈ పాపం చేసినప్పుడు వారే స్వయంగా ఒక రోకలి లాంటి ఆయుధంతో రాజు వద్దకు వెళ్లి, వారి పాపం వారే వెల్లడించి రాజును శిక్షించమని కోరాలి.

ఆ ఆయుధంతోనే రాజు అతడిని ఒక్కదెబ్బవేయాలి. దాంతో వాడు మృతిచెందినా, చచ్చేంత పర్యంతం అయినా ఆ పాపం పోతుంది. బ్రాహ్మణుడికి మాత్రం తపస్సు చేతనే పాపం నశిస్తుంది. ॥100॥

*　*తపసాపనునుత్సుస్తు సువర్ణస్తేయజం మలమ్ ।*
చీరవాసా ద్విజోఽ రణ్యే చరేద్బ్రహ్మహణో వ్రతమ్ ॥　ప్రక్షిప్త శ్లోక సం. **101**

తాత్పర్యం:- ఈ తపస్సుచేత, అలాంటి పాపం పోగొట్టుకోదలచిన బ్రాహ్మణుడు నారవస్త్రాలను ధరించి, అడవుల్లో 12 సంవత్సరాల కాలం సంచరిస్తూ, బ్రహ్మహత్యాపాతకం చేసినవాడనుసరించే ప్రాయశ్చిత్త విధిననుసరించాలి. ॥101॥

* గురుపత్ని గమనానికి ప్రాయశ్చిత్తము-

*　*ఏతైర్వ్రతైరపోహేత పాపం స్తేయకృతం ద్విజః ।*
గురుస్త్రీగమనీయం తు వ్రతైరేభిరపానుదేత్ ॥　ప్రక్షిప్త శ్లోక సం. **102**

తాత్పర్యం:- పైన చెప్పబడిన ప్రాయశ్చిత్తాలచేత బ్రాహ్మణ సువర్ణాపహరణదోషాలను పోగొట్టుకోవాలి. ఇప్పుడు గురుభార్యను సంగమించే వారి దోషానికి ప్రాయశ్చిత్తాలు చెప్పబడతాయి. ॥102॥

*　*గురుతల్ప్యభిభాష్యైనస్తప్తే స్వప్యాదయోమయే ।*
సూర్మీం జ్వలంతీం స్వాశ్లిష్యేన్మృత్యునా స విశుధ్యతి ॥　ప్రక్షిప్త శ్లోక సం. **103**

తాత్పర్యం:- ఏ శిష్యుడైనా తుంటరితనం చేత గాని లేదా యవ్వనవతిగా ఉన్న గురుభార్య అందానికి గాని వశుడై, గురువు ఇంటలేనప్పుడు, మిగిలిన శిష్యులు వేదాధ్యాయంలో ఉండగా ఒంటరిగా ఉన్న గురుభార్యను సంగమించినట్లయితే తానొర్చిన పాపాన్ని రాజుకు చెప్పుకొని, బాగా కాలిన ఇనుపమంచం మీద, అంతకంటే ఎర్రగా కాల్చిన స్త్రీ ప్రతిమను కౌగలించుకొని మరణిస్తేనే ఆ పాపం పోతుంది. ॥103॥

*　*స్వయం వా శిశ్నవృషణావుత్కృత్యాధాయ చాంజలౌ ।*
నైరృతీం దిశమాతిష్ఠేదానిపాతాదజిహ్మగః ॥　ప్రక్షిప్త శ్లోక సం. **104**

తాత్పర్యం:- లేదా, తన శిశ్నాన్ని వృషణాలతో సహా తానే కోసుకొని చేత పట్టుకొని నైరృతి మూలనుద్దేశించి నడుస్తూ క్రిందపడి మరణించే వరకు చీకటిలోన సాగిపోవాలి. నరకంలో విధించే శిక్షలను తనకుతానే ఇహంలోనే విధించుకుని పాపం పోగొట్టుకోవాలి. ॥104॥

*　*ఖట్వాంగీ చీరవాసా వా శ్మశ్రులో విజనే వనే ।*
ప్రాజాపత్యం చరేత్కృచ్ఛ్రమబ్దమేకం సమాహితః ॥　ప్రక్షిప్త శ్లోక సం. **105**

తాత్పర్యం:- గృహస్థుడైతే భ్రమచేత తన భార్యకు బదులు గురుపత్నితో రమిస్తే, ఆ పాపం పోవడానికి నిర్జన వనంలో జడలు పెరిగేదాకా పుర్రె-నారవస్త్రాలు ధరించి, చింకిపాతలతో తిరుగుతూ ఏడాది కాలం ప్రాజాపత్య కృచ్ఛ్రం ఆచరించాలి. ॥105॥

*　*చాంద్రాయణం వా త్రీన్ మాసానభ్యస్యేన్నియతేంద్రియః ।*
హవిష్యేణ యవాగ్వా వా గురుతల్పాపనుత్తయే ॥　ప్రక్షిప్త శ్లోక సం. **106**

తాత్పర్యం:- జారిణి అయిన గురుభార్యని సంగమించినా, ఆమె గురుపత్ని స్థానములో ఉన్నది కాబట్టి, దోషపరిహారార్థం ఇంద్రియాలు వశంలోకి తెచ్చుకొని దుంపలు, పండ్లు ఆహారంగా తీసుకొంటూ, లేదా నీటినే పుచ్చుకొంటూ మూడు నెలల కాలం చాంద్రాయణ వ్రతం ఆచరించాలి. ॥106॥

* ఉపపాతకాలకు ప్రాయశ్చిత్తము-

* ***ఏతైర్వ్రతైరపోహేయుర్మహాపాతకినో మలమ్ ।***
ఉపపాతకినస్త్వేవమేభిర్నానావిధైర్వ్రతైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***107***

తాత్పర్యం:- పైన చెప్పబడిన రీతుల్లో ముఖ్య మహాపాతకాలు పోగొట్టుకోవాలి. గోవధ లాంటి ఉపపాతకములకు ఇప్పుడు చెప్పబోయే ప్రాయశ్చిత్తాలు వర్తిస్తాయి.... ॥107॥

* ***ఉపపాతకసంయుక్తో గోఘ్నో మాసం యవాన్ పిబేత్ ।***
కృతవాపో వసేద్గోష్ఠే చర్మణా తేన సంవృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***108***

తాత్పర్యం:- గోహత్య చేసినట్లయితే శిరోముండనం చేసుకొని, ఒక నెలంతా బియ్యం ఉడికించిన గంజి మాత్రమే తాగి ఉండి, తదుపరి తాను చంపిన గోవు చర్మంతోనే దేహాన్ని కప్పుకొని, ఉప్పుకారాలు లేని తిండి తింటూ మూడు నెలలు గోవులమంద మధ్యలో వాసం చేయాలి. ॥108॥

* ***చతుర్థకాలమశ్నీయాదక్షారలవణం మితమ్ ।***
గోమూత్రేణాచరేత్స్నానం ద్వౌ మాసౌ నియతేంద్రియః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***109***

తాత్పర్యం:- గోమూత్రంతో స్నానం చేస్తూ జితేంద్రియుడై ఉప్పు కారం లేక హవిష్యాన్ని రెండవదినం సాయంకాలం తింటూ రెండవ మూడవ నెల గడపాలి. ॥109॥

* ***దివానుగచ్ఛేద్గాస్తాస్తు తిష్ఠన్నూర్ధ్వం రజః పిబేత్ ।***
శుశ్రూషిత్వా నమస్కృత్య రాత్రౌ వీరాసనం వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***110***

తాత్పర్యం:- ఈ మూడు నెలలు పగటిపూట ఉదయాన ఆవులను తోలుకొనిపోతూ నిలబడి ఉండి ఆవులగిట్టల వల్లవచ్చిన దుమ్ముచే పవిత్రం కావాలి. రాత్రియందాగోవులకు ఒళ్ళుగోకుటవంటి శుశ్రూషలతో గోడమొదలగువాని నానుకొనక వీరాసనం వేసి కొని కూర్చుండాలి. ॥110॥

* ***తిష్ఠంతీష్వనుతిష్ఠేత్తు వ్రజంతీష్వప్యనువ్రజేత్ ।***
ఆసీనాసు తథాసీనో నియతో వీతమత్సరః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***111***

తాత్పర్యం:- ఇట్లు పరిశుద్ధుడై క్రోధం లేక ఆవులు నిలబడితే తాను నిలబడాలి. అవి నడుస్తూ ఉంటే వాటివెంట పోవాలి. కూర్చుంటే కూర్చోవాలి. ॥111॥

* ***ఆతురామభిశస్తాం వా చౌరవ్యాఘ్రాదిభిర్భయైః ।***
పతితాం పంకలగ్నాం వా సర్వోపాయైర్విమోచయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***112***

తాత్పర్యం:- ఆవులు రోగంతో ఉన్నా దొంగలు, పులులవాతబడ్డా, క్రిందబడ్డా, బురదలో పడ్డా వాటిని రక్షించాలి.॥112॥

*   ఉష్ణే వర్షతి శీతే వా మారుతే వాతి వా భృశమ్ ।
న కుర్వీతాత్మనస్త్రాణం గోరకృత్వా తు శక్తితః ॥   ప్రక్షిప్త శ్లోక సం. 113

తాత్పర్యం:- ఎండ,వాన, చలి బాగా ఉన్నప్పుడు ఆవులకు సంరక్షణ చేయకుండా తాను రక్షణచేసికోకూడదు.॥113॥

*   ఆత్మనో యది వాన్యేషాం గృహే క్షేత్రేఽథవా ఖలే ।
భక్షయంతీం న కథయేత్పిబంతం చైవ వత్సకం ॥   ప్రక్షిప్త శ్లోక సం. 114

తాత్పర్యం:- అవి ఇతరుల ఇండ్లలో, పొలాల్లో మేస్తుంటే ఎవరికి చెప్పవద్దు. దూడ పాలుతాగుతున్న విషయాన్ని ఎవరికి చెప్పకూడదు. ॥114॥

*   అనేన విధినా యస్తు గోఘ్నో గామనుగచ్ఛతి ।
స, గోహత్యాకృతం పాపం త్రిభిర్మాసైర్వ్యపోహతి ॥   ప్రక్షిప్త శ్లోక సం. 115

తాత్పర్యం:- ఈ విధంగా గోహత్య చేసినవాడు మూడునెలలు గోశుశ్రూష చేస్తూ గోహత్యా పాపాన్ని పోగొట్టుకుంటాడు. ॥115॥

*   వృషభైకాదశా గాశ్చ దద్యాత్సు చరితవ్రతః ।
అవిద్యమానే సర్వస్వం వేదవిద్భ్యో నివేదయేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. 116

తాత్పర్యం:- ఈ విధంగా పరిపూర్ణ ప్రాయశ్చిత్తం అనుష్ఠించేవాడు వ్రతం పూర్తయ్యాక 15 ఆవులను-ఒక ఆంబోతును దానం చేయాలి. లేదా దాత, తన యావత్ ధనాన్ని వేదవేత్తలయిన బ్రాహ్మణుల పరంచేయాలి. తిరిగి కొత్తగా ద్రవ్యసముపార్జన చేసుకోవాలి. ॥116॥

*   ఏతదేవ వ్రతం కుర్యురుపపాతకినో ద్విజాః ।
అవకీర్ణీవర్జం శుద్ధ్యర్థం చాంద్రాయణమథాపి వా ॥   ప్రక్షిప్త శ్లోక సం. 117

తాత్పర్యం:- ఇలాగే అవకీర్ణితు అయినవాడు తప్ప, మిగిలిన ఉపపాతకాలన్నిటికీ గోవధ విషయమై చెప్పిన ప్రాయశ్చిత్తమే వర్తిస్తుంది. లేదా తేలికగా ఉన్నందున చాంద్రాయణ వ్రతాన్నయినా ఆచరించాలి. లఘువైన ఉపపాతకం చేసినప్పుడు వర్ణమును బట్టి వారి గుణాలను బట్టి, శక్తిని బట్టి ఈ వ్రతం వర్తిస్తుంది. ॥117॥

* అవకీర్ణి యొక్క ప్రాయశ్చిత్తము -

*   అవకీర్ణీ తు కాణేన గర్దభేన చతుష్పథే ।
పాకయజ్ఞ విధానేన యజేత నిరృతిం నిశి ॥   ప్రక్షిప్త శ్లోక సం. 118

తాత్పర్యం:- అవకీర్ణి అయితే, కన్నుకాయకాచి ఉన్న గాడిదను వెతుక్కుని, రాత్రి పూట నాలుగుదార్లు కలిసేచోట గాడిద వసతో పాకయజ్ఞతంత్రం ప్రకారం నైరృతికి హోమం చేయాలి. ॥118॥

*   హుత్వాఽగ్నౌ విధివద్ధోమానంతతశ్చ సమేత్యృచా ।
వాతేంద్రగురువహ్నీనాం జుహుయాత్సర్పిషాఽహుతీః ॥   ప్రక్షిప్త శ్లోక సం. 119

తాత్పర్యం:- ఈ విధంగా శాస్త్రప్రకారం గర్ధభవ పాలతో హోమంచేసి అటుపైన 'సం మా సించస్తు మరుతః' అనే ఋక్కుతో బృహస్పతి, అగ్ని, ఇంద్రుడు, వాయువులకు నేతితో హోమం చెయ్యాలి. ॥119॥

*   కామతో రేతసస్సేకం వ్రతస్థస్య ద్విజన్మనః ।
అతిక్రమం వ్రతస్యాహుర్ధర్మజ్ఞా బ్రహ్మవాదినః ॥   ప్రక్షిప్త శ్లోక సం. 120

తాత్పర్యం:- ఏ బ్రాహ్మణుడు బ్రహ్మచర్య వ్రతధారి అయి ఉండి కూడా అతికామంతో యోనిలోకి రేతస్సు వదులుతాడో....అంటే బ్రహ్మచర్యవ్రత భంగం చేస్తాడో అలాంటివాడిని అవకీర్ణి అంటారు. ॥120॥

* ***మారుతం పురుహూతం చ గురుం పావక మేవ చ ।***
చతురో వ్రతినోఽభ్యేతి బ్రాహ్మం తేజోఽవకీర్ణినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***121***

తాత్పర్యం:- అవకీర్ణిని బ్రహ్మతేజస్సు విడిచిపెట్టి వెళ్లిపోయి ఇంద్ర, వాయు, అగ్ని, బృహస్పతులను చేరుతోంది. కాబట్టే అవకీర్ణి తిరిగి తన తేజస్సు పొందడానికి వాయ్వాది దేవతలకు ఆజ్యహోమం జరపాల్సి ఉంటుంది. ॥121॥

* ***ఏతస్మిన్నేనసి ప్రాప్తే వసిత్వా గర్దభాజినమ్ ।***
సప్తాగారాంశ్చ రేద్భైక్షం స్వకర్మ పరికీర్తయన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***122***

తాత్పర్యం:- అవకీర్ణ దోషం సంభవించినప్పుడు, ప్రాయశ్చిత్త విధి నిర్వర్తించుకొన్న తరవాత, అతడు గాడిద చర్మం ధరించి, 'నేను అవకీర్ణినైతిని' అని స్వయంగా చెప్పుకుంటూ ఏడు ఇళ్లలో భిక్షం ఎత్తుకోవాలి. ॥122॥

* ***తేభ్యో లబ్ధేన భైక్షేణ వర్తయన్నేక కాలికమ్ ।***
ఉపస్పృశం స్త్రిషవణం త్వబ్దేన స విశుధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***123***

తాత్పర్యం:- అలా బిచ్చమెత్తినభోజనమే ఒంటిపూట తింటూ, ఒక ఏడాది కాలం మూడు పూటలా స్నానం చేస్తూంటే గాని అతనికా అవకీర్ణత నుంచి పరిపూర్ణ ఉపశమనం కలగదు. ॥123॥

* ***జాతిభ్రంశం చేయు కర్మలకు ప్రాయశ్చిత్తము-***

* ***జాతిభ్రంశకరం కర్మ కృత్వాన్యతమమిచ్ఛయా ।***
చరేత్సాంతపనం కృచ్ఛ్రం ప్రాజాపత్యమనిచ్ఛయా ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***124***

తాత్పర్యం:- జాతిభ్రంశకరమైన ఏ అకార్యాలొనర్చినా, అవి బుద్ధిపూర్వకంగా చేస్తే ఇటుపై చెప్పబడే సాంతపన కృచ్ఛ్రాలనే ఏడు రోజుల ప్రాయశ్చిత్తాలు చేయాలి. తెలియక చేస్తే ప్రాజాపత్యకృచ్ఛ్రా లాచరించాలి. ॥124॥

* ***అపాత్ర-వర్ణ సంకరము చేయువారి కర్మలకు ప్రాయశ్చిత్తము -***

* ***సంకరాపాత్రకృత్యాసు మాసం శోధనమైందవమ్ ।***
మలినీకరనీయేషు తప్తస్స్యాద్యావకైస్త్ర్యహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***125***

తాత్పర్యం:- సంకరీకరణం, అపాత్రీకరణం లాంటివి బుద్ధి పూర్వకంగా చేస్తే ఒక నెల చాంద్రాయణ వ్రతం చేయాలి. మలినీకరణ కర్మలు చేస్తే మూడు రాత్రులు వేడివేడి గంజి త్రాగాలి. ॥125॥

* క్షత్రియాదుల వధకు ప్రాయశ్చిత్తము -

* ***తురీయో బ్రహ్మహత్యాయాః క్షత్రియస్య వధేస్మృతః ।***
వైశ్యేఽష్ట మాంశో వృత్తస్థే శూద్రే జ్ఞేయస్తు షోడశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***126***

తాత్పర్యం:- సుక్షత్రియుణ్ణి చంపితే బ్రహ్మహత్యాపాతక ప్రాయశ్చిత్తంలో నాలుగోభాగం మూడు సంవత్సరాలకాలం పాటు చేయాల్సి ఉంటుంది. మొత్తం 12 సంవత్సరాల కాలంలోను ఇది చివరిది. ఇది గుణవంతుడైన క్షత్రియుడిని చంపితే చేయాల్సి ఉంటుంది. వైశ్యుడికైతే ఏడాదిన్నర కాలం, శూద్రుణ్ణి చంపితే తొమ్మిదినెలల కాలం ఈ కృచ్ఛ్రం ఆచరించాలి. ॥126॥

* *అకామతస్తు రాజన్యం వినిపాత్య ద్విజోత్తమః ।*
వృషభైకసహస్రాగా దద్యాత్సుచరితవ్రతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **127**

తాత్పర్యం:- సుక్షత్రియుడని తెలీక బ్రాహ్మణుడు వధించడం జరిగితే వెయ్యి ఆవులను, ఒక ఆంబోతును దానం చేయాల్సి ఉంటుంది. ॥127॥

* *త్ర్యబ్దం చరేద్వా నియతో జటీ బ్రహ్మహణో వ్రతమ్ ।*
వసన్ దూరతరే గ్రామాద్వృక్షమూలనికేతనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **128**

తాత్పర్యం:- ఈ పాపానికి మరో నిష్కృతిగా ఇలా చెయ్యవచ్చు!.... జడధారి అయి, గ్రామానికి ఎంతో దూరంగా చెట్లకింద నివసిస్తూ జితేంద్రియత్వం కలిగి మూడేళ్ల పాటు బ్రహ్మహత్యాపాతక ప్రాయశ్చిత్తంలో చివరిభాగాన్ని ఆచరించాలి. హతుడి పుర్రె ధరించడం లాంటి నియమాలు వర్తించవు. ॥128॥

* *ఏతదేవ చ రేదబ్దం ప్రాయశ్చిత్తం ద్విజో త్తమః ।*
ప్రమాప్య వైశ్యం వృత్తస్థం దద్యాచ్చైకశతం గవామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **129**

తాత్పర్యం:- సలక్షణమైన వైశ్యుణ్ణి ఏ కారణం చేతనైనా బ్రాహ్మణుడు వధిస్తే ఒక సంవత్సరకాలం ఈ కృచ్ఛంలో చివరిభాగాన్ని ఆచరించాలి. అంతేగాక 101 గోవులను బ్రాహ్మణులకు దానం చేయాలి. ॥129॥

* *ఏతదేవ వ్రతం కృత్స్నం షణ్మాసాచ్ఛూద్రహా చరేత్ ।*
వృషభైకాదశా వాపి దద్యాద్విప్రాయ గాస్సితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **130**

తాత్పర్యం:- సలక్షణుడైన శూద్రుణ్ణి తాత్కాలికావేశాదులచేత విప్రుడు వధించి నప్పుడు ఇదే కృచ్ఛం 6 మాసాల పాటు ఆచరిస్తే సరిపోతుంది. ఆవులు 10, ఆబోతునొక్కదాన్ని దానంగా ఇవ్వాలి. ॥130॥

* **పశు పక్ష్యాదుల వధకు ప్రాయశ్చిత్తము-**

* *మార్జారనకులౌ హత్వా చాషం మండూకమేవ చ ।*
శ్వగోధోలూకకాకాంశ్చ శూద్రహత్యావ్రతం చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **131**

తాత్పర్యం:- పిల్లి, ముంగిస, పాలపిట్ట, కప్ప, కుక్క కాకి, ఉడుము, గుడ్లగూబ, వీటిని చంపినట్లయితే శూద్రహత్య ప్రాయశ్చిత్తం (చాంద్రాయణ వ్రతం) ఆచరించాలి. కానీ బ్రాహ్మహత్యా పాతకంలో చేసే ప్రాయశ్చిత్తంలో 16వవంతు ఆచరించవలసిన పనిలేదు. ఇదైనా బుద్ధిపూర్వకంగా పలుమార్లు వీటిని చంపినపుడే ఆచరించాలి. ॥131॥

* *పయః పిబేత్త్రిరాత్రం వా యోజనం వాఽధ్వనో వ్రజేత్ ।*
ఉపస్పృశేత్స్రవంత్యాం వా సూక్తం వాఽబ్దైవతం జపేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **132**

తాత్పర్యం:- బుద్ధిపూర్వకంగా గాని, పొరపాటుగా గాని, మార్జాలాదులను చంపినప్పుడు మూడు రోజులు పాలు ఆహారంగా తీసుకోవాలి. లేదా రోజుకు మూడు యోజనాల దూరం నడవాలి. దానికీ శక్తిలేకపోతే మూడు రోజులపాటు నదీస్నానం గాని-అబ్దైవతా మంత్రాలను పఠించడం గాని చేయాలి. ॥132॥

* *అభ్రిం కార్ష్ణాయసీం దద్యాత్సర్పం హత్వా ద్విజోత్తమః ।*
పలాలభారకం షండే సైసకం చైకమాషకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **133**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు పామును చంపితే వాడి మొనగల శూలాన్ని దానం చెయ్యాలి. నపుంసకుణ్ణి చంపితే కసవు (గడ్డి)మోపు, సీసపుపాత్ర దానం చెయ్యాలి. ॥133॥

*   ఘృతకుంభం వరాహే తు తిలద్రోణం తు తిత్తిరౌ ।
శుకే ద్విహాయనం వత్సం క్రౌంచం హత్వా త్రిహాయనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***134***

తాత్పర్యం:- పందిని చంపితే నేతితో నిండిన పాత్రని దానం చేయాలి. తిత్తిరి పిట్టని చంపితే నాలుగు తూముల నువ్వులు దానం చేయాలి. చిలుకని చంపితే రెండేళ్ల దూడని దానం చేయాలి. క్రౌంచపక్షిని చంపితే మూడేళ్లదూడని బ్రాహ్మణుడికి దానంగా ఇవ్వాలి. ॥134॥

*   హత్వా హంసం బలాకాం చ బకం బర్హిణమేవ చ ।
వానరం శ్యేనభాసౌ చ స్పర్శయేద్బ్రాహ్మణాయ గామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***135***

తాత్పర్యం:- హంస, కొంగ, కొక్కిరాయి, నెమలి, కోతి, డేగ, గ్రద్ద.....ఈ పక్షులలో దేన్ని చంపినా బ్రాహ్మణుడికి గోదానం చేయాలి. ॥135॥

*   వాసో దద్యాద్ధయం హత్వా పంచ నీలాన్ వృషాన్ గజమ్ ।
అజమేషావనడ్వాహం ఖరం హత్వైకహాయనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***136***

తాత్పర్యం:- గుర్రాన్ని చంపితే వస్త్రదానం, ఏనుగును చంపితే ఐదు నల్లని ఎద్దుల దానం, మేక పోతునుగాని-పొట్టేలును గాని చంపితే ఒక ఎద్దును, గాడిదను గాని చంపితే ఒక ఏడాది వయస్సున్న లేగదూడను దానం చేయాలి. ॥136॥

*   క్రవ్యాదాంస్తు మృగాన్ హత్వా ధేనుం దద్యాత్పయస్వినీమ్ ।
అక్రవ్యాదాన్వత్సతరీముష్ట్రం హత్వా తు కృష్ణలమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***137***

తాత్పర్యం:- పచ్చిమాంసం తినే పులి లాంటి క్రూరమృగాల్ని చంపితే బాగా సమృద్ధిగా పాలిచ్చే పాడి ఆవును; మాంసం తినని లేడి లాంటి మృగాల్ని చంపితే మూడేళ్ల వయసున్న లేగదూడను దానం చేయాలి. ఒంటెని చంపితే ఒక గురివింద గింజ ఎత్తు బంగారం దానం ఇవ్వాలి. ॥137॥

*   జీనకార్ముకబస్తావీన్ పృథగ్దద్యాద్విశుద్ధయే ।
చతుర్ణామపి వర్ణానాం నారీర్హత్వాఽనవస్థితాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***138***

తాత్పర్యం:- వ్యభిచారిణిగా లోభంచేత మారినట్టి బ్రాహ్మణస్త్రీని చంపితే గుర్రపుజీను, అలాంటి క్షత్రియస్త్రీ అయితే విల్లు, వైశ్య స్త్రీ అయితే మేక,శూద్ర స్త్రీ అయితే పొట్టేలును దానం చేయాలి. ॥138॥

*   దానేన వధనిర్ణేకం సర్పాదీనామశక్నువన్ ।
ఏకైకశశ్చరేత్కృచ్ఛ్రం ద్విజః పాపాపనుత్తయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***139***

తాత్పర్యం:- పామును చంపడం మొదలైన పాపాల నుంచి నివృత్తి పొందడానికి కొయ్యగొడ్డలి దానం చెయ్యాలి. బ్రాహ్మణులు ఈ పైవాటిని ఏయే జంతువులను చంపినా కొనవలసివున్న వస్తు/జంతు జాలం కొనలేకపోతే అన్ని ప్రాయశ్చిత్తాలకు ముఖ్యమైన దైన ప్రాజాపత్యకృచ్ఛ్రం ఆచరించాలి. ॥139॥

*   అస్థిమతాం తు సత్త్వానాం సహస్రస్య ప్రమాపణే ।
పూర్ణే చానస్యనస్థ్నాం తు శూద్రహత్యావ్రతం చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***140***

తాత్పర్యం:- ఎముకలుండే తొండలు లాంటివి ఒక వేయి చంపినప్పుడు, ఎముకలులేనివీ -కీటకాల జాతికి చెందినవీ అయిన పేను, నల్లి లాంటి వాటిని లెక్కలేనన్ని చంపినప్పుడు శూద్రవధకు ఆచరించే ప్రాయశ్చిత్తాన్ని ఆచరించాలి. ఇలాంటి క్షుద్రజంతువుల విషయమై మరికొన్ని ప్రాయశ్చిత్తాలు ఈ దిగువ చెప్పబడ్డాయి.... ॥140॥

* ***కించిదేవ తు విప్రాయ దద్యాదస్థిమతాం వధే ।***
అనస్థ్నాం చైవ హింసాయాం ప్రాణాయామేన శుధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***141***

తాత్పర్యం:- పైన ఉదహరించిన జంతువులలో తొండనొక్కటి చంపినప్పుడు ఒక బ్రాహ్మణుడికి ఒక వెండి రూక దానంగా ఇస్తే ఆ పాపం పోతుంది. పేను, నల్లి లాంటి క్షుద్రజీవులను చంపితే, ద్విజుడు ప్రాణాయామం చేత పరిశుద్ధుడు కావచ్చు! ॥141॥

* ***ఫలదానాం తు వృక్షాణాం ఛేదనే జప్యమృక్శతమ్ ।***
గుల్మవల్లీలతానాం చ పుష్పితానాం చ వీరుధామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***142***

తాత్పర్యం:- ఫలాలనిచ్చే చెట్లు, గొజ్జంగి వంటి పొదలు, చెట్లకు అల్లుకొని ఉన్నతీగలు, కూరగాయపాదులు, ఏ ఒక్కటి నరికినా సావిత్రీ-గాయత్రీ జపం వంద సంఖ్యలో చెయ్యాలి. వంటచెరకు నిమిత్తం పచ్చిచెట్లు నరకడం అనేది ఉపపాతకాల క్రిందకి వస్తున్నందున దానికి అధికప్రాయశ్చిత్తం. ఇవన్నీ ఒక్కసారి చేయబడిన వాటికే. మళ్లీ నరికితే తిరిగి ప్రాయశ్చిత్తమేగతి. ॥142॥

* ***అన్నాద్యజానాం సత్త్వానాం రసజానాం చ సర్వశః ।***
ఫలపుష్పోద్భవానాం చ ఘృతప్రాశో విశోధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***143***

తాత్పర్యం:- అన్నాదుల వల్ల జనించినవి, బెల్లం మొదలైన రస పదార్థాలలో పుట్టినవి, అత్తి-ఇప్ప మొదలైన పువ్వులలో పుట్టినవి అయిన సూక్ష్మ ప్రాణులు, కీటకాలు వీటిని చంపితే వచ్చే పాపానికి నేతిని ఆపోశనం పట్టి లోపలికి పుచ్చుకోవాలి. అదే ప్రాయశ్చిత్తం సూక్ష్మజీవుల విషయంలో- ॥143॥

* ***కృషిజానా మోషధీనాం జాతానాం చ స్వయం వనే ।***
వృథాలంభేఽనుగచ్ఛేద్గాం దినమేకం పయోవ్రతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***144***

తాత్పర్యం:- నేల దున్ని పండించే ధాన్యాలు, ఓషధులు, పైర్లు మొదలైనవి; వనాలలో అంతటా మెలిచే నీవార ధాన్యాలు వీటిని ప్రయోజనరహితంగా పెరికితే, ఒకరోజు అంతా పాలు ఆహారంగా గ్రహించాలి. ఒక రోజు మొత్తం గోవును వెంబడించి తిరగడమే ప్రాయశ్చిత్తం. ॥144॥

* అభక్ష్య భక్షణానికి ప్రాయశ్చిత్తము-

* ***ఏతైర్వ్రతైరపోహ్యం స్యాదేనో హింసాసముద్భవమ్ ।***
జ్ఞానాజ్ఞానకృతం కృత్స్నం శృణుతానాద్యభక్షణే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***145***

తాత్పర్యం:- ఈ పైన చెప్పబడిన ప్రాయశ్చిత్తాలచేత జ్ఞానం లేదా అజ్ఞాన కృతమైనట్టి ప్రాణిహింస పాపాలను పోగొట్టుకోవాలి. ఇక-భక్షించకూడని వస్తువులను భక్షించడం వల్ల కలిగే దోషాలకు నివృత్తి చెపుతాను-వినండి!॥145॥

* ***అజ్ఞానాద్వారుణీం పీత్వా సంస్కారేణైవ శుధ్యతి ।***
మతిపూర్వమనిర్దేశ్యం ప్రాణాంతికమితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***146***

తాత్పర్యం:- పైష్టి, మాధ్వి అనే రెండు రకాల మద్యజాతులను తప్ప మిగిలిన అన్ని రకాల మద్యములు బుద్ధిపూర్వకంగా గాక, అజ్ఞానం వల్ల పానం చేస్తే అతడికి తిరిగి ఉపనయన సంస్కారం చేయాలి. బుద్ధిపూర్వకంగా చేస్తే ప్రాణపరిత్యాగమే దండనగా విధించాలి. ॥146॥

* అపస్సురాభాజనస్థా మద్యభాండస్థితా స్తథా ।
పంచరాత్రం పిబేత్పీత్వా శంఖపుష్పీశ్రితం పయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **147**

తాత్పర్యం:- పైష్టి అనే సురపాత్రలతో ఉంచినవి, తదితర మద్యాలయినా, లేదా ఆ మద్యపాత్రలలో వాసన లేనట్టి మద్యాన్ని సేవించినట్లయినా ఐదురోజులు శంఖపుష్పి మూలికతో కాచిన పాలు త్రాగి నిరాహారంగా ఉంటే పాపం హరిస్తుంది. ॥147॥

* స్పృష్ట్వా దత్వాచ మదిరాం విధివత్ప్రతిగృహ్య చ ।
శూద్రోచ్ఛిష్టిశ్చ పీత్వాఽపః కుశవారి పిబేత్త్ర్యహమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **148**

తాత్పర్యం:- మద్యాన్ని, తాకినా, ఇతులకు ఇచ్చినా, మంత్రపురస్సరంగానే మద్యాన్ని తీసుకొన్నా, ఏ విధంగా సురాపానం చేసినా పాపమే ! శూద్రుడు తాగగా మిగిలిన నీటిని దర్భగడ్డివేసి కాచి మూడు రోజులు తాగడమే ప్రాయశ్చిత్తం.॥148॥

* బ్రాహ్మణస్తు సురాపస్య గంధమాఘ్రాయ సోమపః ।
ప్రాణానప్సు త్రిరాయమ్య ఘృతం ప్రాశ్య విశుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **149**

తాత్పర్యం:- సోమయాగం చేసిన విప్రుడు, మద్యపానం చేసినట్టి వాడి ముఖం నుంచి వచ్చే వాసనను ఆఘ్రాణించడం గాని జరిగితే, దాని క్కూడా ప్రాయశ్చిత్తవిధి ఉంది. నీటినడుమ ముమ్మారు ప్రాణాయామాన్ని ఆచరించి, ఆజ్యపానం (నెయ్యి) వల్ల పరిశుద్ధుడవుతాడు. ॥149॥

* అజ్ఞానాత్ప్రాశ్య విణ్మూత్రం సురాసంస్పృష్టమేవ చ ।
పునస్సంస్కారమర్హంతి త్రయో వర్ణా ద్విజాతయః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **150**

తాత్పర్యం:- తమకు తెలియకుండా మలినపదార్థముల భక్షణగాని జరిగిపోయినప్పుడు- బ్రాహ్మణులకున్న ఏకైక మార్గం- తమకు అంతవరకు ఉన్న బ్రాహ్మణ్యం కోల్పోయినందున, తిరిగి శాస్త్రోక్తంగా ఉపనయనం చేసుకోవడమే!॥150॥

* వపనం మేఖలా దండో భైక్షచర్యా వ్రతాని చ ।
నివర్తంతే ద్విజాతీనాం పునస్సంస్కార కర్మణి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **151**

తాత్పర్యం:- క్షౌరం, మొలతాడు ధరించడం, భిక్షాటనం చేయడం, మద్యమాంసాలను స్త్రీని వీడుట వీటికి సంబంధించిన ప్రాయశ్చిత్తాలు తిరిగి ఉపనయనం చేసుకొంటే ద్విజులు ఆచరించనక్కర్లేదు. ॥151॥

* అభోజ్యానాంతు భుక్త్వాన్నం స్త్రీశూద్రోచ్ఛిష్టమేవ చ ।
జగ్ధ్వా మాంసమభక్ష్యం చ సప్తరాత్రం యవాన్ పిబేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **152**

తాత్పర్యం:- భక్షించదగని వారింట అన్నం తిన్నా, స్త్రీలు-శూద్రులైన వారి ఎంగిలి తిన్నా, అభక్ష్యజంతుమాంసం భక్షించినా ఏడురోజులపాటు బాగా మరుగుతూన్న వేడిగంజిని మాత్రమే తాగాలి. దీంతో నోటి నుంచి లోపలి పేగుల వరకూ అన్నీ శుద్ధి అవుతాయని శాస్త్రం. ॥152॥

*   శుక్తాని చ కషాయాంశ్చ పీత్వామేధ్యాన్యపి ద్విజః ।
తావద్భవత్య ప్రయతో యావత్తన్న వ్రజత్యధః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***153***

తాత్పర్యం:- స్వాభావికంగానే మధురమైన రసాలు గలవే అయినా, ఎక్కువ కాలం నిల్వ ఉండటంచేత, నీరు పోసి ఉంచడంచేత, ఇతర మార్గాల వల్ల పులిసిపోతాయో అలాంటివి మద్యంతో సమానం. వీటిని శుక్తాలు అని చెప్పారు. ఇవి అరిగేంతవరకు అపరిశుద్ధుడే! వేడినీరు తాగడం ప్రాయశ్చిత్తం. ॥153॥

*   విడ్వరాహఖరోష్ట్రానాం గోమాయోః కపికాకయోః ।
ప్రాశ్య మూత్రపురీషాణి ద్విజశ్చాంద్రాయణం చరేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***154***

తాత్పర్యం:- ఊరపంది, కోతి, గాడిద, ఒంటె, నక్కకాకి వీటి వల్ల వదలబడిన విసర్జకాలు ఏ పదార్థాల్లోనో కలిసిపోయి, తెలీక భక్షించడం జరిగితే చాంద్రాయణ వ్రతాన్ని అచరించాలి. ॥154॥

*   శుష్కాణి భుక్త్వా మాంసాని భౌమాని కవకాని చ ।
అజ్ఞాతం చైవ సూనాస్థమేతదేవ వ్రతం చరేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***155***

తాత్పర్యం:- గాలికి అరబెట్టిన మాంసం, గోంగూర, జింక/లేడి మాంసం, ఫలానా జంతువుదని తెలీకుండా ఉన్నా ఏ మాంసమైనా బ్రాహ్మణుడు భుజిస్తే చాంద్రాయణ వ్రతాన్ని ఆచరించాలి. ॥155॥

*   క్రవ్యాదసూకరోష్ట్రాణాం కుక్కుటానాం చ భక్షణే ।
నరకాకఖరాణాం చ తప్తకృచ్ఛ్రం విశోధనమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***156***

తాత్పర్యం:- మాంసం తినే జంతువుల మాంసం గాని; పంది, ఒంటె, కాకి, కోడి, మనిషి, గాడిద వీటి మాంసాన్ని గాని బుద్ధిపూర్వకంగా ద్విజుడు భక్షించినట్లయితే తప్తకృచ్ఛ్రమనే ప్రాయశ్చిత్తం ఆచరించాలి. ॥156॥

*   మాసికాన్నం తు యోఽశ్నీయాదసమావర్తకో ద్విజః ।
స త్రీణ్యహాన్యుపవసేదేకాహం చోదకే వసేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***157***

తాత్పర్యం:- సమావర్తన వ్రతాన్ని ఆచరించనిబ్రహ్మచారి ఏకోద్దిష్టం మొదలైన మాసికాలలో శ్రాద్ధాన్నాన్ని భుజించినట్లయితే మూడు రోజులు ఉపవాసం ఉండాలి. ఒక రోజంతా నీటిలోనే నివసించాలి. ॥157॥

*   బ్రహ్మచారీ తు యోఽశ్నీయాన్మధు మాంసం కథంచన ।
స కృత్వా ప్రాకృతం కృచ్ఛ్రం వ్రతశేషం సమాపయేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***158***

తాత్పర్యం:- బ్రహ్మచారి తేనెను గాని-మాంసాన్ని గాని కోరికతో భక్షించినా-ఆపత్కాలంలో భక్షించినా ప్రాజాపత్య కృచ్ఛ్రం ఆచరించి తాను ఆరంభించిన బ్రహ్మచర్యాశ్రమం మిగిలిన భాగం పూర్తిచేయవలసి ఉంటుంది. ॥158॥

*   బిడాలకాకాఖూచ్ఛిష్టం జగ్ధ్వా శ్వనకులస్య చ ।
కేశకీటావపన్నం చ పిబేద్బ్రహ్మసువర్చలామ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***159***

తాత్పర్యం:- పిల్లి,కాకి, ఎలుక, కోడి, ముంగిన లాంటి క్షుద్రజంతువులచేత కొంత తినబడి అవి వదిలి వేయగా మిగిలిన అన్నాన్ని గాని; వెంట్రుకలు, పురుగులు త్రాగడమే ప్రాయశ్చిత్తం. ॥159॥

*   అభోజ్యమన్నం నాత్తవ్యమాత్మనశ్శుద్ధిమిచ్ఛతా ।
అజ్ఞానభుక్తం తూత్తార్యం శోధ్యం వాప్యాశు శోధనైః ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***160***

తాత్పర్యం:- నిషేధించబడినట్టి ఆహారాన్ని ఆత్మశుద్ధికలవారు కోరకూడదు. తెలియక అలా జరిగితే వాంతి చేసుకోడానికై ప్రయత్నించాలి. అటుపైన ప్రాయశ్చిత్తాది పరిహార క్రియలు జరుపుకోవాలి. కోరికతో చేసినప్పుడు-పైన చెప్పుబడిన ప్రాయశ్చిత్తాలు శుద్ధి చేస్తాయి. ॥160॥

* *ఏషోఽ నాద్యాదనస్యోక్తో వ్రతానాం వివిధో విధిః ।*
స్తేయదోషాపహర్తౄణాం వ్రతానాం శ్రూయతాం విధిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **161**

తాత్పర్యం:- అభక్ష్య భక్షణం వల్ల కలిగే దోషాలకు ఇంతవరకు ప్రాయశ్చిత్తం చెప్పబడింది. ఇప్పుడు వివిధ చౌర్యాలకు ప్రాయశ్చిత్త విధి వివరిస్తాను-వినండి.... ॥161॥

* దొంగతనానికి ప్రాయశ్చిత్తము -

* *ధాన్యాన్నధనచౌర్యాణి కృత్వా కామాద్ద్విజోత్తమః ।*
స్వజాతీయగృహాదేవ కృచ్ఛ్రాబ్దేన విశుధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **162**

తాత్పర్యం:- సాటి బ్రాహ్మణుడి ఇంటి నుంచి ధనం, ధాన్యం, ఆహారపదార్థాలు బుద్ధిపూర్వకంగా దొంగిలిస్తే-ఒక ఏడాది కాలం ప్రాజాపత్య కృచ్ఛ్రం ఆచరించాలి. వీటి పరిమాణాన్ని బట్టి, వస్తు గుణాన్ని బట్టి కష్టమైన రీతి గానా? సులభంగానా? ఎలా ఆచరించాలి? అనేది నిర్ణయం అవుతుంది. ॥162॥

* *మనుష్యాణాం తు హరణే స్త్రీణాం క్షేత్రగృహస్య చ ।*
కూపవాపీజలానాం చ శుద్ధిశ్చాంద్రాయణం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **163**

తాత్పర్యం:- మనుషులను, స్త్రీలను, చేలను, నూతినీటిని, ఇంటి భాగాన్ని గాని, ఇంటిని గాని, మొదలైన పరధనాదులకాశించి, వాటిని కొద్దికొద్దిగా గాని-ఏక మొత్తంగా గాని హరించినప్పుడు చాంద్రాయణ వ్రతం ఆచరించాలి. ఋషులు, మన్వాదులచే ఇది స్మృతులలో చెప్పబడింది. ॥163॥

* *ద్రవ్యాణామల్పసారాణాం స్తేయం కృత్వాన్యవేశ్మతః ।*
చరేత్సాంతపనం కృచ్ఛ్రం తన్నిర్యాత్యాత్మశుద్ధయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **164**

తాత్పర్యం:- కొంచెం విలువైనవి, కొద్దిగా పనికొచ్చేవి, పెద్దగా ప్రాయశ్చిత్తం అవసరంలేని సీసం లాంటి లోహాలను అపహరిస్తే-వాటి విలువకు తగ్గ ధనాన్ని యజమానికి ఇచ్చి, ఆత్మ శుద్ధికోసం సాంతపన కృచ్ఛ్రం అనే ప్రాయశ్చిత్తం జరుపుకోవాలి. ॥164॥

* *భక్ష్యభోజ్యాపహరణే యానశయ్యాసనస్య చ ।*
పుష్పమూలఫలానాం చ పంచగవ్యం విశోధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **165**

తాత్పర్యం:- అన్ని దోషాలలోను (చౌర్యం) సొంతవారికి ద్రవ్యరూపేణ పరిహారం చెల్లించడం గొప్ప ప్రాయశ్చిత్తం. పుష్పములు, ఫలములు, భోజనాలు, శయ్య వాహనాలు, పీటలు మొదలైన ఆసనాలు ఏది సంగ్రహించినా నోటిలోకి పంచ గవ్యములు తీసుకోవాలి. ॥165॥

* *తృణకాష్ఠద్రుమాణాం చ శుష్కాన్నస్య గుడస్య చ ।*
చేలచర్మామిషాణాం చ త్రిరాత్రం స్యాదభోజనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **166**

తాత్పర్యం:- గడ్డి, కట్టెలు, బియ్యం మొదలైనవి; బెల్లం, తోళ్లు, మాంసం వీటిలో దేన్ని అపహరించినా మూడు రోజులు ఉపవాసం చేయాలి. ॥166॥

*   మణిముక్తాప్రవాళానాం తామ్రస్య రజతస్య చ ।
అయఃకాంస్యోపలానాం చ ద్వాదశాహం కణాన్నతా ॥   ప్రక్షిప్త శ్లోక సం. **167**

తాత్పర్యం:- రత్నాలు, ముత్యాలు, పగడాలు, రాగి, వెండి, కంచు, ఇనుము, రాళ్ల వీటిలో ఏవి హరించినా 12 రోజులపాటు బియ్యపు నూకలు మాత్రమే ఆహారంగా గ్రహించాలి. ॥167॥

*   కార్పాసకీటజోర్ణానాం ద్విశఫైకశఫస్య చ ।
పక్షిగంధౌషధీనాం చ రాజ్జ్వాశ్చైవ త్ర్యహం పయః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **168**

తాత్పర్యం:- దూదిబట్టలు, పట్టుబట్టలు, కంబళ్ళు వీటిని అపహరించినప్పుడు, చీలనిగిట్టలవి, చీలిన గిట్టలవి అయిన గుర్రాలు, గోవులు, చిలుకలు మొ॥ పక్షులు, సుగంధద్రవ్యాలు, త్రాడు వీటిలో దేన్నైనా అపహరించినప్పుడు మూడు దినములు పాలాహారంగా తీసుకోవాలి. ॥168॥

* పొందదగనివి పొందిన దానికి ప్రాయశ్చిత్తము-

*   ఏతైర్వ్రతైరపోహేత పాపం స్తేయకృతం ద్విజః ।
అగమ్యాగమనీయం తు వ్రతైరేభిరపానుదేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **169**

తాత్పర్యం:- ఈ విధంగా దొంగతనాలలో వస్తువులను బట్టి కలిగే పాపాలకు ప్రాయశ్చిత్తాలుంటాయి. అలాగే పొందదగని వస్తువులను పొందడంచేత కలిగే పాపాలకు వేరే ప్రాయశ్చిత్తాలు విధించబడ్డాయి. అవి ఈ కింది విధంగా ఉంటాయి. ॥169॥

*   గురుతల్పవ్రతం కుర్యాద్రేతస్సిక్త్వా స్వయోనిషు ।
సఖ్యుః పుత్రస్య చ స్త్రీషు కుమారీష్వంత్యజాసు చ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **170**

తాత్పర్యం:- తోబుట్టువులు, స్నేహితులభార్యలు, కోడళ్లు, కన్యలు, చండాల స్త్రీలతో రమించినప్పుడు-అది కూడా అజ్ఞానవశాన సంఘటిల్లినప్పుడు మాత్రమే గురుభార్యతో సంగమం చేసిన వాడికి విధించే ప్రాయశ్చిత్తం ఆచరించాలి. బుద్ధిపూర్వకంగా చేసినప్పుడు ప్రాణత్యాగమొక్కటే మార్గం. ॥170॥

*   పైతృష్వసేయీం భగినీం స్వస్త్రీయాం మాతురేవ చ ।
మాతుశ్చ భ్రాతుస్తనయాం గత్వా చాంద్రాయణం చరేత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **171**

తాత్పర్యం:- మేనత్తకూతురు, పిన్తల్లి, పెత్తల్లి, కూతుళ్లు, మేనమామ కూతురు, మేనకోడలు....వీరుకూడా సోదరి సమానులే. అంటే-సంగమించడానికి తప్పుగా భావించాలి. అజ్ఞానవశాన వీరిని పొందినప్పుడు చాంద్రాయణ వ్రతాన్ని ఆచరించాలి. అదీ ఒక్కమారు అయితేనే. ॥171॥

*   ఏతాస్తిస్రస్తు భార్యార్థే నోపయచ్ఛేత్తు బుద్ధిమాన్ ।
జ్ఞాతిత్వేనానుపేయాస్తాః పతతి హ్యుపయన్నధః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **172**

తాత్పర్యం:- పైన చెప్పబడిన మేనత్తకూతురు మొదలైనవారు దాయాదులు, బంధువులు అవుతారు కాబట్టి, విజ్ఞుడు వీరిని పెండ్లాడరాదు. వీరిని పెండ్లాడిన వాడు నరకాన్ని పొందగలడు. (అసపిండా చ యా మాతుః = తల్లిగోత్రానికి సపిండురాలు కానిదాన్నే పెళ్లాడాలని శాస్త్రం.) ॥172॥

* *అమానుషీషు పురుష ఉదక్యాయామయోనిషు ।*
రేతస్సిక్త్వా జలే చైవ కృచ్ఛ్రం సాంతపనం చరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **173**

తాత్పర్యం:- ఆవు తప్ప తక్కిన జంతువులందు. రజస్వలయైన స్త్రీయందు, ఇతర స్థలాలలోను, నీటిలోను పురుషుడు తన శుక్రాన్ని వదిలితే సాంతపనమనే కృచ్ఛ్రాన్ని ఆచరించాలి. ॥173॥

* *మైథునం తు సమాసేవ్య పుంసి యోసితి వా ద్విజః ।*
గోయానేఽప్సు దివా చైవ సవాసాస్స్నానమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **174**

తాత్పర్యం:- ఇలాగే మరికొన్ని అసహజ మైథునాలు (పురుషుడి మలద్వారాన సంగమం), స్త్రీతో గుదమైథునం, పగటిపూట సంగమం, నీటిలో (జలకాలాడుతూ) మైథునం.... ఇవన్నీ పాపదాయకమే ! వీటన్నిటికీ సచేలస్నానమే ప్రాయశ్చిత్తంగా చెప్పబడింది. ॥174॥

* *చండాలాంత్య స్త్రియో గత్వా భుక్త్వా చ ప్రతిగృహ్య చ ।*
పతతజ్ఞానతో విప్రో జ్ఞానాత్సామ్యం తు గచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **175**

తాత్పర్యం:- అజ్ఞానంచేత చండాల స్త్రీతో రమించినా, మ్లేచ్ఛజాతి స్త్రీతో సంగమించినా పతితుడనబడతాడు. వారింట భోజనాదికాలు చేసి ఇంకా పాపి అవుతాడు. పతితుడికి విధించిన ప్రాయశ్చిత్తాన్ని ఇతడు ఆచరించాలి. బుద్ధిపూర్వకంగా పలుసార్లు ఇదే విధంగా పైన చెప్పబడిన వారితో సంగమించేవాడు, వారితో సమానుడే అవుతాడు.॥175॥

* *విప్రదుష్టాం స్త్రియం భర్తా నిరుంధ్యాదేక వేశ్మని ।*
యత్పుంసః పరదారేషు తచ్చైనాం చారయేద్వ్రతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **176**

తాత్పర్యం:- స్వభావంచేత తన భార్య బుద్ధిపూర్వకంగానే వ్యభిచారిణి అని ఆమె భర్తదృష్టికి వచ్చినప్పుడు లేదా పరపురుషుడితో రమిస్తూ పట్టుబడిన సందర్భాలలో ఆమె భర్త ఆమెకు సంకెళ్లు వేసి, పరభార్యను సంగమించిన వారికి విధించిన ప్రాయశ్చిత్తం జరిపించాలి. 176॥

* *సా చేత్పునః ప్రదుష్యేత్తు సదృశేనోపయంత్రితా ।*
కృచ్ఛ్రం చాంద్రాయణం చైవ తదస్యాః పావనం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **177**

తాత్పర్యం:- పరపురుషుడితో సంగమించి ఒకసారి ప్రాయశ్చిత్తం జరిగాక కూడా, తిరిగి సవర్ణుడైన పురుషుడితో సంగమాభిలాష గలదైనప్పుడు ఆ పాపపరిహారానికి కృచ్ఛచాంద్రాయణవ్రతమే ప్రాయశ్చిత్తం.॥177॥

* *యత్కరోత్యేకరాత్రేణ వృషలీసేవనాద్ద్విజః ।*
తద్భైక్షభుగ్జపన్నిత్యం త్రిభిర్వర్షైర్వ్యపోహతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **178**

తాత్పర్యం:- బ్రాహ్మణుడు ఒక్కరాత్రి చండాలస్త్రీని సంగమించినా చాలా పాపం. ఈ పాపం పోగొట్టు కోడానికి అతడు భిక్షాటన చేత శరీరాన్ని నిల్పుకొని, గాయత్రిమంత్రాన్ని అనుదినం జపిస్తూంటే మూడేళ్లకు ఆ పాపం పరిహారం కాగలదు. 178॥

* పతితులతో సహవాసమున్నందుకు ప్రాయశ్చిత్తము-

* *ఏషాం పాపకృతాముక్తా చతుర్ణామపి నిష్కృతిః ।*
పతితైస్సంప్రయుక్తానా మీమాః శృణుత నిష్కృతీః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **179**

తాత్పర్యం:- ఒకే వాహనం మీద వెళ్ళడం, ఒకే ఆసనంమీద కూర్చోవడం, ఏక పంక్తిన భుజించడం అనే కృత్యాల ద్వారా పతితులతో సహసంచారం జరిపిన వారికి యాజనం, వేదాధ్యాపనం మొదలైనవి జరపాలి. ॥179॥

* సంవత్సరేణ పతతి పతితేన సహాచరన్ ।
యాజనాధాపనాద్యోనాన్నతు యానాసనాశనాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **180**

తాత్పర్యం:-ఇలాంటివి ఆచరించేవాడు ఒక ఏడాదికి పతితుడవుతాడు. పైన చెప్పబడిన వేదాధ్యాపనం, యజ్ఞాల ద్వారా వీరిని సంస్కరించవలసి ఉంటుంది. ॥180॥

* యో యేన పతితేనైషాం సంసర్గం యాతి మానవః ।
స తస్యైవ వ్రతం కుర్యాత్తత్సంసర్గవిశుద్ధయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **181**

తాత్పర్యం:- ఎవరు ఎలాంటి పతితుడితో కూడి తిరిగినా, వారు ఆ సంసర్గ దోషనివృత్తికి, పతితుడికి విధించిన ప్రాయశ్చిత్తంలో 3/4వ వంతు ఆచరించాలి. ఉదా॥ బ్రహ్మహత్య చేసిన వారికి విధించబడిన 12 సంవత్సరాల ప్రాయశ్చిత్తంలో 3/4వ వంతు అంటే 9 ఏళ్లు వీరికి ప్రాయశ్చిత్తం. ॥181॥

* పతితస్యోదకం కార్యం సపిండై ర్బాంధవైర్బహిః ।
నిందితేఽహని సాయాహ్నే జ్ఞాత్యృత్విగ్గురుసన్నిధౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **182**

తాత్పర్యం:- ఎవరైనా భ్రష్టత్వం పొంది, అలాగే సంచరిస్తూ ఉంటే, వారిని మృతి చెందిన వారిగా ఎంచి, అతడిని దాయాదులు గ్రామం వెలుపలకి జ్ఞాతులతో-ఋత్విక్‌లతో-గురువులతో కలిసి వెళ్లి నవమినాటి సాయంకాలం వేళ ఉదకదానం, ప్రేతకృత్యం, పిండ ప్రదానం మొదలైనవి మరణానంతర కృత్యాలన్నీ జరిపి, మృతసమానుడని గ్రహించాలి.॥182॥

* దాసీ ఘటమపాం పూర్ణం పర్యస్యేత్ప్రేతవత్పదా ।
అహోరాత్రముపాసీరన్నశౌచం బాంధవైస్సహ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **183**

తాత్పర్యం:- సపిండులైన వారిచేత ఇలా చేయబడే కృత్యంలో ఒక ముఖ్య విధి-ఒక దాసీ దానిచేత నీటితో నిండిన కుండను దక్షిణాభిముఖంగా ఉంచి, నీళ్లన్నీ కారిపోయేలాగ తన్నించాలి. సమానోదక పిండులైన దాయాదులు ఆ రోజంతా ఆశౌచం ఆచరించాలి. ॥183॥

* నివర్తేరంశ్చ తస్మాత్తు సంభాషణసహాసనే ।
దాయాద్యస్య ప్రదానం చ యాత్రా చైవ హి లౌకికీ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **184**

తాత్పర్యం:- సపిండాదులు వారి ఆ పతితుడితో మాట్లాడటం, ఒక పీటయందే కూర్చుండటం, దానికి ధనం ఇవ్వడం, శ్రాద్ధాదులందు నిమంత్రణం చెప్పడం మొ॥న లోక వ్యవహారాలను జరపరాదు. ॥184॥

* జ్యేష్ఠతా చ నివర్తేత జ్యేష్ఠావాప్యం చ యద్ధనమ్ ।
జ్యేష్ఠాంశం ప్రాప్ను యాచ్చాస్య యవీయాన్ గుణతోఽధికః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **185**

తాత్పర్యం:- అగ్రజులే అయినప్పటికీ అలాంటి భ్రష్టుల విషయంలో మర్యాదలు పాటించనక్కర్లేదు. శాస్త్రరీత్యా ఇవ్వవలసిన 20వ భాగం ఉద్ధారాంశం ఇవ్వక, అది కూడా అలాంటి వారి సోదరుడు గుణవంతుడు అయినట్లయితే, అతడికి కివ్వాలి. ॥185॥

* ప్రాయశ్చిత్తే తు చరితే పూర్ణకుంభమపాం నవమ్ ।
తేనైవ సార్ధం ప్రాస్యేయుః స్నాత్వా పుణ్యే జలాశయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **186**

తాత్పర్యం:- ఒక పతితుడికి/ భ్రష్టుడికి ప్రాయశ్చిత్తం చేసుకోగా, సమానోదక పిండులు అలాంటి వాటితో ఒక పరిశుద్ధ నదీ నదంలో స్నానం చేసి నీటితో కూడిన కొత్తకుండని నీటిలో పడవేయాల్సి ఉంటుంది. ॥186॥

* ***స త్వప్సు తం ఘటం ప్రాస్య ప్రవిశ్య భవనం స్వకమ్ ।***
సర్వాణి జ్ఞాతికార్యాణి యథాపూర్వం సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***187***

తాత్పర్యం:- ప్రాయశ్చిత్తం ఆచరించబడిన ఆ పతితుడు ఆ మొదటి కుండను నీటి మధ్యలో వేసిన తరవాత ఇంటికి వెళ్లి తాను ప్రాయశ్చిత్తం చేసుకోక ముందు చేయాల్సి ఉన్న జ్ఞాతి కృత్యాలన్నీ చేయాలి. ॥188॥

* ***ఏతదేవ విధిం కుర్యాద్యోషిత్సు పతితాస్వపి ।***
వస్త్రాన్నపానం దేయం తు వసేయుశ్చ గృహాంతికే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***188***

తాత్పర్యం:- భ్రష్ట స్త్రీల విషయమై, ఇలాగే భర్త మొ॥ సపిండులు ఆచరించాలి. అయినా ఆ స్త్రీ ప్రాయశ్చిత్తం చేసుకోనట్లయితే ఇంటికి చేరువగా ఒక గుడిసె కట్టించి అందులో ఆమెకు నివాసం కల్పించి కూడు-గుడ్డ ఇవ్వాలి గాని ఇంట్లోకి రానివ్వకూడదు. ॥188॥

* ***ఏనస్విభిరనిర్ణిక్తైర్నార్థం కించిత్సహాచరేత్ ।***
కృతనిర్ణేజనాంశ్చైవ న జుగుప్సేత కర్హిచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***189***

తాత్పర్యం:- తమ పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకొన్న వారికి దానం ఇవ్వడం-వారి నుంచి తీసుకోవడం నిషేధం. కాని, వారి పూర్వ పాపాలు మళ్లీ మళ్లీ గుర్తు చేసి నిందించరాదు. ఎప్పటిలాగే స్నేహంగా ఉండాలి. ॥189॥

* ***బాలఘ్నాంశ్చ కృతఘ్నాంశ్చ విశుద్ధానపి ధర్మతః ।***
శరణాగతహంతౄంశ్చ స్త్రీహంతౄంశ్చ న సంవసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***190***

తాత్పర్యం:- చేసిన మేలు మరచి అపకారంతో తననే చెడిపేవాడిని, బాలురను హత్యచేసిన వాడిని, శరణన్న వారిని చంపినవాడిని, స్త్రీహత్యకు పాల్పడినవాడిని ప్రాయశ్చిత్తం చేసుకొన్నప్పటికీ స్నేహంగా మెలగరాదు. ॥190॥

ప్రక్షిప్తాల పరిశీలన

11.54 నుంచి 190 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు. వీటి ఆధారాలు ఈ కింద ఇచ్చాము -

1. అంతర్ వ్యతిరేకాలు

మహా పాతకాలు, ఉప పాతకాల వర్గీకరణ, ప్రాయశ్చిత్తాల నిర్ధారణ అనే ఈ ప్రసంగం మౌలికమని రుజువు కావడం లేదు. ఇది మనువు మునుపు చెప్పిన వ్యవస్థలతో కలవక పోగా ఎన్నో వ్యతిరేకతలతో కూడి ఉంది.

1. ఇక్కడ నాలుగు రకాల దోషులను విశిష్ట లని చెబుతూ వారిని 'మహాపాతకులు' గా పేర్కొన్నారు. కానీ హత్యను గురించి [8.278-300] చెప్పిన వాటిలో బ్రహ్మ హత్యను, దొంగతనపు ప్రసంగంలో [8.301-343] బంగారం దొంగతనమూ, పరస్త్రీ గమనంలో [8.352-387] గురుపత్నీ గమనం గురించి విడిగా విశిష్ట దోషాలుగా చెప్పలేదు. దీని వల్ల ఈ విభజన మనువు మౌలికంగా చేసింది కాదని తేలి పోతూంది. ఇది మౌలిక మైతే, పైన చెప్పిన వాటిలో వాటికి ప్రత్యేక శిక్షల పద్ధతీ ఉండేది.

2. 8.386లో విశిష్ట దోషులను గణిస్తూ దొంగ, పరస్త్రీ గామి, దుష్టవాక్కు, దోపిడిదారు, హంతకుడు - వీరందరినీ కలిపారు. వీరందరిపై రాజు ప్రత్యేకంగా నియంత్రణ కలిగి ఉండాలన్న ఆదేశమూ ఉంది. ఇక్కడి నలుగురు మహా పాతకుల గణన పై శ్లోకాలకు భిన్నంగా ఉంది. పైగా అపరాధాల ఆధారంగా విభజించక వ్యక్తులు భేదాలను బట్టి

విభజించారు. అంటే - పరస్త్రీ గమనం అనే అపరాధాన్ని కేవలం గురుపత్నీ గమనం అన్నారు. హంతకుడు అనే ఆధారంతో కాకుండా బ్రహ్మ హత్య ఆధారంగా, దొంగను మామూలు దొంతనంతో కాక బంగారం దొంగిలించటం ఆధారంగా - ఇలా మహా పాతకు లన్నారు. ఈ విభజన మునువటి విభజన కన్నా వేరుగా, వీటి ఆధార పద్ధతి భిన్నంగా ఉన్నాయి.

3. బంగారం దొంగకు మహా పాతకు డనీ, వెండి మొదలైనవాటి దొంగను ఉపపాతకు డనీ చెప్పి, ఇద్దరికీ వేర్వేరు శిక్షా పద్ధతులు చెప్పారు. కానీ 9.321,322లలో ఈ దొంగతనాలను సమానంగా భావించి సమాన శిక్షల పద్ధతి ఉంది. ఇక్కడ ఈ రెండు శిక్షల సంతులత లేక పోగా భూమికీ, ఆకాశానికీ ఉన్నంత తేడాను చూపించారు. బంగారం దొంగకు పన్నెండేళ్ళు, బ్రహ్మ హత్య చేసిన వాడికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్న ఆదేశం ఉంది. (11.101); వెండి, ముత్యాల దొంగకు కేవలం 12 రోజులు అన్నం తిని ఉండాలనే పద్ధతి చెప్పారు ! (11.167) ఒకచోట ఇద్దరూ సమానులైన దొంగ లంటే. మరొక చోట వెండి దొంగను చాలా మామూలు దొంగగా భావించి నామమాత్రపు శిక్ష విధించారు !

4. క. 210 నుంచి 226 వరకు గల శ్లోకాలలో ప్రాయశ్చిత్త వ్రతాల గురించి మనువు, ఫలానా పద్ధతులతో పాపులను శుద్ధి చేయమని చెప్పాడు; కానీ 72 నుంచి 104,108 నుంచి 116, 118 నుంచి 123, 126 నుంచి 138, 140 నుంచి 153, 159, 160, 165, 167, 168, 170, 172, 174, 175, 178, 182 నుంచి 188 శ్లోకాలలో ప్రాయశ్చిత్తం కోసం చెప్పిన వ్రతాలు లేదా పద్ధతులు పైన చెప్పిన వాటికి భిన్నంగా ఉన్నాయి. మనువు ప్రకార మైతే, ఆయన చెప్పిన వ్రతాలలోనే కొన్నిటిని ప్రాయశ్చిత్తానికి నిర్ణయించాలి. ఇక్కడి భిన్నత మనువు పద్ధతులకు వ్యతిరేకం కనుక వేరెవరో చెప్పినట్లుగా ఉంది.

ఖ. 90లో సురాపానానికి సురాపానమే ప్రాయశ్చిత్త మని ఉంది. పాపానికి నివృత్తి ఎక్కడైనా పాపంతోనే జరుగుతుందా? ఇది మనువు వంటి మహర్షి చెప్పిన పద్ధతి అనిపించదు.

5. 226 నుంచి 233 వరకు గల శ్లోకాల వల్ల ప్రాయశ్చిత్తం మృత్యు కారకం కాకూడదని చెప్పారు. ప్రాయశ్చిత్తం ఎలా ఉండాలంటే చేసిన ఆ తప్పును మనిషీ మళ్లీ జీవితంలో చేయకూడదు. భవితలో అపరాధాలు చేయకుండా జాగ్రత పడటం, చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెందటం - వీటి కొరకు ప్రాయశ్చిత్తం చేసుకుంటారు - ఇదీ ఈ శ్లోకాలలో చెప్పింది. ఈ ప్రసంగంలో మహాపాతకులకు మరణ దండన రూపంలో [73, 79, 89- 91, 100, 103, 104, 146] ప్రాయశ్చిత్తం విధించారు. ఇది మనువు వ్యవస్థకు వ్యతిరేకం.

6. 56వ శ్లోకంలో అబద్ధపు సాక్ష్యాన్ని సురాపానం వంటి మహా పాతకంగా భావించి, 88వ శ్లోకంలో దానికి ప్రాయశ్చిత్తం బ్రహ్మ హత్య చేసిన వాడికి విధించే ప్రాయశ్చిత్తమే అన్నారు. కానీ 8.119 నుంచి 122 వరకు గల శ్లోకాలలో అబద్ధపు సాక్ష్యానికి కొంత అపరాధ రుసుము చెల్లించడమే విధించారు. అందులోనూ, ఈ శిక్షలోనూ భూమికీ, ఆకాశానికీ ఉన్నంత తేడా ఉంది. [8.119-122] లలో అబద్ధపు సాక్ష్యానికి మహా పాతక రూపంలో ఎటువంటి శిక్ష ప్రత్యేకంగా చెప్పక పోవటమే ఈ విభజన మనువు చేసింది కాదని రుజువు చేస్తూంది.

7. నమ్మకం మీద దాచిన వస్తువులు స్వాహా చేసిన నేరానికి ప్రాయశ్చిత్తంగా ఎనిమిదవ అధ్యాయంలో చెప్పిన శిక్షలకూ ఇక్కడ చెప్పిన శిక్షలకూ బోలెడు తేడా లున్నాయి. పైగా ఈ నేరాన్ని అక్కడ మహా పాతకంగానూ పేర్కొనలేదు. [11.57, 88, 8.179-196].

8. 62లో డబ్బు తీసుకుని విద్య నేర్పడాన్ని ఉప పాతకం అన్నారు. కానీ 2.141లో ఇటువంటి అధ్యాపకునికి 'ఉపాధ్యాయుడు' పేరిట డబ్బు తీసుకుని చదువు చెప్పే పద్ధతిని గురించిన సంకేతం ఉంది. 2.109లో 'ద్రవ్యదాత' ను చదివించే దాన్ని గురించి స్పష్టంగా చెప్పారు.

9. హత్యానేరపు ప్రసంగం [8.278-300] లో మనువు అందరికీ ఒకటే పద్ధతి చెప్పటంతో పాటు అతని శిక్షా వ్యవస్థ కూడా అందరికీ సమానంగానే నిర్దేశించాడు. ఇక్కడ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు హత్య చేస్తే ఎక్కువ తక్కువలుగా ప్రాయశ్చిత్తాలు చెప్పటం ఆ వ్యవస్థకు భిన్నమే కాక, వివక్షతోనూ ఉంది.

10. ఈ ప్రసంగంలో ఎన్నో చోట్ల ప్రాయశ్చిత్తంగా దానా లిచ్చే పద్ధతి ఉంది. 76లో తన సర్వస్వాన్నీ బ్రాహ్మణుడికి దానమిస్తే బ్రహ్మ హత్యా పాతకం నుంచి ముక్తుడవుతాడని ఉంది. ఇది మనువు చెప్పిన దానికి వ్యతిరేకం. మనువు బ్రాహ్మణులు కేవలం మంచి దానాలే తీసుకోవా లన్నాడు. (2.160; 4.190). చెడు దానం నిషిద్ధమే కాకుండా, నిందనీయం కూడా. ఇదే అధ్యాయంలో చెడు దానాలు తీసుకునే వారికి ప్రాయశ్చిత్తం కూడా చెప్పారు (193-196). దీని వల్ల అపరాధులకు బ్రాహ్మణులకు దానం చేసే అధికారం లేదనీ స్పష్ట మవుతూంది. కనుక, ప్రసంగంలో చెప్పిన దాన విధి మౌలికం కాదు.

11. 9.225లో తాగుబోతులకు కేవలం 'దేశం నుంచి బహిష్కరించే' శిక్ష ఉంది. ఇక్కడ మృత్యుకారకమైన ప్రాయశ్చిత్తం (90, 91, 146) ఉంది. రెండు వ్యవస్థలలోనూ చాలా తేడా ఉంది, వ్యతిరేకతా ఉంది. ఈ విధంగా అంతర్ వ్యతిరేకాలు ఉండటం చేత, మొత్తం ప్రసంగం మౌలికం కాక ప్రక్షిప్తమని రుజువవుతూంది.

2. అవాంతర వ్యతిరేకాలు

ఇందులోని పాతకుల విభజన, వారి శిక్షా వ్యవస్థలో పునరుక్తులు, అసంతులత, పరస్పర వ్యతిరేకతలు, విచ్చలవిడితనం కనబడుతున్నాయి ఈ ప్రసంగ మైతే మౌలికం కానిదే కాక, కేవలం ఒకరి చేత కాకుండా పలువురి చేత, పైగా విద్వాంసులు కాని వారి చేత రచించపబడిందని రుజు వవుతూంది. ఇందులో ఈ కింది లోపాలున్నాయి-

1. 54వ శ్లోకంలో మద్యపానాన్ని మహాపాతక మన్నారు. 66లో తాగుబోతులను ఉపపాతకులలో చేర్చారు.

2. శిక్షలలో ఎంతో ఎక్కువగా అసమానత చూపారు. ఇది ఆలోచించి చేసిన పని కాదు; ఎలా గంటే -

క. 90, 91,146 శ్లోకాలలో తాగితే మరణంతోనే శుద్ధి కలుగుతుందన్నారు. 92లో దానికి వికల్పంగా ఏడాది వరకూ అన్నం తిని బతకటం విధించారు.

ఖ. 73లో బ్రహ్మ హత్యకు మరణ దండన విధించారు. 82-83లలో అశ్వమేధ యజ్ఞంలో బ్రాహ్మణులు, రాజు సమక్షంలో తమ పాపం చెప్పుకుని స్నానం చేస్తే బ్రహ్మ హత్యా పాతకం పోతుందన్నారు. అదే ప్రాయశ్చిత్తమట!

గ. గురుపత్నీగామికి 103,104 శ్లోకాలలో మరణమే ప్రాయశ్చిత్త మని, 106లో కేవలం మూడు నెలలు హవిష్యం, నీవార ధాన్యంతో చాంద్రాయణ వ్రతం చేస్తే ఆ మహా పాతకం పోయి శుద్ధుడవుతాడని ఉంది. ఈ విధంగా వీటిలో సంతులత, కలయిక లేవు.

3. 55లో అబద్ధా లాడటం మహా పాతకంగా, బ్రహ్మ హత్యతో సమానంగా భావించారు. 69లో అబద్ధాలాడటం సాధారణ అపరాధమనీ, 'అపాత్రీకరణ' మనీ అన్నారు.

4. 56లో 'వేద నింద' మహా పాతకమని, 66లో 'నాస్తికత'ను ఉపపాతక మన్నారు. మనువు ప్రకారం, వేదనిందే నాస్తికత **"నాస్తికో వేద నిందకః"** [2.11].

5. 55-57లలో ఎన్నో నేరాలను మహా పాతకాలుగా చెప్పారు. కానీ మహా పాతకాల ప్రాయశ్చిత్త పద్ధతి [86 నుంచి 106] లో వాటి ప్రాయశ్చిత్తాలు చెప్పనే లేదు. అవి ఏవంటే - తమ ఉన్నతి కోసం అబద్ధాలాడటం, రాజుకు చాడీలు చెప్పటం, వేదాలు త్యజించటం, వేద నింద, తినకూడనివి తినటం, మనుష్యులు, గుర్రాలు, వెండి, భూమి, వజ్రాలు, మణుల దొంగతనం.

6. ఇదే విధంగా కొందరు నేరస్తులను మహా పాతకుల ప్రసంగంలో [54-58] లెక్కించ లేదు. కానీ వీరి ప్రసంగంలో వారికి ప్రాయశ్చిత్తం చెప్పారు; వారు- గర్భపాతం, యజ్ఞం చేస్తూ క్షత్రియుల వైశ్యులను, రజస్వల అయిన స్త్రీని, స్త్రీని హత్య చేయటం [87-88].

7. 66వ శ్లోకంలో స్త్రీ హత్యను ఉపపాతకమని చెబుతూ, 88లో దాన్ని మహా పాతకంగా చెప్పి, స్త్రీ హంతకుడికి బ్రహ్మ హత్య చేసిన వాడి ప్రాయశ్చిత్తం చెప్పారు.

8. 56లో నిందనీయమైన తినరాని పదార్థాలను తినటం మహాపాతక మని, 64లో ఉపపాతకం అన్నారు.

9. 57వ శ్లోకంలో మనిషి, గుర్రం, వెండి, మొదలైనవి దొంగలిస్తే మహాపాతక మని, వాటికి ప్రాయశ్చిత్తాలను మాత్రం సాధారణ మైనవి చెప్పారు. [163, 167]. బంగారం దొంగిలిస్తే బ్రహ్మ హత్యతో సమానమని 12 ఏళ్ల వరకూ ప్రాయశ్చిత్తం చెప్పి, మానవులు, స్త్రీలను అపహరించే వారికి కేవలం చంద్రాయణవ్రతమే ప్రాయశ్చిత్త మనటం ఆశ్చర్యకరం ![163] ఇదే శ్లోకంలో మనుషులు, స్త్రీలను అపహరించటాన్నీ, బావులు, దిగుడు బావులలోని జలాన్ని అపహరించటాన్నీ సమాన మన్నారు.

10. ఒకటే ప్రసంగంలో మూడు చోట్ల [57, 65, 66] దొంగతనాన్ని గణించారు; ఇది అనవసరం!

11. వేదాలను వదిలెయ్యటం, వేద పాఠాలు చదవకపోవటం, నింద నాస్తికత- ఇవి మనువు ప్రకారం నాస్తికత కిందికే వస్తాయి[2.11]. వీటిని ఈ ప్రసంగంలో మూడు సార్లు పేర్కొన్నారు. [56, 59, 66].

12. ఇదే విధంగా ఉపపాతకాలు ప్రసంగంలో అగ్నిహోత్రం త్యజించటాన్ని అపరాధంగా రెండుసార్లు చెప్పారు. [59,65].

13. అలాగే పరస్త్రీ గమనం, కన్యాదూషణ, వ్రత లోపాలు, స్త్రీసేవనం మొదలైన ఒకటే రూప మైన విషయాలను కేవలం ఉపపాతకాల ప్రసంగంలోనే మూడుసార్లు చెప్పారు. [59,61,66].

14. కన్యాదూషణను 58లో మహా పాతకాల కింద చెప్పి, 61లో ఉపపాతకాలలోనూ చెప్పారు.

15. పాతకాల లెక్కలోనూ, వాటి ప్రాయశ్చిత్త క్రమంలోనూ సంబద్ధత లేదు. లెక్క ప్రకారం మహా పాతకుడు, అతనితో సంబంధం గల వారి ప్రాయశ్చిత్తం, ఉపపాతకులు, జాతి భ్రంశమైన వారు, సంకరీకరణ, అపాత్రీకరణ. మలావహం- ఈ క్రమంలో ప్రాయశ్చిత్తాలు ఉండాలి. కానీ ఇందులో విచ్చలవిడిగా రాశారు. పాపులతో సంబంధాలున్న వారికి అందరికీ చిట్ట చివర ఫలాన్ని గురించి చెప్పారు. 126 నుంచి 179 వరకు గల శ్లోకాల లెక్క ప్రకారం, 124కు పూర్వం నుంచి ఉండాలి. ఫలం గురించి చెప్పటం మాత్రం క్రమానుసారం లేదు. 54లో మహా పాతకులతో ఉండటమే మహా పాతకం అన్నారు కానీ, ఆ కూడా ఉన్న వారి ప్రాయశ్చిత్తాలు అన్నిటి కన్నా చివర చెప్పడం వల్ల, మిగిలిన అపరాధు లందరినీ కూడా పాతకులుగా పరిగణించి నట్లయింది.

16. స్త్రీవధను ఉపపాతక మన్నారు. దీని ప్రాయశ్చిత్తాన్ని మహా పాతకాలతో సమానంగా మహా పాతకాల ప్రసంగంలో చేర్చారు [66,88].

17. 131వ శ్లోకం అసంతులనానికీ, అత్యధిక ఆశ్చర్యానికీ ఉదాహరణగా నిలుస్తుంది. దీంట్లో శూద్రుల జీవితాన్ని బావురు పిల్లి, ముంగిస, కప్ప, కుక్క, గుడ్లగూబ మొదలైన వాటితో సమానంగా భావిస్తూ, వీటిని హత్య చేస్తే ఒకటే ప్రాయశ్చిత్తం చెప్పారు.

18. ఒక అపరాధానికి ప్రాయశ్చిత్తం ఒక చోటే చెప్పాలి. కానీ ఈ ప్రసంగంలో ఒకటే అపరాధానికి చాలాచోట్ల ప్రాయశ్చిత్తాలు, అవి కూడా వేర్వేరుగా చెప్పారు. అవి -

క. సర్పాన్ని చంపటం 'సంకరీకరణ' పాపంగా భావించి, 125లో దానికి ప్రాయశ్చిత్తంగా చంద్రాయణ వ్రతాన్ని చెప్పారు. మళ్లీ 133, 139లలో దానికి భిన్నమైన ప్రాయశ్చిత్తాలు చెప్పారు.

ఖ. గుర్రం, ఏనుగు, గొర్రె, గాడిద మొదలైన వాటిని చంపితే, 68,125లలోనూ ప్రాయశ్చిత్తం చెప్పారు 136లోనూ.

గ. మద్యంతో పాటు తినే పదార్థాలకు ప్రాయశ్చిత్తం 70,125లలోనూ, వాటికి భిన్నంగా 147-149లలోనూ చెప్పారు.

ఘ. ఫలాలు మొదలైనవి దొంగిలిస్తే ప్రాయశ్చిత్తాలను 70,125లలోనూ, వాటికి భిన్నంగా 165లోనూ చెప్పారు. వీటన్నిటినీ మళ్లీ రెండేసి సార్లు విడివిడిగా అపరాధాల పేర్లతో చెప్పారు. ఇది ఒక రచయిత రాసినది కాదు.

19. 190వ శ్లోకంలో కృతఘ్నులను, శరణాగతులను హత్య చేసేవారు ప్రాయశ్చిత్తం చేసుకున్నా సరే, వారితో మెలగడం మంచిది కాదన్నారు, కానీ ఈ ఇద్దరు అపరాధాలను మునుపటి పాతకాలలో ఎక్కడా చెప్పనే లేదు.

20. ప్రాయశ్చిత్తాల పద్ధతిలో ఎవరో తర్వాతి వారు మనువు శైలిలో నాలుగు విషయాలు ప్రారంభించారు- 126-145లలో హింసించే పాపాల ప్రాయశ్చిత్తాలు, 140-160లలో తినకూడనివి తిన్నందుకు, 161-168లలో చౌర్యానికి, 169-178లలో చేయకూడనివి చేసినందుకు చెప్పారు. ఈ నాలుగింటి ముగింపులను గురించి 179లో ఉంది. కానీ అపరాధాల గణనలో ఈ క్రమం లేదా వీటి పేర్లతో వీటిని పేర్కొన లేదు.

3. ప్రసంగ వ్యతిరేకాలు

ప్రాయశ్చిత్త విషయకమైన ప్రసంగ సంకేత మిచ్చే శ్లోకం 44వది. ఇందులో స్పష్టంగా మూడు విషయాల సంకేతం ఉంది -

క. చెప్పిన వాటిని చేయక పోవటానికి

ఖ. నిందిత కర్మలు చేసినందుకు

గ. ఇంద్రియాసక్తులు అయితే అంటే సోమరితనం, కామవాసనలు మొదలైన వాటిలో పడితే, మనుష్యులు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

పై చెప్పిన శ్లోకాలలో ఇచ్చిన సంకేతాలు ఆధారంగా, తర్వాతి శ్లోకాలలో ఏమీ చెప్పలేదు; కానీ మనువు శైలి ప్రకారం, సంకేతక శ్లోకాలను అనుసరించే తర్వాతివీ ఉంటాయి. తర్వాతి శ్లోకాలను పరిశీలిస్తే, అవి రెండు విభిన్న విషయాలుగా ఉన్నట్లు తెలుస్తుంది. మొదటిది 54 నుంచి 190వరకు, రెండవది 191 నుంచి 209 వరకు. తొలి విషయ సమాప్తి సంకేతం 189లోనూ, తర్వాత అపరాధులతో కలిసి ఉండేవారి పద్ధతి ఉండి ఆ పైన 189,190లలో ఈ తొలి భాగం ముగింపు ఉంది.

ఇక్కడ ఆలోచించ దగ్గ విషయం - అపరాధుల ప్రాయశ్చిత్త విషయాలు ఒక ప్రసంగంలో ముగిసిపోతే, మళ్లీ 191లో ప్రాయశ్చిత్తాలను ప్రారంభించడంలోని పొంతన ఏమిటి? అనేది. దీనికి సమాధానం ఈ రెండవ ప్రసంగమే మౌలికమూ, తొలి ప్రసంగం ప్రక్షిప్తం అని. దీనికి కింది ఆధారాలు చూడండి -

1. తొలి ప్రసంగం (54-190 వరకు) ఎన్నో ఆధారాలతో అమౌలికమూ, ప్రక్షిప్తమూ అని రుజు వవుతూంది. శైలి దృష్టితోనూ మనువు రచన కాదు.

2. తొలి ప్రసంగపు సంకేతక శ్లోకం 44ను అనుసరించింది కాదు. దాని ప్రారంభం కూడా మనువు శైలిలో లేదు. మనువు శైలి ప్రకారం, పాతకుల గణనకు ముందే దాని సంకేతం ఉండాలి.

3. రెండవ ప్రసంగం మనువు సంకేతక శ్లోకమైన 44ను అనుసరించి లేదు. ఇందులో 191వ శ్లోకం **"అకుర్వన్ విహితం కర్మ"** అనే దాన్ని సూచిస్తుంది. 192-196 శ్లోకాలు **"నిందితం చ సమాచరన్"** 203వ శ్లోకం **"ప్రసక్తశ్చేంద్రియార్థేషు"** అనే వాటిని సూచిస్తాయి. మిగిలిన వన్నీ దోషుల ప్రాయశ్చిత్త శక్తి, కాలాన్ని ఆధారం చేసుకుని నిర్ణయించాలనే సంకేతమిస్తూ (209) ఈ ప్రసంగాన్ని సంక్షిప్తంగా ముగించాడు.

4. 192వ శ్లోకంలోని పదాలు, మనువు ఈ ప్రసంగాన్ని సంక్షిప్తంగా చెప్పి ముగించాడని రుజువు చేస్తున్నాయి. 54 నుంచి 190 శ్లోకాలలో వివరణకు ఈ మౌలికలతో ఎటువంటి సంబంధమూ లేదు. ఈ శ్లోకంలో మనువు అన్ని రకాల వికర్మస్థులకూ (నిందనీయ లేదా వ్యవస్థకు వ్యతిరేకమైన పనులు చేసేవారు) ఒకటే పదంతో **"ప్రాయశ్చిత్తం చికీర్షంతి వికర్మస్థాస్తు యే ద్విజాః"** అని సామాన్య పద్ధతిని చెప్పాడు. మనువు కనుక ఒక్కొక్క అపరాధాన్నీ లెక్కించి వాటికి విస్తృత ప్రాయశ్చిత్తాలు చెప్పి ఉంటే - ఒకటే పదంతో అందరినీ, నిందిత కర్మలు చేసే అందరినీ ఒకే చోట చెప్పి ఉండడు. ఈ శ్లోకంతో మొదటి ప్రసంగం అమౌలిక మనీ, రెండవ ప్రసంగమే మౌలిక మనీ రుజు వవుతూంది.

ఈ విధంగా ప్రసంగ వ్యతిరేకాలు ఉండటం చేత ఇది అసంగతంగా రుజువైంది. ప్రసంగం ప్రకారం 53 తర్వాత, 191వ శ్లోకం ఉండాలి. మధ్యలోని ఈ అన్ని శ్లోకాలూ అప్రాసంగిక మైనవి.

4. శైలీగత ఆధారాలు

మొత్తం ప్రసంగంలో మహా పాతకాలు, ఉప పాతకాలు, ఇతర పాతకాల విభజన, వాటి శిక్షా వ్యవస్థలో విచ్చలవిడితనం, పక్షపాతం, అసంతులత నిండిన శైలి ఉంది. వీటి విభజన కూడా నిరాధార మైందీ, సహేతుకం కానిదీ. మనువు శైలిలో ఈ లోపాలు ఉండవు. కనుక ఈ ప్రసంగం ప్రక్షిప్తం.

191,192 శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

వ్రాత్యుల ప్రాయశ్చిత్తం- ఇది మనుకృతం-ప్రామాణికం

యేషాం ద్విజానాం సావిత్రీ నానూచ్యేత యథావిధి । మూలశ్లోక సం. **6**
తాంశ్చారయిత్వా త్రీన్ కృచ్ఛ్రాన్ యథావిధ్యుపనాయయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **191**

టీక:-యేషాం ద్విజానాం సావిత్రీ = ఏ ద్విజుల (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు) యజ్ఞోపవీత సంస్కారం, **యథావిధి** = ఉచిత సమయంలో (2.11,12,13) **న+అనూచ్యేత** = జరగలేదో, (చేయలేదో), **తాన్** = వారిని, **త్రీన్ కృచ్ఛ్రాన్ చారయిత్వా** = మూడు కృచ్ఛ్ర వ్రతాలు చేయించి (11.212) **యథావిధి+ఉపనాయయేత్** = విధిపూర్వకంగా ఉపనయన సంస్కారం చేయాలి.

తాత్పర్యం:- సకాలంలో ఉపనయనం జరగని బ్రాహ్మణక్షత్రియ వైశ్య వర్ణాలవారికి మూడు ప్రాజాపత్య కృచ్ఛ్రాలను చేయించి అటుపైన వారికి విధి పూర్వకంగా ఉపనయనం చేయాలి. నిర్ణీత వయస్సులో ఉపనయనం చేయకపోవడం కూడ పాపహేతువే. ॥191॥

నిందిత కర్మలు చేయువారికి ప్రాయశ్చిత్తము- ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రాయశ్చిత్తం చికీర్షంతి వికర్మస్థాస్తు యే ద్విజాః । మూలశ్లోక సం. **7**
బ్రహ్మణా చ పరిత్యక్తాస్తేషామప్యేతదాదిశేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **192**

టీక:-వికర్మస్థాః యే ద్విజాః = ధార్మిక కర్తవ్యాలను త్యజించిన ద్విజులు (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు) ఉపనయనయుక్తులైనా, **ప్రాయశ్చిత్తం చికీర్షన్తి** = ప్రాయశ్చిత్తం చేసికొని, తమను శుద్ధం చేసికోవాలని కోరేవారు, **చ** = మరియు, **బ్రహ్మణా పరిత్యక్తాః** = వేదాదులను త్యజించినందువల్ల ప్రాయశ్చిత్త మాచరించాలనుకొనేవారు, **తేషామ్+అపి+ఏతత్ + ఆదిశేత్** = వారికి కూడా పూర్వోక్తమైన వ్రతం (11.191) చేయాలని ఆదేశం.

తాత్పర్యం:- ధార్మిక కర్తవ్యాలను త్యజించిన ద్విజులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ఉపనయన యుక్తులైన ప్రాయశ్చిత్తం చేసుకొని, వేదాదులను త్యజించినందువల్ల ప్రాయశ్చిత్యం ఆచరించాలను కొనేవారు, వారికి కూడా పూర్వోక్తమైన వ్రతం చేయాలని ఆదేశం. ॥192॥

193 నుండి 202 శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *యద్గర్హితేనార్జయంతి కర్మణా బ్రాహ్మణా ధనమ్ ।*
తస్యోత్సర్గేణ శుద్ధ్యంతి జప్యేన తపసైవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***193***

తాత్పర్యం:- పట్టరాని దుష్ప్రతిగ్రహం పట్టడం మొదలైన నింద్యమైన కర్మలచేత ఏ ధనమును విప్రులు సంపాదిస్తారో, ఆ ధనమును మరొకడికి దానం చేయడం వల్ల ఇక మీద చెప్పబడు జపతపములచేత పరిశుద్ధులు అవుతారు. విక్రయింపతగని వస్తువులను విక్రయించినా ఇదే ప్రాయశ్చిత్తం. ॥193॥

* **జపిత్వా త్రీణి సావిత్ర్యాస్సహస్రాణి సమాహితః ।**
మాసం గోష్ఠే పయః పీత్వా ముచ్యతేఽసత్ప్రతిగ్రహాత్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* **194**

తాత్పర్యం:- అవి ఏమిటంటే-దుష్టదానాలు తీసుకున్నప్పుడు మూడువేలు గాయత్రీజపం చేసుకోవాలి. ఆవుల మందతో పాటు నివశిస్తూ ఒక నెల పాలు మాత్రమే ఆహారంగా స్వీకరించాలి. దుష్టవర్తకం చేసి ధనం సంపాదించినా, దుష్టదానాల వల్ల డబ్బు పొందినా, శూద్రుల వల్ల ఇలాంటి దానాలు పొందినా ప్రాయశ్చిత్తవిధి ఇదే ! ॥194॥

* **ఉపవాసకృశం తంతు గోవ్రజాత్పునరాగతమ్ ।**
ప్రణతం పరిపృచ్ఛేయుః సామ్యం సౌమ్యేచ్ఛసీతి కిమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* **195**

తాత్పర్యం:- ఈ పాలు ఆహారం ప్రాయశ్చిత్తం నిర్వర్తించి మరలివచ్చిన వాడిని, బ్రాహ్మణ ధర్మపరిషత్తు (ఒక విప్రమండలి) విచారించి "తెలిసో తెలియకో ఈ దుష్టదానం పట్టావు. ప్రాయశ్చిత్తం జరిగింది కదా! ఇకపై తిరిగి ఇలాంటివి చేయనట్లయితేనే నీకు సాటి బ్రాహ్మణులలో గౌరవం" అని హెచ్చరించాలి. ॥195॥

* **సత్యముక్త్వా తు విప్రేషు వికిరేద్యవసం గవామ్ ।**
గోభిః ప్రవర్తితే తీర్థే కుర్యుస్తస్య పరిగ్రహమ్ ॥ *ప్రక్షిప్త శ్లోక సం.* **196**

తాత్పర్యం:- నేను ఇకపై ఇలాంటి అసత్ దానాలకు పాల్పడనని, ఆ విప్రుడి చేత గట్టిగా చెప్పించి, గోవులకు అతడిచేత మేతవేయించాలి. గోవులు ఆ గడ్డిని పరిపూర్ణంగా మేస్తేనే, అతడు పాప పరిశుద్ధుడైనట్లు లెక్క. ॥196॥

ప్రక్షిప్తాల పరిశీలన

ఈ నాలుగు (10.193-196) శ్లోకాలూ కింది కారణాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

1. 10.191వ శ్లోకంలో యజ్ఞోపవీతధారణ జరగని ద్విజులకు మూడు కృచ్ఛ్ర వ్రతాలను ప్రాయశ్చిత్తంగా చెప్పారు. తర్వాత 192లోనూ, **'ఏతదాదిశేత్'** అంటూ వాటినే సంకేతించారు. కేవలం బ్రాహ్మణులకే శుద్ధి చెప్పటం ప్రసంగ వ్యతిరేకం.

2. 192లోని అందరు వ్యక్తులూ అన్ని కర్మలూ ఆచరించక పోవటం గురించి ఉంది. కనుక ఇక్కడ బ్రాహ్మణుల కర్మల గణన అవసరమే లేని విషయం.

2. అంతర్ వ్యతిరేకాలు

ఇక్కడ 'ద్విజ' పదంతో మనువు అభిప్రాయం- బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనే మూడు వర్ణాలవారూ అని. ద్విజుల ప్రాయశ్చిత్తం అంటే బ్రాహ్మణుల ప్రాయశ్చిత్తం కూడా జరుగుతుంది. మరి బ్రాహ్మణులకు కొత్త పద్ధతి చెప్పటం మౌలికంగా తోచదు. పైగా బ్రాహ్మణులకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పరిస్తే, మళ్ళీ క్రమంగా క్షత్రియాదులకూ మరో వ్యవస్థ ఉండాలి. అన్ని వర్ణాలకూ వేర్వేరు వ్యవస్థలు చెప్పడమే మనువు అభీష్టమైతే, ద్విజులనే సామాన్య వ్యవస్థ ఇంకెవరికి చెప్పినట్లు? (బ్రాహ్మణుడు ఒక వేళ [193] జపతపాలతో శుద్ధుడైపోతే, బ్రాహ్మణులకు కృచ్ఛ్రవ్రతాల అవసరం లేదా? కనుక ఈ రెండు పద్ధతులూ పరస్పరం సమన్వయం లేని వ్యతిరేకాలవుతాయి.

3. పునరుక్తులు

మనువు 11.225,226లలో గాయత్రి మొదలైన మంత్రాల జపంతో ద్విజులు శుద్ధు లవుతారని చెప్పాడు. 227లో తపస్సు మొదలైన సాధనలూ చెప్పాడు. మళ్ళీ ఇక్కడ బ్రాహ్మణులకు [193,194] జప తపాలతో శుద్ధి జరగట

మనేది పునరుక్తి కనుక పరిగణించబడదు. జప తపాలకు భిన్నమైన = యజ్ఞాలు చేయటం, అహింసా పాలన [222], తమ దోషాలు చెప్పటం, వేదాభ్యాసం [227], బ్రాహ్మణులకు ఇవన్నీ అవసరం లేదా? కనుక ద్విజుల ప్రాయశ్చిత్తం అనటం వదిలేసి బ్రాహ్మణులకు విడిగా ప్రాయశ్చిత్తం చెప్పటం పునరుక్తీ, పక్షపాత భావనతో కూడిన దవుతుంది.

4. శైలీవ్యతిరేకాలు

194లో ప్రాయశ్చిత్తం కొరకు బ్రాహ్మణులు ఒక నెల పాటు గోశాలలో ఉండి పాలు తాగాలి అని చెప్పి, 196లో గోవులు తిరిగే ప్రాంతం తీర్థ స్థానం అవుతుంది. కనుక అక్కడికి వెళ్తే బ్రాహ్మణులు శుద్ధు లవుతారు అన్నారు. ఇటువంటి సహేతుకం కాని, పక్షపాత భావన గల మాటలు మనువు చెప్పినవి ఎన్నటికీ కానేరవు.

* ఇతర అనేక ప్రాయశ్చిత్తాలు -

* *వ్రాత్యానాం యాజనం కృత్వా పరేషామంత్యకర్మ చ ।*
అభిచారమహీనం చ త్రిభిః కృచ్ఛ్రైర్వ్యపోహతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***197***

తాత్పర్యం:- వ్రాత్యుల చేత వ్రాత్యస్తోమం మొ॥ యాగములు చేయించి గురువు, తల్లిదండ్రులు మొ॥ వారికంటే ఇతరులైన నిషిద్ధులకు దాహ పంచయనములు మొ॥ ప్రేతకృత్యములు చేసి, శ్యేనయాగం మొ॥ అభిచారాలను ప్రయోగించి, అహీనమనే యాగం చేసి మూడు ప్రాజాపత్య కృచ్ఛ్రములును ఆచరించగా పరిశుద్ధదవుతాడు. ॥197॥

* *శరణాగతం పరిత్యజ్య వేదం విప్లావ్య చ ద్విజః ।*
సంవత్సరం యవాహారస్తత్పాపమపసేవతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***198***

తాత్పర్యం:- శరణన్న వారిని రక్షించగలిగీ ఎవడు అతడిని విడిచి పెడతాడో, ఆ పాపాన్ని పోగొట్టుకోడానికి అతడు అనధ్యాయ దినాలలో వేదం చెప్పాలి. సంవత్సరకాలానికి పాపపరిహారం, లేదా ఏడాది పాటు రసవర్గ సహిత భోజనానికి దూరంగా ఉంటూ ఉప్పులేని (చప్పటి) ఆహారం భుజించాలి. ॥198॥

* *శ్వశృగాలఖరైర్దష్టో గ్రామ్యైః క్రవ్యాద్భిరేవ చ ।*
నరాశ్వోష్ట్రవరాహైశ్చ ప్రాణాయామేన శుధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***199***

తాత్పర్యం:- కుక్క నాకినా/ వాసన చూసినా/పండ్లతో చీల్చినా ఆ వస్తువును బాగా కడిగి నిప్పులపై సెగతగిలేలా వేడి చేయాలి. అలాగే కుక్క, నక్క, గాడిద, గుర్రం, పంది, ఒంటె, పిల్లి మొదలైనవీ, నరుడూ కరచినప్పుడు బ్రాహ్మణుడు ప్రాణాయామం చేత పరిశుద్ధుడవుతాడు. ॥199॥

పతితులని చెప్పబడి,పంక్తిబాహ్యులైనవారి విషయమున ఈ కింది విధంగా ఆచరించాలి:

* *షష్ఠాన్న కాలతా మాసం సంహితాజప ఏవ వా ।*
హోమాశ్చ సకలా నిత్యమపాఙ్క్త్యానాం విశోధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***200***

తాత్పర్యం:- అపాంక్తేయులు నెలకు 3 ఉపవాసాలు చేస్తూ నాలుగోరోజు సాయంకాలం భోజనం చేస్తూ, ప్రతిరోజూ వేదాధ్యయనం ఆచరించాలి. ప్రత్యేకమైన 8 మంత్రాలతో హోమాన్ని నిర్వర్తించాలి. ఇలా ఒక ఏడాది కాలం నిర్వర్తిస్తే గాని పరిశుద్ధుడు కాడు. తిరిగి బ్రాహ్మణుల సరసన నిలబడటానికైనా అర్హుడు కాడు. ॥200॥

* *ఉష్ట్రయానం సమారుహ్య ఖరయానం తు కామతః ।*
స్నాత్వా తు విప్రో దిగ్వాసాః ప్రాణాయామేన శుధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***201***

తాత్పర్యం:- ద్విజుడెన్నడూ గాడిదలు-ఒంటెలు పూన్చబడిన బండిని ఎక్కరాదు. అజ్ఞానం చేత ఆ విధంగా జరిగినా, దానికి ప్రాయశ్చిత్తంగా నగ్నంగా స్నానం చేసి ప్రాణాయామం చేత పరిశుద్ధుడు కావలసి ఉంటుంది. ॥201॥

* ***వినాద్భిరప్సు వాఽప్యార్తశ్శారీరం సన్నివేశ్య చ ।***
సచేలో బహిరాప్లుత్య గామాలభ్య విశుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***202***

తాత్పర్యం:- తెలిసిగాని-తెలీకగాని నీటిలోకి వేగంగా మూత్రపురీషాదులు వదిలిన వాడికి ప్రాయశ్చిత్తం:- నదిలో సచేలస్నానం, వేదాధ్యయనం, తదుపరి గోవును తాకి పరిశుద్ధుడు కావడం. ॥202॥

ప్రక్షిప్తాల పరిశీలన

197 నుంచి 202 వరకు గల శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకాలు, విషయ వ్యతిరేకాలు, అంతర్ వ్యతిరేకాలు, శైలీగత ఆధారాలతో ప్రక్షిప్తాలు. వీటి సమీక్ష 11.204-208 శ్లోకాల మీద ఒకే చోట చూడండి.

వేదోక్త కర్మల త్యాగానికి ప్రాయశ్చిత్తం **ఇది మనుకృతం-ప్రామాణికం**

వేదోదితానాం నిత్యానాం కర్మణాం సమతిక్రమే । మూలశ్లోక సం. **8**
స్నాతకవ్రతలోపే చ ప్రాయశ్చిత్తమభోజనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **203**

టీక:-వేదోదితావాం నిత్యానాం కర్మణాం సమతిక్రమే = వేదోక్తమైన నైత్యిక (అగ్నిహోత్రం, సంధ్యావందనం మొ॥) కర్మలు అనుష్ఠించనప్పుడు, **చ** = మరియు, భిక్షాచరణాదులు ఆచరించనప్పుడు, **అభోజనమ్ ప్రాయశ్చిత్తమ్** = ఒకరోజు ఉపవాసం చేయడమే ప్రాయశ్చిత్తం.

తాత్పర్యం:- వేదోక్తమైన నైత్యిక కర్మలు అనుష్ఠించనప్పుడు (ఉదా: వేదోక్త నిత్యకర్మలు విడిచినప్పుడు, నాలుగో అధ్యాయంలో చెప్పబడిన స్నాతక వ్రతాదులు వదిలేసినప్పుడు) భిక్షాచరణాదులు ఆచరించనప్పుడు ఒక రోజంతా ఉపవాసం చేయడమే ప్రాయశ్చిత్తం. ॥203॥

వివరణ: తులనార్థం 2.195,220 చూడగలరు.

204-208వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** బ్రాహ్మణున్ని నిందించినందుకు, చంపినందుకు ప్రాయశ్చిత్తము -**

* ***హుంకారం బ్రాహ్మణ స్యోక్త్వా త్వంకారం చ గరీయసః ।***
స్నాత్వానశ్నన్నహశ్శేష మభివాద్య ప్రసాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***204***

తాత్పర్యం:- తన కంటే వయస్సులో పెద్దవాడైనా, విద్యలో అధికుడైనా అలాంట్టి విప్రుణ్ణి నిందించేవారికి ప్రాయశ్చిత్తం: ఒక నెల రోజులపాటు ఒంటి పొద్దులుండి, ఆఖరిరోజున ఆ బ్రాహ్మణుని కాళ్లు పట్టుకొని, ఆయన కోపాన్ని ఉపశమింపజేయాలి. ॥204॥

* ***తాడయిత్వా తృణేనాపి కంఠే వాఽఽబద్ధ్య వాససా ।***
వివాదే వా వినిర్జిత్య ప్రణిపత్య ప్రసాదయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***205***

తాత్పర్యం:- బ్రాహ్మణుణ్ణి చివరకు గడ్డిపరకతో కూడ కొట్టకూడదు. మెడబట్టి గెంటరాదు. వాదులాడి తనదే విజయమని గర్వించరాదు. అలా జరిపిన వారికి ప్రాయశ్చిత్తం: అదే బ్రాహ్మణుడికి సత్కారం చేయడం. ॥205॥

* *అవగూర్య త్వబ్దశతం సహస్రమభిహత్య చ ।*
జిఘాంసయా బ్రాహ్మణస్య నరకం ప్రతిపద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***206***

తాత్పర్యం:- బ్రాహ్మణుణ్ణి చంపడానికి కర్రపైకెత్తినా చాలు! నూరేళ్లు నరకవాసం తప్పదు. బెదిరింపుగాక నిజంగానే కొడితే వెయ్యేళ్లు నరకంలో పడి ఉండాలి. ॥206॥

* *శోణితం యావతః పాంసూన్ సంగృహ్ణాతి మహీతలే।*
తావన్ త్యబ్దసహస్రాణి తత్కర్తా నరకే వసేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***207***

తాత్పర్యం:- బ్రాహ్మణుణ్ణి చంపబోయి, కొట్టగా ఆ బ్రాహ్మణుడి దేహం నుంచి రక్తంకారి ఎన్ని ధూళి కణాలు తడిస్తే, అన్ని వేల ఏళ్లు ఆ దండించేవాడికి నరకం తప్పదు. ॥207॥

* *అవగూర్య చరేత్కృచ్ఛ్రమతికృచ్ఛ్రం నిపాతనే ।*
కృచ్ఛ్రాతికృచ్ఛ్రౌ కుర్వీత విప్రస్యోత్పాద్య శోణితమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***208***

తాత్పర్యం:- చంపబోయి కర్ర ఎత్తేవాడు అతికృచ్ఛ్రవ్రతం ఆచరించాలి. బ్రాహ్మణుడికి గాయం చేసేంతగా కొడితే కృచ్ఛ్రం-అతికృచ్ఛ్రం రెండూ ప్రాయశ్చిత్తంగా ఆచరించాలి. ॥208॥

ప్రక్షిప్తాల పరిశీలన

11.204 నుంచి 208 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

సంకేతక శ్లోకమైన 11.44 ప్రకారం, ఈ ప్రసంగంలో 191-192, 203 శ్లోకాలే మౌలికమూ, ప్రాసంగికంగా రుజు వవుతూంది, మిగిలిన వన్నీ అప్రాసంగికాలు (చూడండి 54 నుంచి 190 శ్లోకాల ప్రసంగ వ్యతిరేకపు సమీక్ష).

2. విషయ వ్యతిరేకాలు

ఈ ప్రసంగంలో 198, 199-202, 204 శ్లోకాలలోని విషయాలు, 44వ శ్లోకంలో చెప్పిన దాని ప్రకారం పాపాలూ కావు, పాపాలని మునుపు వర్ణించినవీ కావు. అందువల్ల విషయ వ్యతిరేకాలు కావటం చేత ఇవి ప్రక్షిప్తాలు.

3. అంతర్ వ్యతిరేకాలు

1. 198-202, 204, 205-207 శ్లోకాలలో చెప్పినవి 210 నుంచి 226లలో చెప్పిన వాటికి భిన్నం కనుక ఇది వ్యతిరేక వర్ణన.

2. 205-208లలో చెప్పిన నరక వర్ణన మనువుకు వ్యతిరేకం. వీటిలో చెప్పిన నరక పద్ధతి కూడా మను సమ్మతం కాదు. (చూడండి 4.87-91 శ్లోకాల మీది సమీక్ష).

4. శైలీగత ఆధారాలు

202లో సాంప్రదాయిక శైలి ఉంది. 205-207లలో పక్షపాతంతో, సహేతుకం కాని, నిరాధారమైన, అతిశయోక్తులతో కూడిన శైలి ఉంది. మనువు శైలిలో ఈ లోపాలు ఉండవు.

అవిహిత కర్మలు చేసినందుకు ప్రాయశ్చిత్త నిర్ణయం- 209 నుండి 214 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

అనుక్తనిష్కృతీనాం తు పాపానామపనుత్తయే । మూలశ్లోక సం. **9**
శక్తిం చావేక్ష్య పాపం చ ప్రాయశ్చిత్తం ప్రకల్పయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **209**

టీక:-అనుక్త నిష్కృతీనాం తు పాపానామ్ = ప్రాయశ్చిత్తం విధింపబడని అపరాధముల యొక్క **అపనుత్తయే** = దోషాన్ని తొలగించడానికి, **శక్తిం చ పాపం అవేక్ష్య** = ప్రాయశ్చిత్తం చేయబోయే వాడి శక్తిని, అపరాధమును చూసి, **ప్రాయశ్చిత్తం ప్రకల్పయేత్** = ప్రాయశ్చిత్తాన్ని నిర్ణయించాలి.

తాత్పర్యం:- ప్రాయశ్చిత్తం విధింపబడని ఆధారాల యొక్క దోషాన్ని తొలగించడానికి ప్రాయశ్చిత్తం చేయబోయే వాడి శక్తిని, అపరాధాన్ని చూసి ప్రాయశ్చిత్తాన్ని నిర్ణయించాలి. ॥209॥

ప్రాయశ్చిత్తాల పరిచయ వర్ణన

ఇది మనుకృతం-ప్రామాణికం

యైరభ్యుపాయైరేనాంసి మానవో వ్యపకర్షతి । మూలశ్లోక సం.**10**
తాన్ వోఽభ్యుపాయాన్ వక్ష్యామి దేవర్షి పితృసేవితాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**210**

టీక:-మానవః = మనుష్యుడు, **యైః + అభ్యుపాయైః** = ఏ ఉపాయాల ద్వారా, **ఏనాంసి వ్యపకర్షతి** = పాపా (అపరాధాలను)లను, (పాపఫలాలను కాదు) దూరం చేస్తాడో, ఇప్పుడు నేను, **దేవ-ఋషి-పితృ-సేవితాన్** = విద్వాంసులు, ఋషులు, **తత్త్వజ్ఞానులు** = తండ్రి మొ॥ వయోవృద్ధ వ్యక్తులు సేవించిన, **తాన్ అభ్యుపాయాన్ వః వక్ష్యామి** = ఆ ఉపాయాలనన్నింటిని మీకు తెలియజేస్తాను.

తాత్పర్యం:- మానవుడు ఏ కారణాలచేత పాపాలను పోగొట్టుకుంటే....ప్రాయశ్చిత్తం చేసుకుంటే మంచిదో; అందుకు ఋషులు, విద్వాంసులు, తండ్రి, వయోవృద్ధులు అనుష్ఠించిన మార్గాలేమిటో చెపుతాను-గ్రహించండి!॥210॥

వివరణ:

ఇక్కడ మనుమహర్షి- విద్వాంసులు, ఋషులు, పితరులు సేవించిన, ఆచరించిన ప్రాయశ్చిత్తాల విధానాన్ని వర్ణించారు. (11.211-225) మనుస్మృతిలో అనేక స్థలాలలో, దేవ-ఋషి-పితరుల గౌరవాన్ని గురించి వర్ణన లభిస్తుంది. (2.126-131) (2.151, 1-156) మొ॥ పరంపరాగతంగా ఈ శబ్దాలు ప్రచలితాలైనవి. దేవ-ఋషి-పితర శబ్దాలకున్న అర్థాలను తెలియడానికి విశేష వివేచన (3.81,82) శ్లోకాల వివరణ చూడగలరు.

2. 'ఏనః' శబ్దార్థం కోసం 2.2, (2.27) వివరణ చూడగలరు.

3. ఈ వ్రతాల ద్వారా పాపఫలితం నివృత్తికాదు. కానీ, పాపభావన తగ్గిపోతుంది. సప్రమాణంగా వివరణ చూడండి. (11.227)

ప్రాజాపత్యవ్రత విధి-

ఇది మనుకృతం-ప్రామాణికం

త్ర్యహం ప్రాతస్త్ర్యహం సాయం త్ర్యహమద్యాదయాచితమ్ । మూలశ్లోక సం.**11**
త్ర్యహం పరం చ నాశ్నీయాత్ప్రాజాపత్యం చరన్ ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**211**

టీక:-ప్రాజాపత్యం చరన్ ద్విజః = ప్రాజాపత్యమనే పేరుగల వ్రతాన్ని పాలించే ద్విజుడు (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు), **త్రి +అహం ప్రాతః** = మొదటి మూడురోజులు ప్రాతఃకాలమే, **త్రి+అహమ్ సాయం** = మూడురోజులు కేవలం సాయంకాలమే, **త్రి + అహమ్ అయాచితమ్ అద్యాత్** = తరువాత మూడురోజులు, అడక్కుండా లభించిన అన్నమునే భుజించాలి. **చ** = మరియు, **పరం త్రి +అహం న అశ్నీయాత్** = తరువాత మళ్ళీ మూడుదినాలు ఉపవాసముండాలి. ఇది ప్రాజాపత్య వ్రతం.

తాత్పర్యం:- ప్రాజాపత్య కృచ్ఛ్రాన్ని చేసే ద్విజుడు అయాచితంగా తనకు దొరికిన ఆహారాన్ని మూడు దినాలు పగటిపూట మాత్రమే భుజించాలి. మూడు దినాలు రాత్రిపూట మాత్రమే తినాలి. మూడు దినము లే మాత్రం ఆహారం తీసికొనవద్దు. (ఉపవాసం చేయాలి). ॥211॥

వివరణ:

యోగదర్శనంలో "కృచ్ఛ్ర" మొ॥ వ్రతముల ఉద్దేశం:- మనుస్మృతిలో చిత్తం యొక్క అశుద్ధిని తొలగించడానికి ప్రాయశ్చిత్త విధానం తెలుపబడింది. ఈ విషయాన్ని సమర్థిస్తూ యోగదర్శనానికి గల వ్యాసభాష్యంలో ఈ విధంగా రాస్తున్నారు.

"కాయేన్ద్రియసిద్ధిః అశుద్ధిక్షయాత్ తపసః" అంటే తపస్సు ద్వారా, శరీరం ఇంద్రియాల అశుద్ధి క్షీణించగా, శరీరం రోగరహితంగాను, చిత్తాది ఇంద్రియాలు నిర్మలమవుతాయి. 2.32 సూత్ర భాష్యంలో తపస్సుకు వ్యాఖ్య చేస్తూ "కృచ్ఛ్ర" చాంద్రాయణాది వ్రతములను కూడా **"తపస్సు"** కిందనే పరిగణించారు. **"వ్రతాని చైషాం యథాయోగం కృచ్ఛ్ర చాంద్రాయణసాన్తపనాదీని"** అంటే తపస్సులో అంతర్గతాలే. కృచ్ఛ్రవ్రతం, చాంద్రాయణ వ్రతం, సాన్తపనాది వ్రతాలు కూడా ఈ వ్రతాలన్నిటిని, శరీర పరిస్థితిననుసరించి ఆచరించాలి. ఈ ప్రకారంగా, వ్రతాల ద్వారా పాపం వల్ల కలిగే అశుద్ధి క్షీణించి పోతుంది.

కృచ్ఛ్ర-సాంతపన వ్రతవిధి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకమ్ । మూలశ్లోక సం. **12**
ఏకరాత్రోపవాసశ్చ కృచ్ఛ్రం సాంతపనం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **212**

టీక:- క్రమశః ఒక్కొక్కరోజు, **గోమూత్రం, గోమయం, క్షీరం, దధిః సర్పిః కుశ+ఉదకమ్** = గోమూత్రం, గోమయం (గోమయ రసం), క్షీరం, ఆవు పెరుగు, గోఘృతం, కుశోదకమ్ (దర్భలు ఉడికించి తీసిన రసం) వీటిని భుజించాలి. **చ** = మరియు, **ఏకరాత్ర+ఉపవాసః** = మళ్ళీ ఒక పగలు, రాత్రి ఉపవాసం చేయాలి. ఇది, **కృచ్ఛ్రం సాంతపనం స్మృతమ్** = కృచ్ఛ్ర-సాంతపమనే వ్రతం.

తాత్పర్యం:- ఇంకా..... గోమూత్రం, ఆవుపేడ, ఆవుపాలు, ఆవునెయ్యి, ఆవు పెరుగు (వీటిని పంచగవ్యాలు అంటారు) వీటికి దర్భలు ఉడికించి తీసిన రసం చేర్చి ఒక రోజు ఆహారంగా తినాలి. మరుసటి రోజు ఉపవాసం చేయాలి. దీన్ని **'సాంతపన కృచ్ఛ్రం'** అంటారు. ఇక్కడ చెప్పిన ఆరువస్తువులను రోజుకొక్కటి చొప్పున తీసుకొని ఏడో రోజు ఉపవాసం ఉంటే దాన్ని **'మహాసాంతపనం'** అని అంటారు. ॥212॥

అతికృచ్ఛ్ర వ్రత విధి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఏకైకం గ్రాసమశ్నీయాత్త్ర్యహాణి త్రీణి పూర్వవత్ । మూలశ్లోక సం. **13**
త్ర్యహం చోపవసేదంత్యమతికృచ్ఛ్రం చరన్ ద్విజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **213**

టీక:-అతికృచ్ఛ్రం చరన్ ద్విజః = అతికృచ్ఛ్ర నామకవ్రతాన్ని పాలించు, **ద్విజః** = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, **పూర్వం విధి** = (11.211) పూర్వవిధి ప్రకారం, **త్రి + అహాణి త్రీణి** = మూడురోజులు కేవలం ప్రాతఃకాలం, మూడురోజులు కేవలం సాయంకాలం, మూడురోజులు అయాచిత భోజనం, **ఏకం ఏకం గ్రాసమ్ + అశ్నీయాత్** = ఒక్కొక్క గ్రాసం భోజనం చేయాలి, **అన్త్యంత్రి + అహం చ ఉపవసేత్** = అంతిమదినత్రయం ఉపవాసముండాలి. ఇది అతికృచ్ఛ్రవ్రతం.

తాత్పర్యం:- అతికృచ్ఛ్ర వ్రతం అంటే- బ్రాహ్మణుడు క్షత్రియ, వైశ్యులు కేవలం ప్రాతఃకాలం, మూడురోజులు సాయంకాలం మూడు రోజులు అయాచిత భోజనం, ఒక్కొక్క గ్రాసం తీసుకోవాలి, అంతిమదిన త్రయం ఉపవాసముండాలి.॥213॥

తప్తకృచ్ఛ్ర వ్రతవిధి- ఇది మనుకృతం-ప్రామాణికం

తప్తకృచ్ఛ్రం చరన్ విప్రో జలక్షీరఘృతానిలాన్ । మూలశ్లోక సం. **14**
ప్రతిత్ర్యహం పిబేదుష్ణాన్ సకృత్స్నాయీ సమాహితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **214**

టీక:-తప్త కృచ్ఛ్రం చరన్ విప్రః = 'తప్త కృచ్ఛ్ర' వ్రతాన్ని పాలించే విప్రుడు, **ఉష్ణాన్ జల+క్షీర-ఘృత అనిలాన్ ప్రతిత్ర్యహం పిబేత్** = వేడినీరు, వేడిపాలు, వేడిగా ఉన్న నెయ్యి, వాయువు, ఇందులో ఒక్కొక్క దాన్ని మూడు మూడు రోజులు తాగి ఉండాలి, మరియు, **సకృత్ స్నాయీ** = ఒక్కసారి మాత్రమే స్నానం చేయాలి, **తథా** = అలాగే **సమాహితః** = ఏకాగ్ర చిత్తంకలవాడై ఉండాలి.

తాత్పర్యం:- తప్తకృచ్ఛం అంటే వేడినీరు, కాచిన పాలు, వేడిచేసిన నెయ్యి, వేడిగాలి ఒక్కొక్క దాన్ని మూడు రోజులు ఆహారంగా తీసుకోవాలి. ఒక్కసారి మాత్రం స్నానం ఆచరించాలి. అలాగే ఏకాగ్ర చిత్తం కలవాడై ఉండాలి. ॥214॥

వివరణ:

ఈ శ్లోకంలో 'వాయువునాధారంగా జీవించమనడం ఉంది. అంటే చివర మూడురోజులు ఏమీ, తినకుండా, తాగకుండా ఉండటమే ఈ వ్రతం.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* పరాక కృచ్ఛ్ర వ్రతవిధి-

* *యతాత్మనోఽ ప్రమత్తస్య ద్వాదశాహమభోజనమ్ ।*
పరాకో నామ కృచ్ఛ్రోఽ యం సర్వపాపాపనోదనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***215***

తాత్పర్యం:- జాగరూకుడై ఇంద్రియాలను అణచికొని పండ్రెండు దినాలు భోజనం లేకుండా శుద్ధోపవాసం ఉండటం, పరాకకృచ్ఛ్రం. ఇది ఒకసారి గాని అనేకసార్లుగాని చేసినవి గొప్పవి, తేలికయైన సమఫలములు ఇచ్చినట్లయితే అన్ని పాపాలను పోగొట్టును. ॥215॥

ప్రక్షిప్త పరిశీలన

ఈ (215వ) శ్లోకం కింది కారణాలతో ప్రక్షిప్తం -

1. ప్రసంగ వ్యతిరేకం

11.191వ శ్లోకంలో మూడు కృచ్ఛ్ర వ్రతాలను నిర్దేశించారు. వాటి పద్ధతి 212 నుంచి 214 వరకు ఉంది. 215వ శ్లోకంలో వాటికి భిన్నమైన వేరొక పరాక మనే కృచ్ఛ్ర వ్రత పద్ధతి ఉంది. ఇది మునుపు చెప్పిన వాటితో పొంతన లేనిది. మునుపు చెప్పిన కృచ్ఛ్ర వ్రతాల కన్నా ఈ పరాక కృచ్ఛ్రంలో సమానత లేదు. ఎందుకంటే ఆ వ్రతాలలో భోజనాన్ని పూర్తిగా వదిలేయలేదు. కానీ, ఇందులో వరసగా 12 రోజుల పాటు భోజనం నిషేధించడం వ్యావహారికం కాదు. ప్రాయశ్చిత్తపు అభిప్రాయం లేదా ఉద్దేశ్యం శుద్ధి కావడమే కానీ, జీవితాన్ని ముగించడం కాదు. ఆ మూడు కృచ్ఛ్రాల కన్నా భిన్నమూ, అసంగతమూ, వేరు పద్ధతి గల, ప్రాయశ్చిత్తపు ఉద్దేశ్యం లేనిది కావడం చేత 'పరాక కృచ్ఛ్రం' మనువు చెప్పింది కాదు.

2. అంతర్ వ్యతిరేకం

ప్రాయశ్చిత్తపు ఉద్దేశం సంస్కారాలను శుద్ధి చేయటం, భవితలో మళ్లీ ఆ తప్పు చేయక పోవటమే కానీ పాపాలను సమాప్తం చేయటం కాదు. మనువు చెప్పేదేమిటంటే చేసిన పాపాలకు ఫలితం తప్పక లభిస్తుందని. కానీ, ఈ శ్లోకంలో 'పరాక కృచ్ఛ్రం' వ్రతంతో అన్ని పాపాలూ నశించి పోతాయని చెప్పారు. ఇది మనువు చెప్పింది కాదు. దీని అభిప్రాయం ప్రాయశ్చిత్తపు ఉద్దేశానికి భిన్నం కావటం చేత అంగీకృతం కాదు.

216,217 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

చాంద్రాయణ వ్రత విధి-

ఏకైకం హ్రాసయేత్పిండం కృష్ణే శుక్లే చ వర్ధయేత్ । మూలశ్లోక సం. **15**
ఉపస్పృశం స్త్రిషవణమేతచ్చాంద్రాయణం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **216**

టీక:-పూర్ణిమరోజు దినమంతటిలో 15 కబళములు (ముద్దలు) భోజనం చేసి, మళ్ళీ, **కృష్ణే ఏక-ఏకం పిండం హ్రాసయేత్** = కృష్ణ పక్షంలో, ఒక్కొక్క గ్రాస భోజనం ప్రతిదినం తగ్గించుకుంటూ పోవాలి. ఈ విధంగా చేస్తూ ఉంటే అమావాస్య దినం పూర్ణంగా ఉపవాసం ఉండాల్సి వస్తుంది. మళ్ళీ శుక్ల పక్షంలో ప్రతిదినమంతటికీ ఒక్క కబళం భోజనం చేస్తూ, **శుక్లే వర్ధయేత్** = శుక్ల పక్షంలో ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క బుక్క-కబలం భోజనం పెంచుతూ పోవాలి. **త్రిషవణమ్ + ఉపస్పృశన్** = మూడు సమయాల్లో స్నానం చేయాలి. **ఏతత్ చాన్ద్రాయణం వ్రతమ్** = ఇదే చాంద్రాయణ వ్రతమనబడుతుంది.

తాత్పర్యం:- ఉదయ సాయంకాలాల్లోను, మధ్యాహ్నవేళ స్నానాలు చేస్తూ, పూర్ణిమ తిథి రోజున 15 ముద్దలు తిని, తర్వాత కృష్ణపక్షంలో రోజుకోముద్ద తగ్గిస్తూ అమావాస్యనాటికి కటిక ఉపవాసం చేస్తూ తిరిగి పున్నం వరకూ ఒక్కోముద్ద పెంచి పౌర్ణమి రోజున 15 ముద్దలు తినడంతో ఏ వ్రతం ముగుస్తుందో దాన్ని పిపీలికామధ్యం అనే **'చాంద్రాయణవ్రతం'** అంటారు. ॥216॥

యవ మధ్యమ చాంద్రాయణ వ్రతవిధి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతమేవ విధిం కృత్స్నమాచరేద్యవమధ్య మే । మూలశ్లోక సం. **16**
శుక్లపక్షాదినియతశ్చరంశ్చాంద్రాయణం వ్రతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **217**

టీక:-**యవమధ్యమే** = యవమధ్యమ విధిలో అంటే, యవలు మధ్యలో లావుగాను, ముందు వెనుకలు పల్చగా ఉంటాయో అలాగే ఈ విధిననుసరించి, **చాంద్రాయణం చరన్** = యవమధ్యమ చాంద్రాయణ వ్రతం చేస్తూ వ్యక్తి, **శుక్ల పక్ష ఆదినియతః** = శుక్లపక్షం నుండి మొదలుపెట్టి, **ఏతం +ఏవ కృత్స్నం విధిం** = పూర్వోక్తమైన (11.216) సంపూర్ణ విధిని, **ఆచరేత్** = ఆచరించాలి. అంటే శుక్లపక్షం నుండి ప్రారంభించి, మొదటిరోజు నుండి ఒక్కొక్క కబళం-ముద్ద పెంచుకుంటూ పోయి, పూర్ణిమరోజున పూర్ణ భోజనం చేయాలి. మళ్ళా కృష్ణపక్షం మొదటిరోజు నుండి ఒక్కొక్క కళబం తగ్గించుకుంటూ పోయి అమావాస్య దినమున నిరాహారంగా ఉండాలి.

తాత్పర్యం:- యవలు మధ్యలో లావుగాను, ముందు వెనుకలు సన్నగానూ ఉంటుందో అలాగే ఈ విధిననుసరించి యవమధ్యమ చాంద్రాయణ వత్రం చేస్తున్న వ్యక్తి శుక్లపక్షం నుండి ప్రారంభించి మొదటి రోజు నుండి ఒక్కొక్క ముద్ద అన్నం పెంచుకొంటూ పోయి, పూర్ణిమ రోజున పూర్ణభోజనం చేయాలి. మళ్ళా కృష్ణపక్షం మొదటి రోజు నుండి ఒక్కొక్క ముద్ద తగ్గించుకుంటూ పోయి అమావాస్య దినమున నిరాహారంగా ఉండాలి. ॥217॥

218-221వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

*** యతి చాంద్రాయణ వ్రతవిధి-**

* *అష్టావష్టౌ సమశ్నీయాత్పిండాన్మధ్యందినే స్థితే ।*
నియతాత్మా హవిష్యాశీ యతిచాంద్రాయణం చరన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***218***

తాత్పర్యం:- ఇక-యతి చాంద్రాయణమంటే....ఈ శ్లోకంలో చెప్పినట్లుగా-కేవలం మధ్యాహ్నం మాత్రం 8 ముద్దలు తిని ఉండటం. ॥218॥

శిశు చాంద్రాయణ వ్రతవిధి-

* **చతురః ప్రాతరశ్నీయాత్పిండాన్ విప్రస్సమాహితః ।**
చతురోఽస్తమితే సూర్యే శిశుచాంద్రాయణం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **219**

తాత్పర్యం:- శిశు చాంద్రాయణ వ్రతం అనే ప్రాయశ్చిత్త విధి ఏమిటంటే ఉదయం కేవలం 4 ముద్దలు-రాత్రి కేవలం 4 ముద్దలు మాత్రమే ఆహారంగా తీసుకోవడం. (శ్లోక ప్రమాణం క్రింద ఇవ్వబడింది) ॥219॥

* **యథా కథంచిత్పిండానాం త్రిస్రోఽశీతీస్సమాహితః ।**
మాసేనాశ్నన్ హవిష్యస్య చంద్రస్యేతి సలోకతామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **220**

తాత్పర్యం:- ఒక్క మాటలో చెప్పాలంటే-ప్రాయశ్చిత్తంగా పైన పేర్కొన్న వ్రతాలు ఆచరించేవారూ ఉన్నారు. (తప్పనిసరి స్థితిలో) పాపాలు జరిగి ఉండవచ్చు. కాబట్టి వాటి పరిహారార్థం ఓపిక ఉన్నప్పుడే ప్రాయశ్చిత్త కర్మ జరుపుకోవాలన్న ముందు జాగ్రత్తపరులూ ఉన్నారు. ఏవిధంగా అయితేనేం 'నీవార ధాన్యం' అన్నం ముద్దలు 240 మించకుండా (నెలకు) చూసుకొనేవారికి చంద్రలోకప్రాప్తి. పాపక్షయం తథ్యం. ॥220॥

* **ఏతద్రుద్రాస్తథాదిత్యా వసవశ్చాచరన్ వ్రతమ్ ।**
సర్వాకుశలమోక్షాయ మరుతశ్చ మహర్షిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **221**

తాత్పర్యం:- ఈ చాంద్రాయణ వ్రతాలను ఆచరించిన వారిలో సప్తమరుత్తులతో సహా అష్టవసువుల మొదలు ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు కూడా ఉన్నారు. కొన్ని పాపాలు పోవడానికి ఒకసారి, ఎక్కువ పాపాలు నివారించుకోడానికి అనేకసార్లు ఆచరించేవారూ ఉన్నారు.

ప్రక్షిప్తాల పరిశీలన

218 నుండి 221 శ్లోకాలు కింది విధంగా ప్రక్షిప్తాలు-

1. అంతర్ వ్యతిరేకాలు

క. 218-219 శ్లోకాలలో ముఖ్యమైన చాంద్రాయణ వ్రతం కన్నా భిన్నమైన విషయం ఉంది. చాంద్రాయణ వ్రతంలో చంద్రుడు తగ్గుతూ పెరుగుతూ ఉన్నట్లే, భోజనం కూడా తగ్గుతూ పెరుగుతూ ఉంటుంది. ఇక్కడ దానికి సంబంధం లేని విషయం - అంటే, మధ్యహ్నం పూట ఎనిమిది ముద్దలు, ఉదయం, సాయంకాలం నాలు గేసి ముద్దలు తినాలని ఉంది. రోజులో ఉదయం, మధ్యాహ్నం సమయాలలో చంద్రుడు ఉండదు కనుక, దీన్ని చాంద్రాయణ వ్రతం అనటమూ తగదు. తర్వాతి ప్రక్షిప్త కారు లెవరో వీటిని పేరుకున్న పోలికతో కల్పించి కలిపేశారు.

ఖ. 226వ శ్లోకం వల్ల ఈ ప్రాయశ్చిత్త విధానాలన్నీ అపరాధుల శుద్ధి కోసమే కానీ. పరలోక పరిస్థితుల కోసం కాదని స్పష్ట మవుతూంది. 220, 221 శ్లోకాలలో 'చంద్ర లోక ప్రాప్తి' కోసం అని చెప్పటం మనువు ఉద్దేశ్యానికి భిన్నం. 226లో చెప్పిన ఉద్దేశ్య సంకేతానికీ వ్యతిరేకం. పునర్జన్మ, ముక్తి తప్ప, మనువు దృష్టిలో వేరే లోకం లేదా ప్రాంతం లేనే లేదు! కనుక మరణించాక అక్కడికి వెళతా మనుకోవటం దండుగ! చంద్ర లోక ప్రాప్తి కల్పన మనువుకు వ్యతిరేకం. 221వ శ్లోకం దీనితో కలుస్తుంది. కనుక, దీనితో పాటు అది కూడా ప్రక్షిప్తమే !

వ్రతపాలన సమయంలో యజ్ఞం చేయాలి- **ఇది మనుకృతం-ప్రామాణికం**

మహావ్యాహృతిభిర్హోమః కర్తవ్యః స్వయమన్వహమ్। మూలశ్లోక సం. **17**
అహింసాసత్యమక్రోధమార్జవం చ సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **222**

టీక:-ప్రాయశ్చిత్త సమయంలో అన్వహమ్ = ప్రతిదినం, స్వయమ్ = ప్రాయశ్చిత్త కర్మను స్వయంగా, మహావ్యాహృతిభిః హోమః కర్తవ్యః = మహావ్యాహృతులు 'భూః భువః స్వః' ఆదియుక్త మంత్రాలతో, హవనం చేయాలి, చ = మరియు,అహింసా సత్యమ్ అక్రోధం + అర్జవం సమాచరేత్ = అహింస, సత్యములను పాటిస్తూ క్రోధరహితంగా, కుటిలత్వం లేకుండా ఉండాలి.

తాత్పర్యం:- అయితే-ఈ వ్రతాలను ఆచరించేవారు ప్రతిరోజూ ఒక నెలకాలం వరకు నేతితో హోమం చేయాలి. మహావ్యాహృతి మంత్రాలను పఠించాలి. స్వాభావికంగా ఉండవలసిన అహింస, సత్యం, కోపం లేకపోవడం లాంటి గుణాలు వ్రతాచరణ సమయంలో అయినా తప్పక ఉండేలా చూసుకోవాలి.॥222॥

వివరణ:

మహావ్యాహృతియుక్త హోమమంత్రాలు.

మహావ్యాహృతులతో కలిసి కొన్ని ప్రసిద్ధ మంత్రాలు కింద పేర్కొనబడినవి. నేడు కూడా యజ్ఞంలో ఆహుతులివ్వడానికి ప్రయోగింపబడుతుంది.

1. **అగ్నిప్రజ్వలించడానికి చేయాల్సిన-మంత్రం**

ఓం భూర్భువః స్వర్ద్యౌరివ భూమ్నాపృథీవీవ వరిమ్ణా
తస్యాస్తే పృథివి దేవయజని పృష్ఠేఽగ్ని మన్నాదమన్నాద్యాయాదధే । (యజు. 3.5)

2. **ఘృతాహుతి మంత్రాలు**

ఓం భూరగ్నయేస్వాహా, ఇదమగ్నయే ఇదం న మమ 1
ఓం భువర్వాయవే స్వాహా, ఇదంవాయవే ఇదం న మమ 2
ఓం స్వరాదిత్యాయ స్వాహా, ఇదమాదిత్యాయ ఇదం నమ 3
ఓం భూర్భువః స్వరగ్నివాయ్వాదిత్యేభ్యః స్వాహా
ఇదం అగ్నివాయ్వాదిత్యేభః ఇదం న మమ (సం.వి.సామాన్య ప్రకరణం).

3. ఇతర ఋక్కులు-9.66, 19.21, 10.121.10 మరియు గాయత్రీ మంత్రం గురించి శ్లోకం 2.53, (2.78) శ్లోకాల వివరణ చూడండి.

223,224 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* *త్రిరహ్నస్త్రిర్నిశాయాం చ సవాసా జలమావిశేత్ ।*
స్త్రీశూద్రపతితాంశ్చైవ నాభిభాషేత కర్హిచిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***223***

తాత్పర్యం:- పిపీలికామధ్యమ యవమధ్యమ చాంద్రాయణ వ్రతాలను మినహాయించి మిగిలిన వాటి విషయమై స్నానం:-నదిలోస్నానం చేయాలి. మొత్తం 4 సార్లు పగలు, రాత్రి వాటి నడిమి కాలాలు. సచేలంగా స్నానంచేసి వ్రతం ఆచరించాలి. పై రెండు చాంద్రాయణాలకు త్రిషవణ స్నానం (ముమ్మారు) చాలు! ఈ వ్రతాలలో ఏది ఆచరిస్తున్నా స్త్రీలు, శూద్రులు, పతితులతో ఎన్నడూ సంభాషించరాదు. ॥223॥

* *స్థానాసనాభ్యాం విహరేదశక్తోఽధశ్శయీత వా ।*
బ్రహ్మచారీ వ్రతీ చ స్యాద్గురుదేవద్విజార్చకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***224***

తాత్పర్యం:- వ్రతాచరణ సమయాల్లో పగలైనా-రాత్రయినా జాగరణ ముఖ్యం, నిలబడి గాని, కూర్చొని గాని ఉండాలి. శక్తిహీనత వల్ల నేలపై పరుండినా నిద్రించరాదు. మంచం మొదలైనవి కలలోనైనా ఊహించరాదు. స్త్రీ సంభోగం అసలే వర్జ్యం. దండం, మౌంజి ధరించాలి. గురువు, దేవతలు, బ్రాహ్మణులను పూజించాలి. ॥224॥

ప్రక్షిప్తాల పరిశీలన

223-224 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. ఈ శ్లోకాలు పూర్వాపర ప్రసంగానికి వ్యతిరేకం కనుక ప్రక్షిప్తాలు. 222వ శ్లోకంలో సావిత్రీ పూర్వక యజ్ఞం చేయాలని ఉంది. 225లో ఆ విషయాన్ని పూర్తి చేస్తూ 'సావిత్రీ జపం కూడా చేయండి' అని ఉంది. ఇట్లా 222వ శ్లోకానికీ, 225వ శ్లోకానికీ వాక్యాత్మక సంబద్ధత ఉంది మధ్యలో దాన్ని విడగొట్టి వేరు విషయాలు చెప్పటం ప్రాసంగికం కాదు.

2. శైలీ వ్యతిరేకాలు

223వ శ్లోకపు శైలి పక్షపాతంతో ఉంది. దీంట్లో హెచ్చు తగ్గుల తేడా ఆధారంతో స్త్రీలు, శూద్రులు మొదలైన వారితో మాట్లాడకూడదని ఉంది. మనువు శైలిలో ఇలాంటి లోపాలు ఉండవు.

3. అంతర్ వ్యతిరేకాలు

స్త్రీలు, శూద్రులను అపవిత్రులుగా భావించి వారితో ప్రాయశ్చిత్త కాలంలో మాట్లాడ కూడదనటం కచ్చితంగా తరువాతి కాలపు ప్రక్షిప్తమే ! వీరిని హీనంగానూ, అపవిత్రులుగానూ భావించే కాలంలోని ప్రక్షిప్తం. మనువు స్త్రీలు, శూద్రులకు గానూ సేవాకార్యాలు అప్పగించాడు. ఆ విధంగా వారికి అన్ని వర్ణాల వారితోనూ సంబంధం ఉంటుంది. అందుచేత మనువు వ్యవస్థ ప్రకారం వారు హీనులు కారు. స్త్రీలనైతే పవిత్రలనీ, ప్రతి ధర్మ కార్యంలోనూ సహభాగినులనీ చెప్పాడు (9.11, 26, 28, 96). మరి వారి నుంచి విడిగా ఉండటం, లేదా హీనతల ప్రసక్తే లేదు.

225 నుండి 233 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

వ్రతపాలన సమయంలో గాయత్రీ జపం చేయాలి-

సావిత్రీం చ జపేన్నిత్యం పవిత్రాణి చ శక్తితః । మూలశ్లోక సం.**18**
సర్వేష్వేవ వ్రతేష్వేవం ప్రాయశ్చిత్తార్థమాదృతః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**225**

టీక:-ప్రాయశ్చిత్తం చేసే వ్యక్తి ప్రాయశ్చిత్త సమయంలో, **నిత్యం** = ప్రతిదినం, **శక్తితః** = శక్తి కొద్దీ, అత్యధికంగా, **సావిత్రీం చ పవిత్రాణి జపేత్** = సావిత్రీ, గాయత్రీ మంత్రమును, ఇంకా పవిత్రమొనరించే ప్రార్థనా రూపమైన మంత్రాలను, జపించాలి, **ఏవం** = అలాచేయడం, **సర్వేషు + ఏవ వ్రతేషు** = సర్వ వ్రతాలలో, **ప్రాయశ్చిత్తార్థమ్ + ఆదృతః** = ప్రాయశ్చిత్త వ్రతం ఉత్తమమని భావించబడింది.

తాత్పర్యం:- నిరంతరం శక్తి కొద్దీ, అత్యధికంగా గాయత్రిని జపిస్తుండాలి. లేదా పరిశుద్ధ దాయకమైన అఘమర్షణ సూక్తాలనైనా జపించాలి. అలా చేయడం సర్వవ్రతాలలో ప్రాయశ్చిత్తవ్రతం ఉత్తమమని భావించబడింది.॥225॥

వివరణ:

పవిత్రకారక మంత్రాలు:- మనస్సును దుర్గుణాల నుండి దూరం చేసి, పవిత్రం చేసే భావం కలిగిన కొన్ని మంత్రాలు ఈ కింద ఇవ్వడమైంది.

1. **ఓం విశ్వాని దేవ సవితర్దురితాని పరాసువ । యద్భద్రం తన్న ఆ సువ ॥** యజు.30-3

అర్థం: హే సవితః ఓ సకల జగదుత్పత్తి కర్తా, సమగ్ర ఐశ్వర్యవంతుడవైన ఓ ప్రభో ! శుద్ధ స్వరూపుడవు, సర్వ సుఖప్రదాతవైన ఓ పరమేశ్వరా ! దయ ఉంచి, **నః** = మా, **విశ్వాని** = సంపూర్ణమైన, **దురితాని** = దుర్గుణాలను, దుఃఖాలను, **పరాసువ** = దూరం చేయి. **యత్** = యే, **భద్రం** = కళ్యాణకారక గుణ కర్మ స్వభావాలు, పదార్థాలు ఉన్నవో, **తత్** = వాటన్నింటిని, **నః** = మాకు, **ఆసువ** = ప్రసాదించు. (సం.వి.ఈశ్వర స్తుతి ప్రకరణం).

2. శివసంకల్ప మంత్రాలు ఆరు

"ఓం యజ్జాగ్రతో దూరముపైతి" మొదలగు 6 మంత్రాలు. (యజు-34.1-6)

3. గాయత్రీ మంత్రం అర్థ సహితంగా (2.55, వివరణ) మొ॥ దుర్గుణాలను దూరం చేసే సద్గుణాలను కలిగించే మంత్రాల జపం-ప్రాయశ్చిత్త సమయంలో చేయాలి.

మానస పాపాలకు ప్రాయశ్చిత్త విధి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతైర్ద్విజాతయశ్శోధ్యా వ్రతైరావిష్కృతైనసః । మూలశ్లోక సం. **19**
అనావిష్కృతపాపాంస్తు మంత్రైర్హోమైశ్చ శోధయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **226**

టీక:-ఆవిష్కృత-ఏనసః ద్విజాతయః= ఎవరి పాపాలు క్రియారూపంగా స్పష్టంగా ప్రకటితమైనవో, అలాంటి ద్విజాతులను బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు, **అనావిష్కృత పాపాన్ తు** = ఎవరి పాపాలు క్రియారూపంగా ప్రకటితం కాలేదో, అంటే అంతఃకరణములోనే పాపభావనలు ఉత్పన్నమైనవో, అలాంటివారిని, **మన్త్రైః చ హోమైః శోధయేత్** = మంత్ర -జపాల (11.225) ద్వారా, యజ్ఞముల ద్వారా పరిశుద్ధం చేయాలి. అంటే మానసిక పాపాలకు శుద్ధి (పాపఫలములకు కాదు) జపాల ద్వారా, యజ్ఞాల ద్వారా సంధ్యోపాసన- అగ్నిహోత్రాల ద్వారా చేయాలి.

తాత్పర్యం:- అధికభాగం జరిగేపాపాలు, వాటి ప్రాయశ్చిత్తాలు ఇక్కడ చర్చించబడ్డాయి. ఇవేకాక లోకరీతిన విభిన్నమైన పాతక క్రియలు ఆచరించేవారుండవచ్చు! వాటిని పోగొట్టడానికి పండిత పరిషత్‌లు చర్చించి నిర్ణయించినవి కూడా శిరోధార్యాలే ! తాము చేసినట్లుగా ఆ పాపాల గురించి వెల్లడి చేయక **"ఈ పాపానికి ఏం ప్రాయశ్చిత్తం?"** అని అడిగి తెలుసుకొని, పరిషత్ పెద్దలు చెప్పినరీతిన పాపప్రక్షాళన జరుపుకోవాలి. ॥226॥

వివరణ: తులనార్థం (5.107) శ్లోకాన్ని చూడాలి.

క్షాన్త్యా శుద్ధ్యన్తి విద్వాంసో దానేనాకార్యకారిణః ।
ప్రచ్ఛన్నపాపా జప్యేన తపసా వేదవిత్తమాః ॥

ప్రాయశ్చిత్తమున ఐదు కర్మల ద్వారా పాపభావనల నుండి విముక్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఖ్యాపనేనానుతాపేన తపసాఽధ్యయనేన చ । మూలశ్లోక సం. **20**
పాపకృన్ముచ్యతే పాపాత్తథా దానేన చాపది ॥ ప్రక్షిప్త శ్లోక సం. **227**

టీక:-ఖ్యాపనేన = తన లోపాన్నీ, (పాపాన్నీ) అందుకుగాను, దుఃఖాన్ని ప్రకటిస్తూ, ప్రజల ఎదుట తాను చేసిన పాపాన్ని (దోషాన్ని) అంగీకరించి ప్రకటించినట్లయితే (11.228), **అనుతాపేన** = పశ్చాత్తాపం చెందుతూ (11.229,232), **తపసా** = వ్రతముల (11.211-225,233) సాధన వల్ల, **అధ్యయనేన** = వేదాభ్యాసం వల్ల, (11.245,246), **పాపకృత్ పాపాత్ ముచ్యతే** = పాపి పాపభావనా రహితుడవుతాడు. కానీ పాపఫలాన్ని తప్పించుకోలేడు, **తథా** = అలాగే, **ఆపది** = ఆపద్గ్రస్తుడై వ్యాధి, వృద్ధాప్యం మొ॥ వాటితో పీడితుడైనప్పుడు, **దానేన** = ప్రాయశ్చిత్తం కోసం, సత్సంగం పరోపకారార్థం దానం చేయటం వల్ల పాపభావన సమాప్తమై నిష్పాపి అవుతాడు.

తాత్పర్యం:- తమ పాపాలనుంచి విముక్తులు కావడానికి లోకులకు పశ్చాత్తాపాలను మించిన ప్రాయశ్చిత్తాలు లేవు. అయితే అందుకు చాలా నిజాయితీ అవసరం. రహస్యంగా తాము చేసే రకరకాల పాపాలను వెల్లడి చేయగల ధైర్యం ఏ కొద్దిమందికో గాని ఉండదు. మానవ మనస్తత్వ రీతులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారికి సైతం తోచని పాపాలు లోకంలో తెలిసో తెలియకో జరిగిపోవచ్చు! కాబట్టే చాలా వాటికి వేదాధ్యయనం, కఠినతపం లాంటివి ప్రాయశ్చిత్తాలుగా చెప్పబడ్డాయి. ॥227॥

వివరణ:

ప్రాయశ్చిత్తంతో పాపాలుకాదు పాపభావన తొలగుతుంది:-ప్రాయశ్చిత్తం వల్ల పాపభావన తొలగుతుంది. కానీ చేసిన పాప ఫలితం నుండి ముక్తి లభించదు.

1) ఇది ప్రాయశ్చిత్తమునకు సంబంధించిన ప్రసంగం. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయవలసి ఉంది. అదేమంటే, ప్రాయశ్చిత్తం వల్ల చేసిన పాపభావన క్షీణిస్తుంది మళ్ళీ పాపం చేయకపోవచ్చు. కానీ, చేసిన పాపఫలితం మాత్రం తప్పిపోదు. ఆ పాపానికై పశ్చాత్తాపపడుతూ దండన రూపంలో తపశ్చరణ చేస్తాడు. ఇదే భావన ప్రాయశ్చిత్త పరిభాషకు సంబంధించిన విషయం 11.230-232. శ్లోకాలలో వ్యక్తపరచాడు. కానీ చేసిన అధర్మ ఫలితం ఏ పరిస్థితులలోనూ నిష్ఫలం కాదని మనుభావన.

యది నాత్మని పుత్రేషు నచేత్పుత్రేషు నప్తృషు
న త్వేవ తు కృతోఽధర్మః కర్తుర్భవతి నిష్ఫలః (4.173)

తాను చేసిన పాపం వల్ల తనకు తన ధన ధాన్యాలకు నష్టం కలిగించక పోయినా, తన పుత్రులకైనా, తన మనుమలకైనా, తన ముని మనుమలకైనా నష్టం కలిగిస్తుంది. కానీ ఎప్పటికీ వృథాకాదు.

ఈ ప్రమాణాల వల్ల, ఈ శ్లోకాలలో "పాపం నుండి ముక్తి లభిస్తుందని ప్రాచీన వ్యాఖ్యాకారులు రాసింది మాన్యం కాదని సిద్ధమవుతుంది. ఇది మనుసమ్మతం కాదు. అందువల్ల ఈ వ్యాఖ్యలో ఎక్కడెక్కడ-పాపాల నుండి ముక్తుడవుతాడని రాయబడిందో అక్కడంతా "పాపఫలం నుండి కాదు, పాపభావన నుండి మాత్రమే ముక్తు"డవుతాడని వివరించబడింది. ఇందుకు పోషకంగా (11.230) శ్లోకంలో ఉన్న వివరణ చూడగలరు.

2. ఈ భావనకు-తులనాత్మకంగా **5.107** శ్లోకపాదం చూడగలరు.

"దానేనాకార్యకారిణః (శుద్ధ్యన్తి")

3. ఆపత్కాలంలో దానం ద్వారా పాపభావన నుండి ముక్తి గురించిన వివేచన:-శ్లోకంలో ఈ ప్రసంగం-విద్య మొ॥ శుభగుణాల యొక్క మరియు పరోపకారార్థంలో ధనాన్ని దానం చేయడం- మనుమహర్షి మరొక సందర్భంలో కూడా-స్వయంగా ఇలా అన్నాడు. **"సర్వేషామేవ దానానాం బ్రహ్మదానం విశిష్యతే"** (4.233) ప్రపంచంలో అన్ని దానాలకంటే, వేద, ఈశ్వర విద్యాదానం మరియు శ్రేష్ఠ గుణాల దానం సర్వోత్తమం. ధనాన్ని శ్రేష్ఠమైన యోగ్యుడైన వాడికి పరోపకార భానవతో దానం చేయడమే ధనదానమవుతుంది. అన్య భావనచే చేసే దానం దానం కాదు. (4.187,196) మను మహారాజు (4.227) శ్లోకంలో దానస్వరూపాన్ని స్పష్టపరస్తూ మనుషుడు సుపాత్రుడికి (యోగ్యుడికి) సాత్త్విక భావనతో పరోపకారార్థం దానమివ్వాలి. ఆపత్కాలంలో ఈ పనులు చేయాలని చెప్పబడింది. అయితే ఆపత్కాలమంటే ఏమిటి? ఈ ప్రాయశ్చిత్త ప్రసంగంలో విధింపబడిన వ్రతాలు చేయడానికి వ్యక్తి అసమర్థుడైనప్పుడు, అప్పుడతను దాన విధిని అనుసరించాలి. ఇది కూడా ఒక తపస్సులో భేదమే. ఈ దానవ్రతంతో పాటు అన్యమైన మంత్ర జపాలు హోమాది విధులు, అన్యవ్రతములతో సమానంగా చేయాలి.

ఇది మనుకృతం-ప్రామాణికం

అందరి ఎదుట తన అపరాధాన్ని అంగీకరించినట్లయితే పాప భావన నుండి విముక్తి :-

యథా యథా నరోఽధర్మం స్వయం కృత్వాఽనుభాషతే । మూలశ్లోక సం.**21**
తథా తథా త్వచేవాహి స్తేనాధర్మేణ ముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం.**228**

టీక:-అధర్మం కృత్వా = అధర్మాచరణ ద్వారా, **నరః** = మనుషుడు, **యథా యథా+స్వయం అనుభాషతే** = ఏవిధంగా తన పాపాన్ని, ప్రజలకు తెలుపుతాడో, **తథా తథా అహిః త్వచా ఇవ** = అదేవిధంగా పాము యొక్క కుబుసం

లాగ, **తేన అధర్మేణ ముచ్యతే** = ఆ పాపం నుండి, అపరాధజన్మ సంస్కారం నుండి ముక్తుడై పోతాడు. ప్రజలలో అతనికి గల **'అపరాధి'** అనే భావం సమాప్తమవుతుంది.

తాత్పర్యం:- "చేసిన పాపం చెప్తే పోతుంది" అనే నానుడి ఏర్పడ్డానికి ముఖ్యాధారమైన శ్లోకం ఇది. సజ్జనుడైనావాడు తాను చేసిన పాపం దాచి పెట్టుకోరాదు. అతడు దాన్నెంతగా వెల్లడి పరుస్తాడో అతడంతగా ఆ పాపం నుంచి విముక్తుడవుతున్నాడని అర్థం. ॥228॥

అనుతాప పాపభావననుండి ముక్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

యథా యథా మనస్తస్య దుష్కృతం కర్మ గర్హతి । మూలశ్లోక సం. **22**
తథా తథా శరీరం తత్తేనాధర్మేణ ముచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **229**

టీక:-మరియు, **తస్య మనః యథా యథా** = అతని మనస్సు ఎట్లెట్లు, **దుష్కృతం కర్మ గర్హతి** = చేసిన పాపాన్ని, అపరాధమును నిందించుకొద్దీ నేను ఈ పాడుపని చేసితినని తనను తాను తిరస్కరించుకొద్దీ, **తథా తథా తత్ శరీరం** = అట్లట్లా అతడి ఆ శరీరం, **తేన అధర్మేణ ముచ్యతే** = ఆ అధర్మం నుండి లేదా పాపం నుండి ముక్తమవుతుంది. అంటే పాపం, అధర్మమని భావించి, ఆ విషయంలో గ్లాని కలిగినందువల్ల మనస్సు, శరీరం పాపకార్యం నుండి దూరమవుతుంది.

తాత్పర్యం:- అంతేకాదు! అతని మనస్సు చేసిన పాపం గురించి మిక్కిలి విచారిస్తూ "అయ్యో! నేనేల ఇంతటి దుష్కృత్యానికి పాల్పడ్డాను? ఇకపైన ఇట్టిది నావల్ల జరగకూడదు" అని పశ్చాత్తాపపడతాడో, వాడి జీవాత్మ పాపం నుంచి విడుదల పొందుతుంది. ॥229॥

ఇది మనుకృతం-ప్రామాణికం

కృత్వా పాపం హి సంతప్య తస్మాత్పాపాత్ ప్రముచ్యతే । మూలశ్లోక సం. **23**
నైవం కుర్యాత్ పునరితి నివృత్త్యా పూయతే తు సః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **230**

టీక:-మనుషుడు, **పాపం హి కృత్వా** = పాపం (అపరాధం) చేసి, **సంతప్య** = చేసిన పాపానికి పశ్చాత్తాపపడినట్లయితే, **తస్మాత్ పాపాత్ ప్రముచ్యతే** = ఆ పాపం నుండి ముక్తుడవుతాడు. (అయితే పాప ఫలం నుండి ముక్తి లభించదు.) అంటే మళ్ళీ ఆ పాపం చేయడానికి ప్రవృత్తుడు కాడు, **పునః ఏవం న కుర్యాత్** = మళ్ళీ ఎప్పుడు ఈ పాపం చేయనని, **ఇతి నివృత్త్యా** = ఈ ప్రకారం నిశ్చయం చేసికొన్న తరవాత పాపాల నుండి నివృత్తుడవుతాడు, **సః తు పూయతే** = అతడు పవిత్రుడవుతాడు.

తాత్పర్యం:- పాతకుడు తాను చేసిన పాతకములను ఒంటరిగా గాని, పరిషత్ సమక్షంలో పదిమంది ఎదుట గాని వెల్లడించుకొని "ఈ అకృత్యం జరిపిన ఈ జన్మమేల? కాల్చనా" అని ఎంతగానో పశ్చాత్తాపపడితే, అంతగా అతడా పాపం నుంచి విముక్తుడై పరిశుద్ధుడవుతాడు. ॥230॥

వివరణ:

ఈ శ్లోకాన్ని స్వామి దయానందుల వారు తన పూనా ప్రసంగంలో ఉట్టంకించారు. పూర్వకృత పాపాలు జీవుడు అనుభవించకుండా ముక్తుడు కాడా? అను ప్రశ్నకు మా సమాధానమిది. అయితే పశ్చాత్తాపం వల్ల ఏ మాత్రం ఉపయోగం లేదా? అంటే పశ్చాత్తాపం వల్ల పాప క్షయం కాదు, కానీ భవిష్యత్తులో పాపం చేయడం ఆగిపోతుంది.

కర్మ ఫలాలను గురించి ఆలోచించినందువల్ల పాపభావన నుండి ముక్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏవం సంచింత్య మనసా ప్రేత్య కర్మఫలోదయమ్ । మూలశ్లోక సం. **24**
మనో వాఙ్మూర్తిభిర్నిత్యం శుభం కర్మ సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **231**

టీక:-ప్రేత్య కర్మఫల + ఉదయమ్ = మరణానంతరం కర్మలకు ఫలితం తప్పని సరిగా లభిస్తుందని, **మనసా ఏవం సంచిన్త్య** = మనస్సులో ఈ భావన కలుగగా, మనుజుడు, **మనః వాక్ మూర్తిభిః** = మనస్సు వాణి, శరీరం నుండి, **నిత్యం శుభం కర్మ సమాచరేత్** = ఎల్లప్పుడు శుభకర్మనే చేయాలి.

తాత్పర్యం:- ఈ ప్రకారం శుభాశుభకర్మలకు ఫలితాలుంటాయి. ఇహంలో గాని-పరమందుగాని ఆ యా కర్మలకు (అంటే.....మంచి చేసిన పుణ్యం, చెడు చేసిన పాపం) ఫలితముంటుందని గ్రహించేవారు ఇహ, పర సౌఖ్యదాయక స్వర్గం నిమిత్తం మంచినే ఆచరించాలి తప్ప దుష్కర్మల పాల్పడరాదు. ॥231॥

పాప భావన నుండి ముక్తిని కోరేవాడు మళ్ళీ పాపం చేయరాదు- ఇది మనుకృతం-ప్రామాణికం

అజ్ఞానాద్యది వా జ్ఞానాత్కృత్వా కర్మ విగర్హితమ్ । మూలశ్లోక సం. **25**
తస్మాద్విముక్తిమన్విచ్ఛన్ ద్వితీయం న సమాచరేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **232**

టీక:-అజ్ఞానాత్ యది వా జ్ఞానాత్ = తెలియక గాని, తెలిసి గాని, **విగర్హితమ్ కర్మ కృత్వా** = నిందిత కర్మచేసి, **తస్మాత్ విముక్తిమ్ + అన్విచ్ఛన్** = మనుజుడు ఆ పాపప్రవృత్తి నుండి ముక్తుడవ్వడానికి, **ద్వితీయం న సమాచరేత్** = మళ్ళీ పాపం చేయరాదు. అప్పుడే పాప-ప్రవృత్తి నుండి ముక్తుడవుతాడు. మరొక విధంగా పాపానికి దూరం కాలేడు.

తాత్పర్యం:- ఏమరుపాటుచేత కానీ, కోరికతో గానీ నిషిద్ధకార్యాలు ఆచరించినా, ఆ పాపం నుంచి విముక్తులు కాదలచి ప్రాయశ్చిత్తం చేసుకొన్నవారు తిరిగి అలాంటి పనులకు పాల్పడరాదు. అంటే....ప్రాయశ్చిత్తం ఉందికదా అనే ధీమాతో మళ్ళా-మళ్ళా పాడుపనుల కోసం యత్నించరాదు. ॥232॥

మనస్సుకు ప్రసన్నత కలిగే వరకు తపస్సు చేయాలి- ఇది మనుకృతం-ప్రామాణికం

యస్మిన్ కర్మణ్యస్య కృతే మనసస్స్యాదలాఘవమ్ । మూలశ్లోక సం. **26**
తస్మింస్తావత్తపః కుర్యాద్యావత్తుష్టికరం భవేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **233**

టీక:-యస్మిన్ కర్మణి కృతే = ఏ కర్మ చేసినప్పుడు, **అస్య మనసః అలాఘవమ్ స్యాత్** = మనుజుడి మనస్సులో ఎంత దుఃఖం, పశ్చాత్తాపం కలుగుతుందో, **తస్మిన్** = ఆ కర్మలో, **యావత్ తుష్టికరం భవేత్** = ఎంత తపస్సు చేసినా మనస్సుకు, సుప్రసన్నత్వం అదేవిధంగా సంతోషం కలుగుతుందో, **తావత్ తపః కుర్యాత్** = అంత మాత్రం తపస్సు చేయాలి. అంటే ఏదైనా పాపం చేసినప్పుడు, మానవుడి మనస్సులో గ్లానిరహితంగా పూర్ణ సంతోషం కలుగదో. అంతవరకు స్వేచ్ఛగా తపస్సు చేస్తూ ఉండాలి.

తాత్పర్యం:- ఏ ప్రాయశ్చిత్తం జరిపినా; పరిపూర్ణంగా తా నా పాపం నుంచి విముక్తుడినయ్యానని మనస్సాక్షిగా అతడు సాంత్వన పొందేంతవరకూ ఆ ప్రాయశ్చిత్తకాండ అతడు నిర్వర్తించాలి. మొక్కుబడిగా చేయరాదు. ॥233॥

234-244వ శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* తపో మహిమ-

* *తపోమూలమిదం సర్వం దైవమానుషకం సుఖమ్ ।*
తపోమధ్యం బుధైః ప్రోక్తం తపోఽంతం వేదదర్శిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***234***

తాత్పర్యం:- దేవతలకైనా-మనుజులకైనా వారు అనుభవించే సుఖాలన్నిటికీ తపస్సే కారణం. దీనిచేతనే వారి సుఖం నిలిచి ఉంటుంది. సుఖాంతానికీ మూలం తపస్సే. దీన్ని బట్టి ఆదిమధ్యాంతాలలో సుఖాలకు తపస్సే మూలమని చెప్పబడుతోంది. ॥234॥

*   *బ్రాహ్మణస్య తపో జ్ఞానం తపః క్షత్రస్య రక్షణమ్ ।*
వైశ్యస్య తు తపో వార్తా తపశ్శూద్రస్య సేవనమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **235**

తాత్పర్యం:– బ్రాహ్మణునికి బ్రహ్మచర్యరూపమైన వేదాంతాన్ని తెలుసుకోవడమే తపస్సు. రాజుకు ప్రజాసంరక్షణమే తపస్సు. వైశ్యుడికి వాణిజ్యం, పశుపాలనలే తపస్సు. శూద్రుడికి కృషి-బ్రాహ్మణ పరిచర్య తపస్సు. ॥235॥

*   *ఋషయస్సంయతాత్మానః ఫలమూలానిలాశనాః ।*
తపసైవ ప్రపశ్యంతి త్రైలోక్యం స చరాచరమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **236**

తాత్పర్యం:– ఋషులు మనో వాక్కాయ నియమాలు కలవారై కందమూల ఫలాలను తింటూ, గాలినే ఆహారంగా స్వీకరిస్తూ తమజ్ఞాన దృష్టిచేత (దివ్యదృష్టిచేత) కూర్చున్నచోటు నుంచే ముల్లోకాలను వీక్షించగలుగుతున్నారు. ॥236॥

*   *ఔషధాన్యగదో విద్యా దైవీ చ వివిధా స్థితిః ।*
తపసైవ ప్రసిద్ధ్యంతి తపస్తేషాం హి సాధనమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **237**

తాత్పర్యం:– రోగాల్ని పోగొట్టగల ఓషధులు, ఆరోగ్యం, బ్రహ్మజ్ఞానం, తపస్సుచేతనే కలుగుతున్నాయి. ధర్మశాస్త్రం బోధపరుచుకోగల జ్ఞానం వేదాలకు సంబంధించిన విషయాలు ఇవి కూడా తపస్సు చేతనే విశదమవుతూన్నాయి. అందువల్ల అన్నిటినీ పొందడానికి తపస్సు ఒక చక్కని సాధనం-కారణం అవుతున్నది. ॥237॥

*   *యద్దుస్తరం యద్దురాపం యద్దుర్గం యచ్చ దుష్కరమ్ ।*
సర్వం తు తపసా సాధ్యం తపో హి దురతిక్రమమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **238**

తాత్పర్యం:– ఏది గ్రహదోషాలచేత సంచితమైనదో, ఏది దాటరానిదో ఏది విశ్వామిత్రుడి బ్రాహ్మతేజంలా పొందనలవికానిదో, మేరు శిఖరం లాగా ఏది ఎక్కడానికి సాధ్యం కానిదో, అది అంతా తపస్సుచేత సాధించడానికి వీలవుతుంది. ఎ దుష్కర కార్యమైనా తపస్సుకు లొంగాల్సిందే. ॥238॥

*   *మహాపాతకినశ్చైవ దోషాశ్చాకార్యకారిణః ।*
తపసైవ సుతప్తేన ముచ్యంతే కిల్బిషాత్తతః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **239**

తాత్పర్యం:– పై వాటినన్నింటినీ పరికించి చూడగా, బ్రహ్మహత్యాది మహాపాపములు చేసినవారు, మిగిలిన ఉపపాతకాలు ఆచరించినవారు ఎవరైనా గానీ తపస్సు చేతనే వాటిని పోగొట్టుకోవడం పురాణాలలో చదివి ఉన్నాం. కాబట్టి తపోమహిమ అసాధారణం. ॥239॥

*   *కీటాశ్చాహిపతంగాశ్చ పశవశ్చ వయాంసి చ ।*
స్థావరాణి చ భూతాని దివం యాంతి తపోబలాత్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. **240**

తాత్పర్యం:– కీటకాలు, పురుగులు, పశువులు, పక్షులు, పాములు, వృక్షాదిస్థావరాలు, జంతువులు తపోమహిమచేతనే స్వర్గాన్ని పొందుతున్నాయి.॥240॥

*   *యత్కించిదేనః కుర్వంతి మనోవాఙ్మూర్తిభిర్జనాః ।*
తత్సర్వం నిర్దహంత్యాశు తపసైవ తపోధనాః ॥   ప్రక్షిప్త శ్లోక సం. **241**

తాత్పర్యం:– మానవులు తమ మనస్సుచేత, వాక్కు చేత, దేహం చేత తపస్సును సాధనంగా మలుచుకోవడం ద్వారా పాపాలనుంచి విముక్తులు కాగలరన్నది తిరుగులేని సత్యం. ॥241॥

*   **తపసైవ విశుద్ధస్య బ్రాహ్మణస్య దివౌకసః ।**
ఇజ్యాశ్చ ప్రతిగృహ్ణంతి కామాన్ సంవర్ధయంతి చ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***242***

తాత్పర్యం:- ప్రాయశ్చిత్తరూపమైన తపస్సు వల్ల పాపాలను పోగొట్టుకోగలిగినా, విప్రుడు పరిశుద్ధుడైనట్లే. అలాంటి బ్రాహ్మణుడి యాగంలో హవిస్సులు దేవతలు అందుకొని కోరిన వరాలు అనుగ్రహిస్తారు. ॥242॥

*   **ప్రజాపతిరిదం శాస్త్రం తపసైవాసృజన్ ప్రభుః।**
తథైవ వేదానృషయ స్తపసా ప్రతిపేదిరే ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***243***

తాత్పర్యం:- సకల లోకాల ఉత్పత్తి-స్థితి-లయం అనే మూడింటికీ కారణభూతుడైన పరమాత్మ కృపచేతనే బ్రహ్మదేవుడు హిరణ్యగర్భుడై ఈ ధర్మ శాస్త్రాన్ని రచించాడు. వశిష్ఠాది ఋషులు సైతం తపోమహిమకారణంగానే మంత్రబ్రాహ్మణాత్మకమైన వేదాలను-వాటి అర్థాలను గ్రహించగలిగారు. ॥243॥

*   **ఇత్యేతత్తపసో దేవా మహాభాగ్యం ప్రచక్షతే ।**
సర్వస్యాస్య ప్రపశ్యంతస్తపసః పుణ్యముత్తమమ్ ॥   ప్రక్షిప్త శ్లోక సం. ***244***

తాత్పర్యం:- సకల జంతువులకు ఏది దుర్లభమో, అలాంటి జన్మాన్ని తపస్సుచేతనే పొందగలుగుతామని దేవతలు గ్రహించిన వారై, అన్నిటికీ తపస్సే మూలమని తపోమహిమను స్తుతించారు. ॥244॥

ప్రక్షిప్తాల పరిశీలన

234 నుంచి 244 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

క. 227వ శ్లోకంలో తర్వాతి విషయాన్ని సంకేతించి, తర్వాతి శ్లోకాలలో దాని ప్రకారం ఒక్కొక్క దాని వివరణ ఉంది. ఆ శ్లోకంలో క్రమానుసారం 233లో 'తపస్సు' విధానం ఉండటం చేత, 'వేదాధ్యాయన' విధానం ప్రాసంగిక దృష్టితో ఉండాలి. అది 245వ శ్లోకంలో ఉంది. కనుక 233 తర్వాత 245వ శ్లోకం ఉండటం క్రమ బద్ధం అవుతుంది. మిగిలినవి ప్రక్షిప్తాలు.

ఖ. ఈ శ్లోకాలలో ప్రాయశ్చిత్తం గురించి లేదా ప్రాయశ్చిత్తానికి సంబంధించిన తపస్సు గురించి కాకుండా సర్వ సామాన్య తపస్సు మహిమ ఉంది. ఇక్కడి విషయం కేవలం ప్రాయశ్చిత్తానికి సంబంధించిన తపస్సే. ఎలా గంటే- ఇందులో బ్రాహ్మణులను తపస్సు, జ్ఞానం మొదలైన వాటి రూపాలుగా తపస్సు లేకపోవటం చేత తిర్యగ్జాతుల తక్కువ జన్మలు వస్తాయని చెప్పటం సంబంధం లేని విషయాలవుతాయి.

గ. ఈ సర్వ సామాన్య తపస్సును చెప్పటమే ఈ ప్రాయశ్చిత్త విషయానికి పొంతన లేని విషయ మని రుజువవుతూంది. 210 నుంచి 226 శ్లోకాలలో చెప్పిన వ్రతాలే ప్రాయశ్చిత్త తపస్సవుతాయి కానీ, వ్యతిరేకమైనవి ప్రాయశ్చిత్తానికి స్వకార్యాలు కావు. 233లో ఆ తపస్సులే చేయాలని ఉంది. మరి మిగిలిన శ్లోకాలలో భిన్న తపస్సులు, వాటి మహిమ, అసంగతంగా తేలుతుంది. కనుక ఈ 11 శ్లోకాల ప్రసంగం ప్రక్షిప్తం.

2. శైలీగత ఆధారాలు

క. ఈ ప్రసంగం మనువు శైలికి వ్యతిరేకం. ఎలా గంటే, 244వ శ్లోకంలోనే 'ఇది తపో మహిమను చెబుతుంది' అని ఉంది. ఈ మహిమను వర్ణించే శైలి మనువుది కాదు. ఇది ఒక విధాన శాస్త్రం. ఇందులో మహిమల రూపంలో కాక, విధ్యుక్తమైన విధానాలు ఉంటాయి. భాష కూడా విధి పూర్వకంగానే ఉంటుంది. వీటితో పాటు మనువు శైలి ఏ విధంగా ఉంటుందంటే- దేనికైనా లాభ నష్టాలు మామూలుగానే చెబుతాడు కానీ, వాటిని వివరించడు. ఉదాహరణ ఇక్కడి తపో మహిమ వివరణే. ఇది మనువుది కాదు, ప్రక్షిప్తం.

ఖ. ఇందులో 240లో శ్లోకపు శైలి నిరాధారమూ, సహేతుకం కానిదీ, అతిశయోక్తులు నిండినదీ. మనువు శైలిలో ఈ లోపాలు ఉండవు.

245,246 శ్లోకాలు మనుకృతం-ఇవి ప్రామాణికం

వేదాభ్యాసాదుల వల్ల పాపభావన క్షయిస్తుంది-

వేదాభ్యాసోఽన్వహం శక్త్యా మహాయజ్ఞక్రియా క్షమా । మూలశ్లోక సం.**27**
నాశయంత్యాశు పాపాని మహాపాతకజాన్యపి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**245**

టీక:-అన్వహం శక్త్యా వేదాభ్యాసః = ప్రతిదినం అధికాధింగా వేదాధ్యయనం, మననం, **మహాయజ్ఞక్రియాః** = పంచమహాయజ్ఞములననుష్ఠించడం, **క్షమా** = తపసహిష్ణుత్వం, ఈ క్రియలు, **మహాపాతక జాని +అపి పాపాని** = గొప్ప పాపకర్మల వల్ల ఉత్పన్నమైన పాపభావనలను, లేదా దుష్ట సంస్కారాలను కూడా, **నాశయన్తి** = నష్టపరుస్తుంది.

తాత్పర్యం:- శక్తిమేరకు అనుదినం వేదాభ్యాసం; పంచమహాయజ్ఞాల అనుష్ఠానం, కష్టాలను ఓర్చుకోవడం అనేవి మహాపాతకాలను సైతం శీఘ్రంగా తొలగజేస్తున్నాయి. ఇక సామాన్యపాపాలు ఇలాగే నశింపజేస్తాయనడానికి సందేహం అనవసరం. ॥245॥

వేదజ్ఞానాగ్నిలో పాప భావన కాలి బూడిదై పోతుంది - ఇది మనుకృతం-ప్రామాణికం

యథైధస్తేజసా వహ్నిః ప్రాప్తం నిర్దహతి క్షణాత్ । మూలశ్లోక సం.**28**
తథా జ్ఞానాగ్నినా పాపం సర్వం దహతి వేదవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**246**

టీక:-యథా వహ్నిః తేజసా = ఏ విధంగా అగ్ని తన తేజస్సుతో, **ప్రాప్తం ఏధః క్షణాత్ నిర్దహతి** = సమీపానికి చేరిన, కాష్ఠాది ఇంధనమును వెంటనే కాల్చివేస్తుందో, **తథా** = అలాగే, **వేదవిత్** = వేదజ్ఞుడు, **జ్ఞాన+అగ్నినా సర్వం పాపం దహతి** = వేదజ్ఞానరూపమైన అగ్ని ద్వారా పాపభావనను కాల్చివేయునని అంటే పాపసంస్కారాలను భస్మం చేస్తాడు. కానీ పాపఫలమును మాత్రం కాదు.

తాత్పర్యం:- దగ్గరలో ఉన్న కట్టెలను అగ్ని ఏవిధంగా దహించగలదో, అలాగే జ్ఞానం అనే అగ్ని చేతనే వేదవేత్త అయిన బ్రాహ్మణుడు సకలపాపాలను దహించుకోగలుగుతాడు. పరమార్థ జ్ఞానం అనే అగ్నికి అంతటిశక్తి ఉందని తెలుసుకోవాలి. ॥246॥

వివరణ:

ఈ భావనలతో పోల్చడానికి (12.101వ) శ్లోకాన్ని చూడగలరు. 1) జ్ఞానం వల్ల ముక్తి కలుగుతుంది. 'జ్ఞానాన్ముక్తిః' (3.23) అనడానికి సాంఖ్యదర్శన ప్రమాణం. మను.(11.263,264,265) శ్లోకాలలో కూడా, ఇందుకు సమర్థన లభిస్తుంది. వేదవేత్త తన వేదజ్ఞానం ద్వారా ముక్తిని పొందుతాడు. (12.83,85,104) శ్లోకాలలో కూడా వేదాభ్యాసం, పరమాత్మ జ్ఞానం ముక్తిదాయకమని లేదా ముక్తి సాధకమని చెప్పబడింది. సాంఖ్య దర్శనం కూడా ఈ విషయాన్ని ప్రతిపాదించినది. "జ్ఞానాన్ముక్తిః (3.23) అంటే వేదజ్ఞానం, పరమాత్మ జ్ఞానం వల్ల జీవుడు ముక్తిని పొందుతాడు.

247 నుండి 262 వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

గుప్త పాపాల ప్రాయశ్చిత్తము-

* *ఇత్యేతదేనసాముక్తం ప్రాయశ్చిత్తం యథావిధి ।*
అత ఊర్ధ్వం రహస్యానాం ప్రాయశ్చిత్తం నిబోధత ॥ *ప్రక్షిప్త శ్లోక సం.247*

తాత్పర్యం:- ప్రకాశవంతమైన ప్రాయశ్చిత్తవిధి వల్లనే బ్రహ్మహత్యాది మహాపాపాలు తొలగుతూన్నాయి. తేజోవిరాజితమైన ప్రాయశ్చిత్తవిధి వల్ల రహస్య పాపాలూ తొలగిపోగలవని చెప్పడానికి సందేహించనక్కరలేదు కదా!॥247॥

* **సవ్యాహృతిప్రణవకాః ప్రాణాయామాస్తు షోడశ ।**
అపి భ్రూణహణం మాసాత్పునంత్యహరహః కృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**248**

తాత్పర్యం:- వ్యాహృతి, ప్రణవములతో-గాయత్రీ పఠనంతో, రేచక-పూరక-కుంభకములతో పదహారు ప్రాణాయామాలు చేయబడితే బ్రహ్మహత్యాది పాపాలు చేసిన వాడిని సైతం పాపరహితుడిగా చేసి పరిశుద్ధపరిచే ప్రాయశ్చిత్త మంత్రాధికారం ద్విజులకే ఉంది. ॥248॥

* **కౌత్సం జప్త్వాఽప ఇత్యేతద్వాసిష్ఠం చ ప్రతీత్యృచమ్।**
మాహిత్రం శుద్ధవత్యశ్చ సురాపోఽపి విశుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**249**

తాత్పర్యం:- కౌత్సమహర్షి ప్రతిపాదించిన సూక్తం, వశిష్ఠుడు కన్నరచిన సూక్తం, మాహిత్రసూక్తం అనే పరిశుద్ధసూక్తత్రయం అనుదినం ఆరుసార్లు చొప్పున నెలదినాలు జపిస్తే, సురాపాన దోషం పోతుంది. ॥249॥

* **సకృజ్జప్త్వాస్య వామీయం శివసంకల్పమేవ చ ।**
అపహృత్య సువర్ణం తు క్షణాద్భవతి నిర్మలః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**250**

తాత్పర్యం:- సువర్ణాన్ని అపహరించిన రహస్య దోషం వల్ల కలిగిన పాపాన్ని శివ సంకల్పమనే గొప్ప మంత్రపఠనం ద్వారా నివారించుకోవచ్చు! ॥250॥

* **హవిష్యంతీయమభ్యస్య న తమంహ ఇతీతి చ ।**
జపిత్వా పౌరుషం సూక్తం ముచ్యతే గురుతల్పగః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**251**

తాత్పర్యం:- వేదాలలో చెప్పబడిన కొన్ని ఋక్కులు గొప్ప పాతకవినాశకర శక్తిని కలిగి ఉన్నాయి. **'హవిష్పాంత మజరం'**....అంటూ ప్రారంభమయ్యే 19 ఋక్‌లు; **'న తమం హో న దురితం'** అంటూ మొదలయ్యే 8 **ఋక్‌లు,** పురుషసూక్తం, శివసంకల్పం రోజుకు 16 సార్లు చొప్పున జపిస్తే గురువు భార్యతో సంగమించిన పాపం నుంచి విముక్తుడవుతాడు. ॥251॥

* **ఏనసాం స్థూలసూక్ష్మాణాం చికీర్షన్నపనోదనమ్ ।**
అవేత్యృచం జపేదబ్దం యత్కిం చేదమితీతి వా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**252**

తాత్పర్యం:- మహాపాపాలను-ఉపపాతకాలను పోగొట్టుకో గోరువారు **'అవతే హేడో వరుణనమోభిః'** అనే ఋక్‌ను, **'యత్కించేదం వరుణ'** మనే ఋక్‌ను, 7.69.5; **అవ తే హేళో వరుణ నమోభిః,** ఋక్. 1.24.14 **'ఇతివా ఇతి మే మనః'** అనే ఋక్‌ను రోజుకొక మారు ఒక ఏడాది కాలం జపిస్తే పరిశుద్ధులవుతారు. ॥252॥

* **ప్రతిగృహ్యాప్రతిగ్రాహ్యం భుక్త్వా చాన్నం విగర్హితమ్ ।**
జపం స్తరత్సమందీయం పూయతే మానవస్త్ర్యహాత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**253**

తాత్పర్యం:- తీసుకోదగని దానాలు తీసుకోవడం, నింద్యమైన ధనాదులను కోరడం, (అవసరార్థమే అయినా) తీసుకోదగనివారి చేతినుంచి సొమ్ము గ్రహించడం, అలాంటి వారి చేతి అన్నం తినడం మొదలైన పాపాలకు **'తరత్సమందీధావతి'** (ఋ. 9.58) అనే 4 ఋక్‌లను మూడు రోజులు జపించాలి. పవిత్రులవుతారు. ॥253॥

* ***సోమారౌద్రం తు బహ్వేనా మాసమభ్యస్య శుద్ధ్యతి ।***
స్రవన్త్యామాచరన్స్నానమర్యమ్ణామితి చ తృచమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***254***

తాత్పర్యం:- చేయరాని పాపాలు లెక్కలేనన్ని చేసినవారు **'సోమారుద్రా ధారయేథామసుర్యమ్'** ఋ. 6. 7. 4 అనే 4 ఋక్‌లను; **'అర్యమణం మిత్రం'** 4. 2. 4 అనే 3 ఋక్‌లను; నదీస్నానానంతరం నెలరోజులపాటు జపిస్తూంటే ఆ పాతకాలనుంచి విముక్తులు కాగలుగుతారు. ॥254॥

* ***అబ్దార్ధమిన్ద్రమిత్యేతదేనస్వీ సప్తకం జపేత్ ।***
అప్రశస్తం తు కృత్వాప్సు మాసమాసీత భైక్షభుక్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***255***

తాత్పర్యం:- సకలపాపాలూ ఒకేసారిగా పోవడానికి **"ఇంద్రం మిత్రం వరుణ"** (1. 10. 6) అంటూ మొదలయ్యే 7 ఋక్‌లను ఆర్నెల్ల కాలం పాటు సస్వర సహితంగా జపించాలి. ఒక నెల రోజులపాటు భిక్షమెత్తి భోజనం చేయడం ద్వారా జలాల్లో అశుద్ధం విడిచిన పాపానికి నిష్కృతి కలుగుతుంది. ॥255॥

* ***మంత్రైశ్శాకలహోమీయైరబ్దం హుత్వా ఘృతం ద్విజః ।***
సుగుర్వప్యపహన్త్యేనో జప్త్వా వా నమ ఇత్యృచమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***256***

తాత్పర్యం:- 'దేవకృతస్య' (యజు. 8. 15) మొదలైన శాకలహోమమంత్రాలతో ఒక ఏడాది కాలంపాటు నేతి ధారలతో హోమం చేస్తే లేదా **'నమ ఇంద్రశ్చ'** అనే ఋక్‌ను ఏడాదికాలం పాటు జపిస్తే మహా-మహా ఘోర క్రూర పాతకాలు ఉపశమిస్తాయి. ॥256॥

వివరణ:- శాకలహోమీయ మంత్రము:- కాత్యాయన శ్రౌతసూత్రం 10. 86 అనుసారం యజుర్వేదపు 2. 13 'దేవకృతస్యైనసో అవయజనమసి' మంత్రము నుండి మొదలుకొని 'వయం హిత్వా ప్రయతి యజ్ఞే' [2. 20] మంత్రముల వరకు 8 మంత్రములు శాకల హోమీయములు.

* ***మహాపాతక సంయుక్తోఽనుగచ్ఛేద్గాః సమాహితః ।***
అభ్యస్యాబ్దం పావమానీర్భైక్షాహారో విశుద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***257***

తాత్పర్యం:- భిక్షాటన వల్ల లభించే ఆహారంతో కడుపు నింపుకొంటూ, జితేంద్రియుడై వైరాగ్యంతో పశువుల మందతో కూడ ఆవులవెంట నడుస్తూ **"యః పావమానీ రధ్యేతి"** (9. 67,31-32) మొదలైన ఋక్‌లను ప్రతిరోజూ శ్రద్ధగా జపించగలిగినన్ని సార్లు జపిస్తూంటే మహాపాతకాలుతరిస్తాయి. ॥257॥

* ***అరణ్యే వా త్రిరభ్యస్య ప్రయతో వేదసంహితామ్ ।***
ముచ్యతే పాతకైః సర్వైః పరాకైః శోధితస్త్రిభిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***258***

తాత్పర్యం:- అరణ్యంలో నివశిస్తూ, బాహ్యాభ్యంతర శుచికోసం మూడు ప్రోక్షణ మంత్రాలను పఠిస్తూ, నిత్యం స్నానంచేస్తూ మంత్ర బ్రాహ్మణ రూపమైన వేదసంహితను ముమ్మారు పారాయణం చేసినా పాపవిముక్తులవుతారు.॥258॥

* ***త్ర్యహం తూపవసేద్యుక్త స్త్రిరహ్నోఽభ్యుపయన్నపః ।***
ముచ్యతే పాతకైః సర్వై స్త్రిర్జపిత్వాఽఘమర్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***259***

తాత్పర్యం:- క్రూర-ఘోరపాతకాలను పోగొట్టుకోదలచినవారికి మనుస్మృతిలో పెక్కు ప్రత్యామ్నాయ సాధనలు లభిస్తాయి. (ఆచరించగలగాలే కాని, చాలా ఉన్నాయి. ఇదీ అలాంటిదే! అయితే-వేదవిదులను మరోసారి సంప్రదించి

కచ్చితమైన పూర్తి మంత్రపాఠాన్ని తెలుసుకొని పారాయణ చేయాలి గాని, ఇక్కడ ఇచ్చిన సూచనాత్మకమగు ప్రారంభపదం పట్టుకొని సాధన చేయడం సరికాదు). ॥259॥

*　**యథాశ్వమేధః క్రతురాట్సర్వపాపాపనోదనః ।**
తథాఘమర్షణం సూక్తం సర్వపాపాపనోదనమ్ ॥　ప్రక్షిప్త శ్లోక సం. ***260***

తాత్పర్యం:- యాగాలన్నింటిలోకీ అశ్వమేధయాగం ఏవిధంగా ఉత్తమమైనదో, అలాగే స్తోత్రాలన్నిటిలోకీ అఘమర్షణస్తోత్రం అంత ఉత్తమం. అఘం అంటే పాపం, మర్షణం అంటే అణచడం. పేరులోనే ఆ విషయం ఉంది. ॥260॥

*　**హత్వా లోకానపీమాం స్త్రీనశ్నన్నపి యతస్తతః ।**
ఋగ్వేదం ధారయన్విప్రో నైనః ప్రాప్నోతి కించన ॥　ప్రక్షిప్త శ్లోక సం. ***261***

తాత్పర్యం:- స్త్రీ హత్య, భ్రూణహత్య లాంటి క్రూరపాతకాలు చేసినా, మహాపాపాలు చేసిన వారి చేతి అన్నాన్ని భుజించినా ఋగ్వేదాధ్యయనం నిరంతరం చేసే బ్రాహ్మణులకు పాతకాలు అంటుకొనవు. అట్లని వేదం చదువుతూ, క్రూరపాతకాలు చేయమని పొరపాటు అర్థం తీయరాదు. ॥261॥

*　**ఋక్సంహితాం త్రిరభ్యస్య యజుషాం వా సమాహితః ।**
సామ్నాం వా సరహస్యానాం సర్వపాపైః ప్రముచ్యతే ॥　ప్రక్షిప్త శ్లోక సం. ***262***

తాత్పర్యం:- రహస్యంగా చేసే పాపాల్ని సైతం పోగొట్టగల శక్తి ఋగ్వేదానికి ఉంది. కాబట్టి-అలాంటి పాపాలు అజ్ఞాన వశాన జరిగితే, ఈ ఋగ్వేద పారాయణ ఫలితదాయకం. యజుర్వేదం-సామవేదం కూడా అంతటి శక్తి గలవే! వేద విదులచేత పారాయణ చేయించాలి. ॥262॥

ప్రక్షిప్తాల పరిశీలన

11.247 నుంచి 262 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు-

1. ప్రసంగ వ్యతిరేకాలు

క.　ఈ శ్లోకాలు పూర్వాపర ప్రసంగ వ్యతిరేకాలు. 246లో ఉపమతో పాటు 'వేద విత్' అని, చెప్పి, 262-264లలో ఉపమ, 'వేద విత్'ల నిర్వచనం ఇచ్చారు. క్రమానుసారం 246 తర్వాత 263వ శ్లోకం ఉండటం మేలు. ఈ శ్లోకాలు ఆ ప్రసంగాన్ని విడదీస్తున్నాయి కనుక, ప్రక్షిప్తాలు.

ఖ.　227లో ఏది చెప్పబోతున్నారన్న సంకేతం ప్రకారం, 'వేదాధ్యయనం' చెప్పటమే ప్రసంగోచితం. రహస్యాలతో కూడిన ప్రాయశ్చిత్తాలు చెప్పటం ఆ శ్లోకం ప్రకారం అసంగతం 'వేదాధ్యయన' సంబంధులైన 245, 246, 264 శ్లోకాలే ప్రసంగోచితాలు. పైగా అవి 227వ శ్లోకంలోని సంకేతాన్ని అనుసరించి ఉన్నాయి.

గ.　ఈ ప్రక్షిప్త ప్రసంగంలోని చివరి శ్లోకం 262 నుంచి 263కు ఎటువంటి పొంతనా లేదు. ఎందు కంటే 263,264లలో **'త్రివృత వేదం'**, 'వేద విత్'ల లక్షణాలున్నాయి. కానీ 262, దానికి ముందున్న శ్లోకాలలో రహస్యాంగాలతో పాటు వేదాలు చెప్పారు.

2. విషయ వ్యతిరేకాలు

44వ శ్లోకంలో మనువు ప్రాయశ్చిత్త విషయపు సంకేతం ఇచ్చాడు. దాని ప్రకారం, రహస్య పాపాల ప్రసంగపు సంకేతం లేదు. అర్థం ప్రకారమైతే వీటిని గుప్త పాపాలని భావించినా కూడా, వాటితో పొంతన కుదరటం లేదు. ఎందు

కంటే ప్రతి పద్ధతితో పాటు ప్రకటించిన పాపాల భాష, శైలి ప్రయోగించబడ్డాయి. వీటి వల్ల ప్రకటించిన పాపాల ప్రాయశ్చిత్త విషయమే ఇక్కడుందనీ, రహస్యాలది కాదనీ తేలుతూంది. స్పష్టత కోసం 226వ శ్లోకంలో మనువు "**ప్రత్యై రావిష్కృతైనసః**" పదాలను ప్రయోగించడం చూడాలి. ఈ విధంగా ఈ రహస్య పాపాలను చెప్పటం (247-262) విషయ వ్యతిరేకం కనుక, ఇవి ప్రక్షిప్తాలు.

3. శైలీగత ఆధారాలు

ఈ మొత్తం ప్రసంగపు శైలి నిరాధారమూ, అతిశయోక్తులతో కూడినదీ. ఎలా గంటే- "**క్షణా ద్భవతి నిర్మలః**" **(250)**, "**పూయతే మానవస్త్ర్యహాత్**" (253) మొదలైనవి.

4. అంతర్ వ్యతిరేకాలు

క. ఈ ప్రసంగంలో రహస్యాల ప్రాయశ్చిత్తం చెప్పారు కానీ, వీటిలో 'రహస్యం' అనే పదానికి ఏ పాపాలూ పేర్కొనలేదు. అందువల్ల ఈ కల్పన మనువుకు వ్యతిరేకం.

ఖ. విషయానుసారం ఎటువంటి పాపాలకు ప్రాయశ్చిత్తం మనువు చెప్పాడో, వాటికి ప్రకటితం, అప్రకటితం అని చెప్పి, ప్రకటిత పాపాలకు ప్రాయశ్చిత్తాలను 210-226 శ్లోకాలలో చెప్పారు. అప్రకటిత పాపాలకు శుద్ధిని "**మన్త్రై ర్హోమై శ్చ**" అని 226లో చెప్పి, ఆ విషయాన్నే ముగించేశారు. కనుక ఇక్కడ మళ్లీ రహస్య పదాన్ని వాడటం, వాటి వేర్వేరు విధులను నిర్ణయించటం మనువుకు వ్యతిరేకం.

గ. ఇందులో రహస్య పాపాలను చెప్పి వాటిని జపాలు లేదా కృచ్ఛ్ర వ్రతాలతో శుద్ధి చేసుకో వచ్చని చెప్పారు. దీని వల్ల ఇది వేర్వేరు వ్యవస్థల ప్రసంగమనీ పైగా 210-226లలో చెప్పిన వ్యవస్థలకు వ్యతిరేకమనీ తెలుస్తూంది.

ఘ. ఇక్కడ కేవలం జపాదులతో పాపాలను తొలగించుకో వచ్చని ఉంది. కానీ, మునుపటి ప్రసంగంలో ఖ్యాపనం, పశ్చాత్తాపం, తపస్సు, వేదాధ్యయనం మొదలైన వాటితోనూ, మళ్లీ ఆ అపరాధం చేయ కూడదనే సంకల్పంతోనూ పాపాల శుద్ధి జరుగుతుందని ఉంది. దీనికి వ్యతిరేకం (227-233) గా ఈ శ్లోకా లున్నాయి.

ఙ. 261లో వేదజ్ఞులు హత్యలు చేసినా, మూడు లోకాలలోనూ వారికి పాపం రాదని ఉంది. మనువు ప్రకారం బ్రాహ్మణులందరూ వేదజ్ఞులే. ఈ ప్రాయశ్చిత్తం వారికీ వర్తిస్తుంది. అందుచేత చెప్పిన విషయం నిరాధారమూ, మనువుకు వ్యతిరేకమూ.

263 నుండి 266వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

వేదజ్ఞానరూప తటాకంలో పాపభావనను ముంచాలి-

యథా మహాహ్రదం ప్రాప్య క్షిప్తం లోష్టం వినశ్యతి । మూలశ్లోక సం.**29**
తథా దుశ్చరితం సర్వం వేదే త్రివృతి మజ్జతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**263**

టీక:-యథా = ఏవిధంగా, **క్షిప్తం లోష్టం** = విసరివేయబడిన మట్టి పెళ్ళ, **మహాహ్రదం ప్రాప్య వినశ్యతి** = పెద్ద చెరువులో పడి కరిగి నష్టమైపోతుందో, **తథా** = అదే ప్రకారంగా, **త్రివృతి వేదే** = మూడు విద్యల సమన్వయమైన వేదజ్ఞానంలో పడి, **సర్వం దుశ్చరితం మజ్జతి** = సమస్త పాపాచరణం నష్టమైపోతుంది.

తాత్పర్యం:-మట్టిపెళ్ల ఏదైనా ఒక గొప్ప చెరువు-తటాకం, మడుగులోపల పడినప్పుడు ఏవిధంగా కరిగిపోతుందో, ఈ వేద త్రయాన్ని ముమ్మారు పారాయణ చేయడం/ చేయించడం వల్ల సమస్తపాపాలు నశిస్తాయి. ॥263॥

వేదవేత్త లక్షణం- ఇది మనుకృతం-ప్రామాణికం

ఋచో యజూంషి చాన్యాని సామాని వివిధాని చ । మూలశ్లోక సం.**30**
ఏష జ్ఞేయస్త్రివృద్వేదో యో వేదైనం స వేదవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**264**

టీక:-ఋచః = ఋక్కులు, **యజూంషి** = యజుష్ మంత్రాలు, **చ** = మరియు, **అన్యాని వివిధాని సామాని** = వీటికి భిన్నమైన సామవేదంలోని అనేక మంత్రాలు, **ఏషః త్రివృత్ వేదః జ్ఞేయః** = ఈ మూడు "త్రివృత్ వేద" మని అంగీకరించాలి. **యః ఏనం వేద సః వేదవిత్** = ఈ త్రివృత్ వేదం తెలిసినవాడే వేదవేత్త. ఈ విధంగా నాలుగు వేదాలు కూడా త్రయీ విద్యా రూపాలే. ఒక్కొక్కచోట జ్ఞాన-కర్మ ఉపాసనా పరక మంత్రాల ఆధారంగా కూడా నాలుగు వేదాలు కూడా త్రయీ విద్యారూపములుగా అంగీకరింపబడినవి.

తాత్పర్యం:- ఈ మూడు వేదాల్లోని మంత్రాలు, వేర్వేరుగా గల మంత్రబ్రాహ్మణములు త్రివృద్వేదం అని పిలువబడతాయి. దీన్ని తెలిసినవాడే వేదవిదుడు అనబడతాడు. ॥264॥

వివరణ:

త్రయీ విద్యా వర్ణన:- మనువు మూడు వేదరూప త్రయీ విద్యల వర్ణన (1.23; 12.111, 112) చేశాడు.

మీమాంసాదర్శనంలో అర్థవ్యవస్థతోపాటుగా పాద వ్యవస్థ కూడా ఉన్నది. అనగా అర్థానుసారం ఛందోబద్ధత కలిగిన మంత్రాలు ఋగ్వేద మంత్రాలనబడుతాయి. ఈ విశేషతలతోపాటు పాడబడునవి సామములని, మిగతావి గద్య రూపాలైనవి యజస్సులని చెప్పబడుతాయి. ఈ విధంగా నాలుగు వేదాలు త్రయీ విద్య రూపాలు. దీనికి సూత్రము - **'తేషాం ఋక్ యత్రార్థవశేన పాదవ్యవస్థా, గీతిషు సామాఖ్యా, శేషే యజుః శబ్దః'.** 2.1.35-37 అక్కడక్కడ జ్ఞానకర్మ ఉపాసనా భేదాలలో కూడా వేదాలను త్రయీవిద్య అన్నారు.

ఈశ్వరుడు కూడా ఒక జ్ఞేయవేదమే- ఇది మనుకృతం-ప్రామాణికం

ఆద్యం యత్త్ర్యక్షరం బ్రహ్మత్రయీ యస్మిన్ ప్రతిష్ఠితా । మూలశ్లోక సం.**31**
స గుహ్యోఽన్య స్త్రివృద్వేదో యస్తం వేద స వేదవిత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**265**

టీక:-మరియు, **యత్ త్రి+అక్షరం ఆద్యం బ్రహ్మ** = మూడు అక్షరాలు గల ప్రముఖ నామం 'ఓమ్' అని ఉచ్చరింపబడునట్టి సర్వమునకు ఆదిమూలమైన పరమేశ్వరుడు, **యస్మిన్ త్రయీ ప్రతిష్ఠితా** = ఎవడిలో మూడు వేద విద్యలు ప్రతిష్ఠితములో, **సః అన్యః గుహ్యః త్రివృత్ వేదః, యః తం వేద సః వేదవిత్** = అతడిని తెలిసినవాడే **'వేదవేత్త'**గా చెప్పబడుతున్నాడు.

తాత్పర్యం:- ప్రణవం (ఓంకారం) ఒక త్రివృద్వేదంతో సమానం. ఎవరీ రహస్యాన్ని తెలిసి ఓంకారోపాసన చేస్తారో వారు వేదవిదులే! వారికి పాపాలు అంటవు. ॥265॥

మనుమహర్షి 'ఓమ్'ను (2.51(2.76) వర్ణించాడు. ఇదే కాకుండా (1.23, 12.94, 111,112) శ్లోకాలలో కూడా వేదం ఈశ్వర రచితమని ఘోషణ చేశారు. ఈ శ్లోకంలో ఓం నామమునకు వాచ్యమైన పరమేశ్వరుడే స్వయం వేదరూపమని భావించారు. ఎందుకంటే పరమేశ్వరుడు సర్వజ్ఞుడు వారే వేదరచయితలు. ఈ విషయమును మనువు 1.23 శ్లోకంలో స్పష్టపరిచారు. ఈ సంబంధంలో వేద ప్రమాణాల గురించి 1.23 శ్లోకంలో వివరణ చూడగలరు. సూక్ష్మమైన ఆ నిరాకార పరమాత్మను వేదవేత్తలే తెలుసుకోగలరు. ఆ పరమేశ్వరుణ్ణి సాక్షాత్కరించుకొనే వారే నిజమైన వేదవేత్తలు.

ప్రాయశ్చిత్త విషయానికి ఉపసంహారం ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషవోఽభిహితః కృత్స్నః ప్రాయశ్చిత్తస్య నిర్ణయః । మూలశ్లోక సం. **32**
నిః శ్రేయసం ధర్మవిధిం విప్రస్యేమం నిబోధత॥ ప్రక్షిప్త శ్లోక సం. **266**

టీక:-ఏషః = 11.44-265 వరకు, **వః** = మీకు (తమకు), **ప్రాయశ్చిత్తస్య కృత్స్నః నిర్ణయః అభిహితః** = ప్రాయశ్చిత్తమునకు సంబంధించిన సమస్తం, (అపరాధం అందుకు ప్రాయశ్చిత్తం అలాగే ప్రాయశ్చిత్త విధి కూడా) నిర్ణయం చెప్పబడింది. ఇప్పుడు, **విప్రస్య ఇమం నిఃశ్రేయసం ధర్మ విధిం** = 12.1-125 విప్రుడికి సంబంధించిన మోక్ష ధర్మ విధానాన్ని అంటే కర్మ విధానాన్ని, **నిబోధత** = వినండి.

తాత్పర్యం:- ఇంత వరకు ఈ అధ్యాయంలో 44-265వ శ్లోకం వరకు ప్రాయశ్చిత్తానికి సంబంధించిన పూర్తి సమాచారం చెప్పడం జరిగింది. ఇప్పుడు 12వ అధ్యాయంలో 1 నుంచి 125వ శ్లోకం వరకు విప్రుడికి సంబంధించిన మోక్ష ధర్మ విధానాన్ని అంటే కర్మ విధానం గురించి వివరిస్తాను, వినండి. ॥266॥

ఇతి మహర్షి మనుప్రోక్తాయాం ఆచార్య సురేన్ద్రకుమార విరచిత హిందీభాష్యవిభూషితాయాః
'అనుశీలన-ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సమేతాయాః మనుస్మృతేః వాచస్పతిః మట్టి కృష్ణారెడ్డి కృత
ఆంధ్రభాషానువాదాత్మకః 'ప్రాయశ్చిత్త విషయాత్మకః' ఏకాదశోఽధ్యాయః॥

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం ఏకాదశోఽధ్యాయః.

ఇతి ఏకాదశోఽధ్యాయః సమాప్తః

* * *

మనుస్మృతి

ద్వాదశాధ్యాయము

విశేష వివరణ సహిత ప్రక్షిప్తాల పరిశీలన * ఋషి దయానంద భాష్యోపేతం

మొత్తం శ్లోకాల సంఖ్య: 126; మూలశ్లోకాలు: 72 ; ప్రక్షిప్తాలు: 54

కర్మఫల విధానం, నిఃశ్రేయస కర్మల వర్ణన 1-126

1,2 శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* ఋషులు భృగువును ప్రశ్నించుట-

* *చాతుర్వర్ణ్యస్య కృత్స్నోఽయముక్తో ధర్మస్త్వయానఘ ।*
కర్మణాం ఫలనిర్వృత్తిం శంసనస్తత్త్వతః పరామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 1

తాత్పర్యం:- "పాపరహితుడివైన మహర్షీ! బ్రాహ్మణాది చాతుర్వర్ణాల వారికి, సంకీర్ణ జాతులవారికి సంబంధించిన సమస్త ధర్మాలు వివరంగా చెప్పావు. ఇప్పుడు పాపపుణ్యకర్మలకు సంబంధించి, జన్మజన్మలకు (వచ్చేవి) కలిగే శుభాశుభ ఫలితాలను వివరించండ"ని ఋషులు భృగుమహర్షిని అడిగారు. ॥1॥

* భృగువు ఋషులకు ఉత్తరమిచ్చుట-

* *స తానువాచ ధర్మాత్మా మహర్షీన్మానవో భృగుః ।*
అస్య సర్వస్య శృణుత కర్మయోగస్య నిర్ణయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. 2

తాత్పర్యం:- ధర్మమే ప్రధానంగా రూపుకట్టిన వాడు- మనుపుత్రుడు అయిన భృగుమహర్షి మునులందర్నీ చూసి "మీరడిగినట్లే ఈ కర్మలకు చెందిన గుణ దోషఫలితాలు తెలుపుతాను-వినండి" అని ఇలా చెప్పసాగాడు. ॥2॥

ప్రక్షిప్తాల పరిశీలన

1, 2 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. శైలీగత ఆధారాలు

క. ఈ శ్లోకాలలో మహర్షులు భృగువును ప్రశ్నించటం, భృగువు వారికి సమాధానాలు చెప్పటం ఉంది. కనుక ఇవి మనువు చెప్పినవి కావు. పైగా భృగువు కన్నా తర్వాతి వారెవరో రచించి సంకలించారని స్పష్టమవుతూంది.

ఖ. మనుస్మృతి శైలికీ, ఈ శ్లోకాలకూ పొంతన కుదరటం లేదు. మధ్యలో ప్రశ్నలు - సమాధానాల రూపంలో మనుస్మృతి ఉండదు. ప్రారంభంలో ఒక సారి కుతూహలం ప్రకటించటం, దానికి సమాధానం ఉన్నాయి (1.2-4). మొత్తం గ్రంథ మంతా ఇలాగే ఉంటుంది. అంటే మధ్యలో ప్రశ్నలు ఉండవు. ఇక విషయాన్ని ముగిస్తూ తర్వాతి విషయం ఏమిటో మనువు సంకేతిస్తాడు (1.144; 3.286; 4.259, 6-1, 97; 7.1 మొదలైనవి). ఈ విధంగా ఇది శైలి ఆధారంగా ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

1.2-4 శ్లోకాలలో మహర్షులు మనువును ప్రశ్నించడం, మనువు సమాధానం చెప్పటం వల్ల మనుస్మృతి మనువు చెప్పిందేనని రుజువవుతూంది. ఈ శ్లోకాలలో భృగువు ప్రశ్నోత్తరాల వర్ణనతో ఇది భృగువు చెప్పిందని రుజువు చేసే ప్రయత్నం జరిగింది. ఇది పై చెప్పిన శ్లోకాలకు వ్యతిరేకం. ఈ అంతర్ వ్యతిరేకం ఆధారంగానూ ఇవి ప్రక్షిప్తాలే (విస్తృత వివరణకు 1.119 మీదిది చూడండి).

పరిశీలిస్తే మౌలిక విషయ సంకేతకమైన 11.266 వ శ్లోకాన్ని తొలగించి, ఎవరో భృగువు అనుయాయులు, ఈ శ్లోకాలను కలిపినట్లు తోస్తుంది. 11.266గా చొప్పించిన ఈ శ్లోకాలు కొన్ని ప్రాచీన గ్రంథాలలో నేటికీ లభిస్తున్నాయి. మనుస్మృతి శైలికి అనురూపంగా ఉన్నందున అదే మౌలిక శ్లోకం. 12.82, ఈ 116 శ్లోకాలకు ఈ శ్లోకంతో భావ సామ్యం ఉంది.

3 నుండి 9వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

త్రివిధ కర్మలు, త్రివిధగతుల వర్ణన-

శుభాశుభఫలం కర్మ మనోవాగ్దేహసంభవమ్ । మూలశ్లోక సం. **1**
కర్మజా గతయో నృణాముత్తమాధమమధ్యమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **3**

టీక:- మనః-వాక్-దేహ సంభవమ్ కర్మ = మనస్సు, వాక్కు మరియు శరీరాల ద్వారా చేసే కర్మలు, **శుభ-అశుభ-ఫలం** = శుభ, అశుభ ఫలాలనిచ్చునది. **కర్మజా నృణామ్** = మరియు ఆ కర్మననుసరించి మనుషులకు, **ఉత్తమ-అధమ, మధ్యమాః గతయః** = ఉత్తమం, మధ్యమం మరియు అధమం ఈ మూడు గతులు (జన్మావస్థలు) సంభవిస్తాయి.

తాత్పర్యం:- మనస్సు, వాక్కు, దేహం- వీటి ద్వారా చేసే కర్మల వల్లనే సుఖదుఃఖాది ఫలితాలు కలుగుతాయి. శాస్త్ర విహితమైనది గుణం కలిగిస్తే, శాస్త్ర నిషిద్ధమైనది దోషం కలిగిస్తుంది. కాబట్టి రెండింటినీ శాస్త్రం చెబుతుంది. ఈ కర్మాచరణను బట్టి మనిషికి ఉత్తమ మధ్యమ జన్మమో లేదా నీచ జన్మమో కలుగుతుంది. ఇంకా వివరించాలంటే....॥3॥

మనస్సే కర్మప్రవర్తకం- ఇది మనుకృతం-ప్రామాణికం

తస్యేహ త్రివిధస్యాపి త్ర్యధిష్ఠానస్య దేహినః । మూలశ్లోక సం. **2**
దశలక్షణయుక్తస్య మనో విద్యాత్ప్రవర్తకమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **4**

టీక:- ఇహ = ఈ విషయంలో, **దేహినః మనః** = మానవుడి మనస్సు, **తస్య త్రివిధస్య+అపి త్రి + అధిష్ఠానస్య దశలక్షణ యుక్తస్య** = ఆ ఉత్తమ, మధ్యమ, అధమ భేదాలతో మూడు రకాలైన మనః వచనక్రియా భేదాలతో మూడు ఆశ్రయములైన, మరియు దశలక్షణయుక్తమైన కర్మలను, **ప్రవర్తకమ్ విద్యాత్** = ప్రేరేపించేదిగా తెలిసికో. కర్మల ప్రవృత్తికి మనస్సే కారణం. మనస్సులో కలిగినదే ఆలోచన. అదే వాక్కు ద్వారా చెప్పబడుతుంది. అదే శరీరం ద్వారా చేయబడుతుంది.

తాత్పర్యం:- మానవుడి మనస్సు ఉత్తమమధ్యమ అధమ భేదాలతో మూడు రకాలైన మనోవాక్కాయాలను ఆశ్రయించినది, దశలక్షణాలు గలది అయిన కర్మలకు మనస్సే ప్రేరేపించేదిగా ఉంది. (అంటే మనస్సులో సంకల్పించినదే చెప్పబడుతుంది, చేయబడుతుంది). ॥4॥

త్రివిధ మానసిక పాపాలు-

ఇది మనుకృతం-ప్రామాణికం

పరద్రవ్యేష్వభిధ్యానం మనసానిష్టచిన్తనమ్ । మూలశ్లోక సం.**3**
వితథాభినివేశశ్చ త్రివిధం కర్మ మానసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**5**

టీక:- **త్రివిధం మానసమ్ కర్మ** = మానసకర్మలలో మూడు ముఖ్యమైన అధర్మాలు (పాపాలు) ఉన్నాయి. **పరద్రవ్యేషు + అభిధ్యానం** = పరుల ద్రవ్యాపహరణ భావన లేదా చౌర్యం, **మనసా+అనిష్ట చిన్తనమ్** = మనస్సులో ఇతరులకు అనిష్టం కలగాలని ఆలోచించడం, ద్వేషించడం, **వితథ+అభినివేశః** = మిథ్యానిశ్చయం.

ఋషి దయానందభాష్యం:- ఆ పదిలక్షణాలు గల కర్మ లేవో చెప్పబడుతుంది. 1. పరులధనాన్ని అన్యాయం చేత గ్రహించాలని తలంచడం 2. బ్రహ్మహత్య మొ॥ చెడుపనులు చేయడానికి మనస్సులో తలంచడం 3. పరలోకమే లేదనీ, దేహమే జీవాత్మ అనీ పట్టుదల కలిగి ఉండటం అనే ఈ మూడు అశుభమానసకర్మలు. దీనికి విరుద్ధమైనగుణాలు (పరధనాపహార బుద్ధి లేకుండుట, చెడుతలంపులేమి, దైవమందునమ్మిక అను ఈ గుణాలు) శుభమానస కర్మలు. (ఉపదేశమంజరి) ॥5॥

చతుర్విధ వాగ్రూప పాపాలు-

ఇది మనుకృతం-ప్రామాణికం

పారుష్యమనృతం చైవ పైశున్యం చాపి సర్వశః । మూలశ్లోక సం.**4**
అసంబద్ధప్రలాపశ్చ వాఙ్మయం స్యాచ్చతుర్విధమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**6**

టీక:- **వాఙ్మయం చతుర్విధమ్ స్యాత్** = వాచికమైన అధర్మాలు (పాపాలు) నాలుగు విధాలు **1) పారుష్యమ్** = కఠోర భాషణం. అన్ని వేళల అన్ని చోట్ల-మృదువుగా మాట్లాడటం, మానవులకు సముచితం. ఏదో ఒక గుడ్డివాడిని చూసి-'ఓరీ గుడ్డివాడా' అని సంబోధించడం సత్యమైనా, అది అతడికి బాధ కలిగిస్తుంది. కాబట్టి అది అధర్మం, పాపం, **2) అనృతం చ ఏవ** = అసత్య భాషణం అధర్మమే. **3) పైశున్యం చ + అపి** = చాడీలు చెప్పడం, **4) అసంబద్ధ ప్రలాపః** = అసంబద్ధ ప్రలాపం అంటే, కావాలని ఒకరి మీద చెడును ప్రచారం చేయడం.

ఋషి దయానందభాష్యం:- కఠినంగా మాట్లడటం, అసత్యమాడటం, చాడీలు చెప్పడం, సత్యమైన తనకు సంబంధం లేని రాజు, దేశం, పురజనులు వీరిని గురించి మాట్లాడటం ఈ నాలుగు వాక్కుకు సంబంధించిన అశుభ కర్మలు. వీటికి విరుద్ధమైనవి అంటే మంచి మాటలు పలుకుట, సత్యమాడటం, పరోక్షంగా ఇతరులను పొగడటం పురాణాదులందలి రాజు చరితములు చదవడం ఈ నాలుగు వాక్కుకు సంబంధించిన శుభకర్మలు (ఉపదేశమంజరి పూ.ప్ర.) ॥6॥

త్రివిధ శారీరక పాపకర్మలు -

ఇది మనుకృతం-ప్రామాణికం

అదత్తానాముపాదానం హింసా చైవావిధానతః । మూలశ్లోక సం.**5**
పరదారోపసేవా చ శారీరం త్రివిధం స్మృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**7**

టీక:- శారీరం త్రివిధం స్మృతమ్ = శారీరకమైన పాపాలు (అధర్మాలు) మూడు విధాలు: **1) అదత్తానామ్ + ఉపాదానం** = చౌర్యం, **2) హింసా చ + ఏవ** = హింస సర్వ విధాలైన క్రూరకర్మలు, **3) పరదారోపసేవా** = పరభార్యల కూడుట (వ్యభిచారాదులు) **అవిధానతః** = శాస్త్ర విరుద్ధంగా చేయడం, శాస్త్రంలో కొన్ని హింసలు చేయవచ్చునని విధించబడింది. ఆపత్కాలంలో, ఆతతాయీ వధ (8.348,351) యుద్ధంలో శత్రువులను హింసించడం మొ॥వి.

ఋషి దయానందభాష్యం:- ఇతరుల సొమ్ము అన్యాయంగా దొంగిలిచడం, శాస్త్రీయం కాని హింస, పరభార్యలను కూడటం అనే ఈ మూడు శారీరక పాపకర్మలు. (పూ.ప్ర.) ॥7॥

కర్మ ఎట్టిదో, భోగమట్టిది-

ఇది మనుకృతం-ప్రామాణికం

మానసం మనసైవాయముపభుజ్క్తే శుభాశుభమ్ । మూలశ్లోక సం. **6**
వాచా వాచాకృతం కర్మ కాయేనైవ చ కాయికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **8**

టీక:- **అయం** = ఈ జీవుడు, **మానసం శుభమ్ + అశుభమ్ కర్మ** = మనస్సుతో చేసిన శుభకర్మ అశుభకర్మలను, **మనసా ఏవ** = మనస్సుతోనే అనుభవిస్తాడు, **వాచాకృతం వాచా** = వాక్కుతో చేసిన కర్మను వాక్కు, **చ కాయికమ్ కాయేన + ఏవ** = మరియు శరీరం చేసిన కర్మను శరీరమే, **ఉపభుజ్క్తే** = సుఖదుఃఖాలను అనుభవిస్తుంది.

ఋషి దయానందభాష్యం:- మనస్సుచేత చేయబడే శుభాశుభకర్మల యొక్క సుఖదుఃఖరూపమైన ఫలితాలను మనస్సే అనుభవిస్తుంది. వాక్కు వల్ల జరిగేవి కూడ ఇలాగే (మధుర భాషితం లేదా పరుషవచనం మొ॥) ఫలితదాయకమైనవి ఉన్నాయి. దేహం వల్ల జరిగే మంచీ చెడు పనులను బట్టి ఆయా ఫలితాలు దేహమే అనుభవిస్తుంది (మంచి చేస్తే భోగభాగ్యాలు-చెడుచేస్తే వ్యాధులు మొ॥వి).

మానవుడు ఈ విధంగా ఉత్తమ, మధ్యమ, అధమ స్వభావాలను తెలుసుకొని ఉత్తమ శ్రేష్ఠ స్వభావాన్ని గ్రహించి మధ్యమ, అధమ స్వభావాలను త్యజించాలి.

జీవుడు మనస్సుతో చేసిన శుభాశుభా కర్మల ఫలితాన్ని మనస్సుతోనూ, వాక్కుతో చేస్తే వాక్కుతోనూ, శరీరంతో చేస్తే శరీరంతోనూ సుఖ దుఃఖాలను అనుభవిస్తాడని నిశ్చయంగా తెలుసుకోవాలి. (స.ప్ర. 9వ సము.) ॥8॥

ఇది మనుకృతం-ప్రామాణికం

శరీరజైః కర్మదోషైర్యాతి స్థావరతాం నరః । మూలశ్లోక సం. **7**
వాచికైః పక్షిమృగతాం మానసైరంత్యజాతితామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **9**

టీక:- **నరః** = మానవుడు, **శరీరజైః కర్మదోషైః స్థావరతాం యాతి** = శరీరంతో చేసే అధర్మం, చౌర్యం, పరస్త్రీ గమనం, సజ్జనహత్యలు మొ॥ దుష్టకర్మ చేసినట్లయితే, అతడు వృక్ష మొ॥ స్థావర జన్మను, **వాచికైః పక్షి మృగతాం** = వాక్కు ద్వారా చేసిన పాపకర్మల వల్ల పక్షులు- మృగముల జన్మ, **మానసైః అన్త్యజాతితామ్** = మనస్సుతో చేసే దుష్టకర్మల వల్ల చండాల శరీరం లభిస్తుంది.

ఋషి దయానందభాష్యం:- మూడు రకాలుగా ఉండే శరీర సంబంధ కర్మదోషాలచేత మానవుడు చెట్టు మొదలైనవి స్థావర రూపాలను పొందుతాడు. నాలుగు రకాలుగా ఉండే వాక్ కర్మ దోషాలచేత పక్షిజన్మగాని, మృగజన్మగాని పొందుతాడు. మానసిక సంబంధ పాపాలచేత చండాల జన్మ లభిస్తుంది. (స.ప్ర: 9వ సము.) ॥9॥

10 నుండి 23వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

* త్రిదండి పరిభాష-

* ***వాగ్దణ్డోఽథ మనోదణ్డః కాయదణ్డస్తథైవ చ ।***
యస్యైతే నిహితా బుద్ధౌ త్రిదణ్డీతి స ఉచ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***10***

తాత్పర్యం:- నిషిద్ధమైన పలుకులు అనేది; దుర్మార్గపు ఆలోచనలో ఉండటం అనేది; దుర్మార్గవర్తనం జరపడం అనేది ఎవరు చేయరో వారిని త్రిదండి అంటారు. (అంటే వాగ్దండం, మనోదండం, కాయదండం అనేవి త్రికరణ శుద్ధిగా అణచి ఆచరించేవారని అర్థం.). ॥10॥

* *త్రిదణ్డమేతన్నిక్షిప్య సర్వభూతేషు మానవః ।*
కామక్రోధౌ తు సంయమ్య తతః సిద్ధిం నియచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **11**

తాత్పర్యం:- ఈ ఆచరణకు ఎవరు అంకితమై ప్రవర్తిస్తుంటారో వారు మొదట వీటికి కారణమైన కామక్రోధాదులను అణుచుకోవలసి ఉంటుంది. వీటిపై జయం సాధించిన మనుజుడు నేరుగా మోక్షప్రాప్తికీ అర్హుడవుతున్నాడు. ॥11॥

*** క్షేత్రజము - భూతాత్మ-**

* *యోఽస్యాత్మనః కారయితా తం క్షేత్రజ్ఞం ప్రచక్షతే ।*
యః కరోతి తు కర్మాణి స భూతాత్మోచ్యతే బుధైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **12**

తాత్పర్యం:- ఆత్మోపకారకమైనందువల్ల ఆత్మ అయిన శరీరాన్ని శుభాశుభకార్యాలన్నిటిలోనూ ప్రవర్తింపజేసే వారిని క్షేత్రజ్ఞులు అంటారు. ఏ శరీరంలో ఈ సకల వ్యాపారాలను నిర్వర్తిస్తున్నదో-అది పృథివ్యాధి పంచభూతాలచేత చేయబడింది కాబట్టి 'భూతాత్మ' అని పండితులచేత వ్యవహరించబడుతున్నది. ॥12॥

*** ఫల అనుభవ కర్త జీవాత్మయే-**

* *జీవసంజ్ఞోఽన్తరాత్మాన్యః సహజః సర్వదేహినామ్ ।*
యేన వేదయతే సర్వం సుఖం దుఃఖం చ జన్మసు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **13**

తాత్పర్యం:- క్షేత్రజ్ఞ, భూతాత్మలకంటే భిన్నమైనట్టిది-మహత్తత్వం కలిగినట్టిదీ అయిన 'ఆత్మ' మరొకటి ఉంది. ఆ మహత్తత్వం యొక్క సహాయం వల్లనే క్షేత్రజ్ఞుడు ప్రతిజన్మలోనూ సుఖదుఃఖాలను పొందుతున్నాడు. ॥13॥

* *తావుభౌ భూతసంపృక్తౌ మహాన్ క్షేత్రజ్ఞ ఏవ చ ।*
ఉచ్చావచేషు భూతేషు స్థితం తం వ్యాప్య తిష్ఠతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **14**

తాత్పర్యం:- ఆ మహత్, ఈ క్షేత్రజ్ఞులు రెండూ పృథివ్యాధి పంచభూతాలతో కలిసినవై, సకలలోకాలలోను వ్యాప్తిచెందినవై 'సత్' అనబడే పదార్థంగా ఉత్తమ, మధ్యమ, అధమ ప్రాణులన్నిటా ఉన్న పరమాత్మనాశ్రయించి ఉంటుంది. ॥14॥

* *అసంఖ్యా మూర్తయస్తస్య నిష్పతన్తి శరీరతః ।*
ఉచ్చావచాని భూతాని సతతం చేష్టయన్తి యాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **15**

తాత్పర్యం:- ఈ పరమాత్మనుంచే అసంఖ్యాకంగా జీవులు, లింగశరీరధారణ చేత కలుగుతున్నాయి. క్షేత్రజ్ఞత వీటికే ఆపాదించబడుతున్నదని అర్థం. ఇవే సకల భూత భౌతిక కర్మలయందు ప్రవర్తిల్లుతున్నాయి. 'అగ్ని నుంచి మిణుగురులు వెలువడిన రీతి' అని పోలిక చెప్పబడింది. ॥15॥

* *పఞ్చభ్య ఏవ మాత్రాభ్యః ప్రేత్య దుష్కృతినాం నృణామ్ ।*
శరీరం యాతనార్థీయమన్యదుత్పద్యతే ధ్రువమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **16**

తాత్పర్యం:- ఈ యాతన శరీరం (భౌతిక రూపమైన ఈ దేహం) సకల ప్రాణికోటికీ పృథివ్యాది పంచ భూతాల వల్లనే కలిగి నరకం-రోగాలు-బాధలు-కష్టాలు మొదలైనవి పొందుతుంది. ॥16॥

* *తేనానుభూయ తా యామీశ్శరీరేణేహ యాతనాః ।*
తాస్వేన భూతమాత్రాసు ప్రలీయంతే విభాగశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **17**

తాత్పర్యం:- పాపాత్ములైన జీవులకు ఈ యాతనా శరీరంతోనే యమునిచేత బాధలకు గురిచేయబడి సూక్ష్మశరీరం నశించగా, వాటికి మూలమైన పంచ భూతాలలోనే లయం పొందుతోంది.॥17॥

* *సోఽను భూయాసుఖోదర్కాన్ దోషాన్విషయసంగజాన్ ॥*
వ్యపేతకల్మషోఽభ్యేతి తావేవోభౌ మహౌజసౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **18**

తాత్పర్యం:- దేహి లింగశరీరంతో కూడి నిషిద్ధములైన శబ్దస్పర్శాది విషయానుభవం వల్ల కలిగిన యమబాధలన్నీ అనుభవించి, నరకానుభవంవల్ల పాపాన్ని పోగొట్టుకొన్నవాడై మహా వీర్యం గలవాడు మహత్పరమాత్మను పొందుతున్నాడు.॥18॥

* *తౌ ధర్మం పశ్యతస్తస్య పాపం చాతంద్రితౌ సహ ।*
యాభ్యాం ప్రాప్నోతి సంపృక్తః ప్రేత్యేహ చ సుఖాసుఖమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **19**

తాత్పర్యం:- ఆ మహత్తు కలిగిన పరమాత్మ వల్లనే ధర్మాధర్మాలతో మిళితమైన కార్యాలొనరించేది జీవుడు, ఏ సుఖదుఃఖాలను ఇతరలోకాలందు కూడ పొందుతున్నాడో-అది ఆ జీవుడి పుణ్యపాప విశేషాలను బట్టి పరమాత్మే వానికి/ఆ స్వర్గ-నరకాలు కల్పిస్తున్నాడు. ॥19॥

* *యదా చరతి ధర్మం స ప్రాయశోఽధర్మమల్పశః ।*
తైరేవ చావృతో భూతై స్స్వర్గే సుఖముపాశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **20**

తాత్పర్యం:- మానవుడిగా జన్మించినప్పుడైనా, జ్ఞానం చేత ధర్మాన్ని అధికంగాను, అధర్మాన్ని తక్కువగాను ఆచరించడం ద్వారా ఆ జీవుడికి స్థూలశరీరరూపంతో చేయబడే కృత్యాల వల్ల స్వర్గాది సౌఖ్యాలు కలుగుతున్నాయి.॥20॥

* *యది తు ప్రాయశోఽధర్మం సేవతే ధర్మమల్పశః ।*
తైర్భూతైస్స పరిత్యక్తో యామీః ప్రాప్నోతి యాతనాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **21**

తాత్పర్యం:-ఆ జీవుడే అతి దుర్లభమైన ఈ మానవజన్మలో పాపాలు అధికంగా-పుణ్యం కొద్దిగా ఆచరిస్తే పంచభూతాత్మకమైన ఈ దేహం నశించిన వెనుక నరకంలో పడి నానా బాధలకు గురి కావలసి వస్తున్నది. ॥21॥

* *యామీస్తా యాతనాః ప్రాప్య స జీవో వీతకల్మషః ।*
తాన్యేవ పంచ భూతాని పునరభ్యేతి భాగశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **22**

తాత్పర్యం:- యముడు నరకంలో పెట్టే బాధలన్నిటినీ దేహి పలువిధాల యాతనలతో భరించి, ఆ అనుభవం వల్ల పాపాలు ప్రక్షాళితమై తిరిగి ఎన్నడో పృథివ్యాధి పంచభూతాత్మకమైన మానుషాది దేహాలను పొందుతున్నాడు.॥22॥

* *ఏతా దృష్ట్వాఽస్య జీవస్య గతీస్స్వేనైవ చేతసా ।*
ధర్మతోఽధర్మతశ్చైవ ధర్మే దధ్యాత్సదా మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **23**

తాత్పర్యం:- ఈ జ్ఞానం కలిగిన మానవుడు సదా ధర్మానుష్ఠానమందే మనస్సు నిలుపుతాడు. తెలిసీ అజ్ఞానిలా ప్రవర్తిస్తే బాధలు పొందుతాడు. ॥23॥

ప్రక్షిప్తాల పరిశీలన

10-23 శ్లోకాలు కింది ఆధారాలను అనుసరించి ప్రక్షిప్తాలుగా రుజువవుతూంది -

1. విషయ వ్యతిరేకాలు

11.266, 12.3-4,52, 82 శ్లోకాలలో చెప్పిన దాని ప్రకారం, ఇప్పటి విషయం కర్మ ఫల విధానం. 10,11 శ్లోకాలలో మూడు శిక్షలు, ఈ విషయానికి సంబంధించనివి కావటం చేత వ్యతిరేకం. అందుచేత ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

12.3,4, 51 శ్లోకాలలో మనువు ఇప్పటి విషయానికి ఒక క్రమాన్ని ఏర్పరచాడు. అదే కర్మ ఫల విధానం. దీనిలో ముందు మూడు రకాల కర్మలను, మూడు గతులను చెబుతాడు. దాని ప్రకారం 5-9 శ్లోకాలలో మూడు రకాల కర్మలు, 24-51 లలో త్రివిధ గతులకు ఆధారాలు, వాటి వివరాలూ చెప్పాడు. 10-23 శ్లోకాలు, సంకేతించిన విషయానికి భిన్న విషయాలు చెప్పి ఆ నియమ క్రమాన్ని భంగపరచారు. ఇందులో చెప్పిన ఆత్మ మొదలైనవి లేదా గతులు పూర్వాపర ప్రసంగంతో కలవటం లేదు. అందుచేత ప్రసంగ భంజకాలైన ఈ శ్లోకాలు ప్రసంగ వ్యతిరేకాలు, ప్రక్షిప్తాలు.

3. అంతర్ వ్యతిరేకాలు

క. 15వ శ్లోకంలో చెప్పినది, 1.6-16, 19 మొదలైన ఈ అన్ని శ్లోకాలలో చెప్పిన వాటికి వ్యతిరేకం. వాటిలో పరమాత్మ ద్వారా ప్రకృతి, ఆత్మ సంయోగంతో ప్రాణుల ఉత్పత్తి జరిగాయని ఉంది.

ఖ. 20-22,27 శ్లోకాలలో స్వర్గ నరక లోకాల వర్ణన మనువు పద్ధతికి వ్యతిరేకం. మనువు 'స్వర్గ'- సుఖాలను కానీ, 'నరక' దుఃఖాలను కానీ అంగీకరించాడే కానీ, వాటిని ప్రత్యేక లోకాలుగా చెప్పలేదు. (3.79;9.28). అందువల్లనే 12.39-51,74 శ్లోకాలలో ఇదే లోకంలో జన్మ లెత్తటం ఉంది. ఇట్లా ఈ శ్లోకాలు అంతర్ వ్యతిరేకాల కారణంగా ప్రక్షిప్తాలు. మిగిలినవి దీనికి సంబంధించినవి కనుక, ఇవి కూడా ప్రక్షిప్తాలుగా తేలుతున్నాయి.

24 నుండి 52వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

ఆత్మను ప్రభావితం చేసే మూడు ప్రాకృతిక గుణాలు-

సత్త్వం రజస్తమశ్చైవ త్రీన్విద్యాదాత్మనో గుణాన్ । మూలశ్లోక సం. **8**
యైర్వ్యాప్యేమాన్ స్థితో భావాన్మహాన్సర్వానశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **24**

టీక:- సత్త్వం రజః చ తమః ఏవ త్రీన్ ఆత్మనః గుణాన్ విద్యాత్ = సత్త్వగుణం, రజోగుణం, తమో గుణం, ఈ మూడు ఆత్మను ప్రభావితం చేసే ప్రకృతి గుణాలని తెలుసుకోవాలి. **మహాన్** = మహత్తత్త్వం ప్రకృతి యొక్క ప్రథమ వికారం (1.14) **యైః** = ఈ మూడు గుణాలతో, **అశేషతః** = ఏ పదార్థాన్ని విడువకుండా, **ఇమాన్ సర్వాన్ భావాన్ వ్యాప్య స్థితః** = ఈ సమస్త ప్రకృతి కార్యరూప పదార్థాలను వ్యాపించి ఉంది.

తాత్పర్యం:- రజస్సత్త్వతమోగుణాలనే మూడింటితో కూడిన మహత్ తత్త్వమొకటి, స్థావర జంగమరూపమైన ఈ జగత్తునందుండు పదార్థములన్నిటా వ్యాపించి ఉంది. ॥24॥

వివరణ:

'ఆత్మ' శబ్దానికి ప్రకృతి అని కూడా అర్థముంది. ఇక్కడ ఈ అర్థమే ప్రామాణికం. ఈ విషయంలో విస్తృత వివేచనం కోసం 1.15 వివరణ చూడగలరు.

ఏ గుణానికి ప్రాధాన్యం ఉందో ఆత్మకు కూడా అలాగే - ఇది మనుకృతం-ప్రామాణికం

యో యదేషాం గుణో దేహే సాకల్యేనాతిరిచ్యతే । మూలశ్లోక సం. **9**
స తదా తద్గుణప్రాయం తం కరోతి శరీరిణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **25**

టీక:- **యః గుణః ఏషాం దేహే** = ఏ గుణం ఈ జీవుల దేహంలో, **సాకల్యేన + అతిరిచ్యతే** = అధికంగా ఉంటుందో, **సః తదా తం శరీరిణమ్** = ఆ గుణం ఆ జీవుడి **తద్గుణప్రాయం కరోతి** = తనతో సమానంగా చేస్తుంది. (మార్చుతుంది)

ఋషి దయానందభాష్యం:- అన్ని రకాల దేహధారులకు ఈ గుణత్రయం ఉన్నా, ఏ దేహంలో ఎప్పుడే గుణం అధికంగా ప్రవర్తిల్లుతూ ఉంటుందో అప్పుడా దేహిని ఆ గుణం గలవాడిగా భావించాలి. (స.ప్ర. 9వ సము.) ॥25॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సత్త్వం జ్ఞానం తమోఽజ్ఞానం రాగద్వేషౌ రజః స్మృతమ్ । మూలశ్లోక సం. **10**
ఏతద్వ్యాప్తిమదేతేషాం సర్వభూతాశ్రితం వపుః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **26**

టీక:- **సత్త్వం జ్ఞానం** = ఆత్మలో జ్ఞానమున్నప్పుడు సత్త్వం, **అజ్ఞానం తమః** = అజ్ఞానం ఉన్నప్పుడు తమోగుణం, **రాగద్వేషౌ రజః స్మృతమ్** = రాగద్వేషాలలో, **ఏతేషాం సర్వభూతాశ్రితం వపుః ఏతత్ వ్యాప్తిమత్** = ఈ మూడు ప్రాకృతిక గుణాలు ప్రపంచంలో ఉన్న సర్వ పదార్థాలలో వ్యాపించి ఉన్నాయి.

ఋషి దయానందభాష్యం:- ఈ 3 గుణాలకు ఇవీ లక్షణాలు:- పదార్థాల వాస్తవ స్వరూప జ్ఞానం తెలిసివుండటం సత్త్వగుణం. అదే పదార్థాలకు వాస్తవవిరుద్ధమైన జ్ఞానం కలిగి ఉండటాన్ని చూడటమే తమోగుణం. ద్వంద్వాలున్నాయని తెలియడం రజోగుణం. ఇవి సకలప్రాణులకు సామాన్యం. (స.ప్ర. 9వ సము.) ॥26॥

ఆత్మలో సత్త్వగుణ ప్రాధాన్యాన్ని గుర్తించడం - ఇది మనుకృతం-ప్రామాణికం

తత్ర యత్ప్రీతిసంయుక్తం కించిదాత్మని లక్షయేత్ । మూలశ్లోక సం. **11**
ప్రశాంతమివ శుద్ధాభం సత్త్వం తదుపధారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **27**

టీక:- సత్త్వగుణాన్ని గురించే విధానం **తత్ర ఆత్మనియత్ కించిత్ ప్రీతి సంయుక్తం** = ఎప్పుడు ఆత్మలో ప్రసన్నత, **ప్రశాన్తమ్ +ఇవ శుద్ధాభం లక్షయేత్** = ప్రశాంత, శుద్ధమైన ప్రకాశం కనిపిస్తుందో, **తత్ +ఉపధారయేత్ సత్త్వం** = అప్పుడు సత్త్వ గుణం ప్రధానం, రజోగుణం, తమోగుణాలు అప్రధానములని గుర్తించాలి.

ఋషి దయానందభాష్యం:- ఒక్కొక్క జీవాత్మయందు ఏ గుణం అధికంగా ఉంటుందో అది ఆ జీవిలక్షణం. సంప్రీతి, ప్రకాశం, సంతృప్తి, జ్ఞానం లాంటి ఉత్తమలక్షణ సమన్వితం సత్త్వగుణం. రజోగుణం, తమోగుణాలు అప్రధానమని గుర్తించాలి. (స.ప్ర. 9వ సము.) ॥27॥

ఆత్మలో రజోగుణ ప్రాధాన్యానికి గుర్తు - ఇది మనుకృతం-ప్రామాణికం

యత్తు దుఃఖసమాయుక్తమప్రీతికరమాత్మనః । మూలశ్లోక సం. **12**
తద్రజోఽప్రతిపం విద్యాత్సతతం హారి దేహినామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **28**

టీక:- యత్ తు ఆత్మనః= ఎప్పుడు ఆత్మ మనస్సు, **దుఃఖ సమాయుక్తమ్ అ్రప్రీతి కరమ్** = దుఃఖ సంయుక్త ప్రశాంతరహిత విషయంలో, **సతతం హారి** = ఇటు అటు రాకపోకలలో లగ్నమవుతుందో, **తత్ విద్యాత్ రజః** = అది రజో గుణం ప్రధానమని అప్పుడు సత్త్వగుణం, తమోగుణాలు అప్రధానమని గుర్తించాలి. (స.ప్ర. 9వ సముల్లాసము).

ఋషి దయానందభాష్యం:- ఆత్మ ఏగుణం దుఃఖంతో కూడి, సత్త్వ పూర్ణమైన ఆ ఆత్మకు ప్రీతి కలిగించక, ప్రాణులను నిరంతరం విషయలంపటంలోకి లాగుతూంటుందో అది (ఆ లక్షణం) రజో గుణం. (స.ప్ర. 9వ సము.)॥28॥

ఆత్మలో తమోగుణ ప్రాధాన్యానికి గుర్తు - ఇది మనుకృతం-ప్రామాణికం

యత్తు స్యాన్మోహసంయుక్తమవ్యక్తం విషయాత్మకమ్ । మూలశ్లోక సం. **13**
అప్రతర్క్యమవిజ్ఞేయం తమస్తదుపధారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **29**

టీక:- యత్ తు మోహసంయుక్తం స్యాత్ = ఎప్పుడు మోహం భౌతిక పదార్థాలలో ఆత్మ మరియు, మనస్సు చిక్కుపడి ఉంటుందో, **అవ్యక్తమ్** = ఆత్మలో గాని, మనస్సులో గాని వివేకం లేదో, **అప్రతర్క్యమ్** = తర్క వితర్క రహితమో, **అవిజ్ఞేయమ్** = తెలియతగినది కాదో, **విషయాత్మకమ్** = విషయాలలో, **తమస్, తత్ + ఉపధారయేత్ తమః** = ఈ సమయంలో నాలో తమో గుణం ప్రధానమని, సత్త్వ-రజోగుణాలు అప్రధానమని నిశ్చయంగా గుర్తించాలి.

ఋషి దయానందభాష్యం:- ఏది మంచి? ఏది చెడు? అనే విచక్షణా జ్ఞాన శూన్యమైనది, అంతఃకరణం చేతగాని, బాహ్యబుద్ధుల చేతగాని ఎరుగరానిది, స్పష్టమయిన స్వరూపం తెలియబడనిది ఏదైతే ఉంటుందో ఆ లక్షణం తమో గుణం. అన్నిటికంటే సత్త్వగుణమే శ్రేష్ఠమని చెప్పడానికే ఇతర గుణాల లక్షణాలు చెప్పడం జరిగింది. (స.ప్ర. 9వ సము.) ॥29॥

ఇది మనుకృతం-ప్రామాణికం

త్రయాణామపి చైతేషాం గుణానాం యః ఫలోదయః । మూలశ్లోక సం. **14**
అగ్ర్యో మధ్యో జఘన్యశ్చ తం ప్రవక్ష్యామ్యశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **30**

టీక:- అప్పుడు, **యః** = ఎవడు, **చ+ఏతేషాం త్రయాణామ్ + అపి అగ్ర్యః మధ్యః చ జఘన్యః ఫలోదయః** = ఈ మూడు గుణాల యొక్క ఉత్తమ, మధ్యమ, నీచమైన (నికృష్ట) ఫలదోయం సంభవిస్తుందో, **తమ్ + అశేషతః ప్రవక్ష్యామి** = ఆ విషయాన్ని సంపూర్ణంగా వివరిస్తాను.

ఋషి దయానందభాష్యం:- ఈ గుణత్రయం విభాగ రీత్యా, వరుసగా ఉత్తమ-మధ్యమ-అధమ ఫలితాలు ఏ యే క్రియలవల్ల కలుగుతాయో ఇప్పుడు వాటిని సంపూర్ణంగా వివరిస్తాను. (స.ప్ర. 9వ సము.) ॥30॥

ఇది మనుకృతం-ప్రామాణికం

సత్త్వ గుణాన్ని ప్రత్యక్షం చేసే లక్షణాలు

వేదాభ్యాసస్తపో జ్ఞానం శౌచమింద్రియనిగ్రహః । మూలశ్లోక సం. **15**
ధర్మక్రియాత్మచింతా చ సాత్త్వికం గుణలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **31**

టీక:- వేదాభ్యాసః తపః జ్ఞానం = వేదాభ్యాసం, ధర్మానుష్ఠానం, జ్ఞానవృద్ధి, **శౌచమ్ + ఇంద్రియ నిగ్రహః** = పవిత్రతను చేసుకోవడం, ఇంద్రియాలను నిగ్రహించడం, **ధర్మక్రియా చ ఆత్మచిన్తా** = ధర్మకార్యాలొనర్చడం, ఆత్మ చింతనం, **సాత్త్వికం గుణలక్షణమ్** = ఇవే సత్త్వగుణ లక్షణాలు.

ఋషి దయానందభాష్యం:- వేదాభ్యాసం, ప్రాజాపత్యాది తపములు చేయడం, శాస్త్రార్థ జ్ఞానం, జలం మృత్తిక (మట్టి) లాంటి వాటితో పరిశుద్ధం చేసుకోవడం, ఇంద్రియ నిగ్రహం, దానాది సత్కార్యాలు జరపడం, బ్రహ్మ ధ్యానంపైన ఆసక్తి ఇవి సత్త్వగుణం యొక్క కార్యములు. (స.ప్ర. 9వ సము.) ॥31॥

రజోగుణ లక్షణాలు-

ఇది మనుకృతం-(ప్రామాణికం)

ఆరంభరుచితాऽధైర్యమసత్కార్యపరిగ్రహః । మూలశ్లోక సం.**16**
విషయోపసేవా చాజస్రం రాజసం గుణలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**32**

టీక:- రజో గుణోదయం కాగా, సత్త్వ గుణం, తమో గుణం అంతర్ధానమై పోతాయి. **ఆరంభ రుచితా** = ప్రారంభంలో ఆసక్తి, **అధైర్యమ్** = ధైర్యత్యాగం, **అసత్కార్య పరిగ్రహః** = అసత్యకార్యాలను స్వీకరించడం, **అజస్ర విషయ+ఉపసేవా** = నిరంతరం విషయ సేవనలో ప్రీతి. ఇవి, **రాజసం గుణ లక్షణం** = ఇప్పుడు నాలో రజోగుణం ప్రధానంగా ఉందని తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- రజోగుణం వృద్ధిచెంది సత్త్వతమోగుణాలు అంతర్భాగాలు అయినపుడు, కార్యారంభ రుచిత్వం, అధైర్యం, అసత్ కార్యాలను గ్రహించటం, నిరంతరం విషయాసక్తి కలిగి ఉండటం జరుగుతుంది. అప్పుడు తనలో రజోగుణం ప్రధానంగా ఉన్నదని తెలుసుకోవాలి. (స.ప్ర. 9 సము.) ॥32॥

తమోగుణ లక్షణాలు-

ఇది మనుకృతం-ప్రామాణికం

లోభః స్వప్నోऽధృతిః క్రౌర్యం నాస్తిక్యం భిన్నవృత్తితా । మూలశ్లోక సం.**17**
యాచిష్ణుతా ప్రమాదశ్చ తామసం గుణలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**33**

టీక:- తమోగుణోదయం కాగా, సత్త్వ-రజో గుణాలు అంతర్ధానమై పోతాయి, **లోభః** = అత్యంత లోభం అంటే సర్వ పాపాల మూలం అభివృద్ధి చెందుతుంది. **స్వప్నః** = అధికంగా సోమరితనం, నిద్ర, **అధృతిః** = ధైర్యనాశం, **క్రౌర్యం** = క్రూరత్వం, **నాస్తిక్య** = నాస్తిక్య భావం అంటే వేదాలలోనూ, **ఈశ్వరుడిలోనూ** అశ్రద్ధ, **భిన్నవృత్తితా** = భిన్నభిన్నాలైన అంతఃకరణ ప్రవృత్తులు, **చ** = మరియు, **ప్రమాదః** = ఏకాగ్రత లేకపోవడం, **యాచిష్ణుతా** = ఏదైనా వ్యసనంలో చిక్కుబడిపోవడం అప్పుడు, **తామసం గుణ లక్షణమ్** = తమోగుణమని విద్వాంసుడు తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- తమోగుణం అధికమై మిగతా రెండు సత్వరజోగుణాలు అంతర్భాగాలు అయినపుడు సమస్త పాపాలకు మూలమైన అత్యంత లోభం వృద్ధిచెందుతుంది. అత్యంత సోమరితనం, నిద్ర, ధైర్యనాశనం, క్రూరత్వం, నాస్తిక్యం - వేదంలో గాని, ఈశ్వరునిలోగాని శ్రద్ధ లేకుండటం, అంతఃకరణం యొక్క భిన్న భిన్న వృత్తులు, ఏకాగ్రతయొక్క అభావం, అనేక వ్యసనాలలో చిక్కుకొని ఉండటం అనేవి కలుగుతాయి. అపుడు ఇవి తమోగుణ లక్షణాలని తెలుసుకోవాలి.

అత్యాశ, అధైర్యం, సురాపానాసక్తి, ఇతరులపై కొండెములు పలుకుట, ఆచారశూన్యత, యాచన, అన్నీ ఉండి కూడా ధర్మముల పైన అభిరుచిలేక పోవడం ఇవి తామస గుణకార్యాలు. (స.ప్ర. 9వ సము.) ॥33॥

ఇది మనుకృతం-ప్రామాణికం

త్రయాణామపి చైతేషాం గుణానాం త్రిషు తిష్ఠతామ్ । మూలశ్లోక సం.**18**
ఇదం సామాసికం జ్ఞేయం క్రమశో గుణలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**34**

టీక:- **త్రిషు తిష్ఠతామ్** = మూడు కాలాల్లో (భూత-భవిష్యత్-వర్తమాన) ఉంటుందని, **ఏతేషాం త్రయాణామ్ + అపి గుణానాం** = ఈ మూడు గుణాల యొక్క, **గుణలక్షణమ్** = గుణలక్షణాలను, **క్రమశః** = క్రమంగా, **సామాసికం ఇదం జ్ఞేయం** = సంక్షేమంగా ఈ విధంగా (12.35 నుండి 38) తెలియాలి.

ఋషి దయానందభాష్యం:- మనస్సు, వాణి, శరీరాలలో ఉండు ఈ మూడు గుణాలను క్రమంగా గుణలక్షణాలను తెలుసుకోవాలి. (స.ప్ర.9వ సము.) ॥34॥

తమో గుణవంతుడి కర్మల యొక్క సంక్షిప్త పరిభాష - ఇది మనుకృతం-ప్రామాణికం

యత్కర్మ కృత్వా కుర్వంశ్చ కరిష్యంశ్చైవ లజ్జతి । మూలశ్లోక సం.19
తత్ జ్ఞేయం విదుషా సర్వం తామసం గుణలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.35

టీక:- యత్ కర్మ కృత్వా = ఏ పనిచేసి గాని, లేదా, **కుర్వంశ్చ** = చేస్తూ గాని, **చ** = మరియు, **కరిష్యన్ + ఏవ లజ్జతి** = లేదా చేయబోతూ గాని, సిగ్గు, సందేహం, భయం కలుగుతుందో, **తత్ జ్ఞేయం విదుషా సర్వం తామసం గుణ లక్షణమ్** = అప్పుడు నాలో అశుద్ధమైన తామసగుణం ప్రవృద్ధమైందని గుర్తించాలి.

ఋషి దయానందభాష్యం:- ఒక కార్యాన్ని చేసినప్పుడు, చేస్తున్నప్పుడు, చేయాలని అనుకున్నప్పుడు తన ఆత్మలో సిగ్గు, లజ్జ, అనుమానం, భయం కలుగునప్పుడు తనలో తమోగుణం ప్రబలంగా ఉన్నదని విద్వాంసులు తెలుసుకోవాలి. (స.ప్ర.9 సము.) ॥35॥

రజోగుణవంతుడి కర్మల సంక్షిప్త పరిభాష - ఇది మనుకృతం-ప్రామాణికం

యేనాస్మిన్ కర్మణా లోకే ఖ్యాతిమిచ్ఛతి పుష్కలామ్ । మూలశ్లోక సం.20
న చ శోచత్యసంపత్తౌ తద్విజ్ఞేయం తు రాజసమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.36

టీక:- యేన కర్మణా = ఏకర్మ వల్ల, **అస్మిన్ లోకే** = ఈ లోకంలో, **జీవాత్మ, పుష్కలామ్ ఖ్యాతిమ్ + ఇచ్ఛతి** = అధికమైన ప్రసిద్ధిని కోరుతుందో, **అసంపత్తౌ న శోచతి** = దారిద్ర్యంలో కూడా యాచకులకు, దానం చేయడం మానడో, **తత్ జ్ఞేయం తు రాజసమ్** = అప్పుడు తనలో రాజస లక్షణం వృద్ధి పొందిందని గుర్తించాలి.

ఋషి దయానందభాష్యం:- ఒక కార్యం చేసి లోకంలో పుష్కలమైన కీర్తిని కోరుతూ, దరిద్రావస్థలోనూ భట్రాజులకు తనను స్తుతించటానికై దానమివ్వటం చేస్తే తనలో రజోగుణం ప్రబలంగా ఉన్నదని గుర్తించాలి.(స.ప్ర.9 సము.) ॥36॥

సత్త్వ గుణవంతుడి కర్మల సంక్షిప్త పరిభాష - ఇది మనుకృతం-ప్రామాణికం

యత్సర్వేణేచ్ఛతి జ్ఞాతుం యన్న లజ్జతి చాచరన్ । మూలశ్లోక సం.21
యేన తుష్యతి చాత్మాఽస్య తత్సత్త్వగుణలక్షణమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.37

టీక:- ఎప్పుడు మనుష్యుడి ఆత్మ, **సర్వేణ జ్ఞాతుం ఇచ్ఛతి** = సర్వం తెలుసుకోవాలని కోరుకుంటుందో, గుణగ్రహణం చేస్తూ ఉంటుందో, **యచ్చ ఆచరన్ న లజ్జతి** = ఏ పని చేస్తూ సిగ్గుపడడో, **యేన అస్య ఆత్మా తుష్యతి** = ఏ పని చేస్తూ ఆత్మ ప్రసన్నంగా ఉంటుందో, **తత్ సత్త్వ గుణ లక్షణమ్** = అప్పుడు 'తనలో సత్త్వగుణం అధికంగా ఉందని' తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- మానవుని ఆత్మ అన్నింటినీ తెలుసుకోవాలని అనుకుంటూ, గుణాలను గ్రహిస్తూ, సత్కార్యాలను చేయటానికి సిగ్గుపడక, ప్రసన్నత కలిగించే కార్యాలను చేస్తూ ధర్మాచరణలో అభిరుచిని కలిగి ఉంటే తనలో సత్త్వగుణం అధికంగా ఉన్నదని గుర్తించాలి. (స.ప్ర.9వ సము) ॥37॥

త్రిగుణాల ప్రధాన ఉద్దేశాలు-పారస్పరిక శ్రేష్ఠత్వం - ఇది మనుకృతం-ప్రామాణికం

తమసో లక్షణం కామో రజసస్త్వర్థ ఉచ్యతే । మూలశ్లోక సం.22
సత్త్వస్య లక్షణం ధర్మః శ్రైష్ఠ్యమేషాం యథోత్తరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.38

టీక:- తమసః లక్షణం కామః = తమో గుణానికి కామం లక్షణం, **రజసః తు + అర్థః** = రజోగుణానికి అర్థమే (ధనమే) లోభం-అంటే ధనసంగ్రహేచ్ఛ, **సత్త్వస్య లక్షణం ధర్మః** = సత్త్వగుణానికి ధర్మమే లక్షణం (ధర్మ-సేవచేయడం), **ఏషాం యథోత్తరం శ్రైష్ఠ్యమ్** = కానీ తమోగుణం కంటే రజోగుణం, రజోగుణం కంటె సత్త్వగుణం శ్రేష్ఠం.

ఋషి దయానందభాష్యం:- కామం తమోగుణ లక్షణం. అర్థసంగ్రహణం చేయాలనే కోరిక రజోగుణ లక్షణం. ధర్మకార్యాలు చేయటం సత్త్వగుణలక్షణం. కాని తమోగుణం కంటే రజోగుణం, రజో గుణంకంటే సత్త్వగుణం శ్రేష్ఠమైనది. (స.ప్ర. 9వ సము) ॥38॥

ఇది మనుకృతం-ప్రామాణికం

యేన యాంస్తు గుణేనైషాం సంసారాన్ ప్రతిపద్యతే । మూలశ్లోక సం. **23**
తాన్ సమాసేన వక్ష్యామి సర్వస్యాస్య యథాక్రమమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **39**

టీక:-ఏషాం = ఈ మూడు గుణాలలో, **యేన గుణేన** = ఏ గుణం ద్వారా, **యః తు** = ఏ మనుజుడు, **సంసారాన్ ప్రతి పద్యతే** = ఈ ప్రపంచంలో ఏ గతని (జన్మను) పొందుతాడో, **తాన్** = వాటినన్నింటిని, **అస్య సర్వస్య యథాక్రమమ్ సమాసేన వక్ష్యామి** = సమస్త సంసారక్రమమును సంక్షేపంగా వివరిస్తాను. మూడు గుణాల ఆధారంగా మూడు గతులు (జన్మలు).

ఋషి దయానంద భాష్యం:- పైన చెప్పబడిన రీతిగా-దేని మూలాన జీవుడు తిరిగి తిరిగి ఏయే జన్మలను పొందుతాడన్నది అతడికి ఆయా గుణకర్మ విభాగరీత్యా సంక్రమిస్తుందన్న విషయాన్ని సంక్షిప్తంగా వివరిస్తాను. ఈ మూడు గుణాల ఆధారంగానే మూడు గతులు- జన్మలు. (స.ప్ర. 9వ సము) ॥39॥

మూడు గుణాల ఆధారంపై మూడు గతులు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

దేవత్వం సాత్వికా యాంతి మనుష్యత్వం చ రాజసాః । మూలశ్లోక సం. **24**
తిర్యక్త్వం తామసా నిత్యమిత్యేషా త్రివిధా గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **40**

టీక:- సాత్త్వికాః దేవత్వమ్ = సత్త్వ గుణం గలవారు దేవతల జన్మను అంటే విద్వాంసులు , **రాజసాః మనుష్యత్వం** = రజో గుణం కలవారు మనుష్య జన్మను, **చ** = మరియు, **తామసాః తిర్యక్త్వం** = తమోగుణం కలవారు నీచగతిని, అంటే (పశుపక్షి జన్మను పొందుతారు.) **ఇతి ఏషా త్రివిధాగతిః** = ఈ విధంగా మూడు రకాలుగా జన్మలు లభిస్తాయి.

ఋషి దయానందభాష్యం:- ఎవరు సత్త్వగుణం మీదే దృష్టి నిల్పుతారో (ఆచరిస్తారో) వారు దేవత్వం పొందుతారు. రజోగుణం మీద నిలకడగలవారు తిరిగి మానుషజన్మ; తమోగుణమందు ఇష్టులు జంతుపక్షిజన్మలు పొందుతారు. (స.ప్ర. 9వ సము.) ॥40॥

వివరణ:

దేవ శబ్దార్థమును గురించి, అలాగే దేవ కోటికి చెందిన వ్యక్తులను గురించి విస్తృతంగా తెలియడానికి 2-151వ శ్లోకంలోని వివరణ చూడగలరు.

మూడు గతుల (జన్మల) యొక్క కర్మ-విద్యను బట్టి మూడు గౌణగతులు

ఇది మనుకృతం-ప్రామాణికం

త్రివిధా త్రివిధైషాం తు విజ్ఞేయా గౌణికీ గతిః । మూలశ్లోక సం. **25**
అధమా మధ్యమాఽగ్ర్యా చ కర్మవిద్యా విశేషతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **41**

టీక:- ఏషా త్రివిధా = ఈ మూడు విధాలైన, (సత్త్వ-రజ-తమో గతులు), **కర్మ-విద్యా విశేషతః** = కర్మ, విద్యా విశేషాల నాధారంగా చేసికొని ప్రత్యేక గతికి, **అధమా-మధ్యమా చ అగ్ర్యా** = అధమం, మధ్యమం మరియు ఉత్తమం అనే భేదాలతో, **త్రివిధా గౌణికీ గతిః విజ్ఞేయా** = ఈ మూడు రకాలైన గౌణగతులు ఉంటాయి.

మూడు గతులకు-మూడు మూడు భేదాలు, తదనుసారంగా జన్మావస్థల ఫలితాలు.

తాత్పర్యం:- ఈ ప్రకారం కలిగే జన్మలు దేశకాలాది భేదం చేతను, (భౌతిక ప్రపంచ కారణమైన కర్మభేదం చేతను) జ్ఞానభేదం చేతను అధమ, మధ్యమ, ఉత్తమ స్థాయి భేదం చేతను తిరిగి 3 రకాలుగా ఉంటాయి. ॥41॥

తామస గతులకు మూడు భేదాలు -

ఇది మనుకృతం-ప్రామాణికం

స్థావరాః క్రిమికీటాశ్చ మత్స్యాస్సర్పాశ్చ కచ్ఛపాః । మూలశ్లోక సం.**26**
పశవశ్చ మృగాశ్చైవ జఘన్యా తామసీ గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**42**

టీక:- జఘన్యా తామసీ గతిః = అత్యంత తమోగుణం గలవారు, **స్థావరాః** = స్థావరములు కదలనివి వృక్షాదిగతులు (జన్మలు) 1.46-49 **క్రిమికీటాః మత్స్యాః సర్పాః కచ్ఛపాః పశవశ్చ మృగాః** = క్రిములు సూక్ష్మమైన (పురుగులు) కీటకాలు, (కొంచెం పెద్ద పురుగులు), మత్స్యాలు (చేపలు), **సర్పాః** = సర్పాలు (పాములు), తాబేళ్ళు, పశువులు, మృగాలు ఇవన్నీ కూడా నీచ జన్మలు.

ఋషి దయానందభాష్యం: తమోగుణజన్మములు: అత్యంత తమో గుణం గల జీవులు చెట్లు మొదలైన స్థావరాలు, సూక్ష్మజీవుల క్రిములు, కీటకాలు, మత్స్యాలు, సర్పాలు, తాబేళ్లు, పశువులు, మృగాలుగా జన్మిస్తాయి. ఇవి నీచ జన్మములు. (స.ప్ర.9వ సము.) ॥42॥

ఇది మనుకృతం-ప్రామాణికం

హస్తినశ్చ తురంగాశ్చ శూద్రా మ్లేచ్ఛాశ్చ గర్హితాః । మూలశ్లోక సం.**27**
సింహా వ్యాఘ్రా వరాహాశ్చ మధ్యమా తామసీ గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**43**

టీక:- మధ్యమా తామసీగతిః = మధ్యమ తమో గుణాలు కలిగినవారు, **హస్తినః తురంగాః** = ఏనుగులు, గుర్రాలు, **శూద్రాః మ్లేచ్ఛాః గర్హితాః** = శూద్రులు, మ్లేచ్ఛులు, నిందిత కర్మలు చేసేవారు, **సింహాః వ్యాఘ్రాః వరాహాః** = సింహాలు, వ్యాఘ్రములు (పులులు), పందులు- ఈ జన్మలను పొందుతారు.

ఋషి దయానందభాష్యం:- ఏనుగులు, గుర్రాలు, పెద్దపులులు, సింహాలు, శూద్రులు, మ్లేచ్ఛులు తమోగుణం వల్ల కలిగిన మధ్యమ జన్మములు. (స.ప్ర.9వ సము.) ॥43॥

ఇది మనుకృతం-ప్రామాణికం

చారణాశ్చ సుపర్ణాశ్చ పురుషాశ్చైవ దాంభికాః । మూలశ్లోక సం.**28**
రక్షాంసి చ పిశాచాశ్చ తామసీషూత్తమా గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**44**

టీక:- తామసీషు ఉత్తమా గతిః = ఉత్తమ తమోగుణం కలవారు, **చారణాః సుపర్ణాః దాంభికాః పురుషాః** = చారణులు (భట్రాజులు-పద్యాలు మొ॥ చదువుతూ, ప్రజలను ప్రశంసిస్తూ, యాచించేవారు), **సుపర్ణాః** = సుందర పక్షులు, **దాంభికాః** = ఆత్మ ప్రశంసకులు, **రక్షాంసి పిశాచాః** = రాక్షసులు (హింసకులు), **పిశాచులు** = అనాచారులు, మద్యం మొ॥ తాగి మలినంగా ఉండేవారు-వీరందరూ ఉత్తమ తమోగుణ సంజాతులు.

ఋషి దయానంద భాష్యం:- ఉత్తమ తమోగుణం కలవారు కవిత్వం చెప్పి మానవులను స్తుతిస్తూ చారణులుగాను, అందమైన పక్షులుగాను, తమ సుఖానికై తమను తామే ప్రశంసించుకొనే డాంబికులుగాను, హింసించెడు రాక్షసులుగాను, పిశాచులుగాను, మత్తు పదార్థాలను సేవించే అనాచారులుగాను, అపవిత్రులుగాను జన్మిస్తారు. ఇవి అన్నీ ఉత్తమ తమోగుణకర్మల ఫలితం. (స.ప్ర.9వ సము.) ॥44॥

రాజోగుణ గతుల వారిలో మూడు భేదాలు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఝల్లా మల్లా నటాశ్చైవ పురుషాశ్శస్త్రవృత్తయః । మూలశ్లోక సం. 29
ద్యూతపాన ప్రసక్తాశ్చ జఘన్యా రాజసీ గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 45

టీక:- **జఘన్యా రాజసీగతిః** = అధమ రజోగుణం గలవారు, **ఝల్లాః** = కత్తులతో యుద్ధం చేసే ఝల్లులు లేదా గడ్డపారతో భూమిని త్రవ్వేవారు, **మల్లాః** = నౌకలను నడిపేవారు. (లేదా బాహు యుద్ధం చేసే మల్లులు), **నటాః** = నటులు. నాట్యం చేసేవారు లేదా గడ ఎక్కి విన్యాసాలు చేసేవారు, **శస్త్ర వృత్తయః పురుషాః** = శస్త్రధారులైన పురుషులు మరియు, **ద్యూత పాన ప్రసక్తాః చ** = మరియు, తాగుబోతులు, జూదరులు ఇలాంటి జన్మలు నీచమైన రజోగుణానికి ఫలాలు.

ఋషి దయానందభాష్యం:- అత్యంత రజోగుణం కలవారు ఝల్ల = ఖడ్గాలతో సంహరించేవారుగా; గడ్డపారతో త్రవ్వి జీవించేవారుగా, మల్ల = నౌకలను నడుపువారుగా, నట = నాట్యంచేసే దొమ్మరులుగా, శస్త్రదారులుగా, భృత్యులుగా, మద్యపానాసక్తులుగా జన్మిస్తారు. ఇలాంటి జన్మలు నీచమైన రజోగుణ ఫలితం. ॥45॥

ఇది మనుకృతం-ప్రామాణికం

రాజానః క్షత్రియాశ్చైవ రాజ్ఞాం చైవ పురోహితాః । మూలశ్లోక సం. 30
వాదయుద్ధప్రధానాశ్చ మధ్యమా రాజసీ గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 46

టీక:- **మధ్యమా రాజసీ గతిః** = మధ్యమ రజోగుణాత్ములైనవారు, **రాజానః** = క్షత్రియులు గాను, **రాజ్ఞాం పురోహితాః** = రాజులకు పురోహితులుగాను, **వా యుద్ధ ప్రధానాః** = వాద వివాదాలు చేసే న్యాయవాదులు లేదా వకీళ్ళు బారిష్టర్ గాను, యుద్ధ విభాగాధ్యక్షులు గాను జన్మిస్తారు.

ఋషి దయానందభాష్యం:- మధ్యమ రజోగుణం కలవారు రాజులుగా, క్షత్రియులైన రాజులయొక్క పురోహితులుగా, వాద వివాదాలు చేసేవారిగా, దూతలుగా, న్యాయవాదులుగా, యుద్ధవిభాగానికి అధ్యక్షులుగా జన్మిస్తారు. (స.ప్ర.9వ సము.) ॥46॥

ఇది మనుకృతం-ప్రామాణికం

గంధర్వా గుహ్యకా యక్షా విబుధానుచరాశ్చ యే । మూలశ్లోక సం. 31
తథైవాప్సరసాస్సర్వా రాజసీషూత్తమా గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. 47

టీక:- **రాజసీషు ఉత్తమాగతిః** = ఉత్తమ రజోగుణం కలవారు, **గంధర్వాః** = గాయకులు, **గుహ్యకులు** = వాయిద్యమును వాయించేవారు, **యక్షాః** = ధనాఢ్యులు, **విబుధాః అనుచరాః** = విద్వాంసుల సేవకులు, **తథా+ఏవ సర్వాః అప్సరసః** = ఉత్తమ రూపసౌందర్యం గలవారుగా జన్మిస్తారు.

ఋషి దయానందభాష్యం:- ఉత్తమ రజోగుణం కలవారు, గంధర్వులుగా = గానంచేసేవారుగా, గుహ్యకులు = వాయిద్యాలు వాయించేవారుగా, యక్షులు = ధనాఢ్యులుగా, విద్వాంసులను సేవించేవారుగా, అప్సరసలు = ఉత్తమ రూపం గల స్త్రీలుగా జన్మిస్తారు.(స.ప్ర.9వ సము.) ॥47॥

వివరణ:

గంధర్వ శబ్దాన్ని గురించి విస్తృత ప్రమాణాత్మకమైన వివేచనం 3.32 వివరణ చూడగలరు.

సాత్త్విక గతుల మూడు భేదాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

తాపసా యతయో విప్రా యే చ వైమానికా గణాః । మూలశ్లోక సం. **32**
నక్షత్రాణి చ దైత్యాశ్చ ప్రథమా సాత్త్వికీ గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **48**

టీక:- **తాపసాః** = తపస్సంపన్నులు, **యతయః** = సన్యాసులు, **విప్రాః** = వేదపాఠకులు, **వైమానికా గణాః** = విమానం నడిపేవారు, **నక్షత్రాణి** = జ్యోతిష్కులు, విజ్ఞానం కలవారు, **చ** = మరియు, **దైత్యాః** = దేహపోషకులైన మనుషులు. వీరందరూ, **ప్రథమా సాత్త్వికీ గతిః** = ప్రథమ సత్త్వ గుణకర్మ ఫలితంగా జన్మిస్తారు.

ఋషి దయానంద భాష్యం:- ప్రథమ సత్త్వగుణం కలవారు తాపసికులుగా, యతులుగా, సన్న్యాసులుగా, వేదపాఠకులుగా, విమానచోదకులుగా, జ్యోతిష్యులుగా, దేహపోషణపరులైన మానవులుగా జన్మిస్తారు. ఈ జన్మలన్నీ ప్రథమ సత్త్వగుణకర్మల ఫలితమని తెలియాలి. (స.ప్ర 9వ సము.) ॥48॥

వివరణ:

48వ శ్లోకానికి ప్రచలితమైన అర్థం సరియైనది కాదు. టీకాకారులు ఈ శ్లోకమందున్న 'నక్షత్ర' శబ్దానికి **'జపనక్షత్ర'**మని వ్యాఖ్యచేశారు. ఇది మను మహర్షికి సమ్మతం కాదు. (12.23,25,35,37,40,51) శ్లోకాలననుసరించి, ఈ శ్లోకాలలో జీవుడి యొక్క (గతులు) జన్మలను నిరూపించారు. అవి జడ పదార్థాలు. అందువల్ల ఈ అర్థం సరిగాదు. ఇక్కడ ఉదహరించిన అర్థం లాక్షణికం **"జ్యోతిషి"** అంటే నక్షత్ర విజ్ఞాన వేత్త అని అర్థం. ఇది మను సమ్మతం. ఇక్కడ లక్షణాశబ్ద శక్తి వల్ల ఈ అర్థం నిష్పన్నమవుతుంది.

ఇది మనుకృతం-ప్రామాణికం

యజ్వాన ఋషయో దేవా వేదా జ్యోతీంషి వత్సరాః । మూలశ్లోక సం. **33**
పితరశ్చైవ సాధ్యాశ్చ ద్వితీయా సాత్త్వికీ గతిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **49**

టీక:- **ద్వితీయా సాత్త్వికీ గతిః** = మధ్యమ సాత్త్విక గుణయుక్తులై కర్మచేసే జీవులకు ఈ కింది జన్మలు ప్రాప్తిస్తాయి. **యజ్వానః** = యజ్ఞకర్తలు, **ఋషయః దేవాః** = వేదార్థ విదులైన విద్వాంసులు, **వేదాః జ్యోతీంషి వత్సరాః** = వేదాలు విద్యుత్ మొ॥ విద్యా, కాలజ్ఞులు, **పితరః** = రక్షకులు, జ్ఞానులు, **చ** = మరియు, **సాధ్యాః** = సాధ్య కార్యసిద్ధి కోసం సేవించదగిన అధ్యాపకులుగా జన్మిస్తారు.

ఋషి దయానందభాష్యం:- మధ్యమ సత్త్వగుణంతో కూడిన కర్మలు చేసే జీవులు యజ్ఞకర్తలుగా, వేదార్థ విదులుగా, విద్వాంసులుగా, వేదాన్ని, విద్యుత్తును, కాలవిద్యను తెలిసినవారుగా, రక్షకులుగా, జ్ఞానులుగా, సాధ్యులు = కార్యసిద్ధికై యత్నించే అధ్యాపకులుగా జన్మిస్తారు. (స.ప్ర. 9వ సము) ॥49॥

వివరణ:

49వ శ్లోకానికి ప్రచలితమైన అర్థంలో అశుద్ధి (1) టీకాకారులు "జ్యోతీంషి" శబ్దానికి "ధృవ నక్షత్రాలు" మొ॥ అర్థాలు రాశారు. ఇది (12-23, 35, 37, 40,52) శ్లోకాల సంకేతానికి విరుద్ధం. జడ వస్తువులకు ఏ యోని విశేషముండదు. ఈ ప్రసంగమంతా జీవులు జన్మించే యోనులకు సంబంధించినది. వీటికి లాక్షణికమైన అర్థం "విద్యుత్" అన్ని విషయాలు తెలిసినవారు.

ఇది మనుకృతం-ప్రామాణికం

బ్రహ్మా విశ్వసృజో ధర్మో మహానవ్యక్తమేవ చ । మూలశ్లోక సం. **34**
ఉత్తమాం సాత్త్వికీమేతాం గతిమాహుర్మనీషిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **50**

టీక:- ఉత్తమాం సాత్త్వికీం గతిమ్ = ఉత్తమ సత్త్వగుణయుక్తులై ఉత్తమ కర్మలు చేసేవారు, **బ్రహ్మా** = సర్వవేదవేత్త, **విశ్వసృజః** = విశ్వసృజ సమస్త సృష్టిక్రమ విద్య తెలిసి, వివిధ విమానాది యానములను నిర్మించేవారు, **ధర్మః** = ధార్మికులు, **మహాన్ చ అవ్యక్తమ్ + ఏవ** = సర్వోత్తమ బుద్ధియుక్తమైన అవ్యక్త జన్మను, ప్రకృతి వశిత్వ సిద్ధిని పొందుతారు.

ఋషి దయానందభాష్యం:- ఉత్తమ సత్త్వగుణం కలవారై ఉత్తమ కర్మలను చేసేవారు బ్రహ్మా = సర్వవేదవేత్తగా, విశ్వసృజ = సమస్త సృష్టిక్రమ విద్యను తెలుసుకొని వివిధాలైన విమానాది యానాలను నిర్మించేవారుగా, ధార్మికులుగా, సర్వోత్తమ బుద్ధిగలవారుగా, అవ్యక్త జన్మనూ-ప్రకృతికార్యాన్ని తెలుసుకొని ప్రకృతిని వశపరచుకొంటారు.(స.ప్ర.9వ సము.) ॥50॥

వివరణ:

50వ శ్లోకానికి "అసంగతమైన" అర్థం.

1. ఈ శ్లోకానికి ఇప్పుడున్న అర్థం సరైనది కాదు:- ఈ శ్లోకంలో వాఖ్యాకారులు "బ్రహ్మా", "విశ్వసృజః" శబ్దాలకు మరీచి మొదలైనవారు బ్రహ్మ మొదలైన కొందరు వ్యక్తులని రాయడం మనుసమ్మతం కాదు. ఇక్కడ చతుర్ముఖ బ్రహ్మ కల్పన నిరాధారం. ఇదే విధంగా మరీచి మొ॥వారు కూడా విశ్వసృజులు కారు.

సృష్టిస్రష్ట కేవలం ఈశ్వరుడు (1.6, 14,15, 19, 22, 33) వివరణ చూడగలరు. ఈ శబ్దాలకు అర్థం (బ్రహ్మా) సర్వవేదవేత్త (విశ్వసృజః) = సర్వ సృష్టిని తెలిసికొని, వివిధాలైన విమానాది యానములను నిర్మించేవారు. ఈ అర్థమే సంగతమైనది. ఇదే విధంగా ధర్మ మహాన్ మరియు అవ్యక్త-ఇవన్నీ అమూర్తములు, జడ పదార్థాలు. వీటికి ఏ యోని విశేషం లేదు. ఇక్కడ కేవలం జీవుల జన్మలకు సంబంధించిన యోనుల వర్ణన మాత్రమే. అందువల్ల ఈ శబ్దాలకు లాక్షణికమైన అర్థమే (లక్ష్యార్థమే) సంగతం.

2. ప్రకృతి వశిత్వ సిద్ధి వివేచనం-అవ్యక్తమంటే మూలప్రకృతి. అవ్యక్త శబ్దానికి అభిప్రాయమేమంటే, ప్రకృతి వశిత్వ సిద్ధిని సాధించిన యోగిపుంగవులు. అలాంటి యోగులు ఉత్తమ సాత్త్విక జన్మను పొందుతారు. ప్రకృతి వశిత్వ సిద్ధి వర్ణన యోగశాస్త్రంలో కనిపిస్తోంది. **'తతో మనోజవిత్వం వికరణభావః ప్రధాన జయశ్చ'** విభూతి యోగం-48. అంటే ఇంద్రియజయం సిద్ధించగా, మళ్ళీ, ఇంద్రియాల యొక్క విషయగ్రహణ శక్తిలో సంయమం చేయగా యోగికి 3 సిద్ధులు ప్రాప్తిస్తాయి. 1) మనస్సుతో సమానంగా, ఇంద్రియాలలో గతిశీలత (స్ఫూర్తి) కలుగుతుంది. 2) శరీరాపేక్ష లేకుండానే సూక్ష్మములు, దూరస్థ విషయాల జ్ఞానం సిద్ధిస్తుంది.

3. ప్రధాన జయం = ప్రకృతి వికారాలను వశపరచుకోవడం. ఈ మూడు సిద్ధులు. యోగికి ప్రాప్తిస్తాయి.

ప్రధాన జయమే ప్రకృతివశిత్వ సిద్ధి. ఈ సిద్ధి కలిగిన తరవాత యోగిని ప్రాకృతిక వికారాలు బాధించజాలవు. అందువల్ల యోగికి ప్రకృతి వికారాలు వశపడగా, తనకార్యాన్ని స్వతంత్రంగా నిర్వహించుకోగలడు. ఈ సిద్ధికే **'మధుప్రతీకా'** అని పేరు. ఇదే మోక్షానందానికి ప్రతీకరూప సిద్ధి. దీని తరువాత యోగి మోక్షానంద ప్రాప్తి స్థితికి చేరుతాడు.

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏష సర్వస్సముద్దిష్ట స్త్రిప్రకారస్య కర్మణః । మూలశ్లోక సం. **35**
త్రివిధ స్త్రివిధః కృత్స్నః సంసారస్సార్వభౌతికః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **51**

టీక:- త్రిప్రకారస్య కర్మణః = మనః - వచన శరీర భేదాలతో త్రివిధాలైన కర్మ యొక్క, **త్రివిధః** = సత్త్వగుణం, రజోగుణం మరియు తమోగుణం పేరు గల త్రివిధ ఫలితాలు అలాగే, **త్రివిధః** = మళ్ళీ వాటిలో ఉత్తమ, మధ్యమ అధమ అనే భేదాలతో మూడు మూడు గతులు (జన్మలు) కలిగిన, **సార్వభౌమికః కృత్స్నః సంసారః** = సర్వభూత (ప్రాణి) యొక్క సంసారం (ప్రపంచం యొక్క ఉత్పత్తికి సంబంధించిన), **ఏషః సర్వః సముద్దిష్టః** = పూర్ణంగా వర్ణన చేయబడింది.

ఋషి దయానందభాష్యం:- త్రిగుణాత్మక-మనోవాక్కాయ భేదాల-శుభాశుభ కర్మల ప్రకారం 9 రకాల(3×3) ఉత్తమమధ్యమ అధమ స్థాయి ప్రాణి ప్రపంచం వివరించబడింది. ఇతరమైనవి ఈ విధంగా ఉండగలవు. (స.ప్ర. 9వ సము) ॥51॥

అధర్మాచరణవల్ల దుఃఖరూప జన్మల ప్రాప్తి- ఇది మనుకృతం-ప్రామాణికం

ఇంద్రియాణాం ప్రసంగేన ధర్మస్యాసేవనేన చ । మూలశ్లోక సం. **36**
పాపాన్ సంయాంతి సంసారానవిద్వాంసో నరాధమాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **52**

టీక:- **ఇంద్రియాణాం ప్రసంగేన** = ఇంద్రియాలకు వశుడైన విషయీ, **ధర్మస్య అసేవనేన** = ధర్మాన్ని వదిలి అధర్మాన్నాచరించేవారు, **అవిద్వాంసః** = అవిద్వాంసులు, **నరాధమాః పాపాన్ సంసారాన్ సంయాన్తి** = వారు మనుషులలో జన్మలెత్తుతారు. దుఃఖరూప జన్మనెత్తి నరకమనుభవిస్తారు.

ఋషి దయానంద భాష్యం:- ఇంద్రియాలకు వశులై విషయాసక్తి కలవారు ధర్మాన్ని వీడి అధర్మాన్ని ఆచరించే అవిద్వాంసులైనవారు నీచమానవ జన్మలను, అత్యంత అధిక దుఃఖరూప జన్మలను పొందుతారు.

ఈ విధంగా సత్త్వ రజ స్తమోగుణాల వేగంవలన ఏయే కర్మలను జీవుడు చేస్తాడో వానికి తగిన ఫలితాలను పొందుతాడు. కాబట్టి ముక్తిని కోరువారు అంటే గుణాల స్వభావాలలో చిక్కుకొనక గుణాతీతులై, మహాయోగులై ముక్తికొరకు ప్రయత్నించాలి. (స.ప్ర. 9వ సము.) ॥52॥

53 నుండి 72వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

* కర్మల ప్రకారం జీవికి జన్మల ప్రాప్తి -

* ***యాం యాం యోనిం తు జీవోఽయం యేన యేనేహ కర్మణా ।***
క్రమశో యాతి లోకేఽస్మింస్తత్తత్సర్వం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***53***

తాత్పర్యం:- తాము చేసే ఆయా కర్మల వల్ల పుట్టే జన్మల గురించి ప్రస్తుతం వివరించబడుతుంది. ॥53॥

* ***బహూన్ వర్షగణాన్ ఘోరాన్నరకాన్ ప్రాప్య తత్క్షయాత్ ।***
సంసారాన్ ప్రతి పద్యంతే మహాపాతకినస్త్విమాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***54***

తాత్పర్యం:- బ్రహ్మహత్యాది మహాపాపాలు చేసినవారు వేనవేల ఏళ్లు క్రూరనరకాలలో పడి, అప్పటికీ ఆ పాపం తీరక ఈ కింది జన్మలు పొందుతారు. ॥54॥

* ***శ్వసూకరఖరోష్ట్రాణాం గోజావిమృగపక్షిణామ్ ।***
చండాలపుక్కసానాం చ బ్రహ్మహా యోనిమృచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***55***

తాత్పర్యం:- పాపశేషం యొక్క ఎక్కువ తక్కువలను బట్టి-కుక్క, గొర్రె, మృగం పక్షిజాతులు, బోయ-ఛండాల జాతులలో జన్మ కలుగుతాయి. ఈ జన్మలకు మూలకారణం-బ్రహ్మహత్యాపాతక శేషమే! ॥55॥

* ***క్రిమికీటపతంగానాం విడ్భుజాం చైవ పక్షిణామ్ ।***
హింస్రాణాం చైవ సత్త్వానాం సురాపో బ్రాహ్మణో వ్రజేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***56***

తాత్పర్యం:- బ్రాహ్మణుడు మద్యపానం చేస్తే క్రిమికీటకాలు, మిడతలు, మలభక్షక ప్రాణులు, పులుల వంటి క్రూర మృగాల జన్మ ఎత్తవలసి వస్తుంది. ॥56॥

* *లూతాహిసరటానాం చ తిరశ్చాం చాంబుచారిణామ్ ।*
హింస్రానాం చ పిశాచానాం స్తేనో విప్రస్సహస్రశః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **57**

తాత్పర్యం:- బంగారాన్ని దొంగిలించిన వాడికి పాము, సాలీడు, తొండ, నీటి పక్షులు, క్రూర జంతువుల జన్మ ప్రాప్తిస్తుంది. ॥57॥

* *తృణగుల్మలతానాం చ క్రవ్యాదాం దంష్ట్రిణామపి ।*
క్రూరకర్మకృతాం చైవ శతశో గురుతల్పగః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **58**

తాత్పర్యం:- గురువు భార్యతో రమించిన వాడికి కసవు, పొదలు, తీగలు, పచ్చిమాంసం తినే గ్రద్ద, పులులు-సింహాల జన్మ కలుగుతాయి. ॥58॥

* *హింస్రా భవంతి క్రవ్యాద్యాః కృమయోఽభక్ష్యభక్షిణః ।*
పరస్పరాదినః స్తేనాః ప్రేతాంత్యస్త్రీనిషేవిణః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **59**

తాత్పర్యం:- జీవులను చంపడమే వృత్తిగా గలవారికి పిల్లులు, క్రిములు జన్మమేగతి. పాతకులు-చోరులు ఒకరిమాంసాన్నొకరు తినే జన్మ ఎత్తుతారు. చండాలాది స్త్రీలను కూడినవారు ప్రేతలుగా జన్మిస్తారు. ॥59॥

* *సంయోగం పతితైర్గత్వా పరస్యైవ చ యోషితమ్ ।*
అపహృత్య చ విప్రస్వం భవతి బ్రహ్మరాక్షసః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **60**

తాత్పర్యం:- పతితులతో-భ్రష్టులతో సంయోగం, పరస్త్రీ వాంఛ లాంటి పాపాలకు బ్రహ్మరాక్షస జన్మ తథ్యం.॥60॥

* *మణిముక్తా ప్రవాళాని హృత్వా లోభేన మానవః ।*
వివిధాని చ రత్నాని జాయతే హేమకర్తృషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **61**

తాత్పర్యం:- రత్నాలు, ముత్యాలు, పగడాలు మొదలైనవి తనవిగా చేసుకోవాలన్న తపనతో మోసానికి పాల్పడేవాడు కంసాలి జాతిలో పుడతాడు. లోభం చేత ఈ జన్మ ప్రాప్తిస్తుంది. ॥61॥

* *ధాన్యం హృత్వా భవత్యాఖుః కాంస్యం హంసో జలం ప్లవః ।*
మధు దంశః పయః కాకో రసం శ్వాసకులో ఘృతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **62**

తాత్పర్యం:- ధాన్యాన్ని దొంగిలిస్తే ఎలుకగా, కంచు దొంగిలిస్తే హంసగా, నీటిని చౌర్యంచేస్తే బెగ్గురు పక్షిగా, తేనె దొంగిలిస్తే ఈగగా, పాలు చౌర్యం చేస్తే కాకిగా, చెరుకురసం దొంగిలిస్తే కుక్కగా, నేతిని చౌర్యం చేస్తే ముంగిసగా జన్మిస్తారు. ॥62॥

* *మాంసం గృధ్రో వపాం మద్గుస్తైలం తైలపకః ఖగః ।*
చీరీవాకస్తు లవణం బలాకా శకునిర్దధి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **63**

తాత్పర్యం:- మాంసం దొంగిలిస్తే గ్రద్ధగా, వప దొంగిలిస్తే నీటికాకిగా, నూనె దొంగిలిస్తే గబ్బిలంగా, ఉప్పు దొంగిలిస్తే గాజుపురుగుగా, పెరుగుచౌర్యం చేస్తే కొక్కెరగా జన్మిస్తారు. ॥63॥

* *కౌశేయం తిత్తిరిర్హృత్వా క్షౌమం హృత్వా తు దర్దురః ।*
కార్పాసతాంతవం క్రౌంచో గోధా గాం వాగ్గుదో గుడమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **64**

తాత్పర్యం:- పట్టుబట్ట చౌర్యానికి తిత్తిరిపిట్టగా, నారబట్ట అయితే కప్పగా, నేత బట్ట అయితే కొంగగా, గోవును దొంగిలిస్తే ఉడుం, బెల్లం చౌర్యం పక్షి జన్మకు కారణం. ॥64॥

* *ఛుచ్ఛుందరిశ్శుభాన్ గంధాన్ పత్రశాకం తు బర్హిణః ।*
శ్వావిత్కృతాన్నం వివిధమకృతాన్నం తు శల్యకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **65**

తాత్పర్యం:- సుగంధ ద్రవ్యాలను హరిస్తే చుంచుగా, పత్రశాకాలు (ఆకుకూరలు) అయితే నెమలిగా, అన్నం-పిండి మొదలయినవైతే ముళ్ల పందిగా, బియ్యం-పప్పు-కూరలు దొంగిలిస్తే శల్యమృగంగా జన్మిస్తారు. ॥65॥

* *బకో భవతి హృత్వాగ్నిం గృహకారీ హ్యుపస్కరమ్ ।*
రక్తాని హృత్వా వాసాంసి జాయతే జీవజీవకః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **66**

తాత్పర్యం:- అగ్నిని దొంగిలిస్తే కొంగగా, చేట-రోకలి మొదలైన వస్తువులను దొంగిలిస్తే గోడల్ని తొలిచే పురుగుగా, రంగు వస్త్రాలను దొంగిలిస్తే వెన్నెలపురుగుగా జన్మిస్తారు. ॥66॥

* *వృకో మృగేభం వ్యాఘ్రోఽశ్వం ఫలమూలం తు మర్కటః ।*
స్త్రీమృక్షః స్తోకకో వారి యానాన్యుష్ట్రః పశూనజః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **67**

తాత్పర్యం:- ఏనుగు, జింకలను దొంగిలిస్తే తోడేలుగా, గుర్రాన్ని దొంగిలిస్తే పులిగా, పండ్లు-దుంపలు హరిస్తే కోతిగా, స్త్రీలను ఎత్తుకుపోతే ఎలుగుబంటిగా, నీటిని అపహరిస్తే చాతక పక్షిగా, బండి దొంగిలిస్తే ఒంటెగా, ఇతర పశువులను దొంగిలిస్తే పొట్టేలుగా జన్మిస్తారు. ॥67॥

* *యద్వా తద్వా పరద్రవ్య మపహృత్య బలాన్నరః ।*
అవశ్యం యాతి తిర్యక్త్వం జగ్ధ్వా చైవాహుతం హవిః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **68**

తాత్పర్యం:- ఎలాంటిదైనా సరే-ఇతరులకు చెందిన ద్రవ్యం అపహరిస్తే, అలాగే హోమం చెయ్యనిపురోడాశం మొదలైనవి హవిస్సులను ఆరగిస్తే జంతుజాలంలో ఏదో ఒక జన్మ కలుగుతుంది. ॥68॥

* *స్త్రియోఽప్యేతేన కల్పేన హృత్వా దోషమవాప్నుయుః ।*
ఏతేషామేవ జంతూనాం భార్యాత్వముపయాంతి తాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **69**

తాత్పర్యం:- స్త్రీలైనాసరే-ఈవిధంగా బుద్ధిపూర్వకంగా పరులసొమ్ము హరిస్తే పాపం పొంది, పైన చెప్పిన జంతుజన్ములకు భార్యగా ఆ జంతువు రూపంలోనే జన్మిస్తారు. ॥69॥

* *స్వేభ్యస్స్వేభ్యస్తు కర్మభ్యశ్చ్యుతా వర్ణా హ్యనాపది ।*
*పాపాన్ సంసృత్య సంసారాన్ ప్రేష్యతాం యాంతి శత్రుషు ॥*ప్రక్షిప్త శ్లోక సం. **70**

తాత్పర్యం:- ఇలాంటి నిషేధపు పనులు చేయడం వల్ల, బ్రాహ్మణులయినా ఇతరులయినా, (ఆపదలేవీ కలుగనప్పుడు) సాంగోపాంగంగా చేయబడే పంచయజ్ఞాది విధులు నిర్వర్తించనప్పుడు నానా హీనజాతియోనులలోను జన్మిస్తారు. ॥70॥

* *వాంతాశ్యుల్కాముఖః ప్రేతో విప్రో ధర్మాత్స్వ కాచ్యుతః ।*
అమేధ్యకుణపాశీ చ క్షత్రియః కటపూతనః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***71***

తాత్పర్యం:- స్వకర్మాచరణ విస్మరించి చరించే విప్రుడికి జ్వాలాముఖప్రేత జన్మ ప్రాప్తిస్తుంది. ఇలాగే తన ధర్మాన్ని నిర్వర్తించని రాజులకు కటపూతనుడనే ప్రేతజన్మ కలుగుతుంది. ॥71॥

* *మైత్రాక్షజ్యోతికః ప్రేతో వైశ్యో భవతి పూయభుక్ ।*
చైలాశకశ్చ భవతి శూద్రో ధర్మాత్స్వ కాచ్యుతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***72***

తాత్పర్యం:- తనకు విహితమైన కర్మాచరణ చేయని వైశ్యుడికి మైత్రాక్షజ్యోతి అనే ప్రేతజన్మ వస్తుంది. చీలాశక ప్రేతమనే జన్మమెత్తగల శూద్రుడు స్వకర్మ భ్రష్టుడని చెప్పక్కర్లేరు. ॥72॥

ప్రక్షిప్తాల పరిశీలన

53 నుంచి 72 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలను అసురించి ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

ఈ శ్లోకాలు పూర్వాపర ప్రసంగ వ్యతిరేకాలు. 52లో ఇంద్రియాలను విషయాలలో మగ్నం చేయటం వల్ల పాపం వస్తుందన్నారు. 73లో అదే విషయాన్ని ముగిస్తూ 'విషయ వాంఛలున్నవారు వాటిని అనుభవిస్తున్న కొద్దీ వాటి పట్ల ఆసక్తి పెరుగుతుంది' అన్నారు. 74లో దీన్ని ముగించారు. ఇట్లా 51వ శ్లోకానికి, 73వ శ్లోకంతో ఏక వాక్యాత్మక సంబంధం ఉంది. మధ్యలో ఈ శ్లోకాలలోని కొత్త విషయం వల్ల ఆ వాక్యాత్మక ప్రసంగం భంగమైంది. ఇది ప్రాసంగికం కాదు కూడా.

2. అంతర్ వ్యతిరేకాలు

1. 39-51 శ్లోకాలలోని విషయం వల్ల 53-72లలోని విషయపద్ధతికి వ్యతిరేకంగా ఉంది. మునుపటి దాంట్లో సత్త్వ, రజో, తమో గుణాల ఆధిక్యం వల్ల జన్మల నిర్ణయం ఉంటుంది అని ఉంది. కానీ ఇక్కడ ఒక్కొక్క కర్మ ఆధారంగానే ఒక్కొక్క జన్మ కలుగుతుందనీ ఉంది.

2. మనువు ఒక కర్మ ఆధారంగానే ఏ జన్మా కలగదనీ, ఎన్నో జన్మల కర్మల ననుసరించేననీ చెప్పాడు(12.74).

3. ఈ ప్రసంగానికి ఆధార రూపమైన శ్లోకాలు 53, 54. వీటిలో జీవుని ద్వారా నరక లోకం లోనికి వెళతారని ఉంది. ఇది మనువు మౌలిక పద్ధతికి వ్యతిరేకం (చూడండి 4.87-91ల మీది అంతర్ వ్యతిరేకాలు సమీక్ష). ఇటువంటి అంతర్ వ్యతిరేకాల ఆధారంగా ఆధార భూత శ్లోకాలు ప్రక్షిప్తాలని రుజు వయ్యాక, వీటిని ఆధారం చేసుకున్న మిగిలిన (55-72) మొత్తం ప్రసంగమూ ప్రక్షిప్తమే !

ఇదే అంతర్ వ్యతిరేకం కిందికి వచ్చే ప్రేత జన్మల చర్చ ఉన్న 59, 71, 72 శ్లోకాలు కూడా ప్రక్షిప్తాలే! ఈ విధంగా అంతర్ వ్యతిరేకాల ఆధారంగా 53 నుంచి 72 వరకు గల శ్లోకాలున్న ఈ మొత్తం ప్రసంగమూ ప్రక్షిప్తమే!

3. శైలీగత ఆధారాలు

1. 53 నుంచి 72 వరకు శ్లోకాలున్న ఈ ప్రసంగపు శైలి సహేతుకం కానిదీ, నిరాధారమూ, నిందలు, అతిశయోక్తులతో నిండినదే కాక, పరోక్షంగా భయం కలిగిస్తూ ఉంది. మనువు శైలిలో ఇటువంటి ప్రవృత్తులు ఉండవు కనుక ఇది మనువు శైలి కాదు.

2. వర్ణన శైలి వల్లనూ ఇవి ఆ తర్వాతి కాలపు రచనలుగా తేలుతూంది. కొన్ని వర్ణనలకు మనువు వర్ణనలతో

పొంతనే లేదు. 53 నుంచి 72 వరకు గల ప్రసంగంలో 61వ శ్లోకంలో మణులు, ముత్యాలు (మొదలైన వస్తువులు దొంగిలించే వాడు కంసాలిగా పుడతాడని చెప్పారు. మనువు వర్ణ వ్యవస్థలో కంసాలులు అనే జాతే లేదు. [1.87-91]. బంగారం, మణులు, ముత్యాలు మొదలైన వాటి పని వైశ్యులదని చెప్పాడు. [6-329; 10.98,99. వీటిలో శిల్పకార్యం వైశ్యులది]. దీని వల్ల ఎవరో తర్వాతి కాలం వారు, రకరకాల జాతులు ప్రాచుర్యం లోనికి వచ్చిన తరువాత వీటిని రచించి కలిపేయటంతో పాటు, వాటికి సంబంధించిన ముందు వెనుకల ప్రసంగాల తోనూ కలిపారు. ఇట్లా ఈ ప్రసంగం తర్వాతి కాలపు ప్రక్షిప్త మవుతుంది.

3. 55-60 శ్లోకాలలో మహా పాతకులకు ఫలాన్ని చెప్పటం కూడా, దీని తర్వాతి కాలపుదనే సంకేతం లభిస్తుంది. ఎందుకంటే బ్రహ్మ హత్య, గురుపత్నీ సంగమం - వీటి వర్గీకరణ కూడా మౌలికం కాదు, తర్వాతిదే ! (చూడండి 11.54-190 శ్లోకాల మీది సమీక్ష).

73,74వ శ్లోకాలు మనుకృతం. ఇవి ప్రామాణికం

విషయ సేవనాలవల్ల పాపయోనుల ప్రాప్తి-

యథా యథా నిషేవంతే విషయాన్ విషయాత్మకాః । మూలశ్లోక సం. **37**
తథా తథా కుశలతా తేషాం తేషూపజాయతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **73**

టీక:- విషయాత్మికాః= విషయీ స్వభావం కలవారు, **యథా యథా విషయాన్ నిషేవన్తే** = విషయ సుఖాలననుభవించే కొద్దీ, **తథా తథా తేషు తేషామ్ కుశలతా జాయతే** = వారికి వాటి యందు ఆసక్తి అధికంగా పెరుగుతుంది.

తాత్పర్యం:- ఏయే విషయాలలో ఎంతెంతగా ఆశపడతారో (ఉదా:-కామాన్ని అనుభవించాలనే వారి తృష్ణ) వారికి ఆ యా ఇంద్రియ సుఖాభిలాషలోనే ప్రావీణ్యత వస్తుంది. ॥73॥

ఇది మనుకృతం-ప్రామాణికం

నిరాసక్తుల ప్రకారం ఫలప్రాప్తి -

తేఽభ్యాసాత్కర్మణాం తేషాం పాపానామల్పబుద్ధయః । మూలశ్లోక సం. **38**
సంప్రాప్నువంతి దుఃఖాని తాసు తాస్విహ యోనిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం. **74**

టీక:- మళ్ళీ, **తే అల్పబుద్ధయః** = అలాంటి మందబుద్ధులు, **తేషాం పాపానామ్ + అభ్యాసాత్** = అలాంటి పాపకర్మలను నిరంతరం ఆచరించడం వల్ల, ఆ పాపకర్మాభ్యాసం వల్ల, **తాసు తాసు యోనిషు** = పాప కర్మలు ప్రాప్తించే ఆయా పాపయోనులలో తిర్యగ్యోనులందు జన్మిస్తారు. జన్మించి, **ఇహ** = ఈ సంసారంలో, **దుఃఖాని ప్రాప్నువన్తి** = దుఃఖాలు అనుభవిస్తారు.

తాత్పర్యం:- నిరంతర కామసుఖాభిలాషులు, తమకు అలవడిన ప్రావీణ్యత-అనుభవ విశేషం చేత నీచం-అతినీచం-నీచాతినీచం అయిన జంతుజాలపు యోనులలో పుట్టి దుఃఖాలనుభవిస్తారు. ॥74॥

75-80వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

పాపులకు ప్రాప్తించు దుఃఖాలు -

* *తామిస్రాదిషు చోగ్రేషు నరకేషు వివర్తనమ్ ।*
అసిపత్రవనాదీని బంధనచ్ఛేదనాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. *75*

తాత్పర్యం:- తామిస్రం మొదలైన ఘోరనరకాలలో ఎంతోకాలం దుఃఖాలు అనుభవించినా తీరని పాపాలకు-అక్కడే ఉన్న అసిపత్ర వనం, ఛేదనం, బంధనం అనే ఇతర నరకాలలో శిక్షించబడతారు. ॥75॥

* *వివిధాశ్చైవ సంపీడాః కాకోలూకైశ్చ భక్షణమ్ ।*
కరంభవాలుకాతాపాన్ కుంభీపాకాంశ్చ దారుణాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***76***

తాత్పర్యం:- అక్కడా పలుబాధలు....కాకులు-గుడ్ల గూబలచే కరిపించబడటం, కాలిన ఇసుకతో పాటు వేగడం, పెద్దపెద్ద కాగులలో మరిగే నూనెలోకి త్రోయబడటం లాంటివి. ॥76॥

* *సంభవాంశ్చ వియోనీషు దుఃఖప్రాయాసు నిత్యశః ।*
శీతాతపాభిఘాతాంశ్చ వివిధాని భయాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***77***

తాత్పర్యం:- అప్పటికీ పాపశేషం హరించబడకపోగా, నిత్యదుఃఖదాయకమైన జంతుయోనులలో జన్మప్రాప్తిస్తుంది. చలి-ఎండ-వాన మొదలైన వాటిలోనే ఉండవలసి వస్తుంది. ॥77॥

* *అసకృద్గర్భవాసేషు వాసం జన్మ చ దారుణమ్ ।*
బంధనాని చ కాష్ఠాని పరప్రేష్యత్వమేవ చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***78***

తాత్పర్యం:- మాటిమాటికి నీచ జన్మప్రాప్తి, నానాయోనులలోను పలుమార్లు జన్మించడం, అల్పాయువు గల జంతుపక్షి జన్మలలో బంధనాలచేత (కట్టుత్రాళ్లు మొ॥నవి) చిక్కి ఉండటం లాంటి పీడలు కలుగుతాయి. పరదాస్యం తప్పని జంతుజన్మలూ (ఎద్దుమొ॥) తప్పవు. ॥78॥

* *బంధుప్రియవియోగాంశ్చ సం వాసం చైవ దుర్జనైః ।*
ద్రవ్యార్జనం చ నాశం చ మిత్రామిత్రస్య చార్జనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***79***

తాత్పర్యం:- అంతేగాక-బంధుమిత్రుల ఎడబాటు, దుర్జనులతో కలిసి వాసం చేయవలసి రావడం, ధన సంపాదనలో ఇక్కట్లు, ద్రవ్యం నష్టమవడం, మిత్రులేర్పడటం కష్టం కావడం, శత్రువులు సులభంగా తయారవడం వంటివీ పొందగలరు. ॥79॥

* *జరాం చైవాప్రతీకారాం వ్యాధిభిశ్చోపపీడనమ్ ।*
క్లేశాంశ్చ వివిధాంస్తాంస్తాన్మృత్యుమేవ చ దుర్జయమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***80***

తాత్పర్యం:- చికిత్స అనేదే లేని ముసలితనం ప్రాప్తించడం మానుషజన్మకు తప్పనిది. అయినప్పటికీ- పాపులకు అకాల వార్ధక్యం, అకాలమృత్యువు, రోగబాధ, ఆకలిదప్పులచేత బాధించబడటం అధికం. ॥80॥

ప్రక్షిప్తాల పరిశీలన

75 నుంచి 80 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. ప్రసంగ వ్యతిరేకాలు

1. పూర్వా పర ప్రసంగం మంచి చెడు కర్మలు ఆధారంగా సాధారణ ఫలితాలు చెప్తున్నది. 74వ శ్లోకానికీ, 91తో వాక్యగత పరస్పర సంబద్ధత కూడా కనబడుతూంది. 75-80లలో మళ్లీ విశేష దుఃఖాలు, జన్మలు పొందటం గురించి చెప్పటం పూర్వాపర ప్రసంగానికి వ్యతిరేకమే కాకుండా, దాన్ని భంగం చేస్తూంది కూడా.

2. 74కు 75 తోనూ, 80కి 81తోనూ పొంతన లేదు. ఈ ఆధారం కూడా వీటి ప్రసంగ భంజకతను, పూర్వాపర ప్రసంగ వ్యతిరేకతను రుజువు చేస్తూంది.

3. మంచి చెడు కర్మల ఫలాలు, గతులు మునుపటి 39-51 శ్లోకాలలో చెప్పడ మైంది. అది ముగిసి పోయాక, మళ్లీ దుఃఖ ప్రాప్తిని మొదలు పెట్టడం కూడా ఇది అసంగత మని తెలుస్తూంది. ఈ విధంగా ప్రసంగ విరోధాల ఆధారంగా ఈ శ్లోకాలు ప్రక్షిప్తాలు.

2. అంతర్ వ్యతిరేకాలు

1. ఇక్కడ 74లోని **"తాసు తాసు ఇహ యోనిషు"** అనే పాదం గమనించ దగింది. ఇందులో పాపాలు చేసేవారు, వాటిని అనుసరించి ఈ ప్రపంచంలో జన్మలు పొందుతారనీ, ఆయా జన్మల వివరాలు 39-51లలో చెప్పటం అయిపోయింది. ఇది ప్రక్షిప్తకారుని తెలివి తక్కువ తనానికి నిదర్శనం.

2. ఈ ప్రసంగానికి ఆధారశ్లోకం 75వది. ఇందులో తామిస్రం అసిపత్రవనం మొదలైన నరకాలు కలుగుతాయని ఉంది. నరకమనే లోకం ఉందనే సంగతే మనువు పద్ధతికి వ్యతిరేకం (దీనికి 4.87-91ల మీది సమీక్ష చూడండి). ఇది ప్రక్షిప్తం కనుక, దీనికి సంబంధించిన మిగిలిన వన్నీ కూడా ప్రక్షిప్తాలే. ఇట్లా అంతర్ వ్యతిరేకాలు ఉన్నందున ఈ మొత్తం ప్రసంగమే ప్రక్షిప్తం.

ఆసక్తి-అనాసక్తుల అనుసారం ఫలప్రాప్తి - 81 నుండి 83 శ్లోకాల వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

యాదృశేన తు భావేన యద్యత్కర్మ నిషేవతే । మూలశ్లోక సం. **39**
తాదృశేన శరీరేణ తత్తత్ఫలముపాశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **81**

టీక:- మనుషుడు,**యాదృశేన తు భావేన** = అంటే సద్భావనతో గాని లేదా దుర్భావనతో గాని, వాటిలో ఎలాంటి ఆసక్తి లేక నిరాసక్తి ఉంటుందో, దాన్ననుసరించి, **యత్ యత్ కర్మ నిషేవతే** = సత్కర్మ గానీ, దుష్ట కర్మను గానీ చేస్తాడో, **తాదృశేన శరీరేణ** = అలాంటి శరీరాన్ని పొంది, **తత్ తత్ ఫలం+ఉపాశ్నుతే** = అలాంటి కర్మ ఫలితాలనే అనుభవిస్తాడు.

తాత్పర్యం:- ఎలాంటి గుణాలవల్ల ఏ కర్మలను ఆచరిస్తారో, ఆయా రాజస తామస సాత్త్విక శరీరాలతో ఆయా పుణ్యపాపాలు అనుభవిస్తారు. ॥81॥

వివరణ:

ఈ శ్లోకార్థం గురించి సమాలోచన- ఈ శ్లోకార్థాన్ని తెలుసుకోవడానికి 6.80వ శ్లోకం సహాయకం.

"యథా భావేన భవతి సర్వభావేషు నిఃస్పృహః
తథా సుఖమవాప్నోతి ప్రేత్య చేహ చ శాశ్వతమ్ ॥ 6.52

ఎప్పుడు వ్యక్తి సర్వపదార్థాలలో తనకోసం తాను నిస్పృహుడవుతాడో అప్పుడు అతడు లౌకికం పారలౌకిక సుఖాలను పొందుతాడు. ఆ ఆధారంతోనే ఇక్కడ వర్ణించబడింది. ఎవడు ఎంత దృఢమైన ఆసక్తి (స్పృహ) తో లేదా అనాసక్తితో (నిఃస్పృహ) కర్మలను చేస్తాడో, అతడికి ఆ విధంగానే తక్కువగా గాని లేదా ఎక్కువగా గాని, మంచి-చెడు ఫలితాలు లభిస్తాయి.

నిశ్శ్రేయస్కర కర్మల వర్ణన - ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషః సర్వస్సముద్దిష్టః కర్మణాం వః ఫలోదయః । మూలశ్లోక సం. **40**
నిశ్శ్రేయసకరం కర్మ విప్రస్యేదం నిబోధత ॥ ప్రక్షిప్త శ్లోక సం. **82**

టీక:- ఏషః = ఇది (12.3-81), **కర్మణాం ఫలోదయః** = కర్మల ఫలప్రాప్తి, **సర్వః** = సంపూర్ణంగా, **వః సముద్దిష్టః** = మీకు తెలిపాను, **ఇప్పుడు విప్రస్య** = విద్వాంసులు లేదా బ్రాహ్మణాది ద్విజులకు, **నిఃశ్రేయసకరం కర్మ నిబోధత** = మోక్షదాయక కర్మలను వినండి.

తాత్పర్యం:- ఋషులారా! మీకు శాస్త్రం ఒప్పుకొన్నవీ- ఒప్పుకోనివి అయిన కర్మలు చేయడం వల్ల కలిగే ఫలితాలన్నీ చెప్పాను. ఇప్పుడు విద్వాంసులకు, ద్విజులకు మోక్షం కలిగే మార్గం వివరిస్తాను. ॥82॥

ఇది మనుకృతం-ప్రామాణికం

వేదాభ్యాసస్తపోజ్ఞానమింద్రియాణాం చ సంయమః । మూలశ్లోక సం. **41**
ధర్మక్రియాఽత్మచిన్తా చ నిశ్శ్రేయసకరం పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **83**

టీక:- వేదాభ్యాసః తపః, జ్ఞానం, ఇంద్రియాణాం సంయమః ధర్మక్రియా చ ఆత్మచిన్తా = వేదాభ్యాసం (12.94-103) **తథా, తపః** = వ్రత సాధన, (12.104) **జ్ఞానం** = సత్యవిద్యా ప్రాప్తి, (12.104) **ఇంద్రియాణం సంయమః** = (12.92), **ధర్మక్రియ** = ధర్మపాలన అదేవిధంగా యజ్ఞాది ధార్మిక క్రియానుష్ఠానం మరియు, **ఆత్మచిన్తా** = పరమాత్మ జ్ఞానం, ధ్యానం ఈ ఆరు, **నిఃశ్రేయసకరం పరమ్** = మోక్ష ప్రదానం చేసే సర్వోత్తమ కర్మలు.

తాత్పర్యం:- ఉపనిషదభ్యాసం, వాటి అర్థాలను తెలుసుకోవడం, కృచ్ఛ్రం ప్రాజాపత్యం మొదలైన తపస్సులు, బ్రహ్మజ్ఞానం, ఇంద్రియాలను అణచడం, శాస్త్రం అంగీకరించని హింసాచరణం వదలడం, గురుశుశ్రూష ఇవి ముఖ్య మోక్ష సాధనాలు. ॥83॥

వివరణ:

ఈ శ్లోకంలో పాఠభేదం ప్రక్షిప్తం:- ఈ శ్లోకంలో పాఠభేదముంది. ఇప్పుడు లభించే సంస్కరణలలో ఈ శ్లోకంలోని మూడో పాదంలో **"అహింసా గురుసేవా చ"** పాఠం లభిస్తుంది. ఇది మనుస్మృతికి అనురూపం కాదు. ఇక్కడ **"ధర్మక్రియాఽత్మచిన్తా చ"** పాఠమే ఉపయుక్తం. దీన్ని సమర్థించడానికి కింద ప్రమాణాలున్నాయి.

1. ఈ 83వ శ్లోకంలో నిఃశ్రేయసకర్మల పరిగణన ఉంది. పరిగణన తరువాత 6 కర్మలకు సంబంధించిన వ్యాఖ్య (85 నుండి 115వరకు) శ్లోకాలలో ఉంది. ఈ వ్యాఖ్యానంలో "అహింస లేదా గురుసేవ' ప్రస్తావనే లేదు. అయితే ఆత్మజ్ఞానం, ధర్మక్రియా ప్రస్తావన మాత్రమే ఉన్నది. శ్లోకార్థంలో ఆ యా వర్ణనకు సంబంధించిన శ్లోకాల సంఖ్య ఇవ్వబడింది.

2. **"సాత్త్విక కర్మలు నిఃశ్రేయసకరం"**లని మను మహర్షి అభిప్రాయం. ఈ శ్లోకంలో అన్యసర్వకర్మలన్నీ అవే కేవలం రెండు కర్మల విషయంలో పాఠభేదం చేయబడింది. సాత్త్విక కర్మల వర్ణన (12.31) ఉంది. అదే పాఠం ఇక్కడ తీసుకోవడం మనుసమ్మతం. ఎందుకంటే కర్మలే మనుమహర్షి దృష్టిలో సర్వశ్రేష్ఠములు. అవే ముక్తి దాయకాలవుతాయి. అందువల్ల ప్రస్తుత పాఠమే **'ధర్మక్రియాఽత్మచిన్తా చ'** ఉచితం.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

1. ఆత్మజ్ఞాన వర్ణన

* *సర్వేషామపి చైతేషాం శుభానామిహ కర్మణామ్ ।*
కించిచ్ఛ్రేయస్కరతరం కర్మోక్తం పురుషం ప్రతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***84***

తాత్పర్యం:- ఈ వేదాధ్యయనాదులు మొదలైన అన్ని సత్కర్మలలో ఏది పురుషులకు మోక్షసాధకం? అని ప్రశ్నించుకుంటే శ్రేష్ఠమైన కర్మ ఆత్మజ్ఞానమే అని తెలుస్తున్నది. ॥84॥

ప్రక్షిప్త పరిశీలన

84వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. ప్రసంగ వ్యతిరేకం

84వ శ్లోకంలోని **"సర్వేషాం అపి చైతేషాం"** పదాలతో ఇది 83కు సంబద్ధమైన శ్లోకమని తెలుస్తూంది. 83లోని ఆరు కర్మలు, 85లోని వాటన్నిటిలో శ్రేష్ఠమైనది ముందుగా చెప్పారు. దీని వల్ల ముందు వెనుకల శ్లోకాల సంబద్ధత భంగమవుతూంది. కనుక ఇది ప్రక్షిప్తం.

2. అంతర్ వ్యతిరేకం

ఈ శ్లోకంలోని విషయంతోనే ఇది పరస్పర వ్యతిరేకాలు గలదని తెలుస్తూంది. ఇందులోని ఆత్మ జ్ఞానాన్ని **"కించిత్ శ్రేయస్కరతర"** మైన కర్మగా చెప్పారు. తర్వాతి 75వ శ్లోకంలో **"ఆత్మ జ్ఞానం పరం స్మృతం"** అని ఉంది.

ఆత్మజ్ఞానం సర్వశ్రేష్ఠ ధర్మం - **ఇది మనుకృతం. ప్రామాణికం**

సర్వేషామపి చైతేషామాత్మజ్ఞానం పరం స్మృతమ్ । మూలశ్లోక సం. **42**
తద్ధ్యగ్ర్యం సర్వవిద్యానాం ప్రాప్యతే హ్యమృతం తతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **85**

టీక:- ఏషాం సర్వేషామ్ + అపి = ఈ సర్వకర్మలలో (12.83), **ఆత్మజ్ఞానం పరం స్మృతమ్ =** పరమాత్మ జ్ఞానమే సర్వశ్రేష్ఠమైన కర్మగా అంగీకరించబడింది. **తత్+హి సర్వ విద్యానాం అగ్ర్యమ్ =** ఇది సర్వ విద్యలలో సర్వప్రథమ కర్మ, **తతః అమృతం ప్రాప్యతే =** దీని వల్లనే (అమృతం) ముక్తి లభిస్తుంది.

తాత్పర్యం:- వీటన్నింటిలోనూ, ఉపనిషత్తులచేత ప్రతిపాదించబడిన బ్రహ్మను గురించిన జ్ఞానమే శ్రేష్ఠం. ఆ జ్ఞానం వల్లనే మోక్షం కలుగుతుంది. కాబట్టి అది అన్నింటికంటే ముఖ్యంగా సంపాదించాలి. ॥85॥

86-90వ శ్లోకం వరకు ప్రక్షిప్తాలు. ఇవి ప్రామాణికం కావు

ప్రవృత్త-నివృత్త కర్మల వర్ణన-

* *షణ్ణామేషాం తు సర్వేషాం కర్మణాం ప్రేత్య చేహ చ ।*
శ్రేయస్కరతరం జ్ఞేయం సర్వదా కర్మ వైదికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***86***

తాత్పర్యం:- పైన చెప్పబడిన ముఖ్య మోక్ష సాధనాలలో పరమార్థవస్తుజ్ఞానం ఐహికాముష్మిక శ్రేయోదాయకం కాబట్టి అది సంపాదించి తీరాలి. ॥86॥

* వైదికే కర్మయోగే తు సర్వాణ్యేతాన్యశేషతః ।
అంతర్భవంతి క్రమశస్తస్మింస్తస్మిన్ క్రియావిధౌ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **87**

తాత్పర్యం:- 'పరమాత్మోపాసన' అనే వైదిక కర్మయందు ఈ పైన చెప్పిన ఐహికాముష్మిక శ్రేయోదాయక ఫలాలు అన్నీ సంఘటిల్లుతాయి. ॥87॥

* సుఖాభ్యుదయికం చైవ నైశ్శ్రేయసికమేవ చ ।
ప్రవృత్తం చ నివృత్తం చ ద్వివిధం కర్మ వైదికమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **88**

తాత్పర్యం:- ఈ వైదిక కర్మ రెండు విధాలు. ఒకటి-ప్రవృత్తి కర్మ, రెండోది-నివృత్తి కర్మ. మొదటిది స్వర్గాది సుఖప్రాప్తికి, రెండోది సంసార నివృత్తికి హేతువులు. ॥88॥

* ఇహ చాముత్ర వా కామ్యం ప్రవృత్తం కర్మ కీర్త్యతే ।
నిష్కామం జ్ఞానపూర్వం తు నివృత్తముపదిశ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **89**

తాత్పర్యం:- ఈ లోకంలో ఆనందదాయకంగానూ, అంత్యమున స్వర్గాది సుఖదాయకంగానూ ఏ కర్మ వల్ల ప్రాప్తం ఉంటుందో అదంతా ప్రవృత్తి. బ్రహ్మజ్ఞానం వల్ల మోక్షం పొందడం అనేది నివృత్తి కర్మ. ॥89॥

* ప్రవృత్తం కర్మ సంసేవ్య దేవానామేతి సామ్యతామ్ ।
నివృత్తం సేవమానస్తు భూతాన్యత్యేతి పంచ వై ॥ ప్రక్షిప్త శ్లోక సం. **90**

తాత్పర్యం:- ఇటువంటి కర్మలకు యజ్ఞ-దానాదులు ఉదాహరణలు. వీటివల్లనే దేవతలకు అందుబాటులో ఉండే సుఖాలు పరలోకంలో మనిషికి లభిస్తాయి. నివృత్తకర్మ అంటే ఈ స్వర్గాపేక్ష కూడ లేనట్టి మోక్షమార్గం. ॥90॥

ప్రక్షిప్తాల పరిశీలన

86 నుంచి 90 వరకు గల శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలవుతాయి -

1. ప్రసంగ వ్యతిరేకాలు

1. పూర్వాపర ప్రసంగం ఆత్మ జ్ఞానానికి సంబంధించి ఉంది. మధ్యలో ఆ ప్రసంగ భంగానికి, వ్యతిరేకమూ, కొత్తదీ అయిన వైదిక ప్రసంగం రావడం అసంగతం. ఈ ఆధారంతో ఈ 86 నుంచి 90 వరకు గల అన్ని శ్లోకాలూ ప్రక్షిప్తాలే !

2. విషయ వ్యతిరేకాలు

82వ శ్లోకంలో నిశ్శ్రేయస్కర కర్మలు ప్రారంభమయ్యాయి. తర్వాత ప్రవృత్త నివృత్త కర్మల వివేచన రావటం ప్రసంగ వ్యతిరేకం. 68లో పూర్వాపర ప్రసంగాన్ని విడదీస్తూ విడిగా ప్రవృత్త నివృత్త కర్మల ప్రసంగం మొదలైంది.

3. అవాంతర వ్యతిరేకాలు

86వ శ్లోకంలో పైన చెప్పిన ఆరు కర్మల కన్నా వైదిక కర్మలే శ్రేష్ఠ మని ఉంది. తర్వాతి శ్లోకమైన 87లో ఈ ఆరు కర్మలూ వైదిక కర్మల కిందికే వస్తా యన్నారు. ఇవన్నీ వైదిక మైతే మునుపటి శ్లోకంలో వైదిక కర్మలే ఉత్కృష్ట మని, విడిగా వైదికాలను గురించి చెప్పేపనేముంది? ఇలా రెండు శ్లోకాలలోనూ వ్యతిరేకత ఉంది.

4. అంతర్ వ్యతిరేకాలు

83వ శ్లోకంలో మనువు చెప్పిన కర్మలన్నీ వైదికాలు లేదా వేదాలలో చెప్పినవి. ఈ శ్లోకాలలో వైదిక కర్మలను విడిగా శ్రేష్ఠ మని చెప్పటం మళ్లీ చెప్పటమే కాకుండా, ఈ శ్లోకాల ఖండనాత్మక భావనను ద్యోతకం చేస్తున్నది. ఇది ఎవరిదో భిన్న అభిప్రాయం. మనువుకు వ్యతిరేకం కనుక ప్రక్షిప్తం. ఇక్కడ దీని అవసరం కూడా లేదు.

91-106వ శ్లోకం వరకు మనుకృతం. ప్రామాణికం

సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని । మూలశ్లోక సం. **43**
సమం పశ్యన్నాత్మయాజీ స్వారాజ్యమధిగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **91**

టీక:- సర్వభూతేషు ఆత్మానం = సర్వచరాచర పదార్థాలలో, ప్రాణులలో పరమాత్మ యొక్క వ్యాపకత్వమును, **చ** = మరియు, **ఆత్మని** = పరమాత్మలో, **సర్వభూతాని** = సర్వపదార్థాల యొక్క ప్రాణుల యొక్క ఆశ్రయమును, **సమంపశ్యన్** = సమానభావంతో చూస్తూ, యథార్థజ్ఞాన పూర్వకంగా సర్వత్ర పరమాత్మ స్థితిని అనుభవిస్తూ సర్వదా పరమాత్మను ధ్యానిస్తూ, **ఆత్మయాజీ** = పరమాత్మోపాసన చేసే మనుషుడు, **స్వారాజ్యమ్ +అధిగచ్ఛతి** = పరమాత్మ సుఖాన్ని అంటే మోక్షాన్ని పొందుతాడు.

తాత్పర్యం:- స్థావర జంగమరూపాలయిన సర్వభూతాలలో ఆత్మ స్వరూపంతో పరమాత్మ ఉన్నాడు. అలాంటి స్థావర జంగమాలన్నీ నాలోనూ ఉన్నాయి-అనే భావంతో బ్రహ్మార్పణ బుద్ధితో జ్యోతిష్టోమాది యాగాలు చేసేవాడు బ్రహ్మత్వం పొందుతున్నాడు. సంసార విముక్తుడవుతున్నాడు. ॥91॥

వివరణ:

"స్వారాజ్యమ్" శబ్దానికి అర్థం

1) **"స్వప్రకాశేన శక్త్యా వా చరాచరం జగత్ రాజయతి ప్రకాశయతి సః స్వరాట్"** బ్రహ్మ-తన ప్రకాశం లేదా బలంతో సమస్త చరాచర జగత్తును ప్రకాశితం (ఉత్పన్నం) చేస్తాడు. అతడే పరమాత్మ. లేదా **"స్వప్రకాశేన రాజతే ప్రకాశతే ఇతి స్వరాట్** = బ్రహ్మ **స్వరాట్ తస్య భావః = స్వారాజ్యం** = బ్రహ్మత్వ ప్రాప్తి అంటే ముక్తిని పొందడం.

2) ఈ శ్లోకానికి వేదమంత్రంతో పోలిక (తులన) ఈ శ్లోకోక్త భావమునకు ఆధారం, ప్రమాణం వేదం. తులనార్థం మంత్రమును చూడండి.

"యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవాభూత్ విజానతః ।
తత్ర కః మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః ॥ యజు. 110-7

టీక:- అర్థం: యస్మిన్ = ఏ పరమాత్మ-జ్ఞాన విజ్ఞానం-అథవా ధర్మ విషయంలో, **విజానతః** = బాగా తెలిసినవారి కోసం, **సర్వాణి భూతాని** = సర్వభూతాలు లేదా ప్రాణులు, **ఆత్మైవ అభూత్** = తన ఆత్మతో సమానం, **తత్ర** = ఆ పరమాత్మలో విరాజమానమైన, **ఏకత్వమ్** = పరమాత్మ యొక్క ఏకత్వాన్ని, **అనుపశ్యతః** = సరీగా యోగాభ్యాసం ద్వారా సాక్షాత్తుగా చూసే యోగులకు, **కః మోహః** = మోహమెక్కడ?, **కఃశోకః** = శోకమెక్కడ?, **అభూత్** = ఉంటుంది.

యజుర్వేద భాష్యం- ఋషి దయానందుల వారు 'ఆ విద్వాంసులు శోకమోహాలను దాటిపోయి, పరమాత్మను సాక్షాత్కరించు కొంటారు'. ఈ భావంతో పోలికకు (12.119,125) శ్లోకాలను చూడండి.

3) ఆత్మ శబ్దోత్పత్తి-దాని అర్థం-'ఆత్మని యజతే ఇతి ఆత్మయాజీ' = అంటే ఎవడు పరమాత్మలో యజనము చేస్తాడో లేదా పరమాత్మ యొక్క సంగతిలో ఉంటాడో లేదా ధ్యానం చేస్తాడో అలాంటి పరమాత్మ యొక్క ఉపాసకుడ్ని 'ఆత్మయాజీ' అంటారు.

2. ఇంద్రియసంయమనంతో జన్మ సాఫల్యత

ఇది మనుకృతం-ప్రామాణికం

యథోక్తాన్యపి కర్మాణి పరిహాయ ద్విజోత్తమః । మూలశ్లోక సం.**44**
ఆత్మజ్ఞానే శమే చ స్యాద్వేదాభ్యేసే చ యత్నవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**92**

టీక:- ద్విజోత్తమః = శ్రేష్ఠుడైన ద్విజుడు (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యుడు), **యథోక్తాని + అపి కర్మాణి పరిహాయ** = శాస్త్ర విహితములైన ఉపరోక్త కర్మలను, (యజ్ఞాదులు) సన్యాసి అవస్థలో పరిత్యజించి 3.34,43 అయినా, **ఆత్మజ్ఞానే శమే చ వేదాభ్యాసే యత్నవాన్ స్యాత్** = పరమాత్మ, జ్ఞానం, ఇంద్రియజయం (2.68-75) మరియు వేదాభ్యాసం -వేదాధ్యయనం, చింతనం, మననంలో మిక్కిలి ప్రయత్నశీలుడుగా ఉండాలి. ఏ పరిస్థితిలో కూడా వేదాధ్యయనం విడువరాదు.

తాత్పర్యం:- విప్రోత్తముడు శాస్త్రవిహితాలైన అగ్నిహోత్రాదులను పరిత్యజించి అయినా ఇంద్రియజయాన్ని, ప్రణవజపాన్ని, వేదపారాయణాన్ని పరమాత్మ చింతనను వీటిలో ఏ ఒక్కదానినైనా ప్రయత్నంచేత పొందాలి. అలా అని అగ్నిహోత్రాదులు విస్మరించమని అర్థం తీయరాదు. ॥92॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతద్ధి జన్మసాఫల్యం బ్రాహ్మణస్య విశేషతః । మూలశ్లోక సం.**45**
ప్రాప్యైతత్కృతకృత్యో హి ద్విజో భవతి నాన్యథా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**93**

టీక:- ఏతద్ధి= ఇదే (12.92) మూడు కర్మలు (ఆత్మజ్ఞానం, ఇంద్రియ జయం, వేదాభ్యాసం), **విశేషతః బ్రాహ్మణస్య జన్మ సాఫల్యం** = విశేషించి బ్రాహ్మణ జన్మను సఫలం చేసేవి, **ద్విజః** = ద్విజులు (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు), **ఏతత్ ప్రాప్య హి కృత కృత్యః భవతి** = ఈ కర్మలను పాలించి కర్తవ్యాల పూర్ణత్వాన్ని సాధిస్తాడు. **అన్యథా**= వీటిని వదిలినట్లయితే, కృతకృత్యుడు కాలేడు.

తాత్పర్యం:- మూడు కర్మలు ఆత్మజ్ఞానం, ఇదింద్రియజయం, వేదాభ్యాసాలే ముఖ్యంగా బ్రాహ్మణుడికి జన్మ సాఫల్య మార్గాలు. బ్రాహ్మణ క్షత్రియ-వైశ్యులు ఈ కర్మలను పాలించి కర్తవ్యాల పూర్ణత్వాన్ని సాధిస్తారు. వీటిని వదిలినట్లయితే, కృతకృత్యుడు కాలేడు. ॥93॥

వివరణ:

ఈ శ్లోకంలో బ్రాహ్మణుడిని ఉద్దేశించి చెప్పడంలో కారణం వేదాధ్యయనం. పరమాత్మ ప్రాప్తియే (మోక్షప్రాప్తియే) అతని జీవనానికి ముఖ్యోద్దేశం

3. వేదాభ్యాస వర్ణన

వేదం సనాతన నేత్రం - ఇది మనుకృతం-ప్రామాణికం

పితృదేవమనుష్యాణాం వేదశ్చక్షుస్సనాతనమ్ । మూలశ్లోక సం.**46**
అశక్యం చాప్రమేయం చ వేదశాస్త్రమితి స్థితిః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**94**

టీక:- పితృ దేవ మనుష్యాణాం = పితృ సంజ్ఞ కలిగిన రక్షకులు, పాలకులైన పితా మొ॥వారు, **దేవ** = విద్వాంసులు, అన్యమనుషులకు, **వేదః సనాతనమ్ చక్షుః** = వేదం సనాతనమైన నేత్రం. అంటే మార్గ ప్రదర్శకం, **చ**= మరియు, **అశక్యం** = శక్యం కానిది, ఏ పురుషుడు నిర్మించజాలడు. అందువల్ల అది అపౌరుషేయం, **చ** = మరియు, అట్లే, **అప్రమేయం** = అనంత సత్య విద్యలు కలిగినది, **ఇతి స్థితిః** = ఇది నిశ్చితమైన విషయం. (1-3, 23లో) వేదం అపౌరుషేయం, అప్రమేయం అని చెప్పబడింది.

తాత్పర్యం:- పితరులకు, దేవతలకు, కంటికి కన్పించని ఫలితాలకు వేదములే ప్రత్యక్షంగా కనిపించే ప్రమాణాలు. ఇవి అపౌరుషేయాలు కాబట్టి, ఇతరులచేత రచింపశక్యమైనవి కావు. సకల శాస్త్రాల వల్ల, మీమాంసాది జ్ఞానం వల్ల వేదార్థాన్ని తెలుసుకోవాలి. ॥94॥

వేదవిరుద్ధమైన శాస్త్రం అప్రామాణికం -

ఇది మనుకృతం-ప్రామాణికం

యా వేదబాహ్యాః శ్రుతయో యాశ్చ కాశ్చ కుదృష్టయః । మూలశ్లోక సం. **47**
సర్వాస్తా నిష్ఫలాః ప్రేత్య తమోనిష్ఠా హి తాః స్మృతాః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **95**

టీక:- యాః శ్రుతయః వేదబాహ్యాః = ఏ గ్రంథాలు వేద బాహ్యాలో, **యాః చ కాః చ కుదృష్టయః** = కుత్సిత మనుష నిర్మితాలు ప్రజలను దుఃఖ సాగరంలో ముంచేవి, **తాః సర్వాః నిష్ఫలాః** = అవన్నీ నిష్ఫలాలు, **ప్రేత్య తమోనిష్ఠా హి స్మృతాః** = అసత్యం-అంధకార రూపమైన ఈ లోకంలో పరలోకంలో కూడా దుఃఖదాయకాలు.

ఋషి దయానంద భాష్యం:- వేదబాహ్యాలు, కుత్సిత పురుషులైన వారితో రచించబడిన గ్రంథాలు, ప్రపంచ జనులను దుఃఖ సాగరంలో ముంచేవి. అవన్నీ నిష్ఫలాలు, అసత్యాలు. అంధకారరూపాలు, ఇహ, పరలోక దుఃఖదాయకాలు. (స.ప్ర. 11వ సము.) ॥95॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ఉత్పద్యంతే చ్యవంతే చ యాన్యతోఽన్యాని కాని చిత్ । మూలశ్లోక సం. **48**
తాన్యర్వాక్కాలికతయా నిష్ఫలాన్యనృతాని చ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **96**

టీక:- యాని+అతః అన్యాని కానిచిత్ ఉత్పద్యన్తే = ఏ కొన్ని గ్రంథాలు ఈ వేదాలకు విరుద్ధంగా రాయబడుతున్నవో, **తాని+అర్వాక్ కాలికతయా చ్యవన్తే** = అవి ఆధునికాలైనందువల్ల, శీఘ్రంగా నష్టమైపోతాయి. **నిష్ఫలాని చ అనృతాని** = అవి అసత్యాలు. వాటిని అంగీకరించడం నిష్ప్రయోజనం.

ఋషి దయానంద భాష్యం:- ఈ వేదాలకు వ్యతిరేకంగా ఉత్పన్నమైన వేద విరుద్ధ గ్రంథాలు ఆధునికాలు కావటంతో శీఘ్రంగా నశిస్తాయి. వాటిని అంగీకరించటం నిష్ఫలం, అయథార్థం. (స.ప్ర. 11వ సము.) ॥96॥

వివరణ:

"అర్వాక్ కాలం" అనగా-ఆధునిక కాలం అని అర్థం - వేదవిరుద్ధ గ్రంథాలు ఆధునికాలు అంటే, వేదాల ప్రతిష్ఠ చాలాకాలం నుండి ఉంది. అందువల్ల అవి సనాతనాలు. కానీ వేద విరుద్ధ గ్రంథాలు పరవర్తివి. తరువాతవి, అనృతములు. వీటిలో సత్యం లేనందువల్ల కొంతకాలం చలామణిలో ఉండి తరువాత నష్టమైపోతాయి. వేదాల లాగా ఇవి సనాతనాలు కావు. ఈశ్వరీయ జ్ఞానమున్నందువల్ల వేదాలు మాన్యాలు, సనాతనాలు.

ఇది మనుకృతం-ప్రామాణికం

చాతుర్వర్ణ్యం త్రయో లోకాశ్చత్వారశ్చాశ్రమాః పృథక్ । మూలశ్లోక సం. **49**
భూతం భవ్యం భవిష్యఞ్చ సర్వం వేదాత్ప్రసిద్ధ్యతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **97**

టీక:- **చాతుర్వర్ణ్యమ్** = బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలు, వీటి వ్యవస్థలు, **త్రయః లోకాః** = పృథ్వి, ఆకాశం, మరియు ద్యులోకం అంటే సమస్త భూమండలంలో గల లోకాలు. గ్రహాదులు, **చత్వారః ఆశ్రమాః పృథక్** = నాలుగు ఆశ్రమములు (బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం మరియు సన్యాసం.) ఈ నాలుగు ఆశ్రమములకు సంబంధించిన వేరు వేరు విధానాలు (నియమాలు), **చ భూతం భవ్యం భవిష్యం** = మరియు భూత-భవిష్యత్-వర్తమాన కాలములకు సంబంధించిన విద్య, **సర్వం వేదాత్ప్రసిద్ధ్యతి** = ఇవన్నీ వేదాల ద్వారా ప్రసిద్ధమై, ప్రకటమై తెలియబడుచున్నది. అంటే ఈ సర్వవ్యవస్థలు, సర్వ విద్యల జ్ఞానం వేదాల ద్వారానే సిద్ధిస్తున్నవి.

తాత్పర్యం:- బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలు, వీటి వ్యవస్థలు, మరియు పృథ్వి, ఆకాశం సమస్త భూమండలంలో గల లోకాలు, గ్రహాదులు, నాలుగు ఆశ్రమాలు- బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం; ఈ నాలుగు ఆశ్రమాలకు సంబంధించిన వేరువేరు విధానాలు (నియమాలు) మరియు భూత, భవిష్యత్తు వర్తమాన కాలాలకు సంబంధించిన విద్య, ఇవన్నీ వేదాల ద్వారా ప్రసిద్ధమై, ప్రకటమై తెలియబడుతుంది. అంటే ఈ సర్వవ్యవస్థలు, సర్వ విద్యల జ్ఞానం వేదాల ద్వారానే సిద్ధిస్తున్నవి. ॥97॥

"నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమములు, భూత-భవిష్యత్, వర్తమానం మొ॥ సర్వవిద్యలు వేదాల ద్వారానే ప్రసిద్ధమైనవి. ఋ-భాష్య భూమిక, వేద విషయం. ఇదే మాన్యతను మనువు. (1.21)లో వర్ణించాడు.

"సర్వేషాం తు స నామాని కర్మాణి చ పృథక్ పృథక్ ।
వేదశబ్దేభ్య ఏవాదౌ పృథక్ సంస్థాశ్చ నిర్మమే ॥ 1.21

తాత్పర్యం:- నాలుగు వర్ణాలు, స్వర్గాదిలోకాలు, బ్రహ్మచర్యాదిగాగల ఆశ్రమాలు.....వీటితోపాటు జరిగేవి, జరగబోయేవాటికి వేదాలే ఆధారాలు-ప్రమాణాలు.

పంచభూతాది సూక్ష్మశక్తుల జ్ఞానం వేదాలనుండే కలిగింది - ఇది మనుకృతం-ప్రామాణికం

శబ్దః స్పర్శశ్చ రూపం చ రసో గంధశ్చ పంచమః । మూలశ్లోక సం. **50**
వేదాదేవ ప్రసూయంతే ప్రసూతిగుణకర్మతః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **98**

టీక:- **శబ్దః -స్పర్శః రూపం-రసః-పంచమః గంధః** = శబ్ద, స్పర్శ, రూప-రస మరియు, ఐదోది గంధం అవి, **ప్రసూతి-గుణ- కర్మతః** = ఉత్పత్తి గుణం మరియు కార్యముల యొక్క జ్ఞాన రూపంలో, **వేదాత్ + ఏవ ప్రసూయన్తే** = వేదాల నుండి ప్రసిద్ధి చెందినవి. విజ్ఞాతములైనవి. అంటే ఈ తత్త్వ శక్తుల యొక్క ఉత్పత్తి జ్ఞానం, వీటి గుణాల జ్ఞానం, వీటి ఉపయోగ జ్ఞానం, సమస్త జడచేతన ప్రపంచం యొక్క జ్ఞాన విజ్ఞానాలు వేదాల నుండి లభించినవి.

తాత్పర్యం:- విషయగుణాలతో కూడి యుండి శబ్ద, స్పర్శ, రూప,రసగంధాదులనేవి వేదం చేతనే చెప్పబడి శాశ్వతమై ఉన్నాయి. ॥98॥

వేదమే సుఖాలకు సాధనం - ఇది మనుకృతం-ప్రామాణికం

బిభర్తి సర్వభూతాని వేదశాస్త్రం సనాతనమ్ । మూలశ్లోక సం. **51**
తస్మాదేతత్పరం మన్యే యజ్జంతోరస్య సాధనమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **99**

టీక:- **సనాతనం వేదశాస్త్రం** = ఈ సనాతన వేదశాస్త్రం, **సర్వ భూతాని బిభర్తి** = సర్వ విద్యలను దానం చేయడం ద్వారా, సంపూర్ణ ప్రాణులను భరిస్తూ మనువు మొ॥ వారందరు వేదం సర్వదా ఉత్తమమని తలుస్తున్నారు. మరియు అందరూ ఇదే ప్రకారంగా అంగీకరించాలి. **యత్** = ఎందుకంటే, **ఆస్తోః అస్య సాధనమ్** = సర్వప్రాణుల యొక్క సర్వ సుఖాలకు ఇదియే సాధనం.

ఋషి దయానందభాష్యం:-వేదశాస్త్రములే సర్వదా సర్వభూతాలను భరిస్తున్నాయి. కాబట్టి శాశ్వతమైన ఈ వేదాలు వైదిక కర్మాధికారి అయిన పురుషుడికి గొప్ప పురుషార్థసాధకమని తెలుస్తున్నది. (ఋ.భా.భూ. వే.వి.) ॥99॥

వేదవేత్తయే రాజు, సేనాధిపతి, న్యాయాధిపతి కావాలి - ఇది మనుకృతం-ప్రామాణికం

సైనాపత్యం చ రాజ్యం చ దండనేతృత్వమేవ చ । మూలశ్లోక సం.**52**
సర్వలోకాధిపత్యం చ వేదశాస్త్రవిదర్హతి ॥ ప్రక్షిప్త శ్లోక సం.**100**

టీక:- **సైనాపత్యం** = సమస్త సైన్యం, **చ** = మరియు, **రాజ్యం** = సేనాపతికి మించి ఉన్న రాజ్యాధికారం, **దండ నేతృత్వమ్ + ఏవ** = దండించే వ్యవస్థ యొక్క ఆధిపత్యం, **చ** = మరియు, **సర్వలోక +ఆధిపత్యం** = అందరి మీద వుండే సర్వాధీశ రాజ్యాధికారం. ఈ నాలుగు అధికారాలలో, **వేదశాస్త్రవిత్+అర్హతి** = సంపూర్ణ వేద శాస్త్రాలలో ప్రవీణుడు, పూర్ణ విద్వాంసుడు, ధర్మాత్ముడు, జితేంద్రియుడు, సుశీలుడు ప్రజలను శాసించగలడు. అంటే ముఖ్యసేనాపతి, ముఖ్యరాజ్యాధికారి, ముఖ్య న్యాయాధీశుడు మరియు ప్రధానమైన రాజు, ఈ నలుగురు సర్వ విద్యలలో పూర్ణ విద్వాంసులుగా ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- వేదరూపమైన ఈ శాస్త్రాన్నెరిగిన వాడు రాజ్యం, సర్వభూమ్యాధిపత్యం, దండనాయకత్వం, సైన్యాధిపత్యం అన్నీ చేయడానికి అర్హుడై ఉన్నాడు.

వేదశాస్త్రవిదుడు, ధర్మాత్ముడు, జితేంద్రియుడు, న్యాయాధికారి, ఆత్మబల సంపన్నుడు, అయినవాడికి సేనను, రాజ్యమును దండనీతిని ప్రధాన రాజ్యాధికారాన్ని ఇవ్వాలి. ఇతరమైన క్షుద్రాశయుడికి ఈ పై అధికారాలు ఇవ్వరాదు. (స.ప్ర. 6వ సము.) ॥100॥

వివరణ:

'వేదశాస్త్రవిత్ అర్హతి' అంటే వేదశాస్త్రాలు తెలిసినవాడే అర్హుడు కాగలడు. తులనార్థం (7-2) చూడగలరు. దండ నేతృత్వానికి పోలిక (7-31) అక్కడ వేదశాస్త్ర జ్ఞానమే యోగ్యతగా నిర్ణయించబడింది.

వేదజ్ఞానాగ్ని ద్వారానే కర్మదోష నాశనం- ఇది మనుకృతం-ప్రామాణికం

యథా జాతబలో వహ్నిర్దహత్యార్ద్రానపి ద్రుమాన్ । మూలశ్లోక సం.**53**
తథా దహతి వేదజ్ఞః కర్మజం దోషమాత్మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**101**

టీక:- **యథా**= ఏవిధంగా, **జాతబలః వహ్నిః** = జాజ్వల్యమానమైన అగ్ని, **ఆర్ద్రాన్ ద్రుమాన్ అపి దహతి** = పచ్చిమానులను కూడా దహించివేయునో, అలాగే **వేదజ్ఞః** = వేదాల నెరిగిన విద్వాంసుడు, **ఆత్మనః కర్మజం దోషం దహతి**= తాను చేసిన కర్మ జన్యమైన సంస్కారదోషాలను కాల్చి వేస్తాడు. అంటే వేద జ్ఞానమనే అగ్ని దుష్ట సంస్కారాలను తొలగించి, ఆత్మను పవిత్రంగా ఉంచుతుంది.

తాత్పర్యం:- ఏవిధంగా బలవత్తరమైన అగ్ని వచ్చి పచ్చివృక్షాలను సైతం (కార్చిచ్చురూపంలో రగుల్కొన్నప్పుడు) కాల్చి వేయగల్గుతూన్నదో, అలాగే వేదముల అర్థాన్నెరిగినవాడు దోషాలవల్ల కలిగే పాపాలను పోగొట్టుకోగల శక్తిమంతుడవుతున్నాడు. ॥101॥

వివరణ:

తులనార్థం 11.245,246,263 అక్కడ కూడా యోగ్యతగా వర్ణింపబడింది. (11.227 వివరణ చూడగలరు.)

వేదజ్ఞానం వల్ల మోక్షము వైపు ప్రగతి - **ఇది మనుకృతం-ప్రామాణికం**

వేదశాస్త్రార్థతత్త్వజ్ఞో యత్ర తత్రాశ్రమే వసన్ । మూలశ్లోక సం. **54**
ఇహైవ లోకే తిష్ఠన్ స బ్రహ్మభూయాయ కల్పతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **102**

టీక:- వేదశాస్త్రార్థ తత్త్వజ్ఞః = వేదశాస్త్రాల అర్థ తత్త్వాన్ని తెలిసిన విద్వాంసుడు, **యత్ర-తత్ర+ఆశ్రమే వసన్** = ఏ ఆశ్రమంలో (బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాస ఆశ్రమం) అయినా ఉంటూ, **ఇహ+ఏవ లోకే తిష్ఠన్ సః** = ఈ వర్తమాన జన్మలోనే, బ్రహ్మ **భూయాయ కల్పతే** = బ్రహ్మప్రాప్తి (మోక్షం)కి అధికాధిక సమర్థుడవుతాడు.

తాత్పర్యం:- వేదం-వేదార్థం-బ్రహ్మాత్మక కర్మ తెలిసినవాడు నిత్య నైమిత్తికాది కర్మానుష్ఠానం వల్ల జన్మించిన బ్రహ్మజ్ఞానం వల్ల గృహస్థాశ్రమంలో ఉన్నా మోక్షాన్ని పొందగలుగుతున్నాడు. ॥102॥

వివరణ:

తులనార్థం 4.149 శ్లోక వివరణ చూడుము.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

*** ఆచరించువాడు శ్రేష్ఠుడు-**

* ***అజ్ఞేభ్యో గ్రంథినః శ్రేష్ఠా గ్రంథిభ్యో ధారిణో వరాః ।***
ధారిభ్యో జ్ఞానినః శ్రేష్ఠా జ్ఞానిభ్యో వ్యవసాయినః ॥ ప్రక్షిప్త శ్లోక సం. ***103***

తాత్పర్యం:- కొద్దిపాటి వేదాభ్యాసానికంటే పూర్తిగా అధ్యయనం చేసినవారు ఉత్తములు. కేవలం గ్రంథాన్ని మొత్తం వల్లెవేసేవారికంటే-వేదార్థాలు తెలిసినవారు శ్రేష్ఠులు. వాటిని ఆచరణలో పెట్టువారు మరీమరీ ఉత్తములు. ఆచరిస్తూ తిరిగి లోకానికి బోధించగలవారు ఉత్తమోత్తములు. ॥103॥

ప్రక్షిప్త పరిశీలన

103వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. ప్రసంగ వ్యతిరేకం

ఈ శ్లోకం ఇక్కడ ప్రాసంగికమూ కాదు, దీని అవసరమూ లేదు. ఇక్కడ మునుపటి ప్రసంగం నిశ్శ్రేయస కర్మలలో వేదజ్ఞానపు గొప్పతనం చెప్పారు. ఈ శ్లోకంలో మామూలు గ్రంథాల అధ్యయనంగానూ, తర్వాత గొప్పతనమూ చెప్పారు. దీనికి, ముందు వెనుకల ప్రసంగానికి సంబంధమే లేదు. ఇవి వేద సంబంధాలని ఎవరైనా అంటే, అదీ ప్రయోజనం లేనిదే. ఎందుకంటే ఇందులో వేదాలను పేర్కొననూ లేదు, ఈ చర్చ అవసరమూ లేదు. మనువు వేదాలను మామూలు గ్రంథాలని ఎక్కడా చెప్పలేదు.

4,5. తపస్సు-విద్యలవర్ణన

తపస్సు వల్ల పాపభావనా నాశం, విద్య వల్ల అమృత ప్రాప్తి - ఇది మనుకృతం-ప్రామాణికం

తపో విద్యా చ విప్రస్య నిఃశ్రేయసకరం పరమ్ । మూలశ్లోక సం. **55**
తపసా కిల్బిషం హన్తి విద్యయాఽమృతమశ్నుతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **104**

టీక:- **విప్రస్య** = విప్రుడికి, **తపః చ విద్యా** = తపస్సు శ్రేష్ఠ వ్రతాల ధారణ, సాధన మరియు, **విద్యా** = సత్య విద్యల జ్ఞానం. ఈ రెండు, **పరం నిఃశ్రేయసకరం** = ఉత్తమ మోక్షసాధకాలు. ఆ విప్రుడు. **తపసా కిల్బిషం హన్తి** = తపస్సు ద్వారా పాపభావనను తొలగించుకొంటాడు. **విద్యయా + అమృతం + అశ్నుతే** = వేదాది సత్య విద్యల యొక్క యథార్థ జ్ఞానం వల్ల అమరత్వాన్ని (మోక్షాన్ని) పొందుతాడు.

తాత్పర్యం:- తపస్సు, బ్రహ్మజ్ఞానం ఇవే బ్రాహ్మణుడికి మేలు కల్గించేవి. తపస్సు వల్ల చేసిన పాపాలు పోవడం-బ్రహ్మజ్ఞానం వల్ల పునర్జన్మ రాహిత్యాన్ని పొందగల్గడం తథ్యం. ॥104॥

వివరణ:

1. పాపభావనా వినాశం.

శ్రేష్ఠమైన వ్రతాలనాచరించడం వల్ల, ప్రాణాయామాది తపస్సులను పాలించడం వల్ల, ఆత్మలో గల పాపభావన అనే అశుద్ధి క్షయమై పోతుంది. ఇందుకు ప్రమాణం గల అన్యత్ర వర్ణించిన మాన్యతలు నిమ్న శ్లోకాలలో చూడగలరు. (6.70,72, 11.227)

2. **అమృత శబ్దానికి అర్థం: 'మృజ్ ప్రాణత్యాగే'** తుదాది ధాతువుకు **'క్తః'** ప్రత్యయం చేర్చగా మరియు **'నఞ్'** సమాసమున "అమృతమ్" శబ్దం సిద్ధిస్తుంది. జన్మమృత్యువు లేని అంటే, మోక్ష సుఖం అని అర్థం. మనుజుడు వేదాది సత్యవిద్యల యొక్క యథార్థ జ్ఞానం వల్ల మోక్షాన్ని పొందుతాడు. ముక్తి సుఖానికి ఎంత సమయం ఉంటుందో, అంత వరకు సుఖం నష్టం కాదు. మధ్యలో దుఃఖమొచ్చి ఈ ముక్తి సుఖాన్ని నష్టపరచజాలదు. అందువల్ల ఈ మోక్ష సుఖానికి 'అమృత' మని పేరు. యజు. 40.14లో ఈ వాక్యం యథాతథంగా ఉంది. **"విద్యయాఽమృత మశ్నుతే".**

6. ధర్మవర్ణన

ధర్మజ్ఞానం కోసం త్రివిధ ప్రమాణాల జ్ఞానం - ఇది మనుకృతం-ప్రామాణికం

ప్రత్యక్షం చానుమానం చ శాస్త్రం చ వివిధాగమమ్ । మూలశ్లోక సం. **56**
త్రయం సువిదితం కార్యం ధర్మశుద్ధిమభీప్సతా ॥ ప్రక్షిప్త శ్లోక సం. **105**

టీక:- **ధర్మ శుద్ధిమ్ + అభీప్సతా** = ధర్మం యొక్క వాస్తవిక తత్త్వాన్ని తెలుసుకొనగోరు అభిలాష కలిగిన మనుజుడు. **ప్రత్యక్షమ్ అనుమానం చ వివిధాగమం శాస్త్రమ్** = ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం మరియు వేదం. అదేవిధంగా వివిధాలు వేదమూలకాలైన శాస్త్ర ప్రమాణాలు, **త్రయం సువిదితం కార్యమ్** = ఈ మూడు ప్రమాణాల జ్ఞానాన్ని సంపూర్ణంగా పొందాలి.

తాత్పర్యం:- ధర్మశాస్త్రం యొక్క వాస్తవ జ్ఞానం పరిపూర్ణంగా తెలిసి ఉండటానికి వేదం ఆధారంగా కలిగిన స్మృత్యాదులను క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. ప్రత్యక్షానుమానాలు-శాస్త్రం ఇవియే మనువు చేత చెప్పబడిన ధర్మశాస్త్రం యొక్క ఉద్దేశం (అర్థాపత్తి, ఉపమానం అనుమానముననే అంతర్భాగాలు.). ॥105॥

వివరణ:

మూడు ప్రమాణాలు వాటి లక్షణాలు:- ప్రత్యక్షం, అనుమానం మరియు శాస్త్రం లేదా శబ్ద ప్రమాణాలను తెలియడానికి ఇక్కడ విస్తారంగా వివేచన చేయబడుతుంది. సత్యార్థ ప్రకాశం ప్రథమ సముల్లాసంలో ఋషి దయానందుల వారు న్యాయరద్శన సూత్రాలను ఉదాహరిస్తూ ఈ విషయాన్ని గురించి విస్తృతంగా గంభీర వ్యాఖ్య చేసి ఉన్నారు. ఇక్కడ ఆ వ్యాఖ్యలే తెలుపుతున్నాం.

1. ప్రత్యక్ష ప్రమాణం

"ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నం జ్ఞానం అవ్యపదేశ్యం అవ్యభిచారి, వ్యవసాయాత్మకం ప్రత్యక్షమ్"

న్యాయదర్శనం అధ్యాయం 1. ఆహ్నికం 1. సూత్రం. 4

శ్రోత్రం-త్వక్-చక్షు-జిహ్వా మరియు ఘ్రాణములకు శబ్ద, స్పర్శ రూప, రస మరియు గంధముతో అవ్యవహితం అంటే ఆవరణ రహితమైన సంబంధం కలిగినప్పుడు, ఇంద్రియాలతో మనస్సుకు, మనస్సుతో ఆత్మకు సంయోగం కలిగినప్పుడు కలిగిన జ్ఞానమే **ప్రత్యక్ష**మంటారు. కానీ వ్యపదేశ్యం అంటే సంజ్ఞా సంజ్ఞికి సంబంధం కలిగినప్పుడు అది జ్ఞానం కాదు. ఉదాహరణకు ఎవడో ఎవరితోనో, నీవు జలం తీసికొనిరమ్ము అన్నాడు. వాడు జలమును తెచ్చి ఇదిగో జలమన్నాడు. అక్కడ జలం అనేది రెండక్షరాలు గల సంజ్ఞ. తెచ్చినవాడిని, తెమ్మన్నవాడిని చూడలేదు. కాని ఏ పదార్థం యొక్క నామం జలమో అదే ప్రత్యక్షం. శబ్దం వల్ల కలిగిన జ్ఞానం. అది శబ్ద ప్రమాణానికి విషయం. **అవ్యభిచారి**-ఒకడు రాత్రిలో ఒక స్తంభమును చూసి, పురుషుడని నిశ్చయించుకున్నాడు. కానీ పగలు దాన్ని చూచినప్పుడు అది స్తంభమని తెలిసింది. రాత్రి కలిగిన పురుషుడనే జ్ఞానం నష్టమైపోయి, స్తంభమనే జ్ఞానం కలిగింది. ఈ విధమైన వినాశ జ్ఞానమునకు **'వ్యభిచారి'** అని పేరు. వ్యవసాయాత్మకం ఎవడో దూరంగా నదిలో గల ఇసుకను చూసి అక్కడ వస్త్రాలు ఎండుతున్నవి. అది జలమా లేదా మరొకటా అన్నాడు. నిలబడిన అతడు దేవదత్తుడా లేదా యజ్ఞదత్తుడా అని నిశ్చయం లేనప్పుడు అంతవరకు అది ప్రత్యక్షజ్ఞానం కాదు. కాబట్టి ఏది వ్యపదేశమో, అవ్యభిచారియో, నిశ్చయాత్మకమో ఆ జ్ఞానమే. ప్రత్యక్ష జ్ఞానం.

2. అనుమాన ప్రమాణం

"అథ తత్పూర్వకం త్రివిధమనుమానం- పూర్వవత్ శేషవత్ సామాన్యతో దృష్టఇచ్చ"

న్యాయ అధ్యా. 1. ఆ. 1 సూత్రం. 5

ఏదైనా ప్రత్యక్ష పూర్వకంగా ఒక వస్తువు లేదా ఒక వస్తువు యొక్క అంశం ఏ స్థానమందైనా, ఏ కాలమందైనా మనకు ప్రత్యక్షమైనప్పుడు దానికి సమానమైన వస్తువు ఒకటి ప్రత్యక్షమైనప్పుడు అదృష్టమైన వస్తువు యొక్క జ్ఞానం కలగడాన్ని అనుమానమంటారు. ఉదా- పుత్రుణ్ణి చూసి తండ్రిని, పర్వాతాదులందు 'ధూమమును చూసి అగ్నిని ప్రపంచంలోని సుఖదుఃఖాలను చూసినప్పుడు పూర్వజన్మ జ్ఞానం కలుగుతుంది. ఈ అనుమానం మూడు విధాలుగా ఉంటుంది.

1. **పూర్వవత్:** మేఘాలను చూసి వర్షాన్ని ఊహించడం. వివాహాన్ని చూసి సంతానోత్పత్తిని, చదువుతున్న విద్యార్థిని చూసి విద్వాంసుడవుతాడని నిశ్చయించడం మొదలైనవి. ఎక్కడెక్కడ కారణాన్ని చూసి కార్యమును ఊహించడం జరుగుతుందో అది **'పూర్వవత్'** అనుమానం.

2. రెండోది **'శేషవత్'** అంటే ఎక్కడ కార్యాన్ని చూసి కారణం యొక్క జ్ఞానం కలుగుతుందో, అది శేషవత్ ఉదా: నదీప్రవాహం పెరగడం చూసి ఎక్కడో వర్షం బాగాపడిందని, పుత్రుణ్ణి చూసి తండ్రిని, సృష్టిని చూచి అనాది కారణం లేదా కర్తయైన ఈశ్వరుణ్ణి పాపపుణ్యాల అచరాణాన్ని చూసి సుఖదుఃఖ జ్ఞానం కలగడం **'శేషవత్'** అనుమానం అంటారు.

3. **మూడోది:** సామాన్యతో దృష్టం-దేనికి కారణం కార్యం రెండూ లేవో, కాని, ఏదో, ఒకరకమైన సామర్థ్యం, ఒకటి మరొక దానితో కలిసి ఉంటుందో, ఉదా ॥ ఎవరైనా నూతన ప్రదేశానికి పోయినట్లయితే మరొకచోటకు పోజాలడు. అలాగే ఇతరులు కూడా స్థానానంతరమునకు పోయినప్పుడు మరొకచోటకు పోవడానికి తెలియనట్లు.

అనుమాన శబ్దానికి అర్థం:-'అను' అంటే **'ప్రత్యక్షస్య పశ్చాత్ మీయతే జ్ఞాయతే యేన తదనుమానం'.** ఏది ప్రత్యక్షానంతరం ఉత్పన్నమవుతుందో-ధూమమును ప్రత్యక్షంగా చూడకుండా అదృష్టమైన అగ్ని జ్ఞానం ఎప్పుడూ కలుగునట్లు. 3) శాస్త్ర ప్రమాణం = శబ్ద ప్రమాణం **"ఆప్తోపదేశః శబ్దః"** (న్యాయ సూ.1.17) ఆప్తులు అంటే పూర్ణ విద్వాంసులు, ధర్మాత్ములు పరోపకార ప్రియులు **"సత్యవాదులు"**.పురుషార్థులు, జితేంద్రియ పురుషులు. వీరు ఆప్తులు, ఆత్మజ్ఞానం కలవారు. ఆత్మ సుఖానుభవం కలవారు, ఆ అనుభవాన్ని మానవ కల్యాణార్థం ఉపదేశించే తలంపుతో పృథ్వి మొ॥ పరమేశ్వర పర్యంతం సర్వపదార్థాల జ్ఞానం కలిగి ఆ జ్ఞానం ఉపదేశించ తలచి ఉపదేష్టలుగా ఉంటారో అలాంటి పురుషులు,పూర్ణమైన ఆప్తులు పరమేశ్వరుడి ఉపదేశమే వేదం. **"వేదమును"** శబ్ద ప్రమాణంగా తెలిసికో. శబ్ద ప్రమాణం-అంటే వేదం, వేదమూలక శాస్త్రాల వర్ణన ధర్మమూలమని మనువు అంగీకరించాడు. ఈ విషయమై వివేచన కోసం (1.63) వేదం, స్మృతి శీర్షిక చూడగలరు.

ఈ ప్రమాణాల వల్ల వేదాది శాస్త్రాల వల్ల ధర్మాల వాస్తవిక స్వరూపం నిశ్చితమవుతుంది. మరొక విధంగా ధర్మనిర్ణయం జరగదు.

వేదానుకూలమైన తర్కం వల్ల ధర్మజ్ఞానం- **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రాఽవిరోధినా । మూలశ్లోక సం.**57**
యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**106**

టీక:- యః = ఏ మనుజుడు, **ఆర్షం చ ధర్మోపదేశమ్** = వేదం, ఋషివిహితమైన ధర్మోపదేశాన్ని (1.125, 2.3) అంటే ధర్మాశాస్త్రాన్ని, **వేదశాస్త్ర అవిరోధినా తర్కేణ అనుసంధత్తే** = వేదశాస్త్రానుకూలమైన తర్కంతో అనుసంధానం చేస్తాడో, **సః ధర్మం వేద న + ఇతరః** = అతడే ధర్మం యొక్క నిజస్వరూపాన్ని తెలుసుకొన్నవాడు. ఇతరుడు కాదు.

తాత్పర్యం:- ఋషి ప్రోక్తమైన వేదాలు బాగా తెలిసిన వారికి ధర్మశాస్త్రం అర్థం కాగలదు. న్యాయ-మీమాంసాదులు తెలియని వారికి ధర్మసూక్ష్మాలు బోధపడవు. మీమాంసకు సాధన-ఫలం అనేవి రెండు అంగాలు. ॥106॥

వివరణ:

తర్కమంటే అభిప్రాయమేమిటి? ఇక్కడ తర్క శబ్దానికి ప్రమాణాలకు, వేదాలకు అనుకూలంగా సత్యనిరూపణం చేయడమే తర్కం. ఇందుకు విరుద్ధమైన విషయాలు తర్కం కాదు. విరుద్ధమైన విషయాలు కుతర్కాలనబడుతాయి. తర్కాన్ననుసరించి వేదాలు నిర్భ్రాన్తాలని మను అభిప్రాయం. అందువల్ల వేదోక్త ధర్మం నిత్యసత్యం. వేదాలను తర్కించవలసిన పనిలేదు. ఎవరైనా తర్కం ఆధారం చేసుకొని వేదాలను ఖండించినట్లయితే అది తర్కం కాదు. అది కేవలం కుతర్కమే. అలాంటి వ్యక్తి కేవలం నాస్తికుడు. 1.130, 2.11 సమీక్ష చూడగలరు.

మనుస్మృతి రహస్యము -

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *నైశ్రేయసమిదం కర్మ యథోదితమశేషతః ।*
మానవస్యాస్య శాస్త్రస్య రహస్యముపదిశ్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **107**

తాత్పర్యం:- మోక్ష సాధనమైన ఈ కర్మమంతా పూర్తిగా శాస్త్రోక్తంగా వివరించబడింది. మానవ ధర్మమే అయినా ఒక గోప్యమైన విషయాన్ని చెపుతాను వినండి ! ॥107॥

ప్రక్షిప్త పరిశీలన

107వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం-

1. ప్రసంగ వ్యతిరేకం

1. నడుస్తున్న ప్రసంగపు సంకేత శ్లోకం 83వది. ఇందులో చెప్పిన నిశ్రేయస కర్మలు చెబుతున్నారు. అందులోనే 104వ శ్లోకంలోని 'ధర్మక్రియ'ల వర్ణన మొదలైనది. 115 వరకూ సాగుతుంది. మధ్యలో దాని ముందు వెనుకల ఉన్న వాటికి భిన్నంగా ఉండటం చేత ఈ శ్లోకం అనవసరమూ, అప్రాసంగికమూ అవుతుంది.

2. మనువు శ్రేయస్కర్మల ప్రసంగం ప్రారంభం అవుతుందన్న సంకేతం 82లోనూ, దాని ముగింపును 116లోనూ ఇచ్చాడు. ఈ శ్లోకం ముగియని ప్రసంగం మధ్యలోనే నిశ్రేయస కర్మల ప్రసంగం ముగింపు సంకేతం ఇవ్వడం కూడా దీన్ని అసంగతంగా రుజువు చేస్తూంది. చూడబోతే ప్రసంగాన్ని బలవంతంగా దారి మళ్లించినట్లు తోస్తుంది.

2. శైలీగత ఆధారాలు

1. **"మానవస్య శాస్త్రస్య"** (మను చరితశాస్త్రం), అను పదాలతో ఇది మనువు చెప్పింది కాదని స్పష్టమవుతూంది.

2. మౌలికంగా మనుస్మృతి శాస్త్రం కాదు, ప్రవచనం. ఇది దాని శైలితోనే తెలుస్తూంది. ప్రతి ప్రసంగం ప్రారంభంలోనూ "శ్రూయతాం", "నిబోధత" మొదలైన క్రియాపదాల ప్రయోగం దీని మూల రూపం "ప్రవచనమే' అని ప్రమాణీకరిస్తూంది. 1.1-4 శ్లోకాలలో ఋషులు మనువు వద్దకు వచ్చి తమ కుతూహలాన్ని వ్యక్తం చేయటం, మనువు "శ్రూయతాం" అంటూ వారి కుతూహలానికి సమాధానాలు చెప్పటం (1.2-4) కూడా చెప్పిన దానికి విశిష్ట ప్రమాణమవుతుంది. [ఈ విషయంలో 1.4శ్లోకంపై సమీక్ష చూడండి].

108-116వ శ్లోకం వరకు మనుకృతం. ఇవి ప్రామాణికం

అవిహిత ధర్మాల విధానం శిష్ట విద్వాంసుడు చేయాలి -

అనామ్నాతేషు ధర్మేషు కథం స్యాదితి చేద్భవేత్ । మూలశ్లోక సం. **58**
యం శిష్టా బ్రాహ్మణా బ్రూయుస్స ధర్మస్స్యాదశంకితః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **108**

టీక:- **అనామ్నాత్ ఏషు ధర్మేషు కథం స్యాత్ ఇతిచేత్ భవేత్** = ధర్మయుక్తమైన వ్యవహారాలు, మనుస్మృతి మొ॥ వాటిలో ప్రత్యక్షంగా చెప్పకపోయినట్లయితే, వాటి విషయంలో సందేహం కలిగినట్లయితే, మీరు, **యం శిష్టాః బ్రాహ్మణాః స్యుః** = దేనిని శిష్టులని (12.109) ఆప్తవిద్వాంసులు నిర్ణయిస్తారో, **సః అశంకితః ధర్మః స్యాత్** = దాన్నే నిస్సందేహంగా ధర్మమని నమ్మండి.

ఋషి దయానందభాష్యం:- ఇందులో చెప్పబడని ధర్మ సూక్ష్మాల విషయంలో ఎవరికైనా ఎప్పుడైనా సందేహం కలిగితే, శిష్టులయిన వేదవిదులు విప్రులు ఏ ప్రకారం ధర్మనిర్ణయం చేస్తారో, ఆ విధంగా నడుచుకోవాలి. (సం.వి.గృహాశ్రమం) ॥108॥

శిష్ట విద్వాంసుల లక్షణం -

ఇది మనుకృతం-ప్రామాణికం

ధర్మేణాధిగతో యైస్తు వేదస్సపరిబృంహణః । మూలశ్లోక సం.**59**
తే శిష్టా బ్రాహ్మణా జ్ఞేయాః శ్రుతిప్రత్యక్ష హేతవః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**109**

టీక:- మనుష్యులందరు శిష్టులు కారు. కాని, **యైః తు ధర్మేణ సపరి బృంహణః వేదః అధిగతః** = ఎవరు పూర్ణ బ్రహ్మచర్యాన్ని పాలించి, ధార్మిక జీవితం గడుపుతూ సాంగోపాంగంగా వేదాలను అధ్యయనం చేశారో, **శ్రుతిప్రత్యక్ష హేతవః** = శ్రుతి ప్రమాణం ప్రత్యక్షాది ప్రమాణాల వల్లనే విధి నిషేధాలను, చేయడంలో సమర్థులో, ధార్మికులు మరియు పరోపకార జీవులో, **తే శిష్టాః బ్రాహ్మణాః జ్ఞేయాః** = వారే శిష్ట పురుషులలని తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- ఇంతవరకు సవిస్తరంగా చెప్పబడిన బ్రహ్మచర్యం, వేదాలు, మీమాంస, తర్కం, ధర్మశాస్త్రంతో చేరివున్న వేదాన్ని బాగా చదివి అర్థం చేసుకోగల వారు పండితులు, విద్వాంసులు శిష్టులు అనబడతారు. ఈ విద్వాంసబృందం చేసే ధర్మనిర్ణయానికి కట్టుబడి ఉండాలి. (సం.వి.గృ.ప్ర.) ॥109॥

ధర్మ నిర్ణాయక పరిషత్తులో ముగ్గురు లేదా పదిమంది విద్వాంసులుండాలి -

ఇది మనుకృతం-ప్రామాణికం

దశావరా వా పరిషద్యం ధర్మం పరికల్పయేత్ । మూలశ్లోక సం.**60**
త్ర్యవరా వాపి వృత్తస్థా తం ధర్మం న విచారయేత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**110**

టీక:- దశావరా వృత్తస్థావాపి + త్రి అవరా పరిషత్ = కనీసం పదిమంది విద్వాంసులు గాని లేదా అతి తక్కువైనా ముగ్గురు విద్వాంసుల సభ, **యం ధర్మం పరికల్పయేత్** = ఏది ధర్మమని నిర్ణయిస్తారో, **తం ధర్మం న విచారయేత్** = అదే ధర్మం. ఆ ధర్మమును ఎవరు ఉల్లంఘించరాదు.

ఋషి దయానందభాష్యం:- ఎక్కువమంది పండితులు ఒక్కచోట చేరాడానికి అవకాశం లేనప్పుడు పదిమందికి తగ్గకుండా పరిషత్తు ఏర్పడవచ్చు! ఏ కారణంచేతనైనా ఈ పదిమందీ లభ్యం కానప్పుడు ముగ్గురు కలిసి ఏది ధర్మమని నిర్ణయిస్తే, అదే ధర్మమని ఒప్పుకోడానికి సందేహించక్కర్లేదు. ఆ ధర్మాన్ని ఎవరూ ఉల్లంఘించరాదు.

గృహస్థులు చిన్నవారు గానీ పెద్దవారు గానీ రాజకార్యాలను నిర్ణయించడానికి తక్కువగా కనీసం 10 మంది ఉండాలి. అందులో ఋగ్వేదజ్ఞుడు, యజుర్వేదజ్ఞుడు, హైతుకుడు (నైయాయికుడు తార్కికుడు, నైరుక్తుడు (నిరుక్త శాస్త్రజ్ఞుడు) ధర్మాధ్యాపకుడు, బ్రహ్మచారి, స్నాతకుడు మరియు వానప్రస్థుడు మొదలయిన వారు విద్వాంసుల సభ లేదా అతిన్యూనమైనా ముగ్గురు (3) వేదవిదులు ఋగ్వేదజ్ఞుడు, యజుర్వేదజ్ఞుడు మరియు సామవేదజ్ఞుడు. సభ ద్వారా కర్తవ్యాకర్తవ్యం ధర్మం, అధర్మమని ఎలా నిశ్చయింతురో ఆలాగుననే ఆచరించాలి. కనీసం 10 మంది శిష్టులతో పరిషత్తు ఉండాలి. లేదా గొప్ప పండితులైన ముగ్గురుతో సభ ఉండవచ్చు. సభ ఏది ధర్మమని నిర్ణయించునో దాన్ని జనులందరు ఆచరించాలి. (సం.వి.గృ.ప్ర.) ॥110॥

ధర్మపరిషత్ యొక్క 10మంది సదస్యులు -

ఇది మనుకృతం-ప్రామాణీకం

త్రైవిద్యోఽ హేతుక స్తర్కీనైరుక్తో ధర్మపాఠకః । మూలశ్లోక సం.**61**
త్రయశ్చాశ్రమిణః పూర్వే పరిషత్స్యాద్దశావరా ॥ ప్రక్షిప్త శ్లోక సం.**111**

టీక:- దశవరా పరిషత్ స్యాత్ = ఆ పదిలో ఈ ప్రకారంగా విద్వాంసులు ఉండాలి. **త్రై విద్యః** = మూడు వేదాలకు సంబంధించిన విద్వాంసులు, **హేతుకః** = 4వ వాడు హేతుకుడు అంటే కారణమూ, అకారణమూ తెలిసినవాడు. **తర్కీ** = ఐదోవాడు తర్క న్యాయశాస్త్రవేత్త. **నైరుక్తః** = 6వ వాడు నిరుక్త శాస్త్రజ్ఞుడు. **ధర్మ పాఠకః** = 7వ వాడు ధర్మశాస్త్రజ్ఞుడు.

త్రయః పూర్వే ఆశ్రమిణః = 8వ వాడు బ్రహ్మచారి, 9వ వాడు గృహస్థుడు 10 వానప్రస్థుడు, ఈ మహాత్ములతో కూడినది ధర్మపరిషత్.

ఋషి దయానందభాష్యం:- మూడు వేదాలకు సంబంధించిన విద్వాంసులూ, కారణమూ అకారాణమూ తెలిసిన హేతుకుడు 4వ వాడు 5వ వాడు తర్యన్యాయ శాస్త్రవేత్త, 6వ వాడు నిరుక్త శాస్త్రజ్ఞుడు, 7వ వాడు శాస్త్రజ్ఞుడు, 8వ వాడు బ్రహ్మచారి, 9వ వాడు గృహస్తుడు, 10వ వాడు. వానప్రస్థుడు, ఈ పదిమంది విద్వాంసులతో కూడినది ధర్మ పరిషత్. (సం.వి.గృ.ప్ర.) ॥111॥

వివరణ:

త్రయీవిద్యా (ఋక్-యజుః సామ మరియు అథర్వ) ఈ నాలుగు వేదాలకు త్రయీవిద్యారూపములని పేరు. ఈ విషయంలో విస్తృత సమీక్ష (11.30)

ఈ సభలో నాలుగు వేదాలు, న్యాయశాస్త్రం, నిరుక్తం, ధర్మశాస్త్రం మొ॥ తెలిసిన విద్వాంసులు, సభాసదులుగా ఉండాలి. కానీ వారు బ్రహ్మచారి, గృహస్థుడు మరియు వానప్రస్థుడు. అప్పుడు సభ 10 సభ్యుల కంటే తక్కువగా ఉండరాదు. (స.ప్ర. 6 సము.)

ధర్మపరిషత్తుకు సంబంధించిన సదస్యత్రయం - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఋగ్వేదవిద్యజుర్విచ్చ సామవేదవిదేవ చ । మూలశ్లోక సం. **62**
త్ర్యవరా పరిషద్ జ్ఞేయా ధర్మసంశయనిర్ణయే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **112**

టీక:- ఋగ్వేదవిత్ యజుర్వేదవిత్, చ సామవేదవిత్ + ఏవ = ఋగ్వేదజ్ఞుడు, యజుర్వేదజ్ఞుడు, సామవేదజ్ఞుడు, **త్రి + అవరా ధర్మ సంశయ నిర్ణయే పరిషత్ జ్ఞేయా** = ఈ ముగ్గురు విద్వాంసులతో కూడిన సభ, **ధర్మ సంశయ నిర్ణయే** = ధర్మ సంశయాలు సర్వ వ్యవహారాల నిర్ణయం కోసం ఉండాలి.

ఋషి దయానందభాష్యం:- ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలను అధ్యయనం చేసి, వాటి అర్థములు తెలిసిన ముగ్గురు గల పరిషత్తు త్ర్యవరపరిషత్తు అనబడును. ఆ త్ర్యవరపరిషత్తు ధర్మసందేహ నివారణ చేయగలిగి ఉంటుంది. ఈ ముగ్గురు విద్వాంసులు కూడిన సభ చేసిన నిర్ణయాన్ని ఎవరూ ఉల్లంఘించరాదు (స.ప్ర. 6వ సము.).॥112॥

ఇది మనుకృతం-ప్రామాణికం

ధర్మ నిర్ణయంలో అసంఖ్యాకమూర్ఖుల కంటే ఒక్క వేదజ్ఞుడు చెప్పిందే ప్రమాణం -

ఏకోఽపి వేదవిద్ధర్మం యం వ్యవస్యేద్ద్విజోత్తమః । మూలశ్లోక సం. **63**
స విజ్ఞేయః పరో ధర్మో నాజ్ఞానాముదితో యుతైః ॥ ప్రక్షిప్త శ్లోక సం. **113**

టీక:- ఏకః అపి వేదవిత్ = సర్వ వేదజ్ఞుడు ఒక్కడయినా ద్విజులలో ఉత్తమ సన్యాసి, **యం ధర్మం వ్యవస్యేత్** = ఏది ధర్మమని నిర్ణయిస్తాడో, **సః పరః ధర్మః విజ్ఞేయః** = అదే శ్రేష్ఠ ధర్మం, **అజ్ఞానామ్ అయుతైః ఉదితః న** = అజ్ఞానులు వేలకొద్ది, లక్షలకొద్దీ, కోట్ల కొద్దీ కలిసి చేసిన నిర్ణయాన్ని ఎప్పుడు అంగీకరించరాదు.

ఋషి దయానందభాష్యం:- అలాంటి ముగ్గురు లేనప్పుడు ఒక్క వేదవేదార్థధర్మజ్ఞుడు ఎలాంటి ధర్మాన్ని నిర్ణయిస్తాడో, అదే ఉత్తమధర్మంగా తెలుసుకోవాలి. కాని, వేదవేదార్థపరిజ్ఞానశూన్యులైనవారు, అజ్ఞానులు వేలాది మంది ధర్మనిర్ణయము చేసినప్పటికీ అది ఎప్పుడూ అంగీకరించరాదు. అంటే స్మృతిపురాణ మీమాంసా న్యాయశాస్త్రజ్ఞుడు, గురుపరంపరోపదేశం

పొందినవాడు శ్రేష్ఠుడని అర్థం. బహుస్మృతులను తెలిసినవాడు, లెస్సగా ప్రాయశ్చిత్తాది విధులను తెలిసినట్లయితే, వాడొక్కడు చెప్పిన ధర్మనిర్ణయం గ్రాహ్యమే అవుతుంది. (స.ప్ర.6వ సము.)

ద్విజులలో ఉత్తముడు, చతుర్థాశ్రమి అయిన, సన్యాసి ఒక్కడు ఏ ధర్మ వ్యవహారాన్ని నిశ్చయిస్తాడో, అదే కర్తవ్యం, పరమధర్మమని తెలుసుకోవాలి. కానీ, అజ్ఞానులు వేలు, లక్షలు, కోట్లమంది పురుషులు నిర్ణయించిన దాన్ని ధర్మ వ్యవహారమని అంగీకరించరాదు. (స.వి.గృహాశ్రమం.) ॥113॥

ధర్మ పరిషత్‌కు సభ్యులు కాకూడని వారెవరు? - ఇది మనుకృతం-ప్రామాణికం

అవ్రతానామమంత్రాణాం జాతిమాత్రోపజీవినామ్ । మూలశ్లోక సం. **64**
సహస్రశస్సమేతానాం పరిషత్త్వం న విద్యతే ॥ ప్రక్షిప్త శ్లోక సం. **114**

టీక:- అవ్రతానామ్ = ఎవరు బ్రహ్మచర్యం, సత్యభాషణం మొ॥ వ్రతాలు చేయనివారు, **అమన్త్రాణాం** = వేదవిద్యలు గాని, తద్విచారణ చేయని వారు, **జాతిమాత్ర ఉపజీవినామ్** = జన్మించినప్పటి నుండి శూద్రుడి లాగా జీవించే వారు, **సహస్రశః సమేతానాం** = అలాంటి వారు వేలకొద్దీ మనుషులు కలిసినప్పటికీ, **పరిషత్త్వం న విద్యతే** = సభకాజాలదు.

ఋషి దయానందభాష్యం:- బ్రహ్మచర్యం, సత్యభాషణాది వ్రతాలు, వేదవిద్య, ఆలోచన అనేవి లేకుండా, పుట్టుకతోనే శూద్రులలాగా ప్రవర్తించేవారు వేలకొలదిగా కలిసినా అది 'సభ' అనబడదు.

సావిత్రీ జపం మొదలైన బ్రహ్మచర్య వ్రతాలు, మంత్రం, మంత్రార్థం, అనుష్ఠానం లేకుండా కేవలం శూద్రుడిలాగా జీవించే వారూ అలాంటి వారు వేలాది మంది కలిసినప్పటికీ ధర్మనిర్ణయం చేయజాలరు. అది సభకాదు.కాబట్టి వీరుధర్మ పరిషత్తు కాలేరు. (స.ప్ర.6వ సము.) ॥114॥

వివరణ:

జాతి శబ్దార్థం: జాతి శబ్దానికి జన్మ అని అర్థం. మనుస్మృతిలో జాతి శబ్దం- జన్మ అనే అర్థంలో ప్రయోగింపబడింది. ఇక్కడ అలాంటివారు ధర్మపరిషత్తుకు సభ్యులు కాకూడదని నిషేధింపబడింది. ఎవరి జన్మను బట్టి మాత్రమే శ్రేష్ఠులమని తలంచుదురో ఉత్తమ వర్ణంవారమని దురభిమానాన్ని చూపుతారో, గంభీరంగా విధిపూర్వకంగా విద్యాగ్రహణం చేయలేదో, వారు పరిషత్సభ్యులు కాకూడదు. ఇందుకు సమర్థన 2.148వ శ్లోకం వివరణ చూడగలరు.

మూర్ఖులు నిర్ణయించిన ధర్మం వల్ల పాపాభివృద్ధికి అవకాశముంది - ఇది మనుకృతం-ప్రామాణికం

యం వదంతి తమోభూతా మూర్ఖా ధర్మమతద్విదః । మూలశ్లోక సం. **65**
తత్పాపం శతధా భూత్వా తద్వక్తౄననుగచ్ఛతి ॥ ప్రక్షిప్త శ్లోక సం. **115**

టీక:- తమో భూతాః మూర్ఖాః అతద్విదః = అవిద్యావంతులు, మూర్ఖులు, వేదం తెలియనివారు, **యం ధర్మమ్ వదన్తి** = ఏది ధర్మమని నిర్ణయిస్తారో, **తత్ పాపం** = దాన్ని ధర్మంగా ఎప్పుడూ అంగీకరించరాదు అట్లా అంగీకరించినట్లైతే **శతధా భూత్వా** = వందల కొద్దీ రెట్టింపై **తత్ వక్తౄన్ అధి గచ్ఛతి** = ప్రజలలో అధర్మదోషాలు ప్రబలి దాని పాపం ఆ వక్తలకు ప్రాపిస్తుంది.

ఋషి దయానందభాష్యం:- అవిద్యగల మూర్ఖులు, వేదాన్ని తెలియనివారు దేనిని ధర్మమంటారో దానిని ఎన్నడూ అంగీకరించకూడదు. ఎందుకంటే మూర్ఖులు చెప్పిన ధర్మాన్ని అనుసరించేవారికి అనేకవిధాలుగా పాపం చుట్టుకొంటుంది. కాబట్టి విద్యార్యసభ, ధర్మార్యసభ, రాజార్యసభ ఈ మూడింటిలోనూ మూర్ఖులను చేర్చుకోరాదు. వాటిలో నిరంతరం విద్వాంసులకు, ధార్మిక పురుషులకు మాత్రమే స్థానం ఉండాలి.

తమోగుణంతో నిండిన మూర్ఖులు ధర్మప్రమాణవేదవేదార్థపరిజ్ఞాన శూన్యులై, ఏది ధర్మమని నిర్ణయిస్తారో దాన్ని ధర్మంగా ఎప్పుడూ అంగీకరించరాదు. ప్రశ్న విషయం, ధర్మాన్ని తెలియనివారై, ప్రాయశ్చిత్తం మొదలైన విషయాలను ఎవడికి చెబుతారో, వాడి పాపం నూరింతలై ఆ సభ్యులందరినీ చేరుతుంది. (స.ప్ర. 6వ సము.)॥115॥

వివరణ:

మూర్ఖులు నిర్ణయించిన ధర్మం వల్ల హాని:- వేదాది శాస్త్రాలను, ప్రమాణాదులను ఏ మాత్రం తెలియని మూర్ఖులు చెప్పిన ధర్మం వాస్తవంగా అది ధర్మంకాదు. ఎందువల్లనంటే వారికి ధర్మ స్వరూపమే తెలియదు. అధర్మమునే ధర్మమని విధించినట్లయితే వందలకొద్దీ అవిద్యలు, భ్రాంతులు వ్యాపిస్తాయి. వాటి వల్ల పాపం విస్తరిల్లుతుంది. ఈ విధంగా ప్రపంచం పాతాళానికి ప్రస్థానమవుతుంది. అప్పుడు ఆ సమాజస్థితి సంస్కృతంలో ప్రసిద్ధమైన సూక్తిగా మారుతుంది.

"అన్ధేనైవ నీయమానాః యథాన్ధాః" గుడ్డివాడిని ఆధారంగా చేసికొని వాని వెంటనే నడిచేవారి లాగా, వాడితో పాటు అగాథంలో పడిపోతారు. అలాగే మూర్ఖుల వెంట నడిచేవారు, మూర్ఖత్వం, అజ్ఞానాంధకారంలో పడి అవనతిని పొందుతారు.

నిఃశ్రేయస కర్మల ఉపసంహారం - ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతద్వోఽభిహితం సర్వం నిఃశ్రేయసకరం పరమ్ । మూలశ్లోక సం.**66**
అస్మాదప్రచ్యుతో విప్రః ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**116**

టీక:- ఏతత్ = ఇది 12.83-115వ శ్లోకం వరకు, **పరమ్ నిఃశ్రేయసకరం సర్వం వః అభిహితం** = మోక్షప్రదములైన సర్వోత్తమ కర్మలకు సంబంధించిన పూర్ణ విద్వాంసుడైన ద్విజుడు (బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యుడు), **అస్మాత్ అప్రచ్యుతం** = ఈ విధానాన్ని విడువకుండా పాలిస్తూ, **పరమాం గతిమ్ ప్రాప్నోతి** = ఉత్తమగతిని అంటే ముక్తిని పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:- మోక్ష సాధకమైన ఉత్తమ ధర్మాదికమంతా మీకు పూర్తిగా వివరించాను. దీన్ని తప్పక అనుష్ఠించే విప్రులు- ద్విజులు స్వర్గాపవర్గ రూపమైన సుఖదాయక మోక్షాన్ని పొందగలరు. (స.ప్ర. 6వ సము.) ॥116॥

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* *ఏవం స భగవాన్ దేవో లోకానాం హితకామ్యయా ।*
ధర్మస్య పరమం గుహ్యం మమేదం సర్వముక్తవాన్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***117***

తాత్పర్యం:- ఐశ్వర్యాది గుణాలు గలవాడు, గొప్ప జ్ఞానరూపుడు అయిన మనువు పైన చెప్పిన ప్రకారం లోకహితాన్ని కోరి ధర్మశాస్త్ర రహస్యమంతా మాకు వివరించాడు. ॥117॥

ప్రక్షిప్త పరిశీలన

117వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం -

1. శైలీగత ఆధారాలు

గ్రంథాలలోని మొదటి శ్లోకం 1.2-4 వర్ణన శైలి స్పష్టంగా చెప్పేదేమిటంటే, మనువును ఋషులు ప్రశ్నలడిగారనీ, మనువు వాటికి సమాధానాలు చెప్పాడనీ. ఈ శ్లోకంలో భృగువు స్వయంగా తానే చెప్పానని చెప్పడం దీనికి వ్యతిరేకం. [దీనిపై విస్తృత వివరణకు భూమికలోని శైలీగత ఆధారాలు చూడండి]. ఇది భృగువు అనుయాయులు ఎవర్లో తర్వాతి కాలంలో రాసిన ప్రక్షిప్త శ్లోకం.

2. ప్రసంగ వ్యతిరేకాలు

ప్రస్తుత ప్రసంగం నిశ్శ్రేయస కర్మలది. 116లో వీటి ముగింపు సంకేతం ఉంది. తర్వాత వాటికి సంబంధించిన ఉప సంహార వర్ణన ఉంది. ఇది పూర్తయిందో లేదో, ఈ శ్లోకంలో ధర్మోపదేశం పూర్తయిన కథనం ఉంది. ఇట్లా నిశ్శ్రేయస కర్మలు, ఉప సంహారం - వీటి మధ్య ప్రసంగానికి భిన్నమైన విషయం ఉండటమూ, మధ్యలోనే ముగింపును సూచించే వాక్యం ఉండటం చేత, ఇది ప్రసంగ వ్యతిరేకమూ, అసంగతమూ అయిన ప్రక్షిప్తం.

ఈశ్వరద్రష్ట అధర్మంలో మనస్సు నుంచడు- **ఇది మనుకృతం-ప్రామాణికం**

సర్వమాత్మని సంపశ్యేత్సచ్చాసచ్చ సమాహితః । మూలశ్లోక సం.**67**
సర్వం హ్యాత్మని సంపశ్యన్నాధర్మే కురుతే మనః ॥ ప్రక్షిప్త శ్లోక సం.**118**

టీక:- సమాహితః = ఏకాగ్రచిత్తుడై, **అసత్ చ సత్ చ సర్వమ్** = పరివర్తనం చెందేది, పరివర్తనం చెందనిది. (అసత్కారణం, సత్కార్యరూపమైన జగత్తును), **ఆత్మని సంపశ్యేత్** = ఆత్మయందు అంటే సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడులో చూడాలి. **అధర్మే మనః న కురుతే** = అతడు ఎల్లప్పుడు, అధర్మంలో మనస్సును చొప్పించడు, **హి** = ఎందుకంటే, **సర్వం ఆత్మని సంపశ్యన్** = అతడు పరమేశ్వరుడు, సర్వజ్ఞుడని తెలిసినందువల్ల.

ఋషి దయానందభాష్యం:- సత్, అసత్ అనేవి తెలిసి; అది అంతా సర్వవ్యాపకుడైన పరమాత్మ ఉందని తెలిసి; ధ్యానాదుల చేత ఆ రూపాన్ని ప్రత్యక్షం చేసుకొన్న వారు. ఆ విధంగా ప్రయత్నించేవారు దుష్కర్మలు-దురాచారాలు ఎన్నడూ చెయ్యరు. (ద.ల.భ్రా.ని.) ॥118॥

వివరణ:

సర్వజ్ఞుడైన పరమాత్మ యొక్క అనుభవజ్ఞానంతో అధర్మ నివృత్తి:-ఈ సమస్త ప్రపంచం కొంత ప్రకట రూపంలోను, మరికొంత అప్రకట రూపంగానూ ఉంది. అంటే కార్యరూపంలో ప్రకటం, కారణరూపంలో అప్రకటం, పరమాత్మ సంపూర్ణ ప్రపంచంలో వ్యాపించి ఉన్నాడు. ఈ విషయం యొక్క అనుభూతి కలిగిన వ్యక్తి ఏ స్థానంలోనూ ఏ సమయంలోనూ, అధర్మం ఆచరించడు. ఎందుకంటే ప్రత్యేక స్థానంలో, ప్రతి సమయంలోనూ సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడు చూస్తున్నాడనే జ్ఞానమున్నందువల్ల ఇలాంటి అనుభూతి, జ్ఞానమున్నందువల్ల, మనుజుడు అధర్మం నుండి దూరంగా ఉంటాడు.

పరమేశ్వరుడే సర్వనిర్మాత ఫలప్రదాత, ఉపాస్యుడు - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఆత్మైవ దేవతాస్సర్వాస్సర్వమాత్మన్యవస్థితమ్ । మూలశ్లోక సం.**68**
ఆత్మా హి జనయత్యేషాం కర్మయోగం శరీరిణామ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.**119**

టీక:- ఆత్మా ఏవ సర్వాః దేవతాః = ఆత్మా అంటే పరమేశ్వరుడే సర్వ వ్యవహారాలకు సంబంధించిన పూర్వోక్త దేవతలను రక్షించేవాడు, **సర్వమ్ + ఆత్మని + అవస్థితమ్** = మరియు అతనియందే సర్వ జగత్తు ఉంది. అతడే మానవ ప్రపంచానికంతటికి ఉపాస్య దేవత, **ఏషాం శరీరిణాం కర్మ యోగం జనయతి** = జీవులందరికీ పాప-పుణ్య ఫలములనిచ్చేవాడు కూడా ఆయనే.

ఋషి దయానందభాష్యం:- ఆత్మా అంటే పరమేశ్వరుడే సర్వ వ్యవహారాలకు సంబంధించిన దేవతలను రక్షించేవాడు, అతని యందే సర్వజగత్తు ఉంది. జీవులందరికీ పాప పుణ్య ఫలాలనిచ్చేవాడు కూడా అయనే. (మహర్షి దయానందుల వారు ఈ శ్లోకంలో కొంత భాగాన్ని ప్రమాణ రూపంగా నిమ్న స్థలంలో ఉదాహరించి ఉన్నారు.)

1. ద.ల.భ్రా.ని-167, 2) ద.ల.వే.ఖ-24 3) ద.శా.53 4) ఋ.ప.వి.13. 5) ల.వే.అంక.125

వివరణ:

పరమాత్మే సర్వదేవతలకు దేవత.

1. అందరికంటే ముఖ్యమైన దేవుడు ఈశ్వరుడే. దేవతలందరినీ నిర్మించేవాడు ఈశ్వరుడే. ఆ దేవతల వర్ణన ద్వారా కూడా పరమాత్మను గ్రహించగలం. ఈ విషయాన్ని నిరుక్తం కూడా వివరించింది.

"మహాభాగ్యాద్దేవతాయా ఏక ఆత్మా బహుధాస్తూయతే ।
ఏకస్యాత్మనో అన్యే దేవాః ప్రత్యఙ్గాని భవన్తి । ఆత్మా
సర్వం దేవస్య దేవస్య" నిరుక్తం.7-4

అర్థం: మహా ఐశ్వర్యశాలికావడం వల్ల ఆ పరమాత్మ విభిన్న రూపాలలో స్తోత్రం చేయబడుతున్నాడు. తక్కిన దేవతలందరూ ఆ పరమాత్మ ద్వారానే ప్రకాశితులవుతారు. దివ్యగుణ సంపన్నులవుతారు. ఆయనే ఆ దేవతలను రచించేవాడు, ఆ పరమాత్మే సర్వదేవతలకు-దేవత.

2. పరమాత్ముడి ఆశ్రయంలోనే సంసారమంతా నిలిచి ఉంది. ఇందుకు అనేక వేదమంత్రాలు ప్రమాణాలున్నాయి. 1.6,12-124,125 శ్లోకాల అనుశీలనం.

3. అన్యత్ర వర్ణన - జీవులను కర్మలతో కలిపి, ఆ జీవులకు, కర్మ ఫలప్రదాత కూడా పరమేశ్వరుడే. ఈ విషయంలో మనుస్మృతి 1.26-30 శ్లోకాలను చూడగలరు.

120,121 శ్లోకాలు ప్రక్షిప్తాలు-ఇవి ప్రామాణికం కావు

*** ఇంద్రియాలలో ఆకాశాదుల ధ్యానం -**

* ***ఖం సన్నివేశయేత్ఖేషు చేష్టనస్పర్శనేఽనిలమ్ ।***
పఙ్క్తిదృష్ట్యోః పరం తేజః స్నేహేఽపో గాం చ మూర్తిషు ॥ ప్రక్షిప్త శ్లోక సం.***120***

తాత్పర్యం:- బ్రహ్మ ధ్యానము చేయునప్పుడు బాహ్యాకాశమును శరీరాకాశమునందు లయము చేయవలెను. అట్లే బాహ్య వాయువును చేష్టా స్పర్శలకు కారణమైన శరీర వాయువున లయింప చేయవలెను. అగ్ని, సూర్యుల వెలుగును కడుపు, కండ్లలోని వెలుగున బాహ్మ జలమును దేహజలములలో, పృథివిని శరీరమున, విలీనము చేయవలెను.॥120॥

* ***మనసీందుం దిశః శ్రోత్రే క్రాంతే విష్ణుం బలే హరమ్।***
వాచ్యగ్నిం మిత్రముత్సర్గే ప్రజనే చ ప్రజాపతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం.***121***

తాత్పర్యం:- చంద్రుని మనస్సులో, దిక్కులను శ్రోత్రేంద్రియమున, విష్ణువును పాదములందు, హరుని బలమున, అగ్నిని వాక్కులో, మిత్రుని పాయ్వింద్రియంలో, ప్రజాపతిని ఉపస్థేంద్రియమున విలీనము చేయవలెను. **॥121॥**

ప్రక్షిప్తాల పరిశీలన

120-121 శ్లోకాలు కింది ఆధారాలతో ప్రక్షిప్తాలు -

1. అంతర్ వ్యతిరేకాలు

వీటిలో చెప్పిన ధ్యాన విధి ఆకాశం, వాయువు, చంద్రుడూ, విష్ణువు మొదలైన వారి ధ్యానం, మనువు చెప్పిన దానితో సరిపోవటం లేదు. ఇవి మను సమ్మతం కాదు. మనువు కేవలం నిరాకార పరమాత్మ ధ్యానమూ, ఉపాసనా చెప్పాడే కానీ, విష్ణువు, చంద్రుడు మొదలైన వాటివి కాదు. మనువు ఆత్మలో పరమాత్మను ధ్యానించే పద్ధతి చెప్పాడు కానీ శరీరాంగాలతో కాదు. ఈ శ్లోకం మనువు చెప్పిన అన్ని శ్లోకాలకూ వ్యతిరేకం. వాటన్నిటిలోనూ ఒక నిరాకార పరమాత్మను ఆత్మలో ధ్యానం చేయమన్నాడు. (2.100-104; 6.65,72-74; 12.85,91,118,119,122,125 మొదలైనవి). ఈ ఆధారంతో ఇవన్నీ ప్రక్షిప్తాలు.

2. ప్రసంగ వ్యతిరేకాలు

పూర్వాపరాలలోని 119, 122 శ్లోకాలలో నిరాకార పరమాత్మ స్వరూప వర్ణన ఉంది. ఈ శ్లోకాలలో విభిన్నమైన ఉపాసనలు చెప్పి, ఆ ప్రసంగాన్ని భంగం చేశారు. ఇలా ఈ ప్రసంగ వ్యతిరేక శ్లోకాలు ప్రక్షిప్తాలు.

పరమ సూక్ష్మరూపుడుగా పరమాత్మను గుర్తించండి - 122 నుండి 125 వరకు మనుకృతం-ఇవి ప్రామాణికం

ప్రశాసితారం సర్వేషామణీయాంసమణోరపి । మూలశ్లోక సం. **69**
రుక్మాభం స్వప్నధీగమ్యం విద్యాత్తం పురుషం పరమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **122**

టీక:- సర్వేషాం ప్రకాశితారం = అందరినీ శిక్షించేవాడు, **అణోః + అపి అణీయాంసమ్** = సూక్ష్మాతి సూక్ష్మం, **రుక్మాభం** = స్వప్రకాశరూపుడు, **స్వప్నధీగమ్యం** = సమాధిస్థ బుద్ధితో తెలిసికోదగినవాడు, **తం పరమ్ పురుషం విద్యాత్** = ఆయన్నే పరమ పురుషుడని తెలుసుకోవాలి.

ఋషి దయానందభాష్యం:- అందరినీ శిక్షించేవాడు, సూక్ష్మాతి సూక్ష్మం, స్వప్రకాశరూపుడు, సమాధిస్థ బుద్ధితో తెలిసికో దగినవాడు, అయన్నే పరమ పురుషుడని తెలుసుకోవాలి. (స.ప్ర.1వ సము.) 1) 1 దశ. 2)ఉపదేశమంజరీ 3) ద.ల.వేదాంత 4) ఋ.ప.వి. 5) ద.ల.(భ్రా.ని. 6) ఋ.భా.భూమిక. ॥122॥

వివరణ:

పరమాత్మ స్వరూపం గుణకర్మల వర్ణన:-

మను మహర్షి ఈ శ్లోకంలో పరమాత్మ స్వరూపాన్ని వర్ణన చేస్తూ పరమేశ్వరుడు సూక్ష్మాతి సూక్ష్మం, స్వప్రకాశజ్ఞాన స్వరూపుడని, ఆ పరమాత్మే సర్వులకు జ్ఞాన ప్రదాత లేదా శిక్షకుడని వర్ణించారు. ఈ భావమునే మనువు 1.21లో మరొక విధంగా వర్ణించారు.

2. ఈ 122 శ్లోకానికి వేదమంత్రాలతో పోలిక. ఈ శ్లోకంలో వర్ణించిన ఈశ్వర స్వరూపం, గుణాలు, ప్రాప్తవ్య విధులు. అలాగే ప్రేరణకు ఆధారం వేదమంత్రాలే. నిమ్నమంత్రం చూడగా, ఈ శ్లోకం ఈ మంత్రానికి సారరూపమని చెప్పవలసి ఉంటుంది.

క. **"స పర్యగాత్ శుక్రమకాయమవ్రణ మస్నావిరం శుద్ధమపాప విద్ధమ్ ।**
కవిర్మనీషీ పరిభూః స్వయంభూర్యాథా తథ్యతోఽర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః యజు. 40-8

అర్థం : ఓ మనుషులారా ! బ్రహ్మ, **శుక్రమ్** = శీఘ్రకారి సర్వశక్తిమంతుడు, **అకాయమ్** = స్థూల-సూక్ష్మ మరియు కారణ శరీరరహితుడు, **అవ్రణమ్** = ఛిద్రరహితుడు అలాగే రెండుగా విభజించరానివాడు, **అస్నావిరం** = నాడులు మొ॥ బంధనములు లేనివాడు, (శుద్ధమ్) అవిద్య మొ॥ దోషాలు లేనివాడు, సదా పవిత్రుడు, **అపాపవిద్ధమ్** = ఎప్పుడూ కూడ

పాపాలతో కూడినవాడు కాదు, పాపం చేసేవాడు కాదు, పాపాన్ని ప్రేమించువాడు గాదు. ఆయన, **పరి+అగాత్** = సర్వత్ర వ్యాపకుడు, **కవిః** = సర్వజ్ఞుడు, **మనీషీ** = సర్వ ప్రాణుల మనోవృత్తి తెలిసినవాడు, **పరిభూః** = దుష్టులను, పాపులను తిరస్కరించేవాడు, **స్వయం భూః** = అనాది స్వరూపం కలవాడు, ఎవరికి తల్లిదండ్రి ఎవరూ లేరో, ఎవరికి వినాశం కలుగదో, జన్మ వృద్ధులు, క్షయం లేదో, అలాంటి పరమాత్మ, **శాశ్వతీభ్యః** = సనాతనుడో, అనాది స్వరూపుడో, తన స్వరూప దృష్టితో ఉత్పత్తి -వినాశాలు లేనివాడో, **సమాభ్యః** = ప్రజల కోసం, **యాథాతథ్యతః** = **యథార్థంగా అర్థాన్** = వేదం ద్వారా సమస్త పదార్థాలను, **వ్యదధాత్** = చక్కగా ఉపదేశిస్తాడో, **సః** = అలాంటి ఆ పరమాత్మే మనకు ఉపాసనీయుడు ("ఋగ్వేదాది భాష్య భూమిక").

ఖ. **"వేదాహమేతం పురుషం మహాన్తమాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ।**
తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి నాన్యః పన్థా విద్యతేఽయనాయ ॥ యజు. 31-18

అర్థం- ఓ జిజ్ఞాసువుల్లారా ! నేను **ఏతం** = ఈ పూర్వోక్తమైన **మహాన్తమ్** = మహాగుణ యుక్తమైన, **ఆదిత్యవర్ణం** = సూర్యుడి ప్రకాశంతో సమానమైన ప్రకాశం కలవాడు, స్వప్రకాశ స్వరూపుడైన పరమాత్మను, **తమసః** = అజ్ఞానం వాటిని, **వేద** = నేను తెలిసికొన్నాను, నమ్ముతున్నాను, **తమేవ** = ఆయనే, **విదిత్వా** = తెలిసికొని, **మృత్యుమ్** = దుఃఖకారకమైన మృత్యువును, **అతి+ఏతి** = దాటిపోతుందో, **అన్యః** = ఇంతకంటే భిన్నమైన, **పన్థాః** = మార్గం, **అయనాయ**= అభీష్ట స్థానమైన మోక్షానికి, **న విద్యతే** = లేదు-యజుర్వేద భాష్యం- మహర్షి దయానంద సరస్వతి.

పరమాత్మకు అనేక నామాలు - ఇది మనుకృతం-ప్రామాణికం

ఏతమేకే వదంత్యగ్నిం మనుమన్యే ప్రజాపతిమ్ । మూలశ్లోక సం. **70**
ఇంద్రమేకే పరే ప్రాణమ పరే బ్రహ్మ శాశ్వతమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **123**

టీక:- ఏతమ్ = ఈ పరమాత్మను (12.122), **ఏకే** = కొందరు, **అగ్నిం** = అగ్ని అని, **అన్యే మనుమ్ ప్రజాపతిమ్** = ఇతరులు 'ప్రజాపతి' అనీ, మనువనీ, **ఏకే ఇంద్రమ్** = కొందరు ఇంద్రుడనీ, **పరే ప్రాణమ్** = కొందరు ప్రాణమనీ, **అపరే శాశ్వతమ్ బ్రహ్మ** = ఇతరులు శాశ్వతమైన బ్రహ్మ అనీ, **వదన్తి** = చెబుతున్నారు.

ఋషి దయానందభాష్యం:- ఈ పరమాత్మనే కొందరు అగ్నిగా, కొందరు ప్రజాపతిగా, మనువుగా, కొందరు ఇంద్రుడిగా, కొందరు ప్రాణంగా, కొందరు నిత్యానంద స్వరూపుడిగా కొలుస్తూంటారు. ఈ విధంగా సగుణ-నిర్గుణ రూపమైన ఉపాసనారీతులెన్నెన్నో....

స్వప్రకాశుడైనందువల్ల అగ్ని, విజ్ఞాన స్వరూపమైనందువల్ల మనువు, సర్వులను పాలించునందువల్ల పరమైశ్వర్యవంతుడైన 'ఇంద్రుడు', అందరి జీవితాలకు మూలమైనందువల్ల ప్రాణం, నిరంతరం వ్యాపకుడైనందువల్ల పరమేశ్వరుడి నామం బ్రహ్మ అయింది. (స.ప్ర. 1వ సము.). ॥123॥

వివరణ:

పరమాత్మ యొక్క గౌణ నామాలు- వాటి అర్థాలు

పరమాత్మకు గల అనేక నామములలో ముఖ్యమైన నామం 'ఓం' అని- మనుమహర్షి అభిప్రాయం. (2.49-53) అక్కడ ఆ ఓం పదవాచ్యుడైన పరమాత్మకు సంబంధించిన కొన్ని అన్య గౌణ నామములను పేర్కొన్నాడు. ఈ నామముల వల్ల కూడా సూక్ష్మమైన సర్వాంతర్యామి అయిన సర్వ ప్రకాశకుడైన పరమాత్మే (12.122) సూచింపబడుతున్నాడు. కింద వాటికి సంబంధించిన వ్యుత్పత్తి రాయబడుతుంది. దాని వల్ల పరమాత్మే తెలియబడుతుంది. వాటితో పాటు పరమాత్మ యొక్క స్వరూపం, గుణాలుకూడా తెలియబడుతున్నాయి.

1. **అగ్ని:** అఞ్చు గతి పూజనయోః లేదా 'అగ-అగి-గతౌ' ధాతువు వల్ల అగ్ని శబ్దం సిద్ధమవుతుంది. జ్ఞానం, గమనం, ప్రాప్తి అని గతి ధాతువుకు ఏది జ్ఞానస్వరూపమో, సర్వజ్ఞమో, జ్ఞానయోగ్యమో మరియు పూజనీయమో-అది అగ్ని. అది పరమాత్మనామం. "ఆత్మా ఏవ అగ్నిః (శత 6.7.1.20), "అగ్నిరేవ బ్రహ్మ (శత 10.4.1.5), అని బ్రాహ్మణగ్రంథాలలో చెప్పబడి ఉంది.

2 **మనుః:** మను జ్ఞానే అథవా **"మను అవ బోధనే"** ధాతువు వల్ల మనుశబ్దం సిద్ధమవుతుంది. **"యో మన్యతే, జ్ఞాయతే అవబుధ్యతే స మనుః"** ఏది జ్ఞాన రూపమో, మరియు జ్ఞానయోగ్యమో-ఈ కారణాల వల్ల ఈశ్వరుడి పేరు "మనువు".

3. **ప్రజాపతి:** ప్రజా, పతి రెండు శబ్దాలు సమస్తమై ప్రజాపతి శబ్దం నిర్మాణమవుతుంది. **"ప్రజాయాః పతిః = పాలకః, రక్షకః = ప్రజాపతిః** = ప్రజలను పాలించేవాడు, రక్షించువాడైనందువల్ల పరమాత్మకు ప్రజాపతి అని పేరు.

నిరుక్తంలో ఇదే వ్యుత్పత్తి ఇవ్వబడింది. "ప్రజాపతిః పాతా వా పాలయితా వా''= ప్రజావతి రక్షకుడు, పాలకుడవుతాడు. బ్రాహ్మణ గ్రంథాలలో **"బ్రహ్మ వై ప్రజాపతి"** (శత.13.6.2.8) **"ప్రజాపతిర్హి ఆత్మా"** (శత.6.2.2.12).

4. **ఇంద్రుడు:** 'ఇది పరమైశ్వర్యే' ధాతువు నుండి ఋజ్రేన్ద్రా... (ఉణాది) (2-28) సూత్రంతో 'రన్' ప్రత్యయం కలిసినందువల్ల, ఇంద్ర శబ్దం సిద్ధమవుతుంది. **"ఇంద్రతి పరమైశ్వర్యవాన్ భవతి స ఇంద్రః"** అఖిలైశ్వర్యయుక్తుడైనందువల్ల పరమాత్మకు ఇంద్రుడని పేరు. ఇంద్రతేర్వా ఐశ్వర్య కర్మణః (నిరుక్తం 10-8) **"యో హ ఖలు వావ ప్రజాపతిః స ఉవావేన్ద్రః"** (తై 1-2-25).

5. **"ప్రాణః":** ప్ర పూర్వక అన్ ప్రాణనే ధాతువు నుండి ప్రాణ శబ్దం సిద్ధమవుతుంది. 'ప్రాణనాత్ప్రాణః' ధాతువు నుండి ప్రాణులకు జీవనమూలమవడం వల్ల, జీవన రక్షకుడైనందువల్ల ఈశ్వరుడి నామం ప్రాణం "ప్రాణాపానౌ దేవః = బ్రహ్మ (గో.బ్రా-(1-2-11).

6. **బ్రహ్మ:** "బృహివృద్ధౌ" ధాతువు నుండి **"బృహేర్నోఽచ్చ"** (ఉణాది 4-146) సూత్రం ద్వారా మనిన్ ప్రత్యయం చేర్చగా బ్రహ్మ శబ్దం సిద్ధమవుతుంది. **"యోఽఖిలం జగత్ నిర్మాణేన బర్హయతి వర్ధయతి స బ్రహ్మ"** । సంపూర్ణ జగత్తును రచించి అభివృద్ధిపరచడం వల్ల పరమాత్మకు 'బ్రహ్మ' అని పేరు. నిరుక్తం ననుసరించి **"బ్రహ్మ పరివృఢం సర్వతః"** (నిరుక్త 1.8) సర్వోన్నతుడు, అందరి కంటే గొప్పవాడు, సర్వవ్యాపకుడు, అందరి కంటే శక్తిశాలి అవడం వల్ల ఈశ్వరుడి పేరు 'బ్రహ్మ'.

2 వేదమంత్రాలలో ఈశ్వరుడి గౌణనామముల వర్ణన.

వేదమంత్రాలలో ఈశ్వరుడి యొక్క అనేక గౌణనామములు పేర్కొనబడినవి. ఈ శ్లోకం యొక్క భావం ఈ మంత్రాలను ఆధారంగా చేసికొని చెప్పబడినవని తోస్తున్నది.

క. **ఇన్ద్రం మిత్రం వరుణమగ్నిమాహురథో దివ్యస్సః సుపర్ణో గరుత్మాన్ ।**
ఏకం సద్విప్రా బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వానమాహుః ॥ ఋక్.1.64.46

అర్థం : పరమాత్మ ఒక్కడే. ఒక్కడుగా ఉన్నా, విద్వాంసులు భిన్న భిన్న గుణాల కారణంగా, భిన్న భిన్న నామాలతో సంబోధిస్తున్నారు. ఎలా అంటే 'ఇంద్ర-ఐశ్వర్యవంతుడు, మిత్ర- అందరూ ప్రేమించదగినవాడు, వరుణ-వరణీయుడు, అగ్ని-జ్ఞానస్వరూపుడు అలాగే పూజనీయుడు, దివ్య-తేజఃస్వభావుడు అలాగే అద్భుతగుణయుక్తుడు, సుపర్ణ-ఉత్తమ పాలన, మరియు పూర్ణకర్మయుక్తుడు, గురుత్మాన్-మహాస్వరూపుడు, బలవంతుడు,యమ-న్యాయకారి, మాతరిశ్వా = వాయువుతో సమానంగా అనంత బలవంతుడు' ఇవన్నీ పరమాత్మనామాలు.

ఖ. **"తదేవాగ్నిస్తదాదిత్యస్తద్ వాయుః తదుచంద్రమాః**
తదేవ శుక్రం తద్బ్రహ్మ తాఽ ఆపః స ప్రజాపతిః ॥ యజు.31.1

అర్థం: ఇతడు సూక్ష్మ స్వరూపుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడైన పరమాత్మ జ్ఞాన స్వరూపుడు పూజ్యుడైనందువల్ల **'అగ్ని'** అనబడుతున్నాడు. ప్రళయకాలంలో అందరినీ చేర్చుకొనేవాడైనందువల్ల **'ఆదిత్యుడు'** అవుతున్నాడు. అనంత బలసంపన్నుడై నందువల్ల **"వాయువు"**, ఆనందస్వరూపుడు, ఆహ్లాదకుడైనందువల్ల **'చంద్రమా'** అని, శుద్ధ స్వభావమున్నందు వల్ల **'శుక్రుడని'**, అందరి కంటె గొప్పవాడైనందువల్ల 'బ్రహ్మ', సర్వవ్యాపకుడైనందువల్ల **'ఆపః'** అని, సర్వ ప్రజలకు స్వామి పాలకుడైనందువల్ల **'ప్రజాపతి'** అని చెప్పబడుతున్నాడు.

సర్వాంతర్యామి పరమాత్మే ఈ ప్రపంచాన్ని చక్రం లాగా నడుపుతున్నాడు- ఇది మనుకృతం-ప్రామాణికం

ఏషః సర్వాణి భూతాని పంచభిర్వ్యాప్య మూర్తిభిః । మూలశ్లోక సం. **71**
జన్మవృద్ధిక్షయైర్నిత్యం సంసారయతి చక్రవత్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **124**

టీక:- ఏషః = ఈ పరమాత్మ, **పంచభిః మూర్తిభిః సర్వాణి భూతాని వ్యాప్య** = పంచమహాభూతాల ద్వారా, సర్వప్రాణులలో వ్యాప్తమై అంటే వాటిని ఉత్పత్తి చేసి, మరియు వాటిలో వ్యాపించి ఉంటూ, **జన్మ-వృద్ధి-క్షయైః నిత్యం చక్రవత్ సంసారయతి** = ఉత్పత్తి-వృద్ధి-వినాశమును చేస్తూ సదా చక్రంలాగా ప్రపంచాన్ని నడుపుతూ ఉన్నాడు.

తాత్పర్యం:- ఈ పరమాత్మ రూపుడు ప్రాణుల్ని పృథివ్యాధి పంచభూతాలతో పరిగ్రహించి, జన్మాంతరాలలో ఆర్జించబడిన పాపపుణ్యాలకు తగినట్లు ఒక చక్రభ్రమణ గతిన ఉత్పత్తి-స్థితి-లయం అనే మూడింటితో మోక్షం పొందేవరకు ఒక క్రీడగా ఆచరిస్తూంటాడు. ॥124॥

వివరణ:

1. 124వ శ్లోకానికి అన్యత్ర వర్ణన- నిరాకారుడు, సూక్ష్మస్వరూపుడైన పరమాత్మ ఈ ప్రపంచం యొక్క ఉత్పత్తి-వృద్ధి-క్షయమును కలిగిస్తూ ఉన్నాడు. ఈ విషయం (1.57, 80) చూడగలరు.

2. ఉపర్యుక్త స్వరూపం గల పరమాత్మ జగదుత్పత్తి - ప్రళయకర్త. ఇందుకు వేదాలు, ఉపనిషత్తులు ప్రమాణం. వేదాలు, ఉపనిషత్తులను చూసే మనువు ఇక్కడ ప్రకటించాడు. ఈ జగత్తు ఉత్పత్తికి, వృద్ధికి, ప్రళయానికి కర్తయైన పరమాత్మ స్వరూపం 12.122,123 శ్లోకాలలో ప్రదర్శింపబడింది. ఈ పరమాత్మే ఈ ప్రపంచాన్ని సృష్టించి, నడిపిస్తూ ఉంటాడు. మరి ఇతరుడెవ్వడు కాడు. ఈ విషయానికి వేదాలలో, ఉపనిషత్తులలో ప్రమాణాలు కూడా చూడదగినవి.

క. **ఇయం విసృష్టిర్యత ఆ బభూవ యది వా దధే యది వా న ।**
యో యస్యాధ్యక్షః పరమే వ్యోమన్సో అఙ్గ వేద యది వా న వేద ॥ ఋ. 10 మం. సూ. 129.7

ఓ అఙ్గ ! ఓ మానవుడా ! ఎవడి వల్ల ఈ వివిధ సృష్టి ప్రకాశితమైందో, ఎవడు ఈ జగత్తును పోషిస్తున్నాడో, ప్రళయం చేస్తున్నాడో, ఎవడు ఈ జగత్తుకు స్వామియో, ఏ వ్యాపకమైన పరమాత్మలో ఈ సర్వజగత్తు పుట్టి- పెరిగి ప్రళయాన్ని పొందగలుగుతుందో అతడే పరమాత్మ. అతడిని నీవు తెలుసుకో, మరెవరినీ సృష్టి కర్తగా తలంచకు.

ఖ. **హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్ ।**
స దాధార పృథివీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేషు ॥

ఋ. మం. 10. సూ. 121 మంత్రం-1

ఓ మనుషులారా ! ఎవడు సూర్యాది సర్వ తేజస్వి పదార్థాలను ధరించి ఉన్నాడో, ఈ భూత, వర్తమాన, భవిష్య జగత్తులకు అద్వితీయమైన రక్షకుడో (పతి), అతడు ఈ జగదుత్పత్తికి ముందు కూడా ఉన్నాడు. ఎవడు పృథ్వి మొ॥ సూర్య పర్యంతమూ జగత్తును సృష్టించాడో ఆ పరమాత్ముడైన దేవుణ్ణి భక్తితో కొలవండి.

 గ. **పురుష ఏవేదగ్ం సర్వం యద్భూతం యచ్చ భావ్యమ్ ।**
ఉతామృతత్త్వస్యేశానో యదన్నేనాతిరోహితి ॥ యజుః 31.2

ఓ మానవుల్లారా ! ఎవడు అందరిలో నిండి ఉన్నాడో, ఎవడు నాశరహిత కారణమో, జీవుడికి స్వామియో, ఎవడు పృథివ్యాది జడములకు మరియు జీవుడి కంటే అతిరిక్తుడో, ఆ పురుషుడే ఈ సర్వ-భూత-భవిష్యద్వర్తమానస్థ జగత్తును నిర్మించేవాడు.

ఘ. **యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి ।**
యత్ప్రయన్త్యభిసంవిశన్తి తద్విజిజ్ఞాసస్వ తద్ బ్రహ్మ ॥ తైత్తిరీయ ఉప. 3.1

ఏ పరమాత్ముడి రచన వల్ల సమస్తమైన పృథివ్యాధి భూతాలు ఉత్పన్నమైనవో, ఎవడి వల్ల జీవిస్తున్నవో, ఎవడి యందు లయమైపోతున్నాయో అతడే బ్రహ్మ. అతడిని తెలిసికోడానికి ప్రయత్నించు.

జ. **"జన్మాద్యస్య యతః"** వేదాంత దర్శనం. అ.సూ. 1.2

ఎవడి వల్ల ఈ జగత్తు యొక్క జన్మస్థితి ప్రళయములు కలుగునో అతడే బ్రహ్మ. అతడే తెలుసుకోతగినవాడు అన్య మంత్రములు 1.6లోని వివరణ చూడతగినది. (స.ప్ర. 8 సముల్లాసం).

సమాధి వల్ల ఈశ్వర-మోక్షప్రాప్తి - **ఇది మనుకృతం-ప్రామాణికం**

ఏవం యస్సర్వభూతేషు పశ్యత్యాత్మానమాత్మనా । మూలశ్లోక సం. **72**
స సర్వసమతామేత్య బ్రహ్మాభ్యేతి పరం పదమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **125**

టీక:- **ఏవం** = ఈ విధంగా సమాధి యోగం ద్వారా, **యః** = ఎవడు, **సర్వభూతేషు ఆత్మానం పశ్యతి** = సమస్త ప్రాణుల యందు పరమేశ్వరుణ్ణి చూస్తాడో, **సః ఆత్మనా సర్వసమతామ్ + ఏత్య** = అందరినీ తన ఆత్మతో సమానంగా ప్రేమ భావంతో చూస్తాడో, అతడు, **పరం పదమ్ బ్రహ్మ ఆభ్యేతి** = పరమపదమైన బ్రహ్మ (పరమాత్మ)ను చేరి, సదా ఆనందాన్ని పొందుతాడు.

ఋషి దయానందభాష్యం:- ఈ ప్రకారం ఎవరు సర్వభూతాలలోనూ ఉన్న ఆత్మను బ్రహ్మజ్ఞానంతో చూస్తారో, వారు బ్రహ్మ సాక్షాత్కారం వల్ల ఉత్తమ స్థానమైన బ్రహ్మను పొంది, ఆ పరమాత్మలో లీనమవుతారు. (ద.ల.భా.ని.)॥125॥

వివరణ:

సర్వప్రాణులలో ఆత్మవత్ భావన, పరమాత్మ దర్శనంతో ముక్తి-

మనుమహర్షి ఈ భావాన్ని వేదాల నుండే ఉన్నదున్నట్లుగా తీసుకున్నాడు. తులనార్థం అర్థ స్పష్టీకరణం కోసం నిమ్న మంత్రం చూడండి.

యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవాను పశ్యతి ।
సర్వభూతేషు చాత్మానం తతో న విచికిత్సతి ॥ యజు. 40.6

టీక:- అర్థం:యః = ఏ మనుషుడు, **ఆత్మన్యేవ** = **ఆత్మా**= పరమాత్మలో అలాగే తన ఆత్మతో సమానంగా, **సర్వాణి భూతాని** = సమస్త జీవులను, జగత్తులోని జడపదార్థాలను, **అనుపశ్యతి** = అనుకూలంగా లేదా ధర్మాచరణం, యోగాభ్యాసం మొ॥ వాటి ద్వారా చూస్తాడో, **చ** = మరియు, **సర్వభూతేషు** = సమస్త ప్రణులలో, ప్రకృతిస్థ పదార్థాలలో, **ఆత్మానం** = సర్వత్ర వ్యాప్త పరమాత్మను చూస్తున్నాడో, **తతః** = తరువాత అంటే అలాంటి సమ్యక్ దర్శనానంతరం, **న విచికిత్సతి** =

సంశయాలుండవు. సంశయరహితుడై నిర్భ్రాంతజ్ఞానం వల్ల, పరమాత్మ పద = మోక్షాన్ని పొందగలుగుతున్నాడు. అతడికి సంసారాన్ని గురించి గానీ, పరమాత్మ జ్ఞానాన్ని గురించి గానీ ఏ విధమైన సందేహం ఉండదు.

ఇది ప్రక్షిప్తం. ప్రామాణికం కాదు

* ఈ శాస్త్రాధ్యయన ఫలం -

* ఇత్యేతన్మానవం శాస్త్రం భృగుప్రోక్తం పఠన్ ద్విజః ।
భవత్యాచారవాన్నిత్యం యథేష్టాం ప్రాప్నుయాద్గతిమ్ ॥ ప్రక్షిప్త శ్లోక సం. **126**

తాత్పర్యం:- ఈ విధంగా భృగుమహర్షి చేత చెప్పబడిన మానవ సంహిత అనే మనుధర్మశాస్త్రం, ఏ ద్విజుడైతే పఠిస్తాడో అతడు నిత్యం సదాచార సంపద కలిగినవాడై, తనకిష్టమయిన స్వర్గాది లోక సౌఖ్యాన్ని పొందగలడు.॥126॥

ప్రక్షిప్త పరిశీలన

126వ శ్లోకం కింది విధంగా ప్రక్షిప్తం-

1. శైలీగత ఆధారాలు

1. 1.2-4 శ్లోకాల శైలి వల్ల ఈ శాస్త్రము మనువు రచన అనీ, మనువే చెప్పాడనీ రుజువవుతూంది. ఈ శ్లోకంలో దీన్ని భృగువు చెప్పాడనటం అసంగతం [దీనికి సంబంధించిన విస్తృత వివేచనకు భూమికలోని 'శైలీగత ఆధారాలు' మీది సమీక్ష చూడండి]. ఇలా ఇది ప్రక్షిప్తం.

2. సంపూర్ణ మనుస్మృతిలోని శైలి ఏ విషయమైనా ముగించే ముందు దాన్ని ఆచరించటంవల్ల కలిగే ఫలం చెప్తుంది కానీ, చదవటానికి కాదు. మనుస్మృతి శైలి ప్రకారం, ఒక ముగింపు శ్లోకం 125లో జరిగింది. 126లో మళ్లీ ముగింపు చెప్పటం అవసరం ఉండదు, చదవటం వల్ల కలిగే ఫలితం మనువు శైలికి అనుకూలమూ కాదు. ఇట్లా ఈ శ్లోకం ప్రక్షిప్తం.

3. భృగువు పేరు చెప్పటం వల్ల ఈ శ్లోకం భృగువు కాకుండా అతని అనుయాయి లెవరో రచించి కలిపేశారని రుజు వవుతూంది. కనుక, మనువు తర్వాతిది కావటం చేత ఇది ప్రక్షిప్తం.

ఇతి హరయాణాప్రాంతీయగురుకుల ఝజ్జరేఽధీత విద్యేన, తత్ర భవతామాచార్య భగవాన్ దేవానామన్తే వాసినా, హరయాణా ప్రాంతాంతర్గత రోహతకీ మండలే 'మకడౌలీ' నామ్ని గ్రామే లబ్ధ జన్మనా శ్రీ గహర సింహ శాన్తిదేవీతనయేన ఆచార్య సురేంద్రకుమారేణ మనుస్మృతేః వాచస్పతిః మత్తి కృష్ణారెడ్డి కృత ఆంధ్రభాషానువాదాత్మక ప్రక్షిప్తశ్లోకానుసన్ధానయుతా 'ప్రక్షిప్తానుశీలన' సమీక్షా సహితాఽథ చ వివిధవిషయవిమర్శసమ్పన్నా 'అనుశీలన' నామికా సమీక్షా చ పూర్తిమగాత్ ॥

ఇతి ద్వాదశోఽధ్యాయః సమాప్తశ్చాయం గ్రన్థః ॥

ఇతి మానవే ధర్మశాస్త్రే భృగుప్రోక్తాయాం సంహితాయాం ద్వాదశోఽధ్యాయః సమాప్తః

మనువు ప్రతిపాదించిన ధర్మ స్వరూపము

ప్రాచీన భారతీయ ఆలోచనా పద్ధతికి
మూలకారణమైన వేద సిద్ధాంతాలకు,
ఆదర్శాలకు అనుకూలమైనదే
మనువు ప్రతిపాదించిన ధర్మం.
ఏ ధర్మానికి వేదాలలో సూత్రాలు గుదిగుచ్చబడ్డాయో,
వాల్మీకి రామాయణంలో
ఏ ధర్మానికి సజీవమూర్తుల చిత్రాలు లిఖించాడో,
వ్యాసుడు మహాభారతంలో
ఏ ధర్మానికి విశద వ్యాఖ్యానం చేశాడో
అదే ఈ ధర్మం -
'మనుధర్మం - మనుధర్మశాస్త్రం - మానవ ధర్మశాస్త్రం
మానవ సంహిత - మనుస్మృతి'

వెల: రూ. 2100/-

ఆచార్య మట్టి కృష్ణారెడ్డి ఆర్య
94412 00322